గుండెల్లో వేదన.. తరగని నిరీక్షణ

విచార వదనంతో బంధువులు

ఈనాడు డిజిటల్, పాడేరు - న్యూస్‌టుడే, మారేడుమిల్లి, రంపచోడవరం

రంపచోడవరం ఆసుపత్రి వద్ద మావోయిస్టుల బంధువుల పడిగాపులు

ఓ పక్క అయిన వారిని పోగొట్టుకున్న వేదన.. మరో పక్క గుండెలో నుంచి పొంగుకొస్తున్న రోదన. వేదనను కళ్లలో దాచుకుని.. రోదనను పెదవి అంచుల్లోనే ఆపుకొని రోజంతా నిరీక్షిస్తూనే ఉన్నారు. భాషకాని భాష మాట్లాడేచోట, ఊరుకాని ఊరొచ్చి.. తమవారి చివరిచూపు కోసం నిద్రాహారాలు మాని వేచి చూశారు. రంపచోడవరం ఆసుపత్రి ఎదుట గురువారం కనిపించిన ఉద్విగ్న పరిస్థితులివీ. మారేడుమిల్లి మండలంలోని అటవీ ప్రాంతంలో మంగళ, బుధవారాల్లో మావోయిస్టులు, పోలీసు బలగాలకు మధ్య ఎదురుకాల్పులు జరిగి పార్టీ అగ్రనేత హిడ్మా, ఆయన భార్యతో సహా 13 మంది మావోయిస్టులు మృత్యువాతపడిన విషయం తెలిసిందే. మావోయిస్టుల మృతదేహాలను శవపరీక్షల నిమిత్తం రంపచోడవరం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన వారిలో ఎక్కువమంది ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారే ఉన్నారు. బంధువులు విషయం తెలిసి దూరప్రాంతాల నుంచి కొండంత దుఃఖంతో తరలివచ్చారు. పోస్టుమార్టం ప్రక్రియ సుదీర్ఘంగా సాగడం బంధువులను తీవ్ర ఆవేదనకు గురిచేసింది. గురువారం నాటికి నాలుగు మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తయింది. మిగిలిన తొమ్మిది మంది బంధువులు తమను ఎప్పుడు పిలుస్తారో అనే ఆందోళనతో ఆసుపత్రి ఆవరణలోనే వేచిచూస్తూ కనిపించారు.

మాట్లాడుతున్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

కొనసాగుతున్న గాలింపు

జిల్లాలోని రెండు ఎదురుకాల్పుల సంఘటనల్లో మరికొంతమంది తప్పించుకున్నారన్న అనుమానంతో బలగాలు ఇంకా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. మావోయిస్టులు జనావాసాల్లో కలిసిపోయే ఆస్కారం ఉందని జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించారు. ఒడిశా సరిహద్దు వరకు పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తులను ఆరా తీసుస్తున్నారు. సరిహద్దులో ప్రతి వాహనాన్ని ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. సీసీ కెమెరాల ద్వారా నిఘా పటిష్ఠం చేశారు.

హెలిప్యాడ్ వద్ద భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఎస్పీ అమిత్ బర్దార్

రంపచోడవరం ఆసుపత్రి ఆవరణలో మావోయిస్టుల బంధువుల ఎదురుచూపులు

డీజీపీ పర్యటనకు భారీ బందోబస్తు

సాయుధ బలగాలకు, మావోయిస్టులకు ఎదురుకాల్పులు జరిగిన ప్రదేశాలను డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా గురువారం ఏరియల్ సర్వే చేశారు. రెండు ఎన్‌కౌంటర్లలో స్వాధీనం చేసుకున్న ఆయుధాలతో రంపచోడవరం ఏఎస్పీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను పరిశీలించారు. కూంబింగ్‌లో పాల్గొన్న బలగాలను అభినందించారు. డీజీపీ పర్యటన సందర్భంగా రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద భద్రతా ఏర్పాట్లను ఎస్పీ అమిత్ బర్దార్ పరిశీలించారు. డీజీపీ పర్యటన సందర్భంగా రంపచోడవరం అంతటా భారీగా సాయుధ బలగాలను మోహరించారు. మరోవైపు మావోయిస్టుల మృతదేహాల పోస్టుమార్టం నిమిత్తం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసు, రెవెన్యూ సిబ్బందితో రంపచోడవరం ప్రాంతీయ ఆసుపత్రి రోజంతా రద్దీగా కనిపించింది.

శ్రమ వారిది.. సాకారమైంది వారధి

దశాబ్దాలుగా వంతెన లేకపోవడంతో ఎన్నో కష్టాలు పడి.. వాగులో ఈదుకుంటూ అక్కడి గిరిజనులు అవతలి ఒడ్డుకు వెళ్లేవారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా వారి కష్టాన్ని గుర్తించలేదు. ఎవరో వచ్చి.. తమ ఇబ్బందులు తీరుస్తారని చూడకుండా గ్రామస్థులంతా ఒక్కటై కర్రల వంతెన నిర్మాణానికి చేయి చేయి కలిపారు. అరకులోయ మండలంలోని సిరగాం పంచాయతీ కప్పలగొంది నుంచి డుంబ్రిగుడ మండలం చాపరాయితోపాటు డెర్ని తదితర గ్రామాలకు వెళ్లాలంటే వాగు దాటాలి. వర్షాకాలంలో ప్రవాహం ఎక్కువై ఆయా గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయి.

ఈ నేపథ్యంలో గ్రామంలోని యువత, పెద్దలు ఒక్కటై కర్రల వంతెన నిర్మాణానికి నడుం బిగించారు. సమీపంలోని అడవి నుంచి పెద్ద పెద్ద కర్రలను తీసుకొచ్చారు. వారం రోజులపాటు గ్రామంలోని చిన్నాపెద్దా తేడా లేకుండా అంతా ఒక్కటై శ్రమించారు. కర్రలతో వంతెన నిర్మాణం పూర్తి చేశారు. రాకపోకలకు వీలుగా అంతా కలిసి వంతెన నిర్మించుకున్నామని గ్రామస్థులు జగన్, గాసి, గోపాలరావు, రామ్మూర్తి, సోమేష్, అప్పలస్వామి తదితరులు పేర్కొన్నారు. **- అరకులోయ, న్యూస్‌టుడే**

చలి గిలిగింత

మన్యంలో శీతల వాతావరణం కొనసాగుతోంది. చలికి ప్రజలు అల్లాడుతున్నారు. గురువారం జి.మాడుగులలో 8.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. ముంచంగిపుట్టులో 8.9, డుంబ్రిగుడ 9.1, చింతపల్లి, అరకులోయలో 9.5, పాడేరులో 9.8 డిగ్రీలు నమోదయ్యాయని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరింత ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయని కాఫీబోర్డు అధికారులు చెబుతున్నారు. ఉదయం తొమ్మిది గంటలైనా పొగమంచు దట్టంగా కురుస్తోంది. దీంతో పాఠశాల కళాశాలల్లో వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులు చలికి వణుకుతూ వెళ్లాల్సిన పరిసితి నెలకొంది. వాహన చోదకులు లైట్ల వెలుతురులో రాకపోకలు సాగిస్తున్నారు.

- చింతపల్లి, న్యూస్‌టుడే

ముందుజాగ్రత్త తప్పనిసరి!

మావోయిస్టుల ఎన్‌కౌంటర్ నేపథ్యంలో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా గురువారం రంపచోడవరంలో పర్యటించారు. ఆయన రాకకోసం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి పోలీసు ఉన్నతాధికారులు కాన్వాయ్ ఏర్పాటు చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా కాన్వాయ్‌లోని అన్ని వాహనాలకు నంబరు పేట్లను తొలగించారు. **- ఈనాడు, పాడేరు**

హోంస్టేలతో పర్యాటకులకు కొత్త అనుభూతి

అరకులోయ, న్యూస్‌టుడే: పర్యాటకులు హోంస్టేలతో సరికొత్త అనుభూతి పొందుతారని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ మురళి అన్నారు. అరకులోయలో హోంస్టే నిర్వహణపై ఔత్సాహికులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. హోంస్టేలను స్వయంసహాయక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. లబ్ధిదారులకు అవసరమైన మేరకు వెలుగు ద్వారా రుణాలు అందించనున్నామన్నారు. గ్రామం యూనిట్‌గా తీసుకొని హోంస్టేలను నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. పర్యాటకులను ఆకట్టుకునేలా కొన్ని మార్పులు, చేర్పులు చేసేలా సమాయత్తం చేస్తున్నామన్నారు. అనంతరం అరకులోయలో హోంస్టే కోసం సిద్ధం చేసిన గృహాన్ని పరిశీలించారు. డీపీఎం మార్టిన్ తదితరులు పాల్గొన్నారు.

అరకులోయలోని హోంస్టే కోసం సిద్ధం చేసిన ఇంటిని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ మురళి

'పట్టు' లేదాయే!

అరకులోయ, న్యూస్‌టుడే: అరకులోయ నియోజకవర్గం పరిధిలోని రైతులను పట్టు సాగువైపు ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన పట్టు పరిశ్రమ ఎందుకూ పనికిరాని విధంగా మారింది. అరకులోయలో 1970లో ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 16 ఎకరాల విస్తీర్ణంలో కార్యాలయంతోపాటు సాగు భూములను ప్రభుత్వం కేటాయించింది. ఇక్కడ భూముల్లో మల్బరీ సాగు చేసి.. పట్టు పురుగుల పెంపకాన్ని చేపట్టేవారు. సుమారు ఐదేళ్ల నుంచి ఇక్కడ మల్బరీ తోటలు, పట్టు పురుగుల పెంపకాన్ని నిలిపివేశారు. అరకులోయ నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో సమారు 10 వేల ఎకరాల్లో గతంలో ఈ తోటల పెంపకం జరిగేది. రైతులకు ప్రోత్సాహం లేకపోవడంతోపాటు స్థానికంగా అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో రైతులు ఈ పెంపకానికి దూరంగా ఉన్నారు. ప్రస్తుతం ఆరు మండలాల్లో ఎక్కడో ఓచోట మాత్రమే కొద్దిగా మల్బరీ తోటల పెంపకం జరుగుతోంది.



పత్తాలేని అధికారులు..: అరకులోయలో పేరుకు మాత్రమే సెరికల్చర్ కార్యాలయం ఉంది. కార్యాలయ భవనాలు శిథిలావస్థకి చేరాయి. పట్టుపరిశ్రమ కోసం కేటాయించిన భూములకు ఆలనాపాలనా కరవవ్వటంతో ఆక్రమణకు గురవుతున్నాయి. అధికారులు దృష్టిసారించి రైతులకు పట్టుపురుగుల పెంపకంపై ఆసక్తి పెంచేలా చూడాలని.. భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బస్సులు నడపలేం బాబోయ్!

అస్తవ్యస్తంగా ఆర్వీనగర్- పాలగెడ్డ రహదారి
తరచూ నిలిచిపోతున్న వాహనాలు

సీలేరు, న్యూస్‌టుడే: గూడెంకొత్తవీధి మండలం ఆర్వీ నగర్ నుంచి పాలగెడ్డ వరకు రహదారి అత్యంత దయనీయంగా మారింది. అస్తవ్యస్తంగా ఉన్న ఈ రహదారిలో బస్సులు నడుపుతుండటంతో రోజుకు ఒక చోట బస్సులు నిలిచిపోతున్నాయి. అర్ధరాత్రుళ్లు అడవిలో జాగారం చేయాల్సి వస్తోంది. ఈ రహదారిలో తాము బస్సులు నడపలేమని ఏపీఎస్‌ఆర్టీసీ డ్రైవర్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులు చేస్తున్నామని ర.భ. శాఖ అధికారులు చెబుతున్నప్పటికీ పనులెక్కడా సాగడం లేదు.

సీలేరు ఐస్‌గెడ్డ వద్ద గురువారం ఆగిపోయిన బస్సు

▼గురువారం ఉదయం భద్రాచలం నుంచి విశాఖపట్నం వెళ్తున్న బస్సు సీలేరు సమీపంలోని ఐస్‌గెడ్డ వద్ద నిలిచిపోయింది. డ్రైవర్లు పరిశీలించగా.. డీజిల్ నిండుకున్నట్లు గుర్తించారు. ఆటోలో సీలేరు వచ్చి అక్కడ డీజిల్ కొనుగోలు చేసి తిరిగి బస్సు ఆగిపోయిన ప్రదేశానికి చేరుకున్నారు. ఈ క్రమంలో సుమారు గంటపాటు బస్సు అడవిలో నిలిచిపోయింది. వాస్తవానికి విశాఖపట్నంలో డీజిల్ పోసుకుని బయలుదేరితే మళ్లీ విశాఖపట్నం వచ్చేవరకూ డీజిల్ పోసే వీలుండదు.

▼ఒక్కోసారి నర్సీపట్నంలో డీజిల్ వేయించుకుంటారు. అటువంటిది 120 కిలోమీటర్లు ముందుగానే ఇంధనం అయిపోవడంతో డ్రైవర్లు గగ్గోలు పెడుతున్నారు. ఈ రహదారిలో సుమారు 80 కిలోమీటర్ల మేర అస్తవ్యస్తంగా ఉందని, తరచూ గేర్లు వాడుతుంటంతో డీజిల్ వాడకం పెరుగుతోందని డ్రైవర్లు చెబుతున్నారు. అనుకున్న విధంగా డీజిల్ వాడకం జరగకపోతే అధికారుల నుంచి తాఖీదులు వస్తాయని, బస్సును సాఫీగా నడపకపోతే ప్రయాణికుల నుంచి మాటలు పడాల్సి వస్తోందని డ్రైవర్లు వాపోయారు.

బుధవారం విశాఖ నుంచి సీలేరు వచ్చిన రాత్రి బస్సు సాంకేతిక మరమ్మతులతో నిలిచిపోయింది. తరచూ గేర్లు మార్చడం వల్ల క్లచ్ సిలిండర్లు కాలిపోయాయి. దీంతో బస్సు నిలిచిపోయింది. వెంటనే మెకానిక్‌లు వచ్చి బస్సును బాగుచేశారు.

సోమవారం రాత్రి భద్రాచలం నుంచి విశాఖపట్నం వెళ్తున్న బస్సుకు స్టీరింగ్ పట్టేయడంతో సీలేరులో ఆగిపోయింది. సీలేరులో ఉన్న విశాఖ రాత్రి బస్సులో ప్రయాణికులను పంపించి.. మరుసటిరోజు మరమ్మతులు చేయించారు.

కండిషన్‌లో ఉన్నబస్సులనే పంపిస్తున్నాం: డిపోలో బయలుదేరే ముందు ప్రతి బస్సులో అన్ని రకాలుగా తనిఖీలు చేపడుతున్నాం. ఏమైనా మరమ్మతులు ఉంటే వాటిని సరిచేయిస్తున్నాం. ఒకవేళ అవ్వకపోతే ఆ బస్సు స్థానంలో వేరొకదాన్ని పంపించి కండిషన్‌లో ఉన్న బస్సులను ఘాటీకి పంపిస్తున్నాం. ఘాటీ నుంచి వచ్చిన బస్సును వెంటనే మెకానిక్ షెడ్డులో పెట్టి వాటికి ఏమైనా మరమ్మతులు ఉంటే సరిచేసి, అందుబాటులో ఉంచుతున్నాం. **- మాధురి, డీఎం, ఏపీఎస్‌ఆర్టీసీ**

అధికారుల నిర్లక్ష్యంతో..: రహదారులు భవనాలు శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే ఇబ్బందులు పడుతున్నాం. ఆర్వీనగర్ వరకూ రహదారి అధ్వానంగా ఉంది. ఈ రహదారిలో ప్రయాణమంటే హడల్ పుడుతోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించాలి. **-ఎ.శ్రీనివాసు, ప్రయాణికుడు**

నేడు విశాఖలో పిటీషన్ల కమిటీ సమావేశం

విశాఖపట్నం: అసెంబ్లీ పిటీషన్ల కమిటీ సమావేశం ఈనెల 21న శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కమిటీ ఛైర్మన్, ఉప సభాపతి కె.రఘురామకృష్ణంరాజు అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నారు. సమగ్ర భూ సర్వే అంశంపై చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ చేసిన ఫిర్యాదు పరిశీలన కోసం కమిటీ విశాఖ జిల్లాకు వస్తోంది. ఫిర్యాదులను కమిటీ సభ్యులు స్వీకరించనున్నారు. కమిటీ సభ్యులు ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, గురజాల జగన్‌మోహన్‌రావు, కొణతాల రామకృష్ణ, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పల్లా శ్రీనివాసరావు, పి.విష్ణుకుమార్‌రాజు పాల్గొననున్నారు.

NAME CHANGE

I, **SAMEERA BANU, D/o. SYED AHAMED** Resident of # 5-60, Main Road, Vattigadda Village, Rajavommangi Mandal, Alluri Sitharama Raju District - 533 436, Andhra Pradesh. Shall henceforth be known as **SAMEERA BANU W/o. MOHAMMAD RIYAZ**. It was SAMEERA BANU, D/o. SYED AHAMED.

దివ్యాంగులకు స్కూటీలు

పాడేరు, న్యూస్‌టుడే: జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు 30 స్కూటీలు మంజూరైనట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ సహాయ సంచాలకులు కె.కవిత తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. జీవో నం.10 ప్రకారం అర్హులైన దివ్యాంగుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. విభిన్న ప్రతిభావంతుల రాకపోకల సౌలభ్యం, స్వయం ప్రతిపత్తిని పెంపొందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఈనెల 25వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.

సత్తాచాటి.. జాతీయ స్థాయికి ఎదిగి..

పాడేరు, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈనెల 19న అఖిల భారత సివిల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి జావెలిన్ త్రో క్రీడాపోటీల్లో మన్యానికి చెందిన యువకుడు సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. పాడేరు మండలం గుత్తులపుట్టు గ్రామానికి చెందిన సాగెని సాయికుమార్ గ్రామ సచివాలయంలో ఉద్యాన సహాయకుడిగా పని చేస్తూ.. రోజూ క్రీడాపోటీల్లో ప్రత్యేక శిక్షణ పొందుతున్నాడు. అఖిల భారత సివిల్ సర్వీసెస్ ద్వారా రాష్ట్ర స్థాయి జావెలిన్ త్రో పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానం సాధించాడు. డిసెంబర్ 13 నుంచి 15 వరకు పట్నాలో జరిగే జాతీయ క్రీడా పోటీలకు ఎంపికయ్యాడు. ఇతడిని కుటుంబసభ్యులు, క్రీడా అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

విలువిద్య పోటీలకు గిరి యువకుడు

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలు సీనియర్, జూనియర్ విభాగాల్లో మెరుగైన ప్రతిభతో జాతీయ స్థాయి పోటీలకు జిల్లాకు చెందిన ఎస్.దేశాయ్ ఎంపికయ్యాడు. ఈనెల 16 నుంచి 18 వరకు నూజివీడులో జరిగిన ఏపీ 45వ జూనియర్, 32వ సీనియర్ ఇండియన్ రౌండ్ విలువిద్య ఛాంపియన్ షిప్-2025 రాష్ట్రస్థాయి పోటీల్లో ఎస్ దేశాయ్ జూనియర్ విభాగంలో ద్వితీయ స్థానంతో రజత పతకం సాధించాడు. సీనియర్ విభాగంలో నాలుగోస్థానం సాధించాడు. ఈ ప్రదర్శనతో డిసెంబరు 22 నుంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్‌లో జరగనున్న జాతీయ జూనియర్ పోటీలకు, డిసెంబరు 10 నుంచి హైదరాబాదు వేదికగా జరగనున్న జాతీయ సీనియర్స్ విలువిద్య పోటీలకు అర్హత సాధించినట్లు దేశాయ్ తెలిపారు. చింతూరు ప్రాంతానికి చెందిన ఇతడు.. గత ఏడాది వరకు అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ విద్యనభ్యసిస్తూ విలువిద్య శిక్షణను తీసుకున్నాడు. ప్రస్తుతం విశాఖ కేంద్రంగా పాఠశాల విద్యార్థులకు విలువిద్యలో శిక్షణ ఇస్తూ ఉపాధి పొందుతున్నాడు.

మెడల్‌తో దేశాయ్

వేరుసెనగ, మినుము సాగు చేయండి

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: రబీ సీజన్‌లో వేరుసెనగ, మినుము పంటలు పండించాలని జిల్లా వ్యవసాయ అధికారి (పాడేరు) ఎస్.బి.ఎస్.నందు తెలిపారు. చిన్నగెడ్డ గ్రామంలో ఏడీఏపీ ప్రభాకర్‌తో కలసి గిరి రైతులు పండిస్తున్న పలు రకాల పంటలను పరిశీలించారు. వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న పలు కార్యక్రమాల గూర్చి రైతులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానంలో సేంద్రియ పద్ధతిలో పండిస్తున్న రాజ్‌మా పంటను పరిశీలించారు. చింతపల్లి వ్యవసాయ ల్యాబ్‌ను సందర్శించి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులకు వేరుసెనగ, మినుము విత్తనాలు పంపిణీ చేశారు. ఏవో మధుసూదనరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కిముడు కృష్ణమూర్తి, తెదేపా గ్రామకమిటీ అధ్యక్షుడు రీమల ఆనంద్, వల్లీ, మంగు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

వ్యవసాయ కళాశాలల్లో చింతపల్లి విద్యార్థులకు సీట్లు

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లి సేంద్రియ వ్యవసాయ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు వ్యవసాయ బీఎస్సీలో నేరుగా ప్రవేశాలు పొందినట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి గురువారం తెలిపారు. ఈ ఏడాది ఆగస్టులో నిర్వహించిన అగ్రిసెట్‌లో తమ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారన్నారు. వారిలో మొదటి ర్యాంకు సాధించిన తర్రా రాంజీ (శ్రీకాకుళం), కుంతూరు మురళీకృష్ణ (పాడేరు, రెండో ర్యాంకు), కె.రాహుల్ వంశీకృష్ణ వ్యవసాయ కళాశాలల్లో ప్రవేశాలు పొందారన్నారు. నైరా, బాపట్ల, మహానంది కళాశాలల్లో వీరికి ప్రవేశాలు లభించినట్లు ఏడీఆర్ తెలిపారు.

రాంజీ, మురళీకృష్ణ, రాహుల్ వంశీకృష్ణ

MANAGEMENT - ADMISSIONS 2025-26

Post B.Sc - 2 Years (Qualification GNM)
M.sc Nursing - 2 Years (B.Sc + 1year)
Courses offered: **GNM, B.Sc Nursing, Post B.Sc, M.Sc Nursing**
FIND US ON GOOGLE COLLEGE ADDRESS

Secretary & Correspondent
Smt. Vasantha Kumari Indupalli
B.Sc.,(N) R.N,RM, DNEA, DNA.
Former Principal Govt. School of Nursing Kkd
Adhoc Inspector: Indian Nursing Council, New Delhi

MOTHER THERESA
COLLEGE OF NURSING, KAKINADA
Cont : 0884-2345966, 2345977, Direct: 9247255155

THE ARYAPURAM CO-OPERATIVE URBAN BANK LTD. HEAD OFFICE, RAJAMAHENDRAVARAM (Reg.No.3127)

RECRUITMENT NOTIFICATION FOR THE POSTS OF ASST. CLERKS / ASST. CASHIER ON CONTRACT BASIS

Applications are invited from Candidates who passed **IBPS/ SBI/RRB'S CLERKS PRELIMS** for the post of Asst. Clerks on contract basis Age : 21 Yrs-28 Yrs. as on date of notification (Age relaxation as per Bank service conditions), **Consolidated payment of Rs. 24,000/- p.m** during probation period of 1 year and on confirmation pay scales will be applicable.

The vacancies are at our Guntur, Visakhapatnam and Bhimavaram Branches only

Selection Procedure : Written Test and Interview

Last date of application to be received to bank: 29-11-2025 by 5:00 p.m.

Those candidates who have applied in last one year are not eligible to apply **Application only in specified format can be sent through courier or email or through registered post or in person. Bank reserves right to refuse any application without assigning any reasons**

Detailed Recruitment notification & Application can be downloaded from Website:
http://www.aryapurambank.com/career.html
Email: arcobank_rjy@aryapurambank.com

Date: 21-11-2025 **Contact no.:-0883-2473550**
Secretary/CEO

(c) eenadu

గంజాయితో అనర్థాలు

అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎస్సై రమణ, పీవో స్రవంతి

పెదబయలు, న్యూస్‌టుడే: గంజాయితో ఎన్నో అనర్థాలున్నాయని ఎస్సై రమణ, పీవో స్రవంతి పేర్కొన్నారు. పెదబయలు ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం ఐసీడీఎస్ పీవో స్రవంతి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు గంజాయి నిర్మూలన, పోక్సో చట్టం, బాల్యవివాహాల నియంత్రణపై అవగాహన కల్పించారు. గంజాయి సాగు, రవాణాతో ఎదురయ్యే ఇబ్బందులు వివరించారు. కార్యకర్తలు తమ గ్రామాల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సూపర్‌వైజర్లు పైడిమంగమ్మ, కె.సింహాచలం, ఎం.సింహాచలం, పాల్గొన్నారు.

ఘనంగా పడిపూజ

సీలేరు: సీలేరులో అయ్యప్ప పడిపూజ ఘనంగా జరిగింది. జెన్‌కో ఉద్యోగి టకిరి బుట్టి ఇంటి వద్ద పడిపూజ ఏర్పాటు చేశారు. అయ్యప్ప మాలధారులు భారీగా పాల్గొన్నారు.

✦ శుక్రవారం పోలిపాడ్యమి సందర్భంగా శివాలయం వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని ఉమామహేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సీలేరు నదిలో భక్తులు దీపాలు వెలిగించడానికి ఏర్పాట్లు చేశామని చెప్పారు.

కప్పేస్తున్నారు.. కట్టేస్తున్నారు!

గెడ్డలు పోయి గోడలు వచ్చె!

ఈనాడు డిజిటల్, అనకాపల్లి

అనకాపల్లి పట్టణ పరిసర ప్రాంతాల్లో రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాలను ఆక్రమణ చెరకు చిక్కుతు న్నాయి. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు.. కబ్జా చేసేస్తున్నారు. వాగు, గెడ్డ పోరంబోకు భూము లను పక్క సర్వే నంబర్లలో కలిపేసుకుంటున్నారు. తప్పుడు పత్రాలు సృష్టించి చదును చేసే స్తున్నారు. అనకాపల్లి మండలం తుమ్మపాల రెవెన్యూ పరిధిలోని సత్యనారాయణపురం, బయ్యవరంలో వాగు పోరంబోకు స్థలాన్ని ఈ తరహాలోనే చెరబట్టేందుకు సిద్ధమయ్యారు.

సత్యనారాయణపురం: గెడ్డపోరంబోకు స్థలంలో నిర్మాణం చేస్తున్నారిలా..

★ అనకాపల్లి రూరల్ మండలం తుమ్మపాల రెవెన్యూ పరిధిలోని సత్యనారాయణపురం గ్రామంలో కొంత గెడ్డపోరంబోకు స్థలం ఉంది. అనకాపల్లి నుంచి బుచ్చెయ్యపేట వైపు వెళ్లే రహదారిలో టిడ్కో ఇళ్లకు వెళ్లే రోడ్డు సమీపంలో సర్వే నం. 388-2లో ఈ స్థలం ఉంది. ఇక్కడ సెంటు రూ. 8 లక్షలకు పైనే పలుకుతుంది. ఇక్కడ 12 సెంట్లకు పైగా ఆక్రమించేందుకు యత్నిస్తున్నారు. ఈ భూమి చుట్టూ ప్రహరీ నిర్మిస్తున్నారు. ఇక్కడ గతంలో వైకాపా నేతలు ఆక్రమణకు యత్నించగా అప్పట్లో స్థానికులు, నేతలు అడ్డుకుని అనకాపల్లి తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. మళ్లీ ఇప్పుడు అదే స్థలంపై బడాబాబుల కన్నుపడింది.

★ కశింకోట మండలం బయ్యవరం రెవెన్యూ పరిధిలోని రామన్నపాలెం సమీపంలో సర్వే నం. 244లో 48 సెంట్ల గెడ్డపోరంబోకు స్థలం ఉంది. దీనికి ఆనుకుని ఉన్న కొంత స్థలాన్ని ఓ కంపెనీ కొనుగోలు చేసింది. స్థానికంగా ఉన్న కొంత మంది తెదేపా నేతలు వాగు పోరంబోకు స్థలాన్ని కూడా అమ్మేందుకు రెవెన్యూ రికార్డులు తారుమారు చేసి అమ్మేసేందుకు యత్నిస్తున్నారు. దీన్ని గుర్తించిన గ్రామస్థులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.

ఇది కశింకోట సమీపంలోని జాతీయ రహదారికి కొద్దిపాటి దూరంలో ఉండటంతో.. దీని విలువ రూ. 1.10 కోట్లకు పైనే ఉంటుంది. రెవెన్యూ అధికారులు సైతం నేతలతో కుమ్మక్కయి సర్వే చేసి గెడ్డ పోరంబోకు భూమిని వేరు చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. సర్వే చేయాలని గ్రామస్థులు స్థానిక వీఆర్‌ఓను విన్నవించినా.. నచ్చినప్పుడు చేస్తాం. మీరు చెప్పే చేసేయాలా అంటూ గదమాయిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..

బయ్యవరం, తుమ్మపాల రెవెన్యూ పరిధిలోని ఆక్రమణ విషయం నా దృష్టికి రాలేదు. క్షేత్రస్థాయి సిబ్బందిని పంపించి పరిశీలిస్తాం. సర్వే చేయించి.. ప్రభుత్వ స్థలం ఉన్నట్లయితే హద్దులు నిర్ణయించి బోర్డులు పెడతాం. ప్రభుత్వ స్థలం ఆక్రమించడం నేరం. ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటాం.

– అయిషా, ఆర్డీఓ, అనకాపల్లి

'మాచ్‌ఖండ్'లో ఉపాధి కల్పించరూ..

ప్రాజెక్టు ఉద్యోగులతో మాట్లాడుతున్న సంచాలకుడు

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: మాచ్‌ఖండ్ జలవిద్యుత్కేంద్రాన్ని ఒడిశా జలవిద్యుత్తుశాఖ మానవ వనరుల సంచాలకుడు సందీప్‌కుమార్ పట్నాయక్ గురువారం సందర్శించారు. ప్రాజెక్టు ఎస్ఈ ఎ.వి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఈఈ జనరేషన్ బి. గోవిందరాజులు ఆయనకు స్వాగతం పలికారు. విద్యుత్కేంద్రం సందర్శన తరువాత ఎస్ఈతో సమావేశమై ప్రాజెక్టు నిర్వహణపై చర్చించారు. విశాఖలో నిరుపయోగంగా ఉన్న అతిథి గృహం అంశాన్ని ప్రాజెక్టు ఉద్యోగులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రాజెక్టులో ఒప్పంద పద్ధతిలో యువతకు ఉపాధి కల్పించాలని స్థానిక యువకులు అర్జీ సమర్పించారు. ఈఈ జనరేషన్ కరేష్ ప్రధాన్, ఒడిశా జలవిద్యుత్తుశాఖ జనరల్ మేనేజర్ నిర్మల్‌కుమార్ షడంగి, మాచ్‌ఖండ్ ఏడీఈ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల ఖాతాల్లో పరిహారం జమయ్యేలా చర్యలు

చింతూరు, న్యూస్‌టుడే: పోలవరం నిర్వాసితుల్లో గ్రామీణ బ్యాంకు ఖాతాదారులకు పరిహారం జమయ్యేలా చర్యలు చేపడుతున్నట్లు రీజనల్ మేనేజర్ సతీష్‌చంద్ర చెప్పారు. ఇటీవల గ్రామీణ బ్యాంకు ఖాతాలకు పరిహారం జమ చేయడంలో సాంకేతిక సమస్యలు తలెత్తిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అడ్డంకులను తొలగించేందుకు చింతూరులోని పోలవరం కార్యాలయంలో గురువారం అధికారులతో చర్చలు జరిపారు.

పోలవరం అధికారులతో చర్చిస్తున్న గ్రామీణ బ్యాంక్ ఆర్ఎం

ద్రవరూప గంజాయి స్వాధీనం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చౌడుపల్లి మార్కెట్‌యార్డు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా.. ముగ్గురు వ్యక్తుల వద్ద నుంచి మూడు కేజీల ద్రవరూప గంజాయి స్వాధీనం చేసుకున్నామని చింతపల్లి ఎస్సై వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. బలపం, కోరుకొండ పరిసర ప్రాంతాలకు చెందిన ముగ్గురు రెండు ద్విచక్రవాహనాలపై మైదాన ప్రాంతానికి ద్రవరూప గంజాయి తరలిస్తుండగా పట్టుబడ్డారని పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రెండు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని వివరించారు.

గంజాయి, నిందితులతో ఎస్సై సిబ్బంది

విద్యార్థులకు అభ్యసన సామగ్రి

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: మండల పీఆర్టీయూ బృందం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అభ్యసన సామగ్రి సేకరిస్తోంది. ఇందులో భాగంగా ధర్మవరం-అగ్రహారం జడ్పీ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయులు అప్పలనాయుడు రూ.అయిదు వేల విలువ చేసే సామగ్రిని అందించారు. పాఠశాలలో గురువారం పీఆర్టీయూ బృందానికి ఈ సామగ్రిని అందజేశారు. పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సమన్వయకర్త సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గిరి గ్రామాల అభివృద్ధికి కృషి

వంతెన పనులకు శంకుస్థాపన చేస్తున్న కూటమి నేతలు

డుంబ్రిగుడ: గిరిజన గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెదేపా మండల అధ్యక్షుడు ఆనందరావు అన్నారు. రంగిలిసింగి, గుంటసీమ పంచాయతీ పరిధిలోని గ్రామాలకు సమీపంలో ముసర్గండ వాగులో వంతెన నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వంలో గిరిజన గ్రామాల అభివృద్ధి ఆమడ దూరంలో నిలిచిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. తెదేపా అధికార ప్రతినిధి చినగెన్ను, కూటమి నాయకులు విశ్వనాథం, కామేష్, పరశురాం, గంగాధర్, గోపీనాథ్, కేశ్వరరావు, గాసి పాల్గొన్నారు.

మరుగుదొడ్ల పనులు నిలిపేయండి

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరు గురుకుల పాఠశాల వద్ద మెగా కంపెనీ చేపడుతున్న టాయిలెట్ల నిర్మాణం వెంటనే నిలిపేయాలని ప్రిన్సిపల్ ఎం.ఎస్. బుచ్చిబాబు ఏపీ జెన్‌కో ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గురుకుల పాఠశాల సమీపంలో మెగా కంపెనీ కార్యాలయం నిర్మాణం కోసం ఏపీ జెన్‌కో స్థలం కేటాయించింది. పాఠశాల సమీపంలో, వినాయకుని గుడి ఎదురుగా మెగా కంపెనీ సిబ్బంది టాయిలెట్లు నిర్మించడానికి పునాదులు తవ్వుతుంటే ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు వెళ్లి వారిని ప్రశ్నించారు. గురువారం ఎస్ఈని కలిసి సమస్య వివరించారు. ఈ ప్రదేశంలో మరుగుదొడ్ల నిర్మాణం వల్ల విద్యార్థులు తాగు నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ప్రిన్సిపల్ బుచ్చిబాబు, సిబ్బంది

ఏటా వరదలతో ఇబ్బందులు

ఐటీడీఏ ఎదుట మాట్లాడుతున్న వడ్డిగూడెం గ్రామస్థులు

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: వడ్డిగూడెం గ్రామస్థులకు పరిహారం అందించాలని ఆదివాసీలు చింతూరు ఐటీడీఏ పీవోకు గురువారం విజ్ఞప్తి చేశారు. 45 అడుగులకే గ్రామాన్ని వరద నీరు చుట్టుముడుతోందని, బయటకు వచ్చేందుకు వీల్లేక ఏటా ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఇళ్లకు పరిహారం, ఆర్ అండ్‌ఆర్ చెల్లింపులు చేయలేదన్నారు. నాలుగు రోజుల్లో మీ సమస్య పరిష్కారం అవుతుందని ఐటీడీఏ అధికారులు చెప్పడంతో వారంతా వెనుదిరిగారు.

రెండేళ్లలో తొమ్మిది జలాశయాలు పూర్తి

దేవరాపల్లి, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర జిల్లాలో అసంపూర్తిగా ఉండిపోయిన తొమ్మిది జలాశయాలను పూర్తిచేసే పనులు చురుగ్గా జరుగుతున్నాయని ఉత్తరాంధ్ర జల వనరులశాఖ ముఖ్య ఇంజినీర్ (సీఈ) కె.వి.ఎస్.స్వర్ణకుమార్ పేర్కొన్నారు. రైవాడ జలాశయాన్ని ఆయన గురువారం పరిశీలించారు. డీఈఈ సత్యంనాయుడు, జలాశయ ఛైర్మన్ పోతల పాత్రునాయుడు ఆయనకు ఈ జలాశయ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా జలవనరుల నిర్వహణ, అభివృద్ధిపై ఆయన మాట్లాడారు.

▼ రైవాడ జలాశయ మట్టిగట్టు పటిష్ఠంతో పాటు అధునాతన వరదగేట్లు, కుడి, ఎడమ కాలువల ప్రధాన తూముల పునర్నిర్మాణ పనుల కోసం రూ. 336 కోట్లు ఖర్చవుతుందని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. జైకా నిధులతో గతంలో చేపట్టిన రైవాడ కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ పనులు పూర్తి చేయాలంటే రూ. 43.8 కోట్లు అవసరం. 2028 వరకు గడువు పొడిగించడంతో పనులు చేపట్టడానికి ప్రభుత్వం పరిశీలిస్తోంది.

▼ మొంథా తుపాను ప్రభావం వల్ల అనకాపల్లి జిల్లాలో దెబ్బతిన్న జలవనరులశాఖకు చెందిన పనులు తాత్కాలికంగా పూర్తిచేయడానికి రూ. 2.48 కోట్ల అవసరం ఉంటుంది. శాశ్వత మరమ్మతులు చేయడానికి రూ.42 కోట్లు మంజూరు కోసం ప్రభుత్వాన్ని కోరతాం.

▼ ఉత్తరాంధ్రలో 14 జలాశయాలున్నాయి. వాటిలో 11 మధ్యతరహా జలాశయాలు కాగా 3 మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులున్నాయి. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని వంశధార, తోటపల్లి, తారకరామ, తీర్థ సాగరం, ఆఫ్‌షోర్, మడ్డువలస, జంఝావతి జలాశయాల పనులు పూర్తిచేయడానికి రూ. 20,300 కోట్లు ఖర్చు చేస్తున్నాం. ఈ పనులు పూర్తయితే పాత ఆయకట్టు 2.50 లక్షల ఎకరాలతోపాటు అదనంగా 1.40లక్షల ఎకరాలకు మేలు జరుగుతుంది.



రైవాడ జలాశయ సమాచారాన్ని తెలుసుకుంటున్న సీఈ స్వర్ణ కుమార్

దేవుడా.. దేవుడా 'ఆనందపురం' దాటించు!

ఈనాడు, విశాఖపట్నం, న్యూస్‌టుడే, ఆనందపురం

★ జాతీయ రహదారిపై చుక్కలు చూపిస్తున్న కూడలి
★ సమస్యపై దృష్టిసారించని యంత్రాంగం.. పాలకులు



జాతీయ రహదారి ఇక్కడుంది. కానీ ఇలా కిందికి దిగి కూడలిలోకి వాహనాలు రావాల్సి వస్తోంది.

ఎక్కడైతే... ప్రతి వాహనం కచ్చితంగా ఆగి తీరుతుందో..
ఎక్కడైతే... గజిబిజి గందరగోళం కనిపిస్తుందో..
ఎక్కడైతే... ఇది జాతీయ రహదారేనా అని అనిపిస్తుందో..
ఎక్కడైతే... ట్రాఫిక్ పోలీసులు ఉరుకులు పరుగులు పెడతారో..
అదే... ఆనందపురం కూడలి!!

భోగాపురం విమానాశ్రయం నుంచి విశాఖ నగరానికి ట్రాఫిక్ ఇక్కట్లు లేకుండా వచ్చేందుకు అధికారులు కొన్ని రహదారులను విస్తరిస్తున్నారు. కానీ, అత్యంత కీలకమైన 'ఆనందపురం కూడలి'లో సమస్యను మాత్రం పట్టించుకోవడం లేదు. జాతీయ రహదారులపై రాష్ట్రంలో ఎక్కడా కనిపించనంత విచిత్ర, అయోమయ... ప్రమాదకర పరిస్థితిని ఇక్కడ చూడొచ్చు. అయినా... అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్య తీవ్రతను కళ్లారా చూస్తూనే కాలం గడిపేస్తున్నారు.

★ చెన్నై-కోల్‌కతా (జాతీయ రహదారి-16) మార్గంలో ఆనందపురం వద్ద నిత్యం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి 8 గంటల వరకూ ట్రాఫిక్ చాలా రద్దీగా ఉంటుంది.

★ పెందుర్తి, పద్మనాభం, ఆనందపురం మండలాల్లోని పలు గ్రామాల ప్రజలు సర్వీసు మార్గంలోనే రావాల్సివస్తోంది.

★ శ్రీకాకుళం, విజయనగరం వైపు నుంచి వచ్చే వాహనాలకే ఇబ్బంది ఉండదు.



క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఈ సమస్యపై మీ అభిప్రాయాన్ని తెలపొచ్చు.

సమస్య 1 గండిగుండం నుంచి ఆనందపురం రావాలంటే.. సర్వీసు రహదారే దిక్కు. జాతీయ రహదారిపై ప్రయాణిస్తే ఆనందపురం దాటి 3 కి.మీ. ముందుకెళ్లి, మళ్లీ 3 కి.మీ. వెనక్కి రావాల్సిందే.

సమస్య 2 విశాఖ నుంచి (కొమ్మాది మీదుగా) వచ్చి ఆనందపురం-అనకాపల్లి జాతీయ రహదారిపైకి చేరాలంటే చుక్కలు కనిపిస్తాయి. కూడలి నుంచి సర్వీసు రోడ్డులో 17 కి.మీ. ప్రయాణిస్తే గండిగుండం వద్ద జాతీయ రహదారిపైకి వెళ్లేందుకు అవకాశం ఉంది. లేదంటే... కూడలి దాటి 3 కి.మీ. ముందుకెళ్లి... మళ్లీ సర్వీసు రోడ్డులో 2 కి.మీ. వెనక్కి వస్తే జాతీయ రహదారిపైకి చేరొచ్చు.

సమస్య 3 విశాఖ నుంచి విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశా వైపు వెళ్లే ఏ వాహనమైనా జాతీయ రహదారి దిగి.. కూడలిని దాటి... మళ్లీ సర్వీసు రోడ్డు మీదుగా కి.మీ. ప్రయాణిస్తేగానీ జాతీయ రహదారిపైకి చేరదు.

ఏం చేయాలంటే.. ఇక్కడ ప్రస్తుతమున్న సర్వీస్ మార్గాలను విస్తరించాలి. స్థానిక పరిస్థితులకు, వ్యాపారాలకు ఇబ్బంది లేని రీతిలో పరిష్కార మార్గం చూపించాలి. ఉత్తరాంధ్రలోనే అతి పెద్ద పూల మార్కెట్‌కు రాకపోకలు సజావుగా సాగేలా చూడాలి.

తరగని ఆసక్తి.. సాధనే శక్తి!

ఆదర్శం 77 ఏళ్ల వైజయంతిమాల

మురళీనగర్, న్యూస్‌టుడే: అవకాశాలను అందిపుచ్చుకుని క్రీడల్లో రాణించడానికి వయసు అడ్డంకి కాదంటారు నగరానికి చెందిన కొడాలి వైజయంతిమాల. వయసుకు తగ్గ ఆహారం తీసుకుని క్రమం తప్పకుండా సాధన చేస్తే విజయం సొంతం అవుతుందని చెబుతున్నారీమె. 77 ఏళ్ల వయసులో ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ దేశాల్లో నిర్వహించే పోటీలకు(పరుగు, నడక, మారథాన్) హాజరవుతూ పతకాలు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇప్పటివరకు ఫ్రాన్స్, శ్రీలంక, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా, ఫిలిప్పీన్స్, స్వీడన్ దేశాలలో జరిగిన పోటీల్లో పాల్గొన్నారు. సాధించిన విజయాలు, పతకాలు, ఆసక్తి తదితర వివరాలు ఆమె మాటల్లోనే.

ఆసక్తి ఇలా: ఒడిశా విద్యాశాఖలో క్లాస్-1 ఆఫీసర్‌గా 2006లో పదవీ విరమణ చేశాను. అనంతరం హైదరాబాద్‌లోని మహాత్మాగాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ సోషల్ యాక్షన్ (ఎంజీఎన్ఐఆర్ఎస్ఏ) సంస్థకు డైరెక్టర్‌గా పనిచేసి మహిళా సాధికారతకు యూఎస్ఏ, చైనా, మలేసియా, జపాన్, తైవాన్, కువైట్, ఆస్ట్రేలియా, బ్రిటన్, ఈజిప్ట్ దేశాల్లో జరిగిన ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొన్నా.

★ 2008 నుంచి విశాఖలో స్థిరపడ్డాను. 2009లో నగరంలో వైజాగ్ రన్ పేరుతో సాగిన పోటీల్లో తొలిసారి పాల్గొని మొదటి స్థానంలో నిలిచా. బహుమతి రూ.5 వేలు వచ్చింది. దీంతో ఇలాంటి క్రీడల్లో పాల్గొనాలనే ఆసక్తి కలిగింది.

జాతీయ పతాకంతో వైజయంతిమాల

గత 16 ఏళ్లుగా: ప్రతిరోజు ఉదయాన్నే నడక, పరుగు సాధన చేస్తున్నాను. విదేశాల్లో జరిగే పోటీలకు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకుని పాల్గొంటున్నాను. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం మరువలేనిది.

ఆహారపు అలవాట్లు..

ఉదయాన్నే రెండు గ్లాసుల నీరు తాగుతాను. రాగిజావ, ఓట్స్ తీసుకుంటాను. మొలకెత్తిన గింజలు, పండ్లు, ఎక్కువగా తీసుకుంటాను. అప్పుడప్పుడు ఇడ్లీ, దోశ తింటాను. నూనె తక్కువగా వేసిన కూరలను ఎక్కువగా తీసుకుంటాను. రాత్రి రెండు పుల్కాలు తీసుకుంటా.

ప్రశంసలు..

స్థానిక వాకర్స్ క్లబ్‌ల నుంచి ఎన్నో సత్కారాలు, ప్రశంసలు దక్కాయి. ఇప్పటివరకు 150కి పైగా పతకాలు సాధించా. పోటీలకు వెళ్లడం వల్ల శారీరకంగా, మానసికంగా ఆహ్లాదంగా ఉంటుంది. కొత్త కొత్త విషయాలు తెలుసుకుంటున్నాను. పోటీలకు వెళ్లేందుకు నా సొంత డబ్బునే వినియోగిస్తా.

ఖేలో ఇండియా పోటీల్లో బాలికల సత్తా

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాజవొమ్మంగి ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల విద్యార్థినులు ఖేలో ఇండియా మహిళా లీగ్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటి 12 పతకాలు సాధించారు. అరకులోయలో ఇటీవల జరిగిన ఈ పోటీల్లో 44 కేజీల విభాగంలో ఎస్.మోనిక, 53 కేజీల విభాగంలో బి.సాయిదుర్గశ్రీ, 77 కేజీల విభాగంలో ఎస్.లోకోమో, 86 కేజీల విభాగంలో వి.జెస్సీ రాణి ప్రథమ స్థానంలో నిలిచారు. 48 కేజీల విభాగంలో జె.శాంతిలక్ష్మి, దుర్గా పావని, 58 కేజీల విభాగంలో ఇ.దుర్గాదేవి, కె.సత్యశివపార్వతి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో, 63 కేజీల విభాగంలో డి.సంతోష్ వీణ, 69 కేజీల విభాగంలో కె.బ్లెస్సీ విక్టోరియా ద్వితీయ స్థానంలో నిలిచారు. ఆరు బంగారు, నాలుగు రజత, రెండు కాంస్య పతకాలు సాధించారని ప్రిన్సిపల్ తెలిపారు.

విజేతలతో ఉపాధ్యాయులు

చెట్టు కొమ్మపడి గిరిజనుడి మృతి

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: చికిలింతకు చెందిన గిరిజనుడు బి.రమణ (51) చెట్టు కొమ్మ పడి గురువారం మృతి చెందాడని జడ్డంగి ఎస్సై చినబాబు చెప్పారు. కట్టెలు కొట్టేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తూ ఎండిన కొమ్మ మీద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు

JOBS
SECURITY GUARDS
కాకినాడ ఏరియాలో ఒంటిమామిడి ప్రాంతం ప్రముఖ కంపెనీలో సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మంచి జీతం భోజనం+ వసతి కలదు. డ్యూటీ: 8 గం॥ జీతం: 18,500/- 26 రో॥ Contact Ph: 8374164245, 7893197794.

హాల్‌టికెట్‌పై కోడ్.. పరీక్ష కేంద్రానికి తోడు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులు ఇక పరీక్ష కేంద్రాలను సులువుగా గుర్తించి సకాలంలో చేరుకోవచ్చు. విద్యా సంస్కరణలకు కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వం వీరి సౌకర్యార్థం హాల్‌టికెట్‌పై క్యూఆర్‌కోడ్ విధానాన్ని అమలు చేస్తోంది. ఇప్పటివరకు పరీక్షల ముందు కేంద్రాలు ఎక్కడున్నాయో వెతుకులాటతో ఇబ్బందులు ఎదురయ్యేవి. ఇప్పుడు క్యూఆర్‌కోడ్ పుణ్యమా అంటూ ఈ తరహా ఇబ్బందులకు తెరపడనుంది. ఏమాత్రం జాప్యం లేకుండా కేంద్రానికి చేరుకోవడానికి సాధ్యమవుతుంది.

★ పదోతరగతి పరీక్షలంటేనే విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడి ఉంటుంది. పరీక్షల రోజున కేంద్రాలకు చేరుకోవడం చాలామందికి సవాలుగా మారుతోంది. జంబ్లింగ్ విధానంతో ఏ సెంటర్ కేటాయిస్తారో తెలియని పరిస్థితి. ఇవి ఎక్కడ ఉన్నాయో గుర్తించడానికి తంటాలు పడుతుంటారు. దీనికి తోడు ఇటీవల కాలంలో ట్రాఫిక్ సమస్యలు ఈ సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. దీని వల్ల పుణ్యకాలం కాస్త గడిచిపోయి కొంతమంది సకాలంలో కేంద్రాలకు చేరుకోలేకపోతున్నారు.

✦ ప్రభుత్వం ఈసమస్యపై ఇప్పుడు సానుకూలంగా స్పందించింది. సాంకేతికత సాయంతో ఈ ఇబ్బందులను నివారించేందుకు చర్యలు తీసుకుంది. విద్యార్థుల హాల్‌టికెట్లపైన పరీక్ష కేంద్రం లొకేషన్‌కు సంబంధించిన క్యూఆర్ కోడ్ ముద్రించి తద్వారా సమయం వృథా కాకుండా చర్యలు తీసుకున్నారు. జిల్లాలో 119 కేంద్రాల్లో 23,815 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. వీరందరికీ ఈ కోడ్‌తో ఏ ఇబ్బంది లేకుండా అందులోని మ్యాప్ ఆధారంగా కేంద్రానికి ఏలా చేరుకోవాలో స్పష్టమవుతుందని నర్సీపట్నం మండల విద్యాశాఖాధికారి తలుపులు తెలిపారు.

▸▸ కేంద్రాల కేటాయింపులో జంబ్లింగ్ పద్ధతి ఎప్పటి నుంచో అమలవుతోంది. దీనివల్ల ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో పరీక్షలు రాయాల్సిన వారంతా అవస్థలు పడుతున్నారు. విశాఖ, అనకాపల్లి, నర్సీపట్నంలో అక్కడక్కడ స్కూళ్లను కేంద్రాలుగా ఏర్పాటు చేస్తున్నారు. కాపీయింగ్ నిరోధానికి ఇది మంచి పద్ధతి అయినప్పటికీ పొరుగు ప్రాంతాల విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉదాహరణకు నర్సీపట్నం మున్సిపాలిటీలోని వార్డునంబరుతో జడ్పీ హైస్కూల్ అని హాల్‌టికెట్‌పై చిరునామా పేర్కొంటే.. ఇతర ప్రాంతాల వారు ఇక్కడ చేరుకునే సరికి మూడు హైస్కూళ్లు కనిపించేవి. దీంతో తమకు కేటాయించింది ఏదో తెలియక మూడింటి చుట్టూ ప్రదక్షిణలు చేసేవారు.

చోరీ కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు

హుకుంపేట, న్యూస్‌టుడే: ముక్కు పుడకను దొంగిలించి వృద్ధురాలిని గాయపర్చిన నిందితుడికి రెండేళ్ల జైలు శిక్షతోపాటు రూ.రెండు వేల జరిమానా విధించినట్లు సీఐ సన్యాసినాయుడు తెలిపారు. శోభకోట గ్రామానికి చెందిన లకే రమణమ్మ(74)ను ముక్కుపుడకను అదే గ్రామానికి చెందిన కాకరి రాంబాబు దొంగిలించేందుకు ప్రయత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో రాంబాబు స్టీల్ గ్లాసు, గరిటెతో కొట్టి ఆమెను గాయపరిచాడు. నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు. బాధిత కుటుంబసభ్యులు వృద్ధురాలిని పాడేరు ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందించారు. ఈ విషయంపై రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో రాంబాబును అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడికి కోర్టు శిక్ష విధించిందని పేర్కొన్నారు.

సికెల్‌సెల్ ఎనీమియాతో సచివాలయ ఉద్యోగిని మృతి

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: సికెల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతూ సచివాలయ ఉద్యోగిని మృతి చెందింది. కొత్తగూడెం గ్రామానికి చెందిన కంకిపాటి **అరుణకుమారి** వెటర్నరీ సహాయకురాలిగా పనిచేస్తోంది. గతంలో రింతాడ సచివాలయంలో పని చేసిన ఆమె ప్రస్తుతం చింతపల్లి మండలం చౌడుపల్లి-2 సచివాలయంలో విధులు నిర్వహిస్తోంది. సికెల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతూ గురువారం మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. సచివాలయం ఉద్యోగుల సంక్షేమ సంఘం చింతపల్లి అధ్యక్షుడు వంపూరి శోభన్, కార్యదర్శి రెడ్డి శాంతి కొత్తగూడెంలో అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబసభ్యులను పరామర్శించారు.

నిచ్చెన పైనుంచి పడి ఇద్దరికి తీవ్రగాయాలు

చింతపల్లి గ్రామీణం: తాజంగిలో స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణ పనులు చేస్తుండగా ఇద్దరు కార్మికులు ప్రమాదానికి గురయ్యారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడుకు చెందిన గంతకూరి వీరబాబు, ఈగల బాబూరావు గురువారం నిచ్చెనపై నిల్చుని పనులు చేస్తుండగా.. ప్రమాదవశాత్తు జారి పడి గాయాలపాలయ్యారు. తోటి కార్మికులు తాజంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

వైద్యులు ప్రథమ చికిత్స అందించి.. మెరుగైన వైద్యం కోసం అంబులెన్సులో చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యులు అనూష సేవలందించి.. నర్సీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సచివాలయంలో తనిఖీలు

అడ్డతీగల, న్యూస్‌టుడే: సచివాలయ సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలని ఎంపీడీవో ఏవీవీ కుమార్ సూచించారు. కోనలోవ సచివాలయాన్ని గురువారం ఆకస్మికంగా సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. 11 రిజిస్టర్లకు మూడింటినే నిర్వహిస్తుండటంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం సంపద తయారీ కేంద్రం, గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, అంగన్‌వాడీ కేంద్రం, మండల పరిషత్తు పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారా లేదా అని ఆరా తీశారు.

కోనలోవలో దస్త్రాలు పరిశీలిస్తున్న ఎంపీడీవో కుమార్

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	103
లైవ్	142	123
డ్రెస్‌డ్	206	216
స్కిన్‌లెస్	234	226

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా

పాడేరు: 89853 66570 అరకులోయ: 63034 86346 రంపచోడవరం: 94908 77172

మారేడుమిల్లి, కుట్టవాడలో బస్ షెల్టర్ నిర్మాణ లోపంతో నిరుపయోగంగా మారింది. వినియోగంలోకి తీసుకురావాలి. – పల్లాల హనుమంతరెడ్డి, కాకూరు

✓ బస్ షెల్టర్‌ను పరిశీలించి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువస్తాం. – శ్రీనివాసరావు, ఈవోఆర్డీ

జి.మాడుగుల, న్యూస్‌టుడే: మగతపాలెం నుంచి పెదపిన్నపాలెం రహదారి పూర్తిగా ధ్వంసమైంది. భారీ వాహనాలు వెళ్లడంతోనే రహదారి పాడైంది. వెంటనే బాగుచేయాలి. – హనుమంతరావు, సర్పంచి, సొలభం

✓ పెదపిన్నపాలెం ఆవతల ఉన్న గ్రామాలకు రహదారి సదుపాయం కల్పించేందుకు భారీ వాహనాలు తిరుగుతున్నాయి. ఆ రహదారులు పూర్తయిన తరువాత మగతపాలెం-పెదపిన్నపాలెం రహదారికి మరమ్మతులు చేయిస్తాం. – మాణిక్యం, ఇంజినీరింగ్ ఏఈ, జి.మాడుగుల

దరఖాస్తుల ఆహ్వానం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్ల దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ విజయబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఈనెల 22వ తేదీలోపు కళాశాలకు హాజరుకావాలని, బీకాం, బీఎస్సీ (జువాలజీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్) గ్రూపుల్లో మాత్రమే ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు.

బొజ్జిరెడ్డి దృష్టికి సమస్యలు

గంగవరం, న్యూస్‌టుడే: మండలంలో నెలకొన్న సమస్యలను ప్రస్తావిస్తూ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డికి స్థానిక భాజపా నాయకులు గురువారం రాజమహేంద్రవరంలో వినతి పత్రం అందజేశారు. ఆ పార్టీ మండల అధ్యక్షులు నీలాయమ్మ, రమేష్, వెంకటేశ్వర్లుదొర వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

గోదాములో ఓనమాలు

జీసీసీ గోదాములో చదువుకుంటున్న చిన్నారులు

మోతుగూడెం, న్యూస్‌టుడే: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ బచ్చులూరులో మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల సమస్యలతో కునారిల్లుతోంది. ఈ పాఠశాల భవనం నిర్మించి రెండున్నర దశాబ్దాలు కావస్తుండటంతో శిథిలావస్థకు చేరింది. వర్షానికి స్లాబ్ లీకై గదులు కారుతున్నాయి. స్లాబ్ పెచ్చులూడి పడుతుండటంతో పిల్లలను బడికి పంపేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఉపాధ్యాయుడు పాఠశాల పక్కనున్న జీసీసీ గోదాములో చిన్నారులకు విద్యాబోధన చేస్తున్నారు. ఈ ఏడాది డీఎస్సీలో ఉద్యోగం సాధించిన ఉపాధ్యాయునికి ఇక్కడ పోస్టింగ్ ఇచ్చారు.. ఆమె విధుల్లో చేరలేదు. పిల్లల చదువులకు ఆటంకం లేకుండా డొంకరాయి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిని తాత్కాలికంగా ఇక్కడకు పంపారు. పాఠశాల సమయానికి బస్సు లేకపోవడంతో రోజూ బైక్‌పై 50 కి.మీ. ప్రయాణించి రావాల్సి వస్తోంది. అధికారులు స్పందించి భవనం మంజూరు చేయడంతోపాటు శాశ్వత ఉపాధ్యాయుడిని నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రహరీ లేక పాట్లు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో కష్టాలు వెంటాడుతున్నాయి. గత ప్రభుత్వం నాడు-నేడులో పాఠశాలలను ఆధునికీకరణ చర్యలు చేపట్టినా.. పనులు అంతంతమాత్రంగానే చేపట్టి చేతులు దులుపుకొన్నారు. డుంబ్రిగుడ మండలంలోని సొవ్వా గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రహరీ లేక చిన్నారులు బిక్కుబిక్కుమంటూ చదువుకుంటున్నారు. రాత్రివేళల్లో పశువులు లోపలకు చేరుతున్నాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి ప్రహరీ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

రక్షణ గోడ లేని సొవ్వా ఆశ్రమ పాఠశాల

సర్వేలో లోపాలు సరిచేయండి

కూనవరం, న్యూస్‌టుడే: పోలవరం పరిహారం పంపిణీలో తేడాలు, సర్వేలో లోపాలను కరకగూడెం, పంద్రాజుపల్లి, కొత్తూరు గ్రామస్థులు గురువారం మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయనకు అందజేశారు. వరద ముంపుతో ఎదురవుతున్న ఇబ్బందులను కరకగూడెం గ్రామస్థులు వివరించారు. మిగిలిన రెండు గ్రామాల్లో అందరికీ ఇళ్ల పరిహారం అందలేదని పేర్కొన్నారు. కరకగూడెం సర్పంచి వెంకటేశ్వర్లు, రంజిత్, సాంబు, రమేష్, కన్నయ్య, వీరబాబు, రాము తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నిర్వాసితులు

పాపికొండల యాత్రకు తగ్గిన పర్యాటకులు

దేవీపట్నం, న్యూస్‌టుడే: పాపికొండల విహారయాత్రకు వచ్చే పర్యాటకుల సంఖ్య తగ్గింది. మూడు రోజులుగా గండిపోశమ్మ అమ్మవారి ఆలయం నుంచి రోజుకు ఒక బోటులో పాపికొండల సందర్శనకు పర్యాటకులు వెళ్తున్నారు. గురువారం ఒక బోటులో 51 మంది వెళ్లారని కంట్రోల్ రూం అధికారులు చెప్పారు. శని, ఆదివారాల్లో నాలుగు నుంచి ఐదు బోట్లలో పర్యాటకులు వెళ్లవచ్చన్నారు.

ఆన్‌లైన్ విధానంతో తప్పని తిప్పలు

గంగవరం ఐసీడీఎస్ కార్యాలయంలో ఆన్‌లైన్ నమోదుకు వచ్చిన గర్భిణులు, బాలింతలు

అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం తప్పనిసరి కావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మన్యంలో సెల్ సంకేతాలు అందక, అంగన్‌వాడీ కేంద్రాలకు ఇచ్చిన సెల్‌ఫోన్లు సక్రమంగా పనిచేయకపోవడంతో కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలకు తిప్పలు తప్పడం లేదు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీలతోపాటు లోతట్టు ప్రాంతాల్లోని వారంతా ఎఫ్‌ఆర్‌ఎస్ నమోదు కోసం గంగవరంలోని ఐసీడీఎస్ కార్యాలయానికి రావాల్సి వస్తోంది. అంగన్‌వాడీ కార్యకర్తల సెల్‌ఫోన్లు సపోర్టు చేయకపోవడంతో లబ్ధిదారులను ఐసీడీఎస్ కార్యాలయానికి పిలిపించి వైఫై ద్వారా వారి ఫోన్లలో యాప్ ఇన్‌స్టాల్ చేసి ఎఫ్ఎస్ఆర్ నమోదు చేస్తున్నారు. – గంగవరం, న్యూస్‌టుడే

ప్రత్యామ్నాయ పంటల సాగు ఫలితమిచ్చేనా?

ఎటపాక, న్యూస్‌టుడే: గోదావరి వరదలు, తుపాన్లు, ప్రతికూల వాతావరణ పరిస్థితులతో ఈ ఏడాది రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జూన్ నుంచి అక్టోబర్ వరకు ఎనిమిది పర్యాయాలు వరదలు పంట పొలాలను ముంచెత్తాయి. ఫలితంగా మూడు నెలపాటు సాగు ఆలస్యమైంది. విలీన మండలాల్లో మిరప, పత్తి, వరి అధిక విస్తీర్ణంలో సాగవుతాయి. సెప్టెంబరులో వచ్చిన వరదలకు ఈ మూడు పంటలు ముంపునకు గురయ్యాయి. వందల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. ఎకరాకు రూ.35 వేల నుంచి రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతులు మళ్లీ పొలాలను దున్ని ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు అడుగులు వేశారు. పొగాకు, మొక్కజొన్న, పుచ్చ, కూరగాయలు, పప్పుధాన్యాలు పండిస్తున్నారు.

చింతూరు డివిజన్ పరిధిలో మిరప, పొగాకు మినహా పుచ్చ, మొక్కజొన్న, మినుము, పెసర, కూరగాయల పంటలు 1600 ఎకరాల్లో సాగవుతున్నాయి. ఇప్పటికే సాగు ఆలస్యమైందని, గత నెలలో మొంథా తుపానుకు నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మలుపులో ముప్పు

పాడేరు నుంచి పెదబయలు, ముంచంగిపుట్టు, డుడుమ వెళ్లే ప్రధాన రహదారిలో మట్టిమెట్ట మలుపు వద్ద ప్రమాదం పొంచి ఉంది. ఈ మలుపు సమీపంలో వంతెన రక్షణగోడ శిథిలమై కొంత భాగం కూలిపోయింది. ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించే క్రమంలో అదుపుతప్పితే వాహనాలు వంతెన కింద పొలాల్లోకి దూసుకుపోయే ప్రమాదం ఉంది. మలుపుల్లో తుప్పలు సైతం పెరిగాయి. రక్షణ గోడ నిర్మించాలని, రోడ్డుకు ఇరువైపులా తుప్పలు తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. – ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

నీటి పథకాలు నిర్వీర్యం

మన్యంలోని గ్రామాల్లో నీటి పథకాలు నిర్వహణ పడకేసింది. ఫలితంగా నీటిఎద్దడితో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. జలజీవన్‌మిషన్ కింద చేపట్టిన పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో గిరిజనులకు ఊటనీరే దిక్కవుతోంది. ఏనుగురాయి పంచాయతీ కొండపడ గ్రామంలో ఈ పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. బోరుబావిపై మోటారు అమర్చలేదు. పైపులు నీటిట్యాంకు చెంతనే వదిలేశారు. గతంలో నిర్మించిన ట్యాంకులు మూలకుచేరాయి. ప్రస్తుతం ప్రైవేటు స్వచ్ఛంద సంస్థ నిర్మించిన గ్రావిటీ ద్వారా కొండలపై నుంచి వచ్చే నీటిని వినియోగించుకుంటున్నామని గ్రామస్థులు చెబుతున్నారు. జల్‌జీవన్ మిషన్ పనులు పూర్తి చేసి, రక్షిత నీరు అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ రాజేష్‌ను వివరణ కోరగా.. మోటారు అమర్చి నీటి సరఫరాకు చర్యలు చేపడతామని చెప్పారు. – ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

పల్పింగ్ యూనిట్ల నిర్మాణం పూర్తిచేయండి

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: జీకేవీధి, జి.మాడుగుల, చింతపల్లి మండలాల్లో అసంపూర్తిగా ఉన్న ఎకో కాఫీ పల్పింగ్ యూనిట్ల నిర్మాణం పూర్తి చేయాలని బీసీవై పార్టీ జిల్లా అధ్యక్షులు కిల్లో రాజన్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రైతులు కాఫీ పండ్లు సేకరిస్తున్నారు. నిర్మాణాలు పూర్తిచేస్తే ప్రయోజనంగా ఉంటుందని చెప్పారు.

వరికుప్పలు దగ్ధం

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: పినకోట పంచాయతీ పరిధిలోని కొరపర్తి గ్రామంలో గురువారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో వరి కుప్పలు దగ్ధమయ్యాయని గ్రామస్థులు తెలిపారు. జమ్ము పెంటయ్యకు చెందిన వరి కుప్పలు అగ్ని ఆహుతయ్యాయి. పంట చేతికి అందే సమయంలో కాలిపోవడంతో బాధిత రైతు లబోదిబోమన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు రామన్న తదితరులు కోరారు.

23న జిల్లాస్థాయి చెకుముకి సంబరాలు

కూనవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం మండలం ముసురుమిల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ఈ నెల 23న జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు జరగనున్నాయి. మండల స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు హాజరవుతారని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జయ్య, కన్నారావు గురువారం చెప్పారు.

రోడ్డు బాగు చేయాలి

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: రొంపల్లి పంచాయతీ పరిధిలోని రాయిపాటు నుంచి వనిజా వరకు రహదారికి మరమ్మతులు చేపట్టాలని వార్డుసభ్యురాలు అప్పలరాజు డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి అంతా గోతులమయంగా మారిందని పేర్కొన్నారు. అధికారులు స్పందించాలని కోరారు.

సంస్మరణ సభ జయప్రదానికి పిలుపు

ఎటపాక, న్యూస్‌టుడే: చింతూరులో ఈ నెల 24న జరగనున్న అమరవీరుల సంస్మరణ సభను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మర్లపాటి నాగేశ్వరరావు కోరారు. ఎర్రగట్టులో గురువారం కార్యకర్తలతో సమావేశమయ్యారు. జిల్లా కార్యదర్శి కిరణ్, వెంకటేశ్వర్లు, ధర్మరాజు, శంకర్, రాంబాబు, రాజు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం సరికాదు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: బీటీరోడ్డు నిర్మాణంలో అధికారుల నిర్లక్ష్యం తగదని కుట్టి గ్రామ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రంగిలిసింగి పంచాయతీ మారుమూల కుట్టి గ్రామానికి అయిదేళ్ల క్రితం బీటీరోడ్డు నిర్మాణం చేపట్టారు. రహదారి నిర్మాణం పూర్తయ్యి అయిదేళ్లు కావడంతో గుత్తేదారు పైపైనే మెరుగులు అద్దుతున్నారన్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు.

పాఠశాల భవనాలకు ప్రతిపాదనలు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: పాఠశాల భవన నిర్మాణాలకు నిధులు కేటాయించాలని కోరుతూ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి-2 గెన్ను తెలిపారు. కితలంగి పంచాయతీ పింపోల్‌గుడలో మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. చిన్నారుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. 16 మంది చిన్నారులు భవనం లేక ఆరుబయటే చదువులు సాగిస్తున్నారన్నారు. సీఆర్‌పీ సింహబలుడు తదితరులు పాల్గొన్నారు.

పింపోల్‌గుడలో చిన్నారులతో మండల విద్యాశాఖ అధికారి-2 గెన్ను

పుస్తక పఠనంతో ఉన్నత భవిత

డుంబ్రిగుడ, హుకుంపేట, న్యూస్‌టుడే: పుస్తక పఠనంతో ఉన్నత భవిష్యత్తు ఉంటుందని ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్ అన్నారు. డుంబ్రిగుడలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం ఉత్సాహంగా జరిగింది. గ్రంథాలయ అధికారిణి సునీత ఆధ్వర్యాన విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ప్రధానోపాధ్యాయుడు ప్రభుదాస్, అధ్యాపకులు కమలాకర్, దివాకర్, ఉపాధ్యాయుడు సింహాద్రి పాల్గొన్నారు. హుకుంపేటలో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం భీమ్‌నాయుడు పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారిణి సత్యవతి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేటలో బహుమతుల ప్రదానం

కూనవరం, న్యూస్‌టుడే: కూనవరంలో జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గ్రంథపాలకులు గోవిందరాజులు, గ్రంథాలయ కమిటీ ఛైర్మన్ వెంకటస్వామి, కన్యకా పరమేశ్వరి, అరుణ, రమాదేవి, రవి పాల్గొన్నారు.

కొయ్యూరు, న్యూస్‌టుడే: గ్రంథాలయాలతో విజ్ఞానం పెరుగుతుందని స్థానిక గ్రంథాలయాధికారిణి సీతామహాలక్ష్మి అన్నారు. మర్రిపాలెం మహిళా డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ పితామహుడు ఎస్.ఆర్.రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ సుధ పాల్గొన్నారు.

మర్రిపాలెంలో రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది

కూనవరంలో విద్యార్థులతో సిబ్బంది, అతిథులు

పాడేరు, చింతూరు, న్యూస్‌టుడే: పాడేరులో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ ఎం.జాన్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి గ్రంథాలయాలు దోహదపడతాయన్నారు. గ్రంథాలయ అధికారిని మానస, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కన్నయ్య పాల్గొన్నారు. చింతూరు డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో లైబ్రేరియన్ గోవిందరాజును సన్మానించారు. ప్రిన్సిపల్ రత్నమాణిక్యం, అధ్యాపకులు పద్మ, శైలజ, నాగమోహనరావు పాల్గొన్నారు.

గంగవరం: క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుందని సర్పంచి అక్కమ్మ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారిణి గంగాభవాని, ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, గంగాభవాని పాల్గొన్నారు.

తెరుచుకోనున్న చింతపల్లి ఉపకారాగారం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: దాదాపు 20 సంవత్సరాల క్రితం మూసివేసిన చింతపల్లి ఉప కారాగారం త్వరలో తెరుచుకోనుంది. జిల్లా సబ్ జైల్ అధికారి జి.వెంకటరమణ (విశాఖపట్నం) గురువారం స్థానిక జైల్‌ను సందర్శించారు. 2005 సంవత్సరంలో దీన్ని మూసివేశారని, అప్పటినుంచి చింతపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నిందితులను నర్సీపట్నం, అడవివరం తరలిస్తున్నారన్నారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా ఈ ఉప కారాగారాన్ని సందర్శించి ఇక్కడి పరిస్థితులు, భద్రత తదితర విషయాలు అధ్యయనం చేశామన్నారు. నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. సబ్‌జైలర్ రాజు, వర్తక సంఘం నాయకులు బేతాళుడు, నాగు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి సబ్‌జైలును పరిశీలిస్తున్న వెంకటరమణ

సందడిగా వనసమారాధన

విద్యార్థినుల నృత్య ప్రదర్శన

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో బుధవారం వనసమారాధన సందడిగా జరిగింది. విద్యార్థినుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రణాళిక ప్రకారం చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రిన్సిపల్ సత్యవేణి సూచించారు. అనంతరం మధ్యాహ్నం విద్యార్థులు, ఉపాధ్యాయులు సహపంక్తి భోజనాలు చేశారు.

పత్తాలేని సచివాలయ సిబ్బంది

పెదబయలు మండలంలోని ఒడిశా సరిహద్దుకు ఆనుకొని ఉన్న జామిగుడ సచివాలయంలో గురువారం సిబ్బంది లేక ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. గురువారం ఉదయం పదకొండు గంటలవుతున్నా ఏఎన్‌ఎం తప్ప ఇతర సిబ్బంది ఎవరూ లేరు. మధ్యాహ్నం ఒంటి గంటయినా ఒక్కరూ రాలేదు. మారుమూల పంచాయతీ కావడంతో సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు పేర్కొన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి పవన్‌ని 'న్యూస్‌టుడే' ఫోన్‌లో వివరణ కోరగా.. తాను సెలవులో ఉన్నానన్నారు. – పెదబయలు, న్యూస్‌టుడే

జామిగుడ సచివాలయంలో ఉదయం 11 గంటలకు ఖాళీగా కుర్చీలు

రూ.నాలుగు కోట్లతో రహదారుల నిర్మాణం

మద్దిల బూసుకొండ రహదారి పనులు పరిశీలిస్తున్న డీఈఈ జ్యోతిబాబు

సీలేరు, న్యూస్‌టుడే: గూడెంకొత్తవీధి మండలం మారుమూల గాలికొండ పంచాయతీలో రూ.4 కోట్లతో పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో రహదారి పనులు జరుగుతున్నాయి. గాలికొండ నుంచి మద్దిలబూసుకొండ వరకూ నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ పనులను పంచాయతీరాజ్ డీఈఈ జ్యోతిబాబు గురువారం పరిశీలించారు. గ్రావెల్ వేసిన తరువాత బీటీ రహదారి వేస్తామని తెలిపారు. గాలికొండ సర్పంచి కాకూరి బుజ్జిబాబు పాల్గొన్నారు.

మోతుగూడెం, న్యూస్‌టుడే: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో 14, 15 ఆర్థిక సంఘాల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి సర్పంచి హేమ సంధ్యారాణి శ్రీకారం చుట్టారు. డొంకరాయి సినిమా హాలు వీధిలో సర్పంచి, ఎంపీటీసీ సభ్యుడు కరకా వెంకటరమణ గురువారం శంకుస్థాపన చేశారు. ఉప సర్పంచి నాగ జయదాస్, వార్డు సభ్యుడు సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రఘుబాబు, గురుమూర్తి, రాజు, ధను, రాము పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

ఎటపాక, న్యూస్‌టుడే: మండలంలో నెలకొన్న పలు సమస్యలను ప్రస్తావిస్తూ పరిష్కారానికి చర్యలు చేపట్టాలని తెదేపా నాయకులు కోరారు. ఆ పార్టీ అరకు పార్లమెంట్ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు గురువారం చింతూరు ఐటీడీఏ పీవో శుభం నొఖ్వాల్‌కు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఎటపాక సర్పంచి వెంకటేశ్వర్లు, మాధవరావు, రవికుమార్, రాంబాబు తదితరులు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

ఐటీడీఏ పీవోకు వినతిపత్రం ఇస్తున్న తెదేపా నాయకులు

ఉపాధ్యాయులను నియమించాలి

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: గుల్లేలు పంచాయతీ జంగంపుట్టు ఎంపీపీ పాఠశాలలో ప్రత్యామ్నాయ ఉపాధ్యాయుడిని నియమించాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి బూడిదే మాధవరావు డిమాండ్ చేశారు. పాఠశాలను గురువారం సందర్శించారు. ఇక్కడ సుమారు 40 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఉపాధ్యాయుడు 20 రోజులుగా అనారోగ్యం కారణంగా సెలవులో ఉన్నారు. దీంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మన్యంలోని పాఠశాలలకు భవనాలు లేక విద్యార్థులు రేకుల షెడ్లలో కాలం వెళ్లదీస్తున్నారని పేర్కొన్నారు. సంఘ నాయకులు చంటిబాబు, లింగమూర్తి, నాగార్జున్, శివాజీ గ్రామస్థులు పాల్గొన్నారు.

షెడ్డు వద్ద బాలలు, తల్లిదండ్రులు, గిరిజన విద్యార్థి సంఘ నాయకుల నిరసన

రుణాల సద్వినియోగంతో ఆర్థికాభివృద్ధి

జి.మాడుగుల, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం డ్వాక్రా సంఘాలకు అందజేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా ఎదగాలని ఎంపీపీ ఎల్.అప్పలరాజు తెలిపారు. జి.మాడుగులలో మన డబ్బులు- మన లెక్కలు ప్రాజెక్టుపై అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. ఎంపీపీ అప్పలరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మన డబ్బులు..మన లెక్కలు యాప్‌పై అవగాహన కలిగి ఉండాలని వెలుగు ఏపీఎం భద్రరావు పేర్కొన్నారు. తెదేపా నాయకుడు నారాయణరాజు, చిన్నకొండబాబు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కాంతమ్మ, ఈఎంటీలు నాగలక్ష్మి, మేరీ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

జి.మాడుగులలో వెలుగు సిబ్బంది ర్యాలీ

ప్రభుత్వ పథకాలపై అవగాహన అవసరం

జి.మాడుగుల, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలపై గిరిజనులు అవగాహన కలిగి ఉండాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బొయితిలి పంచాయతీ గడ్డిబందలు గ్రామాన్ని మండల అధికారుల బృందం గురువారం పర్యటించింది. ఈ గ్రామం ఒడిశా సరిహద్దుల్లో ఉండడంతో ప్రభుత్వ పథకాలు అంతంతమాత్రంగానే అందుతున్నట్లు గుర్తించిన అధికారులు అక్కడకు వెళ్లారు. గ్రామంలో మరమ్మతులకు గురైన తాగునీటి పథకాన్ని పునరుద్ధరించారు. వైద్యపరీక్షలు చేసి.. మందులు పంపిణీ చేశారు. ఈ- కేవైసీ, ఓటర్ నమోదు చేశారు. చిన్నారులకు ఆధార్ లేకపోవడంతో వెంటనే నూతన ఆధార్ కార్డుల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచి మాలన్న, కార్యదర్శి చంద్రరావు, ఏఎన్‌ఎంలు సలోమి, దేవి, పద్మ, అంగన్‌వాడీ కార్యదర్శి లలిత తదితరులు పాల్గొన్నారు.

గడ్డిబందలులో తాగునీటి పథకాన్ని పునఃప్రారంభిస్తున్న అధికారులు, సర్పంచి

జీతాలు పెంచాలని వీఆర్‌ఏల ఆందోళన

అరకులోయలో వీఆర్‌ఏల నిరసన దీక్ష

జి.మాడుగుల, పెదబయలు, న్యూస్‌టుడే: గ్రామ రెవెన్యూ సహాయకులకు జీతాలు పెంచాలని తహసీల్దారు రాజ్‌కుమార్‌కు ఆ సంఘ నాయకులు వినతి పత్రం అందజేశారు. అర్హత ఉన్న వీఆర్‌ఏలకు వీఆర్‌వోలుగా, రికార్డు అసిస్టెంట్స్‌గా పదోన్నతి ఇవ్వాలన్నారు. అటెండర్, రాత్రి సమయాల్లో కార్యాలయంలో డ్యూటీలను రద్దు చేయాలని తెలిపారు. రీసర్వే పేరుతో ఇతర గ్రామాలలో విధులు తొలగించాలన్నారు. వీఆర్‌ఏల సంఘ నాయకులు మత్స్యరాజు, సత్యనారాయణ, బాలకృష్ణ, సత్తిబాబు, సింహాచలం, దేవిక, మచ్చు తదితరులు పాల్గొన్నారు. పెదబయలు తహసీల్దార్ త్రినాథరావుకు వీఆర్‌ఏలు వినతిపత్రం అందించారు. అరకొర వేతనాలతో పనిచేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. వీఆర్‌ఏలు సుందర్‌దేవ్, నీలకంఠం, సతీష్, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

వరరామచంద్రాపురం: సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలంటూ రెవెన్యూ సహాయకుల సంఘ సభ్యులు తహసీల్దార్ సరస్వతికి వినతి పత్రం అందజేశారు. పేస్కేల్ అమలు, అర్హత ఉన్న వారికి పదోన్నతి కల్పించి వీఆర్వోలుగా నియమించాలని కోరారు. ప్రసాద్, పొట్టియ్య, సీత, పోసిబాబు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

అరకులోయ పట్టణం: వీఆర్‌ఏలకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఉమామహేశ్వరరావు అన్నారు. అరకులోయ, డుంబ్రిగుడ మండలాల్లోని వీఆర్‌ఏలు అరకులోయ తహసీల్దారు కార్యాలయం ఆవరణలో రిలే దీక్ష చేపట్టారు. ఉమామహేశ్వరరావు, సీఐటీయూ సహాయ కార్యదర్శి కిల్లో మోస్య, అప్పారావు పాల్గొన్నారు.

వీఆర్‌పురంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వీఆర్‌ఏలు

తాజంగిలో మాట్లాడుతున్న సీడీపీవో శ్రీదేవి

బాధ్యతగా బాల్య వివాహాల నిర్మూలన

ఎటపాక, న్యూస్‌టుడే: బాల్య వివాహాల నిర్మూలనను ప్రతి ఒక్కరూ బాధ్యతగా చేపట్టాలని తహసీల్దారు శ్రీనివాస్ సూచించారు. మండల పరిషత్తు కార్యాలయంలో సీడీపీవో అరుణ అధ్యక్షతన గురువారం అవగాహన కార్యక్రమం ఏర్పాటైంది. ప్రతి నెలా మొదటి శుక్రవారం బాల్య వివాహాల నిర్మూలనపై గ్రామ స్థాయిలో జరిగే అవగాహన కార్యక్రమంలో సంబంధిత అధికారులు విధిగా పాల్గొనాలన్నారు. ఎంపీడీవో నాగమణి, ఎస్సై అప్పలరాజు, ఎంఈవో రాజులు, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: అన్నిశాఖల అధికారులను సమన్వయం చేసుకుని బాల్య వివాహాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని స్థానిక సీడీపీవో శ్రీదేవి అన్నారు. తాజంగి అంగన్‌వాడీ కేంద్రం వద్ద గురువారం బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం ఎన్నో అవకాశాలు కల్పిస్తోందన్నారు. తాజంగి సర్పంచి మహేశ్వరి, హెచ్‌ఎం పడాల్‌దాస్, ఉపాధ్యాయులు గుంజిబాబు, సూపర్‌వైజర్లు సౌజన్య, జయభారతి, మహిళా పోలీసు హిమబిందు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎటపాకలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఖాళీ సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్ 27న

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని బాపట్ల, మడకశిర వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలల్లో మిగిలిపోయిన అగ్రికల్చర్ బి.టెక్ సీట్ల భర్తీకి ఈనెల 27న ఉదయం 10 గంటలకు గుంటూరుకు సమీపంలోని వర్సిటీ పరిపాలన భవన్ లాంలో స్పాట్ కౌన్సెలింగ్ జరగనుందని రిజిస్ట్రార్ ఎ.వి.రమణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో ఎంపీసీ గ్రూప్‌లో ఉత్తీర్ణులై APEAPCET-2025 లో ర్యాంకు పొందినవారు అర్హులన్నారు. పూర్తి వివరాలకు angrau.ac.in ని, మొబైల్ నంబర్లు 80081 03115, 99516 63399లో సంప్రదించాలని సూచించారు.

రెండో ప్రాకారం పనుల శంకుస్థాపనకు ఏర్పాట్లు

మట్టి తొలగింపు పనుల్లో కార్మికులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని గ్రామం వెంకటపాలెం సమీపంలో తితిదే నిర్మించిన వెంకటేశ్వర స్వామి ఆలయం రెండో ప్రాకారానికి 27న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేయనున్నారు. తితిదే ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఆలయం మొదటి ప్రాకారం రాజగోపురం ఎదురుగా రెండో ప్రాకారంతో పాటు మహా రాజగోపుర నిర్మాణం చేసే ప్రాంతంలో మట్టిని తవ్వి శంకుస్థాపనకు సిద్ధం చేస్తున్నారు. అక్కడే హోమాలు, ప్రత్యేక పూజ నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. మరో వైపు శంకుస్థాపన తర్వాత ముఖ్యమంత్రి ప్రసంగించనున్న బహిరంగ సభకు ఆలయ ప్రాంగణంలో జర్మన్ హ్యాంగర్ టెంట్లు నిర్మిస్తున్నారు. ఆలయ ప్రహరీకి తూర్పు దిక్కున జేసీబీలు, యంత్రాలతో వాహనాల పార్కింగ్ స్థలాన్ని సిద్ధం చేస్తున్నారు. ఆలయం సమీపంలో సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసే పనులను ఎన్‌సీసీ సంస్థ చేపట్టింది. గురువారం తుళ్లూరు సీఐ-2 శ్రీనివాస రావు ఏర్పాట్లు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.

కమీషన్ కొట్టు.. బిల్లులు పట్టు!

నగరపాలికలో దళారుల రంగ ప్రవేశం
బిల్లులు ఇప్పిస్తామంటూ వసూళ్ల పర్వం

"మీకు రావాల్సిన బిల్లు ఎంత. ఎప్పటి నుంచి పెండింగులో ఉంది. మీరు ఇకపై ఎలాంటి ఇబ్బంది పడకుండా అధికారులతో మాట్లాడి మేం ఇప్పించేస్తాం. అయితే, ఆ బిల్లులో 3 నుంచి 5శాతం మాకు కమీషన్‌గా ఇస్తే చాలు." అంటూ మధ్యవర్తులు మాటల గారడీకి దిగుతున్నారు.

ఈనాడు, అమరావతి

గుంటూరు నగరపాలక సంస్థలో సాంకేతిక సమస్యలను ఆసరాగా తీసుకుని, గుత్తేదారుల అవసరాలను ఆదాయవనరుగా మార్చుకుని దళారీ వ్యవస్థ కొందరు ఊపిరిపోస్తున్నారు.

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 57 డివిజన్లలో గత ఐదు నెలల్లో రూ.500 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు పచ్చజెండా ఊపారు. తాజా స్థాయీ సంఘ సమావేశంలో మరో రూ.66కోట్ల పనులకు కేటాయించారు. వీటికి సంబంధించి కొన్ని పట్టాలెక్కుతూ, మరికొన్ని కాగితాలకే పరిమితమయ్యాయి. గతంలో జరిగిన అనేక పనులకు సంబంధించి రూ.70కోట్ల మేర బిల్లులు మంజూరు కావాల్సి ఉన్నట్లు జీఎంసీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో కొన్ని బోగస్ బిల్లులు ఉండటం, మరికొన్ని అసంపూర్తి పనులకు ప్రతిపాదించిన నేపథ్యంలో పడపోత చేసిన నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. అక్కడా సాంకేతిక సమస్యలతో మంజూరులో జాప్యం జరుగుతోంది.

గుత్తేదారులకు అవస్థలు: జీఎంసీలో సుమారు 200 మంది కిపైగా గుత్తేదారులు పనులు చేస్తుంటారు. ఇందులో సగానికి పైగా రూ.10లక్షల లోపు పనులు చేసే వారే కావడం గమనార్హం. వీరికి బిల్లుల్లో జాప్యం శరాఘాతంగా మారుతోంది. కొందరు బడా గుత్తేదారులు రాజకీయ అండదండలతో చక్రం తిప్పుతూ పని కానిచ్చేసుకుంటున్న పరిస్థితి. ఈ సమస్య పరిష్కారంపై జీఎంసీ అధికారులు దృష్టి పెట్టారు. ప్రతి గుత్తేదారుకు సంబంధించి చేసిన పనుల్లో ఆర్థిక మొత్తంలో ఉన్న బిల్లు నిబంధనల మేరకు ఉంటే యుద్ధప్రాతిపదికన మంజూరు చేయించేలా కసరత్తు మొదలుపెట్టారు. అలా రూ.30కోట్ల మొత్తానికి తొలివిడతలో అప్‌లోడ్ చేస్తుండగా.. ఇప్పటివరకు రూ.15కోట్లకు పైగా సమోదు జరిగింది. మిగిలిన పనులకీ త్వరితగతిన చేయనున్నారు.

రాజకీయ నేతల పేర్లు చెప్పి..: ఇక్కడే కొందరు దళారులు రంగప్రవేశం చేశారు. 3 నుంచి 5 శాతం కమీషన్ ఇస్తే ప్రథమ ప్రాధాన్యంలో బిల్లు ఇప్పిస్తామంటూ నమ్మబలుకుతున్నారు. రూ.10లక్షల లోపు బిల్లులను నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయకుండా నేరుగా జీఎంసీ నుంచి ఇప్పించేలా చక్రం తిప్పుతున్నారు. దీనికి ఒకరిద్దరు రాజకీయ నేతల పేర్లు వాడుకుంటుండటం గమనార్హం.

ఖాతాలు ఖాళీ

సీతారామపురంలో పైపులైను పనులు

జిల్లాలోని పంచాయతీలు	257
మొత్తం ఇళ్ల సంఖ్య	2,48,948
జనాభా	10,18,531
రావాల్సిన నిధులు	రూ.16.98 కోట్లు

న్యూస్‌టుడే-పొన్నూరు, చేబ్రోలు

పొన్నూరు మండలం సీతారామపురం మైనర్ పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం మొదటి విడత నిధులు రూ.1,53,678లతో వివిధ అభివృద్ధి పనులు చేశారు. బ్యాంకు ఖాతాలో రూ.15 వేల నిల్వ ఉంది. పాత పైపులైను పగిలి నీరు లీకవుతుండటంతో దాన్ని తొలగించారు. నిధుల్లేక అప్పు చేసి రూ.1.20 లక్షలతో కొత్త పైపులైను వేశారు. నిధుల రాక కోసం ఈ పంచాయతీ ఎదురు చూస్తోంది.

దాదాపు 45 రోజుల క్రితం 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు రూ.16.98 కోట్లు మంజూరైనట్టు ఉన్నతాధికారులు ప్రకటించినా ఇంకా బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదని అధికారులు చెబుతున్నారు. మైనర్ పంచాయతీల్లో నిధుల్లేక అనేక సమస్యలతో జనం ఇబ్బంది పడుతున్నారు. పారిశుద్ధ్య కార్మికులకు జీతాలివ్వడం లేదు. కరెంటు బిల్లులు చెల్లించాలని విద్యుత్తు శాఖాధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు.

జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్ మాట్లాడుతూ.. వారం రోజుల్లోగా పంచాయతీల ఖాతాలకు నిధులు జమవుతాయని చెప్పారు.

నిధులిస్తేనే నీరు

కాలువలు, డ్రెయిన్ల మరమ్మతులకు రూ.64 కోట్లతో ప్రతిపాదనలు

ఈనాడు - అమరావతి

మొంథా తుపాను, భారీ వర్షాలకు కృష్ణా డెల్టాలోని కాలువలు, డ్రెయిన్లకు పడ్డ గండ్లను పూడ్చేందుకు రూ.64 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రభుత్వం వీటినెంత తొందరగా అనుమతులిస్తే సాంకేతిక ప్రక్రియలు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని చెబుతున్నారు. తుపాను తరువాత కాలువల్లో నీటి ప్రవాహాలకు అడ్డంకులు లేకుండా తాత్కాలిక పనులు పూర్తి చేశారు.

కాకుమాను: కొండపాటూరు వద్ద నల్లమడ వాగుకు పడ్డ గండి

జిల్లా	పనులు	తాత్కాలిక ఖర్చు	శాశ్వత పనులకు
		(రూపాయలు కోట్లలో)	
గుంటూరు	130	8.10	14.77
బాపట్ల	317	17.68	19.40
ప్రకాశం	25	1.03	2.03
పల్నాడు	3	0.29	0.70
మొత్తం	475	27.10	36.90

నష్టం ఆనవాళ్లిలా..

- గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో కాలువలు, డ్రెయిన్లు దెబ్బతిన్నాయి.. పల్నాడు జిల్లాలో వాగులకు గండ్లు పడ్డాయి.
- మెట్ట ప్రాంతాల నుంచి వాగుల ద్వారా వచ్చిన వరద కారణంగా బాపట్ల జిల్లాలోని పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి.
- నల్లమడ వాగు వరద కొమ్మమూరు కాలువలో కలవడంతో పలు చోట్ల గండ్లు పడ్డాయి. మిగిలిన వాగుల కట్టలూ దెబ్బతిన్నాయి. ఫలితంగా వేలాది ఎకరాల్లోని పంటలు నీట మునిగాయి.
- శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేయడానికి రూ.36.90 కోట్లు కావాలని జలవనరుల శాఖ ముఖ్య ఇంజినీరుకు ప్రతిపాదనలు పంపించారు.
- తాత్కాలిక ప్రతిపదికన ఇప్పటికే కొన్ని పనులు పూర్తి చేశారు. మిగిలిన పనులకు రూ.27.10 కోట్లు అవసరం. మొత్తంగా రూ.64 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదనల్లో కోరారు.
- డెల్టాలో కాలువలు, మురుగు కాలువలు, పల్నాడులో వాగులకు మరమ్మతులు పూర్తి చేస్తే వరద కష్టాల నుంచి ఉపశమనం లభిస్తుంది.

60 ఏళ్ల తరవాత.. 59 నాటి జ్ఞాపకాలు

గుంటూరులో సమావేశమైన జీఎంసీ పూర్వ విద్యార్థులు

గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల 1959-65 బ్యాచ్ పూర్వ విద్యార్థులు వీరే..

ఈ చిత్రంలో కనిపిస్తున్నవారంతా నిపుణులైన సీనియర్ వైద్యులు. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో 1959-65 బ్యాచ్‌కు చెందినవారు. 60 ఏళ్ల తరువాత గురువారం గుంటూరులోని ఓ ప్రైవేటు హోటల్‌లో కలిశారు. నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. జీఎంసీ, జీజీహెచ్‌కు వెళ్లి ప్రిన్సిపల్ సుందరాచారి, సూపరింటెండెంట్ యశ్వంత రావును కలిశారు. నాటి బ్యాచ్‌లో 131 మంది ప్రవేశం పొందగా.. ఇందులో 55 మంది ఇప్పటికే ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోయారు. 20 మంది సమావేశం తెలియలేదు. మిగిలినవారంతా ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకుని అందులో మరుగ్గా ఉంటున్నారు. నేరుగా కలుసుకోవాలని సంకల్పించుకుని 25 మంది పూర్వ విద్యార్థులు వచ్చారు. ప్రతి ఒక్కరూ వారివారి జీవితాల్లో సాధించిన విజయానందాలను అందరితో పంచుకున్నారు. సన్మానాలు, జ్ఞాపికలతో సందడి చేశారు. సభ్యుల వివరాలతో, వివరాలతో సావనీర్ విడుదల చేశారు. చాలాకాలం తరువాత ఒకచోట కలవడం ఆనందంగా ఉందని మహేష్, జి.రంగారావు 'ఈనాడు'తో చెప్పారు. - ఈనాడు, అమరావతి

గుంతల గాయం... రోడ్ డాక్టర్స్‌తో మాయం

విషయం: గుంటూరు నగరంలో గుంతలుగా మారిన రహదారుల మరమ్మతులు చేసే ది రోడ్డు డాక్టర్స్ వాహనం.

వ్యయం: రూ.1.50 కోట్లు

కొనుగోలు చేసింది: గుంటూరు నగరపాలక సంస్థ

రోజుకు ఎన్ని గుంతలు పూడుస్తుందంటే: చిన్నవి అయితే 15, పెద్దవైతే 10.

సిబ్బంది: ఆపరేటరు వంతున 12 మంది రెండు షిఫ్టులకు

ఒక చదరపు మీటరు పనికి అయ్యే వ్యయం: రూ.1,370

న్యూస్‌టుడే-నగరపాలక సంస్థ, పట్టాభిపురం

రింగ్‌రోడ్డులో విద్యానగర్ వద్ద గుంతల పనిలో రోడ్డు డాక్టర్స్ వాహనం

ఇటీవల వర్షాలకు ప్రధాన రహదారులు సహా అంతర్గత రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. ప్రస్తుతం ప్రధాన రహదారుల మరమ్మతులపై దృష్టి సారించిన అధికారులు అంతర్గత రోడ్లకు సంబంధించి ప్రతిపాదనలు స్వీకరిస్తున్నారు. రోడ్ డాక్టర్స్ పేరిట (పాట్‌హోల్స్ బస్టర్స్) పలిచే వాహనంతో రెండేళ్ల పాటు మరమ్మతులు చేయించేందుకు సంబంధిత ఏజెన్సీకి నిర్వహణ బాధ్యత అప్పగించారు. ఒక చదరపు మీటరుకు రూ.1,370 చొప్పున చెల్లించేందుకు జీఎంసీ అంగీకరించింది.

ఎలా పని చేస్తుందంటే.. గుంతలను ఊడ్చి శుభ్రం చేశాక ఎమల్షన్ పోస్తారు. ఇందులో రోడ్ డాక్టర్ వాహనంలో ప్రత్యేకంగా గోతాల్లో తీసుకొచ్చిన కోల్డ్‌మిక్స్ బీటీ వేస్తారు. వాహనాన్ని ఆన్‌లోనే ఉంచడంతో వేడితోపాటు గ్యాస్ సిలిండర్ల ద్వారా వచ్చిన మంటతో తారును కరిగించి వైబ్రేటర్‌తో లెవెల్ చేస్తారు. దానిపై మళ్లీ ఎమల్షన్ పోసి డస్ట్ వేసి గుంతలను పూడుస్తారు. సాధారణ మరమ్మతు కన్నా పటిష్టంగా రోడ్లు దృఢంగా ఉండటంతో పాటు సమయం ఆదా అవుతుందని అధికారులు చెబుతున్నారు.

నిపుణులైన సిబ్బంది దొరక్క ఇటీవల వరకు ఆ వాహనాన్ని బయటకు తీయలేదు. గత కొన్ని రోజులుగా కొన్నిచోట్ల గుంతలు పూడ్చిస్తున్నారు. సిబ్బంది నైపుణ్యం సాధించేలా శిక్షణ ఇప్పిస్తే పనులు వేగవంతమవుతాయి.

ఇప్పటికే కలెక్టరేట్‌రోడ్డు, పట్టాభిపురం, కంకరగుంట, రింగ్‌రోడ్డు, పాతబస్టాండ్, జీటీరోడ్డు తదితర ప్రాంతాల్లో పనులు చేస్తున్నారు.

వార్డులవారీగా అంతర్గత రహదారులకు మరమ్మతులు చేసి డిసెంబరుకు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.

మందులు.. సగం ధర కన్నా తక్కువకే..!

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: పేద, మధ్య తరగతి ప్రజలు బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు మందులు కొని వాడలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి వెతలు తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం సంకల్పించి దశాబ్దం కిందటే నుంచి ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి కేంద్రాలను అందిస్తోంది. బయట మార్కెట్‌లో ఉండే ధరలకు మందులు అందిస్తోంది. వీటిలో బయట కన్నా సగం.. అంతకన్నా తక్కువ ధరకు లభిస్తుండటం విశేషం.

కొన్నింటి ధరల స్ట్రిప్ (రూ.లలో)

మాత్రల పేరు	జన ఔషధిలో	బహిరంగ మార్కెట్‌లో..
లిక్విడ్ పారాఫిన్	57	80
టెల్మిసార్టన్	12	30
డైక్లోఫినాక్‌సోడియం	12	26
పాంటోప్రజోల్	12	30
పొటాషియం క్లావులెట్, అమాక్సిలిన్	56	105
కాల్షియం	14	30

ఎక్కడెక్కడ ఉన్నాయంటే.. జిల్లాలోని ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి దుకాణాలకు రోగులు నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. తెనాలి జిల్లా ఆసుపత్రి, మంగళగిరి ఎయిమ్స్ ప్రాంగణంలో వీటిని నడుపుతున్నారు. అలాగే కొల్లిపర, పెదవడ్లపూడి, తెనాలి ప్రకాశం రోడ్డు, ఐతానగర్, గుంటూరు, పొన్నూరు, చేబ్రోలు వంటి మండల కేంద్రాలు, పట్టణాలలో 22 చోట్ల ఈ జన ఔషధి కేంద్రాలు నడుస్తున్నాయి. మందులు కొనుగోలు చేసి బిల్లు తీసుకున్న వారు నష్టపోతే తిరిగి దాన్ని రాబట్టుకోవచ్చు. కొన్ని మందుల ధరల వ్యత్యాసాన్ని పట్టికలో సరిపోల్చుకుని చూస్తే ఇట్టే తెలిసిపోతుంది.

ఈకేవైసీ చేయించారా? లేదంటే జాబ్‌కార్డు రద్దు

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - జిల్లాపరిషత్తు

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు ఉన్నవారు ఈకేవైసీ చేయించుకుంటేనే కూలీలుగా కొనసాగనిస్తే అర్హులవుతారు. లేదంటే ఇక వారం నుంచి జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్న గ్రామసభల్లో తొలగించనున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో ఇందుకు సంబంధించిన పనులు ప్రదర్శిస్తున్నారు. అభ్యంతరాలుంటే ఉపాధి హామీ సిబ్బందికి తెలియజేయాలని అధికారులు చెబుతున్నారు.

అక్రమాలకు అడ్డుకట్ట..: ఉపాధి హామీ పథక కూలీలందరూ నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్) యాప్‌లో ముఖచిత్ర ఆధారిత గుర్తింపు ద్వారా హాజరు వేయాలి. నిర్దేశిత పనులకు వచ్చిన వారికే హాజరు పడుతుంది. బోగస్ హాజరువంటి అక్రమాలకు కళ్లెం పడుతుంది. అక్టోబరు 1న ప్రారంభమైన ఈకేవైసీ ప్రక్రియను ఈ నెల 22 వరకు గడువు ఉంది.

బోగస్‌కు చెక్: అనర్హులను తొలగించి అర్హులైనవారికి పూర్తిస్థాయిలో పనులు కల్పించనున్నారు. అనర్హుల గుర్తింపు, గ్రామాల్లో వివరాల ప్రదర్శనతోపాటు జిల్లావ్యాప్తంగా శనివారం ఒక్కరోజే గ్రామసభలు నిర్వహించి అనర్హుల జాబితా తేల్చనున్నారు. ఉపాధి కూలీలు వెంటనే అప్రమత్తమై ఈకేవైసీ చేయించుకోవాలని డ్వామా పథక సంచాలకుడు శంకర్ తెలిపారు.

ఈకేవైసీకి దూరంగా 50 వేలమంది

జిల్లాలో జాబ్‌కార్డ్ ఉన్న వారు: 2.03 లక్షలమంది

ఈకేవైసీ పూర్తయినవారు: 1.50 లక్షల మంది

- వలస వెళ్లడం, మరణించడం, జాబ్‌కార్డు వద్దని చెప్పడం, 75 ఏళ్లు పైబడినవారు పనికి రాలేకపోతుండడం, కొంతమంది ఎక్కువున్నారో తెలియకపోవడం వల్ల ఈకేవైసీ పూర్తి కాలేదు.
- ఇప్పటివరకు జాబ్‌కార్డుల తొలగింపు జాబితాలో ఉన్నవారు 7,163 మంది. ఇందులో మృతులు 3,078, శాశ్వతంగా వలస వెళ్లిన వారు 2,323, ఒకే కుటుంబంలో రెండు జాబ్‌కార్డులున్నవారు 781 మంది, 75 ఏళ్లు దాటి పనికి రాలేనివారు 834 మంది, కార్డులు వద్దన్నవారు 147 మంది ఉన్నారు.
- గతంలో ఇళ్ల నిర్మాణాల కోసం అర్జున్‌లో జాబ్‌కార్డుల్లో పేర్లు నమోదు చేసుకున్న వారు ఎక్కడున్నారో తెలియని పరిస్థితి.
- జాబ్‌కార్డు ఉండి.. పనులకు హాజరు కావడం లేదు.. ఇలాంటి వారిని ఉపాధి పనులకు హాజరయ్యేవారి జాబితా నుంచి తొలగించాలని సిఫార్సు చేశారు. ఇలాంటి వారు జాబితాలో ఉన్నాయి.

అక్షరానికో నిఘంటువు


ఎన్‌కార్టా సంస్థ ప్రచురణ


ఛాంబర్స్ 20వ శతాబ్దపు డిక్షనరీ

ఆంగ్లం నుంచి ఆంగ్లం, తెలుగు, హిందీ భాషల్లో పదాలకు అర్థాలు తెలిపే నిఘంటువులు చూస్తుంటాం. ఆంగ్ల భాషలోని 26 అక్షరాల్లో ప్రతి అక్షరానికి ప్రత్యేకంగా ఓ నిఘంటువును మాడలంలో పల్నాడు జిల్లా నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాల గ్రంథాలయానికి రావాల్సిందే. అక్కడ విదేశీ ప్రచురణ సంస్థలు ఆక్స్‌ఫర్డ్, ఛాంబర్స్, పంక్ అండ్ వాగ్నల్స్, ఎన్‌కార్టా తదితర 100 రకాల నిఘంటువులున్నాయి. వాటిలో ఆక్స్‌ఫర్డ్ సంస్థ 1933లో లండన్‌లో ప్రచురించిన 12 వాల్యూమ్స్ ఈ గ్రంథాలయంలో ఉన్నాయి. ప్రతి అక్షరానికి సంబంధించి పలు పదాలు 3500 పేజీల్లో పొందుపరిచి ఉన్నాయి. గ్రంథాలయ ప్రారంభ సమయం 1956లో అప్పటి కళాశాల కమిటీ నేతలు రూ.650 వెచ్చించి ముంబయి (అప్పటి బొంబాయి) నుంచి వీటిని తెప్పించారు. తర్వాత మరో మూడు సప్లిమెంటరీ వాల్యూమ్స్ తెప్పించి అందుబాటులో ఉంచారు. ఇలా ఈ గ్రంథాలయం ప్రత్యేక నిఘంటువుల కేంద్రంగా మారింది. - న్యూస్‌టుడే, నరసరావుపేట అర్బన్

ధాన్యం కొనుగోలు వ్యాపారం కాదు.. సేవా కార్యక్రమం

మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

కొల్లిపర, న్యూస్‌టుడే: 'ధాన్యం కొనుగోలు వ్యాపారం కాదు.. 'సేవా కార్యక్రమం' అని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. గురువారం కొల్లిపర మండలం దావులూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని బియ్యంగా మార్చి 41 వేల పాఠశాలలకు, నాలుగు వేల వసతిగృహాలకు బియ్యం పంపిణీ చేస్తోంది. పంపిణీ చేసిన బియ్యం వివరాలతోపాటు రైతు వివరాలు తెలిపే క్యూఆర్ కోడ్ బస్తాపై ఉంటుంది. కూటమి ప్రభుత్వం ప్రతి విశ్వసనీయతను పెంపొందించేందుకు గత ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించాం. కొనుగోలు చేసిన నాలుగు నుంచి ఆరు గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. గత వైకాపా ప్రభుత్వం రైతులను ఎంతో ఇబ్బందులకు గురి చేసింది. నేడు రైతులు తనకు నచ్చిన మిల్లర్లకు ధాన్యం అమ్ముకునే వీలుంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 2.65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతులకు సొమ్ము చెల్లించాం' అని పేర్కొన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, జేడీఏ పద్మావతి, సబ్‌కలెక్టర్ సంజనా సింహ, డీసీఎంఎస్ డీఎం హరిగోపాల్‌రెడ్డి, డీఎస్ఓ కోమలిపద్మ, ఆర్డీఓ తులసీ, తహసీల్దార్ సిద్ధార్థ, ఏవో శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కాయకల్ప అవార్డుకు 9 ఆసుపత్రుల ఎంపిక

నగరపాలక సంస్థ(గుంటూరు): అత్యుత్తమ సేవలందించిన ఆసుపత్రులకు ప్రభుత్వం కాయకల్ప అవార్డులు ప్రకటించింది. ఈ జాబితాలో జిల్లాలో 9 ఆసుపత్రులు చోటు సంపాదించాయి. వీటిలో తెనాలిలోని జిల్లా ఆసుపత్రి, ఏఎస్ఆర్‌నగర్, తుళ్లూరు, కొలకలూరు పీహెచ్‌సీలు; ఇంద్రానగర్, రెడ్డిపాలెం యూపీహెచ్‌సీలు; వల్లభాపురం, కొలకలూరు, ఎస్ఆర్‌పురం హెల్త్‌వెల్‌నెస్ సెంటర్లు ఉన్నాయి.

26న ఐటీఐలో ఉద్యోగ మేళా

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 26న గుంటూరులోని ప్రభుత్వ జిల్లా శిక్షణ కేంద్రం/ఐటీఐ శిక్షణ కేంద్రంలో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు గురువారం తెలిపారు. సోలార్ బెస్ట్ కంపెనీలో మార్కెటింగ్, ఇన్‌స్టలేషన్, సర్వీస్ టెక్నీషియన్లు ఉద్యోగాలకు ఖాళీలున్నాయన్నారు. అర్హతలు కలిగిన అభ్యర్థులు సెల్ నెం. 99888 53335, 87126 55686 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

VISHWA BHARATHI
COLLEGE OF PHARMACEUTICAL SCIENCES
(Approved by AICTE & PCI, New Delhi, Affiliated to JNTUK, Kakinada, Govt of AP) PERECHERLA, GUNTUR - 522009. PH: 9440434169
ESTD:1997
B. PHARMACY & PHARM.D SPOT ADMISSION – 2025
Eligible candidates who have not taken admission in any other college so far may attend Spot Admissions in I B. Pharmacy & I Pharm.D with all original certificates between 20-11-2025 to 23-11-2025. The Vacant seats created to unreported candidates shall be filled-up as per guidelines of APSCHE & Convenor APEAPCET- 2025.
PRINCIPAL

CHALAPATHI COLLEGE OF PHARMACY
A.R.Nagar, Mothadaka, GUNTUR- 522 016
Ph: 08645 294242, Mobile : 9492478685,
Email.principalccp2024@gmail.com www.ccpy.ac.in
CCPY
CATEGORY -B / SPOT ADMISSIONS
I B.PHARMACY

S.No.	Course	EAPCET Code	Category-B Seats
01	B.Pharmacy	CCPY	30

Eligible candidates who have not taken admission in any other college so far may attend SPOT Admissions in I B.Pharmacy with all original certificates on 24/11/2025. The vacant seats created to unreported candidates, shall be filled-up as per guidelines of APSCHE & Convenor APEAPCET-2025.
Principal

THE ARYAPURAM CO-OPERATIVE URBAN BANK LTD. HEAD OFFICE, RAJAMAHENDRAVARAM (Reg.No.3127)
RECRUITMENT NOTIFICATION FOR THE POSTS OF ASST. CLERKS / ASST. CASHIER ON CONTRACT BASIS
Applications are invited from Candidates who passed IBPS/ SBI/RRB'S CLERKS PRELIMS for the post of Asst. Clerks on contract basis Age : 21 Yrs-28 Yrs. as on date of notification (Age relaxation as per Bank service conditions), Consolidated payment of Rs. 24,000/- p.m during probation period of 1 year and on confirmation pay scales will be applicable.
The vacancies are at our Guntur, Visakhapatnam and Bhimavaram Branches only
Selection Procedure : Written Test and Interview
Last date of application to be received to bank: 29-11-2025 by 5:00 p.m.
Those candidates who have applied in last one year are not eligible to apply Application only in specified format can be sent through courier or email or through registered post or in person. Bank reserves right to refuse any application without assigning any reasons
Detailed Recruitment notification & Application can be downloaded from Website:
http://www.aryapurambank.com/career.html
Email: arcobank_rjy@aryapurambank.com
Date: 21-11-2025 Contact no.:-0883-2473550
Secretary/CEO

మాట వినదు.. కష్టం కనదు

సీసీఐ తీరుతో నలిగిపోతున్న పత్తి రైతు

ఇప్పటివరకు సీసీఐ కొనుగోలు చేసిన పత్తి: కేవలం 77 క్వింటాళ్లు

రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు: 821 మంది

న్యూస్‌టుడే-మిర్చియార్డు


జిన్నింగ్ మిల్లులో పత్తి

కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) విధించిన నిబంధనల చట్రంలో పత్తి రైతులు నలిగిపోతున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులను ఏమాత్రం పట్టించుకోకుండా.. రైతు కష్టాలను ఆలకించకుండా.. ఒంటెద్దు పోకడలో వెళ్తోంది. అటు వ్యాపారులు సైతం మండిపడుతున్నారు. సీసీఐ నిబంధనల ప్రకారం జిన్నింగ్ చేయలేమని టెండర్ల దాఖలు సమయంలోనే జిన్నర్లు ముందుకు రాలేదు. ప్రభుత్వ జోక్యంతో ఈ సమస్య కొలిక్కి వచ్చింది. తేమ శాతం పేరు చెప్పి దిగిరాపోవడంతో కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి.

కొనుగోళ్లు ఎక్కడంటే..

గుంటూరు: కోటేశ్వర కాటన్ ట్రేడింగ్ కంపెనీ, శ్రీ వెంకటేశ్వర ఇండస్ట్రీస్. ప్రస్తుతం వెంకటేశ్వరలో మాత్రమే కొంటున్నారు.

ఫిరంగిపురం: లక్ష్మీనారాయణ ఎంటర్‌ప్రైజెస్, శ్రీవిజయ వెంకటేశ్వర కాటన్ మిల్స్, విజయ వెంకటేశ్వరలో కొనుగోళ్లు జరుగుతున్నాయి.

ప్రత్తిపాడు: సాంబశివ కాటన్ జిన్నింగ్ మిల్లు, శివసాయి టీఎంసీ, శ్రీలక్ష్మీ కాటన్ కార్పొరేషన్, శ్రీసహజానంద కాటన్స్, రామా జిన్నింగ్ మిల్లు. ప్రస్తుతం శివసాయి టీఎంసీలో లావాదేవీలు మొదలయ్యాయి.

తాడికొండ: శ్రీరామచంద్ర టీఎంసీ, శ్రీమహాలక్ష్మి కాటన్ జిన్నింగ్ మిల్లు, విజయలక్ష్మి స్పిన్నర్స్, కొల్లిపర సుబ్బారావు కాటన్ ఇండస్ట్రీస్. శ్రీరామచంద్రలో కొనుగోళ్లు జరుగుతున్నాయి.

రైతులు ఏం చెబుతున్నారంటే.. తేమ శాతం 8 నుంచి 12 శాతం కొంటామని సీసీఐ చెబుతోంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను బట్టి 12.. నుంచి 18 శాతానికి పెంచాలి. ఉదయం.. చలికాలం కావడంతో ఉష్ణోగ్రతలు పడిపోయి తేమ శాతాన్ని తగ్గించడం సాధ్యం కావడం లేదు.

- తేమ శాతాన్ని 12 నుంచి 18 వరకు అనుమతించాలని, వర్షాలకు తడిసిన, రంగు మారిన పత్తిని కూడా కొనేలా సీసీఐ షరతుల్ని సడలించాలని మార్కెటింగ్ శాఖ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు.

ఆరోగ్యశాఖ అధికారిపై విచారణ

నగరపాలక సంస్థ: మంగళగిరిలోని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా చేస్తున్న సయ్యద్ అహ్మద్‌పై అనిశా కేసు నమోదు చేయడంతో ప్రభుత్వం ఆయనపై శాఖాపరమైన చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు గురువారం వైద్య, ఆరోగ్యశాఖ ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. 2023 జులై 11న లంచం కేసులో అహ్మద్‌ను అనిశా అధికారులు పట్టుకున్నారు. దీనిపై అనిశా డైరెక్టర్ జనరల్ సమర్పించిన సమగ్ర నివేదికను పరిశీలించిన ప్రభుత్వం ఆయనపై శాఖాపరమైన విచారణ జరపాలని నిర్ణయించింది. మెమో అందిన 10 రోజుల్లోగా అహ్మద్ తనపై వచ్చిన ఆరోపణలకు లిఖిత పూర్వక సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. నిర్ణీత గడువులోగా సమాధానం ఇవ్వకపోతే అందుబాటులో ఉన్న ఆధారాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

స్థాయీ సంఘ సమావేశాలు 26న

జిల్లాపరిషత్తు, న్యూస్‌టుడే: జిల్లాపరిషత్తు స్థాయీ సంఘ సమావేశాలు ఏడు ఈనెల 26వ తేదీ ఉదయం 10.30 గంటలకు జడ్పీ కార్యాలయంలో జరుగుతాయని సీఈవో వి.జ్యోతిబసు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 1, 2, 4, 7వ స్థాయీ సంఘాల సమావేశాలను జడ్పీ ఛైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా అధ్యక్షత వహిస్తారన్నారు.

ఇళ్ల నిర్మాణాల తనిఖీల్లో వెలుగులోకి లోపాలు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: గత ప్రభుత్వం వేసిన ప్రభుత్వ లేఅవుట్లలో ఆప్షన్ త్రీ కింద పట్టాలు పొందిన లబ్ధిదారులతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం పూర్తి చేయని ఇళ్ల తనిఖీల్లో లోపాలు వెలుగు చూస్తున్నాయి. మంజూరు చేసిన నగదుతో నిర్మాణాలు చేయకుండా.. వెనక్కి ఇవ్వకుండా తాత్సారం చేస్తూ గుత్తేదార్లు ఇబ్బంది పెడుతున్నట్లు లబ్ధిదారులు వాపోతున్నారు. నిర్మాణ పనులు వేగవంతం చేసే క్రమంలో కూటమి ప్రభుత్వం సర్వే చేసి వాస్తవాలతో కూడిన నివేదిక అందించాలని అధికారులకు సూచించింది.

ఇంటిని పరిశీలిస్తున్న తెనాలి గృహ నిర్మాణ సంస్థ ఈఈ భాస్కరరావు

జిల్లా అంతటా ఇదే పరిస్థితి?

తెనాలి గృహ నిర్మాణ సంస్థ అధికారుల తనిఖీల్లో.. వందకు పైగా ఇళ్ల బేస్‌మెంట్ కోసమని రూ.60 నుంచి రూ.70 వేలు తీసుకుని రూ.40 వేల విలువైన బెల్టు వేసి సరిపెట్టినట్లు తెలిసింది. అలాగే 3 వేల పైన ఇళ్లకు రూ.60 నుంచి రూ.70 వేల బిల్లులు చెల్లించినా రూ.10 వేలు, రూ.20 వేల విలువగల మెరక చేసి వదిలేసినట్లు సమాచారం. 200 ఇళ్ల పునాదుల బోర్లు కోసమని ఇనుము, మరో రూ.10 వేల నగదు గుత్తేదార్లకు చెల్లించాల్సి ఉండగా అధికారులు అదనంగా ఇంకో రూ.10 వేల నగదు చెల్లించడం గమనార్హం. ఒక్క తెనాలిలోనే కాదు జిల్లా అంతటా ఇదే పరిస్థితి ఉన్నట్లు విమర్శలు విన్పిస్తున్నాయి.

★ జిల్లా గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలోని ప్రభుత్వ లేఅవుట్లలో ఆప్షన్ త్రీ కింద 31,620 ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. వీటిలో 31,444 ఇళ్ల తనిఖీ పూర్తయింది. మండలాల వారి గుంటూరు పశ్చిమ 8,028, గుంటూరు తూర్పు 7,914, తెనాలి అర్బన్ 7,890, పొన్నూరు అర్బన్ 3,062, గుంటూరు కార్పొరేషన్ 3,521, గుంటూరు రూరల్ 387, దుగ్గిరాల 240, వట్టిచెరుకూరు 43, తెనాలి రూరల్ 198, ప్రత్తిపాడు 132, తుళ్లూరు 54, చేబ్రోలు 78, కొల్లిపరలో 73 ఇళ్లు ఆప్షన్ త్రీ కింద నిర్మాణాలు జరిగాయి. దీనిపై గృహ నిర్మాణ సంస్థ ఈఈ భాస్కరరావును సంప్రదించగా.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆప్షన్ త్రీ కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను తనిఖీ చేస్తున్నట్టు తెలిపారు.

ఐదేళ్లు సంరక్షణ.. నిరంతర ఆదాయం

రైతేరాజు

మడకశిర, న్యూస్‌టుడే

వక్క తోటల సాగు అన్నదాతకు సిరులు కురిపిస్తుంది. ఐదేళ్ల పాటు సంరక్షణ చేపడితే అనంతరం రాబడి మొదలవుతుంది. ఏటా దిగుబడి పెరగడంతో పాటు ఆదాయం రెట్టింపవుతుంది. చెట్లకు అవసరమైన మేరకు నీరు, పేడ, మట్టిని అందిస్తే చాలు. ఈ పంట సాగులో పెద్దగా ఖర్చు చేయాల్సింది లేదు. ధరలు నిలకడగా ఉంటే రూ.లక్షల్లో ఆదాయం లభిస్తుంది.

నేల ఎంపిక

సాధారణంగా వక్క అన్ని నేలల్లో పండుతుంది. నీరు నిలవకుండా ఉండే భూములు ఎంపిక చేసుకుంటే మొక్క త్వరితగతిన పెరిగేందుకు మంచి అవకాశం. 25 నుంచి 35 డిగ్రీల మధ్య వాతావరణం అనుకూలంగా ఉండాలి. సాలుకు సాలుకు మధ్య 9 అడుగులు, మొక్కకు మొక్కకు మధ్య 7 అడుగులు దూరం పాటించాలి. ఇలా ఒక ఎకరాలో 450 నుంచి 500 మొక్కలు నాటుతారు. కొత్తగా నాటిన మొక్కలకు ఎండ నుంచి రక్షణ కోసం నీడ ఇచ్చే అవిస మొక్కలను నాటుకోవాలి. రెండేళ్ల వరకు నీడలోనే మొక్క పెరుగుతుంది. వక్క మొక్కలకు రసాయన ఎరువులు, పురుగు మందుల అవసరం ఉండదు. సేంద్రియ ఎరువులు ఏడాదికి ఒకసారి మాత్రమే వేస్తారు. డ్రిప్ ద్వారా సరిపడా నీరు వదులుతారు. అనంతరం అయిదేళ్లకు వక్క పంట దిగుబడి ప్రారంభమవుతుంది.

నారు పోసే విధానం

సాగుకు ముందు 40 ఏళ్ల వయసున్న మంచి దిగుబడి ఇచ్చే మొక్క నుంచి విత్తనాలు సేకరిస్తారు. వాటిని గోనెసంచుల్లో కట్టి రెండు నెలల పాటు నీడలో ఉంచి నీరు పోస్తే మొలక వస్తుంది. ఈ మొలకలను మట్టి వేసిన పాలిథిన్ కవర్లలో ఉంచి నీరు పోస్తే ఏడాదికి 2 అడుగులు పెరుగుతుంది. అనంతరం గుంతల్లో నాటి బిందు సేద్యం ద్వారా నీరందించాలి. ఇలా అయిదేళ్ల పాటు ఎకరాకు రూ.50 వేల వరకు పెట్టుబడి అవుతుంది. నాటిన అయిదేళ్ల అనంతరం ఒక చెట్టు నుంచి గరిష్ఠంగా 30 కేజీల వరకు పచ్చి కాయలు వస్తాయి. వీటిని ఒలిచి.. ఉడకబెట్టి, అయిదు రోజుల పాటు ఎండబెడితే 3 కిలోల ఎండిన వక్క సిద్ధమవుతుంది. ఇలా ఏటా ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల వక్క దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాలు ధర రూ.52 వేలు ఉంది. ఈ లెక్కన ఎకరాకు రూ.5 లక్షల వరకు ఆదాయం వస్తే రూ.లక్ష పెట్టుబడి పోనూ రూ.4 లక్షలు నికర లాభం వస్తుంది. అదనపు ఆదాయం కోసం అంతర పంటలుగా తమలపాకు, మిరియాలు, పూలచెట్లు, చెక్క ఇతర సుగంధ ద్రవ్యాలను సాగు చేసుకోవచ్చు.

రాష్ట్రంలోనే అమరాపురం అగ్రస్థానం

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గం అమరాపురం మండలం వక్క సాగులో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంది. శ్రీసత్యసాయి జిల్లాలో 6 వేల ఎకరాల్లో ఈ పంట సాగవుతుండగా, ఒక్క అమరాపురం మండలంలోనే 3,100 ఎకరాల్లో సాగులో ఉంది. అలాగే అగళి, రొళ్ల, గుడిబండ మండలాల్లోనూ ఈ పంట అత్యధికంగా సాగు చేస్తున్నారు. అమరాపురం మండలంలో వక్క సాగు ద్వారా రైతులు ఏటా దాదాపు రూ.వంద కోట్ల వరకు ఆదాయం పొందుతుండడం గమనార్హం.

ప్రశ్న: పత్తిలో గులాబీ రంగు కాయతొలుచు పురుగు ఆశించి నష్ట పరుస్తోంది. నివారణ మార్గాలు ఏమిటి?

– ప్రకాశరావు, బడేపురం గ్రామం, తాడికొండ మండలం.

సమాధానం: పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు సమగ్ర సస్య రక్షణ పద్ధతులను పాటించాలి. పొలాలు, జిన్నింగ్ మిల్లుల దగ్గరలో ఉన్న గుడ్డి పత్తిని నాశనం చేయాలి. పత్తి కట్టెను ఇంటి దగ్గర కాని లేదా పొలంలో కాని ఉంచకూడదు. ముక్కలుగా కోసి ఎరువుగా మార్చాలి. ఎకరానికి 20 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకుని పొలంలోని మగ రెక్కల పురుగులన్నింటినీ నాశనం చేయాలి. వారానికొకసారి 10 శాతం గుడ్డిపూలు శాతం లేదా 10 శాతం గుడ్డి కాయ శాతం మించితే పురుగు మందులు పిచికారీ చేసుకోవాలి. వారానికోసారి అక్కడక్కడ 10 కాయల్లో గుడ్డి కాయ శాతాన్ని గమనించిన వెంటనే (పంట 120 రోజుల వయసు లోపల) కోరాజాన్ 500 మి.లీ. లేదా క్యూరాక్రాన్ 400 మి.లీ. ఎకరానికి పిచికారీ చేసుకోవాలి. అదే పంట వయసు 120 రోజులు దాటితే సైపర్‌మెత్రిన్ 10 ఇ.సి400 మి.లీ. లేదా 25 ఇ.సి 200 మి.లీ. లేదా కరాటె 200 మి.లీ. లేదా డెసిస్ 200 మి.లీ. ఎకరానికి పిచికారీ చేసుకోవాలి. **తొలి దశలో వాడొద్దు..** సింథటిక్ పైరిత్రాయిడ్స్ అనగా 10 ఇ.సి/ 25 ఇ.సి.లను పంట తొలిదశలో వాడితే తెల్లదోమ ఉధృతి పెరుగుతుంది. అందువల్ల 120 రోజులు వయసు దాటిన తర్వాత మాత్రమే వీటిని వినియోగించాలి. **-డాక్టర్ ఎం.నగేష్,** ఆంగ్రూ ఏరువాక కేంద్రం సమన్వయకర్త

-న్యూస్‌టుడే, జిల్లా పరిషత్తు

బెండలో తెల్ల దోమ నివారణ చర్యలు

పొన్నూరు, న్యూస్‌టుడే: బెండలో తెల్ల దోమ నివారణ చర్యలను ఉద్యానశాఖాధికారిణి నిత్య సూచించారు. పంటలో పూతకు ముందు చిన్న, పెద్ద పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చడంతో అవి పసుపు రంగులోకి మారతాయి. అవి శంఖు రోగాన్ని వ్యాప్తి చేస్తాయి. దీని నివారణకు లీటరు నీటికి డైమిథోయేట్ 2 మి.లీ. కలిపి 10 రోజుల వ్యవధిలోనే రెండు సార్లు పిచికారీ చేయాలి. పొలంలో అక్కడక్కడ పసుపు రంగు డబ్బాలకు గ్రీజు గానీ, ఆముదం గానీ పూసి తెల్ల దోమలను ఆకర్షింపజేసి నాశనం చేయాలి. పల్లాకు తెగులు సోకిన ఆకులు పసుపు రంగుకు మారి కాయలు గిడసబారి పోతాయి.

పొద చిక్కుడు సాగులో మెలకువలు

పొద చిక్కుడు సాగులో మెలకువలను ఘంటసాల కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త వి.మంజువాణి సూచించారు. ఎకరానికి 16 కిలోల విత్తనం సరిపోతుంది. విత్తడానికి వారం రోజులు ముందు ఆఖరి దుక్కిలో పశువుల ఎరువు 8-10 టన్నులు వేసి దున్నాలి. 24 కిలోల భాస్వరం, 12 కిలోల పొటాష్‌తో పాటు మొదటి దఫా 15 కిలోల నత్రజని వేయాలి. రెండో దఫా 15 కిలోల నత్రజనిని విత్తిన 30 రోజులకు వేయాలి. ఎరువులు వేసిన వెంటనే నీరు కట్టాలి. 7-10 రోజులకోసారి నీటితడి ఇవ్వాలి. పూత, కాయ దశలో నేల 50 శాతం తేమ ఉండేలా చూసుకోవాలని సూచించారు. **-న్యూస్‌టుడే, ఘంటసాల**

మరుగుదొడ్ల ఆవశ్యకతపై చైతన్య కార్యక్రమాలు

కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో మరుగుదొడ్ల ఆవశ్యకతపై ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో గురువారం వరల్డ్ టాయిలెట్ డే సందర్భంగా జిల్లా పారిశుద్ధ్య కమిటీ రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా బహిరంగ మలవిసర్జన జరగకూడదని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ ఈనెల 21 నుంచి డిసెంబరు 5వ తేదీ వరకు మరుగుదొడ్ల మరమ్మతులు, ఇతర నిర్వహణ కార్యక్రమాలు, డిసెంబరు 6 నుంచి 9వ తేదీ వరకు మరుగుదొడ్ల సుందరీకరణ ఆవశ్యకతపై సర్వే చేపడతారన్నారు. వచ్చేనెల 10న ముగింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కమిటీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

24న బీసీ వర్గీకరణపై వినతిపత్రాలు ఇవ్వండి

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే : బీసీల జనాభా ప్రాతిపదికపై రిజర్వేషన్లను ఏబీసీడీలుగా వర్గీకరించి చట్టబద్ధంగా అమలు చేయాలని కోరుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయా జిల్లాల బీసీ సంఘాల నాయకులు పీఎం, సీఎంని కోరుతూ వినతిపత్రాలు అందజేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పిలుపునిచ్చారు. మంగళగిరిలోని సంఘ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి శివరామ్ బాబాజీ, బీసీ ఉద్యోగ విభాగ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు గుంటుపల్లి ఉమా మహేశ్వరరావుతో కలసి గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. 24న వినతిపత్రాలు ఇచ్చి తమ డిమాండ్లు సాధించుకోవాలని కోరారు. ఎన్నికల సమయంలో 33 శాతం చట్టసభల్లో, 34 శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయాలంటే ముందుగా కులగణన చేయాలని కోరారు. సంఘ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకా వెంకటేశ్వరరావు, విజయవాడ అధ్యక్షుడు చందు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు

ఐటీ రామయ్యకు మంత్రి లోకేశ్ పుట్టినరోజు శుభాకాంక్షలు

తాడేపల్లి, న్యూస్‌టుడే : విద్యావేత్త, ఐటీ రామయ్యగా ప్రసిద్ధులైన చుక్కా రామయ్య పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు మంత్రి నారా లోకేశ్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఉండవల్లిలోని ఆయన కార్యాలయం నుంచి గురువారం ఓ ప్రకటన విడుదలైంది. వేలాదిమంది విద్యార్థులను ఐఐటీయన్లుగా, ఇంజినీర్లుగా తీర్చిదిద్దిన చుక్కా రామయ్య.. నిత్య విద్యార్థిగా, సామాజిక సంస్కర్తగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఎమ్మెల్సీగా ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేశారని, ఆయన నేటితరానికి స్ఫూర్తి అని తెలిపారు.

బెట్టింగ్ మోసాలు.. పోలీసుల అదుపులో యువకుడు

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే : మంగళగిరి మండల పరిధిలోని చినకాకాని ఎన్ఆర్ఐ ఆసుపత్రి సమీపంలోని ఓ అపార్టుమెంట్‌లోని ఓ ఫ్లాట్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్ జరుగుతోందన్న సమాచారంతో మంగళగిరి రూరల్ పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. హుబ్లీ బుక్.కామ్ పేరుతో బెట్టింగ్ మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఐదు ల్యాప్‌టాప్‌లు, 30 సెల్‌ఫోన్లు, 14 ఏటీఎం కార్డులు, 14 బ్యాంక్ పాసు పుస్తకాలు, చెక్కులు స్వాధీనం చేసుకున్నారు. ఒక్కరిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. కీలక నిందితులు మచిలీపట్నం వాసులుగా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మంగళగిరి రూరల్ సీ.ఐ ఎ.వి.బ్రహ్మం పర్యవేక్షణలో ఎస్సై వెంకట్ కేసు నమోదు చేశారు.

రహదారి ప్రమాదంలో యువకుడి మృతి

మేడికొండూరు, న్యూస్‌టుడే : కారు ఢీ కొట్టడంతో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. నల్లపాడు శ్రీనివాస కాలనీకి చెందిన గుంజి వాసు (22) పదో తరగతి వరకు చదువుకున్నాడు. గుంటూరు మిర్చియార్డులో పని చేసేవాడు. వివాహం కాలేదు. గురువారం విధులకు హాజరయ్యాడు. తర్వాత పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై ఫిరంగిపురం వెళ్లాడు. కొద్దిసేపటికి తిరిగి బయలుదేరి పేరేచర్ల బైపాస్ రోడ్డులో వెళ్తుండగా గుంటూరు నుంచి వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. కింద పడటంతో వాసుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆటోలో గుంటూరు సర్వజనాసుపత్రి తరలించారు. కాసేపటికి వాసు మృతి చెందాడు. మృతుడు తల్లి ఉల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

MARRIAGE SERVICES

వనజారావు క్విక్ మ్యారేజెస్ నందు అన్ని కులముల వారికి సంబంధములు కుదర్చబడును. లక్ష్మీపురం, గుంటూరు. సెల్: 98666 33988.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూపు, GNT. వృద్ధులకు, పేషెంట్ల సేవకు, ఇంటి/ వంట, బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 91540 85588, 91549 35588

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

ఫ్లాష్! ఫ్లాష్! చిలకలూరిపేట హైవే ఫేసింగ్ CRDA అప్రూవల్ వెంచర్. బ్యాంకు లోన్ సౌకర్యం. గజం 7500/- మాత్రమే. Phone: 9133574455

TO LET

గుంటూరు సిద్ధార్థ నగర్ 2 లైన్ నందు ఉత్తరం ఫేసింగ్ డూప్లెక్స్ 4BHK ఫుల్లీ ఫర్నీచర్, 3 కార్ పార్కింగ్ ఇల్లు అద్దెకు కలదు. అద్దె రూ. 60,000/-. ✆ 9849719999

JOBS

Jayalakshmi Nexa Hiring for Autonagar, Guntur. Good Opertunity for Freshers/ Experienced Whatsapp: 91007 87054.

ఆఫీసుమేనేజర్ కావలెను. పిజి, అడ్మినిస్ట్రేషన్‌లో 10 సం|| అనుభవం, కంప్యూటర్, 40 సం|| లోపువారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజీనందు క్లాసు ఇన్‌ఛార్జీస్, హాస్టల్ ఇన్‌ఛార్జీస్, వార్డెన్స్‌గా పనిచేయుటకు స్త్రీలు కావలెను. జీతము: 10,000/- నుండి13,000/- వరకు ఇవ్వబడును (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యాఅర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ. వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకు సంప్ర: ✆: 9100024059.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజినందు క్యాంపస్ ఇన్‌ఛార్జీస్, క్లాసు ఇన్‌ఛార్జీస్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 14,000/- నుండి 21,000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: ఇంటర్ నుండి పి.జి. వరకు. వయస్సు: 22 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యి ఉండాలి. సంప్ర: ఫోన్: 8978480429.

HYD, SR నగర్ బాయ్స్ హాస్టల్‌లో అనుభవం గల భార్యభర్తలు వంటమాస్టర్లు కావలెను. సంప్ర: ✆ 9391009238, 8885070231.

పూర్ణ ఎంటర్‌ప్రైజెస్, గోరంట్ల, గుంటూరులో 1-3 సం|| అనుభవమున్న కంప్యూటర్ ఆపరేటర్ (ఫీమేల్) కావలెను. జీ: 10,000/-. 93908 96165.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

మిర్చి యార్డు సమాచారం (నిన్నటి ధరలు)

వచ్చిన బస్తాలు:	51,202
అమ్మకాలు:	54,998
నిల్వ:	10,210
నాన్ ఏసీ కామన్ వెరైటీ (క్వింటా రూ.ల్లో)	
334	10,000-18,200
నంబర్ 5	11,500-16,000
273	10,500-14,500
341	10,000-17,500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ	
తేజ	10,000-16,000
బాడిగ	11,000-18,000
దేవనూరు డీలక్స్	11,000-17,500
ఆర్మూర్	11,500-14,300
ఏసీ కామన్ వెరైటీ	
334	10,500-18,000
నంబర్ 5	12,000-16,500
341	11,500-18,000
4884	11,000-14,600
ఏసీ స్పెషల్ వెరైటీ	
తేజ	11,000-16,000
బాడిగ	10,000-18,500
దేవనూరు డీలక్స్	10,500-17,700
తాలు	5,300-9,000

- న్యూస్‌టుడే, మిర్చియార్డు

91.9FM Vijayawada Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

మూడొంతుల మందికి అనారోగ్య సమస్యలు

పీ4 స్ఫూర్తితో నిర్వహించిన నమూనా ప్రాజెక్టులో వెల్లడి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: అవకాశం ఉన్న వారు తమ పరిధిలో సేవలు అందించడం ద్వారా స్వర్ణాంధ్రప్రదేశ్ కల సాకారం అవుతుందని సీఎం చంద్రబాబు ఇచ్చిన పీ4 పిలుపుతో తెనాలి శారద సర్వీస్ సొసైటీ 'వ్యాధి రహిత తెనాలి' ప్రాజెక్టును ప్రతిపాదించి పంపింది. మూడు వేల మంది మహిళలకు సమగ్ర ఆరోగ్య సేవలు ఇంటి గుమ్మం వద్దకే అందించి.. సమస్యలను గుర్తించి పరిష్కరించేలా నమూనా ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య విభాగం అక్టోబరు 1న తేదీ నుంచి డిసెంబరు 31వ తేదీ వరకు నిర్వహణ చేలా ఆమోద ముద్ర వేసింది. సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ శారద ఆధ్వర్యంలో బృందం తెనాలి పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లో 50 రోజుల పాటు 1670 మంది మహిళలకు మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, కిడ్నీ పనితీరు, థైరాయిడ్, బీఎమ్‌ఐ, ఆవసరం మేరకు అల్ట్రా సౌండ్ స్కానింగ్ తదితర పరీక్షలను నిర్వహించారు. పరీక్షలు నిర్వహించిన మహిళలందరూ తమకు ఎలాంటి అనారోగ్య సమస్య లేదనుకుంటూ ఇంటి పట్టున ఉన్నవారే. నలుగురికి క్యాన్సర్, 8 మందికి గర్భాశయ ముఖద్వారం, 352 మందికి మధుమేహం, 204 మందికి రక్తపోటు, 133 మందికి థైరాయిడ్, 1380 మందికి రక్తహీనత అనారోగ్య సమస్యలు ఉన్నట్లు తెలిసింది. వారందరికీ సంబంధిత వివరాలు అందించి చికిత్సలు ప్రారంభించారు. 50 రోజుల నివేదికను డాక్టర్ శారద గురువారం తెనాలి తహసీల్దార్ గోపాలకృష్ణకు అందించారు. సొసైటీ సేవలను అభినందించిన తహసీల్దార్ నివేదికను ప్రభుత్వానికి అందిస్తానన్నారు. పట్టణానికి చెందిన బంగారు దుకాణ యజమాని కొత్తమాసు కుమార్, సొసైటీ సేవల కోసం రూ.3 లక్షల విరాళాన్ని తహసీల్దార్ చేతుల మీదుగా అందించారు. గంగా వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి, రాజేశ్వరి, కల్యాణి, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షల నివేదికను తహసీల్దార్‌కు అందిస్తున్న డాక్టర్ శారద

యాదవ కార్తిక వనసమారాధన 23న

కార్యక్రమ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌యాదవ్, సంఘ నేతలు

గోరంట్ల, న్యూస్‌టుడే: అఖిల భారత యాదవ మహా సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు యాదవ సంఘ నేతలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఇన్నర్‌రింగ్ రోడ్డులోని వనసమారాధన జరిగే ప్రదేశంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. తొలుత శ్రీకృష్ణ ప్రాంగణంలో కార్తిక వనసమారాధన మహోత్సవం ఏర్పాట్లను సంఘ నేతలు పరిశీలించారు. సమావేశంలో బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, ఉప్పుటూరి పేరయ్య యాదవ్, పెద్దిబోయిన బాలయ్య, తాళ్ల నాగరాజు, డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, కుమ్మర క్రాంతికుమార్‌లు కార్యక్రమ వివరాలను వెల్లడించారు. ఈనెల 23న ఉదయం 8 గంటలకు గోపూజ, అనంతరం సత్యనారాయణ స్వామి వ్రతాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. సామాజికవర్గీయులు కుటుంబాలతో సహా రావాలని పిలుపునిచ్చారు. ఆసక్తి ఉన్న దంపతులు ముందుగా సమాచారం ఇచ్చి సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీలకతీతంగా యాదవ ప్రముఖులు పాల్గొనాలని కోరారు. నాయకులు మద్దుల వెంకట కోటయ్య, దాసరి శివకుమార్, కేశవ్, వెంకట్రావు, తాళ్ల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతులకు నగదు జమ చేయాలి

మార్క్‌ఫెడ్ ఎండీ జిలాని సమాన్‌కు వినతిపత్రం అందిస్తున్న కల్లూరి శ్రీనివాసరావు, కళ్లం రాజశేఖర్‌రెడ్డి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో నల్లబర్లీ పొగాకు అమ్మిన రైతులకు డబ్బులు జమ చేయాలని తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు కళ్లం రాజశేఖర్‌రెడ్డి, ఉమ్మడి గుంటూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కల్లూరి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు మార్క్‌ఫెడ్ ఎండీ మనజీర్ జిలాని సమ్మాన్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ప్రైవేటు వ్యాపారులు నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయకపోవడంతో ప్రభుత్వమే రంగంలోకి దిగి మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేసిందన్నారు. పొగాకు అమ్మిన సుమారు 5 వేల మంది రైతులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.40 కోట్లు విడుదల చేయాలని కోరారు. నిధులను వారం రోజుల్లో విడుదల చేస్తామని ఆయన తెలిపినట్లు రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరావు తెలిపారు.

వృద్ధుడు సజీవ దహనం

పొన్నూరు, న్యూస్‌టుడే: షార్ట్‌సర్క్యూట్‌తో వృద్ధుడు సజీవ దహనమైన ఘటన గురువారం తెల్లవారుజామున పొన్నూరు పట్టణ పరిధిలోని 14వ వార్డులో చోటుచేసుకుంది. అర్బన్ పోలీసుల కథనం ప్రకారం.. డీఆర్‌కే కాలనీకి చెందిన పులిపాటి నాగయ్య(70) కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. కొంత కాలం కిందట కుమార్తె భర్త మృతి చెందడంతో తోడుగా ఉండేందుకు భార్యతో కలిసి కుమార్తె వద్దకు వెళ్లారు. ఈ నేపథ్యంలో వారు ఉంటున్న ఇంట్లో గురువారం తెల్లవారుజామున విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. మంటల్లో నాగయ్య సజీవ దహనమయ్యాడు. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరా నాయక్ తెలిపారు. నాగయ్య మృతి చెందిన విషయం తెలియగానే ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ విద్యుత్తు శాఖా అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.


పులిపాటి నాగయ్య (పాత చిత్రం)

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 108, రిటైల్ ధర - 135, చికెన్ విత్‌స్కిన్ - 196, చికెన్ స్కిన్‌లెస్ - 223.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -106 రిటైల్ ధర 133 చికెన్ విత్ స్కిన్ - 193, చికెన్ స్కిన్‌లెస్ - 219.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 117, 124, 136 చికెన్ విత్ స్కిన్ - 222 చికెన్ స్కిన్‌లెస్ - 232.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 660 (వాణిజ్య & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.100/-.

మిస్టరీగా బాలిక అదృశ్యం

న్యాయం చేయాలంటున్న తల్లిదండ్రులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: బాలిక అదృశ్యం మిస్టరీగా మారింది. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమార్తె (16) అక్టోబరు 4వ తేదీ సాయంత్రం నుంచి కనిపించడం లేదని పోలీసులు, ఎస్పీ, మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసినా.. ఇంతవరకు ఆచూకీ కనిపెట్టలేదని నెహ్రూనగర్‌కు చెందిన ఆమె తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం బాధితులు విలేకరులతో మాట్లాడారు. తమకు ఆరుగురు సంతానమని, వారిలో మాటలు రాని ముగ్గురు పిల్లలున్నారని చెప్పారు. పదోతరగతి చదువుతున్న పెద్దమ్మాయి కనిపించడం లేదని, రాజేష్ అనే వ్యక్తిపై అనుమానం ఉందని కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. అతని కుటుంబం అమ్మాయిని ఎక్కడో దాచి పెట్టి.. ఏం చేశారో అన్న ఆందోళనలో ఉన్నామన్నారు.

వెదుకుతూనే ఉన్నాం

– వీరయ్య చౌదరి, కొత్తపేట సీఐ

ముగ్గురు ఎస్సైలతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గత 45 రోజులుగా వెదుకుతూనే ఉన్నాం. తెనాలి, విజయవాడ, కొలకలూరు, ఒంగోలు, త్రిపురాంతకం, హైదరాబాద్ ప్రాంతాల్లో గాలించాం. బాలిక ఫొటోలను పోలీస్‌స్టేషన్లకు పంపించాం. వేలాది సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించాం. రాజేష్ కుటుంబ సభ్యులను అన్ని కోణాల్లో విచారిస్తూనే ఉన్నాం. త్వరలో బాలిక ఆచూకీ కనిపెడతాం.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

సర్వే చేసి డబ్బు అడిగితే చర్యలు

పెదనందిపాడు, న్యూస్‌టుడే : భూ కొలతల నిమిత్తం వెళ్లిన గ్రామ సర్వేయర్లు రైతులను డబ్బులు అడిగితే చర్యలు తప్పవని సర్వే శాఖ సహాయ సంచాలకుడు వివేక్‌కుమార్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయనతో పాటు సర్వే శాఖ ఇన్స్‌పెక్టర్, డిప్యూటీ ఇన్స్‌పెక్టర్లు కిశోర్‌బాబు, శ్రీనివాసులు దస్త్రాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే జరిగిన గ్రామాల్లో జాయింట్ పట్టాదారులు ఒకే ఎల్పీ నంబరులో ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది ఉంటే వాస్తవ పట్టాదారు ఎవరో గుర్తించాలని సిబ్బందికి సూచించారు. మండల సర్వేయర్ శ్రీనివాసరావు ఉన్నారు.

లైంగిక వేధింపులపై అవగాహన సదస్సు

ఫిరంగిపురం: నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆరోగ్య, ఆశా, అంగన్వాడి కార్యకర్తలకు హెల్ప్‌లైన్ నంబరు 1098పై అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా జిల్లా ఆర్.బి.ఎస్.కె. మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ జ్యోతిర్మయి పాల్గొని బాలలపై లైంగిక వేధింపులు, నివారణ, బాలల హక్కుల గురించి వివరించారు. బాలలపై సామాజిక మాధ్యమాల ద్వారా జరిగే లైంగిక వేధింపుల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పిల్లలతో స్నేహభావంగా మెలుగుతూ వారి ప్రవర్తనపై నిఘా ఉంచాలని చెప్పారు. లైంగిక వేధింపులు జరిగితే హెల్ప్‌లైన్ నంబర్ 1098 కాల్ చేయాలని ఆమె సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

స్పందనకు వందనం

నవులూరు టిడ్కో సమీపంలో వ్యర్థాలు గాలికి కొట్టుకు వచ్చి వాహనదారులపై పడుతున్నాయని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా పారిశుద్ధ్య అధికారి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి పారిశుద్ధ్య కార్మికులను పంపి వ్యర్థాలు తొలగింపజేశారు.
-మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే

ఫెన్సింగ్‌లో విద్యార్థుల ప్రతిభ

జిల్లా జట్టుకు ఎంపికైన వారితో ఉపాధ్యాయులు

మేడికొండూరు, న్యూస్‌టుడే : గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో గురువారం ఫెన్సింగ్ పోటీలు నిర్వహించారు. వీటిలో వేములూరిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి.. జిల్లా జట్టుకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య తెలిపారు. అండర్- 14 విభాగంలో షేక్ మస్తాన్, ఇప్పీ విభాగంలో రత్నతేజ, ఫాయిల్ అండర్- 17 బాలికల విభాగంలో అనుశ్రీ ఎంపికయ్యారని చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు సుజాత మాట్లాడుతూ డిసెంబర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.

ప్రభుత్వం ఇచ్చిన భూమి కబ్జా చేసే యత్నం

మంగళగిరి, న్యూస్‌టుడే : నంద్యాల జిల్లా కోలిమిగుండ్ల మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన దళితుడు వంకదార చిన్నపక్కు ప్రభుత్వం సాగు చేసుకునేందుకు కేటాయించిన ఎకరాల భూమిని అక్కడ ఉన్న కొంతమంది కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మాల మహానాడు వ్యవస్థాపకుడు మల్లెల వెంకట్రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళగిరి ప్రెస్‌క్లబ్‌లో బాధితుడు చిన్నపక్కుతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. తమ భూమిని కబ్జా చేస్తున్నారని ఫిర్యాదు చేసిన పోలీసులు తిరిగి బాధితుడిపైనే కేసు పెడుతున్నారని ఆరోపించారు. చిన్నపక్కుకు న్యాయం చేయాలని మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్, అవుల దేవరత్నం, వికలాంగుల రాష్ట్ర అధ్యక్షుడు వంకదార రవికుమార్, శీలం శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

వాహనాలు ఎదురుపడితే ఇక్కట్లే

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే

☛ ఇరుకుగా మారిన రహదారి
☛ రెండు వరుసలుగా విస్తరించాల్సిందే

ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పర్చూరు రోడ్డు మూడో మైలు నుంచి వట్టిచెరుకూరు వరకు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు రెండు వరుసలుగా లకు విస్తరించటం కలగా మిగిలింది. ఈ మార్గంలో వింజనంపాడు, చమళ్లమూడి, కాట్రపాడు గ్రామాలను కలుపుతూ 18 కిలోమీటర్ల దూరం రహదారి విస్తరించాల్సి ఉంది. ఈ మార్గంలో కాకుమాను మండల కేంద్రం, ప్రత్తిపాడు నియోజకవర్గ కేంద్రం, గుంటూరు నగర పాలక సంస్థకు వాహనాలు వెళుతుంటాయి. ప్రస్తుతం సింగిల్ రోడ్డుగా ఉండటంతో వింజనంపాడు, పర్చూరు రహదారుల మధ్య వాహనాలు ఎదురుపడితే పక్కకు దిగడం వల్ల గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారి రెండు వరుసలుగా విస్తరిస్తే రాకపోకలకు అనువుగా ఉంటాయని ప్రయాణికులు కోరుతున్నారు. వింజనంపాడు నుంచి వట్టిచెరుకూరు వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న సైడ్ బరమ్స్ బురదగా మారటం, రాకపోకలకు అనువుగా లేక ప్రయాణాలు కష్టంగా మారాయి.

చమళ్లమూడి వద్ద దాటలేక ఆగిన వాహనాలు

2012లోనే వంతెనల నిర్మాణం

వట్టిచెరుకూరు, కాట్రపాడు, చమళ్లమూడి, వింజనంపాడును కలుపుతూ పర్చూరు రోడ్డుకు రెండు వరుసల రహదారి నిర్మించేందుకు ఇప్పుడున్న ఆర్అండ్‌బీ రోడ్డుకు అనుబంధంగా రెండు వరుసల రోడ్లకు వీలుగా రెండు వంతెనలు, రెండు కల్వర్టులు నిర్మించారు. వట్టిచెరుకూరును తాకుతున్న జల్లవాగు పైన, అప్పాపురం ప్రధాన రహదారిపై రెండు వరుసల వంతెనలు నిర్మించారు. ఇంతేకాక సౌపాడు క్రాస్ రోడ్డు, చమళ్లమూడి, కాట్రపాడు మధ్య మురుగు కాలువ వద్ద రెండు వరుసల కల్వర్టులు నిర్మించారు. అనంతరం ఈ మార్గంలో రెండు వరుసల రహదారి మాత్రం నిర్మించలేదు. దీంతో వాహనాల సంఖ్య పెరిగి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రోడ్లు భవనాల శాఖ అధికారులు వట్టిచెరుకూరు మండల కేంద్రం వరకు రెండు వరుసలుగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

తుళ్లూరులో భాజపా విజయోత్సవం

తుళ్లూరు, న్యూస్‌టుడే : బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ, నీతీశ్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్డీఏ విజయ దుందుభి మోగించి 202 స్థానాలను సాధించిన సందర్భంగా గురువారం రాజధానిలో భాజపా విజయోత్సవం నిర్వహించినట్లు భాజపా తుళ్లూరు మండలం అధ్యక్షుడు నీరుకొండ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. నాయకులు తుళ్లూరులోని గుంటూరు రహదారిపై టపాసులు కాల్చి, మిఠాయిలు పంచి సంబరాలు చేశారు. దండె కిషోర్, సరిపూడి సాంబశివరావు, కొక్కపూడి హేమ సుందర్, కొమ్మినేని సత్యనారాయణ, కంతేటి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

కృష్ణా మీనోత్సవం నేడు

తాడేపల్లి, న్యూస్‌టుడే : కృష్ణానదిలో ప్రకాశం బ్యారేజీ ఎగువ భాగాన ఈనెల 21న కృష్ణా మీనోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు మత్స్యశాఖ అధికారులు గురువారం తెలిపారు. ఉండవల్లి పడవల రేవు వద్ద కృష్ణానదిలో చేప పిల్లలను వేయనున్నట్లు చెప్పారు.

కొనసాగిన సేవా కార్యక్రమం

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే : మంగళగిరి పట్టణంలోని వీజే డిగ్రీ కళాశాల విద్యార్థులు ఐదు రోజులుగా ఆత్మకూరులో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గురువారం జీఎస్టీ ప్రయోజనాలు, దాని వల్ల దేశానికి కలిగే లాభాలు, దేశ ఆర్థిక అభివృద్ధిలో జీఎస్టీ పాత్రపై విద్యార్థులు పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కుష్ఠు వ్యాధి సర్వే పరిశీలన

ఫిరంగిపురం న్యూస్‌టుడే : మండలంలోని ఫిరంగిపురం, నుదురుపాడు, మేరికపూడి, మునుగుపాడులో గురువారం రాష్ట్ర కుష్ఠు నివారణ అధికారి ఉషారాణి, గుంటూరు అధికారి డా.జయరామకృష్ణ, డాక్టర్ అనూష్య సర్వే తనిఖీ చేశారు. అనుమానిత కేసులను అధికారులు పరీక్షించారు. అధికారులు మాట్లాడుతూ కుష్ఠు లక్షణాలు ప్రారంభ దశలోనే గుర్తించి చర్యలు తీసుకుంటే అంగ వైకల్యం రాకుండా నివారించవచ్చని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు యానిగ్రేస్, నవీనా బేగం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పక్కా గృహ నిర్మాణానికి దరఖాస్తు చేసుకోండి

దుగ్గిరాల, న్యూస్‌టుడే : మండలంలో పక్కా గృహం లేని వాళ్లు ఈనెల 30లోగా పీఎంఏవై 2.0 కింద తమ పేరు నమోదు చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసరావు, గృహ నిర్మాణ శాఖ ఏఈ సుబ్బారావు గురువారం తెలిపారు. ఇలా చేసుకున్న వారికి మాత్రమే రానున్న నాలుగేళ్లలో ఇంటి నిర్మాణం మంజూరు చేస్తారని చెప్పారు.

చెట్టు ఒక్కటి.. శాఖలు ఐదు

వట్టిచెరుకూరులో ఓ ఇంటి పెరటిలోని మరుగుదొడ్డిలో చిన్న మొక్క.. పెద్దరావి చెట్టుగా ఎదిగింది. ఐదేళ్ల క్రితం మొక్క పుట్టింది. ఇందులో ఇది విస్తరిస్తుండటంతో కప్పుగా ఉన్న బండలు, రావిచెట్టు కొమ్మలు పెరుగుదలతో కూలాయి. మొక్క మాత్రం ఐదు పెద్ద శాఖలుగా పెరిగింది. ప్రస్తుతం చెట్టుకు ఆశ్రయం కల్పించిన మరుగుదొడ్డి పగిలి గోడలుగా మిగిలింది. రావి మొక్క ఎదుగుదల స్థానికులకు ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.
-వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే

ఇలాగే వదిలేస్తారా? పూడిక తీయరా?

ఆత్మకూరు గ్రామ పరిధిలోని కొత్త దళితవాడ కాలనీలో సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్లు ఆ ప్రాంత వాసులు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులు నెల తరబడి రోడ్లపై మురుగు స్తంభించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో మంచినీటి పైపు లీకై 4 నెలలుగా తాగునీరు వృథాగా అవుతోందని తెలిపారు. ఈ సమస్యను నగరపాలక సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదని అని వాపోతున్నారు. మురుగు ధాటికి దోమలు చేరి ఆరు బయట కూర్చోవాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.
-మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే

త్రుటిలో తప్పిన ప్రమాదం

పక్కకు ఒరిగిన ఆర్టీసీ బస్సు

గుంటూరు నుంచి విజయవాడ వెళుతున్న ఆర్టీసీ బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. బాపట్ల డిపో బస్సు గుంటూరు నుంచి 11 మందితో విజయవాడ బయలుదేరింది. తాడేపల్లి పరిధిలోని డీజీపీ కార్యాలయం వద్ద బస్సు స్టీరింగ్‌కు సాంకేతిక లోపం తలెత్తడంతో ఒక పక్కకు లాగేసింది. దీంతో జాతీయ రహదారిపై నుంచి పక్కనే ఉన్న మురుగు కాలువ వైపు వెళ్లి ఒరిగింది. బస్సులో ప్రయాణికులకు గాయాలు కాలేదు. బస్సు కల్వర్టు దాటే క్రమంలో ముందు చక్రం ఊడింది. ఆర్టీసీ అధికారులు ఘటనా ప్రదేశానికి చేరుకుని బస్సును రెండు క్రేన్లతో తొలగించారు. -తాడేపల్లి, న్యూస్‌టుడే

చీకటి పడితే చిందులే

తాడికొండ గ్రామ శివారులో ఎస్సీ, ఎస్టీ బాలుర వసతి గృహం నిరుపయోగంగా మారింది. వసతి గృహంలో పిచ్చిమొక్కలు, ముళ్లకంపలు పెరిగి చిట్టడవిని తలపిస్తోంది. దీంతో ఇది మందుబాబులకు ఆసరాగా మారింది. ఊరికి చివర ఉండటంతో పలు అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. దీంతో పక్కనే నివాసం ఉంటున్న స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఆ పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాల దుస్థితి ఇంతే. అధికారులు స్పందించి ప్రభుత్వ భవనాలను పునరుద్ధరించి ఉపయోగంలోకి తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు. -తాడికొండ, న్యూస్‌టుడే

పిచ్చిచెట్ల నడుమ భవనం

సీఐటీయూ జిల్లా మహాసభలు విజయవంతం చేయండి

తాడేపల్లి, న్యూస్‌టుడే : తాడేపల్లిలో ఈనెల 23, 24 తేదీల్లో నిర్వహించే సీఐటీయూ జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని రాజధాని సీఐటీయూ డివిజన్ కమిటీ నాయకుడు ఎం.రవి కోరారు. ఉండవల్లిలో గురువారం మున్సిపల్ కార్మికుల సమావేశం నిర్వహించారు. కృష్ణుడు గుడి కూడలిలో నిర్వహించనున్న సభలో కార్మికులంతా పాల్గొనాలని కోరారు. నాయకులు నారాయణ, స్వర్ణకుమారి, సుందరరావు, స్వరూప పాల్గొన్నారు.

ఇద్దరు పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి

దుగ్గిరాల, న్యూస్‌టుడే : మండలంలో ఇద్దరు పంచాయతీ కార్యదర్శులకు గ్రామ సచివాలయ, వార్డు సచివాలయాల (జీఎస్‌డబ్ల్యూఎస్) అధికారులుగా పదోన్నతి లభించింది. పెదపాలెం కార్యదర్శి తాళ్లూరు వెంకట్రావ్, ఈమని పంచాయతీ కార్యదర్శి అయితపు రామ్‌కుమార్ పేర్లు గురువారం విడుదల చేసిన పదోన్నతి జాబితాలో ఉన్నాయి.

నేటి నుంచి శ్రీరామ నామ సప్తాహ మహోత్సవాలు

వింజనంపాడు (వట్టిచెరుకూరు) : మండలంలోని వింజనంపాడు కోదండరామస్వామి దేవాలయంలో స్వామి 61వ రామ నామ సప్తాహ మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. స్వామి గ్రామోత్సవం, నామ సంకీర్తనలతో కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ కోయి సుబ్బారావు, కార్యదర్శి కోయి శేఖర్ సమక్షంలో కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

యువతకు నైపుణ్య శిక్షణ

తుళ్లూరు: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గుంటూరులోని జిల్లా పారిశ్రామిక శిక్షణ కార్యాలయంలో నిరుద్యోగ యువతకు ఫోర్ వీలర్ టెక్నీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తారని గురువారం తుళ్లూరు ఎంపీడీఓ కానూరి శిల్ప తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు అందించి ప్రైవేటు, కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తారని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు 26 లోపు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉన్న ప్రభుత్వ డీఎల్‌టీసీ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.

గండాలయ్య స్వామికి పూజలు

పూజలో అధికారి సునీల్, భక్తులు

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే : మంగళగిరిలోని పానకాల లక్ష్మీ నరసింహస్వామి ఆలయ కొండ శిఖర భాగంలో గండాలయ్య స్వామి ఆలయం వద్ద కార్తిక అమావాస్య పురస్కరించుకుని గురువారం భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సహాయ కార్య నిర్వహణాధికారి సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మూడువేల మందికి అన్నదానం

భోజనం వడ్డిస్తున్న చేస్తున్న సాంబశివరావు

మంగళగిరి, న్యూస్‌టుడే : అమావాస్య పురస్కరించుకుని మంగళగిరిలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులు, పానకాల లక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకున్న సుమారు 3 వేలమందికి కాశీ అన్న పూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ గురువారం అన్న ప్రసాద వితరణ చేసింది. ట్రస్టు ఛైర్మన్ పందేటి సాంబశివరావు ఆధ్వర్యాన 40 మంది సభ్యులు సేవలో పాల్గొన్నారు. భక్తులు పాల్గొన్నారు.

ఎరువుల కోసం ఆందోళన వద్దు

పెదనందిపాడు, న్యూస్‌టుడే : ఎరువుల కోసం వచ్చిన రైతులను నానో యూరియా కొనాలని బలవంతం చేస్తే ఆ దుకాణాల యజమానులపై చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం ఆయన పెదనందిపాడులో జీడీఎంఎస్, మన గ్రోమోర్, గొరిజవోలు గుంటపాలెంలోని మరో ఎరువుల దుకాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఎరువుల కోసం ఆందోళన చెందవద్దని, ఇప్పటి వరకు 882 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా చేసినట్లు చెప్పారు. అవసరం మేరకు మళ్లీ 200 మెట్రిక్ టన్నుల యూరియా, 100 టన్నుల డీఏపీ మంజూరు చేయాలని ప్రతిపాదన పెట్టామన్నారు. రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచేందుకు ప్రణాళిక రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలు

పోటీల్లో విద్యార్థులు

తుళ్లూరు, న్యూస్‌టుడే : మందడం జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలో రాజధాని సీడ్ యాక్సెస్ రహదారిపై గురువారం రాష్ట్ర స్థాయి సైక్లింగ్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి శాప్ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.భరణి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. శాప్ ఛైర్మన్ రవి నాయుడు, గుంటూరు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి అఫ్రోజ్‌ఖాన్, సైక్లింగ్ ఫెడరేషన్ అధికారులు, తల్లిదండ్రులు, కోచ్‌లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం సక్రమంగా పెట్టరా?

ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

వరగాని (పెదనందిపాడు) న్యూస్‌టుడే : మా పిల్లలకు మధ్యాహ్న భోజనం సక్రమంగా పెట్టడం లేదంటూ వరగాని ఎస్‌డబ్ల్యూయూ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు మూడు రోజులుగా వంట తయారు చేయనందున విద్యార్థులకు ఉపాధ్యాయులే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారని.. ఈ పద్ధతి ఏంటని వారు ప్రశ్నించారు. అనంతరం ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల కమిటీ సమావేశంలో తల్లిదండ్రులు కొందరు పిల్లలకు కూర కొద్దిగా వేస్తున్నారని, మళ్లీ అడిగితే ఏజెన్సీ వారు కోప్పడుతున్నారని చెప్పారు. సకాలంలో బిల్లు రావడం లేదని, పాఠశాలలో నీటి వసతి కూడా లేదని ఏజెన్సీ వారు తెలిపారు. విషయం తెలిసిన ఆర్జేడీ.. ఎంఈవో జాకబ్‌తో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కొత్తగా ఏజెన్సీ ఏర్పాటు చేసి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలను తహసీల్దార్ హేనాప్రియ, ఎస్సై మధుపవన్, వీఆర్వో అనిల్ సందర్శించి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కొత్త ఏజెన్సీ నియమించే వరకు గ్రామంలోని మరో పాఠశాల నుంచి భోజనం వండించాలని తహసీల్దార్ ఉపాధ్యాయులకు సూచించారు.

అంగవైకల్యం.. నివారణే లక్ష్యం

★ కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు చర్యలు ★ ఇంటింటా సర్వే చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

మేడికొండూరు, ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాయి. ఈ నేపథ్యంలో జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన (ఎల్‌సీడీసీ) కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 17 నుంచి 30 వరకు 15 రోజుల పాటు సర్వే చేస్తున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు తమ పరిధిలోని గృహాలు సందర్శిస్తున్నారు.

★ వ్యక్తుల చర్మంపై స్పర్శ లేని మచ్చలు, చర్మం ఉబ్బెత్తు, చెవ్వులు, శరీరంపై నొప్పి లేని బొడిపెలు, కళ్ల వెంట్రుకలు ఊడిపోవడం, కంటి రెప్పలు మూతపడక పోవడం, ముక్కు దిబ్బడ, ముక్కులో నుంచి రక్తం బయటకు రావడం, అర చేతులు, కాళ్లు తిమ్మిర్లు వంటి సమస్యలున్నాయా అంటూ 23 రకాల ప్రశ్నలు అడుగుతూ ఆరా తీస్తున్నారు.

★ వారిలో ఒకరిపై అనుమానం వస్తే స్థానిక ఆరోగ్య కార్యకర్తలు మరోసారి పరిశీలన చేస్తున్నారు. తర్వాత అవసరమైతే వైద్యాధికారులు వద్దకు అనుమానితులను తీసుకెళుతున్నారు. వ్యాధి లక్షణాలు ఉన్నట్లు అనుమానం బలపడితే సదరు వ్యక్తులను గుంటూరు సర్వజనాసుపత్రికి పంపిస్తారు. అక్కడ మరోసారి వైద్య పరీక్షలు చేస్తారు.

★ వ్యాధి నిర్ధారణ అయితే మందులు ఉచితంగా అందిస్తారు. ఇలా తొలిదశలో కుష్ఠు వ్యాధిని గుర్తించి.. దాని నిర్మూలనకు చర్యలు తీసుకుంటారు. దీంతో అంగ వైకల్యం కలగకుండా నివారించవచ్చని ప్రభుత్వం ఆలోచన. గ్రామాల్లో ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటా సర్వే చేస్తూ మరో పక్క పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఫిరంగిపురంలో అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

తాడికొండలో ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

దుగ్గిరాల : బహుమతి అందిస్తున్న తహసీల్దార్ సునీత

పెదనందిపాడు: బహుమతులు అందుకున్న విజేతలతో అతిథులు

న్యూస్‌టుడే, బృందం : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొదుపు చేస్తే ఆర్థికంగా బలోపేతం

మాట్లాడుతున్న ఏపీఎం ప్రియదర్శిని

లేమల్లెపాడు (వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే : పొదుపు వల్ల పేద కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయని వట్టిచెరుకూరు ఏపీఎం ప్రియదర్శిని అన్నారు. మండలంలోని లేమల్లెపాడులో గురువారం నిర్వహించిన పొదుపు సంఘాల మహిళా నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి గ్రూపు తప్పకుండా పొదుపు మొత్తాలు చెల్లించాలని సూచించారు. సర్పంచి పాతూరి శివపార్వతి, సహకార సంఘం ఛైర్‌పర్సన్ పాతూరి కృష్ణారావు, గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు యర్రగుంట్ల కళావతి పాల్గొన్నారు.

అమరావతిలో రూ.150 కోట్లతో జాతీయ గ్రంథాలయ నిర్మాణం

తాడేపల్లి, న్యూస్‌టుడే : రాజధాని అమరావతిలో రూ.150 కోట్లతో జాతీయ గ్రంథాలయ నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టబోతోందని గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తెలిపారు. తాడేపల్లి మండలం వడ్డేశ్వరం వద్ద ఉన్న కేఎల్ విశ్వ విద్యాలయంలో సెంట్రల్ లైబ్రరీ ఆధ్వర్యాన నిర్వహించిన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నూతనంగా నిర్మించనున్న జాతీయ గ్రంథాలయాన్ని 24 నెలల్లో పూర్తి చేయాలని సంకల్పించినట్లు చెప్పారు. గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ పద్మజ, కేఎల్‌యూ వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ, ప్రో.వీసీలు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ వెంకట్రామ్, డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ సుబ్బారావు, సెంట్రల్ లైబ్రరీ ప్రొఫెసర్ ఇన్‌ఛార్జి డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

పూర్తయిన సంతకాల సేకరణ

మంగళగిరి: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ వైకాపా చేపట్టిన కోటి సంతకాల సేకరణలో భాగంగా తాడేపల్లి మండలం ఉండవల్లి, మంగళగిరి మండలం ఆత్మకూరులో ఆ పార్టీ నాయకులు సంతకాలు సేకరణ చేసినట్లు నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి గురువారం ప్రకటించారు. మంగళగిరి పార్టీ కార్యాలయంలో పూర్తి చేసిన సంతకాల జాబితాలను ఉండవల్లి నాయకులు అందజేసినట్లు ప్రకటించారు.

లారీ డ్రైవర్ ఆత్మహత్య

కుర్నూతల (వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే : మండలంలోని కుర్నూతలలో అప్పుల బాధతో లారీడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ రామానాయక్ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కూరపాటి రాజు (42) గతంలో లారీడ్రైవర్.. యజమాని. ఈ క్రమంలో అప్పులు పెరిగి లారీ అమ్మేశాడు. గతంలో తీసుకున్న రుణం చెల్లించమని రుణదాతలు ఫోన్లు చేస్తుండటంతో ఒత్తిడి తాళలేక నవంబర్ 19న ఎలుకల మందు తిన్నాడు. గమనించిన భార్య సుధ గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. సీఐ కేసు నమోదు చేశారు.

రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు

స్థానికులతో మాట్లాడుతున్న సీఐ బ్రహ్మం

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదాల నివారణకు కురగల్లు, నిడమర్రు గ్రామాల్లో గురువారం మంగళగిరి గ్రామీణ సీఐ ఎ.వి.బ్రహ్మం, గ్రామీణ ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా రోడ్డు భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ వాహనాలు జాగ్రత్తగా నడపాలని వాహనదారులను కోరారు. ప్రముఖ విశ్వ విద్యాలయాలకు చెందిన బస్సుల రాకపోకలు, రాజధాని ప్రాంతంలో అభివృద్ధి పనులకు సంబంధించిన భారీ వాహనాల వెళుతున్న నేపథ్యంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని కురగల్లు ప్రాంత ప్రజలు సీఐకి తెలిపారు. ఆయన స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న గుంతలు, పిచ్చిచెట్లను డోజర్ సాయంతో తొలగింపజేశారు. ప్రమాద రహితంగా మంగళగిరి ప్రాంతాన్ని మార్చే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ప్రజలు పాల్గొన్నారు.

(c) eenadu

తెనాలి

•తెనాలి •పొన్నూరు

బేస్‌బాల్ జిల్లా జట్టుకు ఎంపిక

విద్యార్థులకు పుష్పగుచ్ఛం అందిస్తున్న హెచ్‌ఎం జ్యోతిర్మయి

పొన్నూరు, న్యూస్‌టుడే: మేడికొండూరు మండల పరిధి కొర్రపాడు హైస్కూల్‌లో నిర్వహించిన బేస్‌బాల్ జిల్లా జట్టు ఎంపికల్లో దొప్పలపూడి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్-14 విభాగంలో సయ్యద్ షాఫియా, సీహెచ్ షరోన్ కుమారి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు హెచ్‌ఎం జ్యోతిర్మయి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జ్యోతిర్మయి, పీడీ డైసిరాణి, ఉపాధ్యాయులు విద్యార్థినులను అభినందించారు.

దర్గాలో ప్రత్యేక అమావాస్య పూజలు

పెదకాకాని: అమావాస్య సందర్భంగా గురువారం వేల సంఖ్యలో భక్తులు బాజీ బాబాను దర్శించుకున్నారు. క్యూలైన్లో ఉన్న భక్తులు త్వరగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు ఈవో ఖాజా మస్తాన్ తెలిపారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ ఆదేశాలతో అన్నదానం నిర్వహించినట్లు చెప్పారు. తెదేపా మండల అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, ముత్తవల్లి, ముజావర్ల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తెనాలి మార్కెట్ యార్డులో..

నిమ్మకాయల ధరలు రూ.. (క్వింటా)



అత్యధికం:1000
అత్యల్పం:700
సగటు: 800

- న్యూస్‌టుడే, తెనాలి టౌన్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? తెనాలి పట్టణ నెహ్రూ రోడ్డులో చెట్లకొమ్మలు, వ్యర్థాలు పడి ఉన్నాయి. పట్టణ కొత్తపేట వెంకటకృష్ణారావునాయుడు వీధిలో వ్యర్థాలను తరలించడం లేదు. కాలువల్లో మురుగు పారుదల లేదు. - స్థానికులు, నెహ్రూ రోడ్డు, కొత్తపేట
✔ సత్వరం వ్యర్థాలను తరలింపజేస్తాం.
? తెనాలి పట్టణ నాజరుపేట శ్రీసత్యసాయిబాబా గుడి రోడ్డు కూడలిలో వీధి దీపాలు 20 రోజులుగా వెలగడం లేదు.
- స్థానికులు, నాజరుపేట ✔ మరమ్మతులు చేయిస్తాం.
- రామఅప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్
★ తెనాలి పట్టణంలోని రోడ్ల విభాగినుల్లో ఫ్లెక్సీలు ప్రమాదకరంగా ఉన్నాయని స్థానికుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు మున్సిపల్ అధికారులు స్పందించారు. కార్మికులతో వాటిని తొలగింపజేశారు. ★ తెనాలి పట్టణ పినపాడులో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు మున్సిపల్ అధికారులు స్పందించి.. మరమ్మతులు చేయించారు. - న్యూస్‌టుడే, తెనాలి టౌన్

? పొన్నూరు పరిధిలోని 21వ వార్డు శివారులో వీధి దీపం వెలగడం లేదు. బాగు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలి.
- షేక్‌సుభానీ, 21వ వార్డు ✔ వీధి దీపాన్ని బాగు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. - షేక్ హసీనా, సహాయ ఇంజినీరు ? పొన్నూరు పరిధిలోని శ్రీనగర్‌కాలనీలో రెండు రోజులుగా వ్యర్థాలు పేరుకుపోయాయి. - పి.లక్ష్మి ప్రసన్న, శ్రీనగర్‌కాలనీ.
✔ వ్యర్థాలను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం.
- పోతురాజు, ప్రజారోగ్యశాఖాధికారి.
★ పట్టణ పరిధి 17వ వార్డులోని మురుగు నీటి కాలువలో వ్యర్థాలు పేరుకున్నాయని అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. కార్మికులతో కాలువలు శుభ్రం చేయించారు.
★ 12వ వార్డులో కుళాయికి వాల్వును ఏర్పాటు చేసి నీటి వృథాను అరికట్టారు. - న్యూస్‌టుడే, పొన్నూరు

యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్ష, కార్యదర్శులు భాస్కరరావు, శివరామకృష్ణ

పొన్నూరు, న్యూస్‌టుడే: పొన్నూరు యూటీఎఫ్ కార్యాలయంలో గురువారం రాత్రి మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భాస్కరరావు, ప్రధాన కార్యదర్శిగా నన్నపనేని శివరామకృష్ణ, కోశాధికారిగా సుబ్బారావు, గౌరవ అధ్యక్షుడిగా అంకినీడు ప్రసాద్, సహ అధ్యక్షులుగా ఏ. వెంకటేశ్వర్లు, ఎం.స్వాతి, కార్యదర్శులను ఎన్నుకున్నారు.

అన్నదాతలకు.. అండగా..!

పొన్నూరు, న్యూస్‌టుడే

చింతలపూడిలో రైతులతో మాట్లాడుతున్న ఏవో రాజవరపు వెంకటేశ్వరరావు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కష్టకాలంలో ఉన్న అన్నదాతలకు అండగా నిలుస్తున్నాయి. తొలి విడతలో ఇప్పటికే ఒక్కో రైతుకు రూ.7 వేలు నగదు జమ చేశారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం కింద రెండో విడతలో ఒక్కో రైతు ఖాతాలో మరో రూ.7 వేలు జమ చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో 21,632 మంది రైతులకు రూ.13.93 కోట్లు లబ్ధి చేకూరనుందని అధికారులు చెబుతున్నారు.
★ రబీలో మొక్కజొన్న, మినుము, పెసర తదితర విత్తనాలు కొనుగోలు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో వారి ఖాతాలో జమ చేసిన నగదుతో వారికి మేలు జరుగనుందని చెప్పొచ్చు. దీనిపై పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరిని న్యూస్‌టుడే వివరణ కోరగా.. అర్హులైన ప్రతి రైతు ఖాతాలో నగదు జమ అవుతుందని వెల్లడించారు.

మండలం	రైతుల సంఖ్య	నగదు (రూ.కోట్లలో)
పొన్నూరు	8,731	5.55
చేబ్రోలు	8,276	5.25
పెదకాకాని	4,625	3.13
మొత్తం	21,632	13.93

సీడీఈ పీజీ పరీక్షల ఫలితాలు విడుదల

విడుదల చేస్తున్న సంచాలకులు ఆచార్య వెంకటేశ్వర్లు

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని దూర విద్యా కేంద్రం(సీడీఈ)లో ఈ ఏడాది జులైలో నిర్వహించిన పీజీ పరీక్షల ఫలితాలను సంచాలకులు ఆచార్య వెంకటేశ్వర్లు విడుదల చేశారు. ఎంఏ అర్థశాస్త్రం, పొలిటికల్ సైన్స్, చరిత్ర, హిందీ, తెలుగు, జర్నలిజం, సోషియాలజీ, సోషల్‌వర్క్, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, గణాంకాలు, ఫుడ్ అండ్ న్యూట్రిషన్, బోటనీ, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, గణితం, కంప్యూటర్ సైన్స్, ఐటీ, సైకాలజీ, ఎంకామ్, ఎంబీఏ, ఎంసీఏ, హెచ్‌ఆర్‌ఎం, ఎంఎల్‌ఐఎస్సీ, బీఎల్ఐసీ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. పరీక్షా పత్రాల పునర్మూల్యాంకన కోసం ఈ నెల 29లోపు ఒక్కో పేపరుకు రూ.960 చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. సమన్వయకర్త ఆచార్య రామచంద్రన్, డీఆర్ జైనుల్దీన్, ఏఆర్ కృష్ణవేణి, కోదండపాణి, వెంకటప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంఘటిత పోరాటాలతోనే విజయం

మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

కొల్లిపర, న్యూస్‌టుడే: సంఘటిత పోరాటాలతోనే విజయాలు సాధ్యమని సీఐటీయూ జిల్లా నాయకులు భావన్నారాయణ అన్నారు. గురువారం కొల్లిపరలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబరు నెలాఖరులో విశాఖపట్నంలో నిర్వహించనున్న అఖిల భారత మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండల కమిటీ కన్వీనర్‌గా ఎం.జయప్రద, కో కన్వీనర్‌గా మల్లేల రమేష్, ... కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎంపికచేసినట్లు చెప్పారు. నాయకులు ములకా శివసాంబిరెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సిన్ల వినియోగంపై అవగాహన

అధ్యాపకులకు రక్త పరీక్షలు చేస్తున్న ఫార్మసీ విద్యార్థులు

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: జాతీయ ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా గురువారం ఏఎన్‌యూలోని ఫార్మసీ కళాశాల విద్యార్థులకు వ్యాక్సిన్ వినియోగం, మందుల వాడకంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. అనంతరం మందుల వినియోగంపై విద్యార్థులు వేసిన స్కిట్లు ఆకట్టుకున్నాయి. ఫార్మా ర్యాపిడ్ ఫైర్ వక్తృత్వం తదితర పోటీలు నిర్వహించారు. విద్యార్థులు రక్త నమూనా పరీక్షలు, బాడీ మాస్ ఇండెక్స్‌పై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ ఆచార్య దివ్యతేజోమూర్తి, అధ్యాపకులు రవిశంకర్‌రెడ్డి, అన్నపూర్ణ, ప్రవళిక, రవి, షేక్ మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలు

తుళ్లూరు, న్యూస్‌టుడే: మండలం జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలో రాజధాని సీడ్ యాక్సెస్ రహదారిపై గురువారం రాష్ట్ర స్థాయి సైక్లింగ్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి శాప్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.భరణి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. శాప్ చైర్మన్ రవినాయుడు, గుంటూరు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి అప్పోజీవన్, సైక్లింగ్ ఫెడరేషన్ అధికారులు, తల్లిదండ్రులు, కోచ్‌లు పాల్గొన్నారు.

యువతకు నైపుణ్య శిక్షణ

తుళ్లూరు: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గుంటూరులోని జిల్లా పారిశ్రామిక శిక్షణ కార్యాలయంలో నిరుద్యోగ యువతకు ఫోర్ వీలర్ టెక్నీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తుళ్లూరు ఎంపీడీఓ కానూరి శిల్ప గురువారం తెలిపారు.

మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు

ఆలపాటి శివప్రసాద్, సీఈ, ఏఎన్‌యూ

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలోని గుంటూరు, పల్నాడు జిల్లా, డెల్టా ప్రాంతంలోని కొన్ని కళాశాలల్లో మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్లు మీడియాలో వచ్చిన కథనాలపై సీఈ ఆలపాటి శివప్రసాద్ స్పందించారు. బీఈడీ, ఫార్మసిస్ట్ కోర్సుల మూడో సెమిస్టర్ పరీక్షల్లో విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నట్లు మీడియాలో కథనాలు వచ్చాయని సీఈ తెలిపారు. కాపీయింగ్ జరగకుండా ప్రత్యేక బృందాలను నియమించినట్లు తెలిపారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని... పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. డెల్టా ప్రాంతంలోని ఓ కళాశాలకు అప్పటి ఏయూ పరిధిలో ఉన్నప్పటి నుంచి పరీక్ష కేంద్రం కేటాయించామని.. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతమైతే ఆ సెంటర్‌ను రద్దు చేస్తామన్నారు.

సమస్యలు పరిష్కరించకుండా ఒకరిపై మరొకరు చెప్పుకుంటారా..?

ఐసీడీఎస్ అంశాల గురించి వివరిస్తున్న సీడీపీవో విజయగౌరి, వేదికపై ఎంపీపీ, ఎంపీడీవో

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: గ్రామాల్లో నెలకొన్న సమస్యల గురించి పలుమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోకుండా తమ విభాగం కాదంటూ తప్పించుకోవడం ఏంటని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెనాలి మండల ప్రజాపరిషత్తు కార్యాలయంలో గురువారం మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. కుక్కలు, ఆక్రమణలు, రోడ్లపై గుంతలు, అసంపూర్తి నిర్మాణాలు, విద్యుత్తు, మురుగు వంటి సమస్యలు ఎప్పుడు పరిష్కరిస్తారంటూ స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులను ప్రశ్నించారు. తమ వీధి నుంచి పారిశుద్ధ్య సిబ్బంది ఇతర ప్రాంతాలకు పంపవద్దని కఠెవరం గ్రామ సర్పంచి ప్రసాద్ చెప్పగా.. మంత్రి పర్యటన నేపథ్యంలో పంపాల్సి వచ్చిందని.. అవసరమైన సందర్భాల్లో మండలం యూనిట్‌గానే పనులు జరుగుతాయని ఎంపీవో దీప్తి సమాధానం ఇచ్చారు. డిసెంబరు నెలాఖరులోగా ఆధార్‌కు సంబంధించిన పనులు పూర్తి చేయించాలని, శిబిరాల సమాచారాన్ని అందరికీ తెలియజేయాలని, కొన్ని పథకాలు ఆరోగ్య విభాగం నుంచి ఐసీడీఎస్‌కు బదిలీ అయ్యాయని సీడీపీవో విజయగౌరి చెప్పారు. తమ కార్యాలయం వద్ద ప్రహరీ లేక ఇబ్బందిగా ఉందని సమస్యను పరిష్కరించాలని కోరారు. వివిధ విభాగాల అధికారులు మాట్లాడారు. ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు సమావేశానికి అధ్యక్షత వహించారు.

ధాన్యం కొనుగోలుకు సిద్ధం

మాట్లాడుతున్న తహసీల్దారు మహమ్మద్ జియావుల్‌హక్

పొన్నూరు, న్యూస్‌టుడే: రైతు సేవ కేంద్రాల్లో ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉన్నామని తహసీల్దారు మహమ్మద్ జియావుల్‌హక్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం పొన్నూరు తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, వ్యవసాయ అధికారులు, సిబ్బందితో ఆయన ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పొన్నూరులో 32,751 ఎకరాల్లో వరి పైరును సాగు చేశారని, అందుకు గాను 7,32,852 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేసినట్లు తెలిపారు. రైతులు మద్దతు ధరకే ధాన్యం అమ్ముకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల లోపు రైతుల బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని చెప్పారు.

రైతులకు మేలు జరిగేలా చొరవ చూపండి

రైతుకు టార్పాలిన్ పట్టా అందిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: రైతులకు అండగా ఉంటామని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. తెనాలి మండలం సోమసుందరపాలెంలో గురువారం ఆయన వరి పొలాలను పరిశీలించారు. పట్టణ పరిధి ఐతానగర్ లింగారావు కూడలిలో రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అనుబంధ విభాగాల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందనే సమాచారాన్ని అందరికీ తెలిసేలా ప్రచారం చేయాలని.. రైతులకు మేలు జరిగేలా చొరవ చూపాలని సూచించారు. సమావేశానికి కొందరు రైతు సేవా కేంద్రాల సిబ్బంది గైర్హాజరు కావడంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వాహనాలు ఇలా.. రాకపోకలెలా?

తెనాలి పట్టణ వహాబ్ రోడ్డు నుంచి జిలేబి కొట్ల బజారుకు వెళ్లే మార్గం అసలే ఇరుకు. అందులోనూ వాహనాలతో నిండిపోతూ ఉండడంతో రాకపోకల సాగించలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడి వారో ఇక్కడ వాహనాలు పెడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి వహాబ్‌చౌక్‌లోనూ ఉంది. పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తెనాలి టౌన్

పొగతో ఉక్కిరి బిక్కిరి

తెనాలి బుర్రిపాలెం రోడ్డులోని మున్సిపల్ కంపోస్టు యార్డులో వ్యర్థాలు తగలబెడుతున్నప్పుడు ఆ మార్గంలో దట్టంగా పొగ వ్యాపిస్తోంది. దీంతో అటుగా రాకపోకలు సాగిస్తున్న వాహనచోదకులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. పరిస్థితి ఎలా ఉందో పై చిత్రంలో చూడవచ్చు. తరుచూ ఇదే పరిస్థితి కొనసాగుతుందని. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తెనాలి టౌన్

ఇలా ఉంటే.. రోగాలు రావా..

మండల పరిధిలోని వెల్లలూరులోని కాలువల్లో మురుగు నీరు ముందుకు కదలడం లేదు. కాలువల్లో అక్కడక్కడ వ్యర్థాలు పేరుకున్నాయి. స్థానికులు దుర్వాసనతో నానా ఇబ్బందులు పడుతున్నారు. దోమల సమస్య ఎక్కువగా ఉందని చెబుతున్నారు. ఇలా ఉంటే రోగాలు రావా అని స్థానికులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలను శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పొన్నూరు

సీఆర్‌టీ శిక్షణ తరగతులు ప్రారంభం

విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న శ్రీధర్

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాల నాలుగో ఏడాది విద్యార్థులకు గురువారం నుంచి క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ (సీఆర్‌టీ) శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. అన్ని విభాగాల విద్యార్థులకు శిక్షణ తరగతులను ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ ప్రారంభించారు. పది రోజుల పాటు తరగతులు నిర్వహించనున్నట్లు వీసీ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ట్రిఫెంట్ ట్రైనింగ్ సొల్యూషన్స్ సీఈవో జాలపాటి శ్రీధర్, గోపి, అభినయ్ శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. సులభంగా ఉద్యోగాలు సాధించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రెక్టార్ శివరామ్‌ప్రసాద్ మాట్లాడుతూ..ఎంత ఖర్చయినా భరించి విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించాలనే లక్ష్యంతో ఈ శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామన్నారు. రిజిస్ట్రార్ సింహాచలం, ప్రిన్సిపల్ ఆచార్య లింగరాజు, సహాయ ప్రిన్సిపల్స్ గోపీ కిశోర్, చంద్రమౌళి, ప్లేస్‌మెంట్ అధికారి తౌసీఫ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఘన వ్యర్థాల కేంద్రాలు అందుబాటులోకి తేవాలి

అధికారులతో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ సీఈవో జ్యోతి బసు

చేబ్రోలు, న్యూస్‌టుడే: అన్ని గ్రామాల్లో నిర్మించిన ఘన వ్యర్థాల కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా పరిషత్ సీఈవో జ్యోతి బసు అన్నారు. గ్రామాల్లో సేకరించిన తడి చెత్త ద్వారా ఎరువును తయారు చేసి పంచాయతీల ఆదాయాన్ని పెంచుకోవాలన్నారు. మురుగునీటి వ్యవస్థను పరిశీలించి ఇంకుడు గుంతలపై అవగాహన కల్పించి వాటిని ఏర్పాటు చేసుకునేలా ప్రజల్ని చైతన్య పరచాలన్నారు. ఎంపీడీవో ఊహారాణి, గ్రామ ఇన్‌ఛార్జి పర్సన్ సాంబశివరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చక్కటి పుస్తకం మంచి స్నేహితుడితో సమానం

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

తెనాలి జేయంజే కళాశాలలో..

నందివెలుగులో..

న్యూస్‌టుడే బృందం: పుస్తకాలు, పత్రికలు చదివే అలవాటు మనో వికాసానికి దోహదం చేస్తుందని, చక్కటి పుస్తకం మంచి స్నేహితుడితో సమానమని.

చేబ్రోలులో...

. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని అతిథులు, ఉపాధ్యాయులు, పర్యవేక్షకులు విద్యార్థులకు సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల్లో గత వారం రోజులుగా వివిధ పోటీలు నిర్వహించారు. వాటిల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు గురువారం బహుమతులు అందించారు.

పెదకాకానిలో..

కొల్లిపర: వల్లభాపురంలో ...

నవంబరు 26న విద్యార్థులకు మాక్ అసెంబ్లీ

తెనాలి ప్రతినిధిగా అనూష

విజేతను అభినందిస్తున్న ఎంపీడీవో, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఈ ఏడాది వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దేశ రాజ్యాంగం గురించి విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించేందుకు నడుం బిగించింది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లోని 8, 9, 10 తరగతుల విద్యార్థులకు రాజ్యాంగ నిర్మాణం, అందులోని వివిధ అంశాలపై వ్యాస రచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించింది. తొలి దశలో పాఠశాల, అటుపై మండల, చివరగా నియోజకవర్గ స్థాయిల్లో వీటిని నిర్వహించి విజేతలను ఎంపిక చేసింది. గత నెలలో మొదలైన ప్రక్రియ ఇటీవల ముగిసింది. ప్రతి నియోజకవర్గం నుంచి ఒక ప్రతినిధి (స్టూడెంట్ ఎమ్మెల్యే)ను ఎంపిక చేసి రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల ప్రతినిధులతో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న విద్యార్థుల మాక్ అసెంబ్లీని నిర్వహించనుంది. ఈ నెల 24, 25 తేదీల్లో విజయవాడలోని లయోలా కళాశాలలో ఈ ప్రతినిధులందరికీ శిక్షణ ఏర్పాట్లు చేశారు. అసెంబ్లీ నిర్వహణ, ఎలా మాట్లాడాలి తదితర అంశాలపై తర్ఫీదు ఇవ్వనున్నారు.

విద్యార్థినికి అభినందన : కొల్లిపర మండలం అత్తోట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని 'కె. అనూష' తెనాలి ప్రతినిధిగా ఎంపికైంది. అన్ని దశల్లో తొలి స్థానంలో నిలిచి ఈ గౌరవాన్ని దక్కించుకుంది. పాఠశాలలో సాంఘికశాస్త్రం బోధిస్తున్న ఉపాధ్యాయుడు సాంబశివరావు గైడ్ టీచర్‌గా వ్యవహరించారు. అనూష తండ్రి లక్ష్మణరావు కౌలు రైతు, తల్లి వెంకటలక్ష్మి గృహిణి. తెనాలి మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో గురువారం అనూషను ఎంపీడీవో ఏ.దీప్తి, విద్యాశాఖాధికారులు లక్ష్మీనారాయణ, జయంతిబాబు, ఏవో శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

అన్న క్యాంటీన్లను సద్వినియోగం చేసుకోండి

అల్పాహారం తింటున్న కమిషనర్ రామఅప్పలనాయుడు, ఎంహెచ్‌వో ఏసుబాబు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: పేదల కోసం తక్కువ ధరకు అన్న క్యాంటీన్లలో అందిస్తున్న అల్పాహారం, భోజనాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.రామఅప్పలనాయుడు పేర్కొన్నారు. గురువారం ఆర్టీసీ బస్‌స్టేషన్ వెనుక ఉన్న అన్న క్యాంటీన్‌లో ఆయన తనిఖీలు నిర్వహించారు. క్యాంటీన్‌లో ప్రదర్శించిన పట్టికలో పేర్కొన్న ధరలకు అన్ని రకాలు పెడుతున్నారా లేదా? అని అల్పాహారం తీసుకుంటున్న పలువురిని అడిగి తెలుసుకున్నారు. నాణ్యత ఎలా ఉందంటూ ప్రశ్నించి వివరాలు రాబట్టారు. ఏదైనా ఇబ్బందులుంటే నేరుగా తెలియజేయవచ్చని వారికి తెలిపారు. అనంతరం ఎంహెచ్‌వో ఏసుబాబుతో కలిసి అల్పాహారం తిన్నారు.

ప్రార్థనా మందిరాల వద్ద రాజకీయాలు సిగ్గుచేటు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: మెడికల్ కళాశాలల సంతకాల పేరిట వైకాపా నాయకులు మసీదులు, చర్చిల వద్ద రాజకీయాలు చేయడం సిగ్గుచేటని.. గతంలో ఏ రాజకీయ పార్టీ కూడా ఈ రీతిన వ్యవహరించలేదని తెదేపా క్రిస్టియన్, ముస్లీం నాయకులు విమర్శించారు. తెనాలి తెదేపా కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.

అర్జీల స్వీకరణ నేడు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి తెదేపా కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని పార్టీ నాయకులు గురువారం తెలిపారు.

శ్రీరామ నామ సప్తాహ మహోత్సవాలు

వింజనంపాడు (వట్టిచెరుకూరు) : మండలంలోని వింజనంపాడు కోదండరామస్వామి దేవాలయంలో స్వామి 61వ రామ నామ సప్తాహ మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. స్వామి గ్రామోత్సవం, నామ సంకీర్తనలతో కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ కోయి సుబ్బారావు, కార్యదర్శి కోయి శేఖర్ సమక్షంలో కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శ్రీదేవి

పొన్నూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు సమాజ సేవలో భాగస్వాములు కావాలని చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వి.శ్రీదేవి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని వెల్లలూరులో విద్యార్థులు సేవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు గ్రామంలో తిరిగి ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ప్రజలతో మాట్లాడం వల్ల అనేక విషయాలపై అవగాహన వస్తుందని చెప్పారు. ఐక్యమత్యంగా ఉన్నప్పుడే ఏ సమస్యకైనా పరిష్కారం లభిస్తుందని వివరించారు. సర్పంచి ఇక్కుర్తి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టరు సీజ్

కొల్లిపర, న్యూస్‌టుడే: ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టరును సీజ్ చేసినట్లు కొల్లిపర ఎస్సై పి.కోటేశ్వరరావు తెలిపారు. గురువారం కుంచవరం అడ్డరోడ్డులో వాహన తనిఖీలు చేస్తున్న క్రమంలో ఎలాంటి బిల్లులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును గుర్తించామన్నారు. మున్నంగి ఇసుక రీచ్‌లో అక్రమ తవ్వకాలకు పాల్పడి తెనాలి పట్టణానికి తరలిస్తున్నారని చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు సమర్పిస్తామని పేర్కొన్నారు.

స్వాములపై దౌర్జన్యాలు ఆపాలి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: కేరళలో తెలుగు స్వాములపై దౌర్జన్యాలు ఆపాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రజాప్రతినిధులు ఈ విషయంపై స్పందించి కేరళ ప్రభుత్వంతో మాట్లాడాలని పేర్కొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: మహిళలు అన్ని రంగాల్లో ముందంజ వేయాలని ప్రముఖ వ్యాపారవేత్త జాస్తి సరళ పిలుపునిచ్చారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్తు ఆధ్వర్యంలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి, శ్రీశక్తి దివస్ సందర్భంగా తెనాలి వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల ప్రాంగణంలో గురువారం నిర్వహించిన మిషన్ సాహసీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రజని, లత, ప్రియాంక, సుమన్, వేదశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశరావు సేవలు చిరస్మరణీయం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: దాసరి ప్రకాశరావు విద్యారంగ సేవలు చిరస్మరణీయమని, వేలాది మంది హృదయాల్లో ఆయన నిలిచి ఉంటారని పలువురు ప్రముఖులు కొనియాడారు. తెనాలి నెహ్రూనికేతన్ విద్యా సంస్థల వ్యవస్థాపకులు దాసరి ప్రకాశరావు భౌతికకాయాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌లతో పాటు పలువురు నాయకులు, ప్రముఖులు, పూర్వ విద్యార్థులు గురువారం సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

CHANGE OF NAME

I, SHWETA N TOTAD is wife of No 14926438A HAV Nagaraja C/o 56 APO That I have changed my name from SHWETA N TOTAD to SHWETHA TOTAD as per my aadhar card for all future purposes.

(c) eenadu

గుంటూరు తూర్పు

ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్న టివి... (కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాట 41, వంగ 38, బెండ 39, పచ్చిమిర్చి 49, కాకర 30, క్యారెట్ 62, క్యాబేజీ 29, బీర 40, దొండ 64, బంగాళదుంప 29, ఉల్లిపాయలు 17, గోరుచి ఖుష్కు 63, దోస 30, పొట్ల 44, చామదుంప 22, మునగ 8, గోంగూర 12, తోటకూర 20, చుక్కకూర 20, కొత్తిమీర 30, బీట్‌రూట్ 41, కీర 29, క్యాప్సికం 79, అల్లం 80, ఫ్రెంచి బీన్స్ 49, సొర 28, అరటి 7. - న్యూస్‌టుడే, పట్నంబజారు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
94406 38515, 80085 73097

☛ వినోబానగర్ ప్రధానరోడ్డులో చెత్తకుప్పలు రెండ్రోజులుగా తీయడం లేదు. వీటి ఆవరణశుభ్రంగా ఉండని స్థానికుడు శ్రీనివాస్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ ఆయూబ్‌ఖాన్‌కు తెలియజేయడంతో చెత్తకుప్పలు తరలించారు. ☛ ఆదిత్యనగర్ మూడోలైన్ సైడుకాలువల్లో పూడికలు చేరి మురుగునీరు కదలక సమస్యలు వస్తున్నాయని స్థానికుడు చరణ్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్య ప్రజారోగ్య అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పూడికలు తీయించారు. - న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ

స్పందనకు వందనం

పండ్ల మార్కెట్ తరలుతుందా?

న్యూస్‌టుడే – నగరపాలక సంస్థ

రాజధానిలో అంతర్భాగంగా ఉన్న గుంటూరు నగరం విస్తరిస్తోంది. నివాసాలు పెరుగుతున్నాయి. దాంతోపాటే ట్రాఫిక్ ఇబ్బందులూ ఎక్కువవుతున్నాయి. ప్రత్యేకించి నగరం మధ్యలో లాలాపేట ప్రాంతంలో ఐదు దశాబ్దాల నుంచి ఉన్న పండ్ల మార్కెట్‌లో నిత్యం సమస్యలే. ఉదయం 11 గంటల్లోపు ఆ వైపు వెళ్లాలంటే పద్మవ్యూహంలో చిక్కుకున్నట్టే. ఇక్కడ 200 మంది వరకు వ్యాపారులున్నారు. ఉదయం వేళల్లో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పండ్ల లారీలు, మినీట్రక్‌లు బారులు తీరి ఉంటున్నాయి. ట్రాఫిక్ సమస్యల నేపథ్యంలో అటు లాంచెస్టర్ రోడ్డు, సంగడిగుంట వైపు నుంచి వచ్చేవారు ఇటు కొత్తపేట, రాజాగారితోట, మార్కెట్ వైపు నుంచి ఏటుకూరు రోడ్డుకు వెళ్లేవారు అవస్థలు పడాల్సిందే. ప్రత్యామ్నాయ రహదారుల్లో వెళ్లినా చుట్టూ తిరిగి రావాల్సిందే. పండ్ల మార్కెట్‌ను పూర్తిస్థాయిలో నగరం బయటకు తరలిస్తేనే ట్రాఫిక్ సమస్యలు చాలావరకు పరిష్కారమవుతాయని పలువురు సూచిస్తున్నారు. 2010లో బుడంపాడు రోడ్డులోని జీఎంసీ స్థలంలోకి తరలించాలని ప్రతిపాదించి అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయించారు. కాలక్రమంలో ప్రాధాన్యతలు మారిపోవడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది.

లాలాపేటలోని పండ్ల మార్కెట్ దుకాణ సముదాయం

పండ్ల మార్కెట్‌లో వ్యాపారాలు ఇలా.. లాలాపేట వద్ద ఉన్న పండ్ల మార్కెట్లో జీఎంసీకి చెందిన కొన్ని దుకాణాలు పూర్తిగా శిథిలమయ్యాయి. కొన్ని ఖాళీగా ఉండగా.. ఒకట్రెండు దుకాణాల్లోనే వ్యాపారాలు కొనసాగుతున్నాయి. ప్రైవేటు దుకాణాల్లో లావాదేవీలు నడుస్తున్నాయి. ఇక్కడికి నంద్యాల, ఉభయగోదావరి, కృష్ణా జిల్లా, తెనాలి, దుగ్గిరాల తదితర ప్రాంతాల నుంచి అరటి గెలలు వస్తుంటాయి. ఉత్తరాది రాష్ట్రాల నుంచి ఆపిల్, చైనా, ఇరాన్, ఇరాక్ తదితర దేశాల నుంచి పండ్లు దిగుమతి అవుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి దానిమ్మ, బత్తాయి, కమలాలు, జామ, బొప్పాయి వంటివి వస్తుంటాయి. సీజన్లో ప్రకాశం, చిత్తూరు, కృష్ణా జిల్లాల నుంచి మామిడి పెద్దఎత్తున దిగుమతి అవుతుంటుంది.

☛ లాలాపేట, పట్నంబజారుల్లో ఉన్న పండ్లు, పూల మార్కెట్‌లను నగరం బయటకు తరలించాలన్న ప్రతిపాదన చాన్నాళ్లుగా ఉంది. నగరం బయట సుమారు ఐదెకరాల స్థలం సేకరించి, మార్కెట్‌ను అక్కడికి తరలిస్తే బాగుంటుందని వ్యాపారులంటున్నారు. పూల మార్కెట్‌ను కూడా తరలిస్తే నగర పరిధిలో ట్రాఫిక్ సమస్య చాలావరకు తగ్గుతుందని భావిస్తున్నారు. దుకాణాలను తరలించేందుకు వ్యాపారులు సానుకూలంగానే ఉన్నా.. జీఎంసీ నుంచి ఎటువంటి చర్యలు లేవు.

డ్వాక్రా యూనిట్ల స్థాపనలో ఇబ్బందులా? పించన్ల పంపిణీలో సమస్యలా?

నగర పరిధిలో డ్వాక్రా సంఘాలకు సమస్యలు ఎదురవుతున్నాయా? యూనిట్ల స్థాపనకు ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా? ఉత్పత్తుల మార్కెటింగ్‌లో ఆటంకాలున్నాయా? జీవనోపాధుల సెల్ అందిస్తున్న కార్యక్రమాలు అమలు క్షేత్రస్థాయిలో ఎలా ఉంది. ఎస్‌హెచ్‌జీ సభ్యులు, వారి కుటుంబాల కోసం ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలపై సందేహాలున్నాయా? పొదుపు సంఘాలకు సంబంధించి ఏ సమస్యలున్నా ఉపాసెల్ పీవో సింహాచలానికి ఫోన్ చేసి తెలుసుకోవచ్చు. ఇందుకోసం 'ఈనాడు' డయల్ యువర్ ఉపాసెల్ పీవో కార్యక్రమం నిర్వహిస్తోంది. పింఛన్ల అర్హత ఉండీ.. రాని వారు తమ సమస్యలు తెలియజేయవచ్చు. చేయూతిగల దల్ల సమస్యను సూచించి, పరిష్కారం చెప్పడమే.

ఈనాడు మీతోడు

ఉపాసెల్ పీవో సింహాచలంతో 'ఈనాడు' ఫోన్ ఇన్ రేపు

98499 07024 | తేదీ: శనివారం (22.11.2025) | సమయం: ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంట వరకు

ఉపన్యాస పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ ఎం.డీ.మున్ను

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి

పట్నంబజారు, న్యూస్‌టుడే: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని అభివృద్ధి చెందాలని జైన్ హైస్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.డి.మున్ను అన్నారు. సంగడిగుంటలోని జైన్ హైస్కూల్‌లో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాస (స్పీచ్) పోటీలు నిర్వహించారు. ఇందులో 8, 9 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ స్థానంలో ఆర్.వర్షిని, ద్వితీయ స్థానంలో షేక్ సాదియా అత్తర్, తృతీయస్థానంలో షేక్ ఖైరున్నీసా నిలిచారు. విజేతలకు జైన్ హైస్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.డి. మున్ను బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.కనకదుర్గ, ఉపాధ్యాయులు షబీన, అనూష, అఖిల, సరోజిని పాల్గొన్నారు.

దేవాలయ అధికారుల తీరుపై విచారణ

పట్నంబజారు, న్యూస్‌టుడే: పాతగుంటూరులోని అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో అధికారులు, సిబ్బంది ముఖద్వారానికి తలుపులు వేసి మహిళా భక్తుల్ని ఇబ్బంది పెట్టిన సంఘటనపై దేవాదాయశాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. తలుపులు మూసేసిన అంశాన్ని గురువారం 'ఈనాడు' వెలుగులోకి తీసుకురావడంతో వారు స్పందించారు. కార్తిక మాసం ముగింపు సందర్భంగా ఈ నెల 19న లక్ష బిల్వార్చన, కుంకుమ పూజలు, అభిషేకాలు చేసేందుకు కొంతమంది ఆలయ ఈవో సొమ్ము నుంచి అనుమతి తీసుకున్నారు. దాతలు దీనిలా పంపిణీ చేస్తున్న విషయం తెలిసి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు. మరోవైపు దూరప్రాంతాల నుంచి స్వామి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. రద్దీని చూసి అధికారులు, సిబ్బంది ముఖద్వారం మూసేశారు. ఒక ఆర్జితపు భక్తులు నుంచి పెద్ద మొత్తంలో చందాలు వసూలు వేసి ప్రత్యేక పూజలు చేయించిన వైనంపైనా అధికారులు ఆరా తీస్తున్నారు. పూజలు చేసిన దాతలు ఒక ప్రజాప్రతినిధితోపాటు, దేవాదాయశాఖ డీసీని కలిసి జరిగిన సంఘటన గురించి వివరించారు.

ట్రాఫిక్ సిగ్నళ్లకు మరమ్మతులు

ఈనాడు కథనానికి స్పందన

పట్నంబజారు, న్యూస్‌టుడే: ఎత్తురోడ్డు సెంటర్లో పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్ లైట్లకు గురువారం అధికారులు మరమ్మతులు చేయించారు. రెండు నెలలుగా ఇవి వెలగడం లేదని ఈ నెల 19న 'ఈనాడు'లో ప్రచురితమైన పని చేయని సిగ్నళ్లు.. ట్రాఫిక్ చిక్కులు కథనానికి వారు స్పందించారు. రూ.60 వేల వ్యయంతో మరమ్మతులు చేయించారు.

భాషా పండితులకు పే, సర్వీస్ రక్షణ కల్పించండి

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న భాషా పండితులకు పే, సర్వీస్ రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. గురువారం నాయకులు డీఈవో రేణుకను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హైమారావు మాట్లాడుతూ ఆర్నెల్లపాటు స్కూల్ అసిస్టెంట్లుగా చేసి రివర్షన్ పొందడం బాధాకరమన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ మున్సిపల్ పాఠశాలలకు పోస్టులు మంజూరు చేయడంతో భాషా పండితులకు న్యాయం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో వారికి పే, సర్వీస్ రక్షణ కల్పించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో జిల్లా అధ్యక్షుడు సాయివిశ్వనాథ్, సహాధ్యక్షులు పి.లలితబాబు, రవి, ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

డీఈవో రేణుకకు వినతిపత్రం ఇస్తున్న ఎన్టీఏ నాయకులు

పద్య నాటకోత్సవాలు ప్రారంభం

గుంటూరు సాంస్కృతికం: బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీసర్వేశ్వర నాట్యమండలి అధ్యక్షుడు టి.రాజాబాబు (నాన్నగారు) ఆధ్వర్యంలో పద్య నాటకోత్సవాలు గురువారం రాత్రి ప్రారంభమయ్యాయి. అట్ల రామకృష్ణారెడ్డి మయసభలో దుర్యోధనుడి ఏకపాత్రాభినయంతో తొలి రోజు కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం జరిగిన పురస్కార సభలో మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, మేకల మోహనరావు, విశ్రాంత పోలీసు డీఎస్పీ రవి కుమార్.. సీజేడీ డీఎస్పీ గోలి లక్ష్మయ్య పేరిట ఇచ్చే పురస్కారాన్ని ప్రదానం చేసి సత్కరించారు. ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, ఊటుకూరి నాగేశ్వరరావు తదితరులు లక్ష్మయ్య ఆదర్శ గుణగణాలను వివరించారు. అనంతరం శ్రీకృష్ణరాయబారం నాటక సన్నివేశం ప్రదర్శితమైంది. పల్నాటి సుబ్బారావు, చలువాది ప్రసాద్, అట్ల రామకృష్ణారెడ్డి పాత్రోచితంగా నటించి రక్తి కట్టించారు. కార్యక్రమాలను జి.మల్లికార్జునరావు పర్యవేక్షించారు.

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: రాష్ట్రంలోని 924 శాఖ గ్రంథాలయాలను డిజిటల్ గ్రంథాలయాలుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. అరండల్‌పేటలోని జిల్లా గ్రంథాలయ సంస్థలో వారం రోజులుగా జరుగుతున్న వారోత్సవాల ముగింపు సభ గురువారం జరిగింది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ త్వరలోనే నంబూరులోని డిజిటల్ గ్రంథాలయం ప్రారంభించనున్నట్లు తెలిపారు. గ్రంథాలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ తల్లిదండ్రులు.. చిన్నారులను గ్రంథ పఠనం వైపు మళ్లించాలన్నారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా...

పొన్నూరు రోడ్డులోని తపసీలార్ కార్యాలయం ఎదురు రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ ప్రాంతంలో ఇటీవల అధికారులు డ్రైనేజీ మరమ్మతులు చేసి వ్యర్థాలను నడిరోడ్డుపై వదిలేశారు. వీటివల్ల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాత్రి వేళల్లో అవి కనిపించక పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. - న్యూస్‌టుడే, పట్నంబజారు

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ వర్తింపజేయండి

మాట్లాడుతున్న రామారావు, రామకృష్ణ, నాగమల్లేశ్వరరావు

నెహ్రూనగర్: అన్నదాత సుఖీభవను కౌలు రైతులకు వర్తింపచేసి ఆదుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు కోరారు. గురువారం బ్రాడీపేటలోని కార్యాలయంలో మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్నదాత సుఖీభవ పథకం నూటికి 70% భూమిని సాగు చేస్తున్న కౌలు రైతులకు వర్తింప చేయకపోవటం సరికాదన్నారు. యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులిచ్చి పంట రుణాలు మంజూరు చేస్తామని రాజకీయపక్షాలు వాగ్దానం చేసి ఆచరణలో అమలు చేయడం లేదన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల మొంథా తుపాను వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలలో తేమ శాతం పేరుతో రైతుల పత్తిని తిప్పి పంపించడం సరికాదని ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు కృష్ణ, నాగేశ్వరరావు, నీలాంబరం పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి

అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో నూతన రహదారులను ఇరువైపులా అంచుల వరకు (ఎండ్ టు ఎండ్) నిర్మించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం ఆయన ఎస్వీఎన్ కాలనీ, విద్యానగర్, ఇన్నర్ రింగ్ గురోడ్డు-3, వాసవీనగర్, ఏటుకూరు, జూనంపాడు దూరం ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యం పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. గుజ్జనగుండ్ల కూడలి వద్ద రహదార్లు, డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. ఇన్నర్ రింగురోడ్డు-3, నగరంలోకి వచ్చే పెద్ద వాహనాలను తాత్కాలికంగా మళ్లించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఏటుకూరులో పలు అభివృద్ధి పనులను పరిశీలించి ఎస్సీ కాలనీ రహదారి, శ్మశానవాటిక ప్రహరీ పనులకు సర్వే చేపట్టాలని తెలిపారు. కమిషనర్ వెంట కార్పొరేటర్లు వి.శ్రీరాంప్రసాద్, బి.స్మితపద్మజ, డీఈఈలు రమేష్‌బాబు, సతీష్‌కుమార్, ఎస్‌ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులా రహదారి

అంజుమన్ పాఠశాల సమీపంలో రహదారిపై వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. కొట్టేసిన చెట్ల కొమ్మలను ఇక్కడే పడేశారు. చెత్తా, చెదారం పేరుకుపోవడంతో దోమల బెడద సమస్యగా మారిందని స్థానికులు వాపోతున్నారు. - న్యూస్‌టుడే, నెహ్రూనగర్

ఏ తీగ తగులుతుందో?

గుంటూరువారితోటలో విద్యుత్తు తీగలు కిందకు వేలాడుతున్నాయి. కొన్ని మరీ కిందకు వేలాడుతుండడంతో అధికారులు వాటికి విద్యుత్తు సరఫరా నిలిపేశారు. ఓ పాత భవనాన్ని తొలగించేటప్పుడు అవి తెగినట్లు స్థానికులు చెబుతున్నారు. వాహనాలపై వెళ్లే వారికి అవి తగులుతున్నాయని వాటిని తొలగించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గుంటూరు నేరవార్తలు

ప్రమాదాలకు అడ్డాగా నందివెలుగు రోడ్డు

నందివెలుగురోడ్డు ప్రమాదాలకు కేంద్రంగా మారింది. ఇటీవల అధికారులు బస్టాండు సెంటర్ నుంచి మణిహోటల్ సెంటర్ వరకు రోడ్డును 60 అడుగులకు విస్తరించారు. దీంతో కొంతమంది వాహనాలను అతివేగంగా నడుపుతూ పాదచారులను ఢీ కొడుతున్నారు. ఇటీవల మసీదు సెంటర్‌లో రోడ్డుపై వెళ్తున్న మహేష్ అనే యువకుడిని ద్విచక్రవాహనం ఢీ కొట్టడంతో అతని తలకు తీవ్రగాయాలయ్యాయి. ఇలాంటివి తరచూ జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా చర్యలు తీసుకోవటం లేదని స్థానికులు తెలిపారు. - న్యూస్‌టుడే, పట్నంబజారు

రద్దీ వేళ పనులు.. వాహనాల బారులు..

నగరంలో ట్రాఫిక్ పరిస్థితి దారుణంగా ఉంది. ఎదురెళ్లే వాహనం ఒక్క క్షణం ఆగినా అంతే సంగతి. క్షణాల్లో వాహనాలు బారులు తీరుతాయి. ప్రస్తుతం రాకపోకలకు కీలక మార్గమైన కంకరగుంట వంతెనపై మొక్కలకు సిబ్బంది రద్దీ సమయంలో ట్రాక్టరుతో నీరు పోస్తున్నారు. నీటి ట్యాంకరుతో ఉన్న ట్రాక్టరు వంతెనపైకి వచ్చింది మొదలు రెండోవైపు దిగే వరకు ట్రాక్టరు వెనుక పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోతున్నాయి. అధికారులు స్పందించి రాకపోకలకు ఆటంకం లేకుండా రద్దీ లేని సమయాల్లో నీరు పోసేలా చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, గోరంట్ల

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

పట్నంబజారు, న్యూస్‌టుడే: గుంటూరు ఆర్టీసీ బస్టాండులో రోడ్డు దాటుతుండగా బస్సు ఢీకొని ముగావత్ జాంకీ (85) అనే మహిళ మృతి చెందారు. ఈమెది నల్గొండ జిల్లా తిరుమలగిరి మండలం చింతలపాలెం గ్రామంలోని నాగార్జునపేట. నల్లచెరువులో ఉంటున్న తన కుమార్తె ఇంటికి వెళ్లేందుకు గురువారం సాయంత్రం గుంటూరు వచ్చారు. బస్సు దిగి వెళ్తుండగా బాపట్ల డిపోనకు చెందిన బస్సు ఢీకొంది. సంఘటన జరిగిన వెంటనే డ్రైవర్ పరారయ్యాడు. ట్రాఫిక్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ ఏఎస్సై శ్రీహరి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలుపట్టాలపై మృతదేహం

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: డీఆర్‌ఎం కార్యాలయం సమీపంలో రైలుపట్టాలపై మృతదేహం ఉందని గురువారం జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై సుబానీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అంజిబాబు తెలిపారు. మృతునికి 30 సంవత్సరాల వయసు ఉంటుందని, వివరాలు తెలిసినవాళ్లు జీఆర్పీ పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

గడువులోగా పైపులైను మరమ్మతులు పూర్తి చేయండి

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: తక్కెళ్లపాడు హెడ్ వాటర్‌వర్క్స్ వద్ద రిజర్వాయర్‌కు వెళ్లే ప్రధాన పైపులైనుకు ఏర్పడిన లీకేజీలకు మరమ్మతు పనులు గడువులోగా పూర్తి చేయాలని కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం ఆయన వాటిని పరిశీలించారు. హెడ్ వాటర్ వర్క్స్ వద్ద సరఫరా నిలిపేయడం వల్ల 90 శాతం నగరానికి తాగునీరు సరఫరా నిలిచిపోతోందన్నారు. పనులను గడువుకంటే ముందే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈఈ కోటేశ్వరరావు దగ్గరుండి పర్యవేక్షించాలని సూచించారు.

భారీ వాహనాలకు రాత్రిపూటే ప్రవేశం

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

● అతిక్రమిస్తే సీజ్ చేస్తాం ● పార్కింగ్‌జోన్ల బాధ్యతలు పొదుపు సంఘాలకు

నగరంలో భారీ వాహనాలకు రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకే అనుమతి ఉందని, నిబంధనలను అతిక్రమిస్తే వాటిని సీజ్ చేస్తామని కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. గురువారం రవాణా, ట్రాఫిక్ పోలీసు, జీఎంసీ అధికారులతో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 150 చదరపు కిలోమీటర్ల పరిధిలోని గుంటూరు నగరపాలకసంస్థలో గత ఏడాది కాలంగా రహదార్లు, బీటీ రోడ్లు, డ్రెయిన్‌ల నిర్మాణం చేపట్టామన్నారు. భారీ వాహనాల రాకపోకల వల్ల రహదారి నెట్‌వర్క్ దెబ్బతింటుందన్నారు. వాటి నుంచి ఇసుక, కంకర రహదారులపై పడి వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇప్పటికే పలుమార్లు సంబంధిత వాహనాల వారికి పరిస్థితి వివరించినా మార్పు రాలేదన్నారు. ఇక నుంచి నగరంలో ప్రవేశించే ప్రధాన మార్గాలు, సెంటర్లలో 24 గంటల పర్యవేక్షణ ఉంటుందని, నిబంధనలను మీరితే రవాణా, ట్రాఫిక్ పోలీస్, జీఎంసీ సిబ్బంది సంయుక్తంగా చర్యలు తీసుకుంటారని స్పష్టంచేశారు. ప్రభుత్వ, ప్రైవేటు నిర్మాణ పనులకు అత్యవసరమైతే జీఎంసీ నుంచి ప్రత్యేక అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

రాత్రి 10 గంటలకు ముందు, ఉదయం 6 గంటల తర్వాత ఎక్కడైనా భారీ రవాణా వాహనాలు వచ్చినట్లు గమనిస్తే జీఎంసీ కాల్‌సెంటర్ 0863-2345103కి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. నగరంలో వెండింగ్ జోన్‌లు ఏర్పాటుకు పలుప్రాంతాల్లో పాయింట్లను గుర్తించి, కౌన్సిల్ ఆమోదం పొందామన్నారు. అక్కడికి వీధి వ్యాపారులను తరలించడానికి జీఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సంయుక్త కార్యాచరణ చేపడతారని చెప్పారు. పార్కింగ్ జోన్‌లు ఏర్పాటు చేసి, స్వయం సహాయక సంఘాల ద్వారా నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సీపీ రాంబాబు, ఆర్టీవో శ్రీహరి, ఎంవీఐ సౌజన్య, పట్టాభిపురం సీఐ వెంకటేశ్వర్లు, వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

HINDU COLLEGE OF PHARMACY
(AUTONOMOUS)
(Affiliated to Acharya Nagarjuna University and Recognized by Pharmacy Council of India, UGC 2(f) & 12(B)-New Delhi, Certified by ISO-9001-2018
B++ NAAC
Amaravathi Road, Guntur-522 002 (A.P.) ☎ +91-0863-2221935, Fax: +91-863-2217783
E-mail: hinducollegeofpharmacy@yahoo.com, Visit us: www.hcopgnt.com

B.PHARMACY, PHARM.D SPOT ADMISSIONS

Interested candidates who have not taken admission in any other college may attend spot admission with all their original certificates in our college at **10-00 am on 25-11-2025** for **B.Pharmacy Pharm.D**, for the left over vacancies. The students who have taken admission in our college and have not reported to our college in the given time. The left-over vacant seats will now be filled by Spot admission on **25-11-2025 before 5:00 PM** as per the rules and regulations of APEAPCET-2025. The students admitted through spot admission are not eligible for tuition fee reimbursement.

Contact Immediately: College: 0863-2221935, 9912342122, Principal: 9849127290, Vice-Principal : 9849546292, 8885883496

Note: Admissions for Management Seats in M.Pharmacy and Pharm.D (PB) are in progress interested candidates may contact the above numbers.

Chairman – Jupudi Ranga Raju, B.Com. B.L
Secretary & Correspondent – Dr. S. Madhusudana Rao, M.B.B.S

ఈత పోటీల్లో నగర విద్యార్థికి మొదటిస్థానం

నగరపాలక సంస్థ: నగరంలోని లిటిల్ స్టెప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ మూడో తరగతి విద్యార్థి సీహెచ్ ఇషాన్ విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో మొదటి స్థానం సాధించాడని పాఠశాల ఎండీ షేక్ షాజహాన్ తెలిపారు. గురువారం ఇషాన్‌ను తల్లిదండ్రుల సమక్షంలో సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థి ఇషాన్‌ను అభినందిస్తున్న స్కూల్ ఎండీ షాజహాన్

కార్మికులు, ఉద్యోగులకు ప్రత్యేక గ్రీవెన్స్ నేడు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: జీఎంసీ ప్రజారోగ్య, ఇంజినీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై ఫిర్యాదులు, అర్జీలు అందించేందుకు శుక్రవారం సాయంత్రం 3 గంటల నుంచి 4 గంటల వరకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తామని కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. పీఎఫ్, ఈఎస్ఐ, రుణాలు, ఆప్కాస్ తదితర అంశాలపై ఎదురవుతున్న సమస్యలపై అర్జీలను గ్రీవెన్స్‌లో అందిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కనులపండువగా లక్ష బిల్వార్చన

నెహ్రూనగర్: కార్తిక మాసం చివరి రోజు సందర్భంగా గురువారం కొత్తపేటలో దేవాదాయశాఖకు చెందిన బాలా త్రిపుర సుందరీదేవి సమేత ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి లక్ష బిల్వార్చన కనులపండువగా నిర్వహించారు. ప్రధానార్చకులు దండిబొట్ల వేణు శిష్య బృందం స్వామివారికి మహా రుద్రాభిషేకం, ఆలయ ప్రాంగణంలో సహస్ర దీపాలంకరణ వైభవంగా నిర్వహించారు. ఈవో వీరారెడ్డి, ధర్మకర్తలమండలి ఛైర్మన్ శేషతల్పసాయి, సభ్యులు ఉత్సవ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సహస్రదీపాలంకరణలో ఈవో, ఛైర్మన్, అర్చకులు, భక్తులు

శివలింగాకారంలో దీపాలంకరణ

నేటి నుంచి పోలేరమ్మ తిరునాళ్లు

పట్నంబజారు: పాతగుంటూరు మాచిరాజువారివీధిలోని పోలేరమ్మ దేవస్థానం వద్ద శుక్రవారం నుంచి ద్వితీయ వార్షికోత్సవ తిరునాళ్లు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు కూరాకుల కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. 10 గంటలకు మహిళలతో కుంకుమపూజలు, సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఉంటాయన్నారు.

శ్రద్ధాంజలి

జననం 30-07-1928 | మరణం 07-11-2025

కీ॥శే॥ యంగలశెట్టి వెంకటేశ్వరరావు గారు, అడ్వకేట్

మా తండ్రి గారైన కీ॥శే॥ యంగలశెట్టి వెంకటేశ్వరరావు (అడ్వకేట్) గారు ది. 07-11-2025 శుక్రవారం స్వర్గస్తులైనారు.
పెద్దకర్మ: ది. 21-11-2025 శుక్రవారం నాడు గుంటూరు శ్రీనివాసరావుపేట, ఐ.టి.సి. కళ్యాణ మండపము నందు జరుపబడును. కావున తెలియచేయడమైనది.

ఇట్లు: కుమారులు
యంగలశెట్టి పుల్లారావు, Rtd. Bank Employee | యంగలశెట్టి శివసూర్యనారాయణ, అడ్వకేట్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, గుంటూరు
మరియు కుటుంబ సభ్యులు, Ph: 99481 91003

గుంటూరు పశ్చిమ

డ్వాక్రా యూనిట్ల స్థాపనలో ఇబ్బందులా? పింఛన్ల పంపిణీలో సమస్యలా?

నగర పరిధిలో డ్వాక్రా సంఘాలకు సమస్యలు ఎదురవుతున్నాయా? యూనిట్ల స్థాపనకు ఇబ్బందులేమైనా ఉన్నాయా? ఉత్పత్తుల మార్కెటింగ్‌లో అవాంతరాలున్నాయా? జీవనోపాధుల సెల్ అందిస్తున్న కార్యక్రమాల అమలు క్షేత్రస్థాయిలో ఎలా ఉంది? ఎస్‌హెచ్‌జీ సభ్యులు, వారి కుటుంబాల కోసం ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలపై సందేహాలున్నాయా? పొదుపు సంఘాలకు సంబంధించి ఏ సమస్యలున్నా ఉపాసెల్ పీవో సింహాచలానికి ఫోన్ చేసి తెలుసుకోవచ్చు. ఇందు కోసం 'ఈనాడు' డయల్ యువర్ ఉపాసెల్ పీవో కార్యక్రమం నిర్వహిస్తోంది. పింఛన్లకు అర్హత ఉండీ.. రాని వారు తమ సమస్యలు తెలియజేయవచ్చు. చేయాల్సిందల్లా సమస్యను సూటిగా, క్లుప్తంగా చెప్పడమే.

ఈనాడు మీతోడు

ఉపాసెల్ పీవో సింహాచలంతో 'ఈనాడు' ఫోన్ ఇన్ రేపు

98499 07024 | తేదీ: శనివారం (22.11.2025) | సమయం: ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంట వరకు

గడువులోగా పైపులైను మరమ్మతులు పూర్తి చేయండి

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: తక్కెళ్లపాడు హెడ్ వాటర్‌వర్క్స్ వద్ద రిజర్వాయర్‌కు వెళ్లే ప్రధాన పైపులైనుకు ఏర్పడిన లీకేజీలకు మరమ్మతు పనులు గడువులోగా పూర్తి చేయాలని కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం ఆయన వాటిని పరిశీలించారు. హెడ్ వాటర్ వర్క్స్ వద్ద సరఫరా నిలిపేయడం వల్ల 90 శాతం నగరానికి తాగునీరు సరఫరా నిలిచిపోతోందన్నారు. పనులను గడువుకంటే ముందే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈఈ కోటేశ్వరరావు దగ్గరుండి పర్యవేక్షించాలని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో కుప్పలు తెప్పలుగా పేరుకుపోయిన ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. 39వ డివిజన్‌లో గురువారం ఆమె పర్యటించి ప్రజల సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లోని పలు ప్రాంతాలను నేరుగా వెళ్లి ప్రత్యక్షంగా పరిశీలించారు. మారుతీనగర్, నాయీబ్రాహ్మణ కాలనీ పరిధిలో రోడ్లు, సైడు కాల్వలు, వీధి దీపాలు, ఆక్రమణలు తదితర సమస్యల్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించిన ఆమె తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. మారుతీనగర్ అయిదో లైనులో రోడ్డుకు సంబంధించిన ఆక్రమణలపై ప్రజలు ఎమ్మెల్యే మాధవికి ఫిర్యాదు చేశారు. బీసీ కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించి టెండర్ వివరాలపై ఆరా తీశారు. ముస్లింల శ్మశానవాటిక వద్ద జంగిల్ క్లియరెన్స్‌ను వారంలో పూర్తి చేయాలని సూచించారు. రైల్వే ట్రాక్ రోడ్డుకు మూడు మీటర్ల రోడ్డు మంజూరుపై అధికారులతో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. వీధి దీపాలు వెలిగేలా చూడాలని, ధూళిపాళ్ల ఆర్చి వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు సింగంశెట్టి వీరయ్య, రుస్తుం బాబు, రఫీ, ఈశ్వర్, ఖాదర్‌బుడే తదితరులు పాల్గొన్నారు.

సైడు కాల్వ పరిస్థితిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

ధర వరలు

కృష్ణనగర్ రైతుబజార్‌లో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో): టమాట 45, వంగ (సన్నాలు) 53, బెండ 49, పచ్చిమిర్చి 38, కాకర 59, బీర 46, క్యాలీఫ్లవర్ 25, క్యాబేజి 30, క్యారెట్ 60, దొండ 63, బంగాళదుంప 29, ఉల్లిపాయలు 22, గోరుచిక్కుళ్లు 63, దోస 32, సొర 28, పొట్ల 40, అరటికాయ 7, పెద్దచిక్కుళ్లు 85, చామదుంప 24, మునగ 12, బీట్‌రూట్ 43, కీరదోసకాయ 29, బీన్స్ 50, క్యాప్సికమ్ 79, కొత్తిమీర 25, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 28, అల్లం 80, వెల్లుల్లి 110. - న్యూస్‌టుడే, పట్టాభిపురం

జిల్లా సమాఖ్యకు భవనం సమకూరేనా?

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే

మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రాతినిధ్యం వహించే జిల్లా సమాఖ్యకు జిల్లా కేంద్రంలో భవనం లేకపోవడంతో కార్యవర్గ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. డీఆర్డీఏ కార్యాలయ ప్రాంగణంలోని జిల్లా సమాఖ్య భవనం స్లాబ్ పెచ్చులూడి మీద పడడంతో రెండేళ్ల క్రితం ఖాళీ చేశారు. ఇది పూర్తిగా శిథిలస్థితికి చేరింది. భవనం లేకపోవడంతో డీఆర్డీఏ భవనంలోని గదుల్లోనే సర్దుకుని విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ కూడా స్లాబ్ పెచ్చులూడడంతో భయపడుతూ విధులు నిర్వహిస్తున్నారు. అయితే చిన్న మీటింగ్ హాలు కావడంతో సభ్యులతో పాటు వెలుగు సిబ్బంది కూర్చోవడానికి ఇబ్బంది పడుతున్నారు.

☛ జిల్లాలో 19 వేల ఎస్‌హెచ్‌జీలు ఉన్నాయి. 1.90 లక్షల మంది సభ్యులు ఉన్నారు. ప్రతి నెలా సర్వసభ్య సమావేశం నిర్వహించి కాంపొనెంట్లు వారీగా ప్రగతిని సమీక్షించాల్సి ఉండడంతో ఇబ్బందులు తప్పడంలేదు.

ఉత్పత్తుల విక్రయానికి అవస్థలే..

నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద డ్వాక్రా భవన్‌కు 28 సెంట్లు, గుంటూరు తాలూకా వద్ద 15 సెంట్లను డ్వాకా ఉత్పత్తుల స్టాళ్ల కోసం ప్రభుత్వం కేటాయించింది. ఆర్టీసీ బస్టాండ్ వద్ద స్థలంలో అర్బన్ హెల్త్ సెంటర్‌ని ఏర్పాటు చేయడంతో ఇక్కడ డ్వాక్రా మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను విక్రయించుకోవడానికి వీల్లేకుండా పోయింది. తాలూకా వద్ద స్థలం అన్యాక్రాంతం కావడంతో జిల్లా సమాఖ్యకు భవనం లేకుండా పోయింది.

శిక్షణకు ఇబ్బందులే..

ఉమ్మడి గుంటూరు జిల్లాగా ఉన్నప్పుడు నరసరావుపేట మండలం కోటప్పకొండలో శిక్షణ కేంద్రంలో ఎస్‌హెచ్‌జీ మహిళలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేవారు. యువతకు కూడా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కోర్సులు నిర్వహించి.. వారికి ఉపాధి అవకాశాలు కల్పించారు. జిల్లాల పునర్విభజన చేయడంతో శిక్షణ కేంద్రం పల్నాడు జిల్లాకు కేటాయించారు. దీంతో గుంటూరు జిల్లాకు శిక్షణ కేంద్రం లేకుండా పోయింది. దీంతో శిక్షణకు ప్రైవేటు సంస్థలు, కార్యాలయాలు, ప్రభుత్వ సమావేశ మందిరాలను ఆశ్రయించాల్సి వస్తోంది. దీనిదృష్ట్యా జిల్లా సమాఖ్యకు సొంత భవనం నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని సమాఖ్య సభ్యులు, ఉద్యోగులు ఇటీవల రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రతిపాదనలు కార్యరూపం దాల్చేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని, జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి భవనం కోసం స్థలాన్ని కేటాయించాలని కోరుతున్నారు.

మూత పడిన భవనం

ఆక్రమణలు తొలగించండి

అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో నూతన రహదారులను ఇరువైపులా అంచుల వరకు నిర్మించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం ఆయన ఎస్వీఎన్ కాలనీ, విద్యానగర్, ఇన్నర్‌రింగురోడ్డు-3, వాసవినగర్, ఏటుకూరు, జూనంచుండూరు ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యం పరిశీలించారు. గుజ్జనగుండ్ల కూడలి వద్ద రహదార్లు, డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. ఇన్నర్ రింగురోడ్డు-3, నగరంలోకి వచ్చే పెద్ద వాహనాలను తాత్కాలికంగా మళ్లించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఏటుకూరులో పలు అభివృద్ధి పనులను పరిశీలించి ఎస్సీ కాలనీ రహదారి, శ్మశానవాటిక ప్రహరీ పనులకు సర్వే చేపట్టాలని తెలిపారు. కమిషనర్ వెంట కార్పొరేటర్లు వి.శ్రీరాంప్రసాద్, స్మితపద్మజ, డీఈఈలు రమేష్‌బాబు, సతీష్ కుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

కార్మికులు, ఉద్యోగులకు ప్రత్యేక గ్రీవెన్స్ నేడు

నగరపాలక సంస్థ: జీఎంసీ ప్రజారోగ్య, ఇంజినీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై ఫిర్యాదులు, అర్జీలు అందించేందుకు నేడు శుక్రవారం సాయంత్రం 3 గంటల నుంచి 4 గంటల వరకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తామని కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. పీఎఫ్, ఈఎస్ఐ, రుణాలు, ఆప్కాస్ అంశాలపై ఎదురవుతున్న సమస్యలపై అర్జీలను గ్రీవెన్స్‌లో అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

పద్య నాటకోత్సవాలు ప్రారంభం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీసర్వేశ్వర నాట్యమండలి అధ్యక్షుడు టి.రాజాబాబు (నాన్నగారు) ఆధ్వర్యంలో పద్య నాటకోత్సవాలు గురువారం రాత్రి ప్రారంభమయ్యాయి. అట్ల రామకృష్ణారెడ్డి మయసభలో దుర్యోధనుడు ఏకపాత్రాభినయంతో తొలి రోజు కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం జరిగిన పురస్కార సభలో మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, మేకల మోహనరావు, విశ్రాంత పోలీసు డీఎస్పీ రవికుమార్‌లు.. సీఐడీ డీఎస్పీ గోలి లక్ష్మయ్యకు చిత్రవిరించి బిరుదును ప్రదానం చేసి సత్కరించారు. ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, ఊటుకూరి నాగేశ్వరరావు తదితరులు లక్ష్మయ్య ఆదర్శ గుణగణాలను వివరించారు. అనంతరం శ్రీకృష్ణరాయబారం నాటక సన్నివేశం ప్రదర్శితమైంది. పల్నాటి సుబ్బారావు, చలువాది ప్రసాద్, అట్ల రామకృష్ణారెడ్డి పాత్రోచితంగా నటించి రక్తి కట్టించారు. కార్యక్రమాలను జి.మల్లికార్జునరావు పర్యవేక్షించారు.

పురస్కారం అందుకుంటున్న గోలి లక్ష్మయ్య

ఆదమరిస్తే.. అంతే సంగతులు..

లక్ష్మీపురం ప్రధాన రహదారిలో బ్యాంక్ ఆఫ్ బరోడా పక్క లైనులో నుంచి రిజర్వాయర్ల రోడ్డులోకి వెళ్లే మలుపు వద్ద పూడిక తీసేందుకు కల్వర్టును కొంత మేరకు పగలగొట్టారు. రోడ్డుకు సమానంగా కల్వర్టు లేకపోవడంతో మలుపు తిరిగే క్రమంలో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రమాద సూచికగా ట్రాఫిక్ కోన్ అడ్డు పెట్టారు. లక్ష్మీపురం నుంచి రిజర్వాయర్ల రోడ్డు వైపు వచ్చే వాహనచోదకులకు గుంత కనిపించకపోవడంతో ఓ వైపు బ్రిక్ రాయి అడ్డు పెట్టారు. నిత్యం ఎంతో మంది ఇటువైపు రాకపోకలు సాగిస్తుంటారు. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు తప్పించే క్రమంలో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. - న్యూస్‌టుడే, పట్టాభిపురం

స్తంభాలు అలాగే వదిలేస్తారా..!

ఇన్నర్‌రింగ్ రోడ్డు నుంచి రెడ్డిపాలెం ఎస్టీ కాలనీ వరకు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. రోడ్డుపై ఉన్న విద్యుత్తు స్తంభాలను మాత్రం ఆ శాఖ అధికారులు తొలగించలేదు. ఫలితంగా అవి రోడ్డుపైనే దర్శనమిస్తున్నాయి. పనులు పూర్తయితే.. మళ్లీ స్తంభాలు తొలగించేందుకు రోడ్డు ధ్వంసం చేయాల్సి వస్తుందని, ముందుగానే వాటిని తొలగించి పక్కన ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, గోరంట్ల

రద్దీ వేళ పనులు.. వాహనాల బారులు..

నగరంలో ట్రాఫిక్ పరిస్థితి దారుణంగా ఉంది. ఎదురెళ్లే వాహనం ఒక్క క్షణం ఆగినా అంతే సంగతి. క్షణాల్లో వాహనాలు బారులు తీరుతాయి. ప్రస్తుతం రాకపోకలకు కీలక మార్గమైన కంకరగుంట వంతెనపై మొక్కలకు సిబ్బంది రద్దీ సమయంలో ట్రాక్టరుతో నీరు పోస్తున్నారు. నీటి ట్యాంకరుతో ఉన్న ట్రాక్టరు వంతెనపైకి వచ్చింది మొదలు రెండోవైపు దిగే వరకు ట్రాక్టరు వెనుక పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోతున్నాయి. అధికారులు స్పందించి రాకపోకలకు ఆటంకం లేకుండా రద్దీ లేని సమయాల్లో నీరు పోసేలా చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, గోరంట్ల

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

80086 22566, 97042 53525, 80085 74897

కాలువల్లో పూడిక తొలగింపు: శివరామ్‌నగర్ పదో లైన్‌లోని కాలువల్లో మురుగు ముందుకు కదలడంలేదు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమల బెడద ఎక్కువైంది. సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా శానిటరీ సూపర్‌వైజర్ అంగడి రాజేష్ దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్పందించి సచివాలయ శానిటరీ కార్యదర్శి సంజీవ్‌నాయక్, పారిశుద్ధ్య సిబ్బందితో కాలువల్లో పూడిక తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ? కన్నవారితోట వైద్య కళాశాల రోడ్డులో ట్యాంకుల దగ్గర రహదారిపై చెత్త నిల్వలు పేరుకుపోయాయి. దుర్వాసన, దోమల బెడద ఎక్కువైంది. – స్థానికులు. ✔ రహదారిపై చెత్త నిల్వలను తొలగిస్తాం. – అంగడి వెంకటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ – న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం

పండ్ల మార్కెట్ తరలుతుందా?

న్యూస్‌టుడే – నగరపాలక సంస్థ

రాజధానిలో అంతర్భాగంగా ఉన్న గుంటూరు నగరం విస్తరిస్తోంది. నివాసాలు పెరుగుతున్నాయి. దాంతోపాటే ట్రాఫిక్ ఇబ్బందులూ ఎక్కువవుతున్నాయి. ప్రత్యేకించి నగరం మధ్యలో లాలాపేట ప్రాంతంలో ఐదు దశాబ్దాల నుంచి ఉన్న పండ్ల మార్కెట్‌లో నిత్యం సమస్యలే. ఉదయం 11 గంటల్లోపు ఆ వైపు వెళ్లాలంటే పద్మవ్యూహంలో చిక్కుకున్నట్టే. ఇక్కడ 200 మంది వరకు వ్యాపారులున్నారు. ఉదయం వేళల్లో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పండ్ల లారీలు, మినీట్రక్‌లు బారులు తీరి ఉంటున్నాయి. ట్రాఫిక్ సమస్యల నేపథ్యంలో అటు లాంచెస్టర్ రోడ్డు, సంగడిగుంట వైపు నుంచి వచ్చేవారు ఇటు కొత్తపేట, రాజాగారితోట, మార్కెట్ వైపు నుంచి ఏటుకూరు రోడ్డుకు వెళ్లే వారు అవస్థలు పడాల్సిందే. ప్రత్యామ్నాయ రహదారుల్లో వెళ్లినా చుట్టూ తిరిగి రావాల్సిందే. పండ్ల మార్కెట్‌ను పూర్తిస్థాయిలో నగరం బయటకు తరలిస్తేనే ట్రాఫిక్ సమస్యలు చాలావరకు పరిష్కారమవుతాయని పలువురు సూచిస్తున్నారు. 2010లో బుడంపాడురోడ్డులోని జీఎంసీ స్థలంలోకి తరలించాలని ప్రతిపాదించి అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయించారు. కాలక్రమంలో ప్రాధాన్యతలు మారిపోవడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది.

లాలాపేటలోని దుకాణ సముదాయం

పండ్ల మార్కెట్‌లో వ్యాపారాలు ఇలా.. లాలాపేట వద్ద ఉన్న పండ్ల మార్కెట్లో జీఎంసీకి చెందిన కొన్ని దుకాణాలు పూర్తిగా శిథిలమయ్యాయి. కొన్ని ఖాళీగా ఉండగా.. ఒకట్రెండు దుకాణాల్లోనే వ్యాపారాలు కొనసాగుతున్నాయి. ప్రైవేటు దుకాణాల్లో లావాదేవీలు నడుస్తున్నాయి. ఇక్కడికి నంద్యాల, ఉభయగోదావరి, కృష్ణా జిల్లా, తెనాలి, దుగ్గిరాల తదితర ప్రాంతాల నుంచి అరటి గెలలు వస్తుంటాయి. ఉత్తరాది రాష్ట్రాల నుంచి ఆపిల్, చైనా, ఇరాన్, ఇరాక్ తదితర దేశాల నుంచి పండ్లు దిగుమతి అవుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి దానిమ్మ, బత్తాయి, కమలాలు, జామ, బొప్పాయి వంటివి వస్తుంటాయి. సీజన్లో ప్రకాశం, చిత్తూరు, కృష్ణా జిల్లాల నుంచి మామిడి పెద్దఎత్తున దిగుమతి అవుతుంటుంది.

☛ లాలాపేట, పట్నంబజారుల్లో ఉన్న పండ్లు, పూల మార్కెట్‌లను నగరం బయటకు తరలించాలన్న ప్రతిపాదన చాన్నాళ్లుగా ఉంది. నగరం బయట సుమారు ఐదెకరాల స్థలం సేకరించి, మార్కెట్‌ను అక్కడికి తరలిస్తే బాగుంటుందని వ్యాపారులంటున్నారు. పూల మార్కెట్‌ను కూడా తరలిస్తే నగర పరిధిలో ట్రాఫిక్ సమస్య చాలావరకు తగ్గుతుందని భావిస్తున్నారు. దుకాణాలను తరలించేందుకు వ్యాపారులు సానుకూలంగానే ఉన్నా.. జీఎంసీ నుంచి ఎటువంటి చర్యలు లేవు.

భారీ వాహనాలకు రాత్రిపూటే ప్రవేశం

❖ అతిక్రమిస్తే సీజ్ చేస్తాం ❖ పార్కింగ్‌జోన్ల బాధ్యతలు పొదుపు సంఘాలకు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో భారీ వాహనాలకు రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకే అనుమతి ఉందని, నిబంధనలను అతిక్రమిస్తే వాటిని సీజ్ చేస్తామని కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. గురువారం రవాణా, ట్రాఫిక్ పోలీసు, జీఎంసీ అధికారులతో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 150 చదరపు కిలోమీటర్ల పరిధిలోని గుంటూరు నగరపాలకసంస్థలో గత ఏడాది కాలంగా రహదార్లు, బీటీ రోడ్లు, డ్రెయిన్‌ల నిర్మాణం చేపట్టామన్నారు. భారీ వాహనాల రాకపోకల వల్ల రహదారి నెట్‌వర్క్ దెబ్బతింటుందన్నారు. వాటి నుంచి ఇసుక, కంకర రహదారులపై పడి వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇప్పటికే పలుమార్లు సంబంధిత వాహనాల వారికి పరిస్థితి వివరించినా మార్పు రాలేదన్నారు. ఇక నుంచి నగరంలో ప్రవేశించే ప్రధాన మార్గాలు, సెంటర్లలో 24 గంటల పర్యవేక్షణ ఉంటుందని, నిబంధనలను మీరితే రవాణా, ట్రాఫిక్ పోలీస్, జీఎంసీ సిబ్బంది సంయుక్తంగా చర్యలు తీసుకుంటారని స్పష్టంచేశారు. ప్రభుత్వ, ప్రైవేటు నిర్మాణ పనులకు అత్యవసరమైతే జీఎంసీ నుంచి ప్రత్యేక అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. రాత్రి 10 గంటలకు ముందు, ఉదయం 6 గంటల తర్వాత ఎక్కడైనా భారీ రవాణా వాహనాలు వచ్చినట్లు గమనిస్తే జీఎంసీ కాల్‌సెంటర్ 0863- 2345103కి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. నగరంలో వెండింగ్ జోన్‌లు ఏర్పాటుకు పలుప్రాంతాల్లో పాయింట్లను గుర్తించి, కౌన్సిల్ ఆమోదం పొందామన్నారు. అక్కడికి వీధి వ్యాపారులను తరలించడానికి జీఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సంయుక్త కార్యాచరణ చేపడతారని చెప్పారు. పార్కింగ్ జోన్‌లు ఏర్పాటు చేసి, స్వయం సహాయక సంఘాల ద్వారా నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సీపీ రాంబాబు, ఆర్టీవో శ్రీహరి, ఎంవీఐ సౌజన్య, పట్టాభిపురం సీఐ వెంకటేశ్వర్లు, వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

సమాచారం కచ్చితత్వానికి యాప్ దోహదం

నారెడ్కో క్యాపిటల్ జోన్ యాప్‌ను ఆవిష్కరిస్తున్న రమేష్, మధుసూదన్‌రెడ్డి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: నిర్మాణదారులు, వెండర్ల మధ్య అనుసంధానకర్తగా పని చేసి పరస్పర సహకారం, సమాచారాన్ని మరింత కచ్చితంగా ఇచ్చేందుకు ప్రత్యేకంగా రూపొందించిన నారెడ్కో క్యాపిటల్ జోన్ యాప్ ఉపయోగపడుతుందని కమ్మజన సేవా సమితి ఉపాధ్యక్షుడు, పారిశ్రామికవేత్త చుక్కపల్లి రమేష్ పేర్కొన్నారు. నారెడ్కో క్యాపిటల్ జోన్ యాప్‌ను ఆయనతో పాటు మధుసూదనరెడ్డి, జోన్ కార్యదర్శి మామిడి సీతారామయ్య, అధ్యక్షుడు అంకారావు, కార్యదర్శి మాదాల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు శ్రీనాథ్, కోశాధికారి తిరుపతయ్య గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో యాప్‌ను డిజైన్ చేసి రైసినింగ్ ఐటీ సొల్యూషన్ వ్యవస్థాపకులు మువ్వా శ్రీధర్, కొత్తమాసు రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

బహుమతులు అందుకున్న విద్యార్థులతో అతిథులు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: రాష్ట్రంలోని 924 శాఖా గ్రంథాలయాలను డిజిటల్ గ్రంథాలయాలుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. అరండల్‌పేటలోని జిల్లా గ్రంథాలయ సంస్థలో వారం రోజులుగా జరుగుతున్న వారోత్సవాల ముగింపు సభ గురువారం జరిగింది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ త్వరలోనే మంగళగిరిలో డిజిటల్ గ్రంథాలయం ప్రారంభించనున్నట్లు తెలిపారు. గ్రంథాలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ తల్లిదండ్రులు.. చిన్నారులను గ్రంథ పఠనం వైపు మళ్లించాలన్నారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మేధోవికాసం

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: పాఠ్యపుస్తకాలతో పాటు విజ్ఞాన దాయకమైన పుస్తకాలు చదివితే మేధోవికాసం కలుగుతుందని 28వ డివిజన్ కార్పొరేటర్ పడాల సుబ్బారెడ్డి తెలిపారు. ఎన్జీవో కాలనీలోని పట్టాభిపురం శాఖ గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు సమావేశం గురువారం జరిగింది. సిటిజన్స్ అండ్ వాకర్స్ అధ్యక్షులు జె.సుబ్బాయమ్మ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే కథలు, బాల గేయాలు రాయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తెదేపా డివిజన్ అధ్యక్షుడు అప్పారావు యాదవ్, ఎన్జీవోస్ సొసైటీ అధ్యక్షుడు బండి కృష్ణమూర్తి, గ్రంథాలయాధికారి పి.సత్యాశిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇనుప రాడ్డుతో భార్యపై భర్త దాడి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: భార్యపై ఇనుప రాడ్డుతో దాడి చేసిన భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టాభిపురం పోలీసుల కథనం ప్రకారం.. చెన్నుపల్లి నాగ శ్రావణి, సుబ్బారావు, పిల్లలతో కలిసి ఎస్వీఎన్ కాలనీ రెండో లైన్‌లో నివాసం ఉంటున్నారు. పెళ్లయిన దగ్గర నుంచి సుబ్బారావు భార్యని అనుమానించి వేధిస్తూ.. కొట్టడంతో శ్రావణి భర్తపై వేధింపుల కేసుతో పాటు మెయింటినెన్స్ కేసు పెట్టారు. అయితే సుబ్బారావు భార్యతో మంచిగా ఉన్నట్లు నటించి కేసులు రాజీ అయిన తర్వాత మళ్లీ వేధించడం ప్రారంభించాడు. ఈ క్రమంలోనే ఈనెల 19వ తేదీ రాత్రి సుబ్బారావు విపరీతంగా మద్యం తాగి ఇంటికొచ్చి భార్యను ఇనుప రాడ్డుతో కొట్టడంతో గాయపడ్డారు. దీంతో ఆమె గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో భర్తపై ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలు అమూల్యం

ప్రశంసాపత్రాలు చూపుతున్న విద్యార్థులతో బ్రహ్మం, శ్యాంసుందర్‌రావు తదితరులు

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చేస్తున్న సేవలు అమూల్యమైనవని టీజేపీఎస్ కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ కె.వి.బ్రహ్మం తెలిపారు. ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు కళాశాల దత్తత గ్రామమైన చల్లావారిపాలెంలో నిర్వహించిన ప్రత్యేక శిబిరానికి సంబంధించిన ప్రశంసాపత్రాలు గురువారం కళాశాలలో వాలంటీర్లకు అందజేశారు. గౌరవ అతిథిగా విచ్చేసిన మండవ శ్యాంసుందర్‌రావు మాట్లాడుతూ సమాజానికి అవసరమైన కార్యక్రమాలు చేస్తూ.. ప్రజలను జాగృతం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి, గుంటూరు ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారి డాక్టర్ జె.వి.సుధీర్ కుమార్, కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి ఆర్.జయశైలజ, వాలంటీర్లు పాల్గొన్నారు.

కృత్రిమ మేధతో ఎన్నో ఉపయోగాలు

బహుమతులు అందుకున్న విద్యార్థినులతో ప్రిన్సిపల్ శ్రీనివాసరావు

గోరంట్ల, న్యూస్‌టుడే: కృత్రిమ మేధ(ఏఐ)ను సక్రమంగా వినియోగించుకొంటే ఎన్నో ఉపయోగాలని భాష్యం కళాశాల ధన్వంతరి క్యాంపస్ ప్రిన్సిపల్ ఎన్.శ్రీనివాసరావు అన్నారు. భాష్యం కళాశాల ధన్వంతరీ క్యాంపస్ విద్యార్థులకు 'ఈనాడు' ప్రతిభ పాటవ పోటీల్లో భాగంగా గురువారం 'కృత్రిమ మేధ వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని కృత్రిమ మేధ వల్ల కలిగే ప్రయోజనాలు, నష్టాలపైనా మాట్లాడారు. పోటీల్లో ముజవర్ షేక్ దిల్‌రూబా ప్రథమ, టి.ఐశ్వర్య ద్వితీయ, జి.అలేఖ్య తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపల్ ఎన్.శ్రీనివాసరావు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె.సుమలత, అధ్యాపకులు జి.జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

HINDU COLLEGE OF PHARMACY (AUTONOMOUS)
(Affiliated to Acharya Nagarjuna University and Recognized by Pharmacy Council of India, UGC 2(f) & 12(B)-New Delhi, Certified by ISO-9001-2018
NAAC B++
Amaravathi Road, Guntur-522 002 (A.P.) ☎ +91-0863-2221935, Fax: +91-863-2217783
E-mail: hinducollegeofpharmacy@yahoo.com, Visit us: www.hcopgnt.com

B.PHARMACY, PHARM.D SPOT ADMISSIONS

Interested candidates who have not taken admission in any other college may attend spot admission with all their original certificates in our college at 10-00 am on 25-11-2025 for B.Pharmacy Pharm.D , for the left over vacancies. The students who have taken admission in our college and have not reported to our college in the given time. The left-over vacant seats will now be filled by Spot admission on 25-11-2025 before 5:00 PM as per the rules and regulations of APEAPCET-2025. The students admitted through spot admission are not eligible for tuition fee reimbursement.

Contact Immediately: College: 0863-2221935, 9912342122, Principal: 9849127290, Vice-Principal : 9849546292, 8885883496

Note: Admissions for Management Seats in M.Pharmacy and Pharm.D (PB) are in progress interested candidates may contact the above numbers.

Chairman Jupudi Ranga Raju, B.Com. B.L | Secretary & Correspondent Dr. S. Madhusudana Rao, M.B.B.S

శ్రద్ధాంజలి

జననం 30-07-1928 | మరణం 07-11-2025

కీ॥శే॥ యంగలశెట్టి వెంకటేశ్వరరావు గారు, అడ్వకేట్

మా తండ్రి గారైన కీ॥శే॥ యంగలశెట్టి వెంకటేశ్వరరావు (అడ్వకేట్) గారు ది. 07-11-2025 శుక్రవారం స్వర్గస్థులైనారు.
పెద్దకర్మ: ది. 21-11-2025 శుక్రవారం నాడు గుంటూరు శ్రీనివాసరావుపేట, ఐ.టి.సి. కళ్యాణ మండపము నందు జరుపబడును. కావున తెలియచేయడమైనది.

ఇట్లు: కుమారులు
యంగలశెట్టి పుల్లారావు, Rtd. Bank Employee
యంగలశెట్టి శివసూర్యనారాయణ, అడ్వకేట్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, గుంటూరు
మరియు కుటుంబ సభ్యులు. Ph: 99481 91003

ఆలయ కోనేరు.. అధ్వాన తీరు

మొవ్వ మండలం కూచిపూడి గ్రామంలో శ్రీరామలింగేశ్వర దేవాలయ సమీపంలోని ఆలయ కోనేరు కొన్నేళ్ల కిందట అభివృద్ధి చేశారు. అయితే నిర్వహణ కొరవడడంతో మళ్లీ అపరిశుభ్రంగా మారింది. కోనేరు మెట్లపై పిచ్చిమొక్కలు పెరిగి టైల్స్ దెబ్బతిన్నాయి. కొందరు ఇక్కడే చెత్త పడేస్తున్నారు. ఇక రాత్రివేళల్లో మందుబాబులకు అడ్డాగా మారింది. ఈ కోనేరు అభివృద్ధి చేస్తే ఇక్కడికి వచ్చే పర్యాటకులకు ఆహ్లాదం పంచుతుంది. **- ఈనాడు, కృష్ణా**

గోశాలకు పచ్చనితోరణం

మచిలీపట్నం మంగినపూడి బీచ్ సమీపంలోని దత్తరామేశ్వరం ఆలయ ప్రాంగణంలోని ఈ గోశాల ఎంత ముచ్చటగా ఉందో చూడండి. గోశాల మొదటి అంతస్తులో శ్రీకృష్ణుడి విగ్రహంతో పాటు గోమాతలు, గోపబాలుర బొమ్మలు ఏర్పాటు చేశారు. దీని పైకప్పుపై పచ్చని పందిరిలా తీగజాతి మొక్కలు పెంచడంతో ఇలా కనువిందు చేస్తోంది. **- ఈనాడు, కృష్ణా**

ఈనాడు అమరావతి
కృష్ణా

ధాన్యం సేకరణ.. ఇక హాయ్ హాయ్!

కంకిపాడు, ఉయ్యూరు గ్రామీణం, గంపలగూడెం: ఆరుగాలం శ్రమించి పండించిన వ్యవసాయోత్పత్తుల సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులను చాలా వరకు పరిష్కరించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఆధునిక సాంకేతికత సాయంతో వినూత్న ప్రక్రియను అందుబాటులోకి తెస్తోంది. ఈ-పంట నమోదును సంబంధిత రైతు ఫోన్ నంబరుతో లింక్ చేస్తున్నారు. దీని ఆధారంగా కల్లంలోనే ఉండి ఖరీఫ్ ధాన్యం సమాచారాన్ని నిర్దిష్ట 'యాప్'లో అప్‌లోడ్ చేసుకునే సౌకర్యం కల్పించారు. లింకైన ఫోన్ నుంచి వాట్సప్‌లో 7337359375కు 'హాయ్(హెచ్‌ఐ)' అని సందేశం పంపిన వెంటనే రైతుకు నమూనా తెరపై ప్రత్యక్షమవుతుంది.

జిల్లాలో వరి సాగు విస్తీర్ణం:	3.4 లక్షల ఎకరాలు
దిగుబడి:	9 లక్షల మెట్రిక్ టన్నులు
కొనుగోలు కేంద్రాలు:	287
ధాన్యం కొనుగోలు లక్ష్యం:	7.9 లక్షల మెట్రిక్ టన్నులు

సందేశం పంపితే స్పందిస్తారు

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకోవాలనుకునే రైతులు 'హాయ్' సందేశం పంపగానే పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందిస్తారు. రైతు వద్ద ఎన్ని బస్తాల ధాన్యం ఉంది.. ఏ రకానికి చెందినది.. ఎగుమతికి ఇంకా ఎన్ని రోజులు అవసరం.. వంటి ప్రశ్నలకు ఐచ్ఛిక(ఆప్షన్)రూపంలో రైతు బదులివ్వాలి. అనంతరం సమీప కొనుగోలు కేంద్రం, సేకరణ రైస్ మిల్లు ఊరు, పేరుతో పాటు స్లాట్ బుక్ అవుతుంది. దీంతో ఎక్కడికి, ఎప్పుడు తీసుకెళ్లాలనే ఆందోళన తొలగిపోతుందని చెబుతున్నారు.

నిస్పృహ వలదండి.. నిశ్చయంగా కదలండి..

ఈనాడు, అమరావతి

'విజయవాడ, మచిలీపట్నం నగరాలు.. ఉమ్మడి జిల్లాలో అన్ని పట్టణాల్లో నిత్యం ఎదుర్కొనే.. అనేక ప్రమాద, కాలుష్య సమస్యలు.. పొంగిపొర్లే డ్రైనేజీ.. ప్లాస్టిక్ నియంత్రణతోనే పరిష్కరించొచ్చు. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిని గుల్లచేస్తూ.. పర్యావరణ సమతుల్యతను దెబ్బకొడుతున్నాయి. దశాబ్దాలుగా ప్లాస్టిక్ వ్యర్థాలపై విస్తృత ప్రచారం చేస్తున్నా మార్పులేదు. ఇది మన సమస్య కాదని అందరూ అనుకోవడం వల్లే.. ప్లాస్టిక్ వ్యర్థాలు మరింతగా పెరుగుతున్నాయి. ఇది భవిష్యత్తులో మరింత ప్రమాదకరం కానుంది.'

17 నగరాల్లో మనమూ... 2025 అక్టోబరు 02 నుంచి పర్యావరణ, ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా విజయవాడ, మచిలీపట్నం సహా 17 నగరాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తిగా నిషేధిస్తూ ప్రభుత్వం ఆదేశించింది. కానీ.. ప్లాస్టిక్ వినియోగం ఏమాత్రం తగ్గలేదు.

చైతన్యంతో అడుగేస్తేనే ప్లాస్టిక్ నిషేధం

భయపెడుతున్న భూకాలుష్యం...

ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ కవర్లతో నగరాల్లో భూకాలుష్యం తీవ్రమవుతోంది. విజయవాడలో ప్లాస్టిక్ నిషేధం పైగా కొనసాగుతుండడంతో కొంతమేర నియంత్రించారు. ఇప్పటికీ అన్ని చిన్న, పెద్ద దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్ల వినియోగం యథేచ్ఛగా సాగుతోంది.

నిత్య వేదనే..

✦ **విజయవాడ:** ఇళ్లు, హోటళ్లు, మార్కెట్లు, వ్యాపార సంస్థల నుంచి రోజుకు 550-600 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు విడుదల అవుతుండగా.. వీటిలో 20 మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ చెత్తనే.

✦ **మచిలీపట్నం:** రోజుకు 80 మెట్రిక్ టన్నుల చెత్త వస్తే.. 3-5 టన్నులు ప్లాస్టిక్ వ్యర్థాలే.

1 ఓ సంచి తీసుకెళ్తాం: ప్లాస్టిక్ కవర్లను వాడకూడదనే స్పృహ ప్రజల్లో రానంత వరకూ వినియోగం ఆగదు. నిత్యం.. బైక్, కార్లలో ఓ సంచిని పెట్టుకుంటే.. ప్లాస్టిక్ కవర్ల వినియోగం దాదాపు ఆగిపోతుంది. రెండు నగరాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల్లో అత్యధికం.. పాలిథిన్ కవర్లే.

2 తడిపొడి వేరుచేద్దాం: నిత్యం ఇంటికొచ్చి మరీ తడి పొడి చెత్త సేకరిస్తున్నా.. ఇప్పటికీ సగం ఇళ్లలో ప్లాస్టిక్ కవర్లతోపాటు చెత్తంతా కలిపి వేస్తున్నారు. కొన్నిచోట్ల వేర్వేరుగా ఇస్తున్నా.. సిబ్బంది కలిపేసి వాహనాల్లో పోస్తున్నారనే ఫిర్యాదులున్నాయి.

3 మద్యం దుకాణాల వద్ద: రెండు నగరాల్లో మద్యం దుకాణాలను ఆనుకుని ఉండే కాలువలన్నీ.. ప్లాస్టిక్ గ్లాసులు, బాటిళ్లతో నిండి.. కనిపిస్తున్నాయి.

4 నాలుగు కాలువల్లో: నగరంలో అన్ని డ్రెయినేజీ కాలువలు.. బందరు, రైవస్, ఏలూరు, బుడమేరు కాలువల్లో నిత్యం 4-5 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు పోస్తున్నారు.

5 ఒక్క చోట రెండు టన్నులు: విజయవాడ రైల్వేస్టేషన్ వద్ద ఉన్న భూగర్భ డ్రెయినేజీ కాలువల్లోనే నిత్యం కనీసం రెండు టన్నుల ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు పోస్తున్నారు.

కోటి కాంతులు.. శతకోటి ప్రణతులు

పవిత్ర సంగమం వద్ద కోటి దీపోత్సవం శోభ

ఇబ్రహీంపట్నం: పవిత్ర సంగమం వేదికగా కోటి దీపోత్సవం గురువారం సాయంత్రం కనుల పండువలా నిర్వహించారు. శివపార్వతుల కల్యాణ క్రతువు అనంతరం వేల మంది భక్తులు దీపాలను వెలిగించారు. ఎంపీ కేశినేని చిన్ని, కలెక్టర్ లక్ష్మీశ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులకు అడ్డా కొత్త ఆటోనగర్?

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం, న్యూస్‌టుడే పెనమలూరు

అసాంఘిక, సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు కానూరు కొత్తఆటోనగర్ అడ్డాగా మారింది. నిత్యం వేల మంది కార్మికులు ఇక్కడ పనిచేస్తుంటారు. సమీపంలోనే వీఐపీలు, అధికారుల నివాసాలు ఉంటాయి. 28 మంది మావోయిస్టులు పట్టుబడే వరకు నిఘా, స్పెషల్‌బ్రాంచ్, పోలీసుల పర్యవేక్షణ లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ పారిశ్రామికవాడలో గతంలోనూ పెద్ద సంఖ్యలో రాకెట్ లాంచర్ల నిల్వలను పోలీసులు పట్టుకున్నారు.

రాత్రి 7దాటితే నిర్మానుష్యమే..: ఆటోనగర్‌లోని మోటార్‌షెడ్లు, గోదాములు, ఇతర మోటార్‌ఫీల్డుకు చెందిన వ్యాపార లావాదేవీలు జరుగుతుంటాయి. ఇక్కడ భవనాలు కూడా సంబంధిత వ్యాపార వర్గాలకే అద్దెకు ఇవ్వాల్సి ఉంటుందని సమీప పరిశ్రమల వారు చెబుతున్నారు. నివాసం ఉండేందుకు అద్దెకు ఇస్తుండడంతో అసాంఘిక శక్తులకు ఈ ప్రాంతంలోని భవనాలు సురక్షితంగా మారాయి. అద్దెకిచ్చే సమయంలో కనీస జాగ్రత్తలు పాటించడం లేదు. ఇక్కడ పనిచేసే సిబ్బందికి ప్రత్యేక గుర్తింపు కార్డులు లేవు. దీంతో స్థానిక కార్మికులు ఎవరు, బయట నుంచి వచ్చిందెవరో తెలియని గందరగోళం నెలకొంది. ఇక్కడ భవన నిర్మాణాలు అధికంగా జరుగుతుండడంతో ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులు బతుకుదెరువు కోసం వస్తుంటారు. రాత్రి 7 దాటితే ఆటోనగర్‌లో కార్మికుల సంచారం అంతగా ఉండదు. ఆదివారాలైతే నిర్మానుష్యంగా ఉంటుంది. దీన్ని ఆసరాగా చేసుకొని గంజాయి, రేషన్ మాఫియాలు, సంఘ వ్యతిరేకశక్తులు సులువుగా ఇక్కడికి చొరబడుతున్నాయి.

పోలీసుల అదుపులో భవన సూపర్‌వైజర్?

భవనం సూపర్‌వైజర్ రాజును పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. నెలలుగా భవనం ఖాళీగా ఉండడంతో ఓ మహిళ వచ్చి రోడ్డు పనులకు కూలీలు వస్తున్నారని, రెండు నెలలు అద్దెకు అడగ్గా ఇచ్చానని అతడు చెప్పినట్లు తెలిసింది. 'వివరాలు కనుక్కోకుండా ఎలా ఇచ్చారు? వారు గుర్తింపు కార్డులు చూపలేదా? 1, 2 అంతస్తులు కాకుండా చివరి అంతస్తులోనే ఎందుకు దిగారు? కూలి పనులకు వచ్చినవారు ఎందుకని బయటకు రాకుండా లోపల ఉన్నారని అనుమానం రాలేదా? వీరిని ఎవరు పిలిపించారు? వీరేనా ఇంకా ఎవరైనా వచ్చారా? వారి వద్ద ఆయుధాలు కనిపించలేదా? అనే వివరాలు రాబట్టినట్లు తెలుస్తోంది.

కాలువలు పూడి.. కడగండ్లు పొంగి..

ఆటోనగర్‌లో చాలా చోట్ల కాలువలు మూసుకుపోయి రహదారిపై మురుగు నిలిచిపోతోంది. దీంతో నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రహదారుల్లో అవస్థలు తప్పడం లేదు. ఆటోనగర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ గోదాంకు సమీపంలో రహదారిపై మురుగు చేరడంతో ఇలా సగం దారిలోనే వాహనాలు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. **- ఈనాడు, అమరావతి**

దారంతా పాడైంది.. దుమ్మెత్తిపోతోంది..

ఇటీవల కురిసిన వర్షాలకు కానూరు పరిధిలో రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. డ్రెయినేజీ విస్తరణ పనులు సైతం కొనసాగుతుండడంతో రహదారులపై విపరీతంగా దుమ్ము పేరుకుపోతోంది. దీంతో ఈ రోడ్డులో ప్రయాణం అంటేనే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు తిరిగే సమయంలో విపరీతంగా దుమ్ము లేచి వాహనదారులకు ఇబ్బందులు తప్పటం లేదు. స్థానికంగా ఉండే దుకాణాల్లో సైతం దుమ్ము పేరుకుపోతోందని చెబుతున్నారు. **- ఈనాడు, అమరావతి**

పశ్చిమ బైపాస్‌పై... రయ్ రయ్!

ప్యాకేజీ-3లో మొదలైన రాకపోకలు

దూసుకెళ్తున్న వాహనాలు..

ఈనాడు, అమరావతి: పశ్చిమ బైపాస్ ప్యాకేజీ-3కి మార్గం సుగమమైంది. హైదరాబాద్-విశాఖ మధ్య రాకపోకలు సాగించే వారికి విజయవాడ ట్రాఫిక్ చెర నుంచి విముక్తి దొరికింది. ఎంచక్కా పశ్చిమ బైపాస్‌పై దూసుకెళ్లేందుకు గురువారం సాయంత్రం నుంచి దారులు తెరుచుకున్నాయి. ప్రయాణానికి ప్రతిబంధకంగా ఉన్న నున్న విద్యుత్తు టవర్ల సమస్యకు అధికారులు పరిష్కారం చూపించారు. దీంతో హైదరాబాద్ ప్రయాణికులకు బోలెడంత సమయం ఆదా కానుంది.

తాత్కాలిక టవర్ నిర్మాణంతో...: ప్యాకేజీ-3లో చినఆవుటపల్లి-గొల్లపూడి వరకు 30 కిమీ మేర బైపాస్ పూర్తి చేశారు. జక్కంపూడి, నున్నలో రహదారిపై నుంచి వెళ్లిన హైటెన్షన్ విద్యుత్తు టవర్లతో ఇప్పటి వరకు ప్రయాణికులను అనుమతించలేదు. ఇటీవల జక్కంపూడి టవర్ల వివాదానికి కోర్టు పరిష్కారం చూపింది. ప్రస్తుతం ఉన్న ఎలైన్‌మెంట్‌లోనే విద్యుత్తు వైర్లను ఎత్తు పెంచాలని తీర్పు ఇచ్చింది. నున్న టవర్ల విషయంలో ఇప్పటికే కొత్త టవర్ల నిర్మాణం సగానికి పైగా పూర్తవడంతో జక్కంపూడి తరహా మార్పు సాధ్యం కాదని అధికారులు భావించారు. దీనికి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు యుద్ధప్రాతికన రహదారిపై తక్కువ ఎత్తులో ఉన్న వైర్లను పైకిలేపి నున్నలో ఓ తాత్కాలిక టవర్ నిర్మించి సమస్యను పరిష్కరించారు.

ఇక దూసుకుపోవడమే...

ఇప్పటి వరకు వైజాగ్-హైదరాబాద్ మధ్య రాకపోకలు సాగించేవారు విజయవాడ మీదుగా వెళ్లాల్సి వచ్చేది. చినఆవుటపల్లి నుంచి విజయవాడ దాటి హైదరాబాద్ ఎన్‌హెచ్ చేరాలంటే ట్రాఫిక్ యాతనతో గంటపైగా పట్టేది. ప్రస్తుతం చినఆవుటపల్లి దగ్గర బైపాస్ ఎక్కితే 30 నిమిషాల్లో అక్కడికి చేరుకోవచ్చు. చినఆవుటపల్లి దగ్గర గతంలో పండగల సమయంలో అనుమతించిన దారి ద్వారానే బైపాస్ ఎక్కొచ్చు. గొల్లపూడి దగ్గర యూటర్న్ తీసుకుని హైదరాబాద్ ఎన్‌హెచ్‌కి చేరవచ్చు. జక్కంపూడి టవర్ పనులకు మరో మూడు నెలలు పడుతుంది. అయినా అక్కడ రెండు వైపులా ఉన్న సర్వీస్ రోడ్ల నుంచి ప్రయాణికులు వెళ్లే అవకాశం ఉంది.

ఉత్సాహంగా రాష్ట్ర క్రీడా జట్ల ఎంపికలు

విజయవాడ క్రీడలు: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల రాష్ట్ర క్రీడా జట్ల ఎంపిక పోటీల్లో భాగంగా గురువారం 240 మంది ఉద్యోగులు పాల్గొన్నారని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కాకర్ల కోటేశ్వరరావు తెలిపారు. ఐజీఎంసీ స్టేడియంలో జరిగిన కబడ్డీలో 70, బాస్కెట్‌బాల్‌లో 39, క్యారమ్‌లో 62, రెజ్లింగ్‌లో 18 మంది తలపడగా.. ఈడుపుగల్లులోని కృష్ణా డీఎస్‌ఏ ఈత కొలనులో స్విమ్మింగ్ జట్ల ఎంపికలో 50 మంది పోటీపడ్డారు.

24న కృష్ణా వర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

విజయవాడ: పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వ్యాయామ విద్యా విభాగం ఆధ్వర్యంలో 24న కృష్ణా వర్సిటీ అంతర్ కళాశాలల స్త్రీ, పురుషుల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు, వర్సిటీ జట్టు ఎంపికలు నిర్వహిస్తామని ప్రిన్సిపల్ రమేష్ తెలిపారు. వివరాలకు 99639 92102లో సంప్రదించాలన్నారు.

ధాన్యం కొనుగోలుపై భరోసా

రైతుకు ఫోన్ చేసిన మంత్రి నాదెండ్ల

కూచిపూడి, న్యూస్‌టుడే: అన్నదాతలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని కూటమి ప్రభుత్వం మాటలు చెప్పడమే కాదు.. చేతల్లో చేసి చూపిస్తోందని రైతులు ప్రశంసిస్తున్నారు. ధాన్యం విక్రయించడానికి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న మంత్రి నాదెండ్ల మనోహర్ స్వయంగా ఫోన్‌చేసి ధైర్యం చెప్పడం కృష్ణా జిల్లా మొవ్వ మండలంలో చర్చనీయాంశంగా మారింది. మొవ్వ మండలం భట్లపెనుమర్రు గ్రామానికి చెందిన చలసాని వెంకటేశ్వరరావు(చంటిబాబు) 14 ఎకరాల్లో వరిసాగు చేశారు. వాతావరణంలో వస్తున్న మార్పులతో యంత్రాలతో హడావుడిగా కోయిస్తున్నారు. అలా ఇప్పటికే ఏడు ఎకరాల్లో పంటను ఇంటికి తోలించి నిల్వ చేశారు. ధాన్యం విక్రయించేందుకు పడుతున్న ఇబ్బందులను ఆయన ఒక వ్యక్తితో చెప్పగా ఆయన ద్వారా మంత్రి నాదెండ్ల కార్యాలయానికి విషయం చేరింది. విషయం తెలుసుకున్న వెంటనే గురువారం ఉదయం 10.15గంటలకు మంత్రి నాదెండ్ల ఆ రైతుకు ఫోన్ చేసి మాట్లాడారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



రైతు చలసాని వెంకటేశ్వరరావు

❖ ఫోన్ చేసిన నిమిషాల వ్యవధిలోనే జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయం నుంచి వివరాలు సేకరించారు. ఆ వెంటనే మండల తహసీల్దారు గ్రామానికి చేరుకుని చలసాని ఇంటికి వెళ్లి ఎంత ధాన్యం ఉంది, ఎన్ని సంచులు కావాలని అడిగారు. ధాన్యం అంతా కొంటామని అధికారులు చెప్పడంతో ఆ రైతు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఓ మంత్రి స్థాయి వ్యక్తి రైతుకు ఫోన్ చేస్తారన్న విషయాన్ని ఊహించలేకపోయానని, ఫోన్ చేసిన వెంటనే ఒకింత కంగారు అనిపించిందని రైతు తెలిపారు. కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటామని, మంత్రి నాదెండ్ల స్వయంగా ఫోన్ చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఒకరి దుర్మరణం

పెడన, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా పెడన మండలం మడక వద్ద 216 జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి దుర్మరణం చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు మండలంలోని లంకలకలగుంట గ్రామానికి చెందిన మువ్వల చిన వెంకటేశ్వరరావు(55)గా గుర్తించారు. క్షతగాత్రుడు సిరంగి నాగమలేశ్వరరావు ఆస్పత్రిలో కోలుకుంటున్నట్లు పోలీసులు చెప్పారు. ఈ ఇరువురు మడకలోని ఒక ఫాంహౌస్‌లో పనిచేస్తారు. ఉదయం పనికి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొని ఈ ప్రమాదం జరిగింది. ఈ కారు నరసాపురానికి చెందినదిగా పోలీసులు నిర్ధారించారు. కారుపై నర్సాపురం వైకాపా మాజీ ఎమ్మెల్యే ముదునూరు ప్రసాదరాజు పాస్(స్టిక్కర్) ముందు గ్లాసుపై కన్పిస్తోంది. 2022 డిసెంబరుతో పాస్ కాలపరిమితి ముగిసింది. రూరల్ సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్సై సత్యనారాయణ ఘటనా స్థలానికి తరలివచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చినవెంకటేశ్వరరావు (పాతచిత్రం)

★ కారుపై వైకాపా మాజీ ఎమ్మెల్యే స్టిక్కర్

బంధువుల ఆందోళన: లంకలకలవగుంట గ్రామస్థులు, బంధువులు పోలీస్‌స్టేషన్‌కు మృతదేహాన్ని తీసుకొచ్చి ఆందోళన చేశారు. న్యాయం చేయాలని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కారు మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణమైందని నిరసించారు. అధికారులు నచ్చజెప్పడంతో వారు ఆందోళన విరమించారు. కారుకు బీమా లేనట్లు పోలీసులు చెప్పారు.

గ్రామస్థుల నిరసన

ప్రత్యేక రైళ్లు పొడిగింపు

విజయవాడ (రైల్వేస్టేషన్): ప్రయాణికుల సౌకర్యార్థం నడుపుతున్న ప్రత్యేక రైళ్లను పండగల దృష్ట్యా పొడిగిస్తున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబరు 07033/07034 కాకినాడ టౌన్- మైసూర్ ప్రత్యేక రైలు డిసెంబరు 1వ తేదీ నుంచి జనవరి 13 వరకు, 07153/07154 నర్సాపూర్- బెంగళూరు జనవరి 2వ తేదీ నుంచి 10 వరకు, 07165/07166 హైదరాబాద్-భువనేశ్వర్ డిసెంబరు 12వ తేదీ నుంచి జనవరి 28 వరకు రాకపోకలు సాగిస్తాయని చెప్పారు.

కోట్లు కరిగాయి.. పాట్లు మిగిలాయి!

రూ.5 కోట్లు వెచ్చించినా .. బండి నిలిపే స్థలం లేదు

దుర్గగుడిలో అత్యంత తీవ్రంగా పార్కింగ్ సమస్య

ప్రతిపాదిత మల్టీలెవెల్ పార్కింగ్ కాంప్లెక్స్ నమూనా

ఈనాడు, అమరావతి

'దుర్గగుడికి నిత్యం 40 వేలు.. శుక్ర, శని, ఆదివారాల్లో 70 వేల మంది భక్తులు వస్తున్నారు. ఏటేటా ఆలయానికి వచ్చేవారి సంఖ్య పెరుగుతోంది. నిత్యం కనీసం 500 కార్లు, వేలాది ద్విచక్ర వాహనాలు వస్తున్నాయి. వారాంతాల్లో రెట్టింపు ఉంటున్నాయి. కానీ.. ఓ వంద కార్లను నిలిపే సౌకర్యమూ లేదు. వారాంతాలొస్తే.. ఘాట్‌రోడ్డు స్తంభిస్తోంది. పార్కింగ్ సమస్య పరిష్కారానికి.. దశాబ్దాలుగా రూ.కోట్లు కరిగించినా కొలిక్కిరాలేదు.'

ఇంద్రకీలాద్రిని ఆనుకుని పైవంతెన పక్కన రూ.5 కోట్లు ఖర్చు పెట్టి చైనావాల్ పేరుతో 2012లో ఓ నిర్మాణం చేపట్టారు. ఈ వాల్ పూర్తయితే.. కనీసం వంద కార్లను ఘాట్‌రోడ్డుపై పార్కింగ్ చేయొచ్చన్నారు. కానీ.. రూ.5 కోట్లు కరిగినా 50 కార్లను నిలిపే స్థలం కూడా రాలేదు. దేవస్థానం ఇంజినీరింగ్ విభాగం పనితనానికి.. ఇదే నిదర్శనం. ఈ భారీగోడ ఎప్పుడు కుంగుతుందో తెలియని దుస్థితి నెలకొంది.

పరిష్కారాలు అనేకం..

☛ కనకదుర్గానగర్‌లో కింది నుంచి ఘాట్‌రోడ్డును కలిపేలా ఓ మల్టీలెవెల్ వాహన పార్కింగ్ నిర్మిస్తామని కొద్దినెలల కిందట నమూనాలు రూపొందించారు. ఆ ప్రతిపాదన ఏ దశలో ఉందో కూడా తెలీదు. ☛ ఇంద్రకీలాద్రికి సమీపంలోనే తితిదే రెండెకరాల ఖాళీ స్థలం ఉంది. దీనినే ఉత్సవాల వేళ పార్కింగ్‌కు వాడుతుంటారు. ఈ స్థలాన్ని గత తెదేపా ప్రభుత్వంలోనే ఆలయానికి స్వాధీనం చేస్తూ ప్రభుత్వం జీవో ఇచ్చినా.. దుర్గగుడి అధికారుల నిర్లక్ష్యంతో చేజారింది. ☛ దుర్గగుడి బృహత్తర ప్రణాళికలో భాగంగా గతంలోనూ పార్కింగ్ సమస్య తీర్చేందుకు కనకదుర్గానగర్‌లో అనేక ప్రణాళికలు వేసినా.. అమలు జరగలేదు.

పెరిగే అవసరాలకు తగినట్లు ఉండాలి

గత తెదేపా ప్రభుత్వ హయాంలోనే మేం దుర్గగుడిని పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి.. బృహత్తర ప్రణాళికలో భాగంగా పార్కింగ్ సమస్య పరిష్కారానికి అనేక సూచనలు చేశాం. ప్రస్తుతం వస్తున్న వాహనాలు, వచ్చే రెండు మూడు దశాబ్దాల అవసరాలు దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు రూపొందించాలి. **- డాక్టర్ కె.ఎస్.ఎస్.వి.వి.ప్రసాద్, ఛైర్మన్, క్రియాటో సొల్యూషన్స్, విజయవాడ**

గుట్టు వీడుతున్న.. జోగి.. అద్దేపల్లిల ఆర్థిక బంధం!

రమేష్, రాముల ఆర్థిక లావాదేవీల ఆరా

ఆస్తుల కొనుగోళ్లపై నిశిత పరిశీలన

ఈనాడు, అమరావతి

మాజీ మంత్రి, వైకాపా నేత జోగి రమేష్‌తో జనార్దనరావు ఆర్థిక బంధంపై సిట్ సునిశిత దృష్టి సారించింది. గతంలో ఉమ్మడిగా మద్యం వ్యాపారం చేసిన ఇద్దరి ఆర్థిక చరిత్రను తవ్వి తీస్తోంది. శుక్రవారం సిట్, ఎక్సైజ్ అధికారులు నిందితులు జనార్దనరావు (ఏ1), జగన్మోహన్‌రావు (ఏ2)ను ప్రధానంగా వీటి పైనే ప్రశ్నించారు. గత కొన్నేళ్ల నగదు విత్‌డ్రాయల్స్‌ను పరిశీలిస్తున్నారు. నగదు డ్రా చేసిన తేదీల్లో జోగి రమేష్, రాములకు ఇచ్చారా? ఇస్తే.. ఎంత మొత్తాన్ని అందజేశారు? అనే కోణంలో పలు ప్రశ్నలు సంధించి వివరాలు రాబట్టారు.

నిందితుల మధ్య లావాదేవీలు...

ఈ కేసులో పలువురు నిందితులతో అద్దేపల్లి సోదరుల మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఈ స్టేట్‌మెంట్లను వారి ముందుంచి.. వివరాలు తీసుకున్నారు. ఏ1 ఇచ్చిన ముడుపులతో జోగి రమేష్ ఏవైనా ఆస్తులు కొన్నారా? కొంటే వాటి వివరాలు? వాటిని ఎన్నికల అఫిడవిట్‌లో చూపించారా? అనే వివరాలను పరిశీలిస్తున్నారు. ఆదాయ పన్ను రిటర్న్‌లలో పొందుపరిచారా? అని కూడా పరిశీలిస్తున్నారు. ఇందుకు జోగి రమేష్ (ఏ18), జోగి రాము (ఏ19) బ్యాంకు స్టేట్‌మెంట్లను నిశితంగా పరిశీలిస్తున్నారు.

☛ స్పిరిట్, మూతలు, సీసాలు, లేబుళ్లను సరఫరా చేసిన నిందితులకు.. జోగి రమేష్, రాములతో లింకులు ఉన్నాయా? అని దర్యాప్తు చేస్తున్నారు. వీటిపై రెండో రోజు కస్టడీలో నిందితులను పోలీసులు ప్రశ్నించినట్లు సమాచారం. ఏ1, ఏ2 నుంచి వీరి బంధువైన రవి (ఏ14)తో జరిగిన పెద్ద ఎత్తున లావాదేవీలను గుర్తించి.. వాటిని ఆరా తీశారు. మూతలు, లేబుళ్ల సరఫరాదారులకు డబ్బులు ఇచ్చేందుకే రవికి యూపీఐ ద్వారా బదిలీ చేసినట్లు విచారణలో వెల్లడించారు.

(c) eenadu

ఏ కష్టమొచ్చినా మా దృష్టికి తీసుకురండి.. పరిష్కరిస్తాం

వనసమారాధనలో మంత్రులు వాసంశెట్టి సుభాష్, పార్థసారథి

మోపిదేవి, న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీకి ఇన్‌ఛార్జి లేని లోటు గుర్తించామని, ఏ కష్టమొచ్చినా, మీ సమస్యలు తీరకపోయినా మా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఎక్సైజ్ శాఖామంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మోపిదేవి వార్పు మామిడితోటల్లో గురువారం తెదేపా అవనిగడ్డ నియోజకవర్గ స్థాయి కార్తిక వన సమారాధన ఏఎంసీ ఛైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షులు కొనకళ్ల నారాయణ, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, స్వచ్ఛ ఆంధ్ర మిషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు పాల్గొన్నారు. కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల నుంచి నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. తొలుత ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేశారు. 1977 ఉప్పెన మృతులకు మౌనం పాటించారు. నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, బొబ్బా గోవర్ధన్, ఎంపీపీ రావి దుర్గావాణి, రావి నాగేశ్వరరావు, నడకుదిటి జనార్ధనరావు, తెదేపా మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మంత్రి రవీంద్ర, విజయవాడ ఎంపీ శివనాథ్ తదితరులు

మాట్లాడుతున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

☛ మంత్రి పార్థసారథి వద్ద పార్టీ శ్రేణులు సమస్యలను మొరపెట్టుకున్నారు. పార్టీ అధికారంలో ఉన్నా పనులు కావటం లేదని, సమస్యలు వస్తే ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని వాపోయారు. పనులు కాని వైనంపై ఆయా శాఖాధికారులతో ఆయన మాట్లాడారు.

☛ వన సమారాధన ఏర్పాట్ల పర్యవేక్షణలో బుధవారం జరిగిన ప్రమాదంలో గాయాలైన పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రావి రత్నగిరిని నేతలు పరామర్శించారు.

☛ హైదరాబాద్‌లో కోర్టుకు వైకాపా అధినేత జగన్ కార్యకర్తలతో ప్రదర్శనగా వెళ్లడంపై ప్రజాప్రతినిధులు విమర్శలు గుప్పించారు. ఇలా కూడా కోర్టుకు హాజరుకావచ్చని నేర్పారన్నారు.

కీలక పరికరం లేకుండానే పరీక్షలు

ఆక్వా రైతుల దరిచేరని సదుపాయం

అవనిగడ్డ, న్యూస్‌టుడే

అవనిగడ్డలో 2021లో ఆక్వా కల్చర్ ప్రయోగశాల ఏర్పాటు చేసి ఐదేళ్లు అవుతున్నా ఇప్పటి వరకు పరీక్షలకు ముఖ్యమైన లామినర్ ఎయిర్‌ఫ్లో పరికరం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆక్వా కల్చర్ సాగులో వైరస్ ఉందా, లేదా అనే విషయం కచ్చితంగా తెలుసుకునే పరిస్థితి లేక నష్టపోతున్నామని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో అత్యధికంగా ఆక్వా సాగుచేసే రైతులు దివిసీమలో ఉన్నారు. ఆక్వా సాగుకు అనుకూలమైన ప్రాంతం కావడం వలన ఇక్కడ ప్రయోగశాలను వైకాపా హయాంలో రూ.93 లక్షలతో ఏర్పాటు చేశారు. దీనిలో మట్టి, నీరు, మేత, రొయ్యలలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాల్సి ఉంది. అసలైన పరికరం లేకుండా నాణ్యత తనిఖీతో పాటు వ్యాధుల నిర్ధారణ చేయడం వలన ఖచ్చితమైన రిపోర్టు రాకపోవడంతో రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని చెపుతున్నారు. లామినర్ ఎయిర్ ఫ్లో పరీక్షా పరికరం ఉంటే నీటిలో, మేతలో, రొయ్యలలో వైరస్ ఉందా, లేదా అనే విషయాన్ని కచ్చితంగా తెలుసుకునే, తద్వారా మెలకువలు పాటించే అవకాశం ఉంటుందని ఆక్వా రైతులు చెపుతున్నారు. ఇప్పటికైనా ఈ పరికరాన్ని ప్రయోగశాలలో ఏర్పాటు చేసి, నష్టాలలో ఉన్న ఆక్వా రైతులను ప్రోత్సహించాలని వారు కోరుతున్నారు.

అవనిగడ్డలోని ఆక్వా కల్చర్ ప్రయోగశాల

☛ ఆక్వా సాగులో వైరస్‌లను గుర్తిస్తే నష్టాల బారిన పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవచ్చు. మట్టి, నీరు, మేత, రొయ్యలను పరీక్షించి కచ్చితమైన నివేదిక వస్తే రైతులు నష్టాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంది. అధికారులు వెంటనే లామినర్ ఎయిర్ ఫ్లో పరికరం ఏర్పాటుచేసి రైతులను ఆదుకోవాలి. **- లకనం నాగాంజనేయులు, సంప్రదాయ మత్స్య కారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**

రామలింగేశ్వరునికి నవ హారతులు సమర్పిస్తున్న ఆగమ పండితుడు

నదిలో కార్తిక దీపాలు వదులుతున్న భక్తులు

శాకంబరేశ్వరునిగా శ్రీరామలింగేశ్వర స్వామి

నాగాయలంక, న్యూస్‌టుడే: నాగాయలంక కృష్ణాతీరాన శ్రీరామపాద క్షేత్రంలో కొలువై ఉన్న గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తిక మాసం ముగింపు సందర్భంగా గురువారం స్వామి వారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించి విశేష పూజలు చేశారు. నవ జ్యోతులను సమర్పించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్-విజయలక్ష్మి దంపతులు కోటి దీపాన్ని వెలిగించి కృష్ణవేణీ మాతకు నివేదించారు. కమిటీ అధ్యక్షులు ఆలూరి శ్రీనివాసరావు, తలశిల రఘుశేఖర్, ఉప్పల బుజ్జి, కనిగంటి నారాయణ, బోయపాటి రాము, తదితరులు పర్యవేక్షించారు.

వృద్ధుల సంరక్షణలో నిర్లక్ష్యం తగదు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: వృద్ధుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని జిల్లా జడ్జి జి.గోపీ అన్నారు. గురువారం మచిలీపట్నం జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవా సదన్‌లో వృద్ధుల సంరక్షణ చట్టంతో పాటు వివిధ చట్టాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉన్న సమయంలో పిల్లలు కూడా తాతామామ్మల పర్యవేక్షణలో వారు చెప్పే కథలు విని నైతిక విలువలతో పెరిగేవారన్నారు. కాలక్రమంలో వివిధ కారణాల చేత మేమిద్దరం..మాకిద్దరు అన్నట్లుగా చిన్న కుటుంబాలు కావడంతో వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎవరూ యవ్వనంతోనే ఉండరని, అందరూ వృద్ధాప్యంలోకి వెళ్తారన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. వృద్ధులకు అనేక చట్టాలు అండగా ఉన్నాయన్నారు. వృద్ధులైన తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే పిల్లల నుంచి మనోవర్తి పొందే అవకాశాన్ని చట్టం కల్పిస్తుందన్నారు. వృద్ధులకు ఉచిత న్యాయసహాయం అందిస్తామని, దాన్ని వినియోగించుకోవాలన్నారు. ఆయనతో పాటు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కేవీఆర్ కృష్ణయ్యలు వివిధ చట్టాల గురించి వివరించారు. వయోవృద్ధులు, వికలాంగుల సంక్షేమశాఖాధికారి కామరాజు శాఖాపరంగా అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. విశ్రాంత ఉద్యోగులు, వృద్ధుల సంక్షేమ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా జడ్జి జి.గోపీ

108 అంబులెన్సుకు జబ్బు చేసింది

గుడివాడ పట్టణంలోని 108 అంబులెన్సు కనిపించడం లేదు. గత 10 రోజులుగా ఇది విజయవాడ వర్కు షాపులో ఉన్నట్లు సమాచారం. పైగా గుడ్లవల్లేరుకు చెందిన అంబులెన్సు పాడైపోతే గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మార్చురీ గది ముందు వదిలేశారు. చాలా రోజులుగా ఇది ఇక్కడే ఉంది. దీని స్థానంలో గుడ్లవల్లేరుకు వేరొకటి ఏర్పాటు చేశారు. గుడివాడ అంబులెన్సు బాగు చేయకపోవడంతో ఇక్కడి పోకేసులను పెదపారుపూడి, నందివాడ సిబ్బంది స్వీకరిస్తున్నారు. ఈక్రమంలో గతంలో వెంటనే అందుబాటులో ఉండే 108 సర్వీసు దరిచేరడానికి నేడు గంటల సమయం పడుతోంది. అత్యవసరం అయితే నానా అవస్థలు పడుతున్నారు. గుడివాడలో ఇటీవల ప్రమాదాలు అధికం కావడంతో సకాలంలో అంబులెన్సులు రాక ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో జరిగే ప్రమాదాల బాధితులను విజయవాడ ఆసుపత్రికి తరలించడానికి చాలా సమయం పడుతోంది. ఇటీవల బొమ్ములూరు రోడ్డులో ప్రమాదానికి గురైన వారు 108కు ఫోన్ చేసినా సకాలంలో రాకపోవడంతో ప్రమాదం జరిగిన ఆటోలోనే ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లడం గమనార్హం. ఈనేపథ్యంలో తక్షణం గుడివాడకు చెందిన 108 అంబులెన్సును వెంటనే అందుబాటులోకి తీసుకుని రావాలని ప్రజలు కోరుతున్నారు. **- గుడివాడ, న్యూస్‌టుడే**

పాడైన గుడ్లవల్లేరు అంబులెన్సు

పాఠశాల విద్యలో.. ఇన్నోవేషన్ సంస్కృతిగా మారాలి

కానూరు, న్యూస్‌టుడే: పాఠశాల విద్యలో ఇన్నోవేషన్ ఓ సంస్కృతిగా మారాలని సమగ్ర శిక్షా ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం సిద్ధార్థ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో రెండ్రోజుల ఇన్నోవేషన్ డిజైన్, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో వినూత్న మార్పులు తెచ్చేందుకు, విద్యార్థులను ఆవిష్కరణల కర్తలుగా తీర్చిదిద్దడానికి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ పరిధిలోని పాఠశాల విద్య అక్షరాస్యతా విభాగం, ఏపీసీటీఈ, సమగ్రశిక్షా, పీఎంశ్రీ ఎన్‌సీఈఆర్‌టీ, స్కూల్ ఇన్నోవేషన్ కౌన్సిల్, వాద్వానీ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ శిక్షణా కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న సమగ్ర శిక్షా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, ఎంఆర్ ప్రసన్నకుమార్ తదితరులు

సమగ్ర శిక్షా అదనపు రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఎంఆర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ కేవలం అకడమిక్ అంశాలు మాత్రమే కాకుండా సంపూర్ణ వ్యక్తిత్వం తీర్చిదిద్దే విధంగా ఉండాలన్నారు. ఆరో తరగతి నుంచే ఇన్నోవేషన్, డిజైన్‌ను పాఠ్యాంశాలలో ఓ భాగం చేయాలన్నారు. ఏపీసీటీఈ ఇన్నోవేషన్ సెల్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎలంగోవన్ కరియప్పన్ మాట్లాడుతూ రాష్ట్రంలో 50 శాతం పాఠశాలల్లో స్కూల్ ఇన్నోవేషన్ కౌన్సిల్స్ ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. జిల్లాలను ఆవిష్కరణ హబ్‌లుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఐటీ విభాగాధిపతి మన్నే సునీత, ఉపకులపతి పి.వెంకటేశ్వరరావు, ప్రోవైస్‌ఛాన్సలర్ ఏవీ రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక పురోగతిలో సహకార వ్యవస్థ పాత్ర కీలకం

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: దేశ గ్రామీణ ఆర్థిక పురోగతిలో సహకార వ్యవస్థ పాత్ర ఎంతో కీలకమని కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురాం అన్నారు. జాతీయ సహకార వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన బ్యాంకులో సహకార జెండా ఆవిష్కరించి సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు, చిరు వ్యాపారులు, స్వయం సహాయక బృందాల అభివృద్ధికి సహకార బ్యాంకులు ఎనలేని తోడ్పాటు అందిస్తున్నాయన్నారు. కేడీసీసీ బ్యాంకు పరంగా భవిష్యత్తులో మరింత పురోభివృద్ధి సాధిస్తామన్నారు. బ్యాంకు ఎంతో నిబద్ధత, బాధ్యతతో ప్రజలకు సేవలు అందించడానికి కట్టుబడి ఉందన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండి పనిచేస్తున్న సిబ్బందిని అభినందించారు. కార్యక్రమ ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఛైర్మన్ ప్రారంభించి రక్తదాతలను ప్రశంసించారు. బ్యాంకు సీఈవో శ్యామ్‌మనోహర్, డీసీవో చంద్రశేఖర్‌రెడ్డి, డీఆర్ ఫణికుమార్, రంగబాబు, జీఎం పీఎల్ చంద్రశేఖర్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

సహకార జెండాను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేయిస్తున్న ఛైర్మన్ నెట్టెం రఘురాం

డ్రగ్స్ కేసులో కొండారెడ్డి కోసం పీటీ వారెంట్ దాఖలు

ఈనాడు - అమరావతి: ఎండీఎంఏ కేసులో వైకాపా నేత కొండారెడ్డిపై పోలీసులు పీటీ వారెంట్ దాఖలు చేశారు. విశాఖవాసి కొండారెడ్డిని ఈ కేసులో మాచవరం పోలీసులు ఏ7గా నమోదు చేశారు. విశాఖలో ఇటీవల డ్రగ్స్ కేసులో అక్కడి పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. ఇటీవల బెంగళూరులో పోలీసులు అరెస్టు చేసిన పెడ్లర్ మ్యాడీ విచారణలో కొండారెడ్డి లింకుల గురించి వెల్లడించాడు. దీంతో పాటు నెల్లూరు కారాగారంలో రిమాండ్‌లో ఉన్న లోహిత్ యాదవ్‌ను పోలీసులు విచారించారు. అందులోనూ కొండారెడ్డి ప్రమేయం గురించి చెప్పాడు. తరచూ మత్తు పార్టీలు చేసుకునే వారమని తెలిపాడు. ఈ నేపథ్యంలో కస్టడీకి తీసుకుని మరింత లోతుగా విచారించేందుకు ఎంఎస్‌జే కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై విచారణ శుక్రవారానికి వాయిదా పడింది.

కులదూషణ కేసులో నిందితులకు జైలు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: కులం పేరుతో దూషించడంతో పాటు దాడికి పాల్పడిన కేసులో నిందితులపై నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికీ ఏడాది జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ ఎస్సీ, ఎస్టీ కేసుల విచారణ ప్రత్యేక న్యాయమూర్తి బి.బాబూనాయక్ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. బందరు మండలం బుద్ధాలపాలెం గ్రామానికి చెందిన కొక్కు మధుసూదనరావు, అడపాల గోవర్ధనరావు, వాలిశెట్టి సోమేశ్వరరావు, నల్లగంచు లీలామునేశ్వరరావు, చల్లా నాగబాబులకు తాడంకి నరేంద్ర, గరికిముక్కు బాలాజీ, తాడంకి చంద్రబాబు, మండా నాగరాజు, తాడంకి సురేంద్రల మధ్య తలెత్తిన ఫ్లెక్సీల వివాదంలో ఇరుపక్షాలు దాడికి దిగారు. 2017 మార్చి 29న జరిగిన ఈ ఘటనపై ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు తాలూకా పోలీస్‌స్టేషన్‌లో పరస్పర కేసులు నమోదయ్యాయి. కొక్కు మధుసూదనావు వర్గంపై ఎస్సీ, ఎస్టీ, దాడి కేసులు నమోదు చేయగా తాడంకి నరేంద్ర వర్గంపై దాడి కేసు నమోదైంది. ఈ కేసులపై విచారణ నిర్వహించిన న్యాయమూర్తి తాడంకి నరేంద్రకు ఏడాది జైలుశిక్ష, రూ.2,500 జరిమానా, బాలాజీ, సురేంద్ర, చంద్రబాబు, నాగరాజులకు 6నెలలు జైలుశిక్ష, రూ.1000 జరిమానా విధించారు. మరోవర్గంలోని అడపాల గోవర్ధనరావు, సోమేశ్వరరావు, లీలామునేశ్వరరావు, నాగబాబులకు ఒక్కొక్కరికీ ఏడాది జైలుశిక్ష రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. కేసు విచారణలో ఉండగానే కొక్కు మధుసూదనరావు మృతి చెందారు. వివిధ సెక్షన్ల కింద నమోదైన కేసుల్లో విధించిన ఈ శిక్షలు అన్నీ ఏకకాలంలో అమలు చేయాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ లంకె వెంకటేశ్వరరావు వాదనలు వినిపించారు.

నాడు-నేడు నిధుల స్వాహాపై విజిలెన్సు దర్యాప్తు

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవిలోని శ్రీమండలి వెంకట కృష్ణారావు ఆశ్రమ పాఠశాలలో నాడు-నేడు ఫేజ్-2లో జరిగిన నిధుల స్వాహాపై విజిలెన్సు దర్యాప్తునకు ఇన్‌ఛార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథిలు ఆదేశించారు. శాఖాపరమైన దర్యాప్తు చేసి వారం లోగా నివేదిక సమర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారికి చరవాణిలో ఆదేశించారు. ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంగా, మండల విద్యాశాఖాధికారి-1గా పనిచేసిన దుర్గాసాగర్ పనులు చేయకుండానే చేసినట్లు నిధులు తీసుకున్నారని పలువురు ఫిర్యాదు చేయడంతో మండిపడ్డారు. అతడు పెనమలూరు నియోజకవర్గంలోని హైస్కూల్‌కు బదిలీపై వెళ్లకుండా ఎందుకు నిరోధించకలేకపోయారని డీఈఓని ప్రశ్నించారు. కింద ఉద్యోగిపై అవినీతి ఆరోపణలు వస్తే నిజాలు నిగ్గుతేల్చాల్సిన బాధ్యత, జవాబుదారీతనం మరిచారా అంటూ మండిపడ్డారు.

‘రప్పారప్పా బ్యానర్లతో జగన్ ర్యాలీ దేనికి సంకేతం’

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: ‘అక్రమ ఆస్తుల కేసుల్లో ఏ1గా ఉన్న వైకాపా అధ్యక్షుడు, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ ఆరేళ్లుగా కోర్టు వాయిదాలు తప్పించుకొని తిరుగుతున్నారు. కోర్టు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించడంతో వాయిదాకు వెళ్తూ బలప్రదర్శన చేయడం సిగ్గుచేటు. 11 సీబీఐ, 9 ఈడీ ఛార్జిషీట్లలో ఏ1గా ఉన్న జగన్ వందల మందితో కోర్టు వాయదాకు ర్యాలీగా వెళ్లడం న్యాయస్థానాలను కించపరచినట్టు కాదా? రెండు రోజులుగా సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడుతూ.. రప్పా రప్పా అంటూ బ్యానర్లతో ర్యాలీ చేయడం దేనికి సంకేతం’ అని మంత్రి కొల్లు రవీంద్ర గురువారం ఓ ప్రకటనలో జగన్‌పై ధ్వజమెత్తారు. ‘దేశంలో ఏ నాయకుడిపైనా ఇన్ని కేసులు లేవు. తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకొని సూట్‌కేసు కంపెనీల ద్వారా అక్రమార్జనకు పాల్పడ్డారు. ఎన్నో అక్రమాలు చేసి నిర్మించిన ప్యాలెస్‌లు, సంస్థలన్నీ అక్రమాస్తులే. ఇలాంటి వ్యక్తి కోర్టుకు హాజరవడం ఖర్చుతో కూడుకున్న పని అని ఇన్నాళ్లు తప్పించుకున్నారు. ఇప్పుడు ప్రత్యేక విమానంలో వాయిదాకు హాజరయ్యేందుకు వచ్చారు. ఇలాంటి వ్యక్తుల వెనుక జెండాలు పట్టుకొని తిరిగేవారు ఆలోచించాలి. జగన్ సహా వైకాపా నేతల అక్రమాలన్నీ బయటపడతాయి’ అని మంత్రి మండిపడ్డారు.

ఆక్రమణల తొలగింపుతో ఉద్రిక్తత

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: మల్లవల్లి పారిశ్రామికవాడలో ఆక్రమణల తొలగింపుతో గురువారం స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. పారిశ్రామికవాడలో ప్రధాన రహదారితో సహా కొన్నిచోట్ల స్థానికులు తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఈ తరహా ఆక్రమణల ఒరవడి పెరిగిపోతుందనే ఫిర్యాదులు వెళ్లడంతో.. వెంటనే వాటిని తొలగించాల్సిందిగా ఏపీఐఐసీ జోనల్ కార్యాలయ అధికారులకు ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. దీంతో రెండు రోజుల నుంచి ఆక్రమణల తొగింపునకు అధికారులు కార్యాచరణ చేపట్టారు. గురువారం పలు దుకాణాలను తొలగించారు. దీంతో ఆగ్రహించిన నిర్వాహకులు స్థానిక తెదేపా నాయకులతో కలిసి ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావుని కలిసి మొర పెట్టుకున్నారు. పారిశ్రామికవాడ భూసేకరణతో జీవనాధారం కోల్పోయామని, కొంతకాలం నుంచి బతుకుదెరువు కోసం రోడ్డు అంచుల్లో తాత్కాలిక దుకాణాలు పెట్టుకున్నామని, తాము లేని సమయంలో అధికారులు దౌర్జన్యంగా వీటిని ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

తొలగించిన దుకాణాలు

బెట్టింగ్ మోసాలు.. పోలీసుల అదుపులో యువకుడు

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే : మంగళగిరి మండల పరిధిలోని చినకాకాని ఎన్ఆర్ఐ ఆసుపత్రి సమీపంలోని ఓ అపార్టుమెంట్‌లోని ఓ ఫ్లాట్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్ జరుగుతోందన్న సమాచారంతో మంగళగిరి రూరల్ పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. హుబ్లీ బుక్.కామ్ పేరుతో బెట్టింగ్ మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఐదు ల్యాప్‌టాప్‌లు, 30 సెల్‌ఫోన్లు, 14 ఏటీఎం కార్డులు, 14 బ్యాంక్ పాసు పుస్తకాలు, చెక్కులు స్వాధీనం చేసుకున్నారు. ఒక్కరిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. కీలక నిందితులు మచిలీపట్నం వాసులుగా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మంగళగిరి రూరల్ సీ.ఐ ఎ.వి.బ్రహ్మం పర్యవేక్షణలో ఎస్సై వెంకట్ కేసు నమోదు చేశారు.

నిరాడంబర నాయకుడు చంద్ర రాజేశ్వరరావు

చల్లపల్లి, న్యూస్‌టుడే: భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ నాయకులు చంద్ర రాజేశ్వరరావు నిరాడంబర జీవితాన్ని సాగించారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. గురువారం రాజేశ్వరరావు పుట్టిన చల్లపల్లి మండలం మంగళాపురం గ్రామంలోని ఆయన నివసించిన గృహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. రాజేశ్వరరావు దున్నేవాడికే భూమి దక్కాలనే నినాదంతో చల్లపల్లి జమీందారులకు వ్యతిరేకంగా పోరాటం చేసి పేదలకు భూములు పంచారన్నారు. రైతు సంఘం నాయకులు పరుచూరి శ్రీనివాసరావును పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బుడ్డిగ జమిందార్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

మంగళాపురంలో చంద్ర రాజేశ్వరరావు ఇంటి వద్ద సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -106 రిటైల్ ధర 133 చికెన్ విత్ స్కిన్ - 193, చికెన్ స్కిన్‌లెస్ - 219.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, 134, 145 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 660 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.100/-.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

పామర్రు, న్యూస్‌టుడే: అంతర్రాష్ట్ర ద్విచక్ర వాహనాల దొంగను పామర్రు పోలీసులు గురువారం పట్టుకున్నారు. పామర్రు మండలం జుఝువరానికి చెందిన ద్విచక్ర వాహన దొంగ భాస్కరరెడ్డిని అదుపులోకి తీసుకుని, రూ.22.50లక్షల విలువ గల 45 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు గురువారం పామర్రు పోలీస్ స్టేషన్‌కి వచ్చి స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిందితుడు భాస్కరరెడ్డి ఎక్కువగా హీరో కంపెనీ వాహనాలను చోరీ చేశాడన్నారు. వాటిని రూ.2వేలు, రూ.3వేల అప్పు కోసం తాకట్టు పెట్టాడన్నారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని ఎనిమిది పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడ్డాడని, ఇంకా 19 వాహనాలు ఏఏ స్టేషన్ల పరిధిలో చోరీ చేశాడో ధ్రువీకరణ కావాల్సి ఉందన్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరచిన సీఐ సుభాకర్, ఎస్.ఐ రాజేంద్రప్రసాద్, శిక్షణ ఎస్.ఐ సత్యకళ తదితర సిబ్బందికి ఎస్పీ నగదు బహుమతులు అందించి సత్కరించారు.

నగదు బహుమతులు అందుకున్న పోలీసు సిబ్బందితో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

8 మంది బిల్ కలెక్టర్లకు పదోన్నతులు

కలెక్టరేట్ (మచిలీపట్నం): జిల్లాలో వివిధ గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న ఎనిమిది మంది బిల్ కలెక్టర్లకు జూనియర్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి లభించింది. కలెక్టరేట్‌లో గురువారం పదోన్నతులు పొందిన వారికి కలెక్టర్ డీకే బాలాజీ ఉత్తర్వులు అందచేసి మరింత నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పంచాయతీ అధికారిణి అరుణ, పంచాయతీ కార్యాలయ పరిపాలనాధికారి సీతారామయ్య తదితరులు పదోన్నతులు పొందిన వారికి అభినందనలు తెలిపారు.

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU eClassifieds

BUSINESS SERVICES
బంగారం కొనబడును. బ్యాంకులో/ ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 81422 92071

PEOPLE CARE

OLD AGE HOME
శ్రీనివాస గ్రూప్, VJA వృద్ధులు, పేషెంట్స్, బెడ్‌రెస్ట్ పేషంట్స్ అంతటా సంరక్షణ. ✆ 96401 76677, 95537 86677

REAL ESTATE

FLAT FOR SALE
నందమూరి రోడ్డు, నిర్మాణం పూర్తయిన ★ ఫ్లాట్స్ 2 BHK ఫ్లాట్స్ అమ్మకమునకు కలవు. ✆ 73829 81107.

PLOT FOR SALE
విజయవాడ సిటీ, బెంజిసర్కిల్ 5 మినిట్స్ ప్రశాంత వాతావరణంలో ఈస్ట్ & వెస్ట్ ఫేస్ రెడీటు అనుమతులున్న 133 గజాల ఫ్లాట్ కేవలం 80 లక్షలకే అమ్మకం. 77320 51576
చతుర్భుజ ప్రాపర్టీస్ గేటెడ్ కమ్యూనిటీలో CRDA అప్రూవ్డ్ ఓపెన్ Plots అందుబాటులో. ✆ 99481 10645.
AP రాజధాని అమరావతిలో MLA క్వార్టర్స్ దగ్గర E-11 రోడ్‌కి దగ్గరగా 780 గ& AP సెక్రటేరియట్ దగ్గర 180,360 గ కమర్షియల్ LPS ప్లాట్స్ అమ్మకం. ✆ 92907 63488

GOLLAPUDI
విజయవాడ గొల్లపూడి కొత్త బైపాస్ వద్ద C కన్వర్షన్ పంట్లాతో ఫ్లాట్ 200, 400గ అద్దెకు లేదా లీజ్ ప్రతి గజం 25000/-లకే. ✆ 92907 63488

JOBS
విజయవాడలోని ప్రముఖ కన్స్ట్రక్షన్ ఆఫీస్ నందు పనిచేయుటకు సీనియర్ అకౌంటెంట్ కావలెను. ✆ 94947 87509
Wanted Computer Hardware, Printer Engineers for VLMS IT Solutions. Bhavanipuram, www.vlms.in 98488 18090, 97012 27778.
Wanted Male Floor/ Campus Incharges, Data Entry Operators & Hostel Wardens to work in Sri Medha Jr. College, Labbipet, Exp. Min 3 Years. Age: 30-40 Yrs. Qual: Any Degree/ B.Tech. 91542 10069.
ప్రముఖ ఆర్కిటెక్ట్ ఆఫీస్‌లో పనిచేయుటకు ITI CIVIL, Diploma Civil, B.T Civil (Auto CAD Civil)లో అనుభవమున్న Male కావలెను. ✆ 99973 41745
జ్యూవెలరీ షాప్‌లో పనిచేయుటకు మేల్ హెల్పర్స్ కావలెను. గవర్నర్‌పేట, విజయవాడ. శాలరీ-17,000. ✆ 94400 29402
VJAలోని కంపెనీ కొరకు ఐటీ ఫ్రెషర్స్ M/ F, 18-19+ yrs, CRM, పార్ట్/ ఫుల్ టైం జీతం 12K- INC ✆ 93816 91391, 70957 91736

సీనియర్ అకౌంటెంట్ కావలెను
కమర్షియల్ ప్రాజెక్ట్‌లో, VJAలో పనిచేయుటకు 10 సం॥ అనుభవం గల అకౌంటెంట్ కావలెను. (Tally, కంప్యూటర్ నాలెడ్జ్ తప్పనిసరి) R.V.S. కన్స్ట్రక్షన్ ✆ 93943 44444

ENGINEERING
CIVIL ENGINEERS with 5 yrs exp. to work in Jharkhand Thermal Power Plant. CISCONS Pvt. Ltd., WhatsApp resume to: 95023 93999.

BOOK YOUR COLOUR CLASSIFIED
₹1200/- (5 Lines)
PH: 98496 97616
ప్రకటనలపై జీ.ఎస్.టీ. 5% అదనం

ACCOUNTING
Accountants & Store Keepers with 5 years experience to work in Jharkhand construction sites. WhatsApp resume to: 95023 93999.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచన చేస్తున్నాము. ప్రకటనలు చెబుతున్న విధంగా ఉంటున్నాయా లేదా అనేది ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకు అమ్మకం లేదా అందించే సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బుల వసూలుచేసే ప్రకటనకర్తలను బ్లాక్‌లిస్టులో ఉంచే పరిస్థితి ఉంటుంది. ఆశాభంగం వంటి వాటిపై చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

బొడ్డు యోగినాథ్

పెడన, న్యూస్‌టుడే: స్థానిక మోహనరావు, హైమావతి జడ్పీ హైస్కూలు విద్యార్థి బొడ్డు యోగినాథ్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం చింతలపాటి నాగేశ్వరరావు తెలిపారు. కర్నూలులో త్వరలో జరగనున్న అండర్ 17 కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు తరఫున ఈ విద్యార్థి పాల్గొంటాడని పేర్కొన్నారు. యోగినాథ్ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు. హెచ్ఎం, ఫిజికల్ డైరెక్టర్ జి.నరసింహారావు విద్యార్థిని అభినందించారు.

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

26న రాజ్యాంగ దినోత్సవం

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు

భాస్కరపురం(మచిలీపట్నం), న్యూస్‌టుడే: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఈ నెల 26న స్థానిక లక్ష్మీటాకీస్ సెంటర్లో నిర్వహించనున్నట్లు ఎస్సీ, ఎస్టీ, క్రిస్టియన్, మైనార్టీ సంఘాల నాయకులు తెలిపారు. గురువారం లక్ష్మీటాకీస్ సెంటర్‌లోని ఎన్ కన్వెన్షన్ హాల్లో నాయకులు కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దళిత జేఏసీ జిల్లా అధ్యక్షుడు జక్కుల ఆనందరావు, అర్బన్ బ్యాంక్ వైస్‌ఛైర్మన్ వంపుగడవల చౌదరి, నాయకులు చిట్టూరి యువరాజు, ఏజేరి వెంకటేశ్వరరావు, బేతపూడి రవి, బూపతి అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

పూడిక తొలగింపు పనుల్లో కార్మికులు

✦ నగరంలోని రేవతి కూడలిలో ప్రధాన డ్రెయిన్ పూడిపోవడంతో మురుగు పారుదల అవరోధంగా మారింది. సమస్యను ఆ ప్రాంతవాసులు మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తీసుకురాగా అధికారులకు వివరించడంతో సిబ్బందిని పంపి పూడిక తొలగింపు చర్యలు తీసుకున్నారు. ✦ నగరంలోని పరాసుపేట సెంటరు నుంచి డిమ్మిలసెంటరుకు వెళ్లే రోడ్డు రహదారి పక్కన వేసిన చెత్త తొలగించకపోవడంతో అక్కడకు పశువులు చేరుతున్నాయి. దీని వల్ల స్థానికులతో పాటు ప్రయాణికుల రాకపోకలకు ఆటంకంగా మారుతోంది. ఈ సమస్యను ఆ ప్రాంత వాసులు మేమున్నాం మీకుతోడుగా దృష్టికి తీసుకురాగా అధికారులకు వివరించగా సిబ్బందిని పంపి చెత్త తొలగించేలా చర్యలు తీసుకున్నారు.- న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

? పట్టణ పాత కూరగాయల మార్కెట్ పునరావాస షాపింగ్ కాంప్లెక్స్ నిర్వహణ అధ్వానంగా ఉంది. నిర్వహణ సక్రమంగా లేక మొదటి అంతస్తులో ఉన్న షాపుల్లోకి ఎవరూ అద్దెకు రావటం లేదు. - స్థానికులు ✓ పరిశీలించి చర్యలు తీసుకుంటాం.-హరికిశోర్, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్, పెడన - న్యూస్‌టుడే, పెడన గ్రామీణం

చట్టప్రకారం దత్తత తీసుకోవాలి

బంటుమిల్లి, న్యూస్‌టుడే: చిన్నారులను దత్త తీసుకోవాలనుకునేవారు చట్టప్రకారమే తీసుకోవాలని బంటుమిల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో సముద్రవేణి అన్నారు. కోర్లపాడు పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద తల్లిదండ్రులు, తదితరులకు దత్తత అనే అంశం పై గురువారం అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ నాగలక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శి సిలార్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

మచిలీపట్నం (గొడుగుపేట): విద్యుత్తు లైన్ల మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఈఈ జి.గోవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. రుస్తుంబాద, ఈడేపల్లి, బస్టాండు వెనుక ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అక్రమ భవనాల క్రమబద్ధీకరణ

★ అందుబాటులోకి బీపీఎస్ పథకం ★ పెడనలో 352గా లెక్కతేల్చిన అధికారులు

న్యూస్‌టుడే, పెడన

పురపాలికల్లో అక్రమ భవనాల క్రమబద్ధీకరణ జరిగే ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. 1.1.1985 నుంచి 31.08.2025 మధ్య అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలను బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం(బీపీఎస్) కింద రెగ్యులరైజ్ చేసుకోవచ్చని ప్రభుత్వం సూచించింది. ప్రభుత్వ, దేవాదాయశాఖ స్థలాలు, స్థల వివాదాలు, మాస్టర్ ప్లాన్ రోడ్లు, కాలువ, చెరువు గట్లపై కట్టిన భవనాలకు ఈ పథకం వర్తించదు. రూ.10వేల ప్రాథమిక రుసుంతో లైసెన్స్‌డ్ టౌన్ ప్లానర్ ద్వారా దరఖాస్తు చేస్తే ప్లాటు విస్తీర్ణం, స్థల విలువ ఆధారంగా రెగ్యులరైజేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. పెడనలో 352 భవనాల నిర్మాణంలో నిబంధనలు పాటించలేదని అధికారులు గుర్తించారు. ఇందులో 216 ప్లాన్ లేకుండా నిర్మించగా 136 మంది నిబంధనలను అతిక్రమించి కట్టారు.

అనుమతులకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనాన్ని పరిశీలిస్తున్న అధికారి (పాతచిత్రం)

రుసుంలు ఇలా..

100చ.మీటర్లలో నిర్మించిన గృహ వినియోగ భవనాలకు చ.మీకు రూ.60 చెల్లించాల్సి ఉంటుంది. 101-300 చ.మీల లోపు ఉంటే చ.మీకు రూ.60, 300-500 చ.మీ లోపు భవనానికి 30శాతం నిబంధనల ఉల్లంఘన జరిగితే చ.మీ రూ.80, అంతకుమించితే రూ.100 చెల్లించాలి. 501-1000 చ.మీ 30శాతం లోపు అయితే చ.మీ రూ.100, ఆపై రూ.120 ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న భవనాలకు ఎక్కువ ఫీజు వసూలు చేస్తారు. 100చ.మీలోపు రూ.80, 101-300 వరకు రూ.120, 301-500 వరకు 30శాతం లోపు అతిక్రమణకు రూ.200, ఆపై చ.మీకు రూ.250 చెల్లించాల్సి ఉంటుంది. ముందుగా దరఖాస్తు చేసిన తర్వాత టౌన్ ప్లానింగ్ అధికారులు పరిశీలనకు వచ్చి ఫీజులను నిర్ణయిస్తారు. భవనాలు 31.12.1997లోపు నిర్మిస్తే మొత్తం ఫీజుల్లో 25 శాతం తగ్గింపు ఉంటుంది. మునిసిపాలిటీల్లో నిర్మించిన భవనాలకు 50శాతం వరకు రాయితీ ఇస్తారు.

తుది గడువు: నవంబరు 12వ తేదీ నుంచి బీపీఎస్ అందుబాటులోకి వచ్చింది. 2026 మార్చి 11 వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. అక్రమ భవనాల యజమానులు త్వరితగతిన రెగ్యులరైజ్ చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

అవసరమైన డాక్యుమెంట్లు: భవన నిర్మాణ అనుమతి కాపీ ★ రిజిస్టర్ డాక్యుమెంట్ ★ ఇంటి పన్ను రసీదు ★ భవనం ఫొటో ★ ఇండెమ్నిటీ బాండ్ ★ రోడ్డు విస్తరణ అండర్ టేకింగ్ బాండ్

దరఖాస్తుల స్వీకరణ: బండి కిరణ్, ఇన్‌ఛార్జి టీపీవో

దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించాం. బీపీఎస్‌కు అర్హత సాధించే యజమానులు లైసెన్స్‌డ్ టౌన్ ప్లానర్ల వద్దకు వెళ్లి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి.

ప్రత్యేక అవసరాల పిల్లలకు పోటీలు

పెడన గ్రామీణం: జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు త్వరలో అండర్ 17, 20 విభాగాల్లో అథ్లెటిక్ పోటీలు నిర్వహిస్తామని ఎస్ ఎస్ ఏపీసీ కుమారసింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, జావెలిన్‌త్రో, క్లబ్ త్రో క్రీడల్లో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఐఈఆర్టీలు తమ పరిధిలో అటువంటి ప్రత్యేక పిల్లల్ని గుర్తించాలని సూచించారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. మంత్రి కొల్లు రవీంద్ర కార్యాలయంలో గురువారం ఆ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు వేణుగోపాలరావు, జయరావు తదితరులు మాట్లాడుతూ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఉన్నారని, వారు కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందించేలా కృషి చేయాలని కోరారు.

చోరీ ఘటనపై ఫిర్యాదు

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే: తాళం వేసి ఉన్న రెండు వేర్వేరు గృహాల్లో చోరీ జరిగిన ఘటనలు నగర పరిధిలో చోటుచేసుకున్నాయి. పాతతోట ప్యారీ సమీపంలోని ఓ దేవస్థానంలో పనిచేస్తున్న కుమారి, ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సాంబశివరావు నివాస గృహాలున్నాయి. గురువారం ఉదయం వారి ఇళ్లకు తాళాలు వేసి విధులకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి రెండు గృహాల్లోనూ తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లో నగదు, బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. బాధితులు వేర్వేరుగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన చిలకలపూడి పోలీసులు దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కట్టుబడాలి

మచిలీపట్నం (కోనేరుసెంటరు): సమాజంలోని బ్రాహ్మణులు అందరూ హిందూ పరిరక్షణ కోసం త్రికరణ శుద్ధిగా కట్టుబడి ఉండాలని బ్రాహ్మణ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. కార్తిక మాసం ముగింపు సందర్భంగా గురువారం పరాసుపేటలో బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ ఫణికుమార్, సేవా సంఘ అధ్యక్షుడు ఏఆర్కే మూర్తి మాట్లాడుతూ బ్రాహ్మణుల సంక్షేమంపై కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై హర్షం ప్రకటించారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు భోగరాజు పట్టాభిసీతారామయ్య స్మారక భవన నిర్మాణం విషయంలో వైశ్యా నాయకులు మోకా లద్దు పెట్టడాన్ని విమర్శిస్తూ మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి సహకారంతో భవనాన్ని నిర్మించేలా తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. బ్రాహ్మణ సంఘ నాయకులు పణిబలశర్మ, సుబ్రమణ్యం, లలితకుమారి, శర్మ, తదితరులు పాల్గొన్న కార్యక్రమంలో బాధ్యతలు చేపట్టిన వేణుగోపాల స్వామి దేవాలయ ఛైర్మన్ దూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తిని, నగర తెదేపా ఉపాధ్యక్షుడు వేమూరి సాయిలను సత్కరించారు.

శ్రీరామచంద్రమూర్తిని సత్కరిస్తున్న సంఘ నాయకులు

23న దివ్యమహా పడిపూజా మహోత్సవం

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23న మచిలీపట్నంలో దివ్యమహా పడిపూజా మహోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం నగరంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవ కరపత్రాలు ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మత్రి బాబాప్రసాద్, దేవు వెంకటసుబ్రహ్మణ్యం, ఊర రామాంజనేయులు, కె.గోపాలకృష్ణ, కాంతారావు, కాట్రగడ్డ రమేష్ తదితరులు ఉత్సవం గురించి వివరాలు వెల్లడించారు. 23న ఆదివారం నగరంలోని కోనేరుసెంటరు కూడలిలో లోక కల్యాణార్థం కేరళ సంప్రదాయ పూజా విధానంలో పడిపూజా మహోత్సవం జరుగుతుందన్నారు. అయ్యప్ప దీక్షాపరులు, భవానీ మాలధారులు, శివస్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

డ్రెయిన్‌లో చెత్తమేట.. మురుగు పారేదెట్టా

బలరామునిపేట కోదండరామాలయం సమీపంలో అంతర్గత రోడ్డులోని డ్రెయిన్‌లో చెత్త వేయడంతో పారుదలకు ఆటంకంగా మారింది. రాకపోకలకు కూడా ఇబ్బందికరంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. కొందరు చేసిన తప్పిదానికి ఆ ప్రాంతవాసులు అందరూ ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారులు స్పందించి వెంటనే పూడిక తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)**

మొక్కలు బరువై..పచ్చదనం కరవై..

నగరంలోని బైపాస్ రోడ్డు వెంబడి డివైడర్లపై మొక్కలు నాటారు. వాటికి రక్షణ కంచె ఏర్పాటు చేయకపోవడంతో చాలా వరకు మొక్కలు చనిపోయాయి. ప్రధానంగా మాచవరం మసీదు ప్రాంతం నుంచి హౌసింగ్ బోర్డు సర్కిల్ వరకు చాలాచోట్ల నాటిన మొక్కలు చనిపోవడంతో పాటు పలుచోట్ల పిచ్చిమొక్కలు మొలిచి అధ్వానంగా తయారైంది. **- న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)**

గుట్టలుగా వ్యర్థాలు.. గుట్టుగా పోశారు

నగరంలోని హౌసింగ్‌బోర్డు సర్కిల్ నుంచి మాచవరం వెళ్లే బైపాస్‌రోడ్డు పక్కన వేసిన ఖాళీ కొబ్బరి బొండాలు, చెట్లకొమ్మలు, ఇతర వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. ఎప్పటి నుంచో ఇలాగే ఉంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. వ్యర్థాలు రోడ్డుపైకి రావడంతో వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. **- న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్**

దారంతా కోత.. ప్రమాదాల వెత..

కరఅగ్రహారం రహదారి అధ్వానంగా మారి ప్రయాణికులకు నరకాన్ని చూపెడుతోంది. 4వేల జనాభా ఉన్న గ్రామానికి వెళ్లాలంటే గోతులతో కూడిన రహదారిపై ప్రయాణించక తప్పదు. గ్రామంలోనే ఎఫ్‌సీఐ గోదాము కూడా ఉండడంతో లారీలు విపరీతంగా రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో రహదారి మరింత అధ్వానంగా మారింది. మెడికల్ కళాశాల నుంచి క్యాంప్‌బెల్‌పేట వరకు రహదారిని రెండు వరుసలుగా నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, కరఅగ్రహారం(మచిలీపట్నంరూరల్)**

కొంకేపూడిలో డీఎల్‌పీవో విచారణ

పెడన, పెడన గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని కొంకేపూడి పంచాయతీలో ఒక రైతు మురుగు బోదె తవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పీజీఆర్ఎస్‌లో చేశారు. ఈ ఫిర్యాదుపై మచిలీపట్నం డీఎల్‌పీవో రజావుల్లా గురువారం విచారణ నిర్వహించారు. పంచాయతీ చెరువు పక్కగా పోరంబోకు స్థలంలో మురుగుబోదెను అనధికారికంగా తవ్వారని ఆ గ్రామవాసి మోదుగుమూడి దుర్గారావు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ నిర్వహించిన డీఎల్‌పీవో చెరువును సర్వే చేయించాలని డిప్యూటీ ఎంపీడీవో నాగిరెడ్డికి సూచించారు. సర్వే అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని డీఎల్‌పీవో చెప్పారు. పంచాయతీ కార్యదర్శి ఎస్‌కే రఫీకుద్దీన్, వీఆర్వో మౌలాలి తదితరులు ఈ విచారణలో పాల్గొన్నారు.

బాలలకు ఆధార్ అప్‌డేషన్ తప్పనిసరి

పెడన, న్యూస్‌టుడే: 5-15 ఏళ్ల లోపు బాలలకు ఆధార్ అప్‌డేషన్ చేయించాలని ఎంఈవో-1 సలోమి చెప్పారు. స్థానిక బంగ్లాస్కూల్లో గురువారం ఆధార్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ నెల 17-26 వరకు ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నామని, ఈ కేంద్రాలకు బాలల్ని తల్లిదండ్రులు పంపించి బయోమెట్రిక్ అథంటికేషన్ చేయించాలని సూచించారు. 21, 22 తేదీల్లో కళాంజలి విద్యానికేతన్‌లో ఈ శిబిరాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎంఈవో-2 వైవీ హరినాథ్, బంగ్లా స్కూల్ హెచ్ఎం గమిడి భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రాధా-రంగా మిత్రమండలి పట్టణ మహిళా కమిటీ ఏర్పాటు

నూతన కమిటీతో శ్రీనివాసప్రసాద్, బుల్లెట్ ధర్మారావు

భాస్కరపురం (మచిలీపట్నం): రాధా-రంగా మిత్ర మండలి మచిలీపట్నం పట్టణ అధ్యక్షురాలిగా విన్నకోట సంధ్య ఎన్నికయ్యారు. గురువారం రాధా-రంగా మిత్ర మండలి మచిలీపట్నం నియోజకవర్గ అధ్యక్షులుగా రాయగిరి శ్రీరామ్మోహనరావు అధ్యక్షతన సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన వంగవీటి శ్రీనివాస్‌ప్రసాద్ రంగా ఆశయాలను అమలు చేసే దిశగా మిత్రమండలి నాయకులు పయనించాలన్నారు. పట్టణ మహిళా కమిటీ కోశాధికారిగా జూపూడి శాంతకుమారి, ప్రధాన కార్యదర్శిగా సామినేని మల్లిక, మన్నేపల్లి మణికుమారి, కొక్కు ప్రభావతి, తోట విజయకుమారి, ఏల్చూరి సుధారాణి, మోటేపల్లి లక్ష్మీపద్మజ, కూనపరెడ్డి లక్ష్మి, తుమ్మ కామేశ్వరి, అమ్ముల కళ్యాణిలు నియమితులయ్యారు. కార్యక్రమంలో రత్నం బుజ్జి, దాసు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రబీ సాగుపై రైతుల అభ్యంతరాల పరిశీలన

బొర్రపోతుపాలెం (మచిలీపట్నంరూరల్): అనుమతులు లేని రబీ సాగుకు సిద్ధమవుతున్న రైతులపై పొరుగు రైతులు ఫిర్యాదు చేయడంతో బొర్రపోతుపాలెం, బుద్దాలపాలెం సరిహద్దుల్లోని భూములను రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయశాఖ అధికారులు గురువారం పరిశీలించారు. బొర్రపోతుపాలెం సరిహద్దు పెడన మండలానికి చెందిన కొందరు రైతులు రబీ సాగుకు 30ఎకరాల పొలాలను సిద్ధం చేశారు. దీంతో బొర్రపోతుపాలెం, బుద్దాలపాలెం రైతులు కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీని వల్ల తమ భూముల్లో ఊరక వస్తుందని, తాము సాగు చేసే మినుము పంట దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మచిలీపట్నం ఉత్తర మండల తహసీల్దార్ నాగభూషణం, ఇరిగేషన్ డీఈ వీఎస్‌వీఎల్ అపర్ణ, ఏఈ కట్టా హరీష్, మండల వ్యవసాయాధికారి ఎం.రామ్‌కుమార్ వివాదాస్పద భూమిని పరిశీలించారు. రబీసాగుకు అనుమతి లేనపుడు వరిని రెండో పంటగా ఎందుకు వేస్తున్నారని ప్రశ్నించారు. తోటి రైతులను ఇబ్బందుల పాలు చేయవద్దని, రబీ సాగును తక్షణం నిలిపివేయకుంటే కఠినచర్యలు తీసుకుంటామని తహసీల్దారు హెచ్చరించారు. బుద్దాలపాలెం సర్పంచి డి.బాబూరావు, తెదేపా ఇన్‌ఛార్జి కాగిత శ్రీరామ్, వీపీఏ శిరీష, వీఆర్వో లవమోహనరావు పాల్గొన్నారు.

గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలి

మల్లవోలు (గూడూరు), న్యూస్‌టుడే: గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎంహెచ్‌వో యుగంధర్ అన్నారు. గురువారం ఆయన మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. పీహెచ్‌సీలో రోజువారీ ఓపీ, వివిధ అంశాలపై వైద్యులు తరుణ్, రూపశ్రీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గర్భిణులను గుర్తించి వారికి నిర్దేశించిన సమయాల్లో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెరగాలన్నారు. వివిధ అంశాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు.

బాలురకు వాహనాలిస్తే కఠిన చర్యలు

బంటుమిల్లి, న్యూస్‌టుడే : మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తప్పవని బంటుమిల్లి ఎస్‌ఐ గణేష్‌కుమార్ అన్నారు. గురువారం బంటుమిల్లిలో వాహనాలు నడుపుతున్న మైనర్లను గుర్తించి వారి నుంచి వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వారి తల్లిదండ్రులను పిలిపించి అవగాహన కల్పించడంతో పాటు జరిమానాలు విధించారు.

ఎప్పుడు కూలుతుందో.. ఎవరికి మూడుతుందో..

భయాందోళనల్లో గ్రామీణులు

న్యూస్‌టుడే, గూడూరు

బందరు, పెడన నియోజకవర్గాల్లోని అనేక చోట్ల కల్వర్టులు శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయే అవకాశం ఉందని జనం ఆందోళన చెందుతున్నారు. ఎలకుర్రు నుంచి వచ్చే మురుగు గూడూరు మండలంలోని జక్కంచర్ల, కల్పటం, ముక్కొల్లు, గురిజేపల్లి, కంకటావ, కత్తులవానిపాలెం, తుమ్మలపాలెం గ్రామాల మీదుగా లజ్జబండ డ్రెయిన్‌లో కలుస్తుంది. వర్షాలు పడితే ఎగువ నుంచి వచ్చే మురుగు అంతా ఆయా గ్రామాల్లోని పొలాల్లో చేరి రోజుల తరబడి తిష్ట వేసుకుపోతోంది. ప్రధానంగా కంకటావ నుంచి కత్తులవానిపాలెం వెళ్లే దారిలో డ్రెయిన్‌పై వంతెన కూలిపోవడంతో తాత్కాలికంగా ఏర్పాట్లు చేశారు. ఈ వంతెన నిర్మాణానికి రూ.35లక్షలు అవుతుందని వైకాపా హయాంలోనే ప్రతిపాదనలు చేశారు. కానీ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు.

ముక్కొల్లు- నాగారం దారిలో శిథిల కల్వర్టు

నిధులు విడుదలైనా పనుల జాడలేదు..

ఈ సమస్యపై గూడూరు వచ్చిన ఎంపీ వల్లభనేని బాలశౌరి వద్ద మొరపెట్టుకున్నారు. సమస్య తీవ్రతను గుర్తించిన ఆయన రూ.50లక్షలు ఇస్తానని హామీ ఇస్తామని ప్రకటించడంతో పాటు తాత్కాలిక అవసరాలకు రూ.10లక్షలు ఇస్తానని వెల్లడించారు. ఆ నిధులు విడుదలైనట్లు అధికారులు తెలిపారు. కానీ ఇప్పటివరకు అక్కడ ఎలాంటి పనులు చేపట్టకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల గ్రామంలో పర్యటించిన కలెక్టర్ డీకే బాలాజీకి కూడా సమస్యను వివరించి పరిష్కరించాలని మొరపెట్టుకున్నారు.

అనేకచోట్ల అధ్వానంగా..

గూడూరు మండలం ముక్కొల్లు నుంచి నాగారం వెళ్లే రహదారి మధ్యలో ఉన్న కల్వర్టు శిథిలస్థితికి చేరి ఏక్షణాన అయినా కూలిపోయేలా ఉంది. సమస్య తీవ్రంగా ఉండడంతో ఇటీవల గుంతలు పూడ్చారు. కానీ వంతెన గోడలన్నీ పగిలిపోయి వేలాడుతున్నాయి. ఇదికనుక కూలిపోతే వ్యవసాయ అవసరాలతో పాటు ఆయా గ్రామాల రాకపోకలకు కూడా ఇబ్బంది కరంగా మారుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

★ మల్లవోలు పంచాయతీ పరిధిలోని గుండుపాలెం డొంక మధ్యలో ఉన్న కల్వర్టు కూడా శిథిలావస్థకు చేరింది. ఎప్పటి నుంచో ఈ సమస్య ఉన్నా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.

★ ఇదే మండలంలోని గంధ్ర గ్రామానికి వెళ్లేదారిలో ఉన్న వంతెన కూడా అలాగే ఉంది.

★ పెడన మండలం అగ్రహారం గ్రామానికి వెళ్లేదారిలో ఉన్న కల్వర్టుతో పాటు బందరు మండలం బైరాగిపాలెం తదితర గ్రామాల్లోనూ అలాగే ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్త కల్వర్టులు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

15వేల సంచులకు ఇండెంట్

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: వాతవరణ పరిస్థితుల దృష్ట్యా రైతుల్ని అప్రమత్తం చేసినట్లు వ్యవసాయాధికారిణి సజ్జా జెన్నీ తెలిపారు. గురువిందగుంట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆమె పరిశీలించి మాట్లాడారు. గురువిందగుంట గ్రామంలో 15 వేల గోనె సంచులు అవసరమని ఇండెంట్ పెట్టినట్లు తెలిపారు. సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడానికి వాహనాల కోసం ఆన్‌లైన్లో నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌పీవో విభాగ ప్రతినిధి రత్నకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు క్లాప్ మిత్రలకు శిక్షణ

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: ఈ నెల 21న నడుపూరు గ్రామంలో క్లాప్ మిత్ర, సీఆర్పీలకు శిక్షణ ఇవ్వనున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో నాగిరెడ్డి తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ, తడి, పొడి చెత్త సేకరణ, ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించే విషయాలపై రిసోర్సుపర్సన్లు పరహాతుల్లా, రవికిరణ్ శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

విజేతలతో కొనకళ్ల నారాయణరావు తదితరులు

మచిలీపట్నం (గొడుగుపేట): గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. నగరంలోని జిల్లా గ్రంథాలయంలో గురువారం సాయంత్రం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ పిల్లలు గ్రంథాలయాలకు వెళ్లేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. తెదేపా రాష్ట్ర నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పీవీ ఫణికుమార్, వివిధ సంస్థల ప్రతినిధులు జి.కిషోర్‌కుమార్, విడియాల చక్రవర్తి, అప్పినేడి పోతురాజు తదితరులు ప్రసంగించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్, ఉపగ్రంథాలయ అధికారి బీరం వెంకటరమణ గ్రంథాలయంలో ఉన్న వసతులు, అందుబాటులో ఉన్న పుస్తకాలు వివరించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

పెడన: గ్రంథాలయాలు దేవాలయాలతో సమానమని స్థానిక గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ బళ్ల మల్లిఖార్జునప్రసాద్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 14 నుంచి బాలబాలికలకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

పెడన గ్రామీణం: గ్రంథాలయ వారోత్సవాల్ని పురస్కరించుకుని స్థానిక వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, క్విజ్, వక్తృత్వం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

పెడన: విజేతలకు బహుమతులు ఇస్తున్న ఛైర్మన్

అభిషేకాలు.. అర్చనలు

ప్రత్యేక అలంకరణలో మల్లేశ్వరస్వామి

మచిలీపట్నం (గొడుగుపేట), మచిలీపట్నం రూరల్, న్యూస్‌టుడే: నగరంలోని పలు దేవాలయాల్లో గురువారం విశేష పూజలు నిర్వహించారు. గొడుగుపేట మల్లేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, హోమాలు చేశారు. ఎస్.ఎన్.గొల్లపాలెంలోని శ్రీఉమా సమేత సోమేశ్వరస్వామికి ఉదయాన్నే మహాన్యాస పూర్వక ఏకరుద్ర అభిషేకం, అర్చన నిర్వహించారు. మంగినపూడిలోని నగరేశ్వరస్వామి, పోతేపల్లిలోని విజయ కనకదుర్గ మల్లేశ్వరస్వామి, తపసిపూడిలోని శ్రీపార్వతి సమేత నాగేశ్వరస్వామికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ఎస్.ఎన్.గొల్లపాలెంలోని ఉమా సమేత సోమేశ్వరస్వామి

ఉపాధి పథకంపై కానూరులో గ్రామసభ

వన్నారుకానూరు (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే: జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టాల్సిన పనులపై వన్నారుకానూరులో గురువారం గ్రామసభ నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ మాట్లాడుతూ 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి పథకంలో గ్రామంలోని చెరువులు, పంట కాలువలు, పంటబోదెలు, కాలువ మరమ్మతులు చేయించాలని నిర్ణయించామన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో రెండో విడత నగదు జమ విషయంలో రైతులకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీహరి, వీఆర్వో సుబ్బయ్యదాస్, పీత రాము, బొమ్మిడి ఏడుకొండలు, గోపు వెంకటరమణ, బొలిశెట్టి నాని తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ ప్రకటన

యావన్మందికీ తెలియజేయునది ఏమనగా.. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మచిలీపట్నం మెయిన్ బ్రాంచి నందు పోసిన లక్ష్మి, W/o ప్రసాద్ గారు యీ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని హామీగా పెట్టి ఋణము కోరియున్నారు. సదరు ఆస్తిని మచిలీపట్నం మండలం కోన గ్రామ కాపురస్తులు పోసిన ప్రసాద్ గారి భార్య పోసిన లక్ష్మీ గారు ది. 15.12.2014న క్రయ దస్తావేజు ద్వారా 1) కొతరపు వెంకట ఆది లక్ష్మి 2) కొతరపు శ్రీనివాసరావు గార్ల వద్ద నుండి క్రయం పొందియున్నారని, వారి స్వాధీన హక్కు భుక్తములలో వుండి సర్వ హక్కులు కలిగి వున్నారని పై బ్యాంకు వార్కి తెలిపియున్నారు. కావున సదరు షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవరికైనా అభ్యంతరములు ఉన్నయెడల ఈ క్రింది చిరునామాకు 7 రోజుల లోపు రిజిస్టరు పోస్టు ద్వారా తెలియచేయవలెను. లేనియెడల సదరు ఆస్తి నిర్వివాద ఆస్తి అని హామీగా తీసుకొనబడును. తరువాత వచ్చు ఎట్టి అభ్యంతరములు చెల్లనేరవు. **షెడ్యూలు ఆస్తి:** మచిలీపట్నం, చింతగుంటపాలెం, డోర్ నెం. 2/5-2 గల డాబా యిల్లు 161 చ.గ. స్థలమునకు **హద్దులు: తూర్పు:** 9 అ. వెడల్పు గల జాయింటు దారి, **దక్షిణం:** శ్రీరాములు వగైరాల స్థలము, **పడమర:** కాజ రాంబాబు స్థలము, **ఉత్తరం:** కాజ సోమయాజులు వగైరాల స్థలం.

మహమ్మద్ రిజ్వానుల్లా, అడ్వకేట్

D.No. 16/502/5A, Opp. కిరణ్ ఏజెన్సీస్, మాచవరం, మచిలీపట్నం - 2.

✆ 94400 41936

100 మంది చిన్నారులకు 2డి ఎకో పరీక్షలు

మచిలీపట్నం (గొడుగుపేట): మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో గురువారం రమేష్ ఆసుపత్రి సహకారంతో పిల్లలకు ఉచిత గుండె పరీక్షలు నిర్వహించి కార్డియాలజీకి సంబంధించిన వైద్యసేవలు అందించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.ఆశాలత, డీఎంహెచ్‌వో యుగంధర్‌లు మాట్లాడుతూ నవజాత శిశువుల నుంచి 18 ఏళ్ల వయసు వారికి పుట్టుకతో వచ్చే కంజెనిటల్ హార్ట్ డిసీజ్ నిర్ధారణకు ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాదాపు 100 మంది చిన్నారులకు 2డి ఎకో పరీక్షలు నిర్వహించడంతో పాటు సమస్యలు ఉన్న పిల్లల తల్లిదండ్రులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించామన్నారు. ఆస్పత్రి ఆర్ఎంవో నిరంజన్, చిన్నపిల్లల వైద్య నిపుణులు శివరామకృష్ణ, బాలల సురక్ష కార్యక్రమ జిల్లా అధికారి హిమబిందు తదితరులు పాల్గొన్నారు. రమేష్ ఆస్పత్రి వైద్యులు డా.భరత్ సిద్ధార్థ్ సిబ్బందితో కలిసి పరీక్షలు చేశారు.

శిబిరంలో పాల్గొన్న చిన్నారులతో డీఎంహెచ్‌వో, సూపరింటెండెంట్ తదితరులు

ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ శుభాకాంక్షలతో.. కౌశిక్ ✆ 95025 83333
బాబు నైలాన్ రోప్స్ & నెట్స్
#11-14-14, వెలగలేటి వారి వీధి, చేపల మార్కెట్ దగ్గర, కొత్తపేట, విజయవాడ - 1
✆ 0866-6666956, 98481 20305, 92904 50002
మా వద్ద అన్ని రకముల నైలాన్ మరియు సింథటిక్ దారం, వలలు, తాళ్ళు, పూసలు, గాలాలు, టార్పాలిన్స్, ఫ్లోట్స్ లభించును.

(c) eenadu

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు ఆపండి

పెనమలూరు, న్యూస్‌టుడే: పోరంకి పరిధిలోని పాత పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, వాటిని అధికారులు అడ్డుకోవాలని నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి దేవభక్తుని చక్రవర్తి కోరారు. ఆ స్థలాన్ని గురువారం ఆయన పరిశీలించారు. నిర్మాణాలపై పురపాలక అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారులు వెంటనే స్పందించాలని, లేకపోతే గ్రామాల్లోని ప్రభుత్వ స్థలాల్లో తాము నిర్మాణాలు చేపడతామంటూ హెచ్చరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ప్రజాదర్బార్

గన్నవరం గ్రామీణం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. ఉంగుటూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సాయంత్రం 4 గంటల నుంచి ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరించనున్నట్లు చెప్పారు. అర్జీలు పరిష్కరించేందుకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

ఉయ్యూరు, న్యూస్‌టుడే: పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఆధ్వర్యంలో ఉయ్యూరు పురపాలక సంఘం కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఎమ్మెల్యే ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని పేర్కొంది.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

కానూరు, పోరంకి, న్యూస్‌టుడే: మరమ్మతుల నిమిత్తం కానూరు పరిధిలోని కల్పనానగర్, జేఆర్డీ పారిశ్రామికవాడ ప్రాంతం, వృద్ధుల ఆశ్రమం రోడ్డు, అమరావతి కాలనీ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ★ పోరంకి పరిధిలోని నిడమానూరు రోడ్డు, మహాలక్ష్మీనగర్, విష్ణుపురంకాలనీ, సాయినగర్, బందరు రోడ్డు, ఆర్టీసీ కాలనీ, లక్ష్మీపురం కాలనీ, రంగాబొమ్మరోడ్డు, సీతాపురంకాలనీ, బీఎస్‌ఎన్‌ఎల్ రోడ్డు, కృష్ణవేణి స్కూల్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ హరిబాబు తెలిపారు.

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం విద్యుత్తు సెక్షన్ పరిధిలో శుక్రవారం పలుచోట్ల సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ రాజు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. దావాజీగూడెం, అల్లాపురం, పామర్తినగర్, రవణమ్మ చెరువు పరిసరాల్లోని వినియోగదారులు.. విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

నిరుపేదకు తోపుడు బండి అందజేత

పెనమలూరు, న్యూస్‌టుడే: పెనమలూరు మండలం వణుకూరుకు చెందిన నిరుపేద నల్లమోతు శృతికి జీవనోపాధి నిమిత్తం బోడే ప్రసాద్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి బోడే సురేష్ గురువారం తోపుడు బండి అందజేశారు. పోరంకిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సురేష్ మాట్లాడుతూ ట్రస్టు తరఫున పేదలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మానని కూరగాయాలు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే:

కూరగాయలు ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. వర్షాకాలంలో సరకు లభ్యత అంతంతమాత్రంగా మారడం, కార్తిక మాసంలో శాఖాహారానికి డిమాండ్ పెరగడంతో దాదాపుగా అన్ని రకాల కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతూ వంటింటి బడ్జెట్‌ను తారస్థాయికి చేరుస్తున్నాయి. రైతుబజార్లలో సైతం పరిస్థితి దారుణంగా తయారైంది. పూర్తి స్థాయిలో సరకు పెట్టకపోగా, ఉన్నవి కూడా నాసిరకమేనన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో వినియోగదారులు ఇటు ధరల పరంగా, అటు నాణ్యత పరంగానూ నష్టపోవాల్సి వస్తోంది.

బెరా సార: మునుపెన్నడూ లేని విధంగా సొరకాయల ధర కొండెక్కింది. రైతుబజార్లలో కాయ ధర రూ.35 కాగా. . బయటి మార్కెట్లో దీని ధర మరింత ఎక్కువ. పైగా రైతుబజార్లలో అమ్మే కాయలు పరిమాణం కూడా తక్కువగా ఉంటున్నాయి.

అన్ని అర్ధ శతకాలే: కొన్ని వారాలుగా ఒక్క టమాట, దోసకాయలు మినహా అన్ని రకాల కూరగాయలు కిలో రూ.50కు పైగానే ఉన్నాయి. ముఖ్యంగా బీర, బెండ, దొండ రూ.60కు చేరువైతే, క్యారెట్, వంకాయ, చిక్కుళ్లు రూ.80కు పెరిగిపోయాయి. పొట్లకాయ సైతం రూ.25కు పైగానే ఉంది.

వినియోగం పెరిగిపోవడంతో..

కార్తిక మాసం ప్రారంభానికి ముందు నుంచే కూరగాయల ధరలు పెరుగుతూ వచ్చాయి. శ్రావణ మాసం శుభకార్యాలు ఎక్కువగా ఉండడంతో డిమాండ్ పెరిగింది. రెండు వారాల నుంచి వినియోగం మరింత పెరగడం, వరుస వర్షాలు, తుపాన్లు కారణంగా సరకు పాడవ్వడం, స్థానికంగా ఉత్పత్తి లేకపోవడంతో ధరల ఉత్పాతం అనివార్యమైపోయింది. రైతు బజార్ల ద్వారా పూర్తి స్థాయి అవసరాలు తీరకపోవడం, ప్రైవేటు వ్యాపారులు మా వద్ద నాణ్యమైన సరకు దొరుకుతుందంటూ మరింతగా ధర పెంచేస్తుండడంతో వినియోగదారులు వివిల్లాడిపోతున్నారు.

కార్తిక మాసం, వర్షాల ప్రభావంతో ఆకాశాన్నంటిన ధరలు

వారానికి రూ.500

మూడు నెలల నుంచి కేవలం కూరగాయల కోసమే వారానికి రూ.500కు పైగా వెచ్చించాల్సి వస్తోంది. గతంలో రూ.200తో సరిపోయేది. మొన్నటి వరకు టమాటా, పచ్చిమిర్చి ధరలు బెంబేలెత్తిస్తే.. ఇప్పుడు అన్ని రకాల కూరగాయలు జాగ్రత్తగా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

- కుమారి, గృహిణి

సంచి నిండటంలేదు

చేతిసంచి పట్టుకుని రైతుబజారుకు వెళ్తే.. సంచి నిండా కూరగాయలు కొనుక్కుని రాలేకపోతున్నాం. రైతు బజారులో అన్ని రకాల సరకు నాణ్యత ఉండటంలేదు. దీంతో బయటి దుకాణాలకు వెళితే ధరలు మరింత ఎక్కువగా ఉంటున్నాయి. అదేమంటే నాణ్యమైనవి కావాలంటే అంతే అని చెప్పేస్తున్నారు.

- బాలకృష్ణ, ఉద్యోగి

మూగజీవాలకు సేవలు అభినందనీయం

శిబిరాన్ని ప్రారంభిస్తున్న వెంకట్రావు, సత్యప్రసాద్

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: మూగజీవాలకు వైద్య సేవలందించడం అభినందనీయమని ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. బాపులపాడులో పశుసంవర్ధక శాఖ-స్రవంతి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటుచేసిన ఉచిత మెగా పశువైద్య శిబిరాన్ని యార్లగడ్డ ప్రారంభించారు. ఈసందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గన్నవరం నియోజకవర్గంలోనే పశు సంపద అధికంగా ఉందన్నారు. తాను కూడా రైతు కుటుంబంలోనే పుట్టి ఒంగోలు జాతి ఎద్దుల పరిరక్షణకు కృషి చేస్తున్నానన్నారు. రూ.1.20 లక్షల వ్యయంతో స్రవంతి ట్రస్ట్ తరఫున శిబిరాన్ని ఏర్పాటు చేసిన వీరమాచనేని సత్యప్రసాద్, శ్రీదేవి దంపతులు స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. సీఎస్సార్ నిధులతో నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. జంక్షన్ అభయాంజనేయస్వామి సాక్షిగా మంచి చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. పశుసంవర్ధక శాఖ జేడీ చిన నర్సింహులు, ఏడీలు ప్రమీలారాణి, బాలకృష్ణ నేతృత్వంలో వైద్య సేవలందించారు. రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ దయాల రాజేశ్వరరావు, నాయకులు చలమలశెట్టి రమేష్, వేములపల్లి శ్రీనివాసరావు, ఆళ్ల గోపాలకృష్ణ, మూల్పూరి కల్యాణి, కొమ్మారెడ్డి రాజేష్, కడగల శ్రీను, అట్లూరి శ్రీను, వీరమాచనేని బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలి: పశువుల అక్రమ రవాణాపై అధికారులు ఉక్కుపాదం మోపాలని యార్లగడ్డ సూచించారు. వివిధ శాఖల అధికారులతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు కూడా ఇందులో భాగస్వాములు కావాలన్నారు.

సహకార సేవలు మరింత చేరువ

మాట్లాడుతున్న ఆళ్ల గోపాలకృష్ణ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: సహకార సంఘాల ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలందించేందుకు కృషి చేయాలని నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ వైస్‌ఛైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ సూచించారు. రంగన్నగూడెం నేతాజీ ప్రాథమిక సహకార సంఘం తరఫున రైతులకు అవగాహన సమావేశం గురువారం నిర్వహించారు. 1978వ సంవత్సరంలో ప్రారంభమైన ఈ సంఘం 892 మంది సభ్యులతో రూ.20 కోట్ల టర్నోవర్‌కు చేరడం అభినందనీయమన్నారు. కేడీసీసీ బ్యాంకు హనుమాన్‌జంక్షన్ మేనేజర్ అవినాష్ మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా ఇస్తున్న వివిధ రుణాల గురించి వివరించారు. సహకార సంఘ ఛైర్మన్ కనకవల్లి శేషగిరిరావు, సర్పంచి కసుకుర్తి రంగామణి, పాల సంఘం అధ్యక్షుడు మొవ్వా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే ఆరా

స్థానికుల అభిప్రాయం తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ప్రసాద్

పెనమలూరు, న్యూస్‌టుడే: యనమలకుదురు, కానూరుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే బోడేప్రసాద్ గురువారం పరిశీలించారు. రెండు గ్రామాల్లో రూ.25 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతుండగా.. ఆయన వాటిని పరిశీలించడంతో పాటు స్థానికుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యతపై అనుమానాలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. పనులు త్వరలో పూర్తవుతాయని ఆయన వివరించారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గన్నవరంలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంతో పాటు ముస్తాబాద, ఉంగుటూరు, ఆత్కూరు, మానికొండ ఇతర గ్రంథాలయాల్లో వారం రోజులుగా నిర్వహిస్తున్న వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. గన్నవరం ప్రథమశ్రేణి గ్రంథాలయంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకట్రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. నర్రా సీతారామారావు, గన్నె వెంకట్రావు, జాస్తి విజయభూషణ్‌కుమార్, తులసీమోహన్ పాల్గొన్నారు.

ఉయ్యూరులో విద్యార్థులకు బహుమతులు, ధ్రువపత్రాలు అందిస్తున్న నాని, దాతలు కిషోర్, కుటుంబరాజు

పెనమలూరులో..

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: గ్రంథాలయ వారోత్సవాల ముగింపులో భాగంగా బాపులపాడు, కానుమోలు, వీరవల్లి గ్రంథాలయాల్లో వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులకు పుస్తక పఠనం ఆవశ్యకతను చాటి చెప్పేందుకు వారోత్సవాలు దోహదం చేస్తాయని సర్పంచులు పిల్లా అనిత, సీతమ్మ తదితరులు పేర్కొన్నారు.

హనుమాన్‌జంక్షన్: వీరవల్లిలో..

ఉయ్యూరు గ్రామీణం: గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా పెద ఓగిరాల గ్రంథాలయంలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు గ్రామసర్పంచి టి.లక్ష్మి బహుమతులు అందజేశారు. ముదునూరు గ్రంథాలయంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు.

పెనమలూరు: పెనమలూరు గ్రంథాలయంలో వారం రోజుల పాటు నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల బాలలకు దేశభక్తి గీతాలు, ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్పంచి లింగాల భాస్కరరావు, ఎంపీడీవో బండి ప్రణవిలు నీతి చంద్రిక, కథల పుస్తకాలతో పాటు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

ఉయ్యూరు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు గురువారం బహుమతులు, ధ్రువపత్రాలను పురపాలక సంఘం ఛైర్మన్ వల్లభనేని నాని, దాతలు కిషోర్, కుటుంబరాజు, వి.కేశవరావు అందజేశారు.

ప్రకటన

మా క్లయింటు కృష్ణా జిల్లా, ఆత్కూరు గ్రామ కాపురస్తులు షేక్ మస్తాన్ గారి కుమారుడు షేక్ సుభాని గారి సంజాయిషీ పొంది తెలియచేయునది ఏమనగా.. కృష్ణా జిల్లా, పెద అవుటపల్లి కాపురస్తులు తుమ్మల బ్రహ్మేశ్వరరావు గారి భార్య తుమ్మల భాగ్యలక్ష్మి గారు ది. 30-03-1994వ తేదీన కొమ్మరాజు లక్ష్మీ కాంతమ్మ వగైరాల వలన దఖలు పొంది శ్రీ గన్నవరం సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1వ పుస్తకం, 1415 వాల్యూం, 230ల 232 పుటలలో, దస్తావేజు నెం. 603/1994 రుగా రిజిస్టరు కాబడిన దఖలు దస్తావేజు రీత్యా వారికి సంక్రమించి య. 0.85 ట్లున్నూ, ది. 06-04-1994వ తేదీన కొమ్మరాజు లక్ష్మీ కాంతమ్మ వగైరాల వలన దఖలు పొంది శ్రీ గన్నవరం సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1వ పుస్తకం, 1416 వాల్యూం, 206ల 208 పుటలలో, దస్తావేజు నెం. 653/1994 రుగా రిజిస్టరు కాబడిన దఖలు దస్తావేజు రీత్యా వారికి సంక్రమించి య. 1.57 ట్లున్నూ వెరశి య.2.42 ట్లు సంక్రమించి దరిమిలా వారి కుటుంబ క్షేమ లాభాభివృద్ధి నిమిత్తమునూ పోలవరపు శ్రీహరిణి గారికి ది. 21-05-2016వ తేదీన య. 0.13 సెంట్లు లేక చ.గ. 629.2లను విక్రయించి సదరు విక్రయ దస్తావేజును శ్రీ గన్నవరం సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1వ పుస్తకం, దస్తావేజు నెం. 3645/2016 రుగా రిజిస్టరు చేయగా మిగిలియున్న య. 2.29 సెంట్ల భూమి నేటి వరకు వారికి మాత్రమే సర్వ సంపూర్ణ స్వాధీన యాజమాన్య హక్కు భుక్తములతో అనుభవించుచున్నారు. సదరు షెడ్యూలు దాఖలా ఆస్తులను మా క్లయింటు క్రయమును పొందుటకు విక్రయ ఒప్పందము కుదుర్చుకుని కొంత సొమ్ము బయానాగా చెల్లించి త్వరలో మా క్లయింటు పేరగాని, వారు కోరిన వారి పేరున గాని రిజిస్టరు దస్తావేజును వ్రాసుకొనబోవుచున్నారు. కావున యీ దిగువ షెడ్యూలు దాఖలాస్తిపై ఎవ్వరికి ఎట్టి ఆక్షేపణలు, తనఖాలు, కోర్టు దావాలు, డబల్ రిజిస్ట్రేషన్లు, క్లయిములు, మైనరు హక్కులు, వారసత్వపు హక్కులు వగైరాలు వున్న యెడల ఈ ప్రకటన వెలువడిన తేదీ లగాయతు 10 రోజుల లోపల చేరునట్లుగా ఎక్నాలెడ్జిమెంట్ గల రిజిస్టరు పోస్టు ద్వారా మా చిరునామాకు తెలియపరచవలసినది. అట్లు గడువు తేదీలోపు ఎట్టి అభ్యంతరములు, ఆక్షేపణలు వగైరాలు రానియెడల దిగువ షెడ్యూలు దాఖలాస్తి నిర్వివాదమైన ఆస్తిగా పరిగణించి మా క్లయింటు క్రయమును పొందుదురు. గడువు తేదీ దాటి వచ్చు ఎట్టి క్లయిములు, చార్జీలు, అభ్యంతరములు, ఆక్షేపణలు వగైరాలు మా క్లయింటును బద్ధులను చేయజాలవని ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయడమైనది.

షెడ్యూలు: కృష్ణా జిల్లా, గన్నవరం సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో గన్నవరం మండలం, చిన్న అవుటపల్లి గ్రామ పంచాయతీ ఏరియాలో చేరిన అవుటపల్లి గ్రామ రీ. సర్వే నెం. 39/1 రు దాఖలా య. 2.29ట్లు వ్యవసాయ శేరీ పల్లం భూమికి హద్దులు:

తూర్పు: మరీదు నారాయణ మరియు వగైరాల భూమి, **దక్షిణం:** రోడ్డు, **పడమర:** పోలవరపు శ్రీహరిణి గారికి విక్రయించిన భూమి, **ఉత్తరం:** రోడ్డు.

ఇట్లు: **యలమంచిలి రామకృష్ణ,**
యలమంచిలి యశస్విని పద్మావతి,
న్యాయవాదులు, షాపు నెం. 10, రాధాకృష్ణ రెసిడెన్సీ,
న్యూ ఆర్.టి.సి. కాలనీ, పటమట, విజయవాడ-7.
ఫోన్ నెం: 94946 23679, 99594 54322
విజయవాడ, 20-11-2025

అనుమోలుకు మంత్రి అభినందన

పెనమలూరు: తెదేపా నేత అనుమోలు ప్రభాకరరావును పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అభినందించారు. ఉయ్యూరు మండలం గండిగుంటలో జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ 67 ఏళ్ల వయసులో రష్యాలోని 5,642 మీటర్ల ఎత్తైన ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించడం ద్వారా ప్రభాకరరావు యువతకు ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రభాకరరావుకు లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ అందజేసిన ధ్రువపత్రాలు, అవార్డులను ఆయన పరిశీలించారు.

ప్రభాకరరావును అభినందిస్తున్న మనోహర్

ఏఎంఆర్‌పై అవగాహనతోనే ఆరోగ్యం

కంకిపాడు గ్రామీణం: ప్రతిఒక్కరూ యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్)తో జాగ్రత్తగా ఉండాలని ఉప్పులూరు పీహెచ్‌సీ వైద్యురాలు మంజు అన్నారు. పీహెచ్‌సీ ఆవరణలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఏఎంఆర్ అనేది పలు వ్యాధులకు సరైన తీరులో మందులు వాడకపోవడంతో శరీరంలో ఏర్పడే ఒక విధమైన బ్యాక్టీరియా అని, మనకు అవసరమైన సూక్ష్మజీవులను నాశనం చేసి పలు రకాల ఇన్‌ఫెక్షన్లకు కారణమవుతుందన్నారు. దీనిపై అవగాహన కలిగి తగిన విధంగా మందులు వాడాలని సూచించారు. సబ్ యూనిట్ అధికారి జీవీవీ శ్రీనివాసరావు, ఎంపీహెచ్‌ఈవో కృష్ణారావు, పీహెచ్‌ఎన్ రాజమణి, హెల్త్ సూపర్‌వైజర్ సుధాకర్, శ్యామల, హెల్త్ అసిస్టెంట్ రాచమల్ల శ్యాంప్రసాద్, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

ప్రతిభ చాటారు.. విజేతలుగా నిలిచారు

ప్రిన్సిపల్ ప్రసాద్ నుంచి బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

పెనమలూరు, న్యూస్‌టుడే: ఉపన్యాస ప్రతిభతో పోరంకి ఎన్‌ఆర్ ఇంగ్లిషు మీడియం స్కూలు విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో పాఠశాలలో గురువారం ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు పోటీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుపై సెల్‌ఫోన్ ప్రభావం అన్న అంశంపై ఉపన్యాస పోటీ నిర్వహించగా.. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో పి.సంజన, వి.కీర్తన, జె.స్వాతి నిలిచారు. వీరికి పాఠశాల ప్రిన్సిపల్ ఆర్‌ఎస్‌ఎన్ ప్రసాద్, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. పోటీలో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు.

బంగారు నగలున్న పర్సు చోరీ

విజయవాడ, న్యూస్‌టుడే: వృద్ధురాలి సంచిలోని పర్సు దొంగతనంపై గవర్నర్‌పేట పోలీసులు గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. కంకిపాడు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన ప్రత్తిపాటి సుధారాణి(62) బుధవారం మధ్యాహ్నం బీసెంట్‌రోడ్డులో షాపింగ్‌కు వచ్చారు. షాపింగ్ పూర్తయ్యాక లెనిన్‌కూడలిలోని బస్టాపునకు వచ్చారు. దాదాపు గంట సేపు ఎదురు చూసిన తరువాత కంకిపాడు వెళ్లే బస్సు రాగా సాయంత్రం 4.45 సమయంలో బస్సు ఎక్కారు. కండక్టర్‌కు ఆధార్ కార్డు చూపించేందుకు సంచి తీయగా దానిలో ఉంచిన పర్సు కనబడలేదు. పర్సులో 50 గ్రాముల బరువైన బంగారు గొలుసులు, రూ.5 వేల నగదు ఉన్నట్లు బుధవారం రాత్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. గవర్నర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుకు గురై వృద్ధుడి మృతి

గన్నవరం గ్రామీణం: పాముకాటుకు గురైన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గన్నవరం పట్టణ శివారు మర్లపాలెంలో చోటుచేసుకుంది. స్థానికంగా నివసిస్తున్న కళ్ల సుబ్బారావు(58) వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. ఈనెల 5వ తేదీన పాముకాటుకు గురవడంతో.. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ సుబ్బారావు బుధవారం రాత్రి మృతి చెందారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మీసేవా కేంద్రం యజమాని అదృశ్యం

ఉయ్యూరు, న్యూస్‌టుడే: ఉయ్యూరు రావిచెట్టు బజారులోని ఈశ్వరసాయి కమ్యూనికేషన్స్ మీ సేవా కేంద్రం యజమాని రవికుమార్ కనిపించడం లేదని ఉయ్యూరు పట్టణ పోలీసు స్టేషన్లో గురువారం కేసు నమోదైంది. రవికుమార్ గురువారం అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. సీసీ కెమెరాల పరిశీలనలో ఫ్లోరా సెంటర్‌లోని పుల్లేరు కాలువ వంతెన వరకు మాత్రమే అతని జాడ కనిపించింది. ఆ తర్వాత అతను ఎటు వెళ్లింది కనిపించలేదని తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసి అతని ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

పంచాయతీల్లో చెత్త చిక్కులు

ప్రసాదంపాడు, రామవరప్పాడు, న్యూస్‌టుడే: రామవరప్పాడు, ప్రసాదంపాడు పంచాయతీల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. కొందరు ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడకు వ్యర్థాలు తెచ్చి పోసేస్తున్నారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు పంచాయతీలు గన్నవరం నియోజకవర్గంలో అతి పెద్దవి. వీటి పరిధిలో సుమారు 70 వేల మంది ప్రజలు నివసిస్తుంటారు. రోజుకు 25 నుంచి 30 టన్నుల వరకు చెత్త, వ్యర్థాలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రధానంగా డంపింగ్ యార్డుకు స్థలం లేకపోవడం, దాని ఏర్పాటుపై అధికారులు, పాలకులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణ దారుణంగా ఉంది. మరోపక్క చెత్త గుట్టలుగా పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. చెత్త సమస్య కారణంగా దోమల వృద్ధి విపరీతంగా పెరిగిపోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. కొన్నిచోట్ల చెత్తకు నిప్పు పెడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు వ్యర్థాలు తొలగించడంతో పాటు రోడ్డు పక్కన చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రామవరప్పాడులోని బల్లెంవారి వీధిలో వ్యర్థాల గుట్టలు

రహదారులను కమ్మేస్తున్న పొగమంచు

చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై..

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో వేకువజామున పొగమంచు కమ్మేస్తుంది. మూడు రోజులుగా వేకువజామున తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవ్వడం గమనార్హం. ఫలితంగా ఉదయం ఎనిమిది గంటల వరకు పొగమంచుతో చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు గన్నవరం విమానాశ్రయానికి వచ్చే విమానాలు సైతం కొంత ఆలస్యంగా నడుస్తున్నాయి. పల్లెల్లో ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనదారులు రాకపోకలకు తీవ్ర అంతరాయం కల్గిస్తోంది. పలు చోట్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్న సందర్భాలు లేకపోలేదు. విపరీతంగా కురుస్తున్న మంచు కారణంగా ఉదయాన్నే పనులకు వెళ్లాల్సిన కూలీలు కూడా ఇళ్లకే పరిమితమవుతున్నారు. ప్రజలు సైతం ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని, లేదంటే శ్వాసకోశ వ్యాధులు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: హనుమాన్‌జంక్షన్‌కు చెందిన ఓ వ్యక్తి వైద్య చికిత్సకు వీలుగా మానవత స్వచ్ఛంద సంస్థ చేయూతనిచ్చింది. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న బోయిన శంకర్రావుకు గురువారం మానవత కార్యాలయంలో రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు ఆధ్వర్యంలో రూ.13 వేలు సాయం అందించారు. సంస్థ ప్రతినిధులు బోయిన కోటేశ్వరరావు, బాణాల నరసింహారావు, కూరెళ్ల సుబ్బాచారి తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడ చిక్కవు.. అక్కడే దొరుకుతాయి..!

యథేచ్ఛగా మాంసం వ్యర్థాల రవాణా

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే

కోడి మాంసం వ్యర్థాల వాహనాలన్నీ దాదాపుగా ఏలూరు జిల్లా పెదపాడు పరిధిలోకే వెళుతున్నాయి. గన్నవరం నియోజకవర్గంతో సంబంధం ఉన్న పటమట, నున్న, గన్నవరం, ఆత్కూరు, వీరవల్లి, హనుమాన్‌జంక్షన్ పోలీస్‌స్టేషన్ల మీదుగానే ఇవి అక్కడకు వెళుతున్నాయి. అయితే ఆయా స్టేషన్ల పరిధిలో వీటిపై ఏమాత్రం దృష్టి సారించడం లేదు. దాదాపు 50కు పైగా వాహనాలు నిత్యం హైదరాబాద్, విజయవాడ నుంచి 16వ జాతీయ రహదారి మీదుగా వెళుతుంటాయి. వీటిపై పర్యవేక్షణ, మార్గమధ్యంలో ఎవరూ ఆపకుండా కొందరు ప్రైవేటు వ్యక్తులు ఎక్కడికక్కడ 'సర్దుబాట్లు' చేసుకుంటూ వస్తున్నట్లు గట్టి ఆరోపణలున్నాయి. రామవరప్పాడు దాటాక పెదపాడు చేరేవరకు గత అయిదేళ్లలో ఆయా పోలీస్‌స్టేషన్లలో మాంసం వ్యర్థాల వాహనాలు పట్టుకున్న ఉదంతాలు నామమాత్రం. అవి కూడా స్థానికులు అడ్డుకుని పోలీసులకు అప్పగించినవే.

➤ కృష్ణా జిల్లా బాపులపాడు, నందివాడ, ఉంగుటూరు, ఏలూరు జిల్లా మండవల్లి, కైకలూరు, కలిదిండి, పెదపాడు మండలాల్లో చేపల చెరువుల సాగు అధికం. తక్కువ ఖర్చుతో విరివిగా లభ్యమవుతుండటంతో కోడి మాంసం వ్యర్థాలను చేపలకు మేతగా వాడుతున్నారు. ప్రజారోగ్యానికి, పర్యావరణానికి ముప్పని తెలిసినా కూడా యథేచ్ఛగా వినియోగిస్తున్నారు.

➤ మాంసం వ్యర్థాల వినియోగం ఎక్కువగా ఏలూరు జిల్లాలో ఉంటే.. సరఫరా మాత్రం ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల నుంచే కావడం గమనార్హం. తెలంగాణ, విజయవాడలతో పాటు వివిధ ప్రాంతాల్లో సేకరించిన వ్యర్థాలను ట్రక్ ఆటోల్లో, మినీ వ్యానుల్లో తరలిస్తున్నారు. ఇదే ప్రధాన వ్యాపారంగా కొందరు దందా సాగిస్తున్నారు.

ఆదాయ వనరుగా.. మాంసం వ్యర్థాలతో తీవ్రమైన దుర్గంధంతో పాటు, చెరువుల్లో వీటి వినియోగంతో చేపలను ఆహారంగా తీసుకునే వారు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది. 2014-19 మధ్య కొంత అడ్డుకట్ట పడినా, 2019లో వైకాపా ప్రభుత్వ హయాంలో ఏలూరు జిల్లాకు చెందిన అప్పటి ఎమ్మెల్యే ఒకరు దీనిని ఆదాయ వనరుగా మార్చుకుని, మాంసం వ్యర్థాల సరఫరాదారులకు పూర్తి అండగా నిలిచారన్న ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఈ దందా కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

NOTICE

As per the instructions given by my clients **(1) Yalamanchili Sri Sai Lakshminarayana Rao** son of Yalamanchili Murahari Venkata Krishna Rao, and his wife **(2) Smt. Yalamanchili Kasturi kumari** both are wife and husband, Resident of Labbipet, Vijayawada NTR District.

WHEREAS my clients **(1) YALAMANCHILI SRI SAI LAKSHMINARAYANA RAO** and **(2) SMT.YALAMANCHILI KASTURI KUMARI** are the absolute owners of **an extent of 200-0 Sq. Yards** or 167-22 Sq.mts of vacant site, in **Re-Survey.No 130/1B** situated at **the Nidamanuru Village,** Vijayawada Rural Mandal, NTR District, that property was purchased from Shri Janyavula Veera Mastanrao, son of Venkateswara Rao. Shri Janyavula Veera Mastanrao was executed a Sale Deed on 11-12-2006, and presented the sale deed registered before the **Gunadala Sub-registrar** vide document No. **4395 of 2006** and entered into Book No 1, and enjoying the same in my clients possession with absolute rights without any disputes whatsoever.

I declare to all that, my clients are not getting any income from the below mentioned schedule property and decided to sell the property for sale and for the offer made by my clients, the purchaser BUDDHA RAVINDRA PRAKASH has agreed to purchase the below mentioned schedule property.

If anybody has any objections in this conection over the scheduled property should intimate within one week from the date of this notice by registered post to the below mentioned address.

I declare to all that the objections which come after seven days shall not bind my clients.

SCHEDULE : An extent of 200-0 SQ.yards or 167-22 Sq.mts, Plot No 30, Property situated at **Nidamanuru,** bearing **Re-Survey No. 130/1B, within the limits of the Vijayawada Rural Mandal,** NTR District, within the jurisdiction of the **Joint Sub-Registrar, Gunadala** and within the following boundaries: **EAST :** Some extent of Plot No 40 and Plot No 41, Ft. 31-6, **SOUTH :** Property belongs to Plot No 31, Ft. 57-0, **WEST :** 40-0 feet wide Road, Ft. 31-6, **NORTH :** Property belongs to Plot No. 29, Ft. 57-0.

In between the above four boundaries an extent of **200-0 SQ.yards, or 167-22 Sq.mts** of vacant site, along with all easements rights was already agreed to sold by my clients to the purchaser BUDDHA RAVINDRA PRAKASH.

G. SIVA PRASADA RAJU, B.Com., B.L.,
ADVOCATE & NOTARY
23-5-6, Vandanapu Vari Street, Satyanarayanapuram,
VIJAYAWADA - 520 011.

(c) eenadu

గుడివాడ
•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

ఆలయంలో మంత్రి పార్థసారథి తదితరులు

స్వామి సన్నిధిలో మంత్రి

మోపిదేవి, న్యూస్‌టుడే: రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి గురువారం మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈవో శ్రీరామవరప్రసాద్ పట్టువస్త్రాలతో సత్కరించారు.
❖ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ కమిషనర్ వెంకటరామిరెడ్డి స్వామిని దర్శించి పూజలు చేశారు.

ఉచిత వైద్య పరీక్షలు

ఘంటసాల, న్యూస్‌టుడే: మల్లంపల్లిలో కూచిపూడి సిలికానాంధ్ర వైద్యాలయం ఆధ్వర్యంలో జడ్పీ మాజీ ఛైర్మన్ కుక్కల నాగేశ్వరరావు 12వ వర్ధంతి సందర్భంగా డొక్కు గోపాలకృష్ణ సహకారంతో కూచిపూడి రోటరీక్లబ్ వారి సహకారంతో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు ఏఆర్‌కే శివప్రసాద్, లిల్లీ పాల్, శ్వేత, పవన్, హారిక ఆధ్వర్యంలో 186 మందికి వైద్యపరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సంజీవని వైద్యాలయం ప్రతినిధులు హనుమకుమార్, సత్యప్రకాష్, తిరుగణేష్ పాల్గొన్నారు.

వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న గోపాలకృష్ణ, వైద్యులు

ఉద్యోగుల సేవలకు గుర్తింపు

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు సేవలు అందించిన ప్రభుత్వ అధికారులకు, ఉద్యోగులకు ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని, దివిసీమ ప్రకృతి వైపరీత్యాలకు నిలయమని, ఇక్కడ పనిచేసే ప్రతి ఉద్యోగి ప్రజల మన్ననలను పొందే విధంగా పనిచేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. మొంథా తుపానులో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించిన నియోజకవర్గంలోని అధికారులు, ఉద్యోగులను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. ప్రతి అధికారి చట్టపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని మాత్రమే సమస్యలను, ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. నిబంధనలను పక్కన పెట్టి పనులను చేయవద్దని సూచించారు. జిల్లాకు సమర్థవంతమైన పరిపాలనాధికారి డీకే బాలాజీ ఉండటం వల్లే ఎదుర్కొన్నామన్నారు. అనంతరం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఏర్పాటు చేసిన కార్తిక వన సమారాధనలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ప్రత్యేకాధికారి పెనుమూడి సాయిబాబు అధ్యక్షత వహించగా ఇన్‌ఛార్జి డీఎస్పీ రాజా, ఆర్డీవో స్వాతి, విద్యుత్తుశాఖ ఏడీఏ సుబ్రహ్మణ్యం, సీఐ యువకుమార్, జిల్లా పౌర సరఫరా శాఖ అధికారి శివరామ ప్రసాద్, జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సేవలను అందించిన అధికారులు, ఉద్యోగులతో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ బృంద చిత్రం

జీవనోపాధిపై ఏదీ భరోసా?

అవనిగడ్డ గ్రామీణం, నాగాయలంక, న్యూస్‌టుడే

దివిసీమలోని కృష్ణానది పరివాహక ప్రాంత మత్స్యకారులు జీవనోపాధి విషయమై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేపల వేట నిషేధ సమయంలో గుర్తింపు పొందిన కొంత మంది మత్స్యకారులకు జీవన భృతి అందలేదు.
★ జిల్లా వ్యాప్తంగా 13 వేల మత్స్యకార కుటుంబాలు కేవలం చేపల వేటపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అవనిగడ్డ నియోజకవర్గంలో 5,820 మంది మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. 970 బోట్లపై కృష్ణానది, సముద్రంలోను చేపల వేటకు వెళుతుంటారు. ★ వేటాడి తీసుకు వచ్చిన మత్స్య సంపదను పెట్టుబడిదారులు చెప్పిన రేటుకే అమ్మాల్సి వస్తోందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టన్ను ధర రకాన్ని బట్టి రూ.400 నుంచి రూ.1000 వరకు పలుకుతోందని, ఇది చాలా తక్కువని వారు వాపోతున్నారు. ★ తీర ప్రాంతంలో నది, సముద్రపు జలాలు కలుషితం కావడం, మత్స్య సంపద తగ్గిపోవడంతో మత్స్యకార కుటుంబాలు పట్టణ, ఇతర ప్రాంతాలకు వలస బాట పడుతున్నారు. ★ వేటాడి తెచ్చిన మత్స్య సంపదను నిల్వ చేసుకోవడానికి నియోజకవర్గంలో ఎక్కడా శీతల గిడ్డంగులు లేవని, నాగాయలంక, కోడూరు పరిసర ప్రాంతాల్లో వాటిని ఏర్పాటు చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.

నాగాయలంకలో పునాదులకే పరిమితమైన వేట సామగ్రిని భద్రపరుచుకునే భవనం

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

చల్లపల్లి, న్యూస్‌టుడే: అవనిగడ్డ 132 కె.వి సబ్‌స్టేషన్‌లో ఏర్పడిన సాంకేతిక లోపం కారణంగా అవనిగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో శుక్రవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఉయ్యూరు ఈఈ బి.సుధాకర్‌బాబు తెలిపారు.
అవనిగడ్డ, కోడూరు: స్థానిక నాగాయలంక రోడ్డులోని కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో అవనిగడ్డ సబ్‌స్టేషన్ నిర్వహణ పనులలో భాగంగా శుక్రవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఉయ్యూరు డివిజన్ ఈఈ సుధాకర్ తెలిపారు.

గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు కృషి

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ నియోజకవర్గం పరిధిలోని గ్రామాలలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు అధికారులు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. స్థానిక ప్రజా వేదికలో గురువారం రాము గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులతో సమావేశం అయ్యారు. గుడ్లవల్లేరు మండలం వడ్లమన్నాడు, గుడ్లవల్లేరు, పెంజంద్ర, గాదెపూడి, కట్టవాని చెరువు, తాడిచర్ల, లంకా దొడ్డి, పెసరమిల్లి గ్రామాలలో రూ.1.50 కోట్లతో తాగునీటి ప్రాజెక్టులు అభివృద్ధి చేస్తున్నామన్నారు. నందివాడ మండలం ఒద్దులమెరక గ్రామంలో రూ.10 లక్షలతో కల్వర్టు నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం డీఈ శ్రీనివాస్, ఏఈ రూపేష్, గుడివాడ ఇంఛార్జి రాణి తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

విద్యార్థుల నైపుణ్యాలపై చరవాణి ప్రభావం

గుడివాడ, న్యూస్‌టుడే: చరవాణి అత్యధిక వినియోగం వలన విద్యార్థుల రాత, పఠన నైపుణ్యాలు నాశనం అవుతాయని, చిన్నారుల శారీరక మానసిక వికాసాలలో మార్పులు వస్తాయని వికాస్ రెయిన్‌బో ఆంగ్ల మాధ్యమ పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పుట్టి రామచంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక సత్యనారాయణపురంలోని పాఠశాలలో ఈనాడు ప్రతిభా పాటవ పోటీలలో భాగంగా 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై ఉపన్యాసం పోటీలు గురువారం నిర్వహించారు. ఈ పోటీలలో విద్యార్థులు సీహెచ్.జాహ్నవి ప్రథమ, ఏ.సాయి శ్రీవల్లి ద్వితీయ, ఓ.హేమాంబరి తృతీయ స్థానాలను కైవశం చేసుకున్నారు. విజేతలకు రామచంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయిని వై.అరుణ, ఎం.వాణి బహుమతులు అందజేశారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న పాఠశాల సెక్రటరీ పుట్టి రామ చంద్రశేఖర్

సూర్యదేవుడికి చందనోత్సవం

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: వేకనూరులోని సూర్యదేవాలయంలో గురువారం సూర్యనారాయణ స్వామికి చందనోత్సవం చేశారు. దంపతులు మృత్యుంజయ, నవగ్రహ శాంతి కార్యక్రమాలను నిర్వహించారు. సూర్యదేవుడి కల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపారు. కమిటీ ప్రతినిధి తుంగల శ్రీనివాస పెరుమాళ్ళ, ఆలయ వాస్తు సిద్ధాంతి పాకలపాటి రామచంద్రరావు పర్యవేక్షించారు.
అంగలూరు(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని అంగలూరు శ్రీఅమరేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఉపసర్పంచి త్రిపురనేని సురేశ్‌బాబు ఆధ్వర్యంలో కార్తిక దామోదర పూజ, సహస్రదీపార్చన చేశారు. ధర్మ ప్రచారకులు ఘంటశాల బసవయ్య గీతోపదేశం చేశారు. 50 ఏళ్లుగా అర్చకత్వం చేస్తున్న పాలపర్తి నరసింహారావును సత్కరించారు.
కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: స్థానిక గంగాభవానీ, కనకదుర్గమ్మ వారి ఆలయంలో గురువారం భక్తులు సహస్ర దీపాలు వెలిగించి, అమ్మవారలకు ప్రత్యేక పూజలు చేశారు. గంగాభవానీ అమ్మవారు శాకంబరి అలంకారంలో దర్శనం ఇచ్చారు.

చందనం అలంకరణలో సూర్యనారాయణ స్వామి

కోడూరు: శాకంబరి అలంకారంలో గంగాభవానీ అమ్మవారు

మహారాజశ్రీ 11వ అదనపు జిల్లా జడ్జి గుడివాడ వారి కోర్టులో
E.P.6/2016 In M.V.O.P.No.801/2010
Between:
ముత్తిరెడ్డి పిచ్చియ్య & ఇతరులు ...డి.హెచ్.ఆర్స్
AND
ఎమ్.వెంకటేశ్వరరావు & ఇతరులు ...జె.డి.ఆర్స్
పై నెంబరు E.P. వారంటు గ్రంథంలో శ్రీకోర్టువారు ఈదిగువ షెడ్యూలు 2వ J.D.R ఆరకుపూడి నాగమణి గారి ఆస్థిన్ని ది.11.12.2025 తేదిని ఉ॥10.30 ని॥లకు పై కోర్టులో వేలం వేయుదురు ఆసక్తి ఉన్నవారు పాటలో పాల్గొనవచ్చును.
షెడ్యూలు: కృష్ణాజిల్లా గుడివాడ సబ్ రిజిష్ట్రీ యిలాకా పెద్దపారుపూడిమండలం, ఈదుల మద్దల గ్రామం, ఆర్.యస్.నెం.80, య.3.00ల వ్యవసాయభూమి హద్దులు:
తూర్పు: పరుచూరి రామమోహనరావు, దక్షిణం: పంటకాలువ, చావరాలవెంకటరత్నం భూమి,
పడమర: గూడూరి కోటేశ్వరరావు వగైరా భూమి
ఉత్తరం: పాలకోడు.
డి.హెచ్.ఆర్ విలువ : 40,00,000/-
అమీనా విలువ : 60,00,000/-
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
నూకల సూర్యనాగరాజు
కొల్లు శ్రీనివాసరావు
జి. కమల అమృతం
అడ్వకేట్స్, ఏలూరు

నాలుగున్నర ఏళ్లుగా పునాదులకే పరిమితం

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందిస్తామని ప్రజలను నమ్మించిన వైకాపా ప్రభుత్వం పెద్దఎత్తున వెల్‌నెస్ సెంటర్లకు భవన నిర్మాణాలను ప్రారంభించింది. అది పులిగడ్డలోని గ్రామపంచాయతీ ఆవరణలో పునాదులకే పరిమితమైంది. పునాదుల్లో తీగజాతి మొక్కలు చుట్టేశాయి. ఇనుప చువ్వలు తుప్పుపట్టి విరిగిపోతున్నాయి. మండలంలో 8 కేంద్రాలూ నిర్మాణ దశలో ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. పులిగడ్డలో పునాదుల వరకే గుత్తేదారుడు నిర్మాణం చేసి పత్తా లేకుండా పోయాడని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఆరోగ్య ఉపకేంద్రంలో చాలీచాలని ఇరుకు గదిలోనే వైద్యసేవలను అందిస్తున్నారు. భవన నిర్మాణం పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్థులు పేర్కొంటున్నారు.
- అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే

ఎగబాకిన ప్రమాదం

గుడివాడ పామర్రు రోడ్డు సాయిబాబా గుడి సమీపంలోని విద్యుత్తు నియంత్రికకు తీగజాతి మొక్క అల్లుకుపోయింది. స్తంభం కింది భాగంలో కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగాయి. తీగజాతి మొక్కలు విద్యుత్తు తీగలకు చుట్టుకోవడంతో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని స్థానికులు అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తీగలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.
- గుడివాడ (సత్యనారాయణపురం), న్యూస్‌టుడే

సహకార సంఘాలు వినూత్న వ్యాపారాలు చేయాలి

కూచిపూడి, న్యూస్‌టుడే: సహకార సంఘాలు వినూత్న వ్యాపారాలు నిర్వహించాలని జిల్లా సహకార సంఘం అధికారి కె.చంద్రశేఖరరెడ్డి అన్నారు. గురువారం కాజలో అఖిలభారత సహకార సంఘాల వారోత్సవాల ముగింపు సందర్భంగా సంఘం జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం ప్రతినిధులు కె.బోజరంగారావు, వై.రామచంద్, నాగమల్లేశ్వరరావు, రవీంద్ర, పణికుమార్, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

In the Court of the Civil Judge (Senior Division) Avanigadda
E.P. 7/2022 in O.S. 142/2014
Between: State Bank of India Avanigadda, Main Branch, Rep. by its Branch Manager -D.H.R
and
Maddi Murali Rao S/o Subbarao - J.D.R
పై నెంబరు దావాలో డిక్రీ బాకీ వసూలు చేసుకొనుటకు D.H.R బ్యాంకు E.P. దాఖలు చేయగా, J.D.R యొక్క ఈ దిగువ షెడ్యూలులో చూపిన ఆస్తులను ది. 5-12-2025వ తేదీన ఉదయం 10.30 గంటలకు బహిరంగ వేలం వేయబడును. ఆసక్తి కలవారు పాల్గొనవచ్చును.
E.P. షెడ్యూలు దాఖలు ఆస్తి వివరము
Item No-1: [illegible] R.S.No: 149/4 - 0.54 సెంట్లు, R.S.No: 149/5 - 0.09 సెంట్లు, R.S.No: 149/9 - 0.33 సెంట్లు, R.S.No: 149/10 - 0.20 సెంట్లు [illegible]
D.H.R. Value : 15,00,000.00
Amina Value : 25,00,000.00
J.D.R. Value చూపలేదు.
Item No-2: [illegible] R.S.No: 308/3 - 0.83 1/4 సెంట్లు [illegible]
D.H.R. Value : 10,00,000
Amin Value : 17,00,000
J.D.R. Value చూపలేదు.
Warrant Amount : 11,36,545.00 [illegible]
ఇట్లు: సనకా రఘురామప్రసాద్, బికాం, బియల్ అడ్వకేట్, అవనిగడ్డ. సెల్: 99499 88835
అవనిగడ్డ, ది. 20-11-2025

నత్తనడకన 'అన్న క్యాంటీన్' నిర్మాణ పనులు

అవనిగడ్డ, న్యూస్‌టుడే

స్థానిక కోడూరు రోడ్‌లో ఆర్టీసీ బస్ డిపో ఎదురుగా రీ-మోడల్ చేస్తున్న అన్న క్యాంటీన్ భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. అక్టోబర్ 2న ప్రారంభించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. కానీ ఇప్పటికీ పనులు పూర్తికాలేదు. గత 10 రోజులుగా పనులు చేయడం లేదు. గతంలో దాతలు సమకూర్చిన రూ.5 లక్షల వ్యయంతో నిర్మించగా, వైకాపా ప్రభుత్వం ఆ భవనాన్ని మరో రూ.5 లక్షలతో మరమ్మతులు చేసి, మత్స్యశాఖ ఏడీ కార్యాలయాన్ని దానిలో ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం ఇటీవల ఆ భవనాన్ని అన్న క్యాంటీన్‌కు తిరిగి కేటాయిస్తూ రీమోడల్ చేయడానికి, చుట్టూ ప్రహరీ నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు చేసింది. అక్టోబర్ 2న క్యాంటీన్ ప్రారంభిస్తామని తొలుత అధికారులు చెప్పారు. నవంబర్ 20 వచ్చినా పనులు పూర్తికాకుండా నిలిచిపోయాయి. దీంతో ఎప్పటికి పనులు పూర్తిచేస్తారో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటి వరకు ప్రహరీకి ప్లాస్టరింగ్, భవనానికి ఫ్లోరింగ్, అద్దాలు ఏర్పాటు చేయడం, రంగులు వేయడం వంటి పనులు పూర్తి చేయలేదు. దీంతో రూ.5తో భోజనం పెట్టే అన్న క్యాంటీన్ పూర్తయి, ఎప్పుడు ప్రారంభిస్తారా అని పలువురు పేదలు ఆశతో ఎదురు చూస్తున్నారు.

అసంపూర్తిగా ఉన్న అన్న క్యాంటీన్ భవనం

రాష్ట్రస్థాయి కబడ్డీకి అగినపర్రు విద్యార్థిని ఎంపిక

అగినపర్రు(పమిడిముక్కల), న్యూస్‌టుడే: కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి స్కూలుగేమ్స్ అండర్ 17 బాలికల కబడ్డీ పోటీలకు తమ పాఠశాల విద్యార్థిని పిట్టా చంద్రకళ ఎంపికైనట్టు అగినపర్రు జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు వి.వెంకటేశ్వరరావు తెలిపారు.

పిట్టా చంద్రకళతో ఉపాధ్యాయులు

డీసీఎం ఢీకొని ఒకరి దుర్మరణం

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతుండగా డీసీఎం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సూరారం ఠాణా పరిధిలో జరిగింది. ఎస్ఐ లీమా తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని కృష్ణా జిల్లా మొవ్వ మండలం కాజ గ్రామానికి చెందిన టి.శ్రీనివాస్‌రెడ్డి(58) రాధ దంపతులు. ఉపాధి కోసం 27ఏళ్ల క్రితం నగరానికి వలస వచ్చి మధుసూదన్‌రెడ్డి నగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి కుమారుడు వెంకట్ ప్రదీప్ రెడ్డి, కుమార్తె దీప్తి సంతానం. . శ్రీనివాస్‌రెడ్డి సీఎన్‌సీ మిషన్లకు మరమ్మతులు చేస్తుంటారు. విధి నిర్వహణలో భాగంగా గురువారం శివాలయనగర్ నుంచి ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. సాయిబాబా నగర్ కూడలిలో రోడ్డు దాటుతుండగా సూరారం నుంచి జీడిమెట్ల వైపు వెళ్తున్న డీసీఎం అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు.

పామర్రు జడ్పీ పీడీ ప్రతిభ

పామర్రు, న్యూస్‌టుడే: ఈనెల 19న ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంటు రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో కృష్ణా జిల్లా తరఫున డిస్కస్‌త్రో విభాగంలో పామర్రు జెడ్పీ పాఠశాలకు చెందిన పీడీ జి.మురళి పాల్గొని తృతీయ స్థానం సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, సిబ్బంది మురళిని అభినందించారు.

డిస్కస్‌త్రో ఆడుతున్న పీడీ మురళి

గుడివాడ, న్యూస్‌టుడే: ఆలిండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంటు రాష్ట్ర స్థాయి పోటీలలో గుడివాడకు చెందిన ఉపాధ్యాయుడు కొమ్మనబోయిన లక్ష్మీ శ్రీనాథ్ తృతీయ స్థానంలో నిలిచారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన షాట్‌పుట్ పోటీలలో వెటరన్ పురుషుల విభాగంలో ఈయన పోటీలకు ఎంపిక అయ్యారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు అభినందించారు.

శ్రీనాథ్

యార్లగడ్డ మాజీ సర్పంచి సంపూర్ణ మృతి

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి మండలం యార్లగడ్డ మాజీ సర్పంచి పోలిశెట్టి సంపూర్ణ(72) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతిచెందారు. 1995 నుంచి 2001 వరకు సంపూర్ణ సర్పంచ్‌గా సేవలందించారు. ఉత్తమ పంచాయతీ అవార్డును కూడా అందుకొన్నారు. భర్త సాంబశివరావు, ముగ్గురు సంతానం ఉన్నారు. ఆమె భౌతికకాయాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు.

చిట్టీ డబ్బులు ఇవ్వలేదని దాడి

గుడివాడ, న్యూస్‌టుడే: చిట్టీ డబ్బులు ఇవ్వలేదని ఓ మహిళను చిట్టీ పాట నిర్వాహకురాలు మరో ముగ్గురితో కలిసి దాడి చేసి గాయపరచిన సంఘటనపై గుడివాడ రూరల్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని వలివర్తిపాడు గ్రామానికి చెందిన బోలెం శివ మల్లేశ్వరి పలవలసి లక్ష్మీ వద్ద చిట్టీలు వేస్తోంది. ఈక్రమంలో మల్లేశ్వరి చిట్టీ నగదు చెల్లించని కారణంగా ఆమెపై మరో ముగ్గురుతో కలిసి ఈనెల 18న రాత్రి లక్ష్మీ దాడి చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో ప్రమాదంలో 9 మందికి గాయాలు

ముళ్లపూడి(పమిడిముక్కల), న్యూస్‌టుడే: వరి కోతల నిమిత్తం బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం దాసరిపాలెం నుంచి 12 మంది కూలీలు గురువారం కృష్ణా జిల్లా పమిడిముక్కల మండలం ముళ్లపూడి చేరారు. వారి ఆటో గ్రామంలో రోడ్డుపై మిట్టపల్లాల్లో అదుపుతప్పి పక్కకు పడిపోవటంతో 9 మంది గాయాల పాలయ్యారని, వారిని ఉయ్యూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని పోలీసులు తెలిపారు. అందులో 7గురు ప్రథమ చికిత్స చేయించుకొని వారి గ్రామం వెళ్లిపోగా ఇద్దరిని మెరుగైన చికిత్సకోసం విజయవాడ పంపినట్లు తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

గ్రంథాలయాల సద్వినియోగంతో విజ్ఞాన సముపార్జన

అవనిగడ్డ, న్యూస్‌టుడే: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలకు వెళ్లి గ్రంథ పఠనం ద్వారా విజ్ఞానవంతులు కావాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా గ్రంథాలయ ఉద్యమ కారుడు అయ్యంకి వెంకటరమణయ్య నాయుడు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గుడి సేవ విష్ణుప్రసాద్, కొండవీటి ఈశ్వర్‌రావు, ఎ.ప్రభ, తదితరులు పాల్గొన్నారు.


అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటం వద్ద ఎమ్మెల్యే మండలి, తదితరులు

గ్రంథాలయానికి నిత్యం వచ్చే విద్యార్థికి బహుమానం

మేడూరు(పమిడిముక్కల), న్యూస్‌టుడే: స్థానిక గ్రంథాలయానికి క్రమం తప్పకుండా నిత్యం వచ్చి చదువుకునే విద్యార్థికి మళ్లీ వచ్చే గ్రంథాలయాల వారోత్సవాల్లో రూ.5వేలు బహుమానంగా అందచేస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక అకాడెమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. మేడూరు గ్రంథాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రంథాలయాధికారి బి.లావణ్య, సహకార సంఘం ఛైర్మన్ గోపిశెట్టి మోహనరావు, యలమంచి శ్రీరంగం, ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న గుమ్మడి గోపాలకృష్ణ

గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా స్థానిక షా గులాబ్ చంద్ శాఖా గ్రంథాలయంలో వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మండల విద్యాశాఖాధికారి 2 బి.బాలాజీ జ్ఞాపికలు అందజేశారు. అతిథులు డీవీ సత్యనారాయణ, సయ్యద్ గఫార్, తెలుగు భాషా వికాస సమితి సమన్వయకర్త డీఆర్‌బీ ప్రసాద్, తదితరులను ఘనంగా సత్కరించారు.
- గుడివాడ, న్యూస్‌టుడే

పామర్రు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. **- పామర్రు, న్యూస్‌టుడే**

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: జమీగొల్వేపల్లి శాఖా గ్రంథాలయంలో వివిధ పోటీల్లో ప్రతిభ కనపర్చిన విజేతలకు గ్రామ సర్పంచి రాయవరపు శాంతకుమారితో కలిసి ఎంపీటీసీ సభ్యుడు ఎర్నేని అరవింద్‌బాబు బహుమతులు అందించారు. హెచ్ఎం టి.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్
పెదపారుపూడి బ్రాంచ్ (బ్రాంచ్ కోడ్ - 3640), మెయిన్ రోడ్డు, పెదపారుపూడి, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్ - 521263. Email id: iob3640@iob.in, Mob : 8925953640 / 9848811322

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ - వేలం బహిరంగ ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ అధీకృత అధికారి గారు దిగువ ఋణం సొమ్ము వసూలు కొరకు, బ్యాంకుకు రావలసిన బకాయిలు మరియు దిగువ తెలిపిన వడ్డీతో సహా రాబట్టుకొనుటకు దిగువ ఆస్తులను "ఎక్కడ ఉన్నది అక్కడ అలాగే" & "ఏది ఉంటే అది" అను పద్ధతిలో అమ్మకం చేసే హక్కుతో సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం జారీచేసిన నోటీసును అనుసరించి స్వాధీనం చేసుకున్నారు. సదరు బకాయిలు మరియు రావలసిన సొమ్మును చెల్లించనందున, దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) ప్రకారం సంక్రమించిన అధికారములతో బ్యాంకుకు రావలసిన బకాయి సొమ్ములు మొత్తం రాబట్టుకొనుటకు సదరు ఆస్తి అమ్మకం చేయుటకు నిర్ణయించినారు. దిగువ సంతకందారు వెబ్‌పోర్టల్ https://baanknet.com నందు గల ఇ-వేలం ప్లాట్‌ఫారంపై సదరు అమ్మకంను నిర్వహించెదరు.

ఋణగ్రహీత పేరు మరియు చిరునామా: శ్రీ కోపూరి ఠాగూర్ కుమార్ (ఋణగ్రహీత & తనఖాదారు), తండ్రి : శ్రీ కె. మధుసూదనరావు, డి.నెం. 4/4, పాత ఆర్.ఎస్.నెం.203/1, కొత్త ఆర్.ఎస్.నెం.203/8, పెదపారుపూడి, కృష్ణాజిల్లా, పిన్ - 521263.

NPA తేది. 02.12.2022, డిమాండ్ నోటీసు తేది : 21.12.2022, ఎక్నాలెడ్జ్‌మెంట్ డిమాండ్ నోటీసు తేది : 21.12.2022

డిమాండ్ నోటీసు నందు పేర్కొన్న బకాయి : తేది.21.12.2022 నాటికి రూ.12,06,337/- + తదుపరి వడ్డీ, కాస్ట్స్, ఇతర ఖర్చులు.

స్వాధీనత నోటీసు తేది: 02-03-2023, స్వాధీనత నోటీసు పేపరు ప్రచురణ తేది: 07.03.2023

స్వాధీనత నోటీసు నందు పేర్కొన్న బకాయి: రూ.12,24,527/- + తదుపరి వడ్డీ, కాస్ట్స్, ఇతర ఖర్చులు.

స్థిరాస్తి వివరములు: ఆంధ్రప్రదేశ్ - 521263, కృష్ణాజిల్లా, పెదపారుపూడి గ్రామం & మండలం, ఆర్.ఎస్.నెం.203/1, కొత్త ఎస్.నెం.203/8, డి.నెం.4/4లోని 123 చ॥గ॥ల విస్తీర్ణంతో గల నివాస ఇల్లు యావత్తు ఆస్తి. హద్దులు: తూర్పు : శ్రీరంగం శ్రీనివాస చక్రవర్తి గారి ఆస్తి - 46", దక్షిణం: పంచాయితీ బజారు - 24", పడమర : పాలడుగు చంద్రశేఖరరావు గారి స్థలం - 46", ఉత్తరం: గోగినేని మధుసూదనరావు గారి స్థలం మరియు ఉమ్మడి బజారు - 24". అన్నీ ఈజిమెంట్ హక్కులతో కలదు.

రిజర్వుధర: రూ.9,90,000/- ధరావత్తు ధర : రూ.99,000/- బిడ్ పెంపుదల మొత్తం: రూ.25,000/-

వేలం తేది మరియు సమయం: తేది.09-12-2025, ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 01.00 గం॥ల వరకు మరియు https://baanknet.com ప్లాట్‌ఫాం నందు వేలం పూర్తి అయ్యే వరకు ప్రతి 10 ని॥లకు ఒక సారి ఆటోటైమ్ ఎక్స్‌టెన్షన్ ఉండును.

ధరావత్తు చెల్లించువిధానం : ఆసక్తి గల బిడ్డర్లు / కొనుగోలుదారులు వారి మొబైల్ నెంబర్ మరియు ఇ-మెయిల్ ఐడి ఉపయోగించి https://baanknet.com పోర్టల్ నందు నమోదు చేసుకొనవలెను. తదుపరి అవసరమైన కెవైసి పత్రాలను అప్‌లోడ్ చేయవలసిందిగా కోరడమైనది. కెవైసి పత్రాలను ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ ధృవీకరించిన తర్వాత (2 పని రోజులు పట్టవచ్చు), ఆసక్తి గల బిడ్డర్లు/ కొనుగోలుదారులు సదరు గ్లోబల్ ధరావత్తు వాలెట్ ఖాతా నందు ఆన్‌లైన్ విధానం ద్వారా ధరావత్తు మొత్తాన్ని 09-12-2025, మధ్యాహ్నం 1.00 గంటలోపు బదిలీ చేయవలెను. ఆసక్తి గల బిడ్డర్లు చెల్లుబాటు అయ్యే ఇ-మెయిల్ చిరునామాను కలిగి ఉండవలెను మరియు పైన పేర్కొన్న సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్ నందు లాగిన్ అవ్వడం ద్వారా వారి పేరు / ఖాతాను నమోదు చేసుకొనవలెను.

బ్యాంకుకు తెలిసిఉన్నంత వరకు ఎలాంటి ఋణభారములు (ఎన్‌కంబరెన్స్) : లేదు

ఆస్తుల తనిఖీ తేది మరియు సమయం : ముందుగా బ్యాంకు వారి అనుమతి తీసుకొని బ్యాంకు పనివేళలలో తేది.21-11-2025 నుండి

ఆన్‌లైన్ ద్వారా ధరావత్తుతో కలిపి బిడ్స్ సమర్పించుట: తేది:21-11-2025 నుండి

ఆన్‌లైన్ ద్వారా ధరావత్తుతో కలిపి బిడ్స్ దాఖలు చేయు చివరి తేది.09-12-2025, మ॥ 1.00 గం॥ వరకు

* ప్రభుత్వ స్థానిక పన్నులు (ఆస్తులకు సంబంధించిన స్థానిక పన్నులు, ప్రోపర్టీ టాక్స్, వాటర్, డ్రైనేజ్ నిర్వహణ ఛార్జీలు, ఎలక్ట్రికల్ బిల్స్ మొదలగునవి) పాల్గొనదలిచిన బిడ్డర్ల ద్వారా నిర్ధారించబడాలి. సఫలీకృతులైన బిడ్డరుదారులే భరించాలి.

* చట్టబద్ధ బకాయిలు కన్నా బ్యాంక్ బకాయిలకు ప్రాధాన్యత ఉంటుంది.

అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కోసం, సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్ : URL: https://baanknet.com లేదా బ్యాంక్ వెబ్‌సైట్ : www.iob.in మరిన్ని వివరముల కొరకు : బ్రాంచి మేనేజర్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పెదపారుపూడి బ్రాంచ్, మెయిన్ రోడ్డు, పెదపారుపూడి గ్రామం & మండలం, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్ - 521263. ఫోన్ నెం.: 9848811322 / 8925953640 & Email id: iob3640@iob.in లేదా సర్వీస్ ప్రొవైడర్ : M/s. Bank Asset Auction Network, రిజిష్టర్డు ఆఫీస్ : యూనిట్ -1, 3వ ఫ్లోర్, VIOS కమర్షియల్ టవర్, వడాలా ట్రక్ టెర్మినల్ దగ్గర, వడాలా ఈస్ట్, ముంబయి - 400037, email: support.BAANKNET@psballiance.com (Website: https://baanknet.com) (సంప్రదించవలసిన నెం.: 8291220220, హెల్ప్ డెస్క్ పనిచేయు సమయం : ఉ॥ 8.00 గం॥ల నుండి రా॥ 8.00 గం॥ల వరకు) వారిని సంప్రదించగలరు.

తేది : 20-11-2025, ప్రదేశం : విజయవాడ సం/- అధీకృత అధికారి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

(c) eenadu

దరఖాస్తు చేశారా?

☛ పంజాబ్ నేషనల్ బ్యాంకులో లోకల్ బ్యాంకు ఆఫీసర్ పోస్టులు (750)
చివరి తేదీ: 23.11.2025

☛ దక్షిణ మధ్య రైల్వేలో స్పోర్ట్స్ కోటా ఖాళీలు
చివరి తేదీ: 24.11.2025

కరెంట్ అఫైర్స్

✦ ఇటీవల ఏ నగరంలో జరిగిన 28వ యూనివర్సల్ పోస్టల్ యూనియన్ (యూపీయూ) కాంగ్రెస్‌లో భారత్ యూపీయూ కౌన్సిల్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్, పోస్టల్ ఆపరేషన్స్ కౌన్సిళ్లకు తిరిగి ఎన్నికైంది? జ: దుబాయ్

మాదిరి ప్రశ్నలు

✦ 'వై ది కాన్‌స్టిట్యూషన్ మ్యాటర్స్' పుస్తక రచయిత ఎవరు? (రచయిత భారతదేశ 50వ ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు.)
జ: మాజీ సీజేఐ డీవై చంద్రచూడ్

✦ వ్యవసాయ సాంకేతిక ఆవిష్కరణల కోసం ఇటీవల భారత్‌తో కలిసి ఏ దేశం 'మైత్రి 2.0'ను ప్రారంభించింది?
జ: బ్రెజిల్ (ఇండియా-బ్రెజిల్ అగ్రిటెక్ క్రాస్-ఇంక్యుబేషన్ ప్రోగ్రామ్‌గా ఈ కార్యక్రమానికి నామకరణం చేశారు.)

✦ వన్డే క్రికెట్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేసిన భారతీయ క్రికెటర్ జాబితాలో ఎవరు ప్రథమ స్థానం సాధించారు?
జ: స్మృతి మంధాన (న్యూదిల్లీలో ఆస్ట్రేలియాతో జరిగిన 3వ వన్డేలో కేవలం 50 బంతుల్లోనే సెంచరీ సాధించిన ఆమె 2013లో ఆస్ట్రేలియాపై విరాట్ కోహ్లీ 52 బంతుల్లో సెంచరీ చేసిన రికార్డును బద్దలు కొట్టింది.)

మరింత సమాచారం

ఈనాడు ప్రతిభ
pratibha.eenadu.net/eenadupratibha.net

జనరల్ స్టడీస్ – ఇండియన్ ఎకానమీ

అద్భుతవృద్ధి జరిగి.. అసమానతలు పెరిగి!

భారతదేశం స్వాతంత్ర్యానంతరం ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో సోవియట్ యూనియన్ నుంచి ప్రేరణ పొంది పంచవర్ష ప్రణాళికలను ప్రారంభించింది. దేశ ఆర్థిక, సామాజిక పురోగతి లక్ష్యాలను సాధించేందుకు వనరులను కేటాయించే ప్రక్రియగా అవి కొనసాగాయి. 1951 నుంచి 2017 వరకు 12 పంచవర్ష ప్రణాళికలు, 5 వార్షిక ప్రణాళికలు పూర్తయ్యాయి. వాటి వల్ల అనేక విజయాలు అందడంతోపాటు పలు అపజయాలూ ఎదురయ్యాయి. 65 ఏళ్లలో కేంద్రం అమలు చేసిన ప్రణాళికలు, వాటి లక్ష్యాలు, విజయాలు, వైఫల్యాలపై పోటీపరీక్షల అభ్యర్థులకు స్థూల అవగాహన ఉండాలి. ప్రణాళికల కారణంగా ఆహార ధాన్యాలు, పరిశ్రమలు, రక్షణ, సాంకేతిక రంగాల్లో అద్భుత పురోగతి సాధ్యమైన తీరుతో పాటు నిరుద్యోగం, ధరల పెరుగుదల, సంపద కేంద్రీకరణ, అసమానతలు అధికమయ్యేందుకు దోహదపడిన పరిస్థితులనూ అర్థం చేసుకోవాలి.



65 ఏళ్ల భారత ప్రణాళికలు

(విజయాలు, వైఫల్యాలు)

ఆర్థిక వ్యవస్థలోని కార్యకలాపాలను నిర్ణీత కాలవ్యవధిలో నిర్దేశించిన లక్ష్యాల వైపు ఒక క్రమంలో నడపడాన్ని అర్థశాస్త్ర పరిభాషలో 'ప్రణాళిక' అంటారు.

భారతదేశంలో ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో భాగంగా ఆర్థిక ప్రణాళికల అమలు కోసం 1950, మార్చి 15న ప్రణాళికా సంఘం ఏర్పాటైంది. 1951, ఏప్రిల్ 1 నుంచి మొదటి పంచవర్ష ప్రణాళిక ప్రారంభమైంది.

లక్ష్యాలు: దేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధి, పేదరికం తగ్గింపు, దేశ వనరులను సమర్థంగా వినియోగించుకోవడం పంచవర్ష ప్రణాళికల ప్రధాన లక్ష్యాలు. ఆర్థికవృద్ధి, ఉపాధి స్థాయిలను పెంచడం, ఆర్థిక స్థిరత్వం, స్వయంసమృద్ధి, సామాజిక న్యాయం, ప్రాంతీయాభివృద్ధితో పాటు ప్రగతిశీల పన్నులు, ఉపాధి కల్పన, రిజర్వేషన్ల ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గించడం, తలసరి ఆదాయం పెంచడం ద్వారా జీవనప్రమాణాలు పెంచడం తదితరాలన్నీ ప్రణాళికల్లో భాగం.

ఆవశ్యకత: ❖ సుస్థిర ఆర్థికాభివృద్ధి సాధించడం. ❖ పేదరికం, నిరుద్యోగం, ఆర్థిక, ప్రాంతీయ అసమానతలు మొదలైన ఆర్థిక సమస్యలకు పరిష్కార మార్గాలను చూపడం. ❖ ఆర్థిక అవస్థాపనా సౌకర్యాల (విద్యుత్తు, రవాణా, సమాచారం) అభివృద్ధి. ❖ సామాజిక అవస్థాపనా సౌకర్యాల (విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్యం) అభివృద్ధి. ❖ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన. ❖ సంతులిత ప్రాంతీయాభివృద్ధి సాధన.

విజయాలు

జాతీయాదాయం, తలసరి ఆదాయంలో పెరుగుదల: మొదటి ప్రణాళిక (1951-56)లో రూ.1.32 కోట్లు ఉన్న జాతీయాదాయం 2011-12 ధరల ప్రకారం 2017-18లో (12వ ప్రణాళిక ముగిసేనాటికి) రూ.114.1 లక్షల కోట్లకు పెరిగింది. జాతీయాదాయం వృద్ధి రేటు 1980 దశకం లోపు 3.5% వద్ద స్థిరంగా ఉండేది. 12వ ప్రణాళికలో 6.8 శాతానికి చేరింది. ➡ తలసరి ఆదాయం మొదటి ప్రణాళికలో 1993-94 ధరల ప్రకారం రూ.3,687 నుంచి 12వ ప్రణాళిక ముగిసేనాటికి (2011-12 ధరల ప్రకారం) 2017-18లో రూ.86,668కు పెరిగింది. తలసరి ఆదాయ వృద్ధి రేటు మొదటి ప్రణాళికలో 1.4% నుంచి 12వ ప్రణాళిక నాటికి 5.4 శాతానికి పెరిగింది.

వ్యవసాయ రంగంలో మార్పు: భారత ప్రభుత్వం 60 ఏళ్లుగా వ్యవసాయం, దాని అనుబంధ కార్యకలాపాలపై 23%-24% పెట్టుబడులు పెట్టింది. 1960వ దశకంలో నూతన వ్యవసాయ వ్యూహాలను ప్రవేశపెట్టడం, హరితవిప్లవానికి ప్రాధాన్యం ఇవ్వడంతో ఆహారధాన్యాల ఉత్పత్తి 1950-51లో 50.8 మిలియన్ టన్నుల నుంచి 2017-18 నాటికి 284.83 మి.టన్నులకు పెరిగింది. అన్ని ఆహార పంటల ఉత్పత్తిలో 4-5 రెట్లు వృద్ధి నమోదైంది. నూనెగింజలు, చెరకు, పత్తి తదితర ఆహారేతర పంటల ఉత్పత్తి కూడా పెరిగింది.

పారిశ్రామిక రంగ ప్రగతి: ప్రణాళికల వల్ల భారీ పరిశ్రమల్లో వైవిధ్యీకరణ సాధ్యమైంది. రెండో ప్రణాళికలో ప్రత్యేకంగా పారిశ్రామికవృద్ధికి ప్రాధాన్యం ఇచ్చి భారీ, మౌలిక పరిశ్రమలను నెలకొల్పారు. 12వ ప్రణాళిక (2012-17)లో సమ్మిళిత వృద్ధిని పెంపొందించడంపై ప్రణాళిక సంఘం దృష్టి సారించింది.

ఆర్థిక అవస్థాపనా సౌకర్యాల వృద్ధి: సత్వర ఆర్థికాభివృద్ధికి కావాల్సిన ఆర్థిక, సామాజిక అవస్థాపనా సౌకర్యాలు వృద్ధి చెందాయి. రవాణా, విద్యుత్తు, సమాచారం, నీటిపారుదల సౌకర్యాలు లాంటి మౌలిక సదుపాయాలు విస్తృతమయ్యాయి.

ఎగుమతి, దిగుమతుల్లో మార్పులు: సత్వర పారిశ్రామికాభివృద్ధి విధాన ఫలితంగా భారతదేశం తన మూలధన వస్తు అవసరాలకు ఇతర దేశాలపై ఆధారపడటం తగ్గింది. 1991లో వచ్చిన నూతన ఆర్థిక సంస్కరణలతో ఎగుమతి, దిగుమతుల్లో అనూహ్య మార్పులు వచ్చాయి. ఉదా: మొదటి పంచవర్ష ప్రణాళికలో భారత దేశ ఎగుమతుల విలువ రూ.606 కోట్లు ఉండగా, 12వ ప్రణాళికలో రూ.16,35,261 కోట్లకు చేరింది.

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో ముందంజ: 1983లో సైన్స్ అండ్ టెక్నాలజీ పాలసీ, 2013లో సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ పాలసీలను ప్రవేశపెట్టారు. ఫలితంగా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంలో దేశం ప్రపంచస్థాయి ప్రమాణాలను సాధించింది. ❖ విదేశీ నిపుణులపై ఆధారపడటం తగ్గి, ప్రస్తుతం ప్రపంచ నలుమూలలకు నిపుణులను ఎగుమతి చేసే దేశంగా భారత్ అవతరించింది. ఉదా: గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో భారత దేశం 39వ స్థానంలో, ప్రపంచ వ్యాప్తంగా మేధోసంపత్తిదారుల్లో 6వ స్థానంలో ఉంది.

పొదుపు, పెట్టుబడుల వృద్ధి: 1950-51లో స్థూలదేశీయోత్పత్తిలో పొదుపు 9% ఉండగా, 12వ ప్రణాళిక (2012-17)లో 34.02 శాతానికి పెరిగింది. ఇదే కాలంలో పెట్టుబడులు 9% నుంచి 38.8 శాతానికి చేరాయి.

కొన్ని ప్రభుత్వ సంస్థలు ఉద్దేశపూర్వకంగా, సుదీర్ఘ ఆలోచన తర్వాత ఆర్థిక ప్రాధాన్యాలను ఎంపిక చేసుకోవడమే ప్రణాళిక రచన. - బార్బరా ఊటన్

వైఫల్యాలు

ధరల పెరుగుదల: పంచవర్ష ప్రణాళికల లక్ష్యాల్లో ధరల స్థిరత్వం ఒకటి. కానీ మొదటి ప్రణాళిక తప్ప మిగతా అన్ని ప్రణాళికల్లో ధరలు విపరీతంగా పెరిగాయి. రెండో ప్రణాళికలో సగటున 6.3%, మూడో ప్రణాళికలో 5.8%, 4వ ప్రణాళికలో 9%, 12వ ప్రణాళికలో ధరల పెరుగుదల 4.5% - 5.0%గా ఉంది.

పేదరికం, నిరుద్యోగం వృద్ధి: 65 ఏళ్ల ప్రణాళిక కాలంలో నిరుద్యోగం, పేదరికం పెరుగుతూనే ఉన్నాయి. 2012 భారత ప్రభుత్వ నివేదిక ప్రకారం 21.9% జనాభా (300 మిలియన్లు) దారిద్య్రరేఖకు దిగువన ఉంది. ఎన్ఎస్ఎస్ నివేదిక ప్రకారం 1999-2000 నాటికి 26.58 మిలియన్లుగా ఉన్న నిరుద్యోగులు, 2009-10 నాటికి 28.1 మిలియన్లకు పెరిగారు.

'లభ్యమవుతున్న వనరులను గరిష్ఠ సామర్థ్యంతో ఉపయోగించి, కొన్ని స్పష్టమైన లక్ష్యాలను సాధించాలని ప్రభుత్వం తీసుకునే చొరవే ప్రణాళిక.' - ప్రణాళికా సంఘం

ఆదాయ సంపదల పంపిణీలో అసమానతలు: ప్రణాళికల లక్ష్యాల్లో ఆదాయం, సంపద పంపిణీ ప్రధానమైంది. కానీ ఈ ప్రణాళికలు అసమానతలు పెరగడానికి దోహదపడ్డాయి. ధనిక వర్గం మరింత ధనవంతులుగా, పేదవర్గం మరింత పేదలుగా మిగిలిపోయారు.

అసమర్థ పాలన: 'భారత ప్రణాళికల లోపాల్లో ప్రధానమైంది వాటి అమలే' అని యూఎన్ఓ నిపుణుల బృందం పేర్కొంది. అసమర్థ పాలన, పాలకుల, ప్రభుత్వ యంత్రాంగంలో నిజాయతీ లేకపోవడం, స్వార్థ ప్రయోజనాలు, అధికార లాబీయింగ్ కారణంగా వాటి లక్ష్యాలు నెరవేరలేదు. ❖ సంతులిత ప్రాంతీయ అభివృద్ధి సాధించడంలోనూ ప్రణాళికలు విఫలమయ్యాయి. ఉదా: హరియాణా తలసరి ఆదాయం, బిహార్ తలసరి ఆదాయం కంటే నాలుగు రెట్లు అధికంగా ఉంది.

రచయిత: దమరపల్లి రమణయ్య

స్టూడెంట్‌కు అసలు అర్థం తెలుసా!

స్టడీ స్కిల్స్

ప్రసిద్ధ ఆంగ్ల పదాలకు సంబంధించి దాదాపు అన్నింటిలో ప్రతి అక్షరానికి ఒక అర్థం ఉంటుంది. అలాగే STUDENT అనే పదంలోని అక్షరాల్లోనూ విస్తృత అర్థం ఉంది. మొదటి అక్షరం 'ఎస్' సిన్సియారిటీని సూచిస్తుంది. అంటే చదువు పట్ల నిజాయతీగా ఉండటమే విద్యార్థికి ఉండాల్సిన మొదటి లక్షణం. అర్థం కాకపోయినా అర్థమైనట్లుగా, రాని దానిని వచ్చినట్లుగా నటించకూడదని చెబుతోంది. ఆ విధంగా ప్రతి అక్షరానికి ఉన్న ఒక్కో స్ఫూర్తిదాయక అర్థంతో పాటు దానికి ఇచ్చిన సరైన వివరణలపై కూడా అభ్యర్థులు అవగాహన పెంచుకోవాలి. ఉత్తమ విద్యార్థికి ఉండాల్సిన ఆ లక్షణాలను, 'స్టూడెంట్'లోని అక్షరాల పూర్తి అర్థాన్ని తెలుసుకోవాలంటే **క్యూఆర్ కోడ్** స్కాన్ చేయండి.

ఐదేళ్లు సంరక్షణ.. నిరంతర ఆదాయం

అన్నదాతకు సిరులు కురిపించే వక్క సాగు

మడకశిర, న్యూస్‌టుడే

వక్క తోటల సాగు అన్నదాతకు సిరులు కురిపిస్తుంది. ఐదేళ్ల పాటు సంరక్షణ చేపడితే అనంతరం రాబడి మొదలవుతుంది. ఏటా దిగుబడి పెరగడంతో పాటు ఆదాయం రెట్టింపవుతుంది. చెట్లకు అవసరమైన మేరకు నీరు, పేడ, మట్టిని అందిస్తే చాలు. ఈ పంట సాగులో పెద్దగా ఖర్చు చేయాల్సింది లేదు. ధరలు నిలకడగా ఉంటే రూ.లక్షల్లో ఆదాయం లభిస్తుంది.

నేల ఎంపిక : సాధారణంగా వక్క అన్ని నేలల్లో పండుతుంది. నీరు నిలవకుండా ఉండే భూములు ఎంపిక చేసుకుంటే మొక్క త్వరితగతిన పెరిగేందుకు మంచి అవకాశం. 25 నుంచి 35 డిగ్రీల మధ్య వాతావరణం అనుకూలంగా ఉండాలి. సాలుకు సాలుకు మధ్య 9 అడుగులు, మొక్కకు మొక్కకు మధ్య 7 అడుగులు దూరం పాటించాలి. ఇలా ఒక ఎకరాలో 450 నుంచి 500 మొక్కలు నాటుతారు. కొత్తగా నాటిన మొక్కలకు ఎండ నుంచి రక్షణ కోసం నీడ ఇచ్చే అవిస మొక్కలను నాటుకోవాలి. రెండేళ్ల వరకు నీడలోనే మొక్క పెరుగుతుంది. వక్క మొక్కలకు రసాయన ఎరువులు, పురుగుల మందుల అవసరం ఉండదు. సేంద్రియ ఎరువులు ఏడాదికి ఒకసారి మాత్రమే వేస్తారు. డ్రిప్ ద్వారా సరిపడా నీరు వదులుతారు. అనంతరం అయిదేళ్లకు వక్క పంట దిగుబడి ప్రారంభమవుతుంది.

నారు పోసే విధానం : సాగుకు ముందు 40 ఏళ్ల వయసున్న మంచి దిగుబడి ఇచ్చే మొక్క నుంచి విత్తనాలు సేకరిస్తారు. వాటిని గోనెసంచుల్లో కట్టి రెండు నెలల పాటు నీడలో ఉంచి నీరు పోస్తే మొలక వస్తుంది. ఈ మొలకలను మట్టి వేసిన పాలిథిన్ కవర్లలో ఉంచి నీరు పోస్తే ఏడాదికి 2 అడుగులు పెరుగుతుంది. అనంతరం గుంతల్లో నాటి బిందు సేద్యం ద్వారా నీరందించాలి. ఇలా అయిదేళ్ల పాటు ఎకరాకు రూ.50 వేల వరకు పెట్టుబడి అవుతుంది. నాటిన అయిదేళ్ల అనంతరం ఒక చెట్టు నుంచి గరిష్ఠంగా 30 కేజీల వరకు పచ్చి కాయలు వస్తాయి. వీటిని ఒలిచి.. ఉడకబెట్టి, అయిదు రోజుల పాటు ఎండబెడితే 3 కిలోల ఎండిన వక్క సిద్ధమవుతుంది. ఇలా ఏటా ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల వక్క దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాలు ధర రూ.52 వేలు ఉంది. ఈ లెక్కన ఎకరాకు రూ.5 లక్షల వరకు ఆదాయం వస్తే రూ.లక్ష పెట్టుబడి పోనూ రూ.4 లక్షలు నికర లాభం వస్తుంది. అదనపు ఆదాయం కోసం అంతర పంటలుగా తమలపాకు, మిరియాలు, పూలచెట్లు, చెక్క ఇతర సుగంధ ద్రవ్యాలను సాగు చేసుకోవచ్చు.

రాష్ట్రంలోనే అమరాపురం అగ్రస్థానం : ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గం అమరాపురం మండలం వక్క సాగులో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంది. శ్రీసత్యసాయి జిల్లాలో 6 వేల ఎకరాల్లో ఈ పంట సాగవుతుండగా, ఒక్క అమరాపురం మండలంలోనే 3,100 ఎకరాల్లో సాగులో ఉంది. అలాగే అగళి, రొళ్ల, గుడిబండ మండలాల్లోనూ ఈ పంట అత్యధికంగా సాగు చేస్తున్నారు. అమరాపురం మండలంలో వక్క సాగు ద్వారా రైతులు ఏటా దాదాపు రూ.వంద కోట్ల వరకు ఆదాయం పొందుతుండడం గమనార్హం.

చలికాలంలో పాడి పశువులు జాగ్రత్త

న్యూస్‌టుడే తోట్లవల్లూరు

చలికాలంలో పాడి పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటికి సోకే వ్యాధులు, నివారణోపాయాల గురించి పశువైద్యశాల సహాయ సంచాలకుడు జె.ప్రకాష్‌బాబు వివరించారు. పశువులను చలికాలంలో రాత్రిళ్లు ఆరుబయట ఉంచొద్దు. చుట్టూ గోతాలు కట్టిన చావిళ్లలో ఉంచాలి. ఆరుబయట ఉంచితే వాటి శరీర, వాతావరణంలోని ఉష్ణోగ్రతల మధ్య ఏర్పడే తీవ్ర వ్యత్యాసాలతో అవి కొంత మేర శక్తిని కోల్పోతాయి. ఈ కాలంలో వాటికి అదనంగా దాణా కూడా పెట్టాలి. పశువులు ఎక్కువగా శీతకాలంలో ఈత, ఎదకు వస్తాయి. ఎదకొచ్చిన వాటి నుంచి తీగలు వస్తాయి. పశుపోషకులు వాటిని గుర్తించి ఒక రెండు రోజుల్లో సెమన్ వేయించాలి. ఈనిన పశువుల పాలను తీసిన తర్వాత పొదుగును యాంటీ సెప్టిక్ ద్రావణంతో కడిగి జాగ్రత్తలు తీసుకోవాలి. చలికాలంలో ఈ జాగ్రత్తలు పాటిస్తే వ్యాధుల బారిన పడకుండా పశువులను కాపాడుకోవచ్చని పశువైద్యాధికారి తెలియజేశారు.

రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సలహా

ప్రశ్న: వంగ సాగుకు నేలలు, రకాలు, విత్తే కాలం, విత్తన మోతాదు గురించి వివరించండి? -కె.రాజారావు, రైతు, పూషడం

సమాధానం: వంగ సాగుకు లోతైన, సారవంతమైన, మురుగు పారే సౌకర్యం ఉన్న అన్ని రకాల నేలలు అనుకూలం. ఉదజని సూచిక 5.5-6.5 నేలలు శ్రేష్ఠం. రాష్ట్రంలో 15-20 శాతం సంకర రకాలు సాగులో ఉన్నాయి. ఏడాది పొడవునా వంగ సాగు చేయవచ్చు. నవంబరు మాసం అనుకూలంగా ఉంటుంది. ఎకరానికి సూటి రకాలు 260 గ్రాములు, సంకర రకాలు 124 గ్రాముల విత్తన నారు సరిపోతుంది. 30-35 రోజుల వయసు గల మొక్కలను ప్రధాన పొలంలో నాటుకోవాలి. గుబురుగా పెరిగే రకాలను 75×50 సెం.మీ., పొడవుగా నిటారుగా పెరిగే రకాలను 50×50 సెం.మీ. ఎడంతో నాటుకోవాలి.

ప్రశ్న: పాద చిక్కుడు విత్తన మోతాదు, ఎరువులు, నీటి యాజమాన్యం వివరించండి? -ఎం.బాబూరావు, యండకుదురు

సమాధానం: ఎకరానికి 16 కిలోలు విత్తనం సరిపోతుంది. విత్తడానికి వారం రోజులు ముందు ఆఖరి దుక్కిలో పశువుల ఎరువు 8-10 టన్నులు వేసి దున్నాలి. 24 కిలోలు భాస్వరం, 12 కిలోల పొటాష్‌తో పాటు మొదటి దఫా 15 కిలోల నత్రజని వేయాలి. రెండో దఫా 15 కిలోల నత్రజనిని విత్తిన 30 రోజులకు వేయాలి. ఎరువులు వేసిన వెంటనే నీరు కట్టాలి. 7-10 రోజులకోసారి నీటితడి ఇవ్వాలి. పూత, కాయ దశలో నేల 50 శాతం తేమ ఉండేలా చూసుకోవాలి.

- వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కేవీకే, ఘంటసాల
- న్యూస్‌టుడే, ఘంటసాల

మిరప పంటలో సస్యరక్షణ చర్యలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మిర్చి పంట ప్రస్తుతం పూత, పిందె దశలో ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఆయా తోటల్లో నీరు నిలిచింది. దీంతో పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలను నందిగామ ఉద్యాన అధికారిణి వర్ధిని వివరించారు. అధిక వర్షాలకు మిరప మొక్కలు తలవాల్చితే తేరుకోడానికి లీటరు నీటికి పది గ్రాముల యూరియా కలిపిన ద్రావణాన్ని వారంలో రెండు సార్లు పిచికారీ చేయాలి. వేరు కుళ్లు ఆశించకుండా లీటరు నీటికి మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ ద్రావణాన్ని మొక్కల మొదళ్లలో వేర్లు తడిసేలా పోయాలి. సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి.

నేటి దుర్గగుడి సమాచారం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై దుర్గగుడి అంతరాలయంలో వేకువజామున ఉదయం 3 గంటలకు సుప్రభాత సేవ, 3.30కు వస్త్రాలంకరణ సేవ, 4 గంటలకు దేవి ఖడ్గమాలార్చన నిర్వహిస్తారు.

ఉదయం భక్తులకు సర్వదర్శనం కోసం వేకువజామున 5 గంటల నుంచి క్యూలైన్లలోకి అనుమతిస్తారు. యాగశాలలో ఉదయం 6.30కు గణపతి హోమం, 7 గంటలకు రుద్రహోమం, 7.30కు నవగ్రహ శాంతిహోమం, 8 గంటలకు మృత్యుంజయ హోమం, 8.30కు చండీహోమం నిర్వహిస్తారు. ప్రాకార మండపంలో ఉదయం 7.30కు లక్ష కుంకుమార్చన, 8 గంటలకు శ్రీచక్ర నవావరణార్చన, మల్లేశ్వరాలయ ప్రాంగణంలో 9 గంటలకు శాంతి కల్యాణం ఆర్జిత సేవలుగా చేస్తారు.

మధ్యాహ్నం అమ్మవారికి ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పంచభోగ నివేదన చేస్తారు. ఆ సమయంలో అన్ని దర్శనం క్యూలైన్లు నిలిపేస్తారు. వీఐపీ, ప్రోటోకాల్ దర్శనాలు ఉండవు. మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5.30 వరకు దర్శనాలకు అనుమతిస్తారు.

సాయంత్రం దుర్గమ్మకు సాయంత్రం 4 గంటలకు స్వర్ణపుష్పార్చన సేవ(గురువారం మాత్రమే), 6 నుంచి 7 వరకు నివేదన, వేద స్వస్తి, పంచహారతులు ఇస్తారు. అన్ని దర్శనాలను ఈ సమయంలో నిలిపివేస్తారు. సాయంత్రం 7 నుంచి రాత్రి 10 వరకు అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు.

☛ ప్రతి రోజు రాహుకాలంలో నటరాజ స్వామి ఆలయ ప్రాంగణంలో రాహుకేతు పూజలు జరుగుతాయి. ఆర్జిత సేవలకు టిక్కెట్ రుసుము చెల్లించిన భక్తులను మాత్రమే రానిస్తారు. www.kanakadurgamma.com,https:/// www.aptemples.ap.gov.in వెబ్‌సైట్ల ద్వారా ఆర్జిత సేవా టికెట్లు, ఇతర సమాచారం అందుబాటులో ఉంది. వాట్సప్ నంబరు: 955230 0009 ఆర్జిత సేవలు, దర్శనం టికెట్లు, విరాళాలను ఇచ్చేందుకు అవకాశం ఉంది.

☛ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు మల్లికార్జున మహామండపం రెండో అంతస్తులో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేస్తారు.

స్వరాజ్ మైదాన్ కాంప్లెక్స్‌ను సక్రమంగా నిర్వహించడం లేదు

హైకోర్టులో వ్యాజ్యం

ఈనాడు, అమరావతి: విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్వరాజ్ మైదాన్ కాంప్లెక్స్ నిర్వహణ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొంటూ దాఖలైన వ్యాజ్యంపై గురువారం హైకోర్టు విచారణ జరిపింది. పూర్తి వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించింది. విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. అధికారుల నిర్లక్ష్యం, అశ్రద్ధ కారణంగా 18 ఎకరాల్లో విస్తరించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్వరాజ్ మైదాన్ కాంప్లెక్స్ అపరిశుభ్రంగా మారిందని పేర్కొంటూ బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి వై.కొండలరావు హైకోర్టులో వ్యాజ్యం వేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది జడా శ్రావణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. 'ప్రస్తుతం అక్కడ పరిస్థితి దారుణంగా ఉంది. కన్వెన్షన్ కేంద్రం, గ్రంథాలయం, బౌద్ధ ధ్యాన కేంద్రాన్ని మూసివేశారు. నడక మార్గంలో లైట్లు పనిచేయడం లేదు. ఫౌంటెన్లలో నీళ్లు పాచిపట్టి ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది' అని పేర్కొన్నారు.. న్యాయమూర్తి స్పందిస్తూ, పూర్తి వివరాలు సమర్పించాలని విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.

25 నుంచి మత్తు వైద్యుల జాతీయ సదస్సు

మధురానగర్, న్యూస్‌టుడే: మత్తు వైద్యుల 72వ జాతీయ సదస్సు ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో ఈనెల 25 నుంచి 30 వరకు జరుగుతుందని ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్థీషియాలజిస్ట్‌ల రాష్ట్ర పూర్వపు అధ్యక్షుడు డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్ తెలిపారు. 25, 26 తేదీల్లో కార్యశాల ఉంటుందని, 27న మత్తు వైద్యులకు నిరంతర వైద్య విద్య తరగతులు జరుగుతాయని తెలిపారు. 28 నుంచి 30 వరకు మత్తు వైద్యంలో వచ్చిన అత్యాధునిక మార్పులపై సదస్సు జరుగుతుందని, దీనికి దేశ, విదేశాల నుంచి దాదాపు 300 మంది ఫ్యాకల్టీ నిపుణులు, 4 వేల మంది మత్తు వైద్యులు హాజరవుతారని డాక్టర్ తారకప్రసాద్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

కంటెయినర్ ఢీ.. ఒకరి దుర్మరణం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై కోడూరుపాడు వద్ద బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. వీరవల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ మధురానగర్‌కు చెందిన బొద్దుబోయిన ఏడుకొండలు(38) మరొకరితో కలిసి సరకు రవాణా నిమిత్తం ఆటో నడుపుతూ విశాఖపట్నం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బుధవారం రాత్రి 7 గంటల సమయంలో కోడూరుపాడు ఎస్టీ ఫెర్టిలైజర్స్ సమీపంలో ఆగారు. ఈ క్రమంలో గాలికి ఎగురుతున్న పరదాను ఏడుకొండలు సరి చేస్తుండగా వెనక నుంచి వచ్చిన కంటెయినర్ లారీ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. గురువారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

జోగి సోదరుల కస్టడీపై ముగిసిన వాదనలు

25న ఉత్తర్వులు ఇవ్వనున్న ఎక్సైజ్ కోర్టు

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో వైకాపా నేత జోగి రమేష్, అతని సోదరుడు రాము కస్టడీపై గురువారం ఎక్సైజ్ కోర్టులో వాదనలు ముగిశాయి. తీర్పును ఈనెల 25న ఇవ్వనున్నట్లు న్యాయాధికారి లెనిన్‌బాబు ప్రకటించారు. జైలులో తనకు ములాఖత్‌లు పెంచాలన్న జోగి రమేష్ పిటిషన్‌పై కోర్టు తీర్పు ఇచ్చింది. వారంలో రెండు సార్లు కుటుంబ సభ్యులతో, న్యాయవాదులతో అదనంగా ములాఖత్‌లను పెంచుతూ కోర్టు ఉత్తర్వులిచ్చింది. అద్దేపల్లి జనార్దనరావు, జగన్మోహన్‌రావు, బాదల్ దాస్, ప్రదీప్ దాస్, జోగి రమేష్, రాముల బెయిల్ పిటిషన్లపై కౌంటర్ల దాఖలు కోసం ఈనెల 27కి వాయిదా వేశారు. రవి, కల్యాణ్, తిరుమలశెట్టి శ్రీనివాసరావుల బెయిల్ పిటిషన్లపై విచారణ 25కు వాయిదా పడింది. చెక్కా సతీష్ కుమార్, శ్రీనివాసరెడ్డి బెయిల్ పిటిషన్లపై విచారణ 27కు న్యాయాధికారి వాయిదా వేశారు.

మద్యం కేసులో వివిధ పిటిషన్లపై విచారణ వాయిదా

ఈనాడు - అమరావతి: మద్యం కేసులో గురువారం విచారణ నిమిత్తం.. ఏసీబీ కోర్టుకు వచ్చిన పలు పిటిషన్లు వాయిదా పడ్డాయి. దిల్లీలో సమావేశం ఉన్నందున.. శుక్రవారం సిట్ ఎదుట హాజరుకాలేనని, పార్లమెంట్ సమావేశాలకు హాజరయ్యేందుకు అనుమతించాలని వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి వేసిన రెండు పిటిషన్లపై విచారణ 21వ తేదీకి వాయిదా పడ్డాయి. కారాగారంలో వసతులు కల్పించాలని వైకాపా నేత చెవిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్, బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణ బెయిల్ పిటిషన్లపై తదుపరి వాయిదాల నిమిత్తం 21వ తేదీకి వాయిదా వేశారు.

అరుణకు బెయిల్ మంజూరు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: ఎస్సై, అంగన్‌వాడీ పోస్టులు ఇప్పిస్తానంటూ ఒక వృద్ధుడిని రూ.24.5 లక్షలు మోసం చేసిన కేసులో నిందితురాలు నిడిగుంట అరుణకు విజయవాడ 1వ అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. మోసం కేసులో నెల్లూరుకు చెందిన అరుణపై గత నెల 13న విజయవాడ సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేసి ఆమెను పీటీ వారెంట్‌పై న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఈ కేసులో నిందితురాలిని రెండు రోజుల పాటు పోలీసులు తమ కస్టడీలోకి తీసుకుని విచారించారు. నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్న అరుణ ఈ కేసులో తనకు బెయిల్ ఇవ్వాలంటూ న్యాయవాది ద్వారా పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన న్యాయమూర్తి దేవిక నిందితురాలికి బెయిల్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రూ.25 వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించారు.

(c) eenadu

నిత్య కార్తికం.. పచ్చతోరణం

కార్తిక మాసం సందర్భంగా కళాశాల విద్యార్థులు అంతా ఎక్కడో పచ్చని ప్రాంతానికి విహారయాత్రకు వెళ్లి ఇలా మధ్యాహ్న భోజనం చేస్తున్నారని అనుకుంటున్నారా..! అదేంకాదండి వీరికి నిత్యం కార్తిక వనభోజనాలే. ఏడు దశాబ్దాలుగా ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాల ప్రాంగణం ఇది. 1954లో ప్రారంభమై.. 98 ఎకరాల్లో విస్తరించిన ఈ కళాశాలలో సుమారు 20 ఎకరాల్లో మాత్రమే తరగతి గదులు, వసతిగృహాలు, కార్యనిర్వహణ భవనాలు ఉంటాయి. మిగిలిన 78 ఎకరాలు భారీ వృక్షాలతో, విశాలమైన మైదానాలతో నిండి ఉంది. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్‌లలో 5వేల మందికి పైగా విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. నిత్యం ఇలా మధ్యాహ్న విరామ సమయంలో కళాశాలలో అంతర్గత రహదారుల్లో పచ్చని చెట్ల నీడలో ఆహ్లాదభరిత వాతావరణంలో అమ్మాయిలు ఒకవైపు, అబ్బాయిలు మరోవైపు కూర్చుని భోజనాలు చేస్తారు. **- ఈనాడు, అమరావతి**

ప్రత్యేక రైళ్లు పొడిగింపు

విజయవాడ (రైల్వేస్టేషన్): ప్రయాణికుల సౌకర్యార్థం వివిధ ప్రాంతాలకు నడుపుతున్న ప్రత్యేక రైళ్లను పండగల దృష్ట్యా పొడిగిస్తున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబరు 07033/07034 కాకినాడ టౌన్- మైసూర్ ప్రత్యేక రైలు డిసెంబరు 1వ తేదీ నుంచి జనవరి 13 వరకు, 07153/07154 నర్సాపూర్- బెంగళూరు జనవరి 2వ తేదీ నుంచి 10 వరకు, 07165/07166 హైదరాబాద్- భువనేశ్వర్ డిసెంబరు 12వ తేదీ నుంచి జనవరి 28 వరకు రాకపోకలు సాగిస్తాయని చెప్పారు.

ధాన్యం సేకరణ.. ఇక హాయ్ హాయి!

కంకిపాడు, ఉయ్యూరు గ్రామీణం, గంపలగూడెం: ఆరుగాలం శ్రమించి పండించిన వ్యవసాయోత్పత్తుల సేకరణలో ఎదురవుతోన్న ఇబ్బందులను చాలా వరకు పరిష్కరించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక సాంకేతికత సాయంతో వినూత్న ప్రక్రియలను అందుబాటులోకి తెస్తోంది. ఈ-పంట నమోదును సంబంధిత రైతు ఫోన్ నంబరుతో లింక్ చేస్తున్నారు. దీని ఆధారంగా కల్లంలోనే ఉండి ఖరీఫ్ ధాన్యం సమాచారాన్ని నిర్ధారిత 'యాప్'లో అప్‌లోడు చేసుకునే సౌకర్యం కల్పించారు. లింకైన ఫోన్ నుంచి వాట్సప్‌లో 7337359375కు 'హాయ్(హెచ్ఐ)' అని సందేశం పంపిన వెంటనే రైతుకు నమూనా తెరపై ప్రత్యక్షమవుతుంది.

జిల్లాలో వరి సాగు విస్తీర్ణం: 1.34 లక్షల ఎకరాలు
దిగుబడి: 3.59 లక్షల మెట్రిక్ టన్నులు
కొనుగోలు కేంద్రాలు: 149
ధాన్యం కొనుగోలు లక్ష్యం: 1.5 లక్షల మెట్రిక్ టన్నులు

సందేశం పంపితే స్పందిస్తారు

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకోవాలనుకునే రైతులు 'హాయ్' సందేశం పంపగానే పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందిస్తారు. రైతు వద్ద ఎన్ని బస్తాల ధాన్యం ఉంది.. ఏ రకానికి చెందినది.. ఎగుమతికి ఇంకా ఎన్ని రోజులు అవసరం.. వంటి ప్రశ్నలకు ఐచ్ఛిక(ఆప్షన్)రూపంలో రైతు బదులివ్వాలి. అనంతరం సమీప కొనుగోలు కేంద్రం, సేకరణ రైస్ మిల్లు ఊరు, పేరుతో పాటు స్లాట్ బుక్ అవుతుంది. దీంతో ఎక్కడికి, ఎప్పుడు తీసుకెళ్లాలనే ఆందోళన తొలగిపోతుందని చెబుతున్నారు.

నిస్పృహ వలదండి.. నిశ్చయంగా కదలండి..

ఈనాడు, అమరావతి

'విజయవాడ, మచిలీపట్నం నగరాలు.. ఉమ్మడి జిల్లాలో అన్ని పట్టణాల్లో నిత్యం ఎదుర్కొనే.. అనేక ప్రమాద, కాలుష్య సమస్యలను.. పౌరస్పృహతోనే పరిష్కరించుకోవాలి.. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిని గుల్లచేస్తు.. పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తున్నాయి. దుకాణాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలపై విస్తృత ప్రచారం చేస్తున్నా మార్పురాలేదు. ఇది నా సమస్య కాదని అందరూ అనుకోవడం వల్లే.. ప్లాస్టిక్ వ్యర్థాలు మరింతగా పెరుగుతున్నాయి. ఇది భవిష్యత్తులో మరింత ప్రమాదకరం కానుంది.'

17 నగరాల్లో మనమూ... 2025 అక్టోబరు 02 నుంచి పర్యావరణ, ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా విజయవాడ, మచిలీపట్నం సహా 17 నగరాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తిగా నిషేధిస్తూ ప్రభుత్వం ఆదేశించింది. కానీ.. ప్లాస్టిక్ వినియోగం ఏమాత్రం తగ్గలేదు.

చైతన్యంతో అడుగేస్తేనే ప్లాస్టిక్ నిషేధం

భయపెడుతున్న భూకాలుష్యం...

ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ కవర్లతో నగరాల్లో భూకాలుష్యం తీవ్రమవుతోంది. విజయవాడలో దుకాణాలకు ప్లాస్టిక్ నిషేధం కొనసాగుతుండగా కొంతమేర నియంత్రించారు. ఇప్పటికీ అన్ని చిన్న, పెద్ద దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్ల వినియోగం యథేచ్ఛగా సాగుతోంది.

నిత్య వేదనే..

✦ **విజయవాడ:** ఇళ్లు, హోటళ్లు, మార్కెట్లు, వ్యాపార సంస్థల నుంచి రోజుకు 550-600 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు విడుదల అవుతుండగా.. వీటిలో 20 మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ చెత్తనే.

✦ **మచిలీపట్నం:** రోజుకు 80 మెట్రిక్ టన్నుల చెత్త వస్తే.. 3-5 టన్నులు ప్లాస్టిక్ వ్యర్థాలే.

1 ఓ సంచి తీసుకెళ్దాం: ప్లాస్టిక్ కవర్లను వాడకూడదనే స్పృహ ప్రజల్లో రానంత వరకు వినియోగం ఆగదు. నిత్యం.. బైక్, కార్లలో ఓ సంచిని పెట్టుకుంటే.. ప్లాస్టిక్ కవర్ల వినియోగం దాదాపు ఆగిపోతుంది. రెండు నగరాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల్లో అత్యధికం.. పాలిథిన్ కవర్లే.

2 తడిపొడి వేరుచేద్దాం: నిత్యం ఇంటికొచ్చి మరీ తడి పొడి చెత్త సేకరిస్తున్నా.. ఇప్పటికీ సగం ఇళ్లలో ప్లాస్టిక్ కవర్ల తోపాటే చెత్తంతా కలిపేసి వేస్తున్నారు. కొన్నిచోట్ల వేర్వేరుగా ఇస్తున్నా.. సిబ్బంది కలిపేసి వాహనాల్లో పోసేస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి.

3 మద్యం దుకాణాల వద్ద: రెండు నగరాల్లో మద్యం దుకాణాలకు ఆనుకుని ఉండే కాలువలన్నీ.. ప్లాస్టిక్ గ్లాసులు, బాటిళ్లతో నిండి.. కనిపిస్తున్నాయి.

4 నాలుగు కాలువల్లో: నగరంలో అన్ని డ్రెయినేజీ కాలువలు.. బందరు, రైవస్, ఏలూరు, బుడమేరు కాలువల్లో నిత్యం 4-5 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు పోస్తున్నారు.

5 ఒక్క చోటే రెండు టన్నులు: విజయవాడ రైల్వేస్టేషన్ వద్ద ఉన్న భూగర్భ డ్రెయినేజీ కాలువల్లోనే నిత్యం కనీసం రెండు టన్నుల ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు పోస్తున్నారు.

కోటి కాంతులు.. శతకోటి ప్రణతులు

పవిత్ర సంగమం వద్ద కోటి దీపోత్సవం శోభ

ఇబ్రహీంపట్నం: పవిత్ర సంగమం వేదికగా కోటి దీపోత్సవం గురువారం సాయంత్రం కనుల పండువలా నిర్వహించారు. శివపార్వతుల కల్యాణ క్రతువు అనంతరం వేల మంది భక్తులు దీపాలను వెలిగించారు. ఎంపీ కేశినేని చిన్ని, కలెక్టర్ లక్ష్మీశ తదితరులు పాల్గొన్నారు.

వి హారం నోదం జ్ఞానం

విజయవాడ సిటీ, వత్సవాయి, న్యూస్‌టుడే

తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలను విద్యార్థులు క్షేత్రస్థాయిలో దృశ్యరూపంగా దర్శించడం వల్ల వారిలో పూర్తి అవగాహన కలుగుతుంది. ఈ ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం పీఎంశ్రీ పాఠశాలల్లో విద్యార్థులు విజ్ఞాన విహార యాత్రలకు వెళ్లేలా చర్యలు తీసుకుంది.

పర్యాటక ప్రదేశాల సందర్శనకు అనుమతి

హైకోర్టు వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు

భవానీపురం సైన్స్ సెంటర్‌లో బాలికలు

జిల్లాలో 208 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 27 స్కూళ్లను పీఎంశ్రీకి ఎంపిక చేశారు. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం, చారిత్రక, వారసత్వ కట్టడాలు, పర్యాటక ప్రదేశాలు, పాలన, న్యాయపరమైన కార్యాలయాలపై అవగాహన కల్పించాలని సమగ్ర శిక్షా విజ్ఞాన విహార యాత్రలకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా జిల్లాలో పీఎంశ్రీ పాఠశాలలకు రూ.8.57 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే సుమారు 18 పాఠశాలలు విజ్ఞాన యాత్రకు వెళ్లాయి. మిగిలిన స్కూళ్లు కూడా ఈ నెలాఖరులోపు వెళ్లేందుకు సిద్ధం అవుతున్నాయి.

❖ వీటిని చూసేందుకు అనుమతి: విద్యార్థులు సైన్స్, చారిత్రక, పర్యాటక, ముఖ్యమైన ప్రాంతాలను సందర్శించడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. సచివాలయం, హైకోర్టు, బాపూ మ్యూజియం, కొండపల్లి ఖిల్లా, భవానీపురం సైన్స్ సెంటర్, ప్లానిటోరియం, గాంధీహిల్ ప్రాంతాలను ఆరు నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులు సందర్శించారు. వీటివల్ల ఎంతో విజ్ఞానం, అవగాహన కలిగిందని లింగాలపాడు (నందిగామ), కంభంపాడు (వత్సవాయి) విద్యార్థులు చెబుతున్నారు.

సద్వినియోగం చేసుకుంటే ప్రయోజనం

ఈ కార్యక్రమం విద్యార్థుల్లో విజ్ఞానం పెంచుతుంది. పర్యాటక, చారిత్రక ప్రాంతాలపై అవగాహన వస్తుంది. జిల్లాలో ఎంపికైన అన్ని పీఎంశ్రీ పాఠశాలల విద్యార్థులు ఆయా ప్రాంతాలను సందర్శించేలా చర్యలు తీసుకుంటున్నాం. **- అశోక్‌బాబు, సమగ్రశిక్షా అకడమిక్ పర్యవేక్షణాధికారి**

కాలువలు పూడి.. కడగండ్లు పొంగి..

ఆటోనగర్‌లో చాలా చోట్ల కాలువలు మూసుకుపోయి రహదారిపై మురుగు నిలిచిపోతోంది. దీంతో నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రహదారుల్లో అవస్థలు తప్పడం లేదు. ఆటోనగర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ గోదాంకు సమీపంలో రహదారిపై మురుగు చేరడంతో ఇలా సగం దారిలోనే వాహనాలు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. **- ఈనాడు, అమరావతి**

దారంతా పాడైంది.. దుమ్మెత్తిపోతోంది..

ఇటీవల కురిసిన వర్షాలకు కానూరు పరిధిలో రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. డ్రెయినేజీ విస్తరణ పనులు సైతం కొనసాగుతుండడంతో రహదారులపై విపరీతంగా దుమ్ము పేరుకుపోతోంది. దీంతో ఈ రోడ్డులో ప్రయాణం అంటేనే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు తిరిగే సమయంలో విపరీతంగా దుమ్ము లేచి వాహనదారులకు ఇబ్బందులు తప్పటం లేదు. స్థానికంగా ఉండే దుకాణాల్లో సైతం దుమ్ము పేరుకుపోతోందని చెబుతున్నారు. **- ఈనాడు, అమరావతి**

పశ్చిమ బైపాస్‌పై... రయ్ రయ్!

ప్యాకేజీ-3లో మొదలైన రాకపోకలు

దూసుకెళ్తున్న వాహనాలు..

ఈనాడు, అమరావతి: పశ్చిమ బైపాస్ ప్యాకేజీ-3కి మార్గం సుగమమైంది. హైదరాబాద్-విశాఖ మధ్య రాకపోకలు సాగించే వారికి విజయవాడ ట్రాఫిక్ చెర నుంచి విముక్తి దొరికింది. ఎంచక్కా పశ్చిమ బైపాస్‌పై దూసుకెళ్లేందుకు గురువారం సాయంత్రం నుంచి దారులు తెరుచుకున్నాయి. ప్రయాణానికి ప్రతిబంధకంగా ఉన్న నున్న విద్యుత్తు టవర్ల సమస్యకు అధికారులు పరిష్కారం చూపించారు. దీంతో హైదరాబాద్ ప్రయాణికులకు బోలెడంత సమయం ఆదా కానుంది.

తాత్కాలిక టవర్ నిర్మాణంతో...: ప్యాకేజీ-3లో చినఆవుటపల్లి-గొల్లపూడి వరకు 30 కిమీ మేర బైపాస్ పూర్తి చేశారు. జక్కంపూడి, నున్నలో రహదారిపై నుంచి వెళ్లిన హైటెన్షన్ విద్యుత్తు టవర్లతో ఇప్పటి వరకు ప్రయాణికులను అనుమతించలేదు. ఇటీవల జక్కంపూడి టవర్ల వివాదానికి కోర్టు పరిష్కారం చూపింది. ప్రస్తుతం ఉన్న ఎలైన్‌మెంట్‌లోనే విద్యుత్తు వైర్లను ఎత్తు పెంచాలని తీర్పు ఇచ్చింది. నున్న టవర్ల విషయంలో ఇప్పటికే కొత్త టవర్ల నిర్మాణం సగానికి పైగా పూర్తవడంతో జక్కంపూడి తరహా మార్పు సాధ్యం కాదని అధికారులు భావించారు. దీనికి ఎన్‌హెచ్ఏఐ అధికారులు యుద్ధప్రాతికన రహదారిపై తక్కువ ఎత్తులో ఉన్న వైర్లను పైకిలేపి నున్నలో ఓ తాత్కాలిక టవర్ నిర్మించి సమస్యను పరిష్కరించారు.

ఇక దూసుకుపోవడమే...

ఇప్పటి వరకు వైజాగ్-హైదరాబాద్ మధ్య రాకపోకలు సాగించే వారు విజయవాడ మీదుగా వెళ్లాల్సి వచ్చేది. చినఆవుటపల్లి నుంచి విజయవాడ దాటి హైదరాబాద్ ఎన్‌హెచ్ చేరాలంటే ట్రాఫిక్ యాతనతో గంటపైగా పట్టేది. ప్రస్తుతం చినఆవుటపల్లి దగ్గర బైపాస్ ఎక్కితే 30 నిమిషాల్లో అక్కడికి చేరుకోవచ్చు. చినఆవుటపల్లి దగ్గర గతంలో పండగల సమయంలో అనుమతించిన దారి ద్వారానే బైపాస్ ఎక్కొచ్చు. గొల్లపూడి దగ్గర యూటర్న్ తీసుకుని హైదరాబాద్ ఎన్‌హెచ్‌కి చేరవచ్చు. జక్కంపూడి టవర్ పనులకు మరో మూడు నెలలు పడుతుంది. అయినా అక్కడ రెండు వైపులా ఉన్న సర్వీస్ రోడ్డుల నుంచి ప్రయాణికులు వెళ్లే అవకాశం ఉంది.

తేరుకోగలమ?!

మొక్కజొన్న రైతుతో దళారుల చెలగాటం
క్వింటాకు ఏకంగా రూ.600-900 కోత

✦ 20 ఎకరాల్లో మొక్కజొన్న కౌలుకు సాగు చేశా. ఎకరాకు 25 చొప్పున 500 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఎకరాకు రూ.40 వేల ఖర్చయింది. కొనుగోలు కేంద్రాలు లేక క్వింటా రూ.1700లకు.. 250 క్వింటాళ్లు అమ్ముకొని తీవ్రంగా నష్టపోయా. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలు తెరిస్తే మిగిలిందైనా అమ్ముకుంటా. **- ఎం.మధు, రైతు, దాచవరం (వీరులపాడు)**

✦ 10 ఎకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న వేశా. కొనుగోలు కేంద్రాలు తెరుస్తారని ఎదురు చూసినా ఫలితం లేక... తుపాన్ వస్తుందనే భయంతో దళారులకు క్వింటా రూ.1,800 చొప్పున 250 క్వింటాళ్లు అమ్ముకున్నా. క్వింటాకు రూ.600 వరకు నష్టపోయా. **- కోలా శ్రీనివాసరావు, పెద్దాపురం (వీరులపాడు)**

ఈనాడు, అమరావతి

మొక్కజొన్న రైతుల ఆరుగాలం శ్రమను దళారుల సిండికేట్ స్వాహా చేస్తోంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడం.. తుపాను హెచ్చరికలు ఆసరాగా ధరలు తగ్గించి దోచుకుంటున్నారు. రైతులు కోసిన పంట కాపాడుకునే అవకాశం లేక వచ్చిన ధరకే అమ్ముకుని నష్టపోతున్నారు.

కల్లాల్లో మొక్కజొన్న నిల్వలు

దళారులు చెప్పిందే ధర...

ఎన్టీఆర్ జిల్లాలో 11 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. నవంబరు మొదటి వారంలోనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవాల్సి ఉన్నా అడుగు పడలేదు. కేంద్రాల్లో క్వింటాకు రూ.2,400 మద్దతు ధర వస్తుంది. దాదాపు 90 శాతం పంట కోసి కల్లాల్లో ఉంది. తుపాను హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దళారులు.. కొన్ని కంపెనీలు కుమ్మక్కై ధరను అమాంతం తగ్గించేశాయి. రూ.1500-1800 మించకుండా సిండికేట్ అయ్యారు. తేమ శాతం వంకతో మరింత కోత వేస్తున్నారు. క్వింటాకు రూ.600-900 నష్టపోతున్నారు. రైతుల దగ్గర తక్కువకు కొని కొనుగోలు కేంద్రాలు తెరిస్తే ఎక్కువ ధరకు అమ్ముకోవాలనేది దళారుల పన్నాగం. విజయనగరం, శ్రీసత్యసాయి, నంద్యాల జిల్లాల్లో బహిరంగ మార్కెట్‌లోనూ క్వింటా రూ.2,200 ఉంది. ఇక్కడ మాత్రం దళారులు చెప్పిందే ధర.

అనుమతులు రాగానే ప్రారంభం

రెండు నెలల కిందటే కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం.. అనుమతులు రాగానే ప్రారంభిస్తాం. **- నాగమల్లిక, మార్క్‌ఫెడ్ డీఎం**

వాయుసేనలో అవకాశాలపై అవగాహన

పాయకాపురం: భారత వాయుసేనలో ఉద్యోగావకాశాలపై శుక్రవారం లయోలా కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. గురువారం ఆయన, వాయుసేన అధికారి వింగ్ కమాండర్ షేక్ యాకూబ్ అలీ మాట్లాడుతూ.. ఇంటర్, తత్సమాన విద్యార్హతలు గల యువత అగ్నివీర్-వాయుగా వాయుసేనలో చేరవచ్చనీ, 17 -21 ఏళ్ల యువత అర్హులన్నారు. శనివారం తిరువూరులోనూ అవగాహన కల్పిస్తామన్నారు.

దుకాణం డబ్బులు సొంత ఖాతాలోకి..

యజమానికి ఉద్యోగిని టోకరా

గవర్నర్‌పేట: యజమానికి టోకరా వేసిన యువతిపై గవర్నర్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. నగరంలోని మ్యూజియం రోడ్డులో వేముల వెంకటేశ్వర్లు చరవాణి దుకాణం నిర్వహిస్తున్నారు. అతని వద్ద 2020 నుంచి తోట దుర్గా ప్రమీల అనే యువతి పనిచేస్తున్నారు. నమ్మకంగా పని చేస్తుండడంతో ఆమెకు బిల్లింగ్ సెక్షన్ అప్పగించారు. ఇటీవల దుకాణం లావాదేవీలను పరిశీలించినప్పుడు తేడా గుర్తించారు. దీంతో ఆమెను ప్రశ్నించగా తనకేమీ తెలియదని బుకాయించారు. ఈ క్రమంలో ఆమె బ్యాంకు ఖాతా లావాదేవీలను తనిఖీ చేయగా రూ.2,97,750 అనుమానాస్పదంగా కనిపించాయి. అవన్నీ క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా వివిధ ఖాతాల నుంచి వచ్చినట్లు గుర్తించారు. అవన్నీ తన దుకాణంలో ఖాతాదారుల నుంచి వసూలైన డబ్బులేనని.. చెల్లింపులు చేసే వారికి తన ఖాతా క్యూఆర్ కోడ్ ఇచ్చి నగదును తన ఖాతాలోకి మళ్లించుకున్నట్లు యజమాని వెంకటేశ్వర్లు గుర్తించారు. అదే దుకాణంలో పనిచేసే వందన్‌కుమార్‌తో కూడా ఆమె కుమ్మక్కైనట్లు తెలుసుకున్నారు. వారంతా కలిసి నగదును తమ కుటుంబ సభ్యుల ఖాతాలకు మళ్లించి ఆ తరువాత సొంత ఖాతాలకు మళ్లించుకున్నట్లు గుర్తించారు. దాదాపు రూ.4 లక్షలు దుర్వినియోగం అయినట్లు దుకాణ యజమాని వెంకటేశ్వర్లు గవర్నర్‌పేట పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు దుర్గాప్రమీల తదితరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్ కేసులో కొండారెడ్డి కోసం పీటీ వారెంట్ దాఖలు

ఈనాడు - అమరావతి: ఎండీఎంఏ కేసులో వైకాపా నేత కొండారెడ్డిపై పోలీసులు పీటీ వారెంట్ దాఖలు చేశారు. విశాఖవాసి కొండారెడ్డిని ఈ కేసులో మాచవరం పోలీసులు ఏ7గా నమోదు చేశారు. విశాఖలో ఇటీవల డ్రగ్స్ కేసులో అక్కడి పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. ఇటీవల బెంగళూరులో పోలీసులు అరెస్టు చేసిన పెడ్లర్ మ్యాడీ విచారణలో కొండారెడ్డి లింకుల గురించి వెల్లడించాడు. దీంతోపాటు నెల్లూరు కారాగారంలో రిమాండ్‌లో ఉన్న లోహిత్ యాదవ్‌ను పోలీసులు విచారించారు. అందులోనూ కొండారెడ్డి ప్రమేయం గురించి చెప్పాడు. తరచూ మత్తు పార్టీలు చేసుకునే వారమని తెలిపాడు. ఈ నేపథ్యంలో కస్టడీకి తీసుకుని మరింత లోతుగా విచారించేందుకు ఎంఎస్‌జే కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై విచారణ శుక్రవారానికి వాయిదా పడింది.

కోట్లు కరిగాయి.. పాట్లు మిగిలాయి!

రూ.5 కోట్లు వెచ్చించినా .. బండి నిలిపే స్థలం లేదు
దుర్గగుడిలో అత్యంత తీవ్రంగా పార్కింగ్ సమస్య

ప్రతిపాదిత మల్టీలెవెల్ పార్కింగ్ కాంప్లెక్స్ నమూనా

ఈనాడు, అమరావతి

'దుర్గగుడికి నిత్యం 40 వేలు.. శుక్ర, శని, ఆదివారాల్లో 70 వేల మంది భక్తులు వస్తున్నారు. ఏటేటా ఆలయానికి వచ్చేవారి సంఖ్య పెరుగుతోంది. నిత్యం కనీసం 500 కార్లు, వేలాది ద్విచక్ర వాహనాలు వస్తున్నాయి. వారాంతాల్లో రెట్టింపు ఉంటున్నాయి. కానీ.. ఓ వంద కార్లను నిలిపే సౌకర్యమూ లేదు. వారాంతాలొస్తే.. ఘాట్‌రోడ్డు స్తంభిస్తోంది. పార్కింగ్ సమస్య పరిష్కారానికి.. దశాబ్దాలుగా రూ.కోట్లు కరిగించినా కొలిక్కిరాలేదు.'

ఇంద్రకీలాద్రిని ఆనుకుని పైవంతెన పక్కన రూ.5 కోట్లు ఖర్చు పెట్టి చైనావాల్ పేరుతో 2012లో ఓ నిర్మాణం చేపట్టారు. ఈ వాల్ పూర్తయితే.. కనీసం వంద కార్లను ఘాట్‌రోడ్డుపై పార్కింగ్ చేయొచ్చన్నారు. కానీ.. రూ.5 కోట్లు కరిగినా 50 కార్లను నిలిపే స్థలం కూడా రాలేదు. దేవస్థానం ఇంజినీరింగ్ విభాగం పనితనానికి.. ఇదే నిదర్శనం. ఈ భారీగోడ ఎప్పుడు కుంగుతుందో తెలియని దుస్థితి నెలకొంది.

పరిష్కారాలు అనేకం..

☛ కనకదుర్గానగర్‌లో కింది నుంచి ఘాట్‌రోడ్డును కలిపేలా ఓ మల్టీలెవెల్ వాహన పార్కింగ్ నిర్మిస్తామని కొద్దినెలల కిందట నమూనాలు రూపొందించారు. ఆ ప్రతిపాదన ఏ దశలో ఉందో కూడా తెలీదు. ☛ ఇంద్రకీలాద్రికి సమీపంలోనే తితిదే రెండెకరాల ఖాళీ స్థలం ఉంది. దీనినే ఉత్సవాల వేళ పార్కింగ్‌కు వాడుతుంటారు. ఈ స్థలాన్ని గత తెదేపా ప్రభుత్వంలోనే ఆలయానికి స్వాధీనం చేస్తూ ప్రభుత్వం జీవో ఇచ్చినా.. దుర్గగుడి అధికారుల నిర్లక్ష్యంతో చేజారింది. ☛ దుర్గగుడి బృహత్తర ప్రణాళికలో భాగంగా గతంలోనూ పార్కింగ్ సమస్య తీర్చేందుకు కనకదుర్గానగర్‌లో అనేక ప్రణాళికలు వేసినా.. అమలు జరగలేదు.

పెరిగే అవసరాలకు తగినట్లు ఉండాలి

గత తెదేపా ప్రభుత్వ హయాంలోనే మేం దుర్గగుడిని పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి.. బృహత్తర ప్రణాళికలో భాగంగా పార్కింగ్ సమస్య పరిష్కారానికి అనేక సూచనలు చేశాం. ప్రస్తుతం వస్తున్న వాహనాలు, వచ్చే రెండు మూడు దశాబ్దాల అవసరాలు దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు రూపొందించాలి. **- డాక్టర్ కె.ఎస్.ఎస్.వి.వి.ప్రసాద్, ఛైర్మన్, క్రెయాటో సొల్యూషన్స్, విజయవాడ**

గుట్టు వీడుతున్న.. జోగి.. అద్దేపల్లిల ఆర్థిక బంధం!

రమేష్, రాముల ఆర్థిక లావాదేవీల ఆరా
ఆస్తుల కొనుగోళ్లపై నిశిత పరిశీలన

ఈనాడు, అమరావతి

మాజీ మంత్రి, వైకాపా నేత జోగి రమేష్‌తో జనార్దనరావు ఆర్థిక బంధంపై సిట్ సునిశిత దృష్టి సారించింది. గతంలో ఉమ్మడిగా మద్యం వ్యాపారం చేసిన ఇద్దరి ఆర్థిక చరిత్రను తవ్వి తీస్తోంది. శుక్రవారం సిట్, ఎక్సైజ్ అధికారులు నిందితులు జనార్దనరావు (ఏ1), జగన్మోహన్‌రావు (ఏ2)ను ప్రధానంగా వీటిపైనే ప్రశ్నించారు. గత కొన్నేళ్ల నగదు విత్‌డ్రాయల్స్‌ను పరిశీలిస్తున్నారు. నగదు డ్రా చేసిన తేదీల్లో జోగి రమేష్, రాములకు ఇచ్చారా? ఇస్తే.. ఎంత మొత్తాన్ని అందజేశారు? అనే కోణంలో పలు ప్రశ్నలు సంధించి వివరాలు రాబట్టారు.

నిందితుల మధ్య లావాదేవీలు...

ఈ కేసులో పలువురు నిందితులతో అద్దేపల్లి సోదరుల మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఈ స్టేట్‌మెంట్లను వారి ముందుంచి.. వివరాలు తీసుకున్నారు. ఏ1 ఇచ్చిన ముడుపులతో జోగి రమేష్ ఏవైనా ఆస్తులు కొన్నారా? కొంటే వాటి వివరాలు? వాటిని ఎన్నికల అఫిడవిట్‌లో చూపించారా? అనే వివరాలను పరిశీలిస్తున్నారు. ఆదాయ పన్ను రిటర్న్‌లలో పొందుపరిచారా? అని కూడా పరిశీలిస్తున్నారు. ఇందుకు జోగి రమేష్ (ఏ18), జోగి రాము (ఏ19) బ్యాంకు స్టేట్‌మెంట్లను నిశితంగా పరిశీలిస్తున్నారు.

☛ స్పిరిట్, మూతలు, సీసాలు, లేబుళ్లను సరఫరా చేసిన నిందితులకు.. జోగి రమేష్, రాములతో లింకులు ఉన్నాయా? అని దర్యాప్తు చేస్తున్నారు. వీటిపై రెండో రోజు కస్టడీలో నిందితులను పోలీసులు ప్రశ్నించినట్లు సమాచారం. ఏ1, ఏ2 నుంచి వీరి బంధువైన రవి (ఏ14)తో జరిగిన పెద్ద ఎత్తున లావాదేవీలను గుర్తించి.. వాటిని ఆరా తీశారు. మూతలు, లేబుళ్ల సరఫరాదారులకు డబ్బులు ఇచ్చేందుకే రవికి యూపీఐ ద్వారా బదిలీ చేసినట్లు విచారణలో వెల్లడించారు.

(c) eenadu

దీపానికి నమస్కరిస్తున్న భక్తులు

వేదికపై శివలింగం

కల్యాణ శోభలో శివపార్వతులు

ప్రవచనకర్త దివి నరసింహ దీక్షితులును సత్కరిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, కొండపల్లి మున్సిపల్ ఛైర్మన్ చిట్టిబాబు, కమిషనర్ రమ్యకీర్తన, తెదేపా నాయకులు, కౌన్సిలర్లు

కనుల పండువగా కోటి దీపోత్సవం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: కోటి దీపాల కాంతులతో కృష్ణా గోదారమ్మ సంగమం ప్రాంతం ఆధ్యాత్మికతను సంతరించుకొంది. వేలాది మంది భక్తుల శివనామం స్మరణతో మార్మోగింది. కార్తిక మాసం ముగింపు సందర్భంగా కోటి దీపోత్సవ కార్యక్రమం కొండపల్లి పురపాలక సంఘ పరిధిలోని పవిత్ర సంగమం వద్ద గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవచనకర్త దివి నరసింహదీక్షిత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. సంకీర్తనలు, లలిత సహస్రనామ పారాయణం, లింగాష్టకం, భక్తిశ్రద్ధలతో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. అనంతరం పురపాలక సంఘ ఛైర్మన్ చిట్టిబాబు దంపతులు, కమిషనర్ రమ్యకీర్తన, కౌన్సిలర్లు జ్యోతి వెలిగించారు. అర్చకుల పిలుపు మేరకు దీపోత్సవంలో పాల్గొన్న వేలాది మంది భక్తులు దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొని వీక్షించారు. అనంతరం ప్రవచనకర్తను సన్మానించారు.

పూర్వ వైభవం తెస్తాం..

పవిత్ర సంగమానికి పూర్వ వైభవం తీసుకొస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. పవిత్ర సంగమం వద్ద నిర్వహించిన కోటి దీపోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత తెదేపా ప్రభుత్వంలో సంగమం ప్రాంతం ఆధ్యాత్మికంగా ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. తిరిగి ఆ వైభవాన్ని తీసుకొచ్చేందుకు జలహారతి కార్యక్రమాన్ని రెండు నెలల్లో ప్రారంభించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

అనుసంధానం ఆగి.. గోతులు తేలి!

నందిగామ వైజంక్షన్ వద్ద సర్వీసు రోడ్డుపై గోతులు

విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై నందిగామ వైజంక్షన్ వద్ద అండర్‌పాస్ వంతెన అనుసంధాన మార్గం పనులు మళ్లీ ఆగిపోయాయి. ఇవి ఏళ్ల తరబడి సాగుతున్నా.. ఎన్‌హెచ్‌ఏ అధికారులు పట్టించుకోవడం లేదు. కొన్ని రోజులు చేయడం.. నెలలు తరబడి నిలిపివేయడం పరిపాటిగా మారింది. గుత్తేదారు, ఉప గుత్తేదారుడి మధ్య ఆర్థిక లావాదేవీల విషయమే పనులు ముందుకు సాగకపోవడానికి కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో సర్వీస్ రోడ్డుపై పడిన గోతుల కారణంగా రాకపోకలు సాగించే సమయంలో వాహన చోదకులు, ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షం వస్తే గోతులో ఎంత లోతులో నీరు ఉందో తెలియక పడిపోతున్నారు. మరోవైపు నిత్యం ఇసుక, గ్రావెల్, కంకర టిప్పర్లు, లారీలు వెళుతుంటాయి. ఏదైనా ప్రమాదం జరిగితే నష్టం భారీగా ఉండే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. రెండు వైపులా సర్వీసు రోడ్డు పరిస్థితి ఘోరంగా ఉంది. కీసర వద్ద స్వర్ణ టోల్‌ప్లాజా నిర్వాహకులు కేవలం వాహనాల నుంచి టోల్ రుసుం వసూలుపైనే దృష్టి సారిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చందాపురం క్రాస్‌రోడ్డు వద్ద హైవే సర్వీసు రోడ్డుపై పడిన భారీ గోతులు ఇబ్బందికరంగా మారాయి. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీనిపై హైవే అథారిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - **నందిగామ, న్యూస్‌టుడే**

పనులు పూర్తి చేయడంలో అలసత్వం వద్దు

సమావేశంలో ఎంపీ శివనాథ్, రాధాకృష్ణ, శీనానాయక్, వెంకన్న

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : రానున్న కృష్ణా పుష్కరాల నాటికి దుర్గగుడి అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. ఇంద్రకీలాద్రిపై ఉన్న ఈవో కార్యాలయంలో దుర్గగుడి అభివృద్ధి పనులపై పాలక మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్నలతో కలిసి ఆయన గురువారం సమీక్షించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రసాదాల పోటు, అన్నప్రసాద పంపిణీ కేంద్రం, ఎలివేటెడ్ క్యూలైన్లతో పాటు ప్రధాన సమస్యలైన పార్కింగ్, శాశ్వత కేశఖండన శాల, భద్రతా పరమైన చర్యలపై అలసత్వం లేకుండా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ స్కీమ్‌లో అభివృద్ధి చేసే పనులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఆర్కియాలజీ విభాగం నుంచి వచ్చే అభ్యంతరాలపై అవసరమైతే ఉన్నతాధికారులను సంప్రదిస్తామన్నారు. ట్రస్టు బోర్డు సభ్యులు వెలగపూడి శంకర్‌బాబు, సుకాసి సరిత, ఈఈలు కోటేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థినులపై దాష్టీకం!

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాల వసతి గృహంలో ఉంటూ ఇంటర్ చదువుతున్న తాము.. ట్యూటర్ అనుమతితో మూత్రశాలకు వెళ్లి వస్తుండగా.. వైస్ ప్రిన్సిపల్ గువ్వల శ్రీనివాసరెడ్డి.. ఎక్కడికి వెళ్లారంటూ తమను వైరుతో తీవ్రంగా కొట్టారని బాధిత విద్యార్థినుల్లో ఒకరు గురువారం వాపోయారు. తనతో పాటు తన స్నేహితురాలిపై క్రూరంగా వ్యవహరించారని, స్పృహ తప్పేదాకా కొట్టారని ఆరోపించారు. అనంతరం ఎత్తుకొని ఆటోలో ఆసుపత్రికి తీసుకెళ్లారని, ఆ విషయం సీసీ టీవీ ఫుటేజ్ ద్వారా తమకు తెలిసిందని, బోరున విలపిస్తూ వివరించారు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు కళాశాలకు వచ్చి దాష్టీకాన్ని ప్రశ్నిస్తూ ఆందోళనకు దిగారు. బాలికలపై దాడి చేసిన కళాశాల వైస్ ప్రిన్సిపల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆరోపణలు ఎదుర్కొంటున్న కళాశాల వైస్‌ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డితో మాట్లాడేందుకు 'న్యూస్‌టుడే' ప్రయత్నించగా.. ఆయన అందుబాటులోకి రాలేదు. బాలికలపై దాష్టీకం గురించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై జి.రామకృష్ణ తెలిపారు.

ఎమ్మెల్యే సౌమ్యపై అసత్య ప్రచారం

నిందితుడిపై కేసు నమోదు

నందిగామ, న్యూస్‌టుడే: ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్యపై సామాజిక మాధ్యమాల్లో ఓ వ్యక్తి తప్పుడు ప్రచారం చేస్తున్నాడని నందిగామకు చెందిన నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షుడు దాసరి రాజీవ్‌గాంధీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడిపై సీఐ గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆయన వివరాల మేరకు.. నందిగామలో గీతా మందిరం రోడ్డులో ఉంటున్న సోమవరపు రవితేజ తెదేపాలో చురుగ్గా పని చేస్తుండేవాడు. కొంతకాలంగా ఆయన ప్రవర్తనలో మార్పు వచ్చింది. విప్ సౌమ్యపై సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేస్తున్నాడు. ఆయన వల్ల విప్ సౌమ్య ప్రాధాన్యం తగ్గింది. పార్టీలో విభేదాలు వచ్చే విధంగా తప్పుడు ప్రచారం చేస్తున్నాడని, ఈ దుష్ప్రచారం ప్రత్యర్థి పార్టీ వారితో విభేదాలు వచ్చే విధంగా ఉంటోందని రాజీవ్‌గాంధీ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

విద్యుత్తు చట్ట సవరణ బిల్లును వ్యతిరేకించండి

ఐక్యత చాటుతున్న నాయకులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం రూపొందించిన విద్యుత్తు చట్ట సవరణ ముసాయిదా బిల్లును రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలని ఏపీ విద్యుత్తు ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సుదర్శనరెడ్డి, వెన్నపూస సుబ్బిరెడ్డి డిమాండ్ చేశారు. స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ధర్నాచౌక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ బిల్లు పార్లమెంటు ఆమోదం పొంది చట్టంగా మారితే విద్యుత్తు రంగం ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతుందన్నారు. కేంద్రం రూపొందించిన ఈ బిల్లులో ఒక ప్రాంతంలోని ప్రభుత్వ విద్యుత్తు పంపిణీల సంస్థలతోపాటు ప్రైవేటు సంస్థలకు కూడా అవకాశం ఇస్తున్నారని చెప్పారు. మొదట ప్రజలను ఆకర్షించి.. ప్రభుత్వ విద్యుత్తు సంస్థలు దెబ్బతిన్నాక ప్రయివేటు కంపెనీలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తాయన్నారు. భవిష్యత్తులో ప్రైవేటీకరణ దిశగా వెళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే స్మార్ట్ మీటర్లు పెడుతూ వినియోగదారులపై ఒత్తిడి తెస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. క్రమంగా రాయితీలు తొలగించడంతోపాటు తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలు, రైతులు, గ్రామీణ వినియోగదారులపై అదనపు భారం పడుతుందని తెలిపారు. ఉద్యోగ భద్రతకు సైతం ప్రమాదం పొంచి ఉంటుందని, యువతకు రెగ్యులర్ ఉద్యోగాలు ఉండవని చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు డి.హరిబాబు, వి.గంగయ్య, ముజఫర్, ఎం.మోహనరావు, పుల్లారెడ్డి, చంద్రశేఖర్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాష్ట్ర క్రీడా జట్ల ఎంపికలు

విజయవాడ క్రీడలు: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ(డీఎస్‌ఏ) ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల రాష్ట్ర క్రీడా జట్ల ఎంపిక పోటీల్లో భాగంగా రెండో రోజు గురువారం సుమారు 240 మంది ఉద్యోగులు పాల్గొన్నారని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కాకర్ల కోటేశ్వరరావు తెలిపారు. ఐజీఎంసీ స్టేడియంలో జరిగిన కబడ్డీలో 70, బాస్కెట్‌బాల్‌లో 39, క్యారమ్‌లో 62, రెజ్లింగ్‌లో 18 మంది తలపడగా.. ఈడుపుగల్లులోని కృష్ణా డీఎస్‌ఏ ఈత కొలనులో జరిగిన స్విమ్మింగ్ జట్ల ఎంపికలో 50 మంది పోటీపడ్డారని పేర్కొన్నారు. వీరిలో ప్రతిభగల క్రీడాకారులను రాష్ట్ర జట్లకు ఎంపిక చేస్తారని వివరించారు.

బకాయిలు విడుదల చేయాలని వినతి

జెన్‌కో ఎండీ నాగలక్ష్మిని కలిసిన ఏపీ పవర్ ఎంప్లాయీస్ జి-445 నాయకులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: విద్యుత్తు సంస్థల్లో పనిచేసే కార్మికులకు యాజమాన్యాలు ప్రకటించిన బకాయిలను సాధ్యమైనంత త్వరగా విడుదల చేయించాలని జెన్‌కో ఎండీ నాగలక్ష్మిని ఆంధ్ర రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ జి-445 యూనియన్ నాయకులు కోరారు. ఆ మేరకు విజయవాడ కార్యాలయంలో జెన్‌కో ఎండీని గురువారం వారు కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో జరిగిన అనేక చర్చల్లో యాజమాన్యాలు కార్మికులకు లబ్ధి చేకూర్చుతూ ప్రకటనలు చేశాయన్నారు. అయితే వాటిని నెరవేర్చకపోవడంతో ఆందోళన బాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. సర్వీస్ ఇన్‌సెంటివ్, 15 శాతం ఐఆర్‌లను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఎండీని కలిసిన వారిలో యూనియన్ నాయకులు రామగోపాల్‌రెడ్డి, బాలకృష్ణ, కిరణ్‌కిశోర్, సుధాకరరెడ్డి, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కండక్టర్‌పై దౌర్జన్యం తగదు

జగ్గయ్యపేట డిపో గేటు వద్ద ఆర్టీసీ కార్మికుల ధర్నా

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : అంతర్రాష్ట్ర బస్సుల్లో స్త్రీశక్తి వర్తించదు అని చెప్పిన ఒక కండక్టర్‌పై దౌర్జన్యం చేయడం జగ్గయ్యపేట ఆర్టీసీ కార్మికుల ఆగ్రహానికి కారణమైంది. జగ్గయ్యపేట- కోదాడ మార్గంలో షేర్‌మహ్మద్‌పేట వద్ద సుమారు 50 మంది మహిళలు అడ్డరోడ్డు వెళ్లేందుకు బస్సు ఎక్కడం ప్రారంభించారు. ఇది అంతర్రాష్ట్ర బస్సు సర్వీస్, ఇందులో స్త్రీశక్తి వర్తించదని కండక్టర్ షేక్ ఖాదర్ సాహెబ్ చెబుతున్న వారు ఆగకపోవడంతో పాటు కృష్ణ అనే వ్యక్తి కండక్టర్‌పై దౌర్జన్యం చేసి గాయపరిచాడు. మహిళలు బస్సు దిగి వెళ్లగా ఆర్టీసీ కార్మికులు జగ్గయ్యపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటన జరిగింది షేర్‌మహ్మద్‌పేటలో అని చిల్లకల్లు స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సిబ్బంది సూచించారు. మరుసటి రోజు ఉదయం కండక్టర్ ఫిర్యాదు చేయడానికి వెళ్లగా అప్పటికే కండక్టర్‌పై మహిళలు కూడా ఫిర్యాదు చేశారంటూ చెప్పడంతో పోలీసులు ఇరువర్గాలతో మాట్లాడి రాజీ చేశారు. దాడి చేసిన వ్యక్తితో క్షమాపణ లేఖ రాయించి సర్ది చెప్పి పంపించారు. ఈ విషయమై యూనియన్ నాయకులు మాత్రం తమ కార్మికుడికి జరిగిన అన్యాయాన్ని సహించేది లేదంటూ డిపో మేనేజర్, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, కేడీసీసీబీ ఛైర్మన్ నెట్టెం రఘురాంకి వినతిపత్రాలు ఇచ్చారు. దీనిపై డిపో మేనేజర్ సరిగా స్పందించక పోవడంపై వారు డిపో గేటు వద్ద గురువారం నిరసన తెలిపారు.

24 నుంచి రాష్ట్ర స్థాయి ఇంటర్ జోనల్ ఫుట్‌బాల్ లీగ్ టోర్నీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: మైలవరంలోని లకిరెడ్డి హనుమరెడ్డి క్రీడా ప్రాంగణంలో ఈ నెల 24వ తేదీ నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు రాష్ట్ర స్థాయి ఇంటర్ జోనల్ ఫుట్‌బాల్ లీగ్ టోర్నీ నిర్వహిస్తామని ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై.శేషగిరిరావు, బి.చక్రవర్తి తెలిపారు. ఈ టోర్నీలో జోనల్ స్థాయిలో విజేతగా నిలిచిన కోరమాండల్, గోదావరి, కొల్లేరు, నల్లమల, పెన్నా, తుంగభద్ర, వంశధార, విశాఖ ఫుట్‌బాల్ క్లబ్బుల నుంచి 160 మంది క్రీడాకారులు తలపడతారని పేర్కొన్నారు. విజేతలకు ట్రోఫీలు బహూకరిస్తామని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -106 రిటైల్ ధర 133 చికెన్ విత్ స్కిన్ - 193, చికెన్ స్కిన్‌లెస్ - 219. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, 134, 145 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 660 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.100/-.

జగన్ బెయిల్ రద్దు చేయాలని పిటిషన్ దాఖలు చేస్తా: బుద్ధా

మాట్లాడుతున్న వెంకన్న

పటమట, న్యూస్‌టుడే: న్యాయ వ్యవస్థలను సైతం తప్పుదోవ పట్టించే విధంగా న్యాయస్థానానికి హాజరు కాకుండా కుట్రలకు పాల్పడిన మాజీ సీఎం బెయిల్ రద్దు చేయాలని.. దీనిపై న్యాయనిపుణుల సలహా తీసుకుని న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేస్తానని మాజీ ఎమ్మెల్సీ, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న తెలిపారు. గురువారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. నాంపల్లిలోని సీబీఐ కోర్టుకు జగన్ ఊరేగింపుగా వెళ్లడం సరికాదన్నారు. 2020లో సీఎంగా నాంపల్లి కోర్టుకు హాజరైన జగన్.. ఆరేళ్ల తర్వాత పులివెందుల ఎమ్మెల్యేగా హాజరవడం నిజంగా దేవుడి స్క్రిప్టేనని పేర్కొన్నారు. రూ.లక్షల కోట్లు దోచుకుని నిందితుడిగా ఉన్న జగన్ కోర్టుకు సమయమిచ్చేలా షెడ్యూల్ విడుదల చేయడం చూస్తే న్యాయ వ్యవస్థలపై ఆయనకు ఎంత గౌరవం ఉందో స్పష్టమవుతోందన్నారు. పెయిడ్ బ్యాచ్‌లతో దారి పొడవునా నినాదాలు చేస్తూ కోర్టుకు వెళ్లిన జగన్ మళ్లీ వాయిదాకు హాజరు కాకుండా ఉండేందుకు కుట్ర పన్నారంటూ విమర్శించారు.

క్రీడా ప్రోత్సాహకాలు అందిస్తాం

గ్రాండ్ మాస్టర్ లలిత్‌బాబు, ఆర్చర్ ధీరజ్‌లను సన్మానిస్తున్న శాప్ ఛైర్మన్ రవినాయుడు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నూతన క్రీడా విధానం మేరకు అందాల్సిన క్రీడా ప్రోత్సాహకాలు అందిస్తామని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లోని ఢాకాలో జరిగిన ఏషియన్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో రికర్వ్ పురుషుల వ్యక్తిగత విభాగంలో పసిడి పతకం కైవసం చేసుకోవడంతో పాటు చరిత్ర సృష్టించిన బొమ్మదేవర ధీరజ్.. మలేషియా కౌలాలంపూర్‌లో జరిగిన కామన్వెల్త్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించిన ముసునూరి రోహిత్ లలిత్‌బాబులు గురువారం స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని శాప్ కార్యాలయంలో శాప్ ఛైర్మన్ రవినాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. రవినాయుడు వారిని సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు. అనంతరం శాప్ ఛైర్మన్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో సాధించిన విజయాలకు అందాల్సిన క్రీడా ప్రోత్సాహకాలను అందజేస్తామని, రాణించిన క్రీడాకారులకు శాప్ అండగా ఉంటుందని ఆయన అన్నారు.

24న కృష్ణా వర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

విజయవాడ క్రీడలు: స్థానిక పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వ్యాయామ విద్యా విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల స్త్రీ, పురుషుల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు, వర్సిటీ జట్టు ఎంపికలు నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపల్, పోటీల కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్ మేకా రమేష్ తెలిపారు. పోటీలో పాల్గొనే కళాశాల జట్ల క్రీడాకారులు తగు అర్హత పత్రాలతో పాటు గుర్తింపు కార్డులతో అదే రోజు ఉదయం 8 గంటలకు పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి టీవీబీ కృష్ణారెడ్డికి రిపోర్టు చేయాలన్నారు. మరిన్ని వివరాలకు 99639 92102 నంబరుకు సంప్రదించాలన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

పాయకాపురం, న్యూస్‌టుడే: గృహ నిర్మాణాలను వేగవంతం చేసి సకాలంలో పూర్తిచేయాలని కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో గృహాల నిర్మాణంపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి సొంత ఇల్లు నిర్మించుకోవడం ఒక కల అని, దానిని సాకారం చేసేలా అధికారులు కృషి చేయాలన్నారు. లబ్ధిదారుల బిల్లులను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని, ఈవిషయంలో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ పీడీ రజనీకుమారి, ఈఈ, డీఈలు పాల్గొన్నారు.

ప్రగతిపథంలో ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు మండలాలు

పాయకాపురం, న్యూస్‌టుడే: జిల్లాలోని ఆకాంక్షిత బ్లాకులైన ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు మండలాలు వివిధ సూచికల్లో ప్రగతిపథంలో పయనిస్తున్నాయని కలెక్టర్ జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. తాజాగా వ్యవసాయ, అనుబంధ రంగాలతోపాటు ఆరోగ్యం, పోషణ విభాగాల్లో మెరుగైన ఫలితాలు సాధించినందుకు నీతి ఆయోగ్ ప్రశంసాపత్రాలు లభించాయని వెల్లడించారు.

అనుమానం పెనుభూతమై...

భార్య గొంతు కోసి హత్య చేసిన భర్త

అడ్డుపడిన కుమార్తెకు గాయాలు

భాస్కర్, సాయివాణి దంపతులు (పాత చిత్రం)

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: అనుమానం మనిషిని మృగంలా మారుస్తుందనేందుకు ఖమ్మం నగరంలో గురువారం ఉదయం చోటుచేసుకున్న సంఘటనే నిదర్శనం. భార్యపై అనుమానం పెంచుకున్న ఓ వ్యక్తి కత్తితో గొంతు కోసి ఆమెను దారుణంగా హతమార్చాడు. అడ్డువచ్చిన కుమార్తె గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఖమ్మం రెండో పట్టణ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ కథనం ప్రకారం... ఖమ్మం జిల్లా చింతకాని మండలం నేరడకు చెందిన వ్యవసాయదారుడు గోగుల భాస్కర్‌తో ఏపీ ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన సాయివాణి(33)కి పదహారేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమార్తె హర్షవర్ధిని, కుమారుడు వేమేంద్రలక్ష్మీనరసింహ ఉన్నారు. భార్యపై అనుమానం పెంచుకున్న భాస్కర్ గత కొన్నేళ్లుగా వేధిస్తున్నాడు. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించినా, జగ్గయ్యపేట పోలీసు స్టేషన్‌లో రెండుసార్లు కౌన్సెలింగ్ చేసినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. గతేడాదిగా దంపతులు విడిగా ఉంటున్నారు. కొద్ది నెలలు తల్లిదండ్రుల వద్ద ఉన్న సాయివాణి, పిల్లలతో కలిసి ఆరు నెలల క్రితం ఖమ్మం వచ్చి గట్టయ్య సెంటర్‌లో ఓ అద్దె ఇంట్లో నివసిస్తోంది. స్థానికంగా ఫంక్షన్ హాలులో పనిచేస్తూ పిల్లలను చదివిస్తోంది. భార్యపై అక్కసు పెంచుకున్న భాస్కర్ తెల్లవారుజామునే ఆమె ఉండే ఇంటివద్దకు వచ్చి మాటువేశాడు. ఉదయం తలుపు తీసి బయటకు వచ్చిన సాయివాణిపై కత్తితో దాడి చేశాడు. తప్పించుకుని ఇంట్లోకి పరుగెత్తే ప్రయత్నం చేసినా వెంటపడ్డాడు. అనంతరం కత్తితో గొంతుపై బలమైన గాయం చేయడంతో సాయివాణి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనలో ఆమె ముఖం, గొంతు, తొడలపై బలమైన గాయాలయ్యాయి. ఇంట్లోనే ఉన్న కుమార్తె హర్షవర్ధిని అడ్డుకునే ప్రయత్నం చేయడంతో చేతులకు గాయాలయ్యాయి. భయంతో బయటకు పరుగెత్తిన కుమారుడు లక్ష్మీనరసింహ సమీపంలో నివసించే తన పెద్దమ్మ గొడవర్తి కుసుమకు(మృతురాలి అక్క) ఫోన్ చేసి చెప్పాడు. స్థానికులు డయల్-100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. అక్కడికి వచ్చిన కుసుమ, ఆమె భర్త, చుట్టుపక్కల నివాసులు భాస్కర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనతో భీతావహ పరిస్థితి ఏర్పడింది. హర్షవర్ధినిని ఆసుపత్రికి తరలించారు. కుసుమ ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, క్లూస్ టీం సందర్శించి సాక్ష్యాలు సేకరించారు.

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

इंडियन बैंक Indian Bank ALLAHABAD
గుంటూరు బ్రాంచి, 1వ లైను, సాంబశివపేట, నాజ్‌సెంటర్, గుంటూరు జిల్లా. ఫోన్: 0863-2220804, 8121188009

APPENDIX-IV-A [See provison to rule 8(6) / 9(1)]*

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టము 2002 యొక్క సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) / 9(1) తో చదువుకునే నిబంధన క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన

ఋణగ్రహీత: M/s. గోల్డెన్ ట్రేడింగ్ కార్పొరేషన్, యజమాని: శ్రీమతి తిరువాయిపాటి వసుంధర ల చేత సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన ఇండియన్ బ్యాంక్, గుంటూరు బ్రాంచికి తనఖా/ఛార్జ్‌గా పుంచిన దిగువ పేర్కొన్న [illegible]

[illegible]

రిజర్వు ధర	రూ.2,25,45,000/-
ధరావత్తు మొత్తం	రూ.22,54,500/-
బిడ్ పెంపుదల మొత్తం	రూ.10,000/-
ఇ-వేలం తేదీ మరియు సమయం	తేది: 10.12.2025, సమయం: ఉ॥ 10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు
ఆస్తి ఐడి నెం.	IDIB7328907085

[illegible] PSB Alliance [illegible] (https://baanknet.com) [illegible] 8291220220, email ID: support.baanknet@psballiance.com [illegible] support.baanknet@psballiance.com [illegible] baanknet.com [illegible] 8291220220 [illegible] https://baanknet.com [illegible]

తేది: 20.11.2025, ప్రదేశం: గుంటూరు సం/- అధీకృత అధికారి, ఇండియన్ బ్యాంక్

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 81422 92071

PEOPLE CARE

OLD AGE HOME

శ్రీనివాస గ్రూపు, VJA వృద్ధులకు, పేషెంట్లసేవకు, ఇంటి/ వంట జీవికేరకు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 96401 76677, 95537 86677

REAL ESTATE

FLAT FOR SALE

నందిగామ రైతుపేట సెంటర్ నందు నిర్మించిన ★ విఘ్నేష్ ప్లాజా నందు కమర్షియల్ షాప్స్ & 2 BHK ఫ్లాట్స్ అమ్మకమునకు కలవు. ✆ 73829 81107.

PLOT FOR SALE

విజయవాడ సిటీ, బెంజ్‌సర్కిల్‌కి 5 మినిట్స్ జర్నీలో ★ మంచి ప్రశాంతమైన వాతావరణంలో ఈస్ట్&వెస్ట్ ఫేస్ రెడీటూ కన్‌స్ట్రక్షన్‌కి అనువైన 133 గజాలు ప్లాట్లు కేవలం 30 లక్షలు ఫైనల్ రేటుతో అమ్మకం. 77320 51576

చతుర్భుజ ప్రాపర్టీస్ గేటెడ్ కమ్యూనిటీలో CRDA అప్రూవ్డ్ ఓపెన్ Plots కంచికచర్ల, పామర్రు, పరిటాల, పెనమలూరులో కలవు. ✆ 99481 10645.

AP రాజధాని అమరావతిలో MLA క్వార్టర్స్ రాయపూడి E-11 రోడ్‌కి దగ్గరగా 780గ॥ & AP సెక్రటేరియట్ ఎదురు 180,360గ॥ కమర్షియల్ LPS ప్లాట్లు అమ్మకం. ✆ 92907 63488

GOLLAPUDI

విజయవాడ గొల్లపూడి కొత్త బైపాస్ వద్ద C కన్వెన్షన్ ఫంక్షన్‌హాల్ పక్క రోడ్డులో 200, 400గ॥ ఉడా లేఔట్ ప్లాట్లు గజం: 25000/-లకే ✆ 92907 63488

JOBS

విజయవాడలోని ప్రముఖ కన్‌స్ట్రక్షన్ ఆఫీస్ నందు పనిచేయుటకు సీనియర్ అకౌంటెంట్ కావలెను. ✆ 94947 87509

Wanted Computer Hardware, Printer Engineers for VLMS IT Solutions. Bhavanipuram, www.vlms.in 98488 18090, 97012 27778.

Wanted Male Floor/ Campus Incharges, Data Entry Operators & Hostel Wardens to work in Sri Medha Jr. College, Labbipet, Exp. Min 3 Years. Age: 30-40 Yrs. Qual: Any Degree/ B.Tech. 91542 10069.

ప్రముఖ ఆర్కిటెక్ ఆఫీసులో పనిచేయుటకు ITI CIVIL, Diploma Civil, B.T Civil (Auto CAD Civil)లో అనుభవంఉన్న Male కావలెను. ✆ 93973 41745

జ్యువెలరీ షాప్‌లో పనిచేయుటకు మేల్ హెల్పర్స్ కావలెను. గవర్నర్‌పేట, విజయవాడ. శాలరీ-17,000. కాంటాక్ట్: 94400 29402

VJAలోని కంపెనీ కొరకు ఇంటర్ పాసైన M/ F, వ:19+ yrs, CRM, పార్ట్/ ఫుల్ టైం జీతం: 12K+ INC ✆ 93816 91391, 70957 91736

ACCOUNTING

Accountants & Store Keepers with 5 years experience to work in Jharkhand construction sites. WhatsApp resume to: 95023 93999.

సీనియర్ అకౌంటెంట్ కావలెను
కమర్షియల్ ప్రాజెక్ట్‌లో, VJAలో పనిచేయుటకు 10 సం॥ అనుభవం గల అకౌంటెంట్ కావలెను. (Tally, కంప్యూటర్ నాలెడ్జ్ తప్పనిసరి)
R.V.S. కన్స్ట్రక్షన్
✆ 93943 44444

ENGINEERING

CIVIL ENGINEERS with 5 yrs exp. to work in Jharkhand Thermal Power Plant. CISCONS Pvt. Ltd, . WhatsApp resume to: 95023 93999.

BOOK YOUR COLOUR CLASSIFIED
₹1200/- (5 Lines)
PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

తిరువూరు

• తిరువూరు • మైలవరం

రక్త గ్రూపులపై అవగాహన అవసరం

విద్యార్థుల రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

మైలవరం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు వారి రక్త గ్రూపుపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కె.అప్పారావు తెలిపారు. కళాశాలలో మొదటి సంవత్సర విద్యార్థులకు గురువారం ఎన్‌ఎస్‌ఎస్, ఆంధ్రా హాస్పిటల్స్ సహకారంతో రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. రక్త గ్రూపులు ముందుగానే తెలుసుకోవడం ద్వారా అత్యవసర సమయాల్లో రక్తదానం చేయటానికి వీలవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి శివాజీప్రసాద్, ఏపీవో ఉమామహేశ్వర్‌రెడ్డి, వాలంటీర్లు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

విస్సన్నపేట, న్యూస్‌టుడే: స్థానిక నరసాపురం గ్రామం యూదుల బజారులో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. పంచాయతీ ఈవో జి. స్వాతి స్పందించి సమస్య పరిష్కరించారు.

తిరువూరు టౌన్: పట్టణంలోని తమ్మిలేరు వార్డులో డ్రెయినేజీలో మురుగు పారుదల సరిగా లేక దోమలు వృద్ధి చెంది ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తేగా.. మున్సిపల్ శానిటరీ అధికారి సతీష్ స్పందించి సమస్య పరిష్కరించారు.

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం పంచాయతీ పరిధిలోని వెంపటి గూడెంలో డ్రెయినేజీలో పూడిక పేరుకు పోయి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారడంతో స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తేగా.. పంచాయతీ కార్యదర్శి ఎస్. రామారావు స్పందించి.. సమస్య పరిష్కరించారు.

? స్థానిక బీసీ కాలనీ శివారు జంగాల బజారులో పంచాయతీ బోరు మరమ్మతులకు గురై నీటి కోసం అవస్థలు పడుతున్నాం. -బి.అర్జునరావు, గ్రామస్థుడు ✔ మరమ్మతులు చేయిస్తాం. -బసవలింగేశ్వరరావు పంచాయతీ కార్యదర్శి - జి.కొండూరు, న్యూస్‌టుడే

వరికి ఊతం.. మెట్టకు శాపం!

మైలవరం, న్యూస్‌టుడే

ఈ ఏడాది కురిసిన అధిక వర్షాలు పలు మెట్ట పంటలకు నష్టం చేకూర్చగా.. వరిసాగుకు మాత్రం మేలు చేశాయి. ఒక్క రోజు కూడా నీటి తడి కోసం ఇబ్బంది పడకుండా.. సాగు సాఫీగా సాగగా, మూడు నెలల పాటు సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదవడంతో చెరువులు కళకళలాడుతున్నాయి.

మైలవరం నియోజకవర్గంలో పత్తి, వరి ప్రధాన వ్యవసాయ పంటలు. సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో కురిసిన భారీ వర్షాలకు పత్తి పంట దెబ్బతిని.. దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి.

పెసర, మినుము పంటలైతే పూర్తిగా కుళ్లి పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. చేతికొచ్చిన కొద్దిపాటి మినుములకు ధర లేదని ఆందోళన చెందుతున్నారు. ఇన్ని నష్టాల మధ్య వరి సాగు రైతులకు మాత్రం వర్షాలు ఊరటనిచ్చాయి.

నియోజకవర్గంలో ఇలా..

వరిసాగు విస్తీర్ణం	20వేల ఎకరాలు
సాగునీటి చెరువులు	70 వరకు
సెప్టెంబరు, అక్టోబరు నెల్లలో సాధారణ వర్షపాతం	360 మి.మీ
కురిసింది	410 మి.మీ

చెరువులు కళకళ

నియోజకవర్గ వ్యాప్తంగా చెరువులు నిండి ఆయకట్టు ఉంది. భారీ వర్షాలకు వరద పోటెత్తడంతో ఒకానొక దశలో చెరువు కట్టలు తెగుతాయేమోనన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమైంది. వరి అంతా వరి పొలాలకు సమృద్ధిగా నీరందింది. చెరువుల నీరు వాడాల్సిన అవసరం లేకుండా పోయింది. ఇప్పటికే వరి పొలాలు కోతలకు సిద్ధమై, పలు చోట్ల ప్రారంభమయ్యాయి. చెరువుల మాత్రం నిండుకుండలను తలపిస్తున్నాయి.

కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలాలు

రెండో పంటకు సన్నద్ధం

దశాబ్దకాలంగా రబీలో వరి సాగుకు అవకాశం లేకుండా పోయింది. దీనికి కారణం సరిపడా నీరందకపోవడమే. ఈ ఏడాది చెరువులన్నీ నిండుగా ఉండడంతో రబీలో సాగుకు సన్నద్ధమవుతున్నారు. మరోవైపు ఆరుతడి పంటగా వేసిన మొక్కజొన్నకు అవసరమైన నీరు అభిస్తోందని రైతులు ఆశపడుతున్నారు. దీంతో మెట్ట పంటల్లో ఎదురైన నష్టాలను, రబీలో పూడ్చుకోవచ్చన్న ఆలోచన చేస్తున్నారు.

స్వామిత్వ సర్వేతో ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం

నెమలిలో అర్జీ స్వీకరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాల సమస్యలు స్వామిత్వ సర్వే ద్వారా పరిష్కారమవుతాయని ఎంపీడీవో టి.సరస్వతి తెలిపారు. మండలంలోని నెమలిలో గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామంలో జరుగుతున్న సర్వేపై యజమానుల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిలో అధికంటిని పరిష్కరించారు. తహసీల్దార్ వి.రాజకుమారి, సర్పంచి డి.రామకృష్ణ, జడ్పీటీసీ సభ్యుడు కె.శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోళ్లను పారదర్శకంగా నిర్వహించాలని.. అవకతవకలు జరిగితే సహించేది లేదని జేసీ ఇలక్కియా అన్నారు. విస్సన్నపేట మండలం పుట్రేల రైతు సేవా కేంద్రంలో పాటు ధాన్యం కొనుగోళ్లు చేస్తున్న సాయి రాఘవ రైస్ మిల్లును గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కాటా, తేమశాతం కొలిచే యంత్రం పనితీరును పరిశీలించారు. నిబంధనల మేరకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్లు చేయాలని సూచించారు. ధాన్యం కల్లాల వద్దకు వెళ్లి రైతులతో మాట్లాడారు. అనంతరం తాతకుంట్ల గ్రామ పంచాయతీ పరిధిలో భూముల రీసర్వేను సంబంధింది మ్యాపులు, దస్త్రాలను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. జేసీ వెంట తిరువూరు ఆర్డీవో మాధురి, విస్సన్నపేట తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, ఆడిట్ సుజాత, మండల సర్వేయర్ శంకర్‌రావు తదితరులు ఉన్నారు.

పుట్రేలలో రైస్‌మిల్లులో తనిఖీ చేస్తున్న జేసీ ఇలక్కియా, ఆర్డీవో మాధురి, తహసీల్దార్ లక్ష్మీకల్యాణి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మద్దులపర్వ, కూనపరాజుపర్వ గ్రామాల్లోని ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను గురువారం సాయంత్రం జేసీ ఇలక్కియా, తిరువూరు ఆర్డీవో కె. మాధురి తనిఖీ చేశారు. మద్దులపర్వ గ్రామంలో రైతుల ధాన్యం రాశులను పరిశీలించి వారితో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొని మద్దతు ధర పొందాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేయాలని అధికారులను సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.సురేఖ, డిప్యూటీ తహసీల్దార్ జి.శ్రీనివాసరావు, రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎ.కొండూరు, తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: రైతులకు ఆసౌకర్యం కలగకుండా ధాన్యం కొనుగోలు చేసి వెంటనే ఎంపిక చేసిన రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఇలక్కియా ఆదేశించారు. ఎ.కొండూరు మండలం కంభంపాడు, తిరువూరు మండలం లక్ష్మీపురం కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఎ.కొండూరు ధాన్యం సరఫరాకు ఎంపిక చేసిన రైస్‌మిల్లును తనిఖీ చేసి ఆక్కడి దిగుమతులను పరిశీలించారు. కృష్ణారావుపాలెం బాలుర గురుకుల విద్యాలయాన్ని జేసీ సందర్శించి విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనం మెనూ, నాణ్యతను తనిఖీ చేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కొండపల్లి,న్యూస్‌టుడే: పురపాలికలోని నాలుగు డివిజన్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బాజాపా నాయకులు కమిషనర్ రమ్యకీర్తనను కోరారు. డ్రెయినేజీల్లో పూడికలు, కంప చెట్ల తొలగింపు, ఖాళీ స్థలాల్లో పారిశుద్ధ్యం వంటి వాటిపై దృష్టి సారించాలని వినతిపత్రం అందజేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో కృష్ణమోహన్, ఆంజనేయులు, జగదీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మరణించి.. వెలుగులు పంచి!

చెంచులక్ష్మి

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని తోటమూలకు చెందిన శీలం చెంచులక్ష్మి(56) గురువారం సాయంత్రం మృతిచెందగా ఆమె నేత్రాలను కుటుంబ సభ్యుల విజయవాడ ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధి జి.కృష్ణారెడ్డి.. నేత్రదానం ఆవశ్యకతను మృతురాలి భర్త శ్రీనివాసరెడ్డి, కుటుంబ సభ్యులకు వివరించారు. ఆసుపత్రి వైద్యులు వచ్చి చెంచులక్ష్మి కార్నియాలను సేకరించారు.

వెంకటేశ్వరరావు

తిరువూరు, గంపలగూడెం: తిరువూరు పట్టణానికి చెందిన కేతినేని వెంకటేశ్వరరావు(75) గురువారం మృతిచెందారు.. ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు విజయవాడ ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు కె.రాజేష్కన్న, పి.వెంకటేశ్వరరావు.. నేత్రదానం ప్రాధాన్యతను మృతుని కుటుంబ సభ్యులకు వివరించడంతో వారి అంగీకారం మేరకు.. వెంకటేశ్వరరావు కార్నియాలను ఆసుపత్రి వైద్యులు సేకరించారు.

మొక్కజొన్న విత్తనశుద్ధి చేసుకోండి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: జిల్లాలో మొక్కజొన్న సాగు అధికంగా ఉన్న నేపథ్యంలో విత్తన శుద్ధికి ట్రైకోడెర్మా విరిడిని ఉపయోగించాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు కిరణ్‌జ్యోతి తెలిపారు. ఇబ్రహీంపట్నం వ్యవసాయ శాఖ ప్రయోగశాలలో సుడోమోనాస్ అందుబాటులో ఉన్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కొండపల్లిలో వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రంథాలయాధికారులు

గంపలగూడెంలో..

పెనుగొలనులో..

జ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు దోహదం

కొండపల్లి,న్యూస్‌టుడే: జ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు కామేశ్వరరావు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని కొండపల్లి శాఖ గ్రంథాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అత్యంత విలువైన పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్నందున విద్యార్థులు వాటిని ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, రంగవల్లుల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పురపాలిక ఛైర్మన్ చిట్టిబాబు, కౌన్సిలర్లు సీహెచ్ నారాయణ, వాసు, యు.గోపాలరావు, నాయకులు మెల్లంపూడి శ్రీను, రామోజీ తదితరులు పాల్గొన్నారు.

మైలవరంలో..

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారం రోజుల పాటు నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అతిథులు పద్మ, టి.సాంబశివరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, కోయ సుధ, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే: స్థానిక శాఖ గ్రంథాలయంలో గత వారం రోజులుగా నిర్వహించిన వారోత్సవాలు గురువారం ముగిశాయని గ్రంథాలయాధికారిణి విజయకృష్ణ తెలిపారు. విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించి చిన్నారు ఆమె పేర్కొన్నారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే: గంపలగూడెం, పెనుగొలను గ్రంథాలయాల్లో నిర్వాహకులు వి. జ్యోతిర్మయి, టి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు దాతల సౌజన్యంతో బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

లోక్‌అదాలత్ విజయవంతానికి పిలుపు

మైలవరం, న్యూస్‌టుడే: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ పిలుపు మేరకు డిసెంబరు 13న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని స్థానిక కోర్టు న్యాయమూర్తి ఎం.శైలజ పేర్కొన్నారు. అందులో భాగంగా గురువారం స్థానిక న్యాయస్థానంలో న్యాయవాదులు, పోలీసులతో సమావేశం నిర్వహించారు. రాజీపడేందుకు అవకాశం ఉన్న కేసులను పరిష్కరించుకునేలా చూడాలన్నారు.

న్యాయవాదులు, పోలీసులతో చర్చిస్తున్న న్యాయమూర్తి శైలజ

ముగిసిన కార్తిక మాసోత్సవాలు

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: కార్తిక మాసం చివరి రోజు సందర్భంగా గురువారం నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో అర్చకులు, భక్తులు ఆకాశం దీపాలు వెలిగించారు. నెల రోజులుగా కార్తిక మాసం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సత్యనారాయణస్వామి వ్రతాలు, ఉపవాసాలు, వనసమారాధనలతో ప్రజలు ఆధ్మాత్మిక కార్యక్రమాల్లో తరించారు.

తిరువూరు పాటిమీద దాసాంజనేయస్వామి గుడిలో ఆకాశదీపం వెలిగించిన భక్తులు

గంపలగూడెం, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా గురువారం తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లోని శివాలయాల్లో భక్తులు దీపోత్సవాలు నిర్వహించారు. అర్చకులు శివలింగాలకు విశేష పూజలు, అలంకరణలు చేశారు. కొత్తపల్లి సమీప ఉమాగౌరీశంకరుని ఆలయంలో స్వామివారికి అన్నాభిషేకం చేశారు.

కొత్తపల్లిలో ఉమాగౌరీశంకరునికి అన్నాభిషేకం

ఇక.. ఉపాధ్యాయులకూ క్రీడా పోటీలు!

గంపలగూడెం, న్యూస్‌టుడే: మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం, సంపూర్ణ ఆరోగ్యం, ఒత్తిడిని అధిగమించేందుకు విద్యార్థులకు నిర్వహిస్తున్నట్లే ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు కూడా క్రీడా పోటీలు నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు నిర్వహిస్తారు. మండల స్థాయిలో స్పోర్ట్స్ కోఆర్డినేటర్, ఎంఈవో-1, 2లకు, డివిజన్ స్థాయిలో డివిజన్ కోఆర్డినేటర్, డిప్యూటీ డీఈవో, జిల్లా స్థాయిలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి, డీఈవో, రాష్ట్ర స్థాయిలో ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ఏడీ, జేడీ(కోఆర్డినేటర్), జేడీ(ఎస్ఈఆర్-1,2)లకు బాధ్యతలు అప్పగించారు.

వివరాలు ఇలా..

మండలం	పాఠశాలలు	ఉపాధ్యాయులు
గంపలగూడెం	66	217
తిరువూరు	63	238
విస్సన్నపేట	60	210
ఎ.కొండూరు	51	162

తేదీలు ఖరారు: క్రీడా పోటీల నిర్వహించే తేదీలను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. మండల స్థాయిలో ఈ నెల 29, 30 తేదీల్లో, డివిజన్ స్థాయిలో డిసెంబరు 13, 14, జిల్లా స్థాయిలో డిసెంబరు 20, 21, 22, రాష్ట్ర స్థాయిలో వచ్చే ఏడాది జనవరి 2, 3, 4 తేదీల్లో పోటీలు నిర్వహించనున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ ఉన్నత, ఆదర్శ, కేజీబీవీ, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల నుంచి సెకండరీ గ్రేడ్ టీచర్లు, వ్యాయామోపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సహాయకులు జట్లుగా ఏర్పడి క్రీడల్లో పాల్గొంటారు. పురుష ఉపాధ్యాయులకు క్రికెట్, మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలు ఉంటాయి. క్రికెట్ జట్టుకు 17 మంది, త్రోబాల్ జట్టుకు 12 మందిని ఎంపిక చేస్తారు. మండల, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల నిర్వహణకు నిధులు కూడా కేటాయించారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తారు.

మహిళల హక్కులపై అవగాహన అవసరం

మాట్లాడుతున్న న్యాయవాది అనురాధ

మైలవరం, న్యూస్‌టుడే: రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని ఏపీ హైకోర్టు న్యాయవాది మాగంటి అనురాధ సూచించారు. స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఐసీసీ, సహేలి క్లబ్ ఆధ్వర్యంలో గురువారం చట్టపరమైన హక్కులు, మహిళా సాధికారికత అంశంపై బీటెక్, ఎంబీఏ విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు రాజ్యాంగంలో కల్పించిన హక్కులు, గృహహింస నిరోధక చట్టం, బాలికా రక్షణ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అప్పారావు, ఐసీసీ పీఓ రమాదేవి, కోఆర్డినేటర్లు రాణిరుద్రమ, వి.సౌజన్య పాల్గొన్నారు.

మధిర కాలువకు 485 క్యూసెక్కుల సాగర్ జలాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పలబంధం 72వ నియంత్రిక నుంచి మధిర బ్రాంచి కెనాల్‌కు గురువారం 485 క్యూసెక్కుల సాగర్ జలాలు విడుదలైనట్లు ఏఈఈ మహేష్‌బాబు తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 191 క్యూసెక్కులు చేరగా దిగువున మేజర్ల వారీగా గంపలగూడెం-30, ఊటుకూరు-1కి 30, పెదకొమిర 20, మధిర 10, నిదానపురం 15 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

• తెదేపా నాయకులపై దాడి

వినగడప(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని వినగడపకు చెందిన తెదేపా నాయకులు మందడపు జానకిరామయ్య, మందడపు రామారావుపై.. అదే గ్రామానికి చెందిన పసుపులేటి నాగేశ్వరరావు అనే వ్యక్తి బుధవారం రాత్రి అకారణంగా దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో తెదేపా నాయకుల తలలకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం తిరువూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. బాధితుల్లో ఒకరైన జానకిరామయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు నాగేశ్వరరావుపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు గంపలగూడెం ఎస్సై జి. అనిల్ తెలిపారు.

నేడు ప్రజాదర్బార్

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండల పరిషత్తు కార్యాలయం వద్ద శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సరస్వతి తెలిపారు. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పాల్గొని.. ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి అధికారులు పాల్గొనాలని ఆదేశించారు.

• దాటాలంటే దడే..!

జి.కొండూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన జి. కొండూరులో పులివాగుపై నిర్మించిన వంతెన శిథిల స్థితికి చేరుతున్నా అధికారులు నిర్లక్ష్యం వీడటం లేదు. దశాబ్దాల కిందట నిర్మించిన ఈ వంతెనపై ప్రయాణం ప్రమాదమని తెలిసినా రాకపోకలు సాగుతున్నాయి. మైలవరం నుంచి విజయవాడ వెళ్లే వాహనాలకు ఇదే ప్రధాన మార్గం కావడంతో విరామం లేకుండా భారీ వాహనాలు వెళుతుంటాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో వంతెన అభివృద్ధిపై దృష్టి సారించకపోవడంతో మరింత దుస్థితికి చేరిందని స్థానికులు వాపోతున్నారు. రెయిలింగ్ పూర్తిగా ధ్వంసమైంది. ఇంకా రాకపోకలు ఇలాగే కొనసాగితే కూలిపోయి.. రాకపోకలు పూర్తిగా నిలిచిపోయే అవకాశం ఉంటుందని, అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నీటి సమస్యతో అవస్థలు

తిరువూరు మండలం ఎర్రమాడు దళితవాడలో సుమారు 50 కుటుంబాల వారు గత మూడు నెలలుగా తీవ్ర నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. రోజువారీ అవసరాలకు కూడా నీరు దొరకని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్లు పగిలిపోవడంతోనే సమస్య ఏర్పడినట్లు చెబుతున్నారు. తమ సమస్యను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి పైపులైన్లకు మరమ్మతులు చేయించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తిరువూరు టౌన్

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

ప్రదర్శనలో ఉద్యోగులు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే : ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు తినడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని ప్రకృతి వ్యవసాయం జగ్గయ్యపేట డివిజన్ మాస్టర్ ట్రైనర్ వన్నూరప్ప తెలిపారు. మండలంలోని శనగపాడులో గురువారం రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించి స.హ.చట్టం- 2005పై ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన ఉత్పత్తులను ప్రదర్శించారు. ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని చెప్పారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పడవల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరి

నిర్వాహకులకు సూచనలిస్తున్న సీఐ, తహసీల్దార్, ఎంపీడీవో

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట ప్రాంతంలోని వేదాద్రి, ముక్త్యాల రేవుల్లో ప్రజా రవాణాకు ఉపయోగించే పడవల నిర్వహణలో విధిగా నిబంధనలు పాటించాలని సీఐ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మనోహర్, డిప్యూటీ ఎంపీడీవో పద్మావతి తెలిపారు. గురువారం ఆయా రేవుల్లోని పడవుల నిర్వాహకులను కలిసి ప్రస్తుతం వారు అమలు చేస్తున్న విధి విధానాలను తెలుసుకొని పలు సూచనలు చేశారు. పడవల్లో లైఫ్ జాకెట్లను తప్పనిసరిగా ఉంచుకోవాలని, పడవల్లో బైకుల వంటి వాహనాలను ఎక్కించకూడదని, నియమిత సంఖ్యను దాటి ప్రజలను కూడా ఎక్కించవద్దన్నారు. పడవుల నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి వారి నుంచి నిబంధనలు అమలు చేసే ధ్రువీకరణ పత్రాలు తీసుకున్నారు. ఇటీవల వేదాద్రి నుంచి గింజుపల్లి వెళ్లే పడవలో మోటారు ఆగిపోయి పడవ నదిలో అరగంట పాటు ఉండాల్సి రావడంతో రేవులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

ముగిసిన సహకార వారోత్సవాలు

సొసైటీ వద్ద పతాకం ఎగురవేత కార్యక్రమంలో పాలకవర్గం, నాయకులు

మైలవరం, న్యూస్‌టుడే: సహకార వారోత్సవాల ముగింపు కార్యక్రమం స్థానిక సహకార సంఘ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ అధ్యక్షుడు కరెడ్ల వెంకటనారాయణ, సభ్యులు.. సహకార సంఘ పతాకాన్ని ఎగురవేశారు. సంఘాల ద్వారా అందుతున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలిలో తహసీల్దారు వి.రాజకుమారి గురువారం పర్యటించారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు రుచిగా, శుచిగా వడ్డించాలని ఏజెన్సీ సభ్యులను ఆదేశించారు. అనంతరం గ్రామస్థులకు నీరు సరఫరా చేస్తున్న ఓవర్ హెడ్ ట్యాంక్‌ను పరిశీలించారు.

21న పత్తి కొనుగోళ్లు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో శుక్రవారం ఉదయం సీసీఐ బయ్యర్ పత్తి కొనుగోలు చేస్తారని ఏఎంసీ కార్యదర్శి బి.రాజబాబు తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్న రైతులు పత్తిని గోనె సంచులు లేదా లూజుగా తీసుకొచ్చి.. విక్రయించుకోవాలని సూచించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

పీఆర్‌టీయూ నూతన కమిటీ ఎన్నిక

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి. శ్రీను పర్యవేక్షణలో సీనియర్ నాయకుడు శెట్టి దుర్గాప్రసాద్ అధ్యక్షతన టీచర్స్ కోపరేటివ్ భవనంలో గురువారం జరిగిన సభలో జగ్గయ్యపేట మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులుగా ధారావతు పాండు, ఆర్.నాగేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడిగా కొండయ్య, ప్రతినిధులుగా కె.రాజేంద్ర, తారావతు కృష్ణ, ఈశ్వర్, బాణోతు శ్రీనివాస్, పి.రాంబాబు, ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.నాగరాజు, కోట శ్రీనివాస్ నూతన కార్యవర్గానికి ధ్రువపత్రాలు అందజేశారు.

ప్రత్యేక అవసరాల చిన్నారులకు శిబిరం నేడు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపకరణాల పంపిణీ కోసం వైకల్య నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నారని ఎంఈవో-2 ఎం.పద్మ గురువారం తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 3 వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. 0-18 ఏళ్ల వారికి పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. శిబిరానికి వచ్చేవారు సదరన్ ధ్రువపత్రం, ఆధార్, రేషన్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు రెండు, యూడీఐడీ కార్డు, కుల ధ్రువపత్రాలను తీసుకుని రావాలని సూచించారు. ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల తల్లిదండ్రులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ శుభాకాంక్షలతో..
రాంబాబు ✆ 96762 20305
వాసు ✆ 98664 66888
SSN
శ్రీ సాయి నైలాన్స్
11-64-14, గులామ్ మొహిద్దీన్ వీధి, రాయల్ హోటల్ వెనుక, 1వ సందు, విజయవాడ ✆ 0866–2567266, 95734 02247
మా వద్ద అన్ని రకముల నైలాన్ మరియు సింథటిక్ దారం, వలలు, తాళ్ళు, పూసలు, గాలాలు, టార్పాలిన్స్, ప్లోడ్స్ లభించును.

(c) eenadu

విజయవాడ తూర్పు

ప్రతిభ చాటి.. బహుమతులు పట్టి..

పటమట, న్యూస్‌టుడే: పటమటలోని త్రివేణి జూనియర్ కళాశాలలో గురువారం ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు జరిగాయి. దీనిలో భాగంగా 'కృత్రిమ మేధస్సు(ఏఐ) వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బి.దీక్షిత(ద్వితీయ ఇంటర్), సాయి సౌమ్య, పి. దీపిక (జూనియర్ ఇంటర్)లు వరుసగా విజేతలుగా నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ పుష్పలత, అధ్యాపకులు ఎ. వాణి, ఎం.కవిత, వి. వసుంధర, బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

విజేతలతో ప్రిన్సిపల్ పుష్పలత, అధ్యాపకులు వాణి తదితరులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

80085 74652

స్పందన

◆ 4వ డివిజన్ వెటర్నరీ కాలనీ భాగ్యనగర్ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పొంగుతున్నాయని స్థానిక నివాసి కృష్ణారావు మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా ఏఈ దీక్షిత దృష్టికి తీసుకెళ్లారు. ఆయన యంత్ర సాయంతో పూడిక తీయించారు. ◆ 3వ డివిజన్ గుణదల ఈఎస్ఐ ఆసుపత్రి రోడ్డు, పుల్లేటి కట్ట కాలువ ప్రాంతాల్లో దోమలు ఎక్కువగా ఉన్నాయని స్థానిక నివాసి కనకదుర్గ.. మలేరియా అధికారి హెచ్. శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో దోమల మందులను, ఫాగ్ పెట్టించారు. ◆ 10వ డివిజన్ హైవే సర్వీస్ రోడ్డు స్టెల్లా కళాశాల ఎదురుగా కె.పి.నగర్ 10-43/246 విద్యుత్తు కాలనీ నివాసి సీతారామయ్య.. ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు. - న్యూస్‌టుడే, కరెన్సీనగర్

నాట్య మయూరాలు

కూచిపూడిలో నగర విద్యార్థినులు భళా

వెయ్యికి పైగా ప్రదర్శనలు

సాధన చేస్తూ.. పలువురికి శిక్షణ ఇస్తూ..

న్యూస్‌టుడే, విజయవాడ సిటీ

నగరానికి చెందిన విద్యార్థినులు కూచిపూడి నృత్యంపై ఆసక్తి చూపుతున్నారు. ఓ వైపు చదువుకుంటూనే మరో వైపు నృత్య సాధన చేస్తూ పలు వేదికలపై ప్రదర్శనలిస్తూ ప్రశంసలు, అవార్డులు అందుకుంటున్నారు.

పీబీ సిద్ధార్థ కళాశాలకు చెందిన చింతలూరు నిఖిల ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కళారంగంపై ఆమెకున్న ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు తమవంతు ప్రోత్సాహం అందించారు. ఏడేళ్ల వయసులోనే మంటపాల పవన్‌కుమార్ వద్ద శిక్షణ ఇప్పించారు. 15 ఏళ్ల నుంచి నృత్యం చేస్తున్న నిఖిల.. ఇప్పటి వరకు వందలకు పైగా ప్రదర్శనలిచ్చి అవార్డులు అందుకుంది. వెంకటేశ్వరస్వామి, గోదాదేవి, శివుడు, కృష్ణుడు వంటి భావ నృత్య వేషధారణ ప్రేక్షకులను అలరిస్తోంది. నగరంతో పాటు తిరుపతి, శిర్డీ, శ్రీకాళహస్తి, కాశీ, మైసూర్ వంటి ప్రముఖ వేదికలపై ప్రదర్శనలిచ్చింది. నాట్యమయూరి, నర్తన మయూరి, సత్యభామ, నాట్యశిరోమణి, యువ నాట్యహారిణి పురస్కారాలు అందుకుంది. 2023లో కేఎల్‌యూ సినీకార్నివాల్‌లో ప్రథమ, 2024లో యూత్ ఫెస్ట్‌లో జిల్లా స్థాయిలో ప్రథమ, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి నృత్య పోటీలో ప్రథమ బహుమతులు అందుకుంది. గత రెండేళ్లుగా నృత్య శిక్షకురాలుగా విద్యలు నిర్వహిస్తోంది. కూచిపూడి నృత్యకారిణిగా ప్రపంచ స్థాయిలో ఖ్యాతి సాధించాలనేది తన లక్ష్యమని నిఖిల చెబుతోంది.

ఇదే కళాశాలలో బీబీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న ఎం. ప్రణతి దేశ, విదేశాల్లో వెయ్యికి పైగా కూచిపూడి నృత్య ప్రదర్శనలిచ్చి ఎంతోమంది ప్రశంసలు అందుకుంది. నాట్యంపై ఉన్న ఆసక్తి గమనించిన తల్లిదండ్రులు కూచిపూడి సీహెచ్ అజయ్ కుమార్ దగ్గర శిక్షణ ఇప్పించి ప్రోత్సహించారు. మలేషియా, గంగోత్రి, బదరీనాథ్, రుషికేశ్, కాశీ, మైసూరు, బెంగళూరు, తిరుమల, నాదనీరాజనం, చెన్నై, హైదరాబాద్, ముంబయి తదితర ప్రాంతాలు, దేవాలయాల్లో ప్రణతి నృత్య ప్రదర్శనలిచ్చింది. నాట్య కిరణ్, కళ కౌముది, నాట్యకళ విశారద, నాట్య కుసుమశ్రీ, దామోదేశ్వరి అవార్డులను అందుకుంది. ఇటీవల నిర్వహించిన యూత్ ఫెస్ట్‌లో ప్రణతి ప్రథమ, సౌత్‌జోన్ ఇంటర్ కళాశాలల పోటీల్లో నృత్య విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. జాతీయ స్థాయిలో గొప్ప కళాకారిణి కావాలనేది లక్ష్యమని ప్రణతి పేర్కొంది.

హైస్కూలు రోడ్డులో ఆక్రమణలపై కొరడా

షెడ్లు తొలగిస్తున్న సిబ్బంది

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ఆక్రమణలతో కుంచించుకుపోయిన పటమట హైస్కూలు రోడ్డు వెంట ఆక్రమణలు తొలగించి రహదారిని పునరుద్ధరించేందుకు నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికాధికారులు చర్యలు చేపట్టారు. చీఫ్ సిటీప్లానర్ సంజయ్ రత్నకుమార్ ఆదేశాల మేరకు 80 అడుగులుగా ఉండాల్సిన హైస్కూలు రోడ్డు ప్రస్తుతం రెండు వైపులా 20 అడుగులు చొప్పున ఆక్రమణలకు గురైంది. ఫలితంగా ఆ రోడ్డు 30-40 అడుగులకు కుంచించుకుపోయింది. గుర్తించిన ప్రణాళికాధికారులు రహదారి రెండు వైపులా ఉన్న ఆక్రమణలు గురువారం తొలగించి రహదారిని తిరిగి 80 అడుగులకు పునరుద్ధరించారు. ఆ ప్రాంతాల్లో అనధికార పార్కింగ్ ప్రాంతాన్ని తొలగించారు. అధికారులు మాట్లాడుతూ నగర పరిధిలోని అనధికార నిర్మాణాలు, ఆక్రమణలు ప్రణాళికాధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి తొలగిస్తారని తెలిపారు. అధికారులు సామ్రాజ్యం, కమల్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే కాలనీల అభివృద్ధి

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: పరిశుభ్రతతోనే కాలనీలు అభివృద్ధి చెందుతాయని శానిటరీ అధికారి రామకృష్ణ అన్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని నాలుగో డివిజన్ వెంకటేశ్వరనగర్‌లో డివిజన్ పబ్లిక్ హెల్త్, శానిటేషన్ అధికారులు కాలనీ వాసులతో సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సూచనల మేరకు శాస్త్రీయ పద్ధతుల్లో చెత్త నిర్వహణ అమలు చేయాలని, ప్రతి ఇంటి నుంచి చెత్తను నాలుగు వర్గాలుగా వేరు చేయాలని సూచించారు. తడి, పొడి పాటు ప్లాస్టిక్, ప్రమాదకర చెత్తగా విభజించి ఇవ్వాలని, వ్యాపారసంస్థలు, అపార్టుమెంటు కమిటీలు విభజన సౌకర్యాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. శానిటరీ సూపర్‌వైజర్ ఎం.రమేష్ బాబు, మేస్త్రీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రిలో సమస్యల పరిష్కారానికి కృషి

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: కొత్త ప్రభుత్వ ఆసుపత్రిలో సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. గురువారం ఆసుపత్రిలోని అన్ని వార్డులను పరిశీలించి రోగులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీ విలేకర్లతో మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై అవగాహన పెంచుకునేందుకు వచ్చానని, రోజూ ఇక్కడ మూడు వేల మంది అవుట్ పేషెంట్లకు వైద్య సేవలందుతున్నాయన్నారు. ఆసుపత్రిలో సమస్యలను మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకెళతానని తెలిపారు. ఆసుపత్రికి అత్యాధునిక వైద్య, క్యాన్సర్ సంబంధిత పరికరాలు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు.

రోగిని పరామర్శిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

ఆసుపత్రి అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. నర్సింగ్ విద్యార్థినుల సమస్యలు తెలుసుకున్నానని, కొత్త భవనం పూర్తిగానే వారిని అందులోకి షిఫ్ట్ చేస్తామన్నారు. సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.ఏడుకొండలరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.ఏవీ రావు తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాల మహిళలకు వైద్య పరీక్షలు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని 7వేల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు 'సఖి సురక్ష' ద్వారా ఇప్పటి వరకు ఉచిత వైద్య, క్యాన్సర్ పరీక్షలు నిర్వహించినట్టు, మరికొందరికి శుక్రవారం నిర్వహిస్తున్నట్టు యూసీడీ పీవో పి.వెంకటనారాయణ తెలిపారు. కేదారేశ్వరపేట మ్యాంగో మార్కెట్ కల్యాణ మండపం, సూర్యారావుపేట వీవీ ప్యాలెస్, పటమట హైస్కూలు రోడ్డు కనకమేడల రవీంద్రకుమార్ కల్యాణ మండపం ప్రాంతాల్లో గత ఐదు రోజులుగా యూసీడీ విభాగం ఆధ్వర్యంలో క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. గురువారం వెంకటనారాయణ పలు కేంద్రాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సాయంతో 35 ఏళ్ల

శిబిరానికి వచ్చిన మహిళలు

నిండిన మహిళా సంఘాల సభ్యుల కోసం ప్రత్యేకంగా వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి పలు పరీక్షలు చేస్తున్నట్టు తెలిపారు. యూసీడీ అధికారులు, ఉద్యోగులు జీఎస్ సుజాత, శ్రీకాంత్, జగదీశ్వరి, ఉమా మహేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

'వచ్చే ఎన్నికల్లో జగన్ ఓటమి ఖాయం'

పటమట: మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి న్యాయవ్యవస్థను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని కోర్టుకు హాజరు కాకుండా నాటకాలు ఆడుతున్నారని ఎంపీ కేశినేని శివనాథ్ విమర్శించారు. గురువారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మాట్లాడుతూ నాంపల్లి సీబీఐ కోర్టుకు జగన్ ఊరేగింపుగా వెళ్లి న్యాయస్థానాన్ని ప్రభావితం చేసేందుకు ప్రయత్నం చేశారని ఆరోపించారు. రూ.వేల కోట్లు మింగేసిన కేసులో ఏళ్లుగా వాయిదాలు కోరుతూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. జగన్ వైఖరిని కోర్టులు సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పులివెందులలో వాస్తవ పరిస్థితి జగన్‌రెడ్డికి అర్థం కావడం లేదని.. అక్కడ జడ్పీటీసీ ఎన్నికల్లో వైకాపాకు డిపాజిట్లు కూడా రాలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో పులివెందులలో కూడా జగన్ గెలవలేని పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు.

22న ప్రత్యేక కమిటీల సమావేశాలు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలోని ఈ నెల 22న పలు ప్రత్యేక కమిటీల సమావేశాలు జరుగుతాయి. ఈ మేరకు కార్పొరేషన్ కార్యదర్శి విభాగం అధికారులు సమావేశాల తేదీలను గురువారం ప్రకటించారు. రోడ్లు, డ్రెయిన్లు, వంతెనలు, భవనాలు, క్రీడలు, ట్రాఫిక్, మంచినీరు, భూగర్భ డ్రైనేజీ, లైటింగ్, పార్కుల అభివృద్ధి ప్రత్యేక కమిటీల సమావేశాలు నిర్వహించనున్నారు. మిగిలిన ప్రత్యేక కమిటీల సమావేశాల నిర్వహణ తేదీలను అధికారులు తదుపరి ప్రకటిస్తారు.

చెత్త తొలగించరూ..

మూడో డివిజన్ గుణదల మైత్రేయినగర్‌లో చెత్త మేటలు పేరుకున్నాయి. దీంతో దుర్గంధం వ్యాపిస్తోందని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని నివాసులు వాపోతున్నారు. వాహనం ఏర్పాటు చేసి చెత్తను ఎత్తివేయించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కరెన్సీనగర్**

తాగునీటి పైపు లైన్ లీకేజీ

మూడో డివిజన్ కరెన్సీనగర్ 5వ రోడ్డు నుంచి సచివాలయానికి వెళ్లే మలుపు వద్ద పైపు లీకేజీతో తాగునీరు ఖాళీ స్థలంలోకి వృథాగా వెళుతోంది. గతంలో ఇదే ప్రాంతంలో మరమ్మతులు చేసినా మళ్లీ అదేచోట లీకేజీ కావడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. లీకేజీ కారణంగా మిగిలిన రహదారులకుళాయిలకు తాగునీరు సరిగా అందడం లేదని చెబుతున్నారు. అధికారులు దృష్టి పెట్టి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కరెన్సీనగర్**

వానరం.. బయటకొస్తే భయం

వానరాల సంచారంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. లబ్బీపేటలోని గ్రీన్‌ల్యాండ్, రెడ్డిఆర్ కాలనీ, అరవింద్ కార్యదర్శి ప్రాంతాల్లో కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. ఇళ్లు, చెట్ల పైకి ఎక్కి హడావుడి చేస్తున్నాయి. గుంపులుగా తిరగడం వల్ల చిన్నారులను బయటకు పంపాలంటే భయపడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. వీటి వల్ల కొన్ని రోజుల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వీటిని ఇక్కడి నుంచి తరలించేలా నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, లబ్బీపేట (విజయవాడ సిటీ)

ప్రజాదర్బార్‌కు స్పందన

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కూటమి పార్టీల నాయకులు

కృష్ణలంక, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యమని కృష్ణలంక 20వ డివిజన్ తెదేపా అధ్యక్షుడు గల్లా శ్రీను పేర్కొన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆదేశాల మేరకు కృష్ణలంక ఎంహోటల్ సమీప సర్వీసు రోడ్డులో గురువారం ప్రజా దర్బార్ ఏర్పాటు చేసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇళ్ల కేటాయింపు, పింఛన్ల మంజూరు, యూజీడీ తదితర సమస్యలు సంబంధించి సుమారు 300 అర్జీలు స్వీకరించామని, వాటిని ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేయనున్నట్లు వివరించారు. భాజపా, జనసేన పార్టీలకు చెందిన వాసా పల్లపురాజు, బండ్రెడ్డి నాగరాజు, తెదేపా నాయకులు కొడాలి సాయిబాబా, గల్లా సుబ్బారావు, రాధా, రామ్మోహన్, సత్యనారాయణ, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

బారికేడ్ల వితరణ అభినందనీయం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : ట్రాఫిక్ సమస్య పరిష్కారంలో మ్యాక్సివిజన్ భాగస్వామ్యం కావడం అభినందనీయమని ట్రాఫిక్ ఏసీపీ ఎస్.ఆర్.వంశీధర్ గౌడ్ అన్నారు. ఎంజీరోడ్డులోని మ్యాక్సీ విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి హాస్పిటల్ వారు పది బారికేడ్లను గురువారం విజయవాడ సిటీ ట్రాఫిక్ విభాగానికి వితరణగా ఇచ్చారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ వై.రవికుమార్, హాస్పిటల్ చీఫ్ సూపర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు

మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసరావు

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: జూనియర్లను సీనియర్లు ర్యాగింగ్ చేస్తే చర్యలు తప్పవని మాచవరం సెక్టార్ ఎస్ఐ శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. గురువారం సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.ఏడుకొండలరావుతో కలిసి కళాశాల ఆడిటోరియంలో ర్యాగింగ్, ఆ చట్టం ఆవశ్యకత, తీవ్రత అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపల్ డా.గోవింద్, వసతిగృహాల వార్డెన్లు డా.శ్రీనివాస్, డా.సుల్తానా, కళాశాల పీడీ రాము తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వినియోగంతో బహుళ ప్రయోజనం

కరెన్సీనగర్: గ్రంథాలయ వినియోగం క్రమశిక్షణ, బాధ్యత, జ్ఞాన జిజ్ఞాస పెంపొందిస్తుందని ఆంధ్రా లయోలా కళాశాల ప్రిన్సిపల్ ఫాదర్ మిల్కీయోర్ అన్నారు. నగరంలోని ఆంధ్రా లయోలా కళాశాల గ్రంథాలయం ఆధ్వర్యంలో జాతీయ పుస్తక వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం కళాశాలలో జరిగింది. గత వారం రోజులుగా విద్యార్థులకు పఠన అలవాట్లు, డిజిటల్ అక్షరాస్యత, సృజనాత్మకత సంబంధించి పోటీలు నిర్వహించారు. రాధాకృష్ణన్ పిళ్లై రాసిన 'చాణక్య ఇన్ యు' పుస్తక సమీక్షను ద్వితీయ సంవత్సరం బీబీఏ విద్యార్థిని షేక్ షఫియా చేశారు. గ్రంథాలయాధికారి ప్రసాదరావు, పీజీ లైబ్రేరియన్ టి.రోజామణిలు సమన్వయం చేశారు.

లోపాలకు తావులేకుండా అన్నక్యాంటీన్ల నిర్వహణ

అల్పాహారం చేస్తున్న కలెక్టర్ జి.లక్ష్మీశ

పటమట, న్యూస్‌టుడే: అన్న క్యాంటీన్లలో నిర్వహణ లోపాలు లేకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. గురువారం తూర్పు నియోజకవర్గంలోని పటమట హైస్కూల్ రోడ్డులోని అన్న క్యాంటీన్ నిర్వహణను కలెక్టర్ జి. లక్ష్మీశ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రూ.5 చెల్లించి అక్కడకు వచ్చిన వారితో కలిసి అల్పాహారం చేశారు. ఆహార పదార్థాల నాణ్యత, రుచి ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. పదార్థాల పట్టిక, టోకెన్ కౌంటర్, డైనింగ్ ఏరియాతో పాటు సరఫరా చేస్తున్న తాగు నీటిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాభిప్రాయ స్వీకరించేందుకు క్యాంటీన్ ఆవరణలో క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశామన్నారు. ఆ ఫీడ్‌బ్యాక్ పరిగణనలోకి తీసుకుని మరింత సమర్థవంతంగా క్యాంటీన్ నిర్వహించాలని సూచించారు. వీఎంసీ సిటీ ప్లానర్ కె. సంజయ్, జోనల్ కమిషనర్ షమ్మి, హెల్త్ ఆఫీసర్ గోపాల్ నాయక్, సీఈ సత్యకుమారి, ఏసీపీ మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

○ **రైతు బజారు తనిఖీ :** రైతుబజారు నిర్వహణలో పారదర్శకత పాటిస్తూ ఎలాంటి అవకతవకలకు తావులేకుండా వినియోగదారులకు సేవలందించాలని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. గురువారం పటమట హైస్కూల్ రోడ్డులోని రైతు బజారును ఆయన తనిఖీ చేశారు. కూరగాయల విక్రయ స్టాళ్లలో ధరల పట్టికలను, రైతుల గుర్తింపు కార్డులను పరిశీలించారు. వినియోగదారులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. రైతు బజార్లలో ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని పూర్తిగా నిషేధించేలా చర్యలు తీసుకోవాలని, జూట్ సంచుల అమ్మకాలకు ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.రాజబాబు, ఎస్టేట్ అధికారి ఎం.రమేష్ బాబు, మార్కెటింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందిస్తున్నాం

లబ్బీపేట (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : నిర్మాణ సంబంధిత రంగాల్లో పనిచేసే వారికి శిక్షణ ఇచ్చి వృత్తిపరమైన నైపుణ్యాలు పెంపొందిస్తున్నామని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ డైరెక్టర్ జనరల్ జి.గణేశ్‌కుమార్ అన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఉత్తమ శిక్షణ ఇచ్చిన 13 జిల్లాల్లోని సహాయక డైరెక్టర్లకు ఉత్తమ అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని లబ్బీపేటలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ ప్రధాన కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ రంగానికి సంబంధించిన ప్లంబింగ్, వసతి, విద్యుత్తు, ఆటోమొబైల్ రంగాల్లో యువతకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు డైరెక్టర్ జనరల్ డి.మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డులు అందుకున్న వారితో డైరెక్టర్ జనరల్ గణేశ్‌కుమార్

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీసీపీ సరిత, రచయిత్రి తనిషా తదితరులు

యువత సృజన చాటుకోవాలి

విజయవాడ సిటీ: మొబైల్ వినియోగాన్ని తగ్గించుకుని తమలో దాగిన సృజన, నైపుణ్యాలను యువత చాటుకోవాలని డీసీపీ కె.జి.వి.సరిత అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రచయిత్రి తనిషా కాజా రచించిన 'ఏ టేల్ ఆఫ్ లైస్' నవలను సిద్ధార్థ ఆడిటోరియంలో గురువారం ఆమె ఆవిష్కరించారు. ప్రిన్సిపాళ్లు మేకా రమేష్, వెంకటేశ్వర్లు, డీన్ ఆచార్య రాజేశ్ సి.జంపాల, ఎడ్యు కన్సల్టెంట్ సుంకర నాగభూషణం, రచయిత పాపినేని సాయి, గ్రంథ పాలకురాలు వాణి మాట్లాడారు.

ప్రతిభా ఉపకారవేతన పరీక్షపై 24న సదస్సు

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక): జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షపై ఈనెల 24న విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు అమరావతి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి రామిశెట్టి కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు స్కాలర్‌షిప్‌లకు అర్హత సాధించేందుకు డిసెంబరులో జరిగే పరీక్షకు సహకారాన్ని అందించడమే సదస్సు ఏర్పాటు లక్ష్యమన్నారు.

నైతిక విలువలు పెంపొందించడమే లక్ష్యం

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : ప్రజలందరూ ఐకమత్యంగా ఉండాలని, నైతిక విలువలు పాటిస్తూ సమాజానికి మార్గదర్శకంగా నిలవాలనేది లక్ష్యమని జమా అతే ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు హాఫీజ్ షౌకత్ ఫహీం అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 30 వరకు నిర్వహించే 'పొరుగు వారి హక్కులు' ఉద్యమ పుస్తకాన్ని లబ్బీపేటలోని రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన ఆవిష్కరించారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హాఫీజ్ షౌకత్ ఫహీం, అబ్దుర్రహ్మాన్, కరీముద్దీన్ తదితరులు

ఉద్యమ కన్వీనర్ అబ్దుర్రహ్మాన్ సుఫీ మాట్లాడుతూ ప్రజలందరూ ఒకే చోట నివసిస్తున్నా వారి మధ్య సంబంధాలు ఉండడం లేదని, వారి మధ్య ప్రేమ, అనురాగం, సహాయ, సహకారాలను గుర్తు చేస్తూ ఉద్యమం చేపడుతున్నామని తెలిపారు. జమా అతే హింద్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరీముద్దీన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే ఉద్యమంగా భాగంగా వ్యక్తిగతంగా, సామూహికంగా ప్రజలకు పొరుగు వారి హక్కులు గురించి తెలియజేసేందుకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర మీడియా కార్యదర్శి అక్బర్ బాషా మాట్లాడుతూ ప్రసార మాధ్యమాలు, డిజిటల్ మీడియా ద్వారా పోస్టులు, షార్ట్ వీడియోల ద్వారా ఉద్యమ సందేశాలను ప్రజల్లోకి తీసుకెళుతున్నామని తెలిపారు. ఉద్యమ సభ్యులు డాక్టర్ సాధిక్, రాష్ట్ర సహాయ కార్యదర్శి అబ్దుర్రషీద్, మీడియా సహాయ కార్యదర్శి ఇలియాజ్, ఎస్ఐవో రాష్ట్ర అధ్యక్షుడు ఫహద్, కార్యదర్శి అబ్దుల్ హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఏఎంఆర్ వారోత్సవాలు

కార్యక్రమంలో డా.ఏవీ రావు, సిబ్బంది

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్) అవగాహన వారోత్సవాలను గురువారం విజయవాడ కొత్త ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నిర్వహించారు. సూపరింటెండెంట్ డా.ఏవీ రావు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మేధో వికాసం

బహుమతులు పొందిన విద్యార్థులతో కలెక్టర్ లక్ష్మీశ, బాలస్వామి, రమాదేవి, డాక్టర్ పూర్ణచంద్, సాంబశివరావు తదితరులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: ప్రజల జీవన వికాసానికి, సామాజిక పురోగతికి గ్రంథాలయాలు సోపానాలుగా నిలుస్తాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. గ్రంథాలయాల విశిష్టతను నేటి తరానికి తెలియజేయాలని పిలుపునిచ్చారు. గురువారం మహాత్మాగాంధీరోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ-పుస్తకాలు, కంప్యూటర్లు, మొబైల్స్ ద్వారా కావాల్సిన సమాచారం పొందుతున్నప్పటికీ గ్రంథాల ద్వారా అందే సమాచారానికి మించింది లేదన్నారు. పుస్తక పఠనం మేధో వికాసానికి దోహదపడుతుందన్నారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు కావాల్సిన పుస్తకాలను గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచి యువతను ఆకర్షించేలా చూడాలని కోరారు. స్థానిక కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి మాట్లాడుతూ ఠాగూర్ గ్రంథాలయంలో చదువుకుని వందలాది మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని గుర్తు చేశారు. అనంతరం గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి, డాక్టర్ జి.వి. పూర్ణచంద్, గుమ్మా సాంబశివరావు, స్వాతి, చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

సోషలిజమే ధ్యేయంగా పనిచేయాలి

మాట్లాడుతున్న ఈశ్వరయ్య, వేదికపై రాధాకృష్ణమూర్తి, వెంకటసుబ్బయ్య, విల్సన్, రవీంద్రనాథ్, రమేష్‌పట్నాయక్, లక్ష్మణరావు తదితరులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: కమ్యూనిజాన్ని అంతం చేయడం ఎవరి తరం కాదని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు. కార్మికులను చైతన్యం చేసి సోషలిజమే అంతిమ లక్ష్యంగా ముందుకు వెళ్లాలని కార్యకర్తలకు ఆయన సూచించారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నగరంలోని ఐఎంఏ హాలులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం సదస్సు జరిగింది. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత 'ఫాసిజం-పాలక పీడిత వర్గాల్లో వైరుధ్యం' అంశంపై మార్క్సిస్టు విశ్లేషకుడు డి.రమేష్‌పట్నాయక్ ప్రసంగించారు. అనంతరం 'హిందుత్వ-లౌకికవాదం-భారత రాజ్యాంగం' అంశంపై మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ వంద సంవత్సరాల చరిత్రలో ఎంతో మంది పాలకులు వచ్చి వెళ్లారని, ఎన్నో పార్టీలు కనుమరుగయ్యాయని.. అయితే కమ్యూనిస్టు పార్టీ మాత్రం ప్రజల్లో ఉందన్నారు. దేశ దిశ, దశ మార్చాలంటే రాబోయే రోజుల్లో ఎర్రజెండా ముందుండాలన్నారు. దేశంలో ఆర్ఎస్ఎస్ ఏర్పడక ముందే కార్మికవర్గం తమ హక్కుల సాధనకు బ్రిటీష్ వారిని ఎదిరించి ఎర్రజెండా చేతపట్టి అనేక చట్టాలను సాధించుకుందన్నారు. అలాంటి చట్టాలకు నేడు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు జల్లి విల్సన్, ఎస్.వెంకటసుబ్బయ్య, రాధాకృష్ణమూర్తి, చలసాని రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ 6వ అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు, విజయవాడ

O.S.NO: 143/2024

Between:
Jaldi Pushpa & 2 Others ... **Plaintiffs**
And
1) Malapolu Koteswaramma (Died) & 2 other ... **Defendants**
To,
3rd Defendant:
Malapolu Prasanth Kumar, S/o (Late) M. Nasaraiah,
D.No: 41-28/1-73, Ranigarithota,
Krishna Lanka, Vijayawada-520 013.

పై నెంబరు గల **O.S.NO: 143/2024** కేసులో మీరు ప్రతివాది అయివున్నారు. ఈ కేసులో శ్రీ కోర్టు వారు మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను మీరు తీసుకొనక, కాలయాపన చేస్తున్నందున శ్రీ కోర్టు వారు మీ యొక్క హాజరు నిమిత్తం ఈ పేపర్ పబ్లికేషన్ ద్వారా మీకు తెలియపరచుటకు ఈ ఆర్డర్ వేసి ది: **04-12-2025** నాటికి పై కేసు/ దావాను వాయిదా వేసినారు. కావున ది: **04-12-2025** ఉదయం **10.30** ని॥లకు పై తెలిపిన కోర్టులో మీరుగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయవలెను. లేనియెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షముగా తీర్మానించుదురని తెలియజేయడమైనది.

వాయిదా తేది : 04-12-2025

//BY ORDER//

ఇట్లు, **రాంపిళ్ళ శ్రీనివాసరావు,**
అడ్వకేట్, డోర్ నెం: 9-76-36,
N.V.Street, Kothapet, Vijayawada-520 001.
Cell: 93978 11733

(c) eenadu

నందిగామ

• నందిగామ • జగ్గయ్యపేట

ప్రతిభ చాటి.. బహుమతులు పట్టి..

విజేతలతో ప్రిన్సిపల్ సాజిదాభాను, ఉపాధ్యాయులు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : జగ్గయ్యపేటలోని సిటి సెంట్రల్ పాఠశాలలో 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో గురువారం ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'విద్యార్థులపై చరవాణి ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వం పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన సీహెచ్.యుగంధర్, కె.తిరుమలేష్, జి.రత్న రాజులకు ప్రిన్సిపల్ సాజిదాభాను, ఉపాధ్యాయులు రాజేష్ కుమార్, సౌజన్య బహుమతులు అందించారు.

సత్యసాయి సమితి సేవలు ఆదర్శనీయం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: భగవాన్ శ్రీసత్యసాయి సేవా సమితి సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. గురువారం మండలంలోని మునగచర్లలో సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. పాడి రైతులకు మందులు పంపిణీ చేశారు. పశువైద్యులను సన్మానించారు. నందిగామ పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ మోజెస్‌వెస్లీ, నందిగామ ఏఎంసీ ఛైర్‌పర్సన్ పిట్టల శ్రీదేవి, వైస్ ఛైర్మన్ అమ్మినేని జ్వాలాప్రసాద్, ఏడీలు కృష్ణమూర్తి, వెంగళరావు, బి.వెంకట్రావు, సర్పంచి పంగులూరి నరసింహయ్య, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ వాసుదేవరావు, తెదేపా మండల అధ్యక్షుడు వీరాస్వామి, తెదేపా నాయకులు, సత్యసాయి సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందనకు వందనం

✦ కంచికచర్ల సెంట్రల్ బ్యాంకు వెనుక వీధిలో గత వారం రోజులుగా చెత్త పేరుకుని దుర్గంధం వస్తోందని స్థానికుడు మోహనరావు చేసిన ఫిర్యాదుకు సర్పంచి వేల్పుల సునీత స్పందించారు. సిబ్బందితో చెత్తను తొలగింపజేశారు. ✦ పేరకలపాడు ఎస్సీ కాలనీ సమీపంలో తాగునీటి పైపులు పగిలి నీరు వృథాగా పోతోందని కాలనీకి చెందిన రాంబాబు చేసిన ఫిర్యాదుకు పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ స్పందించారు. పైపు లైన్లకు మరమ్మతులు చేయించారు. ✦ కునికినపాడు సచివాలయం ఎదురుగా వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదని గ్రామానికి చెందిన రామారావు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఏఈ దిబ్బయ్య వీధి దీపాలు మార్పించారు. – న్యూస్‌టుడే, కంచికచర్ల

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సౌమ్య

వ్యవసాయ రుణాల మంజూరు

చందర్లపాడు, న్యూస్‌టుడే: కోనాయపాలెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో అఖిల భారత సహకార వారోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. మూడు శాతం వడ్డీ రాయితీ పథకం ద్వారా 391 మంది రైతులకు రూ.16 లక్షలు, నలుగురు రైతులకు రూ.12.50 లక్షల వ్యవసాయ రుణాల చెక్కులను ప్రభుత్వ విప్ సౌమ్య పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. సంఘ అధ్యక్షుడు వాసిరెడ్డి ప్రసాద్, సర్పంచి వెంకట్రావమ్మ, వెంకటేశ్వరరావు, జ్వాలాప్రసాద్, వివిధ సంఘాల అధ్యక్షులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తిక పూజలు

పల్లగిరిపై భవానీశంకరుని వాయులింగం

నందిగామ గ్రామీణం: పల్లగిరిపై భవానీ శంకరుని వాయులింగానికి గురువారం రుద్రాభిషేకం నిర్వహించారు. శుక్రవారం గౌరీ పాడ్యమి పురస్కరించుకుని స్వామివారికి అన్నాభిషేకం, మహాపూర్ణాహుతి, మహిళలు సామూహికంగా కుంకుమార్చన, అన్నదానం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. గోళ్లమూడి శివాలయంలో శంభులింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం చేశారు. దాములూరు శివారు కూడలి సంగమేశ్వరస్వామి దేవాలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. శుక్రవారం వైరా, కట్టలేరులో మహిళలు పోలిస్వర్గం పూజలు నిర్వహిస్తారు. మాగల్లు శివాలయంలో ఉదయం సామూహిక కుంకుమార్చన, అన్నదానానికి ఏర్పాట్లు చేశారు. నందిగామ రైతుపేట భగవాన్ సత్యసాయి మందిరంలో స్వామివారి శతజయంతి వేడుకల్లో గురువారం వేద పఠనం, భజనలు చేశారు. శ్రీవిద్య ఆంగ్ల మాధ్యమ పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు.

భక్తులకు అరటి దొప్పల పంపిణీ

నందిగామ, న్యూస్‌టుడే: కార్తిక మాసం శుక్రవారం ముగియనున్న నేపథ్యంలో స్థానిక ప్రధాన రోడ్డులో గురువారం ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో కేతేపల్లి శ్రీనివాసరావు, దేవత రామకృష్ణ, దేవత గణేష్, కొప్పు సాయి, షేక్ గనిల సహకారంతో భక్తులకు అరటి దొప్పలు పంపిణీ చేశారు. నిర్వాహకులు రామిరెడ్డి కోటేసూర్యం, ఉడత నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల మోములో ఆనందం

● 'అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్'లో రూ.20.42 కోట్లు సాయం

● నియోజకవర్గంలో 30216 మందికి ప్రయోజనం

నందిగామ గ్రామీణం, కంచికచర్ల, న్యూస్‌టుడే

నందిగామ నియోజకవర్గంలో..

మండలం	లబ్ధిదారులు	మంజూరైన సొమ్ము (రూ.కోట్లలో)
నందిగామ	5921	4.01
చందర్లపాడు	10671	7.16
కంచికచర్ల	6498	4.38
వీరులపాడు	7126	4.87

కూటమి ప్రభుత్వం అన్నదాతల ఖాతాలకు 'పీఎం కిసాన్', 'అన్నదాత సుఖీభవ' సాయం విడుదల చేయడంతో కర్షకుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. కీలక సమయంలో అందిన ఈ సాయం వ్యవసాయ ఖర్చులకు ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నెరవేర్చుకుందని ఈ మొత్తాన్ని సద్వినియోగం చేసుకుంటామని చెబుతున్నారు.

నందిగామ నియోజకవర్గంలో సూపర్-6 హామీల అమలులో భాగంగా రెండో విడత పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 30216 మంది రైతు కుటుంబాలకు రూ.20.42 కోట్ల లబ్ధి చేకూరింది. చిన్న, సన్నకారు రైతుల బ్యాంకు ఖాతాలకు ఈ సొమ్ము జమ కావడంతో వారు డ్రా చేసుకుంటున్నారు. పత్తి, మొక్కజొన్న, వరి తదితర పంటలు సాగు చేసిన రైతులు మొంథా తుపాన్‌తో తీవ్రంగా నష్టపోయారు. పత్తి రైతులు పూర్తిగా చిత్తు అయ్యారు. ఈ కీలక సమయంలో ఈ డబ్బులు వీరికి ఉపశమనం కలిగించాయి. ఖరీఫ్‌లో నష్టాలు చవిచూసిన రైతులు రబీలో పంటల సాగులో విత్తనాలు, దుక్కులకు ఈ సొమ్ములు వినియోగిస్తామని చెబుతున్నారు.

నమూనా చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ సౌమ్య

కర్షకులకు ఎంతో ఉపశమనం

ఈ ఏడాది ఖరీఫ్‌లో 72 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగుచేశా. వర్షాలతో నష్టపోయా. ప్రస్తుతం పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రెండో విడతగా రూ.7 వేలు బ్యాంకు ఖాతాకు జమ అయ్యాయి. ఈ సాయం కొంత ఉపశమనంగా ఉంది. రైతులను ప్రభుత్వం మరింతగా ఆదుకోవాలి. – **ఉన్నం నరసింహారావు, చందాపురం**

ఖాతాలో రూ. ఏడు వేలు జమ

ఈ పథకం ద్వారా రెండో విడత పెట్టుబడి సాయం రూ.7 వేలు బ్యాంకు ఖాతాకు జమ అయ్యింది. ఈ నగదు రబీలో పంటల సాగుకు వినియోగిస్తా. విత్తనాలు, దుక్కులు, కూలీల ఖర్చులకు ఉపయోగిస్తా. ఖరీఫ్‌లో 2.30 ఎకరాల్లో పత్తి సాగు చేశా. – **యలమందల సత్యనారాయణ, మాగల్లు**

శనగ సాగుకు ఖర్చు చేస్తా

అధిక వర్షాలతో మొదటి పంటకు నష్టం వచ్చింది. రెండవ పంటగా శనగ సాగు చేస్తున్నా. చేతిలో డబ్బులు లేని సమయంలో ప్రభుత్వం సొమ్ము జమ చేయడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. నా బ్యాంకు ఖాతాలో రూ.7 వేలు జమ అయ్యాయి. – **రైతు సింగంశెట్టి శ్రీనివాసరావు, చెవిటికల్లు, కంచికచర్ల**

పాఠశాలల్లో ఆధార్ శిబిరాలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని లింగాలపాడు, జొన్నలగడ్డ, కొణతమాత్మకూరు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో గురువారం ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించారు. ఐదేళ్లు నిండిన చిన్నారుల ఆధార్ కార్డులను నవీకరణ చేశారు. ఈనెల 21, 22 తేదీల్లో శిబిరాలు కొనసాగుతాయి. 22 నుంచి 26వ తేదీ వరకు ఐతవరం, చందాపురం, పల్లగిరి గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తారు. పౌరులు తమ ఆధార్ కార్డుల్లో తప్పులను సవరించుకోవడానికి వీలుందని కో-ఆర్డినేటర్లు తెలిపారు.

ప్రత్యేక అవసరాల చిన్నారులకు నేడు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపకరణాల పంపిణీ కోసం వైకల్య నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నారని ఎంఈవో-2 ఎం.పద్మ గురువారం తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 3 వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. 0-18 ఏళ్ల వారికి పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. శిబిరానికి వచ్చేవారు సదరన్ ధ్రువపత్రం, ఆధార్, రేషన్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు రెండు, యూడీఐడీ కార్డు, కుల ధ్రువపత్రాలను తీసుకుని రావాలని సూచించారు. ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల తల్లిదండ్రులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వరి నూర్పిళ్లు ప్రారంభం

కల్లంలో ధాన్యం పోస్తున్న ట్రాక్టర్

నందిగామ ప్రాంతంలో వరి నూర్పిడిలు ప్రారంభమయ్యాయి. మాగల్లులో యంత్రాలతో వరి పంటను నూర్పిడి చేయించి ట్రాక్టర్లతో కల్లాలకు తరలించి ఆరబోస్తున్నారు. ఇప్పటికే రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరిచారు. రైతులకు గోనె సంచులను అందుబాటులో ఉంచారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యం క్వింటా రూ.2389, సాధారణ రకం రూ.2369 వంతున మద్దతు ధరకు కొనుగోలు చేస్తోంది. మిల్లులకు ధాన్యం తరలించే ట్రాక్టర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. – న్యూస్‌టుడే, నందిగామ గ్రామీణం

గ్రామ సచివాలయంపై ఖాళీ మద్యం సీసాలు

మండలంలోని మాగల్లు గ్రామ సచివాలయం రాత్రి వేళ మందు బాబులకు కేంద్రంగా మారింది. గ్రామం నడిబొడ్డున ఈ భవనం పైకి చేరి మద్యం తాగి ఖాళీ సీసాలను పగలగొడుతున్నారు. గురువారం పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేసినా ఖాళీ సీసాలను సంచుల్లో వేసి ఆటోలో గ్రామం బయటకు తరలించారు. చుట్టూ ప్రహరీ లేకపోవడంతో రాత్రి వేళ కొందరు మద్యం తాగడానికి ఈ భవనాన్ని ఉపయోగిస్తున్నారు. కార్యాలయంలో మరుగుదొడ్లు నిర్మించకపోవడంతో ఉద్యోగులు, అక్కడకు వచ్చే పౌరులు కాలకృత్యాలు తీర్చుకోడానికి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మరుగుదొడ్లు నిర్మించడంతో పాటు కార్యాలయానికి చుట్టూ ప్రహరీ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నందిగామ గ్రామీణం

రహదారి ఇలా.. రాకపోకలు ఎలా..

ముప్పాళ్ల, నందిగామ గ్రామాల మధ్య రహదారి గుంతలమయంగా మారింది. రాకపోకలు సాగించడానికి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చందర్లపాడు మండలంలోని 21 గ్రామాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం నందిగామకు ఈ రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తుంటారు. ముప్పాళ్ల నుంచి నందిగామ చేరుకోవడానికి కేవలం ఏడు కిలోమీటర్లు ప్రయాణించడానికి అర గంటకుపైగా సమయం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో గుంతలు కనిపించక చోదకులు ప్రమాదాల బారినపడుతున్నారు. 2014లో నాటి తెదేపా ప్రభుత్వం నందిగామ నుంచి ముప్పాళ్ల, చందర్లపాడుల మీదుగా పొక్కునూరు వరకు వెళ్లే మార్గాన్ని రాష్ట్ర రహదారిగా మార్చింది. నాటి నుంచి నేటి వరకు దీనికి మరమ్మతులు చేయలేదు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిధులు మంజూరు చేయించి రోడ్డు అభివృద్ధి చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, చందర్లపాడు

పిచ్చిమొక్కలు తొలగించరూ..

మండల పరిధి వెల్లంకి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయి ప్రమాదకరంగా మారింది. ప్రధాన రహదారికి పక్కనే ఉండడం, నిత్యం విద్యార్థులు రాకపోకలు సాగిస్తుండడంతో ఈ పొదల నుంచి విషపురుగులు, పాములు వస్తాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ సిబ్బంది స్పందించి వెంటనే వీటిని తొలగించి శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, వెల్లంకి (వీరులపాడు)

రోడ్డు పనులు పరిశీలించిన ఎమ్మెల్యే తాతయ్య

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : పట్టణంలోని 29వ వార్డులో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, రోడ్డు నిర్మాణాలను ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర గురువారం పరిశీలించారు. కౌన్సిలర్ కంచేటి గీతారాణి ఆధ్వర్యంలో వార్డులో పర్యటించిన వారు ప్రజలను కలిసి పలు సమస్యలు, ఇతర అవసరాలను తెలుసుకున్నారు.

పీఆర్‌టీయూ నూతన కమిటీ ఎన్నిక

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.శ్రీను పర్యవేక్షణలో సీనియర్ నాయకుడు శెట్టి దుర్గాప్రసాద్ అధ్యక్షతన టీచర్స్ కోపరేటివ్ భవనంలో గురువారం జరిగిన సభలో జగ్గయ్యపేట మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులుగా ధారావతు పాండు, ఆర్.నాగేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడిగా కొండయ్య, ప్రతినిధులుగా కె.రాజేంద్ర, తారావతు కృష్ణ, ఈశ్వర్, బాణోతు శ్రీనివాస్, పి.రాంబాబు, ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.నాగరాజు, కోట శ్రీనివాస్ నూతన కార్యవర్గానికి ధ్రువపత్రాలు అందజేశారు.

సైబర్ మోసాలపై అవగాహన అవసరం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : జగ్గయ్యపేట పట్టణంలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా శాఖలో ఎస్సై రాజు సైబర్ నేరాలు, సామాజిక మాధ్యమాల ద్వారా జరుగుతున్న మోసాలపై సిబ్బందికి, ఖాతాదారులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా అపరిచిత వ్యక్తులు, సంస్థల సందేశాలకు ప్రలోభ పడటం, అమాయకంగా స్పందించడం, వారితో ఛాటింగ్‌లు చేయడం చేయవద్దని సూచించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

ప్రదర్శనలో ఉద్యోగులు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే : ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు తినడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని ప్రకృతి వ్యవసాయం జగ్గయ్యపేట డివిజన్ మాస్టర్ ట్రైనర్ వన్నూరప్ప తెలిపారు. మండలంలోని శనగపాడులో గురువారం రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించి స.హ.చట్టం- 2005పై ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన ఉత్పత్తులను ప్రదర్శించారు. ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని చెప్పారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విలేకరుల పేరుతో విధులకు ఆటంకం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : తాము విలేకరులమంటూ వెళ్లి స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలోని సిబ్బంది విధులకు ఆటంకం కలిగించారన్న ఫిర్యాదుపై పట్టణ ఎస్సై రాజు డాంగేనగర్‌కు చెందిన మహ్మద్ జావేద్, తిరుమలగిరికి చెందిన గుడిమెట్ల జావేద్ అనే వ్యక్తులపై కేసు నమోదు చేశారు. కార్యాలయంలోకి ప్రవేశించి మహిళా సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్న సమయంలో అనుమతి లేకుండా వీడియోలు, ఫొటోలు తీయడమే కాకుండా కార్యాలయంపై అసత్య ఆరోపణలు ప్రచారం చేస్తున్నారని తహసీల్దార్ మనోహర్ ఫిర్యాదు చేశారు. అందుకు సంబంధించిన వీడియో, ఆడియోలను పోలీసులకు అందించిన నేపథ్యంలో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

శతాధిక బడి.. సమస్యల సుడి

వందేళ్లు దాటినా కనిపించని సైన్స్ ప్రయోగశాల

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే

కూల్చి వేసిన పాత భవనం

షెడ్డు లేక చెట్ల కిందనే సైకిళ్లు

శతాధిక విద్యా సంస్థగా జిల్లాలోనే రెండో పురాతన పాఠశాలగా పేరున్న జగ్గయ్యపేట గెంటేల వెంకట జోగయ్య జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ ఇంతవరకు సైన్స్ ల్యాబ్‌కు నోచుకోలేదు. 18 ఎకరాల సువిశాలమైన ప్రాంగణంలో ఉన్న పురాతన భవనాలతో పాటు అంచెలంచెలుగా నిర్మించిన నూతన భవనాలతో గదులు కూడా సమకూరాయి. 1918లో స్థాపించిన ఈ బడిలో ప్రస్తుతం 800 మంది విద్యార్థులు చదువుతున్నారు. పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు.

స్థలం.. నిధులు ఉన్నా.. ఫలితం శూన్యం

సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి అవసరమైన స్థలం, నిధులు ఉండి కూడా శాఖాపరమైన ప్రక్రియలు, విధివిధానాల పేరుతో జాప్యం జరగడంతో కొన్ని బ్యాచిల విద్యార్థులు నష్టపోతున్నారు. పురాతన సామగ్రితో కూడిన పాత భవనాన్ని గతంలో అనుమతిలేకుండా కూల్చివేత ప్రారంభించిన నేపథ్యంలో ఏర్పడిన అపశ్రుతి ఇంకా వెంటాడుతూనే ఉంది. పీఎంశ్రీ పాఠశాలగా ఎంపిక కావడంతో రూ.2 కోట్ల ప్రత్యేక నిధులు విడుదలయ్యాయి. ఇప్పటికే అందులో రూ.50 లక్షలతో గ్రంథాలయ భవనాన్ని, మొదటి అంతస్తులో కంప్యూటర్ ల్యాబ్ నిర్మించారు. కానీ సైన్స్ ప్రయోగశాల ఏర్పాటును మాత్రం విస్మరించారు. సగం కూల్చిన భవనాన్ని పూర్తిగా తొలగించడానికి, ఆ స్థలంలో నూతన సైన్స్ ల్యాబ్ నిర్మించడానికి పాఠశాల నుంచి ప్రతిపాదనలు వెళ్లడం, విద్యా శాఖ నుంచి అనుమతులు రావడం వంటి ప్రక్రియలు జరగాల్సి ఉంది. శాఖాపరమైన అనుమతులు వస్తే పీఎంశ్రీ నిధులతో నిర్మాణం కూడా వెంటనే చేపట్టి పూర్తి చేసే అవకాశం ఉంది. అలాగే సైకిల్ షెడ్డు నిర్మాణంతో పాటు ఇంకా అవసరమైన అదనపు హంగులను సమకూర్చాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు సైన్స్ ల్యాబ్ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పడవల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరి

సూచనలిస్తున్న సీఐ, తహసీల్దార్, ఎంపీడీవో

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట ప్రాంతంలోని వేదాద్రి, ముక్త్యాల రేవుల్లో ప్రజా రవాణాకు ఉపయోగించే పడవల నిర్వహణలో విధిగా నిబంధనలు పాటించాలని సీఐ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మనోహర్, డిప్యూటీ ఎంపీడీవో పద్మావతి తెలిపారు. గురువారం ఆయా రేవుల్లోని పడవుల నిర్వాహకులను కలిసి ప్రస్తుతం వారు అమలు చేస్తున్న విధి విధానాలను తెలుసుకొని పలు సూచనలు చేశారు. పడవల్లో లైఫ్ జాకెట్లను తప్పనిసరిగా ఉంచుకోవాలని, పడవల్లో బైకుల వంటి వాహనాలను ఎక్కించకూడదని, నియమిత సంఖ్యను దాటి ప్రజలను కూడా ఎక్కించవద్దన్నారు. పడవుల నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి వారి నుంచి నిబంధనలు అమలు చేసే ధ్రువీకరణ పత్రాలు తీసుకున్నారు. ఇటీవల వేదాద్రి నుంచి గింజుపల్లి వెళ్లే పడవలో మోటారు ఆగిపోయి పడవ నదిలో అర గంట పాటు ఉండాల్సి రావడంతో రేవులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

బులియన్ మార్కెట్ పురస్కారానికి ఎంపిక



శ్రీరాం సుబ్బారావు

జగ్గయ్యపేట: 75 ఏళ్లు పైబడి బంగారు నగల వ్యాపారంలో కొనసాగుతున్న వారికి ఏపీ జెమ్ అండ్ జ్యువెలరీ ఫేర్, ఏపీ బులియన్ మర్చంట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రకటించిన ప్రత్యేక పురస్కారానికి జగ్గయ్యపేట బులియన్ మర్చంట్స్ అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ శ్రీరాం సుబ్బారావు ఎంపికయ్యారు. శుక్రవారం విజయవాడలో జరిగే కార్యక్రమంలో సుబ్బారావు దంపతులకు ఈ పురస్కారం అందించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. షరాబు వర్తక సంఘం ప్రతినిధులు సుబ్బారావును అభినందించారు.

సర్టిఫికెట్ పోయినది

సాదినేని రవికిరణ్ S/o. శ్రీనివాసరావు రోల్ నెం. 1112204704, K.K. No: 0912717, ZPHS, నందిగామ. నాకు సంబంధించిన 10th క్లాస్ సర్టిఫికెట్ రామన్నపేట నుండి చందర్లపాడుకు బైకు మీద వస్తుండగా జారిపడిపోయినది. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది ఫోన్ నెంబర్‌కు సంప్రదించగలరు.

✆ 98668 43314

ఎంఈవోకు సన్మానం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామలో గురువారం చందర్లపాడు ఎంఈవో-1గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన యు.గురునాథంను ఏపీటీఎఫ్ నాయకులు సన్మానించారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి డి.రాజ్‌కుమార్, జిల్లా కార్యదర్శి ఎస్.నరసయ్య, కార్యవర్గ సభ్యులు శేఖర్ బాబు, జీవీ సురేష్, పి.గణేష్ ఆయన్ను సత్కరించారు.

పెట్రోలు బంకులో తహసీల్దార్ తనిఖీ

జుజ్జూరు(వీరులపాడు), న్యూస్‌టుడే: పెట్రోలు బంకులు నిబంధనలకు అనుగుణంగా ఉండాలని, ఉపక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దారు రవికుమార్ హెచ్చరించారు. మండల పరిధిలోని జుజ్జూరు హెచ్‌పీ పెట్రోలు బంకును గురువారం ఆయన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. పెట్రోల్ నాణ్యత, వినియోగదారులకు అందిస్తున్న సేవలు, భద్రతా ప్రమాణాలను, పెట్రోలు, డీజిల్ సాంద్రతను పరిశీలించారు. ఉప తహసీల్దారు నాగరాజు, గ్రామ రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోటి దీపోత్సవం

నందిగామ: కార్యక్రమంలో భక్తులు

జగ్గయ్యపేట నాగలక్ష్మి ఆలయంలో శివలింగార్చాన

నందిగామ గ్రామీణం, జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: నందిగామ వాసవీ మార్కెట్ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి 12వ కోటి దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. శివాలయం కూడలిలో ఏర్పాటు చేసిన వేదికపై వేదపండితులు గౌరిపెద్ది శేషసాయి ఆధ్వర్యంలో శివ లింగానికి రుద్రాభిషేకం నిర్వహించారు. గుంటూరు జిల్లా తాళ్లాయపాలెం శైవక్షేత్ర వ్యవస్థాపక పీఠాధిపతి శివస్వామి, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ప్రభుత్వవిప్ తంగిరాల సౌమ్య, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. పెద్ద సంఖ్యలో దంపతులు పాల్గొన్నారు. తెదేపా పట్టణ అధ్యక్షుడు ఏచూరి రాము, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, కంచికచర్ల ఏఎంసీ ఛైర్మన్ కోగంటి బాబు, ఎన్నెస్పీ డీసీ ఛైర్మన్ చంద్రశేఖర్, రామాలయ కమిటీ ఛైర్మన్ వెంకన్నగురుస్వామి, కమిటీ సభ్యులు పెద్దిరాజు, చిన్నారి, బుల్లబ్బాయి, కూటమి నాయకులు మనబోతుల శ్రీరామ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నందిగామ: ప్రశంసా పత్రం అందజేస్తున్న విప్ తంగిరాల సౌమ్య

కంచికచర్లలో మాట్లాడుతున్న ఎంఈవో బాలాజీ

చందర్లపాడులో బహుమతులు సాధించిన విద్యార్థులు

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

జగ్గయ్యపేటలో ఎమ్మెల్యే తాతయ్య, రాఘవేంద్రరావు తదితరులు

నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. పలుచోట్ల విద్యార్థులకు ముగ్గులు, క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ, మ్యూజికల్ ఛైర్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. నందిగామ గ్రంథాలయంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కంప్యూటర్లను ప్రారంభించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల్లో అన్నిరకాల వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ బండారు హనుమంతురావు, డైరెక్టర్ రామకోటేశ్వరరావు, గ్రంథాలయ అధికారి రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు. ✦ జగ్గయ్యపేట గ్రేడ్- 1 గ్రంథాలయంలో విద్యార్థులకు ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. మున్సిపల్ ఛైర్మన్ రాఘవేంద్ర, కౌన్సిలర్ రామలక్ష్మి, అబ్బాస్‌అలి, కవులు బ్రహ్మయ్య, నరసింహారాజులు పాల్గొన్నారు. గండ్రాయిలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతులు అందించారు. – న్యూస్‌టుడే బృందం

SBI భారతీయ స్టేట్ బ్యాంక్

హోమ్ లోన్ సెంటర్-2 (ఆర్ఎసిపిసి-2), డోర్ నెం: 59-13-4, ఘంటసాలవారి వీధి, గాయత్రి నగర్, విజయవాడ-520008

స్వాధీనత ప్రకటన

APPENDIX IV (రూలు-8(1) (స్థిరాస్తి కొరకు)

ఇందుమూలముగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం-2002 (నెం.54 ఆఫ్ 2002) ప్రకారం భారతీయ స్టేట్ బ్యాంక్ [illegible] డి.08-09-2025 నాటికి రూ.12,85,069/- [illegible] శ్రీమతి మందపల్లి [illegible] 37235946275 [illegible] డి.08-09-2025 [illegible]

[illegible] డి.15-11-2025 [illegible]

[illegible] రూ.12,85,069/- [illegible]

షెడ్యూల్ ప్రాపర్టీ వివరణ

[illegible]

ప్రదేశం: విజయవాడ
తేది: 15-11-2025

అధీకృత అధికారి
భారతీయ స్టేట్ బ్యాంక్

విజయవాడ పశ్చిమ

పొదుపు సంఘాల మహిళలకు వైద్య పరీక్షలు

విజయవాడ నగరపాలక సంస్థ: నగరంలోని 7వేల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు 'సఖి సురక్ష' ద్వారా ఉచిత వైద్య, క్యాన్సర్ పరీక్షలు నిర్వహించినట్లు, మరికొందరికి శుక్రవారం నిర్వహిస్తున్నట్లు యూసీడీ పీవో పి. వెంకటనారాయణ తెలిపారు. కేదారేశ్వరపేట మ్యాంగో మార్కెట్ కళ్యాణ మండపం, సూర్యారావుపేట ఐవీ ప్యాలెస్, పటమట హైస్కూలు రోడ్డు కనకమేడల రవీంద్ర మార్ కల్యాణ మండపం ప్రాంతాల్లో గత ఐదు రోజులుగా యూసీడీ విభాగం ఆధ్వర్యంలో క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

పోటీలో విద్యార్థులు

విజేతలకు బహుమతులు అందిస్తున్న సూర్యారావు, సాయిరామ్

ప్రతిభ చూపారు.. బహుమతులు సాధించారు

చిట్టినగర్, న్యూస్‌టుడే : గొల్లపాలెం గట్టులోని గీతాంజలి ఆంగ్ల మాధ్యమ హైస్కూల్‌లో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై జరిగిన ఉపన్యాస పోటీలో పలువురు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సత్తా చాటారు. ఇందులో ఎస్‌కే.చాందిని(10వ తరగతి), కె.మాధురిదేవి (9వ తరగతి), మనస్వినీ(8వ తరగతి) వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించారు. విజేతలకు పాఠశాల డైరెక్టర్ ఎన్.సూర్యారావు, ప్రధానోపాధ్యాయుడు సాయిరామ్ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేసి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయ బృందానికి సత్కారం

సన్మాన గ్రహీతలతో కార్పొరేటరు మహాదేవు అప్పాజీ

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే : గత 25 సంవత్సరాలుగా పాతబస్తీలోని మౌలానా ఆజాద్ ఉర్దూ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేశారని 53వ డివిజన్ కార్పొరేటరు మహాదేవు అప్పాజీ ఉపాధ్యాయులను అభినందించారు. గురువారం ఆ పాఠశాలలో 2024-25 విద్యా ఏడాదికి సంబంధించి పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు సాధించిన ఉత్తీర్ణతకు గాను ఉపాధ్యాయ బృందాన్ని ఆయన సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఖుద్దూస్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

? విద్యాధరపురం నుంచి సొరంగ మార్గం వచ్చే రోడ్డు గుంతలమయంగా మారింది. - ప్రవంతి, స్థానికురాలు ✔ పరిశీలించి వాటిని పూడ్చివేస్తాం. - శ్రీనివాస్, సర్కిల్-1 ఈఈ

? సొమాంగం చౌకే విల్లా కాంప్లెక్స్ ఆవరణలో చెత్త పేరుకుపోయింది. - సూరిబాబు, స్థానికుడు ✔ పరిశీలించి చెత్తను తరలిస్తాం. - యోగేంద్ర, స్థానిక శానిటరీ అధికారి

? రథం సెంటర్‌లో రథం ఆవరణలోని చెత్త కుండీలో వ్యర్థాలను తరలించడం లేదు. - వాసవి, స్థానికురాలు ✔ పరిశీలించి వ్యర్థాలను తీయించివేస్తాం. - యోగేంద్ర, స్థానిక శానిటరీ అధికారి

స్పందనకు వందనం

★ చిట్టినగర్ కేఎల్‌రావు పార్క్ సమీపంలోని రోడ్డుపై రాత్రులు పలువురు యువకులు కూర్చుని మద్యం తాగుతున్నారని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. దీనిపై గురువారం వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పోలీసులు ఆ ప్రాంతంలో నిఘా ఏర్పాటు చేశారు. ★ భవానీపురం బరస్‌యార్డు ప్రధాన గేటు సమీపంలో రాత్రులు పలువురు లారీ డ్రైవర్లు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు సమాచారం ఇచ్చారు. దీనిపై ప్రచురితమైన వార్తకు భవానీపురం పోలీసులు స్పందించి గస్తీ పెంచారు. ★ భవానీపురం అన్సర్‌ఫాంటెన్ సమీపంలోని డ్రెయిన్‌లో పూడిక తీయక దుర్వాసన వస్తోందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా అధికారులకు తెలిపారు. స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో పూడిక తీయించారు. - న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

అభివృద్ధి లేదు.. ఆక్రమణల జోరు

నిరుపయోగంగా విలువైన ప్రభుత్వ స్థలాలు

విద్యాధరపురం, న్యూస్‌టుడే

గట్టువెనక ప్రాంతంలో విలువైన ప్రభుత్వ స్థలాలు ఆక్రమణదారుల గుప్పెట్లోకి వెళ్తున్నాయి. సితార సెంటర్ నుంచి గొల్లపూడి వరకు భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని 200 అడుగుల బైపాస్ రోడ్డుకు కేటాయించారు. కానీ కేవలం వంద అడుగుల మేర మాత్రమే రహదారికి వినియోగిస్తున్నారు. మరో వంద అడుగుల స్థలాన్ని ఆక్రమణదారులు చెట్టుబడిగా పెట్టి వ్యాపారాలు చేస్తున్నారు. సితార సెంటర్ సమీపంలో స్థానిక కార్పొరేటరు మాధురి లావణ్య ప్రతిపాదనల మేరకు మూడేళ్ల కిందట నగర మేయర్ భాగ్యలక్ష్మి, అప్పటి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు రూ.70 లక్షలతో పిల్లల పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత వైకాపా నాయకుల ప్రాధాన్యత పెరిగింది. ఆ స్థలంలో వైకాపా కార్యాలయం నిర్మించాలని ప్రతిపాదన తీసుకురావడంతో పార్కు నిర్మాణం వాయిదా పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యానవనానికి కేటాయించిన స్థలం చుట్టూ రక్షణ గోడ నిర్మించింది. పార్కు నిర్మాణం ప్రతిపాదన స్థాయి నుంచి ముందుకు జరగలేదు.

పిల్లల ఉద్యానవనం చుట్టూ నిర్మించిన రక్షణ గోడ

పర్యవేక్షణ లేకపోవడంతో..

సితార బైపాస్ రోడ్డులో ఆక్రమణదారులు హల్‌చల్ చేస్తున్నారు. రహదారికి ఇరువైపుల మొక్కలు, ఇసుక, కంకర, పండ్ల వినియోగిస్తున్నారు. కొంతమంది రోడ్డు స్థలాన్ని ఆక్రమించి పక్కా నిర్మాణాలు చేస్తున్నప్పటికీ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు కన్నెత్తి చూడకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. బైపాస్ సమీపంలోని స్థలంలో లారీలు నిలిపి రూ. లక్షల విలువ చేసే ఇసుక, కంకర విక్రయాలు చేస్తున్నారు. ఈ విషయంపై స్థానిక కార్పొరేటరు మాధురి లావణ్యను సంప్రదించగా బైపాస్ రహదారి పక్కన చిల్డ్రన్ పార్కు నిర్మాణానికి ప్రతిపాదనలు కౌన్సిల్ ఆమోదించినప్పటికీ వైకాపా పాలకులు కొందరు అడ్డు తగలడంతో సమస్యలు తలెత్తాయని తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్యే సుజనా చౌదరి దృష్టికి సమస్యను తీసుకొచ్చామని, త్వరలో అభివృద్ధి పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రథమ బహుమతి రావడం అభినందనీయం

కళాకారులతో డీఆర్ఎం మోహిత్ సొనాకియా తదితరులు

విజయవాడ (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే : జోనల్ హిందీ నాటక పోటీల్లో విజయవాడ డివిజన్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ నెల 17న సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో 'ఆఖంద సర్గ్' హిందీ నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకం వివిధ విభాగాల్లో తొమ్మిది వ్యక్తిగత అవార్డులు గెలుచుకుంది. విజయవాడ డివిజన్ స్టేషన్ మేనేజర్ ఎం.గోపాలకృష్ణ దర్శకత్వంలో రూపొందిన ఈ నాటకంలో డివిజన్‌లో పనిచేస్తున్న పలు విభాగాల సిబ్బంది నటించారు. ఈ సందర్భంగా గురువారం డీఆర్ఎం కార్యాలయంలో కళాకారులను డీఆర్ఎం మోహిత్ సొనాకియా పురస్కారాలతో సత్కరించారు. బహుమతి సాధించడంపై డీఆర్ఎం వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం కొండా శ్రీనివాసరావు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

22న ప్రత్యేక కమిటీల సమావేశాలు

విజయవాడ నగరపాలక సంస్థ: నగరపాలక సంస్థ పరిధిలోని ఈ నెల 22న పలు ప్రత్యేక కమిటీల సమావేశాలు జరుగుతాయి. ఈ మేరకు కార్పొరేషన్ కార్యదర్శి విభాగం అధికారులు సమావేశాల తేదీలను గురువారం ప్రకటించారు. రోడ్లు, డ్రెయిన్లు, వంతెనలు, భవనాలు, క్రీడలు, ట్రాఫిక్, మంచినీరు, భూగర్భ డ్రైనేజీ, లైటింగ్, పార్కుల అభివృద్ధి ప్రత్యేక కమిటీల సమావేశాలు నిర్వహించనున్నారు. మిగిలిన ప్రత్యేక కమిటీల సమావేశాల నిర్వహణ తేదీలను అధికారులు తదుపరి ప్రకటిస్తారు.

దుర్గగుడి నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల నిత్యాన్నదాన పథకానికి విజయవాడ మధురానగర్‌కు చెందిన పళని సాయిచరణ్ రూ.1,00,116 విరాళాన్ని గురువారం అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది అమ్మవారి దర్శనం చేయించారు. వేద పండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం పాలక మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ వారికి విరాళం రసీదుతో పాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందించారు.

దాత పళని సాయిచరణ్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఛైర్మన్

క్రమశిక్షణతో విద్యాభ్యాసం పూర్తి చేస్తే ఉపాధి

విద్యాధరపురం, న్యూస్‌టుడే : ప్రతి వ్యక్తి జీవితంలో బాల్యం మధురం కావాలని సైనిక్ వెల్ఫేర్ శాఖ అడిషనల్ డైరెక్టర్ కెప్టెన్ సత్యప్రసాద్ అన్నారు. బాలల హక్కుల వారోత్సవాలను పురస్కరించుకొని కబేళా సెంటర్ సమీపంలోని జువనైల్ హోమ్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత సమాజంపైన ఉందని చెప్పారు. చిన్న వయసులో చెడు వ్యసనాలకు లోను కాకుండా వారిని తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులదన్నారు. క్రమశిక్షణతో విద్యాభ్యాసం పూర్తి చేస్తే ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. జువనైల్ వెల్ఫేర్ బోర్డు జాయింట్ డైరెక్టర్ రామమనోహర్, బాలల సంక్షేమ సమితి సభ్యులు రాధాకుమారి, హోమ్ సూపరింటెండెంట్ రామ్మోహనరెడ్డి, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు సుజాత, నిధి జైన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సత్యప్రసాద్, పక్కన రాధాకుమారి, రవి భార్గవ్, రామ్మోహనరెడ్డి

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

చిట్టినగర్, న్యూస్‌టుడే : కార్తిక మాసంలో భక్తిశ్రద్ధలతో విశేష పూజలు నిర్వహించడం ఆధ్యాత్మిక శోభ ఇచ్చిందని భాజపా జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయం ఇన్‌ఛార్జి పత్తిపాటి శ్రీధర్ అన్నారు. పాల ఫ్యాక్టరీ సమీపంలోని శ్రీవిజయదుర్గా రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం కుంభాభిషేకం, పూర్ణాహుతి నిర్వహించారు. ఇందులో వారు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నూతన ఆంగ్ల సంవత్సర కాలమానినిని ఆవిష్కరించి భక్తులకు పంపిణీ చేసినట్లు ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశర్మ, నాగ వెంట పవన్‌కుమార్‌శర్మ తెలిపారు.

జగన్మోహిని దేవి అలంకారంలో భ్రమరాంబదేవి

రామలింగేశ్వర స్వామి

★ ఆంజనేయవాగు సెంటర్‌లోని శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలోని శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో అర్చకుడు విన్నకోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఛైర్మన్ నందిపాటి నాగ వెంకట శ్రీనివాసరావు పర్యవేక్షణలో పూజలు నిర్వహించినట్లు ఈవో వై.సీతారామయ్య తెలిపారు. అనంతరం ప్రముఖ వ్యాపారవేత్త చింతలపూడి సత్యనారాయణ, కుంచం శ్రీనివాసరావు, భక్తుల సహకారంతో అన్నదానం చేశారు.

ఇంద్రకీలాద్రి: కార్తిక మాసం ముగింపు సందర్భంగా గురువారం ఇంద్రకీలాద్రిపై ఆది దంపతులకు ఊంజల్ సేవ నిర్వహించారు. మల్లేశ్వర స్వామి ఆలయంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర దీపార్చన చేశారు. కార్యక్రమంలో దేవస్థానం పాలక మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఊంజల్ సేవలో రాధాకృష్ణ తదితరులు

భక్తులకు అన్నప్రసాదం వితరణ

★ వన్‌టౌన్‌లోని శ్రీభ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారికి జగన్మోహిని దేవి అలంకారం చేశారు. విజయేశ్వరాలయం, వసంత మల్లికార్జున స్వామి ఆలయాల్లో శివయ్యకు మహాలింగార్చన పంచహారతులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈవోలు నటరాజన్ షణ్ముఖం, వెంకటరెడ్డి, వసంత మల్లికార్జున స్వామి ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ సుదర్శనరావు పాల్గొన్నారు.

విజయవాడ వన్‌టౌన్: కార్తిక మాసం ముగింపు సందర్భంగా కొత్తపేట శ్రీధర్బేశ్వరాలయంలో పది వేల మంది భక్తులకు అన్నదానం చేసినట్లు దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త రాంపిళ్ల జయప్రకాష్ తెలిపారు. గురువారం కొత్తపేట సైకం వారి వీధిలో ఉన్న శ్రీధర్బేశ్వర స్వామి దేవస్థానం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఇండియన్ సివిలైజేషన్ గాంధీ ట్రస్ట్ డైరెక్టర్లు తమ్మిన సోనియా, హనుమ, ప్రముఖ వ్యాపారవేత్తలు తమ్మిన యజ్ఞేశ్వరరావు, అవినాష్ పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ అధ్వానం.. నడకకు విఘాతం

కేఎల్‌రావు పార్కులోని వాకింగ్ ట్రాక్‌తో వాకర్స్ ఇబ్బందులు పడుతున్నారు. అక్కడక్కడ గోతులుగా మారడం, వర్షం పడినప్పుడు నీరు నిల్వ ఉండడంతో దానిపై నడవలేని పరిస్థితి. ట్రాక్ రక్షణ గోడను ఆనుకుని తూర్పు భాగంలో ఉన్న నివాసితులు తినేసిన ఆహార పొట్లాలు, తాగిన మద్యం సీసాలు ట్రాక్‌పై పడేస్తున్నారు. పడమర భాగంలోని జయంతి అపార్టుమెంట్‌లోని నివాసితులు కొందరు చెత్త, ఇతర వ్యర్థాల కవర్లను ట్రాక్‌పై పడేస్తున్నారు. ఈ క్రమంలో తీవ్ర దుర్వాసనతో అవస్థలు పడుతున్నామని పలువురు ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని నివాసితులతో మాట్లాడి ఆయా సమస్యలను పరిష్కరించాలని వాకర్స్ కోరుతున్నారు. - న్యూస్‌టుడే, చిట్టినగర్

పూడిక తీయక.. వెతలు తీరక

భవానీపురం న్యూ హెచ్‌బీ కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంటుంది. కాలువల్లో పూడిక తీయకపోవడంతో మురుగు పొంగిపొర్లుతోంది. దీంతో స్థానిక ప్రజలకు అసౌకర్యంగా ఉంటుంది. నగరపాలక సంస్థ సిబ్బంది కొన్ని వారాలుగా రావడం లేదని కాలనీవాసులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, భవానీపురం

తాగునీరు వృథా.. ప్రజలకు వ్యధ

తాగునీరు సరఫరా చేసే పైపు లీకై మంచి నీరు వృథాగా రోడ్డు పాలవుతోంది. 46వ డివిజన్, లంబాడీపేట, దేవయ్య వీధి అడ్డరోడ్డులో లీకవుతున్న పైపునకు ప్లాస్టిక్ సంచులు చుట్టినా ఫోర్స్‌గా నీరు చిమ్ముతోంది. దీని వల్ల కొండ ప్రాంతంలో ఉన్న రిజర్వాయర్‌కు నీరు పంపింగ్ జరగడం లేదు. తద్వారా ప్రజలకు నీటి కొరత ఏర్పడి అవస్థలు తప్పడం లేదు. నీటి విభాగం సిబ్బంది పర్యవేక్షణ పూర్తిగా కొరవడడం వల్లనే లీకుల విషయం అధికారుల దృష్టికి రావడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. - న్యూస్‌టుడే, చిట్టినగర్

పుస్తక పఠనంతో మేధో వికాసం

గవర్నర్‌పేట: ప్రజల జీవన వికాసానికి, సామాజిక పురోగతికి గ్రంథాలయాలు సోపానాలుగా నిలుస్తాయని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. గ్రంథాలయాల విశిష్టతను నేటి తరానికి తెలియజేయాలని పిలుపునిచ్చారు. గురువారం మహాత్మాగాంధీ రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశం జరిగింది.

పల్స్ పోలియోపై అవగాహన పెంచుకోండి

వీడియో కాన్ఫరెన్స్‌లో డా.ఎం.సుహాసిని, అధికారులు

విజయవాడ పాతాసుపత్రి, న్యూస్‌టుడే : హెల్త్ సూపర్‌వైజర్లు అంతా పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డా.ఎం.సుహాసిని సూచించారు. గురువారం విజయవాడలోని ఆమె కార్యాలయంలో జిల్లాలోని సూపర్‌వైజర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. 100 శాతం కవరేజ్‌కు సరైన బూత్ నిర్వహణ, తప్పిపోయిన పిల్లల కోసం తదుపరి వ్యూహాలను నిర్ధారించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మురుగు పారదు.. దుర్వాసన వీడదు



పాతబస్తీ పాత రాజరాజేశ్వరీపేట ప్రధాన రహదారి మార్గం వెంబడి ఉన్న కాలువల్లో పది రోజులుగా పూడిక తీయక దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

ఆక్రమణలు తొలగించి రోడ్డు పునరుద్ధరణ

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ఆక్రమణలతో కుంచించుకుపోయిన పటమట హైస్కూలు రోడ్డు వెంట ఆక్రమణలు తొలగించి రహదారిని పునరుద్ధరించేందుకు నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికాధికారులు చర్యలు చేపట్టారు. చీఫ్ సిటీప్లానర్ సంజయ్ రత్నకుమార్ ఆదేశాల మేరకు 80 అడుగులుగా ఉండాల్సిన హైస్కూలు రోడ్డు ప్రస్తుతం రెండు వైపులా 20 అడుగులు చొప్పున ఆక్రమణలకు గురైంది. ఫలితంగా ఆ రోడ్డు 30-40 అడుగులకు కుంచించుకుపోయింది. గుర్తించిన ప్రణాళికాధికారులు రహదారికి రెండు వైపులా ఉన్న ఆక్రమణలు గురువారం తొలగించి రహదారిని తిరిగి 80 అడుగులకు పునరుద్ధరించారు. ఆ ప్రాంతాల్లో అనధికారిక పార్కింగ్ ప్రాంతాన్ని తొలగించారు. అధికారులు మాట్లాడుతూ నగర పరిధిలోని అనధికారిక నిర్మాణాలు, ఆక్రమణలను ప్రణాళికాధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి తొలగిస్తారని తెలిపారు. అధికారులు సామ్రాజ్యం, కమల్, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి పక్కనున్న ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది

దెబ్బతిన్న కల్వర్టులు.. రాకపోకలకు ఇక్కట్లు

చిట్టినగర్, న్యూస్‌టుడే

పలు ప్రాంతాల్లో కల్వర్టులపై ఉన్న సిమెంటు దిమ్మెలు దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల ఎగుడు దిగుడుగా, మరికొన్ని చోట్ల ఇనుప చువ్వలు బయటపడి ప్రమాదభరితంగా మారాయి. ప్రధానంగా 47వ డివిజన్‌లోని మరుపిళ్ల చిట్టి పార్కు పక్క వీధిలోని కల్వర్టుపై సిమెంటు దిమ్మెలు కుంగిపోయాయి. కేఎల్‌రావు నగర్ రాకేష్ పాఠశాల సమీపంలో దీన్‌దయాళ్ నగర్‌కు వెళ్లే మార్గంలో కల్వర్టుపై ఉన్నవి పగిలిపోయి ఎప్పుడు కాలువలోకి కుంగిపోయి ప్రమాదం సంభవిస్తుందనే ఆందోళన స్థానికుల్లో నెలకొంది. చిట్టి పార్కు ఎదురు వీధిలో ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. లంబాడీపేట గురుస్వామి వీధిలో ర్యాంపు రోడ్డు కాలువ దిమ్మె కుంగిపోయాయి. దీంతో వాహనాలు ఎక్కేటప్పుడు ఇబ్బందిగా ఉంటుంది. ఈ మార్గంలో రోజుకు 200 వాహనాలకు పైగా రాకపోకలు సాగిస్తాయి. కొండ ప్రాంతానికి ఇదొక్కటే ర్యాంపు మార్గం. ద్విచక్ర వాహన చోదకులు, ఆటోవాలాలు, కార్లకు రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుంది. ఈ క్రమంలో కాలువపై కల్వర్టు ఎత్తు పెంచాలి. సంబంధిత అధికారులు ఆయా ప్రాంతాలను పరిశీలించి కల్వర్టులపై రాకపోకలకు అనువుగా మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

చిట్టి పార్కు ఎదురు వీధిలో మరమ్మతులు చేయాల్సిన కల్వర్టు

యువతకు రాజ్యాంగం ప్రాముఖ్యత తెలపాలి

భవానీపురం: గోడపత్రులు ఆవిష్కరిస్తున్న నాయకులు

భవానీపురం, న్యూస్‌టుడే : షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు రామారావు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం భవానీపురంలోని పశ్చిమ శాసన సభ్యుడు సుజనా చౌదరి కార్యాలయంలో దీనికి సంబంధించిన గోడపత్రులను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నేటి యువతకు రాజ్యాంగం ప్రాముఖ్యతను తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ రోజు భవానీపురం నుంచి బందరు రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భాజపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం, కార్యాలయ కార్యదర్శి పత్తిపాటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాట్‌ఫాంపై మర్చిపోయిన బ్యాగు అప్పగింత

విజయవాడ (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే : రైలు ఎక్కే క్రమంలో ప్లాట్‌ఫాంపై మర్చిపోయిన బ్యాగును రైల్వే పోలీసులు భద్రంగా అప్పగించిన సంఘటన విజయవాడ రైల్వే స్టేషన్‌లో గురువారం చోటు చేసుకుంది. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన విత్తనాల రవి ప్రసాద్ శబరిమల వెళ్లే రైల్లో ప్రయాణిస్తున్నారు. రైలు విజయవాడ 6వ నంబరు ప్లాట్‌ఫాంపైకి చేరుకుంది. బోగీలో ఎక్కువ మంది ప్రయాణికులు ఉండడంతో రైలు దిగి ఎక్కేటప్పుడు తన బ్యాగును ప్లాట్‌ఫాంపై మర్చిపోయి రైలు ఎక్కి వెళ్లారు. బ్యాగు మర్చిపోయిన విషయం తెలుసుకుని వెంటనే విజయవాడ జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ జేవీ రమణ స్పందించి సిబ్బందితో ప్లాట్‌ఫాంపై బ్యాగును వెతికించారు. చోరీకి గురి కాకుండా బ్యాగు అక్కడే ఉండడంతో స్వాధీనం చేసుకుని రవి ప్రసాద్‌కి తెలిపారు. అందులో 20 గ్రాముల బంగారం లాకెట్, చైను, దుస్తులు ఉన్నాయి. రవి ప్రసాద్ బంధువు అయిన నాగేశ్వరరావుకు దాన్ని అప్పగించారు. ఈ సందర్భంగా రవిప్రసాద్ జీఆర్పీ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

రవి ప్రసాద్ బంధువుకు బ్యాగు ఇస్తున్న కానిస్టేబుల్

క్రైమ్ కార్నర్

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

భవానీపురం, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు చనిపోయినట్లు భవానీపురం పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి...విద్యాధరపురం రావిచెట్టు సెంటర్ వద్ద కోరాడ రాఘవమ్మ(70) కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. ఈ నెల 20న ఉదయం రావిచెట్టు సమీపంలోని రామాలయానికి వెళ్లేందుకు ఇంటి వద్ద నుంచి బయలుదేరారు. హెడ్‌వాటర్ వర్క్స్ సమీపంలో రోడ్డు దాటుతుండగా అటుగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి ఢీకొట్టాడు. దీంతో ఆమె తలకు బలమైన గాయమైంది. కుటుంబ సభ్యులు ఆమెను విజయవాడలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకుని వెళ్లగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. ఆమె కోడలు శ్యామల ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు

చిట్టినగర్, న్యూస్‌టుడే : చంపుతానని బెదిరిస్తున్నాడని పోలీసులకు గురువారం ఫిర్యాదు అందింది. వివరాలు ఇలా ఉన్నాయి.. చిట్టినగర్ కుండల మార్కెట్ ప్రాంతంలో బి.హేమలత, సాయికుమార్ దంపతులు నివాసం ఉంటున్నారు. హేమలత ఆడపడుచు భవితకు ఆళ్ల సూర్యనారాయణ అలియాస్ బాబ్జి నాయుడుతో 2017లో పెళ్లి జరిగింది. వివాహ సమయంలో సూర్యనారాయణకు అనారోగ్యంగా ఉన్నట్లు చెప్పలేదని, తెలిసి గొడవలు జరిగి పెద్దల సమక్షంలో విడిపోయారు. భవిత మాత్రం హేమలత వద్దనే ఉంటూ కొంతకాలంగా వేరే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. హేమలత తన కాపురం చెడగొట్టిందని భావించిన సూర్యనారాయణ ఆమెను తీవ్ర పదజాలంతో దూషించడం, చంపుతానని బెదిరించడం చేస్తున్నాడు. తనకు రక్షణ కల్పించి, అతనిపై చర్యలు తీసుకోవాలని హేమలత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

రుణం ఇప్పిస్తానని మోసం చేసిన..

భవానీపురం: రుణం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. .విద్యాధరపురం సితార సెంటర్ సమీపంలో చిమట మహాలక్ష్మి కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. ప్రస్తుతం ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నారు. ఆరు నెలల క్రితం రూ.30 లక్షలు ఎడ్యుకేషన్ రుణం ఇప్పిస్తానని చెప్పి నవీన్ అనే వ్యక్తి రెండు దఫాలుగా ఆమె వద్ద రూ.73 వేలు తీసుకున్నాడు. రుణం ఇప్పించకపోవడంతో మోసపోయినట్లు గ్రహించిన మహాలక్ష్మి భవానీపురం పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై హత్యాయత్నం

చిట్టినగర్ : భార్యపై భర్త హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఇది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వైఎస్ఆర్ కాలనీలో ఉండే అల్లాకుంట దీనకుమారి(35)కి ముగ్గురు సంతానం. ఆమె ప్రభుత్వాపత్రిలో స్వీపర్‌గా పని చేస్తున్నారు. భర్త చనిపోతే ఆరేళ్ల కిందట తమ్మిశెట్టి ఆంజనేయులును రెండో వివాహం చేసుకున్నారు. కొద్ది రోజుల కిందట స్వీపర్‌గా మానేసి చెల్లితో కలిసి మట్టి పనులకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో భార్యాభర్తల మధ్య చిన్నచిన్న గొడవలు జరుగుతున్నాయి. మద్యం తాగి వచ్చి అకారణంగా కొట్టడం, తిట్టడం మానసిక, శారీరకంగా వేధిస్తున్నాడు. ఈ నెల 20న మరలా ఇద్దరి మధ్య గొడవ జరిగి భర్త చాకుతో ఆమె ఛాతిపై పొడిచాడు. రక్తస్రావమై కేకలు వేస్తూ పడిపోగా అదే భవనంలో ఉండే తమ్ముడు, మరదలు వచ్చేసరికి ఆంజనేయులు పారిపోయాడు. వెంటనే 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కొత్తపేట పోలీసులు తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

సర్టిఫికేట్స్ పోయినవి
Sk. మస్తాన్‌వలి, S/o. SK. హుస్సేన్, భవానీపురం, ఇందిరా ప్రియదర్శిని కాలనీ వాస్తవ్యుడు తెలియజేయునదేమనగా నా ఇంటి వద్ద నుండి జిరాక్స్ నిమిత్తం స్వాతి సెంటర్‌లో గల జిరాక్స్ షాపు నుండి వెళ్ళి వచ్చుచుండగా తిరుగు ప్రయాణంలో మార్గమధ్యలో నా ఒరిజినల్ టెన్త్ మెమో ఒరిజినల్ ఇంటర్ టి.సి. మరియు ఆధార్ కార్డు కలిగి ఉన్న కవరు జారిపడిపోయినది. దొరికిన యెడల తెలియపరచగలరు.
✆ 84988 92441

(c) eenadu

విజయవాడ మధ్య

ప్రతిభా ఉపకారవేతన పరీక్షపై 24న సదస్సు

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే: జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షపై ఈనెల 24న విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు అమరావతి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి రామిశెట్టి కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు స్కాలర్‌షిప్‌లకు అర్హత సాధించేందుకు డిసెంబరులో జరిగే పరీక్షకు సహకారాన్ని అందించడమే సదస్సు ఏర్పాటు లక్ష్యమన్నారు. ఎంబీ ఆడిటోరియంలో నిర్వహించే సదస్సులో అర్హత కలిగిన విద్యార్థులు పాల్గొనాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

సీతారాంపురం–63036 11232, పాయకాపురం– 90631 44761

స్పందనకు వందనం

పాయకాపురం, న్యూస్‌టుడే: ● హారిక బిర్యానీ పాయింట్ ప్రాంతంలో రంగుమారిన మంచినీరు సరఫరా అవుతోందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. ఈ సమస్య ప్రచురితమైంది. స్పందించిన మంచినీటి విభాగం అధికారులు ఆప్రాంతంలో పైపులైన్ల లీకేజీని పరిశీలించారు. మంచినీటి పరీక్షలు నిర్వహించారు.

సీతారాంపురం, న్యూస్‌టుడే: ● 23వ డివిజన్ సూర్యారావుపేట, సూర్యనారాయణ వీధిలో ఇంటి నం:29-27-54 వద్ద నుంచి మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా..'కు సమాచారం ఇచ్చారు. సమస్య ఈనెల 18న 'ఈనాడు'లో ప్రచురితమైంది. స్పందించిన డివిజన్ పారిశుద్ధ్య తనిఖీ అధికారి కె. నరసింహారావు మురుగు నీరు రోడ్డుపై నిలవకుండా తగిన చర్యలు తీసుకొని ఆ ప్రాంతంలో బ్లీచింగ్ చల్లించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

డ్రోన్లతో నిరంతర నిఘా

నిర్మానుష్య ప్రాంతాలు, ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

శివారు ప్రాంతంలోని పొలాల్లో పోలీస్ డ్రోన్ చూసి పారిపోతున్న జూదరులు

వన్‌టౌన్ కాళేశ్వరరావు మార్కెట్ పరిసరాల చిత్రీకరణ

శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా నగరంలోని పలు నిర్మానుష్య ప్రాంతాలు, ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలపై పోలీసులు డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేశారు. పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు డీసీపీలు కృష్ణకాంత్ పాటిల్, బి.లక్ష్మీనారాయణ, షిరీన్‌బేగం తదితరులు తమ సిబ్బందితో డ్రోన్ల ద్వారా తనిఖీలు నిర్వహించారు. శివారు ప్రాంతాల్లో జూదం, బహిరంగంగా మద్యం తాగే వారిపై నిఘా ఉంచారు.

కీలక కూడళ్లపై... ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా నగరంలోని పలు ముఖ్యమైన కూడళ్లపై నిఘా ఉంచారు. వన్‌టౌన్ కాళేశ్వరరావు మార్కెట్, కనకదుర్గ పైవంతెన, దుర్గగుడి ఘాట్‌రోడ్డు, ప్రకాశం బ్యారేజీ తదితర ప్రాంతాల్లోని ట్రాఫిక్ రద్దీని పరిశీలించారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించే వారిని గుర్తించి అక్కడకు సిబ్బందిని పంపి ఇబ్బందులు తొలగించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నిరంతరం నగరంలో సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా పర్యవేక్షిస్తామని, ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కళా సంపదను కాపాడుకుందాం

గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జి.లక్ష్మీశ, గొల్ల నారాయణరావు, కమిలిశ్రీ, తదితరులు

పాయకాపురం, న్యూస్‌టుడే: ఆధునిక జీవనశైలితో మసకబారుతున్న సాంస్కృతిక కళా సంపదను పరిరక్షించుకుంటూ.. వాటిని భావితరాలకు వారసత్వ సంపదగా అందించేందుకు కవులు, రచయితలు, కళాకారులను ప్రోత్సహించేలా జాతీయ సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఏపీ రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి, జిల్లా యంత్రాంగం, మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ సంయుక్త సారథ్యంలో కోహన్స్ సంస్థ సహకారంతో జాతీయ సాంస్కృతిక ఉత్సవాల గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 22, 23 తేదీల్లో నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. 500కు పైగా ఎంట్రీలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో కమిలిశ్రీ, యేమినేని వెంకటరమణ, గొల్ల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

బాలల స్నేహపూర్వక సమాజం నిర్మిద్దాం

బాలల హక్కుల పరిరక్షణ ప్రతులు ఆవిష్కరిస్తున్న డీసీపీ కె.జి.వి.సరిత తదితరులు

మధురానగర్, న్యూస్‌టుడే: బాలల హక్కులు, సమస్యల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీసీపీ కె.జి.వి.సరిత పేర్కొన్నారు. బాలలంతా విద్య ద్వారానే ఉన్నతస్థితికి చేరాలని, పేదరికం అభివృద్ధికి ఆటంకం కాకూడదని కోరారు. బాలల స్నేహపూర్వక సమాజాన్ని నిర్మిద్దామని కోరారు. గురువారం మధ్యాహ్నం దుర్గాపురంలోని టి వెంకటేశ్వరరావు నగరపాలక సంస్థ పాఠశాలలో బాలల హక్కుల పరిరక్షణ వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీసీపీ సరిత మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణకు ఫోరం ఫర్ చైల్డ్‌రైట్స్ చేస్తున్న కృషిని అభినందించారు. బాల్య వివాహాలతో వచ్చే అనర్థాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలు, లైంగిక వేధింపుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై బాలలకు అవగాహన కలిగించారు. పిల్లలున్న ప్రతి ప్రదేశంలో, పాఠశాలల్లో అందరికీ అందుబాటులో ఉండేలా ఫిర్యాదుల బాక్సులు ఏర్పాటు చేయాలని కోరారు. బాలలు ఎవరైనా తమ సమస్యలను ఫిర్యాదుల బాక్సుల్లో వేస్తే సంబంధిత అధికారులు వాటిని పరిష్కరిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఫోరం ఫర్ చైల్డ్‌రైట్స్ రూపొందించిన బాలల హక్కుల గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం బాలల హక్కుల పరిరక్షణకు అందరం పాటు పడతామంటూ ప్రతిజ్ఞ చేయించారు.

విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపల్ ఎం.నాంచారయ్య, ఉపాధ్యాయిని కృష్ణవేణి

ప్రతిభ చాటి.. బహుమతులు సాధించి..

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే: న్యూరాజరాజేశ్వరి పేటలోని కేర్ అండ్ షేర్ పాఠశాలలో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో కె.ద్రాక్షాయని ప్రథమ, ఎం.దీవెన ద్వితీయ, సీహెచ్.శ్రీవిద్యసాహితి తృతీయ స్థానాల్లో నిలిచారు. ప్రిన్సిపల్ ఎం. నాంచారయ్య, ఉపాధ్యాయిని డి.కృష్ణవేణి విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే: 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా గురువారం ఏకేజీపీ ఎంసీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం, ఏఐపై ఉపన్యాస(స్పీచ్) పోటీలు నిర్వహించారు. ఎం.సౌమ్య ప్రథమ, ఎస్.తన్మయి ద్వితీయ, పి.వెంకట్ తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల సిబ్బంది బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఉమర్ అలీ, బి.మస్తాన్‌రావు, బి.ప్రశాంతి పాల్గొన్నారు.

విజేతలతో పాఠశాల సిబ్బంది

పుస్తక పఠనంతో మేధో వికాసం

బహుమతులు పొందిన విద్యార్థులతో కలెక్టర్ లక్ష్మీశ, నెల్లిబండ్ల బాలస్వామి, జి.రమాదేవి, డాక్టర్ జి.వి.పూర్ణచంద్, గుమ్మా సాంబశివరావు తదితరులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: ప్రజల జీవన వికాసానికి, సామాజిక పురోగతికి గ్రంథాలయాలు సోపానాలుగా నిలుస్తాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. గ్రంథాలయాల విశిష్టతను నేటి తరానికి తెలియజేయాలని పిలుపునిచ్చారు. గురువారం మహాత్మాగాంధీరోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ-పుస్తకాలు, కంప్యూటర్లు, మొబైల్స్ ద్వారా కావాల్సిన సమాచారం పొందుతున్నప్పటికీ గ్రంథాల ద్వారా అందే సమాచారానికి మించింది లేదన్నారు. పుస్తక పఠనం మేధో వికాసానికి దోహదపడుతుందన్నారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు కావాల్సిన పుస్తకాలను గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచి యువతను ఆకర్షించేలా చూడాలని కోరారు. స్థానిక కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి మాట్లాడుతూ ఠాగూర్ గ్రంథాలయంలో చదువుకుని వందలాది మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని గుర్తు చేశారు. అనంతరం గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి, డాక్టర్ జి.వి. పూర్ణచంద్, గుమ్మా సాంబశివరావు, స్వాతి, చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: రామకృష్ణాపురంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్సీ-2025లో ఉద్యోగం సాధించిన బి.స్వామినాయుడిని సత్కరించారు. గ్రంథాలయాధికారిణి ఎస్.కల్యాణి, పెన్మత్స దుర్గాభవాని, పి.అప్పలరాజు, మధుసూదనరాజు తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణపురం (గాంధీనగర్), న్యూస్‌టుడే: పుస్తక పఠనాన్ని ప్రతి ఒక్కరూ దినచర్యగా మార్చుకోవాలని శారద జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లుక్కా శ్రీధర్ కోరారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం చిత్తరంజన్ గ్రంథాలయంలో విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. గ్రంథాలయ అధికారి కేవీఆర్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

మధురానగర్, న్యూస్‌టుడే: లైన్ల తనిఖీలు, మరమ్మతుల కారణంగా మధురానగర్ సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పి.రవీంద్రబాబు తెలిపారు. ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు వెంకటేశ్వరనగర్, పప్పులమిల్లు ప్రాంతం, ఉలవచారు కంపెనీ రోడ్డు, తుంగం రాములు వీధి తదితర ప్రాంతాల్లో కరెంటు ఉండదని ఈఈ తెలిపారు.

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే: లైన్ల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 నుంచి 10 వరకు ఏఎస్‌రాజు వీధి, కనకరాజు వీధి, కొమ్ము వారి వీధి, వానపాల వారి వీధి, పాపరాజు వీధి, పెనుమత్స వారి వీధి, దేవాలయం వీధి ప్రాంతాల్లో సరఫరా నిలిపేస్తున్నట్లు ఈఈ పి.రవీంద్రబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పాయకాపురం, న్యూస్‌టుడే: శుక్రవారం ఉదయం 8:30 నుంచి 11:30 గంటల వరకు లైన్ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ రవీంద్రబాబు గురువారం తెలిపారు. ఈ ప్రభావంతో రాధానగర్, బర్మాకాలనీ, ప్రజాశక్తి నగర్, సుందరయ్యనగర్, ఎస్‌జే కిడ్నీ స్కూల్ రోడ్డు, బిందెల కంపెనీ, డాక్టర్స్ కాలనీ, విశాలాంధ్రకాలనీలో కరెంటు ఉండదని వెల్లడించారు.

రైతులకు ప్రభుత్వం భరోసా



నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఉమామహేశ్వరరావు

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని రైతులకు ప్రభుత్వం భరోసాగా నిలుస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం అజిత్‌సింగ్‌నగర్‌లోని తెదేపా కార్యాలయంలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం నిధులు విడుదల చేసిన సందర్భంగా రైతులతో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం కుందావారి కండ్రిక పాల సొసైటీ కృష్ణ యూనియన్‌లో రెండో స్థానం సాధించగా పాలకవర్గాన్ని సత్కరించి, రైతులకు అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం ద్వారా రూ.3.92 లక్షల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు విద్యార్థి ఎంపిక

విజయవాడ క్రీడలు: అజిత్‌సింగ్‌నగర్ ఎంబీపీ స్టేడియంలోని ఏసీఏ-కేడీసీఏ వీఎంసీ క్రికెట్ అకాడమీలో సాధన చేస్తున్న ఎన్.వెంకట కార్తీక్ రాష్ట్ర స్థాయి అండర్-14 స్కూల్ గేమ్స్ క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడని ఏసీఏ క్రికెట్ కోచ్ కె.శ్రీనివాస్ తెలిపారు. కుంచనపల్లిలో నిర్వహించిన జిల్లా జట్ల ఎంపిక పోటీలో కార్తీక్ మెరుగైన ప్రతిభ ప్రదర్శించి జట్టులో స్థానం సాధించాడని పేర్కొన్నారు.

సోషలిజమే లక్ష్యంగా పనిచేయాలి

మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

గవర్నర్‌పేట: కమ్యూనిజాన్ని అంతం చేయడం ఎవరి తరం కాదని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు. కార్మికులను చైతన్యం చేసి సోషలిజమే అంతిమ లక్ష్యంగా ముందుకు వెళ్లాలని కార్యకర్తలకు ఆయన సూచించారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నగరంలోని ఐఎంఏ హాలులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం సదస్సు జరిగింది. తొలుత 'ఫాసిజం-పాలక పీడిత వర్గాల్లో వైరుధ్యం' అంశంపై మార్క్సిస్టు విశ్లేషకుడు డి.రమేష్‌పట్నాయక్ ప్రసంగించారు. అనంతరం 'హిందుత్వ-లౌకికవాదం-భారత రాజ్యాంగం' అంశంపై మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ దేశ దిశ, దశ మార్చాలంటే రాబోయే రోజుల్లో ఎర్రజెండా ముందుండాలన్నారు. దేశంలో ఆర్ఎస్ఎస్ ఏర్పడక ముందే కార్మికవర్గం తమ హక్కుల సాధనకు బ్రిటీష్ వారిని ఎదిరించి ఎర్రజెండా చేతపట్టి అనేక చట్టాలను సాధించుకుందన్నారు. అలాంటి చట్టాలకు నేడు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు రావులపల్లి రవీంద్రనాథ్, జల్లి విల్సన్, ఎస్.వెంకటసుబ్బయ్య, రాధాకృష్ణమూర్తి, చలసాని రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆటోల్లో పరిమితికి మించి లోడు

యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: మూడు చక్రాల ఆటో... ఏమాత్రం వేగం పెంచి ఒక్కసారిగా పక్కకు తిప్పితే బోల్తా కొట్టడం ఖాయం. ఇక పరిమితికి మించిన ఎత్తులో సరకులు నింపి వెళితే వేగంగా వెళ్లకపోయినా పడిపోయే ప్రమాదం ఉంది. వాహనాల గురించి ఏ మాత్రం అవగాహన ఉన్న వారు ఎవరైనా ఈ మాటే చెబుతారు. పరిమితికి మించి సరకులు తీసుకువెళుతూ ప్రమాదభరితంగా రాకపోకలు సాగిస్తున్న వాహనాలపై ఉక్కుపాదం మోపేందుకు ట్రాఫిక్ పోలీసులు నడుం బిగించారు. గురువారం రాత్రి బి.ఆర్.టి.ఎస్.రోడ్డులో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలను చూసి నిశ్చేష్టులయ్యారు.

అధిక లోడు వాహనాలు బారులు తీరాయిలా..

బరువు పట్టించుకోరు... సరకు రవాణా వాహనాలకు నియమిత బరువు మాత్రమే తీసుకువెళ్లాలి. లేకపోతే రోడ్లపై భారం ఎక్కువై అవి ధ్వంసమవుతాయి. పరిమితికి మించి బరువు తీసుకువెళ్లే వాహనాలు ఒక్కసారిగా బ్రేక్ వేసినా ఆగలేవు. ఒక్కొక్కసారి ఎక్కువ ఉన్న బరువు ముందుకు జరిగిపోయి.. వాహనం పైనుంచి కింద పడి పక్కన ఉన్న వారికి ప్రమాదం జరుగుతుంది. అందుకే సరుకు రవాణా వాహనాలు నిబంధనలను పాటించాలని ట్రాఫిక్, రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు. కానీ ఆచరణ అంతంత మాత్రంగానే ఉంది. గురువారం రాత్రి ట్రాఫిక్ సీఐ కిషోర్‌బాబు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో అనేక వాహనాలు నిబంధనలు ఉల్లంఘిస్తూ పోలీసులకు దొరికిపోయాయి. వాటితో బి.ఆర్.టి.ఎస్.రోడ్డులో ట్రాఫిక్ నిలిచిపోయింది. ఏదో ఒక రోజు కాకుండా నిత్యం ఇలాంటి ఉల్లంఘనలపై నిఘా ఉంచి ఉల్లంఘించిన వారిపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు.

నియమిత ఎత్తుకు మించి..

ప్రతి వాహనానికి నియమిత ఎత్తులో మాత్రమే సరకులు లోడ్ చేయాలి. దాన్ని మించి లోడ్ చేస్తే మలుపు తిరిగేటప్పుడు వాహనాలు పడిపోతాయి. ఆటోలు ఎత్తు నిబంధన కచ్చితంగా పాటించాలి. గురువారం రాత్రి ఒక ఆటోలో దాని పరిమితి దాటిపోయి చెక్కలను లోడ్ చేసుకుని వెళుతుండగా పోలీసులు పట్టుకున్నారు.

పరిమితికి మించి చెక్కలు తీసుకెళుతున్న ఆటోను అడ్డుకున్న ట్రాఫిక్ సీఐ కిషోర్‌బాబు

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వరరావు మాదిగ, ఏసుపాదం, శేఖర్, శ్రీను తదితరులు

డిసెంబరు 4న మాదిగల విజయోత్సవ సభ

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో చట్టం చేసి 59 షెడ్యూల్ కులాలకు న్యాయం చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని ఏపీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ తెలిపారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ డిసెంబరు 4న విజయవాడ జింఖానా మైదానంలో వేలాది మంది మాదిగలతో విజయోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గురువారం విజయవాడలోని సంఘ రాష్ట్ర కార్యాలయంలో కార్యక్రమ కరపత్రాలను విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. చట్టం అమలుతో మాదిగలకు విద్యా, ఉపాధి రంగాల్లో చట్టబద్ధంగా తమ హక్కులను పొందే మార్గం ఏర్పడిందని చెప్పారు. చలో విజయవాడ పేరుతో నిర్వహించే ఈ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర నాయకులు ఏసుపాదం, శేఖర్, శ్రీను, ప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

గాంధీనగర్, న్యూస్‌టుడే: సంక్షేమ బోర్డు ఆరేళ్లుగా కార్మికులకు అందని ద్రాక్షలా మారిందని వెంటనే ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సి.హెచ్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం ధర్నా చౌక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 1214 మెమో రద్దు చేసి నిర్మాణ కార్మికులకు అండగా ఉంటామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ తుంగలో తొక్కిందన్నారు. సంక్షేమ బోర్డు పూర్తి స్థాయిలో అమలు అయ్యేవరకు పోరాడతామని స్పష్టం చేశారు. జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసే వరకు సీఐటీయూ పోరాటం చేస్తుందని చెప్పారు. జిల్లా కార్యదర్శి పి.అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు.

నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు

గౌతమ్‌రెడ్డి కారు దగ్ధం కేసులో నిందితుడి అరెస్టు

సత్యనారాయణ(గాంధీనగర్), న్యూస్‌టుడే: వైకాపా కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూనూరు గౌతమ్‌రెడ్డి కారు దగ్ధం కేసులో నిందితుడిని సత్యనారాయణపురం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. అక్టోబరు 12న గౌతమ్‌రెడ్డి ఇంటి ఆవరణలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో నిలిపిన కారును గుర్తు తెలియని వ్యక్తి పెట్రోలు పోసి నిప్పు అంటించాడు. ఈ ఘటనపై సీపీకి గౌతమ్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. సీపీ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎస్సై జి.సౌజన్య సిబ్బందితో కలిసి శుక్రవారం స్థానిక మట్టి రోడ్డులో ఒక అనుమానిత వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా నిందితుడు హైదరాబాద్ హైదర్‌షా కోటకు చెందిన హరికోటి లెనిన్‌బాబుగా గుర్తించారు. నిందితుడు 2005 ముందు వరకు విజయవాడ పెజ్జోనిపేటలో నివసించేవాడు. అనంతరం కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. గతంలో ఇతనిపై సత్యనారాయణ, కృష్ణలంక, మాచవరం, సూర్యారావుపేట, గవర్నర్‌పేట పోలీస్‌స్టేషన్లలో 15 వరకు దొంగతనాల కేసులు ఉన్నాయి. అతనిపై సస్పెక్ట్ షీట్ కూడా ఉంది. ఇతను మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా వీరాభిమాని. ఓ టీవీ ఛానల్‌లో గౌతమ్‌రెడ్డి రంగాను విమర్శించగా.. అదను చూసి అతనికి సంబంధించిన ఏదైనా ఆస్తికి నష్టం కలిగించాలని కారుపై పెట్రోలు పోసి నిప్పంటించి వెళ్లిపోయాడు. ఒక టీవీ చర్చలో 2017లో రంగాపై గౌతమ్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేసినందుకే నిందితుడు ఇలా చేసినట్లు విచారణలో తేలిందని సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

మహిళా పోలీస్‌స్టేషన్ సమీపంలోనే భార్యపై దాడి

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: మహిళా పోలీస్‌స్టేషన్ సమీపంలోనే భార్యపై సహజీవనం చేస్తున్న మహిళతో కలిసి దాడికి పాల్పడ్డాడో భర్త. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... నున్న చెరువు సెంటరుకు చెందిన యువతికి 2014లో జయకృష్ణతో వివాహమైంది. వివాహ సమయంలో రూ.7 లక్షలు కట్నం ఇచ్చారు. ఆ తరువాత మరింత కట్నం కావాలని వేధిస్తుండడంతో మరో రూ.5 లక్షలు ఇచ్చారు. క్రికెట్ బెట్టింగ్, జూదానికి బానిసై డబ్బులు మొత్తం దుర్వినియోగం చేశాడు. 2020లో భార్యపై హత్యాయత్నం చేయగా.. ఆమె వారి బారి నుంచి తప్పించుకున్నారు. భార్యపై కోపంతో జయకృష్ణ ఆమెను విడిచి వెళ్లిపోయారు. శ్రీలక్ష్మి అనే మహిళను వివాహం చేసుకున్నాడని తెలుసుకున్న భార్య అతని కోసం గాలించారు. నూజివీడులో కోర్టు విచారణకు వస్తున్నారని తెలుసుకున్నారు. ఈ క్రమంలో 13న మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో మహిళా పోలీస్‌స్టేషన్ కూడలి వద్ద కాపు కాసి ఉండగా జయకృష్ణ, శ్రీలక్ష్మి కనిపించారు. భర్తను ఇంటికి రమ్మని భార్య కోరగా ఆమెపై ఇద్దరూ దాడి చేశారు. దీనిపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహిళా పోలీస్‌స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు నగలున్న పర్సు చోరీ

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: వృద్ధురాలి సంచిలోని పర్సు దొంగతనంపై గవర్నర్‌పేట పోలీసులు గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. కంకిపాడు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన ప్రత్తిపాటి సుధారాణి(62) బుధవారం మధ్యాహ్నం బీసెంట్‌రోడ్డులో షాపింగ్‌కు వచ్చారు. షాపింగ్ పూర్తయ్యాక లెనిన్‌కూడలిలోని బస్టాపునకు వచ్చారు. దాదాపు గంట సేపు ఎదురు చూసిన తరువాత కంకిపాడు వెళ్లే బస్సు రాగా సాయంత్రం 4.45 సమయంలో బస్సు ఎక్కారు. కండక్టర్‌కు ఆధార్ కార్డు చూపించేందుకు సంచి తీయగా దానిలో ఉంచిన పర్సు కనబడలేదు. పర్సులో 50 గ్రాముల బరువైన బంగారు గొలుసులు, రూ.5 వేల నగదు ఉన్నట్లు బుధవారం రాత్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. గవర్నర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాత ప్రభుత్వాసుపత్రిలో చరవాణి..

చరవాణి చోరీపై గవర్నర్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మైలవరం మండలం పొందుగుల గ్రామానికి చెందిన భూక్యా రంగమ్మ ఈనెల 17న పాత ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. కోడలు ఆసుపత్రిలో ఉండగా.. ఆమె విజిటర్స్ షెడ్డులో పడుకున్నారు. 17వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో చరవాణి ఛార్జింగ్ పెట్టి పడుకున్నారు. తెల్లవారుజామున 4 గంటలకు చూడగా కనబడలేదు. దీనిపై గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

వేధిస్తున్న మామ, బంధువులపై యువతి ఫిర్యాదు

మధురానగర్, న్యూస్‌టుడే: కట్నం కోసం వేధిస్తున్న మామ, ఇతర బంధువులపై యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పైపులరోడ్డుకు చెందిన మౌనిక రాణి, చిన్నా భార్యాభర్తలు. వీరికి 2012 జులై 24న వివాహమైంది. చిన్నా పాస్టర్‌గా పనిచేస్తుంటారు. మౌనిక రాణి మామ ఇజ్రాయిల్ రాజు తాను నిర్వహిస్తున్న చర్చిని కుమారుడు చిన్నాకు ఇచ్చారు. ఆ తరువాత వారి మధ్య విబేధాలు వచ్చాయి. ఈ క్రమంలో కట్నం తీసుకురావాలంటూ మౌనికరాణిని మామ, ఇతర బంధువులు వేధిస్తున్నారు. గత నెల 11న ఇంట్లో ఉండగా దాడి చేశారని మౌనిక రాణి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీరువాలో పెట్టిన వెండి, బంగారం మాయం

మధురానగర్, న్యూస్‌టుడే: ఇంట్లోని బీరువాలో పెట్టిన వెండి, బంగారు ఆభరణాలు కనిపించడం లేదంటూ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. చింతా నీరమ్మ ఇంటికి సెప్టెంబరు 13 నుంచి 29 వరకు మరమ్మతులు చేశారు. ఆ క్రమంలో కొంతమంది వీరింట్లో పనిచేశారు. సెప్టెంబరు 30న చూడగా బీరువాలో ఉన్న ఎనిమిదిన్నర కాసుల బంగారం, 29 తులాల వెండి కనబడలేదు. దీనిపై నీరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని మోసం చేసిన యువకుడిపై మహిళా పోలీస్‌స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మాచవరానికి చెందిన యువతి (25) సూర్యారావుపేటలోని ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో పురమా సాయిబాబు అనే యువకుడితో పరిచయమైంది. వివాహం చేసుకుంటానని నమ్మించి ఇద్దరూ సహజీవనం చేశారు. నాలుగు సంవత్సరాల తరువాత పెళ్లి చేసుకోనని ముఖం చాటేయడంతో ఏలూరు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ తరువాత వెనక్కి తగ్గిన సాయిబాబు పెళ్లి చేసుకుంటానని చెప్పి మళ్లీ కలిసి ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మే 7న సాయిబాబు మరో యువతిని వివాహం చేసుకున్నాడని తెలుసుకుని అతనిని నిలదీశారు. ఈ ఏడాది జూన్ 21న ఇంటి వద్ద ఉండగా సాయిబాబు ఆమె ఇంటికి వచ్చి గొడవ పెట్టుకుని కొట్టారు. దీనిపై యువతి గురువారం మధ్యాహ్నం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.

మరో కేసులో.. పెళ్లైన 15 సంవత్సరాల తరువాత భార్యను వదిలేసి వేరే యువతిని పెళ్లి చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న భర్త, అతని తల్లిదండ్రులు, ఇతర బంధువులపై ఒక యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహిళా పోలీస్‌స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సనత్‌నగర్‌కు చెందిన యువతి 2010లో సయ్యద్ ఆసిఫ్ అనే యువకుడిని పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. వారికి ఒక కుమారుడు, ఒక కుమార్తె. ఆ తరువాత సయ్యద్ ఆసిఫ్ అమ్మ, అక్క, చెల్లెళ్ల మాటలు విని 2021లో తనను ఇంట్లో నుంచి పుట్టింటికి పంపించేశారని యువతి చెబుతున్నారు. ఈనెలలో మరో మహిళను తన భర్త పెళ్లి చేసుకుంటున్నారని తెలుసుకుని వారి ఇంటికి వెళ్లి నిలదీశాను. దీంతో భర్త ఆసిఫ్, అత్త కమర్, ఆడపడుచు హసీనా, ఆడపడుచు భర్త బాషా, చిన్న ఆడపడుచు ఆషమరి కొందరు తనపై దాడి చేసి కొట్టారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహిళా పోలీస్‌స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై దాడి

మధురానగర్, న్యూస్‌టుడే: కల్యాణమండపం డెకరేషన్‌కు పనివాళ్లను సమకూరిస్తే వారికివ్వాల్సిన డబ్బులు ఎగ్గొట్టడమే కాకుండా అడిగిన తనపై దాడికి పాల్పడ్డారంటూ ఒక యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అజిత్‌సింగ్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. చిట్టినగర్‌కు చెందిన బి.దుర్గా డెకరేషన్ పనులు చేస్తుంటారు. అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన ముడుగు అనిల్‌కుమార్ ఆమెను కలుసుకుని తనకు డెకరేషన్ పనులు చేసే పనివాళ్లు కావాలని, వారికి రోజుకు రూ.500 చెల్లిస్తాననడంతో 20 మంది పనివాళ్లను పంపించారు. దీనికి సంబంధించి రూ.40 వేలు చెల్లించాల్సి రావటంతో అతని అడిగినా సరైన స్పందన లేదు. దీంతో ఈనెల 2న డబ్బులు కోసం అనిల్‌కుమార్ ఇంటికి వెళ్లగా ఆయన భార్య రాజి ఆమెతో గొడవ పెట్టుకుని చేతులతో కొట్టారు. దీనిపై దుర్గ అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

(c) eenadu

దరఖాస్తు చేశారా?
☛ పంజాబ్ నేషనల్ బ్యాంకులో లోకల్ బ్యాంకు ఆఫీసర్ పోస్టులు (750)
చివరి తేదీ: 23.11.2025
☛ దక్షిణ మధ్య రైల్వేలో స్పోర్ట్స్ కోటా ఖాళీలు
చివరి తేదీ: 24.11.2025

కరెంట్ అఫైర్స్

✦ ఇటీవల ఏ నగరంలో జరిగిన 28వ యూనివర్సల్ పోస్టల్ యూనియన్ (యూపీయూ) కాంగ్రెస్‌లో భారత్ యూపీయూ కౌన్సిల్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్, పోస్టల్ ఆపరేషన్స్ కౌన్సిళ్లకు తిరిగి ఎన్నికైంది? జ: దుబాయ్

మాదిరి ప్రశ్నలు

✦ 'వై ది కాన్‌స్టిట్యూషన్ మ్యాటర్స్' పుస్తక రచయిత ఎవరు? (రచయిత భారతదేశ 50వ ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు.)
జ: మాజీ సీజేఐ డీవై చంద్రచూడ్

✦ వ్యవసాయ సాంకేతిక ఆవిష్కరణల కోసం ఇటీవల భారత్‌తో కలిసి ఏ దేశం 'మైత్రి 2.0'ను ప్రారంభించింది?
జ: బ్రెజిల్ (ఇండియా-బ్రెజిల్ అగ్రిటెక్ క్రాస్-ఇంక్యుబేషన్ ప్రోగ్రామ్‌గా ఈ కార్యక్రమానికి నామకరణం చేశారు.)

మరింత సమాచారం

✦ వన్డే క్రికెట్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేసిన భారతీయ క్రికెటర్‌గా ఇటీవల ఎవరు ఘనత సాధించారు?
జ: స్మృతి మంధాన (న్యూదిల్లీలో ఆస్ట్రేలియాతో జరిగిన 3వ వన్డేలో కేవలం 50 బంతుల్లోనే సెంచరీ సాధించిన ఈమె 2013లో ఆస్ట్రేలియాపై విరాట్ కోహ్లీ 52 బంతుల్లో సెంచరీ చేసిన చిరకాల రికార్డును బద్దలు కొట్టింది.)

ఈనాడు ప్రతిభ
pratibha.eenadu.net/eenadupratibha.net

అద్భుతవృద్ధి జరిగి.. అసమానతలు పెరిగి!

జనరల్ స్టడీస్ – ఇండియన్ ఎకానమీ

భారతదేశం స్వాతంత్ర్యానంతరం ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో సోవియట్ యూనియన్ నుంచి ప్రేరణ పొంది పంచవర్ష ప్రణాళికలను ప్రారంభించింది. దేశ ఆర్థిక, సామాజిక పురోగతి లక్ష్యాలను సాధించేందుకు వనరులను కేటాయించే ప్రక్రియగా అవి కొనసాగాయి. 1951 నుంచి 2017 వరకు 12 పంచవర్ష ప్రణాళికలు, 5 వార్షిక ప్రణాళికలు పూర్తయ్యాయి. వాటి వల్ల అనేక విజయాలు అందడంతోపాటు పలు అపజయాలూ ఎదురయ్యాయి. 65 ఏళ్లలో కేంద్రం అమలు చేసిన ప్రణాళికలు, వాటి లక్ష్యాలు, విజయాలు, వైఫల్యాలపై పోటీపరీక్షల అభ్యర్థులకు స్థూల అవగాహన ఉండాలి. ప్రణాళికల కారణంగా ఆహార ధాన్యాలు, పరిశ్రమలు, రక్షణ, సాంకేతిక రంగాల్లో అద్భుత పురోగతి సాధ్యమైన తీరుతో పాటు నిరుద్యోగం, ధరల పెరుగుదల, సంపద కేంద్రీకరణ, అసమానతలు అధికమయ్యేందుకు దోహదపడిన పరిస్థితులనూ అర్థం చేసుకోవాలి.



65 ఏళ్ల భారత ప్రణాళికలు
(విజయాలు, వైఫల్యాలు)

ఆర్థిక వ్యవస్థలోని కార్యకలాపాలను నిర్ణీత కాలవ్యవధిలో నిర్దేశించిన లక్ష్యాల వైపు ఒక క్రమంలో నడపడాన్ని అర్థశాస్త్ర పరిభాషలో 'ప్రణాళిక' అంటారు.

భారతదేశంలో ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో భాగంగా ఆర్థిక ప్రణాళికల అమలు కోసం 1950, మార్చి 15న ప్రణాళికా సంఘం ఏర్పాటైంది. 1951, ఏప్రిల్ 1 నుంచి మొదటి పంచవర్ష ప్రణాళిక ప్రారంభమైంది.

లక్ష్యాలు: దేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధి, పేదరికం తగ్గింపు, దేశ వనరులను సమర్థంగా వినియోగించుకోవడం పంచవర్ష ప్రణాళికల ప్రధాన లక్ష్యాలు. ఆర్థికవృద్ధి, ఉపాధి స్థాయులను పెంచడం, ఆర్థిక స్థిరత్వం, స్వయంసమృద్ధి, సామాజిక న్యాయం, ప్రాంతీయాభివృద్ధితో పాటు ప్రగతిశీల పన్నులు, ఉపాధి కల్పన, రిజర్వేషన్ల ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గించడం, తలసరి ఆదాయం పెంచడం ద్వారా జీవనప్రమాణాలు పెంచడం తదితరాలన్నీ ప్రణాళికల్లో భాగం.

ఆవశ్యకత: ❖ సుస్థిర ఆర్థికాభివృద్ధి సాధించడం. ❖ పేదరికం, నిరుద్యోగం, ఆర్థిక, ప్రాంతీయ అసమానతలు మొదలైన ఆర్థిక సమస్యలకు పరిష్కార మార్గాలను చూపడం. ❖ ఆర్థిక అవస్థాపనా సౌకర్యాల (విద్యుత్తు, రవాణా, సమాచారం) అభివృద్ధి. ❖ సామాజిక అవస్థాపనా సౌకర్యాల (విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్యం) అభివృద్ధి. ❖ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన. ❖ సంతులిత ప్రాంతీయాభివృద్ధి సాధన.

విజయాలు

జాతీయాదాయం, తలసరి ఆదాయంలో పెరుగుదల: మొదటి ప్రణాళిక (1951-56)లో రూ.1.32 కోట్లు ఉన్న జాతీయాదాయం 2011-12 ధరల ప్రకారం 2017-18లో (12వ ప్రణాళిక ముగిసేనాటికి) రూ.114.1 లక్షల కోట్లకు పెరిగింది. జాతీయాదాయం వృద్ధి రేటు 1980 దశకం లోపు 3.5% వద్ద స్థిరంగా ఉండేది. 12వ ప్రణాళికలో 6.8 శాతానికి చేరింది.
➾ తలసరి ఆదాయం మొదటి ప్రణాళికలో 1993-94 ధరల ప్రకారం రూ.3,687 నుంచి 12వ ప్రణాళిక ముగిసేనాటికి (2011-12 ధరల ప్రకారం) 2017-18లో రూ.86,668కు పెరిగింది. తలసరి ఆదాయం వృద్ధి రేటు మొదటి ప్రణాళికలో 1.4% నుంచి 12వ ప్రణాళిక నాటికి 5.4 శాతానికి పెరిగింది.

వ్యవసాయ రంగంలో మార్పు: భారత ప్రభుత్వం 60 ఏళ్లుగా వ్యవసాయం, దాని అనుబంధ కార్యకలాపాలపై 23%-24% పెట్టుబడులు పెట్టింది. 1960వ దశకంలో నూతన వ్యవసాయ వ్యూహాలను ప్రవేశపెట్టడం, హరితవిప్లవానికి ప్రాధాన్యం ఇవ్వడంతో ఆహారధాన్యాల ఉత్పత్తి 1950-51లో 50.8 మిలియన్ టన్నుల నుంచి 2017-18 నాటికి 284.83 మి.టన్నులకు పెరిగింది. అన్ని ఆహార పంటల ఉత్పత్తిలో 4-5 రెట్లు వృద్ధి నమోదైంది. నూనెగింజలు, చెరకు, పత్తి తదితర ఆహారేతర పంటల ఉత్పత్తి కూడా పెరిగింది.

పారిశ్రామిక రంగ ప్రగతి: ప్రణాళికల వల్ల భారీ పరిశ్రమల్లో వైవిధ్యీకరణ సాధ్యమైంది. రెండో ప్రణాళికలో ప్రత్యేకంగా పారిశ్రామికాభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చి భారీ, మౌలిక పరిశ్రమలను నెలకొల్పారు. 12వ ప్రణాళిక (2012-17)లో సమ్మిళిత వృద్ధిని పెంపొందించడంపై ప్రణాళిక సంఘం దృష్టి సారించింది.

> కొన్ని ప్రభుత్వ సంస్థలు ఉద్దేశపూర్వకంగా, సుదీర్ఘ ఆలోచన తర్వాత ఆర్థిక ప్రాధాన్యాలను ఎంపిక చేసుకోవడమే ప్రణాళిక రచన.
> – బార్బరా ఊటెన్

ఆర్థిక అవస్థాపనా సౌకర్యాల వృద్ధి: సత్వర ఆర్థికాభివృద్ధికి కావాల్సిన ఆర్థిక, సామాజిక అవస్థాపనా సౌకర్యాలు వృద్ధి చెందాయి. రవాణా, విద్యుత్తు, సమాచారం, నీటిపారుదల సౌకర్యాలు లాంటి మౌలిక సదుపాయాలు విస్తృతమయ్యాయి.

ఎగుమతి, దిగుమతుల్లో మార్పులు: సత్వర పారిశ్రామికాభివృద్ధి విధాన ఫలితంగా భారతదేశం తన మూలధన వస్తు అవసరాలకు ఇతర దేశాలపై ఆధారపడటం తగ్గింది. 1991లో వచ్చిన నూతన ఆర్థిక సంస్కరణలతో ఎగుమతి, దిగుమతుల్లో అనూహ్య మార్పులు వచ్చాయి.

ఉదా: మొదటి పంచవర్ష ప్రణాళికలో భారతదేశ ఎగుమతుల విలువ రూ.606 కోట్లు ఉండగా, 12వ ప్రణాళికలో రూ.16,35,261 కోట్లకు చేరింది.

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో ముందంజ: 1983లో సైన్స్ అండ్ టెక్నాలజీ పాలసీ, 2013లో సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ పాలసీలను ప్రవేశపెట్టారు. ఫలితంగా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంలో దేశం ప్రపంచస్థాయి ప్రమాణాలను సాధించింది.
❇ విదేశీ నిపుణులపై ఆధారపడటం తగ్గి, ప్రస్తుతం ప్రపంచ నలుమూలలకు నిపుణులను ఎగుమతి చేసే దేశంగా భారత్ అవతరించింది. **ఉదా:** గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో భారతదేశం 39వ స్థానంలో, ప్రపంచ వ్యాప్తంగా మేధోసంపత్తిదారుల్లో 6వ స్థానంలో ఉంది.

పొదుపు, పెట్టుబడుల వృద్ధి: 1950-51లో స్థూలదేశీయోత్పత్తిలో పొదుపు 9% ఉండగా, 12వ ప్రణాళిక (2012-17)లో 34.02 శాతానికి పెరిగింది. ఇదే కాలంలో పెట్టుబడులు 9% నుంచి 38.8 శాతానికి చేరాయి.

వైఫల్యాలు

ధరల పెరుగుదల: పంచవర్ష ప్రణాళికల లక్ష్యాల్లో ధరల స్థిరత్వం ఒకటి. కానీ మొదటి ప్రణాళికలో తప్ప మిగతా అన్ని ప్రణాళికల్లో ధరలు విపరీతంగా పెరిగాయి. రెండో ప్రణాళికలో సగటున 6.3%, మూడో ప్రణాళికలో 5.8%, 4వ ప్రణాళికలో 9%, 12వ ప్రణాళికలో ధరల పెరుగుదల 4.5% - 5.0%గా ఉంది.

పేదరికం, నిరుద్యోగం వృద్ధి: 65 ఏళ్ల ప్రణాళికా కాలంలో నిరుద్యోగం, పేదరికం పెరుగుతూనే ఉన్నాయి. 2012 భారత ప్రభుత్వ నివేదిక ప్రకారం 21.9% జనాభా (300 మిలియన్లు) దారిద్ర్యరేఖకు దిగువన ఉంది. ఎన్ఎస్ఎస్ నివేదిక ప్రకారం 1999-2000 నాటికి 26.58 మిలియన్లుగా ఉన్న నిరుద్యోగులు, 2009-10 నాటికి 28.1 మిలియన్లకు పెరిగారు.

> "లభ్యమవుతున్న వనరులను గరిష్ఠ సామర్థ్యంతో ఉపయోగించి, కొన్ని స్పష్టమైన లక్ష్యాలను సాధించాలని ప్రభుత్వం తీసుకునే చొరవే ప్రణాళిక."
> – ప్రణాళికా సంఘం

ఆదాయ సంపదల పంపిణీలో అసమానతలు: ప్రణాళికల లక్ష్యాల్లో ఆదాయం, సంపద పంపిణీ అసమానతలు తగ్గించడం ప్రధానమైంది. కానీ ఈ ప్రణాళికలు అసమానతలు పెరగడానికే దోహదపడ్డాయి. ధనిక వర్గం మరింత ధనవంతులుగా, పేదవర్గం మరింత పేదలుగా మిగిలిపోయారు.

అసమర్థ పాలన: 'భారత ప్రణాళికల లోపాల్లో ప్రధానమైంది వాటి అమలే' అని యూఎన్ఓ నిపుణుల బృందం పేర్కొంది. అసమర్థ పాలన, పాలకులు, ప్రభుత్వ యంత్రాంగంలో నిజాయతీ లేకపోవడం, స్వార్థ ప్రయోజనాలు, అక్రమ లావాదేవీల కారణంగా వాటి లక్ష్యాలు నెరవేరలేదు.
● సంతులిత ప్రాంతీయాభివృద్ధి సాధించడంలోనూ ప్రణాళికలు విఫలమయ్యాయి. **ఉదా:** హరియాణా తలసరి ఆదాయం, బిహార్ తలసరి ఆదాయం కంటే నాలుగు రెట్లు అధికంగా ఉంది.

రచయిత: **వమరవల్లి రమణయ్య**

స్టూడెంట్‌కు అసలు అర్థం తెలుసా!
స్టడీ స్కిల్స్

ప్రసిద్ధ ఆంగ్ల పదాలకు సంబంధించి దాదాపు అన్నింటిలో ప్రతి అక్షరానికి ఒక అర్థం ఉంటుంది. అలాగే STUDENT అనే పదంలోని అక్షరాల్లోనూ విస్తృత అర్థం ఉంది. మొదటి అక్షరం 'ఎస్' సిన్సియారిటీని సూచిస్తుంది. అంటే చదువు పట్ల నిజాయతీగా ఉండటమే విద్యార్థికి ఉండాల్సిన మొదటి లక్షణం. అర్థం కాకపోయినా అర్థమైనట్లుగా, రాని దానిని వచ్చినట్లుగా నటించకూడదని చెబుతోంది. ఆ విధంగా ప్రతి అక్షరానికి ఉన్న ఒక్కో స్ఫూర్తిదాయక అర్థంతో పాటు దానికి ఇచ్చిన సరైన వివరణలపై కూడా అభ్యర్థులు అవగాహన పెంచుకోవాలి. ఉత్తమ విద్యార్థికి ఉండాల్సిన ఆ లక్షణాలను, 'స్టూడెంట్'లోని అక్షరాల పూర్తి అర్థాన్ని తెలుసుకోవాలంటే **క్యూఆర్ కోడ్** స్కాన్ చేయండి.

ఐదేళ్లు సంరక్షణ.. నిరంతర ఆదాయం

రైతేరాజు

అన్నదాతకు సిరులు కురిపించే వక్క సాగు

మడకశిర, న్యూస్‌టుడే

వక్క తోటల సాగు అన్నదాతకు సిరులు కురిపిస్తుంది. ఐదేళ్ల పాటు సంరక్షణ చేపడితే అనంతరం రాబడి మొదలవుతుంది. ఏటా దిగుబడి పెరగడంతో పాటు ఆదాయం రెట్టింపవుతుంది. చెట్లకు అవసరమైన మేరకు నీరు, పేడ, మట్టిని అందిస్తే చాలు. ఈ పంట సాగులో పెద్దగా ఖర్చు చేయాల్సింది లేదు. ధరలు నిలకడగా ఉంటే రూ.లక్షల్లో ఆదాయం లభిస్తుంది.

నేల ఎంపిక : సాధారణంగా వక్క అన్ని నేలల్లో పండుతుంది. నీరు నిలవకుండా ఉండే భూములు ఎంపిక చేసుకుంటే మొక్క త్వరితగతిన పెరిగేందుకు మంచి అవకాశం. 25 నుంచి 35 డిగ్రీల మధ్య వాతావరణం అనుకూలంగా ఉండాలి. సాలుకు సాలుకు మధ్య 9 అడుగులు, మొక్కకు మొక్కకు మధ్య 7 అడుగులు దూరం పాటించాలి. ఇలా ఒక ఎకరాలో 450 నుంచి 500 మొక్కలు నాటుతారు. కొత్తగా నాటిన మొక్కలకు ఎండ నుంచి రక్షణ కోసం నీడ ఇచ్చే అవిస మొక్కలను నాటుకోవాలి. రెండేళ్ల వరకు నీడలోనే మొక్క పెరుగుతుంది. వక్క మొక్కలకు రసాయన ఎరువులు, పురుగుల మందుల అవసరం ఉండదు. సేంద్రియ ఎరువులు ఏడాదికి ఒకసారి మాత్రమే వేస్తారు. డ్రిప్ ద్వారా సరిపడా నీరు వదులుతారు. అనంతరం అయిదేళ్లకు వక్క పంట దిగుబడి ప్రారంభమవుతుంది.

నారు పోసే విధానం : సాగుకు ముందు 40 ఏళ్ల వయసున్న మంచి దిగుబడి ఇచ్చే మొక్క నుంచి విత్తనాలు సేకరిస్తారు. వాటిని గోనెసంచుల్లో కట్టి రెండు నెలల పాటు నీడలో ఉంచి నీరు పోస్తే మొలక వస్తుంది. ఈ మొలకలను మట్టి వేసిన పాలిథిన్ కవర్లలో ఉంచి నీరు పోస్తే ఏడాదికి 2 అడుగులు పెరుగుతుంది. అనంతరం గుంతల్లో నాటి బిందు సేద్యం ద్వారా నీరందించాలి. ఇలా అయిదేళ్ల పాటు ఎకరాకు రూ.50 వేల వరకు పెట్టుబడి అవుతుంది. నాటిన అయిదేళ్ల అనంతరం ఒక చెట్టు నుంచి గరిష్ఠంగా 30 కేజీల వరకు పచ్చి కాయలు వస్తాయి. వీటిని ఒలిచి.. ఉడకబెట్టి, అయిదు రోజుల పాటు ఎండబెడితే 3 కిలోల ఎండిన వక్క సిద్ధమవుతుంది. ఇలా ఏటా ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల వక్క దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాలు ధర రూ.52 వేలు ఉంది. ఈ లెక్కన ఎకరాకు రూ.5 లక్షల వరకు ఆదాయం వస్తే రూ.లక్ష పెట్టుబడి పోనూ రూ.4 లక్షలు నికర లాభం వస్తుంది. అదనపు ఆదాయం కోసం అంతర పంటలుగా తమలపాకు, మిరియాలు, పూలచెట్లు, చెక్క ఇతర సుగంధ ద్రవ్యాలను సాగు చేసుకోవచ్చు.

రాష్ట్రంలోనే అమరాపురం అగ్రస్థానం : ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గం అమరాపురం మండలం వక్క సాగులో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంది. శ్రీసత్యసాయి జిల్లాలో 6 వేల ఎకరాల్లో ఈ పంట సాగవుతుండగా, ఒక్క అమరాపురం మండలంలోనే 3,100 ఎకరాల్లో సాగులో ఉంది. అలాగే అగళి, రొళ్ల, గుడిబండ మండలాల్లోనూ ఈ పంట అత్యధికంగా సాగు చేస్తున్నారు. అమరాపురం మండలంలో వక్క సాగు ద్వారా రైతులు ఏటా దాదాపు రూ.వంద కోట్ల వరకు ఆదాయం పొందుతుండడం గమనార్హం.

చలికాలంలో పాడి పశువులు జాగ్రత్త

న్యూస్‌టుడే తోట్లవల్లూరు

చలికాలంలో పాడి పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటికి సోకే వ్యాధులు, నివారణోపాయాల గురించి పశువైద్యశాల సహాయ సంచాలకుడు జె.ప్రకాష్‌బాబు వివరించారు. పశువులను చలికాలంలో రాత్రిళ్లు ఆరుబయట ఉంచొద్దు. చుట్టూ గోతాలు కట్టిన చావిళ్లలో ఉంచాలి. ఆరుబయట ఉంచితే వాటి శరీర, వాతావరణంలోని ఉష్ణోగ్రతల మధ్య ఏర్పడే తీవ్ర వ్యత్యాసాలతో అవి కొంత మేర శక్తిని కోల్పోతాయి. ఈ కాలంలో వాటికి అదనంగా దాణా కూడా పెట్టాలి. పశువులు ఎక్కువగా శీతకాలంలో ఈత, ఎదకు వస్తాయి. ఎదకొచ్చిన వాటి నుంచి తీగలు వస్తాయి. పశుపోషకులు వాటిని గుర్తించి ఒక రెండు రోజుల్లో సెమన్ వేయించాలి. ఈనిన పశువుల పాలను తీసిన తర్వాత పొదుగును యాంటీ సెప్టిక్ ద్రావణంతో కడిగి జాగ్రత్తలు తీసుకోవాలి. చలికాలంలో ఈ జాగ్రత్తలు పాటిస్తే వ్యాధుల బారిన పడకుండా పశువులను కాపాడుకోవచ్చని పశువైద్యాధికారి తెలియజేశారు.



రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సలహా

ప్రశ్న: వంగ సాగుకు నేలలు, రకాలు, విత్తే కాలం, విత్తన మోతాదు గురించి వివరించండి? -కె.రాజారావు, రైతు, పూషడం

సమాధానం: వంగ సాగుకు లోతైన, సారవంతమైన, మురుగు పారే సౌకర్యం ఉన్న అన్ని రకాల నేలలు అనుకూలం. ఉదజని సూచిక 5.5-6.5 నేలలు శ్రేష్ఠం. రాష్ట్రంలో 15-20 శాతం సంకర రకాలు సాగులో ఉన్నాయి. ఏడాది పొడవునా వంగ సాగు చేయవచ్చు. నవంబరు మాసం అనుకూలంగా ఉంటుంది. ఎకరానికి సూటి రకాలు 260 గ్రాములు, సంకర రకాలు 124 గ్రాముల విత్తన నారు సరిపోతుంది. 30-35 రోజుల వయసు గల మొక్కలను ప్రధాన పొలంలో నాటుకోవాలి. గుబురుగా పెరిగే రకాలను 75×50 సెం.మీ., పొడవు నిటారుగా పెరిగే రకాలను 50×50 సెం.మీ. ఎడంతో నాటుకోవాలి.

ప్రశ్న: పొద చిక్కుడు విత్తన మోతాదు, ఎరువులు, నీటి యాజమాన్యం వివరించండి? -ఎం.బాబూరావు, యండకుదురు

సమాధానం: ఎకరానికి 16 కిలోలు విత్తనం సరిపోతుంది. విత్తడానికి వారం రోజులు ముందు ఆఖరి దుక్కిలో పశువుల ఎరువు 8-10 టన్నులు వేసి దున్నాలి. 24 కిలోలు భాస్వరం, 12 కిలోల పొటాష్‌తో పాటు మొదటి దఫా 15 కిలోల నత్రజని వేయాలి. రెండో దఫా 15 కిలోల నత్రజనిని విత్తిన 30 రోజులకు వేయాలి. ఎరువులు వేసిన వెంటనే నీరు కట్టాలి. 7-10 రోజులకోసారి నీటితడి ఇవ్వాలి. పూత, కాయ దశలో నేల 50 శాతం తేమ ఉండేలా చూసుకోవాలి.

- వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కేవీకే, ఘంటసాల
- న్యూస్‌టుడే, ఘంటసాల

మిరప పంటలో సస్యరక్షణ చర్యలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మిర్చి పంట ప్రస్తుతం పూత, పిందె దశలో ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఆయా తోటల్లో నీరు నిలిచింది. దీంతో పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలను నందిగామ ఉద్యాన అధికారిణి వర్ధిని వివరించారు. అధిక వర్షాలకు మిరప మొక్కలు తలవాల్చితే తేరుకోడానికి లీటరు నీటికి పది గ్రాముల యూరియా కలిపిన ద్రావణాన్ని వారంలో రెండు సార్లు పిచికారీ చేయాలి. వేరు కుళ్లు ఆశించకుండా లీటరు నీటికి మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ ద్రావణాన్ని మొక్కల మొదళ్లలో వేర్లు తడిసేలా పోయాలి. సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి.

నేటి దుర్గగుడి సమాచారం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై దుర్గగుడి అంతరాలయంలో వేకువజామున ఉదయం 3 గంటలకు సుప్రభాత సేవ, 3.30కు వస్త్రాలంకరణ సేవ, 4 గంటలకు దేవి ఖడ్గమాలార్చన నిర్వహిస్తారు.

ఉదయం
భక్తులకు సర్వదర్శనం కోసం వేకువజామున 5 గంటల నుంచి క్యూలైన్లలోకి అనుమతిస్తారు. యాగశాలలో ఉదయం 6.30కు గణపతి హోమం, 7 గంటలకు రుద్రహోమం, 7.30కు నవగ్రహ శాంతిహోమం, 8 గంటలకు మృత్యుంజయ హోమం, 8.30కు చండీహోమం నిర్వహిస్తారు. ప్రాకార మండపంలో ఉదయం 7.30కు లక్ష కుంకుమార్చన, 8 గంటలకు శ్రీచక్ర నవావరణార్చన, మల్లేశ్వరాలయ ప్రాంగణంలో 9 గంటలకు శాంతి కల్యాణం ఆర్జిత సేవలుగా చేస్తారు.

మధ్యాహ్నం
అమ్మవారికి ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పంచభోగ నివేదన చేస్తారు. ఆ సమయంలో అన్ని దర్శనం క్యూలైన్లు నిలిపేస్తారు. వీఐపీ, ప్రోటోకాల్ దర్శనాలు ఉండవు. మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5.30 వరకు దర్శనాలకు అనుమతిస్తారు.

సాయంత్రం
దుర్గమ్మకు సాయంత్రం 4 గంటలకు స్వర్ణపుష్పార్చన సేవ(గురువారం మాత్రమే), 6 నుంచి 7 వరకు నివేదన, వేద స్వస్తి, పంచహారతులు ఇస్తారు. అన్ని దర్శనాలను ఈ సమయంలో నిలిపివేస్తారు. సాయంత్రం 7 నుంచి రాత్రి 10 వరకు అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు.

☛ ప్రతి రోజు రాహుకాలంలో నటరాజ స్వామి ఆలయ ప్రాంగణంలో రాహుకేతు పూజలు జరుగుతాయి. ఆర్జిత సేవలకు టిక్కెట్ రుసుము చెల్లించిన భక్తులను మాత్రమే రానిస్తారు. www.kanakadurgamma.com,https:/// www.aptemples.ap.gov.in వెబ్‌సైట్ల ద్వారా ఆర్జిత సేవా టికెట్లు, ఇతర సమాచారం అందుబాటులో ఉంది. వాట్సప్ నంబరు: 955230 0009 ఆర్జిత సేవలు, దర్శనం టికెట్లు, విరాళాలను ఇచ్చేందుకు అవకాశం ఉంది.

☛ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు మల్లికార్జున మహామండపం రెండో అంతస్తులో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేస్తారు.

స్వరాజ్ మైదాన్ కాంప్లెక్స్‌ను సక్రమంగా నిర్వహించడం లేదు
హైకోర్టులో వ్యాజ్యం

ఈనాడు, అమరావతి: విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్వరాజ్ మైదాన్ కాంప్లెక్స్ నిర్వహణ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొంటూ దాఖలైన వ్యాజ్యంపై గురువారం హైకోర్టు విచారణ జరిపింది. పూర్తి వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించింది. విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. అధికారుల నిర్లక్ష్యం, అశ్రద్ధ కారణంగా 18 ఎకరాల్లో విస్తరించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్వరాజ్ మైదాన్ కాంప్లెక్స్ అపరిశుభ్రంగా మారిందని పేర్కొంటూ బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి వై.కొండలరావు హైకోర్టులో వ్యాజ్యం వేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది జడా శ్రావణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. 'ప్రస్తుతం అక్కడ పరిస్థితి దారుణంగా ఉంది. కన్వెన్షన్ కేంద్రం, గ్రంథాలయం, బౌద్ధ ధ్యాన కేంద్రాన్ని మూసివేశారు. నడక మార్గంలో లైట్లు పనిచేయడం లేదు. ఫౌంటెన్లలో నీళ్లు పాచిపట్టి ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది' అని పేర్కొన్నారు.. న్యాయమూర్తి స్పందిస్తూ, పూర్తి వివరాలు సమర్పించాలని విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.

25 నుంచి మత్తు వైద్యుల జాతీయ సదస్సు

మధురానగర్, న్యూస్‌టుడే: మత్తు వైద్యుల 72వ జాతీయ సదస్సు ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పుర్‌లో ఈనెల 25 నుంచి 30 వరకు జరుగుతుందని ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్థీషియాలజిస్ట్‌ల రాష్ట్ర పూర్వపు అధ్యక్షుడు డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్ తెలిపారు. 25, 26 తేదీల్లో కార్యశాల ఉంటుందని, 27న మత్తు వైద్యులకు నిరంతర వైద్య విద్య తరగతులు జరుగుతాయని తెలిపారు. 28 నుంచి 30 వరకు మత్తు వైద్యంలో వచ్చిన అత్యాధునిక మార్పులపై సదస్సు జరుగుతుందని, దీనికి దేశ, విదేశాల నుంచి దాదాపు 300 మంది ఫ్యాకల్టీ నిపుణులు, 4 వేల మంది మత్తు వైద్యులు హాజరవుతారని డాక్టర్ తారకప్రసాద్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

కంటెయినర్ ఢీ.. ఒకరి దుర్మరణం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై కోడూరుపాడు వద్ద బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. వీరవల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ మధురానగర్‌కు చెందిన బొద్దుబోయిన ఏడుకొండలు(38) మరొకరితో కలిసి సరకు రవాణా నిమిత్తం ఆటో నడుపుతూ విశాఖపట్నం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బుధవారం రాత్రి 7 గంటల సమయంలో కోడూరుపాడు ఎన్జీ ఫెర్టిలైజర్స్ సమీపంలో ఆగారు. ఈ క్రమంలో గాలికి ఎగురుతున్న పరదాను ఏడుకొండలు సరిచేస్తుండగా వెనక నుంచి వచ్చిన కంటెయినర్ లారీ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. గురువారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

జోగి సోదరుల కస్టడీపై ముగిసిన వాదనలు
25న ఉత్తర్వులు ఇవ్వనున్న ఎక్సైజ్ కోర్టు

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో వైకాపా నేత జోగి రమేష్, అతని సోదరుడు రాము కస్టడీపై గురువారం ఎక్సైజ్ కోర్టులో వాదనలు ముగిశాయి. తీర్పును ఈనెల 25న ఇవ్వనున్నట్లు న్యాయాధికారి లెనిన్‌బాబు ప్రకటించారు. జైలులో తనకు ములాఖత్‌లు పెంచాలన్న జోగి రమేష్ పిటిషన్‌పై కోర్టు తీర్పు ఇచ్చింది. వారంలో రెండు సార్లు కుటుంబ సభ్యులతో, న్యాయవాదులతో అదనంగా ములాఖత్‌లను పెంచుతూ కోర్టు ఉత్తర్వులిచ్చింది. అద్దేపల్లి జనార్దనరావు, జగన్మోహన్‌రావు, బాదల్ దాస్, ప్రదీప్ దాస్, జోగి రమేష్, రాముల బెయిల్ పిటిషన్లపై కౌంటర్ల దాఖలు కోసం ఈనెల 27కి వాయిదా వేశారు. రవి, కల్యాణ్, తిరుమలశెట్టి శ్రీనివాసరావుల బెయిల్ పిటిషన్లపై విచారణ 25కు వాయిదా పడింది. చెక్కా సతీష్ కుమార్, శ్రీనివాసరెడ్డి బెయిల్ పిటిషన్లపై విచారణ 27కు న్యాయాధికారి వాయిదా వేశారు.

మద్యం కేసులో వివిధ పిటిషన్లపై విచారణ వాయిదా

ఈనాడు - అమరావతి: మద్యం కేసులో గురువారం విచారణ నిమిత్తం.. ఏసీబీ కోర్టుకు వచ్చిన పలు పిటిషన్లు వాయిదా పడ్డాయి. దిల్లీలో సమావేశం ఉన్నందున.. శుక్రవారం సిట్ ఎదుట హాజరుకాలేనని, పార్లమెంట్ సమావేశాలకు హాజరయ్యేందుకు అనుమతించాలని వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి వేసిన రెండు పిటిషన్లపై విచారణ 21వ తేదీకి వాయిదా పడ్డాయి. కారాగారంలో వసతులు కల్పించాలని వైకాపా నేత చెవిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్, బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణ బెయిల్ పిటిషన్లపై తదుపరి వాయిదాల నిమిత్తం 21వ తేదీకి వాయిదా వేశారు.

అరుణకు బెయిల్ మంజూరు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: ఎస్సై, అంగన్‌వాడీ పోస్టులు ఇప్పిస్తానంటూ ఒక వృద్ధుడిని రూ.24.5 లక్షలు మోసం చేసిన కేసులో నిందితురాలు నిడిగుంట అరుణకు విజయవాడ 1వ అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. మోసం కేసులో నెల్లూరుకు చెందిన అరుణపై గత నెల 13న విజయవాడ సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేసి ఆమెను పీటీ వారెంట్‌పై న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఈ కేసులో నిందితురాలిని రెండు రోజుల పాటు పోలీసులు తమ కస్టడీలోకి తీసుకుని విచారించారు. నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్న అరుణ ఈ కేసులో తనకు బెయిల్ ఇవ్వాలంటూ న్యాయవాది ద్వారా పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన న్యాయమూర్తి దేవిక నిందితురాలికి బెయిల్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రూ.25 వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించారు.

(c) eenadu

వరదొస్తేనే గుర్తొస్తుందా?

ఎలమంచిలి, న్యూస్‌టుడే

ఎలమంచిలి-గాజువాక రహదారిపై నారాయణపురం వద్ద మైనర్ శారదానదిపై వంతెన నిర్మాణం.. అమ్మకు ఇల్లు కట్టించేస్తా సామెత చందాన తయారైంది. ఇక్కడున్న కాలం చెల్లిన లోలెవెల్ వంతెనపై తరచూ నాలుగు నుంచి ఐదడుగుల ఎత్తులో నీరు ప్రవహించడం.. వెంటనే అధికారులు, పాలకులు ఇక్కడికొచ్చి వెంటనే భారీ వారధి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పడం.. వరద తగ్గగానే గాలికొదిలేయడం మామూలుగా మారింది. ప్రస్తుతం ఉన్న లోలెవెల్ వంతెనకు రెండు వైపులా రక్షణ గోడలు లేవు. దీంతో ఎదురుగా వాహనం వచ్చి అంచుకెళ్లాల్సి వస్తే వాహనదారుల గుండెలదిరిపోతున్నాయి.

ప్రతి పాదనలు పంపిస్తాం

వంతెన దిగువకు ఉండటం వల్ల నదిలో నీరు వస్తే పైనుంచి ప్రవహిస్తోంది. ఇక్కడ కొత్త వంతెన నిర్మాణానికి మళ్లీ ప్రతిపాదనలు పంపుతాం. నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం. అధికలోడుతో భారీ వాహనాలు వెళ్లడం వల్ల వంతెన దెబ్బతింది. కొత్తది నిర్మించాల్సిన అవసరం ఉంది.

– ఎన్.నరసింహమూర్తి, రోడ్లు-భవనాలశాఖ డీఈఈ

సమగ్రశిక్షా అదనపు సంచాలకులుగా అరుణ

నెహ్రూచౌక్ (అనకాపల్లి): జిల్లా సమగ్రశిక్షా అదనపు పథక సంచాలకులుగా ఉప్పాటి అరుణ నియమితులయ్యారు. వాణిజ్య పన్నుల శాఖలో సీటీఓగా పనిచేస్తున్న ఈమెను ఏపీఓగా నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఇంతవరకు ఏపీఓగా పనిచేసిన డాక్టర్ రోణంకి జయప్రకాశ్‌ను కళాశాల అధ్యాపకుడిగా తిరిగి పంపినట్లు అధికారులు తెలిపారు.

కబ్జేస్తున్నారు.. కట్టేస్తున్నారు!

గెడ్డలు పోయి గోడలు వచ్చె!

ఈనాడు డిజిటల్, అనకాపల్లి

అనకాపల్లి పట్టణ పరిసర ప్రాంతాల్లో రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాలు ఆక్రమణ చెరకు చిక్కుతున్నాయి. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు.. కబ్జా చేసేస్తున్నారు. వాగు, గెడ్డ పోరంబోకు భూములను పక్క సర్వే నంబర్లలో కలిపేసుకుంటున్నారు. తప్పుడు పత్రాలు సృష్టించి దర్జాగా చేసేస్తున్నారు. అనకాపల్లి మండలం తుమ్మపాల రెవెన్యూ పరిధిలోని సత్యనారాయణపురం, బయ్యవరంలో వాగు పోరంబోకు స్థలాన్ని ఈ తరహాలోనే చెరబట్టేందుకు సిద్ధమయ్యారు.

సత్యనారాయణపురం: గెడ్డపోరంబోకు స్థలంలో చేపట్టిన నిర్మాణం

1 కొంకోట మండలం బయ్యవరం రెవెన్యూ పరిధిలోని రామన్నపాలెం సమీపంలో సర్వే నం. 244లో 48 సెంట్ల గెడ్డపోరంబోకు స్థలం ఉంది. దీనికి ఆనుకుని ఉన్న కొంత స్థలాన్ని ఓ కంపెనీ కొనుగోలు చేసింది. స్థానికంగా ఉన్న కొంత మంది తెదేపా నేతలు వాగు పోరంబోకు స్థలాన్ని కూడా రెవెన్యూ రికార్డులు తారుమారు చేసి అమ్మేసేందుకు యత్నిస్తున్నారు. దీన్ని గుర్తించిన గ్రామస్థులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.

రామన్నపాలెం స్థలం కొంకోట సమీపంలో జాతీయ రహదారికి కిలోమీటరు దూరంలో ఉండటంతో.. దీని విలువ రూ. 1.10 కోట్లకు పైనే ఉంటుంది. రెవెన్యూ అధికారులు సైతం నేతలతో కుమ్మక్కయి సర్వే చేసి గెడ్డ పోరంబోకు భూమిని వేరు చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. సర్వే చేయాలని గ్రామస్థులు స్థానిక వీఆర్‌ఓను విన్నవించినా.. నచ్చినప్పుడు చేస్తాం. మీరు చెప్తే చేసేయాలా అంటూ గదమాయిస్తున్నారు.

2 అనకాపల్లి రూరల్ మండలం తుమ్మపాల రెవెన్యూ పరిధిలోని సత్యనారాయణపురం గ్రామంలో కొంత గెడ్డపోరంబోకు స్థలం ఉంది. అనకాపల్లి నుంచి బుచ్చెయ్యపేట వైపు వెళ్లే రహదారిలో టిడ్కో ఇళ్లకు వెళ్లే రోడ్డు సమీపంలో సర్వే నం. 388-2లో ఈ స్థలం ఉంది. ఇక్కడ సెంటు రూ. 8 లక్షలకు పైనే పలుకుతుంది. ఇక్కడ 12 సెంట్లకు పైగా ఆక్రమించేందుకు యత్నిస్తున్నారు. ఈ భూమి చుట్టూ ప్రహరీ నిర్మిస్తున్నారు. ఇక్కడ గతంలో వైకాపా నేతలు ఆక్రమణకు యత్నించగా అప్పట్లో స్థానికులు, నేతలు అడ్డుకుని అనకాపల్లి తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. మళ్లీ ఇప్పుడు అదే స్థలంపై బడాబాబుల కన్నుపడింది.

చర్యలు తీసుకుంటాం..

బయ్యవరం, తుమ్మపాల రెవెన్యూ పరిధిలోని ఆక్రమణ విషయం నా దృష్టికి రాలేదు. క్షేత్రస్థాయి సిబ్బందిని పంపించి పరిశీలిస్తాం. సర్వే చేయించి.. ప్రభుత్వ స్థలం ఉన్నట్లయితే హద్దులు నిర్ణయించి బోర్డులు పెడతాం. ప్రభుత్వ స్థలం ఆక్రమించడం నేరం. ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటాం.

– అయిషా, ఆర్డీఓ, అనకాపల్లి

ఈ-కేవైసీ.. ఏటా తప్పనిసరి

పాయకరావుపేట, న్యూస్‌టుడే: గ్యాస్ సిలిండరుకు రాయితీ పొందాలంటే ఇకపై ఏటా ఈ-కేవైసీ చేయించుకోవాల్సిందే. ఇప్పటి వరకు ఒకసారి ఈ-కేవైసీ, బయోమెట్రిక్ చేయించుకుంటే సరిపోయేది. తాజాగా వచ్చిన ఉత్తర్వుల ప్రకారం ప్రతి సంవత్సరం నవీకరించాల్సిందే. కేంద్ర ప్రభుత్వం గరిష్ఠంగా ఏడాదికి తొమ్మిది సిలిండర్లకు రాయితీ అందిస్తోంది. ఏడాది చివరిలో ఆడిటింగ్ చేసుకుంటే రాయితీ అర్హత వస్తుంది. హెచ్‌పీ, భారత్ పెట్రోలియం, ఐఓసీ కంపెనీల గ్యాస్ వినియోగదారులు మార్చి 31లోగా ప్రతి ఏడాది ఈకేవైసీ చేయించుకోవాలి. దీనిపై ఉత్తర్వులు జారీ అయ్యాయి.

» జిల్లాలో 24 గ్యాస్ ఏజెన్సీల పరిధిలో సుమారు 4.90 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. దీనిలో సుమారు 1.70 లక్షల ఉజ్వల కనెక్షన్లు. ప్రధాన మంత్రి ఉజ్వల యోజనలో గ్యాస్ తీసుకునే వారికి, రాష్ట్ర ఉజ్వల పథకంలో గ్యాస్ పొందిన వారికి సుమారు రూ.315 రాయితీ వస్తోంది. మిగతా వారికి సుమారు పది రూపాయల లోపు రాయితీ అందుతోంది.

» వినియోగదారులు సమీపంలోని గ్యాస్ ఏజెన్సీకి వెళ్లి ఉచితంగా ఈ-కేవైసీ చేయించుకోవచ్చు.

» సిలిండరు డెలివరీబాయ్ వద్దనున్న యాప్ ద్వారా చేయవచ్చు.

» పరిజ్ఞానం ఉంటే చరవాణిలోనే యాప్‌లో చేసుకునే వెసులుబాటు ఉంది.

గుండెబలం ఉందా.. మంచుకొండ పిలుస్తోంది!

నర్సీపట్నం, న్యూస్‌టుడే

దివ్యాంగ విద్యార్థుల సాహసాల దిశగా తమసత్తా చాటేందుకు మంచి అవకాశం వచ్చింది. ఇప్పటికే వీరికి అన్ని విధాలా కూటమి ప్రభుత్వం చేయూతనిస్తోంది. ఇప్పుడు ముందెన్నడూ లేని విధంగా హిమాలయ పర్వతాలు అధిరోహించేలా వీరిని ప్రోత్సహించేందుకు ముందుకు వచ్చింది. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 'ఇన్‌క్లూజివ్ స్పోర్ట్స్' పేరిట కార్యక్రమానికి రూపకల్పన చేసింది. జోనల్‌స్థాయిలో ఆయా జిల్లాల నుంచి ప్రత్యేక అవసరాల పిల్లలను దీనికి ఎంపిక చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

★ దివ్యాంగ విద్యార్థులకు క్రీడా సామర్థ్యాలు, ప్రతిభను వెలికి తీసేందుకు దోహదపడేలా ఒకరోజు జోనల్‌స్థాయి స్పోర్ట్స్ మీట్ నిర్వహించాలని ప్రతిపాదించారు. ఈనెల 24 నుంచి వచ్చే డిసెంబరు నెల 2వ, తేదీలోగా దీనిని చేపట్టనున్నారు. దీనికి ఆయా జిల్లాల నుంచి మొత్తం 15 నుంచి 18 ఏళ్లలోపు 208 మంది విద్యార్థుల జాబితాను సిద్ధం చేశారు.

ముందుగా జోనల్.. ఆ తరవాత రాష్ట్ర స్థాయిలో ఎంపిక చేసిన అనంతరం తుదిగా హిమాలయాల అధిరోహణకు సిద్ధం చేయనున్నారు.

జోన్-2లోని అల్లూరి జిల్లా నుంచి 12 పీఎంశ్రీ పాఠశాలల్లోని 52 మంది దివ్యాంగ విద్యార్థులు, అనకాపల్లిలోని 33 బడుల నుంచి 52 మంది, కాకినాడలోని 29 స్కూళ్లకు చెందిన 52 మంది, విశాఖపట్నంలోని 5 పాఠశాలల్లోని 52 మందికి అనకాపల్లిలోని ఎన్టీఆర్ స్టేడియంలో త్వరలో స్పోర్ట్స్ మీట్ ఏర్పాటు కానుంది. ఇందులో ఎంపికైన వారు రాష్ట్రస్థాయికి అర్హత సాధిస్తారు. తుదిగా అడ్వాన్స్‌డ్ శిక్షణతో జాతీయ స్థాయి నిపుణుల పర్యవేక్షణలో వీరిని హిమాలయాల యాత్రకు సన్నద్ధం చేయనున్నారు.

★ 'ఎవరెస్ట్ బేస్ క్యాంప్' యాత్రగా పేర్కొంటున్న ఇందులో అయిదు వేల అడుగుల ఎత్తు వరకు పర్వతాలను అధిరోహించడానికి అనుమతిస్తారు. ఈ సాహసకృత్యంలో సత్తా చాటే ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉత్తమ పురస్కారాలు, బహుమతులు దక్కే అవకాశం ఉంది. సమగ్రశిక్షా నుంచి వీటికి అనకాపల్లిలో తగిన ఏర్పాట్లు చేపట్టాల్సిందిగా ఆదేశాలు జారీ అయ్యాయని జిల్లా సహిత విద్య సమన్వయకర్త రామకృష్ణ తెలిపారు. అన్ని పరీక్షలు అనంతరం ఈ యాత్రకు పిల్లలను అన్ని విధాలా తీర్చిదిద్దుతారని తెలిపారు.

నెమలి పింఛాలతో.. నయనమనోహరం

అనకాపల్లి గవరపాలెంలోని అనూకాంబిక ఆలయంలో గురువారం కార్తిక మాసం చివరి అమావాస్య పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకలు నిర్వహించారు. మహిళలు పిండి వంటలు, అరటి గెలలతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించారు. నెమలి పింఛన్లతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

- లక్ష్మీదేవిపేట, (అనకాపల్లి), న్యూస్‌టుడే

సివిల్స్ సాధనకు సహకారం

చీడికాడ, న్యూస్‌టుడే

సివిల్ సర్వీసు పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ప్రిలిమ్స్ పరీక్షలు రాసేవారికి బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచితశిక్షణ ఇప్పించనుంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, నిరుద్యోగ యువత దీనిని సద్వినియోగం చేసుకోవచ్చు. అభ్యర్థులకు నాలుగు నెలలపాటు ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తారని బీసీ సంక్షేమ సాధికారిత అనకాపల్లి జిల్లా అధికారిణి శ్రీదేవి ప్రకటించారు.

అర్హత: డిగ్రీ ఉత్తీర్ణులై కుటుంబ ఆదాయం ఏడాదికి రూ. లక్ష లోపు ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు అర్హులు. దరఖాస్తు చేసుకున్నవారికి డిసెంబరు 5న ప్రతిభా పరీక్ష నిర్వహిస్తారు. అందులో ఎంపికైన వారికి డిసెంబరు 12 నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 10 వరకు ఉచితశిక్షణ ఇస్తారు.

దరఖాస్తు ఇలా..: అనకాపల్లి బీసీ సంక్షేమ కార్యాలయంలో దరఖాస్తులు పొందవచ్చు. కుల, ఆదాయ, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు జతచేసి పూరించిన దరఖాస్తులను ఈ నెల 25వ లోగా కార్యాలయంలో అందించాలి.

ఎంపిక ప్రక్రియ : డిసెంబరు 5న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తారు. అందులో ప్రతిభ కనబరిచిన వారికి రిజర్వేషన్ ప్రకారం అవకాశం కల్పిస్తారు. ఎంపికైన వారికి ఈ-మెయిల్, ఎస్‌ఎంఎస్ ద్వారా సమాచారం ఇస్తారు. వందసీట్లు ఉండగా.. వంద మందిని ఎంపిక చేసి, విజయవాడ గొల్లపూడిలోని ఏపీ బీసీ స్టడీసర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తారు.

జనరల్ స్టడీస్ (పేపర్-1), సివిల్ సర్వీస్ అప్టిట్యూడ్ టెస్ట్ (పేపర్-2)లో శిక్షణ ఇస్తారు. ప్రతివారం పరీక్షలు నిర్వహిస్తారు. స్టడీ మెటీరియల్ అందజేస్తారు.



వివరాలకు 98858 45743, 94949 78777 నంబర్లకు సంప్రదించవచ్చు.

హాల్‌టికెట్‌పై కోడ్ .. పరీక్ష కేంద్రానికి తోడు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులు ఇక పరీక్ష కేంద్రాలను సులువుగా గుర్తించి సకాలంలో చేరుకోవచ్చు. విద్యా సంస్కరణలకు కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వం వీరి సౌకర్యార్థం హాల్‌టికెట్‌పై క్యూఆర్‌కోడ్ విధానాన్ని అమలు చేస్తోంది. ఇప్పటివరకు పరీక్షల ముందు కేంద్రాలు ఎక్కడున్నాయో వెతుకులాటతో ఇబ్బందులు ఎదురయ్యేవి. ఇప్పుడు క్యూఆర్ కోడ్ పుణ్యమా అంటూ ఈ తరహా ఇబ్బందులకు తెరపడనుంది. ఏమాత్రం జాప్యం లేకుండా కేంద్రానికి చేరుకోవడానికి సాధ్యమవుతుంది.

★ పదోతరగతి పరీక్షలంటేనే విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడి ఉంటుంది. పరీక్షల రోజున కేంద్రాలకు చేరుకోవడం చాలామందికి సవాలుగా మారుతోంది. జంబ్లింగ్ విధానంతో ఏ సెంటర్ కేటాయిస్తారో తెలియని పరిస్థితి. ఇవి ఎక్కడ ఉన్నాయో గుర్తించడానికి తంటాలు పడుతుంటారు. దీనికితోడు ఇటీవల కాలంలో ట్రాఫిక్ సమస్యలు ఈ సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. దీని వల్ల పుణ్యకాలం కాస్త గడిచిపోయి కొంతమంది సకాలంలో కేంద్రాలకు చేరుకోలేకపోతున్నారు.

» కేంద్రాల కేటాయింపులో జంబ్లింగ్ పద్ధతి ఎప్పటి నుంచో అమలవుతోంది. దీనివల్ల ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో పరీక్షలు రాయాల్సిన వారంతా అవస్థలు పడుతున్నారు. విశాఖ, అనకాపల్లి, నర్సీపట్నంలో అక్కడక్కడ స్కూళ్లను కేంద్రాలుగా ఏర్పాటు చేస్తున్నారు. కాపీయింగ్ నిరోధానికి ఇది మంచి పద్ధతి అయినప్పటికీ పొరుగు ప్రాంతాల విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉదాహరణకు నర్సీపట్నం మున్సిపాలిటీలోని వార్డునంబరుతో జడ్పీ హైస్కూల్ అని హాల్‌టికెట్‌పై చిరునామా పేర్కొంటే.. ఇతర ప్రాంతాల వారు ఇక్కడ చేరుకునే సరికి మూడు హైస్కూళ్లు కనిపించేవి. దీంతో తమకు కేటాయించింది ఏదో తెలియక మూడింటి చుట్టూ ప్రదక్షిణలు చేసేవారు.

» ప్రభుత్వం ఈసమస్యపై ఇప్పుడు సానుకూలంగా స్పందించింది. సాంకేతికత సాయంతో ఈ ఇబ్బందులను నివారించేందుకు చర్యలు తీసుకుంది. విద్యార్థుల హాల్‌టికెట్లపైన పరీక్షకేంద్రం లొకేషన్‌కు సంబంధించిన క్యూఆర్ కోడ్ ముద్రించి తద్వారా సమయం వృథా కాకుండా చర్యలు తీసుకున్నారు. జిల్లాలో 119 కేంద్రాల్లో 23,815 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. వీరందరికీ ఈ కోడ్‌తో ఏ ఇబ్బంది లేకుండా అందులోని మ్యాప్ ఆధారంగా కేంద్రానికి ఏలా చేరుకోవాలో స్పష్టమవుతుందని నర్సీపట్నం మండల విద్యాశాఖాధికారి తలుపులు తెలిపారు.

విద్యుత్తు ఉపకేంద్రాల్లో ఈవీ స్టేషన్లు

జిల్లాలో ఏర్పాటు చేయబోయే ఛార్జింగ్ స్టేషన్లు 40

పాయకరావుపేట, న్యూస్‌టుడే

ఎంపిక చేసిన ప్రాంతాలు...

అనకాపల్లి, కశింకోట ఆర్‌ఈసీఎస్, ఎలమంచిలి, నర్సీపట్నం, శ్రీరాంపురం, అచ్యుతాపురం, నర్సింగబిల్లి, కొరుప్రోలు, పాయకరావుపేట

విస్తీర్ణం : అయిదు సెంట్లు.. అంతకు మించి

కాలం మారింది... సహజ వనరులు తగ్గిపోతున్నాయి. ప్రత్యామ్నాయంపై దృష్టి పెరుగుతోంది. ఇంధన వనరులు సద్వినియోగం చేసే దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయి. దీనిలోభాగంగానే విద్యుత్తు వాహనాల వాడకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ప్రస్తుతం ద్విచక్ర వాహనాలు, బస్సులు, కార్లు క్రమేణా పెరుగుతున్నాయి. ఇప్పటికే తక్కువ దూరం ప్రయాణించే ద్విచక్ర వాహనచోదకులు వీటిని వాడుతున్నారు. అయితే ఈవీ ఛార్జింగు స్టేషన్లు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

జాతీయ, రహదారులకు దగ్గరలో...

తొలుత జాతీయ, రాష్ట్ర, మండల, గ్రామస్థాయి రహదారులకు దగ్గరల్లో ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాల్లోనూ వీటిని ఏర్పాటు చేయనున్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించనుంది.

త్వరలో అందుబాటులోకి తెస్తాం »

జిల్లాలో మరిన్ని చోట్ల ఛార్జింగు స్టేషన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. విద్యుత్తు ఉపకేంద్రాల్లోనూ అందుబాటులోకి తెస్తాం. దీనికోసం అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. వీటి నిర్మాణానికి పెద్దగా స్థలం అవసరం లేదు. వాహనాలు వెళ్లి ఛార్జింగు పెట్టుకునే వచ్చేందుకు సరిపోయే స్థలం ఉంటే సరిపోతుంది.

– రాజశేఖర్, ఈఈ, ఏపీ ఈపీడీసీఎల్

అప్రెంటిస్‌షిప్‌తో యువతలో నైపుణ్యం పెంపు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అచ్యుతాపురం ఏపీఐఐసీ వన్‌స్టాప్ కార్యాలయం వద్ద గురువారం లైఫ్ సైన్సెస్ వారి ఆధ్వర్యంలో అప్రెంటిస్‌షిప్‌పై కంపెనీ ప్రతినిధులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వల్ల కంపెనీలకు నైపుణ్యంగల యువతను అందివ్వడానికి అవకాశం ఉంటుందని సంస్థ సౌత్ ఇండియా హెడ్ అమరేంద్రబాబు అన్నారు. 10వ తరగతి నుంచి పీజీ, ఐటీఐ, పాలిటెక్నిక్, బీటెక్, ఎంటెక్ వరకు అందరూ శిక్షణ పొందవచ్చని చెప్పారు. అభ్యర్థులు https:///www.apprenticeshipindia.gov.in/candidate-login ద్వారా పేర్లు నమోదు చేసుకుంటే తామే సంప్రదించి అవకాశం కల్పిస్తామన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు..

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోళ్లకు మిల్లర్లు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంయుక్త కలెక్టర్ జాహ్నవి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లాలోని రైస్ మిల్లర్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ రైతు సేవాకేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మిల్లర్లు తప్పనిసరిగా ఈ-బ్యాంకు గ్యారంటీలను పౌర సరఫరాల శాఖకు వెంటనే అందించాలన్నారు. రైతు సేవా కేంద్రాల నుంచి ఇండెంట్ అందిన వెంటనే మిల్లర్లు నాణ్యమైన సంచులను రైతులకు అందించాలని సూచించారు. తేమశాతంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు.

రెండేళ్లలో తొమ్మిది జలాశయాలు పూర్తి

ఉత్తరాంధ్ర జలవనరులశాఖ సీఈ స్వర్ణకుమార్

దేవరాపల్లి, న్యూస్‌టుడే : ఉత్తరాంధ్ర జిల్లాలో అసంపూర్తిగా ఉండిపోయిన తొమ్మిది జలాశయాలను పూర్తిచేసే పనులు చురుగ్గా జరుగుతున్నాయని ఉత్తరాంధ్ర జల వనరులశాఖ ముఖ్య ఇంజినీర్ (సీఈ) కె.వి.ఎస్.స్వర్ణకుమార్ పేర్కొన్నారు. రైవాడ జలాశయాన్ని గురువారం పరిశీలించారు. డీఈఈ సత్యంనాయుడు, జలాశయ ఛైర్మన్ పోతల పాత్రునాయుడు ఎ ఈ జలాశయ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా జలవనరుల నిర్వహణ, అభివృద్ధిపై మాట్లాడారు.



రైవాడ జలాశయ సమాచారాన్ని తెలుసుకుంటున్న సీఈ

» రైవాడ జలాశయ మట్టిగట్టు పటిష్ఠంతో పాటు అధునాతన వరదగేట్లు, కుడి, ఎడమ కాలువల ప్రధాన తూముల పునర్నిర్మాణ పనుల కోసం రూ. 336 కోట్లు ఖర్చవుతుందని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. జైకా నిధులతో గతంలో చేపట్టిన రైవాడ కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ పనులు పూర్తి చేయాలంటే రూ. 43.8 కోట్లు అవసరం. ఇందుకు 2028 వరకు గడువు పొడిగించడంతో పనులు చేపట్టడానికి ప్రభుత్వం పరిశీలిస్తోంది.

» అనకాపల్లి జిల్లాలో ట్రిపుల్ ఆర్ పథకం కింద రూ. 330 కోట్ల వ్యయంతో సాగు నీటి చెరువులు అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించాం.

» మొంథా తుపాను ప్రభావం వల్ల అనకాపల్లి జిల్లాలో దెబ్బతిన్న జలవనరుల శాఖకు చెందిన నిర్మాణాలను తాత్కాలికంగా బాగు చేయడానికి రూ. 2.48 కోట్ల అవసరం ఉంటుంది. శాశ్వత మరమ్మతులు చేయడానికి రూ. 42 కోట్ల మంజూరు కోసం ప్రభుత్వాన్ని కోరతాం.

» ఉత్తరాంధ్రలో 14 జలాశయాలున్నాయి. వాటిలో 11 మధ్యతరహా జలాశయాలు కాగా.. 3 భారీ పారుదల ప్రాజెక్టులున్నాయి. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని వంశధార, తోటపల్లి, తారకరామ, తీర్థ సాగరం, ఆఫ్‌షోర్, మడ్డువలస, జంఝావతి జలాశయాల పనులు పూర్తిచేయడానికి రూ. 20,300 కోట్లు ఖర్చు చేస్తున్నాం. ఈ పనులు పూర్తయితే పాత ఆయకట్టు 2.5 లక్షల ఎకరాలతోపాటు అదనంగా 1.4 లక్షల ఎకరాలకు మేలు జరుగుతుంది. ఈ పనులు రెండేళ్లలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది.

మీనం.. బహుమానం

నేడు ప్రపంచ మత్స్య దినోత్సవం

పాయకరావుపేట, న్యూస్‌టుడే

అగాధ జలరాశి మనకు ఇచ్చినవరాల్లో అపార మత్స్యరాశి ఒకటి. సముద్రంలో దొరికే మత్స్య సంపద ఎందరికో జీవనాధారంగా ఉంది. జిల్లాలో పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, అచ్యుతాపురం, రాంబిల్లి తదితర మండలాల పరిధిలో తీరప్రాంతం ఉంది.

గతంలో మత్స్యకారులు వేటకు వెళితే పడవ నిండుగా చేపలు తెచ్చేవారు. ప్రస్తుతం చాలాసార్లు సగం ఖాళీ పడవతో తిరిగి రావాల్సి వస్తోంది. సముద్రంలో పెరుగుతున్న కాలుష్య ప్రభావం చేపల లభ్యతపై పడుతోంది. ఇక తీరం వెంబడి ఏర్పాటవుతున్న రసాయన పరిశ్రమల నుంచి కాలుష్య జలాలు సముద్రంలోకి చేరుతున్నాయి. దీంతో చేపలు పెద్దసంఖ్యలో చనిపోతున్నాయి. ఆలివ్‌రిడ్లే తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. పరిశ్రమల యాజమాన్యాలు వ్యర్థాలను శుద్ధి చేయకుండా వదిలేస్తుండటం అసలు సమస్యగా మారిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బొంతు చేపతో మత్స్యకారుడి ఆనందం

» ఉమ్మడి జిల్లాలో మత్స్యసంపద ఉత్పత్తి : ఏటా 8 లక్షల టన్నుల పైబడి

» మత్స్యకారుల సంఖ్య : 80 వేలమందికిపైగా

» ఇంజిన్ బోట్లు, కర్రతెప్పలు : 2,360కి పైగా ఉన్నాయి.

» మత్స్యసంపద పెంపొందించే లక్ష్యంతో ఏటా ఏప్రిల్ 14 నుంచి జూన్ 15 వరకు 61 రోజులపాటు సముద్రంలో వేటకు విరామమిస్తారు. ఈ సమయంలో మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం ప్రస్తుతం రూ. 20 వేల నగదును ఖాతాల్లో జమచేసి చేయూతగా నిలుస్తోంది.

భారీ బొంతులు చిక్కాయి..

రాజయ్యపేట తీరంలో గురువారం చేపలవేటకు వెళ్లిన పలువురు మత్స్యకారులకు అరుదుగా లభించే భారీ బొంతు చేపలు చిక్కాయి. ఒక్కొక్కటి దాదాపు పది కేజీల బరువుండే చేపలు పదుల సంఖ్యలో లభించాయి. ఒడ్డుకు చేరిన వీరి నుంచి స్థానిక వ్యాపారులు అధిక మొత్తం ధర చెల్లించి కొనుగోలు చేశారు.

– నక్కపల్లి, న్యూస్‌టుడే

MANAGEMENT - ADMISSIONS 2025-26
Post B.Sc - 2 Years (Qualification GNM)
M.sc Nursing - 2 Years (B.Sc + 1year)
Courses offered: GNM, B.Sc Nursing, Post B.Sc, M.Sc Nursing
FIND US ON GOOGLE COLLEGE ADDRESS
Secretary & Correspondent Smt. Vasantha Kumari indupalli
MOTHER THERESA
COLLEGE OF NURSING, KAKINADA
Cont : 0884-2345966, 2345977, Direct: 9247255155

THE ARYAPURAM CO-OPERATIVE URBAN BANK LTD. HEAD OFFICE, RAJAMAHENDRAVARAM (Reg.No.3127)
RECRUITMENT NOTIFICATION FOR THE POSTS OF ASST. CLERKS / ASST. CASHIER ON CONTRACT BASIS
Applications are invited from Candidates who passed IBPS/ SBI/RRB'S CLERKS PRELIMS for the post of Asst. Clerks on contract basis Age : 21 Yrs-28 Yrs. as on date of notification (Age relaxation as per Bank service conditions), Consolidated payment of Rs. 24,000/- p.m during probation period of 1 year and on confirmation pay scales will be applicable.
The vacancies are at our Guntur, Visakhapatnam and Bhimavaram Branches only
Selection Procedure : Written Test and Interview
Last date of application to be received to bank: 29-11-2025 by 5:00 p.m.
Those candidates who have applied in last one year are not eligible to apply Application only in specified format can be sent through courier or email or through registered post or in person. Bank reserves right to refuse any application without assigning any reasons
Detailed Recruitment notification & Application can be downloaded from Website:
http://www.aryapurambank.com/career.html
Email: arcobank_rjy@aryapurambank.com
Date: 21-11-2025 Contact no.:-0883-2473550
Secretary/CEO

(c) eenadu

శిలకు హరితం.. కనులకు ఆనందభరితం!

రుషికొండ సమీప కార్తికవనం బీచ్‌లో గురువారం అలల తీవ్రత తగ్గి సముద్రం కొంత మేర వెనక్కి వెళ్లింది. దీంతో వివిధ ఆకృతుల్లోని ఆకర్షణీయ శిలలు వెలుగు చూశాయి. పచ్చని నాచుతో హరితశోభ ఉట్టిపడేవి వీటి మధ్య నిలిచిన నీరు సందర్శకులకు కనువిందుగా నిలిచింది. - న్యూస్‌టుడే, విశాఖపట్నం

తరగని ఆసక్తి.. సాధనే శక్తి!

ఆదర్శం 77 ఏళ్ల వైజయంతిమాల

మురళీనగర్, న్యూస్‌టుడే: అవకాశాలను అందిపుచ్చుకుని క్రీడల్లో రాణించడానికి వయసు అడ్డంకి కాదంటారు నగరానికి చెందిన కొడాలి వైజయంతిమాల. వయసుకు తగ్గ ఆహారం తీసుకుని క్రమం తప్పకుండా సాధన చేస్తే విజయం సొంతం అవుతుందని చెబుతున్నారీమె. 77 ఏళ్ల వయసులో ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ దేశాల్లో నిర్వహించే పోటీలకు(పరుగు, నడక, మారథాన్) హాజరవుతూ పతకాలు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇప్పటివరకు ఫ్రాన్స్, శ్రీలంక, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా, ఫిలిప్పీన్స్, స్వీడన్ దేశాలలో జరిగిన పోటీల్లో పాల్గొన్నారు. సాధించిన విజయాలు, పతకాలు, ఆసక్తి తదితర వివరాలు ఆమె మాటల్లోనే.

ఆసక్తి ఇలా: ఒడిశా విద్యాశాఖలో క్లాస్-1 ఆఫీసర్‌గా 2006లో పదవీ విరమణ చేశాను. అనంతరం హైదరాబాద్‌లోని మహాత్మాగాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ సోషల్ యాక్షన్ (ఎంజీఎన్‌ఐఆర్ఎస్ఏ) సంస్థకు డైరెక్టర్‌గా పనిచేసి మహిళా సాధికారతకు యూఎస్ఏ, చైనా, మలేసియా, జపాన్, తైవాన్, కువైట్, ఆస్ట్రేలియా, బ్రిటన్, ఈజిప్ట్ దేశాల్లో జరిగిన ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొన్నా.

★ 2008 నుంచి విశాఖలో స్థిరపడ్డాను. 2009లో నగరంలో 'వైజాగ్ రన్' పేరుతో సాగిన పోటీల్లో తొలిసారి పాల్గొని మొదటి స్థానంలో నిలిచా. బహుమతి రూ.5 వేలు వచ్చింది. దీంతో ఇలాంటి క్రీడల్లో పాల్గొనాలనే ఆసక్తి కలిగింది.

జాతీయ పతాకంతో వైజయంతిమాల

గత 16 ఏళ్లుగా: ప్రతిరోజు ఉదయాన్నే నడక, పరుగు సాధన చేస్తున్నాను. విదేశాల్లో జరిగే పోటీలకు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకుని పాల్గొంటున్నాను. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం మరువలేనిది.

ఆహారపు అలవాట్లు..

ఉదయాన్నే రెండు గ్లాసుల నీరు తాగుతాను. రాగిజావ, ఓట్స్ తీసుకుంటాను. మొలకెత్తిన గింజలు, పండ్లు, ఎక్కువగా తీసుకుంటాను. అప్పుడప్పుడు ఇడ్లీ, దోశ తింటాను. నూనె తక్కువగా వేసిన కూరలను ఎక్కువగా తీసుకుంటాను. రాత్రి రెండు పుల్కాలు తీసుకుంటా.

ప్రశంసలు..

స్థానిక వాకర్స్ క్లబ్‌ల నుంచి ఎన్నో సత్కారాలు, ప్రశంసలు దక్కాయి. ఇప్పటివరకు 150కి పైగా పతకాలు సాధించా. పోటీలకు వెళ్లడం వల్ల శారీరకంగా, మానసికంగా ఆహ్లాదంగా ఉంటుంది. కొత్త కొత్త విషయాలు తెలుసుకుంటున్నాను. పోటీలకు వెళ్లేందుకు నా సొంత డబ్బునే వినియోగిస్తా.

సభాపతితో 'డోజ్‌కో' ప్రతినిధుల భేటీ



అయ్యన్నతో మాట్లాడుతున్న కంపెనీ ప్రతినిధులు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: మాకవరపాలెం మండలంలో సుమారు వంద ఎకరాల విస్తీర్ణంలో ఎర్త్ మూవింగ్ యంత్రాలు, వాటి విడి భాగాలు తయారుచేసే పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చిన డోజ్‌కో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) చంద్రశేఖర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రామారావు గురువారం సాయంత్రం సభాపతి అయ్యన్నపాత్రుడుతో భేటీ అయ్యారు. రూ.1234 కోట్ల పెట్టుబడితో కంపెనీ కార్యకలాపాలు త్వరలోనే మొదలవుతాయని వివరించారు. అయ్యన్న మాట్లాడుతూ.. పారిశ్రామికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమన్నారు. జిల్లాలో మాకవరపాలెం మండలం పరిశ్రమల హబ్ కానుండడం ఆనందంగా ఉందన్నారు. తద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. కౌన్సిలర్ రాజేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి మార్గశిర మాసోత్సవాలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: పాతనగరంలోని బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఈ నెల 21 నుంచి డిసెంబరు 19 వరకు మార్గశిర మాసోత్సవాలు నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం 8.45 గంటలకు ఉత్సవాలను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ జ్యోతి వెలిగించి ప్రారంభించనున్నారు. నెల రోజులపాటు జరిగే ఉత్సవాల్లో ప్రతి గురువారం భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశముంది. ఆ రోజున ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టనున్నారు.

ఎంవీపీకాలనీ: ఎంవీపీకాలనీలోని కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం అవుతున్నాయి. ఇందుకోసం ఉత్సవ కమిటీ భారీ ఏర్పాట్లు చేసింది. అమ్మవారి ఆలయాన్ని అందంగా తయారు చేసి విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం విస్తృతమైన ఏర్పాట్లు చేశారు. నెల రోజుల పాటు ఇక్కడ ఉత్సవాలు జరుగుతాయని ఉత్సవ కమిటీ ఛైర్మన్ కొరాడ సాంబశివరావు చెప్పారు. ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివస్తారన్నారు. తొలి శుక్రవారం బోనాల సంబరం ఏర్పాటు చేశామన్నారు. రెండోవారం అమ్మవారి సారె ఊరేగింపు, మూడో వారం వెయ్యి మంది మహిళలతో కుంకుమ పూజలు, నాలుగోవారం లక్ష పుష్పాలతో పూజలు ఉంటాయన్నారు. కమిటీ సభ్యులు కొరాడ కొండబాబు, కొరాడ నరేష్, ఏవీఎల్ రాజు, పిల్లా రాము, తాటిపాకల నాని, గోవింద్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి విగ్రహం

జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అచ్యుతాపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన బి.సాయికిరణ్ విజయనగరంలో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ చూపించి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఇదే పాఠశాలకు చెందిన పి.తేజేంద్ర అండర్-17 విభాగంలో, కుసుమకుమార్, వి.ప్రసాద్, వి.మనోజ్ వినోద్ అండర్-14 విభాగంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈనెల 28, 29, 30 తేదీల్లో ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొననున్నారు. ఇదే పాఠశాలకు చెందిన బి.పవిత్ర అండర్-14లో నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను, శిక్షణ అందించిన పీఈటీలు డాడి శ్యాంప్రసాద్, పవిత్ర సూర్యకళను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మావతి, విద్యా కమిటీ ఛైర్మన్ వెర్రి తాతారావు గురువారం పాఠశాల వద్ద అభినందించారు.

ఉపాధ్యాయులతో పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నక్కపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు నక్కపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని విజయ గురువారం తెలిపారు. ఇటీవల జరిగిన అండర్ 14, 17 బాలుర విభాగంలో పాఠశాల నుంచి పలువురు విద్యార్థులు ప్రతిభ చూపారన్నారు. దీంతో అండర్-14కు కె.నాగమనోజ్, పి.రాకేష్, ఇ.వినాల్, అండర్-17లో ఎ.వినీత్, కె.నాగరుద్ర, కె.గణేష్, బి.నరేష్, ప్రమోదకుమార్, పి.రోహిత్ ఎంపికయ్యారన్నారు. అండర్ 14 విద్యార్థులు ఈనెల 22 నుంచి తిరుపతి జిల్లా చంద్రగిరిలో జరిగే పోటీల్లో, మిగిలిన వారు కడప జిల్లా పులివెందులలో ఈనెల 27న జరిగే పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా జట్టు తరపున పాల్గొంటారన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులతో కలిసి పాఠశాలలో ఆమె అభినందించారు. ఉపాధ్యాయులు టి.వి.రమణ, డి.శ్రీనివాస్, పి.భరత్, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో పోటీలకు హిరణ్మయవర్ష

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి ఏఎంఏఎల్ ఆంగ్ల మాధ్యమ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని కొణతాల హిరణ్మయ వర్ష రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనే ఉమ్మడి విశాఖ జిల్లా జట్టుకు ఎంపికైంది. ఈ మేరకు గురువారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ అధ్యక్ష, కరస్పాండెంట్లు కొణతాల శివకుమార్, గ్రంథి సత్య సురేష్, ప్రధానోపాధ్యాయులు కె లావణ్య, వ్యాయామోపాధ్యాయులు పి.శివ, కె మణికుమారి అభినందించారు.

కుట్టుమిషన్లు అందుకున్న మహిళలతో క్లబ్ ప్రతినిధులు

సేవలో ముందువరుసలో రోటరీక్లబ్

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: సేవా రంగంలో రోటరీ క్లబ్‌ను ముందువరుసలో నిలుపుతామని క్లబ్ జిల్లా గవర్నర్ కల్యాణ్ చక్రవర్తి పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఆయన అనకాపల్లి రోటరీ క్లబ్‌ను సందర్శించారు. క్లబ్ అధ్యక్షులు బుద్ధ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రోటరీక్లబ్ సేవలను గ్రామీణ ప్రాంతాలకు అందిస్తామని వెల్లడించారు. సేవలో భాగంగా గిరిజన పేద మహిళలకు కుట్టుమిషన్లు, జీవీఎంసీ పట్టణ బాలికోన్నత పాఠశాలకు బల్లలు, దివ్యాంగులకు చక్రాల కుర్చీలు, పరికరాలు అందజేశారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు రోటరీ ద్వారా ఉచిత శిక్షణతోపాటు కుట్టుమిషన్లు అందిస్తున్నామన్నారు. పోలియో నిర్మూలనకు రూ. రెండు లక్షల నగదును గవర్నర్‌కు అందజేశారు. క్లబ్ కార్యదర్శి ప్రకాశరావు, కోశాధికారి బొగ్గారపు సర్వారావు, ప్రోగ్రాం ఛైర్మన్ బుద్ధ సత్యనారాయణ, కడిమిశెట్టి సతీష్, బీఎస్.గుప్తా, కన్నాబాబు పాల్గొన్నారు.

పోలియో అనుమానిత కేసుపై ఉన్నతాధికారుల ఆరా

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: పూడిమడకలో ఏడేళ్ల బాలుడు వాసుపల్లి కార్తీక్ పోలియో అనుమానిత లక్షణాలతో ఆసుపత్రిలో చేరాడు. దీనిపై గురువారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు వైద్య, ఆరోగ్యశాఖకు చెందిన రాష్ట్ర ఇమ్యునైజేషన్ అధికారి స్పందించారు. ఈ కేసుపై వివరాలు పంపించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. సమగ్ర వివరాలను గురువారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి లిఖిత పూర్వకంగా పంపించారు. ఈ నెల 11న సాధారణ సందర్శనలో భాగంగా పూడిమడక వెళ్లిన వైద్య బృందానికి బాలుడికి ఆరోగ్య సమస్యలు, నడవలేకపోవడం, విరేచనాలు, జ్వరం, కాళ్ల బలహీనత ఉన్నట్లు గుర్తించి అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించినట్లు ఆ నివేదికలో పేర్కొన్నారు. చిన్నపిల్లల వైద్యనిపుణుడు పర్యవేక్షణలో ఈనెల 13, 14 తేదీల్లో రెండుసార్లు బాలుడి నుంచి పోలియో అనుమానిత నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం పంపినట్లు తెలిపారు. ఈనెల 14న బాలుడిని ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారన్నారు.

నేడు పిటిషన్ల కమిటీ సమావేశం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: అసెంబ్లీ పిటిషన్ల కమిటీ సమావేశం ఈ నెల 21న కలెక్టరేట్ సమావేశ మందిరంలో కమిటీ ఛైర్మన్, ఉప సభాపతి కె.రఘురామకృష్ణరాజు అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు జరగనుంది. సమగ్ర భూసర్వే అంశంపై చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చేసిన ఫిర్యాదు పరిశీలన కోసం కమిటీ విశాఖపట్నం వస్తోంది. జిల్లా అధికారులతో సమావేశమై ఈ అంశంపై చర్చించనున్నారు. కమిటీ సభ్యులు ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, గురజాల జగన్మోహన్, కొణతాల రామకృష్ణ, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పల్లా శ్రీనివాసరావు, పి.విష్ణుకుమార్‌రాజు హాజరుకానున్నారు. ఉపసభాపతి రఘురామకృష్ణరాజు శుక్రవారం ఉదయం 8.30 గంటలకు హైదరాబాద్ నుంచి విమానంలో విశాఖ చేరుకుంటారు.

22న ఉద్యోగ మేళా

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ఐటీఐ, డిప్లొమా విద్యార్థులకు ఈనెల 22న కంచరపాలెంలోని ప్రభుత్వ పాత ఐటీఐ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు వైస్ ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఐటీఐ ఫిట్టర్, డిప్లొమా మెకానికల్ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు పాల్గొనవచ్చునన్నారు. ప్రముఖ కంపెనీ టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్(హైదరాబాద్)కు చెందిన ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు అన్ని రకాల ధ్రువపత్రాలతో హాజరుకావాలని తెలిపారు.

కొనసాగుతున్న సాగర్ కవచ్

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: తీరప్రాంత రక్షణపై నిర్వహిస్తున్న సాగర్ కవచ్ కొనసాగుతోంది. ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా ఉన్న తీరప్రాంతాల్లో కేంద్ర రక్షణ బలగాలు, రాష్ట్ర పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. పూడిమడక, తంతడి వాడపాలెం, రాంబిల్లి, నక్కపల్లి, పాయకరావుపేట, రేవుపోలవరం, వాడపాలెం వంటి తీరప్రాంతాల గ్రామాలపై గురువారం నిఘా పెట్టారు. పోలీసులు, మెరైన్ సిబ్బంది జిల్లాకు పట్టణంతోపాటు ఇక్కడి నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పూడిమడక సీఐ సింహాద్రినాయుడు ఆధ్వర్యంలో మరో 50 మంది సిబ్బందితో వాహనాలు, తనిఖీ చేశారు. పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ పూడిమడక తీరంలో పర్యటించారు. తీరరక్షణపై పోలీసులకు, కేంద్ర బలగాలకు మత్స్యకారులు సహకరించారని పూడిమడక మెరైన్ సీఐ సింహాద్రినాయుడు అభినందించారు. తనిఖీలతోపాటు మత్స్యకారులకు తీరక్షణపై అవగాహన కల్పించారు. దేశానికి ఉగ్రవాదుల ముప్పు ఎప్పుడూ సముద్రం మీదుగానే ఉంటుందన్నారు. చేపల వేట చేసే మత్స్యకారులు అప్రమత్తంగా ఉంటే మన దేశాన్ని, మన ప్రాంతాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు.

పూడిమడక తీరంలో పర్యటిస్తున్న పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ సింహాద్రినాయుడు

రాంబిల్లి, న్యూస్‌టుడే: సాగర్ కవచ్‌లో భాగంగా మండలంలోని తీర గ్రామాలకు వెళ్లే రహదారులపై స్థానిక పోలీసులు, మెరైన్ పోలీసులు గురువారం వాహనాలను ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. తీర గ్రామాల్లో సీఐ సీహెచ్. నరసింగరావు పర్యటించి అనుమానితులు కనిపిస్తే వివరాలు అడిగి తెలుసుకున్నారు. తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

BUSINESS OFFER

BOYS HOSTEL FOR LEASE IMMEDIATELY
FULLY FURNISHED
5FLOORS with STRENGTH
Near GITAM University
Opp: Silver OAK School
YENDADA VIZAG
✆ 9010396396, 9390461426

BUILDING CONSTRUCTION

VIZAG TDR | BPS
Contact for BPS PLAN APPROVALS
PILLA BRAHMAJI RAO
Rtd. BUILDING INSPECTOR
GVMC PRESENT LICENSED SURVEYOR
92904 41348

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై విశాఖ జిల్లా, విజయనగరం జిల్లా అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్. స్థిరాస్తి ఎక్కడ ఏ సంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. సిబిల్ అవసరం లేదు. అయోధ్య కోఆపరేటివ్ సొసైటీ బ్యాంక్, ✆ 9396 999 669.

ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభ వాయిదా లేదా నెలవారీ వడ్డీ పద్ధతిలో పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటి, ✆ 73862 01191.

REAL ESTATE

FLAT FOR SALE

PENDURTHI

1080 Sft. with Car Park, 2 B/R Luxury Flat, Sarada Peetam Back side, Pendurthy Police Station Down. 9866811112, 9642211112.

GENERAL

MVP కాలనీలో 3BHK ఫ్లాట్, సాగర్‌నగర్ మరియు PM పాలెంలో 2BHK ఫ్లాట్ బ్యాంక్‌లోన్ సదుపాయంతో అమ్మకం. ✆ 8686997700.

HOUSE FOR SALE

ATCHYUTAPURAM

121Sq.Yds. Cellar+G+1 Building for sale. North-East Facing. Exclnt Vastu - Prime Location Assured Rental. A.G.M.T. ✆ 9885824528.

LAND FOR SALE

GENERAL

10 Acre Land for Sale- Near Jeypore- Vizianagaram Road (Panasalapadu Road) 500 M from Main Highway. ✆ 9652661542.

PLOT FOR SALE

ANAKAPALLI

Google Data సెంటర్‌కి దగ్గర నీలకుండీలు శొంఠ్యాంలో VMRDA/ RERA అప్రూవ్డ్, Open Plots సేల్. బ్యాంకు లోన్ సౌకర్యం. ✆ 9949375838.

ATCHYUTAPURAM

Vizag Economical Zone Atchutapuram - Yelamanchili 200 Ft. Approching Rd. Commercial Plots Sale. VMRDA. ✆ 8639765271.

DTCP Approved Plot (1120 Sq.Yds) Cheemalapalli, Atchutapuram, Vizag. Contact Phone Number: 9923879631.

TAGARAPUVALASA

Thagarapuvalasa Y Jn, NH facing plots Ready to construct useful for duplex, hostel, commercial etc. ✆ 9992273747

GENERAL

Bogapuram Airports 3 Km డిస్టెన్స్ లో (గేటెడ్ కమ్యూనిటీ, Airport Residence) Open ప్లాట్స్ అందుబాటులో ఉన్నవి, 15,499 మాత్రమే. ✆ 98486 73474.

JOBS

Need Teaching Staff and Principal for ITI Anakapalli and Atchuthapuram. Salary: 15K/ 25K. Contact: 7032015042.

Wanted Collection Telecallers & Field Executives for Bank. Experience & Freshers can WhatsApp your details. ✆ 7207502157.

Draughtsman (Civil) with Diploma (Civil), B.Tech., B.Arch. (with Auto CAD & Preferably Pre DCR) Cont. 3-00 to 8-00 p.m. only. Phone: 9848159212.

Req. Part Time/Full Time. A well Reputed Company is looking for Experienced People as Managers (M/F) preferably Rtd./VRS/ LIC/HomeMakers above 30 Yrs. Monthly income 80K and above. Contact: 9347777899, 9030030411.

3S Solutions: Required Marketing Executives for Solar Company. Contact Phone Number : 70754 41639.

Agent & ABM Wanted for Chit Fund Company. Freelancers, Commission & Salary Basis. Monthly 10K to 50K+ ✆ 9392111223.

Castle Cubz- Hiring Designer (5+ yrs)- Expert in AutoCAD 2D/3D, SketchUp. Ar. T. S. Sandeep Reddy. ✆ 83093 90836.

Wanted Managerial Persons for a reputed org., any qlf. Full / Part Time, M/F, Retd. & Housewives with Desire & Earn High Incomes, Age: 30+. Contact Ph: 9848889021, 9701014777.

WANTED
2 దశాబ్దాల మా సంస్థ ఆఫీసులో
☛ మేనేజర్స్ - 10
☛ టీమ్‌లీడర్స్ - 10
☛ పార్ట్ టైమర్స్ - 20
25 సం॥ పైబడిన M/F కావలెను. గృహిణులు, రిటైర్డ్ పర్సన్స్‌కి ట్రైనింగ్ ఇవ్వబడును. 5 అంకెల ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. వర్క్ ఫ్రమ్ హోమ్ అవకాశం కలదు. మీ బయోడేటాతో సంప్రదించండి.
MEGHANATH, DGM
T.P.T. COLONY, VSP
✆ 9110762087, 9652834999

కావలెను
ప్రముఖ వ్యాపార సంస్థలో పనిచేయుటకు ఈ క్రింది స్టాఫ్ కావలెను.
❖ అసిస్టెంట్ జనరల్ మేనేజర్స్ : M/F
❖ చీఫ్ మేనేజర్స్ : M/F
అర్హత: ఏదైనా డిగ్రీ, వయస్సు: 30+. Retd; State/ Central Govt. Gazetted Officer Rank వారు మరియు LIC Agents, Chit Fund Agents, School Teachers కూడా అర్హులే. Part Time Jobs కూడా కలవు.
Con. P.N.V. SUBRAMANYAM
B.S. LAYOUT, VIZAG
Ph: 9848441497

ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేయుటకు స్త్రీ/పురు॥ కావలెను. రిటైర్డ్ ఉద్యోగులు/ హౌస్‌వైవ్స్‌కి ప్రాధాన్యత. ఫిక్స్‌డ్ శాలరీ+ కమీషన్ Contact.: 8885866999.

Wanted Computer ఆపరేటర్ టైపింగ్ తెలుగు,ఇంగ్లీషులో ప్రావీణ్యం కల్గి స్పీడుగా టైప్ చేయగల Exp. కావలెను. Contact Phone: 9989765615, 9912208283.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

పాఠశాలను తెరిపించాలని వినతి

మునగపాక, న్యూస్‌టుడే: తిమ్మరాజుపేట డావెన్సీ ఇంటర్నేషనల్ పాఠశాలను తెరిపించి తమ పిల్లలకు ఆఫ్‌లైన్ విద్యాబోధన అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావు నాయుడుకు వినతిపత్రం అందజేశారు. పాఠశాల ప్రాంగణంలోని నీటికొలనులో ప్రమాదవశాత్తు పడిపోయి విద్యార్థి మృతిచెందడం దురదృష్టకరమని ఆడారి శివ అప్పలనాయుడు, బుద్ధనాయుడు, లక్ష్మి హరనాథ్, దేవి తదితరులు అన్నారు. నాటి నుంచి పాఠశాల మూతపడిందన్నారు. విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నా తమ పిల్లలు చదువులో వెనుకబడుతున్నారన్నారు. పాఠశాలను తెరిపించి యథావిధిగా తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీబీఎస్‌సీఈ బోర్డు దృష్టికి తీసుకెళ్లి త్వరగా పాఠశాల తెరిపించి యథావిధిగా తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకొంటామని డీఈఓ చెప్పారన్నారు.

డీఈఓ అప్పారావునాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

వాహనం ఢీకొని గుర్తుతెలియని యువకుడి మృతి

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై కొక్కిరాపల్లి కూడలి సమీపాన గురువారం గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందినట్లు గ్రామీణ ఎస్సై ఉపేంద్ర తెలిపారు. సుమారు 30 ఏళ్ల కలిగిన గుర్తు తెలియని వ్యక్తిని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొక్కిరాపల్లి వీఆర్వో గంగబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ద్విచక్రవాహన చోరీ కేసులో ఆరు నెలల జైలు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని వేల్పులవీధిలో ద్విచక్ర వాహనం చోరీ చేసిన నిందితుడు ఎన్.ధనుకుమార్‌ను ఈ ఏడాది జూన్‌లో అరెస్టు చేశారు. కోర్టులో విచారణ జరపగా గురువారం నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు పట్టణ ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపారు.

వసతిగృహ విద్యార్థి అదృశ్యం

కశింకోట, న్యూస్‌టుడే: కశింకోట బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థి అదృశ్యమయ్యాడు. అచ్యుతాపురం మండలం తంతడి వాడపాలెం గ్రామానికి చెందిన ఎజ్జల నరేంద్ర వసతిగృహంలో ఉంటూ స్థానిక డీపీఎన్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఈనెల 17న వసతిగృహానికి ఆలస్యంగా రావడంతో తాత్కాలిక సిబ్బంది మందలించారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో మనస్తాపం చెందిన విద్యార్థి 18 హాస్టల్ నుంచి వెళ్లిపోయాడు. తన కుమారుడు కనిపించడంలేదని గురువారం తల్లిదండ్రులు సోమునాయుడు, తల్లి సత్యవతి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ అల్లు స్వామినాయుడు, బీసీ సంక్షేమ జిల్లా అధికారిణి కె.శ్రీదేవి వసతిగృహాన్ని సందర్శించి విద్యార్థులను, తల్లిదండ్రులను విడివిడిగా విచారణ చేపట్టారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

బీసీ బాలుర వసతిగృహం వద్ద విచారణ చేస్తున్న సీఐ స్వామినాయుడు

టీకాలపై అవగాహన తప్పనిసరి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: టీకాలపై వైద్య సిబ్బంది అవగాహన పెంపొందించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వి.జ్యోతి తెలిపారు అనకాపల్లిలోని జిల్లా ఆసుపత్రిలో గురువారం జిల్లాలోని వైద్యులు, సిబ్బందికి టీకాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం కొత్త వ్యాక్సిన్లను పిల్లల కోసం అందుబాటులోకి తెచ్చిందన్నారు. వీటిని చిన్నారులకు సక్రమంగా అందించేలా దృష్టి సారించాలన్నారు. వచ్చే నెల 21న నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఆర్‌సీహెచ్ 2.0 కింద ప్రసవాలు, చిన్నారుల టీకాలు ఆయా ఆసుపత్రుల వారీగా యాప్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లా టీకాల అధికారి డాక్టర్ చంద్రశేఖర్, ఎఫ్ఎంఓ డాక్టర్ జాన్, ఎస్ఓ రామచంద్రరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జ్యోతి

ఏకపక్ష నిర్ణయాలు వద్దు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై అన్ని సంఘాల బాధ్యులతో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. అనకాపల్లి సీఐటీయూ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యారంగంలో ఏ నిర్ణయాలు తీసుకున్నా.. వాటిపై ముందుగా ఉపాధ్యాయ సంఘాలు, నిపుణులతో చర్చించాలని కోరారు. గత ప్రభుత్వంలా తొందరపాటు నిర్ణయాలతో అభాసుపాలు కావద్దన్నారు. ఇన్ సర్వీసు టీచర్లకు టెట్ అర్హత పరీక్ష నుంచి మినహాయింపు వచ్చే విధంగా న్యాయస్థానంలో చర్యలు ప్రారంభించాలన్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివసరావు, రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు, అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వత్సవాయి శ్రీలక్ష్మి, గొంది చిన్నబ్బాయ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

సేఫ్టీ కోర్సుల్లో చురుగ్గా ప్రవేశాలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ప్రభుత్వ కెమికల్ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న సేఫ్టీ కోర్సుల్లో ప్రవేశాలు ఊపందుకున్నాయి. ఫైర్, ఇండస్ట్రియల్, కెమికల్ సేఫ్టీ కోర్సుల్లో అభ్యర్థులకు ఇక్కడ శిక్షణ ఇస్తారు. గతంలో శిక్షణ పొందిన వారు పలు కంపెనీల్లో మంచి ప్యాకేజీలతో ఉద్యోగాలు సాధించారు. దీంతో ఆయా సీట్లకు ఏటా డిమాండ్ పెరుగుతోంది. ఈ ఏడాది కోర్సుల్లో చేరేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించడం జరిగిందని ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణ తెలిపారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	103
లైవ్	142	123
డ్రెస్డ్	206	216
స్కిన్‌లెస్	234	226

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

(c) eenadu

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా: రాజు వెడ్స్ రాంబాయి, సత్య నారాయణ స్క్రీన్-2: రోడ్డు టు లివెన్స్, పరిసాయి: ప్రేమంటే, విజిసాయి: గర్ల్‌ఫ్రెండ్, రామచంద్ర: 12ఏ రైల్వేకాలనీ, సత్య నారాయణ స్క్రీన్-1: పాంచ్‌మినార్, వెంకటేశ్వర: మఫ్టీ పోలీస్, అచ్యుతాపురం: ఎస్‌జీఎస్ సినీవర్ల్డ్ స్క్రీన్-1 12ఏ రైల్వేకాలనీ, స్క్రీన్-2: ప్రేమంటే

సంక్షేమ పథకాలపై ఇంటింటి ప్రచారం

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఇంటింటి ప్రచారం చేయాలని తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు సూచించారు. తెదేపా జిల్లా కార్యాలయంలో గురువారం తెలుగు మహిళ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వనివి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. జిల్లా కార్యదర్శి రమణమ్మ, నేతలు వేముల సూర్యప్రభ, లక్ష్మి, భారతి పాల్గొన్నారు.

పల్లె పండగ నిధులకు ఎదురుచూపులు

పాయకరావుపేట, న్యూస్‌టుడే

పల్లెపండగలో ఎంతో ఉత్సాహంగా రోడ్లు వేశారు. దీంతో గ్రామాలకు సిమెంట్ రోడ్ల కళ వచ్చింది. దీనికి సంబంధించి పూర్తిస్థాయిలో బకాయిలు మంజూరు కాకపోవడంతో ఎదురుచూపులు తప్పడం లేదు.

✦ పల్లె పండగలో భాగంగా నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రెండు విడతల్లో రూ.15 కోట్లు కేటాయించారు. దీనిలోభాగంగా కోటవురట్లలో 105, నక్కపల్లి 90, పాయకరావుపేటలో 49, ఎస్.రాయవరంలో 91 పనులు చేయాలని నిర్ణయించారు. నాలుగు మండలాల్లో మొత్తం 335 పనులు చేపట్టాల్సి ఉండగా దీనిలో 8 తారురోడ్లు వేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల పనులు చేపట్టారు. వీటిలో 230కి పైగా పనులు పూర్తి చేశారు. ఇంకా 100కు పైగా పనులు ప్రారంభం కావాల్సి ఉంది. అయితే ఈ పనులకు సంబంధించి బకాయిలు పూర్తిస్థాయిలో చెల్లించలేదు. మరో రూ.రెండు కోట్లు చెల్లించాల్సి ఉంది.

పల్లెపండగ నిధులతో వేసిన సిమెంట్ రోడ్డు

✦ పాత వాటికి నిధులు రాకపోవడంతో కొత్తవి చేపట్టేందుకు వెనుకంజ వేస్తున్నారు. ఏది ఏమైనా రోడ్లు వేయడంతో గ్రామస్థులకు మట్టిరోడ్ల సమస్య తొలగింది. డ్రైనేజీల సమస్య కొలిక్కి వచ్చింది. తాజాగా నియోజకవర్గానికి రూ.27 కోట్లు పంచాయతీరాజ్‌శాఖ నుంచి విడుదలయ్యే అవకాశముంది. వీటితోనూ మరిన్ని పనులు చేపట్టనున్నారు. దీనిపై పంచాయతీరాజ్‌శాఖ డీఈ వై.హరి మాట్లాడుతూ పెండింగు బిల్లులో త్వరలోనే చెల్లించే అవకాశముందని పేర్కొన్నారు.

సత్యసాయి మార్గం.. అమ్మకు అన్నదానం

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2017లో అనకాపల్లి ఆసుపత్రిలో మాతా శిశుసంరక్షణ విభాగం ప్రారంభోత్సవానికి వచ్చారు. అప్పటి ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణతో కలిసి ఆయనను కలిసిన అనకాపల్లి సత్యసాయి ట్రస్టు సభ్యులు ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చే గర్భిణులకు రోజూ తాము ఉచితంగా భోజనం అందిస్తాం. ఇందుకోసం తమకు స్థలం కేటాయిస్తే రూ. 30 వేలతో చిన్న షెడ్డు నిర్మించుకుంటామని కోరారు. అయితే రూ. 30 లక్షలతో ప్రభుత్వమే భవనం నిర్మించి మీకు ఇస్తుందని చంద్రబాబు మాట ఇచ్చారు. అన్నమాట ప్రకారం భవన నిర్మాణం పూర్తిచేశారు. ఇలా సత్యసాయి ట్రస్టు సభ్యులు 2018లో ప్రారంభించిన గర్భిణుల ఉచిత భోజనం నేటికీ కొనసాగుతోంది.
– న్యూస్‌టుడే, అనకాపల్లి పట్టణం

అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రికి దూర ప్రాంతాల నుంచి గర్భిణులు చికిత్స నిమిత్తం వస్తుంటారు. చికిత్స అనంతరం వీరు భోజనానికి కష్టంగా ఉండేది. దూర ప్రాంతానికి వెళ్లి భోజనాలు చేసేవారు. సమస్యను గుర్తించిన సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు సభ్యులు రాష్ట్రంలోనే తొలిసారిగా ఆసుపత్రిలోని గర్భిణులకు ప్రతీరోజు ఉచితంగా భోజనాలు అందించే కార్యక్రమాన్ని చేపట్టారు.

భోజనాలు చేస్తున్న గర్భిణులు

✦ రోజూ 150 మందికి పైగా ఇక్కడ భోజనాలు అందిస్తున్నారు. మధ్యాహ్నం వేళలో అన్నం, కూర, సాంబారు, పెరుగు, పులిహోర, మజ్జిగతో స్వయంగా వండించి భోజనాలు ఏర్పాటుచేస్తున్నారు.

బాబా ఆశీస్సులతో



సత్యసాయి బాబా ఆశీస్సులతో చిన్నగా ప్రారంభించిన ఈ కార్యక్రమం నేడు చాలా పెద్దగా సాగుతోంది. దీనికి దాతలు సహకరించారు. ఆసుపత్రికి వచ్చే గర్భిణులు భోజనాలకు పడుతున్న ఇబ్బందులు గుర్తించి వీరికి ఆకలి తీర్చాలని అనుకున్నాం. క్రమం తప్పకుండా మధ్యాహ్నం అన్నదానం చేస్తున్నాం. నిరంతరం కొనసాగిస్తాం. – మోదినాయుడు, సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు నిర్వాహకులు, అనకాపల్లి

రుచికరమైన భోజనం

ఇక్కడ అందిస్తున్న భోజనం చాలా రుచికరంగా ఉంది. పరిశుభ్రంగా వండుతూ వారే స్వయంగా వడ్డిస్తున్నారు. తొలిసారి నేను భోజనం చేశాను. దూర ప్రాంతాల నుంచి వచ్చే మాకు ఇక్కడ అందిస్తున్న భోజనం ఎంతో ఉపయోగపడుతుంది. – వి.భవాని, సీతయ్యపేట

✦ కరోనా సమయంలోనూ భోజనాల ప్యాకెట్లు తయారుచేసి ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు అందజేశారు. సత్యసాయి 100వ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా మరిన్ని సేవ కార్యక్రమాలు చేపట్టారు. భక్తులే స్వయంగా భోజనాలు వడ్డిస్తూ అన్నదానం చేస్తున్నారు.

ఇక్కడే భోజనం చేస్తున్నాను

ఎన్టీఆర్ ఆసుపత్రికి ప్రతీ నెలా పరీక్ష కోసం వస్తున్నాను. వచ్చిన ప్రతిసారీ ఇక్కడే భోజనం చేస్తున్నాను. ఇంట్లో వండినట్లుగా ఉంటోంది. ఉచితంగా భోజన సదుపాయంతో పాటు ఆధ్యాత్మిక భావం ఇక్కడ పెంపొందిస్తున్నారు. సత్యసాయి భక్తులు చేస్తున్న సేవ అభినందనీయం. – ఎన్.లక్ష్మి, కె.జె.పురం

విద్యార్థులకు అభ్యసన సామగ్రి

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: మండల పీఈటీయా బృందం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం సేకరిస్తున్న అభ్యసన సామగ్రిలో భాగంగా ధర్మవరం-అగ్రహారం జడ్పీ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయులు అప్పలనాయుడు రూ.ఐదు వేల విలువ చేసే సామగ్రిని అందించారు. పీఈటీయా మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సమన్వయకర్త సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి సభ్యుడు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

కశింకోట: విద్యార్థులు తమ దైనందిన జీవితంలో చట్టాల ప్రాధాన్యంపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై కె.లక్ష్మణరావు సూచించారు. స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలో గురువారం కొత్తగా అమల్లోకి వచ్చిన క్రిమినల్ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

అనకాపల్లి పట్టణం: ట్రాఫిక్ నిబంధనలపై యువత అవగాహన పెంచుకుని ప్రచారం చేయాలని ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ తెలిపారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో కొత్త చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్సై శేషగిరిరావు పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీకి గణపర్తి విద్యార్థి ఎంపిక

మునగపాక: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న అసెంబ్లీలో నిర్వహించనున్న స్టూడెంట్ (మాక్) అసెంబ్లీకి ఎలమంచిలి నియోజకవర్గం నుంచి గణపర్తి జడ్పీ పాఠశాల పదో తరగతి విద్యార్థి నందారపు జశ్వంత్ ఎంపికయ్యారు. ఎమ్మెల్యే విజయకుమార్ గురువారం జశ్వంత్‌ను అభినందించారు. ప్రధానోపాధ్యాయిని రోజామణి, శ్రీనివాసరావు, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

జశ్వంత్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

INTERIOR DECORATOR
OLD BUILDING?
We Make it New!
Design-Renovate-Transform
Guaranteed Premium Finish
Cell: 9885824528

320 మందికి వైద్య పరీక్షలు

ఎస్.రాయవరం: వాకపాడు శివారు బంగారమ్మపాలెంలో గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటైంది. తునికి చెందిన మమత ఆసుపత్రి సిబ్బంది శిబిరంలో రోగులకు వైద్య సేవలు అందించారు. వైద్యులు మంగాలక్ష్మి, విహారి పరీక్షించి మందులు ఇచ్చారు.

ఆన్‌లైన్‌లోనే ఇళ్ల పన్నుల వసూలు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: పంచాయతీలో ఇళ్ల పన్నుల వసూళ్లు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జరగాలని డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పెదఉప్పలం శివారు పిట్లపాలెంలో ఇళ్ల పన్నుల వసూలును గురువారం ఆయన పర్యవేక్షించారు. ఆఫ్‌లైన్‌లో వసూలు చేస్తే పంచాయతీ కార్యదర్శిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి నాగరాజు తదితరులు ఉన్నారు.

సంపద కేంద్రాలతో ఆదాయం సమకూర్చండి

కోటవురట్ల: సంపద కేంద్రాల ద్వారా ఆదాయం సమకూర్చడానికి తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్పంచులు, ఉప సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంపై ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీఓ కూర్మారావు, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు పెంచాలని డిమాండ్

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: కనీస వేతనాలు పెంచడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు డిమాండ్ చేశారు. అచ్యుతాపురం సెజ్‌లో కార్మిక సంఘాలు, ముఠాకార్మికులతో గురువారం సీఐటీయూ నాయకులు సమావేశమయ్యారు. నాయకులు సోమునాయుడు, రొంగలి రాము, రాము, తాతారావు పాల్గొన్నారు.

గ్రామకంఠం ఆస్తులకు ఉచితంగా పట్టాలు

రాంబిల్లి, న్యూస్‌టుడే: గ్రామకంఠం, ఇతర ఖాళీ స్థలాల్లో ఇళ్లకు కూటమి ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి యజమానులకు పట్టాలు ఇస్తుందని తెదేపా రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దూళి రంగనాయకులు చెప్పారు. హరిపురంలో డీడీఓ నాగలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామిత్వ గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీడీఓ నాగలక్ష్మి కోరారు.

లారీ, బైక్ ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

ఎలమంచిలి గ్రామీణం: జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామీణ ఎస్సై ఉపేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. తుని నుంచి అనకాపల్లి వైపు వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఎర్రవరం గ్రామానికి చెందిన సేనాపతి భాను, చరణ్ రోడ్డుపై పడిపోయారు. తీవ్ర గాయాలవడంతో వారిని అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాగ్రత్తగా ఉండమని.. భర్త అదృశ్యం

అనకాపల్లి పట్టణం: మళ్లవీధిలో ఉంటున్న కె.సునీల్ అనుమానాస్పద రీతిలో కనిపించకుండా పోయారు. ఈయన అచ్యుతాపురంలోని సెల్ పాయింట్‌లో పని చేస్తున్నారు. బుధవారం సాయంత్రం తన భార్య చరవాణికి 'జాగ్రత్తగా ఉండండి' అంటూ మెసేజ్ చేసి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసినట్లు అందిన ఫిర్యాదుపై గురువారం కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు.

సమతుల్య ఎరువుల వాడకంతో నేల ఆరోగ్యం

రాంబిల్లి: సమతుల్యా ఎరువుల వాడకంతో ఆశించిన దిగుబడులతోపాటు నేల ఆరోగ్యాన్ని కాపాడవచ్చని అనకాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా.గౌరి సూచించారు. దిమిలిలో గురువారం పీఎం కిసాన్ సంగోష్టి సదస్సు నిర్వహించారు. ఇండియన్ పొటాష్ లిమిటెడ్ (ఐపీఎల్) ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో బీసీటీ-కేవీకే శాస్త్రవేత్త డా.శ్రీహరిరావు, మాజీ సర్పంచి సేనాపతి నాగేశ్వరరావు, వ్యవసాయాధికారిణి సి.సుమంత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇరువాడలో దాహం దాహం

ఇరువాడలో తాగునీటి సరఫరా కాక ప్రజలు అవస్థలు పడుతున్నారు. నీటి పథకం నిర్వహణను పంచాయతీ అధికారులు గాలికి వదిలేయడంతో కొందరు మొక్కలు, ఇతర పంటలను తడుపుకోవడానికి వినియోగించుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ప్రజల దాహం తీర్చడానికి ఉపయోగించాల్సిన పంచాయతీ నీరు పొలాలకు వెళ్లడంతో తమకు నీరు అందడంలేదని గ్రామానికి చెందిన మహిళలు మండిపడుతున్నారు. తాగునీటి ఇబ్బందులు తీర్చాలని పంచాయతీ అధికారులను కోరినా పట్టించుకోవడంలేదని పక్షం రోజులుగా నీటి కోసం బావులు, బోరుల వద్దకు పరుగులు తీస్తున్నామని వాపోతున్నారు. ఉన్నతాధికారులు జోక్యంచేసుకొని తాగునీటి ఇబ్బందులను సరిచేయాలని లేకుంటే బిందెలతో ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని మహిళలు తెలిపారు. – న్యూస్‌టుడే, అచ్యుతాపురం

కుళాయి వద్ద మహిళలు

ఈ మలుపు అత్యంత ప్రమాదకరం

పాయకరావుపేట నుంచి నర్సీపట్నం వెళ్లే మార్గంలో తాండవ చక్కెర కర్మాగారం వద్ద అత్యంత ప్రమాదకరమైన మలుపు ఉంది. ఈ మలుపులో వాహనచోదకులు అదుపు తప్పి తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో ఇదే ప్రదేశంలో కారు కాలువలోకి దూసుకుపోయింది. ట్రాక్టర్‌పై కూర్చున్న వ్యక్తి అదుపు తప్పి కిందపడి మృత్యువాత పడ్డారు. నర్సీపట్నం రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఇక్కడ భూమి కాలువపై భారీ కల్వర్టు నిర్మాణం చేపట్టారు. పూర్తిస్థాయిలో పనులు చేపట్టకపోవడంతో ఈ మలుపు వద్ద సాంకేతిక లోపాలు ఎత్తి చూపుతున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు ఈ ప్రదేశంలో రక్షణ చర్యలు చేపట్టాలని చోదకులు, స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పాయకరావుపేట గ్రామీణం

చక్కెర కర్మాగారం వద్ద ప్రమాదాలకు కేంద్రంగా మారిన భారీ మలుపు

కళ్లముందే ఎగబాకిన ప్రమాదం..

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉపమాక వెంకన్న ఆలయానికి సమీపాన ఓ విద్యుత్తు స్తంభం చూపరులను భయపెడుతోంది. దీనికి నిండుగా తుప్పలు పెరిగిపోవడమే కారణం. పెద్ద స్తంభంతోపాటు, సర్వీసు వైర్లను సైతం భారీగా అల్లుకున్నాయి. ఈ కారణంగా కింద వరకు విద్యుత్తు ప్రవహించే ముప్పు లేకపోలేదు. ఈ రోడ్డులో ఆలయానికి వచ్చే భక్తులతోపాటు, హెటెరోకి వెళ్లే ఉద్యోగులు నిత్యం వందలమంది రాకపోకలు సాగిస్తుంటారు.

చీరలు పంపిణీ

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ఇక్కడి సత్యసాయి భజనమండలి ఆధ్వర్యంలో తునిలోని లెప్రసీ కాలనీలో గురువారం సేవా కార్యక్రమాలు చేపట్టారు. చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. రమేష్‌బాబు, యాజ్ఞవల్క్యశర్మ, రమణరాజు, లక్ష్మీపతి రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాలిథిన్ వాడొద్దు

ఎలమంచిలి: పాలిథిన్ సంచులు వాడొద్దని సచివాలయం ఉద్యోగులు గురువారం పట్టణంలో ప్రచారం చేశారు. వ్యాపారులను చైతన్యపర్చారు.

PUBLIC NOTICE

Under the instructions of my client **M/S SHRIRAM FINANCE LIMITED GAJUWAKA Branch, Gajuwaka, Visakhapatnam,** I issue the following notice to general public. My client intends to grant loan to **Mr. ESWARAPU ASHOK** S/o Eswarapu Narayana Rao by keeping the below mentioned schedule property as security by way of Registered Mortgage. As such if any one have any claims, charges, mortgages Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices. Otherwise, later objections will not bind my client in this regard.

SCHEDULES OF THE PROPERTY

Item No.01: (Property covered under document No.10665/2024) Anakapalli District, Anakapalli District Registrar Area, Yelamanchili Sub-District, Rambilli Mandalam, Rambilli Gram panchayat and village accounts zeriothy dry land covered by S. Nos.79-1A, 79-1H, 79-11, 79-1K, 79-2 & 88-2 in which **Plot No.33** an extent of 183.33 Sq. yards or 153.282 Sq. meters of vacant site is measured and bounded by:
EAST: Plot No.32 site - 55 feet or 16.756 meters ; **SOUTH :** Others land - 30 feet or 9.140 meters ; **WEST :** Others land - 55 feet or 16.756 meters ; **NORTH :** 30 feet wide road - 30 feet or 9.140 meters

Item No.02: (Property covered under document no.101564/2024) All that vacant site measuring an extent of 100 Sq. yards or 83.613 Sq. meters bearing **Plot No.224** situated at SREE RAM NAGAR layout covered by S. Nos.143-4, 143-5, 143-6, 143-7, 143-8, 143-9, 143-10, 174-30, 174-31, 174-33, 174-40, 174-41, 140-1, 140-12, 140-13, 140-14, 138-2, 138-3, 138-4, 138-13, 138-14, 138-15, 138-16, 138-17, 138-18, 138-19, 138-20, 138-21, 137-1, 137-2, 137-5, 138-1, 138-5, 138-6, 138-7, 139-1, 139-3, 139-4, 139-6, 139-8, 138-10, 139-11, 140-1, 141-5, 141-6, 141-7, 141-9, 141-10, 142-1, 142-2, 143-3, 142-4, and 142-5 of A Kothapalli village and panchayat within the limits of Deverapalli Mandalam, K Kotapadu Sub-District Anakapalli District is measured and bounded by:
EAST : Plot No.227 site - 20 feet or 6.09 meters ; **SOUTH :** Plot No.225 site - 45 feet or 13.71 meters ; **WEST :** 30 feet wide road - 20 feet or 6.09 meters ; **NORTH :** Plot No.223 site - 45 feet or 13.71 meters

Item No.03: (Property covered under document no.101565/2024) All that vacant site measuring an extent of 100 Sq. yards or 83.613 Sq. meters bearing **Plot No.223** situated at SREE RAM NAGAR layout covered by S. Nos.143-4, 143-5, 143-6, 143-7, 143-8, 143-9, 143-10, 174-30, 174-31, 174-33, 174-40, 174-41, 140-1 140-12, 140-13, 140-14, 138-2, 138-3, 138-4, 138-13, 138-14, 138-15, 138-16, 138-17, 138-18, 138-19, 138-20, 138-21, 137-1, 137-2, 137-5, 138-1, 138-5, 138-6, 138-7, 139-1, 139-3, 139-4, 139-6, 139-8, 138-10, 139-11, 140-1, 141-5, 141-6, 141-7, 141-9, 141-10, 142-1, 142-2, 143-3, 142-4, and 142-5 of A Kothapalli village and panchayat within the limits of Deverapalli Mandalam, K Kotapadu Sub-District Anakapalli District is measured and bounded by:
EAST : Plot No.278 site - 20 feet or 6.09 meters ; **SOUTH :** Plot No.224 site - 45 feet or 13.71 meters ; **WEST :** 30 feet wide road - 20 feet or 6.09 meters ; **NORTH :** Plot No.222 site - 45 feet or 13.71 meters

Item No.04 : (Property covered under document no.103396/2024) All that vacant site measuring an extent of 100 Sq. yards or 83.613 Sq. meters bearing **Plot No.240** situated at SREE RAM NAGAR layout covered by S. Nos.143-4, 143-5, 143-6, 143-7, 143-8, 143-9, 143-10, 174-30, 174-31, 174-33, 174-40, 174-41, 140-1 140-12, 140-13, 140-14, 138-2, 138-3, 138-4, 138-13, 138-14, 138-15, 138-16, 138-17, 138-18, 138-19, 138-20, 138-21, 137-1, 137-2, 137-5, 138-1, 138-5, 138-6, 138-7, 139-1, 139-3, 139-4, 139-6, 139-8, 138-10, 139-11, 140-1, 141-5, 141-6, 141-7, 141-9, 141-10, 142-1, 142-2, 143-3, 142-4, and 142-5 of A Kothapalli village and panchayat within the limits of Deverapalli Mandalam, K Kotapadu Sub-District Anakapalli District is measured and bounded by:
EAST : Plot No.261 site - 20 feet or 6.09 meters ; **SOUTH :** Plot No.241 site - 45 feet or 13.71 meters ; **WEST :** 30 feet wide road - 20 feet or 6.09 meters ; **NORTH :** Plot No.239 site - 45 feet or 13.71 meters

Visakhapatnam
Dt.20.11.2025

KODURI SREENIVASA RAO
SMT. SIVA KUMARI JALADI
Advocates,
S-2, Bharat Apartments, Seethammadhara,
Visakhapatnam-13. **Mobile No.9885166648**
Mail:sreenivaskoduri@gmail.com

పుస్తక పఠనాన్ని యువత అలవర్చుకోవాలి

చినదొడ్డిగల్లు వేడుకల్లో బహుమతులతో విద్యార్థులు

అనకాపల్లి పట్టణం, కశింకోట న్యూస్‌టుడే: యువత గ్రంథాలయాల్లో పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని జిల్లా ఖజానా అధికారిణి వి. లక్ష్మి సుభాషిణి పేర్కొన్నారు. పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. శాఖ గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు, కోరుకొండ బుచ్చిరాజు, బల్లా నాగభూషణం పాల్గొన్నారు. కశింకోట గ్రంథాలయంలో అనకాపల్లి మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ సత్యనారాయణ, గ్రంథాలయాధికారి జగన్నాథరావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం, మునగపాక, ఎలమంచిలి: అచ్యుతాపురం శాఖాగ్రంథాలయంలో జరిగిన ముగింపు వేడుకలకు ఎంపీడీఓ చిన్నారావు, ఎంఈఓ దేవరాయల్, అచ్యుతా విద్యాసంస్థల ఛైర్మన్ పల్లి శేషగిరిరావు, గ్రంథాలయాధికారి ఎల్‌వీ రమణ హాజరయ్యారు. మునగపాకలో ఎంఈఓ శివనాయుడు, ఎస్సై ప్రసాదరావు, గణపర్తిలో రామనాగేశ్వరరావు, వెంకటరమణ, చంద్రమోహన్ చేతులమీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారిణిలు సత్యవతి, అప్పలనర్స పాల్గొన్నారు. ఎలమంచిలిలో ముగింపు సమావేశానికి మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఎస్తేరు రాణి, గ్రంథపాలకులు వి.ఆనంద్ పాల్గొన్నారు.

నక్కపల్లి, పాయకరావుపేట, కోటవురట్ల: చినదొడ్డిగల్లులో గ్రంథాలయ అధికారి కలగా జనార్దన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మహిళా ఎస్సై సాహిబా అంజుమ్ హాజరయ్యారు. బండారు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులు అందించారు. ఎస్సైతోపాటు, యూనియన్ బ్యాంకు మేనేజరు నూకేష్‌లను సత్కరించారు. పేట గ్రంథాలయంలో విజేతలకు ఎస్సై పురుషోత్తం బహుమతులు అందజేశారు. ఇన్‌ఛార్జి గ్రంథాలయాధికారి వి.లక్ష్మణరావు, కె.వెంకటరమణ పాల్గొన్నారు. కోటవురట్లలో గ్రంథాలయాధికారి అప్పలనాయుడు తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు పంపిణీ చేస్తున్న ఎలమంచిలి మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు

పాఠశాలలో మౌలిక వసతులు

రాంబిల్లి: విద్యార్థులు చదువులో రాణిస్తూ నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవాలని యూనిపార్ట్స్ కంపెనీ ప్రతినిధి శేషవర్ధన్ కోరారు. రాజకోడూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో యూనిపార్ట్స్ కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులు రూ.10 లక్షలతో మౌలిక వసతులు కల్పించింది. నిర్మించిన వంటశాలను సర్పంచి ముత్తా శంకరరావుతో కలిసి ప్రారంభించారు. మండల విద్యాశాఖ అధికారి మళ్ల సూర్యారావు, కంపెనీ ప్రతినిధులు తోట శ్రీను, వెంకటరావు, బాబూరావు, పాఠశాల కమిటీ ఛైర్మన్ ముత్తా ప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధికి నమూనాగా తగరంపూడిని తీర్చిదిద్దుతాం

తగరంపూడిలో పర్యటిస్తున్న కొణతాల

కొత్తూరు, లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: జాతీయ ఉత్తమ పంచాయతీ అవార్డు అందుకున్న తగరంపూడిని ఆ స్థాయిలో అభివృద్ధి చేయడానికి అధికారులు, గ్రామస్థులు సహకరించాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరారు. అన్ని శాఖల అధికారులు, వివిధ పార్టీల నాయకులతో కలిసి గురువారం ఆయన గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ పంచాయతీగా రూ. కోటి నజరానా పంచాయతీకి అందుతుందన్నారు. జిల్లా పంచాయతీ అధికారి ఇ. సందీప్, డీఈలు వేణుగోపాల్, సత్యకుమారి, తహసీల్దార్ ఆనంద్, ఎంపీడీఓ ఆశా జ్యోతి, సర్పంచి యాదగిరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు. తగరంపూడిలో అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభోత్సవంలో అధికారులు ప్రొటోకాల్ పాటించలేదని ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆరోపించారు. మండల అధికారులపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పట్టణంలోని రింగురోడ్డు జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజలు, కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ శాఖల అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించారు.

కూటమి ప్రభుత్వంతో రైతులకు ఆర్థిక భరోసా

మునగపాక, కొత్తూరు (అనకాపల్లి): జగన్ వంచనతో మోసపోయిన రైతులకు కూటమి ప్రభుత్వం ఆర్థికభరోసాతో బాసటగా నిలుస్తోందని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో గురువారం రైతులతో సమావేశమయ్యారు. రైతుభరోసా నిధులు జమచేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి చెరకురసంతో అభిషేకం చేశారు. గవర కార్పొరేషన్ డైరెక్టరు భీమరశెట్టి శ్రీనివాసరావు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టరు డొక్కా నాగభూషణం, శ్రీకాళహస్తి దేవాలయం డైరెక్టరు బీలా స్రవంతి పాల్గొన్నారు.

మునగపాకలో చంద్రబాబునాయుడు చిత్రపటానికి అభిషేకం చేస్తున్న నాగేశ్వరరావు, నాయకులు

అనకాపల్లి మండలం కూండ్రంలో గా తెదేపా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆనంద కుమార్ పాల్గొన్నారు. చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ఆధ్యాత్మికంగా అయ్యప్పస్వామి మండల ఉత్సవాలు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి కన్యకాపరమేశ్వరి అయ్యప్ప స్వామి ఆలయంలో వార్షిక మండలి ఉత్సవాలు జాతరలా నిర్వహిస్తున్నారు. శబరిమల నుంచి అయ్యప్ప స్వామి ఆలయ పూజారులు మేల్ శాంతి, మురళి నంబూద్రితోపాటు హైదరాబాద్ అయ్యప్ప ఆలయ ప్రతినిధి వెంకటరమణ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

విశేష అలంకరణలో అయ్యప్పస్వామి

అనకాపల్లి, మునగపాక, ఎస్.రాయవరం: అనకాపల్లి బెల్లం మార్కెట్ సమీపంలో ఓంశక్తి అమ్మవారి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, నూకాలమ్మ దేవస్థానం ఛైర్మన్ పీలా నాగశ్రీను, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రత్నకుమారి అమ్మవారిని దర్శించుకున్నారు. మునగపాక మండలం వెంకటాపురం నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాస అన్నసమారాధనను గురువారంతో ముగించారు. పరవాడ ఫార్మా కంపెనీ ఎండీ అంజనేయ పట్టాభి రామేశ్వరరావు చివరిరోజు దీన్ని ఏర్పాటుచేశారు. పెనుగొల్లు శివారు సోముదేవుపల్లి వమరిడిమాంబ అమ్మవారి జాతర గురువారం జరిగింది.

పాయకరావుపేట: పాల్తేరులో ఈనెల 23న హిందూ చైతన్య వేదిక నిర్వహించనున్నట్లు హైందవ ధర్మయజ్ఞం కోశాధికారి ఎన్. వెంకటరెడ్డి తెలిపారు. ఆంజనేయస్వామి ఆలయం వద్ద దీన్ని నిర్వహించనున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722 | పాయకరావుపేట- 80085 74750
ఎలమంచిలి- 80085 74726

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ?: పాయకరావుపేట ప్రధాన రహదారిపై రాత్రిపూట పశువులు ఉంటున్నాయి. మంగవరం రోడ్డు కూడలి నుంచి రాజుగారిబీడు వరకు ఇదే పరిస్థితి. దీనివల్ల వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. – **చంటిరాజు, రాజుగారిబీడు,** ✓: రోడ్లపై పశువులు ఉండకుండా చర్యలు చేపడతాం. సంబంధిత యజమానులకు తాఖీదులు ఇస్తాం. – **కె.డేవిడ్, ఈవో**

పాయకరావుపేట గ్రామీణం: ?: పట్టణంలోని నాగరాజుపేట రామాలయానికి ఎదురుగా ఉన్న వీధి వద్ద సోలార్ దీప స్తంభం పడిపోయే స్థితిలో ఉంది. దీని సరిచేయకుంటే ప్రమాదం పొంచి ఉంది. – **కాలనీవాసులు,** ✓: సిబ్బంది ద్వారా స్తంభాన్ని సరి చేయిస్తాం. – **నాగార్జున్, పంచాయతీ మేస్త్రి**

అచ్యుతాపురం: ?: పూడిమడక తాగునీటి పథకం వీధిలో వీధి దీపాలు వెలగడం లేదు. మురుగు కాలవలు శుభ్రం చేయడంలేదు. పాముల బెడద ఎక్కువగా ఉంది. – **భాస్కరరావు, పూడిమడక,** ✓: మురుగు కాలువలను తరుచూ శుభ్రం చేస్తున్నా చెత్త పడేస్తున్నారు. వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. – **సరస్వతి, పంచాయతీ కార్యదర్శి**

(c) eenadu

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

రాత్రి వేళలో గస్తీ తిరగాలి

ఎ.కోడూరులో రికార్డులు పరిశీలిస్తున్న అనకాపల్లి డీఎస్పీ శ్రావణి

కె.కోటపాడు, న్యూస్‌టుడే: రాత్రివేళ గ్రామాల్లో గస్తీ తిరగాలని అనకాపల్లి డీఎస్పీ శ్రావణి సూచించారు. ఎ.కోడూరు పోలీస్‌స్టేషన్‌ను ఆమె గురువారం పరిశీలించారు. దస్త్రాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రశాంత వాతావరణానికి నిరంతరం గ్రామాలను సందర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ పైడపునాయుడు, ఎస్సై లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మదుమును మరవద్దు

చీడికాడ మండలం దిబ్బపాలెం-దండిసురవరం రోడ్డు ప్రమాదకరంగా మారింది. దిబ్బపాలెం కల్లాల వద్ద కల్వర్టు వద్ద భారీ రంధ్రం పడింది. ఏమాత్రం ఆదమరిచినా పెను ప్రమాదం తప్పదు. ఇది రాత్రి సమయంలో కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీరాజ్‌ శాఖ అధికారులు స్పందించి మదుముకు మరమ్మతు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు. – చీడికాడ, న్యూస్‌టుడే

కార్యాలయమా.. పార్కింగ్‌ స్థలమా

కార్యాలయం ఆవరణలో ప్రైవేటు వాహనాలు

స్థానిక తహసీల్దారు కార్యాలయం ప్రైవేటు వాహనాలకు అడ్డాగా మారింది. బయట వ్యక్తులు కార్యాలయంలోపల ఇష్టారాజ్యంగా వాహనాలను నిలిపివేస్తున్నారు. స్థానిక సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయం తహసీల్దారు కార్యాలయానికి సమీపంలో ఉంది. దీంతో రిజిస్ట్రేషన్‌ పనులపై వచ్చినవారంతా తహసీల్దారు కార్యాలయంలో వాహనాలను పెడుతూ పార్కింగ్‌ స్థలంగా మార్చేస్తున్నారు. దీంతో గతంలో బయటి వ్యక్తులు కార్యాలయం లోపల వాహనాలు పెట్టకుండా రెవెన్యూ సిబ్బంది గేటు వద్ద నియంత్రించేవారు. ఇప్పుడా పరిస్థితి లేకుండా పోయింది. – న్యూస్‌టుడే, చోడవరం

పల్లెల్లోనూ పన్నులు.. ఆన్‌లైన్లో చెల్లింపులు

రూ.3 కోట్లుపైగా ప్రభుత్వానికి జమ

నర్సీపట్నం, న్యూస్‌టుడే: పల్లెపాలన డిజిటల్‌ హంగులను సంతరించుకుంటోంది. కూటమి ప్రభుత్వం చొరవ ఫలితంగా సాంకేతిక సాయంతో పంచాయతీలు ప్రగతిబాట పడుతున్నాయి. గ్రామస్థులు తమ ఇంటి పన్నులను ఆన్‌లైన్లోనే చెల్లించగలుగుతున్నారు. దీనికోసం గతంలోనే స్వర్ణ పంచాయతీ పేరుతో ఓ వెబ్‌సైట్‌ను రూపొందించింది. ఇది అన్ని సాంకేతిక అడ్డంకులను అధిగమించి ఇటీవల గాడిలో పడింది. ఫలితంగా ప్రస్తుతం జిల్లాలో రూ.3 కోట్లకు పైగా పన్నులు ఆన్‌లైన్లో జమకావడం విశేషంగా పేర్కొంటున్నారు.

★ ప్రభుత్వం పాలనలో సాంకేతికతను జోడించేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగానే దీని సహకారంతో గ్రామ పంచాయతీల వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తోంది. స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్‌ గత ఏడాదే అందుబాటులోకి తీసుకొచ్చింది. కార్యాలయంలోని సిబ్బంది అందరికీ శిక్షణ తరగతులు నిర్వహించారు. దీని ద్వారా ఇంటి పన్నులు చెల్లించేలా అందరిలోనూ అవగాహన పెంపొందించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. గ్రామాల్లో పంచాయతీ అధికారులు, సిబ్బంది విస్తృత ప్రచారం చేపట్టిన కొన్ని అనివార్య కారణాలతో తొలుత ఇది పట్టాలెక్కలేదు.

★ జిల్లాలోని 646 గ్రామ పంచాయతీల్లో మొత్తం 3,85,381 అసెస్‌మెంట్లు ఉన్నాయి. ఇవన్నీ స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌ చేసేందుకు ముందుగా చర్యలు తీసుకున్నారు. ఇందులో సాంకేతికంగా ఎదురవుతున్న సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేవారు. ఒక్కొక్కటిగా వీటిని పరిష్కరించిన నేపథ్యంలో ఇప్పుడు పూర్తిస్థాయిలో ఇది అందుబాటులోకి వచ్చింది. దీంతో ఇక అందరూ విధిగా ఆన్‌లైన్లో పన్నులు చెల్లించాలని గ్రామాల్లో మరోసారి ప్రచారం నిర్వహిస్తున్నారు.



పన్ను చెల్లింపుదారుకు ఆన్‌లైన్‌ రసీదు అందజేస్తున్న పంచాయతీ ఉద్యోగి

★ గ్రామాల్లోని ఇళ్ల పన్నులు నూరుశాతం ఆన్‌లైన్లో జమయ్యేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని జిల్లా పంచాయతీ అధికారి సందీప్‌ తెలిపారు. జిల్లాలోని పంచాయతీల నుంచి మొత్తం రూ.31.44 కోట్లు డిమాండ్‌ ఉంది. ఇందులో ఇప్పటికే 35,280 మంది రూ.3.80 కోట్ల పన్నులను ఆన్‌లైన్‌ ద్వారా చెల్లించారు. ఇది వసూళ్లు చేయడంలో ప్రస్తుతం జిల్లా రాష్ట్రంలో 12వ స్థానంలో ఉంది. స్మార్ట్‌ఫోన్లలో ప్రత్యేక లింక్‌పై క్లిక్‌చేసి ఎవరైనా సరే వీటిని చెల్లించవచ్చు. దీనిపై అందరికీ మరింత అవగాహన కల్పిస్తున్నాం. పంచాయతీ కార్యాలయాల్లో సంప్రదించి సైతం ఈ సేవలు పొందవచ్చని తెలిపారు.

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీ కన్య ఆడి 1: గోపికల గోదా (ట్రిపుల్‌), ఆడ్ల కాదరా శివ, సీతా ప్రయాణం కృష్ణతో, లవ్‌ ఓటీపీ, మా ఊరి వెంకన్న ఆడి 2: ది గర్ల్‌ ఫ్రెండ్‌, సంతాన ప్రాప్తిరస్తు ఆడి 3: కాంత, ఆడి 4: శివ, రోలుగుంట సూరి, జగదీష్‌ బంగార్రాజు: ప్రీ వెడ్డింగ్‌షో రాజు: జింగిరి చోడవరం: శ్రీసాయిలక్ష్మి: కాంత సాయిలక్ష్మి: శివ, పూర్ణ: జటాధర

ఏఐఆర్‌ డోలు విద్వాన్‌గా కొండలరావు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: నర్సీపట్నంకు చెందిన డోలు వాయిద్య కళాకారుడు సవరపు నాగ కొండలరావు ఆల్‌ ఇండియా రేడియో (ఏఐఆర్‌) డోలు విద్వాన్‌గా నియమితులయ్యారు. జిల్లా నుంచి ఈ పోస్టుకు ఎంపికైన మొదటి వ్యక్తి ఈయనే. ప్రస్తుతం ఈయన స్థానిక దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో ఆస్థాన విద్వాంసుడిగా పనిచేస్తున్నారు. సంగీతంలో డిప్లొమా కోర్సు చేసిన కొండలరావు శ్రీలంక, మారిషస్‌లో కచేరీలు ఇచ్చి పురస్కారాలు అందుకున్నారు. ఏఐఆర్‌ నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఏఐఆర్‌ డైరెక్టర్‌ కె.ఇందిర విద్వాన్‌గా నియమిస్తూ గురువారం ధ్రువపత్రం అందజేశారు.

కొండలరావు

దరఖాస్తుల ఆహ్వానం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో స్పాట్‌ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్‌ విజయభారతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఒరిజినల్‌ ధ్రువపత్రాలతో ఈనెల 22వ తేదీలోపు కళాశాలకు హాజరుకావాలన్నారు. బీకాం, బీఎస్సీ (జువాలజీ, కెమిస్ట్రీ, కంప్యూటర్‌ సైన్స్‌) గ్రూపుల్లో మాత్రమే ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: రబీలో పెసర, మినుము, కంది, జొన్న, ఆముదం, అనుములు సాగు చేసే సూక్ష్మ దాతువులు అభివృద్ధి చెంది నేల సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి లచ్చన్న సూచించారు. మాకవరపాలెం మండలం కొండల అగ్రహారంలో రైతులకు అవగాహన కల్పించేందుకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామపెద్ద రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరా నిలుపుదల

దేవరాపల్లి, న్యూస్‌టుడే: దేవరాపల్లి మండలంలోని పది గ్రామాల్లో శుక్రవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్తు శాఖ ఏఈఈ కత్తి శంకర్రావు తెలిపారు. తెనుగుపూడి, చినగంగవరం, వెంకటరాజపురం, గరిశింగి, తారువ, మారేపల్లి, పెదనందిపల్లి, వాకపల్లి, తిమిరాం, కలిగొట్ల గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

రావికమతం: కొత్తకోట విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో శుక్రవారం ఆర్‌డీఎస్‌ పనులు చేపడుతున్నట్టు ఏపీఈపీడీసీఎల్‌ ఏఈ అప్పారావు చెప్పారు. కొత్తకోట సబ్‌స్టేషన్‌ పరిధిలోని అన్ని గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 2గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ మండలంలోని తురువోలు, అర్జునగిరి, జి.కొత్తపల్లి, పెదగోగాడ, వరహాపురం, చుక్కపల్లి, చెట్టుపల్లి, అప్పలరాజుపురం, కోనాం, సిరిజాం, మంచాల, ఐండివరం, ఎల్‌.బి.పట్నం, వీరభద్రపేట తదితర గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని ఈఈ అప్పారావు చెప్పారు.

బ్రహ్మలింగేశ్వరాలయ దత్తతకు వినతి

నర్సీపట్నం అర్బన్‌, న్యూస్‌టుడే: బలిఘట్టంలోని పురాతన బ్రహ్మలింగేశ్వర స్వామి ఆలయాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని టీడీపీ నాయకుడు ఆడిగర్ల సతీష్‌ శ్రీశైలం దేవస్థానం ఛైర్మన్‌ పి.రమేష్‌నాయుడును కోరారు. స్థానిక నాయకులతో కలిసి గురువారం శ్రీశైలంలో అతిథి గృహంలో ఆయన్ను కలిశారు. బ్రహ్మలింగేశ్వర ఆలయంలో శివలింగాన్ని బలిచక్రవర్తి ప్రతిష్ఠించినట్లు పురాణ కథ ఉందన్నారు. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని ఈ ఆలయాన్ని శ్రీశైల దేవస్థానం దత్తత తీసుకుంటే ఎంతో ప్రాముఖ్యం లభిస్తుందని పేర్కొన్నారు. అప్పలనాయుడు, ప్రసాద్‌ పాల్గొన్నారు.

రమేష్‌కు స్వామి చిత్రపటం బహూకరిస్తున్న సతీష్‌ తదితరులు

ఉరుకులు.. పరుగులు

చీడికాడ, న్యూస్‌టుడే: తుపాను హెచ్చరిక నేపథ్యంలో చీడికాడ మండలంలో అన్నదాతలు ఉరుకులు, పరుగులు తీస్తున్నారు. వరిపంట చేతికి అందొచ్చిన సమయంలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ కావడంతో మండలంలోని పలు ప్రాంతాల్లో కోత కోసిన రైతులు పంటను మోపులు కట్టి, ఎడ్లబళ్లు, ట్రాక్టర్లపై కల్లాలకు తరలిస్తున్నారు. కొందరు పండిన పంటను కోతకోసిన వెంటనే ఒడ్డుకు తరలిస్తున్నారు. ఈనెల 24 నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

మోపులను కల్లాలకు చేర్చుతున్న రైతులు

పంట పండింది..

ఒమ్మలిలో పండిన వరి చేను

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: ఆరుగాలం శ్రమించి అన్నదాత పడిన కష్టానికి ప్రతిఫలం దక్కే రోజులు చేరువలోనే ఉన్నాయి. ఎన్నో కష్టాలకు ఓర్చి సాగు చేసిన మంట కోత దశకు చేరుకుంది. ముందుగా ఉడిచిన చేలల్లో వరి పంట పక్వానికి చేరుకోవడంతో కర్షకులు కోటి ఆశలతో ఖరీఫ్‌ కోతలు ప్రారంభించారు.

12,600ఎకరాల్లో ఖరీఫ్‌ సాగు...

మాడుగుల మండలంలో 12,600 ఎకరాల్లో వరిసాగు జరిగింది. స్వర్ణ, సాంబామసూరి, ఎంటీయూ 1064, 1061 బీపీటీ రకాలు పండించారు. స్వర్ణ, సాంబామసూరి రకాలు కోత దశకు చేరుకుంటున్నాయి. 100 శాతం రైతులు పెద్దేరు జాలాశయం పైనే ఆధారపడి సాగు చేశారు. ముందుగా నాట్లు వేసిన చోట పంట కోత దశకు వచ్చింది. ముందుగా నాటిన చేలు పక్వానికి రావడంతో రైతులు వరి కోతలు ప్రారంభించారు. సాధారణంగా అమావాస్య వెళ్లిన తర్వాత ప్రారంభించాల్సిన కోతలు ఇప్పటికే చేలు పక్వానికి రావడంతో మొదలు పెట్టేశారు.

కోతలు ప్రారంభమయ్యాయి..

ముందు ఉడిచిన వరిచేలు పంటకు రావడంతో వరికోతలు ప్రారంభించారు. ఎకరాకు 25నుంచి 30 బస్తాలు దిగుబడి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరో పది రోజుల్లో పూర్తిస్థాయిలో కోతలు సాగుతాయి. – వ్యవసాయశాఖ అధికారి అనసూయ

అ వీ ఇ వీ

ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వండి

చోడవరం, న్యూస్‌టుడే: వివిధ సంస్థలు, దుకాణాల్లో పనిచేసే అందరికీ ఉద్యోగ నియామకపు పత్రాలు అందించేలా కార్మిక శాఖ చర్యలు చేపట్టిందని కార్మిక శాఖ చోడవరం కార్యాలయ సహాయక అధికారి పి.సూర్యనారాయణ అన్నారు. గురువారం పాత బస్‌స్టాండు వద్ద ఉన్న కె.ఎస్‌.ఎన్‌.మూర్తి పెట్రోల్‌బంకులో పనిచేస్తున్న కార్మికులకు నియామకపు పత్రాలను అందించారు. ఈ సందర్భంగా కార్మిక శాఖాధికారి సూర్యనారాయణ మాట్లాడుతూ చోడవరం, బుచ్చెయ్యపేట, దేవరాపల్లి, కోటపాడు, మాడుగుల, రావికమతం, చీడికాడ, సబ్బవరం మండలాలలో ఉన్న ప్రైవేట్‌ సంస్థలు, దుకాణదారులు తమ వద్ద పనిచేసే వారికి కనీస వేతనాలు అందించడంతో పాటు నియామకపు పత్రాలను అందజేయాలని ఆయన స్పష్టం చేశారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన అవసరం

జి.మాడుగుల, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలపై గిరిజనులు అవగాహన కలిగి ఉండాలని ఆర్‌డబ్ల్యూఎస్‌ ఏఈ విజయ్‌కుమార్‌ పేర్కొన్నారు. బొయితిలి పంచాయతీ గడ్డిబందలు గ్రామాన్ని మండల అధికారుల బృందం గురువారం పర్యటించింది. ఈ గ్రామం ఒడిశా సరిహద్దుల్లో ఉండడంతో ప్రభుత్వ పథకాలు అంతంతమాత్రంగానే అందుతున్నట్లు గుర్తించిన అధికారులు అక్కడకు వెళ్లారు. గ్రామంలో మరమ్మతులకు గురైన తాగునీటి పథకాన్ని పునరుద్ధరించారు.

తెరుచుకోనున్న చింతపల్లి ఉపకారాగారం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: దాదాపు 20 సంవత్సరాల క్రితం మూసివేసిన చింతపల్లి ఉప కారాగారం త్వరలో తెరుచుకోనుంది. జిల్లా సబ్‌ జైల్‌ అధికారి జి.వెంకటరమణ (విశాఖపట్నం) గురువారం స్థానిక జైల్‌ను సందర్శించారు. 2005 సంవత్సరంలో దీన్ని మూసివేశారని, అప్పటినుంచి చింతపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో నిందితులను నర్సీపట్నం, అడవివరం తరలిస్తున్నారన్నారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా ఈ ఉప కారాగారాన్ని సందర్శించి ఇక్కడి పరిస్థితులు, భద్రత తదితర విషయాలు అధ్యయనం చేశామన్నారు. నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. సబ్‌జైలర్‌ రాజు, వర్తకసంఘం నాయకులు బేతాళుడు, నాగు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలని ఆందోళన

గొలుగొండ, న్యూస్‌టుడే: తక్కువ వేతనంతో పనిచేస్తున్న వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించాలంటూ వారంతా గురువారం ఆందోళన చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజుతో కలిసి తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సంఘ నాయకులు నరేంద్ర, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ కార్యాలయం ముందు వీఆర్‌ఏల నిరసన

కొట్నాబిల్లి రోడ్డు పనులు పునఃప్రారంభం

రావికమతం, న్యూస్‌టుడే: బిల్లులు చెల్లించకపోవడంతో ఏడాది కాలంగా నిలిచిపోయిన కొట్నాబిల్లి రోడ్డు నిర్మాణపనులు ఎట్టకేలకు పునఃప్రారంభమయ్యాయి. ప్రభుత్వం ఇటీవల బిల్లులు చెల్లించడంతో గుత్తేదారు నిలిచివేసిన రోడ్డు పనులను మళ్లీ ప్రారంభించారు. ప్రస్తుతం పాత కొట్నాబిల్లి నుంచి చిన పాచిల వరకు 7కి.మీల మేర తారు రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పాత కొట్నాబిల్లి, కె.గదబపాలెం, రామన్నదొరపాలెం, కొత్త కొట్నాబిల్లి, డోలవానిపాలెం తదితర ఐదు శివారు గిరిజన గ్రామాల ప్రజలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తూ గతంలో పీఆర్‌ పరిధిలోని చినపాచిల నుంచి టి.అర్జాపురం వరకు 13.7 కి.మీల మేర తారురోడ్డు నిర్మాణం జరిగింది.

★ సార్వత్రిక ఎన్నికలకు ముందు రోడ్డు అభివృద్ధికి నాబార్డు ద్వారా రూ.6.98 కోట్లు నిధులు మంజూరు కాగా హడావుడిగా మట్టి పనులు చేపట్టి పూర్తి చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక తిరిగి పనులు మొదలు పెట్టినా బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారుడు పనులు మధ్యలో వదిలేశాడు. దీంతో జనవరి నుంచి పనులు నిలిచిపోయాయి. వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తామని పీఆర్‌ ప్రాజెక్ట్‌ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

తారు వేసి రోలర్‌తో రోడ్డు చదును, పటిష్టం చేసే పనులు

ఆనందంగా ఆకాశ దీపం

చోడవరం, న్యూస్‌టుడే: స్థానిక స్వయంభూ గౌరీశ్వర ఆలయంలో కార్తికమాసంలో గురువారం సాయంత్రం ఆకాశదీపం కార్యక్రమం అత్యంత వేడుకగా జరిగింది. అర్చకులు చలపతి సారథ్యంలో నిర్వహించిన ఈ ఘట్టంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చోడవరం గౌరీశ్వరాలయంలో ఆకాశ దీపం

రావికమతం, న్యూస్‌టుడే: కొత్తకోట, రావికమతం, కల్యాణపులోవ, కవగుంట, మేడివాడల్లోని శివాలయాలకు తరలివెళ్లి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. కార్తికమాసం ముగింపు సందర్భంగా దొండపూడి ఎగువ రాయాలయం వీధిలోని రామాలయం వద్ద మహిళలు ఆకాశ దీపలో భాగంగా దీపాలు వెలిగించారు.

దొండపూడి రామాలయంలో పూజల్లో పాల్గొన్న మహిళలు

స్పందించకుంటే రహదారి దిగ్బంధం

రోలుగుంట, న్యూస్‌టుడే: బీఎన్‌ రోడ్డుపై వేలాదిమంది ప్రయాణికులు అవస్థలపై పాలకుల్లో స్పందన లేకపోవడం విచారకరమని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు ఆవేదన వ్యక్తం చేశారు. రోలుగుంట మండల కార్యాలయం సమీపంలో బీఎన్‌.రోడ్డు గోతులో కూరుకుపోయిన వాహనాల వద్ద సీపీఎం నాయకులు రోడ్డుపైనే ఆందోళన చేశారు. వారంరోజుల్లో పనులు ప్రారంభించకపోతే వారం రోజుల్లోగా ఈ పనులను ప్రారంభించకపోతే రోలుగుంట నుంచి కొత్తకోట వరకూ రహదారి దిగ్బంధం చేయడంతో ఆందోళన ఉద్ధృతం చేస్తామని గోవిందరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గెమ్మిలి వాసు తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న నిరసనకారులు

ప్రొటోకాల్‌ పాటించరా..!

చోడవరం, న్యూస్‌టుడే: రోలుగుంటలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి అన్నదాత సుఖీభవ నగదు పంపిణీ కార్యక్రమానికి తనను పిలవకుండా అగౌరవపరిచారని చోడవరం వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఛైర్మన్‌ అల్లం మాధవి అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ వ్యవసాయ శాఖకి చెందిన కార్యక్రమమైన సంబంధిత అధికారులు తనను విస్మరించడం దారుణమన్నారు. ఈ విషయమై అధికారులను అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదని ఆమె పేర్కొన్నారు. దీన్ని కప్పిపుచ్చుకునేలా అధికారులు వ్యవహరిస్తున్న తీరు తీవ్ర మనస్తాపం కలిగించిందని మార్కెట్‌ కమిటీ ఛైర్మన్‌ మాధవి అన్నారు.

23న ఉద్యోగ మేళా

చీడికాడ, న్యూస్‌టుడే: నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 23న చీడికాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఉద్యోగమేళా జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మేళాలో 15 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. పది, ఇంటర్‌, డిగ్రీ, డిప్లమో, ఐటీఐ, పీజీ పూర్తిచేసిన 18 నుంచి 35 ఏళ్లలోపు నిరుద్యోగులు పాల్గొనవచ్చన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

చోడవరంలో విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎంఈవో పాండురంగారావు

న్యూస్‌టుడే, బృందం : 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో విజయవంతంగా ముగిశాయి. దీనిలో భాగంగానే ఈనెల 14నుంచి 19వరకూ వారం రోజులపాటు వ్యాసరచన, వక్తృత్వం, ముగ్గులు, చిత్రలేఖనం, క్విజ్‌ చదరంగం తదితర పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచినవారికి గ్రంథాలయాధికారులు బహుమతులు అందజేశారు.

కొత్తకోటలో జ్ఞాపికలతో విజేతలు

చోడవరంలో..

గొలుగొండలో జ్ఞాపికలు అందిస్తున్న ఎంఈఓ సత్యనారాయణ

చౌడువాడలో..

మాడుగులలో..

రోలుగుంటలో..

అందరిని అక్షరాస్యులుగా చేయాలని..

చోడవరం, న్యూస్‌టుడే: మండలంలో అక్షరాస్యత పెంచే క్రమంలో వాలంటీర్లుగా నియమితులైన వారంతా శ్రద్ధగా పనిచేయాలని ఎంపీడీవో ఆంజనేయులు అన్నారు. ఉల్లాస్‌ పథకం నిర్వహణలో భాగమైన వాలంటీర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం గురువారం స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీడీఓ ఆంజనేయులు మాట్లాడుతూ మీ అందరి పై బృహత్తరమైన బాధ్యత ఉందన్నారు. 180 మంది వాలంటీర్లతో పాటు ఎంపీపీ గాడి కాసు, వెలుగు ఏపీఎం తిలక్‌ పాల్గొన్నారు.

విద్యా సామగ్రితో వాలంటీర్లు

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743	చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74740	చీడికాడ - 80085 74742

గొలుగొండ, న్యూస్‌టుడే: లింగంపేట వద్ద సామూహిక మరుగుదొడ్లకు ఏర్పాటు చేసిన నీటి సరఫరా పైపు దెబ్బతింది. నీటి వసతి నిలిచిపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. – సత్యవతి, స్థానికురాలు, ✓: సమస్య సచివాలయం దృష్టికి వచ్చింది. పరిశీలించి నీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటాం. – శివ, కార్యదర్శి

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాల చెంత చెత్తాచెదారాలు పేరుకుపోయాయి. డంపింగ్‌ యార్డును తలపిస్తోంది. దుర్వాసనతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. – అప్పారావు, సూరిబాబు గ్రామస్థులు, ✓: గ్రామంలో డంపింగ్‌యార్డు సమస్య ఉంది. పారిశుద్ధ్య కార్మికులతో చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. – సర్పంచి, ఆదిగణపతి నాయుడు

రోలుగుంట, న్యూస్‌టుడే: నిండుగొండ కూడలిలో గతంలో నిర్మించిన ప్రయాణికుల విశ్రాంతి భవనం పూర్తిగా శిథిలమైపోయింది. ఏ క్షణంలో కూలిపోతుందోనని ఆందోళన కలిగిస్తోంది. – రాజునాయుడు, నిండుగొండ, ✓: ఈ సమస్య ఇప్పటికే మా దృష్టికొచ్చింది. సుమారు 30ఏళ్లక్రితం దీన్ని నిర్మించాం. ఇటీవల కురిసిన వర్షాలకు శిథిలావస్థకు చేరుకోకపోవడంతో మరమ్మతు చేపట్టాలని సంకల్పించాం. – శెట్టి సంధ్య, సర్పంచి, నిండుగొండ

తాగునీటి వృథాకు అడ్డుకట్ట

స్పందనకు వందనం

గొలుగొండ, న్యూస్‌టుడే: ఏటిగైరంపేట నుంచి పలు గ్రామాలకు నీటి సరఫరా అందించే పైపులైను ఎయిర్‌వాల్వ్‌ చీడిగుమ్మల వంతెన వద్ద మరమ్మతులకు గురైంది. దీంతో శుద్ధిజలం నేలపాలవడంతోపాటు రోడ్డు బురదగా మారుడంతోపాటు జనాలు తాగునీటికి ఇబ్బందులు ఎదురయ్యేవి. దీనిపై 6న 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో చిత్రవార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ఎయిర్‌వాల్వ్‌కు మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించారు.

విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన

గొలుగొండ, న్యూస్‌టుడే: హైస్కూల్‌ స్థాయి నుంచే విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సీఐ రేవతమ్మ సూచించారు. గొలుగొండ కస్తూర్బా విద్యాలయంలో గురువారం బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు.

రోలుగుంట ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో మాట్లాడుతున్న ఎస్సై రామకృష్ణారావు

నర్సీపట్నం అర్బన్‌, న్యూస్‌టుడే: బీఎన్‌ఎస్‌, బీఎన్‌ఎస్‌ఎస్‌, బీఎన్‌ఏ చట్టాలతో నిందితులకు త్వరితంగా శిక్షలు పడుతున్నాయని పట్టణ సీఐ గోవిందరావు చెప్పారు. పట్టణంలోని ఎస్టీ కళాశాలల విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై ఉమామహేశ్వరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీఐ రేవతమ్మ

అలరించిన చిన్నారుల నృత్యాలు

నర్సీపట్నం అర్బన్‌, న్యూస్‌టుడే: భగవాన్‌ సత్యసాయిబాబా శత జయంత్యుత్సవాలను పురస్కరించుకుని గురువారం రాత్రి బాల వికాస్‌ చిన్నారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. స్థానిక సత్యసాయి మందిరంలో ఏర్పాటైన ఈ కార్యక్రమంలో 35 మంది చిన్నారులు నృత్యరీతులను ప్రదర్శించారు. సాయి వేషధారణ, భక్తుల వేషధారణల్లో ఆకట్టుకున్నారు. సేవాసమితి కన్వీనర్‌ రామకృష్ణ పర్యవేక్షించారు.

సత్యసాయి మందిరంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు
లక్ష్మీకాంత్ ఫ్రేమ్-1 ప్రేమంటే (మార్నింగ్, ఫస్ట్ షో), 12ఎ రైల్వేకాలనీ (మ్యాట్నీ, సెకండ్ షో) ఫ్రేమ్-2 - రాజు వెడ్స్ రాంబాయి

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

(వేపగుంట), న్యూస్‌టుడే : సింహాద్రినగర్, పద్మావతినగర్ 11 కేవీ ఫీడర్లలో విద్యుత్తు వైర్ల మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్తు సరఫరా అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఏఈ బి.సింహాచలంనాయుడు గురువారం తెలిపారు. సింహాద్రినగర్, బొబ్బిలివారి వీధి, దత్తసాయినగర్, పద్మావతినగర్, మైత్రీనగర్, పరిసర ప్రాంతాల్లో విద్యుత్తు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

సేవకులకు సత్కారం

కృష్ణానగర్(వేపగుంట), న్యూస్‌టుడే: కృష్ణానగర్ దుర్గామల్లేశ్వర సహిత అయ్యప్పస్వామివారి ఆలయంలో నెలరోజుల పాటు స్వాములకు అందించిన సేవల్లో పాల్గొన్న సేవకులను, ఆలయ కమిటీ సభ్యులను జనసేన సీనియర్ నాయకులు సుధాకర్‌రాజు గురువారం సత్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు యర్రా నాగరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

సేవకులను సత్కరిస్తున్న సుధాకర్‌రాజు

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య

పరవాడ, న్యూస్‌టుడే: ?: [illegible] బస్ షెల్టర్ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. వర్షాలు, ఎండల సమయంలో అవస్థలు పడుతున్నాం. - నాయుడు
✓: సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. - మురళీధర్ పట్నాయక్, పంచాయతీ కార్యదర్శి

వేపగుంట, న్యూస్‌టుడే : ?: సిద్ధిలక్ష్మీనగర్‌లో కాలువలు శుభ్రతకు నోచుకోవడం లేదు. - శ్రీనివాసరావు
✓: సమస్య పరిష్కరిస్తాం. - అప్పలనాయుడు, ఏఎంహెచ్‌వో, జోన్‌8

మురుగు లీకేజీకి అడ్డుకట్ట

స్పందనకు వందనం

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ శ్రమశక్తినగర్ కాలనీలో ఇరవై రోజులుగా వేధిస్తున్న భూగర్భ మురుగు నీటి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. రహదారిపై మురుగు నిలిచిపోయిన నేపథ్యంలో 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. సమస్యపై అధికారులు స్పందించాలని కోరుతూ బుధవారం కాలనీవాసులు నిరసన తెలిపారు. ఈ మేరకు 'ఈనాడు' పత్రికలో గురువారం 'మొరపెట్టుకున్నా పట్టించుకోరా..?' శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. తక్షణమే యూజీడీ సిబ్బందితో మురుగు లీకేజీకి మరమ్మతు చేయించారు. సమస్య పరిష్కరించారు. అధికారుల తీరుపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దివ్యాంగులకు ఉచిత శిక్షణ

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : ఉక్కునగరం అరుణోదయం ప్రత్యేక అవసరాల బాలల పాఠశాల విద్యార్థులకు కల్చర్ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇవ్వనున్నట్టు భాజపా గాజువాక ఇన్‌ఛార్జి కరణంరెడ్డి నరసింగరావు తెలిపారు. ఉక్కునగరం కల్చర్ ఫౌండేషన్ ఛైర్మన్ పేర్ల అప్పారావు అధ్యక్షతన గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి ఉద్యోగ అవకాశాలు కూడా ఉన్నాయన్నారు. పేర్ల అప్పారావు మాట్లాడుతూ కంప్యూటర్, అకౌంట్స్, రిసెప్షనిస్ట్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈత కొలనులో.. పతకాలు పట్టేస్తాం..

పరవాడ మండలం పి.భోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థినిలు స్విమ్మింగ్‌లో రాణిస్తున్నారు. బాల్యం నుంచే ఈతపై ఆసక్తి పెంచుకొని పతకాలు సొంతం చేసుకుంటున్నారు. శిక్షకుల పర్యవేక్షణలో కఠోర సాధన చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ నెల 08న ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో, 16న స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖలో జరిగిన రాష్ట్ర స్థాయి ఫిన్ స్విమ్మింగ్ పోటీల్లో పతకాల పంట పండించారు. అందరి ప్రశంసలు అందుకున్నారు.
– న్యూస్‌టుడే, పరవాడ

శిక్షణ పొందుతున్న క్రీడాకారిణులు

రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ

మరింత సాధన చేస్తా..

నాలుగేళ్లుగా స్విమ్మింగ్ నేర్చుకుంటున్నా. స్వగ్రామం పి.భోనంగి. మొదట్లో స్విమ్మింగ్ అంటే భయపడేదాన్ని. కోచ్ ధైర్యం చెప్పడంతో క్రమేపి పట్టు సాధించా. రెండేళ్లుగా పోటీల్లో పాల్గొంటూ రెండు స్వర్ణ, ఒక రజత, కాంస్య పతకాలు సాధించా. తండ్రి శేఖర్ చేస్తున్న స్విమ్మింగును చూసి ఆసక్తి పెంచుకున్నా. మరింత సాధన చేసి క్రీడలో రాణిస్తా. – బండారు లాస్యవర్ణిత

అంతర్జాతీయ స్విమ్మర్‌గా..

తండ్రి నరహరి అంతర్జాతీయ స్విమ్మర్ కావడంతో ఈతపై ఆసక్తి పెంచుకున్నా. పి.భోనంగి వసతి గృహంలో ఉంటూ.. వేగంగా ఈదేందుకు తర్ఫీదు పొందుతున్నా. ఇటీవల విశాఖలో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి బ్రెస్ట్‌స్ట్రోక్ ఈత పోటీల్లో రజత, కాంస్య పతకాలు సాధించా. ఈ నెల 29న దిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యా. గతంలో పల్నాడు, విశాఖలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని రజత, కాంస్య పతకాలు సాధించా. ఇంటర్నేషనల్ స్థాయిలో రాణించడమే లక్ష్యం. – రోషిణి

నేవీలో కొలువు సాధిస్తా..

స్వగ్రామం అగనంపూడి. మూడేళ్లుగా ఈతలో తర్ఫీదు పొందుతున్నా. శిక్షకుడు హరినాథరెడ్డి వద్ద మెలకువలు నేర్చుకుంటూ క్రీడలో పట్టు సాధిస్తున్నా. ఇటీవల విశాఖలో జరిగే రాష్ట్ర స్థాయి ఫిన్ స్విమ్మింగ్ పోటీల్లో మూడు రజత పతకాలు సాధించా. గతంలో రాష్ట్ర స్థాయి ఫిన్ స్విమ్మింగ్ పోటీల్లో రెండు స్వర్ణ, ఒక రజత పతకాలు సాధించా. ఈతలో మరిన్ని మెలుకువలు నేర్చుకొని నేవీలో కొలువు సాధించడమే లక్ష్యం. – ఐ.వైష్ణవి

తొలి ప్రయత్నంలోనే స్వర్ణం..

ఈత నేర్చుకోవడంతో నీటిలో మునిగిపోయిన వారిని రక్షించవచ్చని అమ్మానాన్న చెప్పేవారు. దీంతో ఇష్టం పెంచుకున్నా. ఏడాదిగా ఈత సాధన చేస్తున్నా. ఇటీవల విశాఖలో జరిగిన రాష్ట్రస్థాయి ఫిన్ స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొని తొలి ప్రయత్నంలోనే స్వర్ణ పతకం సాధించడంతో చాలా సంతోషంగా ఉంది. మున్ముందు మెరుగైన ప్రదర్శన చేసి ప్రపంచ స్థాయి స్విమ్మర్‌గా గుర్తింపు తెచ్చుకుంటా. – కె.ఆధ్య

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం: ఎమ్మెల్యే

తానాంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ, న్యూస్‌టుడే: ఫార్మా వ్యర్థాల నివారణకు చర్యలు తీసుకుంటామని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. 'మన గ్రామం - మన ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా గురువారం కలపాక, భరణికం, తానాం గ్రామాల్లో ఆయన కాలుష్య నియంత్రణ మండలి, ఏపీఐఐసీ, మండల అధికారులతో కలిసి పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వినతిపత్రాలు స్వీకరించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. యువతకు కంపెనీల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పనిచేస్తోందన్నారు. రాంకీ యాజమాన్యం తానాం రెవెన్యూ పరిధిలో తవ్విన అక్రమ చెరువును ఎందుకు మూసివేయలేదని పీసీబీ అధికారులను ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఈ మేరకు వారు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యేకు వివరించారు. భరణికం మొల్లోడు గెడ్డవాగులో స్తంభించిన ఫార్మా వ్యర్థాలను ఆయన పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. అనంతరం పరవాడ మండల తెదేపా అధ్యక్షుడిగా నియమితులైన కన్నూరు వెంకటరమణను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో సర్పంచి కన్నూరు దేవి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పైలా జగన్నాథరావు, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో రమేశ్‌నాయుడు, కూటమి నాయకులు పంచకర్ల ప్రసాద్, చింతకాయల ముత్యాలు, బొడ్డపు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కన్నూరు వెంకటరమణను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

నేడు సబ్బవరం మండలంలో పర్యటన

సబ్బవరం, న్యూస్‌టుడే: పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు శుక్రవారం సబ్బవరం మండలంలో పర్యటించనున్నారని సబ్బవరం ఎంపీడీవో పి.పద్మజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'మన గ్రామం - మన ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా మండలంలోని [illegible], వంగలి గ్రామాలను సందర్శించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

గోతులు.. నిత్యం వెతలే..!

నరవవానిపాలెం (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు పరిధి నరవవానిపాలెం నుంచి కుమ్మరి కాలనీకి వెళ్లే రహదారి దుస్థితి దయనీయంగా ఉంది. ఇటీవల ఈ ప్రాంతంలో భూగర్భ విద్యుత్తు తీగల పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో రోడ్డంతా తవ్వేశారు. ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం సమీపంలో భారీ గుంతలు ఏర్పడ్డాయి. గుంతలు పూడ్చి మట్టి చదును చేయకపోవడంతో ప్రమాదకరంగా ఉంది. రాత్రివేళల్లో అదుపుతప్పి పడిపోతున్నామని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేయించాలని కోరుతున్నారు.

కలుషిత నీటితో అనారోగ్య సమస్యలు

సుజాతనగర్‌లో ర్యాలీ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: కలుషిత నీరు తాగడంతో అనారోగ్య సమస్యలు వస్తాయని ఆదర్శ్ కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో మంజుల అన్నారు. సుజాతనగర్‌లో జరుగుతున్న కళాశాల ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా గురువారం నీటి కాలుష్యంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు నినాదాలు చేస్తూ కాలనీలో ర్యాలీ చేపట్టారు. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలను వివరించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

వ్యర్థాలతో అవస్థలు

వి.జుత్తాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తి మండలం వి.జుత్తాడ రహదారిలో వ్యర్థాలు పేరుకుపోయాయి. పులగవానిపాలెం నుంచి జుత్తాడ వెళ్లే మార్గంలోని ఎన్టీఆర్ కాలనీ సమీపంలో రోడ్డు పక్కన పెద్ద ఎత్తున చెత్తా చెదారం పోస్తుండటంతో ఆ ప్రాంతం దుర్గంధభరితంగా మారింది. ప్లాస్టిక్ సంచులు, కాగితాలు గాలికి ఎగిరి వాహనదారులపై పడి అసౌకర్యానికి గురిచేస్తున్నాయి. గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలున్నప్పటికీ తగినంత మంది సిబ్బంది లేకపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణ కుంటుపడుతోంది. అధికారులు స్పందించి రోడ్డు పక్కన ఎవరూ వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రహదారికి మోక్షమెప్పుడో..?

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం గొర్లెవానిపాలెం-గొల్లలపాలెం రహదారి నుంచి అమృతపురం శివారు సూరెడ్డిపాలెం వెళ్లే శిథిలమైన రహదారి అధ్వానంగా ఉంది. సుమారు 20 ఏళ్ల క్రితం గ్రావెల్‌పైన పిక్కలు వేసి రహదారిని గాలికొదిలేశారు. వర్షాలకు అవి తేలిపోయి నడవడానికి అవకాశం లేకుండా మారింది. వాహనాలు నిత్యం మరమ్మతులకు గురవుతున్నాయి. అప్పట్లో బీటీ రోడ్డుగా మారుస్తామని అధికారులు చెప్పి దశాబ్ద కాలం గడుస్తున్నా ఈ మార్గానికి మోక్షం కలగడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిని అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

వైభవంగా కార్తిక పూజలు

వేంకటాద్రిపై పూజల్లో పాల్గొన్న భక్తులు

పెందుర్తి, న్యూస్‌టుడే: కార్తిక మాసం చివరి రోజు, అమావాస్య తిథిని పురస్కరించుకుని వేంకటాద్రిపై గురువారం రాత్రి అఖండ దీపోత్సవం వైభవోపేతంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు మహర్తి రామానుజాచార్యులు నేతృత్వంలో అర్చకులు శ్రీవారికి అష్టోత్తర శతనామార్చన జరిపారు. అంతరాలయాన్ని దీపాలతో అలంకరించి దీపారాధన చేశారు. అనంతరం భక్తులు కొండ మెట్ల మార్గం, ఆలయ ధ్వజస్తంభం, ప్రాకారంలో జ్యోతులు వెలిగించారు. ఈవో నీలిమ పాల్గొని దీపారాధనలు చేశారు.

★ సుజాతనగర్‌లో కొలువైన కల్యాణ వేంకటేశ్వర స్వామికి నక్షత్ర దీపారాధన జరిగింది. 27 నక్షత్రాలకు ప్రతీకగా అర్చకులు 27 జ్యోతులు వెలిగించి ఆరాధించారు.

జ్యోతుల వెలుగుల్లో శ్రీనివాసుడు

సుజాతనగర్ హరిహర క్షేత్రంలో..

హరిహర క్షేత్రంలో కోటి దీపోత్సవం

మహాకాళేశ్వరుడి అలంకరణలో కేదారేశ్వరస్వామి

శివలింగాకృతిలో వెలిగించిన దీపాలు

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: సుజాతనగర్ హరిహర క్షేత్రం ఆవరణలో గురువారం రాత్రి కోటి దీపోత్సవం వైభవోపేతంగా జరిగింది. ఈ సందర్భంగా కేదారేశ్వర స్వామిని లక్ష రుద్రాక్షలతో అర్చకులు మహాకాళేశ్వరుడిగా అలంకరించి విశేష అర్చనలు చేశారు. 97వ వార్డు కార్పొరేటర్ వసంత ఈ ఉత్సవాన్ని ప్రారంభించారు. కాలనీకి చెందిన మహిళలు పాల్గొని ఆలయ ప్రాంగణంలో శివలింగాకృతిలో జ్యోతులు వెలిగించి దామోదరుడిని ఆరాధించారు.

ఆకట్టుకున్న దీపాలంకరణ

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట సమీప వరలక్ష్మీనగర్ కొండపై ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయానికి వెళ్లే మెట్ల మార్గంలో అఖండ దీపారాధన చేశారు. భక్తులు, స్వాములు, బాబా భక్తులు దీపాలు వెలిగించారు. ★ వరలక్ష్మీనగర్ కాలనీలోని మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూకాంబికా అమ్మవారికి దీపాలంకరణ చేశారు. ★ ప్రహ్లాదపురం నూకాంబికా అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో మధ్యాహ్నం భక్తులకు, అయ్యప్ప స్వాములకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్త గంగవరహాలు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా, శైలజ పాల్గొని ప్రారంభించారు.


వరలక్ష్మీనగర్‌లో నూకాంబికా అమ్మవారు

ఉచిత కంటి శిబిరానికి స్పందన

కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పరవాడ, న్యూస్‌టుడే: రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి యాజమాన్యం సహకారంతో జీవీఎంసీ పరిధి తాడి గ్రామంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ శ్రీకాంత్ ఈ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఉచిత శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కంటి వైద్యులు లోకేశ్, రాహుల్ తదితరులు 98 మందికి పరీక్షలు చేశారు. వారిలో 21 మందికి కంటి అద్దాలు, 20 మంది కంటి శస్త్ర చికిత్సలు అవసరమని వైద్యులు తెలిపారు. అద్దాలను రాంకీ ఫౌండేషన్ అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మహిళా కో-ఆర్డినేటర్ రాజేశ్వరి, శ్రీనివాస్, శశిధర్, ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి కో-ఆర్డినేటర్ శివ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

దుప్పట్లు అందుకున్న వారితో దాతలు

లంకెలపాలెం (పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ పరిధి లంకెలపాలెం సమీపంలోని శ్రీరామ్‌నగర్, ఎస్సీ, బీసీ, ఉప్పర కాలనీకి చెందిన వంద మంది పేదలకు దాతలు చిట్టిబోయిన అప్పారావు, పైడమ్మ, కోటేశ్వరరావు దుప్పట్లు, పండ్లు గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు గిరి ప్రసాద్, రమణబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు కల్పించాలి

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ ఫార్మాసిటీలో ముత్యాలమ్మపాలెం మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సర్పంచి చింతకాయల సుజాత, తెదేపా సీనియర్ నాయకులు చింతకాయల ముత్యాలు అన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గురువారం వారు మాట్లాడారు. ఫార్మా సంస్థలకు చెందిన వ్యర్థాలను తీరంలోకి నేరుగా విడిచి పెట్టేస్తుండడంతో మత్స్య సంపద నశించిపోయి వేటకు వెళ్లే మత్స్యకారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. గతంలో జిల్లా ఉన్నతాధికారులు ఇచ్చిన హామీ మేరకు ఐదు వందల ఉద్యోగ అవకాశాలను మత్స్యకార యువతకు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ ఆయా సంస్థల యాజమాన్యాలు ఉద్యోగాలు కల్పించకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న సర్పంచి చింతకాయల సుజాత, తదితరులు

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

సబ్బవరం, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ అన్నారు. మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలను వివరిస్తూ పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు 'అభ్యుదయం' పేరుతో పోలీసు సిబ్బంది చేపట్టిన సైకిల్ యాత్ర గురువారం సబ్బవరం చేరుకుంది. ఈ మేరకు డీఎస్పీ, సీఐ రామచంద్రరావు వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. సబ్బవరం ఎంపీపీ బోకం సూర్యకుమారి, తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, ఎంపీడీవో పి.పద్మజ, ఎంఈవో ఎంజే రవీంద్రబాబు, గ్రామ సర్పంచి దెడ్డం ప్రసాదరావు మాట్లాడుతూ మత్తు పదార్థాలతో కలిగే దుష్పరిణామాలను వివరించారు. సీఐ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలతో ఎవరైనా పట్టుబడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా హాజరైన విద్యార్థులతో అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సబ్బవరంలో ర్యాలీ నిర్వహించారు.

ర్యాలీలో పాల్గొన్న వారికి స్వాగతం పలుకుతున్న అధికారులు, తదితరులు

చట్టాలపై అవగాహన సదస్సు

దేశపాత్రునిపాలెంలో మాట్లాడుతున్న పరవాడ సీఐ మల్లికార్జునరావు

దేశపాత్రునిపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెంలో గురువారం రాత్రి క్రిమినల్ చట్టాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పరవాడ సీఐ మల్లికార్జునరావు పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. చట్టంలో వచ్చిన మార్పులను ప్రజలకు వివరించారు. సైబర్ నేరాల, మహిళల భద్రతపై అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

పోటీల్లో గెలుపొందిన చిన్నారులతో మేయర్ పీలా శ్రీనివాసరావు, తదితరులు

పెందుర్తి, న్యూస్‌టుడే: సాంకేతికత అభివృద్ధి చెందుతున్నప్పటికీ గ్రంథాలయాలకు ఆదరణ తగ్గడం లేదని జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. పెందుర్తి శాఖా గ్రంథాలయంలో జరిగిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం గ్రంథాలయాలను మరింత అభివృద్ధి చేస్తుందని పేర్కొన్నారు. గ్రంథాలయ అధికారిణి బి.చంద్రకళ ఆధ్వర్యంలో వారం రోజులుగా గ్రంథాలయంలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు మేయర్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డి నారాయణరావు, వేగి దివాకర్, నరసింహమూర్తి, రమణచిట్టి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు భూలోకరావు, రామకృష్ణ, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం శాఖా గ్రంథాలయంలో జరిగిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఎంపీపీ బోకం సూర్యకుమారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రంథాలయాలు దేవాలయాలతో సమానమన్నారు. ఫోన్లు వదిలి పుస్తకం చేతపట్టాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా వారం రోజులుగా ఇక్కడ నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో రవీంద్రబాబు, గ్రామ సర్పంచి దెడ్డం ప్రసాదరావు, గ్రంథాలయ అధికారిణి శిరీష, తదితరులు పాల్గొన్నారు.

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ సీనియర్ పాఠకులు కాండ్రేగుల వెంకట రామారావు, ప్రసాద్, సన్యాసిరావు పాల్గొని మాట్లాడారు. గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఎంపీపీ సూర్యకుమారి, ఎంఈవో రవీంద్రబాబు, సర్పంచి ప్రసాదరావు

పరవాడ శాఖా గ్రంథాలయంలో...

14వ వర్ధంతి

స్వ॥ అనంతారపు సన్యాసినాయుడు గారు
మరణం: 21-11-2011
భార్య: మహాలక్ష్మి
కుమారుడు: అనంతారపు [illegible] - కోడలు: మణి రమణ

సాగు చేస్తూ.. కబ్జా

సలకంచెరువులో ఓ నాయకుడి దందా

సలకంచెరువులో ఆక్రమణకు గురైన భూమి

ఈనాడు, అనంతపురం: అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఓ స్థానిక నాయకుడు గ్రామంలోని భూముల్ని మింగేశాడు. అక్రమ నిర్మాణాలు చేపట్టాడు. అనధికారికంగా భూమి సాగు చేసుకుంటూ ఫలితాలు అనుభవిస్తున్నాడు. పనిలోపనిగా దేవుడి మాన్యం కూడా కలిపేసుకున్నాడు. అంతటితో ఆగకుండా ఆక్రమించిన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ప్రయత్నాలు సాగిస్తున్నాడు. దీనిపై గ్రామస్థులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. సదరు స్థానిక నాయకుడికి నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధి అండ ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వైకాపా హయాంలోనే..

శింగనమల మండలం సలకంచెరువు పరిధిలో సర్వే నంబరు 97లో 455 ఎకరాల్లో చెరువు విస్తరించి ఉంది. చెరువుకు ఆనుకుని అదే గ్రామానికి చెందిన స్థానిక నాయకుడికి అర ఎకరా భూమి ఉంది. రాజకీయ అండతో సదరు నాయకుడు కొద్దికొద్దిగా చెరువును ఆక్రమించుకుంటూ వచ్చాడు. వైకాపా హయాంలో పక్కనే ఉన్న దేవుని మాన్యం రెండు ఎకరాల మేర కబ్జా చేశాడు. మొత్తంగా చెరువు, మాన్యం భూమి 5 ఎకరాలు ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నాడు. గత వైకాపా ప్రభుత్వంలోనే పట్టుపురుగుల షెడ్డు నిర్మించాడు. షెడ్డు నిర్మాణానికిగాను రాయితీ కోసం దరఖాస్తు చేసుకోగా అక్రమ నిర్మాణం కావడంతో అధికారులు తిరస్కరించారు. అందులోనే రెండు బోర్లు వేసుకోగా.. అధికారులు విద్యుత్తు కనెక్షన్ ఇవ్వడం గమనార్హం. అప్పట్లోనే ఆక్రమించుకున్న భూమిని తన పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించుకునేందుకు ప్రయత్నాలు సాగించాడు. స్థానికులు పెద్దఎత్తున అభ్యంతరం వ్యక్తం చేయడంతో అధికారులు వెనక్కు తగ్గారు.

అధికార పార్టీలోకి మారి..

సదరు నాయకుడు కబ్జా భూమిని కాపాడుకునేందుకు అధికార పార్టీలో చేరాడు. స్థానిక ప్రజాప్రతినిధి అనుచరులతో అంటకాగుతూ చెరువు భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామస్థులు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ విషయంగా శింగనమల తహసీల్దార్ శేషారెడ్డి వివరణ కోరగా.. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు మేరకు మైనర్ ఇరిగేషన్ అధికారులకు లేఖ రాసినట్లు తెలిపారు. వారి నుంచి స్పష్టత వచ్చాక ఆక్రమణలు ఉంటే తొలగిస్తామని పేర్కొన్నారు.

- తెలివిగలవాడు ఎప్పుడూ వాదించడు..
- అహం నిన్ను నాశనం చేయకముందే అహాన్ని నువ్వు నాశనం చెయ్యి

అందర్నీ ప్రేమించు.. సేవించు!

సేవల విస్తరణకు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు చర్యలు

ఈనాడు, పుట్టపర్తి: సత్యసాయి జీవితంలో తల్లి ఈశ్వరమ్మ పాత్ర చాలా కీలకం. ఈ ప్రాంత ప్రజలకు ఉన్నత విలువలతో కూడిన విద్య, మెరుగైన వైద్యం అందించాలని తల్లి కోరారు. ఆమె కోరిక మేరకు బాబా ప్రారంభించిన సామాజిక సేవలు ప్రపంచ నలుమూలలకు చేరాయి. బోధనలు, సేవలతో ప్రపంచవ్యాప్తంగా భక్తుల అభిమానం చూరగొన్నారు సత్యసాయి బాబా. శివైక్యం చెంది 15 సంవత్సరాలైనా.. సేవలు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. బాబా శతజయంతి ఉత్సవాలు మరో వందేళ్ల సేవలకు బలమైన పునాది అవుతాయని సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ పేర్కొన్నారు. 'అందర్నీ ప్రేమించు.. అందర్నీ సేవించు' అన్న సత్యసాయి బాటలో నడుస్తూ.. బాబా చేపట్టిన సేవా కార్యక్రమాలు విస్తరిస్తూ మరిన్ని ప్రవేశపెడుతున్నామని చెబుతున్నారు.

ఆధునిక సర్జరీ పరికరాలు

సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో రెండు సూపర్‌స్పెషాలిటీ, రెండు జనరల్, రెండు సంచార వైద్యశాలలు ఉన్నాయి. వీటిల్లో రోజూ సుమారు 3 వేల మందికి ఉచితంగా వైద్యం అందిస్తున్నారు.

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రోబోటిక్ సర్జరీ పరికరాలు

- గుండె సంబంధిత రోగ నిర్ధారణకు రూ.3.8 కోట్ల విలువైన ఎకో కార్డియోగ్రఫీ యంత్రాన్ని మేలో ప్రారంభించారు. గుండె, యూరాలజీకి సంబంధించి రూ. 8 కోట్ల విలువైన రోబోటిక్ సర్జరీ యంత్రాలను ఇటీవల అందుబాటులోకి తెచ్చారు. శస్త్రచికిత్సలను రోబో యంత్రాలతో ఉచితంగా చేస్తున్నారు. కంటి చికిత్సలకు అత్యాధునిక పరికరాలను ఇటీవలే సమకూర్చారు.

విలువలతో కూడిన విద్య

ఒకటో తరగతి నుంచి పీహెచ్‌డీ వరకు 102 విద్యా సంస్థల్లో దాదాపు 60 వేలమంది విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందిస్తున్నారు.

- శ్రీసత్యసాయి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదేళ్లలోపు బాలికలకు శతజయంతి ఉత్సవాల సందర్భంగా సుకన్య సమృద్ధి పథకాన్ని ప్రకటించారు. ఇందులో భాగంగా జిల్లాలోని 20,231 మంది బాలికల పేరుతో తపాలా కార్యాలయాల్లో రూ.50 లక్షలు వెచ్చించి మొదట ఖాతాలు తెరిచారు. త్వరలో వారిపేరుపై కొంతమొత్తం డిపాజిట్ చేయనున్నట్లు తెలుస్తోంది.

రైతులకు గిర్ జాతి గోవులు

జిల్లాలోని వంద మంది రైతులకు గిర్ జాతి ఆవులను ఇస్తున్నట్లు ప్రకటించారు. అవి ఈ ప్రాంత వాతావరణానికి అలవాటుపడితే మరింతమందికి ప్రయోజనం చేకూర్చేలా చర్యలు తీసుకోవాలని ఆలోచిస్తున్నారు. వీటి ద్వారా ఇక్కడి రైతుల జీవన ప్రమాణాలు పెరిగే అవకాశం ఉంది.

వ్యర్థాల గుట్ట తరుగుతున్నా.. భయం అలానే ఉందన్నా!

బయోమైనింగ్ ప్రక్రియ

ఒకవైపు డంపింగ్ యార్డులో బయోమైనింగ్ సాగుతోందన్న సంతోషం ఉన్నా.. సమీప కాలనీల ప్రజలకు గాలి కాలుష్య భయం మాత్రం వీడలేదు. ఎందుకంటే నిత్యం పొగకు ఉక్కిరిబిక్కిరవుతున్న పరిస్థితిలో ఎలాంటి మార్పు ఉండటం లేదు. రెండు నెలలుగా గుత్తి రోడ్డులోని డంపింగ్ యార్డులో చెత్త నుంచి కంపోస్ట్ తయారు చేసి రైతులకు ఉచితంగా అందిస్తున్నారు. మరోవైపు నగరం నుంచి రోజూ పోగవుతున్న చెత్తను పాత డంపింగ్ వెనుక కుప్పలుగా వేస్తున్నారు. ఆచెత్త నుంచి రోజంతా పొగ వ్యాప్తి అనేది తగ్గడం లేదు. స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. చెత్తను క్రమపద్ధతిలో వేరు చేసి కంపోస్టుగా మారిస్తే ఉపయుక్తంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఓ వైపు చెత్త నుంచి సంపద సృష్టిస్తుంటే మరోవైపు చెత్త కాలిపోతున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

- ఈనాడు, అనంతపురం

సాంకేతిక పద్ధతిలో సాగుపై రైతులకు అవగాహన

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ఆధునిక వ్యవసాయంలో సాంకేతిక విధానాన్ని అనుసరించాలి. ప్రతి రైతుకు అర్థమయ్యేలా విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్సు హాలులో వ్యవసాయం, అనుబంధ శాఖల సమీక్ష జరిగింది. సాగులో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి. అపుడే దిగుబడి, నాణ్యత మెరుగ్గా ఉంటాయని కలెక్టర్ అన్నారు. ప్రస్తుత రబీలో 1,07,261 హెక్టార్లల్లో సాగు చేయాల్సి ఉంది. ఇప్పటిదాకా 39 శాతం పంటలు వేశారు. యూరియా, డీఏపీ ఎరువులు 36,651 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది. ఇందులో 8726 మెట్రిక్ టన్నులు యూరియా ఉందని కలెక్టర్ వివరించారు. జేడీఏ ఉమా మహేశ్వరమ్మ, ఉద్యాన అధికారి ఉమాదేవి, ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ పెన్నేశ్వరి, ప్రకృతి వ్యవసాయం డీపీఎం లక్ష్మానాయక్, డీసీఓ అరుణకుమారి, ఆత్మాపీడీ పద్మాలత, ఎల్‌డీఎం నరేశ్‌రెడ్డి, నాబార్డు ఏజీఎం అనురాధ పాల్గొన్నారు.

అమృత్ పనుల్లో వేగం పెంచాలి

పట్టణ ప్రాంతాల్లో అమలు చేస్తున్న అమృత్ పనులు రెట్టింపు వేగంతో ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్ తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీరింగ్ అధికారులు, ప్రజారోగ్య అధికారులతో సమీక్ష జరిపారు. సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల పనుల్లో జాప్యం జరగడానికి వీలు లేదన్నారు.

సంగీత కచేరీ నిర్వహిస్తున్న సాయిభక్తబృందం

అలరించిన 'శ్రీసత్యసాయి సంగీత రాగమాల'

పుట్టపర్తి, న్యూస్‌టుడే: సత్యసాయి శత జయంతి వేడుకల్లో భాగంగా అంతర్జాతీయ యువజన సదస్సును పురస్కరించుకుని గురువారం సాయికుల్వంత్ మందిరంలో శ్రీసత్యసాయి రాగమాల పేరుతో సంగీత విభావరి నిర్వహించారు. సత్యసాయి భక్తబృందం శ్రావ్యంగా సాయి భక్తి గీతాలను ఆలపించారు. ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ సతీమణి హిమవాహిని సంగీత బృందాన్ని సత్కరించారు. ఆ తర్వాత భక్తులు బాబా మహాసమాధిని దర్శించుకున్నారు.

నేడు మహారాష్ట్ర సీఎం, ఒడిశా గవర్నర్ రాక

పుట్టపర్తి, న్యూస్‌టుడే: సత్యసాయి శత జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు శుక్రవారం పుట్టపర్తికి రానున్నారు. వీరు సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటారు. మహారాష్ట్ర సీఎం అంతర్జాతీయ యువజన సదస్సులో పాల్గొని, యువతను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

మాట్లాడుతున్న ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాల ఫెర్రర్, విద్యార్థినుల నృత్యప్రదర్శన

పిల్లల హక్కులు కాపాడుదాం

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: పిల్లల హక్కులపై ఐక్యరాజ్యసమితి రూపొందించిన నియమాలను అందరూ పాటించాలని ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాలఫెర్రర్ పిలుపునిచ్చారు. గురువారం ఆర్డీటీ సమ్మిళిత ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలను మన జాతీయ సంపదగా భావించి వారి హక్కులకు ఎలాంటి ఆటంకం కలిగించకూడదని హెచ్చరించారు. బాలల సంరక్షణ కోసం ఆర్డీటీ ముందుస్తు చర్యగా అన్ని ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి, విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ డైరెక్టర్ అర్చన మాట్లాడుతూ బాలల సంరక్షణ కేంద్రాల్లో పిల్లల భద్రత కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ఆటపాటల్లో గెలుపొందిన బాలలకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మాక్ అసెంబ్లీకి విద్యార్థుల ఎంపిక

తపోవనం, ఎస్కేయూ, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరావతిలో నిర్వహించనున్న మాక్ అసెంబ్లీకి ఒక్కో నియోజకవర్గం నుంచి ఒకరు చొప్పున ఎంపిక చేశారు. నియోజకవర్గస్థాయిలో నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారి పేర్లను పాఠశాల విద్య కమిషనర్‌కు పంపారు. అక్కడి అధికారులు ఎంపిక చేసిన విద్యార్థుల వివరాలు ఇలా..

- అనంతపురం అర్బన్ నియోజకవర్గం ఎస్.సదాఫ్ నాజ్ (శారద నగరపాలక సంస్థ పాఠశాల), కళ్యాణదుర్గం నుంచి తలారి అభిజ్ఞ (జడ్పీ హైస్కూలు), రాప్తాడు నుంచి ఎం.షమ్ శ్రీనిత్‌రెడ్డి (ఏపీఎంఎస్, రాప్తాడు), శింగనమల అసెంబ్లీ నుంచి కె.శిరీష (అంబేడ్కర్ గురుకులం, కొర్రపాడు), తాడిపత్రి నుంచి పి.అనిల్‌కుమార్ (జడ్పీ హైస్కూలు, యాడికి), గుంతకల్లు నుంచి ఎం.స్వప్న (జడ్పీహెచ్‌ఎస్, గుత్తి ఆర్ఎస్), ఉరవకొండ నుంచి ఎం.లోకేష్ (జడ్పీహెచ్‌ఎస్, పెద్దకౌకుంట్ల), రాయదుర్గం నుంచి జి.గంగోత్రి (జడ్పీహెచ్‌ఎస్, లింగదహాల్)లు మాక్ అసెంబ్లీకి ఎంపికయ్యారు.

పేద బిడ్డలకు శుద్ధ జల యోగం

బిందెలో నీరు ఉంచుకొని అల్పాహారం చేస్తున్న విద్యార్థులు

సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు యంత్రాలు

అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లోని పేద బిడ్డల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఆరోగ్యంగా ఉంటేనే విద్యార్థులు ఏదైనా సాధించగలరు. ప్రతి వసతి గృహానికి శుద్ధ జలయంత్రాలను ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే సంక్షేమ వసతిగృహాల్లో రూ.9.25 కోట్లతో మరమ్మతులు పూర్తి చేసి వసతి లోగిలి ఇంటిని మురిపించే విధంగా తీర్చిదిద్దారు. ఐదేళ్ల వైకాపా హయాంలో వసతి గృహాల్లో కనీసం చిన్నచిన్న మరమ్మతులు చేయలేదు. నాడు-నేడు ద్వారా మరమ్మతులు చేస్తామని ఊరిస్తూ ఐదేళ్లు గడిపేశారే గానీ కనీసం నిర్వహణ ఖర్చులు కూడా విదల్చక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సాంఘిక సంక్షేమ వసతి గృహాలు	51
విద్యార్థుల సంఖ్య	5,668
శుద్ధ జల యంత్రాలు ఉన్నవి	5మాత్రమే..

ఇక్కట్లకు స్వస్తి..

అనంతపురం జిల్లాలో 51 సాంఘిక సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. విద్యార్థులకు శుద్ధ జలం లేకపోవడంతో క్యాన్ల ద్వారా తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కొన్ని వసతి గృహాల్లో సమీపంలో నీరు లేక విద్యార్థులే క్యాన్లు, బిందెలు తీసుకెళ్లి శుద్ధ జలకేంద్రం వద్ద తెచ్చుకోవాల్సిన దుస్థితి ఉంది. అనంతపురం హౌసింగ్ బోర్డు శివారులో ఉన్న సాంఘిక సంక్షేమ కళాశాల వసతి గృహంలోని విద్యార్థులు సమీపంలో ఉన్న శుద్ధ జలకేంద్రం వద్ద క్యాన్లతో నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఒక్కోసారి ఉదయాన్నే కళాశాలకు వెళ్లడానికి బోరు నుంచి వచ్చే నీరు తాగి వెళుతున్నారు. సంక్షేమ అధికారులు దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి శుద్ధ నీరు తాగే పరిస్థితి ఉంది. జిల్లాలో కేవలం 5 వసతి గృహాల్లో మాత్రమే శుద్ధ జలం అందించే యంత్రాలు ఉండగా 46 వసతి గృహాల్లోని విద్యార్థులకు ఇక్కట్లు పడాల్సి వస్తోంది. ఒక్కో వసతి గృహంలో రూ.2 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేయబోతున్నారు. విద్యార్థులకు ఇక్కట్లు తీరనున్నాయి.

అనంతకు పరిశ్రమలు వచ్చేస్తున్నాయ్!

రూ.4వేల కోట్లకు పైగా పెట్టుబడులు

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: ప్రతి ఇంట్లో ఓ పారిశ్రామికవేత్త... ఇదే కూటమి ప్రభుత్వం నినాదమంటూ ముఖ్యమంత్రి, మంత్రులు పలుసార్లు ఉద్ఘాటించారు. ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. జిల్లాకు పరిశ్రమల రాకతోనే ఆర్థిక పురోగతి సాధ్యమవుతుందని ప్రభుత్వం విశ్వసిస్తోంది. ఇప్పటికే ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు ఔత్సాహికులను ప్రోత్సహిస్తోంది. అన్ని రకాల పరిశ్రమలు అనంత జిల్లాకు క్యూ కట్టేలా రాయితీలు, భూమి, నీరు కేటాయింపు.. వంటి వాటిని కల్పిస్తామంటూ పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తోంది.

వేలాది మందికి ఉపాధి

ఏడాదిన్నర కాలంలో అనంత జిల్లాకు ఏకంగా రూ.4,194 కోట్ల పెట్టుబడులు రావడం విశేషం. ప్రత్యక్ష, పరోక్షంగా సుమారు 3 వేల మందికి పైగా ఉపాధి దక్కనుంది. 2027-28నాటికి పూర్తి స్థాయి ఉత్పత్తి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఇటీవల విశాఖలో జరిగిన సదస్సులో అనంత జిల్లాకు పలు రకాల పెట్టుబడులు వచ్చాయి. ఇప్పటికే సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో కొన్నింటికి శంకుస్థాపన చేశారు.

ఏవి.. ఎక్కడంటే..

- రేమండ్ గ్రూపు రూ.1,200 కోట్ల పెట్టుబడులతో అనంత, శ్రీసత్యసాయి జిల్లాల్లో మూడు వేర్వేరు యూనిట్లను నెలకొల్పనుంది. రాప్తాడు సమీపంలో రూ.497 కోట్లతో అపెరెల్ పార్కు ఏర్పాటు చేయనుంది. శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి వద్ద గుడిపల్లిలో రూ.441 కోట్లతో ఆటో కాంపొనెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్లాంటు, టేకులోడు వద్ద రూ.262 కోట్లతో ఏరోస్పేస్ పరికరాల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ మూడింటిలో కలిపి 6,500 మందికి ఉద్యోగాలు రానున్నాయి.
- కళ్యాణదుర్గం నియోజకవర్గం తిమ్మసముద్రం వద్ద రూ.1,300 కోట్లతో ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు స్కై ఫ్యాక్టరీ ముందుకొచ్చింది. 2027 నాటికి ఉత్పత్తి ప్రారంభించనుంది. వెయ్యి ట్యాక్సీల తయారీ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. 180 మందికి పైగా ఉపాధి కల్పించనున్నారు.
- అదే పార్కులోనే గిన్‌ఫ్రా ప్రెసిషన్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ బై మాడ్యూలర్ ఛార్జ్ సిస్టమ్స్ తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించింది. 121 ఎకరాల్లో రూ.1,150 కోట్లు వెచ్చించనున్నారు.
- తాడిపత్రి మండలం బోగసముద్రం సమీపంలో సుగ్నా స్పాంజ్ పవర్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఇప్పటికే పరిశ్రమను నిర్వహిస్తోంది . తాజాగా.. రూ.1,247కోట్లతో రెండో యూనిట్‌ను విస్తరించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు పొందింది. ఈ పరిశ్రమలో 1,100 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఇక్కడ స్పాంజ్ ఐరన్, స్టీల్ బిల్లెట్స్, టీఎంటీ బార్స్ తయారు చేస్తారు.

గుంతకల్లు రైల్వే జంక్షన్‌లోని హోటల్

జనతా ఖానా... అందలేదప్పా!

● రాయితీ అల్పాహారం ఎక్కడ? ● రైల్వే స్టేషన్లలో ఇదీ పరిస్థితి

గుంతకల్లు, న్యూస్‌టుడే : రైళ్లలోని జనరల్ బోగీల్లో వెళ్లే ప్రయాణికులకు తక్కువ ధరకు అల్పాహారాన్ని అందించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం గతేడాది 'జనతా ఖానా' పథకాన్ని తీసుకొచ్చింది. ఆయా స్టేషన్లలో హోటళ్ల వారు పథకాన్ని అమలు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పథకం అమలు కావడంలేదు. ప్రయాణికులు ఎక్కువ డబ్బులు వెచ్చించి అల్పాహారాన్ని కొనాల్సి వస్తోంది.

- రైల్వే డివిజన్‌లోని ముఖ్యమైన రైల్వే స్టేషన్లుగా గుంతకల్లు, తిరుపతి, రేణిగుంట, రాయచూరు, యాదగిరి, ధర్మవరం, పాకాల, కడప, మంత్రాలయం ప్రాంతాలు ఉన్నాయి. ఆయా స్టేషన్లలోని హోటళ్ల నిర్వాహకులు రూ.15కే ఏడు పూరీలు(175 గ్రాములు), ఆలూ బజ్జీ (150 గ్రాములు), ఊరగాయ(15 గ్రాములు), ఒక మిరపకాయను అందించాల్సి ఉంది. దీన్ని ఎవరూ అమలు చేయడం లేదు. వీటిని ప్రస్తుతం రూ.30, రూ.35 ధరలకు అమ్ముతున్నారు. ఫలితంగా సామాన్య, మధ్యతరగతి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

చిన్న అక్షరాలతో బోర్డులు

జనతా ఖానా పథకానికి సంబంధించి జనరల్ బోగీల్లో ప్రయాణించే వారికి అల్పాహారం అందించడానికి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు చెందిన జనరల్ బోగీలు ఎక్కడ ఆగుతాయో అక్కడ కౌంటర్లను ఏర్పాటు చేయాలని రైల్వే బోర్డు ఆదేశాలున్నాయి. ప్రయాణికులకు తెలిసే విధంగా కౌంటర్ల వద్ద బోర్డులను ప్రదర్శించాలి. ఎవరూ దీన్ని పట్టించుకోవడంలేదు. క్యాటరింగ్ విభాగాల వద్ద అన్ని వస్తువుల జాబితాలో జనతాఖానా గురించి చిన్న అక్షరాల్లో రాసి బోర్డులు పెట్టారు. ఎక్కడా రాయితీపై మెనూలో కనబరచిన ధరలతో అల్పాహారాన్ని ఇవ్వడం లేదు.

తనిఖీల సమయంలోనే..

రైల్వే స్టేషన్లలో అధికారులు తనిఖీలకు వస్తున్నారని సమాచారం ఉన్నప్పుడు మాత్రమే రాయితీతో ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై గుంతకల్లు రైల్వే స్టేషన్ క్యాటరింగ్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణను వివరణ కోరగా 'జనతా ఖానా' పథకాన్ని పటిష్ఠంగా అమలయ్యే విధంగా చూస్తామన్నారు. క్యాటరింగ్‌కు చెందిన హోటళ్ల యజమానులు పథకాన్ని అమలు చేయకుంటే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డెక్కితే వణుకే..!

నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే గుంతకల్లు-బళ్లారి రోడ్డు దారుణంగా మారింది. పైగా అది జాతీయ రహదారి కావడం గమనార్హం. కల్వరి టెంపుల్ సమీపాన గుంతలు పడి ప్రయాణానికి నరకప్రాయంగా మారింది. ప్రధానంగా రాత్రి వేళల్లో ద్విచక్రవాహన దారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులను గుంతలను పూడ్చాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నా ఎలాంటి ఫలితం లేదు.

-న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

(c) eenadu

22న జిల్లావ్యాప్తంగా గ్రామసభలు

లక్ష్మీనగర్ (అనంతపురం): గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి ప్రజలకు అవసరమయ్యే సేవలను గ్రామస్థాయిలోనే అందించేందుకు జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామ పంచాయతీలలో ఈనెల 22న గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పీడీ సలీమ్ బాషా తెలిపారు. గ్రామ సభల్లో కొత్తజాబ్ కార్డుకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ఉపాధి శ్రామికుల ఈకేవైసీలో భాగంగా తొలగించిన లేదా రద్దు చేసినట్లు ప్రకటించిన జాబితాపై ఉన్న అభ్యంతరాలను తీసుకోవడంతోపాటు వాటిని పరిశీలించి అర్హులైతే వారి పేర్లను పునరుద్ధరిస్తామని వెల్లడించారు. ఉపాధి శ్రామికులకు పని లేదని దరఖాస్తులను అందజేయవచ్చు అని తెలిపారు. సభల్లో ఏపీడీ/పీవోలు పాల్గొని సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటారన్నారు. సభల్లో గ్రామపెద్దలు, ప్రజలు, ఉపాధి శ్రామికులు పాల్గొని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని పీడీ కోరారు.

పట్టు అమ్మిన వెంటనే పైసలు

- ఆన్‌లైన్‌లో రైతులు, బ్యాంకు ఖాతాల వివరాలు
- జనవరి నుంచి ఏ రోజుకారోజు ఖాతాల్లో నగదు జమ

హిందూపురంలోని పట్టుగూళ్ల మార్కెట్

హిందూపురం, న్యూస్‌టుడే: పట్టురైతులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఈ-మార్కెటింగ్ సేవలు త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా పట్టుగూళ్ల మార్కెట్లలో అందుబాటులోకి రానున్నాయి. దీంతో రైతులు మార్కెట్లలో గూళ్ల విక్రయం జరిగిన కొన్ని గంటల వ్యవధి లోనే నగదు వారి ఖాతాల్లోకి జమ అయ్యే అవకాశం అందుబాటులోకి రానుంది. ఇప్పటి వరకు రైతులు పట్టుగూళ్ల మార్కెట్‌లో గూళ్ల విక్రయం జరిగినా కొనుగోలు చేసిన రీలరు నగదు అందించే వరకు రైతులు ఎదుచూడాల్సి వస్తోంది. కొంతమంది వేలంలో రైతుల వద్ద నుంచి పట్టుగూళ్లు కొనుగోలు చేసినా డబ్బు చెల్లింపులో జాప్యం చేయడం, ఫోన్ పే చేస్తామని చెప్పటంతో రైతులు ఇంటికి వెళ్లిన తర్వాత చూస్తే సకాలంలో ఆ మొత్తం చేరకపోవడం జరుగుతోంది. ఈ-మార్కెటింగ్ సేవలు అందుబాటులోకి వస్తే గూళ్ల విక్రయం జరిగిన తర్వాత రైతులు ఇక్కడ వెళ్లేనా వారి ఖాతాలోకి కొన్ని గంటల్లోనే నగదు జమ అవుతోంది. ఈ విధానం కర్ణాటకలో ఇప్పటికే ఆ రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురావడంతో రైతులు వెంటనే డబ్బు ఖాతాలో జమ అవుతుండటంతో చాలామంది అటువైపు వెళుతున్నారు.

జిల్లాలో పట్టుగూళ్లమార్కెట్లు	హిందూపురం, కదిరి, ధర్మవరం
పట్టు రైతులు	4వేలు

వేలంలో పాల్గొనే రీలర్లు ముందే జమ చేయాలి

పట్టుగూళ్ల వేలంలో పాల్గొనే రీలర్లు ఇకపై ముందే కొంత మొత్తం మార్కెట్ అధికారి ఖాతాలోకి డిపాజిట్ చేయాలి. అలాంటి వారికే వేలంలో పాల్గొనే విధంగా మార్కెట్ అధికారులు చర్యలు తీసుకొంటారు. డిపాజిట్ మొత్తం చెల్లించని రీలర్లు ఇకపై వేలంలో పాల్గొనే అవకాశం ఉండదు.

జనవరికి ఈ-మార్కెటింగ్ సౌకర్యం

వచ్చే జనవరి మాసానికి ఈ-మార్కెటింగ్ సేవలు పట్టు రైతులకు అందుబాటులోకి ప్రభుత్వం తీసుకొచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే రైతుల వివరాలు, వారి బ్యాంకు ఖాతాలు అంతర్జాలంలో నిక్షిప్తం చేస్తున్నారు. ఈ విధానం అందుబాటులోకి వస్తే రైతులకు జాప్యం లేకుండా నగదు చేతికి చేరుతోంది.

-హంపయ్య, పట్టుగూళ్ల మార్కెట్ ఇన్‌స్పెక్టర్, హిందూపురం

నిబంధనలు మార్పు... రుణాల పెంపు

జిల్లా సమాఖ్య సాధారణ సమావేశంలో ఆమోదం

కొత్తచెరువు, న్యూస్‌టుడే: డ్వాక్రా సంఘాల్లో నిర్వహిస్తున్న ఆర్థిక లావాదేవీలు గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయి. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా రుణాలు అందిస్తుండటంతో మహిళలు అధిక వడ్డీ ఊబిలో నుంచి బయటపడ్డారు. అయితే డ్వాక్రా సంఘాల్లో వెలుగు సిబ్బంది నిర్లక్ష్యం, స్వార్థం కారణంగా కొందరు సభ్యుల మొండి బకాయిలు పేరుకుపోయి ఇతర సభ్యులకు శాపంగా మారింది. దీంతో నాన్ పర్ఫామింగ్ అసెట్ (ఎన్‌పీఏ) కింద నమోదైన మండలాలకు స్త్రీనిధి రుణాల మంజూరు రెండు, మూడేళ్లుగా నిలిచిపోవడంతో మహిళలు ఆర్థికంగా సతమతమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో సగం మండలాలు తరచూ ఎన్‌పీఏ కింద నమోదవుతున్నాయి. నిబంధనలు సడలిస్తూ తీసుకొచ్చిన మార్పులతో జిల్లాలో ఎన్‌పీఏ మండలాల సంఖ్య రెండింటికి పరిమితం కానుంది.

కొందరి తప్పిదం... అందరికీ శాపం

మహిళా సంఘాల్లో స్త్రీనిధి రుణాల చెల్లింపులో కొందరి అలసత్వం అందరికి శాపంలా మారింది. గ్రామైక్య సంఘం నుంచి రూ.3 లక్షలు, మండల సమాఖ్యల్లో రూ.20 లక్షల బకాయిలు పేరుకుపోతే ఎన్‌పీఏగా గుర్తించిన మండలానికి స్త్రీనిధి రుణాలను నిలిపేశారు. దీంతో బకాయిదారులతోపాటు సకాలంలో రుణాలు చెల్లించిన వారికి మళ్లీ రుణాలు అందే పరిస్థితి లేదు. ఏళ్ల తరబడి ఎదురు చూసే పరిస్థితి ఏర్పడింది. విధిలేని పరిస్థితుల్లో కొందరు బయట అప్పులు చేసి అధిక వడ్డీలు చెల్లించలేక ఇబ్బందులు పడిన ఘటనలు కోకొల్లలు.



పెంపు ఇలా..

- జిల్లా సమాఖ్యలో ఇరవై రోజుల కిందట జరిగిన సాధారణ సమావేశంలో స్త్రీనిధి మంజూరు విధానంలో తీసుకువచ్చిన అనేక మార్పులు డ్వాక్రా సంఘాలకు ఎంతో ఉపకరిస్తున్నాయి.
- మండల సమాఖ్య ఎన్‌పీఏ పరిమితిని రూ.20 లక్షల నుంచి రూ.35 లక్షలకు పెంచారు. దీంతో జిల్లాలో బుక్కపట్నం, నల్లచెరువు మండలాలు మాత్రమే ఎన్‌పీఏ కింద మిగిలనున్నాయి.
- ఎస్‌హెచ్‌జీ రుణ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షలకు పెంచారు.
- గ్రామ సంఘం రుణ పరిమితిని రూ.కోటి వరకూ పెంచారు.

ఎన్‌పీఏ పరిమితి పెంచారు

ఇటీవల జరిగిన జిల్లా సమాఖ్య సమావేశంలో ఎన్‌పీఏ రుణాల పరిమితి నిబంధనల్లో మార్పు చేశాం. జిల్లాలో ఇక రెండు మండలాలు తప్ప మిగిలిన మండలాల్లోని అన్ని సంఘాలకు స్త్రీనిధి రుణాలు మంజూరుకానున్నాయి. సంఘాల ఆర్థిక లావాదేవీల నిర్వహణ, రుణాలు నేరుగా సభ్యులే చెల్లించేలా ప్రత్యేక యాప్ తీసుకొస్తున్నారు. దీంతో చెల్లింపులు పారదర్శకంగా మరింత సులభతరం కానున్నాయి.

- నరసయ్య, డీఆర్‌డీఏ పీడీ, పుట్టపర్తి

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 7382114647

JOBS

కావలెను: మా సంస్థ యందు పని చేయుటకు 150 మంది (10th to డిగ్రీ) యువకులు అర్జెంటుగా కావలెను. జీతం రూ.18 వేలుసంప్రదించండి. 8500242049.

తెలుగు మ్యారేజ్ బ్యూరో అనంతపూర్ బ్రాంచి నందు పనిచేయుటకు డిగ్రీ చదివి కంప్యూటర్ పరిజ్ఞానం గల మహిళ అభ్యర్థులు కావలెను. సంప్ర: Cell: 9885141567, 9885141199.

హాస్టల్ ఫుడ్ మేనేజర్ కావలెను. అనంతపురంలోని ఒక ప్రముఖ కళాశాలలో హాస్టల్స్ కోసం ఫుడ్ క్వాలిటి వంటశాల హైజిన్ రోజువారి భోజన తయారి మరియు సరఫరా పర్యవేక్షణకోసం అనుభవం ఉన్న హాస్టల్ ఫుడ్ మేనేజర్ కావాలి. హోటల్ మేనేజ్‌మెంట్ చేసినవారు లేదా ఫుడ్‌సూపర్ వైజింగ్‌లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం. వసతి కల్పించబడును. సంప్ర: 9133399861.

ఫామ్‌మేనేజర్ కావలెను. అనంతపురం రుద్రంపేట సమీపంలో ఉన్న మా గొర్రెల ఫామ్ కోసం గొర్రెల సంరక్షణ వాటి ఆహార నిర్వహణ డీ-వార్మింగ్/ వ్యాక్సినేషన్ మొదలైన వాటిపై మంచి అనుభవం కలిగి ఉన్నవారు కావలెను.వసతి కల్పించబడును. ఆసక్తిగలవారు సంప్ర: 9133399861

హైదరాబాద్‌లో పనికి వంటమాస్టర్ ఫ్యామిలీ (భార్యభర్త) జీ: 35 వేలు. కిచెన్ హెల్పర్స్ ఫ్యామిలీ (భార్యభర్త) జీ: 26 వేలు. కావలెను. రూం, మీల్స్ ఫ్రీ. ✆ 9493931224, 7386951320.

అటెండెంట్ కావలెను (పురుష) 63 సం. వయస్సు గల ఒంటరి పురుషుడికి సహకారం అందించేందుకు కావలెను. నెలవారీ జీతం. రామ్‌నగర్. 9393724047.

MARKETING/ SALES

ప్రముఖ ఆయిల్ మరియు మసాలాల కంపెనీకి Sales Executive కావలెను. సంప్రదించండి: ✆ 9032963185.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS 5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు: 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

ఆధ్యాత్మిక సమాచారం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నేడు(శుక్రవారం) ఉదయం 7.30 గంటలకు అమృతవల్లి అమ్మవారికి అభిషేక పూజలు నిర్వహిస్తారు. పది గంటలకు శ్రీవారికి కల్యాణోత్సవం ఉంటుంది. ఉదయం 6 గంటలకు స్వామివారి సాధారణ దర్శనం. ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల మధ్య అభిషేక, స్వర్ణకవచ సేవలు. తర్వాత తొమ్మిది నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు భక్తులకు స్వామివారి సర్వ దర్శనం ఉంటుంది.

బుగ్గరామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలోని పెన్నానది ఒడ్డున ఉన్న బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం కార్తికమాస పూజలు ముగిశాయి. బుగ్గరామలింగేశ్వరస్వామికి భస్మాలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని కాశీ విశ్వేశ్వర లింగానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఆయా పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

పర్యాటక వలయం ఏర్పాటుకు కృషి: మంత్రి

లేపాక్షి, న్యూస్‌టుడే: చిత్ర, శిల్పకళలకు కాణాచిగా ఉన్న లేపాక్షితో పాటు కదిరి, పుట్టపర్తి వంటి ఆలయాలను కలుపుతూ పర్యాటక వలయం ఏర్పాటు చేసి అక్కడ పర్యాటకులకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం మంత్రి స్థానిక దుర్గా, పాపనాశేశ్వర, వీరభద్రస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయలంలోని పురాతన కట్టడాలు, చారిత్రక నిర్మాణాలు, ఆలయ చరిత్రను పర్యాటక శాఖ గైడ్ విరుపన్న వివరించారు. వీరభద్రస్వామి, దుర్గాదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేసి తద్వారా ఆదాయం పెంచుకునేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు శ్రమిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే లేపాక్షి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు మంత్రి వివరించారు. తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఉమేష్, నాయకులు లోకేష్, మండల కన్వీనర్లు బాలాజీగౌడ్, చిన్న ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ చరిత్రను తెలుసుకుంటున్న మంత్రి కందుల దుర్గేష్

బాల్యవివాహాలను అరికట్టాలి

అనంతపురం (మూడోరోడ్డు), న్యూస్‌టుడే: బాలల హక్కుల పరిరక్షణతోనే పటిష్ఠమైన భావి భారత నిర్మాణం సాధ్యమని డీఎల్ఎస్ఏ కార్యదర్శి, న్యాయమూర్తి రాజశేఖర్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యాలయంలో గురువారం బాలల హక్కులపై సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ.. భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలన్నారు. ప్రభుత్వ వివిధ శాఖలు ఇందుకోసం గట్టిగా కృషి చేయాలన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. జిల్లాలో ఇంకా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయన్నారు. వాటిని నియంత్రించడానికి ఐసీడీఎస్ అధికారులు కృషి చేయాలన్నారు. బాలలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలన్నారు. బాలలు మాదక ద్రవ్యాల బారిన పడకుండా కాపాడాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) మాలోల మాట్లాడుతూ.. బాలల హక్కుల ఉల్లంఘన జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించామన్నారు. బాలల హక్కుల అమలులో ఉద్యోగులు అలసత్వంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఖుష్బూ కొఠారి, శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ కె.శ్రీనివాసరావు, న్యాయవాది నల్లప్ప పాల్గొన్నారు.

మాట్లాడుతున్న న్యాయమూర్తి రాజశేఖర్

యువత చేతుల్లోనే దేశ భవిత

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ స్మిత

కదిరి, న్యూస్‌టుడే: యువత చేతుల్లో దేశానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రిన్సిపల్ స్మిత తెలిపారు. కదిరి ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యువజన సర్వీసులశాఖ, ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో యువజనోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానందుడి చిత్రపటానికి పూలమాలతో నివాళి అర్పించారు. జానపద నృత్యం, గేయాలు, కథలు, పద్యాలు రాయటం, వక్తృత్వ, చిత్రలేఖనం, సైన్స్‌మేళా వంటి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ విజయకుమార్, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు జీవన్‌కుమార్, కె.జయమారుతి మాట్లాడారు. యువత తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి దేశాభివృద్ధికి కృషి చేయాలన్నారు. జానపద నృత్యంలో ఆర్డీటీ మోనికా బృందం ప్రథమ, గీతాలాపనలో జ్యోషిణి బృందం ప్రథమ, జానపద నృత్య, గేయాలాపనలో ఎస్టీఎస్ఎన్ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానం పొందారు. వక్తృత్వంలో ఎ.మహిదా, చిత్రలేఖనంలో ఎస్.ముస్కాన్, కవితల పోటీలో బి.ఉస్మాన్‌ఘని, కథలలో రెడ్డిశ్రీజ ప్రథమ బహుమతులు సొంతం చేసుకున్నారు. న్యాయ నిర్ణేతలుగా విష్ణుప్రియ, అనిల్‌నాయుడు, సుధాకర్, హైదర్‌అలీ వ్యవహరించారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను ప్రిన్సిపల్, ముఖ్య అతిథులు అందజేశారు. గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకులు సుంకర రమేష్, అంబరీష్, బాలాజీ, మహేంద్ర, శిరీష, అస్నెట్ మేనేజరు శ్రీనివాసులు, అన్వర్‌బాషా పాల్గొన్నారు.

జానపద నృత్యంలో ప్రథమ స్థానం పొందిన ఆర్డీటీ మోనిక బృందం

కార్మిక మండలి పునరుద్ధరణకు డిమాండ్

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుల ప్రయోజనం కోసం ఏర్పడిన కార్మిక సంక్షేమ మండలిని సత్వరమే పునరుద్ధరించాలని సీఐటీయూ అనుబంధ ఏపీ భవన నిర్మాణ కార్మికుల సంఘం డిమాండ్ చేసింది. గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ ప్రధాన గేటుముందు నిరసన చేపట్టారు. ఆ సంఘం కార్యదర్శి రామాంజినేయులు, అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు గత ప్రభుత్వం తీరని అన్యాయం చేసింది. మెమో 12, 14లను తీసుకొచ్చి తీరని ద్రోహం చేసిందని ఆరోపించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సత్వరమే ఆ మెమోలను రద్దు చేసి, పెండింగ్‌లో ఉన్న డెత్ క్లెయిమ్‌లను పరిగణనలోకి తీసుకుని నిధులు చెల్లించాలన్నారు. సంక్షేమ మండలి పునరుద్ధరణ ద్వారా అనేక ప్రయోజనాలను కల్పించాలన్నారు. సెస్ నిధులను కార్మికులకే కేటాయించాలి. 50 ఏళ్లు దాటిన కార్మికులకు రూ.10 వేల ప్రకారం పెన్షన్ చెల్లించాలన్నారు. ఆ తర్వాత డిమాండ్లతో కూడిన వినతిని కలెక్టర్‌కు అందజేశారు. ఈ నిరసనలో నాయకులు పరమేశ్వర, నాగరాజు, సూర్యనారాయణ, ప్రవీణ్‌కుమార్, బాబు, సాయికిరణ్, సురేశ్, వెంకటనారాయణ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

రోజూ గంటసేపు అందుబాటులో విద్యాశాఖాధికారులు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: విద్యావిభాగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం డీఈవో, ఎంఈవోలు ప్రతిరోజూ ఒక గంటసేపు కార్యాలయంలో అందుబాటులో ఉండాలని విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకూ మండల విద్యాశాఖాధికారులు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకూ జిల్లా విద్యాశాఖాధికారి అందుబాటులో ఉండాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

26న గోల్‌షాట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాస్థాయి గోల్‌షాట్‌బాల్ సబ్ జూనియర్ బాల, బాలికల జట్ల ఎంపిక కదిరి మండల పరిధిలోని హరీష్ పాఠశాలలో ఈ నెల 26వ తేదీ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు జనవరి 1, 2009వ సంవత్సరం తరువాత జన్మించిన వారై ఉండాలని, ఆధార్ కార్డుతో ఎంపికకు హాజరవ్వాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఉమ్మడి జిల్లా అసోసియేషన్ కార్యదర్శి 97041 40510 నంబరులో సంప్రదించాలని కోరారు.

'బార్ కౌన్సిల్ ఎన్నికల్లో సమర్థుడికే ఓటేయండి'

అనంతపురం (మూడోరోడ్డు), న్యూస్‌టుడే: రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల్లో సమర్థుడికే ఓటు వేయాలని హైకోర్టు న్యాయవాది బాలాజీ యలమంజుల అన్నారు. ఆయన గురువారం సీనియర్ న్యాయవాదులతో కలిసి అనంతపురం కోర్టు ఆవరణలో న్యాయవాదులకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతపురం నగరానికి చెందిన తాను ఇక్కడే న్యాయశాస్త్రంలో పట్టభద్రుడిని అయ్యానన్నారు. తర్వాత హైకోర్టులో న్యాయవాద వృత్తిని చేపట్టానన్నారు. రైతుల పక్షాన నిలిచి వారికి దోహదపడేలా చట్టాన్ని తీసుకొచ్చానని గుర్తు చేశారు. తాను రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు ఎన్నికైన తర్వాత కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. న్యాయవాదుల బీమా, ఇతర సంక్షేమ పథకాలను అమలు చేయడానికి పాటు పడతానన్నారు. మహిళా న్యాయవాదులకు కోర్టు ఆవరణంలో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానన్నారు. హైకోర్టు న్యాయవాది రాజేంద్రప్రసాద్, సీనియర్ న్యాయవాదులు తిరుపతినాయుడు, లేపాక్షి నాయుడు, బుడేన్ సాబ్, కేఎల్వీ ప్రసాద్, బాలకృష్ణ, ధర్మ సింగ్‌నాయక్, సుదర్శన్, జెన్నె ఆనంద్ పాల్గొన్నారు.

డిసెంబరు 10న సీపీఐ వందేళ్ల వేడుక

ఆజాద్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: సీపీఐ పార్టీ వందేళ్ల వేడుకలు అనంతపురం నగరంలో డిసెంబరు 10న నిర్వహిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీశ్ తెలిపారు. నగరంలోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవనంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి జగదీశ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డిసెంబరు 26వ తేదీ నాటికి కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా డిసెంబరు 10న నగరంలోని లలిత కళా పరిషత్‌లో పార్టీ నాయకుల ఆత్మీయ కలయిక నిర్వహిస్తామన్నారు. ముఖ్య అతిథులుగా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య హాజరవుతారని ఆయన వెల్లడించారు. పార్టీ శ్రేణులు జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాఫర్, జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, సహాయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాం

పెద్దరెడ్డిపల్లి, (పరిగి,): కొడిగెనహళ్లి పంచాయతీలోని బిందూనగర్‌లో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి తాగునీటి కేంద్రాన్ని గురువారం మంత్రి సవిత ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గవ్యాప్తంగా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ఎన్టీఆర్ సుజల స్రవంతి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా కన్వీనర్ ఎస్.ఎన్.గోవిందరెడ్డి, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సోమప్ప, బాలాజీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

'క్యూఎస్'లో వీఐటీకి 7వ ర్యాంకు

చెన్నై(వడపళని), న్యూస్‌టుడే: 'క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్'లో 2026 సంవత్సరానికి వేలూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(వీఐటీ)కి దేశవ్యాప్తంగా 7వ ర్యాంకు, అంతర్జాతీయంగా 352వ ర్యాంకు లభించింది. పర్యావరణ ప్రభావ విభాగంలో ప్రపంచవ్యాప్తంగా 194వ స్థానంలో నిలిచి ప్రత్యేకత చాటుకుందని వర్సిటీ గురువారం ప్రకటన విడుదల చేసింది. సస్టైనబిలిటీని పరిగణనలోకి తీసుకుని ర్యాంకులను విడుదల చేసిందని వీఐటీ కులపతి డాక్టర్ జి.విశ్వనాథన్ పేర్కొన్నారు. సోషల్ ఇంపాక్ట్, గవర్నెన్స్, పర్యావరణ ప్రభావంలో వర్సిటీ అత్యంత ప్రతిభను కనబరుస్తోందని ఆయన అన్నారు. 2025లో అంతర్జాతీయ స్థాయిలో 396వ స్థానంలో ఉండగా 2026లో 352వ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు.

మెదడు రక్తనాళాలకు అరుదైన శస్త్రచికిత్స

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: కణేకల్లుకు చెందిన రైతు పక్కీరప్ప (47) మెదడులోని రక్తనాళాలకు అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడినట్లు కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ అనిల్, డాక్టర్ మురళీమోహన్‌కృష్ణ తెలిపారు. గురువారం వారు కిమ్స్ సవీరా ఆసుపత్రిలో శస్త్రచికిత్సకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పక్కీరప్పకు తీవ్ర తలనొప్పి రావటం, మతిమరుపు వంటి లక్షణాలతో ఆసుపత్రికి వచ్చారని వెల్లడించారు. ఆయనను పరిశీలించి సిటి యాంజియోగ్రామ్ పరీక్ష చేయగా ఆర్టెరియో వీనస్‌మాల్ ఫార్మేషన్ (ఏవీఎం) అనే సమస్య ఉందని గుర్తించామని తెలిపారు. సాధారణంగా రక్తనాళాల నుంచి మెదడులోకి రక్తప్రసారం జరిగే క్రమంలో మెదడులోని కీలక ప్రాంతాల వద్ద నరాలు ఉబ్బటంతో ఆయనకు మతిమరుపులాంటి సమస్యలు వచ్చాయని వివరించారు. ఉబ్బిన నరాలు సరిగ్గా మెదడులో మాట, కదలికలను నియంత్రించే ప్రాంతంలో ఉండటంతో వాటిని ఆరు గంటలపాటు శస్త్రచికిత్స చేసి తొలగించామన్నారు. శస్త్రచికిత్స విజయవంతం తరువాత మెదడులోకి రక్తప్రసరణ సాధారణంగా జరుగుతుండటంతో రోగి కోలుకున్నారని ఎలాంటి ఇబ్బంది లేకపోవటంతో డిశ్చార్జి చేసినట్లు వివరించారు.

కోలుకున్న రైతు పక్కీరప్పతో వైద్యులు అనిల్, మురళీ మోహన్‌కృష్ణ

యువకుడి మోసపూరిత ఆర్థిక లావాదేవీలు?

ఉరవకొండకు వచ్చిన తెలంగాణ పోలీసులు

ఉరవకొండ, న్యూస్‌టుడే: తెలంగాణలోని నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్‌కేపల్లి పోలీస్‌స్టేషన్ చెందిన ఇద్దరు పోలీసు అధికారులు గురువారం ఉరవకొండకు చెందిన ఓ సామాజిక వర్గం యువకుడి కోసం వెదుక్కుంటూ వచ్చారు. ఆ పోలీస్‌స్టేషన్ పరిధిలో యువకుడు 1.5 కోట్ల మోసపూరిత ఆర్థిక లావాదేవీల్లో భాగస్వామిగా ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. అతడి చరవాణి ఆధారంగా అదుపులోకి తీసుకొని ఉరవకొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈలోపు ఆ సామాజిక వర్గానికి చెందిన వారు పెద్ద సంఖ్యలో పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఆ లావాదేవీల్లో యువకుడి ప్రమేయం లేదని, వదిలేయాలంటూ తెలంగాణ పోలీసులతో వాదించారు. ఒకవేళ మీకు ఆధారాలు దొరికితే, తామే అతడిని ఎస్‌కే పల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి అప్పగిస్తామనడంతో ఆ పోలీసు అధికారులు అంగీకరించినట్లుగా తెలిసింది.

జాతీయస్థాయి పోటీలకు ఉపాధ్యాయుడి ఎంపిక

అమరాపురం, న్యూస్‌టుడే: అమరాపురం ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు నాగేంద్రప్ప జాతీయ స్థాయి సింగిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. అఖిల భారత సివిల్ సర్వీస్ ఉద్యోగులకు జరిగిన క్రీడా పోటీల్లో ఈనెల 12న సత్యసాయి జిల్లా పెనుకొండలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈనెల 19న విజయవాడ రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరిగిన 55 ప్లస్ కేటగిరి సింగిల్స్ బ్యాడ్మింటన్‌లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఉపాధ్యాయుడు నాగేంద్రప్పను పాఠశాల ఉపాధ్యాయులు, సంఘం నాయకులు అభినందించారు.



నాగేంద్రప్ప

శతాధిక వృద్ధురాలి మృతి

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: రాయదుర్గం నియోజకవర్గ కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే ఎన్.సి.శేషాద్రి స్వామి సతీమణి, శతాధిక వృద్ధురాలు ఎన్.సి.లీలావతమ్మ (103) గురువారం మరణించారు. ఆమె స్వగ్రామం మండలంలోని రాయంపల్లి గ్రామం. ముగ్గురు కుమారులు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. భర్త, మాజీ ఎమ్మెల్యే శేషాద్రి స్వామి 30 ఏళ్ల క్రితమే మృతి చెందారు. కొంతకాలంగా వయోభార సమస్యలతో బాధపడుతున్న లీలావతమ్మ హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడి చెంతకు చేరింది. అక్కడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయినట్లు బంధువులు తెలిపారు.

లీలావతమ్మ

బ్యాటరీల దొంగలు చిక్కారు

యాడికి, న్యూస్‌టుడే : ఓ వాహనంలో బ్యాటరీలను చోరీ చేసి ఎత్తుకెళ్తున్న ఇద్దరు దొంగలను దైవాలమడుగు గ్రామస్థులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని దైవాలమడుగు, చందన గ్రామ పరిసరాల్లోని తోటల్లో విద్యుత్తు తీగలను గుర్తు తెలియని దొంగలు తరచూ ఎత్తుకెళ్తున్నారు. పోలీసులు, గ్రామస్థులు కలిసి రాత్రిళ్లు పహారా కాస్తూ వచ్చారు. బుధవారం అర్ధరాత్రి పెద్దవడుగూరు మండల కేంద్రానికి చెందిన రఘురాముడు, నాగరాజు ఇద్దరు కలిసి దైవామడుగు సమీపంలోని ఓ గనిలో నిలిపిన హిటాచీ వాహనంలోని రెండు బ్యాటరీలను ఎత్తుకెళ్తూ గ్రామస్థులకు చిక్కగా, వారిని బంధించి గుడిలో ఉంచారు. పెద్దఎత్తున రైతులు కలిసి గురువారం దొంగలను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ విషయంపై పోలీసులు విచారణ చేపట్టారు.

రూ.3.05 లక్షల విలువైన రసాయన ఎరువులు, మందుల సీజ్

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లా వ్యవసాయశాఖ డివిజన్ తనిఖీ బృందాలను నియమించింది. అనంతపురం వ్యవసాయ సబ్ డివిజన్‌కు గుత్తి డివిజన్ ఏడీఏ వెంకట్రాముడును నియమించారు. అందులో భాగంగా అనంతపురం గ్రామీణం ఏవో వెంకట్‌కుమార్‌తో కలిసి అనంతపురం నగర పరిధిలోని ఎరువులు, పురుగు మందులు దుకాణాలను ఏడీఏ తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, లైసెన్సులు, రికార్డులు కంపెనీ '0' ఫారం, తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. నగరంలో ఐదు దుకాణాలు తనిఖీలు చేయగా రెండింటిలో లైసెన్సులో '0' ఫారం లేకపోవడంతో రూ.3.05 లక్షల విలువైన రసాయన ఎరువులు, నీళ్ల మందును సీజ్ చేశారు. రుద్రంపేట కూడలిలో న్యూశ్రీనివాస ఫర్టిలైజర్ దుకాణంలో రాయల్ ఆగ్రో లైఫ్ సైన్స్ కంపెనీకి చెందిన రూ.97,272 విలువైన హై-జింక్ 1.2 మెట్రిక్ టన్నులు రసాయన ఎరువులు, గుత్తిరోడ్డులోని ఉమా గోదాములో ఉన్న ఫార్మ్‌మాట్రిన్ కంపెనీకి చెందిన ఫోర్ఎస్ నీళ్ల మందు రూ.2.08 లక్షలు విలువైన 220 లీటర్లు సీజ్ చేశామని, అందుకు సంబంధించిన రికార్డులు చూపించే వరకు అనుమతి లేకుండా ఎరువులు, మందులు అమ్మకూడదని ఏడీఏ వెంకట్రాముడు తెలిపారు.

రుద్రంపేటలో ఎరువుల దుకాణంలో బిల్లులు పరిశీలిస్తున్న ఏడీఏ వెంకట్రాముడు, ఏవో వెంకట్‌కుమార్

రాయదుర్గం
•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

విజేతలతో ఉపాధ్యాయులు

ప్రతిభ చూపారు... బహుమతులు పట్టారు

కళ్యాణదుర్గం: విద్యార్థులు వక్తృత్వ పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారు. గురువారం చైతన్య విద్యానికేతన్ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు జరిగాయి. 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై జరిగిన వక్తృత్వ పోటీల్లో ఏడు నుంచి పదో తరగతి చదివే విద్యార్థులు పాల్గొని ఉపన్యసించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో జ్యోత్స్న, శ్రీశాంత్, హాసిని నిలిచారు. వీరికి ఉపాధ్యాయులు శరత్, దినేష్ తదితరులు బహుమతులు అందజేసి అభినందించారు.

నేటినుంచి లక్ష్మీనారాయణ స్వామి మహాయజ్ఞం

రాయదుర్గం గ్రామీణం: మండలంలోని మల్లాపురంసమీపంలో వెలసిన విప్రమలై లక్ష్మీనృసింహ క్షేత్రంలోని విశ్వమాత ఆశ్రమంలో ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ శుక్రవారం యాగశాలలో లక్ష్మీనారాయణ మహాయజ్ఞం నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ గౌరవాధ్యక్షుడు ఆడియన్ స్వామిదాసన్ రామమూర్తిస్వామి తెలిపారు. 64 రోజుల పాటు మహాయజ్ఞం కొనసాగుతుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి గురు రాఘవేంద్ర, కోశాధికారి సత్యనారాయణ, సభ్యులు కమలాక్షుడు పాల్గొన్నారు.

విప్రమలైలో సిద్ధమైన యాగశాల

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య: పట్టణంలోని సెయింట్ పాల్ పాఠశాలకు వెళ్లే దారి అధ్వానంగా మారింది. చిన్నపాటి వానకే చిత్తడిగా మారుతోంది. ప్రధాన డ్రైనేజీ నిండి మురుగు రోడ్డుపైకి వస్తోంది. విద్యార్థులు, తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారు. మరోవైపు దాసప్ప రోడ్డు నుంచి అజీజియా షాదీకానా వరకు గుంతలు పడటంతో పాదాచారులు, వాహనచోదకులకు తిప్పలు పడుతున్నారు. నేసేపేటలో సీసీ రోడ్డు నిర్మించాలి. - ఉమేష్, వ్యాపారి

సమాధానం: పురపాలిక పరిధిలో అధ్వానంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేయిస్తాం. సీసీ రోడ్డు నిర్మిస్తాం.
-దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్
-న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం

ఉన్నవాటిలోనే సర్దుకుందాంలే..!

- నిలిచిన తరగతి గదుల నిర్మాణం
- నిధుల కొరతతో పడకేసిన పనులు

రాయదుర్గం, బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: రాయదుర్గం నియోజకవర్గంలో సమగ్రశిక్షా పథకం కింద చేపట్టిన పలు పాఠశాలల అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు నిధుల కొరతతో రెండేళ్లుగా నిలిచిపోయాయి. సరిపడినన్ని గదులు లేక విద్యార్థులు నానాఅవస్థలు పడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో నాడు-నేడు మొదటి, రెండో దశలో ఈ పనులు చేపట్టిన విషయం తెలిసిందే. తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 'మనబడి-మన భవిష్యత్తు' పథకం కింద నిర్మాణ సామగ్రి మంజూరు చేస్తామని చెప్పినా, పనుల్లో ఎలాంటి పురోగతి లేకపోవడం బాధాకరం. ఈ నేపథ్యంలో పలు పాఠశాలల్లో ఉన్న గదుల్లోనే నాలుగైదే తరగతుల విద్యార్థులను సర్ది పాఠాలు చెప్పాల్సి వస్తోందని ఉపాధ్యాయులు వాపోతున్నారు.


రాయదుర్గం: రాధాకృష్ణ ఉన్నత పాఠశాలలో ఇది పరిస్థితి

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం

అదనపు తరగతి గదుల కొరత ఉన్నమాట వాస్తవమే. అసంపూర్తి గదుల పూర్తికి అవసరమైన నిధుల కోసం సమగ్రశిక్ష ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. కొన్ని పాఠశాలల మిగులు నిధులను అవసరమైన వాటికి బదిలీ చేస్తామని అంటున్నారు. ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి సమస్యను తెచ్చారు. త్వరలోనే అసంపూర్తి భవనాల నిర్మాణ పనులను మనబడి కింద చేపట్టే అవకాశం ఉంది.
- వెంకటరమేష్, ఈరన్న, మల్లికార్జున, ఎంఈఓలు

ఎక్కడెక్కడ ఆగాయంటే...

- రాయదుర్గం పట్టణం, గ్రామీణంలో మొత్తం 31 పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.9.24 కోట్లకుగాను రూ.3.15 కోట్లు మాత్రమే విడుదల చేశారు. అసంపూర్తి గదులు నిరుపయోగంగా మారాయి. రాయదుర్గం పట్టణంలోని రాధాకృష్ణ ఉన్నత పాఠశాలలో 320 మంది విద్యార్థులకు 5 గదులు, బాలగంగాధర్‌తిలక్ బడిలో 415 మందికి 7, మోడల్ స్కూల్‌లో 303 మందికి 5 గదులే ఉన్నాయి. వేపరాళ్లలో 270 మంది విద్యార్థులకు గదులు చాలక షెడ్లు వేసి పాఠాలు చెబుతున్నారు. కొన్ని పాఠశాలల్లో సమగ్రశిక్షా నిధులు మిగిలిపోవడం గమనార్హం.
- బొమ్మనహాళ్ మండలంలో రెండు విడతల్లో రూ.37.65 కోట్ల అంచనాతో పాఠశాల భవనాల నిర్మాణ పనులు మొదలవగా, ఇప్పటికి ఒక్కటీ పూర్తికాలేదు. చంద్రగిరి, లింగదహాళ్, నేమకల్లు, ఉద్దేహాళ్, దేవగిరి, కల్‌హోళ, దర్గా హొన్నూరు, గోవిందవాడ తదితర గ్రామాల్లో సరిపడినన్ని గదులు లేవు. పిల్లలు చెట్ల కింద, వరండాలు, అసంపూర్తి భవనాల్లోనే సర్దుకొని చదువుకుంటున్నారు.

బొమ్మనహాళ్: దేవగిరిలోని అసంపూర్తి పాఠశాల భవనం వద్ద కట్టేసిన పశువులు

సహకార సంఘం అభివృద్ధికి కృషి

బ్రహ్మసముద్రం: అందరూ సమన్వయంతో ఉంటూ సహకార సంఘాన్ని అభివృద్ధి చేసుకుందామని బ్రహ్మసముద్రం మండలం భైరవానితిప్ప ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు అంకె ఓబుళేసు అన్నారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా గురువారం సహకార సంఘం కార్యాలయంలో సహకార పతకాన్ని ఆవిష్కరించి, అనంతరం సహకార ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు ప్రభావతి, డైరెక్టర్లు దనుంజయ, మూర్తి, బ్యాంకు సీఈవో కలాధరి, సిబ్బంది ఈశ్వర్, నవీన్, రైతు సంఘం అధ్యక్షుడు బిలేగౌడ పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో గత వారం రోజులుగా జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ఆయా గ్రంథాలయాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. పలువురు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వ్యాఖ్యానించారు. పుస్తకాలను చదివి విద్యార్థులు జ్ఞానాన్ని సముపార్జించుకోవాలన్నారు. - న్యూస్‌టుడే, బృందం

కళ్యాణదుర్గంలో విద్యార్థికి బహుమతి అందజేస్తున్న వక్తలు

ఒరిగిన స్తంభం తొలగించారు

కణేకల్లు, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే దారిలో ప్రమాదకరంగా ఒరిగిన ఇనుప విద్యుత్తు స్తంభాన్ని ఆ శాఖ సిబ్బంది తొలగించారు. దీనిపై ఈనాడులో ఈ నెల 3న ప్రచురించిన చిత్ర కథనానికి విద్యుత్తు అధికారులు స్పందించారు. ఎస్ఈ శేషాద్రి శేఖర్ ఆదేశాలతో ఏఈ శంకర్ నాయక్ సిబ్బందిని పంపించారు. ప్రమాదం తొలగడంతో స్థానికులు, విద్యార్థులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తూ ఈనాడుకు కృతజ్ఞతలు తెలిపారు.

స్పందనకు వందనం

కుంగిన వంతెనకు మరమ్మతులు

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ-బొమ్మనహాళ్ మార్గంలో విడపనకల్ మండలం పాల్తూరు వద్ద పెద్ద వంకపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరడంతో బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. దీనివల్ల పలు కళాశాలల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఈ నెల 15న 'వంతెన శిథిలం...నిలిచిన రాకపోకలు' శీర్షికతో ఈనాడులో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్‌అండ్‌బీ ఏఈఈ నాగభూషణం వంతెన కుంగిపోయిన చోట గురువారం మట్టిని వేయించి రాకపోకలకు మార్గం సుగమం చేశారు.

30 గ్రామాల్లో రాకపోకలకు తీరిన కష్టాలు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, తెదేపా నాయకుడు తిమ్మరాజు కృషి వల్ల వేదవతి హగరిలో వరదలకు కొట్టుకుపోయిన రోడ్డుకు కొత్తగా కల్వర్టు నిర్మించారు. నూతన మట్టి రోడ్డు వేయడంతో ఆరేళ్ల సమస్య తీరినట్లయింది. ఆయా గ్రామస్థులు గురువారం సంగమేశ్వరాలయంలో స్వామికి పూజలు చేశారు. 2022లో కురిసిన భారీ వర్షాలకు కల్లుదేవనహళ్లి రోడ్డు నుంచి సంగమేశ్వరాలయం, శింగానహళ్లి గ్రామం మీదుగా కణేకల్లు, ఉప్పరహాళ్, ఉరవకొండ ప్రధాన రహదారి గుండా వెళ్లడానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో తెదేపా నాయకులు బొంబాయి ఈరన్న, నాగరాజు, గోపాల, చిన్న వంద్రప్ప, డి.హొన్నూరుస్వామి తదితరులు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లారు. కాలవ స్పందించి కల్వర్టు నిర్మాణానికి కృషి చేశారు. దీంతో సుమారు 30 గ్రామాల ప్రజల రాకపోకలకు మార్గం సుగమమైందని హర్షం వ్యక్తం చేశారు.

నూతనంగా నిర్మించిన కల్వర్టును పరిశీలిస్తున్న తెదేపా నాయకులు

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

బెళుగుప్ప, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభచూపి పాఠశాలకు మంచి పేరు తేవాలని డీవైఈవో మల్లారెడ్డి విద్యార్థులకు సూచించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న హరి సాద్విక్ 19న అనంతపురంలోని ఆర్డీటీ మైదానంలో జరిగిన జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. పులివెందులలో జరిగే రాష్ట్ర స్థాయిపోటీల్లో పాల్గొంటారని చెప్పారు. రాజశేఖర్ అనే విద్యార్థి ఖో ఖో గడ్డలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో 26న తలపడతారన్నారు. విద్యార్థులను ఎంఈవో హరికృష్ణ, ప్రధానోపాధ్యాయుడు వెంకటప్రసాద్, పీడీ గోవిందరెడ్డి అభినందించారు.

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బి.మంజునాథ్ అనే విద్యార్థి రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు రవిచక్రవర్తి, పీడీ భోగేశ్ తెలిపారు. గుంతకల్లు మండలం తిమ్మాపురం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సైక్లింగ్ సంఘం తోడ్పాటుతో 69వ జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలు జరిగాయన్నారు. ఇందులో సత్తాచూపి ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మంజునాథ్‌ను ఎంఈఓ మల్లికార్జున, స్థానిక సర్పంచి పరమేష్, ఎస్ఎంసీ ఛైర్మన్ హనుమంతప్ప, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

బొమ్మనహాళ్: మంజునాథ్‌ను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

బెళుగుప్ప: ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

ఏపీ ఫైబర్ నెట్ సేవల్లో అంతరాయం

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు ఏపీ ఫైబర్ నెట్ సేవల్లో అంతరాయం ఏర్పడింది. పలు ఇంటర్నెట్ కేంద్రాలు, గృహ వినియోగదారులకు ఇంటర్నెట్ సేవలు, టీవీల్లో కార్యక్రమాల ప్రసారం రాకపోవడంతో ఇబ్బందిపడ్డారు. నేసేపేట, చౌడమ్మ గుడి, కణేకల్లు రోడ్డు, లక్ష్మీబజారు తదితర ఇంటర్‌నెట్ కేంద్రాల్లో దరఖాస్తుల సాయంతో పనులు చక్కదిద్దుకోవాల్సి వచ్చింది.

'టిప్పుసుల్తాన్ కటౌట్ తొలగించాలి'

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని టీ కూడలిలో గురువారం అనధికారికంగా ఏర్పాటు చేసిన టిప్పు సుల్తాన్ కటౌట్‌ను తొలగించాలని హిందూ ధార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సై రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఎన్నడు లేనివిధంగా టిప్పు సుల్తాన్ జయంతిని జరపడం సమంజసం కాదన్నారు.

కార్మికులను బెదిరించడం తగదు

కళ్యాణదుర్గం గ్రామీణం: నీటి పథకం కార్మికులను బెదిరించడం తగదని సీఐటీయూ జిల్లా కోశాధికారి నాగమణి అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ శ్రీరామిరెడ్డి నీటి పథకం కార్మికులు తహసీల్దారు కార్యాలయం ఎదుట చేపట్టిన సామూహిక దీక్ష గురువారం నాలుగో రోజుకు చేరింది. వారికి మద్దతుగా నాగమణి శిబిరంలో కొద్దిసేపు కూర్చొని మాట్లాడారు. గుత్తేదారులు కార్మికుల కడుపులు కొడుతున్నారని ఆరోపించారు. 18 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికుల జీతాల్లో కోత విధించడం, కొందరిని విధుల నుంచి తొలగించడం ఏంటని మండిపడ్డారు. వారి సమస్యలు పరిష్కారమయ్యే వరకురిలే దీక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్మికులు రాము, అశోక్, అల్లాబకాష్, రమేశ్, సంగప్ప, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కట్టేశారు... పక్కన పెట్టేశారు

శెట్టూరులోని ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.1.28 కోట్ల నాబార్డ్ నిధులతో రెండేళ్ల క్రితం నిర్మించిన ఆరు అదనపు తరగతి గదుల భవనాన్ని పక్కన పెట్టేశారు. ప్రస్తుతం ఈ గదులు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. సంబంధిత అధికారులు చిన్నపాటి పనులు పూర్తిచేసి గదులను వినియోగంలోకి తేవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై 'హెచ్ఎం పిరోజ్‌ఖాన్ మాట్లాడుతూ గదులకు తలుపులు, వరండాలో బండలు సరిచేయాల్సి ఉందని, త్వరలోనే వినియోగంలోకి తెస్తామన్నారు. - న్యూస్‌టుడే, శెట్టూరు

ప్రమాదాలు జరుగుతున్నా పట్టదా?

రాయదుర్గం నుంచి అనంతపురం వైపు వెళ్లే రింగురోడ్డులో సుబేదారు చెరువుకు అనుకుని పలువురు భవనాల వ్యర్థాలు పడేస్తున్నారు. మరోవైపు చికెన్, మటన్ వ్యాపారులు వ్యర్థాలతో పాటు జంతువుల కళేబరాలను తెచ్చి వేస్తున్నారు. రింగురోడ్డు కావడంతో వాహనాలు వేగంగా తిరుగుతున్నాయి. పలువురు వాహనచోదకులు వేగం అదుపు తప్పి వ్యర్థాలపైకి వెళ్లి ప్రమాదాలపాలు అవుతున్నారు. పురపాలిక, పోలీసు అధికారులు స్పందించి వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం

తాగునీటి వృథా అరికట్టరూ..

పట్టణంలోని మారెమ్మ గుడికి వెళ్లే రోడ్డుపై తాగునీరు నిల్వతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు నెల రోజులుగా తాగునీరు వృథా అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అగ్నిమాపక కార్యాలయ సమీపంలోని ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు నీరు సరఫరా చేసే సమయంలో ఇలా జరుగుతోందని, సంబంధిత అధికారులు లీకేజీ అరికట్టి వృథాను ఆపాలని కోరుతున్నారు. దీనిపై ఫిట్టర్ జగన్నాథ్ మాట్లాడుతూ లీకేజీని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.
- న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం

దారి పక్కనే చెత్తదిబ్బలు

మండలంలోని కొనకొండ్ల గ్రామంలో 8వ వార్డు సమీపంలో వజ్రకరూరు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే చెత్తదిబ్బలు పేరుకుపోవడంతో అపరిశుభ్రంగా మారింది. మరోవైపు కుక్కలు, పందులు, కోతులు దిబ్బల్లో ఆహారం కోసం వెళ్లి కొట్టుకుంటూ.. రోడ్డుపైకి వస్తుండడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పారిశుద్ధ్య కార్మికులతో చెత్తదిబ్బలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, వాహన చోదకులు విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, వజ్రకరూరు

భక్తిశ్రద్ధలతో కార్తిక అమావాస్య పూజలు

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని శైవ ఆలయాల్లో గురువారం కార్తిక అమావాస్య సందర్భంగా విశేష పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో మహిళా భక్తులు హాజరై దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. రాయదుర్గంలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన లక్ష దీపోత్సవం, ఆకాశ దీపం, జ్వాలాతోరణం తదితర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. నేమకల్లు ఆంజనేయ స్వామి, సంగమేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- న్యూస్‌టుడే బృందం

రాయదుర్గం: విశేషాలంకారంలో జంబుకేశ్వరస్వామి

కళ్యాణదుర్గం: ప్రత్యేకాలంకారంలో లక్ష్మీనరసింహస్వామి

విడపనకల్లు: భద్రకాళి సమేత వీరభద్రస్వామి చిన్న తేరును లాగుతున్న భక్తులు

రాయదుర్గం: దీపాలు వెలిగిస్తున్న మహిళలు

లీకేజీ మరమ్మతులు పురపాలక సంఘానికే..

రాయదుర్గం, న్యూస్‌టుడే: కణేకల్లు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే ప్రధాన పైపులకు ఎనిమిదిచోట్ల లీకేజీలు ఏర్పడ్డాయి. అవి అధికమవడంతో తరచూ పట్టణవాసులు తగినంత నీరందక అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో స్పందించిన కలెక్టర్ లీకేజీ మరమ్మతులకు రూ.40లక్షల జిల్లా ఖనిజ నిధులు మంజూరు చేశారు. పనులను ప్రజారోగ్య శాఖకు కేటాయించారు. నెలలు గడచినా పనులు సాగకపోవడంతో, ప్రజారోగ్య శాఖలో సిబ్బంది కొరత ఉందంటూ మళ్లీ పురపాలక సంఘానికే అప్పగించారు. రూ.40లక్షల్లో రూ.20 లక్షలు లీకేజీలకు, మరో రూ.20లక్షలు విద్యుత్తు మోటార్ల మరమ్మతులకు వినియోగించనున్నట్లు మున్సిపల్ డీఈ సురేష్ తెలిపారు. త్వరలో పనులు చేపడతామన్నారు.

కణేకల్లు రోడ్డు పక్కన లీకేజీతో ఏర్పడిన నీటి మడుగు

పూర్వ ప్రాథమిక విద్య సమర్థంగా అందించాలి

కళ్యాణదుర్గం గ్రామీణం: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న 3-6 సంవత్సరాల్లోపు విద్యార్థులకు పూర్వ ప్రాథమిక విద్యను సమర్థంగా అందించాలని ఎంఈవో విజయకుమారి, సీడీపీవో లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. గురువారం స్థానిక శిశుసంక్షేమశాఖ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలను శక్తిమంతంగా తయారు చేసేలా విద్యాశాఖతో కలిసి పని చేస్తున్నామన్నారు.

ఇళ్లపై వేలాడుతున్న మృత్యుపాశాలు!

శెట్టూరు, న్యూస్‌టుడే: శెట్టూరు మండలం ములకలేడులో పలుకాలనీల్లోని ఇళ్లపై విద్యుత్తు తీగలు మృత్యుపాశాలుగా వేలాడుతున్నాయి. పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న విద్యుత్తు ఇనుప, సిమెంట్ స్తంభాలు ఎపుడు విరిగి పడుతాయోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అవసరాల రీత్యా ఇళ్లపైకి ఎక్కినపుడు తీగలు తగిలి ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని పలువురు వాపోతున్నారు. సలాంసాబ్ ఇంటి నుంచి వెంకటసుబ్బయ్య ఇంటి వరకు, విద్యానగర్, అంబేద్కర్‌నగర్, గోవిందనగర్ కాలనీల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న, విరిగి పడే స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. విద్యుత్తు లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకటపతి 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ఇన్‌ఛార్జి ఏఈ భరత్‌ను పంపి సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ కూలీ మృతి

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పి.టి.ఆర్.పల్లి గ్రామంలో కూలి పనులు చేస్తూ ప్రమాదవశాత్తు కిందపడి గంగప్ప(40) అనే కూలీ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దురదకుంటకు చెందిన గంగప్ప బుధవారం పీటీఆర్‌పల్లి వద్ద ట్రాక్టర్‌లో టమాటా కర్రలు జోడిస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడటంతో తలకు తీవ్రగాయమైంది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యానికి అనంతపురం, అక్కడి నుంచి బెంగళూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం చనిపోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయినికి తీవ్ర గాయాలు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని కొల్లాపురమ్మ ఆలయం వద్ద ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో భైరసముద్రం పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయిని లక్ష్మీదేవి తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. కంబదూరు మండలంలోని స్వగ్రామం రాంపురానికి ఆమె భర్తతో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. కొల్లాపురమ్మ ఆలయం వద్దకు చేరుతుండగా వెనుక నుంచి ట్రాక్టర్ ఢీకొంది. ఆ ధాటికి లక్ష్మీదేవి కిందపడగా, ఆమెపై ట్రాక్టర్ ముందు చక్రం ఎక్కడంతో ముఖం, కన్ను భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు. పట్టణ పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించారు.

మత్తులో వాహనాల చోదకం: జరిమానా విధింపు

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న అయిదుగురికి న్యాయమూర్తి రమ్య జరిమానా విధించినట్లు యూపీఎస్ సీఐ జయానాయక్ తెలిపారు. గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అయిదుగురు చోదకులు మద్యం తాగి పట్టుబడినట్లు చెప్పారు. వారిని కోర్టులో హాజరుపరిచామని, విచారించిన జడ్జి రమ్య ఒక్కొక్కరికి రూ.5వేలు జరిమానా విధించారన్నారు. చెల్లించకపోతే మూడు రోజులు జైలు శిక్ష అనుభవించాలని తీర్పు ఇచ్చినట్లు సీఐ వెల్లడించారు.

మహిళా సహకార సంఘాలతోనే సాధికారత

కుందుర్పి, న్యూస్‌టుడే: మహిళా సహకార సంఘాలతోనే సాధికారత సాధ్యమవుతుందని.. మండల వెలుగు ఏపీఎం సర్దానప్ప, సీసీ శివణ్ణ పేర్కొన్నారు. మహిళా సంఘాల సహకార, సాధికారత చట్టాలపై గురువారం వెలుగు కార్యాలయంలో మహిళా సంఘాల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళా సంఘాల అభివృద్ధి, సాధికారితపై కూటమి ప్రభుత్వం పెద్దఎత్తున కార్యక్రమాలు చేస్తూ, మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు మహిళలకు విరివిగా బ్యాంకు రుణాలు, స్త్రీనిధి రుణాలు మంజూరు చేసి సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం వెంకటంపల్లి గ్రామంలో మహిళా సంఘాల సభ్యులతో ప్రమాణ కార్యక్రమం నిర్వహించారు.

Before the Hon'ble Motor Accident Claims Tribunal Cum VII Addl. Dist. Judge, Kadapa
M.V.O.P.No. 253/2025
Sidda Lakshmi Devi & 4 Others ...Petitioners
Vs
K.Hari Krishna, S/o Obulesu, aged about 30 years, Hindu, Lorry Driver, R/o D.No. 2/340, Kammuru (Vi), Kuderu (M), Anantapur Dist. ...Respondent No.3.
NOTICE
ఇందుమూలముగా తెలియజేయడమేమనగా పై వాది యొక్క భర్త ప్రతివాది యొక్క లారీ ఆక్సిడెంటులో చనిపోయినందులకు గాను, వాదులు పై ప్రతివాదిపైన దాఖలు చేసిన పిటీషను వాయిదా 17.12.2025వ తేదీన ఉన్నది. కావున పై ప్రతివాది 17.12.2025వ తేదీన ఉదయం 10.30 గంIIలకు పై కోర్టు నందు వకీలు ద్వారా గానీ లేక ఖుద్దున గానీ హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకోవలెను. లేనియెడల పరోక్షముగా తీర్మానించబడును.
ఇట్లు: యం. రామాంజనేయరెడ్డి
అడ్వకేట్, కడప.

(c) eenadu

గుంతకల్లు
•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

సమస్యలను గుర్తించేందుకు వార్డుల పర్యటన

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లు మున్సిపాలిటీలోని వార్డుల్లో సమస్యలను పరిష్కరించి ఆదుకుంటామని పురపాలక కమిషనర్ నయాం అహ్మద్, తెదేపా పట్టణ ఇన్‌ఛార్జి నారాయణస్వామి అన్నారు. సమస్యలను గుర్తించడానికి వారు గురువారం 1, 2 వార్డుల్లో పర్యటించారు. గ్రామాల్లో ప్రభుత్వం వివిధంగా సమస్యలను తీరుస్తోందో, అదేవిధంగా పట్టణంలోని సమస్యలను పరిష్కరించనున్నామన్నారు. ఎమ్మెల్యే సూచన మేరకు కాలనీల్లోని ప్రధాన సమస్యల పరిష్కారం కోసం మొదట పనులను ప్రారంభిస్తామని చెప్పారు. కౌన్సిలర్లు ప్రభాకర్, మెహరున్నీసాబేగం, సింగిల్‌విండో అధ్యక్షుడు మస్తానయ్య, వార్డు ఇన్‌ఛార్జి సాయిప్రసాద్ పాల్గొన్నారు.

చితంబరస్వామికి గ్రామోత్సవం

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే : పెద్దపప్పూరు మండల కేంద్రంలోని చితంబరస్వామి ఆలయంలో కార్తిక మాసం ముగింపు సందర్భంగా విశేష పూజలు చేశారు. ఆక పూజలు, అర్చనలు నిర్వహించి స్వామివారిని అలంకరించారు. పుర వీధుల గుండా భజనలతో స్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించారు.

గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆర్థిక నేరాలు.. పట్టని పోలీసులు

లబోదిబోమంటున్న ప్రజలు

గుత్తిలోని ఓ ఏటీఎం కేంద్రంలో కార్డుమార్చి నగదును ఉపసంహరించుకుంటున్న దుండగుడు

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తిలో రోజురోజుకీ ఆర్థిక నేరాలు పెరుగుతున్నాయి. పోలీసులు కేసుల నమోదుకే పరిమితమవుతున్నారు. నిందితులను అరెస్టు చేసి బాధితులకు రికవరీలు చేయడం లేదు. మోసగాళ్లు ప్రజల నుంచి మాయమాటలతో రూ.కోట్లు దండుకుంటున్నారు. గుత్తిలో అనేక మంది చీటీల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారు. మరికొందరు ఏటీఎం కేంద్రాల వద్ద నక్కి, ఖాతాదారుల కార్డులు మార్చి నగదు చోరీ చేస్తున్నారు.

● గుత్తిఆర్.ఎస్.లో ఓ విశ్రాంత రైల్వే ఉద్యోగి రూ.2 కోట్లు వరకు చీటీల సొమ్మును ఎగ్గొట్టి పారిపోయాడు. ప్రజలు, మిత్రులతో ఆయన చీటీలు వేస్తూ నమ్మకాన్ని సాధించాడు. రూ.కోట్లు కూడగట్టుకుని ఇంటికి తాళం వేసి పారిపోయాడు. సూరకింగనపల్లెలో ఓ మహిళ రూ.కోటి వరకు చీటీలు వేసి ప్రజలను మోసం చేసింది.

● గుత్తిలోని మెయిన్ బజార్‌లో ఓ వ్యాపారి చీటీలు వేసి రూ.10 కోట్లు దాకా మోసం చేసి పారిపోయాడు. కుమారుంగేరికి చెందిన ఓ ఆటోడ్రైవర్ తన భార్యతో చీటీలు నడిపి రూ.20 లక్షలు దాకా జనానికి కుచ్చు టోపీ పెట్టి ఊరువదిలిపోయాడు.

● ఎస్‌బీఐ కాలనీలో ఓ వ్యక్తి విలేకరినని ప్రజలను నమ్మించి చీటీలు వేసి మోసం చేశాడు. సుమారు రూ.20 లక్షలు దాకా ప్రజలకు ఎగనామం పెట్టాడు. ఇలా ప్రజలను దండగులు మోసం చేస్తున్నారు.

● ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో ఇటీవల గుత్తికి చెందిన నలుగురు మిత్రులు రూ.40వేలు ఓ సంస్థ పేరుతో సొమ్ము జమ చేశారు. తరువాత ఫోన్ స్విచ్ ఆఫ్ అయి ఉండటంతో వారు పోలీసులను ఆశ్రయించారు. ఓర్వకల్ నుంచి సరకును కొనుగోలు చేసుకున్న వ్యక్తి రైతులకు సొమ్ము చెల్లించకుండా చేతులు ఎత్తేశాడు.

రికవరీలు చేయడం లేదు

ఆర్థిక మోసాలు పెద్దఎత్తున జరుగుతున్నా పోలీసులు నిలువరించలేకపోతున్నారు. పైగా సొమ్మును రికవరీ చేయడం లేదు. దీంతో ప్రజలు దిక్కులు చూడాల్సి వస్తోంది. అనుమతులు లేకుండా అనధికారిక చీటీలు నడిపేవారిపై ముందస్తు చర్యలు తీసుకోలేకపోతున్నారు. మోసాలకు ప్రజలు రూ.కోట్లలో సొమ్ము కోల్పోతున్నా పోలీసులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ● అనధికారిక చీటీలు వేసి సొమ్ము కాజేస్తున్న విషయం వాస్తవమేనని సీఐ రామారావు తెలిపారు. ప్రజలు అలాంటి చీటీలు వేయడమే తప్పు. ఇలాంటి విషయాల్లో సొమ్ము రికవరీ చేయడం ఇబ్బంది. కొన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో నిందితులను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థినుల సౌకర్యార్థం వసతిగృహాలు

గుంతకల్లు, న్యూస్‌టుడే : స్థానిక ఎస్‌జేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అనుబంధంగా నిర్మిస్తున్న జిల్లా మహిళా వసతిగృహాల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వం ఇలాంటి వసతిగృహాలను రాష్ట్రంలో రెండింటిని మాత్రమే కేటాయించింది. ఒకటి గుంతకల్లు, మరొకటి శృంగవరపుకోటలో నిర్మిస్తున్నారు. జిల్లాలోని మహిళలు డిగ్రీ చదవడానికి, వివిధ కోర్సుల్లో శిక్షణ పొందడానికి ఆయా భవనాలు నిర్మిస్తున్నారు. దీనికి గాను రూ.6 కోట్లు, అవసరమైన కంప్యూటర్లు, ఇతర సామగ్రి కొనుగోలు చేయడానికి ప్రభుత్వం రూ.2 కోట్లు కేటాయించింది. ఏడాది లోగా పనులను పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇక్కడ ప్రత్యేకంగా కంప్యూటర్, టైలరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదితర అంశాల్లో ప్రభుత్వం శిక్షణ ఇవ్వనుందని కళాశాల ప్రధానాచార్యుడు లక్ష్మయ్య పేర్కొన్నారు.

నిర్మాణంలో వసతిగృహ భవనాలు

30న వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలు

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తిలోని బీసీ కాలనీలో ఈనెల 30న వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలను ఘనంగా నిర్వహిద్దామని ఆ సంఘం నాయకులు మల్లేశ్, చంద్ర తెలిపారు. మహాసభల నిర్వహణపై సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక సమస్యలపై చర్చిస్తామన్నారు. మహాసభలకు గుత్తితోపాటు గ్రామీణ ప్రాంతాల నుంచి కార్మికులను సమీకరించాలని పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 8008612342

సమస్య: నార్పల నుంచి బత్తలపల్లి, నాయనపల్లి గ్రామాల వైపు వెళ్లే ప్రధాన రహదారి గుంతలతో అధ్వానంగా ఉంది. తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించాలని కోరుతున్నాం. **-రమణ, కేశేపల్లి**

సమాధానం: బత్తలపల్లి, నాయనపల్లి గ్రామాలకు వెళ్లే రహదారులు ఆర్అండ్‌బీ పరిధిలోకి వస్తాయని, ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకుంటాం. **-మమత, ఎంపీడీవో, నార్పల**

-న్యూస్‌టుడే, నార్పల

సమస్య: గుంతకల్లులోని పాత గుత్తిరోడ్డులో కసాపురం రోడ్డుకు వెళ్లే రైల్వే బ్రిడ్జి దగ్గర చెత్త రోడ్డుపై పడింది. వాహన చోదకులు అవస్థ పడుతున్నారు. **- రామాంజి**

సమాధానం: శానిటేషన్ సిబ్బందితో శుభ్రం చేయిస్తాం. **- అనిల్, ఇన్‌స్పెక్టర్, 3వ సచివాలయం**

సమస్య: గుంతకల్లులోని బస్టాండ్ ఏరియా, కసాపురం రోడ్డులో రైల్వే వంతెన వద్ద ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుంది. **- గోవిందు**

సమాధానం: ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి ప్రణాళికతో ముందుకెళ్తాం.
- మనోహర్, సీఐ, ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్

-న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

సమస్య: ఎద్దులపల్లి రోడ్డులో కృష్ణవేణి పాఠశాలకు వెళ్లే మలుపు వద్ద ఉన్న కాలువలో మురుగు వెళ్లకుండా చెత్తచెదారం పేరుకుపోయింది. **- ముకుందా రెడ్డి**

సమాధానం: వెంటనే కాలువలో మురుగు వెళ్లేటట్లు చర్యలు తీసుకుంటాం.
- సురేశ్, పంచాయతీ శానిటేషన్ మేస్త్రీ

-న్యూస్‌టుడే, పామిడి

సమస్య : గార్లదిన్నెలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణ - జాతీయ రహదారి సమీపంలో రాత్రి వేళల్లో యువత విచ్చలవిడిగా ద్విచక్రవాహనాలను వేగంగా నడపడం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. **- గార్లదిన్నె గ్రామస్థులు**

సమాధానం: రాత్రి సమయాల్లో ప్రత్యేక నిఘా ఉంచి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.
- గౌస్‌బాషా, ఎస్సై, గార్లదిన్నె

-న్యూస్‌టుడే, గార్లదిన్నె

వ్యర్థాలు తొలగించారు

యాడికి, న్యూస్‌టుడే: యాడికిలో చింతవనం ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో మురుగు కాలువను గురువారం కార్మికులు శుభ్రం చేశారు. 'నిండా వ్యర్థాలు' అనే శీర్షికతో ఈ నెల 19న ఈనాడులో వచ్చిన చిత్రవార్తకు డిప్యూటీ ఎంపీడీవో స్పందించారు. వెంటనే పారిశుద్ధ్య కార్మికులను పంపి కాలువను శుభ్రం చేయించి మురుగు ముందుకు వెళ్లేందుకు చర్యలు తీసుకున్నారు.

స్పందనకు వందనం

ప్రమాదాన్ని తప్పించారు!

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి మండలంలోని ఆలూరుకోను వెళ్లే దారి పక్కలోనే ప్రమాదకరంగా విద్యుత్తు స్తంబం ఉందని, దీంతో ఆలయానికి వెళ్లే భక్తులు భయాందోళనకు గురవుతున్నారని ఈ నెల 19న 'పడితేనే స్పందిస్తారా' అనే శీర్షికతో 'ఈనాడు'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. విద్యుత్తు స్తంభాన్ని సరిచేసి ప్రమాదాన్ని తప్పించారు.

పత్తిపంటకు మద్దతు ధరలు

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే : ప్రస్తుతం రైతులు పండించిన పత్తి పంటకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరలు కల్పించనుందని, దీనిపై ఎవరికి అపోహలు వద్దని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు ఉమామహేశ్వరమ్మ రైతులకు సూచించారు. పెద్దవడుగూరులోని రైతుసేవాకేంద్రంలో గురువారం పెద్దవడుగూరు, యాడికి, గుత్తి, పామిడి మండలాల పత్తిరైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి చర్చించారు. రైతులు దళారుల ఉచ్చులో పడకుండా దిగుబడులను నేరుగా కొనుగోలు కేంద్రాలకు తరలిస్తే గిట్టుబాటు ధరలు లభిస్తాయన్నారు. కొనుగోలు కేంద్రాలు ఎక్కడెక్కడ ఉంటాయో వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్దవడుగూరు, యాడికి, గుత్తి మండలాల వ్యవసాయాధికారులు మునికృష్ణ, మహబూబ్‌బాషా, ముస్తాక్అహ్మద్, ఏఈవో, మార్కెట్ కమిటీ ఏడీ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యం

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే : రైతుల జీవితాల్లో వెలుగులు నింపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ముచ్చుకోట జలాశయాన్ని గురువారం పరిశీలించారు. పలు గ్రామాల ప్రజలకు తాగు నీటితో పాటు సాగు నీటి కష్టాలను తీర్చే జలాశయానికి హెచ్చెల్సీ నీటితో పూర్తిస్థాయిలో నింపాలని అధికారులకు సూచించారు. జలాశయంలో పూర్తిస్థాయి నీరు నిల్వ ఉండేలా చూడాలన్నారు. అమ్మలదిన్నె సమీపంలోని తాడిపత్రి బ్రాంచ్ కెనాల్‌ను పరిశీలించారు. త్వరలో అమ్మలదిన్నె, జూటూరు, చిన్నపప్పూరు, నారాయణపురం, సోమనపల్లి తదితర గ్రామాల్లో భూగర్భ జలాలు పెరగడానికి అవసరమైన నీటిని విడుదల చేయాలని అధికారులకు తెలిపారు. హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్‌రావు, డీఈ సూర్యనారాయణ, తెదేపా నాయకుడు ఎస్వీ రవీంద్రారెడ్డి, మండల కన్వీనర్ లోకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురుగుతో ఎవరూ ఇబ్బంది పడకూడదు

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రి పురపాలికలో ఎవరూ మురుగు సమస్యతో అవస్థలు పడకూడదని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి తెలిపారు. పురంలో స్థానిక గాంధీకట్ట వద్ద ఉన్న మురుగుకాలువను ఆయన పరిశీలించారు. ఏళ్ల నాటి కాలువల సమస్యను పరిష్కరిస్తామన్నారు. దీనికి గాను దాతల సహకారం, సొంత నిధులు రూ.2.30 కోట్లతో పనులు చేపడతామన్నారు. కి.మీ పొడవు, 8 మీటర్ల వెడల్పుతో నంద్యాల రోడ్డు వరకు దారి వేస్తామని తెలిపారు. మున్సిపల్ డీఈ రాంప్రసాద్, ఏఈ, తెదేపా నాయకులు రవీంద్రరెడ్డి, విజయ్‌కుమార్, బబ్లూ పాల్గొన్నారు.

హెచ్చెల్సీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి

ప్రతిభతో మెరిశారు!

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలోని ఆదర్శ జూనియర్ కళాశాలలో గురువారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)పై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఏఐపై ఉపన్యసించి ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో వరుసగా మొదటి, రెండు, మూడో స్థానాల్లో నిలిచిన జాన్‌సుధాకర్, లలితకుమార్, హనీఫ్ సాలకు అధ్యాపకులు బహుమతులు అందజేశారు.

గుంతకల్లు: పాతగుంతకల్లులోని విజ్ఞానజ్యోతి పాఠశాలలో గురువారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో విద్యార్థులకు 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో సీమా అంజుమ్, విమల, పల్లవి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుమలత బహుమతులను అందజేశారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. గత వారం రోజుల్లో విద్యార్థుల్లో పుస్తక పఠనాన్ని పెంపొందించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఆయా రోజుల్లో ప్రముఖులు పాల్గొని గ్రంథాలయాల ఆవశ్యకతను వివరించారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి అతిథులు బహుమతులు అందజేశారు. **-న్యూస్‌టుడే బృందం**

తాడిపత్రిలో బహుమతి అందజేస్తున్న ఉపాధ్యాయిని

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. కోటంక, మర్తాడు, జూటూరు, కృష్ణాపురం, సంజీవపురం, యర్రగుంట్ల, పెనకచర్ల, పెనకచర్ల డ్యామ్, కొత్తపల్లి, కొప్పల కొండ గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించి సభ్యత్వ నమోదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు చైల్డ్ కేర్ లీవ్ జీవో విడుదల చేయాలని, సర్వీస్ రూల్స్ పరిష్కరించి పదోన్నతులు ఇవ్వాలని, 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించాలని వంటి పలు డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లికార్జున, నాయకులు రామకృష్ణ, సాంబశివుడు, షంషీర్ బాబా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సభ్యత్వ నమోదు రసీదు అందజేస్తున్న ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

శింగనమల (బుక్కరాయసముద్రం), న్యూస్‌టుడే: గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకే మండల కేంద్రాల్లో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. గురువారం శింగనమల తహసీల్దారు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల వినతులు స్వీకరించారు. ప్రధానంగా రీసర్వే కారణంగా తమ భూములు ఆన్‌లైన్‌లో చూపించడం లేదని, సమస్యలు పరిష్కరించాలని ఎక్కువ మంది రైతులు వినతులు ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రీసర్వే గ్రామాల్లో రైతులకు కొత్తసమస్యలు వచ్చాయన్నారు. వచ్చే నెలలో ఈ సమస్యలు పరిష్కరించడానికి రెవెన్యూ అధికారులను గ్రామాలకు పంపి సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఆయా సమస్యలను రెవెన్యూశాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఎంపీడీవో భాస్కర్, తహసీల్దారు శేషారెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ లక్ష్మీనారాయణ, తెదేపా నాయకులు ఆదినారాయణ, మారుతీనాయుడు, నాగముని, పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

వీధికుక్కలు.. ప్రజలు బెంబేలు!

చిన్నారులపై వరుస దాడులు

బుక్కరాయసముద్రం, నార్పల, న్యూస్‌టుడే : బుక్కరాయసముద్రం, నార్పల మేజర్ పంచాయతీల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వృద్ధులు, చిన్నారులపై దాడులు చేస్తున్నాయి.

● నార్పల పంచాయతీలో 20 కాలనీలు, బుక్కరాయసముద్రంలో 30 కాలనీలు ఉన్నాయి. బుక్కరాయసముద్రం మేజర్ పంచాయతీలో జనచైతన్యనగర్, శర్మకాలనీ, హమాలీ, ఎల్‌బీ, రామిరెడ్డి, అనంతసాగరం కాలనీ, నార్పలలో చైతన్యకాలనీ, ఉయ్యాలకుంట, అంబేడ్కర్, దూల్‌పేట, సుల్తాన్‌పేట, దుగుమర్రి రోడ్లు కాలనీల్లో వందల సంఖ్యలో కుక్కలు ఉన్నాయి. రోడ్లపై ఆడుకుంటున్న చిన్నారులపై కుక్కలు అకారణంగా దాడులు చేస్తున్నాయి. రాత్రి సమయంలో ద్విచక్రవాహనాల్లో వెళ్తున్న చోదకులను కరవడానికి వెంటపడుతున్నాయి.

ప్రమాదాల బారిన చోదకులు

కుక్కల బారినుంచి తప్పించుకునే క్రమంలో చోదకులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. కుక్కలను గ్రామాల నుంచి దూరంగా తరలించాలని బుక్కరాయసముద్రం, నార్పల గ్రామాల ప్రజలు అధికారులను కలిసి ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

● కుక్కలు కరిస్తే రేబిస్ వ్యాధి వస్తుందని సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

జనచైతన్యనగర్‌లో గుంపులుగా సంచరిస్తున్న శునకాలు

ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజల క్షేమం కోసం కుక్కల బోనులు ఏర్పాటు చేసి, వాటిని పట్టుకుని అటవీ ప్రాంతాల్లో వదిలివేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై బుక్కరాయసముద్రం డిప్యూటీ ఎంపీడీవో సదాశివను వివరణ కోరగా ఈ విషయాన్ని జిల్లా పంచాయతీ అధికారులతో చర్చించి కుక్కలను అదుపు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

తాగునీరు.. వృథా తీరు

తాడిపత్రిలోని అంబేడ్కర్ కూడలిలో భారీగా తాగునీరు వృథా అవుతోంది. మున్సిపాలిటీ తాగునీటి పైపు పగలడంతో సమస్య తలెత్తింది. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. తాగునీటిని విడుదల చేసిన సమయంలో వందల లీటర్లు రోడ్డుపాలవుతోంది. దీనిపై మున్సిపల్ ఏఈ తేజను వివరణ కోరగా వెంటనే పైపును సరి చేసి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

-న్యూస్‌టుడే, తాడిపత్రి

వాలీబాల్ పోటీలకు ఎంపిక

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే : మండలంలోని వీరన్నపల్లి జడ్పీఉన్నత పాఠశాల విద్యార్థులు పాఠశాల అండర్-14 వాలీబాల్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మధుసూదనరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ఇక్కడి పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న లావణ్య, ఎనిమిదో తరగతి చదువుతున్న భరత్, కార్తిక్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. డిసెంబరు 6న నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం గ్రామంలో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో విద్యార్థులు తలపడనున్నారు. వీరి ఎంపికకు కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్‌బాబు, విద్యార్థులను పాఠశాల యాజమాన్యం సన్మానించి అభినందించారు.

ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీ

కుష్ఠుపై ఇంటింటి సర్వే

బుక్కరాయసముద్రం, శింగనమల, న్యూస్‌టుడే: గ్రామాల్లో కుష్ఠువ్యాధిపై ఇంటింటా సర్వే వేగవంతం చేయాలని జిల్లా అదనపు వైద్యాధికారి జయలక్ష్మి, వైద్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. గురువారం ఆమె కొర్రపాడు, తరిమెల ప్రభుత్వ వైద్యశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సర్వే ఎంత వరకు వచ్చిందని ఆరా తీశారు. డాక్టర్ ఇందరా ప్రియదర్శిని, నాగన్న, సూపర్‌వైజర్ రమణ, మహేష్ పాల్గొన్నారు.

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: కుష్ఠు నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వైద్యులు దిలీప్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని యర్రగుంట్ల గ్రామంలో గురువారం కుష్ఠువ్యాధి నియంత్రణపై ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ వరకు గ్రామంలో కుష్ఠు వ్యాధిపై ఇంటింటి సర్వే జరుగుతుందన్నారు. వైద్యురాలు హనీషా, ఆరోగ్య విస్తరణాధికారి నాగేశ్వరయ్య, వైద్యసిబ్బంది రాణి, మణిమాల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యర్రగుంట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

డాక్యుమెంట్ పోయినది

నా క్లయింట్ **సూరపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, S/o వెంకట్‌రెడ్డి** తాడిపత్రి వారికి సంబంధించిన 31/12/2014 తాడిపత్రి సబ్ రిజిస్ట్రార్ వారి కార్యాలయం 1వ పుస్తకం 5948/2014 నెంబర్‌గా రిజిస్టర్ కాబడిన విక్రయం దస్తావేజు పోయినది. దొరికినచో సంప్రదించగలరు.

ఎం.క్రిష్ణమోహన్ B.A., B.L.,
అడ్వకేట్, తాడిపత్రి. Ph: 9440985436

సమయపాలన పాటించని తీరు!

నార్పల, న్యూస్‌టుడే : నార్పల మండల ఉపాధి హామీ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో ఉపాధి శ్రామికులు, ఉద్యాన రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

● మండల పరిధిలో 17 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించడానికి 17 మంది క్షేత్ర సహాయకులు, ఆరుగురు సాంకేతిక సహాయకులు ఉన్నారు. ఉపాధిహామీ పథకం పర్యవేక్షణ అధికారులు ఉన్నారు. వీరంతా ఎంపీడీవో పర్యవేక్షణలో ఎంపీడీవో కార్యాలయంపై అంతస్తులో విధులు నిర్వహిస్తుంటారు. నాలుగు నెలలుగా ఉపాధి శ్రామికులకు అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పనులు కల్పించడం లేదు. పనుల కోసం కూలీలు నిత్యం ఎంపీడీవో కార్యాలయానికి వస్తున్నారు. కొందరు అధికారులు, సిబ్బంది ఎంపీడీవో కార్యాలయంలో అందుబాటులో ఉండటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఉపాధి హామీ కార్యాలయంలో ఖాళీ కుర్చీలు

తప్పని ప్రదక్షిణలు

ఉపాధిహామీ పథకం కింద ఉద్యాన పంటలు సాగుచేస్తున్న రైతులు ఉపాధి సిబ్బంది కోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని ఉపాధిహామీ సిబ్బంది, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ విషయంపై ఏపీవో ఎర్రమ్మను వివరణ కోరగా ఉపాధిహామీ సిబ్బంది, అధికారులు ఉదయాన్నే గ్రామాలకు వెళ్లి క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నామని, మధ్యాహ్నం నుంచి కార్యాలయంలో అందుబాటులో ఉంటామని సమాధానమిచ్చారు.

ముగిసిన కార్తిక మాస పూజలు

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: నెల రోజుల పాటు ఆలయాల్లో నిర్వహించిన కార్తిక మాసం పూజలు గురువారం అమావాస్యతో ముగిశాయి. కోటంక, కమలాపురం, కొట్టాలపల్లి, కనంపల్లి, గార్లదిన్నె, కేశవాపురం, కల్లూరు, ముంటిమడుగు తదితర గ్రామాల్లో వెలసిన ఆంజనేయస్వామి, రామాలయం, శివాలయం, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, లక్ష్మీ చెన్నకేశవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. చివరి రోజు కార్తిక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కేశవాపురం గ్రామంలో లక్ష్మీ చెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

కేశవాపురంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఊరేగింపు

పామిడి : మండలంలోని పలు దేవాలయాల్లో గురువారం కార్తిక మాస పూజలు ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని కాళాపురం గ్రామంలో వెలిసిన చిన్ననెట్టికంటి ఆంజనేయ స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నెట్టికంటి సన్నిధికి పోటెత్తిన భక్తులు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి గురువారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమావాస్య, కార్తిక మాసం చివరి రోజు కావడంతో ఆలయంలో స్వామి మూలవిరాట్‌ను దర్శించుకున్నారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

కసాపురం ఆలయ ప్రాంగణంలో కోలాహలం

రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు బాలికలు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : గుంతకల్లులో ఎస్‌జేపీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఖాజాబీ, తొమ్మిదో తరగతి చదువుతున్న అపూర్వ రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. మూడు రోజుల క్రితం ఎన్.తిమ్మాపురం-దోనిముక్కల జాతీయ రహదారిలో జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు జరిగాయి. బాలికలు ఇద్దరూ ప్రథమ, తృతీయ స్థానాలు సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈనెల 21,22వ తేదీల్లో కృష్ణాజిల్లాలో జరిగే పోటీల్లో ఆడనున్నారు. హెచ్‌ఎం మురళీకృష్ణ, పీఈటీలు జ్యోతి, రాజేశ్ బాలికలను అభినందించారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మంది ప్రజలకు తెలియజేయడము ఏమనగా మా కక్షిదారుడు అయిన **జి.నవాబ్‌జాన్** గారు తాడిపత్రి మునిసిపల్ పరిధిలోని మెయిన్ బజార్ వీధిలోని ఇంటి నెంబర్ 8/519 మీద గుత్తి 6వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో O.S.No.10/2025 నంబర్ గల దావాను **1) నగరూరు రవిప్రకాష్, 2) తోటంశెట్టి వెంకట శివప్రసాద్** అనువారి మీద దాఖలు చేసి ఉన్నారు. సదరు దావా పై కోర్టులో విచారణలో ఉన్నందున పై ఇంటి మీద ఎవరు గాని క్రయవిక్రయాలు జరుపకూడదని తెలుపడమైనది. **ఇట్లు**

జి.వెంకటరెడ్డి, అడ్వకేట్, గుత్తి & వై.హనీఫ్ బాష, అడ్వకేట్, తాడిపత్రి

(c) eenadu

అనంతపురం

•అనంతపురం •రాప్తాడు

మేమున్నాం.. మీకు తోడుగా

లక్ష్మీనగర్: 9849771687
అరవింద్‌నగర్: 8008573004
రాప్తాడు: 6304766286

సమస్య: పాతూరు మార్కెట్ గాంధీ విగ్రహం వెనుక వైపున రోడ్డులో గుంతలతో ఇబ్బందిగా ఉంది. - రమేష్

సమాధానం: మరమ్మతులు చేసి సమస్య తీర్చారు.

సమస్య: సాయినగర్ మూడో క్రాస్ చివరలో మురుగు కాలువ తీయకపోవడంతో దుర్వాసన వస్తోంది. - సావిత్రి

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువ శుభ్రం చేయిస్తాం.

(పై ప్రశ్నలకు నగరపాలక ఈఈ షాకీర్, ఇన్‌ఛార్జి ప్రజారోగ్య అధికారి నరసింహ సమాధానాలు ఇచ్చారు.)

- న్యూస్‌టుడే, అశోక్‌నగర్

టమాటా కిలో రూ.50

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: అనంతపురం గ్రామీణ కక్కలపల్లి మార్కెట్‌లో టమాటా ధరలు పెరుగుతూనే ఉన్నాయి. పంట ఉన్న రైతులకు ధరలు ఊరటనిస్తున్నాయి. మూడ్రోజులుగా గరిష్ఠ ధరలు పరిశీలిస్తే ఈ నెల 18న టమాటా కిలో రూ.38, 19న 47, 20న రూ.50 పలికింది. గురువారం మార్కెట్‌లో రైతులు 1,875 టన్నులు విక్రయించారు. కిలో గరిష్ఠం రూ.50, మధ్యస్థం రూ.37, కనిష్ఠం రూ.27 చొప్పున ధరలు పలికాయి.

తెరపై ఈనాడు

అనంతపురం (కమలానగర్): గంగ: ప్రేమంటే, గౌరి: కాంత, గాయత్రి: శివ 2023, త్రివేణి: కొరమీనసింహం, తరంగిణి: మఫ్టీ పోలీస్, తేజస్విని: పాంచ్ మినార్, నిలీమ: ఇట్లు మీ ఎదవ, ఎస్వీ సినిమా: రాజు వెడ్స్ రాంబాయి, శాంతి: 12A రైల్వే కాలనీ, సుధ: ది గర్ల్‌ఫ్రెండ్.

బాలల భవిష్యత్తుకు బాటలు వేద్దాం

రాంనగర్: ప్రతి ఒక్కరూ బాలల భవిష్యత్తుకు బాటలు వేయాలని సెయింట్ ఆన్స్ పాఠశాల ప్రిన్సిపల్ సెల్వరీన్ పిలుపునిచ్చారు. గురువారం అనంతపురం గ్రామీణ కక్కలపల్లికాలనీ పంచాయతీ పాఠశాలలో ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సాహిత్య సామాజిక సేవా సంస్థ అధ్యక్షుడు వెంకటరెడ్డి, డాక్టర్ ఉంకె రామలింగయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రతి బిడ్డకు ఆహారం, ఆరోగ్యంతో పాటు మంచి విద్యను అందించాలన్నారు. పిల్లల సంరక్షణ, సాంఘిక భద్రత హక్కులతో పాటు విద్య, వినోదం, సాంస్కృతిక కార్యకలాపాలు సంబంధించిన హక్కులు కూడా ఉన్నాయన్నారు. ప్రిన్సిపల్ సెల్వరీన్ మాట్లాడుతూ.. ఏటా నవంబరు 20న ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం జరుపుకొంటున్నామన్నారు.

ఆనవాళ్లు లేని రోడ్డు.. వణికించే గుంతలు

న్యూస్‌టుడే, అనంతపురం (అశోక్‌నగర్)

నగరంలో మ్యాన్‌హోళ్లు, మురుగు కాలువల మలుపుల వద్ద ప్రమాదాలు పొంచి ఉన్నాయి. చోదకులు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రమాదానికి గురవ్వాల్సిందే. రాప్తాడు, ఆత్మకూరు మండలాల్లోని పలు ప్రాంతాల్లో రోడ్లపై గుంతలకు మరమ్మతులు చేయకపోవడంతో భారీ వాహనాలు వెళ్లేటప్పుడు, ఎదురెదురుగా వాహనాలు వచ్చే సమయంలో ఇబ్బందిగా మారుతోంది. అనంతపురం నగరం, రాప్తాడు, ఆత్మకూరు మండలాల్లో నెలకొన్న తాజా పరిస్థితిపై పరిశీలన కథనం.

ప్రమాద మలుపు

నగరంలోని ప్రధాన మురుగు కాలువల వంకల నడిమివంక, మరువవంక, అమ్మవారి చెరువు వంకలకు ఇరువైపులా ఎలాంటి రక్షణ గోడలు లేవు. వాహనాల్లో వెళ్లే వారు ఏమాత్రం అజాగ్రత్తగా వెళ్లినా వంకల్లో పడే దుస్థితి నెలకొంది. ఆదర్శనగర్ నుంచి హౌసింగ్ బోర్డు ప్రధాన రోడ్డుకు వచ్చే ప్రాంతంలో పెద్ద మురుగు కాలువ ఉంది. అక్కడ సిమెంట్ రోడ్డు, కాలువ సమాంతరంగా ఉంది. మలుపు ఉండటంతో పాటు రోడ్డుకు నేరుగా వెళ్లే వారు వివరణ వస్తే కాలువలో పడే ప్రమాదం ఉంది.

కల్వర్టు దారుణం

ఆత్మకూరు: మండలంలోని పి.యాలేరు, తలుపూరు గ్రామాలకు వెళ్లే తారు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. జడ్పీ ఛైర్మన్ ఓటు హక్కు ఉన్న గ్రామంలో కనీసం కల్వర్టు నిర్మాణం చేపట్టలేకపోతున్నారు. వైకాపా హయాం నుంచే గ్రామస్థులు కల్వర్టు నిర్మాణానికి అధికారులతో పాటు జడ్పీ ఛైర్మన్ బోయ గిరిజమ్మకు విన్నవించినా ఎలాంటి స్పందన లేదు. ఆత్మకూరు నుంచి పి.యాలేరు గ్రామానికి 5 కి.మీ రోడ్డు గుంతలు పడి అధ్వానంగా తయారైంది. వర్షాకాలంలో రోడ్డుపై నీరు నిలువుండటంతో వాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారు. తలుపూరు నుంచి వడ్డుపల్లి తారు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఆత్మకూరు మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ప్రధాన రోడ్డుపై కల్వర్టు దారుణంగా ఉన్నా పంచాయతీ లేదా ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

మ్యాన్‌హోళ్లు మూయరు!

నగరంలో మురుగు తీయడం కోసం మ్యాన్‌హోళ్ల మూతలు తీసి మూయకుండా అలాగే వదిలేస్తున్నారు. పలువురు వాహనదారులు అందులో పడి గాయాలపాలవుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో రోడ్డును సైతం రంధ్రాలు పెట్టి అధ్వానంగా తయారు చేస్తున్నారు.

రాంనగర్ శివారు బహుళ అంతస్తుల వద్ద ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

నగరపాలక ఎన్నికల్లో తెదేపా గెలుపే లక్ష్యం: ఎమ్మెల్యే

రాంనగర్: మరో రెండు నెలల్లో అనంతపురం నగరపాలక సంస్థ ఎన్నికలు జరుగనున్నాయి. తెదేపా గెలుపే లక్ష్యంగా మనమంతా కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ సూచించారు. గురువారం అనంతపురం అర్బన్ తెదేపా కార్యాలయంలో 10వ డివిజన్ నూతనంగా నియమించిన క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను శాలువాలతో సత్కరించారు. కొత్తగా వివిధ కమిటీల్లో ఎన్నికైనవారిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించి తెలియజేశారు. అనంతపురం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో అనంతపురం నగరంలోని 50 డివిజన్లు, నాలుగు గ్రామ పంచాయతీల్లోని అన్ని స్థానాల్లో తెదేపా జెండా ఎగరవేయాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అంతా కలిసికట్టుగా పనిచేసి ఎమ్మెల్యేగా గెలిపించారని, అదే స్ఫూర్తితో పనిచేయాలన్నారు.

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను సన్మానిస్తున్న నూతన కమిటీ సభ్యులు

నగరంలో ఈనాడు

కమలానగర్, న్యూస్‌టుడే: నగరంలోని తెదేపా అర్బన్ కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహణ. ● జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో ప్రభుత్వ సంక్షేమాలపై నేడు అధికారులు, మత్స్యకారుల సమావేశం.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న శ్రీవిజన్ జూనియర్ కళాశాల డైరెక్టర్ శంకరయ్య

ఉపన్యాసం ఇస్తున్న విద్యార్థిని

ప్రతిభా పాటవ పోటీలతో విజ్ఞానం

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ప్రతిభా పాటవ పోటీలు విద్యార్థుల్లో విజ్ఞానం వికాసం చెందడానికి ఉపయోగపడతాయని శ్రీవిజన్ జూనియర్ కళాశాల డైరెక్టర్ శంకరయ్య పేర్కొన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో గురువారం అశోక్‌నగర్ శ్రీవిజన్ జూనియర్ కళాశాలలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. కృత్రిమమేధ ఏఐ వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు నాగప్రజ్ఞ ప్రథమ, హుస్నబాను ద్వితీయ, ప్రథమ సంవత్సరం విద్యార్థిని లావణ్య తృతీయ బహుమతులు దక్కించుకున్నారు. విజేతలకు శంకరయ్య బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. అధ్యాపకులు మహేష్, మల్లికార్జున పాల్గొన్నారు.

పక్కాగా జీవవైద్య వ్యర్థాల నిర్వహణ

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జీవ వైద్య (బయో మెడికల్) వ్యర్థాల నిర్వహణను పటిష్ఠంగా అమలు చేయాలని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. గురువారం తన కార్యాలయంలో కాలుష్య నియంత్రణ మండలి శాఖ వర్గాలు, కార్యక్రమాలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లు, క్లినిక్, డయాగ్నొస్టిక్ కేంద్రాలు..వంటి వైద్య కేంద్రాల్లో జీవ వైద్య వ్యర్థాల నిర్వహణ నిర్దేశిత ప్రమాణాల ప్రకారం జరగాలని కలెక్టర్ సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. రోగులు, ప్రజలు, సిబ్బంది ఆరోగ్య భద్రత దృష్ట్యా వ్యర్థాలను వేరు చేసి తరలించాలని, ఎరుపు, పసుపు పచ్చ, నీలిరంగు, తెలుపు రంగుల్లో ఉండే జీవ సంచులను విధిగా ఏర్పాటు చేయాలని, నిర్దేశిత ప్రకారం వ్యర్థాలను పడేయాలన్నారు. ఆ తర్వాత జీవ వైద్య వ్యర్థ పదార్థాల నుంచి పర్యావరణాన్ని కాపాడుకుందాం అన్న ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు.

ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఇతర అధికారులు

నిర్ణయించిన ధరలకే ఎరువుల విక్రయం

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని ఆ సొసైటీ ఛైర్మన్ నెట్టెం వెంకటేశ్ హామీ ఇచ్చారు. ఎరువులు, పురుగు మందులు సరసమైన ధరలతో అందిస్తున్నట్లు వివరించారు. బయట ధరలతో పోల్చితే సంస్థలు నిర్ణయించిన ధరలకే విక్రయిస్తున్నట్లు తెలిపారు. గురువారం అఖిల భారత సహకార వారోత్సవాలు డీసీఎంఎస్ ప్రాంగణంలో ముగిశాయి. తొలుత సహకార పతాకాన్ని ఆవిష్కరించి గీతాన్ని ఆలపించారు. జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీకి పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. నష్టాల్లో ఈ సొసైటీని ఇప్పుడిప్పుడే లాభాల బాట పట్టించాం. ఆర్థికంగా ఈ సొసైటీని మరింత బలోపేతం చేసి రైతులకు మరిన్ని ఎక్కువ సేవలు అందించడానికి ప్రణాళిక తయారు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాయలసీమ సహకార శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ బి. శ్రీనివాసులు, సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ బాలగంగాధర్, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజరు విజయభాస్కర్, సహాయ మేనేజరు సత్యనారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీసీఎంఎస్ ఛైర్మన్ నెట్టెం వెంకటేశ్, అధికారులు

మురుగు కదలదు

విస్తరిస్తున్న కాలనీలో మురుగు కాలువల నిర్మాణం సాగడం లేదు. మురుగు ఎక్కడికక్కడ ఆగుతోంది. ప్రధాన కాలువ నిర్మాణానికి రూ.66 లక్షలతో టెండర్లు పిలిచినా ఇంకా ప్రారంభం కాలేదు. కాలువ నిర్మాణం చేపడితే ఆదర్శనగర్, ఓబుళదేవర నగర్, సెవెన్‌హిల్స్ కాలనీ మీదుగా రాంనరేష్ ఫంక్షన్‌హాల్ సమీపంలో ఉన్న ప్రధాన కాలువలోకి కలిస్తే వర్షం వచ్చినా మురుగు ఆగకుండా వెళ్తుంది. - **న్యూస్‌టుడే: అనంతపురం (అశోక్‌నగర్)**

అల్లుకున్న నిర్లక్ష్యం

నగరంలో నిత్యం వందల మంది రాకపోకలు సాగిస్తున్న దారి సమీపంలో విద్యుత్తు తీగలకు చెట్టు తీగలు ప్రమాదంగా అల్లుకున్నాయి. సమీపంలోనే నగరపాలక ఎల్ఈడీ స్క్రీన్ ఉన్నా కనీసం పట్టించుకొని పరిస్థితి ఉంది. కోర్టు రోడ్డు నుంచి రహమత్‌నగర్ వెళ్తే ప్రధాన దారిలో, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఇంటి సమీపంలో ఇలా ప్రమాదంగా తీగలు అల్లుకున్నాయి. వర్షం కురిసిన సమయంలోను నిప్పురవ్వలు వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.

- **న్యూస్‌టుడే, కమలానగర్**

ధర లేక పంటను దున్నేశారు

గొందిరెడ్డిపల్లిలో అరటి తోటను తొలగిస్తున్న రైతు శీనయ్య

రాప్తాడు, న్యూస్‌టుడే: రాప్తాడు మండల పరిధిలోని గ్రామాల్లో అరటి రైతులు పంటను అమ్ముకోలేక సందిగ్ధంలో పడ్డారు. మండలంలో దాదాపు 1803 ఎకరాల్లో అరటి సాగు అవుతుంది. అయితే ఈసారి ఎన్నడూ లేని విధంగా గిట్టుబాటు ధర లేక పోవడంతో రైతులు ఆశలు నీరుగారాయి. గెలలను కొనేందుకు వ్యాపారులు రావడం లేదు. గత నెల టన్ను 8 వేలు వరకు అమ్ముడుపోగా పెట్టుబడులు దక్కగా నేడు టన్ను వెయ్యి, 2వేలకు పతనమైంది. కూలి ఖర్చులు కూడా దక్కే పరిస్థితి లేక గెలలతో ఉన్న పంటను ట్రాక్టరు డోజర్‌తో దున్నేశారు.

అప్పులే మిగిలాయి

రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లి గ్రామంలో 300 ఎకరాలు సాగు చేశారు. నేను 4 ఎకరాల్లో ఎకరా 10 వేలు చొప్పున కౌలుకు సాగు చేశాను. ఎకరాకు 2 లక్షలు చొప్పున 8 లక్షలు పెట్టుబడి పెట్టాను. మంచి దిగుబడి వచ్చింది. గత సంవత్సరం టన్ను 25 వేలు పలికింది. ఈసారి టన్ను వెయ్యి పలుకుతోంది. చెట్లు మీద కాయలు మాగిపోతున్నా అడిగేవారు లేరు. సుమారు 16 లక్షలు నష్టపోయాం. **- మిడతల శీనయ్య. రైతు, గొందిరెడ్డిపల్లి**

ప్రాజెక్టులకు భూసేకరణ వేగంగా పూర్తి చేయాలి

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు ప్రాంతాల్లో జాతీయ రహదారులు, ప్రాజెక్టులకు భూసేకరణ వేగంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టరు శివనారాయణ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం అహుడా కార్యాలయంలో పలు శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పీజీఆర్ఎస్‌కు సంబంధించి అర్జీలు పెండింగ్ లేకుండా చేయాలన్నారు. రీ సర్వే ఫేస్ 1,2,3కి సంబంధించిన గ్రామాల్లో రీ సర్వే సకాలంలో పూర్తి చేయాలన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టరు తిప్పేనాయక్, పలు సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జేసీ శివనారాయణశర్మ

శిర్డీసాయి మందిరంలో కుంకుమార్చన

స్థానిక ఆదిమూర్తి నగర్ వేమన టెలిఫోన్ భవనం ఎదురు శిర్డీసాయిబాబా మందిరంలో గురువారం శ్రీలలిత పరమేశ్వరీదేవి కోటి కుంకుమార్చన శోభాయమానంగా జరిగింది. నెల్లూరు జిల్లా పెంచలకోన మణిద్వీప మహా సంస్థానం వ్యవస్థాపకురాలు విజయేశ్వరిదేవి మాత ఆదేశాల మేరకు జరిగిన లలితా సహస్రనామ కోటి కుంకుమార్చన కార్యక్రమంలో వెయ్యి నామాల బీజాక్షరాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు.

- **న్యూస్‌టుడే, అనంత సాంస్కృతికం**

మాట్లాడుతున్న పుష్పశ్రీరాములు

రక్షణ కల్పించండి

కమలానగర్, న్యూస్‌టుడే: తన భర్త శ్రీరాములును గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లారని కోవూర్‌నగర్‌కు చెందిన మహిళ పుష్పశ్రీరాములు వాపోయారు. గురువారం ఎన్జీవో నూతన భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కొన్ని ఏళ్లుగా తాము బెంగళూరులో నివాసం ఉంటూ కల్పవృక్ష డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ సంస్థ ద్వారా ప్రాజెక్టుల కోసం కొంతమంది దగ్గరి నుంచి పెట్టుబడులు స్వీకరించి లాభాల్లో సమానంగా పంపకాలు జరిపామన్నారు. అభివృద్ధిని ఓర్వలేక తమ సంస్థపై కొందరు తప్పుడు ఆరోపణలు చేశారన్నారు. తిరుమలేష్, ప్రియాంక, శారద, ఉమ, పూజ ఇలా కొంతమంది తమకు రూ.15 లక్షలు ఇవ్వాల్సి ఉంటే కోట్లు ఇవ్వాలంటూ నిత్యం బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. రెండు రోజుల క్రితం అనంతపురంలోని కోవూరునగర్ నివాసంలో ఉంటే తన భర్త శ్రీరాములును కొంతమంది వ్యక్తులు బలవంతంగా కారులో కిడ్నాప్ చేసి తీసుకెళ్లారన్నారు.

పర్సన్ ఇన్‌ఛార్జిగా జేసీ కొనసాగింపు

అనంత సంక్షేమం, న్యూస్‌టుడే: జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌ఛార్జిగా జేసీని కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ నియామకంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జాప్యం అవుతోంది. గతంలోనే పర్సన్ ఇన్‌ఛార్జిగా జేసీ ఉండే విధంగా ఉత్తర్వులు ఇవ్వగా ఆ గడువు ముగియడంతో మరో ఆరునెలలు కొనసాగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ అయ్యాయి.

సీఆర్ఎంటీను స్థానికంగా నియమించాలి

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: సమగ్రశిక్షా పథకంలో క్లస్టర్ మొబైల్ రిజల్ట్ టీచర్లను స్థానిక మండలాల్లో లేదా క్లస్టర్‌లోనే నియమించాలని ఆ సంఘం నాయకులు కోరారు. డీఈవో ప్రసాద్‌బాబుకి గురువారం సీఆర్పీల సంక్షేమ సంఘం నాయకులు బ్రహ్మయ్య, నరసింహామూర్తి, నాగేంద్ర, విద్య వినతిపత్రం సమర్పించారు. స్థానికంగానే విధులు నిర్వహించాలని నియమించారు. కానీ క్లస్టర్లు కుదించడంతో సీఆర్ఎంటీలు దూర మండలాలకు కేటాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువ వేతనాలకే పనిచేస్తున్నట్లు వివరించారు.

నేడు ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాదర్బార్

తపోవనం : రాప్తాడు నియోజకవర్గం పరిధిలోని అనంతపురం గ్రామీణ మండల సమస్యల పరిష్కారానికి శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే పరిటాల సునీత స్వయంగా ఈ కార్యక్రమంలో పాల్గొని అర్జీలు స్వీకరిస్తారు. ప్రజలు తమ సమస్యను అర్జీ రూపంలో రాసుకుని ఆధార్, చరవాణి నంబరు, అవసరమైన ఆధారాలు జత చేయాలని అధికారులు సూచించారు.

అవీ.. ఇవీ..

యల్లమ్మ సన్నిధిలో అన్నప్రసాద వితరణ

అనంత సాంస్కృతికం: కార్తిక మాసం ముగింపు పురస్కరించుకుని నగరంలోని ఉమానగర్ రేణుకా యల్లమ్మ ఆలయంలో గురువారం అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. మాజీ మేయర్ రాగే పరశురాం కార్పొరేటర్ బండి నాగమణి దంపతుల చేతుల మీదుగా జరిగిన ఈ కార్యక్రమానికి మునుపు ఆలయంలో యల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన కార్యక్రమం సైతం నిర్వహించారు. నిర్వాహకులు మాట్లాడుతూ.. ఏటా కార్తికమాసం ముగింపులో అన్నదానం చేయడం ఆలయ ఆనవాయితీ.

రేపు మాజీ సైనికుల సంఘం సమావేశం

తపోవనం: పారా మిలిటరీ దళాల మాజీ సైనికుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఆ సంఘం కార్యదర్శి ఎస్సీ బోస్ తెలిపారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలు, వార్షిత నివేదిక సమర్పణ, భవిష్యత్తు కార్యాచరణ రూపొందించే విషయంపై చర్చిస్తామని తెలిపారు. నగరంలోని గుల్జార్‌పేటలో ఉన్న సంఘం కార్యాలయంలో నిర్వహించే ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని పారా మిలిటరీ మాజీ సైనికులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పొరుగు వారి పరిరక్షణ ముఖ్యం

కమలానగర్, న్యూస్‌టుడే : ఆదర్శ సమాజం కోసం పొరుగు వారి హక్కుల పరిరక్షణ ముస్లింల ముఖ్య కర్తవ్యమని జమాతే ఇస్లామీ హింద్ అనంతపురం యూనిట్ జిల్లా అధ్యక్షుడు రఫీ పేర్కొన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆదర్శ పొరుగు వారు ఆదర్శ సమాజం ఉద్యమ పరిచయం అనే బ్రోచర్‌ను విడుదల చేసి మాట్లాడారు. తన పొరుగు వారితో సత్ప్రవర్తన కలిగిన వ్యక్తియే అల్లాహ్ దృష్టిలో ఉత్తముడు అని దైవ ప్రవక్త ముహమ్మద్ తెలిపారన్నారు. పొరుగు వారి హక్కుల కోసం తన యూనిట్ ఆధ్వర్యంలో ప్రచారం కల్పిస్తామన్నారు. నగర అధ్యక్షుడు నవాజ్ అహ్మద్, మహిళా విభాగం బాధ్యులు అయేషా, అఖిలా, బాను, రేష్మా పాల్గొన్నారు.

కబడ్డీలో విద్యార్థిని సత్తా

అనంతపురం విద్య: రాష్ట్రస్థాయి బాలికల కబడ్డీ పోటీల్లో అనంతపురం జట్టు విజయం సాధించింది. ఆ జట్టులో నలంద జూనియర్ కళాశాలకు చెందిన ప్రియాంకరెడ్డి సభ్యురాలిగా ఉన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరచినందుకు కళాశాల ప్రిన్సిపల్ ఖాజీ బాబు, తదితరులు అభినందించారు.

ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: కారు అదుపు తప్పి ముగ్గురికి గాయాలైన ఘటన మండలంలోని వడ్డుపల్లి టోల్‌గేట్ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. అనంతపురానికి చెందిన ప్రేమ్ కుమార్ కుటుంబ సభ్యులతో పంపనూరు నగర వనానికి వచ్చారు. పని ముగించుకొని తిరిగి అనంతపురం కారులో వెళుతున్నారు. టోల్‌గేట్ సమీపంలోకి రాగానే కారు టైరు పగిలి రోడ్డు పక్క ఉన్న గుంతలోకి వెళ్లిపోయింది. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలు కాగా.. వారిని అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

అరగంట అని ఆరు నెలలైనా ఇవ్వలేదు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అర గంటలో పిల్లలను స్కూలుకు వదిలేసి వస్తానని చెప్పి మిత్రుడి బైకును తీసుకెళ్లి.. ఆరు నెలలైనా తిరిగివ్వక పోవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. శ్రీకాంత్ ఉమానగర్‌లో నివశిస్తున్నాడు. ఆరు నెలల క్రితం మిత్రుడు మునీంద్ర వచ్చి పిల్లలను పాఠశాలకు వదిలేసి వస్తాను. ద్విచక్ర వాహనం ఇవ్వాలని త్వరగా వస్తానని తీసుకెళ్లాడు. అర గంట దాటినా రాకపోవడంతో చరవాణికి ఫోన్ చేశాడు. కాల్‌కు స్పందించలేదు. తన ద్విచక్ర వాహనం ఇవ్వాలనీ, ఫోన్ చేసినా, ఇంటి వద్దకు వెళ్లి అడిగినా పట్టించుకోలేదు. విసిగిపోయిన బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బడికి పంపాలంటే భయమే!

పిల్లలకు పుస్తకాల బరువు తగ్గించాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలున్నా కానీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. పుస్తకాలకే వేలాది రూపాయలు చెల్లించాల్సిన పరిస్థితి. చిన్నచిన్న పిల్లలు కూడా ఐదారు కేజీల బరువున్న పుస్తకాల సంచి మోసుకుంటూ వెళ్లాల్సిందే. పిల్లల స్థాయికి మించి పుస్తకాల బరువు మోయిస్తున్నారు. కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు పిల్లలను ఆటోల్లో ప్రమాదకరంగా ఉన్నా అలానే పంపిస్తున్నారు. చాలా బడి బస్సుల భద్రతపై అనుమానాలున్నాయి. అనేక చోట్ల పాఠశాల బస్సులు ప్రమాదానికి గురవుతున్నా చర్యలు లేవు. ప్రైవేటు ఆటోల్లో విద్యార్థుల ప్రయాణం మరింత ఆందోళన కలిగిస్తోంది. బహుళ అంతస్తు భవనాల్లోనే ఎక్కువగా పాఠశాలలున్నాయి అగ్ని ప్రమాదాలు జరిగితే అంతే సంగతులు. ఈ విషయంపై హెచ్చరికలు, పరిశీలనలు ఏమాత్రం ఉండటం లేదు - **న్యూస్‌టుడే, ఎస్కేయూ**

పుస్తకాల బరువు అమ్మ మోయాల్సిందే

నిత్యం ఇలా ఆటోలో ప్రయాణం భద్రమేనా?

గ్రంథాలయాలకు వెళ్లడం అలవాటుగా మారాలి

విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న రవికాంత్ రమణ, కార్యదర్శి రమ

అనంత సంక్షేమం, న్యూస్‌టుడే: విద్యార్థులకు గ్రంథాలయాలకు వెళ్లడం అన్నది అలవాటుగా మారాలని సామాజిక వేత రవికాంత్ రమణ పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన గత వారం రోజులుగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, పలు రకాల ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ, డిప్యూటీ లైబ్రేరియన్ కమ్మన్న సహ గ్రంథాలయాధికారి గోవిందు పాల్గొన్నారు.

అనంత నగరపాలక: డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు నిర్వహించిన స్వీయ అవగాహన ఆకట్టుకుంది. గురువారం నగరంలోని గ్రంథాలయాల్లో అధికారి శ్రీపతి అవగాహన కల్పించారు. సామూహిక స్వీయ పఠనం అన్నది అందరూ కలిసి ఓ చోట కూర్చొని నచ్చిన పుస్తకాన్ని చదువుకోవచ్చు అన్నారు. అరుదైన పుస్తకాలు, పురాతన పత్రాలు, పుస్తకాలు డిజిటలైజ్ చేయడం ద్వారా భవిష్యత్తు తరాలకు భద్రపరచవచ్చు అన్నారు.

(c) eenadu

ఈనాడు అన్నమయ్య
శుక్రవారం నవంబరు 21, 2025

మధ్యాహ్న భోజన వంట ఛార్జీల పెంపు

గాలివీడు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో భోజనం తయారీ ఛార్జీలను పెంచుతూ మధ్యాహ్న భోజనం, పాఠశాల పారిశుద్ధ్య విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పెంచిన ఛార్జీలు ఆగస్టు 8 నుంచి అమల్లోకి వస్తాయని పేర్కొంది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు కార్యాలయాలకు చేరాల్సి ఉంది.

తరగతి	ప్రస్తుత ఛార్జీ	పెంపు (ఒక్కో విద్యార్థికి రూ.లలో)
1-5	5.45	6.19
6-8	8.17	9.29
9 - ఇంటర్	8.17	9.29

పల్లకీలో ఊరేగిన వీరభద్రుడు

రాయచోటి, న్యూస్‌టుడే: కార్తిక అమావాస్యను పురస్కరించుకుని రాయచోటి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో గురువారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే ఆలయ ప్రాంగణంలోని అఘోర లింగేశ్వరుడి ఆలయం ఎదుట భక్తులు కార్తిక దీపాలు వెలిగించారు. రాత్రివేళ స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి పల్లకీపై మాడవీధుల్లో ఊరేగించారు.

జడ్పీలో ఉద్యోగోన్నతులు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: జడ్పీ పరిధిలో సీనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న పలువురికి డిప్యూటీ ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ, జీఏస్‌డబ్ల్యూఎస్ సెక్రటరీ కాటమనేని భాస్కర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం ఇరవై మందికి ఉద్యోగోన్నతులు కల్పించగా.. అందులో లింగారెడ్డి, అనురాధ ఇప్పటికే ఉద్యోగ విరమణ చేయడంతో 18 మందికి వర్తించనుంది. వీరికి వైఎస్సార్ కడప, అన్నమయ్య, సత్యసాయి జిల్లాలు కేటాయించారు.

నియోజకవర్గానికి పది మూడు చక్రాల మోటార్ సైకిళ్లు

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లాలోని శారీరక విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల మోటార్ సైకిళ్లు అందించనున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అధికారి కృష్ణకిశోర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గానికి పది చొప్పున మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఔత్సాహికులు ఈ నెల 25వ తేదీలోపు ఏపీడీఏఎస్‌సీఏఎస్.ఏపీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 18 నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగి.. 70 శాతం కంటే ఎక్కువ వికలత్వం కలిగి ఉన్నట్లు తెలిపే సదరం ధ్రువీకరణ పత్రం ఉండాలని, కుటుంబ వార్షికాదాయం రూ. 30 వేలు కంటే ఎక్కువ ఉండకూడదని తెలిపారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం చెల్లుబాటయ్యే లైసెన్స్ కలిగి ఉండాలని, గతంలో ప్రభుత్వం, ఏ ఇతర ప్రైవేట్ ఏజెన్సీ నుంచి వాహనం పొంది ఉండకూడదని వివరించారు.

కొత్తపేట.. కళాకారుల కోట

పుల్లంపేట, న్యూస్‌టుడే: పుల్లంపేట మండలంలోని కొత్తకోట. ఈ ఊరి పేరు చెప్పగానే కళాకారులు గుర్తుకొస్తారు. జీవనోపాధికి చేసే పనులు ముగిసిన తర్వాత పలువురు ఒకేచోట చేరతారు. నాటికలు సాధన చేయడం, పద్యాలు ఆలపించడంలో మునిగిపోతారు. ఇతర ప్రాంతాలకు వెళ్లి నాటకాలు ప్రదర్శిస్తారు. ఈ క్రమంలోనే పలువురు సినీ రంగం వైపు కూడా అడుగులేస్తున్నారు. అటువంటి వారిలో సాకే వెంకట రమణ అనే యువకుడు ఒకరు. ఇతని తల్లిదండ్రులు రామయ్య, కాంతమ్మ. పుట్టి పెరిగిందంతా కొత్తకోట. వెంకట రమణకు చిరుప్రాయం నుంచే సంగీతంపై మక్కువ ఎక్కువ. సాయంత్రం వేళల్లో కళాకారుల సాధన, దేవాలయాల్లో భజన కార్యక్రమాలకు వెళ్తుండేవాడు. కళాకారులకు సహాయకారిగా ఉండేవాడు. ఎప్పటికైనా తాను మంచి కళాకారుడిగా పేరు తెచ్చుకోవాలని తాపత్రయ పడేవారు. అయినా చదువును నిర్లక్ష్యం చేయలేదు. చెన్నైలో సీఏ పూర్తి చేసిన అనంతరం హైదరాబాద్ వెళ్లారు. ప్రైవేట్ ఉద్యోగం చేస్తూనే సంగీతంపై దృష్టిసారించారు. బీమిశెట్టి కోదండ రామయ్య, అనమల మల్లికార్జున, గీతాంజలి, శ్యామ్ వద్ద శిక్షణ పొందారు. దివంగత సినీ గాయకుడు రామకృష్ణ వద్ద పాటలు పాడటంలో మెలకువలు నేర్చుకున్నారు. ఆ తర్వాత మాయ మహల్, నువ్వెవరో నేనెవరో, శ్రీనుగాడి పెళ్లి' చిత్రాలకు పాటలు, సంగీతం అందించారు. ప్రస్తుతం సొంత బ్యానర్‌పై 'ప్రేమలో రెండోసారి' సినిమాను తెరకెక్కించారు. ఈ చిత్రంలో ఆ గ్రామ సర్పంచి మణికంఠ, మరో యువకుడు సురేష్ కూడా నటించడం విశేషం.

1) 'ప్రేమలో రెండోసారి' చిత్రంలోని సన్నివేశం 2) వెంకట రమణ 3) సురేష్ 4) మణికంఠ, కొత్తపేట సర్పంచి

దాగుడుమూతల దందాకోర్

◆ అడంగళ్లలో అనుమానాస్పద నమోదులు
◆ సీకే దిన్నెలో ఆగని 'భూ'చోళ్ల అక్రమాలు

కడప నగరంలోని ఈఫీఎఫ్ భవన్ ఎదుట ఉన్న స్థలం

ఈనాడు, కడప: తినమరిగి'నోళ్లు' ఆగడం లేదు. విలువైన భూములు కొట్టేసేందుకు వక్ర మార్గాలు పడుతున్నారు. తమతో అంటకాగే అధికారులతో కలిసి కొట్టేసే కుయుక్తులు పన్నుతున్నారు. ఇందుకుగాను దస్త్రాల్లో నమోదు చేసే వివరాలతో దాగుడు మూతలు ఆడుతున్నారు. అనుమానాస్పద వివరాలతో తమ పరం చేసుకునేందుకు చూస్తున్నారు. అందుకుగాను రెవెన్యూ గ్రామంలో పలు సర్వే నంబర్లలో పట్టాదారు, అనుభవదారుని పేర్ల వద్ద నివాస గృహాలుగా నమోదు చేశారు. సాధారణంగా వ్యక్తుల పేర్లు ఉండాల్సిన చోట నివాస గృహాలుగా నమోదు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- కడప నగరంలోని భవిష్య నిధి(ఈపీఎఫ్) భవన్ ఎదుట ఉన్న విలువైన స్థలం. దస్త్రాల్లో ప్రభుత్వ భూమిగా నమోదై ఉంది. ఆచరణలో మాత్రం కడప నగర కార్పొరేషన్ పాలకవర్గంలోని ఓ వైకాపా ప్రజాప్రతినిధి చేతిలో ఉండిపోయింది.
- కమలాపురం నియోజకవర్గం సీకే దిన్నె మండలం విశ్వనాథపురం రెవెన్యూ గ్రామంలో భూముల విలువ పెరిగింది. ఇక్కడ సెంటు భూమి విలువ రూ.10 లక్షలు పలుకుతోంది. దీంతో దాదాపు రూ. 3.50 కోట్ల విలువైన సర్వే నంబరు 13లోని 34 సెంట్ల ప్రభుత్వ భూమిని కొట్టేయడానికి వైకాపా నేత ఒకరు పావులు కదుపుతున్నారు.

వాగునూ మింగేసే యత్నం

సీకేదిన్నె మండలంలోని ఊటుకూరు రెవెన్యూ గ్రామంలో సర్వే నంబరు 235/5లో 0.47 సెంట్లు, 235/12లో 0.73 సెంట్లు చీమల గంగమ్మ పేరిట డీకేటీ పట్టా ఇచ్చినట్లు వెబ్‌ల్యాండ్ అడంగల్‌లో చూపుతోంది. ఈ భూమంతా రెవెన్యూ రికార్డు ఆర్ఎస్ఆర్ ప్రకారం 42.78 ఎకరాలు వాగుగా కనిపిస్తోంది. ఇక్కడే అసలు మతలబు ఉంది. వాగును మింగేసేందుకు డీకేటీ పట్టా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై కడప నగరానికి చెందిన కొందరు కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు.

మరికొన్ని భూములకు

కడప నగర పరిధిలోని విలువైన భూముల ఖరీదు భారీగా ఉండటంతో సీకే దిన్నె మండలంపై అక్రమార్కుల కళ్లు పడ్డాయి. కొన్ని స్థలాలకు సంబంధించి రిమార్కుల వద్ద కూడా తహసీల్దార్ సంతకం లేకపోయింది. గతంలో చోటుచేసుకున్న అక్రమాలపై ఉన్నతాధికారులు ఇప్పటికే ప్రత్యేక దృష్టి సారించారు. ఓ వైపు రద్దు పర్వం సాగిస్తున్నారు. అదే సమయంలో మరో వైపు ఆక్రమణలకు అధికారిక ముద్ర వేసుకునేందుకు భూచోళ్లు ఎత్తులు వేస్తూనే ఉండటం గమనార్హం.

సివిల్ సర్వీస్ పరీక్షలకు ఉచిత శిక్షణ

రాయచోటి, న్యూస్‌టుడే: యూపీఎస్సీ సివిల్ సర్వీస్ పరీక్షలకు సన్నద్ధమయ్యే బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఆర్.నాగేంద్రరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర బీసీ స్టడీ సర్కిల్ విజయవాడ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఉంటుందని.. అభ్యర్థులకు ఉచితంగా భోజన, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డిసెంబర్ 5న స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందని, అర్హత సాధించిన వారికి 10 నుంచి గొల్లపూడిలోని ఏపీ బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో శిక్షణ ఉంటుందని వివరించారు. ఔత్సాహికులు రాయచోటిలోని రాజంపేట రోడ్డులో ఉన్న మైనార్టీ ఐటీఏ కార్యాలయంలో ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తులు అందజేయాలని కోరారు.

ఆమె ఆరోగ్యానికి అభయం

హెల్త్ పాయింట్ పర్సన్ల నియామకం

జిల్లాలో వెలుగు సంఘాలు	అందులో చేపట్టిన నియామకాలు
1,057	1,018

జిల్లాలోని గ్రామ సంఘాలు	అందులో హెచ్‌పీపీల నియామకం
29,676	27,865

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే: అతివలు ఆకాశంలో సగం. ఇంటి నిర్వహణలో వారే కీలకం. తీరిక లేని పనులతో సతమతం అవుతుంటారు. కుటుంబ సభ్యులను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నా.. తమ ఆరోగ్యంపై మాత్రం కొందరు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ విషయాన్ని పాలకులు గుర్తించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు అనేక పథకాలు అమలు చేస్తోంది. అదే సమయంలో వారి ఆరోగ్యం పైనా దృష్టి సారించింది. 2016లో వెలుగు మహిళల ఆరోగ్యాన్ని పర్యవేక్షించేందుకు హెల్త్ రిసోర్స్ పర్సన్లు నియమితులయ్యారు. వైకాపా ప్రభుత్వం వీరిని తొలగించింది. కూటమి ప్రభుత్వం తిరిగి హెల్త్ పాయింట్ పర్సన్స్ పేరుతో నియామకానికి చర్యలు చేపట్టింది.

- **సమావేశాల్లో ఆరా:** వెలుగు పథకంలోని ప్రతి మహిళా సంఘానికి ఒక హెల్త్ పాయింట్ పర్సన్‌ను నియమించేలా అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలో కొన్ని మండలాలకు ఇప్పటికే పూర్తయింది. మిగిలిన చోట్ల త్వరలో చేపట్టనున్నారు. గ్రామ, , మండల స్థాయిలో ఆరోగ్య కమిటీలు ఉంటాయి. ప్రతి నెలా మహిళలు సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్న సమయంలో సభ్యుల ఆరోగ్య పరిస్థితులపై కమిటీలు ఆరా తీస్తాయి. సమస్యలు తెలుసుకుని వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటాయి. ఈ విషయమై వెలుగు పీడీ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మహిళా సంఘం సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు, వారి ఆరోగ్య భద్రతకు సంఘానికో హెల్త్ పాయింట్ పర్సన్ ఉంటారన్నారు. అవసరమైన వారికి దగ్గరుండి వైద్య సేవలు అందిస్తామని చెప్పారు.

బాల్యం.. చిక్కిశల్యం

పోషకాహార లోపంతో బరువులో తేడాలు

ఓ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారి బరువు నమోదు చేస్తున్న సిబ్బంది

జిల్లాలో మొత్తం చిన్నారులు	కొలతలు నమోదు చేసిన సంఖ్య	వయసుకు తగిన ఎత్తు లేని బాలలు	బరువు తక్కువగా ఉన్న పిల్లలు
76,925	76,506	4,915	2,528

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులకు పోష్టికాహారం అందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. అయినా క్షేత్రస్థాయిలో కొందరు అధికారులు, సిబ్బంది, నిర్లక్ష్యం., తల్లిదండ్రుల అవగాహనా లోపం వెరసి బాల్యం బక్కచిక్కుతోంది. వయసుకు తగ్గ ఎత్తు, బరువు, లేని పిల్లల సంఖ్య పెరుగుతోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంటోంది.

- **శాపంగా అవగాహనా లోపం:** అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న సరకులను క్షేత్రస్థాయి అధికారులు సక్రమంగా ఇవ్వడం లేదనే విమర్శలు చాలా చోట్ల వెల్లువెత్తుతున్నాయి. కొన్నిచోట్ల పంపిణీ సక్రమంగా చేపట్టినా అవగాహనా లోపంతో తల్లిదండ్రులు తమ చిన్నారులకు పెట్టేందుకు ఇష్టపడటం లేదు. అదే సమయంలో దుకాణాల్లో దొరికే కొన్ని చిరుతిండ్లకు అలవాటు పడి అనారోగ్యం పాలవుతున్నారు. ముఖ్యంగా గర్భిణిగా ఉన్న సమయంలో మంచి ఆహారం తీసుకోకపోవడం కూడా పిల్లల ఎదుగుదలపై ప్రభావం చూపుతోంది.
- **ఇలా చేస్తే ప్రయోజనం:** ● పిల్లలను శీతల పానీయాలు, బయట ఆహారానికి దూరంగా ఉంచాలి. ● చిరుధాన్యాలు, పప్పుధాన్యాలతో కూడిన పదార్థాలు పెట్టాలి. ● సెల్‌ఫోన్లకు బానిస కాకుండా చూడాలి. ● ఆకుకూరలు, కూరగాయలతో కూడిన ఆహారం అందించాలి. ● పండ్లు, ఎండు ద్రాక్ష, బాదం వంటివి కూడా అందిస్తే మరింత మంచిది. ● ఈ విషయమై ఐసీడీఎస్ పీడీ హైమావతి మాట్లాడుతూ.. వయసుకు తగ్గ బరువు, ఎత్తు లేని చిన్న పిల్లలపై ప్రత్యేక దృష్టిపెడతామన్నారు. అటువంటి వారికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు.

టమాటకు కాస్త ఊరట

చిన్నమండెం, న్యూస్‌టుడే: నిన్నటి వరకు టమాల ధరలు పాతాళం వైపు పరుగులు తీశాయి. తాజాగా చిన్నమండెం ప్రాంతంలో తోటల దగ్గర 30 కిలోల పెట్టె గురువారం రూ. వెయ్యి పలికింది. దాదాపు మూడున్నర నెలల తర్వాత ఈ ధర పలకడం గమనార్హం.

- మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, రాయచోటి నియోజకవర్గాల్లో పలువురు రైతులు సీజన్‌తో పని లేకుండా సంవత్సరం పొడవునా టమాట సాగు చేస్తారు. చిన్నమండెం మండలంలోని కలిబండ రోడ్డు నుంచి గతంలో రోజూ ఇరవై వరకు మినీ లారీలు దిగుబడులు తీసుకెళ్లేవి. కాయలు తగ్గిపోవడంతో వ్యాపారులు ఇప్పుడు ఆటోలు, బొలెరో వాహనాల్లో మార్కెట్లకు తరలిస్తున్నారు.

● జులైలో 30 కిలోల పెట్టె రూ. 980 పలకగా ఆ తర్వాత క్రమేణా తగ్గింది. ● గత నెల 22న రూ. 800కు దిగజారింది. ఆ తర్వాత మరింత తగ్గుతూ రూ. 350కి చేరింది. ● ఈ నెల 1న రూ. 450 పలకగా రోజు రోజుకూ పెరుగుతూ 16న రూ. 820, 19న రూ. 920, 20న రూ.1,000 పలికింది. ● మదనపల్లె మార్కెట్‌లో మొదటి రకానికి రూ. 1,300 వరకు లభించినట్లు రైతులు తెలిపారు.

బ్యాంకుల్లో ఎవరూ తీసుకోని నిధులు రూ.80 కోట్లు

సమావేశంలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు

పీలేరు, న్యూస్‌టుడే: జిల్లాలోని బ్యాంకు శాఖల ద్వారా ఈ ఏడాది ఇప్పటి వరకు రూ. 11,485 కోట్ల రుణాలు పంపిణీ చేసినట్లు జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు తెలిపారు. పీలేరులో గురువారం నిర్వహించిన బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు వ్యవసాయానికి రూ. 8,089 కోట్లు, చిన్నపరిశ్రమలకు రూ. 82 కోట్లు, సేవా రంగాలకు రూ. 929 కోట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఇళ్ల నిర్మాణాలు, విద్యా రుణాలు, చిరు వ్యాపారులకు ముద్రా రుణాలు ఇచ్చే దిశగా ఆలోచించాలని సూచించారు. బ్యాంకుల్లో 3,40,000 మంది ఖాతాదారులకు సంబంధించి రూ. 80 కోట్ల వరకు క్లెయిమ్ చేయని నిధులు ఉన్నాయని తెలిపారు. ఖాతాదారులను గుర్తించి అలాంటి ఖాతాలను నవీకరణ చేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్డీఏ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి, వ్యవసాయాధికారి రమాదేవి, ఏపీఎంలు జవహర్, రమేష్ బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

జీవన ప్రమాణం అవసరం లేదు ప్రయాణం

కలకడ, న్యూస్‌టుడే: పింఛను పొందేందుకు జీవన ప్రమాణ పత్రం(లైఫ్ సర్టిఫికెట్) సమర్పించడం ఎంతో అవసరం. పింఛనుదారులకు ఈ విషయం ఏటా ఓ ప్రహసనంలా ఉండేది. సమర్పించేందుకు ప్రయాస పడేవారు. మీసేవా, నెట్ సెంటర్ల చుట్టూ తిరిగేవారు. ప్రస్తుతం ఇంటి నుంచి కాలు బయట పెట్టకుండానే సమర్పించే అవకాశాన్ని కేంద్రం కల్పించింది. చరవాణిలో ముఖ ఆధారిత గుర్తింపు ద్వారా ఇంటి నుంచే పత్రం పొందేలా యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.

- **గతంలో పత్రం పొందనివారైతే:** వివరాలను కొత్తగా నమోదు చేయాలి. పేరు, పీపీవో నంబరు, బ్యాంకు, డిపార్టుమెంట్, పింఛను మంజూరు ఏజెన్సీ వివరాలు సమర్పించాల్సి ఉంటుంది. ఆ తర్వాత రౌండ్ సర్కిల్‌లో ముఖం స్పష్టంగా కనిపించేలా ఫొటో తీసుకుంటే ప్రక్రియ పూర్తయినట్లు సందేశం వస్తుంది.
- **ఇలా నమోదు:** ● గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి జీవన్ ప్రమాణ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయాలి. ● ఆధార్ సంఖ్య, చరవాణి నంబరు, ఈ-మెయిల్ ఐడీ అందులో నమోదు చేసి సమర్పించాలి. ● అనంతరం చరవాణికి ఓటీపీ వస్తుంది. అది నమోదు చేయగానే ముఖ ఆధారిత గుర్తింపు నిర్ధారణ కోరుతుంది. ● చరవాణిలో వచ్చే సర్కిల్ వద్ద ముఖం కనిపించేలా స్పష్టంగా కెమెరా ఉంచాలి. పచ్చటి గీతతో సర్కిల్ వచ్చి సందేశం చేరితే రిజిస్ట్రేషన్ పూర్తయినట్లే. ● ఆ తర్వాత యాప్ మూసి వేసి మళ్లీ తెరవాలి. ● అనంతరం ఆధార్ సంఖ్య, చరవాణి నంబరు, ఈ-మెయిల్ ఐడీ అడుగుతుంది. ఈ వివరాలు నమోదు చేసి సమర్పిస్తే పింఛను వివరాలు ప్రత్యక్షమవుతాయి.

422 పాఠశాలలకు బోధనా సామగ్రి

పీలేరు, న్యూస్‌టుడే: ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆసక్తిగా బోధించేందుకు వినూత్నంగా 'జాదుయ్ పితారా' పేరుతో ప్రత్యేక కిట్లు పాఠశాలలకు సరఫరా అయ్యాయి. జిల్లాలో విద్యార్థుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని 422 ఆదర్శ పాఠశాలలకు వీటిని అందించారు. ఎంఈవో కార్యాలయాల నుంచి ప్రత్యేక వాహనంలో వీటిని ఉపాధ్యాయులకు స్వాధీనం చేస్తున్నారు. జాదుయ్ పితారా కిట్‌లో మొత్తం 52 రకాల వస్తువులుంటాయి. వీటిని ఉపయోగించి ఉపాధ్యాయులు బోధించాల్సి ఉంటుంది.

SBMC RENIGUNTA
SRI BALAJI MEDICAL COLLEGE
HOSPITAL & RESEARCH INSTITUTE
New Airport Road, Renigunta, Tirupati - 517520
WANTED
HOSPITAL
- Marketing Executives
- Marketing Telecallers
- Nurses (GNM / B.Sc.)
- Ward Boys
COLLEGE
- Accountant's
- Telecallers & Councellers
- HR Executives & Managers
- Hostel Wardens (Male & Female)
- Securities (Male & Female)
E-mail: info.sbmch@gmail.com
Mobile : 8106497638, 8125465490

అతకని గతుకులు

ఏడాది తిరక్కుండానే మళ్లీ అవస్థలు

పీలేరు - కడప మార్గంలో లేచిపోయిన ప్యాచ్‌లు

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం రహదారుల నిర్వహణను గాలికొదిలేసింది. దీంతో భారీ గుంతలతో వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రమాదాల బారిన పడి పలువురు ప్రాణాలు పోగొట్టుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గుంతలు పూడ్చేలా చర్యలు చేపట్టింది. ప్యాచ్‌లకుగాను జిల్లాకు నిధులు మంజూరు చేసింది. వీటితో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి రోడ్లపై ప్యాచ్‌ల పనులను అధికారులు చేపట్టారు. రోడ్డుపై ఉన్న ప్రతి గుంతనూ పూడ్చించారు. ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ప్రయాణాలు సాఫీగా సాగుతాయని ఆశించారు. ప్యాచ్‌లు కొంతకాలం పాటు ఫర్వాలేదనిపించాయి. ఏడాది తిరక్కుండానే తిరిగి గుంతలు ఏర్పడుతున్నాయి. నాసిరకంగా పనులు చేపట్టడమే కారణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం స్పందించి నాణ్యతగా పనులు చేయిస్తే బాగని కోరుతున్నారు.

మంజూరైన నిధులు	గుంతలు పూడ్చిన విస్తీర్ణం	మదనపల్లె డివిజన్ పరిధిలో	గుంతలు పూడ్చిన పరిధి
రూ.16 కోట్లు	1,444 కిలో మీటర్లు	మంజూరు: రూ. 4 కోట్లు	700 కిలో మీటర్లు

మార్పుతోనే సిరిమాలక్ష్మి



రైతులు సాగు చేసిన బీర పంట

రామాపురం, న్యూస్‌టుడే: జిల్లాలోని రైతులు ఏళ్ల తరబడి ఒకటే రకమైన పంట సాగుకు పరిమితమయ్యారు. గతంలో వరి, చెరకు, వేరుసెనగ, రాగులు, కూరగాయలు, మల్బరీ వంటివి పండించేవారు. ఆ తర్వాత వరి, వేరుసెనగ, టమాట పంటలకే పరిమితమయ్యారు. దీంతో భూసారం కోల్పోతూ ఎరువులు ఎక్కువ వినియోగించాల్సిన పరిస్థితి. తెగుళ్లూ వ్యాపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు పంట మార్పుపై విస్తృతంగా ప్రచారం చేపట్టారు. క్షేత్రస్థాయిలో తిరుగుతూ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. కొత్త పంటలతో తెగుళ్ల నివారించవచ్చని, అధిక దిగుబడి పొందవచ్చని చెబుతున్నారు. ఈ క్రమంలోనే వేరుసెనగతో పాటు కూరగాయలు, పూలు, ఆకుకూరల సాగు వైపు రైతులను మళ్లిస్తున్నారు. ఈ విషయమై ఉద్యాన శాఖ లక్కిరెడ్డిపల్లె క్లస్టర్ అధికారిణి సింధూరి మాట్లాడుతూ.. రైతులు చాలా మంది ఆకుకూరలు, కూరగాయలతో మంచి ఆదాయం పొందుతున్నారన్నారు. ఒకే రకం పంటలు కాకుండా మారిస్తే మంచి దిగుబడులు వస్తాయని చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి రాయితీలు కూడా అందుకునే వీలుందని తెలిపారు.

జిల్లాలో పంట సాగు వివరాలు ఇలా... రకం	వరి	వేరుసెనగ	రాగులు	మొక్కజొన్న	సజ్జలు	కంది	కూరగాయలు
విస్తీర్ణం (హెక్టార్లలో)	8,653	6,979	362	2,354	182	482	27,194

ప్లేట్ ఫిరాయిస్తే మోత మోగుద్ది

◆ ఆరు నెలల్లో 3,223 కేసులు

నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన నంబరు ప్లేట్

- ఆర్టీవో పరిధి: మదనపల్లె
- నమోదైన కేసులు: 3,223
- వసూలు చేసిన అపరాధ రుసుం: రూ. 3,40,97,246 (2025 జనవరి నుంచి అక్టోబర్ 31 వరకు)

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: కొత్త వాహనాలు కొన్న తర్వాత నంబరు ప్లేటు రవాణా శాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండాల్సిందే. నిబంధనలు అతిక్రమించి ఇష్టానుసారం ఏర్పాటు చేయించుకుని రోడ్డెక్కితే జరిమానాల మోత తప్పదు. ఈ విషయాన్ని విస్మరిస్తున్న పలువురు ఇష్టారీతిన నంబరు రాయించుకుని ఊరేగుతున్నారు. మరికొందరు తమవో, ఇష్టమైన రాజకీయ నాయకుల పేర్లో రాసుకుని తిరుగుతున్నారు. ఇటువంటి వాటిపై మోటారు వాహనాల చట్టం కింద అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు.

- **ఇవీ నిబంధనలు:** ● రవాణా శాఖ వాహనాలకు ప్రత్యేకమైన కొన్ని మార్గదర్శకాలతో నంబరు ప్లేట్లను మంజూరు చేస్తుంది. ● రవాణేతర(నాన్ ట్రాన్స్‌పోర్ట్) వాహనాలకు నంబరు ప్లేట్‌ను తెలుపు రంగులో, రవాణా వాహనాలకు(ట్రాన్స్‌పోర్ట్) పసుపు రంగును కేటాయించారు. వీటిపై నలుపు రంగు అక్షరాలతో మాత్రమే నంబర్లు రాయాల్సి ఉంటుంది. ● విద్యుత్తు వాహనాలకు ఆకుపచ్చ రంగు ప్లేట్‌పై తెలుపు రంగు అక్షరాలతో నంబరు ఉండాలి. ● నంబరు ప్లేట్ కూడా రవాణా శాఖ సూచించిన నిబంధనల మేరకు నిర్ణీత పరిమాణం, మందంతో ఉండాలి. ● కొన్నింటికి హైసెక్యూరిటీ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి ప్లేటుపై వాహనానికి కేటాయించిన నంబరు, అక్షరాలు తప్ప మరేమీ రాయకూడదు. ● నిబంధనలు అతిక్రమిస్తే ట్రాఫిక్ పోలీసులు జరిమానాలు విధించొచ్చు.
- **వాహనాలూ స్వాధీనం చేసుకోవచ్చు:** నంబర్ ప్లేట్లపై మదనపల్లె ఆర్టీవో అశోక్ ప్రతాప్‌రావ్ మాట్లాడుతూ.. రవాణా శాఖ నిబంధనలకు అమర్చుకోవాల్సిందేనని సూచించారు. ఎటువంటి పేర్లు, ఫొటో లున్నా నేరమేనని చెప్పారు. నిర్ణీత రంగులు కాకుండా వేరేవి అమర్చుకుంటే జరిమానా తప్పదన్నారు. పదే పదే పట్టుబడితే వాహనాలు స్వాధీనం చేసుకునే అధికారం కూడా ఉందని తెలిపారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి : కడప 99899 97626
మదనపల్లి 80080 01768

(c) eenadu

ప్రజాదర్బార్‌లో ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి: మంత్రి

చిన్నమండెం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతని రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బోడిరెడ్డిగారిపల్లెలోని తన నివాసంలో గురువారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించారు. ఎక్కువగా భూ సమస్యలు వస్తుండడంతో ప్రత్యేక చొరవ తీసుకొని సంబంధిత అధికారులతో అప్పటికప్పుడే మాట్లాడి పరిష్కారానికి ఆదేశాలిచ్చారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మాట ఇచ్చినట్టుగానే రెండో విడత అన్నదాత సుఖీభవ రైతుల ఖాతాల్లో జమ చేశారన్నారు. నియోజకవర్గ రైతులకు రూ.26 కోట్లు ఇవ్వడం గమనార్హమన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నట్లు వివరించారు.

వైకాపా హయాంలో నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటి పురపాలకలో నిధుల వ్యయంపై అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించారు. 2019-2024 మధ్య చెత్త సేకరణ, డంపింగ్ యార్డు నిర్వహణ విషయంలో భారీగా నిధులు పక్కదారి పట్టాయనే ఆరోపణలు వచ్చాయి. డంపింగ్ యార్డులో ఏపీ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కింద పచ్చదనం పెంపు, అంతర్గత రహదారుల పనులు చేపట్టారు. అప్పట్లో సుమారు రూ.కోటి వరకు నిధులు వెచ్చించారు. నిధుల వినియోగంలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయనే ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో డంపింగ్ యార్డులపై విజిలెన్సు అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆ జాబితాలో ఉన్న రాయచోటి పురపాలక డంపింగ్ యార్డులో గురువారం విజిలెన్సు అధికారులు తనిఖీలు నిర్వహించారు. యార్డు ప్రాంతంలో బ్యూటిఫికేషన్ చేసిన ప్రాంతాలు, అంతర్గత రహదారులు, ఇతర పనులను కొలతలు వేసి తనిఖీ చేశారు. చెత్త సేకరణ, తరలింపు సిబ్బందితో పాటు గతంలో ఇక్కడ పని చేసిన పురపాలక కమిషనర్లు, ఇంజినీరింగ్ అధికారులు ఈ తనిఖీలలో పాల్గొన్నారు.

మన మిత్ర.. సేవల్లో కీలకపాత్ర

రాయచోటి, న్యూస్‌టుడే: ధ్రువపత్రాలకు కాగితాలు చేత పట్టుకొని కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటారు. వీఆర్వో, గ్రామ కార్యదర్శి, మండల, డివిజన్, జిల్లాస్థాయి అధికారుల సంతకాలు చేయించుకొని పత్రం అందుకోవాలంటే చెప్పులు అరిగిపోయే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఆ కష్టాలను తొలగించి కూటమి ప్రభుత్వం సాంకేతికతను వినియోగించుకొని మనం ఎక్కడికీ వెళ్లకుండానే చేతిలోని చరవాణే ఆయుధంగా ధ్రువపత్రాలను ఇంటికి పంపే పరిస్థితి తీసుకొచ్చింది. కొత్తగా 'మన మిత్ర' యాప్‌ను రూపొందించింది. అందులో ప్రభుత్వ పరమైన 738 రకాల సేవలు అనుసంధానం చేసింది. కావాల్సిన ధ్రువపత్రం కోసం చరవాణిలో దరఖాస్తు సమర్పిస్తే చాలు నిర్ణీత గడువు లోపు అధికారుల సంతకాలతో కూడిన పత్రం చరవాణికే వచ్చి చేరుతుంది. అవగాహన లేక నేటికీ చాలా మంది గ్రామ సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

● చరవాణిలో 738 సేవలు అనుసంధానం

'మన మిత్ర' యాప్‌పై అవగాహన కల్పిస్తున్న సచివాలయ ఉద్యోగులు

జిల్లాలో పరిస్థితి		
మండలాలు	:	30
కుటుంబాలు	:	5.41 లక్షలు
జనాభా	:	16.71 లక్షలు
గ్రామ సచివాలయాలు	:	501
ఉద్యోగులు	:	3,973

వాట్సప్ గవర్నెన్స్‌పై విస్తృత ప్రచారం

జిల్లాలో 5.41 లక్షల కుటుంబాలను సర్వే చేసి మన మిత్ర సేవలపై అవగాహన కల్పించనున్నారు. వాట్సప్ ద్వారా సేవలు ఎలా పొందాలో సచివాలయ ఉద్యోగులు వివరిస్తారు. క్యూఆర్ కోడ్‌ను ముద్రించి కరపత్రాలు అందజేయాల్సి ఉంది. ఇళ్ల సంఖ్య, నమోదైన పౌరుల వివరాలను యాప్‌లో నమోదు చేస్తారు. వీటన్నింటినీ పంచాయతీ కార్యదర్శి (వార్డు పరిపాలన) కార్యదర్శి సమన్వయం చేస్తూ సర్వే విజయవంతంగా పూర్తి చేసేలా పర్యవేక్షిస్తారు.

సేవలు ఇలా పొందాలి

9552300009 వాట్సప్ నంబరుకు హాయ్ అనే సందేశం పంపితే అన్ని ప్రభుత్వ సేవల జాబితా కనిపిస్తుంది. కావాల్సిన సేవలు ఎంచుకొని అవసరమైన వివరాలు పొందుపరచాలి. సేవలకు సంబంధించి చాట్‌బాట్లు అదనపు వివరాలను అక్షరాలు, వాయిస్ రూపంలో అడగొచ్చు. వివరాలు ఒకసారి తనిఖీ చేసిన తర్వాత రియల్ టైం అప్‌డేట్ లేదా కన్ఫర్మేషన్ సందేశం వస్తుంది. వాట్సప్ గవర్నెన్స్‌లో చాట్‌బాట్ ఈ ధ్రువీకరణ పత్రాలు, రసీదులు, తిరుగు రసీదు అందిస్తుందని జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారి లక్ష్మీపతి తెలియజేశారు. ప్రజలు మన మిత్ర యాప్‌పై అవగాహన పెంచుకొని సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రజలకు అవగాహన కల్పించేది వీరే

గ్రామ, పట్టణ స్థాయిలో 'మన మిత్ర' యాప్‌పై గ్రామ, పట్టణ సచివాలయాలలో పని చేసే ఉద్యోగులే ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఎనర్జీ అసిస్టెంట్లు, కార్యదర్శులు, విద్యుత్తు బిల్లులు నమోదు చేసే అసిస్టెంట్లు, కొత్త కనెక్షన్లు, వాట్సప్ సేవలను వివరిస్తారు. వ్యవసాయ, ఉద్యాన, పట్టు, పశుసంవర్ధక, మత్స్య, ఏఎన్ఎం, వార్డు హెల్త్ కార్యదర్శులు శాఖల వారీగా వాట్సప్ సేవలపై అవగాహన కల్పిస్తారు. సచివాలయాలకు వచ్చే ప్రజలకు సేవలు అందించే ముందు ప్రభుత్వం అందిస్తున్న వాట్సప్ సేవలను తెలియజేస్తే మరోసారి ఇంటి నుంచే దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉంటుందనే విషయాన్ని సచివాలయ ఉద్యోగులు గుర్తించాల్సి ఉంది.

కుళ్లిన గుడ్లపై క్షేత్ర స్థాయి పరిశీలన

బాధితురాలితో మాట్లాడుతున్న సహాయ సీడీపీవో సునీత

స్పందనకు స్పందనం

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు పంపిణీ చేసిన కోడిగుడ్లల్లో కుళ్లిపోయినవి వస్తే వెంటనే సూపర్‌వైజర్ల దృష్టికి తీసుకురావాలని సహాయ సీడీపీవో సునీత అన్నారు. మండలంలోని నడిమితాండ అంగన్‌వాడీ కేంద్రం నుంచి కుళ్లిపోయిన గుడ్లు వచ్చాయని గర్భిణి హేమలత ఇచ్చిన సమాచారంతో ఈ నెల 20న 'ఈనాడు'లో 'అంగన్‌వాడీ కేంద్రంలో.. కుళ్లిన కోడిగుడ్లు' అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు క్షేత్ర స్థాయిలో విచారించి కుళ్లిన కోడి గుడ్ల స్థానంలో తిరిగి 25 గుడ్లను ఇచ్చారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

● డ్వామా పీడీ వెంకట రత్నం

కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటరత్నం

రామాపురం, న్యూస్‌టుడే: ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని డ్వామా పీడీ వెంకటరత్నం అన్నారు. గురువారం మండలంలోని నీలకంఠరావుపేట పంచాయతీలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు దారులు ప్రతి ఒక్కరు పనులు చేసుకోవాలన్నారు. నీలకంఠరావు చెరువు నిండడంతో ఉపాధి గుంతలు తవ్విన చోట నీటితో కళకళలాడుతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. రామాపురం మండలంలోని ప్రతి పంచాయతీలో కరవు పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మూడు నెలలుగా చేసిన పనులకు కూలీ డబ్బులు రాలేదని కూలీలు తెలపడంతో త్వరలోనే ఖాతాల్లో జమవుతాయన్నారు. కార్యక్రమంలో ఏపీవో పెంచలయ్య, వైస్ సర్పంచి మహబూబ్‌బాషా, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ఏపీసీగా డాక్టర్ అనురాధ

రాయచోటి, న్యూస్‌టుడే: సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా డాక్టర్ అనురాధను ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. జిల్లా సమగ్ర శిక్ష సమన్వయ కర్తగా బదిలీ అయ్యారు. వైఎస్ఆర్ కడప జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెకు కోఆర్డినేటర్‌గా పని చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ నిత్యాందరాజును నంద్యాల ఏపీసీగా బదిలీ బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరు డిప్యూటేషన్ ప్రాతిపదికపై పని చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: మదనపల్లె మండలం పుంగనూరు రోడ్డులోని గ్రీన్‌వ్యాలీ పాఠశాలలో జరుగుతున్న 69వ రాష్ట్ర స్థాయి అండర్- 14 బాలబాలికల ఫుట్‌బాల్ పోటీల్లో భాగంగా రెండో రోజైన గురువారం క్రీడాకారులు పోటాపోటీగా తలపడ్డారు. వీటిలో పలు జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. బాలుర విభాగంలో పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, చిత్తూరు, నెల్లూరు, కర్నూల్, కడప, విశాఖపట్నం, అనంతపురం జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. క్వార్టర్ ఫైనల్స్‌లో నెల్లూరు జట్టుపై చిత్తూరు జట్టు 2-0 గోల్స్‌తో విజయం సాధించి

● క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన జట్లు

సెమీస్‌కు చేరుకుంది. మిగిలిన జట్లు తలపడాల్సి ఉంది. అలాగే బాలికల విభాగంలో అనంతపురం, నెల్లూరు, పశ్చిమగోదావరి, విశాఖపట్నం, తూర్పుగోదావరి, కడప, చిత్తూరు, శ్రీకాకుళం జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. వీరి మధ్య పోటీలు జరగాల్సి ఉంది. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకుడు పాల్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు డాక్టర్ ఎన్.బాబు, శారద, నాగరాజు, ఝాన్సీరాణి, ఆర్గనైజింగ్ కార్యదర్శి మురళీధర్, నరేష్, దిలీప్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పోటీ పడుతున్న బాలికలు

ఫుట్‌బాల్.. హాకీ పోటీల్లో ప్రతిభ

హేమలత

ములకలచెరువు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ పోటీలకు కన్నెమడుగు హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న హేమలత ఎంపికైనట్లు పీడీ ఖాదర్‌బాషా గురువారం తెలిపారు. ఈ నెల 7న మదనపల్లె ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి ఫుట్‌బాల్ ఎంపిక పోటీలలో హేమలత సత్తా చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 21, 22 తేదీలలో మదనపల్లెలోని గ్రీన్ వ్యాలీలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నాగరాజు తెలిపారు.

రామసముద్రం: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన హాకీ క్రీడల్లో అండర్-14 విభాగంలో మట్లవారిపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థిని స్రవంతి ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైందని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ గురువారం తెలిపారు. డిసెంబరు నెలలో జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో జిల్లా జట్టుకు ఆ విద్యార్థిని ప్రాతినిధ్యం వహిస్తుందని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగరాజు అన్నారు. ఈ మేరకు ఉన్నతపాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు, సిబ్బంది విద్యార్థినిని అభినందించారు.



స్రవంతిని అభినందిస్తున్న హెచ్‌ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు

సాహితిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

బేస్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో చదువుతున్న యు. సాహితి జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎస్ఎన్ శ్రీనివాసులు గురువారం తెలిపారు. ఈ నెల 15 నుంచి 17 వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపడంతో ఈ అవకాశం లభించిందన్నారు. జనవరి మొదటి వారంలో దిల్లీలో నిర్వహించబోయే ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటారని వివరించారు. కళాశాల డైరెక్టర్ వసుంధర, పిఈటీ పుల్లారావు విద్యార్థినిని అభినందించారు.

రైలు నిలయంలో డీఆర్‌ఎం తనిఖీ

నందలూరు, న్యూస్‌టుడే: నందలూరు రైలు నిలయాన్ని గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా గురువారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. రైల్వేస్టేషన్, క్రూ కంట్రోల్ కార్యాలయం, పార్కు, జిమ్, రీడింగ్ రూమ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నేతలు ఎంబటూరు నరసింహ స్వామి, మేడ వెంకట కుమార్, సర్పంచి జంబు సూర్యనారాయణ, రైల్వే విశ్రాంత ఉద్యోగి కమల్ బాష డీఆర్‌ఎంను కలిసి హైదరాబాద్, చెన్నై వెళ్లే రైళ్లకు నందలూరులో స్టాపింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన డీఆర్‌ఎం వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈఎన్ సుదర్శన్‌రెడ్డి, స్టేషన్ మేనేజర్ కమలాకర్, ఆర్పీఎఫ్ ఎస్ఐ త్రివేణి, సీఎల్ఐ పెంచలయ్య, విశ్వనాథ్, చీఫ్ ఆఫీస్ సూపరింటెండెంట్ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌ఎంకు వినతిపత్రం అందజేస్తున్న స్థానిక నాయకులు

22, 23 తేదీల్లో రాష్ట్రస్థాయి ఐఎంఏ సదస్సు

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేటలో ఈ నెల 22, 23 తేదీలోల 67వ రాష్ట్రస్థాయి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సదస్సు నిర్వహిస్తున్నట్లు సంఘ నూతన అధ్యక్షుడు డాక్టర్ బాలరాజు తెలిపారు. స్థానిక ఐఎంఏ భవనంలో గురువారం మాట్లాడారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వైద్య రంగంలో నిపుణులైన వైద్యులు కొత్త వైద్య విధానంలోని విషయాలను తెలియజేస్తారని తెలిపారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా ఈ ప్రాంతానికి రాష్ట్ర అధ్యక్ష పదవి దక్కడం గర్వంగా ఉందని ఐఎంఏ నాయకుడు డాక్టర్ విజయ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఐఏఎంఏ సంఘ వైద్యులు సి.సుధాకర్, అనిల్, వీరయ్య, సునీల్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

APSRTC

టెండరు ప్రకటన — పల్లె వెలుగు

అన్నమయ్య జిల్లా పరిధిలోని వివిధ డిపోలకు సంబంధించిన బస్ స్టేషన్‌లలో స్టాల్స్/ షాపులు, ఖాళీ స్థలములలో వ్యాపారములు చేసుకొనుటకు ఆసక్తి కలిగిన వ్యాపారస్థుల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. (1) టెండరు ఫారములు సంబంధిత డిపో మేనేజర్ల వారి కార్యాలయములలో తేది.24-11-2025 నుండి తేది.08-12-2025 వరకు అన్ని ఆఫీసు పనిదినములలో ఉ॥10.30 గం॥ల నుండి సా॥5.00 గం॥ల వరకు అమ్మబడును. (2) పూర్తి చేసిన టెండరు ఫారములు తేది.09-12-2025న ఉ॥10.30 గం॥ల నుండి మ॥2.00 గం॥ల లోపున జిల్లా ప్రజా రవాణా అధికారి వారి కార్యాలయం, రాయచోటి నందు ఏర్పాటు చేసిన టెండరు బాక్సులో వేయవలెను. అదేరోజు మ.3.00 గం॥లకు టెండరుదారుల సమక్షములో టెండర్లు తెరువబడును. (3) పూర్తి వివరములకు మా వెబ్‌సైట్ : https://www.apsrtc.ap.gov.in లో tenders ను చూడగలరు. (4) ఎట్టి కారణము చూపకుండా టెండర్లు అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు మరియు రద్దుచేయుటకు APSRTC కి పూర్తి అధికారము కలదు.

నెం.P1/797(04)/2025-DPTO/ANM, తేది:18-11-2025 సం/- జిల్లా ప్రజా రవాణా అధికారి, రాయచోటి, అన్నమయ్య జిల్లా.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate — A Government of India Undertaking

రాయచోటి-II బ్రాంచ్ (13194) ట్రంక్ రోడ్, రాయచోటి, అన్నమయ్య జిల్లా, ఆంధ్రప్రదేశ్-516269

స్థిరాస్తులు అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్, రాయచోటి-II బ్రాంచ్ వారికి ఋణగ్రహీతలు: M/s న్యూ సుప్రీమ్ పైప్ ఇండస్ట్రీ, ప్రొప్రయిటర్: డి షేక్ ఫజ్లూర్ రహమాన్ మరియు దఫేదార్ షేక్ యాస్మిన్ (హామీదారు)వారు తేది 31.10.2025 నాటికి చెల్లించవలసిన బకాయి రూ.22,23,966.43/- (అక్షరాల ఇరవై రెండు లక్షల ఇరవై మూడు వేల తొమ్మిది వందల అరవై ఆరు రూపాయలు మరియు నలభై మూడు పైసలు మాత్రమే) + తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్, రాయచోటి-II బ్రాంచ్ అధీకృత అధికారిచే నిర్మాణాత్మక స్వాధీనం చేసుకున్న సెక్యూర్డ్ క్రెడిటార్‌కు ఛార్జ్/తనఖాపెట్టిన దిగువ వివరించిన స్థిరాస్తిని తేది 09-12-2025 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని ప్రజానీకానికి మరియు ముఖ్యంగా పైన తెలిపిన ఋణగ్రహీతలు & హామీదారులకు తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది & సమయం: 09-12-2025, ఉ॥ 11.30 గం. నుండి మ॥ 2.30 గం.ల వరకు

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 08-12-2025, సా॥ 4.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:

రాయచోటి మున్సిపాలిటీ, చిత్తూరు రోడ్డు, రాయచోటి ఇండస్ట్రియల్ పార్కు, సర్వే నెం. 578/1 మరియు 578/2, ప్లాట్ నెం. D8 లోని మొత్తం 964.05 చ॥గ॥ లేదా 805.95 చ॥మీ॥ ఖాళీ స్థలం. హద్దులు: తూర్పు: 40 అ॥ రస్తా, పడమర: మెస్సర్స్ న్యూ సుప్రీమ్ పైప్ ఇండస్ట్రీ ప్లాట్ నెం. D5 లోని స్థలం, ఉత్తరం: మెస్సర్స్ న్యూ సుప్రీమ్ పైప్ ఇండస్ట్రీ ప్లాట్ నెం. D7 లోని స్థలం, దక్షిణం: 40 అ॥ రస్తా. కొలతలు: తూర్పు-పడమర: ఉత్తరం 30 మీ॥, దక్షిణం 29.70 మీ॥, ఉత్తరం-దక్షిణం: తూర్పు 24 మీ॥, పడమర 30 మీ॥, మొత్తం ఏరియా 964.05 చ॥గ॥.

రిజర్వు ధర: రూ. 58,00,000/-   ధరావత్తు సొమ్ము: రూ. 5,80,000/-

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.bank.in లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, రాయచోటి-II బ్రాంచ్, అధీకృత అధికారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 7901626769

ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ (baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com హెల్ప్‌డెస్క్: 8291220220, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది: 18-11-2025, ప్రదేశం: కడప   సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి

ఒప్పంద పత్రాలను చూపుతున్న మిట్స్ ఛాన్స్‌లర్ విజయభాస్కర్‌చౌదరి, బౌలింగ్ గ్రీన్ స్టేట్ విశ్వవిద్యాలయం అధ్యక్షుడు డాక్టర్ రోడ్నీ కె రోజర్స్

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో విద్యాప్రమాణాలు పెంచేందుకే విశ్వవిద్యాలయాల మధ్య పరస్పర ఒప్పందం చేసుకుంటున్నామని మిట్స్ డీమ్డ్ టుబీ విశ్వవిద్యాలయం ఛాన్స్‌లర్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్ చౌదరి అన్నారు. గురువారం కళాశాలలో యూనైటెడ్ స్టేట్స్ అమెరికాలోని బౌలింగ్ గ్రీన్ స్టేట్ విశ్వవిద్యాలయంతో ఒప్పందం చేసుకున్నారు. ఈ విశ్వవిద్యాలయంలో ఏరో స్పేస్ ఇంజినీరింగ్, ఫార్మసూటికల్ రంగాలు అత్యుత్తమ ప్రతిభ కలిగి ఉన్నాయన్నారు. ప్రస్తుతం భారతదేశం, దక్షిణ ఆసియా ప్రాంతాలు ఏరో స్పేస్, ఎయిర్‌క్రాఫ్ట్ ప్రయాణాల విస్తరణలో వేగంగా సాగుతున్నాయన్నారు. యూఎస్ఏ, భారతదేశం రెండు దేశాలకు సేవ చేసే దిశగా తమ ప్రయాణం మరింత బలపడాలని కోరారు. 2 లక్షల మందికి పైగా పూర్వ విద్యార్థులు కలిగిన విశ్వవిద్యాలయంతో ఎంఓయూ చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా బౌలింగ్ గ్రీన్ స్టేట్ విశ్వవిద్యాలయం అధ్యక్షుడు డాక్టర్ రోడ్నీ కె రోజర్స్, మిట్స్ ఛాన్సలర్ విజయభాస్కర్ చౌదరిలు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. అడ్వకేట్ డాక్టర్ సాండ్ర ఎర్ల్, ప్రోవోస్టు అండ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రవిక్రోవి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పతకధారి నాగరాజు

బంగారు పతకం సాధించిన కొర్లకుంట నాగరాజు

వీరబల్లి, న్యూస్‌టుడే: క్రీడా రంగంలో అద్భుత ప్రతిభ కనపరుస్తూ పట్టుదలతో గుర్తింపు తెచ్చుకున్న కొర్లకుంట నాగరాజు భూటాన్ దేశంలో ఈ నెల 14 నుంచి 17వ వరకు జరిగిన (ఎస్‌బీకేఎఫ్) సంయుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్ అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 74 కిలోల కేటగిరిలో బంగారు పతకం సాధించారు. పోటీల్లో భారతదేశంతో పాటు భూటాన్, బంగ్లాదేశ్, శ్రీలంక దేశాలు పాల్గొన్నాయి. నాగరాజుది మేడిమాకులకుంట. పోటీల్లో పాల్గొనడానికి ఆర్థిక స్తోమత లేకపోగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, దాతల సహకారం అందిస్తే పాల్గొన్నట్లు చెప్పారు. అవకాశం కల్పించిన ఫౌండేషన్ వ్యవస్థాపకులు పంకజ్‌గౌడ్, శివ తివారిలకు కృతజ్ఞతలు తెలిపారు. పతకం సాధించడం పట్ల వీఆర్‌డీఎస్ ఛైర్మన్ సురేంద్రారెడ్డి, వంగిమళ్ల, వీరబల్లి వాసులు హర్షం వ్యక్తం చేశారు.

అన్నదాతల ఆవేదనా పట్టదా!

పడమటికోన దగ్గర ప్రారంభమైన వరి కోతలు

చిన్నమండెం, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో సాగు చేసిన పలు పంటలు నూర్పిడి దశకు చేరుకున్నాయి. ఈ సమయంలో దిగుబడులను ఆరబెట్టాలన్నా, నూర్పిడి చేసిన సమయంలో రాశులుగా పోసుకోవాలన్నా టార్పాలిన్ పట్టలు అవసరం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన రోజు నుంచి రైతులు రాయితీ పట్టల కోసం ఎదురు చూస్తున్నారు. రాయచోటి ప్రాంతంలో వరి, వేరుసెనగ నూర్పిడి పనులు మొదలయ్యాయి. తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు ఇప్పటికే చెబుతున్నారు. కోతకు వచ్చిన వరి పంటను యంత్రాలతో కోసేందుకు రైతులు శ్రీకారం చుట్టారు. అనుకోకుండా వర్షాలు వస్తే ధాన్యంపై పట్టలు కప్పుకోవాల్సిన అవసరం ఉంది. గతంలో తెదేపా ప్రభుత్వం 50 శాతం రాయితీపై పట్టలు సరఫరా చేసింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. అప్పటి నుంచి రైతులు ఏటా బహిరంగ మార్కెట్లో అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. పట్ట సైజును బట్టి రూ.వెయ్యి నుంచి రూ. 2,500 వరకు ధరలు పలుకుతున్నాయి. రాయచోటి నియోజకవర్గంలో వరి 3 వేల ఎకరాల్లో సాగయింది. చేతికందే పంట వర్షాలకు ఎక్కడ దెబ్బతింటుందో అన్న భయం రైతులను వేధిస్తోంది. రాయితీపై పట్టలు పంపిణీ చేస్తారని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

చెయ్యేరు నుంచి చెరువులకు నీరు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట మండలం పరిధిలోని చెరువుల్లో సాగు నీరు నింపడానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో రాజంపేట ఎంపీడీవో, నీటి పారుదలశాఖ అధికారులు మండలంలోని చెరువులను గురువారం పరిశీలించారు. చెయ్యేరులో వృథా నీరు సోమశిలకు వెళ్తున్న నేపథ్యంలో మండల పరిధిలోని చెరువులు నింపడానికి ఉన్న అవకాశాలను అధికారులు పరిశీలించారు. 2021లో అన్నమయ్య జలాశయం తెగిపోవడంతో చెరువులకు నీరందక సాగు నీటి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చెయ్యేరు నుంచి లింక్ చెరువులకు నీరందించడానికి, ఉపాధి పథకం ద్వారా పనులు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. ఎంపీడీవో వరప్రసాద్, ఉపాధి ఏపీవో సాలయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మనస్తాపంతో బలవన్మరణం

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆస్తి వివాదంలో ఓ వ్యక్తి ఉరేసుకున్న ఘటన బుధవారం అర్ధరాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు... శ్రీనివాసులు(48) కుటుంబంతో కలిసి పట్టణంలోని వీవర్స్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఆయన కొంత కాలంగా సోదరుడు సురేంద్రని ఆస్తి పంచాలని అడుగుతున్నారు. దీనికి సురేంద్ర అంగీకరించకపోవడంతో మనస్తాపానికి గురై ఆయన ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా ఉరేసుకుని మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని సీఐ రాజారెడ్డి తెలిపారు.

EENADU Classifieds

AUTO

VEHICLES FOR SALE

Sundaram Finance Ltd Vehicle for Sale KIA CARENS CLAVIS Model 2025 Registration Number AP-40-HM-2627. Cell : 9440909749, 8500667214.

Vehicle for Sale Unregistered Maruti Brezza Smart Hybrid VXI1.5L 5MT BSVI Buyers Has come to along with IDS Address Proof. Cont: Indusind Bank Ltd, W/14-245, 1st Floor, IVR Towers Beside Saibaba School, ITI Circle, Kadapa-516003, 8328668171, 7550065615.

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647

TO LET

COMMERCIAL

కడప మారుతీనగర్ (నాగార్జున స్కూల్ ప్రక్కన) విద్యాసాగర్ హాస్పిటల్ దగ్గర 4000 Sft బిల్డింగ్‌ను బాడుగకు గాని లేక అమ్మబడును. Cell :7702936190.

JOBS

Amaravathi Software, Kadapa. Job Offer For Any B.Tech, M.Tech, MBA. Interview Date: 23-11-2025, Time: 9 AM - 5 PM, Cont: 9849720149.

NIT కేరళలో EEE B.Tech చదువుతున్న నడవలేని విద్యార్థినిని (PWD) చూసుకొనుటకు B.Tech చదువుకొని 35 సం॥లోపు వయస్సు ఉన్న ఒంటరి మహిళలు కావలెను. భోజనం, వసతి కల్పించి జీతం ఇవ్వబడును. Cell: 9866432259.

ప్రముఖ ట్రాక్టర్ కంపెనీ డీలర్షిప్ లో పని చేయుటకు స్పేర్స్ ఇన్‌ఛార్జి కావలెను. హనుమాన్ మోటార్స్, M.G.Auto Nager, Proddatur 9390032810.

FACULTY/ TEACHERS

కడప పట్టణంలో ప్రముఖ స్కూల్ నందు నర్సరీ నుండి UKG వరకు బోధించుటకు 5 & 10 సం॥ అనుభవం కల్గిన టీచర్స్ కావలెను. Cell : 6281155858, 9966149515.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ॥ 350/- మాత్రమే

Contact: KDP: 9989997626, 8008514248 PDTR: 8008597620 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

ధ్రువపత్రం పోగొట్టుకున్నారా.. మళ్లీ నకలు పొందొచ్చు!

ముకోసం

రాజంపేట, కలకడ, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరికీ విద్య, ఉద్యోగ జీవితానికి ఎంతో ముఖ్యమైనవి ధ్రువీకరణ పత్రాలు. పది, ఇంటర్మీడియట్ ధ్రువపత్రాలు లేకుంటే పలు రకాలుగా నష్టం తప్పదు. మనం ఎక్కడికైనా ప్రయాణించే సమయంలో ఆ ధ్రువపత్రాలను మరిచిపోవడం, పోగొట్టుకోవడం, ఇతర ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోవడం జరిగితే వాటి నకలు పొందేందుకు ఇప్పుడు మార్గాలు ఉన్నాయి. అయితే నకలు మన చేతికి రావాలంటే కొన్ని పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. అదేంటో తెలుసుకుందాం.

పదో తరగతి

★ పదో తరగతి ధ్రువపత్రం పోగొట్టుకొంటే bse-.ap.gov.in వెబ్‌సైట్‌లో వెళ్లి డూప్లికేట్ ఎస్ఎస్‌సీ దరఖాస్తు ఆప్షన్‌పై క్లిక్ చేస్తే తెరుచుకుంటుంది. ప్రింట్ తీసి వివరాలు నింపాలి. ★ దరఖాస్తు ఫొటో అతికించి సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడి సంతకంతో పాటు లేఖను, రూ.50 విలువైన స్టాంపు పేపర్‌పై చేయించిన అఫిడవిట్, సబ్‌ఇన్‌స్పెక్టర్, డిప్యూటీ తహసీల్దారు, అంతకంటే ఎక్కువ స్థాయి కల్గిన అధికారి ఎవరైనా ఇచ్చిన నాట్ ట్రేసింగ్ ధ్రువపత్రం, పోయిన పదో తరగతి ధ్రువపత్రం జిరాక్స్ కాపీలను జతచేయాలి. ★ రూ.250 విలువైన చలానా తీసి, ఇవన్నీ కలిపి సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడి ద్వారా డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ వారికి పోస్టు ద్వారా పంపించాలి. ★ నెల రోజుల్లో ఆ పాఠశాలకు నకలు ధ్రువపత్రం వస్తుంది. విద్యార్థి చిత్రంతో పాఠశాలకు వెళ్తే సర్టిఫికెట్‌పై అతికించి ప్రధానోపాధ్యాయుడు సంతకం పెట్టి ఇస్తారు.

ఇంటర్మీడియట్

★ ఇంటర్మీడియట్ ధ్రువపత్రం అయితే .-.-.bi-cap.ap-cf-ss.-in- వెబ్‌సైట్‌లో స్టూడెంట్ సర్వీసెస్‌లోకి వెళ్లి డూప్లికేట్ ఓపెన్ అవుతుంది. (మొదటిసారి పోతే డూప్లికేట్, రెండోసారి పోతే ట్రిప్లికేట్) అందులో హాల్‌టికెట్ నంబరు, పుట్టిన తేదీ, మెయిల్ ఐడీ నమోదు చేస్తే విద్యార్థి వివరాలు కనిపిస్తాయి. ★ అవన్నీ పరిశీలించి చరవాణి సంఖ్యను ఎంటర్ చేశాక... సర్టిఫికెట్ పోయిందా, చిరిగి పోయిందా అన్నది సెలెక్ట్ చేయాలి. పోయినట్లయితే పోలీస్ ఎఫ్ఐఆర్ కాపీని, చిరిగిపోతే చిరిగిన కాపీని అప్లోడ్ చేయాలి. ★ ఎఫ్ఐఆర్ కాపీ కోసం దగ్గరలోని మీ సేవలో మిస్సింగ్ సర్టిఫికెటు కోసం దరఖాస్తు చేస్తే పొందవచ్చు. ★ ఆ తర్వాత అఫిడవిట్, ప్రిన్సిపల్ సంతకం చేసిన దరఖాస్తు ఫారాన్ని నింపి అప్లోడ్ చేయాలి. సర్టిఫికెట్ పొందడానికి అవసరాన్ని కూడా నమోదు చేయాలి. తర్వాత చలానా తీసి ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ కొడితే అప్లికేషన్ నంబరు ఓపెన్ అవుతుంది. ★ ఆ నంబరు ద్వారా అప్లికేషన్ స్థితిని తెలుసుకోవచ్చు. అప్లోడ్ చేసిన ఒక సెట్ పత్రాలను సంబంధిత కళాశాలకు ఇవ్వాలి. అనంతరం డూప్లికేట్ సర్టిఫికెట్ కళాశాలకు వస్తుంది.

(c) eenadu

మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

తక్కువ ధరకే నాణ్యమైన విత్తనాలు

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: రైతులకు తక్కువ ధరలకే నాణ్యమైన విత్తనాలు ఇవ్వాలని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. గురువారం నిమ్మనపల్లెలో వ్యవసాయ వృత్తిదారుల కంపెనీ లిమిటెడ్ రైతు సేవా కేంద్రంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ జంగాల శివరాం ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. రైతులకు 340 రకాలకు పైగా ఉత్పత్తులను ఎపీమాస్ సంస్థ అందించడం అభినందనీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యే తహసీల్దారు కార్యాలయాన్ని పరిశీలించి ప్రజలనుంచి వినతులు స్వీకరించారు.

మదనపల్లె

•మదనపల్లె •పీలేరు •తంబళ్లపల్లె

దండువారిపల్లిలో ఉచిత వైద్యశిబిరం

పాడి పశువుకు చికిత్సలు చేస్తున్న వైద్యులు

ములకలచెరువు, న్యూస్‌టుడే: తంబళ్లపల్లె మండలం, రేణుమాకులపల్లి పంచాయతీ, దండువారిపల్లిలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు మండల పశువైద్యాధికారి విక్రమ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా తంబళ్లపల్లె ఏడీ సుమిత్ర హాజరై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పోషకులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేవీవోలు శ్రీనాథ్, హేమాపతిరెడ్డి, పశువైద్య సహాయకులు శ్రీనివాసరెడ్డి, శిరిష పాల్గొన్నారు.

ఆత్మరక్షణ విద్యలో నైపుణ్యం అవసరం

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: ఆత్మరక్షణ విద్యలో విద్యార్థులకు నైపుణ్యం అవసరం అని విజయభారతి విద్యా సంస్థ ఛైర్మన్ డాక్టర్ ఎన్. సేతు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు డాక్టర్ బాబు, నాగరాజు అన్నారు. గురువారం పట్టణంలోని విజయభారతి ఇంగ్లీషుమీడియం హైస్కూల్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్- 14, 17 బాల బాలికల జిల్లా స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యార్థులు తమ నైపుణ్యాలు ప్రదర్శించి జిల్లా జట్టులో స్థానం సంపాదించాలని కోరారు. కార్యక్రమంలో క్రీడాభారతి జిల్లా కార్యదర్శి నరేష్‌బాబు, మదనపల్లె యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అకాడమి కరాటే మాస్టర్ మణిసాయి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోటీలు ప్రారంభిస్తున్న డాక్టర్ ఎన్ సేతు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగరాజు

ఈత కొలనులో పతకాల పంట

రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్న విద్యార్థులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: ఈత కొట్టడం అంటే అందరికి ఇష్టం. చిన్నప్పుడు సరదాగా నేర్చుకున్న ఈతే పతకాలు తెచ్చి పెడున్నాయి అంటున్నారు మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు. తిరుపతి, విశాఖపట్నంలో జరిగిన జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని బహుమతులు, ప్రశంసాపత్రాలు పొందారు. ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు దేవకమ్మ, జలజ, సుధాకర్, అన్సర్ బాషాల ప్రోత్సాహంతో ఈతలో నైపుణ్యాలు సాధించి పతకాలు సాధించారు.

ఈత పోటీలకు సిద్ధంగా ఉన్న విద్యార్థులు

ఆర్మీలో ఉద్యోగం చేయడమే లక్ష్యం..

ఆర్మీలో కొలువు సాధించాలని నాకు చిన్నప్పటి నుంచి కల ఉంది. అందుకే చదువుతో పాటు ఆటల్లో ప్రావీణ్యం సంపాదించాలని నిర్ణయించుకున్నాను. అమ్మానాన్నలు హరి, సుగుణల ప్రోత్సాహంతో స్వగ్రామమైన కందూరులో ఈత నేర్చుకున్నాను. అమ్మానాన్న మదనపల్లెకు వచ్చి ఇక్కడే పానీపూరి వ్యాపారం చేస్తున్నారు. దీంతో నేను కూడా మదనపల్లెకు వచ్చి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేరాను. గతేడాది జరిగిన ఈత పోటీల్లో ఫ్రీస్టైల్ విభాగంలో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. ఈ ఏడాది తిరుపతిలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. - లోకేశ్, 10వ తరగతి, జడ్పీహెచ్‌ఎస్, మదనపల్లె.

జిల్లా స్థాయి పోటీల్లో సత్తా

చిన్నప్పుడు మా స్వగ్రామం బి.కొత్తకోటలో సరదాగా ఈత నేర్చుకున్నాను. ఆ ఈతే ఇప్పుడు పతకాలను తెచ్చి పెట్టాయి. అమ్మానాన్న భాస్కర్, లక్ష్మీదేవిల సహకారంతో ఈత నేర్చుకున్నాను. పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులు నేర్పించిన మెలకువలతో తిరుపతిలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు ఎంపికయ్యాను. భవిష్యత్తులో జాతీయ స్థాయి ఈత పోటీల్లో రాణించాలన్నదే నా లక్ష్యం. - రామచంద్ర, 10వ తరగతి, జడ్పీహెచ్‌ఎస్, మదనపల్లె.

స్వర్ణపంచాయతీ యాప్‌తో పన్ను వసూళ్లు

వాల్మీకిపురం : మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ

మాట్లాడుతున్న డీఎల్‌డీవో అమర్‌నాథ్‌రెడ్డి

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: ఇంటి పన్ను, పన్నేతర బిల్లులులన్నింటిని స్వర్ణపంచాయతీ యాప్ ద్వారానే నగదు రహిత వసూళ్లు చేయాలని డీఎల్‌డీవో అమర్‌నాథ్‌రెడ్డి పంచాయతీ అధికారులను ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో 2025-26 ఆర్థిక సంవత్సరం లక్ష్యాలకు సంబంధించి సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రీన్‌అంబాసిడర్లకు, పారిశుద్ధ్య కార్మికులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడంతోపాటు, ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దాలన్నారు. అదే విధంగా స్వామిత్వ సర్వే వెంటనే పూర్తిచేయాలని, దీని ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రావడంతో పాటు, లబ్ధిదారులకు బ్యాంకురుణాలు కల్పించేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో తాజ్‌మస్రూర్, డిప్యూటీ ఎంపీడీవో భారతి, ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

వాల్మీకిపురం: గ్రామాల్లో ఇకపై స్వర్ణ పంచాయతీలలో భాగంగా ఇంటి పన్ను, నీటి పన్నులతో పాటు ఇతర వాణిజ్య పన్నులు ఆన్‌లైన్ ద్వారానే జరగాలని జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ అన్నారు. గురువారం వాల్మీకిపురం మేజర్ పంచాయతీ కార్యాలయాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం 16 పంచాయతీలకు చెందిన కార్యదర్శులతో పెండింగ్ బకాయిలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సుధాకర్, 16 పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

నిధుల లేమి.. అభివృద్ధి కనరేమి

పెద్దతిప్పసముద్రం మండలంలోని నవాబుకోటలోని రైతు సేవా కేంద్రం పునాదికే పరిమితమైంది. గత వైకాపా పాలనలో నవాబుకోట పంచాయతీలో రైతు సేవా కేంద్రం నిర్మాణాన్ని ప్రారంభించి మధ్యలోనే పనులు ఆపేశారు. గుత్తేదారులకు చేసిన పనులకు నిధులు మంజూరు చేయకపోవడంతోనే పనులు ఆపేశామని వారు చెబుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఇరుకు గదిలోనే విధులు నిర్వహించాల్సి వస్తోందని సిబ్బంది వాపోతున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పెద్దతిప్పసముద్రం

చెత్త నిలిచి.. అవస్థలు పెంచి

పీలేరు ఆర్టీసీ డిపో బస్టాండు ప్రాంగణంలో చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వారు రాకపోకలు చేస్తున్నప్పుడు అవస్థలు పడుతున్నారు. బస్టాండులోని హోటళ్లు, దుకాణాల నుంచి విడుదలయ్యే వ్యర్థాలను ఇక్కడ వేస్తున్నారు. అయితే అక్కడి నుంచి ఆ చెత్తను డంపింగ్ యార్డుకు తరలించకపోవడంతో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. సమస్యను పీలేరు బస్టాండ్ మేనేజర్ బాబునాయక్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే శుభ్రం చేయిస్తామన్నారు. - న్యూస్‌టుడే, పీలేరు

ప్రజా శౌచాలయం.. శోచనీయం

వ్యవసాయ మార్కెట్‌లో రైతుల కోసం నిర్మించిన శౌచాలయం చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచి అడవిని తలపిస్తోంది. నిత్యం ఎంతో మంది రైతులు టమాటా మార్కెట్‌కు వస్తూ ఉంటారు. అత్యవసర సమయాల్లో అటు వైపు వెళ్లాలంటే రైతులు, మహిళలు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై కార్యదర్శి కుమార్‌రెడ్డిని వివరణ కోరగా నూతన శౌచాలయం నిర్మించడానికి ప్రతిపాదనలు పంపాము. అనుమతులు వచ్చిన వెంటనే నిర్మిస్తామన్నారు. -న్యూస్‌టుడే, గుర్రంకొండ

మరువ దారి.. ప్రమాదకరంగా మారి

పీలేరు మండలం అగ్రహారం చెరువు మరువ గతంలో కురిసిన వర్షాలకు దెబ్బతింది. అయితే అప్పట్లో మరువ నుంచి నీరు వెళ్లేందుకు సిమెంటు గొట్టం ఏర్పాటు చేశారు. గొట్టం పైన ఉన్న సిమెంటు దారి దెబ్బతినడంతో అక్కడ పెద్ద గుంత ఏర్పడింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఈ రహదారిలో నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు. ప్రమాదం జరగక ముందే మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఆర్అండ్‌బీ ఏఈ సురేశ్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లగా మరువ నీరు నిలిచిపోయిన తరువాత పరిస్థితిని పరిశీలించి మరమ్మతులు చేయిస్తామన్నారు. - న్యూస్‌టుడే, పీలేరు

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: వాహన యజమానులు, డ్రైవర్లు రవాణాశాఖ సూచనలను తప్పక పాటించాలని మదనపల్లె ఆర్టీవో డి.వి.ప్రతాప్‌రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫైర్ డిటెక్షన్ అలారమ్ సిస్టం ఉండాలని, 12 మీటర్లు పొడవు అంతకన్నా తక్కువ ఉన్న మెయిన్ డోర్‌తో పాటు రెండు అత్యవసర డోర్లు, రెండు బస్సు రూఫ్ అత్యవసర డోర్లు ఉండాలన్నారు. వాహనం పొడవు 12 మీటర్లు పైబడితే డ్రైవర్ డోర్, మెయిన్ డోర్ కాకుండా 5 అత్యవసర డోర్లు, 3 బస్సు రూఫ్ అత్యవసర డోర్లు కలిగి ఉండాలన్నారు. ప్రథమ చికిత్స పెట్టె ఉండాలని ఈ వాహనాలకు స్పీడ్ గవర్నర్ పనిచేయాలన్నారు. ప్రతి వాహనానికి అన్ని పత్రాలు చెల్లుబాటులో ఉండాలని, రాత్రి సమయంలో 8 గంటలకు మించి ప్రయాణించే వాహనాల్లో ఇద్దరు డ్రైవర్లు ఉండాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి వాహనాలను నడిపే వారిపై చర్యలు తప్పవని ఆర్టీవో ప్రతాప్‌రావు హెచ్చరించారు.

ఘనంగా బాస్ ఆవిర్భావ వేడుకలు

బాస్ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: భారతీయ అంబేడ్కర్‌సేన (బాస్) ఆవిర్భావ వేడుకలు గురువారం మదనపల్లెలో ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలు నెల రోజులు పాటు కొనసాగుతాయన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఉలగనాథన్ గణపతితో కలసి బాస్ జండాను ఆవిష్కరించారు. బాస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ 2012 డిసెంబర్ 20వ తేదీ బాస్ ఆవిర్భవించిందని, నేడు ఆరు రాష్ట్రాల్లో విస్తరించిందన్నారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక నియోజకవర్గాల ఏర్పాటు, జాతీయ అంబేడ్కర్ బ్యాంకు, సాగుభూమి పంపిణీ, మూడు సెంట్లు ఇంటి స్థలం, వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని బాస్ నాయకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాస్ నాయకులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

విద్యార్థినికి ప్రశంసా పత్రం అందజేస్తున్న అధికారులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: పుస్తక పఠనంతోనే విజ్ఞానం పెరుగుతుందని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిరత్నం అన్నారు. మదనపల్లె పట్టణం రెడ్డీశ్వరుల కాలనీలోని జిల్లా శాఖ గ్రంథాలయం వారోత్సవాల ముగింపు కార్యక్రమం గ్రంథాలయాధికారిణి వసంతకుమారి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. డాక్టర్ వైఎస్.మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు అదాలత్‌తో సమస్యల పరిష్కారం

ములకలచెరువు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో మదనపల్లె డివిజన్ స్థాయి విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని అదాలత్ ఛైర్మన్ వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. సమావేశంలో తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన పలువురు వినియోగదారులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. ఇందులో భాగంగా బి.కొత్తకోట, పీటీఎం, ములకలచెరువు మండలాలకు చెందిన సమస్యలను అదాలత్‌లో నమోదు చేసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ఈ సోమశేఖర్‌రెడ్డి, మదనపల్లె ఈఈ గంగాధర్, ములకలచెరువు ఏడీఈ గోవిందరెడ్డి, మదనపల్లె టౌన్ ఏడీఈ హరికుమార్, మదనపల్లె రూరల్ ఏడీఈ సురేంద్రనాయక్‌తో పాటు ఆయా సబ్ డివిజన్లకు చెందిన ఏఈలు పాల్గొన్నారు.

విద్యుత్తు అదాలత్ ఛైర్మన్ శ్రీనివాస ఆంజనేయ మూర్తికి సమస్యను వివరిస్తున్న అధికారి

క్రయవిక్రయాలపై విద్యార్థులకు అవగాహన

కలికిరి, న్యూస్‌టుడే: పీఎంశ్రీ పథకం ఒకేషనల్ విద్యలో భాగంగా కలికిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు పట్టణంలోని పలు సూపర్‌మార్కెట్లు, దుకాణాల్లో ప్రయోగాత్మకంగా క్రయవిక్రయాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ సూపర్‌మార్కెట్లు, వివిధ దుకాణాలను సందర్శిస్తూ వాటి నిర్వహణ, వస్తువులను అమర్చడం, అమ్మడం వంటి విషయాలపై అవగాహన పొందారు. విద్యార్థులకు క్రయవిక్రయాలపై అవగాహన ఉండాలని అందుకే ఈ కార్యక్రమం చేపట్టామని ప్రధానోపాధ్యాయురాలు శారద అన్నారు. కార్యక్రమంలో టైమ్స్ సెంటర్ ఫర్ లెర్నింగ్ లిమిటెడ్ కంపెనీ తరపున ఒకేషనల్ కో-ఆర్డినేటర్లు పైడి కార్తిక్, బారు శ్రీను పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి స్వామిత్వ గ్రామసభలు

వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

ములకలచెరువు, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీలో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి స్వామిత్వ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ప్రత్యేక అధికారి(ఈఓపీఆర్డి) మోహన్ ప్రతాప్, యూనిట్ ఇన్‌ఛార్జ్ సుధాకర్(జేసీబీ) అన్నారు. గురువారం మండలంలోని మద్దినాయునిపల్లి గ్రామంలో స్వామిత్ర గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... స్వామిత్వతో గ్రామాల్లో హక్కుదారుల ఇళ్లకు హద్దులతో కూడిన ఉచిత హక్కు పత్రం అందిస్తామన్నారు. ఇళ్లు లేని వారిని గుర్తించి వారికి ఇళ్లు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: బాలల హక్కుల పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని మదనపల్లె ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, పోర్డు సంస్థ డైరెక్టర్ లలితమ్మ, బ్యాంక్ ఆఫ్ బరోడా అసిస్టెంట్ మేనేజర్ కోటిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బాలల హక్కుల పరిరక్షణ దినోత్సవ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల విద్యకు సౌకర్యాలు కల్పించడం బాలల హక్కుల్లో భాగమేనన్నారు. విద్యార్థులు వారికున్న హక్కులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్రమశిక్షణతో చదివితే మంచి జీవితం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మోటివేషనల్ స్పీకర్ రామ్మూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్, విద్యార్థి సంఘం నాయకుడు ఉత్తన్న పాల్గొన్నారు.

చట్టబద్ధ దత్తతో కల సాకారం

ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పీలేరు, న్యూస్‌టుడే: పిల్లలులేని దంపతులు ఇతరుల సంతానం అనధికారంగా దత్తత తీసుకోవడం చట్టపరంగా శ్రేయస్కరం కాదని పీలేరు ఐసీడీస్ అధికారి రాజమ్మ స్పష్టం చేశారు. గురువారం పీలేరులో బాలికల సంరక్షణలో భాగంగా జిల్లా శిశుగృహ ప్రత్యేక దత్తత విభాగం ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మాతృత్వం ఒక వరమని దత్తత అందుకు మరోమార్గమని తెలిపారు. 0-18 ఏళ్ల పిల్లలను ఎవరైనా అనధికారంగా దత్తత తీసుకోవడంతో భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. అలా ఎవరైనా చేస్తుంటే 1098 నెంబరుకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు స్వరూపకుమారి, దత్తత విభాగం మేనేజరు ఆర్. సుప్రియ, సమాజిక కార్యకర్త లావణ్య పాల్గొన్నారు.

అక్రమాల కట్టడికి యుక్తధార

కంభంవారిపల్లి (న్యూస్‌టుడే): గ్రామీణ ప్రాంతాల్లో కూలీల వలసలను నివారించడానికి కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. గత వైకాపా పాలనలో ఉపాధి పనుల్లో అవినీతి చోటుచేసుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిజమైన కూలీలకు ఉపాధి నిధులు అందాలనే లక్ష్యంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకంగా అమలు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈకేవైసీ చేయడం, పనుల వద్ద ఉదయం, సాయంత్రం రెండు సార్లు ఉపాధి శ్రామికులు చేసిన పనులను ఫొటోలు అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం మరింత పారదర్శకంగా పథకాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం యుక్తధార జియో స్పేషియల్ ప్లానింగ్ పోర్టల్ ద్వారా సర్వే చేస్తున్నారు. ఉపాధి హామి పనుల కొలతల్లో తేడా చూపి, చేసిన పనులనే మళ్లీ చేసినట్లు బిల్లులు పెట్టేందుకు వీలు లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

కంభంవారిపల్లెలో పనులు చేస్తున్న ఉపాధి శ్రామికులు

✶ జిల్లా వ్యాప్తంగా ఉపాధిహామీ పథకం సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. 2025- 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనుల ప్రణాళికను ఇందుకు అనుగుణంగానే సిద్ధం చేస్తున్నారు. సాంకేతిక సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. జిల్లాలో జాబ్‌కార్డులు 1,91,477 ఉన్నాయి. ఉపాధి శ్రామికులు 3,06,304 మంది ఉన్నారు. ఉపాధి సిబ్బంది గ్రామాల్లో ఈకేవైసీ పూర్తి చేసే కార్యక్రమంలో ఉన్నారు.

నిబంధనల మేరకు నిధులు..

ప్రతి పనిని ప్రత్యేక యాప్‌తో సర్వే చేసి, 50 మీటర్లకు ఒక ఫొటో తీసి, పొడవు, వెడల్పు, లోతు కొలతలను ఆటోమేటిక్ గూగుల్ ఎర్త్ మ్యాప్‌లతో గుర్తిస్తారు. వాటిని కంప్యూటర్‌లో నమోదు చేసి, నిబంధనల ప్రకారం నిధులు మంజూరు చేస్తారు. ముందుగా గుర్తించిన ప్రదేశంలో నిర్ణీత కొలతల మేరకే పనులు చేయాలి. అంతకు మించి చేసినా, చేసినట్లు చూపినా బిల్లులు మంజూరు కావు. ప్రతిరోజు చేసిన పనుల వివరాలను కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది.

పారదర్శకంగా పనులు..

యుక్తధారతో పారదర్శకంగా ఉపాధి పనులు చేయాల్సి ఉంది. అక్రమాలకు అవకాశం లేకుండా ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. యుక్తధార టూల్‌తో పని ప్రదేశంలో ముందుగానే కొలతలు తీసి, అప్‌లోడ్ చేస్తారు. ప్రతి రోజు పని కొలతలు తీస్తారు. నిబంధనల మేరకే కూలీలకు చెల్లింపులు చేస్తారు. ఒకసారి చేసిన పనిని మరోసారి చేసినట్లు చూపే అవకాశం ఉండదు.

- వెంకటరత్న ఉపాధి పీడీ, అన్నమయ్య జిల్లా

ప్రభుత్వాసుపత్రికి ఆక్సిజన్ కాన్సంట్రేటర్ల వితరణ

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: స్థానిక శ్రీసాయి నారాయణ సేవా ట్రస్టు తరపున మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి గురువారం స్థానిక ప్రభుత్వాసుపత్రికి రెండు ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను వితరణ చేశారు. ఈ సందర్భంగా వాటిని ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి మాలతికి అందజేశారు. ప్రభుత్వాసుపత్రికి వచ్చే నిరుపేదల వైద్యం కోసం ఈ ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను ఉపయోగించాలని మాజీ ఎమ్మెల్యే సూచించారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: ఇరు వర్గాల ఘర్షణపై కేసు నమోదు చేశామని సీఐ గోపాల్‌రెడ్డి గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... మండలంలోని బడికాలయపల్లెకు చెందిన గడ్డం కృష్ణారెడ్డి స్థానిక బీరంగి రోడ్డులో బుధవారం తాను కొనుగోలు చేసిన భూమిలో రేకులషెడ్ల నిర్మాణం చేస్తున్నారు. అదే ప్రాంతానికి చెందిన ఓబులేసు ఆ పనులను అతని అనుచరులతో వెళ్లి అడ్డుకున్నారు. అయితే కృష్ణారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆగ్రహించిన ఓబులేశు అతనిపై గురువారం దాడి చేశారు. ఈ దాడిలో గాయపడిన కృష్ణారెడ్డిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఆయన వివరించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80080 01768
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

రాయచోటి
• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

కాయగూరలతో వినూత్న బోధన

కూరగాయలను గుర్తించి విభజన చేస్తున్న చిన్నారులు

పుల్లంపేట, న్యూస్‌టుడే: కృత్యాధార, ప్రత్యక్ష అనుభవం ద్వారా ఆనందదాయక అభ్యసన వాతావరణంలో విద్యార్థులు నేర్చుకుంటారని ఉపాధ్యాయుడు వెంకట రమణ తెలిపారు. గురువారం కూరగాయల పాఠంలో వాటిని ప్రత్యక్షంగా చూడటంతో పాటు వాటి పేర్లు, రంగులు, ఆకారాలను తెలుగు, ఆంగ్ల భాషలో నేర్పించినట్లు చెప్పారు. ఈ పద్ధతితో పిల్లల్లో శాశ్వతంగా గుర్తుండి పోయే అవకాశం ఉందన్నారు.

వైద్యానికి ఆర్థిక చేయూత

రాజంపేట, న్యూస్‌టుడే: కార్పొరేట్ వైద్యం చేయించుకున్న నిరుపేదలకు సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక చేయూతనిస్తున్నట్లు తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. పార్టీ కార్యాలయంలో గురువారం వివిధ మండలాలకు చెందిన 20 మందికి రూ.11,67,513లు విలువైన చెక్కులను ఆయన అందజేశారు. నాయకులు సుబ్రహ్మణ్యం నాయుడు, రవినాయుడు, వేణుగోపాల్, ఆనంద్, పాండురాజు, నరసింహ, వెంకటేశ్వర్లు, మహమ్మద్ అలీ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు

మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పరామర్శ

సంబేపల్లె, న్యూస్‌టుడే: యువగళం కో-ఆర్డినేటర్ మండిపల్లి సిద్ధారెడ్డి తండ్రి నారాయణరెడ్డి ఇటీవల మృతిచెందారు. గురువారం మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామం బండకాడపల్లెలో జరిగిన మండిపల్లి నారాయణరెడ్డి దశదిన కర్మ కార్యక్రమంలో రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. నారాయణరెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

◆ సంబేపల్లె మాజీ జడ్పీటీసీ, తెదేపా సీనియర్ నాయకుడు మల్లు నరసారెడ్డిని రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. గురువారం ఆయన స్వగృహానికి మంత్రి చేరుకున్నారు. నరసారెడ్డి ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్నారు. మంత్రి ఆయన ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన కుటుంబీకులను పలకరించి ధైర్యం చెప్పారు. నాయకులు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మల్లు విష్ణువర్ధనరెడ్డి, మౌర్యారెడ్డి, దుద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, సహదేవరెడ్డి, వేణుగోపాల్ నాయుడు, మండల, గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జడ్పీటీసీ మాజీ సభ్యుడు నరసారెడ్డి ఆరోగ్యంపై ఆరా తీస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

వసతులు పెరగాలి.. చదువులు వెలగాలి: ఎమ్మెల్యే

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు సక్రమంగా ఉండాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీలో భాగంగా మండల పరిధిలోని సింగిరివారిపల్లెలో గురువారం ఆయన పర్యటించారు. గ్రామానికి చెందిన నాగశౌర్యకు సీఎం సహాయ నిధి రూ.23,400 చెక్కును అందజేశారు. అనంతరం అక్కడి ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులకు చాక్లెట్లు పంచారు. రైల్వేకోడూరు పట్టణానికి చెందిన జాహ్నవికి రూ.55,082 చెక్కును అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకురాలు ముక్కా వరలక్ష్మి, ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు చాక్లెట్లు ఇస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

చిట్టి కన్నలకు చలితో చిక్కులు

పెరుగుతున్న న్యూమోనియా కేసులు ✧ ఫిబ్రవరి 28 వరకు పరీక్షలు

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే : చలికాలం వచ్చిందంటే చాలు చిన్నారులు తరచూ జలుబు, దగ్గుతో బాధపడుతుంటారు. శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతారు. ముఖ్యంగా మంచు ఎక్కువగా కురుస్తున్న రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాల్లో న్యూమోనియా కేసులు పెరుగుతున్నాయి. తొలిదశలోనే కట్టడి చేయకపోతే ప్రాణాంతకంగా మారతాయని ప్రభుత్వం గుర్తించి అప్రమత్తమైంది. ఈ నెల 12 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు సర్వే చేపట్టింది. ఆరు నెలలలోపు చిన్నారులైతే తీవ్ర ఇబ్బంది పడతారు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న పిల్లలపై ప్రభావం ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఇప్పటికే ఇంటింటా సర్వే ప్రారంభించారు.

ఇక్కడ రక్షణ పొందవచ్చు

రాజంపేట వంద పడకల ఆసుపత్రి : ఈ ఆసుపత్రిలో చిన్నారులకు సంబంధించి ప్రత్యేక వార్డు ఉంది. న్యూమోనియా బారిన పడిన బాలలను రక్షించుకోవడానికి ఆధునిక వైద్య పరికరాలున్నాయి. వీటితో పాటు రైల్వేకోడూరు, పెనగలూరు, చిట్వేలి, పుల్లంపేట మండల కేంద్రాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరీక్షలు, చికిత్సలు పొందవచ్చు.

◆ ఈ సీజన్‌లో చంటి పిల్లలు న్యూమోనియా బారిన పడకుండా వారి చుట్టూ వెచ్చని వాతావరణం ఉండేలా చూడాలి. తలుపులు, కిటికీలు తెరిచి పెట్టడం, బయటి వాతావరణంలో తిప్పడం వల్ల న్యూమోనియా బారిన పడే ప్రమాదం ఉంది. క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలకు దగ్గు, ఆయాసం, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్న చిన్నారులు ఎక్కువగా కనిపిస్తున్నారు.

మంగంపేటలో చిన్నారిని పరీక్షిస్తున్న ఆరోగ్య సిబ్బంది

శ్వాస సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

చిన్నారుల్లో శ్వాస సంబంధ సమస్యలు వస్తే నిర్లక్ష్యం చేయొద్దని ముక్కావారిపల్లె వైద్యాధికారి రాజశేఖర్ తెలిపారు. శ్వాస సమస్యలతో బాధపడుతున్న చిన్నారులను సర్వేలో గుర్తిస్తే వెంటనే వారికి వైద్యం అందిస్తాం అని జిల్లా వైద్యాధికారి లక్ష్మీనరసయ్య తెలిపారు.

◆ నియోజకవర్గం: రైల్వేకోడూరు ◆ అంగన్‌వాడీ కేంద్రాలు: 268 ◆ చిన్నారులు: 8,451

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
రాజంపేట : 9441872651
రాయచోటి : 9703622242
రైల్వేకోడూరు : 9703572572

కొత్త స్తంభం ఏర్పాటు

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: మండల పరిధిలోని చెన్నరాజుపోడు పంచాయతీ, గాడివారిపల్లెకు వెళ్లే మార్గంలో విరిగిన విద్యుత్తు స్తంభాన్ని తొలగించి అక్కడ కొత్త విద్యుత్తు స్తంభం ఏర్పాటు చేశారు. గురువారం 'ఈనాడు'లో విరిగిన స్తంభం.. పొంచి ఉన్న ప్రమాదం శీర్షికతో వార్త ప్రచురణ అయింది. స్పందించిన విద్యుత్తుశాఖ అధికారులు వెంటనే విరిగి స్తంభాన్ని తొలగించి కొత్త విద్యుత్తు స్తంభం ఏర్పాటు చేశారు.

- న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ

?: పట్టణంలోని కొత్తపల్లెలో కాలువలు సమయానికి శుభ్రం చేయడం లేదు. దీంతో మురుగు పొంగిపొర్లుతూ నివాసాల మధ్య నిల్వ ఉంటోంది. దీంతో దోమలు వృద్ధి చెంది స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నారు? **- ఖాదర్ వలీ, స్థానికుడు**

✓: వెంటనే సిబ్బందిని పంపి కాలువలు శుభ్రం చేయిస్తాను. స్థానికులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.
- రవి, రాయచోటి పురపాలక కమిషనర్

?: పట్టణంలోని కె.రామాపురంలో సీసీ రోడ్డుపై స్థానికులు వారి వారి నివాసాల ముందర పెద్ద పెద్ద రాళ్లు ఉంచారు. దీంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి? **- శారద, స్థానికురాలు**

✓: సమస్య మా దృష్టికి రాలేదు. వెంటనే సిబ్బందిని పంపి రాళ్లు తొలగింపజేస్తాం. **- రవి, పురపాలక కమిషనర్**

క్రీడా దుస్తుల పంపిణీ

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులతో యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: హెచ్.చెర్లోపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక కావడం పట్ల యూటీఎఫ్ నాయకులు గురువారం విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేశారు. మారుమూల గ్రామం నుంచి నలుగురు విద్యార్థులు రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాల పీడీగా పనిచేస్తున్న ఈశ్వర్ నాయక్ విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంతో పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చెంగల్‌రాజు, జిల్లా కార్యదర్శి వెంకట సుబ్బయ్య, మండల అధ్యక్షుడు నాగేంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బయ్య, తెలుగు ఉపాధ్యాయుడు సాల్వ చిన్న గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి గ్రామోత్సవం నేడు

చిన్నమండెం: చిన్నమండెంలో శుక్రవారం అయ్యప్ప స్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు శ్రీ మణికంఠ సేవా సమితి వారు తెలిపారు. పట్టణంలోని బలిజపల్లె సీతా రామాలయం నుంచి సాయంత్రం నాలుగు గంటలకు స్వామి బయలుదేరుతారన్నారు. అక్కడి నుంచి బస్టాండు, ఆంజనేయ స్వామి ఆలయం వరకు గ్రామోత్సవం ఉంటుందన్నారు. రాత్రి స్వాములకు రవాణా, యువజన, క్రీడాశాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దంపతులు భిక్ష ఏర్పాటు చేశారన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

రైతులకు రూ.3.85 కోట్ల లబ్ధి

వీరబల్లి: వీరబల్లి మండలంలోని 5,706 మంది రైతులకు అన్నదాత సుఖీభవతో రూ.3.85 కోట్లు లబ్ధి చేకూరిందని తెదేపా మండల శాఖ అధ్యక్షులు ఎం.భానుగోపాల్‌రాజు అన్నారు. వీరబల్లి తెదేపా కార్యాలయంలో గురువారం ఆయన కార్యకర్తలతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతులకు అన్నదాత సుఖీభవ రూ.7 వేలు చొప్పున వేసిందన్నారు. ఒక్కో గ్రామ పంచాయతీలో సరాసరి 500 మంది రైతులకు లబ్ధి చేకూరిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంతో రైతులకు అన్ని విధాలా దగా చేసి నష్టపరిచారన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

సంబేపల్లె, న్యూస్‌టుడే: కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపై సంబేపల్లె మండలం పీఎన్ కాలనీ బస్టాప్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయపడ్డారు. ఈ సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పీఎన్ కాలనీ గొల్లపల్లికి చెందిన జబీరుల్లా, కౌసర్‌జాన్ దంపతులు ద్విచక్ర వాహనంపై సొంత పనుల నిమిత్తం పీఎన్ కాలనీకి వచ్చి తిరిగి వెళ్లేందుకు రోడ్డుపక్కన నిలబడి ఉన్నారన్నారు. పీలేరు నుంచి రాయచోటి వైపు వెళ్తున్న సుమో వీరిని ఢీకొనడంతో జబీరుల్లా కుడికాలుకు తీవ్ర గాయాలు కాగా కౌసర్‌జాన్‌కు కుడిచేతికి గాయాలయ్యాయి. క్షతగ్రాతులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకు తిరుపతికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇరు వర్గాలపై కేసు నమోదు

పుల్లంపేట, న్యూస్‌టుడే: స్థల వివాద ఘర్షణలో ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గురువారం పుల్లంపేట మండలం టి.కమ్మపల్లె పంచాయతీ కృష్ణంపల్లెలో వెంకటసుబ్బయ్య, లక్ష్మీదేవి, యానాదమ్మ, పెద్దమణి కుమారుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో యానాదమ్మపై మణి కుమారులు దాడి చేసి గాయపరిచారు. దీంతో గాయపడిన యానాదమ్మ రాజంపేట ఆసుపత్రికి తరలించి ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

ప్రతిభకు పురస్కారం

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: రాయచోటి పట్టణంలోని శ్రీవిద్యా భారతి హైస్కూల్‌లో ఈనాడు ఆధ్వర్యంలో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై గురువారం ప్రతిభా పాటవ పోటీలు (ఉపన్యాసం) నిర్వహించారు. విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఫరజ్‌ఖాన్ (ఎనిమిదో తరగతి) సైబీ (ఎనిమిదో తరగతి) ప్రణవి (ఏడో తరగతి) విజేతలుగా నిలిచారు. వీరికి పాఠశాల కరస్పాండెంట్ వెంకటరామిరెడ్డి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మీశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిభా పాటవ పోటీల్లో ఉపన్యసిస్తున్న విద్యార్థిని

విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న పాఠశాల కరస్పాండెంట్ వెంకటరామిరెడ్డి

ఎస్టీయూ అధ్యక్షుడిగా మల్లికార్జున ఎన్నిక

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: పెనగలూరు మండల ఎస్టీయూ అధ్యక్షుడిగా కాన్నేపాటి మల్లికార్జునను ఎన్నుకున్నారు. పెనగలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ మండల సర్వసభ సమావేశం గురువారం గౌరవాధ్యక్షుడు రాఘవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా బిట్టా శివప్రసాద్‌ను ఎన్నుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు పిల్లి రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు కె.యానాదయ్య, జిల్లా కౌన్సిలర్లు శ్రీనివాసరావు, ప్రభాకర్‌రెడ్డి, సురేంద్ర, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి జయరామయ్య, శివారెడ్డి, శేషారెడ్డి, రమణయ్య, శ్రీనివాసులు, వేణుగోపాలరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ నిర్లక్ష్య రహదారి

కడప- తిరుపతి జాతీయ రహదారిపై అటవీశాఖ, పోలీసు అధికారులు ఏర్పాటు చేసిన బారికేడ్లు ప్రమాదాలను నివారించక పోగా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రాజంపేట మండలం రామాపురం చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేయడానికి బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఎలాంటి రేడియం స్టిక్కర్లు, రంగులు వేయలేదు. దీంతో పట్టపగలే ప్రమాదాలు జరుగుతున్నాయి. దగ్గరకు వచ్చే వరకు ఈ బోర్డులు కనిపించకపోవడంతో ద్విచక్ర వాహన చోదకులు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహదారులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ**

మహిళ అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన ఓ మహిళ (55) ఈ నెల 14వ తేదీ నుంచి కనిపించడంలేదని ఆమె కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గత కొంత కాలంగా మతిస్థిమితం సరిగా లేక బాధపడుతున్న ఆమె ఎటో వెళ్లిపోయిందని వారు చెప్పారన్నారు. ఈ విషయంపై గురువారం కేసు నమోదు చేసినట్లు వివరించారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన కేంద్రాలు

రాజంపేటలో విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఎంఈవో రఘునాథ్‌రాజు

పుల్లంపేటలో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంఈవో చక్రధర్‌రాజు

గ్రంథాలయాలు విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చే విజ్ఞాన కేంద్రాలని అధికారులు, గ్రంథపాలకులు తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపులో భాగంగా రాయచోటి, రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రంథాలయాల్లో గురువారం ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చదువుతో పాటు విజ్ఞానం, వినోదం, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు ఎన్నో ఉంటాయని, వాటిని చదివితే జీవితం ఉన్నతంగా ఉంటుందని, అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చునని తెలిపారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల చిత్రాలివి. **- న్యూస్‌టుడే, క్లస్టర్ బృందం**

నెలాఖరులోగా సర్వే చేయాలి

వీరబల్లి, న్యూస్‌టుడే: నూతన గృహాలకు నవంబరు 30లోగా దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరు పీఎంఏవై గ్రామీణ 2.0 యాప్ ద్వారా సర్వే పూర్తి చేయించుకోవాలని ఎంపీడీవో గౌస్ బాషా, హౌసింగ్ ఏఈ వెంకటేసు అన్నారు. నియమించిన అధికారిచే సర్వే చేయించుకుని యాప్ ద్వారా మీరు ఇల్లు కట్టుకునే ప్రదేశం జియో ట్యాగింగ్ చిత్రం తప్పక తీసుకోవాలన్నారు. ఈ యాప్ ద్వారా దరఖాస్తులు నవంబర్ 30వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉందన్నారు. గ్రామాలకు నియమించబడిన అధికారుల ద్వారా సర్వే తప్పక చేయించుకోవాలని కోరారు.

సుండుపల్లి, న్యూస్‌టుడే: పక్కా ఇంటికి అర్హత ఉన్న వారు తగిన వివరాలతో సచివాలయంలో నమోదు చేయించు కోవాలని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. సొంత ఇంటి స్థలం ఉన్నా, లేకున్నా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రేషన్‌కార్డు, కుటుంబ సభ్యుల ఆధార్ పత్రం, బ్యాంకు ఖాతా, చరవాణి నంబరు తదితర వివరాలతో వెళ్లి నమోదు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్విజ్ పోటీల విజేత రాయవరం ఉన్నత పాఠశాల

సుండుపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మానవత సంస్థ ఆధ్వర్యంలో సంస్థ మాజీ అధ్యక్షులు, విశ్రాంత హిందీ ఉపాధ్యాయుడు ఎస్.మహబూబ్‌బాషా క్విజ్‌పోటీలు నిర్వహించారు. గురువారం తెలుగు, హిందీ, ఆంగ్లబాషల్లో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రాయవరం వైఎస్ఆర్ జడ్పీ ఉన్నత పాఠశాల, తిమ్మసముద్రం తెలుగు, ఉర్దూ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. సంస్థ తరపున జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో పాటు నగదు బహుమతిని అందిస్తారని నిర్వాహకులు తెలిపారు. కన్వీనరు ఆర్.కృష్ణమరాజు, డైరెక్టరు ఎన్.రవీంద్రనాథరెడ్డి, జిల్లా కోశాధికారి జె.హరికుమార్, మండల కోశాధికారి నరసింహులు, కార్యదర్శి శంకర్‌నాయక్, సుండుపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ప్రకాష్‌నాయక్, ఉపాధ్యాయులు దేవలానాయక్, నాగరాజనాయక్, మణికంఠ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత.. పర్యావరణం.. పల్లెలకు ఆభరణం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవోలు సూచించారు. రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల పరిధిలోని మండల పరిషత్తు కార్యాలయాల్లో గురువారం సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులు, సచివాయాల సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా థీమ్-5లో భాగంగా చేపట్టే కార్యక్రమాల గురించి వివరించారు. శుక్రవారం ఉదయం నుంచే అన్ని వార్డుల్లో కేటాయించిన సిబ్బంది వెళ్లి వీధుల పరిశుభ్రత చేయించాలని, ప్రజలకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించి చెత్తను తీసుకెళ్లే వాహనాలను సద్వినియోగం చేసుకొనేలా చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు, గృహనిర్మాణశాఖ ఏఈలు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, రాయచోటి క్లస్టర్ బృందం

పుల్లంపేటలో స్వచ్ఛ హరిత గ్రామం శిక్షణ అనంతరం సర్పంచులు, ఉపసర్పంచులు, కార్యదర్శులతో అధికారులు

చిన్నమండెం మండల పరిషత్తు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఆదినారాయణ

కుడి కాలువకు నీరు విడుదల చేయాలి

గాలివీడు, న్యూస్‌టుడే: వెలిగల్లు జలాశయం నుంచి కుడి కాలువకు నీటిని విడుదల చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. జలాశయంలో గరిష్ఠ నీటి సామర్థ్యం 4.64 టీఎంసీలు కాగా గురువారం 4.15 టీఎంసీలకు నీటి మట్టం పెరిగింది. ఎగువ నుంచి జలాశయానికి నీరు చేరుతుండటంతో గస్తీ ఏర్పాటు చేశారు. ప్రాజెక్టులో నీటి నిల్వలు పెరిగితే స్పిల్‌వే గేట్లు ఎత్తి దిగువన నదికి విడుదల చేయనున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదిస్తే స్పందించాలా!

గాలివీడు, న్యూస్‌టుడే: గొర్రెల షెడ్డు నుంచి వస్తున్న దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని జిల్లా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు అర్జీ సమర్పించినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. గాలివీడు గ్రామ పంచాయతీ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఎదురు వీధి రవీంద్రనగర్‌లో ఓ మాంసం దుకాణ యజమాని షెడ్డులో గొర్రెలు మేపుతున్నాడు. వాటి వాసనతో అవస్థలు దూరంగా ఏర్పాటు చేయించాలని పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టరేట్‌లో అర్జీ ఇచ్చారు. షెడ్డును తొలగించకుండా బాగుందని నివేదిక పంపి పంచాయతీ అధికారులు చేతులు దులుపుకొన్నారు. మళ్లీ పంచాయతీ వారిని ఆశ్రయించగా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఉన్నతాధికారులు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

మంచు.. ప్రమాదాల్లో ముంచు

కడప-తిరుపతి జాతీయ రహదారిపై మంచు కురిసే వేళ ప్రమాదాలు ఎదురు చూస్తున్నాయి. రైల్వేకోడూరు నియోజకవర్గం అటవీ ప్రాంతంలో ఉండడం వల్ల దట్టమైన పొగమంచుకు దారి కనిపించడం లేదు. ఈ రహదారిపై వేలల్లో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. తెల్లవారుజామున మంచు కురుస్తుండటంతో లైట్లు వేసుకుని వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఉదయం 9 గంటల వరకు భానుడు కనిపించడం లేదు. అప్రమత్తంగా ఉండకపోతే ప్రమాదాలు తప్పవు. **- న్యూస్‌టుడే, పుల్లంపేట**

ముగిసిన పూజలు

సుండుపల్లి: కార్తిక మాస పూజలు గురువారం ముగిశాయి. మండలంలోని విరూపాక్ష స్వామి, చంద్రమౌళీశ్వర స్వామి, ప్రసన్న సిద్ధేశ్వర స్వామి, సంగమేశ్వర స్వామి, మల్లికార్జున స్వామి, పార్వతీసమేత శంకరనాథ స్వామి ఆలయాలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

CHANGE OF NAME
I, UTUKURU LAKSHMI NARASA REDDY (OLD NAME), S/o UTUKURU KRISHNA REDDY, R/o D.No:6-170-3, UPPARAPALLI (Vi), KONDUR (Post), PENAGALUR (Ml), ANNAMAYYA DIST., A.P. - 516127, INDIA. DECLARE THAT I HAVE CHANGED MY NAME AS UTUKURU LAKSHMI REDDY (NEW NAME).

CHANGE OF NAME
I, UTUKURU SUBBA LAKSUMMA, W/o UTUKURU LAKSHMI NARASA REDDY (OLD NAME), R/o D.No:6-170-3, UPPARAPALLI (Vi), KONDUR (Post), PENAGALUR (Mi), ANNAMAYYA DIST., A.P. - 516127, INDIA. DECLARE THAT I HAVE CHANGED MY NAME AS UTUKURU SUBBALAKSHUMMA, W/o UTUKURU LAKSHMI REDDY (NEW NAME).

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు, రాయచోటిలో
I.P. No.14/2025
ఉప్పుతోళ్ళ లక్ష్మీదేవి, భర్త సుబ్బరామ, R/o B.C. కాలనీ, నల్లగుట్టపల్లి గ్రామం, రామాపురం మండలం, అన్నమయ్య జిల్లా. ...పిటీషనరు
V/s
1. గంపా చిన్న సుబ్బరాయుడు, తండ్రి సుబ్బరాయుడు @ ముగన్న, 2. దేరంగుల నరసమ్మ, భర్త శ్రీనివాసులు, 3. దేరంగుల [illegible]
[illegible]
15.12.2025వ తేదీన [illegible] 10.30 గంటలకు [illegible]
By Order of the Court
[illegible]
Cell No.9703710303.

IN THE COURT OF THE CIVIL JUDGE (JUNIOR DIVISION), RLY KODUR
E.P. No. 1/2025 IN O.S. No. 6/2018
[illegible] ...డిక్రీ హోల్డర్
Vs
[illegible] ...జడ్జిమెంట్ డెటర్
నోటీసు
[illegible] 25.11.2025వ తేదీన ఉదయం 10.30 [illegible]
SCHEDULE
ITEM No.I: Mangalore tiled house bearing D.No.8/196 with Vacant site situated at Kadapa District, Pullampet Sub-District, Kodur Mandal, Kodur Village, Kodur Grama Panchayat, Kodur Village Lands, Sy.No.716-4, Ram Nagar Residential area, 8th ward.
Boundaries: East: Vacant Site of Dandu Sunitha, West: Panchayat Road, North: 6 feet Sandhu Rastha, South: Tiled house and Vacant site of Dandu Sunitha.
Measurements: Vacant Site: East-West: 26 1/4 feet (7.96 meters), North-South: 45 feet (13.65 meters) in 131 1/2 Square yards.
Mangalore Tile House: East-West: 18 feet, North-South: 45 feet in 810 Square feets consisting doors, almerahs, electrical fittings with house service connection No.2140. At present the Mangalore Tiled House in this property was collapsed due old age and now it is only a vacant site. D.Hr Value: Rs.1,00,000/-
ITEM No.II: Mangalore tiled house bearing D.No.8/196 with vacant site situated at Kadapa District, Pullampet Sub-District, Kodur Mandal, Kodur Village, Kodur Grama Panchayat, Kodur Village Lands, Sy.No.716-4, Ram Nagar Residential area, 8th ward.
Boundaries: East: Vacant Site of Dandu Sunitha, West: Panchayat Road, North: Tiled house and Vacant site of Dandu Sunitha, South: Panchayat Road.
Measurements: Vacant Site: East-West: 26 1/4 feet (7.96 meters), North-South: 45 feet (13.65 meters) in 131 1/2 Square yards.
Mangalore Tiled House: East-West: 18 feet, North-South: 45 feet in 810 Square feets consisting doors, almerahs, electrical fittings with house service connection No.2140. At present the Mangalore Tiled House in this property was collapsed due old age and now it is only a vacant site. D.Hr Value: Rs.1,00,000/-
By Order of the Court
S.మధుసూదనరావు, అడ్వకేట్, రైల్వేకోడూరు.

60 ఏళ్ల తరవాత.. 59 నాటి జ్ఞాపకాలు

గుంటూరులో సమావేశమైన జీఎంసీ పూర్వ విద్యార్థులు

గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల 1959-65 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

ఈ చిత్రంలో కనిపిస్తున్న వారంతా నిపుణులైన సీనియర్ వైద్యులు. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో 1959-65 బ్యాచ్‌కు చెందినవారు. అరవై ఏళ్ల తరువాత గురువారం గుంటూరులోని ఓ ప్రైవేటు హోటల్‌లో కలిశారు. నాటి జ్ఞాపకాల్ని గుర్తు చేసుకున్నారు. జీఎంసీ, జీజీహెచ్‌కు వెళ్లి ప్రిన్సిపల్ సుందరాచారి, సూపరింటెండెంట్ యశస్వి రమణను కలిశారు. నాటి బ్యాచ్‌లో 131 మంది ప్రవేశం పొందగా.. ఇందులో 55 మంది ఇప్పటికే ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోయారు. 20 మంది సమాచారం తెలియలేదు. మిగిలినవారంతా ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకుని చురుగ్గా ఉంటున్నారు. నేరుగా కలుసుకోవాలన్న ఉద్దేశంతో 25 మంది పూర్వ విద్యార్థులు వచ్చారు. ప్రతి ఒక్కరూ వారివారి జీవితాల్లో సాధించిన విజయానందాన్ని అందరితో పంచుకున్నారు. సన్మానాలు, జ్ఞాపికలతో సందడి చేశారు. సభ్యుల చిరునామాలు, వివరాలతో సావనీర్ విడుదల చేశారు.

- ఈనాడు, అమరావతి

31,051 జాబ్ కార్డుల తొలగింపునకు చర్యలు

బాపట్ల, న్యూస్‌టుడే: ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయని జిల్లాలోని 31,051 జాబ్ కార్డులు తొలగించడానికి చర్యలు చేపడుతున్నట్లు డ్వామా పీడీ విజయలక్ష్మి గురువారం తెలిపారు. ప్రతి పంచాయతీలో తొలగించే జాబ్ కార్డుల జాబితాను ప్రదర్శనగా ఉంచామన్నారు. 22న జరిగే గ్రామ సభల్లో కార్డులు తొలగించే వారి పేర్లను చదివి వినిపిస్తారన్నారు. కొత్తగా జాబ్ కార్డులు కావాల్సిన కూలీల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు.

అటవీ భూములు హాంఫట్!

నకిలీ పత్రాలు సృష్టించి రూ.కోట్లకు విక్రయం ● గత వైకాపా ప్రభుత్వ హయాంలో అక్రమాలు

బాపట్ల, న్యూస్‌టుడే

పర్యాటక కేంద్రం సూర్యలంకలో అటవీ భూములకు నకిలీ పత్రాలు సృష్టించి.. పట్టా భూములుగా చూపిస్తూ కొందరు అక్రమార్కులు విక్రయిస్తున్నారు. బీచ్ సమీపంలో భూములకు విపరీతమైన డిమాండ్ ఉంది. విశ్రాంత తహసీల్దారు పేరుతో రెండున్నర దశాబ్దాల కిందట నకిలీ స్టాంపులతో జారీ చేసిన పట్టాల ఆధారంగా ప్రైవేటు వ్యక్తులకు ఆశ చూపుతున్నారు. ఎకరా రూ.2-3 కోట్లకు బేరం పెడుతున్నారు. కొందరు అటవీ భూములకు ఎనీవేర్ రిజిస్ట్రేషన్ కింద పల్నాడు జిల్లాలో దొంగ రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు తెలిసింది. అటవీ భూములు కొని అమాయకులు మోసపోతున్నారు.

సూర్యలంకలో అటవీ భూములు

పట్టాకు రూ.లక్షన్నర ఇస్తానని బేరం

సూర్యలంకలో ప్రభుత్వ, పట్టా భూములు చాలా తక్కువ. 98 శాతం అటవీ భూములే. ప్రధాన బీచ్ నుంచి పోగురు వరకు రిజర్వు అటవీ భూములు ఉన్నాయి. ఓ విశ్రాంత తహసీల్దారు 1998లో సొసైటీ పేరిట సాగు చేయడానికి 60 ఎకరాలు కేటాయించినట్లు ఆసోదివారిపాలెం, పడమర బాపట్ల, పోతురాజుకొత్తపాలెం, హనుమాన్ నగర్, బవిసిరెడ్డిపాలేనికి చెందిన కొందరు వ్యక్తులు తిరుగుతున్నారు. తమ భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని రెండేళ్ల కిందట తహసీల్దారు వద్దకు వెళ్లారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఓ ప్రజాప్రతినిధి పట్టాకు రూ.లక్షన్నర చెల్లిస్తానని, తనకు ఇవ్వాలని కోరారు. రెవెన్యూ శాఖ తమకు 90 ఎకరాల భూమి ఉందంటోంది. సర్వేలో అవి రిజర్వు అటవీ భూములని తేలింది.

అక్రమ రిజిస్ట్రేషన్లు.. ప్రైవేటు వ్యక్తుల వద్ద ఉన్న పట్టాల ఆధారంగా అక్రమార్కులు దొంగ పత్రాలు సృష్టించి చిలకలూరిపేట, నరసరావుపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అటవీ భూములకు రిజిస్ట్రేషన్లు చేయించారు. ఆ పత్రాల్ని ప్రైవేటు బ్యాంకుల్లో తనఖా పెట్టి రూ.కోట్ల రుణాలు తీసుకుని స్వాహా చేశారు. ప్రైవేటు సర్వేయర్లను తీసుకొచ్చి రిజర్వు అటవీ భూముల్లో సర్వే చేసి హద్దు రాళ్లు పాతడానికి యత్నించగా అటవీ శాఖాధికారులు అడ్డుకున్నారు. కొందరు నాయకులు భూములను అమ్మకానికి పెట్టారు. మోసపోయిన వారు పోలీస్ స్టేషన్లను ఆశ్రయించగా.. తమకు సంబంధం లేదని పోలీసులు వెనక్కి పంపుతున్నారు.

రూ.లక్షలు వ్యయం.. నిరుపయోగం

దేశాయిపేటలోని ఆక్వా, అగ్రి టెస్టింగ్ ల్యాబ్

వేటపాలెం, న్యూస్‌టుడే: దేశాయిపేటలోని చీరాల వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ప్రాంగణంలో గత ప్రభుత్వ హయాంలో రూ.80 లక్షలు వెచ్చించి సమీకృత అగ్రి, ఆక్వా టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. ఆ సమయంలో దీన్ని ప్రారంభించినా చాలా రోజులు పరికరాలు లేక తెరుచుకోలేదు. ఎట్టకేలకు పరికరాలు ఏర్పాటు చేయడంతో వ్యవసాయం, ఆక్వాకు సంబంధించి మట్టి, నీటి పరీక్షలు చేసేవారు. చీరాల, చినగంజాం, వేటపాలెం మండలాలకు చెందిన అయిదు వేల మంది ఆక్వా రైతులు, 30 వేల ఎకరాలకు చెందిన అన్నదాతలకు ఎంతగానో ఉపయోగపడేది.

ఆరు నెలల కిందట సచివాలయ సిబ్బందిని బదిలీ చేశారు. ఆ సమయంలో ఇక్కడి సిబ్బంది ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఆక్వా రైతులకు సంబంధించి పరీక్షలు జరగడం లేదు. అన్నదాతలదీ ఇదే పరిస్థితి. ప్రధానంగా ఆక్వా రైతులైతే ఇటు ఒంగోలు, అటు గుంటూరు వెళ్లాల్సి రావడంతో ఇబ్బందులతో పాటు అధిక వ్యయమవుతోందని వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి సిబ్బందిని ఏర్పాటు చేసి ల్యాబ్‌లో నిరంతరం పరీక్షలు జరిగేలా చర్యలు చేపట్టాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అతిథి దేవోభవ

హోం స్టేకు ఆదరణ

గవినివారిపాలెంలో పొలాల మధ్య నిర్మించిన అతిథి గృహం

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో పర్యాటకరంగం కొత్త పుంతలు తొక్కుతోంది. బాపట్ల, చీరాల, వేటపాలెం తీర ప్రాంతాలు సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. బీచ్‌కు సమీపంలో... తీర గ్రామాల్లో పచ్చని పొలాల మధ్య హోం స్టేలు ఇప్పుడిప్పుడే ఆదరణ పెరుగుతోంది. చుట్టూ పచ్చదనం ఉండే ప్రాంతాల్లో అతిథి గృహాలు నిర్మిస్తున్నారు. కింద పూర్తిగా సెల్లార్‌కు వదిలిపెట్టి కార్లు, ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసుకునే సౌకర్యం కల్పిస్తున్నారు. వారాంతాల్లో హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి పర్యాటకులు వీటిలో ఉంటూ బీచ్‌కు వెళ్లి వస్తున్నారు. పదుల సంఖ్యలో భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. శుక్ర, శని, ఆదివారాలు బీచ్ వద్ద రిసార్టుల్లో కాటేజీలు లభించడం లేదు. నలుగురు కుటుంబ సభ్యులు, స్నేహితులు ఉండాలంటే రూ.పది నుంచి పన్నెండు వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. అదే అతిథి గృహాల్లో రూ.మూడు నుంచి రూ.నాలుగు వేలకు ఏసీ గదులు లభిస్తున్నాయి. పర్యాటకులకు నచ్చిన వంటకాలను వండి పెడుతున్నారు. ఆదరణ బాగా లభిస్తే భవిష్యత్తులో హోంస్టే సంస్కృతి మరింత విస్తరించనుంది.

రాయబారం రసవత్తరం

గ్రామోత్సవంలో వీరుల ఆయుధాలు

కారంపూడి, న్యూస్‌టుడే: పల్నాటి వీరుల ఆరాధనోత్సవాల్లో రెండో రోజు రాయబార ఘట్టం రసవత్తరంగా సాగింది. అలనాడు కోడిపోరులో మాచర్ల రాజధానిని కోల్పోయి అరణ్య, అజ్ఞాత వాసాలు ముగించుకొని మలిదేవ, బ్రహ్మన్నల పరివారం తిరిగి వస్తారు. వారికి రాజ్యం ఇవ్వాలంటూ గురజాల రాజు నలగామని వద్దకు అలరాజు రాయబారానికి వస్తారు. ఆయనను చర్లగుడిపాడు వద్ద హతమార్చడంతో పల్నాటి యుద్ధం అనివార్యమైన క్రతువును ప్రదర్శించారు. గురజాల రాజు వీర్ల దేవాలయంలోని కథ మండపంలో గానం చేస్తుండగా... వీరుల వంశీయులు కత్తిసేవ చేశారు. వీరాచారవంతులు రాయబారం ఘట్టం ముగిసింది. ఉదయం వీరుల ఆయుధాలకు (కొణతాలు) పవిత్ర నాగులేరు గంగధారి మడుగులో స్నానాలు చేయించి వీరగంధం పూసి ప్రత్యేకంగా అలంకరించారు. చెన్నకేశవ స్వామి, అంకాళమ్మ ఆలయాల్లో శంఖుతీర్థాలు తీసుకొని ఆచారవంతులు పీఠాధిపతి ఇల్లు చేరారు. ఈ ఘటనను కళ్లకు కడుతూ చేసిన గానం ఆకట్టుకుంది.

అక్షరానికో నిఘంటువు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: ఆంగ్లం నుంచి ఆంగ్లం, తెలుగు, హిందీ భాషల్లో పదాలకు అర్థాలు తెలిపే నిఘంటువులు చూస్తుంటాం. ఆంగ్ల భాషలోని 26 అక్షరాల్లో ప్రతి అక్షరానికి ప్రత్యేకంగా ఓ నిఘంటువును చూడాలంటే పల్నాడు జిల్లా నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాల గ్రంథాలయానికి రావాల్సిందే. అక్కడ విదేశీ ప్రచురణ సంస్థల ఆక్స్‌ఫర్డ్, ఛాంబర్స్ ఫర్ అండ్ వాగ్నల్స్, ఎన్‌సైక్లో తదితర 100 రకాల నిఘంటువులున్నాయి. వాటిలో ఆక్స్‌ఫర్డ్ సంస్థ 1933లో లండన్‌లో ప్రచురించిన 12 వాల్యూమ్స్ ఈ గ్రంథాలయంలో ఉన్నాయి. ప్రతి అక్షరానికి సంబంధించిన పలు పదాలకు 3500 పుటల్లో అర్థాలు ప్రచురించి ఉన్నాయి. గ్రంథాలయ ప్రారంభ సమయం 1956లో అప్పటి కళాశాల కమిటీ నేతలు రూ.650 వెచ్చించి ముంబయి (అప్పటి బొంబాయి) నుంచి వీటిని తెప్పించారు. తర్వాత మరో మూడు సప్లిమెంటరీ వాల్యూమ్స్ తెప్పించి అందుబాటులో ఉంచారు. ఇలా ఈ గ్రంథాలయం ప్రత్యేక నిఘంటువుల కేంద్రంగా మారింది.

బీచ్ రహదారికి తాత్కాలిక మరమ్మతులు

బాపట్ల, న్యూస్‌టుడే: మొంథా తుపాను ప్రభావానికి ధ్వంసమైన వాడరేవు- రామాపురం- కఠారిపాలెం బీచ్ రహదారి పునరుద్ధరణ పనుల్ని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు చేపడుతున్నారు. రహదారి ఆరు చోట్ల కొట్టుకుపోయి, కల్వర్టులు కూలి రాకపోకలు నిలిచి తీరగ్రామాల ప్రజలు, మత్స్యకారులు, పర్యాటకులు పడుతున్న ఇబ్బందులపై 'వస్తే పోలేరు.. వెళ్తే రాలేరు' శీర్షికన ఈ నెల 13న 'ఈనాడు'లో ప్రచురించిన కథనానికి కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించారు. రహదారి, కల్వర్టుల తాత్కాలిక మరమ్మతులకు జిల్లా ఖనిజ నిధి నుంచి రూ.40 లక్షలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సత్వరమే పనులు ప్రారంభించి రాకపోకలు పునరుద్ధరించాలని పంచాయతీరాజ్ ఎస్ఈ రాజన్‌బాబును కలెక్టర్ ఆదేశించారు. కొత్త వంతెనలు, కల్వర్టులు, అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి జాతీయ విపత్తు నిధి నుంచి రూ.8 కోట్లు కేటాయించాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపించారు.

పైన కొమ్మమూరు.. కింద నల్లమడ

రేటూరు సమీపంలో అక్విడక్టు వద్ద ఇలా..

బాపట్ల: కృష్ణా పశ్చిమ డెల్టాలో సాగు, మురుగునీటి కాలువలు ఎక్కువ. కొమ్మమూరు కాలువ అతి పెద్ద సాగునీటి వనరు కాగా.. నల్లమడ వాగు పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో భారీ మురుగునీటి పారుదల వ్యవస్థ. బాపట్ల, కాకుమాను, పర్చూరు మండలాల సరిహద్దుల్లో కాలువ, వాగు ఒకదానినొకటి దాటుకుంటూ వెళ్తున్నాయి. రేటూరు సమీపంలోని యూటీ రెండింటిని వేరు చేస్తోంది. అక్విడక్టులో పైన కొమ్మమూరు కాలువలో గరిష్ఠంగా రెండున్నర వేల క్యూసెక్కుల వరకు సాగునీరు ప్రవహిస్తుండగా.. కింద నల్లమడ వాగులో అత్యధికంగా 42 వేల క్యూసెక్కుల వరద వెళ్తుంది. డెల్టాలో లక్షన్నర ఎకరాల్లో ఆహార, వాణిజ్య పంటల సాగులో కాలువ, వాగు రెండూ కీలకమే.

అనుమతికి మించి లోడు వినియోగంపై కేసులు

98 మందికి రూ.3.37 లక్షల అపరాధ రుసుం

అద్దంకి, న్యూస్‌టుడే: పట్టణంలో గురువారం విద్యుత్తు శాఖాధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు. తొలుత ద్వారకా నగర్ విద్యుత్తు ఉప కేంద్రం వద్ద సిబ్బందికి అధికారులు సూచనలిచ్చారు. మొత్తం 32 బృందాలుగా ఏర్పడి పట్టణంలోని ప్రతి స్తంభాన్ని తనిఖీ చేశారు. అనుమతికి మించి లోడు వాడుతున్న 90 మందిని గుర్తించి రూ.3 లక్షలు, అనుమతించిన కేటగిరీ కాకుండా మరో కేటగిరీ వాడుతున్న ఎనిమిది మందికి రూ.37 వేల అపరాధ రుసుం విధించారు. తొలిసారి పొరపాట్లు జరిగిన వారికి మాత్రమే జరిమానా విధిస్తామని, రెండోసారి పట్టుబడితే కేసు నమోదు చేసి అరెస్టు చేయిస్తామని అధికారులు తెలిపారు. అద్దంకి డివిజన్ పరిధిలోని విద్యుత్తు సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు.

VISHWA BHARATHI COLLEGE OF PHARMACEUTICAL SCIENCES

(Approved by AICTE & PCI, New Delhi, Affiliated to JNTUK, Kakinada, Govt of AP) PERECHERLA, GUNTUR - 522009. PH: 9440434169

ESTD:1997

B. PHARMACY & PHARM.D SPOT ADMISSION – 2025

Eligible candidates who have not taken admission in any other college so far may attend Spot Admissions in **I B. Pharmacy & I Pharm.D** with all original certificates between **20-11-2025 to 23-11-2025.** The Vacant seats created to unreported candidates shall be filled-up as per guidelines of APSCHE Convenor APEAPCET- 2025. **PRINCIPAL**

CHALAPATHI COLLEGE OF PHARMACY

CCPY

A.R.Nagar, Mothadaka, GUNTUR- 522 016
Ph: 08645 294242, Mobile : 9492478685,
Email.principalccp2024@gmail.com www.ccpy.ac.in

CATEGORY -B / SPOT ADMISSIONS I B.PHARMACY

S.No.	Course	EAPCET Code	Category-B Seats
01	B.Pharmacy	CCPY	30

Eligible candidates who have not taken admission in any other college so far may attend SPOT Admissions in I B.Pharmacy with all original certificates on **24/11/2025.** The vacant seats created to unreported candidates, shall be filled-up as per guidelines of APSCHE & Convenor APEAPCET-2025. **Principal**

నిధులిస్తేనే నీరు

కాలువలు, డ్రెయిన్ల మరమ్మతులకు రూ.64 కోట్లతో ప్రతిపాదనలు

ఈనాడు – అమరావతి

మొంథా తుపాను, భారీ వర్షాలకు కృష్ణా డెల్టాలోని కాలువలు, డ్రెయిన్లకు పడ్డ గండ్లను పూడ్చేందుకు రూ.64 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రభుత్వం వీలైనంత తొందరగా అనుమతులిస్తే సాంకేతిక ప్రక్రియలు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని చెబుతున్నారు. తుపాను తరువాత కాలువల్లో నీటి ప్రవాహాలకు అడ్డంకుల్లేకుండా తాత్కాలిక పనులు పూర్తి చేశారు.

కాకుమాను మండలం కొండపాటూరు వద్ద నల్లమడ వాగుకు పడ్డ గండి

నష్టం ఆనవాళ్లిలా... ● గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో కాలువలు, డ్రెయిన్లు దెబ్బతినగా.. పల్నాడు జిల్లాలో వాగులకు గండ్లు పడ్డాయి. ● మెట్ట ప్రాంతాల నుంచి వాగుల ద్వారా వచ్చిన వరద కారణంగా బాపట్ల జిల్లాలోని పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ● నల్లమడ వాగు వరద కొమ్మమూరు కాలువలో కలవడంతో పలు చోట్ల గండ్లు పడ్డాయి. మిగిలిన వాగుల కట్టలూ దెబ్బతిన్నాయి. ఫలితంగా వేలాది ఎకరాల్లోని పంటలు నీట మునిగాయి. ● శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేయడానికి రూ.36.90 కోట్లు కావాలని జలవనరుల శాఖ ముఖ్య ఇంజినీరుకు ప్రతిపాదనలు పంపించారు. తాత్కాలిక ప్రాతిపదికన ఇప్పటికే కొన్ని పనులు పూర్తి చేయగా.. మిగిలిన వాటికి రూ.27.10 కోట్లు అవసరం. మొత్తంగా రూ.64 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదనల్లో కోరారు. ● డెల్టాలో కాలువలు, మురుగుకాలువలు, పల్నాడులో వాగులకు మరమ్మతులు పూర్తి చేస్తే వరద కష్టాల నుంచి ఉపశమనం లభిస్తుంది.

జిల్లా	పనులు	తాత్కాలిక ఖర్చు (రూ.కోట్లలో)	శాశ్వత పనులకు (రూ.కోట్లలో)
గుంటూరు	130	8.10	14.77
బాపట్ల	317	17.68	19.40
ప్రకాశం	25	1.03	2.03
పల్నాడు	3	0.29	0.70
మొత్తం	475	27.10	36.90

గ్యాస్ సిలిండరా.. మార్చేద్దామా!

పిట్టలవానిపాలెం, కర్లపాలెం, న్యూస్‌టుడే: గ్యాస్ సిలిండర్ల సరఫరా చేస్తున్న ఏజెన్సీలపై అసంతృప్తిగా ఉన్నారా.. అయితే మార్చుకునే వెసులుబాటును కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోంది. ఏ కంపెనీ గ్యాస్ సిలిండరైనా ధర ఒకటే కావడంతో పోర్టబిలిటీ విధానానికి ఇంధన నియంత్రణ సంస్థ సంకల్పించింది. జిల్లాలోని 34 ఏజెన్సీల్లో సుమారు 4.88 లక్షల గ్యాస్ సిలిండర్లకు పోర్టబిలిటీ విధానం ఉపయుక్తం కానుంది. ఎల్పీజీ పోర్టబిలిటీ ప్రక్రియను 2013 అక్టోబరులో కేంద్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా తెలుగు రాష్ట్రాల్లో చేపట్టింది. ఒకే కంపెనీ పరిధిలోని డీలరును మార్చుకునేందుకు అనుమతించింది. తాజా ప్రతిపాదనలతో ఏ కంపెనీల సిలిండరైనా మార్చుకునే సౌలభ్యాన్ని వినియోగదారులకు ఇవ్వనుంది. త్వరలో ఈ విధానం అందుబాటులోని రానుందని పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు.

ఊరికి ఉపకారి.. అభివృద్ధికి సహకారి

నేడు గొట్టిపాడులో తపాలా కార్యాలయం ప్రారంభం



పోస్టాఫీసు

యద్దనపూడి ప్రసాద్

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : ఆయనో ప్రభుత్వ ఉద్యోగి. తాను నివసిస్తున్న ఊరు బాగు కోసం నిరంతరం తపన పడుతుంటారు. రెండు దశాబ్దాలకు పైగా ఉద్యోగ జీవితంలో గ్రామంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి ఊరికి ఉపకారిగా నిలుస్తున్నారు. ఆయనే మండలంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న యద్దనపూడి ప్రసాద్. ఆయనకు పిల్లలు లేరు. 'ప్రేమామయుని నిలయం' పేరుతో ఓ భవనం నిర్మించి ఎంతో మంది అనాథ పిల్లలకు ఆశ్రయం కల్పించి సేవలందించారు. ప్రస్తుతం అక్కడ పిల్లలు ఎవరూ లేకపోవడంతో ఆ భవనాన్ని అంగన్‌వాడీ కేంద్రానికి అప్పగించారు. తన స్వగ్రామమైన గొట్టిపాడు ప్రధాన కూడలి వద్ద రెవెన్యూ భవనం తన సొంత డబ్బులతోనే నిర్మించారు. గ్రామంలో రెండు చోట్ల బస్ షెల్టర్లు, మూడు చేతిపంపులు, శుద్ధ జల కేంద్రం ఏర్పాటుచేశారు. గ్రామంలో పోస్టాఫీసు లేక గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి నూతన భవనాన్ని తన సొంత నిధులతో నిర్మించారు. దానిని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం ప్రారంభించనున్నారు. యద్దనపూడి ప్రసాద్ ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ తనకు ఉన్నంతలో ఊరికి మేలు చేస్తున్నారు.

క్షతగాత్రుల ప్రాణం.. గాల్లో దీపం

ట్రామా కేంద్రాలు ఏర్పాటు చేస్తేనే అత్యవసర వైద్యం

బాపట్ల, అద్దంకి, న్యూస్‌టుడే

బాపట్ల జిల్లాగా ఏర్పడి మూడేళ్లయినా వైద్య సేవలపరంగా వెనుకబడే ఉంది. జిల్లా నుంచి నాలుగు జాతీయ రహదారులు, రెండు రాష్ట్ర రహదారులు వెళ్తున్నాయి. రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నా క్షతగాత్రులకు అత్యవసర వైద్యం అందించేందుకు ఒక్క ట్రామాకేర్ కేంద్రం లేదు. తీవ్రంగా గాయపడ్డ వారికి సకాలంలో వైద్యం అందక ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. పాలకులు దృష్టి సారించి సత్వరమే ట్రామాకేర్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కోల్‌కతా- చెన్నై, వాడరేవు-పిడుగురాళ్ల జాతీయ రహదారులు, మేదరమెట్ల- అద్దంకి- నార్కట్‌పల్లి ఎక్స్‌ప్రెస్ వే, గుంటూరు- బాపట్ల- చీరాల, పెనుమూడి- ఒంగోలు రహదారుల్లో నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతున్నాయి. జిల్లా కేంద్రం బాపట్ల, పెద్ద పట్టణం చీరాలలో ప్రాంతీయ ఆసుపత్రులు, రేపల్లె, అద్దంకి, మార్టూరులో సామాజిక ఆసుపత్రులున్నా ట్రామాకేర్ విభాగం లేదు. క్షతగాత్రుల్ని తొలుత ఈ ఆసుపత్రులకు తీసుకొస్తే.. సిబ్బంది కట్లు కట్టి అత్యవసర వైద్యం నిమిత్తం 70 కి.మీ. దూరంలోని గుంటూరు సర్వజన ఆసుపత్రి, ఒంగోలు రిమ్స్‌కు పంపిస్తున్నారు. అర్ధరాత్రి, తెల్లవారుజామున ప్రమాదాలు జరిగితే తీవ్రంగా గాయపడ్డవారికి కనీసం కట్లు కట్టేవారు కూడా ఉండటం లేదు. సకాలంలో అత్యవసర వైద్యం అందక తీవ్రంగా గాయపడ్డవారు ప్రాణాలు కోల్పోతున్నారు. ఎన్‌హెచ్‌ల సమీపంలోని పట్టణాల్లో ట్రామాకేర్ కేంద్రాల్లేక, అత్యవసర వైద్యం అందక ఇరవై నుంచి ముప్పై శాతం మరణాలు పెరుగుతున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

వాడరేవు- పిడుగురాళ్ల రహదారిలో బోల్తా పడిన లారీ

ఎక్కడెక్కడ అవసరమంటే..

● జాతీయ రహదారులు వెళ్తున్న బాపట్ల, చీరాల, మార్టూరు, అద్దంకిలో ట్రామాకేర్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. తద్వారా క్షతగాత్రులకు అత్యవసర వైద్యం అందించి ప్రాణాలు కాపాడటానికి అవకాశం ఉంటుంది. జిల్లా రహదారి భద్రత కమిటీ బాపట్ల, అద్దంకిలో వీటి ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తూ ప్రభుత్వానికి నివేదిక పంపించింది.

● ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి రెండు ట్రామాకేర్ కేంద్రాలు మంజూరు చేయిస్తానన్నారు. రోడ్డు ప్రమాదాల క్షతగాత్రులకు సత్వర వైద్యం అందేలా కృషి చేస్తానని తెలిపారు.

ప్రాంతీయ ఆసుపత్రులు	సామాజిక వైద్యశాలలు	ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	2024లో రోడ్డు ప్రమాదాలు	మృతుల సంఖ్య	క్షతగాత్రులు	2025లో ఇప్పటి వరకు ప్రమాదాలు	మృతుల సంఖ్య	క్షతగాత్రులు
02 (బాపట్ల, చీరాల)	08	44	522	242	558	496	248	513

THE ARYAPURAM CO-OPERATIVE URBAN BANK LTD. HEAD OFFICE, RAJAMAHENDRAVARAM (Reg.No.3127)

RECRUITMENT NOTIFICATION FOR THE POSTS OF ASST. CLERKS / ASST. CASHIER ON CONTRACT BASIS

Applications are invited from Candidates who passed **IBPS/ SBI/RRB'S CLERKS PRELIMS** for the post of Asst. Clerks on contract basis Age : 21 Yrs-28 Yrs. as on date of notification (Age relaxation as per Bank service conditions), **Consolidated payment of Rs. 24,000/- p.m** during probation period of 1 year and on confirmation pay scales will be applicable.

The vacancies are at our Guntur, Visakhapatnam and Bhimavaram Branches only

Selection Procedure : Written Test and Interview

Last date of application to be received to bank: 29-11-2025 by 5:00 p.m.

Those candidates who have applied in last one year are not eligible to apply **Application only in specified format can be sent through courier or email or through registered post or in person. Bank reserves right to refuse any application without assigning any reasons**

Detailed Recruitment notification & Application can be downloaded from Website: http://www.aryapurambank.com/career.html

Email: arcobank_rjy@aryapurambank.com

Date: 21-11-2025 **Contact no.:-0883-2473550**

Secretary/CEO

దారి ఇలా.. ధాన్యం తరలించేదెలా?

చెరువు ఎస్సీ కాలనీ నుంచి మూలపాలేనికి వెళ్లే డొంక రోడ్డు అధ్వానంగా మారింది. సుమారు 4,400 ఎకరాల్లోని పంట చేలకు వెళ్లేందుకు ఇదే మార్గం. వారం రోజుల్లో వరి కోతలు ప్రారంభం కానున్నాయి. ధాన్యాన్ని తరలించే ట్రాక్టర్లు మట్టి రోడ్డులో ఇరుక్కుపోతున్నాయి. ఇలా ఉంటే నూర్పిడి చేసిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాలు, మార్కెట్‌కు ఎలా తరలించాలని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోతులు పూడ్చి గ్రావెల్ పోసి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, చెరువుజమ్ములపాలెం (బాపట్ల)

26న ఉద్యోగ మేళా

గుంటూరు: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 26న గుంటూరు ప్రభుత్వ జిల్లా స్థాయి శిక్షణ కేంద్రం/ ఐటీఐలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు తెలిపారు. ఔత్సాహికులు 99888 53335, 87126 55686, 87901 18349 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

పీఎం సూర్యఘర్ సద్వినియోగం చేసుకోండి

మాట్లాడుతున్న సీఎండీ పుల్లారెడ్డి

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే: పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఏపీ సీపీడీసీఎల్ ఛైర్మన్, ఎండీ పుల్లారెడ్డి అన్నారు. నరసరావుపేట మండలం జొన్నలగడ్డలోని జిల్లా విద్యుత్తు కార్యాలయంలో గురువారం పల్నాడు సర్కిల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్లులు సకాలంలో వసూలుచేసి విద్యుత్తు శాఖకు ఆదాయం పెంచాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తరచూ తలెత్తే లోవోల్టేజీ సమస్యను అధిగమించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్తు కనెక్షన్ల మంజూరులో జాప్యం తగదన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ డైరెక్టర్లు మురళీకృష్ణ యాదవ్, టి.వి.ఎస్.ఎన్.మూర్తి, వెంకటేశ్వర్లు, ఎస్ఈ విజయ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

(c) eenadu

ఈసారి లేనట్టే!

జిల్లాలో కౌలు రైతులు:	సుమారు 1.48 లక్షలు
సీసీఆర్ కార్డుల పంపిణీ లక్ష్యం :	1,00,000
ఇప్పటివరకు పంపిణీ చేసినవి :	85,000

కౌలు రైతులకు అందని అన్నదాత సుఖీభవ లబ్ధి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

అన్నదాత సుఖీభవ రెండో విడతలో తమకు లబ్ధి అందుతుందని ఆశించిన కౌలు రైతులకు నిరాశే మిగిలింది. మరి కొన్ని రోజులు ఆగాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం గత ఏడాది అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద మూడు విడతల్లో.. ఒక్కోసారి రూ.2 వేల చొప్పున అందించే ఆర్థిక సాయానికి తోడు అన్నదాత సుఖీభవ పథకం కింద మరో రూ.14 వేలు అందించేలా కార్యాచరణ రూపొందించారు.

తొలి విడతలో పీఎం కిసాన్.. అన్నదాత సుఖీభవ పథకాలు కలిపి ఒక్కో రైతుకు రూ.7 వేల చొప్పున అందజేశారు. బుధవారం రెండో విడతలోనూ అంతే నగదు అందజేశారు. రెండో విడతలో కౌలుదారులకు సాయం అందుతుందని భావించినా దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. ఇప్పటివరకు కౌలుదారుల్లో అర్హులెవరో కూడా తేల్చలేదు. దీనికి సంబంధించిన కసరత్తే మొదలవకపోవడంతో ఈసారికి సాయం లేనట్లేనని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు.

అయోమయం.. అన్నదాత సుఖీభవ పథకం కింద కౌలు రైతులను ఎంపిక చేసినా వారికి రూ.20 వేలు అందే పరిస్థితి లేదు. కేంద్రం వీరిని సాయానికి పరిగణనలోకి తీసుకోవట్లేదు. ఈ కారణంగా వారికి ఏడాదికి పెట్టుబడి సాయంగా రూ.14 వేలు మాత్రమే అందుతుంది. అయితే ఇప్పటికే రెండో విడతలు పూర్తయిన నేపథ్యంలో వారికి సాయం అందించే విషయమై అయోమయం నెలకొంది.

పశువులు చెప్పలేవని అలుసా!

ఆర్ఎస్‌కేలను వేధిస్తున్న మందుల కొరత | రైతులకు తప్పని భారం

జిల్లాలో ఆర్ఎస్‌కేలు:	408
పశు చికిత్స కేంద్రాలున్నవి:	219
పనిచేస్తున్న పశు సంవర్థక సహాయకులు:	203

చీరాల అర్బన్, వేటపాలెం, న్యూస్‌టుడే

రైతు సేవా కేంద్రా (ఆర్ఎస్‌కే)ల్లో మూగజీవాల మందుల కొరత వేధిస్తోంది. గత ప్రభుత్వం ఆర్బీకే (రైతు భరోసా కేంద్రాలు)ల ద్వారా పశువైద్యాన్ని రైతుల ముంగిటకే తీసుకొచ్చామని గొప్పలు చెప్పుకోగా మందుల సరఫరాను పట్టించుకోలేదు. ప్రస్తుత సర్కారు వీటి పేరును ఆర్ఎస్‌కేలుగా మార్చిన మూగజీవాల చికిత్సకు అవసర మైన మందులు అందని పరిస్థితి. ఫలితంగా చేతి చమురు వదులుతోందని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పశువులకు వైద్యం అందిస్తున్న వైద్యులు

మూగజీవాల వివరాలు	
తెల్ల పశువులు:	21,930
నల్ల పశువులు:	3,81,964
గొర్రెలు:	4,22,523
మేకలు:	49,990

జిల్లాలోని ఆర్ఎస్‌కేల్లో ఉంటున్న పశుసంవర్ధక సహాయకుల వద్దకు పశువులను తీసుకెళితే మందులు తీసుకురావాలంటూ పోషకులను ప్రైవేట్ దుకాణాలకు పంపుతున్నారు. జ్వరం, పారుడు వ్యాధి, మేత మేయకపోవడం, నులి పురుగులు తదితర సమస్యలతో దూరంలో ఉన్న పశు వైద్యశాలకు వెళ్లలేక చాలా మంది రైతులు వీటిని సమీపంలోని చికిత్స కేంద్రాలకు తీసుకెళుతున్నారు. అక్కడ మందులు లేవని వారు చెప్పడంతో చేసేది లేక వాటిని కొని, మూగజీవాలకు వైద్యం చేయిస్తున్నారు. టీకాలు, కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్లు మాత్రమే ఇక్కడ ఉచితంగా ఇస్తున్నారని పశుపోషకులు వాపోతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం

2019-20 సంవత్సరంలో ఆనాటి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. వీటిల్లో పశు చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రారంభంలో మందులు సరఫరా చేసింది. ఆ తరువాత వీటి ఊసే పట్టించుకోలేదు. పశు సంవర్ధక సహాయకులు మందులు ఇండెంట్ పెడితే అరకొరగానే అందించారు. 2023 నుంచి ఇప్పటి వరకు వీటికి అవసరమైన మందులు సరఫరా చేయలేదు. కూటమి ప్రభుత్వమైన స్పందించి వీటికి ప్రత్యేకంగా మందులు సరఫరా చేయాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

పశువైద్యశాల నుంచి సరఫరా

ఆర్ఎస్‌కేలకు ప్రభుత్వ పరంగా మూగజీవాల చికిత్సకు ప్రత్యేకంగా మందులు సరఫరా చేయడంలేదు. దీంతో దగ్గరలోని పశువైద్యశాల నుంచి వీటికి అందిస్తున్నాం. అవసరమైన వాటిని తీసుకెళ్లాలని లైవ్‌స్టాక్ సహాయకులకు సూచించాం.

- డాక్టరు వేణుగోపాల్, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి, బాపట్ల

ఎస్సీలపై దాడుల నిరోధానికి పటిష్ఠ చర్యలు

మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై దాడుల నిరోధానికి పోలీసు అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్లో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం జిల్లా స్థాయి పర్యవేక్షణ, నిఘా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బహుజనులపై దాడులు, నేరాలు జరిగితే యంత్రాంగం తక్షణమే స్పందించి న్యాయం చేయాలన్నారు. అట్రాసిటీ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. రెండేళ్లలో 152 కేసుల్లో బాధితులకు రూ.1.44 కోట్ల పరిహారం చెల్లించామని తెలిపారు. 29 కేసుల్లో పోలీసుల దర్యాప్తు సాగుతోందన్నారు. 265 కేసులు కోర్టుల విచారణలో ఉన్నాయని వివరించారు. ఓ కేసులో నిందితులకు కోర్టు శిక్ష విధించిందన్నారు. దర్యాప్తులో జాప్యం ఉండరాదన్నారు. డీఆర్వో గంగాధర్ గౌడ్, కమిటీ కన్వీనర్ రాజా దిబోరా, సభ్యులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

ఫార్మసీ విభాగంలో మందులు పరిశీలిస్తున్న పద్మావతి

పర్చూరు, న్యూస్‌టుడే: గ్రామీణులకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఆసుపత్రి సేవల జిల్లా సమన్వయకర్త (డీసీహెచ్) డాక్టర్ పద్మావతి తెలిపారు. గురువారం పర్చూరు సీహెచ్‌సీని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలలోని ఫార్మసీ, ఎక్స్‌రే యూనిట్, రక్తనిధి కేంద్రాలను పరిశీలించారు. వైద్యశాలలో గర్భిణులకు ప్రసవాలు ఎక్కువ సంఖ్యలో జరిగేలా చూడాలన్నారు. రోగులకు అవసరమైన మందుల కొరత ఉంటే వెంటనే జిల్లా అధికారులకు తెలియజేయాలన్నారు. రికార్డులను, ఆసుపత్రిలో ఓపీల వివరాలను సూపరింటెండెంట్ సౌమ్యను అడిగి తెలుసుకుని, సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట ఫార్మసీ సూపర్‌వైజర్ శోభారాణి, వైద్యులు ఉన్నారు.

యుద్ధప్రాతిపదికన గండ్లు పూడ్చివేత

మాట్లాడుతున్న డీఈఈ ప్రసాదరావు

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: కొమ్మమూరు కాలువ పరిధిలో ప్రధాన కాలువకు పడిన గండ్లన్నీ పూడ్చివేశామని, బ్రాంచి కాలువలకు పడిన వాటి కోసం యుద్ధ ప్రాతిపదికన పని చేస్తున్నట్లు సాగునీటి డీఈఈ ప్రసాదరావు తెలిపారు. చీరాల సాగునీటి కార్యాలయంలో గురువారం సాయంత్రం డీసీ, నీటి సంఘాల ప్రతినిధులు, పలు శాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. కొమ్మమూరు పరిధిలో ప్రధాన, బ్రాంచి కాలువలకు పడిన 123 గండ్లు వల్ల రూ.18 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు వివరించారు. నీటి సంఘాల సహకారంతో పనులు జరుగుతున్నాయని, త్వరలో పూర్తి చేసి రైతులకు రబీలో నీటి విడుదలకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏడీఏ రత్నకుమారి, వేటపాలెం ఏవో సరిత, చీరాల డీసీ అధ్యక్షుడు పాండురంగారావు, ఉపాధ్యక్షుడు సాయిప్రసాద్, సాగునీటి ఏఈలు నీలిమ, గురు ప్రసాద్, శ్రీధర్, నాగవనజ, శ్రీనివాసరావు, డ్రైనేజీ ఏఈలు ఆదిలక్ష్మి, శ్రీనివాసరావు, చీరాల, చినగంజాం, బాపట్ల డీసీల పరిధిలోని 24 మంది నీటి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లాకు ప్రధాని పురస్కారం సాధించేలా కృషి చేద్దాం

బాపట్ల, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు నూరు శాతం అమలు చేసి రానున్న ఏప్రిల్ ఒకటిన జిల్లాకు ప్రధానమంత్రి పురస్కారం సాధించేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్లో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పురస్కారానికి జిల్లా నుంచి దరఖాస్తు చేస్తామన్నారు. దేశంలో 747 జిల్లాలు పురస్కారం కోసం పోటీ పడుతున్నాయని పేర్కొన్నారు. హర్ ఘర్ జల్ యోజన, ప్రధానమంత్రి అవాస్ యోజన (గ్రామీణ), పీఎంఏవై అర్బన్, మిషన్ ఇంద్ర ధనుష్, ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన, పీఎం ఉజ్వల యోజన, పీఎం స్వనిధి, కిసాన్ క్రెడిట్ కార్డ్, పీఎం మాతృవందన, పీఎం విశ్వకర్మ, పీఎం పోషణ్, పీఎం ముద్రా తదితర 11 పథకాలు జిల్లాలో సంతృప్తి స్థాయిలో అమలు చేసేలా అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. డీఎంహెచ్‌వో విజయమ్మ, సీపీవో ఎస్.రాజు, పీడీలు రాధ మాధవి, వెంకటేశ్వరరావు, సమన్వయకర్త యశ్వంత్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం


ఎమ్మెల్యే నరేంద్రవర్మకు చెక్కు అందజేస్తున్న విజయకుమార్ దంపతులు

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి భక్తులు గొల్లపూడి విజయ్‌కుమార్, నాగ ఫణేశ్వరి దంపతులు రూ.5,00,116 విరాళం చెక్కును ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు గురువారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ భక్తులు అందించిన విరాళాలతో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా గొప్పగా ఆలయాన్ని నిర్మాణ కమిటీ సభ్యులు నిర్మిస్తున్నారని పేర్కొన్నారు.

జిల్లా కబడ్డీ జట్టుకు గూడవల్లి విద్యార్థుల ఎంపిక

ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ శ్వేత, పీఈటీలు

గూడవల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలోని గూడవల్లి వనజాచంద్ర పబ్లిక్ పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ గోగినేని శ్వేత తెలిపారు. పదో తరగతి విద్యార్థి పి.లీలాకృష్ణ అండర్-17 జట్టుకు ఎంపికయ్యాడు. ఈనెల 21 నుంచి 23 వరకు కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. అండర్-14 బాలుర కబడ్డీ జట్టుకు 9వ తరగతి విద్యార్థి మరీదు యజ్ఞేష్, 8వ తరగతి విద్యార్థి అక్కల వెంకటరెడ్డి ఎంపికయ్యారు. వీరు ఈనెల 22 నుంచి 24 వరకు మచిలీపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొంటారన్నారు. ఎంపికైన వారిని ఆమె గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

బాలల హక్కులు పరిరక్షించాలి

మార్టూరు, న్యూస్‌టుడే: బాలల హక్కుల పరిరక్షణకు అందరూ తోడ్పాటుగా నిలవాలని సమగ్ర శిక్ష ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ వి.సత్యసాగర్ కోరారు. మార్టూరు ఎమ్మెస్సెన్ ఉన్నత పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. విద్యార్థులకు తమ హక్కులు, బాల్య వివాహాల నివారణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. పోలీస్ హెల్ప్‌లైన్-100, చైల్డ్‌లైన్-1098, మంచి, చెడు స్పర్శల గురించి వివరించారు. హెచ్ఎం రూత్‌మేరిజాయ్, సీఆర్పీ రామారావు పాల్గొన్నారు.

కూరగాయలకు మొంథా దెబ్బ

అమాంతం పెరిగిన ధరలు

అద్దంకి, మార్టూరు, న్యూస్‌టుడే: గత నెలలో సంభవించిన మొంథా తుపాను ప్రభావం కూరగాయల ధరలపై పడింది. తుపానుకు కూరగాయల పంటలు దెబ్బతినడం, కావాల్సిన వాటిని ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి రావడం, రవాణాతో కలుపుకొని ధరలు పెరిగాయి. కొరిశపాడు మండలం పి.గుడిపాడులో పందిరి సాగు దెబ్బతింది. పొలాల్లో నీరు నిలిచి ఉండటంతో పంట పూర్తిగా దెబ్బతింది. పల్నాడు, గుంటూరు, కృష్ణా జిల్లాలతో పాటు మదనపల్లి తదితర ప్రాంతాల్లో కూరగాయల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ కారణంగా ధరలు భారీగా పెరిగాయి. మార్టూరులో హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ ఉండగా, చుట్టుపక్కల మండలాల్లో పండించిన వాటిని ఇక్కడికి తరలించి టోకుగా విక్రయిస్తుంటారు. మార్కెట్ నుంచి రిటైల్ వ్యాపారులు తీసుకెళ్లి అమ్ముతుంటారు. అద్దంకిలో హోల్‌సేల్ వ్యాపారులు రైతుల నుంచి కొంటుంటారు. తుపానుకు పూర్వం, తర్వాత ధరలు రెండింతలు పెరగడంతో భోజన హోటల్ నిర్వాహకులూ తల్లడిల్లిపోతున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో సంతలు ఏర్పాటు చేసి వినియోగదారులకు తక్కువ ధరకు కూరగాయలు అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

రకం (కిలో)	తుపానుకు ముందు	తరువాత ధరలు (రూ.ల్లో)
కాకర	40	80
దొండ	30	80
బెండ	20	60
వంగ	30	80
చిక్కుడు	40	60
బీర	40	80
టమాటా	30	60
ఆకుకూరలు	5	10

ఏడు స్థాయీ సంఘ సమావేశాలు 26న

గుంటూరు, న్యూస్‌టుడే: జిల్లాపరిషత్తు స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 26వ తేదీ ఉదయం 10.30 గంటలకు జడ్పీ కార్యాలయంలో జరుగుతాయని సీఈవో వి.జ్యోతిబసు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 1, 2, 4, 7వ స్థాయీ సంఘాల సమావేశాలను జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షత వహించి నిర్వహిస్తారన్నారు. జడ్పీ ఉపాధ్యక్షుడు శొంఠిరెడ్డి నర్సిరెడ్డి, బత్తుల అనురాధ 3, 6వ స్థాయీ కమిటీల సమావేశాలు, తెనాలి జడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమా ప్రణతి 5వ కమిటీ సమావేశాలు నిర్వహిస్తారన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

MARRIAGE SERVICES

వనజారావు క్విక్ మ్యారేజెస్ నందు అన్ని కులముల వారికి సంబంధములు కుదర్చబడును. లక్ష్మీపురం, గుంటూరు. సెల్: 98666 33988.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూపు, GNT. వృద్ధులకు, పేషెంట్ల సేవకు, ఇంటి/ వంట, బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 91540 85588, 91549 35588

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

ఫ్లాష్! ఫ్లాష్! చిలకలూరిపేట హైవే ఫేసింగ్ CRDA అప్రూవల్ వెంచర్. బ్యాంకు లోన్ సౌకర్యం. గజం 7500/- మాత్రమే. Phone: 9133574455

TO LET

గుంటూరు సిద్ధార్థ నగర్ 2 లైన్ నందు ఉత్తరం ఫేసింగ్ డూప్లెక్స్ 4BHK ఫుల్లీ ఫర్నీచర్, 3 కార్ పార్కింగ్ ఇల్లు అద్దెకు కలదు. అద్దె రూ. 60,000/-. ✆ 9849719999

JOBS

Jayalakshmi Nexa Hiring for Autonagar, Guntur. Good Opertunity for Freshers/ Experienced Whatsapp: 91007 87054.

ఆఫీసుమేనేజర్ కావలెను. పిజి, అడ్మినిస్ట్రేషన్‌లో 10 సం॥ అనుభవం, కంప్యూటర్, 40 సం॥ లోపువారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజీనందు క్లాసు ఇన్‌ఛార్జీస్, హాస్టల్ ఇన్‌ఛార్జీస్, వార్డెన్స్‌గా పనిచేయుటకు స్త్రీలు కావలెను. జీతము: 10,000/- నుండి13,000/- వరకు ఇవ్వబడును (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యాఅర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ. వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకు సంప్ర: ✆: 9100024059.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు క్యాంపస్ ఇన్‌ఛార్జీస్, క్లాసు ఇన్‌ఛార్జీస్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 14,000/- నుండి 21,000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: ఇంటర్ నుండి పి.జి. వరకు. వయస్సు: 22 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యి ఉండాలి. సంప్ర: ఫోన్: 8978480429.

HYD, SR నగర్ బాయ్స్ హాస్టల్‌లో అనుభవం గల భార్యభర్తలు వంటమాస్టర్లు కావలెను. సంప్ర: ✆ 9391009238, 8885070231.

పూర్ణ ఎంటర్ప్రైజెస్, గోరంట్ల, గుంటూరులో 1-3 సం॥ అనుభవమున్న కంప్యూటర్ ఆపరేటర్ (మేల్) కావలెను. జీ: 10,000/-. 93908 96165.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం

పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-

5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-

ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

అనుమానాస్పద రీతిలో వృద్ధురాలి మృతి

శ్రీకృష్ణ దయావతి (పాత చిత్రం)

చుండూరు, న్యూస్‌టుడే: అనుమానాస్పద రీతిలో వృద్ధురాలు మృతి చెందిన ఘటన చుండూరు మండలం యడ్లపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పతకమూరి శ్రీకృష్ణదయావతి (84)కు ముగ్గురు సంతానం. పెద్దకుమారుడు వెంకటేశ్వరరావు గుంటూరులో, చిన్నకుమారుడు సత్యసాయిబాబు యడ్లపల్లిలో, కుమార్తె నెప్పలి లక్ష్మీభవానీ విజయవాడలో నివాసం ఉంటారు. లక్ష్మీభవానీ మూడున్నర నెలల క్రితం విజయవాడ నుంచి యడ్లపల్లి వచ్చి తల్లితో కలిసి ఉంటోంది. మూడు రోజుల నుంచి శ్రీకృష్ణదయావతి బయటకు రాకుండా ఉండడంపై ఇరుగుపొరుగు వారు లక్ష్మీభవానీని ప్రశ్నించారు. దీనిపై ఆమె ఇరుగు పొరుగు వారికి సరైన సమాధానం ఇవ్వలేదు. శ్రీకృష్ణదయావతి ఉంటున్న ఇంటికి తాళం వేసి బుధవారం అక్కడి నుంచి కనిపించకుండా వెళ్లిపోయిది. ఆ తర్వాత లక్ష్మీభవానీ తన కోసం భర్త రామకృష్ణ విజయవాడ నుంచి వస్తున్నాడంటూ తెనాలిలోని సామ్రాట్ హోటల్ వద్దకు చేరింది. అక్కడ గురువారం తెల్లవారుజాము వరకు ఉండి, తనతోపాటు తెచ్చుకున్న చేతి సంచిని వదిలి, కనిపించకుండా వెళ్లిపోయింది. ఎంతకీ లక్ష్మీభవానీ రాకపోవడంతో హోటల్ సిబ్బంది ఆమె సంచిలో ఉన్న చరవాణిని తీసి అందులో ఒక ఫోన్ నెంబరుకు ఆమె సంచి వదిలి వెళ్లిన విషయంపై సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న మృతురాలి పెద్ద కుమారుడు వెంకటేశ్వరరావు లక్ష్మీభవానీ తన చెల్లెలు అని, ఆమె వెంట తన తల్లి శ్రీకృష్ణదయావతి కూడా ఉండాలని ఆరా తీశాడు. దీనిపై స్పందించిన హోటల్ సిబ్బంది లక్ష్మీభవానీ ఒక్కరే హోటల్‌కు వచ్చిన విషయం తెలిపారు. దీంతో వెంకటేశ్వరరావు హోటల్ వద్దకు వచ్చి అక్కడ వదిలివెళ్లిన సంచిని పరిశీలించగా అందులో ఇంటి తాళాలు ఉన్నాయి. వాటిని తీసుకుని పోలీసుల సాయంతో ఇంటి తలుపులు తెరిచి చూడగా కుళ్లిపోయిన శ్రీకృష్ణదయావతి మృతదేహం కనిపించింది. జరిగిన సంఘటనపై చుండూరు సీఐ శ్రీనివాసరావు క్లూస్ టీమ్‌కు, రేపల్లె ఇన్‌ఛార్జి డీఎస్పీ రామాంజనేయులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని స్థానికులను, కుటుంబ సభ్యులను వివరాలడిగి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో లక్ష్మీభవానీ తెనాలిలో తిరుగుతుండగా ఆమె పరిస్థితి అనుమానాస్పదంగా ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు అదుపులోకి తీసుకుని చుండూరు పోలీసులకు అప్పగించారు.

ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడి దుర్మరణం

ఇంటూరు, (అమృతలూరు), న్యూస్‌టుడే: ఇంటూరు-పొన్నూరు ఆర్అండ్‌బీ రహదారిలో గురువారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇంటూరుకు చెందిన వృద్ధుడు ధర్మారావు(68) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వృద్ధుడు పొలంలో పని ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు రోడ్డుపైకి వచ్చాడు. అదే సమయంలో పొన్నూరు నుంచి ద్విచక్రవాహనంపై అతివేగంగా వస్తున్న వ్యక్తి వృద్ధుడిని ఢీకొట్టాడు. ఈ ఘటనలో ధర్మారావు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవితేజ తెలిపారు.

డాడ్జి బాల్ పోటీల్లో సత్తా

కప్పు అందుకుంటున్న ఆంధ్రప్రదేశ్ జట్టు సభ్యులు

కొల్లూరు, న్యూస్‌టుడే: గుజరాత్‌లోని పఠాన్‌లో ఈ నెల 14 నుంచి 17 వరకు జరిగిన డాడ్జి బాల్ జాతీయ స్థాయి ఛాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్రానికి చెందిన సబ్‌జూనియర్స్ జట్టు రెండో స్థానం సాధించింది. ఈ జట్టుకు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 14 మంది ఎంపిక కాగా వీరిలో మండలంలోని చిలుమూరు శ్రీ రామ సైనిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు 8 మంది ఉన్నారు. గురువారం ఆ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తమ పాఠశాలకు చెందిన జట్టు సభ్యులతో పాటు శిక్షకులు అఫ్రాజ్, సుబ్బారావు, విష్ణులకు ఆ పాఠశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కొలసాని శ్రీకాంత్, బోధన, బోధనేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

వ్యక్తిపై బ్లేడుతో దాడి.. కేసు నమోదు

మార్టూరు, న్యూస్‌టుడే: మండలంలోని వలపర్లకు చెందిన కుంచాల ఆంజనేయులుపై బ్లేడుతో దాడి జరిగిన సంఘటనలో కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మహ్మద్ బాషా గురువారం తెలిపారు. అదే గ్రామానికి చెందిన తన్నీరు అంకమ్మరావు మద్యం మత్తులో ఆంజనేయులు ఛాతి, గడ్డంపై దాడి చేయడంతో రక్త గాయాలయ్యాయని, సీహెచ్‌సీకి తరలించారన్నారు. అక్కడి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మనస్తాపంతో ఇద్దరి ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: వ్యసనాలు, కుటుంబ సభ్యులతో మనస్తాపానికి గురై ఇద్దరు వేర్వేరుగా ఆత్మహత్యకు పాల్పడ్డారు. తిరుపతి తూర్పు పీఎస్ సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. బాపట్లకు చెందిన నవీన్(30) తిరుపతి డీఆర్ మహల్ సమీపానికి చెందిన ఓ మహిళను వివాహం చేసుకుని ఇక్కడే ఉంటున్నారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. తిరుపతి-తిరుమల మధ్య ట్యాక్సీ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. 9 నెలల కిందట భార్య మృతి చెందింది. దీంతో మనస్తాపానికి గురైన నవీన్ మద్యానికి బానిసయ్యాడు. బుధవారం రాత్రి స్థానిక లాడ్జిలో ఉరేసుకుని మృతి చెందాడు.

◆ స్థానిక తాతయ్యగుంటకు చెందిన చంద్రబాబు(31) చిన్నపాటి పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడు. తాగుడుకు బానిసైన ఆయన అప్పులపాలయ్యారు. మనస్తాపానికి గురై బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని మృతి చెందాడు. పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

లూథరన్ పాఠశాలకు పూర్వ వైభవం తేవాలి

మాట్లాడుతున్న డాక్టర్ జాషువా దానియల్, చిత్రంలో విశ్రాంత న్యాయమూర్తులు జేసు రత్నకుమార్, జస్టిస్ జోసఫ్ పీఎస్

యడ్లపాడు, న్యూస్‌టుడే: లూథరన్ ఉన్నత పాఠశాల భవిష్యత్తు కార్యాచరణ ప్రక్రియ న్యాయస్థానం, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై ఆధారపడి ఉంటుందని రాష్ట్ర మైనార్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ జాషువా డానియల్ అన్నారు. యడ్లపాడులోని లూథరన్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. విద్యా, రెవెన్యూ శాఖ అధికారులు, ఉపాధ్యాయులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పాఠశాల భవనం వెనుక ఖాళీ స్థలం, ఆట స్థలం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య లేకుండా చట్టపరంగా ఏమీ చేయలేమన్నారు. పాఠశాల బలోపేతానికి విద్యార్థుల సమీకరణ చేయాలని, పాఠశాలకు పూర్వ వైభవం తెచ్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పాఠశాల అభ్యున్నతికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో డీఈవో చంద్రకళ, డిప్యూటీ డీఈవో సుభానీ, ఏఈఎల్‌సీ అడ్మినిస్ట్రేటర్, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జోసఫ్ పీఎస్, ఏఈఎల్‌సీ సెక్రటరీ కంట్రోలర్, విశ్రాంత న్యాయమూర్తి కె.జేసు రత్నకుమార్, తహసీల్దార్ విజయశ్రీ, హెచ్ఎం పద్మలత పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 108, రిటైల్ ధర - 135, చికెన్ విత్‌స్కిన్ - 196, చికెన్ స్కిన్‌లెస్ - 223.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -106 రిటైల్ ధర 133 చికెన్ విత్ స్కిన్ - 193, చికెన్ స్కిన్‌లెస్ - 219.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 117, 124, 136 చికెన్ విత్ స్కిన్ - 222 చికెన్ స్కిన్‌లెస్ - 232.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 660 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.100/-.

91.9 FM Vijayawada ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 80080 03297

ఉమ్మడి గుంటూరు అండర్-14 జిల్లా క్రికెట్ జట్టు కెప్టెన్‌గా అబ్దుల్ సాద్

అబ్దుల్ సాద్

బాపట్ల, న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-14 క్రికెట్ జట్టు కెప్టెన్‌గా బాపట్లకు చెందిన షేక్ అబ్దుల్ సాద్ నియమితుడయ్యాడు. గతేడాది రాష్ట్ర అండర్-14 క్రికెట్ జట్టుకు ఎంపికై పాండిచ్చేరిలో నిర్వహించిన సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొన్నాడు. అబ్దుల్ సాద్‌ను బాపట్ల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘునాథ్, కార్యదర్శి దొప్పలపూడి రామ్మోహనరావు, ఉపాధ్యక్షుడు స్లాన్లీ విమల్‌కుమార్ అభినందించారు. సెంట్రల్ జోన్ పోటీల్లో జిల్లా జట్టును విజేతగా నిలపాలని ఆకాంక్షించారు.

పాఠశాలకు పగిలిన గుడ్లు సరఫరా

అమరావతి,న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి మురిగిన, పురుగులు పడిన గుడ్లు సరఫరా చేస్తున్నారు. నాణ్యత లోపించడంతో విద్యార్థుల ఆరోగ్యానికి హానికరంగా మారాయి. అమరావతి మండలంలోని ఓ పాఠశాలకు ఇటీవల సరఫరాదారులు గుడ్లు అందజేశారు. ట్రేలలో పగిలిన గుడ్లు ఉండటంతో దుర్వాసన వచ్చాయి. గుడ్లు మురిగిపోయి ఉండటంతో ఉడకబెట్టిన వాటిల్లో పురుగులు బయటపడ్డాయి. భోజన నిర్వాహకులు, పాఠశాల ఉపాధ్యాయులు గమనించి వాటిని పక్కన పెట్టేశారు. గుత్తేదారును అడిగితే పాడైపోయిన గుడ్లు పక్కన పెడితే వాటి స్థానంలో మళ్లీ ఇస్తామని చెప్పారని నిర్వాహకులు వాపోయారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 80085 10541

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80085 14589

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73136, వేమూరు: 91107 83738

? రేపల్లె మండలం రావిఅనంతవరంలో పలుచోట్ల వీధిదీపాలు వెలగడం లేదు. **-రాంబాబు, స్థానికుడు**

✔ వెంటనే వెలగని దీపాలు గుర్తించి కొత్తవి ఏర్పాటు చేసేలా కృషి చేస్తాం. **-అబీద్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి, పెనుమూడి.** ? రేపల్లె 16, 17 వార్డుల్లో గూడవల్లివారి వీధి, నాయీ బ్రాహ్మణవీధిలో రెండు చొప్పున చేతిపంపులు పాడయ్యాయి. **-వెంకటేశ్వరరావు, కిశోర్**

✔ తక్షణం నాలుగు చేతిపంపులను బాగు చేసేలా చర్యలు తీసుకుంటాం. **-శామ్యూల్, మున్సిపల్ ఏఈ, రేపల్లె**

-న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్

15 వీధిదీపాలు ఏర్పాటు

స్పందనకు వందనం

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె మండలం పెనుమూడి ప్రధాన రహదారి పక్కన వీధిదీపాలు వెలగడం లేదు. సమస్యను ఈనెల 19న మేమున్నాం.. మీకు తోడుగా శీర్షికన ఈనాడు అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి అబీద్ హుస్సేన్ గురువారం కార్మికులను పంపి 15 చోట్ల వీధిదీపాలు ఏర్పాటు చేయించారు.

నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి

కొల్లూరు, న్యూస్‌టుడే: వరదల వల్ల నష్టపోయిన రైతుల జాబితాను అధికారులు ప్రభుత్వానికి సమర్పించి నెల రోజులు అవుతున్నా ఇంత వరకు పరిహారం అందించలేదని సీపీఎం జిల్లా కార్యవర్గం సభ్యుడు తురుమిళ్ల కృష్ణమోహన్ అన్నారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సీపీఎం మండల స్థాయి కార్యకర్తల విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండో పంట వేసుకునేందుకు వీలుగా పరిహారం అందిస్తామని ప్రభుత్వ పెద్దలు చెప్పినా అది ఆచరణకు నోచుకోలేదన్నారు. మొంథా తుపాను బాధిత రైతులకు పరిహారం ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. పంట పరిహారం, కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకంతో పాటు బ్యాంకు రుణాలు మంజూరు చేయకపోతే ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

రూ.7 లక్షలతో సంపద సృష్టి కేంద్రం పూర్తి

మంత్రిపాలెం(నగరం), న్యూస్‌టుడే: మంత్రిపాలెంలో రూ.7లక్షలతో సంపద సృష్టి కేంద్రం నిర్మాణం పనులు పూర్తి చేసినట్లు ఎంపీడీవో బొర్రా శ్రీను గురువారం తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం చెత్త శుద్ధి కేంద్రాలకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. వీటిని ఉపయోగించుకుని ఆదాయం పెంచుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సర్పంచి ప్రమీల, ఇతర అధికారులు పాల్గొన్నారు.

23న మహిళా సమ్మేళనం

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె ఎంసీపీ హాలు పక్కనున్న శ్రీరామకృష్ణ విద్యా నిలయంలో ఈనెల 23 ఉదయం 10 గంటలకు శ్రీ సరస్వతీ విద్యాపీఠం విజయవాడ విద్యా భారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ సప్తశక్తి ఆధ్వర్యంలో మహిళా సమ్మేళన కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రాయితీ విత్తనాలు.. రానట్టేనా!

స్పష్టత ఇవ్వని వ్యవసాయాధికారులు

వేమూరు, న్యూస్‌టుడే

అమృతలూరు, చుండూరు మండలాల్లో 50 వేల ఎకరాల సాగు భూమి ఉంది. ఖరీఫ్‌లో వరిసాగు చేశారు. ప్రస్తుతం పైరు పంట దశకు చేరడంతో యంత్రాలతో నూర్పిడి చేసి ధాన్యం ఇళ్లకు చేరవేస్తున్నారు. రైతులు రబీలో మినుము, పెసర సాగు చేస్తారు. వీరంతా ప్రభుత్వం అందించే రాయితీ విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే వ్యవసాయాధికారుల నుంచి ఎలాంటి స్పష్టత రాకపోవడంతో విత్తనాల కొనుగోలుపై ఆలోచనలో పడ్డారు.

వ్యవసాయ శాఖ అధికారులు అందించిన వివరాల ప్రకారం జిల్లాలో ఈ ఏడాది రబీలో తెల్ల జొన్న 11,348 హెక్టార్లలో, మొక్కజొన్న 28,820 హెక్టార్లలో, శనగ 27,016 హెక్టార్లలో, మినుము 25,432 హెక్టార్లలో, పెసర 12,323 హెక్టార్లలో సాగవుతాయని అంచనా వేశారు. శనగ సాగుకు సంబంధించి

యంత్రంతో వరి పంట కోత

రాయితీ విత్తనాల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. కానీ మిగతా వాటి గురించి ఇంతవరకు పట్టించుకున్న దాఖలాలు లేవు. రైతులు మాత్రం రబీలో వేసే మిగతా పంటలకు రాయితీ విత్తనాలు అందించాలని కోరుతున్నారు.

ఏటా పెరుగుతున్న ధరలు

వివిధ ప్రైవేటు కంపెనీలు ఏటా రబీలో వేసే మినుము, పెసరతో పాటు, తెల్లజొన్న, మొక్కజొన్న విత్తనాల ధరలు పెంచేస్తున్నారు. రెండేళ్ల క్రితం రెండు మూడు కంపెనీలు తెల్లజొన్న మూడు కిలోల విత్తనాల సంచి రూ. 700 ఉంటే, ప్రస్తుతం దాని ధర రూ. 1100కు చేరిందని రైతులు చెబుతున్నారు. మొక్కజొన్న 4కిలోల సంచిని రూ. 1300కు విక్రయిస్తే, ప్రస్తుతం దాని ధర రూ.2 వేలు దాటినట్లు అన్నదాతలు చెప్తున్నారు. ఇక మినుములు, పెసల విత్తనాల ధరలు కూడా ఏటా పెరుగుతున్నాయంటున్నారు. ప్రభుత్వం రాయితీపై విత్తనాలు అందిస్తే రైతులకు కొంతవరకు మేలు జరుగుతుందని అభిప్రాయ పడుతున్నారు. దీనిపై బాపట్ల ఏడీఏ ధనరాజు మాట్లాడుతూ అపరాల సాగుకు రైతులకు రాయితీ విత్తనాలు అందించే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

ధర్మ రక్షణకు కృషి చేయండి

ఐలవరం (భట్టిప్రోలు), న్యూస్‌టుడే : హిందూ ధర్మ రక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ అన్నారు. ఐలవరం రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం సమరసత సేవా ఫౌండేషన్ సభ్యుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా మాట్లాడుతూ దేవాలయాల్లో ధర్మరక్ష దినోత్సవ వేడుకలు జరుగుతున్నాయని, హిందువులు ఈ పూజల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఫౌండేషన్ సభ్యులు జంజనం హేమశంకరరావు, చింతల మురళీకృష్ణ, వామనపల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించండి

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే : వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలని చందోలు ఎస్సై శివకుమార్ కోరారు. మండలంలోని రెడ్డిపాలెం కూడలిలో గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. రికార్డులు పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాహనదారులందరికీ లైసెన్సు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు.

సృజన చాటారు.. విజేతలుగా నిలిచారు

బాపట్ల, న్యూస్‌టుడే: ఈనాడు ఆధ్వర్యంలో కర్లపాలెం భార్గవి ఉన్నత పాఠశాల, లిటిల్ ఏంజెల్స్ ఉన్నత పాఠశాలలో ప్రతిభా పాటవ పోటీలు గురువారం నిర్వహించారు. వక్తృత్వ పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. భార్గవి పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపి విద్యార్థులు భార్గవి ప్రథమ, సాయిచరణ్‌తేజ ద్వితీయ, అంజనా తృతీయ స్థానాల్లో నిలిచారు.

భార్గవి ఉన్నత పాఠశాలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న డైరెక్టర్ సురేష్, ప్రిన్సిపల్ లక్ష్మి

లిటిల్ ఏంజెల్స్ ఉన్నత పాఠశాలలో బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపల్ సెబాస్టియన్

విజేతలకు పాఠశాల డైరెక్టర్ పీవీ సురేష్, ప్రిన్సిపల్ పి.లక్ష్మీ బహుమతులు ప్రదానం చేశారు. లిటిల్ ఏంజెల్స్ పాఠశాలలో జరిగిన పోటీల్లో సృజన కనబరిచి విద్యార్థులు భార్గవ సాయినాథ్ ప్రథమ, భవ్య శబరీనాథ్ ద్వితీయ, తరుణి తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్ ఇ.సెబాస్టియన్, ఉపాధ్యాయులు ఎన్.రమేష్, డి.కళాప్రియ బహుమతులు అందజేశారు.

నెలాఖరులోగా ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకోండి

బాపట్ల, న్యూస్‌టుడే: ఇళ్ల స్థలాలు ఉన్న పేదలు పక్కా గృహాల కోసం ఈ నెల 30 లోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. తెదేపా కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన గృహాలు రద్దు చేసినట్లు తెలిపారు. పీఎంఏవై కింద రూ.1.59 లక్షలతో పాటు కూటమి ప్రభుత్వం సాయం కలిపి గృహనిర్మాణానికి పేదలకు రూ.2.25 నుంచి 2.50 లక్షల వరకు సాయం అందే అవకాశం ఉందన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో రూ.4.87 కోట్ల సాయం

గత పదిహేను నెలల్లో సీఎంఆర్‌ఎఫ్ ద్వారా నియోజకవర్గంలో 579 మంది పేద, మధ్యతరగతి వర్గాల వారికి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం చంద్రబాబు రూ.4.87 కోట్ల సాయం మంజూరు చేశారని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. తెదేపా కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో 25 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరు చేసిన రూ.14 లక్షల సాయం చెక్కులను ఆయన పంపిణీ చేశారు.

సత్యసాయి జయంతి కార్యక్రమం

బాపట్ల వెస్ట్, న్యూస్‌టుడే: పట్టణంలోని సత్యసాయి ధ్యాన సేవా మందిరంలో సత్యసాయిబాబా జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. సత్యసాయి బాలవికాస్ విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

నృత్యం చేస్తున్న బాలికలు

కార్తిక మాస కాపు సమారాధన

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె మండలం చినఅరవపల్లి శ్రీబాలకోటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో గురువారం కార్తికమాసం కాపు వనసమారాధన నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజలతో ఐక్యంగా ఉండి రాజ్యాధికారం పొందేలా అందరూ కృషి చేయాలని వక్తలు కోరారు. తొలుత వంగవీటి మోహనరంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

ప్రజల ఆరోగ్యంపై అప్రమత్తతతో మెలగాలి

అమృతలూరు, న్యూస్‌టుడే: ప్రజల ఆరోగ్యం పట్ల వైద్యసిబ్బంది అప్రమత్తతతో మెలగాలని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి రత్నమన్మోహన్ అన్నారు. ఆయన గురువారం అమృతలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, వైద్యసిబ్బందితో సమావేశమై గర్భిణుల నమోదు, వైద్యులతో ప్రసవాలు, చిన్నపిల్లలకు వ్యాధినిరోధక టీకాలు వేయడం తదితర అంశాలను సమీక్షించారు. సంబంధిత దస్త్రాలను పరిశీలించారు. వైద్యాధికారిణి వెంకటలక్ష్మి ఉన్నారు.

చిన్నారులకు అన్నదానం

బాపట్ల టౌన్, న్యూస్‌టుడే: ఈనెల నాలుగో ఆదివారం ఎన్‌సీసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాపట్ల ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ల ఆధ్వర్యంలో బాపట్ల పట్టణంలోని హోప్ ఆర్ఫనేజ్‌లోని విద్యార్థులకు ఉచితంగా మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. ఎన్‌సీసీ క్యాడెట్లు విద్యార్థులతో మాట్లాడి చదువుపై, క్రీడలపై వారికి అవగాహన కల్పించారు.

అన్నదానం చేస్తున్న కళాశాల బృందం

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

రేపల్లె అర్బన్, కొల్లూరు, వేమూరు, పిట్టలవానిపాలెం, నగరం, కూచిపూడి, ఇంటూరు, (అమృతలూరు),న్యూస్‌టుడే: విజ్ఞానం పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని వక్తలు పేర్కొన్నారు. బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో శాఖా గ్రంథాలయాల్లో గురువారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. రేపల్లె గ్రంథాలయంలో 22 వేల పుస్తకాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ◆ కొల్లూరు శాఖా గ్రంథాలయంలో ఉప సర్పంచి దూళిపూడి కృష్ణ నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ◆ విద్యార్థి దశ నుంచి గ్రంథాలయాలను వినియోగించుకోవడం వల్ల మేథాశక్తి పెరుగుతుందని వేమూరు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ విజయబాబు తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన ప్రతిభా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ◆ ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని గ్రంథాలయాభివృద్ధి కమిటీ ఛైర్మన్ మున్నంగి సుబ్బారెడ్డి అన్నారు. పిట్టలవానిపాలెం శాఖా గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడి విజేతలకు బహుమతులు అందజేశారు. ◆ అమృతలూరు మండలం కూచిపూడిలో సర్పంచి శ్యామల విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

కొల్లూరు: విజేతలతో అతిథులు

విద్యార్థులతో ఎమ్మెల్యే నరేంద్రవర్మ

పుస్తక పఠనంతో జీవన వికాసం

బాపట్ల, న్యూస్‌టుడే: పుస్తక పఠనంతో జీవన వికాసం కలిగి సమాజ పురోగతికి దోహదపడుతుందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. వేగేశన మాట్లాడుతూ పుస్తకాలు చదవటం ద్వారా పొందే జ్ఞానం, సమాచారం ఎప్పుడూ గుర్తుండి పోతాయని తెలిపారు. శాఖ గ్రంథాలయానికి పక్కా భవనం నిర్మించి అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. గ్రంథాలయాధికారి శివాజీ గణేష్, తెదేపా నేతలు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

రోడ్డు పక్కకు ఒరిగిన బస్సు

గుంటూరు నుంచి విజయవాడ వెళుతున్న ఆర్టీసీ బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. బాపట్ల డిపో బస్సు గుంటూరు నుంచి 11 మందితో విజయవాడ బయలుదేరింది. తాడేపల్లి పరిధిలోని డీజీపీ కార్యాలయం వద్ద బస్సు స్టీరింగ్ సాంకేతిక లోపం తలెత్తడంతో ఒక పక్కకు లాగేసింది. దీంతో జాతీయ రహదారిపై నుంచి పక్కనే ఉన్న మురుగు కాలువ వైపు వెళ్లి ఒరిగింది. బస్సులో ప్రయాణికులకు గాయాలు కాలేదు. బస్సు కల్వర్టు దాటే క్రమంలో ముందు చక్రం ఊడింది. ఆర్టీసీ అధికారులు ఘటనా ప్రదేశానికి చేరుకుని బస్సును రెండు క్రేన్లతో తొలగించారు. **-తాడేపల్లి, న్యూస్‌టుడే**

నేలకూలిన చెట్టు.. తొలగించరా

బాపట్ల మండల పరిధిలోని అడవి పంచాయతీ పాండురంగాపురంలో మొంథా తుపానుకు నిద్రగన్నేరు చెట్టు నేలకూలింది. తుపాను వచ్చి మూడు వారాలు అవుతున్నా అప్పటి నుంచి పడిన చెట్టును తొలగించలేదు. చెట్టు పడిపోయిన చోట రైతుసేవా కేంద్రం, పంచాయతీ వాటర్ ట్యాంక్, పంచాయతీ సామగ్రి దాచుకునే భవనం ఉన్నాయి. వాటికి చెట్టు అడ్డంగా ఉన్నా పడిన చెట్టును తొలగించటం లేదు. పంచాయతీ సిబ్బంది చెట్టును తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, అడవి (బాపట్ల టౌన్)**

అసంపూర్తిగా వదిలేస్తే ఎలా?

గత వైకాపా ప్రభుత్వంలో గ్రామాల్లో పాలను సేకరించేందుకు ప్రతి సచివాలయానికి రూ.12 లక్షలతో పాల సేకరణ కేంద్రం భవనాలు మంజూరు చేసింది. చాలా చోట్ల వీటి నిర్మాణానికి చర్యలు చేపట్టారు. అల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని రెడ్లపాలెం జగనన్న కాలనీలో చేపట్టిన పాల సేకరణ కేంద్రానికి మూడేళ్ల క్రితం పైకప్పు వేసి, గోడలకు ప్లాస్టింగ్ చేసి వదిలేశారు. ప్రస్తుతం భవనం చుట్టూ ముళ్ల చెట్లు పెరిగిపోయాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం**

రోడ్డుకు బీటలు.. రాకపోకలకు అవస్థలు

మండలంలోని సంగుపాలెం పంచాయతీ పరిధిలోని బావాజీపాలెం నుంచి తాగునీటి బావి దగ్గరకు వెళ్లే సీసీ రహదారి బీటలు వారింది. తాగునీరు తెచ్చుకునే మహిళలు, పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి సమయాల్లో పలువురు వాహనచోదకులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం**

మురుగు తొలగించండి

చీరాల మండలం దేవినూతల గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. గ్రామంలోని ప్రధాన కూడలిలో మురుగు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. తుపాను వచ్చి చాలా రోజులు అవుతున్నా గ్రామంలో మురుగు తొలగించలేదు. ఇళ్ల మధ్య నీళ్లు పచ్చగా మారి దుర్వాసన వస్తున్నాయి. గ్రామంలో దోమలు ముసరటంతో రోగాలు వస్తాయని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ సిబ్బంది మురుగును తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే దేవినూతల (బాపట్లటౌన్)**

మాటలకే నిబంధనలు.. చోదకుల ప్రాణాలతో ఆటలు

అంకమ్మచెట్టు(రేపల్లె అర్బన్), న్యూస్‌టుడే

ఆటోల్లో అయిదుగురిని మించి ఎక్కించుకోవద్దని రవాణాశాఖ, అధికారులు స్పష్టంగా చెబుతున్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం వల్ల కలిగే అనర్థాలపై డ్రైవర్లకు అవగాహన సదస్సులు పెట్టి మరీ వివరిస్తున్నారు. కొందరు డ్రైవర్లు మాత్రం అధికారుల మాటలను లెక్కచేయడంలేదు. ముఖ్యంగా వ్యవసాయ కూలీలను తీసుకెళ్లేవారు ముందుజాగ్రత్తలు గాలికొదిలేస్తున్నారు. డ్రైవరు పక్కనే రెండు వైపులా నలుగురిని కూర్చోబెడుతున్నారు. ఆటో డ్రైవరు సీటు వెనుక ఏర్పాటు చేసిన చెక్కపై, సీటు మీద ఎనిమిది మంది, వీరి మధ్యన ఇద్దరు, వెనక డోరుపై ముగ్గురు చొప్పున ఎక్కించి రహదారులపై వేగంగా పరుగులు తీయిస్తున్నారు.

ప్రయాణికులతో కిక్కిరిసి వెళ్తున్న ఆటో

రూ.1000 కూలి గిడుతుందని..

కృష్ణా జిల్లా చల్లపల్లి, మోపిదేవి, కోడూరు, కొడాలి, మొవ్వ తదితర ప్రాంతాల్లో వరిపంట కోత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎకరానికి రూ.5 నుంచి 6 వేల వరకు యజమానులు కూలి చెల్లిస్తున్నారు. ఎకరానికి అయిదుగురు కోతకోసినా రూ. వెయ్యి కూలి గిడుతుంది. రెండెకరాలు కోసుకుంటే రూ.2 వేలు వస్తాయనే ఆశతో ప్రాణాలను ఫణంగా పెట్టి కూలీలు ఆటోల్లో వెళ్తున్నారు. పనులు లేక నిజాంపట్నం, నగరం మండలాల నుంచి వేతనదారులు కృష్ణాజిల్లాకు ఆటోల్లో వెళ్లి తిరిగి గమ్యాలకు చేరుకుంటున్నారు. డ్రైవరుకు ఇరువైపులా నలుగురిని కూర్చోబెట్టుకోవడంతో చోదకుడు ఓపక్కకు కూర్చొని ఆటోలను నడుపుతున్నారు. పరిమితికి మించిన ప్రయాణికులతో పాటు వేగంతో నడుస్తున్న వాహనాలు ప్రమాదానికి గురైనా అదుపుతప్పి బోల్తా కొట్టినా ప్రమాదాన్ని అంచనా వేయలేం. గతంలో ఇలాంటి ఘటనలు అనేకం జరిగినా ఆటోడ్రైవర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు తిరిగి వచ్చే వరకు కుటుంబ సభ్యులు భయంగా ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. పెను ప్రమాదాలు జరగకముందే సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు

అమృతలూరు, న్యూస్‌టుడే: అమృతలూరు శ్రీ అమృతేశ్వర స్వామి ఆలయంలో అమావాస్య పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామికి మహన్యాస రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, అలంకరణ చేశారు. అనంతరం దేవస్థానం క్షేత్రపాలకుడు కాలభైరవ స్వామికి అభిషేకం, అలంకరణ చేశారు. కాలభైరవ, అష్టభైరవ, రుద్రహోమాలు జరిపారు. ప్రవాస భారతీయుడు పరుచూరి సీతారామాంజనేయులు, మీనాక్షి దేవి దంపతుల సహకారంతో జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు చీరాల, రేపల్లె, గుంటూరు, సత్తెనపల్లి తదితర దూరప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.

పూజలందుకున్న కాలభైరవస్వామి

అలంకరణలో అమృతేశ్వరస్వామి

బాపట్ల, న్యూస్‌టుడే: చీలురోడ్డులో రుక్మిణీ సమేత పాండురంగ స్వామి కార్తిక దీపోత్సవాన్ని గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. కార్తిక మాసం అమావాస్య సందర్భంగా ఉమామహేశ్వర స్వామి మూల విరాట్, నవగ్రహాల వద్ద 365 ఒత్తులతో మహిళలు 108 దీపాలు వెలిగించి పూజలు చేశారు.

బాపట్ల: ఉమామహేశ్వరి మూల విరాట్ వద్ద వెలిగించిన దీపాలు

గీతా జయంతి

వెల్లటూరు (భట్టిప్రోలు), న్యూస్‌టుడే : వెల్లటూరు గీతా ఆశ్రమంలో భక్తిశ్రద్ధలతో గీతా జయంతి నిర్వహించారు. శ్రీకృష్ణుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు కర్పూర యజ్ఞం జరిగింది. పూజల్లో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ మోటూరు పుణ్యశ్రీనివాసరావు, తెదేపా నాయకులు పాల్గొన్నారు. వెల్లటూరు పరిసర ప్రాంతాల్లోని భజన బృందాలు గీతా పారాయణం చేశారు. అనంతరం వేములపల్లి వనజాక్షి ఆధ్వర్యంలో సమారాధన నిర్వహించారు.

పూజలో ఎమ్మెల్యే ఆనందబాబు

అనంతభోగేశ్వర స్వామికి భస్మాభిషేకం

కొల్లూరు, న్యూస్‌టుడే: కార్తిక మాసం చివరి రోజు అమావాస్య కావడంతో స్థానిక శ్రీ అనంతభోగేశ్వర స్వామికి అర్చకులు, పండితులు విబూదితో భస్మాభిషేకం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

భస్మాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు, పండితులు

పొదుపు వివరాలు తెలుసుకునేందుకు యాప్

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే : స్వయం సహాయక మహిళలు మన డబ్బులు- మన లెక్కలపై అవగాహన కలిగి ఉండాలని వెలుగు ఏపీఎం చిన్నయ్య అన్నారు. ఖాజీపాలెంలో గురువారం మహిళలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. మహిళలు వారి పొదుపు, అప్పుల వివరాలు సులభంగా తెలుసుకునేందుకు ప్రత్యేక యాప్ రూపొందించారని చెప్పారు.

మురుగు కాలువ నిర్మించారు

నగరం, న్యూస్‌టుడే: నగరం జియో కాలనీలో సుమారు రూ.4లక్షలతో మురుగు కాలువ నిర్మించారు. మూడు దశాబ్ధాలుగా మురుగు కాలువ లేక కాలనీ ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నివాసాల్లో వినియోగించిన మురుగు రోడ్డుపై నెలల తరబడి నిల్వ ఉండేది. నడవాలన్నా ప్రజలు ఇబ్బందులు పడేవారు. కూటమి ప్రభుత్వం రాకతో కాలనీ ప్రజల కల నెరవేరింది. మురుగు కాలువ నిర్మించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గర్భిణులకు పండ్లు పంపిణీ

అమృతలూరు, న్యూస్‌టుడే: అమృతలూరు, పాంచాళవరం గ్రామాల్లోని పలువురు గర్భిణులకు గురువారం మైనేని రత్నప్రసాద్ మిత్ర బృందం సహకారంతో పండ్లు, ఊలు టోపీలు పంపిణీ చేశారు. వైద్యాధికారిణి వెంకటలక్ష్మి, ఎహెజ్కేలు, బసవేశ్వరావు, నరేంద్రకుమార్, శ్యామల పాల్గొన్నారు.

పోలీసులమని బెదిరించి నగదు దోపిడీ

కర్లపాలెం (బాపట్ల టౌన్),న్యూస్‌టుడే : న్యూస్‌టుడే: సినీ పక్కీలో నగదు కాజేసిన సంఘటన గురువారం కర్లపాలెంలో చోటు చేసుకుంది. చందోలుకు చెందిన ఓ వ్యక్తి కర్లపాలెం ఎంపీ రాజుపాలెంలోని తన కూతురు ఇంటికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో తన కుమార్తె చందోలులో ఇవ్వాల్సిన చీటి నగదు రూ.8 వేలు ఇచ్చి చీటి వారికి ఇవ్వమని చెప్పింది. ఆ నగదుతో ద్విచక్ర వాహనంపై అతడు వెళ్తుండగా కర్లపాలెం యాక్షన్ టవర్ సమీపంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు అతడిని ఆపి తాము పోలీసులమని చెప్పి గంజాయి సప్లై చేస్తున్నావా అని అతని జేబులో ఉన్న రూ. 8 వేలలో రూ.4వేలు తీసుకుని వెళ్లిపోయారు. మోసపోయిన బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై రవీంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఆటో ప్రమాదంలో 9 మందికి గాయాలు

ముళ్లపూడి(పమిడిముక్కల), న్యూస్‌టుడే: వరి కోతల నిమిత్తం బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం దాసరిపాలెం నుంచి 12 మంది కూలీలు గురువారం కృష్ణా జిల్లా పమిడిముక్కల మండలం ముళ్లపూడి చేరారు. వారి ఆటో గ్రామంలో రోడ్డుపై మిట్టపల్లాల్లో అదుపుతప్పి పక్కకు పడిపోవటంతో 9 మంది గాయాలపాలయ్యారని, వారిని ఉయ్యూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని పోలీసులు తెలిపారు. అందులో 7గురు ప్రథమ చికిత్స చేయించుకొని వారి గ్రామం వెళ్లిపోగా ఇద్దరిని మెరుగైన చికిత్సకోసం విజయవాడ పంపినట్లు తెలిపారు.

అంతిమ సంస్కారానికి అవస్థలే

రైలుపేట(బాపట్ల), న్యూస్‌టుడే: పట్టణంలో మృతుల అంతిమ సంస్కారాల నిర్వహణకు కుటుంబసభ్యులు అవస్థలు పడుతున్నారు. పురపాలక సంఘంలో రాజీవ్‌గాంధీ కాలనీ హిందూ శ్మశానవాటికలో గ్యాస్ దహనవాటిక నిర్మాణంలో ఐదేళ్లకు పైగా తీవ్ర జాప్యం జరుగుతోంది. భవన నిర్మాణం పూర్తయినా గ్యాస్ చిమ్నీ అమరిక పనులు పదకొండు నెలలుగా చేపట్టలేదు. ❖ ప్రతి లోక్‌సభ నియోజకవర్గ కేంద్రంలో ఓ శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని ఐదేళ్ల క్రితం కేంద్రం నిర్ణయించింది. పట్టణంలో అతిపెద్దదైన మూడో వార్డులోని హిందూ శ్మశానవాటికను ఎంపిక చేశారు. గత ప్రభుత్వంలో 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.కోటిన్నర నిధులు కేటాయించారు. టెండర్ పిలిచి గుత్తేదారుడికి పనులు కేటాయించారు. పునాది, పిల్లర్లకు వరకు నిర్మాణ పనులు చేపట్టిన గుత్తేదారు బిల్లులు రాలేదని అర్థంతరంగా నిలిపివేశాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పిల్లర్లు, శ్లాబ్ వేసి భవన నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేశారు. ఇప్పటి వరకు రూ.కోటి ఖర్చు చేశారు. గుత్తేదారుడికి బిల్లు చెల్లించారు. ❖ మిగిలిన రూ.50 లక్షలతో గ్యాస్ చిమ్నీ అమర్చే పనులు చేయాల్సి ఉంది. అది పూర్తయితేనే గ్యాస్ దహన వాటిక ప్రారంభమవుతుంది. ప్రస్తుతం మృతదేహాలను కట్టెలపై దహనం చేస్తున్నారు. కేవలం ఓ షెడ్డు మాత్రమే ఉంది. ఒకేసారి రెండు, మూడు మృతదేహాలు వస్తే అంత్యక్రియలు నిర్వహించటానికి ఇబ్బంది పడుతున్నారు. గ్యాస్ దహన వాటిక నిర్మాణం పూర్తయితే మూడింటిని ఒకే సారి దహనం చేయటానికి అవకాశం ఉంటుంది. పురపాలక డీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజారోగ్య శాఖ మిగిలిన పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. త్వరగా చేపట్టేలా చూస్తామన్నారు.

అమర్చాల్సిన గ్యాస్ చిమ్నీ

(c) eenadu

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

ఆరు నెలలుగా ఇదే పరిస్థితి

కిందకు దించిన ఐమాస్ట్ లైట్లు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: చీరాల-వేటపాలెం బైపాస్ రోడ్డులో వాహన చోదకుల సౌకర్యార్థం జాతీయ రహదారుల అధికారులు ఐమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. బైపాస్ నుంచి ఈపూరుపాలేనికి తిరిగే మలుపులోని లైటును ఆరు నెలల క్రితం మరమ్మతులు చేయడానికి కిందకు దించారు. అనాటి నుంచి వీటిని బాగుచేయలేదు. ఫలితంగా ఇవి అలాగే ఉన్నాయి. అధికారులు స్పందించి వాటిని బాగుచేస్తే చోదకులకు ఎంతగానో ఉపయోగంగా ఉంటోందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

వరి నారుకు డిమాండ్

తుపానుతో వేలాది ఎకరాల్లో వరి పంట నాశనం కావడంతో తిరిగి రైతులు నారు పెంపకంపై దృష్టి సారించారు. వరి పైరు కొనుగోలు చేసి నాటాలని మరికొందరు రైతులు ఎదురు చూడటంతో డిమాండ్ ఏర్పడింది. దీంతో పాత చీరాల ప్రాంతంలో నారు పెంచుతున్నారు. వరదలతో నష్టపోయినది కొంతైనా పూడ్చుకోవాలని చూస్తున్నారు. - న్యూస్‌టుడే, చీరాల గ్రామీణం

పాత చీరాల ప్రాంతంలో వరి నారు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల అర్బన్: 9849165169 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

? పట్టణంలోని హరిప్రసాద్‌నగర్ పోలేరమ్మ ఆలయం పక్కన ఉన్న మురుగు కాలువలో చెత్త పేరుకుపోయింది. పారుదల లోపించి దుర్వాసన వెదజల్లుతోంది. **- నారాయణ, స్థానికుడు** ✔ వెంటనే సిబ్బందిని పంపి అక్కడ బాగుచేయిస్తా. **- ప్రవీణ్, శానిటరీ ఇన్‌స్పెక్టరు, పురపాలక సంఘం, చీరాల** - న్యూస్‌టుడే, చీరాల అర్బన్

? తిమ్మరాజుపాలెం గ్రామ శివారులో చెత్తా చెదారం పడేస్తున్నారు. దుర్వాసన వెదజల్లుతోంది. చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లించాలి. **- స్థానికుడు** ✔ రెండ్రోజుల్లో చెత్తాచెదారం తొలగించి, బ్లీచింగ్ చల్లిస్తాం. **- అనిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి, తిమ్మరాజుపాలెం** - న్యూస్‌టుడే, పర్చూరు.

? ఇంకొల్లు-కొణికి రోడ్డులో పేదలకు ప్రభుత్వం అందజేసిన ఇళ్ల స్థలాల్లో నుంచి విద్యుత్తు తీగలు వెళుతున్నాయి. దీంతో గృహ నిర్మాణాలకు ఆటంకం కలుగుతోంది. **- ఖాజావలి, లబ్ధిదారు, ఇంకొల్లు.** ✔ విద్యుత్తు లైన్లు మార్చాలంటే ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాలి. లబ్ధిదారుల వినతి పత్రం అందజేస్తే, పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. **- రామకృష్ణ, ఏఈ, ఇంకొల్లు** - న్యూస్‌టుడే, ఇంకొల్లు

? స్థానిక సుందరయ్య కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రుల ఇబ్బందిగా ఉంది. సమస్యను పరిష్కరించండి. **- శ్రీనివాసరావు, చినగంజాం** ✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి, రెండు రోజుల్లో వీధి దీపాల సమస్యను పరిష్కరిస్తా. **- బి.అంజయ్య, గ్రామ కార్యదర్శి, చినగంజాం** - న్యూస్‌టుడే, చినగంజాం

స్పందనకు వందనం

వెలిగిన వీధి దీపం.. వేటపాలెం, న్యూస్‌టుడే: కొత్తపేట గ్యాస్ గోదాం పక్కన వెన్నెల బ్యూటీ పార్లర్ ముందు వీధి లైటు కొన్నాళ్లుగా వెలగడంలేదని స్థానికులు ఈనెల 16న 'మేమున్నాం...మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై వార్త ప్రచురించగా స్పందించిన డిప్యూటీ ఎంపీడీవో టి.వెంకటేశ్వరరావు గురువారం ఎలక్ట్రీషియన్‌ను పంపి, అక్కడ లైటు బాగుచేయించారు.

తొలగిన చెత్త.. వేటపాలెం, న్యూస్‌టుడే: కొత్తపేట బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురు వీధిలోని రెండో సందులో చెత్త పేరుకుపోయిందని ఆ ప్రాంతవాసులు ఈనెల 14న 'మేమున్నాం...మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై వార్త ప్రచురించగా స్పందించిన డిప్యూటీ ఎంపీడీవో టి.వెంకటేశ్వరరావు గురువారం ప్రత్యేకంగా పారిశుద్ధ్య సిబ్బందిని పంపి, అక్కడ చెత్తను తొలగింపజేశారు.

చెత్తాచెదారం తొలగించారు.. పర్చూరు: మండల కేంద్రం వీరన్నపాలెంలో బాపట్ల వెళ్లే మార్గం వైపు చెత్తాచెదారం పడేస్తుండటంపై ఈనెల 20న 'ఈనాడు'లో 'మేమున్నాం.. మీకుతోడుగా' శీర్షిక ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. గురువారం చెత్తాచెదారం తొలగించి బ్లీచింగ్ చల్లి, ఆ ప్రాంతాన్ని శుభ్రపరిచారు.

22న మెగా జాబ్‌మేళా

మార్టూరు, న్యూస్‌టుడే: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎమ్మెల్యే ఏలూరి ఛారిటబుల్ ట్రస్టు, శ్రీహర్షిణి విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో యువత కోసం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని శ్రీహర్షిణి విద్యాసంస్థల ప్రిన్సిపల్ గడ్డం ఆంజనేయులు కోరారు. ఆమేరకు గురువారం జాబ్‌మేళా వివరాలు వెల్లడించారు. ఈనెల 22న నిర్వహించే మేళాలో 18 బహుళజాతి సంస్థల ప్రతినిధులు హాజరుకానున్నట్లు చెప్పారు. పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఐటీఐ, డిప్లొమా, ఎంబీఏ, పీజీ అభ్యసించిన 18-30 ఏళ్ల యువతీ యువకులు తమ ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు.

స్మార్ట్ కార్డుల పంపిణీ పూర్తిచేయాలి

ఇంకొల్లు, న్యూస్‌టుడే: వినియోగదారులకు రేషన్ స్మార్ట్ కార్డులు అందజేయడం పూర్తి చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం తన కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. డీటీ లక్ష్మీకుమారి, డీలర్లు పాల్గొన్నారు.

వేగ నిరోధకం.. ఇష్టానుసారం

చీరాల అర్బన్, న్యూస్‌టుడే

ప్రమాణాలు పాటించకుండా... సూచికలు లేకుండా ఇష్టానుసారంగా వేగ నిరోధకాలు(స్పీడ్ బ్రేకర్లు) వేస్తున్నారు.. వీటి వల్ల ఒళ్లు, వాహనాలు రెండూ గుల్లవుతున్నాయని చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది చూసుకోకుండా వేగంగా వీటిపై వెళితే అదుపుతప్పి పడిపోతున్నారు. ఈ సమయంలో గాయమై, ఆసుపత్రి పాలవుతున్నారు. ప్రధానంగా పట్టణాల్లోని సిమెంటు రహదారుల్లో ఎవరి ఇంటి ముందు వారు కట్టలుగా వేస్తున్నారు. గ్రామాల్లో అనధికారింగా నిర్మిస్తున్నారు. దీంతో వీటిపై ప్రయాణించేందుకు వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అనధికారికంగా నిర్మిస్తున్నారు.. వేగ నిరోధకాల నిర్మాణాల్లో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. చాలా చోట్ల వీటిని పాటించడంలేదు. ఈ విషయం ఇంజినీరింగ్ అధికారులు ఇటీవల నిర్వహించిన సర్వేలో స్పష్టమైంది. పట్టణాల్లో ఒక రోడ్డు ఉంటే అందులో పలుచోట్ల ఎటువంటి అనుమతుల్లేకుండా వీటిని వేస్తున్నారు.

ఈపూరుపాలెం మార్కెట్ పక్క శివాలయం రోడ్డులో వేగ నిరోధకం

నిబంధనలు ఇలా..

★ ఇండియన్ రోడ్ కాంగ్రెస్(ఐఆర్‌సీ) విధానాన్ని కచ్చితంగా పాటించాలి. వాహనాల బంపర్లకు తగలకుండా ఉండాలి ★ 10 సెంటీమీటర్ల ఎత్తు, 3.7 మీటర్ల పొడవు, 1.7 మీటర్ల రేడియస్ (వ్యాసార్థం)తో నిర్మించాలి. ★ వేగ నిరోధానికి 40 మీటర్ల ముందుగానే సూచికలు పెట్టాలి ★ ఒకే రహదారిలో రెండింటిని వేయకూడదు. ఒక వేళ ఏర్పాటు చేయాల్సి వస్తే వాటి మధ్య దూరం 100 నుంచి 150 మీటర్లు ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

✦ జాతీయ రహదారులపై ఎక్కడ వీటిని నిర్మించకూడదు ✦ ప్రధాన రహదారిలో చిన్న మార్గాలు కలిసే ప్రాంతం, జంక్షన్ల వద్ద ఏర్పాటు చేయాలి ✦ విద్యాసంస్థలు, వైద్యశాలలు, వంతెనలు, మలుపులు ఉన్న చోట నిర్మించాలి ✦ నివాసాలు ఎక్కువగా ఉండి పాదచారులు తిరిగే చోట వేయాలి

చినగంజాంలో ఓ ఇంటి వద్ద సిబ్బంది పొడి చెత్తను సేకరిస్తుండగా పరిశీలిస్తున్న బాలమ్మ

పంచాయతీ ఆదాయం పెంచండి

చినగంజాం, న్యూస్‌టుడే: ఇంటింటికీ వెళ్లి తడి చెత్త, పొడి చెత్తను సేకరించి పంచాయతీ ఆదాయాన్ని పెంచాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా డిప్యూటీ సీఈవో పావులూరి బాలమ్మ ఆదేశించారు. చినగంజాంలో ఇళ్ల వద్ద చెత్తను సేకరిస్తున్న విధానాన్ని ఆమె గురువారం పరిశీలించారు. ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంపద షెడ్డును పరిశీలించారు. షెడ్డు ఆవరణలో కొబ్బరి మొక్కలు నాటారు. ఎంపీడీవో కె.ధనలక్ష్మి, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంటు సీహెచ్ పూర్ణచంద్రరావు, సర్పంచి రాయని ఆత్మారావు, ఉప సర్పంచి చెరుకూరి రాఘవయ్య, కార్యదర్శి కె.అంజయ్య పాల్గొన్నారు.

విద్యుత్తు దీపాల ఏర్పాటు

పర్చూరు, న్యూస్‌టుడే: పర్చూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే మార్గంలో విద్యుత్తు దీపాలు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ఈనెల 9న 'చీకటిపడితే హడలే' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులు స్పందించారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు అధికారులు బుధ,గురువారాల్లో ఈ మార్గంలోని స్తంభాలకు దీపాలు అమర్చే పనులు చేపట్టి, పూర్తి చేశారు. వైద్యశాలకు వెళ్లే మార్గంలో మొత్తం ఎనిమిది చోట్ల దీపాలు ఏర్పాటుచేసి, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా వెలుగులు నింపారు. సమస్య పరిష్కారం కావడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈనాడు కథనాలకు స్పందన

వాహనాలు నిలపకుండా బల్లల ఏర్పాటు

చీరాల, న్యూస్‌టుడే: ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో ప్రత్యేకంగా వాహనాలు నిలిపేందుకు స్థలం లేక ఇష్టారాజ్యంగా ఎక్కడంటే అక్కడే నిలుపుతున్నారు. దీనివల్ల రోగులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై 'పార్కింగ్ లేక ఆవరణలోనే' అనే శీర్షికతో గురువారం వచ్చిన కథనానికి వైద్యశాల అధికారులు స్పందించారు. ఆసుపత్రి ఆవరణలో వాహనాలు నిలపకుండా బల్లలు వేశారు. దీంతో రోగులు, వారి బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిలబడేబాధ తప్పిందని అంటున్నారు.

అక్రమ కట్టడం తొలగింపు

ఎన్టీఆర్‌నగర్(అద్దంకి), న్యూస్‌టుడే: ఎన్టీఆర్ నగర్ ఊరచెరువు సమీపంలో కాలువ కట్ట ఒడ్డున నిర్మించిన అక్రమ కట్టడాన్ని రెవెన్యూ అధికారులు తొలగించారు. 'ఈనాడు'లో గురువారం ప్రచురించిన 'హెచ్చరించినా..లెక్కచేయని అక్రమార్కులు' కథనానికి స్పందించారు. సాగర్ కాలువ నీరు చెరువులోకి చేరే దారి వెంబడి ప్రమాదకరంగా నిర్మాణాలు చేపట్టడాన్ని అధికారులు గుర్తించారు. సొంతంగా తొలగించాలని అధికారులు సూచించినా లెక్క చేయకపోవడంతో అధికారులు తొలగించారు. ఇకపై ఎన్టీఆర్ నగర్‌లో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని అధికారులు హెచ్చరించారు.

ఎన్టీఆర్ నగర్‌లో కట్టడాన్ని తొలగిస్తూ..

కొత్తపేట రోడ్ల సొగసు చూడతరమా!

వరసిద్ధి గణపతి ఆలయం పక్క రహదారి ఇలా..

చీరాల పట్టణానికి కూతవేటు దూరంలోని కొత్తపేట గ్రామంలో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఇక్కడ వ్యాపారులు, విద్యావేత్తలు, ఉద్యోగులు ఇక్కడ ఉండేందుకు ఆసక్తి చూపుతున్నారు. లక్ష్మీశ్రీనివాస కాలనీ, వడ్డెసంఘం, రోశయ్య కాలనీ, ప్రసాదు నగరం, కొత్తపేట, వివేకానంద కాలనీ, ఐఎల్‌టీడీ కాలనీ, టైలర్స్ కాలనీ, శ్రీనివాసపురం, విలేకర్ల కాలనీలున్నాయి. వీటితో పాటు కొత్త కాలనీలు పెరుగుతున్నాయి. జనాభా సుమారు 20 వేలుపైగా ఉండగా, ఆదాయం రూ. 2 కోట్లుపైనే వస్తోంది. మేజరు పంచాయతీ అయిన ఇక్కడ సిమెంటు రహదారులు 40, మట్టిరోడ్లు 80 వరకు ఉన్నాయి. చాలా వరకు మట్టిరోడ్డు (గ్రావెల్)తో వేసి ఉన్నాయి. మరో 20 వరకు మెటల్ చిప్స్ పోసి వదిలేశారు. దీంతో ఆయా ప్రాంత ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఈ సమస్య దారుణంగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు వేయాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కొత్తపేట (వేటపాలెం)

చీరాల: విజేతకు బహుమతి అందజేస్తున్న ఛైర్మన్ సాంబశివరావు

పర్చూరు: విజేతలతో ఉపాధ్యాయులు, అధికారులు

అద్దంకిలో ప్రదర్శన

విజ్ఞాన భాండాగారాలు గ్రంథాలయాలు

చీరాల, మార్టూరు, చినగంజాం, కారంచేడు, న్యూస్‌టుడే: విజ్ఞానాన్ని వెదజల్లే భాండాగారాలు గ్రంథాలయాలు అని, యువత వీటిని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ ఎం.సాంబశివరావు పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పుస్తకాల కోసం రూ. 5వేలు విరాళంగా అందజేశారు. గ్రంథపాలకుడు ప్రసాద్, డాక్టర్ సుబ్బారావు, మురళీకృష్ణ, సుందరరావు పాల్గొన్నారు. మార్టూరు, చినగంజాం, కారంచేడు గ్రామల్లో చిన్నారులకు వివిధ పోటీలు నిర్వహించి, బహుమతులు పంపిణీ చేశారు. మార్టూరులో గ్రంథపాలకురాలు ఎ.శకుంతల, ప్రధానోపాధ్యాయుడు ఇ.శ్రీనివాసరావు పాల్గొన్నారు. చినగంజాంలో జరిగిన కార్యక్రమంలో విశ్రాంత ఈఈ కుర్రి రామసుబ్బారావు, విశ్రాంత బ్యాంకు అధికారి పర్వతరెడ్డి కాంతారావు, గ్రంథపాలకుడు మోహన లక్ష్మీ నరసింహాచార్యులు, ఎంఈవో ఎంఈవో-1 బి.అజయ్‌బాబు పాల్గొన్నారు. పలువురిని సత్కరించారు. కారంచేడులో జరిగిన కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకుడు బుచ్చయ్యచౌదరి, వైఎన్ ఉన్నత పాఠశాల హెచ్ఎం సామ్రాజ్యం, గ్రంథాలయాధికారి ఎం.నాగయ్య, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి, న్యూస్‌టుడే: పుస్తక పఠనంతోనే సామాజిక చైతన్యం సాధ్యమని పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు అన్నారు. పట్టణంలో వివిధ విద్యాలయాలకు చెందిన విద్యార్థులు ప్రదర్శన చేశారు. గ్రంథపాలకురాలు సీహెచ్.వి.ఎల్.వసుంధరాదేవి, గాడేపల్లి దివాకర్‌దత్తు, ఆనంద్, బుజ్జిబాబు, వెంకటేశ్వరరెడ్డి, పేరయ్య, శేషారెడ్డి, మేనేజరు తాళ్లూరి బాబూరావు పాల్గొన్నారు..

పోటీపడ్డారు... బహుమతులు సాధించారు

పేరాల(చీరాల అర్బన్), న్యూస్‌టుడే: 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. గురువారం పేరాలలోని శ్రీ సాయి హైస్కూల్‌లో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోను ప్రభావం' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించగా బాలికలు తమ సత్తా చాటారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను బి.సుష్మ, షేక్ సమీరా, ఎం.ఎన్.డి అమలేశ్వరి సాధించారు. వీరికి 'ఈనాడు' తరపున జ్ఞాపికలను ప్రధానాచార్యుడు ఎ.వెంకట్రావు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శింగరకొండ(అద్దంకి), న్యూస్‌టుడే: అందుబాటులోని చరవాణిని ప్రతి వ్యక్తి సద్వినియోగం చేసుకోవాలే తప్ప దుర్వినియోగానికి పాల్పడరాదని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి అన్నారు. శింగరకొండ సమీపంలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'చరవాణి వల్ల కలిగే లాభాలు, నష్టాలు' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో వైవీ.లావణ్య, పి.చైతన్య వరలక్ష్మి, పి.ప్రవల్లిక నిలిచారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ప్రధానోపాధ్యాయిని పి.చాముండేశ్వరి, ఉపాధ్యాయినులు జి.నాగజ్యోతి, జి.నీలిమ, జి.కృష్ణవేణి, పి.జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

చీరాల: విజేతలతో ప్రిన్సిపల్ వెంకట్రావు

అద్దంకిలో..

గుండ్లకమ్మలో ఇసుక నిల్వల పరిశీలన

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి సమీపంలోని గుండ్లకమ్మ నదిలో ఇసుక నిల్వలను అధికారుల బృందం గురువారం పరిశీలించింది. సీఐ సుబ్బరాజు, పురపాలక, రెవెన్యూ అధికారులు ఈ బృందంలో ఉన్నారు. మంచినీటి బావులకు, వంతెనలకు 500 మీటర్ల దూరంలో ఇసుక తవ్వకోవాలని, యంత్రాలు ఉపయోగించరాదన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5వరకు మాత్రమే తవ్వకాలు జరపాలని.. తరువాత చేస్తే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

నిఘా కెమెరాలు ఏర్పాటు చేసుకోండి

అద్దంకి, న్యూస్‌టుడే: దేవాలయాల్లో హుండీల దొంగతనాలు పెరిగిన నేపథ్యంలో నిర్వాహకులు కచ్చితంగా సీసీ కెమెరా బిగించుకోవాలని అద్దంకి సీఐ ఎ.సుబ్బరాజు అన్నారు. హుండీల్లో డబ్బులు ఉంచరాదని, భక్తుల రద్దీని నియంత్రించేందుకు వాలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వాకబు చేయాలని, పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు.

వాహనదారులకు శిరస్త్రాణం తప్పనిసరి

పుట్టావారిపాలెం (సంతమాగులూరు): వాహనదారుడు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని ఎస్సై ఎం.పట్టాభిరామయ్య సూచించారు. పుట్టావారిపాలెం కూడలిలో గురువారం రాత్రి వీటి వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

రామలింగేశ్వరాలయంలో అన్నసంతర్పణ

జె.పంగులూరు, న్యూస్‌టుడే: మండలంలోని రామకూరు కొండపై ఉన్న రామలింగేశ్వరాలయంలో శుక్రవారం సాయంత్రం అన్నసంతర్పణ జరుగుతుందని అర్చకుడు నూతలపాటి వెంకటేష్ శర్మ తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఉదయం రుద్రాభిషేకం, కుంకుమార్చన ఉంటాయని చెప్పారు.

నేడు

విద్యుత్తు సరఫరా నిలిపివేత

అద్దంకి, న్యూస్‌టుడే: పట్టణంలోని సంజీవ్‌నగర్, పోలీస్‌స్టేషన్ బజారు, బంగ్లా రోడ్డు, అత్తులూరివారి వీధి, కురిచేటి రైస్‌మిల్, ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, శింగరకొండ రోడ్డులోని విద్యుత్తు కార్యాలయం నుంచి భవానీ సెంటర్ వరకు రోడ్డుకు తూర్పువైపున, దామావారిపాలెం పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ ఎం.దామోదరం గురువారం తెలిపారు.

గ్రానైట్ వ్యర్థాలు పడితే చర్యలు

బల్లికురవ, న్యూస్‌టుడే: రహదారులపై గ్రానైట్ వ్యర్థాలు పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై నాగరాజు అన్నారు. గ్రానైట్ పరిశ్రమల నుంచి వ్యర్థాలు తరలించేటప్పుడు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. రెండు రోజులుగా స్థానిక బల్లికురవ కూడలిలో గ్రానైట్ వ్యర్థాలను ట్రాక్టర్లతో తరలించే క్రమంలో రోడ్డుపై వ్యర్థాలు పడి, వాహనాలు తిరిగేటప్పుడు దుమ్ము, ధూళితో మార్గం కనిపించకుండా పోతుందని పలువురు ఎస్సైకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఎస్సై ట్రాక్టర్ యజమానులతో మాట్లాడి, ట్యాంకర్ సాయంతో రోడ్డుపై నీళ్లు కొట్టించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వేటపాలెం, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏపీ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల పంచాయతీ కార్మికుల సర్వసభ్య సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. కార్మికులకు నెలల తరబడి జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, పన్నుల వసూలుతో వీటిని ముడిపెట్టి ఇవ్వకపోవడం దారుణమన్నారు. సమావేశానికి బ్రహ్మయ్య అధ్యక్షత వహించారు. కన్వీనరు ఎం.అయ్యప్పరెడ్డి, కో-కన్వీనరు ఆంజనేయులు, సభ్యులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంతో అనేక ప్రమాదాలు

అద్దంకి: ప్లాస్టిక్ వాడకంతో అనేక ప్రమాదాలు ఉన్నాయని రాష్ట్ర స్వచ్ఛాంధ్ర మిషన్ డైరెక్టర్ చిన్ని శ్రీనివాసరావు అన్నారు. గొరకాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. విద్యార్థులు ప్లాస్టిక్ సీసాల వాడకం గమనించి మాట్లాడారు. గాజులపాలెం యూపీహెచ్‌సీని సందర్శించారు. డాక్టర్ గొట్టిపాటి జయసింహతో మాట్లాడారు.

ఉల్లాస్‌పై ఉపాధి సిబ్బందికి శిక్షణ

జె.పంగులూరు: ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని మండలంలో నూరుశాతం అక్షరాస్యత సాధించేలా కృషి చేయాలని ఎంపీడీవో కె.స్వరూపరాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ పథకం సిబ్బందికి మండల స్థాయి శిక్షణ నిర్వహించారు.

అవీ ఇవీ

వైభవంగా ప్రత్యేక పూజలు

ఉప్పుటూరు (పర్చూరు), న్యూస్‌టుడే: శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయంలో గురువారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మకర్త బెండపూడి రాధాకృష్ణ దంపతులు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. గుడిలో జ్వాలాతోరణం ఏర్పాటు చేశారు. భక్తులు ప్రత్యేక దీపాలు వెలిగించారు.

ప్రత్యేకాలంకరణలో శ్రీవేంకటేశ్వరస్వామి

అధిక పురుగు మందుల వాడకంతో నష్టం

గోవాడ(అద్దంకి), న్యూస్‌టుడే: మితిమీరిన పురుగు మందుల ప్రభావం మానవ శరీరంపై చూపుతుందని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. మండలంలోని గోవాడలో గురువారం జరిగిన పొలం పిలుస్తోందిలో రైతులతో మాట్లాడారు. శ్రీలక్ష్మి, కోటేశ్వరరావు, శేషారావు, నరిశెట్టి రమేష్ బాబు, మాకినేని ఏడుకొండలు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

✦ మండలంలో ఉపాధిహామీ పనులకు తరచూ గైర్హాజరవుతున్న 960మంది జాబ్‌కార్డులు తొలగించినట్లు ఏపీవో ఐఎన్ఎస్.కోటేశ్వరి తెలిపారు. అభ్యంతరాలుంటే కార్యాలయం దృష్టికి తీసుకురావాలని సూచించారు.

రెస్టారెంట్లలో అధికారి తనిఖీలు

జె.పంగులూరు: రెస్టారెంట్ నిర్వహణకు లైసెన్సు తప్పనిసరిగా ఉండాలని చీరాల డివిజన్ ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రణీత్ అన్నారు. మండలంలోని పంగులూరులో గురువారం పలు రెస్టారెంట్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. లైసెన్సు లేకుండా నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

బల్లికురవ, న్యూస్‌టుడే: మండలంలోని చెన్నుపల్లిలో అగ్రహారం భూములకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో అన్నదాత సుఖీభవ నిధులు విడుదలతో రైతులు సంతోషం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

20 శాతం రాయితీతో నిత్యావసరాలు

చినగంజాం, న్యూస్‌టుడే: డ్వాక్రా మహిళలకు 20 శాతం రాయితీతో నిత్యావసరాలు అందజేస్తామని నరసింహ వెల్ఫేర్ రూరల్ డెవలప్‌మెంట్ అధ్యక్షుడు వంకాయలపాటి జాషువా అన్నారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ వ్యవస్థాపకుడు గంగుల నరసింహ, తాళ్లూరి శివ తదితరులు పాల్గొన్నారు.

వైకాపా నిరసన ర్యాలీ

పర్చూరు, న్యూస్‌టుడే: వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గురువారం స్థానిక బొమ్మలికూడలిలో వైకాపా ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త గాదె మధుసూదనరెడ్డి పాల్గొన్నారు. అనంతరం సెంటర్‌లో ఏర్పాటు చేసిన కోటిసంతకాల ప్రజా ఉద్యమ కార్యక్రమ ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు చింపివేశారంటూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఉప్పుటూరు(పర్చూరు): ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యశాలలో ప్రపంచ ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ప్రజలకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ డి.చంద్రశేఖర్ మాట్లాడుతూ వ్యసనాలకు బానిసలై ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దని సూచించారు.

మర్యాదపూర్వకంగా కలిసి.. విజ్ఞప్తి చేసి

పర్చూరు, న్యూస్‌టుడే: విజయవాడలోని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఛైర్మన్ గుడిపూడి నారాయణస్వామిని ఆయన కార్యాలయంలో గురువారం పర్చూరు నియోజకవర్గ యాదవ జేఏసీ కన్వీనర్ పాలేరు నాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. తమ ప్రాంతంలోని విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల అభ్యున్నతికి కృషిచేయాలని కోరారు.

అద్దంకి సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి సామాజిక ఆరోగ్యకేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఆసుపత్రిలోని సిబ్బంది కొరత, ఏఆర్‌టీ కేంద్రం ఏర్పాటు, భవనం, ఫర్నిచర్ మరమ్మతులపై చర్చించారు.

కశ్యాపురంలో స్వామిత్వ గ్రామసభ రేపు

జె.పంగులూరు, న్యూస్‌టుడే: మండలంలోని కశ్యాపురంలో ఈ నెల 22న స్వామిత్వ సర్వే గ్రామ సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.స్వరూపరాణి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో చోదకుడికి గాయాలు

మేదరమెట్ల: విజయవాడ నుంచి జేసీబీ యంత్రాన్ని తీసుకువెళ్తున్న లారీ ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టడంతో చోదకుడికి గాయాలయ్యాయి. కొరిశపాడు మండలం మేదరమెట్లలో జాతీయ రహదారిపై గురువారం వేకువజామున ఇది చోటుచేసుకుంది. హైవే పోలీసులు క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌లో ఒంగోలు ఆసుపత్రికి తరలించారు.

తేళ్ల కుటుంబానికి పరామర్శ

పర్చూరు, న్యూస్‌టుడే: శ్రీశైలం కాకతీయ సేవాసమితి ఛైర్మన్, చిలకలూరిపేట మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ తేళ్ల సుబ్బారావు తల్లి శ్రీహరమ్మ ప్రథమ వర్ధంతిలో చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌లు పాల్గొని నివాళులర్పించారు. నాగులపాలెంలోని శ్రీవెంకటేశ్వర కల్యాణ మండపంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్యాంపు కార్యాలయ ప్రతినిధులు నివాళులర్పించారు.

పరిశుభ్ర గ్రామాలుగా ఎంపిక

అద్దంకి, న్యూస్‌టుడే: మండలంలోని తిమ్మాయపాలెం గ్రామాన్ని విజువల్లీ పరిశుభ్ర గ్రామంగా ఎంపిక చేసినట్లు ఎంపీడీవో బి.వరూధిని తెలిపారు. శుక్రవారం మండలంలోని హరిత రాయబారులతో గ్రామాన్ని శుభ్రం చేయడం జరుగుతుందని వెల్లడించారు.

చినగంజాం: క్లీన్ అండ్ గ్రీన్ పంచాయతీగా గుర్తించిన గొనసపూడిలో శుక్రవారం జరిగే స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో అందరూ పాల్గొనాలని ఎంపీడీవో కె.ధనలక్ష్మి అన్నారు. దీనిపై మండల పరిషత్ సమావేశపు భవనంలో గురువారం కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

అమ్మవారికి కుంకుమ పూజలు

జె.పంగులూరు: కొండమూరులోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో గురువారం విశేష పూజలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించినట్లు అర్చకుడు కొండకావూరి శివయ్యశర్మ తెలిపారు. రాత్రికి గ్రామస్థుల సహకారంతో అన్నసంతర్పణ చేపట్టినట్లు చెప్పారు.

(c) eenadu

వనమిత్ర.. సాహసయాత్ర

● నల్లమలలో ట్రెక్కింగ్‌కు విస్తృత అవకాశాలు

సామాజిక మాధ్యమాలే దిక్కు

శేషాచలం అడవులు ఆధ్యాత్మికతకు, ప్రకృతి అందాలకు నెలవు. ఇక్కడి అడవుల్లో ఎన్నో వింతలు, విశేషాలు ఇమిడి ఉన్నాయి. అయితే కొన్నేళ్లుగా కొందరు ట్రెక్కర్ల పేరుతో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలోనే అడవుల్లోకి వెళ్లడానికి వీల్లేదంటూ అటవీ అధికారులు నిషేధాజ్ఞలు జారీచేశారు. ఈ నిర్ణయంతో గుర్తింపు, అనుభవంగల ట్రెక్కర్లు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సడలింపు దిశగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు.

జిల్లా పరిధిలో వందకుపైగా అనధికార ట్రెక్కింగ్ గ్రూపులు ఉన్నట్లు అంచనా. ఇవి ఫేస్‌బుక్, ఇన్‌స్టా, యూట్యూబ్ వేదికలుగా ఔత్సాహికులను ఆకర్షిస్తున్నాయి. వీటితోపాటు తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన జాతీయస్థాయి సంస్థలు, ట్రెక్కర్లు ఇక్కడికి రావడానికి ఆసక్తి చూపుతున్నారు. సాహసయాత్రలకు తోడు శ్రీవారి దర్శనం కలిసివచ్చే అంశం.

పరిశీలనలోని అంశాలు

● ట్రెక్కర్లను ఒకతాటిపైకి తీసుకురావడం. ● ప్రత్యేకంగా వనమిత్ర పేరుతో వెబ్‌పోర్టల్ రూపొందించి రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించడం. ● ప్రత్యేకంగా ఐడీ కార్డులు జారీ చేయడం. ● అటవీశాఖ గుర్తింపు పొందిన గైడ్ల సాయం తీసుకోవడం. ● గుర్తింపులేని ట్రెక్కర్లకు అడ్డుకట్టవేయడంతోపాటు అటవీశాఖకు ఆదాయం సమకూర్చడం. ● జంగిల్ సఫారికి సాధ్యాసాధ్యాలు పరిశీలించడం. (మామండూరులో గతంలో అమలులో ఉండేది.)

విన్నపాలు ఇలా..

కొందరు ట్రెక్కర్లు రెండునెలల కిందట తిరుపతి పర్యటనకు వచ్చిన ఏపీ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు(అటవీశాఖ) పి.మల్లికార్జునరావు దృష్టికి వారి సమస్యలను నివేదించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వ విధానాల్లో ఒకటైన అడ్వెంచర్ టూరిజంలో భాగంగా ట్రెక్కింగ్‌ను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని జిల్లా అధికారులకు ఆయన వివరించారు. అడవుల్లో ట్రెక్కర్లు, ఔత్సాహికులు, పరిశోధకులు, ప్రకృతి ప్రేమికుల కదలికలు ఉంటే స్మగ్లర్లు సైతం భయపడతారని, వనమిత్రలకు గుర్తింపు కార్డులు ఇచ్చి అటవీశాఖ సమన్వయంతో పర్యావరణం, వన్యమృగాల సంచారానికి ఇబ్బందులు లేకుండా ట్రెక్కింగ్‌ను ప్రోత్సహించే దిశగా ఆయన దిశానిర్దేశం చేశారు.

సందర్శనకు వీలున్నవి

● తుంబుర, రామకృష్ణ, సనకసనంద, చక్ర, కుమారధార, పుసుపుధార, గుంజన జలపాతాలు, బ్రహ్మగుండం, చామల వ్యాలీ

● **ఎకో టూరిజం కేంద్రాలు:** తలకోన, ఉబ్బలమడుగు, మామండూరు.

● శేషాచలం విస్తీర్ణం : 5000 చ.కి.మీ.
● ప్రముఖ తీర్థాలు, జలపాతాలు: 108

త్వరలోనే తుది నిర్ణయం: సాయిబాబ, తిరుపతి జిల్లా అటవీపాలనాధికారి

అటవీశాఖ సాయంతో ట్రెక్కింగ్ నిర్వహించడంపై దృష్టిసారించాం. గతంలో అధికారులు సూచించిన వనమిత్ర వెబ్ పోర్టల్ రూపొందించే దిశగా అధ్యయనం చేస్తున్నాం. నిబంధనలు, అనుమతులు, ఫీజు వంటి అంశాలపైనా చర్చలు జరుపుతున్నాం. త్వరలోనే తుది నిర్ణయం ప్రకటిస్తాం.

న్యూస్‌టుడే, తిరుపతి (జీవకోన)

దేదీప్యం

పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుచానూరు విద్యుద్దీపాలతో మెరిసిపోతోంది. ప్రధాన కూడళ్లు, ఆలయ గోపురాలు, ప్రాకారాలు, కోనేరును అందంగా ముస్తాబు చేశారు. పట్టణమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. – ఈనాడు, తిరుపతి

నేటి ఉత్సవాలు..



హనుమంత వాహనంపై పద్మావతి అమ్మవారు

ఐదో రోజు శుక్రవారం రాత్రి గజవాహనసేవ జరగనుంది. అమ్మవారికి జరిగే వాహనసేవల్లో గజవాహనసేవకు అత్యంత ప్రాధాన్యం ఉంది. ఉదయం 8 గంటలకు పల్లకీ వాహనసేవ, మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 5 గంటల వరకు వసంతోత్సవం నిర్వహిస్తారు. గజవాహనసేవకు అలంకరించేందుకు తిరుమల నుంచి శ్రీవారి కాసులహారాన్ని శుక్రవారం శోభాయాత్రగా తిరుచానూరుకు తీసుకురానున్నారు.

పట్టాభిరాముడు.. భక్తజన హృదయుడు

తిరుచానూరు, తిరుమల, న్యూస్‌టుడే: తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం కల్పవృక్ష వాహనసేవ జరిగింది. అమ్మవారు చేతిలో పిల్లనగ్రోవి ధరించి మురళీకృష్ణుడు రూపంలో, రాత్రి హనుమంతవాహనంపై పట్టాభిరాముడి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు సాయంత్రం అమ్మవారికి ఊంజల్‌సేవ కనులపండువగా జరిగింది. శ్రీ పద్మావతి అమ్మవారిని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దర్శించుకున్నారు. వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా.. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం తిరుమల చేరుకున్న రాష్ట్రపతి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు.

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పుష్పగుచ్ఛం అందిస్తున్న తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, పక్కన హోంమంత్రి అనిత

ఏడు కొండలు బ్రాండ్లు..

● స్వామికి అలంకరించిన పూలతో అగరుబత్తీలు
● అంచనాకు మించి భక్తుల నుంచి డిమాండ్

అగరబత్తీలు తయారుచేస్తున్న మహిళలు

తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే: దేవుడికి అర్చన చేసిన పూలను అర్చకులు భక్తులకు ప్రసాదంగా ఇస్తే కళ్లకు అద్దుకొని స్వీకరిస్తారు. సాక్షాత్తు దేవదేవుడైన కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామికి అలంకరించిన పూలమాలలతో అగరబత్తీలు తయారు చేస్తే.. వాటి పవిత్రత గురించి చెప్పాల్సిన పనిలేదు. ఎస్వీ గోసంరక్షణ శాలలోని తితిదే (దర్శన్) కేంద్రంలో తయారు చేస్తున్న ఏడు రకాల అగరబత్తీలకు భక్తుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది.

● ఎల్ఎస్‌నగర్ సమీపంలోని ఎస్వీగోసంరక్షణ శాల ప్రాంగణంలో 2021లో సెప్టెంబరు 13న దర్శన్ ఇంటర్నేషనల్, బెంగళూరు సహకారంతో తితిదే అగరబత్తీల తయారీ కేంద్రం ఏర్పాటుచేశారు.

తయారీ ఇలా..

● ఏరోజుకారోజు స్వామి, అమ్మవార్లకు అలంకరించి తీసేసిన పూలమాలలను అగరబత్తీ కేంద్రానికి తరలిస్తారు. ● పూలను వేరు చేసి జల్లెడపడతారు. తర్వాత ఓ యంత్రంలో వేసి వాటిని నిర్ణీత వేడిలో ఆరబెడతారు. ● ఆరబెట్టిన పూలను పొడిచేసి, పలు మిశ్రమాలను కలిపి యంత్రాల్లో పోస్తారు. ● యంత్రం నుంచి వచ్చే పొడితో అగరబత్తీలు తయారుచేస్తున్నారు.

● రోజుకు ఉత్పత్తి: 27 వేల ప్యాకెట్లు
● ఆదాయం నెలకు: రూ. 4 కోట్ల నుంచి రూ.5 కోట్లు

విస్తరించిన విక్రయాలు

ఏడు కొండలను ప్రతిబింబించేలా అగరబత్తీలకు తందనాన, దివ్యపాద, అభయహస్త, దృష్టి, సృష్టి, ఆకృష్టి, తుష్టి అనే పేర్లు పెట్టారు. ఒక్కో రకం అగరబత్తీకి ఒక్కో రకం పువ్వును వినియోగిస్తారు. వీటికి విపరీతంగా ఆదరణ ఉండడంతో అనుబంధ ఆలయాలతోపాటు, తెలంగాణ, చెన్నై, బెంగళూరు రాష్ట్రాల్లోని తితిదే ఆలయాల్లోనూ విక్రయిస్తున్నారు.

మహిళలే ఎక్కువ..

అగర్‌బత్తీ కేంద్రంలో మొత్తం 150 మంది పని చేస్తుండగా.. అందులో 128 మంది మహిళలే ఉండటం గమనార్హం. రోజుకు వంద గ్రాముల ప్యాకెట్లు 27వేల వరకు తయారుచేస్తున్నారు.

సరిపడా లేని ఉత్పత్తి

ప్రారంభించిన రెండేళ్లలోనే భక్తుల డిమాండుకు తగ్గట్టు ఉత్పత్తి చేయలేకపోయారు. స్పందించిన తితిదే అధికారులు 2023లో మరో యూనిట్‌ను ప్రారంభించారు.

అమ్మ.. కుంకుమ బొమ్మ

తిరుపతికి చెందిన సూక్ష్మకళాకారుడు పల్లి చిరంజీవి.. తిరుచానూరు కార్తిక బ్రహ్మోత్సవాల సందర్భంగా కుంకమతో అమ్మవారి రూపాన్ని గీశారు. అరకిలో కుంకుమతో నాలుగు అడుగుల చతురస్రాకార వస్త్రంపై అమ్మవారికి రూపమిచ్చారు. గత బ్రహ్మోత్సవాల్లో కాఫీ పొడితో 30 అడుగుల అమ్మవారి నిలువెత్తు చిత్రాన్ని చిత్రీకరించినట్లు చిరంజీవి తెలిపారు. తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా చింత గింజలపై శ్రీపద్మావతి శ్రీనివాస కల్యాణ ఘట్టాలను చిత్రీకరించారు. – ఈనాడు, తిరుపతి

కృష్ణమ్మకు జల హారతి

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: హంద్రీ-నీవా ద్వారా కృష్ణమ్మ జలాలతో నిండిన కుప్పం పురపాలిక పరిధిలోని దళవాయికొత్తపల్లె చెరువులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు ట్రస్టీ నారా భువనేశ్వరి గురువారం జలహారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు చెరువు కట్టపై కొలువైన చౌడేశ్వరమ్మకు పూజలు చేశారు. అనంతరం కృష్ణమ్మ జలాలకు సారె సమర్పించి జలహారతి ఇచ్చారు.

SRI BALAJI MEDICAL COLLEGE
HOSPITAL & RESEARCH INSTITUTE
SBMC RENIGUNTA
New Airport Road, Renigunta, Tirupati - 517520

WANTED

HOSPITAL
- Marketing Executives
- Marketing Telecallers
- Nurses (GNM / B.Sc.)
- Ward Boys

COLLEGE
- Accountant's
- Telecallers & Councellers
- HR Executives & Managers
- Hostel Wardens (Male & Female)
- Securities (Male & Female)

E-mail: info.sbmch@gmail.com
Mobile : 8106497638, 8125465490

మాటలే.. చేతల్లేవ్

పుత్తూరులో డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న నాటి ఆర్డీ విశ్వనాథ్, అధికారులు(పాతచిత్రం)

● పుర, నగరపాలికల్లో అక్రమాలపై సాగని విచారణ
● కమిటీలు నియమించినా కనిపించని వైనం

పుత్తూరు, న్యూస్‌టుడే: నాటి వైకాపా ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలోని పుర, నగర పాలక సంస్థల్లో చోటు చేసుకున్న అక్రమాలపై ప్రభుత్వం చేపట్టిన విచారణ కథ కంచికి అన్నట్లుగా మారింది. పురపాలక పరిపాలన, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళికా శాఖలతో నియమించిన విచారణ కమిటీలో ప్రజారోగ్యశాఖ నిర్లక్ష్యంతో అడుగులు ముందుకు పడలేదు.

విచారణకు ఆదేశించినా: చిత్తూరు, తిరుపతి నగర పాలికలతోపాటు పుత్తూరు, పుంగనూరు, మదనపల్లె పట్టణాల్లో అక్రమాలు జరిగాయి. వీటిపై సుమోటోగా, తెదేపా ఎమ్మెల్యేలు, నేతల ఫిర్యాదుతో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. అనంతపురం ఆర్డీ, నెల్లూరు ప్రజారోగ్యశాఖ ఎస్ఈ, పట్టణ ప్రణాళికా విభాగం అధికారితో వేర్వేరుగా కమిటీలు నియమించింది.

ఇదీ పరిస్థితి

● చిత్తూరు నగర పాలకలో చేపట్టిన వేర్వేరు విచారణల్లో ఒకటి పూర్తయ్యింది. పూర్వ కమిషనర్ అరుణ అక్రమాలపై నియమించిన విచారణాధికారి రవీంద్రబాబు అమరావతిలోని డీఎంఏ కార్యాలయానికే పరిమితమయ్యారు.

● పుంగనూరు, మదనపల్లెలో అక్రమాల నిగ్గు తేల్చేందుకు నియమితులైన ప్రజారోగ్యశాఖ ఈఈ సుబ్బరాయుడు నేటి వరకు అటువైపు కన్నెత్తి చూడలేదు.

● తిరుపతిలో ప్రజారోగ్య శాఖ ఇంజినీరింగ్ అక్రమాలపై దృష్టిసారించలేదు.

ఫిర్యాదు చేసినా..

నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పుత్తూరు పురపాలికలో జరిగిన అక్రమాలపై రెండుసార్లు ఫిర్యాదు చేయడమే కాక శాసనసభలోనూ ప్రస్తావించారు. ఈ మేరకు నాటి పురపాలక ఆర్డీ విశ్వనాథ్ చేపట్టిన విచారణ పూర్తయ్యింది. ఇక్కడే అసలు కీలక పరిణామం జరిగింది. ప్రజారోగ్యశాఖ అధికారులు వచ్చి వెళ్లడం తప్ప విచారణ నేటికీ మొదలు పెట్టలేదు. 3 విభాగాల్లో విచారణ పూర్తయితేనే తుది నివేదిక ఇవ్వడానికి వీలవుతుంది.

పాడికి అండ.. పశువులకు నీడ..!

90 శాతం రాయితీతో 2,242 షెడ్ల నిర్మాణం

పుంగనూరు, న్యూస్‌టుడే: పాడి రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. మినీ గోకులాల పేరుతో నిర్మిస్తున్న పశువుల షెడ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఏకంగా 90 శాతం రాయితీతో వీటిని ప్రోత్సహిస్తున్నారు. ఉపాధిహామీ పనుల్లో భాగంగా వీటిని నిర్మిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి మొదటి విడతగా 2,242 షెడ్లను నిర్మించనున్నారు. మూగజీవాల కోసం నిర్మిస్తున్న ఈ షెడ్లతో రైతులకు ప్రయోజనాలు చేకూరనున్నాయి.

వైకాపా హయాంలో గోకులాల నిర్మాణాలు జరగక, కొన్నిచోట్ల పూర్తయినా బిల్లులు అందక లబ్ధిదారులు ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పాడి పరిశ్రమకు మరింత చేయూత ఇచ్చేందుకు గోకులం షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఉపాధి హామీ పథకం నుంచి రూ.2లక్షల వరకు అందిస్తున్నారు. పశుపోషకులు యూనిట్ విలువలో 10 శాతం, కోళ్లు, గొర్రెలు, మేకల పెంపకందార్లు 30 శాతం లబ్ధిదారుని వాటా భరించాల్సి ఉంటుంది. ఈ ఆర్థిక సంవత్సరం జిల్లాలోని 700 పంచాయతీల్లో మంజూరైన 1,047 వివిధ స్థాయిల్లో నిర్మాణంలో ఉండగా 429 పూర్తయ్యాయి.

గోకులాలతో ఉపశమనం

పల్లెల్లో ఎక్కడపడితే అక్కడ సేదతీరే పశువులు, గొర్రెలు, మేకలకు ఈ గోకులాలతో ఉపశమనం కలగనుంది. డ్వామా అధికారులు తరచూ సమీక్షలు నిర్వహిస్తూ త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశిస్తున్నారు. వర్షాకాలం, వేసవి కాలం మూగజీవాలు శుభ్రత వాతావరణంలో సేద తీరడంతో పాటు చోరీకి గురికాకుండా నివారించవచ్చని పశుపోషకులు పేర్కొంటున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నామని డ్వామా పీడీ రవి కుమార్ తెలిపారు.

మీ స్మార్ట్‌కార్డు తీసుకోకపోతే వెనక్కే..!

తిరుపతి(రెవెన్యూ), న్యూస్‌టుడే: చౌకదుకాణాల ద్వారా నిత్యావసరాల పంపిణీ పారదర్శకంగా జరగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అధునాతన సాంకేతికతతో స్మార్ట్ రేషన్ కార్డులను రూపొందించింది. జిల్లాకు సంబంధించి 5.80 లక్షల కార్డులు ఆగస్టులో చేరుకున్నాయి. వాటిలో 60 వేల కార్డులు పంపిణీకి నోచుకోక సచివాలయాల్లో ఉన్నాయి. వాటిని నెలాఖరులోపు తీసుకోకపోతే వెనక్కి పంపిస్తామని డీఎస్వో శేషాచలం రాజు తెలిపారు.

దయచేసి వినండి.. ప్లాట్‌ఫాం ఖాళీ అయ్యేవరకు ఆగండి

రైళ్ల రద్దీతో రేణిగుంటకు ముందే ఆపేస్తున్న వైనం

రేణిగుంట, న్యూస్‌టడే: తిరుమల శ్రీవారి దర్శనార్థం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి నిత్యం వేలాదిమంది ప్రయాణికులు వస్తుంటారు. తిరుపతి, రేణిగుంట సమీపానికి రైలు రాగానే దేవదేవుడి సన్నిధికి చేరవవుతున్నామనే ఆతృత చాలా మందిలో ఉంటుంది. కానీ రైల్వే అధికారులు ప్రయాణికుల ఆతృతపై నీళ్లు చల్లుతూ నిరీక్షణ పరీక్ష పెడుతున్నారు. రైళ్లను ఔటర్‌లో లేదా ఏర్పేడు, మామండూరు స్టేషన్ల వద్ద గంటల కొద్ది నిలిపివేస్తున్నారు.

కడప మార్గంలో నిలిచి ఉన్న ఎక్స్‌ప్రెస్ రైలు

నిత్యం రాకపోకలు సాగించే రైళ్లు: 110
పట్టాలు: 13
ప్లాట్‌ఫాంలు: 05

ఇదీ సమస్య...

రేణిగుంట రైల్వే జంక్షన్ కావడంతో ముంబయి, చెన్నై, విజయవాడ, గుంతకల్లు, హైదరాబాద్ తదితర నగరాలకు ఈ మార్గమే ప్రధానమైంది. దిల్లీ, ముంబయి నగరాల నుంచి వారంతపు స్పెషల్స్ వస్తుంటాయి. రద్దీకి తగినన్ని ప్లాట్‌ఫామ్‌లు లేకపోవడంతో స్టేషన్‌కు సమీపంలో నిలిపివేస్తున్నారు.

ప్రయాణికుల ఇబ్బందులు...

రైళ్లు స్టేషన్‌కి సమీపంలోనే ఆపేస్తుండటంతో కనీసం తాగునీరు, ఆహారం సదుపాయం లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ అంశంపై రైల్వే అధికారులను వివరణ కోరగా తిరుపతి స్టేషన్ పనులు పూర్తయిన తరువాత ఇక్కడ పనులు చేసే అవకాశం ఉందని తెలిపారు.

ఇలా చేస్తే బాగు..

● ఒకటో ప్లాట్‌ఫాం నుంచి గూడురుకు వెళ్లే మార్గం లేదు. దీనిని కలుపుతూ సుమారు 12 ఏళ్ల క్రితం రేణిగుంట నుంచి గూడురుకు ఈ మార్గంలో పంపాలని రూ.కోట్లు ఖర్చు చేసి వంతెన నిర్మించారు. దానిపై పట్టాలు ఏర్పాటు చేసి అన్ని ప్లాట్‌ఫామ్‌లకు వచ్చే ట్రాక్‌లను అనుసంధానం చేస్తే రద్దీ తగ్గి ఔటర్‌లో నిలిచే సమస్య తగ్గుతుంది. ● 4వ నంబర్ ప్లాట్‌ఫామ్ పొడిగించాలని గత కొన్నేళ్లుగా ప్రతిపాదన ఉంది. ఈ పనులు పూర్తయితే సమస్య సగం తగ్గుతుంది. ● కనీసం మరో రెండు ప్లాట్‌ఫారాలు నిర్మిస్తే ఈ సమస్యను పూర్తిగా అదుపు చేసే అవకాశం ఉంది.

104FM Tirupati
ఈ FM 104 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా-నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

హెచ్‌ఎం అకౌంట్ టెస్టుకు దరఖాస్తులు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: పురపాలక, ఎయిడెడ్ పాఠశాలల్లో వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు హెచ్‌ఎం అకౌంట్ టెస్టుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని డీఈవో వరలక్ష్మి గురువారం ప్రకటనలో తెలిపారు. www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో అపరాధ రుసుం లేకుండా ఈనెల 24 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ప్రతులను ఈనెల 25వ తేదీ లోగా అందజేయాలన్నారు. తర్వాత అపరాధ రుసుం రూ.60తో ఈనెల 30వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు గడువు ఉందని ఆమె పేర్కొన్నారు.

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం శ్రీవారిని 67,121 మంది దర్శించుకున్నారు. రూ.4.75 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

క్లిక్ చేస్తే.. పోయిన ఫోను తిరిగొస్తుంది!

ప్రస్తుతం మనిషికి సంబంధించిన సమస్తం చరవాణిలోనే ఉంటుంది. అలాంటి చరవాణి పోతే.. ఎవరైనా దొంగతనం చేస్తే.. అధైర్య పడాల్సిన పనేలేదు. ఒక్కసారి సీఈఐఆర్ యాప్‌లో వివరాలు నమోదు చేస్తే.. మీ ఇంటికే ఫోను అందజేస్తాం అంటున్నారు పోలీసులు. ఇలాంటి అనేక కేసులు ఛేదించి బాధితులకు న్యాయం చేశారు. ఇలా చిత్తూరు జిల్లా పోలీసులు ఇప్పటివరకు 4,106 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

హాయ్ అంటే చాలు..

● పోలీసు వాట్సాప్ నంబరు **94409 00004**కు హాయ్ లేక హెల్ప్ అని మెసేజ్ చేయాలి. ● వారు చాట్‌బాట్ లింక్ పంపిస్తారు. ● క్లిక్ చేసి చరవాణి, యజమాని వివరాలు నమోదు చేస్తే ఫిర్యాదు వెళ్తుంది. ● పోలీసులు దర్యాప్తు చేపట్టి ఫోన్‌ను స్వాధీనం చేసుకుంటారని చిత్తూరు క్రైం సీఐ మహేశ్వర్ తెలిపారు.

ఇలా చేయండి..

■ సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్ ద్వారా చరవాణిని సులభంగా పొందొచ్చు. ■ చోరీకి గురైన సిమ్ డూప్లికేట్ తీసుకొని ఎస్ఎంఎస్ వచ్చేలా యాక్టివేట్ చేయాలి. ■ పోలీసు ఫిర్యాదు నంబరు, బిల్ స్కాన్, గుర్తింపు కార్డులు ఉంచుకొని ఆన్‌లైన్ ద్వారా నమోదు చేయాలి. ■ గూగుల్‌లో సీఈఐఆర్ పోర్టల్‌లో బ్లాక్ స్టోలెన్/లాస్ట్ మొబైల్ కాలమ్‌పై క్లిక్ చేయాలి. ■ తర్వాత చరవాణి, యజమాని వివరాలు నమోదు చేస్తే ఫోను ఎవరు వాడుతున్నారో పోర్టల్‌కు వివరాలు వస్తాయి. సదరు వ్యక్తికి సంక్షిప్త సమాచారం వస్తుంది. ఇలా కేసులు ఛేదిస్తున్నారు.

- న్యూస్‌టుడే, చిత్తూరు నేరవార్తలు

ఉపాధి పనుల్లో నిమగ్నమైన కూలీలు

ఉపాధి.. కూలీలకు హామీ

పుంగనూరు, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో భాగంగా పనుల గుర్తింపు సాగుతోంది. అక్టోబరు 3 నుంచి గ్రామాల్లో సభలు నిర్వహించి కూలీలకు, రైతులకు ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులను వివరిస్తూ అధికారులు పనులను గుర్తిస్తున్నారు. సర్పంచితో పాటు ఉపాధిహామీ సాంకేతిక, క్షేత్ర సహాయకులు పనుల గుర్తింపులో భాగస్వాములవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 31 మండలాల్లో 700 గ్రామసభలు ఇప్పటికే పూర్తిచేశారు. ఓ వైపు అవగాహన మరోవైపు పనుల పరిశీలన సాగుతోంది. గుర్తించిన పనులను పంచాయతీ, మండల పరిషత్ ఆమోదం పొందిన తర్వాత జిల్లా పరిషత్‌కు పంపనున్నారు.

జిల్లా వివరాలిలా..
- జాబ్‌కార్డులు: 2.39 లక్షలు
- నమోదైన కూలీలు: 4.06 లక్షల మంది
- పనికి వస్తున్నవారు: 1.95 లక్షల మంది
- వందరోజులు పూర్తయిన కుటుంబాలు: 1,925

డిసెంబరులో ఆమోదముద్ర

ఉపాధి పథకం పనులు వేసవిలో చేయడానికి క్షేత్రస్థాయిలో గుర్తిస్తున్న పనులకు డిసెంబరులో జడ్పీ ఆమోదముద్ర పడనుంది. కాలువలు, చెరువుల్లో పూడికతీత, కందకాలు, ఇంకుడు గుంతల తవ్వకాలు, పండ్ల తోటల పెంపకం వంటి 23 రకాల పనులకు అవకాశం కల్పించారు. కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు రైతుల పొలాల్లో పండ్ల తోటలు పెంచనున్నారు.

కిలోకు అరకిలో..!
కూరగాయల ధరలకు రెక్కలు

పుంగనూరులోని కూరగాయల దుకాణం

పుంగనూరు, న్యూస్‌టుడే: కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. అమాంతంగా ధరలు పెరగడం సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు భారంగా మారింది. దీంతో సామాన్యుడు సంతకు వెళ్లేందుకు సుముఖత చూపడం లేదు. కిలో కొనాల్సిన వినియోగదారులు అర కిలోతో సరిపెట్టుకుంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు, ప్రస్తుత అల్పపీడన ప్రభావంతో పంటలు దెబ్బతిని దిగుబడులు గణనీయంగా తగ్గినట్లు రైతులు పేర్కొంటున్నారు. వరుస వర్షాలతో టమాటా, మిరప, బెండ, చిక్కుడు, బీన్స్, ముల్లంగి, మునగ తదితర పంటలు దెబ్బతిన్నాయి. స్థానిక దిగుబడులు చాలకపోవడంతో పొరుగు జిల్లాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. పలు రకాల డిమాండ్ పెరిగి కిలోకు రూ.6-7 వరకు ధర పెరిగింది.

15 రోజుల కిందట పుంగనూరు మార్కెట్‌లో ధరలు ఇలా.. (కిలో రూ.లలో)

కూరగాయలు	గతం	ప్రస్తుతం
వంకాయ	90	120
బీర	40	60
క్యాప్సికం	30	50
పచ్చిమిరప	40	60
కందికాయలు	100	120
క్యారెట్	70	80

అదుపు చేయాలి

కూరగాయల ధరలను అదుపు చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. రైతుల నుంచి కొనుగోలు చేసే ధరలకు వ్యాపారులు విక్రయించే ధరలకు వ్యత్యాసం ఉంది. ఇలాంటి వాటిని నివారిస్తే రైతులకు, వినియోగదారులకు ఊరట కలుగుతుంది. - సజ్జాద్, స్థానికుడు

నాణ్యత ఉండటం లేదు

15 రోజుల కిందట సంతకు రూ.500 తీసుకెళ్తే వారానికి సరిపడా వచ్చేవి. ఇప్పుడు అవే కూరగాయలకు రూ.700-800 వెచ్చించాల్సి వస్తోంది. పైగా నాణ్యత ఉండటం లేదు. - రమాదేవి గృహిణి

మాట్లాడుతున్న కేఎల్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు

నైపుణ్యాల ద్వారానే అత్యున్నత ఉద్యోగాలు

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: ఇంజినీరింగ్, డిగ్రీ వంటి కోర్సులతో అత్యున్నత స్థాయిలోకి రావాలంటే విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలు అత్యవసరమని కేఎల్ యూనివర్సిటీ డైరెక్టర్ డా. జె.శ్రీనివాసరావు తెలిపారు. చిత్తూరులోని వివేకానంద జూనియర్ కళాశాల, పీసీఎస్ వివేకానంద జూనియర్ కళాశాలల్లో గురువారం వర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'దశ-దిశ' కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన సమకాలీన విద్యావిధానాలపై విశ్లేషించారు. జీవితంలో ఉన్నతమైన అత్యంత విలువైనది.. నాలుగేళ్ల విద్యా ప్రయాణంలో నేర్చుకోవడానికి ఎన్నో అంశాలు ఉంటాయన్నారు. ఆధునిక విద్యారంగంలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. ఫేస్‌మెంట్ ఉపగ్రహ, శాటిలైట్ ప్రయోగాలతో జాతీయస్థాయిలో తమ విద్యార్థులు గుర్తింపు తెచ్చారన్నారు. శ్రీవివేకానంద జూనియర్ కళాశాల అధ్యక్షురాలు, డైరెక్టర్ భాస్కరనాయుడు, అకడమిక్ డైరెక్టర్ మహేంద్రకుమార్, డీసీస్ సాయినాథ్, పీసీఎస్ శ్రీ వివేకానంద జూనియర్ కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణ, ప్రిన్సిపల్ నాగరాజ చెట్టి, వైస్ ప్రిన్సిపల్ హేమలత, కేఎల్ యూనివర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రఘు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు, పతకాలు అందజేశారు.

వినతులు స్వీకరించి.. పరిష్కారానికి హామీ ఇచ్చి

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ ట్రస్ట్ ట్రస్టీ నారా భువనేశ్వరి కుప్పం పర్యటనలో భాగంగా రెండో రోజు గురువారం ఉదయం శాంతిపురం మండలం శివపురంలోని సొంతింట్లో గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తర్వాత డీకేపల్లె చెరువులో జలహారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వస్థ సర్వేక్షణ అవార్డు పొందిన పబ్లిక్ స్కూల్ విద్యార్థులను ఆమె అభినందించారు. ఫౌండేషన్ విరాళంగా అందించిన వాహనాన్ని పరిశీలించారు. కడా, చాయ్ రాస్తా ఆధ్వర్యంలో స్వయం సహాయ సంఘాల ద్వారా ఏర్పాటు చేయనున్న చాయ్ రాస్తా లోగో ఆవిష్కరించారు.

విలువల బడి ప్రారంభం: పురపాలిక పరిధిలోని పరమసముద్రంలో ప్రాథమికోన్నత పాఠశాలలో సమాజ క్రాంతి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విలువల బడి కార్యక్రమాన్ని నారా భువనేశ్వరి ప్రారంభించారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నారని... ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరి, నో అడ్మిషన్ బోర్డులు పెట్టడం సంతోషంగా ఉందన్నారు. పరమసముద్రంలోని కేజీబీవీని సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. అనంతరం వారితో కలసి భోజనం చేశారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడా పీడీ వికాస్ మర్మత్, పీకేఎం ఉడా ఛైర్మన్ డా.సురేష్‌బాబు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్ కుమార్ పాల్గొన్నారు.

పరమసముద్రంలోని కేజీబీవీ విద్యార్థినులతో సహపంక్తి భోజనం

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్, ముస్లిం మైనార్టీ నాయకులు

మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

పుత్తూరు, న్యూస్‌టుడే: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. గేటుపుత్తూరు ఆనంబట్టు రోడ్డులోని ఖాదర్‌వల్లీ దర్గాలో డిసెంబరు 5వ తేదీ నుంచి 7 వరకు నిర్వహించే గంధ మహోత్సవానికి సంబంధించి గోడపత్రికలు ఆవిష్కరించారు. ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తున్నానని చెప్పారు. ఐక్యంగా ఉండి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఆయన వెంట ముస్లిం, మైనార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

కాణిపాకంలో హోంస్టేలపై అవగాహన

కాణిపాకం: ఏపీ పర్యాటకశాఖ ఆధ్వర్యంలో కాణిపాకంలో హోంస్టేలపై అవగాహన కల్పిస్తూ జిల్లా పర్యాటకశాఖ అధికారి నరేంద్రకుమార్, ఆలయ ఈవో పెంచల కిశోర్ కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఇంట్లో ఖాళీ గదులను పర్యాటకులకు, యాత్రికులకు వసతిగృహంలో బస చేయడానికి అద్దెకు ఇచ్చి మన సంస్కృతీ సంప్రదాయాలను, భోజన రుచులను వారికి తెలియజేస్తామన్నారు. ఆ ఇంటి యజమానికి అద్దె రూపంలో నగదు అందిస్తారన్నారు. పర్యాటకశాఖ కార్యాలయ అధికారిణి గౌరి పాల్గొన్నారు.

విద్యుత్తు శాఖకు ఇద్దరు నోడల్ అధికారులు

చిత్తూరు(మిట్టూరు): జిల్లా విద్యుత్తు శాఖకు ఇద్దరు నోడల్ అధికారులను నియమించారు. ఆ శాఖ రెవెన్యూ విభాగ సీజీఎం ఎం.మురళీకుమార్, అసెస్‌మెంట్ ఎస్ఈ ఎం.కృష్ణారెడ్డిని నియమిస్తూ ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు.

గ్రంథాలయాల్లో మెరుగైన సేవలు

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: గ్రంథాలయాల ద్వారా ప్రభుత్వం పాఠకులకు మెరుగైన సేవలు అందిస్తోందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని గురువారం చిత్తూరులోని విజయం డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్త విషయాలు తెలుసుకోవాలనే కుతూహలం ఉన్న విద్యార్థులకు గ్రంథాలయాలు చక్కని వేదికగా నిలుస్తుందన్నారు. వారోత్సవాల సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పతకాలు, నిఘంటువులు, ధ్రువపత్రాలు అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శర్మ, ఉప గ్రంథాలయాధికారి గజేంద్రబాబు, విశ్రాంత అధికారిణి లలిత, తెదేపా నాయకులు బాలాజీ, ఎస్సై నాగ సౌజన్య, లయన్స్ క్లబ్ సభ్యులు శ్రీనివాసమూర్తి, మల్లిఆచారి, మునస్వామి పాల్గొన్నారు.

విజేతలతో ఎమ్మెల్యే జగన్మోహన్ తదితరులు

షెల్టర్ లేదు.. బస్సు ఆగదు

రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పిస్తున్నా అది అందక కొందరు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని క్రిష్ణజిమ్మాపురం పంచాయతీ కొల్లురెడ్డి కండ్రిగ(కేఆర్ కండ్రిగ)లో విద్యార్థులు, మహిళలు ఈ ఉచిత ప్రయాణానికి దూరమవుతున్నారు. గ్రామం నుంచి 20 మంది విద్యార్థులు నిత్యం బలిజకండ్రిగ జడ్పీ ఉన్నత పాఠశాల, పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లి చదువుకుంటున్నారు. ఇక్కడ బస్ షెల్టర్ లేక రోడ్డు పక్కనున్న కల్వర్టు గోడలపై ఎండుతూ, వానకు తడుస్తూ బస్సుల కోసం వేచిఉంటున్నారు. కనీసం గ్రామాన్ని తెలిపే సూచిక బోర్డు లేదు. అధికారులు స్పందించి బోర్డు, బస్‌షెల్టర్ ఏర్పాటుసహా బస్సులు ఇక్కడ నిలిపేలా చర్యలు తీసుకోవాలి. **-న్యూస్‌టుడే, పాలసముద్రం**

26లోగా చెల్లించాలి

చిత్తూరు విద్య: జనవరి 2026లో జరగనున్న ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ పరీక్షకు జిల్లాలో పని చేస్తున్న ఇన్ సర్వీస్ ఎస్జీటీ, గ్రేడ్-2 పండిట్, పీఈటీలు, క్రాఫ్ట్, డ్రాయింగ్, టైలరింగ్ ప్రత్యేక ఉపాధ్యాయులు ఈ నెల 26లోగా పరీక్ష రుసుం చెల్లించాలని, దరఖాస్తు పత్రాలు 27లోగా డీఈవో కార్యాలయంలో సమర్పించాలని డీఈవో వరలక్ష్మి పేర్కొన్నారు. అపరాధ రుసుంతో డిసెంబరు 3 లోగా రుసుం చెల్లించాలని, 4లోగా డీఈవో కార్యాలయంలో దరఖాస్తు పత్రాలు సమర్పించాలన్నారు.

ఇంకా జగన్ చిత్రాలే..!

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదిన్నర గడిచినా నేటికీ పలు ప్రభుత్వ కార్యాలయాల్లో మాజీ సీఎం జగన్ ఫొటోతో ఉన్న బోర్డులు ఉండటం గమనార్హం. ఇదెక్కడి చోద్యమని తెదేపా నాయకులు ప్రశ్నిస్తున్నారు. గురువారం మండల బొమ్మసముద్రం పీహెచ్‌సీలో జగన్ ఫొటోతో ఉన్న ఆరోగ్యశ్రీ బోర్డును జడ్పీటీసీ మాజీ సభ్యుడు బాలాజీ, మాజీ ఎంపీపీ నాగరాజయాదవ్ గుర్తించారు. వెంటనే ఆ బోర్డు తొలగించాలని అక్కడి ఆరోగ్యాధికారులకు సూచించారు. **-న్యూస్‌టుడే, గుడిపాల**

ఒకే డివిజన్..
కూటమి విజన్
తీరనున్న నగరి ప్రజల కష్టాలు

పుత్తూరు, న్యూస్‌టుడే: ప్రజలకు సులభతర సేవలు అందించేందుకు ఒక నియోజకవర్గానికి ఒక రెవెన్యూ డివిజన్ నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం నగరికి వరం కానుంది. ఈ నియోజకవర్గంలోని మూడు మండలాలు నగరిలో, మరో రెండు తిరుపతి రెవెన్యూ డివిజన్‌లో ఉన్నాయి. నూతన విధానంతో అన్ని మండలాలు ఒకే డివిజన్‌లోకి రానున్నాయి.

❖ గత ప్రభుత్వం నియోజకవర్గంలోని మండలాలను అస్తవ్యస్తంగా విభజించింది. పుత్తూరు, వడమాలపేట మండలాలను తిరుపతి జిల్లాలో.. నగరి, నింద్ర, విజయపురం మండలాలను చిత్తూరులో కలిపారు. ఈ నేపథ్యంలో నగరి రెవెన్యూ డివిజన్‌లో నగరి, విజయపురం, నింద్ర, కార్వేటినగరం, వెదురుకుప్పం, ఎస్.ఆర్.పురం, పాలసముద్రం మండలాలు ఉన్నాయి. పుత్తూరు, వడమాలపేట మండలాలు తిరుపతి డివిజన్‌లో చేర్చారు. కార్వేటినగరం, వెదురుకుప్పం, ఎస్ఆర్‌పురం, పాలసముద్రం మండలాల ప్రజలు నగరి రావాలంటే పుత్తూరుకు వచ్చి వెళ్లాలి. దీంతో ప్రజల ఇబ్బందులు వర్ణనాతీతం. కూటమి ప్రభుత్వం దిశానిర్దేశంతో నగరి డివిజన్‌లో నగరి, పుత్తూరు, వడమాలపేట, నింద్ర, విజయపురం మండలాలు ఉంటాయి. గతంలో ఉన్న కార్వేటినగరం, ఎస్ఆర్‌పురం, వెదురుకుప్పం, పాలసముద్రం చిత్తూరు డివిజన్‌లోకి వెళ్లి పాలనాపరమైన సౌలభ్యం ఉంటుంది.

నగరి టవర్ క్లాక్

ఇతర శాఖల సమస్యలు ఇలా..

ప్రస్తుతం నియోజకవర్గంలో ఇద్దరు డీఎస్పీలు, నలుగురు సీఐలు పనిచేస్తున్నారు. వ్యవసాయం, జలవనరుల శాఖలో పుత్తూరు, నగరి డివిజన్లు ఉండటం సమస్యగా మారింది. వీటిని ఒకే డివిజన్ కిందకు తీసుకొస్తే ఇది పరిష్కారమవుతుంది. పుత్తూరు వ్యవసాయ డివిజన్‌లో నగరి, సత్యవేడు, చంద్రగిరి నియోజకవర్గంలోని మండలాలు ఉన్నాయి. దీంతో ఏ సమాచారం కావాలన్నా ఇబ్బందులే. రైతులు అక్కడికి చేరుకోవాలంటే అవస్థే. ఈ నేపథ్యంలో అన్ని శాఖలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా తీసుకొస్తే ప్రజల కష్టాలు తొలగినట్లే.

అండర్-14 వాలీబాల్ జట్ల ఎంపిక

తిరుపతి(గ్రామీణం), న్యూస్‌టుడే: దుర్గసముద్రం ఉన్నత పాఠశాలలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14 ఉమ్మడి చిత్తూరు జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు గురువారం ముగిశాయి. జిల్లా జట్లు ఎంపిక చేశారు. **బాలుర జట్టు:** లతీష్‌కుమార్ (జడ్పీ దుర్గసముద్రం), విమల్ (బీఎన్‌కండ్రిగ), చరణ్ (రాచపల్లి), యశ్వంత్ (నింద్ర), నరసింహ (నేలపల్లి), వరుణ్ (నెల్లేపల్లి), డిల్లీ (కుప్పంబాదూరు), బ్లెస్సింగ్ (కార్వేటినగరం), రాజు (రెడ్డివారిపల్లి), దినేష్ (గోవర్ధనపురం), రాంప్రసాద్ (శంకరాయపేట), గగన్‌కృష్ణ (తిరుపతి). **బాలికల జట్టు:** ఈశా(మాసిమాకులపల్లి), వెన్నెల(కొత్తకోట), భోజశ్రీ(తిరుపతి), నిషారాణి(దుర్గసముద్రం), తులసి(నెలవాయి), హేమశ్రీ(గుడిపల్లి), హవిష(తిరుపతి), చాందిని (అరణ్యం కండ్రిగ), తనూష (కాటపేరి), మోహన (మహదేవ మంగళం), కల్పన (అరికెల), బీనా(కేఎంపురం).

తగ్గుతున్న అర్హులు..
కొత్తవారికి లేదు చోటు
8,550 మందికి పీఎం కిసాన్‌కు దూరం

చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే : పెట్టుబడి సాయంగా కేంద్ర ప్రభుత్వం ఏటా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పేరుతో రూ.6 వేల చొప్పున కర్షకులకు ఆర్థిక సాయం అందజేస్తోంది.. జిల్లాలో బుధవారం 21వ విడత 1.67 లక్షల మంది రైతుల ఖాతాలో రూ.33.58 కోట్లు జమచేయగా ఈ ఏడాది ఆగస్టు 2న 1,76,450 మంది రైతులకు (20వ విడత) రూ.35.29 కోట్లు జమచేశారు.. గతంతో పోల్చితే 8,550 మంది రైతుల సంఖ్య తగ్గింది. ఇలా ఏటా తగ్గుతూ వస్తోంది.. మరోవైపు కొత్తగా నమోదు చేసుకున్న పలువురు లబ్ధిదారులకు సాయం అందడం లేదు.

వేలమందికి నిరాశ..

పథకాన్ని కేంద్రం 2019లో ప్రారంభించింది. అప్పట్లో సాగు భూములు ఉన్న రైతులు అందరూ పేర్లు నమోదు చేసుకున్నారు. ఈకేవైసీ చేయించుకోకపోవడం, మృతులు, ఆదాయపు పన్ను చెల్లించే వారు, బియ్యం కార్డులు లేని వారు, వెబ్‌ల్యాండ్ సమస్యలు తదితర కారణాలతో వేలసంఖ్యలో రైతులు పథకానికి దూరమయ్యారు. 2019 ఫిబ్రవరి ఒకటో తేదీకి ముందు పట్టాదారు పాసుపుస్తకం కలిగి ఆన్‌లైన్ వెబ్‌ల్యాండ్, అడంగల్‌లో పేర్లు ఉన్న రైతులకే పథకం వర్తింపజేశారు. అప్పట్లో రెవెన్యూ సమస్యలతో పుస్తకాలు లేక.. కొత్తగా పుస్తకాలు పొందినప్పటికీ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించకపోవడంతో పెద్దసంఖ్యలో కర్షకులకు సాయం అందలేదు. నేటికీ అర్హులైన రైతులకు పీఎం కిసాన్ సాయం దక్కలేదు. కొందరికి కొన్ని విడతలు జమైనా ప్రస్తుతం జమకావడం లేదు. ఇందుకు కారణమేంటని అధికారులను అడిగితే సాంకేతిక సమస్యలని చెప్పి దాటవేస్తున్నారు. అకారణంగా నిలిచిపోయిన వారికి, కొత్తగా నమోదైన వారికి పథకాన్ని వర్తింపజేయాలని రైతులు కోరుతున్నారు.

ఉద్యోగులకు ట్రోఫీలు అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

డిసెంబర్ 20, 21న రెవెన్యూ ఉద్యోగుల క్రీడలు

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: విధి నిర్వహణ ఒత్తిడిలో ఉండే ఉద్యోగులకు క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఉపశమనం దక్కుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. అనంతపురంలో ఇటీవల జరిగిన 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ ఉద్యోగుల క్రీడాపోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించి నాలుగు క్రీడాంశాల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించిన ఉద్యోగులను కలెక్టర్ అభినందించారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఉద్యోగులకు ట్రోఫీలు ప్రదానం చేశారు. డిసెంబర్ 20, 21న జిల్లాస్థాయిలో రెవెన్యూ ఉద్యోగుల క్రీడాపోటీలు నిర్వహించేలా షెడ్యూల్ సిద్ధం చేయాలని ఆదేశించారు. శిక్షణ కలెక్టర్ నరేంద్ర పాడల్, డీఆర్‌వో మోహన్‌కుమార్, ఏవో వాసుదేవన్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మానస

మానసను అభినందిస్తున్న హెచ్ఎం కరుణా నవనీతం

వడమాలపేట, న్యూస్‌టుడే: ఇటీవల బీఎన్‌కండ్రిగ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-14 బాలబాలికల ఎంపిక కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వడమాలపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన మానస(9వ తరగతి) రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం కరుణా నవనీతం, పీడీ చంద్రశేఖర్‌రాజు గురువారం తెలిపారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో స్కూల్‌గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నదని వారు పేర్కొన్నారు. మానసను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

APSRTC
టెండరు ప్రకటన
చిత్తూరు జిల్లా పరిధిలోని వివిధ డిపోలకు సంబంధించిన బస్‌స్టేషన్‌లలో స్టాల్స్/షాపులు మొదలగు వ్యాపారములు చేసుకొనుటకు, OPRS, PWM ... టెండరుదారుల సమక్షములో టెండర్లు తెరవబడును. (3) పూర్తి వివరములకు మా వెబ్‌సైట్ :https://www.apsrtc.ap.gov.in ...

టెట్ నుంచి మినహాయింపునకు ప్రభుత్వ కృషి

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు ఇన్‌సర్వీస్ టెట్ నుంచి మినహాయింపునకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్‌టీఏ) రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రెడ్డిరమేష్ అన్నారు. పూతలపట్టు ఎంపీపీ పాఠశాలలో గురువారం ఎన్‌టీఏ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్‌నాయుడు, బాబురెడ్డి, దేవిక, లక్ష్మీపతినాయుడు, బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్లస్‌టూ పాఠశాలల్లో ఖాళీలు భర్తీచేయాలి

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: ప్లస్ టూ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజుకు.. పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్ విన్నవించారు. గురువారం అమరావతిలో ఆయన్ను కలిసి ఉపాధ్యాయుల సమస్యలపై 10 అంశాలను ప్రస్తావించారు. ఎస్ఎస్‌సీ వంద రోజుల ప్రణాళిక, ఎల్‌పీలకు ఉద్యోగోన్నతి, ఎస్సీ/ఎస్టీ ఉపాధ్యాయుల ఉన్నత చదువు దరఖాస్తులకు అనుమతి ఇతర అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

వాణిజ్య పన్నులశాఖ జేసీపై విచారణ ప్రారంభం

చిత్తూర (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: కింది స్థాయి ఉద్యోగులపై అనుచితంగా ప్రవర్తిస్తున్నారన్న వాణిజ్య పన్నులశాఖ సంయుక్త కమిషనర్ రవీంద్రనాథ్‌రెడ్డిపై విచారణ ప్రారంభమైంది. కట్టమంచిలోని ఆ శాఖ జిల్లా ప్రధాన కార్యాలయంలో రీజనల్ జీఎస్టీ ఆడిట్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం(విజయవాడ) నుంచి వచ్చిన స్టేట్ ట్యాక్స్ అదనపు కమిషనర్ బాలాజీబాబు గురువారం ఉదయం 10 నుంచి రాత్రి ఏడు గంటల వరకు విచారణ నిర్వహించారు. బాధితులతో పాటు కార్యాలయంలోని ఉద్యోగులను విచారించారు. నేడు శుక్రవారం తిరుపతిలోని వాణిజ్య పన్నులశాఖ కార్యాలయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న జేసీ రవీంద్రనాథ్ రెడ్డితో పాటు ఉద్యోగులను విచారించనున్నారు.

తెదేపా వార్డు కమిటీ ఎన్నికల్లో ఘర్షణ

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పుంగనూరు మున్సిపాలిటీలో తెదేపా వార్డు కమిటీ ఎన్నికల్లో ఆ పార్టీ నాయకులు ఘర్షణ పడి దాడి చేసుకున్న ఘటన స్థానిక నక్కబండ 15వ వార్డులో గురువారం చోటు చేసుకుంది. వివరాల మేరకు.. వార్డు కమిటీ ఎన్నికలు బుధవారం నుంచి ప్రారంభం కాగా.. పరిశీలకులుగా తిరుపతి గంగమ్మ గుడి ఛైర్మన్ మహేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. మొదటి రోజు ఎనిమిది వార్డులకు పూర్తిస్థాయిలో ఎన్నికలు నిర్వహించారు. రెండో రోజు గురువారం 15వ వార్డు కమిటీ ఎన్నికలకు నాయకులతో కలిసి నక్కబండకు వెళ్లగా... కమిటీలో మధుసూదన్ రాయల్ వర్గానికి చెందిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలని కార్యకర్తలు కోరగా.. మరో వర్గానికి ప్రాధాన్యం ఇవ్వడంతో ఘర్షణకు దారి తీసింది. ఘర్షణలో ఇరువర్గాలు దాడులు చేసుకున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గుంపులను చెదరగొట్టేందుకు స్వల్ప లాఠీఛార్జి చేశారు. ఘర్షణ పడిన తెదేపా నాయకులు దినేష్, మధుసూదన్ రాయల్‌ను సీఐ సుబ్బరాయుడు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. డీఎస్పీ ప్రభాకర్ మాట్లాడుతూ.. ఘర్షణకు కారకులైన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని.. దీనిపై ఎలాంటి ఫిర్యాదులు అందలేదన్నారు.

ఘర్షణ పడుతున్న నాయకులు, కార్యకర్తలు

పాడిరైతు ఆత్మహత్యాయత్నంలో ముగ్గురిపై కేసు

గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే: ముక్కళత్తూరు పంచాయతీ నాశంపల్లెకు చెందిన పాడిరైతు నరసింహులుశెట్టి ఆత్మహత్యాయత్నం వ్యవహారంలో గజేంద్ర, పాత్రికేయులైన చిన్న, మునస్వామిపై కేసు నమోదు చేశామని సీఐ శ్రీనివాసంతి గురువారం తెలిపారు. బాధితుడైన నరసింహులుశెట్టిని అప్పు చెల్లించలేదని ఆతడి పాడిఆవులను గజేంద్ర కుటుంబీకులు పట్టుకుపోవడంతో పాటు పోలీస్‌స్టేషన్ సమీపంలో అతడిని గజేంద్ర.. తన స్నేహితులైన చిన్న, మునస్వామితో కలిసి అవమానకరంగా మాట్లాడటంతో ఆయన విషం తాగారని పేర్కొన్నారు. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఆమె వివరించారు. చిత్తూరు ప్రభుత్వ సుపత్రిలో చికిత్సపొందుతున్న బాధితుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య

కుప్పం, న్యూస్‌టుడే: స్థానికంగా ఉన్న ఓ నర్సింగ్ కళాశాలకు చెందిన పల్లవి(18) అనే విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం చోటు చేసుకొంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు... కుప్పం మండలం బేవనపల్లెకు చెందిన పల్లవి శాంతిపురం మండలం వెంకటేపల్లెలోని అమ్మమ్మ ఇంట్లో ఉంటూ.. బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఏమైందో ఏమో..? గురువారం కళాశాల భవనం నాలుగో అంతస్తు పైనుంచి దూకింది. తీవ్రంగా గాయపడటంతో విద్యార్థినిని కళాశాల సిబ్బంది స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. విద్యార్థిని ఆత్మహత్యకు కారణాలు దర్యాప్తులో తేలాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు.

EENADU e Classifieds

REAL ESTATE
PLOT FOR SALE
GENERAL

క్యాష్ బ్యాక్ వెంచర్ 25 అం||ల ప్లాట్. స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికి బంపర్ ఆఫర్ (కొన్ని ప్లాట్లు మాత్రమే కలవు). Ph: 80086 15946

TO LET

తిరుపతి- జైనగర్‌లో బ్లిస్ హోటల్ వెనుక 60 అంకణముల 36x60 వేణి విశ్వవిహార్ బిల్డింగ్ గ్రౌండ్ ఫ్లోర్ రెండు 2 BHK బెడ్ రూమ్స్ మిగిలిన 3 ఫ్లోర్‌లో విశాలమైన 23 అటాచ్ బాత్రూమ్స్‌తో రూమ్స్, పార్కింగ్‌తో హోమ్ స్టే, ఉమెన్స్ హాస్టల్‌కు తదితర వాటికి అద్దెకు కలదు. Cont: 99895 68666.

JOBS

SLN MARKETING Pvt. Ltd. Nagari Branch. Require Marketing Managers (6) (M/F) 15,000/- to 20,000/-. Cont: ✆ 95152 02700.

కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ F/M కావలెను. ఇంటర్నేషనల్ మ్యాట్రిమోనియల్ కన్సల్టెన్సీ, తిరుపతి బ్రాంచ్ కొరకు. ✆ 98666 33988.

SLN మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ నందు సూళ్లూరుపేట, నాయుడుపేట బ్రాంచీలలో పనిచేయుటకు మేనేజర్లు, అకౌంటెంట్లు, సిస్టం ఆపరేటర్లు, సైట్ ఇన్‌ఛార్జ్‌లు, డ్రైవర్లు కావలెను. ఆసక్తిగల వారు సంప్రదించండి. Contact: ✆ 70975 25709.

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు... 80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

దాత పెద్ది శ్రీధర్‌కు స్వామివారి చిత్ర పటాన్ని అందజేస్తున్న అధికారులు

కాణిపాకం ఆలయానికి రూ.లక్ష విరాళం

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ నిత్యాన్నదాన ట్రస్టుకి గుంటూరుకు చెందిన పెద్ది శ్రీధర్ రూ.1,00,216 చెక్కును కుటుంబ సమేతంగా ఆలయ అధికారులకు విరాళంగా గురువారం అందజేశారు. దాతకు స్వామివారి దర్శనం చేయించి శేషవస్త్రాలు, స్వామివారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్వోలకు శిక్షణ

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: 2022వ సంవత్సర ఓటర్ల జాబితాను 2025వ సంవత్సర ఓటర్ల జాబితాలోకి మ్యాపింగ్ చేయడంపై బీఎల్వోలకు గురువారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు షబీర్‌బాషా శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యాలయ సిబ్బంది, బీఎల్వోలు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 9866112017
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 9505557466

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం: సమస్య: గజానన్ పోలీస్ కాలనీలో వీధి శునకాల బెడద ఎక్కువగా ఉంది. **-కాలనీవాసులు**

సమాధానం: వీధిశునకాలను బంధించి ఏఆర్‌వీ టీకా వేయిస్తాం. **- లోకేష్, ఆరోగ్యాధికారి, నగరపాలక సంస్థ**

న్యూస్‌టుడే, తవణంపల్లె: సమస్య: పల్లెచెరువు గ్రామంలో వీధి దీపాలు కొన్ని వెలగడం లేదు. **- స్థానికులు**

సమాధానం: పంచాయతీ అధికారులతో మాట్లాడి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో**

న్యూస్‌టుడే, నింద్ర: సమస్య: కచ్చరవేడు ప్రధాన వీధి, ఆఖరి వీధిలోని కాలువల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. శుభ్రం చేయాలి. **- స్థానికులు**

సమాధానం: సర్పంచితో మాట్లాడి పిచ్చిమొక్కలు తొలగింపజేస్తాం. **- రామమూర్తి, పంచాయతీ కార్యదర్శి**

శిబిరంలో పాల్గొన్న కలెక్టర్ సుమిత్‌కుమార్

దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యం

కార్వేటినగరం, న్యూస్‌టుడే: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల సహాయ పరికరాల గుర్తింపు కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. వృద్ధులకు, దివ్యాంగులకు అవసరమైన సహాయ పరికరాలు గుర్తించి త్వరలో పంపిణీ చేయనున్నామన్నారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, సాంఘిక సంక్షేమశాఖ పీడీ విక్రమ్‌కుమార్‌రెడ్డి, ఆర్డీవో అనుపమ, మాల కార్పొరేషన్ డైరెక్టర్ పొన్నా యుగంధర్, ఎంపీడీవో చంద్రమౌళిరెడ్డి, తహసీల్దార్ నాగరాజు, తెదేపా మండల అధ్యక్షుడు చెంగల్రాయులు, కార్యదర్శి రాజా పాల్గొన్నారు.

వీడనున్న ఉమ్మడి హక్కు చిక్కు

- ఎల్పీఎం సమస్యలకు చెక్
- శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్
- చిత్తూరు రెవెన్యూ డివిజన్‌లో ముమ్మరంగా

రెవెన్యూ డివిజన్ పరిధిలో మండలాలు	11
రీసర్వే జరిగిన రెవెన్యూ గ్రామాలు	107
మొత్తం జేఎల్‌పీఎం సమస్యలు	9.874
పూర్తి పరిష్కారమైనవి	578
వెబ్‌ల్యాండ్‌లో మార్పులు చేయాల్సినవి	2,172
చలానా కట్టినవి	1,921
ప్రత్యేక డ్రైవ్ చేపట్టినది	తాజాగా మొదలు

చిత్తూరు గ్రామీణ మండలంలో రీసర్వే నిర్వహిస్తున్న సర్వే అధికారులు

న్యూస్‌టుడే, చిత్తూరు(మిట్టూరు), కలెక్టరేట్

గత వైకాపా ప్రభుత్వం లోపాలమయంగా చేపట్టిన రీసర్వేలో గుర్తించిన సమస్యలకు కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారానికి నాంది పలికింది. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని గత వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీసర్వే రైతులకు సాంకేతిక చిక్కులు తెచ్చిపెట్టింది.. ఉండాల్సిన విస్తీర్ణం కంటే తగ్గిందని.. తమ భూమి సంయుక్త ఎల్పీఎంలో నమోదైందని రైతులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఎల్పీఎం సమస్యతో చిన్న, సన్నకారు రైతులు సైతం సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. చిత్తూరు రెవెన్యూ డివిజన్‌లోనే 3,049 జాయింట్ ఎల్పీఎం సమస్యలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వాటిని పరిష్కరించాలని జనవరిలోనే రెవెన్యూ శాఖను ఆదేశించింది. పరిష్కరించుకోకపోవడంతో ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారు ఎల్పీఎంల సమస్యతో అనర్హుల జాబితాలో చేరారు.. దీంతో జాయింట్ ఎల్పీఎం సమస్య శాశ్వత పరిష్కారానికి జిల్లా రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది.

జాయింట్ ఎల్పీఎం అంటే..!

వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీసర్వే గ్రామాల్లో అయిదారుగురు రైతులకు కలిపి ఒకే సంయుక్త ఎల్పీఎం(ల్యాండ్ పార్సిల్ మ్యాప్) సంఖ్య కేటాయించి భూ హక్కు పత్రాలు అందజేసింది. సర్వే సంఖ్యలోని రైతులకు పదెకరాలకు మించి పొలం ఉన్నట్లు చూపుతోంది. దీంతో బియ్యం కార్డు మంజూరు కావాలన్నా.. పంట రుణాలు, పలు సంక్షేమ పథకాల మంజూరుకు జాయింట్ ఎల్పీఎం సమస్య వెంటాడుతోంది. దీంతో వాటిని పరిష్కరించుకునేందుకు రైతులు పడుతున్న బాధలు అన్నీఇన్నీకావు.

అధిక ప్రాధాన్యం ఇస్తూ..

జాయింట్ ఎల్పీఎంల సమస్యల పరిష్కారానికి చిత్తూరు రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీనివాసులు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రత్యేక డ్రైవ్ ద్వారా ఉమ్మడి హక్కు సమస్యకు చెక్ పెడుతున్నారు. సమస్య పరిష్కారానికి ఎంత మంది ఆసక్తి చూపుతున్నారు..? ముందుకురాని భూ యజమానులు ఎందరు..? దరఖాస్తు చేసుకున్నవారు ఎందరు..? తదితర అంశాలను క్రోడీకరించి పక్కా ప్రణాళికతో సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. దీనిపై ఇప్పటికే ఆయన ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకు సాగుతున్నారు. అందరితో చర్చించి వాటిని అప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు.

శాశ్వతంగా పరిష్కరిస్తాం..

ఎల్పీఎం సమస్యలను శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాం. దరఖాస్తు చేసిన భూ యజమానుల సమస్యలు పరిష్కరిస్తున్నాం. వీఆర్వో ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఒకే సర్వే నంబరులో ఉన్న రైతులు స్వచ్ఛందంగా ముందుకొస్తే ప్రయోజనం ఉంటుంది.

- శ్రీనివాసులు, ఆర్డీవో, చిత్తూరు

భక్తిశ్రద్ధలతో సత్సంగం

చిత్తూరు (సంతపేట), న్యూస్‌టుడే: సత్య సాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం గిరింపేటలోని మందిరంలో భజన, అష్టోత్తరం, సత్సంగ కార్యక్రమాల్ని నిర్వహించారు.

రైతులకు పరికరాలివ్వని కంపెనీలు తొలగిస్తాం

చిత్తూరు (వ్యవసాయం) : బిందు, తుంపర్ల సేద్యం పరికరాలు సకాలంలో అందజేయకపోవడం, పథకం అమలులో అలసత్వం ప్రదర్శించే కంపెనీలను తొలగిస్తామని సూక్ష్మనీటి సాగు పథకం జిల్లా ప్రత్యేక అధికారి రమేష్ పేర్కొన్నారు. స్థానిక ఏపీఎంఐపీ కార్యాలయంలో డ్రిప్ కంపెనీల ప్రతినిధులు, సూక్ష్మసేద్యం ఇంజినీర్లతో గురువారం సమీక్షించారు. ఏపీఎంఐపీ పీడీ రమణ, అధికారులు పాల్గొన్నారు. * మామిడి పంటకు ప్రత్యామ్నాయంగా అధిక ఆదాయాన్ని ఇచ్చే ఇతర ఉద్యాన పంటల సాగు విస్తరణకు రైతులను ప్రోత్సహించాలని ప్రత్యేక అధికారి రమేష్ పేర్కొన్నారు. స్థానిక డీడీ కార్యాలయంలో ఉద్యానశాఖ అధికారులతో సమీక్షించారు.

ఇన్‌ఛార్జి మంత్రికి సత్కారం

వెదురుకుప్పం: మండల తెదేపా అధ్యక్షుడిగా ఎన్నికైన మోహన్‌మురళి.. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని గురువారం రాయచోటిలో మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. మోహన్‌మురళి మాట్లాడుతూ ఎమ్మెల్యే థామస్ సూచనల మేరకు మంత్రిని కలిసి మండల పరిస్థితులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు వివరించానన్నారు.

శబరిమలలో కనీస సౌకర్యాలు కల్పించాలి

చిత్తూరు(సంతపేట) : శబరిమల యాత్రకు వచ్చే అయ్యప్ప స్వామి భక్తులకు కేరళ ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించాలని భాజపా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వరనాయుడు, శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు.

తులసీనాథంనాయుడు, పుష్పను సత్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సేవలకు సత్కారం

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: తెలుగు భాషా సేవ చేస్తున్న తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష, కార్యదర్శులు తులసీనాథంనాయుడు, పుష్పను కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం సత్కరించారు. తెలుగు భాషపై ముద్రించిన రెండు లక్షల పుస్తకాలను ప్రజలకు ఉచితంగా పంచిపెట్టడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు జీవీరమణ, యుగంధర్‌బాబు, శ్రీరామచంద్రమూర్తి, సిద్ధార్థ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

దాతల దాతృత్వం స్ఫూర్తిదాయకం

పూతలపట్టు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో దాతల దాతృత్వం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. మండలానికి చెందిన ఎన్నారై అనూష.. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పూతలపట్టు జడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.15 లక్షలతో నిర్మించిన భోజనశాలను గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజసేవలో ఎన్నారైలు కీలక భూమిక పోషిస్తున్నారని అభినందించారు. పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.. దాతల సహకారం తోడు కావడంతో పాఠశాలలు నూతన రూపురేఖలు సంతరించుకుంటున్నాయని పేర్కొన్నారు. మండల తెదేపా అధ్యక్షుడు దొరబాబుచౌదరి, నాయకులు ధరణి, చంద్రమౌళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **పూతలపట్టు:** నియోజకవర్గ స్థాయిలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని మండల తెదేపా కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెదేపా మండల అధ్యక్షుడు దొరబాబుచౌదరి ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే మురళీమోహన్ విచ్చేసి ప్రజా సమస్యలపై వినతులు స్వీకరిస్తారని ఆయన చెప్పారు.

గృహనిర్మాణ మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

రాష్ట్రాభివృద్ధికి సీఎం కృషి

పుత్తూరు, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. పుత్తూరు మున్సిపాలిటీలో హౌసింగ్ 2.0 కార్యక్రమంలో భాగంగా 325 మంది లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణానికి సంబంధించి మంజూరు పత్రాలు అందజేశారు. కమిషనర్ నాగేశ్వరరావు, పద్మశాలి, వన్నెకుల క్షత్రియ, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్లు గంజి మాధవయ్య, షణ్ముగరెడ్డి, ధనపాల్, మాజీ ఎంపీపీ ఏలుమలై, మార్కెట్ కమిటీ ఛైర్మన్ గణేష్, పుత్తూరు పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ● తిరుపతిలో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహమ్మద్‌వీధికి చెందిన తెదేపా సీనియర్ నాయకులు మజీద్ సాహెబ్‌ను ఎమ్మెల్యే పరామర్శించారు.

ముస్లిం నాయకులు, ఖాజీలతో కలిసి ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే జగన్మోహన్‌ను కలిసిన ఖాజీలు

చిత్తూరు(జిల్లా పంచాయతీ): నగరంలో పలు మసీదులకు ప్రభుత్వ ఖాజీలుగా నియమితులైన మౌలానా షేక్ షబ్బీర్, షేక్ షమీఉల్లా, మహమ్మద్ అలియాస్ షరీఫ్ గురువారం ఎమ్మెల్యే జగన్మోహన్‌ను బీవీరెడ్డి కాలనీలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఎన్నడూ లేనివిధంగా నియోజకవర్గానికి ముగ్గురు ఖాజీలను ప్రభుత్వం నియమించడంపై వారు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపి సత్కరించారు. నాయకులు కాలేషా, అత్తు పాల్గొన్నారు.

ఇక్కడో సూచిక ఉండాలే!

వెదురుకుప్ప మండల పరిధిలోని పచ్చికాపల్లం- చవటగుంట ప్రధాన రహదారిపై నాయినిరెడ్డిండ్ల సమీపంలో మలుపు వద్ద సూచిక దుస్థితి ఇది. చుట్టూ లతలు అల్లుకొని పూర్తిగా కప్పేశాయి. రోడ్డు ఎక్కడికక్కడ కోతకు గురై అధ్వానంగా మారింది. దీంతో రాకపోకలకు వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. సూచికలు కనిపించేలా చూడాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, వెదురుకుప్పం

గుంతల దారి.. గుండెలదిరి..

చిత్తూరు- పలమనేరు జాతీయ రహదారిలోని బోడబండ్ల క్రాస్ నుంచి సుమారు 10 కిలోమీటర్ల వరకు రోడ్డు కోతకు గురై రాళ్లు తేలి అధ్వానంగా మారింది. దశాబ్దకాలంలో నిర్వహణకు నోచుకోలేదు. వర్షాలు, వాహనాల రాకపోకలతో పూర్తిగా పాడైంది. రోడ్డు బాగు చేయాలని ఆ మార్గంలో ప్రయాణాలు చేసే కాటప్పగారిపల్లె, ఎద్దులవారిపల్లె, బోడబండ్ల, డేగలబండ, పొన్నేడుపాళ్యం, జంబునేరుడుపల్లె ప్రజలు వినతులు ఇచ్చిన ఫలితం లేకపోయింది. దీంతో అవస్థలు పడుతూనే ప్రయాణాలు సాగిస్తున్నారు.

- న్యూస్‌టుడే, బంగారుపాళ్యం

తాగునీరు వృథా

బంగారుపాళ్యం అరగొండ రహదారి ప్రాంతంలో తాగునీటి వసతి కల్పించేందుకు ఏర్పాటు చేసిన పైపులు పాడయ్యాయి. ఇక్కడ బోరు నుంచి వస్తున్న నీరు కుంటలో నిల్వ చేరి మురుగుగా మారుతోంది. సరఫరా సమయంలో కలుషితం అవుతున్నాయని, జ్వరాలు విజృంభించే ప్రమాదం ఉందని, శుభ్రత చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, బంగారుపాళ్యం

పుస్తకాలు.. ప్రగతికి సోపానాలు

పుత్తూరు : పుస్తకాలు ప్రగతికి సోపానాలని, ప్రతి ఒక్కరు విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని ప్రముఖ సాహితీవేత్త, విశ్రాంత ప్రిన్సిపల్ గాలి గుణశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ● శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ చంద్రమౌళి, అధ్యాపకులు నరసింహులు, వాణిశ్రీ, శ్రీనివాసులు, గ్రంథాలయాధికారిణి మీనాకుమారి, బాలికల జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భువనేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **బంగారుపాళ్యం :** వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. గ్రంథాలయ అధికారి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజేంద్ర, కరుణీకర్ సంక్షేమ సంఘ గౌరవాధ్యక్షులు షణ్ముగం పిళ్లై పాల్గొన్నారు.

పుత్తూరు.. విజేతలకు బహుమతులు అందజేసిన అతిథులు

పెద్ద చెరువు కట్టకు మరమ్మతులు

నింద్ర, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లోని పది చెరువుల నీరు.. నింద్ర పెద్ద చెరువుకు చేరి కట్ట దెబ్బతిన్న ప్రాంతాలను జల వనరుల శాఖ అధికారులు గుర్తించారు. ప్రమాదకరంగా ఉన్న ప్రదేశాల్లో ముళ్లపొదలు జేసీబీతో తొలగిస్తున్నారు. మరమ్మతులకు రూ.2.5 లక్షలు మంజూరయ్యాయని ఏఈ లోకేశ్‌రెడ్డి తెలిపారు. పనులను ఆయకట్టు సంఘ అధ్యక్షుడు బలరాంరెడ్డి పర్యవేక్షిస్తున్నారు.

సమయపాలన పాటించాలి

గంగాధరనెల్లూరు: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కోటి, పెద్దబ్బరెడ్డి ఎంఈవోలు ఆంజనేయులశెట్టి, గుణశేఖర్‌రెడ్డిని కోరారు. గురువారం వారు కార్యవర్గంతో ఎమ్మార్సీలో అధికారులను కలిసి మాట్లాడారు. ఏకోపాధ్యాయ పాఠశాలల ఉపాధ్యాయుల సెలవులు, క్లస్టర్ కాంప్లెక్స్‌కు దూరప్రాంతాల నుంచి ప్రశ్నపత్రాలు తెచ్చుకోవడానికి ఉపాధ్యాయులు పడుతున్న అవస్థలు వివరించారు. సమయపాలన పాటించాలని, సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని సూచిస్తూ సమస్యలు పరిష్కరిస్తామని ఎంఈవోలు హామీ ఇచ్చారు.

నేడు గృహ నిర్మాణ మంజూరు పత్రాల పంపిణీ

.. నగరి, న్యూస్‌టుడే: జడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో నేడు గృహనిర్మాణ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అందజేస్తారని కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించాలి

అధికారులతో సమీక్షిస్తున్న సీఈవో రవికుమార్‌నాయుడు

పెనుమూరు, న్యూస్‌టుడే: ప్రజల సమస్యలపై సత్వరం స్పందించి పరిష్కరించాలని జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు ఆదేశించారు. ఆయన ఎంపీడీవో సమావేశ మందిరంలో మండల అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యపై దృష్టి పెట్టాలని, ఈ విషయంలో పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా ఉండాలన్నారు. ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్‌కుమార్, ఎంఈవో2 భాస్కర్‌నాయుడు, ఏపీవో గుణశేఖర్, ఏపీఎం చిరంజీవి, వివిధ శాఖల ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● పిచ్చిమొక్కల తొలగింపు

నింద్ర: కొత్తఆరూరు వద్ద నుంచి నేటమ్స్ షుగర్స్ కూడలి వరకు నగరి-నాగలాపురం రోడ్డులో పిచ్చిమొక్కల తొలగింపు బుధవారం ప్రారంభించారు. పర్యవేక్షించాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు అందుబాటులో లేరు. వారు దగ్గరుండి పనులు సక్రమంగా జరిగేలా చూడాలని స్థానికులు కోరారు.

ఆ దిశగా రైతులను మార్చండి .. చిత్తూరు(వ్యవసాయం): ప్రకృతి వ్యవసాయం దిశగా రైతులను మార్పు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. స్థానిక జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో చిత్తూరు డివిజన్ పరిధిలోని రైతు సేవా కేంద్రాల సహాయకులకు మూడు రోజుల శిక్షణ గురువారం ప్రారంభమైంది.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

నగరి, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడిని సాధించవచ్చని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు పేర్కొన్నారు. నగరి, నింద్ర, విజయపురం, జీడీనెల్లూరు, ఎస్‌ఆర్‌పురం, పాలసముద్రం, కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాల రైతులకు గురువారం నగరిలో శిక్షణ శిబిరం నిర్వహించారు. ఏడీఏ కవిత, ఏవో రాఘవేంద్ర, సాంకేతిక వ్యవసాయాధికారి అజిత, ఆత్మ బీటీఎం దేవేంద్ర, ఎన్‌ఎఫ్‌ఏ నాంచారమ్మ, నవీన్ పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని(16) చిత్తూరులోని ఓ కళాశాలలో చదువుతోంది. ఈ నెల 18న కళాశాలకు వెళ్లి మళ్లీ ఇంటికి రాకపోవడంతో ఆ విద్యార్థిని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ శ్రీనివాసులు తెలిపారు.

కంచె వివాదంపై కేసు

వడమాలపేట, న్యూస్‌టుడే: మండలంలోని టీఆర్‌కండ్రిగకు చెందిన మోహన్‌రాజు, బాలసుబ్రహ్మణ్యం రాజు పొలాలు.. పక్కపక్కనే ఉన్నాయి. మోహన్‌రాజు పొలం వద్ద వేసిన కంచెను బాలసుబ్రహ్మణ్యం రాజు తొలగించారని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ధర్మారెడ్డి తెలిపారు.

వరకట్న వేధింపులపై..

వడమాలపేట, న్యూస్‌టుడే: మండలంలోని నారాయణదాసుతోటకు చెందిన మురళి, దివ్యకు 2018లో వివాహమైంది. ఇటీవల మురళి మద్యం సేవించి అదనపు వరకట్నం తీసుకురావాలంటూ భార్యను వేధిస్తుండటంతో ఆమె భరించలేక గురువారం తమకు ఫిర్యాదు చేసిందని ఎస్సై ధర్మారెడ్డి తెలిపారు. భర్త మురళి, అత్త మంజుల, మామ రామయ్యపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

ఆటల్లో ఆణిముత్యాలు

ప్రతిభ చూపిన విద్యార్థులు

న్యూస్‌టుడే, వడమాలపేట

పల్లె సీమలో పుట్టిన క్రీడా ఆణిముత్యాలు వారు.. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాల నుంచి వచ్చిన పేదలు.. ఒక్కో ఆటలో ఎవరికి వారు తమ ప్రత్యేకత చాటుకుంటున్నారు.. తమకున్న అసాధారణ ప్రతిభతో ఇటీవల ఎన్టీఆర్ జిల్లా నున్న జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-17 జూడో, రెజ్లింగ్ పోటీల్లో పీఎంశ్రీ వడమాలపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.. అండర్-17 జూడోలో అన్నపూర్ణ బంగారు పతకాన్ని, గీతిక రజత పతకాన్ని సాధించారు.. అండర్-17 రెజ్లింగ్ పోటీల్లో వినయ్‌కుమార్, సిద్ధార్థ, రజత పతకాన్ని, యోగేశ్వర్, షణ్ముగం కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు.. ఇలా పతాకాలు సాధిస్తూ అందరి మన్ననలు పొందారు.. త్వరలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపేందుకు సన్నద్ధమవుతున్నారు.

రాష్ట్ర స్థాయిలో రాణించిన విద్యార్థులు

ఆనందంగా ఉంది..

అండర్-17 జూడో పోటీల్లో బంగారు పతకాన్ని సాధించడం ఆనందంగా ఉంది. డిసెంబర్ మొదటి వారంలో మణిపూర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున పాల్గొంటా. క్రీడా కోటాలో ఉన్నత ఉద్యోగం సాధించాలి. క్రమం తప్పని సాధనతో జూడోపై మక్కువ పెరిగింది. ఫిట్‌నెస్ కోసం వ్యాయామం చేస్తున్నా.

- అన్నపూర్ణ, ఎనిమిదో తరగతి

ప్రతిభ కనబరుస్తా..

మాది రైతు కుటుంబం. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తారు. రాష్ట్ర స్థాయి అండర్-17 జూడోలో రజత పతకాన్ని సాధించా. క్రీడలంటే ప్రాణం. జాతీయ స్థాయిలో రాణించి సత్తా చాటాలని ఉంది. పీడీ చంద్రశేఖర్‌రాజు ప్రోత్సాహం మరువలేనిది. **- గీతిక, తొమ్మిదో తరగతి**

ఆశయాలు నెరవేరుస్తా..

రాష్ట్ర స్థాయి అండర్-17 రెజ్లింగ్ పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించా. వాటిలో నైపుణ్యం సాధించి ప్రతిభ చాటుతా. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా కష్టపడి చదివి ఉన్నత స్థానంలో స్థిరపడతా. నిత్యం రెజ్లింగ్‌లో సాధన చేస్తున్నా.

- షణ్ముగం, పదో తరగతి

జాతీయ స్థాయిలో సత్తా..

రాష్ట్ర అండర్-17 రెజ్లింగ్ పోటీల్లో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నా. జాతీయ స్థాయిలో రాణించి సత్తా చాటుతా. తల్లిదండ్రుల ఆకాంక్ష, ఉపాధ్యాయుల కృషికి గుర్తింపు తెస్తా. క్రీడల్లో ప్రతిభ చూపడమే లక్ష్యంగా సాధన చేస్తున్నా.

- వినయ్‌కుమార్, తొమ్మిదో తరగతి

ప్లాస్టిక్ నిషేధ చట్టం కఠినతరం: కమిషనర్

ఉద్యోగులకు స్టీల్ బాటిళ్లు అందజేస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ వెల్లడించారు. నగరపాలక కార్యాలయంలో ఏఐఐఎల్ఎస్జీ ఆధ్వర్యంలో ఉద్యోగులకు ప్లాస్టిక్ నిషేధ చట్టంపై గురువారం అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ నిషేధాన్ని నగరపాలక కార్యాలయం నుంచే ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పర్యవేక్షణ కోసం కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన కమిటీ ఏర్పాటైందని వివరించారు. అనంతరం ఉద్యోగులకు స్టీల్ నీటి సీసాలు పంపిణీ చేశారు. ఆరోగ్యాధికారి లోకేష్, సహాయ సిటీ ప్లానర్ నాగేంద్ర, డీఈఈ రమణ, టీపీవో శుభప్రద పాల్గొన్నారు.

(c) eenadu

పలమనేరు

•పలమనేరు •కుప్పం •పుంగనూరు

పారిశుద్ధ్య పనులు పక్కాగా చేపట్టాలి

మాట్లాడుతున్న మెప్మా పీడీ రవీంద్ర

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని బీసీ, ఎస్సీ హాస్టళ్లలో పారిశుద్ధ్య పనులు పక్కాగా చేపట్టాలని మెప్మా పీడీ రవీంద్ర సూచించారు. గురువారం మున్సిపల్ సమావేశపు హాలులో సంక్షేమశాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. విద్యార్థుల ఆరోగ్యం ఎంతో ముఖ్యమన్నారు. విద్యతో పాటు యోగా, ధ్యానం మీద కూడా శిక్షణ ఇప్పించాలన్నారు. కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి, ఎస్సై లోకేశ్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో వ్యవసాయశాఖ జేడీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతు సేవా కేంద్రాల సభ్యులకు శిక్షణ ఇచ్చారు. మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

వీధుల్లో శుభ్రత పనులు

స్పందనకు వందనం

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని సుందరయ్య వీధిలో మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వీధులు అపరిశుభ్రంగా ఉండటంతో 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా'లో వార్త ప్రచురితమైంది. అధికారులు ఆ మేరకు స్పందించారు.

మూతపడిన నీటిశుద్ధి కేంద్రాలు

సదుం ప్రాథమిక పాఠశాల, భట్టువారిపల్లెలో ఉన్న నీటి శుద్ధ నీటికేంద్రాలు గత నెలరోజులుగా మూతపడ్డాయి. మరమ్మతులు చేయకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి కేంద్రాలకు మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సదుం

పలమనేరు బాలోత్సవ కమిటీ ఎంపిక

తులసినాథంనాయుడు, యుగంధర్‌బాబు

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలో బాలోత్సవం నిర్వహించడానికి కమిటీని ఎన్నుకున్నట్లు కమిటీ సలహాదారు ఆనందబాబు తెలిపారు. గురువారం పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికలు నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడిగా తులసినాథంనాయుడు, ప్రధాన కార్యదర్శిగా యుగంధర్‌బాబును ఎన్నుకున్నట్లు ఆయన చెప్పారు. ఉత్సవాలు ఎప్పుడనేది ఇంకా నిర్ణయించలేదని పేర్కొన్నారు.

పదేళ్లుగా ఇన్‌ఛార్జులే..!

❖ వారంలో పనిచేసేది రెండు రోజులే
❖ మూతపడుతున్న గ్రంథాలయాలు

బైరెడ్డిపల్లె, పెద్దపంజాణి, న్యూస్‌టుడే: ఎందరికో దిక్సూచీ.. మార్గదర్శకంగా నిలిచిన గ్రంథాలయాలకు పాలకులు లేక వెలవెలపోతున్నాయి. విజ్ఞాన భాండాగారాలుగా పిలిచే గ్రంథాలయాలు దశాబ్ద కాలంగా ఇన్‌ఛార్జుల పాలనలో నడుస్తున్నాయి. గ్రంథాలయాలు తెరచుకోక పాఠకులు పుస్తక పఠనానికి దూరమయ్యే పరిస్థితి నెలకొంది. పలమనేరు నియోజకవర్గ పరిధిలోని బైరెడ్డిపల్లె, పెద్దపంజాణి గ్రంథాలయాలకు పదేళ్లుగా అధికారులు లేకపోవడంతో ఇన్‌ఛార్జులే గ్రంథాలయాలను తెరవాల్సిన పరిస్థితి. ఇన్‌ఛార్జి అధికారులు వారంలో ఒకటి, రెండు రోజులే మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. ఫలితంగా గ్రంథాలయాలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి.

నిరాశలో యువత..

బైరెడ్డిపల్లె గ్రంథాలయానికి పదేళ్లుగా ఇన్‌ఛార్జి అధికారే దిక్కు.. గంగవరం మండల గ్రంథాలయాధికారి ఇక్కడ కొన్నేళ్లు ఇన్‌ఛార్జిగా పని చేశారు. ప్రస్తుతం వి.కోట గ్రంథాలయ అధికారి వాహబ్ ఇన్‌ఛార్జిగా పని చేస్తున్నారు. వారంలో రెండు రోజులు(గురు, శనివారం) మాత్రమే ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. మిగిలిన రోజుల్లో స్వీపర్ గ్రంథాలయం తెరుస్తున్నారు. ఆమె కూడా రాని రోజుల్లో మూతపడుతోంది. దీంతో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులు, యువత నిరాశకు లోనవుతున్నారు. రెగ్యులర్ అధికారిని నియమించి విద్యార్థులు, పాఠకులకు విజ్ఞానాన్ని అందించడానికి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బైరెడ్డిపల్లెలో తెరచుకోని గ్రంథాలయం

పెద్దపంజాణిలో 13 ఏళ్లు..

పెద్దపంజాణి మండల కేంద్రంలోని గ్రంథాలయం 13 ఏళ్లుగా ఇన్‌ఛార్జి పాలనలో నడుస్తోంది. వారంలో ఒకరోజు మాత్రమే అధికారి ఇక్కడ ఉంటున్నారు. పలమనేరు గ్రంథాలయ అధికారి ఇక్కడ ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్నారు. 13 ఏళ్లుగా గ్రంథాలయానికి అధికారి లేక ఇన్‌ఛార్జి అధికారులతో మమ అనిపించే దుస్థితి నెలకొంది. అధికారి రాని రోజుల్లో స్వీపర్ (కార్మికురాలు) గ్రంథాలయాన్ని తెరుస్తున్నారు. వార్తా పత్రికలు మాత్రమే పాఠకులకు అందుబాటులో ఉంటాయి. పుస్తకాలు కావాలంటే అధికారి అనుమతి కావాలి. రెగ్యులర్ అధికారి నియామకం చేస్తే విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

పలమనేరు, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని వినాయక నగర్‌లో కాలువలు అధ్వానంగా ఉన్నాయి.
– సుబ్బయ్య, పలమనేరు
సమాధానం: సిబ్బందిని పంపి కాలువలు శుభ్రం చేయిస్తాం. – ఎన్వీ రమణారెడ్డి, కమిషనర్

కూర్నిపల్లె రోడ్డుకు భూమిపూజ

ఈనాడు కథనానికి స్పందన

గంగవరం, న్యూస్‌టుడే: మండలంలోని మదనపల్లె రోడ్డు నుంచి కూర్నిపల్లె వరకు రోడ్డు అధ్వానంగా ఉండటంతో సమస్యపై ఇటీవల ఈనాడులో చిత్ర వార్త ప్రచురితమైంది. ఎమ్మెల్యే అమరనాథరెడ్డి స్పందించి రోడ్డు నిర్మాణానికి రూ.70లక్షలు మంజూరు చేయించారు. మండల తెదేపా అధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్, సింగిల్ విండో ఛైర్మన్ ప్రసాద్‌నాయుడు రోడ్డు నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు.

మాట్లాడుతున్న డీపీవో సుధాకర్‌రావు

చెత్త సంపద కేంద్రాలతో ఎరువు తయారీ

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సంపద కేంద్రాల ద్వారా పొడి, తడి చెత్తలను వేరు చేసి వర్మీ కంపోస్టు తయారీపై ప్రత్యేక దృష్టి సారించాలని డీపీవో, మండల ప్రత్యేకాధికారి సుధాకర్‌రావు తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. చెత్తను రీసైక్లింగ్ చేసి రైతులకు వర్మీకంపోస్టు ఎరువు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అప్పాజీ, డిప్యూటీ ఎంపీడీవో నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు ఏవైనా పరిష్కరిస్తాం

విద్యార్థినిని అభినందిస్తున్న నారా భువనేశ్వరి..

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: పురపాలిక పరిధిలోని కేజీబీవీ పాఠశాలలో గురువారం పర్యటించిన ఎన్టీఆర్ ట్రస్టు ట్రస్టీ నారా భువనేశ్వరి విద్యార్థినులతో కొంతసేపు మాటామంతీ చేశారు. రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైన తేజశ్రీని అభినందించారు. విద్యార్థిలకు ఏదైనా సమస్య ఉంటే చెప్పాలంటూ అడగ్గా.. పాఠశాలలో కంప్యూటర్స్ అవసరం ఉందని, ల్యాబ్, పరికరాలు కావాలని కొందరు విద్యార్థులు కోరారు. అన్నీ వసతులు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఈ-రాయ్స్ అందించిన రెండు ఆటోలను ప్రారంభించి, విద్యార్థినులతో కలిసి గురుకుల పాఠశాల వరకు ప్రయాణించారు.

నెర్వ్ సెంటర్ పరిశీలన..

కుప్పం ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న నెర్వ్ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. నెర్వ్ కేంద్రం ద్వారా చేపడుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం, పీకేఎం ఉడా ఛైర్మన్ డా.సురేష్‌బాబు, కడా పీడీ వికాస్ మర్మత్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల చేతుల్లో విద్యార్థుల భవిష్యత్తు

శాంతిపురం, న్యూస్‌టుడే: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. గురువారం రాత్రి శివపురంలోని స్వగృహంలో మెగా డీఎస్సీ ఉపాధ్యాయులతో ఆమె సమావేశమయ్యారు. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా అందించిన ఉచిత శిక్షణతో 20 మంది టీచరు ఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు.

పరిష్కారానికి నివేదికలు రూపొందించాలి

చౌడేపల్లె, న్యూస్‌టుడే: మండలంలో ప్రతివారం వచ్చే ప్రజా సమస్యల జాబితా, పరిష్కార నివేదికలను వారాంతంలో నిర్వహించే సమావేశానికి సంబంధిత శాఖ అధికారులు తప్పక తీసుకురావాలని మండల ప్రత్యేకాధికారి ప్రసన్నకుమార్ సూచించారు. అధికంగా రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల నుంచి సమస్యలు వస్తున్నాయని అయితే పరిష్కారంలో వెనుకబడి ఉన్నారని హెచ్చరించారు. ఎంపీడీవో లీలామాధవి, ఈవోపీఆర్డీ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీల నియామకం

చౌడేపల్లె, న్యూస్‌టుడే: మండలంలో తెదేపా గ్రామ కమిటీల ఎన్నికలను గురువారం ప్రారంభించారు. రెండు రోజులు నిర్వహించే ఈ కార్యక్రమంలో మొదటి రోజు నాలుగు పంచాయతీల్లో గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. మండల ఎన్నికల పరిశీలకుడు నాగేశ్వరనాయుడు ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ జరిగింది. గ్రామ కమిటీ సభ్యులను, ఛైర్మన్లను ఆయా పంచాయతీల కార్యకర్తలు ఎన్నుకున్నారు. ఆమినిగుంట గ్రామ కమిటీ ఛైర్మన్‌గా శంకర, పరికిదొన చెంగల్రాయులు, గడ్డంవారిపల్లె మునివెంకటప్ప, పెద్దకొండామర్రి సుభహాన్‌లు ఎన్నికైనట్లు ఆయన ప్రకటించారు. మండల అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు పగడాల హరిప్రసాద్, మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్ పాల్గొన్నారు.

గ్రామ కమిటీ సభ్యులతో నాగేశ్వరనాయుడు

విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: గ్రంథాలయాల్లో లభించే విజ్ఞానాన్ని పొంది, విద్యార్థులు మరింత ఉన్నతస్థాయి అధిరోహించాలని రాష్ట్ర గ్రంథాలయాల డైరెక్టర్ మునస్వామి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో గురువారం జాతీయ గ్రంథాలయ ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. గ్రంథాలయ అధికారిణి సత్యవాణి, లయన్స్ క్లబ్ సలహాదారు మహేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేస్తున్న మునస్వామి..

వన సంరక్షణ సమితి కమిటీల ఎన్నిక

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: కంభంపల్లె, కడతట్లపల్లె రేంజ్ అటవీశాఖాధికారుల ఆధ్వర్యంలో గురువారం వన సంరక్షణ సమితి(వీఎస్ఎస్) సభ్యుల ఎన్నిక జరిగింది. కడతట్లపల్లె, కంభంపల్లె వీఎస్ఎస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ప్రకాష్, మేనక, విశ్వనాథరెడ్డి, శాంతమ్మలతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను తెదేపా మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు సత్కరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ నాగరాజనాయుడు, నాయకులు భువనచంద్రగౌడు, మంజునాథరెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

విశ్వనాథరెడ్డి, శాంతమ్మలను సత్కరిస్తున్న కిశోర్‌గౌడు

సదరం స్లాట్ బుకింగ్‌కు సర్వర్ చిక్కులు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పాతూరు నత్తం సచివాలయం పరిధిలో దివ్యాంగులు సదరం స్లాట్ బుకింగ్ కోసం ఆన్‌లైన్ పనిచేయక అవస్థలు పడ్డారు. కొందరు మీ-సేవ [illegible] సచివాలయాల వద్ద వేచి ఉన్న దివ్యాంగులకు ఆన్‌లైన్ పనిచేయక నమోదు చేసుకోలేకపోయారు. మిట్టకురపల్లెకు చెందిన దివ్యాంగుడు వెంకటేష్ దివ్యాంగ పింఛను పొందడానికి ధ్రువపత్రం కోసం ఇబ్బందులు పడుతున్నాడు. ఆన్‌లైన్‌లో నమోదుకు మరో అవకాశం కల్పించి ఆదుకోవాలని బాధితుడు అధికారులకు మొరపెట్టుకుంటున్నారు.

శిథిలావస్థలో మరగుదొడ్లు

పుంగనూరు మండలంలోని గెరిగిపల్లె ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరాయి. అలాగే పాఠశాల పక్కనే మరో తరగతి గది ఉంది. దానిని గతంలో అంగన్‌వాడీ భవనంగా ఉపయోగించేవారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉంది. భవనాన్ని తొలగించి విద్యార్థుల సౌకర్యార్థం మరుగుదొడ్లు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈవో నటరాజరెడ్డి మాట్లాడుతూ.. నివేదిక ఉన్నతాధికారులకు పంపి త్వరలో సమస్యను పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ

అల్లుకున్న పొదలు.. కానరాని సూచికలు

కుప్పం-ద్రవిడ వర్సిటీ డబుల్ రోడ్డుకు ఇరువైపులా పొదలు, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరగడంతో వాహనదారులు అసౌకర్యం ఎదుర్కొంటున్నారు. గ్రామాల వద్ద నామ ఫలకాలు, రహదారి మలుపుల్లో సూచికలకు పొదలు అల్లుకుపోవడంతో వాటి జాడ కనిపించని పరిస్థితి ఏర్పడింది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, కుప్పం

కల్లుపల్లె చెరువు కంపుకొడుతోంది..!

మండలంలోని కల్లుపల్లె చెరువు కంపుకొడుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు నిండుకుండలా ఉంది. అయితే చెరువులో కోళ్ల వ్యర్థాలు వేయడంతో తీవ్ర దుర్వాసన వస్తోందని గ్రామస్థులు తీవ్రంగా మండిపడుతున్నారు. చుట్టుపక్కల ఉన్న కోళ్లఫారాల్లో చనిపోయిన కోళ్లను చెరువులో వేస్తున్నారని అలాగే చికెన్ దుకాణాల్లో మిగిలిన వ్యర్థాలను చెరువులో వేయడంతో నీరు కలుషితమవుతోందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గంగవరం

ఈ గోతులు పూడ్చండి సారూ...

పుంగనూరు-రాగానిపల్లె మార్గం గుంతలమయం కావడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. బైపాస్ రోడ్డుకు అనుసంధానమైన రోడ్డు కావడంతో నిత్యం రద్దీగా మారింది. దీనికి తోడు మట్టి రోడ్డు కావడం, తరచూ వర్షాలు కురుస్తుండటంతో ఇలా దుస్థితికి చేరుకుంది. ప్రమాదాలు సంభవించకముందే మార్గాన్ని తారు, సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, పుంగనూరు

పశువులకు ఉచిత గర్భధారణ ఇంజెక్షన్లు

యామగానిపల్లె(గుడుపల్లె), న్యూస్‌టుడే: నియోజకవర్గంలో పశు గర్భధారణ ఇంజెక్షన్లు ఉచితంగా వేస్తామని చిత్తూరు ఉప సంచాలకులు అరీఫ్ రైతులకు తెలిపారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో గురువారం మండల పరిధి యామగానిపల్లెలో నిర్వహించిన పశువైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం రైతులకు ఉచితంగా 120 కిలోల మినరల్ మిశ్రమం కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌జీఎం ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ హరికృష్ణ, పశు వైద్యాధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మల్లానూరు హెల్త్ ఎడ్యుకేటర్‌గా వెంగల్‌రెడ్డి

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: వైఎస్సార్ జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో ఎంపీహెచ్‌డబ్ల్యూగా విధులు నిర్వహిస్తున్న వెంగల్‌రెడ్డిని కుప్పం మండలం మల్లానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి హెల్త్ ఎడ్యుకేటర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వ కార్యదర్శి సౌరబ్ గౌర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

చెక్కు అందజేస్తున్న సింగిల్ విండో మండల అధ్యక్షుడు ధనంజయనాయుడు

కల్లూరు, న్యూస్‌టుడే: ఏనుగుల దాడులతో నష్టపోయిన రైతులను ఆదుకుంటామని సింగిల్ విండో మండల అధ్యక్షుడు ధనంజయనాయుడు అన్నారు. దేవళంపేట, కమ్మపల్లె, పాళెం పంచాయతీల్లో ఏనుగుల దాడిలో నష్టపోయిన 28 మంది రైతులకు మంజూరైన రూ.3.98లక్షలు పరిహారాన్ని బాధిత రైతులకు అందజేశారు.

పంటలపై ఒంటరి ఏనుగు బీభత్సం

కల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని పాళెం, పాతపేట పంచాయతీల్లోని కోటపల్లె, కొంగరవారిపల్లె, పూరేడువారిపల్లె, పాతపేట గ్రామాల్లో బుధవారం రాత్రి ఒంటరి ఏనుగు సంచరించింది. పలువురి రైతులకు చెందిన పంటలను ఒంటరి ఏనుగు ధ్వంసం చేసింది.

పఠనాసక్తిని పెంపొందించుకోవాలి

పుంగనూరు : విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాసక్తిని పెంపొందించుకోవాలని తహసీల్దారు రాము, ఎంపీడీవో అప్పాజీ కోరారు. స్థానిక నానబాల వీధిలోని శాఖ గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు.

విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంపీడీవో అప్పాజీ

ఏకాభిప్రాయం మేరకు కమిటీల ఎంపిక

సోమల, న్యూస్‌టుడే: అందరి ఏకాభిప్రాయం మేరకు గ్రామ కమిటీల ఎంపిక చేపడుతున్నట్లు సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు ప్రభాకర్, మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఏఎంసీ ఛైర్మన్ శ్రీనివాసులునాయుడులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని 81.ఉప్పరపల్లె, ఆవులపల్లె, పెద్దఉప్పరపల్లె, అన్నెమ్మగారిపల్లె, పేటూరు పంచాయతీల్లో గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించండి

సోమల: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఏడీఏ శివకుమార్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం డివిజన్ స్థాయిలో వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలకు శిక్షణ తరగతులు నిర్వహించారు.

సద్వినియోగం చేసుకోండి

సోమల: ఆధార్ కేంద్రాలను ప్రజలతో పాటు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని పెద్దఉప్పరపల్లె, నంజంపేట సచివాలయాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను ఎంపీడీవో గురువారం తనిఖీ చేసి సచివాలయ సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

మురుగు కాలువలకు మహర్దశ..!

✦ మారుమూల ప్రాంతాలకు పక్కా కాలువలు

గుర్తించిన ప్రాంతాలు	నిధులు (రూ.లక్షల్లో)
గంటావూరు చంద్రబాబు కాలనీ	25
గడ్డూరు కాలనీ	25
గంటావూరు కాలనీ కనకదుర్గమ్మ ఆలయం	10
గాంధీనగర్ శ్మశానవాటిక	10

గాంధీనగర్‌లోని శ్మశానం వద్ద మట్టి కాలువ

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణవాసులు చాలా కాలంగా దుస్థితిలో ఉన్న మురుగు కాలువల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎప్పుడో పంచాయతీ కాలం నాటి రాచకాలువలే ఇప్పటికీ కొనసాగుతున్నాయి. అవి కూడా మట్టి కొట్టుకుపోవడంతో మురుగు ముందుకు కదలక నిల్వ ఉంటోంది. ప్రతిరోజు మున్సిపల్ కార్యాలయానికి కాలువల సమస్యపైనే ప్రజలు అధికారులకు వినతి పత్రాలు అందుతున్నాయి. ప్రభుత్వం ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తాజాగా కాలువల నిర్మాణానికి, అభివృద్ధి చేయడానికి నిధులు విడుదల చేయనుంది. దీంతో అధికారులు అత్యవసరంగా ప్రజలకు అవసరం ఉన్న కాలువలను గుర్తించి నిర్మించడానికి ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు. నిధులను కేవలం పట్టణంలో సీసీ కాలువల నిర్మాణానికి మాత్రమే వెచ్చించాలని ప్రభుత్వ ఆదేశాల్లో పేర్కొంది.

ఏ పథకం కింద..

పలమనేరు, కుప్పం, మదనపల్లె అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పథకం కింద నిధులు విడుదల చేశారు

ఎన్ని నివాసాలకు మేలు

కాలువల నిర్మాణం వల్ల 1,100 నివాసాల ప్రజలకు మేలు చేకూరనుంది.

చర్యలు తీసుకుంటాం

త్వరితగతిన పనులు చేపట్టి ప్రజల ఇబ్బందులను తొలగించడానికి చర్యలు తీసుకుంటాం. ఈ నెల 29 లోపు టెండర్లు ప్రక్రియ పూర్తి చేస్తాం.
- ఎన్వీ రమణారెడ్డి, కమిషనర్

తల్లి మందలించిందని ఆత్మహత్య

అనూష (పాతచిత్రం)

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: బెంగళూరు-చెన్నై ప్రధాన రైలు మార్గంలో కుప్పం మండలం ఆవులనత్తం గేటు వద్ద ఓ యువతి బుధవారం సాయంత్రం రైలు పట్టాలపై ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. దీనిపై రైల్వే పోలీసులు ఆరా తీయడంతో మృతురాలు కుప్పం మండలం డి.అగ్రహారానికి చెందిన వెంకటేశు కుమార్తె అనూష(17)గా గుర్తించారు. అనూష కుప్పంలోని ఓ కళాశాలలో డిప్లొమా ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇంట్లో చిన్నచిన్న పనులు చేయడం లేదంటూ తల్లి మందలించడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిందని రైల్వే పోలీసులు తెలిపారు.

చోరీకి విఫలయత్నం

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: ఇంట్లో చోరీకి వచ్చిన దుండగులు తాళాలు పగలగొడుతుండగా శబ్దం రావడంతో గుర్తించిన స్థానికులు ఆ ఇంటిని చుట్టుముట్టడంతో దుండగులు పరారైన ఘటన కుప్పం మండలం కృష్ణాపురంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఈ ఘటనపై గ్రామానికి చెందిన అరుణ్ గురువారం కుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్రైం కార్నర్

ఎద్దు పొడవడంతో వృద్ధురాలికి తీవ్రగాయాలు

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టణంలోని నాగప్పాళ్యంలో నడుచుకుంటూ వెళ్తున్న మేలుపట్ల ఎస్సీ కాలనీకి చెందిన పుష్పావతమ్మను ఎద్దు వెనుక నుంచి పొడిచింది. తీవ్రగాయాలు కావడంతో స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

బాలిక అదృశ్యం

గుడుపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(17) కళాశాలకు వెళ్లి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గురువారం పోలీసులను ఆశ్రయించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

జూదరుల అరెస్టు

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దఅల్లాపురం సమీపంలో కోడిపందేలు ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై హరిప్రసాద్ గురువారం తెలిపారు.

నిరంతర విద్యుత్తుతో రైతులకు ప్రయోజనం

విద్యుత్తు సరఫరాను ప్రారంభిస్తున్న ఏఈ రాంప్రసాద్‌రెడ్డి, నాయకులు

రొంపిచెర్ల, న్యూస్‌టుడే: రైతులకు ప్రయోజనం చేకూరే విధంగా నిరంతర విద్యుత్తు సరఫరా చేయడం సంతోషించదగ్గ విషయమని రొంపిచెర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు చెంగల్‌రెడ్డి, రఘునాథ అన్నారు. గురువారం చెంచెమరెడ్డిగారిపల్లె ఉపకేంద్రం నుంచి రైతులకు, గృహాలకు నిరంతర విద్యుత్తు సరఫరాను మండల ఏఈ రాంప్రసాద్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు.

పాస్‌పోర్ట్ పోయినది
పాస్‌పోర్ట్ నెంబరు: Z6299190.
సుబ్రమణ్యం గోవుల S/o చిన్న తిరుపాల్ వడ్డె.
H.No:81-234-1, కస్తూరి నగర్, షరీన్ నగర్ ఏరియా,
కల్లూరు మండలం, కర్నూలు జిల్లా, ఆం.ప్ర.- 518002.
నేను 15-11-2025 తేదీన కుప్పం మంచి కడపకు వెళ్తున్నప్పుడు కుప్పం ఏపీఎస్ఆర్టీసి బస్టాండు సమీపంలో నా పాస్‌పోర్ట్ పోయినది. ఎవరికైనా దొరికిన యెడల దయచేసి ఫోన్ నెం: 9550157755, పీఈఎస్ మెడికల్ కాలేజ్, కుప్పంనకు తెలియపరచగలరు.

(c) eenadu

కార్తిక దీపం.. ఆధ్యాత్మిక శిఖరం

ఐ.పోలవరం మండలం మురమళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం కార్తిక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళలు దీపాలను వెలిగించారు. ఆలయం విద్యుత్తు కాంతులతో శోభిల్లింది. -న్యూస్‌టుడే, ఐ.పోలవరం

అఖండ గోదావరి హారతి

కుండలేశ్వరంలోని వృద్ధగౌతమి నది చెంతన గురువారం రాత్రి అఖండ గోదావరి హారతి కార్యక్రమం నిర్వహించారు. తొలుత పుష్కరఘాట్‌లో గోదావరిమాతకు ప్రత్యేక పూజలు చేశారు. అయిదుగురి అర్చకుల బృందం గోదావరికి ధూప, కుంభ, నాగ, కర్పూర, నక్షత్ర హారతులను ఇచ్చారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, దాట్ల పవన్ ప్రత్యేక పూజలు చేశారు. ఈవో దుర్గ, కామేశ్వరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, కాట్రేనికోన

రాజోలులో 26న పవన్‌కల్యాణ్ పర్యటన

మలికిపురం: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈ నెల 26న రాజోలు నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. ఆ వివరాల ప్రకారం.. కేశనపల్లిలో చనిపోయిన కొబ్బరి చెట్లను పరిశీలించి అక్కడే 15 గ్రామాలకు చెందిన బాధిత రైతులతో మాట్లాడుతారు. అనంతరం రాష్ట్రస్థాయి పల్లె పండగ-2.0 కార్యక్రమాన్ని శివకోటిలో ప్రారంభిస్తారు. రూ.3.21 కోట్లతో ములికిపల్లి-కాట్రేనిపాడు లంక మధ్య 4.4 కిలోమీటర్ల రోడ్డు, రూ.5 కోట్ల ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధులతో గుడిమెళ్లంక మంచినీటి పథకంలో ఆర్ఎస్ఎఫ్(ర్యాపిడ్‌శాండ్ ఫిల్టరు), రూ.7.34 కోట్లతో మంచినీటి ట్యాంకులు, రూ.11.41 కోట్లతో 177 గ్రామీణ రోడ్లకు శంకుస్థాపన చేస్తారు.

నింగిలో తేలి.. నీటిపై వాలి

కోనసీమలో జల విమాన సేవలకు ప్రయత్నాలు

న్యూస్‌టుడే, అల్లవరం

కోనసీమ మణిహారంలో మరో కలికితురాయి చేరేందుకు మార్గం సుగమం అవుతోంది. మహా నగరాలకే పరిమితమైన సీ-ప్లెయిన్(జల విమానం) సేవలు కోనసీమ ప్రజల అందుబాటులోకి రానున్నాయి. దీనికి సంబంధించి ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత సంస్థ ప్రతినిధులతో ఆయన సమీక్ష నిర్వహించారు.

దిండిలో ప్రతిపాదనలు

రాష్ట్రంలో చేపట్టనున్న 9 ప్రాజెక్టుల్లో భాగంగా కోనసీమలో ఒక ప్రాజెక్టు ప్రారంభించనున్నారు. దీనికి దిండి ప్రాంతాన్ని ఎంపిక చేశారు. ఇక్కడ సంస్థ తరఫున వచ్చిన అధికారులు బృందానికి రెవెన్యూ అధికారులు మూడు ప్రాంతాలను చూపారు. దానిలో ఒక ప్రాంతం జల విమానం రాకపోకలు సాగించేందుకు అనుకూలంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీనిని పరిశీలించేందుకు శుక్రవారం నిపుణుల బృందం సభ్యులు జిల్లాకు రానున్నట్లు సమాచారం. వారు వచ్చి ఇక్కడ ఉన్న పరిస్థితులను అధ్యయనం చేసి తుది నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తారు. తర్వాత ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తారు.

విజయవాడలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సీ-ప్లెయిన్ విన్యాసాలు

రూ.20 కోట్లతో..

ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 9 చోట్ల ఈ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఒక్కొక్క ప్రాంతంలోనూ రూ.20 కోట్ల పెట్టుబడితో ఈ ప్రాజెక్టు ప్రారంభిస్తారు. ఏర్పాట్లు చేసేందుకు ప్రభుత్వం ఎఫ్ఎస్ హెచ్ఎంఎంటీ ప్రాజెక్టు అసోసియేషన్ అనే ప్రైవేటు ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

ఎంతో ఉపయోగం

జలవిమాన సర్వీసులు ప్రారంభమైతే ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు పర్యాటకుల తాకిడి పెరుగుతుంది. స్థానికులకు ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. విమాన సర్వీసులు ఉన్న జిల్లాల జాబితాల్లో కోనసీమ చేరుతుందని అధికారులు అభిప్రాయ పడుతున్నారు.

లోన్ తీసుకుని.. సైబర్ నేరగాళ్ల ఖాతాలో జమ

- డిజిటల్ అరెస్ట్ పేరిట రూ.34.60 లక్షల కాజేత
- ముమ్మిడివరంలో మోసపోయిన విశ్రాంత ఎంఈవో

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: సైబర్ కేటుగాళ్ల మోసానికి ఓ విశ్రాంత విద్యాశాఖాధికారి(ఎంఈవో) రూ.34.60 లక్షలు పోగొట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముమ్మిడివరానికి చెందిన బి.రమణశ్రీ ఈ నెల 8న వాట్సప్ కాల్ వచ్చింది. మీపై కేసు నమోదైందని అవతల వ్యక్తి చెప్పారు. కేసుకు సంబంధించి మరో వ్యక్తితో మాట్లాడాలని ఓ ఫోన్ నంబరు ఇచ్చారు. ఆ వ్యక్తిని సంప్రదించగా.. ఆధార్ నంబరు చెబితే పూర్తి వివరాలు చూస్తానని నమ్మించారు. తర్వాత ఫోన్ చేసి పెద్ద కేసులో ఇరుక్కున్నారు, కెనరా బ్యాంకు ఏటీఎంలో జరిగిన రూ.3 కోట్ల అక్రమాల్లో మీ ఖాతాలో రూ.75 లక్షలు జమైందని చెప్పారు. డిజిటల్ అరెస్ట్ పేరిట ఇతరులతో మాట్లాడవద్దని హెచ్చరించారు. కేసు నుంచి బయట పడే మార్గం ఉందని చెప్పి.. ఆయన పేరిట లోన్ రూ.15 లక్షలు తమ ఖాతా బదిలీ చేయించుకున్నారు. తర్వాత మరో రూ.20 లక్షలు డిమాండ్ చేశారు. తన వద్ద డబ్బులేదని చెప్పగా.. మోసగాడు పింఛను హామీతో వ్యక్తిగత రుణం తీసుకోవాలని చేశారు. ఆ సొమ్మును రెండు విడతలుగా రూ.9.80 లక్షలు చొప్పున వారు చెప్పిన ఖాతాల్లో బాధితుడు జమ చేశారు. ఈ నెల 8 నుంచి 15వ తేదీ వరకు ఈ వ్యవహారం సాగింది. బాధితుడు ఎట్టకేలకు బుధవారం అర్ధరాత్రి ముమ్మిడివరం పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముమ్మిడివరం ఎస్సై డి.జ్వాలాసాగర్ తెలిపారు.

వరిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త నందకిశోర్ తదితరులు

గింజ రాలదు.. దిగుబడి తగ్గదు

రాజోలు, న్యూస్‌టుడే: వరిలో కొత్తగా వచ్చిన ఆర్.జీ.ఎల్.7034 రకం(మినికిట్) తుపానును తట్టుకుని అధిక దిగుబడినిస్తోందని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డా.ఎం.నందకిశోర్ పేర్కొన్నారు. చింతలపల్లిలో 25 సెంట్ల మీటర్ల విస్తీర్ణంలో ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్న ఈ రకం పంటను గురువారం పరిశీలించారు. పంటకోత ప్రయోగంలో ఎకరాకు 30 బస్తాలు దిగుబడి వచ్చిందన్నారు. ఇది మొంథా తుపాను ప్రభావాన్ని తట్టుకుందన్నారు. ఏడీఏ ఏవీఎస్ రాజశేఖర్, అభ్యుదయ రైతు వీరభద్రరావు పాల్గొన్నారు.

ఇళ్లు.. ఏఐ కళ్లు

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) 2.0 పథకం కింద పేదల ఇళ్ల మంజూరుకు సంబంధించి ఏఐ(కృత్రిమ మేధ) సాంకేతికతను వినియోగించనున్నట్లు గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. నాయకులు, అధికారుల ప్రమేయం లేకుండా ప్రాధాన్యం వారీగా గృహాలు కేటాయించాలన్నది ఈ కార్యక్రమం లక్ష్యమని వారు తెలిపారు. ఇంటింటి సర్వే ఆధారంగా తొలుత పాకలు, తర్వాత పెంకటిళ్లు(కచ్చా)కు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

తప్పులు దొర్లకుండా..

సర్వే సిబ్బంది ఫేషియల్ ఆధారంగా యాప్‌లో లాగిన్ అయి.. లబ్ధిదారుల వివరాలను నమోదు చేస్తున్నారు. సర్వే సిబ్బంది లబ్ధిదారులు ప్రస్తుతం నివసిస్తున్న ఇళ్లతో పాటు కొత్తగా నిర్మించే స్థలాన్ని జియోట్యాగ్ చేసి అప్‌లోడ్ చేస్తున్నారు.

పెద్ద ఎత్తున దరఖాస్తులు

ఇళ్ల మంజూరుకు సంబంధించి ఇప్పటి వరకు 14,147 దరఖాస్తులు అందాయి. వీటిలో 6,807 మంది వివరాలను ఆవాస్ యోజన పోర్టల్‌లో నమోదు చేశారు. మిగిలిన 7,340 మంది వివరాలను ఈనెలాఖరు లోగా అప్‌లోడ్ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

అర్హులు ముందుకు రావాలి

సొంత స్థలాలు ఉండి ఇళ్ల నిర్మాణాలు చేసుకునే వారు సచివాలయ ఇంజినీరింగ్ సహాయకుడిని సంప్రదించి వివరాలు ఆన్‌లైన్ చేసుకోవాలి. ప్రభుత్వం చేపట్టిన సర్వే ఈ నెలాఖరుతో ముగుస్తుంది. రానున్న నాలుగేళ్ల కాలంలో ఇళ్ల రుణాలు ఇచ్చేందుకు ఈ సమాచారమే ఆధారంగా చేసుకుంటారు.
నరసింహారావు, గృహ నిర్మాణ శాఖ, పీడీ

గండాల అలలపై.. గంపెడాశల వలలు

నేడు ప్రపంచ మత్స్యకార దినోత్సవం

సముద్ర తీరం	93 కి.మీ.
తీర ప్రాంత మండలాలు	7
మత్స్యకార జనాభా	1,15,574
చేపల వేట చేసే బోట్లు	1942
వేట సాగించేవారు	17వేల మంది
ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలు	7
మత్స్యకార భరోసా లబ్ధిదారులు	11,123 మంది

న్యూస్‌టుడే, ముమ్మిడివరం, అల్లవరం

సముద్ర ఆటుపోట్లను ఎదురీదుతూ.. చేపల వేట జీవనాధారంగా ముందుకు సాగే మత్స్యకారుల నిత్యం నీటితోనే సావాసం. [illegible] నేడు ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా.. కథనం.

కొన్ని బోట్లకే ట్రాన్స్‌పాండర్లు

జిల్లాలో 1942 బోట్లు ఉంటే 250 బోట్లకు మాత్రమే ట్రాన్స్‌పాండర్లు ఏర్పాటు చేశారు. ఇవి ఉంటే సముద్రంలో ఏదైనా ప్రమాదం సంభవించినా, ప్రతికూల పరిస్థితులు ఎదురైనా ప్రత్యేక యాప్ ద్వారా కమాండ్ కంట్రోల్ రూంకు సమాచారాన్ని చేరవేయవచ్చు. మత్స్య సంపద ఎక్కడ ఎక్కువగా ఉందో తెలుసుకోవచ్చు.

దోచుకుంటున్న దళారులు

జిల్లాలో 7చోట్ల వేట బోట్లు నిలిపే(ల్యాండింగ్ సెంటర్లు) ఉన్నాయి. ఓడలరేవులో ఉన్న జెట్టీ, అంతర్వేది పల్లిపాలెంలోని మినీ హార్బర్‌లలో మత్స్యకారులు ఉత్పత్తులను విక్రయిస్తారు. ఈ రెండు చోట్ల దళారీ వ్యవస్థ వేళ్లూనింది.

సాయం రెట్టింపు..

వేట నిషేధ సమయంలో వైకాపా ప్రభుత్వంలో రూ.10 వేలు అందించారు. దానిని కూటమి ప్రభుత్వం రెట్టింపు చేసింది. డీజిల్‌పై లీటరుకు రూ.9 చొప్పున రాయితీ ఇస్తున్నారు. ప్రమాదాల్లో మృత్యువాత పడిన మత్స్యకారులకు రూ.10 లక్షలు పరిహారం అందజేస్తున్నారు

సౌకర్యాలు కల్పిస్తున్నాం..

మత్స్యకారులకు ప్రభుత్వ పరంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. అర్హులకు 50 ఏళ్లకే పింఛను అందిస్తున్నాం. ఓడలరేవులోని జెట్టీ, అంతర్వేది పల్లిపాలెంలోని మినీ హార్బర్‌లలో పనులు వేగవంతం చేశాం.
-పీవీ శ్రీనివాసరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి

అపరిచిత వ్యక్తులపై ఆరా

అల్లవరం, న్యూస్‌టుడే: తీరానికి ఉగ్రవాదులు, మావోయిస్టులు వస్తే వారిని ఎదుర్కొనేందుకు రక్షణ బలగాలు, పోలీసులు ఎంత వరకు సన్నద్ధంగా ఉన్నారనే దానిపై సాగర్ కవచ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సముద్ర తీరం వెంబడి పోలీసులు, మెరైన్ సిబ్బంది, నేవీ ఇతర అధికారులు జల్లెడ పడుతున్నారు. తీర ప్రాంత గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు, సంచారంపై ఆరాతీస్తున్నారు.

ఫాస్టాగ్ లేని వారికి స్వల్ప ఊరట

ఈతకోటలోని టోల్‌ప్లాజా

టోల్‌ప్లాజాల వద్ద రుసుము చెల్లించడానికి ఎక్కువ సమయం ఆగకుండా ఫాస్టాగ్ విధానం తెచ్చిన విషయం తెలిసిందే. ఒకవేళ ఫాస్టాగ్ లేకుంటే రుసుము రెండింతలు చెల్లించాల్సి వస్తుంది. దీన్ని కేంద్ర ప్రభుత్వం తాజాగా సడలించింది. యూపీఐ ద్వారా 25 శాతం అదనంగా చెల్లిస్తే సరిపోతుంది. ఈ నిబంధన ఈ నెల 16 నుంచి అమల్లోకి వచ్చింది. ఉదాహరణకు ఫాస్టాగ్ ఉన్న కార్లకు రూ.125 చెల్లిస్తే, లేనివారు నగదు రూపంలో రూ.250 చెల్లించాల్సి ఉంటుంది. అదే యూపీఐ ద్వారా అయితే రూ.156.25 చెల్లిస్తే సరిపోతుంది. దీనిపై ఈతకోట టోల్‌ప్లాజా మేనేజరు సత్యనారాయరెడ్డిని వివరణ కోరగా యూపీఐ నుంచి చెల్లిస్తే నగదు తగ్గుతుందని, ఈ మేరకు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ అయ్యిందన్నారు. - న్యూస్‌టుడే, రావులపాలెం పట్టణం

కాకినాడ టౌన్-మైసూరుకు ప్రత్యేక రైళ్లు

సాంబమూర్తినగర్(కాకినాడ): డిసెంబరు 1 నుంచి జనవరి 12వ తేదీ వరకు కాకినాడ టౌన్ నుంచి మైసూరు (07033)కు ప్రత్యేక రైలును 13 ట్రిప్పులు, అదే విధంగా డిసెంబరు 2 నుంచి జనవరి 13వ తేదీవరకు మైసూరు నుంచి కాకినాడ టౌన్‌కు(07034) 13 ట్రిప్పులు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల రద్దీని పురస్కరించుకుని ఈ ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు అధికారులు తెలిపారు.

బస్తా బరువులో బురిడీ..!

రేషన్ బియ్యంలో తరుగుపై డీలర్ల లబోదిబో

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

తెల్లకార్డుల్లో నమోదైన ప్రతి ఒక్కరికి 5 కేజీల చొప్పున ప్రభుత్వం బియ్యం పంపిణీ చేస్తోంది. సరఫరా విధానంలో లోపాలతో సరకు పక్కదారి పడుతోంది. మండల స్థాయి నిల్వ కేంద్రాలు (ఎంఎల్‌సీపీ) నుంచి రేషన్ దుకాణాలకు చేరే బస్తాల్లో తరుగు వస్తోందని డీలర్లు వాపోతున్నారు.

◆ ప్రతి నెలా తనకు 60 కేజీల వరకు బియ్యం తరుగు వస్తోందని మండపేట పరిధిలో ఓ డీలర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లోటును ఎలా భర్తీ చేయాలో తెలియడం లేదని వాపోయారు.

రేషన్ బియ్యం బస్తాల్లో తరుగుపై పలువురు డీలర్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయింది. ఇటీవల పౌరసరఫరాల సంస్థ మేనేజర్‌ను డీలర్లు అమలాపురం పరిధిలో ఎంఎల్ఎస్ పాయింట్‌కు తీసుకువెళ్లి ప్రత్యక్షంగా తరుగు చూపించారు. సరి చేస్తామని చెప్పినా పరిస్థితి అలానే ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

◆ ఎందుకిలా..?

50 కిలోల బస్తా సంచితో కలిపి 50.500 కిలోల బరువుతో రేషన్ డిపోకు చేరాలి. పౌరసరఫరాల గోదాముల నుంచి ఎంఎల్‌సీపీలకు లారీలతో వస్తాయి. వాటిని తూకం వేసి పంపిస్తున్నా.. ఇక్కడికి చేరే సరికి ప్రతి బస్తాకు 3 నుంచి 4 కేజీల తరుగు వస్తోంది. తూకం వేసిన చోటే మోసం జరుగుతోందని కొందరు డీలర్లు ఆరోపిస్తున్నారు.

తనిఖీలు చేస్తాం..

జిల్లాలోని 6 ఎంఎల్ఎస్ పాయింట్లలో తూకాలను తనిఖీలు చేస్తున్నాం. డీలర్లకు పూర్తి స్థాయిలో తూకం వేసిన తర్వాతనే బియ్యం పంపిణీ చేస్తున్నాం. ఎక్కడైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తాం.
-శ్రీనివాసరావు, పౌర సరఫరాల సంస్థ మేనేజర్

◆ రేషన్ దుకాణాలు: 926 ◆ కార్డులు: 5,37,902 ◆ ప్రతి నెలా పంపిణీ: 7 వేల టన్నులు ◆ ఎంఎల్‌సీపీలు: 6 ◆ గోదాములు: 9

పి.గన్నవరం కాటన్ అక్విడక్టు దిగువనుంచి సముద్రంలోకి వెళ్తున్న గోదావరి జలాలు

పెరిగిన గోదారి గలగలలు

గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం వరదల సీజన్ నుంచి నేటి వరకు భారీగా గోదావరి జలాలు కడలిలో చేరుతున్నాయి. గురువారం ధవళేశ్వరం బ్యారేజీ నుంచి 43,241 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. ఇందులో ధవళేశ్వరం ఆర్మ్ నుంచి 22,396, ర్యాలి నుంచి 13,627, మద్దూరు నుంచి 7,218 క్యూసెక్కుల చొప్పున వదిలినట్లు గోదావరి హెడ్‌వర్క్స్ జేఈ డి.రాధాకృష్ణ తెలిపారు. విజ్జేశ్వరం ఆర్మ్‌ను పూర్తిగా మూసేశామన్నారు. గత ఏడాది ఇదే రోజు బ్యారేజీ నుంచి సముద్రంలోకి 17,382 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు.

ఖరీఫ్ అవసరాలకు స్వల్పంగా..

మొంథా తుపాను ప్రభావంతో పలుచోట్ల ఖరీఫ్ వరి చేలు ముంపు బారినపడ్డాయి. అనంతరం వరికోతలు పుంజుకున్నాయి. ఈ నేపథ్యంలో ఖరీఫ్‌సాగుకు నీటి వినియోగం బాగా తగ్గింది. అవసరాలకు స్వల్పంగా నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టాకు పూర్తిగా నిలుపుదల చేశారు. తాగునీటి పథకాలకోసం మరికొంత జలం విడుదల చేస్తున్నారు.
-న్యూస్‌టుడే, పి.గన్నవరం

గడ్డర్లను విరగ్గొట్టేస్తున్నారు!

దిండి-చించినాడ వశిష్ఠ వారధిపై భారీ వాహనాల రాకపోకలను నియంత్రిస్తూ ఇరువైపులా ఏర్పాటు చేసిన గడ్డర్లను కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు తరచూ ధ్వంసం చేస్తున్నారు. బుధవారం రాత్రి ఓ భారీ వాహనం వెళ్లేందుకు ప్రయత్నించడంతో 9 అడుగుల ఎత్తున ఉన్న గడ్డర్లు రెండూ విరిగిపోయాయి. అక్కడి పర్యవేక్షకుడిపై దౌర్జన్యానికి పాల్పడి బలవంతంగా వాహనం తీసుకెళ్లారని 216 జాతీయ రహదారి సిబ్బంది తెలిపారు. దీంతో గురువారం దిండి వైపున గడ్డర్‌ను సిబ్బంది బాగుచేసి అమర్చాల్సి వచ్చింది. -న్యూస్‌టుడే, మలికిపురం



దిండి వైపు గడ్డర్‌ను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ముద్ద మరింత నాణ్యంగా..

మధ్యాహ్న భోజన వంట ఛార్జీల పెంపు

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో వండి వడ్డించే నిర్వాహకులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. సరకుల ధరలను పెంచుతూ ఉత్తర్వులు విడుదల చేసింది. కుక్‌లు, హెల్పర్లకు నెలకు రూ.3 వేలు గౌరవ వేతనం ఇస్తున్నారు. సన్నబియ్యం, గుడ్డు, రాగి పిండి, చిక్కీలను ప్రభుత్వమే సరఫరా చేస్తోంది. కూరగాయలు, వంట నూనె, ఇతర సరకులను నిర్వాహకులు సమకూర్చుకోవాలి. ప్రస్తుత ధరలను సవరించి.. కొత్త ధరలను పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చారు.

ప్రతి విద్యార్థికి రోజుకు ఇలా.. (రూ.లలో)

తరగతి	పాత ధర	కొత్త ధర
1-5	5.45	6.19
6-8	8.17	9.29
9-ఇంటర్	8.17	9.29

అదనపు ఛార్జీగా 0.40 చెల్లిస్తారు

ముమ్మిడివరం జడ్పీజీహెచ్‌లో భోజనం చేస్తున్న విద్యార్థిని

1-10 వరకు విద్యార్థులు: 87,000 ● హైస్కూల్ ప్లస్: 559
జూనియర్ కళాశాలల పిల్లలు: 2822
నిర్వాహకులకు గౌరవవేతనం: రూ.75.45 లక్షలు

ఆర్థిక ప్రాంతం.. అభివృద్ధి మంత్రం

ఉమ్మడి జిల్లాలో నీతి ఆయోగ్ ప్రణాళికలు

ఈనాడు, కాకినాడ: దేశంలో ప్రాంతాలవారీ ఆర్థిక కార్యకలాపాల ఆధారంగా గ్రోత్ హబ్‌లను ఏర్పాటుచేసి ప్రజల తలసరి ఆదాయం పెంచవచ్చన్నది నీతి ఆయోగ్ ఆలోచన. ఆ దిశగానే విశాఖ కేంద్రంగా 9 జిల్లాలతో ఎకనామిక్ రీజియన్‌కు నాంది పలికారు. ఇటీవల సీఐఐ భాగస్వామ్య సదస్సులో ముసాయిదా ప్రకటించారు. అందులో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని వనరులతో ఎలా అభివృద్ధి సాధించవచ్చో చూపారు. వ్యవసాయ, పర్యాటక, పారిశ్రామిక రంగాల వారీ ప్రాజెక్టుల గురించి వివరించారు. 2047 నాటికి జిల్లా స్థూల దేశీయోత్పత్తి (జీడీడీపీ), స్థూల అదనపు విలువ (జీవీఏ) ఎంత మేర పెరుగుతాయో అంచనా వేశారు.

కోనసీమ.. కొబ్బరికి చిరునామా

▪ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాను కొబ్బరి హబ్‌గా చేస్తారు. జిల్లాలో లక్ష ఎకరాల్లో తోటలు, అంబాజీపేటలో పరిశోధనా కేంద్రం ఉన్నాయి. అన్ని రకాల కొబ్బరి ఉత్పత్తులు, ఉప ఉత్పత్తుల తయారీతో గణనీయమైన వృద్ధి సాధించవచ్చన్నది నీతి ఆయోగ్ సూచన. ▪ కాకినాడ-యానాం-దిండి వరకు రివర్ క్రూయిజ్‌తో పర్యాటక ప్రాజెక్టుకు పరిశీలిస్తున్నారు.

కాకినాడ.. గ్రీన్ అమ్మోనియా సిటీ

▪ నీతి ఆయోగ్ నివేదికలో కాకినాడను గ్రీన్ అమ్మోనియా సిటీగా పేర్కొన్నారు. ఏడాదికి మిలియన్ మెట్రిక్ టన్నులను ఏఎం గ్రీన్ కంపెనీ తయారుచేయనుంది. రెండు గిగావాట్ల ఎలక్ట్రోలైజర్ పరికరాలు సరేసరి. ▪ డీప్ సీ, యాంకరేజ్, కాకినాడ గేట్ వే పోర్టులతో సరకు రవాణాలో తిరుగులేని శక్తిగా జిల్లా ఎదగనుంది. కాకినాడ-శ్రీకాకుళం మధ్య 150-175 కి.మీ మేర గ్యాస్ పైప్‌లైన్, కాకినాడలో గ్యాస్ టెర్మినల్‌తో ఆర్థిక వృద్ధికి ఆస్కారం. ▪ 200 ఎకరాల్లో రూ.123 కోట్లతో సమీకృత ఆక్వా పార్కు రానుంది.



నర్సరీ రాజధానిగా తూర్పు..

▪ దేశానికి నర్సరీ రాజధానిగా తూర్పుగోదావరి జిల్లాను అభివృద్ధి చేస్తారు. కడియం పరిసరాల్లో 5 వేల ఎకరాల్లో నర్సరీలు ఉండగా 30 వేల మంది ఆధారపడ్డారు. నర్సరీలను మరింతగా వృద్ధిలోకి తెచ్చి తలసరి ఆదాయం రెట్టింపు చేస్తారు. ▪ అరటి, ఆయిల్‌పామ్ సాగు ప్రోత్సహిస్తారు. కొవ్వూరే కాకుండా మిగతాచోట్లా అరటి పెంచుతారు. ▪ టెంపుల్ సర్క్యూట్‌తో ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ ఆలయాలన్నీ అందుబాటులోకి తెస్తారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

MANAGEMENT - ADMISSIONS 2025-26
Post B.Sc - 2 Years (Qualification GNM)
M.sc Nursing - 2 Years (B.Sc + 1year)
Courses offered: GNM, B.Sc Nursing, Post B.Sc, M.Sc Nursing
FIND US ON GOOGLE COLLEGE ADDRESS
Secretary & Correspondent Smt. Vasantha Kumari Indupalli B.Sc.,(N) R.N.R.M, DNEA, DNA, Former Principal :Govt. School of Nursing,Kkd Adhoc Inspector, Indian Nursing Council, New Delhi
MOTHER THERESA
COLLEGE OF NURSING, KAKINADA
Cont : 0884-2345966, 2345977, Direct: 9247255155

శ్రద్ధాంజలి

మంచి మనిషి, స్నేహశీలి, అందరిని చిరునవ్వుతో పలుకరించే మహోన్నతవ్యక్తి, మా తండ్రి గారు శ్రీ చిగురుపాటి సుబ్బారావు గారు ది.12-11-2025న స్వర్గస్తులైనారని తెలియజేయుటకు చింతిస్తూ, వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...
శ్రీ చిగురుపాటి సుబ్బారావు గారు
మే॥పా॥ కోహినూర్ గ్రాఫైట్ క్రూసిబుల్ కంపెనీ రాజమండ్రి
కుమారుడు: చిగురుపాటి ప్రవీణ్ మరియు కుటుంబసభ్యులు
పెద్దకర్మ: ది. 22-11-2025 శనివారం, రాజమండ్రి, శ్యామలానగర్, పంచవటి హోటల్ ప్రక్క వీధిలో, డోర్ నెం.78-13-7/2లో గల మా స్వగృహమునందు జరుగును.

THE ARYAPURAM CO-OPERATIVE URBAN BANK LTD. HEAD OFFICE, RAJAMAHENDRAVARAM (Reg.No.3127)
RECRUITMENT NOTIFICATION FOR THE POSTS OF ASST. CLERKS / ASST. CASHIER ON CONTRACT BASIS
Applications are invited from Candidates who passed IBPS/ SBI/RRB'S CLERKS PRELIMS for the post of Asst. Clerks on contract basis Age : 21 Yrs-28 Yrs. as on date of notification (Age relaxation as per Bank service conditions), Consolidated payment of Rs. 24,000/- p.m during probation period of 1 year and on confirmation pay scales will be applicable.
The vacancies are at our Guntur, Visakhapatnam and Bhimavaram Branches only
Selection Procedure : Written Test and Interview
Last date of application to be received to bank: 29-11-2025 by 5:00 p.m.
Those candidates who have applied in last one year are not eligible to apply Application only in specified format can be sent through courier or email or through registered post or in person. Bank reserves right to refuse any application without assigning any reasons
Detailed Recruitment notification & Application can be downloaded from Website:
http://www.aryapurambank.com/career.html
Email: arcobank_rjy@aryapurambank.com
Date: 21-11-2025 Contact no.:-0883-2473550
Secretary/CEO

(c) eenadu

దీపోత్సవం.. భక్తుల తన్మయత్వం

బండారులంకలో ఉన్న పద్మావతి, అలివేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో కార్తికమాసం చివరిరోజు కావడంతో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన సహస్ర దీపాలంకరణ ఆకట్టుకుంది. శివలింగంతోపాటు స్వస్తిక్, వేంకటేశ్వరస్వామి నామాల ఆకారంలో దీపాలను అలంకరించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

మహా కుంభాభిషేకం

కాకినాడ సాగరతీరంలో మంగళాంబికా సమేత ఆదికుంభేశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం 50వ మహాకుంభాభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. కోటి ఎనిమిది లక్షల శివలింగాలకు పండ్ల రసాలతో భక్తులు స్వయంగా అభిషేకించారు. – న్యూస్‌టుడే, గాంధీనగర్

పాల్గొన్న భక్తజనం (అంతర చిత్రం) అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం గురువారం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో శోభిల్లింది. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈవో ఎన్ఎస్ చక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. – న్యూస్‌టుడే, ఆత్రేయపురం

తీరంలో సాగర్ కవచ్

అంతర్వేది మినీ ఫిషింగ్ హార్బర్‌లో మెరైన్, సివిల్ పోలీసులు

తీరం వెంబడి ముష్కరులు దేశంలోకి చొరబడకుండా నివారించే చర్యల్లో భాగంగా గురువారం మెరైన్, సివిల్, కోస్టుగార్డ్ పోలీసుల ఆధ్వర్యంలో సాగర్ కవచ్ నిర్వహించారు. అంతర్వేది సాగర సంగమం నుంచి కరవాక తీరం వరకు పెద్దఎత్తున మోహరించారు. మత్స్యకారులు, పర్యాటకులను తనిఖీ చేశారు. సివిల్, మెరైన్ సీఐలు నరేష్‌కుమార్, నవీన్ నరసింహమూర్తి, సఖినేటిపల్లి, మలికిపురం, రాజోలు, రావులపాలెం పోలీసులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, సఖినేటిపల్లి

ఆటల్లో మెరికలు.. ఇక శిక్షకులు

- క్రీడాకారులకే పీడీలు, కోచ్‌లుగా అవకాశం
- ఇప్పటికే నియామకాలు

మండపేట, న్యూస్‌టుడే: క్రీడాకారులుగా ప్రతిభ చాటిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోని పలు విభాగాల ఉద్యోగాల్లో కోటా అమలు చేస్తున్నట్లే విద్యాశాఖలో కూడా అవకాశాలు కల్పిస్తున్నారు. గతంలో విద్యాశాఖలో 0.5 శాతంగా ఉన్న కోటాను అమలు చేయడంలో వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చూపడంతో పీఈటీ, పీడీ పోస్టులు భర్తీ కాలేదు. ఇటీవల మెగా డీఎస్సీ నియామకాల్లో 3 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంతో క్రీడాకారులకు అవకాశాలు లభించాయి. కోనసీమ జిల్లాలో 15 పీడీ పోస్టులు, 21 పీఈటీ పోస్టులు భర్తీ చేశారు. దీంతో [illegible] క్రీడాకారుల్లో సంతృప్తి వ్యక్తమవుతోంది. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఇటీవల విశాఖ నగరంలో నిర్వహించిన వేడుకల్లో విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ 3 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని ప్రకటించడమే కాకుండా ఆ వెంటనే నియామకాలు పూర్తి చేశారు.

ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు..

2028లో జరిగే ఒలింపిక్స్‌లో రాష్ట్రానికి స్వర్ణపతకం వచ్చేలా కూటమి ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తోంది. గతంలో క్రీడ కోటా ఉన్నా అమలు కాలేదు. పోటీ పరీక్ష రాసినవారికి మాత్రమే రిజర్వేషన్ అమలు చేశారు. దీనివల్ల క్రీడల్లో ప్రతిభ ఉన్నా ఎక్కువ మందికి అవకాశం దక్కలేదు. ఆ విధానానికి తాజాగా స్వస్తి పలికి క్రీడల్లో నైపుణ్యం ఉన్నవారికి కోటా ఆధారంగా నియామకాలు చేపడుతున్నారు. దేశంలోనే తొలిసారిగా మన రాష్ట్రంలో 3 శాతం కోటాతో పాటు పోటీపరీక్షతో సంబంధం లేకుండా, డీఎస్సీ రాయకున్నా ఉద్యోగావకాశాలు ఇచ్చే విధానాన్ని అమలు చేస్తున్నారు.

దశలవారీగా స్టేడియాలు..

మెగా డీఎస్సీలో రాష్ట్రంలో 421 మందికి క్రీడా కోటాలో పోస్టులు దక్కాయి. వీటిలో 44 మంది పీఈటీలు ఉన్నారు. అమరావతిలో స్పోర్ట్స్ సిటీకి 500 ఎకరాలు ప్రభుత్వం కేటాయించింది. దశలవారీగా 13 స్టేడియాల నిర్మాణాలు పూర్తి చేస్తాం.

– పేరం రవీంద్రనాథ్, స్పోర్ట్స్ అకాడమీ డైరెక్టర్, అమరావతి

కొబ్బరి.. ధర తడబడి

- తమిళనాడులో పెరిగిన దిగుబడి
- కోనసీమపై తీవ్ర ప్రభావం

న్యూస్‌టుడే, అంబాజీపేట

కోనసీమ కొబ్బరి మార్కెట్లో కాయల ధరలు తగ్గిపోయాయి. మొన్నటి వరకు రైతులు, వ్యాపారులకు కాసులు కురిపించిన ఈ పంటకు కాస్త డిమాండ్ తగ్గుతుంటే నిరాశ లోనవుతున్నారు. కార్తికమాసం పూర్తికావటం, ఉత్తరాది రాష్ట్రాల్లో చలి తీవ్రత అధికం కావటం, తమిళనాడులో కొబ్బరి దిగుబడులు అందుబాటులోకి రావటం వంటి ప్రతికూల అంశాల నడుమ ఇక్కడి ధరలు మందగమనంలో ఉన్నాయి. ఈ ఏడాది సెప్టెంబరులో వెయ్యి పచ్చికొబ్బరికాయల ధర రికార్డు స్థాయిలో రూ.27 వేలు నమోదయింది.

అంబాజీపేటలో పచ్చికొబ్బరికాయల రాశులు

అక్కడ తగ్గి.. ఇక్కడ పెరిగి..

తమిళనాడు రాష్ట్రంలో కొబ్బరి తోటలకు వ్యాపించిన తెగుళ్లు, పురుగుల కారణంగా దిగుబడులు పడిపోవడంతో కోనసీమ కొబ్బరికాయలకు అవసరం ఏర్పడింది. ఇప్పుడు అక్కడ దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో ఇక్కడి కాయలకు గిరాకీ తగ్గిపోయింది. వెయ్యి పచ్చి కాయలు సెప్టెంబరులో రూ.27 వేలు, అక్టోబరులో రూ.26 వేలు ఉండగా, ప్రస్తుతం రూ.19 వేల నుంచి రూ.18 వేలకు దిగజారింది. కోనసీమలో ఎకరానికి 1,500 వరకు కొబ్బరికాయల దిగుబడి వచ్చేది. ప్రస్తుతం 800 నుంచి 1000 కాయలు మాత్రమే వస్తున్నాయని రైతులు చెబుతున్నారు.

సన్నగిల్లిన ఎగుమతులు

ఉత్తరాది రాష్ట్రాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో కొబ్బరి వ్యాపారాలు సజావుగా సాగడం లేదు. ఈ ప్రభావం కోనసీమ ఎగుమతులపై చూపుతోందని కొబ్బరి మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చి వరకు కూడా ధరలు ఇలానే ఉంటాయని అంటున్నారు. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు నిత్యం కోనసీమ జిల్లా నుంచి 100 నుంచి 150 వరకు లారీల కొబ్బరి కాయలు ఎగుమతులు జరిగేవి. ఇప్పుడు 30 నుంచి 40 లారీల సరకు మాత్రమే వెళ్తోందని వ్యాపారవర్గాలు చెబుతున్నాయి.

మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్, చిత్రంలో ఎమ్మెల్యే సుబ్బరాజు, డీఆర్వో మాధవి

రబీకి సమృద్ధిగా సాగునీరు

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: రానున్న రబీ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా వరి సాగుకు సమృద్ధిగా సాగు నీరు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో రబీ సీజన్‌కు సంబంధించి సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహించారు. రబీలో జిల్లాలో అన్ని రకాల పంటలు కలిపి 8.96 లక్షల ఎకరాల్లో సాగు చేపట్టే అవకాశం ఉందన్నారు. వీటికి 92.22 టీఎంసీల నీరు అవసర అవుతుందని అంచనా వేసినట్లు చెప్పారు. గోదావరిలో 9 టీఎంసీలు, సీలేరు నుంచి 44, పోలవరం ప్రాజెక్టు నుంచి 20, సీలేరు బైపాస్ అనుమతితో మరో 20 టీఎంసీల జలాలను సేకరించనున్నట్లు ఆయన తెలిపారు. కాలువల్లో చేపట్టాల్సిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోష్ మాట్లాడుతూ గోదావరి, సీలేరు జలాల లభ్యతపై పునః పరిశీలన చేయాలన్నారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ పూడిక తీత పనులు సకాలంలో ప్రారంభించి నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ లాకుల మరమ్మతులు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యేలు దేవ వరప్రసాద్, వేగుళ్ల జోగేశ్వరరావు, గిడ్డి సత్యనారాయణ, డీఆర్వో కె.మాధవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శెట్టిబలిజలకు అన్యాయంపై బహిరంగ చర్చ

- మాజీ మంత్రి చెల్లుబోయినకు మంత్రి సుభాష్ సవాల్

రామచంద్రపురం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో శెట్టిబలిజలకు జరిగిన అన్యాయంపై బహిరంగ చర్చకు రావాలని ఆ పార్టీ నాయకులకు కార్మిక శాఖ మంత్రి సుభాష్ సవాల్ విసిరారు, శెట్టిబలిజల ఆత్మగౌరవాన్ని వైకాపా అగ్రనేతల కాళ్ల దగ్గర తాకట్టు పెట్టి మోకరిల్లిన మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల్ ప్రస్తుతం ఆ సామాజిక వర్గంపై మొసలికన్నీరు కారుస్తున్నారని ఒక ప్రకటనలో విమర్శించారు. శెట్టిబలిజలను గౌడ కులంలో చేరుస్తూ వైకాపా ప్రభుత్వం విడుదలచేసిన జీవోను చంద్రబాబు పాలనలోనే జారీచేశారంటూ మాజీ మంత్రి చేసిన ఆరోపణలను మంత్రి తీవ్రంగా ఖండించారు. ఎవరి పాలనలో జీవోలు జారీ చేశారో తేదీలతో సహా ఉంటుందనే విషయం తెలియదా అని ప్రశ్నించారు. వైకాపా పాలనలో కులస్థులకు ద్రోహం జరుగుతున్నా నోరువిప్పని ఆయన పదవిపోయిన తర్వాత ప్రేమ ఒలకబోస్తున్నారని విమర్శించారు.

వసతి గృహాల విద్యార్థులకు సౌకర్యాలు

దుప్పట్లు అందిస్తున్న జేసీ నిశాంతి

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని రకాల వసతి గృహాల విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు జేసీ నిశాంతి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో వసతి గృహాల అధికారులకు దుప్పట్లు, బకెట్లను అందించారు. ఇటీవల జిల్లాలోని అన్ని వసతి గృహాల్లో మౌలిక వసతులకు సంబంధించి అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించామన్నారు. నాణ్యమైన భోజనం, సురక్షితమైన తాగునీరు, శుభ్రమైన మరుగుదొడ్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. డీఆర్వో కె.మాధవి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి జ్యోతిలక్ష్మీ దేవి, వసతి గృహాల సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చే నెల 9 నుంచి ర్యాలిలో పవిత్రోత్సవాలు

స్వామివారు

ర్యాలి(ఆత్రేయపురం): ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో డిసెంబరు 9 నుంచి 11 వరకు పవిత్రోత్సవాలు ఘనంగా జరగనున్నాయి. ఏడాది పొడవునా ఆలయంలో నిర్వహించే అర్చనలు, ఉత్సవాల్లో అర్చకులు, భక్తుల వల్ల తెలిసీతెలియక జరిగే దోషాల నివారణకు ఆగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో భాగవతుల వెంకటరమణమూర్తి గురువారం వెల్లడించారు. ఈ మేరకు తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

హుండీ సొమ్ము తస్కరించిన వ్యక్తికి రిమాండ్

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం హుండీల ఆదాయం లెక్కింపు సమయంలో రూ.60 వేలు తస్కరించిన వేగేయమ్మపేటకు చెందిన వాసంశెట్టి శ్రీనివాసరావును పోలీసులు అరెస్టు చేసి గురువారం కొత్తపేట కోర్టులో హాజరు పర్చారు. న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించడంతో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించారని సీఐ విద్యాసాగర్ తెలిపారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు

మదనపల్లె విద్య: మదనపల్లె మండలం పుంగనూరు రోడ్డులోని గ్రీన్‌వ్యాలీ పాఠశాలలో జరుగుతున్న 69వ రాష్ట్రస్థాయి అండర్- 14 బాలబాలికల ఫుట్‌బాల్ పోటీల్లో భాగంగా రెండో రోజైన గురువారం క్రీడాకారులు పోటాపోటీగా తలపడ్డారు. పలు జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. బాలుర విభాగంలో పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, చిత్తూరు, నెల్లూరు, కర్నూల్, కడప, విశాఖపట్నం, అనంతపురం జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. బాలికల విభాగంలో అనంతపురం, నెల్లూరు, పశ్చిమగోదావరి, విశాఖపట్నం, తూర్పుగోదావరి, కడప, చిత్తూరు, శ్రీకాకుళం జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి.

'సివిల్స్' ఉచిత శిక్షణకు దరఖాస్తులు

కాకినాడ కలెక్టరేట్: బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో యూపీఎస్సీ ద్వారా నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ సంక్షేమశాఖ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సంక్షేమాధికారిణి ఎం.లల్లీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని అభ్యర్థులు ఈ నెల 25లోగా కాకినాడలోని బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. వివరాలకు 80081 21321, 89858 99221 ఫోను నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ఏర్పాట్లు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురంలోని జిల్లా పరిషత్తు బాలుర పాఠశాల 150 వసంతాల వేడుకలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు తెలిపారు. గురువారం ఆయన పూర్వవిద్యార్థులతో సమావేశమయ్యారు. శనివారం నిర్వహించనున్న సమ్మేళనం గురించి చర్చించారు. ఈ సందర్భంగా శనివారం మధ్యాహ్నం బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పాఠశాలను ఫ్రెడరిక్ రికెట్స్ హేమాంగ్ వే బోర్డు స్కూల్‌గా దీనిని స్థాపించారని అన్నారు. ధవళేశ్వరం బ్యారేజీ నిర్మాణ సమయంలో సర్ ఆర్థర్ కాటన్ ఈ పాఠశాలలో విశ్రాంతి తీసుకున్నారన్నారు. పూర్వవిద్యార్థులు కుటుంబాలతో కలిసి రావాలని కోరారు.

చిన్నారులు, మహిళలపై నేరాల నియంత్రణకు నిఘా

పోలీసుస్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఐజీ అశోక్‌కుమార్, చిత్రంలో ఎస్పీ రాహుల్‌మీనా

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: చిన్నపిల్లలు, మహిళలపై నేరాలకు పాల్పడేవారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని ఏలూరు రేంజ్ ఐజీ జీవీఎస్ అశోక్‌కుమార్ చెప్పారు. ద్రాక్షారామ పోలీసు స్టేషన్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించి రికార్డులు తనిఖీచేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. శాంతిభద్రతల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, నేరాల అదుపునకు తీసుకున్న చర్యలు ప్రస్తావించారు. స్టేషన్ పరిధిలో గంజాయి కేసులు లేవని, పాత నేరస్థులపై నిఘా కొనసాగుతుందని వివరించారు. స్థానికంగా ఉంటూ వేర్వేరు ప్రాంతాల్లో నేరాలకు పాల్పడుతున్నవారిపై నిఘా ఉంటుందని చెప్పారు. అలాంటి వారు పట్టుబడితే పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామన్నారు. పాఠశాలల నిర్వాహకులు, సిబ్బంది, విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. దీని కోసం ఓఎన్జీసీ సమకూర్చిన ప్రచార వాహనాన్ని ఉపయోగిస్తున్నామన్నారు. షీ టీమ్స్ నిలిపివేతపై వివరణ ఇస్తూ వాటి స్థానంలో శక్తి బృందాలు ప్రతి సబ్ డివిజన్‌కు ఒకటి ఉందని చెప్పారు. మహిళలకు ప్రత్యేక పోలీస్‌స్టేషన్ గురించి ప్రస్తావించగా అమలాపురంలో ఉందని, నేర పరిశోధనపై వారికి అధికారాలు ఇవ్వాలని కోరుతూ ఉన్నతాధికారులకు లేఖ రాశామని తెలిపారు. అంతకుముందు ఐజీ ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని సందర్శించి పూజలు చేశారు. కార్యక్రమంలో ఎస్పీ రాహుల్ మీనా, సీఐ ఎం.వెంకటనారాయణ, ఎస్సై ఎం.లక్ష్మణ్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న

అంబాజీపేట, న్యూస్‌టుడే: నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలగ్రామ లక్ష్మీప్రసన్న అన్నారు. అంబాజీపేటలో గురువారం జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. త్వరలో మన ఊరు-మన జెండా కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. గ్రామాల్లో పర్యటించి బూత్ కమిటీలు వేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి చీకరమెల్లి శ్రీనివసరావు, సలాది వీరబాబు, కొపనాతి దత్తాత్రేయ, తమనంపూడి రామకృష్ణారెడ్డి, కర్రి చిట్టిబాబు, పాలూరి సత్యానందం, ఆర్వీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల మర్రిలో ప్రతీకార హత్య

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: సూర్యాపేట గ్రామీణ ఠాణా పరిధిలోని పిల్లలమర్రి శివారులో ఈ నెల 15న అమలాపురం మండలం కరక్కాయలపేటకు చెందిన నాగవరపు సత్యనారాయణ అలియాస్ సత్తిబాబు (50) హత్యకు గురయ్యారు. ఈ కేసులో తొమ్మిది మంది నిందితులను హైదరాబాద్‌లోని జీడిమెట్లలో బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్పీ నరసింహ గురువారం వివరాలను వెల్లడించారు. సూర్యాపేట జిల్లా పిల్లలమర్రి శివారులో గుర్తుతెలియని వ్యక్తి హత్యకు గురైనట్లు తెలియడంతో ఫింగర్ ప్రింట్ డేటా బేస్ ఆధారంగా మృతుడిని సత్యనారాయణగా గుర్తించామన్నారు.

చంపుతానని బెదిరించడంతో..: గతంలో సత్యనారాయణ హైదరాబాద్ బోయినపల్లిలోని తన బావమరిది గెల్లా కిరణ్ ఇంట్లో భార్య ఝాన్సీరాణితో గొడవపడి కత్తితో దాడిచేయడంతో ఆమె మృతిచెందింది. బావమరిది భార్య షీలా గాయాలతో బయటపడింది. ఈ కేసులో విచారణ ఖైదీగా జైలుకు వెళ్లిన అతను ఈ నెల 6న జైలు నుంచి విడుదలై, మరుసటి రోజు కరక్కాయపేటకు వెళ్లి తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పిన అందరినీ చంపుతానని బెదిరించాడు. దీంతో కిరణ్ అక్క చీకురుమిల్లి అమ్మాజీ, బావ చీకురుమల్లి మాధవరావు, వారి కుమారుడు శశికుమార్, కూతురు మౌనిక, కిరణ్ మేనమామ నేతల సర్వేశ్వరరావు, ఇతని కారు డ్రైవర్ గిడ్డి రమేశ్, కిరణ్ భార్య షీలా, అద్దె ఇంట్లో నివాసం ఉంటే విశ్వనాథం కలిసి ఈ నెల 14న హైదరాబాద్‌లో కోర్టుకు హాజరైన సత్యనారాయణను బలవంతంగా కారులో ఎక్కించుకొని కిడ్నాప్ చేశారు. కారులోనే గొంతు నొక్కి హత్య చేశారు. పిల్లలమర్రి శివారులోని ఖమ్మం జాతీయ రహదారి పక్కన కాలువలో పడేశారు. ముఖంపై యాసిడ్ పోసి పరారయ్యారు. నిందితులు హైదరాబాద్ జీడిమెట్లలోని సర్వేశ్వరరావు ఇంట్లో ఉండగా పోలీసులు అరెస్టు చేశారు. మృతుడిపై బోయినపల్లి ఠాణాలో భార్య హత్యతోపాటు అమలాపురం ఠాణాలో నాలుగు దాడి కేసులు ఉన్నట్లు గుర్తించారు. కేసు ఛేదనలో చురుగ్గా పనిచేసిన వారికి ఎస్పీ అభినందించి రివార్డు అందజేశారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	21,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	20,000-21,000
కొత్త (పచ్చి) కాయ	18,000-19,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	106-00
రిటైల్ లైవ్	133-00
డ్రెస్డ్	193-00
స్కిన్‌లెస్	219-00

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్‌డ్ అసెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం
అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ వై. కిరణ్ చంద్ (చీఫ్ మేనేజర్) మొబైల్ నెం.91609 49910, ఇ-మెయిల్ ఐడి: sbi.10077@sbi.co.in, ఆస్తి తనిఖీ కొరకు : 98482 49289

ఇ-వేలం అమ్మకం ప్రకటన

[illegible]

రిజర్వు ధర: రూ.1,18,00,000/- ధరావత్తు: రూ.11,80,000/- బిడ్ పెంపుదల: రూ.20,000/-
ఇ-వేలం తేదీ: 09-12-2025 సమయం: ఉ|| 11.00 గంటల నుండి సా|| 04.00 గంటల వరకు

[illegible]

తేది: 17-11-2025, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES
బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

FINANCIAL SERVICES
ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభ వాయిదా లేదా నెలవారీ వడ్డీ పద్ధతిలో పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటి. ✆ 73862 01191.

REAL ESTATE
LAND FOR SALE
GENERAL
రాజమండ్రికి 30 కి.మీ. దూరంలోగల మురారి - గండేపల్లి మధ్య నేషనల్ హైవేకి చేర్చి 100 అ||ల రోడ్ ఫేసింగ్‌తో 60 సెంట్లు భూమి అమ్మబడును. (నో బ్రోకర్స్), ✆ 90329 88265.

PLOT FOR SALE
GENERAL
వైజాగ్ Google డేటా సెంటర్ - ఎయిర్‌పోర్ట్ మధ్య హైవే ఫేసింగ్ వెంచర్‌లో మీపెట్టుబడికి గజానికి అధిక ఆదాయం. త్వరపడండి. ✆ 9949000033

JOBS
కొటక్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో పనిచేయుటకు రిటైర్డ్ ఉద్యోగులకు, సీనియర్ సిటిజనులకు, గృహిణీలకు ఉద్యోగ అవకాశం. Cont: మోహనరావు, రిటైర్డ్ ఎంప్లాయ్ ✆ 96035 93843

లక్ష్మి మోటార్స్ (YAMAHA షోరూమ్) తణుకు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, ఏలూరు నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 96667 14613.

HYD, SR నగర్ బాయ్స్ హాస్టల్‌లో అనుభవం గల భార్యభర్తలు వంటమాస్టర్లు కావలెను. సంప్ర: ✆ 9391009238, 8885070231.

రాజమండ్రి హెయిర్ క్లినిక్ నందు పనిచేయుటకు నర్సులు కావలెను. (నో నైట్ డ్యూటీస్) ఆసక్తి కలవారు సంప్రదించండి: 76749 99906.

మా గ్లోబెల్ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు టీం మెంబర్స్ కావలెను. మోర్ డీటెయిల్స్ Contact Cell: 89852 40614.

Required Managers, Agents, Salary and Incentives. Marketing Job, guarantee Income, Age 50 above Cont: 90108 09384

లైఫ్ మెడికల్ స్టోర్స్, రాజమండ్రి నందు పనిచేయుటకు క్యాషియర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఫార్మాసిస్టులు, ఫార్మసీ అసిస్టెంట్లు, పార్ట్‌టైమ్ స్టాఫ్, డెలివరీ బాయ్స్ కావలెను. మా బ్రాంచిలు: ప్రకాష్‌నగర్, మెయిన్‌రోడ్, దేవీచౌక్ ✆ 99667 44450

సేల్స్ గర్ల్స్ కావలెను. అనుభవం ఉన్నవారు మాత్రమే సంప్రదించండి. భవాని సిల్క్స్, శశికాంత్‌నగర్, కాకినాడ. Contact: 91339 59999

FACULTY/ TEACHERS
Wanted 6th, 7th Maths/ English Teacher, Attractive Salary. Cont: Prakasham E.M. High School, Madhuranagar, Kkd. ✆ 63023 05325, 99488 81449.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-45 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

కొబ్బరి చెట్ల లీజుతో ఆదాయం

మలికిపురం, న్యూస్‌టుడే: గోదావరి గట్లపై ఉన్న కొబ్బరి చెట్లకు లీజు విధానం అమలు చేయడం ద్వారా నీటిసంఘాలకు ఆదాయం సమకూరిస్తే కాలువల అభివృద్ధికి వీలుంటుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. అమలాపురంలో గురువారం జరిగిన నీటిపారుదల సలహామండలి సమావేశంలో ఈ విషయం అధికారుల దృష్టికి తెచ్చినట్లు స్థానిక విలేకర్లకు చెప్పారు. నియోజకవర్గంలో ఈవిధంగా లక్ష కొబ్బరి చెట్లు ఉన్నట్లు అంచనా వేశామన్నారు. వీటి ద్వారా రూ.30 కోట్ల వరకు ఆదాయం సమకూరుతుందని, అందులో కనీసం పదిశాతం నీటి సంఘాలకు బదలాయిస్తే నియోజకవర్గంలోని 11 సంఘాలకు రూ.3 కోట్ల వరకు లభిస్తుందన్నారు. వీటితో కాలువలు, డ్రెయిన్ల నిర్వహణ చేపట్టవచ్చని తెలియజేశారు.

ఎన్నికల హామీలు నెరవేరుస్తున్నాం

పి.గన్నవరం, న్యూస్‌టుడే: ఎన్నికల హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం వేగవంతమైన చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. నియోజకవర్గంలో 28 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ఉన్నతీకరించి వాటిల్లో పనిచేస్తున్న వారికి ప్రధాన కార్యకర్తగా హోదా కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను గురువారం పి.గన్నవరంలోని క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలకు అందజేశారు. మరో అయిదు కేంద్రాలు కూడా ఉన్నతీకరణ(అప్‌గ్రేడ్) అవుతాయని వెల్లడించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పప్పుల సాయిబాబు, సీడీపీవో వై.విజయశ్రీ పాల్గొన్నారు.

పంటల సాగులో సందేహాలా?

మామిడికుదురు, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో మామిడికుదురు మండల వ్యవసాయాధికారి ఎన్‌వీవీ సత్యనారాయణతో 'ఫోన్ ఇన్' కార్యక్రమం జరగనుంది. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, ఇతర పథకాల అమలు పరంగా సందేహాలు, వచ్చే దాళ్వావరి సాగుకు సంబంధించి విత్తనాల ఎంపిక, సాగుకు సమాయత్తం, మెలకువలు, సస్యరక్షణ, ప్రస్తుత వరికోతలు, యాంత్రీకరణ తదితర అంశాలకు సంబంధించిన సమస్యలను రైతులు వివరించాలి.

తేదీ: ఈ నెల 22 (శనివారం)
సమయం: ఉదయం 10 నుంచి 11 గంటల వరకు

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబరు: రాజోలు: 80085 74174
ఉ॥ 10 - మ॥ 1 పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట: 90323 93884

మ్యాన్‌హోల్ బాగుచేత

మలికిపురం: మలికిపురం అడబాలవారి మెరక శివాలయం సమీపంలో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు బయటకు వచ్చి దుర్వాసన వ్యాపిస్తోంది. ఈ సమస్యను సర్పంచి గెడ్డం రాజ్యలక్ష్మి, కార్యదర్శి తేజ ఏసుబాబు దృష్టికి తేగా స్పందించిన వారు సిబ్బందితో బాగుచేయించి మురుగునీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు.

స్పందనకు స్పందన

కొళాయిలకు మరమ్మతులు

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెం పాత ఎల్ఐసీ సమీపంలో వీధి కొళాయి పాడైపోవడంతో నీరు వృథాగా పోతోంది. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లడంతో సిబ్బందిని పంపి మరమ్మతు చేయించారు.

ప్రతిభా పోటీలు.. భవితకు పునాది

– న్యూస్‌టుడే, మలికిపురం

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ప్రతిరోజు ఒక్కో అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విభాగాల వారీగా ప్రతిభా పోటీలు పెడుతూ విజ్ఞానాన్ని పెంపొందిస్తున్నారు. ఈ నెల 14 నుంచి నిర్వహించిన వారోత్సవాల్లో వివిధ పాఠశాలల నుంచి పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మలికిపురం, కేశనపల్లి శాఖా గ్రంథాలయాల్లో గ్రంథాలయాధికారులు బి.నాగేంద్రకుమార్, కె.ఇందిర ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వం, చదరంగం, క్విజ్, కవితలు, చిత్రలేఖనం, క్యారమ్స్, మ్యూజికల్ ఛైర్, పద్యాలు, కథలు చెప్పడం తదితర పోటీలు నిర్వహించి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రోత్సాహక బహుమతులకు ఎంపిక చేశారు. లక్కవరంతో పాటు మలికిపురం డిగ్రీ కళాశాలలోనూ వారోత్సవాలు జరిగాయి. రామరాజులంక, కేశనపల్లి, మలికిపురం ఏఎఫ్‌డీటీ, కేశనపల్లి తదితర పాఠశాలల నుంచి సుమారు 800 మంది వరకు చిన్నారులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకున్నాను

వివిధ పోటీలు మాలో ప్రతిభను వెలికితీయడానికి దోహదం చేశాయి. కేశనపల్లిలో నిర్వహించిన పోటీల్లో వ్యాసరచన, క్విజ్, చదరంగం, క్యారమ్స్, పాటలు, పద్యాల పోటీల్లో పాల్గొన్నాను. తెలుగు భాషా దినోత్సవం గురించి చక్కగా వివరించారు. ఇది మాకు ఉపయోగపడుతుంది. – ఎ.సంజన, 9వ తరగతి, కేశనపల్లి

మలికిపురంలో విజేతకు ప్రశంసాపత్రం అందిస్తున్న నిర్వాహకులు

పోటీతత్వాన్ని పెంచుతాయి

గ్రంథాలయాల్లో నిర్వహించిన పోటీలు భవిష్యత్తులో ఉపయోగకరంగా ఉన్నాయి. పోటీతత్వాన్ని పెంపొందించే విధంగా వారోత్సవాలు జరిగాయి. నేను వివిధ పోటీల్లో పాల్గొన్నాను. క్విజ్‌లో ప్రథమ బహుమతి గెల్చుకున్నాను. – ఒ.ఇందు, కేశనపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల

రోజూ గ్రంథాలయానికి వెళ్తాను

ప్రతిరోజూ మలికిపురంలోని గ్రంథాలయానికి వెళ్లి విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు, వార్తాపత్రికలు చదవడం అలవాటు. ఏటా గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొంటున్నాను. ఈసారి వ్యాసరచనలో ప్రథమ బహుమతి గెల్చుకున్నాను. అంతా సద్వినియోగం చేసుకోవాలి. – సీహెచ్ సనాశ్రీకాంక్ష, 9వ తరగతి, మలికిపురం

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

కొత్తపేట, న్యూస్‌టుడే: బిల్లకుర్రు సబ్‌స్టేషను పరిధిలో విద్యుత్తు మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుంది. ఈ మేరకు వానపల్లి, బిల్లకుర్రు గ్రామాలకు సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కె.రాంబాబు తెలిపారు.

ఆలయాల నిర్మాణానికి నిధుల మంజూరు

మలికిపురం, న్యూస్‌టుడే: దేవాలయాల నిర్మాణానికి, పునర్నిర్మాణ పనులకు తితిదే శ్రీవాణి ట్రస్టు నుంచి రూ.50 లక్షలు అందనున్నట్లు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ చెప్పారు. విశ్వేశ్వరాయపురంలోని క్యాంపు కార్యాలయంలో ఆయా ఆలయాల ఈవోలు, ముఖ్య నాయకులతో గురువారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. భక్తుల నుంచి 25 శాతం అంటే రూ.12.50 లక్షలు సమకూర్చాలని, మిగతా మొత్తం శ్రీవాణి ట్రస్టు ద్వారా అందుతుందని చెప్పారు. ఈ మేరకు ప్రతిపాదనలు రూపొందించాలని కోరారు.

పుస్తక పఠనం.. మేధోశక్తికి దోహదం

మామిడికుదురు, సఖినేటిపల్లి, ఆత్రేయపురం: గ్రంథాలయాలను వినియోగించుకోవడం ద్వారా అన్ని రంగాల్లోనూ ప్రతిభ చూపవచ్చని సమగ్రశిక్ష సీఎంవో బొరుసు సుబ్రహ్మణ్యం అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా మామిడికుదురు శాఖ గ్రంథాలయంలో గురువారం జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందజేశారు. ఎంఈవో మోకా వెంకస్వరాజు, ప్రధానోపాధ్యాయులు బి.చిరంజీవి రావు, సీహెచ్ కేశవరావు, గ్రంథాలయాధికారి సూర్యనారాయణ పాల్గొన్నారు. ఆత్రేయపురం మండలం పేరవరంలో అక్షరాస్యతపై ర్యాలీ నిర్వహించారు.

మామిడికుదురులో విజేతకు జ్ఞాపిక అందిస్తున్న సీఎంవో సుబ్రహ్మణ్యం

పేరవరంలో అక్షరాస్యతపై ర్యాలీ

పశుదాణా విక్రయాలు ప్రారంభం

రాజోలు: రాజోలు పీఏసీఎస్ వద్ద అధ్యక్షుడు కసుకుర్తి త్రినాథస్వామి గురువారం రాయితీ పశుదాణా విక్రయాలను ప్రారంభించారు. అధిక పాల దిగుబడి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు సంకర్తి ఆదినారాయణ, రేకపల్లి శ్రీనివాస్, సోంపల్లి సర్పంచి బత్తుల శ్రీనివాసరావు, ఏడీ కె.దివాకర్, సీఈవో బండారు భాస్కరరావు పాల్గొన్నారు.

పవర్‌లిఫ్టింగ్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపిక

అంబాజీపేట, న్యూస్‌టుడే: ముక్కామల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. జిల్లా కేంద్రంలో జరిగిన పోటీల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న జి.దినేష్‌ప్రసాద్, వై.యశ్వంత్‌సుకుమార్‌లు బంగారు పతకాలు సాధించారని ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీహరి ప్రసాద్ తెలిపారు. వీరు త్వరలో రాష్ట్ర స్థాయిలో పాల్గొంటారన్నారు. డీఈవో షేక్ సలీం బాషా, ఎస్ఎంసీ ఛైర్మన్ బి.శ్యామ్యూల్‌రాజు, సర్పంచి బండారు వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కనకదుర్గ, పీడీ పవన్‌కిశోర్ గురువారం అభినందించారు.

హెచ్ఎంతో విజేత విద్యార్థులు

చోదకులు జాగ్రత్తలు పాటించాలి

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: చలి తీవ్రత పొగమంచు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వాహన చోదకులు జాగ్రత్తలు పాటిస్తూ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో సూచించారు. ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల డ్రైవర్లు మంచుకురిసే సమయంలో వాహనాలను నిలుపుదల చేయడం మంచిదన్నారు. ప్రతి డ్రైవర్ రహదారి భద్రత నియమాలు పాటిస్తూ వాహనాలను నడపాలన్నారు. ఈ ఏడాది రహదారి భద్రత ఉల్లంఘనలకు పాల్పడిన 427 మంది డ్రైవింగ్ లైసెన్సులను సస్పెండ్ చేసినట్లు ఆయన తెలిపారు.

ఆ మలుపు ప్రమాదకరం

మాచవరం-నందంపూడి పంచాయతీల పరిధిలో దొమ్మేటివారి పాలెం కృష్ణుడి ఆలయం సమీపంలో ఉన్న మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇక్కడ మూడు రహదారులు కలిసే చోట వేగంగా వచ్చే వాహన చోదకులు పలువురు అదుపుతప్పి పడిపోతున్నారు. మలుపు ప్రాంతంలో రహదారిపై కొంత మేర ఆక్రమణలు ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సర్పంచి నాగాబత్తుల శాంతకుమారిని వివరణ కోరగా ర.భ. శాఖ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, అంబాజీపేట

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాం

అయినవిల్లి, న్యూస్‌టుడే: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. గురువారం సిరిపల్లెలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, అయినవిల్లి, నేదునూరు గ్రామాల్లో పశుదాణా పంపిణీని ఆయన ప్రారంభించారు. పీఏసీఎస్ ఛైర్మన్ వర్రే శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వ్యవసాయ సహకార సంఘం ద్వారా మంజూరైన డ్రోన్‌ను లబ్ధిదారుకు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ చిట్టూరి శ్రీనివాసరావు, ఎన్.గంగాధరరావు, ఎంపీటీసీ సభ్యులు కళ్లేపల్లి వెంకటసుబ్బరాజు, ఐండుగుల వెంకటరామయ్య పాల్గొన్నారు.

లబ్ధిదారుడికి డ్రోన్ అందిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

విద్యుత్తు సమస్యల పరిష్కారానికి చర్యలు

మలికిపురం: విద్యుత్తు సమస్యల పరిష్కారానికి కృషి జరుగుతోందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాంబాబు చెప్పారు. ప్రజాప్రతినిధులు, వినియోగదారులతో గుడిమెళ్లంక పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు, గృహ వినియోగదారులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. లోవోల్టేజీ, లైన్‌మెన్ కొరతతో ఇబ్బందులు, స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల అవసరం గురించి వివరించారు. తక్షణమే ఆయా సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాజోలు డీఈఈ బి.కృష్ణ, ఏఈ బి.ప్రసాద్, ఎంపీడీవో మేడిచర్ల వెంకటలక్ష్మణ్, జడ్పీటీసీ సభ్యురాలు బళ్ల ప్రసన్నకుమారి, సర్పంచులు నల్లి విజయకుమారి, కడలి దుర్గాదేవి, రాపాక రమేశ్‌బాబు, ఆనందకుమార్, ఆరేటి రంగనాయకులు, కాకర శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాలువలో తూడు.. సాగునీరందక గోడు

చిరుతపూడి-అవిడి డ్యామ్ కూడలి నుంచి చిరుతపూడి, ఇసుకపూడి మీదుగా మాచవరానికి సాగునీరు అందించే పంటకాలువ వెంబడి చెత్త, వ్యర్థాలతోపాటు తూడు, తుప్పలు పెరిగిపోవడంతో ప్రవాహం నిలిచిపోయిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉపాధి హామీ పథకం ఏపీవో ఎ.వి.కృష్ణను వివరణ కోరగా జలవనరుల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తామని చెప్పారు. - న్యూస్‌టుడే, అంబాజీపేట

వంతెన వద్ద గుంత.. తీరని చింత

మాచవరం పంచాయతీ పరిధిలో మెట్లకాలనీకి వెళ్లే దారిలో వంతెన మలుపు వద్ద రోడ్డు కోతకు గురై గుంత ఏర్పడింది. రాత్రి వేళల్లో పలువురు వాహన చోదకులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇక్కడి గుంతను పూడ్చివేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై సర్పంచి నాగాబత్తుల శాంతకుమారిని వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, అంబాజీపేట

వైనతేయ తీరం నువ్వానేనా

ప్రపంచ మత్స్యకార దినోత్సవం పురస్కరించుకుని మామిడికుదురు మండలం గోగన్నమఠంలోని వైనతేయ నదీ తీరంలో శుక్రవారం పడవల పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికిగాను స్థానిక మత్స్యకారులు తమ పడవలను జెండాలతో అందంగా తీర్చిదిద్దారు. పోటీలకు సమాయత్తం అవుతున్నారు. – న్యూస్‌టుడే, మామిడికుదురు

తాగునీరు వృథా

నేదునూరు శివాలయం కూడలి వద్ద ప్రధాన రహదారిలో తాగునీటి పైపులైను దెబ్బతినడంతో కొళాయి నీరు వృథాగా పోతోంది. దీంతో శివారు కాలనీలకు సక్రమంగా సరఫరా కావడం లేదని స్థానికులు వాపోతున్నారు. దీనిని పరిశీలించి మరమ్మతులు చేపడతామని పంచాయతీ కార్యదర్శి అన్వర్ తెలిపారు. – న్యూస్‌టుడే, అయినవిల్లి

అప్రోచ్ పటిష్ఠం

వాడపల్లి కొత్తవంతెన వద్ద కుంగిన అప్రోచ్‌ను గురువారం ర.భ.శాఖ అధికారులు పటిష్ఠం చేశారు. బ్యాంక్ కెనాల్‌పై గోవిందనగర్ వద్ద నిర్మించిన వంతెన అప్రోచ్ కుంగిపోవడంతో వాహనదారులు భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారంటూ 'కుంగిన అప్రోచ్‌ను పటిష్ఠం చేయరూ' శీర్షికన వెలువడిన కథనానికి తోడు కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ కూడా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన డీఈ రాజేంద్ర సర్వేబాదులు, ఎర్ర గ్రావెల్ వేయించారు. - న్యూస్‌టుడే, ఆత్రేయపురం

ఈనాడు కథనానికి స్పందన

ఆక్రమణల్లో కాలువ గట్లు

న్యూస్‌టుడే, పి.గన్నవరం, అంబాజీపేట

పి.గన్నవరం నియోజకవర్గంలోని పలు పిల్ల కాలువలకు సంబంధించిన గట్లు ఆక్రమణలతో పాటు తుప్పలు పెరిగిపోయి అధ్వానంగా మారాయి. కొంత మంది ఆక్రమించుకుని ఏకంగా పక్కా కట్టడాలు నిర్మిస్తుండగా మరికొందరు కొబ్బరి, అరటి తోటలు పెంచుకుంటూ ఆదాయం సమకూర్చుకుంటున్నారు. ఈ కారణంగా ఆయా ప్రాంతాల్లో రాకపోకలకు వీలులేకుండా పోతోంది. కనీసం తుప్పలు కూడా తొలగించకుండా ఉంచేస్తున్నారు. నియోజకవర్గంలోని గన్నవరం, ముక్తేశ్వరం, అమలాపురం ప్రధాన పంట కాలువలకు అనుసంధానంగా సుమారు 50 వరకు పిల్లకాలువలు ఉన్నాయి. పి.గన్నవరం మండలంలోని ఏనుగుపల్లి, ఆసుపత్రి, బూరుగు, బోడపాటి, అంబాజీపేట మండలంలోని ముక్కామల, పుల్లేటికుర్రు, మామిడికుదురు మండలంలోని నగరం, ఈదరాడ తదితర పంటకాలువల గట్లు అధ్వానంగా ఉన్నాయి. జలవనరుల శాఖ ఇంజినీరింగ్ అధికారులు వాటిపై వాహనాలతో వెళ్లి పరీక్షించి తగు చర్యలు తీసుకునేవారు. లష్కర్లు వెళ్లేందుకు అనువుగా ఉండాలి. రానురాను ఆక్రమణలు పెరిగిపోయి నడిచేందుకు కూడా వీలులేకుండా ఉన్నాయి. ఇలాంటి వాటిపై ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని రైతులు మొరపెట్టుకుంటున్నారు.

మూసుకుపోయిన ఏనుగుపల్లి పంటకాలువ గట్టు

శుభ్రం చేయిస్తాం

పంట కాలువలపై పెరిగిపోయిన తుప్పలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. రైతులు వెళ్లేవిధంగా వీటిని శుభ్రం చేయిస్తాం. ఆక్రమణలను గతంలోనే గుర్తించాం. వాటిపైనా చర్యలు తీసుకుంటాం.
- కె.వెంకటేశ్వరరావు, ఈఈ, గోదావరి మధ్యడెల్టా

డీజిల్ ట్యాంకర్ సీజ్

ఐ.పోలవరం: యానాం నుంచి అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ట్యాంకర్‌ను ఐ.పోలవరం పోలీసులు గురువారం పట్టుకున్నారు. యానాం నుంచి 8వేల లీటర్లతో పశ్చిమగోదావరి జిల్లా ఆచంట తరలిస్తుండగా.. ఎదుర్లంక వద్ద పట్టుకున్నట్లు ఎస్సై ఎంవీవీ రవీంద్రబాబు తెలిపారు. ట్యాంకర్‌ను సీజ్ చేసి.. ముగ్గురు వ్యక్తుల్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

హరహర మహాదేవ

వాడపల్లి విశ్వేశ్వరస్వామి

ఆత్రేయపురం, మామిడికుదురు, న్యూస్‌టుడే: కార్తిక మాసం చివరి గురువారం శైవక్షేత్రాలన్నీ భక్తజనంతో అలరారాయి. ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

● మామిడికుదురు మండలం పెదపట్నంలంకలో అయ్యప్పస్వామికి 18 కలశాలతో పూజ నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన మాలధారులు పాల్గొన్నారు.

పెదపట్నంలంకలో అయ్యప్పస్వామికి కలశ పూజ

మందులు అందుబాటులో ఉండాలి

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: హెచ్ఐవీ వల్ల రోగ నిరోధక వ్యవస్థ బలహీనపడి పిల్లలకు తరచూ ఇన్ఫెక్షన్లు వస్తాయని జిల్లా అదనపు వైద్యారోగ్యశాఖ అధికారిణి భరతలక్ష్మి పేర్కొన్నారు. సరైన పోషణ అందిస్తూ మందులు అందుబాటు ఉంచాలన్నారు. అమలాపురంలోని ఏరియా ఆసుపత్రిలో గురువారం హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపరిటెండెంట్ శంకరరావు, డాక్టర్ సుమలత, సుబ్బారావు, దుర్గాప్రకాష్, మురళీ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

తెలుగునాడు విద్యుత్తు కార్మిక సంఘం అధ్యక్షునిగా గొడవర్తి

సురేష్

ఆలమూరు: అమలాపురం సర్కిల్ తెలుగునాడు విద్యుత్తు కార్మిక సంఘం అధ్యక్షుడిగా ఆలమూరుకు చెందిన గొడవర్తి సురేష్ గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కన్వీనర్‌గా భారతి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. యూనియన్, కార్మికుల అభివృద్ధి, శ్రేయస్సుకు తమవంతు కృషి చేస్తామని వారు తెలిపారు.

వైకాపా అసత్య ప్రచారం తగదు: బాబ్జి

కొత్తపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్య కళాశాలలపై వైకాపా అవాస్తవ ప్రచారాన్ని నమ్మొద్దని తెదేపా జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి కోరారు. గురువారం కొత్తపేటలో ఆయన మాట్లాడుతూ పీపీపీ పద్ధతిలో వైద్య కళాశాలలను సత్వరమే అందుబాటులోకి తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే, పేదలకు సీట్లు తగ్గినట్లు గ్రామాల్లో వైకాపా నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. పారిశ్రామిక ప్రగతికి ప్రాధాన్యం ఇచ్చిన ప్రభుత్వం వందలాది కంపెనీలను ఆకర్షించి రూ.లక్షల కోట్ల విలువ చేసే ఒప్పందాలు కుదుర్చుకుంటోందని వివరించారు. బూసి భాస్కరరావు, కడలి భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై పోరాటం

ముమ్మిడివరం: ఎస్సీ వర్గీకరణ పేరుతో అన్ని రాజకీయ పార్టీలు దళితుల ఐక్యతపై కుట్ర చేస్తున్నాయని మాల మహానాడు నాయకులు ఆరోపించారు. ముమ్మిడివరంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు వద్ద గురువారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ వల్ల ఉనికిని కోల్పోయి.. మాల సామాజికవర్గ గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోందన్నారు. శాంతియుత పోరాటానికి అంతా సిద్ధం కావాలని నాయకులు పిలుపునిచ్చారు. కొంకి వెంకట్రావు, గుర్రాల రాంబాబు, చీకురుమిల్లి కిరణ్‌కుమార్, టి.దుర్గాప్రసాద్, సత్యనారాయణ, సూరిబాబు, నెల్లి సూరిబాబు పాల్గొన్నారు.

నేలపై పడక.. చలికి తట్టుకోలేక

వసతిగృహాల్లో విద్యార్థుల ఇక్కట్లు

పరిశీలన

ఇళ్లకు దూరంగా వసతిగృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు తగిన వసతుల్లేక ఇబ్బంది పడుతున్నారు. చలి కాలంలో చన్నీళ్ల స్నానంతో సతమతమవుతున్నారు. నేలపైనే దుప్పట్లు పరచుకుని నిద్రిస్తున్నారు. కొన్నిచోట్ల భవనాలకు తలుపులు, మరికొన్ని చోట్ల స్లాబ్‌లు దెబ్బతిన్నాయి. దోమలతో ఇబ్బంది పడుతున్నారు. 'న్యూస్‌టుడే' పరిశీలనలో వారి ఇబ్బందులు వెలుగులోకి వచ్చాయి.

ఆలమూరులో తలుపులు లేని స్నానాల గదులు

స్నానానికి చన్నీళ్లే గతి

ఆలమూరు: ఆలమూరు సమీకృత బాలుర వసతిగృహంలో 58 మంది విద్యార్థులు ఉన్నారు. మరుగుదొడ్లకు, స్నానాల గదులకు తలుపులు లేవు. ఆరుబయటే చన్నీళ్ల స్నానం చేస్తున్నారు. సోలార్ హీటర్లు, గీజర్లు లేవు. రెండు కిలోమీటర్ల దూరంలోని కొత్తూరులో పాఠశాల ఉండటంతో రాకపోకలకు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

మంచాలు లేక ఇబ్బందులు

అయినవిల్లి: తొత్తరమూడిలో వెనుకబడిన తరగతుల వసతిగృహంలో కళాశాల విద్యార్థినులు 22 మంది ఉన్నారు. ప్రహరీ, మరుగుదొ((డ్ల చుట్టూ తుప్పలు అలముకున్నాయి. స్థానిక కాలనీవాసులు వ్యర్థాలు వేస్తుండటంతో దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. చన్నీళ్లతో స్నానం చేస్తున్నారు. నేలపై చాపలు వేసుకుని నిద్రిస్తున్నారు. అయినవిల్లి బీసీ కళాశాల బాలుర వసతిగృహంలో 58 మంది ఉన్నారు. వేడినీళ్లు, మంచాల సౌకర్యాలు లేవు.

దుర్వాసనతో అవస్థలు

రావులపాలెం పట్టణం: రావులపాలెంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాల సమీపంలో సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాలు రెండు ఉన్నాయి. వీటిలో 130 మంది విద్యార్థులు ఉంటున్నారు. 17 గదులు ఉండగా ఒక్కో గదిలో 8 మంది నిద్రిస్తున్నారు. చన్నీటి స్నానాలు చేయలేక ఇబ్బంది పడుతున్నారు. డ్రెయినేజీ సదుపాయం లేకపోవడంతో మురుగు నిలిచిపోయి దుర్వాసన వ్యాపిస్తోంది. సరైన రహదారి కూడా లేదు. డ్రెయినేజీ, రోడ్డు పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు వార్డెన్ వాణి తెలిపారు.

దోమలతో సహవాసం

మలికిపురం: కేశనపల్లి సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహంలో కిటికీ తలుపులు, మెష్ సక్రమంగా లేకపోవడంతో దోమల బెడదతో విద్యార్థులు సతమతమవుతున్నారు. వసతిగృహం, ప్రహరీల మధ్య తుప్పలు పెరగడంతో దోమలు విజృంభిస్తున్నాయి. నాలుగు గదులకు గాను ఒకటి మాత్రమే అనుకూలంగా ఉండటంతో అందులోనే 20 మంది పడుకొంటున్నారు. భోజనశాల స్లాబ్ దెబ్బతినడంతో వరండాలో భోజనాలు పెడుతున్నారు.

కేశనపల్లి వసతిగృహం పక్కన తుప్పలు, పిచ్చి మొక్కలు

(c) eenadu

అమలాపురం
• అమలాపురం • ముమ్మిడివరం

‘ఎస్సీ వర్గీకరణపై పోరాటానికి సిద్ధం’

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ పేరుతో అన్ని రాజకీయ పార్టీలు దళితుల ఐక్యతపై కుట్ర చేస్తున్నాయని మాల మహానాడు నాయకులు ఆరోపించారు. ముమ్మిడివరంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు వద్ద గురువారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ వల్ల ఉనికిని కోల్పోయి.. మాల సామాజికవర్గ గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోందన్నారు. శాంతియుత పోరాటానికి అంతా సిద్ధం కావాలని నాయకులు పిలుపునిచ్చారు. కొంకి వెంకట్రావు, గుర్రాల రాంబాబు, చీకురుమిల్లి కిరణ్‌కుమార్, తోట దుర్గాప్రసాద్, సత్యనారాయణ, సూరిబాబు, నెల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో నిన్నటి ధరలు (కిలోకు)

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: టమాట - 43, కంద - 55, బీట్‌రూట్- 52, కీరదోసకాయలు -35, అల్లం - 82, క్యాప్సికం -90, చిలకడదుంపలు - 50, గుమ్మడి -30, ముల్లంగి -45, ఉసిరి - 80, నిమ్మకాయలు - 30. 38, వంకాయలు నలుపు - 65, వంకాయలు తెలుపు - 50, బెండకాయలు - 60, పచ్చిమిర్చి - 45, కాకరకాయ - 42, బీరకాయలు - 58, కాలీఫ్లవర్ -28, క్యాబేజీ - 38, క్యారెట్ - 60, దొండకాయలు - 60, బంగాళదుంపలు - 25, ఉల్లిపాయలు - 25, గోరుచిక్కుళ్లు - 45, దోసకాయలు - 35, చిక్కుడుకాయలు - 115, చేమదుంపలు -

★ ఒక్కొక్కటి చొప్పున..

ఆనబకాయ -30, పొట్లకాయ -25, అరటికాయ -6, మునగకాయ -12, ఆకుకూరలు కట్ట -10, కొత్తిమీర కట్ట -30, కొబ్బరికాయ - 25.

విజేతలతో ప్రిన్సిపల్ తమ్మేశ్వరరావు, అధ్యాపకులు

ఉత్సాహంగా ఉపన్యాస పోటీలు

ఉపన్యాసం ఇస్తున్న విద్యార్థి

అమలాపురం పట్టణం: కృత్రిమ మేధ (ఏఐ)ను ఎలా ఉపయోగించుకోవాలో విద్యార్థులు చక్కగా వివరించారు. అమలాపురం నల్లవంతెన దిగువున పరంజ్యోతి మిరియం డిగ్రీ కళాశాలలో ‘ఈనాడు - ఈటీవీ’ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ‘కృత్రిమ మేధ (ఏఐ) వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు’ అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. బి.కుమార్, బి.సుభాష్, ఇ.కీర్తన మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు ‘ఈనాడు’ సమకూర్చిన బహుమతులు, ప్రశంసాపత్రాలను ప్రిన్సిపల్ తమ్మేశ్వరరావు, అధ్యాపకులు పి.కన్యకుమారి, ఎస్.వెంకటేశ్వరరావు, ఎస్.రామలక్ష్మి, విజయ దుర్గాలక్ష్మి, శ్రీహరిబాబులు అందజేశారు.

ఎక్కడ చూసినా.. ప్లాస్టిక్ వ్యర్థాలే

• రహదారులు అస్తవ్యస్తం • డ్రెయినేజీ వ్యవస్థకు అడ్డంకులు

న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

ఈదరపల్లిలో కాలువ పక్కన ప్లాస్టిక్ వ్యర్థాలు

పట్టణంలో ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోతోంది. రహదారులు.. మురుగు కాలువలు.. ఖాళీ ప్రదేశాలు.. ఎక్కడ చూసినా ఈ వ్యర్థాలే కనిపిస్తున్నాయి. కాలువల్లో పేరుకుపోయి మురుగు కదిలేందుకు సమస్యలు ఎదురవుతున్నాయి. కూరగాయల దుకాణాలు, హోటళ్లు, తోపుడు బండ్లు.. ఇలా ఎక్కడి చూసినా ఇబ్బడి ముబ్బడిగా పాలిథిన్ సంచులు, ప్లాస్టిక్ వస్తువులు వినియోగిస్తున్నారు. నిత్యం ఒక్కో ఇంటి నుంచి కనీసం నాలుగు పాలథిన్ సంచులు చెత్తకుప్పలోకి చేరుతున్నాయని అంచనా.

ఈ ప్రాంతాల్లో..

పట్టణంలోన అన్ని ప్రాంతాల మురుగు కాలువల్లో గుట్టలుగా తేలుతున్నాయి. స్థానిక నల్లవంతెన బైపాస్ రోడ్డు, కె.అగ్రహారం ప్రధాన రహదారి, భూపాయఅగ్రహారంలోని ఖాళీ స్థలాల్లో, ఈడబ్ల్యూఎస్ కాలనీ, కార్మికనగర్, సావరం రోడ్డులో ప్లాస్టిక్ వ్యర్థాలు నిత్యం పోగవుతున్నాయి. వీటిని డంపింగ్ తరలిస్తుండగా అక్కడ గుట్టలను తలపిస్తున్నాయి. ఒకసారి తాగిపారేసే నీటి బాటిళ్లు సైతం కాలువల్లో తేలుతున్నాయి. వీటి వల్ల పారిశుద్ధ్య ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

పట్టణంలో నిషేధించాం

పట్టణంలో పురపాలక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాలిథిన్ వస్తువులు అమ్మే దుకాణంలో దాడులు నిర్వహిస్తున్నారు. ఈ నెలాఖరు నుంచి పూర్తిస్థాయిలో అదుపు చేస్తాం. నీటితో కొనుగోలు చేసి బాటిళ్లను తిరిగి వినియోగించకూడదు. అమలాపురం పురపాలక సంఘ కార్యాలయంలో ప్లాస్టిక్ బాటిళ్లను నిషేధించాం. గాజు, స్టీల్ గ్లాసులనే వాడుతున్నాం.

–వి.నిర్మల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్


నియామక పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

అంగన్‌వాడీ సిబ్బందికి నియామక పత్రాలు

ముమ్మిడివరం: మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేసిన చోట్ల కార్యకర్తలకు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు చేతుల మీదుగా గురువారం నియామక పత్రాలను అందజేశారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో 9 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు మెయిన్ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేశారు. వీటిలో ఆయాలను కార్యకర్తలుగా నియమించారు. సీడీపీఓ ఎం.నిహారిక, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సముద్రపు నాచు విడుదల

కాట్రేనికోన: చిర్రయానంలో సముద్రపు నాచు పెంపకానికి సిద్ధమైన యూనిట్ల వద్ద మత్స్యకార మహిళలు పెంచిన నాచును విడుదల చేయనున్నారని ఎఫ్‌డీవో చలపతి తెలిపారు. కలెక్టరు మహేష్‌కుమార్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పాల్గొననున్నారని ఆయన తెలిపారు.

రంగాపురంలో రుద్రాభిషేకం

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చినరాజప్ప

అమలాపురం గ్రామీణం: రంగాపురంలోని రాజరాజేశ్వరి సమేత రామేశ్వరస్వామి ఆలయంలో మహామృత్యుంజయ పాశుపత రుద్రాభిషేకం కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత వెలవెలపల్లి వీరవెంకటసత్యనారాయణ శివాచార్య ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు చేశారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, అనురాధ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు.

పుష్కరఘాట్‌లో మహిళల పూజలు

ఘనంగా కార్తిక పూజలు

కాట్రేనికోన: కార్తికమాసం చివరిరోజు కుండలేశ్వరాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు కాళ్లకూరి కామేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామివారికి నైవేద్యం సమర్పించి పూజలర్పించారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే : ఇటీవల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయిలో నిర్వహించిన ఖోఖో పోటీల్లో అండర్-17, అండర్-14 విభాగాల్లో సమనస మహాత్మాజ్యోతిబా పులె బీసీ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. పల్లి వెంకటేష్, వనమాడి లోకేష్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ వై.టి.ఎస్.రాజు గురువారం తెలిపారు.

సీఆర్పీల బదిలీలు నిలుపుదల చేయాలి

అల్లవరం: విద్యాశాఖలో ఒప్పంద పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న సీఆర్పీల అకస్మిక బదిలీలు నిలుపుదల చేయాలని గురువారం జేసీ నిశాంతికి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం జిల్లాలోని 123 స్కూల్ కాంప్లెక్స్‌లను 87కు తగ్గించిందన్నారు. 29 మంది సీఆర్ ఎంటీలను మిగులుగా చూపించి అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల్లోని ఖాళీల్లో భర్తీ చేయాలని విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఉత్తర్వులు ఇచ్చారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇతర జిల్లాలకు బదిలీచేయడం తగదన్నారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

యానాం: భక్తుల విరాళాలు, తిరుమల తిరుపతి దేవస్థానం ఆర్థిక సహాయంతో జరుగుతున్న యానాం శ్రీవేంకటేశ్వరుని ఆలయ నిర్మాణం పనుల్ని పుదుచ్చేరి ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు గురువారం పరిశీలించారు. పనులు స్థితిగతుల గురించి, చేపట్టాల్సిన తదుపరి నిర్మాణాల గురించి తితిదే ఆలయ స్థపతి కృష్ణారావు, గుత్తేదారు ప్రతినిధి అబ్బారావులతో మల్లాడి చర్చించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఎంపికైన విద్యార్థులు

అల్లవరం, న్యూస్‌టుడే: ఇటీవల కాకినాడలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ విభాగంలో దేవగుప్తం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రాజ్‌కుమార్ తెలిపారు. వాలీబాల్ విభాగంలో 9వ తరగతి చదువుతున్న గెద్దాడ సాయి ప్రసన్న, బాలుర విభాగంలో పవన్ కుమార్, అథ్లెటిక్ పోటీల్లో అండర్ 17 విభాగంలో షాట్ పుట్‌లో గూడపల్లి రక్షితలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

బహుమతుల ప్రదానం.. సత్కారం

ఉప్పలగుప్తం: ఉప్పలగుప్తం, భీమనపల్లి గ్రంథాలయాల్లో వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంపీడీవో కృష్ణ, ఎంఈవో-2 సత్యకృష్ణ, రాష్ట్ర ఆక్వాబోర్డు డైరక్టర్ దేశంశెట్టి లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఆర్యవైశ్య

ఐ.పోలవరంలో రెడ్డి గౌరికి సత్కారం

కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం, ఎంపీటీసీ సభ్యురాలు నాగులాపల్లి శేషవేణి పాల్గొన్నారు.

అమలాపురం పట్టణం: గ్రంథాలయాలు విజ్ఞాన సంపదలని ఉప విద్యాశాఖాధికారి జి.సూర్యప్రకాశం పేర్కొన్నారు. అమలాపురంలోని ప్రథమశ్రేణి శాఖ గ్రంథాలయంలో అధికారి జీవీఆర్ఎస్ వర్మ ఆధ్వర్యంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సభ నిర్వహించారు. విజేతలకు డీవైఈవో సూర్యప్రకాశం బహుమతులను అందజేశారు.

ముమ్మిడివరం: ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ విళ్ల వీరాస్వామినాయుడు, సుబ్బారెడ్డి, జాగు

భీమనపల్లి గ్రంథాలయంలో నాయకులకు సన్మానం

రాంబాబు, శీలం వెంకటరమణ, జాగు రాంబాబు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఐ.పోలవరం: ప్రముఖ వైజ్ఞానిక సాంస్కృతిక సంస్థకు చెందిన మానవవాద గ్రంథాలయం వద్ద సంస్థ అధ్యక్షుడు డా.పుల్లెపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. రెడ్డి గౌరి, వెంకటేశ్వరరావులను సావిత్రిబాయి పులే అవార్డులతో సత్కరించారు.

పట్టణాన్ని అభివృద్ధి చేయాలని వినతి

మంత్రి నారాయణకు పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురం పట్టణంలోని మురుగుకాలువలు, రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను కోరారు. గురువారం విజయవాడలోని మంత్రి కార్యాలయంలో కలిసి ఈ మేరకు కోరినట్లు చెప్పారు. పురపాలక సంఘంలో అభివృద్ధి పనులను పరిశీలించేందుకు రావాలని కోరామన్నారు.

గుంతల దారిలో గండం

ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి నుంచి ఎస్.యానాం వెళ్లే కొత్తకాలువ రహదారి గుంతలతో అధ్వానంగా మారింది. అమలాపురం నుంచి ఎస్.యానాం బీచ్‌కు చేరుకోవడానికి దగ్గర దారి కావడంతో పర్యాటకులు ఈ రహదారిపై నిత్యం ప్రయాణిస్తుంటారు. ఎస్.యానాం చమురు సంస్థలకు చెందిన వందలాది ఉద్యోగులు, పలు వాహనాలకు సైతం ఈ రహదారే ప్రయాణం తప్పనిసరి. అధికారులు చొరవచూపి ఈ రహదారిని త్వరితగతిన బాగు చేయాలని పలువురు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

పరిసరాలు అధ్వానం

విలసవిల్లి పరిధిలోని గోకవల్లి అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ తుప్పలు, పిచ్చిమొక్కలు పెరిగి అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. వర్షం వస్తే కేంద్రానికి వెళ్లడానికి చిన్నారులు ఇక్కట్లు పడుతున్నారు. పిచ్చిమొక్కలు దట్టంగా పెరగడంతో విషపురుగులు వస్తున్నాయని పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తుప్పలు తొలగించి పరిసరాలను బాగుచేయాలని పలువురు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

బెర్ములు లేక ప్రమాదకరంగా..

అమలాపురం మహిపాలవీధి ప్రధాన రహదారికి బెర్ములు నిర్మించక అటుగా వెళ్లే వాహనాలు, కార్లు గుంతలో పడి ఇబ్బందులు పడుతున్నారు. చీకటిలో రాకపోకలు సాగించే సమయంలో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

ప్రమాదమని తెలిసినా..!

అమలాపురం మండలం సమనస లాకు వంతెన ప్రమాదకరంగా మారింది. ఈ పరిస్థితి నెలల తరబడి ఉన్నప్పటికీ ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికే ఈ వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు విరిగిపోయాయి. భారీ వాహనాలు సైతం రాకపోకలు సాగిస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

విద్యుత్తు సమస్యల పరిష్కారానికి చర్యలు

మలికిపురం: విద్యుత్తు సమస్యల పరిష్కారానికి కృషి జరుగుతోందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రాంబాబు చెప్పారు. ప్రజాప్రతినిధులు, వినియోగదారులతో గుడిమెళ్లంక పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు, గృహ వినియోగదారులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. లోవోల్టేజీ, లైన్‌మెన్ కొరతతో ఇబ్బందులు, స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల అవసరం గురించి వివరించారు. [illegible] చేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాజోలు డీఈఈ బి.కృష్ణరాజా, ఏఈ బి.ప్రసాద్, ఎంపీపీ మేడిచర్ల వెంకటసత్యవాణి, జడ్పీటీసీ సభ్యురాలు బళ్ల ప్రసన్నకుమారి, సర్పంచులు నల్లి విజయకుమారి, కడలి దుర్గాదేవి, రాపాక రమేశ్‌బాబు, ఆనందకుమార్, ఆరేటి రంగనాయకులు, కాకర శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎల్జీని కలిసిన యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి

ఎల్జీ కైలాష్‌నాథన్‌ను సత్కరిస్తున్న గొల్లపల్లి

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథన్‌ను కలిసి పలు అంశాలపై చర్చించినట్లు యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దరియాలతిప్ప ఐలెండు వద్ద గ్యాస్ పైప్‌లైన్ లీకేజీ ఘటన పరిహారం విషయమై కోరినట్లు చెప్పారు. దీనిపై ఓఎన్జీసీ అధికారులతో ఎమ్మెల్యే సమక్షంలో సమావేశం ఏర్పాటు చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ కుళోత్తుంగన్‌ను ఆదేశించారని ఎమ్మెల్యే తెలిపారు. యానాం మాస్టర్ ప్లాన్ రెండు మూడు నెలల్లో పూర్తవుతుందని గవర్నర్ చెప్పారన్నారు.

పశువుల దాణా పంపిణీ

ఉప్పలగుప్తం: భీమనపల్లి ప్రాథమిక పరపతిసంఘం వద్ద రాష్ట్ర ఆక్వాబోర్డు డైరెక్టర్ దేశంశెట్టి లక్ష్మీనారాయణ, తదితరులు గురువారం పాడిరైతులకు రాయితీపై పశుదాణా అందజేశారు. చల్లపల్లి, భీమనపల్లి, పశువైద్యాధికారులు రమేష్, నిరోషా, సీఈవో దుర్గాప్రసాద్, పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: ప్రభుత్వం అందిస్తున్న పశువుల దాణాతో పాల ఉత్పత్తి బాగా పెరుగుతుందని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందికుప్ప సొసైటీ కార్యాలయం వద్ద ఛైర్మన్ నూకల వీవీఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో గురువారం పాడిరైతులకు పశువులదాణా పంపిణీ చేశారు.

డీజిల్ ట్యాంకర్ సీజ్

ఐ.పోలవరం: యానాం నుంచి అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ట్యాంకర్‌ను ఐ.పోలవరం పోలీసులు గురువారం పట్టుకున్నారు. యానాం నుంచి 8వేల లీటర్లతో పశ్చిమగోదావరి జిల్లా ఆచంట తరలిస్తుండగా.. ఎదుర్లంక వద్ద పట్టుకున్నట్లు ఎస్సై ఎంవీవీ రవీంద్రబాబు తెలిపారు. ట్యాంకర్‌ను సీజ్ చేసి.. ముగ్గురు వ్యక్తుల్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

సమనసలో రచ్చబండ

అమలాపురం గ్రామీణం: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైకాపా కోటి సంతకాల సేకరణలో భాగంగా సమనసలో గురువారం రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పినిపే శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలల పట్ల ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరికాదని అన్నారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. ఎంపీపీ భాగ్యలక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు శ్రీహరిరామ్‌గోపాల్, ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణ, వైకాపా మండల అధ్యక్షుడు చిరంజీవిరావు, రమేష్, స్పర్జన్‌రాజు, గణపతి, నాని, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలనకు సహాయ కేంద్రాలు

హెల్ప్ డెస్కులో వివరాలు తెలుసుకుంటున్న ఓటర్లు

యానాం, న్యూస్‌టుడే: యానాంలో జరుగుతున్న ప్రత్యేక విస్తృత తనిఖీ (ఎస్ఐఆర్)లో భాగంగా 2002 జాబితాలో తమ వివరాలు తెలుసుకునేందుకు ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో పౌరకార్యాలయంలో సాంఘిక సంక్షేమశాఖ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. 2025 ఓటరు జాబితా ప్రకారం యానాంలో 40,043 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2002లో ఓటు ఉన్నవారెందరు, తర్వాత ఓటు హక్కు పొందినవారి తల్లిదండ్రులు, తాత, అమ్మమ్మ, నాన్నమ్మల ఓట్లు ఎక్కడి జాబితాలో ఉన్నాయన్న రుజువును ఎస్ఐఆర్ కోసం సమర్పించడం తప్పనిసరి. 2002 జాబితాలో ఓటు పరిశీలించేందుకు ప్రైవేటు సంస్థలు నగదు వసూలు చేస్తుండడంతో ఈ సేవలు ఉచితంగా అందించాలని పరిపాలనాధికారి అంకిత్‌కుమార్ ఆదేశించారు. దీంతో (ఎన్నికల విభాగం హెల్ప్ డెస్క్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది.

కెరటాలపై బతుకు ప్రయాణం

కాట్రేనికోన, న్యూస్‌టుడే: ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కాట్రేనికోనకు చెందిన ప్రముఖ చిత్రకారుడు ఆకొండి అంజి గీసిన సముద్రంలో చేపలు పడుతున్న మత్స్యకారుల నీటిరంగుల చిత్రం ఆకట్టుకుంది. మత్స్యకారుల వలలో పడేవి చేపలు మాత్రమే కాదని.. సాహసంతో నిండిన శ్రమ ఉంటుందనే ఆలోచనతో ఈ చిత్రం గీశానని అంజి తెలిపారు.

నిబంధనలు పాటించాలి

అమలాపురం కలెక్టరేట్: జిల్లాలో బాణసంచా తయారీ కేంద్రాలు, అమ్మకాలు చేసే వారు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని డీఆర్వో కె.మాధవి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో బాణసంచా తయారీ, అమ్మకాలు చేసే వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల రాయవరం మండలంలో చోటు చేసుకున్న ప్రమాదం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం బాణసంచా తయారీ యూనిట్లపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు.

మందులు అందుబాటులో ఉండాలి

మాట్లాడుతున్న ఏడీఎంహెచ్‌వో భరతలక్ష్మి

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: హెచ్ఐవీ వల్ల రోగ నిరోధక వ్యవస్థ బలహీనపడి పిల్లలకు తరచూ ఇన్ఫెక్షన్లు వస్తాయని జిల్లా అదనపు వైద్యారోగ్యశాఖ అధికారిణి భరతలక్ష్మి పేర్కొన్నారు. సరైన పోషణ అందిస్తూ మందులు అందుబాటు ఉంచాలన్నారు. అమలాపురంలోని ఏరియా ఆసుపత్రిలో గురువారం హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపరింటెండెంట్ శంకరరావు, డాక్టర్ సుమలత, సుబ్బారావు, దుర్గాప్రకాష్, మురళీ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఓడలరేవులో తనిఖీలు నిర్వహిస్తున్న మెరైన్ పోలీసులు

తీరప్రాంతంలో సాగర్ కవచ్

యానాంలో తనిఖీలు

యానాం, అల్లవరం: తీరప్రాంత భద్రత వార్షిక తనిఖీలో భాగంగా గురువారం యానాంలో సాగర్ కవచ్ విస్తృత తనిఖీ ప్రక్రియ జరిగింది. ఎస్పీ వరదరాజన్ నేతృత్వంలో వేకువ జాము నుంచే సావిత్రినగర్ మొదలుకొని కనకాలపేట వరకు వివిధ గ్రామాలు, కీలక ప్రాంతాలు, పరిపాలనాధికారి కార్యాలయం, రాజీవ్‌బీచ్ ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. తీవ్రవాదులు వస్తే వారిని ఎలా పట్టుకోవాలనే అంశంపై ఈ కసరత్తు జరిగింది. ఇందులో భాగంగా మారువేషాల్లో యానాంలో సంచరించిన ఇద్దరు సిబ్బంది(రెడ్‌ఫోర్స్) పట్టుకోవడంతో కార్యక్రమం ముగిసింది. ఎస్సైలు పునీత్‌రాజ్, కట్టా సుబ్బరాజు, కవల రమణమూర్తి పాల్గొన్నారు. ★ అల్లవరం మండలం ఓడలరేవు తీరంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

పోటీల్లో చిన్నారుల ప్రతిభ

న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

చిత్రాలను చూపిస్తున్న విద్యార్థులు

చిన్నారులకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచేందుకు, ప్రతిభను వెలికితీసేందుకు గ్రంథాలయ వారోత్సవాల్లో పోటీలు నిర్వహించారు. అమలాపురం ప్రథమశ్రేణి శాఖ గ్రంథాలయంలో అధికారి జీవీఆర్ఎస్ వర్మ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఈ పోటీల్లో జడ్పీ బాలుర పాఠశాల, మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సీనియర్ విభాగంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు సైబర్ నేరాలపై ప్రజల అప్రమత్తతపై వ్యాసరచన, చిత్ర లేఖన పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగంలో 5, 6, 7 తరగతుల విద్యార్థులకు పుస్తక పఠనం వల్ల లాభాలపై వ్యాసరచన, చిత్రలేఖనంపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు మాట్లాడారు.

బొమ్మలు గీయడమంటే ఇష్టం..

చదువుతో పాటు ఖాళీ సమయంలో చిత్రకళపై ఆసక్తితో బొమ్మలు గీస్తా. చిత్రలేఖన సాధన వల్ల రాత మెరుగుపడింది. ఇది పరీక్షల్లో ఉపయోగపడుతుందని భావిస్తున్నా. –నెల్లి రేష్మ, విత్తనాల కాలువగట్టు

దేశభక్తి పెంపొందించేలా..

నేను జడ్పీ బాలుర పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నా. నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రం గీశా. ఇంటి వద్ద యూట్యూబ్‌లో చూసి బొమ్మలు వేయడం ప్రారంభించి క్రమేపీ ఆసక్తి పెంచుకున్నా. ఖాళీ సమయంతో పాటు సెలవురోజుల్లో సాధన చేస్తున్నా. –రాయుడు హేమచంద్రిక, శ్రీరామపురం

(c) eenadu

మండపేట

విరాళం అందిస్తున్న దాతలు

సుందరపల్లి ఆలయ నిర్మాణానికి విరాళం

పామర్రు: గోదావరి తీరంలోని కె.గంగవరం మండలం సుందరపల్లిలోని ఉమా సమేత సోమేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి దాతలు రూ.2,00,116 విరాళంగా అందించారు. రామచంద్రపురానికి చెందిన వల్లూరి సత్యనారాయణ జ్ఞాపకార్థం భార్య సత్యవతి, కుమారులు శ్రీరామకుమార్, లక్ష్మణ్ శేషుకుమార్, కుమార్తె శ్రీదేవి సంయుక్తంగా నగదును కమిటీ సభ్యులకు గురువారం అందచేశారు. నూతన ఆలయంలో ద్వారపాలకుల విగ్రహాల ఏర్పాటుకు నగదును వెచ్చించాలని కోరారు.

ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలి

మండపేట, న్యూస్‌టుడే: రైతులు పండించిన ధాన్యం మొత్తం రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. గురువారం అమలాపురం కలెక్టరేట్‌లో జరిగిన సాగునీటి సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యంలో ఎకరానికి 24 బస్తాలు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. అలా కాకుండా మొత్తం కొనుగోలు చేయాలని సభలో కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగేశ్వరరావు

పట్టణ సమస్యల పరిష్కారానికి గళం విప్పండి..

నేడు ఈనాడు ఫోన్-ఇన్

● మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకురండి..

సమయం: శుక్రవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు

మండపేట పట్టణంలో శునకాల సమస్య తీవ్రంగా ఉంది.. ఎవరికి చెప్పాలో తెలియడం లేదా..? పట్టణ శివారుతో పాటు వీధులు, రోడ్లపై చెత్త పేరుకుపోయింది.. తొలగించడంలో పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తునారా..? దోమలు విజృంభిస్తున్నాయా, టిడ్కో ఇళ్ల కేటాయింపుల్లో అన్యాయం జరిగిందా.. రక్షితనీటి సరఫరాలో లోపాలా.. అన్న క్యాంటీన్‌లో ఆహార పదార్థాలు సరిగా లేవా.. ఎల్ఆర్ఎస్‌లో భవనాల క్రమబద్ధీకరణ ఎలా చేసుకోవాలి..? ఇలా మీ సమస్య ఏదైనా నేరుగా మున్సిపల్ కమిషనర్ టి.వి.రంగారావుతో మాట్లాడే అవకాశం 'ఈనాడు' కల్పిస్తోంది. – న్యూస్‌టుడే, మండపేట

ఆత్మరక్షణ.. బాలికలకేదీ శిక్షణ

పాఠశాలల్లో నిలిచిన యుద్ధ విద్య ప్రత్యేక శిబిరాలు

న్యూస్‌టుడే, అంగర

విద్యార్థి దశలోనే బాలికలు యుద్ధ విద్యల్లో సుశిక్షితులుగా ఎదిగితే భవిష్యత్తులో ఆత్మరక్షణకు ఆలంబనగా నిలుస్తుందని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్షణ ప్రశిక్షణ్' కార్యక్రమం అమలు దాదాపు నిలిచిపోయింది. సమాజంలో చిన్నారులు, విద్యార్థినులపై లైంగికదాడులు నిత్యకృత్యంగా మారిన నేపథ్యంలో మృగాళ్ల దాడిని వారు సమర్థంగా ఎదుర్కొనేలా కరాటే, కుంగ్‌ఫూ, తైక్వాండో వంటి ఆత్మరక్షణ విద్యల్లో నిపుణులైన శిక్షకులతో శిక్షణ ఇప్పించాలని గతంలో ప్రత్యేక తరగతులు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో దాదాపు ఏడాది కాలం పాటు నిర్వహించిన తర్వాత కొవిడ్ సమయంలో అప్పటి వైకాపా ప్రభుత్వం ఈ కార్యక్రమానికి మంగళం పాడింది.

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలో 324 ప్రభుత్వ పాఠశాల్లో 12,117 మంది విద్యార్థినులు ఉన్నారు. ఆత్మరక్షణ విద్యల్లో వారానికి మూడు చొప్పున నెలలో 12 శిక్షణ తరగతులు నిర్వహించేవారు. మహిళా శిక్షకులకే ప్రాధాన్యతనివ్వాలనే నిబంధన ఉన్నా వారు అందుబాటులో లేక పురుష అభ్యర్థులను తీసుకున్నారు. ప్రారంభించిన కొత్తలో శిక్షణ సక్రమంగానే జరిగినా కొవిడ్ తరవాత నిలిచిపోయింది. గతేడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత పునఃప్రారంభించినా కొన్ని పాఠశాలలకే తరగతులు పరిమితమయ్యాయి.

కపిలేశ్వరపురంలో యుద్ధవిద్య శిక్షణలో విద్యార్థినులు

మండలం	పాఠశాలలు	విద్యార్థినులు
కె.గంగవరం	76	2140
రామచంద్రపురం	84	3352
కపిలేశ్వరపురం	51	1684
మండపేట	67	3217
రాయవరం	46	1724

బాలికలకు ఎంతో మేలు..

గతంలో కరాటే, తైక్వాండో తదితర ఆత్మరక్షణ విద్యల్లో ఇచ్చిన శిక్షణతో బాలికలు మెరికల్లా తయారయ్యారు. ప్రస్తుత తరుణంలో ఈ విద్య నేర్చుకోవడం ఆడపిల్లలకు చాలా అవసరం. వారికి స్వీయ రక్షణ తరగతులు ప్రారంభిస్తే ఎంతో మందికి మేలు జరుగుతుంది. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.
- మత్సా దుర్గారావు, శిక్షకుడు, అంగర

త్వరలో ప్రారంభిస్తాం..

బాలికలకు ఆత్మరక్షణ విద్య అవసరాన్ని గుర్తించిన ప్రభుత్వం పాఠశాల స్థాయి నుంచే నేర్పించేలా గతంలో ప్రణాళిక సిద్ధంచేసింది. త్వరలోనే ఈ శిక్షణ తరగతులు ప్రారంభిస్తాం. ఆరో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు చదువుతున్న బాలికలకు ఏడాదిలో 20 రోజుల పాటు శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలలల్లోనూ త్వరలోనే ప్రారంభిస్తాం.
- సలీంభాషా, జిల్లా విద్యాశాఖాధికారి, కోనసీమ జిల్లా

పరుగు పోటీల్లో గురుకుల పాఠశాల విద్యార్థి ప్రతిభ

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: రామచంద్రపురంలోని ఆదివారపుపేట అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి పరుగు పోటీల్లో ఉత్తమ ప్రతిభచాటాడు. కాకినాడలో ఇటీవల జరిగిన పోటీల్లో 400 మీటర్ల కేటగిరీలో ప్రథమ, 800 మీటర్లలో ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నాడు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ శంకర్, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు గురువారం అతన్ని అభినందించారు.

విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 | మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు | మండపేట: 80085 74183 | రామచంద్రపురం: 80085 74191

సమస్య: మండపేట మండలం పాలతోడు గ్రామం ఎస్సీ కాలనీ రెండో వీధిలో రహదారి పక్కన వ్యర్థాలు పోస్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది.
- మహేష్‌కుమార్, స్థానికుడు

పరిష్కారం: రహదారి పక్కన వ్యర్థాల సమస్యను పంచాయతీ కార్యదర్శి కె.వరప్రసాద్ వివరించగా సమస్యను పరిష్కరించి వ్యర్థాలను తొలగింపజేశారు.
- న్యూస్‌టుడే, ద్వారపూడి

వ్యర్థాలు తొలగించారు..

స్పందనకు వందనం

మండపేట: స్థానిక శాఖా గ్రంథాలయం వద్ద రామచంద్రపురం పంటకాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. పట్టణానికి చెందిన సురేష్ 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికకు సమాచారం ఇచ్చారు. వెంటనే మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.సత్తిబాబు పర్యవేక్షణలో సిబ్బంది వ్యర్థాలు తొలగించారు.

రాజమహేంద్రవరంలో రాష్ట్ర మహాసభలు

మండపేట, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో ఈనెల 28, 29 తేదీల్లో నిర్వహించే పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ పిలుపునిచ్చారు. గురువారం బలిజ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గోడపత్రికలు ఆవిష్కరించారు. పీడీఎస్ నాయకుడు వి.నాగరాజు, కె.మణిదీప్, బి.మనోజ్, కె.విహారి, ఎం.సతీష్, డి.నగేష్, పి.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కనులపండువగా తెప్పోత్సవం

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం ఏటిగట్టు సమీపంలోని అగస్త్యేశ్వర, పాపనాశేశ్వరస్వామి, జనార్దన స్వామివార్ల ఆలయాల్లో నిర్వహించిన కార్తిక మహోత్సవాలు గురువారంతో ముగిసిన నేపథ్యంలో పావన గౌతమి గోదావరి నదీతీరంలో కనులపండువగా తెప్పోత్సవం నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పడవలపై కొలువుదీర్చి జలవిహారం చేయించారు. ఆలయ అర్చకులు యేన్నాప్రగడ కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళతాళాలతో ఊరేగింపు సాగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తిలకించారు. కార్యనిర్వహణ అధికారి కృష్ణచైతన్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గౌతమి గోదావరిలో స్వామివార్ల తెప్పోత్సవం

రేపు ఉపాధి మేళా

రామచంద్రపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఉపాధి భవనంలో ఈనెల 22న ఉదయం 9 గంటలకు ఉపాధి మేళా నిర్వహిస్తామని మంత్రి కార్యాలయం నుంచి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో జస్ట్ డయల్ కంపెనీలో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, బీపీవో పోస్టులకు 18 నుంచి 30 సంవత్సరాల వయసున్న ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగిన అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారని, వార్షిక జీతం రూ.2.4 లక్షలు ఇస్తారని తెలిపారు. కాకినాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నం, హైదరాబాద్ కేంద్రాల్లో పనిచేయాలని సూచించారు. బేబి వరల్డ్ కంపెనీలో స్టోర్ ఇన్‌ఛార్జి, సేల్స్ ప్రమోటర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ మేనేజర్, సేల్స్ ఇన్‌ఛార్జి బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, మేనేజ్ పోస్టులకు 18 నుంచి 28 సంవత్సరాల వయసు, 10వ తరగతి, ఇంటర్ డిగ్రీ, పీజీ, ఎంబీఏ విద్యార్హతలు ఉన్న అభ్యర్థులకు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు జీతంతో మండపేట, రావులపాలెం, కాకినాడ, రాజమహేంద్రవరం, తుని, పెద్దాపురం ఏలేశ్వరంలో పనిచేయడానికి అవకాశం కల్పిస్తారని సత్యం ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం, ఉపాధి ప్రాజెక్టు డైరెక్టర్ రామ్‌కుమార్ తెలిపారు.

భీమ షిరిడీ మందిరంలో దీపోత్సవం

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: ద్రాక్షారామ సూర్యదేవిలోని భీమషిరిడీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపారాధన గురువారం రాత్రి వైభవంగా సాగింది. అర్చకులు చందుశర్మ ఆధ్వర్యంలో హారతులు, క్షీరాభిషేకాలు, అష్టోత్తర పూజలు అనంతరం పల్లకీసేవ జరిపించారు. రాత్రి 8 గంటలకు ఆలయ ధర్మకర్త సత్తి సుబ్బారెడ్డి దంపతులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు పోతంశెట్టి రాంబాబు దంపతులు దీపారాధన ప్రారంభించారు. ఈసందర్భంగా బాణసంచా కాల్చారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి కార్తికదీపాలు వెలగించారు.


ఆలయంలో వెలిగించిన కార్తిక దీపాలు

ప్లాస్టిక్ రహిత గ్రామాలే లక్ష్యం

రాయవరం, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ రహిత గ్రామాలే లక్ష్యం కావాలని ఎంపీడీవో ఎన్.కీర్తిస్పందన పిలుపునిచ్చారు. గురువారం వెంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో ఐటీసీ సౌజన్యంలో వ్యాపార, వాణిజ్య వర్గాలతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ వుండవిల్లి రాంబాబు మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంలో పంచాయతీ కార్యదర్శులు కీలకపాత్ర పోషించాలని కోరారు. సర్పంచి రామకృష్ణ మాట్లాడుతూ స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి పి.వెంకటరత్నం, ఐటీసీ సంస్థ సమన్వయకర్త రాజబాబు, కూటమి నాయకులు కోట వెంకటరమణ, వల్లూరి శ్రీనివాస్, దేవిశెట్టి చిన్ని, ఏఎస్సై రాంబాబు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కీర్తి స్పందన

మండపేటకు నూతన సొబగులు

మండపేట, న్యూస్‌టుడే: పట్టణ సుందరీకరణ కార్యక్రమంలో భాగంగా రూ.14 లక్షలతో చేపట్టిన పలు నిర్మాణాలు కొలిక్కి వస్తున్నాయి. బైపాస్ రోడ్డు, పట్టణంలోకి వచ్చే ప్రవేశమార్గంలో ఐ లవ్ మండపేట అంటూ ఆంగ్ల అక్షరాలు, గుర్తులతో పాటు ఫౌంటెన్, అందమైన పూలమొక్కలు పెడుతున్నారు. కలువపువ్వు సెంటరులో వేగుళ్ల వీర్రాజు విగ్రహం వద్ద ఫౌంటెన్ పనులు దాదాపు పూర్తయ్యాయి. వీటికి త్వరలో ప్రారంభోత్సవం చేయనున్నారు. ఆయా పనులను మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, మున్సిపల్ కమిషనర్ టి.వి.రంగారావు గురువారం పరిశీలించారు. డీఈ కె.శ్రీనివాస్, ఏఈ పవన్ పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి.

ప్రవేశద్వారం వద్ద ఏర్పాటుచేస్తున్న ప్రత్యేక అలంకరణ

ముగిసిన నగర సంకీర్తన

రాయవరం, న్యూస్‌టుడే: వెదురుపాకలో కార్తికమాసం నెల రోజులు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన నగర సంకీర్తన కార్యక్రమం గురువారంతో ముగిసింది. గీతాజ్ఞాన మందిరం నిర్వాహకులు సత్తి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో దాదాపు వంద మంది మహిళలు, మందిరం సభ్యులు వేకువజామునే నాలుగు గంటలకు శివ నామస్మరణ, హరినామ సంకీర్తనలు ఆలపిస్తూ గ్రామంలోని పార్వతీ సమేత సోమేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామి, రామాలయాలు, శ్రీపోలేరమ్మతల్లి ఆలయాలు సందర్శిస్తూ నగర సంకీర్తన కార్యక్రమాన్ని నెల రోజుల పాటు కొనసాగించారు. కార్తికమాసం ముగిసిన నేపథ్యంలో గొలుగూరి గోవిందరెడ్డి, కొవ్వూరి నాగిరెడ్డి, చిట్టూరి వెంకటరమణ, గీతా మందిరం సభ్యులు పాల్గొన్నారు.

భక్తిగీతాలు ఆలపిస్తున్న గీతాజ్ఞాన మందిర సభ్యులు

భక్తిశ్రద్ధలతో నాగదేవత ప్రతిష్ఠ

పామర్రు, న్యూస్‌టుడే: కె.గంగవరంలోని అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, సుబ్రహ్మణ్యస్వామి సన్నిధిలో నాగదేవత పాములపుట్ట ప్రతిష్ఠ గురువారం భక్తిశ్రద్ధలతో జరిగింది. స్థానికులు వుండమట్ల చంద్రరావు, వెంకటరామలక్ష్మి ఆర్థికసాయంతో దీన్ని నిర్మించారు. స్టీల్ గొట్టాలతో రక్షణచట్రాన్ని శ్రీవ్యూహలక్ష్మి పేపరుమిల్లు యాజమాన్య ప్రతినిధులు ఏర్పాటుచేశారు. వచ్చే సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాల్లో పుట్టను అధిక సంఖ్యలో దర్శించుకుంటారని ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కె.గంగవరంలో సిద్ధమవుతున్న పాములపుట్ట

పుంతరోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలి

ద్రాక్షారామ: రైతులు పండించిన పంటలను రోడ్ల పైకి తెచ్చుకొనేందుకు అవసరమైన పుంతరోడ్ల నిర్మాణాన్ని మార్కెట్టు కమిటీ ద్వారా చేపట్టాలని కమిటీ పాలకవర్గ సమావేశంలో సభ్యులు కోరారు. ద్రాక్షారామ మార్కెట్‌యార్డులో గురువారం పాలకవర్గ సమావేశం ఛైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్ ఆధ్యక్షతన జరిగింది. పుంతరోడ్ల సమస్యపై ఆయన మాట్లాడుతూ మంత్రి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. గోదాముల అద్దె పెంపునకు అవసరమైన చర్యలు చేపట్టాలని సభ్యులు నారపరెడ్డి బలరాం, జగ్గంపూడి గనిరాజు, గుణ్ణం వినోద్‌కుమార్ తదితరులు కోరారు. మద్దతు ధరల వివరాలతో గోడపత్రికలను ఆవిష్కరించారు. పాలకవర్గ సభ్యులు, ద్రాక్షారామ సర్పంచి కొత్తపల్లి అరుణ, గ్రేడ్-1 కార్యదర్శి పి.వాసుదేవరావు, ఏడీ బి.నాగకుమార్ పాల్గొన్నారు.

గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న పాలకవర్గ సభ్యులు

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

ఏపీ ఎన్జీవో మండపేట కార్యవర్గం ఎన్నిక

మండపేట గ్రామీణం: ఏపీ ఎన్జీవో మండపేట తాలూకా కార్యవర్గం ఎన్నిక ఎంపీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా చిక్కాల సూర్యారావు, ఉప అధికారిగా కాశీవిశేశ్వరరావు, పరిశీలకుడుగా జి.వెంకటేశ్వరరావు వ్యవహరించారు. అధ్యక్షుడిగా జె.మల్లికార్జునుడు, ఉపాధ్యక్షుడిగా మోహన్, కార్యదర్శిగా రామకృష్ణ, కోశాధికారిగా దుర్గాశ్రీనివాస్, మరో 11 మంది కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరంతా ప్రమాణ స్వీకారం చేశారు.

ఆహార అలవాట్లు, జీవనశైలితోనే ఎముకల బలహీనత

మండపేట, న్యూస్‌టుడే: ప్రస్తుత జీవన విధానంలో ఆహార అలవాట్ల, మారిన జీవనశైలి కారణంగా ఎముకల సాంద్రత తగ్గుతోందని రాజమహేంద్రవరం వేద ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ తోజే ఫణీంద్ర తెలిపారు. అపోలో హాస్పటల్స్ ఆధ్వర్యంలో గురువారం కేపీరోడ్డులోని అపోలో ఫార్మసీ వద్ద ఉచితంగా చక్కెర, ఎముకలు, రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ ఎం.గోపాలకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఎస్.శ్రీకాంత్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పెద్దిరాజు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

అంగర: నిరంతర ధ్యాన సాధనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని తూర్పుగోదావరి జిల్లా పిరమిడ్ సోసైటీ అధ్యక్షుడు సంగిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పడమర ఖండ్రిక ఉయ్యాల జంపాల క్షేత్రంలోని ఖణ్వ మహర్షి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో గురువారం అమావాస్య సందర్భంగా ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో అంగర, పడమర ఖండ్రిక, టేకి, వెదురుమూడి, కపిలేశ్వరపురం గ్రామాల నుంచి ఆసక్తిపరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని బస్ సీజ్

రామచంద్రపురం: మోటారు వాహనాల చట్టం ప్రకారం నిబంధనలు పాటించని బస్సులపై చర్యలు తీసుకుంటామని జిల్లా రవాణా శాఖ అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. నిబంధనలు పాటించకుండా పట్టణంలో తిరుగుతున్న ఓ పాఠశాలకు చెందిన బస్సుని గురువారం సీజ్ చేశామని చెప్పారు. బడి బస్సులకు ఫిట్‌నెస్ పర్మిట్, బీమా, కాలుష్య నియంత్రణ పత్రం, డ్రైవర్‌కి లైసెన్సు ఉండాలని, భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

రామచంద్రపురం, మండపేట గ్రామీణం: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఏలూరు రేంజీ ఐజీ అశోక్‌కుమార్ చెప్పారు. రామచంద్రపురం డీఎస్పీ కార్యాలయం, మండపేట గ్రామీణ సీఐ కార్యాలయం, ద్రాక్షారామ పోలీస్‌స్టేషన్లను వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఆయన సందర్శించారు. కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని, సబ్ డివిజన్‌లో నమోదైన కేసుల రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసుల వివరాలు, దర్యాప్తుపై ఆరాతీశారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారు, బహిరంగ ప్రాంతాల్లో తాగేవారిపై నిఘా ఉంచాలని, కేసులు నమోదుచేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీసులపై నమ్మకం పెంచేలా గస్తీలపై దృష్టి సారించాలన్నారు. సైబర్ నేరాలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా, డీఎస్పీ రఘువీర్, సీఐలు వెంకటనారాయణ, దొరరాజు, సబ్ డివిజన్‌లోని ఎస్సైలు వి.పుల్లారావు, సురేష్, లక్ష్మణ్, నాగేశ్వరరావు, రాము, సురేష్‌బాబు, హరీష్‌కుమార్, కిషోర్, జానీబాషా పాల్గొన్నారు.

పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్

రూరల్ సర్కిల్ కార్యాలయంలో..

శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా గురువారం మండపేట రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. కేసుల దస్త్రాలు, కార్యాలయ దస్త్రాలు తనిఖీచేశారు. చోరీలు, రహదారి ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు.

విద్యుత్తు సమస్యల పరిష్కారానికి చర్యలు

మలికిపురం: విద్యుత్తు సమస్యల పరిష్కారానికి కృషి జరుగుతోందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రాంబాబు చెప్పారు. ప్రజాప్రతినిధులు, వినియోగదారులతో గుడిమెళ్లంక పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు, గృహ వినియోగదారులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. లోవోల్టేజీ, లైన్‌మేన్‌ల కొరతతో ఇబ్బందులు, స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల అవసరం గురించి వివరించారు. ఈఈ మాట్లాడుతూ ఆయా సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాజోలు డీఈఈ బి.కృష్ణరాజా, ఏఈ బి.ప్రసాద్, ఎంపీపీ మేడిచర్ల వెంకటసత్యవాణి, జడ్పీటీసీ సభ్యురాలు బళ్ల ప్రసన్నకుమారి, సర్పంచులు నల్లి విజయకుమారి, కడలి దుర్గాదేవి, రాపాక రమేశ్‌బాబు, ఆనందకుమార్, ఆరేటి రంగనాయకులు, కాకర శ్రీనివాస్ పాల్గొన్నారు.

సుబ్బారెడ్డికి పురస్కారం

మండపేట గ్రామీణం: అర్తమూరు గ్రామానికి చెందిన ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పడాల సుబ్బారెడ్డికి రాజమహేంద్రవరంలోని నటరాజ నృత్య నికేతన్ సాంస్కృతిక సంస్థ సప్తా ఎక్సలెన్స్ అవార్డు ప్రకటించింది. కోళ్ల పరిశ్రమ అభివృద్ధికి చేస్తున్న సేవలను గుర్తించి పురస్కారానికి ఎంపిక చేశారని, ఈనెల 23న రాజమహేంద్రవరంలో జరిగే కార్యక్రమంలో అందిస్తారని ఆయన తెలిపారు.

వెలగతోడులో కోటి సంతకాల సేకరణ

మండపేట గ్రామీణం: వైద్య కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ వైకాపా ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు అడబాల బాబ్జి ఆధ్వర్యంలో వెలగతోడులో గురువారం నిర్వహించారు. నాయకులు వాసిరెడ్డి అర్జున్, గాంధీబాబు, బళ్ల నాగేశ్వరరావు, అన్నందేవుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ

రామచంద్రపురం: శ్రీసత్యసాయి రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో భాగంగా రామచంద్రపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో విజేతలకు గురువారం బహుమతులు అందించారు. 'నేటి విద్యార్థి రేపటి భవిష్యత్తు' అంశంపై నిర్వహించిన పోటీల్లో నిఖిల్‌వర్మ, చంద్రకళ, నంద గణేష్, చంద్రకళ, దుర్గ, ప్రతిభ చూపిన ఉన్నత పాఠశాల విద్యార్థులకు సేవా సమితి ప్రముఖులు విస్సాప్రగడ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో వీటిని అందజేశారు.

వారోత్సవాల విజేతలకు బహుమతులు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రత్నంపేట హైస్కూల్ ఆవరణలో గ్రంథాలయాధికారి జి.వి.వి.ఎన్.త్రినాథ్ అధ్యక్షతన నిర్వహించిన సభలో వాసంశెట్టి సత్యం విజేతలకు బహుమతులు అందించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, ఏఎంసీ ఛైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, ఎస్‌కేపీ ట్రస్టు ఛైర్మన్ సలాది నాయుడు మాట్లాడారు. ఉప విద్యాశాఖాధికారి పి.రామలక్ష్మణమూర్తి, తెదేపా పట్టణ అధ్యక్షుడు ఉండవల్లి శివ, తెదేపా ఉపాధ్యక్షుడు, గ్రంథాలయ అభివృద్ధి ప్రోత్సాహకులు చందమామ వాసు, వార్డు కౌన్సిలర్లు తోట అమ్మాజీ, అంకం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ: ద్రాక్షారామ శాఖా గ్రంథాలయంలో వారం రోజుల పాటు జరిగిన వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో విజ్ఞానభారతి కరస్పాండెంట్ ఎం.శివాజీ, ఎండీ హుసేన్, బి.శివరావు, గ్రంథపాలకుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

పామర్రు: విద్యార్థులను అన్ని రంగాల్లో చైతన్యవంతులుగా తీర్చిదిద్దడంలో గ్రంథాలయాల పాత్ర ముఖ్యమని గ్రామాభివృద్ధి సంఘం అధ్యక్షుడు మరివాడ సూరిబాబు అన్నారు. పామర్రు శాఖ గ్రంథ పాలకుడు ఎన్.గంగాధరరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ముఖ్యఅతిథిగా కళాశాల అధ్యాపకుడు, గోదావరి కవి డా.ర్యాలి శ్రీనివాసు విచ్చేసి వివిధ పోటీల్లోని విజేతలకు బహుమతులు అందించారు. పామర్రు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యర్రా ఈశ్వరుడు, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు చుండ్రు వి.వి.చౌదరి, వీఆర్వో మాగాపు వీరభద్రరావు, ప్రధానోపాధ్యాయులు ఓ.వి.రమణ, ఎ.వెంకట్రావు తదితరులు ప్రసంగించారు.

అంగర: విద్యార్థులంతా పుస్తక పఠనాన్ని అలవాటుగా చేసుకోవాలని తహసీల్దార్ జి.శ్రీనివాస్, ఎంపీడీవో హెచ్.భానోజీ అన్నారు. కపిలేశ్వరపురం శాఖా గ్రంథాలయంలో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నెక్కంటి రాంజీ, సర్పంచి సాకా శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు భాస్కర్, మాజీ సర్పంచి మేకా ప్రసాద్, వీఆర్వో సత్యనారాయణ, గ్రంథాలయాధికారి దానేటి శికుమారి, తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ గ్రంథాలయంలో బహుమతులు పొందిన విద్యార్థులు

మహారాజశ్రీ రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
CREDITOR IP No.37/2025
Between:
షేక్ కరీమ్ సాహెబ్, S/o షేక్ వల్లి సాహెబ్, Age: 46 Yrs
D.No.5-87/1, చర్చిపేట, అంగర, కపిలేశ్వరపురం మండలం ..పిటిషనర్
And
1. కటకం వీరనాగమల్లేశ్వరరావు, S/o సూర్యనారాయణ, Age: 44 yrs, D.No.6-38/1, అంగర, కపిలేశ్వరపురం మండలం
2. కటకం వీర ఈశ్వరి, W/o వీరనాగమల్లేశ్వరరావు, Age: 40 yrs, D.No.6-38/1, అంగర, కపిలేశ్వరపురం మండలం
3. ఇసుమర్తి పద్మావతి, W/o సత్తిబాబు, Age: 46 yrs, D.No.3-42, ఇంజరం, తాళ్ళరేవు మండలం ..రెస్పాండెంట్స్
పై నంబరు IP లో 1వ రెస్పాండెంట్‌ని ఇన్సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని 1వ రెస్పాండెంట్, 3వ రెస్పాండెంట్‌కి వ్రాసిన క్రియ దస్తావేజు, Dt: 5-6-2025, Doc. No.3930/2025 of SRO తాళ్ళరేవును రద్దుపరచమని పిటీషన్ దాఖలు చేసినందున ఎవ్వరికైనా అభ్యంతరములు ఉన్నయెడల ది.10-12-2025 వ తేదీన ఉదయం గం.10.30 ని॥లకు పై కోర్టువారి ఎదుట స్వయముగా గాని, ప్లీడర్ గారి ద్వారా గాని హాజరు అయ్యి అభ్యంతరములు తెలియపరచుకొనవచ్చును. లేనిచో పై పిటీషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.
Station: రామచంద్రపురం, **Allam Gani Raju,** Advocate
Date: 19-11-2025. Ramachandrapuram, Ph: 91820 22951

(c) eenadu

భీమేశ్వరాలయం.. దీప శోభితం

సామర్లకోటలోని భీమేశ్వరాలయం గురువారం కోటికాంతుల వెలుగులతో శోభిల్లింది. శివుడికి ప్రీతికరమైన దీపారాధనను ఆలయ ఈవో నీలకంఠం, ఛైర్మన్ జగదీష్ మోహన్ ఆధ్వర్యంలో కోటి దీపాలను భక్తులు వెలిగించారు. పలువురు ఆకాశ దీపాలనూ వదిలారు.
- న్యూస్‌టుడే, సామర్లకోట

26న పవన్‌కల్యాణ్ పర్యటన

మలికిపురం, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ 26న రాజోలు నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. కేశనపల్లిలో చనిపోయిన కొబ్బరి చెట్లను పరిశీలించి అక్కడే 15 గ్రామాలకు చెందిన బాధిత రైతులతో మాట్లాడతారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారు.

ఫాస్టాగ్ లేని వారికి స్వల్ప ఊరట

జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు టోల్‌ప్లాజాల వద్ద రుసుం చెల్లించడానికి ఎక్కువ సమయం ఆగకుండా ఫాస్టాగ్ విధానం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఒకవేళ ఫాస్టాగ్ లేకుంటే రుసుము రెండింతలు చెల్లించాల్సి వస్తుంది. దీన్ని కేంద్ర ప్రభుత్వం తాజాగా సడలించింది. యూపీఐ ద్వారా అయితే 25 శాతం అదనంగా చెల్లిస్తే సరిపోతుంది. ఈ నిబంధన ఈ నెల 16 నుంచి అమల్లోకి వచ్చింది. ఉదాహరణకు ఫాస్టాగ్ ఉన్న కార్లకు రూ.125 చెల్లిస్తే, లేనివారు నగదు రూపంలో రూ.250 చెల్లించాల్సి ఉంటుంది. అదే యూపీఐ ద్వారా అయితే రూ.156.25 చెల్లిస్తే సరిపోతుంది. దీనిపై రావులపాలెం సమీపంలోని ఈతకోట టోల్ ప్లాజా మేనేజరు కర్రి వీరవెంకట సత్యనారాయరెడ్డిని వివరణ కోరగా యూపీఐ నుంచి చెల్లిస్తే నగదు తగ్గుతుందని, ఈ మేరకు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ అయ్యిందన్నారు.
- న్యూస్‌టుడే, రావులపాలెం పట్టణం

ఈతకోటలోని టోల్‌ప్లాజా

బుజ్జాయిలపై వ్యాధుల పంజా..!

దగ్గు, జలుబు, జ్వరం, న్యుమోనియాతో ఇక్కట్లు

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం వైద్యం, కోటగుమ్మం

పరిశీలన

చిన్నారులపై వ్యాధులు పంజా విసురుతున్నాయి. గత వారం రోజులుగా చలితీవ్రత విపరీతంగా పెరగడంతో జలుబు, దగ్గు, జ్వరం, న్యుమోనియా, శ్వాసకోశ వ్యాధులు బుజ్జాయిలపై మూకుమ్మడి దాడి చేస్తున్నాయి. ఈ తరహా లక్షణాలతో బాధపడుతూ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న చిన్నారుల సంఖ్య 50 శాతం పెరిగింది. ఇదే అదనుగా కొన్ని ప్రైవేటు పరీక్ష కేంద్రాలు అధిక ధరలు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నాయి.

వారం రోజులుగా ఇదే తీరు..

రాజమహేంద్రవరం జీజీహెచ్, యూపీహెచ్‌సీలతోపాటు కోరుకొండ, గోకవరం, కొవ్వూరు, నిడదవోలు, అనపర్తి తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో జ్వరాలు, విపరీతమైన జలుబు, శ్వాసకోశ తదితర సమస్యలతో బాధపడుతున్న చిన్నారులు అధికంగా వస్తున్నారు.

ఇదే అదునుగా..

ప్రస్తుతం జ్వరాలు, అధికంగా ఉండడంతో మలేరియా, డెంగీ, టైఫాయిడ్ పరీక్షలు చేస్తున్నారు. ప్రైవేటు కేంద్రాల్లో ఒక్కో పరీక్షకు రూ.200-300 అధికంగా వసూలు చేస్తున్నారు. ఏ పరీక్షకు ఎంత వసూలు చేస్తున్నారో బోర్డులు ఏర్పాటు చేయడం లేదు.

జీజీహెచ్‌లో వారం కిందట రోజుకు 70లోపు మాత్రమే చిన్నారుల ఓపీ ఉంటే ప్రస్తుతం వంద దాటింది. నగరంలోని యూపీహెచ్‌సీల్లో రోజుకు మొత్తం 60 ఓపీ ఉంటే అందులో 20-30 కేసులు చిన్నారులే ఉంటున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో వైద్యుడి సలహా లేకుండా మందులు వినియోగించడం వల్ల వ్యాధి తీవ్రమైన తరువాత నగరంలోని ఆసుపత్రులకు వస్తున్న వారు సైతం పెరిగారు.

జీజీహెచ్‌లో 30 పడకల వార్డు ఉండగా ఇన్‌పేషంట్లుగా చేరేవారి సంఖ్య సైతం 30 శాతం పెరిగింది. ఇందులో ముఖ్యంగా 0-5 ఏళ్లలోపు వారే అధికంగా ఉంటుండడం కలవరపెడుతోంది.

జిల్లా వ్యాప్తంగా సుమారు 50లోపు చిన్నపిల్లల ఆసుపత్రులున్నాయి. రాజమహేంద్రవరం నగరంలోని ఒక్కో ప్రైవేటు ఆసుపత్రిలో రోజుకు 60 వరకు ఉండే ఓపీ గత వారం నుంచి 50 శాతం పెరిగిందని ఆయా ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి.

జీజీహెచ్‌లోని వార్డులో చికిత్స పొందుతున్న చిన్నారులు

వైద్యుల సలహాలు తీసుకోవాలి

వైద్యుడి సలహా లేకుండా అనవసరంగా మందులు వినియోగించవద్దు. దొక్కలు ఎగరేయడం, జ్వరంతో ఎక్కువగా నీరసంతో ఉన్న పిల్లలను అశ్రద్ధ చేయకుండా వెంటనే ఆసుపత్రికి తీసుకురావాలి. - ఇంద్రజ, చిన్నపిల్లల వైద్యనిపుణురాలు

మైసూర్‌కు ప్రత్యేక రైళ్లు

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: డిసెంబరు 1 నుంచి జనవరి 12వ తేదీ వరకు కాకినాడ టౌన్ నుంచి మైసూరు (07033)కు ప్రత్యేక రైలును 13 ట్రిప్పులు, అదే విధంగా డిసెంబరు 2 నుంచి జనవరి 13వ తేదీవరకు మైసూరు నుంచి కాకినాడ టౌన్‌కు(07034) 13 ట్రిప్పులు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల రద్దీని పురస్కరించుకుని ఈ ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు అధికారులు తెలిపారు.

ఆర్థిక ప్రాంతం.. అభివృద్ధి మంత్రం

ఉమ్మడి జిల్లాలో నీతి ఆయోగ్ ప్రణాళికలు

ఈనాడు, కాకినాడ: దేశంలో ప్రాంతాలవారీ ఆర్థిక కార్యకలాపాల ఆధారంగా గ్రోత్ హబ్‌లను ఏర్పాటుచేసి ప్రజల తలసరి ఆదాయం పెంచవచ్చన్నది నీతి ఆయోగ్ ఆలోచన. ఆ దిశగానే విశాఖ కేంద్రంగా 9 జిల్లాలతో ఎకనామిక్ రీజియన్‌కు నాంది పలికారు. ఇటీవల సీఐఐ భాగస్వామ్య సదస్సులో ముసాయిదా ప్రకటించారు. అందులో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని వనరులతో ఎలా అభివృద్ధి సాధించవచ్చో చూపారు. వ్యవసాయ, పర్యాటక, పారిశ్రామిక రంగాల వారీ ప్రాజెక్టుల గురించి వివరించారు. 2047 నాటికి జిల్లా స్థూల దేశీయోత్పత్తి (జీడీడీపీ), స్థూల అదనపు విలువ (జీవీఏ) ఎంత మేర పెరుగుతాయో అంచనా వేశారు.

కాకినాడ.. గ్రీన్ అమ్మోనియా సిటీ

■ నీతి ఆయోగ్ నివేదికలో కాకినాడను గ్రీన్ అమ్మోనియా సిటీగా పేర్కొన్నారు. ఏడాదికి మిలియన్ మెట్రిక్ టన్నులను ఏఎం గ్రీన్ కంపెనీ తయారుచేయనుంది. రెండు గిగావాట్ల ఎలక్ట్రొలైజర్ పరికరాలు సరేసరి. ■ డీప్ సీ, యాంకరేజ్, కాకినాడ గేట్ వే పోర్టులతో సరకు రవాణాలో తిరుగులేని శక్తిగా జిల్లా ఎదగనుంది. కాకినాడ-శ్రీకాకుళం మధ్య 150-175 కి.మీ మేర గ్యాస్ పైప్‌లైన్, కాకినాడలో గ్యాస్ టెర్మినల్‌తో ఆర్థిక వృద్ధికి ఆస్కారం. ■ 200 ఎకరాల్లో రూ.123 కోట్లతో సమీకృత ఆక్వా పార్కు రానుంది.

నర్సరీ రాజధానిగా తూర్పు..

■ దేశానికి నర్సరీ రాజధానిగా తూర్పుగోదావరి జిల్లాను అభివృద్ధి చేస్తారు. కడియం పరిసరాల్లో 5 వేల ఎకరాల్లో నర్సరీలు ఉండగా 30 వేల మంది ఆధారపడ్డారు. నర్సరీలను మరింతగా వృద్ధిలోకి తెచ్చి తలసరి ఆదాయం రెట్టింపు చేస్తారు. ■ అరటి, ఆయిల్‌పామ్ సాగు ప్రోత్సహిస్తారు. కొవ్వూరే కాకుండా మిగతాచోట్లా అరటి పెంచుతారు. ■ టెంపుల్ సర్క్యూట్‌తో ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ ఆలయాలన్నీ అందుబాటులోకి తెస్తారు.

కోనసీమ.. కొబ్బరికి చిరునామా

■ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాను కొబ్బరి హబ్‌గా చేస్తారు. జిల్లాలో లక్ష ఎకరాల్లో తోటలు, అంబాజీపేటలో పరిశోధనా కేంద్రం ఉన్నాయి. అన్ని రకాల కొబ్బరి ఉత్పత్తులు, ఉప ఉత్పత్తుల తయారీతో గణనీయమైన వృద్ధి సాధించవచ్చన్నది నీతి ఆయోగ్ సూచన. ■ కాకినాడ-యానాం-దిండి వరకు రివర్ క్రూయిజ్‌తో పర్యాటక ప్రాజెక్టుకు పరిశీలిస్తున్నారు.

సైబర్ నేరగాళ్ల టోకరా

డిజిటల్ అరెస్ట్ పేరిట రూ.34.60 లక్షల కాజేత

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: సైబర్ కేటుగాళ్ల మోసానికి ఓ విశ్రాంత విద్యాశాఖాధికారి(ఎంఈవో) రూ.34.60 లక్షలు పోగొట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముమ్మిడివరానికి చెందిన బి.రమణశ్రీకి ఈ నెల 8న వాట్సాప్ కాల్ వచ్చింది. మీపై కేసు నమోదైందని అవతల వ్యక్తి చెప్పాడు. కేసుకు సంబంధించి మరో వ్యక్తితో మాట్లాడాలని ఓ ఫోన్ నంబరు ఇచ్చాడు. ఆ వ్యక్తిని సంప్రదించగా.. ఆధార్ నంబరు చెబుతే పూర్తి వివరాలు చూస్తానని నమ్మించాడు. తర్వాత ఫోన్ చేసి పెద్ద కేసులో ఇరుక్కున్నారని, కెనరా బ్యాంకు ఏటీఎంలో జరిగిన రూ.3 కోట్ల అక్రమాల్లో మీ ఖాతాలో రూ.75 లక్షలు జమైందని చెప్పాడు. డిజిటల్ అరెస్ట్ పేరిట ఇతరులతో మాట్లాడకుండా చేశాడు. కేసు నుంచి బయటపడే మార్గం ఉందని చెప్పి.. ఆయన ఖాతాల్లోని రూ.15 లక్షలు తమ ఖాతాకు బదిలీ చేయించుకున్నారు. తర్వాత మరో రూ.20 లక్షలు డిమాండ్ చేశాడు. తన వద్ద డబ్బులేదని చెప్పగా.. మోసగాడు పింఛను హామీతో వ్యక్తిగత రుణం తీసుకునేలా చేశాడు. ఆ సొమ్మును రెండు విడతలుగా రూ.9.80 లక్షలు చొప్పున వారు చెప్పిన ఖాతాల్లో బాధితుడు జమ చేశారు. ఈ నెల 8 నుంచి 15వ తేదీ వరకు ఈ వ్యవహారం సాగింది. బాధితుడు ఎట్టకేలకు బుధవారం అర్ధరాత్రి ముమ్మిడివరం పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముమ్మిడివరం ఎస్సై డి.జ్వాలాసాగర్ తెలిపారు.

వాడేసినవి.. పారేయకుండా..!

పర్యావరణ పరిరక్షణకు ఆర్ఆర్ఆర్ కేంద్రం

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాత వస్తువుల సేకరణపై నగరపాలక సంస్థ ప్రత్యేక దృష్టి సారించింది. రెడ్యూస్, రీయూజ్ (పునర్వినియోగం), రీసైకిల్ (పునరుత్పాదన) పేరుతో వీఎల్ పురంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇళ్లల్లో వినియోగించిన వస్తువులు, దుస్తులు, బ్యాగ్‌లు ఏదైనా ఇక్కడ సేకరిస్తారు. వాటిని బాగు చేసి పండుగలకు, ఇతర ప్రత్యేక సందర్భాల్లో పేదలకు పంపిణీ చేస్తారు.

సేకరించిన పాత దుస్తులు, పాత బొమ్మలు

కాలువల్లో వేయకుండా..

వాస్తవానికి ఉపయోగించిన వస్తువులను కాలువల్లో వేస్తుంటారు. అవి నేరుగా గోదావరిలోకి చేరుతున్నాయి. వీటిలో ఉండే రసాయన మలినాలు నది నీటిలో కలవడం వల్ల నీటి కాలుష్యం మరింత పెరుగుతోంది. పాత దుస్తులు, ప్లాస్టిక్ వ్యర్థాలు, బొమ్మలు, కూల్ డ్రింక్ బాటిళ్లు, పిల్లలకు కొనుగోలు చేసిన ప్లాస్టిక్ బొమ్మలు ఈ కేంద్రంలో అప్పగించవచ్చు. పాత వస్తువులు ప్రతి రోజు ఇంటింటా సేకరిస్తున్నా... డంపింగ్ యార్డుకు చేర్చడం, వేరు చేయడం కష్టతరంగా మారుతుంది. పైగా ఎప్పటికప్పుడు చెత్త పెరిగిపోతోంది. ఈ సమస్యలు పరిష్కరించడానికి ప్రత్యేకించి ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటారు.

కలిసొచ్చిన కార్తికం

యాత్ర బస్సులతో ఆర్టీసీకి రూ.31.15 లక్షల అదనపు రాబడి

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం: కార్తిక మాసంలో పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రదేశాలకు జిల్లాలోని నాలుగు డిపోల నుంచి నిర్దేశించిన తేదీల్లో 36 ఆర్టీసీ ప్రత్యేక బస్సులను 49,650 కి.మీ మేర నడిపారు. వీటి ద్వారా ఆర్టీసీకి మొత్తం రూ.31.15 లక్షల అదనపు రాబడి సమకూరింది. ● శబరిమల యాత్రకు రాజమహేంద్రవరం, కొవ్వూరు డిపోల నుంచి మరో నాలుగు బస్సులు పంపించనున్నట్లు ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి(డీపీటీవో) వై.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. ధనుర్మాసంలోనూ ప్రత్యేక యాత్ర బస్సులను నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు.

ఆధ్యాత్మికతకు అద్దం పట్టేలా..!

కోరుకొండ మండలంలోని బుచ్చింపేట శివాలయం ఇది. గురువారం తెల్లవారుజామున ఆలయ గోపుర ప్రతిబింబం కోనేరులో ఇలా ఆవిష్కృతమైంది. - న్యూస్‌టుడే, కంబాలచెరువు (రాజమహేంద్రవరం)

ఆటలో గెలిపిస్తారు.. జీవితంలో ఓడిస్తారు..!

కొన్ని క్రీడా సంఘాల నిర్వాకంతో ఆవిరవుతున్న యువత కలలు

న్యూస్‌టుడే, శ్యామలా సెంటర్

● నగరానికి చెందిన బాలు ఓ క్రీడా సంఘం నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ధ్రువపత్రం పొంది, ఇటీవల చేపట్టిన స్పోర్ట్సు డీఎస్సీలో దరఖాస్తు చేసుకున్నారు. కానీ సంబంధిత క్రీడా సంఘానికి గుర్తింపు లేదంటూ దరఖాస్తును తిరస్కరించారు.

● రాజమహేంద్రవరానికి చెందిన పదో తరగతి విద్యార్థిని ఛరిష్మా రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పలు పతకాలు సాధించారు. ఇటీవల ఇంజినీరింగ్‌లో ప్రవేశాలకు క్రీడా కోటాలో దరఖాస్తు చేసుకుంటే సంబంధిత క్రీడా సంఘానికి గుర్తింపు లేదనడంతో సీటు రాలేదు.

రాజమహేంద్రవరంలో పలు క్రీడాసంఘాలున్నాయి. ఏటా పలు రాష్ట్ర, జాతీయ క్రీడాపోటీలు నిర్వహిస్తుంటారు. ఒక్కోసారి అంతర్జాతీయ పోటీలు నిర్వహిస్తున్నామంటూ ప్రకటనలు కూడా ఇస్తున్నారు. వీరు నిర్వహించే పోటీల్లో పాల్గొని క్రీడాకారులు ప్రతిభ చూపుతున్నారు. కానీ కొన్ని సంఘాలు ఇచ్చే ధ్రువపత్రాలు, పతకాలు గోడకు తగిలించుకోడానికి తప్ప ఎందుకు పనికిరావని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి హెచ్చరిస్తున్నారు. నగరంలో సుమారు 54కు పైగా సంఘాలున్నాయి. ఒక్కో ఆటకు రెండు సంఘాలుండటం గమనార్హం. వీటిలో 24 సంఘాలకు శాప్ నుంచి గుర్తింపు లేదు. మరికొన్ని రెన్యువల్ చేయించుకోలేదు.

ఇలా తెలుసుకోవాలి

■ పోటీల్లో పాల్గొనే ముందే సంబంధిత సంఘానికి గుర్తింపు ఉందా లేదా అనేది తెలుసుకునేందుకు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీవో)ని సంప్రదించాలి.
■ క్రీడా యాప్‌లో వ్యక్తిగతంగా నమోదు కావటం ద్వారా కూడా తెలుసుకునే వీలుంది.
■ వీటి నిర్వహణ తీరు బాగా లేకుంటే విజయవాడలోని శాప్ కార్యాలయానికి నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.

గుర్తింపు ఉంటేనే ప్రయోజనం

▼ గుర్తింపు ఉన్న క్రీడా సంఘాల ఆధ్వర్యంలో పోటీల్లో ప్రతిభ చూపితే ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం, క్రీడాసామగ్రి పొందవచ్చు. ▼ గ్రూప్-1, గ్రూప్-2, డీఎస్సీ ఇతర ప్రభుత్వ ఉద్యోగాలకు క్రీడా కోటాలో రిజర్వేషన్ పొందవచ్చు.

'శాప్ గుర్తింపు లేకుండా, రెన్యువల్ చేయించుకోకుండా పోటీలు నిర్వహించకూడదు. ఇలాంటివి ఉంటే ఫిర్యాదు చేయవచ్చు' అని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శేషగిరి అన్నారు.

పెరిగిన గోదారి గలగలలు

గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం వరదల సీజన్ నుంచి నేటి వరకు భారీగా గోదావరి జలాలు కడలిలో చేరుతున్నాయి. గురువారం ధవళేశ్వరం బ్యారేజీ నుంచి 43,241 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. ఇందులో ధవళేశ్వరం ఆర్మ్ నుంచి 22,396, ర్యాలి నుంచి 13,627, మద్దూరు నుంచి 7,218 క్యూసెక్కుల చొప్పున వదిలినట్లు గోదావరి హెడ్‌వర్క్స్ జేఈ డి.రాధాకృష్ణ తెలిపారు. విజ్జేశ్వరం ఆర్మ్‌ను పూర్తిగా మూసేశామన్నారు.

ఖరీఫ్ అవసరాలకు స్వల్పంగా..

మొంథా తుపాను ప్రభావంతో పలుచోట్ల ఖరీఫ్‌వరి చేలు ముంపుబారినపడ్డాయి. అనంతరం వరికోతలు పుంజుకున్నాయి. ఈ నేపథ్యంలో ఖరీఫ్‌సాగుకు నీటి వినియోగం బాగా తగ్గింది. ఖరీఫ్‌సాగు అవసరాలకు నీటిని విడుదల చేస్తున్నారు. -న్యూస్‌టుడే, పి.గన్నవరం

పి.గన్నవరం కాటన్ అక్విడక్టు దిగువ నుంచి సముద్రంలోకి వెళ్తున్న గోదావరి జలాలు

శాఖల పని తీరుపై గ్రేడింగ్ : కలెక్టర్

కలెక్టరేట్(రాజమహేంద్రవరం) : ప్రతి శాఖ పనితీరుపై రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ పర్యవేక్షణ ఉందని, శాఖల వారీగా గ్రేడింగ్‌లో ర్యాంకు పెంచుకోవడంపై దృష్టి సారించాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ శాఖల పనితీరు, సేవల నాణ్యత, లక్ష్యాల సాధన, ప్రజా సౌకర్యాల అభివృద్ధి వంటి అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని శాఖలు మెరుగైన గ్రేడ్ సాధించే విధంగా కృషి చేయాలన్నారు. ప్రజలతో నేరుగా సంబంధం ఉన్న అన్ని సేవల్లో పారదర్శకత, వేగం, నాణ్యత పెరగాల్సిన అవసరం ఉందన్నారు.

గుండెల్లో వేదన.. తరగని నిరీక్షణ

మావోయిస్టుల మృతదేహాల కోసం వచ్చిన బంధువులు

ఈనాడు డిజిటల్, పాడేరు - న్యూస్‌టుడే, రంపచోడవరం

ఓపక్క అయిన వారిని పోగొట్టుకున్న వేదన.. మరోపక్క పొంగుకొస్తున్న రోదన.. భాష తెలియని, ఊరు కాని ఊరు వచ్చి తమవారి చివరిచూపు కోసం నిద్రాహారాలు మాని వేచి చూశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఆసుపత్రి ఎదుట గురువారం కనిపించిన ఉద్విగ్న పరిస్థితులివీ. మారేడుమిల్లి మండలంలోని అటవీ ప్రాంతంలో మంగళ, బుధవారాల్లో మావోయిస్టులు, పోలీసు బలగాలకు మధ్య ఎదురుకాల్పులు జరిగి పార్టీ అగ్రనేత హిడ్మా, ఆయన భార్యతో సహా 13 మంది మావోయిస్టులు మృత్యువాతపడిన విషయం తెలిసిందే. మృతదేహాలను రంపచోడవరం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ప్రాణాలు కోల్పోయిన వారిలో ఎక్కువమంది ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారే ఉండడంతో బంధువులు అంత దూరంనుంచి కొండంత దుఃఖంతో తరలివచ్చారు. గురువారం నాటికి నాలుగు మృతదేహాలకు మాత్రమే పోస్టుమార్టం పూర్తయింది. మిగిలిన తొమ్మిదిమంది బంధువులు తమను ఎప్పుడు పిలుస్తారోనని ఆసుపత్రి ఆవరణలోనే వేచిచూస్తూ కనిపించారు.

ఆసుపత్రి వద్ద మావోయిస్టుల కుటుంబ సభ్యులు

కొనసాగుతున్న గాలింపు

రెండు ఎదురుకాల్పుల సంఘటనల్లో మరికొంతమంది మావోయిస్టులు తప్పించుకున్నారన్న అనుమానంతో బలగాలు ఇంకా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. వారు జనావాసాల్లో కలిసిపోయే ఆస్కారం ఉందని అన్ని పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించారు. ఒడిశా సరిహద్దు వరకు పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. సరిహద్దులో ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నారు.

డీజీపీ ఏరియల్ సర్వే

సాయుధ బలగాలకు, మావోయిస్టులకు ఎదురుకాల్పులు జరిగిన ప్రదేశాలను డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా ఏరియల్ సర్వే చేశారు. రెండు ఎన్‌కౌంటర్లలో స్వాధీనం చేసుకున్న ఆయుధాలతో రంపచోడవరం ఏఎస్పీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన ప్రదర్శనను పరిశీలించారు. కూంబింగ్‌లో పాల్గొన్న బలగాలను అభినందించారు. రంపచోడవరం అంతటా భారీగా సాయుధ బలగాలను మోహరించారు.

MANAGEMENT - ADMISSIONS 2025-26
Post B.Sc - 2 Years (Qualification GNM)
M.sc Nursing - 2 Years (B.Sc + 1year)
Courses offered: GNM, B.Sc Nursing, Post B.Sc, M.Sc Nursing
FIND US ON GOOGLE COLLEGE ADDRESS
Secretary & Correspondent Smt. Vasantha Kumari Indupalli
MOTHER THERESA COLLEGE OF NURSING, KAKINADA
Cont : 0884-2345966, 2345977, Direct: 9247255155

శ్రద్ధాంజలి
మంచి మనిషి, స్నేహశీలి, అందరిని చిరునవ్వుతో పలుకరించే మహోన్నతవ్యక్తి, మా తండ్రి గారు శ్రీ చిగురుపాటి సుబ్బారావు గారు ది.12-11-2025న స్వర్గస్తులైనారని తెలియజేయుటకు చింతిస్తూ, వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...
శ్రీ చిగురుపాటి సుబ్బారావు గారు
మేనేజింగ్ పార్ట్‌నర్ కోహినూర్ గ్రాఫైట్ క్రూసిబుల్ కంపెనీ రాజమండ్రి
కుమారుడు: చిగురుపాటి ప్రవీణ్ మరియు కుటుంబసభ్యులు
పెద్దకర్మ: ది. 22-11-2025 శనివారం, రాజమండ్రి, శ్యామలానగర్, పంచవటి హోటల్ ప్రక్క వీధిలో, డోర్ నెం.78-13-7/2లో గల మా స్వగృహమునందు జరుగును.

THE ARYAPURAM CO-OPERATIVE URBAN BANK LTD. HEAD OFFICE, RAJAMAHENDRAVARAM (Reg.No.3127)

RECRUITMENT NOTIFICATION FOR THE POSTS OF ASST. CLERKS / ASST. CASHIER ON CONTRACT BASIS

Applications are invited from Candidates who passed **IBPS/ SBI/RRB'S CLERKS PRELIMS** for the post of Asst. Clerks on contract basis Age : 21 Yrs-28 Yrs. as on date of notification (Age relaxation as per Bank service conditions), **Consolidated payment of Rs. 24,000/- p.m** during probation period of 1 year and on confirmation pay scales will be applicable.

The vacancies are at our Guntur, Visakhapatnam and Bhimavaram Branches only

Selection Procedure : Written Test and Interview

Last date of application to be received to bank: 29-11-2025 by 5:00 p.m.

Those candidates who have applied in last one year are not eligible to apply **Application only in specified format can be sent through courier or email or through registered post or in person. Bank reserves right to refuse any application without assigning any reasons**

Detailed Recruitment notification & Application can be downloaded from Website:
http://www.aryapurambank.com/career.html
Email: arcobank_rjy@aryapurambank.com
Date: 21-11-2025 Contact no.:-0883-2473550
Secretary/CEO

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

(c) eenadu

దీపోత్సవం.. భక్తుల తన్మయత్వం

బండారులంకలో ఉన్న పద్మావతి, అలివేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో కార్తికమాసం కావడంతో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన సహస్ర దీపాలంకరణ ఆకట్టుకుంది. శివలింగంతోపాటు స్వస్తిక్, వేంకటేశ్వరస్వామి నామాల ఆకారంలో దీపాలను అలంకరించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

మహా కుంభాభిషేకం

కాకినాడ సాగరతీరంలో మంగాయమ్మ సమేత ఉమా భీమేశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం 50వ మహాకుంభాభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. కోటి ఎనిమిది లక్షల శివలింగాలకు పండ్ల రసాలతో భక్తులు స్వయంగా అభిషేకించారు. – న్యూస్‌టుడే, గాంధీనగర్

పాల్గొన్న భక్తజనం (అంతర చిత్రం) అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం గురువారం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో శోభిల్లింది. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈవో ఎన్ఎస్ చక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. – న్యూస్‌టుడే, ఆత్రేయపురం

అంతర్వేది మినీ ఫిషింగ్ హార్బర్‌లో మెరైన్, సివిల్ పోలీసులు

తీరంలో సాగర్ కవచ్

తీరం వెంబడి ముష్కరులు దేశంలోకి చొరబడకుండా నివారించే చర్యల్లో భాగంగా గురువారం మెరైన్, సివిల్, కోస్టుగార్డ్ పోలీసుల ఆధ్వర్యంలో సాగర్ కవచ్ నిర్వహించారు. అంతర్వేది సాగర సంగమం నుంచి కరవాక తీరం వరకు పెద్దఎత్తున మోహరించారు. మత్స్యకారులు, పర్యాటకులను తనిఖీ చేశారు. సివిల్, మెరైన్ సీఐలు నరేష్‌కుమార్, నవీన్ నరసింహమూర్తి, సఖినేటిపల్లి, మలికిపురం, రాజోలు, రావులపాలెం పోలీసులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, సఖినేటిపల్లి

జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

వర్ష మాలిని, జతిన్‌రెడ్డిలను అభినందిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

కడియం, అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం గ్రామీణ మండలం బొమ్మూరుకు చెందిన కిల్లిని వర్షమాలిని జాతీయస్థాయి అండర్-19 క్రికెట్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల విశాఖలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో విశేష ప్రతిభ కనబర్చి అర్హత సాధించింది. ఆమె ఓఎన్‌జీసీ కేంద్రీయ విద్యాలయంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. అదే పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఆమె తమ్ముడు జతిన్‌రెడ్డి అండర్-14లో ఆడి ఆల్‌రౌండర్‌గా నిలిచాడు. వారి తండ్రి కె.మధుసూదన్‌రెడ్డి ప్రస్తుతం కడియంలోని ఓ పేపరు మిల్లులో పనిచేస్తున్నారు. గురువారం వారు అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని కలవగా సత్కరించారు. భవిష్యత్తులో చక్కగా రాణించాలంటూ అభినందించారు.

తెలుగు వర్సిటీకి వెలుగులు

- డిసెంబరు 1 నుంచి తరగతులకు కార్యాచరణ
- నెలలో కొన్ని పనులకు రూపు..

బొమ్మూరు, హుకుంపేట, న్యూస్‌టుడే: ఒకప్పుడు ఎంతో ఘనత కలిగిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తర్వాత కాలంలో కొంత వెనుకబడింది. తాజాగా పూర్వ వైభవం సంతరించుకునేలా వడివడిగా అడుగులు పడుతున్నాయి. అందులో భాగంగా కోర్సులు ప్రారంభించేందుకు చర్యలు వేగవంతం చేసింది. 2025-26 సంవత్సరానికి ఎంఏ తెలుగు మొదటి సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. డిసెంబరు 1 నుంచి తరగతులు ప్రారంభించేలా కార్యచరణ చేపడుతున్నామని ఉపకులపతి డి. మునిరత్నం నాయుడు చెబుతున్నారు.

కొత్తగా ఏర్పాటు చేసిన బోర్డు

- కూటమి సర్కారు చొరవతో ఉపకులపతిగా డి.మునిరత్నం నాయుడు అక్టోబరు 23న బాధ్యతలు స్వీకరించారు.
- ప్రధాన కార్యాలయం వీసీ గది, విద్యార్థుల తరగతి గదుల చుట్టూ దట్టమైన చెట్లు తొలగింపజేశారు.
- పైఅంతస్తులో బోధనకు అనుగుణంగా గదులకు మరమ్మతులు చేయించారు.
- కుర్చీలు, బల్లలు అన్నింటినీ మరమ్మతులు చేయించారు. వైఫై సౌకర్యం కల్పించారు.
- రాజమహేంద్రవరం సంగీత కళాశాల ప్రిన్సిపల్ డా.పసుమర్తి శ్రీనివాస్ శర్మ పూర్వ విద్యార్థుల సాయంతో యూనివర్సిటీకి రూ.25వేల విలువైన ఫర్నీచర్ సమకూర్చారు.

వీటిపై ప్రత్యేక దృష్టి..

ప్రొఫెసర్లను తాత్కాలిక పద్ధతిలో నియమించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇతర సదుపాయాలపైనా దృష్టి సారించారు. పాత భవనాల్లో మరమ్మతులు చేసేందుకు పరిశీలిస్తున్నారు. కొత్తగా కోర్సుల్లో చేరే అభ్యర్థుల సంఖ్యను బట్టి వర్సిటీ ప్రాంగణంలో వసతి, భోజన సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

నాణ్యమైన బోధన అందిస్తాం..

వర్సిటీలో ఎంఏ తెలుగు తరగతులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రభుత్వం, దాతల సహకారంతో డిసెంబర్ 1 నాటికి వీలైనంత సౌకర్యాలు కల్పించేలా ప్రయత్నిస్తున్నాం. వచ్చే ఏడాది మరిన్ని కోర్సులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రవేశాలు పొందిన వారికి నాణ్యమైన బోధన అందించడమే మా లక్ష్యం.

– డి.మునిరత్నం నాయుడు, వీసీ

వచ్చే నెల 15లోగా పిల్లర్ పనులు పూర్తి చేయాలి

అధికారులతో మాట్లాడుతున్న గోదావరి డెల్టా చీఫ్ ఇంజినీర్ శేషుబాబు

నిడదవోలు, న్యూస్‌టుడే: రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా పశ్చిమ డెల్టా ప్రధాన కాలువలో చేపట్టిన ఆర్వోబీ నిర్మాణ పనులను వచ్చే నెల 15వ తేదీలోగా పూర్తి చేయాలని గోదావరి డెల్టా చీఫ్ ఇంజినీర్ శేషుబాబు సూచించారు. గురువారం ఆర్వోబీ వద్ద కాలువలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ప్రణాళిక ప్రకారం పనులు జరిగే విధంగా జలవనరులు, ర.భ.శాఖ అధికారులు రోజువారీ పర్యవేక్షణ చేయాలన్నారు. దాళ్వా సాగుకు నీటి సరఫరా సక్రమంగా చేయడానికి అప్పారావు కాలువలో పూడిక తొలగించాలని నిడదవోలు డీసీ అధ్యక్షుడు జుజ్జవరపు సత్యనారాయణ, రైతు విరాల సత్యనారాయణ ఆయనను కోరారు. ఆయన వెంట తూర్పు, పశ్చిమ డెల్టా ఈఈలు శ్రీనివాస్, రమేష్, డీఈ ధర్మజ్యోతి, ర.భ.శాఖ డీఈ శ్రీకాంత్ ఉన్నారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: మదనపల్లె మండలం పుంగనూరు రోడ్డులోని గ్రీన్‌వ్యాలీ పాఠశాలలో జరుగుతున్న 69వ రాష్ట్ర స్థాయి అండర్- 14 బాలబాలికల ఫుట్‌బాల్ పోటీల్లో భాగంగా రెండో రోజైన గురువారం క్రీడాకారులు పోటాపోటీగా తలపడ్డారు. పలు జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. బాలుర విభాగంలో పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, చిత్తూరు, నెల్లూరు, కర్నూల్, కడప, విశాఖపట్నం, అనంతపురం జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. బాలికల విభాగంలో అనంతపురం, నెల్లూరు, పశ్చిమగోదావరి, విశాఖపట్నం, తూర్పుగోదావరి, కడప, చిత్తూరు, శ్రీకాకుళం జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి.

అంతర్జాతీయస్థాయి చదరంగం పోటీల్లో స్వర్ణ పతకం

గెల్లా రాజశేఖర్

దేవరపల్లి, న్యూస్‌టుడే: అంతర్జాతీయస్థాయి చదరంగం పోటీల్లో దేవరపల్లి మండలం గౌరీపట్నానికి చెందిన గెల్లా రాజశేఖర్ ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకం కైవసం చేసుకున్నాడు. సన్‌యుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు భూటాన్ దేశంలోని థింపూలో 12వ అంతర్జాతీయ చదరంగం పోటీలు జరిగినట్లు రాజశేఖర్ తెలిపారు. సుమారు 12 దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనగా రాజశేఖర్ ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఆయనను గ్రామస్థులు, స్నేహితులు, బంధువులు అభినందించారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రతి కుటుంబంలోనూ ఒక మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నది ప్రభుత్వ సంకల్పమని డీఆర్డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి అన్నారు. ఏడాది గ్రామ ప్రణాళికపై కొవ్వూరు మండల వీవోఏలకు సమాఖ్య కార్యాలయంలో గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ చిన్న తరహా పరిశ్రమల స్థాపన ద్వారా మహిళ స్వయం ఉపాధి పొంది తద్వారా ముగ్గురు లేదా నలుగురికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కొవ్వూరులో నాలుగు రోజులపాటు మహిళల జీవన స్థితిగతులు మార్చే ప్రణాళిక, ఆరోగ్యం, అక్షరాస్యత అంశాలపై సమగ్ర శిక్షణ తరగతులు కొనసాగనున్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా దశలవారీగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బ్యాంకు, స్త్రీ నిధి, ఉన్నతి వంటి పథకాల ప్రగతిపై సమీక్షించారు. ప్రతి వీవోఏ పరిధిలో 300 మంది సభ్యులు ఉంటారని, మార్చి నెలాఖరు నాటికి ముగ్గురు పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దేలా శ్రద్ధ చూపించాలన్నారు. ధవళేశ్వరంలో వీడియోగ్రఫీ, ప్రథమ చికిత్స అంశాల్లో ఆంధ్రాబ్యాంకు ద్వారా శిక్షణ ఇస్తున్నారన్నారు. ప్రాజెక్టు మేనేజరు ఎం. సంపత్‌కుమార్, ఏపీఎంలు ఇ.శ్రీనివాసరావు, కె.నిర్మల, సీసీలు, వీవోఏలు, అకౌంటెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వజ్రోత్సవాలకు నిడదవోలు ముస్తాబు

రోప్ లైటింగ్‌తో ఆర్వోబీపై స్తంభాల కాంతులు

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు పురపాలక సంఘం ఏర్పడి 60 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు వజ్రోత్సవాల నిర్వహణకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. గణపతికూడలి నుంచి గణేష్‌చౌక్ కూడలి, అక్కడ నుంచి సమిశ్రగూడెం వంతెన వరకు గల సెంట్రల్ డివైడర్స్‌పై ఏర్పాటు చేసిన గ్రానైట్ క్లాడింగ్‌కు గ్రూపు, డివైడర్ అంచులకు ఎనామిల్ పెయింట్ వేస్తున్నారు. సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు పెయింటింగ్, వైరింగ్, రోప్ లైటింగ్, పంగిడి రోడ్డులో గణేష్‌చౌక్ నుంచి విద్యుత్తు సబ్‌స్టేషన్ వరకు డివైడర్‌కు 3డి ఆర్ట్ పెయింటింగ్ వేస్తున్నారు. వీటిలో ప్రధానంగా నాలుగు పనులను చేపట్టారు. గణపతికూడలిలో రుడా నిధులతో ఏర్పాటు చేసిన ఐ లవ్ నిడదవోలు పార్కులో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి పురపాలక సంఘ కార్యాలయానికి రంగులు వేసి, ఆవరణను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. వజ్రోత్సవాలను పురస్కరించుకుని నూతన లోగో రూపకల్పన చేశారు. దీనిలో కోట సత్తెమ్మ ఆలయంతోపాటు మసీదు, చర్చి, రైలు, ఆర్వోబీ, పచ్చని పంటచేలతో ఆకర్షణీయంగా తీర్చి దిద్దారు.

బిల్లులు లేకుండా ఇసుక తరలింపు

- లారీకి రూ.లక్ష జరిమానా

చాగల్లు, న్యూస్‌టుడే: సరైన బిల్లులు లేకుండా కొవ్వూరు మండలం వాడపల్లి నుంచి నిడదవోలు వైపు ఇసుక తరలిస్తున్న లారీని ఈనెల 18న గ్రామీణ పోలీసులు గుర్తించారు. వాహన వివరాలను మైనింగ్ అధికారులకు పంపించారు. లారీపై రెండోసారి బిల్లులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించిన మైనింగ్ అధికారులు రూ.లక్ష జరిమానా విధించినట్లు గ్రామీణ ఎస్సై కె.శ్రీహరి గురువారం తెలిపారు.

కొబ్బరి.. ధర తడబడి

- తమిళనాడులో పెరిగిన దిగుబడి
- కోనసీమపై తీవ్ర ప్రభావం

న్యూస్‌టుడే, అంబాజీపేట

కోనసీమ కొబ్బరి మార్కెట్‌లో కాయల ధరలు తగ్గిపోయాయి. మొన్నటి వరకు రైతులు, వ్యాపారులకు కాసులు కురిపించిన ఈ పంటకు కాస్త డిమాండ్ తగ్గటంతో నిరాశకు లోనవుతున్నారు. కార్తికమాసం పూర్తికావటం, ఉత్తరాది రాష్ట్రాల్లో చలి తీవ్రత అధికంగా కావటం, తమిళనాడు రాష్ట్రంలో కొబ్బరి దిగుబడులు అందుబాటులోకి రావటం వంటి ప్రతికూల అంశాల నడుమ ఇక్కడి ధరలు మందగమనంలో ఉన్నాయి. ఈ ఏడాది సెప్టెంబరులో వెయ్యి పచ్చికొబ్బరికాయల ధర రికార్డు స్థాయిలో రూ.27 వేలు నమోదయింది.

అంబాజీపేటలో పచ్చికొబ్బరికాయల రాశులు

అక్కడ తగ్గి.. ఇక్కడ పెరిగి..

తమిళనాడు రాష్ట్రంలో కొబ్బరి తోటలకు వ్యాపించిన తెగుళ్లు, పురుగుల కారణంగా దిగుబడులు పడిపోవడంతో కోనసీమ కొబ్బరికాయల అవసరం ఏర్పడింది. ఇప్పుడు అక్కడ దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో ఇక్కడి కాయలకు గిరాకీ తగ్గిపోయింది. వెయ్యి పచ్చి కాయలు సెప్టెంబరులో రూ.27 వేలు, అక్టోబరులో రూ.26 వేలు ఉండగా, ప్రస్తుతం రూ.19 వేల నుంచి రూ.18 వేలకు దిగజారింది. కోనసీమలో ఎకరానికి 1,500 వరకు కొబ్బరికాయల దిగుబడి వచ్చేది. ప్రస్తుతం 800 నుంచి 1000 కాయలు మాత్రమే వస్తున్నాయని రైతులు చెబుతున్నారు.

సన్నగిల్లిన ఎగుమతులు

ఉత్తరాది రాష్ట్రాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో కొబ్బరి వ్యాపారాలు సజావుగా సాగడం లేదు. ఈ ప్రభావం కోనసీమ ఎగుమతులపై చూపుతోందని కొబ్బరి మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చి వరకు కూడా ధరలు ఇలానే ఉంటాయని అంటున్నారు. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు నిత్యం కోనసీమ జిల్లా నుంచి 100 నుంచి 150 వరకు లారీల కొబ్బరి కాయలు ఎగుమతులు జరిగేవి. ఇప్పుడు 30 నుంచి 40 లారీల సరకు మాత్రమే వెళ్తోందని వ్యాపారవర్గాలు చెబుతున్నాయి.

రత్నగిరి.. భక్తసిరి..

వ్రతమాచరిస్తున్న భక్తులు

అన్నవరం, న్యూస్‌టుడే: ఈ ఏడాది కార్తికమాసం గురువారంతో ముగిసింది. ఈ మాసంలో అన్నవరం సత్యదేవుని దర్శనానికి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. వ్రతాలు అత్యధికంగా జరిగాయి. కమిషనర్ కె.రామచంద్రమోహన్ నిరంతర పర్యవేక్షణ, ప్రత్యేక అధికారుల నియామకం, ఛైర్మన్ ఐ.వి. రోహిత్ ప్రత్యేక దృష్టి, అధికారులు, సిబ్బంది సమన్వయంతో అంతా సాఫీగా సాగింది. భక్తులకు కొన్ని ఇబ్బందులు ఎదురవ్వగా భవిష్యత్తులో పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఉంది.

కార్తికం సాగిందిలా..

- **భక్తులు:** గత నెల 21 నుంచి ఈ నెల 20 వరకు సత్యదేవుని దర్శనానికి సుమారు 9 లక్షల మంది భక్తులు వచ్చారని అంచనా. ఈనెల 5, 9, 15, 16 తేదీల్లో భక్తజనం ప్రవాహంలా తరలివచ్చారు.
- **వ్రతాలు:** 1,34,476 వ్రతాలు జరిగాయి. రూ.300 వ్రతాలు 96484, రూ.1000 వ్రతాలు 16,099, రూ.1,500 వ్రతాలు 9,511, రూ.2000 వ్రతాలు 12,382 జరిగాయి.
- **అన్నదానం:** నిత్యాన్నదాన పథకం ద్వారా 3.75 లక్షల మందికి పులిహోర, దద్దోజనం, 99,360 మందికి భోజనాలు పంపిణీ చేశారు. గోధుమనూక ప్రసాదం సుమారు 22 లక్షల ప్యాకెట్లు విక్రయం.
- **రవాణా:** రైల్వేస్టేషన్, కొండ దిగువన, సత్యగిరి నుంచి రత్నగిరికి సుమారు 1.50 లక్షలు మంది ఉచితంగా, 2.70 లక్షల మంది టికెట్లు తీసుకుని ప్రయాణించారు. దీనిద్వారా రూ.38 లక్షల ఆదాయం వచ్చింది. సుమారు 30 వేల కార్లు వచ్చాయని అంచనా.
- **వసతి:** వసతి సముదాయాలు అద్దెకు ఇవ్వడం ద్వారా సుమారు రూ.1.29 కోట్లు ఆదాయం వచ్చింది. డార్మెటరీలు ఉచితంగా కేటాయించారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్సడ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ వై. కిరణ్ చంద్ (చీఫ్ మేనేజర్) మొబైల్ నెం.91609 49910, ఇ-మెయిల్ ఐడి: sbi.10077@sbi.co.in, ఆస్తి తనిఖీ కొరకు : 98482 49289

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8(6)కు 9(1) నిబంధనలతో చదువబడు (సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకుకు తనఖా చేసిన స్థిరాస్తుల అమ్మకము) SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13(4) క్రింద దిగువ తెలిపిన ఆస్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిగా దిగువ సంతకందారు నిర్మాణాత్మక స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు బకాయిలు రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తనఖాపెట్టిన ఆస్తి/ఆస్తుల ఈ-వేలం (SARFAESI చట్టం 2002 క్రింద) "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" పద్ధతి పై నిర్వహించబడుతుందని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది మరియు నియమ నిబంధనలు దిగువ తెలుపబడినవి.

ఋణగ్రహీత(లు) : శ్రీ కోలా నరసింహారావు, తండ్రి : కోలా పుల్లయ్య, డి.నెం.4-37, పెనుగొండ నగర్, వేమగిరి, కడియం మండలం, తూర్పుగోదావరి జిల్లా - 533125. డిమాండ్ నోటీసు తేది: 27-06-2024

డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం : తేది.26.06.2024 నాటికి రూ.59,52,187/- + తేది.27.06.2024 నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి.

ప్రస్తుత బకాయి మొత్తం: తేది.17-11-2025 నాటికి రూ.62,83,985/- + భవిష్య వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి. (మునుపటి జమలు మినహాయించిన తరువాత).

షెడ్యూల్ ఆస్తి వివరములు:

రిజిష్టర్డు సేల్ డీడ్ నెం.10062/2018 ప్రకారం శ్రీ కోలా నరసింహారావు, తండ్రి : పుల్లయ్య గారిచే తనఖా పెట్టబడిన స్థిరాస్తి: ఆంధ్రప్రదేశ్, కాకినాడ జిల్లా, కాకినాడ రూరల్ మండలం, తూరంగి గ్రామం మరియు గ్రామ పంచాయితీ, సమీప డి.నెం. 11-24-1/ఏ, ఎల్‌పి నెం.4/86, ప్లాట్ నెం.47 వద్ద పాత ఆర్.ఎస్.నెం.161/1ఎ మరియు ఆర్.ఎస్.నెం.217/1 లోని 1398 చ॥గ॥లు మొత్తం విస్తీర్ణంలో 740 చ॥గ॥లు(తూర్పు వైపు) విస్తీర్ణం గల ఓపెన్ నివాస ప్లాట్ యావత్తు ఆస్తి రిజిష్టర్డు సేల్ డీడ్ నెం.10062/2018, తేది.04.10.2018 ప్రకారం శ్రీ కోలా నరసింహారావు, తండ్రి : పుల్లయ్య గారి పేరున కలదు. ఆస్తికి హద్దులు: తూర్పు : 126'.0" - ఇతరులకు చెందిన ఆస్తి, పడమర : 126'-0" - కృష్ణవేణి, భర్త: బోసం వెంకట రావు గారికి చెందిన స్థలం, ఉత్తరం : 53'.0"- 33 అ॥ల వెడల్పు గల రోడ్డు, దక్షిణం : 53'.0" - పుంత రోడ్డు.

పైన తెలిపిన హద్దులలోని 740 చ॥గ॥ల విస్తీర్ణం గల స్థలం అన్నీ సూపర్ నిర్మాణాలు, ఉమ్మడి దారులు, నీటి మార్గాలు మరియు ఈజిమెంటరీ హక్కులు మొ॥ వాటితో కలదు.

రిజర్వు ధర : రూ.1,18,00,000/- ధరావత్తు : రూ.11,80,000/- బిడ్ పెంపుదల : రూ.20,000/-

ఇ-వేలం తేదీ : 09-12-2025 సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఆస్తి తనిఖీ తేది మరియు సమయం: తేది:21-11-2025 నుండి 08-12-2025 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింకును రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఇఎండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s. PSB Alliance & M/s. Baanknet యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.comను సంప్రదించండి.
2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, ఎస్సెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.

గమనిక : ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ ఇ.ఎం.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎం.డి మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు. కావున బిడ్డర్లు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎం.డిను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలని సూచించటమైనది.

గమనిక -2 : ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 194-1A ప్రకారం అమ్మకంలో భాగంగా అమ్మకం విలువ రూ.50,00,000/- (యాభై లక్షల రూపాయలు) మరియు అంతకంటే ఎక్కువ ఉన్నచో సదరు మొత్తముపై TDS @ 1% వర్తిస్తుంది. కావున సఫలీకృత బిడ్డరు/కొనుగోలుదారు గవర్నమెంట్ గైడ్‌లైన్స్ ధర లేదా అమ్మకం ధరలో ఏది ఎక్కువైతే దానిలో 1% TDS ను తగ్గించుకొని సదరు మొత్తమును ఆదాయపు పన్ను డిపార్ట్‌మెంట్ యొక్క ఫారం నెం.16-బి నందు జమచేయవలెను మరియు సదరు ఒరిజినల్ TDS సర్టిఫికెట్‌ను బ్యాంకు వారికి సమర్పించవలెను.(వ్యవసాయ భూమి కాకుండా కేవలం స్థిరాస్తికి మాత్రమే వర్తించును).

తేది:17-11-2025, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

కాలినడకన శబరిమల వెళ్లి..
క్షేమంగా ఇంటికి తిరిగొచ్చిన సాయితేజ

సాయితేజకు స్వాగతం పలుకుతున్న కుటుంబ సభ్యులు

గోపాలపురం: అయ్యప్ప స్వామిపై ఉన్న భక్తితో గోపాలపురం మండలం కొవ్వూరుపాడుకు చెందిన చిలకా సాయితేజ కేరళ రాష్ట్రంలోని శబరిమలైకు కాలినడకన అక్టోబరు 3వ తేదీన బయలుదేరి వెళ్లారు. 45 రోజులుపాటు సుమారు 1200 కిలోమీటర్ల దూరం ఒక్కడే నడిచి వెళ్లిన ఆయన నవంబరు 20వ తేదీ గురువారం స్వగ్రామానికి తిరిగి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు కుటుంబ సభ్యులు, స్థానికులు ఘన స్వాగతం పలికి గ్రామంలో ఊరేగించి ఆయా ఆలయాల్లో దర్శనం చేయించారు.

అసంక్రమిత వ్యాధుల నివారణకు శిక్షణ తరగతులు

ధవళేశ్వరం, మోరంపూడి: రాష్ట్రప్రభుత్వం, జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో యోసైడ్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో అసంక్రమిత వ్యాధుల నివారణ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కె.వెంకటేశ్వర్రావు తెలిపారు. నూరా హెల్త్ సాంకేతిక సహకారంతో ఈ కార్యక్రమం ప్రారంభించామన్నారు. రక్తపోటు, మధుమేహం, మహిళల్లో వివిధ రకాల క్యాన్సర్లు వంటి వాటిపై దృష్టి సారించామన్నారు. వ్యాధులకు కారకాలు, సమస్య గుర్తించడం, స్వయంగా పరిష్కార వ్యూహాలను రూపొందించుకొనే అవకాశం లభిస్తుందన్నారు. ఆశా కార్యకర్తలు, సీహెచ్‌వోలు, ఏఎన్‌ఎంలు, ఎల్‌హెచ్‌వీలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా. బి.శ్రీదేవి, జిల్లా ప్రజారోగ్య వైద్యాధికారి డా.శ్రీవల్లి, జిల్లా ఎన్‌సీడి అధికారి డా.హరిచంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	21,000
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	20,000-21,000
కొత్త (పచ్చి) కాయ	18,000-19,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	106-00
రిటైల్ లైవ్	133-00
డ్రెస్డ్	193-00
స్కిన్‌లెస్	219-00

92.7 FM Rajamahendravaram 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

FINANCIAL SERVICES

ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభ వాయిదా లేదా నెలవారీ వడ్డీ పద్ధతిలో పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటి. ✆ 73862 01191.

REAL ESTATE

LAND FOR SALE

GENERAL

రాజమండ్రికి 30 కి.మీ. దూరంలోగల మురారి - గండేపల్లి మధ్య నేషనల్ హైవేకి చేర్చి 100 అ॥ల రోడ్ ఫేసింగ్‌తో 60 సెంట్లు భూమి అమ్మబడును. (నో బ్రోకర్స్), ✆ 90329 88265.

PLOT FOR SALE

GENERAL

వైజాగ్ Google డేటా సెంటర్ - ఎయిర్‌పోర్ట్ మధ్య హైవే ఫేసింగ్ వెంచర్‌లో మీపెట్టుబడికి. గజానికి అధిక ఆదాయం. త్వరపడండి. ✆ 9949000033

JOBS

కొటక్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో పనిచేయుటకు రిటైర్డ్ ఉద్యోగులకు, సీనియర్ సిటిజనులకు, గృహిణీలకు ఉద్యోగ అవకాశం. Cont: మోహనరావు, రిటైర్డ్ ఎంప్లాయ్ ✆ 96035 93843

లక్ష్మి మోటార్స్ (YAMAHA షోరూమ్) తణుకు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, ఏలూరు నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటీవ్స్ కావలెను. ✆ 96667 14613.

HYD, SR నగర్ బాయ్స్ హాస్టల్‌లో అనుభవం గల భార్యభర్తలు వంటమాస్టర్లు కావలెను. సంప్ర: ✆ 9391009238, 8885070231.

రాజమండ్రి హెయిర్ క్లినిక్ నందు పనిచేయుటకు నర్సులు కావలెను. (నో నైట్ డ్యూటీస్) ఆసక్తి కలవారు సంప్రదించండి: 76749 99906.

మా గ్లోబెల్ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు టీం మెంబర్స్ కావలెను. మోర్ డీటెయిల్స్ Contact Cell: 89852 40614.

Required Managers, Agents, Salary and Incentives. Marketing Job, guarantee Income, Age 50 above Cont: 90108 09384

లైఫ్ మెడికల్ స్టోర్స్, రాజమండ్రి నందు పనిచేయుటకు క్యాషియర్స్, కంప్యూటర్ ఆపరేటర్లు, ఫార్మాసిస్టులు, ఫార్మసీ అసిస్టెంట్లు, పార్ట్‌టైమ్ స్టాఫ్, డెలివరీ బాయ్స్ కావలెను. మా బ్రాంచ్‌లు: ప్రకాష్‌నగర్, మెయిన్‌రోడ్, దేవీచౌక్ ✆ 99667 44450

సేల్స్ గర్ల్స్ కావలెను. అనుభవం ఉన్నవారు మాత్రమే సంప్రదించండి. భవాని సిల్క్స్, శశికాంత్‌నగర్, కాకినాడ. Contact: 91339 59999

FACULTY/ TEACHERS

Wanted 6th, 7th Maths/ English Teacher, Attractive Salary. Cont: Prakasham E.M. High School, Madhuranagar, Kkd. ✆ 63023 05325, 99488 81449.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- For the Information of Trade & Industry
- తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-45 పై॥

అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

రాజమహేంద్రవరం

23న చెకుముకి పోటీలు

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో ఈ నెల 23న చెకుముకి జిల్లాస్థాయి పోటీలు సీతంపేట ప్రగతి జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నట్లు కన్వీనర్ రవిబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు విభాగాల్లో మండలస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థుల జట్లు జిల్లా స్థాయి పోటీలకు హాజరుకావాలని సూచించారు. జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన జట్లు డిసెంబరు 12, 13, 14తేదీల్లో కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

రైతు బజారులో నిన్నటి ధరలు(రూ.లో)

దేవీచౌక్, న్యూస్‌టుడే: టమాట-32, వంకాయలు నలుపు-50/గులాబీ-64/తెలుపు-50/దొమ్మేరు-66, బెండ-56, కాకర-38, బీర పందిరి-54, దొండ-56, క్యారెట్-54, బీట్‌రూట్-54, గోరు చిక్కుళ్లు-60, దోస-34, ఆనపకాయ-34, చిక్కుళ్లు-90/సన్నాలు-105, పచ్చిమిర్చి-34, బంగాళదుంపలు-21, ఉల్లిపాయలు-19

మేమున్నాం.. మీకు తోడుగా

సమస్య: స్థానిక సీతంపేటలో కాలువల్లో పూడిక తీత లేదు. -ప్రశాంతి

సమస్య: స్థానిక మున్సిపల్ కాలనీలో కాలువల్లో చెత్త పేరుకుపోయింది. -జీవన్‌కుమార్

సమాధానం: కాలువలను శుభ్రం చేయిస్తాం. -ఎంహెచ్‌వో, వినూత్న

వి.ఎల్.పురం: నగరంలోని వివిధ సమస్యలపై 'మేమున్నాం.. మీకుతోడుగా'కు ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను నగరపాలక సంస్థ ఆయా విభాగాల అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు. ◗ స్థానిక క్వారీ మార్కెట్ ఏరియాలోని శివాలయం నుంచి వెళ్లే మార్గంలో వీధి దీపాలు సంబంధిత విభాగం సిబ్బంది మరమ్మతులు చేపట్టినట్లు ఫిర్యాదుదారుడు నాగేశ్వరరావు తెలిపారు. ◗ తిలక్‌రోడ్డులోని మాధవ్ నర్సింగ్‌హోమ్ ఎదురువీధిలో వీధిదీపాలను సిబ్బంది మరమ్మతులు చేశారని ఫిర్యాదుదారు కుసుమకుమారి చెప్పారు. ◗ జేఎన్‌రోడ్డులోని అభయ ఆసుపత్రి ఎదుట వీధిలో వీధిదీపాల సమస్య పరిష్కారమైనట్లు ఫిర్యాదుదారు సూర్యకుమార్ పేర్కొన్నారు. ◗ శ్రీనగర్‌కాలనీలో రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్త కుప్పలను పారిశుద్ధ్య సిబ్బంది తొలగించినట్లు ఫిర్యాదుదారుడు సుబ్బ ప్రజ్వల తెలిపారు. ◗ ఆర్యాపురంలోని రెడ్డిపేట జంక్షన్ వద్ద డ్రైయిన్లలో పేరుకుపోయిన చెత్తను పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారని ఫిర్యాదుదారుడు కామేశ్వరరావు చెప్పారు.

83282 39927, 80089 02897

పోటీతత్వం.. ప్రగతికి మార్గం

గ్రంథాలయ వారోత్సవ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

చదువు.. సాంస్కృతిక అంశాలు రెండింటిలో నేటితరం చిన్నారులు పోటీపడుతున్నారు. పిల్లలకు ఇష్టమైన అంశాల్లో అందుకు తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించడం మంచి విషయం. పాఠశాల స్థాయిలో చదువుతోపాటు ఇతర అంశాల్లో ఎందులో ఆసక్తి చూపుతున్నారో ఉపాధ్యాయులకు తెలుస్తుంది. విద్యార్థులు ఇష్టపడుతున్న అంశంలో ప్రోత్సహిస్తే విజేతలుగా నిలుస్తారు. 14న ప్రారంభమైన గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. ఆయా పోటీల్లో విరివిగా పాల్గొంటూ పాఠశాల, కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. రాజమహేంద్రవరం నగరంలోని గ్రంథాలయాల్లో జరుగుతున్న వారోత్సవాల్లో పలు పాఠశాలల చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఇన్నీస్‌పేట గ్రంథాలయంలో బొమ్మలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పోటీల్లో ఇవి.. విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వం, దేశభక్తి గీతాల పోటీలు, క్రాఫ్ట్ వర్క్స్, ఎంబ్రాయిడరీ చేయడం, కథలు చదవడం, వినడం, వాద ప్రతివాదనలు తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆయా గ్రంథాలయాల్లో బహుమతులు అందించారు.

ఆ ఆనందం చెప్పలేను..

మనకు తెలిసిన అంశాన్ని అందరికీ తెలియజేయడానికి పోటీలు ఉపకరిస్తాయి. రెండేళ్లుగా తోటి పిల్లలతో కలిసి చిత్రలేఖనం, వ్యాసరచన తదితర పోటీల్లో పాల్గొంటున్నా. విజేతగా నిలిచినప్పుడు కలిగే ఆనందం చెప్పలేను. మా పాఠశాలలో జరిగే జాతీయ పండగల సందర్భాల్లోనూ, గ్రంథాలయ వారోత్సవాల్లోనూ ప్రతిభ చూపినప్పుడు లభించే ప్రశంసలు సంతోషాన్ని అనిపిస్తాయి. - వి.విజయ్, ఏడో తరగతి, నన్నయ మున్సిపల్ పాఠశాల

ఎంతో ఉపయుక్తం..

గ్రంథాలయాల్లో దొరికే అరుదైన పుస్తక సంపదను అధ్యయనం చేయడం అంటే నాకు చాలా ఇష్టం. సివిల్స్ కోసం సాధన చేస్తున్నాను. రోజూ సీతానగరం మండలం ఐనాలపూడివారిపేట నుంచి సీతంపేట గ్రంథాలయానికి వస్తాను. వారోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న పోటీలు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయి. స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రలు, గ్రంథాలయ ఉద్యమకారుల సేవలు, తెలుగు భాషా వికాసం తదితర అంశాలు పోటీల్లో ఉండడంతో నా సివిల్స్ సాధనకు ఇది ఉపయోగపడింది. - కె.అలేఖ్య, పోటీపరీక్షల అభ్యర్థిని

పోటీతత్వంతో ప్రతిభ వెలుగులోకి..

చిన్నతనం నుంచి స్నేహితులతో కలిసి ఆటలు, చదువు, పోటీలు అన్నింటిలో పాల్గొనడం అంటే ఇష్టం. పోటీతత్వం ఉన్నప్పుడే ప్రతిభ వెలికి తీయడానికి అవకాశం దొరుకుతుంది. గ్రంథాలయ వారోత్సవాల్లో పలు అంశాల్లో పోటీలు నిర్వహిస్తారు. సీతంపేట గ్రంథాలయంలో వారం రోజుల పాటు జరిగే ప్రతి పోటీల్లో పాల్గొన్నాను. ఇది నాకు చాలా ఇష్టంగా అనిపిస్తుంది. - ఎస్.జయస్వి, తొమ్మిదో తరగతి

నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు

రాజమహేంద్రవరం గంటలమ్మగుడి వీధిలో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. ఇరువైపులా ద్విచక్ర వాహనాల పార్కింగ్, ఆటోలు, కార్ల రద్దీతో నడిచి వెళ్లడానికి కూడా వీలు లేని పరిస్థితి నెలకొంది. మెయిన్‌రోడ్డు అనుకుని ఉన్న వాణిజ్య కూడలి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. రోజూ నగరం, గ్రామీణం, కొవ్వూరు, పరిసర ప్రాంతాల నుంచి సుమారు 40వేల మంది వస్తారు. పండగలు, ప్రత్యేక దినాల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉంటోంది. ట్రాఫిక్ నియంత్రించి ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, దేవీచౌక్

22న విద్యుత్తు సరఫరాలో అంతరాయం

దేవీచౌక్, న్యూస్‌టుడే: అత్యవసర మరమ్మతులకు 22న (శనివారం) పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ నక్కపల్లి శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొంతమూరులోని రాజరాజేశ్వరినగర్, బీసీ కాలనీ, అఫీషియల్ కాలనీ, చందన రమేష్ లేఔట్, మెయిన్‌రోడ్డు, చెంచుకాలనీ, విడోకాలనీ, ఎస్‌బీఐ బ్యాంక్ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

లక్ష్యాల సాధనకు బ్యాంకర్లు సహకరించాలి

టి.నగర్, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యాల సాధనకు బ్యాంకర్లు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా కోరారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం మెప్మా సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. వివిధ పథకాల అమల్లో బ్యాంకర్ల పాత్ర కీలకమన్నారు. పీఎం స్వనిధి పథకంలో భాగంగా చిరు వ్యాపారులకు రుణాలను అందించేందుకు బ్యాంకర్లు శ్రద్ధ చూపాలన్నారు. టిడ్కో గృహాలు కేటాయించిన లబ్ధిదారులకు కూడా రుణాలు మంజూరు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, లీడ్ బ్యాంకు మేనేజరు డీవీ ప్రసాద్, మెప్మా జిల్లా ప్రాజెక్టు మేనేజరు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరణలు.. అంకురాలు..

రాజానగరం: జీజీయూలోని స్కూల్ ఆఫ్ సైన్స్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం బిజ్‌మైండ్ అవేకెనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య రీసోర్స్ పర్సన్‌గా కర్నూలులోని జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల ఇన్నోవేషన్ డైరెక్టర్ డా.సి.రంజిత్‌కుమార్ విచ్చేశారు. విద్యార్థులకు స్టార్టప్ అవకాశాలు, ఆధునిక వ్యాపార నమూనాలకు సంబంధించి పలు సూచనలు చేశారు. విద్యార్థుల్లో ఆలోచనలు, స్ఫూర్తి పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. జీజీయూ స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ డా.కె.వల్లీమాధవి మాట్లాడుతూ యువత ఆవిష్కరణల దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, సృష్టించేలా యోచించాలన్నారు. ఎంబీఏ విభాగాధిపతి డా.ఆర్.రాజా, బీబీఏ విభాగాధిపతి డా.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నగర సమగ్ర అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ: గత వైకాపా హయాంలోని నాయకుల పాపాలు ప్రజలకు శాపాలుగా మారాయని అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ విమర్శించారు. దేవీచౌక్, పుష్కరఘాట్ ప్రాంతాల్లో గత ప్రభుత్వంలో అలంకరణ పేరుతో నిర్మించిన రోడ్డు టైల్స్‌ను ఎమ్మెల్యే, కమిషనర్ రాహుల్ మీనాతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో జరిగిన పనులపై విచారణ జరుగుతుందన్నారు. వర్షం వస్తే ఇక్కడ పరిస్థితి దారుణంగా మారుతుందన్నారు. అనంతరం గోదావరి బండ్ రోడ్డుపై పనులు పరిశీలించారు. నగరాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని

దెబ్బతిన్న టైల్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కమిషనర్ రాహుల్ మీనా

పేర్కొన్నారు. జనసేన నగర ఇన్‌ఛార్జి అత్తి సత్యనారాయణ మాట్లాడుతూ మాజీ ఎంపీ భరత్ ప్రజల సొమ్మును దుర్వినియోగం చేశారన్నారు.

ధాన్యం సొమ్ము చెల్లింపు: జేసీ

కలెక్టరేట్(రాజమహేంద్రవరం): జిల్లాలో కొనుగోలు చేసిన ఖరీఫ్ ధాన్యానికి సంబంధించి ఇప్పటివరకు 6,750 మంది రైతులకు రూ.118.5 కోట్లు చెల్లించినట్లు జేసీ మేఘస్వరూప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ సీజన్-2025-26కు సంబంధించి జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలనేది లక్ష్యం కాగా గురువారానికి 92,998 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటలలోనే రైతుల ఖాతాలకు నగదు జమ చేసినట్లు వివరించారు. రైతులకు అవసరమైన గోనె సంచులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. ధాన్యం రవాణాకు సంబంధించి గోనె సంచుల వినియోగఛార్జీ రూ.4.74, హమాలీ ఛార్జీ (క్వింటాకు) రూ.22 చొప్పున ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో సందేహాలు, ఎటువంటి ఫిర్యాదులు ఉన్నా కలెక్టరేట్‌లోని కంట్రోల్‌రూమ్ నంబరు 83094 87151లో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటలలోపు సంప్రదించవచ్చని జేసీ తెలిపారు.

విజేతలతో పాఠశాల యాజమాన్యం

చరవాణులకు దూరంగా ఉంటేనే భవిత

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: హుకుంపేటలోని ఎస్ఆర్ ప్రైమ్ పాఠశాలలో ఈనాడు ఈటీవీ ఆధ్వర్యంలో గురువారం 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వి.సత్యవేణి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బాల్యంపై చరవాణి తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. ఇటువంటి అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పి.జోయల్ సామ్రాజ్ (7వ తరగతి), జి.హర్షిత గౌరి (7వ తరగతి), బి.నవతేజ (8వ తరగతి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను ప్రిన్సిపల్ సత్యవేణి, జోనల్ ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు అందజేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా కిరణ్, జ్యోతి వ్యవహరించారు.

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

చిందరవందరగా పలకలు

రాజమహేంద్రవరం నగరంలోని కోటగుమ్మం సెంటర్‌లో బి.ఎస్.ఎన్.ఎల్.కార్యాలయం ఎదురుగా మురుగునీటి కాలువపై పలకలు సరిగా లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. వాణిజ్య సముదాయాలు కార్యాలయాలు అధికంగా ఉన్న ఈ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. సంబంధిత అధికారులు పలకలు సరి చేయాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, కోటగుమ్మం

పడాల సుబ్బారెడ్డి సేవా పురస్కారం

అనపర్తి గ్రామీణం: అనపర్తి శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు, రాష్ట్ర పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పడాల సుబ్బారెడ్డి రాజమహేంద్రవరానికి చెందిన నటరాజ నృత్య నికేతన్ సాంస్కృతిక సంస్థ సప్పా ఎక్సలెన్స్ పురస్కారం-2025ను ప్రకటించింది. అనపర్తి శ్రీరామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడిగా సమాజానికి అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. ఈనెల 23న రాజమహేంద్రవరంలో సంస్థ వ్యవస్థాపకుడు డా.సప్పా దుర్గాప్రసాద్ జన్మదిన వేడుకల్లో భాగంగా పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు.

ఇంద్ర ఏసీ బస్సులో 15 శాతం టికెట్ రాయితీ

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే : రాజమహేంద్రవరం డిపో నుంచి హైదరాబాద్‌కు నడిచే ఇంద్ర ఏసీ బస్సులో ప్రయాణించే వారికి 15 శాతం టికెట్ రాయితీ కల్పిస్తున్నట్లు ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి(డీపీటీవో) వై.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. సూపర్‌లగ్జరీ నాన్ ఏసీ టికెట్ ఛార్జీతోనే ఇంద్ర ఏసీ బస్సులో ప్రయాణం చేయవచ్చన్నారు. ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు ఏసీ బస్సు సాధారణ టికెట్ ధర రూ.1060 కాగా రాయితీ టికెట్ రూ.920కే ఇస్తున్నట్లు చెప్పారు. ఈ రాయితీ డిసెంబరు 31 వరకు వర్తిస్తుందని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థులను వేధిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోండి

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: స్థానిక సాంఘిక సంక్షేమ కళాశాల బాలుర వసతిగృహం 1లో సరైన భోజనం పెట్టకుండా కళాశాలలకు వెళ్లే సమయానికి అల్పాహారం అందించకుండా విద్యార్థులను వేధిస్తున్న సంక్షేమాధికారులపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నాయకులు విజయకుమార్, రాంబాబు, వెంకటరత్నం, అబ్బులు, సూరిబాబు తదితరులు డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించిన అనంతరం గురువారం ప్రకటన విడుదల చేశారు. దీనిపై త్వరగా విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు.

కరపత్రం ఆవిష్కరణ

దేవీచౌక్: ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ఖాతా నుంచి ఈఎంఐ చెల్లించేందుకు వీలుగా ఈ నాచ్ మాండేట్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. దీనికి సంబంధించిన కరపత్రాన్ని గురువారం రాజమహేంద్రవరం తపాలా డివిజన్ సూపరింటెండెంట్ శేషారావు ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవిత బీమా ప్రీమియం, జనరల్ ఇన్సూరెన్స్ ప్రీమియం, క్రెడిట్ కార్డ్ బిల్లు చెల్లించడానికి ఈ నాచ్ మాండేట్ ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. రాజమహేంద్రవరం డివిజన్‌లోని 3,60,000 ఐపీపీబీ ఖాతాదారులందరికీ ఈ సదుపాయం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఐపీపీబీ సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిరాధార విమర్శలు తగవు

మాట్లాడుతున్న భాజపా జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర

దేవీచౌక్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని భాజపా నాయకులు హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు ఎంపీపై నిరాధార విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. గురువారం రాజమహేంద్రవరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భాజపా జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ ఉనికి కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరాధార, అసత్య ఆరోపణలు, విమర్శలు చేయడం తగదన్నారు. ఎంపీ పురందేశ్వరి జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, మంత్రి కందుల దుర్గేష్‌తో కలిసి సమన్వయంతో పనిచేస్తూ నిధులు తెస్తున్నారని వివరించారు. రూ.270 కోట్లతో రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ అభివృద్ధికి చర్యలు తీసుకున్నారన్నారు. గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజును దుర్భాషలాడిన మాజీ ఎంపీ మార్గాని భరత్ కారు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. భాజపా రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు, యెనుముల రంగబాబు, శివరామకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

గౌతమీ గ్రంథాలయంలో చిన్నారుల నృత్యాభినయం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : రాజమహేంద్రవరం నగరంలోని పలు గ్రంథాలయాల్లో వారం రోజులుగా జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. గౌతమీ ప్రాంతీయ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో కొప్పినీడి స్వప్న శిష్యబృందం నృత్య ప్రదర్శనతో అలరించింది. ● సీతంపేట గ్రంథాలయంలో జరిగిన వేడుకలో విజేతలకు బహుమతులు అందజేశారు. ● ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆడిట్ ఆఫీసర్, కళాశాల పూర్వవిద్యార్థి ఎ.వి.వి.సత్యనారాయణ మాట్లాడుతూ గ్రంథాలయం అంటే జ్ఞానానికి జన్మభూమి వంటిదన్నారు.

కాలుష్య కోరల్లో గోదావరి

తగ్గుతున్న కాలువ వెడల్పు..

తూర్పుడెల్టా కాలువ గట్టున వ్యర్థాలు వేసి నిప్పు పెడుతున్నారు. దాంతో అటుగా ప్రయాణించే వాహనచోదకులు, సమీపంలోని పాఠశాల విద్యార్థులు దుర్వాసనతో కూడిన పొగ కారణంగా అస్వస్థతకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో డెల్టా కాలువ గట్టుమీద వేసిన వ్యర్థాలను జేసీబీలతో కాలువలోకి నెట్టేస్తున్నారు. దాంతో నానాటికీ కాలువ వెడల్పు తగ్గిపోతుంది. ఇంత జరుగుతున్నా జలవనరుల శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



తూర్పుడెల్టా కాలువలోకి వ్యర్థాలు నెట్టేయడంతో వెడల్పు తగ్గుతోంది ఇలా..

న్యూస్‌టుడే, ధవళేశ్వరం(కడియం)

ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ తూర్పు డెల్టా కాలువ గట్టు మీద, బ్యారేజీ దిగువన, కాటన్ అతిథి గృహం వెనుక పంచాయతీ సిబ్బంది చెత్త, వ్యర్థాలను డంపింగ్ చేస్తున్నారు. దీంతో గోదావరి జలాలు కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నాయి. కాటన్ బ్యారేజీ నుంచి 10 లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు డెల్టా కాలువల ద్వారా విడుదల చేస్తారు. డెల్టా కాలువల్లో వ్యర్థాలు కలసిపోవడంతో గోదావరి జలాలు కలుషితం అవుతున్నాయి. ధవళేశ్వరం మేజర్ పంచాయతీలో ఏళ్ల తరబడి డంపింగ్ యార్డు సమస్య కొలిక్కి రావట్లేదు. డంపింగ్ యార్డుకు కేటాయించిన స్థలం వివాదంలో ఉండడంతో బొమ్మూరు జాతీయ రహదారి చెంతన ఉన్న డంపింగ్ యార్డుకు తరలించేవారు మూడేళ్ల క్రితం అగ్నిప్రమాదం జరగడంతో అప్పటి కలెక్టరు ఆదేశాల మేరకు చెత్త తరలింపు నిలిపేశారు. అప్పటి నుంచి సేకరించిన చెత్త, వ్యర్థాలను అనధికారికంగా డెల్టా కాలువ గట్టు మీద డంపింగ్ చేస్తున్నారు.

ప్రతిష్టాత్మకంగా బిక్కవోలు షష్ఠి ఉత్సవాలు

బిక్కవోలు: బిక్కవోలులో షష్ఠి ఉత్సవాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. బిక్కవోలులో గురువారం ఆయన మండల స్థాయి అధికారులు, కూటమి నేతలతో సమావేశమయ్యారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేయాలన్నారు. పురాతన దేవాలయం కావడంతో లోపల ఇరుకుగా ఉంటుందని, ఆ మేరకు ఏర్పాట్లు చేయాలన్నారు. స్త్రీశక్తి పథకం కింద ఉచిత బస్సు సౌకర్యంతో ఎక్కువ మంది మహిళా భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి, సభ్యులు చిట్టిబాబు చౌదరి, తహసీల్దారు కృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

మురుగు కాలువలను ప్రక్షాళన చేయాలి

టి.నగర్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం అర్బన్, గ్రామీణం పరిధిలో మురుగునీటి పారుదల వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని గ్రామీణం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. గురువారం ఎమ్మెల్యే గోరంట్ల నివాసంలో మున్సిపల్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాన రైల్వే స్టేషన్, ఈస్ట్ రైల్వే స్టేషన్ రహదారులను విస్తరించాల్సి ఉందన్నారు. హుకుంపేట మెయిన్ కాలువ వ్యవస్థను మెరుగుపర్చాల్సి ఉందని పేర్కొన్నారు. ఎస్ఈ శేషగిరిరావు, ఈఈలు మాధవి, ఆలీ, డీఈలు సత్యనారాయణ, లోవరాజు, రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమీక్షలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

కార్తికమాస పూజలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : గోదావరిగట్టున ఉన్న శ్రీఉమా మార్కండేయస్వామి ఆలయంలో కార్తిక మాసం చివరి రోజును పురస్కరించుకుని స్వామివారికి విశేష పూజలు చేశారు. గురువారం ఉదయం రుద్రహోమం, పూర్ణాహుతి జరిగాయి. ఆలయ ఛైర్మన్ మదన్ పురోహిత్, పాలక మండలి సభ్యులు హాజరై విశేష హారతులు సమర్పించారు.

కుప్పం పోలీసులమంటూ మోసం

బిక్కవోలు, న్యూస్‌టుడే: ఎప్పటికప్పుడు కొత్త విధానాలతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. కుప్పం పోలీసులమంటూ మోసం చేసిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. బిక్కవోలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బలభద్రపురం గ్రామానికి చెందిన అమలాపురపు శ్రీనివాస్‌కు గతేడాది ఆగస్టు 23న ఒక ఫోన్ వచ్చింది. తాము కుప్పం పోలీసుస్టేషన్ నుంచి మాట్లాడుతున్నామని, మీరు దొంగ బంగారం కొనుగోలు చేశారని, వెంటనే ఇక్కడకు బయలుదేరి రావాలని బెదిరించారు. లేదంటే కేసు నమోదు చేస్తామన్నారు. అది నకిలీ ఫోన్ కాల్ అయ్యి ఉంటుందని శ్రీనివాస్ కుమారుడు ఇంట్లో వాళ్లకు చెప్పారు. అయినా పలుసార్లు ఫోన్ చేసి బెదిరించడంతో బాధితుడు ఆందోళనకు గురయ్యారు. వారు చెప్పినట్లే రూ.30వేలు పంపారు. దీనిపై తాజాగా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

పోలవరం నిర్వాసితులకు పరిహారం చెల్లించండి

మాట్లాడుతున్న పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్

దేవీచౌక్, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు వల్ల నష్టపోతున్న 89 వేల మంది నిర్వాసితులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని పీసీసీ ఉపాధ్యక్షుడు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణ, నిర్వాసితుల కమిటీ ఛైర్మన్ మార్టిన్ లూథర్ డిమాండ్ చేశారు. గురువారం రాజమహేంద్రవరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్వాసితులందరికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందేవరకు కాంగ్రెస్ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. డిసెంబరు మొదటివారంలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు వస్తారని తెలిపారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్టులో నీటి నిలువ ఎత్తు తగ్గకుండా చూడాలన్నారు. బాలేపల్లి మురళీధర్, దేవత సుధాకర్, కొవ్వూరి శ్రీనివాసరావు, బెజవాడ రంగారావు, కిషోర్‌కుమార్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

రైలులో గుండెపోటుతో మహిళ మృతి

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రైల్లో ప్రయాణిస్తూ ఓ వృద్ధురాలు మృతి చెందిందని రైల్వే పోలీసులు తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన వనమా లక్ష్మి(67) కుటుంబ సభ్యులతో కలిసి విజయవాడలోని కుమార్తె గృహ ప్రవేశానికి వెళ్లేందుకు గురువారం రైల్లో బయలుదేరారు. రైలు ఏలూరు చేరుకునేసరికి మార్గమధ్యంలో ఆమెకు గుండెపోటు వచ్చింది. ఏలూరు రైల్వేస్టేషన్ వద్ద కిందకు దింపగా రైల్వే డాక్టర్ సీపీఆర్ చేశారు. అయినా ప్రయోజనం లేకపోయింది. చనిపోయినట్లు ధ్రువీకరించారు. కొంతకాలంగా ఆమెకు గుండె సంబంధిత వ్యాధి ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

(c) eenadu

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

ధవళేశ్వరం, మోరంపూడి, న్యూస్‌టుడే: కాటన్ సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ ఎర్ర కొండ, 11కేవీ రాజవోలు అగ్రికల్చర్ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేయనున్నట్లు ఈఈ నక్కపల్లి శామ్యూల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పాత బొమ్మూరు, వడ్డీ వీరభద్రనగర్ కాలనీ, రాజవోలు, ఏఎంజీ, గాయత్రీనగర్, పద్మావతి నగర్, రెవెన్యూకాలనీ, వాంబే గృహాలు, అడవిపాలెం రోడ్, పాలిటెక్నిక్ కాలేజీ, డైట్ కాలేజీ, తహసీల్దారు కార్యాలయం, రమాదేవి గార్డెన్స్ పరిసర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రంగంపేట విద్యార్థులు

రంగంపేట, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా వినుకొండలో ఈనెల 23, 24 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు రంగంపేట విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి క్రీడాకారుల ఎంపిక జరిగింది. 100 మీటర్ల పరుగుపందెం, ట్రిపుల్ జంప్‌లో యవ్వన లక్ష్మి, ట్రిపుల్ జంప్‌లో జాహ్నవి, హర్డిల్స్‌లో సాయి వీరలక్ష్మి, పోల్‌వాల్ట్‌లో ప్రసన్న, స్వర్ణ, సత్యనారాయణ విజయం సాధించారు. వీరికి శిక్షణను అందించిన పీడీలు శైల, వీరబాబు, బూరిబాబులను ప్రధానోపాధ్యాయుడు వి.సార్థసారధి అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: 91212 29057, కడియం: 91212 29062, అనపర్తి: 95333 66637

పూడికలు తొలగించాలి..

సమస్య: హుకుంపేట వరలక్ష్మి కాలనీలో పూడికలు రోజుల తరబడి పేరుకుపోతున్నాయి. మురుగు ముందుకు పారట్లేదు. చెత్త వేయడంతో దుర్వాసన వస్తుంది. - నీరజ, స్థానికురాలు

సమాధానం: పూడికలు తీయించి కాలువ శుభ్రం చేయిస్తాం. - కాశీ, గ్రామ కార్యదర్శి, హుకుంపేట

– న్యూస్‌టుడే, హుకుంపేట

కొత్త కొళాయి వేశారు..

స్పందనకు వందనం

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: అనపర్తి ఇందిరానగర్‌లో కేవీఆర్ అపార్టుమెంట్ పక్కన వీధిలో కొళాయి పగిలి నీరు వృథాగా పోతోంది. స్థానికులు 'న్యూస్‌టుడే'కు తెలియజేశారు. సమస్యను గ్రామ పంచాయతీ కార్యదర్శి ఫణికుమార్ దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే ఆయన స్పందించారు. సిబ్బందిని పంపించి మరమ్మతులు చేసి కొత్త కొళాయి వేయించారు.

కాలుష్య కోరల్లో గోదావర్రీ

తగ్గుతున్న కాలువ వెడల్పు..

తూర్పుడెల్టా కాలువ గట్టున వ్యర్థాలు వేసి నిప్పు పెడుతున్నారు. దాంతో అటుగా ప్రయాణించే వాహనచోదకులు, సమీపంలోని పాఠశాల విద్యార్థులు దుర్వాసనతో కూడిన పొగ కారణంగా అస్వస్థతకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో డెల్టా కాలువ గట్టు మీద వేసిన వ్యర్థాలను జేసీబీలతో కాలువలోకి నెట్టేస్తున్నారు. దాంతో నానాటికీ కాలువ వెడల్పు తగ్గిపోతుంది. ఇంత జరుగుతున్నా జలవనరుల శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



తూర్పుడెల్టా కాలువలోకి వ్యర్థాలు నెట్టేయడంతో వెడల్పు తగ్గుతోంది ఇలా..

న్యూస్‌టుడే, ధవళేశ్వరం(కడియం)

ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ తూర్పు డెల్టా కాలువ గట్టు మీద, బ్యారేజీ దిగువన, కాటన్ అతిథి గృహం వెనుక పంచాయతీ సిబ్బంది చెత్త, వ్యర్థాలను డంపింగ్ చేస్తున్నారు. దీంతో గోదావరి జలాలు కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నాయి. కాటన్ బ్యారేజీ నుంచి 10 లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు డెల్టా కాలువల ద్వారా విడుదల చేస్తారు. డెల్టా కాలువల్లో వ్యర్థాలు కలిసిపోవడంతో గోదావరి జలాలు కలుషితం అవుతున్నాయి. ధవళేశ్వరం మేజర్ పంచాయతీలో ఏళ్ల తరబడి డంపింగ్ యార్డు సమస్య కొలిక్కి రావట్లేదు. డంపింగ్ యార్డుకు కేటాయించిన స్థలం వివాదంలో ఉండడంతో బొమ్మూరు జాతీయ రహదారి చెంతన ఉన్న డంపింగ్ యార్డుకు తరలించేవారు మూడేళ్ల క్రితం అగ్నిప్రమాదం జరగడంతో అప్పటి కలెక్టరు ఆదేశాల మేరకు చెత్త తరలింపు నిలిపేశారు. అప్పటి నుంచి సేకరించిన చెత్త, వ్యర్థాలను అనధికారికంగా డెల్టా కాలువ గట్టుమీద డంపింగ్ చేస్తున్నారు.

తీరమంతా కలుషితం..

గోదావరిలో వ్యర్థాల డంపింగ్ కారణంగా గోదావరి పరివాహక ప్రాంతమంతా కలుషితంగా మారిపోతుంది. అదనపు జలాలు బ్యారేజీ నుంచి విడుదల చేసినప్పుడు నీటిలో వ్యర్థాలు కలిసిపోయి దిగువకు వెళ్తున్నాయి. చెత్త కారణంగా విలువైన మత్స్య సంపదకు అపార నష్టం కలుగుతుందని విశ్రాంత జలవనరులశాఖ అధికారులు చెబుతున్నారు. కాలుష్యం కారణంగా అరుదైన పులస చేపల లభ్యత బాగా తగ్గిపోయిందని మత్స్యకారులు చెబుతున్నారు.

స్పష్టమైన ఆదేశాలు..

డెల్టా కాలువ గట్టుమీద వ్యర్థాలు వేయొద్దని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. మల్లయ్యపేటలో నగరపాలక సంస్థకు చెందిన డంపింగ్ యార్డుకు చెత్త తరలిస్తున్నాం.

- వెంకట్రావు, పంచాయతీ కార్యదర్శి, ధవళేశ్వరం

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: వార్షిక తనిఖీలలో భాగంగా రాజమహేంద్రవరం దక్షిణ మండల డీఎస్పీ భవ్యకిషోర్ ధవళేశ్వరం పోలీస్ స్టేషన్‌ను గురువారం పరిశీలించారు. ఫిర్యాదు దారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని సిబ్బందికి సూచించారు. 112 కాల్స్‌కు తక్షణమే స్పందించి బాధితులకు రక్షణ కల్పించాలన్నారు. రౌడీషీటర్ల కదలికలు గమనించాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించాలని సీఐ గణేష్‌కు సూచించారు. స్టేషన్ పరిధిలో సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సైబర్ నేరాలు, మైనర్ డ్రైవింగ్, హెల్మెట్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్సై హరిబాబు, పీఎస్సై శివగణేష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ భవ్యకిషోర్

ప్రతిష్ఠాత్మకంగా బిక్కవోలు షష్ఠి ఉత్సవాలు

బిక్కవోలు: బిక్కవోలులో షష్ఠి ఉత్సవాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. బిక్కవోలులో గురువారం ఆయన మండల స్థాయి అధికారులు, కూటమి నేతలతో సమావేశమయ్యారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేయాలన్నారు. పురాతన దేవాలయం కావడంతో లోపల ఇరుకుగా ఉంటుందని, ఆ మేరకు ఏర్పాట్లు చేయాలన్నారు. స్త్రీశక్తి పథకం కింద ఉచిత బస్సు సౌకర్యంతో ఎక్కువ మంది మహిళా భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి, సభ్యులు చిట్టిబాబు చౌదరి, తహసీల్దారు కృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

రాష్ట్రంలో సుపరిపాలన: నల్లమిల్లి

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తోందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. అనపర్తి మండలం కుతుకులూరులో రూ.41లక్షలతో నిర్మించిన సీసీరోడ్లను ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలతో పాటు, చెప్పని వాటిని కూడా నెరవేరుస్తున్నామన్నారు. గ్రామ సర్పంచి గొల్లు హేమతులసి, కూటమి నాయకులు తిరుమలరెడ్డి, ఎన్ఆర్‌కే ప్రసాద్‌రెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, కర్రిశేషారత్నం తదితరులు పాల్గొన్నారు.

● నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధికారులతో అనపర్తి మండలం రామవరంలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సమావేశమయ్యారు. మండలాల్లో నిర్వహించిన కేడర్ కోసం నల్లమిల్లి కార్యక్రమంలో భాగంగా వచ్చిన ప్రజాసమస్యలపై వచ్చిన ఫిర్యాదులపై శాఖలవారీగా సమీక్షించారు. వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

మురుగు కాలువలు ప్రక్షాళన చేయాలి

టి.నగర్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం అర్బన్, గ్రామీణం పరిధిలో మురుగునీటి పారుదల వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని గ్రామీణం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. గురువారం ఎమ్మెల్యే గోరంట్ల నివాసంలో మున్సిపల్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రధాన రైల్వే స్టేషన్, ఈస్ట్ రైల్వే స్టేషన్ రహదారులను విస్తరించాలన్నారు. హుకుంపేట మెయిన్ కాలువ వ్యవస్థను మెరుగుపర్చాలన్నారు. ఎస్ఈ శేషగిరిరావు, ఈఈలు మాధవి, ఆలీ, డీఈలు సత్యనారాయణ, లోవరాజు, రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

సమీక్షలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

పుస్తకాలు.. విజయ సోపానాలు

కడియం, బిక్కవోలు, అనపర్తి గ్రామీణం: విద్యార్థి దశ నుంచే పుస్తకాలతో సహవాసం చేస్తే విజయానికి సోపానంగా నిలుస్తాయని ఎంఈవోలు మణికుమార్, నాగేశ్వరరావు పేర్కొన్నారు. కడియం గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. నిర్వాహకుడు ఎం.వీరలింగం ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా హాజరైన సర్పంచి మోసిగంటి సత్యవతిని సత్కరించారు. పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఉపసర్పంచి రఘురామ్, ఈశ్వరరావు, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, హనుమంతరావు, శశికుమారి, ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ● బిక్కవోలులో జరిగిన కార్యక్రమంలో సర్పంచి సత్తి వీరమణి, సొసైటీ అధ్యక్షులు చింతా శ్రీనివాస రెడ్డి, ఎంపీటీసీ పి.వి.సత్యనారాయణ రెడ్డి, గ్రంథాలయాధికారి బాల తదితరులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ● అనపర్తి ద్వారంపూడి బుల్లమ్మాయి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు కల్యాణి, గ్రంథాలయాధికారి అభిలాష్ బహుమతులు అందజేశారు.

బిక్కవోలులో విజేతలకు బహుమతుల పంపిణీ

అనపర్తిలో విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేత

సన్న రకాలతో అధిక దిగుబడి

రాజానగరం, న్యూస్‌టుడే: అధిక దిగుబడిని ఇచ్చే సన్నరకాలు సాగు చేయాలని జిల్లా ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు డా.చల్లా వెంకటనరసింహారావు, డా.మానుకొండ శ్రీనివాస్ సూచించారు. రాజానగరం మండల పరిధిలోని నరేంద్రపట్నం, కోటికేశవరం, శ్రీరంగపట్నంలో అభ్యుదయ రైతులకు నూతన వరి రకాలు ఎంటీయూ 1426, ఎన్ఎల్ఆర్ 3648 రకాలను గురువారం పంపిణీ చేశారు. వాటి గుణగణాలను రైతులకు వివరించారు. ఈ దాళ్వాలో ప్రయోగం నిమిత్తం వీటిని పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ రకాలు సన్న రకాలని, 120 నుంచి 125 రోజుల్లో పక్వానికి వచ్చి, హెక్టారుకు 6.5 నుంచి 7.0 టన్నుల దిగుబడి వస్తాయన్నారు. అగ్గితెగులు, ఎండాకు తెగులు, దోమపోటు, ఉల్లికోడును తట్టుకుంటాయన్నారు. అభ్యుదయ రైతులు ముంద్రు వీరభద్రరావు, విస్సా చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సుబ్బారెడ్డికి సేవా పురస్కారం

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: అనపర్తి శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు, రాష్ట్ర పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పడాల సుబ్బారెడ్డికి రాజమహేంద్రవరానికి చెందిన నటరాజ నృత్య నికేతన్ సాంస్కృతిక సంస్థ సప్పా ఎక్స్‌లెన్స్ పురస్కారం-2025 ప్రకటించింది. అనపర్తి శ్రీరామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడిగా సమాజానికి అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. ఈనెల 23న రాజమహేంద్రవరంలో సంస్థ వ్యవస్థాపకుడు డా.సప్పా దుర్గాప్రసాద్ జన్మదిన వేడుకల్లో భాగంగా పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు.

భయపెడుతున్న శునకాలు

ధవళేశ్వరంలోని కెనాల్ ప్రధాన రహదారిలో శునకాలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. వాహనాలకు అడ్డు పడుతూ ప్రమాదాల బారినపడేలా చేస్తున్నాయి. కొన్ని రోజులుగా శునకాలు విపరీతంగా పెరిగిపోయి, వృద్ధులు, చిన్నారులపై దాడులు చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, అరికట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ధవళేశ్వరం, మోరంపూడి

ఇసుక లారీలతో అవస్థలు

ఇసుక లారీల రవాణాపై కొరవడిన అధికారుల పర్యవేక్షణతో జనాల కళ్లల్లో ఇసుక పడుతోందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు పాతరేసి అధికలోడుతో ఇసుకను ఇష్టారీతిన రవాణా చేస్తున్న లారీలపై ఉక్కుపాదం మోపాల్సిన అధికారులు పట్టించుకోవట్లేదనే వాదన వినిపిస్తోంది. రోడ్డుపై వెళ్లే క్రమంలో పడిపోతూ వెనుక వచ్చే వారి కళ్లల్లో పడుతోందని అంటున్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కడియం

వృథాగా వెలుగులు

ధవళేశ్వరం అగ్రహారం వీధి ప్రధాన రోడ్డులో వీధి దీపం వృథాగా వెలుగుతోంది. కొన్ని చోట్ల దీపాలు లేక, మరికొన్ని చోట్ల వెలగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ మాత్రం రోజంతా వెలుగుతున్నా యంత్రాంగం పట్టించుకోక పోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– మోరంపూడి, ధవళేశ్వరం

రూ.2.50 లక్షల విరాళం

అన్నసమారాధనకు చెక్కు అందజేస్తున్న కంబాల

కోరుకొండ: స్థానిక పెట్రోలు బంకు సమీపంలోని సాయిబాబా ఆలయంలో జరిగిన అన్నసమారాధనకు విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు విరాళం అందజేశారు. కార్తికమాసంలో జరిగిన మూడు వారాల అన్నసమారాధనకు అయిన ఖర్చు రూ.2.50 లక్షల మొత్తాన్ని నిర్వాహకులకు అందజేశారు. ద్వారకాసాయినగర్ శిర్డీ సాయిబాబా ఆలయంలో జరుగుతున్న ఓం శ్రీసాయిరాం సప్తాహ అఖండ నామ జపయజ్ఞ కార్యక్రమం గురువారంతో ముగిసింది. అన్నసమారాధనలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

'పేదలకు విద్య, వైద్యం దూరం'

బొమ్మూరు, న్యూస్‌టుడే: పేదలకు కావాల్సిన విద్య, వైద్యం దూరం చేయాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు ఆరోపించారు. బొమ్మూరులోని వైకాపా కార్యాలయంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాలి వేణు నేతృత్వంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వేణు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ రూ.వేల కోట్లు అప్పులు చేసి, ఎంత ఖర్చు చేస్తున్నారో జవాబుదారీ లేకుండా వ్యవహరిస్తున్నారన్నారు. 50 ఏళ్లు దాటిన ఎస్సీ, బీసీలకు పింఛను, మహిళలకు రూ.1,500 ఇస్తానని, అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో ఏడు నియోజకవర్గాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రలో మృతులకు నివాళి

బొమ్మూరు, న్యూస్‌టుడే: సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 45 మంది ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదకరమని మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు పేర్కొన్నారు. బొమ్మూరులోని వైకాపా కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. వారి కుటుంబాలకు మనోధైర్యం కలగాలని ప్రార్థించారు. జడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి మీర్జా మౌలాలి, ఉపాధ్యక్షుడు ఎండీ హమీద్ బాషా, కార్యదర్శి ఇబ్రహీం పాల్గొన్నారు.

23న చెకుముకి పోటీలు

శ్యామలాసెంటర్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 23న చెకుముకి జిల్లాస్థాయి పోటీలు సీతంపేట ప్రగతి జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నట్లు కన్వీనర్ రవిబాబు పేర్కొన్నారు. మండలస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన జట్లు జిల్లా స్థాయికి హాజరుకావాలన్నారు. జిల్లా విజేతలు డిసెంబరు 12, 13, 14తేదీల్లో కాకినాడలో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

బొమ్మూరు: హుకుంపేట సీతారామ, సాయి దేవాలయాల్లో డా.కొయ్యలమూడి సాయి ఆధ్వర్యంలో గురువారం అన్నదానం చేశారు. సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ప్రముఖ్ కర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ కష్టంలో ఉన్నవారిని ఆదుకోవాలన్నారు. ఆర్ఎస్ఎస్ విభాగ్ సహ సంఘ చాలక్ సుబ్బారాజు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు హర్షణీయమన్నారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. సత్యనారాయణ, రాజారావు, పట్నాల వీరభద్రరావు, సూర్య చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

చోరీపై కేసు నమోదు

బిక్కవోలు: బలభద్రపురంలో వరికోత యంత్రం విడిభాగాల చోరీపై గురువారం కేసు నమోదు చేశారు. ఎస్సై రవిచంద్రకుమార్ తెలిపిన వివరాల మేరకు.. దేవీపట్నం మండలానికి చెందిన ఎం.వి.పవన్ వరికోత పని నిమిత్తం బలభద్రపురం వచ్చారు. బుధవారం పొలంలో యంత్రం ఉండగా గురువారం చూసేసరికి తలుపులు, మోటారు, 120 లీటర్ల డీజిల్ తదితరాలు అపహరణకు గురైనట్లు గుర్తించి ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదైంది. దర్యాప్తు చేస్తున్నామని వారు తెలిపారు.

కుప్పం పోలీసులమంటూ మోసం

బిక్కవోలు: కుప్పం పోలీసులమంటూ మోసం చేసిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. బిక్కవోలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బలభద్రపురానికి చెందిన శ్రీనివాస్‌కు గతేడాది ఆగస్టు 23న ఒక ఫోన్ వచ్చింది. తాము కుప్పం పోలీసుస్టేషన్ నుంచి మాట్లాడుతున్నామని, మీరు దొంగ బంగారం కొనుగోలు చేశారని, వెంటనే ఇక్కడకు రావాలని బెదిరించారు. లేదంటే కేసు నమోదు చేస్తామన్నారు. అది నకిలీ ఫోన్ కాల్ అయ్యి ఉంటుందని శ్రీనివాస్ కుమారుడు ఇంట్లో వాళ్లకు చెప్పారు. అయినా పలుసార్లు ఫోన్ చేసి బెదిరించడంతో బాధితుడు ఆందోళనకు గురయ్యారు. వారు చెప్పినట్లే రూ.30వేలు పంపారు. దీనిపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత మృతి

కొవ్వూరు పట్టణం: అధిక కట్నం వేధింపులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. కొంతమూరుకు చెందిన అరుణకు కొవ్వూరుకు చెందిన ఎలుబండి వెంకట సత్యనారాయణతో రెండేళ్ల కిందట వివాహం జరిగింది. కట్నం వేధింపులతో ఈనెల 4న అరుణ ఆత్మహత్యాయత్నం చేశారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతిరాలి ఆమె భర్త, అత్త, మరిదిపై కేసు నమోదు చేశారు.

ఆవిష్కరణలు.. అంకురాలు..

జీజీయూలోని స్కూల్ ఆఫ్ సైన్స్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం బిజ్‌మైండ్ అవేకెనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య రీసోర్స్ పర్సన్‌గా కర్నూలులోని జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల ఇన్నోవేషన్ డైరెక్టర్ డా.సి.రంజిత్‌కుమార్ విచ్చేశారు. విద్యార్థులకు స్టార్టప్ అవకాశాలు, ఆధునిక వ్యాపార నమూనాలకు సంబంధించి పలు సూచనలు చేశారు. విద్యార్థుల్లో ఆలోచనలు, స్ఫూర్తి పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. జీజీయూ స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ డా.కె.వల్లీమాధవి మాట్లాడుతూ యువత ఆవిష్కరణల దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా, సృష్టించేలా యోచించాలన్నారు. ఎంబీఏ విభాగాధిపతి డా.ఆర్.రాజా, బీబీఏ విభాగాధిపతి డా.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, రాజానగరం

కార్యక్రమంలో ప్రాజెక్టు వివరిస్తున్న విద్యార్థినులు

(c) eenadu

కొవ్వూరు
•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం

కైవల్యకు సత్కారం

నిడదవోలు: శ్రీహరికోటలోని టైటాన్స్ స్పేస్ ఇండస్ట్రీస్‌లో అంతరిక్ష శిక్షణకు ఎంపికైన నిడదవోలుకు చెందిన కుందుల కైవల్యరెడ్డిని భాజపా ఆధ్వర్యంలో గురువారం జడ్పీ బాలికోన్నత పాఠశాలలో సత్కరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఆమెకు రూ.11వేల నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. భాజపా జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, క్లస్టర్ ఇన్‌ఛార్జి కంటిపూడి చౌదరి, ప్రధానోపాధ్యాయిని ఫిలిప్స్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా సహకార సంఘాలు

ఉండ్రాజవరం: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు రైతులకు అండగా ఉన్నాయని పాలంగి సొసైటీ అధ్యక్షుడు కాకర్ల నరసన్న అన్నారు. అఖిల భారత సహకార సంఘ వారోత్సవాల్లో భాగంగా సొసైటీ వద్ద ఆయన ఆధ్వర్యంలో గురువారం పతాకావిష్కరణ చేశారు. రైతులకు అందిస్తున్న సేవలను వివరించారు. పాలంగి, కె.సావరం రైతులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఉండ్రాజవరం: డ్వాక్రా మహిళలు రుణాలు సద్వినియోగం చేసుకుని వ్యాపారాలు వృద్ధి చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఎంపీడీవో మడిపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని స్వయం సహాయక సంఘాల అధ్యక్షులకు ఉండ్రాజవరంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రొఫెసర్ జె.సుధీర్‌కుమార్ మార్కెటింగ్, ప్యాకింగ్, ఆన్‌లైన్ అమ్మకాలు, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఏవో వి.రామారావు, డిప్యూటీ ఎంపీడీవో కె.ఆంజనేయశర్మ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

ఉండ్రాజవరం: పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెట్టే సుజనరావు అన్నారు. వచ్చేనెల 4న నిర్వహించనున్న మాదిగల విజయోత్సవ సభ విజయవంతం చేయాలన్నారు. కాల్దరిలో గురువారం గోడపత్రాలను ఆవిష్కరించి, ప్రదర్శించారు. నాయకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 – మ॥ 1
మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తాళ్లపూడి: 80085 74498
ఉండ్రాజవరం: 80085 74503, నల్లజర్ల: 97011 37112

గుంతలతో అవస్థలు..

సమస్య: యర్నగూడెం నుంచి చిన్నాయిగూడెం, యాదవోలు, సంగాయిగూడెం మీదుగా కొయ్యలగూడెం వెళ్లే ప్రధాన రహదారి గుంతలతో అధ్వానంగా తయారైంది. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరమ్మతులు చేయించాలి.
-డి.వి.ప్రసాద్, యర్నగూడెం

సమాధానం: రోడ్డు నిర్మాణం కోసం ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు రాగానే పనులు చేపడతాం.
-వెంకటరమణ, డీఈ ర.భ.శాఖ, కొవ్వూరు
- న్యూస్‌టుడే, దేవరపల్లి

రోడ్డుపైకి వాడుక నీరు రాకుండా చర్యలు

ఈనాడు స్పందన

నిడదవోలు: మండలంలోని సమిశ్రగూడెం వద్ద నిడదవోలు-నరసాపురం ర.భ.శాఖ రహదారిపైకి వాడుక నీరు రాకుండా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈనెల 16న 'ఈనాడు'లో 'రోడ్డుపైనే వాడుక నీరు' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు మురుగు కాలువను శుభ్రం చేసి, లీకులను మరమ్మతులు చేసి రహదారిపైకి నీరు రాకుండా నిలుపుదల చేశారు.

కొవ్వూరులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, నాయకులు

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

న్యూస్‌టుడే బృందం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. కొవ్వూరులో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ. పౌర గ్రంథాలయాలు, పాఠశాలల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ఉందన్నారు. భాజపా జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసం, పోటీపరీక్షల అంశాలపై గ్రంథాలయం తోడ్పడుతుందన్నారు. వారోత్సవాల్లో నిర్వహించిన వ్యాసరచన, కథలు చెప్పడం, చిత్రలేఖనం, రంగవల్లులు, దేశభక్తి, జానపద గీతాల పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు, పాల్గొన్న 43 మందికి బహుమతి, ప్రశంసా పత్రాలు, పెనుమాక జయరాజు సమకూర్చిన రాత పుస్తకాలను అతిథులు అందించారు. చాగల్లు మండలం చందవరంలో సొసైటీ అధ్యక్షుడు మద్దిపాటి వీరరాఘవులు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మద్దిపాటి రమేష్, తాళ్లపూడిలో మానవత సంస్థ, నిడదవోలు తెదేపా పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, నల్లజర్లలో విద్యాశాఖాధికారి సత్యనారాయణ, యర్నగూడెంలో సర్పంచి బొంతా భరత్‌బాబు విజేతలకు బహుమతులు అందించారు.

నడుస్తున్నవి నాలుగే..!

కొవ్వూరు డివిజన్లో రైతు బజార్ల నిర్వహణ తీరిది

పరిశీలన

న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం, గోపాలపురం, నిడదవోలు

సరసమైన ధరలకు నాణ్యమైన కూరగాయలు ప్రజలకు అందించాలన్నది రైతు బజారు సంకల్పం. తెదేపా హయాంలో ఆవిర్భవించిన ఈ బజార్ల అభివృద్ధికి వైకాపా ప్రభుత్వం శ్రద్ధ చూపలేదు. అన్నదాతలకు మేలు చేసేలా ఉచితంగా దుకాణాలను ఇచ్చి సౌకర్యాలను కల్పించినా ఆదరణ నోచుకోవడం లేదు. ఈ వ్యవస్థను పర్యవేక్షించాల్సిన మార్కెటింగ్ శాఖ అధికారులు చుట్టపు చూపుగా వచ్చి వెళుతున్నారే తప్ప లోపాలు సరిదిద్దడం లేదనే విమర్శలు ఉన్నాయి. బహిరంగ మార్కెట్ కన్నా తక్కువ ధరలకు కూరగాయలు లభిస్తాయని వెళ్లిన వారికి దుకాణాలే లేక.. ఉన్నా అరకొర సరకు, ధర వ్యత్యాలతో ఆవేదన మిగులుతోంది. కొవ్వూరు డివిజన్ పరిధిలో రైతుబజార్ల వెతలను 'న్యూస్‌టుడే' పరిశీలించింది.

నిరుపయోగంగా చాగల్లు రైతుబజారు

ధరల పట్టీ ఎప్పుడూ ఖాళీ..

కూరగాయలను విక్రయించాల్సిన ధరలను ప్రదర్శించే బోర్డులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. బహిరంగ మార్కెట్లో కంటే కిలో రూ.2 నుంచి రూ.5 తక్కువకు కూరగాయలు, ఆకుకూరలు లభించాలి. కొన్నిచోట్ల బోర్డుపై ధరలకు విక్రయించే విధానానికి సంబంధం ఉండటం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఉదయం 9 గంటలు దాటిన తర్వాత ధరలు పట్టికపై రాస్తున్నారు. అప్పటికే కొనుగోలు పూర్తవుతోంది.

ఉన్నాయంటే ఉన్నాయంతే..

డివిజన్ పరిధిలో కొవ్వూరు పట్టణంలో మాత్రమే రైతు బజారు ఉంది. ఆరు చోట్ల మినీ రైతు బజార్లున్నా ఒక్క తాళ్లపూడిలో రెండు దుకాణాలు మినహా ఎక్కడా ఈ వ్యవస్థ నడవటం లేదు. నిర్వహణ తీరు సరిగా లేక, అన్ని రకాల కూరగాయలు దొరక్క విక్రయదారులు వచ్చేందుకు విముఖత చూపుతున్నారు.

ఎస్టేట్ ఆఫీసర్లు లేక..

కూరగాయలను రైతుల నుంచి కొనుగోలు చేసి గోదాములో భద్రపర్చి దుకాణాలకు అందించడం, ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ధరలను రాయించి ఆ ప్రకారం విక్రయాలను పర్యవేక్షించేందుకు ఎస్టేట్ ఆఫీసరు (ఈఓ) వ్యవస్థ ఉంది. కానీ కొవ్వూరు బజారుకు ఈవో, సెక్యూరిటీ గార్డు లేరు.

లెక్కకు 30..

● కొవ్వూరు పట్టణంలో రాష్ట్ర రహదారిని ఆనుకుని రైతు బజారు ఒకప్పుడు కూరగాయలు, ఆకుకూరలు, కిరాణా సామగ్రి కొనుగోళ్లతో కళకళలాడేది. అయిదేళ్లుగా కళావిహీనంగా తయారైంది. 8 దుకాణాలు పెట్టుకునే అవకాశం ఉన్నా నడుస్తున్నవి రెండు మాత్రమే. ● తాళ్లపూడిలో మినీ బజారులో 10 దుకాణాలకు అవకాశం ఉన్నా రెండు దుకాణాలు అరకొరగా నడుస్తున్నాయి. ఈ మండలంలో కూరగాయలు, ఆకు కూరల సాగు బాగున్నా ఇక్కడికి తెచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. ● చాగల్లులో ఆర్భాటంగా రైతుబజారును నిర్మించినా నిరుపయోగంగా ఉంది. మూడేళ్ల క్రితం బజారు పునరుద్ధరిస్తామని పనులు చేయించినా ప్రయోజనం శూన్యం. ● గోపాలపురంలో 10 దుకాణాలు పెట్టుకునేలా రైతు బజారు నిర్మించారు. ఆరు నెలల పాటే ఇవి పనిచేశాయి. ● వైకాపా హయాంలో దేవరపల్లిలో పది దుకాణాలు నడిచేలా బజారును ఆర్భాటంగా ప్రారంభించారు. బయటి దుకాణాల దాటికి ఇవేమీ ఇప్పుడు పని చేయడం లేదు. ● నల్లజర్లలో 8 దుకాణాలను పెట్టుకునేలా బజారు ఏర్పాటు చేశారు. కేవలం కొన్ని నెలలే ఇక్కడ వ్యాపారం జరిగింది. మళ్లీ పునరుద్ధరణకు ఏ ప్రయత్నమూ జరగలేదు. ● నిడదవోలులో ఉన్న మినీ బజారుకు ఏమాత్రం ఆదరణ లేదు. ఈ పట్టణ జనాభా అవసరాలకు ఖచ్చితంగా 20 దుకాణాలు గల రైతుబజారు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

పరిస్థితిని చక్కదిద్దుతున్నాం..

కొవ్వూరు రైతుబజారులో ఖాళీగా ఉన్న దుకాణాలను తెరిపించడం, నిరుపయోగంగా ఉన్న బజార్లను అందరికీ అనువుగా ఉన్న ప్రదేశాలకు మార్చేందుకు శ్రద్ధ చూపుతున్నాం. నిడదవోలులో రైతుబజారు ఏర్పాటుకు స్థల సేకరణపై ప్రభుత్వానికి నివేదించాం. కూరగాయల ధరలను దుకాణదారులతో రాయిస్తున్నాం.
- సునీల్, జిల్లా సహాయ మార్కెటింగ్ అధికారి

వజ్రోత్సవాలను విజయవంతం చేద్దాం

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు పురపాలక సంఘం ఆవిర్భవించి 60 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించనున్న వజ్రోత్సవాలను కలిసికట్టుగా విజయవంతం చేద్దామని పురపాలక సంఘ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. సంఘ కౌన్సిల్ హాల్‌లో గురువారం ఆయన అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ గత 6 దశాబ్దాలుగా పురపాలక సంఘ అభివృద్ధి ప్రస్థానాన్ని, ప్రజా సేవల ప్రాధాన్యతను, పట్టణ చరిత్ర, సంస్కృతిని ప్రజలకు తెలియచేసే విధంగా ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. పురపాలక సంఘ అభివృద్ధిలో భాగమైన ప్రతి ఒక్కరిని సత్కరిస్తామన్నారు. వజ్రోత్సవాల నిర్వహణ కోసం ముందుగానే తెలిసినా అభివృద్ధి పనులు టెండర్లు పిలవకుండా నామినేషన్‌పై ఇవ్వడం వల్ల పురపాలక సంఘ నిధుల వృథాతోపాటు పనుల్లో నాణ్యత ఉండదని 21వ వార్డు కౌన్సిలర్ కామిశెట్టి వెంకట సత్యనారాయణ అన్నారు. సమయం తక్కువగా ఉండటం వల్ల నిబంధనల మేరకు కొన్ని పనులు నామినేషన్ పద్ధతిపై అప్పగించినట్లు ఛైర్మన్ తెలిపారు. 2వ వార్డు కౌన్సిలర్ ఆలమూరి భారతి, వైస్ ఛైర్మన్ యలగడ బాలరాజు మాట్లాడారు. అజెండాలోని అంశాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది.

మాట్లాడుతున్న ఆదినారాయణ

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

నల్లజర్ల, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు నల్లజర్ల జడ్పీ పాఠశాల ప్లస్ విద్యార్థినులు బేతా ఉదయ పోశేశ్వరి, మైనం దుర్గాభవాని ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని కోమలిచిత్ర గురువారం తెలిపారు. ఇటీవల పెదవేగి మండలం గోపన్నపాలెం శ్రీ సీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో జిల్లాస్థాయి ఖోఖో అండర్ 17 విభాగంలో జరిగిన పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో విజయనగరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టు తరఫున విద్యార్థినులు పాల్గొంటారన్నారు. వారిని విద్యాకమిటీ ఛైర్మన్ కేదారి నారాయణ, వ్యాయామోపాధ్యాయులు పల్లి వెంకట అప్పారావు, కె.రాంబాబు, ఎ.సుబ్రహ్మణ్యం తదితరులు అభినందించారు.

విద్యార్థులతో ప్రధానోపాధ్యాయిని కోమలిచిత్ర తదితరులు

హాకీలో చాగల్లు విద్యార్థులు..

చాగల్లు, న్యూస్‌టుడే: గత నెల పెదవేగిలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్-19 హాకీ పోటీల్లో చాగల్లు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ విజయలక్ష్మి తెలిపారు. ఈనెల 22వ తేదీ నుంచి అనకాపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో వీరు పాల్గొంటారన్నారు. ప్రధానోపాధ్యాయిని ఎం.వాసవి, తదితరులు వారిని అభినందించారు.

ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సైబర్ నేరాలపై అవగాహన

నల్లజర్ల, న్యూస్‌టుడే: జాతీయ సేవా శిబిరంలో భాగంగా వైజ్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు సైబర్ క్రైమ్, డిజిటల్ అరెస్టు, క్రెడిట్, డెబిట్ కార్డు క్లోనింగ్ తదితర అంశాలపై గురువారం నల్లజర్లలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. తొలుత వాలంటీర్లు ఎకేఆర్జీ కళాశాల విద్యార్థులకు హ్యాకింగ్, ఫిషింగ్, మాల్వేర్, సైబర్ స్టాకింగ్, ఆన్‌లైన్ మోసాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో వైజ్ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన బస్సులకు స్వస్తి చెప్పాలి

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు ఆర్టీసీ డిపోలో కాలం చెల్లిన బస్సులకు స్వస్తి చెప్పాలని కోరుతూ పట్టణ ప్రజల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డిపో మేనేజర్ టి.ధనుంజయకు గురువారం వినతిపత్రాన్ని అందించారు. హైదరాబాద్, విశాఖ పట్టణానికి కొత్త సూపర్ లగ్జరీ బస్సులు నడపాలన్నారు. హైదరాబాద్‌కు గత పది ఏళ్లుగా అదే బస్సును నడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. కార్యక్రమంలో అంబటి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

మల్లవరం కార్యదర్శికి సత్కారం

చాగల్లు, న్యూస్‌టుడే: నవంబరు నెలకు సంబంధించి సానిటేషన్ పబ్లిక్ రెస్పాన్స్ సిస్టం ద్వారా ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో రాష్ట్ర స్థాయిలో చాగల్లు మండలంలోని మల్లవరానికి ద్వితీయ స్థానం రావడం అభినందనీయమని ఎంపీడీవో ఆర్.శ్రీదేవి పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మల్లవరం కార్యదర్శి జి.కమలావతిని సిబ్బంది, అధికారులు సత్కరించారు.

తలుపుల్లేవు.. అట్టలతోనే రక్షణ

నిడదవోలు మండలం కోరుమామిడి 136వ నంబరు అంగన్‌వాడీ కేంద్ర భవనం పనులు పూర్తి కాకుండానే ప్రారంభించారు. ఈ భవనానికి 8 కిటికీలున్నాయి. ఒక్క దానికి కూడా ఇంత వరకు తలుపు ఏర్పాటు చేయలేదు. అట్టలు అడ్డంగా పెటారు. కేంద్రం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి. పాములు వచ్చి చేరతాయేమోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం ఎదురుగా ఉన్న ఖాళీస్థలంలోనూ పిచ్చి మొక్కలు భారీగా పెరిగాయి. అంగన్‌వాడీ కేంద్ర కిటికీలకు తక్షణమే తలుపులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నిడదవోలు

తాగునీరు వృథా..

నిడదవోలు మండలం సమిశ్రగూడెం ఎస్సీ ఏరియాలోని తాగునీటి ట్యాంకు నింపేందుకు మోటార్లు వేస్తున్న పంచాయతీ సిబ్బంది అవి నిండిన తర్వాత సకాలంలో మోటార్లు ఆపకపోవడంతో తాగునీరు వృథాగా పోతోంది. పక్కనే అంగన్‌వాడీ కేంద్రం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ట్యాంకు నిండిన వెంటనే మోటార్లను నిలుపుదల చేసే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని చుట్టుపక్కల వారు కోరుతున్నారు. ట్యాంకు నిండిన వెంటనే మోటార్లు నిలుపుదల చేస్తామని పంచాయతీ అధికారులు తెలిపారు. – న్యూస్‌టుడే, నిడదవోలు

దుర్వాసనతో ఇక్కట్లు

పెరవలి మండలం కాకరపర్రులోని సొసైటీ వీధిలో విద్యుత్తు పరివర్తకం వద్ద చెత్త డంపింగు పాయింట్ ఏర్పాటు చేశారు. అక్కడ వేస్తున్న చెత్తను రోజుల త్వరబడి తొలగించకపోవడంతో దుర్వాసన వెల్లువెత్తుతోంది. అటుగా రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కడ పేరుకుపోయిన చెత్త తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని సచివాలయ కార్యదర్శి గంగరాజు దృష్టికి తీసుకువెళ్లగా పరిశీలించి తొలగిస్తామన్నారు. – న్యూస్‌టుడే, పెరవలి

ఎండుకొమ్మే ప్రమాద సూచిక

తాళ్లపూడిలో నేత్ర వైద్యశాలకు వెళ్లే దారిలో మురుగు కాలువపై పలక దెబ్బతిని రంధ్రం పడింది. ఇటుగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల, కళాశాలకు విద్యార్థులు, నేత్ర వైద్యశాలకు వెళ్లేవారు రాకపోకలు సాగిస్తుంటారు. దెబ్బతిన్న పలకను గుర్తించక ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో స్థానికులు స్పందించి రంధ్రం పడినచోట ప్రమాదాన్ని తెలిపేలా ఎండుకొమ్మను సూచికగా ఏర్పాటు చేశారు. ఈ దుస్థితిని పంచాయతీ కార్యదర్శి వీరన్న దృష్టికి తీసుకెళ్లగా కొత్త పలక ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, తాళ్లపూడి

వేలాడుతున్న విద్యుత్తు వైర్లు

తాళ్లపూడిలోని బాలుర సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో శుద్ధి నీటి పరికరం లేక డబ్బానీరు తాగుతున్నారు. కిటికీలకు దోమల తెర లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. శీతాకాలం నేపథ్యంలో గీజర్ లేక చల్లని నీటితో స్నానాలు చేస్తున్నారు. వసతిగృహం మరమ్మతుల పనులు నత్తనడకన సాగుతుండటంతో విద్యుత్తు వైర్లు వేలాడుతున్నాయి.
– న్యూస్‌టుడే, తాళ్లపూడి

WANTED TEACHERS
Highschool: Maths -2, English -1, Hindi -1
Primary section: Vice Principal -1
PRIMARY: Maths/Science -2
English/Social -2
WALK-IN- INTERVIEW
22nd, 23rd, 24th, 25th -November: 2025
From 9:00am to 4:00pm at. Send your resume
pericherla.prkraju@gmail.com
WhatsApp:89859 85259
Contact: 83286 85666
Swarnabharathi
EM high school Dharmavaram, Kovvur mandal, E.G Dist.

భక్తిశ్రద్ధలతో కార్తిక పూజలు

తాడిపర్రులో పూజలందుకున్న సోమేశ్వరస్వామి

ఉండ్రాజవరం : కార్తిక మాసం ముగింపును పురస్కరించుకుని తాడిపర్రులో నూతనంగా నిర్మించిన పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో గురువారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు, విశేష అలంకరణ చేశారు. భక్తులు విచ్చేసి కార్తిక దీపారాధనలు నిర్వహించారు. ఉండ్రాజవరంలో నందీశ్వరునికి అభిషేకాలు చేశారు.

తాళ్లపూడి: స్థానిక పార్వతి సమేత ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తాళ్లపూడిలోని సాయినాధుని, అయ్యప్పస్వామి ఆలయంలో దీపాలను వెలిగించారు. ప్రక్కిలంకలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసి స్వామివార్లను పుష్పాలతో అలంకరించారు.

ప్రక్కిలంక: పుష్పాలంకరణలో విశ్వేశ్వరస్వామి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

చాగల్లు, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, వనాల సంరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని రాజమహేంద్రవరం డెప్యూటీ రేంజ్ అధికారిణి కె.వి.పి.లత పేర్కొన్నారు. కొవ్వూరులోని పీఎంఎంఎం పాఠశాల ప్రాంగణంలో అటవీశాఖ ఆధ్వర్యంలో గురువారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడి వనాల సంరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసన్, అటవీశాఖ అధికారులు డి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నుంచే స్వచ్ఛత ఆరంభమవ్వాలి

కొవ్వూరు పట్టణం: స్వచ్ఛత ఇంటి నుంచి ప్రారంభం కావాలని, ఈ సంకల్పాన్ని నెరవేర్చడంలో మహిళల పాత్ర కీలకమని ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ (ఎస్‌బీఎం) 2.0 ఘన వ్యర్థ విభజన సదస్సు, సామర్థ్య నిర్మాణ మార్గదర్శకాలపై శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మెప్మా పరిధిలోని రిసోర్స్‌పర్సన్లకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ప్రతినిధులు ఘన, వ్యర్థాల నిర్వహణ, ఇంట్లో సేంద్రీయ ఎరువుల తయారీ, మిద్దె పంటల సాగు పద్ధతులను వివరించి, సందేహాలను నివృత్తి చేశారు. 60 మంది ఆర్పీలకు ప్రశంసపత్రాలను అందించారు. సామర్థ్య నిర్మాణ ప్రాజెక్టు సమన్వయకర్త జి.సీతారామాంజనేయరాజు, మెప్మా సీఎంఎం భవాని, కార్పొరేషన్ ప్రతినిధులు బీవీ రావు, ప్రదీప్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి

మంచికి, మారుపేరుగా నిలిచి,
మమతానురాగాలు పంచి,
మా అందరి హృదయాలలో
సుస్థిరస్థానం పొందిన
కీ॥శే॥ శ్రీమతి గారపాటి మంగమ్మ గారి
మరణం మాకు తీరనిలోటు.
వారి పవిత్ర ఆత్మకు
శాంతి చేకూర్చాలని భగవంతుని
ప్రార్థిస్తూ, అశ్రునయనాలతో..
కీ॥శే॥ శ్రీమతి గారపాటి మంగమ్మ గారు
వేలివెన్ను
మరణం: 11-11-2025
భర్త: గారపాటి పోలయ్య
కుమారుడు : గారపాటి నరేష్ కోడలు : గారపాటి అంబికా దేవి
కుమార్తెలు : కొఠారు సత్యవతి అల్లుళ్లు : కొఠారు శ్రీనివాసరావు
చిట్టూరి సుధారాణి చిట్టూరి రామ్‌క్రిష్ణ
మనుమలు, మనుమరాండ్రు మరియు కుటుంబసభ్యులు
పెద్దకార్యం: ది.22-11-2025 శనివారం రోజున వేలివెన్ను
రైతు ఫంక్షన్ హాల్ నందు జరుపబడును.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత మృతి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే : అధిక కట్నం తేవాలంటూ వేధింపులకు గురి చేస్తుండడంతో భరించలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం కొంతమూరుకు చెందిన అరుణకు కొవ్వూరుకు చెందిన ఎలుబండి వెంకట సత్యనారాయణతో రెండేళ్ల కిందట వివాహం జరిగింది. అధిక కట్నం కోసం వేధిస్తున్న నేపథ్యంలో ఈనెల 4న ఆమె ఆత్మహత్యాయత్నం చేశారు. దీనికి సంబంధించి అరుణ భర్త, అత్త, మరిదిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆమె తల్లి మాగాపు పుల్లారత్నం ఫిర్యాదు చేశారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ అరుణ మృతి చెందడంతో పైముగ్గురిపై ఎస్సై విజయ్‌కుమార్ కేసు నమోదు చేశారు.

కులం పేరుతో దూషించి దాడి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే : తీసుకున్న రుణం తిరిగి చెల్లించాలని అడిగినందుకు కులం పేరుతో దూషించి దాడి చేసినట్లు పట్టణ స్టేషన్లో ఫిర్యాదు అందింది. వివరాల ప్రకారం పట్టణ పరిధి ఒకటో వార్డు శ్రీరామకాలనీకి చెందిన బొండాడ సురేష్ పట్టణానికి చెందిన ఎ.శివకు గతంలో రూ.5 వేలు అప్పుగా ఇచ్చాడు. ఆ డబ్బులు ఇవ్వాలని పలుమార్లు అడిగినా ఇవ్వడం లేదు. ఈనెల 19న రాత్రి డబ్బులు అడిగేందుకు సురేష్ అతని ఇంటికి వెళ్లాడు. అక్కడ నుంచి ఇద్దరు వెంకాయమ్మ చెరువు వద్ద మద్యం తాగడానికి వెళ్లారు. తెల్లవారే వరకు అక్కడే ఉండగా ఆ సమయంలో డబ్బులు ఇవ్వాలని అడగ్గా వాగ్వాదం జరిగి మద్యం సీసాతో సురేష్ మెడపై శివ దాడి చేశాడు. దీంతో సురేష్‌ను కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అతను ఇచ్చిన ఫిర్యాదుపై హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలి

నిడదవోలు, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతమణి అన్నారు. నిడదవోలు మండలం విజ్జేశ్వరం, గోపవరం గ్రామాల్లో గురువారం ఆమె పర్యటించారు. సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. స్వామిత్వ, పన్నుల వసూళ్లు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో టి.సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



గోపవరంలో పర్యటిస్తున్న డీపీవో శాంతమణి

ఆకాశంలో మబ్బులు.. ఆందోళనలో రైతులు

మోర్తలో హడావుడిగా ధాన్యం ఒబ్బిడి చేస్తున్న రైతులు

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: ఆకాశం మేఘావృతం కావడంతో రైతులు గురువారం ఆందోళన చెందారు. ప్రస్తుతం సార్వా మాసూళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. నియోజకవర్గంలోని ఉండ్రాజవరం, పెరవలి, నిడదవోలు మండలాల్లో 32 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా ఇప్పటి వరకు 30 శాతం మాసూళ్లు పూర్తి చేశారు. తుపాను కారణంగా కొంత మేర వరిపైరు నేలనంటటంతో రైతులు నష్టపోయారు. ప్రస్తుతం అల్పపీడనం ప్రభావంతో మబ్బులు కమ్ముకోవడంతో ధాన్యం దక్కించుకోటానికి పరుగులు తీశారు. మోర్త, కాల్దరి, వడ్లూరు, సత్యవాడ, పసలపూడి, సూర్యారావుపాలెం తదితర గ్రామాల్లో ఆరబెట్టిన ధాన్యం హడావుడిగా బస్తాల్లో నింపి సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

ప్రతిష్టాత్మకంగా బిక్కవోలు షష్ఠి ఉత్సవాలు

బిక్కవోలు: బిక్కవోలులో షష్ఠి ఉత్సవాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. బిక్కవోలులో గురువారం ఆయన మండల స్థాయి అధికారులు, కూటమి నేతలతో సమావేశమయ్యారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేయాలన్నారు. పురాతన దేవాలయం కావడంతో లోపల ఇరుకుగా ఉంటుందని, ఆ మేరకు ఏర్పాట్లు చేయాలన్నారు.

శ్రీ సోమేశ్వర స్వామివారి దేవస్థానం కానూరు గ్రామం, పెరవలి మండలం
షాపు నెంబర్ 1 నుండి 8 వరకు, లైసెన్స్ హక్కునకు

వేలం ప్రకటన తేది: 02-12-2025 ఉదయం 10.00 గంటలకు

తూర్పుగోదావరి జిల్లా, పెరవలి మండలం, కానూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ సోమేశ్వర స్వామివారి దేవస్థానంనకు సంపూర్ణ హక్కుభుక్తములలో కలిగిన ఆలయంనకు ఆనుకొనియున్న షాప్ నెంబర్ 1 నుండి 8 వరకు వేలం ది.02-12-2025 ఉదయం 10.00 గం॥లకు దేవాదాయ శాఖ అధికారుల సమక్షములో శ్రీ సోమేశ్వర స్వామివారి దేవస్థానం ఆలయ ప్రాంగణం నందు వేలంపాట పెట్టబడును. పాట కాలపరిమితి నెలవారి అద్దె చెల్లించు పద్ధతిపై ది.03-12-2025 నుండి 02-12-2028 వరకు (3 సం॥రంలు).

వ. నెం.	వివరములు	లీజు కాలం	ధరావతు రూ.	పాట జరుగు సమయం, ప్రదేశం
1	షాపు నెంబర్-1 నుండి 8 వరకు	ది.03-12-2025 నుండి 02-12-2028 వరకు (3 సం॥రంలు)	5,000	02-12-2025 ఉదయం 10.00 లకు శ్రీ సోమేశ్వర స్వామివారి దేవస్థానం ఆలయ ప్రాంగణం నందు

షరతులు: 1. వేలంపాట షరతులు, ఇతర వివరములకు దేవస్థానం కార్యాలయం వద్ద సంప్రదించవచ్చు మరియు కార్యనిర్వహణాధికారి వారి చరవాణికి ఫోన్ చేసి గాని తెలుసుకొనవచ్చును.
గ్రామం: కానూరు.
తేది:20-11-2025.
కార్యనిర్వహణాధికారి
ఎస్.శివ, సెల్: 92914 93250

నగరం.. భద్రం

శాంతిభద్రతల దృష్ట్యా అత్యంత సున్నితమైనదిగా భావిస్తున్న బెంగళూరుకు మరో ప్రత్యేక బలగం సేవలు అందుబాటులోకి వచ్చాయి. 'ప్రత్యేక సాయుధ శిక్షణ-నిపుణ దళం (స్వాట్)' గురువారమే నగరానికి చేరుకుంది. ఎలాంటి మతపరమైన అల్లర్లవేళ ఎదుర్కొనేందుకు ఈ దళ సభ్యులు ముందుంటారు. పౌర జీవన శాంతికి నిత్యం అప్రమత్తంగా మసలుతుంటుంది. ఈ దళ సభ్యులు టౌన్‌హాల్ ముంగిట కవాతు చేస్తున్న దృశ్యమిది. (న్యూస్‌టుడే, బెంగళూరు)

ధర్మస్థలపై సిట్ అభియోగపత్రం

మంగళూరు, న్యూస్‌టుడే : ధర్మస్థలలో వందలాది మంది మృతదేహాలను ఖననం చేశానని ఒకప్పటి పారిశుద్ధ్య కార్మికుడు చిన్నయ్య చేసిన ఆరోపణలతో దర్యాప్తు పూర్తి చేసిన ప్రత్యేక దర్యాప్తు దళం బెళ్తంగడి న్యాయస్థానంలో గురువారం అభియోగపత్రాన్ని దాఖలు చేసింది. దర్యాప్తు ప్రారంభించిన ఐదు నెలల అనంతరం సిట్ అధిపతి- ఏస్పీ జితేంద్ర దయామా నేతృత్వంలోని అధికారులు 3,923 పుటల నివేదికను న్యాయస్థానంలో గురువారం దాఖలు చేశారు. కొందరు నిందితులు విచారణకు గైర్హాజరు అవుతూ రావడం, చిన్నయ్య చూపించిన ప్రాంతాల్లో మృతదేహాల ఆనవాళ్లు లభించకపోవడంతో విచారణ ఆలస్యమైందని అభియోగపత్రంలో పేర్కొన్నారు. శాసనసభ సమావేశాల ప్రారంభం ముందుగా సిట్ అధికారులు దర్యాప్తునకు సంబంధించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తారని హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్ గురువారం ఇక్కడ విలేకరులకు తెలిపారు.

రాజకీయ కాలచక్రానికి కుదుపు

హస్తినలో రాజకీయ విందు.. ఎవరికి పసందు?

ఈనాడు, బెంగళూరు : సిద్ధరామయ్య రెండో సారి ముఖ్యమంత్రిగా రెండున్నరేళ్ల కాలచక్రాన్ని పూర్తి చేశారు. శుక్రవారం నుంచి.. ముఖ్యమంత్రిగా రికార్డులు సృష్టించే అవకాశాన్ని అందిపుచ్చుకునే సిద్ధరామయ్య మరో నాలుగు నెలలు దాటితే దేవరాజ్ అరసు దీర్ఘకాలిక ముఖ్యమంత్రి కాలచక్రాన్ని (7ఏళ్ల 238రోజులు) అధిగమిస్తారు. అందుకు అవకాశం ఉందా? అన్నది నేటికీ చర్చనీయాంశమే. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ రూపంలో ఆయనకు గట్టిపోటీ ఎదురవుతుండగా, మిగిలిన రెండున్నరేళ్ల కాలచక్రాన్ని పూర్తి చేసేందుకు సిద్ధరామయ్య పోరాడక తప్పని పరిస్థితి. పూర్తి చేసిన రెండున్నరేళ్ల పాలనా కాలంలో సిద్ధు సర్కారు సాధనలేమిటంటే..

● ఐదు భారీ గ్యారంటీ పథకాలతోనే అధికారాన్ని అందుకున్న కాంగ్రెస్ సర్కారు వాటిని అమలు చేసేందుకు నానా కష్టాలు ఎదుర్కొంది. ఆర్థిక ఇక్కట్లను దాటుకుంటూనే ఐదు గ్యారంటీలను ప్రజలకు చేర్చింది. ఏటా రూ.55 వేల కోట్లను ఖజానా నుంచి ప్రజల వద్దకు చేర్చింది. ఈ సమయంలో అభివృద్ధిని విస్మరించిందన్న అపవాదును మూటగట్టుకుంది. సొంత ఎమ్మెల్యేలకే నిధులివ్వలేక విమర్శలు ఎదుర్కొంది. వీటి మధ్య అత్యంత కీలకమైన ఆర్థిక, సామాజిక, విద్యా సమీక్షకు సిద్ధమై పలు సవాళ్లు ఎదుర్కొంది. ఈ మధ్యలో కీలకమైన గ్రేటర్ బెంగళూరు ప్రాధికారతో ఐదు కార్పొరేషన్లకు శ్రీకారం చుట్టింది. ఇక జలవనరుల విషయంలో ముందడుగు వేసింది. మేకెదాటు ప్రాజెక్టు విషయంలో సుప్రీంకోర్టు నుంచి ఉపశమనం లభించటం, ఎగువ కృష్ణ-3 దశలో భూసేకరణ, పునర్వసతికి రూ.75 వేల కోట్లను కేటాయించటం, బెంగళూరులో సొరంగ మార్గానికి ప్రణాళికలతో ప్రజలకు ఊరట కల్గించే నిర్ణయాలు తీసుకుంది.

అడ్డంకులు.. విమర్శలు

సర్కారు ఏర్పాటైన తొలినాళ్లలోనే వాల్మీకి అభివృద్ధి మండలి అక్రమాలతో మంత్రి నాగేంద్ర రాజీనామాతో సిద్ధరామయ్య విమర్శలు ఎదుర్కొన్నారు. ఆపై ముడా కేసుకు సంబంధించి ముఖ్యమంత్రితో పాటు ఆయన కుటుంబ సభ్యులు నేటికీ కోర్టులు, సిట్ పోలీసుల విచారణ ఎదుర్కొంటూనే ఉన్నారు. మధ్యలో కాంట్రాక్టర్ల సంఘం నుంచి కమీషన్ ఆరోపణ, ఎన్నికల అక్రమాలపై అధిష్ఠానం పోరాటాన్ని ప్రశ్నించిన మంత్రి రాజణ్ణపై వేటు వంటి అనూహ్య సంఘటనలకు ఈ రెండున్నరేళ్లు వేదిక కల్పించింది. ఇవన్నీ కాదని నిత్యం పక్కలో బల్లెంలా అధికార పంపిణీ అంశం ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను పీఠంపై కుదురుగా కూర్చోనివ్వకుండా చేసింది. నేటి నుంచి మిగిలి కాలచక్రంలో అడుగుపెట్టే సిద్ధరామయ్య ఈ గమ్యాన్ని చేరుకుంటారా? లేదా అన్నది తేలాల్సి ఉంది.

విలువలేని నాణెం!

ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నేతృత్వంలోని రెండున్నరేళ్ల ప్రభుత్వ పాలన శూన్యమని కర్ణాటక భాజపా శాఖ విమర్శలు గుప్పించింది. 'జీరో రుపీస్' అంటూ వారిద్దరి చిత్రం ఉన్న ఒక నాణెన్ని భాజపా డిజిటల్ వింగ్ విడుదల చేసింది. ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న అధికార పార్టీ చలామణి కాని నాణెంతో సమానమంటూ తమ సామాజిక మాధ్యమంలో విమర్శలు గుప్పించింది.

-న్యూస్‌టుడే, మల్లేశ్వరం

మళ్లీ మాదే అధికారం!

విలేకరులతో మాట్లాడుతున్న సిద్ధరామయ్య

చామరాజనగర, న్యూస్‌టుడే : ఈసారి ఎన్నికల్లో (2028) కర్ణాటకలో కాంగ్రెస్ ఘన విజయం సాధించి, అధికారంలోకి వస్తుందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు కోరుకున్నంత వరకు ముఖ్యమంత్రిగా కొనసాగుతాను, వచ్చే ఏడాది మార్చిలో శాసనసభలో పద్దు ప్రవేశపెడతానని ఆయన చామరాజనగరలో విలేకరులతో మాట్లాడుతూ ప్రకటించారు. మూఢ నమ్మకాలతో పలువురు నేతలు చామరాజనగర జిల్లాకు రాకుండా తప్పించుకుంటారని, నేను అన్ని జిల్లాలు, ప్రాంతాలను సమానంగా చూస్తానని చెప్పారు. చామరాజనగరకు వస్తే అధికారం కోల్పోతామని ప్రచారం చేయడం మూఢ నమ్మకమేనని పేర్కొన్నారు. నవంబరులో అధికార మార్పిడితో విప్లవం వస్తుందన్నది కేవలం భ్రాంతి మాత్రమేనని వ్యాఖ్యానించారు. రెండున్నరేళ్ల అనంతరం మంత్రివర్గంలో మార్పు చేయాలని ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పుడే నిర్ణయించామని చెప్పారు. మంత్రివర్గంలో 34 మందికి అవకాశం ఉండగా, ప్రస్తుతం రెండు స్థానాలు మాత్రమే ఖాళీగా ఉన్నాయన్నారు. పాత వారి స్థానంలో కొత్తవారికి అవకాశాలు ఇవ్వాలని భావిస్తుండగా, దీనిపై పార్టీ అధిష్ఠానం ఆదేశాల కోసం వేచి చూస్తున్నానని చెప్పారు.

ఇప్పుడు కాకపోతే..

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : రాష్ట్రంలోని ఒక్కలిగ సముదాయానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఒక్కతాటిపైకి వస్తున్నారన్న సమాచారం చక్కర్లు కొడుతోంది. వారందరినీ హస్తినకు తీసుకెళ్లే ప్రయత్నాలు ఊపందుకున్నాయి. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు ముఖ్యమంత్రిగా బాధ్యతలు అప్పగించాలనేది వారి ప్రధాన డిమాండు. ఇప్పుడు కాకపోతే.. ఇంకెప్పుడు అధికారం దక్కించుకోవడం సాధ్యమనే ప్రశ్న ఆ బృంద సభ్యులు సంధిస్తున్నారు. ఈ నాయకుల బృందానికి వ్యవసాయ శాఖ మంత్రి చెలువరాయస్వామి నేతృత్వం వహిస్తున్నారనేది మరో సమాచారం. తెర వెనుక డీకే శివకుమార్ సోదరుడు సురేశ్ చక్రం తిప్పుతున్నట్లు విశ్లేషకుల మదింపు. ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య కొనసాగాలని మాజీ మంత్రి రాజణ్ణ చామరాజనగరలో వ్యాఖ్యానించగా.. ఎవరికి ఏ సమయంలో ఏ పదవి దక్కుతుందో హైకమాండ్ తీర్మానిస్తుందని బమూల్ అధ్యక్షుడు డీకే సురేశ్ వ్యాఖ్యానించారు. కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్ష స్థానాన్ని వీడేందుకు సిద్ధమని శివకుమార్ ఇప్పటికే పరోక్షంగా ప్రకటించడం వెనుక.. 'ముఖ్యమంత్రి' పీఠం ఊరింపే కారణమని సమాచారం.

సాంకేతిక సమ్మేళనం.. దిగ్విజయం

50 అంకుర ఉత్పత్తుల ఆవిష్కరణ

ఈనాడు, బెంగళూరు : బెంగళూరు సాంకేతిక ప్రగతిని జగత్తుకు చాటే బెంగళూరు సాంకేతిక సమ్మేళనం (బీటీఎస్) గురువారం ముగిసింది. మంగళవారం స్థానిక బెంగళూరు అంతర్జాతీయ ప్రదర్శన కేంద్రం (బీఐఈసీ)లో ప్రారంభమైన ఈ సమ్మేళనంలో తొలి రోజున సాంకేతిక, అంకుర, అంతర్జాతీయ సాంకేతిక విధానాలను సర్కారు ఆవిష్కరించింది. ఇదే సమయంలో 'స్టార్టప్ కర్ణాటక' ఆధ్వర్యంలో నిధులతో స్థాపించిన అంకురాలు తాము రూపొందించిన 50 సాంకేతిక ఉత్పత్తులను ఆవిష్కరించాయి. ఐటీ- బీటీ, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఇండియాలు సంయుక్తంగా నిర్వహించిన ఈ సమ్మేళనానికి 60 దేశాల నుంచి 50 వేల మంది సందర్శకులు, వెయ్యి మంది పెట్టుబడిదారులు విచ్చేశారు. నిపుణులైన 500 మంది వివిధ అంశాలపై ప్రసంగించారు.

'కియో' విప్లవం..

కర్ణాటక కియోనిక్స్ సంస్థ రూపొందించిన పోర్టబుల్ పీసీ 'కియో' రాష్ట్ర సాంకేతిక ప్రగతికి దర్పణంగా నిలవగా.. ఇదే సమయంలో 250 మంది యువ సాంకేతిక నిపుణులకు రాష్ట్రం పురస్కారాలు అందించింది. అత్యంత పిన్న వయస్కుడు (8 ఏళ్లు) అత్విక్ అమిత్ కుమార్ ఆవిష్కరించిన జోజో కనెక్ట్ యంగెస్ట్‌తో ఇన్నోవేటర్ పురస్కారాన్ని అందుకున్నారు. స్మార్ట్ డిజిటల్ కార్డులు, మైక్రో మెడికల్ కార్డులతో కొత్తతరం జీవన విధానాన్ని మరింత సరళీకరణ చేస్తామన్న భరోసా ఇచ్చాయి. ఐఏ, ఐవోటీ, ఆటోమోటివ్, రక్షణ, అంతరిక్ష రంగ సాంకేతికతలు, వ్యవసాయ, వినోద రంగాల్లో ఏఐ వినియోగం గురించి నాస్కాం నుంచి బీటీఎస్ వరకు కీలక ప్రకటనలు చేశాయి. డిజిటల్ డేటా ద్వారా వ్యవసాయ రంగానికి అవసరమైన సాంకేతికతలు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తాయని నాబార్డ్ ప్రకటించింది. బియాండ్ బెంగళూరులో రూ. 1000 కోట్ల పెట్టుబడులు, సెమీకండక్టర్, క్వాంటమ్ సిటీ కాన్సెప్ట్‌లు 28వ బీటీఎస్‌లో బెంగళూరు సాంకేతిక భవితను చాటాయి.

స్మారిక అందుకున్న శుభాంశు శుక్లాతో ప్రియాంక్ ఖర్గే, శరత్ బచ్చేగౌడ

చివరిగా.. యువ ప్రతినిధుల చర్చలను ఆసక్తిగా ఆలకిస్తున్న మంత్రి ప్రియాంక్, ఇతర అధికారులు

సత్కారం అందుకున్న అంకుర, టెక్ పరిశ్రమల దిగ్గజాలు

కామాంధుడికి 20 ఏళ్ల కారాగారం

శివమొగ్గ, న్యూస్‌టుడే : బాలిక (16)పై లైంగిక దౌర్జన్యానికి పాల్పడిన నిందితునికి (30) 20 ఏళ్ల కారాగార శిక్ష, రూ.65 వేల జరిమానా విధిస్తూ మైసూరులోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. నిందితుడు 2022లో మార్చి 22న బాలికకు మాయమాటలు చెప్పి భద్రావతి సమీపంలోని హలగనహళ్లి నుంచి హుబ్బళ్లికి తీసుకువెళ్లాడు. అక్కడ బెదిరించి అత్యాచారానికి పాల్పడి, అనంతరం తాళి కట్టాడు. కొద్ది రోజుల అనంతరం ఇంటికి తీసుకువచ్చాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు నేరానికి పాల్పడినట్లు రుజువు కావడంతో శిక్ష జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. బాధితురాలికి రూ.4.5 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వానికి న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

పట్టభద్రులకే సర్కారు సహకారం

సభావేదికపై వెండి గద అందుకుంటున్న సిద్ధరామయ్య

చామరాజనగర, న్యూస్‌టుడే : సహకార సంఘాల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు ఆ రంగంలో పట్టభద్రులైన వారికే అవకాశం కల్పిస్తామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించారు. గ్రామీణ భారతదేశంలో ఆర్థికాభివృద్ధికి పాఠశాల, గ్రామ పంచాయతీ, సహకార సంఘం ఎంతో అవసరమనేది దేశ మొదటి ప్రధానమంత్రి నెహ్రూ ప్రతిసారీ ప్రతిపాదిస్తూ వచ్చారని గుర్తు చేశారు. విద్యార్థులకు సహకార రంగం ప్రాధాన్యమేంటో తెలిపేందుకు పాఠ్యాంశాలను రూపొందించాలని అభిప్రాయపడ్డారు. కర్ణాటకలో సహకార రంగానికి మొదటి నుంచి ప్రాధాన్యం ఉండడంతోనే వందేళ్లకు పైగా ఈ రంగం అభివృద్ధి చెందుతూ వస్తోందన్నారు. చామరాజనగరలో అఖిల భారత 72వ సహకార వారోత్సవాల ముగింపు సమావేశంలో ఆయన గురువారం మాట్లాడారు. వ్యవసాయ, పశుసంవర్ధక, పారిశ్రామిక, బ్యాంకింగ్ రంగాల్లో.. సహకార సంఘాల సంఖ్య నానాటికీ పెరగడం శుభ పరిణామమని చెప్పారు. తాను పశుసంవర్ధక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు పాల ఉత్పాదకుల సంఘాలను ప్రోత్సహిస్తూ వచ్చానని గుర్తు చేశారు. ఇప్పుడు రోజుకు కోటి లీటర్ల పాలు ఉత్పాదన వెనుక సహకార సంఘాల పాత్ర ఉందన్నారు. 'నేను జనతాదళ్‌లోనే ఉంటే ముఖ్యమంత్రిని అయ్యే వాడిని కాదు. ఆ పార్టీ నేత దేవేగౌడ, ఆయన కుమారులు నాకు అడ్డుపడుతూ వచ్చారు. దళ్ నుంచి నన్ను బహిష్కరించిన అనంతరం తనతో పలువురు నేతలు కాంగ్రెస్‌లో చేరారు. సహకార రంగంలో కీలకమైన నాయకుడు జీటీ దేవేగౌడ దళ్‌లోనే ఉండిపోయారు. పార్టీ వేరైనా ఆయన ఇప్పటికీ నాకు పాలనా విధానాల్లో మద్దతు ఇస్తున్నారు' అని పేర్కొన్నారు.

కార్యక్రమానికి హాజరైన ప్రజలు.. సహకార ప్రగతికి ప్రతిన

బాలికలకు అండగా అక్క

బెంగళూరు (రామమూర్తినగర), న్యూస్‌టుడే : బాల్య వివాహాలను అడ్డుకునేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ తెలిపారు. కనీసం 18 ఏళ్లు నిండకుండా వివాహం చేయకూడదని అన్ని గ్రామాల్లో, తండాల్లో జాగృతి కల్పిస్తున్నామని చెప్పారు. బాల్య వివాహ ముక్త గ్రామ పంచాయతీలకు తమ శాఖ తరఫున రూ. 25 వేల బహుమతులను అందిస్తున్నామని ప్రకటించారు. బాలికలను, మహిళలను రక్షించేందుకు 'అక్క' దళాలను ఏర్పాటు చేశామని తెలిపారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, దక్కిన అవకాశాన్ని వినియోగించుకుని ఉత్తమ సేవలు అందిస్తే పేరు శాశ్వతంగా మిగిలిపోతుందన్నారు. చదువుకునే రోజుల్లో ఒక ప్రముఖుని ఉపన్యాసం విన్న అనంతరం తాను రాజకీయాల్లోకి వచ్చి మంచి పనులు చేయాలని తీర్మానించుకున్నానని తెలిపారు.

ఆ అధికారికి ఫోన్ పే లంచం!

కలబురగి, న్యూస్‌టుడే : ఫోన్ పే ద్వారా లంచం తీసుకుని శివలింగప్ప అనే ఉద్యోగి లోకాయుక్త అధికారులకు దొరికిపోయాడు. ఆఫ్రిది అనే వ్యక్తి పదవీ విరమణ చేసిన తన తల్లి రజాక్ బేగానికి పింఛను, ఇతర సదుపాయాలను పొందేందుకు సేడం తాలూకా బీఈఓ కార్యాలయంలో దస్త్రాలను అప్పగించారు. పని పూర్తి చేసేందుకు రూ.28,500 ఇవ్వాలని శివలింగప్ప డిమాండ్ చేశాడు. ముందు తనకు రూ.25 వేలు పంపించాలని సందేశాన్ని పంపించాడు. లంచం ఇవ్వడం ఇష్టం లేని ఆఫ్రిది తక్షణమే లోకాయుక్త సిబ్బందికి ఫిర్యాదు చేశాడు. వారి మార్గదర్శనంలో నగదు పంపించిన అనంతరం దాడి చేసి శివలింగప్పను బంధించారు. అతని చరవాణిని జప్తు చేసుకుని, ఎవరెవరి నుంచి నగదు తీసుకున్నాడో గుర్తించేందుకు విచారణ చేపట్టారు.

వైద్యుల నిర్లక్ష్యంతో విషాద ప్రసవం

హావేరి, న్యూస్‌టుడే : రాణెబెన్నూరు సమీపంలోని కాకోల్ గ్రామానికి చెందిన రూప కరబన్ననవర్ (30) ప్రసవ వేదనతో హావేరిలోని జిల్లా ఆసుపత్రిలో మంగళవారం రాత్రి చేరింది. వార్డులో పడకలు లేకపోవడంతో మరో వార్డు వెలుపల నేలపై ఆమెను కూర్చోబెట్టారు. మరుగుదొడ్డికి వెళుతున్న సమయంలో పురిటి నొప్పులు తీవ్రం కావడంతో కారిడార్‌లోనే ఆడబిడ్డకు జన్మనిచ్చింది. బిడ్డ తల నేలకు బలంగా కొట్టుకోవడంతో తీవ్ర గాయాలతో మరణించింది. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపణలు రావడంతో ఆసుపత్రి వైద్యాధికారి పీఆర్ హావనూర్ దర్యాప్తునకు ఆదేశించారు.

స్వచ్ఛభారతానికి సంకల్పదీక్ష

వాతావరణం శిబిరానికి హాజరైన పారిశ్రామికవేత్తలు, శాస్త్రవేత్తలు, పర్యావరణ కార్యకర్తలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : వాతావరణంలో చోటు చేసుకుంటున్న అపాయకర మార్పుల ప్రభావం అన్నింటిపైనా పడుతుందని, దాన్ని నియంత్రించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని దిల్లీలోని స్వీడన్ రాయబార కార్యాలయ అధికారి పవన్ తహ్లోని సూచించారు. బెంగళూరులో స్వీడన్- స్వీడిష్ వ్యాపార మండలి, భారతీయ పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) సంయుక్తంగా గురువారం ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రానున్న ఇంధన వనరుల సమస్యను నూతన సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కృత్రిమ మేధ సాయంతో పరిష్కరించేందుకు ప్రయత్నిస్తే వాతావరణంలో నెలకొన్న అపాయకరమైన పరిస్థితుల నుంచి బయటపడవచ్చన్నారు. దీని కోసం భారత్‌లో తయారీ, స్వచ్ఛభారత్ మిషన్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హరిత శక్తి, నీటి నిర్వహణ, సంరక్షణ, జలమార్గాలు, ఇంధన నిర్వహణ, సౌరశక్తి తదితరాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఐజీబీసీ అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్ హరిహరన్ తదితరులు పాల్గొన్నారు.

రాచనగరీ.. హాయిగా ఊపిరి పీల్చుకో!

విద్యుత్తు దీపాల వెలుగులో రాచనగరి

మైసూరు, న్యూస్‌టుడే : వాయు నాణ్యత విషయంలో రాష్ట్రంలో మొదటి స్థానాన్ని, దేశంలో మూడో స్థానంలో రాచనగరి నిలిచి భళా అనిపించింది. దేశంలోనే అత్యంత ప్రణాళికాబద్ధ (ప్లాన్డ్) నగరంగా గుర్తింపు ఉన్న సాంస్కృతిక నగరికి వాయు నాణ్యత (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్)లో ర్యాంకు దక్కించుకునేందుకు ఉద్యానవనాల నిర్వహణ, ప్రజలు తీసుకునే జాగ్రత్తలు, పర్యావరణంపై ప్రతి ఒక్కరి ప్రేమ ఉపకరించింది. నగరంలో 65 వార్డులు ఉండగా, 332 ఉద్యానవనాలు విస్తరించాయి. వీటి నిర్వహణను గుత్తేదారులకు అప్పగించారు. ఇందులో 13 పార్కులను స్థానికులు, కొన్ని కంపెనీలు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా చూసుకుంటున్నాయి. నగర సౌందర్యాన్ని పెంపొందించేందుకు పాలికె కూడా 40 కి.మీ. పొడవునా రహదారికి ఇరువైపులా, కొన్ని చోట్ల రహదారి విభాజకాలపై రెండు లక్షలకు పైగా మొక్కలు నాటి పెంచుతోంది. చెట్లు, ఉద్యానవనాల రక్షణకు 13 ప్యాకేజీల కింద గుత్తేదారులకు రెండేళ్ల పాటు నిర్వహణ బాధ్యత అప్పగించారు. ఉద్యానాలను పెంచేందుకు, అన్ని వార్డుల్లో మొక్కలు పెంచేందుకు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని పాలికెలో ఉద్యాన శాఖ విభాగం అధికారి మోహన్ కుమార్ తెలిపారు.

పరిష్కారం చూపితే పురస్కారం

బెంగళూరు (మల్లేశ్వరం): నగరం ఎదుర్కొంటున్న కీలక సమస్యలకు పరిష్కారం చూపిస్తే రూ.25 లక్షలు గెల్చుకునే అవకాశాన్ని అంకుర పరిశ్రమలకు కల్పిస్తూ 'గ్రేటర్ బెంగళూరు ప్రాధికర' అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. వాహన రద్దీ, వ్యర్థాల నిర్వహణ, రహదారులపై గుంతలు, ఇతర సమస్యలకు అంకుర పరిశ్రమలు పరిష్కారాలు చూపించేందుకు తమ అర్బన్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ వెబ్‌సైట్‌లో నవంబరు 24 లోగా పేర్లు నమోదు చేసుకోవలసి ఉంటుంది. విజేతలను వచ్చే ఏడాది ప్రారంభంలో ప్రకటిస్తామని జీబీఏ అధికారులు ప్రకటించారు.

సమస్యల కాసారం.. రాజధాని నగరం

శైల్.. బెయిలు గడువు పెంపు

బెంగళూరు (రామమూర్తినగర), న్యూస్‌టుడే : బేలెకేరి నుంచి ఇనుప ఖనిజాన్ని అక్రమంగా ఎగుమతి చేసిన ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే సతీశ్ శైల్‌కు ఇచ్చిన బెయిలు అవధిని ఉన్నత న్యాయస్థానం ఈ నెల 28 వరకు పొడిగించింది. ఆయనకు వైద్య పరీక్షలు చేసి, నివేదిక ఇవ్వాలని కమాండ్ ఆసుపత్రి అధికారులను జస్టిస్ సునీల్ దత్ ఇప్పటికే ఆదేశించారు. వైద్య పరీక్షల నివేదికను అందించని ఆసుపత్రి అధికారుల తీరును న్యాయమూర్తి తప్పుపట్టారు. తదుపరి విచారణ సమయానికి సమగ్ర నివేదిక అందించాలని న్యాయమూర్తి ఆదేశించారు.

దర్శన్‌కు మళ్లీ వెన్నునొప్పి

హలసూరు, న్యూస్‌టుడే : తనకు వెన్ను నొప్పి ఎక్కువగా ఉందని, వైద్య పరీక్షలు, ఫిజియో థెరపీకి అవకాశం కల్పించాలని కోరుతూ నటుడు దర్శన్ వేసుకున్న అర్జీ విచారణ గురువారం ప్రారంభమైంది. న్యాయమూర్తి ఆదేశాలతో కారాగారం అధికారులు తనకు గురువారం కంబళి ఇచ్చారని వీడియోకాన్ఫరెన్సు ద్వారా విచారణకు హాజరైన సమయంలో న్యాయమూర్తి దృష్టికి తీసుకువెళ్లారు. తదుపరి విచారణను న్యాయమూర్తి వాయిదా వేశారు.

చివరికి అంబులెన్సులోనే ..

చామరాజనగర, న్యూస్‌టుడే : కురట్టి హొసూరుకు చెందిన శిల్ప అనే గర్భిణి అంబులెన్సులోనే ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఇంట్లో ఉన్న సమయంలో పురిటి నొప్పులు రావడంతో అంబులెన్సు పిలిపించారు. మార్గ మధ్యంలో కణివె ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్సు సిబ్బంది రాణి, నాగరాజ్ ఆమెకు కాన్పు చేశారు. కాన్పు అనంతరం చామరాజనగర ఆసుపత్రిలో గురువారం చేర్పించారు.

బురఖా ధరించి.. కత్తి ఎక్కుపెట్టి..

మంగళూరు: బంట్వాళ పట్టణ నడిబొడ్డున.. అదొక దుస్తుల దుకాణం. బుధవారం రాత్రి ఏడుగంటల సమయంలో వినియోగదారులు పెద్దగా లేని సమయం. దుకాణ యజమాని కృష్ణకుమార్ లెక్కలు సరిచూసుకుంటూ.. అక్కడి సిబ్బందితో మాట్లాడుతున్న సమయానికి ఓ మహిళ లోనికి ప్రవేశించింది. బురఖా ధరించి, నోటికి అడ్డుగా మాస్క్ వేసుకున్న ఆమె ఏవో దుస్తుల కోసం అన్నట్లు అక్కడ కలియ తిరుగుతూ ఒక్కసారిగా కత్తి దూసింది. కృష్ణకుమార్‌పై దాడిచేసి, ఇష్టానుసారం పొడిచి పరుగులు తీసింది. అక్కడి వారు అప్రమత్తమై, బాధితుడిని ఓవైపు మంగళూరులోని ఏజే ఆసుపత్రికి తరలిస్తూ.. మరికొందరు ఆమెను వెంబడించి పట్టుకునే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులూ రంగంలోకి దిగి ఆమెను బంట్వాళ వీధుల్లో పట్టుకున్నారు. ఠాణాకు తరలించి.. విచారిస్తే.. బురఖా తొలగించి ఆమె అసలు రూపం చూపింది. ఆమె మరెవ్వరో కాదు.. కృష్ణకుమార్ సతీమణి కేటీ జ్యోతి! ఆమెను చూసి పోలీసులు, దుకాణ సిబ్బంది కంగుతిన్నారు. కుటుంబంలో పలు వివాదాలు ఉండడంతోనే దాడి చేసిందని గుర్తించి విచారణ కొనసాగిస్తున్నామని పోలీసు అధికారులు వెల్లడించారు. సకాలంలో ఆయనను ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది.

సాయం పేరిట దోపిడీ

మండ్య: డ్రాప్ ఇస్తామంటూ దారి దోపిడీలకు పాల్పడిన కిరణ్, కుశాల్ బాబు, గోకుల్ అనే విద్యార్థులను మండ్య నగర పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వీరు బెంగళూరులోని ఓ కళాశాల విద్యార్థులుగా గుర్తించారు. త్వరగా నగదు సంపాదించుకునేందుకు బస్టాప్‌ల వద్ద వేచి ఉన్న వారి వద్దకు కారులో వెళ్లి.. ఎక్కించుకుని.. అనంతరం బెదిరించి నగదు దోచుకునేవారని ప్రాథమిక విచారణలో గుర్తించారు. నిందితుల నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు పోలీసులు విచారణను తీవ్రం చేశారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 9121167525

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 9945050116

(c) eenadu

రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య. చిత్రంలో మంత్రులు ఎం.బి.పాటిల్, జమీర్ అహ్మద్ ఖాన్, లోక్‌సభ సభ్యుడు ఇ.తుకారామ్, ఎమ్మెల్యే ఇ.అన్నపూర్ణ, అధికారులు

కుడతిని రైతులతో ముఖ్యమంత్రి భేటీ

ఆరు నెలల్లో సమగ్ర నివేదిక

బళ్లారి, న్యూస్‌టుడే: వివిధ పరిశ్రమలకు భూములు కోల్పోయిన వారికి న్యాయం చేయాలని కుడతిని సత్యాగ్రహ సమితి ఆధ్వర్యంలో 1070 రోజులుగా నిరవధిక సత్యాగ్రహం చేస్తున్న రైతులు, సంఘం సభ్యులతో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, పరిశ్రమలశాఖ మంత్రి ఎం.బి.పాటిల్, జిల్లా బాధ్యమంత్రి జమీర్ అహ్మద్ ఖాన్, లోక్‌సభ సభ్యుడు ఇ.తుకారామ్, ఎమ్మెల్యే ఇ.అన్నపూర్ణ బెంగళూరులో సమావేశమయ్యారు. గంటసేపు పైగా రైతుల నుంచి ముఖ్యమంత్రి వివరాలు సేకరించారు. రైతులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యు.బసవరాజు విలేకరులతో మాట్లాడారు. లక్ష్మీ, బ్రాహ్మణి, ఎన్ఎండీసీలకు భూమిని స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మీమిట్టల్ స్టీల్ ప్లాంట్ స్థాపించడం లేదని ఇప్పటికే ప్రకటించారు. బ్రాహ్మణి స్వాధీనం చేసుకున్న భూమిని ఉత్తమ గాల్వాకు విక్రయించారు. ఉత్తమ గాల్వా స్వాధీనం చేసుకున్న భూమి కోర్టులో ఉండటంతో తీర్పు తర్వాత పరిశ్రమ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఎన్ఎండీసీ కూడా పరిశ్రమ స్థాపించడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించిందని బసవరాజు తెలిపారు. పరిశ్రమలు స్థాపిస్తే రైతుల పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని తెలిపారు.

అధికార దుర్వినియోగంతో మోసం చేశారు

గాలి జనార్దనరెడ్డి జిల్లాలో బలమైన నేత. రాష్ట్రంలో యడియూరప్ప, ఆంధ్రప్రదేశ్‌లో వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వాల మద్దతు, కేంద్ర ప్రభుత్వమూ అనుకూలంగా నిలిచింది. అధికార దుర్వినియోగంతో ఎకరా రూ.6లక్షలు, రూ.8లక్షలు, రూ.12లక్షలు, రూ.16లక్షలు, రూ.20 లక్షలతో ధరలతో కొనుగోలు చేయడంతో తమకు అన్యాయం జరిగిందని రైతు నాయకులు వాపోయారు. ఒకే ప్రదేశంలో వేర్వేరు ధరలతో కొనుగోలు చేయడంపై అప్పటి సబ్ రిజిస్ట్రార్‌తో పాటు జిల్లా పాలనాధికారి కొత్త ధరలు ఇవ్వాలని ప్రభుత్వానికి నివేదిక అందజేశారన్నారు. నివేదికలను సంబంధించిన అధికారులకు అందజేశాం. స్వాధీనం చేసుకున్న భూములు, విజయనగరవృద్ధి పరిధిలో ఉండటంతో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని ముఖ్యమంత్రికి వివరించామన్నారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారు. రైతులకు అన్యాయం జరిగిందని ప్రాథమికంగా గుర్తించారు. దీనికి సంబంధించిన పత్రాలను సంబంధిత అధికారులకు అందజేయాలని కోరారు. అధికారులు మరోసారి పరిశీలించి ఆరు నెలల్లో నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. తమ డిమాండ్లు పరిష్కరించే వరకు నిరవధిక సత్యాగ్రహం చేస్తామని యు.బసవరాజు తెలిపారు. సమావేశంలో జిల్లా పాలనాధికారి నాగేంద్రప్రసాద్, జిల్లా పోలీస్ అధికారి డాక్టర్ శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

జీన్స్ పార్కుకు రాహుల్‌గాంధీతో భూమిపూజ చేయిస్తాం

జనవరి 3న వాల్మీకి కూడలి ప్రారంభం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, చిత్రంలో మేయర్ పూజారి గాదెప్ప, తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: జీన్స్ పార్కుకు 2026 మొదటి మూడు నెలల్లో భూమిపూజ చేయిస్తామని ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. జీన్స్ పార్కులో కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపుతున్న వారికి 25 శాతం రాయితీతో స్థలం కేటాయిస్తున్నాం. నగర శివారు ప్రాంతమైన పారిశ్రామిక ప్రాంతంలో వ్యర్థాల మురుగునీటి శుద్ధీకరణ కేంద్రాలు ఉన్న వారికి జీన్స్ దుస్తుల శుద్ధి యూనిట్లకు అనుమతులు ఇస్తున్నాం. గతంలో బళ్లారి తాలూకా సంజీవరాయనకోటలో జీన్స్ పార్క్ కోసం సేకరించిన 600 ఎకరాల స్థలంలో పనులు ప్రారంభించేందుకు పార్లమెంటులో ప్రతిపక్షనేత, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీని ఆహ్వానిస్తున్నాం. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డితో కలిసి అర్హులైన లబ్ధిదారులకు స్థలాలను వితరణ చేస్తామన్నారు. ఈటీపీ ప్లాంట్లు లేని జీన్స్ దుస్తుల శుద్ధి కేంద్రాలను మూసివేస్తున్నాం. నిబంధనల ప్రకారం ఉన్న యూనిట్లకు తమ మద్దతు ఉంటుందన్నారు. పరిసరాల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జీన్స్ పార్కుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించిందా అని ప్రశ్నించగా, తమకు కేంద్ర రాష్ట్రాల నిధులు ఉండటం వల్ల వాటిని ఉపయోగిస్తామన్నారు. బళ్లారి జీన్స్ దుస్తుల శుద్ధి కేంద్రాల నుంచి వచ్చే వ్యర్థాల నివారణ కోసం ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని శుద్ధీకరణ కేంద్రం నిర్మాణానికి రూ.22 కోట్ల నిధులు కేటాయించారు. తమ ప్రభుత్వం ఎలాంటి కక్ష సాధింపులకు పాల్పడదని, యజమానులతో పాటు ప్రజల ఆరోగ్యం కూడా చాలా ముఖ్యమన్నారు.

నగరాభివృద్ధికి ప్రజలు సహకరించాలి

బళ్లారి నగరంలోని వాల్మీకి కూడలి అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి. కూడలిలో వాల్మీకి విగ్రహం ప్రతిష్ఠించి 2026 జనవరి 3న ప్రారంభిస్తామని ఎమ్మెల్యే భరత్ రెడ్డి పేర్కొన్నారు. జనవరిలోనే గడగి చెన్నప్ప కూడలిని ప్రారంభిస్తామని, నగర వాసులు అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. మేయర్ పూజారి గాదెప్ప, కార్పొరేటర్లు రాజేశ్వరి, రాజు, పాలెన్న, మల్లికార్జున, దాదా ఖలందర్, వెంకటేశ్ హెగ్డే పాల్గొన్నారు.

జీన్స్ శుద్ధి కేంద్రాలపై కాంగ్రెస్ దౌర్జన్యం తగదు

మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి. చిత్రంలో గుర్రం వెంకటరమణ, శ్రీనివాస మొత్కార్, మల్లనగౌడ

బళ్లారి, న్యూస్‌టుడే: జీన్స్ దుస్తుల శుద్ధి కేంద్రాలపై కాంగ్రెస్ ప్రభుత్వం దౌర్జన్యం చేయడంతో మూత పడి వేలాది మంది ఉపాధి కోల్పోయే పరిస్థితి నెలకొందని మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బళ్లారి నగర వాసులకు జీవనాధారమైన జీన్స్ పరిశ్రమలకు రాత్రికి రాత్రే తాళాలు వేయడంతో ఈ సమస్య వచ్చిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జీన్స్ పరిశ్రమకు నిధులు విడుదల చేసినట్లు ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నాం. బళ్లారిని జీన్స్ రాజధాని చేస్తామని ప్రభుత్వం ప్రకటించి రెండేళ్లు గడిచినా...నేటికీ పూర్తి స్థాయిలో భూమిని కొనుగోలు చేయలేదని ఆరోపించారు. 600కు పైగా జీన్స్ తయారీ కేంద్రాలు ఉండగా, ప్రస్తుతం 300లకు పడిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. బళ్లారిలో ఉన్న పరిశ్రమలు వేర్వేరు రాష్ట్రాలకు తరలివెళ్తున్నాయి. బి.గోనాళ్‌లో 104 ఎకరాల్లో బుడా వేస్తున్న లే అవుట్ ఇప్పటికీ పూర్తి చేయలేదన్నారు. నేటికి అర్హులకు ఇంటి స్థలాలు వితరణ చేయాల్సి ఉండాలి. నేటికీ అభివృద్ధి పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. భాజపా నగర అధ్యక్షుడు గుర్రం వెంకటరమణ, కార్పొరేటర్ శ్రీనివాస మొత్కార్, మల్లనగౌడ, వేమణ్ణ, హనుమంతప్ప పాల్గొన్నారు.

భూగర్భ జలాల సంరక్షణలో చిత్రదుర్గం జిల్లాకు జాతీయ పురస్కారం

కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ చేతుల మీదుగా జాతీయ అవార్డు అందుకున్న జడ్పీ సీఈవో డాక్టర్ ఆకాశ్

చెళ్లకెర(చిత్రదుర్గం), న్యూస్‌టుడే: చిత్రదుర్గం జిల్లాలో 2024-25వ సంవత్సరంలో భూగర్భ జలాల సంరక్షణకు చేపట్టిన వివిధ కార్యక్రమాలను గుర్తించిన కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ జల సంచయ్ జన భాగీదారి విభాగంలో జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక చేసిందని జడ్పీ సీఈవో డాక్టర్ ఆకాశ్ తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో ప్రమాణ పత్రం, పురస్కారాన్ని ప్రదర్శించి మాట్లాడారు. జల సంచయ్ జన భాగీదారి కార్యక్రమంలో భాగంగా జిల్లాలో భూగర్భ జలాల సంరక్షణకు జలమూలాల సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు చెక్ డ్యాంలు, ఇంకుడు గుంతల నిర్మాణం, పురాతన కాలం నాటి పుష్కరిణిల సంరక్షణ, జీర్ణోద్ధారణ, చెరువుల్లో పూడిక తీయడం, చెరువు కట్టలకు మరమ్మతులు చేయడం, కంచె చెట్లను తొలగించడం, నీటి కాలువల అభివృద్ధి పనులను సమగ్రంగా అమలు చేశామన్నారు. జిల్లాలోని 1,063 గ్రామాల్లో 7,815 కార్యక్రమాలను చేపట్టి భూగర్భ జలాల అభివృద్ధికి కృషి చేసినట్లు వివరించారు. పురస్కారం కింద రూ.25 లక్షల నగదు, జ్ఞాపిక, ప్రశస్తి పత్రాన్ని కేంద్ర జల శక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ కొత్త దిల్లీలో జరిగిన కార్యక్రమంలో అందజేశారన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర జలశక్తి సహాయ మంత్రి వి.సోమణ్ణ తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

వేషం తీసేసి.. ఊపిరి వదిలేసి..

ఉడుపి, న్యూస్‌టుడే: ఉడుపి జిల్లా మందార్తి గ్రామ శివారులో నిర్వహిస్తున్న కూమలేలో మహిషాసుర పాత్ర పోషించిన యక్షగాన కళాకారుడు ఈశ్వరగౌడ (65) గుండెపోటుతో మరణించారు. బుధవారం రాత్రి మహిషాసురుని పాత్రను ముగించి, మేకప్ తొలగించుకునేందుకు తనకు కేటాయించిన గదికి చేరుకుని.. ఛాతీ పట్టుకుని పడిపోయిన ఆయనను చికిత్స కోసం ఉడుపిలోని ఆసుపత్రికి తరలించేలోగా కన్నుమూశారు. ఆయన మృతికి యక్షగాన కళాకారులు, కళాభిమానులు సంతాపాన్ని ప్రకటించారు. కుటుంబ సభ్యులు, కళాకారుల మధ్య ఆయన భౌతికకాయానికి గురువారం అంత్యక్రియలు నిర్వహించారు.

మహిషాసుర పాత్రలో ఈశ్వరగౌడ

19 ఏళ్లకు నిందితుడి ఆటకట్టు

మంగళూరు, న్యూస్‌టుడే : ఒకప్పటి సంఘ పరివార నాయకుడు సుఖానంద శెట్టి హంతకులకు ఆశ్రయం ఇచ్చిన ఆరోపణలను ఎదుర్కొంటున్న అబ్దుల్ సలాం అడ్డూరు (47)ను సూరత్కల్ ఠాణా పోలీసులు 19 ఏళ్ల అనంతరం గురువారం అరెస్టు చేశారు. బంట్వాళ తాలూకా అడ్డూరు టిబెట్ కాలనీకి చెందిన నిందితుడు బజ్పె సమీపంలోని కిన్నిపదవిలో ఉంటున్నాడు. సుఖానంద శెట్టిని హత్య చేసిన హంతకులకు తన ఇంట్లో ఆశ్రయం ఇవ్వడంతో పాటు, వారికి తన వాహనంలో కేరళలోని కాసరగోడు వరకు తీసుకువెళ్లి విడిచి పెట్టి వచ్చాడనేది అభియోగం. తన విషయాన్ని పోలీసులు గుర్తించారని, అప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతూ, కిన్నపదవిలో స్థిరపడ్డాడు. అబ్దుల్ సలాంపై పోలీసులు ఇప్పటికే రౌడీషీటు తెరిచారు.

26న చలో బెంగళూరు

బళ్లారి, న్యూస్‌టుడే: పేదలకు వ్యవసాయ భూమిని పంపిణీ చేయాలి. ఇంటి స్థలాలు లేని వారికి ప్రభుత్వం స్థలం కొనుగోలు చేసి వితరణ చేయాలని కోరుతూ రైతు, దళిత, కార్మిక, మహిళ, విద్యార్థి యువజన, సంయుక్త పోరాట కర్ణాటక సంఘం ఈ నెల 26న చలో బెంగళూరు నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు కరియప్ప గుడిమని వెల్లడించారు. గురువారం పత్రికాభవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం భూమిని పంపిణీ చేయాలని 42 లక్షల మంది దరఖాస్తులు సమర్పించారు. 25 లక్షల దరఖాస్తులు పరిశీలించారు. వారిలో 15 లక్షల మందిని ఎంపిక చేశారు. 3 లక్షల మందికి మాత్రమే భూమిని పంపిణీ చేసి సాగు పట్టాలు అందజేశారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. బగర్ హుకుం సాగువళి దరఖాస్తులను తక్షణమే పరిశీలించి సాగు పట్టాలు అందజేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తున్నా.. కేంద్ర భాజపా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సభ్యులు విశ్వనాథ, రామకృష్ణ, ఈశ్వరప్ప, మహేష్, వసంతరాజ్, బసవరాజస్వామి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు కరియప్ప గుడిమని.. చిత్రంలో సభ్యులు

25న హొసపేటెలో పాదయాత్ర

హొసపేటె, న్యూస్‌టుడే: సర్దార్ వల్లభభాయి పటేల్ 150వ జయంత్యుత్సవాన్ని పురస్కరించుని ఈ నెల 25న పట్టణంలో ఐక్యతా పాదయాత్ర కార్యక్రమాన్ని చేపట్టామని మేరా యువ భారత్ కేంద్రం అధికారి సంజీవ్ ముఖ్య తెలిపారు. గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు 500 మంది విద్యార్థులు ఈ పాదయాత్రలో పాల్గొంటున్నారు. విద్యార్థుల్లో ఇప్పటి నుంచే దేశభక్తి, ఐక్యతా, సామరస్యాన్ని నూరిపోసేందుకు ఈ పాదయాత్ర ఎంతగానో తోడ్పడుతుందని అధికారి వివరించారు. మొన్న బళ్లారిలో చేపట్టిన పాదయాత్ర విజయవంతమైందని హర్షం వ్యక్తం చేశారు. వడకరాయ ఆలయం నుంచి ప్రారంభంకానున్న పాదయాత్ర ప్రముఖ కూడళ్లగుండా సాగి జిల్లా క్రీడామైదానాన్ని చేరుకుంటుంది. బళ్లారి ఎంపీ ఇ.తుకారామ్, స్థానిక ఎమ్మెల్యే హెచ్.ఆర్.గవియప్ప, జిల్లా పాలనాధికారి, ఎస్పీ, నగరసభ అధ్యక్షుడు పాల్గొంటారని తెలిపారు. భాజపా నుంచి పెద్ద ఎత్తున సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. బళ్లారి వర్సిటీ ఆచార్య కుమార్, భాజపా నాయకులు అయ్యాళి తిమ్మప్ప, కిచిడి కొట్రేష్, రాఘవేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాదయాత్ర గోడపత్రికను విడుదల చేశారు.

ఐక్యతా పాదయాత్ర గోడపత్రికను విడుదల చేస్తున్న అధికారులు, భాజపా నాయకులు

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరి మృతి

కారటగి, న్యూస్‌టుడే: కారటగి - గంగావతి మార్గంలోని జూరటగి గ్రామం వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఎదురెదురుగా వస్తున్న రెండు దిచక్ర వాహనాలు ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతి చెందిన ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు సింధనూరు తాలూకా జాలిహాళ గ్రామ నివాసి కాగా మరో వ్యక్తి ఎవరనేది తెలియలేదు. కారటగి పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

ప్రమాద స్థలంలో ద్విచక్ర వాహనాలు, మృతదేహం

ఎర్రితాతకు.. అమావాస్య పూజలు

చెళ్లగుర్కి ఎర్రితాతకు పుష్పాలంకరణ

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: చెళ్లగుర్కిలో వెలసిన భక్తుల ఆరాధ్యగురువు ఎర్రితాత మఠంలో అమావాస్యను పురస్కరించుకుని గురువారం తాతకు విశేష క్షీరాభిషేకం నిర్వహించారు. పంచామృతాలో అభిషేకించారు. పుష్పాలు, రజతకవచంతో అలంకరించారు. ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఉన్న తాతను దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రాత్రి తాత ఉత్సవ విగ్రహాన్ని ముత్యాల రథంలో ఉంచి ఊరేగించారు. బాణోత్సవం జరిపారు. మఠం కమిటీ అధ్యక్షుడు బాలనగౌడ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

హనుమమాల ఏర్పాట్ల పరిశీలన

గంగావతి,న్యూస్‌టుడే: అంజనాద్రి వద్ద హనుమ మాల దీక్ష విరమణకు వచ్చే భక్తుల కోసం చేస్తున్న ఏర్పాట్లను కొప్పళ జిల్లా పాలనాధికారి సురేశ్ ఇట్నాళ గురువారం పరిశీలించారు. వాహనాల పార్కింగ్, భక్తుల అన్నదానం, తాగునీరు సౌకర్యాలపై బాధ్యతలు అప్పగించిన అధికారుల నుంచి వివరాలు సేకరించారు. పూజలు, ధార్మిక కార్యాలు, ఆలయం అలంకరణ సమాచారం అడిగి తెలుసుకున్నారు. సుమారు లక్షన్నర మంది భక్తులు దీక్ష విరమణకు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నెల 30లోగా అన్ని ఏర్పాట్లు పూర్తి కావాలని సూచించారు. ఎస్పీ రామ్ అరసిద్ధి మాట్లాడుతూ భక్తులు తరలివచ్చే రహదారుల్లో 25 చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. భద్రత కోసం 1,500 మంది పోలీసులను నియమిస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి సమస్య ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. జడ్పీ సీఈవో వర్ణిత్ నేగి, అదనపు జిల్లాధికారి సిద్ధరామేశ్వర, గంగావతి తహసీల్దార్ యు.నాగరాజ్ పాల్గొన్నారు.

అంజనాద్రి వద్ద హనుమమాల ఏర్పాట్లపై చర్చిస్తున్న జిల్లా పాలనాధికారి సురేశ్ ఇట్నాళ

జాతి ఐక్యతలో తెలుగువారి పాత్ర కీలకం

హొసపేటె, న్యూస్‌టుడే: జాతీయ ఐక్యతలో తెలుగువారి పాత్ర కీలకమని కల్లుగీత కులాల సమాఖ్య అధ్యక్షుడు కోళ్ల ఈశ్వరప్రసాద్ అభివర్ణించారు. హొసపేటె వచ్చిన ఆయన్ను గురువారం టీబీ డ్యాంలోని కర్ణాటక తెలుగు సంఘం ప్రముఖులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఈశ్వరప్రసాద్ మాట్లాడుతూ దేశం నలుమూలల్లో తెలుగు వారు స్థిరపడ్డారని, స్థానికులతో మమేకమై సమాజ సేవ చేస్తున్నారని కొనియాడారు. మా తాత క్రీ.శ. 1911లో బర్మాలో తెలుగు సంఘం స్థాపించి, ఓ భవనమూ నిర్మించారని గుర్తుచేశారు. అక్కడి తెలుగు వారు నిర్మించిన రామాలయం వచ్చే ఏడాది ఫిబ్రవరి 22న ప్రారంభోత్సవం కానుంది, దేశ నలుమూలల నుంచి తెలుగువారు పాల్గొంటారని వివరించారు. కర్ణాటక తెలుగు సంఘం అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వరరావు, కార్యదర్శి ధర్మారావు, కోశాధ్యక్షుడు వెంకటరమణ సభ్యులు రెడ్డి వెంకటేశ్వరరావు, రామానాయుడు, రాధాకృష్ణ, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

కల్లుగీత సమాఖ్య అధ్యక్షుడు కోళ్ల ఈశ్వరప్రసాద్‌ను సన్మానిస్తున్న తెలుగు సంఘం ప్రముఖులు

EENADU Classifieds

PROFESSIONAL SERVICES

VAASTU

ఇల్లు, ఆఫీస్, స్థలాలకు వాస్తు సరిచేసుకోండి. వాస్తు సిద్ధాంతి డా॥ కుంచాల హనుమంతరావు గారు బెంగుళూరులో 4 రోజులు మాత్రమే ఉంటారు. సం॥ 9246624248

JOBS

హైదరాబాద్‌లో పనికి వంటమాస్టర్ ఫ్యామిలీ (భార్యభర్త) జీ: 35 వేలు. కిచెన్ హెల్పర్స్ ఫ్యామిలీ (భార్యభర్త) జీ: 26 వేలు. కావలెను. రూం, మీల్స్ ఫ్రీ. © 9493931224, 7386951320.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

బళ్ళారి : 9121167525

బెంగుళూరు : 9121167527

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

గాంధీనగర్‌లో ఘనంగా లక్ష దీపోత్సవం

గాంధీనగర్ (సింధనూరు), న్యూస్‌టుడే: కార్తీక అమావాస్యను పురస్కరించుకుని సింధనూరు తాలూకా గాంధీనగర్‌లోని ప్రసిద్ధ శివ పంచాయతన క్షేత్రం గురువారం ఓం నమశ్శివాయ మంత్రంతో మారుమోగింది. ఏటా సంప్రదాయంగా ఆచరించే లక్ష దీపోత్సవంతో గురువారం రాత్రి క్యాంపు మొత్తం దీప కాంతులతో మెరిసిపోయింది. సింధనూరుతో పాటు పక్క తాలూకాల భక్తులు కూడా తరలిరావడంతో సాయంత్రానికే ఆలయ ప్రాంగణం జనంతో కిటకిటలాడింది. ఆలయం ఆవరణం అంతా వివిధ రకాల ముగ్గులు, దేవతల బొమ్మలు రంగవల్లులుగా వేసి దీపాలు అమర్చారు. సాయంత్రం అర్చకస్వాములు ఆకాశదీపం పూజలు ముగించి సామూహిక దీపోత్సవానికి తెరలేపారు. కొప్పళ ఎంపీ రాజశేఖర్ హిట్నాళ్, ఆలయ సమితి అధ్యక్షుడు ముళ్లపూడి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్ శివాలయంలో దీపోత్సవ శోభ

అర్ధనారీశ్వరునిగా ఆది దేవుడు

తెలిసినోడిలా నమ్మిస్తాడు.. నకిలీ బంగారం అంటగడతాడు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: నకిలీ బంగారం అంటగట్టి రూ.12 లక్షలు కొల్లగొట్టిన కేసులో ప్రధాన నిందితుడిని తెలంగాణం రాష్ట్రం నల్గొండ జిల్లా మిర్యాలగూడ రెండో పట్టణ, నల్గొండ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. మిర్యాలగూడలో గురువారం డీఎస్పీ రాజశేఖర్‌రాజు కేసు వివరాలు వెల్లడించారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో కర్ణాటకలోని బళ్లారి జిల్లాకు చెందిన గోవిందప్ప కొంత మందితో పలు బృందాలను ఏర్పాటు చేసి పలు ప్రాంతాల్లో దుకాణాల బోర్డులపై ఉన్న ఫోన్ నంబర్లకు ఫోన్ చేసి తెలిసిన వారి లాగా మాట కలిపి నమ్మిస్తున్నాడు. అనంతరం నకిలీ బంగారం అంటగట్టి రూ.లక్షలతో ఉడాయిస్తుంటాడు.

● ఈ క్రమంలో జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన కారపు శ్యామ్‌సుందర్‌ను పట్టణ పరిధిలో ఇదే విధంగా మోసగించి నకిలీ బంగారు బిళ్లలు అంటగట్టి రూ.12 లక్షలు కొల్లగొట్టారు. బాధితుడి ఫిర్యాదుతో రెండో పట్టణ సీఐ సోమనర్సయ్య, నల్గొండ సీసీఎస్ సీఐలు జితేందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డితో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో పట్టణంలోని బైపాస్ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా కర్ణాటక రిజిస్ట్రేషన్ నంబర్ గల కారులో వెళ్తున్న వ్యక్తిని అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించగా నకిలీ బంగారం నిందితుడిగా తేలింది. అతడిని అదుపులోకి తీసుకుని మిగిలిన నిందితులు మహేష్, లోహిత్, నాగప్ప, ప్రసన్న గంగప్ప కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. నిందితుడి నుంచి రూ.5లక్షల నగదు, 200 గ్రాముల నకిలీ బంగారు నాణేలు, రూ.7లక్షల విలువ చేసే కారు, చరవాణి స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కురుగోడు(బళ్లారి), న్యూస్‌టుడే: అంతర్జాలం ఉపయోగించే విద్యార్థులు, యువతీ, యువకులు జాగ్రత్తగా ఉండాలి. సమాజంలో సైబర్ నేరాలు పెద్ద సవాల్‌గా మారాయి. దీనిపై అవగాహన పెంచుకోవాలని అధ్యాపకుడు ఎం.రిషికేశ విద్యార్థులకు సూచించారు. కురుగోడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రోజురోజుకు సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. సైబర్ దొంగలు అమాయక ప్రజల బ్యాంకుల ఖాతాల నుంచి నగదును దోచుకుంటున్నారని విచారం వ్యక్తం చేశారు. గుర్తుతెలియని నంబర్ల నుంచి ఫోన్ చేసి మీ వ్యక్తిగత సమాచారం కోరితే పూర్తిగా తిరస్కరించాలన్నారు. బ్యాంకుల నుంచి ఫోన్ చేస్తున్నాం. మీ చరవాణికి వచ్చిన ఓటీపీ చెప్పాలని కోరితే ఇవ్వకండని సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రధానాచార్యురాలు శాంతల సాంకేతిక పరిజ్ఞానం, సామాజిక మాధ్యమాల వినియోగంపై వివరించారు. అధ్యాపకులు రుద్రముని శాస్త్రి, ప్రసూనాంబ, మధుసూదన్, మురళీ, శంకరగౌడ, శశికాంత్, వీరలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధ్యాపకుడు రిషికేశ, ప్రధానాచార్యురాలు శాంతల, తదితరులు

15 గొర్రెలను పొట్టన పెట్టుకున్న చోదకుడు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి-బెంగళూరు జాతీయ రహదారిని దాటుతున్న గొర్రెల మందపై వేగంగా కారు దూసుకెళ్లడంతో 15 గొర్రెలు మృతిచెందగా ఐదు గొర్రెలు గాయపడిన ఘటన గురువారం మధ్యాహ్నం బీజీ కెరె సమీపంలో జరిగింది. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో బీజీ కెరె (బొమ్మనగుండ కెరె) గ్రామం సమీపంలో ఉన్న వీరభద్రప్పప్ప తోటలో నీటిని తాగడానికి గొర్రెల మందను రోడ్డును దాటిస్తున్న సమయంలో బళ్లారి నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న కారు బలంగా ఢీకొంది. ఈ ఘటనలో 15 గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందగా కొన్ని జీవాలు తీవ్రంగా గాయపడ్డాయి. గొర్రెల మందను ఢీకొన్న ఒత్తిడికి కారు ముందు ఉన్న అయిల్ ట్యాంకర్ లీకేజీ అయి రోడ్డుపై పరుగులు తీసింది. ఓ గొర్రె కారు ముందు ఇరుక్కుపోయింది. రోడ్డుపై గొర్రెలు విడివిడిగా పడిపోయాయి. ఈ ప్రమాదంలో చిక్కి రూ.50వేలతో కొనుగోలు చేసిన పొట్టేలు మృతిచెందింది. ప్రమాదం జరిగిన వెంటనే మిగిలిన గొర్రెలు సమీపంలోని తోటల్లో పరుగులు తీశాయి. హైవే పెట్రోలింగ్ వాహనంలో ఉన్న సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. తళుకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కారు ఢీకొనడంతో రోడ్డుపై చెల్లాచెదురుగా పడిన గొర్రెల కళేబరాలు

శ్రమ దోపిడీకి గురవుతున్న గని కార్మికులు

బళ్లారి, న్యూస్‌టుడే: గని కార్మికులు తమ శ్రమతో సంపదను సృష్టిస్తున్నారు. ప్రభుత్వాలు, గనుల లీజుదారులు రూ.కోట్లు లాభాలు గడిస్తున్నా కార్మికులు పరిస్థితి చాలా దయనీయంగా ఉందని ఏఐయూటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సోమశేఖర్ ఆరోపించారు. ఏఐయూటీయూసీ ఆధ్వర్యంలో గురువారం సండూరులో ఏర్పాటు చేసిన గని కార్మికుల సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. గనుల కంపెనీలు కార్మికులను బానిసలుగా చూస్తున్నాయని ధ్వజమెత్తారు. ఎన్ఎండీసీ కేంద్ర ప్రభుత్వ సంస్థ అయినా. .కార్మికులను గుత్తేదారు పద్ధతిలో తీసుకుని మోసం చేస్తున్నాయని ఆరోపించారు. ఎన్ఎండీసీ సంస్థ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడం లేదని, మరోవైపు భూమిని కోల్పోయిన, ఆరోగ్యం క్షీణించిన కుటుంబాలకు శాశ్వత ఉపాధి కల్పించడం లేదన్నారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకుని రావాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల ప్రయోజనాలను పట్టించుకోవడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను అణచివేస్తున్నాయి. వారి గొంతు నొక్కడానికి ప్రయత్నాలు చేస్తున్నారని తీవ్రంగా దుయ్యబట్టారు. గని కార్మికులు ఐకమత్యంగా నిలిచి.. తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్ యాదగిరి మాట్లాడుతూ ప్రభుత్వాలు, యజమానులు కార్మికులు ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి కుతంత్రాలను ఉపయోగిస్తున్నారు. కులం, మతం, భాష, ప్రాంతం పేరుతో నీచ రాజకీయాలు చేస్తూ కార్మికుల పోరాటాన్ని దారి మళ్లించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. కార్మికుల హక్కుల కోసం నిరంతరం ఐకమత్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి డా.ప్రమోద్, సభ్యులు సోమశేఖర్‌గౌడ, దేవదాస్, హులిగేష్, సంతోష్, బాబు, అంబరీష్, మంజునాథ్, కొట్రేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శనగా వస్తున్న గని కార్మికులు

(c) eenadu

బళ్లారి

రాజ్యాంగంపై అవగాహన అవసరం

రాజ్యాంగాన్ని పఠనం చేస్తున్న ప్రధాన ఆచార్యులు, అధ్యాపకులు, విద్యార్థులు

బళ్లారి, న్యూస్‌టుడే: విద్యార్థులు రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవడానికి నిత్యం రాజ్యాంగ పఠన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రధానాచార్యుడు ప్రహ్లాదచౌదరి తెలిపారు. బళ్లారి ప్రభుత్వ సరళాదేవి సతీశ్చంద్ర అగరవాల్ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ పఠనం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నిత్యం కళాశాల ప్రారంభం సమయంలో విద్యార్థులు రాజ్యాంగ పఠనం చేసిన తర్వాత తరగతులకు వెళ్లాలన్నారు. రాజ్యాంగం విశిష్టతను తెలుసుకోవడానికి కృషి చేయాలన్నారు. అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా టిప్పుసుల్తాన్ జయంతి

చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

సిరివార, (మాన్వి) : టిప్పుసుల్తాన్ జయంతి సందర్భంగా గురువారం పట్టణంలోని టిప్పుసుల్తాన్ కూడలి వద్ద నామఫలకానికి పూజలు చేసి నివాళులర్పించారు. పట్టణ పంచాయతీ అధ్యక్షుడు వై.భూపనగౌడ, సభ్యుడు రాధాకృష్ణనాయక్, వివిధ సంఘాల సంచాలకులు మాట్లాడారు. టిప్పుసుల్తాన్ జయంతిని రాజకీయం చేయటం, ఆయన్ని ఓ వర్గానికి పరిమితం చేయటం దురదృష్టకరమన్నారు. ఉపాధ్యక్షురాలు లక్ష్మీఆదెప్ప, ఎస్ఐ వెంకటేశ్‌నాయక్, మౌలాసాబ్, ఎం.డి.హుసేన్, బందేనవాజ్, మహ్మద్ హుసేన్, చన్నబసవ గడ్ల, మహిబూబ్, ఫకీరప్ప తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో విజయ'నగార'

వాలీబాల్ పోటీల్లో విజేతగా నిలిచిన విజయనగర కళాశాల జట్టు

హొసపేటె, న్యూస్‌టుడే: క్రీడాపోటీల్లో రాణిస్తే ఉత్తమ భవిష్యత్తు మీ సొంతమని హొసపేటె డీఎస్పీ డాక్టర్ మంజునాథ తళవార్ పేర్కొన్నారు. కమలాపురలో ఉన్న హంపీ విరూపాక్షేశ్వర డిగ్రీ కళాశాల, మదకరి నాయక విద్యాసంస్థలు సంయుక్తంగా గురువారం ఏర్పాటు చేసిన అంతర్ కళాశాలల మహిళల వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ క్రీడాకోటా ఉందని గుర్తు చేశారు. పోలీస్ శాఖలో క్రీడాకారులకు మంచి అవకాశాలు ఉన్నాయి, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సంఘ సేవకురాలు రశ్మీ హిట్నాళు, కళాశాల ప్రధానాచార్య బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు. 15 జట్లు పాల్గొనగా, విజయనగర కళాశాల ప్రథమ, మాతా డిగ్రీ కళాశాల ద్వితీయ స్థానాల్లో నిలిచాయి.

గనినాడు జీన్స్‌కు మంచి రోజులు

రూ.22 కోట్ల సీఈటీపీ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

బళ్లారి, న్యూస్‌టుడే: స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటిష్ పాలన నుంచే బళ్లారి జీన్స్ దుస్తుల పరిశ్రమ ఏర్పాటైన చరిత్ర ఉంది. అంతటి ఘనకీర్తి గల ఈ పరిశ్రమను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సీఈటీపీ (వ్యర్థనీరు శుద్ధీకరణ ఘటకం) నిర్మాణానికి పచ్చజెండా ఊపడంతో పరిశ్రమవర్గాల్లో ఆశలు రేకెత్తాయి.

జీన్స్ ఉత్పత్తి

మన దుస్తులకు ప్రత్యేక గుర్తింపు

బళ్లారి జిల్లా అంటే స్టీల్ సిటీనే కాదు..జీన్స్ రాజధాని నగరమని చెప్పవచ్చు. ఈ పరిశ్రమలో 500కుపైగా జీన్స్ రెడీమేడ్ గార్మెంట్ తయారీ యూనిట్లు ఉన్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా 10వేల కుటుంబాలకు ఉపాధి పొందుతున్నారు. ఇక్కడ తయారయ్యే జీన్స్‌కు రాష్ట్రంలోనే కాకుండా దేశ, విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. పరిశ్రమకు జీవనాడి అయిన వాషింగ్ యూనిట్లు నుంచి వెలువడే వ్యర్థ జలాలను శుద్ధి చేయడానికి ప్రత్యేక ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలనే డిమాండ్ దశాబ్దాలుగా నెరవేరలేదు. వ్యర్థ జలాలతో పర్యావరణానికి కలిగే నష్టం కారణంగా ఇటీవల రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు 36 శుద్ధి యూనిట్లను మూసివేయాలని తాఖీదులు జారీ చేసింది. పరిశ్రమకు మరింత ఎదురుదెబ్బ తగిలింది. పరిశ్రమకు శాశ్వత ఉపశమనం కల్పించే లక్ష్యంతో ముఖ్యమంత్రి వెంటనే సాయం అందించి సీఈటీపీ నిర్మాణాన్ని ప్రారంభించాలని సూచించడంతో పరిశ్రమవర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

సీఈటీపీ నిర్మాణానికి కదలిక

బళ్లారి నగర శివారు ప్రాంతంలో మొత్తం 83 శుద్ధి కేంద్రాలు ఉండగా, వాటిలో కరోనా సమయంలో 30 కేంద్రాలు మూతపడ్డాయి. ఇటీవల వ్యర్థాలు, రసాయన మురుగునీరు ప్రకృతి సిద్ధమైన వాగులోకి విడుదల చేయడంతో ఉప లోకాయుక్త ఆదేశాలతో 36 శుద్ధి కేంద్రాలు మూసివేయాలని తాఖీదులు జారీ చేశారు. జిల్లాలో జీన్స్ పరిశ్రమ ప్రశ్నార్థకంగా మారింది. బళ్లారి జీన్స్ పరిశ్రమలు వేర్వేరు రాష్ట్రాలకు తరలించే ఆలోచనలో ఉండటంతో జిల్లా ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ కేఐఏడీబీ నుంచి రూ.11 కోట్లు, కేకేఆర్‌డీబీ నుంచి రూ.11 కోట్లు కలిపి మొత్తం రూ.22 కోట్లతో సీఈటీపీ యూనిట్‌ను నిర్మించాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు.

వాగులోకి వెళ్తున్న రసాయనలతో కూడిన మురుగునీరు

ఏడాదిలో నిర్మాణం పూర్తి

జీన్ పరిశ్రమ పునరుద్ధరణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సీఈటీపీ యూనిట్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.22 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ కేంద్రం నిర్మాణానికి కనీసం ఆరు నెలల్లో డీపీఆర్, టెండర్ ప్రక్రియ పూర్తి చేసి ఏడాదిలో పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకున్నట్లు ఓ అధికారి తెలిపారు. పనులు ప్రారంభిస్తే ఏడాదిలో పూర్తి చేయడానికి అధికారులు సిద్ధమవుతున్నారు.

ముందస్తు జాగ్రత్తలతోనే వ్యాధులు దూరం

శిబిరాన్ని ప్రారంభిస్తున్న జీవనేశ్వరయ్య, తదితరులు

మాన్వి, న్యూస్‌టుడే : వ్యాధులు తీవ్రం కాకనే చికిత్సలు చేయించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కేపీఎస్‌వీఎస్ ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జీవనేశ్వరయ్య సూచించారు. కళాశాల ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మూలవ్యాధి సోకిన వారు బయటికి చెప్పుకోకుండా బాధపడతారని, ఆయుర్వేదం ద్వారా నయం చేసుకోవచ్చని తెలిపారు. 10 రోజుల పాటు శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు శంకరానంద, అంజు, పర్వీన్ కళాశాల ఆసుపత్రి వైద్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హుసేన్ సాబ్ మృతికి సంతాపం

సంతాపసభలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

కంప్లి, న్యూస్‌టుడే: రంగస్థల నటుడు, మిమిక్రీ కళాకారుడు బూదగుంపి హుసేన్ సాబ్ మృతి రంగస్థల రంగానికి తీరని లోటని సాహిత్యసిరి ప్రతిష్ఠాన అధ్యక్షుడు జి.ప్రకాష్ తెలిపారు. కంప్లిలో ప్రతిష్ఠాన గురువారం నిర్వహించిన హుసేన్ సాబ్ సంతాప సభలో ఆయన మాట్లాడారు. హుసేన్ సాబ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన ఆత్మశాంతికి నిమిషం మౌనం పాటించారు. కన్నడ హిత రక్షక సంఘం సైతం సంతాప సభ నిర్వహించింది. జీరు మల్లికార్జున, బూదగుంపి అంబణ్ణ, కె.చంద్రశేఖర్, బంగి దొడ్డ మంజునాథ, హేమయ్య స్వామి, అంబిగర మంజునాథ పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో జ్ఞాన వికాసం

మాట్లాడుతున్న విశ్రాంత ఎస్ఐ మహ్మద్ యూనిస్

సిరుగుప్ప, న్యూస్‌టుడే: గ్రంథాలయాల్లో పుస్తకాలు చదివితే జ్ఞానంతో పాటు వికాసం లభిస్తుందని విశ్రాంత ఎస్ఐ మహ్మద్ యూనిస్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ గ్రంథాలయంలో గ్రంథాలయ సప్తాహను పురస్కరించుకుని గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి ప్రపంచంలో విద్యార్థులు, యువత అంతర్జాలం, వాట్సప్, యూట్యూబ్‌లో సమయం వెళ్లబుచ్చుతూ వారి భవిష్యత్తును పాడుచేసుకుంటున్నారు. వాటిని అవసరం మేరకు వాడుకుంటూ పుస్తక పఠనానికి సమయం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు, పాఠకులు పాల్గొన్నారు.

శ్రీరామనగర్ పాల సంఘానికి ఉత్తమ పురస్కారం

పురస్కారం అందుకున్న పాల సంఘం అధ్యక్షుడు డి.ఆర్.ప్రసాద్ (మధ్యలో వ్యక్తి)

శ్రీరామనగర్, న్యూస్‌టుడే: శ్రీరామనగర్ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం కొప్పళ జిల్లా ఉత్తమ సంఘం పురస్కారానికి ఎంపికైంది. సంఘం అధ్యక్షుడు డి.ఆర్.ప్రసాద్ బుధవారం కొప్పళలో జరిగిన సహకార వారోత్సవ కార్యక్రమంలో పురస్కారాన్ని అందుకున్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న వస్తుప్రదర్శన

హోటల్ భవనంలో వస్తువులను కొనుగోలు చేస్తున్న నగరప్రజలు

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: ముంబయికి చెందిన ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ వస్తుప్రదర్శన నగరప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా నిర్వాహకుడు రమేష్ మాట్లాడుతూ తొలిసారి ముంబయి ఫ్యాషన్ వారి ఉత్పత్తులను నగరంలో ప్రదర్శనలో ఉంచామన్నారు. బ్రాండెడ్ దుస్తులు, బూట్లు, పాదరక్షలు, టీషర్టులు, చొక్కాలు, కుర్తాలు, తదితర వస్తువులు లభిస్తాయన్నారు. నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పలు రకాల దుస్తులపై 70 శాతం వరకు రాయితీ ఇస్తున్నామన్నారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

20-11-2025 (ఉ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1624.08	1630.75
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	2,632	3,850
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	7,232	6,645
నీటి నిల్వ (టి.ఎం.సి)	73.520	96.915

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

నగరాభివృద్ధికి పాటుపడాలి

వాణిజ్య పారిశ్రామిక మండలి అధ్యక్షుడు మంజునాథ్‌ను సత్కరిస్తున్న అయ్యప్ప ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడు జయంతి జయప్రకాష్‌గుప్త, మేయర్ గాదెప్ప, తదితరులు

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: బళ్లారి నగరాభివృద్ధికి తమవంతు సేవలందించాలని శబరి అయ్యప్ప స్వామి దేవస్థాన ట్రస్ట్ అధ్యక్షుడు ప్రముఖ లెక్కపరిశోధకుడు జయంతి జయప్రకాష్ గుప్త పేర్కొన్నారు. రాఘవేంద్ర కాలనీ శబరి అయ్యప్ప స్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన సన్మాన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల మేయర్‌గా ఎన్నికైన గాదెప్ప, వాణిజ్య పారిశ్రామిక మండలి అధ్యక్షుడు అవ్వారు మంజునాథ్, సహకార రత్న పురస్కారం అందుకున్న బళ్లారి అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షుడు వెంకటేశ్‌ను సన్మానించారు. తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించి కీర్తిగడించాలని పిలుపునిచ్చారు. ప్రముఖులు పోలా రాధాకృష్ణ, సంజీవప్రసాద్, సుధాకర్, మనోహర్, మౌలాలి, మనోహర్, తల్లం కిషోర్, వేణుగోపాల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

అర్హులందరికీ గ్యారంటీ పథకాలు

బళ్లారి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇచ్చిన హామీలకు అనుగుణంగా గ్యారంటీ పథకాలను అమలు చేసింది. గ్యారంటీలను ప్రవేశపెట్టి పేదలు, మహిళలకు మద్దతుగా నిలిచిందని నిరూపించారని గ్యారంటీ అనుష్ఠాన అమలు ప్రాధికార అధ్యక్షుడు శ్రీనివాస్‌రావ్ పేర్కొన్నారు. వార్తశాఖ ఆధ్వర్యంలో 2025-26 ఏడాదిలో క్షేత్ర ప్రచారంలో భాగంగా 10 రోజులపాటు తాలూకాలు, గ్రామ పంచాయతీల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్యారంటీలు అమలుపై ఏర్పాటు ప్రచార కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఐదు గ్యారంటీలు పేదల జీవితాల్లో వెలుగు నింపాయి. ప్రజలు ఆర్థికాభివృద్ధి చెందుతున్నారు. సభ్యులు రమణయ్య, సావిత్రి, వీరనగౌడ, హొన్నూరమ్మ, హులిగెమ్మ, మరియమ్మ, బసవరాజ్, భారతి, నాగమ్మ, గవిసిద్ధప్ప, జ్యోతి, రత్నమ్మ పాల్గొన్నారు. హులుగప్ప నేతృత్వంలో కళాకారులు రమేశ్, ఎర్రిస్వామి, వెంకటేశ్, నవీన్, గంగమ్మ, రత్నమ్మ గ్యారంటీలపై వీధి నాటకాలు, జానపద గేయాలతో అవగాహన కల్పించారు.

గ్యారంటీలపై వీధి నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

నాటుకోళ్ల పెంపకం లాభదాయకం

మాట్లాడుతున్న జడ్పీ ఉప కార్యదర్శి శశికాంత శివపూరె, చిత్రంలో అధికారులు, సిబ్బంది, శిబిరానికి హాజరైన మహిళలు

బళ్లారి, న్యూస్‌టుడే: నాటు కోళ్లకు డిమాండ్ ఎక్కువగా ఉంది. మహిళలు ఇంటి వద్దనే ఉంటూ ఆర్థికాభివృద్ధి సాధించడానికి ఈ పరిశ్రమ అనుకూలంగా ఉంటుంది. 13 రోజులు పాటు నిర్వహించే శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీ ఉప కార్యదర్శి శశికాంత శివపూరె సూచించారు. కెనరా బ్యాంకు గ్రామీణ ఉద్యోగ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాటు కోళ్ల పెంపకం శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలు తమ గ్రామాల్లోనే కోళ్ల షెడ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వాలు సాయం చేస్తున్నాయని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కెనరా బ్యాంకు గ్రామీణ స్వ ఉద్యోగ శిక్షణ సంస్థ నిర్దేశకుడు రాజెసాబ్ హెచ్.ఎరిమని, అధికారులు రాజేంద్ర, జడెప్ప, సిద్ధలింగమ్మ, సంతోష్‌కుమార్, పరమేశ పాల్గొన్నారు.

నాలుగేళ్ల పాలనపై ఆత్మవిమర్శ అవసరం

సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న అధ్యక్షుడు రూపేశ్‌కుమార్, కమిషనర్ మన్సూర్ అహ్మద్

హొసపేటె, న్యూస్‌టుడే: తమ నాలుగేళ్ల పాలనపై సభ్యులు ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉందని నగరసభ సభ్యులు రాఘవేంద్ర, హనుమంతప్ప, ఆనంద్ తదితరులు వాపోయారు. తమ అధికార వ్యవధిలో పట్టణ ప్రజల సంక్షేమానికి ఎంతకృషి చేశామో అంచనా చేసుకోవాలన్నారు. మిగిలిన ఏడాదిలో అన్ని వార్డులకు సక్రమంగా తాగునీరు సరఫరా చేయటానికి కృషి చేయాలి, దాని కోసం అధికారులు సహకారం అందివ్వాలని కోరారు. గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన నగరసభ సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు తమ పనితీరుపైనే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికీ పలు వార్డుల్లో మంచినీరు సక్రమంగా సరఫరా కావడంలేదని విచారం వ్యక్తంచేశారు. చాలా పనులు వాయిదా పడుతున్నాయి, సిబ్బంది, అధికారులు ఇంకా మొద్దునిద్ర వీడలేదని చురకలంటించారు. ఇకనైనా మేల్కొని పట్టణ ప్రజల బాగోగులకు పాటుపడదామని సంకల్పం చేశారు. నగరసభ ఆదాయ వనరులను పెంచేందుకు అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. అధ్యక్షుడు రూపేశ్‌కుమార్, ఉపాధ్యక్షుడు జీవరత్నం, కమిషనర్ మన్సూర్ అహ్మద్ పాల్గొన్నారు.

దివ్యాంగులపై నిర్లక్ష్యం వద్దు

కురుగోడు(బళ్లారి), న్యూస్‌టుడే: దివ్యాంగులను నిర్లక్ష్యం చేయొద్దు.. వారు అన్ని రంగాల్లో రాణించే విధంగా వెన్నుతట్టి ప్రోత్సహించాలని సమన్వయ శిక్షణ నోడల్ అధికారి వీరేశ్ తెలిపారు. తాలూకా సిరిగేరి ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సముదాయం శిక్షణను వ్యాప్తి చేయాలి. దివ్యాంగులు కేవలం శరీరానికి మాత్రమే మనసుకు కాదు. హెచ్ఐవీ పిల్లలను పాఠశాలకు దూరంగా ఉంచడం సరికాదు. వారిని విద్యార్థులతో కలిసి శిక్షణ ఇవ్వాలన్నారు. విద్యార్థులు దైహిక, మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. శిక్షణ సమన్వయ అధికారి మధుసూదన్ శిక్షణ ప్రాముఖ్యత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు బాధ్యతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డా. మల్లికార్జున పూజారి, గోవిందరాజు, ఎస్‌ఎండీసీ అధ్యక్షుడు శ్రీరామ, శివకుమార్ పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శిక్షణ సమన్వయశాఖాధికారి వీరేశ్, చిత్రంలో మధుసూదన్, తదితరులు

24,25 తేదీల్లో మంత్రి జార్జ్ పర్యటన

హొసపేటె, న్యూస్‌టుడే: ఇంధన శాఖ మంత్రి కె.జె.జార్జ్ 24, 25 తేదీల్లో హొసపేటెలో పర్యటిస్తున్నారని మంత్రి వ్యక్తిగత కార్యదర్శి సతీశ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 24న సాయంత్రం ఆయన హొసపేటె చేరుకుని బసచేస్తారు. మరుసటి రోజు ఉదయం డీసీసీ కార్యాలయాన్ని సందర్శించి జిల్లాస్థాయి నాయకులతో చర్చలు జరుపుతారు. హొసపేటె, నాగేనహళ్లిలో ఏర్పాటు చేయనున్న 110 కేవీ విద్యుత్తు వితరణ కేంద్రాల నిర్మాణానికి భూమిపూజ, బైలువద్దిగెరెలో 110 కేవీ విద్యుత్తు వితరణ కేంద్రం ప్రారంభోత్సవాల్లో మంత్రి పాల్గొంటారు. మధ్యాహ్నం ఇంధన శాఖ ప్రగతి సమీక్ష సమావేశంలో పాల్గొంటారని వివరించారు.

ఐఎన్‌టీయూసీ జిల్లాధ్యక్షుడిగా రెడ్డి వెంకట సత్యనారాయణ

రెడ్డి వెంకట సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పార్టీ నాయకులు

శ్రీరామనగర్, న్యూస్‌టుడే: ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కొప్పళ జిల్లా అధ్యక్షుడిగా కారటగి తాలూకా ముష్టూరు క్యాంపు కాంగ్రెస్ నాయకుడు రెడ్డి వెంకట సత్యనారాయణ (రెడ్డి సతీష్) నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షులు డి.లక్ష్మీ వెంకటేశ్ ఆయనను బుధవారం బెంగళూరులో జిల్లా సమితి అధ్యక్షుడిగా నియమించారు. కారటగిలో గురువారం వెంకట సత్యనారాయణ విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ అధిష్ఠానం ఈ బాధ్యతలు అప్పగించింది. అందరి సహకారంతో జిల్లాలో పార్టీ సంక్షేమానికి శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు.

ప్రభుత్వ బడులను మూసేస్తే ఉద్యమమే

తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టిన ఏఐడీఎస్ఓ కార్యకర్తలు

హొసపేటె, న్యూస్‌టుడే: విద్యార్థుల సంఖ్య తగ్గిందని రాష్ట్రంలో సుమారు 25 వేల ప్రభుత్వ బడులను మూసివేయాలన్న నిర్ణయం అసమంజసమని అఖిల భారత ప్రజాస్వామ్య విద్యార్థి సంఘటన (ఏఐడీఎస్ఓ) కార్యకర్తలు తప్పుబట్టారు. సర్కారు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గురువారం సంఘటన కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆందోళనకు నేతృత్వం వహించిన జిల్లా సంచాలకుడు రవికిరణ్ తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెరగటానికి చర్యలు తీసుకోవడం మానేసి, వాటిని మూసివేస్తామని వెల్లడించడం దారుణమన్నారు. ఉన్న పాఠశాలలను బలపరచకుండా కొత్తగా కర్ణాటక పబ్లిక్ పాఠశాలలను ప్రారంభిస్తామని సంబంధించిన మంత్రి మధుబంగారప్ప పేర్కొనడం హాస్యాస్పదమన్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

ఉత్సాహంగా గ్రామీణ కృషి ఉత్సవం

సిరివార, (మాన్వి) : రాయచూరు వ్యవసాయ వర్సిటీ ఆధ్వర్యంలో మల్లట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల మైదానంలో రైతులు, విద్యార్థులకు కార్యానుభవ శిబిరం, గ్రామీణ కృషి ఉత్సవాన్ని నిర్వహించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు రూపొందించిన వివిధ పరికరాలు, వస్తువులు ఉత్సవంలో ఆకర్షణగా నిలిచాయి. జిల్లా వ్యవసాయ శాఖ డైరెక్టర్ ప్రకాష్ చౌహాణ్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ రైతులు సేంద్రీయ సాగుపై ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. క్రిమిసంహారకాలు, రసాయన ఎరువులు లేని సాగు అన్ని విధాలా మేలు చేస్తుందన్నారు. మాన్వి తాలూకా ఏడీఏ గురునాథ్, యంకణ్ణ యాదవ్, రైతు సంపర్క కేంద్రం సంచాలకుడు మారుతి, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

సహకార సంఘాలతో రైతులకు ప్రయోజనాలు

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: సహకార సంఘాలంటే నేడు రుణాలను అందించే సంఘాలుగా కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు అవసరమైన పరికరాలు, వ్యవసాయ యంత్రాలను అందుబాటులో ఉంచాలని లోక్‌సభ సభ్యుడు గోవిందకారజోళ పేర్కొన్నారు. గురువారం హొళల్కెరలో 72వ అఖిల భారత సహకార వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులకు సహకార సంఘాల ద్వారా రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు అందిస్తే వారికి చౌకగా లభిస్తాయన్నారు. వ్యవసాయ పెట్టుబడులు తగ్గి లాభదాయకంగా మారుతుందన్నారు. ముఖ్య అతిథి హాజరైన ఎమ్మెల్యే ఎం.చంద్రప్ప మాట్లాడుతూ యువకులు, మహిళలు, తదితర వర్గాల వారు తమ అవసరాలను తీర్చుకోవడానికి ప్రత్యేకంగా సహకార సంఘాలను ఏర్పాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గిరీశ్, తిప్పేస్వామి, రవికుమార్ పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపీ గోవిందకారజోళ, ఎమ్మెల్యే చంద్రప్ప తదితరులు

నేత్రపర్వంగా.. కార్తిక దీపోత్సవం

నాగేశ్వర ఆలయంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సిరుగుప్ప: దీపోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: నాగేశ్వర ఆలయంలో అమావాస్య కార్తికం చివరిరోజు గురువారం రాత్రి శివయ్యకు అభిషేకాలు, దీపోత్సవ పూజలు నేత్రపర్వంగా జరిపారు. ఆలయం చుట్టూ దీపాలు వెలిగించారు. మహిళలు రంగవల్లులతో అలంకరించి దీపాలు వెలిగించారు. ఆలయ పండితుడు శివశంకరభట్ కార్తిక పురాణం చదివి విన్పించారు. భక్తులందరికీ ప్రసాద వితరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శివనామస్మరణ చేశారు. ఆలయ ప్రాంగణం ఓం నమఃశివాయ పంచాక్షరి నామపఠనంతో మార్మోగిపోయింది.

సిరుగుప్ప: అలంకరణలో శంభులింగేశ్వర స్వామి

సిరుగుప్ప, న్యూస్‌టుడే: కార్తికమాస చివరి రోజు దీపోత్సవాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. చివరి రోజును పురస్కరించుకుని బుధవారం రాత్రి కార్తిక దీపోత్సవాన్ని నిర్వహించారు. శంభులింగేశ్వర ఆలయంలో స్వామి వారికి పూజలు, అభిషేకాలు నిర్వహించి రాత్రికి 11,111 దీపోత్సవ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు చేపట్టారు. పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో నెల రోజుల నుంచి లోకకల్యాణార్థం నిత్యం 5,100 దీపాలు వెలిగించారు.

సిరుగుప్ప: మనిషిలో పేరుకుపోయిన అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని నింపేది కార్తిక దీపోత్సవమని కొట్టూరు మఠం మఠాధిపతి జగద్గురు బసవలింగ మహాస్వామి పేర్కొన్నారు. సిరిగేరి గ్రామంలో విరక్తి మఠంలో కార్తికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సాన్నిధ్యం వహించి ఆయన ఆశీర్వచనం చేస్తూ దీపాలు వెలిగించేది కార్తికమాసం ఉద్దేశం అయినా దీపం శాశ్వతం కాదు, చీకటిలో జ్యోతిని వెలిగిస్తే ప్రమిదలో నూనె ఉన్నంత వరకు వెలుగుతుందన్నారు. అంటే కవి చెప్పినట్లు.. దీపం వెలిగించి చీకటిని పారదోలతాం అంటే ఆ సమయంలో ఒకరిని ఒకరు చూసుకుంటామన్నారు. అయితే దీని ప్రధాన ఉద్దేశం మనలోని అజ్ఞానాన్ని తొలగించుకొని, జ్ఞానం నింపుకోవాలని అర్థమన్నారు. గ్రామ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

ఆశీర్వచనం చేస్తున్న జగద్గురు కొట్టూరు బసవలింగ మహాస్వామి

(c) eenadu

ధర్మ వీధుల్లో భక్త తాండవం

శ్రీమంజునాథుడి కోవెల ముంగిట సందడి

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : శ్రీమంజునాథుడి దివ్య క్షేత్రం.. ధర్మస్థలలో కార్తిక మాస లక్షదీపోత్సవాల సందడి గురువారం తెల్లవారుజామున పతాక స్థాయికి చేరింది. బుధవారం రాత్రి మొదలైన కార్తిక వేడుకలు.. సుమారు 12 గంటల సేపు కొనసాగాయి. శ్రీమంజునాథుడి భవ్య ఊరేగింపుతో వేడుకలకు స్వస్తి పలికారు. దేశ, విదేశాల నుంచి కదలివచ్చిన లక్షలాది భక్తులు దివ్యమూర్తిని దర్శించుకుని, అన్నప్రసాదం స్వీకరించారు. వేలాది మంది భక్తులు పాదయాత్రగా శ్రీక్షేత్రానికి చేరుకున్నారు. ధర్మస్థల, ఉజిరే, బెళ్తంగడి తదితర ప్రాంతాలన్నీ విద్యుద్దీప కాంతులతో ఇంద్ర నగర వైభవాన్ని కళ్లముందు సాక్షాత్కరింప చేశాయి. ధర్మాధికారి డాక్టర్ వీరేంద్రహెగ్గడే ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేర్వేరు రంగాల కళాకారులు 6,849 నిర్వహించిన సంగీత, వాద్య, జానపద ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బెంగళూరుకు చెందిన రాము, రమేష్ అనే పూల వ్యాపారులు తమ బృందంతో కలిసి.. ఆలయాన్ని వందలాది జాతుల పూలు- పండ్లతో అలంకరించి మన్ననలు పొందారు. జాతీయ దారులు, నగర మార్గాలు దీప కాంతులతో కొత్త అందాలను సంతరించుకున్నాయి. సాహిత్య, సర్వధర్మ సమ్మేళనాలూ ముగిసినట్లు నిర్వాహకులు ప్రకటించారు.

షహనాయి వాద్య కళాకారుల సంగీత స్వర లయలు..

గౌరీమారుకట్టె ఉత్సవం

గురువారం తెల్లవారుజామున దేవదేవుడి ఊరేగింపు

అమ్మోరికి వేరుసె'నగ'

బెంగళూరు నగరంలోని బనశంకరి అమ్మవారికి వేరుసెనక్కాయలతో గురువారం ప్రత్యేకంగా అలంకరించారు. బసవనగుడిలో నిర్వహిస్తున్న వేరుసెనగ జాతర నుంచి.. భక్తులు తీసుకువచ్చిన కాయలతో మూడు గంటలు శ్రమించి, ఈ అలంకరణ పూర్తి చేశామని ఆలయ నిర్వహణ సమితి ప్రతినిధులు తెలిపారు. కార్తిక మాసం చివరి రోజు సందర్భంగా అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

-న్యూస్‌టుడే, శివాజీనగర

వేదికపై ఉడుపి సర్క్యూట్ ప్రతినిధులు

'ఉడుపి సర్క్యూట్'కు రూపం

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : బెంగళూరు టెక్ సదస్సులో ఒన్‌ట్యాక్ సంస్థ ప్రతినిధులు ఉడుపి సర్క్యూట్‌ను ప్రకటించారు. పర్యాటకం, కళలు, సంస్కృతిని ప్రతిబింబించేలా ఈ సర్క్యూట్‌ను తీర్చిదిద్దామని విజన్ గ్రూపులో అంకుర పరిశ్రమల విభాగం అధ్యక్షుడు ప్రశాంత్ ప్రకాశ్ తెలిపారు. పర్యాటక శాఖ కార్యదర్శి డాక్టర్ త్రిలోక్‌చంద్‌తో కలిసి దీన్ని ప్రారంభించారు. ఎక్కువ మంది పర్యాటకులను, కళాకారులను ఉడుపికి ఆహ్వానించడం, అక్కడి సదుపాయాలను తెలియజేయడం, ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు ఈ సర్క్యూట్‌ను వినియోగించుకోవాలని ప్రశాంత్ ప్రకాశ్ పిలుపునిచ్చారు. సర్క్యూట్‌కు సహ క్యూరేటర్ ప్రతిమా మనోహర్, వివిధ సంస్థల ప్రతినిధులు, పర్యాటక శాఖ అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వేషం తీసేసి.. ఊపిరి వదిలేసి..

ఉడుపి, న్యూస్‌టుడే : ఉడుపి జిల్లా మందార్తి గ్రామ శివార్లలో నిర్వహిస్తున్న కళామేళాలో మహిషాసురుడి పాత్ర పోషించిన యక్షగాన కళాకారుడు ఈశ్వరగౌడ (65) గుండెపోటుతో మరణించారు. బుధవారం రాత్రి మహిషాసురుని పాత్రను ముగించి, మేకప్ తొలగించుకునేందుకు తనకు కేటాయించిన గదికి చేరుకుని.. ఛాతీ పట్టుకుని పడిపోయిన ఆయనను చికిత్స కోసం ఉడుపిలోని ఆసుపత్రికి తరలించేలోగా కన్నుమూశారు. ఆయన మృతికి యక్షగాన కళాకారులు, కళాభిమానులు సంతాపాన్ని ప్రకటించారు. కుటుంబ సభ్యులు, కళాకారుల మధ్య ఆయన భౌతికకాయానికి గురువారం అంత్యక్రియలు నిర్వహించారు.

మహిషాసుర పాత్రలో ఈశ్వరగౌడ

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

బీన్స్-	95
క్యారెట్-	90
బీరకాయలు-	65
క్యాబేజి-	35
క్యాలీఫ్లవర్(ఒక్కోటి)-	30
సొరకాయ-	50
దొండకాయలు-	45
పొట్లకాయ-	45
పచ్చి మిరపకాయలు-	95
కాకర కాయలు-	55
టమాటా(నాటు)-	25
టమాటా(సాధారణ)-	20
గుమ్మడి-	35
ఆలుగడ్డ-	35
ఉల్లి(మేలురకం)-	25
ఉల్లి(సాధారణ)-	20
వెల్లుల్లి-	160
సాంబారు ఉల్లి-	165
బీట్‌రూట్-	55
వంకాయలు-	65
బెండకాయలు-	55
ముల్లంగి-	55
నిమ్మకాయ-	140

పండ్లు, ఫలాలు ధరలు

వాషింగ్టన్ ఆపిల్-	385
సిమ్లా ఆపిల్-	155
గ్రీన్ ఆపిల్-	295
అరటి కాయలు-	35
సపోటా-	65
ఫైనాపిల్-	65
బొప్పాయి-	30
ఆరంజి-	70
బత్తాయి-	65

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

EENADU Classifieds

PROFESSIONAL SERVICES

VAASTU

ఇల్లు, ఆఫీస్, స్థలాలకు వాస్తు సరిచేసుకోండి. వాస్తు సిద్ధాంతి డా|| బండారు హనుమంతరావు గారు బెంగళూరులో 4 రోజులు మాత్రమే ఉంటారు. సెల్: 9246624248

JOBS

హైదరాబాద్‌లో పనికి వంటమాస్టర్ ఫ్యామిలీ (భార్యభర్త) జీ: 35 వేలు. క్లీనింగ్ హెల్పర్ ఫ్యామిలీ (భార్యభర్త) జీ: 26 వేలు. వసతి, భోజనం ఉచితం. ✆ 9493931224, 7386951320.

గమనిక

[illegible]

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇప్పుడు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి.

బళ్లారి : 9121167525

బెంగళూరు : 9121167527

19 ఏళ్లకు నిందితుడి ఆటకట్టు

మంగళూరు, న్యూస్‌టుడే : ఒకప్పటి సంఘ పరివార నాయకుడు సుఖానంద శెట్టి హంతకులకు ఆశ్రయం ఇచ్చిన ఆరోపణలను ఎదుర్కొంటున్న అబ్దుల్ సలాం అడ్డూరు (47)ను సూరత్కల్ ఠాణా పోలీసులు 19 ఏళ్ల అనంతరం గురువారం అరెస్టు చేశారు. బంట్వాళ తాలూకా అడ్డూరు టిబెట్ కాలనీకి చెందిన నిందితుడు బజ్పె సమీపంలోని కిన్నిపదవిలో ఉంటున్నాడు. సుఖానంద శెట్టిని హత్య చేసిన హంతకులకు తన ఇంట్లో ఆశ్రయం ఇవ్వడంతో పాటు, వారికి తన వాహనంలో కేరళలోని కాసరగోడు వరకు తీసుకువెళ్లి విడిచి పెట్టి వచ్చాడనేది అభియోగం. తన విషయాన్ని పోలీసులు గుర్తించారని, అప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతూ, కిన్నపదవిలో స్థిరపడ్డాడు. అబ్దుల్ సలాంపై పోలీసులు ఇప్పటికే రౌడీషీటు తెరిచారు.

72 గంటల పని వేళలే మేలు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : ఉద్యోగులు వారానికి ఆరు రోజుల్లో 72 గంటలు పని చేయాలని ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి చేసిన వ్యాఖ్యలను పారిశ్రామికవేత్త మోహన్‌దాస్ పాయ్ సమర్థించారు. ఈ సూచన సాధారణ ఉద్యోగులకు వర్తించదని, ముందంజలోకి రావాలని కోరుకునే నిపుణులైన ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు, వినూత్న ఆవిష్కర్తలకు మాత్రమే వర్తిస్తుందని పేర్కొన్నారు. ప్రపంచంలోని నైపుణ్యంతో పోటీ పడాలంటే ఆవిష్కర్తలు పనిపై అంకితభావం చూపించడం తప్పనిసరి అని స్పష్టం చేశారు.

'ఆ కేసుల రద్దు కుదరదు'

కలబురగి, న్యూస్‌టుడే : చిత్తాపురలో 2019లో అక్రమంగా గోవులను తరలిస్తూ దొరికిపోయిన 13 మందిపై నమోదైన కేసులను రద్దు చేస్తూ ఇదివరకటి మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. ప్రభుత్వ ఆదేశాలను ప్రశ్నిస్తూ న్యాయవాది గిరీశ్ భరద్వాజ కలబురగి ఉన్నత న్యాయస్థానం పీఠంలో వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. అక్రమంగా గోవులు తరలించేందుకు వినియోగించిన వాహనాన్ని మళ్లీ జప్తు చేయాలని, నిందితులపై కేసు కొనసాగించాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది.

శునకాలు కాటేస్తే పరిహారం

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే : వీధి కుక్క కరచి, చికిత్స పొందుతూ మరణిస్తే బాధితుల కుటుంబానికి రూ.5 లక్షల పరిహారాన్ని ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. గాయమైతే చికిత్స కోసం రూ.5 వేలు విడుదల చేయాలని నగరాభివృద్ధి శాఖ నిర్ణయించింది. ఇప్పటి వరకు ఉద్యాననగరిలో వీధి కుక్కల దాడిలో గాయపడిన 3,500 మందికి పరిహారం ఇచ్చామని ఆ శాఖ అధికారులు వివరించారు.

ఆధార్ డేటాకు నిబంధనల వర్తింపు

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : మరణించిన వ్యక్తి వేలి ముద్రలను ఉపయోగించి, ఆధార్ డేటాను సేకరించుకునేందుకు అవకాశం లేదని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. దీనికి సంబంధించి బ్యాటరాయనపుర ఠాణా పోలీసులు వేసుకున్న అర్జీని జస్టిస్ సూరజ్ గోవిందరాజ్ తోసిపుచ్చారు. ధ్రువీకరణకు వ్యక్తి జీవించి ఉన్నప్పుడు ఇచ్చే డేటా, వేలిముద్రలే కీలకం అవుతాయని న్యాయమూర్తి స్పష్టం చేసి అర్జీని తోసిపుచ్చారు.

'స్థానిక' సమరంపై విచారణ

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే : రాష్ట్రంలో 70కు పైగా స్థానిక సంస్థలకు ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ప్రమాణపత్రాన్ని దాఖలు చేస్తే దానికి అనుగుణంగా ప్రతి వారం విచారణ చేపడతామని జస్టిస్ సునీల్ దత్ యాదవ్ పేర్కొన్నారు. అవధి ముగిసిన స్థానిక సంస్థలకు ఎన్నికలను నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం లేదని వచ్చిన అర్జీలను ఆయన విచారణకు స్వీకరించారు. కొన్ని చోట్ల వార్డుల పునర్విభజన చేయవలసి ఉందని, దీని ప్రగతికి సంబంధించిన వివరాలను అందించేందుకు పది రోజులు గడువు ఇవ్వాలని అదనపు అడ్వకేట్ జనరల్ ప్రతిమా హొన్నాపుర చేసుకున్న విన్నపాన్ని పరిగణనలోకి తీసుకుని తదుపరి విచారణను న్యాయమూర్తి వాయిదా వేశారు.

దర్శన్ కుమారుడికి శివణ్ణ పరామర్శ

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : హత్య కేసులో నటుడు దర్శన్ గత రెండు నెలల నుంచి కారాగారంలో ఉన్నాడు. అతని కుమారుడు వినీశ్‌ను హ్యాట్రిక్ హీరో శివరాజ్ కుమార్ తాజాగా కలిసి మాట్లాడారు. ఆ యువకుడికి ధైర్యం చెప్పారు. కుంబళగోడులోని మైదానంలో తాను నటిస్తున్న 'డ్యాడ్' సినిమా చిత్రీకరణకు శివరాజ్ వచ్చారు. చిత్రీకరణ చూసేందుకు వచ్చిన వినీశ్‌ను దగ్గరకు పిలిపించుకుని, ఎలా ఉన్నావు, ఏం చదువుతున్నావు, మీ అమ్మగారు బాగున్నారా, అధైర్య పడకు, మంచే జరుగుతుందని చక్కగా మాట్లాడి పంపించారు. ఆ వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

పోలీస్ అధికారి తీరుపై నివేదిక

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే : బళ్లారి జిల్లాకు చెందిన వి.వివేకానంద వేసుకున్న అర్జీని జస్టిస్ ఎం.నాగప్రసన్న విచారణకు చేపట్టారు. తనపై సండూరు ఠాణా ఇన్‌స్పెక్టర్ మహేశ్ గౌడ దాడి చేసి, తప్పుడు కేసు నమోదు చేశారని వేసుకున్న అర్జీపై విచారణ పూర్తి చేసి, దర్యాప్తు చేసి నివేదికను అందించాలని హోం శాఖను న్యాయమూర్తి ఆదేశించారు.

నీటివృథా అడ్డుకట్టకు చర్యలు

రోబో సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధ సాయంతో నీటి వృథా గుర్తించే విధానాన్ని పరిశీలిస్తున్న శివకుమార్

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : ఎండాకాలం వస్తేనే.. రాజధాని నగర ప్రజలకు నీటి విలువ తెలిసేది. అంతవరకు వృథా చేసినవారే అప్రమత్తమవుతుంటారు. కుళాయిలు, గుట్టాల్లోనూ ఇలాంటి నీటి వృథా తక్కువేమీ కాదు. దాన్ని గుర్తించి నివారించడానికి బెంగళూరు జలమండలి నూతనంగా 'నీలి పడె' పేరిట ఓ వ్యవస్థను సిద్ధం చేసింది. రోబోటిక్ సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కృత్రిమ మేధ(ఏఐ) ఆధారంగా అక్రమ కుళాయిలు- గొట్టాల్లో నీటి వృథా నియంత్రిస్తారు. 'నీలిపడె' సేవలను గురువారం ఇక్కడ ప్రారంభించిన ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ నగరవాసులకు పరిశుద్ధమైన నీరు సరఫరా చేసేందుకు పలు చర్యలు చేపడుతున్నామన్నారు. మంచినీటిలో మురుగు చేరకుండా 'నీలిపడె' నియంత్రిస్తుందన్నారు. రోబోటిక్ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అక్రమ కుళాయిలను గుర్తిస్తారని తెలిపారు. నీలిపడె 16 విభాగాల్లో పని చేస్తుందని మండలి అధ్యక్షుడు డాక్టర్‌రామ్ ప్రశాంత్ మనోహర్ తెలిపారు. అక్రమ కుళాయిలు, నీటి వృథా పూర్తి స్థాయిలో నియంత్రిస్తామన్నారు.

'నీలిపడె' సేవలు ప్రారంభించి పరిశీలిస్తున్న డీకే తదితరులు

రాష్ట్రపతి పాలన ఉత్తమం: యత్నాళ్

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నాయని ప్రభుత్వం ఒకవైపు ప్రకటిస్తుండగా.. పట్టపగలు బెంగళూరులో రూ.7.11 కోట్ల నగదు దోపిడీకి గురైందని ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ ఆవేదన వ్యక్తం చేశారు. కలబురగి, బీదర్, దక్షిణ కన్నడ జిల్లాల్లోనూ బ్యాంకుల్లో దోపిడీలు, దొంగతనాలు పెద్ద మొత్తంలో జరిగాయని గుర్తు చేశారు. పోలీసులను బదిలీ చేయించేందుకు ఎమ్మెల్యేలే బాధ్యతలు తీసుకుంటున్నారని ఆరోపించారు. కర్ణాటకలో రాష్ట్రపతి పాలన అమలు చేయవలసిన సమయం వచ్చేసిందని వ్యాఖ్యలు చేశారు. హోం మంత్రిని ఏమడిగినా 'గొత్తిల్ల. ననగె గొత్తిల్ల' (తెలియదు. నాకు తెలియదు) అని బదులిస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి పదవి దిగాలని, ఉపముఖ్యమంత్రికి బాధ్యతలు అప్పగించాలన్న డిమాండ్ మధ్య కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను సీఎం చేయాలన్న ఒత్తిడి తెర పైకి వచ్చిందన్నారు. సిద్ధరామయ్యను అధికార పీఠం నుంచి కిందకు దించే సాహసాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం చేయలేకపోతోందని ఎద్దేవా చేశారు. ఇదే కారణంతో డీకే నిర్వేదంగా మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. బిహారు ఎన్నికలకు పార్టీ అధిష్ఠానం సూచించిన విధంగా నిధులు పంపించినా.. డీకేకు ఫలం మాత్రం దక్కలేదన్నారు. రాష్ట్రంలో గ్యారంటీ పథకాలు పూర్తిగా అమలు కావడం లేదని, చేసిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో గుత్తేదారులు బలవన్మరణానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కలల సాకారానికే పెద్దపీట

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే : ప్రపంచం కోరుకుంటున్న దాని కన్నా, మీ కలలను సాకారం చేసుకునేందుకు ప్రాధాన్యమిస్తేనే విజయాలను సొంత చేసుకోవచ్చని మాజీ క్రికెటర్ బీకే వెంకటేశ్‌ప్రసాద్ పేర్కొన్నారు. బెంగళూరు జైన్ విశ్వవిద్యాలయంలో 15వ వార్షిక స్నాతకోత్సవంలో ఆచార్యులు, సంస్థ ప్రతినిధుల నుంచి సత్కారాన్ని అందుకుని ఆయన మాట్లాడారు. జీవితంలో సాధించవలసిన అంశాల్లో మీ కలల్ని చేర్చుకోవడమే కీలకమని సూచించారు. అభిరుచులను నెరవేర్చుకోలేకపోతే జీవిత చరమాంకంలో బాధ పడవలసి వస్తుందని తేల్చిచెప్పారు. వైఫల్యాలు భయపెడతూ ఉంటాయని, భయాన్ని పక్కన పెడితే, వరుస విజయాలు దక్కుతాయని వివరించారు. కల్యాణి జ్యువెలర్స్ ఈడీ టీకే సీతారాం, విశ్వవిద్యాలయ కులపతి చెన్‌రాజ్ రాయ్‌చంద్, రిజిస్ట్రార్ జితేంద్ర కుమార్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు. స్నాతకోత్సవంలో 127 బంగారు పతకాలను సాధించగా, ర్యాంకులు సాధించిన 360 మందితో కలిపి 30,439 మందికి పట్టాలను ప్రదానం చేశారు.

వెంకటేశ్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు, ఆచార్యులు

రేవణ్ణ కేసుపై వాదనలు

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే : హొళెనరసీపుర ఠాణాలో తనపై నమోదైన లైంగిక దౌర్జన్యం కేసు రద్దు చేయాలని కోరుతూ మాజీ మంత్రి హెచ్‌డీ రేవణ్ణ వేసుకున్న అర్జీ ఉన్నత న్యాయస్థానం ముందుకు వచ్చింది. దిగువ న్యాయస్థానంలో విచారణ కొనసాగుతోందని ప్రభుత్వం తరపు న్యాయవాది వాదన వినిపించారు. దీనిపై ఆలస్యం లేకుండా విచారణ పూర్తి చేయాలని 42వ ఏసీజేఎం న్యాయస్థానానికి జస్టిస్ ఎంఐ అరుణ్ సూచనలు వేశారు. రేవణ్ణ పని మనిషిని ఉద్దేశించి కొన్ని సంజ్ఞలు చేశారంటూ పోలీసులు నమోదు చేసిన కేసులోని ఒక భాగాన్ని రద్దు చేస్తున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు.

సొరంగ మార్గం మనకేల?

తేజస్వీ సూర్య

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే : బెంగళూరు నగరంలో వాహన రద్దీ సమస్యకు సొరంగ మార్గం పరిష్కారాన్ని చూపించదని బెంగళూరు దక్షిణ లోక్‌సభ సభ్యుడు తేజస్వీ సూర్య పేర్కొన్నారు. ఖర్చుతో కూడిన ఈ ప్రాజెక్టుతో వాహన రద్దీ సమస్యకు పరిష్కారం లభించదన్నారు. కూడళ్లలో చిన్నవంతెనలు, ఎక్కడికక్కడ బిలమార్గాలు, రోజంతా అందుబాటులో ఉండే ప్రజా రవాణా వ్యవస్థ తదితరాలతోనే వాహన రద్దీ నియంత్రణలోకి వస్తుందన్నారు. హెబ్బాళ నుంచి సిల్కు బోర్డు వైపు గంటకు 1800 కార్లు మాత్రమే ఈ సొరంగ మార్గంలో ప్రయాణించేందుకు అవకాశం ఉంటుందని నిపుణులు ఇప్పటికే ప్రకటించారు. టోల్ చెల్లించి ఈ మార్గంలో ప్రయాణించడం కేవలం శ్రీమంతులకు మాత్రమే సాధ్యమవుతుంది. లాల్‌బాగ్, స్యాంకీ చెరువుతో పాటు నగరంలో 18 కి.మీ. కొనసాగే సొరంగ మార్గంతో పలు పురాతన ఉద్యానాలు, ప్రాంతాలకు ముప్పు కలుగుతుందని హెచ్చరించారు. ఒక చోట సొరంగ మార్గం నిర్మిస్తే 22 చోట్ల వాహన రద్దీ సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. మెట్రో రైలు సేవలను విస్తరిస్తే కొంత వరకు వాహన రద్దీ నియంత్రణలోకి వస్తుందని ప్రభుత్వానికి రాసిన బహిరంగ లేఖలో పేర్కొన్నారు.

ఇతర ప్రతినిధులతో కలిసి మాట్లాడుతున్న సానియా మీర్జా

క్విజ్, ఇతర పోటీల్లో విజేతలతో మంత్రి ప్రియాంక్ ఖర్గే, ఇతర ప్రతినిధులు

నవతరానికి మహా పండగ!

ముగిసిన బెంగళూరు టెక్ సదస్సు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : బెంగళూరు టెక్ సమ్మిట్-2025కు గురువారం రాత్రి తెరపడిన వేళ.. యువత జోష్ పతాక స్థాయికి చేరింది. గత 27 ఏళ్లుగా బెంగళూరు ప్యాలెస్ మైదానం ఈ సదస్సుకు వేదికగా మారగా.. మొదటిసారి ఈ 28వ ఏడాది సదస్సు నగర శివారు ప్రాంతం మాదావరలోని బెంగళూరు అంతర్జాతీయ వస్తు ప్రదర్శన కేంద్రం ఆతిథ్యాన్ని అందించింది. చివరి రోజు సదస్సులో అంతరిక్ష యాత్రికుడు శుభాంశు శుక్లా, టెన్నిస్ క్రీడాకారిణి సానియా మీర్జా, ఐసీసీ మహిళా క్రికెట్ వరల్డ్ కప్ ఛాంపియన్, వికెట్ కీపర్ రిచా ఘోష్, దేశంలో మొదటి మహిళా మెంటలిస్టు, మైండ్ రీడర్ సుహానీ షా, జెప్టో వ్యవస్థాపకుడు కైవల్య వోహ్రా, ఇన్‌ఫ్లూయెన్సర్ అంకుర్ వారికూ తదితరులు వేర్వేరు చర్చాగోష్ఠుల్లో పాల్గొన్నారు. టెక్ క్విజ్, ఇతర పోటీల్లో విజేతలుగా నిల్చిన విద్యార్థులు, టెక్, అంకుర పరిశ్రమల్లో నవ్యాలోచనలతో ముందంజలో నిల్చిన వారికి ఐటీ, బీటీ శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే, కియోనిక్స్ అధ్యక్షుడు శరత్‌కుమార్ బచ్చేగౌడ స్మరణికలు అందించి సత్కరించిన సమయంలో ఆ ప్రాంగణం ఈలలు, కేకలు, చప్పట్లతో మార్మోగింది. అంకుర పరిశ్రమలు, అంతరిక్ష సాంకేతికతకు సంబంధించి కొత్త విధానాలను ప్రకటించడం, మానవాళికి మేలు చేసే వేర్వేరు ఆవిష్కరణలు, ఆయా స్టాళ్లలో ప్రదర్శించారు. రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు, ఐటీ, బీటీ సంస్థల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో టెక్‌సదస్సులో భాగంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు.

రిచాఘోష్, సానియా మీర్జాలకు స్మరణికలు అందిస్తున్న కేపీసీసీ మహిళా విభాగం అధ్యక్షురాలు సౌమ్యారెడ్డి

మెంటలిస్ట్ సుహాని షా, గగన యాత్రికుడు శుభాంశు శుక్లా

సదస్సుకు హాజరైన టెక్ కంపెనీల ప్రతినిధులు

టెక్‌సమ్మిట్ ప్రవేశ ద్వారం వద్ద రద్దీ

బెంగళూరు

● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

వైభవంగా కార్తిక దీపోత్సవాలు

బావిలో గంగమ్మకు దీపాలర్పిస్తున్న మహిళలు

పావగడ, న్యూస్‌టుడే : కార్తిక మాసం అమావాస్యను పురస్కరించుకొని పట్టణం, తాలూకాలోని పలు దేవాలయాల్లో కార్తిక దీపోత్సవాలను మహిళలు వేడుకలుగా జరుపుకున్నారు. పట్టణంలోని శనిమహాత్ముడి దేవాలయం, నల్లరాళ్ల గంగమ్మ, అక్కమ్మగార్ల దేవాలయ ఆవరణలు, పతంజలి నగరంలోని శాంతి బృందావనంలో మహిళలు దీపాలను వెలిగించి పూజలాచరించారు. నల్లరాళ్ల గంగమ్మ ఆలయంలోని బావిలోని గంగమ్మకు దీపాలు సమర్పించారు.

నేడే చింతామణిలో అఖండ-2 ట్రైలర్ విడుదల

చింతామణి, న్యూస్‌టుడే : నందమూరి బాలకృష్ణ నటించిన అఖండ-2 ట్రైలర్‌ను శుక్రవారం సాయంత్రం బెంగళూరు రోడ్డు చిన్నసంద్ర సమీపంలోని ఎస్‌ఎస్‌ఆర్ (బ్రిక్స్ ఫ్యాక్టరీ) వద్ద విడుదల చేస్తాంసని అఖిల భారత నందమూరి బాలకృష్ణ అభిమానుల సంఘం అధ్యక్షుడు నంబూరి సతీశ్ తెలిపారు. కన్నడ నటుడు శివరాజ్‌కుమార్, దునియ విజయ్‌తో పాటు ప్రముఖులు పాల్గొంటారన్నారు. తమిళనాడు, ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో అభిమానులు హాజరవుతారన్నారు. సంఘం రాష్ట్రం అధ్యక్షుడు కాంతరాజ్, తాలూకా అధ్యక్షుడు వెంకటరమణస్వామి నేతృత్వంలో ఏర్పాట్లు సాగుతున్నాయి. చిక్కబళ్లాపుర జిల్లా భాజపా అధ్యక్షుడు సీకల్ రామచంద్రగౌడ ఏర్పాట్లను పరిశీలించారు. బాలయ్య అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

హోసూరు కబుర్లు

అట్టహాసంగా టెక్ ఎక్స్‌పో ప్రారంభం

ప్రదర్శనను ప్రారంభిస్తున్న మేయర్ సత్య, తదితరులు

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు-బెంగళూరు జాతీయ రహదారి మూకండపల్లిలోని హిల్స్‌హోటల్ సభాప్రాంగణంలో గురువారం టెక్ ఎక్స్‌పో ప్రదర్శనను మేయర్ ఎస్.ఎ.సత్య ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్మికుల వల్ల పారిశ్రామికంగా హోసూరు దినదినాభివృద్ధి చెందుతోందని, ప్రదర్శనలో దేశ విదేశాలకు చెందిన పరిశ్రమలు తమ ఉత్పత్తులను ప్రదర్శించాయి. సాంకేతికంగా అభివృద్ధి చెందిన ఆధునిక ఉత్పత్తుల వివరాలను నిర్వాహకుడు వెంకటేష్‌నాయుడు వివరించారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన 140 స్టాళ్లను ప్రముఖులు సందర్శించారు. ఈ సందర్భంగా మేయర్‌ను నిర్వాహకులు సత్కరించారు. మేయర్ వెంట హోస్టియ కార్యదర్శి వడివేలు ఉన్నారు.

28 నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు-తళి రోడ్డులో విశాలమైన మైదానంలో ఈనెల 28, 29, 30వ తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల ఏర్పాట్లను గురువారం హోసూరు ఎమ్మెల్యే ప్రకాశ్ పరిశీలించారు. ఎనిమిది వేల మంది వీక్షించడానికి చేపట్టిన గ్యాలరీ నిర్మాణ పనులను పరిశీలించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 40 పురుషుల జట్లు, నాలుగు మహిళల జట్లు పాల్గొంటాయని ఎమ్మెల్యే తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వస్తున్న క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తామన్నారు. జిల్లా డీఎంకే కమిటీ, బృందావన పాఠశాలల యాజమాన్యం సంయుక్తంగా పోటీలను నిర్వహిస్తున్నాయి. కార్యక్రమంలో బృందావన పాఠశాలల అధిపతి డాక్టర్ శేఖర్, లోకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్యాలరీను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్, తదితరులు

ఘనంగా టిప్పుసుల్తాన్ జయంతి

తళి (డెంకణీకోట) న్యూస్‌టుడే : తళి బస్సు నిలయంలో టిప్పుసుల్తాన్ జయంతి తళి దర్గా ఆధ్వర్యంలో నిర్వహించారు. టిప్పుసుల్తాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దర్గా కార్యదర్శి అస్లాంఖాన్, సభ్యులు మహమ్మద్ ఉస్మాన్, యువజన కాంగ్రెస్ ఉప కార్యదర్శి ఇర్ఫాన్, జాబిత్, ఇమ్రాన్, నవాస్, నసీర్ తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

ఆకట్టుకున్న చిన్నారుల నాటక ప్రదర్శన

కెలమంగలం (డెంకణీకోట) న్యూస్‌టుడే : కెలమంగలం శివారు హెచ్.శెట్టపల్లిలోని ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు ఆరోగ్య సమస్యలు, పరిష్కార మార్గాలపై నాటక ప్రదర్శన చేశారు. ఇటీవల కాలంలో ఫాస్ట్‌ఫుడ్ ఎక్కువగా తీసుకుంటున్నారని, వాటి వల్ల అనారోగ్య సమస్యలు అధికమవుతాయని నాటకం, పాటల ద్వారా అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిన్నారులతో ఉపాధ్యాయులు

ఇళ్ల నిర్మాణాలకు అనుమతి

డెంకణీకోట, న్యూస్‌టుడే : డెంకణీకోట పట్టణంలో ప్రధాన మంత్రి ఇళ్ల నిర్మాణ పథకం కింద 32 మంది లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించడానికి అనుమతి వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీటికి సంబంధించిన ఉత్తర్వులను పట్టణ పంచాయతీ అధ్యక్షుడు శ్రీనివాసన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అబ్దుల్ కలాం, ఈఓ నాగరాజు, కౌన్సిలర్ సుమతి, సభ్యులు పాల్గొన్నారు.

భాజపా విజయోత్సవాలు

శూలగిరి, (బేరికె), న్యూస్‌టుడే : బిహార్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించడంపై గురువారం భాజపా, హిందూ సంఘాల సభ్యులు సంబరాలు చేసుకున్నారు. భాజపా జెండాలను చేతపట్టి నినాదాలు చేశారు. ప్రముఖులు మునిరెడ్డి, ప్రదీప్, నంజుండేశ్వర గౌడు, పోతిరెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు. శూలగిరిలో భాజపా కృష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యదర్శి కె.సుందరమూర్తి, మురళి ఆధ్వర్యంలో టపాకాయలు పేల్చి విజయోత్సవాలు నిర్వహించారు. నాయకులు అన్బరసన్, సతీష్‌కుమార్, శ్రీనివాస్, మంజు,సేటు పాల్గొన్నారు.

సంబరాలు చేసుకుంటున్న భాజపా నాయకులు, కార్యకర్తలు

వీధికుక్కల నియంత్రణ చర్యలు షురూ

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : బెంగళూరు నగరంలో నెలకు 27 వేల మంది వీధి కుక్కల కాట్లకు గురవుతున్నారు. గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ) నియంత్రణ చర్యలు చేపడుతున్నప్పటికీ బెడద తప్పడం లేదు. పగలు, రాత్రి తేడా లేకుండా సంచరిస్తూ.. వాహనదారులు, పాదచారులు, చిన్నారులపై దాడి చేస్తున్నాయి. దాడులకు వ్యతిరేకంగా ప్రజలు అనేక సార్లు నిరసనలు వ్యక్తం చేశారు. సర్వోన్నత న్యాయస్థానంలో ప్రాధికార అధికారులు అన్ని వివరాలతో కూడిన ప్రమాణ పత్రాన్ని అందజేశారు. వీధి కుక్కల నియంత్రణ చర్యలు ముమ్మరంగా అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇన్ని చేసినా కుక్కకాటు సంఘటనలు ఆగలేదు. చలికాలం ఎక్కువగా వీధి కుక్కలు దాడులకు దిగుతున్నాయి. మంగళవారం నగర శివార్లలో ప్రాధికార సిబ్బంది వీటిని బంధించే కార్యక్రమాన్ని చేపట్టారు. అందు కోసం నాగాలాండ్, మేఘలాయ తదితర రాష్ట్రాల నుంచి వీధి కుక్కలు బంధించే నిపుణులను రప్పించారు. ప్రస్తుతం మాంసం దుకాణాలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో శునకాలు ఎక్కువగా సంచరిస్తున్నాయి. ఆప్రదేశాల్లో కార్యాచరణ చేపట్టారు. బంధించిన వాటికి సంతాన రహిత చికిత్స చేస్తున్నారు. అందు కోసం పశు వైద్యులు ప్రత్యేక సూది మందు వేస్తున్నారు. అన్ని ప్రాంతాల్లో వీధి కుక్కలను నియంత్రించే చర్యలు చేపట్టారు.

నాయండనహళ్లిలో కుక్కలను బంధిస్తున్న సిబ్బంది

సూది మందు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

హాజరైన సాహిత్యాభిమానులు, కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హెగ్గడే, సాహితీవేత్తలు, అతిథులు

మానవీయ రచనలకే గుర్తింపు

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : సమాజసేవ, మానవ విలువలకు అద్దం పట్టే రచనలే పాఠకుల హృదయాల్లో శాశ్వత ముద్ర వేసుకుంటాయని ప్రముఖ సాహితీవేత్త ఆచార్య ప్రేమశేఖర్ పేర్కొన్నారు. ధర్మస్థలలో జరుగుతున్న లక్షదీపోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాహిత్య సమ్మేళనాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఇటీవల వస్తున్న రచనల్లో జీవన వాస్తవాలు ప్రతిబింబించలేదని, సమాజంలో జరుగుతున్నదానికి భిన్నంగా వస్తున్నాయన్నారు. సమాజాన్ని జాగృత పరచాల్సిన బాధ్యత రచయితలపై ఉందని వక్కాణించారు. జీవితంలో ఎదురయ్యే సన్నివేశాలు, పాత్రలు, విచారాలు, వాస్తవాలను సమాజానికి అందించాలన్నారు. నిత్య చైతన్యశీలురుగా ఉండే రచయితలు అన్ని అంశాలపై దృష్టి సారించాలన్నారు. అధ్యక్షత వహించిన విశ్వవాణి పత్రిక సంపాదకుడు విశ్వేశ్వరభట్ మాట్లాడుతూ కన్నడ అభివృద్ధికి రచనల్లో కన్నడ భాషను ఉపయోగించాలన్నారు. అన్ని విధాలుగా సమృద్ధి, పరిపూర్ణత గల భాషగా కన్నడ ఉందన్నారు. ధర్మాధికారి వీరేంద్ర హెగ్గడే మాట్లాడుతూ మానవీయత, శాంతి కథనాలతో ప్రజల్లో జాగృతి కల్పించాలన్నారు. అందరి హితాన్ని అభిలషించే సాహిత్యం, సంస్కృతి సమాజ నిర్మాణానికి దోహదకారి అవుతుందన్నారు. కార్యక్రమంలో సాహిత్యాభిమానులు, ప్రముఖులు పాల్గొన్నారు.

22న సాహే విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం

మాట్లాడుతున్న కులపతి లింగేగౌడ, సుదీప్‌కుమార్, తదితరులు

తుమకూరు : తుమకూరు శివారు అగలకోటెలోని సిద్ధార్థ విద్యాసంస్థలో ఈనెల 22న స్నాతకోత్సవం నిర్వహించనున్నట్లు సాహే విశ్వవిద్యాలయం కులపతి కె.లింగేగౌడ తెలిపారు. గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 14వ పట్టాల ప్రదానోత్సవానికి విశ్వవిద్యాలయం సంస్థాపకుడు హోంమంత్రి జి.పరమేశ్వర్ అధ్యక్షత వహిస్తారన్నారు. 1086 మంది విద్యార్థులకు డిగ్రీలు, 15 మందికి బంగారు పతకాలను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. పావగడ రామకృష్ణ వివేకానంద ఆశ్రమం వ్యవస్థాపకులు జపానంద, విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ జి.పి.జె.రెడ్డిలకు డాక్టరేట్లు అందజేస్తామన్నారు.

జనవరిలో కేరళ సాహిత్య ఉత్సవాలు

బెంగళూరు (రామమూర్తినగర), న్యూస్‌టుడే : 2026 జనవరి 22-25 వరకు కేరళలోని కోజికోడ్‌లో నిర్వహించే 'కేరళ సాహిత్య ఉత్సవాలకు విచ్చేయాలని నిర్వాహకులు కోరారు. మ్యాక్స్ ముల్లర్ భవన్, ప్రపంచంలో వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన రచయితలు, ప్రచురణ సంస్థల ప్రతినిధులు సాహిత్య ఉత్సవాల్లో పాల్గొంటారని నిర్వాహక ప్రతినిధులు డీసీ రవి, హెచ్. మైఖేల్ తెలిపారు. ఇక్కడ నిర్వహించిన సమావేశంలో విలేకరులతో వారు మాట్లాడుతూ ఈ ఉత్సవాల్లో 400కు పైగా స్టాళ్లు ఉంటాయన్నారు.

హలసూరు చెరువు అభివృద్ధికి ప్రణాళికలు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : నగర నిర్మాత కెంపేగౌడ తవ్వించిన హలసూరు చెరువు సమగ్రాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని బెంగళూరు కేంద్ర నగర పాలికె కమిషనర్ రాజేంద్రచోళన్ అధికారులకు సూచించారు. గురువారం ఇక్కడ ఆయన ఉన్నతాధికారులతో కలిసి చెరువును సందర్శించారు. చెరువులోకి వచ్చే మురుగునీటిని గమనించి ఆయన ఆనీరు చెరువులోకి నేరుగా వెళ్లకుండా శుద్ధీకరించి తరువాత సరఫరా చేయాలని సూచించారు. పై నుంచి వచ్చే మురుగునీటి నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. ఆనీటిని శుద్ధీకరించేందుకు ప్రత్యేక ఎస్‌టీఎఫ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. గుర్రపు డెక్కలతో పాటు పిచ్చి మొక్కలను తొలగించి శుద్ధీకరించాలన్నారు. చెరువు చుట్టు వాయువిహారులకు ప్రత్యేక నడకదారి నిర్మించాలని, ప్రస్తుతం ఉన్న దారిని మరింత అభివృద్ధి చేయాలన్నారు. ప్రాచీన హలసూరు చెరువు సంరక్షించుకోవాల్సిన బాధ్యత సమాజంపై ఉందని కమిషనర్ రాజేంద్రచోళన్ అభిప్రాయపడ్డారు.

మురుగునీటిని పరిశీలిస్తున్న కమిషనర్ రాజేంద్రచోళన్, తదితరులు

సమస్యలపై దృష్టి సారించాలి

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ) పరిధిలోని ఐదు నగరపాలికెల్లో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించాలని చీఫ్ కమిషనర్ మహేశ్వరరావు సూచించారు. గురువారం ఇక్కడ ఆయన ఐదు నగర పాలికెల ఇంజినీర్లతో సమావేశం నిర్వహించారు. రహదారుల్లో ఏర్పడిన గుంతలు పూడ్చివేతలు, సిమెంట్ రహదారులు, తదితర పనులను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ప్రధాన రహదారుల్లో సాగుతున్న పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అభివృద్ధి పనులు అమలులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలన్నారు. సిమెంట్ దారులుగా మార్చే జాబితా సిద్ధం చేయాలని, పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రతి పనిని స్వయంగా పరిశీలించిన తరువాతే బిల్లులు మంజూరు చేయాలని ఆయన స్పష్టం చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్వరరావు

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

విద్యార్థులతో గండసీ సదానందస్వామి జయలక్ష్మి, తదితరులు

బెంగళూరు (కెంగేరి) : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించాలనే ధ్యేయంతో సంజయ్‌గాంధీ పాఠశాల విద్యార్థులకు రాత పుస్తకాలు, వృద్ధులకు కంబళ్లు పంపిణీ చేశారు. జయదుర్గ సేవా చారిటబల్ ట్రస్టు, అభయ సేవా సమాజ సంఘం ఆధ్వర్యంలో రాజ్యోత్సవం వేడుకలను ఘనంగా ఆచరించారు. కార్యక్రమంలో నటుడు గండసీ సదానందస్వామి, అధ్యక్షురాలు జయలక్ష్మీ మంజేగౌడ, కృష్ణేగౌడ, మంజునాథ్, అక్షత, వనిత, చెన్నబసణ్ణ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

'కెంగల్ హనుమంతయ్య' పేరు హర్షణీయం

మాట్లాడుతున్న అనీల్‌చెళగేరీ తదితరులు

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : స్థానిక నాయకులు, భాజపా, జేడీఎస్ ప్రముఖుల పోరాట ఫలితంగా జీబీఏ వార్డుల జాబితాలో కెంగేరి పేరు కెంగల్ హనుమంతయ్య వార్డుగా నామకరణం చేసినందుకు ఆనందంగా ఉందని యశ్వంతపుర భాజపా నగర అధ్యక్షుడు అనీల్ చెళగెరీ తెలిపారు. కెంగేరికి శతాబ్దాల చరిత్ర ఉందని, త్వరలో జీబీఏ ఎన్నికలు జరగనున్నాయని, అన్ని వార్డుల్లో ఎన్డీఏ అభ్యర్థుల విజయం తథ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు రుద్రేష్, సత్యనారాయణ, రమేష్, శశికుమార్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి మృతి

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : బీఎంటీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో కూరగాయల వ్యాపారి వెంకటరామప్ప (65) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గురువారం ఉదయం కూరగాయలు తెచ్చేందుకు వెళ్తుండగా మడివాళ బస్టాండ్ వద్ద వేగంగా వచ్చిన బీఎంటీసీ బస్సు ఆయనను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆయనను సెయింట్‌జాన్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మడివాళ పోలీసులు కేసు నమోదు చేసుకొని డ్రైవర్‌ను అరెస్టు చేసి దర్యాప్తు చేపట్టారు.

కుమార్తెను బలి ఇచ్చే యత్నం

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : మానసిక వ్యాధికి గురైన కుమార్తెను దేవస్థానం ముందు బలి ఇచ్చేందుకు తల్లి ప్రయత్నించి ఉండవచ్చని సంపిగేహళ్లి పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం సంపిగేహళ్లి అగ్రహార లేఅవుట్‌లో ఉన్న హరిహరేశ్వర దేవస్థానం వద్ద తన కుమార్తె రమ్యపై ఆమె తల్లి సరోజమ్మ కత్తితో హత్య చేసేందుకు ప్రయత్నించిన విషయం తెల్సిందే. రమ్యకు ఆనేకల్ నివాసి సురేష్‌తో పదేళ్ల కిందట వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు. రెండేళ్ల కిందట భర్త మృతి చెందారు. అప్పటి నుంచి రమ్య మానసికవ్యాధికి గురైంది. ఓపూజారి చేసిన సూచనలు మేరకు దేవస్థానం వద్ద నరబలి ఇచ్చేందుకు ప్రయత్నించినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. గాయపడిన కూతురు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

రాబర్ట్‌సన్‌పేటలో గంజాయి స్వాధీనం

కోలారు, న్యూస్‌టుడే : రాబర్ట్‌సన్ పేట పరిధి స్కూల్ ఆఫ్ మైన్స్ వద్ద గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. కడపజిల్లా చమలరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కంచర్ల హర్షవర్ధనరెడ్డి (21), యాటె మహేంద్ర (21) అనే వ్యక్తులను నిందితులుగా గుర్తించారు. వీరి నుంచి రూ.2.01 లక్షల విలువైన 4.140 కిలోల గంజాయిని జప్తు చేసుకున్నామని డీఎస్పీ వి.లక్ష్మయ్య తెలిపారు. నిందితుల నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు విచారణను తీవ్రం చేశారు.

కారు ఢీకొని విద్యార్థిని దుర్మరణం

మంగళూరు, న్యూస్‌టుడే : పుంజాలకట్టె వద్ద గురువారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో అనన్య (21) అనే విద్యార్థిని మరణించింది. బెళ్తంగడి నుంచి మంగళూరులోని సహ్యాద్రి ఇంజినీరింగ్ కళాశాలకు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. ప్రమాదంలో ఆమె స్నేహితురాలు పృథ్వీరావు గాయపడింది. బెళ్తంగడి ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కార్లకు నిప్పు పెట్టిన దుండగులు

మైసూరు, న్యూస్‌టుడే : నంజనగూడు శ్రీరాంపుర లేఅవుట్‌లో ఛలవాది మహాసభ జిల్లా అధ్యక్షుడు అభినాగభూషణ్, 5వ క్రాస్‌లో ఉంటున్న సంతోశ్ అనే వ్యక్తుల కార్లకు గుర్తు తెలియని దుండగులు పెట్రోలు పోసి నిప్పంటించారు. అర్ధరాత్రి దాటిన అనంతరం కార్లు తగలబడడాన్ని గుర్తించిన స్థానికులు నీళ్లు పోసి మంటల్ని అదుపు చేసేందుకు విఫలయత్నం చేశారు. అగ్నిమాపక దళ సిబ్బంది వచ్చేలోగా కార్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. నంజనగూడు ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE : HINDUPUR
H.M.O.P. 178/2022

Between:
P.N.Rachana ... **Petitioner**
Vs
L.S.Shiva Shankar ... **Respondent**

NOTICE TO THE RESPONDENT

L.S.Shiva Shankar, S/o Siddappa, aged about 36 years, working as Relationship Manager in Pratham Motors, Doddaballapura Town and Taluk, Residing at Linganahalli village, Doddaballapura Taluk, Bangalore Rural District, Karnataka State (7899699660, 9972412738).

Sir,
Whereas the above petitioner has filed the above petition against you seeking Divorce from you and the same is posted to **15-12-2025** for your appearance. Hence you are hereby summoned to attend this Hon'ble Court on **15-12-2025** at **10.30** a.m. either in person or through an advocate and file your objections if any. If you fail to do so, the matter will be decided exparte.

(BY ORDER OF THE COURT)

A.GOPALA KRISHNA, Advocate, Hindupur. Cell: 9949157054.

ప్రతిభతో ఉత్తమ ఫలితాలు సాధించాలి

బెంగళూరు (పీణ్యాదాసరహళ్లి) న్యూస్‌టుడే : కళాశాలలో చదువుకునే విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి ఉత్తమ ఫలితాలు సాధించాలని బెంగళూరు ఉత్తర జిల్లా పాఠశాల విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ టి.పాలాక్షి సూచించారు. చిక్కబానువారలోని ఆర్.ఆర్.కళాశాలలో గురువారం సాంస్కృతిక పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఆర్.ఆర్.కళాశాల ప్రిన్సిపల్ ఎస్.గురురాజా, వీరేష్, సంధ్య, ఆనందమూర్తి శ్రీకాంతయ్య, వేణుగోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ దత్తత మాసం

పావగడ, న్యూస్‌టుడే : అంతర్జాతీయ దత్తత మాసం సందర్భంగా గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి గుండా ఎస్.ఎస్.కె.కమ్యూనిటీ భవనం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఎస్.ఎస్.కె.కూడలిలో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీడీపీవో సునీత గ్రేడ్-2 తహసీల్దార్ ప్రసాద్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

తెలుగు పాఠశాలల అభ్యున్నతికి కృషి

విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఆదికేశవులు నాయుడు

భాషా సామరస్యాన్ని చాటుకునే దిశలో తెలుగు విజ్ఞాన సమితి కనకపుర రోడ్డు వాసుదేవపురలోని ప్రభుత్వ కన్నడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గడియారాలు, నోటు పుస్తకాలు, స్కూలు బ్యాగులను సమితి ఉపాధ్యక్షుడు ఆర్.ఆదికేశవులు నాయుడు పంపిణీ చేశారు. తెలుగు పాఠశాలలకు ప్రాధాన్యమిస్తూ పేద విద్యార్థులు చదువుకునే కన్నడ మాధ్యమ ప్రభుత్వ పాఠశాలల్లోనూ సేవలు అందిస్తామని ఆయన తెలిపారు.

- న్యూస్‌టుడే, బెంగళూరు (మల్లేశ్వరం)

పోలీసులు క్రీడల్లో పాల్గొనాలి

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : పోలీసులు తమ కర్తవ్యాల ఒత్తిడి నుంచి మానసిక, దైహిక సామర్థ్యాలను పెంచేందుకు క్రీడా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోలారు జిల్లాధికారి ఎం.ఆర్.రవి తెలిపారు. గురువారం కేజీఎఫ్ పోలీసు క్రీడా పోటీలను బెలూన్‌లను వదిలి రవి ప్రారంభించి మాట్లాడారు. పోలీసులు తమ కుటుంబ సభ్యులతో కలిసి క్రీడల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ అధికారి శివాంశు రాజపుత్, డీవైఎస్పీ వి.లక్ష్మయ్య, సీపీసీ పి.సత్య, వి.సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభ వేదికలో రవి, శివాంశు రాజపుత్ తదితరులు

బ్యాంకింగ్, ఆర్థిక సేవానిధి ప్రారంభం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : బజాజ్ ఫిన్‌సర్వ్‌సెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ బ్యాంకింగ్, ఆర్థిక సేవానిధి ప్రారంభించినట్లు ఎండీ గణేశ్ మోహన్ తెలిపారు. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీ, బీమాదారులు, ఏఎంసీ తదితరాల్లో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశం ఉందన్నారు. దేశీయ ఆర్థిక అభివృద్ధికి అనుకూలవుతుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఎఫ్‌ఎస్‌ఐ పెరుగుదల వల్ల దేశంలోకి విదేశీ పెట్టుబడులు విరివిరిగా వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

విమాన ప్రయాణానికి రాయితీ

బెంగళూరు (ఆడుగోడి), న్యూస్‌టుడే : అమెజాన్ పే ఈనెల 18 నుంచి డిసెంబరు 9 వరకు ఇంపాసిబల్ ట్రావెల్స్ ఉత్సవాలను నిర్వహిస్తోంది. విమానం ప్రయాణం, హోటల్ బుకింగ్‌లపై రాయితీలను ప్రకటించింది. విమానం ప్రయాణికులకు 20 శాతం, హోటల్‌లో 60 శాతం రాయితీ ఇస్తామని సంస్థ సీఈఓ వికాస్ బన్సాల్ ఒక ప్రకటనలో తెలిపారు. రాయితీ ధరల్లో దేశ విదేశాల్లో విమానాల్లో సంచరించే అవకాశాన్ని ప్రజలకు కల్పించామని, ఆయా ప్రాంతాల్లో హోటల్ గదుల సౌకర్యాలను రాయితీ ధరల్లో అందిస్తామని వివరించారు.

బళ్ళారి

• బళ్ళారి • రాయచూరు • కొప్పళ • విజయనగర • చిత్రదుర్గ

అమ్మోరికి వేరుసె'నగ'

బెంగళూరు నగరంలోని బనశంకరి అమ్మవారికి వేరుసెనక్కాయలతో గురువారం ప్రత్యేకంగా అలంకరించారు. బసవనగుడిలో నిర్వహిస్తున్న వేరుసెనగ జాతర నుంచి.. భక్తులు తీసుకువచ్చిన కాయలతో మూడు గంటలు శ్రమించి, ఈ అలంకరణ పూర్తి చేశామని ఆలయ నిర్వహణ సమితి ప్రతినిధులు తెలిపారు. కార్తిక మాసం చివరి రోజు సందర్భంగా అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

- న్యూస్‌టుడే, శివాజీనగర

గాంధీనగర్‌లో ఘనంగా లక్ష దీపోత్సవం

గాంధీనగర్ (సింధనూరు), న్యూస్‌టుడే: కార్తిక అమావాస్యను పురస్కరించుకుని సింధనూరు తాలూకా గాంధీనగర్‌లోని ప్రసిద్ధ శివ పంచాయతన క్షేత్రం గురువారం ఓం నమశ్శివాయ మంత్రంతో మారుమోగింది. ఏటా సంప్రదాయంగా ఆచరించే లక్ష దీపోత్సవంతో గురువారం రాత్రి క్యాంపు మొత్తం దీప కాంతులతో మెరిసిపోయింది. కొప్పళ ఎంపీ రాజశేఖర్ హిట్నాళ్, ఆలయ సమితి అధ్యక్షుడు ముళ్లపూడి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్ శివాలయంలో దీపోత్సవ శోభ

సేకరణ కేంద్రాలు తెరవాలని ఒత్తిడి

రాయచూరు : జిల్లాలో వరి, కందులు, జొన్న కొనుగోలు కేంద్రాలను తెరవాలని, అతివృష్టికి వరి దిగుబడులను కోల్పోయిన ప్రతి రైతుకు క్వింటాల్‌కు వెయ్యి రూపాయల ప్రోత్సాహ ధనాన్ని ప్రకటించాలని రైతు సంఘం వ్యవసాయ శాఖ మంత్రి చెలువరాయ స్వామిపై ఒత్తిడి తెచ్చింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శరణప్ప మరళి నాయకత్వంలో ప్రతినిధులు మహేశ్‌గౌడ సుబేదార్, నాగయ్య స్వామి, దేసాయి గురు, రంగనగౌడ, కరియప్ప కరిగార బెంగళూరులో మంత్రికి వినతి పత్రాన్ని అందజేశారు. గిట్టుబాటు ధరలు లభించక అన్నదాతలు నష్టపోయారని ఏకరవు పెట్టారు.

మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

తగ్గనున్న వరి దిగుబడి

రాయచూరు, న్యూస్‌టుడే : తుంగభద్ర ఆయకట్టు ప్రదేశంలో రెండో సాగుకు నీరు సరఫరా చేయకపోవడం బియ్యం సరఫరాపై ప్రభావం చూపనుందా? సుమారు 20 లక్షల టన్నుల ఉత్పత్తి పడిపోనుందా? అన్న ప్రశ్నలకు వ్యాపారులు అవుననే అంటున్నారు. రాయచూరు, కొప్పళ, విజయనగరం, బళ్లారి జిల్లాల్లో నిరుడు రబీ సీజన్‌లో 6 లక్షల ఎకరాల్లో వరి పండించారు. రెండో సీజన్లలో పంట వచ్చిన ఫలితంగా బియ్యం ధరలకు కళ్లెం పడింది. అతివృష్టి, తుపాను కారణంగా ఈ ఏడాది తొలి పంటలో దిగుబడులు తగ్గాయి. రెండో సాగును వదులుకోవడంతో మరింత దిగుబడులు పతనం కానున్నాయి. దరిమిలా మార్కెట్‌లో మెల్లగా బియ్యం ధరలు పెరుగుతున్నాయి. ఈ ప్రాంతంలోని సోనా, ఆర్‌ఎన్‌ఆర్ రకాలకు విదేశాల్లో డిమాండ్ ఉంది. ఖరీఫ్ ధాన్యం మాత్రమే మార్కెట్‌లో ఉన్నందున దేశీయంగా డిమాండ్ ఊపందుకోనుంది. కొత్త ఏడాది నుంచి ధరలు పెరిగే అవకాశముందని అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో ఏటా 75 నుంచి 80 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఉత్పాదన చేస్తే.. ఇందులో 45 లక్షల మెట్రిక్ టన్నులను తుంగభద్ర జిల్లాల్లో ఉత్పత్తి చేస్తారు.

కూలీలు, కార్మికులను ఆదుకోవాలి



వ్యవసాయంపై ఆధారపడి ఉపాధి పొందే వారికి ప్రభుత్వం ఆర్థికంగా సాయం చేయాలి. కాల్వలు, అక్విడేట్స్‌ను ఆధునికీకరణ చేస్తామని సర్కారు హామీ ఇచ్చినందునే రైతులు రెండో పంటను వదులుకున్నారు. పనులు చేయకపోతే మాత్రమే ఆందోళనలు చేస్తాం.

- చామరస్ మాలిపాటిల్ (రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు)

మిల్లర్లకు గడ్డు కాలమే

నాలుగు జిల్లాల్లో దాదాపుగా 400 రైస్ మిల్లులు ఉన్నాయి. రెండో పంట లేనందున ఏప్రిల్ నుంచి ఐదు మాసాలు మిల్లులు నడపటం కష్టమేనని మిల్లర్లు చెబుతున్నారు. మిల్లు రన్నింగ్‌లో లేకున్నా విద్యుత్తు బిల్లు కట్టాల్సిందే. నిర్వహణ ఖర్చులు భరించాల్సిందే. సిబ్బందికి, కూలీలకు జీతం ఇవ్వాల్సిందే. బ్యాంకులు రుణాలు చెల్లించాల్సిందే. ఇవన్నీ కట్టుకుంటూ ఎలా నడపాలో తెలియలేదని వాపోతున్నారు. లారీలు, ట్రాక్టర్లు, కోత యంత్రాల యజమానులు, కార్మికులు, కూలీలు ఉపాధిని కోల్పోతారు. ఏపీఎంసీల ఆదాయానికి గండిపడుతుంది.

ఏపీఎంసీలో మిల్లులకు పంపే ధాన్యపు సంచులు

పంపుసెట్ల చోరీ నిందితుల అరెస్టు

రాయచూరు, న్యూస్‌టుడే : రైతులు వినియోగించే మోటారు పంపుసెట్లను చోరీ చేశారన్న ఆరోపణలతో ఇద్దరు నిందితులను రాయచూరు గ్రామీణ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్పీ పుట్టమాదయ్య ఓ ప్రకటన విడుదల చేశారు. తాలూకాలోని కొర్విహాళ్ గ్రామం రైతు నరసింగ మరమ్మతుల కోసం ఇంటి ముందు ఉంచిన ఐదు హెచ్.పి.సామర్థ్యం కలిగిన రెండు, 7.5 సామర్థ్యం ఉన్న ఒక పంపుసెట్లు (వీటి విలువ రూ.1.10 లక్షలు) ఆగంతకులు చోరీ చేశారని బాధితుడు ఫిర్యాదు చేశారు. పీఎస్సైలు ప్రకాశరెడ్డి, ఎం.డి.పాషా, కానిస్టేబుల్స్ గౌస్ పాషా, మహిబూబ్ ఆలీ, శాంతకుమార్, మల్లికార్జున, హుస్సేనప్ప, రమేష్, మహేశ్వరెడ్డి దర్యాప్తు చేసి.. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం గుడిగండ్లా గ్రామానికి చెందిన విజయకుమార్, ఆదిగౌడలను అదుపులోకి తీసుకుని విచారించారు. రాయచూరు తాలూకాలోని శక్తినగర్, యాపలదిన్ని, తెలంగాణ నారాయణపేట జిల్లా కృష్ణా పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీలు చేసినట్లు నిందితులు అంగీకరించారని ఎస్పీ తెలిపారు. వీరి నుంచి రూ.4.31 లక్షల విలువైన 18 పంపుసెట్లు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు.

స్వాధీనం చేసుకున్న మోటారు పంపుసెట్లు

పటేల్ చొరవతోనే సంపూర్ణ భారత్

రాయచూరు, న్యూస్‌టుడే : దేశ ఉప ప్రధాని దివంగత సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ దేశభక్తి, ధైర్య సాహసాలను యువత స్ఫూర్తిగా తీసుకుని దేశసేవ చేయాలని రాజ్యసభ సభ్యుడు లెహరసింగ్ పిలుపునిచ్చారు. జిల్లా యంత్రాంగం, నగర పాలక సంస్థ, భారత్ సేవాదళ్, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం పటేల్ జయంతి సందర్భంగా నగరంలో ఏక్తా యాత్ర చేపట్టారు. పటేల్ కూడలి వరకు కొనసాగిన యాత్రను మహాత్మాగాంధీ మైదానం వద్ద లెహర్‌సింగ్ ప్రారంభించి మాట్లాడారు. అనేక రాజ్యాలు భారత్‌లో విలీనం కావటానికి పటేల్ చూపిన తెగువ వల్లనే సాధ్యపడిందని తెలిపారు. కల్యాణ కర్ణాటక ప్రాంత ప్రజలకు నిజాం పాలన నుంచి విముక్తి కల్పించిన ఘనత ఆ మహనీయుడికే దక్కుతుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎన్.శంకరప్ప ప్రసంగిస్తూ స్వాతంత్ర్య పోరాటంలో పటేల్ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. భారతీయుల ఐక్యతను చాటి చెప్పేందుకు గుజరాత్‌లో పెద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేశారని వెల్లడించారు. కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షుడు వీరనగౌడ, నాయకులు నరసారెడ్డి, సంతోశ్ రాజగురు, విజయకుమార్ సజ్జన్, రోటరీ క్లబ్ ప్రముఖుడు పవన్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న లెహరసింగ్, వేదికపై ప్రముఖులు

మరుగుదొడ్ల వినియోగం పై ప్రచారం

రాయచూరు, న్యూస్‌టుడే : ప్రపంచ శౌచాలయం దినోత్సవం సందర్భంగా మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ రాయచూరు తాలూకాలోని మిట్టి మల్కాపూరు, దేవనపల్లి గ్రామాల్లో మరుగుదొడ్ల వాడకంపై ప్రజల్లో అవగాహన కల్పించింది. ఫౌండేషన్ సభ్యులు శౌచాలయం లేని కుటుంబాలను కలుసుకుని, బహిర్భూమికి వెళ్లడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. మిట్టి మల్కాపూరులో పంచాయతీ అభివృద్ధి అధికారిణి రేణుకా ప్రసంగిస్తూ శౌచాలయాలను నిర్మించుకునేందుకు స్వచ్ఛ భారత్ మిషన్ పథకంలో రాయితీ ఇస్తున్నారని వెల్లడించారు. మ్యాజిక్ ఇండియా ప్రతినిధులు సౌమ్య, వై.ఎం. హనుమంత, రేఖ, ప్రశాంతి మాట్లాడుతూ గౌరవం, ఆరోగ్యం, పరిశుభ్రత, స్వచ్ఛత కోసం మరుగుదొడ్లను వినియోగించాలని విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారిణి భాను, నీటి నిర్వహణ ఉద్యోగి శేషమ్మ, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రముఖులు హాజరయ్యారు.

25న బెంగళూరులో సత్యాగ్రహం

రాయచూరు, న్యూస్‌టుడే : మద్య నిషేధం అధికారాన్ని గ్రామ పంచాయతీలకు అప్పగించాలని, మద్యం అక్రమ అమ్మకాలను అరికట్టాలని కోరుతూ ఈ నెల 25న బెంగళూరులోని స్వతంత్ర ఉద్యానవనంలో సత్యాగ్రహాన్ని నిర్వహిస్తామని జిల్లా మద్య నిషేధ ఆందోళన ప్రతినిధి మోక్షమ్మ వెల్లడించారు. గురువారం పత్రికా భవన్‌లో ఆమె విలేకర్లతో మాట్లాడారు. మహారాష్ట్ర, హరియాణా తదితర రాష్ట్రాల్లో గ్రామ సభలకే అధికారాన్ని కట్టబెట్టారని తెలిపారు. 20 శాతం మంది మహిళలు మద్యం అమ్మకాలను నిలిపివేయాలని కోరుకుంటే దుకాణం లైసెన్సును రద్దు చేస్తారని చెప్పారు. కర్ణాటకలో ఇదే విధానాన్ని అమలు చేయాలని ఒత్తిడి తెస్తామన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని ఆరోపించారు. అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని వాపోయారు. సమావేశంలో శారదా, విరుపమ్మ పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న మోక్షమ్మ, ప్రతినిధులు

19 ఏళ్లకు నిందితుడి ఆటకట్టు

మంగళూరు, న్యూస్‌టుడే : ఒకప్పటి సంఘ పరివార నాయకుడు సుఖానంద శెట్టి హంతకులకు ఆశ్రయం ఇచ్చిన ఆరోపణలను ఎదుర్కొంటున్న అబ్దుల్ సలాం అడ్డూరు (47)ను సూరత్కల్ ఠాణా పోలీసులు 19 ఏళ్ల అనంతరం గురువారం అరెస్టు చేశారు. బంట్వాళ తాలూకా అడ్డూరు టిబెట్ కాలనీకి చెందిన నిందితుడు బజ్పె సమీపంలోని కిన్నిపదవిలో ఉంటున్నాడు. సుఖానంద శెట్టిని హత్య చేసిన హంతకులకు తన ఇంట్లో ఆశ్రయం ఇవ్వడంతో పాటు, వారికి తన వాహనంలో కేరళలోని కాసరగోడు వరకు తీసుకువెళ్లి విడిచి పెట్టి వచ్చాడనేది అభియోగం. తన విషయాన్ని పోలీసులు గుర్తించారని, అప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతూ, కిన్నపదవిలో స్థిరపడ్డాడు. అబ్దుల్ సలాంపై పోలీసులు ఇప్పటికే రౌడీషీటు తెరిచారు.

'ధర్మస్థల'పై సిట్ అభియోగపత్రం

మంగళూరు, న్యూస్‌టుడే : ధర్మస్థలలో వందలాది మృతదేహాలను ఖననం చేశానని ఒకప్పటి పారిశుద్ధ్య కార్మికుడు చిన్నయ్య చేసిన ఆరోపణలతో దర్యాప్తు పూర్తి చేసిన ప్రత్యేక దర్యాప్తు దళం బెళ్తంగడి న్యాయస్థానంలో గురువారం అభియోగపత్రాన్ని దాఖలు చేసింది. దర్యాప్తు ప్రారంభించిన ఐదు నెలల అనంతరం సిట్ అధికారి- ఎస్పీ జితేంద్ర దయామా నేతృత్వంలోని అధికారులు 3,923 పుటల నివేదికను న్యాయస్థానంలో గురువారం దాఖలు చేశారు. కొందరు నిందితులు విచారణకు గైర్హాజరు అవుతూ రావడం, చిన్నయ్య చూపించిన ప్రాంతాలలో మృతదేహాల ఆనవాళ్లు లభించకపోవడంతో విచారణ ఆలస్యమైందని అభియోగపత్రంలో పేర్కొన్నారు. శాసనసభ సమావేశాలు ప్రారంభమయ్యేలోగా సిట్ అధికారులు దర్యాప్తునకు సంబంధించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తారని హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్ గురువారం ఇక్కడ విలేకరులకు తెలిపారు.

ఒక్క అబద్ధమే..: ధర్మస్థలలో అనుమానాస్పద మరణాలకు సంబంధించిన ఆరోపణల్లో తాను ఒక్క అబద్ధం చెప్పానని సుజాత భట్ పేర్కొన్నారు. అభియోగపత్రంలో తన పేరు ఉందా లేదా అని తనకు తెలియదన్నారు. తాను చేసిన తప్పని న్యాయస్థానం నిరూపిస్తే కారాగారానికి వెళ్తానని చెప్పారు. తాను ఒంటరిదాన్నని, కారాగారంలో ఉండవలసి వస్తే, బెయిలు కోసం ప్రయత్నం చేయకుండా శిక్ష అనుభవిస్తానని చెప్పారు. 'ధర్మస్థలకు నేనెప్పుడూ వెళ్లి మంచి వచ్చి వెళుతుంటాను. అక్కడ జరిగే ప్రతి ఘటనకు ధర్మాధికారి వీరేంద్ర హెగ్డే బాధ్యులని ఆరోపించడం తప్పన్నారు. ఆయన ఎవరికీ కావలి ఉండరు కదా' ఇప్పటి వరకు నిర్వహించిన విచారణలో సుజాత భట్- ఘటనకు సంబంధం లేదని సిట్ అధికారులు ఇప్పటికే స్పష్టం చేశారని విషయం మరవకూడదు. న్యాయస్థానం నుంచి నోటీసు వస్తే విచారణకు హాజరవుతాను' అని ఆమె తెలిపారు.

పచ్చజెండా ఊపుతున్న పవన్ పాటిల్, తదితరులు

గ్యారంటీ పథకాలపై అవగాహన జాతా

రాయచూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఐదు గ్యారంటీ పథకాలపై అవగాహన తాలూకాలో ప్రచారం చేసే వాహన జాతా గురువారం బయలుదేరింది. తాలూకా గ్యారంటీ పథకాల అమలు సమితి అధ్యక్షుడు పవన్‌పాటిల్ జిల్లా పంచాయతీ కార్యాలయం వద్ద పచ్చ జెండా ఊపి జాతాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లఘు చిత్రాలు, వీధి నాటకాలు, సంగీత కార్యక్రమాల ద్వారా పథకాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. గృహలక్ష్మి లబ్ధిదారుల్లో రాష్ట్రంలో జిల్లా ఐదో స్థానంలో, యువనిధి అమల్లో మూడో స్థానంలో ఉన్నట్లు వెల్లడించారు. గ్యారంటీ పథకాల గురించి ఇంటింటికీ ప్రచారం చేయాలని కోరారు. జిల్లా పంచాయతీ ప్రణాళిక డైరెక్టర్ రోణె, పౌర సంబంధాల శాఖ సహాయకుడు గవి సిద్ధప్ప మాట్లాడారు.

పట్టభద్రులకే సర్కారు సహకారం

చామరాజనగర, న్యూస్‌టుడే : సహకార సంఘాల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు ఆ రంగంలో పట్టభద్రులైన వారికే అవకాశం కల్పిస్తామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించారు. గ్రామీణ భారతదేశంలో ఆర్థికాభివృద్ధికి పాఠశాల, గ్రామ పంచాయతీ, సహకార సంఘం ఎంతో అవసరమనేది దేశ మొదటి ప్రధానమంత్రి నెహ్రూ ప్రతిసారీ ప్రతిపాదిస్తూ వచ్చారని గుర్తు చేశారు. విద్యార్థులకు సహకార రంగం ప్రాధాన్యమేంటో తెలిపేందుకు పాఠ్యాంశాలను రూపొందించాలని అభిప్రాయపడ్డారు. కర్ణాటకలో సహకార రంగానికి మొదటి నుంచి ప్రాధాన్యం ఉందంటూ వందేళ్ల క్రితమే ఈ రంగం అభివృద్ధి చెందుతూ వస్తోందన్నారు. చామరాజనగరలో అఖిల భారత 72వ సహకార వారోత్సవాల ముగింపు సమావేశంలో ఆయన గురువారం మాట్లాడారు. వ్యవసాయ, పశుసంవర్ధక, పారిశ్రామిక, బ్యాంకింగ్ రంగాల్లో.. సహకార సంఘాల సంఖ్య నానాటికీ పెరగడం శుభ పరిణామని చెప్పారు. తాను పశుసంవర్ధక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు పాల ఉత్పాదకుల సంఘాలను ప్రోత్సహిస్తూ వచ్చానని గుర్తు చేశారు. ఇప్పుడు రోజుకు కోటి లీటర్ల పాలు ఉత్పాదన వెనుక సహకార సంఘాల పాత్ర ఉందన్నారు. 'నేను జనతాదళ్‌లోనే ఉంటే ముఖ్యమంత్రిని అయ్యే వాడిని కాదు. ఆ పార్టీ నేత దేవేగౌడ, ఆయన కుమారులు నాకు అడ్డుపడుతూ వచ్చారు. దళ్ నుంచి నన్ను బహిష్కరించిన అనంతరం తనతో పలువురు నేతలు కాంగ్రెస్‌లో చేరారు. సహకార రంగంలో కీలకమైన నాయకుడు జీటీ దేవేగౌడ దళ్‌లోనే ఉండిపోయారు. పార్టీ వేరైనా ఆయన ఇప్పటికీ నాకు పాలనా విధానాల్లో మద్దతు ఇస్తున్నారు' అని పేర్కొన్నారు.

సభావేదికపై వెండి గద అందుకుంటున్న సిద్ధరామయ్య

ఆవుకు పండు తినిపిస్తున్న సిద్ధరామయ్య

సొరంగ మార్గం మనకేల?

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే : బెంగళూరు నగరంలో వాహన రద్దీ సమస్యకు సొరంగ మార్గం పరిష్కారాన్ని చూపించదని బెంగళూరు దక్షిణ లోక్‌సభ సభ్యుడు తేజస్వి సూర్య పేర్కొన్నారు. ఖర్చుతో కూడిన ఈ ప్రాజెక్టుతో వాహన రద్దీ సమస్యకు పరిష్కారం లభించదన్నారు. కూడళ్లలో చిన్నవంతెనలు, ఎక్కడికక్కడ బిలమార్గాలు, రోజంతా అందుబాటులో ఉండే ప్రజా రవాణా వ్యవస్థ తదితరాలతోనే వాహన రద్దీ నియంత్రణలోకి వస్తుందన్నారు. హెబ్బాళ నుంచి సిల్కు బోర్డు వైపు గంటకు 1800 కార్లు మాత్రమే ఈ సొరంగ మార్గంలో ప్రయాణించేందుకు అవకాశం ఉంటుందని నిపుణులు ఇప్పటికే ప్రకటించారు. టోల్ చెల్లించి ఈ మార్గంలో ప్రయాణించడం కేవలం శ్రీమంతులకు మాత్రమే సాధ్యమవుతుంది. లాల్‌బాగ్, స్యాంకీ చెరువుతో పాటు నగరంలో 18 కి.మీ. కొనసాగే సొరంగ మార్గంతో పలు పురాతన ఉద్యానాలు, ప్రాంతాలకు ముప్పు కలుగుతుందని హెచ్చరించారు. ఒక చోట సొరంగ మార్గం నిర్మిస్తే 22 చోట్ల వాహన రద్దీ సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. మెట్రో రైలు సేవలను విస్తరిస్తే కొంత వరకు వాహన రద్దీ నియంత్రణలోకి వస్తుందని ప్రభుత్వానికి రాసిన బహిరంగ లేఖలో పేర్కొన్నారు.

22న నులి-సిరి పురస్కారాల ప్రదానం

రాయచూరు, న్యూస్‌టుడే: ఈ నెల 22న రంగమందిరంలో సంగీత ఉత్సవాన్ని నిర్వహిస్తామని, నులి-సిరి పురస్కారాలను ప్రదానం చేస్తామని వచన సిరి పండిత అంబయ్య నులి సంగీత సాంస్కృతిక సంస్థ గౌరవాధ్యక్షుడు అంబయ్య నులి వెల్లడించారు. ఆయన గురువారం పత్రికా భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. స్వామీజీలు శాంత మల్ల శివాచార్య, రాయచోటి వీరశివాచార్య సాన్నిధ్యం వహిస్తారని, సాహితీవేత్త వీరభద్రప్ప అధ్యక్షత వహిస్తారని, మంత్రి బోసు రాజు, ఎమ్మెల్యేలు శివరాజ్ పాటిల్, బసనగౌడ దద్దల్ పాల్గొంటారని వివరించారు. సమావేశంలో చిదానంద సాలి, దేవేంద్రమ్మ, వీరణ్ణ, ప్రభు లింగయ్య పాల్గొన్నారు.

చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

ఘనంగా టిప్పుసుల్తాన్ జయంతి

సిరివార, (మాన్వి) : టిప్పుసుల్తాన్ జయంతి సందర్భంగా గురువారం పట్టణంలోని టిప్పుసుల్తాన్ కూడలి వద్ద నామఫలకానికి పూజలు చేసి నివాళులర్పించారు. పట్టణ పంచాయతీ అధ్యక్షుడు వై.భూపనగౌడ, సభ్యుడు రాధాకృష్ణనాయక్, సంఘాల సంచాలకులు మాట్లాడారు. టిప్పుసుల్తాన్ జయంతిని రాజకీయం చేయటం, ఆయన్ని ఓ వర్గానికి పరిమితం చేయటం దురదృష్టకరమన్నారు. ఉపాధ్యక్షురాలు లక్ష్మీఆదెప్ప, ఎస్‌ఐ వెంకటేశ్‌నాయక్, మౌలాసాబ్, ఎం.డి. హుసేన్, బందేనవాజ్, మహ్మద్ హుసేన్, చన్నబసవ గడ్ల, మహిబూబ్, ఫకీరప్ప తదితరులు పాల్గొన్నారు.

రాచనగరీ.. హాయిగా ఊపిరి పీల్చుకో!

మైసూరు, న్యూస్‌టుడే : వాయు నాణ్యత విషయంలో రాష్ట్రంలో మొదటి స్థానాన్ని, దేశంలో మూడో స్థానంలో రాచనగరి నిలిచి భళా అనిపించింది. దేశంలోనే అత్యంత ప్రణాళికాబద్ధ (ప్లాన్డ్) నగరంగా గుర్తింపు ఉన్న సాంస్కృతిక నగరికి వాయు నాణ్యత (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్)లో ర్యాంకు దక్కించుకునేందుకు ఉద్యానవనాల నిర్వహణ, ప్రజలు తీసుకునే జాగ్రత్తలు, పర్యావరణంపై ప్రతి ఒక్కరి ప్రేమ ఉపకరించింది. నగరంలో 65 వార్డులు ఉండగా, 332 ఉద్యానవనాలు విస్తరించాయి. వీటి నిర్వహణను గుత్తేదారులకు అప్పగించారు. ఇందులో 13 పార్కులను స్థానికులు, కొన్ని కంపెనీలు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా చూసుకుంటున్నాయి. నగర సౌందర్యాన్ని పెంపొందించేందుకు పాలికె కూడా 40 కి.మీ. పొడవునా రహదారికి ఇరువైపులా, కొన్ని చోట్ల రహదారి విభాజకాలపై రెండు లక్షలకు పైగా మొక్కలు నాటి పెంచుతోంది. చెట్లు, ఉద్యానవనాల రక్షణకు 13 ప్యాకేజీల కింద గుత్తేదారులకు రెండేళ్ల పాటు నిర్వహణకు బాధ్యత అప్పగించారు. ఉద్యానాలను పెంచేందుకు, అన్ని వార్డులలో మొక్కలు పెంచేందుకు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని పాలికెలో ఉద్యాన శాఖ విభాగం అధికారి మోహన్ కుమార్ తెలిపారు.



విద్యుత్తు దీపాల వెలుగులో రాచనగరి

సింగపూర్ సంస్థతో ఒప్పందాలు

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే : ఎగ్జిక్యూటివ్ మాస్టర్ ఇన్ హెల్త్ కేర్ లీడర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ పీజీ కోర్సు కోసం సింగపూర్‌కు చెందిన సింగ్‌హెల్త్ డ్యూక్ ఎన్‌యూఎస్ గ్లోబల్ సంస్థ బెంగళూరులోని నారాయణ హెల్త్, అరవింద్ కంటి ఆసుపత్రులతో తాజాగా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా వైద్యులు, వైద్య నిపుణులకు 15 నెలల కోర్సును బోధిస్తామని ఇరు సంస్థల ప్రతినిధులు డాక్టర్ దేవిప్రసాద్ శెట్టి, డాక్టర్ ఎన్.వెంకటేశ్ ప్రజ్ఞ తెలిపారు. సింగపూర్‌లో ప్రారంభమయ్యే ఈ కోర్సు భారత్‌తో పాటు థాయిలాండ్, ఫిలిప్పైన్స్‌కు విస్తరిస్తామని ప్రకటించారు. ఆసియా ఖండంలో ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలను పరిష్కరించేందుకు, చికిత్సలను అందించే విధానాలను మరింత మెరుగుపరచేందుకు ఈ కోర్సును రూపొందించామని డాక్టర్ దేవిశెట్టి వివరించారు. వృత్తినిపుణులు మరింత నాణ్యతతో కూడిన సేవలను అందించేలా ఈ కోర్సును రూపొందించామని వివరించారు. సమావేశంలో సింగ్‌హెల్త్ డ్యూక్ ఎన్‌యుఎస్ గ్లోబల్‌తో పాటు ఇతర ఆసుపత్రుల వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

సింగపూర్ ప్రతినిధులతో డాక్టర్ దేవిశెట్టి, డాక్టర్ ఎన్ వెంకటేశ్ ప్రజ్ఞా

రాష్ట్రపతి పాలన ఉత్తమం : యత్నాళ్

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నాయని ప్రభుత్వం ఒకవైపు ప్రకటిస్తుండగా.. పట్టపగలు బెంగళూరులో రూ.7.11 కోట్ల నగదు దోపిడీకి గురైందని ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ ఆవేదన వ్యక్తం చేశారు. కలబురగి, బీదర్, దక్షిణ కన్నడ జిల్లాల్లోనూ బ్యాంకుల్లో దోపిడీలు, దొంగతనాలు పెద్ద మొత్తంలో జరిగాయని గుర్తు చేశారు. పోలీసులను బదిలీ చేయించేందుకు ఎమ్మెల్యేలే బాధ్యతలు తీసుకుంటున్నారని ఆరోపించారు. కర్ణాటకలో రాష్ట్రపతి పాలన అమలు చేయవలసిన సమయం వచ్చేసిందని వ్యాఖ్యలు చేశారు. హోం మంత్రిని ఏమడిగినా 'గొత్తిల్ల. ననగె గొత్తిల్ల' (తెలియదు. నాకు తెలియదు) అని బదులిస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి పదవి దిగాలని, ఉప ముఖ్యమంత్రికి బాధ్యతలు అప్పగించాలన్న డిమాండ్ మధ్య కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను సీఎం చేయాలన్న ఒత్తిడి తెరపైకి వచ్చిందన్నారు. సిద్ధరామయ్యను అధికార పీఠం నుంచి కిందకు దించే సాహసాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం చేయలేకపోతోందని ఎద్దేవా చేశారు.

ఉత్సాహంగా గ్రామీణ కృషి ఉత్సవం

సిరివార, (మాన్వి) : రాయచూరు వ్యవసాయ వర్సిటీ ఆధ్వర్యంలో మల్లట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల మైదానంలో రైతులు, విద్యార్థులకు కార్యానుభవ శిబిరం, గ్రామీణ కృషి ఉత్సవాన్ని నిర్వహించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు రూపొందించిన వివిధ పరికరాలు, వస్తువులు ఉత్సవంలో ఆకర్షణగా నిలిచాయి. జిల్లా వ్యవసాయ శాఖ డైరెక్టర్ ప్రకాష్ చౌహాణ్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ రైతులు సేంద్రియ సాగుపై ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. క్రిమిసంహారకాలు, రసాయన ఎరువులు లేని సాగు అన్ని విధాలా మేలు చేస్తుందన్నారు. మాన్వి తాలూకా ఏడీఏ గురునాథ్, యంకణ్ణ యాదవ్, రైతు సంపర్క కేంద్రం సంచాలకుడు మారుతి, విద్యార్థులు, అధికారులు, ప్రముఖులు, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం రాసికి పూజలు చేస్తున్న అధికారులు, ప్రముఖులు

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మాన్వి, న్యూస్‌టుడే : వ్యాధులు తీవ్రత కాకనే చికిత్సలు చేయించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కేపీఎస్‌వీఎస్ ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జీవనేశ్వరయ్య సూచించారు. కళాశాల ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మూలవ్యాధి సోకిన వారు బయటికి చెప్పుకోకుండా బాధపడతారని, ఆయుర్వేదం ద్వారా నయం చేసుకోవచ్చని తెలిపారు. 10 రోజుల పాటు శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు శంకరానంద, అంజు, పర్వీన్ కళాశాల ఆసుపత్రి వైద్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శిబిరాన్ని ప్రారంభిస్తున్న జీవనేశ్వరయ్య, తదితరులు

పట్టాలెక్కిన 'రైల్వే' ప్రగతి

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : సిటీ, కంటోన్మెంట్ రైల్వేస్టేషన్లను నైరుతి రైల్వే విభాగం జనరల్ మేనేజరు ముకుల్ శరణ మత్తూర్ గురువారం తనిఖీ చేశారు. వివిధ అభివృద్ధి పనుల తీరు పరిశీలించారు. కంటోన్మెంట్ రైల్వేస్టేషన్ వద్ద రూ.480 కోట్లతో కొనసాగుతున్న పనులు సమీక్షించారు. ప్రధాన భవనం, పట్టాల అమరిక పరిశీలించడంతో పాటు నాణ్యత వివరాలు తెలుసుకున్నారు. కంటోన్మెంట్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ చేపడుతున్నారు. ప్రయాణికులకు అన్ని సౌకర్యాలూ కల్పించేలా ప్రాంగణాలు విస్తరించాలని అధికారులు, గుత్తేదారులకు సూచించారు.

(c) eenadu

ఈనాడు ఒడిశా

30 మంది ప్రాణాలు కాపాడి ఊపిరొదిలిన డ్రైవర్

పి.సాయి కృష్ణ

సిమిలిగుడ, న్యూస్‌టుడే: ఆంధ్రలో విజయనగరం నుంచి ఒడిశాలో మల్కాన్‌గిరికి వెళ్తున్న ఓఎస్ ఆర్టీసీ బస్సు డ్రైవర్ గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. విధి నిర్వహణలో ఉన్న చోదకుడికి గుండెపోటు రావడంతో తన ప్రాణాలు పోతున్నా బస్సులో ఉన్న 30 మంది ప్రయాణికుల ప్రాణాలు కాపాడారు. వివరాల్లోకి వెళ్తే... విజయనగరం నుంచి మల్కాన్‌గిరికి గురువారం రాత్రి 30 మంది ప్రయాణికులతో ఓఎస్ ఆర్టీసీ బస్సు బయలుదేరింది. సిమిలిగుడ సమీపంలో కుంధిలి వద్ద బస్ డ్రైవర్ పి.సాయికృష్ణకు ఛాతిలో తీవ్రమైన నొప్పి వచ్చింది. నొప్పిని భరిస్తూ ఎటువంటి ప్రమాదం జరగకుండా బస్సును సురక్షితంగా పక్కన పెట్టి కృష్ణ కుప్పకూలిపోయారు. బస్సులో ఉన్న మరో డ్రైవర్ వెంటనే అదే బస్సులో ఆయనను కొరాపుట్‌లోని లక్ష్మణ్ నాయక్ వైద్య కళాశాల తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

కాత్యాయని అవతారంలో కటక్ చండీ

మార్గశిర అమావాస్య, గురువారం సందర్భంగా కటక్ చండీ అమ్మవారిని కాత్యాయని అవతారంలో అలంకరించారు. ఈ రూపం భక్తులకు నేత్రపర్వం చేసింది. మహిళలు అమ్మవారి సన్నిధిలో వ్రతాలు చేశారు.
– న్యూస్‌టుడే, భువనేశ్వర్

బంగాళాఖాతంలో ద్రోణి

గోపాలపూర్, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో మలక్కా పరిధిలో గురువారం అల్ప పీడనద్రోణి ఏర్పడిందని, దీనికి చేరువగా 5.8 కిలోమీటర్ల ఎత్తులో సముద్ర ఉపరితలంలో ఆవర్తనం కొనసాగుతోందని గోపాల్‌పూర్ వాతావరణ అధ్యయన కేంద్రం (ఐఎండీ) అధికారి ఉమాశంకర్ దాస్ సాయంత్రం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. ద్రోణి శనివారం (22న) నాటికి అల్పపీడనంగా మారుతుందని, తర్వాత 48 గంటల్లో వాయుగుండంగా పుంజుకోనుందన్నారు. ఇది తుపానుగానూ మారొచ్చన్న అంచనా ఉందని, పశ్చిమ-ఉత్తర, పశ్చిమ దిశగా 28న తీరం దాటే అవకాశం ఉందన్నారు. ఈ విపత్తు తమిళనాడు లేదా ఆంధ్రప్రదేశ్‌కు చేరువయ్యే సూచనలున్నాయని విదేశీ మెట్ సంస్థలు అంచనా వేశాయి. ఐఎండీ దీనిపై ఇంతవరకు కచ్చితంగా చెప్పలేకపోయినా, రాష్ట్రంలో వర్షాలకు అవకాశం ఉందని దాస్ చెప్పారు. అల్పపీడనం ఏర్పడిన తర్వాత దీనిపై స్పష్టంగా చెప్పగలుగుతామన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో చలితీవ్రత తగ్గింది. ఉష్ణోగ్రతలు పెరిగాయన్నారు.

పొంచి ఉన్న విపత్తు

- రైతన్నల గుండెల్లో గుబులు
- కోతకొచ్చిన పంట పాడవుతుందని ఆందోళన

మిషన్‌తో పంట కోత

గోపాలపూర్, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో విపత్తు పొంచి ఉంది. ఇది ఏ తీరానికి చేరువవుతుందన్న దానిపై వాతావరణ అధ్యయన శాఖ (ఐఎండీ) అధికారవర్గాలు అంచనా వేయకపోయినా, గాలి వాటం చెప్పలేమని, ఏమైనా జరగొచ్చని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

వానొచ్చినా, గాలి వీచినా నష్టమే

ఈ సమయంలో వానలు కురిసినా, గాలి వీచినా అన్ని పంటలకు నష్టం వాటిల్లుతుంది. వాతావరణం అనుకూలంగా లేకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారు. దేవుడు కరుణిస్తే ఇబ్బందులు తప్పుతాయి. లేకుంటే నెలల కష్టం వర్షంపాలవుతుంది.
– చిన్నయ్య, రైతు, కొరాపల్లి, రొంగాయిలొండ సమితి

డిసెంబరు రెండో వారం వరకూ పనులు

ఈ ఏడాది వరి పంట ఆశాజనకంగా ఉంది. పొలాల్లో వరి పంట కళకళలాడుతోంది. ధాన్యం క్వింటాలుకు రూ.3,169లు ప్రభుత్వం చెల్లిస్తున్నందున రైతన్నలు వరి దిగుబడిపై దృష్టి సారించారు. గంజాం జిల్లాలో పంట కోత, నూర్పిడి జరిగింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఆహార, పౌరసరఫరాల శాఖ తొలుతగా ఈ నెల 25 నుంచి కొనుగోళ్లకు నిర్ణయించింది. మిగతా జిల్లాల్లో ఇది డిసెంబరు 25 నుంచి ప్రారంభం కానుంది. అన్నిచోట్లా మండీలు తెరవడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఉత్తరకోస్తా, తీర జిల్లాల్లో అన్నదాతలు వరి కోతకు సన్నద్ధమవుతున్నారు. మరో పక్షం రోజుల్లో నూర్పిళ్లు పూర్తవుతాయన్న అంచనా ఉంది. దక్షిణ ఒడిశా జిల్లాల్లో డిసెంబరు ద్వితీయార్థం వరకు ఈ పనులు కొనసాగుతాయి. ధాన్యం బాగా పెరిగి వెన్నులు బరువెక్కిన ఈ సమయంలో గాలి వీచినా, భారీ వర్షాలు కురిసినా పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరి మాత్రమే కాదు, శీతాకాలం కూరగాయల పంటలూ పాడవుతాయని తల్లడిల్లుతున్నారు.

నేర నియంత్రణే ధ్యేయం కావాలి

ఒత్తిడికి గురి కావొద్దు: బాధ్యతగా విధులు నిర్వహించండి

ఎస్పీలకు ముఖ్యమంత్రి మోహన్ ఉద్బోధ

ప్రసంగిస్తున్న సీఎం మోహన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: నేర నియంత్రణ ధ్యేయం కావాలని, విధి నిర్వహణలో ఒత్తిడికి గురి కావొద్దని, బాధ్యతగా విధులు నిర్వహించాలని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి ఎస్పీలకు ఉద్బోధించారు. భువనేశ్వర్‌లోని లోక్‌సేవాభవన్ వేదికగా రెండు రోజుల కలెక్టర్లు, ఎస్పీల ముగింపు సదస్సు బుధవారం రాత్రి జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న సీఎం మాట్లాడుతూ... పోలీసు వ్యవస్థ గురించి విపులంగా వివరించారు.

ప్రజలతో సత్సంబంధాలు

ఫిర్యాదులు చేయడానికి పోలీసు స్టేషన్‌కు వస్తున్న ప్రజలను గౌరవించాలని వారి ఇబ్బందులు వినాలని, వివక్ష చూపరాదన్నారు. నేర నియంత్రణలో ఒత్తిళ్లకు గురి కాకుండా నిజాయతీగా మెలగాలన్నారు. చట్టాల అమలులో పోలీసు యంత్రాంగం బాధ్యతగా వ్యవహరించాలన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఐపీఎస్ అధికారులు

సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం మరో 20 సైబర్ ఠాణాల ఏర్పాటుకు నిర్ణయించినట్లు తెలిపారు. పోలీసులకు శిక్షణ, ఆధునిక ఆయుధ సంపత్తి ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు.

పాల్గొన్న మంత్రులు, ఉన్నతాధికారులు

రెండు రోజుల సదస్సులో భాగంగా పట్టణాభివృద్ధి, రవాణా, అటవీ, రెవెన్యూ, ప్రజాపనులు, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, నీటి సరఫరా, విద్యుత్తు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యశాఖ మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ ఆహుజా, అభివృద్ధి కమిషనర్ అను గార్గ్, వివిధ శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శులు పాల్గొని మాట్లాడారు.

విపత్తులు ఎదుర్కొనే శక్తి, సామర్థ్యాలున్నాయ్

మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి సింగ్‌దేవ్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కొనే శక్తి, సామర్థ్యాలు రాష్ట్రానికున్నాయని, అత్యాధునిక సాధనా సంపత్తి పుష్కలంగా ఉందని ఉపముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్ చెప్పారు. బుధవారం రాత్రి భువనేశ్వర్‌లోని రాజీవ్ భవన్‌లో 'విపత్తులు - శక్తి సామర్థ్యాలు' అన్న అంశంపై రెండురోజుల జాతీయ ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సింగ్‌దేవ్ మాట్లాడుతూ... విపత్తులు రాష్ట్రాన్ని తరచూ చుట్టుముడుతున్నందున ప్రాణనష్టం నివారణ, ఆస్తి నష్టం తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అగ్నిమాపక శాఖను పటిష్ఠం చేశామని, 20 ఓడ్రాఫ్ దళాలు ఇదివరకే ఏర్పాటు కాగా, మరో 10 దళాలు ఏర్పాటు కానున్నాయన్నారు. రెవెన్యూ, విపత్తు నివారణ శాఖల మంత్రి సురేష్ పూజారి మాట్లాడుతూ... విపత్తుల నివారణ సంస్థ (ఓఎస్‌డీఎంఏ) ఆధ్వర్యంలో సహాయ బృందాలు విపత్తుల సమయంలో ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు వెళ్లి సహాయ కార్యక్రమాలు చేపడుతున్నాయని చెప్పారు. ఈ సదస్సులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహుజా, అభివృద్ధి కమిషనర్ అనూగార్గ్, ప్రత్యేక రిలీఫ్ కమిషనర్ దేవ్‌రంజన్ కుమార్ సింగ్, ఇతర అధికారులు, ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీక్షేత్రంలో అమావాస్య సేవలు

శ్రద్ధావతారంలో పురుషోత్తముడు

గోపాలపూర్, న్యూస్‌టుడే: మార్గశిర అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం పూరీ శ్రీక్షేత్రంలో జగన్నాథుని సన్నిధిలో ప్రత్యేక సేవలు, వేడుకలు జరిగాయి. తెల్లవారు జాము 4 గంటలకు ఆలయం తలుపులు తెరిచిన సేవాయత్‌లు మంగళహారతి, మైలం, అబకాశ, గోపాలవల్లభ సేవలు చేపట్టారు. తర్వాత పురుషోత్తమునికి శ్రద్ధావతారంలో అలంకరించారు. శ్రీక్షేత్రం ఎదుట దీపాలు వెలిగించారు. మధ్యాహ్న ధూపం సమయంలో ఒబడా (మహాప్రసాదం), మరో 56 రకాల పిండి వంటకాలు సిద్ధం చేశారు. దేవ దీపావళి వేడుకల్లో భాగంగా పురుషోత్తముని తరపున దశరథ, కౌసల్యలకు ఆనవాయితీ ప్రకారం పిండ ప్రదానం చేయించారు. ఇతర గోప్య సేవలు నిర్వహించారు. ఉదయం జరిగిన దీపారాధనలో పూరీ ఎంపీ సంబిత్ పాత్ర్ పాల్గొన్నారు. మరో వైపు రాష్ట్ర పర్యటనలో ఉన్న కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమార స్వామి బుధవారం రాత్రి దేవ దీపావళి ఉత్సవంలో పాల్గొని దీపారాధన చేశారు.

దేవదీపావళిలో దీపం వెలిగిస్తున్న కుమారస్వామి

సామూహిక గీతా పఠనం.. ధ్యానం

వేడుకల్లో పాల్గొన్న అతిథులు, ఆధ్యాత్మికవేత్తలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: చిన్మయ మిషన్ 75 ఏళ్లయిన సందర్భంగా 'అమృత మహోత్సవాల' సందర్భంగా గురువారం భారీ ఎత్తున సామూహిక 'గీతా పఠనం, ధ్యానం' కార్యక్రమాన్ని నిర్వహించింది. నగర శివారున యూసీపీ ఇంజినీరింగు స్కూలు మైదానంలో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో బ్రహ్మపుర, పరిసర ప్రాంతాల నుంచి వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన వేలాది మంది విద్యార్థులు హాజరయ్యారు. వారు భగవద్గీతలో ఆరో అధ్యాయంలోని ఇరవై శ్లోకాలను సామూహికంగా పఠించారు. బ్రహ్మపుర చిన్మయ మిషన్ కేంద్రం ఆచార్యుడు స్వామి సదాశివానంద కార్యక్రమం వివరాలు, వేడుకల లక్ష్యాలను తెలిపారు. వేడుకల్లో బ్రహ్మపుర ఎమ్మెల్యే కె.అనిల్‌కుమార్, స్వామి ప్రకర్షానంద (సందీపని సాధనాలయ ఆచార్యుడు), స్వామి రఘువీరానంద (విశాఖ), రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) ఒడిశా ప్రతినిధి అనిల్ మిశ్ర, స్వామి నిర్లిప్తానంద (రవుర్కెలా), బ్రహ్మచారి ఆనంద్ (చెన్నై) తదితరులు మాట్లాడారు.

సామూహిక గీతా పఠనం చేస్తున్న పాఠశాల, కళాశాలల విద్యార్థులు

ఎమ్మెల్యేగా జయ ప్రమాణ స్వీకారం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: నువాపడ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో భాజపా నుంచి ఎన్నికైన జయ డోల్కియా గురువారం శాసనసభలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. సభాపతి సురమా పాఢి ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఆయన సభకు ఎన్నికైనట్లు అందుకున్న ధ్రువపత్రాన్ని స్పీకరుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన తల్లి కల్పనా, భార్య సుమన్, ఇతర బంధువులు పాల్గొన్నారు. అనంతరం జయ విలేకరులతో మాట్లాడుతూ... తన తండ్రి రాజేంద్ర డోల్కియా జయంతి రోజున ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆయన ఆశయాలు, ఆకాంక్షలు నెరవేరుస్తానని, అభివృద్ధే తన అజెండా అని, ప్రజలకు అండగా ఉంటానని తెలిపారు.

సభాపతి సురమాపాఢికి ధ్రువపత్రం అందజేస్తున్న జయ డోల్కియా

ముఖ్యమంత్రి ఆదేశం.. అధికారుల పరుగులు!

- సువర్ణపూర్‌లో విద్యుత్తు వెలుగులకు ఏర్పాట్లు

విద్యుత్తు స్తంభాలు గ్రామానికి తరలింపు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా ధారాకోట సమితిలో ఝూడబంధ పంచాయతీలోని మారుమూల సువర్ణపూర్ గ్రామంలో నేటికీ విద్యుత్తు వెలుగులు లేవన్న వార్తలకు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి స్పందించారు. అంధకారంలో మగ్గుతున్న గ్రామంలో విద్యుత్తు వెలుగులకు తక్షణం చర్యలు తీసుకోవాలని ఆయన గంజాం పాలనాధికారి వి.కీర్తివాసన్‌ను ఆదేశించిన సంగతి తెలిసిందే. దీంతో అధికారులు పరుగులు తీశారు. సమస్య తక్షణం పరిష్కారం దిశగా పాలనాధికారి ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఆయన ఆదేశంతో ధారాకోట బీడీవో సంగ్రాం కేసరి జెనా, జిల్లా పరిషత్ సభ్యుడు ప్రతాప్ స్వయిన్, విద్యుత్తు సరఫరా సంస్థ టీపీఎస్‌ఓడీఎల్ గంజాం జిల్లా నోడల్ అధికారి చందన్ దాస్ హుటాహుటిన సువర్ణపూర్ గ్రామానికి వెళ్లి క్షేత్ర స్థాయిలో పరిస్థితిని సమీక్షించారు. గ్రామంలో విద్యుత్తు సరఫరా కోసం పనులు ప్రారంభించామని టీపీఎస్‌ఓడీఎల్ అస్కా ఎలక్ట్రికల్ డివిజన్ కార్యనిర్వాహక ఇంజినీరు (ఈఈ) జగదీష్ మహాపాత్ర్ చెప్పారు. గురువారం ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ సువర్ణపూర్‌లోని 25 ఇళ్లకు బిజు గ్రామ్ జ్యోతి యోజన (బీజీజేవై) కింద విద్యుత్తు సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మొత్తం 35 స్తంభాలు ఏర్పాటు చేస్తామని, ప్రస్తుతం వాటిని గ్రామానికి తరలించడంతో పాటు పాతే పనులు చేపడుతున్నామన్నారు. 7 నుంచి 10 రోజుల్లో గ్రామానికి విద్యుత్తు సరఫరా చేయాలని పాలనాధికారి ఆదేశించారని, ఆ గడువులోగా పనులు పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

చిలికాలో గస్తీ ముమ్మరం

చిలికాలో పడవలో గస్తీ నిర్వహిస్తున్న అటవీ సిబ్బంది

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో వలస పక్షులకు నిలయమైన చిలికా సరస్సులో వేటగాళ్లపై గట్టి నిఘా పెట్టేందుకు చిలికా వన్యప్రాణి డివిజన్ అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టారు. ఇటీవల చిలికాలో విషమిచ్చి చంపిన 44 వలస పక్షుల్ని తరలిస్తున్న ఓ వేటగాడ్ని అటవీ అధికారులు అరెస్టు చేసి న్యాయస్థానానికి తరలించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనతో మరింత అప్రమత్తమైన అధికారులు చిలికా సరస్సులో, ఒడ్డున వివిధ బృందాలతో ముమ్మర గస్తీ నిర్వహిస్తున్నారు. డివిజన్‌లోని బల్లుగాం, టాంగీ, సతపడ, రంభ, చిలికా వన్యప్రాణి రేంజ్‌ల పరిధుల్లో 21 పక్షి భద్రతా శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆరు సొంత పడవలు, అద్దెకు తీసుకున్న మరో ఐదు పడవలు చిలికా సరస్సులో పరిస్థితిపై గట్టి నిఘా పెట్టామని చిలికా వన్యప్రాణి డివిజన్ అటవీ అధికారి (డీఎఫ్‌వో) అమ్లాన్ నాయక్ గురువారం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. గంజాం, ఖుర్దా, పూరీ జిల్లాలకు విస్తరించిన చిలికాకు ఏటా శీతాకాలంలో దేశ, విదేశాల నుంచి లక్షలాది పక్షులు వలస వస్తున్న సంగతి తెలిసిందే.

జగన్నాథుని సాగర బిజె వేడుక

అలంకరణలో నారాయణుడు

గోపాలపూర్, న్యూస్‌టుడే: మార్గశిర అమావాస్య పర్వదినం పురస్కరించుకుని గురువారం పూరీ శ్రీక్షేత్రంలో జగన్నాథుని సాగర బిజె వేడుక జరిగింది. గర్భగుడిలోని స్వామి ఉత్సవ విగ్రహం నారాయణునికి అలంకరణ చేసిన సేవాయత్‌లు పల్లకిలో ఉంచి బొడొదండోలో తిరువీధిగా మహోదధి తీరానికి తీసుకెళ్లి పూజలు చేసి ఆలయానికి తెచ్చారు.

మరో అయిదుగురికి శ్రీముఖాలు

- రథయాత్ర తొక్కిసలాట ఘటనలో చర్యలు

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ రథయాత్ర తొక్కిసలాట ఘటనపై హోంశాఖ మరో అయిదుగురిపై చర్యలకు శ్రీకారం చుట్టింది. కంట్రోల్ రూం బాధ్యతల్లో ఉన్న అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (ఏసీఎఫ్) అశోక్ బెహర, మరో నలుగురు సహాయ తహసీల్దారు స్థాయి అధికారులకు గురువారం శ్రీముఖాలు (షోకాజ్ నోటీసులు) జారీ చేసింది. ఈ ఏడాది రథయాత్ర రాత్రి గుండిచా మందిరం ఆవరణలో జరిగిన తొక్కిసలాటలో ముగ్గురు మృతి చెందగా, ఆరుగురికి గాయాలైన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై ప్రభుత్వం అదనపు ప్రధాన కార్యదర్శి అనూగార్గ్‌కు దర్యాప్తు బాధ్యత అప్పగించింది. ఇటీవల ఆమె హోంశాఖ యంత్రాంగానికి నివేదిక సమర్పించారు. దీన్ని ఆధారంగా యాత్ర సమయంలో విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేసిన ఏడుగురు పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి ప్రభుత్వం సిఫార్సు చేసిన సంగతి తెలిసిందే. ఇంతలో మరో అయిదుగురికి శ్రీముఖాలు పంపించిన హోంశాఖ ఎందుకు చర్యలు తీసుకోరాదు అన్నదానిపై వివరణ ఇవ్వాలని కోరింది.

ఓలీవుడ్‌కు మంచి రోజులు: సింగ్‌దేవ్

సినీ పరిశ్రమ ప్రముఖులతో వేదికపై ఉపముఖ్యమంత్రి సింగ్‌దేవ్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని కళింగ స్టూడియో త్వరలో పునఃప్రారంభం కానుందని, ఒడియా సినీపరిశ్రమ (ఓలీవుడ్)కు మంచి రోజులొచ్చాయని ఉపముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్ చెప్పారు. బుధవారం రాత్రి భువనేశ్వర్ గండముండ పరిధిలోని కళాభూమి పీఠంలో ఓలీవుడ్ కళాకారుల సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సింగ్‌దేవ్ మాట్లాడుతూ... రూ.200 కోట్ల వ్యయంతో కళింగ స్టూడియో ఆధునికీకరణ పనులు జరిగాయన్నారు. ఇక్కడ అన్ని సౌకర్యాలున్నాయని, దేనికీ కొరత లేదన్నారు. సినిమాల చిత్రీకరణకు ఇతర రాష్ట్రాలకు వెళ్లే ఇబ్బందులు ఉండవని, నిర్మాణ వ్యయం తగ్గుతుందన్నారు. ఒడియా చిత్రాల నిర్మాణాలు పెరుగుతాయన్న ఆశాభావం ఉందని, కళాత్మక చిత్రాలకు ప్రభుత్వ రాయితీలుంటాయని చెప్పారు. ఓలీవుడ్‌కి సంబంధించి ఇబ్బందులుంటే చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఒళి ఎమ్మెల్యే, సినీహీరో ఆకాష్ నాయక్ అధ్యక్షతన జరిగిన సదస్సులో చిత్రరంగ ప్రముఖులు పాల్గొన్నారు.

బాలికపై హత్యాచారం

నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి ఠాణా పరిధిలోని 2024లో బాలికపై జరిగిన హత్యాచారం ఘటనను విచారించి అదనపు జిల్లా జడ్జి న్యాయస్థానం బిభు ప్రసాద్ పండా గురువారం తీర్పు వెలువరించారు. నిందితుడు సేరంగో ఠాణా పరిధిలోని నువాగడ గ్రామానికి చెందిన యువరాజ్ కిషోర్ పాణిని దోషిగా నిర్ధారించి 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. బాధిత కుటుంబానికి రూ.4 లక్షలు నష్టపరిహారం అందజేయాలని జిల్లా న్యాయ సేవలు అథారిటీ ఆదేశించినట్లు ఎస్పీ జేకే పండా ఓ ప్రకటన విడుదల చేశారు.

తండ్రి దశదిన కర్మరోజే కుమారుడి మృతి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ఆ ఇంట్లో పెద్ద వ్యక్తి మృతిచెంది పదిరోజులైంది. కుటుంబమంతా తీవ్ర విషాదంలో ఉంది. 9 రోజుల పాటు దిన కర్మలు చేస్తూ వచ్చిన కుమారుడు ఆకస్మికంగా పదోరోజు మృతిచెందాడు. దీంతో ఆ కుటుంబంతోపాటు గ్రామస్థులూ షాకయ్యారు. గంజాం జిల్లా అస్కా సమితిలో సిద్ధనయి పంచాయతీలోని అతరంగ గ్రామంలో ఉదయ గౌడ మృతి చెందిన పదో రోజున కొడుకు రాజేంద్ర గౌడ హఠాత్తుగా మృతిచెందాడు. ఈ ఘటనతో గురువారం గ్రామంలో శోకఛాయలు అలముకున్నాయి. తండ్రి ఉదయ ఈ నెల 11న మృతిచెందాడు. గురువారం తండ్రి దశదిన కర్మ చేయాల్సి ఉండగా, బుధవారం రాత్రి ఇంట్లో పడుకుని ఉన్న కొడుకు రాజేంద్ర హఠాత్తుగా కడుపు నొప్పితో బాధపడ్డాడు. దీంతో ఆయనను గ్రామస్థులు అస్కాలోని ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఉదయకు ఏకైక కుమారుడు రాజేంద్ర. రాజేంద్ర సోదరికి పెళ్లయి అత్తారింటికి వెళ్లిపోయింది. రాజేంద్రకు భార్య, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఇంటికి ఏకైక ఆధారమైన ఆయన మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది. ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రమాదాల కాలం... నిఘాకు నిర్ణయం

- రాష్ట్రంలో భయం గొలిపే సీజన్‌గా నవంబర్ - మార్చి

చలానా వేస్తున్న పోలీసులు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో నవంబర్ - మార్చి మధ్య అత్యధిక రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటూ ప్రమాదాల సీజన్‌గా మారుతోంది. దీనికి తీవ్రంగా పరిగణించిన సర్కారు వీటి నియంత్రణకు ప్రత్యేక నిఘా పెంచాలని నిర్ణయం తీసుకుంది. గతేడాదిలో జరిగిన 12 వేలకు పైగా రోడ్డు ప్రమాదాల్లో 6,142 మంది దుర్మరణం చెందగా, వీటిలో నవంబర్ - మార్చి మధ్యలో 5,744 ప్రమాదాలు, 2,859 మరణాలు నమోదు కావడం గమనార్హం. వాణిజ్య, రవాణా శాఖ విడుదల చేసిన నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. 2023తో పోలిస్తే గతేడాది రోడ్డు ప్రమాద మరణాల రేటు మరింత పెరిగింది. 2024లో చోటు చేసుకున్న మొత్తం 12.375 ప్రమాదాల్లో 75 శాతం మితిమీరిన వేగం, తప్పుడు మార్గాల్లో ప్రయాణం, మద్యం తాగి వాహనాలు నడపడం కారణాల వల్ల నమోదయ్యాయి. మొత్తం ప్రమాదాల్లో 5 శాతం, మరణాల్లో 56 శాతం జాతీయ, రాష్ట్ర రహదారులపై చోటు చేసుకోవడం గమనార్హం. రోడ్డు ప్రమాదాల్లో అధికంగా 5,490 ద్విచక్ర వాహనాల సంబంధిత ప్రమాదాలు కాగా, వీటి కారణంగా 3,017 మంది మృతి చెందారు. కారు, లైట్ మోటార్ వాహనాల వల్ల 1,796 ప్రమాదాలు జరగగా, 739 మంది చనిపోయారు. ట్రక్కులు, లారీల ప్రమాదాల్లో 607 మరణాలు నమోదయ్యాయి.

ఈ జిల్లాల్లో ఎక్కువ.. 2023తో పోలిస్తే గతేడాది పూరీ, భద్రక్, కటక్ జగపతి, ఝార్సుగూడ జిల్లాల్లో రోడ్డు ప్రమాదాలు, మరణాలు పెరిగాయి. సాయంత్రం 3 నుంచి రాత్రి 9 మధ్య అత్యధిక ప్రమాదాలు జరిగినట్లు నివేదిక బహిర్గతం చేసింది. దీనిపై రవాణాశాఖ కమిషనర్ అమితాబ్ ఠాకూర్ మాట్లాడుతూ డిసెంబర్ నుంచి మార్చి వరకు రోడ్డు ప్రమాదాలు, మరణాల నియంత్రణకు ప్రత్యేక నిఘా చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతానికి నవంబర్ 16 నుంచి 30 వరకు శూన్య మరణాల ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు ఆయన గుర్తుచేశారు.

వివిధ కేటగిరీల్లో గతేడాది చోటుచేసుకున్న ప్రమాదాలు, మరణాల వివరాలు పరిశీలిస్తే....

కేటగిరీ	ప్రమాదాలు	మరణాలు
మితిమీరిన వేగం	7,269	3,846
తప్పుడు మార్గ ప్రయాణం	1,103	470
మద్యం తాగి	838	317
చరవాణి వినియోగిస్తూ నడపడం	585	235
ట్రాఫిక్ సిగ్నల్ నిబంధనల అతిక్రమణ	88	35



(c) eenadu

ఈర్ష్య, ద్వేషమే దుఃఖానికి కారణం

వేడుకల్లో పాల్గొన్న రవాణా శాఖ మంత్రి జెనా, బ్రహ్మపుర ఎమ్మెల్యే అనిల్ కుమార్, బ్రహ్మకుమారి శివానీ తదితరులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ప్రస్తుత సమాజంలో ఈర్ష్య, ద్వేషం, అసూయలు వంటివి పెరుగుతున్నాయని, దుఃఖాలకు ఇదే కారణమని అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన ఆధ్యాత్మికవేత్త, ప్రముఖ వక్త బ్రహ్మకుమారి శివానీ అన్నారు. స్థానిక బ్రహ్మకుమారీస్ శాంతి కుంజ్ ఆధ్వర్యంలో స్థానిక ఖోటే కోట వద్దనున్న మైదానంలో బుధవారం రాత్రి బ్రహ్మకుమారీల ఆధ్యాత్మిక వేడుకలు జరిగాయి. ఇందులో బ్రహ్మకుమారి శివానీ పాల్గొని 'ఆధునిక ప్రపంచంలో భావోద్వేగ శ్రేయస్సు' అనే అంశంపై ప్రసంగించారు. బ్రహ్మపుర మాల సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి బిభూతి భూషణ్ జెనా, బ్రహ్మపుర ఎమ్మెల్యే కె.అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రమేష్‌చంద్ర ఛ్యవ్‌పట్నాయక్, బ్రహ్మపుర వర్సిటీ ఉపకులపతి ఆచార్య గీతాంజలి దాష్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. వేడుకల్లో బాలీవుడ్ గాయకుడు హరిష్ మోయల్ సంగీత విభావరి ఏర్పాటైంది.

పారా స్విమ్మింగ్ క్రీడాకారులకు మంత్రి అభినందన

పతకాలతో క్రీడాకారులు: చిత్రంలో మంత్రి సూర్యవంశీ

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో జరిగిన జాతీయ పారా స్విమ్మింగ్ పోటీల్లో 39 పతకాలతో రాష్ట్రానికి తిరిగొచ్చిన ఒడిశా పారా క్రీడాకారులను రాష్ట్ర క్రీడలశాఖ మంత్రి సూర్యవంశీ అభినందించారు. భువనేశ్వర్‌లోని కళింగ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బుధవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో పారా క్రీడాకారులను అభినందిస్తూ.. భవిష్యత్తులో మరిన్ని పతకాలతో రాష్ట్ర ఖ్యాతిని పెంపొందించాలన్నారు. పోటీల్లో వివిధ కేటగిరీలలో రాష్ట్ర పురుషులు, మహిళా క్రీడాకారులు 8 పసిడి, 18 రజత, 13 కాంస్య పతకాలను గెలుచుకున్నట్లు ఒడిశా పారా క్రీడల సంఘం కార్యదర్శి సునీల్ ప్రధాన్ గురువారం సాయంత్రం 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

లబ్ధిదారులకు వర్క్ ఆర్డర్లు అందజేత

వర్క్ ఆర్డర్లు అందుకున్న లబ్ధిదారులు, ఎమ్మెల్యే అనిల్‌కుమార్, మేయరు దొళాయి, కమిషనర్ రాజశిర్కె తదితరులు

బ్రహ్మపుర బజారు, న్యూస్‌టుడే: రాష్ట్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ పీఎంఏవై-2.0 ద్వారా బ్రహ్మపుర పురపాలక సంఘం (బీఈఎంసీ) పరిధిలోని వివిధ వార్డుల్లో పీఎంఏవై లబ్ధిదారులకు గురువారం వర్క్ ఆర్డర్లు అందజేశారు. బీఈఎంసీలోని కన్వెన్షన్ హాల్లో ఏర్పాటైన కార్యక్రమంలో హాజరైన బ్రహ్మపుర ఎమ్మెల్యే కె.అనిల్‌కుమార్, మేయరు సంఘమిత్ర దొళాయి, ఉపమేయరు వివేకరెడ్డి, కమిషనర్ ప్రమేష్ అరవింద రాజశిర్కె వీటిని ప్రదానం చేశారు. ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ అందరికీ సొంత ఇల్లు ఉండేలా గృహయోగ్యం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. వర్క్ ఆర్డర్లు తీసుకున్న వారిలో మొట్టమొదటగా అనుకున్న లక్ష్యం లోగా ఇంటిని నిర్మించుకుని గృహప్రవేశం తేదీ ఖరారు చేసుకున్న ఒకరికి ప్రభుత్వం రూ.20వేల నగదు బహుమతి అందజేస్తుందని ఆయన చెప్పారు. మేయరు దొళాయి, ఉపమేయరు, ఆశీర్వాద్ పరిదా, ఎమ్మెల్యే ప్రతినిధి అశోక్‌కుమార్ శర్మ, ఎంపీ ప్రతినిధి బాలకృష్ణ సామంత్రాయ్ పాల్గొన్నారు.

దత్తత అవగాహన రథం ప్రారంభం

జెండాలు ఊపి రథాన్ని ప్రారంభిస్తున్న అశుతోష్

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: చిన్నారులను చట్టపరంగా దత్తత తీసుకోవడం అనే అంశంపై జిల్లా వ్యాప్త అవగాహన రథాన్ని జిల్లా యంత్రాంగం ప్రారంభించింది. గురువారం కలెక్టర్ అశుతోష్ కులకర్ణి ముఖ్య అతిథిగా, ఇతర అధికారులు గౌరవ అతిథులుగా పాల్గొని జెండాలు ఊపి రథాన్ని ప్రారంభించారు. దత్తత నియమాలు, విధివిధానాలు, చిన్నారుల సంరక్షణ తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై నెలకొన్న సందేహాలను రథం పూర్తిగా నివృత్తి చేయనుందని అశుతోష్ ఆశాభావం వ్యక్తం చేశారు. అదనపు కలెక్టర్ నవీన్ చంద్ర నాయక్, జిల్లా శిశు సురక్ష అధికారి ప్రతిమా దాస్, దశరథ్ సోరెన్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యం

విద్యార్థినికి ప్రశంసా పత్రం, బహుమతి అందజేస్తున్న డిప్యూటీ రిజిస్ట్రార్ హరిహర సెఠి

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే సహకార సంఘాల ప్రధాన లక్ష్యమని సబ్ కలెక్టర్ అనూప్ పండా అన్నారు. 72వ సహకార సంఘం వారోత్సవాల్లో భాగంగా పర్లాఖెముండి పట్టణంలోని కో-ఆపరేటివ్ సొసైటీ కార్యాలయం ప్రాంగణంలోని సింహాద్రి అప్పన్న కల్యాణ మండపంలో గురువారం జిల్లా స్థాయి సహకార సంఘాల సమావేశం నిర్వహించారు. సబ్ కలెక్టర్ అనూప్ పండా, రెవెన్యూ ఏడీఎం మునీంద్ర పాల్గొని మాట్లాడుతూ రైతులు సొసైటీల్లో అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. సహకార సంఘం డిప్యూటీ రిజిస్ట్రార్ హరిహర సెఠి, జడ్పీ సభ్యుడు ఎస్ బాలరాజు పాల్గొన్నారు.

నమ్మించారు.. మోసం చేసి కాజేశారు

చెత్తకుప్పల మధ్య ఉన్న వృద్ధురాలు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: ఎవరూ లేని వృద్ధురాలికి న్యాయపరంగా రావాల్సిన పింఛను పథకాన్ని కాజేసి అనాథగా వదిలేసిన హృదయ విదారక సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది... వివరాల్లోకి వెళ్తే.. గజపతి జిల్లా రాయగడ బ్లాక్ పరిధిలోని రాయగడ గ్రామం స్టాల్లింగ్ వీధిలో నివాసముంటున్న ఋషాగమన స్వాల్లెంగ్(82) భర్త 2008లో మృతి చెందారు. ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసిన ఆయన పింఛను ఈమెకు రావాల్సి ఉండగా వీధిలో నివసిస్తున్న కొందరు పింఛను వచ్చేలా చేసి వివరాన్ని ఆమెకు తెలియకుండా కాజేశారు. కొద్ది రోజుల కిందట బ్యాంకు సిబ్బంది లైఫ్ సర్టిఫికెట్ కోసం ఆమె వద్దకు వెళ్లిన వివరాలు పరిశీలించారు. ఆమె బ్యాంకు ఖాతాలో నుంచి పింఛను సొమ్ము ఎవరో తీసుకున్నట్లు ఇరుగుపొరుగు వారికి బ్యాంకు సిబ్బంది తెలియజేశారు. దీంతో ఆమె బంధువు సుఖానందో రావాల్లో పొందారు. పింఛను 10 ఏళ్లలో సుమారు రూ.25 లక్షలకు పైగా దోచుకున్నారని, నిందితులు అదే ప్రాంతానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు నిలేష్, సూరజ్, ఉజాల్ బర్జుగ్‌లుగా ఫిర్యాదు చేశారు. వీరు వృద్ధురాలి తాలూకు ఆధార్ కార్డు, బ్యాంకు సంబంధింది పత్రాలు తమ వద్దే ఉంచుకున్నట్లు ఫిర్యాదు దారు తెలిపారు. వృద్ధురాలు బాటిల్స్ సంచులు ఏరుకుంటూ జీవిస్తుందని, కొద్ది నెలల కిందట కళ్ళు చిరిగిపోవడం, మానసికంగా కుంగిపోయి చెత్త కుప్పల మధ్య జీవనం కొనసాగిస్తోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు తెలిపారు.

నందపూర్ ల్యాంప్స్‌కు పురస్కారం

పురస్కారాన్ని అందుకుంటున్న ల్యాంప్స్ అధికారులు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయిలో ద్వితీయ ఉత్తమంగా నందపూర్ ల్యాంప్స్‌కు బహుమతి లభించింది. భువనేశ్వర్‌లో బుధవారం జరిగిన రాష్ట్రస్థాయి 72వ సహకార సంఘం వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో రైతుల శ్రేయస్సు అభివృద్ధి కోసం కృషి చేసిన ల్యాంప్స్‌కు బహుమతులను అందజేయగా నందపూర్ ల్యాంప్స్‌కు ద్వితీయ బహుమతి లభించింది. రాష్ట్ర సహకార శాఖ మంత్రి ప్రదీప్ బాలసామంత ముఖ్య అతిథిగా పాల్గొని అతిథులుగా సహకార సంఘం ప్రధాన కార్యదర్శి రాజేష్ ప్రభాకర్ పటేల్, అడిషనల్ సెక్రటరీ సంతోష్ కుమార్ పాల్గొని బహుమతి అందజేశారు. ల్యాంప్స్ ఎండీ సురేష్ పండా, డైరెక్టర్ బలభద్ర సియా తదితరులు పురస్కారాన్ని అందుకున్నారు.

సిమిలిపాల్‌లో నల్లపులుల సఫారీ?

అభయారణ్యంలో 'కాలియా'

భువనేశ్వర్, న్యూస్‌టుడే: మయూర్‌భంజ్ జిల్లా సిమిలిపాల్ అడవిలో 'కాలియా' (నల్ల పులి) ఈ జాతి అభివృద్ధికి దోహదపడుతోందని మాజీ డీసీసీఎఫ్ సుశాంత నంద బుధవారం సామాజిక మాధ్యమాల్లో పేర్కొన్నారు. కాలియా ఫోటో విడుదల చేసిన ఆయన బ్లాక్ బ్యూటీగా నామకరణం చేశారు. ఇది వరకు శిమిలిపాల్‌లో 6 పులులుండేవని, కాలియా ఆడపులులతో సాన్నిహిత్యం పెంచుకోవడంతో ఈ ప్రాణుల సంఖ్య 30కి పెరిగినట్లు తెలిపారు. ఈ అభయారణ్యంలో నల్లపులుల సఫారీ ఏర్పాటుకు కేంద్ర జూ అథారిటీ ఇదివరకే అనుమతిచ్చింది.

కోణార్క్ అందాలు తిలకించిన కుమారస్వామి

కోణార్క్ ఆలయం వద్ద కుమార స్వామి దంపతులు

గోపాలపూర్, న్యూస్‌టుడే: కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామి సతీసమేతంగా గురువారం సాయంత్రం కోణార్క్ శిల్ప కళారామం తిలకించారు. ఆయనకు పురావస్తు శాఖ (ఏఎస్ఐ) అధికారులు ఆలయ విశేషాలు వివరించారు.

మందిరాలు.. ఇళ్లల్లో మహాలక్ష్మీ పూజలు

లంజిపల్లిలోని మందిరంలో మహాలక్ష్మికి పూజలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: మార్గశిర గురువారం సందర్భంగా బ్రహ్మపురలో వివిధ ప్రాంతాల్లోని మహాలక్ష్మి మందిరాల్లో రోజంతా ప్రత్యేక పూజలు, కలువ పూలతో విశేష అర్చనలు నిర్వహించారు. నగరంలోని పలు ఒడియా కుటుంబాల్లో మహిళలు ఇళ్లల్లో భక్తిశ్రద్ధలతో గురువారం లక్ష్మీ పూజలు చేశారు.

కృత్రిమ అవయవాల అమరిక శిబిరం

కృత్రిమ అవయవాలతో వృద్ధులు

బ్రహ్మపుర బజారు, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ ఆఫ్ బ్రహ్మపుర ఈస్ట్ ఆధ్వర్యంలో మూడు రోజులు జరిగిన ఉచిత కృత్రిమ అవయవాల అమరిక శిబిరం గురువారం ముగిసింది. స్థానిక ధర్మసాగర్‌లోని రోటరీ ఈస్ట్ సామాజిక భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దివ్యాంగులకు ఆయా పరికరాలను అమర్చారు. శిబిరంలో సుమారు వందమందికి కృత్రిమ అవయవాలు, కాలిపర్, వాకింగ్ కర్రలు, ఎల్‌బో క్రచ్, ఆక్సిలరీ క్రచ్, వినికిడి మిషన్లు, బ్లైండ్ స్టిక్ తదితరాలు అందజేసి వాటిని ఎలా వినియోగించుకోవాలో వివరించారు.

సిమిలిగుడ కళాశాల ప్రిన్సిపల్‌కు సత్కారం

ప్రిన్సిపల్‌ను సత్కరిస్తున్న అతిథులు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ ఝూన్సీ సింగ్‌ను కొరాపుట్‌లో ఇగ్నో సంస్థ ద్వారా సత్కారాన్ని పొందారు. ఇగ్నో 40వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గురువారం ఇగ్నో ప్రాంతీయ కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యారంగంలో విశిష్ట సేవలకు గాను ఝూన్సీను సత్కరించారు. ముఖ్య అతిథిగా ఏడీఎం భక్తబంధు జనార్దన్ దొళాయి పాల్గొన్నారు.

బిహార్ సీఎం ప్రమాణ స్వీకారోత్సవంలో మోహన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బిహార్ రాజధాని పట్నా నగరంలోని గాంధీ మైదానంలో ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్ ప్రమాణ స్వీకారోత్సవంలో ఒడిశా ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి, ఉపముఖ్యమంత్రులు కనకవర్ధన్ సింగ్‌దేవ్, ప్రభాతి పరిదా పాల్గొన్నారు. బిహార్ ముఖ్యమంత్రిగా పదోసారి పదవీ బాధ్యతలు చేపట్టిన నితీశ్ కుమారకు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, ఉపముఖ్యమంత్రులు కనకవర్ధన్ సింగ్‌దేవ్, ప్రభాతి పరిదా, మాజీ ముఖ్యమంత్రి, బిజద అధినేత నవీన్ పట్నాయక్‌లు గురువారం అభినందించారు. సీఎం, ఉపముఖ్యమంత్రులు నితీశ్‌ను పట్నాలో స్వయంగా కలుసుకోగా, నవీన్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో అభినందించారు.

సత్య సాయి శతజయంతి ఉత్సవాలు

రాయగడ, ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కొత్త పేట సత్యసాయి సేవా సమితిలో గురువారం ఉదయం నగర సంకీర్తన, సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు జరిగాయి. ● భగవాన్ సత్యసాయి కొత్త కోళీ శ్రీ సత్య సాయి సేవా కేంద్రంలో సత్యసాయి ఆర్గనైజేషన్స్ బుధవారం సత్య సాయి శతజయంతి వేడుకలు నిర్వహించారు.

భావి శాస్త్రవేత్తలతోనే వికసిత్ భారత్

బహుమతులు అందుకున్న విజేతలు, చిత్రంలో అతిథులు

రాయగడ, న్యూస్‌టుడే: విద్యార్థులు నిరంతరం వినూత్న ఆవిష్కరణలు రూపొందించేందుకు కృషి చేయాలని, వాస్తవాలను మాత్రమే అందించే శాస్త్ర అధ్యయనంపై దృష్టి పెట్టాలని బీడీఓ సుజిత్ కుమార్ మిశ్ర అన్నారు. బుధవారం స్థానిక జీసీడీ ఉన్నత పాఠశాల సమావేశ భవనంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. జిల్లా అదనపు విద్యాధికారి భజన్ లాల్ మాఝి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ప్రతిష్ఠ నిలిపేందుకు కృషి చేయాలి

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రతిష్ఠ నిలిపేందుకు కార్యకర్తలంతా కృషి చేయాలని ఎమ్మెల్యే రామ్‌చంద్ర కడం పిలుపునిచ్చారు. పొట్టంగి నియోజకవర్గం స్థాయి కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం గురువారం సిమిలిగుడలో అన్న గార్డెన్‌లో ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కడం పాల్గొని కార్యకర్తలకు సూచనలు, సలహాలు అందించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రూపాక్ తురుక్ మాట్లాడుతూ విభేదాలు విడిచి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు.

ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కడం

సంప్రదాయాలు, సంస్కృతులను పరిరక్షించాలి

ప్రత్యేక పుస్తకావిష్కరణ చేసిన అతిథులు

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా కేంద్రంలో స్థానిక నైపుణ్య అభివృద్ధి కేంద్రంలో ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. అవిభక్త కొరాపుట్ జిల్లాలో జీవనం సాగిస్తున్న పలు గిరిజన జాతులపై అధ్యయనం చేసిన పలువురు నిపుణుల సహాయంతో కనుమరుగవుతున్న సంప్రదాయాలు, కళలు, సంస్కృతులపై పుస్తకావిష్కరణ చేశారు. లక్ష్మీపురం ఎమ్మెల్యే పవిత్ర శాంత పాల్గొన్నారు.

ఉత్తరప్రదేశ్ దంపతులకు దత్తత

దంపతులతో కలెక్టర్ మధుమిత

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా శిశు సంరక్షణ పర్యవేక్షణలో ఉన్న 3, 4 ఏళ్ల బాలలను ఉత్తరప్రదేశ్ దంపతులకు కలెక్టర్ మధుమిత చేతుల మీదుగా గురువారం దత్తత ఇచ్చారు. అంతర్జాలం ద్వారా శిశు విభాగం గురించి తెలుసుకున్న వీరు రెండేళ్ల కిందట దరఖాస్తు చేసుకోగా వివరాలను పరిశీలించిన అధికారులు వారికి దత్తత ఇచ్చేందుకు అంగీకరించారు.

చైతన్యంతోనే ప్రమాదాల నివారణ

రాయగడ, న్యూస్‌టుడే: వాహన చోదకుల నిర్లక్ష్యం, ఏమీ జరగదనే మొండితనం, అతివేగం, నిద్ర లేమి తదితర కారణాల వలన ప్రమాదాలు జరుగుతున్నాయని, చోదకులు చైతన్య వంతులైతే వీటిని నివారించొచ్చని అదనపు కలెక్టర్ నవీన్ చంద్ర నాయక్ అన్నారు. బుధవారం ప్రాంతీయ రవాణా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన చైతన్య రథం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రవాణాధికారి బినయ్ కుమార్ పాలో ఉన్నారు.

చైతన్య రథాన్ని ప్రారంభిస్తున్న నాయక్, బినయ్

వైభవంగా అయ్యప్ప పడిపూజ..

గజపతి జిల్లాలోని పర్లాఖెముండి పట్టణంలోని ఆరోగ్య వీధిలో అయ్యప్ప స్వామి భక్తులు రోహిత్ కన్నె స్వామి ఇంటి ప్రాంగణంలో ప్రత్యేకంగా అయ్యప్ప మండపాన్ని అలంకరించి అప్పారావు గురుస్వామి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. – న్యూస్‌టుడే, పర్లాఖెముండి

ఆచార్య కిన్సుక్ నస్కర్‌కు ఉన్నత పదవి

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఖరగ్‌పూర్ ఐఐటీ పూర్వ విద్యార్థి ఆచార్య కిన్సుక్ నస్కర్ జర్మనీలోని ఐపీఎఫ్ ఫెలోగా రబ్బర్ టెక్నాలజీ సెంటర్ (ఆర్టీసీ) ఛైర్మన్‌గా నియామకం అయ్యారు. దీంతో ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

ఎల్ఎల్‌బీలో దీపాలికి స్వర్ణం

నవరంగపూర్, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన దీపాళి కోల్‌కతా విశ్వవిద్యాలయంలో బీబీఏ, ఎల్ఎల్‌బీ పూర్తి చేసి బంగారు పతకం సాధించింది. ప్రముఖ న్యాయవాది నరసింగ్ త్రిపాఠి వద్ద జూనియర్ న్యాయవాదిగా పని చేయనున్నట్లు తెలిపింది.

బాలికపై అత్యాచారం: నిందితుడికి అయిదేళ్ల కారాగారం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: కొంధమాల్ జిల్లా జి.ఉదయగిరి ఠాణా పరిధిలోని ఓ ప్రాంతానికి చెందిన తొమ్మిదేళ్ల బాలికను ఈ ఏడాది ఏప్రిల్ 18న అపహరించి, అత్యాచారం చేసిన ఘటనను విచారించిన ఫుల్బాణీలోని పోక్సో న్యాయస్థానం బుధవారం తీర్పు వెలువరించింది. నిందితుడు శిబరామ్ ప్రధాన్ అలియాస్ సిడా (27)కు అయిదేళ్ల జైలు శిక్ష, రూ. 8 వేలు జరిమానా విధించినట్లు ఆ తీర్పులో పేర్కొంది. జరిమానా చెల్లించలేని పక్షంలో మరో ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాలని న్యాయస్థానం వెల్లడించిందని పోక్సో న్యాయస్థానం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటరు అసీమ్ ప్రహరాజ్ విలేకరులకు తెలిపారు. బాధితురాలికి రూ. లక్ష నష్ట పరిహారం చెల్లించాలని న్యాయస్థానం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ)ను ఆదేశించిందని ఆయన వివరించారు.

అత్యాచారం కేసులో 20 ఏళ్లు శిక్ష

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కేంద్రపడ జిల్లాకు చెందిన 8 ఏళ్ల బాలికపై ఈ ఏడాది ఫిబ్రవరి 19న ఆటోరిక్షా నడిపే స్వయం ప్రకాష్‌నాయక్ అత్యాచారం చేశాడు. ఈ కేసు పోక్సో కోర్టు విచారణ చేసింది. బుధవారం జడ్జి ప్రజ్ఞాన్ పరిమిత రౌళో నిందితుడికి 20 ఏళ్ల జైలు, రూ.50 వేలు జరిమానా విధించారు. బాధిత కుటుంబానికి రూ.6 లక్షల మొత్తాన్ని జిల్లా లీగల్ అథారిటీ ఆర్థిక సాయం చేయాలని ఆదేశించారు.

డిసెంబరు 2 నుంచి పోటీలు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణంలో జిల్లా స్థాయి 'పరబ్' ఉత్సవాల్లో భాగంగా డిసెంబర్ 2-8 వరకు నాటకం, చిత్రలేఖన, రచన, పాటల పోటీలు నిర్వహించనున్నట్లు యంత్రాంగం నిర్ణయించింది. ఈ నెల 25 తేదీ లోపు బీడీవోలు పోటీదారుల పేర్లు నమోదు చేసుకోవాలని సబ్ కలెక్టర్ సస్యరెడ్డి ఆదేశించారు. స్థానిక కల్యాణ మండపంలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు వాటికి తగిన ఏర్పాట్లు చేయనున్నట్లు బీడీవో శక్తి మహాపాత్ర్, తహసీల్దారు సబ్యాసాచి చెన్నా తెలిపారు.

వృద్ధులకు బ్యాంక్ చేయూత

రాయగడ, న్యూస్‌టుడే: వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న ప్రభుత్వ పింఛన్‌దారులకు గుణుపురం ఎస్‌బీఐ చేయూత అందిస్తోంది. పింఛన్ దారులు ప్రతీ ఏడాది నవంబర్ నెలలో బ్యాంక్‌కు సమర్పించాల్సిన లైఫ్ సర్టిఫికెట్ అందివ్వలేని వారి ఇంటి వద్దకే బ్యాంక్ ఉద్యోగులు వెళ్లి, నింపి బ్యాంక్‌కు సమర్పిస్తున్నారు. గురువారం బ్యాంక్ సిబ్బంది సురేంద్ర బెహరా, ఎస్ మోహన్, అశుతోష్ బారిక్‌లు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

అఖిల భారత పోటీల్లో ప్రదర్శించే నాటికలు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణ జై హింద్ నగర్ ప్రముఖ సాంస్కృతిక కళా, సేవా సంస్థ ప్రవాసాంధ్ర నవ్య కళాపరిషత్తు డిసెంబర్ 20, 21 తేదీల్లో అఖిల భారత స్థాయి నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. ఇందులో ఏడు నాటికలు ప్రదర్శిస్తారని ప్రకటించింది. 20వ తేదీన అజ్ఞాతవాసం, దేవరాగం, ఇది కదా ముగింపు, నువ్వు ఒక సగం - నేను ఒక సగం, 21వ తేదీన పున్నామ నరకం, దేవుడు కనిపించాడు, మధుర స్వరం ప్రదర్శిస్తారు.

డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన

శంకుస్థాపన చేసిన కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చో

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ పురపాలికలో డ్రైనేజీల నిర్మాణానికి కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చో శంకుస్థాపన చేశారు. పలు వార్డుల్లో పారిశుద్ధ్యం దిగజారి అధ్వానంగా ఉందని అందిన ఫిర్యాదులకు స్పందించిన పురపాలిక ఛైర్మన్ లలాట రంజన్ సేథీ చర్యలకు తీసుకున్నారని ఆయనకు అభినందనలు తెలిపారు.

దివ్యాంగుల గుర్తింపు శిబిరం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: దమన్‌జోడిలో గురువారం దివ్యాంగుల గుర్తింపు శిబిరాన్ని నిర్వహించారు. 500 మందికి కృత్రిమ అవయవాలు, పునరావాసం కల్పించేందుకు నాల్కో ఫౌండేషన్ ద్వారా కృత్రిమ అవయవాల తయారీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (అలింకో) సంస్థతో నవంబర్ మొదటి వారంలో ఒప్పందం జరిగిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా నాల్కో ఆరోగ్య కేంద్రంలో దివ్యాంగుల గుర్తింపు శిబిరాన్ని ఏర్పాటు చేయగా నాల్కో కార్యనిర్వాహక సంచాలకులు నిరంజన్ సామల్ శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు పాల్గొని దివ్యాంగులకు వివిధ పరీక్షలు జరిపి అర్హత గల వారికి కృత్రిమ అవయవాలు అందజేసేందుకు గుర్తించారు.

హితకారిణి పాఠశాల శతాబ్ది ఉత్సవాలు ప్రారంభం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణ మలంచా ప్రాంతంలో ఉన్న హితకారిణి పాఠశాల శతాబ్ది ఉత్సవాలు ఘనంగా బుధవారం జరిగాయి. పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్య అతిథులు జ్యోతి వెలిగించి మాట్లాడారు.

జ్యోతి ప్రజ్వలనంలో అతిథులు

ఘనంగా లక్ష్మీభాయ్ జయంతి

ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణం విక్రమ్‌దేవ్ విశ్వవిద్యాలయంలో రాణీ లక్ష్మీభాయ్ 196 జయంతి, స్త్రీశక్తి దివస్ కార్యక్రమం వర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ దేవి ప్రసాద్ మిశ్ర, డా.ప్రశాంత్ కుమార్ పాత్ర్ అధ్యక్షతన గురువారం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించాలరు.

చెరువులో పడి వ్యక్తి మృత్యువాత

నవరంగపూర్, న్యూస్‌టుడే: చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన నవరంగపూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ సమితి బుర్జా పంచాయతీ కుసుమగూడ గ్రామంలో జరిగింది. ఎస్సై సోమేంద్ర సెఠి తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన క్రిష్ణ బొత్ర(40) గురువారం పొలం పనులకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లగా, పొలం సమీపంలో ఉన్న చెరువు ఒడ్డున ఆయన చెప్పులు, దుస్తులు ఉండటంతో చెరువులో గాలించగా మృతదేహం లభ్యమైంది.

నదిలో మునిగి అంధుడు మృతి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా పట్టపూర్ ఠాణా పరిధిలోని ఎరెంద్రా గ్రామానికి చెందిన అంధుడు ఉజ్వల బరాడ్ గురువారం గ్రామ శివారులోని ఘొడాహడా నదికి స్నానానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తూ ఆయన నదిలో గోయి ఉన్నచోట పడిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు అగ్నిమాపక సిబ్బంది సహకారంతో మృతదేహాన్ని వెలికి తీశారు. కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పరీక్షకు తరలించి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

రజనీకాంత్ (పాత చిత్రం)

జయపురం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో జయపురం పట్టణం బ్యాంకు కాలనీకి చెందిన సమాజ సేవకుడు రజనీకాంత్(52) మృతిచెందారు. సంబల్‌పూర్ జిల్లా రెతాఖోల గ్రామం వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా భారీ వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది.

భూ వివాదం కేసులో తొమ్మిదికి చేరిన అరెస్టులు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఝూర్‌గ్రామ్ జిల్లా సంక్రాయల్ పరిధిలో బక్రా ప్రాంతంలో 125 కుటుంబాలకు చెందిన సుమారు నాలుగు వందల ఎకరాల భూవివాదం ముదురుతోంది. భూమిని కొందరు నకిలీ పత్రాలు సృష్టించి తమ వసం చేసుకున్నారనే ఆరోపణ ఉంది. పోలీసులు ఈ కేసులో ఇప్పటివరకు 8 మందిని అరెస్టు చేశారు. పోలీసులు మంగళవారం రాత్రి తొమ్మిదో నిందితుడిగా సమీర్ మహతోను అరెస్టు చేశారు.

కలప మిల్లులో అగ్ని ప్రమాదం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: స్థానిక అస్కా రోడ్డు ఫస్ట్ గేటు సమీపాన శిల్లా కలప మిల్లులో బుధవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది.

మిల్లులో ఎగసిపడుతున్న మంటలు

సమాచారం అందుకున్న బ్రహ్మపుర అగ్నిమాపక కేంద్రం సిబ్బంది రెండు వాహనాలతో హుటాహుటిన చేరుకుని మంటలను నియంత్రించారు. ప్రమాదానికి గల కారణాలపై పరిశీలిస్తున్నామని, నష్టం వివరాల్ని అంచనా వేస్తున్నామని అగ్నిమాపక కేంద్రం అధికారులు తెలిపారు.

మార్కెట్లో కాలిపోయిన దుకాణాలు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పశ్చిమ మిడ్నాపూర్ జిల్లా చంద్రకోణా బస్టాండ్ దగ్గర ఉన్న చేపల మార్కెట్లో గురువారం ఉదయం అగ్నిప్రమాదం జరిగింది. దుకాణాలన్నీ కాలిపోయాయి. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలప అక్రమ రవాణా: ఇద్దరి అరెస్టు

స్వాధీనం చేసుకున్న కలపతోపాటు మినీ సరకు వాహనం, అరెస్టయిన నిందితులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా దక్షిణ ఘుముసుర అటవీ డివిజన్ పరిధిలోని అస్కా రేంజ్ పరిధిలోని హుముకి కూడలి వద్ద గురువారం ఓ మినీ సరకు వాహనంలో అక్రమంగా రవాణా చేస్తున్న 19 కలప దుంగల్ని అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కొంధమాల్ జిల్లా బ్రాహ్మణిగావ్ ఠాణా పరిధిలోని ప్రాంతానికి చెందిన ఇద్దరు నిందితుల్ని అరెస్టు చేసి న్యాయస్థానానికి తరలించామని అస్కా అటవీ రేంజర్ ప్రమోద్ కుమార్ పండా విలేకరులకు తెలిపారు.

కలప స్వాధీనం.. నిందితుడు పరారీ

నవరంగపూర్, న్యూస్‌టుడే: పపదహండి సమితి మైదల్‌పూర్ అటవీ పరిధిలో గద్భకతర పంచాయతీ తారాపాణి గ్రామంలో కాశీనాథ్ హరిజన్ ఇంటిపై గురువారం దాడులు నిర్వహించారు. ఇంట్లో రూ.4 లక్షల విలువ చేసే కలప స్వాధీనం చేసుకున్నారు. కాశీనాథ్ కలపను చోరీ చేసి గృహాలంకరణ సామగ్రి తయారు చేసి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేశామని, ఆయన పరారైనట్లు అధికారులు తెలిపారు. అధికారులు రామచంద్ర బొత్ర, మధుసూదన్ పాత్ర్ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

సేంద్రియ బాట.. లాభాల పంట

– న్యూస్‌టుడే, జలుమూరు, సారవకోట, నరసన్నపేట, పోలాకి

రసాయనిక ఎరువులు అధికంగా వినియోగించి పంటలు పండిస్తున్న ప్రస్తుత రోజుల్లో ప్రకృతి విధానంలో సాగు చేపడుతూ అతివలు ముందడుగు వేస్తున్నారు. బ్యాంకు ద్వారా రుణాలు తీసుకుని వాటిని పెట్టుబడులుగా వినియోగించి ఆదాయం పొందుతున్నారు. ఇంటిలోని వ్యర్థాలతో వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేసి ఉపయోగిస్తున్నారు. ఆదర్శంగా నిలుస్తున్న నరసన్నపేట నియోజకవర్గానికి చెందిన స్వయంశక్తి సంఘాల సభ్యుల గురించి ప్రత్యేక కథనం.

ఆరోగ్యకరమైన సమాజం కోసం

పోలాకి మండలంలోని అంబీరుపేట, తోటాడ, గొల్లలవలస, గాతలవలస గ్రామాల్లో 20 ఎకరాల్లో, జలుమూరు మండలం రాణా, ఎలమంచిలి, రావిపాడు ప్రాంతాల్లో 15 ఎకరాల్లో సేంద్రియ విధానంలో మహిళలు సాగు చేపడుతున్నారు. నరసన్నపేటలో తామరపల్లి, ఈదలవలస, కోమర్తి గ్రామాల్లో 20 ఎకరాల్లో, సారవకోట మండలం తొగిరి, రామచంద్రాపురం, బుడితి, పద్మాపురం ప్రాంతాల్లో 15 ఎకరాల్లో మహిళలు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు.

దశాబ్ద కాలంగా సాగు

35 సెంట్ల విస్తీర్ణంలో ఆరేళ్లుగా సేంద్రియ విధానంలో బెండ, చిక్కుడు, వంగ వంటి కూరగాయలు సాగు చేస్తున్నాం. వర్మీ కంపోస్టు, వేపనూనె, కషాయాలతో చీడ పీడల బారి నుంచి కాపాడుతున్నాం. పెట్టుబడి కోసం బ్యాంకు నుంచి రుణం తీసుకున్నాం. రెండు నెలలకు ఒకసారి పంట చేతికి వస్తుంది. ఒక విడతలో సుమారు రూ.35 వేల వరకు ఆదాయం వస్తుంది.

– సడగాన సింహాద్రమ్మ, తొగిరి, సారవకోట మండలం

ఇతరులను ప్రోత్సహిస్తూ..

ప్రకృతి విధానంలో ఐదేళ్లుగా కూరగాయలు పండిస్తున్నాం. 25 సెంట్ల విస్తీర్ణంలో బెండ, కాకర, మిర్చి వంటి పంటలు సాగు చేస్తున్నాం. అధికారుల సూచనలు పాటిస్తూ.. వేపనూనె, పశువుల వ్యర్థాలు ఎక్కువగా వినియోగిస్తున్నాం. స్త్రీ నిధి ద్వారా రుణం తీసుకున్నాను. పెట్టుబడి పోనూ ఒక విడతలో రూ.30 వేలకు పైగా ఆదాయం వస్తుంది.

– గొద్దు శ్యామల, తామరాపల్లి, నరసన్నపేట మండలం

రుణ సదుపాయం కల్పిస్తున్నాం..

సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని స్వయం శక్తి సంఘాల సభ్యులను ప్రోత్సహిస్తున్నాం. ఆసక్తి ఉన్న వారికి గరిష్ఠంగా రూ.50 వేల వరకు రుణం అందిస్తున్నాం. ప్రకృతి విధానంలో పండించిన ఉత్పత్తులకు డిమాండ్ ఉండటంతో లాభాలు వస్తున్నాయి.

– హేమసుందరరావు, అప్పలసూర్యనారాయణ, శ్రీనివాసబాబా, సుశీల, వెలుగు ఏపీఎంలు

రంగులు భళా..

● మేడిపండు చందంగా ఆసుపత్రి ఆధునికీకరణ
● రోగులకు తప్పని అవస్థలు

మన్యం ప్రజల వైద్యానికి గుండెకాయలాంటి జిల్లా ఆసుపత్రికి వెళ్లిన రోగులను అసౌకర్యాలు పట్టి పీడిస్తున్నాయి. ఓ పక్క నాలుగేళ్ల క్రితం చేపట్టిన కొత్త భవన నిర్మాణం పూర్తికాలేదు. పడకలు సరిపోక ఒక్కోదానిపై ఇద్దరు, ముగ్గురికి వైద్యం అందిస్తున్నారు. మరోవైపు రూ.3 కోట్లతో చేపట్టిన పాత భవనం ఆధునికీకరణ పనులు అస్తవ్యస్తంగా జరగడంతో రోగులు గదుల్లో ఉండలేని దుస్థితి. భవనానికి ఆకర్షణీయంగా రంగులు వేశారే తప్పా.. లోపలంతా డొల్లే.

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం



కిటికీలకు తలుపులు ఏర్పాటు చేయకపోవడంతో వస్త్రాలు కట్టుకున్న రోగులు

డ్రైనేజీ పనులు పూర్తికాక గదుల వెనుక భాగంలో అధ్వానంగా..

చల్ల గాలికి వణకాల్సిందే..!

జిల్లా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసిన తర్వాత 100 పడకల స్థాయిని 150కు పెంచారు. అదనపు 50 పడకల నిర్మాణానికి నాబార్డు నిధులు రూ.21 కోట్లు మంజూరు కాగా, రూ.3 కోట్లు పాత భవనం ఆధునికీకరణకు కేటాయించారు. నాలుగేళ్ల క్రితం ఈ పనులు ప్రారంభమైనా నేటికీ పూర్తికాలేదు. పైన రంగులు వేసి అయ్యింది అనిపించారు. కిటికీలకు తలుపులు బిగించలేదు. చల్లగాలికి రోగులు వణుకుతున్నారు. మురుగు వ్యవస్థను సరిచేయలేదు. ఆసుపత్రి వెనుక వైపు వాడుక నీరు ఎక్కడిక్కడే ఉండిపోవడం, పైపుల లీకులతో పరిసరాలు దారుణంగా ఉన్నాయి. మ్యాన్ హోల్స్‌కు సరైన మూతలు లేక దుర్గంధం వ్యాపిస్తోంది. రోగులు, వారి సహాయకులు ప్రశాంతంగా గాలి పీల్చుకోలేని పరిస్థితి.

● రోజుకు ఓపీ: 850-1,000
● ఇన్‌పేషెంట్లు: 250-300 (సాధారణ రోజులు), 380 మందికిపైగా.. (సీజనల్ వ్యాధుల కాలంలో..)
● ఆధునికీకరణ లోపాలు: కిటికీలకు తలుపులు ఏర్పాటు చేయలేదు, పేమెంటు వార్డుల మరుగుదొడ్ల తలుపులు నాణ్యత లోపంతో పాడైపోతున్నాయి. మురుగు వ్యవస్థ అధ్వానంగా ఉన్నా.. సరిచేయకుండా వదిలేశారు.

సరిచేయిస్తాం: ఆధునికీకరణ పనుల్లో ఎక్కడైనా లోపం ఉంటే గుత్తేదారుతో మాట్లాడి, సరిచేయిస్తాం. డ్రైనేజీ, ఇతర పనుల పూర్తికి చర్యలు తీసుకుంటాం.

– ప్రసన్నకుమార్, డీఈఈ, ఏపీఎంఎస్ఐడీసీ

జాతీయస్థాయి పోటీలకు మన్యం మహిళ

రవ్వల గౌరీశ్వరి

పార్వతీపురం, న్యూస్‌టుడే: జాతీయస్థాయిలో ఉద్యోగులకు నిర్వహించే పోటీల్లో పాల్గొనేందుకు ఏపీలోని పార్వతీపురం మన్యం జిల్లా నుంచి క్రీడాకారిణి ఎంపికయ్యారు. ఈ నెల 19 నుంచి నిర్వహించిన రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్న కురుపాం మండలం లంకాజోడు గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల ఉపాధ్యాయిని రవ్వల గౌరీశ్వరి ప్రతిభ చూపి, జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీలకు అర్హత సాధించారు. 50 ఏళ్ల పైబడిన కేటగిరీలో ఈమె రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించేందుకు అర్హత సాధించారు. ఎంపిక కావడం ఆనందంగా ఉందని గౌరీశ్వరి ఈ సందర్భంగా 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

కొండపై ఒడియా యాత్రికుల సందడి

దిగువ పీఠం దర్శనానికి వెళ్తున్న భక్తులు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఏపీలోని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో పీర్లకొండ యాత్రకు ఒడియా సంప్రదాయాన్ని పాటించే భక్తులు తరలివచ్చారు. ఒడియా వారికి ఇది మార్గశిర గురువార పర్వదినం కావడంతో పీర్లకొండపై ఉన్న పురాతన కట్టడాల వద్ద హిందూ భక్తులు పూజలు చేశారు. కొండ దిగువ కొబ్బరికాయలు కొట్టి, కొండపై కట్టడాల వద్ద విభూతిని బొట్టుగా, కందకంలోని నీటిని తీర్థంలా స్వీకరించారు. ఉత్కళ ప్రాంతాల వారు సాయంత్రం వరకు కొండపై ఉల్లాసంగా గడిపి మొక్కులు చెల్లించుకున్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ ఎం.చిన్నంనాయుడు పర్యవేక్షణలో పట్టణ ఎస్సై ఎం.ముకుందరావు, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. వచ్చే వారం తెలుగువారికి కూడా మార్గశిర మాసం కావడంతో ఉభయ రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్నారు.

కుక్కల బెడద.. పాములతో దడ

– న్యూస్‌టుడే, సారవకోట, నరసన్నపేట, జలుమూరు, పోలాకి

నరసన్నపేట నియోజకవర్గంలోని ప్రజలు పాములు, కుక్కల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలను ఆనుకుని కొండలు, పంట పొలాలు, తోటలు ఉండటంతో పాముల సంచారం అధికంగా ఉంటోంది. కొన్ని గ్రామాల్లో ఇళ్లలోకి విష సర్పాలు ప్రవేశిస్తున్నాయి. వ్యవసాయ, ఉపాధి పనులకు వెళ్లే వారు తరచూ పాముకాట్లకు గురవుతున్నారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రులకు తరలిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో ప్రాణాలు కోల్పోతున్నారు. సారవకోట మండలంలోని దర్శిల్లి పురం గ్రామానికి చెందిన కృష్ణారావు ఇటీవల పొలంలో ఎరువు వేస్తుండగా పాము కాటు వేయడంతో ప్రాణాలు కోల్పోయారు.

సారవకోట ప్రధాన మార్గంలో సంచరిస్తున్న శునకాలు

ఒంటరిగా వెళ్లాలంటే వణుకు

ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో కుక్కలు గుంపులుగా సంచరిస్తూ పాదచారులు, వాహనదారులపై దాడులు చేస్తున్నాయి. దీంతో ఒంటరిగా వెళ్లాలంటే స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటి సంఖ్య తగ్గించడానికి ప్రభుత్వం దృష్టి సారించినప్పటికీ ఫలితం అంతంతమాత్రంగానే కనిపిస్తోంది. మాంసం దుకాణాల నిర్వాహకులు వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడే వేస్తుండటంతో వీటిని తింటూ వృద్ధులు, మహిళలు, పిల్లల పైనా విరుచుకుపడుతున్నాయి. నరసన్నపేట మండలం ఉర్లాంలో ఇటీవలే ఒకే రోజు 10 మంది కుక్క కాటు బారిన పడ్డారు.

ఏడాదిలో కేసుల వివరాలు

మండలం	పంచాయతీలు	ఆసుపత్రులు	కుక్కకాటు	పాముకాటు
సారవకోట	35	3	505	81
నరసన్నపేట	34	3	1,272	684
జలుమూరు	40	3	157	15
పోలాకి	31	2	15	1

అశ్రద్ధ వద్దు

పాము, కుక్కకాటు బారిన పడిన వారు అశ్రద్ధ చేయకుండా ఆసుపత్రుల్లో చేరి వైద్యసేవలు పొందాలి. నాటు వైద్యం జోలికి పోవద్దు. ఈ విధానం సరికాదు. ఎంత తొందరగా ఆసుపత్రికి వస్తే అంత మంచిది. మందులు అందుబాటులో ఉన్నాయి. – తాడేల శ్రీకాంత్, జిల్లా అదనపు వైద్యాధికారి

పల్లెల్లో స్వచ్ఛత.. పచ్చదనం

న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం, కాశీబుగ్గ

పంచాయతీల్లో పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ కూటమి ప్రభుత్వం నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 'క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్' పేరిట నెల రోజులపాటు ఎంపిక చేసిన గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇందుకు జిల్లా నుంచి 30 మండలాల ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు(మండలానికి ఒకరు)కు శిక్షణ ఇచ్చారు.

కవిటిలో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం

మండలానికి ఓ పంచాయతీ నమూనా

శిక్షణ తీసుకున్న మండలస్థాయి అధికారులు తమ పరిధిలోని ఒక గ్రామాన్ని ఎంచుకుని పచ్చదనం, పరిశుభ్రత, ఇతర అంశాల్లో ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతారు. దాన్ని ఆదర్శంగా చూపి మిగిలిన గ్రామాలను తీర్చిదిద్దాలి. కార్యాచరణకు పంచాయతీల నుంచి ప్రత్యేక నిధులు కేటాయించేలా చర్యలు చేపట్టాల్సి ఉంది. అవసరమైన పంచాయతీల్లో తాత్కాలిక పద్ధతిలో పారిశుద్ధ్య సిబ్బందిని నియమించి, పచ్చదనం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ప్రతి మండల స్థాయి అధికారి వారి పరిధిలో వారంలో ఒక గ్రామాన్ని పర్యవేక్షించాలి.

నియోజకవర్గాల్లో ఎంపిక చేసిన గ్రామాలు

మండలం	గ్రామం
కవిటి	కవిటి
ఇచ్ఛాపురం	తేలుకుంచి
కంచిలి	పెద్ద కొజ్జిరియా
సోంపేట	సోంపేట
పలాస	అల్లుకోల
మందస	కొంకడాపుట్టి
వజ్రపుకొత్తూరు	దేవునల్తాడ

శిక్షణ ఇచ్చాం

ఎంపిక చేసిన ఆదర్శ పంచాయతీల్లో కార్యదర్శులకు శిక్షణ ఇచ్చాం. ఆయా పంచాయతీల్లో హరిత రాయబారులుగా ఎంపిక చేసిన గ్రామానికి చెందిన ప్రతి ఇంటికి వెళ్లి తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తారు. సిబ్బందికి చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ ఇస్తారు. అనంతరం ఈ విధానాన్ని అన్ని గ్రామాలకు వర్తింపజేస్తారు.

– ఎల్.త్రినాథ్, ఎంపీడీవో, కవిటి

రాజధాని వాసులకు ఇళ్లు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లో సొంత ఇళ్లు లేనివారికి రాష్ట్ర ప్రభుత్వం గృహాలు నిర్మించి కేటాయిస్తుందని పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ శాఖల మంత్రి కృష్ణచంద్ర మహాపాత్ర్ గురువారం భువనేశ్వర్‌లో విలేకరులకు చెప్పారు. ఒడిశాలో ఇళ్ల ఒక్కో ఫ్లాట్ రూ.14 నుంచి రూ.50 లక్షలకు భువనేశ్వర్ అభివృద్ధి సంస్థ (బీడీఏ) నిర్మాణాలు చేయించిందని, 90 గృహాలు సిద్ధమైనట్లు తెలిపారు. త్వరలో అప్పగించే పనులు చేపడామన్నారు.

పెట్టుబడి వల.. చిక్కితే విలవిల..!

● యాప్‌ల్లో లాభాల పేరుతో సైబర్ మోసాలు



★ ఎచ్చెర్లకు చెందిన ఓ యువకుడు యాప్‌లో రూ.20 వేలు పెట్టుబడి పెడితే గంటలోపే అతనికి ఖాతాకు రూ.7,400 జమయ్యాయి. ఆ తర్వాత తన స్నేహితులతోనూ పెట్టుబడి పెట్టించగా.. వారిలో ఇద్దరికి మాత్రమే రూ.14,800 తిరిగి వచ్చాయి. మరో రెండు గంటల్లో మిగిలిన వారికి జమ అవుతాయని ఫోన్ వచ్చింది. దీంతో అత్యాశకు పోయి తన సోదరుడికి ఫోన్ చేసి మరో రూ.లక్ష జమ చేయించాడు. కాసేపటి తర్వాత యాప్ పని చేయకపోవడంతో మోసపోయామని తెలిసి లబోదిబోమన్నారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నేరవార్తావిభాగం

సైబర్ నేరగాళ్లు రోజుకో రూపంలో చెలరేగుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో సందేశాలు పంపి వల విసురుతున్నారు. ప్రముఖ కంపెనీల పేరు చెప్పి... ఫలానా యాప్‌లో పెట్టుబడి పెడితే రెట్టింపు లాభాలు వస్తాయని నమ్మిస్తున్నారు. చెప్పినట్లుగానే మొదట్లో అధిక మొత్తాన్ని వడ్డీగా జమ చేస్తున్నారు. ఒకరిని చూసి మరొకరు పెట్టుబడి పెట్టేలా ఆకర్షిస్తున్నారు. కొందరు అత్యాశతో వారి ఉచ్చులో పడి రూ.లక్షలు అప్పగించేస్తున్నారు. తేరుకునేలోగా కేటుగాళ్లు మాయమైపోతున్నారు.

★ శ్రీకాకుళం నగరానికి చెందిన కొందరు విశ్రాంత ఉద్యోగులకు ఉదయపు నడక సమయంలో ఓ యువకుడు పరిచయమయ్యాడు. ఫలానా యాప్‌లో పెట్టుబడి పెడితే వడ్డీ బాగా వస్తుందని వారిని నమ్మించాడు. వారితో వాట్సాప్ గ్రూపు క్రియేట్ చేసి మరింత దగ్గరయ్యాడు. అతని మాటలు నమ్మి కొందరు ఆ యాప్‌లో రూ.లక్షలు డిపాజిట్ చేశారు. మరుసటి రోజు నుంచి ఆ వ్యక్తి మైదానానికి రాకపోవడంతో పాటు వాట్సాప్ గ్రూప్ నుంచి సభ్యులందర్నీ ఏక కాలంలో తొలగించి మాయమయ్యాడు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

యువత, వృద్ధులే అధికం..

ఇలాంటి మోసాలకు గురవుతున్న వారిలో ఎక్కువ మంది యువత, వృద్ధులే ఉంటున్నారు. ఉద్యోగ విరమణతో ప్రశాంత జీవనం సాగిస్తున్న వారిపై ఈ తరహా మోసాలతో పిడుగు పడినట్లవుతోంది. అత్యాశకు పోయి ఎంతో మంది మానసిక వేదనకు గురవుతున్నారు. చాలా మంది ఫిర్యాదు చేసేందుకు సైతం ముందుకు రాకుండా లోలోపల మథనపడిపోతున్నారు.

1930కు ఫిర్యాదు చేయండి..

యాప్‌ల్లో పెట్టుబడి పెడితే తక్కువ కాలంలో ఎక్కువ ఆదాయం వస్తుందని అత్యాశకు పోవద్దు. సామాజిక మాధ్యమాల్లో కనిపించే మోసపూరిత ప్రకటనలు నమ్మొద్దు. అటువంటి వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలి. జిల్లాలో ఎవరైనా ఆ విధంగా మోసపోతే వెంటనే టోల్‌ఫ్రీ నంబరు 1930కు ఫిర్యాదు చేయండి.

– కె.వి.మహేశ్వరరెడ్డి, ఎస్పీ, శ్రీకాకుళం

● జిల్లాలో వాట్సాప్ గ్రూప్‌లో చేరి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టిన విశ్రాంత ఉద్యోగుల సంఖ్య: 120 మందికిపైగా
● వారి నుంచి కొట్టేసిన సొమ్ము: సుమారు రూ.2 కోట్లు

ఎల్‌ఎన్‌పురంలో గజగజ

ఎల్‌ఎన్‌పురం ప్రాంతంలో తిరుగాడుతున్న ఏనుగుల గుంపు

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని చినమరికి, ఎల్‌ఎన్‌పురాల మధ్య కరిరాజుల గుంపు తిష్ఠ వేసింది. గురువారం ఎల్‌ఎన్‌పురం సమీప బోడికొండ పరిసరాల్లో తిరుగుతోంది. గత నెల వరకూ ఈ ప్రాంతంలో తిరిగిన గుంపు మళ్లీ రావడంతో ఖరీఫ్ పనుల్లో ఉన్న రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏం నష్టం, ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. ఏనుగుల సంచారంపై ప్రత్యేక నిఘా పెట్టామని, ట్రాకర్లను నిరంతర విధుల్లో ఉంచామని రేంజర్ కె.మణికంఠేష్ తెలిపారు. సమీప గ్రామస్థులు ఏనుగుల వైపు వెళ్లకుండా తమకు సహకరించాలని కోరారు.

పక్కాగా ఆరోగ్య సర్వే

బాలగుడబ ఆరోగ్య కేంద్రంలో దస్త్రాలు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న ఆరోగ్య సర్వేల వివరాలు పక్కాగా నమోదు చేయాలని జిల్లా ఎస్సీడీ పీడీ జగన్మోహనరావు సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని బాలగుడబ ఉప వైద్యఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో సర్వే దస్త్రాలు పరిశీలించారు. వివరాలు ఎలా నమోదు చేయాలో సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామంలో పరిసరాల శుభ్రతను పరిశీలించారు. ఆయన వెంట మలేరియా నివారణ అధికారి, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

ఇరుకు రోడ్డు.. మరింత ప్రమాదకరంగా

దినవారీ బజారు వద్ద చిరువ్యాపారులు రోడ్డుపై అంగళ్లు పెట్టడంతో ఇరుకుగా ఉన్న రహదారి మరింత ప్రమాదకరంగా మారింది. భారీ వాహనం వస్తే, రోడ్డుపై వెళ్తున్న వారు తప్పుకొనేందుకూ అవకాశం లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఇద్దరు సైకిలిస్టులు ఇక్కడే కన్నుమూశారు. పుర అధికారులతో చర్చించి, పరిష్కార చర్యలు చేపడతామని సీఐ చిన్నంనాయుడు తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

మురుగుతో అవస్థలు

లండారిపుట్టుగలో పారిశుద్ధ్య లోపంతో గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. మంచినీటి ట్యాంకు వద్ద మురుగునీరు నిల్వ ఉండటంతో చుట్టు పక్కల నివాసితులు దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాస్‌ను వివరణ కోరగా పరిశీలించి పారిశుద్ధ్య పనులు చేపట్టి, బ్లీచింగ్ వేసి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

వృథా నీరు.. ఇదేం తీరు

వజ్రపుకొత్తూరులో వెలుగు కార్యాలయం సమీపంలో మంచినీటి పథకం సరఫరా పైపులైను లీకేజీ కావడంతో తాగునీరు వృథాగా పోతుంది. కొన్ని నెలలుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో పరిసర ప్రాంతం చిత్తడిగా తయారవుతోంది. అటు వైపు నుంచి వెళ్లలేని పరిస్థితి ఏర్పడటంతో ఇబ్బందులు పడుతున్నారు. పరిశీలించి మరమ్మతులు చేపడతామని గ్రామీణ మంచినీటి సరఫరా పథకం జేఈ సతీష్ తెలిపారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

రాకపోకలెలా..!

కవిటి చింతామణి ఆలయం నుంచి ఇద్దివానిపాలెం చేరుకునే రోడ్డులో పలు చోట్ల గుంతలు ఏర్పడటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై పంచాయతీరాజ్ శాఖ ఏఈ ధనంజయను వివరణ కోరగా ఉన్నతాధికారులకు తెలియజేశామని, నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేస్తామని తెలిపారు. –న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

వానతో.. వణుకు..

ఆరబోసిన ధాన్యంపై పరదాలు కప్పుతున్న రైతులు

సాలూరు, న్యూస్‌టుడే: వాతావరణంలో మార్పులతో అన్నదాతల్లో వణుకు పుడుతోంది. ఆరుగాలం కష్టించి పండించిన వరి పంట చేతికి వచ్చింది. విక్రయించే సమయంలో వానలు కురిస్తే పంట తడిచిపోతుందని తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎండగా ఉండడంతో గురువారం ఉదయం తేమశాతం తగ్గించేందుకు పట్టణ ప్రత్యామ్నాయదారిపై రైతులు ధాన్యం ఆరబోశారు. మధ్యాహ్నం మబ్బులు రావడంతో ధాన్యం తడవకుండా ఉండేందుకు కర్షకులు హుటాహుటిన పరదాలు కప్పారు.

బొప్పాయికి తెగులు.. రైతుకు దిగులు

– న్యూస్‌టుడే, లావేరు

వందల ఎకరాల్లో కుళ్లిన పంట

మరికొద్ది రోజుల్లో పంట చేతికి అందివస్తుందనే సమయానికి బొప్పాయి రైతులకు నిరాశే మిగిలింది. కళ్లెదుటే తెగుళ్లు సోకి చెట్లు ఎండిపోయి, కాయలు రాలిపోతుంటే వారి గుండె బరువెక్కిపోతోంది. ఇటీవల వచ్చిన మొంథా తుపాను వారిని నిండా ముంచేసింది. భారీ వర్షాలకు తెగుళ్లు విజృంభించడంతో వాణిజ్య పంటలు సర్వనాశనం అవుతున్నాయి. రూ.వేలల్లో పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి.

పండించే మండలాలు: లావేరు, రణస్థలం, జి.సిగడాం, ఎచ్చెర్ల, గార, పొందూరు, నరసన్నపేట, పోలాకి.

సాగు విస్తీర్ణం: సుమారు 1,000 ఎకరాలు

నష్టం అంచనా: 400 ఎకరాలకుపైగా

కారణం: రింగ్ వైరస్ వ్యాప్తి

ఏమవుతోందంటే..

★ చెట్ల ఆకులు ఎండిపోయి.. కాయలు సగం పండి రాలిపోతున్నాయి.
★ కాయల్లో పురుగులు ఉంటున్నాయి.
★ తెగులు సోకిన వారంలో చెట్లన్నీ చనిపోతున్నాయి.
★ కుళ్లిన పంటను తొలగించడానికి సుమారు రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు పెట్టుబడి అవుతుంది.

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాం..

తెగుళ్లు సోకిన బొప్పాయి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాం. వాటికి పరిహారం ఉండదు. తుపాన్ల ప్రభావంతో నష్టపోతేనే పరిహారం వర్తిస్తుంది. రింగు వైరస్ వ్యాప్తి కారణంగా బొప్పాయికి నష్టం వస్తోంది. నివారణకు పంట చుట్టు బంతిపూల తోటలు వేయాలి. అధికారుల సూచన మేరకు ఎరువులు, పురుగుమందులు వాడాలి.

– ఆర్.వరప్రసాద్, ఉద్యానశాఖాధికారి శ్రీకాకుళం

ఉద్యానాల్లో వ్యర్థాలు వేస్తే కేసులు

నర్సిపురం సర్పంచి, అధికారులతో మాట్లాడుతున్న కలెక్టరు ప్రభాకరరెడ్డి

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: రూ.లక్షలు వెచ్చించి అభివృద్ధి చేసిన చెరువులు, ఉద్యానాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా పాలకవర్గాలు, అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టరు ప్రభాకరరెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన జేసీ యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్‌కలెక్టరు వైశాలితో నర్సిపురం కోనేరు గట్లపై చేపడుతున్న సుందరీకరణ పనులను పర్యవేక్షించారు. స్థానిక చెరువు గట్లపై ఉన్న పార్కు ప్రదేశం, నేతల చిత్రాల సమీపంలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువు సుందరీకరణకు ఉపాధి నిధులు రూ.20 లక్షలతో పనులు ప్రారంభించిన సమయంలో ఇదేం నిర్వహణ అని సిబ్బందిని ప్రశ్నించారు. ఇకపై ఎవరైనా వ్యర్థాలు వేస్తే కేసులు నమోదు చేయాలని సర్పంచి బంగారమ్మ, కార్యదర్శులకు ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో సత్యం, ఉప ఎంపీడీవో పాపారావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుదాం

పాచిపెంట, న్యూస్‌టుడే: ఏపీలోని పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలంలో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని డిప్యూటీ ఎంపీడీవో మల్లేశ్వరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో రెండో రోజు గురువారం శుభ్రతపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో పాత్రో, గ్రామ ఐక్య సంఘ అధ్యక్షులు, మహిళా సంఘసభ్యులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఈనాడు తమిళనాడు

ఓటరు జాబితా పారదర్శకంగా ఉండాలి

మాట్లాడుతున్న జయకుమార్

సైదాపేట, న్యూస్‌టుడే: భాజపాతో కూటమిలో ఉన్నందున 'సర్'కు మద్దతివ్వటం లేదని, ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండాలన్నదే అన్నాడీఎంకే వైఖరి అని ఆ పార్టీ మాజీ మంత్రి జయకుమార్ తెలిపారు. 'సర్'పై డీఎంకే తీరును ఖండిస్తూ చెన్నై ఎగ్మూర్ రాజరత్నం స్టేడియం వద్ద గురువారం ఆందోళన జరిగింది. చెన్నై జిల్లా ఎన్నికల అధికారి డీఎంకేకు మద్దతుగా వ్యవహరిస్తున్నారని నేతలు ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జయకుమార్ విలేకర్లతో మాట్లాడుతూ.. వలస వెళ్లినవారు, దొంగ ఓట్లపై డీఎంకే ఆధారపడి ఉందని, అందుకే 'సర్'ను వ్యతిరేకిస్తోందని ఆరోపించారు. మాజీ మంత్రులు పొన్నయ్యన్, గోకుల ఇందిర, వళర్మతి తదితరులు పాల్గొన్నారు.

కళ్లకురిచ్చిలో నేడు.. సైదాపేట: డీఎంకే ప్రభుత్వ తీరును ఖండిస్తూ శుక్రవారం అన్నాడీఎంకే తరఫున కళ్లకురిచ్చిలో ఆందోళన జరగనుందని పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి ప్రకటన విడుదల చేశారు. కళ్లకురిచ్చి జిల్లాలో అభివృద్ధి పనులు సక్రమంగా సాగడంలేదన్నారు. 'సర్' ప్రక్రియలో అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందన్నారు.

ఆందోళనలో పాల్గొన్న కార్యకర్తలు

ప్రమాదకర చెట్లు.. జీవ ఇంధనంగా

☛ నీలగిరి అడవుల్లో వినూత్న ప్రాజెక్టు

ముదుమలై టైగర్ రిజర్వ్ ఫారెస్టుకు ఓ చెట్ల ద్వారా ముప్పు కలుగుతోంది. ఇవి పర్యావరణానికి ఇబ్బందిగా మారడంతో పాటు స్థానిక వృక్షజాతుల మనుగడను తగ్గిస్తున్నాయి. వాటిని తొలగించడంతో పాటు ఇంధనంగా మార్చి మార్కెటింగ్ చేస్తున్నారు.

-ఈనాడు-చెన్నై

ఈ చెట్లజాతి పేరు లాంటానా కమారా. పూలు చూసేందుకు అందంగా ఉంటాయి. ఈ మొక్కల్ని తెలుగు రాష్ట్రాల్లో తలంబ్రాల చెట్లు, పులి కంప, అత్తా కోడలు ఆకు చెట్లు అని పిలుస్తుంటారు. గుబురుగా పెరిగే ఇవి స్థానిక వృక్షజాతులకు ఎండను అందివ్వకుండా అడ్డుపడటం, పరిసరాల్లోని నీటిని భూమి నుంచి ఎక్కువగా తీసుకోవడంలాంటివి చేస్తున్నాయి. జంతువులకూ ఇబ్బందిగా మారింది. ఇలాగే కొనసాగితే పెద్ద ముప్పే ఎదురవుతుందని గుర్తించిన నీలగిరి జిల్లా యంత్రాంగం వాటిని తొలగించాలని నిర్ణయం తీసుకుంది.

ముదుమలై అడవుల్లో సింగార, మసినగుడి రేంజ్ ప్రాంతాల్లో ఈ ప్రమాదకర చెట్లు ఎక్కువగా విస్తరిస్తున్నట్లు గుర్తించారు. తొలివిడతగా సింగార రేంజ్‌లో తొలగింపు కార్యక్రమాల్ని మొదలుపెట్టారు. ప్రస్తుతం 30 ఎకరాలకు మించి పనులు చేస్తున్నారు. ఈ బాధ్యతను స్థానికంగా 9 గిరిజనుల తెగలకు ఇవ్వడం ద్వారా ఉపాధి కల్పిస్తున్నారు.

చెట్లను కత్తిరించి ఓచోట వేయడానికి ట్రాక్టర్లకు ష్రెడర్లను అమర్చారు. కొమ్మల్ని అడవిలోనే ఎండబెడుతున్నారు. ఎండిన కొమ్మల్ని అక్కడ క్రషర్లలో కత్తిరిస్తున్నారు. ఇలా చిన్నచిన్న ముక్కలైన వాటినుంచి నాణ్యమైనవి తీసి ప్లాంటుకు పంపుతున్నారు.

చిన్నముక్కలను యంత్రాల ద్వారా చూర్ణంలా చేసి తేమగుజ్జుగా మారుస్తున్నారు. ఈ మెత్తటి పదార్థాన్ని 'హ్యామర్ మిల్లు' లోని యంత్రాల్లో గట్టి పదార్థంగా మార్చుతున్నారు.

బ్రికెటింగ్ విధానం ద్వారా వాటిని వివిధ సైజుల్లో ముక్కలుగా(బ్లాక్స్) చేసి ప్యాకింగ్‌కు పంపుతున్నారు. వాటినే ఇంధనంగా వినియోగించేందుకు మార్కెటింగ్ చేస్తున్నారు.

టీ పరిశ్రమతో ఒప్పందం..

గుడలూరులోని సాలిస్‌బరీ కో-ఆపరేటివ్ టీ పరిశ్రమతో జిల్లా యంత్రాంగం ఒప్పందం కుదుర్చుకుంది. ఇంధన బ్లాక్‌లను వారికి విక్రయించేందుకు ముందుకొచ్చింది. ఇప్పటిదాకా సుమారు 10టన్నులకు మించి తరలించారు. ఇంకా ప్రక్రియ కొనసాగుతోంది. వచ్చే ఆదాయాన్ని గిరిజనులకు అందిస్తున్నారు.

తెలుగు ఐఏఎస్ చొరవ

లక్ష్మీభవ్య తన్నీరు

నీలగిరి జిల్లా కలెక్టర్‌గా ఉన్న లక్ష్మీభవ్య తన్నీరు ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ముప్పున్న చెట్ల తొలగింపు, వాటిని బ్లాక్‌లుగా మార్చే విధానం తదితర ప్రక్రియల్ని పరిశీలించడం, ఎప్పటికప్పుడు పనితీరును ఆరా తీస్తున్నారు. వర్షాలు కురిసినా, చలి పెరిగినా పని ఆగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సిమెంటు ప్లాట్‌ఫామ్‌లు నిర్మించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

తమిళ భాషావేత్తలకు పురస్కారాలు

ముఖ్యమంత్రితో పురస్కార గ్రహీతలు

చెన్నై, న్యూస్‌టుడే: తమిళ సాహిత్యానికి వన్నె తెస్తున్న రచయితలను ప్రోత్సహించేలా తమిళ అభివృద్ధిశాఖ తరఫున 2024వ ఏడాదికిగాను 'ఇలక్కియ మామణి' పురస్కారానికి చెన్నై జిల్లాకు చెందిన జ్ఞానసుందరం, తిరువళ్లూర్ జిల్లాకు చెందిన కామరాసు, తెన్కాశి జిల్లాకు చెందిన సోమసుందరం అలియాస్ కళాప్రియలను ఎంపిక చేశారు. వారికి సచివాలయంలో గురువారం ముఖ్యమంత్రి 'ఇలక్కియ మామణి' పురస్కారాలు, రూ.5లక్షలు బ్యాంకు చెక్కు, సవరు బంగారు పతకం, అర్హతాపత్రం అందించి సత్కరించారు.

నిరసనలో పాల్గొన్న సెంథిల్ బాలాజీ, ముర్పోక్కు ఇయక్కం సభ్యులు

సుప్రీంకోర్టు అభిప్రాయాలు డీఎంకేకు అనుకూలం

☛ ఎంపీ విల్సన్

చెన్నై, న్యూస్‌టుడే: రాష్ట్రపతి కేసులో సుప్రీంకోర్టు అభిప్రాయాలు తమకే సానుకూలమని డీఎంకే న్యాయవాది, ఎంపీ విల్సన్ తెలిపారు. పెండింగ్ బిల్లుల ఆమోదం కోసం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించడం తగదని రాజ్యాంగ ధర్మాసనం గురువారం స్పష్టం చేసిన నేపథ్యంలో చెన్నైలో విలేకర్లతో విల్సన్ మాట్లాడారు. రాష్ట్రపతి కేసులో సుప్రీంకోర్టు తీర్పును, ఉత్తర్వులను వెల్లడించలేదని, తన అభిప్రాయాలను మాత్రమే వెల్లడించిందని తెలిపారు. గవర్నర్ కేసులో ఇప్పటికే సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తుత అభిప్రాయాలు దెబ్బతీయవని, రాష్ట్ర ప్రభుత్వం పొందిన తీర్పును నియంత్రించలేవని పేర్కొన్నారు. బిల్లులను ఆమోదించడానికి గవర్నర్ జాప్యం చేస్తే మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని పేర్కొన్నారు.

అన్నదాతల ఆక్రందన వినిపించలేదా? : సీఎం స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: ధాన్యం సేకరణ తేమశాతం సడలింపునకు సంబంధించిన అభ్యర్థననూ కేంద్రంలోని భాజపా ప్రభుత్వం నిరాకరించిందని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన తన 'ఎక్స్' పేజీలో... కోయంబత్తూర్ మెట్రోరైలు ప్రాజెక్టును నిరాకరించి అదే కోవైకు ఎలాంటి అపరాధభావం లేకుండా ప్రధాని వచ్చి వెళ్లిన తడి కూడా ఇంకా ఆరలేదని, అంతలోనే ధాన్యం సేకరణలో తేమశాతం సడలింపునకు సంబంధించిన అభ్యర్థనను నిరాకరించిందని తెలిపారు. భారీవర్షాలు కారణంగా తేమశాతం పెరిగిన ధాన్యాన్ని సేకరించాలనే తమిళనాడు గళం ప్రధాని చెవులకు ఎందుకు వినిపించలేదు, రైతుల ఆక్రందనను ఎందుకు పట్టించుకోలేదని, వారి కన్నీళ్లు ఎందుకు కనిపించలేదని ప్రశ్నించారు. గతంలో పలుమార్లు తేమశాతంలో సడలింపులు కల్పించిన కేంద్రం ప్రస్తుతం ఎందుకు నిరాకరిస్తోందన్నారు. భారీవర్షాలతో దెబ్బతిన్న పంటలకు కోరిన పరిహారం అందించకుండా, తేమశాతం పెంచకుండా ఉంటే అన్నదాతలకు ఎలా మేలు జరుగుతుందని భావిస్తున్నారంటూ ప్రశ్నించారు. వెంటనే వాటిని పునఃపరిశీలించడంతో పాటు రాష్ట్ర అభ్యర్థనలపై మంచి నిర్ణయం తీసుకుని రైతులకు మంచి చేస్తుందని నమ్ముతున్నట్లు పేర్కొన్నారు.

తమిళనాడు పోరాడుతుంది

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడు ప్రయోజనాలకు విరుద్ధమైన కేంద్ర ప్రభుత్వ చర్యలన్నింటికీ వ్యతిరేకంగా రాష్ట్రం పోరాడుతుందని ముఖ్యమంత్రి స్టాలిన్ ఉద్ఘాటించారు. ఆయన తన 'ఎక్స్' పేజీలో... తమిళనాడు అభివృద్ధిని అడ్డుకునే దుష్టభావన కలిగిన కేంద్ర భాజపా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోయంబత్తూర్‌లో లౌకికవాద ప్రగతిశీల కూటమి ఏకమైందన్నారు. కోయంబత్తూర్, మదురై నగరాలకు మెట్రో రైలు ప్రాజెక్టు నిరాకరణ, ఎస్.ఐ.ఆర్ ద్వారా ఓటు హక్కు తొలగింపు, పునర్విభజన ద్వారా రాష్ట్రానికి నియోజకవర్గాల సంఖ్య తగ్గింపు, ప్రజాస్వామ్య విలువలను గౌరవించని గవర్నర్ హల్‌చల్, నిధుల కేటాయింపుల్లో వివక్ష, రైతులకు సాయం నిరాకరణ, తమిళ భాషపై దాడి, హిందీని బలవంతంగా రుద్దడం అంటూ అన్నిటికీ వ్యతిరేకంగా తమిళనాడు పోరాడుతుందని, గెలుస్తుందని తెలిపారు.

పెంచిన పన్ను తగ్గించి భాజపా సంబరాలు

మాజీ మంత్రి సెంథిల్‌బాలాజీ విమర్శ

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: పెంచిన పన్ను తగ్గించేసి సంబరాలు చేసుకున్న ఏకైక పార్టీ భాజపా అని మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ విమర్శించారు. అందుకే పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో వారి ఖాతా సున్నాగా ఉందని, రాబోయే శాసనసభ ఎన్నికల్లోనూ అదే పరిస్థితి ఎదురవుతుందని తెలిపారు. కోయంబత్తూరు మెట్రో రైలు ప్రాజెక్టుకు అనుమతి నిరాకరించిన కేంద్ర ప్రభుత్వ తీరును ఖండిస్తూ ముర్పోక్కు కూటమి తరఫున కోవై దక్షిణ తాలూకా కార్యాలయం ఎదుట గురువారం నిరసన జరిగింది. సెంథిల్ బాలాజీ మాట్లాడుతూ.. మదురై, కోయంబత్తూరు మెట్రో రైలు ప్రాజెక్టులకు అనుమతి కోరుతూ నివేదిక సమర్పించి 15 నెలలైందని, ప్రపంచ బ్యాంకు అధికారులు కూడా అనేకసార్లు వచ్చి పరిశీలించారన్నారు. భాజపా పాలిత రాష్ట్రాల్లో ఐదు నెలల్లోపు అనుమతిస్తారని, తమిళనాడులో మాత్రమే చిన్నచిన్న కారణాలను చూపుతూ నిరాకరించారని తెలిపారు.

దేశం, సినిమా విషయంలో ఐక్యంగా ఉండాలి

విలేకర్లతో మాట్లాడుతున్న కమల్‌హాసన్

సైదాపేట, న్యూస్‌టుడే: రాజకీయాల్లో ఎలా ఉన్నా దేశం, సినిమా విషయాల్లో అందరూ ఐక్యంగా ఉండాలని ఎంఎన్ఎం అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ కమల్ హాసన్ తెలిపారు. 56వ అంతర్జాతీయ భారత చలనచిత్రోత్సవం గోవా రాజధాని పనాజీలో గురువారం ప్రారంభమైంది. తమిళనాడు నుంచి రెండు సినిమాలు, రెండు లఘు చిత్రాలు ఎంపికయ్యాయి. చెన్నై విమానాశ్రయంలో కమల్ హాసన్ విలేకర్లతో మాట్లాడుతూ... 'అమరన్' అంతర్జాతీయ చలన చిత్రోత్సవానికి ఎంపికవటం సంతోషంగా ఉందని, అందుకే గోవా వెళ్తున్నామని తెలిపారు. ఇలాంటి సినిమాలు మరిన్ని రావాలని కోరారు.

మెట్రో ప్రాజెక్టుపై తప్పుడు సమాచారం

మాట్లాడుతున్న వానతి శ్రీనివాసన్

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం మెట్రో రైలు ప్రాజెక్టును నిరాకరించిందని డీఎంకే, మిత్రపక్షాలు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నాయని భాజపా జాతీయ మహిళా విభాగ అధ్యక్షురాలు వానతి శ్రీనివాసన్ తెలిపారు. కోయంబత్తూరులో గురువారం విలేకరులతో మాట్లాడారు. జనాభా, మెట్రో వినియోగంపై కచ్చితమైన సమాచారాన్ని తమిళనాడు ప్రభుత్వం అందించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ సందేహాలకు అవసరమైన వివరణలు ఇవ్వలేదని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి గెలిచిన తర్వాత కోవైకు మెట్రోరైలు కచ్చితంగా తీసుకొస్తామన్నారు.

మల్లై సత్యా కొత్త పార్టీ.. డీవీకే

సైదాపేట, న్యూస్‌టుడే: ద్రావిడ వెట్రి కళగం(డీవీకే) అనే కొత్త పార్టీని మల్లై సత్యా గురువారం ప్రారంభించారు. ఎండీఎంకే ప్రధాన కార్యదర్శిగా ఉన్న మల్లై సత్యానికి పార్టీ అధిష్ఠానంతో అభిప్రాయాలు బేధాలు వచ్చాయి. ఆయన్ను పార్టీ నుంచి తొలగించారు. ఈ నేపథ్యంలో ఆయన కొత్త పార్టీ ప్రారంభించారు. పార్టీ జెండాలోని 7 నక్షత్రాల్లో 5 ఐదుగురు ద్రావిడ ఉద్యమ నాయకులను, ఒకటి అంబేడ్కర్‌ను, మరొకటి కార్ల్‌మార్క్స్‌ను సూచిస్తాయని తెలిపారు.

పార్టీ ప్రారంభోత్సవంలో మల్లై సత్యా, మద్దతుదారులు

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

సర్‌పై అవగాహనకు మానవహారం

చెన్నై, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(సర్) ప్రక్రియకు సంబంధించి ఓటర్లకు అవగాహన కల్పించేలా చెన్నై మహానగర పాలకసంస్థ(జీసీసీ) తరఫున మానవహారం నిర్వహించారు. రిప్పన్ బిల్డింగ్ ప్రాంగణంలో గురువారం జరిగిన మానవహారంలో 200 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్లకార్డులు ప్రదర్శించడంతోపాటు ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు.

పారిశ్రామిక పెట్టుబడిదారుల సమావేశం 25న

సైదాపేట, న్యూస్‌టుడే: కోయంబత్తూరులో 25న పారిశ్రామిక పెట్టుబడిదారుల సమావేశం జరగనుంది. ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించనున్నారు. పారిశ్రామికాభివృద్ధి, ఆర్థిక వ్యవస్థ పురోగతి చెన్నైతోనే ఆగిపోకూడదనే ఉద్దేశంతో అన్ని జిల్లాలకు వ్యాప్తి చేసేందుకు పరిశ్రమల శాఖ తరఫున 'టీఎన్ రైజింగ్' పేరుతో పారిశ్రామిక పెట్టుబడిదారుల సమావేశాలు నిర్వహిస్తున్నారు.

24 శాతం

☛ అవయవదాన మార్పిడి శస్త్రచికిత్సల్లో రాష్ట్ర వాటా

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: గత ఏడాది దేశవ్యాప్తంగా 36 రాష్ట్రాల్లో జరిగిన అవయవ మార్పిడి శస్త్రచికిత్సల్లో నాలుగోవంతు తమిళనాడులోనే నిర్వహించినట్లు కేంద్రప్రభుత్వం వెల్లడించింది. దేశవ్యాప్తంగా 1,128 మంది జీవన్మృతుల అవయవాలను అర్హులైన వారికి మార్పిడి చేశారు. అందులో 268 అవయవ దానాలు(24%) తమిళనాడులోనే జరిగాయి. రాష్ట్ర అవయవదాన మార్పిడి అథారిటీ సభ్య కార్యదర్శి డాక్టర్ గోపాలకృష్ణన్ మాట్లాడుతూ.. అవయవదాతల మృతదేహాలకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు చేపడతామని ముఖ్యమంత్రి స్టాలిన్ 2023 సెప్టెంబర్ 23న ప్రకటించారన్నారు. అనంతరం ఇప్పటివరకు రాష్ట్రంలో 553మందికి పైగా అవయవాలను దానం చేశారన్నారు. 23వేల మందికిపైగా అవయవ దానానికి సమ్మతిపత్రాలు అందించారని తెలిపారు.

- గత సంవత్సరం 268 మంది జీవన్మృతుల నుంచి అవయవాలను 1,500 మందికి మార్పిడి చేశారన్నారు. వారిలో 456 మూత్రపిండాలు, 210 కాలేయాలు దానంగా పొందినట్లు తెలిపారు.
- జీవన్మృతి చెందిన వ్యక్తి ఏడుగురికి పునర్జన్మ కల్పించవచ్చన్నారు.
- ఇప్పటివరకు రాష్ట్రంలో 2,286 మంది దాతలు 13,400 అవయవాలు దానం చేశారన్నారు. వాటిలో 4,036 మూత్రపిండాలు, 3,356 కార్నియాలు, 2,036 కాలేయాలు, 1,089 గుండె కవాటాలు, 979 గుండెలు, 1,010 ఊపిరితిత్తులు ఉన్నాయన్నారు.

ట్రామ్ నుంచి మెట్రో రైలు వరకు..

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ఒక నగరం అభివృద్ధిలో రవాణా సేవలు కీలకంగా నిలుస్తాయి. చెన్నైలోనూ ఆ దాఖలాలు కనిపిస్తాయి. చెన్నైలోని ప్యారిస్, పురసైవాక్కం, సెంట్రల్ రైల్వేస్టేషన్, మౌంట్‌రోడ్, రాయపేట, లజ్, మైలాపూర్, శాంథోమ్ తదితర మార్గాల్లో నిత్యం లక్షమందికి సేవలందించేలా అప్పట్లో ట్రామ్ బండ్లు నడిచేవి. గంటకు 7 కి.మీ వేగంతో వెళ్లే ట్రామ్‌లలో ప్రయాణించేందుకు మైలుకు ఆరుపైసలు రుసుము చెల్లించేవారు. 24 కి.మీ దూరానికి వేసిన పొడవైన పట్టాలపై 97 ట్రామ్‌లు నడిచాయి. ఒక ట్రామ్‌లో 150మంది వరకు ప్రయాణించారు. దేశంలో ఎలక్ట్రిక్ ట్రామ్‌లు మొదట 1895 మే 7న చెన్నైలో నడిచాయి. నష్టం రావడంతో 1953 ఏప్రిల్ 11న ట్రామ్‌ల సేవలు ఆపేశారు. ట్రామ్‌ల వర్క్‌షాప్‌లు, స్టాప్‌లను శూలై, ఎలిఫెంట్‌గేట్‌లోని సాల్ట్ క్వార్టర్స్ ప్రాంతంలో చూడొచ్చు.



చెన్నైలో నడిచిన ట్రామ్

రెండు మార్గాల్లో..

మహానగరంలోని రెండు మార్గాలలో 55 కి.మీ దూరానికి మెట్రో రైలు సేవలు 2015 జూన్ 29న ప్రారంభమయ్యాయి. సరాసరి రోజూ 3 లక్షల మంది ప్రయాణికులు వాటిలో రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం చెన్నైలో రెండో విడతగా రూ.61,843 కోట్లతో 116.1 కి.మీ దూరానికి మూడు మార్గాలలో 124 రైల్వేస్టేషన్లతో పనులు జరుగుతున్నాయి.

రాబోయే పాతికేళ్లకు..

చెన్నై, శివారు ప్రాంతాల్లో పెరుగుతున్న జనాభా, ట్రాఫిక్ రద్దీని పరిగణనలోకి తీసుకొని చెన్నై ఇంటిగ్రేటెడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ(సీయూఎంటీఏ) రాబోయే 25 ఏళ్లకు ప్రజారవాణ ప్రణాళికలను విడుదల చేసింది. అందులో పలు సిఫార్సులు ఉన్నాయి.

- చెన్నైలో 346 కొత్త బస్టాప్‌లు, 30 కొత్త బస్ డిపోలు.

■ రవాణాసేవల్లో వృద్ధి దిశగా చెన్నై

- తాంబరం-అడయారు, పెరుంగళత్తూర్-మాధవరం ప్రాంతాల్లో కొత్త మెట్రోరైలు మార్గాలు.
- కోయంబేడు-పూందమల్లి, పల్లావరం-కుండ్రత్తూరు, వండలూర్-కేళంబాక్కం మార్గాలలో నియో మెట్రో సర్వీసు ప్రవేశపెట్టాలి.
- ఎన్నూర్-సింగపెరుమాళ్ కోవిల్, శ్రీపెరుంబుదూర్- కాంచీపురం కొత్త మార్గాలలో సబర్బన్ రైలు సేవలు.
- చెన్నై నడిబొడ్డున టీనగర్, నుంగంబాక్కం, నందనం, లైట్‌హౌస్ మధ్య ట్రామ్ సేవలు ప్రవేశపెట్టాలి. చెన్నై సెంట్రల్-కోవలం-మామల్లపురం మార్గంలో రెండు దశల్లో వాటర్ మెట్రో సర్వీస్. భవిష్యత్తు రవాణ అవసరాలను తీర్చడానికి చెన్నై ఒడరేవు-పరందూర్, మామల్లపురం, తిరుపతి కేంద్రంగా గంటకు 240కి.మీ వేగంతో పనిచేసే ఎయిర్ ట్యాక్సీ సర్వీస్ వంటి ప్రాజెక్టులు కూడా ఉన్నాయి.

కోయంబేడు- విమానాశ్రయం మెట్రోరైలు మార్గం

తిరువణ్ణామలై కార్తిక దీపోత్సవానికి ప్రత్యేక బస్సులు, రైళ్లు

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలైలో కార్తిక దీపోత్సవాలు 21న ప్రారంభమై డిసెంబరు 3 వరకు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా మంత్రులు ఏవీవేలు, శేఖర్‌బాబు విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి తిరువణ్ణామలైకు బస్సులు నడుపుతామన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా 40 బస్సులు అదనంగా సిద్ధం చేస్తామన్నారు. ● భక్తులకు తాగునీటి వసతి కల్పిస్తామన్నారు. మహా దీపోత్సవం రోజు వర్షం కురిస్తే నీటిని తొలగించడానికి స్వీపర్లను ఏర్పాటు చేశామన్నారు. ● తాత్కాలిక బస్టాండు నుంచి గిరి ప్రదక్షిణ బాటకు వివిధ కళాశాలకు చెందిన 220 బస్సులను ఉచితంగా నడుపుతామన్నారు. ● దగ్గర్లో ఉన్న జిల్లాల నుంచి రూ.10 టిక్కెట్‌తో 90 మినీ బస్సులు తిరుగుతాయన్నారు. ● తిరువణ్ణామలైకు 16 రైళ్లు నడుస్తున్నాయని, మహా దీపోత్సవం రోజున మరో 16 ప్రత్యేక రైళ్లు నడుపుతామన్నారు. ● 25 కి.మీ దూరానికి ఆటో ఛార్జీ రూ.40గా నిర్ణయించామన్నారు. అంతకుమించిన దూరం పెరిగితే రూ.60 చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఎక్కువ రుసుము వసూలు చేసే ఆటోలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆటోల పర్యవేక్షణకు సిబ్బంది ఏర్పాటు చేస్తామన్నారు. ● గిరి ప్రదక్షిణ బాటలో 90 వైద్య బృందాలను, ఆలయం లోపల 7 వైద్య బృందాలను, 45 అంబులెన్స్‌లు, 5 బైక్ అంబులెన్స్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. ● రాష్ట్ర హైవేలో ఉన్న ట్రావెలర్ బంగ్లాలను ప్రజల అత్యవసర చికిత్స కోసం ఉపయోగిస్తామన్నారు. ● మహాదీపోత్సవానికి సుమారు 40 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేసినట్లు మంత్రులు వివరించారు.

మొత్తం బస్సులు	4,764
పోలీసులు	15 వేల మంది
అగ్నిమాపక సిబ్బంది	430 మంది
అగ్నిమాపక వాహనాలు	24
గిరిప్రదక్షిణబాట, మాడవీధుల్లో వాచ్‌టవర్స్	24
సీసీటీవీ కెమెరాలు	1060
పోలీసు సహాయక కేంద్రాలు	61
అనౌన్స్‌మెంట్ కేంద్రాలు	454
తాత్కాలిక బస్టాండ్లు	24
కార్ పార్కింగ్ ప్రదేశాలు	130

తిరుప్పరకుండ్రం కొండపైకి వెళ్తున్న న్యాయమూర్తి జస్టిస్ స్వామినాథన్

కార్తిక దీపం ఎక్కడ వెలిగించాలి?

ప్యారిస్, న్యూస్‌టుడే: తిరుప్పరకుండ్రం కొండపై కార్తిక దీపం వెలిగించాలన్న పిటిషన్ విషయమై న్యాయమూర్తి జస్టిస్ జీఆర్ స్వామినాథన్ నేరుగా వెళ్లి ఆ ప్రాంతాలను పరిశీలించారు. ఏటా కొండపైనున్న దీప స్తంభంపై దీపం వెలిగిస్తారు. ఈ ఏడాది కొండపై పిళ్లైయార్ ఆలయంలోని దీప మండపంలో వెలిగించడానికి నిర్ణయించారు. ఇందుకు వ్యతిరేకత తెలిపి మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనంలో పిటిషన్ దాఖలైంది. వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ జీఆర్ స్వామినాథన్ సంబంధిత ప్రాంతాన్ని గురువారం పరిశీలించారు. మదురై డిప్యూటీ కమిషనర్ ఇనిగో దివ్యన్ నేతృత్వంలో భద్రత కల్పించారు.

పుదుచ్చేరి అన్నాడీఎంకే నుంచి వైదొలగిన మాజీ ఎమ్మెల్యే

భాజపా ఇన్‌ఛార్జి నిర్మల్‌కుమార్‌తో భాస్కర్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే నుంచి వైదొలగిన పుదుచ్చేరి మాజీ ఎమ్మెల్యే భాస్కర్ భాజపాలో చేరేందుకు చర్చలు జరుపుతున్నారు. పుదుచ్చేరి అన్నాడీఎంకేలో పురట్చి తలైవి జయలలిత పేరవై కార్యదర్శిగా ఉన్న భాస్కర్ 2011, 2016 ఎన్నికల్లో ముదలియార్‌పేట్టై నియోజకవర్గం నుంచి అన్నాడీఎంకే తరఫున గెలిచి ఎమ్మెల్యేగా వ్యవహరించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ఆయన ఓటమిపాలయ్యారు. ఆయన పుదుచ్చేరి అన్నాడీఎంకే రాష్ట్ర కార్యదర్శి అన్బళగన్ సోదరుడు. అన్నాడీఎంకే ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు పార్టీ ప్రధానకార్యదర్శి ఎడప్పాడి పళనిసామికి రెండ్రోజుల కిందట భాస్కర్ లేఖ పంపారు. అప్పటికే మాజీ ఎమ్మెల్యే అసనా కూడా అన్నాడీఎంకే నుంచి వైదొలగారు. పుదుచ్చేరికి గురువారం విచ్చేసి భాజపా అధిష్ఠాన ఇన్‌ఛార్జి నిర్మల్‌కుమార్ సురానాను, రాష్ట్ర భాజపా అధ్యక్షుడు రామలింగాన్ని భాస్కర్ కలిశారు. త్వరలో భాజపాలో చేరనున్నట్లు, ముదలియార్‌పేట్టైలో పోటీకి అవకాశం కల్పించాలని అభ్యర్థించినట్లు తెలిసింది.

(c) eenadu

చెన్నైలో ఈడీ సోదాలు పూర్తి

ప్యారిస్, న్యూస్‌టుడే: చెన్నైలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలు పూర్తయ్యాయి. బంగారు నగలు, ఇనుప వ్యాపారంతో సంబంధం ఉన్న పారిశ్రామికవేత్తల ఇల్లు, కార్యాలయాలు తదితర 15కిపైగా ప్రాంతాల్లో బుధవారం ఉదయం ప్రారంభమైన సోదాలు గురువారం తెల్లవారుజాము వరకు కొనసాగాయి. స్వాధీనం చేసుకున్న పత్రాలపై అధికారులు ఎలాంటి సమాచారం వెల్లడించలేదు.

టీఎన్‌ఈబీ కార్యాలయం ప్రారంభం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా ఆవడి సమీప తిరునింద్రవూరు ఉత్తర సబ్‌స్టేషన్ పరిధిలో 25 వేల విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. నిర్వహణ పరంగా కొన్ని సమస్యలు తలెత్తాయి. పరిష్కారానికి ప్రకాష్‌నగర్‌లో కొత్త కార్యాలయం ఏర్పాటైంది. ప్రకాష్‌నగర్, నడుకుత్తగై, నత్తమేడు, నెమిలిచ్చేరి ప్రాంతాలను కలుపుతూ 11 వేల కనెక్షన్లతో జోన్ ఏర్పాటు చేశారు. ప్రకాష్‌నగర్‌లో ఏర్పాటైన కార్యాలయాన్ని మంత్రి నాజర్ గురువారం ప్రారంభించారు. శాఖాధికారులు శేఖర్, బాలమురుగన్ తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో చదివేస్తాం

✦ ఆసక్తి చూపుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ✦ అండగా నిలుస్తున్న ప్రభుత్వ ఉపకారవేతన పథకం

వడపళని, న్యూస్‌టుడే: ఉన్నతవిద్య అభ్యసించేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఉపకారవేతనంతో ఈ ఏడాది విదేశీ వర్సిటీలో చేరనున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సంఖ్య ఎక్కువగానే ఉంది.

☛ చెన్నైకి చెందిన జీవన్ పరశురామన్ బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేశాడు. నెదర్లాండ్స్‌లోని వాగెంగెన్ యూనివర్సిటీ అండ్ రీసెర్చ్(డబ్ల్యూఏఆర్)లో మాస్టర్ డిగ్రీలో చేరనున్నాడు. ఈ వర్సిటీ మత్స్యసంబంధిత కోర్సుల్లో క్యూఎస్ ప్రపంచర్యాంకింగ్‌లో నంబర్‌వన్ స్థానంలో ఉంది. ట్యూషన్ రుసుము రూ.20 లక్షలు, ఇతరత్రా ఖర్చులకు రూ.13 లక్షల వరకు అవుతుందని సంకోచించానని విద్యార్థి చెప్పాడు. ప్రభుత్వం నుంచి ఉపకారవేతనం అందుతున్నందున చేరగలిగానన్నాడు. తన తండ్రి ప్రైవేటు సంస్థలో పని చేస్తున్నారన్నారు. అదే వర్సిటీలో పరిశోధన కూడా చేయాలనే ఆలోచన ఉన్నట్లు పరశురామన్ చెప్పాడు.

☛ మదురైకి చెందిన బీటెక్ విద్యార్థిని శ్వేత పెరియకరుప్పన్ ఐర్లాండ్‌లోని యూనివర్సిటీ కాలేజ్ కార్క్‌లో మైక్రోబయోమ్ సైన్స్‌లో మాస్టర్ డిగ్రీ సీటు సంపాదించింది. ఈ కోర్సుకు భవిష్యత్తులో మంచి అవకాశాలుంటాయని జీర్ణ వ్యవస్థకు(గట్ హెల్త్)కు సంబంధించి ఎమ్మెస్సీలో చేరానని శ్వేత అన్నారు. తన తండ్రి ప్రైవేటు సంస్థలో పని చేస్తున్నారని తెలిపింది.

☛ 2025-26 విద్యా సంవత్సరంలో యాన్యువల్ అంబేడ్కర్ ఓవర్‌సీస్ హయ్యర్ ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్ స్కీమ్ కింద 21 మంది విద్యార్థులు ఉన్నత విద్యకు ఎంపికయ్యారు. ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.35 లక్షల వరకు అందిస్తోంది. గత ఏడాదితో పోలిస్తే ఇది 13 శాతం ఎక్కువ. ఇప్పటి వరకు 172 మంది విద్యార్థులు యూకే, ఐర్లాండ్, న్యూజిలాండ్, నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీలాంటి దేశాల్లోని విశ్వవిద్యాలయాల్లో చేరారు.

2003లో..

☛ పథకం 2003లో ప్రారంభించినా కొన్నేళ్ల వరకు ఉపకారవేతనాలు అందుకుంటున్న విద్యార్థుల సంఖ్య తక్కువగానే ఉండేది. ఈ ఏడాది 400 మంది నుంచి దరఖాస్తులందాయి. 'క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్'ను పరిగణనలోకి తీసుకుని 213 దరఖాస్తులను ఎంపిక చేశామని రాష్ట్ర ఆది ద్రావిడ, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి జి.లక్ష్మీప్రియ అన్నారు. వారిలో ఈ సంవత్సరం ఐదుగురు విద్యార్థులు గిరిజన వర్గాలకు చెందినవారని తెలిపారు.

కుటుంబ ఆదాయం మేరకు..

☛ కుటుంబ ఆదాయం రూ.8 లక్షల వరకున్న వారికి రూ.35 లక్షల వరకు, రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు ఉన్న వారికి రూ.25 లక్షల వరకు ఉపకారవేతనం అందిస్తోంది.

☛ మాస్టర్ డిగ్రీ లేదా పరిశోధన డిగ్రీలు అభ్యసించేందుకు విదేశాలకు వెళ్లే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ట్యూషన్ ఫీజులు, జీవన ఖర్చులు, వీసాలకయ్యే ఖర్చులు కూడా ఉపకారవేతనాల్లో కలుస్తాయి.

అడవి ఏనుగులకు పేర్లు పెట్టడానికి నిషేధం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: అడవి ఏనుగులకు కొంబన్, పడైయప్పన్‌లాంటి పేర్లు పెట్టడానికి అటవీశాఖ నిషేధం విధించింది. గ్రామాల్లోకి ప్రవేశిస్తున్న ఏనుగులకు స్థానికులు అరిసికొంబన్, పడైయప్పా, బాహుబలి, రివాల్డో తదితర పేర్లతో పిలుస్తున్నారు. ఈ పేర్ల కారణంగా కొన్ని ఏనుగులపై తప్పుడు అభిప్రాయం కలుగుతోందని సామాజిక కార్యకర్తలు పేర్కొంటున్నారు. అటవీ శాఖాధికారి ఒకరు మాట్లాడుతూ.. ఏనుగులకు స్థానికులు పెడుతున్న పేర్లను అనుసరించకుండా సి-12, సి-14 లాంటి కోడ్ నెంబర్లు ఉపయోగించాలని సూచించినట్లు తెలిపారు. ఈ విషయంలో కోర్టు ఉత్తర్వులు, చట్టపరమైన మార్గదర్శకాలు పాటిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో 3,170 ఏనుగులన్నాయి. ఈ ఏడాది 69 గజరాజులు మృతి చెందాయి.

క్రీడలతో సంబంధంలేనివారు ఫెడరేషన్ నిర్వాహకులా?: హైకోర్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: ఒలింపిక్ పోటీల్లో చిన్న దేశాలు బంగారు పతకాలు సాధిస్తున్నాయని 140 కోట్ల జనాభా ఉన్న భారత్ ఒక్క పసిడి పతకం కూడా సాధించలేకపోయిందని మద్రాసు హైకోర్టు ఆవేదన వ్యక్తం చేసింది. చెన్నై అమింజకరైకి చెందిన విద్యార్థిని ఎస్.శ్రీమది దాఖలు చేసిన పిటిషన్‌లో.. తైక్వాండో పోటీలో జాతీయ, రాష్ట్ర స్థాయిలో బంగారు, వెండి పతకాలు సాధించినట్లు తెలిపారు. గతేడాది ఫిబ్రవరిలో పుదుచ్చేరిలో జరిగిన ఖేలో ఇండియా పోటీల గురించి తనకు ఆలస్యంగా తెలిసిందన్నారు. ఆన్‌లైన్‌లో నమోదుకు వెబ్‌సైట్ లింక్ ఇవ్వలేదని, నేరుగా వెళ్లి దరఖాస్తు చేసుకోగా అనుమతి ఇవ్వలేదన్నారు. ఈ పిటిషన్ జస్టిస్ దండపాణి ముందు బుధవారం విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున.. తైక్వాండో తదితర వ్యక్తిగత క్రీడల్లో అసోసియేషన్, ఫెడరేషన్లకు బదులు క్రీడాకారులకు ప్రాధాన్యం ఇచ్చేలా నిబంధనలు తీసుకురావాలని కోరారు. క్రీడలతో సంబంధం లేని వారిని ఫెడరేషన్ నిర్వాహకులుగా నియమించడం ఎలా సరైనదని న్యాయమూర్తి ప్రశ్నించారు. ప్రతిదీ రాజకీయం చేస్తున్నారని, అందుకే ఒలింపిక్ పోటీల్లో దేశం ఒక్క బంగారు పతకం కూడా సాధించలేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పిటిషన్‌ను న్యాయమూర్తి ముగించేశారు. కొత్త పిటిషన్ దాఖలు చేయాలని, దానిని కేంద్ర ప్రభుత్వం పరిశీలించాలని ఉత్తర్వులు ఇచ్చారు.

విద్యా భవనాలు ప్రారంభం

పూర్తయిన నిర్మాణాలు ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, న్యూస్‌టుడే: ఉన్నత విద్యాశాఖ తరఫున నిర్మించిన పలు భవనాలను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. ఉన్నత విద్యాశాఖ తరఫున కడలూర్, విళుపురం, తిరుపత్తూర్, అరియలూర్, మయిలాడుతురై జిల్లాల్లోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో రూ.59.93 కోట్లతో విద్యా సంబంధిత భవనాలు నిర్మించారు. వాటిని సచివాలయం నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి ప్రారంభించారు. రాష్ట్రంలోని 44 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా అభివృద్ధి చేసేలా టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. 190 మంది సహాయ అధ్యాపకులు, 12 మంది లైబ్రేరియన్, 11 మంది సహాయ సంచాలకులు(ఫిజికల్ ఎడ్యుకేషన్) ఉద్యోగ ఖాళీలకు ఎంపిక చేసిన అభ్యర్థులకు నియామక ఉత్తర్వులను అందించారు.

సీఎండీఏ తరఫున..

చెన్నై: గృహనిర్మాణం, పట్టణాభివృద్ధిశాఖ కింద కొనసాగే చెన్నై మహానగరాభివృద్ధి సంస్థ(సీఎండీఏ) తరఫున ఆవడి, అన్ననూర్, కోణాంబేడు ప్రభుత్వ మహోన్నత పాఠశాలల్లో అదనపు నిర్మాణాలు, కోయంబేడు హోల్‌సేల్ మార్కెట్ ప్రాంగణంలో శీతల గోదాములు నిర్మించారు. పుళల్ మేట్టుపాళయంలోని ఫుట్‌బాల్ మైదానం, చేట్‌పేట్‌లోని మినీ ఫుట్‌బాల్ మైదానాన్ని అభివృద్ధిపరిచారు. మొత్తం రూ.20.89 కోట్లతో చేపట్టి పూర్తి చేసిన ఈ పనులను సచివాలయం నుంచి ముఖ్యమంత్రి ప్రారంభించారు.

కుట్రలు తిప్పికొడదాం: స్టాలిన్

చెన్నై: ఆర్య కుట్రలను తిప్పికొడదామని ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. ఆయన తన 'ఎక్స్' పేజీలో... రాష్ట్రానికి చెందినవారికి విద్య, ఉద్యోగం, అధికారంలో తగిన భాగస్వామ్యం కల్పించి, సామాజికన్యాయాన్ని నెలకొల్పాలనే బ్రాహ్మణేతర మేనిఫెస్టోను అమలు చేసేందుకు జస్టిస్ పార్టీ ఆవిర్భవించిన రోజు ఇదన్నారు. ఆ పార్టీ కొనసాగింపే ద్రావిడ మోడల్ ప్రభుత్వమని నిరూపిద్దామని తెలిపారు.

సీఎంను కలిసిన విద్యార్థిని

ముఖ్యమంత్రికి బహుమతి చూపుతున్న హేమదర్శిని

చెన్నై, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి తక్షణ స్పందనతో సాయం పొందిన విద్యార్థిని ఆయన్ను కలిసింది. ఫిబ్రవరి 11న మెరినా తీరంలోని అన్నాదురై, కరుణానిధి సమాధులకు ముఖ్యమంత్రి స్టాలిన్ నివాళులర్పించే సమయంలో వినికిడి లోపం ఉన్న తన కుమార్తె హేమదర్శినికి వినికిడి పరికరాన్ని అమర్చడానికి సాయం చేయాలంటూ త్రిశూలానికి చెందిన సురేష్ అభ్యర్థించారు. వెంటనే ముఖ్యమంత్రి స్పందించి హేమదర్శినికి వినికిడి పరికరాన్ని ప్రభుత్వం తరఫున అమర్చడానికి చర్యలు చేపట్టారు. ఆ బాలిక తన తల్లిదండ్రులతో పాటు సచివాలయంలో గురువారం ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిసింది. తమిళనాడు ఫోరం తరఫున జరిగిన క్విజ్ పోటీల్లో జూనియర్ విభాగంలో గెలిచిన రెండో బహుమతిని చూపించగా ఆ బాలికను సీఎం అభినందించారు. వెంట మాజీ ఎంపీ ఆర్.ఎస్.భారతి ఉన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

శంకుస్థాపన కార్యక్రమంలో పి.కె.శేఖర్‌బాబు, దయానిధి మారన్, ప్రియ తదితరులు

చెన్నై, న్యూస్‌టుడే: రాయపురం జోన్‌లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంత్రి పి.కె.శేఖర్‌బాబు, ఎంపీ దయానిధి మారన్ శంకుస్థాపన చేశారు. చెన్నై మహానగర పాలకసంస్థలోని 54, 55, 56, 57, 59, 60వ డివిజన్లలో ఉన్న పలు వీధుల్లో కార్పొరేషన్ మూలధన నిధి కింద రూ.4.80 కోట్లతో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. రాయపురం జోన్ ప్రకాశం రోడ్డులోని తాతా ముత్తైయప్పన్ వీధిలో గురువారం జరిగిన కార్యక్రమంలో పనులకు మంత్రి పి.కె.శేఖర్‌బాబు, మధ్య చెన్నై ఎంపీ దయానిధి మారన్ శంకుస్థాపన చేశారు. ఓమందూరర్ ప్రభుత్వ ఎస్టేట్ సమీపాన, స్వామి శివానంద రోడ్డులోని ఎం.ఆర్.టి.ఎస్ రైల్వే వంతెన కింద ఉన్న ప్రాంతాన్ని జీసీసీ తరఫున రూ.4.91 కోట్ల వ్యయంతో సుందరీకరణ, పలు వసతులు కల్పించే పనులకు కూడా శంకుస్థాపన చేశారు. మేయర్ ప్రియ, ఉత్తర ప్రాంతీయ డిప్యూటీ కమిషనరు కట్టా రవితేజ తదితరులు పాల్గొన్నారు.

వారాంతపు సెలవులకు ప్రత్యేక బస్సులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: వారాంతపు సెలవులకు చెన్నై నుంచి ప్రత్యేక బస్సులు శుక్రవారం నుంచి నడవనున్నాయి. ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ రవాణ సంస్థ విడుదల చేసిన ప్రకటనలో.. చెన్నై కిళాంబాక్కం నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునెల్వేలి, నాగర్‌కోవిల్, సేలం, కోవై, ఈరోడ్, తిరుప్పూర్ తదితర ప్రాంతాలకు శుక్రవారం 340 బస్సులు, శనివారం 350 బస్సులు తిరగనున్నాయి. ● కోయంబేడు బస్టాండ్ నుంచి తిరువణ్ణామలై, నాగై, వేలాంగణ్ణి, హోసూరు, బెంగళూరుకు రెండు రోజులపాటు తలా 55 బస్సులు నడవనున్నాయి. ● మాధవరం బస్టాండ్ నుంచి రెండ్రోజులపాటు 20 బస్సులు నడపనున్నారు. ● బెంగళూర్, తిరుప్పూర్, ఈరోడ్, కోవై నుంచి ఇతర ప్రాంతాలకు 100 ప్రత్యేక బస్సులు రాకపోకలు సాగించనున్నాయి. ● ఆదివారం చెన్నై, బెంగళూరుకు తిరిగి వెళ్లేందుకు ప్రయాణికుల సౌకర్యానికి తగ్గట్లు రాష్ట్రంలోని అన్ని ఊర్ల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

శ్రీలంక శరణార్థులకు గృహాలు

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతాప్

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి తాలూకా కార్యాలయానికి ఆనుకుని శ్రీలంక శరణార్థులకు శిబిరం ఉంది. ఇరుకు గదుల్లో నివసిస్తున్న వారి కోసం సమీపంలోని పెద్దికుప్పంలో 198 గృహాల నిర్మాణం జరుగుతోంది. కలెక్టర్ ప్రతాప్ గురువారం పనులను పరిశీలించారు. పునరావాస సంక్షేమ శాఖాధికారులు రాజవేల్, గజలక్ష్మి ఆయన వెంట ఉన్నారు.

పురాతన శిల్పం గుర్తింపు

కొట్రవై శిల్పం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: దిండివనం ప్రాంతంలో విళుపురానికి చెందిన చరిత్ర పరిశోధకుడు కె.సెంగుట్టువన్ ఇటీవల పల్లవుల కాలం నాటి కొట్రవై సహా అనేక శిల్పాలను గుర్తించారు. ఆయన మాట్లాడుతూ భారతీదాసన్‌పేటలోని వనదుర్గ ఆలయంలో మూలమూర్తిగా కొట్రవై శిల్పం సుమారు 6 అడుగుల ఎత్తులో 8 చేతులతో నిల్చుని భక్తులకు దర్శనమిస్తున్నారన్నారు. ఏదో కారణాలతో శిల్పాన్ని పూర్తిగా చెక్కలేదని, పూజలు నిర్వహించినట్లు తెలుస్తోందన్నారు. పల్లవుల కాలానికి చెందిన సుమారు 1200 ఏళ్ల కిందటి నాటిదని శిలాశాసనంలో ఉందని తెలిపారు.

ఆ రోజు ఏం జరిగింది?

విద్యుత్తు అధికారులతో సీబీఐ దర్యాప్తు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కరూర్ దుర్ఘటనకు సంబంధించి 8 మంది విద్యుత్తు శాఖాధికారులు, ఇద్దరి సిబ్బందిని బుధవారం సీబీఐ అధికారులు దర్యాప్తు చేశారు. ఘటనరోజు పరిస్థితులపై వారితో సుమారు 2 గంటలకు పైగా మాట్లాడినట్లు తెలిసింది.

బాధితులకు ఆస్తులు అప్పగింత

రెడ్‌హిల్స్: ఆవడి పోలీసు కమిషనరేట్ పరిధిలో నకిలీ దస్త్రాలతో భూమోసాలకు పాల్పడిన వారి నుంచి రూ.4.82 కోట్ల విలువ చేసే ఆస్తులు, నగదును సైబర్‌క్రైం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం అడిషనల్ పోలీసు కమిషనర్ భవానీశ్వరి బాధితులకు అప్పగించారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

వడపళని, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ చేపడుతున్న మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలవరకు తరమణి ప్రాంతంలో సరఫరాలో అంతరాయం కలగనుందని అధికారులు ప్రకటనలో పేర్కొన్నారు.

పూందమల్లిలో ఆక్రమణల తొలగింపు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా పూందమల్లిలో తిరుకచ్చినంబిగల్, వరదరాజ పెరుమాళ్ ఆలయాలకు చెందిన స్థలాన్ని ఆక్రమించుకుని కొందరు పూల దుకాణాలు, హోటళ్లు ఏర్పాటు చేసుకున్నారు. ఆలయానికి కొత్తగా రథం నిర్మించారు. దాన్ని ఆపేందుకు అధికారులు గురువారం ఆక్రమణలు తొలగించారు. నోటీసులు జారీ చేయకుండా ఎలా తొలగిస్తారని ఆక్రమణదారులు అడ్డుకోగా పోలీసులు శాంతపరిచారు.

రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు: సీమాన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: మహిళలు జీవించలేని రాష్ట్రంగా తమిళనాడు మారిందని, ఇదే డీఎంకే విజయమని ఎన్టీకే సమన్వయకర్త సీమాన్ ఆరోపించారు. ఆయన విడుదల చేసిన ప్రకటనలో...రామనాథపురంలో 12వ తరగతి విద్యార్థినిని హత్య చేసిన ఘటన దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. డీఎంకే పాలనలో శాంతిభద్రతలు పూర్తి క్షీణించిపోయాయన్నారు.

అందరూ అయ్యప్పస్వామిని దర్శించుకోవాలి: ఓపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: శబరిమలైలో రద్దీని నియంత్రించి భక్తులంతా అయ్యప్పస్వామి దర్శనం చేసుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం కోరారు. గురువారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... రద్దీ కారణంగా ఈ ఏడాది అనేక మంది భక్తులు స్వామి దర్శనం చేసుకోకుండా వెనుదిరిగినట్లు తెలుస్తోందన్నారు. భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించలేదని ఆరోపణలు వచ్చాయని తెలిపారు.

సేలంలో నూతన వైద్య భవనాలు ప్రారంభం

జ్యోతి వెలిగిస్తున్న మా.సుబ్రమణియన్

టీనగర్, న్యూస్‌టుడే: సేలం జిల్లాలో వైద్య సదుపాయాలు, సేవలను మెరుగుపరచడం డీఎంకే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆరోగ్య శాఖ మంత్రి మా.సుబ్రమణియన్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో రూ.8.60 కోట్లతో నిర్మించిన 17 నూతన వైద్య భవనాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మోహన్ కుమారమంగళం వైద్య కళాశాల ఆసుపత్రిలో పరికరాల కొనుగోలుకు రూ.65 కోట్లు వెచ్చించినట్లు గుర్తు చేశారు. పర్యాటక శాఖ మంత్రి రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అరుళ్‌పై ఫిర్యాదు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సదాశివం

ప్యారిస్, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే అరుళ్‌పై చర్యలు చేపట్టాలని గురువారం డీజీపీ కార్యాలయంలో పీఎంకే ఎమ్మెల్యే సదాశివం ఫిర్యాదు చేశారు. సదాశివం విలేకరులతో మాట్లాడుతూ.. వాళ్పాడిలో తమ కార్యకర్తలపై దాడి జరిగిందని, కారకులపై చర్యలు చేపట్టాలని ఆందోళన చేపడితే తమవారు 8 మందిని పోలీసులు అరెస్టు చేశారన్నారు. ఎమ్మెల్యే అరుళ్‌పై ఎలాంటి చర్యలు చేపట్టలేదని చెప్పారు.

చట్టవిరుద్ధ క్వారీలు నిర్వహిస్తే క్రిమినల్ కేసు నమోదు చేయాలని ప్రజాప్రయోజన వ్యాజ్యం

ప్యారిస్, న్యూస్‌టుడే: అక్రమ క్వారీల ద్వారా ప్రభుత్వానికి నష్టం ఏర్పరిచిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనంలో పుదుక్కోట్టైకి చెందిన కాశిరాజన్ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. క్వారీలో అనుమతి పొందిన విస్తీర్ణం కన్నా ఎక్కువ పరిమాణంలో రాళ్లను కోసి చట్టవిరుద్ధంగా విక్రయిస్తున్నారని, లైసెన్సు పూర్తయినా కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ అనితా సుమంత్, జస్టిస్ కుమరప్పన్ ధర్మాసనం.. క్వారీల్లో చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారికి విధించే జరిమానా, క్రిమినల్ చట్టం కింద చర్యలు చేపట్టాలని ఇదివరకే సుప్రీంకోర్టు స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఆ ప్రకారం తగిన చర్యలు చేపట్టాలన్నారు.

ఉప ముఖ్యమంత్రికి స్వాగతం

ఉదయనిధి స్టాలిన్‌కు పుస్తకం అందిస్తున్న జీవీ సెల్వం

సైదాపేట, న్యూస్‌టుడే: వీఐటీ చెన్నైలో యువజన సంక్షేమ, క్రీడాభివృద్ధి శాఖ తరఫున డాక్టర్ కలైజ్ఞర్ క్రీడా ఉపకరణాల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ పాల్గొన్నారు. కార్యక్రమానికి వచ్చిన ఉదయనిధిని వీఐటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ జీవీ సెల్వం పుస్తకం అందించి స్వాగతించారు.

ఉదయనిధి హఠాత్తుగా వెలుగులోకి వచ్చిన నాయకుడు

నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న వైగై సెల్వన్

కాంచీపురం, న్యూస్‌టుడే: ఉదయనిధి ఉన్నట్లుండి వెలుగులోకి వచ్చిన రాజకీయ నాయకుడని, డీఎంకేకు ఆయన ఫాస్ట్‌ఫుడ్ మాదిరి అని అన్నాడీఎంకే మాజీ మంత్రి వైగై సెల్వన్ పేర్కొన్నారు. ఎస్ఐఆర్‌పై డీఎంకే వ్యతిరేకతను ఖండిస్తూ కాంచీపురం కలెక్టరేట్ సమీపాన నిరసన కార్యక్రమం చేపట్టారు. వైగై సెల్వన్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెరియార్ సిద్ధాంతాలతో ఏర్పడిన ద్రావిడ కళగం నేడు డీఎంకేకు వత్తాసు పలుకుతోందన్నారు.

యువకుడికి మరణశిక్షను సమర్థించిన మదురై ధర్మాసనం

ప్యారిస్, న్యూస్‌టుడే: బాలికపై హత్యాచారం చేసిన యువకుడికి విధించిన మరణశిక్షను మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం సమర్థించింది. విరుదునగర్ జిల్లా శివకాశికి చెందిన ఎనిమిదేళ్ల బాలికపై 2020 జనవరి 20న అస్సోంకి చెందిన మజామ్ అలి(20) అనే యువకుడు హత్యాచారానికి పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి మజామ్ అలిని అరెస్టు చేశారు. శ్రీవిల్లిపుత్తూర్ ప్రత్యేక కోర్టు మరణశిక్ష విధిస్తూ 2022లో ఉత్తర్వులు ఇచ్చింది. తీర్పును సవాలు చేస్తూ దాఖలైన అప్పీల్ మదురై ధర్మాసనంలో న్యాయమూర్తి జస్టిస్ వేల్‌మురుగన్, జస్టిస్ విక్టోరియా గౌరీ ధర్మాసనంలో గురువారం విచారణకు వచ్చింది. పిటిషనరుపై ఆరోపణలు రుజువయ్యాయని ప్రభుత్వం తరఫున తెలిపారు. నమోదు చేసుకున్న న్యాయమూర్తులు కిందికోర్టు విధించిన మరణశిక్షను సమర్థించి పిటిషన్‌ను కొట్టివేశారు.

రాజ్యాంగానికి అనుగుణంగా గవర్నర్ వ్యవహరించాలి

ఎంపీ కనిమొళి

ప్యారిస్, న్యూస్‌టుడే: ఇకనైనా రాజ్యాంగానికి అనుగుణంగా రాష్ట్ర గవర్నర్ పని చేస్తారని ఆశిస్తున్నట్లు ఎంపీ కనిమొళి తెలిపారు. ఆమె తన 'ఎక్స్' పేజీలో.. రాష్ట్ర ప్రయోజనాలను రక్షించేందుకు శాసనసభలో ఆమోదించి పంపే బిల్లులను ఆలస్యం చేయకుండా ముద్ర వేసి దిల్లీకి పంపే సులభమైన పనిని మాత్రమే గవర్నర్‌కు రాజ్యాంగం ఇచ్చిందన్నారు. ఇదే విషయాన్ని తాజాగా సుప్రీంకోర్టు ధ్రువీకరించిందన్నారు.

పాక్షికంగా రద్దయిన రైళ్లు

వడపళని, న్యూస్‌టుడే: తిరువనంతపురం డివిజన్‌లో సాంకేతిక పనుల కారణంగా కొన్ని రైళ్లను పాక్షికంగా రద్దు చేసినట్టు దక్షిణ రైల్వే ప్రకటనలో తెలిపింది. ● 12695 డాక్టర్ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ - తిరువనంతపురం సెంట్రల్ 21న 15.20కు బయలుదేరే రైలు కొట్టాయం వరకు వెళ్తుంది. ● 12696 తిరువనంతపురం సెంట్రల్ - చెన్నై సెంట్రల్ 22న 17.15 రైలు కొట్టయంలో 20.05 గంటలకు బయలుదేరుతుంది.

దారి మళ్లింపు

● 12624 తిరువనంతపురం సెంట్రల్ - చెన్నై సెంట్రల్ 22న 15.00కు బయలుదేరే రైలు అళప్పుళా మీదుగా వస్తుంది. ప్రయాణికుల కోసం అళప్పుళా, చెర్తాల, ఎర్నాకులం జంక్షన్‌లో కాసేపు ఆగుతుంది.

తీర ప్రాంతాల్లో మాక్‌డ్రిల్



సముద్రంలోకి వెళుతున్న పోలీసులు

మహాబలిపురం, న్యూస్‌టుడే: తీరప్రాంత భద్రతకు సంబంధించి ఏటా సాగర్ కవచ్ మాక్‌డ్రిల్‌ను నిర్వహిస్తున్నారు. మహాబలిపురం వద్ద గురువారం ఉదయం 8 గంటలకు ఈ ప్రక్రియ ప్రారంభించారు. ఈస్ట్‌కోస్ట్ రోడ్డులో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుందని కోస్ట్‌గార్డ్ అధికారులు తెలిపారు.

ఓటరు జాబితా నుంచి మృతుల పేర్లు తొలగించడానికి భయమెందుకు?

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: చనిపోయినవారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించడానికి డీఎంకేకు ఎందుకు భయమని మాజీ మంత్రి సీవీ షణ్ముగం ప్రశ్నించారు. ఎస్ఐఆర్‌పై దిల్లీలో ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదు లేఖ అందించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్ఐఆర్ దరఖాస్తులను బీఎల్ఓల నుంచి లాక్కొని డీఎంకే స్వయంగా నింపి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తోందన్నారు. రాష్ట్ర ఓటర్ల జాబితాలో ఎవరెవరు ఉండాలని, ఎవరిని తొలగించాలో డీఎంకే నిర్ణయిస్తోందన్నారు.

EENADU Classifieds
REAL ESTATE
PLOT FOR SALE
GENERAL
TUDA APPROVED Plots available with all Modern Amenities & Ready to Construction Suitable for Commercial Building for more Rental Purpose at Sri City TADA, Tirupati (Dist). 99592 21918.
22 సెంట్లు వ్యవసాయ భూమి 92 మొక్కలతో 8 లక్షల 50 వేలు మాత్రమే. 5 సం. నుండి సుమారు 40 సం. వరకు ఆదాయం. ✆ 89781 62222.

25, 26 తేదీల్లో అగరుబత్తీల తయారీలో శిక్షణ

వడపళని, న్యూస్‌టుడే: తమిళనాడు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ ఇన్‌స్టిట్యూట్ (ఈడీఐఐటీఎన్) ఆధ్వర్యంలో అగరుబత్తీ సంబంధిత ఉత్పత్తుల తయారీపై రెండు రోజుల పాటు శిక్షణ అందించనుంది. ఈక్కాట్టుతాంగల్, గిండి ప్రాంగణంలోని కార్యాలయంలో 25, 26 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు జరిగే శిక్షణకు పదో తరగతి ఉత్తీర్ణులైన, 18ఏళ్లకు పైబడిన పురుషులు, మహిళలు, హిజ్రాలు హాజరుకావచ్చు. నామమాత్రపు రుసుముతో హాస్టల్ వసతి కూడా కల్పిస్తున్నారు. ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 98401 14680 నంబర్‌ను సంప్రదించాలి.

10 వేల ఉద్యోగావకాశాలు టీఆర్బీ రాజా

ఒప్పందపత్రాలతో అధికారులు, చిత్రంలో మంత్రి టీఆర్బీ రాజా

సైదాపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 10 వేల ఉద్యోగావకాశాలు రానున్నట్లు పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్బీ రాజా తెలిపారు. తమిళనాడు ప్రభుత్వం ప్రపంచస్థాయి నైపుణ్య కేంద్రాలను రూపొందించే ప్రముఖసంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందన్నారు. తద్వారా తమిళనాడులో 10 వేల ఉద్యోగావకాశాలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఇందుకు సంబంధించి బెంగళూరులో జరిగిన సమావేశంలో ఒప్పందం కుదిరిందని ఆయన గురువారం తెలిపారు.

ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(సర్) సందర్భంగా ఓటర్లకు సహాయపడేలా అన్ని పోలింగ్ కేంద్రాల్లో హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేశారు. అడయారు జోన్ శాస్త్రీనగర్‌లోని చెన్నై ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లో స్థానికుల సందేహాలు నివృత్తి చేస్తున్న దృశ్యం -న్యూస్‌టుడే, చెన్నై

(c) eenadu

సౌర విద్యుత్తు కొనుగోలుకు సిద్ధం

వడపళని, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని రైతులు, గ్రామ పంచాయతీలు, సహకార సంఘాల నుంచి 420 మెగావాట్ల సౌర విద్యుత్తు కొనుగోలుకు తమిళనాడు గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్(టీఎన్‌జీఈసీఎల్) సిద్ధంగా ఉంది. పీఎం కుసుమ్ పథకం కింద ఏర్పాటు చేసిన సౌర విద్యుత్తు ప్లాంట్ల నుంచి యూనిట్‌కు రూ.3.10 చొప్పున విద్యుత్తును విక్రయించేందుకు టెండర్లు దాఖలు చేయడానికి తమిళనాడు ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(టీఎన్ఈఆర్సీ) అనుమతిచ్చిన తర్వాత ఈ చొరవ ప్రారంభమైంది.

● కుసుమ్ పథకంలో భాగంగా రైతులు తమ బంజరు భూమిలో సౌర విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. ఉత్పత్తి అయిన విద్యుత్తును పంపిణీ సంస్థలకు అమ్ముకునే వీలు కూడా ఉంది. కేంద్రంలోని నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వశాఖ ఈ ఏడాది డిసెంబరు వరకు కుసుమ్ పథకం కింద రాష్ట్రానికి 424 మెగావాట్లను మంజూరు చేసినా రాష్ట్రం రెండు మెగావాట్లను మాత్రమే అమలు చేసింది.

రైతులకు అవగాహన కల్పించి.

● 420 మెగావాట్ల విద్యుదుత్పత్తికి టెండర్లను పిలిచేందుకు 'టీఎన్‌జీఈసీఎల్' దాఖలు చేసిన సమీక్ష పిటిషన్‌ను నియంత్రణ సంస్థ ఆమోదించింది. పథక ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించి, సౌర విద్యుత్తు ప్లాంట్లను ఏర్పాటు చేయమని, వారిని ఆహ్వానించేందుకు గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ హామీ ఇవ్వడంతో రాజస్థాన్ కుసుమ్ పథకం కింద 462.75 మెగావాట్ల వరకు సామర్థ్యాన్ని పెంచుకుంది. ఈ క్రమంలో టీఎన్‌జీఈసీఎల్ లక్ష్యాన్ని సాధించడానికి, పథకాన్ని సక్రమంగా అమలు చేయడానికి కఠోర కృషి చేయాల్సి ఉంటుందని కమిషన్ పేర్కొంది.

● టీఎన్‌జీఈసీఎల్ యూనిట్‌కు రూ.3.28ను గరిష్ఠ ధరగా నిర్ణయించాలని ప్రతిపాదించగా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, హరియాణా లాంటి రాష్ట్రాల్లో విద్యుత్తు కొనుగోళ్ల ఖర్చు, జీఎస్టీ ప్రయోజనాలను వివరిస్తూ టీఎన్ఈఆర్సీ యూనిట్ ధరను రూ.3.10కి తగ్గించింది.

నిబంధనలు తప్పనిసరి చేసి..

● గ్రిడ్ స్థిరత్వాన్ని కాపాడేందుకు, రిమోట్ మీటరింగ్, రిమోట్ ట్రిప్పింగ్, గ్రిడ్ కోడ్ నిబంధనలను తప్పనిసరి చేయాలని కమిషన్ ఆదేశించింది. నికర శక్తిపై చెల్లింపులు, లైన్ నష్టాలను తగ్గించిన తర్వాత, డెవలపర్లు ఫీడర్ నిర్వహణ లేదా సబ్‌స్టేషన్ షట్‌డౌన్‌లతో కలిగే అంతరాయాలకు పరిహారం పొందేందుకు అర్హులు కారని కమిషన్ ఉత్తర్వులో స్పష్టం చేసింది.

డిసెంబరు 12నుంచి పార్సిల్ రైలు సేవలు

వడపళని, న్యూస్‌టుడే: పార్సిళ్లను తక్కువ ఖర్చుతో రవాణా చేసేందుకు దక్షిణ రైల్వే యంత్రాంగం సిద్ధమైంది. 'కోస్ట్ టు కోస్ట్' పేరిట సేవలు తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి ప్రారంభం కానున్నాయని దక్షిణ రైల్వే బుధవారం ప్రకటన విడుదల చేసింది. మొదటి 'పార్సిల్ ఎక్స్‌ప్రెస్' డిసెంబరు 12వ తేదీ మధ్యాహ్నం 3.10 గంటలకు మంగళూరు సెంట్రల్ రైల్వేస్టేషనులో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 1.30 గంటలకు రాయపురం చేరుతుంది. డిసెంబరు 16న మధ్యాహ్నం 3.45కు రాయపురంలో బయలుదేరి మంగళూరు సెంట్రల్‌కు మరుసటి రోజు మధ్యాహ్నం 2.20 గంటలకు చేరుకుంటుంది. ఈ రైలులో హై కెపాసిటీ పార్సిల్ వ్యాన్లు 10, లగేజ్ కమ్ బ్రేక్ వ్యాన్లు 2 ఉంటాయి. మంగళూరు నుంచి శుక్రవారం, చెన్నైలోని రాయపురం నుంచి మంగళవారం నడిచే పార్సిల్ సర్వీసు సేలం, ఈరోడ్, ఊత్తుకుళి, తిరుపూర్, కోయంబత్తూరు, పాలక్కాడ్, షోరనూర్, తిరూర్, కోజికోడ్, తలస్సెరి, కానూర్, కాసర్‌గాడ్ స్టేషన్లలో ఆగుతుంది.

'క్యూఎస్'లో వీఐటీకి 7వ ర్యాంకు

వడపళని, న్యూస్‌టుడే: 'క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్'లో 2026 సంవత్సరానికి వేలూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(వీఐటీ)కి దేశవ్యాప్తంగా 7వ ర్యాంకు, అంతర్జాతీయంగా 352వ ర్యాంకు లభించింది. పర్యావరణ ప్రభావ విభాగంలో ప్రపంచవ్యాప్తంగా 194వ స్థానంలో నిలిచి ప్రత్యేకత చాటుకుందని వర్సిటీ గురువారం ప్రకటన విడుదల చేసింది. సస్టైయినబిలిటీని పరిగణనలోకి తీసుకుని ర్యాంకులను విడుదల చేసిందని వీఐటీ కులపతి డాక్టర్ జి.విశ్వనాథన్ పేర్కొన్నారు. సోషల్ ఇంపాక్ట్, గవర్నెన్స్, పర్యావరణ ప్రభావంలో వర్సిటీ అత్యంత ప్రతిభను కనబరుస్తోందని ఆయన అన్నారు. 2025లో అంతర్జాతీయ స్థాయిలో 396వ స్థానంలో ఉండగా 2026లో 352వ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు.

పాండిచ్చేరి వర్సిటీకి 45వ స్థానం..

ఆర్కేనగర్: క్యూఎస్ ర్యాంకింగ్స్ జాబితాలో పాండిచ్చేరి విశ్వవిద్యాలయం జాతీయ స్థాయిలో 45వ స్థానంలో నిలిచింది. వర్సిటీ డిప్యూటీ రిజిస్ట్రార్ మహేష్ విడుదల చేసిన ప్రకటనలో... 2026 సంవత్సరానికి క్యూఎస్ సస్టైనబిలిటీ ర్యాంకింగ్స్‌లో పాండిచ్చేరి విశ్వవిద్యాలయం గణనీయమైన మెరుగుదల నమోదు చేసిందన్నారు.

తిరువణ్ణామలై ఆలయానికి సారె అందజేత

సారె తీసుకొస్తున్న భక్తులు

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురానికి చెందిన తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణ కమిటీకి చెందిన శివ భక్తులు ఏటా తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయంలో నిర్వహించే కార్తిక మాస దీపోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయానికి కాంచీపురం కమిటీ తరఫున చీర, దోవతులు, రుద్రాక్షలు, ఇతర పూజా సామగ్రి అందజేయడం ఆనవాయితీ. ఆ క్రమంలో గిరి ప్రదక్షిణ కమిటీ 22వ వార్షిక కార్తిక దీపోత్సవం సందర్భంగా కాంచీపురానికి చెందిన శివ భక్తులు తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామికి గురువారం సారెను ఆలయ నిర్వాహకులకు అందజేశారు.

అంతర్జాతీయ పోటీలకు సహకరించాలి

పీటీ ఉషతో ఆదవ్ అర్జున

సైదాపేట, న్యూస్‌టుడే: అంతర్జాతీయ పోటీలు జరిపేందుకు సహకారం అందించాలని జాతీయ బాస్కెట్‌బాల్ సంఘ అధ్యక్షుడు ఆదవ్ అర్జున కోరారు. చెన్నై ఎగ్మూర్‌లోని ఓ ప్రైవేటు విద్యాసంస్థ తరఫున రూ.25 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఫుట్‌బాల్ రెసిడెన్షియల్ అకాడమీ, స్విమ్మింగ్ ట్రైనింగ్ స్కూల్‌ను భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆదవ్ అర్జున మాట్లాడుతూ... అంతర్జాతీయ క్రీడా పోటీలు తమిళనాడులో జరిగేందుకు సహకారం అందించాలని ఆమెను కోరారు.

కూటమి పాలనే ఉత్తమం: కృష్ణస్వామి

మాట్లాడుతున్న కృష్ణస్వామి

టీనగర్, న్యూస్‌టుడే: బిహార్ తరహాలోనే తమిళనాడులోనూ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావాలని పుదియ తమిళగం పార్టీ అధ్యక్షుడు కృష్ణస్వామి ఆకాంక్షించారు. ఆయన గురువారం తిరునెల్వేలిలో విలేకర్లతో మాట్లాడారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఒంటరి పార్టీ పాలనకు ముగింపు పలకాలన్నారు. కేంద్ర, రాష్ట్ర నిధుల దుర్వినియోగానికి వ్యతిరేకంగా తిరునెల్వేలిలో ఆందోళన జరిగిందని, త్వరలో రాష్ట్రవ్యాప్తంగా చేపడతామన్నారు.

నీతి ఆయోగ్ క్రిటికల్ మినరల్స్ కమిటీ సభ్యుడిగా ఎన్ఎల్‌సీ సీఎండీ నియామకం

ప్రసన్నకుమార్ మోటుపల్లి

వడపళని, న్యూస్‌టుడే: ఎన్ఎల్‌సీ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ప్రసన్నకుమార్ మోటుపల్లి 'నీతి ఆయోగ్ క్రిటికల్ మినరల్స్'కు సంబంధించిన జాతీయ కమిటీలో కీలక వ్యూహకర్తగా నియమితులయ్యారు. దేశంలో ఇంధన పరివర్తన, అధునాతన తయారీ, వ్యూహాత్మక రంగాలకు కీలకమైన ఖనిజ వనరులను గుర్తించి, అంచనా వేయడానికి, అభివృద్ధి పథంలో భారత్ ప్రయత్నాలను వేగవంతం చేయడానికి నీతి ఆయోగ్ ఉన్నత స్థాయి క్రిటికల్, స్ట్రాటజిక్ మినరల్స్ కమిటీని ఏర్పాటు చేసిందని ఎన్ఎల్‌సీ గురువారం ప్రకటన విడుదల చేసింది.

సహకార సంఘంలో కుంభకోణం

ఫిర్యాదు చేసిన ఉద్యోగికి ప్రాణహాని

టీనగర్, న్యూస్‌టుడే: సేలంలో జరిగిన కార్మికుల సహకార సంఘంలో రూ.కోట్ల భారీ మోసం జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ సంఘం నిర్వాహక డైరెక్టర్ ఎ.పి.భారతి తన కుటుంబ సభ్యులతో కలిసి, రోజువారీ చందాలు, డిపాజిట్ల రూపంలో ప్రజల నుంచి వసూలు చేసిన కోట్లాది రూపాయలను సంఘం బ్యాంకు ఖాతాలో జమ చేయకుండా, సొంత అవసరాలకు వాడుకుని, స్థిరాస్తులు కొన్నారని మాజీ ఉద్యోగి ధనశేఖరన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసినందుకు తనను కార్యాలయ గదిలో బంధించి హత్య చేస్తామని బెదిరించారని ధనశేఖరన్ ఆందోళన వ్యక్తం చేశాడు. నిందితులపై చర్యలు తీసుకుని ప్రజల డబ్బు తిరిగి చెల్లించాలని పోలీసులను కోరారు.

రూ.1.14 కోట్లు జీఎస్టీ చెల్లించాలని వృద్ధుడికి లేఖ

ట్రిప్లికేన్: భార్య పింఛన్‌తో జీవితం గడుపుతున్న వృద్ధుడు రూ.కోట్లు జీఎస్టీ చెల్లించాలని బ్యాంకు అధికారులు లేఖ పంపారు. తిరుప్పత్తూరు జిల్లా ఆంబూరు మున్సిపాలిటీలోని మళిగైతోప్పునకు చెందిన వేలాయుధం కొన్నేళ్ల కిందట గుండె శస్త్రచికిత్స చేయించుకున్నారు. భార్య ప్రైవేటు షూ పరిశ్రమలో పనిచేస్తూ మృతిచెందింది. భార్య పింఛన్ డబ్బుతో జీవనం సాగిస్తున్నారు. కొద్ది నెలలుగా పింఛన్ రాలేదు. ఆంబూరులోని బ్యాంకుకెళ్లి అడిగితే రూ.1.14 కోట్లు జీఎస్టీ చెల్లించాలని అధికారులు ఉత్తరం ఇచ్చారు. దిగ్భ్రాంతికి గురైన వేలాయుధం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

20లలోనే వివాహం చేసుకోండి: శ్రీధర్ వేంబు

ఆర్కేనగర్: యువత 20ఏళ్ల వయసులోనే వివాహం చేసుకొని పిల్లలు కనాలని జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వేంబు సలహా ఇచ్చారు. నటుడు రామ్‌చరణ్ సతీమణి ఉపాసనా వ్యాఖ్యలకు ఆయన 'ఎక్స్'లో స్పందించారు. 20లలో(20-29 ఏళ్లలో) పెళ్లి చేసుకుని పిల్లలను కనాలని, పెళ్లి, పిల్లలను వాయిదా వేయవద్దని తనను కలిసిన యువ పారిశ్రామికవేత్తలకు సలహా ఇస్తున్నానని తెలిపారు. ఈ ఆలోచన వింతగా, పాతకాలం నాటిదిగా అనిపించవచ్చన్నారు.

కచ్చపేశ్వరాలయంలో తెప్పోత్సవాలు

తెప్పపై విహరిస్తున్న స్వామి, అమ్మవారు ✦ అలంకరణలో సుందరాంబిక సమేత కచ్చపేశ్వరస్వామి

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురంలోని సుందరాంబిక సమేత కచ్చపేశ్వరస్వామి తెప్పోత్సవాలు బుధవారం రాత్రి ప్రారంభమయ్యాయి. స్వామి, అమ్మవారికి అభిషేక ఆరాధనలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా తీసుకొచ్చి తెప్పపై కొలువుదీర్చి మూడు ప్రదక్షిణలు చేయించారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి తితిదే పట్టువస్త్రాలు

పట్టువస్త్రాలు తెచ్చిన బృందాన్ని ఆహ్వానిస్తున్న ప్రముఖులు

శోళింగర్, న్యూస్‌టుడే: శోళింగర్ యోగ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి 80 ఏళ్ల తర్వాత తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున గురువారం పట్టువస్త్రాలు అందించారు. పట్టువస్త్రాలు తీసుకొచ్చిన బృందానికి పలువురు ప్రముఖులు ఆహ్వానం పలికారు. పట్టువస్త్రాలను స్వామి, అమ్మవార్లకు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం తరఫున ఆ బృందాన్ని సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రవి, కమిటీ సభ్యులు హరీష్, రాజ్‌కుమార్, వేలూరు ఆలయ సంయుక్త కమిషనర్ విజయ, శోళింగర్ ఆలయ డిప్యూటీ కమిషనర్ రాజా, దాతలు నరసింహరాజు, రవిచంద్రరాజు, పూర్ణచంద్రన్, భట్టాచార్యులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ముగ్గురు యువకుల మృతి

దినేశ్, షాజహాన్, బాలమురుగన్ (పాతచిత్రాలు)

అరక్కోణం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... రాణిపేట జిల్లా కారైకూట్ రోడ్డు వంతెన వద్ద గురువారం తెల్లవారుజామున ముగ్గురు యువకులు ఒకే ద్విచక్ర వాహనంలో వెళ్తున్నారు. కర్ణాటక నుంచి చెన్నై వెళ్తున్న కారు వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ముగ్గురు యువకులు తీవ్రగాయాలకు గురయ్యారు. కారు కూడా ధ్వంసమైంది. సమాచారం మేరకు రాణిపేట పోలీసులు అక్కడికి చేరుకుని క్షతగాత్రులను వాలాజాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే కారైకూట్ రోడ్డుకు చెందిన దినేశ్(20) మృతిచెందాడు. మిగిలిన ఇద్దరు వేలూరు రంగాపురానికి చెందిన షాజహాన్(26), ఆర్కాడుకు చెందిన బాలమురుగన్(19) వేలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు కారు డ్రైవర్‌ను అరెస్టు చేశారు.

ప్రియుడితో రీల్స్

ప్రశ్నించిన భర్తను హత్య చేసిన భార్య

విజయ్(పాతచిత్రం), భార్య షర్మిల

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: సేతుపట్టు సమీపం ఇడయాన్‌కొళత్తూర్ గ్రామానికి చెందిన లారీడ్రైవర్ విజయ్(27), షర్మిల ఐదేళ్ల కిందట ప్రేమించి వివాహం చేసుకున్నారు. వారికి నాలుగేళ్ల కుమార్తె, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. విజయ్ డ్రైవర్ పనికివెళ్లి 10, 15 రోజులకు ఇంటికి వచ్చేవాడు. ఈ నేపథ్యంలో షర్మిలకు మరొకరితో స్నేహం ఏర్పడింది. అనుమానం కలిగిన విజయ్ చుట్టుపక్కల వారిని విచారించి ఆమెకు వివాహేతర సంబంధం ఉందని తెలుసుకున్నాడు. షర్మిల ప్రేమికుడితో కలిసి చేసిన రీల్స్ విజయ్ చూసి ప్రశ్నించగా వారి మధ్య వాగ్వివాదం జరిగింది. ఆ సమయంలో షర్మిల కర్రతో విజయ్ తలపై కొట్టడంతో మృతి చెందాడు. షర్మిల తన తల్లి రాని ఫాతిమా సాయంతో కిటికీకి వేలాడదీసి విజయ్ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు తెలిపారు. పోలీసులు తమదైనశైలిలో విచారించగా నేరాన్ని అంగీకరించారు. పోలీసులు వారిని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగ ప్రకటన నమ్మి మోసపోయిన వివాహిత

మనస్తాపంతో ఆత్మహత్య

లావణ్య (పాతచిత్రం)

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ఆన్‌లైన్‌లో ఉద్యోగ అవకాశాల ప్రకటన నమ్మి రూ.5 లక్షలు కోల్పోయిన వివాహిత మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు...దిండుక్కల్ జిల్లా సత్రం పట్టి సమీపం విరుప్పాచ్చి ప్రాంతానికి చెందిన శివశక్తి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను కోవైకు చెందిన లావణ్య(25)ను ఆరేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారు సత్రం పట్టిలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. వారికి ఇద్దరు పిల్లలున్నారు. లావణ్య ఇంట్లో ఉంటూనే దూరవిద్యలో డిగ్రీ చేస్తూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తోంది. సామాజిక మాధ్యమాల ద్వారా ఉద్యోగ అవకాశాల ప్రకటన చూసిన ఆమె ఫోన్ ద్వారా సంప్రదించింది. అందులో ఓ వ్యక్తి ఉద్యోగంలో చేరాలంటే రూ.5 లక్షలు చెల్లించాలని చెప్పడంతో పలు విడతలుగా ఆన్‌లైన్ ద్వారా పంపించింది. ఉద్యోగం రాకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిని సంప్రదించినా అతను అందుబాటులోకి రాలేదు. మోసపోయినట్లు గ్రహించిన మనస్తాపంతో ఉండేది. రోజులానే భర్త పనికి వెళ్లగా లావణ్య ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేపట్టారు.

నదిలో దూకి వ్యక్తి ...

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నది వంతెనపై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. జంబైయె సమీపంలోని దళవాయ్‌పేట పెరుమాల్‌పాళయంకు చెందిన రఘు(35) చెన్నైలో డ్రైవర్‌గా పనిచేశాడు. ఈయన భవాని నదిపై ఉన్న కొత్త వంతెన నుంచి హఠాత్తుగా దూకాడు. ఆ దృశ్యాన్ని చూసిన స్థానికులు భవాని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం చేరవేశారు. ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మృతదేహాన్ని బయటికి తీసి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వ్యాపారిని హత్య చేసిన మిత్రుడి అరెస్ట్

విల్లివాక్కం, న్యూస్‌టుడే: వ్యాపారిని హత్య చేసిన కేసులో ఆయన మిత్రుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కృష్ణగిరి జిల్లా బర్గూర్ సమీపంలోని పీఎర్‌జీ మాతేపల్లికి చెందిన వస్త్ర వ్యాపారి గణేశన్ కుళ్లిన స్థితిలో పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం కృష్ణగిరి ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి పంపారు. మృతి చెందిన వ్యక్తి కల్లావికి చెందిన గణేశన్(48) అని, రెండు రోజుల కిందట చెన్నకేశవులు అనే వ్యక్తితో వెళ్లినట్లు పోలీసుల దర్యాప్తులో తెలిసింది. పోలీసులు చెన్నకేశవన్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా ఇద్దరం మిత్రులమని, భోజనం చేస్తున్న సమయంలో జరిగిన ఘర్షణలో గణేశన్‌ను హత్య చేసి పూడ్చినట్లు, దుర్వాసన రావడంతో మృతదేహాన్ని ఇంటి ముందు రోడ్డుపై పడేసినట్లు ఒప్పుకొన్నాడు.

దోపిడీ కేసులో ఇద్దరు..

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తూత్తుకుడి జిల్లా ముత్తుకృష్ణాపురానికి చెందిన శివ లారీ డ్రైవర్. ఈయన తిరువళ్లూరు జిల్లా రెడ్‌హిల్స్‌కు ద్విచక్ర వాహనంపై బుధవారం రాత్రి బయలుదేరాడు. పుళల్ సమీప సైకిల్ షాప్ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇద్దరు కత్తి చూపి రూ.7 వేల నగదు దోచుకుని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రెడ్‌హిల్స్ పోలీసులు సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా అంబత్తూరుకు చెందిన వేల్‌మురుగన్, విమల్‌కుమార్ అనే వ్యక్తులను గురువారం అరెస్టు చేశారు.

ఆస్తి ఆక్రమణకు పాల్పడిన ఇద్దరు..

కుమారి, మేరీ

ప్యారిస్, న్యూస్‌టుడే: విలువైన ఆస్తిని నకిలీ పత్రాలతో ఆక్రమించుకున్న కేసులో ఇద్దరు మహిళలను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... దిల్లీలో ఉంటున్న విశ్వనాథన్ మహాదేవన్ మేనమామ గణపతికి చెన్నై కొళత్తూరులో రూ.3 కోట్ల ఆస్తి ఉంది. ఈ నేపథ్యంలో గణపతి మృతి చెందిన విషయం, అతనికి వారసులు లేరని తెలుసుకున్న కుమారి, మేరీలు గణపతి కుమార్తెలుగా నకిలీ పత్రాలు సృష్టించి ఆ స్థలాన్ని ఆక్రమించుకున్నారు. ఈ విషయమై విశ్వనాథన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేసి, ఇదివరకే ముగ్గురిని అరెస్టు చేశారు. పరారీలో ఉన్న చెన్నై శ్రీనివాసపురానికి చెందిన కుమారి, మేరీలను బుధవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

విద్యార్థినిని హత్య చేసిన యువకుడికి రిమాండ్

ప్యారిస్: విద్యార్థిని హత్య కేసులో అరెస్టయిన యువకుడికి 15 రోజులు రిమాండ్ విధిస్తూ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. రామనాథపురం జిల్లా రామేశ్వరం సేరాంకోట్టైకి చెందిన మారియప్పన్ కుమార్తె షాలినిని మునిరాజ్ బుధవారం కత్తితో పొడిచి హత్య చేసిన విషయం తెలిసిందే. పోలీసులు నిందితుడిని అరెస్టు చేయగా తమకు అప్పగించాలంటూ విద్యార్థిని బంధువులు ఆందోళన చేపట్టారు. పోలీసులు హామీ మేరకు ఆందోళన విరమించి మృతదేహాన్ని తీసుకుని అంత్యక్రియలు నిర్వహించారు. రాత్రి రామేశ్వరం కోర్టులో మునిరాజ్‌ను హాజరు పరచగా 15 రోజులు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు ఇచ్చారు.

బాలురపై హెడ్‌కానిస్టేబుల్ దాడి

రూ.25 వేలు చొప్పున పరిహారం ఇవ్వాలని ఉత్తర్వులు

ప్యారిస్, న్యూస్‌టుడే: బాలురను హింసించిన కేసులో పరిహారం చెల్లించాలని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఉత్తర్వులు ఇచ్చింది. 2016లో చోరీ కేసులో నలుగురు బాలురను కొడుంగైయూర్ పోలీసులు అరెస్టు చేశారు. కొడుంగైయూర్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న గుణశేఖరన్(ప్రస్తుతం సబ్ ఇన్‌స్పెక్టర్) బాలురను హింసించినట్లు ఆరోపణలు వచ్చాయి. సుమోటోగా విచారణకు తీసుకున్న రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ విచారణ జరిపింది. బాలురు తమపై గుణశేఖరన్ దాడిచేసిన విషయమై వాగ్మూలం ఇచ్చారు. మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందనే విషయం రుజువైందని మానవ హక్కుల కమిషన్ నలుగురికి తలా రూ.25 వేలు పరిహారం రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మొత్తాన్ని ఎస్సై గుణశేఖరన్ వద్ద వసూలు చేయాలని ఉత్తర్వులు ఇచ్చింది.

అత్యాచారం కేసులో యువకుడికి 20 ఏళ్లు శిక్ష

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై చిన్నకల్లాపాడి ప్రాంతానికి చెందిన పొన్నుడి కుమారుడు ప్రభు(30) 2022లో 10వ తరగతి చదువుతున్న 16 ఏళ్ల విద్యార్థినిని ప్రేమిస్తున్నట్లు చెప్పి కిడ్నాప్ చేసి బాల్యవివాహం చేసుకుని అత్యాచారం చేశాడు. ఈ విషయమై బాలిక తల్లిదండ్రులు వేరయూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి బాలికను రక్షించి ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు. ప్రభును అరెస్టు చేసి తిరువణ్ణామలై పోక్సో కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసును విచారించిన జడ్జి కాంచన ప్రభుకి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. పోలీసులు ప్రభును వేలూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

దత్తత పేరుతో రూ.3 లక్షల మోసం

కోర్టులో లొంగిపోయిన నిందితులు

టీనగర్, న్యూస్‌టుడే: బిడ్డను దత్తత ఇస్తామని చెప్పి నగదు దోచుకున్న కేసులో ప్రధాన నిందితులు ఇద్దరు కోర్టులో లొంగిపోయారు. విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూరుకు చెందిన పాదముత్తుకు పెళ్లై 23 ఏళ్లయినా పిల్లల్లేరు. పిల్లల దత్తత కోసం ఆయన తన బంధువు ద్వారా సేలంకు చెందిన అరుణ్‌కుమార్‌ను సంప్రదించారు. రూ.3 లక్షలు డిమాండ్ చేయడంతో పాదముత్తు నగదుతో తన బంధువులతో కలిసి సేలం వచ్చారు. ఈనెల 11న డబ్బు తీసుకునే సమయంలో అరుణ్‌కుమార్ అతని అనుచరులు తాము పోలీసులమని బెదిరించి పాదముత్తు నుంచి రూ.3 లక్షలు దోచుకున్నారు. ఈ కేసులో కరుప్పూర్ పోలీసులు ఇప్పటికే మధురాజ్, యేసురాజ్ అనే ఇద్దరిని అరెస్టు చేశారు. ప్రధాన నిందితులైన అరుణ్‌కుమార్, అతని సహచరుడు పళనిభారతి కోసం గాలిస్తున్నారు. ఇటీవల వారిద్దరు కొల్లిమలై వద్ద కారులో వెళ్తుండగా పోలీసులు వెంబడించగా పరారయ్యారు. ఈ నేపథ్యంలో వారు గురువారం సేలం కోర్టులో లొంగిపోయారు. న్యాయమూర్తి వారిని ఒకరోజు పోలీసు కస్టడీకి అప్పగించారు. లొంగిపోయిన నిందితుల్లో ప్రధాన సూత్రధారి అరుణ్‌కుమార్ సేలం నగర జిల్లా అన్నాడీఎంకే విద్యార్థి విభాగం సంయుక్త కార్యదర్శిగా ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

చెక్‌పోస్టులో అనిశా అధికారుల తనిఖీ

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా పూందమల్లి సమీపం నసరత్‌పేటలో రవాణా శాఖ చెక్‌పోస్టు ఉంది. వాహన చోదకుల నుంచి సిబ్బంది ఇష్టానుసారం డబ్బులు వసూలు చేస్తున్నట్లు తిరువళ్లూరు అనిశా అధికారులకు ఫిర్యాదులు అందాయి. చెక్‌పోస్టులో గురువారం తనిఖీ చేపట్టి లెక్కల్లోలేని రూ.1.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. విధుల్లో ఉన్న ముగ్గురిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అనిశా అధికారులు తెలిపారు.

పాఠశాల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ మృతి

ఉపాధ్యాయులే కారణమని తల్లిదండ్రుల ఆందోళన

ముత్తు సంజన(పాతచిత్రం)

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: వాల్‌పారైలో తొమ్మిదో తరగతి విద్యార్థిని ఉపాధ్యాయుల వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు యత్నించి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు... కోయంబత్తూరు జిల్లా వాల్‌పారైకి చెందిన శక్తివేల్ కుమరన్, వత్సలకుమారి దంపతులకు ముత్తు సంజన(14) అనే కుమార్తె ఉంది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. 10వ తేదీ ఇంట్లో ఎవరూ లేని సమయాన ఇంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. స్థానికులు కాపాడి వాల్‌పారై ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం కోయంబత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా బుధవారం రాత్రి మృతి చెందింది. తమ కుమార్తె మరణానికి ముగ్గురు పాఠశాల ఉపాధ్యాయులే కారణమని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు మృతదేహాన్ని తీసుకోమని గురువారం తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. జిల్లా ఎస్పీ, జిల్లా కలెక్టర్, సీఈవోకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

వైద్య సిబ్బంది నిర్లక్ష్యం మహిళ మృతి

నిర్వాహకులను నిలదీసిన కుమార్తె

టీనగర్, న్యూస్‌టుడే: తిరునెల్వేలిలోని ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తన తల్లి మరణించినట్లు ఓ మహిళ విడుదల చేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరలైంది. తూత్తుక్కుడి జిల్లాలోని కయత్తార్‌కు చెందిన ఊర్కాళి(55) తీవ్రమైన కడుపునొప్పితో తిరునెల్వేలి ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో చేరింది. కొద్దిరోజుల చికిత్స అనంతరం ఆమె పరిస్థితి విషమంగా ఉందని బుధవారం అత్యవసర చికిత్స విభాగం నుంచి సాధారణ వార్డుకు మార్చారు. సాధారణ వార్డుకు వెళ్లిన కొన్ని గంటల్లోనే ఆమె మరణించింది. తల్లి మరణంతో కుమార్తె ఆస్పత్రి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కన్నీళ్లు పెట్టుకుంటూ ఆమె వైద్య సిబ్బందిని నిలదీసిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సకాలంలో పడక వసతి కల్పించని కారణంగానే తల్లి మరణించినట్లు ఆరోపించారు.

గంజాయి స్వాధీనం

స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులు

వేలూరు, న్యూస్‌టుడే: పరదరామి చెక్‌పోస్టులో కంటైనర్ లారీ నుంచి గంజాయి స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు... వేలూరు ఎస్పీ మయిల్‌వాగనన్ ఆదేశాల మేరకు పరదరామి పోలీసులు బుధవారం రాత్రి చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. అప్పుడు ఆ వైపు వెళ్తున్న కంటైనర్ లారీని అడ్డుకుని తనిఖీ చేయగా అందులో 40 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి గంజాయితో పాటు కంటైనర్‌ను స్వాధీనం చేసుకుని మదురైకి చెందిన బాబు, శివగంగైకి చెందిన రాజ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

నొప్పి నివారణ మాత్రలు..

అరెస్టయిన నిందితులు

ప్యారిస్, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాల ద్వారా నొప్పి నివారణ మాత్రలు విక్రయిస్తున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై కొడుంగైయూర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో కొంతమంది యువకులు నొప్పి నివారణ మాత్రలు ఉపయోగిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. గస్తీ చేపట్టి అరవింద్ అనే యువకుడిని అరెస్టు చేసి 420 మాత్రలు స్వాధీనం చేసుకున్నారు. వాటిని సామాజిక మాధ్యమాల ద్వారా విక్రయించేవాడని తెలిసింది. అతను మాత్రలు అందించిన సంజయ్‌ని అరెస్టు చేసి 480, అజిత్‌కుమార్‌ను అరెస్టు చేసి 266 మాత్రలు స్వాధీనం చేసుకున్నారు. మాత్రలు విక్రయిస్తున్న రంజిత్, ప్రవీణ్‌లను అరెస్టు చేశారు. కన్నదాసన్‌నగర్‌లో ఉంటున్న బిహార్‌కు చెందిన బైసన్ అహమ్మద్ నొప్పి నివారణ మాత్రలను అరవింద్‌కు విక్రయించినట్లు తెలిసింది.

వాహనాలు...

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఈరోడ్ జిల్లా వెళ్ళిత్తిరుప్పూర్ సమీపంలోని మాక్కల్‌పుదూర్‌కు చెందిన జయరామన్ తోటలో అనుమతి లేకుండా గ్రావెల్ మట్టి తోడుకుంటున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు అక్కడికి చేరుకుని పొక్లెయినర్, టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని, డ్రైవర్లు జగదీశన్, మురుగన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

(c) eenadu

ఈనాడు
ఏలూరు
శుక్రవారం నవంబరు 21, 2025

ఆ 48 వేలు.. ఎవరు?

వేలిముద్రకు ఇంకా దూరం
ఈకేవైసీతోనే గుట్టు రట్టు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఉపాధిహామీ పథకంలో అక్రమాల గుట్టు రట్టవుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటోన్న చర్యలతో బోగస్ జాబ్ కార్డులు వెలుగులోకి వస్తున్నాయి. పథకం కింద పని చేసే ప్రతి శ్రామికుడికీ ఈకేవైసీ తప్పనిసరి చేయడంతో.. అక్రమార్కుల జాబితా బయట పడుతోంది. జిల్లాలో ఇప్పటి వరకు 48 వేల మంది ఈ-కేవైసీ చేయించుకోకపోవడం గమనార్హం.

జిల్లాలో ఉపాధి వివరాలిలా..	
జాబ్ కార్డులు:	1.60 లక్షలు
శ్రామికులు:	2,51,838
ఈ-కేవైసీ చేయించుకున్న వారు:	2,03,098
చేయించుకోని వారు:	48,740

పేదలకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో కేంద్రం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎన్ఆర్ఈజీఎస్) అమలు చేస్తోంది. కొందరు స్వార్థపరుల కారణంగా పథక లక్ష్యం పక్కదారి పడుతోంది. బోగస్ జాబ్ కార్డులతో నిధులు స్వాహా చేస్తున్నారు. ఇందులో క్షేత్ర స్థాయి సిబ్బందితోపాటు అధికారులు, ప్రజాప్రతినిధుల పాత్ర ఉంటోంది. దీన్ని గుర్తించిన ప్రభుత్వం ఉపాధి శ్రామికులందరూ తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలన్న నిబంధన విధించడంతో అక్రమాల తుట్టె కదులుతోంది.

ఏరివేతకు చర్యలు.. 'జాబ్ కార్డులు పొందిన వారిలో కొందరు పనులకు రాకున్నా లబ్ధి పొందుతున్నారు. ఈ-కేవైసీలో విషయం వెలుగులోకి వస్తోంది. జిల్లాలో ఇంకా ఈ-కేవైసీ చేయించుకోని వారిపై దృష్టి సారించాం. కొందరు వలసెళ్లిన వారు ఉంటారు. వారి వివరాలు సేకరిస్తున్నాం. ఈ-కేవైసీ చేయించుకోకుంటే జాబ్ కార్డులు రద్దు చేస్తాం' అని డ్వామా పీడీ సుబ్బారావు తెలిపారు.

నీలకంఠాయ.. నమో నమః!

నిడమర్రు మండలం మందలపర్రులోని ఉమా నీలకంఠేశ్వరస్వామి పంచాయతన క్షేత్రంలో కార్తిక దీపోత్సవాలు గురువారం రాత్రితో సమాప్తమయ్యాయి. చివరి రోజు స్వామివారికి ప్రత్యేకాభిషేకాలు, విశేషాలంకరణలు చేశారు. రాత్రి గోదావరి మాతకు పంచ హారతులిచ్చారు. వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. **- న్యూస్‌టుడే, నిడమర్రు**

దారికి తెద్దాం

- ప్రమాదాల నివారణకు ప్రణాళిక
- క్షేత్రస్థాయిలో పరిశీలించి నిపుణుల సూచనలు

ఈనాడు- ఏలూరు: జాతీయ రహదారులపై తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. కొందరు శరీర అవయవాలు కోల్పోతున్నారు. మరికొందరు కోలుకునేందుకు నెలలు, సంవత్సరాలు పడుతోంది. వీటి నియంత్రణకు ఇటీవల జాతీయ రహదారులు, రోడ్డు భద్రతా ఇంజినీర్లు, పోలీసు, ర.భ.శా., రవాణా శాఖ అధికారులు బృందంగా ఏర్పడి.. ఎక్కడెక్కడ ప్రమాదాలో చోటుచేసుకుంటున్నాయో క్షేత్ర పరిశీలన చేపట్టారు. కొన్ని సూచనలూ చేశారు. ఎన్‌హెచ్ అధికారులు, గుత్తేదారులతో యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టేలా జిల్లా పోలీసులు చొరవ తీసుకుని దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఏయే సూచనలు చేశారంటే..

హనుమాన్‌జంక్షన్- గుండుగొలను(ఎన్‌హెచ్-16)

ప్రమాద ప్రాంతాలు: కలపర్రు టోల్‌గేట్, రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల ప్రాంతం, అమ్మపాలెం పెట్రోలు బంకు, చింతలపూడి, కొవ్వలి, సత్యనారాయణపురం వంతెనలు, గుండుగొలను కూడలి.

సిఫార్సులు: ➤ రోడ్డు ఆకృతి నిర్మాణంలో లోపం
➤ వాహనాల వేగాన్ని తట్టుకునేలా అయిదు వంతెనల వద్ద పాత పొర తొలగించి, మూడో పొర వేయడం
➤ వారధుల వద్ద వాహనాల వేగం తగ్గించడం

పాతూరు వద్ద కనిపించని స్థితిలో డివైడర్

హనుమాన్‌జంక్షన్- నూజివీడు (ఎన్‌హెచ్ 216హెచ్)

మీర్జాపురం, తుక్కులూరు, గొల్లపల్లి, సీతంపేట క్రాస్, ఎంఆర్ అప్పారావు కాలనీ

➤ ప్రాధాన్యం మేరకు స్పీడ్ బ్రేకర్లు/ రంబుల్ స్ట్రిప్స్ ➤ రాత్రిపూట స్పష్టంగా కనిపించేలా రేడియం స్టిక్కర్లు అంటించడం

భీమడోలు వద్ద రహదారిపై కానరాని హెచ్చరిక బోర్డులు

పెదపాలపర్రు- ఉప్పుటేరు వంతెన (ఎన్‌హెచ్ 165)

చావలిపాడు, భైరవపట్నం, ముదినేపల్లి.
➤ ప్రమాద మలుపులు, క్రాసింగ్‌లు కనిపించేలా హెచ్చరిక బోర్డులు
➤ వేగ నియంత్రణకు రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు
➤ సర్వీసు మార్గాలు స్పష్టంగా తెలిసేలా సూచికలు ➤ పాదచారులు రోడ్డు దాటేలా రంగులు వేయాలి.

గుండుగొలను- ద్వారకాతిరుమల (ఎన్‌హెచ్ 16)

గుండుగొలను, సీతంపేట అడ్డరోడ్డు, పోలసానిపల్లి, ఎం.నాగులపల్లి, గున్నంపల్లి, కప్పలగుంట, లక్ష్మీనగర్ క్రాసింగ్.
➤ కాంతివంతమైన విద్యుద్దీపాలు, సూచికల ఏర్పాటు

ఉప్పరిల్లు.. ఉప్పొంగేలా!

కనువిందు చేస్తున్న జలపాతం

చుట్టూ ఎత్తైన కొండలు.. అరుదైన వృక్ష జాతులు.. పక్షుల కిలకిలరావాలు.. దట్టమైన అటవీ అందాలు.. వాగుల నీటి సవ్వళ్లు.. వీటన్నింటి మధ్య కొండల నుంచి జాలువారే జలపాతం.. ఈ దృశ్యాలు చూసి పర్యాటకుల మనసు ఉప్పొంగిపోతోంది. బుట్టాయగూడెం మండలం ఉప్పరిల్ల గ్రామ సమీప అటవీ ప్రాంతంలోని జలపాతం సవ్వళ్లు కొంగొత్త అనుభూతి పంచుతున్నాయి. వారాంతాలు, పర్వదినాల్లో పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలివస్తూ.. ఇక్కడి ప్రకృతి సౌందర్యాలు తిలకిస్తూ.. ఆయా చిత్రాలు తమ ఫోన్లలో భద్రపర్చుకుంటున్నారు. **- న్యూస్‌టుడే, బుట్టాయగూడెం**

చీకటి వలయానికి చిక్కొద్దు

- భవితను పణంగా పెట్టొద్దు
- గంజాయి విక్రయ కేసుల్లో యువతే అధికం

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: బాధ్యతలు.. బంధాలు మరిచిన కొందరు యువకులు పెడదారి పడుతున్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను అంధకారంలోకి నెట్టుకుంటున్నారు. మరికొందరు గంజాయి విక్రయ కేసుల్లో ఇరుక్కుంటూ భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ తరహా కేసులు ఎక్కువగా చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది.

- ఏలూరుకు చెందిన ఓ యువకుడు ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం చెవుటూరు శివారులోని ఓ కళాశాల సమీపంలో కొందరికి గంజాయి సరఫరా చేస్తుండగా.. అక్కడి పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్దనున్న 1.10 కిలోల సరకు స్వాధీనం చేసుకున్నారు.
- పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట శివారు మార్టేరు రోడ్డులో ఏడుగురు యువకులు 3.95 కిలోల గంజాయి తరలిస్తుండగా.. వారిని పోలీసులు అరెస్టు చేసి.. సరకును సీజ్ చేశారు.

పెరిగిన వాతావరణమే.. పలువురు యువకులు తాము పెరిగిన వాతావరణ పరిస్థితుల కారణంగా నేరాలు, జూదాలు, మత్తు పదార్థాలు తదితర వ్యసనాలకు బానిసలవుతున్నారు. ఇంటర్, డిగ్రీతో చదువు మానేసి మద్యం, మత్తుకు బానిసలవుతున్నారు. అక్రమ మార్గంలో డబ్బు సంపాదించే క్రమంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి తక్కువ ధరకు గంజాయి తీసుకొచ్చి, ఉభయ జిల్లాల్లోని యువతకు విక్రయిస్తూ.. సొమ్ము చేసుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో కేసుల వివరాలిలా	
2022	485
2023	390
2024	412
2025	306

సామాజిక మాధ్యమాలతో.. సామాజిక మాధ్యమాలను అడ్డుపెట్టుకుని.. కొందరు యువకులు గంజాయి వ్యాపారం చేస్తున్నారు. నకిలీ ఐడీలతో సామాజిక మాధ్యమాల ఖాతాలు తెరచి.. బృందాలుగా ఏర్పడి గంజాయి విక్రయాలు, కొనుగోలు చేస్తున్నారు. సరకు ఎక్కడ దొరుకుతుంది? ఎంత కావాలి? ధరెంత? తదితర వివరాలు పోస్టు చేసుకుంటున్నారు. ఇటీవల రాజోలులో పట్టుబడిన యువకులు సైతం ఇదే పంథా అనుసరించడం గమనార్హం. 'గంజాయి విక్రయాలు, వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. ఏలూరు నగర శివారులోని గంజాయి కార్యకలాపాల అనుమానిత ప్రాంతాల్లో డ్రోన్లతో నిఘా పెట్టాం. కొందరు యువకులు కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు నిర్ధారించాం. పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తున్నాం' అని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ తెలిపారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: కలెక్టర్

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ వైద్య సేవను సక్రమంగా అమలు చేయని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ ప్రాంగణంలో గురువారం ఎన్టీఆర్ వైద్య సేవలు - జిల్లా క్రమశిక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులపై ఐవీఆర్ఎస్ ఫోన్ల ద్వారా 96, గుర్తించినవి 22 వచ్చిన ఫిర్యాదులపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలవారు ఆపద, అత్యవసర సమయంలో వైద్యం పొందేందుకు ఎన్టీఆర్ వైద్య సేవను ఆశ్రయిస్తారని, వారికి మెరుగైన వైద్య సేవలు అందేలా సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏలూరు జిల్లాలో ఎన్టీఆర్ వైద్య సేవలు అందించడంలో ముందున్నామని, భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు.

MANAGEMENT - ADMISSIONS 2025-26
Post B.Sc - 2 Years (Qualification GNM)
M.sc Nursing - 2 Years (B.Sc + 1year)
Courses offered: GNM, B.Sc Nursing, Post B.Sc, M.Sc Nursing
FIND US ON GOOGLE COLLEGE ADDRESS
Secretary & Correspondent Smt. Vasantha Kumari Indupalli
MOTHER THERESA COLLEGE OF NURSING, KAKINADA
Cont : 0884-2345966, 2345977, Direct: 9247255155

Authorised Channel Partner TATA POWER SOLAROOF INDIA'S NO.1 SOLAR ROOFTOP COMPANY
AQJ GREEN ENERGY PRIVATE LIMITED
APEPDCL (Domestic and other than Domestic Category) / NATIONAL PORTAL EMPANELLED VENDOR
PM SURYA GHAR MUFT BIJLI YOJANA
We deal in sales & installation of solar panels for residential, commercial, industrial sectors
WALK- IN INTERVIEW on 21-11-2025 & 22-11-2025.
We are looking for experienced candidates in sales and installation of solar panels in the following positions:
❖ MANAGER : with accounting knowledge.
❖ MARKETING STAFF : experience in promoting the sale of solar panels.
❖ OFFICE ASSISTANT : expertise in handling and uploading documents in DCR Portal.
Walk- in with your resume between 04.00 pm & 06.00pm at
22A-5-17, 2nd Floor, Singh Street, Chittivalasapakalu, Powerpet, Eluru - 534002. Ph: 92810 61398.
Branch Offices:- Vizag: 92810 61399. Rjy: Ph: 92810 61397. Email: aqjgreenenergy@gmail.com

కొయ్యలగూడెం మండలంలో ఆయుధ కర్మాగారం?

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: మండలంలో ఆయుధ కార్మాగారం ఏర్పాటయ్యే అవకాశం కనిపిస్తోంది. బోడిగూడెం, మంగపతిదేవిపేట గ్రామాల పరిధిలో దీని ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలపై అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఈ రెండు గ్రామాల పరిధిలో అసైన్‌మెంటు భూమి అధికంగా ఉండటం కూడా అనుకూల అంశంగా భావించి ఈ ప్రాంతాన్ని ఎంపిక చేస్తున్నట్లు తెలుస్తోంది. బోడిగూడెం పరిధిలో దాదాపు 600 ఎకరాలు, మంగపతిదేవిపేట పరిధిలో 400 ఎకరాలు వెరసి సుమారు వెయ్యి ఎకరాల వరకు అసైన్‌మెంటు భూమి ఈ రెండు గ్రామాల పరిధిలో ఉన్నట్లు గుర్తించారు. కార్మాగారం ఏర్పాటుకు అవసరమైన సుమారు 1,200 ఎకరాల వరకు భూసేకరణ చేయడం సాధ్యమేనని తేల్చారు.

భూ పరిశీలన.. జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ రమణ, కొయ్యలగూడెం తహసీల్దారు నాగరాజు, అధికారులు గురువారం బోడిమంగపతిదేవి పరిధిలో కొన్ని భూములను పరిశీలించారు. ఈ రెండు గ్రామాల పరిధిలో ఉన్న భూముల మధ్య నుంచి చింతలపూడి కాలువ వెళ్లింది. అధికారుల బృందం ఆ ప్రాంతాన్ని పరిశీలించి కర్మాగారం కోసం ఎంపిక చేసే ప్రాంతంలో కాలువ ఉంటే ఇబ్బందులపై చర్చించుకున్నట్లు తెలిసింది.

సులువు పట్టారు.. కొలువు కొట్టారు
6లో

సాగుదామా.. ధ్యానం చేద్దామా..!

ఏలూరు పంపుల చెరువు సమీప గులాబీ తోటలోని ఉద్యానం పిల్లలు, పెద్దలను ఆకట్టుకుంటోంది. నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన వివిధ రూపాల్లోని బొమ్మలు కనువిందు చేస్తున్నాయి. పల్లెటూరి వాతావరణం, భారతీయ సంస్కృతి, రైతులు, గోదారోళ్ల సంక్రాంతి సంబరాలు తదితర ఇతివృత్తాలతో తీర్చిదిద్దిన బొమ్మలు అలరిస్తున్నాయి. **- న్యూస్‌టుడే, ఏలూరు**

అప్పుడే పుష్కర శోభ

ఘాట్ల ఆధునికీకరణకు ప్రతిపాదనలు

ఈనాడు డిజిటల్, భీమవరం, పెనుగొండ గ్రామీణ, నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే

గోదావరి పుష్కర శోభ అప్పుడే మొదలైంది. నదీ తీరంలో పుణ్యస్నానాలకు పోటెత్తే భక్తుల సంఖ్యకు అనుగుణంగా ఘాట్లను అభివృద్ధి చేయడంతో పాటు రద్దీకి తగ్గట్టుగా రహదారుల నిర్మాణం, ఆలయాల సుందరీకరణపై ప్రత్యేక దృష్టి సారించారు.

- తెదేపా హయాంలోనే 2015లో పుష్కరాలు జరిగాయి. అప్పట్లో రూ. కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి చేశారు. గత పుష్కరాలకు జిల్లాలో సుమారు 50 లక్షల మంది స్నానాలు చేయగా 2027 జులై 23 నుంచి ఆగస్టు 3 వరకు జరగనున్న పుష్కరాలకు మరింత పెరుగుతారని అంచనా వేశారు.

అభివృద్ధి.. సుందరీకరణ

గత పుష్కరాలకు నరసాపురంలో అయిదు ఘాట్లతో పాటు లక్ష్మణేశ్వరం, రాజుల్లంక, ఆచంటలో కోడేరు, సిద్ధాంతం, యలమంచిలి, దొడ్డిపట్లలో ఘాట్లు ఏర్పాటు చేశారు. వాటి అభివృద్ధి, సుందరీకరణకు రూ.108 లక్షలతో ప్రతిపాదనలు పంపించారు. నరసాపురంలోని వలంధర రేవు, ఆచంటలోని పెద్దమల్లం ఘాట్లను రూ.7 లక్షల చొప్పున ఆధునికీకరించనున్నారు. పెద్దమల్లం మసేనమ్మ ఆలయం వద్ద రూ.25 లక్షలతో 4.5 కిలోమీటర్ల రహదారి నిర్మించనున్నారు. దొంగరావిపాలెం, కేదారేశ్వరస్వామి ఆలయం, దొడ్డిపట్ల, ఆచంట, చించినాడ, లలితాంబ రేవుల వద్ద సుందరీకరణకు సన్నాహాలు చేస్తున్నారు.

మరో ఏడు

గత పుష్కరాలకు 32 ఘాట్లు ఉండగా మరో ఏడింటిని పెంచనున్నారు. ఆచంటలో కోడేరు పల్లిపాలెం, రావిలంక, పుచ్చల్లంక, కరుగోరుమిల్లి, అయోధ్యలంక, పాలకొల్లులో కె.ఎస్.పాలెం, నరసాపురంలోని నవరసపురం సమీపంలో కొత్త ఘాట్లు నిర్మించనున్నారు. వీటికి ఆయా ప్రాంతాలను బట్టి రూ.కోటి నుంచి కోటిన్నర వరకు ఖర్చు చేయనున్నారు.

త్వరలోనే కొలిక్కి

ఘాట్లకు అయిదు కిలోమీటర్ల పరిధిలో ఉన్న దేవాలయాలతో పాటు జిల్లాలోని ప్రసిద్ధ ఆలయాలను సందర్శించే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రణాళిక చేస్తున్నాం. ఏపరేవుల వద్ద రద్దీ ఎక్కువ ఉంటుంది, వాహనాల పార్కింగ్, మహిళలు వస్త్రాలు మార్చుకునేందుకు వసతి, మంచినీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య నిర్వహణ, ట్రాఫిక్ మళ్లింపు తదితర అంశాలను ఆయా శాఖల వారీగా నివేదికలు తయారు చేస్తున్నాం. **- ఎ.వెంకటఅప్పారావు, జిల్లా పర్యాటకశాఖ అధికారి**

WALK-IN INTERVIEWS
SHANMUKHA AGRITEC LIMITED Your Partner in Prosperity
SHANMUKHA AGRITEC LIMITED, part of SHIVASHAKTI GROUP successfully completed 30 years in service of farmers. Having a range of Agro Chemicals, Micro Nutrients, Water Soluble Products, etc...
Recruiting Sales & Marketing Professionals....
Qualification & Experience :
B.Sc. (Ag)/M.Sc. (Ag)/Any Graduate with 5+ Years in Sales & Marketing of Agri-inputs
REGION-1 Srikakulam, Vizianagaram, Vizag
Vacancies: Regional Manager : 01; Area Sales Manager : 03; Sales Officer : 06
REGION-2 East & West Godavari
Vacancies: Regional Manager : 01; Area Sales Manager : 03; Sales Officer : 07
Interested Candidates need to register at the below coordinates
Mail-Id: hr@shanmukha.net
VENUE-1 KVS LODGE & HOTEL Opp. Tirumala Medicover Hospital. Mayuri tiffins backside, PSR complex, Vizianagaram. Contact: 95059 18819
VENUE-2 HOTEL SITARA ELITE Beside Kumari Theatre, Vyagram Road T.Nagar, Rajamahendravaram. Contact: 98499 90544
Walk-In Timings for both the Venues
10:00 AM to 04:00 PM on Sunday, 23rd November 2025
A Good Decision will Lead to a Great Career...
SHANMUKHA AGRITEC LIMITED
(AN ISO 9001:2015 CERTIFIED ORGANIZATION)
Reg. & Corp. Off: H.No. 1-90/28/C/5, Plot No. 5 & 10, 1st Floor, B5, South/2, Madhapur, Hyderabad, Shaikpet, Telangana-500081, India.

మూగ జీవాలకు.. మాటవుతూ..!

ఆపదొస్తే ఆదుకుంటున్న యువకుడు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: వాటికి బాధ కలిగితే.. అతడి కంట్లో నీళ్లు తిరుగుతాయి. వాటికి దెబ్బ తగిలితే.. వేదన కలుగుతుంది. నోరులేని మూగజీవాలకు ఏ ఆపదొచ్చినా.. ఆ యువకుడు ప్రత్యక్షమవుతారు. పశు వైద్యులను పిలిపించి చికిత్సనందిస్తారు. మూగజీవాలకు పెన్నిధిగా మారి ఆదర్శంగా నిలుస్తున్నారు.. అతడే ఏలూరుకు చెందిన సామాజిక కార్యకర్త మల్లిపూడి రాజు.

నగరంలో వీధుల్లో తిరిగే పశువులే అధికం. ఒక్కోసారి వాహనాలు ఢీకొని గాయపడుతున్నాయి. వ్యర్థాలు తిని అస్వస్థతకు గురవుతున్నాయి. స్థానికుల సమాచారంతో రాజు ఘటనా స్థలికి చేరుకొని.. వాటికి సపర్యలు చేస్తున్నారు. అవసరం బట్టి పశు వైద్యులను పిలిపించి.. చికిత్స నందిస్తున్నారు. అతడే సెలైను బాటిల్ పట్టుకోవటం, దెబ్బలకు కట్టు కట్టుతుంటారు. పదేళ్లలో సుమారు 300కు పైగా పశువులకు సపర్యలు చేశారు. ఇందుకయ్యే ఖర్చు భరిస్తున్నారు. అతడి సేవలకు గుర్తింపుగా స్వాతంత్ర్య దినోత్సవం రోజున మంత్రి పార్థసారథి, కలెక్టర్ వెట్రిసెల్వి నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. 'మూగజీవాలపై ప్రేమతోనే సేవలు చేస్తున్నా. దీన్ని అదృష్టంగా భావిస్తున్నా. మిగతా వారూ జీవాలపై ప్రేమ చూపాలి' అని రాజు తెలిపారు.

అధ్యక్షా..!

గళం వినిపించనున్న విద్యార్థులు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా.. ఈ నెల 26న జిల్లాలోని పలువురు విద్యార్థులు శాసనసభలో తమ గళం వినిపించనున్నారు. కార్యక్రమంలో పాల్గొనే పిల్లలను విద్యాశాఖ ఎంపిక చేసింది. ప్రతి నియోజకవర్గం నుంచి ఒక్కొక్కరు చొప్పున.. మొత్తం ఏడుగురు ఎంపికయ్యారని డీఈవో వెంకట లక్ష్మమ్మ తెలిపారు. విద్యార్థుల వివరాలిలా.. జీజీఎన్ఎస్ ప్రసాద్(జడ్పీహెచ్ఎస్, పెదనిండ్రకొలను), ఎస్ఎన్‌వీ సాయి మణికంఠ(దెందులూరు), కె.వంశిక(రంగాపురం), బి.గోపి నాగచైతన్య(గోపవరం), బి.అస్మితసాయి(లింగాల), జి.లిఖిత(సుబ్బమ్మదేవి నగరపాలకోన్నతఏలూరు), కె.నిఖిల్‌సాయి(ఏపీఆర్ఎస్,అప్పలరాజుగూడెం).

THE ARYAPURAM CO-OPERATIVE URBAN BANK LTD. HEAD OFFICE, RAJAMAHENDRAVARAM (Reg.No.3127)
RECRUITMENT NOTIFICATION FOR THE POSTS OF ASST. CLERKS / ASST. CASHIER ON CONTRACT BASIS
Applications are invited from Candidates who passed IBPS/ SBI/RRB'S CLERKS PRELIMS for the post of Asst. Clerks on contract basis Age : 21 Yrs-28 Yrs. as on date of notification (Age relaxation as per Bank service conditions), Consolidated payment of Rs. 24,000/- p.m during probation period of 1 year and on confirmation pay scales will be applicable.
The vacancies are at our Guntur, Visakhapatnam and Bhimavaram Branches only
Selection Procedure : Written Test and Interview
Last date of application to be received to bank: 29-11-2025 by 5:00 p.m.
Those candidates who have applied in last one year are not eligible to apply Application only in specified format can be sent through courier or email or through registered post or in person. Bank reserves right to refuse any application without assigning any reasons
Detailed Recruitment notification & Application can be downloaded from Website:
http://www.aryapurambank.com/career.html
Email: arcobank_rjy@aryapurambank.com
Date: 21-11-2025 Contact no.:-0883-2473550
Secretary/CEO

24న ఐఎస్ జగన్నాథపురానికి పవన్ కల్యాణ్

పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు

ఈనాడు- ఏలూరు, న్యూస్‌టుడే- ద్వారకాతిరుమల: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ నెల 24న ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురానికి రానున్నారు. గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి గుడికి స్థానికంగా ఉన్న 30 ఎకరాల కొండ పోరంబోకు భూమిని దేవస్థానానికి కేటాయిస్తూ హక్కు పత్రాలు అందజేయనున్నారు. ఇది ద్వారకాతిరుమల శ్రీవారి దేవస్థానానికి దత్తత ఆలయం కావడంతో.. అధికారుల చేతికి కేటాయింపు పత్రాలు ఇవ్వనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ మేరకు అధికారులు భూమిని సర్వే చేసి హద్దులు నిర్ధారించారు. గతంలో రాయితీ వంట గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు పవన్ కల్యాణ్ ఇక్కడికి రాగా, లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చెందిన కొండ పోరంబోకు భూమిని తిరిగి ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. దీనికి మంత్రివర్గం ఆమోదం తెలపడంతో.. పత్రాలు పంపిణీ చేయనున్నారు. ఆలయం పైకి రూ.3 కోట్లతో బీటీ రహదారి, మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. పవన్ కల్యాణ్ పర్యటన నేపథ్యంలో పి.రాజవరంలో హెలిప్యాడ్ నిర్మాణానికి పోలీసు, రెవెన్యూ, ర.భ.శా. అధికారులు గురువారం సాయంత్రం స్థల పరిశీలన చేశారు.

వన్‌స్టాప్.. సేవలు నాన్‌స్టాప్!

681 మంది సమస్యలకు పరిష్కారం

- మానసిక స్థితి సరిగా లేని మహారాష్ట్రకు చెందిన ఓ మహిళ రోడ్డుపై తిరుగుతుంటే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఆమెను పోలీసులు వన్‌స్టాప్ కేంద్రానికి తరలించారు. మహిళ చిరునామా తెలియకపోవడంతో వసతి గృహంలోనే ఉంచి యోగక్షేమాలు చూసుకుంటున్నారు.
- ఏలూరులో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న ఓ యువకుడు తరచూ భార్యతో గొడవపడేవారు. వివాదం పోలీస్‌స్టేషన్‌కు చేరడంతో.. వారిని వన్‌స్టాప్ కేంద్రానికి పంపారు. దంపతులకు పలుమార్లు కౌన్సెలింగ్ ఇవ్వడంతో.. మధ్యనున్న మనస్పర్ధలు సమసిపోయాయి.

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: మహిళలకు సత్వర న్యాయం అందించేందుకు.. ఆపద వేళ అండగా నిలిచేందుకు.. వారికి భరోసా కల్పించేందుకు.. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మిషన్ శక్తి పథకం కింద వన్‌స్టాప్ కేంద్రం ఏర్పాటు చేసింది. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యాన కేంద్రం నడుస్తోంది. మహిళలపై అఘాయిత్యాలు, లైంగిక వేధింపులు, గృహహింస, సైబర్ మోసాలు, ఈవ్ టీజింగ్ తదితరాల నుంచి రక్షణ కల్పిస్తోంది. బాధితులకు కౌన్సెలింగ్ ఇవ్వడం, వైద్యం చేయించడం, ఎఫ్ఐఆర్, కోర్టులో న్యాయం జరిగేలా చూస్తోంది.

దంపతులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అడ్మిన్ నిర్మల

సేవ	సంఖ్య
న్యాయం	58
వైద్యం	90
పోలీసు	78
వసతి	133
కౌన్సెలింగ్	322
మొత్తం	681

పది నెలల్లో.. కేంద్రం ద్వారా చట్టపరమైన సలహాలు, పోలీసు సహాయం, కౌన్సెలింగ్, వైద్య సహాయం, తాత్కాలిక ఆశ్రయం సేవలందుతున్నాయి. జనవరి నుంచి అక్టోబర్ వరకు మొత్తం 681 సేవలందించారు. 'మహిళలపై ఎక్కడైనా అఘాయిత్యాలు, అన్యాయం జరిగితే హెల్ప్‌లైన్ నంబరు 181కు ఫోన్ చేస్తే తక్షణ స్పందన ఉంటుంది. అక్కడి సిబ్బంది వెంటనే పోలీసులను అప్రమత్తం చేస్తారు. ఆపై బాధితురాలిని కేంద్రానికి పిలిపించి సేవలందిస్తారు' అని ఐసీడీఎస్ పీడీ పి.శారద తెలిపారు.

(c) eenadu

గోదారమ్మకు హారతి

హిందూ ధర్మ పరిరక్షణ, పవిత్ర నదుల సంరక్షణ సంకల్ప దీక్షలో భాగంగా నరసాపురం వశిష్ఠ పుష్కర్ ఘాట్‌లో కార్తిక అమావాస్య సందర్భంగా గురువారం రాత్రి గోదావరికి హారతి ఇచ్చారు. నరసాపురం విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బందారు మాధవ నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, నరసాపురం పట్టణం

జడ్పీ రహదారుల మరమ్మతులకు నిధులివ్వండి

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే : ఇటీవల కురిసిన వర్షాలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో జడ్పీ రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయని, మరమ్మతులు చేపట్టడానికి నిధులు విడుదల చేయాలని జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ వీఆర్ కృష్ణ తేజను విజయవాడలోని పంచాయతీరాజ్ కార్యాలయంలో జడ్పీ ఛైర్‌పర్సన్ గురువారం కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ముఖ్య సమస్యలు, నిధుల విడుదల, పెండింగ్ బిల్లులు, రహదారుల మరమ్మతులు తదతర అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి చర్చించారు.

యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి

మాట్లాడుతున్న ప్రభాకర్

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: యువత అవకాశాలను అందిపుచ్చుకొని నైపుణ్యాలు పెంపొందించుకోవడం ద్వారా లక్ష్యాలను చేరుకోవాలని సెట్‌వెల్ సీఈవో ప్రభాకర్ అన్నారు. స్థానిక లేడీస్ క్లబ్‌లో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సంస్థ సమన్వయకర్త సింగవరపు జ్యోతి అధ్యక్షతన గురువారం యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు సంబంధించి జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో ఎన్నో అవకాశాలున్నాయన్నారు. ప్రతిభ ఆధారంగా ముందుకు సాగాలన్నారు. జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఈవో వరలక్ష్మి మాట్లాడుతూ చదువుకున్న ప్రతి ఒక్కరూ ఉపాధి కార్యాలయంలో నమోదు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్వహించే ఉద్యోగ మేళాకు వారే అర్హులన్నారు.

ఆనందమే

సచివాలయ ఉద్యోగుల బదిలీలకు అవకాశం

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల అంతర్ జిల్లా బదిలీలకు సర్కారు ఆమోదం తెలిపింది. దీంతో ప్రభుత్వ కొలువుల్లో ఉన్న భార్యాభర్తలు ఒకేచోటకు వెళ్లొచ్చు. ఈ నెల 30వ తేదీకే ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

జిల్లా	సచివాలయాలు	ఉద్యోగులు
ఏలూరు	605	4,518
పశ్చిమ	535	4,203

ఉమ్మడి జిల్లాలో 1,140 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 8,721 మంది పనిచేస్తున్నారు. 2019లో సచివాలయ వ్యవస్థ అమలులోకి వచ్చిన తర్వాత 2022లో ఉద్యోగుల రెగ్యులైజేషన్ చేపట్టారు. ఆ ఏడాది చివర్లో స్పౌజ్ కోటాలో బదిలీలు చేశారు. అప్పట్లో పరస్పర అంగీకారం మేరకు మాత్రమే బదిలీలు నిర్వహించారు. ప్రస్తుతం స్పౌజ్ కోటాకు అవకాశం ఇవ్వడంతో చాలా మందికి ఊరట లభించనుంది.

మార్గదర్శకాలు ఇవీ.. ఉద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అనిశా, విజిలెన్స్ కేసులు పెండింగ్‌లో ఉన్న వారు బదిలీలకు అనర్హులు. ప్రస్తుతం పనిచేస్తున్న చోట ఎలాంటి బకాయిలు లేవని ఎంపీడీవో, పురపాలక కమిషనర్‌తో ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. దానిని ఆన్‌లైన్‌లో పొందుపరచాలి. దరఖాస్తుల పరిశీలన అనంతరం జాబితాను పోర్టల్‌లో పెడతారు. వీటిపై అభ్యంతరాలను అప్‌లోడ్ చేయాలి. పరిశీలన అనంతరం సీనియారిటీ ఆధారంగా తుది జాబితా ప్రకటిస్తారు.

సులువు పట్టారు.. కొలువు కొట్టారు..

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు పెద్దఎత్తున ఇన్ఫోసిస్‌లో ఉద్యోగాలు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ప్రముఖ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ ఈ సంవత్సరపు క్యాంపస్ నియామకాల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ప్రతిభకు మంత్ర ముగ్ధమైంది. వందల సంఖ్యలో ఉద్యోగాలను ఒకేసారి విద్యార్థులు సాధించడం విశేషం. ఈ విజయంతో రాష్ట్రంలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో పండగ వాతావరణం నెలకొంది. ఈ సారి ఇన్ఫోసిస్ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో విద్యార్థులు సాంకేతిక ప్రతిభతో పాటు సమస్యలను పరిష్కరించే తీరు, సృజనాత్మకత, వినూత్న ఆలోచనలు ప్రదర్శించడం వంటి లక్షణాలు కంపెనీ ప్రతినిధులను కట్టిపడేశాయి. కోడింగ్ రౌండ్, టెక్నికల్ ఇంటర్వ్యూ తదితర దశల్లో విద్యార్థుల సమర్థతను స్పష్టంగా గుర్తించి ఎంపిక చేసుకున్నారు. తల్లిదండ్రులు, అధ్యాపకులు, సహ విద్యార్థుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు భావోద్వేగానికి గురవుతున్నారు. నూజివీడు, శ్రీకాకుళం, ఇడుపులపాయ, ఒంగోలు క్యాంపస్‌లలో ఈ పరిస్థితి నెలకొంది. 2,600 మంది విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలకు రిజిస్టర్ చేసుకుంటే 1,016 మంది ఎంపికవడం విశేషం

ప్రతిష్ఠాత్మక కంపెనీకి..

దేశంలోనే ప్రతిష్ఠాత్మక కంపెనీగా ఉన్న ఇన్ఫోసిస్‌కు ఎంపికవడం సంతోషంగా ఉంది. ఇక్కడ పొందిన శిక్షణ, వాతావరణం, ప్రాజెక్టులు మమ్మల్ని ఈ స్థాయికి తీసుకువచ్చాయి. ఆన్‌లైన్ శిక్షణ ఎంతో ఉపయోగపడింది.
- ఎస్‌కే ఆసియా, బట్టు సుజన్ శ్వేత

కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రధానం

ఉద్యోగ సాధనలో కమ్యూనికేషన్ స్కిల్స్ కీలక భూమిక పోషించాయి. బేసిక్ కోర్సులతో పాటు బ్యాంకింగ్ సెక్టార్ అవసరమైన అంశాలను ఔపోసన పట్టాం. దీంతోనే ఉద్యోగ సాధన సాధ్యమైంది.
- పి.నవ్యశ్రీ, పి.పావని

ప్రతిభ చూపుతాం..

ప్రస్తుత ప్యాకేజీని పక్కన పెడితే ముున్ముందు మన సామర్థ్యాన్ని బట్టే జీతం లభిస్తుందని ఆశిస్తున్నాం. ఆరు నెలల్లో మేమేంటో, మా ప్రతిభ ఏమిటో అక్కడ చూపిస్తాం. శిక్షణ అనంతరం మరో పరీక్ష ఉంటుంది. దీనిని బట్టే జీతం ఎంతనేది నిర్ణయిస్తారు.
- టీవీఎస్ లిఖితా భవాని, ఎం.లిల్లీ

మరింత బలోపేతం చేస్తాం

భవిష్యత్తులో ఐటీ విద్య మరింత బలోపేతం అవుతుంది. విద్యార్థులు సామర్థ్యాలను నిరూపించుకోవడం అభినందనీయం. మున్ముందు మరిన్ని ఉద్యోగాల సాధనే లక్ష్యంగా ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లను తీర్చిదిద్దుతున్నాం.
- సంద్ర అమరేంద్రకుమార్, రిజిస్ట్రార్, ఆర్జీయూకేటీ

లక్ష్యానికి అనుగుణంగా..

విద్యార్థుల లక్ష్యాలకు అనుగుణంగానే ఫలితం ఉంటుందని తేలింది. భవిష్యత్తులో మరింతగా రాణించి మంచి ప్యాకేజీలను పొందుతారని ఆశిస్తున్నాం. ఆ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం.
- రుద్రం చింతయ్యనాయుడు, ప్లేస్‌మెంట్ సెల్ ఇన్‌ఛార్జి

నూజివీడు మామిడి.. వచ్చేసింది!

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఫలరాజు మామిడికి నూజివీడు ప్రసిద్ధి. మార్చి నెలలో వచ్చే మామిడి ఈ ఏడాది నవంబర్ నెలలోనే ఆగిరిపల్లి, వడ్లమానుకు చెందిన కొందరు రైతుల వద్ద అందుబాటులోకి రావడంతో మామిడి ప్రియులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వివాహాలు, విందు భోజనాల్లో మామిడితో ప్రత్యేకంగా వంటలు చేస్తుంటారు. ప్రస్తుతం చాలా కొద్ది మంది దగ్గర మాత్రమే మామిడి కాయలు లభిస్తుండటంతో ఉమ్మడి జిల్లాలోని అనేక మంది ఇక్కడకు వచ్చి కొనుగోలుకు ఉత్సాహం చూపుతున్నారు. విజయవాడ నుంచి పలువురు వ్యాపారులు సైతం నూజివీడు రసాల కోసం బారులు తీరుతున్నారు. తన మిత్రుడు కుమారుడి వివాహంలో ప్రత్యేక వంటల కోసం 82 కిలోల మామిడిని కిలో రూ. 150 చొప్పున కొనుగోలు చేసినట్లు ఆగిరిపల్లికి చెందిన గుండుబోగుల వెంకట రమేశ్ (చిన్నారి) 'న్యూస్‌టుడే'కు తెలిపారు. సాధారణ రోజుల్లో ఇదే మామిడి కిలో రూ.10-15కి లభించడం విశేషం.

విద్యార్థులతో ప్రతాప్ శివకిశోర్

క్రమశిక్షణతో మెలగాలి: ఎస్పీ

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: క్రమశిక్షణతో మెలిగి చదువులో రాణించి భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ విద్యార్థులకు సూచించారు. బాలల వారోత్సవాల సందర్భంగా శనివారపుపేట ప్రభుత్వ బాలుర వసతిగృహంలో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. బాలలు మార్చ్ పాస్ట్ చేసి ఎస్పీకి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సత్ప్రవర్తనతో నడుచుకొని ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. విద్యార్థులకు కావాల్సిన సదుపాయాల కల్పనలో తన వంతు సాయం అందిస్తానని చెప్పారు. క్రీడల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. వసతిగృహం పర్యవేక్షకురాలు శ్రీవల్లీ, త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, పోలీసు, వసతిగృహం సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌ఛార్జిగా జేసీ

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌ఛార్జి పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరులోని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ ప్రస్తుతం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాగానే ఉంది. దీంతో ఏలూరు జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ గౌడ పర్సన్ ఇన్‌ఛార్జిగా వ్యవహరించనున్నారు.

పలు రైళ్ల సేవల పొడిగింపు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు రైళ్ల సేవలను పొడిగించినట్లు దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పీఆర్వో కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. డిసెంబరు ఒకటి నుంచి జనవరి 12 వరకు ప్రతి సోమ, శుక్రవారాల్లో కాకినాడ టౌన్-మైసూర్ (07033) రైలు నడపనున్నట్లు పేర్కొన్నారు. డిసెంబరు 2 నుంచి జనవరి 13 వరకు ప్రతి మంగళ, శనివారాల్లో మైసూరు-కాకినాడ టౌన్ (07034) రైలు, జనవరి 2 నుంచి 9వ వరకు ప్రతి శుక్రవారం నరసాపూర్-ఎస్ఎంవీటీ బెంగళూరు (07153) రైలు, జనవరి 3 నుంచి 10 వరకు ప్రతి శనివారం ఎస్ఎంవీటీ బెంగళూరు-నరసాపూర్ (07154) రైలు నడపనున్నట్లు వివరించారు.

జ్ఞాపకశక్తి పోటీల్లో తండ్రీ కూతుళ్ల ప్రతిభ

ఆసియా స్థాయిలో అయిదేసి కాంస్య పతకాలతో రికార్డు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన కాసర సుభాశ్ ఆయన కుమార్తె ప్రతిభా సరోజ్‌లు ఏసియా ఓపెన్ మెమరీ ఛాంపియన్ షిప్ (జ్ఞాపక శక్తి) పోటీల్లో ప్రతిభ చూపి అయిదేసి కాంస్య పతకాలు సాధించారు. ఈ నెల 15, 16 తేదీల్లో ఈ పోటీలు హైదరాబాద్‌లో జరిగాయి. చిన్నారుల విభాగంలో ప్రతిభా సరోజ్, సీనియర్స్ విభాగంలో సుభాశ్ ప్రతిభ చూపారు. బైనరీ నంబర్స్, ర్యాండమ్ వర్డ్స్, స్పోకెన్ నంబర్స్, ర్యాండమ్ నంబర్స్, కార్డ్స్ విభాగాలలో పతకాలు అందుకున్నారు. ఈ పోటీలను ఐఎంఎస్ఎఫ్, ఏఎంఎస్ఏ సంస్థలు సంయుక్తంగా నిర్వహించాయి. ప్రతిభా సరోజ్ 8వ తరగతి చదువుతోంది. ఇటీవల ముంబైలో జరిగిన వరల్డ్ మెమరీ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొన్నట్లు సుభాశ్ తెలిపారు.

లక్కవరం విద్యార్థిని సత్తా

నమూనా చెక్కు అందుకుంటున్న జాహ్నవి

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఉత్తమ విద్యుత్తు సామర్థ్యంపై ఎన్టీపీసీ సింహాద్రి ఆధ్వర్యంలో విశాఖలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన చిత్ర లేఖనం పోటీల్లో లక్కవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని కాసారపు జాహ్నవి ద్వితీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా ఎన్టీపీసీ అధికారుల నుంచి రూ.30 వేల నగదు బహుమతి అందుకుంది. దిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీలకు ఎంపికైంది. చిత్రలేఖనంలో విద్యార్థిని జాహ్నవి ప్రతిభ చూపడంపై మండల విద్యాశాఖాధికారులు రాముడు, రాములు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యాకమిటీ, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థినికి తర్ఫీదు ఇచ్చిన ఉపాధ్యాయుడు మనోహర్‌ను అభినందించారు.

శ్రీవారి క్షేత్రంలో గదులు, కాటేజీల ఖాళీల వివరాలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించి శుక్ర, శనివారాల్లో గదులు, కాటేజీల ఖాళీల వివరాలు ఆలయ అధికారులు వెల్లడించారు.

సత్రం పేరు	ఖాళీలు	
20న రాత్రి 10గంటల సమయానికి	21న	22న
ధర్మప్పారాయ నిలయం	112	35
తితిదే సత్రం	13	16
రాణి చిన్నమ్మారావు సత్రం	27	31
కాటేజీలు	26	00
బాలాజీ	05	05

సంప్రదించాల్సిన నంబర్లు:
90375 69891, 90375 67892
ఆన్‌లైన్ బుకింగ్ కోసం:www.aptemples.ap.gov.in

వేతనాలు పెంచాలని వినతి

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: వేతనాలు పెంచాలని కోరుతూ సమగ్ర శిక్షా ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు డీఈవో వెంకటలక్ష్మమ్మకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు వి.శ్రీనివాసరావు, కె.వినోద్ మాట్లాడుతూ సమగ్ర శిక్షా ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 24న కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే డిసెంబరు 10న సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకుని కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు.

మండల పరిధిలోనే బదిలీకి విజ్ఞప్తి

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో పని చేసే సీఆర్‌పీలను మండల పరిధిలోనే బదిలీ చేయాలని పలువురు సీఆర్‌పీలు కోరారు. ఈ మేరకు సమగ్ర శిక్షా ఏపీసీ పంకజ్ కుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఆర్‌పీలు మాట్లాడుతూ సమగ్ర శిక్షాలో కాంప్లెక్స్ రీఆర్గనైజేషన్ పేరుతో క్లస్టర్ పాఠశాలలను కుదించారని తెలిపారు. ఈ నేపథ్యంలో సీఆర్‌పీలను మండల పరిధిలో కాకుండా ఇతర ప్రాంతాలకు బదిలీ చేసే పరిస్థితులున్నాయన్నారు. దీనివల్ల సీఆర్‌పీలకు నష్టం వాటిల్లుతుందన్నారు.

ప్రధానోపాధ్యాయినికి తాకీదు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) సభ్యుల సంతకాలను ఫోర్జరీ చేసి పెదవేగి మండలం కొప్పాక జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఆర్.శైలజ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కొందరు ఫిర్యాదు చేశారు. దీనిపై తగిన వివరణ ఇవ్వాలంటూ ప్రధానోపాధ్యాయినికి డీఈవో వెంకటలక్ష్మమ్మ తాకీదు జారీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో క్లీనర్ దుర్మరణం

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో క్లీనర్ మృతి చెందాడు. జంగారెడ్డిగూడెం ఎస్సై వీరప్రసాద్ కథనం ప్రకారం.. కాకినాడ జిల్లా పెనుమళ్ల గ్రామానికి చెందిన చోడిశెట్టి పుల్లయ్య (60) లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. కాగా బుధవారం చోదకుడు బోణం త్రినాథ్‌తో కలిసి లారీలో పామాయిల్ ప్యాకెట్ల లోడుతో కాకినాడ నుంచి హైదరాబాద్ బయలుదేరాడు. మార్గమధ్యంలో దేవరపల్లి-తల్లాడ జాతీయ రహదారిపై జంగారెడ్డిగూడెం పట్టణ శివారు విద్యుత్తు కేంద్రం వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న లారీని..వీరు ప్రయాణిస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఘటనలో క్లీనర్ పుల్లయ్య మృతి చెందగా.. చోదకుడు త్రినాథ్‌కు గాయాలయ్యాయి. దీనిపై పుల్లయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కుమార్తె గృహప్రవేశానికి వెళ్తూ..

రైల్లో గుండెపోటుతో తల్లి మృతి

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రైల్లో ప్రయాణిస్తూ ఓ వృద్ధురాలు మృతి చెందిందని రైల్వే పోలీసులు తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన వనమా లక్ష్మి (67) కుటుంబ సభ్యులతో కలిసి విజయవాడలోని కుమార్తె గృహప్రవేశానికి వెళ్లేందుకు గురువారం రైల్లో బయలుదేరారు. రైలు ఏలూరు చేరుకునేసరికి మార్గమధ్యంలో ఆమెకు గుండెపోటు వచ్చింది. ఏలూరు రైల్వేస్టేషన్ వద్ద కిందకు దింపగా రైల్వే డాక్టర్ సీపీఆర్ చేశారు. అయినా ప్రయోజనం లేకపోయింది. చనిపోయినట్లు ధ్రువీకరించారు. కొంతకాలంగా ఆమెకు గుండె సంబంధిత వ్యాధి ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గోదావరి తీరంపై డేగకన్ను

కుక్కునూరు, న్యూస్‌టుడే: పోలీసుల కన్ను గోదావరి తీరంపై పడింది. ఏలూరులో 15 మంది నక్సల్స్ పట్టుబడటం, వారంతా ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన వారు కావటంతో, వారు ఏ మార్గంలో వచ్చారన్న దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ప్రధానంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం విలీన మండలాలకు చేరువగా ఉంది. ఆ రాష్ట్ర అడవుల నుంచి అల్లూరి జిల్లాలోకి ప్రవేశించి, అక్కడి నుంచి గోదావరి నది దాటితే ఏలూరు జిల్లాకు చేరుకొనే అవకాశాలు ఉన్నాయి. ఆయుధాలతో వారు ఏలూరుకు చేరుకోవటం కూడా ఆశ్చర్యపరుస్తోంది. ఎవరైనా సానుభూతిపరుల సహాయంతో చేరి ఉండవచ్చనే అనుమానాలు బలపడుతున్నాయి. 2005లో కుక్కునూరు పోలీసుస్టేషన్ పేల్చివేత ఘటనలో మావోలు వింజరం రేవు వద్ద గోదావరి దాటి వచ్చారు. గోదావరి రేవు నుంచి ముందుగానే ఓ ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసుకొని, సంఘటనా స్థలానికి చేరుకొని, పేల్చివేత జరిపారు. అప్పటి నుంచి గోదావరి నదిపై వారు రాకపోకలు సాగాయి. పలు సందర్భాల్లో ఇందుకు తగిన ఆధారాలు లభ్యమయ్యాయి. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లోని అబుజ్‌మడ్, అల్లూరి జిల్లాలోని ఆంధ్రా, ఒడిశా సరిహద్దు (ఏఓబీ) ప్రాంతం నక్సల్స్ తలదాచుకునేందుకు ఏ మాత్రం అనుకూలంగా లేకపోవటంతో, తీరం దాటి జిల్లాలోకి ప్రవేశించే అవకాశాలుంటాయనే అనుమానాలు పోలీసుల్లో ఉన్నాయి. దీంతో తీరంపై డేగ కన్ను వేశారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో అల్లూరి జిల్లా నుంచి మన జిల్లాలోకి ప్రవేశించేందుకు దాదాపు 10 రేవులున్నాయి. పోలీసులు ఆ రేవులపై నిఘా పెట్టారు. రేవు పడవ దాటించే గుత్తేదారులు, చేపలవేట కొనసాగించే జాలర్లకు హెచ్చరికలు జారీ చేశారు. రాత్రి పూట పడవలు దాటవేయొద్దనీ, ఎవరైనా వ్యక్తులు బలవంతంగా పడవ దాటించాలని ఒత్తిడి తెస్తే, వారి వివరాలు అందించాలనీ సూచించారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా రేవు దాటితే వెంటనే పోలీసులకు సమాచారం చేరవేయాలని తెలియజేస్తున్నారు.

బహుళ పంటల సాగు.. లాభాలు బాగు

కామవరపుకోట, న్యూస్‌టుడే: అంతర పంటల సాగులో జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఉద్యానశాఖ అడిషనల్ డైరెక్టర్ ఎం.అశోక్ కుమార్ తెలిపారు. గురువారం సాగిపాడులో తోటలు పరిశీలించారు. రైతులు బహుళ పంటల విధానంలో సాగు చేపట్టి అధిక ఆదాయాలు సాధించాలని సూచించారు. మెట్ట ప్రాంత రైతులు కొబ్బరిలో వేస్తున్న తరహాలోనే పామాయిల్‌లో అంతర పంటలు వేయాలని సూచించారు. ఎకరం పొలంలో 50 పామాయిల్ మొక్కలు, పలక ఆకారంలో వేసుకొని, అంతర పంటలుగా కోకో, వక్క, జాపత్రి, జాజికాయ పంటలు సాగు చేపట్టాలని రైతులకు వివరించారు.

వృద్ధురాలిపై దాడి.. నగలు దోపిడీ

ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలిపై ఇద్దరు దాడి చేసి బంగారు నానుతాడు, చెవిదిద్దులు దోపిడీ చేసి పారిపోయారు. ఆమెను తీవ్రంగా కొట్టడంతో స్పృహ తప్పి పడిపోయింది. బుధవారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. గురువారం సాయంత్రం వరకు ఆమె స్పృహ కోల్పోయే ఉంది. మనవడు చూసి సర్వజన ఆసుపత్రికి తరలించగా ప్రస్తుతం కోలుకుంటోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. స్థానిక శివగోపాలపురానికి చెందిన సామ్రాజ్యం(75) భర్త చనిపోవడంతో ఒంటరిగా ఉంటోంది. బుధవారం మధ్యాహ్నం ఒక మహిళ, ఓ వ్యక్తి వెనుక వైపు నుంచి ఆమెపై దాడిచేసి బంగారు నగలు దోచుకున్నారు. సమీపంలో ఉంటున్న మనవడు వచ్చి కంగారుగా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం గురువారం రాత్రికి ఆమె స్పృహలోకి వచ్చి విషయం చెప్పింది. బీరువాలో నగదు ఉందని చెప్పడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూశారు. నగదు మాత్రం అలాగే ఉంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తండ్రి మందలించాడని ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: తండ్రి మందలించాడని మనస్తాపానికి గురైన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జంగారెడ్డిగూడెం మండలంలో గురువారం చోటుచేసుకుంది. లక్కవరం ఎస్సై జబీర్ కథనం ప్రకారం.. జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం గ్రామానికి చెందిన కాకి ఉమామహేశ్వరకుమార్ (35) తన తండ్రి వెంకట సత్యసర్విశెట్టితోపాటు స్థానికంగా కిరాణా దుకాణం నడుపుతూ జీవిస్తుంటాడు. అతడికి మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో గత కొంత కాలంగా మందులు వాడుతున్నారు. ఉమామహేశ్వరకుమార్ ఈ నెల 17న సరకులు ఖరీదు నిమిత్తం రూ.20 వేలు తీసుకుని జంగారెడ్డిగూడెం వెళ్లి రూ.5 వేల విలువైన సరకులను మాత్రమే తీసుకొచ్చాడు. ఇదేమని తండ్రి ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య స్వల్ప వాగ్వివాదం జరిగింది. అనంతరం 18వ తేదీ ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఉమామహేశ్వరకుమార్ తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలోనే ఉమామహేశ్వరకుమార్ మండలంలోని కొంగువారిగూడెం ఎర్రకాలువ జలాశయం దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా గురువారం స్థానిక మత్స్యకారులు జలాశయంలోని మృతదేహాన్ని గుర్తించి లక్కవరం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలికి చేరుకున్న ఎస్సై జబీర్ మృతదేహాన్ని వెలికి తీయించి జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. దీనిపై మృతుడు ఉమామహేశ్వరకుమార్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆక్వా ల్యాబ్‌లో అగ్ని ప్రమాదం

మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఆటపాక(కైకలూరు), న్యూస్‌టుడే: కైకలూరు మండలం ఆటపాక జాతీయ రహదారి-165 చెంతనే ఉన్న సూపర్ ఆక్వా ఎరువులు, రసాయనాల దుకాణానికి చెందిన ఆక్వా ల్యాబ్‌లో గురువారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. రెండు భారీ కంటైనర్ బాక్సుల్లో నూతనంగా ల్యాబ్ ఏర్పాటు చేయగా కంటైనర్లపై చిన్నపాటి రంధ్రాలు ఉన్నాయి. వీటికి వెల్డింగ్ పనులు నిర్వహిస్తున్న తరుణంలో థర్మాకోల్ సీలింగ్‌కు నిప్పు రవ్వలు అంటుకుని మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ వ్యాపించడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. అప్రమత్తమైన దుకాణ సిబ్బంది కైకలూరు అగ్నిమాపక శకటానికి సమాచారం అందించడంతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఒకానొక సందర్భంలో ప్రధాన ద్వారాలు తెరచుకోక పోవడంతో అద్దాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి మంటలను ఆర్పారు. ల్యాబ్‌లో ఉన్న కొన్ని రకాల మందులు, ఫర్నిచర్ కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ. 5 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని అగ్నిమాపక అధికారి క్రాంతికుమార్ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -106 రిటైల్ ధర 133 చికెన్ విత్ స్కిన్ - 193, చికెన్ స్కిన్‌లెస్ - 219. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, 134, 145 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.



విద్యాశాఖ సిబ్బందిపై దిగువస్థాయి అధికారి పెత్తనం

ప్రవర్తన మార్చుకోవాలంటూ డీఈవో ఆదేశం

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖ మరో వివాదాస్పద అంశానికి నెలవైంది. ఇక్కడి సిబ్బంది పనితీరు సక్రమంగా ఉండకపోవడంతో తరచూ ఏదో ఒక అంశంలో ఈ శాఖ వార్తల్లోకి ఎక్కడం పరిపాటిగా మారింది. తాజాగా మరో వివాదాస్పద అంశం చోటుచేసుకుంది. విద్యాశాఖ కార్యాలయంలో పనిచేసే దిగువ స్థాయి అధికారి ఒకరు సిబ్బందిపై పెత్తనం చేస్తుండడంతో విసిగిపోయిన వారు ఉన్నతాధికారికి ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఆయన తీరు మారలేదు. ఆయన వద్ద పని చేయలేమంటూ సిబ్బంది చేతులెత్తేయడంతో డీఈవో వెంకటలక్ష్మమ్మ జోక్యం చేసుకున్నారు. సిబ్బందితో అంతర్గతంగా సమావేశమై దిగువస్థాయి అధికారికి, సిబ్బందికి మధ్య సఖ్యత లేకపోవడాన్ని గుర్తించారు. ఈ నేపథ్యంలో సిబ్బందితో ప్రవర్తించే తీరును మార్చుకోవాలంటూ సదరు అధికారిని డీఈవో ఆదేశించారు. దిగువ స్థాయి అధికారి గతంలో ఒక జిల్లాకు ఇన్‌ఛార్జి డీఈవోగా పని చేసినప్పుడు కూడా అక్కడి సిబ్బందితో ఇదేవిధంగా ప్రవర్తించేవారని తెలిసింది. ఇకపై ఏలూరు జిల్లా విద్యాశాఖ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తిస్తే శాఖాపరమైన చర్యలకు ఉపేక్షించేదిలేదని డీఈవో హెచ్చరించినట్లు సమాచారం.

పుస్తకాలకు ఏదీ సాటి రాదు : ఎమ్మెల్సీ

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: అంతర్జాలం ఎంత అందుబాటులో ఉన్నా పుస్తక పఠనానికి సాటి రాదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి అన్నారు. భీమవరం మండలం చినఅమిరం ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని పాఠశాలల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలని సూచించారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు.

సామూహిక సాధారణ సెలవు ఇవ్వాలి

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సమగ్ర శిక్షా ఉద్యోగులకు సామూహిక సాధారణ సెలవు ఇవ్వాలని కోరుతూ సమగ్ర శిక్షా ఐకాస జిల్లా విద్యాశాఖ అధికారి, సమగ్ర శిక్షా ఏపీసీకి గురువారం వినతిపత్రం అందజేశారు. ఐకాస జిల్లా అధ్యక్షుడు కె.వినోద్‌కుమార్, జిల్లా మహిళా కార్యదర్శి కె.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. హెచ్ఆర్ పాలసీ, ఎంటీఎస్ వేతనాల పెంపు కోసం ఈ నెల 24, డిసెంబరు 10న కలెక్టరేట్ వద్ద నిర్వహించే పోరాట దీక్షలో సమగ్ర శిక్షా ఉద్యోగులు పాల్గొనాలని ఐకాస రాష్ట్ర వైస్ ఛైర్మన్ వాసా శ్రీనివాసరావు కోరారు.

92.7 FM Rajamahendravaram 92.7 Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

REAL ESTATE

PLOT FOR SALE

వైజాగ్ Google డేటా సెంటర్ - ఎయిర్‌పోర్ట్ మధ్య హైవే ఫేసింగ్ వెంచర్‌లో మీపెట్టుబడికి. గజానికి అధిక ఆదాయం. త్వరపడండి. ✆ 9949000033

JOBS

దక్షిణభారతదేశంలో ప్రముఖ చేపల రొయ్యలమందుల తయారీ ISOసర్టిఫైడ్ కంపెనీకి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, కైకలూరు, అమలాపురం, ఆకివీడు, గణపవరం హెడ్ క్వార్టర్స్‌గా మాఉత్పత్తులను మార్కెటింగ్ చేయుటకు అనుభవం గల పురుషఅభ్యర్థులు కావలెను. లోకల్ వారికి ప్రాధాన్యత. ఆకర్షణీయమైన జీతం & అలవెన్సులు కలవు. 2 వీలర్ తప్పనిసరి. సంప్ర॥ అల్ట్రా టెక్ మినరల్స్, గుంటూరు. మెయిల్: ultratechminerals@gmail.com. Ph:9573308158. గమనిక: ఆక్వారంగంలో అనుభవంకల్గిన అభ్యర్థులు మాత్రమే సంప్ర.

ఏలూరు జ్ఞాపిక TVS షోరూమ్‌లో పర్క్ చేయుటకు షోరూమ్ మేనేజర్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, సర్వీస్ ఎగ్జిక్యూటివ్స్, సీనియర్ టెక్నీషియన్స్, హెల్పర్స్ కావలెను. సంప్రదించండి ✆ 94922 25959.

లక్ష్మి మోటార్స్ (YAMAHA షోరూమ్) తణుకు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, ఏలూరు నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 96667 14613.

HYD, SR నగర్ బాయ్స్ హాస్టల్‌లో అనుభవం గల భార్యభర్తలు వంటమాస్టర్లు కావలెను. సంప్ర: ✆ 9391009238, 8885070231.

FACULTY/ TEACHERS

WANTED LADY Teachers. Sub: Hindi, Mother Teachers, Q: D.Ed., B.Ed., P.G, Degree. Variant Primary School, R.R.Pet, Eluru. Contact: ✆ 97059 12338.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం CLASSIFIEDS

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 6.45 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

ఏలూరు

● ఏలూరు ● దెందులూరు ● ఉంగుటూరు

సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు

ఏలూరు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పవరుపేటలోని సూర్యభగవాన్ ఆలయంలో స్వామివారి జయంత్యుత్సవాలు ఘనంగా ముగిశాయి. గురువారం అమావాస్య సందర్భంగా మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. స్వామిని తులసి మాలలు, వివిధ పుష్పాలతో అలంకరించారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కూటమి నాయకులు, పెద్ద ఎత్తున భక్తులు స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ ఈవో, పాలకమండలి ఛైర్మన్ కోరాడ రెడ్డి, సభ్యులు పర్యవేక్షించారు.

విశ్వేశ్వరస్వామికి భస్మాభిషేకం.. **ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** కార్తిక మాసం అమావాస్య సందర్భంగా దొండపాడులోని దత్తనాథక్షేత్రంలో గురువారం సర్వదోష పరిహారక విశ్వేశ్వరస్వామికి భస్మాభిషేకం, విశేష అలంకరణ చేశారు. లక్ష్మీగణపతి, నవగ్రహ, సహిత మృత్యుంజయ, చండీ హోమం నిర్వహించారు.

రైతుల సమస్య పరిష్కారానికి కృషి

అటవీశాఖ అధికారులతో మాట్లాడుతున్న వీరాంజనేయులు

భీమడోలు, న్యూస్‌టుడే: నిడమర్రు మండలం పెద నింద్రకొలను, చిననింద్రకొలను గ్రామాల రైతులు ఎదుర్కొంటున్న ముంపు సమస్య పరిష్కారానికి శాసనసభ్యుడు పత్సమట్ల ధర్మరాజుతో కలిసి కృషి చేస్తానని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. భీమడోలులోని తెదేపా కార్యాలయంలో ఆప్కాబ్ ఛైర్మన్‌ను ఆయా గ్రామాల రైతులు గురువారం కలిసి తమ సమస్యను వివరించారు. గతంలో తమ గ్రామాల పరిధిలోని డ్రెయిన్లకు అధికారులు గండి కొట్టడం వల్ల ఇప్పటికీ పట్టా ఉన్న పంట పొలాలు నీట మునుగుతున్నాయని, గండ్లు పూడ్పించాలని కోరారు. రైతులంతా కలిసి గండ్లు పూడ్చుకుందామంటే అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై సంబంధిత అధికారులతో ఫోనులో చర్చించిన అనంతరం వీరాంజనేయులు మాట్లాడుతూ శాసనసభ్యుడితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

పేదలకు చేయూత

మూడు చక్రాల సైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: పేదలకు చేయూత అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఆయన సొంత నిధులతోపాటు దాతలు అందించిన సొమ్ముతో పలువురికి మూడు చక్రాల సైకిళ్లు, తోపుడు బండ్లు, కుట్టు యంత్రాలను గురువారం పంపిణీ చేశారు. తెదేపా నగర అధ్యక్షుడు వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

పశుగణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్, అధికారులు

దుగ్గిరాల (పెదపాడు), న్యూస్‌టుడే : పశుగణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాలలోని తన క్యాంపు కార్యాలయంలో పీఎం కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం నుంచి తొలిగా పెదపాడు మండలానికి ప్రధానమంత్రి కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా ఎటువంటి హామీ లేకుండా అతి తక్కువ వడ్డీకి సగటున రూ. 2 లక్షలు చొప్పున 105 మంది లబ్ధిదారులకు రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. తెదేపా నాయకులు గుత్తా అనిల్, ఉప్పలపాటి రాంప్రసాద్, మరడాని రవికుమార్, పశుసంవర్ధకశాఖ పెదపాడు మండల వైద్యాధికారిణి చావా వాణిసంధ్యశ్రీ పాల్గొన్నారు.

డిసెంబర్ 5 నుంచి 100 రోజుల ప్రణాళిక అమలు

అప్పనవీడు: విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆశ

పెదపాడు, న్యూస్‌టుడే : డిసెంబర్ 5 నుంచి పదో తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రణాళిక అమలు చేసేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ప్రభుత్వ పరీక్షల జిల్లా సహాయ కమిషనర్ ఆశ పేర్కొన్నారు. మండలంలోని పదో తరగతి పరీక్షల కేంద్రాలను గురువారం ఆమె సందర్శించారు. పరీక్ష కేంద్రాల్లోని వసతులను పరిశీలించిన ఆమె మెరుగైన వసతుల కల్పనకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె అప్పనవీడులోని జ్యోతి బాలికల ఉన్నత పాఠశాలలో మాట్లాడుతూ 100 రోజుల ప్రణాళికను చక్కగా వినియోగించుకొని 550కి పైగా మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. వసతులు కల్పించేందుకు ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని పెదపాడు ఎంఈవో-1 సబ్బితి నరసింహమూర్తికి సూచించారు. పలు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రబీ సాగు లేనట్లేనా..?

అయోమయంలో అన్నదాతలు

పెదపాడులో కోతకు సిద్ధంగా వరి పైరు

పెదపాడు, న్యూస్‌టుడే : ఈ ఏడాది రబీలో సాగునీరు అందే విషయంలో రైతులు అయోమయంలో ఉన్నారు. గతేడాది సాగునీరు ఇవ్వకపోవడంతో రైతులు అపరాల సాగు చేపట్టారు. దెందులూరు నియోజకవర్గంలో పెదపాడు, ఏలూరు గ్రామీణ, దెందులూరు మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 56 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. రబీలో రెండో పంటగా ఏ పంట సాగు చేయాలో అర్థం కాని పరిస్థితుల్లో రైతులున్నారు. రబీలో వరి సాగుకు నీరు ఇచ్చే విషయంలో జలవనరుల శాఖ అధికారులు ఇప్పటి వరకు స్పష్టమైన ప్రకటన ఏదీ ఇవ్వలేదు.

అపరాలతో అవస్థలు కొన్నేళ్లుగా అపరాల సాగు చేసిన రైతులు వాటిని కొనే నాథుడు లేక అవస్థలు పడుతున్నారు. పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లగా అధికారులు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మమ అనిపిస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో ఇది ఏటా జరిగే తంతుగానే మిగిలిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అధికారులు అపరాల విత్తనాలను పూర్తి స్థాయిలో అందించలేకపోతున్నారు.

ప్రకటన కోసం ఎదురుచూపులు ఖరీఫ్ పంట కోత దశకు చేరుకుంది. పలు చోట్ల యంత్రాల సహాయంతో కోస్తున్నారు. మరో పక్షం రోజుల్లో పూర్తిస్థాయిలో కోతలు ప్రారంభమవుతాయి. అపరాలు సాగు చేస్తే కోతకు ముందే విత్తనాలు చల్లుకోవాలి. ఇప్పటివరకు జలవనరుల శాఖ అధికారులు లేదా వ్యవసాయశాఖ అధికారులు గానీ అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదు. ఆ దిశగా రైతులు ఎదురుచూస్తున్నారు.

విత్తనాలు రావాల్సి ఉంది

అపరాల విత్తనాలు కావాలని ఇప్పటికే ఇండెంట్ పెట్టాం. కొంత వరకు వచ్చాయి. పూర్తిస్థాయిలో రాగానే రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

- షేక్ ఇమామ ఖాసిం, మండల వ్యవసాయాధికారి, పెదపాడు

ఉచిత నేత్ర వైద్య శిబిరం నేడు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: సానా సతీశ్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక అమీనాపేటలోని సురేశ్‌చంద్ర బహుగుణ పోలీసు పాఠశాలలో విద్యార్థులకు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి ఎం.చంద్రకిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు.

పీఎఫ్ రుణాలు త్వరగా మంజూరు చేయండి

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: పీఎఫ్ రుణాలను త్వరితగతిన మంజూరు చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు జడ్పీ సీఈవో ఎం.శ్రీహరికి గురువారం వినతిపత్రం అందజేశారు. రుణాల మంజూరు ప్రక్రియలో జాప్యం జరగడం వల్ల ఉపాధ్యాయులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిల్లా కార్యదర్శి ఎం. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు అర్బన్:	80085 74486	ఏలూరు టూటౌన్:	80085 74487
దెందులూరు:	80085 74535	పెదపాడు, పెదవేగి:	80085 74483
భీమడోలు:	80085 74527	నిడమర్రు గ్రామీణం:	97040 21765
ఉంగుటూరు:	94939 90333	గణపవరం:	99480 66777

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ? రైల్వే స్టేషన్ ఎదురుగా వున్న వంతెన పైనుంచి కోడేలు, కొమడవోలు మీదుగా చాటపర్రు వెళ్లే మార్గంలో లారీలు అతి వేగంగా రాకపోకలు సాగిస్తున్నాయి. నియంత్రించగలరు. **- ఆంజనేయులు**

✔ లారీల వేగాన్ని నియంత్రించేందుకు తగిన చర్యలు చేపడతాం. **- లక్ష్మణరావు, ఏలూరు ట్రాఫిక్ సీఐ**

వెలిగిన వీధి దీపాలు

స్పందనకు వందనం

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే : నిడమర్రు ఇందిరమ్మ కాలనీలో ఎట్టకేలకు వీధి దీపాలు వెలిగాయి. 'కమ్మేసిన చీకట్లు' శీర్షికన ఈ నెల 13న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఈవోపీఆర్డీ స్వామి స్పందించారు. పంచాయతీ కార్యదర్శి సంజీవరావు ఆధ్వర్యంలో కొత్త దీపాలు ఏర్పాటు చేసి కాలనీవాసుల చీకటి సమస్య పరిష్కరించారు.

గోతులు పూడ్చారు.. కవ్వగుంట (పెదవేగి) న్యూస్‌టుడే : మొంథా తుపాను కారణంగా పెదవేగిలోని కవ్వగుంట గ్రామం కాలనీలోని మట్టి రోడ్లు పూర్తిగా ధ్వంసమై బురదతో నిండి, గోతులు ఏర్పడ్డాయి. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కాలనీలోని రహదారులన్నింటిపై గ్రావెల్ పోసి, మెటల్ వేసి రోలర్‌తో చదును చేయించారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా రహదారులు

కూచింపూడి (పెదవేగి), న్యూస్‌టుడే : కూచింపూడి గ్రామంలోని అంతర్గత రహదారులన్నీ పూర్తిగా ధ్వంసమై రాకపోకలు సాగించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ప్రధానంగా హాస్టల్ నుంచి హైస్కూల్‌కు వెళ్లే రహదారిలో మలుపు వద్ద భారీ గుంతలు ఏర్పడి నీరు నిలిచి ఉండడం వల్ల విద్యార్థులు, వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి రహదారులు అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

జాతీయస్థాయి కుస్తీ పోటీలకు ఎంపిక

ఎం.కృష్ణ, ఎం.రవికుమార్

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో శాప్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల పోటీల్లో కుస్తీ విభాగంలో ఏలూరుకు చెందిన ఎం.కృష్ణ, ఎం.రవికుమార్ సత్తాచాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జనవరిలో జరగబోయే పోటీల్లో వీరు ఆంధ్రప్రదేశ్ జట్టులో సభ్యులుగా పాల్గొంటారు. ఈ పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా డీఎస్‌డీవో కోటేశ్వరరావు, జిల్లా క్రీడాధికారి బి.శ్రీనివాసరావు, పలువురు శిక్షకుల పర్యవేక్షణలో ఎంపికలు నిర్వహించారు.

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కంద్రికగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల పీడీ ఎం. కృష్ణారావు, ఏలూరు నగరపాలక సంస్థ వార్డు, శానిటేషన్ ఎన్విరాన్‌మెంట్ సెక్రెటరీ ఎం. రాజ్‌కుమార్ అఖిల భారత సివిల్ సర్వీసెస్ ఎంప్లాయిస్ జాతీయస్థాయి రెజ్లింగ్ క్రీడల పోటీకి ఎంపికయ్యారు. ఏలూరు మండలం పెదయాగనిమిల్లి ఇంజినీరింగ్ సహాయకుడు పి.పవన్ అచ్యుత్ కుమార్, ఎన్విరాన్‌మెంట్ సెక్రెటరీ ఎం.రాజ్‌కుమార్ జాతీయస్థాయి కబడ్డీకి ఎంపికయ్యారు.

బాలికల పాఠశాల సందర్శన

వట్లూరు (పెదపాడు), న్యూస్‌టుడే : వట్లూరులోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలను ఎస్టీ కమిషన్ సభ్యురాలు కాకి లక్ష్మి గురువారం సందర్శించారు. పాఠశాలలో వసతి సౌకర్యాలు, విద్యార్థినుల భోజనశాల, వంటశాల, దుస్తాలను పరిశీలించారు. సౌకర్యాలు, విద్య, వైద్యసేవలు, బాలికల సంరక్షణ, భద్రత వంటి అంశాల గురించి ఆరా తీశారు. ప్రధానాచార్యులు దాసరి మేరీ ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ ఏలూరు జిల్లా భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లెయిమ్స్ పరిష్కరించాలని, గత వైకాపా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు కాకుండా ఇచ్చిన మెమోలు రద్దు చేయాలని కోరుతూ నాయకులు కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.

రహదారి విస్తరణ పనులు ప్రారంభం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: వంగాయగూడెం - పెరికీడు ప్రధాన రహదారి విస్తరణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పనులు కొంత కాలం నిలిచిపోవడంతో అధ్వానంగా మారిన రోడ్డులో ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. 'ఈనాడు'లో దీనిపై వరుస కథనాలు ప్రచురించారు. గుత్తేదారుడికి పెండింగ్ బిల్లులు మంజూరైన నేపథ్యంలో రహదారి విస్తరణ పనులు చేపట్టారు. వంగాయగూడెం నుంచి క్యాన్సర్ ఆసుపత్రి వరకు సీసీ రహదారి నిర్మించేందుకు పొక్లెయిన్‌తో రహదారి అంచుల్లో మట్టిని తొలగించి గ్రావెల్, నల్లకంకర్ వేసే పనులు చేపట్టారు.

స్వచ్ఛ గ్రామాల సంకల్పం నెరవేర్చాలి

అవగాహన సదస్సులో పాల్గొన్న డ్వాక్రా సభ్యులు

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే : స్వచ్ఛ గ్రామాల సంకల్పాన్ని నెరవేర్చడంలో ప్రజల పాత్ర కీలకమని ఎంపీడీవో విజయకుమారి అన్నారు. నిడమర్రు మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం గ్రామాల అభివృద్ధి, స్వచ్ఛత, పచ్చదనం వంటి అంశాలపై డ్వాక్రా సంఘ సభ్యులకు, సీసీలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలు, పరిష్కార మార్గాలను డిప్యూటీ ఎంపీడీవో స్వామి తెలిపారు.

డ్రమ్ముందా.. దమ్ముందా!

కూరెళ్లగూడెంలో ఇలా..

పదహారో నంబరు జాతీయ రహదారిపై పలు కూడళ్లలో ప్రమాదాల నివారణకు పోలీసులు ఖాళీ డ్రమ్ములు ఏర్పాటు చేశారు. వాహనదారులు డ్రమ్ములు చూసి వాహనాల వేగాన్ని తగ్గించి నెమ్మదిగా వెళ్తున్నారు. ఖాళీ డ్రమ్ములు గాలికి పడిపోతున్నాయి, వాటిపై రేడియం స్టిక్కర్లు అతికించకపోవడంతో రాత్రివేళ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాహనదారులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. భీమడోలు, ఉంగుటూరు మండలాల్లోని జాతీయ రహదారిపై కనిపించిన చిత్రమిది. **- ఈనాడు, ఏలూరు**

ప్రమాదాల వారధి.. పట్టించుకునేవారేరీ..?

రక్షణ గోడ, కంచె లేక ఇలా..

ఏలూరు తూర్పు లాకుల సమీపంలోని మల్కాపురం వంతెన ప్రమాదకరంగా మారింది. ప్రభుత్వాలు, పాలకులు మారినా ఈ వంతెన నిర్మాణానికి నోచుకోలేదు. మల్కాపురం, కొవ్వలి, దోసపాడు, పోతునూరుతోపాటు పలు లంక గ్రామాలకు నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాల రాకపోకలతో ఈ వారధి రద్దీగా ఉంటుంది. గత తెదేపా ప్రభుత్వ హయాంలో ఈ రహదారిని విస్తరించారు. వంతెన నిర్మాణం చేపట్టలేదు. అనంతరం గత వైకాపా ప్రభుత్వ హయాంలో దీన్ని విస్మరించారు. కృష్ణా, గోదావరి కాలువలు కలిసేచోట ఉన్న ఈ వంతెన ఇరుకుగా ఉంటుంది. దీనికితోడు ఈ వంతెన, కాలువలకు మధ్య రక్షణగోడ, కంచెలు లేవు. గతంలో ఇక్కడ ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలున్నాయి. నూతన వంతెన నిర్మించి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏలూరు గ్రామీణ**

అదుపు తప్పితే అపాయమే..!

గణపవరం నుంచి ఆకివీడు వైపు వెళ్లే ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి బావాయిపాలెం వద్ద పంటకాలువ పక్కన కోతకు గురై గుంతలా ఏర్పడింది. అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు ఏ మాత్రం అజాగ్రత్తగా వెళ్లినా అందులో పడిపోయే ప్రమాదం ఉంది. స్థానికులు ప్రమాద సూచికగా ఎర్రజెండా ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, నిడమర్రు గ్రామీణం**

ఆత్మహత్యకు యువకుడి యత్నం.. రక్షించిన పోలీసులు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించిన యువకుడిని పోలీసులు రక్షించి తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక అరుణదళ్‌పేటకు చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకోబోతున్నాడని, రక్షించాలని అతని కుటుంబ సభ్యులు పోలీసు కంట్రోల్ రూమ్‌కు ఫోను చేశారు. టూటౌన్ పోలీసులు వెంటనే స్పందించారు. దగ్గరలో తంగెళ్లమూడి పరిధిలో విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్ సతీశ్‌కు సమాచారం అందించారు. వెంటనే అతను వెళ్లి కుటుంబ సభ్యుల వద్ద వివరాలు తెలుసుకున్నారు. రైల్వేస్టేషన్ వైపు వెళ్లాడని తెలుసుకొని స్థానిక యువకులతో కలిసి రైలు పట్టాల వెంబడి వెళ్లి యువకుడిని పట్టుకొని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రమేశ్ కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ఇస్తాం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఏలూరు నగరపాలక సంస్థ ట్రాక్టర్ డ్రైవర్ చందక రమేశ్ కుటుంబానికి రూ.10 లక్షల నష్ట పరిహారం అందజేస్తామని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య హామీ ఇచ్చారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రమేశ్ భౌతిక కాయానికి ఆయన గురువారం పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రమేశ్ భార్యకు ఆప్కాస్ ద్వారా ఉద్యోగం ఇవ్వడంతోపాటు ఇల్లు మంజూరు చేసి పిల్లల చదువులకు సాయం చేస్తామన్నారు. విధి నిర్వహణలో చనిపోయిన మున్సిపల్ కార్మికులకు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షలు పరిహారం చెల్లిస్తున్నారు.. అదే విధంగా రమేశ్‌కు కూడా చెల్లించాలని ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు బి.సోమయ్య, ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు డిమాండ్ చేశారు. శవ పరీక్ష అనంతరం రమేశ్ భౌతిక కాయాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లారు. భౌతిక కాయంపై నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

వాహనాలు స్వాధీనం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయానికి చెల్లించాల్సిన వాయిదాలు సక్రమంగా చెల్లించకపోవడంతో ఏలూరు నగరపాలక సంస్థలో పనిచేసే సఫాయి కార్మికులకు చెందిన సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్సీ సొసైటీ కార్యనిర్వాహక సంచాలకుడు ఎం.ముఖలింగం ఒక ప్రకటనలో తెలిపారు.

జూదరుల అరెస్టు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: జూదం ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు మండలం జాలిపూడిలో జూదం ఆడుతున్నారని తెలియడంతో గురువారం రూరల్ ఎస్సై నాగబాబు తమ సిబ్బందితో వెళ్లి దాడి చేసి ఆరుగుర్ని అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 6 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

25న దివ్యాంగ విద్యార్థులకు వైద్య సేవలు

భీమడోలు, న్యూస్‌టుడే: సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో మండలంలోని దివ్యాంగులైన విద్యార్థులకు నారాయణపురం ఉన్నత పాఠశాలలో ఈ నెల 25న ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నారని మండల విద్యాశాఖాధికారి-2 ఎ.బ్యాంకిమకుమార్ తెలిపారు. ఈ శిబిరంలో విద్యార్థుల వైకల్య తీవ్రత గుర్తించి వారికి అవసరమైన ఉపకరణాలు(వీల్ చైర్, వినికిడి యంత్రాలు, మూడు చక్రాల సైకిళ్లు) అందించేందుకు వివరాలు నమోదు చేస్తారన్నారు. విద్యార్థులు తమ ఆధార్, సదరం, వైద్య ధ్రువపత్రం, యూడైస్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకొని హాజరు కావాలన్నారు. విద్యార్థులకు భోజన సదుపాయం, రవాణా భత్యం చెల్లిస్తారన్నారు. ఇతర వివరాలకు 73825 70218 నంబరులో సంప్రదించాలని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ఏలూరు : మాట్లాడుతున్న రత్నప్రసాద్

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఏలూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథులుగా ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు పాల్గొన్నారు. ఏలూరులోని బాలల గ్రంథాలయంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించిన ప్రతి ఒక్కరూ పుస్తక పఠనంతో ఆ స్థాయికి చేరుకున్నారన్నారు. బాలల గ్రంథాలయంలో చదివి వివిధ ఉద్యోగాలకు ఎంపికైనవారిని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. దెందులూరు మండలం పోతునూరు శాఖా గ్రంథాలయంలో అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు.

లక్ష్యం ఉన్నతంగా ఉండాలి.. ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని ఏఎస్పీ సూర్యచంద్రరావు అన్నారు. స్థానిక సీఆర్ఆర్ పీజీ కళాశాలలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: గ్రంథాలయ వారోత్సవాల ముగింపు ఆదిత్య డిగ్రీ కళాశాలలో గురువారం గ్రంథాలయ ఉద్యమ పితామహుడు రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

పెదపాడు: పెదపాడు శాఖా గ్రంథాలయంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పూళ్ల : బహుమతులు, ప్రశంసాపత్రాలతో విజేతలు

ఉంగుటూరు: విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు, అధికారులు

భవిత కేంద్రం.. చిన్నారులకు వరం

నిడమర్రులో స్పీచ్‌థెరపీ చేస్తున్న సిబ్బంది

న్యూస్‌టుడే, నిడమర్రు గ్రామీణం: శారీరక, మానసిక వైకల్యంతో జన్మించే చిన్నారుల కోసం విద్యతోపాటు వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. వారి ఎదుగుదలకు అవసరమైన సేవలు అందిస్తూ వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే కాకుండా సాధారణ స్థాయికి వచ్చేలా మార్పు తీసుకొస్తున్నాయి.

మండలానికి ఒకటి.. ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలో నిడమర్రు, గణపవరం, భీమడోలు, ఉంగుటూరులో భవిత కేంద్రాలున్నాయి. ఒక్కో చోట ఇద్దరు ఉపాధ్యాయులతోపాటు ఒక ఫిజియోథెరపిస్టు, ఒక స్పీచ్ థెరపిస్టు సేవలు అందిస్తున్నారు. ఈ కేంద్రాలకు వచ్చే బాలికలకు రూ. 700, బాలురకు రూ. 500 రవాణా ఖర్చుల కింద ప్రతి నెలా వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తోంది.

ఉంగుటూరు నియోజకవర్గంలో ఇలా..

కేంద్రం	ప్రత్యేకావసరాల పిల్లలు	చిన్నారుల సంఖ్య
నిడమర్రు	20	110
గణపవరం	25	105
భీమడోలు	21	135
ఉంగుటూరు	20	109

సద్వినియోగం చేసుకోవాలి.. భవిత కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి. అవగాహన లేక కొందరు ఈ సేవలను అందిపుచ్చుకోలేక పోతున్నారు. ఇక్కడికి తీసుకొచ్చే చిన్నారులకు రవాణా భత్యం కూడా ప్రభుత్వం చెల్లిస్తుంది.

- నవ్యశ్రీ, భవిత కేంద్రం ఉపాధ్యాయిని, నిడమర్రు

సబ్ కలెక్టర్ విచారణ

చింతలపూడి, న్యూస్‌టుడే: లింగపాలెం మండలం కొణిజర్ల గ్రామంలో బీరప్ప దేవాలయానికి సంబంధించిన భూమి ఆక్రమణకు గురైందని గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న గురువారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు, గ్రామస్థుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీనికి సంబంధించి కోర్టులో విచారణ సాగుతుందని గ్రామస్థులకు రెవెన్యూ అధికారులు తెలియజేశారు.

పల్లెలు పచ్చదనంతో మెరవాలి

ఉంగుటూరు, న్యూస్‌టుడే: పల్లెలు పచ్చదనంతో మెరిసేందుకు కలిసికట్టుగా పని చేయాలని ఎంపీడీవో రాజ్ మనోజ్ కోరారు. సుస్థిర అభివృద్ధిలో భాగంగా పచ్చదనం-పరిశుభ్ర గ్రామాలు అనే అంశంపై మండల పరిషత్తు సమావేశ మందిరంలో స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు, వీవోలకు గురువారం శిక్షణ ఇచ్చారు.

గుంటుపల్లి బౌద్ధ గుహలను సందర్శించిన విద్యార్థుల బృందం

బౌద్ధ గుహలపై విద్యార్థులకు అవగాహన

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: ప్రపంచ వారసత్వ వారోత్సవాల్లో ఈ నెల 19 నుంచి 25 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాలు, విజ్ఞాన యాత్రలో భాగంగా ఏలూరు జిల్లా పురావస్తు శాఖ ఆధ్వర్యంలో వారసత్వ సంపద ప్రాధాన్యత, పరిరక్షణ, సంరక్షణ విశేషాలను విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఏలూరు నగరానికి చెందిన జింగిల్ బెల్స్ పాఠశాల విద్యార్థులను జిల్లాలో చారిత్రక ప్రదేశం గుంటుపల్లి బౌద్ధ గుహలను సందర్శించారు. ఆంధ్రా అజంతాగా పేరుగాంచిన గుంటుపల్లి బౌద్ధ గుహల చరిత్ర వైభవాన్ని విద్యార్థులకు జిల్లా పురావస్తు మ్యూజియం ఇన్‌ఛార్జి స్వర్ణ సత్యవతి సవివరంగా తెలియజేశారు. పాఠశాల డైరెక్టర్ వి.సురేశ్, ప్రిన్సిపల్ కడియాల విజయలక్ష్మి, మానవత సభ్యుడు వల్లకవి శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగికి రక్తదానం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ మహిళకు రక్తం అవసరమని తెలియడంతో పోలీస్ కంట్రోల్ రూమ్ కానిస్టేబుల్ చైతన్య స్పందించి గురువారం ఆశ్రం ఆసుపత్రికి వెళ్లి రక్తం దానం చేశారు. ఇప్పటివరకు ఆయన 16 సార్లు రక్తదానం చేసినట్లు తెలిపారు.

మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం

దెందులూరు, న్యూస్‌టుడే: అనారోగ్యంతో మృతి చెందిన శ్రీరామవరం వీఆర్ఏ చోడవరపు ఏసుబాబు కుటుంబాన్ని తహసీల్దార్ బి.సుమతి గురువారం పరామర్శించారు. మట్టి ఖర్చుల కోసం రూ. 25 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఏసుబాబు భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. తెదేపా నాయకులు మోతుకూరి నాని, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పరామర్శించిన వారిలో ఉన్నారు.

SRI SIDDHARTHA PHARMACY COLLEGE
Nuzvid- 521 201, Eluru District, A.P.
Few Seats Available - Notification for M.Pharmacy & B.Pharmacy - SPOT and CAT-B Admissions
Applications are invited for SPOT and CATEGORY-B Quota from eligible students into B.PHARMACY and M.PHARMACY (Analysis & Ceutics) courses for the academic year-2025-26.
Contact: 81878 12888, 98482 72327
M.Mohan Rao, Secretary

(c) eenadu

పోలవరం

•పోలవరం •చింతలపూడి

గ్రామాల్లో ప్రపంచ బ్యాంకు బృందం పర్యటన

జీలుగుమిల్లి: రైతులతో ప్రతినిధులు

జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: చిర్రివారిగూడెం, దబ్బవారిగూడెం, జీలుగుమిల్లి గ్రామాల్లో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు గురువారం పర్యటించారు. చిర్రివారిగూడెంలో కూరగాయ తోటల సాగు, దబ్బవారిగూడెంలో జీడిమామిడి గింజల ప్రాసెసింగ్ యూనిట్, జీలుగుమిల్లిలో ఊర చెరువు ఆయకట్టు భూముల్లో పంటల సాగు పరిశీలించారు. ప్రపంచ బ్యాంకు ద్వారా వీరికి మరింత తోడ్పాటు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచ బ్యాంకు కో-ఆర్డినేటర్ సందీప్, వ్యవసాయాధికారి గంగాధర్, జలవనరుల శాఖ ఏఈఈ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ విచారణ

విచారణ చేస్తున్న వినూత్న

చింతలపూడి, న్యూస్‌టుడే: లింగపాలెం మండలం కొణిజర్ల గ్రామంలో బీరప్ప దేవాలయానికి సంబంధించిన భూమి ఆక్రమణకు గురైందని గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న గురువారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు, గ్రామస్థుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీనికి సంబంధించి కోర్టులో విచారణ సాగుతుందని గ్రామస్థులకు రెవెన్యూ అధికారులు తెలియజేశారు. తహసీల్దార్ నజీముల్లాషా, ఎస్సై వెంకన్న ఉన్నారు.

23న నూతన రాజగోపుర శిఖర ప్రతిష్ఠ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల క్షేత్రపాలకుడు శ్రీభ్రమరాంబామల్లేశ్వరస్వామి ఆలయ నూతన రాజగోపుర శిఖర ప్రతిష్ఠ ఈ నెల 23న జరగనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. 21 నుంచి 23 వరకు ఆలయంలో శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

23 నుంచి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరు కల్యాణ మహోత్సవాలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి ఉపాలయమైన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరుకల్యాణ మహోత్సవాలు ఈ నెల 23 నుంచి 29 వరకు జరగనున్నట్లు ఆలయ ఈవో ఎన్వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఇందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎరువుల గిడ్డంగిలో ఆకస్మిక తనిఖీ

ఎరువుల నిల్వలపై ఆరా తీస్తున్న బుజ్జిబాబు

కొయ్యలగూడెం (గ్రామీణ), న్యూస్‌టుడే: పరింపూడి పరిధిలోని డీసీఎంఎస్ ఎరువుల గిడ్డంగులను వ్యవసాయశాఖ కేంద్రీకృత సహాయ సంచాలకుడు పి.జి.బుజ్జిబాబు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పొగాకు సాగు నిమిత్తం సరఫరా చేస్తున్న ఎరువులను, ఇన్వాయిస్‌లను తనిఖీ చేశారు. నాణ్యత పరీక్షల నిమిత్తం నాలుగు నమూనాలను సేకరించారు. మండల వ్యవసాయాధికారి పోశాలను ఆదేశించారు. ఈ-పోస్ యంత్రాల ద్వారా మాత్రమే ఎరువుల విక్రయాలు జరగాలని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని నిర్వాహకులను హెచ్చరించారు. ఆయన వెంట వ్యవసాయ సహాయకులు ఉన్నారు.

బాలికల్లో ఆత్మస్థైర్యం నింపడం కోసం శిక్షణ

పోలవరం ఉన్నత పాఠశాలలో బాలికల కరాటే సాధన

పోలవరం, న్యూస్‌టుడే: బాలికల్లో ఆత్మస్థైర్యం పెంపొందించడం, విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వీలుగా ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ ఇస్తోందని పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎల్.సత్యనారాయణ చెప్పారు. ఎస్ఎస్ఏ ప్రాజెక్టులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లోని 8 నుంచి 10వ తరగతి బాలికలకు స్వీయరక్షణ కోసం కరాటేలో శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడారు.

బొత్తప్పగూడెంలో గ్రామసభ

జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: కామయ్యపాలెం పంచాయతీ బొత్తప్పగూడెంలో స్వామిత్వ యోజన పథకం కింద ఇన్‌ఛార్జి ఎంపీడీవో నిఖిల్ మధు శరణ్ నేతృత్వంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. సర్వేకు సహకరించాలని ఆయన కోరారు. సర్పంచి బోడిక భోగేశ్వరరావు, పంచాయతీ అభివృద్ధి అధికారి ఎల్.రవి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి శతజయంతి

కొయ్యలగూడెం (గ్రామీణ), న్యూస్‌టుడే: భగవాన్ సత్యసాయి శత జయంతి వేడుకలను కొయ్యలగూడెంలో రెండో రోజు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సత్యసాయి మందిరం వద్ద జరిగిన కార్యక్రమాల్లో నిత్యపూజలతోపాటు 100 నిమిషాల పాటు బాబా కీర్తనలు, భజనలు ఆలపించారు.

ఆక్రమించి.. అద్దెలకిచ్చి..

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి పట్టణంలో ఖాళీ జాగా కనిపిస్తే చాలు అందులో దుకాణాలు, శాశ్వత భవనాలు వెలుస్తున్నాయి. రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను కొందరు అక్రమార్కులు తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకుని వాటిని క్రయవిక్రయాలు చేస్తున్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం ముందు ఇటీవల కొందరు ఆక్రమించి దుకాణాలు నిర్మించారు. అవన్నీ రహదారికి ఆనుకుని ఉండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. స్థానిక అధికారులు నిత్యం అదే ప్రాంతంలో తిరుగుతున్నా అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

ప్రభుత్వ స్థలాల్లో శాశ్వత కట్టడాలు

ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా వేసిన దుకాణాలు

మహిళా సమాఖ్య భవనం ముందు ప్రభుత్వ స్థలంలో వ్యాపార సముదాయాలు వెలిశాయి. పాత బస్టాండ్‌లోని చెరువు అలుగును కొంత మంది ఆక్రమించి శాశ్వత భవనాలు నిర్మించి అద్దెలకిచ్చారు. ఆ ప్రాంతంలోని పెట్రోలు బంకు దగ్గర చెరువు గట్టును ఆనుకుని ఉన్న స్థలం మొత్తం ఆక్రమించి దుకాణాలు నిర్మించి అద్దెలకిచ్చారు. ఆలపాటి కాంప్లెక్సు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమించి నివాసాలు, దుకాణాలు నిర్మించారు. కొందరు వేరే వ్యక్తులకు విక్రయించారనే ఆరోపణలు ఉన్నాయి. గురుభట్లగూడెం రోడ్డులో ఉన్న బందెలదొడ్డి చాలా వరకు ఆక్రమణకు గురైంది. ఉన్న కొద్దిపాటి స్థలాన్ని ఒక వ్యక్తి అక్రమంగా తన పేరట రిజిస్ట్రేషన్ చేయించుకుని వేరే వ్యక్తులకు విక్రయించారు. విషయం బయటకు రావడంతో ఆ రిజిస్ట్రేషన్ చెల్లదని పంచాయతీ అధికారులు సదరు భూమిని స్వాధీనం చేసుకున్నారు.

పట్టణం మొత్తం అంతే..

పట్టణ ప్రధాన రహదారి పొడవునా ఆక్రమిత దుకాణాలు వెలిశాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఎంపీడీవో కార్యాలయం ముందు మత్స్యశాఖ భవనం, గోదాము నిర్మాణం కోసం కేటాయించిన స్థలం చాలా వరకు ఆక్రమణకు గురైంది. ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మించిన దుకాణాలకు విద్యుత్తు కనెక్షన్లు మంజూరు చేయడం గమనార్హం.

చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ భూములు ఆక్రమించడం చట్టరీత్యా నేరం. త్వరలోనే వాటిని గుర్తించి నోటీసులు ఇస్తాం. డ్రెయినేజీ పనులు చేపడుతున్నాం. ఆ సమయంలోనే అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకుంటాం.

- రాంబాబు, నగర పంచాయతీ కమిషనర్, చింతలపూడి.

10 AM to 1 PM మేమున్నాం.. మీకు తోడుగా..
జంగారెడ్డిగూడెం: 80085 74478
కొయ్యలగూడెం: 80085 74947
చింతలపూడి: 76759 19086

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: ? చింతలపూడి స్టేట్‌బ్యాంకు నగర్‌లో డ్రెయిన్లు పూడిపోయి మురుగు నీరు ప్రవహించడం లేదు. కొన్ని చోట్ల డ్రెయినేజీలు లేక ఇబ్బంది పడుతున్నాం. **- రామారావు, బ్యాంకు ఉద్యోగి**

✔ డ్రెయినేజీ పూడికతీత పనులు చేపడతాం. డ్రెయిన్లు లేని చోట్ల మురుగు నిల్వకుండా చర్యలు తీసుకుంటాం. **- రాంబాబు, నగర పంచాయతీ కమిషనర్.**

చింతలపూడి, న్యూస్‌టుడే: ? గ్రామంలో డ్రెయిన్లు నిర్మించకపోవడంతో ఇళ్లలోని వాడకం నీరు అంతా ఎక్కడికక్కడ నిలిచిపోతుంది. **-బి.శ్రీనివాస్, బాదరాల, లింగపాలెం మండలం.**

✔ డ్రెయిన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేశాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం. **- పీఎస్.రాజేశ్, పంచాయతీ కార్యదర్శి**

విజ్ఞానంతో ఉత్తమ భవితకు బాటలు

బుట్టాయగూడెంలో విజేతలకు బహుమతులు అందజేసిన తహసీల్దారు చలపతిరావు తదితరులు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: విద్యార్థులు శాఖా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ద్వారా ఉత్తమ భవితకు బాటలు వేసుకోవాలని తహసీల్దారు పీవీ చలపతిరావు సూచించారు. బుట్టాయగూడెం శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపులో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు గురువారం ధ్రువపత్రాలు, బహుమతులను ప్రదానం చేశారు. గ్రంథాలయాధికారి బీమారావు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ముదునూరి రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, టి.నరసాపురం, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శాఖా గ్రంథాలయంలో వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు చివరి రోజు బహుమతులు ప్రదానం చేశారు. జంగారెడ్డిగూడెం శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు వేడుకలు కమిటీ చైర్మన్ కొప్పాక శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలైన వారికి ఈ సందర్భంగా బహుమతులు అందజేశారు. చింతలపూడి శాఖా గ్రంథాలయంలో ఎంపీడీవో మాట్లాడారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ తనగాల అనిల్ తదితరులు పాల్గొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా టి.నరసాపురంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీవో జి.మణికుమారి మాట్లాడారు. వారం రోజులు పాటు నిర్వహించిన వివిధ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఎంఈవో టి.రామమూర్తి, పంచాయతీరాజ్ ఏఈ సంపత్‌కుమారి, జవివే జిల్లా నాయకుడు పురం శ్రీనివాస్, గ్రంథాలయ పాలకుడు కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత లబ్ధిపై హర్షం

క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారు

కొయ్యలగూడెం (గ్రామీణ), న్యూస్‌టుడే: అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ కార్యక్రమంలో రెండో విడత నగదు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చిందని నాయకులు పేర్కొన్నారు. బయ్యనగూడెం సొసైటీ వద్ద జరిగిన కార్యక్రమంలో పథకం లబ్ధిదారులతో కలిసి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు లబ్ధిదారు మహిళలు క్షీరాభిషేకం చేశారు.

మలేరియా ప్రబలకుండా అప్రమత్తం

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యం గ్రామాల్లో మలేరియా ప్రబలకుండా ప్రజలను వైద్య సిబ్బంది మరింత అప్రమత్తం చేయాలని జిల్లా మలేరియా నివారణ అధికారి ప్రసాద్ ఆదేశించారు. కేఆర్‌పురంలోని తన కార్యాలయంలో 'హెల్త్ అసిస్టెంట్లతో' గురువారం ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోమల కాటుకు గురి కాకుండా రక్షణ పొందేలా గిరిజనులకు అవగాహన కల్పించాలన్నారు. కేఆర్‌పురం ఇన్‌ఛార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి గురువారం తప్పనిసరిగా గిరిజన ఆశ్రమ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయాలన్నారు. తాగునీటి క్లోరినేషన్‌పై పర్యవేక్షించాలన్నారు.

బాలికల పాఠశాలను సందర్శించిన ఎస్టీ కమిషన్ సభ్యురాలు

వట్లూరు (పెదపాడు), న్యూస్‌టుడే : వట్లూరులోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలను ఎస్టీ కమిషన్ సభ్యురాలు కాకి లక్ష్మి గురువారం సందర్శించారు. పాఠశాలలో వసతి సౌకర్యాలు, విద్యార్థినుల భోజనశాల, వంటశాల, దస్త్రాలను పరిశీలించారు. సౌకర్యాలు, విద్య, వైద్యసేవలు, బాలికల సంరక్షణ, భద్రత వంటి అంశాల గురించి ఆరా తీశారు. ప్రధానాచార్యులు దాసరి మేరీ ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం

రిలే దీక్షలో నినాదాలు చేస్తున్న నాయకులు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: మొక్కజొన్న విత్తన పంట బకాయిలు సీడ్ ఆర్గనైజర్ వెంటనే చెల్లించకపోతే ఆత్మహత్యలే శరణ్యం అంటూ మొక్కజొన్న విత్తన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం శివారు హనుమాన్ గూడెంలో మొక్కజొన్న సీడ్ ఆర్గనైజర్ చిలక అప్పారావు ఇంటి ముందు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో బాధిత రైతులు రెండో రోజు గురువారం రిలే దీక్షలు నిర్వహించారు. రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ మొక్కజొన్న విత్తన పంట బకాయిలు రూ.18.65 లక్షలు వెంటనే రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు మాట్లాడుతూ రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని వెల్లడించారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వద్దు

జంగారెడ్డిగూడెంలో ప్రదర్శన

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరించాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈపిచర్ల భూషణం డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గురువారం ఏలూరు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యార్థి నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భూషణం మాట్లాడారు.

తమ్మిలేరును .. తవ్వేస్తున్నారు

చింతలపూడి, న్యూస్‌టుడే: తమ్మిలేరు జలాశయం చుట్టూ ఉన్న ఎర్రమట్టిని పగలు, రాత్రి తేడా లేకుండా పొక్లెయిన్లతో తవ్వేస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. నాగిరెడ్డిగూడెం నుంచి మంకొల్లు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే తమ్మిలేరు భూభాగంలో పెద్ద గోతులు పెట్టి మట్టి తోడేస్తున్నారు. నిత్యం పొక్లెయిన్లతో ఈ మట్టిని తవ్వి చింతలపూడి, యర్రంపల్లి, మంకొల్లు, నాగిరెడ్డిగూడెం తదితర గ్రామాలకు ట్రాక్టర్ల ద్వారా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టర్ మట్టిని రూ.700 కు అమ్ముకుంటున్నారు. ప్రాజెక్ట్ పరిధిలో పనిచేస్తున్న లస్కర్లు చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మట్టి దందా రెండు నెలలుగా సాగుతున్నా తమ్మిలేరు జలాశయం అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ పరిస్థితిపై తమ్మిలేరు డీఈ సీతారాంను వివరణ కోరగా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు

అల్లుకున్న నిర్లక్ష్యం

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న విద్యుత్తు నియంత్రికకు చెట్లపాదులు అల్లుకుని ప్రమాదకరంగా మారింది. చుట్టూ ఉన్న రక్షణ కంచెకు కూడా పాదులు ఉండటంతో ఆసుపత్రికి వెళ్లే రోగులు ఆందోళన చెందుతున్నారు. వర్షం కురిస్తే ఆవైపు వెళ్లాలంటే భయపడుతున్నామని వారు తెలిపారు. నియంత్రికకు అల్లుకున్న చెట్లపాదులు తొలగిస్తామని, పరిసరాలు శుభ్రం చేసి సమస్య పరిష్కరిస్తామని విద్యుత్తు శాఖ ఏడీ రాంబాబు నాయక్ తెలిపారు.

పూర్తికాని మరుగుదొడ్లు.. ప్రయాణికుల ఇక్కట్లు

తాళాలు వేసిన ఇలా..

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం ఏటిగట్టు సెంటర్‌లోని బస్సుషెల్టర్‌లో మహిళా ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని నిర్మిస్తున్న మరుగుదొడ్ల నిర్మాణం కొన్ని నెలలుగా నత్తనడకన సాగుతున్నాయి. మండల పరిషత్తు నిధులు రూ.4 లక్షలతో బస్సుషెల్టర్ వెనుక భాగంలో పది నెలల కిందట వీటి నిర్మాణం ప్రారంభించారు. మరుగుదొడ్ల వరకు నిర్మాణం పూర్తిచేసి తాళాలు వేశారు. రంగులు వేసి పైపులైన్ కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. బస్సుల్లో వచ్చే మహిళలు మరుగుదొడ్లు లేక నానా అవస్థలు పడుతున్నారు. ఈ పరిస్థితిపై ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీనివాస్‌బాబు మాట్లాడుతూ సత్వరం పనులు పూర్తి చేయిస్తామని చెప్పారు.

'పీఆర్సీ ప్రకటించాలి'

కుక్కునూరు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు పీఆర్సీని ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ కోరారు. గురువారం కుక్కునూరులో జరిగిన ఆ సంఘ సమావేశంలో మాట్లాడారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి కమల్‌కుమార్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. మండల గౌరవాధ్యక్షుడిగా సాంబశివరావు, అధ్యక్షునిగా నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ, కోశాధికారిగా భాస్కర్‌లను ఎంపిక చేశారు.

మోసగించిన వ్యక్తులపై కేసు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: మోసగించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు జంగారెడ్డిగూడెం ఎస్సై వీరప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జంగారెడ్డిగూడెంకు చెందిన పగడ రాము, విజయ్‌లు స్థానిక మునసబు వీధిలో బంగారు పని చేస్తూ జీవనం సాగిస్తుంటారు. అయితే పట్టణానికి చెందిన నూకారపు చంద్ర, సూర్యకాంతం, కె.కృష్ణంరాజుతోపాటు మరికొంత మంది సుమారు 26 కాసుల బంగారు, 20 తులాల వెండి వస్తువులను మెరుగు పరిచేందుకు, నూతన ఆభరణాలు చేసేందుకు రూ.7 లక్షల నగదు ఓ నెల కిందట రాము, విజయ్‌లకు ఇచ్చారు. అప్పటి నుంచి వీరిద్దరూ దుకాణాన్ని మూసివేసి పరారయ్యారు. దీనిపై బాధితురాలు చంద్ర, మరికొంత మంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

టి.నరసాపురం, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా నుంచి తెలంగాణకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని గురువారం టి.నరసాపురం పోలీసులు పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల మేరకు గోపాలపురం మండలం తొక్కిరెడ్డిగూడెనకు చెందిన చాపల వెంకట్రావు, ఉస్సే ప్రసాదరావు తమకు చెందిన లారీలో కొవ్వూరు మండలం దొండగుంట ఇసుక ర్యాంపు నుంచి 20 టన్నుల ఇసుకతో తప్పుడు పత్రాలతో వెళ్తుండగా, లంకాలపల్లి చెక్‌పోస్టు వద్ద పట్టుకుని కేసు నమోదు చేసి, లారీని సీజ్ చేశారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

కుక్కునూరు, చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: కుక్కునూరు మండలం వేలేరు సమీపంలోని పాములేరు నది ఒడ్డున పెద్దఎత్తున నాటుసారా తయారీ చేస్తున్న కేంద్రాలపై గురువారం దాడులు చేసినట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు. ముందుగా వచ్చిన సమాచారం మేరకు పోలీసులు నేరుగా స్థావరాలపై దాడులు చేశారు. 1500 లీటర్ల బెల్లం ఊట, సారా తయారీకి ఉపయోగించే పాత్రలను ధ్వంసం చేశారు. ★ చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో నాటుసారా స్థావరాలపై దాడులు చేసినట్లు సీఐ అశోక్ తెలిపారు. ఈ దాడుల్లో ఇద్దరు పాత నిందితులు సురేష్, సత్యనారాయణలను బైండోవర్ చేసినట్లు చెప్పారు.

జూద శిబిరంపై దాడి

చింతలపూడి, న్యూస్‌టుడే: లింగపాలెం మండలం సింగగూడెంలో జూద శిబిరంపై గురువారం దాడి చేసి రూ.2,130 స్వాధీనం చేసుకొని, ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్సై రాంబాబు తెలిపారు.

బేళ్లు వస్తూనే ఉన్నాయ్!

గోపాలపురం, దేవరపల్లి కేంద్రాలు మూసేయడమే కారణం

జాతీయ రహదారిపై బారులు తీరిన పొగాకు ట్రాక్టర్లు

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: కొయ్యలగూడెం పొగాకు వేలం కేంద్రానికి బేళ్లు వస్తూనే ఉన్నాయి. రైతుల వద్ద పెద్ద ఎత్తున పొగాకు బేళ్లు ఉండిపోవడంతో అమ్మకానికి తీసుకొస్తున్నారు. అధికారులు అంచనాకు మించి బేళ్లు వేలం కేంద్రానికి వస్తుండటంతో నాలుగు రోజులుగా సాయంత్రం 6గంటల వరకు వేలం కొనసాగిస్తున్నారు. రోజుకు 2 వేలకు మించి వేలం నిర్వహిస్తున్నారు. గోదాముల్లో ఖాళీ లేకపోవడంతో కొనుగోలు చేసిన బేళ్లను భద్రపరచడం కూడా కష్టంగా ఉందని బోర్డు అధికారులు పేర్కొన్నారు.

పక్క మండలాల నుంచి.. గోపాలపురం, దేవరపల్లి వేలం కేంద్రాలు మూసి వేయడంతో ఆ ప్రాంతంలోని రైతుల వద్ద ఉండిపోయిన పొగాకును కొయ్యలగూడెం వేలం కేంద్రానికి తీసుకువచ్చి అమ్ముకుంటున్నారు. ఇక్కడి రైతుల పేరుపై విక్రయాలు చేస్తుండటంతో రైతుల వద్ద ఎంత పంట మిగిలి ఉందనేది అంచనా వేయలేకపోతున్నారు. దీంతో కొయ్యలగూడెం వేలం కేంద్రానికి తీసుకొచ్చి బేళ్లు జాతీయ రహదారి వెంబడి ట్రాక్టర్లతో గంటల తరబడి నిలిపివేస్తున్నారు.

శుక్రవారం కొనసాగింపు.. కొయ్యలగూడెం వేలం కేంద్రంలో శుక్రవారం కూడా వేలం కొనసాగనుందని వేలం నిర్వహణాధికారిణి గ్రేస్ మార్గరెట్ తెలిపారు. తమ అంచనా ప్రకారం రైతుల వద్ద ఉన్న పొగాకు అమ్మకాలు పూర్తయ్యాయని ఇతర ప్రాంతాల నుంచి కొందరు పొగాకు బేళ్లు ఇక్కడకు తీసుకొస్తున్నట్లు రైతు నాయకుల ద్వారా తెలిసిందని పేర్కొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలి

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని ద్వారకాతిరుమల సొసైటీ ఛైర్మన్ పోలిన శ్రీనివాసరావు అన్నారు. ద్వారకాతిరుమల అంతర్జాతీయ సహకార వారోత్సవాల్లో భాగంగా ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వర విశాల సహకార సంఘంలో ఆయిల్‌పామ్ రైతులకు అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నాబార్డ్ డీడీఎం టి.అనిల్ కాంత్, ఏలూరు డీసీసీబీ డీపీడీఎంలు సాయికిరణ్, పరమేష్, గోద్రెజ్ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ మేనేజర్ నవనీత్ పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పోలిన శ్రీనివాసరావు మాట్లాడారు.

అస్సైన్డ్ చట్టం ఫ్రీహోల్డ్ చేయడం విరమించాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న రవి

టి.నరసాపురం, న్యూస్‌టుడే: అస్సైన్డ్ చట్టం ఫ్రీహోల్డ్ చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలు వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. టి.నరసాపురంలో గురువారం ఆ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు రక్షణగా ఉన్న 1977 అస్సైన్డ్ చట్టాన్ని సడలిస్తే వారికి అన్యాయం జరుగుతుందన్నారు.

అమ్మకాలు మరో రోజు పొడిగింపు

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: వర్జీనియా పొగాకు వేలం మరో రోజు అదనంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నెల 19న 'ముందే వచ్చినా.. బేళ్ల చూపులు' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన విషయం విదితమే. దీనికి స్పందించిన జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా వేలం ఆలస్యం అవడానికి కారణం తెలుసుకోవాలని ఆదేశించడంతో కేఆర్‌పురం ఏడీఏ బుజ్జిబాబు ఆధ్వర్యంలో గురువారం వేలం కేంద్రానికి వెళ్లి విచారించారు.

నమ్మారు.. నిండా మునిగారు!

తాలు గింజలతో అన్నదాతలకు అపార నష్టం

ధాన్యం రాశి వద్ద రైతులు

వేలేరుపాడు, న్యూస్‌టుడే: పుడమి తల్లిని నమ్ముకున్న అన్నదాతకు కష్టాలు తప్పడం లేదు. ఆరుగాలం శ్రమించి అప్పులు చేసి సాగు చేస్తే ఏదో ఒక రూపంలో నష్టం చవి చూడాల్సి వస్తోంది. సాక్షాత్తు వ్యవసాయాధికారులు అందించిన వరి విత్తనాలు సాగు చేసిన వేలేరుపాడు మండలం కమ్మరిగూడెం గిరిజన రైతులు తీవ్రంగా నష్టపోయి లబోదిబోమంటున్నారు.

ఆశ పడి.. అప్పులు చేసి..

పోలవరం ప్రాజెక్టు ముంపు పరిధిలో లేని కమ్మరిగూడెంలో 29 మంది నిరుపేద రైతులకు గాను, ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 58 ఎకరాల్లో సాగు చేసేందుకు మండల వ్యవసాయాధికారులు 90 శాతం రాయితీపై ఎంటీయూ 7029 (స్వర్ణ రకం) 18 క్వింటాళ్ల వరి విత్తనాలు అందించారు. అయితే పంట సాగు చేసిన తొలినాళ్లలో ఆశాజనకంగా ఉండటంతో గంపెడాశతో పుట్టిన చోటల్లా అప్పులు చేసి ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేశారు. ఈ క్రమంలో ఒక్కో రైతు ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టారు. తీరా పంట చేతికొస్తుందనుకునే తరుణంలో తాలు కంకులు ఏర్పడి పంటంతా ఎండు దశకు చేరుకుంటుంది. ఏటా ఎకరాకు 20 నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి సాధించే పలువురు రైతులు తాలు కంకులతో కేవలం 10, 15 క్వింటాళ్లకే పరిమితం అవుతున్నారు.

న్యాయం జరిగేలా చూస్తాం..

'వరిలో తాలు గింజలు ఏర్పడటంతో పంట దిగుబడి తగ్గిన వేలేరుపాడు మండలంలోని కమ్మరిగూడెం పంట పొలాలను పరిశీలించాం. విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు నివేదించాం. మరోసారి విన్నవించి బాధితులకు తగు న్యాయం జరిగేలా చూస్తాం.' అని కేఆర్‌పురం ఐటీడీఏ ఏడీఏ పీజీ బుజ్జిబాబు తెలిపారు.

హరిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు తోడ్పాటు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: పంచాయతీల్లో హరిత గ్రామాలను తీర్చిదిద్దేందుకు స్వయం సహాయక సంఘాల మహిళలు తోడ్పాటు అందించాలని డిప్యూటీ ఎంపీడీవో ఎం.శ్రీనివాసరావు కోరారు. బుట్టాయగూడెం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

Prakasam College of Pharmacy
Recognized by PCI, Affiliated to JNTUK University
Koyyalagudem, Eluru - 534312, Andhra Pradesh, India
Notification for Spot & Category-B Admissions 2025-26
Applications are invited from the eligible candidates for Spot admissions on 23.11.2025 & Category-B under Management Quota on or before 23.11.2025 as per the guidelines of APSCHE.

Course	Spot vacancy	Category-B seats
B. Pharmacy	27	30

Date: 20.11.2025 Mob: 99663 84333 Sd/- Principal

ప్రకటన
మహారాజశ్రీ జంగారెడ్డిగూడెం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P. No. 8/2025 O.S No. 43/2024
బిట్వీన్:
శ్రీ మీసాల యేసుకాంతం, W/o సూరిబాబు, 48 సం॥, డోర్ నెం: 7-126, బంగారమ్మపేట, పట్టిసీమ, పోలవరం మండలం ... డిక్రీహోల్డర్
మరియు
సిరపరపు రామతులసి, W/o సూర్యప్రకాశరావు, 53 సం॥, డోర్ నెం: 7-67 రామాలయం వీధి, బంగారమ్మపేట, పట్టిసీమ, పోలవరం మండలం ... జేడీఆర్
వేలం తేదీ: 12-12-2025
పై నంబరు ఈపీ బాకీకి గాను జేడీఆర్‌కు గల ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని ది. 12-12-2025 తేదీన ఉదయం 10.30 ని.ల లగాయితు పై కోర్టు వారి ఎదుట వేలం జరుగును. వేలం పాట పాడుకునేవారు వేలం షరతులు శ్రీ కోర్టువారి నజారత్ నందుగాని, డిక్రీహోల్డర్ తరుపు న్యాయవాది గారి ఆఫీసు నందు గాని తెలుసుకొనవచ్చును.
షెడ్యులు ఆస్తి వివరం: ఏలూరు జిల్లా, పోలవరం మండలం, పోలవరం సబ్ డివిజన్, పోలవరం గ్రామం / పంచాయితీ ఏరియా, సర్వే నెం: 553-4Dలో 0.16 1/2 సెంట్లు (మొత్తం విస్తీర్ణం 0.49 1/2) ఈ క్రింది సరిహద్దుల మధ్య.
తూర్పు: చౌదరి శ్రీదేవి గారి పొలం, **దక్షిణం:** పుంతరోడ్డు
పడమర: కొల్లి అరుణ గారి పొలం, **ఉత్తరం:** సిరపరపు నరేష్ గారి పొలం
పై సరిహద్దుల మధ్యగల భూమి విస్తీర్ణం 0.16 1/2 సెంట్లు అన్ని ఈజ్‌మెంటు హక్కులతో సహా.
డిక్రీ హోల్డర్ విలువ: 6,00,000/- అమీనా విలువ: 5,00,000/-
సబ్-రిజిస్ట్రార్ పోలవరం వారి నిలువ: రూ. 14,00,000/- ఎకరం.
(ఈ ప్రకటన ది. 12-11-2025వ తేదీన కోర్టువారు జారీచేసిన ఉత్తర్వుల మేరకు జారీ చేయడమైనది)
జంగారెడ్డిగూడెం ది. 20-11-2025 సం/- గెద్దా గౌతమి, అడ్వకేట్ జంగారెడ్డిగూడెం, సెల్: 93471 47031

(c) eenadu

నూజివీడు
• నూజివీడు • కైకలూరు

ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.3 లక్షల సాయం

ఎల్‌వోసీ అందిస్తున్న మంత్రి పార్థసారథి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: మెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.3 లక్షల ఎల్‌వోసీని బాధిత కుటుంబానికి మంత్రి పార్థసారథి అందించారు. గురువారం చాట్రాయి మండలంలోని కోటపాడుకు చెందిన ఎన్.సత్యనారాయణ కుటుంబ సభ్యులు తాము ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటూ డబ్బుకోసం ఇబ్బంది పడుతున్నామని వివరించారు. స్పందించిన మంత్రి వెంటనే ముఖ్యమంత్రి కార్యాలయ ఉద్యోగులతో మాట్లాడి అప్పటికప్పుడు రూ.3లక్షల ఎల్‌వోసీని వారికి ఇప్పించారు. ఆ కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

బాలల హక్కులపై అవగాహన

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బాలల హక్కుల వారోత్సవాలు, దత్తత మాసోత్సవాల్లో భాగంగా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలల సంరక్షణ జిల్లా అధికారిణి పి.జయలక్ష్మి మాట్లాడుతూ ఎవరైనా ఆపదలో ఉన్న పిల్లలను గుర్తిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబరు 1098కు తెలపాలన్నారు. అంతేకాకుండా ఎవరైనా పిల్లలు లేని వారు దత్తత తీసుకోవాలనుకుంటే జిల్లా బాలల సంరక్షణ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. పిల్లల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించాలని కోరారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.కరుణ, ముదినేపల్లి, వడాలి సెక్టారు అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు : 80085 74698	ఆగిరిపల్లి: 9121229090
ముసునూరు : 93983 81268	చాట్రాయి: 8008574700
కైకలూరు : 73060 88555	మండవల్లి: 8106099008
కలిదిండి : 90594 84862	ముదినేపల్లి: 8008574693

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు ఒకటో వార్డులో చెత్త సేకరణ సక్రమంగా చేయడం లేదని స్థానికుడు కృష్ణ 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ ఈవో వై.ప్రసాద్ దృష్టికి తీసుకు వచ్చారు. స్పందించిన ఆయన వార్డులో చెత్త వ్యర్థాలను తొలగింపజేశారు.

తాగునీటి సరఫరా.. ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం రమణక్కపేట ఎస్సీ కాలనీలో గత వారం రోజులుగా పంచాయతీ బోరు మరమ్మతులకు గురవడంతో తాగునీరు సరఫరా కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికుడు ఆముదాల క్రాంతికుమార్ 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ కార్యదర్శి సుజాత దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె బోరుకు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించారు.

పల్లెల్లో పచ్చదనం.. శుభ్రతకు శ్రీకారం

నేటి నుంచి 'క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్' కార్యక్రమాలు

నూజివీడు, న్యూస్‌టుడే

గ్రామ పంచాయతీల్లో పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ కూటమి ప్రభుత్వం నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్' పేరుతో ఈ నెల 21 నుంచి నెల రోజుల పాటు ఎంపిక చేసిన గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇందుకు నియోజకవర్గంలో ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులకు ఇటీవల శిక్షణ ఇచ్చారు.

మండలానికి ఓ పంచాయతీ నమూనా.. శిక్షణ పొందిన అధికారులు తమ పరిధిలోని ఒక గ్రామాన్ని ఎంచుకుని పచ్చదనం, పరిశుభ్రత, ఇతర అంశాల్లో ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతారు. దాన్ని ఆదర్శంగా చూపి మిగిలిన గ్రామాలను తీర్చిదిద్దాలి. కార్యాచరణకు పంచాయతీల నుంచి ప్రత్యేక నిధులు కేటాయించేలా చర్యలు చేపట్టాల్సి ఉంది. అవసరమైన పంచాయతీల్లో తాత్కాలిక పద్ధతిపై పారిశుద్ధ్య సిబ్బందిని నియమించి, పచ్చదనం మెరుగుకు చర్యలు తీసుకోవాలి. ప్రతి మండల స్థాయి అధికారి వారి పరిధిలో వారంలో ఒక గ్రామాన్ని పర్యవేక్షించాలి.

చొప్పరమెట్లలో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం

మండలం	ఎంపిక చేసిన గ్రామం
నూజివీడు	రావిచర్ల
ఆగిరిపల్లి	చొప్పరమెట్ల
ముసునూరు	వలసపల్లి
చాట్రాయి	పర్వతాపురం

గ్రామాలు అభివృద్ధి చెందేలా..

ఎంపిక చేసిన ఆదర్శ పంచాయతీల్లో కార్యదర్శులు లక్ష్య కల్పన ఇవ్వాలి. ఆయా పంచాయతీల్లో హరిత రాయబారులంతా ఎంపిక చేసిన గ్రామానికి చేరుకుని ప్రతి ఇంటికి వెళ్లి తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తారు. సిబ్బందికి చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన కల్పిస్తారు. దశల వారీగా అన్ని గ్రామాలకు కార్యక్రమాలు వర్తింపజేస్తాం.

-ఇ.భార్గవి -ఆగిరిపల్లి, సి.రామచెంద్రనాథ్ - నూజివీడు ఎంపీడీవోలు

సస్యరక్షణ చర్యలతో మామిడికి మేలు

పూత చర్యలు వివరిస్తున్న ఉద్యానశాఖ అధికారిణి హేమ

అడవినెక్కలం(ఆగిరిపల్లి), న్యూస్‌టుడే: సస్యరక్షణ చర్యలతో రైతులకు మేలు జరుగుతుందని ఉద్యానశాఖ అధికారిణి ఆర్.హేమ తెలిపారు. అడవినెక్కలంలో గురువారం మామిడి తోటలను క్షేత్ర పరిశీలన చేశారు. మామిడిలో పూత రావడానికి చేపట్టాల్సిన చర్యలు వివరించారు. 10గ్రా పొటాషియం నైట్రేట్, బోరాన్ 2 గ్రా, జింక్ సల్ఫేట్ 2గ్రా, వేప నూనె 3 మి.లీ, హెక్సాకోనజోల్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి మామిడి తోటలకు పిచికారీ చేయడం ద్వారా పూత వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల వ్యాధులపై అప్రమత్తత అవసరం

పాడి రైతుకు మందులు అందజేస్తున్న రమేశ్

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: పశువులకు వస్తున్న వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డా.జి.రమేశ్, ప్రాంతీయ సహాయ సంచాలకుడు డా.కె.నరసింహారావు తెలిపారు. ఆగిరిపల్లి మండలం నూగొండపల్లి గ్రామంలో రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం ద్వారా గురువారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువుల గర్భ కోశ వ్యాధుల చికిత్స, పశువుల యాజమాన్యం, శాస్త్రీయ మెళకువలు రైతులకు అవగాహన కల్పించారు. మండలం పశువైద్యాధికారులు డా.హనుమంతరావు, డా.హరిత, సిబ్బంది పాల్గొన్నారు.

గుంతలు పూడ్చిన అధికారులు

ఈనాడు స్పందన

కైకలూరు, మండవల్లి, న్యూస్‌టుడే: కైకలూరు-ఏలూరు రోడ్డు మండవల్లి మండలం లోకుమూడి మొదలుకుని పెద ఎడ్లగాడి వరకు గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. రెండడుగుల లోతున భారీ గుంతలు ఏర్పడటంతో వాహనదారులు గమనించక ఇందులో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. పోలీసులు ప్రమాదాల నివారణకు గుంతల్లో ప్లాస్టిక్ డ్రమ్ములు ఏర్పాటు చేసినా చీకట్లో గమనించక ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. దీనిపై ఈ నెల 16న 'ఈనాడు'లో 'ప్రధాన రహదారి.. ప్రమాదకరంగా మారి' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆర్అండ్‌బీ అధికారులు లోకుమూడి నుంచి 5 కిలో మీటర్ల మేర పెద ఎడ్లగాడి వరకు ఉన్న గుంతలను పూడ్చి రోడ్డు మరమ్మతులు నిర్వహించారు. ప్రయాణాలకు ఆటంకం లేకుండా సాఫీగా ఉండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పూర్తి స్థాయి వసతులు కల్పిస్తాం: కామినేని

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

కైకలూరు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేసి విద్యార్థులకు పూర్తిస్థాయి వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మండలంలోని భుజబలపట్నం జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం రూ.15 లక్షల నిధులతో నిర్మించే తరగతి గదుల మరమ్మతుల పనులకు కూటమి నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. నాడు-నేడు పథకం అంటూ ఆర్భాటపు పనులతో గత ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధిని నిర్వీర్యం చేసిందన్నారు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేశ్ విద్యావ్యవస్థలో పెనుమార్పులు తీసుకువచ్చి విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తున్నారని తెలిపారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సీతారామరాజు, డీసీ ఛైర్మన్ కొత్తూరి వాసురాజు, కార్మిక సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు నల్లగోపుల చలపతి, కూటమి నాయకులు ప్రసాదరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే కూటమి ప్రభుత్వ ధ్యేయం

గోపవరంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

ముసునూరు, న్యూస్‌టుడే: కూటమి పాలనలో రైతులకు స్వర్ణయుగ పాలన కొనసాగుతుందని సొసైటీ అధ్యక్షుడు, తెదేపా గ్రామ అధ్యక్షుడు ఉప్పలపాటి గణేశ్ అన్నారు. గురువారం ముసునూరు మండలం గోపవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు సేవా కేంద్రాల్లో విక్రయిస్తేనే రైతులకు ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుందన్నారు. రైతులు ధాన్యం విక్రయించిన 24 గంటల్లో ఖాతాలో నగదు జమ చేస్తామన్నారు. సీఎం చంద్రబాబు ప్రజల మన్ననలను పొందుతూ రైతుల పక్షపాతిగా నిలబడుతున్నారన్నారు.

పీఏసీఎస్‌లలో ఈ-పాక్స్ విధానం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో దేశంలో తొలిసారి ఈ పాక్స్ విధానాన్ని ప్రవేశపెట్టిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందని నూజివీడు విభాగ సహకార అధికారి మరీదు రవికుమార్ తెలిపారు. గురువారం నూజివీడు సహకార సంఘంలో 72వ అఖిల భారత సహకార వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. సంఘం సీఈవో ఎన్.నాగేశ్వరరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు మేనేజర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: సింగరాయపాలెం - కోరుకొల్లు ప్రధాన రహదారిపై కొర్రగుంటపాలెం వద్ద గొయ్యి ఏర్పడి నెలలు గడుస్తున్నా ఆర్అండ్‌బీ అధికారులు గుంత పూడ్చివేతకు చర్యలు తీసుకోలేదు. ఈ గుంత కనిపించక ప్రతిరోజూ కనీసం నలుగురు ప్రమాదాల బారినపడి క్షతగాత్రులుగా మారుతున్నారు. భీమవరం, కలిదిండి నుంచి గుడివాడ, విజయవాడకు వెళ్లేవారికి ఇదే ప్రధాన రహదారి. ఈ రహదారి రూ.కోట్లు వెచ్చించి నిర్మించి ఏడాది కూడా పూర్తికాలేదు. నిర్మించిన నెలల్లోనే ఎక్కడికక్కడ గుంతలు పడిపోయింది. ప్రమాదాలు జరుగుతుండటంతో స్థానికులు గుంతలో రాళ్లు ఏర్పాటు చేసి ఎర్ర రంగు వస్త్రం కప్పి వాహనదారులకు హెచ్చరికగా ఏర్పాటు చేశారు. ఆర్అండ్‌బి ఏఈ సత్య అరవింద్‌ను సంప్రదించగా వెంటనే పరిశీలించి మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటానని వివరించారు.

14 ఏళ్లుగా పూర్తికాని వారధి!

శిథిల వంతెనపై ప్రమాదకర ప్రయాణం

కలిదిండి, న్యూస్‌టుడే : 14 ఏళ్ల కిందట కోరుకొల్లు - ఆవకూరు సరిహద్దులోని పెదలంక డ్రెయిన్ పైనున్న వంతెన రూ.3 కోట్లతో నిర్మాణం చేపట్టారు. అది నేటికీ పూర్తి కాలేదు. అనుసంధాన రోడ్డు నిర్మాణానికి నిధులు లేకపోవడంతో అది వినియోగంలోకి రావడం లేదు. ఈ వారధికి భూమి పూజ చేసిన తరువాత ఇప్పటి వరకు నాలుగు ప్రభుత్వాలు మారాయి. ఎందరో పాలకులు వచ్చి వెళ్లారు. ఎవరూ ఈ వంతెన పూర్తి చేయలేకపోయారు. ఏలూరు - కృష్ణా జిల్లాలకు అనుసంధానంగా ఉన్న ఈ మార్గంలోని పాత వంతెన 20 ఏళ్ల కిందటే శిథిలావస్థకు చేరింది. ఏటికేడు క్రమంగా కుంగిపోతోంది. ఏ క్షణం కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కొత్త వారధికి అనుసంధాన రోడ్డుకు నిధులు మంజూరు చేసి.. ప్రమాదం బారి నుంచి కాపాడాలంటూ ప్రయాణికులు వేడుకుంటున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ డీఈఈ అనిల్‌కుమార్ అనుసంధాన రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్లకు ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. నిధులు మంజూరు కావాల్సి ఉందని ఆయన వివరించారు.

సగంలో నిలిచిన నిర్మాణమిలా..

అల్లుకున్న నిర్లక్ష్యం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లి శివారు అన్నవరం కాలువ గట్టు బజారులోని కరెంటు స్తంభానికి పిచ్చి మొక్కలు, పాదులు అల్లుకున్నాయి. విద్యుత్తు తీగలను పిచ్చి మొక్కలు అల్లుకుని దాని ద్వారా స్తంభం కనబడకుండా అల్లుకుపోతున్నాయి. వర్షం వచ్చినా, గాలులు వీచినా అవి తగిలి నిప్పు రవ్వలు రాలి ప్రమాదం జరిగేందుకు ఆస్కారం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై విద్యుత్తు శాఖ ఏఈ పూర్ణచంద్రరావును సంప్రదించగా వెంటనే సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తానని తెలిపారు.

తేమ శాతంలో నిర్లక్ష్యం వద్దు

ధాన్యం కొనుగోలుపై సమీక్షిస్తున్న తహసీల్దారు భద్రూ

చాట్రాయి, న్యూస్‌టుడే: ధాన్యం తేమ శాతం కచ్చితంగా ఉండేలా చూడాలని, రైతులకు నష్టం జరిగితే సహించేది లేదని తహసీల్దారు భద్రూ అన్నారు. పోలవరం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేసి అక్కడే ఉన్న రైతులతో మాట్లాడారు. సమస్యలు ఎదురైతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకు రావాలని సూచించారు. త్రిసభ్య కమిటీ ఛైర్మన్ యర్రా ప్రసాద్ ధాన్యం కొనుగోలు తీరును ఆయనకు వివరిస్తూ వెంటనే నగదు జమ చేస్తున్నామని తెలిపారు.

సినిమాలు

నూజివీడు పట్టణం

సత్యనారాయణ	రాజు వెడ్స్ రాంబాయి
సత్యనారాయణ మినీ	జిగ్రీస్
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	శిశు రోడ్ టు రివెంజ్
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	12ఏ రైల్వే కాలనీ
ద్వారక సినిమాస్ స్క్రీన్ 3	మఫ్టీ పోలీస్
ఆగిరిపల్లి: శ్రీఅను డీలక్స్	తెలుసు కదా
కైకలూరు: విజయలక్ష్మి జీ3	రాజు వెడ్స్ రాంబాయి
మాగంటి సినిమాస్	కాంత
శ్రీవెంకటరమణ సినిమాస్	12ఏ రైల్వే కాలనీ
ముదినేపల్లి: పూర్ణిమ	రాజు వెడ్స్ రాంబాయి

నేడు ప్రజాదర్బార్

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజాదర్బార్, ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ కార్యాలయ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు కొన్నకుంట రోడ్డులో దివంగత డా. మాగంటి రవీంద్రనాథ్ ఠాగూర్ తోటలో నూతనంగా ఎంపికైన మండల పార్టీ అధ్యక్షులు, మండల కమిటీ సభ్యులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు తదితరులతో ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి కొలుసు పార్థసారథి హాజరవుతారన్నారు.

కార్యాలయాల ప్రారంభం ఎన్నడో

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన డివిజన్, నియోజకవర్గ అభివృద్ధి కార్యాలయాలు ప్రారంభానికి నోచుకోవడం లేదు. ప్రజాప్రతినిధులకు తీరిక లేకపోవడంతో ఈ పరిస్థితి ఉత్పన్నమవుతోంది. దీంతో భవన నిర్మాణం పూర్తి అయినప్పటికి తాళాలే దర్శనమిస్తున్నాయి. ఇక్కడ విధుల్లో ఉండాల్సిన అధికారులు, సిబ్బంది పరాయి చెంతన ఉంటూ.. వస్తున్నామా.. వెళ్తున్నామా.. అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. డివిజన్, నియోజకవర్గ స్థాయిలో ఏమి జరుగుతుందో చెప్పుకోలేని పరిస్థితి వీరిది. డివిజనల్ అభివృద్ధి అధికారి వారి కార్యాలయానికి మండల పరిషత్తు నిధులు రూ.15 లక్షలు, జడ్పీ నిధులు రూ. 10 లక్షలు కేటాయించారు. నియోజకవర్గ స్థాయి కార్యాలయాన్ని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో రూ.6 లక్షలు వెచ్చించి సిద్ధం చేశారు. ఇక్కడ మంత్రి కొలుసు పార్థసారథికి ఓ ఛాంబర్‌తో పాటు ఉద్యోగులకు కుర్చీలు కేటాయించారు. డీఎల్‌డీవో, ఇతర సిబ్బంది కేవలం పీ4 కార్యక్రమాలపై పర్యవేక్షణ చేస్తూ మమ అనిపిస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ఈ కార్యాలయాలను ప్రారంభించాల్సి ఉంది. ఆయనకు సమయం చిక్కకపోవడంతో నూజివీడు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి సైతం ఈ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నారు. మొంథా తుపాను కారణంగా ప్రారంభించాల్సిన తేదీ వాయిదా పడిందని పంచాయతీరాజ్ ఏఈ విజయ గోపాల్ తెలిపారు.

భారంగా నిర్మాణ సామగ్రి రవాణా

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ప్రధాన రహదారి నుంచి ఇళ్ల స్థలాల వరకు నిర్మాణ సామగ్రి మోయించుకోవాలని, అంత భారం తాము మోయలేక నిర్మించడం లేదని దాకరం లబ్ధిదారులు తహసీల్దారు ఎదుట మొరపెట్టుకున్నారు. దాకరం, పేరూరులో గురువారం సాయంత్రం ఇంటి నిర్మాణాలు ప్రారంభించేలా అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దారు లతీఫ్ పాషా మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో వెంటనే నిర్మాణాలు ప్రారంభించుకోవాలని, ప్రభుత్వం వెంటనే బిల్లులను అందిస్తుందని చెప్పారు. దాకరం శివారు నాయుడు చెరువులో ఇచ్చిన స్థలాలకు వెళ్లాలంటే పోల్ రాజ్ కాలవపై వంతెన లేక కనీసం ట్రాక్టర్ కూడా వెళ్లే వీల్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీలతో మోయించుకోవాలంటే సామగ్రి కంటే రెట్టింపు ఖర్చవుతుందని వాపోయారు. సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆయన చెప్పారు. సర్పంచి జాస్తి రాజా, వీఆర్వో, సిబ్బంది పాల్గొన్నారు.

భవితకు బాటలు వేసే ఉపాధ్యాయులు కావాలి: మాజీ ఎమ్మెల్సీ

మాట్లాడుతున్న లక్ష్మణరావు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: జీవితంలో విద్య ఎంతో కీలకమని, విద్యార్థులకు విజ్ఞానాన్ని అంకిత భావంతో అందిస్తూ వారి ఉజ్వల భవితకు బాటలు వేసే ఉపాధ్యాయులు నేటి సమాజానికి అవసరమని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు తెలిపారు. ఆగిరిపల్లిలో గురువారం నిర్వహించిన యూటీఎఫ్(ఐక్య ఉపాధ్యాయ సంఘం) మండల కౌన్సిల్ నూతన కార్యవర్గ ఎన్నిక పర్యవేక్షణ అధికారిగా పి.వీరకోటి వ్యవహరించారు. మండల అధ్యక్షుడిగా జి.రామచంద్రన్, కార్యదర్శిగా కె.అజరయ్య, గౌరవ అధ్యక్షుడిగా బి.ఏసేపు, సహాధ్యక్షులుగా ఎ.మాధవి, సీహెచ్ అంజనాదేవి, కోశాధికారిగా పి.సతీశ్‌బాబులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ మనోహర్ కుమార్, సీనియర్ నాయకుడు పాతూరి రవి, సీపీఎం నాయకుడు సత్తు కోటేశ్వరరావు, సీఐటీయూ నాయకుడు రాజు, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహన దొంగల అరెస్టు

నిందితులతో పోలీసులు

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండలం పరిధిలో వివిధ ద్విచక్రవాహనాల చోరీలో నిందితులను ఎస్.ఐ. రామచంద్రరావు, పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నట్లు సీఐ రవికుమార్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న 5 ద్విచక్ర వాహనాలను మీడియా ముందు ప్రవేశపెట్టారు. మండవల్లిలో 1 మణుగునూరులో 3, లోకుమూడిలో 1 ద్విచక్ర వాహనాల దొంగతనాలు జరిగాయని కేసు నమోదు చేసిన ఎస్.ఐ. విజయవాడ వరకు ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించినట్లు తెలిపారు. నిందితులు రమావతు దుర్గాప్రసాద్ నాయక్, బాణవతు తులసీ బాబు నాయక్, మరో మైనర్‌ను కొవ్వాడలంక డొంక వద్ద ఆధారాలతో పట్టుకున్నారు. వారి వద్ద నుంచి మొత్తం 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసులో పురోగతి సాధించిన ఎస్.ఐ. రామచంద్రరావు, కానిస్టేబుళ్లు పి.రవీంద్రబాబు, మహేశ్, రామకృష్ణలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డు ప్రకటించినట్లు సీఐ తెలిపారు.

సరిహద్దుల్లో జూదాల జోరు

చాట్రాయి, న్యూస్‌టుడే: జూదాల నిర్వహణకు సరిహద్దు ప్రాంతాలు వేదికగా మారాయి. ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట, ముసునూరు, చింతలపూడి, లింగపాలెం స్టేషన్లకు సరిహద్దులో చాట్రాయి స్టేషన్ ఉంది. జూద శిబిరాల నిర్వాహకులు ఇక్కడ రాత్రి పది గంటల తర్వాత భారీ జూదాలకు తెర తీస్తున్నారు. తమ్మిలేరు జలాశయం సమీపంలో యర్రంపల్లి వద్ద తోటలో బుధవారం రాత్రి నిర్వహిస్తున్న జూద కేంద్రంపై దాడికి చాట్రాయి ఎస్.ఐ. సిబ్బందితో వెళ్లగా వారి పరిధి కాదని తెలిసింది. చింతలపూడి స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా గంట తర్వాత వచ్చి వారిని తీసుకెళ్లారు. సుమారు తొమ్మిది మంది వ్యక్తులను పట్టుకుని, నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఇటీవల కృష్ణారావుపాలెంలో భారీ జూదంపై తెలంగాణ పోలీసులు దాడి చేశారు. నరసింహారావుపాలెం - నరసాపురం మధ్యలో ఇటీవల దాడికి వెళ్లగా తమ పరిధి కాదని వెనక్కి వచ్చారు. పర్వతాపురం, సి.గుడిపాడు, చీపురుగూడెం పరిధిలో సరిహద్దును తమకు అనుకూలంగా మలుచుకుని శిబిరాలు నిర్వహిస్తున్నారని తెలిసింది. బూరుగుగూడెం-పర్వతాపురం అటవీ భూములు జూదాలకు అడ్డాగా మారాయి.

నలుగురిని.. ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి మండలం ఈదర సమీపంలో నిర్వహిస్తున్న జూద శిబిరంపై గురువారం పోలీసులు దాడులు నిర్వహించారు. దీనిలో నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.4,400 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు.

విప్లవాత్మక మార్పులకు పుస్తకాలే నాంది



ధ్రువపత్రాలతో విద్యార్థులు

మండవల్లి, న్యూస్‌టుడే: జీవితంలో విప్లవాత్మక మార్పులకు పుస్తకాలే నాంది పలుకుతాయని మండవల్లి హెచ్ఎం శ్రీనివాస్ తెలిపారు. జాతీయ గ్రంథాలయ ఉత్సవాల ముగింపు సందర్భంగా విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. నేటి ఆధునిక కాలంలో స్మార్టు ఫోన్, ఇంటర్‌నెట్ వల్ల గ్రంథాలయాలకు ఆదరణ తగ్గుతున్నా విద్యార్థులకు మరింత విజ్ఞానాన్ని అందించే ఉద్దేశంతోనే ప్రభుత్వం వీటిని నిర్వహిస్తోందన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు.

కైకలూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు నిత్య పఠనంతో విజ్ఞానాన్ని పెంచుకోవాలని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కీర్తి వెంకటరామ్ ప్రసాద్, తెదేపా జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి పోలవరపు లక్ష్మీరాణి అన్నారు. కైకలూరు గ్రంథాలయ సంస్థలో నిర్వహిస్తున్న జాతీయ వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఇందులో రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టరు లంకా రత్నారావు, సాహితీ మిత్రులు చింతపల్లి వెంకటనారాయణ, తెదేపా నేతలు పి.రాధాకృష్ణ, కేకే బాబు, వీరాబత్తిన సుధ, గ్రంథాలయ అధికారి కె.శ్రీనివాస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలిదిండి, న్యూస్‌టుడే: బడిలో చెప్పే పాఠాలతో పాటు గ్రంథాలయంలోని విజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటే ఉజ్వల భవిత ఉంటుందని తహసీల్దారు రామకృష్ణ, ఎంఈవో-2 అనిశెట్టి శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపును పురస్కరించుకుని కలిదిండి, కోరుకొల్లులో మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, మాజీ ఎంపీపీలు వలవల రామారావు, చెన్నంశెట్టి మురళీకృష్ణ, సర్పంచి బట్టు లీలా కనకదుర్గ చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు అందించారు.

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: గ్రంథాలయాలు విద్యార్థుల జ్ఞానాభివృద్ధికి దోహద పడతాయని విశ్రాంత ఎంఈవో గోవిందరావు అన్నారు. గురువారం నూజివీడు గ్రంథాలయంలో ఉత్సవాల ముగింపు కార్యక్రమం గ్రంథాలయాధికారి బీహెచ్ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. పురపాలక సంఘం వైస్ ఛైర్మన్ పి.సత్యనారాయణ, కౌన్సిలర్ కె.సత్యనారాయణ, టి.సాధన స్రవంతి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

ముసునూరు, న్యూస్‌టుడే: అక్కిరెడ్డిగూడెం సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు దీపక్ పాండ్యే స్వామివారికి అభిషేకాలు, హారతులు ఇచ్చి పూజలు చేశారు. వివిధ రకాల పుష్పాలతో బాబాను అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

సెలవు దరఖాస్తు పుస్తకాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

సమస్యల పరిష్కారంలో ఏపీటీఎఫ్ ముందంజ

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో, వారి అభ్యున్నతికి ఏపీటీఎఫ్ ఎప్పుడు ముందుంటుందని ఆ సంఘ జిల్లా నాయకులు బేతాళ రాజేంద్రప్రసాద్ అన్నారు. ముదినేపల్లిలో గురువారం ఏపీటీఎఫ్ మండలాధ్యక్షులు ఎ.కృపాకర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సెలవు దరఖాస్తు పుస్తకాన్ని ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై చిత్తశుద్ధితో ఉంటామన్నారు. మండల ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, నారాయణ, దాసు, జయశ్రీ లత, చక్రధర్, రామరాజు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

కైకలూరు, న్యూస్‌టుడే: భర్త, అత్తమామలు వేధిస్తున్నారని ఓ వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేయగా కైకలూరు గ్రామీణ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని వరహాపట్నం గ్రామానికి చెందిన సీహెచ్ భువన తేజకు కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం కొత్త మాజేరు గ్రామస్థుడు మనోహర బాల గురు రాజేశ్‌తో 7 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఓ అమ్మాయి, అబ్బాయి ఉన్నారు. ఈ క్రమంలో కొన్ని నెలలుగా భర్త, అత్తమామలు అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తుండగా ఇరువురి మధ్య వివాదాలు జరుగుతున్నాయి. ఇరు కుటుంబ పెద్దలు వద్ద సమస్య పరిష్కారం కాకపోవడంతో భువన తేజ పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదుతో భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాంబాబు తెలిపారు.

విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లిలోని బాలికల వసతి గృహం సమీపంలోని ఓ ఇంటిలో గురువారం సాయంత్రం స్విచ్ బోర్డులో నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించి గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గండేపూడి రవి శంకర్‌కు చెందిన బెడ్‌రూంలోని స్విచ్ బోర్డు నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఆ గదిలో ఉన్న వస్త్రాలు, మంచం, ఫర్నిచర్‌కు మంటలు అంటుకుని కాలిపోయాయి. స్థానికులు వెంటనే స్పందించి మంటలు అదుపు చేశారు. దీంతో మిగిలిన గదుల్లోకి మంటలు వ్యాపించక పోవడంతో త్రుటిలో పెనుప్రమాదం తప్పింది.

ఘనంగా అయ్యప్ప పడి పూజ

ముదినేపల్లి, న్యూస్‌టుడే: దేవపూడిలో సోమవారం రాత్రి అయ్యప్ప పడి పూజ ఘనంగా నిర్వహించారు. కేరళకు చెందిన మురళీ నంబూద్రి ఆధ్వర్యంలో పూజ నిర్వహించారు. అయ్యప్ప శరణు ఘోషతో గ్రామం మార్మోగింది. పడి వెలిగించి పేటతుల్లి ఆడారు. అయ్యప్ప, భవాని, ఆంజనేయస్వామి మాలధారులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టు హేయం: దూలం

కైకలూరు, న్యూస్‌టుడే: వైకాపా కార్యకర్తలను అక్రమంగా అరెస్టులు చేయడం హేయమని వైకాపా జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు అన్నారు. కైకలూరులో జరిగిన కాపు వన సమారాధనకు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ హాజరైన తరుణంలో ఆయనను విమర్శించేలా వైకాపా కైకలూరు మండల అధ్యక్షుడు సింగంశెట్టి రాంబాబు(రాము) సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. రెండు వర్గాల మధ్య విభేదాలు సృష్టించేలా వ్యవహరించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ పోలీసులు రాముకు నోటీసులు ఇచ్చి గురువారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. నాగేశ్వరరావు, పార్టీ నాయకులతో కలిసి పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. మీడియా ముఖంగా ఎమ్మెల్యే, సీఐ, ఎస్సైలపై ఘాటు వ్యాఖ్యలు చేశారు.

వ్యాఖ్యలు సరికాదు.. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌పై దూలం నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలు సరికాదని నియోజకవర్గ కాపు వన సమారాధన ఆహ్వాన కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, టి.శ్రీనివాసరావు, ఏవీ.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో ఖండించారు. ఎమ్మెల్యేను తామే వన సమారాధనకు ఆహ్వానించి తమ వర్గానికి అండగా ఉండాలని కోరగా కల్యాణ మండపం కోసం స్థలం కేటాయించి భవన నిర్మాణంలో సగం ఖర్చు భరించేలా దాతను ఏర్పాటు చేశారని తెలిపారు. సింగంశెట్టి రాము పెట్టిన పోస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

SRI SIDDHARTHA PHARMACY COLLEGE
Nuzvid- 521 201, Eluru District, A.P.
Few Seats Available - Notification for M.Pharmacy & B.Pharmacy - SPOT and CAT-B Admissions
Applications are invited for SPOT and CATEGORY-B Quota from eligible students into B.PHARMACY and M.PHARMACY (Analysis & Ceutics) courses for the academic year-2025-26.
Contact: 81878 12888
98482 72327
M.Mohan Rao
Secretary

(c) eenadu

భీమేశ్వరాలయం.. దీప శోభితం

సామర్లకోటలోని భీమేశ్వరాలయం గురువారం కోటికాంతుల వెలుగులతో శోభిల్లింది. ఆలయ ఈవో నీలకంఠం, ఛైర్మన్ జగదీష్‌మోహన్ ఆధ్వర్యంలో కోటి దీపాలను భక్తులు వెలిగించారు. పలువురు ఆకాశ దీపాలనూ వదిలారు.
– న్యూస్‌టుడే, సామర్లకోట

మాతృ, శిశు మరణాలకు కారణాలేంటి?

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో మాతృమరణాల నివారణకు చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో జె.నరసింహనాయక్ పేర్కొన్నారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు సంభవించిన నాలుగు మాతృమరణాలపై గురువారం జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో విశ్లేషించారు. ప్రమాదకర స్థితిలో ఉన్న గర్భిణులను గుర్తించి, ప్రభుత్వాసుపత్రుల్లో చేర్పించాలని నిర్ణయించారు. అలాగే తూరంగి, రౌతులపూడి, శంఖవరం, గెద్దనాపల్లి, కాకినాడ నేతాజీ పార్కు, రెల్లిపేటలోని యూపీహెచ్‌సీల్లో 120 శిశు మరణాలు సంభవించాయని, వీటిని నూరుశాతం నివారించడానికి కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ లావణ్యకుమారి, డీసీహెచ్ఎస్ మహేశ్వరరావు, డీఐవో కేవీ సుబ్బరాజు పాల్గొన్నారు.

రైస్ మిల్లుల వద్ద అధికారులతో పర్యవేక్షణ

జిల్లాలో 25 వేల టన్నుల ధాన్యం సేకరణ

సూచనలిస్తున్న డీఆర్వో వెంకటరావు, చిత్రంలో డీఎం, డీఎస్‌వో

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఖరీఫ్ ధాన్యం సేకరణలో భాగంగా సీఎంఆర్‌కు గుర్తించిన రైస్‌మిల్లుల వద్ద కస్టోడియన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నిరంతరం పర్యవేక్షించాలని డీఆర్వో జె.వెంకటరావు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ఇప్పటికి 25 వేల టన్నుల ధాన్యాన్ని సేకరించారని తెలిపారు. కొన్నిసార్లు ఆర్ఎస్‌కే నుంచి పంపిన ధాన్యాన్ని వివిధ కొర్రీలతో మిల్లర్లు వెనక్కి పంపడానికి గతంలో యత్నించారని, ఈసారి ఇటువంటి వాటికి తావులేకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. కస్టోడియన్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు ఎం.దేవులనాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి రుద్రరాజు సత్యనారాయణరాజు, సహాయ సరఫరా అధికారి తుమ్మల ప్రసన్నలక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ప్రాంతం.. అభివృద్ధి మంత్రం

ఉమ్మడి జిల్లాలో నీతి ఆయోగ్ ప్రణాళికలు

ఈనాడు, కాకినాడ

దేశంలో ప్రాంతాలవారీ ఆర్థిక కార్యకలాపాల ఆధారంగా గ్రోత్ హబ్‌లను ఏర్పాటుచేసి ప్రజల తలసరి ఆదాయం పెంచవచ్చన్నది నీతి ఆయోగ్ ఆలోచన. ఆ దిశగానే విశాఖ కేంద్రంగా తొమ్మిది జిల్లాలతో ఎకనామిక్ రీజియన్‌కు నాంది పలికారు. ఇటీవల సీఐఐ భాగస్వామ్య సదస్సులో ముసాయిదా ప్రకటించారు. అందులో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని వనరులతో ఎలా అభివృద్ధి సాధించవచ్చో చూపారు. వ్యవసాయ, పర్యాటక, పారిశ్రామిక రంగాల వారీ ప్రాజెక్టుల గురించి వివరించారు. 2047 నాటికి జిల్లా స్థూల దేశీయోత్పత్తి (జీడీడీపీ), స్థూల అదనపు విలువ (జీవీఏ) ఎంత మేర పెరుగుతాయో అంచనా వేశారు.

తూర్పు.. నర్సరీ రాజధాని

- అరటి, ఆయిల్‌పామ్ సాగు ప్రోత్సహిస్తారు. కొవ్వూరే కాకుండా మిగతాచోట్లా అరటి పెంచుతారు.
- టెంపుల్ సర్క్యూట్‌తో ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ ఆలయాలన్నీ అందుబాటులోకి తెస్తారు.
- దేశానికి నర్సరీ రాజధానిగా తూర్పుగోదావరి జిల్లాను అభివృద్ధి చేస్తారు. కడియం పరిసరాల్లో 5 వేల ఎకరాల్లో నర్సరీలు ఉండగా 30 వేల మంది ఆధారపడుతున్నారు. నర్సరీలను మరింతగా వృద్ధిలోకి తెచ్చి తలసరి ఆదాయం రెట్టింపు చేస్తారు.

కాకినాడ.. గ్రీన్ అమ్మోనియా సిటీ

- నీతి ఆయోగ్ నివేదికలో కాకినాడను గ్రీన్ అమ్మోనియా సిటీగా పేర్కొన్నారు. ఏడాదికి మిలియన్ మెట్రిక్ టన్నులను ఏఎం గ్రీన్ కంపెనీ తయారు చేయనుంది. రెండు గిగావాట్ల ఎలక్ట్రోలైజర్ పరికరాలూ సరేసరి.
- డీప్ సీ, యాంకరేజ్, కాకినాడ గేట్ వే పోర్టులతో సరకు రవాణాలో తిరుగులేని శక్తిగా జిల్లా ఎదగనుంది. కాకినాడ, శ్రీకాకుళం మధ్య 150–175 కి.మీ మేర గ్యాస్ పైప్‌లైన్, కాకినాడలో గ్యాస్ టెర్మినల్ నిర్మాణంతో ఆర్థిక వృద్ధి నమోదుకు ఆస్కారం.
- 200 ఎకరాల్లో రూ.123 కోట్ల అంచనాతో సమీకృత ఆక్వా పార్క్ రానుంది.

కోనసీమ.. కొబ్బరికి చిరునామా

- కోనసీమ జిల్లాను కొబ్బరి హబ్‌గా చేస్తారు. జిల్లాలో లక్ష ఎకరాల్లో ఈ తోటలు, అంబాజీపేటలో పరిశోధనా కేంద్రం ఉన్నాయి. అన్ని రకాల కొబ్బరి ఉత్పత్తులు, ఉప ఉత్పత్తుల తయారీతో గణనీయమైన వృద్ధి సాధించవచ్చన్నది నీతి ఆయోగ్ సూచన.
- కాకినాడ-యానాం-దిండి వరకు రివర్ క్రూయిజ్‌తో పర్యాటక ప్రాజెక్టుకు పరిశీలిస్తున్నారు.

కాకినాడ టౌన్-మైసూరుకు ప్రత్యేక రైళ్లు

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: డిసెంబరు 1 నుంచి జనవరి 12వ తేదీ వరకు కాకినాడ టౌన్ నుంచి మైసూరు (07033)కు ప్రత్యేక రైలును 13 ట్రిప్పులు, అదే విధంగా డిసెంబరు 2 నుంచి జనవరి 13వ తేదీవరకు మైసూరు నుంచి కాకినాడ టౌన్‌కు(07034) 13 ట్రిప్పులు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల రద్దీని పురస్కరించుకుని ఈ ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు అధికారులు తెలిపారు.

MANAGEMENT - ADMISSIONS 2025-26

Post B.Sc - 2 Years (Qualification GNM)
M.sc Nursing - 2 Years (B.Sc + 1year)
Courses offered: GNM, B.Sc Nursing, Post B.Sc, M.Sc Nursing
FIND US ON GOOGLE COLLEGE ADDRESS
Secretary & Correspondent
Smt. Vasantha Kumari Indupalli
B.Sc.,(N) R.N.R.M, DNEA, DNA.
Former Principal: Govt. School of Nursing, kkd
Adhoc Inspector: Indian Nursing Council, New Delhi
MOTHER THERESA
COLLEGE OF NURSING, KAKINADA
Cont : 0884-2345966, 2345977, Direct: 9247255155

THE ARYAPURAM CO-OPERATIVE URBAN BANK LTD. HEAD OFFICE, RAJAMAHENDRAVARAM (Reg.No.3127)

RECRUITMENT NOTIFICATION FOR THE POSTS OF ASST. CLERKS / ASST. CASHIER ON CONTRACT BASIS

Applications are invited from Candidates who passed **IBPS/ SBI/RRB'S CLERKS PRELIMS** for the post of Asst. Clerks on contract basis Age : 21 Yrs-28 Yrs. as on date of notification (Age relaxation as per Bank service conditions), **Consolidated payment of Rs. 24,000/- p.m** during probation period of 1 year and on confirmation pay scales will be applicable.

The vacancies are at our Guntur, Visakhapatnam and Bhimavaram Branches only

Selection Procedure : Written Test and Interview

Last date of application to be received to bank: 29-11-2025 by 5:00 p.m.

Those candidates who have applied in last one year are not eligible to apply **Application only in specified format can be sent through courier or email or through registered post or in person. Bank reserves right to refuse any application without assigning any reasons**

Detailed Recruitment notification & Application can be downloaded from Website:
http://www.aryapurambank.com/career.html
Email: arcobank_rjy@aryapurambank.com

Date: 21-11-2025 **Contact no.:-0883-2473550**
Secretary/CEO

కడలి కోత.. కట్టడికి మార్గం

యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ నుంచి కాకినాడ బీచ్‌రోడ్డుపై ఏడాదికి రెండుమూడు సార్లు రాకాసి అలల తాకిడికి రోడ్డు ధ్వంసం అవుతుండడం షరామామూలుగా మారింది. ఉప్పాడ పంచాయతీ శివారు పల్లిపేట నుంచి సుబ్బంపేట మధ్యలో దారి ఇటీవల తుపానుకు ధ్వంసమై చాన్నాళ్లు రాకపోకలు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం నిధులివ్వగా సిమెంట్ రోడ్డును దృఢంగా నిర్మిస్తున్నామని అధికారులు తెలిపారు. ఎంతటి కెరటాలైనా తట్టుకుంటుందని చెబుతున్నారు. – న్యూస్‌టుడే, కొత్తపల్లి

విశ్వేశ్వరుడికి మహాకుంభాభిషేకం

శంఖవరం మండలంలోని కత్తిపూడిలో కాశీ విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామికి గురువారం వైభవంగా మహాకుంభాభిషేకం నిర్వహించారు. ఉత్సవమూర్తులకు మహాగణపతి పూజ, రక్షాబంధనం, దీక్షా వస్త్రధారణ, నవగ్రహ మండపారాధన తదితర పూజలు చేశారు. సప్త నదీ జలాలతో కూడిన 571 కలశాలతో మహాకుంభాభిషేకం, మహాకుంభ అధిష్ఠాన దేవత ఆవాహనం, రుద్ర హోమం నిర్వహించారు. అనంతరం శోభాయాత్ర, గ్రామోత్సవం జరిపారు. మహిళలు పెద్దసంఖ్యలో కదిలొచ్చారు. ఆలయ ధర్మకర్త మంచాల సత్యనారాయణ, పండితులు ఘంటశాల సోమేశ్వరశర్మ, సుబ్రహ్మణ్యశర్మ, చెరుకూరి వీరబాబు, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, శంఖవరం

మళ్లీ రండి.. మాయమైపోండి

తనిఖీలపై మైనింగ్ అక్రమార్కులకు ముందే లీకులు

ఈనాడు, కాకినాడ

కాకినాడ జిల్లా గండేపల్లి మండలం రామేశ్వరంమెట్ట నుంచి రోజూ వందల సంఖ్యలో లారీలతో అక్రమంగా కంకర తరలిస్తుండడం బహిరంగ రహస్యమే. ఇక్కడ అనుమతులతో పనిలేదు. నేతల అండదండలుంటే చాలు. స్థానిక మైనింగ్ అధికారులకు సమాచారం ఉన్నా అటు చూడరు. విజిలెన్స్ విభాగానికి ఉప్పందడంతో గురువారం ఉదయం హడావిడిగా చేరుకునేసరికి అక్కడ ఒక్కరూ లేరు. వాహనాలన్నీ మెట్ట బయటే ఉన్నాయి. గనులశాఖలోనే కొందరు సిబ్బంది అక్రమార్కులకు ముందే సమాచారం ఇచ్చేశారు.

రామేశ్వరం మెట్టలో అనుమతుల్లేకుండా మైనింగ్ జరుగుతున్న ప్రాంతం

వచ్చారు.. వెళ్లారు..

ఏలూరు నుంచి ప్రాంతీయ విజిలెన్స్ మైనింగ్ ఏడీ కిశోర్ బాబు, ఆర్‌ఐలు వెంకటరమణ, అన్నపూర్ణ, గంగాధర్ రామేశ్వర మెట్ట పరిశీలనకు వచ్చారు. అక్కడ రెండు యంత్రాలు, మరికొన్ని లారీలు మెట్టకు ఓ చోటున నిలిపి ఉన్నాయి. తవ్విన ప్రాంతాన్ని పరిశీలించి కొలతలు తీసుకున్నారు. ఇక్కడ యంత్రాలు లేవని, వేరే చోట నిలిపిన వాటి జోలికి పోలేదు. రెండు జేసీబీలు సమీపంలో ఉండడంతో, వాటి యజమానులు వస్తే విచారించి అపరాధ రుసుము విధిస్తామని చెప్పి వెళ్లిపోయారు.

లీజుల పేరిట లాక్కొని

గత వైకాపా ప్రభుత్వ హయాంలో రామేశ్వరం మెట్ట స్వరూపం మారి 20 అడుగుల లోతుగా మారిపోయింది. ఇక్కడ పేదలకు అసైన్డ్ పట్టాలివ్వగా లీజుల పేరిట పెద్దలు లాక్కొని మైనింగ్‌తో రూ.కోట్లకు పడగలెత్తారు. పెద్దాపురం పరిధిలో తవ్వకాలపై ఎన్‌జీటీలో కేసు విచారణా నడుస్తోంది. ఇప్పుడు జగ్గంపేట పరిధి మెట్టలోని సర్వేనంబర్ 202లో విచ్చలవిడిగా మైనింగ్ చేస్తున్నారు.

MARGADARSI CHIT FUND PVT LTD.
Chit Groups are available at our SAMALKOT Branch.

Chit Group	Duration In Months	Monthly Installment	Chit Value
LT D	50	50,000	25,00,000
LT X	50	20,000	10,00,000
LT T	50	10,000	5,00,000
LT P	50	4,000	2,00,000
FT V	40	1,00,000	40,00,000
TT C	30	30,000	9,00,000

Please Contact Branch Manager **Mr. L.BHASKARA RAO** for further details. Mobile No. **8008001668**, Landline: **0884-2329558.**

శ్రద్ధాంజలి

మంచి మనిషి, స్నేహశీలి, అందరిని చిరునవ్వుతో పలుకరించే మహోన్నతవ్యక్తి, మా తండ్రి గారు శ్రీ చిగురుపాటి సుబ్బారావు గారు ది.12-11-2025న స్వర్గస్తులైనారని తెలియజేయుటకు చింతిస్తూ, వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

శ్రీ చిగురుపాటి సుబ్బారావు గారు
మేనేజింగ్ పార్టనర్: కోహినూర్ గ్రాఫైట్ క్రూసిబుల్ కంపెనీ, రాజమండ్రి

కుమారుడు: చిగురుపాటి ప్రవీణ్ మరియు కుటుంబసభ్యులు

పెద్దకార్యం: ది. 22-11-2025 శనివారం, రాజమండ్రి, శ్యామలానగర్, పంచవటి హోటల్ ప్రక్క వీధిలో, డోర్ నెం.78-13-7/2లో గల మా స్వగృహమునందు జరుగును.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి

Cell: 80085 97607

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80082 34669

బతుకులు మారాలని ఆకాంక్ష

నేడు ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం

తీరానికి పరిమితమైన బోట్లు

సముద్రంలో వేటకు వెళ్తేనే పూట గడిచే బతుకులు వారివి. ఇతర పనులేవీ వారికి తెలియవి. కారణాలేవైనా.. కొన్నేళ్లుగా చేతినిండా పని లేక.. తగిన ఆదాయం లభించక కాలం నెట్టుకొస్తున్నామని వాపోతున్నారు. గత ప్రభుత్వం అయిదేళ్లలో తమ గురించి పట్టించుకోలేదని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలున్నాయని చెబుతున్నారు మత్స్యకారులు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ హామీల అమలు కోసం నిరీక్షిస్తున్నామని అంటున్నారు. – న్యూస్‌టుడే, కొత్తపల్లి

వారు పేర్కొంటున్న సమస్యలివీ..

- తీరంలో పలు పరిశ్రమల నుంచి సముద్ర జలాల్లో కలుస్తున్న కలుషిత జలాలతో మత్స్య సంపద అంతగా లభించడం లేదు.
- భారీ పెట్టుబడితో సముద్రంలోకి వేటకెళ్లినా చేపలు చిక్కకపోవడంతో 70శాతం మంది వేట మానుకున్నారు.
- హార్బర్ నిర్మాణంలో భాగంగా సముద్రంలోకి వేసిన రాళ్లగట్టు కారణంగా ఇప్పటివరకు 23 బోటు ప్రమాదాలు జరిగాయి.
- సుబ్బంపేట నుంచి కోనపాపపేట వరకు పది కిలోమీటర్ల మేర మత్స్యకార గ్రామాలు సముద్రకోతకు గురవుతున్నాయి.

ఆశిస్తున్న అంశాలివీ..

- కాలుష్య కారక పరిశ్రమలను నియంత్రించాలి. వాటినుంచి బాధిత కుటుంబాలకు పరిహారం ఇప్పించాలి.
- సుబ్బంపేట నుంచి కోనపాపపేట వరకు ఏడు మత్స్యకార గ్రామాలకు గట్టుతో రక్షణ కల్పించాలి.
- నూతన హార్బర్ నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురాలి.
- ప్రమాదాలకు కారణమవుతున్న గట్టును ఇంకా సముద్రంలోకి పొడిగించాలి.
- సముద్రంలో గల్లంతైన వారికి త్వరితంగా మరణ ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలి.

కూటమి ప్రభుత్వంలో భరోసా..

కూటమి ప్రభుత్వం వేట నిషేధ భృతిని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచింది. బోటు ప్రమాదాల్లో మృతి చెందిన 18 బాధిత కుటుంబాలకు రూ.90 లక్షల పరిహారం అందించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రమాదాలకు గురైన బోట్లకు పరిహారంగా రూ.72 లక్షలు మంజూరు చేసింది. జీఎస్టీ తగ్గించడంతో వలలు, ఇంజిన్లు, బోట్లు ఇతర సామగ్రిపై మత్స్యకారులకు పన్ను భారం తగ్గింది. రూ.9 లక్షల రింగు వలకు జీఎస్టీ రూ.90 వేలు తగ్గుతోంది. ప్రతి బోటుకి వందశాతం రాయితీతో ట్రాన్స్‌పాండర్ పరికరం అందించారు. ఇతర పథకాలూ అందుబాటులో ఉన్నాయి.

రత్నగిరి.. భక్తసిరి..

వ్రతమాచరిస్తున్న భక్తులు

అన్నవరం, న్యూస్‌టుడే: ఏడాది కార్తికమాసం గురువారంతో ముగిసింది. ఈ మాసంలో అన్నవరం సత్యదేవుని దర్శనానికి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. వ్రతాలు అత్యధికంగా జరిగాయి. కమిషనర్ కె. రామచంద్రమోహన్ నిరంతర పర్యవేక్షణ, ప్రత్యేక అధికారుల నియామకం, ఛైర్మన్ ఐ.వి.రోహిత్ ప్రత్యేక దృష్టి, అధికారులు, సిబ్బంది సమన్వయంతో అంతా సాఫీగా సాగింది. భక్తులకు కొన్ని ఇబ్బందులు ఎదురైనా భవిష్యత్తులో పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఉంది.

కార్తికం సాగిందిలా..

● **భక్తులు:** గత నెల 21 నుంచి ఈ నెల 20 వరకు సత్యదేవుని దర్శనానికి సుమారు 9 లక్షల మంది భక్తులు వచ్చారని అంచనా. ఈనెల 5, 9, 15, 16 తేదీల్లో భక్తజనం ప్రవాహంలా తరలివచ్చారు.

● **వ్రతాలు:** 1,34,476 వ్రతాలు జరిగాయి. రూ.300 వ్రతాలు 96484, రూ.1000 వ్రతాలు 16,099, రూ.1,500 వ్రతాలు 9,511, రూ. 2000 వ్రతాలు 12,382 జరిగాయి.

● **అన్నదానం:** నిత్యాన్నదాన పథకం ద్వారా 3.75 లక్షల మందికి పులిహోర, దద్దోజనం, 99,360 మందికి భోజనాలు పంపిణీ చేశారు.

● **ప్రసాదం:** గోధుమనూక ప్రసాదం సుమారు 22 లక్షల ప్యాకెట్లు విక్రయం.

● **రవాణా:** రైల్వేస్టేషన్, కొండ దిగువన, సత్యగిరి నుంచి రత్నగిరికి సుమారు 1.50 లక్షల మంది ఉచితంగా, 2.70 లక్షల మంది టికెట్టు తీసుకుని ప్రయాణించారు. దీనిద్వారా రూ.38 లక్షల ఆదాయం వచ్చింది. సుమారు 30 వేల కార్లు వచ్చాయని అంచనా.

● **వసతి:** వసతి సముదాయాలు అద్దెకు ఇవ్వడం ద్వారా సుమారు రూ.1.29 కోట్లు ఆదాయం వచ్చింది. డార్మెటరీలు ఉచితంగా కేటాయించారు.

మహా కుంభాభిషేకం

కాకినాడ సాగరతీరంలో మంగాంబికా సమేత ఆదికుంభేశ్వర స్వామి ఆలయం వద్ద గురువారం 50వ మహాకుంభాభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. కోటి ఎనిమిది లక్షల శివలింగాలకు పంచ రసాలతో భక్తులు స్వయంగా అభిషేకించారు. - న్యూస్‌టుడే, గాంధీనగర్

మెగా రక్తదాన శిబిరంతో స్ఫూర్తి

సర్పవరం, న్యూస్‌టుడే: కాకినాడలోని శ్రీకిరణ్ కంటి ఆసుపత్రిలో సంక్రాంతి ఫౌండేషన్ ఛైర్మన్ డా.చంద్రశేఖర్ తన కుమారుడు శ్రీకిరణ్ జయంతిని పురస్కరించుకుని గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. జేఎన్‌టీయూకే వీసీ ప్రసాద్ ప్రారంభించి మాట్లాడుతూ ప్రజలంతా రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. జేఎన్‌టీయూకే నుంచి డా.ఎ.కృష్ణమోహన్, రోటరీ ఇన్నర్‌వీల్ ఛైర్మన్ డా. నవనీకృష్ణ, మాచార్లకో, కె.శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

శిబిరం ప్రారంభిస్తున్న జేఎన్‌టీయూకే వీసీ ప్రసాద్, డా.చంద్రశేఖర్

ఈవీఎంల భద్రతకు పటిష్ఠ చర్యలు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఈవీఎంలు, వీవీప్యాట్ల భద్రతకు పటిష్ఠ చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి షాన్‌మోహన్ తెలిపారు. గురువారం ఆయన కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదామును రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక అధికారులతో కలిసి తనిఖీ చేశారు. చుట్టూ ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. తహసీల్దార్ వి.జితేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల ఉప తహసీల్దార్ ఎం.జగన్నాథం తదితరులు ఉన్నారు.

తహసీల్దార్ జితేంద్రకు సూచనలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

కొత్తగా 183 పోలింగ్ కేంద్రాలు

కాకినాడ కలెక్టరేట్: జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో హేతుబద్ధీకరణలో భాగంగా కొత్తగా 183 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 1,640 పోలింగ్ కేంద్రాల పరిధిలో 16,43,161 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. ఓటర్ల సౌలభ్యాన్ని పరిగణలోకి తీసుకుని కొత్తవి ఏర్పాటుకు ప్రతిపాదించామన్నారు. నిర్వహణకు అనువుగా లేని వాటిని కొత్త భవనాల్లోకి మార్పుకు ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు ఏమైనా అభ్యంతరాలు ఉంటే వివరాలు సమర్పించాలని కోరారు. సమావేశంలో గడాల సాయి బాబా(తెదేపా), రావూరి వెంకటేశ్వరరావు(వైకాపా), సత్యనారాయణ(జనసేన), సి.హెచ్.రమేశ్‌బాబు(భాజపా), పోలిశెట్టి శ్రీనివాస్(కాంగ్రెస్), ఎస్.అప్పారావు(బీఎస్పీ), కరణం ప్రసాదరావు(సీపీఎం) తదితరులు పాల్గొన్నారు.

తెలుగు వర్సిటీకి వెలుగులు

● డిసెంబరు 1 నుంచి తరగతులకు కార్యాచరణ

బొమ్మూరు, హుకుంపేట, న్యూస్‌టుడే: ఒకప్పుడు ఎంతో ఘనత కలిగిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం గత కాలంలో కొంత వెనుకబడింది. తాజాగా పూర్వ వైభవం సంతరించుకునేలా అడుగులు పడుతున్నాయి. అందులో భాగంగా కోర్సులు ప్రారంభించేందుకు చర్యలు వేగవంతం చేసింది. 2025-26 సంవత్సరానికి ఎంఏ తెలుగు మొదటి సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. డిసెంబరు 1 నుంచి తరగతులు ప్రారంభించేలా కార్యాచరణ చేపడుతున్నామని ఉపకులపతి డి. మునిరత్నం నాయుడు చెబుతున్నారు.

కొత్తగా ఏర్పాటు చేసిన బోర్డు

నెలలో కొన్ని పనులకు రూపు..

● కూటమి సర్కారు చొరవతో ఉపకులపతిగా డి.మునిరత్నం నాయుడు అక్టోబరు 23న బాధ్యతలు స్వీకరించారు. ● ప్రధాన కార్యాలయం వీసీ గది, విద్యార్థుల తరగతి గదుల చుట్టూ దట్టమైన చెట్లు నెలలో తొలగించారు. పైఅంతస్తులో బోధనకు అనుగుణంగా గదులకు మరమ్మతులు చేయించారు. ● కుర్చీలు, బల్లలు అన్నింటికీ మరమ్మతులు చేయించారు. వైఫై సౌకర్యం కల్పించారు. ● రాజమహేంద్రవరం సంగీత కళాశాల ప్రిన్సిపల్ డా.పసుమర్తి శ్రీనివాస్ శర్మ పూర్వ విద్యార్థుల సాయంతో యూనివర్సిటీకి రూ.25 వేల విలువైన ఫర్నీచర్ సమకూర్చారు.

వీటిపై ప్రత్యేక దృష్టి..

ప్రొఫెసర్లను తాత్కాలిక పద్ధతిలో నియమించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇతర సదుపాయాలపైనా దృష్టి సారించారు. పాత భవనాల్లో మరమ్మతులు చేసేందుకు పరిశీలిస్తున్నారు. కొత్త కోర్సుల్లో చేరే అభ్యర్థుల సంఖ్యను బట్టి వర్సిటీ ప్రాంగణంలో వసతి, భోజన సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

నాణ్యమైన బోధన అందిస్తాం..

వర్సిటీలో ఎంఏ తెలుగు తరగతులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రభుత్వం, దాతల సహకారంతో డిసెంబరు 1 నాటికి వీలైనన్ని సౌకర్యాలు కల్పించేలా ప్రయత్నిస్తున్నాం. వచ్చే ఏడాది మరిన్ని కోర్సులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రవేశాలు పొందిన వారికి నాణ్యమైన బోధన అందించడమే మా లక్ష్యం. - డి.మునిరత్నం నాయుడు, వీసీ

సఫాయీ కర్మచారీ యువతకు రుణాలు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: జిల్లాలోని సఫాయీ కర్మచారీ వృత్తిలో ఉన్న నిరుద్యోగ యువతకు జాతీయ సఫాయీ కర్మచారీ ఆర్థిక సహకార సంస్థ (ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ) ద్వారా రుణాలు అందించనున్నట్లు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జె.సత్యవతి తెలిపారు. రాయితీపై సెప్టిక్ ట్యాంకుల క్లీనింగ్ వాహనాలను అందిస్తామని ఆమె వివరించారు. అర్హతలు కలిగిన అభ్యర్థులు ఈ నెల 30 లోగా కాకినాడ జీజీహెచ్ ఎదురుగా ఉన్న ప్రగతి భవన్‌లోని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో నేరుగా సంప్రదించాలని సూచించారు. రుణం పొందే అభ్యర్థులు ఇదే వృత్తిలో ఉన్న అయిదుగురు సభ్యులతో కలిసి గ్రూపుగా ఏర్పడాలన్నారు. ఒకరికి హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్సు ఉండాలని చెప్పారు. వివరాలకు 62818 17023 నంబరులో సంప్రదించాలని ఈడీ సూచించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము - దేవదాయ ధర్మదాయ శాఖ

"ఇ" ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

కాకినాడ జిల్లాలోని, పిఠాపురం మండలంలో మంగితుర్తి గ్రామములోయున్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవాలయం వారు దేవాలయ పునఃనిర్మాణ పని నిమిత్తం టెండర్ పిలవబడుచున్నది.

1. Reconstruction of Temple (Balance of Work)	నిట్. S/COE/1226/2025	Rs. 130.00 Lakhs

బిడ్ డాక్యుమెంట్ తేది.21-11-2025 ఉదయం గం.10:30 AM నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. టెండరు దాఖలు చేయుటకు ఆఖరి తేది.08-12-2025 మధ్యాహ్నం గం.12:05 PM వరకు మిగిలిన వివరముల కొరకు https://tender.apeprocurement.gov.in లో చూడవచ్చును. Cell: 9966977771

సం/- ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు, శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవాలయం

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

సంక్షేమ బోర్డు ఏర్పాటుకు డిమాండ్

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం నిలిపివేసిన భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, కూటమి ఎన్నికల హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టరేట్ వద్ద కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఏపీ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. సంక్షేమ బోర్డు నుంచి ఆర్థిక సాయం కోసం లక్షల కుటుంబాలు ఎదురుచూస్తున్నాయని, అధికారంలోకి వచ్చి 18 నెలలు కావస్తున్నా.. ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇసుక, సిమెంటు, ఐరన్ ధరలు అందుబాటులో ఉన్నా.. భవన నిర్మాణాలు జరగడంలేదని, కార్మికులను సంక్షేమ బోర్డు ద్వారా ఆదుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వ శేషబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్, యూనియన్ ప్రతినిధులు నిట్ల శ్రీను, రొంగల ఈశ్వరరావు, తెలగరెడ్డి జీవా, ఆకుల సత్యనారాయణ తదితరులు నాయకత్వం వహించారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

పెద్దాపురం: వివిధ చోరీ కేసుల్లో నిందితుడిని బుధవారం రాత్రి కాకినాడ జిల్లా పెద్దాపురం-సామర్లకోట రోడ్డులో అయోధ్యాలయం (గ్రాండ్ లేఅవుట్) వద్ద అరెస్టు చేశామని డీఎస్పీ శ్రీహరిరాజు గురువారం తెలిపారు. ఆయన వివరాల మేరకు.. ఈ నెల 10న పెద్దాపురంలోని టెలికంకాలనీకి చెందిన [illegible] ఇంట్లో చోరీ జరిగింది. [illegible] రూ.5 లక్షలు, అరకిలో బంగారం ఎత్తుకుపోయాడు. విచారణ అనంతరం నిందితుడిని పట్టుకున్నారు. ఇతను రాజమహేంద్రవరం, గండేపల్లి, సర్పవరం, హైదరాబాద్‌లోని చైతన్యపురి, మలక్‌పేట, అంబర్‌పేట, సరూర్‌నగర్, వనస్థలిపురం, హయత్‌నగర్ ప్రాంతాల్లో 30 చోరీ కేసుల్లో నిందితుడని డీఎస్పీ తెలిపారు. అతని నుంచి రూ.3.60 లక్షల నగదు, ఒక ద్విచక్ర వాహనం, ఇనుప రాడ్డు, రెండు చరవాణీలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసును ఛేదించిన పెద్దాపురం ఎస్సై మౌనిక, సీఐ విజయశంకర్, నేరవిభాగం సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

'సివిల్స్' ఉచిత శిక్షణకు దరఖాస్తులు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో యూపీఎస్సీ ద్వారా నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ సంక్షేమశాఖ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సంక్షేమాధికారిణి ఎం.లల్లి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన అభ్యర్థులు ఈ నెల 25లోగా కాకినాడలోని బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. స్క్రీనింగ్ పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసి విజయవాడ, గొల్లపూడిలోని బీసీ భవన్‌లో ఉచిత శిక్షణ ఇస్తారని తెలిపారు. వివరాలకు 80081 21321, 89858 99221 ఫోను నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ముగిసిన సహకార వారోత్సవాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: అఖిల భారత సహకార వారోత్సవాల ముగింపు వేడుకలను గురువారం జిల్లా సహకార కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా సహకార అధికారి కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సహకార వ్యవస్థ బలోపేతానికి అంతా కృషి చేయాలన్నారు. జిల్లాలోని 72 సహకార సొసైటీలలో కంప్యూటరీకరణ, ఈ ఆడిట్ విజయవంతంగా పూర్తి చేసిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లా సహకార ఆడిట్ అధికారి కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శివ కామేశ్వరరావు, సీనియర్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌కుమార్, డీసీసీబీ ఏజీఎం బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలు అందుకున్న ఉద్యోగులతో సహకార అధికారి శ్రీనివాసరెడ్డి తదితరులు

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate

ప్రాంతీయ కార్యాలయం : కాకినాడ
డి నెం.2-26-1, 50 బిల్డింగ్స్ సెంటర్, వార్డు నెం.5, శ్రీనగర్, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లా-533003. ఫోన్: 0884-2366727

స్థిరాస్తులు అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్సు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్, వాకలపూడి బ్రాంచ్ (13258) వారికి ఋణగ్రహీత/లు : శ్రీ రాము పుల్ల, తండ్రి: పి. సుబ్బారావు మరియు శ్రీమతి శ్రీలక్ష్మి పుల్ల, భర్త : రాము పుల్ల మరియు హామీదారు/లు : శ్రీ బర్రె వీర శివ చక్రధర్, తండ్రి: నారాయణమూర్తి వారు తేది 31.10.2025 నాటికి చెల్లించవలసిన బకాయి రూ.22,14,202.48/- (అక్షరాల ఇరవై రెండు లక్షల పద్నాలుగు వేల రెండు వందల రెండు రూపాయల నలభై ఎనిమిది పైసలు మాత్రమే) + తదుపరి వడ్డీ మరియు ఛార్జీలు మొత్తమును రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్, ప్రాంతీయ కార్యాలయం, కాకినాడ అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతిక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు ఛార్జ్/తనఖాపెట్టిన దిగువ వివరించిన స్థిరాస్తిని తేది 23.12.2025 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని ప్రజానీకానికి మరియు ముఖ్యంగా పైన తెలిపిన ఋణగ్రహీతలు & హామీదారులకు తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది & సమయం: 23.12.2025, ఉ॥ 10.30 గం. నుండి ఉ॥ 11.30 గం.ల వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (BAANKNET) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములుకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 22.12.2025, సా॥ 4:00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:
తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ రూరల్ మండలం, పూర్వం కాకినాడ సబ్-రిజిస్ట్రార్, ప్రస్తుతం సర్పవరం సబ్-రిజిస్ట్రార్, సర్పవరం గ్రామ పంచాయితీ, సర్పవరం గ్రామం, పాత సర్వే నెం. 26, కొత్త సర్వే నెం. 26/16, డి.నెం. 4-86 కలిగిన 306.17 చ॥గ॥ లేదా 255.99 చ॥మీ॥లలోని ఆర్ సి సి రూఫ్ క్రింద మరియు మొదటి అంతస్తుల గల రెసిడెన్షియల్ బిల్డింగ్. హద్దులు: తూర్పు: 8 అ॥ మార్గం కొంత వరకు మరియు పుల్లా సుబ్బారాజు ఇల్లు కొంత వరకు, పడమర: పుల్లా ప్రకాశరావు స్థలము, ఉత్తరం: పుల్లా లక్ష్మణరావు స్థలము, దక్షిణం: పుల్లా రాఘవ స్థలము. పైన తెలిపిన సరిహద్దులు అన్ని ఈజుమెంటరీ హక్కులతో. టైటిల్ హోల్డర్: శ్రీ. రాము పుల్ల, తండ్రి: పి. సుబ్బారావు.

రిజర్వు ధర: రూ. 89,68,000/- ధరావత్తు సొమ్ము: రూ. 8,96,800/-

గమనిక: బ్యాంకుకు తెలిసి/తెలియని బకాయిలు/ట్యాక్సులు ఏవైనా ఉన్నచో వేలం కొనుగోలుదారు మాత్రమే వాటిని భరించవలసి ఉంటుంది మరియు చివరి మొత్తం బిడ్డు సొమ్ముకు అది అదనం.

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, వాకలపూడి బ్రాంచ్ (13258), మేనేజర్ గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 94409 05121.

ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ (Baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com, హెల్ప్‌డెస్క్: 8291220220, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com.

తేది: 17.11.2025, ప్రదేశం: కాకినాడ సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

భవనం పైనుంచి దూకిన గురుకుల విద్యార్థిని?

వెన్నెముక, కాళ్లకు శస్త్ర చికిత్స

జగ్గంపేట గ్రామీణం, మసీద్ సెంటర్, న్యూస్‌టుడే: జగ్గంపేట మండల పరిధిలోని డా.బి.ఆర్. అంబేడ్కర్ గురుకుల బాలికల వసతిగృహంలో పదో తరగతి విద్యార్థిని మేడపై నుంచి దూకి గాయపడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. కిర్లంపూడి మండలం బూరుగుపూడికి చెందిన టి.మోహన్‌రావు(ఆటోడ్రైవర్) కుమార్తె గురుకుల పాఠశాలలో పదోతరగతి చదువుతోంది. ఈనెల 14న సాయంత్రం ఆమె మరో విద్యార్థినితో గొడవ మెట్ల పైనుంచి జారిపడిపోయిందని.. గాయాలు కావడంతో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి, కాకినాడ జీజీహెచ్‌కు తరలించినట్లు తమకు చెప్పారని బాలిక తల్లి దండ్రులు అంటున్నారు. విషయాన్ని ప్రిన్సిపల్, సిబ్బంది స్థానిక అధికారులకు తెలియకుండా ఉంచడం విమర్శలకు తావిస్తోంది. బాలికకు వెన్నెముక, రెండు కాళ్లకు తీవ్రగాయాలు కావడంతో గురువారం శస్త్ర చికిత్స చేశారు. బాలిక తండ్రి మాట్లాడుతూ తమ

ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

కుమార్తె మెట్లపై నుంచి జారిపడితే ఇంత పెద్దగా యాలు ఎలా అయ్యాయని వాపోయారు. ప్రిన్సిపల్, వైస్‌ప్రిన్సిపల్, వార్డెన్ వేధించడంతోనే మేడపైనుంచి దూకిందని ఆరోపించారు. అధికారులు విచారణ చేపట్టాలని, న్యాయం చేయాలని బాలిక తల్లి కోమలి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ విషయంపై ప్రిన్సిపల్ లలిత కుమారిని వివరణ కోరగా బాలిక, ఇంటర్ విద్యార్థిని పాఠశాల మేడపైన వాదులాడుకొని వేగంగా కిందికి వస్తుండగా కాలుజారి పడిపోవడంతో గాయపడిందన్నారు. దీనికి ప్రత్యక్ష సాక్షి ఉన్నారని, సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేయవద్దని, తమకు తెలియక పోలీసులకు సమాచారం అందించలేదని పేర్కొన్నారు. తహసీల్దార్ జేవీఆర్ రమేష్ మాట్లాడుతూ బాలికకు తీవ్రగాయాలైన విషయం తమకు ఆలస్యంగా తెలిసిందన్నారు. దీంతో గురువారం సాయంత్రం పాఠశాలకు వెళ్లి వివరాలు సేకరించామని, ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని తెలిపారు.

దుర్గాడను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా..

● పిఠాపురాన్ని సొంత నియోజకవర్గంలా భావిస్తా..: ఎంపీ

గొల్లప్రోలు: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్ఫూర్తితో పిఠాపురాన్ని తన సొంత నియోజకవర్గంగా భావించి అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ తెలిపారు. గ్రామంలో వివిధ శాఖల అధికారులు, జనసేన నాయకులతో కలిసి గురువారం పర్యటించారు. వారం క్రితం దుర్గాడలో పర్యటించిన ఎంపీకి ప్రజలు పారిశుద్ధ్య సమస్యలు వివరించారు. ఎస్సీపేట శ్మశానవాటిక దగ్గర డంపింగ్‌యార్డు అస్తవ్యస్తంగా మారిందని వాపోయారు. రెండు రోజుల్లో చర్యలు చేపట్టాలని అధికారులను ఎంపీ ఆదేశించారు. ఆ మేరకు పనులను ఎంపీ పరిశీలించారు. మాజీ ఎమ్మెల్యే దొరబాబు, ఓదూరి కిషోర్, జ్యోతుల శ్రీనివాస్, ఎంపీడీవో సలాట్‌రాజు, డిప్యూటీ ఎంపీడీవో కుమార్ తదితరులు పాల్గొన్నారు. ● మంజూరైన నిధులతో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ ఆదేశించారు. చేబ్రోలులో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నివాసంలో పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ వై. కిరణ్ చంద్ (చీఫ్ మేనేజర్) మొబైల్ నెం.91609 49910,
ఇ-మెయిల్ ఐడి: sbi.10077@sbi.co.in, ఆస్తి తనిఖీ కొరకు : 98482 49289

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8(6)కు 9(1) నిబంధనలతో చదవబడు (సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకునకు తనఖా చేసిన స్థిరాస్తుల అమ్మకము)

SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13(4) క్రింద దిగువ తెలిపిన ఆస్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిగా దిగువ సంతకందారు నిర్మాణాత్మక స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు బకాయిలు రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తనఖాపెట్టిన ఆస్తి/ఆస్తుల ఈ-వేలం (SARFAESI చట్టం 2002 క్రింద) "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" పద్ధతి పై నిర్వహించబడుతుందని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది మరియు నియమ నిబంధనలు దిగువ తెలుపబడినవి.

ఋణగ్రహీత(లు) : శ్రీ కోలా నరసింహారావు, తండ్రి : కోలా పుల్లయ్య, డి.నెం.4-37, పెనుగొండ నగర్, వేమగిరి, కడియం మండలం, తూర్పుగోదావరి జిల్లా - 533125. డిమాండ్ నోటీసు తేది: 27-06-2024
డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం : తేది.26.06.2024 నాటికి రూ.59,52,187/- + తేది.27.06.2024 నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి.
ప్రస్తుత బకాయి మొత్తం: తేది.17-11-2025 నాటికి రూ.62,83,985/- + భవిష్య వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి. (మునుపటి జమలు మినహాయించిన తరువాత).

షెడ్యూల్ ఆస్తి వివరములు:
రిజిస్టర్డు సేల్ డీడ్ నెం.10062/2018 ప్రకారం శ్రీ కోలా నరసింహారావు, తండ్రి : పుల్లయ్య గారిచే తనఖా పెట్టబడిన స్థిరాస్తి: ఆంధ్రప్రదేశ్, కాకినాడ జిల్లా, కాకినాడ రూరల్ మండలం, తూరంగి గ్రామం మరియు గ్రామ పంచాయితీ, సమీప డి.నెం. 11-24-1/ఎ, ఎల్‌పి నెం.4/86, ప్లాట్ నెం.47 వద్ద పాత ఆర్.ఎస్.నెం.161/1ఎ మరియు ఆర్.ఎస్.నెం.217/1 లోని 1398 చ॥గ॥లు మొత్తం విస్తీర్ణంలో 740 చ॥గ॥లు(తూర్పు వైపు) విస్తీర్ణం గల ఓపెన్ నివాస ప్లాట్ యావత్తు ఆస్తి రిజిస్టర్డు సేల్ డీడ్ నెం.10062/2018, తేది.04.10.2018 ప్రకారం శ్రీ కోలా నరసింహారావు, తండ్రి : పుల్లయ్య గారి పేరున కలదు. ఆస్తికి హద్దులు: తూర్పు : 126'.0" - ఇతరులకు చెందిన ఆస్తి, పడమర : 126'-0" - కృష్ణవేణి, భర్త: బోనం వెంకట రావు గారికి చెందిన స్థలం, ఉత్తరం : 53'.0"- 33 అ॥ల వెడల్పు గల రోడ్డు, దక్షిణం : 53'.0" - పుంత రోడ్డు.
పైన తెలిపిన హద్దులలోని 740 చ॥గ॥ల విస్తీర్ణం గల స్థలం అన్నీ సూపర్ నిర్మాణాలు, ఉమ్మడి దారులు, నీటి మార్గాలు మరియు ఈజిమెంటరీ హక్కులు మొ॥ వాటితో కలదు.

రిజర్వు ధర : రూ.1,18,00,000/- ధరావత్తు : రూ.11,80,000/- బిడ్ పెంపుదల : రూ.20,000/-

ఇ-వేలం తేదీ : 09-12-2025 సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఆస్తి తనిఖీ తేది మరియు సమయం: తేది:21-11-2025 నుండి 08-12-2025 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు
1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింక్‌ను రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఇయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s. PSB Alliance & M/s. Baanknet యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.comను సంప్రదించండి.
2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, ఎస్సెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.
గమనిక : ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు, కావున బిడ్డర్లు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డీను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలని సూచించటమైనది.
గమనిక -2 : ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 194-1A ప్రకారం అమ్మకంలో భాగంగా అమ్మకం విలువ రూ.50,00,000/- (యాభై లక్షల రూపాయలు) మరియు అంతకంటే ఎక్కువ ఉన్నచో సదరు మొత్తముపై TDS @ 1% వర్తిస్తుంది. కావున సఫలీకృత బిడ్డరు/కొనుగోలుదారు గవర్నమెంట్ గైడ్‌లైన్స్ ధర లేదా అమ్మకం ధరలో ఏది ఎక్కువైతే దానిలో 1% TDS ను తగ్గించుకొని సదరు మొత్తమును ఆదాయపు పన్ను డిపార్ట్‌మెంట్ యొక్క ఫారం నెం.16-బి నందు జమచేయవలెను మరియు సదరు ఒరిజినల్ TDS సర్టిఫికెట్‌ను బ్యాంకు వారికి సమర్పించవలెను.(వ్యవసాయ భూమి కాకుండా కేవలం స్థిరాస్తికి మాత్రమే వర్తించును).

తేది:17-11-2025, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

వైద్యుడ్ని బెదిరించిన కేసులో ముగ్గురి అరెస్ట్

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: ఇటీవల ఓ పీజీ వైద్యుడిపై బెదిరింపులు, నగదు లాక్కుని పరారైన ముగ్గురు నిందితులను కాకినాడ రెండో పట్టణ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించారు. కోల్‌కతాకు చెందిన డా.రవి జైస్వాల్ కాకినాడ ఆర్ఎంసీలో ఈఎన్‌టీ పీజీ మొదటి ఏడాది చదువుతున్నారు. ఈనెల 17న అర్ధరాత్రి 1.30 గంటలకు జీజీహెచ్‌లో విధులు ముగించుకుని స్థానిక రామారావుపేటలోని రూమ్‌కు బయలుదేరారు. స్థానిక త్రీలైట్ కూడలి వద్ద నిందితులైన కొవ్వాడకు చెందిన ఆర్.శివకుమార్, కాకినాడ దేవాలయం వీధికి చెందిన వి.సుదర్శన్, ఇంద్రపాలేనికి చెందిన నాగం వెంకటేష్‌లు వైద్యుడిని ఆపి ఐడీ కార్డు అడిగారు. ఇవ్వగా చూసి పంపించేశారు. అనంతరం వైద్యుడిని నిందితులు ముగ్గురు రెండు ద్విచక్రవాహనాలపై వెంబడించారు. టౌన్ రైల్వేస్టేషన్ సమీపంలో ఆపి అతని వద్ద నుంచి రూ.2500 లాక్కున్నారు. అనంతరం ఓ నిందితుడు వైద్యుడిని ఏటీఎం సెంటర్‌కు తీసుకెళ్లి మరిన్ని డబ్బులు డ్రా చేసి ఇవ్వాలని బెదిరించాడు. ఆ సమయంలో రవి జైస్వాల్, అతని సహచర వైద్యుడికి ఫోన్ చేసి జరిగిన ఘటన చెప్పాడు. అక్కడకు పోలీసుల రావడంతో నిందితులు పరారయ్యారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ముగ్గురినీ అరెస్ట్ చేసి గురువారం న్యాయమూర్తి ముందు హాజరుపరచగా రిమాండ్ విధించారు.

సారా స్థావరాలపై ఉక్కుపాదం

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: నాటుసారా నిర్మూలనకు నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక చర్యలు చేపట్టామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కృష్ణకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 1306 కేసులు నమోదు చేసి 968 మందిని అరెస్ట్ చేశామని, 9220 లీటర్ల నాటుసారా, 18490 కేజీల నల్ల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 1375 మంది నిందితులను బైండోవర్ చేశామని, నలుగురిపై పీడీ యాక్ట్ పెట్టామని పేర్కొన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	21,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	20,000-21,000
కొత్త (పచ్చి) కాయ	18,000-19,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	106-00
రిటైల్ లైవ్	133-00
డ్రెస్డ్	193-00
స్కిన్‌లెస్	219-00

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

FINANCIAL SERVICES

ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభ వాయిదా లేదా నెలవారీ వడ్డీ పద్ధతిలో పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటీ. ✆ 73862 01191.

REAL ESTATE

LAND FOR SALE

GENERAL

రాజమండ్రికి 30 కి.మీ. దూరంలోగల మురారి - గండేపల్లి మధ్య నేషనల్ హైవేకి చేర్చి 100 అ॥ల రోడ్ ఫేసింగ్‌తో 60 సెంట్లు భూమి అమ్మబడును. (నో బ్రోకర్స్). ✆ 90329 88265.

PLOT FOR SALE

GENERAL

వైజాగ్ Google డేటా సెంటర్ - ఎయిర్‌పోర్ట్ మధ్య హైవే ఫేసింగ్ వెంచర్‌లో మీపెట్టుబడికి. గజానికి అధిక ఆదాయం. త్వరపడండి. ✆ 9949000033

JOBS

కొటక్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో పనిచేయుటకు రిటైర్డ్ ఉద్యోగులకు, సీనియర్ సిటిజనులకు, గృహిణీలకు ఉద్యోగ అవకాశం. Cont: మోహనరావు, రిటైర్డ్ ఎంప్లాయ్ ✆ 96035 93843

లక్ష్మి మోటార్స్ (YAMAHA షోరూమ్) తణుకు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, ఏలూరు నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 96667 14613.

HYD, SR నగర్ బాయ్స్ హాస్టల్‌లో అనుభవం గల భార్యభర్తలు వంటమాస్టర్లు కావలెను. సంప్ర: ✆ 9391009238, 8885070231.

రాజమండ్రి హెయిర్ క్లినిక్ నందు పనిచేయుటకు నర్సులు కావలెను. (నో నైట్ డ్యూటీస్) ఆసక్తి కలవారు సంప్రదించండి: 76749 99906.

మా గ్లోబెల్ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు టీం మెంబర్స్ కావలెను. మోర్ డీటెయిల్స్ Contact Cell: 89852 40614.

Required Managers, Agents, Salary and Incentives. Marketing Job, guarantee Income, Age 50 above Cont: 90108 09384

లైఫ్ మెడికల్ స్టోర్స్, రాజమండ్రి నందు పనిచేయుటకు క్యాషియర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఫార్మాసిస్టులు, ఫార్మసీ అసిస్టెంట్లు, పార్ట్‌టైమ్ స్టాఫ్, డెలివరీ బాయ్స్ కావలెను. మా బ్రాంచ్‌లు: ప్రకాష్‌నగర్, మెయిన్‌రోడ్, దేవీచౌక్ ✆ 99667 44450

సేల్స్ గర్ల్స్ కావలెను. అనుభవం ఉన్నవారు మాత్రమే సంప్రదించండి. భవాని సిల్క్స్, శశికాంత్‌నగర్, కాకినాడ. Contact: 91339 59999

FACULTY/ TEACHERS

Wanted 6th, 7th Maths/ English Teacher, Attractive Salary. Cont: Prakasham E.M. High School, Madhuranagar, Kkd. ✆63023 05325, 99488 81449.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-45 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కాకినాడ

రేపు విద్యుత్తు సరఫరా నిలిపివేత

కాకినాడ కలెక్టరేట్: నగరంలోని పలు సబ్‌స్టేషన్ల పరిధిలో వార్షిక మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎన్.ఉదయ్‌భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నాగమల్లితోట, ఎల్‌బీ నగర్, రాజీవ్‌గాంధీ నగర్, గైగోలుపాడు ప్రాంతాల్లో.., ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బీచ్‌రోడ్డు, రాజీవ్‌గృహకల్ప, సత్యనగర్, పావురాల తూము, దుమ్ములపేట ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని పేర్కొన్నారు.


నగరంలో సినిమాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆనంద్ సినిమాస్ 4కిడ్స్- 12ఎ రైల్వేకాలనీ, శశి, ప్రేమంటే, కాంత, హ్యాపీ జర్నీ, దేవీ మల్టీప్లెక్స్ 4కిడ్స్- ప్రేమంటే, జట్టు మీ ఎవడ, కలివి వనం, కాంత, లక్ష్మీ- శశి, సత్యగౌరి- 12ఎ రైల్వే కాలనీ, తిరుమల- సంతాన ప్రాప్తిరస్తు, సీలండ్స్ 1- 12ఎ రైల్వేకాలనీ, సీలండ్స్ 2- జిగ్రిస్, శ్రీప్రియ- కొదమసింహం(ఉ.ఆ), దిగర్ల్‌ఫ్రెండ్(మ.సా), పద్మప్రియ- రాజు వెడ్స్ రాంబాయి, సూర్య1(వాకలపూడి)- 12ఎ రైల్వేకాలనీ, సూర్య 2 -శశి

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
ఉ. 10 - మ. 1 కాకినాడ నగరం: 80085 74157
సాంబమూర్తినగర్: 91548 46719, మసీదుసెంటర్: 91541 18210
గాంధీనగర్: 80085 74159, బాలాజీచెరువు: 80085 74154

కొమ్మలు తొలగించారు.. జగన్నాథపురం ఎంఎస్ఎన్ చారిటీస్ వద్ద నడక దారిలో చెట్ల కొమ్మలు అడ్డుగా వాలడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర వార్తకు అధికారులు స్పందించారు. సిబ్బందితో చెట్ల కొమ్మలు తొలగింపజేశారు.

సందేహం సంధానం

గుంతలు పూడ్చారు.. శశికాంత్‌నగర్ శివారు కొండగుంట రహదారిలో భూగర్భ కేబుల్ నిమిత్తం తవ్వకాలు చేపట్టి పూడ్చలేదని 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర వార్తకు అధికారులు స్పందించారు. గుంతలను పూడ్చి సమస్యను పరిష్కరించారు. - న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

వీధిదీపాలకు మరమ్మతులు
మసీదు సెంటర్ (కాకినాడ): కాకినాడ బాలాజీనగర్‌లో వీధిదీపం వెలగడం లేదని 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించారు.

కాలువలు శుభ్రం చేయడం లేదు..

సమస్య: నగరంలోని సూర్యనారాయణపురం ప్రాంతంలో కాలువలను సరిగా శుభ్రం చేయకపోవడంతో వర్షాలలో మురుగు నీరు రామకృష్ణారావుపేట ప్రధాన రోడ్డుపైకి వస్తోంది. దీంతో ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. -సత్యవేణి, రామకృష్ణారావుపేట

సమాధానం: కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నాం. మరోసారి అక్కడ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - డా.పృథ్వీచరణ్, ఎంహెచ్ఓ - న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

ఒక కార్యాలయం.. నాలుగు ప్రాంతాలు

న్యూస్‌టుడే, కాకినాడ నగరం

నగరపాలక సంస్థ కార్యాలయ నూతన భవన నిర్మాణం చేపట్టి మూడేళ్లవుతున్నా ఇప్పటికీ పూర్తి కాలేదు. దీంతో వివిధ పనుల కోసం ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం విభాగాలను నాలుగు చోట్ల ఏర్పాటు చేశారు. పనుల కోసం ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రజలు నరకయాతన పడుతున్నారు.

పూర్తికాని కార్పొరేషన్ భవనం.. ప్రజలకు తప్పని అవస్థలు

అసంపూర్తిగా నగరపాలక సంస్థ కార్యాలయ భవనం

వెంటాడుతున్న నిధుల కొరత
నగరపాలక సంస్థ కార్యాలయ భవన నిర్మాణ పనులను 2022లో తలపెట్టారు. సినిమా రోడ్డులో పాత పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలోనే నూతన భవనానికి శ్రీకారం చుట్టారు. సాధారణ నిధులు రూ.38 కోట్లతో జీ+3 విధానంలో దీనిని చేపట్టారు. కొత్త భవన నిర్మాణం పేరుతో పాత భవనాన్ని తొలగించారు. దాంతో అందులో కార్యాలయాలను వేర్వేరు చోట్లకు మార్పు చేశారు. గతంలో వివిధ పనుల పేరుతో నగరపాలక సంస్థ కార్యాలయానికి వచ్చి అన్నీ ఒకే చోట పూర్తిచేసుకునేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ఒక్కో పనికి ఒక్కో ప్రదేశానికి వెళ్లాల్సి వస్తోంది.

1. కమిషనర్, అదనపు కమిషనర్, ఉప కమిషనర్, రెవెన్యూ విభాగాలను కొండయ్యపాలెం శాంతినగర్ వద్ద గల స్మార్ట్ సిటీ భవనంలోకి మార్పు చేశారు.
2. ప్రజారోగ్యం, పట్టణ ప్రణాళిక విభాగాలను బీచ్ రోడ్డు బాలభవన్‌లో ఏర్పాటు చేశారు.
3. ఇంజినీరింగ్ విభాగాన్ని విక్టోరియా వాటర్ వర్క్స్ ఆవరణలోని స్మార్ట్ సిటీ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు.
4. పట్టణ పేదరిక నిర్మూలన కార్యాలయాన్ని పాత మున్సిపల్ కార్యాలయ సముదాయంలో కమర్షియల్ కాంప్లెక్స్‌లో పైఅంతస్తుల్లో ఉంచారు.

రూ.20 కోట్లు అవసరం
నగరపాలక సంస్థ భవనాన్ని రూ.38 కోట్ల అంచనాతో పనులు చేపట్టాం. ఇంకా రూ.20 కోట్ల వరకు అవసరం ఉంది. ప్రభుత్వానికి, కలెక్టరు ఇటీవలే ఈ భవన పనులను పరిశీలించారు. అదనపు నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించేందుకు ఆదేశాలిచ్చారు. పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటాం.
- కేటీ సుధాకర్, ఇన్‌ఛార్జి కమిషనర్, నగరపాలక సంస్థ, కాకినాడ

వైభవంగా కార్తిక దీపోత్సవం

రామారావుపేట శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

బాలాత్రిపుర సుందరి ఆలయంలో

గాంధీనగర్, న్యూస్‌టుడే: కార్తిక మాసం చివరిరోజు గురువారం రాత్రి నగరంలోని శివాలయాలు దీపకాంతులతో విరాజిల్లాయి. రామారావుపేటలోని శ్రీఅన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో దీపోత్సవాన్ని నిర్వహించారు. సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి ఆలయంలో జ్యోతిర్లింగాలు, వివిధ ఆకృతుల్లో దీపాలను వెలిగించారు. భానుగుడిసెంటర్‌లోని భానులింగేశ్వరస్వామి ఆలయం, సాంబమూర్తినగర్, శ్రీరామ్‌నగర్, జగన్నాథపురం తదితర ప్రాంతాల్లో ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

గాంధీనగర్: కాకినాడ సాగరతీరంలో శ్రీమంగళాంబికా సమేత ఆదికుంభేశ్వర స్వామి ఆలయం వద్ద గురువారం కార్తిక అమావాస్యను పురస్కరించుకుని భారత యజ్ఞపీఠం ఆధ్వర్యంలో మహాకుంభాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. కోటి ఎనిమిది లక్షల శివలింగాలకు పండ్ల రసాలతో భక్తులు స్వయంగా అభిషేకించుకునే అవకాశాన్ని కల్పించారు. రసలింగానికి ప్రత్యేక పూజలు ఆచరించి, సుంగధద్రవ్యాలు, పండ్లరసాలతో అభిషేకించారు. ఈ సందర్భంగా 108మంది కన్యలు తీసుకువచ్చిన సుగంధద్రవ్యాలు, రుద్రాక్షలను ద్వాదశ లింగాలకు ప్రత్యేక పూజలు చేశారు. వాటిని సాగర జలాల్లో నిమజ్జనం చేశారు. శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి అర్చన, ఆదికుంబేశ్వరస్వామికి బిల్వార్చన, కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.లక్ష్మీప్రసన్న, విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసు, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి, తోట పుండరీకాక్షులు, కమిటీ సభ్యులు తాతయ్య నాయుడు, గంగిరెడ్డి కృష్ణమూర్తి, చిట్నీడి శ్రీనివాసు, వాసు పాల్గొన్నారు.

రస లింగానికి భక్తుల అభిషేకం

ప్రతిభ చాటారు.. బహుమతులు పట్టారు

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ శాంతినగర్‌లోని అఖిల్ జూనియర్ కళాశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో గురువారం ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 'కృత్రిమ మేధ(ఏఐ) వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అంశంపై నిర్వహించిన ఉపన్యాసం(స్పీచ్) పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఐ.హనీష్ ఆనంద్ (ప్రథమ), ఎస్‌కే బషీర బేగం(ద్వితీయ), ఎం.హియమంగి తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల డైరెక్టర్లు ఎ.సూర్యనారాయణ, ఏజీపీ, ప్రిన్సిపల్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోటీలో పాల్గొన్న విద్యార్థులు

విజేతలతో కళాశాల డైరెక్టర్ ఏజీపీ

అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ప్రయోజనకరం

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం పాఠశాలలకు మంజూరు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు విద్యార్థులకు ప్రయోజనకరమని అటల్ నోడల్ అధికారిణి మాధవీలత అన్నారు. స్థానిక గాంధీనగర్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులతో జిల్లా స్థాయి కార్యశాలను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకతను పెంచటానికి అటల్ ల్యాబ్‌లు ఉపకరిస్తాయన్నారు. ఆయా పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. సమగ్ర శిక్షా ఏపీసీ వేణుగోపాలరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీవీ సత్యనారాయరాజు, అర్బన్ ఎంఈవో సీహెచ్ రవి, అటల్ జిల్లా రిసోర్సుపర్సన్లు పాల్గొన్నారు.

కార్యశాలలో మాట్లాడుతున్న మాధవీలత

కీటక జనిత వ్యాధులపై అవగాహన

మసీదు సెంటర్ (కాకినాడ): జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లోని ప్రజలందరికీ కీటక జనిత వ్యాధుల నుంచి రక్షణ పొందే విధంగా అవగాహన కల్పించడానికి ఫ్లిప్ చార్ట్‌బుక్‌లు దోహదపడతాయని డీఎంహెచ్‌వో డా.జె.నరసింహనాయక్ తెలిపారు. గురువారం జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణలో భాగంగా డెంగీ వ్యాధిపై ప్రజల్లో, ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన నిమిత్తం ప్రభుత్వం పంపిన బుక్‌లను డీఎంహెచ్‌వో ఆవిష్కరించారు. ఆరోగ్య కార్యకర్తలందరూ గ్రామ, వార్డు పర్యటనకు వెళ్లినపుడు వీటిని తీసుకెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డీఐవో డా.సుబ్బరాజు, డీఎంవో డా.ప్రభాకర్, డిప్యూటీ డెమో సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

కొండయ్యపాలెంలో నిరసన తెలియజేస్తున్న కార్మికులు, సంఘ నాయకులు

సంక్షేమ పథకాలను అమలు చేయండి

గాంధీనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, సంక్షేమ పథకాలను తిరిగి అమలు చేయాలంటూ ఏఐటీయూసీ అనుబంధం సంఘం ది కాకినాడ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం కొండయ్యపాలెం, శాంతినగర్, గుడారిగుంట, గ్లాస్‌హౌస్ సెంటర్ తదితర ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ నిర్మాణ రంగంలో వసూలు చేస్తున్న 1శాతం సెస్ నిధులు దోచుకోవడం ఆపాలన్నారు. కార్మికులందరి సంక్షేమానికి నిధులు ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. సోహెల్ ఖాన్, సూరిబాబు, రమేష్, బాలకృష్ణ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కళ్లజోళ్లు, దుస్తుల పంపిణీ

గాంధీనగర్: బాదం బాలకృష్ణ క్లాత్, ఐగ్లాస్ ప్రాజెక్టు ద్వారా గురువారం రామారావుపేటలోని లయన్స్‌క్లబ్ హాల్లో సుమారు 80మంది పేదలకు కళ్లజోళ్లు, దుస్తులను లయన్స్ కాకినాడ ట్రెజరర్ వి.వెంకట నూకాజీ పంపిణీ చేశారు. జీవిఎల్.జగన్నాథరావు, రామసుబ్రహ్మణ్యం, బాదం కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ కమిషనర్‌గా సత్యనారాయణ

కాకినాడ కలెక్టరేట్: కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్(ఎఫ్ఏసీ)గా జిల్లా హౌసింగ్ పీడీ, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఎన్‌వీవీ సత్యనారాయణను నియమించారు. ఈ మేరకు గురువారం రాత్రి కలెక్టర్ షాన్‌మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన ఐఏఎస్ అధికారిణి భావన బదిలీ అయిన విషయం తెలిసిందే. విశాఖపట్నంలో అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న ఎస్ఎస్ వర్మకు ఇటీవల కాకినాడ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ పురపాలక శాఖ మెమో జారీ చేసింది. ఈ నెల 19న ఆ ఉత్తర్వులను రద్దు చేశారు. ఈ క్రమంలో హౌసింగ్ పీడీ సత్యనారాయణకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ఆదేశాలతో కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన గతంలో జడ్పీ సీఈవో, కాకినాడ ఆర్డీవోగా పనిచేశారు.

అపాయాన్ని అరికట్టాలిగా..!

కాకినాడ వెంకట్ నగర్‌లోని ఓ వీధిలో రహదారి పక్కన విద్యుత్తు స్తంభానికి ఉన్న ఫ్యూజ్ బాక్స్ ప్రమాదకరంగా ఉంది. బాక్సుకు మూత లేకపోవడంతో తీగలు బయటకు కనిపిస్తున్నాయి. ఏమాత్రం తగిలినా.. వారికి అపాయం తప్పదు. చేతికి అందే ఎత్తులో ఉందని, అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మసీద్‌సెంటర్

ఇలాగుంటే.. మురుగు పారేదెలా?

కాకినాడ మూడో డివిజన్ పరిధిలోని గొడారిగుంట శివారు శంతనపురి కాలనీ ఉద్యానం వద్ద కాలువపై ఓ పెద్ద సిమెంటు దిమ్మె అడ్డుగా ఉంది. చాలా రోజుల నుంచి అలాగే ఉన్నా.. ఎవరూ తొలగించడం లేదని స్థానికులు చెబుతున్నారు. కాలువ శుభ్రం చేసేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, భానుగుడిసెంటర్

పొంచి ఉన్న ప్రమాదం..

కాకినాడ శాంతినగర్ ప్రధాన రహదారి నుంచి పోస్టల్‌కాలనీకి వెళ్లే మూడు రోడ్ల కూడలి మలుపు వద్ద మ్యాన్‌హోల్‌పై ఇనుప మూతలు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. వారం రోజుల కిందట ఓ వృద్ధుడు మలుపు తిరిగే క్రమంలో మ్యాన్‌హోల్ తగులుకుని గాయాలపాలయ్యాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రక్షణ చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు విన్నవించారు. - న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

తాగునీరు వృథా..!

నగరంలో 4లక్షల మంది ప్రజలకు రోజూ 45 ఎంఎల్‌డీ తాగునీటిని నగరపాలక సంస్థ వాటర్‌వర్క్స్ ద్వారా సరఫరా చేస్తున్నారు. పైపులైన్ల లీకేజీతో వేల లీటర్లు రోజూ వృథాగా పోతోంది. ఏదో ప్రాంతంలో పైపులైను పగిలిపోతోంది. ఇప్పుడు ఏకంగా వాటర్‌వర్క్స్ రెండో గేటు వద్దే ప్రధాన పైపులైనుకు లీకేజీ ఏర్పడి.. నీరంతా రోడ్డు పాలవుతోంది. అధికారులు చూస్తున్నా పట్టించుకోవడం లేదు.
- న్యూస్‌టుడే,బాలాజీచెరువు, గాంధీనగర్

నేడు ఉద్యోగులకు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

కాకినాడ కలెక్టరేట్: కలెక్టరేట్‌లో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రకటన

[illegible]

...వివరం: తూర్పు: అ.59'-3"లు లేక 18.05 మీ. - ఇందుల 1వ ప్రతి, పడమర: అ.59'-3"లు లేక 18.05 మీ. - జాగు గోవిందు, జాగు మంగరాజు గార్ల స్థలము, అందలి ఇల్లు, ఉత్తరం: అ.3'-2"లు లేక 0.96 మీ. - జాగు గోవిందు, జాగు మంగరాజు గార్ల స్థలము, అందలి ఇల్లు, దక్షిణం: అ.3'-2"లు లేక 0.96 మీ. - జాగు గోవిందు, జాగు మంగరాజు గార్ల స్థలము, అందలి ఇల్లు. సదరు హద్దుల మధ్యస్థమైన పై రెండు ప్రతులు తాలూకు 273.22 చ॥గ॥ లేక 228.44 చ॥మీ॥లు ఖాళీ నివేశన స్థలము యాపత్తు యాజిమెంటు హక్కులతో సర్వం సహా.

కాకినాడ
ది.20-11-2025

K.V.S.V.లక్ష్మాజీరావు (వేణు)
అడ్వకేట్, డో.నెం.6-1-9/1, దూసర్లపూడివారి వీధి,
కాకినాడ, సెల్: 9866211196

పిల్లలూ.. శెభాష్!

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన వారితో కలెక్టర్ షాన్‌మోహన్

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి స్కేటింగ్, కరాటే పోటీలకు ఎంపికైన విద్యార్థులను కలెక్టర్ షాన్‌మోహన్ అభినందించారు. మూడో తరగతి చదువుతూ జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికైన కంకటాల నిహారిక, జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైన నాలుగో తరగతి చదువుతున్న కారే మోక్షా ఆదిత్య, 8వ తరగతి చదువుతున్న కారే రేవంత్ గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సాధించిన ట్రోఫీలను కలెక్టర్‌కు చూపించారు. ఇదే స్ఫూర్తి, పట్టుదలతో జాతీయ స్థాయిలో రాణించి, జిల్లాకు మంచి పేరు తేవాలని ఆయన ఆకాంక్షించారు. గుత్తుల సుశీల, కొవ్వాడ నాగేశ్వరరావు, సాపే సుధాకర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష తులసి పూజ

గాంధీనగర్, న్యూస్‌టుడే: శ్రీరాఘవేంద్ర బృందావన సేవా సమితి ట్రస్టు ఆధ్వర్యంలో కార్తిక అమావాస్య సందర్భంగా గురువారం రాఘవేంద్రస్వామి ఆలయంలో లక్ష తులసి అర్చన విశేషంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు రవీంద్రభట్ ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాభిషేకం, విశేష అర్చన, అలంకారం చేశారు. ట్రస్టు ఛైర్మన్ భగీరథశర్మ, ప్రధాన కార్యదర్శి వై.రాఘవేంద్రరావు, కోశాధికారి వెంకటేష్, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్ఎంసీ వార్షిక క్రీడా దినోత్సవం

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ రంగరాయ వైద్య కళాశాల వార్షిక క్రీడా దినోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించనున్నారు. కళాశాల ప్రిన్సిపల్ డా.ఎ.విష్ణువర్ధన్ అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేజీహెచ్ సూపరింటెండెంట్, అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(విశాఖపట్నం) డా.ఐ.వాణి హాజరుకానున్నారు. 22వ తేదీన కళాశాల వార్షిక సాంస్కృతిక ఉత్సవం కళాశాల ఆడిటోరియంలో జరుగుతుంది. ముఖ్యఅతిథిగా విశ్రాంత డీఎంఈ డా.డీఎస్‌వీఎల్ నరసింహం హాజరు కానున్నారు.

23న ఉపకారవేతన పరీక్ష

గాంధీనగర్, న్యూస్‌టుడే: శ్రీప్రకాష్ పాఠశాల వారి సినర్జీ ఇంటర్నేషనల్ అకాడమీ(ఐఐటీ, నీట్) ఆధ్వర్యంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు 11వ తరగతి ప్రవేశాలకు సంబంధించిన ఉపకారవేతన పరీక్ష నిర్వహించనున్నట్లు పాఠశాల డైరెక్టర్ విజయ ప్రకాష్ తెలిపారు. ఈ నెల 23న సురేష్‌నగర్‌లోని శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో పరీక్ష జరుగుతుందని చెప్పారు. వివరాలకు 9032616333 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

బీపీఎస్‌ను గడువు లోపు వినియోగించుకోండి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: అనధికార భవనాలను గడువులోపు క్రమబద్ధీకరించుకోవాలని నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ కేటీ సుధాకర్ కోరారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ (బీపీఎస్)ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆయన గురువారం పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు, సచివాలయ ప్రణాళిక కార్యదర్శులు, లైసెన్స్డ్ సర్వేయర్లతో సమావేశాన్ని నిర్వహించారు. డీసీపీ కృష్ణారావు, ఏసీపీలు పాల్గొన్నారు.

సమగ్రశిక్షా ఏపీసీ బదిలీ

కాకినాడ నగరం: సమగ్ర శిక్షా జిల్లా అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త (ఏపీసీ) పి.వేణుగోపాలరావు శ్రీకాకుళం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇక్కడ ఇంకా ఎవరినీ నియమించలేదు.

చేనేత పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలి

మాట్లాడుతున్న రామకృష్ణ

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: చేనేత పరిశ్రమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని చేనేత సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పంపన రామకృష్ణ కోరారు. కాకినాడలో గురువారం సంఘ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రస్తుతం చేనేత రంగం సంక్షోభంలో చిక్కుకుందని, కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం చేనేతపై జీఎస్టీ విధించటమే ఇందుకు కారణమన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేనేత రంగానికి రూ.120 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. చేనేత రంగ సమస్యలపై చర్చించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈనెల 23న కాకినాడ ఫ్యాబిన్ కళాక్షేత్రలో రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు రామకృష్ణ వెల్లడించారు. సంఘ నాయకులు కాదా త్రిమూర్తులు, సిరం వీరబాబు, కట్టా రామారావు, పంపన వెంకటరమణ, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: కాకినాడలో గురువారం మహాకుంభాభిషేకాన్ని బోటు యజమానులు, మత్స్యకారులు, రేవు పాటదారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు పెద్దఎత్తున అన్నదానం చేశారు. నిర్వాహకులు ఎరిపిల్లి రాము, గద్దేపల్లి సత్తిబాబు, బొడ్డు ధనరాజు, పెమ్మాడి చంద్రయ్యపాల్గొన్నారు.

బాలల సంక్షేమంపై బాధ్యత తీసుకోవాలి

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: పిల్లలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరగాలని, బాలల సంక్షేమంపై అందరూ బాధ్యత తీసుకోవాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి సిహెచ్.వెంకట్రావు అన్నారు. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా సాంబమూర్తినగర్‌లోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, కె.శ్రీనివాస్, జె.విజయ, ప్రిన్సిపల్ కె.సత్యవతి, పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన గనులు

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విజేతలకు బహుమతులు అందజేసిన అతిథులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన ముగింపు వేడుకల్లో డివిజినల్ పంచాయితీ అధికారి టి.అన్నమణి, సానా సతీష్‌బాబు ఫౌండేషన్ అధ్యక్షుడు తలాటం హరీష్ పాల్గొని మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంపొందించే విజ్ఞాన గనులని చెప్పారు. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వెంకటరావు, సంస్థ ఉప గ్రంథాలయాధికారి కిషోర్, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు. రాజాట్యాంకు పార్కు ఆవరణలోని గాంధీనగర్ శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల్లో లైబ్రేరియన్ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా సమాచార పౌర సంబంధాలశాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.నాగార్జున హాజరయ్యారు. రామకృష్ణారావుపేట, జగన్నాథపురం గ్రంథాయాల్లో వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు.

సాంబమూర్తినగర్: గ్రంథాలయంలో పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.వి.అనంతలక్ష్మి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ఇన్‌ఛార్జి ఎం.సులక్షణ, లైబ్రేరియన్ ఎకేవీ ఆచార్యుల ఆధ్వర్యంలో గురువారం విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ కవయిత్రి గునుపూడి సావిత్రి ప్రసాద్ గ్రంథాలయ ప్రాముఖ్యం, పుస్తక పఠనం ద్వారా వ్యక్తిత్వాన్ని ఏవిధంగా తీర్చిదిద్దుకోవచ్చో వివరించారు. విద్యార్థినులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ఉచిత వినికిడి పరీక్షలు

గాంధీనగర్: కాకినాడ చందన బ్రదర్స్ వెనుక దంటు వారి వీధిలో శ్రీబాల చెవి, ముక్కు, గొంతు ఆసుపత్రిలో గురువారం నుంచి ఉచిత వినికిడి పరీక్షలను నిర్వహిస్తున్నామని ఈఎన్‌టీ వైద్య నిపుణులు డాక్టర్ కనుమూరి బాల కిరణ్ తెలిపారు. శుక్ర, శనివారాల్లో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ పరీక్షలు చేసి వినికిడి మిషన్ల ట్రయల్స్ అందిస్తామని పేర్కొన్నారు. ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని, వివరాలకు 0884-2385499 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

(c) eenadu

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

22న విద్యుత్తు సరఫరాలో అంతరాయం

కరప: నడకుదురులోని విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో శనివారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ ఉదయ్‌భాస్కర్ కోరారు. కరపలో గురువారం ఆయన ఏఈ ఈశ్వర్‌ప్రసాద్‌తో కలిసి మాట్లాడుతూ వార్షిక మరమ్మతుల కారణంగా నడకుదురు, పెనుగుదురు, గురజనాపల్లి, ఉప్పలంక, పాతర్లగడ్డ గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెదపూడి: కరకుదురు ఉపవిద్యుత్తు కేంద్రం పరిధిలో శనివారం నాలుగు గ్రామాలకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఉదయ్ భాస్కర్ గురువారం తెలిపారు. కరకుదురు, దోమాడ, అచ్యుతాపురత్రయం, పెదపూడి గ్రామాల్లో ఉదయం 7.30 ఉంచి మధ్యాహ్నం 1 వరకు ఉండదన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పెదపూడి: జి.మామిడాడ జడ్పీ బాలికోన్నత పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి కబడ్డీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎం.రవి గురువారం తెలిపారు. ఇటీవల కాకినాడలో జరిగిన స్కూల్‌గేమ్స్‌లో అండర్-14, 17 విభాగాల్లో ప్రతిభ కనబరచిన ఈ.మహిజ, కె.చైత్ర ఎంపికయ్యారన్నారు. త్వరలో మచిలీపట్నం, కర్నూలులో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

హక్కులపై అవగాహన

పిఠాపురం: విద్యుత్తు వాడే వారు తమ హక్కులపై అవగాహన కలిగిఉండాలని విద్యుత్తు వినియోగదారుల ఫోరం ఛైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి సత్యనారాయణ తెలిపారు. గురువారం పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో సభ్యులు సుబ్బారావు, డీఈ శ్రీనివాస్, ప్రిన్సిపల్ డా.పి.సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులూ జాగ్రత్త

పిఠాపురం: గర్భకోశ వ్యాధులున్న పశువులకు ఉచితంగా చికిత్స అందిస్తున్నామని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డా.రమేష్‌చంద్ర తెలిపారు. గురువారం పిఠాపురం ఏరియా పశువైద్యశాలలో శిబిరం నిర్వహించారు. సంయుక్త సంచాలకుడు కోళ్ల కృష్ణమూర్తి, ఉప సంచాలకులు అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం సాధిద్దాం

గొల్లప్రోలు: గొల్లప్రోలులో సంపూర్ణ పారిశుద్ధ్యం సాధించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. ప్రత్యేక పారిశుద్ధ్య పనుల్లో భాగంగా రాయవరం రోడ్డులో గురువారం కార్యాచరణ నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, కాలువల్లో పూడిక తొలగింపును సిబ్బంది నిర్వహించారు. పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పేదలకు చేయూత

సర్పవరం: కాకినాడలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే నానాజీ చేతుల మీదుగా తడికల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. జనసేన నిర్వహించిన కార్తిక వనసమారాధనలో అంజు కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో కంటి సమస్యలు గుర్తించిన వారికి వాటిని ఇచ్చారు. శాంతి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆపన్నులకు సాయం

సర్పవరం: సూర్యారావుపేట పరకాలువ ప్రాంతంలో గురువారం నిరుపేదల కుటుంబాలకు హెల్త్ అవేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రశెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డా.చప్పిడి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు కిరణ్‌కుమార్, బాలత్రిపురసుందరి తదితరులు పాల్గొన్నారు.

భవనమెట్టా అయ్యేది.. బాలలెట్టా చదివేది?

చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం పంపిణీతోపాటు పలు సేవలందించే అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస వసతులు కొరవడుతున్నాయి. అద్దె, సామాజిక భవనాల్లో, అరకొర వసతులున్న ఇళ్లలో కేంద్రాలను నిర్వహిస్తున్నారు. చుట్టూ అపరిశుభ్ర వాతావరణం, చిన్నారులు ఆడుకునేందుకు అనువైన స్థలం లేనిచోట కేంద్రాలు కొనసాగిస్తున్నారు. కొన్నిచోట్ల మరుగుదొడ్డి సౌకర్యం, తాగునీటి వసతి వంటివి ఉండడం లేదు.

– న్యూస్‌టుడే, గొల్లప్రోలు, పెద్దాపురం, కరప

వివరాలు ఇవీ.. ప్రాజెక్టు	మొత్తం కేంద్రాలు	సొంత భవనాలు	అద్దె భవనాలు	ఇతర భవనాలు
పిఠాపురం	318	110	170	38
పెద్దాపురం	292	85	182	25
కాకినాడగ్రామీణం	205	135	42	28

పిఠాపురం ఐసీడీఎస్ పరిధిలోని మూడు మండలాల్లో 28 అంగన్‌వాడీ భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. కొద్దిపాటి నిధులతో వినియోగంలోకి వచ్చేవీ ఉన్నా.. పనులు చేపట్టక అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. సొంత భవనాలుసైతం దుర్భరస్థితిలో ఉన్నాయి. ఎ.కె.మల్లవరంలోని రెండు అంగన్‌వాడీ భవనాల్లో టైల్స్ ఊడిపోయాయి. ప్రహరీలు లేవు. కొన్నిచోట్ల దారులు బురదమయంగా మారుతున్నాయి. పెద్దాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 9 భవనాలు అసంపూర్తిగా మిగిలాయి. వీటిలో రెండు స్లాబువేసి వదిలేశారు. కాకినాడ గ్రామీణ ప్రాజెక్టు పరిధిలో 3 భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి.

చేబ్రోలులో అసంపూర్తిగా నిర్మాణం

చర్యలు చేపట్టి పూర్తి చేయిస్తాం..

భవనాలు పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నాం.

– దుర్గాదేవి, సీడీపీవో, పిఠాపురం

కార్తిక దీపం.. శివలింగ రూపం

గొల్లప్రోలు: కార్తికమాసం ముగింపు సందర్భంగా గురువారం రాత్రి చేబ్రోలు శివాలయం, గొల్లప్రోలులోని వేంకటేశ్వరాలయంలో దీపోత్సవం నిర్వహించారు. ఈబీసీకాలనీ సత్తెమ్మ తల్లి ఆలయంలోనూ దీపారాధన చేశారు. ✦ **పిఠాపురం:** వేణుగోపాలస్వామి ఆలయంలో సహస్ర దీపోత్సవం నిర్వహించారు. జనార్దనాచార్యులు స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భాష్యం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు దీపోత్సవం చేశారు. ప్రిన్సిపల్ వేణు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. జైగణేష్ ఆలయంలో ఆకాశ దీపోత్సవం చేశారు.

పిఠాపురం: వేణుగోపాలస్వామికి అలంకరణ

గొల్లప్రోలు వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

ఒకేచోట నాలుగు చౌక దుకాణాలపై విచారణ

గొల్లప్రోలు: గొల్లప్రోలులోని చౌక దుకాణాలు కార్డుదారులకు అందుబాటులో లేకుండా ఒకేచోట కొనసాగిస్తుండడంపై పౌరసరఫరాలశాఖ అధికారులు గురువారం విచారణ నిర్వహించారు. స్థానిక పాపయ్యచావిడి ప్రాంతంలో నాలుగు దుకాణాలు నిర్వహిస్తుండడంతో శివారు ప్రాంతాల వారికి సరకులు సరిగా లభించడంలేదని ఫిర్యాదులు వచ్చాయి. దాంతో కాకినాడ ఆర్డీవో మల్లిబాబు విచారణకు ఆదేశించారు. ఎంఎస్‌వోలు అనిల్‌కుమార్, శ్రీనివాస్ దుకాణాలవారీగా ధ్రువపత్రాలు తనిఖీ చేశారు. వారికి కేటాయించిన కార్డుదారులు నివసిస్తున్న ప్రాంతాలను పరిశీలించారు. నివేదికను అధికారులకు అందజేస్తామన్నారు.

భీమేశ్వరాలయంలో అన్నసమారాధన

సామర్లకోట: సామర్లకోట భీమేశ్వరాలయం ఆవరణలో దీపారాధన కమిటీ నాయకులు, పాత్రులవీధిలో గురువారం కార్తికమాస ముగింపు నేపథ్యంలో అన్నసమారాధనలు జరిగాయి. అయ్యారక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వినియోగదారులకు అండగా నిలుస్తాం

పిఠాపురం: విద్యుత్తు పరమైన ఇబ్బందులు ఏర్పడినప్పుడు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరిగినప్పుడు ఆదుకునేందుకు విద్యుత్తు వినియోగదారుల ఫోరం అండగా ఉంటుందని విశ్రాంత న్యాయమూర్తి, తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ ఛైర్మన్ సత్యనారాయణ తెలిపారు. గురువారం పిఠాపురం విద్యుత్తు ఉపకేంద్రం వద్ద సమస్యలపై పలువురి నుంచి అర్జీలు స్వీకరించి, పరిష్కారానికి సిబ్బందిని ఆదేశించారు. మీటర్లలో లోపాలు, కొత్త సర్వీసులు ఇవ్వకపోవడం, వైర్లు కాలిపోవడం, అదనపు లోడ్ మంజూరు తదితరాలకు సంబంధించి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులు అందాయన్నారు. సంస్థ సభ్యులు మురళీకృష్ణ, సుబ్బారావు, ఈఈలు ప్రభాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: 80085 74325 పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

సమస్య: వలసపాకల గ్రామం చేపలమార్కెట్ కూడలి వద్ద మురుగు కాలువలో పూడిక తీయడం లేదు. - శ్రీనివాస్

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి వెంకటరత్నంకు చెప్పగా సిబ్బందితో శుభ్రం చేయించారు.

– న్యూస్‌టుడే, సర్పవరం

సమస్య: నాగులాపల్లిలోని ఎస్బీఐ బ్యాంకు వద్ద మురుగు కాలువ పూడికతో మూసుకుపోయింది. -స్థానికులు

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి పెద్దిశెట్టి సిబ్బందిని పంపి పూడిక తీయించారు.

– న్యూస్‌టుడే, కొత్తపల్లి

సమస్య: కరప మండలం పెద్దపూడిపాలెం శివారు వై.సావరం ఎస్సీపేటలో వీధి దీపాలు సరిగా వెలగడం లేదు. - రాంబాబు

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి వీరభద్రరావుకు చెప్పగా సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

– న్యూస్‌టుడే, కరప

సమస్య: పిఠాపురంలోని వస్తాద్ వీధి నుంచి గాలిగంగాలమ్మతల్లి గుడికి వెళ్లే మార్గంలో రోడ్లపై చెత్త కుప్పలున్నాయి. - రఫీ

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ప్రభాకర్‌కు చెప్పగా కార్మికులతో చెత్తను తొలగింపజేశారు.

– న్యూస్‌టుడే, పిఠాపురం

సమస్య: బుక్కావారి సందులో రహదారిపై చెత్త కుప్పలతో దుర్వాసన వస్తోంది. - నాగేశ్వరరావు

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ఆదినారాయణకు చెప్పగా సిబ్బందిని పంపించి చెత్తను ఎత్తించారు.

– న్యూస్‌టుడే, పెద్దాపురం

సమస్య: గొల్లప్రోలు గాంధీనగరం శివారు రోడ్డుపక్కన చెత్త పేరుకుపోయి ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. - స్థానికులు

పరిష్కారం: పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్ సిబ్బందితో చెత్తను ఎత్తించారు.

– న్యూస్‌టుడే, గొల్లప్రోలు

గ్రంథాలయాలు.. స్ఫూర్తికేంద్రాలు

పెద్దాపురం: పెద్దాపురం పట్టణ శాఖాగ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి నిర్వహించిన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ✦ **కరప:** సామాజికవేత్త డా.బొండ వెంకటరావు వేళంగిలో లైబ్రేరియన్ వెంకటరాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు మెర్ల కృష్ణప్రసాద్ అందజేసిన రూ.2 వేలు అందజేశారు. ✦ **సామర్లకోట గ్రామీణం:** సర్పంచి సత్యనారాయణ పెదబ్రహ్మదేవంలో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల విజేతలను అభినందించారు. ✦ **పిఠాపురం:** పురపాలిక కమిషనర్ రాజు పిఠాపురంలో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి ఆదివారం ఉదయం లవ్ రీడింగ్ కార్యక్రమం ప్రవేశపెట్టిందన్నారు. ✦ **కొత్తపల్లి:** ఉప్పాడ, కొత్తపల్లిల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ✦ **సామర్లకోట:** డీసీసీబీ ఛైర్మన్ రామస్వామి స్థానిక గ్రంథాలయాధికారిణి రత్నమణి ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు అందించారు. ✦ **కాజులూరు:** ఎంఈవో జాన్ కాజులూరు గ్రంథాలయంలో కాదా ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ✦ **తాళ్లరేవు:** తెదేపా రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పొన్నమండ రామలక్ష్మి కొత్తకోరింగలో పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులందిస్తున్న రామస్వామి

విద్యార్థులతో రామలక్ష్మి, బాబీ తదితరులు

సంఘాల సభ్యులకు సౌకర్యమేదీ?

కరప మండలంలోని సిరిపురంలో డ్వాక్రా ఐక్యసంఘ భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో కార్యకలాపాలు నిర్వహించేందుకు డ్వాక్రా మహిళాసంఘాల సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక ఈబీసీకాలనీలో 2017లో చేపట్టిన ఈ నిర్మాణం స్లాబ్ దశలోనే నిలిచిపోయింది. ఎంపీడీవో శ్రీనివాస్ చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కరప

ఈ చెత్త తొలగించేదెవరు..

గొల్లప్రోలు మండలం తాటిపర్తి శివారు చినజగ్గంపేట వెళ్లే మార్గంలో రోడ్డుపై చెత్త పేరుకుపోయి సమీప ప్రాంత ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో సేకరించిన చెత్తను రోడ్డుపక్కన వేస్తుండడంతో 200 మీటర్ల పొడవునా డంపింగ్‌యార్డ్‌లా మారింది. పారిశుద్ధ్యం మెరుగుపరచాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

ఇది నిరుపయోగమేనా..

పిఠాపురంలోని చేపల మార్కెట్ వద్ద నాలుగేళ్ల క్రితం ఫిష్ ఆంధ్ర దుకాణం రూ.2లక్షలతో ఏర్పాటు చేశారు. ఏనాడూ ఇందులో చేపలు, రొయ్యల వ్యాపారం జరగలేదు. దుకాణ యజమాని కొంతకాలం అద్దెకు ఇచ్చుకున్నారు. కౌన్సిలర్లు వ్యతిరేకించడంతో మూతపడింది. నిధుల వృథాపై అడగ్గా మున్సిపల్ అధికారులు చర్యలు చేపడతామంటున్నారు. – న్యూస్‌టుడే, పిఠాపురం

పారమా.. ప్రాణాలతో చెలగాటమా..?

కళాశాలలు, పాఠశాలలకు వెళ్లి పాఠాలు వినాల్సిన విద్యార్థులు నిత్యం ఇలా తమ ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఈ బస్సుపోతే చాలాసేపు నిరీక్షించాలనే ఆవేదనతో వేలాగుతూ ప్రయాణాలు సాగిస్తున్నారు. గురువారం ఉదయం ఆర్టీసీ బస్సు డోరులో గొల్లప్రోలు నుంచి పిఠాపురం, కాకినాడకు వెళ్లే విద్యార్థులు ఇలా కనిపించారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు

మన చైతన్యం.. జనసౌకర్యం

కాకినాడ అర్బన్ పరిధి బ్యాంకుకాలనీ ప్రాంతంలోని కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు పెరిగిపోవడం, చాలాకాలంగా పూడిక తీయకపోవడంతో మురుగు నుంచి దుర్వాసన వస్తోందని స్థానికులు సత్యనారాయణ 'ఈనాడు-మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే పరిశీలించి పూడిక తీయిస్తానని పారిశుద్ధ్యబాధ్యుడు జగన్ తెలిపారు.

– న్యూస్‌టుడే, సర్పవరం

సైన్స్‌పై అవగాహన పెంచుకోండి

కాజులూరు: సైన్స్‌పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఎంఈవో డేవిడ్ అన్నారు. గురువారం మంజేరు జిల్లా పరిషత్తు పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. హెచ్‌ఎం విజయదుర్గ తదితరులు పాల్గొన్నారు.

23న సత్యసాయి ధ్యానమండలి యోగా చికిత్స

సర్పవరం: వలసపాకల మత్స్యకార సామాజిక భవనంలో ఆదివారం శ్రీసత్యసాయి ధ్యానమండలి కాకినాడ ఆధ్వర్యంలో అంతర్ముఖం, ఆనందం, ఆరోగ్యం అనే విషయాలపై ఒక రోజు అవగాహన, శిక్షణ, విశ్వశక్తి యోగా చికిత్స కార్యక్రమం నిర్వహించనున్నట్లు యోగా గురువు దంగేటి సత్యనారాయణరావు గురువారం తెలిపారు. సత్యపసాద్, లక్ష్మి పాల్గొన్నారు.

మాలధారులకు భిక్ష

తాళ్లరేవు: తాళ్లరేవు బాప్టిస్టు చర్చి పాదర్, జడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్‌సాగర్, నాగదుర్గాదేవి దంపతుల ఆధ్వర్యంలో అయ్యప్ప, భవానీ, శివ మాలధారులకు గురువారం భిక్ష ఏర్పాటు చేశారు. తాళ్లరేవు ధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయంలో 400 మంది స్వీకరించారు. మతసామరస్యం చాటేందుకు భిక్ష ఏర్పాటు చేశానన్నారు. ఆలయ నిర్వాహకులు దొమ్మేటి సత్యనారాయణ, కందికొండ భాస్కరశర్మ, పితాని బాలవెంకటరమణ తదితరులు సాగర్‌ను అభినందించారు. చలపతి, మహేంద్ర, సూర్యనారాయణ, భైరవమూర్తి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోకు సత్కారం

తాళ్లరేవు: ఉద్యోగోన్నతి బాధ్యత పెంచుతుందని జడ్పీటీసీ సభ్యుడు సామ్యూల్‌సాగర్ అన్నారు. తాళ్లరేవులో డిప్యూటీ ఎంపీడీవోగా ఉన్నతి పొందిన పంచాయతీ కార్యదర్శి శంకరనారాయణను గురువారం సన్మానించారు.

దివిలిలో సంతకాల సేకరణ

పెద్దాపురం: దివిలి గ్రామంలో గురువారం వైసీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల కార్యక్రమం నిర్వహించారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి నెక్కంటి సాయిప్రసాద్, ఇతర నాయకులు మురళి, త్రినాథ్, విష్ణుచక్రం, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో, కబడ్డీ పోటీలకు ఎంపిక

పెద్దాపురం: కొండపల్లి గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న శ్రీకాకోళ్లపు కార్తిక్, వానపల్లి ఉమామహేష్ అండర్ 17, 14 విభాగాల్లో రాష్ట్ర స్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఫణికుమార్ గురువారం తెలిపారు. వారిని ఛాత్రోపాధ్యాయుడు సుబ్బారావు, ఇతర ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు.

'ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత కన్నబాబుకు లేదు'

సామర్లకోట గ్రామీణం: గత వైకాపా ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, అలాంటి వైఫల్యాల నుంచి వచ్చిన మాజీ మంత్రి కురసాల కన్నబాబుకు కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదని ఎమ్మెల్యే చినరాజప్ప పేర్కొన్నారు. గురువారం అచ్చంపేటలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వ్యవసాయశాఖ మంత్రిగా పని చేసిన కన్నబాబు రైతులకు ఉపయోగపడలేదన్నారు. అబద్ధాలతో కన్నబాబు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

నేడు ఆధార్ రిజిస్ట్రేషన్లు

సామర్లకోట గ్రామీణం: ఎంఎస్‌ఎంఈ ద్వారా చిరువ్యాపారాలు నిర్వహిస్తున్న మహిళలు, పురుషులు రుణాలు పొందేందుకు అవసరమైన ఉద్యమ్ ఆధార్ రిజిస్ట్రేషన్‌లను ఉచితంగా నిర్వహిస్తామని వెలుగు ఏపీఎం జగదీశ్వరి గురువారం తెలిపారు. ఈ నెల 21న స్థానిక వెలుగు కార్యాలయంలో ఉదయం 9 గంటలకు అవగాహన సదస్సు ఉంటుందన్నారు. హాజరయ్యేవారు ఆధార్, పాన్‌కార్డు, ఆధార్ లింకైన ఫోన్ నంబరు, బ్యాంక్ పాస్ పుస్తకం, ఈ-మెయిల్ అడ్రస్ తదితర వివరాలతో రావాలన్నారు.

అవీ ఇవీ అన్నీ

నిరసనగా రచ్చబండ

గొల్లప్రోలు: వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా వైకాపా ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం గొల్లప్రోలులో గురువారం నిర్వహించారు. 3, 4 వార్డుల్లో పర్యటించి ప్రజల సంతకాలు సేకరించారు. వైద్యకళాశాలల ప్రైవేటీకరణ జీవోను ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు. రాజా, శ్రీరామచంద్రమూర్తి, అయ్యారావు, భీముడు తదితరులు పాల్గొన్నారు.

షష్ఠి ఉత్సవాలపై సమీక్ష

గొల్లప్రోలు: మండల పరిధి ఆలయాల్లో ఈ నెల 26 నుంచి జరిగే షష్ఠి ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ రామ్‌కుమార్ ఆదేశించారు. గొల్లప్రోలులో గురువారం మల్లవరం, తాటిపర్తిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల కమిటీల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో సలాట్ రాజు, ఎస్సై రామకృష్ణ, దేవాదాయశాఖ అధికారిణి అశ్విని, డిప్యూటీ ఎంపీడీవో కుమార్, ఆలయాల ప్రతినిధులు భాస్కరరెడ్డి, సత్యనారాయణ, రామయ్యదొర, వెంకటేశ్వరశర్మ పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి సహకరించాలి

కాజులూరు: ప్రజారవాణా వ్యవస్థను మరింత సక్రమంగా నడిపించడంలో ప్రయాణికుల సహకారం కీలకమని ఆర్టీసీ స్క్వాడ్ కేవీరావు అన్నారు. గురువారం కుయ్యేరు వద్ద బస్సులను తనిఖీ చేశారు.

గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ

గొల్లప్రోలు: దుర్గాడలో మండల గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సలాట్‌రాజు తెలిపారు.

27 నేత్ర వైద్య శిబిరం

సామర్లకోట: సామర్లకోట భీమేశ్వరాలయం వద్ద ఈ నెల 27 నుంచి డిసెంబరు 3వ తేదీ వరకు ఉచిత కంటి పొర వైద్య శిబిరం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధి గ్రామసభలు రేపు

గొల్లప్రోలు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో శ్రామికులకు కేవైసీ ప్రాధాన్యం వివరించేందుకు ప్రత్యేక గ్రామసభలు శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సలాట్‌రాజు, ఏపీవో గంగాభవానీ గురువారం తెలిపారు.

జనసేన పార్టీలో చేరిన మాజీ ఛైర్మన్లు

పెద్దాపురం, న్యూస్‌టుడే: ఆర్బీపట్నం సొసైటీ మాజీ ఛైర్మన్ నల్లల నాగేంద్రబాబు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లూరి జ్యోతితోపాటు మరికొందరు వైసీపీకి రాజీనామా చేసి గురువారం జనసేన పార్టీలో చేరారు. కండువాలు కప్పి వారిని ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, డీసీసీబీ ఛైర్మన్ రామస్వామి పార్టీలోకి ఆహ్వానించారు.

వామ్మో గుంత.. పడితే వెత

– న్యూస్‌టుడే, పెద్దాపురం, సామర్లకోట

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలను కలిపే ప్రధాన రహదారి మార్గమైనా సామర్లకోట రైల్వే వంతెనపై రహదారి పరిస్థితి చూస్తే వామ్మో ఇదేం దారని వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. ఇటు వంతెన ప్రారంభం నుంచి రైల్వే గేటు వరకు, అటు చక్కెర పరిశ్రమ కింది వరకు రహదారి బాలేక వాహనదారులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఈ గుంతలను తప్పించి ముందుకు వెళ్లేందుకు నరకం చవిచూస్తున్నారు. పెద్దాపురం, జగ్గంపేట, ఏజెన్సీ మండలాలు, కిర్లంపూడి, ప్రత్తిపాడు, పిఠాపురం, రాజానగరం, రాజమహేంద్రవరం, ద్వారపూడి, రామచంద్రపురం, మండపేట, కాకినాడ ప్రాంతాలకు ప్రతిరోజూ వందలాది మంది ఈ వంతెనపై ఆర్టీసీ బస్సులు, ఆటోలు, కళాశాల, పాఠశాలల బస్సులు, టిప్పర్లు, గ్రానైట్ తరలించే భారీ వాహనాల రాకపోకలు నిత్యం భారీగానే ఉంటాయి. గుంతలను తప్పించి ముందుకు వెళ్లే క్రమంలో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించి ప్రయాణికులు అష్టకష్టాలు పడుతున్నారు. ఈ గుంతల దారిపై వెళ్లలేక కొందరు ప్రమాదకరమని తెలిసీ ఫుట్‌పాత్‌పై కొంత దూరం వరకు వెళ్లి మళ్లీ ప్రధాన రహదారిపైకొస్తున్నారు. గుంతలు పూడ్చేందుకు ర.భ.శాఖ అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు. ఏఈ లోవరాజు మాట్లాడుతూ ప్రభుత్వం మరమ్మతులకు నిధులు కేటాయించిందని, చర్యలు తీసుకుంటామన్నారు.

ఫుట్‌పాత్ ఎక్కిన ద్విచక్ర వాహనదారు

సామర్లకోట రైల్వే వంతెనపై ప్రమాదకరంగా గుంత

(c) eenadu

తుని
• తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

రౌతులపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన పోటీల్లో రౌతులపూడి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పదో తరగతి చదువుతున్న పైల శ్రీనివాస్ షార్ట్‌పుట్, డిస్క్, గాడి రమణమ్మ డిస్క్‌లో జిల్లాస్థాయిలో విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. హెచ్‌ఎం కోళ్ల రాంబాబు, వైస్ చైర్మన్ షేక్ సలీం, ఎంఈవోలు కొండబాబు, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, చిన్ని బాలబాలాజీ అభినందించారు.

నాలుగు పంచాయతీల్లో రూ.48.76 లక్షల బకాయిలు

తొండంగి: కొత్త కొడాడ, గొర్రిపాలెం, కొమ్మనాపల్లి, దానవాయిపేట 2 పంచాయతీల్లో ద్వారా సంపాల వద్ద రూ.48.76 లక్షల బకాయిలు పేరుకుపోయినట్లు డీఎల్‌పీవో వీవీ శ్రీనివాస్ అన్నారు. గురువారం పీడీ, ఏపీడీ జలని, నలుగురు ఏపీవోలు కలిసి రెండు బృందాలుగా ఏర్పడి ఈ గ్రామాల్లో పర్యటించి యానిమేటర్ల పనితీరును సభ్యులను అడిగి తెలుసుకున్నారు. గడువులోగా బకాయిలు వసూలు చేయకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

22 నుంచి గ్రామసభలు

రౌతులపూడి: గ్రామపంచాయతీల్లో ఈనెల 22వ తేదీ నుంచి గ్రామసభలు నిర్వహిస్తామని ఎంపీడీవో శివరామకృష్ణయ్య, ఉపాధి హామీ జేఈ కాంచన తెలిపారు. ఈకేవైసీ నిమిత్తం రద్దు చేసిన జాబ్ కార్డుల వివరాలు, కొత్త జాబ్ కార్డుల ఆమోదం కోసం గ్రామసభలు ఏర్పాటుచేశామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబరు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066
ఉ. 10 - మ. 1

రహదారి కోతతో ప్రమాదాలు

సమస్య: మండలంలోని పేరవరం గ్రామానికి వెళ్లే ర.భ.శాఖ రహదారి మలుపులో ఉంది. పైగా సమీపంలో పంట కాలువ ఉండటంతో రహదారి కోతకు గురవుతోంది. అసలే ఇరుకు మార్గం, ఆపై సక్రమంగా లేని అంచులతో ప్రమాదాలు జరుగుతున్నాయి. – రాకేష్, పేరవరం

సమాధానం: మలుపులు ఉన్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేస్తాం. రహదారి అంచులను పటిష్ఠం చేసేందుకు జలవనరుల శాఖతో సంయుక్తంగా అవసరమైన పనులు నిర్వహించి ప్రమాదాలకు అడ్డుకట్ట వేస్తాం.
- సాయి కిరణ్, ఏఈ, ర.భ.శాఖ
– న్యూస్‌టుడే, ఏలేశ్వరం

పర్యవేక్షణ లేక.. నిబంధనలు పాటించక

లోడు ట్రాక్టర్‌పై ప్రమాదకరంగా కూలీలు

గండేపల్లి, న్యూస్‌టుడే: డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, ప్రయాణికులు నిబంధనలు పాటించకపోవడం తదితర కారణాలతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దైవ దర్శనాలకు, శుభకార్యాలకు వెళ్లేవారు ఆటోల్లో, మినీ వాహనాల్లో పరిమితికి మించి వెళ్తున్నారు. కూలి పనులకు వెళ్లేవారు లోడు వాహనాలపై ప్రమాదకరంగా కూర్చుంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం కూడా మరొక లోపంగా మారుతోంది.

ఇటీవల ప్రమాదాలు ఇలా..

✦ గండేపల్లి మండలం యల్లమిల్లి మీదుగా నాయకంపల్లి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పాల్వాన్ ఢీకొన్న ప్రమాదంలో రెండు రోజుల చికిత్స అనంతరం యువకుడు మృత్యువాత పడ్డాడు. ✦ సోమవరం కూడలి వద్ద రహదారి పక్కనున్న వ్యక్తులపైకి డ్రైవర్ నిద్రమత్తులో ఉండి కారును నడిపాడు. ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, చికిత్స పొందుతూ మరొక విద్యార్థిని మృతి చెందింది.

✦ కిర్లంపూడి మండలం ముక్కొల్లుకు చెందిన కొందరు భక్తులు జగ్గంపేట మండలం ఇర్రిపాక దైవదర్శనానికి వెళ్లి తిరిగి ఆటోలో వస్తున్నారు. ప్రత్తిపాడు సమీపంలో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఆటోడ్రైవర్ మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి.

మండలం	కూడళ్లు	కి.మీ
గండేపల్లి	8	16
జగ్గంపేట	2	3
కిర్లంపూడి	3	5
ఏలేశ్వరం	3	6
ప్రత్తిపాడు	4	7

అతిక్రమణలు వద్దు..

లోడు వాహనాలపై ప్రయాణించిన వారికి నిబంధనల అతిక్రమణ కింద రూ.10 వేలు జరిమానా విధిస్తాం. ప్యాసింజర్ ఆటోల్లో పరిమితులకు అనుగుణంగా ప్రయాణించాలి. ఒక్కో మండలంలో నెలకు 10 కేసులు కడుతున్నాం. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. - ప్రసాద్, ఆర్టీవో, పెద్దాపురం

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

వసతి గృహాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి

గండేపల్లి: వసతి గృహాల వద్ద సీసీ కెమెరాలు ఉండాలని, ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు పేర్కొన్నారు. రామేశ్వరంపేటలోని ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులుండే ప్రైవేట్ వసతి గృహాలను గురువారం పరిశీలించారు. డీఎస్పీ మాట్లాడుతూ రాత్రి సమయాల్లో బయటకు రాకూడదని, అపరిచిత వ్యక్తులతో సామాజిక మాధ్యమాల్లో స్నేహాలు మంచిది కాదని సూచించారు. మాదకద్రవ్యాలు వినియోగించినా, వాటి సమాచారం తెలిసినా పోలీసులకు తెలియజేయాలన్నారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలకు అందుతున్న సౌకర్యాల తనిఖీ

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడులోని బీసీ బాలికల వసతి గృహాన్ని మండల న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ న్యాయవాదులు మధుబాబు, అపసరాల దేవి గురువారం సందర్శించారు. బాలికల సంఖ్య, వారికి అందుతున్న సౌకర్యాలపై హాస్టల్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నిబంధనల మేరకు భోజనాన్ని సమకూర్చాలని, నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే మా దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చొరవ చూపిస్తామన్నారు.

శిక్షణలో పాల్గొన్న ప్రకృతి వ్యవసాయ, రిలయన్స్ ఫౌండేషన్ సిబ్బంది

పెరటి తోటల పెంపకంపై అవగాహన

కిర్లంపూడి: నివాసాల వద్ద ఖాళీ స్థలాల్లో పెరటి తోటలను పెంచడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారాన్ని పొందవచ్చని రిలయన్స్ ఫౌండేషన్ మేనేజరు బర్రే నాగేశ్వరరావు అన్నారు. ప్రకృతి వ్యవసాయ, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రామకృష్ణాపురంలో పెరటితోటల పెంపకంపై శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు డి.మేరీగ్రేస్, బి.శిరోమణి రసాయన ఎరువులు, క్రిమి సంహారకాలు లేకుండా కూరగాయల పంటలను ఏవిధంగా పండించవచ్చో వివరించారు. రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కూరగాయల విత్తనాలను గ్రామస్థులకు అందజేశారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వరలక్ష్మి, డి.రాజు, భవానీ, రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఆత్మ కమిటీ ఛైర్మన్‌కు సత్కారం

తొండంగి, న్యూస్‌టుడే: తుని డివిజన్ ఆత్మ కమిటీ ఛైర్మన్‌గా ఎన్నికైన నరహరశెట్టి సూర్యప్రకాష్‌ను గురువారం మత్స్యకార, మాల, మాదిగ, బీసీ సంఘాల నాయకులు సత్కరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సూర్యప్రకాష్ మాట్లాడుతూ తొండంగి, తుని, కోటనందూరు, రౌతులపూడి, శంఖవరం మండలాల రైతులందరికీ కూటమి ప్రభుత్వం సహకారంతో రాయితీ పరికరాలు, యంత్రాలు, డ్రోన్, స్ప్రేయర్స్ తదితర వాటిని అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. తెదేపా నాయకులు యనమల రాజేష్, ములికి రామకృష్ణ, తంగెళ్ల శ్రీను, వడ్డి రాంబాబు, చిట్టుమూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తెదేపాలో చేరిక

పార్టీలో చేరిన వారితో యనమల రామకృష్ణుడు

తుని గ్రామీణం: మండలంలోని తేటగుంట గ్రామానికి చెందిన వైకాపా నాయకులు తెదేపాలో చేరారు. గ్రామానికి చెందిన వైకాపా నాయకులు దిడ్డి రమణ, ఎర్రబిల్లి ఏసుబాబు, కోనే ఏసు తదితరులు తమ అనుచరులతో శుక్రవారం తేటగుంట పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు సమక్షంలో పార్టీలోకి చేరారు. వారికి పార్టీకండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషిచేయాలని సూచించారు. నాయకులు చింతంనీడి అబ్బాయి, జి.అప్పలరాజు, చామంతి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

శస్త్రచికిత్సకు ఎల్‌వోసీ పత్రం అందజేత

గండేపల్లి, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ శస్త్రచికిత్సకు రూ.2 లక్షల విలువైన ఎల్‌వోసీ పత్రాన్ని తితిదే బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గురువారం రాత్రి అందించారు. గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామానికి చెందిన మారోజు సూర్యకుమారి అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమెకు శుక్రవారం శస్త్రచికిత్స చేయాలని వైద్యులు సూచించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాధిత కుటుంబానికి అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ కుటుంబానికి ఆపద వచ్చినా అందుబాటులో ఉంటానని తెలిపారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత మహిళకు ఎల్‌వోసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

ఉపన్యసించి.. బహుమతి సాధించి

‘ఈనాడు- ఈటీవీ’ ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు

తుని, న్యూస్‌టుడే: తుని పట్టణంలోని సిద్ధార్థ హైస్కూల్లో ‘ఈనాడు - ఈటీవీ’ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ‘విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం’ అంశం గురించి ఉత్సాహంగా అనేక మంది పిల్లలు ఉపన్యాసం ఇచ్చారు. పాఠశాల ఉపాధ్యాయులే న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేశారు. ఈ పోటీల్లో విద్యార్థినులు అడిగర్ల ఎన్ఎన్ఆర్ రాజేశ్వరి (ప్రథమ), ఎరుప్రోలు మౌనశ్రీ (ద్వితీయ), కర్రి అర్షిత కమలిని (తృతీయ) స్థానాలు సాధించారు. వీరికి కరస్పాండెంట్ కెఎన్‌వి రంగారావు, ఏవో నారాయణ మూర్తి, ప్రిన్సిపల్ కె.శ్రీనివాస్ చేతులమీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. విజేతలను విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ కెవి దుర్గాదాస్ అభినందించారు.

తరగతిలో ఉపన్యాసం ఇస్తున్న విద్యార్థిని

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

సేవాకార్యక్రమాలు విస్తృతం చేయాలి

జగ్గంపేట, జగ్గంపేట గ్రామీణం: వాసవిక్లబ్ సేవలను విస్తృతం చేయాలని జాతీయ అధ్యక్షుడు ఇరుకుమల రామకృష్ణ అన్నారు. మండల కేంద్రమైన జగ్గంపేట ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవిక్లబ్, వనితక్లబ్, వాసవిక్లబ్ బీటెక్‌యూత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. సభ్యులు మానేపల్లి బంగార్రాజు, కొత్త కొండబాబు, నాళం ఆండాల్, మామిడిపాక సతీష్, కంచర్ల సత్యనారాయణ, వీరసత్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

ఘనంగా అంతర్జాతీయ బాలల దినోత్సవం

తొండంగి: కేపీపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం అంతర్జాతీయ బాలల దినోత్సవం హెచ్‌ఎం చక్రాతి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు శ్రీదేవి విద్యార్థులకు రూ.5 వేలు విలువ చేసే షీల్డ్, ప్రశంసా పత్రాలు అందించారు. అనంతరం జగదీష్ చంద్రబాబు బోస్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు.

వృథాగా తాగునీరు

గండేపల్లి మండలం తాళ్లూరు ప్రాథమిక పాఠశాల-2లో విద్యార్థులకు సురక్షిత నీరును అందించే ఆర్వోప్లాంట్లు నిర్వహణలేక మూలకు చేరాయి. అంతే కాకుండా విద్యార్థులు చేతులు కడుక్కునే కుళాయిల వద్ద అపరిశుభ్రంగా ఉండి, మరమ్మతులకు గురై నీరు వృథాగా పోతోంది. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గండేపల్లి

ఇళ్లను తాకుతున్నా పట్టించుకోరా?

గోనేడ గ్రామంలో నివాసాలను తాకుతూ విద్యుత్తు తీగలు ఉండడంతో నివాసితులు బెంబేలెత్తుతున్నారు. ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. వైర్ల కారణంగా ఇళ్ల స్లాబ్‌లపైన పిట్టగోడలు కట్టడం మానేశారు. ఒకొక్క సమయంలో ఇళ్లకు విద్యుత్తు ప్రవాహం జరుగుతుందని వాపోతున్నారు. అధికారులు స్పందించి నివాసాలను తాకుతున్న తీగలను మార్చాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, కిర్లంపూడి

చెత్తకు నిప్పు.. ఆరోగ్యానికి ముప్పు

నగర పంచాయతీ ఏలేశ్వరంలో అధికారుల పర్యవేక్షణ లోపంతో చెత్త ఎక్కడపడితే అక్కడ నిల్వ ఉండిపోతోంది. అనంతరం దానికి పారిశుద్ధ్య సిబ్బంది నిప్పు పెడుతున్నారు. దీంతో వచ్చే పొగతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. చిత్రంలో ఏలేశ్వరంలోని ఆర్టీసీ కాంప్లెక్ సమీపాన లింగంపర్తి వెళ్లే ప్రధాన రహదారి చెంతనే ఉన్న చెత్తకు తరచూ ఇలా నిప్పు పెడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, ఏలేశ్వరం

కూలేవరకూ చూడాల్సిందేనా..

జగ్గంపేట గ్రామీణం మండలంలోని కాట్రావులపల్లిలో ర.భ రహదారిని ఆనుకుని పంటపొలాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభం కూలేందుకు సిద్ధంగా నేలవాలి ప్రమాదాన్ని తలపిస్తుంది. నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్తు లైనులో పలుచోట్ల పటిష్ఠంగా లేకపోవడంతో రైతుల పొలాల్లోకి వాలాయి. స్తంభాలకు సపోర్టు స్తంభాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా విద్యుత్తు అధికారులు ఆదిశగా చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. విద్యుత్తు అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం

రాచపల్లిలో పంచామృత అభిషేకాలు

ప్రత్తిపాడు మండలంలోని రాచపల్లి అరుణాచలేశ్వరుని ఆలయంలో దక్షిణామూర్తికి గురువారం పంచామృత అభిషేకం చేశారు. ఆలయ ప్రాంగణంలో లోక కల్యాణార్థం హోమం నిర్వహించారు. ప్రత్తిపాడు మండల పరిధిలోని పలు జలపాతాలకు సందర్శకులు పెద్ద ఎత్తున తరలివెళ్లి సందడి చేశారు. - న్యూస్‌టుడే, ప్రత్తిపాడు

సత్యదేవుని సన్నిధిలో భగవద్గీత పారాయణ

అన్నవరం: భగవద్గీత పారాయణం కార్యక్రమాన్ని అన్నవరం సత్యదేవుని సన్నిధిలో గురువారం నిర్వహించారు. గీతా జయంతి సందర్భంగా విశాఖపట్నం సింహాచలం సమీపంలోని చింతల అగ్రహారానికి చెందిన భగవద్గీత భక్తుల ఆధ్వర్యంలో డిసెంబరు 1 వరకు కార్యక్రమం జరుగుతుంది. ఈవో సుబ్బారావు చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రత్నగిరి ప్రాంగణంలోని కళామందిరంపై జరిగిన కార్యక్రమానికి వివిధ పాఠశాలల విద్యార్థులు హాజరై గీతా పారాయణ చేశారు. భగవద్గీతలోని 18 అధ్యాయాల్లో శ్లోకాలు నిర్వాహకురాలు గీతా సత్యవతి ఆలపించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

కిర్లంపూడి, న్యూస్‌టుడే: శీతాకాలంలో చలిగాలులకు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ముక్కొల్లు గ్రామానికి చెందిన ద్వారపూడి సూరిబాబు ఆచార్యులు దుప్పట్లు, తలగడలను గురువారం పేదలకు పంపిణీ చేశారు. పంచాయతీ కార్మికులకు, నిరుపేదలకు వీటిని అందజేశారు. ద్వారపూడి సాయి పాల్గొన్నారు.

ఏడుగురిపై బైండోవర్ కేసులు

గండేపల్లి, న్యూస్‌టుడే: రహదారి పక్కన అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే ఏడుగురిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై శివనాగబాబు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. సామర్లకోట, పిఠాపురం గ్రామాలకు చెందిన అదుగురు మహిళలు మల్లేపల్లి రహదారి పక్కన అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. వీరితో పాటు వీరికి సహకరిస్తున్న ఇద్దరు పురుషులను తహసీల్దార్ శ్రీనివాస్ వద్ద గురువారం బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేదల భూముల్లో పరిశ్రమలు వద్దు

గండేపల్లి : ఏళ్లుగా పోరాడి సాధించిన పేదల భూముల్లో పరిశ్రమల ఏర్పాటుకు అంగీకరించమని రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. గండేపల్లి మండలం కె.గోపాలపురంలో ర్యాలీ నిర్వహించారు. అడ్డుకొండ భూముల్లో ఇండస్ట్రియల్ పార్కు వద్దని, ఆ భూములు పేదలకు పంచాలని అన్నారు.

నిచ్చెన పైనుంచి పడి ఇద్దరికి తీవ్రగాయాలు

చింతపల్లి గ్రామీణం : అల్లూరి సీతారామరాజు జిల్లా తాజంగిలో స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణ పనులు చేస్తుండగా ఇద్దరు కార్మికులు ప్రమాదానికి గురయ్యారు. ప్రత్తిపాడుకు చెందిన గంతకూరి వీరబాబు, ఈగల బాబూరావు గురువారం నిచ్చెనపై నిల్చొని పనులు చేస్తుండగా. జారి పడి గాయపడ్డంతో తోటి కార్మికులు తాజంగి పీహెచ్‌సీకి తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం అంబులెన్సులో చింతపల్లి ఏరియా ఆసుపత్రికి.. అనంతరం నర్సీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు.

ఉన్నత పాఠశాల అభివృద్ధికి సహకారం

సౌండ్ స్పీకర్‌ను అందిస్తున్న ఎంపీపీ బుజ్జి

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దనాపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి సహకరిస్తానని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. గ్రామంలోని ఈ పాఠశాలకు సీత ఈశ్వరి ఛారిటబుల్ ట్రస్ట్ తరపున సౌండ్ స్పీకర్‌ను గురువారం ఆయన బహుకరించారు. ట్రస్ట్ ఛైర్మన్‌గా ఉన్న తాను తన సొంత నిధులతో ఈ బాక్స్‌ను సమకూర్చానన్నారు. తెదేపా నాయకులు సుంకర సత్తిబాబు, శెట్టి వెంకట అప్పారావు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

తుని పట్టణం, ఏలేశ్వరం: గ్రంథాలయ వారోత్సవాల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ప్రముఖుల చేతులమీదుగా బహుమతులు అందించారు. పట్టణంలోని శాంతినగర్‌లో ఉన్న శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. పురపాలక వైస్ ఛైర్మన్ ఆచంట సురేష్, గ్రంథాలయాధికారి రంగనాథరావు పాల్గొన్నారు. ● ఏలేశ్వరం శాఖా గ్రంథాలయంలో గురుకులానికి చెందిన 79 మంది బాలికలు పాల్గొన్నారని ప్రిన్సిపల్ చంద్రశారద చెప్పారు. చిత్రలేఖనం, వ్యాసం తదితర పోటీల్లో 29 మంది బాలికలు విజేతలుగా నిలిచారన్నారు. ● ఏలేశ్వరం పట్టణ గ్రంథాలయంలోని విజేతలకు నగర పంచాయతీ వైస్ ఛైర్‌పర్సన్ త్రివేణి చేతులమీదుగా ప్రసంశాపత్రాలను అందజేశామని గ్రంథాలయాధికారి సత్యనారాయణ చెప్పారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమ పూజలు

తుని పట్టణం: పల్లపువీధిలో ఉన్న శ్రీగౌరీ శంకర సమేత వీరభద్ర స్వామివారి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో గురువారం జరిగాయి. పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు హాజరై అమ్మవారికి విశేషపూజలు ఆచరించారు. జాన గౌరీ శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

వనదుర్గ ఆలయంలో ప్రత్యంగిర హోమం

అన్నవరం: అన్నవరం సత్యదేవుని క్షేత్ర రక్షకులుగా కొలిచే వనదుర్గ అమ్మవారి ఆలయంలో గురువారం అమావాస్య సందర్భంగా ప్రత్యంగిర హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈవో సుబ్బారావు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

108 హోమగుండాలతో శివరుద్ర యాగం

హోమంలో పాల్గొన్న భక్తులు

తొండంగి, న్యూస్‌టుడే: గోపాలపట్నం గ్రామ శివారు యడ్ల కోటీశ్వరరావు స్థలంలో వారాహిని మాత శివ రుద్ర మహాయాగం గురువారం భక్తి శ్రద్ధలతో జరిగింది. పవనానందస్వామి పర్యవేక్షణలో 108 హోమగుండాలతో వారాహిమాత యాగం నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున హాజరై ప్రత్యేక పూజలు చేశారు. యనమల రాజేష్, యడ్ల సూరిబాబు, బుజ్జి, పి.సుబ్రహ్మణ్యం, చిరంజీవి తదితరులు దర్శించుకున్నారు.

వైభవంగా గంగా హారతి

కిర్లంపూడి : కిర్లంపూడిలోని ఉమావైద్యనాథేశ్వర స్వామివారి ఆలయ కోనేరులో కార్తిక మాసం చివరిరోజును పురస్కరించుకుని గురువారం రాత్రి గంగా హారతిని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు బాదంపూడి వైద్యనాథశర్మ ఆధ్వర్యంలో అర్చక స్వాములు కోనేరు వద్దున మహాశివునికి, పార్వతిదేవి, గంగాదేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు.

పది తులాల బంగారం చోరీ

తొండంగి: బెండపూడి శివారు గూడేవారి తోటకు చెందిన ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నక్కా రమణమ్మ కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 18న తిరుపతి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. 17న ఇంటివద్ద తన సోదరి ఎస్.రామలక్ష్మిని ఉండాలని చెప్పడంతో ఆమె వెంకటనగరం నుంచి గూడేవారి తోటకు వచ్చింది. రామలక్ష్మి వచ్చిన మరుసటి రోజు వారంతా తిరుపతి వెళ్లారు. అదేరోజు సాయంత్రం ఇంటికి తాళం వేసి రామలక్ష్మి తన స్వగ్రామం వెంకటనగరం వెళ్లిపోయింది. గురువారం ఉదయం ఇంటి తాళాలు పగలగొట్టి తలుపులు తెరిచి ఉండడంతో చుట్టు పక్కల వారు ఆమెకి సమాచారం ఇచ్చారు. వచ్చి చూసేసరికి గదిలో ఉన్న బీరువా పగలగొట్టి ఉంది. అందులో ఉన్న 10 తులాల బంగారం, వెండి, కొన్ని పట్టు చీరలు లేకపోవడంతో ఎవరో దొంగిలించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జగన్‌మోహన్‌రావు తెలిపారు.

తప్పిపోయిన బాలుడి ఆచూకీ లభ్యం

శంఖవరం:కత్తిపూడి గ్రామానికి చెందిన ముదగ్రడ శ్రీనివాస్ అనే బాలుడు (15) తల్లిదండ్రులు మందలించిన కారణంగా ఈనెల 17న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలని తల్లిదండ్రులు అన్నవరం ఎస్సై శ్రీహరిబాబుని కోరారు. ఆ బాలుడు తొండంగిలో గురువారం కనిపించడంతో పట్టుకుని పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు.

సంస్మరణ సభ రేపు..

రౌతులపూడి: కత్తిపూడిలో శ్రీరాజా వత్సవాయి బుచ్చి సీతాయమ్మ మహారాణి బహద్దర్ వర్ధంతి సందర్భంగా ఈనెల 22న సంస్మరణ సభ, వస్త్రదానం, అన్నదానం నిర్వహిస్తామని సత్రం ఛైర్మన్ చంద్రమౌళి తెలిపారు.

కర్షకుల మోములో సంతోషం

27,617 మందికి రూ.18.9 కోట్ల నగదు జమ

- న్యూస్‌టుడే, తొండంగి, తుని గ్రామీణం

ఎన్నికల హామీలో భాగంగా అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత నగదును కూటమి ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. రబీ పంటకు ముందే ముఖ్యమంత్రి చంద్రబాబు నిధులు విడుదల చేయడంతో రైతుల కళ్లలో ఆనందం వ్యక్తమవుతోంది. మొదటి విడత రూ.7,000 రైతుల బ్యాంకు ఖాతాలో ఆగస్టులో జమ అయ్యాయి. రెండో విడత నగదు కూడా మంజూరు చేయడంతో రైతుల మోములో సంతోషం వెల్లివెరిసింది. తుని నియోజకవర్గంలోని తొండంగి, తుని, కోటనందూరు మండలాల్లో 27,617 మంది రైతులకు రూ. 18.9 కోట్లు జమ అయినట్లు ఏవో పద్మశ్రీ, ఏఈవో సతీష్ తెలిపారు.

పెట్టుబడికి ఉపయోగపడుతుంది..

మండల వ్యాప్తంగా మరో నెల రోజుల్లో రబీ సీజన్ ప్రారంభమవుతుంది. ఈ సమయంలో ప్రభుత్వం రైతు కష్టాలను గుర్తించి అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.7,000 ఇవ్వడం సంతోషంగా ఉంది. పంట పెట్టుబడికి ఈ నగదు ఉపయోగపడుతుంది. - వి.తమ్మారావు, రైతు

రెండు గంటల్లో డబ్బులు వచ్చాయి



సీఎం పథకం ప్రారంభించిన రెండు గంటల వ్యవధిలో నా బ్యాంకు ఖాతాకు రూ.5 వేలు జమ అయ్యాయి. పీఎం కిసాన్ డబ్బులు రావాల్సి ఉంది. పొట్టదశలో వచ్చే చీడపీడల నుంచి పంటను కాపాడుకునేందుకు ఈ నగదు సరిపోతుంది. - సన్యాసిరావు, రైతు, రాజుపేట

రూ. 20 వేలకు పెంచడం అభినందనీయం

గత ప్రభుత్వం రైతు భరోసా పేరుతో రూ. 13,500 మాత్రమే ఇచ్చేది. ప్రస్తుతం వ్యవసాయంలో ఖర్చులు పెరిగిపోయాయి. దీంతో ఆ డబ్బులు సరిపోయేవి కావు, అప్పులపై ఆధారపడాల్సి వచ్చేది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పేరుతో రూ. 20 వేలు పెంచడం అభినందనీయం.
-వెంకటరమణ, రైతు

(c) eenadu

ఈనాడు కర్నూలు
శుక్రవారం నవంబరు 21, 2025

డిజిటల్ లక్ష్ములు.. ప్రజ్ఞాపాటవాలు!

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : స్వయం సహాయ సంఘాల మహిళల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించి.. ఆన్‌లైన్ ద్వారా అందించే డిజిటల్ సేవలను సద్వినియోగం చేసుకునేలా తీర్చిదిద్దేందుకుగాను ప్రభుత్వం డిజిటల్ సాక్షరతకు శ్రీకారం చుట్టింది. ప్రజ్ఞా వర్చువల్ ట్రైనింగ్ అకాడమీ కృత్రిమ మేధ ఆధారిత ఈ లెర్నింగ్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

పట్టణం	కర్నూలు	నంద్యాల
సంఘాలు	15,929	9,707
సభ్యులు	1,18,159	80,363
రిజిస్ట్రేషన్	14,599	6,066

ఏం చేయాలి..

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పరిధిలోని సంఘంలో సభ్యురాలై ఉండాలి. తమ రిజిస్టర్డ్ చరవాణి నంబరు వాట్సప్ నుంచి వాట్సప్ నంబరు 95523 00009కు హాయ్ అని మెసేజ్ చేస్తే ప్రజ్ఞా యాప్ ఓపెన్ అవుతుంది.

ఏమేం తెలుసుకోవచ్చు

ప్రజ్ఞా యాప్‌లో డిజిటల్ సాక్షరతకు సంబంధించిన వీడియో పాఠాలు ఉంటాయి. కేంద్ర ప్రభుత్వ పథకాలు, వాటి ద్వారా జీవనోపాధులు పొందడం, సామాజిక, ఆర్థిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, కెరీర్ గైడెన్స్, ఆరోగ్యం, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ అరెస్టులు, కంప్యూటర్ పరిజ్ఞానం, విద్యార్థులకు అవసరమైన ఉన్నత చదువులు, నైపుణ్య శిక్షణలు తదితర అంశాలపై పాఠాలు విని అవగాహన పెంచుకోవచ్చు.

శిక్షణతోపాటే ధ్రువపత్రం

పొదుపు మహిళలు తమ వీలును బట్టి ఇంటి వద్ద ఉండే డిజిటల్, ఆర్థిక అక్షరాస్యత వంటి 12 రకాల కోర్సులను ఆన్‌లైన్‌లో నేర్చుకోవచ్చు. వీడియోలన్నీ చూసిన తర్వాత.. ఆయా అంశాలపై ఏ మేరకు అవగాహన పెంచుకున్నారో పరీక్షించేందుకు యాప్‌లోనే ప్రశ్నలు ఉంటాయి. వాటికి సమాధానాలు ఇచ్చి ధ్రువపత్రం దిగుమతి (డౌన్‌లోడ్) చేసుకొనే అవకాశం ఉంది.

కష్టాలు వంట పట్టించుకున్నారు

ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 600 మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. వంట గది లేకపోవడంతో నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. ఆరుబయట వంట చేస్తుండటంతో ఆహార పదార్థాలు కలుషితమవుతాయని పలువురు పేర్కొంటున్నారు. వంట గది ఏర్పాటుచేయడం ద్వారా ఇబ్బందులు తొలగుతాయని చెబుతున్నారు.
– న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

అక్రమాలను మట్టించుకోరు

☛ యథేచ్ఛగా ఎర్రమట్టి తవ్వకాలు

ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసిఫారం.. పరమాన్‌దొడ్డి సమీపంలోని కొండ రోజురోజుకు కరిగిపోతోంది. అక్రమార్కులు పొక్లెయిన్లు పెట్టి పెద్ద ఎత్తున తవ్వకాలు చేపట్టారు. రాజకీయ అండదండలు సమృద్ధిగా ఉండటంతో చెలరేగిపోతున్నారు. టిప్పర్లతో మట్టిని ఆదోనితోపాటు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. వెంచర్లతోపాటు రహదారి నిర్మాణాలకు సంబంధించి ఎర్ర మట్టి, గరుసు తవ్వి తీసుకెళ్తున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా మట్టి తరలిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా కొండ రూపు కోల్పోయింది. రోజుల వ్యవధిలో పచ్చని కొండ మటుమాయమవుతోంది. – న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు గ్రామీణం, ఎమ్మిగనూరు

కొండను తవ్వేసిన అక్రమార్కులు

తనిఖీలు మరిచి..

పరమాన్‌దొడ్డి, బనవాసిఫారం తదితర ప్రాంతాల నుంచి ప్రతిరోజూ సుమారు 60 వాహనాల్లో మట్టి తరలిపోతోంది. ఈ లెక్కన పరిశీలిస్తే రోజుకు రూ.3 లక్షలు.. ప్రతి నెలా సుమారు రూ.కోటి విలువ చేసే మట్టిని మింగేస్తున్నారు. తనిఖీలు చేయాల్సిన అధికారులు దృష్టి సారించడం లేదు. ఫిర్యాదులు అందుతున్నా తనిఖీలు కానరావడం లేదు.

కన్నేసి.. సొమ్ము చేసుకుని

ట్రాక్టరు గరుసు మట్టి రూ.1,000 నుంచి రూ.1,200, టిప్పరు రూ.5 వేల నుంచి రూ.7 వేలకు అమ్ముకొంటున్నారు. రెండు పొక్లెయిన్లు పెట్టి రేయింబవళ్లు తవ్వి తరలించేస్తున్నారు. బనవాసిఫారంలో 2 వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో కొంతమేర కృషి విజ్ఞాన కేంద్రం, నవోదయ విద్యాలయం, పశుసంవర్ధకశాఖ పాలిటెక్నిక్ కళాశాల, గురుకుల బాలికల జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల తదితరాలున్నాయి. మిగిలిన వందలాది ఎకరాల భూమి ఖాళీగా ఉంది. ఎర్రమట్టి, గరుసు పెద్దఎత్తున లభిస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో అక్రమార్కులు తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు.

హుళేబీడు.. శత లింగాలు చూడు

సాధారణంగా పల్లెల్లో ఒకటో రెండో.. మహా అయితే పదో శివలింగాలు ఉండటం మనం చూస్తుంటాం. ఆలూరు మండలం హుళేబీడు గ్రామంలో 101 శివలింగాలు ఉన్నాయి. గ్రామంలో ఎక్కడ చూసినా దర్శనమిస్తాయి. ప్రస్తుతం వాటిలో కొన్ని కనుమరుగు కాగా.. ఇప్పటికీ చాలావరకు కనపడుతున్నాయి. ఆదోని వెళ్లే మార్గంలో ఆలూరుకు ఐదు కి.మీ. దూరంలో హుళేబీడు గ్రామం ఉంది. శ్రీకృష్ణదేవరాయల రాజ్యపాలనకు అనువుగా ఉండే ప్రదేశాన్ని ఎంపిక చేసేందుకు ఆయన అనుచరులు ఇటువైపు వెళ్తూ కొద్దిరోజులపాటు గ్రామంలో ఉన్నారు. శ్రీకృష్ణదేవరాయల ఇష్టదైవం శివుడు కావడంతో శివలింగాలను పెద్దఎత్తున ప్రతిష్ఠించి పలు ఆలయాలు నిర్మించారు. అలా గ్రామానికి హుళేరాయపట్నంగా నామకరణం చేశారు. పూర్వం ఆదోని వెళ్లే మార్గంలోని ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద గ్రామం ఉండేది. కాలక్రమేణా అక్కడినుంచి మరో చోటుకు మారి హుళేబీడుగా స్థిరపడిందని పెద్దలు తెలిపారు. దీంతో ఆ గుడికి కడె హనుమంతరాయ ఆలయంగా పేరు వచ్చింది. కడె అంటే కన్నడలో చివరి అని అర్థం. ఆ ఆలయం గ్రామానికి దూరంగా ఉండటంతో ఆ పేరు వచ్చింది. – న్యూస్‌టుడే, ఆలూరు

పలకరించనిధి

■ రాయితీ రుణాలకు ఎదురుచూపు

	యూనిట్లు	దరఖాస్తులు
కర్నూలు	1,617	29,337
నంద్యాల	2,156	24,150

● జిల్లా ● యూనిట్లు ● దరఖాస్తులు

నంద్యాల పట్టణం, కర్నూలు సంక్షేమం, ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాయితీ రుణాలు ప్రకటించింది. దీంతో ఆయా వర్గాల నుంచి పెద్దఎత్తున స్పందన లభించింది. పది నెలల కిందట అధికారులు అభ్యర్థులకు ముఖాముఖి నిర్వహించారు. ఇప్పటివరకు రుణాలు మంజూరే కానరావడం లేదు. రుణాలు లభిస్తే స్వయం ఉపాధితో జీవనం సాగించొచ్చని పలువురు ఆశించారు.

భారీగా దరఖాస్తులు

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రాయితీ రుణాల మంజూరుకు బీసీ కార్పొరేషన్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానించారు. బీసీ, ఈబీసీ, కాపు, రెడ్డి, కమ్మ, వైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, మేదర, కుమ్మరి తదితర వర్గాల నుంచి దరఖాస్తులు పిలిచారు. ఈ ఏడాది ఫిబ్రవరి 12వ తేదీ చివరి గడువు కాగా మంజూరైన యూనిట్ల కంటే 20 రెట్లు ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగరపాలక సంస్థ, ఏడు పురపాలక సంఘాలు, రెండు నగర పంచాయతీల పరిధిలో కమిషనర్లు, ఎంపీడీవోల ఆధ్వర్యంలో ముఖాముఖి నిర్వహించి అర్హుల ఎంపిక ప్రక్రియ జరిపారు.

ప్రదక్షిణలు చేస్తున్నా..

రాయితీ రుణం కావడంతో ఆశావహులు ఎక్కువగానే ఉన్నారు. ప్రతి మున్సిపాలిటీ, మండలానికి 50లోపు యూనిట్లు మాత్రమే కేటాయించారు. అటు పంచాయతీల్లోనూ పది మందికిలోపే రుణాలు దక్కే అవకాశముంది. ఉమ్మడి జిల్లాలో 3,773 యూనిట్ల కోసం 53,487 మంది ఔత్సాహికులు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికీ చాలామంది కర్నూలులోని బీసీ కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. మరికొందరు జిల్లా కేంద్రాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతులు ఇస్తున్నారు.

ఆదాయం రూ.కోటి.. అసౌకర్యాలు పరిపాటి

☛ రైతులకు తప్పని ఇబ్బందులు

పత్తికొండ, న్యూస్‌టుడే: పత్తికొండ మార్కెట్ యార్డుకు ఏటా రూ.కోటికి పైగా ఆదాయం వస్తున్నా.. అక్కడికి వెళ్లే రైతులకు కనీస సౌకర్యాలు కరవయ్యాయి. అన్నదాతలు పండించే టమాటాతోపాటు వివిధ రకాల కూరగాయలు ఇక్కడికి తెచ్చి విక్రయిస్తారు. ప్రతి సోమవారం పశువుల సంత నిర్వహిస్తారు. వీటి ద్వారా మార్కెట్ యార్డుకు భారీగా ఆదాయం సమకూరుతోంది. నిత్యం రూ.లక్షల్లో వ్యాపారం సాగుతుంది. కానీ వ్యాపారులకు, రైతులకు కనీసం గుక్కెడు తాగునీరు కూడా లభించదు.

ఆరు నెలలు.. రూ.50.41 లక్షలు

పత్తికొండ మార్కెట్ కమిటీ ద్వారా జరిగే టమాటా, కూరగాయల విక్రయాలతోపాటు చెక్‌పోస్టులు, పశువుల సంత ద్వారా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రూ.50.41 లక్షలు సమకూరిందని అధికారులు చెబుతున్నారు. ఇవన్నీ కలిపి ఏటా రూ.కోటికిపైగా వస్తోంది. సౌకర్యాలు కల్పించడంపై దృష్టి సారించడం లేదు.

గుక్కెడు నీటికి కష్టమే...

పత్తికొండ మార్కెట్ యార్డు ఆవరణలోని తాగునీటి ట్యాంకు ఇది. ఈ నీటితోనే దాహార్తి తీర్చుకోవాలి. ఆదాయం వస్తున్నా.. దాహం తీర్చేందుకు నీరందించలేని దుస్థితి. పశువులకు నీరు దొరకదు. చిన్న పశువుల తొట్టి ఉన్నా. అందులో చుక్క నీరు ఉండదు. రైతులు తమ సరకు అమ్ముడుపోయేవరకు ఇక్కడ నిలబడే ఉండాలి. కూర్చునేందుకు ఎలాంటి సౌకర్యం లేదు.

టన్నుల్లో విక్రయాలు

మార్కెట్‌లో విక్రయానికి ఏటా నాలుగు వేల టన్నుల వరకు టమాటా ఉత్పత్తులు వస్తాయి. ఏటా 25 నుంచి 30 టన్నుల వరకు కూరగాయల అమ్మకాలు సాగుతాయి. రైతులు, వ్యాపారుల నుంచి రుసుం వసూలు చేస్తారు. ప్రతి వారం పశువుల సంతకు మేకలు, గొర్రెలు, పశువులు వస్తాయి.

క్రికెట్‌లో సూర్యతేజం

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే : నంద్యాల బొమ్మలసత్రానికి చెందిన దాసు, రేణుక దంపతుల కుమారుడు వనం యశ్వంత్ సూర్యతేజ.. ఏడో తరగతి చదువుతున్నాడు. అతనికి మొదటి నుంచి క్రికెట్ అంటే ఎనలేని మక్కువ. ఈ నేపథ్యంలో బౌలింగ్, బ్యాటింగ్‌తోపాటు ఫీల్డింగ్‌లోనూ సత్తా చాటుతున్నాడు. కోచ్ ప్రసన్న కుమార్, పాలిటెక్నిక్ కళాశాల ఫిజిక్స్ హెచ్‌వోడీ రాజేష్‌కుమార్ చేయూతతో ఏడేళ్లుగా సాధన చేస్తూ ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్నాడు. అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

☛ గతేడాది జనవరిలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడపలో అండర్-12 విభాగంలో జరిగిన పోటీల్లో ఐదు వికెట్లు తీసి బెస్ట్ బౌలర్ అవార్డు సాధించాడు. అదే ఏడాది డిసెంబరులో గుంటూరులో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో అండర్-14 విభాగంలో 50 పరుగులు సాధించి జట్టును గెలిపించాడు.

☛ ఈ ఏడాది ఆగస్టులో కర్నూలు జిల్లా పత్తికొండలో జరిగిన పోటీల్లో 57 పరుగులతోపాటు వికెట్లు సాధించి బహుమతి అందుకున్నాడు. ఈనెలలో కడప (అండర్-14)లో సౌత్‌జోన్ జట్ల (కర్నూలు, చిత్తూరు, అనంతపురం, కడప)తో జరిగిన పోటీల్లో 14 వికెట్లు తీయడం విశేషం. ఈనెల 25 నుంచి కడపలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో అతను పాల్గొననున్నాడు.

కొత్త కార్డులకు సరకులు

☛ 51,071 కుటుంబాలకు ప్రయోజనం

	■ కొత్త కార్డులు	■ కార్డుల విభజన
కర్నూలు	6,160	17,731
నంద్యాల	3,750	13,520

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ఉమ్మడి కర్నూలు జిల్లాలో కొత్తగా మంజూరు చేసిన బియ్యం పత్రాలతోపాటు విభజన కార్డుల లబ్ధిదారులకు వచ్చే నెల నుంచి సరకులు పంపిణీ చేయనున్నారు. కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని, తల్లిదండ్రుల కార్డు నుంచి విభజించి తమకు ప్రత్యేక కార్డు ఇవ్వాలంటూ వేలాది మంది కొన్ని నెలల కిందట దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో అర్హులకు కొత్త కార్డులు ఇవ్వడంతోపాటు కుటుంబ కార్డులను విభజించారు. గత సెప్టెంబరులోనే నూతన బియ్యం పత్రాలు, కార్డులను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంజూరు చేసింది. రెండు నెలలు గడిచినా లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు.

☛ స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చినా వాటిని అందించలేదు. సరకులు తీసుకోలేక నిరుపేదలు నష్టపోయారు. కార్డుల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసినా సమాధానం చెప్పేవారే కరవయ్యారు.

ఇంకెప్పుడు అందిస్తారో

● ఉమ్మడి కర్నూలు జిల్లాలో 9,910 మందికి కొత్త కార్డులు, 31,251 మందికి స్ప్లిట్ కార్డులు పంపిణీ చేయాల్సి ఉంది. రెండు నెలలుగా 41,161 మంది లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. అధికారులు మాత్రం పంపిణీపై దృష్టి పెట్టలేదు.

● మరోవైపు పాత కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులు ముద్రించి జిల్లాలకు పంపారు. రెండు నెలలైనా వీటి పంపిణీ పూర్తికాలేదు. ఉమ్మడి జిల్లాలో 12.01 లక్షల స్మార్ట్ కార్డులు పంపిణీ చేయాల్సి ఉండగా. 10.92 లక్షల కార్డులను మాత్రమే ఆయా ప్రాంతాల సచివాలయ ఉద్యోగులు, చౌకదుకాణాల డీలర్లు అందజేశారు.

● కర్నూలు జిల్లాలో 6,68,944 స్మార్ట్ కార్డులకుగాను 6,06,433 వరకు అందించారు. నంద్యాల జిల్లాలో 5,32,570 కార్డులకుగాను ఇప్పటివరకు 4,86,002 కార్డుల పంపిణీ పూర్తైంది. మరో 46,568 కార్డులు పెండింగ్‌లో ఉన్నాయి.

చిర్రెత్తుకొచ్చి.. పోలీసుల కారెత్తుకెళ్లాడు?

కర్నూలు నిఘా విభాగం, న్యూస్‌టుడే: పోలీసుల తీరుకు చిర్రెత్తుకొచ్చిన ఓ యువకుడు ఏకంగా వారి కారెత్తుకెళ్లిన ఘటన గురువారం జరిగినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆలూరు నియోజకవర్గానికి చెందిన ఓ యువకుడు మద్యం తాగి వాహనం నడుపుతూ.. పోలీసులకు పట్టుబడ్డాడు. ఆ యువకుడి వాహనాన్ని స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌లో ఉంచారు. తనకు వాహనం ఇచ్చే వరకు ఊరికి వెళ్లేది లేదని యువకుడు భీష్మించాడు. గ్రామస్థులను పిలిపించి యువకుడిని పంపేశారు. మరుసటి రోజు ఉదయం స్టేషన్‌కు రావాలని పోలీసులు చెప్పారు. ఆ యువకుడు గురువారం పోలీసుస్టేషన్‌కు వచ్చి తన వాహనం ఇవ్వాలని కోరాడు. స్టేషన్ ఆవరణలోని చెట్టు అరుగుపై కూర్చొన్నాడు. తన వాహనం ఇవ్వాలని.. లేదంటే పోలీసు జీపు తీసుకెళ్తానని చెప్పాడు. సాయంత్రం వరకు వేచి ఉన్నా.. వాహనం ఇవ్వకపోవడంతో చిర్రెత్తుకొచ్చిన ఆ యువకుడు చివరికి పోలీసు కారెత్తుకెళ్లాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అతడికి ఫోన్ చేసి వాహనం తీసుకురావాలని చెప్పారు. పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్తుండగా.. రహదారి మధ్యలోనే పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకొని యువకుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయమై సంబంధిత సీఐతో ప్రస్తావించగా.. అలాంటిదేమీ జరగలేదని, అనవసరమైన పుకార్లు చేస్తున్నారని, వాహనం తమ వద్దే ఉందని తెలిపారు.

నూతన వంగడం.. రైతుకు బలం

ఎంటీయూ 1426 రకం వరికి తెగుళ్లు తక్కువగా సోకుతుంది.. అధిక దిగుబడులు వస్తాయి. దీనిపై విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయి. పూర్తిస్థాయిలో ఫలితాలు వచ్చిన తర్వాత దీనిని రైతులకు అందుబాటులో తీసుకొచ్చేలా శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామంలో ఎంటీయూ 1426 వరి రకంపై క్షేత్ర దినోత్సవాన్ని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, కర్నూలు ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహాయ సంచాలకులు డా.జాన్సన్, ఏరువాక శాస్త్రవేత్త డా.సుజాతమ్మ మాట్లాడుతూ రైతులు ఈ రకం వరిని సాగు చేయడం ద్వారా సాగు ఖర్చులు తగ్గి అధిక దిగుబడులు వస్తాయని వివరించారు. ఈ రకం వరి రైతులకు అత్యంత అనుకూలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డా.రవిప్రకాశ్‌రెడ్డి, అధికారులు మద్దిలేటి, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కొత్తపల్లె (నంద్యాల గ్రామీణం)

దివ్యాంగులకు కానుక

■ ఉచితంగా మూడు చక్రాల మోటారు వాహనాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగులకు అండగా నిలుస్తోంది. వచ్చిన వెంటనే పింఛను మొత్తాన్ని రూ.6 వేలకు పెంచింది. దివ్యాంగులకు సంబంధించిన మోటారు సైకిళ్లకు 50 శాతం ఇంధన రాయితీ ఇస్తోంది. తాజాగా రూ.1.2 లక్షల విలువ చేసే మూడు చక్రాల మోటారు వాహనాలు ఉచితంగా అందజేయనుంది. అర్హులైనవారు నవంబరు 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకొని సంబంధిత ధ్రువపత్రాలతో కర్నూలు కలెక్టరేట్‌లోని దివ్యాంగులు, వృద్ధుల సహాయ సంస్థలో అందజేయాలని జిల్లా మేనేజరు రయీస్ ఫాతిమా సూచించారు.
– న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

ఈ ఏడాది నవంబరు 25వ తేదీ నాటికి 18 నుంచి 45 ఏళ్లలోపు వారై ఉండాలి. 70 శాతం, అంత కంటే ఎక్కువ వైకల్యం ఉండాలి. వార్షిక ఆదాయం రూ.3 లక్షల లోపు ఉండాలి. చెల్లుబాటయ్యే డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరి. ప్రభుత్వ లేదా ప్రైవేటు సంస్థల ద్వారా ఇంతకుముందు ఏ మోటరైజ్డ్ వాహనం తీసుకొని ఉండకూడదు. లేదా తన పేరుపై వాహనం ఉండకూడదు. డిగ్రీ, ఆపై స్థాయి కోర్సులు చదివే విద్యార్థులకు ప్రాధాన్యముంటుంది. స్వయం ఉపాధి, వ్యవసాయ అనుబంధ రంగాల్లో పనిచేసేవారు కనీసం పదో తరగతి పాసైన వారికి ప్రాధాన్యం ఉంటుంది. అవసరమైన పత్రాలను అభ్యర్థులు సిద్ధంగా ఉంచుకోవాలి.

దరఖాస్తు వెబ్‌సైట్ : ఏపీడీఏఎస్‌సీఏసీ.ఏపీ.జీవోవీ.ఇన్

మంజూరయ్యే వాహనాలు : 140

కర్నూలు : 70.. నంద్యాల : 70

నియోజకవర్గానికి.. 10 చొప్పున

జత చేయాల్సిన పత్రాలు

సదరం, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, పదో తరగతి బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్, పాస్‌పోర్టు సైజు ఫొటోతోపాటు ఇంతకుముందు వాహనం పొందలేదని స్వీయ ప్రకటన పత్రం జత చేయాల్సి ఉంటుంది.

పారదర్శకంగా ఎంపిక

– రయీస్ ఫాతిమా, జిల్లా మేనేజరు, విభిన్న ప్రతిభావంతుల సహాయ సంస్థ

అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తాం. మొదట పీజీ చదువుతున్న దివ్యాంగ అభ్యర్థులు, తర్వాత స్వయం ఉపాధి పొందుతున్న వారిని ప్రాధాన్యపరంగా ఎంపిక చేస్తాం. జిల్లా స్థాయి ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో దరఖాస్తుల పరిశీలన, ఎంపిక ప్రక్రియ ఉంటుంది. అర్హులైన అభ్యర్థులు త్వరగా దరఖాస్తు చేసుకోవాలి.

ఏఎస్సైలుగా పదోన్నతి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలో నలుగురు హెడ్ కానిస్టేబుళ్లు ఏఎస్సైలుగా పదోన్నతి పొందారు. ఆస్పరి హెడ్ కానిస్టేబుల్ మద్దిలేటి, కె.నాగలాపురం ఠాణా హెడ్ కానిస్టేబుల్ ఎండీ హనీఫ్, జూపాడుబంగ్లా పీఎస్‌కు చెందిన సి.నాగన్న, కోవెలకుంట్ల పీఎస్ హెడ్ కానిస్టేబుల్ డి.మీరాసాహెబ్‌కు పదోన్నతి కల్పించారు. హనీఫ్‌ను వెల్దుర్తి పీఎస్‌కు నియమించగా, మిగిలిన ముగ్గురినీ నంద్యాల జిల్లాకు కేటాయిస్తూ ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఉత్తర్వులు జారీ చేశారు.

జ్ఞాపకాల మదిలో...
జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృత్యస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి
మీరు చూపిన ఆప్యాయత..
అనురాగం మా అభ్యున్నతికి చేసిన ప్రోత్సాహం
మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.
మిమ్మల్ని రోజూ తలచుకొంటూ మా యదలోతుల్లో
భావాలను అక్షర రూపంలో నివేదించుకునేందుకు
స్మృతి, వర్ధంతి, జయంతి
ప్రకటనల వివరాలకు
కర్నూలు: 99899 97628
80080 12489
నంద్యాల: 90007 66039, ఆదోని: 80087 09793

గర్భిణులకు గండం

■ కీలక పోస్టులు ఖాళీ

ఈనాడు, కర్నూలు, కోసిగి, న్యూస్‌టుడే : మంత్రాలయం నియోజకవర్గ పరిధిలోని కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవసరమైన సదుపాయాలు కరవయ్యాయి. గైనకాలజిస్టు అందుబాటులో లేకపోవడంతో గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలోనే అత్యధిక సంఖ్యలో గర్భిణులు వచ్చే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా కోసిగి పీహెచ్‌సీకి గుర్తింపు ఉంది. ఏటా 1,400కు పైగా ప్రసవాలు అందులో జరుగుతున్నా సేవలు మాత్రం పూర్తిస్థాయిలో అందడం లేదు.

కోసిగిలో ఉన్న పీహెచ్‌సీని 16 గ్రామాలకు చెందిన 74,646 మంది వినియోగించుకుంటుంటారు. ఈ పీహెచ్‌సీలో గురు, శుక్ర, శనివారాల్లో గర్భిణులకు వైద్య సేవలు అందిస్తుంటారు. ఆయా రోజుల్లో 100 నుంచి 150 మంది వరకు గర్భిణులు వస్తుంటారు. కానీ గైనకాలజిస్టు పోస్టును నేటికీ మంజూరు చేయలేదు. ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో గైనకాలజిస్టు పోస్టు మంజూరు చేయాలని వైద్యులు కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. గర్భిణులకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు చేయాల్సి వస్తుంది. ఇది మరమ్మతులకు గురవడంతో పరీక్షల కోసం ఆదోనికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

కోసిగి పీహెచ్‌సీలో ప్రసవాల వివరాలు

సం॥	ప్రసవాలు
2021	1697
2022	1768
2023	1555
2024	1466
2025	767

(అక్టోబరు నెలాఖరు వరకు)

కోసిగిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

హైరిస్కు వారికి ముప్పు

● గర్భిణుల్లో కొందరికి రక్తహీనత, గుండె, థైరాయిడ్ సమస్యలు ఉంటాయి. అలాంటి హైరిస్క్ కేసులకు వైద్య సేవలందించాలంటే గైనకాలజిస్టులు అందుబాటులో ఉండాలి. ఈ విషయాన్ని ఆసుపత్రి వైద్యులు గతంలో మండల సర్వసభ్య సమావేశాల్లో ప్రస్తావించారు. కలెక్టర్‌కు నివేదించారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో హైరిస్కు కేసులను ఆదోనికి పంపాల్సి వస్తోంది.

● పీహెచ్‌సీల్లో సాధారణంగా ఐదుకు మించి పడకలు అందుబాటులో ఉండవు. గర్భిణులను దృష్టిలో ఉంచుకుని కోసిగి పీహెచ్‌సీలో 25 పడకలను అందుబాటులో ఉంచి వైద్యం అందిస్తున్నారు. అదనపు సిబ్బంది లేకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. హెడ్‌నర్స్ పోస్టు నాలుగు నెలలుగా ఖాళీగా ఉంది. కోసిగి పీహెచ్‌సీకి డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్టు ఉన్నప్పటికీ ఆ హోదా ఉన్న వైద్యుడిని నియమించలేదు.

ఆటల మైదానం.. చేరువలో విజ్ఞానం

◆ పీఎంశ్రీ పథకం.. విద్యార్థులకు వరం
◆ ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగు

ఆదోని పట్టణంలోని ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో గ్రంథాలయం, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్ నిర్మాణం

రూ.కోటితో అభివృద్ధి పనులు

ఆదోని విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులకు చదువుతో పాటు విజ్ఞానం.. సాంకేతిక నైపుణ్యం.. పెంపొందించాలని.. క్రీడాకారులుగా తయారు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పీఎంశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టింది. క్రీడా మైదానాల ఏర్పాటు, గ్రంథాలయాలు, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఆదోని నియోజకవర్గంలోని మూడు ప్రభుత్వ పాఠశాలల్లో పీఎంశ్రీ పథకం పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే 90 శాతం మేర పనులు పూర్తికావచ్చాయి. మరో రెండు నెలల్లో విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయి.

ఆదోని పట్టణంలోని ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, మండల పరిధిలోని పెద్దహరివాణం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పీఎంశ్రీ పథకం కింద ఒకటి, రెండో విడతల కింద రూ.కోటి వెచ్చించి పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

◆ ఆదోని పట్టణం ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో సుమారు 750 మంది విద్యార్థులు ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్నారు. ఈ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన సాంకేతిక విద్య, విజ్ఞానం అందించాలని ప్రభుత్వం ఈ పాఠశాలలో రూ.60 లక్షలతో గ్రంథాలయ భవనం, సైన్స్ ల్యాబ్ భవనం, కంప్యూటర్ ల్యాబ్ భవనాల నిర్మాణాలు చేపట్టింది. ఇప్పటికే 90 శాతం మేర నిర్మాణాలు పూర్తయ్యాయి. త్వరలో మిగిలిన పనులు ముగించుకొని ప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు.

◆ ఆదోని మండలం పెద్దహరివాణం జడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.30 లక్షలతో ఈ పాఠశాలలో గ్రంథాలయ భవన నిర్మాణం చేపట్టారు. దీంతో పాటు విద్యార్థుల కోసం కిచెన్ గార్డెన్, వాటర్ హార్వెస్టింగ్ ఏర్పాటు చేశారు. ఈ నిర్మాణాలు పూర్తికావచ్చాయి. గ్రంథాలయం, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్ అందుబాటులోకి వస్తే.. విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యం పెరుగుతుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

క్రీడాభివృద్ధిపై దృష్టి

ఆదోని మండలం పెద్దహరివాణం జడ్పీ ఉన్నత పాఠశాల, ఆదోని పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలల్లో పీఎంశ్రీ పథకం కింద ఒక్కో పాఠశాలకు రూ.5 లక్షల నిధులు విడుదల చేసింది. పెద్దహరివాణం జడ్పీ ఉన్నత పాఠశాలలో వాలీబాల్ కోర్టు, కబడ్డీ కోర్టుతో పాటు క్రికెట్ ఆడేందుకు నెట్ సౌకర్యంతో కూడిన మైదానం ఏర్పాటు చేస్తున్నారు. ఆదోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఖోఖో కోర్టు, కబడ్డీ కోర్టు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మైదానాలు పూర్తయితే క్రీడాకారులను తయారు చేసే అవకాశం ఉంటుందని వ్యాయామ ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

పెద్దహరివాణం ఉన్నత పాఠశాల మైదానంలో కబడ్డీ కోర్టు

ముక్కు మూసుకోవాల్సిందే..

నంద్యాల పట్టణం నుంచి మహానంది వెళ్లే దారిలో చిన్న చెరువు కట్ట వద్ద ప్రధాన రహదారి పక్కనే పట్టణంలోని వ్యర్థాలు వేయడంతో డంపింగ్ యార్డుగా మారింది. ఆ మార్గంలో మహానంది పుణ్యక్షేత్రానికి వందల సంఖ్యలో భక్తులు నిత్యం రాకపోకలు సాగిస్తారు. నెలల తరబడి నిల్వ ఉన్న చెత్త నుంచి దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పురపాలక అధికారులు స్పందించి చెత్తను తొలగించి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

మల్లన్నసేవలో రష్యా దేశస్థులు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జునస్వామివార్లను గురువారం రష్యా దేశానికి చెందిన ముగ్గురు మహిళలు దర్శించుకున్నారు. జ్యోతిర్లింగ యాత్రలో భాగంగా వారు శ్రీశైలాన్ని సందర్శించినట్లు తెలిపారు. శ్రీశైలంతో 11 జ్యోతిర్లింగాలు పూర్తి చేసి, రామేశ్వరం దర్శనానికి వెళ్తున్నట్లు వారు చెప్పారు. ఈ సందర్భంగా రష్యా దేశస్థులకు ఈవో ఎం.శ్రీనివాసరావు, శ్రీశైలప్రభ సంపాదకులు అనిల్‌కుమార్ శ్రీశైల పుణ్య క్షేత్రం విశిష్టతను వివరించారు. శ్రీశైలం ఆలయ ప్రాంగణంలో రష్యా దేశస్థులు ధ్యానంలో గడిపి ఆధ్యాత్మికానుభూతి చెందారు.

ఈవో ఎం.శ్రీనివాసరావు దంపతులతో రష్యా దేశస్థులు

పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేయండి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : పరిశ్రమల స్థాపనకు వీలుగా ఆయా శాఖలు నిర్దేశించిన గడువులోగా అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ డా.ఎ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. కర్నూలు కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా స్థాయి పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సింగిల్ డెస్క్, పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తులకు గడువులోపు అనుమతులను మంజూరు చేయాలని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన అనుమతులు ఇవ్వాలన్నారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం కింద లబ్ధిదారులకు రుణాలు త్వరగా మంజూరయ్యేలా చర్యలు చేపట్టాలని ఎల్డీఎంను ఆదేశించారు. జిల్లాలో పారిశ్రామిక ప్రగతి గురించి ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌కు సూచించారు. ఇటీవల నిర్వహించిన పారిశ్రామిక భాగస్వామ్య సదస్సులో చేసుకున్న ఎంవోయూల గురించి కలెక్టర్ సమీక్షించారు. పరిశ్రమల ప్రోత్సాహకాలకు సంబంధించి మూడు క్లెయిమ్‌లకు రూ.9.72 లక్షలకు ఆమోదం తెలిపినట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో పరిశ్రమలశాఖ జీఎం అశోక్‌కుమార్, డీడీ జవహర్‌బాబు, నగరపాలక కమిషనర్ విశ్వనాథ్, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కిషోర్‌కుమార్‌రెడ్డి, ఎల్డీఎం రామచంద్రరావు, ఏపీఐఐసీ జెడ్ఎం మధుసూదన్ రెడ్డి, డీపీవో భాస్కర్, వ్యవసాయశాఖ జేడీ పీఎల్ వరలక్ష్మి, ఉద్యానశాఖ అధికారి రాజకృష్ణారెడ్డి, ఎస్సీ ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రాజామహేంద్రనాథ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ డా.సిరి

రైతులకు ఇబ్బందులు తలెత్తొద్దు: కలెక్టర్

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సీసీఐ కేంద్రాలకు పత్తితో వస్తున్న రైతులకు ఇబ్బందులకు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఏ.సిరి పేర్కొన్నారు. మండలంలోని పెంచికలపాడు శివారులో మన్జీత్ పత్తి మిల్లులోని సీసీఐ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ గురువారం పరిశీలించారు. నిబంధనల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేసి వెనక్కి పంపొద్దన్నారు. సీసీఐ కేంద్రం వద్ద కొనుగోలు చేయని పత్తిని మిల్లర్లు కొనుగోలు చేయాలని ఆదేశించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎదురవుతున్న సాంకేతిక సమస్యలకు తగిన సహకారం అందించేలా సచివాలయం సిబ్బందికి సూచించారు. ఆమె వెంట మార్కెటింగ్ ఏడీ.నారాయణమూర్తి, తహసీల్దార్ వెంకటేశ్ నాయక్, ఏవో దస్తగిరిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా బాధితులకు అండగా నిలవాలి

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : తలసేమియా బాధితులకు ప్రతిఒక్కరు అండగా నిలవాలని సినీ నటుడు మంచు మనోజ్ పిలుపునిచ్చారు. నగరంలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో నందమూరి బాలకృష్ణ అభిమానులు మోక్షజ్ఞ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం తలసేమియా బాధితుల సహాయార్థం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ గోవిందరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంచు మనోజ్‌తో పాటు 81 మంది బాలకృష్ణ అభిమానులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో భూమా మౌనిక, మూడో పట్టణ సీఐ శేషయ్య, మోక్షజ్ఞ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు మోతీలాల్, కన్వీనర్ రమేష్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సభ్యులు అరుణ, నరసింహ, శ్రీనివాసయాదవ్, డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి భీమా శంకర్‌రెడ్డి, ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న సినీ నటుడు మంచు మనోజ్

'క్యూఎస్'లో వీఐటీకి 7వ ర్యాంకు

చెన్నై(వడపళని), న్యూస్‌టుడే: 'క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్'లో 2026 సంవత్సరానికి వేలూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(వీఐటీ)కి దేశవ్యాప్తంగా 7వ ర్యాంకు, అంతర్జాతీయంగా 352వ ర్యాంకు లభించింది. పర్యావరణ ప్రభావ విభాగంలో ప్రపంచవ్యాప్తంగా 194వ స్థానంలో నిలిచి ప్రత్యేకత చాటుకుందని వర్సిటీ గురువారం ప్రకటన విడుదల చేసింది. సస్టైయినబిలిటీని పరిగణనలోకి తీసుకుని ర్యాంకులను విడుదల చేసిందని వీఐటీ కులపతి డాక్టర్ జి.విశ్వనాథన్ పేర్కొన్నారు. సోషల్ ఇంపాక్ట్, గవర్నెన్స్, పర్యావరణ ప్రభావంలో వర్సిటీ అత్యంత ప్రతిభను కనబరుస్తోందని ఆయన అన్నారు. 2025లో అంతర్జాతీయ స్థాయిలో 396వ స్థానంలో ఉండగా 2026లో 352వ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు.

అక్రిడిటేషన్లకు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకుల ఆదేశాల మేరకు జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులు అక్రిడిటేషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమాచార, పౌర సంబంధాలశాఖ అధికారిణి కె.జయమ్మ సూచించారు. http:///mediarelations.ap.gov.in వెబ్‌సైట్‌లో పాత్రికేయులు ముందుగా వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకోవాలని గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. సంస్థలు అక్రిడిటేషన్ పోర్టల్‌లో రిజిస్టర్ అయ్యాక జర్నలిస్టులు తాము పనిచేస్తున్న సంస్థ వివరాలు ఇచ్చి దరఖాస్తు సబ్మిట్ చేయవచ్చన్నారు. జిల్లా నుంచి ప్రచురితమవుతున్న దినపత్రికలు, పీరియాడికల్స్, కేబుల్ ఛానళ్లకు సంబంధించిన వివరాలను ఆయా సంస్థలు పోర్టల్‌లో పొందుపరిచిన తర్వాతే దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఆయా దినపత్రికలు, పీరియాడికల్స్, కేబుల్ టీవీ యాజమాన్యాలు సంబంధిత పత్రాలు డాక్యుమెంట్లను పెన్‌డ్రైవ్‌లో పొందుపరిచి, ఒక సెట్ జిరాక్స్ కాపీలతో పాటు సమాచారశాఖ డీడీ కార్యాలయంలో అందజేయాలన్నారు.

జోడు బసవేశ్వరునికి లవణమే నైవేద్యం

శివాలయాల్లో ఈశ్వరుని ఎదుట ఒక నంది విగ్రహం ప్రతిష్ఠిస్తారు. ఇక్కడ మాత్రం జోడు బసవేశ్వరుల విగ్రహాలు ఆదోని మండలం ఇస్వీ గ్రామం మాత్రం ఇందుకు విరుద్ధం. ఈ గ్రామంలోని ఆలయంలో జోడు బసవేశ్వరస్వాములు ఉండటం విశేషం. ఆ నందుల వెనుక భాగంలో పార్వతి పరమేశ్వరులు కొలువుదీరడం ప్రత్యేకం. ఇలా జోడు బసవేశ్వర స్వాములు ఎక్కడా కనిపించవు. ఈ ఆలయానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ ఆలయాన్ని చోళ రాజులు కట్టించినట్లు చోళరాజుల ఆనవాళ్లు ఈ ఆలయంలో ఉంది. ఇక్కడ మరో ప్రత్యేకత ఏమిటంటే.. భక్తులు ఉప్పును నైవేద్యంగా సమర్పిస్తుంటారు. ప్రతి సోమ, గురువారాల్లో భక్తులు ఈ ఆలయానికి వచ్చి, స్వామి వార్లను దర్శించుకొని టెంకాయ, నైవేద్యంతో పాటు ఉప్పును సమర్పించి తమ మొక్కులు తీర్చుకోవడం విశేషం. ఏటా శ్రావణమాసం ఆఖరి సోమవారం స్వామి వారి రథోత్సవం నిర్వహిస్తారు.

– న్యూస్‌టుడే, ఆదోని సాంస్కృతికం

సర్వజన వైద్యశాలలో అరుదైన శస్త్రచికిత్స

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : గుండె శస్త్రచికిత్స చేసిన చోట తీవ్ర ఇన్‌ఫెక్షన్ కారణంగా ఛాతీ భాగం తెరచుకోవడంతో ప్రాణాపాయ స్థితికి చేరుకున్న 54 ఏళ్ల ఏసన్నకు అరుదైన శస్త్రచికిత్స చేసినట్లు కర్నూలు సర్వజన ఆసుపత్రి ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ మంజులాబాయి తెలిపారు. వైద్యశాలలో గురువారం ఆమె శస్త్రచికిత్సలో పాల్గొన్న వైద్యులతో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అనంతపురం జిల్లా కదిరికి చెందిన ఏసన్నకు నవంబరులో అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఓపెన్ హార్ట్ సర్జరీ చేశారని తెలిపారు. కుట్లు తీసిన తర్వాత ఇన్‌ఫెక్షన్ సోకిందన్నారు. దీంతో బెంగళూరుకు తీసుకెళ్లి రూ.10 లక్షలు ఖర్చు చేశారన్నారు. అయినాసరే ఇన్‌ఫెక్షన్ తగ్గకపోవడంతో అక్టోబరు 30న కర్నూలు సర్వజన వైద్యశాలకు తీసుకొచ్చారని తెలిపారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆయనకు ఈనెల 8న 3 గంటల పాటు శస్త్రచికిత్స చేసి తెరచుకున్న ఎద భాగాన్ని మూసివేశామని వివరించారు. ఈనెల 12న ఆయన్ను డిశ్చార్జి చేశామన్నారు. గురువారం ఆయన ఫాలోఅప్‌కు వచ్చారని, ఆరోగ్యంగా ఉన్నారని వెల్లడించారు. ఈ శస్త్రచికిత్సలో డాక్టర్ గంగాభవాని, డాక్టర్ సింధూప్రియాంక, డాక్టర్ విజయచంద్రమౌళి, పీజీలు పాల్గొన్నట్లు వివరించారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించండి

మంత్రాలయం, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీసు అధికారులకు, సిబ్బందికి సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంత్రాలయానికి గురువారం చేరుకున్న ఆయన గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. అనంతరం శ్రీమఠం పరిసర ప్రాంతాలు, క్యూలైన్లను పరిశీలించారు. మాధవరం, మంత్రాలయం పోలీస్ స్టేషన్లలో రికార్డులు తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఎస్పీ మాట్లాడుతూ..మాధవరం అంతరాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలన్నారు. తరచూ వాహనాల తనిఖీ, డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి, సీఐ రామానుజులు, ఎస్సై విజయ్‌కుమార్, స్పెషల్ బ్రాంచి రాఘవేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీమఠం పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీ, సీఐ

రాఘవేంద్రుని సన్నిధిలో తిక్కారెడ్డి

శ్రీమఠంలో తిక్కారెడ్డి, తెదేపా నాయకులు

మంత్రాలయం, న్యూస్‌టుడే: అమావాస్యను పురస్కరించుకుని మంత్రాలయం గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని గురువారం జిల్లా పార్లమెంట్ తెదేపా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి దర్శించుకున్నారు. పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు ఆయనకు శేషవస్త్రం, ఫలమంత్ర అక్షింతలు ఇచ్చి ఆశీర్వదించారు. వైకాపా కార్యకర్తలతో కలిసి ఇసుక అక్రమార్కులు పాత్రికేయులపై దాడులకు పాల్పడటం, దూషణలు చేయడంపై తిక్కారెడ్డి మండిపడ్డారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తెదేపా మండల నాయకుడు పన్నగ వెంకటేశప్పస్వామి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అమర్నాథ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, అబ్దుల్లా, సుంకప్ప, చిన్నిభీమ తదితరులు పాల్గొన్నారు.

గెలుపు తరుణం

ఆలూరు ప్రభుత్వ రెండో ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న తరుణ్ తేజ బాస్కెట్‌బాల్‌లో సత్తా చాటుతున్నాడు. ఆలూరుకు చెందిన వన్నూర్ స్వామి, సరస్వతి దంపతులు వ్యవసాయం చేస్తూ.. కుమారుడిని చదివించడంతో పాటు ఆటల్లో ప్రోత్సహిస్తున్నారు. వ్యాయామ అధ్యాపకురాలు రజియా శిక్షణలో సాధన చేస్తున్నాడు. అక్టోబరులో కర్నూలులో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో తరుణ్ తేజ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెలలో కృష్ణా, అన్నమయ్య జిల్లాల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. బాస్కెట్‌బాల్‌లో ఇప్పటికే రెండు సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. మూడోసారి కూడా ఎంపిక కావడంతో ప్రధానోపాధ్యాయిని ప్రశాంతి అభినందించారు. జాతీయ స్థాయిలో పాల్గొనడమే తన లక్ష్యమని చెబుతున్నాడు తరుణ్ తేజ. – న్యూస్‌టుడే, ఆలూరు

బాస్కెట్‌బాల్‌లో సాధన చేస్తున్న విద్యార్థులు

మిరప పంటపై గడ్డి మందు పిచికారీ.. పోలీసులకు ఫిర్యాదు

మంత్రాలయం, న్యూస్‌టుడే: గడ్డి మందు పిచికారీ చేసి దాదాపు రూ.10 లక్షలు విలువ చేసే మిరప పంటను నాశనం చేశారంటూ బాధితులు మంత్రాలయం పోలీసు స్టేషన్‌ను గురువారం ఆశ్రయించారు. మండల పరిధిలోని సూగూరు గ్రామానికి చెందిన పింజరి మాబుసాబ్ అనే రైతు ఎకరం భూమిలో దాదాపు రూ.2 లక్షలు అప్పు చేసి మిరప పంటను సాగు చేశారు. కాపు బాగా వచ్చి కోత దశకు వచ్చింది. ఈ తరుణంలో మూడు రోజుల కిందట కొందరు పంటపై గడ్డి మందు పిచికారీ చేయడంతో ఎండిపోయింది. చేతికొచ్చిన పంట నాశనం కావడంతో మాబుసాబ్, దస్తగిరమ్మ దంపతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది కూడా తీవ్రంగా నష్టపోయి, అప్పుల పాలయ్యామని వారు తెలిపారు. కారకులను కఠినంగా శిక్షించి, ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు. అనంతరం మంత్రాలయం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని సీఐ రామానుజులు తెలిపారు.

ఎండిపోయిన పంటను చూపుతున్న బాధిత రైతు

ఈరన్న స్వామికి విశేష పూజలు

కౌతాళం, న్యూస్‌టుడే: కార్తిక అమావాస్యను పురస్కరించుకుని ఉరుకుంద శ్రీనరసింహ ఈరన్న స్వామికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి ఉదయాన్నే పంచామృతాభిషేకం, సహస్రనామార్చన చేశారు. యాగశాలలో హోమం, లక్ష పుష్పార్చన గావించారు. అనంతపురం జిల్లా కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయ డిప్యూటీ కమిషనరు మేడేపల్లి విజయరాజు స్వామిని దర్శించుకున్నారు. ఉరుకుంద ఆలయ ఈవో వాణి ఆయనకు స్వామివారి శేషవస్త్రం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామివారికి విశేషమైన రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలొచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. వీధులు రద్దీగా మారాయి.

పూజలందుకుంటున్న ఈరన్న స్వామి

ఆపరేషన్ థియేటర్లను త్వరగా పూర్తిచేయండి

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : కర్నూలు సర్వజన వైద్యశాలలోని న్యూరో సర్జరీ, యూరాలజీ విభాగాల ఆపరేషన్ థియేటర్ల నిర్మాణాన్ని డిసెంబరులోగా పూర్తిచేయాలని కలెక్టర్ డా.ఎ.సిరి గుత్తేదారును ఆదేశించారు. సర్వజన వైద్యశాలను గురువారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. అత్యవసర వార్డు, మేల్ ఓపీ, క్రిటికల్ ఎమర్జెన్సీ వార్డు, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ ఓపీలు, సూపర్ స్పెషాలిటీ ఓటీలను, న్యూడయాగ్నోస్టిక్ బ్లాక్‌ను పరిశీలించారు. రోగులు, వారి సహాయకులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రోగ నిర్ధారణ, ఐపీ నంబర్ల ఎంట్రీలు సరిగా చేయడం లేదని.. నమోదు సక్రమంగా చేయాలని ఆర్థో విభాగం వైద్యులను ఆదేశించారు. ఏఎంసీలో స్త్రీ, పురుషులకు ఒకే శౌచాలయం ఉండటం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలోని మరుగుదొడ్లకు అవసరమైన మరమ్మతుల కోసం వెంటనే ప్రతిపాదనలు పంపాలని ఆసుపత్రి పర్యవేక్షకుడిని ఆదేశించారు. ఆసుపత్రిలో స్క్రాబ్ చాలా ఎక్కువగా ఉందని, ఎందుకు శుభ్రం చేయించడం లేదని ఆయన్ను ప్రశ్నించారు. అనంతరం వైద్య కళాశాలలోని వసతిగృహాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ సూపరింటెండెంట్స్ డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ లక్ష్మీబాయి, వైస్‌ప్రిన్సిపల్స్ డాక్టర్ హరిచరణ్, డాక్టర్ సాయిసుధీర్, ఆర్ఎంవో డాక్టర్ వెంకటరమణ, ఏపీఎంఎస్ ఐడీసీ ఈఈ చిరంజీవులు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధూసుబ్రహ్మణ్యం, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ పద్మజ పాల్గొన్నారు.

అత్యవసర విభాగంలో అందుతున్న వైద్య సేవలపై రోగిని ఆరా తీస్తున్న కలెక్టర్ డాక్టర్ సిరి

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

కంబాలపాడు(కృష్ణగిరి), న్యూస్‌టుడే: మండలంలోని కంబాలపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు తెలిపారు. అథ్లెటిక్స్, కబడ్డీ విభాగంలో బి.వెంకటేష్, పి.మహేష్, వి.శ్రీహరి, కె.జగదీష్, బాలికలు లావణ్య, పల్లవి, టి.రాజశేఖర్ ఎంపికైనట్లు తెలిపారు. వారు ఈ నెల 22, 23 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

ఎంపికైన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

సమగ్ర శిక్షా ఏపీసీగా లోకరాజు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : కర్నూలు జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా డాక్టర్ ఎన్‌బీ లోకరాజును నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వు జారీ చేసింది. ఆయన డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా పని చేస్తున్నారు.

ఎన్‌బీ లోకరాజు

నీరు-చెట్టు బిల్లుపై ఎంపీ, కలెక్టర్‌కు ఫిర్యాదు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: గడివేముల మండలంలో డబ్ల్యూయూఏ 13కు సంబంధించి ప్రభుత్వం మంజూరు చేసిన నీరు చెట్టు బిల్లును పాత నీటి సంఘం అధ్యక్షుడికి ఇస్తామని కేసీ కెనాల్ డీఈ రవికుమార్ అంటున్నారని నీటి సంఘం అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆరోపించారు. స్థానిక దిశ సమావేశంలో ఎంపీ డా.బైరెడ్డి శబరి, కలెక్టర్ రాజకుమారికి గురువారం ఆయన ఫిర్యాదు చేశారు. తాము ముగ్గురం 2018-19లో ఈ పనులు చేశామన్నారు.

నేటి నుంచి కబడ్డీ పోటీలు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : నగరంలోని జొహరాపురంలో ఉన్న డా.అంబేడ్కర్ మెమోరియల్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు ఎస్‌జీఎఫ్ఐ అండర్-17 బాల బాలికల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి టి.కృష్ణ గురువారం తెలిపారు. ఈ పోటీలను రాష్ట్ర మంత్రి టీజీ భరత్ శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ప్రారంభిస్తారని వెల్లడించారు.

23న క్రికెట్ జట్టు ఎంపికలు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : కర్నూలు డీఎస్ఏ స్టేడియంలోని క్రికెట్ నెట్‌లో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన (ఆదివారం) అండర్-12 జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యదర్శి కె.దేవేంద్రగౌడ్ గురువారం తెలిపారు. 2013 సెప్టెంబరు 1 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఏసీఏ ఆధ్వర్యంలో త్వరలో జరగబోయే అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో జిల్లా జట్టు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

CREATIVE EDUCATIONAL SOCIETY'S
COLLEGE OF PHARMACY
NH-44, CHINNATEKUR, KURNOOL. A.P. - 518218
Website:www.cescop.ac.in
SPOT & CAT-B ADMISSIONS 2025-26
Eligible Candidates for Admission into 1st year B.Pharmacy and Pharm-D Courses who have not taken Admission in any College Can attend for the Spot and Category-B Admissions on or before 24-11-2025 with all Original Documents as per Guidelines of AP EAPCET-25.
Contact: 8142233361/454 SECRETARY

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/ షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 73821 14647.

నెట్వర్క్ లీడర్స్‌కు మంచి అవకాశం నూతనంగా స్టార్టైన HYD కంపెనీలో మల్టిపుల్ ప్రొడక్ట్ బేస్‌డ్ ద్వారా డబ్బులు సంపాదించుకునే అవకాశం. 99599 74159.

TO LET

For Rent to Hospital, Poly Clinics, Diagnostic Centres 5200 Sft, G+1, 43/194-2, Line No-7, N.R.Peta, Kurnool. Cont: ✆ 89851 32552.

JOBS

3S Solutions: Required Marketing Executives for Solar Company. Contact: 80740 91107.

ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ శ్రీరామ్/ ముత్తూట్/ మణప్పురం స్టాఫ్, HDFC/AXIS బ్యాంక్, క్లర్క్, లోన్ రికవరీ బాయ్స్ కావలెను. ✆:76599 88728.

కర్నూలు నగరం నందు పని చేయుటకు మంచి వాక్చాతుర్యం గల లేడీ టెలీకాలర్స్ కావలెను. సంప్ర: 90322 23367.

కర్నూలులోని మెడికల్ ఏజెన్సీ మరియు పాల షాపులో పనిచేయుటకు ఆఫీసు బాయ్స్ మరియు డెలివరీ బాయ్స్ కావలెను. సంప్రదించండి. Cell: 83286 75684.

నంద్యాల జిల్లా బనగానపల్లె నెహ్రూ హైస్కూల్ హాస్టల్ నందు ఇంగ్లీష్, మ్యాథ్స్, బయాలజి సబ్జెక్టులు బోధించుటకు ప్రైమరీ హైస్కూల్ రెసిడెన్షియల్ టీచరు కావలెను. సంప్ర: 63020 26495, 95501 31444, 94410 56875.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

ఆదోని
• ఆదోని • ఆలూరు • పత్తికొండ

ముఖ్యమంత్రి సహాయ నిధితో పేదలకు ఆసరా

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యాధులతో బాధపడుతున్న పేద, మధ్య తరగతి ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆసరాగా ఉంటుందని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను గురువారం పలువురికి అందజేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు మనోహర్‌చౌదరి, బత్తిన లోక్‌నాథ్, ప్రమోద్‌కుమార్‌రెడ్డి, సుధాకర్, శ్రీనివాసులు, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ, న్యూస్‌టుడే: నేలతలమర్రి గ్రామానికి చెందిన ఈడిగ ప్రతాప్ చెట్టుపై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం రూ.లక్షలు ఖర్చయ్యాయి. మండల కన్వీనర్ విజయ్ భాస్కర్ ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా.. రూ.1,75,204 చెక్కు వచ్చింది. పత్తికొండలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు బాధితుడికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు రాజశేఖర్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఝాన్సీలక్ష్మీబాయి జయంతి

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని విశ్వనారాయణ కళాశాలలో ఝాన్సీలక్ష్మీబాయి జయంతి వేడుకలను పురస్కరించుకొని ఏబీవీపీ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ముందుగా ఝాన్సీలక్ష్మీబాయి చిత్రపటానికి అతిథులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది పద్మదేశాయి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ నాగజ్యోతి, ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ ఎర్రిస్వామి మాట్లాడారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 80085 73822

ఆస్పరి: ?: చిగళి గ్రామంలో ప్రధాన వీధిలోనే మురుగు పారుతోంది. అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేయించాలి. **- రంగన్న, రాజశేఖర్, చిగళి**

✔: గ్రామంలో ప్రధాన రహదారిలో ఇరువైపులా మురుగు కాల్వలు లేవు. సీసీ రహదారి, మురుగు కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం.

- నబిసాహెబ్. పంచాయతీ కార్యదర్శి, చిగళి

బురుజుల(మద్దికెర), న్యూస్‌టుడే: ?: బురుజుల బస్టాండు నుంచి గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి ఆరంభంలో మురుగు నిలుస్తోంది. **- పులికొండ, బురుజుల**

✔: పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

- విజయలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో మద్దికెర

వెల్దుర్తి, న్యూస్‌టుడే: ?: వెల్దుర్తి బ్రహ్మగుండం మార్గంలోని బ్రిడ్జి సమీపంలో చికెన్ దుకాణదారులు కోళ్ల వ్యర్థాలు వేస్తున్నారు. దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **- లక్ష్మీదేవి, వెల్దుర్తి**

✔: చికెన్ దుకాణాదారులతో మాట్లాడి కోళ్ల వ్యర్థాలను నివాస సముదాయాల్లో వేయకుండా చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు చేపడతాం. **- లక్ష్మీనాథ్, పంచాయతీ ఈవో, వెల్దుర్తి**

హొళగుంద: ?: స్థానిక ప్రధాన రహదారి అంచున తహసీల్దారు కార్యాలయానికి వెళ్లే మార్గంలో నీరు పారి, గుంత ఏర్పడింది. **- రామయ్య, హొళగుంద**

✔: పంచాయతీ కార్మికులకు సూచించి, సమస్య పరిష్కరిస్తాం. **- రంగమ్మ, సర్పంచి హొళగుంద**

తుగ్గలి, న్యూస్‌టుడే: ?: మారెల్ల గ్రామంలో బొంది మడుగులకు వెళ్లే ప్రధాన రహదారిలో మురుగు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **- సుంకన్న, మారెల్ల**

✔: మురుగు కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు వచ్చిన వెంటనే పనులు చేపడతాం.

- శ్రీహరి, ఈఓపీఆర్డీ, తుగ్గలి

తొలగిన మెలిక.. పనుల్లో కదలిక

◆ జేఎన్‌టీయూ బృందం నివేదికతో ఆమోదం
◆ పూర్తిచేసేందుకు రెండేళ్ల గడువు

ఏం జరిగిందంటే..

వాణిజ్య సముదాయం పనులు నెల తరబడి ఆగిపోవడం వల్ల పునాదుల్లో నీరు ఊరడం, ఇనుము తుప్పు పట్టడం, మట్టి వదులుగా మారడం వంటివి జరిగాయి. పనుల పునరుద్ధరణకు పురపాలక అధికారులు జేఎన్‌టీయూ నిపుణుల బృందాన్ని ఆశ్రయించింది. దీంతో గత నెల 22వ తేదీన బృంద సభ్యులు నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించి.. ఇనుము, మట్టి నమూనాలు సేకరించి, పరీక్షలకు తీసుకెళ్లారు. పునాదుల వాడిన ఇనుమును తుప్పు తొలగించి, వాటికి యాంటీ కోర్సు రంగులేయాలని, పునాది మట్టి వదులుగా కాకుండా, సిమెంట్‌తో పటిష్ఠంగా చేపట్టాలని సూచించింది. దీంతో యంత్రాలతో పనులు ఆరంభించారు.

సాగుతున్న వాణిజ్య సముదాయ నిర్మాణం

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో రిక్రియేషన్ క్లబ్ మైదానంలో ఆగిపోయిన పురపాలక వాణిజ్య సముదాయ నిర్మాణ పనుల్లో కదలిక వచ్చింది. రూ.33 కోట్లతో మూడు విభాగాల్లో 300లకు పైగా దుకాణాలు నిర్మించాలని, గతేడాది సార్వత్రిక ఎన్నికలకు ముందు పనులు మొదలు పెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి కేవలం పది శాతం పనులు మాత్రమే చేశారు. ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. ఎట్టకేలకు జేఎన్‌టీయూ నిపుణుల బృందం సూచనల మేరకు పనుల్లో కదలిక వచ్చింది.

మూడు విభాగాలు.. రూ.33 కోట్లు

ఇక్కడి ప్రాంతంలో సుమారు 3,125 చ.మీ. విస్తీర్ణంలో రూ.33 కోట్లతో మూడు విభాగాల్లో 300లకు పైగా దుకాణాలు నిర్మించాలని భావిస్తున్నారు. పనులు ఆరంభించిన నాటి నుంచి రెండేళ్లలో పనులు పూర్తి చేయాలని గడువు విధించింది. పనులు పూర్తయితే.. పురపాలికకు అద్దె రూపంలో ఆదాయం పెరుగుతుంది. ఇప్పటికే పట్టణంలో పలు చోట్ల పురపాలక సంఘానికి 165 దుకాణాలు ఉన్నాయి. వీటి ద్వారా ఏడాదికి రూ.కోటికి పైగా అద్దె రూపంలో ఆదాయం వస్తోంది. పట్టణంలో వ్యాపారులతో పాటు ప్రజలకు, ఉద్యోగ అవకాశాలు కొంత మెరుగుపడనున్నాయి.

నాడు నిధులు లేక..

పురపాలక నూతన వాణిజ్య సముదాయ నిర్మాణం చేపట్టాలని 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వం యోచించింది. వైకాపా అధికారంలోకి వచ్చాక నిధులు సమకూర్చలేకపోయింది. ఆసక్తి ఉన్న వారి నుంచే గుడ్‌విల్ ఆధారంగా నిధులు సేకరించి, వాటి ద్వారా దుకాణాలు నిర్మించాలని ప్రణాళిక చేసి, పనులు చేపట్టింది. వేలం నిర్వహణలో కేవలం ముందు వైపు డిమాండ్ ఉన్న దుకాణాలు మాత్రమే దక్కించుకున్నారు. మిగిలిన వాటికి ఎవ్వరూ ముందుకు రాలేదు. ఈ లెక్కన సుమారు 43 దుకాణాలు వేలం ద్వారా రూ.3-4 కోట్లు పురపాలక సంఘానికి గుడ్‌విల్ ఆధారంగా నిధులు సమకూరాయి. దీంతో పనులు చేస్తూవెళ్తే.. వాటికి డిమాండ్ ఏర్పడుతుందని భావిస్తున్నారు.

భూ సమస్యలకు పరిష్కారం

హొళగుంద, న్యూస్‌టుడే: గ్రామంలో భూ సంబంధిత సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్తే.. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హొళగుంద ఇన్‌ఛార్జి తహసీల్దారు నిజాముద్దీన్ పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గ్రామ రైతులు ఆదోని సబ్ కలెక్టర్‌కు వినతులు సమర్పించారు. దీంతో హెబ్బటం గ్రామ సచివాలయంలో గురువారం సంబంధిత రైతులతో భూములకు సంబంధించిన పత్రాలు, వివరాలు అడిగి తెలుసుకొని విచారణ చేపట్టి వాటిని పరిష్కరించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ఆదోని ఎస్సీ బాలుర కళాశాల వసతిగృహ విద్యార్థులకు గురువారం ఏఎస్‌డబ్ల్యూవో వెంకటరాముడు, వసతి గృహ నిర్వాహకుడు నాగమద్దయ్య దుప్పట్లు పంపిణీ చేశారు. మొత్తం 170 మంది విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయండి

ఆలూరు, న్యూస్‌టుడే: ఆలూరు మండలం హులేబీడు, తుంబళబీడు గ్రామ సచివాలయం పరిధిలో ఆధార్ సవరణ (అప్‌డేట్) కేంద్రం ఏర్పాటు చేయాలని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు రామాంజనేయులు, విజయభాస్కర్, మంజునాథ్ కోరారు. ఆలూరులో ఎంపీడీవో మద్దిలేటిస్వామిని గురువారం కలిసి వినతి పత్రం అందించారు. దీనిపై ఎంపీడీవో మాట్లాడుతూ.. ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

చిప్పగిరి, న్యూస్‌టుడే: చిప్పగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను ప్రిన్సిపల్ వరదరాజులు, ప్రధానోపాధ్యాయుడు లతీఫ్, విద్యాకమిటీ ఛైర్మన్ కె.నాగరాజు గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వీఆర్‌ఏల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని వీఆర్‌ఏల సంఘం మండల నాయకులు అయ్యస్వామి, వెంకటేశ్వర్లు అన్నారు. వేతనంతో పాటు అర్హులైన వారికి వీఆర్వోలుగా పదోన్నతి కల్పించి, సమస్యలు పరిష్కరించాలని తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఉపతహసీల్దారు గురుస్వామిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు ఉస్మాన్‌బాషా, సురేష్, రామాంజనేయులు, అనురాధ, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

స్పర్శ లేని మచ్చలతో ప్రమాదం

మద్దికెర, న్యూస్‌టుడే: చర్మంపై స్పర్శ లేని, నొప్పి లేని ఎర్ర, రాగి రంగులో ఉన్న మచ్చలతో ప్రమాదం పొంచి ఉందని వైద్యాధికారిణి రాగిణి అన్నారు. కుష్ఠు వ్యాధిగ్రస్థులను గుర్తించే కార్యక్రమంలో భాగంగా మద్దికెరలో గురువారం ఆమె వైద్య సిబ్బందితో కలిసి రామనగర్ కాలనీలో ఇంటింటికి తిరిగి స్థానికుల్లో అవగాహన కల్పించారు.

క్యాన్సర్‌తో అప్రమత్తం

దేవనకొండ, న్యూస్‌టుడే: క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి చికిత్సలు తీసుకోవాలని రాష్ట్ర బాల స్వాస్థ్య కార్యక్రమం సమన్వయ కర్త డాక్టర్ మహేశ్వర్ ప్రసాద్ పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు విజయ్, కల్యాణ్, సుధాకర్, సీహెచ్‌వో భాగ్యలక్ష్మీ, మంజూభార్గవి, సుప్రియ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తులు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించే ఉచిత కంప్యూటర్ శిక్షణలో చేరే యువతీ యువకులు ఈ నెల 21 నుంచి 30 లోపు దరఖాస్తులు చేసుకోవాలని శిక్షణ కో-ఆర్డినేటర్ అల్తాఫ్ కోరారు. ఈ నెల 30 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా పూర్తిచేసిన యువతీ యువకులు దరఖాస్తు చేసేందుకు అర్హులన్నారు. వివరాలకు 96033 03354 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

గుత్తి- పత్తికొండ రహదారికి మహర్దశ

తుగ్గలి, న్యూస్‌టుడే: దెబ్బతిన్న గుత్తి- పత్తికొండ ప్రధాన రహదారి మరమ్మతులకు రూ.5 కోట్లు మంజూరైనట్లు పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు తెలిపారు. రహదారి చాలా చోట్ల బాగా దెబ్బతినడంతో వాహనదారులు ఇబ్బందులు స్వయంగా చూసి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఈ మార్గంలో మంత్రాలయానికి వెళ్లే కర్ణాటక భక్తులు వాహనాలు ఎక్కువగా వెళ్తుంటాయన్నారు. స్థానిక ప్రజలు, యాత్రికులను దృష్టిలో పెట్టుకొని ఎంతో ప్రాధాన్యం ఉన్న ఈ మార్గం అభివృద్ధికి చర్యలు తీసుకొంటామన్నారు.

జొన్నగిరి వద్ద దెబ్బతిన్న రహదారి

ప్రమాదాలు నియంత్రించలేక

ఆలూరు మండలం హులేబీడు గ్రామంలోని ఎస్సీ కాలనీకి వెళ్లే మార్గంలో చిన్న విద్యుత్తు నియంత్రికలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ దారిలో కాలనీ వాసులతో పాటు విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. చేతికందేంత ఎత్తులో ఏర్పాటు చేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి నియంత్రిక చుట్టూ కంచె ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఆలూరు

కరెంటు తీగ.. తాకితే అంతేగా!

హొళగుంద మండలంలో కొందరు రైతులు వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ కోసం కర్రలపై తీగలు లాగారు. స్తంభాల ఏర్పాటుకు ఖర్చు అధికం అవుతుందని ఇలా చేశారు. భారీ ఈదురు గాలులు, వర్షాలు కురిసినప్పుడు ప్రమాదం తప్పదని ఆందోళన చెందుతున్నారు. హొళగుంద నుంచి వన్నూరు క్యాంపు వైపు వెళ్లే దారిలో పొలాల్లో ఇలా ఏర్పాటు చేసుకున్నారు. రహదారి పక్కనే ఇలా కర్రలపై తీగలు ఉండటంతో.. గ్రామాలకు, కర్ణాటక ప్రాంతానికి వెళ్లే ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. దీనిపై అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, హొళగుంద (హాలహర్వి)

అదుపు తప్పితే.. పాతాళంలోకే!

రామళ్లకోట నుంచి కల్వబుగ్గ మార్గంలోని జోషి మైన్స్ సమీపంలోని ఆర్‌అండ్‌బీ రహదారి కోతకు గురైంది. ఈ ప్రాంతంలో ఇనుప ఖనిజం తవ్వకాలు చేపట్టడంతో రహదారికి ఇరువైపులా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ప్రమాదాల నివారణకు ఇరువైపుల ఇనుప రెయిలింగ్ ఏర్పాటు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు రెయిలింగ్ చుట్టూ వేసిన మట్టి కోతకు గురై, రహదారి దెబ్బతింది. ఈ ప్రాంతంలో ఏమాత్రం అజాగ్రత్తగా వెళ్లినా.. అదుపుతప్పి 30 అడుగుల గోతిలో పడాల్సిందే. ఈ విషయంపై కర్నూలు ఆర్‌అండ్‌బీ డీఈ ఫణిరాంతో ప్రస్తావించగా.. సిబ్బందిని పంపిమరమ్మతులు చేపట్టి, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, వెల్దుర్తి

నీరు తొలగించారు

నీటిని తొలగిస్తున్న ట్రాక్టర్

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తి తహసీల్దారు కార్యాలయ సమీపంలోని రైల్వే భూగర్భ వంతెన కింద నిలిచిన నీటిని మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్, వెల్దుర్తి ఈవో లక్ష్మీనాథ్ ఆధ్వర్యంలో తొలగింపు చర్యలు చేపట్టారు. ఈ నెల 16న ‘ఈనాడు’లో ప్రచురితమైన ‘అటు వెళ్తే.. గోతిలో పడ్డట్లే’ అనే కథనానికి వారు స్పందించారు. వంతెన కింద ఉన్న నీటిని ట్రాక్టర్ మోటార్ సాయంతో తొలగించారు. గుంతలు సైతం పూడ్చివేయించే పనులు చేపడతామని వారు పేర్కొన్నారు.

స్పందనకు వందనం

అద్దె గదుల వ్యాపారులకు తాఖీదులు

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెర పంచాయతీ వ్యాపార గదుల్లో ఉంటూ.. అద్దె చెల్లించని వారికి అధికారులు తాఖీదులు జారీ చేశారు. పంచాయతీ ఆదాయం కోల్పోవడం, అద్దె బకాయిలపై ‘ఈనాడు’లో బుధవారం ప్రచురితమైన ‘పంచాయతీ గదుల్లో అద్దె వ్యాపారం’ అనే కథనానికి అధికారులు స్పందించారు. చెల్లించని వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలనే డీపీవో భాస్కర్ ఆదేశాల పంచాయతీ కార్యదర్శి తాఖీదులు జారీ చేశారు. ఇక నుంచి వరుసగా మూడు నెలలు అద్దె చెల్లించని వారి గదులకు తాళం వేసి వేలం నిర్వహిస్తామని పంచాయతీ కార్యదర్శి పేర్కొన్నారు.

కార్తిక దీపాలు.. ఆధ్యాత్మిక వెలుగులు

ఆదోని హనుమాన్ నగర్‌లో ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న పంచముఖి వీరాంజనేయస్వామి

హాలహర్వి: గాదిలింగేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఆదోని ఇస్వీ రహదారిలోని శివశంకరస్వామి ఆలయంలో భక్తులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

కార్తిక మాసం ముగింపు సందర్భంగా పలు గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో ఆలయాల ఆవరణలో కార్తిక దీపాలు వెలిగించారు. శివలింగం, గణపతి, స్వస్తిక్.. తదితర ఆకృతుల్లో దీపాలు వెలిగించారు. పలు చోట్ల నిర్వాహకులు అన్నదానం చేశారు. దీంతో పాటు అమావాస్య పూజలు సైతం నిర్వహించారు. భకఉతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, బృందం

మద్దికెర: సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో భక్తులు

ఆదోని: పెద్దహరివాణంలో గర్జిలింగేశ్వరస్వామి సన్నిధిలో కార్తిక మాసం ముగింపు ఉత్సవాలకు తరలివచ్చిన భక్తులు, చుట్టుపక్కల గ్రామస్థులు

ఆదోని కోట భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో శివలింగం ఆకారంలో వెలిగించిన దీపాలు

క్షయ బాధితులకు ఊరట

నిత్యావసర కిట్లు అందజేస్తున్న ఏపీఎన్జీవో సంఘం నాయకులు

ఆదోని వైద్యం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో పలువురు క్షయ బాధితులను ఏపీఎన్జీవో సంఘం నాయకులు గురువారం దత్తత తీసుకున్నారు. వారిలో రోగ నిరోధక శక్తి పెంచి, టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా రోగులకు ఆరు నెలల పాటు ఉచితంగా నిత్యావసర సరకుల కిట్లు అందించనున్నట్లు సంఘం తాలుకా అధ్యక్షురాలు ఉషారాణి తెలిపారు. ఎస్బీఐ ముఖ్య శాఖ మేనేజరు మద్దిలేటి చేతుల మీదుగా రోగులకు కిట్లు అందజేశారు. కార్యక్రమంలో కోశాధికారి మంజునాథ్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలి

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలని డిమాండు చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో నాయకులు ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి తిప్పన్న, ఉపాధ్యక్షుడు లక్ష్మన్న, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఈరన్న మాట్లాడారు. అనంతరం కార్యాలయ పరిపాలన అధికారిణికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశు, లోకేశ్, అజీమ్‌ఖాన్, జలందర్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన భాండాగారం శిథిల భవనం

పాఠకులకు, విద్యార్థులకు విజ్ఞానం అందించే ఆదోని పట్టణంలోని ప్రభుత్వ శాఖా గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరింది. 87 ఏళ్ల కిందట నిర్మించిన పురపాలక సంఘం భవనంలో ప్రస్తుతం ఈ గ్రంథాలయం కొనసాగుతోంది. ఇక్కడ సుమారు 36వేల వివిధ రరకాల పుస్తకాలు పాఠకుల కోసం అందుబాటులో ఉంచారు. వీటిలో పిల్లలకు అవసరమైన నీతిబోధన కథలు, పొడుపు కథలు, విజ్ఞాన, విహారయాత్రలకు సంబంధించిన పుస్తకాలతో పాటు నిరుద్యోగ యువతకు అవసరమైన పోటీ పరీక్షలకు సంబంధించినవీ ఉన్నాయి. పాఠకుల కోసం వార్త పత్రికలు, వారంతపు, మాస పత్రికలను అందుబాటులో ఉంచారు. రోజూ 150 నుంచి 200 మంది దాకా పాఠకులు గ్రంథాలయానికి వెళ్తుంటారు. గత నెల ఈ భవనం పైకప్పు పెచ్చులూడి పడింది. ఆ సమయంలో గదిలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గ్రంథాలయ నిర్వాహకులు భవనానికి మరమ్మతులు చేయించారు. గత వైకాపా ప్రభుత్వం గ్రంథాలయానికి కొత్త భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చినా.. నెరవేరలేదు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి శిథిలావస్థకు చేరిన గ్రంథాలయానికి కొత్త భవనం నిర్మించాలని పాఠకులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఆదోని విద్య

రైతులకు ఆర్థిక సహకారం అందిద్దాం

సహకార సంఘాల ఛైర్మన్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా రైతులకు ఆర్థిక సహకారమందిద్దామని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. పత్తికొండలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన నియోజకవర్గంలోని ఆయా వ్యవసాయ పరపతి సంఘాల ఛైర్మన్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు దీర్ఘకాలిక రుణాలు, వ్యవసాయ ఆధారిత పరికరాలు, అవసరమైన ఎరువులను రాయితీతో అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆయా పరపతి సంఘాల ఛైర్మన్లు చందోలి రంగప్ప, ఎద్దులదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, అప్పా వేణు, ఆనంద్, ఎర్రిస్వామి, నక్క నాగరాజు, శేషాద్రి, రమాకాంత్‌రెడ్డి, తెదేపా సీనియర్ నాయకులు సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: రబీలో సాగు చేసే పప్పుశనగ, వేరుసెనగ, ఉల్లి, వాము, మిరప, మినుము పంటలకు అవసరమైన మేర సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటిస్తే.. అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ అన్నపూర్ణ, బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం డైరెక్టర్ రాఘవేంద్ర అన్నారు. పత్తికొండలో గురువారం నిర్వహించిన రైతు సేవా కేంద్రాల సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. శిక్షణ అనంతరం మినుము పంట సాగు చేసే రైతులకు ఉచితంగా విత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో పత్తికొండ ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్, వ్యవసాయాధికారి వెంకటరాముడు, వ్యవసాయ విస్తరణాధికారులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు మినుములు అందజేస్తున్న వ్యవసాయాధికారులు

అన్ని చెరువులు నింపాలి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: హంద్రీనీవా నీటితో పత్తికొండ నియోజకవర్గంలోని అన్ని చెరువులను నింపటమే కాకుండా పంట కాల్వల ద్వారా రైతులకు సాగు నీరు అందించాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా చేపట్టిన ఉద్యమాల్లో భాగంగా పత్తికొండ నియోజకవర్గంలోని ఆయా మండలాలు, గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం పత్తికొండలో మహా ప్రదర్శన చేపట్టారు. ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు. మండల కార్యదర్శి కె.వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు రంగారెడ్డి, దస్తగిరి, గోపాల్, రవిచంద్ర, కొండారెడ్డి, శ్రీరాములు, రమేశ్, బజారి, రాముడు, నరసన్న, బుజులు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న నాయకులు

వృద్ధులకు ఆప్యాయత పంచాలి

వృద్ధులను పరీక్షిస్తున్న వైద్యాధికారిణి కల్పన, తదితరులు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: వృద్ధాప్యంలో కుటుంబ సభ్యులకు ప్రేమ, ఆప్యాయతలు పంచాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ సమన్వయకర్త, అసంక్రమిత వ్యాధుల నియంత్రణాధికారి మహేశ్వర ప్రసాద్ అన్నారు. పత్తికొండ శివారులోని హోసూరు రోడ్డులోని రూరల్‌ట్రైబల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పత్తికొండ సీహెచ్‌సీ, పుచ్చకాయలమడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు కల్పన, రాఘవనాయుడు, ఆయా విభాగాల వైద్యులు, మధుప్రియ, జాన్వి, రవికిరణ్, చైతన్య, వెంకటేశ్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరం 23న

ప్రచార పత్రాలను విడుదల చేస్తున్న ఆవోపా సభ్యులు

ఆదోని పాత పట్టణం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాలలో ఆవోపా, వామ్ సంయుక్త ఆధ్వర్యంలో 23వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆవోపా పట్టణ అధ్యక్షుడు శ్రీనాథ్‌గుప్తా, ఎన్నారై కాకుబాల్ నగేష్ కుమార్ తెలిపారు. గురువారం శిబిర ప్రచార పత్రాలను విడుదల చేసి మాట్లాడారు. ఏషియన్ వ్యాస్కులర్, శాంతిరాం ఆస్పత్రుల సారథ్యంలో కంటి, రక్తనాళాల ఉచిత వైద్య సేవలుంటాయన్నారు. 9980269662కు సంప్రదించి, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

(c) eenadu

రైతుల సంక్షేమానికి పెద్దపీట

చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న తెదేపా శ్రేణులు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసిందని మండల తెదేపా నాయకులు తిరుపతయ్య, రామాంజనేయులు, బేతాలబేసా, మహేంద్రస్వాం తుల్లా, మురళీనాయుడు, చంద్రశేఖర్ పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ పథకం నిధులు విడుదల చేయడంతో గోనెగండ్లలోని తెదేపా కార్యాలయం ముందు గురువారం ప్రధాని, సీఎం, ఉపముఖ్యమంత్రి చిత్రపటాలకు కూటమి నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు
• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

వ్యవసాయ రంగం బలోపేతానికి కృషి

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తుందని కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు తెలుగు ఈరన్న పేర్కొన్నారు. స్థానిక భాజపా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రం అందించే రూ.5వేలతో పాటు కిసాన్ సమ్మాన్ నిధి కింద రైతుల ఖాతాల్లో రూ.2వేల జమ చేసినట్లు వెల్లడించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఎమ్మిగనూరు గ్రామీణం 80085 73794 కోసిగి 95504 34095

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ?: 13వ వార్డు కొత్త వీధిలో రాత్రి వేళ విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. - అనీఫ్ అమర్, కాలనీవాసి

?: ఎన్టీఆర్ కాలనీ బోర్డు సమీపంలో సిమెంట్ రహదారి అడుగు మేరకు గుంత ఏర్పడింది. - ఖాజాబాషా

✓: మురుగ పైపులైన్ బోర్డు గుంతలు పడ్డాయి. - రంగన్న

✓: సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తాం. నూతన రహదారులకు ప్రతిపాదనలు పంపాం. - గంగిరెడ్డి, పురపాలక కమిషనర్

?: గాంధీనగర్ కాలనీలో వెన్నారెడ్డి కాంప్లెక్స్ వెనుక మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. -ఆనంద్, విక్రాంత్ ఉప్పర్

✓: కాల్వను శుభ్రం చేయిస్తాం. -శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: ?: మేకడోన గ్రామంలో మురుగు కాల్వలు శుభ్రం చేయకపోవడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. -నర్సయ్య, మేకడోన

?: మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో బస్టాండు వద్ద ప్రధాన అంతర్గత రహదారి వద్ద మట్టి గురుసు వేయాలి. - ఆటో సూరి, కల్లుకుంట

?: మండల పరిధిలోని చిన్నకడబూరు గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయం వెనక భాగంలో గొట్టపు ద్వారానికి లీకేజీలు ఏర్పడి తాగునీరు వృథా పోతోంది. మరమ్మతులు చేయాలి. - నర్సన్న, చిన్నకడబూరు

✓: సమస్యలను పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - ప్రభావతి దేవి, ఎంపీడీవో, పెద్దకడబూరు

సమస్యలు విన్నారు.. పరిష్కారానికి ఆదేశించారు

■ ఈనాడు ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ కార్యక్రమం

ఫోన్‌ఇన్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎస్‌ఈ విజయరాజు, ఏడీఈ నాగేంద్ర, ఏఈ ప్రసన్నాంజనేయులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరు, కోడుమూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో నెలకొన్న విద్యుత్తు సమస్యల పరిష్కారానికి 'ఈనాడు' గురువారం విద్యుత్తు శాఖ ఎస్‌ఈ విజయరాజు, ఏడీఈ నాగేంద్ర, ఏఈ ప్రసన్నాంజనేయులతో నిర్వహించిన 'ఫోన్‌ఇన్' కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. వినియోగదారులు అడిగిన ప్రశ్నలు, సమస్యలను విని వాటికి సమాధానమిచ్చారు. సమస్యల పరిష్కారానికి ఆదేశించారు. విద్యుత్తు అధికారులు ఇచ్చిన సమాధానాలు ఇలా ఉన్నాయి.

?: వర్కూర్‌లో ఇప్పటికే విద్యుత్తు లైన్ ఉండటంతో తొలగించాలనుకు వేరే లైన్ పూర్తి చేశారు. ప్రస్తుత లైన్ తొలగించండి - తిమోతి, వర్కూర్

✓: వారం రోజుల్లో విద్యుత్తు లైన్ మారుస్తాం.

?: పంపన్నగౌడ్ కాలనీలో విద్యుత్తు స్తంభం ఒరిగిపోయింది. - సుఖాన్, కాలనీవాసి

✓: కొత్త విద్యుత్తు స్తంభం ఏర్పాటు చేస్తాం.

?: పట్టణంలో 11, 16, 18వ వార్డుల్లో విద్యుత్తు తీగలు కిందకు వేలాడుతున్నాయి. - కాశీవలి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి, ఎమ్మిగనూరు

✓: సమస్యను పరిశీలించి తీగలు అమర్చుతాం.

?: మునిప్పనగర్ కాలనీలో లోవోల్టేజీ సమస్యతో తరచూ విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. - వీరేష్ యాదవ్, కాలనీవాసి

✓: నూతన విద్యుత్తు నియంత్రికను ఏర్పాటు చేస్తాం.

?: 18 వార్డులో విద్యుత్తు లోఓల్టేజీతో రాత్రి వేళ ఇబ్బందులు పడుతున్నాం. - కాశీంవలి, 18వార్డు

✓: సమస్యను పరిశీలించి పరిష్కరిస్తాం.

?: 13వ వార్డులో కొత్త వీధి వద్ద విద్యుత్తు సరఫరా సక్రమంగా ఉండటం లేదు. రాత్రి వేళ ఇబ్బందులు పడుతున్నాం. - అనీఫ్, కాలనీవాసి

✓: విద్యుత్తు లైన్లు పరిశీలించి సమస్యలను తీర్చుతాం.

?: కోసిగిలో మిద్దెపై విద్యుత్తు తీగలు వాలాయి. - చిదానందం, కోసిగి

✓: తీగలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.

?: గోనెగండ్లలో సినిమా టాకీస్ సమీపంలో విద్యుత్తు స్తంభం శిథిలమైంది. -ప్రతాప్‌రెడ్డి, గోనెగండ్ల గ్రామం

✓: నూతన విద్యుత్తు స్తంభం ఏర్పాటు చేస్తాం.

?: గాంధీనగర్ కాలనీలో మనోజ్ ఆసుపత్రి ఎదురుగా ఉన్న వీధిలో విద్యుత్తు స్తంభం ఒరిగిపోయింది. - సూగూరప్ప, గాంధీనగర్

✓: ఒరిగిన విద్యుత్తు స్తంభాన్ని మారుస్తాం.

?: సాయిగణేశ్ కాలనీలో విద్యుత్తు స్తంభాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. సమస్యను పరిష్కరించండి. - గోపాల్, కాలనీవాసి

✓: నూతన విద్యుత్తు స్తంభాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం.

?: పార్లపల్లిలో విద్యుత్తు స్తంభాలు ఒరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. - మల్లికార్జున, పార్లపల్లి

✓: ఒరిగిన విద్యుత్తు స్తంభాలకు మరమ్మతులు చేయిస్తాం.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

సూచనలు ఇస్తున్న డీఎస్పీ భార్గవి

గోనెగండ్ల, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి పేర్కొన్నారు. గోనెగండ్లలోని కస్తూర్బా పాఠశాలను డీఎస్పీ గురువారం సందర్శించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆడ పిల్లల రక్షణకు శక్తి టీమ్‌ను ఏర్పాటు చేసిందన్నారు. అండర్-19 విభాగంలో జోనల్ పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో శిక్షణ ఎస్సై అనిల్‌కుమార్, ఎంఈవో-1 రామాంజనేయులు, ప్రిన్సిపల్ విజ్యవతి, పీడీ కల్యాణి, విజయరాణి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి అభినందన

నందవరం, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందవరానికి చెందిన విద్యార్థి బి.మహేష్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ తెలిపారు. విద్యార్థిని గురువారం అభినందించారు.

విద్యార్థితో ఉపాధ్యాయ బృందం

ఘనంగా భజన పోటీలు

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వెంకటగిరి గ్రామంలో వెలసిన శ్రీగిడ్డాంజనేయస్వామి క్షేత్రంలో రాష్ట్ర స్థాయి భజన పోటీలు ఘనంగా నిర్వహించారు. స్వామికి అమావాస్య పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

దారంతా గోతులు.. ప్రయాణానికి అవస్థలు

నిత్యం రద్దీగా ఉంటుంది. దారంతా గుంతలమయంగా మారింది. ఎమ్మిగనూరు-వయా బనవాసి మీదుగా పెద్దకడబూరుకు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. ఆ దారిలో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. బనవాసి గ్రామంలో వాహనాలు గుంతలోకి ఇరుక్కుపోయి అవస్థలు పడుతున్నారు. బనవాసి నుంచి పెద్దకడబూరుకు దాదాపు అరకిలోమీటర్ వరకు 150కిపైగానే గుంతలు పడ్డాయి. ఆ మార్గంలో 8 గ్రామాల ప్రజలు, వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. అధికారులు రహదారికి మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. - న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

నియంత్రిక ప్రమాద ఘంటిక

కోడుమూరు పట్టణంలోని పాత బస్టాండులోని విద్యుత్ నియంత్రిక ప్రమాదకరంగా మారింది. దాని చుట్టూ రక్షణ గోడలు లేవు. ఆ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. దాంతో ఆ ప్రదేశంలో ప్రజలు రాకపోకలకు భయాందోళన చెందుతున్నారు. నియంత్రిక చుట్టూ పక్కల అనేక దుకాణాలు ఉన్నాయి. వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అధికారులు స్పందించి నియంత్రిక చుట్టూ రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కోడుమూరు పట్టణం

నిర్వహణ కరవైంది.. నిరుపయోగంగా మారింది

మండలంలోని నదికైరవాడి గ్రామంలో శుద్ధజల కేంద్రం నిరుపయోగంగా మారింది. వాటి నిర్వహణ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. గ్రామంలో సుమారు 200 కుటుంబాలు ఉన్నాయి. తుంగభద్ర నది నుంచి వచ్చే కలుషిత నీరు తాగుతున్నామని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి శుద్ధ జలకేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నదికైరవాడి (నందవరం)

వెలగని దీపం.. ప్రజలకు శాపం

నందవరం మండల పరిధిలోని పోనకలదిన్నెలో వీధి దీపాలు రెండు నెలలుగా వెలగడం లేదు. దాంతో కాలనీలు చీకటిగా మారాయి. ఫలితంగా విష పురుగులు సంచరిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆ సమస్యపై పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచికి విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన వీధి దీపాలను ఏర్పాటు చేయాల్సి ఉంది.

– న్యూస్‌టుడే, పోనకలదిన్నె (నందవరం)

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

అవగాహన కల్పిస్తున్న ఎంఈవో వసంతలక్ష్మి

కోడుమూరు పట్టణం, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈవో వసంతలక్ష్మి సూచించారు. పరీక్షల సన్నద్ధతకు వంద రోజుల ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. స్థానిక జడ్పీ బాలిక ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. క్రమశిక్షణతో చదవాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇంద్రదేవి, ఫిజికల్ సైన్స్ అసిస్టెంట్ నీలకంఠేశ్వర, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

పరమ పవిత్రం.. కార్తికం

ఎమ్మిగనూరు, కోడుమూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో కార్తికమాసం అమావాస్య ముగింపు వేడుకలను శక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా దేవాలయాల్లో వైభవంగా పూజలు చేశారు.

పార్లపల్లి: ప్రభోత్సవంలో పాల్గొన్న భక్తులు

మహిళలు దీపాలు వెలిగించారు. పలు ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు చేశారు. – న్యూస్‌టుడే, బృందం

ఆలయాల్లో పూజలు

కంబదహల్(సి.బెళగల్), న్యూస్‌టుడే: మండలంలోని కంబదహల్ గ్రామంలో సాయి బాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పల్లకి సేవా నిర్వహించారు. పోలకల్‌లో సద్దురు శింగరయ్య ఆలయంలో నాగదోష నివారణ, కొత్తకోటలో రాఘవేంద్రస్వామి మఠంలో, గుండ్రేవుల గ్రామంలో సుబేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఖానాపురం: ప్రత్యేక అలంకరణలో బాల ఆంజనేయస్వామి

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు

పుస్తక పఠనం ఊహాశక్తితో పాటు ఆలోచన విధానాన్ని, పరిధిని పెంచుతుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. కొత్త విషయాలు తెలుసుకోవచ్చు. 58వ జాతీయ గ్రంథాలయం వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. విద్యార్థులకు వ్యాస రచన, ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, అధికారులను గ్రంథాలయ అధికారులు సన్మానించారు.– న్యూస్‌టుడే, బృందం

కోడుమూరు: బహుమతులు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మంత్రాలయం: విద్యార్థులతో గ్రంథాలయ అధికారిణి, తదితరులు

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మంత్రాలయం, న్యూస్‌టుడే: జాతీయస్థాయి సెపక్ తక్రా పోటీలకు మంత్రాలయం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని రాధమ్మ ఎంపికైనట్లు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు వితోభారావు తెలిపారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ..ఈ నెలలో 5,6వ తేదీలలో అనంతపురం జిల్లా ఉరవకొండలో నిర్వహించిన అండర్-19 రాష్ట్రస్థాయి పోటీల్లో కర్నూలు జిల్లా జట్టు తరుపున తమ విద్యార్థిని పాల్గొని ప్రతిభ చాటారన్నారు. జాతీయ జట్టుకు ఎంపికైన ఏకైక క్రీడాకారిణిగా రికార్డు సృష్టించిందన్నారు. డిసెంబరులో రాజస్థాన్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. విద్యార్థినిని పీడీ రవీంద్ర, పీఈటీ నరసింహరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

సబ్‌స్టేషన్ పనుల పరిశీలన

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: బనవాసి ఫారం వద్ద రూ.124 కోట్లుతో నిర్మిస్తున్న విద్యుత్తు సబ్‌స్టేషన్ పనులను మైనింగ్ విజిలెన్స్ ఏజీ రాజశేఖర్ గురువారం పరిశీలించి విచారణ చేశారు. ఆయన మాట్లాడుతూ.. సబ్ స్టేషన్ పనుల అవసరమైన మట్టిని మైనింగ్ అనుమతితో తీసుకోవాలన్నారు. ప్రభుత్వం రాయల్టీ కింద మట్టి తవ్వుకునేందుకు అనుమతి ఇస్తుందన్నారు. అనుమతి లేని తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇన్‌స్పెక్టర్ సాంబశివారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ దిలిప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులు శుభ్రం చేస్తూ.. నిరసన

నిరసన తెలుపుతున్న కార్మికులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: మృతి చెందిన కార్మిక కుటుంబాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ నాయకుడు తిమ్మగురుడు డిమాండు చేశారు. కార్మికులతో కలిసి గురువారం సోమప్పకూడలిలో చిపుర్లుతో నిరసన చేపట్టి ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కరోనా సమయంలో మృతి చెందిన 13 మంది కార్మికుల కుటుంబాలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రంగన్న, విజయేంద్ర, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాజు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు. అనంతరం నాలుగో రోజు రిలేనిరాహార దీక్షల్లో పాల్గొన్నారు.

స్థానికులుగా గుర్తించాలని వినతి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శ్రేష్ఠ పథకం ద్వారా ఎంపికై వివిధ రాష్ట్రాల్లో చదువుకుంటున్న ఎస్సీ విద్యార్థులను లోకల్ విద్యార్థులుగా గుర్తించాలని ఏపీ శ్రేష్ఠి పేరెంట్స్ ఆధ్వర్యంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్యకు గురువారం ఎమ్మిగనూరు వాసులు వినతి పత్రాన్ని అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. ఉన్నత చదువులను ఇతర రాష్ట్రాల్లో చదివితే నాన్‌లోకల్‌గా ఎలా పరిగణిస్తారని వాపోయారు. కావున సీపీఐ నాయకులు తమ ఉద్యమాలకు మద్దతు ఇవ్వాలన్నారు.

బ్యాంకింగ్ పరీక్షలపై ఉచిత శిక్షణ

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: బ్యాంకింగ్ రంగంలో రాణించాలంటే పోటీ పరీక్షలు కీలమని మహాయోగి లక్ష్మమ్మ అవ్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ మహబూబ్‌బాషా పేర్కొన్నారు. బ్యాంకింగ్ పరీక్షలపై గురువారం కళాశాలలో సాయిక్రిష్ణ కోచింగ్ కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివితే బ్యాంకు ఉద్యోగం సాధించడం సులభమన్నారు. అనంతరం కోచింగ్ సెంటర్ నిర్వాహకులు విద్యార్థులకు మెటీరియల్స్ అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సుశీల, కోర్డినేటర్ క్రాంతికుమార్, సాయి కృష్ణ కోచింగ్ సెంటర్ మేనేజర్ గంగాధర శివ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్ మహబూబ్‌బాషా

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ధర్నా

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవన కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకుడు గోవిందు డిమాండు చేశారు. పట్టణంలో రాఘవేంద్ర కాలనీలోని లేబర్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. భవన కార్మికుల సంక్షేమానికి పదేళ్లుగా నిధులు విడుదల చేయలేదన్నారు. ప్రభుత్వం హామీలు ఇచ్చి విస్మరించిదన్నారు. వైకాపా హయాంలో బిల్డింగ్ కార్మికులకు రూ.10 వేలు ఇస్తామని పంపిణీ చేయలేదన్నారు. కార్యక్రమంలో భవన కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

మండల సమస్యలు పరిష్కరించాలి

వినతిపత్రం అందిస్తున్న నాయకులు కార్యకర్తలు

సి.బెళగల్, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు మరుగుదొడ్లు, డ్రైనేజీ కాల్వలు వంటి ఇతర సమస్యలు పరిష్కరించాలని గురువారం తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఎం పార్టీ ప్రాంతీయ నాయకుడు జె. మోహన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో అనేక ప్రజా సమస్యలు దశాబ్దాలుగా తీరక అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. తహసీల్దారు వెంకటలక్ష్మీకి వినతి పత్రం అందజేశారు. సీపీఎం మండల నాయకులు పాల్గొన్నారు.

రెండు ట్రాక్టర్ల పట్టివేత

కోడుమూరు, న్యూస్‌టుడే: కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామంలో అక్రమంగా ఎర్రమట్టి తవ్వి, రవాణా చేస్తున్నట్లు సమాచారం రావడంతో గురువారం సాయంత్రం కోడుమూరు పోలీసులు దాడులు నిర్వహించారు. జేసీబీ, రెండు ట్రాక్టర్లను పట్టుకుని కోడుమూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. జిల్లా మైనింగ్ అధికారులకు సమాచారం అందించారు.

బాలికలు.. భవిష్యత్తు దీపికలు

● పలు రంగాల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

కోడుమూరు, న్యూస్‌టుడే: వీరు నిరుపేద కుటుంబంలో జన్మించిన చిన్నారులే. ప్రైవేట్‌లో ఫీజులు కట్టలేక.. గురుకుల పాఠశాలలో సీటు సాధించి విద్య అభ్యసిస్తున్నారు. వృత్తి విద్య, ఆటల్లోనూ ప్రతిభ కనబరుస్తున్నారు. తమ ఆసక్తికి తోడు ఉత్తమ శిక్షణ, ప్రోత్సాహం అందిస్తే.. అద్భుత విజయాలు సాధిస్తామని నిరూపిస్తున్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు కోడుమూరు పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో చదువుతున్నారు. ప్రిన్సిపల్ గౌసియా బేగం ప్రోత్సాహంతో శిక్షకురాలు గాయత్రి ఆధ్వర్యంలో వివిధ క్రీడా రంగాల్లో శిక్షణ పొందుతున్నారు. ఇటీవల ఎస్‌జీఎఫ్, 'ట్రేడ్ అండ్ ఫుడ్ ప్రాసెసింగ్' పోటీల్లో పాల్గొని విజయం సాధించారు. ఫుడ్ ప్రాసెసింగ్ పోటీల్లో పాఠశాల తరపున ఆరుగురు విద్యార్థులు పాల్గొన్నారు. కేకులు, జామ్‌లు వంటి వంటకాల్లో ప్రతిభ చూపారు. పాఠశాల విద్యార్థినులు చదువుతో పాటు ఆటలు, వంటల పోటీల్లోనూ రాణిస్తూ.. పాఠశాలకు పతకాలు సాధిస్తున్నారు.

అన్నిరంగాల్లో రాణిస్తూ...

ఎం. ధనిత ఇంటర్మీడియట్ చదువుతోంది. బాలికలు అన్ని రంగాల్లోనూ రాణించాలనేదే తన కోరిక. చదువుతో పాటు వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాణిస్తుంది. అందుకు పీఈటీ దేవమణి దగ్గర శిక్షణ పొందుతుంది. ఇటీవల జిల్లాస్థాయి పోటీల్లో 48 కిలోల విభాగంలో ద్వితీయస్థానం, రాష్ట్ర స్థాయిలో నాలుగో స్థానం దక్కించుకుంది. దాంతో జాతీయస్థాయికి ఎంపిక చేశారు. క్రీడా కోటాలో ఉద్యోగం సాధించడమే లక్ష్యమట.

గెలుపే లక్ష్యంగా..

ఎస్. హస్మత్‌బేగం పదోతరగతి చదువుతోంది. ఇటీవల కర్నూలులో జరిగిన పోటీల్లో ప్రిన్సిపల్ సహకారంతో పాల్గొని ఈ బాలిక ఆపిల్, జామలతో జామ్ తయారు చేసి ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఆ పోటీల్లో విజయం సాధించడమే లక్ష్యంగా సిద్ధం అవుతోంది ఈ బాలిక.

అక్రమాలపై విజిలెన్సు దాడులు

పట్టుకున్న గ్యాస్ సిలిండర్లతో విజిలెన్స్ అధికారులు

కోడుమూరు, న్యూస్‌టుడే: కోడుమూరు పట్టణంలో గురువారం విజిలెన్సు అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. పట్టణంలో పలు దుకాణాల్లో అక్రమంగా గ్యాస్ ఫిల్లింగ్ చేయడం, డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వ్యాపార కార్యకలాపాలకు వినియోగిస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. దీంతో పట్టణంలోని కె.లక్ష్మయ్య దుకాణంలో 10 పెద్ద సిలిండర్లు, 9 చిన్న సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. దస్తగిరి చికెన్ సెంటర్, శివసాయి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో ఉపయోగిస్తున్న డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలో మొత్తం 13 పెద్ద గ్యాస్ సిలిండర్లు, 9 చిన్నగ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకోగా.. పౌరసరఫరా సీఎస్‌డీటీ నవీన్‌కు వాటిని అప్పగించారు. అక్రమంగా గ్యాస్ ఫిల్లింగు, కనెక్షన్లను కలిగిన వారిపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడులతో పట్టణంలోని పలు దుకాణాలను యజమానులు మూసివేశారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా ఎమ్మిగనూరు నియోజకవర్గ ప్రజలకు తెలియజేయడమేమనగా, కీ.శే. గుడికల్ చిన్న ఈరన్న గారి స్వయార్జితంగా సంపాదించబడిన ఈ షెడ్యూలు దాఖలా భూముల యందు సదరు లేట్ గుడికల్ చిన్న ఈరన్న గారి కూతురు అనగా, నా క్లయింట్ శ్రీమతి ఎం.భాగ్యమ్మ వైఫ్ ఆఫ్ లేట్ యం.చెన్నారెడ్డి గారికి వారసత్వ రీత్యా హక్కు కలిగి, విభాగాల కొరకు శ్రీమతి యు.కె.బజారమ్మ, యు.కె.శ్రీనివాసులు, ఎమ్మిగనూరు టౌన్‌కు చెందిన వారిపై గౌ॥ ఆదవాని రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టు నందు O.S. No.2/2019 కేసు వేసి IA.No.56/2019 నందు ఇంజంక్షన్ ఉత్తర్వులు ఏమనగా, (ఎవరు ఈ షెడ్యూలు ఆస్తులను అన్యాక్రాంత పరచకుండా మరియు ఎటువంటి లావాదేవీలు చేయరాదని) కోర్టు ఉత్తర్వులు పొందియున్నారు. నా క్లయింట్ ఈ సమాచారాన్ని 17/4/2019 ఈనాడు మరియు సాక్షి పత్రికల్లో బహిరంగ ప్రకటనలు ఇచ్చి ఉన్నారు. మరియు ఈనాడు తేది. 30.01.2025, ఆంధ్రజ్యోతి తేది: 26.02.2025 పత్రికల్లో కూడా బహిరంగ ప్రకటనల ద్వారా ఎమ్మిగనూరు ప్రజలకు తెలియజేయడమైనది. ఈ షెడ్యూలు ఆస్తులను యు.కె.శ్రీనివాసులు మరియు వారి కుమారులు అనగా, యు.కె.బాల మహేష్, యు.కె.గంగాధర్‌లు కలిసి ...

Cell: 94402 94559

C.ANAND, ADVOCATE, ADONI. PHONE: 98490 93379

(c) eenadu

కర్నూలు
•కర్నూలు • పాణ్యం

అపరిష్కృత కేసులు పరిష్కరించండి

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే : కర్నూ

మాట్లాడుతున్న న్యాయమూర్తి లీలా వెంకటశేషాద్రి

వివాదాలలో ఉన్న అపరిష్కృత కేసులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి ఆదేశించారు. డిసెంబరు 13న జరిగే మెగా లోక్ అదాలత్‌పై స్థానిక న్యాయ సేవా సదన్‌లో గురువారం ఆయన నగరపాలక సంస్థ, బీమా, చిట్‌ఫండ్, బ్యాంకు, బీఎస్ఎన్ఎల్, పంచాయతీశాఖ అధికారులతో సమావేశమయ్యారు. రోడ్డు ప్రమాద కేసులు, ఆస్తి పన్నుల వివాదాలు రాజీ మార్గంలో పరిష్కారమయ్యేలా కృషి చేయాలన్నారు.

నేడు నగరంలో విద్యుత్తు అంతరాయం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : నగరంలో శుక్రవారం ఉదయం 7 నుంచి 11 గంటల మధ్య విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు డివిజన్ ఈఈ శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి పనుల్లో భాగంగా కొత్తబస్టాండు ప్రాంతం, కల్లూరు ఈద్గా, మహావీర్‌నగర్ తదితర ప్రాంతాల్లో సరఫరాలో ఉండదని వెల్లడించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) కర్నూలు : 80085 52632, కర్నూలు గ్రామీణం : 85010 05408, ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

?: టీచర్స్‌కాలనీలో కుక్కల బెడద అధికంగా ఉంది. రాత్రివేళల్లో వీధిదీపాలు వెలగడం లేదు. **- స్థానికులు**

?: బుధవారపేటలో మురుగు కాలువలను సక్రమంగా శుభ్రం చేయడం లేదు. **- రమణ**

✔ : కాలువలు శుభ్రం చేయిస్తాం. కుక్కల్ని పట్టిస్తాం. **- నగరపాలక అధికారులు**

ఉపన్యసించారు.. విజేతలుగా నిలిచారు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : ఉపన్యాస పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని ప్రిన్సిపల్ జలీల్ సాహెబ్ పేర్కొన్నారు. నగరంలోని విజన్ జూనియర్ కళాశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో గురువారం 'డ్రోన్ టెక్నాలజీ' అన్న అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. ఆయేషా బేగం, షేక్ మహేక్, అవేజా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వారికి ప్రిన్సిపల్, అధ్యాపకులు బహుమతులు అందజేశారు.

విజేతలతో అధ్యాపకులు

ఉపన్యాస పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పట్టణ పేదలపై అనుగృహం

★ పీఎంఏవై అర్బన్ 2.0 కింద పక్కా ఇళ్ల మంజూరు

★ నగరపాలక పరిధిలో స్థలం కలిగిన వారికి అవకాశం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : 2029 నాటికి ప్రతి పేద కుటుంబం సొంతింటి కల నెరవేర్చాలన్న ధ్యేయంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 కార్యక్రమం కింద పట్టణ ప్రాంతాల్లో సొంత స్థలం ఉన్న వారు ఇల్లు కట్టుకునేందుకు ఆర్థిక సాయం అందిస్తోంది. కేంద్ర వాటా రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.1.0 లక్ష కలిపి మొత్తం రూ.2.50 లక్షలు మంజూరు చేస్తున్నారు. సొంత స్థలం కలిగిన పేదలు దరఖాస్తు చేసుకుంటే పక్కాగృహం మంజూరు చేయనున్నారు.

పీఎంఏవై అర్బన్ 2.0 కింద 35వ వార్డులో కొత్త ఇల్లు మంజూరైన లబ్ధిదారుకు అనుమతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, జేసీ నూరుల్ ఖమర్

914 మందికి మంజూరు

కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో సొంత స్థలం కలిగిన వెయ్యిమందికి పైగా పేదలు ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 2024-25 సంవత్సరానికి గాను 914 మందికి గృహాలను మంజూరు చేశారు. కర్నూలు నియోజకవర్గం లోని 33 వార్డులు, కోడుమూరు నియోజకవర్గం లోని 3 వార్డుల్లో కలిపి 424 ఇళ్లు మంజూర య్యాయి. పాణ్యం నియోజకవర్గం కల్లూరు అర్బన్ పరిధిలోని 16 వార్డుల్లో 480 మందికి గృహాలు మంజూరయ్యాయి.

అనుమతి పత్రాల పంపిణీ

2024 జూన్ నుంచి ఇప్పటి వరకు 17 నెలల కాలంలో ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించిన 3 లక్షల ఇళ్లను లబ్ధి దారులకు అప్పగించేందుకు ఈనెల 12వ తేదీన గృహ ప్రవే శాల కార్యక్రమం నిర్వహిం చారు. 35వ వార్డులోని చింతల ముని నగర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలోనే పీఎంఏవై అర్బన్ 2.0 కింద 36 మందికి పైగా లబ్ధిదారులకు గృహాలు మంజూరుకు సంబంధించిన పత్రాలను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, జేసీ నూరుల్ ఖమర్, హౌసింగ్ పీడీ చిరంజీవి పంపిణీ చేశారు. మిగిలిన లబ్ధి దారులకు ఇంత వరకు ఇళ్ల మంజూరు అనుమతి పత్రాలను పంపిణీ చేయలేదు.

విచారణ అనంతరం బిల్లులు

తమకు సొంత స్థలాలున్నా యని, ఆర్థిక సాయం అందిస్తే ఇళ్లు నిర్మించుకుంటామని మరో 336 మంది పేదలు పీఎంఏవై అర్బన్ 2.0 కింద దరఖాస్తు చేసు కున్నారు. కర్నూలు నగరపాలక సంస్థలో మొత్తం మంజూరైన 914 ఇళ్లకు సంబంధించి అర్బన్ పరిధిలోని ఇద్దరు వర్క్ ఇన్‌స్పె క్టర్లు, వార్డు సచివాలయ అమిని టీస్ సిబ్బంది ఇళ్లు మంజూరైన లబ్ధిదారులపై విచారణ చేప ట్టారు. వారు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారా..? పనులు ప్రారం భించి ఉంటే.. పునాదులు తీశారా లేక బేస్‌మెంట్ నిర్మించారా అని క్షేత్రస్థాయిలో ఆరా తీస్తూ జియో ట్యాగింగ్ చేస్తున్నారు. బేస్‌మెంట్ వరకు కట్టిన, ఆపై నిర్మించుకున్న ఇళ్లను వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. పరిశీలన అనంతరం వారికి అనుమతి పత్రాలను పంపిణీ చేయనున్నారు. ఆ తర్వాత మొదటి బిల్లు అందించేం దుకు చర్యలు చేపడతారు.

దిశ కమిటీలో నలుగురికి చోటు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : జిల్లా అభి వృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ కమిటీ)లో నలుగురికి అనధికార సభ్యులుగా స్థానం కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి పీయూష్ రంజన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్.విశ్వనాథరెడ్డి (ఓసీ జనరల్), కె.దేవశంకర్ (బీసీ), విశ్రాంత పీఆర్ ఎస్ఈ జి.సురేంద్రనాథ్ (ఎస్సీ), కె.రాధ (బీసీ మహిళ)ను ఎంపిక చేశారు. ఈ నలుగురు కర్నూలు జిల్లా దిశ కమిటీలో నాన్ అఫీషియల్ మెంబ ర్లుగా కొనసాగనున్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు దిశ సమావేశం నిర్వహించనున్నారు. కలెక్టర్ డా.ఎ.సిరి, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, మంత్రులు, ఎమ్మె ల్సీలు, ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో పాటు ఈ నలుగురు పాల్గొననున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమీక్ష నిర్వహించనున్నారు.

గ్రంథాలయాల సేవలు విస్తృతం చేయాలి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : గ్రంథాలయాల ద్వారా అందిస్తున్న సేవలను మరింత విస్తృతం చేయాలని మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ పేర్కొన్నారు. నగరంలోని జిల్లా గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన

మాట్లాడుతున్న టీజీ వెంకటేష్

మాట్లాడుతూ.. గ్రంథాలయంలో లభించే పుస్తకాలు చదువుకొని ఎంతో మంది నిరుద్యోగ యువత ప్రభుత్వ, ప్రైవేటు కొలువులు సాధించడం సంతోషంగా ఉందన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. అనంతరం వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి సెక్రెటరీ పెద్దక్క, చంద్రశేఖర్ కల్కూర, కేవీ సుబ్బారెడ్డి, సహాయ గ్రంథాలయ అధికారి గోవిందరెడ్డి, లైబ్రేరియన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : పుస్తక పఠనంతోనే జ్ఞానం పెరుగుతుందని గ్రంథాలయ అధికారి సంధ్యారాణి పేర్కొన్నారు. కృష్ణానగర్‌లోని కేశవరెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వ్యాస రచన, క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

ఓర్వకల్లు న్యూస్‌టుడే : మండలంలోని నన్నూరు, ఓర్వకల్లు గ్రంథాలయాల్లో గురువారం గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. గ్రంథాలయాధికారులు కౌసల్య, హనుమేనాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

నగరంలో పారిశుద్ధ్యం మెరుగవ్వాలి

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరంలో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ కోసం అధికారులు, సిబ్బంది పనిచేయాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ సూచించారు. గురువారం ఆయన లక్ష్మీనగర్, మద్దూరునగర్, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. ఇంటింటి చెత్తసేకరణ సక్రమంగా జరగాలన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలపై దాడి చేస్తున్న వీధికుక్కలను గార్గేయపురం డంపింగ్ యార్డుకు తరలించారు. కార్యక్రమంలో నగరపాలక కార్యదర్శి నాగరాజు, ప్రజారోగ్యాధికారి నాగశివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : పారిశుద్ధ్య సిబ్బంది పనితీరు మెరుగుపడాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ సూచించారు. ఎస్బీఐ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో గురువారం ఆయన పారిశుద్ధ్య తనిఖీదారులు, వార్డు సచివాలయ కార్యదర్శులతో సమీక్షించారు. ట్రేడ్ లైసెన్సు వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, ప్రజారోగ్యాధికారి నాగశివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నియామకంపై విచారణకు ఆదేశం

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : గ్రామీణ నీటి సరఫరా విభాగం కర్నూలు సర్కిల్ కార్యాలయంలో ఓ ఉద్యోగిని నిబంధనలకు విరుద్ధంగా నియమించిన అధికారులపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును తక్షణమే పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌కు నిధులు మంజూరు

ధర్నాలో పాల్గొన్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి.అంజిబాబు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఖాజాబాషా, జిల్లా నాయకులు సుధాకరప్ప, టి.రాముడు, పెయింటర్స్ సంఘం నాయకుడు జాఫర్ హుస్సేన్, సెంట్రింగ్ యూనియన్ నాయకులు దస్తగిరి, రఫీ, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్తు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ అలవర్చుకుంటే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని సీఈవో డాక్టర్ హరీష్‌కృష్ణ పేర్కొన్నారు. నగర పరిధిలోని అశోకా మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో టెక్ మహీంద్రా సంస్థ ఆధ్వర్యంలో గురువారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాంపస్ డ్రైవ్‌కు రాయలసీమలోని ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 1,327 మంది

క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొన్న అధ్యాపకులు, ప్రతినిధులు

విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని క్యాంపస్ డ్రైవ్‌లు నిర్వహించి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. టెక్ మహీంద్రా హెచ్ఆర్ జాని బేగమ్, అధ్యాపకులు, ప్లేస్మెంట్ కోఆర్డినేటర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

కారాగారాల తనిఖీ

కర్నూలు గాయత్రీఎస్టేట్, న్యూస్‌టుడే : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి గురువారం కర్నూలులోని మహిళా కారాగారం, మండల పరిధిలోని జిల్లా కారాగారాన్ని తనిఖీ చేశారు. ఖైదీలకు అందించే ఆహారం, రేషన్‌పై ఆరా తీశారు. జిల్లా కారాగారంలో ప్రిజన్ లీగల్‌ఎయిడ్ క్లినిక్ పరిశీలించారు. ఖైదీలతో సమావేశమై ప్రిజన్ లీగల్‌ఎయిడ్ క్లినిక్ ఏర్పాటు ఉద్దేశంపై అవగాహన కల్పించారు. న్యాయ సేవల కోసం 15100 నంబరుకు సంప్రదించాలన్నారు. లీగల్ ఎయిడ్ న్యాయవాది శివరాం ఉన్నారు.

ఆంజనేయస్వామికి అమావాస్య పూజలు

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : మండలంలోని కొమ్ముచెరువులో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ఆకుపూజలు, అమ్మవారికి కుంకుమార్చన చేశారు.

ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

రైతులతో మాట్లాడుతున్న జేసీ నూరుల్ ఖమర్

పైపులైను పనులు త్వరగా పూర్తిచేయండి

ఓర్వకల్లు న్యూస్‌టుడే : ఓర్వకల్లుకు పరిశ్రమలు వస్తున్న నేపథ్యంలో పారిశ్రామిక వాడకు నీటి సౌకర్యం కల్పించే పైపులైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని జేసీ నూరుల్ ఖమర్ అధికారులను ఆదేశించారు. మండలంలోని పూడిచెర్ల గ్రామాన్ని గురువారం ఆయన సందర్శించారు. రైతులతో చర్చించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ.. పనుల వల్ల రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూస్తామని నచ్చజెప్పారు. అనంతరం తహసీల్దారు కార్యాలయానికి చేరుకుని అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఆర్డీవో సందీప్‌కుర్, తహసీల్దారు విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణుడి సేవలో చింతామణి పీఠాధిపతి

కర్నూలు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే : కర్ణాటక రాష్ట్రంలో హొసపేటె చింతామణి మఠం పీఠాధిపతి శివానంద భారతి స్వామి గురువారం కర్నూలులోని సూర్యనారాయణస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అర్చకులు, కమిటీ ఛైర్మన్ టి.శివరామకృష్ణ, సభ్యులు స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన ఆలయంలో పూజలు నిర్వహించారు.

● కార్తికమాస అమావాస్యను పురస్కరించుకుని నగరంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆకుపూజలు నిర్వహించారు. శివాలయాల్లో అభిషేకాలు జరిపించారు.

పీఠాధిపతికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

వీరభద్ర స్వామికి ప్రత్యేక పూజలు

ఓర్వకల్లు న్యూస్‌టుడే : ఓర్వకల్లులోని వీరభద్రేశ్వరస్వామికి కార్తిక మాసం అమావాస్య సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెల రోజుల పాటు భక్తులు భజనలు, పూజలు చేశారు. కార్తిక మాసం ముగింపు సందర్భంగా స్వామివారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

సమాజ సేవతోనే సంతృప్తి

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : సమాజ సేవ ద్వారానే సంతృప్తి, మనశ్శాంతి లభిస్తాయని విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ పార్వతి పేర్కొన్నారు. సత్యసాయిబాబా శత జయంతి వేడుకల్లో భాగంగా గురువారం రాత్రి స్థానిక నెహ్రూనగర్‌లోని సత్యసాయి మందిరంలో వివిధ ధార్మిక, ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులను సత్కరించారు. సద్గురు దత్త కృపాలయం, కల్కి సేవా ట్రస్టు, మానవత, గాయత్రీ గోశాల, అన్నమాచార్య సేవా ట్రస్టు, చిన్మయ మిషన్, సూర్యనారాయణ ఆలయం, గీతా ప్రచార సంఘం ప్రతినిధులను సత్కరించారు. ఉచిత వైద్య శిబిరాల్లో సేవలందిస్తున్న వైద్యులను చిన్మయ మిషన్ బాధ్యురాలు సుప్రేమానంద, జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సందీప్ తదితరులు సత్కరించారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ మాకా అశోక్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపొందించేందుకు కృషి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : ప్రతిఒక్కరు మొక్కలు పెంచడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని ఆర్‌యూ ఉపకులపతి ఆచార్య వెంకటబసవరావు పిలుపునిచ్చారు. క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా డాక్టర్స్‌కాలనీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్‌సీసీ విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రిన్సిపల్ ఇందిరాశాంతిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.శ్రీనివాస్, ఎన్‌సీసీ ఆఫీసర్

ఎన్‌సీసీ విద్యార్థులతో కలిసి మొక్క నాటిన వీసీ వెంకటబసవరావు

డా.ఆర్.కె.నాయక్, వైస్ ప్రిన్సిపల్, జె.హేమంత్, ఎ.సత్యనారాయణ, ఐక్యూఏసీ సమన్వయకర్త డా.ఫక్రున్నిసాబేగం తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ విగ్రహం ఏర్పాటు చేయాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : నూతన రాజధాని అమరావతిలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ఏపీ రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం వారు డీఆర్వో వెంకటనారాయణమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బిర్రు ప్రతాప్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పల్లె శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర సంఘటన కార్యదర్శి తూముకుంట ప్రతాప్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సిద్ధం రాజారెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు ధారా హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ..వైఎస్సార్ కడప జిల్లాలో కాశిరెడ్డి నాయన సమాధి మందిరం నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు ఇవ్వాలని, యోగి వేమన జయంతి రోజు రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించాలని కోరారు.

డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

☛ షూటింగ్‌లో రాణిస్తున్న విద్యార్థినులు

గురిపెడితే పతకం

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : కర్నూలు నగరానికి చెందిన నక్షత్ర, అన్య జైన్ రైఫిల్ షూటింగ్ క్రీడలో రాణిస్తున్నారు. ఇష్టంతో ఆట నేర్చుకుని.. పట్టుదలతో సాధన చేస్తూ విజయ పథంలో దూసుకెళ్తున్నారు. గురి తప్పని వీరు బరిలో దిగితే పతకం రావాల్సిందే. ఇలా ఇప్పటి వరకు జిల్లా, రాష్ట్రస్థాయిలో జరిగిన పలు పోటీల్లో విజేతలుగా నిలిచి ప్రశంసలు, పురస్కారాలు అందుకుంటున్నారు.

బంగారు నక్షత్రం

ఎన్‌ఆర్‌పేటకు చెందిన జ్యోతిరాణి, రాము దంపతుల కుమార్తె నక్షత్ర ఎనిమిదో తరగతి చదువుతోంది. రైఫిల్ షూటింగ్‌పై ఆసక్తితో శిక్షణ తీసుకుని పోటీల్లో రాణిస్తోంది. ● 2023 ఆగస్టులో కర్నూలులో జరిగిన జిల్లాస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో ఓపెన్ సైట్ విభాగంలో స్వర్ణ పతకం అందుకుంది. ● 2023 అక్టోబరు 28 నుంచి 30వ తేదీ వరకు రాజమహేంద్రవరంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-14 బాలికల విభాగంలో స్వర్ణం గెలుచుకుంది. ● 2025 సెప్టెంబరు 29న కర్నూలు ఆర్.కె.అకాడమీలో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ జిల్లాస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించింది. ● ఈనెల 7- 9వ తేదీ వరకు ఒంగోలులో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-14 విభాగం ఓపెన్‌సైట్‌లో రజత పతకం సాధించింది. ● 2026 జనవరిలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌లో జరగనున్న ఎస్‌జీఎఫ్ఐ జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించనుంది.

తిరుగులేని అన్యజైన్

వెంకటరమణకాలనీ సమీపంలోని భగత్‌సింగ్ నగర్‌కు చెందిన సుధ, ప్రవీణ్‌కుమార్ దంపతుల కుమార్తె అన్యజైన్. ఏపీజే అబ్దుల్ కలాం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ఏడాది నుంచి పిస్టల్ షూటింగ్‌లో శిక్షణ పొందుతోంది. ● 2024 ఆగస్టులో కర్నూలులోని ఆర్.కె.అకాడమీలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో పిస్టల్ షూటింగ్‌లో స్వర్ణం గెలుచుకుంది. ● 2024 అక్టోబరులో రాజమహేంద్రవరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహించింది. ● 2025 సెప్టెంబరు 29న కర్నూలు ఆర్.కె అకాడమీలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో స్వర్ణ పతకం అందుకుంది. ● ఈనెల 7- 9వ తేదీ వరకు ఒంగోలులో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి పోటీల్లో పిస్టల్ విభాగంలో కాంస్య పతకం సాధించింది. ● 2026 జనవరిలో భోపాల్‌లో జరిగే జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ఐ షూటింగ్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించాలన్నదే తన లక్ష్యమని చెబుతోంది అన్యజైన్ వెల్లడించారు.

పశుగణం.. రహదారులపైనే మకాం

ఇందిరాగాంధీనగర్ సమీపంలో రోడ్డుపై సంచరిస్తున్న పశువులు

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : కర్నూలు నగరంలోని ప్రధాన రహదారులపై పశువుల సంచారం అధికమైంది. రేయింబవళ్లు అవి రహదారులపైనే తిష్టవేస్తున్నాయి. మందలుగా నడిరోడ్డుపై నిద్రిస్తున్నాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పశువుల యజమానులకు నోటీసులు జారీ చేసి. . వాటిని రోడ్లపై వదలకుండా చూడాల్సిన నగరపాలక అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

● నగరంలో కలెక్టరేట్, కల్లూరు చెన్నమ్మ కూడలి, కొత్త బస్టాండు, వై.జంక్షన్, బుధవారపేట, పాతనగరం, ఎన్.ఆర్.పేట, సి.క్యాంపు, ముజఫర్‌నగర్, బళ్లారి చౌరస్తా, సంతోష్‌నగర్, కోట్ల కూడలి తదితర ప్రాంతాల్లో ప్రధాన రహదారులపైనే నిత్యం పశువులు సంచరిస్తున్నాయి. వీటివల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని సందర్భాలలో వాహనాలు ఢీకొట్టడంతో మూగజీవులు సైతం గాయపడుతున్నాయి.

● రోడ్లపైకి వదిలే పశువులను గోశాలకు తరలిస్తామని అధికారులు పలుమార్లు ప్రకటించారు. ఆచరణలో మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా ఇబ్బందులు తప్పడం లేదని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంక్షిప్త సమాచారం

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : గుండ్రేవుల ప్రాజెక్టును వెంటనే నిర్మించాలని కోరుతూ ఈనెల 24, 25 తేదీల్లో నగరంలో జల సమర దీక్ష పేరుతో 48 గంటలు దీక్ష చేపడుతున్నట్లు కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీహర్ష తెలిపారు. రవీంద్ర విద్యా సంస్థల అధినేత పుల్లయ్యతో కలిసి గురువారం ఆయన దీక్షకు సంబంధించి గోడపత్రాలను ఆవిష్కరించారు.

చెట్లమల్లాపురం (కల్లూరు గ్రామీణ), న్యూస్‌టుడే : చెట్లమల్లాపురం గ్రామంలో గురువారం ఎంపీడీవో జీఎన్ఎస్‌రెడ్డి పర్యటించారు. ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : వెంకటరమణ కాలనీలోని కేశవరెడ్డి పాఠశాలలో డిసెంబరు 9, 10 తేదీల్లో నిర్వహించనున్న బాలోత్సవాన్ని జయప్రదం చేయాలని డెంటిస్టు రాయపు రామచంద్రారెడ్డి, కార్యదర్శి ధనుంజయ పిలుపునిచ్చారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : కర్నూలు మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 23, 24 తేదీల్లో జీపుజాతా నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రామకృష్ణ, మండల కార్యదర్శి హుస్సేనయ్య తెలిపారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : డిసెంబరు 31న నిర్వహించనున్న సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి అంజిబాబు, ఏపీ అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షురాలు బాలదుర్గమ్మ పిలుపునిచ్చారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : గ్రంథాలయ ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసినట్లు బి.క్యాంపు శాఖ గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.

రైతుల శ్రేయస్సే ధ్యేయం

ఓర్వకల్లు న్యూస్‌టుడే : రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రతిఒక్కరు పనిచేయాలని హుసేనాపురం సహకార సంఘం అధ్యక్షుడు సీఎన్ సుధాకరరెడ్డి పిలుపునిచ్చారు. హుసేనాపురం సహకారం సంఘంలో గురువారం అఖిలభారత సహకార వారోత్సవాలను నిర్వహించారు. సీఈవో మాలిక్‌బాషా, సహకార అధికారి వెంకటకృష్ణ, డీసీఏవో చెన్నమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఆటోడ్రైవర్ మృతి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు మండలం శివరాంపురానికి చెందిన జయకృష్ణ (25) చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆటోడ్రైవర్‌గా పనిచేసే ఆయన ఈనెల 18న రాత్రి తన స్నేహితుడిని గార్గేయపురంలో వదిలి ఆటో నడుపుతూ స్వగ్రామానికి బయలుదేరారు. గార్గేయపురం శివారులో ప్రమాదవశాత్తు ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో తీవ్రంగా గాయపడ్డారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు.

వైద్య సేవలు సత్వరం అందించండి

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : సర్వజన వైద్యశాలలోని అత్యవసర విభాగానికి వచ్చిన రోగులకు వైద్యసేవలు సత్వరం అందించాలని ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ వెంకటేశ్వర్లు వైద్యులను ఆదేశించారు. ఆసుపత్రిలోని ధన్వంతరి కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం ఆయన అన్ని విభాగాల అధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

వస్త్ర వ్యాపారి ఇంట్లో చోరీ

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు మండలం మమతానగర్‌లో నివసించే వస్త్ర వ్యాపారి మునిస్వామి ఇంట్లో చోరీ జరిగింది. ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 17న స్వగ్రామమైన లద్దగిరికి వెళ్లారు. బుధవారం సాయంత్రం తిరిగొచ్చే సరికి దొంగలు ఇంటిని దోచేశారు. తాళం తొలగించి ఇంట్లోకి చొరబడిన దొంగలు బీరువాలోని సొత్తు అపహరించారు. తులం బంగారు ఆభరణాలు, రూ.40 వేల నగదు అపహరణకు గురైనట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు.

(c) eenadu

డిజిటల్ లక్ష్ములు.. ప్రజ్ఞాపాటవాలు!

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : స్వయం సహాయ సంఘాల మహిళల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించి.. ఆన్‌లైన్ ద్వారా అందించే డిజిటల్ సేవలను సద్వినియోగం చేసుకునేలా తీర్చిదిద్దేందుకుగాను ప్రభుత్వం డిజిటల్ సాక్షరతకు శ్రీకారం చుట్టింది. ప్రజ్ఞా వర్చువల్ ట్రైనింగ్ అకాడమీ కృత్రిమ మేధ ఆధారిత ఈ లెర్నింగ్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

పట్టణం	కర్నూలు	నంద్యాల
సంఘాలు	15,929	9,707
సభ్యులు	1,18,159	80,363
రిజిస్ట్రేషన్	14,599	6,066

ఏం చేయాలి..

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పరిధిలోని సంఘంలో సభ్యురాలై ఉండాలి. తమ రిజిస్టర్డ్ చరవాణి నంబరు వాట్సప్ నుంచి వాట్సప్ నంబరు 95523 00009కు హాయ్ అని మెసేజ్ చేస్తే ప్రజ్ఞా యాప్ ఓపెన్ అవుతుంది.

ఏమేం తెలుసుకోవచ్చు

ప్రజ్ఞా యాప్‌లో డిజిటల్ సాక్షరతకు సంబంధించిన వీడియో పాఠాలు ఉంటాయి. కేంద్ర ప్రభుత్వ పథకాలు, వాటి ద్వారా జీవనోపాధులు పొందడం, సామాజిక, ఆర్థిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, కెరీర్ గైడెన్స్, ఆరోగ్యం, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ అరెస్టులు, కంప్యూటర్ పరిజ్ఞానం, విద్యార్థులకు అవసరమైన ఉన్నత చదువులు, నైపుణ్య శిక్షణలు తదితర అంశాలపై పాఠాలు విని అవగాహన పెంచుకోవచ్చు.

శిక్షణతోపాటే ధ్రువపత్రం

పొదుపు మహిళలు తమ వీలును బట్టి ఇంటి వద్ద ఉండే డిజిటల్, ఆర్థిక అక్షరాస్యత వంటి 12 రకాల కోర్సులను ఆన్‌లైన్‌లో నేర్చుకోవచ్చు. వీడియోలన్నీ చూసిన తర్వాత.. ఆయా అంశాలపై ఏ మేరకు అవగాహన పెంచుకున్నారో పరీక్షించేందుకు యాప్‌లోనే ప్రశ్నలు ఉంటాయి. వాటికి సమాధానాలు ఇచ్చి ధ్రువపత్రం దిగుమతి (డౌన్‌లోడ్) చేసుకొనే అవకాశం ఉంది.

ఆటల మైదానం.. చేరువలో విజ్ఞానం
పథకాలను వినియోగించుకోండి 6

పాలేరు.. వంతెనపై పోలేరు



నంద్యాల మండలం అబండం తండా నుంచి పెద్దకొట్టాల వెళ్లే మార్గంలో పాలేరు వాగు వంతెనకు ఇరువైపులా ఏర్పాటుచేసిన రక్షణ దిమ్మెలు విరిగిపోయాయి. ఫలితంగా ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో ప్రతిరోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రక్షణ గోడలు లేక పోవడం.. ఎదురెదురుగా వాహనాలు వస్తే ప్రమాదం జరిగే అవకాశముంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

అయినోళ్లకు బిల్లు.. ఖజానాకు చిల్లు

పలు వస్తువుల కొనుగోళ్లలో అక్రమాలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నీటి శుభ్రతకు ఉపయోగించే బ్లీచింగ్.. చెత్త తొలగింపునకు వాడే చీపుర్లు.. కాలువల శుభ్రతకు వినియోగించే పరికరాలు.. ఇలా ఏ వస్తువులైనా కొందరు ప్రజాప్రతినిధులకు చెందిన దుకాణాల నుంచే కొనుగోళ్లు జరిగాయి. మరికొన్నింటికి అసలు బిల్లులే లేవు. అక్రమాలు యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు పట్టించుకోలేదు. ఫలితంగా పెద్దఎత్తున ప్రజాధనం పక్కదారి పట్టింది.

జిల్లాలో తొమ్మిది స్పెషల్ గ్రేడ్, 15 నోటిఫైడ్ పంచాయతీలున్నాయి. స్పెషల్ గ్రేడ్ పంచాయతీల ఆదాయం ఏటా రూ.కోటికిపైగా ఉంటుంది. 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు జిల్లాలో బాగా ఆదాయం వచ్చే 24 పంచాయతీల్లోని కొన్నింటిలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయి. గ్రామ అవసరాల పేరుతో భారీగా నిధులు ఖర్చు చేశారు. కొందరు సర్పంచులు ఇష్టారాజ్యంగా నిధులు డ్రా చేసుకున్నారు. ఈవోలు, పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోలేదు.

కొన్నింటికి బిల్లులే లేవు

జిల్లాలోని కొన్ని గ్రామ పంచాయతీల్లో చేసిన పనులకు అసలు బిల్లులే లేవు. ప్యాపిలి మండల పరిధిలోని ఓ గ్రామంలో ట్రాక్టర్ డీజిల్‌కు రూ.90 వేలు డ్రా చేసుకున్నా బిల్లులు మాత్రం లేవు. కొలిమిగుండ్ల మండల పరిధిలోని రెండు గ్రామాలు, పారిశుద్ధ్య సామగ్రికి సంబంధించి చాగలమర్రి, వెలుగోడు, కోవెలకుంట్ల పంచాయతీల్లో ఎం.బుక్కుల నిర్వహణ సరిగా లేదు. కొన్ని పంచాయతీల్లో 15వ ఆర్థిక సంఘం నిధులన్నీ డీజిల్‌కు మాత్రమే వినియోగించారు. మరికొన్ని గ్రామాల్లో సర్పంచులకు బదులు ప్రైవేటు వ్యక్తుల ప్రమేయం ఎక్కువగా ఉండటం గమనార్హం. ఇలా కొన్ని పంచాయతీల్లో నిధులు పక్కదారి పట్టింది.

నిబంధనలు ఉల్లంఘించి..

కొందరు సర్పంచులు ఇచ్చిన బిల్లులు మాయాబజారును తలపిస్తున్నాయి. వస్తువులన్నీ వారి బంధువులే నుంచే కొనుగోళ్లు జరిగాయి. పంచాయతీరాజ్ నిబంధనల ప్రకారం ప్రభుత్వానికి సంబంధించిన లావాదేవీలను బంధువుల నుంచి ఎట్టి పరిస్థితుల్లో నిర్వహించకూడదు. కానీ ఇది యథేచ్ఛగా సాగింది. మరోవైపు గ్రామ పంచాయతీకి అందించిన ఈ రసీదులపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో దస్త్రాల నిర్వహణే కానరావడం లేదు. కొన్ని మేజర్ పంచాయతీల్లో కంప్యూటర్ ఆపరేటర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. చేసిన ఖర్చులకు, చూపిన బిల్లులకు అసలు పొంతనే లేకుండా ఉంది. బనగానపల్లిలో ఇలాగే అక్రమాలు జరగడంతో ఒకరిపై వేటు పడింది. రుద్రవరం పంచాయతీ కేంద్రంలోనూ అక్రమాలు జరిగాయి.

- వివిధ మేజర్ పంచాయతీల పరిధిలో ఎక్కువగా డ్రా చేసిన నిధులకు సంబంధించి బిల్లులన్నీ తమకు కావాల్సిన దుకాణాల నుంచే ఇచ్చినవే. బ్లీచింగ్ కొనుగోలు, సున్నం, పారిశుద్ధ్య సామగ్రి, వీధి దీపాల పరికరాలు తదితరాలన్నీ తమ వారి దుకాణాల నుంచే కొనుగోళ్లు జరిగాయి. ఈ గ్రామ పంచాయతీల కేంద్రంగా రూ.కోటి వరకు ఇలానే బిల్లులు ఉండడం గమనార్హం.

హుళేబీడు.. శత లింగాలు చూడు

సాధారణంగా పల్లెల్లో ఒకటో రెండో.. మహా అయితే పదో శివలింగాలు ఉండటం మనం చూస్తుంటాం. ఆలూరు మండలం హుళేబీడు గ్రామంలో 101 శివలింగాలు ఉన్నాయి. గ్రామంలో ఎక్కడ చూసినా దర్శనమిస్తాయి. ప్రస్తుతం వాటిలో కొన్ని కనుమరుగు కాగా.. ఇప్పటికీ చాలావరకు కనపడుతున్నాయి. ఆదోని వెళ్లే మార్గంలో ఆలూరుకు ఐదు కి.మీ. దూరంలో హుళేబీడు గ్రామం ఉంది. శ్రీకృష్ణదేవరాయల రాజ్యపాలనకు అనువుగా ఉండే ప్రదేశాన్ని ఎంపిక చేసేందుకు ఆయన అనుచరులు ఇటువైపు వెళ్తూ కొద్దిరోజులపాటు గ్రామంలో ఉన్నారు. శ్రీకృష్ణదేవరాయల ఇష్టదైవం శివుడు కావడంతో శివలింగాలను పెద్దఎత్తున ప్రతిష్ఠించి పలు ఆలయాలు నిర్మించారు. అలా గ్రామానికి హుళేరాయపట్నంగా నామకరణం చేశారు. పూర్వం ఆదోని వెళ్లే మార్గంలోని ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద గ్రామం ఉండేది. కాలక్రమేణా అక్కడినుంచి మరో చోటుకు మారి హుళేబీడుగా స్థిరపడిందని పెద్దలు తెలిపారు. దీంతో ఆ గుడికి కడె హనుమంతరాయ ఆలయంగా పేరు వచ్చింది. కడె అంటే కన్నడలో చివరి అని అర్థం. ఆ ఆలయం గ్రామానికి దూరంగా ఉండటంతో ఆ పేరు వచ్చింది. – న్యూస్‌టుడే, ఆలూరు

కొత్త కార్డులకు సరకులు

☛ 51,071 కుటుంబాలకు ప్రయోజనం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ఉమ్మడి కర్నూలు జిల్లాలో కొత్తగా మంజూరు చేసిన బియ్యం పత్రాలతోపాటు విభజన కార్డుల లబ్ధిదారులకు వచ్చే నెల నుంచి సరకులు పంపిణీ చేయనున్నారు. కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని, తల్లిదండ్రుల కార్డు నుంచి విభజించి తమకు ప్రత్యేక కార్డు ఇవ్వాలంటూ వేలాది మంది కొన్ని నెలల కిందట దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో అర్హులకు కొత్త కార్డులు ఇవ్వడంతోపాటు కుటుంబ కార్డులను విభజించారు. గత సెప్టెంబరులోనే నూతన బియ్యం పత్రాలు, కార్డులను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంజూరు చేసింది. రెండు నెలలు గడిచినా లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. రేషన్ కూడా పంపిణీ చేయలేదు.

	కొత్త కార్డులు	కార్డుల విభజన
కర్నూలు	6,160	17,731
నంద్యాల	3,750	13,520

సమస్యను పట్టించుకోక..

స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చినా వాటిని అందించలేదు. ఫలితంగా సరకులు తీసుకోలేక నిరుపేదలు నష్టపోయారు. కార్డుల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసినా సమాధానం చెప్పేవారే కరవయ్యారు.

ఇంకెప్పుడు అందజేస్తారో..

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 9,910 మందికి కొత్త కార్డులు, 31,251 మందికి స్ప్లిట్ కార్డులు పంపిణీ చేయాల్సి ఉంది. రెండు నెలలుగా 41,161 మంది లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. అధికారులు మాత్రం పంపిణీపై దృష్టి పెట్టలేదు.
- మరోవైపు పాత కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులు ముద్రించి జిల్లాలకు పంపారు. రెండు నెలలైనా వీటి పంపిణీ పూర్తికాలేదు. ఉమ్మడి జిల్లాలో 12.01 లక్షల స్మార్ట్ కార్డులు పంపిణీ చేయాల్సి ఉండగా.. 10.92 లక్షల కార్డులను మాత్రమే సచివాలయ ఉద్యోగులు, చౌకదుకాణాల డీలర్లు అందజేశారు.
- కర్నూలు జిల్లాలో 6,68,944 స్మార్ట్ కార్డులకుగాను 6,06,433 వరకు అందించారు. నంద్యాల జిల్లాలో 5,32,570 కార్డులకుగాను ఇప్పటివరకు 4,86,002 కార్డుల పంపిణీ పూర్తైంది. మరో 46,568 కార్డులు పెండింగ్‌లో ఉన్నాయి.

ముచ్చట్ల కోవెల.. ప్రగతి వెలవెల

☛ దృష్టి సారించని అధికారులు

శిథిలావస్థకు చేరిన గాలి గోపురం

మండల పరిధిలోని హెచ్ కొట్టాలలో పురాతనమైన ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. శ్రీకృష్ణదేవరాయల కాలంలో ఆలయం అభివృద్ధి జరిగినట్లు.. ఆలయ గోపుర నిర్మాణం చేపట్టినట్లు చరిత్ర చెబుతోంది. ఆలయానికి మెట్ట భూమితో పాటు బోరు బావుల కింద కలిపి మొత్తం 40 ఎకరాలకుపైగా ఉంది. 17.40 ఎకరాల భూమి ఆలయానికి వెళ్లే మార్గంలో ఉంది. మరో 24.60 ఎకరాలు రహిమాన్‌పురం వద్ద ఉంది. ఈ భూముల ద్వారా ఏటా రూ.2 లక్షల ఆదాయం సమకూరుతుంది. టికెట్లు, హుండీల ద్వారా మరికొంత సమకూరుతోంది.

– న్యూస్‌టుడే, హెచ్ కొట్టాల (బేతంచెర్ల)

రూ.1.90 కోట్లు మంజూరైనా..

గాలిగోపురం, కోనేరు, ఆలయం లోపల బండ పరుపు తదితర పనుల కోసం గత ప్రభుత్వ హయాంలో రూ.1.90 కోట్లతో అభివృద్ధి చేపట్టేందుకు అప్పటి మంత్రి భూమి పూజ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. మ్యాచింగ్ గ్రాంట్ కింద ఆలయ నిర్వాహకులు రూ.38 లక్షలు చెల్లించారు. గుత్తేదారుడు కల్యాణ మండపం పనులు కొద్దిగా పూర్తి చేశారు. మిగిలినవి పూర్తి చేయలేదు.

భక్తులకు ఇబ్బందులే..

ముక్కోటి దేవతలు ముచ్చటించుకున్న ఆలయంగా ప్రసిద్ధి చెందిన ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయం.. కొండలు, కోనల నడుమ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంది. కానీ అభివృద్ధి ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. కనీస సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. స్నానాలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు లేవు. విడిది చేసేందుకు గదులు అందుబాటులో లేవు. వివిధ సమస్యలను పలువురు దేవాదాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. ఇకనైనా స్పందించి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

క్రికెట్‌లో సూర్యతేజం

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే : నంద్యాల బొమ్మలసత్రానికి చెందిన దాసు, రేణుక దంపతుల కుమారుడు వనం యశ్వంత్ సూర్యతేజ.. ఏడో తరగతి చదువుతున్నాడు. అతనికి మొదటి నుంచి క్రికెట్ అంటే ఎనలేని మక్కువ. ఈ నేపథ్యంలో బౌలింగ్, బ్యాటింగ్‌తోపాటు ఫీల్డింగ్‌లోనూ సత్తా చాటుతున్నాడు. కోచ్ ప్రసన్న కుమార్, పాలిటెక్నిక్ కళాశాల ఫిజిక్స్ హెచ్‌వోడీ రాజేష్‌కుమార్ చేయూతతో ఏడేళ్లుగా సాధన చేస్తూ ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్నాడు. అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

☛ గతేడాది జనవరిలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడపలో అండర్-12 విభాగంలో జరిగిన పోటీల్లో ఐదు వికెట్లు తీసి బెస్ట్ బౌలర్ అవార్డు సాధించాడు. అదే ఏడాది డిసెంబరులో గుంటూరులో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో అండర్-14 విభాగంలో 50 పరుగులు సాధించి జట్టును గెలిపించాడు.

☛ ఈ ఏడాది ఆగస్టులో కర్నూలు జిల్లా పత్తికొండలో జరిగిన పోటీల్లో 57 పరుగులతోపాటు వికెట్లు సాధించి బహుమతి అందుకున్నాడు. ఈనెలలో కడప (అండర్-14)లో సౌత్‌జోన్ జట్ల (కర్నూలు, చిత్తూరు, అనంతపురం, కడప)తో జరిగిన పోటీల్లో 14 వికెట్లు తీయడం విశేషం. ఈనెల 25 నుంచి కడపలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో అతను పాల్గొననున్నాడు.

ఎట్టకేలకు దారికొచ్చింది

ఆళ్లగడ్డ-కోవెలకుంట్ల రహదారికి ఎట్టకేలకు మహర్దశ వచ్చింది. ఈ మార్గం అధ్వానంగా మారడంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడేవారు. తరచూ ప్రమాదాలు జరిగేవి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి నిర్మాణ పనులకు రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసింది. సుమారు 3 కి.మీ. మేర పనులు చేపట్టాల్సి ఉంది. జూన్ 11వ తేదీన భూమి పూజ సైతం చేశారు. టెండరు దక్కించుకున్న గుత్తేదారుడు పనులు చేపట్టలేదు.

❒ సుమారు 5 నెలలవుతున్నా చేపట్టకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లిపోతాయని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు కొన్నిచోట్ల రహదారి తవ్వి వదిలేయడంతో సమస్యలు ఎదురయ్యాయి. వాహనదారులు రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడింది. ఎట్టకేలకు పనులు ప్రారంభమయ్యాయి. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

చిర్రెత్తుకొచ్చి.. పోలీసుల కారెత్తుకెళ్లాడు?

కర్నూలు నిఘా విభాగం, న్యూస్‌టుడే: పోలీసుల తీరుకు చిర్రెత్తుకొచ్చిన ఓ యువకుడు వారి కారెత్తుకెళ్లిన ఘటన గురువారం జరిగినట్లు తెలిసింది. ఆలూరు నియోజకవర్గానికి చెందిన ఓ యువకుడు మద్యం తాగి వాహనం నడుపుతూ.. పోలీసులకు పట్టుబడ్డాడు. వాహనాన్ని పోలీసు స్టేషన్‌లో ఉంచారు. వాహనం ఇచ్చే వరకు ఊరికి వెళ్లేదే లేదని యువకుడు భీష్మించాడు. గ్రామస్థులను పిలిపించి యువకుడిని పంపేశారు. మరుసటి రోజు ఉదయం స్టేషన్‌కు రావాలని పోలీసులు చెప్పారు. గురువారం పోలీసు స్టేషన్‌కు వచ్చిన ఆ యువకుడు వాహనం ఇవ్వాలని కోరారు. సాయంత్రం వరకు వేచి ఉన్నా ఇవ్వకపోవడంతో పోలీసు కారెత్తుకెళ్లాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అతడికి ఫోన్ చేసి వాహనాన్ని తీసుకురావాలని చెప్పారు. పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్తుండగా.. రహదారి మధ్యలోనే పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకొని అతడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

నూతన వంగడం.. రైతుకు బలం

ఎంటీయూ 1426 రకం వరికి తెగుళ్లు తక్కువగా సోకుతుంది.. అధిక దిగుబడులు వస్తాయి. దీనిపై విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయి. పూర్తిస్థాయిలో ఫలితాలు వచ్చిన తర్వాత దీనిని రైతులకు అందుబాటులో తీసుకొచ్చేలా శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామంలో ఎంటీయూ 1426 వరి రకంపై క్షేత్ర దినోత్సవాన్ని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, కర్నూలు ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహాయ సంచాలకులు డా.జాన్సన్, ఏరువాక శాస్త్రవేత్త డా.సుజాతమ్మ మాట్లాడుతూ రైతులు ఈ రకం వరిని సాగు చేయడం ద్వారా సాగు ఖర్చులు తగ్గి అధిక దిగుబడులు వస్తాయని వివరించారు. ఈ రకం వరి రైతులకు అత్యంత అనుకూలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డా.రవిప్రకాశ్‌రెడ్డి, అధికారులు మద్దిలేటి, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కొత్తపల్లె (నంద్యాల గ్రామీణం)

దివ్యాంగులకు కానుక

■ ఉచితంగా మూడు చక్రాల మోటారు వాహనాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగులకు అండగా నిలుస్తోంది. వచ్చిన వెంటనే పింఛను మొత్తాన్ని రూ.6 వేలకు పెంచింది. దివ్యాంగులకు సంబంధించిన మోటారు సైకిళ్లకు 50 శాతం ఇంధన రాయితీ ఇస్తోంది. తాజాగా రూ.1.2 లక్షల విలువ చేసే మూడు చక్రాల మోటారు వాహనాలు ఉచితంగా అందజేయనుంది. అర్హులైనవారు నవంబరు 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకొని సంబంధిత ధ్రువపత్రాలతో కర్నూలు కలెక్టరేట్‌లోని దివ్యాంగులు, వృద్ధుల సహాయ సంస్థలో అందజేయాలని జిల్లా మేనేజరు రయీస్ ఫాతిమా సూచించారు. – న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

ఈ ఏడాది నవంబరు 25వ తేదీ నాటికి 18 నుంచి 45 ఏళ్ల లోపు వారై ఉండాలి. 70 శాతం, అంత కంటే ఎక్కువ వైకల్యం ఉండాలి. వార్షిక ఆదాయం రూ.3 లక్షల లోపు ఉండాలి. చెల్లుబాటయ్యే డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరి. ప్రభుత్వ లేదా ప్రైవేటు సంస్థల ద్వారా ఇంతకుముందు ఏ మోటరైజ్డ్ వాహనం తీసుకొని ఉండకూడదు. లేదా తన పేరుపై వాహనం ఉండకూడదు. డిగ్రీ, ఆపై స్థాయి కోర్సులు చదివే విద్యార్థులకు ప్రాధాన్యముంటుంది. స్వయం ఉపాధి, వ్యవసాయ అనుబంధ రంగాల్లో పనిచేసేవారు కనీసం పదో తరగతి పాసైన వారికి ప్రాధాన్యం ఉంటుంది. అవసరమైన పత్రాలను అభ్యర్థులు సిద్ధంగా ఉంచుకోవాలి.

దరఖాస్తు వెబ్‌సైట్ : ఏపీడీఏఎస్‌సీఏసీ.ఏపీ.జీవోవీ.ఇన్

మంజూరయ్యే వాహనాలు : 140

కర్నూలు : 70.. నంద్యాల : 70

నియోజక వర్గానికి.. 10 చొప్పున

జత చేయాల్సిన పత్రాలు

సదరం, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, పదో తరగతి బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్, పాస్‌పోర్టు సైజు ఫొటోతో పాటు ఇంతకుముందు వాహనం పొందలేదని స్వీయ ప్రకటన పత్రం జత చేయాల్సి ఉంటుంది.

పారదర్శకంగా ఎంపిక

– రయీస్ ఫాతిమా, జిల్లా మేనేజరు, విభిన్న ప్రతిభావంతుల సహాయ సంస్థ

అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తాం. మొదట పీజీ చదువుతున్న దివ్యాంగ అభ్యర్థులు, తర్వాత స్వయం ఉపాధి పొందుతున్న వారిని ప్రాధాన్యపరంగా ఎంపిక చేస్తారు. జిల్లా స్థాయి ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో దరఖాస్తుల పరిశీలన, ఎంపిక ప్రక్రియ ఉంటుంది. అర్హులైన అభ్యర్థులు త్వరగా దరఖాస్తు చేసుకోవాలి.

ఆపదలో ఉన్నారా.. 112కు ఫోన్ చేయండి

బాలికలు ఆపద సమయంలో 112కు ఫోన్ చేస్తే వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని ఆదుకుంటారు. సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేస్తే తగిన చర్యలు తీసుకుంటారు. శక్తి యాప్‌తో సత్వర సేవలు అందుతాయని మహిళా పోలీసుస్టేషన్ సీఐ జయరాం అన్నారు. స్థానిక వెలాసిటీ కళాశాలలో బాలికలకు పలు అంశాలపై గురువారం అవగాహన కల్పించారు. – న్యూస్‌టుడే, నంద్యాల నేరవిభాగం,

పలకరించనిధి

■ రాయితీ రుణాలకు ఎదురుచూపు



జిల్లా	యూనిట్లు	దరఖాస్తులు
కర్నూలు	1,617	29,337
నంద్యాల	2,156	24,150

నంద్యాల పట్టణం, కర్నూలు సంక్షేమం, ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాయితీ రుణాలు ప్రకటించింది. దీంతో ఆయా వర్గాల నుంచి పెద్దఎత్తున స్పందన లభించింది. పది నెలల కిందట అధికారులు అభ్యర్థులకు ముఖాముఖి నిర్వహించారు. ఇప్పటివరకు రుణాలు మంజూరే కానరావడం లేదు. రుణాలు లభిస్తే స్వయం ఉపాధితో జీవనం సాగించొచ్చని పలువురు ఆశించారు.

భారీగా దరఖాస్తులు

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రాయితీ రుణాల మంజూరుకు బీసీ కార్పొరేషన్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానించారు. బీసీ, ఈబీసీ, కాపు, రెడ్డి, కమ్మ, వైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, మేదర, కుమ్మరి తదితర వర్గాల నుంచి దరఖాస్తులు పిలిచారు. ఈ ఏడాది ఫిబ్రవరి 12వ తేదీ చివరి గడువు కాగా మంజూరైన యూనిట్ల కంటే 20 రెట్లు ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగరపాలక సంస్థ, ఏడు పురపాలక సంఘాలు, రెండు నగర పంచాయతీల పరిధిలో కమిషనర్లు, ఎంపీడీవోల ఆధ్వర్యంలో ముఖాముఖి నిర్వహించి అర్హుల ఎంపిక ప్రక్రియ జరిపారు.

ప్రదక్షిణలు చేస్తున్నా..

రాయితీ రుణం కావడంతో ఆశావహులు ఎక్కువగానే ఉన్నారు. ప్రతి మున్సిపాలిటీ, మండలానికి 50లోపు యూనిట్లు మాత్రమే కేటాయించారు. అటు పంచాయతీల్లోనూ పది మందికిలోపే రుణాలు దక్కే అవకాశముంది. ఉమ్మడి జిల్లాలో 3,773 యూనిట్ల కోసం 53,487 మంది ఔత్సాహికులు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికీ చాలామంది కర్నూలులోని బీసీ కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. మరికొందరు జిల్లా కేంద్రాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతులు ఇస్తున్నారు.

అహోబిలేశునికి తిరుమంజన సేవ

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా గురువారం తిరుమంజన సేవ నిర్వహించారు. ప్రహ్లాదవరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవారిని ఆలయ ముఖద్వార మండపంలో కొలువుంచి పంచామృతాలతో అభిషేకించారు. పసుపు, చందనం, కర్పూరం వంటి లేపనాలు సమర్పించి మహా మంగళ హారతి అందించారు. సాయంత్రం విశేషంగా అలంకరించి పల్లకిపై కొలువుదీర్చి తిరువీధుల్లో ఊరేగించారు.

హారతి ఇస్తున్న అర్చకుడు

(c) eenadu

ఆటల మైదానం.. చేరువలో విజ్ఞానం

◆ పీఎంశ్రీ పథకం.. విద్యార్థులకు వరం
◆ ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగు

క్రీడాభివృద్ధిపై దృష్టి

రూ.కోటితో అభివృద్ధి పనులు

ఆదోని పట్టణంలోని ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో గ్రంథాలయం, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్ నిర్మాణం

ఆదోని విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులకు చదువుతో పాటు విజ్ఞానం.. సాంకేతిక నైపుణ్యం.. పెంపొందించాలని.. క్రీడాకారులుగా తయారు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పీఎంశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టింది. క్రీడా మైదానాల ఏర్పాటు, గ్రంథాలయాలు, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఆదోని నియోజకవర్గంలోని మూడు ప్రభుత్వ పాఠశాలల్లో పీఎంశ్రీ పథకం పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే 90 శాతం మేర పనులు పూర్తికావచ్చాయి. మరో రెండు నెలల్లో విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయి.

ఆదోని పట్టణంలోని ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, మండల పరిధిలోని పెద్దహరివాణం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పీఎంశ్రీ పథకం కింద ఒకటి, రెండో విడతల కింద రూ.కోటి వెచ్చించి పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

◆ ఆదోని పట్టణం ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో సుమారు 750 మంది విద్యార్థులు ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్నారు. ఈ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన సాంకేతిక విద్య, విజ్ఞానం అందించాలని ప్రభుత్వం ఈ పాఠశాలలో రూ.60 లక్షలతో గ్రంథాలయ భవనం, సైన్స్ ల్యాబ్ భవనం, కంప్యూటర్ ల్యాబ్ భవనాల నిర్మాణాలు చేపట్టింది. ఇప్పటికే 90 శాతం మేర నిర్మాణాలు పూర్తయ్యాయి. త్వరలో మిగిలిన పనులు ముగించుకొని ప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు.

◆ ఆదోని మండలం పెద్దహరివాణం జడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.30 లక్షలతో ఈ పాఠశాలలో గ్రంథాలయ భవన నిర్మాణం చేపట్టారు. దీంతో పాటు విద్యార్థుల కోసం కిచెన్ గార్డెన్, వాటర్ హార్వెస్టింగ్ ఏర్పాటు చేశారు. ఈ నిర్మాణాలు పూర్తికావచ్చాయి. గ్రంథాలయం, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్ అందుబాటులోకి వస్తే.. విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యం పెరుగుతుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

ఆదోని మండలం పెద్దహరివాణం జడ్పీ ఉన్నత పాఠశాల, ఆదోని పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలల్లో పీఎంశ్రీ పథకం కింద ఒక్కో పాఠశాలకు రూ.5 లక్షల నిధులు విడుదల చేసింది. పెద్దహరివాణం జడ్పీ ఉన్నత పాఠశాలలో వాలీబాల్ కోర్టు, కబడ్డీ కోర్టుతో పాటు క్రికెట్ ఆడేందుకు నెట్ సౌకర్యంతో కూడిన మైదానం ఏర్పాటు చేస్తున్నారు. ఆదోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఖోఖో కోర్టు, కబడ్డీ కోర్టు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మైదానాలు పూర్తయితే క్రీడాకారులను తయారు చేసే అవకాశం ఉంటుందని వ్యాయామ ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

పెద్దహరివాణం ఉన్నత పాఠశాల మైదానంలో కబడ్డీ కోర్టు

ముక్కు మూసుకోవాల్సిందే..

నంద్యాల పట్టణం నుంచి మహానంది వెళ్లే దారిలో చిన్న చెరువు కట్ట వద్ద ప్రధాన రహదారి పక్కనే పట్టణంలోని వ్యర్థాలు వేయడంతో డంపింగ్ యార్డుగా మారింది. ఆ మార్గంలో మహానంది పుణ్యక్షేత్రానికి వందల సంఖ్యలో భక్తులు నిత్యం రాకపోకలు సాగిస్తారు. నెలల తరబడి నిల్వ ఉన్న చెత్త నుంచి దుర్వాసన వస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పురపాలక అధికారులు స్పందించి చెత్తను తొలగించి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

మల్లన్నసేవలో రష్యా దేశస్థులు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జునస్వామివార్లను గురువారం రష్యా దేశానికి చెందిన ముగ్గురు మహిళలు దర్శించుకున్నారు. జ్యోతిర్లింగ యాత్రలో భాగంగా వారు శ్రీశైలాన్ని సందర్శించినట్లు తెలిపారు. శ్రీశైలంతో 11 జ్యోతిర్లింగాలు పూర్తి చేసి, రామేశ్వరం దర్శనానికి వెళ్తున్నట్లు వారు చెప్పారు. ఈ సందర్భంగా రష్యా దేశస్థులకు ఈవో ఎం.శ్రీనివాసరావు, శ్రీశైలప్రభ సంపాదకులు అనిల్‌కుమార్ శ్రీశైల పుణ్యక్షేత్రం విశిష్టతను వివరించారు. శ్రీశైలం ఆలయ ప్రాంగణంలో రష్యా దేశస్థులు ధ్యానంలో గడిపి ఆధ్యాత్మికానుభూతి చెందారు.

ఈవో ఎం.శ్రీనివాసరావు దంపతులతో రష్యా దేశస్థులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యమిస్తూ.. పరిష్కరిస్తున్నట్లు మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో గురువారం ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం ఉండకూడదన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు ముందు ఉండాలన్నారు. కొన్ని సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు.

సమస్యలు వింటున్న మంత్రి ఫరూక్

యాగంటిలో ఎమ్మెల్సీ అనురాధ పూజలు

యాగంటి (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండలం యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో తెదేపా ఎమ్మెల్సీ అనురాధ గురువారం కుటుంబసభ్యులతో కలిసి పూజలు చేశారు. ఆలయ విశిష్టతలను అర్చకులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు ఆలయాధికారి పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో ఆమెకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో యాగంటిపల్లి మౌళీశ్వరరెడ్డి, ఆలయసిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్సీకి ప్రసాదాలు అందజేస్తున్న ఈవో పాండురంగారెడ్డి

మంత్రిని కలిసిన ఏజీపీ

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌ను నూతనంగా నియమితులైన అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ అడ్డగాళ్ల వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి కార్యాలయంలో గురువారం ఆయన్ను కలిసి సన్మానించారు. మంత్రి మాట్లాడుతూ.. న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేయాలని కోరారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి వెదుర్ల రామచంద్రరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హుస్సేన్ బాషా, పీవీ రాజేశ్వరరెడ్డి, న్యాయవాదులు ప్రసాద్‌రెడ్డి, గోళ్ల జయకృష్ణ, రఘుప్రకాశ్, వైవీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎన్‌ఎండీ ఫరూక్‌ను సన్మానిస్తున్న వెంకటేశ్వర్లు

పోలీసు శాఖ బలోపేతానికి వాహనం

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: శాంతిభద్రతల నిర్వహణ, పోలీసు శాఖ బలోపేతం కోసం వాహనం అప్పగించినట్లు ఎంపీ డా.బైరెడ్డి శబరి అన్నారు. ఎంపీ నిధులతో నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయానికి గురువారం ఆమె బొలేరో వాహనాన్ని అప్పగించారు. ఎస్పీ సునీల్ షొరాణ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ అన్నారు. ఇస్కాల గ్రామంలో గురువారం రాత్రి గ్రామ సభ నిర్వహించారు. దొంగతనాలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, పంట కొనుగోలు, ఉద్యోగాల పేరిట జరుగుతున్న మోసాలు, సైబర్ నేరాల గురించి వివరించారు. రోడ్డు భద్రత నియమాలు పాటించకుంటే జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆత్మకూరు గ్రామీణ సీఐ సురేశ్‌కుమార్‌రెడ్డి, పాములపాడు ఎస్సై సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాల గ్రామంలో అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ రామాంజినాయక్

‘క్యూఎస్’లో వీఐటీకి 7వ ర్యాంకు

చెన్నై(వడపళని), న్యూస్‌టుడే: ‘క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్’లో 2026 సంవత్సరానికి వేలూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(వీఐటీ)కి దేశవ్యాప్తంగా 7వ ర్యాంకు, అంతర్జాతీయంగా 352వ ర్యాంకు లభించింది. పర్యావరణ ప్రభావ విభాగంలో ప్రపంచవ్యాప్తంగా 194వ స్థానంలో నిలిచి ప్రత్యేకత చాటుకుందని వర్సిటీ గురువారం ప్రకటన విడుదల చేసింది. సస్టెయినబిలిటీని పరిగణనలోకి తీసుకుని ర్యాంకులను విడుదల చేసిందని వీఐటీ కులపతి డాక్టర్ జి.విశ్వనాథన్ పేర్కొన్నారు. సోషల్ ఇంపాక్ట్, గవర్నెన్స్, పర్యావరణ ప్రభావంలో వర్సిటీ అత్యంత ప్రతిభను కనబరుస్తోందని ఆయన అన్నారు. 2025లో అంతర్జాతీయ స్థాయిలో 396వ స్థానంలో ఉండగా 2026లో 352వ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు.

ప్రీ మెట్రిక్ భవన నిర్మాణాలను పరిశీలించిన మంత్రి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణ శివార్లలోని వైఎస్సార్.నగర్ సమీపంలో ఉర్దూ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న వసతి గృహ నిర్మాణాలను మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ పరిశీలించారు. రూ.8.4కోట్లతో నిర్మిస్తున్న భవనాల పనులను ఆయన గురువారం పరిశీలించారు. ప్రీమెట్రిక్ బాలబాలికలకు, పోస్టు మెట్రిక్ బాలికల, వర్కింగ్ ఉమెన్స్ కోసం నాలుగు రకాల నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. మండల తెదేపా కన్వీనర్ విశ్వనాథరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోడు బసవేశ్వరునికి లవణమే నైవేద్యం

శివాలయాల్లో ఈశ్వరుని ఎదుట ఒక నంది విగ్రహం ప్రతిష్ఠిస్తారు. ఇక్కడ మాత్రం జోడు బసవేశ్వరుల విగ్రహాలు ఆదోని మండలం ఇస్వీ గ్రామం మాత్రం ఇందుకు విరుద్ధం. ఈ గ్రామంలోని ఆలయంలో జోడు బసవేశ్వరస్వాములు ఉండటం విశేషం. ఆ నందుల వెనుక భాగంలో పార్వతి పరమేశ్వరులు కొలువుదీరడం ప్రత్యేకం. ఇలా జోడు బసవేశ్వర స్వాములు ఎక్కడా కనిపించవు. ఈ ఆలయానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ ఆలయాన్ని చోళ రాజులు కట్టించినట్లు చోళరాజుల ఆనవాళ్లు ఈ ఆలయంలో ఉంది. ఇక్కడ మరో ప్రత్యేకత ఏమిటంటే.. భక్తులు ఉప్పును నైవేద్యంగా సమర్పిస్తుంటారు. ప్రతి సోమ, గురువారాల్లో భక్తులు ఈ ఆలయానికి వచ్చి, స్వామి వార్లను దర్శించుకొని టెంకాయ, నైవేద్యంతో పాటు ఉప్పును సమర్పించి తమ మొక్కులు తీర్చుకోవడం విశేషం. ఏటా శ్రావణమాసం ఆఖరి సోమవారం స్వామి వారి రథోత్సవం నిర్వహిస్తారు.

– న్యూస్‌టుడే, ఆదోని సాంస్కృతికం

భక్తిశ్రద్ధలతో కార్తిక వనభోజనాలు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కొండజూటూరు గ్రామంలో భక్తిశ్రద్ధలతో కార్తిక వనభోజనాలు నిర్వహించారు. గ్రామంలోని గంగమ్మ దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేసి ఆలయ ప్రాంగణంలో వనభోజనాలు చేశారు. చుట్టుపక్కల గ్రామాలతోపాటు గ్రామంలోని ప్రజలందరూ తరలి రావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.

కొండజూటూరులో నిర్వహిస్తున్న వనభోజనాలు

నానో ఎరువులపై అవగాహన పెంచాలి

నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: నానో ఎరువులు వినియోగించడంతో కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ హరినాథరెడ్డి, జిల్లా సహకార అధికారి రామాంజనేయులు అన్నారు. నంద్యాలలోని మార్క్‌ఫెడ్ కార్యాలయంలో సహకార వారోత్సవాల్లో భాగంగా గురువారం చివరి రోజు కార్యక్రమం నిర్వహించారు. ‘ఇన్నోవేషన్ ఇన్ కో ఆపరేటివ్ గ్లోబల్ బిజినెస్ మోడల్స్ ఫర్ గ్లోబల్ కాంపిటేటివ్‌నెస్’ అంశంపై అవగాహన నిర్వహించారు. సహకార వ్యవస్థలో చేపట్టాల్సిన ఆధునిక పద్ధతులు, నానో ఎరువులు వాడాలి అంశంపై చర్చించినట్లు తెలిపారు.

మాట్లాడుతున్న హరినాథరెడ్డి

ప్రభుత్వం ఇచ్చిన భూమి కబ్జా చేసే యత్నం

మంగళగిరి, న్యూస్‌టుడే : నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన దళితుడు వంకదార చిన్నప్పకు ప్రభుత్వం సాగు చేసుకునేందుకు కేటాయించిన ఐదెకరాల భూమిని అక్కడ ఉన్న కొంతమంది కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మాల మహాసభ వ్యవస్థాపకుడు మల్లెల వెంకట్రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గుంటూరు జిల్లా మంగళగిరి ప్రెస్‌క్లబ్‌లో బాధితుడు చిన్నప్పతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. తమ భూమిని కబ్జా చేస్తున్నారని ఫిర్యాదు చేస్తే పోలీసులు తిరిగి బాధితుడి పైనే కేసు పెడుతున్నారని ఆరోపించారు. చిన్నప్పకు న్యాయం చేయాలని మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్, ఆవుల దేవరత్నం, వికలాంగుల రాష్ట్ర అధ్యక్షుడు వంకదార రవికుమార్, శీలం శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

గెలుపు తరుణం

ఆలూరు ప్రభుత్వ రెండో ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న **తరుణ్ తేజ** బాస్కెట్‌బాల్‌లో సత్తా చాటుతున్నాడు. ఆలూరుకు చెందిన వన్నూర్ స్వామి, సరస్వతి దంపతులు వ్యవసాయం చేస్తూ.. కుమారుడిని చదివించడంతో పాటు ఆటల్లో ప్రోత్సహిస్తున్నారు. వ్యాయామ అధ్యాపకురాలు రజియా శిక్షణలో సాధన చేస్తున్నాడు. అక్టోబరులో కర్నూలులో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో తరుణ్ తేజ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెలలో కృష్ణా, అన్నమయ్య జిల్లాల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. బాస్కెట్‌బాల్‌లో ఇప్పటికే రెండు సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. మూడోసారి కూడా ఎంపిక కావడంతో ప్రధానోపాధ్యాయిని ప్రశాంతి అభినందించారు. జాతీయ స్థాయిలో పాల్గొనడమే తన లక్ష్యమని చెబుతున్నాడు తరుణ్ తేజ.

– న్యూస్‌టుడే, ఆలూరు

సాధన చేస్తున్న విద్యార్థులు

నీరు-చెట్టు బిల్లుపై ఎంపీ, కలెక్టర్‌కు ఫిర్యాదు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: గడివేముల మండలంలో డబ్ల్యూయూఏ 13కు సంబంధించి ప్రభుత్వం మంజూరు చేసిన నీరు చెట్టు బిల్లును పాత నీటి సంఘం అధ్యక్షుడికి ఇస్తామని కేసీ. కెనాల్ డీఈ రవికుమార్ అంటున్నారని నీటి సంఘం అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆరోపించారు. స్థానిక దిశ సమావేశంలో ఎంపీ డా.బైరెడ్డి శబరి, కలెక్టర్ రాజకుమారికి గురువారం ఆయన ఫిర్యాదు చేశారు. తాము ముగ్గురం 2018-19లో ఈ పనులు చేశామన్నారు. వీటికి సంబంధించి ఇటీవల రూ.9,42,787 చెక్కు వచ్చింది. ఈ డబ్బులు తనకు ఇవ్వకుండా పాత డబ్ల్యూయూఏ ప్రసిడెంట్‌కు ఇస్తామని డీఈ చెబుతున్నారని ఆరోపించారు. ఎవరి హయాంలో పనులు జరిగాయో వారికే బిల్లులు చెల్లించాలనే విధంగా ఆదేశాలు ఉండడంతో తాము ఆ విధంగానే నడుచుకుంటున్నట్లు డీఈ రవికుమార్ ‘న్యూస్‌టుడే’కు తెలిపారు.

నల్లమలపై అధ్యయనానికి ఆసక్తి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: జీవ వైవిధ్యభరితమైన నల్లమల గురించి తెలుసుకునేందుకు భోపాల్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఎంబీఏ విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ప్రథమ, ద్వితీయ ఏడాదిలో ఇంటర్న్‌షిప్‌లో భాగంగా నల్లమల అడవులు, వృక్ష, జంతుజాలాలు, చెంచుల జీవన విధానాల గురించి పరిశీలిస్తున్నారు. విడతల వారీగా విద్యార్థులు బైర్లూటి ఎకో టూరిజాన్ని సందర్శించి అవగాహన పెంచుకుంటున్నారు. రెండు రోజులుగా ప్రథమ ఏడాది విద్యార్థిని అగస్త్య అగర్వాల్ బైర్లూటి, నాగలూటి గూడేల్లో పర్యటించారు. చెంచుల జీవన విధానాల గురించి తెలుసుకున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ పథకాల కింద మంజూరు చేసిన పనుల్లో ఎలాంటి జాప్యానికి తావు ఇవ్వకుండా సకాలంలో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎంపీ, జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ కమిటీ ఛైర్మన్ డా.బైరెడ్డి శబరి ఆదేశించారు. సెంటినరీ హాల్‌లో గురువారం దిశ కమిటీ సమావేశం నిర్వహించారు. జడ్పీ ఛైర్మన్ పాపిరెడ్డి, కలెక్టర్ రాజకుమారి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ.. కేంద్ర నుంచి విడుదలైన ప్రతి రూపాయిని సద్వినియోగం చేసుకుని జిల్లాను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఏఏ శాఖలకు ఎంత నిధులు అవసరం అనే విషయాలపై నివేదిక తయారు చేసి అందించాలన్నారు. విద్యాశాఖలో మరమ్మతులకు గురైన భవనాలకు నిధులు వినియోగించుకోవాలని సూచించారు. జలజీవన్ మిషన్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేసి ప్రజలకు నీటి సమస్య రాకుండా చూడాలన్నారు. రైతుల కోసం భూసార పరీక్షా కేంద్రాలను పెంచాలన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ..ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనతో ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే పంట నష్టాల నుంచి రైతులకు ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. పంట బీమా చేసుకునేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. జడ్పీ ఛైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ.. జల్‌మార్గ్ వికాస్ ప్రాజెక్టు ద్వారా జిల్లాను పర్యాటకపరంగా అభివృద్ధి చేయాలన్నారు. సమావేశంలో దిశ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో ఎంపీ బైరెడ్డి శబరి, కలెక్టర్ రాజకుమారి, జడ్పీ ఛైర్మన్ పాపిరెడ్డి

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : హిందూ ధర్మ పరిరక్షణతోపాటు సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు విశ్వహిందూ పరిషత్ కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వర్‌రెడ్డి అన్నారు. సున్నిపెంట, శ్రీశైలంలో గురువారం వేర్వేరుగా సమావేశాలు జరిగాయి. ప్రతినిధులు మాట్లాడుతూ..శ్రీశైలం సమీప చెంచు గూడేలు, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మతమార్పిడీలు జరుగుతున్నాయన్నారు. వీటిని వీహెచ్‌పీ ఖండిస్తున్నట్లు చెప్పారు. శ్రీశైల క్షేత్రాన్ని పరిరక్షించుకునే బాధ్యత స్థానిక హిందూ సమాజంపై ఉందని సూచించారు. జిల్లా కార్యదర్శి కిశోర్‌కుమార్, జిల్లా లీగల్‌సెల్ కన్వీనర్ గిరిధర్, స్థానిక వీహెచ్‌పీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీశైలంలో సమావేశమైన నాయకులు

రైలు కిందపడి యువకుడి బలవన్మరణం

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: గూడ్స్ రైలు కిందపడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందికొట్కూరుకు చెందిన బుడగ జంగాల శ్రీనివాసులు(30) గ్రామాల్లో తిరుగుతూ గ్యాస్ స్టౌవ్‌లు రిపేర్ చేసేవాడు. తన ద్విచక్రవాహనం, స్టౌవ్‌లు రిపేర్ చేసే సామగ్రి రైల్వే ట్రాక్ సమీపంలో పెట్టి.. పట్టాలపై తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. గూడ్స్ రైలు లోకోపైలట్ డోన్ రైల్వేస్టేషన్‌లో విధుల్లో ఉన్న డిప్యూటీ స్టేషన్ మేనేజర్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఉన్న చరవాణి ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పూర్తిగా విచారించి కేసు నమోదు చేస్తామని రైల్వే జీఆర్పీ పోలీసులు వివరించారు.

వాగులో పడి వ్యక్తి మృతి

చాగలమర్రి, న్యూస్‌టుడే: నగళ్లపాడు గ్రామానికి చెందిన రామసుబ్బరాయుడు(60) సమీపంలో వాగులో పడి మృతి చెందారు. గురువారం గేదెలను మేపేందుకు వెళ్లారు. ఈ క్రమంలో భవనాశి వాగు దాటుతుండగా ప్రవాహానికి నీట మునిగిపోయారు. గాలించగా అతడి మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్సై సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్లలో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై మల్లికార్జునరెడ్డి గురువారం తెలిపారు. స్థానిక ఎల్ఎం కాంపౌండ్ కాలనీకి చెందిన రామారావు కొడుకు రంగస్వామి(21) గౌండ పనిచేసేవాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో వివాహిత..

మిడుతూరు, న్యూస్‌టుడే: మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఓ మహిళ మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఓబులేసు తెలిపారు. షేక్ షఫిఉల్లా, కరిష్మ దంపతులకు 14 నెలల పాప ఉంది. షఫిఉల్లా సీసీ కెమెరాలు బిగించే పనులు చేస్తుండగా. . కరిష్మ గృహిణి. ఆమె ఓపెన్ డిగ్రీ పరీక్షలకు సన్నద్ధమవుతోంది. పరీక్షలు రాసే సమయంలో భర్త తన వెంట ఉండాలని బుధవారం ఫోన్ చేయగా.. భర్త గురువారం రాలేనని, శుక్రవారం వస్తానని అన్నట్లు ఎస్సై వెల్లడించారు. దీంతో మనస్తాపం చెందిన కరిష్మ గురువారం ఉదయం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అక్రిడిటేషన్లకు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకుల ఆదేశాల మేరకు జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులు అక్రిడిటేషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమాచార, పౌర సంబంధాలశాఖ అధికారిణి కె.జయమ్మ సూచించారు. http:/// mediarelations.ap.gov.in వెబ్‌సైట్‌లో పాత్రికేయులు ముందుగా వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకోవాలని గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. సంస్థలు అక్రిడిటేషన్ పోర్టల్‌లో రిజిస్టర్ అయ్యాక జర్నలిస్టులు తాము పనిచేస్తున్న సంస్థ వివరాలు ఇచ్చి దరఖాస్తు సబ్మిట్ చేయవచ్చన్నారు. జిల్లా నుంచి ప్రచురితమవుతున్న దినపత్రికలు, పీరియాడికల్స్, కేబుల్ ఛానళ్లకు సంబంధించిన వివరాలను ఆయా సంస్థలు పోర్టల్‌లో పొందుపరిచిన తర్వాతే దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు.

CREATIVE EDUCATIONAL SOCIETY'S
COLLEGE OF PHARMACY
NH-44, CHINNATEKUR, KURNOOL. A.P. - 518218
Website:www.cescop.ac.in
SPOT & CAT-B ADMISSIONS 2025-26
Eligible Candidates for Admission into 1st year B.Pharmacy and Pharm-D Courses who have not taken Admission in any College Can attend for the Spot and Category-B Admissions on or before 24-11-2025 with all Original Documents as per Guidelines of AP EAPCET-25.
Contact: 8142233361/454 SECRETARY

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/ షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 73821 14647.

నెట్వర్క్ లీడర్స్‌కు మంచి అవకాశం నూతనంగా స్టార్ట్‌ఐన HYD కంపెనీలో మల్టిపుల్ ప్రొడక్ట్ బేస్డ్ ద్వారా డబ్బులు సంపాదించుకునే అవకాశం. 99599 74159.

TO LET

For Rent to Hospital, Poly Clinics, Diagnostic Centres 5200 Sft, G+1, 43/194-2, Line No-7, N.R.Peta, Kurnool. Cont: ✆ 89851 32552.

JOBS

3S Solutions: Required Marketing Executives for Solar Company. Contact: 80740 91107.

ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ శ్రీరామ్/ ముత్తూట్/ మణప్పురం స్టాఫ్, HDFC/AXIS బ్యాంక్, క్లర్క్, లోన్ రికవరీ బాయ్స్ కావలెను. ✆:76599 88728.

కర్నూలు నగరం నందు పని చేయుటకు మంచి వాక్చాతుర్యం గల లేడీ టెలికాలర్స్ కావలెను. సంప్ర: 90322 23367.

కర్నూలులోని మెడికల్ ఏజెన్సీ మరియు పాల షాపులో పనిచేయుటకు ఆఫీసు బాయ్స్ మరియు డెలవరీ బాయ్స్ కావలెను. సంప్రదించండి. Cell: 83286 75684.

నంద్యాల జిల్లా బనగానపల్లె నెహ్రూ హైస్కూల్ హాస్టల్ నందు ఇంగ్లీష్, మ్యాథ్స్, బయాలజి సబ్జెక్టులు బోధించుటకు ప్రైమరీ హైస్కూల్ రెసిడెన్షియల్ టీచరు కావలెను. సంప్ర: 63020 26495, 95501 31444, 94410 56875.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

నంద్యాల
• నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకురండి

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరు పురపాలక పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై 'ఈనాడు' దృష్టి సారించింది. ఇందులో భాగంగా శుక్రవారం పురపాలక కమిషనర్ బేబీతో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. మీరు మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను కమిషనర్ ఫోన్ ద్వారా తెలియజేయవచ్చు. వాటిపై కమిషనర్ స్పందించి, పరిష్కరించనున్నారు. మరెందుకు ఆలస్యం ఫోన్ చేసి సమస్యలను వివరించండి.

తేదీ: 21.11.2025
సమయం: ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు
చరవాణి నంబరు: 83339 03567

జాబ్ మేళా 22న

నంద్యాల పట్టణం: నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఈనెల 22న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రామకృష్ణ విద్యాసంస్థల ఛైర్మన్ డా. జి. రామకృష్ణారెడ్డి తెలిపారు. బీటెక్, బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీసీఏ తదితర చదివిన వారు అర్హులని గురువారం వెల్లడించారు. ప్రిన్సిపల్ సుబ్బయ్య, ప్లేస్‌మెంట్ అధికారులు డా.వై.వీ.ఎస్. కుమార్, కేఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు: 94403 61729
ఆత్మకూరు: 90149 09024
నంద్యాల: 98853 28120

నంద్యాల పురపాలకం: ?: పట్టణంలోని ఫారుక్‌నగర్‌లో, అంజుమాన్ వీధిలో కాల్వలు వ్యర్థాలతో నిండిపోయి ఇబ్బందులు పడుతున్నాం. - రవి, షబ్బీర్, స్థానికులు

?: నీటి వీధిలో దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. - పవన్, స్థానికుడు

✓: సిబ్బందిని పంపి కాల్వలు శుభ్రం చేయిస్తాం. దోమల మందు పిచికారీ చేసే సమస్య పరిష్కరిస్తాం. - లక్ష్మీనారాయణశర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్.

మిడుతూరు: ?: మిడుతూరులోని పశువైద్యశాల నుంచి ఎస్సీ కాలనీ వరకు ఉన్న మురుగు కాలువల నుంచి దుర్వాసన వస్తోంది. శుభ్రం చేయించాలి. - రమణ, మిడుతూరు.

✓: సర్పంచితో మాట్లాడి కాలువలను శుభ్రం చేయిస్తాం. - కల్యాణ్‌సింగ్ తాత్కాలిక కార్యదర్శి, మిడుతూరు.

?: మిడుతూరులోని చెన్నకేశవాలయం, తహసీల్దారు కార్యాలయం పరిసరాలు చెత్తాచెదారంతో ఉన్నాయి. శుభ్రం చేయాలి. - దేవన్న, మిడుతూరు.

✓: గ్రీన్ అంబాసిడర్లతో తహసీల్దారు కార్యాలయం, చెన్నకేశవాలయం పరిసరాలను శుభ్రం చేయిస్తాం. - కల్యాణ్ సింగ్, తాత్కాలిక కార్యదర్శి, మిడుతూరు.

ఆత్మకూరు పట్టణం: ?: ఇందిరానగర్ నుంచి జంగాల బీడీకి వెళ్లే మార్గంలో రహదారి పక్కన వర్షపు నీరు నిలిచి ఉంది. దోమలు వ్యాపిస్తున్నాయి. - రమణ, స్థానికుడు.

✓: వర్షపు నీటిలో బ్లీచింగ్ పౌడరు చల్లుతాం. - జీవన్, శానిటరీ ఇన్‌స్పెక్టరు.

?: సిద్ధపల్లె రస్తాలో ట్యాంకు సమీపంలో వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసన వెదజల్లుతోంది. - సుబ్బయ్య, స్థానికుడు.

✓: చెత్తాచెదారం తొలగిస్తాం. - జీవన్, శానిటరీ ఇన్‌స్పెక్టరు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: ?: పాణ్యం బస్టాండు సమీపంలో జాతీయ రహదారి వంతెన కింద పీయూపీలో వర్షం పడితే నీరు నిలుస్తూ రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. - చౌడయ్య, స్థానికుడు

?: పాణ్యం బస్టాండు సమీపంలో జనగాపల్లె రహదారిలో మురుగు కాల్వలు లేక ఇబ్బందులు పడుతున్నాం. - రాజేశ్వర్, స్థానికుడు

✓: వంతెన కింద నీరు నిలబడకుండా ఏర్పాటు చేయాలని జాతీయ రహదారి నిర్వహణ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం. జనగాపల్లె రహదారిలో మురుగు కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. - ఆనందరావు, పంచాయతీ కార్యదర్శి, పాణ్యం

చక్కగా మాట్లాడి.. బహుమతులు పొంది

నందికొట్కూరు, న్యూస్‌టుడే: చక్కగా మాట్లాడి బహుమతులు పొందారని కోటా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కౌసల్యాబాయి పేర్కొన్నారు. పట్టణంలోని కోటా ఉన్నత పాఠశాలలో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అంశంపై వక్తృత్వ పోటీ నిర్వహించారు. అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. పదో తరగతికి చెందిన ఎస్.సమీర్ బాషా, ఏడో తరగతికి చెందిన ఎస్.షాకీర్, ఎస్. రెహనాలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. గెలుపొందిన వారికి ఉపాధ్యాయులు సాలమ్మ, విజయకుమారి, లలితమ్మ, ఈశ్వరయ్య, శ్రీనాథ్, వెంకటేశ్వర్లు బహుమతులు ప్రదానం చేశారు.

మాట్లాడుతున్న విద్యార్థిని

విజేతలకు బహుమతులు అందజేస్తున్న పాఠశాల సిబ్బంది

విద్యుత్తు ప్రమాద ఘంటికలు

★ ఆక్రమించి నిర్మాణాలు.. భయపెడుతున్న స్తంభాలు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలో విద్యుత్తు ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ప్రజలు విద్యుత్తు స్తంభాలను ప్రమాదకరంగా ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. మరికొన్ని చోట్ల విద్యుత్తు స్తంభాలు ఒరిగి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. విద్యుత్తు తీగలు ఇళ్లను ఆనుకుంటూ ప్రమాదకరంగా వెళ్తున్నాయి. రహదారుల పక్కన నియంత్రికలు రక్షణ గోడలు, కంచెలు లేకుండా భయపెడుతున్నాయి. కొన్ని నియంత్రికల దిమ్మెలు తక్కువ ఎత్తులో ఏర్పాటు చేశారు. మరికొన్ని దిమ్మెలకు పగుళ్లు ఏర్పడ్డాయి. ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

● నంద్యాల పట్టణంలో 41 ఫీడర్లు, 850 విద్యుత్తు నియంత్రికలు, 6,700 స్తంభాలు, 33 కేవీ లైన్లు 19 కి.మీ. 11 కేవీ లైన్లు 170 కి.మీ. మేర ఉన్నాయి.

● విశ్వనగర్‌లో చామకాల్వ వంతెన దాటిన తర్వాత రహదారి పక్కన ఉన్న షాపు వద్ద, బొమ్మలసత్రం నుంచి కాలినగర్ వెళ్లే దారిలో రహదారి పక్కనే షాపు ఎదురుగా విద్యుత్తు స్తంభం మధ్యలో అరుగు ఏర్పాటు చేశారు.

విశ్వనగర్‌లో స్తంభాన్ని ఆక్రమించి కట్టిన అరుగు

పట్టణంలోని ఈ ప్రాంతాల్లో..

● ఎన్జీవోస్ కాలనీ నుంచి విశ్వనగర్‌కు వెళ్లే దారిలో విద్యుత్తు స్తంభాన్ని ఆక్రమించి మెట్లు కట్టారు. వర్షాలు కురిసినప్పుడు స్తంభానికి విద్యుత్తు సరఫరా అయితే ప్రాణాలకే ప్రమాదం.

● బొగ్గులైన్‌లో నియంత్రికలు, విద్యుత్తు స్తంభాలు ఇళ్లను ఆనుకొని ఉన్నాయి.

● బర్మాశాల, బైర్మల్ వీధి, బంగారు అంగళ్ల వీధి, ఫరూక్‌నగర్, దేవనగర్, ఎన్జీవోస్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్తు తీగలు ఇళ్లను ఆనుకొని ప్రమాదకరంగా వెళ్తున్నాయి.

● వైఎస్సార్‌నగర్, జ్ఞానాపురం, ఎన్జీవోస్ కాలనీ, మూలసాగరం, నామా నేనగర్, దేవనగర్ తదితర ప్రాంతాల్లో రహదారుల పక్కనే రక్షణ గోడలు లేకుండా నియంత్రికలు ఉన్నాయి. వీటి దిమ్మెలకు పగుళ్లు ఏర్పడి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి.

● ఆర్టీవో కార్యాలయం నుంచి ఆటోనగర్‌కు వెళ్లే దారి పక్కన నియంత్రిక దిమ్మె పగుళ్లు ఏర్పడి ప్రమాదకరంగా ఉంది. మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

● బర్మాశాల, సరస్వతీనగర్, నందమూరినగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్తు తీగలు కిందకి ప్రమాదకరంగా వేలాడుతున్నాయి.

● పట్టణంలోని కేంద్ర ప్రభుత్వ గిడ్డంగుల వద్ద, ఎన్జీవోస్ కాలనీ ప్రసార భారతి వద్ద, ఎస్బీఐ కాలనీ రహదారి చివరిలో విద్యుత్తు స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా ఉన్నాయి.

దారిలో గుంత.. చూడకుంటే చింత

నంద్యాల పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో రహదారిపై గుంత ప్రమాదకరంగా ఉంది. గురు రాఘవేంద్ర కోచింగ్ అకాడమీ ఎదురుగా సందులో పైపులైన్ వాల్వు కోసం గుంత ఏర్పాటు చేశారు. దీనిపై బండలు, సిమెంటు దిమ్మెలు ఏర్పాటు చేయలేదు. రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనదారులు గుంతను గమనించకుంటే ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలి.
- న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

తవ్వారు.. వదిలేశారు

నంద్యాల పట్టణంలోని పలు ప్రాంతాల్లో వివిధ పనుల నిమిత్తం గుంతలను తవ్వి అలాగే వదిలేశారు. పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్‌లో ప్రైవేటు కేబుల్ వైర్ల కోసం నాలుగు అడుగుల గుంతలు తవ్వారు. పనులు పూర్తయి.. నెలలు గడుస్తున్నా గుంతలను పూడ్చకుండా అలాగే వదిలేశారు. ఈ ప్రాంతంలో పాఠశాలలు, బహుళ అంతస్తులు అధికంగా ఉన్నాయి. ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా గుంతలో పడి ప్రమాదాల బారిన పడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, నంద్యాల పురపాలకం

శిథిల వంతెన.. ప్రమాదం అంచున

జూపాడుబంగ్లా మండలంలోని 80బన్నూరు నుంచి పోతులపాడుకు వెళ్లేదారిలో వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. దీనిపై పోతులపాడు, చాబోలు గ్రామాల ప్రజలు నిత్యం జూపాడుబంగ్లా మండల కేంద్రానికి, నందికొట్కూరుకు రాకపోకలు సాగిస్తారు. అధికారులు స్పందించి నూతన వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నందికొట్కూరు గ్రామీణం

కాల్వల్లో వ్యర్థాలు.. తొలగించకుంటే అనర్థాలు

నంద్యాల టెక్కె మార్కెట్ యార్డులోని కాల్వల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో మురుగు పారడం లేదు. ఈ పరిసరాల్లో దోమలు వ్యాప్తి చెందడంతోపాటు దుర్వాసన వస్తోంది. అధికారులు చర్యలు చేపట్టి వ్యర్థాలు తొలగించి కాల్వను, యార్డు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

సెలవు రోజుల్లో మినహాయింపు ఇవ్వాలి

వెలుగోడు, న్యూస్‌టుడే: పదోతరగతి పరీక్షల కోసం ప్రభుత్వం రూపొందించిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను సెలవు రోజుల్లో లేకుండా పాఠశాల పనిదినాల్లో మాత్రమే నిర్వహించాలని పీఆర్‌టీయూ నంద్యాల జిల్లా అధ్యక్షుడు రాంభూపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాంద్ బాషా కోరారు. వెలుగోడు మండలంలోని అన్ని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలను గురువారం వారు సందర్శించి, ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు చేపట్టడం జరిగింది. పీఆర్‌టీయూ వెలుగోడు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ మొయినుద్దీన్, అబ్దుల్ అహద్, నాయకులు నూర్ మొహమ్మద్, హుసేన్ సాహెబ్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

తిమ్మాపురం(మహానంది): మండల కేంద్రం ఎం.తిమ్మాపురంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి దూదేకుల మస్తాన్ రూ.10 వేలకుపైగా విలువచేసే సిమెంట్ ఇటుకలను విరాళంగా అందజేశారు. ప్రధానోపాధ్యాయులు సీహెచ్ చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

నంద్యాల పట్టణం: నంద్యాల ఇన్నర్‌వీల్ ఆధ్వర్యంలో టంగుటూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటుపుస్తకాలు, కాపీ రైటింగ్ పుస్తకాలు, పలకలు, రంగు పెన్సిళ్లను ఉచితంగా పంపిణీ చేశారు.

శ్రీశైలం ఆలయం: మండల పరిధిలో ఏఐవైఎఫ్ కార్యక్రమాలు యథావిధిగా జరుగుతాయని ఆ సమితి రాష్ట్ర కమిటీ సభ్యుడు లక్ష్మయ్య తెలిపారు. మండలంలో ఏఐవైఎఫ్ రద్దు చేసినట్లు నాగిరెడ్డి ఏకపక్ష నిర్ణయంతో ప్రకటించడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు.

పాణ్యం గ్రామీణం: భూపనపాడు గ్రామంలో తాగునీరు కలుషితం అవుతుందని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామంలో చేతిపంపు చుట్టూ నీరు నిలుస్తుండటంతో పైపుల ద్వారా లోపలికి చేరుతున్నాయన్నారు.

నంద్యాల గ్రామీణం: చాబోలు, మిట్నాల గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను గురువారం సామాజిక తనిఖీ బృందం సభ్యులు పరిశీలించారు. పంట కాలువ పనులను కొలతల పుస్తకం ప్రకారం పరిశీలించారు.

నంద్యాల రైతునగరం: నంద్యాల జిల్లా సర్వజన ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వేతనం రూ.16,500 ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బాలవెంకట్ డిమాండు చేశారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం పారిశుద్ధ్య కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

మిడుతూరు: మెట్ట ప్రాంతాల్లో ఆరుతడి పంట కింద వరి రకం సాగుపై రైతులకు వ్యవసాయ సిబ్బంది అశోక్, మల్లికార్జున గురువారం అవగాహన కల్పించారు.

బండిఆత్మకూరు: జాయింట్ ఎల్పీఎంల నుంచి వేరు కావడానికి ప్రభుత్వం చలానా రేటు తగ్గించడంతో రైతులకు కొంత ఊరట లభించిందని తహసీల్దారు పద్మావతి, మండల సర్వేయర్ నాగప్రసాద్ తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో గురువారం వారు మాట్లాడారు.

నంద్యాల పట్టణం: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి సమాజ నిర్మాణానికి పాటుపడాలని నంద్యాల ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ వినియోగం, వాటితో కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఆత్మకూరు పట్టణం: ఆత్మకూరు సహాయ సాంఘిక సంక్షేమశాఖ పరిధిలోని వేల్పనూరు బాలుర వసతిగృహంలో గురువారం ఏఎస్‌డబ్ల్యూవో అంకన్న దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ చలికాలం కావటంతో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. వసతి గృహాలు, విద్యార్థుల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టిసారించి మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. ఆత్మకూరు పరిధిలోని 11 కళాశాల, పాఠశాల వసతి గృహాలకు దుప్పట్లు అందజేశామన్నారు.

మహిళలు భారతదేశ గొంతుకలు

గడివేముల, న్యూస్‌టుడే : మహిళలు, బాలికలు భారతదేశ నినాదాన్ని ప్రతిధ్వనించే గొంతుకలని ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. గడివేములలో

ఎంపీ బైరెడ్డి శబరికి జ్ఞాపిక అందిస్తున్న ఆంధ్ర విద్యార్థి సంఘం నాయకులు

గురువారం శ్రీరాజరాజేశ్వరి పాఠశాలలో ఆంధ్ర విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలు నిర్వహించారు. ఆమె పాల్గొని మాట్లాడుతూ.. ఝాన్సీ లక్ష్మీబాయి ధైర్యాన్ని, సేవలను కొనియాడారు. పాఠశాల ఏవో రాఘవేంద్రరావు, తెదేపా నాయకులు మంచాలకట్ట భాస్కరరెడ్డి, కే బొల్లవరం విజయబాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు బండిఆత్మకూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు గురువారం తాత్కాలిక ప్రధానోపాధ్యాయురాలు సుస్మిత తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి అండర్-17 ఖోఖో బాలికల విభాగంలో పదో తరగతి విద్యార్థిని మున్నీ, అండర్-17 క్రికెట్ బాలుర విభాగంలో గణేష్ కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో తలపడనున్నట్లు ఆమె వివరించారు.

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన నంద్యాలలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులు రాకేష్‌రెడ్డి, సందీప్‌కుమార్‌రెడ్డి, తరుణ్ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ విద్యాసంస్థల అధినేత సుధాకర్ తెలిపారు. విద్యార్థులను గురువారం ఆయన అభినందించారు.

పనుల్లో నాణ్యత అవసరం

గడివేముల, న్యూస్‌టుడే: చెక్‌డ్యాం, రాతికట్టడం పనుల్లో నాణ్యత పాటించాలని నాబార్డు డీడీఎం కార్తిక్‌దొరై ఆదేశించారు. గని గ్రామంలో జరుగుతున్న చెక్‌డ్యాం, రాతికట్టడం పనులను గురువారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ..నిర్మాణాలు ధ్వంసం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మిగిలిన పనులను త్వరగా

చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న కార్తిక్ దొరై

పూర్తి చేయాలన్నారు. నాబార్డు ఆధ్వర్యంలో చేపట్టిన పండ్ల తోటలను పరిశీలించారు. నవయూత్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, డైరెక్టర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రాయితీతో స్వయం ఉపాధి

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి పొదుపు మహిళకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీతో స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి అన్నారు. పాణ్యం గ్రామానికి చెందిన మహాలక్ష్మి పీఎంఈజీపీ పథకం ద్వారా ఏర్పాటు చేసుకున్న కంప్యూటర్ ఎంబ్రాయిడరీ మిషన్‌ను గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం ప్రసాద్, ఏపీజీబీ బ్యాంకు మేనేజర్ సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ వనభోజనం

మహానంది, న్యూస్‌టుడే: మహానంది మండలంలోని తిమ్మాపురం, బుక్కాపురం

ఒకే ఆకులో భోజనం ఆరగిస్తున్న మహిళలు

గ్రామాల పరిధిలోని అరటి తోటల్లో గురువారం కార్తిక వన భోజన కార్యక్రమాన్ని ఆంజనేయ, వీరభద్రస్వామివారి ఆలయాల వద్ద నిర్వహించారు. మహిళలంతా (బుక్కాపురం సర్పంచి కందుల వరలక్ష్మీతోపాటు) ఒక అరటి ఆకులో వనభోజనం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వనభోజనాలు ఆరగించారు. ఆంజనేయస్వామివారికి ఆకుపూజలు చేశారు.

విద్యార్థులను తీర్చిదిద్దాలి

మిడుతూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు విద్యాబోధన చేసే అవకాశం రావడం అదృష్టమని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయ రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు సుంకన్న పేర్కొన్నారు. మండలంలోని తలముడిపి ఉన్నత పాఠశాలలో నూతన ఉపాధ్యాయులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. పేద విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని దిశా నిర్దేశం చేశారు. అనంతరం వారికి నూతన సర్వీస్ రిజిస్టర్లు అందజేశారు.

నూతన ఉపాధ్యాయినికి సర్వీస్ రిజిస్టరు అందజేస్తున్న హృదయ రాజు, సుంకన్న

కార్తిక అమావాస్య పూజలు

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలోని పలు ఆలయాల్లో కార్తిక అమావాస్యను పురస్కరించుకొని గురువారం ప్రత్యేక పూజలు చేశారు. పుష్పాభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. బైరమల్ వీధిలో ఉన్న బసవేశ్వరస్వామి ఆలయంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవాన్ని వీక్షించారు.

పగిడ్యాల: పగిడ్యాల మండల పరిధిలోని తూర్పు ప్రాతకోట గ్రామంలో శ్రీగంగా పార్వతి సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నంద్యాల గాంధీచౌక్: కాశీ విశ్వేశ్వరుడికి పుష్పాభిషేకం

పగిడ్యాల: అలంకరణలో గంగా పార్వతి సమేత నాగేశ్వరస్వామి

నంద్యాల గాంధీచౌక్: కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అయ్యప్పస్వామి పడిపూజోత్సవం

ప్రత్యేక అలంకారంలో మండపాలు

గాజులపల్లె ఆర్.ఎస్(మహానంది), న్యూస్‌టుడే: మహానంది మండలం గాజుల పల్లెఆర్.ఎస్ గ్రామంలోని నవగ్రహ దేవాలయ సముదాయంలోని మరకత లింగేశ్వరస్వామివారి ఆలయంలో అయ్యప్ప పడిపూజోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త, జ్యోతిష్యులు కనమర్లపూడి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి దీక్షాధారులతోపాటు భవానీ, శివదీక్షధారులు ఈ కార్యక్రమం చేపట్టారు.

ఓంకారేశ్వరుని హుండీ ఆదాయం రూ.3.35 లక్షలు

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: నల్లమల అభయారణ్యంలో వెలసిన ఓంకార పుణ్యక్షేత్రంలో దేవాదాయ శాఖ జిల్లా తనిఖీ అధికారి హరిచంద్రారెడ్డి, ఈవో నాగప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం శాశ్వత హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఎనిమిది నెలల 20 రోజుల కాల వ్యవధిలో భక్తులు కానుకల రూపంలో వేసిన రూ. 3. 35 లక్షలు ఆదాయం వచ్చినట్లు చెప్పారు. ఆలయ పూజారులు చక్రపాణి శర్మ, మృగపాణి శర్మలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ నంద్యాల ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు నందు
E.P.No.4/2024 in O.S.No.31/2022
మేడం సుబ్బ రామాంజనేయులు, వయస్సు 37 సం॥లు, తండ్రి మేడం సుబ్బ హరినాథ్, హిందూ, వృత్తి : వ్యాపారం, శ్రీనివాస నగర్, నంద్యాల టౌన్ & జిల్లా. ...అర్జీదారు/డిక్రీ హోల్డర్
-Vs-
టి.వి.యస్.సత్యనారాయణ, వయస్సు 42 సం॥లు, తండ్రి లక్ష్మీనారాయణ, హిందూ, వ్యాపారము, నివాసము: 2/428/124/బి/8/ఎ.7, బాలాజీ కాంప్లెక్స్, నంద్యాల టౌన్ & జిల్లా.
...ప్రతివాది (రెస్పాండెంటు)/జె.డి.ఆర్
వేలం ప్రకటన
పై నెంబరు దావా నందలి డిక్రీ బాకీ క్రింది రెస్పాండెంటు/జె.డి.ఆర్ తాలూకు దిగువ తెలిపిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టువారి ఎదుట తేది.12.12.2025వ తేదీన ఉదయం గం॥10.30 ని॥ల నుండి బహిరంగ వేలం (పబ్లిక్ ఆక్షన్) వేయబడును. కావున దిగువ షెడ్యూలు ఆస్తిని కొనదలచిన సవాలుదార్లు వేలం వాయిదా తేదీన అనగా తేది.12.12.2025న ఉదయం గం॥10.30 ని॥లకు పై కోర్టువారి ఎదుట హాజరై వేలంపాట పాడుకొనవచ్చును.
షెడ్యూలు: కర్నూలు జిల్లా (ప్రస్తుతం నంద్యాల జిల్లా) నంద్యాల మండలం, నంద్యాల సబ్ డివిజన్‌లో చేరిన నంద్యాల మునిసిపల్ లిమిట్స్ పరిధిలోని, నంద్యాల టౌన్‌లోని జె.డి.ఆర్.ఆస్తి వివరములు: సర్వే నెం. 1938/2ఎ, చేనుపేరు: పెద్దమడి, విస్తీర్ణం: ఎక 0-04 సెంట్లు 292 1/4 లింకులు లేక 0-017 హెక్టార్లు, ఇం.నెం.2/428/124/బి/8/ఎ.7, అసెస్‌మెంట్ నెం. 1017040754, గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్‌ఫ్లోర్ మరియు సెకండ్‌ఫ్లోర్.
హద్దులు: (దస్తావేజు 3963/2008 ప్రకారం) తూర్పు: 36 లింకులు వెడల్పు గల రస్తా, పడమర: సర్వే నెం: 1938/3లోని భూమి, ఉత్తరం: నిచ్చెనమెట్ల రాధగారి భూమి, దక్షిణం: దుగ్గి సుభాషిణిగారి భూమి.
కొలతలు: తూర్పు-పడమర ఉత్తర దిశలో 72 1/2 లింకులు, దక్షిణ దిశలో: 73 లింకులు, ఉత్తర దక్షిణం తూర్పు దిశలో: 59 లింకులు, పడమర దిశలో: 59 లింకులు.
మార్కెట్ విలువ: రూ.75,00,000-00
అమీనా విలువ: రూ. 1,50,00,000-00
యస్.ఆర్.ఓ విలువ: రూ.82,65,131-00
నోట్: ఇ.సి.లో ఎలాంటి తగాదాలు లేవు.
వేలం వాయిదా తేదీ:12.12.2025
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
తాతిరెడ్డి రామగోపాల రెడ్డి
డిక్రీ హోల్డర్ తరఫున న్యాయవాది, నంద్యాల.
Cell: 94402 12642.

సుభాష్.. శెభాష్

☛ వాలీబాల్‌లో రాణిస్తున్న ఫార్మసీ విద్యార్థి

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యవసాయ కుటుంబంలో పుట్టి చదువుతోపాటు క్రీడల్లోనూ సత్తా చాటుతున్నాడు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ తమలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నాడు. పాఠశాల స్థాయిలో రాణించడమే కాకుండా యూనివర్సిటీ, జాతీయ స్థాయికి చేరుకొని అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి పోటీ పడుతున్నాడు సుభాష్.

సుభాష్

● పాణ్యం గ్రామానికి చెందిన బి.గోపాల్, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు సుభాష్. శాంతిరాం ఫార్మసీ కళాశాలలో బీ ఫార్మసీ రెండో సంవత్సరం చదువుతూ క్రీడల్లోనూ రాణిస్తున్నాడు. వాలీబాల్‌లో ప్రతిభ చూపుతూ.. వివిధ స్థాయిల్లో సత్తా చాటుతున్నాడు. రోజు రెండు గంటలకు పైగా సాధన చేస్తూ కళాశాలల్లో వచ్చే క్రీడా పోటీల్లో పాల్గొంటూ ప్రత్యేకత చాటుతున్నాడు. పాఠశాల స్థాయి నుంచే వాలీబాల్‌లో ప్రతిభ చూపుతూ పలు జ్ఞాపికలు, ధ్రువపత్రాలు అందుకున్నాడు. అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యంగా సాధన చేస్తున్నట్లు పేర్కొంటున్నారు సుభాష్.

సాధించిన ఘనతలు

● 2018లో హైదరాబాద్ మల్లారెడ్డి కళాశాలలో నిర్వహించిన స్కూల్ విభాగం సీబీఎస్ఈ క్లస్టర్ స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు.

● 2019లో నిజామాబాద్‌లో నిర్వహించిన స్కూల్ విభాగం సీబీఎస్ఈ క్లస్టర్ స్థాయి పోటీల్లో రెండవ స్థానం సాధించాడు.

● 2023, 2025 మార్చి నెలలో గూడూరు, కలికిరిలో జరిగిన జేఎన్‌టీయూఏ అంతర కళాశాల క్రీడా పోటీల్లో యూనివర్సిటీ జట్టులో పాల్గొన్నాడు.

● 2024 ఏప్రిల్‌లో విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అంతర ఫార్మసీ కళాశాల క్రీడా పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపాడు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన కేంద్రాలు

విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న గ్రంథాలయాధికారి మధు

తిమ్మాపురం(మహానంది): జ్ఞాన సముపార్జన కేంద్రాలు గ్రంథాలయాలని గ్రంథాలయాధికారి మధు పేర్కొన్నారు. ఎం.తిమ్మాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గ్రంథాలయాల వారోత్సవాలను పురస్కరించుకొని విజేత విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు మద్దిలేటి, కరస్పాండెంట్ అనురాధ, డి.చంద్రమౌళీశ్వరుడు పాల్గొన్నారు.

పాణ్యం గ్రామీణం: స్థానిక గ్రంథాలయంలో పలు పాఠశాల విద్యార్థులకు గ్రంథాలయాధికారిణి భాగ్యలక్ష్మి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంఈవో సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ రంగారమేష్ బహుమతులు అందించారు. వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు.

నందికొట్కూరు: నందికొట్కూరు గ్రంథాలయంలో నిర్వహించిన వారోత్సవాల్లో ముఖ్య అతిథిగా పట్టణం సీఐ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

వెలుగోడులో ఇంట్లో చోరీ

వెలుగోడు, న్యూస్‌టుడే: వెలుగోడు పట్టణంలోని గాంధీనగర్‌లో రమణయ్య అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగినట్లు బాధితులు తెలిపారు. పట్టణానికి చెందిన రమణయ్య కొంతకాలంగా పట్టణంలోని ప్రధాన సెంటరులో పానీపూరి బండి పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. బుధవారం వ్యాపారం ముగించుకొని రాత్రి ఇంటికి వెళ్లే సరికి ఇంటి తాళాలు పగలకొట్టి ఉండడాన్ని గుర్తించారు. బీరువా పగులకొట్టి బీరువాలో ఉన్న రూ.60 వేలు, రెండు తులాల బంగారు ఆభరణాలు, ఓ చరవాణి అపహరించుకెళ్లినట్లు బాధితులు చెప్పారు. పోలీసు స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేయడంతో ఎస్సై సురేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువకుడిపై కేసు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైలంలోని మేకలబండ చెంచుకాలనీకి చెందిన బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనలో యువకుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రసాదరావు తెలిపారు. రెండు రోజుల క్రితం శ్రీశైల దేవస్థానంలో పొరుగుసేవల కింద విధులు నిర్వర్తించే రాజు ప్రకాశ్‌రెడ్డి అనే యువకుడు ఓ బాలిక పట్ల వ్యవహరించిన తీరుపై వచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

(c) eenadu

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఉప విద్యాధికారి వెంకటరామిరెడ్డి

ప్యాపిలి, డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని డోన్ ఉప విద్యాధికారి వెంకటరామిరెడ్డి, జిల్లా ప్రభుత్వ పరీక్షల నిర్వహణాధికారి రఘురామిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల పరీక్షా కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. పాఠశాలల్లో వసతులు, సౌకర్యాలపై ప్రధానోపాధ్యాయులతో ఆరా తీశారు. డోన్‌లోని స్థానిక పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, ఒయిసెస్, శాంజో, శ్రీసుధ, నారాయణ పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాల్లో కనీస సౌకర్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు వెంకటేశ్వర నాయక్, మహేశ్వరరెడ్డి, సీఆర్పీ రామాంజనేయులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ పథకం కొనసాగింపు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకాన్ని కొనసాగిస్తున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ పేర్కొన్నారు. మున్సిపల్‌లో ఎల్‌ఆర్‌ఎస్ పథకంపై సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నోటిఫికేషన్ ఇచ్చిన రోజు నుంచి 90 రోజుల లోపు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ జాకీర్ హుస్సేన్, టీపీఎస్ మస్రత్ అలీ ఖాన్, కౌన్సిలర్లు రమణ, నాగేంద్ర పాల్గొన్నారు.

బిల్లులు లేకుంటే జరిమానా విధిస్తాం

బేతంచెర్ల, న్యూస్‌టుడే: నాపరాయి, ఇనుప ఖనిజం, కంకర, డోలమైట్ తదితర ఖనిజాలకు బిల్లులు లేకుండా అక్రమ మార్గాల్లో వెళ్లే వాహనాలపై కేసులు నమోదు చేస్తామని రాయల్టీ ఇన్‌స్పెక్టర్ రామాంజనేయరెడ్డి హెచ్చరించారు. బేతంచెర్ల మండలం హెచ్‌కొట్టాల నుంచి విజయవాడకు వెళ్తున్న మొజాయిక్ చిప్స్ లారీకి ఎలాంటి బిల్లులు లేకపోవడంతో రూ. 30,440 జరిమానా విధించినట్లు తెలిపారు.

తీరనున్న కాలనీవాసుల కష్టాలు

◆ ఎస్సీ కాలనీల్లో పనులకు రూ. 2 కోట్లు మంజూరు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: డోన్ పురపాలిక పరిధిలోని ఎస్సీ కాలనీలకు మహర్దశ తిరిగింది. షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక పథకం కింద ప్రభుత్వం 2024-25లో పలు రకాల అభివృద్ధి నిర్మాణాలు చేపట్టేందుకు నిధులు మంజూరు చేసింది. 40శాతం ఎస్సీ జనాభా ఉన్న కాలనీల్లోని వీధుల్లో నిధులను ఖర్చు పెట్టాల్సి ఉంటోంది. ఈ పథకం కింద సీసీ రహదారులు, సీసీ డ్రైన్లు వంటి పలు రకాల అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. ఎస్సీ కాలనీల్లో 18 రకాల పనులను మున్సిపల్ అధికారులు గుర్తించారు. వీటికి సంబంధించి ప్రతిపాదనలను రూపొందించి సాంకేతిక(టెక్నికల్) మంజూరు కోసం నంద్యాలలోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయానికి అధికారులు పంపించారు. అక్కడి నుంచి అనుమతి రావడంతో అధికారులు ఈనెల 18వ తేదీ నుంచి ఆన్‌లైన్ టెండర్లకు ఆహ్వానిస్తున్నారు. టెండర్లు పూర్తైన తర్వాత గుత్తేదారుకు వర్క్ ఆర్డర్ ఇచ్చి పలు అభివృద్ధి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు.

ఉప ప్రణాళిక కింద

షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక పథకం కింద ప్రభుత్వం డోన్ పురపాలక సంఘానికి రూ.2కోట్లు మంజూరు చేసింది. 40 శాతం ఎస్సీ జనాభా ఉన్న ప్రదేశాల్లో అధికారులు సంబంధిత గుత్తేదారుతో మంజూరైన నిధులతో పలు రకాల అభివృద్ధి పనులు చేపడతారు. పట్టణంలోని త్రివర్ణ కాలనీ, శ్రీరామానగర్, వైఎస్ఆర్ నగర్, శ్రీనివాసనగర్, బంగారయ్య కాలనీల, విడోస్ కాలనీ, కేవీఆర్ నగర్, న్యూ స్వీపర్స్ కాలనీల్లో షెడ్యూల్డ్ ఉప ప్రణాళిక నిధులతో పలు రకాల అభివృద్ధి పనులు చేపట్టి కాలనీల పురోగతికి కృషి చేయనున్నారు.

పలు రకాల అభివృద్ధి

పురపాలక సంఘం పరిధిలో 40శాతం ఎస్సీ జనాభా నివాసాలు ఉంటున్న ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులు పలు రకాల అభివృద్ధి నిర్మాణాలను చేపట్టనున్నారు. రూ. 80లక్షలతో సీసీ రహదారులకు సంబంధించి 8 పనులు, రూ. 10లక్షలతో శ్మశానవాటికకు సంబంధించిన ప్రహరీ నిర్మాణం, తాగునీటి సౌకర్యం కల్పించడం, మిగతా రూ. 1.10కోట్లతో సీసీ డ్రైన్ల నిర్మాణాలకు సంబంధించి 9 పనులు చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

డోన్‌లోని విడోస్ కాలనీలో రోడ్డుపైకి చేరిన మురుగు

☛ పట్టణంలోని చిగురుమానుపేటలోని ఎస్సీలు నివాసం ఉంటున్న ప్రాంతాలను అధికారులు గుర్తించారు. ఈ వీధిలో సీసీ రహదారి, డ్రైన్ల నిర్మాణాలకు నోచుకోక పోవడంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక కింద నిధులు మంజూరు కావడంతో ఈ వీధిలో సీసీ రహదారితో పాటు సీసీ డ్రైన్ల నిర్మాణాలు చేపట్టేందుకు అధికారులు ప్రణాళికను రూపొందించారు. టెండర్లు పూర్తయ్యాక అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

☛ పట్టణంలోని విడోస్ కాలనీలోని ఓ వీధిలో సీసీ రహదారులు, సీసీ డ్రైన్ల నిర్మాణాలు లేకపోవడంతో జనం పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఈ వీధిలో సీసీ రహదారులు, కాల్వల నిర్మాణాలు చేపట్టనుండటంతో వీధిలోని ఎస్సీలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

పోషకాహారం అందించాలి

ఏనుగుమమర్రి(ప్యాపిలి),న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని ఎంపీడీవో శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్ పేర్కొన్నారు. మండలంలోని ఏనుమర్రి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. దస్త్రాలను పరిశీలించి సూచనలు సలహాలు అందజేశారు. గ్రామంలోని చెత్త సంపద కేంద్రాన్ని తనిఖీ చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ?: ఆళ్లగడ్డ మండలంలోని అహోబిలం గ్రామంలో బైపాస్ రహదారిలో నీటి ట్యాంకు వద్ద అపరిశుభ్రత నెలకొంది. - నరసింహ, అహోబిలం

✔: పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. -నూర్జహాన్, ఎంపీడీవో.

కోవెలకుంట్ల గ్రామీణం,న్యూస్‌టుడే: ?: కోవెలకుంట్ల నుంచి బనగానపల్లె దారిలో మురుగు కాలువలు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కాలువలు నిర్మించండి. - శేషు. గ్రామస్థుడు

✔: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. -ప్రకాష్ నాయుడు. ఇన్‌ఛార్జి ఈవో

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు బస్సులు బయటకు వచ్చే చోట రోడ్డు ప్రమాదకరంగా ఉంది. ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సమస్యను పరిష్కరించండి. -మల్లేశ్వరరెడ్డి, ఆళ్లగడ్డ

✔: గుంతలకు మరమ్మతులు చేస్తాం. -వెంకటేశ్వరెడ్డి, ఏఈఈ, ఆర్అండ్‌బీ, ఆళ్లగడ్డ

?: పట్టణంలోని టీబీ రోడ్డులో మార్కెట్ యార్డు ఎదురుగా మురుగు నీరు రహదారిపైకి వస్తోంది. సమస్యను పరిష్కరించండి. -శ్రీనివాసులు, ఆళ్లగడ్డ

✔: ప్రధాన డ్రైన్లలో త్వరలోనే పూడిక తీసే కార్యక్రమం ప్రారంభిస్తాం. -పి.కిశోర్, కమిషనర్, ఆళ్లగడ్డ

సంజామల, న్యూస్‌టుడే : ?: గ్రామం నుంచి గిద్దలూరు వెళ్లే రహదారిలో పురాతన బావి రక్షణగోడ కూలింది. దీంతో గోడతో పాటు రహదారి మట్టి కూడా బావిలోకి జారిపోయింది. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. –వెంకటేశ్వర్లు, ఆర్.లింగందిన్నె

✔: సమస్యపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. వారి నుంచి అనుమతులు రాగానే మరమ్మతులు చేపడతాం. -రెడ్డిగోవింద్, ఆర్అండ్‌బీ ఏఈ. సంజామల

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ?: బనగానపల్లి మండలం పసుపల గ్రామంలోని ఎస్సీకాలనీకి వెళ్లే దారిలో మురుగు దారిపై ప్రవహిస్తోంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి -లక్ష్మిదేవి, పసుపల

✔: గ్రామంలోని సమస్యను గుర్తించి చర్యలు తీసుకుంటాం, ఇబ్బందులు లేకుండా చేస్తాం. -నాగరాజు, ఎంపీడీవో

పోటీ పరీక్షలతో విద్యార్థుల్లో నైపుణ్యం

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు పోటీ పరీక్షలతో నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ప్రిన్సిపల్ గణేష్ సురేంద్రన్ అన్నారు. బనగానపల్లి మండలం ఇల్లూరు కొత్తపేట గ్రామంలోని పెండేకంటి పబ్లిక్ స్కూల్‌లో 'ఈనాడు' ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. దాదాపు 120 మందిలో 40 మంది విద్యార్థులు ఉపన్యాసం ఇచ్చారు. వారిలో గేయపల్లవి(9వ తరగతి), రుక్సీరా (9వ తరగతి),మేఘశ్రీ(7వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో బహుమతులు సాధించారు. బహుమతులు, ప్రశంస పత్రాలను ప్రిన్సిపల్ గణేష్ సురేంద్రన్, ఏవో సురేష్‌కుమార్‌లు అందజేశారు. విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

బహుమతులు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

పాల్గొన్న విద్యార్థులు

కుష్ఠు వ్యాధిపై అప్రమత్తత అవసరం

ప్యాపిలి, న్యూస్‌టుడే: కుష్ఠు వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి రాఘవేంద్ర, పర్యవేక్షకుడు మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని నాల్గవ సచివాలయం పరిధిలో గురువారం కుష్ఠు వ్యాధి సర్వే నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. శరీరంపై రాగిరంగులో ఉండే మచ్చలు ఉంటే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. సిబ్బంది మల్లేశ్వరమ్మ, శోభ, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: గ్రామాల్లో కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపుకు సర్వే నిర్వహిస్తున్నట్లు వైద్యులు అంజలి తెలియజేశారు. చాగలమర్రి పట్టణంలోని ఆర్‌సీఎం పాఠశాల సమీపంలో గురువారం సంచార చికిత్స నిర్వహించారు. పలువురికి పరీక్షలు నిర్వహించారు. హెల్త్‌సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ సురేంద్రబాబు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామి రథోత్సవంలో కోట్ల

డోన్, న్యూస్‌టుడే: పట్టణంలోని ద్రోణపురి వీరాంజనేయస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన రథోత్సవంలో తెదేపా యువ నాయకుడు, ఎమ్మెల్యే తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెదేపా పట్టణ అధ్యక్షుడు టీఈ రామచంద్రగౌడ్, రాష్ట్రనాయకులు వలసల రామకృష్ణ, లక్ష్మినారాయణ, భాస్కర్‌నాయుడు, గోవిందరెడ్డి, రామాంజనేయులు, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రథోత్సవంలో పాల్గొన్న కోట్ల రాఘవేంద్రరెడ్డి

మట్టి కాల్వ ఏర్పాటు

స్పందనకు వందనం

కోవెలకుంట్ల గ్రామీణం, న్యూస్‌టుడే: కోవెలకుంట్ల పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల సమీపంలోని ఉచిత మినరల్ వాటర్ ప్లాంటు వద్ద రహదారి పైకి నీరు చేరుతుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. దీనిపై ఈనెల 17న 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. కథనానికి అధికారులు స్పందించి రహదారి పైకి నీరు రాకుండా మట్టి కాలువ ఏర్పాటు చేశారు.

ఆదమరిస్తే కాల్వలోకే

బనగానపల్లి పట్టణంలోని పెట్రోల్ బంకు కూడలి నుంచి మార్కెట్ వరకు రహదారికి మరమ్మతుల పనులు కొనసాగుతున్నాయి. దీంతో బనగానపల్లి నుంచి అవుకుకు వెళ్లే వాహనాల రాకపోకలు శివారులోని ఎస్ఆర్‌బీసీ కాల్వపై కొనసాగిస్తున్నారు. కట్ట ఎత్తులో ఉండటంతో ఏ మాత్రం వాహనదారులు ఆదమరిచినా కాల్వలో పడిపోయే ప్రమాదముంది. ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని వాహనాదారులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, బనగానపల్లి గ్రామీణం

ప్రభుత్వ ఆసుపత్రికి శుద్ధజల కేంద్రం

బనగానపల్లి వంద పడకల ఆసుపత్రికి త్వరలోనే శుద్ధజల కేంద్రం అందుబాటులోకి రానుంది. ఆసుపత్రిలో శుద్ధజల కేంద్రం మూసివేయడంతో రోగులు వారి సహాయకులు ఇబ్బందులు పడుతున్నారని ఇటీవల 'ఈనాడు'లో కథనాలు వచ్చాయి. స్పందించిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి యుద్ధ ప్రాతిపదికన మినరల్ వాటర్ ప్లాంటు నిర్మాణానికి ఆదేశాలు జారీ చేశారు. సుమారు రూ.8లక్షలు వెచ్చించి పనులు ప్రారంభించారు. శుద్ధజల కేంద్రానికి అవసరమైన గదిని పూర్తి చేశారు. త్వరలోనే యంత్రాలను అమర్చి రోగులకు నీరు అందించనున్నారు. -న్యూస్‌టుడే, బనగానపల్లి

రహదారి ఇలా.. రాకపోకలు ఎలా..

మండలంలోని ముద్దవరం గ్రామంలో ఎస్సీ కాలనీలో ఆర్బీకే, హెల్త్ సెంటరుకు వెళ్లే రహదారి గుంతలు, బురదమయంగా మారింది. రహదారి అభివృద్ధికి కూడా దూరంలో ఉంది. వైకాపా పాలనలో కొంత మేర సీసీరోడ్డు వేసి మిగిలిన మేర రహదారి వేయక పోవడంతో కాలనీవాసులు, సచివాలయ సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. వివిధ పనులపై వెళ్లే ప్రజలు సైతం అవస్థలు పడుతున్నారు. ఇరువైపులా ముళ్ల పొదలు పెరగడంతో రాత్రి చీకట్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి సీసీ రహదారి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ముద్దవరం(బేతంచెర్ల)

ప్రయాణం ప్రమాదకరం

కూలీలు ప్రమాదకర ప్రయాణాలు సాగిస్తున్నారు. పంట దిగుబడులు తరలించే లారీల్లో బస్తాలపై కూర్చొని ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ఆళ్లగడ్డ మండలంలోని కొండాపురం, ఎస్.లింగందిన్నె, పేరాయిపల్లె గ్రామాల్లో మొక్కజొన్న దిగుబడులు బస్తాల్లో నింపి వ్యాపారులకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో అధిక లోడుతో ఉన్న లారీలోని బస్తాలపై ఎలాంటి ఆధారం లేకుండా కూలీలు కూర్చుంటున్నారు. వాహనం అదుపుతప్పినా పెను ప్రమాదం చోటుచేసుకుంటుంది. -న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణం

పిచ్చికుక్క దాడిలో ఆరుగురికి గాయాలు

మాయలూరు(ఉయ్యాలవాడ), న్యూస్‌టుడే: మాయలూరులో గురువారం ఉదయం 10 గంటలకు పిచ్చికుక్క దాడిలో ఆరుగురికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన విద్యార్థులతో పాటు పలువురిపై పిచ్చికుక్క దాడి చేయటంతో రక్త గాయాలయ్యాయి. వీరికి మాయలూరు ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి ఆశోక్ చికిత్సలు నిర్వహించారు.

యూనియన్ అధ్యక్షుడి మృతికి సంతాపం

డోన్, న్యూస్‌టుడే: డోన్ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు భాస్కర్ అనారోగ్యంతో మృతి చెందడంతో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగ నాయుడు, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సుంకయ్య తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. గురువారం ఆయన స్వగృహం వద్ద మృతదేహానికి పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. సీపీఐ జిల్లా నాయకులు నక్కిలెనిన్‌బాబు, రాధాకృష్ణ, అన్వర్, అబ్బాస్, మోటారాముడు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

డోన్, న్యూస్‌టుడే: కొండపేటలో ఉన్న హజరత్ హసన్ అలీ మౌలాలి ఉరుసు ఉత్సవాలను ఈనెల 21 నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రహిమాన్ తెలిపారు.

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువులో రాణించాలని జేకేఆర్ సంస్థ అధ్యక్షులు బ్రహ్మానందచారి పేర్కొన్నారు. రామతీర్థం ప్రాథమిక పాఠశాలలో పొదుపు ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 22న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్లలో తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 2002 ఓటర్ల జాబితా, ప్రస్తుత ఓటర్ల జాబితాకు సంబంధించి మ్యాపింగ్ కార్యక్రమం గురువారం నిర్వహించారు.

డోన్, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం డోన్ ఎమ్మెల్యే ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమంలో పాల్గొంటారని నాయకులు తెలిపారు.

డోన్, న్యూస్‌టుడే: చలికాలంలో వృద్ధులు ఎంతో ఇబ్బంది పడుతుంటారని అలాంటి వారికి దుప్పట్లు అందించటం ఎంతో అవసరమని ప్రార్థన సమయం నిర్వాహకులు జానప్రభాకర్ అన్నారు. స్థానిక వైఎస్‌నగర్‌లోని వృద్ధులకు బెడ్‌షీట్లు అందజేశారు.

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని తోళ్లమడుగు గ్రామంలో డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళీశ్వర గౌడ్ ఆధ్వర్యంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఇళ్లులేని నిరుపేదలకు ఆవాస్ ప్లస్ పథకం కింద ఇళ్లు కట్టిస్తారని చెప్పారు. లబ్ధిదారులు ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రుద్రవరం, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దకంబలూరు గ్రామంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చెడు వ్యసనాల వల్ల కలిగే దుష్ఫలితాలపై ఎస్సై మహమ్మద్‌రఫీ అవగాహన కల్పించారు.

యర్రగుంట్ల (శిరివెళ్ల), న్యూస్‌టుడే: గర్భిణులు, బాలింతలు కూరగాయలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ మండల పర్యవేక్షకురాలు సువర్ణలత పేర్కొన్నారు.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనదారులు విధిగా ధ్రువపత్రాలు, లైసెన్సు కలిగి ఉండాలి ఎస్సై చిన్న పీరయ్య యాదవ్ పేర్కొన్నారు. జాతీయ రహదారిలోని గోవింద పల్లె మెట్ట వద్ద ఎస్సై వాహనాల తనిఖీ చేపట్టారు.

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: గ్రంథాలయాలు పుస్తకాలతో కూడిన ఆలయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయాధికారి డా. గంగన్న అన్నారు. వారోత్సవాల సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వాసవి బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.వేణుగోపాల్ పేర్కొన్నారు.

బనగానపల్లి, న్యూస్‌టుడే: నేటి ఆధునిక ప్రపంచంలో గ్రంథాలయాల ప్రాముఖ్యత తగ్గిపోవడం బాధాకరమని పట్టణ మాజీ సర్పంచు బీసీ రాజారెడ్డి పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

దొర్నిపాడులో విద్యార్థులతో ఉపాధ్యాయులు

దొర్నిపాడు, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు చెన్నకేశ్వరి పేర్కొన్నారు. సాఫ్ట్‌బాల్‌లో ఉష, శ్రీకంఠ ఆచారి, కళ, బేస్‌బాల్‌లో వుశేన్, జుబేదా, అఫ్రిది, కుసుమాబి ఎంపికయ్యారు.

చింతలచెరువు(చాగలమర్రి): చింతలచెరువు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు సుబ్బరాయుడు తెలిపారు. సాఫ్ట్‌బాల్ విభాగంలో వెంకటరమణ, వెంకటశ్రావణి, బేస్‌బాల్ పోటీల్లో భరత్, అనుమోషిత, శివపుష్పలత, రామ్‌చరణ్, పల్లవి, దాక్షాయని ఎంపికయ్యారని తెలియజేశారు.


చాగలమర్రి: ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: హ్యాండ్‌బాల్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డా.తొగట సురేష్‌బాబు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎస్.ఫయాజ్(7వ తరగతి), సాఫ్ట్‌బాల్‌కు ఇ.నాగేంద్ర(7వతరగతి), బేస్‌బాల్‌కు హెచ్.జీవన్ ఎంపికైనట్లు తెలిపారు.

మానవ సంబంధాలు పెరగాలి

బనగానపల్లి, న్యూస్‌టుడే: మానవ సంబంధాలు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని జమాతే ఇస్లామిక్ హింద్ అధ్యక్షుడు గౌస్‌బాషా పేర్కొన్నారు. ఈనెల 21 నుంచి 30 వరకు దేశవ్యాప్తంగా నిర్వహించే పొరుగువారి హక్కుల దేశవ్యాప్త ఉద్యమం గోడ ప్రతులను గురువారం విడుదల చేశారు.

టైలర్స్‌ను ఆర్థికంగా ఆదుకోవాలి

బేతంచెర్ల,న్యూస్‌టుడే: కుట్టు మిషన్లు పెట్టుకొని స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న యువతను ఆదుకోవాలని టైలర్స్ సంఘం అధ్యక్షులు ఎల్లయ్య పేర్కొన్నారు. బేతంచెర్లకు చెందిన గోపాల్ అనారోగ్యంతో మరణించాడు. ఆ కుటుంబానికి సంఘం తరఫున రూ. 21,500 ఆర్థిక సాయం అందించారు. రామచంద్రారెడ్డి, వినోద్, హరి, రమణ, గంగన్న, మధు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధితో జీవాలు మృతి

ప్యాపిలి, న్యూస్‌టుడే: ప్యాపిలి మండలంలోని రాంపురం గ్రామంలో గత కొద్ది రోజుల నుంచి జీవాలు మృత్యువాత పడుతున్నాయని గొర్రెల పెంపకందారులు రామ్‌శేఖర్, నారాయణస్వామి, రవిలు గురువారం పేర్కొన్నారు. గ్రామంలో ఇప్పటి వరకు 50కి పైగా గొర్రెలు, మేకలు మృతి చెందాయని, తమకు తీరని నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం

మాట్లాడుతున్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు వాణి

బనగానపల్లి గ్రామీణం: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యులు వాణి పేర్కొన్నారు. పట్టణంలోని జడ్పీబాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ప్రసాదరావు ఆధ్వర్యంలో పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించారు. ఎంఈవో స్వరూప మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ఇద్దరు బాలికల అదృశ్యం

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: కొలిమిగుండ్లలో ఇద్దరు బాలికలు అదృశ్యమైనట్లు సీఐ రమేష్‌బాబు గురువారం చెప్పారు. అవుకుకు చెందిన 15, 17 ఏళ్ల వయసున్న ఇద్దరు అక్కాచెల్లెళ్లు తల్లితో పాటు కొలిమిగుండ్లలోని అక్కదేవతల గుడి వద్దకు వచ్చారు. కనిపించకుండా పోయారు. తల్లి ఎంత వెతికినా కనిపించలేదు. బాలికల తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

పాఠశాలలోని రేషన్ బియ్యం తరలింపు

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్లలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి సంబంధించిన రేషన్ బియ్యంను తరలించారు. గురువారం రేషన్ బియ్యం బస్తాలను పాఠశాలలో పనిచేస్తున్న క్లర్క్ ఓ డీలర్‌కు పంపడం జరిగింది. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో చక్కర్లు కొట్టింది. దీనిపై డిప్యూటీ డీఈవో వెంకట్రామిరెడ్డితో మాట్లాడగా తమ దృష్టికి రాలేదన్నారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెరగాలి

శిరివెళ్ల, న్యూస్‌టుడే: మండలంలోని యర్రగుంట్ల, శిరివెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలని వైద్యాధికారులు ఆంజనేయులు నాయక్, ముకేష్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని యర్రగుంట్ల, శిరివెళ్ల గ్రామాల్లోని పీహెచ్‌సీల్లో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలకు గురువారం సమావేశం నిర్వహించారు. ప్రతినెలా గర్భిణులను పీహెచ్‌సీల్లోనే నెలవారీ పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు.

రుణాలు మంజూరు చేయండి

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలని కోరుతూ ఎంపీడీవో వరప్రసాదరావుకు ఎమ్మార్పీఎస్ నాయకులు నవీన్ మాదిగ, దండు మాదిగ, రమేష్ మాదిగల ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. రుణాలు మంజూరు చేసి దళితులను ఆదుకోవాలని సూచించారు.

బ్రాహ్మణుల అభివృద్ధికి కృషి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: బ్రాహ్మణుల అభివృద్ధి కోసం చైతన్య వేదిక కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీపీ సుబ్బారావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సహకారంతో బ్రాహ్మణ సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతాయని అన్నారు. ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందించాలన్నారు.

పాచిపట్టి ప్రమాదకరంగా మారి

సంజామల, బనగానపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: వర్షం కురిసినప్పుడు లో లెవెల్ వంతెనలు.. వాటి చప్టాలపై ప్రయాణించాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. నెలల కొద్ది రెండు నుంచి అడుగు మేరకు వరద నీరు ప్రవహిస్తుండటంతో వాటిపై పాచి పేరుకుపోతోంది. పాచిలో ప్రయాణించే సమయంలో వాహనాలు అదుపుతప్పి వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నాయి. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరి పరిస్థితుల్లో ఈ వంతెనలపై ప్రయాణం చేయటంతో వాహనాలు జారి పడుతున్నాయి. దీంతో వాహనచోదకులు కిందపడి కాళ్లు చేతులు విరగొట్టుకుండటంతో పాటు వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆర్థిక ఇబ్బందుల పాలవుతున్నారు.

పలు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి

సంజామల మండలంలోని సంజామల నుంచి పేరుసోముల వెళ్లే రహదారిలో సంజామల గోంద్రవాగు పాయ వద్ద, రెడ్డిపల్లె నుంచి అవుకు మండలం కాశీపురం వెళ్లే రహదారిలో రెడ్డిపల్లె వాగు, గిద్దలూరు వద్ద, వసంతాపురం-హొత్రమావ్‌దిన్నె మధ్యన ఉన్న పాలేదరువాగు, ముదిగేడు-కమలపురి మధ్యన ఉన్న వాగులో చప్టాలపై వరదనీరు ప్రవహించడంతో పాచి పేరుకుపోతుంది. వసంతాపురం-హొత్రమాన్‌దిన్నె వాగులో ఐదేళ్ల క్రితం వాగు దాటుతున్న సమయంలో ఉధృతికి కొట్టుకుపోయి మృతి చెందాడు.

★ బనగానపల్లి మండలంలోని టంగుటూరు వద్ద పెల పూలవాగు, అలుగు వాగు, పెద్దరాజుపాలెం జుర్రేరువాగుల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

గిద్దలూరులో లోతట్టు వంతెనలో పేరుకుపోయిన పాచి

★ అవుకు మండలంలోని ఉప్పలపాడు వద్ద కాలువకట్ట వాగులో వరదనీరు వంతెనపై నుంచి ప్రవహించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి.

★ కొలిమిగుండ్ల మండలంలోని చింతలాయిపల్లె-ఎస్.చెన్నంపల్లె గ్రామాల మధ్యలో ఉన్న వాగు, కోరుమానుపల్లె- అబ్దుల్లాపురం మధ్యలో ఉన్న వాగు, నాగిశెట్టిపల్లె, బి.తాడిపత్రి గ్రామాల మధ్యలో ఉన్న వాగుల్లో ఇలాంటి పరిస్థితి నెలకొంది.

కొండలో ఎర్రమట్టి తవ్వకాలు

ప్యాపిలి, న్యూస్‌టుడే: ప్యాపిలి మండలంలోని కలచట్ల.. ఎస్.రంగాపురం గ్రామాల మధ్యలో ఉన్న కొండ ప్రాంతంలో గ్రావెల్ కోసం ఎర్రమట్టి తవ్వకాలు జరుపుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. కొన్ని నెలల నుంచి కొండ నుంచి ఎర్రమట్టిని తవ్వుతూ గాలిమరల వద్దకు టిప్పర్ల ద్వారా తరలిస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై వీఆర్వోను వివరణ కోరగా ఓ సర్వే నంబరులో తవ్వకాలకు అనుమతి ఇచ్చినట్లు పేర్కొన్నారు. కానీ గ్రామ ప్రజలు మాత్రం వేరే సర్వే నంబరులో ఎర్రమట్టి తవ్వకాలు జరుపుతున్నారని ఆరోపిస్తున్నారు.

అనుమతి పత్రాలు తప్పనిసరి

ప్యాపిలి, న్యూస్‌టుడే: వాహన చోదకులు అనుమతి పత్రాలు తప్పనిసరిగా ఉంచుకోవాలని ఎంవీఐ క్రాంతికుమార్ పేర్కొన్నారు. ప్యాపిలి మండలంలోని కలుచట్ల సమీపంలో గురువారం వాహన తనిఖీ చేపట్టారు. టిప్పర్‌కు రోడ్డు ట్యాక్స్ లేనందున రూ. 1.17 లక్షల జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. అనంతరం టిప్పర్‌ను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

శివయ్య చితాభస్మం.. స్తూపంలో పదిలం

వినుకొండ, న్యూస్‌టుడే: వినుకొండ పట్టణ ప్రధాన కూడలిలో నిర్మించిన స్తూపానికి ఓ చరిత్ర ఉంది. ప్రజల మన్ననలు పొందిన నాయకుడు పులుపుల వెంకటశివయ్య పేరుతో 50 ఏళ్ల కిందట దీనిని నిర్మించారు. స్వాతంత్య్రం వచ్చిన తొలినాళ్లలో వినుకొండ పంచాయతీ బోర్డు అధ్యక్షుడిగా, తర్వాత రెండు సార్లు శాసనసభ్యుడిగా పనిచేశారు. బెనారస్ విశ్వవిద్యాలయంలో చదివి బీఎస్సీ (ఆనర్స్) పట్టా అందుకుని తొలి తరం కమ్యూనిస్టు నాయకుడిగా ఎదిగారు. సొంత ఇల్లు కూడా సమకూర్చుకోని నిష్కలంగా ప్రజా సేవకుడిగా గుర్తింపు పొందారు. అప్పట్లో సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ ఆహ్వానం మేరకు ఆ దేశ సందర్శనకు వెళ్లి 1976 జులై 14న అక్కడే తుదిశ్వాస విడిచారు. నాటి కలెక్టర్ స్థలం కేటాయించడంతో ఆయన పేరుతో ప్రజల విరాళాలతో వినుకొండలో స్మారకస్తూపం నిర్మించారు. రష్యా నుంచి తెచ్చిన ఆయన చితాభస్మాన్ని ఓ పాత్రలో ఉంచి స్తూపంపైన గాజు పెట్టెలో భద్రపరిచారు. నాటి నుంచి ఈ ప్రాంతాన్ని శివయ్య స్తూపం సెంటర్‌గా పిలుస్తున్నారు.

వల్లభేశ్వరుడికి విశేషాలంకరణ

కార్తిక మాసం ముగింపు సందర్భంగా గురువారం మండల పరిధిలోని విప్పర్ల వల్లభేశ్వర స్వామికి విశేష అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

– న్యూస్‌టుడే, రొంపిచర్ల

ఉద్యోగాల వల.. నిరుద్యోగులు విలవిల

డబ్బులిస్తే కొలువులు ఇప్పిస్తామంటూ మోసాలు

బయోమెడికల్ ఇంజినీర్, ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్టాఫ్‌నర్సు ఉద్యోగాలు ఇప్పిస్తానని చిత్తూరుకు చెందిన రమేష్ అనే వ్యక్తి వల విసిరితే సత్తెనపల్లి మండలం అబ్బూరు గ్రామానికి చెందిన ఇద్దరు చిక్కుకుని రూ.9.10 లక్షలు మోసపోయారు. డబ్బులిచ్చి ఆరు నెలలు గడిచినా ఉద్యోగాలు రాకపోవడంతో ఎస్పీకి పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ నెల 18న సత్తెనపల్లి గ్రామీణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

నరసరావుపేట, సత్తెనపల్లి, న్యూస్‌టుడే

విద్యార్హతలకు తగ్గ ఉద్యోగాలు లేని నిరుద్యోగులు చాలా మంది జిల్లాలో ఉన్నారు. వారిని లక్ష్యంగా చేసుకుని కొందరు మోసాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ శాఖలు, ప్రముఖ ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని మభ్యపెట్టి రూ.లక్షలు కాజేస్తున్నారు. డబ్బులు జేబుల్లోకి వెళ్లిన తరువాత ముఖం చాటేస్తున్నారు. ఎక్కువ మొత్తంలో డబ్బులు పోగొట్టుకున్నవారు పీజీఆర్ఎస్‌తో పాటు పోలీసు స్టేషన్లలో ఫిర్యాదులు చేస్తున్నారు. మోసం విషయం బయటపడితే పరువు పోతుందని కొందరు మిన్నకుండిపోతున్నారు.

సత్తెనపల్లి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత, విద్యార్థుల కోసం ప్రభుత్వ పరంగా నిర్వహిస్తున్న జాబ్ మేళాల్ని లక్ష్యంగా చేసుకుని ఓ మోసగాడు ఉద్యోగాల వల విసిరాడు. మేళాకు హాజరైన వారి వివరాలు సేకరించి వైజాగ్ పోర్టు, రాజమహేంద్రవరం, గన్నవరం విమానాశ్రయాల్లో ఉద్యోగాలు ఉన్నాయని.. రిజిస్ట్రేషన్‌కు రూ.8,500 చెల్లించాలని వందల మంది నుంచి డబ్బులు వసూలు చేశాడు. మోసపోయిన వారినుంచి అందిన ఫిర్యాదు మేరకు చిత్తూరుకు చెందిన రాజేశ్ అనే మోసగాడిని పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు.

సమాచారం తెలియడంతోనే సమస్య

నిరుద్యోగుల సమాచారం నేరగాళ్లకు తెలియడంతోనే సమస్య వస్తోంది. సీఎంఓ కార్యాలయం, మంత్రులు, ఉన్నతాధికారులతో పరిచయాలు ఉన్నాయని, ఇలా డబ్బులు కడితే.. అలా ఉద్యోగ నియామక పత్రం చేతిలో పెడతామని చెప్పి అనుమానం రాకుండా విడతల వారీగా రూ.లక్షలు తీసుకుంటున్నారు. తీరా తమ లక్ష్యం పూర్తయ్యాక చిరునామాలు మార్చి నిరుద్యోగులు, వారి కుటుంబ సభ్యులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఇలాంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు.

మరింత రుచికరంగా మధ్యాహ్న భోజనం

నరసరావుపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు పెంచడం, బడి మానేసే విద్యార్థుల సంఖ్యను గణనీయంగా తగ్గించేందుకు ఉద్దేశించిన మధ్యాహ్న భోజనాన్ని మరింత రుచికరంగా ఏజెన్సీలు వండి వడ్డించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. నిత్యావసరాల ధరలు పెరిగిన నేపథ్యంలో వంట ఛార్జీలు పెంచుతూ

ఛార్జీలు పెంచిన ప్రభుత్వం

నిర్ణయం తీసుకుంది. మెనూ ప్రకారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలయ్యేలా ప్రభుత్వం పర్యవేక్షణ పెంచనుంది. కేంద్ర ప్రభుత్వం వంట ఛార్జీల ధరలు పెంచిన నేపథ్యంలో రాష్ట్రంలోనూ పెంపుదలకు నిర్ణయం తీసుకున్నారు.

ఒక్కో విద్యార్థికి వంట ఛార్జీలు ఇలా.. (రూపాయల్లో)

తరగతులు	ప్రస్తుతం	పెంచిన తర్వాత
1–5	5.45	6.19
6–8	8.17	9.29
9-ఇంటర్మీడియట్	8.17	9.29

- జిల్లాలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు : 1518
- ఒకటి నుంచి ఇంటర్ విద్యార్థులు : 1,25,633
- రోజూ మధ్యాహ్న భోజనం చేసేవారు : 1.11 లక్షలు
- ప్రభుత్వ జూనియర్ కళాశాలలు : 9
- మధ్యాహ్న భోజనం చేసేవారు : 1500

గ్రామోత్సవంలో వీరుల ఆయుధాలు

రాయబారం రసవత్తరం

కారంపూడి, న్యూస్‌టుడే: పల్నాటి వీరుల ఆరాధనోత్సవాల్లో రెండో రోజు రాయబార ఘట్టం రసవత్తరంగా సాగింది. అలనాడు కోడిపోరులో మాచర్ల రాజధానిని కోల్పోయి అరణ్య, అజ్ఞాత వాసాలు ముగించుకొని మలిదేవ, బ్రహ్మన్నల పరివారం తిరిగి వస్తారు. వారికి రాజ్యం ఇవ్వాలంటూ గురజాల రాజు నలగామని వద్దకు అలరాజు రాయబారానికి వస్తారు. ఆయనను చర్లగుడిపాడు వద్ద హతమార్చడంతో పల్నాటి యుద్ధం అనివార్యమైన క్రతువును ప్రదర్శించారు. గురువారం రాత్రి వీర్ల దేవాలయంలోని కథా మండపంలో గానం చేస్తుండగా.. వీరుల వంశీయులు కత్తిసేవ చేశారు. వీరారాధనతో రాయబార ఘట్టం ముగిసింది. ఉదయం వీరుల ఆయుధాలకు (కొణతాలు) పవిత్ర నాగులేరు గంగధారి మడుగులో స్నానాలు చేయించి వీరగంధం పూసి ప్రత్యేకంగా అలంకరించారు. ముందుగా కొణతాలకు వీర్ల దేవాలయంలో ఆచారం నిర్వహించి గ్రామోత్సవంగా చెన్నకేశవస్వామి, అంకమ్మ ఆలయాలలో శంఖుతీర్థాలు తీసుకుని ఆచారవంతులు పీఠాధిపతి ఇల్లు చేరారు. ఈ ఘటనను కళ్లకు కడుతూ చేసిన గానం ఆకట్టుకుంది.

నేడు చాపకూడు వేడుక

బ్రహ్మనాయుడు కులమతాలను ఏకం చేస్తూ అందరికీ చాపకూడు సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టారు. శుక్రవారం చాపకూడు మండపం వద్ద వేడుక నిర్వహిస్తారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంతో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి నేతృత్వంలో సహపంక్తి భోజనాలకు అన్ని ఏర్పాట్లు చేశారు.

60 ఏళ్ల తరవాత.. 59 నాటి జ్ఞాపకాలు

గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల 1959-65 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

ఈ చిత్రంలో కనిపిస్తున్నవారంతా నిపుణులైన సీనియర్ వైద్యులు. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో 1959-65 బ్యాచ్‌కు చెందినవారు. 60 ఏళ్ల తరువాత గురువారం గుంటూరులోని ఓ ప్రైవేటు హోటల్‌లో కలిశారు. నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. జీఎంసీ, జీజీహెచ్‌కు వెళ్లి ప్రిన్సిపల్ సుందరాచారి, సూపరింటెండెంట్ యశస్వి రమణను కలిశారు. నాటి బ్యాచ్‌లో 131 మంది ప్రవేశం పొందగా.. ఇందులో 55 మంది ఇప్పటికే ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోయారు. 20 మంది సమాచారం తెలియలేదు. మిగిలినవారంతా ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకుని అందులో చురుగ్గా ఉంటున్నారు. నేరుగా కలుసుకోవాలన్న ఉద్దేశంతో 25 మంది పూర్వ విద్యార్థులు వచ్చారు. ప్రతి ఒక్కరూ వారి వారి జీవితాల్లో సాధించిన విజయానందాన్ని అందరితో పంచుకున్నారు. సన్మానాలు, జ్ఞాపికలతో సందడి చేశారు. సభ్యుల చిరునామాలు, వివరాలతో సావనీర్ విడుదల చేశారు. చాలాకాలం తరువాత ఒకచోట కలవడం ఆనందంగా ఉందని మహేష్, జి.రంగారావు 'ఈనాడు'తో చెప్పారు.

– ఈనాడు, అమరావతి

సంక్షేమ విద్యార్థులకు శుద్ధజలం

నరసరావుపేట, సత్తెనపల్లి, **న్యూస్‌టుడే:** సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతిగృహాల్లో నీటి కష్టాలకు చెల్లుచీటి పాడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇప్పటివరకు నీటి వసతి లేక డబ్బా నీళ్లపై ఆధారపడాల్సి వస్తోంది. ఇక నుంచి విద్యార్థులకు శుద్ధజలం అందించేలా ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. 45 రోజుల్లోపు పనులు పూర్తి చేయాలని నిర్దేశించారు.

❖ జిల్లాలోని రామకృష్ణాపురంలో రెండు (సత్తెనపల్లి), అచ్చంపేట, కారంపూడి, అమరావతి, వీపీసౌత్, వినుకొండ, యడ్లపాడు, ఉప్పలపాడు (నూజండ్ల), మాడుగల (గురజాల)లో ఒకటి చొప్పున సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలున్నాయి. వీటిలో 4 వేల మంది వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. ఒక్కో పాఠశాలలో రూ.6 లక్షలు వెచ్చించి ప్లాంటు ఏర్పాటు చేయనున్నారు.

సత్తెనపల్లి వసతిగృహానికి దాత అందజేసిన స్టీలు డబ్బా. విద్యార్థులకు ఈ నీరే దిక్కు

❖ జిల్లాలోని 18 ప్రీమెట్రిక్ వసతిగృహాల్లో 1,800 మంది, 11 పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాల్లో 1,100 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఒక్కోచోట రూ.2 లక్షలు వెచ్చించి ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయనున్నారు.

❖ జిల్లావ్యాప్తంగా 29 ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాల్లో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు ద్వారా విద్యార్థులకు శుద్ధ జలం అందనుందని జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి రాజేశ్వరమ్మ తెలిపారు.

VISHWA BHARATHI
COLLEGE OF PHARMACEUTICAL SCIENCES
(Approved by AICTE & PCI, New Delhi, Affiliated to JNTUK, Kakinada, Govt of AP) PERECHERLA, GUNTUR - 522009. PH: 9440434169
ESTD:1997
B. PHARMACY & PHARM.D SPOT ADMISSION – 2025
Eligible candidates who have not taken admission in any other college so far may attend Spot Admissions in I B. Pharmacy & I Pharm.D with all original certificates between **20-11-2025 to 23-11-2025.** The Vacant seats created to unreported candidates shall be filled-up as per guidelines of APSCHE Convenor APEAPCET- 2025. **PRINCIPAL**

ఊరికి ఉపకారి.. అభివృద్ధికి సహకారి

నేడు ప్రారంభం

గొట్టిపాడు (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే: ఆయనో ప్రభుత్వ ఉద్యోగి. తాను నివసిస్తున్న ఊరు బాగు కోసం నిరంతరం తపన పడుతుంటారు. రెండు దశాబ్దాలకు పైగా ఉద్యోగ జీవితంలో గ్రామంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి ఊరికి ఉపకారిగా నిలుస్తున్నారు. ఆయనే మండలంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న యద్దనపూడి ప్రసాద్. ఆయనకు పిల్లలు లేరు. 'ప్రేమామయుని నిలయం' పేరుతో ఓ భవనం నిర్మించి ఎంతో మంది అనాథ పిల్లలకు ఆశ్రయం కల్పించి సేవలందించారు. ప్రస్తుతం అక్కడ పిల్లలు ఎవరూ లేకపోవడంతో ఆ భవనాన్ని అంగన్‌వాడీ కేంద్రానికి అప్పగించారు. తన స్వగ్రామమైన గొట్టిపాడు ప్రధాన కూడలి వద్ద రెవెన్యూ భవనం తన సొంత డబ్బుతోనే నిర్మించారు. గ్రామంలో రెండు చోట్ల బస్‌షెల్టర్లు, మూడు చేతిపంపులు, శుద్ధ జల కేంద్రం ఏర్పాటుచేశారు. గ్రామంలో పోస్టాఫీసు లేక గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి నూతన భవనాన్ని తన సొంత నిధులతో నిర్మించారు. దానిని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం ప్రారంభించనున్నారు.

గొట్టిపాడులో నిర్మించిన పోస్టాఫీసు (అంతర చిత్రంలో) ప్రసాద్

గ్రామాల్ని పరిశుభ్రంగా మార్చాలని..

నేడు ప్రత్యేక కార్యక్రమం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల్ని పరిశుభ్రంగా మార్చాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఈ నెల 21వ తేదీన ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మండలానికి ఒక పంచాయతీని ఎంపిక చేసి ఆదర్శంగా పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలు చేపట్టనున్నారు. వీధుల్లో నుంచి చెత్త తొలగించడం, మురుగు కాలువల శుభ్రత, ఘనవ్యర్థాల కేంద్రాల సేవల్ని మెరుగుపర్చడం, రెండు డబ్బాల్లో చెత్త, వ్యర్థాలు ఇచ్చేలా ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయనున్నారు. జిల్లా, మండల స్థాయి అధికారులు, స్వచ్ఛత సిబ్బంది ఇందులో కీలక భూమిక పోషించనున్నారు.

ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమానికి ముప్పాళ్ల మండలం మాదల ఎంపికైంది. మండలంలోని అన్ని గ్రామాల గ్రీన్ అంబాసిడర్లు, గార్డులు మాదల వెళ్లి 21న పారిశుద్ధ్య కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఘనవ్యర్థాల నిర్వహణ కేంద్రంలో తడిచెత్తతో వర్మీ కంపోస్టు తయారీ, పొడి చెత్తను వేరుగా సేకరించి ఆదాయం పెంచుకోవడంపై దృష్టి సారించనున్నారు. జనాభా, నివాస గృహాలు ఎక్కువగా ఉన్న కొన్ని గ్రామాల్ని దీనికి ఎంపిక చేశారు.

మాదల ఎస్సీ కాలనీలో మురుగు కాలువ దుస్థితి

- జిల్లాలో మండలాలు 28
- ఎంపికైన పంచాయతీలు 28
- గ్రీన్ అంబాసిడర్లు 1,222 మంది
- గ్రీన్ గార్డులు : 421 మంది

CHALAPATHI COLLEGE OF PHARMACY
CCPY
A.R.Nagar, Mothadaka, GUNTUR- 522 016
Ph: 08645 294242, Mobile : 9492478685,
Email.principalccp2024@gmail.com www.ccpy.ac.in
CATEGORY -B / SPOT ADMISSIONS
I B.PHARMACY

S.No.	Course	EAPCET Code	Category-B Seats
01	B.Pharmacy	CCPY	30

Eligible candidates who have not taken admission in any other college so far may attend SPOT Admissions in I B.Pharmacy with all original certificates on **24/11/2025.** The vacant seats created to unreported candidates, shall be filled-up as per guidelines of APSCHE & Convenor APEAPCET-2025. **Principal**

పీఎం సూర్యఘర్ సద్వినియోగం చేసుకోండి

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే: పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఏపీ సీపీడీసీఎల్ ఛైర్మన్, ఎండీ పుల్లారెడ్డి అన్నారు. నరసరావుపేట మండలం జొన్నలగడ్డలోని జిల్లా విద్యుత్తు కార్యాలయంలో గురువారం పల్నాడు సర్కిల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్లులు సకాలంలో వసూలుచేసి విద్యుత్తు శాఖకు ఆదాయం పెంచాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తరచూ తలెత్తే లోవోల్టేజీ సమస్యను అధిగమించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్తు కనెక్షన్ల మంజూరులో జాప్యం తగదన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ డైరెక్టర్లు మురళీకృష్ణ యాదవ్, టి.వి.ఎస్.ఎన్.మూర్తి, వెంకటేశ్వర్లు, ఎస్ఈ విజయ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీఎండీ పుల్లారెడ్డి

నిధులిస్తేనే నీరు

కాలువలు, డ్రెయిన్ల మరమ్మతులకు రూ.64 కోట్లతో ప్రతిపాదనలు

ఈనాడు – అమరావతి

మొంథా తుపాను, భారీ వర్షాలకు కృష్ణా డెల్టాలోని కాలువలు, డ్రెయిన్లకు పడ్డ గండ్లను పూడ్చేందుకు రూ.64 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రభుత్వం వీలైనంత తొందరగా అనుమతులిస్తే సాంకేతిక ప్రక్రియలు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని చెబుతున్నారు. తుపాను తరువాత కాలువల్లో నీటి ప్రవాహాలకు అడ్డంకుల్లేకుండా తాత్కాలిక పనులు పూర్తి చేశారు.

నల్లమడ వాగుకు పడిన గండి

జిల్లా	పనులు	తాత్కాలిక ఖర్చు	శాశ్వత పనులకు
		(రూ.కోట్లలో)	
గుంటూరు	130	8.10	14.77
బాపట్ల	317	17.68	19.40
ప్రకాశం	25	1.03	2.03
పల్నాడు	3	0.29	0.70
మొత్తం	475	27.10	36.90

నష్టం ఆనవాళ్లిలా...

❖ గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో కాలువలు, డ్రెయిన్లు దెబ్బతినగా.. పల్నాడు జిల్లాలో వాగులకు గండ్లు పడ్డాయి. ❖ మెట్ట ప్రాంతాల నుంచి వాగుల ద్వారా వచ్చిన వరద కారణంగా బాపట్ల జిల్లాలోని పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ❖ నల్లమడ వాగు వరద కొమ్మమూరు కాలువలో కలవడంతో పలుచోట్ల గండ్లు పడ్డాయి. మిగిలిన వాగుల కట్టలూ దెబ్బతిన్నాయి. ఫలితంగా వేలాది ఎకరాల్లోని పంటలు నీట మునిగాయి. ❖ శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేయడానికి రూ.36.90 కోట్లు కావాలని జలవనరులశాఖ ముఖ్య ఇంజినీరుకు ప్రతిపాదనలు పంపించారు. తాత్కాలిక ప్రాతిపదికన ఇప్పటికే కొన్ని పనులు పూర్తి చేయగా.. మిగిలిన వాటికి రూ.27.10 కోట్లు అవసరం. మొత్తంగా రూ.64 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదనల్లో కోరారు. ❖ డెల్టాలో కాలువలు, మురుగు కాలువలు, పల్నాడులో వాగులకు మరమ్మతులు పూర్తి చేస్తే వరద కష్టాల నుంచి ఉపశమనం లభిస్తుంది.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
నెకరికల్లు బ్రాంచ్ (03727), ఫోన్: 94416 90949.
శాఖ తరలింపు ప్రకటన
మా ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించే మా ప్రయత్నంలో నెకరికల్లు శాఖ బ్యాంక్ రోడ్డు నుండి జానకిరామ రైస్ మిల్ ఎదురుగల నూతన భవనం (పిడుగురాళ్ళ-నరసరావుపేట హైవే) లోనికి తరలించబడుతుంది. మరియు తరలించబడే తేది అయిన 24-11-2025 నుండి క్రొత్త చిరునామా నుండి పనిచేస్తుంది. క్రొత్త చిరునామా ఆవరణ నుండి పనిచేస్తూ అన్ని రకాల సాధారణ బ్యాంకింగ్ వ్యాపార కార్యకలాపాలను నిర్వహిస్తుంది.
మీ నమ్మకాన్ని మరియు విశ్వాసాన్ని మేము ఎంతో విలువైనదిగా భావిస్తున్నాము. మరియు మా వ్యాపారం పట్ల మీ విధేయతను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాము. భవిష్యత్తులో మా ఉత్తమమైన సేవలను మీకు అన్ని వేళలా అందించగలమని తెలియజేస్తున్నాము.
ప్రదేశం: నెకరికల్లు
తేదీ: 20-11-2025
సం/- బ్రాంచ్ మేనేజర్,
స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, నెకరికల్లు బ్రాంచ్

ఆదాయానికి గండి.. చర్యలు లేవండి!

ఈనాడు – అమరావతి

దేవాదాయ శాఖలో వైకాపా హయాంలో కొందరు కార్యనిర్వాహక అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి దేవాదాయ శాఖ ఆదాయానికి గండికొట్టారు. పల్నాడు జిల్లా మాచవరం మండలం పిల్లుట్ల గ్రామంలోని జీవీజీకేఆర్వో ఎస్టేట్‌కు కార్యనిర్వహణాధికారిగా పనిచేసిన జి.శ్రీనివాస రెడ్డి ఎస్టేట్‌లో ఉన్న పది భారీవృక్షాలను నరికేసి కలప తరలించినా బహిర్గతం కాకుండా గోప్యంగా ఉంచారు. ఈవో ప్రమేయం లేకుండా వృక్షాలు నరికి తరలించే పరిస్థితి లేదని గుర్తించిన కొందరు దేవాదాయశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

నెలలు గడుస్తున్నా..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ విషయమై విచారణకు ఆదేశించింది. విచారణలో భారీ వృక్షాలు నరికేసినట్లు గుర్తించి ఈవో శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యంతో దేవాదాయ శాఖ ఆదాయానికి గండి పడిందని నివేదిక ఇచ్చారు. విచారణ

భారీవృక్షం నరికేసిన ఆనవాళ్లు

దేవాదాయ శాఖలో ఇదీ పరిస్థితి

నివేదిక ఆధారంగా దేవాదాయ కమిషనర్ ఈ ఏడాది ఫిబ్రవరిలో ఐదు అంశాలపై ఐదు ఛార్జి మెమోలు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అనుమతి లేకుండా భారీ వృక్షాలు నరికివేయడం, కలప విక్రయించిన తర్వాత సొమ్ము ఎస్టేట్ ఖాతాకు జమ చేయకపోవడం, చెట్లు నరికిన తర్వాత ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకపోవడం, పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం, విధులు నిర్వహించడంలో విఫలం అయ్యారన్న అంశాలపై ఛార్జిమెమోలు జారీచేశారు. అయితే నెలలు గడుస్తున్నా తదుపరి చర్యలు తీసుకోవడంలో అంతులేని జాప్యం జరుగుతోంది.

విచారణలో అక్రమాలు నిర్ధారించిన తర్వాత కూడా కాలయాపన జరుగుతుండటం చర్చనీయాంశమైంది. చెట్లు నరకడానికి గల కారణాలేంటి? కలప విక్రయించగా వచ్చిన సొమ్ము ఎవరి ఖాతాలోకి వెళ్లింది? చెట్లు నరకడం వెనుక ఉన్న ఉద్దేశాలేమిటన్న విషయాలు తెలియాల్సి ఉంది. అక్రమాలు పిల్లుట్లకే పరిమితమా? అన్న విషయమై కూడా ఆరా తీయాల్సిన సమయంలో అంతులేని జాప్యం జరుగుతోంది. ఇప్పటికైనా దేవాదాయశాఖ ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారా? లేదా? వేచిచూడాల్సిందే.

అక్షరానికో నిఘంటువు

ఆంగ్లం నుంచి ఆంగ్లం, తెలుగు, హిందీ భాషల్లో పదాలకు అర్థాలు తెలిపే నిఘంటువులు చూస్తుంటాం. ఆంగ్ల భాషలోని 26 అక్షరాల్లో ప్రతి అక్షరానికి ప్రత్యేకంగా ఓ నిఘంటువును చూడాలంటే పల్నాడు జిల్లా నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాల గ్రంథాలయానికి రావాల్సిందే. అక్కడ విదేశీ ప్రచురణ సంస్థలు ఆక్స్‌ఫర్డ్, ఛాంబర్స్, ఫంక్ అండ్ వాగ్నల్స్, ఎన్‌కర్టా తదితర 100 రకాల నిఘంటువులున్నాయి. వాటిలో ఆక్స్‌ఫర్డ్ సంస్థ 1933లో లండన్‌లో ప్రచురించిన 12 వాల్యూమ్స్ ఈ గ్రంథాలయంలో ఉన్నాయి. ప్రతి అక్షరానికి సంబంధించి పలు పదాలకు 3500 పుటల్లో అర్థాలు ప్రచురించి ఉన్నాయి. గ్రంథాలయ ప్రారంభ సమయం 1956లో అప్పటి కళాశాల కమిటీ నేతలు రూ.650 వెచ్చించి ముంబయి (అప్పటి బొంబాయి) నుంచి వీటిని తెప్పించారు. తర్వాత మరో మూడు సప్లిమెంటరీ వాల్యూమ్స్ తెప్పించి అందుబాటులో ఉంచారు. ఇలా ఈ గ్రంథాలయం ప్రత్యేక నిఘంటువుల కేంద్రంగా మారింది.

– న్యూస్‌టుడే, నరసరావుపేట అర్బన్

THE ARYAPURAM CO-OPERATIVE URBAN BANK LTD. HEAD OFFICE, RAJAMAHENDRAVARAM (Reg.No.3127)

RECRUITMENT NOTIFICATION FOR THE POSTS OF ASST. CLERKS / ASST. CASHIER ON CONTRACT BASIS

Applications are invited from Candidates who passed **IBPS/ SBI/RRB'S CLERKS PRELIMS** for the post of Asst. Clerks on contract basis Age : 21 Yrs-28 Yrs. as on date of notification (Age relaxation as per Bank service conditions), **Consolidated payment of Rs. 24,000/- p.m** during probation period of 1 year and on confirmation pay scales will be applicable.

The vacancies are at our Guntur, Visakhapatnam and Bhimavaram Branches only

Selection Procedure : Written Test and Interview

Last date of application to be received to bank: 29-11-2025 by 5:00 p.m.

Those candidates who have applied in last one year are not eligible to apply **Application only in specified format can be sent through courier or email or through registered post or in person. Bank reserves right to refuse any application without assigning any reasons**

Detailed Recruitment notification & Application can be downloaded from Website:
http://www.aryapurambank.com/career.html
Email: arcobank_rjy@aryapurambank.com
Date: 21-11-2025 **Contact no.:-0883-2473550**
Secretary/CEO

(c) eenadu

చంద్రమౌళీశ్వరునికి నాగాభరణం బహూకరణ

నర్సింగపాడు (నకరికల్లు): నర్సింగపాడులోని అయ్యప్పస్వామి సహిత శ్రీగంగా అన్నపూర్ణ సమేత మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి, శ్రీగంగా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో కార్తీకమాసం ముగింపు సందర్భంగా ఉత్సవాలు పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా చోట్ల గణపతి పూజ, కలశస్థాపన, లలితాసహస్రనామార్చన, కుంకుమార్చన, రుద్ర, చండీహోమాలను ఆలయ అర్చకులు నిర్వహించారు. అయ్యప్పస్వామి సహిత శ్రీగంగా అన్నపూర్ణ సమేత మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామికి 4.1కిలోల వెండి నాగాభరణం నకరికల్లు గ్రామానికి చెందిన తిరువీదుల శ్రీను బహూకరించారు. ఆయాచోట్ల స్వామివారికి చేసిన అలంకరణలు భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అటు కోతులు.. ఇటు కుక్కలు

☛ పదిన్నర నెలల్లో 2,208 మందిపై దాడి ☛ బెంబేలెత్తుతున్న జనం

బెల్లంకొండ డొంక, జానపాడురోడ్డు, పిడుగురాళ్ల, న్యూస్‌టుడే

పట్టణాలు, గ్రామాల్లో వీధి కుక్కలు, కోతలు బెడద పెరిగింది. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో దాడులు చేస్తూనే ఉన్నాయి. దీంతో రోడ్డుపైకి రావాలంటేనే జనం భయపడిపోతున్నారు. పిడుగురాళ్ల మండలంలో ఎక్కడ చూసినా శునకాలు గుంపులుగా కనిపిస్తున్నాయి. కొందరు వాటి బారిన పడి గాయాలపాలవుతున్నారు. మండలంలో గత జనవరి నుంచి ఇప్పటివరకు 2,208 మందిపై కుక్కలు, కోతులు దాడి చేసి గాయపరిచినట్లు ఆసుపత్రుల్లోని గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో 80 శాతం మంది కుక్కకాటు బాధితులే.

జానపాడు రోడ్డులో..

బడికి వెళ్లాలంటే భయం

పట్టణంలోని 8, 9వ వార్డుల్లో విద్యాసంస్థలు ఎక్కువగా ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో కుక్కల సంచారం ఎక్కువ. పిల్లలకు బడికి పంపాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో తల్లిదండ్రులు పాఠశాలల వద్దకు వెళ్లి తమ పిల్లలను వదిలి పెట్టి తీసుకొని వెళ్లాల్సి వస్తోంది. పోస్టాఫీసు, వికాస్ పాఠశాల, జానపాడురోడ్డు, మారుతీనగర్, లెనిన్‌నగర్, కొండమోడు పునరావాస కేంద్రం, కళ్లం టౌన్‌షిప్, జానపాడు, గుత్తికొండ, బ్రాహ్మణపల్లి, పాతగణేశునిపాడు, కోనంకి, తుమ్మలచెరువు, కరాలపాడు గ్రామాల్లో కుక్కలు, కోతల సంచారం ఎక్కువగా ఉంది. పురపాలక సంఘం అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కలు, కోతులను పట్టించి అటవీ ప్రాంతాల్లో వదలాలని కోరుతున్నారు.

✦ గత వారం పిడుగురాళ్ల ఎనిమిదో వార్డుకు చెందిన వృద్ధురాలు పోస్టాఫీసు ప్రాంతానికి వచ్చింది. వీధి కుక్క దాడి చేయడంతో కిందపడిపోయింది. వృద్ధురాలికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు నరసరావుపేట ఆసుపత్రికి తరలించారు. ఇదే ప్రాంతంలో నిత్యం ఎవరో ఒకరిపై వీధి కుక్కలు దాడి చేస్తున్నారు.

✦ జూలకల్లు మసీదు ప్రాంతంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. స్థానికులపై దాడి చేస్తున్నాయి. ఇటీవల పది మందికిపైగా బాధితులు ఆసుపత్రిలో చికిత్స పొందారు.

జనవరి నుంచి ఇప్పటివరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నమోదైన బాధితుల వివరాలివీ..

ప్రాంతం	సంఖ్య
పిడుగురాళ్ల	829
కరాలపాడు	345
లెనిన్‌నగర్	321
ఎల్ఐసీ కృష్ణారావు	313
సంజీవరెడ్డినగర్	400

✦ దీనిపై పురపాలిక కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ రెండు నెలల కిందట కుక్కలకు సత్తెనపల్లిలో శస్త్రచికిత్సలు చేయించాం. ఇబ్బందికర పరిస్థితులు ఉన్న ప్రాంతాల్లో కుక్కలు, కోతలు పట్టించి అటవీ ప్రాంతంలో వదిలిపెట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పుస్తక పఠనం.. లక్ష్య సాధనకు దోహదం

బహుమతులు సాధించిన విద్యార్థులతో డీఈవో చంద్రకళ తదితరులు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: నిరంతరం పుస్తక పఠనం చేస్తే విజ్ఞాన సముపార్జనతో పాటు జీవిత లక్ష్యాన్ని సాధించేందుకు దోహదపడుతుందని డీఈవో చంద్రకళ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని పట్టణంలోని గ్రంథాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రతిరోజు దినపత్రికలు చదివేందుకు కొంత సమయం కేటాయించాలన్నారు. మహనీయుల జీవిత చరిత్ర చదివితే వారు ఉన్నతికి చేసిన కృషి, అనుసరించిన జీవన విధానం, పాటించిన విలువలు తెలుస్తాయన్నారు. గ్రంథాలయాల్లో విద్యార్థులు సభ్యత్వం తీసుకుని అధ్యయనం కొనసాగించాలని సూచించారు. జిల్లా ఔషధ నియంత్రణ అధికారిణి సునీత మాట్లాడుతూ పుస్తకాలన్నంటినీ ఒకచోట చేర్చిన ఆలయమే గ్రంథాలయం అన్నారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి రాధ, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆదర్శ విద్యార్థినులకు అంబేడ్కర్ ప్రతిభ అవార్డులు

మోతీబాయి

వైష్ణవి

రొంపిచర్ల, న్యూస్‌టుడే: మండలంలోని వి.రెడ్డిపాలెం పీఎంశ్రీ ఏపీ మోడల్ స్కూలు విద్యార్థినులకు 2025 మార్చిలో జరిగిన 'పది' పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా అంబేడ్కర్ జాతీయ ప్రతిభ అవార్డులు దక్కాయని ప్రిన్సిపల్ డాక్టర్ బి.రవినాయక్ గురువారం తెలిపారు. బాలికలు రామావత్ మోతీబాయి, కోట వైష్ణవికి అవార్డులతో పాటు ఒక్కొక్కరికి రూ.60 వేల నగదు బహుమతి అందుతుందన్నారు. తమ విద్యార్థినులకు అవార్డులు దక్కడం ఉపాధ్యాయులు, విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. విద్యార్థినులను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పెద్దలు అభినందించారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు జొన్నలగడ్డ విద్యార్థులు

ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం మందడంలో ఈనెల 18న అండర్-14, అండర్-17 విభాగాలకు జరిగిన జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీల్లో మండలంలో జొన్నలగడ్డ జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు ఆరుగురు చొప్పున ఎంపికయ్యారని హెచ్‌ఎం మల్లికార్జునరావు గురువారం తెలిపారు. వీరు ఈనెల 21న ఎన్టీఆర్ జిల్లా నున్నలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వీరితో పాటు శిక్షణ ఇచ్చిన పీఈటీ సునీల్‌కు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

బాస్కెట్‌బాల్ జిల్లా జట్టులో చోటు

పండరీపురం(చిలకలూరిపేట పట్టణం): బాస్కెట్‌బాల్ అండర్-17 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు పట్టణంలో వేద పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి **కె.ప్రభాకర్** ఎంపికయ్యాడు. గత నెల 21న స్థానిక ఏఎంజీ పాఠశాలలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్‌గేమ్స్ బాస్కెట్ బాల్ పోటీలు జరిగాయి. దీనిలో ప్రతిభ చూపి ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. నేటి నుంచి మూడ్రోజుల పాటు నూజివీడులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా పాఠశాలలో గురువారం జరిగిన అభినందన సభలో పాఠశాల డైరెక్టర్ పెర్సీ స్వరూప, అకడమిక్ డైరెక్టర్ సత్య దీప్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయ బ్యాడ్మింటన్‌కు ఎంపిక

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు పట్టణంలోని వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థి **షేక్ మహ్మమద్ నిసా** ఎంపికయ్యాడని ప్రిన్సిపల్ ఓగూరి నాగేశ్వరరావు గురువారం తెలిపారు. ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపి వచ్చే ఏడాది జనవరి 10 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడన్నారు. ఇతన్ని కళాశాల కార్యదర్శి అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు రామకోటేశ్వరరావు, రాజేంద్ర ప్రసాద్, కృష్ణారావు, అచ్యుతరావు, పీడీ రాయల ఆంజనేయులు అభినందించారు.

బేస్‌బాల్ పోటీలకు..

అమరావతి, న్యూస్‌టుడే: బాలికల అండర్ 17 విభాగంలో ఈ నెల 28 నుంచి నంద్యాల జిల్లా అహోబిలంలో జరిగే రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు మండెపూడి జిల్లాపరిషత్తు పాఠశాలకు చెందిన **పాదిలె వీరలక్ష్మి** ఎంపికైంది. కొర్రపాడులో జరిగిన స్కూల్‌ఫెడరేషన్ గేమ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా తరుపున వీరలక్ష్మి రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటుందని వ్యాయామ ఉపాధ్యాయుడు సంజీవరావు తెలిపారు. ఎంఈవోలు శివబాబు, ప్రసాద్, హెచ్‌ఎం అన్నపూర్ణ అభినందించారు.

ఏఈఎల్‌సీ కబంధ హస్తాల నుంచి ఆస్తుల విముక్తి లక్ష్యం

పాఠశాల అభివృద్ధి కమిటీ సమావేశంలో తీర్మానం

మాట్లాడుతున్న పాఠశాల అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షుడు రామారావు

యడ్లపాడు, న్యూస్‌టుడే: ఏఈఎల్‌సీ కబంధ హస్తాల నుంచి యడ్లపాడు లూథరన్ హైస్కూల్ ఆస్తులను విడిపించి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని పాఠశాల అభివృద్ధి కమిటీ, పాఠశాల నిర్మాణ దాతల వారసులు, గ్రామపెద్దలు డిమాండ్ చేశారు. దీనికి సంబంధించి కార్యాచరణ రూపొందించే విషయమై స్థానిక లూథరన్ పాఠశాల ఆవరణలో అభివృద్ధి కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ముత్తవరపు రామారావు, నూతలపాటి కాళిదాసు మాట్లాడారు. 1952లో 28 మంది రైతుల దాతృత్వంతో పాఠశాల నిర్మాణం జరిగిందన్నారు. 1956లో నాటి పెద్దలు పాఠశాల నిర్వహణ బాధ్యతలు మాత్రమే ఏఈఎల్‌సీకి ఇచ్చారన్నారు. మొదట పాఠశాలలో విద్యా ప్రగతి బాగున్నా క్రమేణా ఏఈఎల్‌సీ నిర్లక్ష్యంతో మూసివేత దశకు వచ్చిందన్నారు. తీరా విద్యాశాఖ పాఠశాల మూసివేత ఉత్తర్వులు ఇచ్చాక అభివృద్ధి కమిటీపై నిందారోపణ తగదన్నారు. తాము పాఠశాల ఆస్తుల కోసం పాకులాడటం లేదని, కేవలం దాతల ఆశయాలను నెరవేర్చటం కోసం ప్రభుత్వమే వీటి నిర్వహణ బాధ్యతలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏఈఎల్‌సీ ప్రతినిధులు ఇటీవల పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడిన అంశాలను ఖండించారు. పాఠశాలను భవిష్యత్తులో ఉన్నత విద్య లేదా నైపుణ్య శిక్షణ కేంద్రంగా ఏర్పాటు చేయాలన్నది కమిటీ, దాతల వారసులు, గ్రామస్థుల ఆకాంక్ష అన్నారు. ఈ విషయమై పార్టీలు, వర్గాలకు సంబంధం లేకుండా సమష్టి కార్యాచరణ రూపొందించి సాధించుకునేలా ఏకగ్రీవంగా తీర్మానించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సీహెచ్ సృజన, డాక్టర్ పోపూరి రమేష్, రాఘవయ్య, శివయ్య, చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, యడ్ల సునీల్, బెజ్జం రాజశేఖర్, దాసరి వరహాలు, కారుచోల రోశయ్య, కాసు రామస్వామిరెడ్డి, తవ్వా వెంకటనర్సు, డి.సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

లూథరన్ పాఠశాలకు పూర్వవైభవం తేవాలి

మాట్లాడుతున్న జాషువా డానియల్, చిత్రంలో విశ్రాంత న్యాయమూర్తులు

యడ్లపాడు, న్యూస్‌టుడే: లూథరన్ ఉన్నత పాఠశాల భవిష్యత్తు కార్యాచరణ ప్రక్రియ న్యాయస్థానం, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై ఆధారపడి ఉంటుందని రాష్ట్ర మైనార్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ జాషువా డానియల్ అన్నారు. యడ్లపాడులోని లూథరన్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. విద్యా, రెవెన్యూ శాఖ అధికారులు, ఉపాధ్యాయులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పాఠశాల భవనం వెనుక ఖాళీ స్థలం, ఆట స్థలం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య లేకుండా చట్టపరంగా ఏమీ చేయలేమన్నారు. పాఠశాల బలోపేతానికి విద్యార్థుల సమీకరణ చేయాలని, పాఠశాలకు పూర్వవైభవం తెచ్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పాఠశాల అభ్యున్నతికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో డీఈవో చంద్రకళ, డిప్యూటీ డీఈవో సుభానీ, ఏఈఎల్‌సీ అడ్మినిస్ట్రేటర్, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జోసఫ్ పీఎస్, ఏఈఎల్‌సీ సెక్రటరీ కంట్రోలర్, విశ్రాంత న్యాయమూర్తి కె.జేసు రత్నకుమార్, తహసీల్దార్ విజయశ్రీ, హెచ్‌ఎం పద్మలత పాల్గొన్నారు.

బంగారం పేరిట రూ.10 లక్షలకు టోకరా

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: నరసరావుపేట సాయినగర్ మొదటి లైనుకు చెందిన కాకుమాను అయ్యప్పకు ఈ నెల 11న బెంగళూరు నుండి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. మీ తాతతో బాగా పరిచయం ఉందని మాటలు కలిపాడు. తన వద్ద బంగారం ఉందని రూ.10 లక్షలకే 3 కిలోల బంగారం ఇస్తానని నమ్మబలికాడు. ఆశ పడ్డ అయ్యప్ప నగదు తీసుకుని బెంగళూరు వెళ్లాడు. డబ్బు చెల్లించి బంగారం తీసుకుని తనిఖీ చేయించగా నకిలీ బంగారంగా తేలింది. మోసపోయానని గుర్తించి రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పాఠశాలకు పగిలిన గుడ్లు సరఫరా

ఉడకబెట్టిన వాటిలో పురుగులు

పాడైన గుడ్లు

అమరావతి, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి మురిగిన, పురుగులు పడిన గుడ్లు సరఫరా చేస్తున్నారు. నాణ్యత లోపించడంతో విద్యార్థుల ఆరోగ్యానికి హానికరంగా మారాయి. అమరావతి మండలంలోని ఓ పాఠశాలకు ఇటీవల సరఫరాదారులు గుడ్లు అందజేశారు. ట్రేలలో పగిలిన గుడ్లు ఉండటంతో దుర్వాసన వచ్చాయి. గుడ్లు మురిగిపోయి ఉండటంతో ఉడకబెట్టిన వాటిల్లో పురుగులు బయటపడ్డాయి. భోజన నిర్వాహకులు, పాఠశాల ఉపాధ్యాయులు గమనించి వాటిని పక్కన పెట్టేశారు. గుత్తేదారును అడిగితే పాడైపోయిన గుడ్లు పక్కన పెడితే వాటి స్థానంలో మళ్లీ ఇస్తామని చెప్పారని నిర్వాహకులు వాపోయారు. నాణ్యతను పరిశీలించాల్సిన కమిటీలు నిద్రావస్థలో ఉండటంతో సరఫరాదారులు ఇష్టానుసారం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సరఫరా సమయంలో గుడ్లను తనిఖీ చేయాల్సి ఉన్నా చేయకపోవడంతోనే నాణ్యత లోపించిందని విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

సాగర్ కుడికాలువ కట్టకు గండి

20 గ్రామాల ప్రజల ఆందోళన

గండి పడిన చోట నీటి ప్రవాహం

యంత్రాలతో పూడ్చే యత్నం

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ కుడికాలువ కట్టకు గురువారం అర్ధరాత్రి గండి పడింది. ఎస్కేప్ ఛానల్ వద్ద కట్టకు గండి పడటంతో నాగులేటి వాగుకు ప్రవాహం పెరిగింది. దీంతో వాగు పరీవాహక ప్రజలు భయాందోళన చెందుతున్నారు. నాగులేటి వాగు ఆనుకొని వీరుల తిరునాళ్ల నేపథ్యంలో వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. అందులోని మూడు దుకాణాలు లోతట్టులో ఉండటంతో నీరు చేరింది. మరో వైపు వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో ఎప్పుడు ఏమి జరుగుతుందో అని దాదాపు 20 గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎన్నెస్పీ అధికారులు వెంటనే యంత్రాల సాయంతో అక్కడకు చేరుకుని గండి పూడ్చే పనులు చేపట్టారు. ట్రాక్టర్ల ద్వారా మట్టిని తీసుకొచ్చి పోస్తున్నప్పటికీ గండి పూడటం లేదు. బుగ్గవాగులో కూడా వరద ప్రవాహం ఎక్కువ ఉండటంతో ప్రాజెక్టు వద్దే నీటిని నిలుపుదల చేయాల్సి ఉందని స్థానిక అధికారులు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. గుర్తు తెలియని వ్యక్తులు కట్టను ధ్వంసం చేసి ఉండొచ్చని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

గుట్టుగా తెచ్చి.. రైతులను ముంచి..!

విచ్చలవిడిగా నకిలీ పురుగు మందుల విక్రయాలు

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: పల్నాడు ప్రాంతంలో నకిలీ పురుగు మందులు విచ్చలవిడిగా అమ్ముతున్నారు. అధికారులు దాడులు నిర్వహిస్తున్నా గుట్టుచప్పుడు కాకుండా గ్రామాల్లోకి చేర్చుతూ రైతులను మోసం చేస్తున్నారు. పురుగు మందుల దుకాణాల యజమానులు, సరఫరాదారులు కుమ్మక్కై రైతులను ముంచుతున్నారు. గురజాల మండలం గొట్టిముక్కలలో ఇటీవల గ్రామానికి చెందిన ఇద్దరు గడువు ముగిసిన నకిలీ పురుగు మందులను గ్రామానికి చెందిన రైతులకు తక్కువ ధరకు ఆశచూపి అమ్మేశారు. రైతు పొలానికి పురుగు మందు పిచికారీ చేసినా ఎలాంటి మార్పు లేకపోవడంతో మోసపోయామని గుర్తించిన రైతులు మందుల కంపెనీ యజమానులను నిలదీశారు. వారు బుకాయించడంతో మరికొంతమంది రైతులతో కలిసి గురజాల పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు వారం రోజుల క్రితం గ్రామంలో దాడులు నిర్వహించగా 10 బాక్సుల నకిలీ పురుగు మందులు గుర్తించి స్టేషన్‌కు తరలించారు. రైతులకు మందులు అమ్మిన ఇద్దరిని పట్టుకుని విచారించగా తెలంగాణకు చెందిన ఓ వ్యక్తి పురుగు మందులు సరఫరా చేసినట్లుగా తెలిసింది. అతడిని పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. పట్టుబడిన నకిలీ మందుల విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. పురుగు మందులు విక్రయ దుకాణదారులపై రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణానది ఒడ్డునే గొట్టిముక్కల, దైద గ్రామాలు ఉండటంతో క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఈ విషయమై గురజాల వ్యవసాయ శాఖ అధికారి పుల్లారెడ్డిని వివరణ కోరగా, నకిలీ మందుల శాంపిళ్లను పరీక్షకు పంపించామని, నకిలీవో, ఒరిజినలో తేలిన తర్వాత చర్యలు చేపడతామని గురువారం తెలిపారు.

ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోండి

రైతులకు మందులు అందిస్తున్న జిల్లా పశువైద్యాధికారి రామారావు

రొంపిచర్ల: పాడి రైతులకు ప్రభుత్వం అనేక పథకాలు అందుబాటులోకి తెచ్చిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ పి.రామారావు అన్నారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని బుచ్చిపాపన్నపాలెంలో గురువారం పశువులకు గర్భ కోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. దీనిని ప్రారంభించిన ఆయన మట్లాడుతూ రాయితీపై గడ్డి జొన్నలు, లింగ నిర్ధారిత వీర్యం తదితర పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువైద్యులు డాక్టర్ సాయి మహేష్‌రెడ్డి, డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, పశువైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పశువులకు గర్భకోశ, గర్భ నిర్ధారణ, కృత్రిమ గర్భధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 108, రిటైల్ ధర - 135, చికెన్ విత్‌స్కిన్ - 196, చికెన్ స్కిన్‌లెస్ - 223.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -106 రిటైల్ ధర 133 చికెన్ విత్ స్కిన్ - 193, చికెన్ స్కిన్‌లెస్ - 219.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 117, 124, 136 చికెన్ విత్ స్కిన్ - 222 చికెన్ స్కిన్‌లెస్ - 232.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 660 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.100/-.

చంటిబిడ్డకు మందులు తేవడానికి వెళుతూ మృతి

శివయ్య (పాత చిత్రం)

కారంపూడి, న్యూస్‌టుడే: చంటిబిడ్డకు మందులు కొనేందుకు ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తిని బస్సు రూపంలో మృత్యువు కబలించింది. మండలంలోని పేటసన్నెగండ్లకు చెందిన సురుగుల శివయ్య (26) తాపీపని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నెలరోజుల క్రితం భార్య పద్మ ఆడపిల్లకు జన్మనిచ్చింది. చంటిబిడ్డకు మందులు తీసుకొచ్చేందుకు ద్విచక్రవాహనంపై కారంపూడి వెళుతున్న అతన్ని మాచర్ల డిపోకు చెందిన బస్సు చిలకలూరిపేటకు వెళుతూ ఢీ కొట్టింది. శివయ్యకు తీవ్రగాయాలు కాగా స్థానికులు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. నాలుగేళ్ల క్రితం పెద్దకొడుకు మృతి చెందగా, చిన్నకొడుకు దూరమయ్యారని తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. భర్త మృతిని తట్టుకోలేక భార్య పద్మ విలపించిన తీరు స్థానికులను కలచి వేసింది. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి..

నరసింహారావు (పాత చిత్రం)

క్రోసూరు(అచ్చంపేట): క్రోసూరు మండలం అనంతవరంలో గురువారం తాపీ పనికి వెళ్లిన కార్మికుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఉసిరికాయల నరసింహారావు (54) గ్రామంలోని ఎస్టీకాలనీలో కె.ఆంజనేయులు ఇంటి నిర్మాణ పనికి వెళ్లాడు. గోడ ఆనుకుని ఉన్న 11కేవీ విద్యుత్తు లైన్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతవరం గ్రామంలోని ఎస్టీ, బీసీ, ఎస్సీకాలనీల మీదుగా విద్యుత్తు తీగలు తక్కువ ఎత్తులో ఉన్నాయని గ్రామస్థులు అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలిపామని, విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యం వల్లనే ప్రమాదం జరిగిందని స్థానికులు వాపోయారు.

కత్తితో దాడి.. యువకుడికి గాయాలు

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: నరసరావుపేట పట్టణం సత్తెనపల్లి రోడ్డులో ఓ ఆసుపత్రి పక్కన టీ దుకాణం నిర్వహిస్తున్న బరంపేటకు చెందిన మణికంఠ అనే వ్యక్తిపై అతనికి పరిచయస్తుడు దుడ్డు సుబ్బారావు కత్తితో దాడికి పాల్పడ్డాడు. దుకాణంలో మణికంఠ పనిచేసుకుంటుండగా వెనుక నుండి వచ్చి కత్తితో తలపై మోదాడు. ఘటనలో తలకు తీవ్ర గాయమైంది. బాధితుడిని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఉద్దేశపూర్వకంగా అతన్ని ఎవరో రెచ్చగొట్టి పంపి ఉంటారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దీనిపై రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

MARRIAGE SERVICES

వనజారావు క్విక్ మ్యారేజెస్ నందు అన్ని కులముల వారికి సంబంధములు కుదర్చబడును. లక్ష్మీపురం, గుంటూరు. సెల్: 98666 33988.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూపు, GNT. వృద్ధులకు, పేషెంట్ల సేవకు, ఇంటి/ వంట, బేబికేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 91540 85588, 91549 35588

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

ఫ్లాష్! ఫ్లాష్! చిలకలూరిపేట హైవే ఫేసింగ్ CRDA అప్రూవల్ వెంచర్. బ్యాంకు లోన్ సౌకర్యం. గజం 7500/- మాత్రమే. Phone: 9133574455

TO LET

గుంటూరు సిద్దార్థ నగర్ 2 లైన్ నందు ఉత్తరం ఫేసింగ్ డూప్లెక్స్ 4BHK ఫుల్లీ ఫర్నీచర్, 3 కార్ పార్కింగ్ ఇల్లు అద్దెకు కలదు. అద్దె రూ. 60,000/-. ✆ 9849719999

JOBS

Jayalakshmi Nexa Hiring for Autonagar, Guntur. Good Opertunity for Freshers/ Experienced Whatsapp: 91007 87054.

ఆఫీసుమేనేజర్ కావలెను. పిజి, అడ్మినిస్ట్రేషన్‌లో 10 సం|| అనుభవం, కంప్యూటర్, 40 సం|| లోపువారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజీనందు క్లాసు ఇన్‌ఛార్జీస్, హాస్టల్ ఇన్‌ఛార్జీస్, వార్డెన్స్‌గా పనిచేయుటకు స్త్రీలు కావలెను. జీతము: 10,000/- నుండి13,000/- వరకు ఇవ్వబడును (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ. వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకు సంప్ర: ✆: 9100024059.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు క్యాంపస్ ఇన్‌ఛార్జీస్, క్లాసు ఇన్‌ఛార్జీస్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 14,000/- నుండి 21,000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: ఇంటర్ నుండి పి.జి. వరకు. వయస్సు: 22 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యి ఉండాలి. సంప్ర: ఫోన్: 8978480429.

HYD, SR నగర్ బాయ్స్ హాస్టల్‌లో అనుభవం గల భార్యభర్తలు వంటమాస్టర్లు కావలెను. సంప్ర: ✆ 9391009238, 8885070231.

పూర్ణ ఎంటర్ప్రైజెస్, గోరంట్ల, గుంటూరులో 1-3 సం|| అనుభవమున్న కంప్యూటర్ ఆపరేటర్ (ఫీమేల్) కావలెను. జీ: 10,000/-. 93908 96165.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం

పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-

5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-

ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

91.9 FM Vijayawada ఈ FM 91.9 Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 80085 10541

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80085 14589

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

ఓటర్ల జాబితాలు సక్రమంగా రూపొందించాలి

నూజండ్ల, న్యూస్‌టుడే: ఓటరు జాబితాలు సక్రమంగా రూపొందించాలని తహసీల్దార్ రమేష్‌కుమార్ ఆదేశించారు. బీఎల్‌వోలతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పంచాయతీ ఎన్నికలకు ఓటర్ల జాబితాలు సిద్ధం చేయాలన్నారు. కొత్త ఓటర్లకు దరఖాస్తులు తీసుకోవడంతో పాటు మృతుల పేర్లు జాబితా నుంచి తొలగించాలన్నారు. సవరణలకు అవకాశం కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు వస్తే బీఎల్‌వోలు బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు.

నేడు ప్రజాదర్బార్

వినుకొండ: కొత్తపేటలోని తన కార్యాలయంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజాదర్బార్ నిర్వహిస్తారని కార్యాలయ సిబ్బంది తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై వినతులు అందించవచ్చన్నారు.

సత్యసాయి చరిత్ర పారాయణం

వినుకొండ: సత్యసాయిబాబా శత జయంతి వేడుకల్లో భాగంగా గురువారం రెండోరోజు కొత్తపేటలోని బాబా మందిరంలో ఆయన జీవితచరిత్ర పారాయణం చేశారు. మధ్యాహ్నం ఆర్టీసీ బస్టాండ్ వద్ద పేదలకు అన్నసంతర్పణ చేశారు. సాయంత్రం మందిరంలో భగవాన్ సత్యసాయి సేవా సమితి సభ్యులు ప్రత్యేక భజన నిర్వహించారు.

23న నవోదయ నమూనా పరీక్ష

వినుకొండ: జవహర్ నవోదయ అయిదో తరగతి ప్రవేశాలకు నమూనా పరీక్ష ఈ నెల 23న నిర్వహిస్తున్నట్లు గీతమ్స్ ప్రిన్సిపల్ ఎం.కృష్ణవేణి తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు సిద్ధార్థనగర్‌లోని తమ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తొలి మూడు స్థానాలలో నిలిచిన వారికి నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? పట్టణంలో ఆర్యవైశ్య కల్యాణ మండపం బజారు నుంచి సీఆర్ కాలనీకి వెళ్లే రహదారిలో మలుపు వద్ద స్పీడ్‌బ్రేకర్ సగం మేర పాడైంది. దీంతో వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో అదుపు తప్పుతున్నాయి. - **మోహన్‌రావు** ✔ వేగనిరోధకం వద్ద మరమ్మతులు చేయించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. - **అన్సర్, పురపాలక సంఘ ఏఈ**
– న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

? పట్టణంలో విష్ణుకుండిననగర్ కాలువ కట్ట నుంచి నాలుగో లైన్‌లో విద్యుత్తు తీగలు తరచూ తెగిపడి ఇబ్బంది పడుతున్నాం. - **గంగినేని నాగేశ్వరరావు.** ✔ పరిశీలించి అవసరమైతే కొత్త కండక్టర్ ఏర్పాటు చేస్తాం. - **పిచ్చయ్య, ఏఈ, విద్యుత్తు శాఖ**

? హనుమాన్‌నగర్ రోడ్డు నుంచి డబ్బా స్తంభం సెంటర్ మీదుగా రామాలయం వరకు రోడ్డు, డ్రెయినేజీ సక్రమంగా లేదు. - **సుబ్బారావు.** ✔ డబ్బా స్తంభం సెంటర్ నుంచి దిగువకు రూ.15లక్షలతో డ్రెయినేజీ నిర్మించే ప్రతిపాదన ఉంది. టెండర్ పూర్తయింది. త్వరలో పని మొదలు పెడతాం. - **పి.ఆదినారాయణ, ఏఈఈ, వినుకొండ పురపాలక సంఘం** – న్యూస్‌టుడే, వినుకొండ

గొళ్లేలు విరిచేసి.. గొలుసులు తెంచేసి..

→ నరసరావుపేట ప్రకాష్‌నగర్‌కు చెందిన ఓ కుటుంబం ఈ నెల 5న సత్తెనపల్లి మండలం గణపవరం వెళ్లారు. ఇదే అదనుగా దుండగులు ఇంటి తాళాలు పగలగొట్టి ఇనుప పెట్టెలో సుమారు 66 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.45వేలు నగదు అపహరించారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

→ బరంపేట మొదటి లైనులో ఈనెల 17న ఉదయం 6.30 గంటల సమయంలో ఇంటి ముందు ముగ్గు వేస్తున్న మహిళ మెడలో రెండున్నర సవర్ల బంగారు గొలుసును ద్విచక్రవాహనంపై వచ్చిన గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు లాక్కెళ్లారు.

→ నాదెండ్ల మండలం సాతులూరులో ఈ నెల 11న ఓ మహిళ గేదెలను మేపేందుకు వెళ్తుండగా ద్విచక్రవాహనంపై వచ్చిన నిందితుడు ఆమెను బెదిరించి మెడలో నల్లపూసల గొలుసు, చెవి దుద్దులు లాక్కున్నాడు. బాధితురాలు నాదెండ్ల పోలీసులను ఆశ్రయించారు.

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: నరసరావుపేట డివిజన్ పరిధిలో దొంగలు పేట్రేగిపోతున్నారు. తాళాలు వేసిన ఇళ్లు, మెడలో బంగారు ఆభరణాలు ధరించిన మహిళలే లక్ష్యంగా చోరీలు చేస్తున్నారు. నిర్మానుష్యంగా ఉన్న ప్రదేశాల్లో మాటువేసి ఆ మార్గంలో వెళ్లే వారిని మరణాయుధాలతో బెదిరించి దొంగతనాలకు తెగబడుతున్నారు. పోలీసుల నిరంతర పర్యవేక్షణ కొరవడటమే దీనికి కారణమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. దొంగల బెడదతో బంగారు ఆభరణాలు ధరించాలంటేనే భయమేస్తుందని మహిళలు వాపోతున్నారు.

అప్రమత్తత అవసరం.. ప్రజల సహకారంతోనే చోరీల నివారణ సాధ్యమని పోలీసులు పేర్కొంటున్నారు. సెలవులు, అత్యవసర పరిస్థితుల్లో ఊరికి వెళ్లాల్సి వస్తే ఇంటి యజమానులు పోలీసులకు సమాచారం ఇవ్వాలి. అప్పుడు వారు ఇంటి వద్ద ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్) ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ ఉంచుతారు. అందుకే విహార యాత్రలు, దైవ దర్శనాలకు వెళ్లి, ఎక్కువ రోజులు ఇంటికి దూరంగా ఉండాల్సిన వారు ఈ వ్యవస్థను వినియోగించుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. అంతేకాక బంగారు ఆభరణాలు ధరించే వారెవరైనా జాగ్రత్తగా ఉండాలి. నిర్మానుష్యంగా ఉండే రహదారుల్లో రాకపోకలు సాగించడం, రద్దీ ప్రదేశాల్లో బస్సులు, రైళ్లు ఎక్కేటప్పుడు చుట్టూ ఉన్న వారిని ఓ కంట కనిపెట్టాలి. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు.

సీసీ కెమెరాలు అమర్చుకోండి.. దొంగల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ హనుమంతరావు సూచిస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిధిలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు అమర్చుకోవాలని కోరుతున్నారు. తద్వారా దొంగలను సులువుగా చోరులను గుర్తించవచ్చన్నారు.

గత నెల రోజుల్లో చోటుచేసుకున్న పలు రకాల దొంగతనాలు
తాళం వేసిన ఇళ్లలో చోరీలు : 9
దారి దోపిడీలు : 7
గొలుసు దొంగతనాలు : 7
ఇతర దొంగతనాలు (బైక్‌లు, డీజిల్, విద్యుత్తు నియంత్రికలు): 30కి పైగా
చోరీ యత్నాలు : 5
ఈ కేసుల్లో కొందరిని పోలీసులు పట్టుకుని నగదు, బంగారు ఆభరణాలు రికవరీ చేశారు.

బరంపేటలో గొలుసు లాక్కెళ్తున్న దుండగుల వెనుక బాధితురాలి పరుగు (సీసీ కెమెరా దృశ్యం)

సహకార వ్యవస్థ బలోపేతానికి కృషి చేద్దాం

శావల్యాపురం: జెండా ఆవిష్కరిస్తున్న జిల్లా సొసైటీ ఛైర్మన్ మక్కెన, చిత్రంలో చీఫ్ విప్ జీవీ

శావల్యాపురం, సంతగుడిపాడు(రొంపిచర్ల), న్యూస్‌టుడే : రైతుల అభ్యున్నతే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకార వ్యవస్థకు ప్రత్యేక శాఖను ఏర్పాటు చేసినట్లు జిల్లా సొసైటీ బ్యాంకు ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు తెలిపారు. సహకార వారోత్సవాల ముగింపు సందర్భంగా శావల్యాపురంలో సొసైటీ కార్యాలయం వద్ద పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార వ్యవస్థ బలోపేతానికి అందరూ సమన్వయంతో కృషి చేయాలన్నారు. సహకార సంఘాల ద్వారా రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు అందచేస్తామన్నారు. చీఫ్ విప్ జి.వి.ఆంజనేయులు మాట్లాడుతూ ఆగ్రో ఇన్‌ఫ్రా కింద కేంద్ర ప్రభుత్వం రూ.20లక్షల కోట్లు సంఘాలకు కేటాయించిందన్నారు. ప్రతి రైతు ఈ-పంట నమోదు చేయించుకోవాలని కోరారు. రైతులు ఉద్యానవన పంటల సాగు ద్వారా మరింత ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని తెలిపారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు మెటీరియల్ అందచేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గడుపూడి విశ్వనాథం, గోపాళం శివయ్య, తెదేపా మండల అధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు, గోరంట్ల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. రొంపిచర్ల మండలం సంతగుడిపాడు కార్యాలయం వద్ద స్థానిక సహకార బ్యాంకు మేనేజర్ మిర్యాల కోటేశ్వరరావు జెండా ఆవిష్కరించారు. సంతగుడిపాడు, రొంపిచర్ల, బుచ్చిపాపన్నపాలెం సొసైటీ అధ్యక్షులు పి.శ్రీనివాసరావు, పి.రత్నారెడ్డి, ఎస్.రామారావు, సీఈవోలు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.

ప్లాస్టిక్‌తో మానవాళి మనుగడకు ముప్పు

జూట్ సంచులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ సంచుల వినియోగంతో మానవాళి మనుగడకు ముప్పు వాటిల్లుతుందని ఎమ్మెల్యే అరవిందబాబు అన్నారు. పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో పర్యటించిన ఆయన అక్కడ చిరు వ్యాపారులకు జూట్ సంచుల వినియోగంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ సంచుల వాడకం మాని జూట్, వస్త్ర సంచులు వినియోగించాలని సూచించారు. ప్లాస్టిక్ సంచులు వినియోగిస్తే జరిమానా వేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయం సిబ్బంది ఉన్నారు.

కోటప్పకొండపై నిత్యాన్నదానానికి విరాళం

దాతకు రసీదు అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: కోటప్పకొండపై త్రికోటేశ్వరస్వామి దేవస్థానంలో నిత్యాన్నదానానికి భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. చిలకలూరిపేట మండలం కట్టుబడివారిపాలేనికి చెందిన చెన్నంశెట్టి ఏడుకొండలు రూ.1,00,116 దేవస్థానం అధికారులకు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాస్, ఉద్యోగులు ఉన్నారు.

నూజండ్ల: గురపనాయుడుపాలెం రామాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

చిలకలూరిపేట: పల్లకీ మోస్తున్న పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ

నూజండ్ల: రవ్వారం రామలింగేశ్వరుడు

వినుకొండ: శనీశ్వరుడికి అభిషేకం

ముగిసిన కార్తిక పూజలు

చిలకలూరిపేట గ్రామీణ, చిలకలూరిపేట పట్టణం, వినుకొండ, వినుకొండ రూరల్, నూజండ్ల, న్యూస్‌టుడే : కార్తిక మాసం ప్రత్యేక పూజలు ఆలయాల్లో గురువారం ముగిశాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు వెళ్లి దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. చిలకలూరిపేట మెయిన్ బజారులోని సీతారామస్వామి ఆలయంలో స్వామి వారి పల్లకీ సేవలో రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ఎం.వి.కృష్ణతేజ పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గ్రంధి భాస్కర్ ఆయనకు స్వాగతం పలికారు. వినుకొండ మండలం విఠంరాజుపల్లి శనీశ్వర ఆలయంలో పసుపు, కుంకుమ, గంధం, విభూది కలిపిన నీళ్లతో స్వామికి అభిషేకాలు చేశారు. వినుకొండలో కొండమెట్ల వద్ద లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో రాజ శ్యామలయాగం నిర్వహించారు. ప్రజలందరు బాగుండాలని పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. చిలకలూరిపేట చౌత్రా సెంటర్‌లో శ్రీగంగాపార్వతి సమేత ఉమామహేశ్వర స్వామి ఆలయంలో కార్తిక అమావాస్య పురస్కరించుకుని పెద్ద ఎత్తున అన్న ప్రసాద వితరణ చేశారు.

అనధికార విలీనం నాలుగు గ్రామాలకు శాపం

పసుమర్రులో శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి

పసుమర్రు, గణపవరం (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే : గత వైకాపా ప్రభుత్వంలో నాలుగు గ్రామాల అనధికార విలీనం ప్రజలకు శాపంగా మారిందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని పసుమర్రులో రూ.26లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత అవినీతి మంత్రి గణపవరం, పసుమర్రు, మానుకొండవారిపాలెం, దండమూడి గ్రామాలను గాలికొదిలి స్వప్రయోజనాల కోసం అనధికారికంగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించి పబ్బం గడుపుకొన్నారని విమర్శించారు. దీంతో ఆరున్నరేళ్లుగా మేజర్ పంచాయతీ గ్రామాలు అభివృద్ధికి దూరమయ్యాయన్నారు. పసుమర్రులో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.30 లక్షలు మంజూరు చేయించానని త్వరలోనే ఆ సమస్యను పరిష్కరిస్తానన్నారు. మంత్రి లోకేశ్ సహకారంతో పాఠశాలల అభివృద్ధికి రూ.20లక్షలు మంజూరు చేయించామన్నారు. త్వరలో ఎత్తిపోతల పథకాల ఆధునికీకరణ పనులకు టెండర్లు పిలుస్తారన్నారు. కార్యక్రమంలో ఛైర్మన్ ఎస్కే రఫాని, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గణపవరంలో తాగునీటి సమస్యకు పరిష్కారం.. నాదెండ్ల మండలం గణపవరం గ్రామంలో రూ.34లక్షలతో నిర్మించిన ఫిల్టర్‌బెడ్‌లను ఎమ్మెల్యే ప్రత్తిపాటి అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. 30వేల జనాభా ఉన్న గ్రామానికి పరిశుభ్రమైన తాగునీరు అందించడంలో గత అవినీతి మంత్రికి చేతకాలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ చొరవతో ఫిల్టర్‌బెడ్‌లు బాగు చేయించి తాగునీటి సమస్యకు పరిష్కారం చూపామన్నారు. రాజీవ్‌గాంధీ కాలనీ వాసులకు త్వరలో శ్మశానవాటికకు అవసరమైన స్థలాన్ని కేటాయించేలా చూస్తామన్నారు. ఎంపీడీవో స్వరూపరాణి, జనసేన ఇన్‌ఛార్జి తోట రాజారమేష్, తెదేపా నాయకులు నెల్లూరి సదాశివరావు, గంగా శ్రీనివాసరావు, పెంట్యాల శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు పరిశీలన

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: నరసరావుపేట పట్టణ, పరిసర ప్రాంతాల్లో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు డీఎస్పీ హనుమంతరావు తెలిపారు. నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్, వై-జంక్షన్, ఎస్ఆర్‌కేటీ, పలు కూడళ్లలో సీసీ కెమెరాల పనితీరు, ఏర్పాటు చేయాల్సిన ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రమాదాల నివారణ, దొంగతనాల కట్టడికి పోలీసులు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. పట్టణ శివారు ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను పరిశీలించి, ఆయా ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఆయన వెంట సీఐలు ఫిరోజ్, లోకనాథం, గ్రామీణ ఎస్సై కిషోర్, మున్సిపల్ డీఈ రఫీ, ఎస్సై ప్రియాంక, ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు పలు శాఖల అధికారులు ఉన్నారు.

ఉప్పలపాడు వై జంక్షన్ ప్రాంతం పరిశీలిస్తున్న డీఎస్పీ హనుమంతరావు తదితరులు

పసుమర్రు(చిలకలూరిపేట గ్రామీణ): 167ఎ జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా కూడళ్ల వద్ద అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టాలని చిలకలూరిపేట గ్రామీణ సీఐ సుబ్బానాయుడు హైవే అధికారులకు సూచించారు. వాడరేవు - పిడుగురాళ్ల 167ఎ జాతీయ రహదారిలో పసుమర్రు, వింజనంపాడు వైపు వెళ్లే కూడళ్ల వద్ద ఇటీవల ప్రమాదాలు చోటు చేసుకున్న నేపథ్యంలో ఆ ప్రాంతాలను పరిశీలించారు. ఎస్సై అనిల్‌కుమార్, ఎన్‌హెచ్ ఏఈ నవాజ్‌బాషా తదితరులున్నారు.

ఈనాడు కథనాలకు స్పందన

మహాప్రస్థానంలో స్వచ్ఛత.. యడ్లపాడు: యడ్లపాడులో ఎర్రకొండ పక్కన హిందూ శ్మశానవాటికను పంచాయతీ డంపింగ్‌యార్డుగా మార్చారు. దీంతో మృతుల అంత్యక్రియల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనికి తోడు పక్కనే ఉన్న కళాశాల విద్యార్థుల అవస్థలపై 'దుర్వాసన.. పొగతో అవస్థలు' శీర్షికన ఈనెల 10న కథనం ప్రచురితమైంది. పంచాయతీ అధికారులు స్పందించారు. శ్మశానవాటికలో వ్యర్థాలు తొలగించారు.

నడక 'దారి' బాగు.. వినుకొండ: ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆట స్థలంలో నడక దారి(వాకింగ్ ట్రాక్)కి మట్టి పోసి చదును చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరి అధ్వానంగా మారడంతో వాకర్స్ ఇబ్బంది పడుతున్నారు. 'నడక దారిలో నరకయాతన.'.! శీర్షికన ఈనెల 9న ప్రచురితమైన కథనానికి స్పందించిన గుత్తేదారు మట్టి తోలించారు.

రంగు పడింది.. నరసరావుపేట సెంట్రల్: మండలంలో ఉప్పలపాడు సచివాలయంపై గత వైకాపా ప్రభుత్వ హయాంలో పథకాలు, చిత్రాలు దర్శనమిచ్చాయి. ఈ విషయమై 'నిర్లక్ష్యమా.. మమకారమా' శీర్షికన ఈనెల 13న కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి సచివాలయంపై జగన్ బొమ్మ కనిపించకుండా రంగు వేశారు. టేబుల్ ప్యాడ్‌లకూ రంగులద్దారు.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

కారుమంచి (శావల్యాపురం), సాతులూరు (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని చీఫ్ విప్ జి.వి.ఆంజనేయులు అన్నారు. శావల్యాపురం మండలం కారుమంచి లైబ్రరీ కూడలి వద్ద కాటూరి వైద్య కళాశాల ఆధ్వర్యంలో గురువారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 450మందికి ఉచితంగా ఈసీజీ, ఎక్స్‌రే, రక్తపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మొత్తం 40 మంది వైద్యులు, సిబ్బంది సహాయ సహకారాలు అందచేశారు. కార్యక్రమంలో వైద్యశాల సీఈవో త్రుశాక్, గ్రామ పెద్దలు యరమాసు కోటేశ్వరరావు, శివయ్య తదితరులు పాల్గొన్నారు. నాదెండ్ల మండలం సాతులూరులో జాతీయ ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా చెన్నుపాటి ఇండో అమెరికన్ స్కూలు ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాల విద్యార్థులతో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిన్నారులకు వయస్సుల వారీగా వేయించాల్సిన టీకాల గురించి వివరించారు. కళాశాల కార్యదర్శి చెన్నుపాటి సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీకి సహకరించాలి

ఈపూరు, న్యూస్‌టుడే: ఉపాధి పనులకు సంబంధించి మండలంలో జరుగుతున్న సామాజిక తనిఖీ కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు సహకరించాలని స్టేట్ రిసోర్స్ పర్సన్ బత్తుల ఆవులయ్య కోరారు. సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం గురువారం ఈపూరులో జరిగింది. వివిధ శాఖల అధికారులు తనిఖీ బృందానికి వెంటనే రికార్డులు అప్పగించాలని, తనిఖీల సందర్భంగా గొడవలు పెట్టుకోవద్దని అనుమానం వస్తే తమను సంప్రదించాలని ఆయన కోరారు. సమావేశంలో ఎంపీడీవో ఉమాదేవి, ఏపీవో పుష్పరాజు, పంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక సిబ్బంది, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి.. మండలంలోని వివిధ గ్రామాల్లో 17వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. 18 పంచాయతీల పరిధిలో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31వరకు జరిగిన 544 పనులను సామాజిక తనిఖీ బృందం పరిశీలించనుంది. 20 రోజుల పాటు తనిఖీలు సాగనున్నాయి.

వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

శావల్యాపురం: అద్దంకి బ్రాంచి కెనాల్‌పై కారుమంచి వద్ద శిథిలావస్థకు చేరిన వంతెనను చీఫ్ విప్ జి.వి.ఆంజనేయులు గురువారం పరిశీలించారు. వంతెన స్లాబు పెచ్చులు ఊడిపోతున్నాయని గ్రామస్థులు వివరించారు. ఈ ప్రదేశంలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. స్పందించిన జీవీ ఆర్అండ్‌బీ డీఈఈతో ఫోన్‌లో మాట్లాడారు. వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

వాసవీ క్లబ్ చేయూత

వినుకొండ, న్యూస్‌టుడే: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఎంబీబీఎస్ మూడో ఏడాది విద్యార్థికి రూ.25వేలు, ఇంటర్ విద్యార్థికి రూ.10వేలు వంతున సీనియర్ సభ్యుడు కన్నెగండ్ల అనంతకోటేశ్వరరావు అందజేశారు. గుంటి ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి క్లబ్ జిల్లా గవర్నర్ మునగాల చిరంజీవి హాజరయ్యారు. అలాగే ఆలయానికి వెయ్యి లీటర్ల సామర్థ్యం కలిగిన నీళ్ల ట్యాంక్ అందజేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కాసుల రవీంద్ర, వీరబ్రహ్మం పాల్గొన్నారు.

అంగన్‌వాడీ యాప్‌లు సవరించాలి

వినుకొండ, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ యాప్‌లు సవరించి కొత్త సెల్‌ఫోన్లు ఇవ్వాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలిత ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక శివయ్య భవన్‌లో అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో గురువారం ఆమె మాట్లాడారు. నాణ్యమైన సరకులను సకాలంలో సరఫరా చేయాలని కోరారు. డిమాండ్ల సాధనకు డిసెంబరు 12న కలెక్టరేట్‌ల వద్ద ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు.

తెదేపాకు కార్యకర్తలే బలం

కారుమంచి(శావల్యాపురం), నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : తెదేపాకు కార్యకర్తలే వెన్నెముకలాంటి వారని, వారి సంక్షేమానికి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అనేక పథకాలు ప్రవేశపెడుతున్నారని చీఫ్ విప్ జి.వి.ఆంజనేయులు, నరసరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు అన్నారు. శావల్యాపురం మండలం కారుమంచి, నరసరావుపేట పట్టణంలో ఇటీవల మృతిచెందిన తెదేపా కార్యకర్తల కుటుంబాలకు పార్టీ తరఫున ఆర్థిక సహాయం అందచేసే కార్యక్రమాల్లో వేర్వేరుగా పాల్గొన్నారు. ప్రమాదబీమా కింద రూ.5లక్షలు చెక్కు బాధిత కుటుంబాలకు అందించారు.

చిన్నారికి అన్ని విధాలా అండ

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారి దూపాటి విజయకుమారిని కాపాడేందుకు అన్ని విధాలా సాయం అందిస్తామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. చిలకలూరిపేట క్యాంప్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా పాస్టర్ నందమూరి క్రిష్టర్‌తో కలిసి వచ్చి 38వ వార్డుకు చెందిన దూపాటి రవిబాబు, రోజా దంపతులు తమ కుమార్తె సమస్యను ఎమ్మెల్యేకు వివరించారు. గతంలోనే పాపకు రూ.10లక్షల వరకు ఆర్థికసాయం అందేలా చూశామని, మరోమారు సీఎం సహాయనిధి నుంచి సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వచ్చిన పలు అర్జీలపై సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని కోరారు.

ఆదినారాయణ మృతికి నివాళి

రొంపిచర్ల, న్యూస్‌టుడే: మండలంలో పరగటిచర్లకు చెందిన తెదేపా సీనియర్ నాయకుడు చిగురుపాటి ఆదినారాయణ మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, రాష్ట్ర తెదేపా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరాం, మానవ హక్కుల కమిషన్ మాజీ ఛైర్మన్ కాకుమాను పెద్ద పేరిరెడ్డి అన్నారు. గురువారం ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు.

తేళ్ల కుటుంబానికి పరామర్శ

పర్చూరు, న్యూస్‌టుడే: శ్రీశైలం కాకతీయ సేవా సమితి ఛైర్మన్, చిలకలూరిపేట మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ తేళ్ల సుబ్బారావు తల్లి శ్రీహరమ్మ ప్రథమ వర్ధంతిలో చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌లు పాల్గొని నివాళులర్పించారు. నాగులపాలెంలోని శ్రీవెంకటేశ్వర కల్యాణ మండపంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్యాంపు కార్యాలయ ప్రతినిధులు నివాళులర్పించారు.

అవీ ఇవీ

పుస్తక పఠనంతో మేధోవికాసం

చిలకలూరిపేట పట్టణం, చిలకలూరిపేట గ్రామీణ, రొంపిచర్ల, యడ్లపాడు, నూజండ్ల, ఈపూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు ఖాళీ సమయాలను సద్వినియోగం చేసుకుని గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని వక్తలు సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ నియోజకవర్గాల్లో పలు శాఖా గ్రంథాలయాల్లో గురువారం నిర్వహించారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు వారిని అభినందించారు. ఆయా మండల విద్యాశాఖాధికారులు, గ్రంథాలయాల అధికారులు, పాఠశాలల హెచ్ఎంలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కట్నం వేధింపులపై కేసు

గణపవరం(చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే : కట్నం కోసం భర్త వేధింపులకు గురిచేస్తున్నారని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన నాదెండ్ల మండలం గణపవరంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కె.సంధ్యకు చిలకలూరిపేటకు చెందిన శ్రావణ్‌కుమార్‌తో ఏడేళ్ల క్రితం వివాహమైంది. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పుల్లారావు తెలిపారు.

11 మంది జూదరుల అరెస్టు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: పట్టణంలో ఓ లాడ్జిలో పేకాడుతున్న 11 మందిని పోలీసులు అరెస్టు చేశారు. తమకు అందిన పక్కా సమాచారం మేరకు పోలీసులు దాడులు చేశారు. జూదరుల నుంచి 11 సెల్‌ఫోన్లు, రూ.82,260 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిని వినుకొండ పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన వారిలో ఓ ఎంపీపీ భర్త, మరికొందరు ప్రముఖులు ఉన్నారు. వీరితో పాటు లాడ్జి నిర్వాహకులపైనా కేసు నమోదు చేయనున్నట్లు పట్టణ సీఐ ప్రభాకర్ తెలిపారు.

(c) eenadu

సత్తెనపల్లి

•సత్తెనపల్లి •పెదకూరపాడు •మాచర్ల •గురజాల

సత్రశాలలో అన్నాభిషేకం

రెంటచింతల, న్యూస్‌టుడే : సత్రశాలలో ఆట్టహాసంగా కార్తిక మాస ఉత్సవాలు ముగిశాయి. మల్లయ్య స్వామి అన్నాభిషేకంలో భక్తులకు దర్శనమిచ్చారు. 76,460 ఆదాయం ఆలయానికి సమకూరినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ శివయ్య, ఈవో రామిరెడ్డి తెలిపారు. సుమారు 60 వేల మంది భక్తులు దేవతామూర్తులను దర్శించుకున్నారు. నిత్యం పంచామృతాభిషేకాలు, కుంకుమార్చన, రుద్రహోమం అయ్యప్ప స్వాముల భజనలు, మహిళల కోలాటాలు కనుల పండువగా సాగాయి. లక్షలాది రూపాయల భక్తుల విరాళాలతో అన్నదానం జరిగింది.

అలంకరణలో మల్లయ్యస్వామి

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

కొమెరపూడి(సత్తెనపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే : సత్తెనపల్లి మండలం కొమెరపూడి జడ్పీ ఉన్నత పాఠశాల బాలికలు మదీహ, ధనలక్ష్మి జాతీయస్థాయిలో జరిగే బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం బి.విజయ, పీఈటీ యు.సుబ్బారావు తెలిపారు. ఇటీవల పిడుగురాళ్లలో జరిగిన అండర్-19 బేస్‌బాల్ ఉమ్మడి గుంటూరు జిల్లా బాలికల జట్టులో పాల్గొని ప్రతిభ కనబరిచి జట్టు ద్వితీయ స్థానం సాధించడంలో కీలకంగా వ్యవహరించారు. రాష్ట్రజట్టులో స్థానం పొందారు. జనవరిలో దిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీలో తలపడనున్నారు. బాలికలను ఉపాధ్యాయులు, స్థానిక పెద్దలు అభినందించారు.

ఎంపికైన బాలికలతో హెచ్ఎం విజయ

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
రెంటచింతల: 80085 73185 గురజాల: 80085 7 3176

? గ్రామంలో వృద్ధులు, చిన్నారులు, మహిళలపై వీధికుక్కలు దాడిచేసి గాయపరుస్తున్నాయి. - **స్థానికులు, గుండ్లపాడు**
✔ వీధికుక్కల సమస్యను త్వరలో పరిష్కరిస్తాం. - **ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి.**
? గ్రామంలోని రామాలయం ప్రక్క వీధిలో కాలువలు పూడికతో నిండి మురుగునీరు రోడ్డుపైన ప్రవహిస్తోంది. - **వెంకటేశ్వరరెడ్డి, శిరిగిరిపాడు**
✔ సిబ్బందిని పంపించి కాలువల్లో పూడికలు తీయిస్తాం. - **మకటిలాల్, పంచాయతీ కార్యదర్శి** - న్యూస్‌టుడే, వెల్దుర్తి

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం, ఆదాయం

కారంపూడి, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం పెంపొందటంతో పాటు దిగుబడి పెరిగి ఆదాయం పెరుగుతుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కాకానివారిపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంతో సాగైన పంటపొలాలను క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. నిర్వాహకులు వరప్రసాద్ సాగులో అవలంబిస్తున్న పద్ధతులు, ఉపయోగిస్తున్న ప్రకృతి సిద్ధమైన ఎరువుల వివరాలను తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న వారికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. కార్యక్రమంలో డాక్టర్ సరళాదేవి, నరసింహారావు, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

క్రీడా మైదానం.. కళావిహీనం!

నిర్వహణ లేక అధ్వానంగా ఆటస్థలం

పశువులకు నిలయంగా మారినా పట్టని అధికారులు

అమరావతి, న్యూస్‌టుడే

అమరావతిలోని ఎయిడెడ్ పాఠశాల శ్రీరామకృష్ణా హిందూ హైస్కూల్‌లో చదివి ఎంతో మంది విద్యావేత్తలుగా, క్రీడాకారులుగా ఎదిగారు. ఇక్కడున్న మైదానంలో ఎంతో మంది విద్యార్థులు సాధన చేసి వివిధ పోటీల్లో పాల్గొని రాష్ట్ర, జాతీయస్థాయిలో ఆడారు. కొన్నేళ్లుగా మైదానాన్ని పాఠశాల యాజమాన్య కమిటి గాలికి వదిలేయడంతో బర్రెలు, గొర్రెలు, పందులు తిరుగుతున్నాయి. విద్యార్థుల ఆట స్థలం పశువులకు నిలయంగా, అధ్వానంగా తయారైంది. అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

ఐదు ఎకరాల్లో మైదానం

అమరావతిలోని గాజులపాలెంలో శ్రీరామ కృష్ణా హిందూ హైస్కూల్‌కు సుమారు 5 ఎకరాల్లో సువిశాలమైన మైదానం ఉంది. చుట్టు పక్కల పాఠశాలలకు మైదానం లేక పోవడంతో క్రీడా పోటీలు నిర్వహించాల్సి వస్తే గతంలో అన్ని పాఠశాలలు ఇక్కడే నిర్వహించేవి. వేసవి వచ్చిందంటే యువత టోర్నమెంట్లు నిర్వహించుకోవడానికి ఈ మైదానాన్నే వినియోగించుకుంటారు. ఎస్ఆర్‌కేహెచ్ పాఠశాల విద్యార్థులు ఈ మైదానంలోనే సాధన చేసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించారు. క్రీడా కోటాలో కొలువులు సంపాదించారు. పాఠశాలలోని శిక్షణ ఉపాధ్యాయులకు ఇప్పుడు సాధన చేయించేందుకు క్రీడా మైదానం అందుబాటులో లేక పోవడంతో పాఠశాల ప్రాంగణంలో ఉన్న గోడల మధ్యే సాధన చేయాంచాల్సి వస్తోంది. పాఠశాలకు కొత్త కమిటీ వచ్చిన తరువాత నిర్వహణను గాలికి వదిలేయడంతోనే మైదానానికి ఈ దుస్థితి వచ్చిందన్న విమర్శలు వస్తున్నాయి.

అధ్వానంగా మారిందిలా..

సువిశాలంగా ఉన్న మైదానాన్ని కమిటీలోని కొంత మంది గేదెలు, గొర్రెలు మేపుకోవడానికి ఇచ్చినట్లు విమర్శలున్నాయి. మైదానం అంతా గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగిపోయి బురద మయంగా మారింది. సాధన కోసం అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొన్నది. పాఠశాల యాజమాన్య కమిటీ కూడా క్రీడా మైదానం నిర్వహణ, అభివృద్ధిపై దృష్టి సారించక పోవడంతో అధ్వానంగా తయారైంది. మైదానం ఉన్నా అది అందుబాటులో లేక పోవడంతో సాధన చేయలేక పోతున్నామని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాఠశాల యాజమాన్య కమిటీ దృష్టి సారించి క్రీడా మైదానాన్ని అందుబాటులోకి తీసుకురావాలని తల్లిదండ్రులు, విద్యార్థులు, క్రీడాకారులు కోరుకుంటున్నారు.

ఇంటర్‌లో నూరుశాతం ఉత్తీర్ణత లక్ష్యం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : ఇంటర్మీడియట్‌లో శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నట్లు జిల్లా ఇంటర్ బోర్డు పర్యవేక్షణాధికారి నీలావతీదేవి చెప్పారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక తరగతులు, అర్ధ సంవత్సర పరీక్షల్ని గురువారం ఆమె పరిశీలించి మాట్లాడారు. రాజుపాలెం, బెల్లంకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, బెల్లంకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల్ని పరిశీలించినట్లు చెప్పారు. ప్రత్యేక తరగతులు, రోజూ స్లిప్ టెస్టులతో ఉత్తీర్ణత మార్కులు పెంచుతున్నామన్నారు. పరీక్షల హాజరు ... ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించే విధంగా యాజమాన్యాలు కళాశాలల్లో బోధన, పునశ్చరణ, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని కళాశాల బాధ్యులకు సూచించారు. ప్రిన్సిపల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న జిల్లా పర్యవేక్షణాధికారి నీలావతీదేవి

ఆర్చరీ క్రీడాకారిణికి అభినందన

పెదకూరపాడు, న్యూస్‌టుడే: ప్రముఖ ఆర్చరీ క్రీడాకారిణి అర్జున అవార్డు గ్రహీత వెన్నం జ్యోతి సురేఖను పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ అభినందించారు. అతిపిన్న వయసులో అర్జున అవార్డు సాధించడం దేశానికి గర్వకారణమని కొనియాడారు. కూటమి ప్రభుత్వం క్రీడలకు ప్రోత్సాహం అందిస్తోందని చెప్పారు. నియోజకవర్గ పరిశీలకులు నల్లపాటి రాము తదితరులు ఉన్నారు.

జ్యోతి సురేఖను అభినందిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్, నల్లపాటి రాము

సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: ప్రజాసమస్యలను అధికారులు నిర్లక్ష్యం చేయడం వల్లనే వారు ప్రత్యక్షంగా ప్రజాదర్బార్‌కు వస్తున్నారని, ఇకనుంచైనా అధికారులు తీరు మార్చుకోవాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అధికారులకు హితవు పలికారు. గురువారం మండలకేంద్రమైన వెల్దుర్తిలోని తెదేపా క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వివిధ సమస్యలపై నియోజకవర్గ ప్రజలు 35 అర్జీలు అందజేశారు.

ప్రజాదర్బార్‌లో సమస్యలు వింటున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి

చదువుతోనే ఉన్నతస్థాయి

న్యూస్‌టుడే, బృందం: విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలంటే చిన్నతనం నుంచే చదువు పట్ల ఆసక్తి కలిగి ఉండాలని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ శశమూరి సురేష్ చెప్పారు. గురువారం పట్టణంలోని పార్కు ప్రాథమిక పాఠశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ సభ్యులు శిల్పరెడ్డి, యల్లమంద అన్నారు. దుర్గి గ్రంథాలయంలో వ్యాసరచన, క్విజ్ తదితర పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. * పెదకూరపాడు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు గ్రంథాలయ ఆవశ్యకత, ఆహార పదార్థాల కల్తీ నివారణపై వ్యాసరచన, మత సామరస్యం, యువతపై టెక్నాలజీ ప్రభావం, మానవ సంబంధాలపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. * బెల్లంకొండలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంఈవో బి.రాజకుమారి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. * రెంటచింతలలో మండల మాజీ ఉపాధ్యక్షుడు సుమంత్‌రెడ్డి, గ్రంథాలయ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు. * గ్రంథాలయాలు విద్యార్థులకు ఉత్తమ పరిశోధనలు చేసేందుకు దోహదపడతాయని గురజాల మున్సిపల్ ఛైర్మన్ బడేజాని అన్నారు. గురజాలలో గురువారం స్థానిక గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో గురజాల కమిషనర్ శివన్నారాయణతో కలిసి పాల్గొన్నారు. * బాల్యదశ నుంచే విద్యార్థులు గ్రంథాలయాల బాట పడితే చదువులో ఉత్తమంగా రాణించడంతోపాటు లక్ష్యాల్ని చేరుకోవడం సులువు అవుతుందని ఎంఈవోలు శ్రీనివాసరావు, రాఘవేంద్రరావు అన్నారు. * మాచవరంలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

గెలుపొందిన విద్యార్థులతో ఎంఈవో రాజకుమారి

రుణ బాధితులకు నష్టపరిహారం అందజేత

క్రోసూరు(అచ్చంపేట) న్యూస్‌టుడే: బంగారం తాకట్టుపెట్టి రుణం తీసుకున్న బాధితులందరికీ నష్టపరిహారం అందజేసే ప్రక్రియ గురువారం పూర్తి అయ్యింది. గురువారం బాధితులకు చివరి విడత నష్టపరిహారం చెక్కులను ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ప్రాంతీయ మేనేజరు పి.సుభాష్, బ్యాంక్ ఛీఫ్‌మేనేజరు శివశంకర్‌నాయక్, ఎస్సై రవిబాబు అందజేశారు. ఈవివరాలను ప్రాంతీయ మేనేజరు పి.సుభాష్ విలేకరుల సమావేశంలో తెలిపారు. 2023 ఆగస్టులో క్రోసూరు మండలం దొడ్లేరు లో అప్పటి చైతన్యగోదావరి బ్యాంకులో రైతులు బంగారం తాకట్టుపెట్టి రుణాలు తీసుకున్నారు. అప్రైజర్‌గా ఉన్న నాగార్జున అవకతవకలకు పాల్పడ్డారని గుర్తుచేశారు. బ్యాంకు అధికారులు విచారించి మొత్తం 505మంది బాధితులను గుర్తించి రెండు దఫాలుగా రూ.3.50కోట్లు పరిహారం అందజేశామన్నారు. గత ఏడాది మొదటి విడత 401 మంది బాధితులకు రూ.2.50కోట్లు అందజేశామని, మిగిలిన 104మందికి రూ.కోటి బాధితుల ఖాతాలకు జమచేశామన్నారు. దొడ్లేరు బ్యాంకులో పదేళ్లుగా లావాదేవీలు జరపని ఖాతాదారులు 1818 మందికి చెందిన రూ.22లక్షలు నగదు ఉందని, సంబంధించిన వారు బ్యాంకును సంప్రదించి సేవలు తిరిగి పొందాలని కోరారు.

ఉపన్యాసం.. అందిన బహుమానం

రఘురామ్‌నగర్(సత్తెనపల్లి), న్యూస్‌టుడే : పట్టణంలోని రఘురామ్‌నగర్‌లోని యూనిక్ కాన్సెప్ట్ స్కూల్‌లో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీ నిర్వహించారు. విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం అంశంపై నిర్వహించిన ఉపన్యాసం పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలో విద్యార్థులు హవీషా దాస్(ఎనిమిదో తరగతి), నవ్యశ్రీ(పదో తరగతి), ఎస్.దీక్షిత(ఏడో తరగతి) వరుసగా మొదటి మూడుస్థానాల్లో నిలిచారు. వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.కాశి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

బహుమతులతో యూనిక్ కాన్సెప్ట్ విద్యార్థులు

మంచినీటి పైపులైను ధ్వంసం

నకరికల్లు, న్యూస్‌టుడే: నకరికల్లు అడ్డరోడ్డు నరసరావుపేట రహదారి శాంతినగర్ వద్ద మంచినీటి ప్రధాన పైపులైను ధ్వంసమైంది. నీరంతా వృథాగా పోతుండటంతో మండలంలోని పలు గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచింది. ఫలితంగా తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం పొంచి ఉంది. అధికారులు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

'గుప్పెడు బియ్యం.. రూపాయి డబ్బు'తో వనసమారాధన

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: కరాలపాడు గ్రామస్థులు ఆదర్శంగా కార్తిక గ్రామ వనసమారాధన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. రాత్రి గ్రామంలో వనసమారాధనలో పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగా అద్దంకి నాంచారమ్మ తల్లి ఆలయానికి విద్యుత్తు లైట్ల వేసి అందంగా అలంకరించారు. ఆధ్యాత్మిక గురువులు బోధనలు చేశారు. గ్రామస్థులు అందరూ కలిసి వనభోజనాలు చేశారు. కులమతాలకు అతీతంగా 'గుప్పెడు బియ్యం-రూపాయి డబ్బు' నినాదంతో అన్ని వర్గాల వారు చందాలు వేసుకొని ఏటా గ్రామ సమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని గ్రామ పెద్దలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పణిదం(సత్తెనపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీలకు పణిదం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం అడపా పద్మలత తెలిపారు. మేడికొండూరు మండలం కొర్రపాడు పాఠశాలలో జరిగిన బేస్‌బాల్ జట్ల ఎంపికలో ప్రతిభ కనబరిచి అండర్-14 విభాగంలో కె.గుణశేఖర్, అండర్-17లో యమ్.మహీధర్ జిల్లా జట్లలో స్థానం పొందారన్నారు. వెనిగండ్లలో జరిగిన రగ్బీ పోటీలో అండర్-17 విభాగంలో ఆర్.వెంకటేష్, నందిగామలో జరిగిన హాకీ అండర్-19లో షేక్ రియాజ్, ఎం.నీరజ్ జిల్లా జట్లకు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెలలో విశాఖ, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు జిల్లాల్లో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో పాల్గొంటారని పీఈటీ తెలిపారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను పాఠశాల యాజమాన్య కమిటీ, ఉపాధ్యాయులు అభినందించారు.

అలరించిన ఎడ్ల బలప్రదర్శన పోటీలు

కారంపూడి, న్యూస్‌టుడే: పల్నాటి వీరుల తిరుణాళ్లను పురస్కరించుకొని రైతు సంఘం నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఎడ్ల బలప్రదర్శన పోటీలు భక్తులను, రైతులను అలరిస్తున్నాయి. గురువారం జూనియర్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో హైదరాబాదుకు చెందిన మేక రామకృష్ణ, ప్రతీక్ ఎడ్లజత 3195.2 అడుగుల బండ లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. ద్వితీయ బహుమతిని ప్రకాశం జిల్లాలోని మద్దిరాలముప్పాళ్ల గ్రామానికి చెందిన పుచ్చకాయల శేషాద్రిచౌదరి ఎడ్లజత 3158.8 అడుగుల దూరం లాగి గెలుపొందాయి. తృతీయ బహుమతిని బాపట్ల జిల్లా వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరీల ఎడ్లజత 3016.3 అడుగుల దూరం లాగి సొంతం చేసుకున్నాయి.

పోటీలను ప్రారంభిస్తున్న తెదేపా నాయకులు

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

పెదకూరపాడు, న్యూస్‌టుడే: వీఆర్ఏల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వీఆర్ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బందగీ సాహెబ్ అన్నారు. అర్హత ఉన్న వారికి పదోన్నతులు ఇవ్వాలి, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం పెదకూరపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని, కూటమి ప్రభుత్వమైనా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల నేపథ్యంలో కనీస వేతన చట్టం అమలు చేయాలంటూ రెవెన్యూ సిబ్బందికి వినతిపత్రం అందించారు. *అచ్చంపేట మండల వీఆర్ఏల సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ వీఆర్ఏల సంఘం ప్రతినిధి సుబ్బారావు, వసంతరావు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడు తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వీఆర్ఏలు

విశాఖ ఉక్కు కార్పొరేట్‌కు ఇచ్చే కుట్రలు

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ ఉక్కును కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు సిద్ధమై కుట్రలు చేస్తున్నాయని, ఇందుకు ముఖ్యమంత్రి మాటలే నిదర్శనమని వామపక్ష నాయకులు ఆరోపించారు. గురువారం మాచర్లలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా అనంతరం వారు మాట్లాడుతూ 32 మంది విద్యార్థుల ప్రాణత్యాగాల ఫలితంగా విశాఖ ఉక్కు కర్మాగారం ఏర్పడిందని, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం సైతం కేంద్రానికి వంతపాడుతోందన్నారు. అనంతరం తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు.

ఆందోళన చేస్తున్న వామపక్ష నాయకులు

ఓటర్ల జాబితాలో తప్పులు సవరించండి

అచ్చంపేట, న్యూస్‌టుడే: బీఎల్‌వోలు ఓటర్ల జాబితాలో తప్పులను సవరించి నూతన జాబితా రూపొందించాలని అచ్చంపేట డీటీ జానీబాషా, ఆర్ఐ నాగేశ్వరరావు కోరారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాల బూత్ స్థాయి అధికారులు శిక్షణ సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో బీఎల్‌వోలుగా ఉన్న వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామసచివాలయ సిబ్బంది, వీఆర్ఏలు పాల్గొన్నారు.

అమరేశ్వరాలయానికి పోటెత్తిన భక్తుల

అమరావతి, న్యూస్‌టుడే : పంచారామ క్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలో కార్తిక అమావాస్య పూజలకు భక్తులు తరలివచ్చారు. కార్తిక అమావాస్యను పురస్కరించుకొని కృష్ణానదిలో స్నానాలు చేసిన భక్తులు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమరేశ్వరున్ని, బాలచాముండికా అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో రేఖ ఏర్పాట్లు చేశారు.

క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

తల్లిదండ్రులను మరవొద్దు

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరూ జన్మనిచ్చిన తల్లిదండ్రులను మరువ వద్దని మాచర్ల ఎస్సై అనంతకృష్ణ అన్నారు. గురువారం రాత్రి మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఏఆర్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధ మహిళలకు దుప్పట్ల పంపిణీ చేశారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులను విస్మరించకుండా జాగ్రత్తగా చూసుకోవాలని, సాధ్యమైతే వారి పేరున సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. తండ్రి పేరున ట్రస్ట్ ఏర్పాటు చేసి పేదలకు సాయం చేస్తున్న అల్లం కోటిరెడ్డిని ఆమె అభినందించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎస్సై అనంతకృష్ణ

వంతెన నిర్మాణ పనుల పరిశీలన

మాదిపాడు (అచ్చంపేట) న్యూస్‌టుడే: అచ్చంపేట మండలం మాదిపాడు వద్ద కృష్ణానదిపై నిర్మించే వంతెన నిర్మాణ పనులను గురువారం ఆర్అండ్‌బీ నాణ్యతా విభాగం అధికారుల బృందం పరిశీలించింది. నిర్మాణ పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేసింది. గుత్తేదారులకు తగు సూచనలు చేసింది. ఎస్ఈ సత్యనారాయణ, ఈఈ ఏడుకొండలు, జిల్లా ఈఈ గీతారాణి, డీఈఈ కృష్ణారెడ్డి, ఏఈ పున్నారావులు పాల్గొన్నారు. నిర్మాణ పనుల వివరాలను వారికి గుత్తేదారులు తెలియజేశారు.

వరికపూడిశెలకు తొలి అడుగు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: పల్నాటి ప్రజల చిరకాల కోరిక అయిన వరికపూడిశెల ఎత్తిపోతల పథకం నిర్మాణానికి ఎట్టకేలకు తొలిఅడుగు పడింది. మండల పరిధిలోని హనుమాపురం తండానుంచి వరికపూడిశెల పంప్‌హౌస్ వరకు గురువారం పనులు ముమ్మరంగా చేపట్టారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిరుద్యోగ యువతి, యువకులకు ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి.వి.కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. టెక్నీషియన్ అండ్ కంప్యూటర్, ఎంఎస్ ఆఫీస్ కోర్సుల్లో మూడు నెలలు పాటు శిక్షణ ఇస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెలాఖరు లోపు దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. పదోతరగతి పాసైన 16 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాలు వయసు గలవారు అర్హులుగా చెప్పారు.

పరిసరాల పరిశుభ్రతకు కృషి

పెదకూరపాడు, న్యూస్‌టుడే: ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజల సహకారంతోనే గ్రామాలను పరిశుభ్రంగా ఉంచవచ్చునని ఎంపీడీవో సాయిలీల అన్నారు. పెదకూరపాడు మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం ఏఎస్ఎస్ఐఎస్‌టీ-ఐఐటీ ఆధ్వర్యంలో గ్రామాల్లో పరిశుభ్రత, పచ్చదనంపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎస్‌హెచ్‌జీ వీవోఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అనిల్‌కుమార్, బొలయ్యలు అవగాహన కల్పించారు. ఐఈసీ సామగ్రి పంపిణీ చేశారు.

సామాజిక మాధ్యమాలకు బానిసలు కావద్దు

నందిగామ(సత్తెనపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: కౌమార ప్రాయంలో సామాజిక మాధ్యమాలకు బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని గ్రామీణ ఎస్సై అమీనుద్దీన్ సూచించారు. సత్తెనపల్లి మండలం నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికలకు గురువారం అవగాహన కల్పించారు. తెలిసీతెలియని వయసులో సరైన నిర్ణయాలు తీసుకోలేక మోసపోతున్న వారెందరో ఉన్నారన్నారు. తల్లిదండ్రుల గౌరవాన్ని పెంచేలా, సమాజంలో ఉత్తమ పౌరులుగా గుర్తింపు పొందేలా రాణించాలన్నారు. విద్య ద్వారా కుటుంబాల్లో వెలుగులు నింపవచ్చన్నారు. శిక్షణ ఎస్సై వెంకటేశ్వరరావు, హెచ్ఎం కె.శ్రీనివాసరావు, పీఈటీ జి.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లి మందలించిందని బలవన్మరణం

రాజుపాలెం: తల్లి మందలించిందని బాలిక ఆత్మహత్య చేసుకొంది. రాజుపాలెంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాలిక గురువారం స్టడీ అవర్ ముగించుకొని ఇంటికి వచ్చింది.ఆలస్యంగా వచ్చినందుకు తల్లి మందలించటంతో మనస్థాపం చెంది ఇంట్లో చీరతో ఉరేసుకొంది. బాలిక కిందకి రాకపోవటంతో తల్లి వెళ్లి చూసి కేకలు వేసింది. ఇరుగుపొరుగు వచ్చి బాలికను కిందకి దించి రెడ్డిగూడెంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందింది. బాలిక మృతితో పాఠశాల విద్యార్థులు అక్కడకు వచ్చి కన్నీరు మున్నీరుగా విలపించడం గ్రామస్థుల చేత కంటతడి పెట్టించింది.

పేదలకు చీరల పంపిణీ

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: సత్యసాయి శతజయంతి సందర్భంగా పట్టణంలోని సత్యసాయి బాబా ఆలయంలో దేవాలయ కమిటీ, ట్రస్టు సభ్యులు పేద మహిళలకు గురువారం చీరలు పంపిణీ చేశారు. దేవాలయంలో పురపాలకసంఘం పారిశుద్ధ్య కార్మికులు, లెనిన్‌నగర్‌లోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు, యానాది కాలనీ మహిళలకు చీరలు అందజేశారు. దేవాలయంలో భక్త బృందం సభ్యులు భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏలూరి శశికుమార్, తెదేపా జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు గొంట్ల శ్రీనివాసరావు, కౌన్సిలర్లు గర్రె నాగేశ్వరరావు, జూలకంటి సుబ్రమణ్యం, వల్లెపు రామకృష్ణ, పసుమర్తి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు ఎప్పుడో?

నోటీసులిచ్చి వదిలేసిన అధికారులు ★ జోరుగా నిర్మాణాలపై ఫిర్యాదులు

పెదకూరపాడు, న్యూస్‌టుడే

వాగులు వెడల్పు చేసి ఆక్రమణలు లేకుండా చూస్తామన్న అధికారులు ఆచరణలో చూపడం లేదు. ప్రభుత్వ స్థలాలు, వాగులు సంరక్షణకు చర్యలు లేకపోవటంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. పెదకూరపాడులో ప్రాధాన్యమున్న పేరమ్మ వాగు ఆక్రమణలతో కుచించుకుపోతోంది. లగడపాడు రహదారి నుంచి పంచాయతీ కార్యాలయం పెదకూరపాడు సామాజిక ఆరోగ్యకేంద్రం, పాటిబండ్ల గృహాల్లోని మురుగునీరు ప్రవహించే ఈ వాగు కబ్జాలకు గురైంది. దీంతో పట్టణానికి ముప్పు వాటిల్లే పరిస్థితులు నెలకొన్నాయి. సహజంగా పారే వాగు ప్రాంతాన్ని మట్టితో పూడ్చివేసి గృహాలు, మరుగుదొడ్ల నిర్మాణాలు చేపడుతుండటంపై స్థానికులు ఫిర్యాదు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వస్తున్నాయి. ఆక్రమణదారులకు పంచాయతీ అధికారులు జులైలో నోటీసులు ఇచ్చినా ఇప్పటి వరకు చర్యలు లేవు. ఆక్రమణలు తొలగించాలని కొందరు తెదేపా, జనసేన రాష్ట్ర కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు. పెదకూరపాడు పంచాయతీ కార్యాలయం నుంచి ఆనందపేట తెలుగు బాప్టిస్ట్ చర్చి వరకు ఇంటి ఆవరణలో నిర్మించుకోవాల్సిన మరుగుదొడ్లను వాగుపై నిర్మించి సెప్టిక్ ట్యాంకులు ఏర్పాటు చేసుకోకుండా వ్యర్థాలను పైపులు నేరుగా వ్యర్థాలను వాగులో కలుపుతున్నారు. వర్షం కురిసిన సమయంలో వ్యర్థాలు రోడ్డుపైకి చేరి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. వేసవి కాలంలో వాగు ప్రవాహం నిలిచిన సమయంలో గృహాల నుంచి వచ్చే వ్యర్థాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. వర్షాకాలంలో వాగులు పొంగి రహదారిపైకి చేరి సత్తెనపల్లి-అమరావతి మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు వాపోతున్నారు.

పేరమ్మ వాగు

తిరునాళ్లలో జూదం

కారంపూడి, న్యూస్‌టుడే: పల్నాటి వీరుల తిరునాళ్లలో కొంతమంది గుండాట, మూడుముక్కలాట, నెంబర్ల ఆటలతో అమాయకులను దోచుకుంటున్నారు. పోలీసులు ఆయా ప్రాంతాల్లో తిరుగుతున్నప్పటికీ నిర్వాహకులు ప్రజల జేబులకు చిల్లులు పెడుతున్నారు.

ప్రకటన

నా క్లయింటు **వంకాయలపాటి నరేష్, తండ్రి చలపతిరావు,** డో.నెం. 1-73, చిన మోదుగపల్లి, వత్సవాయి మండలం, ఎన్.టి.ఆర్. జిల్లా వారి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది ఏమనగా...
పల్నాడు జిల్లా, పెదకూరపాడు మం. బలుసుపాడు గ్రామ కాపురస్తుడు నందిగం జేమ్స్ గారి కుమారుడు నందిగం నాగేశ్వరరావుకు బలుసుపాడు గ్రామ డి.నెం. 276-డి, పట్టా నెం. 208, య.0.48 సెంట్లు, పూర్వార్జిత ఆస్తి అమరావతి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో రిజిస్టర్ కాబడిన పార్టీషన్ దస్తావేజు నెం.5092/2025, ది. 11-11-2025 ద్వారా సంక్రమించినది. సదరు దస్తావేజులోని ఎ-షెడ్యూలు దాఖలా ఆస్తి సంక్రమించి సర్వసంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములలో అనుభవించుచున్న స్థిరాస్తిని నా క్లయింట్ క్రయం పొందుటకు బయానాగా కొంత సొమ్మును నగదుగా ఇచ్చియున్నారు. కావున ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవరికైననూ ఏవిధమైన అభ్యంతరములు, తనఖాలు, కోర్టు జప్తులు, భాగలబ్ధి తగాయిదాలు, భాగాలు, బ్యాంక్ ష్యూరిటీలు, వగైరాలు ఉన్నయెడల ఈ ప్రకటన తేదీ నుండి 7 రోజులలోపు తగు ఆధారాలతో వ్రాతపూర్వకంగా ఈ దిగువ అడ్రస్‌కు రిజిస్టర్ పోస్టు తిరుగు రశీదు ద్వారా తెలుపగలరు. సదరు గడువులోపు ఎవరినుండైనా ఏవిధమైన అభ్యంతరములు రాని యెడల నా క్లయింటు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని నిర్వివాద ఆస్తిగా భావించి పై తెలిపిన వారినుండి రిజిష్టర్డ్ సేల్ డీడ్ పొందగలరు. గడువు అనంతరము వచ్చు అభ్యంతరములు వగైరాలు నా క్లయింటును గానీ, సదరాస్తిని గాని బైండు చేయజాలవు.
షెడ్యూలు: పల్నాడు జిల్లా, నరసరావుపేట రి.డి అమరావతి సబ్ డి., పెదకూరపాడు మం., బలుసుపాడు గ్రామ డి. నెం. 276-డి, య. 0.48 సెంట్లు స్థిరాస్తికి **హద్దులు. తూర్పు:** దుప్పటి వెంకటేశ్వర్లు భూమి, **దక్షిణం:** నందిగం సంజీవరావు భూమి, **పడమర:** చెన్ను దుర్గారావు భూమి, **ఉత్తరం:** నందిగం కోటయ్య భూమి. ఈ నాలుగు హద్దుల మధ్య య.0.48 సెంట్లు లేక 0.194 హెక్టార్స్ స్థిరాస్తి.
ఇట్లు, **సి.హెచ్.బాలసుధాకర్, ఎస్.పురుషోత్తం**
అడ్వకేట్స్, షాపు నెం. 23, ఫస్ట్ ఫ్లోర్,
శ్రీకృష్ణదేవరాయ కాంప్లెక్స్, అరండల్‌పేట, విజయవాడ-520 002

ప్రకటన

నా క్లయింటు Jhaishna Technologies Pvt Ltd., విజయవాడ, డైరెక్టర్ శ్రీమతి ఉషారాణి సుంకర, భర్త పి.రామకృష్ణ, డో.నెం.40-5/3-9, వెంకటేశ్వరపురం, విజయవాడ వారి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది ఏమనగా...
పల్నాడు జిల్లా, పెదకూరపాడు మం., బలుసుపాడు గ్రామ కాపురస్తుడు నందిగామ చిన్న ఏసు గారి కుమారుడు నందిగామ అలియాస్ నందిగం సంజీవరావుకు బలుసుపాడు గ్రామ డి.నెం. 276-డి పట్టా నెం. 206, య.0.51 సెంట్లు, పూర్వార్జిత ఆస్తి అమరావతి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్టర్ కాబడిన పార్టీషన్ దస్తావేజు నెం. 4825/2025, ది. 18-10-2025 ద్వారా సంక్రమించినది. సదరు దస్తావేజులోని బి-షెడ్యూలు దాఖలా ఆస్తి సంక్రమించి సర్వసంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములలో అనుభవించుచున్న స్థిరాస్తిని నా క్లయింట్ క్రయం పొందుటకు బయానాగా కొంత సొమ్మును నగదుగా ఇచ్చియున్నారు. కావున ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవరికైననూ ఏవిధమైన అభ్యంతరములు, తనఖాలు, కోర్టు జప్తులు, భాగలబ్ధి తగాయిదాలు, భాగాలు, బ్యాంక్ ష్యూరిటీలు వగైరాలు ఉన్నయెడల ఈ ప్రకటన తేదీ నుండి 7 రోజుల లోపు తగు ఆధారాలతో వ్రాతపూర్వకంగా ఈ దిగువ అడ్రస్‌నకు రిజిస్టర్ పోస్టు తిరుగు రశీదు ద్వారా తెలుపగలరు. సదరు గడువులోపు ఎవరినుండైనా ఏవిధమైన అభ్యంతరములు రాని యెడల నా క్లయింటు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని నిర్వివాద ఆస్తిగా భావించి పై తెలిపిన వారి నుండి రిజిష్టర్డ్ సేల్ డీడ్ పొందగలరు. గడువు అనంతరము వచ్చు అభ్యంతరములు వగైరాలు నా క్లయింటును గానీ, సదరాస్తిని గానీ బైండు చేయజాలవు.
షెడ్యూలు: పల్నాడు జిల్లా, నరసరావుపేట రి.డి., అమరావతి సబ్ డి., పెదకూరపాడు మం., బలుసుపాడు గ్రామ డి.నెం. 276-డి, య.0.51 సెంట్లు స్థిరాస్తికి హద్దులు: **తూర్పు:** దుప్పటి వెంకటేశ్వర్లు భూమి, **దక్షిణం:** అత్తోట దాసు భూమి, **పడమర:** చెన్ను దుర్గారావు భూమి, **ఉత్తరం:** నందిగామ జేమ్స్ భూమి. ఈ నాలుగు హద్దుల మధ్య య. 0.51 సెంట్లు లేక 0.206 హెక్టార్స్ స్థిరాస్తి.
ఇట్లు **సి.హెచ్.బాలసుధాకర్, ఎస్.పురుషోత్తం**
అడ్వకేట్స్, షాపు నెం. 23, ఫస్ట్ ఫ్లోర్, శ్రీకృష్ణదేవరాయ కాంప్లెక్స్,
అరండల్‌పేట, విజయవాడ - 520 002

(c) eenadu

ఈనాడు
పార్వతీపురం మన్యం
శుక్రవారం నవంబరు 21, 2025

రాళ్లు.. రప్పలు.. ఏంటీ తిప్పలు

పాచిపెంట మండలం గరిసిగుడ్డి పంచాయతీ మర్రిపాడు గిరిజన గ్రామానికి సరైన రోడ్డు లేదు. రాళ్లుతేలిన మార్గంలో రాకపోకలకు నరకం చూస్తున్నారు. విద్యార్థులు సుమారు రెండు కి.మీ దూరంలోని జీలికివలస మండల పరిషత్తు పాఠశాలకు వెళ్లేందుకు నిత్యం ఇబ్బందులకు పడుతున్నారు. గురువారం సిటు నాయకుడు కె.ఈశ్వరరావు, చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రహదారి బాగు చేయాలని కోరారు.
– న్యూస్‌టుడే, పాచిపెంట

నేడు ఎస్సీ కమిషన్ పర్యటన

పార్వతీపురం: ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కె.ఎస్.జవహర్ నేతృత్వంలో బృందం శుక్రవారం జిల్లాలో పర్యటించనుందని కలెక్టరు ప్రభాకరరెడ్డి ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఐటీడీఏ కమ్యూనిటీ హాలులో ఛైర్మన్ ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరిస్తారు. ఎస్సీ సంఘాల నాయకులతో సమావేశమవుతారు. 2.30 గంటల నుంచి 5 వరకు కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తారు.

కార్డు కావాలా.. పరేషన్ అవసరం లే!

ఒకప్పుడు కొత్త రేషన్ కార్డు కావాలన్నా.. పిల్లల పేర్లు కలపాలన్నా.. కాళ్లు అరిగేలా తిరగాల్సి వచ్చేది. మండల కార్యాలయాలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి. ఈ ఇబ్బందులకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఎవరైనా.. ఎప్పుడైనా దరఖాస్తు చేసుకునేలా సచివాలయాల్లో కొత్త వ్యవస్థ తీసుకొచ్చింది. డిజిటల్ సహాయకులకు బాధ్యతలు అప్పగించారు. జనవరి నుంచి జూన్ వరకు దరఖాస్తు చేసుకున్న వారికి జులైలో.. జులై నుంచి డిసెంబరు వరకు దరఖాస్తు చేసుకున్న వారికి జనవరిలో కొత్త కార్డులు అందిస్తారు. – న్యూస్‌టుడే, చీపురుపల్లి

పిల్లల పేర్లు కలపాలంటే..

పిల్లల ఆధార్ కార్డులు, జనన ధ్రువపత్రాలు, తల్లిదండ్రుల రేషన్ కార్డు ఉండాలి. వివరాలు నమోదు చేసి, వీఆర్వో, తహసీల్దారు పరిశీలనకు పంపిస్తారు. వారు అనుమతించగానే కార్డులో పేర్లు కలుస్తాయి. ఇతర వివరాలకు గ్రామ, వార్డు సచివాలయాల్లో సంప్రదించాలని జిల్లా పౌర సరఫరా శాఖ అధికారి మురళీనాథ్ తెలిపారు. కార్డుల్లో చిరునామాలు మార్పు చేసుకోవడానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

కొత్తగా వివాహమైతే ఇలా..

కొత్తగా పెళ్లైన దంపతులు రేషన్‌కార్డు చేసుకోవాలంటే గతంలో పెద్ద ప్రక్రియ ఉండేది. ముందుగా మహిళను తల్లిదండ్రుల జాబితా నుంచి తొలగించి, తదుపరి ప్రక్రియ చేపట్టేవారు. ఈ వ్యవధిలో లబ్ధి కోల్పోయేవారు.

ప్రస్తుతం ఆ బాధ లేదు. భార్యాభర్తలు ఇద్దరి ఆధార్, భర్త పాత రేషన్‌కార్డు, పెళ్లి ధ్రువపత్రం తీసుకుని వెళ్తే.. ప్రభుత్వ వెబ్‌సైట్‌లో మ్యారేజ్ స్ప్లిట్ ఆప్షన్ నమోదు చేస్తారు. వారికి ఓ నంబరు కేటాయించి, దాని ఆధారంగా ఈకేవైసీ చేస్తారు. తర్వాత వీఆర్వో, తహసీల్దారు పరిశీలనకు పంపుతారు. అక్కడ నుంచి అనుమతి పొందగానే కార్డులు మంజూరు చేస్తారు. ఇంతలో అత్తవారింట్లో రేషన్ అందజేస్తారు.

రూ. కోట్లు ఖర్చు.. తిప్పలు తీరితే ఒట్టు!

వినియోగానికి నోచుకోని గోదాములు | **పీఏసీఎస్‌ల నెత్తిపై గుదిబండ**

నాబార్డు రుణాలతో గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేపట్టిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల (పీఏసీఎస్) గోదాములు నిరుపయోగంగా దర్శనం ఇస్తున్నాయి. స్థలాలను ఎంపిక చేయడంలో అనాలోచితంగా నిర్ణయం తీసుకోవడంతోనే నేడు దిష్టి బొమ్మల్లా మారాయి. గ్రామాలు, పట్టణాలకు దూరంగా రక్షణ లేని ప్రాంతాల్లో వీటిని నిర్మించడంతో అక్కడ పంటలను దాచుకునేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు.
– న్యూస్‌టుడే, గరివిడి, పార్వతీపురం

కెల్లలో గ్రామానికి దూరంగా గోదాము

రుణాలు చెల్లించేందుకు పాట్లు

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర వచ్చేంత వరకు నిల్వ చేసుకునేందుకు వీలుగా ఉమ్మడి జిల్లాలో గోదాములను నిర్మించారు. నిల్వ ఉంచిన సరకు విలువను బట్టి రైతుల నుంచి నామమాత్రపు అద్దె వసూలు చేసి, నాబార్డు రుణాలు చెల్లించాలి. కానీ ఎక్కడా వాడుకలోకి రాలేదు. రుణాలు చెల్లించడానికి సొసైటీలు పాట్లు పడుతున్నాయి. 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాముకు రూ.40 లక్షలు, వెయ్యి మెట్రిక్ టన్నుల గోదాముకు రూ.70 లక్షలు వెచ్చించారు. పది శాతం రాయితీ పోనూ.. 90 శాతం రుణాన్ని 3 శాతం వడ్డీతో పీఏసీఎస్‌లు చెల్లించాలి. ఇప్పటికే అప్పుల ఊబిలో ఉన్న సొసైటీలకు ఇది ఆర్థిక భారమవుతోంది.

నిర్మించి.. వదిలేశారు

ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు పండించే వరి, మొక్కజొన్న, మినుము, పెసర ఇతర పంటల ఉత్పత్తులను గోదాముల్లో నిల్వ ఉంచుకుని గిట్టుబాటు ధర ఉన్నప్పుడు విక్రయించేలా సహకార శాఖ అధికారులు చర్యలు తీసుకుంటే ఉపయోగపడేవి. నిల్వ ఉంచిన ఉత్పత్తుల విలువలో 70 శాతం వరకు సహకార సంఘాల ద్వారా రైతులు రుణాలు పొందే అవకాశం ఉంది. కానీ ఆ దిశగా ఏ మాత్రం చర్యలు లేవు.

తొలి ప్రాధాన్యత వారికే..

గోదాముల్లో పంటలు దాచుకోవడానికి రైతులు ముందుకు రావడం లేదు. తొలి ప్రాధాన్యత వారికే ఇవ్వాం. వారు రానిపక్షంలో ప్రభుత్వ శాఖల అవసరాలకు కేటాయించి, త్వరలో వినియోగంలోకి తీసుకొస్తాం.
– పి.రమేష్, జిల్లా సహకారశాఖ అధికారి, విజయనగరం

ఉమ్మడి జిల్లాలో మంజూరైన గోదాములు	నిర్మాణం పూర్తి	స్థల సమస్యతో ప్రారంభం కానివి	వివిధ దశల్లో ఉన్నవి	ఖర్చు చేసిన నిధులు
65	41	07	17	రూ.21.46 కోట్లు

తవ్వకాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు సత్యనారాయణ తదితరులు

నాగావళి తీరంలో కందకాలు

ఈనాడు కథనానికి స్పందన

కొమరాడ, న్యూస్‌టుడే: కొమరాడ మండలం కూనేరు రామభద్రపురం సమీప నాగావళి నది తీరంలో అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని గురువారం 'ఈనాడు'లో 'నాగావళిలో తోడు దొంగలు' శీర్షికతో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. తహసీల్దారు సత్యనారాయణ రీచ్‌ను పరిశీలించి, వాహనాలు వెళ్లకుండా కందకాలను తవ్వించారు. కొమరాడ మండలంలో ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. యంత్రాలు వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉద్యానాల్లో వ్యర్థాలు వేస్తే కేసులు

పార్వతీపురం గ్రామీణం, పట్టణం, న్యూస్‌టుడే: రూ.లక్షలు వెచ్చించి అభివృద్ధి చేసిన చెరువులు, ఉద్యానాల పరిసరాలు శుభ్రంగా ఉండేలా పాలకవర్గాలు, అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టరు ప్రభాకరరెడ్డి ఆదేశించారు. గురువారం జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, సబ్‌కలెక్టరు వైశాలితో నర్సిపురం కోనేరు సుందరీకరణ పనులు, పట్టణంలోని సన్యాసిరాజు ఉద్యానాన్ని పరిశీలించారు. పార్కు చుట్టూ చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేం నిర్వహణనని ప్రశ్నించారు. ఇకపై ఎవరైనా వ్యర్థాలు వేస్తే కేసులు నమోదు చేయాలని సర్పంచి బంగారమ్మ, కార్యదర్శులను ఆదేశించారు. ఎంపీడీవో సత్యం ఉన్నారు.

సర్పంచి, అధికారులతో మాట్లాడుతున్న ప్రభాకరరెడ్డి

గరివిడి కాజా.. తింటే మజా

నోట్లో పెట్టగానే తియ్యగా కరిగిపోయే చెనా కాజా.. రుచి మధురం.. గరివిడి పేరు చెప్పగానే టక్కున గుర్తుచ్చేది ఈ స్వీటే. ఇక్కడ మాత్రమే దొరికే ఒక ప్రత్యేకమైన రకం ఇది. కాకినాడ గొట్టం కాజా మాదిరిగా ప్రసిద్ధి చెందింది. దీని తయారీ విధానం ప్రత్యేకంగా ఉంటుంది. దాదాపు ఆరు దశాబ్దాలుగా ఉమ్మడి జిల్లా వాసులకు ఈ స్వీటు సుపరిచితమే. కాలక్రమేణా ఉత్తరాంధ్ర, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించింది. – న్యూస్‌టుడే, గరివిడి

పరిచయం ఇలా..

దాదాపు 60 ఏళ్ల క్రితం ఓ కుటుంబం ఒడిశా నుంచి గరివిడికి వలస వచ్చి, చెనా కాజాను ఈ ప్రాంత ప్రజలకు పరిచయం చేసింది. అనతి కాలంలోనే ప్రాచుర్యం పొందింది. ప్రజలు ఎక్కువ ఆసక్తి చూపడంతో గరివిడిలోని మిగతా స్వీటు దుకాణదారులూ తయారు చేయడం మొదలుపెట్టారు. బంధువులు, తెలిసిన వారి ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ప్రాంతాలకు పంపేవారు. అలవాటు పడిన ఆయా ప్రజలు ఇక్కడికి వచ్చిన ప్రతిసారీ కొనుగోలు చేస్తుంటారు. శుభకార్యమేదైనా ఖాజా ఉండాల్సిందే. దారిలో వెళ్లేవారెవరైనా.. గరివిడి రాగానే కాజా కొనుగోలు చేయాల్సిందే.

తయారీ ప్రత్యేకం

కేవలం పాలను మాత్రమే కాజా తయారీలో ఉపయోగిస్తారు. మరే పదార్థాలు కలపరు. స్వచ్ఛమైన పాలు వేడిచేసి, చల్లార్చిన తర్వాత సహజ సిద్ధమైన పులుపు పదార్థాలను ఉపయోగించి విరిగిపోయేలా చేస్తారు. అందులో నుంచి వచ్చిన చిన్న చిన్న ముద్దలను చుట్టి, పాకంలో నానబెట్టి ఈ కాజాలను తయారుచేస్తారు. నాణ్యమైన పదార్థాలు, రంగు, రుచి, వాసన చక్కగా ఉండడంతో తినడానికి అంతా ఇష్టపడతారు.

ప్రకృతి సిగలో సిందూరం

సాయంత్రం వేళ ఎరుపు రంగు రాసుకున్న ఆకాశం

కనుచూపుమేర ఎత్తయిన కొండలు.. తనువును తాకే పిల్ల గాలి.. మనసును కట్టిపడేసేలా రంగురంగుల ఆకాశం.. సీతంపేట మండలం తుంబకొండ సమీపంలో శ్రీపెద్దమ్మ-చిన్నమ్మ తల్లి కొండల వద్ద నాటి దృశ్యాలివి. ఇక్కడ ప్రకృతి రమణీయంగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో సూర్య కిరణాలు మబ్బులను తాకి ఎర్రగా అబ్బురపరుస్తుంటాయి. ఇక్కడి పెద్ద బండరాళ్లపై నుంచి దిగువకు చూస్తే గిరిజన తండాలు సుందరంగా కనిపిస్తాయి.
– న్యూస్‌టుడే, సీతంపేట

ఎల్ఎన్‌పురంలో గజగజ

పార్వతీపురం మండలంలోని చినమరికి, ఎల్ఎన్‌పురాల మధ్య కరిరాజుల గుంపు తిష్ఠ వేసింది. గురువారం ఎల్ఎన్‌పురం సమీప బోడికొండ పరిసరాల్లో ఉన్నాయి. గత నెల ఈ ప్రాంతం నుంచి వెళ్లిన గుంపు మళ్లీ రావడంతో ఖరీఫ్ పనుల్లో ఉన్న రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏనుగుల సంచారంపై ప్రత్యేక నిఘా పెట్టామని, ట్రాకర్లను నిరంతర విధుల్లో ఉంచామని రేంజర్ కె.మణికంఠేష్ తెలిపారు. సమీప గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.
– న్యూస్‌టుడే,పార్వతీపురం గ్రామీణం

ఎల్ఎన్‌పురం ప్రాంతంలో తిరుగాడుతున్న ఏనుగుల గుంపు

సమాచారం లేకుండా తిరగొద్దు

ఈనాడు, విజయనగరం: అల్లూరి సీతారామరాజు జిల్లాలో మావోయిస్టుల ఎన్‌కౌంటర్ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమై, సరిహద్దుల్లో నిఘా ఉంచింది. మావోల్లో కొందరు తప్పించుకుని రెండు జిల్లాల మీదుగా ఒడిశాకు వెళ్లేందుకు అవకాశం ఉందని భావిస్తోంది. సముద్ర తీరానికి చేరుకుని పరదీప్, యానాం, పశ్చిమ బెంగాల్, చెన్నై చేరుకునేందుకు ప్రయత్నం చేయవచ్చని అనుమానిస్తోంది. ఈ నేపథ్యంలో తమకు సమాచారం ఇవ్వకుండా మారుమూల గ్రామాల పర్యటనలకు వెళ్లొద్దని మంత్రులు, ఎమ్మెల్యేలు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నేతలకు పోలీసు ఉన్నతాధికారులు సూచనలు చేసినట్లు ఎస్పీ దామోదర్ చెప్పారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అయ్యన్నపేట: బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన నిరుద్యోగ యువత సివిల్స్ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నామని, దరఖాస్తులు చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ సాధికారత అధికారిణి జె.జ్యోతిశ్రీ తెలిపారు. డిగ్రీ అర్హత కలిగిన వారు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, విద్య, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, పాన్ కార్డులను జతపరిచి ఈనెల 25లోపు విజయనగరంలోని తమ కార్యాలయానికి దరఖాస్తు పంపాలన్నారు. వివరాలకు 96035 57333, 98668 86844ను సంప్రదించాలని సూచించారు.

కాసులు రాక.. కష్టాలు పోక..!

బిల్లుల చెల్లింపులో జాప్యం | **మన్యంలో ఆగిన రహదారుల నిర్మాణం**

గిరిజన ప్రాంతంలో రహదారుల కష్టాలు తీర్చడానికి 'పల్లె పండగ', 'అడవితల్లిబాట', 'డోలీ రహదారులు' పేర్లతో ఉపాధిహామీ నిధులు మంజూరు చేశారు. కానీ ఈ పనుల్లో ఏదీ పూర్తకాక.. ప్రజలకు అనుకున్న మేలు చేకూర్చలేని దుస్థితి. బిల్లులు చెల్లించి, మన్యం దారులకు మోక్షం కలిగించాలని ప్రజలు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురం

71 దారులు.. 11 పూర్తి

జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లో 71 పనులకు పంచాయతీరాజ్ శాఖ ఉపాధిహామీ పథకం నిధులు మంజూరు చేసింది. ★ 12.97 కి.మీ మేర 42 సిమెంటు రహదారుల పనులకు రూ.10.30 కోట్లు, 48.81 కి.మీ 29 బీటీ రోడ్లకు రూ.42.90 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో 11 మాత్రమే పూర్తయ్యాయి. 22 ప్రారంభించలేదు. మిగిలినవి వివిధ దశల్లో ఆపేశారు. ★ ఇప్పటివరకు రూ.17.21 కోట్ల పనులు జరగగా రూ.11.99 కోట్ల బిల్లులు అప్‌లోడ్ చేశారు. రూ.4.51 కోట్లు మాత్రమే చెల్లింపులు జరిగాయి. ఇంకా రూ.7.48 కోట్లు చెల్లించాలి.

రాళ్లు తేలిన అడ్డంగిజంగిడిభద్ర రహదారి

అడవితల్లికి దారేదీ?

అడవితల్లి బాట పేరుతో మూడు రోడ్లు మంజూరు కాగా.. రూ.9 కోట్లతో చేపట్టిన బాగుజోల రహదారి (6.6 కి.మీ) పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. రిట్టపాడు, మంత్రజోల రోడ్లు పనులు ఆగిపోయాయి.

డోలీ మోత ఉండకూడదని..

జిల్లాలో డోలీ మోత ఉండకూడదని దారిలేని గ్రామాలకు నిధులు మంజూరు చేశారు. కురుపాం నియోజకవర్గంలో 51 గ్రామాలకు రూ.20.45 కోట్లు, పార్వతీపురంలో 5 రోడ్లకు రూ.52.15 లక్షలు, పాలకొండలో ఆరింటికి రూ.125 లక్షలు, సాలూరులో 21 దారులకు రూ.5.43 కోట్లు మంజూరు చేశారు. ఇంకా ఆయా పనులు ప్రారంభం కాలేదు.

పూర్తికి చర్యలు

నిధులు త్వరలోనే విడుదల అవుతాయి. మంజూరైన అన్ని పనులు పూర్తిచేసే దిశగా చర్యలు చేపడుతున్నాం.
– వీఎస్ నగేష్, పీఆర్ ఇంజినీరింగు అధికారి

చన్నీళ్ల స్నానాలు.. చలించరా సారూ

కురుపాం, గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ ప్రాంతాల్లో చలి తీవ్రత ఎక్కువ. తెల్లవారుజామున చన్నీళ్లతో స్నానమంటే వణుకే. కానీ తల్లిదండ్రులకు దూరంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఉంటూ చదువుతున్న విద్యార్థులకు చన్నీరే దిక్కయ్యాయి. నిత్యం గజగజ వణుకుతున్నారు. వీరికి వేడి నీరు అందించేందుకు 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం సౌరశక్తితో పని చేసే యంత్రాలను ఏర్పాటు చేసింది. ఆపై వచ్చిన గత వైకాపా ప్రభుత్వం అయిదేళ్లూ వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో మరమ్మతులకు గురై నిరుపయోగంగా మారాయి.
– న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం, గుమ్మలక్ష్మీపురం

గత నిర్లక్ష్యమే..: కురుపాం మండలం నీలకంఠాపురం, లంకాజోడు, గుమ్మలక్ష్మీపురం మండలం రేగిడి, కొత్తగూడ, పి.ఆమిటిలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలల్లో రూ.లక్షలతో ఏర్పాటు చేసిన వేడినీటి సౌరశక్తి యంత్రాలు దిష్టి బొమ్మల్లా మారాయి. కొన్నిచోట్ల సోలార్ పలకలు శిథిలమై, ట్యాపులు మరమ్మతులకు గురై తుప్పుపట్టాయి. పరికరాల పనితీరు పరిశీలించి వినియోగంలోకి తీసుకొస్తామని పార్వతీపురం ఐటీడీఏ డీడీ విజయశాంతి చెప్పారు.

నీలకంఠాపురంలో మరమ్మతులకు గురైన సౌర యంత్రాలు

వేధింపులు ఆగేలా.. వేదన తీరేలా..!

● విజయనగరానికి చెందిన కె.వీరబాబు అదనపు కట్నం కోసం భార్యను వేధించేవాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు. ఈమేరకు కేసు నమోదైంది. తాజాగా అతడికి సంవత్సరం జైలు శిక్ష పడింది.

– న్యూస్‌టుడే, విజయనగరం అయ్యన్నపేట

ప్రస్తుతం చాలామంది వరకట్న వేధింపులతో ఇబ్బంది పడుతున్నారు. రోజూ ఇలాంటి ఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఇలాంటి వారికి అండగా నిలిచేందుకు వరకట్న నిషేధిత చట్టాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో 2015 నుంచి ఇప్పటివరకు 71 కేసులు నమోదయ్యాయి. బాధితులకు రూ.20 లక్షల మేర పరిహారం అందినట్లు ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు.

రక్షణాధికారిగా ఆర్డీవో..

రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం రెవెన్యూ డివిజనల్ అధికారులను ఈ చట్టం రక్షణాధికారులు నియమించింది. బాధితులకు అవగాహన కల్పించి, వారికి న్యాయం చేసేందుకు కలెక్టర్ ఛైర్మన్‌గా ఉండే కమిటీ అందుబాటులో ఉంటుంది. ఇందులో ఎస్పీ, సంయుక్త కలెక్టర్, ఐసీడీఎస్ పీడీ, అయిదుగురు సామాజిక కార్యకర్తలు ఉంటారు. మరో అడ్వైజరీ కమిటీ కూడా పనిచేస్తుంది.

శిక్ష ఇలా..

కట్నం ఇవ్వడం లేదా తీసుకోవడం నేరంగా పరిగణిస్తారు. జిల్లాలో ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు వచ్చిన ఫిర్యాదును పరిశీలిస్తుంది. నేరం రుజువైతే ఆరు నెలల నుంచి అయిదేళ్ల వరకు జైలు శిక్ష పడుతుంది. కనీసం రూ.10 వేల జరిమానా విధిస్తారని, తీవ్రత ఆధారంగా శిక్ష ఉంటుందని ఐసీడీఎస్ పీడీ టి.విమలారాణి తెలిపారు. చట్టంపై అవగాహన పెంచుకుని, బాధితులు సద్వినియోగం చేసుకోవచ్చన్నారు.

ఫిర్యాదు ఎలా..:

వేధింపులకు గురవుతున్న బాధితులు ఆర్డీవో కార్యాలయంలో లేదా స్థానికంగా ఉండే అంగన్వాడీ కేంద్రాల్లో, సీడీపీవోలను ఆశ్రయించవచ్చు. లేదా మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 181, పోలీసు హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించవచ్చు. ఐసీడీఎస్ జిల్లా కార్యాలయాల్లో ప్రత్యేక సెల్ కూడా ఉంటుంది.

కెల్ల భూములపై కన్ను

ఈనాడు, విజయనగరం: గుర్ల మండలంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. పశ్చిమబెంగాల్‌కు చెందిన సూపర్ స్మెల్టర్స్ లిమిటెడ్ సంస్థతో ఒప్పందం కుదిరిన వెంటనే ఈనెల 14న జీవో జారీ చేసింది. 1,085 ఎకరాల మేర కేటాయిస్తున్నట్లు అందులో పేర్కొంది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. భూసేకరణపై దృష్టిసారించింది.

రెండు దశల్లో..

తొలి దశ పనులకు 775 ఎకరాలు, రెండో దశ కోసం 310 ఎకరాలు అవసరం. ప్రభుత్వం భూములు అప్పగించిన వెంటనే నిర్మాణాలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సంస్థ ప్రకటించింది. 2029 ఏప్రిల్ నాటికి తొలి దశ ప్రక్రియను పూర్తి చేయాలని సంకల్పించింది. గుర్ల మండలంలోని కెల్ల, బెల్లానపేట, మన్యపురిపేట, దమరసింగి, ఎస్ఎస్ఆర్.పేట గ్రామాల పరిధిలోని భూములు అనుకూలమని గుర్తించింది. ప్రతిపాదిత 1,085 ఎకరాల్లో డి- పట్టా, అభ్యంతకర, అభ్యంతరం లేనివి, రోడ్లు, వ్యవసాయ పొలాలు, వినియోగ మార్పిడి స్థలాలున్నాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం ఒక్క దమరసింగిలోనే అడవులను ఆనుకుని 559.61 ఎకరాల మేర వ్యవసాయ భూములు ఉన్నాయి.

పెద్ద పరిశ్రమ వస్తోందని జిల్లా వాసులు ఆనందపడుతున్నా.. కెల్ల ప్రాంతంలో అత్యధికంగా పచ్చని పంట పొలాలను రైతులు వదులుకోవాల్సి వస్తుంది. ప్రస్తుతం ఖరీఫ్‌లో వరి, మొక్కజొన్న, రబీలో ఆరుతడి పంటలు సాగు చేస్తున్నారు. ఇక్కడ రెండు ప్రధాన గ్రామాలు విస్తరించాయి. తగిన నష్టపరిహారం చెల్లించి, నిర్వాసితులకు ప్రత్యామ్నాయం చూపి, భూములు సేకరిస్తే పూర్తిగా కనుమరుగయ్యే

అవే ఎక్కువ..

పరిస్థితి. బెల్లానపేటలో సుమారు 119 ఇళ్లలో 522 మంది, మన్యపురిపేటలో సుమారు 241 ఇళ్లలో 725 మంది నివసిస్తున్నారు. వీరిని మరో ప్రాంతానికి తరలించడం తప్పనిసరి. మిగిలిన గ్రామాలకు పాక్షికంగా దెబ్బతగిలినా వాటి పరిధిలోని భూములు ఇక కనిపించవు. అనుమతులు రాగానే భూసేకరణపై దృష్టిసారిస్తామని జిల్లాకు చెందిన ఓ ఉన్నతాధికారి 'ఈనాడు'కు తెలిపారు.

పంట భూముల మధ్యలో బెల్లానపేట గ్రామం

(c) eenadu

చీపురుపల్లి విద్యార్థులకు ప్రశంస

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లిలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులను ఇంటెల్ సంస్థ అంతర్జాతీయ వ్యవహారాల ప్రతినిధి సారా కెంప్ ప్రశంసించారు. కేంద్ర విద్యాశాఖ, ఇంటెల్ సంస్థ దిల్లీలోని అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇంపాక్ట్ ఫెస్టివల్‌లో మన బాలలు పాల్గొన్నారు. 'పరిశుభ్రం ఎస్ పవరింగ్ అవర్ శానిటేషన్ హీరోస్' అంశంపై ఆర్. హర్షిత, పీఎస్ఎల్.ప్రణవి, దేవస్థానాల్లో భక్తుల రద్దీ నాలకు ఇబ్బంది కలుగకుండా పవర్ ఆటోమేటిక్ క్యూ సిస్టమ్ అంశంపై పైడిశెట్టి తనిష్క్, ఏఐ ద్వారా ప్రాజెక్టులను తయారు చేశారు. దీంతో ఇంటెల్ వ్యవహారాల బాధ్యులు సారా విద్యార్థులను, గైడ్ టీచర్ ప్రసాద్‌ను అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఇంటెల్ భారత్ ప్రభుత్వ వ్యవహారాల ప్రతినిధి సారా కెంప్, చిత్రంలో హర్షిత, ప్రణవి, తనిష్క్

జీవితంలో మరువలేం.. మా ప్రాజెక్టులను పరిశీలించిన భారత ప్రభుత్వ ఐటీ, ఎలక్ట్రానిక్స్ కార్యదర్శి ఎస్.కృష్ణన్ పాఠశాల పేరు ప్రస్తావిస్తూ మమ్మల్ని వేదికపై అభినందించారు. దీంతో మా ఆనందానికి హద్దులు లేవు. ఇంపాక్ట్ ఫెస్టివల్‌కు వెళ్లిన మాకు దేశ రాజధానిలో ఉన్నత సౌకర్యాలు కల్పించారు. ప్రాజెక్టులను ప్రదర్శించడానికి మా పాఠశాల, ప్రాజెక్టు వివరాలను పొందుపరిచిన ప్రత్యేకంగా చాంబర్ కేటాయించారు. అంతర్జాతీయ నిపుణులతో సంభాషించాం. దీంతో మాలో ఆత్మ విశ్వాసం పెరిగింది. జీవితంలో మరిచిపోలేం. - విద్యార్థులు

చలిని తరిమేలా.. ఉత్సాహం ఉరిమేలా

ఎకో టూరిజం కేంద్రంలో ఉన్న కాటేజీల వద్ద క్యాంప్ ఫైర్ వేసుకుని సందడి చేస్తున్న పర్యాటకులు

కొండ ప్రాంతంలో.. నది ఒడ్డున.. ఈ శీతాకాలంలో రాత్రి వేళ కలప మంట సెగకు చలి మటుమాయమవుతుంది. గంట్యాడ మండలంలోని తాటిపూడి సమీపంలో ఉన్న గిరి వినాయక ఎకో టూరిజం కేంద్రంలో క్యాంప్ ఫైర్లు ప్రారంభమయ్యాయి. రాత్రి వేళ కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఇక్కడ గడిపేందుకు పర్యాటకులు తరలి వస్తున్నారు. ఇటీవల 'ఈనాడు'లో ప్రచురితమైన 'ప్రకృతి ఒడిలో సేదదీరండి రండి' కథనానికి ప్రకృతి ప్రేమికుల నుంచి విశేష స్పందన వస్తోందని కాటేజ్ మేనేజర్ సీహెచ్.శేషు చెబుతున్నారు. గిరి వినాయక ప్రాంతంలో కలపను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. - న్యూస్‌టుడే, గంట్యాడ(తాటిపూడి)

పుస్తక పఠనంతో మెరుగైన విజ్ఞానం

బహుమతులు పొందిన వారితో అధికారులు, ప్రముఖులు

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: చిన్ననాటి నుంచి పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని వయోజన విద్య ఉప సంచాలకుడు ఎస్.సుబ్రహ్మణ్యం, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి సూచించారు. గురువారం విజయనగరంలోని కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చదవాలనుకునే అవకాశం మేరకే వినియోగించుకోవాలన్నారు. గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందించారు. గంట్యాడ ఎంఈవో ఎస్.వెంకటరావు, సాహితీ వేత్తలు ఎ.గోపాలరావు, సముద్రాల గురుప్రసాద్, బుర్రా శ్రీనివాసరావు, బి.రామభద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆగాలి.. లోతెంతో చూడాలి

మక్కువ బైపాస్ రోడ్డులో ఏర్పడిన గుంతలు

పట్టణాభివృద్ధికి కేంద్రం రూ.కోట్లలో నిధులు మంజూరు చేస్తోంది. కానీ పనులు మాత్రం జరగడం లేదు. బిల్లులు మంజూరు కావడం లేదని గుత్తేదారులు సైతం ముందుకు రాని పరిస్థితి. సాలూరు పురపాలికలో ఆగస్టులో 57 పనులకు టెండర్లు పిలిస్తే 17 పత్రాలు దాఖలయ్యాయి. పాలనా అనుమతులు సైతం వచ్చాయి. ఉన్నతాధికారుల నుంచి అంగీకారం రాలేదు. సాంకేతిక లోపం కారణంగా ఈ దుస్థితి నెలకొంది.

ఇంకెప్పుడో.. ● కొన్ని పనులకు టెండర్లు పూర్తయినా ముందుకు కదలడం లేదు ● గాంధీపార్కు, ఒడియాపేటవీధి, ముజ్జలపేటలోని నీటి పథకాలకు మెట్లు కట్టేందుకు రూ.13 లక్షలు కేటాయించారు ● రైల్వేస్టేషన్ రోడ్డు కూడలి నుంచి మక్కువ బైపాస్ వరకు తారు రోడ్డు నిర్మాణానికి రూ.8 లక్షలు ● అటవీ కార్యాలయం నుంచి బంగారమ్మకాలనీ రెండో లైన్ తారురోడ్డుకు రూ.6.40 లక్షలు ● సామాజిక భవనం నుంచి రామాకాలనీ అపార్ట్‌మెంట్స్ వరకు తారు రోడ్డు- రూ.8 లక్షలు ● శివాజీ కూడలి నుంచి ప్రధాన నీటి సరఫరా కేంద్రానికి రహదారి- రూ.12 లక్షలు ● పెదకోమటిపేట, యాతవీధి, చిట్టివీధిలో మార్గాల ఏర్పాటు- రూ.9.20 లక్షలు ● కోటవీధి దుర్గ గుడి నుంచి పెదహరిజనపేట వర్గి వరకు- రూ.9.60 లక్షలు ● క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ నుంచి రామాకాలనీ వివేకానంద స్కూల్ వరకు- రూ.9.50 లక్షలు ● ఎస్సీ ఎల్విన్ కూడలి నుంచి రైల్వేస్టేషన్ కూడలి- రూ.13 లక్షలు ● ఆంజనేయస్వామి గుడి నుంచి బంగారమ్మకాలనీ వరకు రోడ్డు వేసేందుకు రూ.6.90 లక్షలు మంజూరైనా ప్రారంభం కాలేదు. ● ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే మొదలు పెడతామని పురపాలిక డీఈ బి.వి.ప్రసాద్ తెలిపారు. - న్యూస్‌టుడే, సాలూరు

ఇళ్ల మంజూరులో సందేహాలా..?

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 కింద గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయనుంది. ఈనెల 30 లోగా లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవాలి. గతంలో ఈ పథకం ద్వారా జిల్లాలో 36,862 మంది సచివాలయాల్లో దరఖాస్తులు చేశారు. ఈ నేపథ్యంలో వారు మళ్లీ సంప్రదించాలా.. వద్దా.. కొత్తవారికి ఏ పత్రాలు ఉండాలి.. సొంత స్థలం ఉండాలా.. గతంలో లబ్ధి పొందితే పరిస్థితి ఏంటి.. ఇంట్లో మరోసారి పేదల మంజూరుకు ఏం చేయాలి.. తదితర సందేహాల నివృత్తికి 'ఈనాడు' అవకాశం కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా ఒక్క ఫోన్ కాల్ మాత్రమే. గృహ నిర్మాణశాఖ జిల్లా అధికారి గండి మురళీమోహన్ మీతో మాట్లాడనున్నారు.

ఈనాడు ఫోన్ ఇన్ కార్యక్రమం

★ **తేదీ:** 21.11.2025 (శుక్రవారం)
★ **సమయం:** ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ★ సంప్రదించాల్సిన నంబరు: **70939 30102** - న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్

దారిలోనే ఉంటున్నాయ్.. దాడులు చేస్తున్నాయ్

గుమ్మలక్ష్మీపురంలో గుంపుగా సంచరిస్తున్న శునకాలు

వీధి ఏదైనా.. అడ్డా మాదే అన్నట్లు గుంపులుగా సంచరిస్తున్నాయి గ్రామ సింహాలు. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గుమ్మ లక్ష్మీపురం, ఎల్విన్‌పేటలో వీధి శునకాలు హడలెత్తిస్తున్నాయి. ప్రధాన రహదారులు, ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో పెద్దసంఖ్యలో గుంపులుగా సంచరిస్తున్నాయి. ద్విచక్ర వాహనాల వెంటపడుతూ దాడులకు పాల్పడుతుండడంతో చిన్నారులు, వృద్ధులు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కుక్కలను పట్టి, ఇతర ప్రాంతాల్లో విడిచిపెట్టేందుకు చర్యలు తీసుకుంటామని డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.
- న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం

తలగాంలో 25 గొర్రెపిల్లల మృతి.. వంగర: వంగర మండలం తలగాం గ్రామంలో గురువారం ఉదయం వీధి కుక్కల దాడిలో పి.సింహాచలంకు చెందిన 25 గొర్రె పిల్లలు మృతిచెందాయి. ఇంటి సమీపంలోని షెడ్‌లో 40 పిల్లలను ఉంచి.. పెద్ద గొర్రెలను మేత కోసం బయటకు తీసుకెళ్లిన సమయంలో ఘటన చోటుచేసుకుంది.

బాలుడికి తీవ్రగాయాలు.. పార్వతీపురం, గ్రామీణం: కుక్క దాడిలో మూడేళ్ల బాలుడు గాయపడిన ఘటన పార్వతీపురం మండలంలోని తాళ్లబురిడి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామంలోని సుమిత్రాపురం కాలనీకి చెందిన బాలుడు టి.యశ్వంతకుమార్ ఇంటివద్ద ఆడుకుంటున్న సమయంలో కుక్క ముఖంపై దాడి చేయడంతో రక్తస్రావం జరిగింది. కుటుంబ సభ్యులు వెంటనే బాలుడ్ని డోకిశీల ఆసుపత్రికి తీసుకెళ్లగా ప్రాథమిక చికిత్స అనంతరం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. శునకాలను తరలించాలని బాలుడి తండ్రి శేఖర్ డిమాండు చేశారు.

ముఖంపై గాయం కారణంగా బోరుమంటున్న బాలుడు

ముంజేరులో కాలువ నిర్మాణంపై వివాదం

ఇరువర్గాల మధ్య తోపులాట

భోగాపురం, న్యూస్‌టుడే: భోగాపురం మండలంలోని ముంజేరు గ్రామంలో రెండు రోజుల క్రితం నుంచి జరుగుతున్న కాలువ వివాదం గురువారం తీవ్ర ఘర్షణకు దారితీసింది. పోలీసుల సమక్షంలో తెలగ సామాజిక వర్గానికి చెందిన వారు జేసీబీతో కాలువ తవ్వేందుకు ప్రయత్నించారు. వీరిని సిద్ధార్థ కాలనీ వారు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగి, ఒకరిపై ఒకరు రాళ్లు, మట్టి విసురుకున్నారు. పోలీసులు అదుపు చేసేందుకు ప్రయత్నం చేయగా చెల్లాచెదురుగా వెళ్లిపోయారు. అనంతరం సిద్ధార్థ కాలనీ వారు ఫిర్యాదు చేసేందుకు విజయనగరంలోని ఎస్పీ కార్యాలయానికి వెళ్లడంతో మరో వర్గానికి చెందిన వారు జేసీబీతో కాలువ తవ్వేశారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ ఆర్.గోవిందరావు పరిశీలించారు. సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వండుతున్న వంటల్లో ఇసుక పడడంతో భోజనాలు పాడయ్యాయి. వేరే బడి నుంచి తెప్పించారు.

భవనం చిన్నది.. బాధ్యత పెద్దది

- న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

విజయనగరంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉత్తరాంధ్ర ప్రాంతీయ శిక్షణ కేంద్రం అధ్వానంగా మారింది. చుట్టూ దట్టమైన అటవీ ప్రాంతం ఉండడంతో లోపలకొచ్చే వరకు ఇక్కడ భవనాలు కానరావడం లేదు. మౌలిక సదుపాయాలు సైతం అంతంత మాత్రమే. సరైన దారి కూడా లేదు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. శిక్షణకు వచ్చేవారికి అవస్థలు తప్పడం లేదు.

ప్రస్తుతం ఉన్నది ఈ ఒక్క గదే..

ఏళ్ల క్రితమే.. విజయనగరం జిల్లా కేంద్రానికి సమీపంలోని పూల్‌బాగ్‌లో ఉన్న కేంద్రానికి దివంగత పీవీజీ.రాజు 23.62 ఎకరాల స్థలాన్ని ఉచితంగా కేటాయించారు. 1963లో భవనం నిర్మించారు. అది శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతమున్న కార్యాలయం విధుల వరకే సరిపోతోంది. ఒక్కటే గది, వరండా మాత్రమే ఉన్నాయి. రాత్రి కాపలాదారుకు మరో చిన్న గది ఉంది. ఏడాదిలో ఉపాధ్యాయులకు 4 సార్లు, పిల్లలకు 5 సార్లు శిక్షణ క్యాంపులు, టెస్టింగ్ క్యాంపులు జరుగుతుంటాయి. ఒకేసారి 130 మంది నుంచి 140 మంది వరకు హాజరవుతారు. దీంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇవి అవసరం.. ● వసతి, భోజన సౌకర్యాల నిమిత్తం 150- 200 మందికి సరిపడా డార్మెటరీ ● కేంద్రానికి వెళ్లేందుకు 250 మీటర్ల పొడవున రోడ్డు నిర్మాణం ● అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉండడంతో చుట్టూ ప్రహరీ ● ప్రస్తుతం 120 మంది ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటివరకు 2,250 మంది విద్యార్థులు నమోదయ్యారు. ఈ కేంద్రాన్ని సాహస కృత్యాలకు కేంద్రంగా తీర్చిదిద్దితే ఉపయోగకరంగా ఉంటుందని గైడ్ మాస్టర్లు పేర్కొంటున్నారు. ● ఇటీవల ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే శ్రీనివాసులనాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు శిక్షకుడు వాక చిన్నంనాయుడు తెలిపారు.

కళ్లు లేకున్నా.. కంప్యూటర్ వాడేస్తా

కీ బోర్డు నొక్కుతున్న అంధ విద్యార్థికి సూచనలు చేస్తున్న విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరంలోని పూల్ బాగ్ కాలనీలో ఉన్న ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలను ఎమ్మెల్యే అదితి గజపతిరాజు గురువారం సందర్శించారు. సదుపాయాలు, సమస్యలపై ఆరా తీశారు. అశోక్ గజపతి రాజు ముందు చూపుతో అయిదు ఎకరాల భూమి కేటాయించారన్నారు. ఇటీవల నిధులు మంజూరయ్యాయని, అభివృద్ధికి అన్నివిధాలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు కంప్యూటర్లను వాడి అలరించారు. అనంతరం ఎమ్మెల్యేతో కలిసి మొక్కలు నాటారు. ప్రిన్సిపల్ ఎం.మహేశ్వరరెడ్డి, ఎంఈఓ-2 పి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

వ్యర్థమే.. అక్కడ పరమార్థం

పట్టణాల్లో బయోమైనింగ్

న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

ఉమ్మడి జిల్లాలోని పుర, నగరపాలక, నగర పంచాయతీల్లో ఉండే డంపింగ్ యార్డులు ఒకప్పుడు చెత్త గుట్టలతో.. ప్లాస్టిక్ వ్యర్థాలతో.. పందుల సంచారంతో అపరిశుభ్రంగా ఉండేవి. ఇప్పుడా పరిస్థితిలో మార్పు వచ్చింది. బయోమైనింగ్ ప్రక్రియ చేపడుతున్నారు. చెత్తను ప్రాసెసింగ్ చేసి విభజిస్తున్నారు. చివరికి మట్టిగా మార్చుతున్నారు. బొబ్బిలి, రాజాం, పార్వతీపురం, పాలకొండలో ఇప్పటికే పూర్తికాగా.. విజయనగరం నగరపాలక సంస్థలో మూడో విడతలో పనులు జరుగుతున్నాయి. నాలుగో విడత టెండర్ల దశలో ఉంది. నెల్లిమర్ల, సాలూరులో ప్రారంభం కావాలి.

పనులు ఇలా.. ● స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా తరుణీ ఏజెన్సీ ఈ పనులు చేస్తోంది ● బొబ్బిలి, నెల్లిమర్ల, రాజాం, పార్వతీపురం, పాలకొండ, సాలూరుతో పాటు విశాఖ రీజియన్ పరిధిలోని మరికొన్ని ప్రాంతాల్లో ప్రక్రియ నిర్వహణకు రూ. 1.15 కోట్లతో ప్రతిపాదించారు
● బొబ్బిలిలో 14,711 మె.ట, రాజాంలో 12,849 మె. టన్నులను మట్టిగా మార్చారు
● పార్వతీపురంలో 14 వేలు, పాలకొండలో 7,500 టన్నుల మేర సేకరించారు
● సాలూరులో 10 వేల మె.టన్నుల వ్యర్థాలను ప్రాసెసింగ్ చేయాల్సి ఉంది
● నెల్లిమర్ల నుంచి 7,789 టన్నులను విజయనగరం తరలించాలని భావిస్తున్నారు.

విజయనగరంలో రూ.15 కోట్ల వ్యయంతో మొదట విడతలో 2,06,101 మెట్రిక్ టన్నుల చెత్తను బయో మైనింగ్ చేశారు. రెండో విడతలో రూ.2.42 కోట్లతో 30,600 మె.ట, మూడో విడత కింద రూ.2 కోట్లతో 28 వేల మె.ట చెత్తను ప్రాసెస్ చేస్తున్నారు.

మైదానంలా మారిన విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలోని గుణుపూరుపేట డంపింగ్ యార్డు

ఉపయోగాలివీ.. ● బయోమైనింగ్ ప్రక్రియతో కాలుష్యం తగ్గుతుంది ● అక్కడ పచ్చదనం పెంపునకు అవకాశం ఏర్పడుతుంది
● ప్రాసెసింగ్ అనంతరం వచ్చే మట్టిరూపంలోని వ్యర్థాన్ని మొక్కలకు ఎరువుగా వినియోగించవచ్చు. రోడ్ల నిర్మాణంలో ఉపయోగించవచ్చు.
● చుట్టుపక్కల ప్రాంతాల వారికి దుర్వాసన సమస్య ఉండదు

సకాలంలో పూర్తికి చర్యలు.. అన్నిచోట్లా డిసెంబరు నెలాఖరు లోపు ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. బొబ్బిలి, రాజాంలో పనులు పూర్తయ్యాయి. విజయనగరంలో ముగింపు దశకు వచ్చాయి. పాలకొండ యార్డు నుంచి వ్యర్థాలను శ్రీకాకుళం తరలిస్తున్నాం. - ఎస్.జ్యోతి, ఈఈ, ప్రజారోగ్య సాంకేతిక శాఖ

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	123	216	226

వ్యసనాలకు బానిసై వాహనాల చోరీ

పాలకొండ, న్యూస్‌టుడే: వ్యసనాలకు బానిసై చోరీలకు పాల్పడుతున్న యువకుడిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ రాంబాబు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటకు చెందిన టి.ప్రసాద్ పాలకొండలో ఉంటున్నాడు. మద్యం, ఇతర వ్యసనాలకు బానిసయ్యాడు. అవసరాలకు డబ్బు సరిపోకపోవడంతో వాహనాలను దొంగతనం చేసేవాడు. ఏలాం కూడలి వద్ద గురువారం వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులకు శ్రీకాకుళం వైపు నుంచి వస్తున్న ప్రసాద్ అనుమానాస్పదంగా కనిపించాడు. అదుపులోకి తీసుకుని విచారించగా.. నేరం ఒప్పుకొన్నాడు. అతడి నుంచి 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన సిబ్బంది రాజేష్, రమేష్‌కు నగదు బహుమతులు అందించారు. సీఐ ప్రసాదరావు, ఎస్సై ప్రయోగమూర్తి ఉన్నారు.

నాగావళి నదిలో పశువుల వ్యాపారి గల్లంతు

కురుపాం గ్రామీణం, కొమరాడ, న్యూస్‌టుడే: నాగావళి నది దాటుతూ ప్రవాహానికి చిక్కుకున్న ఓ వ్యక్తి గల్లంతైన ఘటన గురువారం కొమరాడ మండలంలోని చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం... కురుపాం మండలం బియ్యాలవలస గ్రామానికి చెందిన అన్నపురాయుడు(65) పశువుల క్రయవిక్రయాలు చేస్తుంటాడు. ఇందులో భాగంగా పార్వతీపురం సంతలో రెండు గేదెలను కొనుగోలు చేశాడు. తిరిగి వస్తుండగా కళ్లికోట- దళాయిపేట మధ్య నాగావళి నది దాటితే సులభంగా గ్రామానికి చేరుకోవచ్చని దిగాడు. ప్రవాహానికి కొట్టుకుపోయి అదృశ్యమయ్యాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై నీలకంఠం సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపడుతున్నారు.

PUBLIC NOTICE
IN THE COURT OF THE HON'BLE ADDITIONAL DISTRICT AND SESSIONS COURT:: AT MEDCHAL
FCOP. No. 206 Of 2025
Between:
Mr. Dasari Sai Aakash ... Petitioner
AND
Smt. Praveena Yandamuri ... Respondent
To
Smt. Praveena Yandamuri, W/o Dasari Sai Aakash, D/o Y. Malleswara Rao Aged about 30 years, Occ: House wife R/o. 101, Sai Nilayam. 4, Sai Nagar Rajam, Andhra Pradesh-532127
Cell: 7093327509
My Client Mr. Dasari Sai Aakash have filed the above FCOP No.206 of 2025 for annulment of marriage U/s 12 of HM Act on the file of the Hon'ble Addl. **District and Sessions Court at Medchal** and the Hon'ble Court was pleased to order for paper publication against you therefore, you are hereby advised to appear in this court in person or by a pleader duly instructed on the 09th day of **December, 2025 (09.12.2025) at 10-30 O'clock** in the forenoon, failing which the said matter will be heard ex-parte.
Smt. **Nagisetty Kalpana**, Advocate
Arella Abode, H. No. 8-3-228/265/A, Rahmath Nagar, Yousufguda, Hyderabad 500045,
Mobile No. **9703814689**

MAHARAJAH'S COLLEGE OF PHARMACY
(Approved by PCI, New Delhi & SBTET)
Phool Baugh, Vizianagaram-535 002
Ph: 08922-277255, Contact Mobile No's: 8121530528, 9912342138
E-Mail: principalmrcp@gmail.com, www.mrpharmacy.co.in
Admission Notification for 1st B. Pharmacy Under Category-B
NRI/Non-NRI Seats - AY 2025-26
Applications are invited from eligible candidates for admission into 1st Year B. Pharmacy under Category-B (NRI/Non-NRI) for the Academic Year 2025-26.

Course	Intake	"B" Category Seats
B.Pharmacy	100	30

Eligibility: Candidates should have passed the qualifying examination (Intermediate MPC/BIPC) with **not less than 50% marks** in the group subjects. Last date for submission of filled in applications to the college on or before **23.11.2025.** The Admissions shall be made as per the **guidelines of APSCHE.**
PRINCIPAL

సైనికా.. మళ్లీ రావాలి

యువ జవానుకు కన్నీటి వీడ్కోలు

చీపురుపల్లి, మెరకముడిదాం, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంపై విధులకు వెళ్తూ అసోంలో జరిగిన రహదారి ప్రమాదంలో మృతిచెందిన మెరకముడిదాం మండలం గొల్లలవలసకు చెందిన అడ్డూరి దుర్గాప్రసాద్ మృతదేహాన్ని గురువారం స్వగ్రామం తీసుకొచ్చారు. చీపురుపల్లి నుంచి స్వగ్రామం వరకు అంతిమ యాత్ర నిర్వహించారు. యువత అధిక సంఖ్యలో హాజరై జాతీయ జెండాలతో భారీ ర్యాలీ చేపట్టారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అందొచ్చిన కుమారుడి మృతితో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. ఆర్మీ అధికారులు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఎమ్మెల్యే కళా వెంకటరావు తదితరులు నివాళులర్పించారు.

అంతిమ యాత్రలో పాల్గొన్న యువత

మృతదేహాన్ని తీసుకొస్తున్న ఆర్మీ అధికారులు

ప్రాంతాలవారీగా లబ్ధిపొందని వారు..

మండలం	విద్యార్థులు
విజయనగరం	137
భోగాపురం	22
బొబ్బిలి	43
బొండపల్లి	22
చీపురుపల్లి	24
దత్తిరాజేరు	22
డెంకాడ	29
గజపతినగరం	24
గంట్యాడ	36
గరివిడి	23
కొత్తవలస	45
ఎల్.కోట	26
మెంటాడ	22
నెల్లిమర్ల	30
పూసపాటిరేగ	28
రేగిడి	34
రాజాం	60
సంతకవిటి	23
ఎస్.కోట	21
తెర్లాం	26
వేపాడ	28

నమోదులో నిర్లక్ష్యం.. పథకానికి దూరం

కలెక్టరేట్ వద్ద వినతిపత్రాలు చూపుతున్న రెల్లివలస గ్రామస్థులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: విజయనగరం జిల్లాలోని కొన్ని పాఠశాలల విద్యార్థుల వివరాలను నమోదు చేయకపోవడంతో తల్లికి వందనం పథకానికి దూరం కావాల్సి వచ్చింది. ఇలాంటి వారు 814 మంది ఉన్నట్లు గుర్తించారు. ఆరు దశల పరిశీలనలో భాగంగా అనర్హులైన వారికి వీరంతా అదనం. సచివాలయాలు, విద్యాలయాల మధ్య సమన్వయ లోపంతో ఈ పరిస్థితి ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు. వీరిలో ప్రభుత్వంతో పాటు ప్రైవేటు పాఠశాలల పిల్లలూ ఉన్నారు. ప్రవేశాలు పొందిన వారి వివరాలను పాఠశాల లాగిన్‌లో నమోదు చేయాలి. పేరు, తల్లిదండ్రుల పేర్లు, ఆధార్, తరగతి తప్పనిసరి. సిబ్బంది ఈప్రక్రియను సక్రమంగా నిర్వహించకపోవడంతో డేటా పోర్టల్‌లో అందుబాటులోకి రాలేదని తెలుస్తోంది.

అర్బన్‌లోనే ఎక్కువ.. ఎక్కువగా పట్టణాల పరిధిలో ఉండిపోయారు. ఈవిషయంలో విజయనగరం నియోజకవర్గం తొలిస్థానంలో ఉంది. రాజాం, బొబ్బిలి, నెల్లిమర్ల నగర పంచాయతీల్లోనూ అనర్హులున్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని జిల్లా సచివాలయాల అధికారిణి ఎస్.రోజారాణి తెలిపారు. పాఠశాలల డేటా లాగిన్ నుంచి తల్లికి వందనం పోర్టల్‌లోకి వస్తే కానీ ఏమీ చేయలేమన్నారు. జిల్లాలో 17,685 మంది గ్రీవెన్స్‌లో దరఖాస్తులు చేసుకోగా, అర్హతున్న వారిలో 12,105 మందికి డబ్బులు జమయ్యాయి. 1148 మందిని అనర్హులుగా గుర్తించారు. మిగిలిన వారికి త్వరలో నగదు అందనుందని రోజారాణి వెల్లడించారు.

22న ఉద్యోగ మేళా

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: విజయనగరంలోని మహారాజా ఫార్మసీ కళాశాలలో ఈనెల 22న విశాఖకు చెందిన ఫైజర్ ఫార్మా హెల్త్ కేర్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ప్రధానాచార్యుడు ఎం.రామయ్య ఓ ప్రకటనలో తెలిపారు. 2024, 2025 సంవత్సరాల్లో డీఫార్మసీ కోర్సును పూర్తిచేసినవారు అర్హులన్నారు. ఆసక్తి గలవారు దరఖాస్తు, విద్యార్హత ధ్రువపత్రాల నకళ్లు, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరుకావాలన్నారు.

డ్రైవింగ్ స్కూళ్లపై చర్యలు

నేరవార్తా విభాగం: జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న రెండు డ్రైవింగ్ స్కూళ్లపై చర్యలు తీసుకున్నట్లు రవాణాశాఖ ఉప కమిషనర్ మణికుమార్ తెలిపారు. ఒక కేంద్రం లైసెన్సును రద్దు చేశామని, మరోదాన్ని సరెండర్ చేశామన్నారు. త్వరలో అన్ని డ్రైవింగ్ స్కూళ్లను తనిఖీ చేసి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు.

EENADU Classifieds

REAL ESTATE

LAND FOR SALE
10 Acre Land for Sale- Near Jeypore- Vizianagaram Road (Panasalapadu Road) 500 M from Main Highway. ✆ 9652661542.

PLOT FOR SALE
Global IT Economy Future City Bhogapuram. VMRDA & RERA Approved Open Plots for sale. Cont: 8639765271.

OPEN PLOTS FOR SALE
● Google Data Center కి అతి దగ్గరలో
● నీలకుండీల జంక్షన్, కొండ్రాం
● GVMC పరిధిలో VMRDA/RERA అప్రూవ్
● తక్షణ ఇంటి నిర్మాణం ● 167-400 Sqyds
● బ్యాంకు లోన్ సదుపాయం కలదు.
SUBHAGRUHA Infrastructures Private Limited
అందమైన ఊహకు... పొందికైన రూపం.
Call: 9502230091

JOBS
Vision buzz కంపెనీలో డోర్ టూ డోర్ మార్కెటింగ్ చేయడానికి యువతి యువకులు స్టాఫ్ కావలెను. డైలీ Payment ఇవ్వబడును. ✆ 9550109729.

SECURITY GUARDS
కాకినాడ ఏరియాలో ఒంటిమామిడి ప్రాంతం ప్రముఖ కంపెనీలో సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మంచి జీతం భోజనం+ వసతి కలదు. డ్యూటీ: 8 గం॥ జీతం: 18,500/- 26 రో॥ ✆ 8374164245, 7893197794.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

మన్యం జీడికి మరిన్ని ఆర్డర్లు

జీడి పప్పు ప్యాకెట్లు తయారు చేస్తున్న సిబ్బంది

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రంలోని మార్కెట్ యార్డులో తయారవుతున్న మన్యం జీడిపప్పుకు డిమాండు పెరుగుతోంది. ఆగస్టులో సరకు తయారీ చేపట్టారు. ఇప్పటి వరకు రూ.12 లక్షలకుపైగా సరకు విక్రయాలు సాగినట్లు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలకు మన్యం జీడిపప్పు సరఫరాకు అనుమతులు వచ్చాక విక్రయాలు ఊపందుకున్నాయి. విశాఖ, విజయవాడ, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాలతోపాటు జిల్లాలోని పలు మండలాల నుంచి కొనుగోలుదారులు వచ్చి సరకు తీసుకెళ్తున్నారు. 20 మంది వరకు జీడి ప్రాసెసింగ్ యూనిట్‌లో పనిచేస్తున్నారు. ప్రస్తుతం ప్రతి రోజు ఆర్డర్లు వస్తుండడంతో సిబ్బందికి చేతి నిండా పని ఉంటోంది. మరింతగా విక్రయాలు పెరిగే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

బలిజిపేట, గరుగుబిల్లి, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, సాలూరు, పాచిపెంట, పాలకొండ గ్రామీణం, సీతంపేట: బలిజిపేట శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు లైబ్రేరియన్ బి.రాజారావు బహుమతులు ఇచ్చారు. గరుగుబిల్లి ఎంపీడీవో జి.పైడితల్లి,

సాలూరులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో, హెచ్ఎం

సీతంపేటలో బహుమతులతో విద్యార్థులు

జియ్యమ్మవలసలో జిల్లా గ్రంథాలయ అధ్యక్షుడు శివకేశవరావు, సాలూరులో ఎంఈవో వెంకటరావు, పాచిపెంటలో ఎంపీపీ ప్రమీల, పాలకొండలో కళాశాల ప్రిన్సిపల్ శ్యాంబాబ్, సీతంపేటలో గ్రంథాలయాధికారి బి.గణేష్‌బాబు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు ఇచ్చారు.

పోలిపాడ్యమి వేడుకలకు ఏర్పాట్లు

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: తోటపల్లి వేంకటేశ్వర కోదండ రామాలయం దేవస్థానంలో పోలి పాడ్యమి ఉత్సవాల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. బారికేడ్లు, నాగావళి నదిఒడ్డున విద్యుత్తు దీపాలు, స్నానాల గదులు ఏర్పాటుచేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆలయం ఈవో శ్రీనివాసరావు తెలిపారు. గరుగుబిల్లి, పార్వతీపురం నుంచి పోలీసు సిబ్బంది భద్రత నిమిత్తం వచ్చారు.

నమో లక్ష్మీనరసింహ

సీతానగరం వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీనరసింహునికి గురువారం ముడుపుల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసాచార్యులు, రామానుజాచార్యులు ఆధ్వర్యంలో మూల విరాట్‌ను పూలమాలలు, ఆభరణాలతో అలంకరించారు. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, సీతానగరం

సత్యసాయి తిరువీధి ప్రదర్శన

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి భక్తులు మహానగర సంకీర్తన నిర్వహించారు. కోలాటం, తప్పెటగుళ్ల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

పక్కాగా ఆరోగ్య సర్వే

బాలగుడబలో దస్త్రాలు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న ఆరోగ్య సర్వేల వివరాలు పక్కాగా నమోదు చేయాలని జిల్లా ఎన్సీడీ పీడీ జగన్మోహనరావు సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని బాలగుడబ ఉప వైద్యఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో సర్వే దస్త్రాలు పరిశీలించారు. వివరాలు ఎలా నమోదు చేయాలో సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామంలో పరిసరాల శుభ్రతను పరిశీలించారు. ఆయన వెంట మలేరియా నివారణ అధికారి పాల్గొన్నారు.

అందరి ఆరోగ్యమే లక్ష్యం

శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టరు ప్రభాకర రెడ్డి

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రజలందరి ఆరోగ్యమే లక్ష్యంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు కలెక్టరు ప్రభాకర రెడ్డి అన్నారు. గురువారం జిల్లా ఆసుపత్రి వద్ద ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగులు, విలేకర్లు, వివిధ వర్గాల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హాజరైన వారికి ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్(అభా) సంఖ్యను కేటాయిస్తామన్నారు. శిబిరంలో వివిధ విభాగాల వైద్యులు పరీక్షలు నిర్వహించారు. 216 మందికి అభా నమోదు చేసినట్లు డీసీహెచ్ఎస్ జి.నాగభూషణరావు, ఆసుపత్రి పర్యవేక్షకులు నాగశివజ్యోతి తెలిపారు.

ఆకస్మికంగా తనిఖీలు

కురుపాం గ్రామీణం: కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వై.నాగేశ్వరరావు గురువారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. కళాశాలలో నిర్వహిస్తున్న అర సంవత్సర పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రిన్సిపల్ కుమారస్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అద్భుత ప్రదర్శన... అందలానికి నిచ్చెన

మైదానంలో దిగితే పతకాల వేటే లక్ష్యం

భామిని, న్యూస్‌టుడే

గ్రామీణ ప్రాంత విద్యార్థులైనా చదువుతోపాటు ఆటల్లోనూ నైపుణ్యం కనబరుస్తున్నారు. ఏ రంగం అయినా విజయాలు మావే అంటున్నారు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన పోటీల్లో రాణించి రాష్ట్ర స్థాయికి ఎంపికై పుట్టిన ఊరు, చదువుతున్న పాఠశాల, తల్లిదండ్రులకు పేరు తెస్తున్నారు. ప్రోత్సహిస్తే మరిన్ని పతకాలు సాధిస్తామని భామిని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎస్‌జీఎఫ్ సెలక్షన్‌లో కబడ్డీకి ఇద్దరు, బాక్సింగ్‌కి 8 మంది రాష్ట్రస్థాయిలో పాల్గొన్నారు. ఉషూలో 10 మంది ఆడగా రెండు స్వర్ణాలు, 2 రజతాలు, 6 కాంస్య పతకాలు సాధించారు. హాకీలో ఆరుగురు, స్విమ్మింగ్‌లో ఒకరు సత్తా చాటారు.

ఐపీఎస్ అవ్వాలనేదే లక్ష్యం

రాష్ట్ర స్థాయిలో జరిగే కబడ్డీ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచి అందరి అభినందనలు పొందడం చాలా ఆనందంగా ఉంది. క్రీడలతో పాటు చదువులోనూ ప్రతిభ కనబర్చి ఐపీఎస్‌గా ఉద్యోగం చేయాలనేది నా లక్ష్యం. దాని కోసం ఇప్పటి నుంచే ప్రణాళికతో చదువుతున్నాను.

-బి. భావన, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం

ఫిజికల్ డైరెక్టర్ అవుతా

జమ్మూ కశ్మీర్‌లో జరిగిన జాతీయ స్థాయి ఉషూ క్రీడలో పాల్గొనడమే చాలా పెద్ద విషయం అనుకున్నాను. అలాంటిది దానిలో ద్వితీయ స్థానం కైవసం చేసుకోవడం నాలో ఆత్మ విశ్వాసాన్ని మరింత రెట్టింపు చేసింది. చదువు పూర్తయిన తర్వాత ఫిజికల్ డైరెక్టర్‌గా చేరాలనేది నా లక్ష్యం.

- పి.స్రవంతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం

భారత సాయుధ బలగాల్లో ఉద్యోగం సాధించాలి

క్రీడలపై ఉన్న మక్కువతో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపి జాతీయ స్థాయి ఉషూ క్రీడల్లో పాల్గొని ప్రథమ స్థానం దక్కించుకున్నాను. భవిష్యత్తులో మరింత ప్రతిభ కనబరిచి భారత సాయుధ బలగాల్లో మంచి ఉద్యోగం సాధించేందుకు కష్టపడుతున్నాను.

- జి.ఆదిత్య, ఇంటర్ మొదటి సంవత్సరం

ఆర్మీలో కొలువే ధ్యేయం

ఇటీవల జాతీయ స్థాయిలో జరిగిన బాక్సింగ్ క్రీడలో మొదటి స్థానం కైవసం చేసుకోవడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. మొదట ఆర్మీలో కొలువు సాధించి తర్వాత ఇండియా తరుపున బాక్సింగ్ ఆడాలనేదే నా కల. - ఎన్.శాంతికుమారి, పదో తరగతి

నేవీలో చేరాలనేది నా కల

జాతీయ స్థాయి ఉషూ క్రీడల్లో ప్రతిభ కనబర్చి రజతం సాధించాను. నేవీలో ఉద్యోగం సాధించడం, ఈ క్రీడలో మరింత ప్రతిభ చూపి ఇండియా తరపున ఆడాలనేదే నా లక్ష్యం.

-డి.చందు, ఇంటర్ మొదటి సంవత్సరం

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

? నర్సిపురం పరిధిలో కనుమల చెరువు మదుములో నీరువెళ్లే మార్గం.. మొక్కలు, రాళ్లతో నిండిపోయింది. పలుమార్లు అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదు. - **రామయ్య** ★ పరిస్థితి క్షేత్రస్థాయిలో పరిశీలించి, చర్యలు తీసుకుంటాం. - **అన్సార్ వలీ, ఏఈ** – న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

? బుడ్డిపేట ఆంజనేయ ఆలయం నుంచి మదర్ థెరిసా విగ్రహం వరకు వరద నీరు రహదారిపై ప్రవహిస్తోంది. - **వెంకటరమణ** ★ పక్కా కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. - **సురేష్, ఈవో** – న్యూస్‌టుడే, సీతానగరం

? పాలకొండ వడమ రహదారిలో పైపు పగిలి రక్షితనీరు వృథా అవుతోంది. **-రమేష్, వ్యాపారి** ★ మరమ్మతులు చేసి వృథాను అరికడతాం. **-దేవీవరప్రసాద్, ఏఈ** –న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

? మొండెంఖల్లు గ్రామంలో వీధి కాలువలు పూడికతో నిండిపోయాయి. - **శివ** ★ పరిశీలించి, చర్యలు తీసుకుంటాం. **-గౌరీశంకరరావు, సర్పంచి** – కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే

కర్రల పొయ్యిపై పడిన మహిళకు తీవ్ర గాయాలు

కొమరాడ: కర్రల పొయ్యిపై పడి మహిళకు తీవ్రగాయాలైన ఘటన గురువారం చోటుచేసుకుంది. కూనేరు రామభద్రపురానికి చెందిన మండంగి పార్వతి అంటువ్యాధితో ఉంటున్న కన్నవారింటికి వెళ్లింది. ఉదయం కర్రల పొయ్యి వద్ద వంట చేస్తుండగా, అదుపుతప్పి అందులో పడిపోయింది. కేకలు వేయడంతో స్థానికులు పరుగున వచ్చి మంటలు ఆర్పారు. వెంటనే జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఎస్సై నీలకంఠం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై దాడి: యువకులపై కేసు

పార్వతీపురం పురపాలక: పట్టణంలోని ఎస్పీ కార్యాలయం(కొత్తవీధి) శ్రీనాథస్వామి ఆలయ సమీపంలో గురువారం ఇద్దరు యువకులు దాడిచేసినట్లు మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. బాధితురాలు లక్ష్మి ఇంటిని నిర్మించుకుంటున్నారు. ఈ నిర్మాణ విషయంలో ఇరువురు గొడవపడి తనతోపాటు భర్తని కొట్టినట్లు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై జగదీష్ నాయుడు తెలిపారు.

నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

వీరఘట్టం: నాటుసారా తరలిస్తుండగా వీరఘట్టం రెల్లివీధి సమీపంలో గురువారం ఒక వ్యక్తిని పట్టుకొని కేసు నమోదు చేశామని ఎస్సై జి.కళాధర్ తెలిపారు. అతని వద్ద నుంచి 15 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

ఇంటి దొంగ అరెస్టు

పాలకొండ: పట్టణంలో వాండ్రంకి వీధికి చెందిన ఎస్.సాయికృష్ణ సమీప బంధువుల ఇంట్లో చోరీకి పాల్పడడంతో అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితున్ని గుర్తించామన్నారు. అతని నుంచి పావుతక్కువ మూడు తులాల బంగారాన్ని రికవరీ చేసినట్లు తెలిపారు. హైమావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

సీతంపేట: మండలంలోని ఎగువ దరబ అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ కేంద్రాలపై గురువారం దాడులు నిర్వహించినట్లు ఎస్సై వై.అమ్మనరావు తెలిపారు. 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. నాటుసారా తయారీ, విక్రయాలు చేస్తే చర్యలు తప్పవన్నారు. శిక్షణ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

సీతానగరం, న్యూస్‌టుడే: మండలంలోని చెల్లంనాయుడువలస గ్రామానికి చెందిన కె.శ్రీనివాసరావు ఇంట్లో 133 బస్తాలు(40 కిలోలు) పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ చేయడాన్ని గుర్తించినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. 5,320 కిలోల బియ్యాన్ని, ఆయన్ను తహసీల్దారు ప్రసన్నకుమార్ ముందు హాజరుపర్చినట్లు ఎస్ఐ చెప్పారు.

వానతో.. వణుకు..

సాలూరు, న్యూస్‌టుడే: వాతావరణంలో మార్పులతో అన్నదాతల్లో వణుకు పుడుతోంది. ఆరుగాలం కష్టించి పండించిన వరి పంట చేతికి వచ్చింది. విక్రయించే సమయంలో వానలు కురిస్తే పంట తడిచిపోతుందని తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎండగా ఉండడంతో గురువారం ఉదయం తేమశాతం తగ్గించేందుకు పట్టణ ప్రత్యామ్నాయదారిపై రైతులు ధాన్యం ఆరబోశారు. మధ్యాహ్నం మబ్బులు రావడంతో ధాన్యం తడవకుండా ఉండేందుకు కర్షకులు హుటాహుటిన పరదాలు కప్పారు.

ఆరబోసిన ధాన్యంపై పరదాలు కప్పుతున్న రైతులు

చేతికందే ఎత్తులో.. ప్రమాదం

మక్కువ, న్యూస్‌టుడే: మండలంలోని సరేయవలస గ్రామంలోని విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. గ్రామ ప్రధాన వీధిలో ఈ మధ్య కాలంలో సింగిల్ ఫేజ్ నియంత్రిక అమర్చారు. ఫ్యూజ్‌లు చేతికందే ఎత్తులో ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనిపై జేఎల్ఎం వాసు వద్ద ప్రస్తావించగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని అన్నారు.

నమ్మండి.. ఇది వంట షెడ్డు

ఈ చిత్రంలో కనిపిస్తున్న తడికలు, రేకులతో ఉన్న షెడ్డు పశువుల శాల అనుకుంటే పొరపాటే. జియ్యమ్మవలసలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల వంట షెడ్డు. ఈ పాఠశాలలో 81 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ సరిపడా గదుల్లేక ఇలా రేకుల షెడ్డులో విద్యార్థులకు భోజనాలు వండిపెడుతున్నారు. గతంలో భవనానికి ప్రతిపాదనలు చేసినా మంజూరు కాకపోవడంతో ఇలా కాలం వెళ్లదీస్తున్నారు. ఈ విషయమై గిరిజన సంక్షేమశాఖ ఏఈ రమేష్ వద్ద ప్రస్తావించగా, నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు. – న్యూస్‌టుడే, జియ్యమ్మవలస

కల్వర్టుకు మోక్షమెన్నడో..!

కురుపాం మండలం బియ్యాలవలస గ్రామంలో మురుగు కాలువలపై ఉన్న కాంక్రీట్ పలకలు పగిలిపోయి ప్రమాదకరంగా మారింది. పలువురు ఇక్కడ పడిపోతున్నారు. రాత్రివేళల్లో వృద్ధులు, వాహనచోదకులు, చిన్నారులు పడిపోతున్నారు. తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాగుచేయాలని పాలకులు, అధికారులను కోరుతున్నా స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. పరిశీలించి, సమస్యను పరిష్కరిస్తామని పంచాయతీ కార్యదర్శి వెంకటనాయుడు తెలిపారు. – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

క్షేత్రస్థాయిలో పథకాలపై ఆరా

భామిని, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులైన ప్రతి ఒక్కరికి కేంద్ర పథకాలు అందుతున్నాయా లేదా వంటి అంశాలపై డిప్యూటీ సెక్రటరీ జాస్బిత్ సింగ్ (డిపార్టుమెంట్ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్) గిరిజనులను అడిగి తెలుసుకున్నారు. గురువారం మండలంలోని మనుమకొండ గిరిజన గ్రామంలో పర్యటించారు. నీతిఆయోగ్ జాబితాలో ఉన్న ఈ గ్రామంలో అభివృద్ధిచేసేందుకు అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. సర్పంచి కేశవ, రైతులతో మాట్లాడారు.

గిరిజనులతో మాట్లాడుతున్న జాస్బిత్ సింగ్

150 మందికి ఉచిత వైద్యపరీక్షలు

సాలూరు: సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు చేశారు. 150 మందికి రక్తపరీక్షలు నిర్వహించారు. సమితి కన్వీనర్ రాజకుమార్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ

పాలకొండ: పుట్టపర్తి సత్యసాయి శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో పాలకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో, ప్రాంతీయాసుపత్రిలో 75 మంది రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆసుపత్రి పర్యవేక్షకుడు డా.చిరంజీవి, భక్తులు పాల్గొన్నారు.

వ్యాధిని అప్రమత్తతో పారదోలాలి

బలిజిపేట, బలిజిపేట గ్రామీణం: కుష్ఠువ్యాధిని పూర్తిగా సమాజం నుంచి పారదోలేందుకు అంతా అప్రమత్తంగా ఉండాలని, శరీరంపై ఎలాంటి అనుమానిత మచ్చలున్నా వెంటనే వైద్యులను సంప్రదించాలని బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి కిరణ్మయి తెలిపారు. నారాయణపురంలో ఇంటింటా తిరిగి పరీక్షించారు.

పూర్వవిద్యార్థికి ఆర్థికసాయం

బలిజిపేట: వెంగాపురం శ్రీభారతి పాఠశాలలో 2014-15లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థి అక్కుపోలు శివ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకొన్న ఉపాధ్యాయులు, యాజమాన్యం చందాలు వేసుకుని రూ.26,500 సాయం అందించారు.

రూ.50లక్షల బీమా చెక్కు అందజేత

బలిజిపేట, బలిజిపేట గ్రామీణం: మండలంలోని నారాయణపురానికి చెందిన మండల శ్రీనివాసరావు రైల్వేశాఖలో సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీసు ఉద్యోగం చేసి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కుటుంబానికి రూ.50లక్షల బీమా చెక్కును ఆర్ఎం భూషణ్‌షాహో, సీఎం విజయకుమార్, సీవీసీ మేనేజరు ఖాదీర్ షరీఫ్, బీఎం కె.విజయ్‌బాబు చేతులమీదుగా అందజేశారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

సాలూరు గ్రామీణం: దళారులను నమ్మి మోసపోవద్దని జీసీసీ సేల్స్‌మేన్‌లు రమేశ్, మహేష్ తెలిపారు. కొఠియా వివాదస్పద గ్రామాల్లో ఎగువశెంబిలో, కురుకుట్టి పంచాయతీ బట్టివలసలో అవగాహన సదస్సులను నిర్వహించారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కలెక్టరేట్ ప్రాంగణం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.గౌరీశ్వరరావు, ఆర్.రాము కోరారు. కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. జిల్లాలో 15వేల మంది ఈ రంగంపై ఆధారపడి ఉన్నారని వెల్లడించారు. సిటు అధ్యక్ష కార్యదర్శులు రమణారావు, మన్మథరావు పాల్గొన్నారు.

దుకాణాలు వేలం వేయాలి

సాలూరు: పెద్దబజారులో దుకాణాలు వేలం వేయకుండా అధికారులు వ్యాపారులతో లాలూచి పడుతున్నారని, చర్యలు చేపట్టి, రిజర్వేషన్ పద్ధతిలో కేటాయించాలని కోరుతూ సీఎం, ఉప ముఖ్యమంత్రి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాశరావు తెలిపారు. జనసేన నేత మహేష్‌తో కలిసి విలేకర్లతో మాట్లాడారు.

స్వచ్ఛతే లక్ష్యంగా.. పరిశుభ్రతే ప్రాధాన్యంగా

న్యూస్‌టుడే, జియ్యమ్మవలస

పరిశుభ్రమైన పరిసరాలు, పారిశుద్ధ్యం లేని గ్రామాలే లక్ష్యంగా ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలకు గత ప్రభుత్వ హయాంలో నెలకొన్న నిర్లక్ష్యం తూట్లు పొడిచాయి. గ్రామీణ వాతావరణానికి, ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీశాయి. కూటమి ప్రభుత్వం మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణే ధ్యేయంగా ముందుగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించింది. దీంతో జిల్లా అధికారులు పారిశుద్ధ్యంపై ప్రణాళికలు వేస్తున్నారు.

చినమేరంగిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

జిల్లాలో ఇదీ పరిస్థితి...	
మండలాలు:	15
పంచాయతీలు:	451
చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు:	257
ప్రస్తుతం నిర్వహణలో ఉన్నవి:	250

మన్యం జిల్లాలోని గ్రామాల్లో పారిశుద్ధ్యం చేపట్టి చెత్త, వ్యర్థాలను చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తున్నారు. స్వచ్ఛత దిశగా ముందడుగు వేస్తున్నారు. ప్రస్తుతం మంచినీరు, పారిశుద్ధ్యం కోసం జిల్లాలో రూ.29.88 కోట్లు వెచ్చించేందుకు అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే దీనికి సంబంధించి అన్ని మండలాల్లో సర్పంచులు, ఉప సర్పంచులు, మహిళా సంఘాల సభ్యులకు, గ్రీన్ అంబాసిడర్స్‌కు శిక్షణ ఇస్తున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ పేరిట కేంద్ర బృందాలు పలు గ్రామాల్లో పర్యటించి, వివరాలు సేకరించాయి. కేంద్రాలు, ఘన వ్యర్థాల నిర్వహణ, బహిరంగ మలవిసర్జన లేని స్వచ్ఛ పంచాయతీలను గుర్తించనున్నారు.

పల్లెల శుభ్రతే..

జిల్లాలో అన్ని పల్లెలు స్వచ్ఛంగా పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాం. ఇందులో భాగంగా ప్రతి రోజూ పంచాయతీల్లో శుభ్రత నిర్వహణపై తనిఖీలు చేపడుతున్నాం. గ్రామాల్లో చెత్త లేకుండా చూడాలి, తాగునీటి ట్యాంకులు శుభ్రం, క్లోరినేషన్ చేయాలి. దీనికి సంబంధించి మండల అధికారులకు ఇప్పటికే ఆదేశాలిచ్చాం.

- టి.కొండలరావు, జిల్లా పంచాయతీ అధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

భామిని: భామిని, గురండి ఫీడర్ పరిధిలోని పలు గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆశాఖ ఏఈ శ్రీనివాసరావు ప్రకటనలో పేర్కొన్నారు.

వీరఘట్టం: వీరఘట్టం ఉపకేంద్రం పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈఈ కె.విష్ణుమూర్తి ఆదేశాల మేరకు విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ సోమేశ్వరరావు తెలిపారు.

అంగన్‌వాడీల బలోపేతానికి చర్యలు

పార్వతీపురం గ్రామీణం/సీతానగరం: నియోజకవర్గంలో అంగన్‌వాడీల వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే బి.విజయచంద్ర అన్నారు. గురువారం పెదమరికిలో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు ప్రారంభించి మాట్లాడారు. మండలానికి ప్రత్యేక కోటాలో నాలుగు కేంద్రాలు మంజూరు చేసినట్లు చెప్పారు. సీడీపీవో, సర్పంచి గంగమ్మ, గుంపస్వామి పాల్గొన్నారు సీతానగరం, మండల ఆటోచోదకులు పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలు వినిపించారు. సీతానగరంలో లక్ష్మీనరసింహ ఆలయం, చాకరాపల్లి అజ్జాడ కూడళ్ల వద్ద ఇతర ఆటోలు నిలపనీయడం లేదని వాపోయారు.


అంగన్‌వాడీ భవనం పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్లాస్టిక్ రహిత పట్టణమే ధ్యేయం

సాలూరు, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ రహిత పట్టణమే ధ్యేయంగా పారిశుద్ధ్య అధికారులు, సిబ్బంది పనిచేసి, ప్రజలకు పాలిథిన్ నిషేధంపై అవగాహన కల్పించాలని పుర కమిషనర్ రత్నకుమార్ అన్నారు. గురువారం పుర కౌన్సిల్ హాలులో పారిశుద్ధ్య నిర్వహణపై నాలెడ్జ్ పార్టనర్ ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సంస్థ శిక్షణ ఇచ్చింది. అధికారులు, సిబ్బందికి స్టీల్ సీసాలను పంపిణీ చేశారు. పూర్వవైభవం తీసుకొస్తామని కమిషనర్ అన్నారు. ఆర్పీ వెంకటేశ్వరరావు, జిల్లా సమన్వయకర్త గణపతమ్మ, ఎస్సై బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై శిక్షణ ఇస్తున్న వెంకటేశ్వరరావు

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

వినతిపత్రం అందజేస్తున్న జి.ఈశ్వరరావు

కురుపాం గ్రామీణం, పార్వతీపురం గ్రామీణం: రాష్ట్ర వీఆర్ఏల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.ఈశ్వరరావు కోరారు. గురువారం కురుపాం తహసీల్దారు కె.జయకు వినతిపత్రం అందజేశారు. పేస్కేల్, అర్హత ఉన్న వారికి ఉద్యోగోన్నతులు ఇవ్వాలని డిమాండు చేశారు. పార్వతీపురం తహసీల్దారు కార్యాలయం వద్ద సీఐటీయూ జిల్లా కోశాధికారి రమణ ఆధ్వర్యంలో వీఆర్వేలు నిరసన తెలిపారు. అనంతరం ఉప తహసీల్దారు రత్నకుమారికి వినతిపత్రాన్ని అందించారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

కురుపాం గ్రామీణం, పార్వతీపురం పట్టణం: అల్లూరి సీతారామరాజు జిల్లాలో మావోయిస్టుల కాల్పుల నేపథ్యంలో గురువారం కురుపాంలో పలు కూడళ్లలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వారపుసంతలో డ్రోన్ ద్వారా తనిఖీలు చేపట్టారు. పార్వతీపురం పట్టణంలోని ప్రధాన కూడళ్లు, రైల్వేస్టేషన్లు, కాంప్లెక్సు ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేశారు.

ఎలాంటి తప్పులూ దొర్లకుండా రీ సర్వే

గజిలిలో రీ సర్వేను పరిశీలిస్తున్న శ్రీనివాసులు రెడ్డి

సీతంపేట, న్యూస్‌టుడే: ఎలాంటి తప్పులు దొర్లకుండా పక్కాగా రీ సర్వే ప్రక్రియ నిర్వహించాలని సెంట్రల్ సర్వే కార్యాలయం(మంగళగిరి) డిప్యూటీ డైరెక్టర్ టి.శ్రీనివాసులు రెడ్డి అన్నారు. సీతంపేట మండలం గజిలిలో నిర్వహిస్తున్న రీ సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. భూ తగాదాలకు ఆస్కారం లేకుండా గ్రామసభలు పెట్టి సర్వే చేపట్టాలన్నారు. రీ సర్వే తర్వాత తప్పులు చోటు చేసుకున్నాయంటూ ఎవరూ కార్యాలయానికి రాకూడదన్నారు. డీఎస్ఎల్‌వో పి.లక్ష్మణరావు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ కె.శ్రీవిద్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలన

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ ఇందిరానగర్‌లోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను గురువారం రాత్రి సబ్‌కలెక్టర్, ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాల పరిసరాలు పరిశీలించి మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండడంతో శుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. నగర పంచాయతీ సిబ్బందితో పాఠశాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడతామన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

(c) eenadu

పక్కాగృహాలకు దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగింపు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: పీఎంఏవై పథకం కింద కొత్తగా పక్కాగృహాల మంజూరు నిమిత్తం దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా గృహనిర్మాణశాఖ అధికారి పి.శ్రీనివాసప్రసాద్ తెలిపారు. సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునేందుకు ఆసక్తి గల లబ్ధిదారులు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. దరఖాస్తులను స్థానిక సచివాలయంలో ఇంజినీరింగ్ సహాయకుడు లేదా పంచాయతీ కార్యదర్శికి అందజేయాలని ఆయన సూచించారు.

చినుకు పడితే ఛిద్రమే

చిత్రంలో కనిపిస్తోంది ఒంగోలు-చీరాల రహదారి. దీనిని చదలవాడ వద్ద చెరువు మధ్యలో నుంచి నిర్మించడంతో వర్షాలు కురిసినప్పుడల్లా చెరువు తెగిపోతూ రహదారితో పాటు పక్కనున్న డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతింటోంది. ఇటీవల మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు చెరువు తెగిపోయి వరదనీరు ఉద్ధృతంగా ప్రవహించడంతో రహదారి అంచులు, డ్రైనేజీ కాలువలు, స్తంభాలు, బోర్డులు ధ్వంసమయ్యాయి. ఇది జరిగి మూడు వారాలైనా అధికారులు బాగుచేయకుండా అలాగే వదిలేశారు. ప్రమాదకరంగా మారిన అంచుల పక్క నుంచే వాహనాల రాకపోకలు సాగుతున్నాయి.

-ఈనాడు, ఒంగోలు న్యూస్‌టుడే, నాగులుప్పలపాడు

గుంత కనిపిస్తే చూస్తూ ఊరుకోరు

రెండేళ్లలో 600 పూడ్చిన విశ్రాంత ఉపాధ్యాయుడు కిచ్చారెడ్డి

చిత్రంలో కనిపిస్తున్న ఈయన పేరు పాపసాని కిచ్చారెడ్డి. ఈయనది కనిగిరి పట్టణంలోని కొత్తపేట. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందారు. రహదారిపై గుంత కనిపిస్తే చాలు అస్సలు ఊరుకోరు. వెంటనే సిమెంటు, ఇసుక, కంకర తీసుకెళ్లి గుంతను పూడ్చేస్తారు. పది మందికి ఉపయోగపడేవిధంగా 68 ఏళ్ల వయసులో తన సొంత నిధులతో రహదారిపై గుంతలు పూడ్చే పని నేటికీ కొనసాగిస్తున్నారు. ఇలా గత రెండేళ్లలో 600కుపైగా గుంతలు పూడ్చారు. ఇందుకు తన పింఛనులో ప్రతినెలా రూ.4 వేలు వరకు వెచ్చిస్తున్నారు. 'రహదారులపై పడిన గుంతలతో చాలామంది ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. నాకు బేల్దారి పని తెలుసు ప్రమాదాలు జరగకుండా గుంతలు పూడుస్తుండడం ఆ భగవంతుడు నాకు కల్పించిన అవకాశంగా భావిస్తున్నాను.' అని చెబుతున్నారు కిచ్చారెడ్డి. -న్యూస్‌టుడే, కనిగిరి

తడిసింది పంటే కాదు.. రైతుల గుండె కూడా..!

● మొంథా తుపానుతో పత్తి పంటకు అపార నష్టం

ఆరుగాలం శ్రమించి ప్రకృతి విపత్తులను ఎదుర్కొని పంటలు పండిస్తే కొనేవారు లేక రైతులకు కష్టనష్టాలు తప్పడంలేదు. పత్తి పంట చేతికొచ్చే సమయంలో మొంథా తుపాను మొత్తం ముంచేసింది. ప్రస్తుతం మిగిలిన పంటనైనా అమ్ముకుందామన్నా నిబంధనల అడ్డంకిగా మారడంతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో కర్షకులు కొట్టుమిట్టాడుతున్నారు. -ఈనాడు, ఒంగోలు

● జిల్లాలో ఈ ఏడాది 19 వేల హెక్టార్లలో పత్తి పంట సాగైంది. మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో మొత్తం 12 వేల హెక్టార్లలో పంటలు దెబ్బతినగా, అందులో 8 వేల హెక్టార్లలో అత్యధికంగా పత్తి పంట దెబ్బతింది. పంట కాపుకొచ్చే సమయంలో కాయల్లోకి నీరు చేరి దారుణంగా దెబ్బతీసింది. గతేడాది ధర లేక తీవ్రంగా నష్టపోయిన రైతులు ఈ ఏడాదైనా అప్పులు తీరుద్దామని భావిస్తున్న తరుణంలో మొంథా తుపాను దెబ్బతీసింది.

● జిల్లాలోని పశ్చిమ ప్రకాశం ప్రాంతంలోని 14 మండలాల్లో పత్తి పంట సాగులో ఉండగా, సగానికి పైగా దెబ్బతింది. మిగిలిన సగం మేర దిగుబడులు తీసికట్టుగా మారాయి. ఎకరాకు ఆరేడు క్వింటాళ్ల రావాల్సిన దిగుబడులు ప్రస్తుతం రెండు నుంచి మూడు క్వింటాళ్లే వచ్చే పరిస్థితి నెలకొంది. కనీసం పెట్టుబడి అయినా దక్కుతుందని ఎదురుచూస్తున్న తరుణంలో భారత పత్తి సంస్థ (సీసీఐ) నిబంధనలు అడ్డంకిగా మారాయి.

నాగులుప్పపాడులో పత్తి పంటను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

మేలి రకం పత్తి క్వింటా ధర: రూ.8,110
నిబంధనల ప్రకారం అనుమతించే తేమ: 8 శాతం
గరిష్ఠంగా అనుమతించేది: 12 శాతం వరకు
(తేమ 8 శాతం దాటితే ధరలో కోత విధిస్తారు)
ప్రస్తుతం రైతుల వద్ద పంటలో తేమ: 18 నుంచి 20 శాతం

తేమ పెరిగి.. నాణ్యత తరిగి

భారీ వర్షాలకు పంటలు రోజులతరబడి నీటిలో నానడంతో దిగుబడికి వచ్చిన పత్తిలో తేమ 18 శాతానికిపైగానే ఉంది. సగానికి సగం తేమ పెరగడంతో సీసీఐ నిబంధనల ప్రకారం కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. పత్తి సాగు ఎక్కువగా ఉన్న పశ్చిమ ప్రకాశం ప్రాంతంలోని మార్కాపురంలో సోమవారం సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం తేమ శాతం ఎక్కువగా ఉండటంతో పంటను ఎలా అమ్ముకోవాలని రైతులు దిగాలుగా ఉన్నారు. తేమ శాతం సడలింపు ఇచ్చి కొనుగోలు చేయాలని రైతులు జిల్లా అధికారులకు విన్నవించారు. తేమ శాతం సడలింపు విషయమై తాము కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని జేసీ గోపాలకృష్ణ రైతులకు హామీ ఇచ్చారు. పండిన అరకొర పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

మాట నిలబెట్టుకుని.. వితంతువును ఆదుకుని

దర్శి మండలం తూర్పు వీరాయపాలేనికి చెందిన మాలపాటి స్వప్న... పెళ్లయిన అయిదేళ్లకే భర్తను కోల్పోయారు. అప్పటికే ఇద్దరు సంతానం ఉండడంతో ఉపాధి మార్గం చూపి ఆదుకోవాలని ఈ నెల 17న కలెక్టరేట్‌లో నిర్వహించిన 'మీ కోసం'లో జేసీ గోపాలకృష్ణకు అర్జీ అందజేశారు. ఆమె దీనస్థితి చూసి అన్ని విధాలా ఆదుకుంటామని జేసీ భరోసా ఇచ్చారు. దర్శి తహసీల్దారు శ్రావణ్‌కుమార్, రెవెన్యూ శాఖాధికారులతో మాట్లాడి తక్షణ సాయంగా 25 కిలోల బియ్యం, నిత్యావసర సరకులు అందజేశారు. తాజాగా గురువారం ఆమెకు ఇంటి పట్టా సైతం అందించారు. ఇల్లు మంజూరుకు చర్యలు తీసుకోవాలని గృహనిర్మాణశాఖ అధికారులను ఆదేశించారు. వితంతు పింఛను మంజూరు చేయడంతోపాటు జీవనోపాధి నిమిత్తం నైపుణ్యాభివృద్ధిశాఖ ద్వారా శిక్షణ ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

- న్యూస్‌టుడే, కలెక్టరేట్

వేంపాడు టు అమెరికా

వేంపాడు...ముండ్లమూరు మండలంలోని ఓ చిన్న గ్రామం. ఇక్కడ 350 కుటుంబాలు నివాసముంటున్నాయి. ఇక్కడ యువకులు దేశ, విదేశాల్లో కొలువులు సాధించి స్థిర పడ్డారు. తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటూ తమ బిడ్డలను బాగా చదివిస్తుండగా, పిల్లలు కూడా తల్లిదండ్రుల ఆశలకు అనుగుణంగా పట్టుదలతో చదువుకుని ఉన్నత కొలువులు సాధిస్తున్నారు. ఈ కుగ్రామంలో 40 మంది అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా స్థిరపడగా, దేశ, విదేశాల్లో మరో 200 మంది వివిధ ఉద్యోగాల్లో కొనసాగుతున్నారు. -న్యూస్‌టుడే, ముండ్లమూరు

ఇక నిరీక్షించక్కర్లేదు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉపాధ్యాయులు అధికారుల వద్ద వివిధ పనుల నిమిత్తం ఇకపై గంటలతరబడి నిరీక్షించాల్సిన అవసరం లేదు. వీరి కోసం విద్యాశాఖ కమిషనర్ నిర్దిష్ట సమయాలు కేటాయిస్తూ ఉత్తర్వులిచ్చారు. ఎంఈవోలు పనిదినాల రోజుల్లో వారి కార్యాలయంలో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు, డీఈవో సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు అందుబాటులో ఉంటూ ఉపాధ్యాయుల అర్జీల స్వీకరణ, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు.

జలం.. పెరిగింది బలం

జిల్లాలో గణనీయంగా పెరిగిన భూగర్భ సిరులు

జిల్లాలో ఏళ్లతరబడి ఒట్టిపోయిన భూగర్భానికి జీవం వచ్చింది. దశాబ్దాలుగా ఎన్నడూ లేనంతగా ఇటీవల భారీ వర్షాలు కురవడంతో ఎక్కడ చూసినా జలవనరులు తొణికిసలాడుతున్నాయి. మీటర్ల కొద్దీ దిగజారిన భూగర్భజలాలు ఏకధాటిన పుంజుకున్నాయి. ఒట్టిపోయిన బోర్లు సైతం ప్రాణం పోసుకుని జలధారలు కురిపిస్తున్నాయి. గత అక్టోబరుతో పోల్చితే ఈ అక్టోబరు నాటికి భూగర్భ జలమట్టం బాగా పెరిగింది. కరవుతో అల్లాడే పశ్చిమ ప్రాంతానికి జీవం వచ్చిందని చెప్పొచ్చు. ఎన్నడూ లేనంతగా ఇక్కడి వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. గతేడాది అక్టోబరు నాటికి భూగర్భజలమట్టం సరాసరి 16.97 మీటర్లు ఉండగా, ఈ ఏడాది అక్టోబరు నాటికి 11.86 మీటర్లకు చేరింది. అంటే 5.12 మీటర్ల పెరుగుదల కనిపించింది.

- న్యూస్‌టుడే,యర్రగొండపాలెం

పెరిగిన వర్షపాతం...: జిల్లాలో భూగర్భ జలాల రూపంలో 44.66 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. ఈ ఏడాది జూన్ నుంచి ఈ నెల 20వ తేదీ నాటికి జిల్లా సాధారణ వర్షపాతం 694.6 మి.మీ కాగా, 800.9 మి.మీ వర్షపాతం నమోదైంది. అంటే 15.3 శాతం అదనంగా నమోదైంది. జిల్లావ్యాప్తంగా 18 మండలాల్లో అధిక వర్షపాతం నమోదు కాగా, మరో 19 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

నిండుకుండల్లా చెరువులు

జిల్లాలో మొత్తం 785 చెరువులుండగా, 33 చెరువులు పూర్తిస్థాయిలో నిండాయి. 75 శాతం నిండినవి 27 చెరువులుండగా, 50 శాతం నిండినవి 72, 25 శాతం నిండినవి 330 ఉన్నాయి. వీటిల్లో నీటి నిల్వ సామర్థ్యం: 14,068.16 ఎంసీఎఫ్‌టీ (వెయ్యి ఎంసీఎఫ్‌టీలు ఒక టీఎంసీ) కాగా, ప్రస్తుతం 5,239.78 ఎంసీఎఫ్‌టీలు (5.2 టీఎంసీలు) నిల్వలున్నాయి. గతేడాది ఇదే సమయానికి 2,176.24 ఎంసీఎఫ్‌టీలు కాగా, గతేడాది ఈ ఏడాదికి నిల్వల పెరుగుదల 3,063.54 ఎంసీఎఫ్‌టీలుగా నమోదైంది.

వేటకెళుతున్నారా.. పథకాలు అందుతున్నాయా?

● తీర ప్రాంత గ్రామాల్లో మత్స్యకారుల గణన సర్వే

మత్స్యకారుల సర్వోతోముఖాభివృద్ధికి తోడ్పాటునందించేందుకు ఉద్దేశించిన సమగ్ర సర్వేకు శ్రీకారం చుట్టారు. మెరైన్ ఫిషరీస్ సెన్సస్-2025 పేరిట కేంద్ర మత్స్యశాఖ అధికారులు పూర్తి వివరాలు సేకరించేందుకు అయిదేళ్లకొకసారి గణన నిర్వహిస్తున్నారు. వేట సాగించే మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయంతోపాటు రాయితీపై డీజిల్, పడవలు, వలలు, వివిధ పరికరాలు అందిస్తున్నారు. సర్వే డిసెంబరు 18వ తేదీతో పూర్తి కానుంది.

- న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

వాస్తవ జీవన స్థితిగతులపై..

మత్స్యకారుల గణనలో వాస్తవ జీవన స్థితిగతులను తేల్చనున్నారు. ఈ వృత్తిపై ఆధారపడి ఎంతమంది ఉన్నారు? ఇతర వృత్తుల్లో ఎందరున్నారు? అందులో ఎంత మందికి మత్స్యకార సంక్షేమ పథకాలు అందుతున్నాయి? అక్షరాస్యులెందరు? వృత్తి ద్వారా వచ్చే ఆదాయమెంత? ఖర్చులు, తదితర అంశాలపై దృష్టిసారించనున్నారు. వీటితోపాటు బోట్ల వివరాలు సైతం లెక్కించనున్నారు. మొత్తం 177 అంశాలపై వివరాలు సేకరిస్తున్నారు. ఆయా వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు.

కొత్తపట్నం మండలం కె.పల్లెపాలెంలో మత్స్యకార గణన చేస్తున్న సిబ్బంది

యానిమేటర్లను నియమించి...

సర్వేను పక్కాగా, పారదర్శకంగా నిర్వహించేందుకు మత్స్యకార ప్రాంతాల్లో పరిస్థితులపై అవగాహన కలిగినవారినే సిబ్బందిగా నియమించారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన స్థానిక యువతీ, యువకులను ఎంపిక చేశారు. ఒక్కొక్కరికి 500 కుటుంబాలు కేటాయించగా, ఒక్కో కుటుంబానికి రూ.50 చొప్పున సర్వే సిబ్బందికి చెల్లించ నున్నారు. మత్స్యకారుల జీవన ప్రమాణాల వృద్ధికి సర్వే దోహదపడనున్నట్లు జిల్లా అధికార యంత్రాంగం చెబుతోంది.

జిల్లాలో సముద్ర తీరం పొడవు: 50 కిలోమీటర్లు | మండలాలు: ఒంగోలు, కొత్తపట్నం, నాగులుప్పలపాడు, టంగుటూరు, సింగరాయకొండ | సర్వే జరుగుతున్న గ్రామాలు : 29 | మత్స్యకార కుటుంబాలు: 9,511

ఆట.. బాలికలకు బంగారు బాట

తండ్రికి ఆటలపై ఉన్న ఆసక్తి, ఆయన ప్రోత్సాహమే ఆమెకు వెయ్యి ఏనుగుల బలమైంది. వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్‌లో రాష్ట్ర, జాతీయస్థాయిల్లో బంగారు పతకాలు సాధించారు. పీఈటీ కొలువు సాధించి వందలాది మంది బాలికలకు తర్ఫీదునిస్తూ ఉన్నత శిఖరాలకు నిచ్చెనలేస్తున్నారు. ఆమె జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట కేజీబీవీ పీఈటీ బక్కా హెప్సిబా. ఈమెది నాగులుప్పలపాడు మండలం చవటపాలెం కాగా, ఈమె తండ్రి మార్క్ రైల్వే ఉద్యోగి కాగా, తల్లి కావమ్మ గృహిణి. ఈమె శిక్షణలో 300 మందికిపైగా విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, వాలీబాల్, అథ్లెటిక్స్, యోగా క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, రాజస్థాన్ రాష్ట్రాల్లో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో 80 మందికి పైగా బంగారం, వెండి, రజిత పతకాలు సాధించారు. తద్వారా ఎంసెట్, ఐటీఐ, ఐఐటీ సీట్లు సాధించారు. ఈమె రెండు సార్లు ఉత్తమ రాష్ట్ర వ్యాయామోపాధ్యాయినిగా పురస్కారాలు పొందారు. - న్యూస్‌టుడే, టంగుటూరు

రోగుల సహాయకుల వసతికి ప్రతిపాదన

ఈనాడు కథనానికి స్పందన

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి రోగుల వెంట వచ్చే సహాయకుల వసతికి మూడు షెడ్లు నిర్మించాలని నిర్ణయించారు. 'ఈనాడు'లో గురువారం 'ఆసుపత్రికి వస్తే ఆరుబయటే' శీర్షికన ప్రచురితమైన కథనంపై స్పందించిన కలెక్టర్ పి.రాజాబాబు వివరణ ఇవ్వాలని ఆసుపత్రి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ జి.వెంకటేశ్వర్లు, ఏపీఎస్ఎంఐడీసీ ఇంజినీర్లు వివరణ ఇచ్చారు. ఆసుపత్రి ఆవరణలోని మార్చురీ సమీపంలో ఒకటి, గైనికాలజీ విభాగానికి ఉత్తరం వైపున, క్రిటికల్ కేర్ సెంటర్ సమీపంలో షెడ్లు నిర్మాణానికి రూ.70 లక్షలతో ప్రతిపాదనలు పంపామని, అనుమతులు రావాల్సి ఉందన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ డీఎంఈతో ఫోన్‌లో మాట్లాడగా, త్వరలో పాలనాపరమైన ఉత్తర్వులిస్తామని డీఎంఈ తెలిపారు.

జిల్లా వణుకుతోంది!

● దోమల బెడదతో విజృంభిస్తున్న డెంగీ, మలేరియా
● మూడు నెలల్లో 58,532 జ్వరాల కేసుల నమోదు

జ్వరాలతో జిల్లా వణుకుతోంది. గత నెల చివరిలో మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో జ్వరాలు మరింత విజృంభిస్తున్నాయి. గత 10 రోజుల వ్యవధిలో మలేరియా, డెంగీ కేసులు వెలుగుచూడడం పరిస్థితికి అద్దం పడుతోంది. ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని జనరల్ మెడిసిన్ విభాగానికి నిత్యం పెద్ద సంఖ్యలో జ్వరపీడితులు వస్తున్నారు. ముండ్లమూరుకు చెందిన 64 ఏళ్ల వ్యక్తికి డెంగీ పాజిటివ్‌గా తేలడంతో ఇన్‌పేషంట్‌గా చేర్చుకుని చికిత్స అందిస్తున్నారు.

-న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఓపీ విభాగంలో బారులు తీరిన రోగులు

తుపాను అనంతరం నిల్వ నీటిలో దోమల ఉత్పత్తి పెరిగి వ్యాధులు ప్రబలుతున్నాయి. ఒంగోలు సర్వజన ఆసుపత్రిలో రోజువారీ 900 ఓపీ నమోదవుతుండగా, 30 శాతానికిపైగా జ్వరాలతో వచ్చేవారే ఉంటున్నారని వైద్యాధికారులు చెబుతున్నారు. తాజాగా బుధవారం జరిపిన పరీక్షల్లో ఇద్దరికి మలేరియా పాజిటివ్ వచ్చినట్లు సమాచారం. ● సెప్టెంబరు నుంచి జ్వరాల కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. సెప్టెంబరు నుంచి ఈ నెల 19వ తేదీ వరకు మొత్తం 58,532 కేసులు నమోదయ్యాయి. వీటిలో వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉండగా, టైఫాయిడ్ కేసులు 498 నమోదయ్యాయి. మరణాలు లేనప్పటికీ వారం రోజులపాటు జ్వరంతో ఇబ్బంది పడుతున్నారు. గురు వారం కలెక్టర్ రాజాబాబు అధ్యక్షతన వైద్యశాఖపై సమీక్ష జరగ్గా జ్వరాల అంశం చర్చకు వచ్చింది. జ్వరాలతో వచ్చేవారి సంఖ్య పెరగడంతో అదనంగా మరో గదిని కేటాయించి అదనంగా పడకలు ఏర్పాటు చేస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు కలెక్టర్‌కు వివరించారు.

ఆందోళన కలిగిస్తున్న పరిస్థితులు

దీనిపై స్పందించిన కలెక్టర్ జిల్లాలో ప్రాంతీయ ఆసుపత్రులు, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు ఉండగా, జ్వరపీడితులు సర్వజన ఆసుపత్రికి ఎందుకొస్తున్నారని ప్రశ్నించారు. గురువారం చీమకుర్తి నుంచి సుమారు 24 మంది జ్వరంతో వచ్చి చికిత్స పొందినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. మండలాల్లో జ్వరాలకు అవసరమైన చికిత్స అందేవిధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీఎంహెచ్‌వో, డీసీహెచ్ఎస్‌లను ఆదేశించారు.

ఏ ఇంట కార్యమైనా ఆ ఊరి వంటే!

బేస్తవారపేట... ఇక్కడవారు జిల్లాలోనే వంటలు చేయడంలో పేరు గడించారు. సుమారు 200 మంది వరకు ఇదే వృత్తిలో కొనసాగుతున్నారు. వంటల తయారీలో నాణ్యమైన సరకులు ఉపయోగించడంతోపాటు ఉప్పు, కారం సమపాళ్లలో వేయడంతోనే తమ వంటలకు రుచి వస్తుందని ఇక్కడ వారు చెబుతుంటారు. గిద్దలూరు, నంద్యాల, ఆళ్లగడ్డ, మార్కాపురం, పామూరు, కనిగిరి, పొదిలి, యర్రగొండపాలెం, పోరుమామిళ్ల, మైదుకూరు, బద్వేలు తదితర ప్రాంతాల్లో శుభ, అశుభ కార్యాలయాలతోపాటు విజ్ఞాన, విహారయాత్రల్లో వంటలు చేయడం సిద్ధహస్తులు.

-న్యూస్‌టుడే, బేస్తవారపేట గ్రామీణం

వేపచెట్టే వారికి దైవం!



వేప చెట్టును దేవతామూర్తిలా భావించి సుమారు 150 ఏళ్లుగా పూజిస్తున్నారు కనిగిరి పట్టణ వాసులు. తాతల కాలం నుంచి ఉన్న ఈ మహావృక్షానికి మహాలక్ష్మమ్మగా నామకరణం చేసి కొలుస్తున్నారు. కాలక్రమేణా ఈ ప్రాంతం మహాలక్ష్మమ్మ చెట్టువీధిగా పేరొందింది. ఈ చెట్టు 30 సెంట్లలో శాఖోపశాఖలుగా విస్తరించి చుట్టుపక్కల ప్రాంతాలకు గొడుగులా నీడనిస్తోంది. తమ ఇంటి దేవతలా భావించి కాపాడుకుంటున్నామని ఇక్కడ ప్రజలు చెబుతున్నారు. - న్యూస్‌టుడే, కనిగిరి

నేతల పాపాలు.. సంఘాలకు శాపాలు!

● గత ప్రభుత్వంలో ఇష్టానుసారంగా బోగస్ రుణాల మేత
● బకాయిలున్నాయంటూ బ్యాంకుల నుంచి నోటీసుల జారీ

జిల్లా మెప్మాలో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో నేతలు 200పైగా బోగస్ సంఘాల పేరిట రూ.కోట్లలో రుణాలు కొల్లగొట్టారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రకాశం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (పీడీసీసీబీ)లో 260 సంఘాల నుంచి రూ.11 కోట్ల మేర రుణ బకాయిలున్నాయని, పీడీసీసీబీలో జరిగిన అక్రమాలపై నియమించిన త్రిసభ్య కమిటీ తేల్చి చెప్పింది. కార్పొరేటర్లు, నాయకులు బోగస్ సంఘాలు ఏర్పాటు చేసి ఇష్టానుసారం రుణాలు మేసేశారు. ఓ కార్పొరేటరు రూ.కోటి మేర రుణాలు స్వాహా చేయడం అప్పట్లో చర్చనీయాంశమైంది. అప్పట్లో రుణాలు తీసుకున్నారంటూ ఇప్పుడు అమాయక మహిళలకు బ్యాంకుల నుంచి నోటీసులొస్తున్నాయి.

- ఈనాడు, ఒంగోలు

నీకింత.. నాకింత..: అప్పట్లో నాలుగు పొదుపు సంఘాల నుంచి తలా ఇద్దరితో కొత్త సంఘాలు ఏర్పాటు చేశారు. మొత్తం రుణ మొత్తం రూ.20 లక్షల్లో రూ.లక్ష సంఘం సభ్యులుగా ఉన్న 10 మందికి రూ.10 వేలు చొప్పున పంచేవారు. మెప్మా కార్యాలయం అధికారులతోపాటు బ్యాంకర్లకు కలిపి మరో రూ.3 లక్షలు ఇచ్చేవారు. మిగిలిన రూ.16 లక్షలు వెనకేసుకునేవారు. బోగస్ రుణాలపై చర్యలు తీసుకోవాలంటూ అప్పటి కలెక్టర్ దినేష్‌కుమార్‌కు తెదేపా నాయకులు ఫిర్యాదు చేశారు.

మంత్రి నారాయణతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్

సునీల్ నోరువిప్పితే..: మెప్మా ఉద్యోగి సునీల్ చెక్కుల ట్యాంపర్ చేసి నగదు కాజేశాడనే ఆరోపణలపై మెప్మా పీడీ శ్రీహరి ఇచ్చిన ఫిర్యాదుపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు కూడా చూపారు. కొంత మంది అధికారులు చెప్పిన మేరకు తాను ఇలాంటి పనులు చేసినట్లు సదరు ఉద్యోగి చెప్పినట్లు ప్రచారం సాగుతోంది. సునీల్ నోరు విప్పితే తమ పరిస్థితి ఏమిటని కొందరు అధికారులు ఆందోళన చెందుతున్నారు.

పూర్తిస్థాయిలో విచారించండి: మెప్మా పరిధిలో బోగస్ సంఘాలు ఏర్పాటు చేసి, రుణాలు స్వాహా చేసిన వైనంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే జనార్దన్ గురువారం పురపాలకశాఖ మంత్రి నారాయణకు వినతిపత్రం అందజేశారు. మెప్మా పరిధిలో గత ప్రభుత్వ హయాం నుంచి బోగస్ రుణాలు తీసుకున్నారని, దీనిపై విచారణ చేపట్టాలని కోరారు. అప్పట్లో ఇచ్చిన రుణాలు ఎవరెవరికి ఎంత ఇచ్చారనే దానిపై సమగ్రంగా విచారించి, అక్రమాలు నిగ్గు తేల్చాలన్నారు.

రామా... కనవేమిరా?

చిత్రంలో కనిపిస్తోంది నాగులుప్పపాడు మండలం కనపర్తి గ్రామంలో 14 శతాబ్దంలో చోళరాజులు నిర్మించిన రామాలయం. 2017లో అప్పటి ప్రభుత్వం ప్రాచీన స్మారక కట్టడంగా గుర్తించింది. దీంతో ఆలయం రూపురేఖలు మారిపోతాయనుకున్న దశలో ప్రభుత్వం మారిపోవడం, దేవాదాయశాఖ అధికారులు గాలికొదిలేయడంతో ఇలా శిథిలావస్థకు చేరింది.

- ఈనాడు, ఒంగోలు న్యూస్‌టుడే, నాగులుప్పలపాడు

(c) eenadu

జిల్లా కోర్టు పీపీగా అజయ్‌బాబు



ఒంగోలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఒంగోలు జిల్లా కోర్టు న్యాయవాది మొలకలపల్లి అజయ్‌బాబును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. టంగుటూరు మండలం సూరారెడ్డిపాలేనికి చెందిన ఆయన గత 38 ఏళ్లుగా జిల్లా కోర్టులో విధులు నిర్వహిస్తున్నారు. గతంలో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరుగా, గవర్నమెంట్ ప్లీడరుగా బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు న్యాయవాదులు అభినందించారు.

గ్రామ కార్యదర్శి సస్పెన్షన్

ఈనాడు కథనానికి స్పందన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: పంచాయతీ నిధులు దుర్వినియోగానికి సంబంధించి కురిచేడు మండలం పడమర వీరాయపాలెం గ్రామ పూర్వ కార్యదర్శి కె.జగన్‌మోహన్‌రెడ్డిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ పి.రాజాబాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన కార్యదర్శిగా పనిచేసిన సమయంలో రూ.13,39,810 మేర పంచాయతీ నిధులు దుర్వినియోగమయ్యాయి. ఈ విషయమై ఈ నెల 3న 'రూ.లక్షలు పక్కదారి.. చేతులు నీరుగారి' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించి విచారణకు ఆదేశించారు. కనిగిరి డీఎల్‌పీవో శ్రీనివాసరెడ్డి విచారణ చేపట్టి నివేదిక అందజేశారు. ఆ మేరకు కార్యదర్శిపై చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ఆయన సీఎస్‌పురం మండలం పెదగోగులపల్లి కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు.

మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనం

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారమే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని జిల్లా పర్యవేక్షణాధికారి వరప్రసాద్ సూచించారు. గురువారం మండలంలోని వెన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ పాఠశాలలను తనిఖీ చేశారు. ముందుగా మరుగుదొడ్లు, తాగునీరు, ఆవరణ పరిశీలించారు. అనంతరం ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుడ్లు, చిక్కీలు అందుతున్నాయా? లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా లేని విధంగా దాతల సహాయంతో పెరుగన్నం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆయన వెంట ఎంఈవో- 2 రామారావు, ప్రధానోపాధ్యాయురాలు భారతి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు మేనేజరుపై వేటు?

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: వరంగల్ జిల్లా గీసుకొండ ఆంధ్రా బ్యాంకు (ప్రస్తుతం యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా)లో గతంలో పని చేసిన బ్యాంకు మేనేజరుపై ఇటీవల ఆ బ్యాంకు ఉన్నతాధికారులు వేటు వేసినట్లు తెలిసింది. ప్రస్తుతం ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒంగోలులో యూనియన్ బ్యాంకు మేనేజరుగా పని చేస్తున్నారు. ఇక్కడ విధులు నిర్వహించిన పుడు.. నిబంధనలకు విరుద్ధంగా రుణాలు మంజూరు చేశారనే కారణంతో ఆయనను విధుల నుంచి తొలగించినట్లు సమాచారం. వ్యవసాయ, ముద్ర తదితర రాయితీ రుణాలు, మహిళల బ్యాంకు లింకేజీ రుణాల విషయంలో డబ్బులు తీసుకొని రుణాలు మంజూరు చేసినట్లు అధికారుల విచారణలో తేలింది. సంబంధిత బ్యాంకు అధికారులు గోప్యంగా ఉంచడంతో ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మరోవైపు గీసుకొండ మండలం నందానాయక్‌తండా కల్యాణి స్వయం సహాయక సంఘానికి చెందిన మహిళలు వీవోఏ (గ్రామ సంఘాల సహాయకుడు), బ్యాంకు మేనేజరుపై గత సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తమకు తెలియకుండా బ్యాంకు మేనేజరు సాయంతో వీవోఏ 2019లో రూ.20 లక్షల రుణం తీసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. నిధుల దుర్వినియోగంపై ప్రస్తుతం విచారణ చేస్తున్నట్లు డీఆర్‌డీఏ అధికారులు వెల్లడించారు.

చీరకు నిప్పంటుకుని వృద్ధురాలికి తీవ్ర గాయాలు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సింగరాయకొండలో గురువారం సాయంత్రం చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో ఓ వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై మహేంద్ర తెలిపిన వివరాల మేరకు.. స్థానిక డ్రైవరుపేటలో నివాసం ఉంటున్న బక్కమంతల వెంకటసుబ్బమ్మ తన ఇంటిలో గ్యాస్ పొయ్యిపై వంట చేస్తుండగా చీరకు మంటలు అంటుకున్నాయి. కుటుంబ సభ్యులు వెంటనే మంటలు అదుపు చేసి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

పెద్దమంతనాలలో యువకుడి హత్య

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: ఇద్దరు యువకుల మధ్య జరిగిన ఘర్షణ హత్యకు దారితీసింది. ఈ సంఘటనలో పెద్ద మంతనాలకు చెందిన అర్తి నాగన్న చాకుతో తన బావాయి కొడుకు అర్తి అంకన్న(25)ను పొడిచి చంపాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్తి అంకన్న తన తండ్రి, తల్లితో కలిసి హనుమాన్ జంక్షన్‌కుంటకు వెళ్లి కట్టెలు అమ్ముకొని వచ్చాడు. స్థానిక [illegible] మందిరంలో అంకన్న భార్య మద్యం మత్తులో పడి ఉంది. దీంతో తన భార్యకు మద్యం ఎందుకు తాగించావని అక్కడే ఉన్న నాగన్నను అతను ప్రశ్నించాడు. దీంతో ఇద్దరి మధ్య వివాదం చోటుచేసుకుని ఘర్షణకు దారి తీసింది. దీంతో కోపోద్రిక్తుడైన నాగన్న తన వద్ద ఉన్న చాకుతో అంకన్న గుండెపై పొడిచి పరారయ్యాడు. గాయపడిన అంకన్నను ఆటోలో పెద్దదోర్నాల వైద్యశాలకు తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న డీఎస్పీ నాగరాజు, సీఐ అజయ్‌కుమార్, ఎస్సై మహేష్ వైద్యశాలకు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి తల్లిదండ్రులు, భార్యను విచారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మృతుడి భార్య, తల్లిని విచారిస్తున్న డీఎస్పీ నాగరాజు

కార్యరూపం దాల్చాలి.. కంపెనీలు రావాలి

❖ దొనకొండలో పారిశ్రామిక వృద్ధికి కూటమి ప్రభుత్వం హామీ

న్యూస్‌టుడే, దొనకొండ

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దొనకొండపై వరాల జల్లులు కురిపిస్తుంది. దీంతో ఈ ప్రాంతంతోపాటు, జిల్లాలోని యువత తమకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశగా ఎదురుచూస్తున్నారు. త్వరగా పనులు మొదలుపెట్టి కార్యరూపం దాల్చాలని అందరూ కోరుతున్నారు.

ఇవీ.. వచ్చే కంపెనీలు, సంస్థలు..

రాష్ట్రంలో పది భారీ పారిశ్రామిక పార్కులు కేటాయించగా అందులో దొనకొండలో బహుళ ఉత్పత్తుల పార్కు ఏర్పాటుకు ఆమోదించారు. మూడు నెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మండలంలోని రుద్రసముద్రం, భూమనపల్లి, మంగినపూడి గ్రామాల్లో వెయ్యి మెగావాట్ల సోలార్ ప్లాంటు ఏర్పాటుకు అయిదు వేల ఎకరాల భూములు కావాలని సోలార్ పవర్ కార్పొరేషన్ వారు అడిగారు. గతంలో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోలార్ ప్లాంటు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. డీఆర్‌డీవో పర్యవేక్షణలో క్షిపణుల తయారీకి బాదాపురంలో 1400 ఎకరాల్లో రూ.1200 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు బీడీఎల్ సంస్థ ముందుకు వచ్చింది. ఇటీవల 25 ఎకరాల్లో రూ.4,260 కోట్లతో ప్రపంచ స్థాయి క్యాన్సర్ సెంటర్‌ను నిర్మించేందుకు దక్షిణ కొరియాకు చెందిన వరల్డ్ స్మార్ట్ సిటీస్ ఫోరం ఛైర్మన్ పీటర్ చున్ వెల్లడించారు. చల్లా గ్రూపు ఒమెక్సా బయాలజీస్, మేస్, ఐ హోల్డింగ్ సంస్థల భాగస్వామ్యంతో ఈ సెంటర్‌ను నిర్మించనున్నట్లు ఆయన ప్రకటించారు.

దొనకొండ సమీపంలోని ఎంఎస్‌ఎంఈ పార్కులో రోడ్డును కమ్మేసిన చిల్లచెట్లు

వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో

ఏడు సంవత్సరాల క్రితం అప్పటి తెదేపా ప్రభుత్వం దొనకొండ మండలంలోని రాగమక్కపల్లిలో ఎంఎస్‌ఎంఈ పార్కు కోసం 43.79 ఎకరాలు కేటాయించింది. సౌకర్యాల కల్పనకు రూ.8 కోట్ల నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించింది. 2019లో వైకాపా అధికారంలోకి రాగా ఈ పార్కు పనులను పూర్తిచేయకుండా వదిలేసింది. రోడ్లు, కాలువలు, విద్యుత్తు సౌకర్యం ఏర్పాటు చేసినా ఇంకా కొన్ని పనులు ఇప్పటికీ మిగిలి ఉన్నాయి. అవి పూర్తయి కంపెనీలకు కేటాయించి ఉంటే ప్రస్తుతం ఇక్కడ ఉపాధి ఉండేది. ఎవరు వచ్చినా రోడ్లు, మంచినీరు, విద్యుత్తు, రవాణా సౌకర్యం గురించి అడిగినప్పుడు వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే నీళ్లు వస్తాయని, పది కిలోమీటర్ల దూరంలో సాగర్ కాలువ ఉందని దగ్గర్లో రోడ్లు ఉన్నాయని చెప్పడమే తప్ప పెట్టుబడిదారుల్లో నమ్మకం కలిగించలేకపోతున్నారు. వెంటనే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి వసతులు కల్పిస్తేనే ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పే అవకాశం ఉంది.

పశు పోషకులకు మందులు పంపిణీ చేస్తున్న డీడీ జయచంద్ర

లింగ నిర్ధారిత వీర్యంతో పెయ్యి దూడల జననం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భదారణ చేయడం ద్వారా 90 శాతం కచ్చితత్వంతో పెయ్యి దూడలు జన్మించేలా చేయవచ్చని పశుసంవర్ధకశాఖ డీడీ జయచంద్ర తెలిపారు. ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ, జిల్లా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సర్వేరెడ్డిపాలెంలో గురువారం నిర్వహించిన పశు వైద్యశిబిరంలో మాట్లాడారు. పశువుల్లో ఈతల మధ్య వ్యవధిని తగ్గించి... ఏడాదికో దూడ పొందాలన్నారు. లేగదూడల సంరక్షణ, పశుగ్రాసం ప్రాధాన్యతను ఏడీ బసవ శంకరరావు వివరించారు. పశువులకు గర్భకోశ నిర్ధారణ, సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. పశు వైద్యాధికారులు భూపాల్‌రెడ్డి, ప్రతిమ, ఆశా, ఎంపీటీసీ సభ్యుడు గుండపనేని శ్రీనివాసరావు, నాయకులు మక్కెన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీ

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 25 వరకు సింగరాయకొండ జూనియర్ కళాశాల మైదానంలో అండర్-19 రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీ జరగనుంది. సంబంధిత గోడపత్రాలను ప్రకాశం భవన్‌లో కలెక్టర్ పి.రాజాబాబు గురువారం ఆవిష్కరించారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఈదర చింపారెడ్డి, పీడీలు ఎం.ఆదినారాయణ, పి.శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జల సంరక్షణ సేవలు స్ఫూర్తిదాయకం

రాజశేఖరరాజును అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ రాజాబాబు, డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్

దర్శి, న్యూస్‌టుడే: నీటి సంరక్షణ రంగంలో విశేష సేవలందించి రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ జల అవార్డును అందుకున్న పొదిలి రాజశేఖరరాజును జిల్లా కలెక్టర్ రాజాబాబు అభినందించారు. ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో దర్శికి చెందిన ఆయనను అభినందనలు తెలిపి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 20 సంవత్సరాలుగా నీటి వనరుల సంరక్షణ, రైతుల అభ్యున్నతి కోసం చెక్ డ్యాములు, ఫారం పాండ్లు నిర్మించడం వంటి వినూత్న కార్యక్రమాలు నిర్వహించి, జిల్లాకు గర్వకారణంగా నిలిచారని తెలిపారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ఇతరులు గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా అభియాన్ ఏపీసీగా అనిల్‌కుమార్

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: సమగ్ర శిక్షా అభియాన్ జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్‌గా ఉదయగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల బోటనీ అధ్యాపకుడు దాసరి అనిల్‌కుమార్ నియమితులయ్యారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఎనిమిది జిల్లాలకు ఏపీసీలను నియమిస్తూ ఎస్పీడీ ఉత్తర్వులిచ్చారు. జిల్లాలో ఈ పోస్టు మూడేళ్లుగా ఖాళీగా ఉంది. డీఈవో అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

పుస్తక పఠనంతో మానసిక వికాసం

సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు సాంస్కృతికం, న్యూస్‌టుడే: విద్యార్థులు చిన్న వయసు నుంచే పుస్తక పఠనం అలవరచుకోవాలని జేసీ రోణంకి గోపాలకృష్ణ పేర్కొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలో మాట్లాడారు. వారంలో ఒక్కరోజైనా గ్రంథాలయాన్ని సందర్శించాలన్నారు. దినపత్రికలు చదవడం, చిత్రలేఖనం వంటివి మానసిక వికాసానికి దోహదం చేస్తాయన్నారు. చరవాణికి దూరంగా ఉండాలని సూచించారు. వారం రోజుల పాటు గ్రంథాలయం నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జీవీ.శివారెడ్డి, గ్రంథ పాలకులు సంపూర్ణ, సందీప్, అనిల్, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

పర్సన్ ఇన్‌ఛార్జిగా జేసీ కొనసాగింపు: ఒంగోలు కలెక్టరేట్: జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌ఛార్జిగా జేసీ గోపాలకృష్ణను మరో ఆరు నెలల పాటు కొనసాగిస్తూ రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై నిఘా

సింగరాయకొండ గ్రామీణం: రద్దీ ప్రదేశాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని పాకల, ఊళ్లపాలెం సముద్ర తీర ప్రాంతాల్లో గురువారం రామాయపట్నం మెరైన్ సీఐ శివన్నారాయణ ఆధ్వర్యంలో సాగర్ కవచ్ కార్యక్రమం చేపట్టారు. తనిఖీల్లో ఆయనతో పాటు నెల్లూరు ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్ తదితరులు పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తీవ్రవాదులు దేవాలయాలు, రైల్వే స్టేషన్, బస్టాండు, ప్రభుత్వ కార్యాలయాలు తదితర ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ప్రాణ, ఆస్తి నష్టం కలిగించేందుకు కుట్రలు పన్నే అవకాశాలు ఉన్నాయన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని తీరప్రాంతాలైన నాలుగు మండలాల్లో 24 గంటలూ సిబ్బంది పర్యవేక్షణలో విధులు నిర్వహిస్తూ అనుమానిత వ్యక్తులు, వారి వద్ద ఉండే సామగ్రిని తనిఖీ చేయాలని ఆదేశించారు. సింగరాయకొండ, టంగుటూరు, ఉలవపాడు, గుడ్లూరు, వలేటివారిపాలెం, రామాయపట్నం మెరైన్ ఎస్సైలు మహేంద్ర, నాగమల్లేశ్వరరావు, బి.మహేంద్ర, అంకమ్మ, మరిదినాయుడు, మస్తాన్‌షరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

పాకలలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సంఘం నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలంటూ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కోట్లాది రూపాయల సెస్సు వసూలు చేసినట్లు తెలిపారు. ఆ నిధులను కార్మికుల సంక్షేమానికి కాకుండా పథకాలకు మళ్లించారని విమర్శించారు. బోర్డు పునరుద్ధరణతో పాటు యాభైఏళ్లు నిండిన కార్మికులకు నెలకు రూ.9 వేల పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. డీఆర్వో ఓబులేసుకు వినతి పత్రం అందజేశారు. సంఘం నాయకులు ఎన్.రామారావు, జి.రమేష్, ఎస్కే హుస్సేన్, నాగూర్, భానుమూర్తి పాల్గొన్నారు.

నిరుద్యోగ మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: నిరుద్యోగ మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ అందిస్తున్నట్లు మహిళా ప్రాంగణం మేనేజర్ కె.మాధవి ఓ ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 45 ఏళ్లలోపు వారు అర్హులని... ఆసక్తిగల వారు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 99630 05209 నంబరులో సంప్రదించవచ్చని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

ఒంగోలు కలెక్టరేట్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తోందని జేసీ రోణంకి గోపాలకృష్ణ తెలిపారు. ప్రకాశం భవన్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌ను గురువారం సాయంత్రం సందర్శించారు. అర్జీదారులకు ఫోన్ చేసి మాట్లాడారు. సమస్య, పరిష్కార విధానం, సంతృప్తి చెందారా..లేదా? అన్నదానిపై ఆరా తీశారు. సంబంధిత అధికారులతోనూ మాట్లాడి ఏ విధంగా సమస్య పరిష్కరించారన్న వివరాలు తెలుసుకున్నారు. ఎస్‌డీసీ మాధురి, డీటీ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

మహిళా మార్ట్‌లో అక్రమాలపై విచారణ

ఒంగోలు నగరం: మెప్మా మహిళా మార్ట్‌లో అక్రమాలపై రెండో విడత విచారణ గురువారం చేపట్టారు. నెల్లూరు జిల్లా డిప్యూటీ కలెక్టర్ లీలారాణిని విచారణాధికారిగా నియమించారు. గత నెలలో కార్యాలయానికి వచ్చి కొన్ని దస్త్రాలు పరిశీలించారు. ఆ సమయంలో సిబ్బంది కొన్ని బిల్లులను అందుబాటులో ఉంచకపోవడంతో వాటిని తెప్పించి పరిశీలించారు. మార్ట్ నిర్వహణ బాధ్యతలు చూసిన సిబ్బంది, అధికారులతో మాట్లాడి వివరాలు సేకరించారు. పొదుపు సంఘాల సభ్యుల నుంచి రూ.150 చొప్పున వసూలు చేసి దాదాపు రూ.50 లక్షలతో మార్ట్ ఏర్పాటు చేశారు. ఇందులో దాదాపు రూ.25 లక్షలకు లెక్కలు తేలడం లేదు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నాలుగు రోజుల్లో మెప్మా ఎండీకి నివేదిక సమర్పించనున్నారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 660 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.100/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 108, రిటైల్ లైవ్ - 135, చికెన్ విత్ స్కిన్ - 196, చికెన్ స్కిన్‌లెస్- 223

నకిలీ పత్రాలతో ఉద్యోగోన్నతికి ఇద్దరి యత్నం

❖ ఆర్అండ్‌బీలో విజిలెన్స్ అధికారుల విచారణ

ఒంగోలు కర్నూలు రోడ్డు, న్యూస్‌టుడే: నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగోన్నతికి ప్రయత్నించిన ఇద్దరు ఆర్అండ్‌బీ సిబ్బందిని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గుర్తించారు. వీరిలో ఒకరు గతంలోనూ ఇదే తరహా అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్అండ్‌బీ కనిగిరి డివిజన్‌లో వల్లం పోలయ్య ప్రింటింగ్ టెక్నీషియన్‌గా, కొడవటి జోసెఫ్ అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగోన్నతి కోసం ఐటీఐ చదవాలని చెప్పి ఉన్నతాధికారుల అనుమతితో రెండేళ్లు సెలవు తీసుకున్నారు. చీరాలలోని ఓ ఐటీఐలో చేరారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. . రెండేళ్లలో చేయాల్సిన కోర్సు తొమ్మిది నెలలకే పూర్తి చేసినట్లు నకిలీ పత్రాలు సృష్టించారు. వాటితోనే ఉద్యోగోన్నతికి దరఖాస్తు చేశారు. విషయం ఉన్నతాధికారులకు తెలియడం, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్‌కు సైతం ఫిర్యాదులు వెళ్లడంతో విచారణ చేపట్టారు. ఎస్ఈ నుంచి వారి పూర్తి వివరాలు, జీతాల బిల్లులు సేకరించారు. పోలయ్య గతంలోనూ నకిలీ ధ్రువపత్రంతోనే అటెండర్ నుంచి ప్రింటింగ్ టెక్నీషియన్‌గా ఉద్యోగోన్నతి పొందినట్లు గుర్తించారు. కోర్టు స్టే ఆర్డర్‌తో కొనసాగుతూ ఇప్పుడు మళ్లీ అదే తరహాలో ఉద్యోగోన్నతికి ప్రయత్నించినట్లు తేలింది. మొత్తం వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

వైద్యకళాశాలకు మృతదేహం అప్పగింతకు అంగీకారం

సయ్యద్ ఇమాం

తాళ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని గంగపాలేనికి చెందిన సయ్యద్ ఇమాం హైదరాబాద్‌లోని బీరంగూడలో ఆర్ఎంపీ వైద్యుడిగా స్థిరపడ్డారు. మరణానంతరం తన భౌతిక కాయాన్ని సనత్‌నగర్‌లో ఉన్న ఈఎస్ఐసీ వైద్య కళాశాలకు అందజేసేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు ఆయన గురువారం స్వయంగా కళాశాలకు వెళ్లి దరఖాస్తు చేసుకున్నారు. సంబంధిత పత్రాలను అందజేశారు. వాటిని పరిశీలించిన తదుపరి మృతదేహాన్ని తీసుకునేందుకు కళాశాల నిర్వాహకులు అంగీకరించారు. తన మృతదేహం వైద్య విద్యార్థుల పరిశీలనకు ఉపయోగిస్తారని, అందుకే అప్పగించాలని నిర్ణయించినట్లు ఇమాం తెలిపారు.

బాలికలతో అసభ్యకర ప్రవర్తన

❖ ఉపాధ్యాయుడిని నిలదీసిన తల్లిదండ్రులు

కురిచేడు, న్యూస్‌టుడే: విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడు బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన తీరు మండలంలోని కల్లూరు గ్రామంలో గురువారం వెలుగుచూసింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఉర్దూ పాఠశాలలో తక్కువ మంది విద్యార్థులు ఉండడంతో అదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విలీనం చేశారు. నాలుగు నెలల క్రితం ఉర్దూ పాఠశాలకు ఉపాధ్యాయుడిగా వచ్చిన ఓ వ్యక్తి.. నాలుగు, అయిదు తరగతులు చదువుతున్న కొందరు బాలికల పట్ల ఇటీవల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ క్రమంలో ఓ విద్యార్థిని బుధవారం రాత్రి వారి తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో గురువారం పాఠశాల వద్దకు వెళ్లి ఆ ఉపాధ్యాయుడిని వారు నిలదీశారు. విషయం బయటకు రావడంతో ఆ ఉపాధ్యాయుడి ఘన కార్యాలన్నీ బయటపడ్డాయి. గతంలో పనిచేసిన చీరాల, సంతమాగులూరు మండలాల్లో విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి రెండు సార్లు సస్పెండ్ అయ్యాడు. భార్య గృహహింస కేసు పెట్టడంతో మరొకసారి సస్పెండ్‌కు గురయ్యాడు. తల్లిదండ్రుల తరువాత స్థానంలో ఉన్న గురువు ఇలాంటి పనులు చేస్తూ సస్పెన్షన్‌కు గురైనా మళ్లీ ఉద్యోగం ఎలా ఇస్తారని గ్రామస్థులు మండిపడుతున్నారు. ఈ విషయంపై ఎంఈవో వస్త్రాం నాయక్‌ను వివరణ కోరగా.. సంబంధిత ఉపాధ్యాయుడిపై పూర్తి విచారణ చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని తెలిపారు.

కంభంలో పైపుల దుకాణంలో చోరీ

కంభం, న్యూస్‌టుడే : స్థానిక బస్టాండ్ సమీపంలోని ఓ దుకాణంలో చోరీ జరిగింది. ఎస్సై రవీంద్రారెడ్డి కథనం మేరకు. . పట్టణానికి చెందిన మల్లికార్జున పైపుల దుకాణం షట్టర్ పగులగొట్టి అందులో ఉన్న నగదును ఓ దుండగుడు చోరీ చేశాడు. పక్కనే ఉన్న మరో దుకాణం షెట్టర్ పగులగొట్టి అందులోకి వెళ్లగా ఏమీ దొరకలేదు. ముసుగు వేసుకున్న వ్యక్తి ఈ చోరీలకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. చోరీ జరిగిన ప్రాంతాన్ని బేస్తవారపేట ఎస్సై రవీంద్రారెడ్డి పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. నిందితుడి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

నిందితుడి అరెస్టు..

కంభం: నిద్రిస్తున్న మహిళ వద్ద నుంచి బంగారం గొలుసు చోరీ చేసిన నిందితుడిని గ్రామస్థులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఎస్సై రవీంద్రారెడ్డి కథనం మేరకు. . ఎల్.కోట గ్రామానికి చెందిన గోపినేని శివకుమారి బుధవారం అర్ధ రాత్రి 3 తులాల బంగారం గొలుసును దిండు కింద పెట్టుకొని నిద్రిస్తున్నారు. రాత్రి వేళ అదే గ్రామానికి చెందిన సుభానీ ఆ గొలుసు చోరీ చేశాడు. ఇంట్లో వారు లేచి నిందితుడిని పట్టుకునేలోగా అతను పరారయ్యాడు. నిందితుడు గ్రామంలో ఓచోట నక్కి ఉండగా..స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై తెలిపారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులో/ ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్న విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనుగోలు చేయబడును. [illegible] Ph: 81422 92071.

PLOT FOR SALE

ఒంగోలు, గుంటూరురోడ్డు A1 ఫంక్షన్‌హాల్ ఎదురుగుండా [illegible] 18గదులు, 9గదులు స్థలం అమ్మబడును. [illegible] సెల్: 9440563799.

JOBS

Wanted Lady Computer Operators Lady Telecallers for Educational Consultancy Ongole. Sal: 10-15K. Cont: 90529 75353.

Wanted B.Com/ M.Com/ MBA Finance/ CA IPCC Dropouts to be work as Field Executive in Ongole in a Reputed Audit Firm. Interested Persons (Male Only) Contact © 70135 11502 or Mail to kowthahr@gmail.com

EDUCATION

B.ఫార్మసీ, Bachelor of Physiotherapy (BPT), B.Sc, నర్సింగ్, GNM నర్సింగ్, మేనేజ్‌మెంట్ 9866939320,7013448102

TO LET

COMMERCIAL

ఒంగోలు, గుంటూరురోడ్ రిజిస్టర్ ఆఫీసు ప్రక్కన గల KB బిల్డింగ్‌లో 1st ఫ్లోర్ (1300Sft) అద్దెకు ఇవ్వబడును. 9100290022.

DISTANCE EDUCATION

వన్ సిట్టింగ్ డిగ్రీ B.Tech, MBA, MCA, M.Sc, నర్సింగ్ కోర్సులు గుజరాత్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ యూనివర్సిటీల నుండి ఇవ్వబడును. ఒంగోలు 7093621555

REAL ESTATE

FLAT FOR SALE

ఒంగోలు కర్నూల్ రోడ్డు [illegible] ఫంక్షన్ హాల్ దగ్గర [illegible] 2BHK [illegible] 1250Sft అమ్మబడును. [illegible] 9247131337.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలు [illegible]

[illegible] ©:9703971963

[illegible] © 92814 44697, 92814 44698.

[illegible] ©: 9100024059.

మార్కాపురం

•మార్కాపురం •గిద్దలూరు •యర్రగొండపాలెం

ప్రతిభా పోటీలతో సృజన పెంపు

తర్లుపాడు : ప్రధానోపాధ్యాయుల నుంచి బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

తర్లుపాడు, న్యూస్‌టుడే: ప్రతిభా పోటీలతో సృజన పెంపొందుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. తర్లుపాడులో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని గురువారం గ్రంథ పాలకుడు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తా చాటిన విద్యార్థులకు బహుమతులందజేశారు. తర్లుపాడు, చెన్నారెడ్డిపల్లె జడ్పీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సుధాకర్, బాలరాజు పాల్గొన్నారు.

▶మార్కాపురం పట్టణం: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని మున్సిపల్ కమిషనర్ నారాయణరావు అన్నారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రముఖ కవి వీరారెడ్డి, ఎంఈవో రాందాస్‌నాయక్, మల్లిక్ పాల్గొన్నారు.

▶పెద్దారవీడు, న్యూస్‌టుడే: విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని సర్పంచి దుగ్గెం చెన్నమ్మ ఆకాంక్షించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథపాలకుడు వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎంఈవో శ్రీనివాసులు బహుమతులను ప్రదానం చేశారు.

▶త్రిపురాంతకం: విద్యార్థులు ఉన్న స్థాయి నుంచి ఉన్నత స్థాయికి చేరుకునేలా కృషి చేయాలని తహసీల్దార్ కృష్ణమోహన్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా గ్రంథపాలకుడు రామాంజినేయక్ ఆధ్వర్యంలో స్థానిక శాఖ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈవోలు మల్లికార్జున నాయక్, రాజశేఖర్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు.

అనారోగ్యంతో తెదేపా మాజీ ఎంపీపీ మృతి



వెంకటేశ్వర్లు

యర్రగొండపాలెం పట్టణం: తెదేపా మాజీ ఎంపీపీ గోపిరెడ్డి వెంకటేశ్వర్లు(70) గురువారం గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈయన గతంలో జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడిగా, వై.పాలెం సొసైటీ అధ్యక్షుడిగా పనిచేశారు. నియోజకవర్గంలో బలమైన నాయకుడిగా రాణించారు. స్థానిక నాయకులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు.

మార్కాపురం జిల్లా ఏర్పాటుతోనే న్యాయం

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జిల్లా సాధన సమితి సభ్యులు

కంభం, న్యూస్‌టుడే : మార్కాపురం జిల్లా ఏర్పాటుతోనే ఈ ప్రాంత వాసులకు న్యాయం జరుగుతుందని జిల్లా సాధన సమితి సభ్యులు అన్నారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయం సమీపంలో జిల్లా ఏర్పాటుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షుడు మీనిగ ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. ఈ నెల 26న మార్కాపురం, 27న కంభంలో భారీ ప్రదర్శన నిర్వహించి తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా త్వరగా జిల్లాను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు దేవిరెడ్డి నాగేంద్రుడు, పగడాల పాండు, ఉపాధ్యక్షుడు వేశపోగు బాలు, ఈద చెన్నయ్య, విశ్రాంత అధ్యాపకుడు మురళీకృష్ణ, శ్రీనివాస రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఇబ్రహీం, రమణ, తదితరులు పాల్గొన్నారు.

చెరువుకు మరమ్మతులు చేపట్టాలి

చెరువు పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

పుల్లలచెరువు (యర్రగొండపాలెం), న్యూస్‌టుడే: చిన్నకండ్లేరు చెరువు మరమ్మతులు వెంటనే పూర్తిచేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆయన రైతు సంఘం నాయకులతో కలిసి బుధవారం చెరువును పరిశీలించారు. కార్యక్రమంలో డి.శ్రీనివాస్, బి.రామయ్య, ఎం.సాంబశివరావు, జానకి రఘు, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

గుడ్లు ఇలా.. ఆరోగ్యం ఎలా!

గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పూర్తి స్థాయి పోషకాహారం అందిస్తున్నామని అధికారులు చెబుతున్నా.. అవేమీ క్షేత్రస్థాయిలో కానరావడం లేదు. వారికి అందిస్తున్న కోడిగుడ్ల పరిమాణం మరీ చిన్నదిగా ఉండటంపై చిన్నారుల తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇది బావి పౌరుల ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తుందని వాపోతున్నారు. -న్యూస్‌టుడే, బేస్తవారపేట

సోమవారపేట అంగన్‌వాడీ కేంద్రంలో చిన్న పరిమాణంలో ఉన్న గుడ్లు

● అంగన్‌వాడీల్లో దుస్థితి

పశ్చిమ ప్రాంతంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం పోషకాహారంతో పాటు కోడిగుడ్లు అందజేస్తోంది. అయితే పంపిణీ చేసే గుత్తేదారులు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వారు నాసిరకమైనవి సరఫరా చేస్తున్నారని చిన్నారుల తల్లిదండ్రులు వాపోతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే గుడ్లు కనీసం 50 గ్రాముల బరువైన ఉండాలన్నా నిబంధన ఉన్నా..చాలాచోట్ల అమలు కావడంలేదు. నవంబర్ నెలకు సంబంధించి బేస్తవారపేట, పరిసర మండలాల్లోని చాలా కేంద్రాల్లో 50 గ్రాముల కంటే తక్కువ బరువున్న గుడ్లను సరఫరా చేశారు. వీటినే సిబ్బంది లబ్ధిదారులకు అందజేస్తున్నారు. ఇంత చిన్న పరిమాణంలో ఉన్న వాటితో పూర్తిస్థాయి పోషకాహారం ఎలా అందుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. సోమవారపేట అంగన్‌వాడీ కేంద్రానికి ఈ నెల పంపిణీ చేసిన దాదాపు అన్ని గుడ్లు చిన్న పరిమాణంలోనే ఉన్నాయి. అందులో కొన్ని గోలీ సైజులో ఉన్నాయని చిన్నారుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. దీనిపై సిబ్బందిని నిలదీస్తే..చిన్నవే సరఫరా చేశారని చెబుతున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కేంద్రాలకు నాణ్యమైన గుడ్లు అందించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

భవన నిర్మాణ కార్మికుల ధర్నా

మార్కాపురం అర్బన్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు అమలు చేయాలని కోరుతూ గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు రఫీ మాట్లాడారు. అంతకుముందు వారు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

సమాచార కమిషనర్ దాతృత్వం

పెద్దదోర్నాల: నల్లమలలోని ఇష్టకామేశ్వరిదేవి చెంచు గిరిజన గూడేనికి రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ రూ.55వేలు విలువ చేసే బోరు మోటారు అందజేసి దాతృత్వం చాటారు. ఈ మేరకు నెక్కంటి రేంజ్ అటవీ క్షేత్ర అధికారి హరి తెలిపారు. దాన్ని బిగించి గూడెంవాసుల నీటి సమస్య తీరుస్తామని ఆయన తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
మార్కాపురం : 8008631313
గిదలూరు పటణం : 8008574135
యర్రగొండపాలెం : 8008552658

న్యూస్‌టుడే, మార్కాపురం గ్రామీణం

?: పట్టణంలోని గాంధీ బజారు, పేరం బజారుల్లో డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడంతో మురుగంతా నిలిచిపోయి దుర్వాసన వస్తోంది.
– కుమార్, గాంధీ బజారు, మార్కాపురం

✓: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి వెంటనే శుభ్రం చేయిస్తాం. – బి.చెన్నకేశవులు, శానిటరీ ఇన్‌స్పెక్టరు, మార్కాపురం

న్యూస్‌టుడే, పొదిలి

?: పొదిలి ఇస్లాంపేటలో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. కొన్నిచోట్ల సిమెంటు రోడ్లు, మరికొన్నిచోట్ల మురుగు కాలువలు నిర్మించాలి. – మస్తాన్‌వలీ, పొదిలి

✓: నగర పంచాయతీలో నిధుల లభ్యతను బట్టి ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేయిస్తాం.
–కె.ఎల్.నారాయణరెడ్డి, కమిషనరు, పొదిలి

త్రిపురాంతకం, న్యూస్‌టుడే

?: దూపాడు గ్రామంలో మురుగు నీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు వీధి దీపాలు వెలగక రాత్రివేళ అంధకారంలో బతుకుతున్నారు. -స్థానికులు, దూపాడు

✓: గ్రామంలో మురుగు సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. వెలగని వీధి దీపాల స్థానంలో త్వరలో కొత్తవి ఏర్పాటు చేయిస్తాం. -వెంకిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి, దూపాడు.

పెద్దారవీడు, న్యూస్‌టుడే

?: నీళ్ల ట్యాంకు మొత్తం పాచి పట్టి అధ్వానంగా తయారైంది. కుళాయిలు విరిగి నీరంతా వృథాగా పోతోంది.
– గోరుము అంజనేయులు, గుండంచర్ల.

✓: సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి గ్రామంలోని అన్ని నీళ్ల ట్యాంకులకు మరమ్మతులను చేయించి, బ్లీచింగ్ చల్లిస్తాం.
– హర్షవర్ధన్, పంచాయతీ కార్యదర్శి.

అర్థవీడు, న్యూస్‌టుడే

?: వీధి దీపాలు నిరంతరాయంగా వెలగడంతో..తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. – రమేష్, వెలగలపాయ.

✓: విద్యుత్తు సిబ్బందికి తెలియజేసి సమస్యను పరిష్కరిస్తాం.
–ఎంపీడీవో ఖాసీంపీరా, అర్థవీడు.

తర్లుపాడు, న్యూస్‌టుడే:

?: తర్లుపాడు నుంచి మార్కాపురం పట్టణానికి వెళ్లు రహదారిపై ఉన్న గుంతలు పూడ్చకపోవడంతో రాత్రుల్లో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు సమస్యను పరిష్కరించగలరు.
–నాగేంద్ర, న్యాయవాది, తర్లుపాడు.

✓: మొంథా తుఫాన్‌కు శిథిలమైన రహదారుల తోపాటు తర్లుపాడు, మార్కాపురం రోడ్డుకు కూడా ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు పూర్తి చేస్తాం.
–నరసింహులు, రోడ్డు భవనాల శాఖ డీఈ, కంభం.

?: తాడివారిపల్లెలో ప్రజల అవసరాలకై ఏర్పాటు చేసిన తాగునీటి పైపులైను మిట్టపల్లెలో శిథిలమై నీరు వృథాగా పోతోంది.
–వెంకటేశ్వర్లు, తాడివారిపల్లె యువకుడు.

✓: త్వరలోనే శిథిలమైన తాగునీటి పైపులైనుకు మరమ్మతులు చేయిస్తాం.
– అనూష, తాడివారిపల్లె పీ.ఎస్.

సచివాలయాల తనిఖీ

అర్థవీడు, న్యూస్‌టుడే: నాగులవరం, కాకర్ల గ్రామ సచివాలయాలను ఎంపీడీవో ఖాశింపీరా గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. దస్త్రాలు, యాప్‌ల పనితీరును పరిశీలించారు. సంక్షేమ పథకాల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

నిందితుడికి జైలుశిక్ష

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : మద్యం తాగి వాహనం నడిపిన కేసులో నిందితుడికి గిద్దలూరు అదనపు కోర్టు న్యాయమూర్తి భరత్‌చంద్ర వంద రోజుల జైలుశిక్ష విధిస్తూ గురువారం తీర్పు వెలువరించారు. గిద్దలూరుకు చెందిన ఎస్‌కె.షరీఫ్ మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ కేసులో న్యాయమూర్తి విచారణ చేపట్టి వంద రోజుల జైలుశిక్ష, రూ.15వేల జరిమానా విధించారు.

ట్యాంకు శుభ్రంచేసి అయిదేళ్లు

నాగిరెడ్డిపల్లె మంచినీటి ట్యాంకు నుంచి కలుషిత నీటి సరఫరా అవుతోంది. ఈ ట్యాంకుకు ఉన్న నిచ్చెన దెబ్బతినడంతో గత అయిదేళ్లుగా శుభ్రం చేసింది లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జ్యోతిని వివరణ కోరగా..క్లోరినేషన్ చేయిస్తానన్నారు. –న్యూస్‌టుడే, కొనకనమిట్ల

దాతలను సన్మానించిన దేవస్థానం కమిటీ సభ్యులు

దాతల సహకారంతో సేవలు

పొదిలి, న్యూస్‌టుడే: కార్తికమాసం సందర్భంగా నెలరోజులపాటు నిర్మ మహేశ్వరస్వామి దేవాలయంలో కార్యక్రమాల నిర్వహణకు సహకరించిన దాతలను గురువారం దేవస్థానం ఛైర్మన్ ఒగ్గు వెంకట్రామయ్య ఘనంగా సన్మానించారు. దేవాలయంలో ముందుగా ప్రత్యేక రుద్రాభిషేకాలు నిర్వహించారు. దాతలకు పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ సభ్యులు, దాతలు పాల్గొన్నారు.

లోక కల్యాణానికి గాయత్రి హోమం

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : కాశిరెడ్డినగర్‌లోని గురువారం గాయత్రి పరివార్ సభ్యులు లోక కల్యాణం కోరుతూ హోమం నిర్వహించారు. భక్తాదులకు కమిటీ నిర్వాహకులు అన్నదానం చేశారు. విశ్రాంత అధ్యాపకుడు సూరం నారాయణరెడ్డి, రామకృష్ణ మఠం అధ్యక్షుడు పి.హనుమంతారెడ్డి, గాయత్రి పరివార్ సభ్యులు వి.లక్ష్మి ప్రసూన, పి.విజయ పాల్గొన్నారు.

హోమం చేస్తున్న పరివార్ సభ్యులు

త్వరలో హక్కు పత్రాల అందజేత

మాట్లాడుతున్న ఎంపీడీవో వీరభద్రాచారి

కంభం, న్యూస్‌టుడే : ఔరంగాబాద్‌లోని ఇళ్లు, ఖాళీ స్థలాల కొలతలు తీయడం, హద్దులు నిర్ణయించే పనులు పూర్తయ్యాయని, త్వరలో అర్హులకు హక్కు పత్రాలు అందజేయనున్నట్లు ఎంపీడీవో వీరభద్రాచారి తెలిపారు. గ్రామంలో గురువారం సర్పంచి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్వామిత్వకు సంబంధించిన గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మి, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ARUNACHALESWARA COLLEGE OF EDUCATION
(Approved by NCTE, New Delhi & Affiliated to Andhra Kesari University, ONGOLE)
Racharla, Prakasam Dt, A.P Email: gprreddy1976@gmail.com
Admission Notification for B.Ed "A" & "B" Category Seats. Applications are invited from Eligible candidates for Management Quota (Cat-B) and Cat-A/ left over seats (Spot Admissions) for the Academic Year 2025 -2026

Category A Seats 75 +10 (10% EWS)	Total Vacancies 110
Category B Seats 25	

Apply along with relevant certificates copies should submit in college office on any working day or by online in college Website/ Post/mail on or before 22-11-2025 for selection of candidates.
Note: Preference will be given to the A.P., State Candidates and left over Seats will be allotted to the other State Candidates.
Cell: 9912361611 Secretary & Correspondent

హక్కులపై ఇస్లామీ హింద్ ఉద్యమం

యర్రగొండపాలెం పట్టణం: యర్రగొండపాలెంలో జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో నవంబర్ 21 నుంచి 30 వరకు హక్కులపై దేశవ్యాప్త ఉద్యమం చేపట్టినట్లు ఆ సంఘం ప్రతినిధులు చెప్పారు. ఈ మేరకు 'పొరుగువారి హక్కులు - దేశవ్యాప్త ఉద్యమం' కరపత్రాలను గురువారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనాబ్ రసూల్ సాహెబ్ మాట్లాడుతూ దిగజారిపోతున్న మానవ సంబంధాలు పెంపొందించేందుకే జమాతే ఇస్లామి హింద్ దేశవ్యాప్త ఉద్యమం చేపడుతోందన్నారు. కార్యక్రమంలో హఫీజ్, సయ్యద్ గఫార్, షేక్ రఫీ, అతహర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాలో 74 మందికి కొలువులు

అవీ... ఇవీ..

యర్రగొండపాలెం పట్టణం : ఏపీ స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో గురువారం నిరుద్యోగులకు జాబ్‌మేళా నిర్వహించారు. దీనికి 157 మంది హాజరయ్యారు. 9 కంపెనీలకు 74 మంది ఎంపికైనట్లు అధికారులు తెలిపారు. ముఖ్య అతిథిగా వై.పాలెం తెదేపా ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు, ప్రిన్సిపల్ శ్రీధర్‌నాయుడు, కంపెనీ ప్రతినిధులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు వినియోగదారుల సదస్సు

మార్కాపురం అర్బన్: యర్రగొండపాలెం విద్యుత్తు సబ్ స్టేషన్ పరిధిలోని వినియోగదారులకు ఈ నెల 21న అంబేడ్కర్ ఆడిటోరియంలో విద్యుత్తు అదాలత్, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మార్కాపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు దీనికి హాజరై తమ ఇబ్బందులు తెలియజేయాలన్నారు.

ఆన్‌లైన్‌లోనే ఇంటి పన్నుల చెల్లింపు

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నుల చెల్లింపు ప్రక్రియను ఇకపై పూర్తిగా ఆన్‌లైన్‌లోనే చేపట్టాలని మార్కాపురం మండల అభివృద్ధి అధికారి ఏ.బాలచెన్నయ్య తెలిపారు. రాయవరం గ్రామ సచివాలయ పరిధిలో ఆయన గురువారం అవగాహన కల్పించారు. పన్ను వసూళ్లలో పారదర్శకతకు ప్రభుత్వం 'స్వర్ణ పంచాయతీ' పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చిందని, దీనివల్ల సులభంగా ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో ఇంటిపన్నులు చెల్లించవచ్చన్నారు. అనంతరం తెదేపా మండలాధ్యక్షుడు కాకర్ల శ్రీనివాసులుతో కలిసి గోడపత్రాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

మార్కాపురంలో పత్తి కొనుగోలు కేంద్రం

మార్కాపురం గ్రామీణం: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మార్కాపురం మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రం అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి బుజ్జిబాయి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సి.సి.ఐ నిర్దేశించిన మేరకు పొడవు పింజ రకం క్వింటా రూ.8,110, పొట్టి పింజ రకం క్వింటా రూ.7,710 కనీస మద్దతు ధరకు రైతులు పత్తి అమ్ముకోవచ్చన్నారు.

ఆకాశదీపం ఏర్పాటు

పొదిలి: పొదిలిలోని శ్రీవెంకయ్యస్వామి దేవాలయంలో గురువారం ఆకాశదీపం ఏర్పాటుచేశారు. ముందుగా అన్నపూర్ణేశ్వరి ఆలయంలో మహిళలు కార్తికదీపాలు వెలిగించి పూజలు చేశారు.

పరివర్తకం వద్ద మంటలు

పెద్దారవీడు, న్యూస్‌టుడే: విద్యుత్తు తీగలు రాసుకోవడంతో పరివర్తకం వద్ద మంటలు రేగాయి. ఈ సంఘటన పోతంపల్లిలో గురువారం చోటుచేసుకుంది. దీంతో సరఫరా నిలిచిపోయింది. మూడేళ్లుగా లైన్‌మెన్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ

అర్థవీడు, న్యూస్‌టుడే: సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఆరుగురు విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్రజట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లీశ్వరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల మైనంపాడులో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో కొత్త షర్మిల, రవళి, ప్రసాద్; అండర్-17 విభాగంలో తేజేశ్వర్‌రెడ్డి, లక్ష్మి, కాశీలక్ష్మి విజయం సాధించి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. త్వరలో పులివెందులలో అండర్-14, వీరవాసరంలో అండర్-17 రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయన్నారు. క్రీడాకారులతో పాటు పీడీ చెంచయ్యను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.



మార్కాపురం పట్టణం: క్రీడాకారులతో ఉపాధ్యాయులు

కబడ్డీ పోటీల్లో..

మార్కాపురం గ్రామీణం: గజ్జలకొండ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు అర్హత సాధించారని ప్రధానోపాధ్యాయుడు ఎ.శ్యామ్‌శుభాకర్ తెలిపారు. అండర్-17కు ఎ.సూర్యతేజ, అండర్-14కు ఎం.రుబాస్, జి.అభిలాష్ ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

▶ మార్కాపురం పట్టణం: పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కంచర్లవారిపల్లి జడ్పీపాఠశాలలో బుధవారం జరిగిన అండర్-14, 17 పోటీల్లో పాఠశాలకు చెందిన వి.మహేష్, ఎం.అజయ్, జస్వంత్‌నాయక్, పి.అజయ్, ఎం.అభి, డి.రాజశేఖర్‌రెడ్డి ఎంపికయ్యారు. గురువారం పాఠశాలలో వారిని అభినందించారు. కార్యక్రమంలో పీడీలు డి.శ్యామలాదేవి, పి.దామోదర్ రెడ్డి, కె.ఓబులేసు పాల్గొన్నారు.

"॥ జాతస్వి హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ॥
తస్మాదపరిహార్యేర్థేన త్వం శోచితుమర్హసి॥"

శ్రద్ధాంజలి

23-08-1957
12-11-2025

కీ॥శే॥ శ్రీ రాజా శాయపనాయుని ఉమాశంకర్‌ప్రసాద్ గారు
(పెద్దబొమ్మలాపురం దొరవారు)
పెద్దబొమ్మలాపురం, దోర్నాల(మం)

నిండు మనస్సుతో ఎల్లవేళలా అందరి శ్రేయస్సు కాంక్షిస్తూ... కల్మషమెరుగని చిరునవ్వుతో మా అందరి హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న మీ అకాల మరణం మాకు తీరనిలోటు... మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆసర్వేశ్వరుణ్ణి ప్రార్థిస్తూ...

పెద్దకర్మ: తేది: 22-11-2025 శనివారం రోజు సంయుక్త వేదిక కళ్యాణ మండపము సాయిబాబా గుడి దగ్గర, విజయవాడ నందు జరుగును.

భార్య: శాయపనాయుని విజయలక్ష్మి
కుమార్తెలు: శాయపనాయుని విద్య, శాయపనాయుని కావ్య
అల్లుళ్ళు: తూమాటి వంశీకృష్ణ, బొద్దులూరు శ్రీదీష్
మనుమడు: తూమాటి జైష్ణవిశ్రుత్
మనుమరాలు: బొద్దులూరు ప్రవిజ్ఞ
మామయ్య: (లేటు) తుమ్మల నాగేశ్వరరావు
అత్తమ్మ: తుమ్మల భరద్వాజలక్ష్మి
బావమరుదులు: తుమ్మల బాలకృష్ణ- సుధ
తుమ్మల విష్ణుమోహన్‌ప్రసాద్-లీలాకుమారి
తుమ్మల సుధాకర్- శిరీషదేవి
మరియు బంధుమిత్రులు

(c) eenadu

కనిగిరి

• కనిగిరి • దర్శి • కొండపి

అందరిలో ఆకట్టుకుని.. విజేతగా నిలిచి!

కనిగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎంఎస్‌ఆర్ ఎస్ ఉన్నత పాఠశాలలో 'కృత్రిమ మేధ (ఏఐ)తో భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఇందులో ఎ. యోగేంద్రనాథ్‌రెడ్డి, పి.మేఘమాల, ఎస్.మానస్వినిరెడ్డిలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి కరస్పాండెంట్ మద్దులూరి హనుమంతరావు, డైరెక్టర్ పాలూరి వరుణ్‌కుమార్‌రెడ్డిలు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. ● దర్శి: 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు గురువారం దర్శి వివేకానంద ఉన్నత పాఠశాలలో జరిగాయి. 7 నుంచి 10వ తరగతి బాలబాలికలకు 'విద్యార్థుల జీవితాల్లో సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో చరవాణి వినియోగం వల్ల జరిగే నష్టాలపై విద్యార్థులు చక్కగా వివరించారు. ప్రతిభ చూపి తొలి మూడు స్థానాల్లో నిలిచిన కె. హేమంత్, జె.యశస్వి, వి.మోక్షగ్నశ్రీలకు ప్రిన్సిపల్ రామాంజనేయులు చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, మస్తాన్‌వలి, దయాకర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న ఎంఎస్‌ఆర్‌ఎస్ హైస్కూల్ కరస్పాండెంట్ హనుమంతరావు, డైరెక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి

బహుమతులు అందుకున్న విద్యార్థులతో దర్శి వివేకానంద పాఠశాల ఉపాధ్యాయులు

1,691 పొగాకు బేళ్ల కొనుగోలు

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: కొండపి వేలం కేంద్రంలో గురువారం 429 పొగాకు బేళ్లు తిరస్కరించినట్లు నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. బోర్డు పరిధిలోని చోడవరం, ముప్పవరం, వెన్నూరు, చిన్నవెంకన్నపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1,338 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా, అందులో 909 బేళ్లను కొనుగోలు చేశారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.310, కనిష్ఠ ధర రూ.50 పలికిందన్నారు. ● టంగుటూరు: టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో గురువారం 346 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. పొందూరు గ్రామానికి చెందిన రైతులు 1,128 బేళ్లను తీసుకు రాగా.. 782 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ఠ ధర రూ.310, కనిష్ఠ ధర రూ.50, సరాసరి ధర రూ.160 పలికినట్లు వేలం కేంద్ర నిర్వహణాధికారి ఆట్లూరి శ్రీనివాసరావు తెలిపారు.

గ్రంథాలయం.. మరో ప్రపంచం!

-న్యూస్‌టుడే, కనిగిరి

గ్రంథాలయం.. విజ్ఞాన భాండాగారం. సాధారణ వ్యక్తులను సైతం జ్ఞానవంతులుగా మార్చే సరస్వతి నిలయం. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వారం రోజుల పాటు జరిగిన గ్రంథాలయ వారోత్సవాల్లో విద్యార్థులు రోజుకొక అంశం చొప్పున ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నారు. కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని శాఖా గ్రంథాలయాల పరిధిలో బాలబాలికలకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వం, పాటల పోటీల్లో నిర్వహించారు. రామాయణం, మహాభారతం, భాగవతం వంటి వాటిపైనా వక్తలు అవగాహన కల్పించారు. మహనీయుల జీవిత చరిత్రలు చదివి వారి గురించి తెలుసుకున్నారు. మొత్తం మీద గ్రంథాలయ వారోత్సవాల్లో ఎన్నో కొత్త విషయాలు తెలుసుకున్నామని, పుస్తక పఠనం ఇక అలవాటుగా మార్చుకుంటామని కనిగిరి, వెలిగండ్ల మండలాలకు చెందిన విద్యార్థులు తమ అభిప్రాయాలను పంచుకున్నారిలా..

కనిగిరి గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న చిన్నారులు

మహనీయుల గురించి తెలుసుకున్నాం

ప్రతి రోజూ గ్రంథాలయానికి వెళ్లి ఎన్నో విషయాలు తెలుసుకున్నా. వ్యాసరచన పోటీలో పాల్గొని ప్రతిభను చాటి బహుమతులు అందుకున్నాను. దీంతో పాటు జాతీయ నాయకులు, రాజుల పరిపాలనకు సంబంధించిన పుస్తకాలు చదివాను. మన సంస్కృతి, సంప్రదాయాల గురించి కూడా తెలుసుకున్నాను.

-సన, సహనభాను, 7వ తరగతి, కనిగిరి

పత్రికలు చదువుతాను..

రోజూ మాకు దినపత్రిక అందుబాటులో ఉన్నా.. ఎప్పుడూ చదివేదాన్ని కాదు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా రోజూ పత్రికలు చదివాను. దేశ విదేశాల్లోని తెలియని కొత్త విషయాలు ఎన్నో అందులో ఉంటున్నాయి. ఆదివారం వచ్చే ప్రత్యేక అనుబంధ పుస్తకంలోనూ ఎన్నో వింతలు, విశేషాలు, పజిల్స్ ఉంటున్నాయి. ఇక నుంచి నిత్యం పత్రికలు చదువుతాను.

-శ్రావ్య, పదోతరగతి, కేజీబీవీ, వెలిగండ్ల

క్రమం తప్పకుండా వెళ్తాను..

వారం రోజులపాటు వెలిగండ్ల గ్రంథాలయానికి వెళ్లాను. ఎన్నో పుస్తకాలు చదివాను. శాస్త్రవేత్తలు, కవులు, చరిత్రకారుల గురించి తెలుసుకున్నా. విజ్ఞానం అందించే పుస్తకాలు చదివా. ఇక నుంచి క్రమం తప్పకుండా గ్రంథాలయానికి వెళ్తాను. పాఠ్యాంశాలతోపాటు, ఇతర పుస్తకాలను చదవడం అలవాటు చేసుకుంటాను.

-పవిత్ర, ఇంటర్ విద్యార్థిని

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

దర్శి, న్యూస్‌టుడే: పట్టణంలోని గాంధీనగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్తు పరివర్తక మార్పు సందర్భంగా శుక్రవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని పట్టణ ఏఈ సచ్చేన్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8-11 గంటల మధ్య బాలాజీ సెంటర్, గాంధీనగర్, ఎల్వీ రోడ్డు, కిడ్స్ పాఠశాల రోడ్డు, దద్దాలమ్మ ఆలయం ప్రాంతం, టీచర్స్ కాలనీ, హ్యాపీ హోమ్స్, కొత్తరెడ్డిపాలెం ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

పామూరు, న్యూస్‌టుడే: మండలంలోని వగ్గంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 19న కందర్పవారిపల్లి హైస్కూల్‌లో పోటీలు నిర్వహించగా, అండర్ 17 విభాగంలో బి.నాగసుందరి, ఎస్.మహాలక్ష్మి, ఎస్కే.మహమ్మద్ సమీ తదితరులు ప్రతిభ చాటారు. వీరు ఈ నెల 21 నుంచి 23 వరకు కర్నూలులో జరగనున్న ఎస్జీఎఫ్ కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా వారిని ప్రత్యేకంగా అభినందించారు.

పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ

కనిగిరి, న్యూస్‌టుడే: పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కోరారు. గురువారం మండలంలోని తుమ్మగుంట అటవీ ప్రాంతంలోని నగరవనంలో అటవీశాఖ ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించి మొక్కలు నాటారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పచ్చదనం ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉండగలమన్నారు. వాతావరణ కాలుష్యం నుంచి బయట పడతామన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసులు, కనిగిరి అటవీశాఖ అధికారి టి.ఉమామహేశ్వరరెడ్డి, విద్యుత్తు శాఖ డీఈఈ ఉమాకాంత్, తహసీల్దార్ ఎన్.జయలక్ష్మి, కమిషనర్ పి.కృష్ణమోహన్‌రెడ్డి, తెదేపా పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, నాయకులు పాల్గొన్నారు.

మొక్క నాటుతున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, అటవీశాఖ అధికారులు

మార్మోగిన అయ్యప్ప శరణు ఘోష

ముండ్లమూరు, న్యూస్‌టుడే: మండలంలోని మారెళ్లలో అయ్యప్పస్వామి పడిపూజ గురువారం వైభవంగా జరిగింది. అరటి బోదెలతో మండపాన్ని నిర్మించి స్వామివారి చిత్రపటాలకు విశేష పూజలు నిర్వహించారు. ఇరుముడి ఏర్పాటు చేసిన అగ్ని గుండంలో భక్తులు నడిచారు. అయ్యప్ప, శివ, ఆంజనేయ, భవాని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భజనలు చేశారు. అనంతరం మాలధారులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ● దొనకొండ: స్థానిక శివాలయంలో స్వామియే శరణం అయ్యప్ప అంటూ అయ్యప్ప శరణు ఘోష మార్మోగింది. ఆలయంలో మాలధారులు అరటి మండపాన్ని ఏర్పాటు చేసి అందులో శివపార్వతులు, కనకదుర్గమ్మ, గణపతి, సుబ్రమణ్యేశ్వరస్వామి, అయ్యప్ప స్వామి విగ్రహాలను ఉంచి అలంకరించారు. గురుస్వామి వెంకటేశ్వర్లు, పూజారి మణిశర్మబాబు ఆధ్వర్యంలో పంచామృత అభిషేకాలు చేశారు.

దొనకొండ: పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభ

టంగుటూరు, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం గ్రామాల్లో కూలీలకు పనులు కల్పిస్తూ వారికి భరోసా ఇస్తుందని ఒంగోలు క్లస్టర్ అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ సుబ్బారావు తెలిపారు. టంగుటూరు మండలం కారుమంచిలో 2026-27 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులపై గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంద రోజుల పని దినాలు కల్పించాల్సి ఉందన్నారు. గ్రామ సహజ వనరుల పటం ద్వారా పనుల గుర్తింపుపై తెలియజేశారు. ఎంపీడీవో దేవసేన కుమారి, సర్పంచి మస్తాన్ శ్రీనివాసరావు, ఏపీవో మాచర్ల, పంచాయతీ కార్యదర్శి స్వర్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ చిత్రపటం ద్వారా పనుల గుర్తింపుపై వివరిస్తున్న అధికారులు

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

దర్శి, న్యూస్‌టుడే: దోపిడీ, పీడన నుంచి ప్రపంచ మానవాళికి విముక్తి మార్గాన్ని చూపేది సోషలిజమే అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొండారెడ్డి, అంజనేయులు తెలిపారు. గురువారం దర్శి సుందరయ్య భవన్‌లో పిచ్చయ్య అధ్యక్షతన సీపీఎం నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. సమాజంలో ప్రస్తుతం జరుగుతున్న సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమన్నారు. కార్యక్రమంలో నారాయణ, జాన్‌సామ్యేల్, ఏడుకొండలు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలపై అప్రమత్తత అవసరం

దర్శి, న్యూస్‌టుడే: వాతావరణ పరిస్థితులతో జ్వరాల వ్యాప్తి అధికంగా ఉందని, వీటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చందలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డా. జ్యోత్స్న సూచించారు. మండలంలోని వెంకటాచలంపల్లిలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరం, ఒంటి నొప్పులు, నీరసం వంటి లక్షణాలు కలిగిన 76 మందికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు ఇచ్చారు. అనంతరం ఇంటింటికీ తిరిగి జ్వర సర్వే నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ.. జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో పాటు స్వీయ శుభ్రత పాటించాలని కోరారు. అనంతరం వెంకటాచలంపల్లి, తానంచింతల గ్రామాల్లో మురుగు కాలువల, చెత్త కుప్పలపై క్రిమి సంహారక మందులు పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ శ్రీనివాసులు, ల్యాబ్‌టెక్నీషియన్ వసంతకుమార్, అలోక్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటాచలంపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మేమున్నాం.. మీకు తోడుగా

కనిగిరి : 8008574114, (10 AM TO 1 PM)
దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

?: మర్రిపూడి మండలం అంకేపల్లి పంచాయతీ సన్నమూరు ఎస్సీ కాలనీలో వీధిదీపాలు వెలగడం లేదు. రాత్రి పూట చీకట్లో తిరగాల్సి వస్తోంది. -వెంకటేశ్వర్లు, స్థానికుడు

✓:పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి వెంటనే మరమ్మతులు చేయిస్తాం. -నాగూర్‌వలీ, డిప్యూటీ ఎంపీడీవో

?:హనుమంతునిపాడు మండలం మల్లవరం - ఆవులవారిపల్లి రహదారి గుంతలమయంగా మారింది. చిల్లచెట్లతో కనీసం వాహనాలు నడిచే పరిస్థితి లేదు.

-తాతిరెడ్డి రామిరెడ్డి, స్థానికుడు

✓: పంచాయతీరాజ్ అధికారులకు తెలియజేసి చిల్లచెట్లు తొలగిస్తాం. గుంతలను పూడ్చిస్తాం.

-ఎం.రంగసుబ్బారాయుడు, ఎంపీడీవో

- న్యూస్‌టుడే, మర్రిపూడి, హనుమంతునిపాడు

పట్టించుకోక.. వినియోగంలోకి రాక

సింగరాయకొండ తహసీల్దార్ కార్యాలయం కోసం ఏర్పాటు చేసిన జనరేటర్ దిష్టి బొమ్మలా దర్శనమిస్తుంది. అధికారులు నిర్వహణ పట్టించుకోకపోవడంతో ఆవరణలోని ఆరుబయటే ఉంది. దీంతో ఎండకు ఎండి వానకు తడిసి తుప్పు పట్టింది. విద్యుత్తు సరఫరా నిలిచిన సమయంలో విధులకు తీవ్ర ఆటంకం కలుగుతుందని సిబ్బంది వాపోతున్నారు. దీనిపై తహసీల్దార్ రాజేష్‌ను వివరణ కోరగా.. ఉన్నతాధికారులకు నివేదిక అందించామని, నిధులు మంజూరైన వెంటనే మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు.

-న్యూస్‌టుడే, సింగరాయకొండ గ్రామీణం

తూమాడు.. కాలువ చూడు

జరుగుమల్లి మండలం తుమాడు గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతో దోమల సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. కొంత కాలంగా కాలువలను శుభ్రం చేయకపోవడంతో వాటిలో నీరు కదలడం లేదు. పూడికలు పేరుకు పోయి దుర్వాసన వస్తోందని చెబుతున్నారు. కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి మౌనికను వివరణ కోరగా.. త్వరలో కాలువలను శుభ్రం చేయించి దోమల నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

-న్యూస్‌టుడే, జరుగుమల్లి

నిత్యం వెలుగులైతే.. తర్వాత చీకట్లే!

పొన్నలూరు మండలం చెన్నిపాడు గ్రామంలో వీధి దీపాలు రాత్రి, పగలు అనే తేడా లేకుండా నిత్యం వెలుగుతూనే ఉన్నాయి. దీంతో అవి కాలిపోయే అవకాశాలు ఉన్నాయని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. రాత్రి సమయంలో మాత్రమే వెలిగే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి రమణమ్మను వివరణ కోరగా.. పరిశీలించి వీధి దీపాలకు ఆన్‌ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు.

-న్యూస్‌టుడే, పొన్నలూరు

దారిపై గుంత.. చూడకుంటే చింత

తాళ్లూరు-కొర్రపాటివారిపాలెం రహదారి మొంథా తుపాను ప్రభావంతో కోతకు గురైంది. తాళ్లూరు శివారున పాముల వారి కాలనీ సమీపాన పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనాలు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై తాళ్లూరు పీఐయూ సబ్‌డివిజన్ ఏఈ శంకరరావును సంప్రదించగా.. రహదారి అభివృద్ధికి నిధులు మంజూరుకోసం ప్రతిపాదించామని, విడుదల కాగానే మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తామన్నారు.

-న్యూస్‌టుడే, తాళ్లూరు

బాలల సంరక్షణ అందరి బాధ్యత

తాళ్లూరు, న్యూస్‌టుడే: బాలల హక్కులు, వారి సంరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి కె.శేఖర్‌బాబు సూచించారు. స్థానిక వీకే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధానోపాధ్యాయులు కె.ఆరోన్‌మిల్టన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ తదితర అంశాలపై వివరించారు. బాలల జిల్లా సంరక్షణ విభాగం సిబ్బంది ఎన్.వీరాంజనేయులు, ఎ.దేవకుమారి, మహిళా సంరక్షణ విభాగం కార్యదర్శి సుకన్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● దర్శి: గ్రంథాలయాలు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పడతాయని దర్శిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రంగారావు తెలిపారు. గురువారం పాఠశాల ఆవరణలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథపాలకురాలు విజయకుమారి, ఉపాధ్యాయులు కృష్ణప్రసాద్, నర్సిరెడ్డి, లావణ్య, వరలక్ష్మి, ఎలిసెమ్మ, ఇతరులు పాల్గొన్నారు. ● పామూరు: ప్రపంచ బాలల హక్కుల దినోత్సవాన్ని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్, స్వయంకృషి సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంఈవో కోటిరెడ్డి వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ● టంగుటూరు: టంగుటూరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. మాజీ సర్పంచి బెల్లం జయంత్‌బాబు, బెజవాడ వెంకటేశ్వర్లు, కామని విజయ్‌కుమార్, తోకల భారతి తదితరులు పాల్గొన్నారు.

పామూరు: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో కోటిరెడ్డి, ఉపాధ్యాయులు

రాయితీపై పశువుల దాణా పంపిణీ

దర్శి: తుపాను నష్ట నివారణ చర్యల్లో భాగంగా రైతులకు 50 శాతం రాయితీపై పశువుల దాణా పంపిణీని గురువారం చేపట్టారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో 50 కిలోల దాణా బస్తాను 50 శాతం రాయితీపై రూ.550లకు అందజేశారు. మున్సిపల్ ఛైర్మన్ పిచ్చయ్య చేతుల మీదుగా రైతులకు 5 టన్నుల దాణా పంపిణీ చేశారు. దర్శి, తాళ్లూరు, ముండ్లమూరు మండలాల పరిధిలో రైతులకు 30 టన్నుల దాణాను రాయితీపై పంపిణీ చేసినట్లు పశుసంవర్ధకశాక ఏడీ డా.పురుషోత్తంరాజు తెలిపారు.

పాము కాటుతో రైతు మృతి

దర్శి, న్యూస్‌టుడే: పొలం పనులు చేస్తున్న సమయంలో పాము కాటువేయడంతో రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని తూర్పువీరాయపాలెంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ముప్పరాజు వెంకటేశ్వర్లు (52), తన పొలంలో గడ్డిని ట్రాక్టరుకు ఎత్తుతున్న సమయంలో పాము కాటు వేసింది. సమీప పొలంలో పని చేస్తున్న వారు గమనించి ద్విచక్ర వాహనంపై దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రైవేట్ అంబులెన్సులో ఒంగోలు తరలించే క్రమంలో మార్గం మధ్యలోనే మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అతడి కుమారుడు వెంకట నవీన్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రాంబాబు తెలిపారు.

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ

టంగుటూరు, న్యూస్‌టుడే: విత్తన శుద్ధితో తెగుళ్లు నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం మాస్టర్ ట్రైనర్ నరసింహులు తెలిపారు. మండలంలోని ఎం.నిడమానూరు, కొణిజేడు గ్రామాల్లో శనగ, మినుము సాగు రైతులకు విత్తన శుద్ధిపై గురువారం అవగాహన కల్పించారు. బీజామృతంతో విత్తన శుద్ధి చేయడం వల్ల తెగుళ్లను నివారించవచ్చన్నారు. అంతర పంటలుగా ఆవాలు, ధనియాలు, పొద్దుతిరుగుడు, జొన్న, సజ్జ వంటి పంటలు వేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ఆచరిస్తే తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ భరత్, యూనిట్ ఇన్‌ఛార్జి వెంకటరావు, సిబ్బంది విజయలక్ష్మి, కవిత తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధి చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు

పంట ఉత్పత్తుల నాణ్యతకు జాగ్రత్తలు తప్పనిసరి..

తాళ్లూరు, న్యూస్‌టుడే: పంట కోతలు పూర్తయ్యాక వాటిని విక్రయించే వరకూ ఉత్పత్తుల్లో నాణ్యత తగ్గకుండా ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో బి.ప్రసాదరావు తెలియజేశారు. తాళ్లూరు రైతు సేవా కేంద్రం పరిధిలో గురువారం పంట క్షేత్రాలను పరిశీలించి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గోదాముల్లో ఎలుకలు, పందికొక్కులు ఉత్పత్తులను పాడు చేయకుండా ఉండేందుకు మెట్టు ఏర్పాటు చేయాలని సూచించారు. గదుల్లో నాలుగువైపులా గోడలకు వేపాకు ద్రావణం పిచికారీ చేయాలన్నారు. వీఏఏ సాయి, రైతులు పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాలపై అవగాహన

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాలపై అవగాహన కలిగి ఉండాలని కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల అధ్యాపకులు సూచించారు. ఇక్కడ బీఎస్సీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరంలో భాగంగా సామాజిక మాధ్యమాలపై గురువారం శీలంవారిపల్లిలో ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. యువతలో సామాజిక మాధ్యమాల పట్ల పెరుగుతున్న ఆసక్తి, వారిపై అవి చూపుతున్న ప్రభావం గురించి అధ్యాపకులు వివరించారు. సమాజ శ్రేయస్సు కోసం సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకోవాలని కోరారు.

ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

రబీపైనే ఆశలు!

-న్యూస్‌టుడే, టంగుటూరు, తాళ్లూరు, జరుగుమల్లి

ఈ ఏడాది ఖరీఫ్‌లో వేసిన అనేక పంటలు వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో అన్నదాతలు రబీపైనే ఆశలు పెంచుకున్నారు. కొండపి, దర్శి నియోజకవర్గాల్లో ఇప్పటికే వరి సాగుపై దృష్టి సారించగా.. మరికొందరు పొగాకుతోపాటు, ఇతర పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. కుంటలు, చెరువులు, వాగుల్లో జలకళ సంతరించుకోవడంతో సాగునీటికి ఇబ్బందులు రావని భావిస్తున్నారు.

ప్రధాన పంటల వైపే రైతుల మొగ్గు..

కొండపి నియోజకవర్గంలోని టంగుటూరు, జరుగుమల్లి, కొండపి, మర్రిపూడి, దర్శి నియోజకవర్గంలో తాళ్లూరు, దొనకొండ, దర్శి, కురిచేడు మండలాల పరిధిలో పొగాకు, శనగ పంటల సాగుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. ఏటా వీటి ధరల్లో వ్యత్యాసాన్ని బట్టి పంట మార్పిడులు జరుగుతుంటాయి. శనగ ధరలు నేలచూపు చూస్తుండటంతో కోల్డ్‌స్టోరేజీల్లోనే గత పంట ఇంకా మొగ్గుతుంది. రబీకి టంగుటూరు బోర్డు పరిధిలో 250 హెక్టార్లలో పొగాకు పంట వేశారు. శనగ పంట 100 ఎకరాల్లో సాగు చేపట్టారు.

ఈ మండలాల్లో వరి వైపు..

టంగుటూరు మండలంలోని వాసేపల్లిపాడు, సూరారెడ్డిపాలెం, మర్లపాడు, వల్లూరు గ్రామాల్లో ఏటా 500 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. సింగరాయకొండ మండలంలో 1,500 ఎకరాలు, జరుగుమల్లి మండలంలో 350 ఎకరాల చొప్పున ఏటా సాగు చేస్తున్నారు. ఈ ఏడాది సాగు మరికొంత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. తాళ్లూరు మండలంలో బోర్ల కింద మూడు పంటలు పండిస్తున్నారు. ముండ్లమూరు, దర్శి మండలాల్లోనూ సాగర్ ఆయకట్టు పరిధిలో వరి ఎక్కువగా వేయనున్నారు.

పొగాకు నారు ధరలు పెరిగినా..

గత సీజన్‌లో పొగాకు సాగుతో ఊహించని విధంగా నష్టాలు వాటిల్లాయి. వాటిని ప్రస్తుత సీజన్‌లోనైనా పూడ్చుకోవాలనే ఆశతో రైతులు పొగాకు సాగు ఆరంభించారు. మొంథా తుపాను ధాటికి అప్పటికే నాటిన పొగాకు మొక్కలు ఉరకెత్తి దెబ్బతిన్నాయి. అనేక చోట్ల నారు మళ్లు దెబ్బతిన్నాయి. దీంతో ఇప్పుడు పొగాకు నారు ధరలకు రెక్కలొచ్చాయి. తొలుత నారు మూట ధర రూ.మూడువేలు ఉండగా ప్రస్తుతం రూ. ఏడు వేలకు పెరిగింది. అయినప్పటికీ కొనుగోలు చేసి రెండోసారి రైతులు తమ పొలాల్లో పొగాకు నాట్లు వేయిస్తున్నారు.

వావిలేటిపాడులో నాటేందుకు పొగాకు నారు తీస్తున్న కూలీలు

సంక్షేమబోర్డు పునరుద్ధరించాలని ఆందోళన

కనిగిరి, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ గురువారం ఆర్డీవో కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ.. గతంలో మంజూరైన పథకాల లబ్ధిదారులకు నిధులు విడదల చేయాలన్నారు. ఉచిత ఇసుక హామీ అమలు చేయాలన్నారు. అర్హులైన కార్మికులకు పథకాలు అందించేందుకు అర్జీలు తీసుకోవాలన్నారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీవో కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణయ్య, నరసింహ, వెంకటయ్య, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

(c) eenadu

ఎస్పీని కలిసిన గ్రానైట్ యజమానులు

చీమకుర్తి, న్యూస్‌టుడే: జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానుల సంఘం ప్రతినిధులు... ఎస్పీ హర్షవర్ధన్ రాజును గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను సత్కరించి అభినందనలు తెలిపారు. మార్కెట్ బజ్జి, కట్టగ్రడ్డ రమణయ్య, యర్ర గుంట్ల శ్రీనివాసరావు, లగడపాటి శ్రీనివాసరావు, భవానీ ప్రసాద్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని సత్కరిస్తున్న ప్రతినిధులు

ఒంగోలు

•ఒంగోలు •సంతనూతలపాడు

ప్రయోజకర పనులకు ప్రాధాన్యం

మద్దిపాడు, న్యూస్‌టుడే: ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా ఉపాధి పనులు గుర్తించాలని ఏపీవో ధనుంజయరావు తెలిపారు. సీతారాంపురం పంచాయతీలో సర్పంచి మండవ శివానందరావు అధ్యక్షతన గురువారం నిర్వహించిన ఉపాధి గ్రామసభలో మాట్లాడారు. జల వనరుల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అందరికీ ఉపాధి కల్పించేలా పనులు అంచనాలు రూపొందించాలన్నారు. సామాజిక వనరుల చిత్రంతో పాటు నెలల వారీగా చేపట్టాల్సిన పనులను రంగవల్లుల రూపంలో తీర్చిదిద్దడం ప్రత్యేకంగా నిలిచింది. కార్యదర్శి సుభాషిణి, సాంకేతిక సహాయకులు హనుమాన్ ప్రసాద్, స్వాతి, క్షేత్ర సహాయకులు కల్యాణి, నవీనలు సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

ప్రసంగ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

'ఈనాడు' ప్రతిభాపాటవ పోటీల్లో భాగంగా కర్నూలు సెంటర్‌లోని రవీంద్రభారతి, కర్నూలు రోడ్డులోని జూపిటర్ హైస్కూల్లో గురువారం నిర్వహించిన ఉపన్యాస పోటీలు ఉత్సాహంగా సాగాయి. 7, 8, 9, 10 తరగతుల వారు పాల్గొని 'విద్యార్థులపై సెల్‌ఫోన్ ప్రభావం' అన్న అంశంపై తమ అభిప్రాయాలను తెలియజేస్తూ ప్రసంగించారు. రవీంద్రభారతిలో వి.వైశాలి, జె. హర్షిత జి.దేవా చరిత్ర... ప్రతిభ చాటి తొలి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ టి.లక్ష్మీరాజ్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ❖ జూపిటర్ స్కూల్లో వర్షిణ్య, శ్రుతి, మహిత... వరుసగా తొలి మూడు స్థానాలు సాధించారు. విజేతలను కరస్పాండెంట్ ఆలూరు వంశీకృష్ణ, ప్రిన్సిపల్ భార్గవి అభినందించి బహుమతులు అందజేశారు.

– న్యూస్‌టుడే, ఒంగోలు విద్య

విజేతలతో జూపిటర్ పాఠశాల ఉపాధ్యాయులు

బహుమతులు అందుకున్న వారితో రవీంద్రభారతి స్కూల్ ప్రతినిధులు

భాజపాలో వ్యాపారుల చేరిక

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు మండలాలకు చెందిన 20 మంది వ్యాపారులు గురువారం భాజపాలో చేరారు. పార్టీ రాష్ట్ర కో-కన్వీనర్ నిడమనూరి కల్యాణచక్రవర్తి, జిల్లా అధ్యక్షుడు సెగ్గెం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో... గుర్తి శ్రీధర్, వాసుదేవ్, కిషోర్‌కుమార్‌తో పాటు ఇరవై మందికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో వికసిత్ భారత్ లక్ష్యంగా దేశం ప్రగతిపథంలో నడుస్తోందన్నారు. నాయకులు మాకినేని అమరసింహం, రాయపాటి అజయ్, బి.అంజనేయులు, సత్యవతి పాల్గొన్నారు.

పార్టీలో చేరిన వారితో నాయకులు కల్యాణ చక్రవర్తి, శ్రీనివాసరావు

ఆలయ ఆదాయం... ఖర్చులంతా రహస్యం!

❖ విమర్శలకు తావిస్తున్న ఉప్పుగుండూరు వ్యవహారం

న్యూస్‌టుడే – నాగులుప్పలపాడు

దేవాదాయశాఖ పర్యవేక్షణ కొరవడడంతో ఆలయాల ఆదాయం పక్కదారి పడుతోంది. అవకతవకలు వెలుగు చూస్తున్నా కనీస చర్యలు లేకపోవడంతో ఈ తరహా ఘటనలు మరిన్ని చోటుచేసుకుంటున్నాయి. మద్దిరాలగుంట శివాలయం, ఉప్పుగుండూరులోని శ్రీవేణుగోపాలస్వామి, ఆళ్వారాజుల దేవస్థానంలో చోటుచేసుకున్న ఉదంతాలే ఇందుకు నిదర్శనం.

వేణుగోపాలస్వామి, ఆళ్వారాజుల దేవస్థానం

బ్రహ్మోత్సవాలు నిర్వహించకపోయినా...

ఉప్పుగుండూరులోని ఆలయానికి 53.84 ఎకరాల మాన్యం భూములున్నాయి. ఏటా కౌలు రూపంలో రూ.15 లక్షల మేర ఆదాయం లభిస్తోంది. దాతలు ఇచ్చే విరాళాలు దీనికి అదనం. ఇంతవరకు బాగానే ఉన్నా ఈ నిధులను ఈవో పక్కదారి పట్టిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏళ్లుగా ఖర్చులే పడిపోవడంతో ఆయన జమా ఖర్చుల సరిగా చూపకపోవడం... కరోనా కారణంగా 2020, 21 సంవత్సరాల్లో ఆలయం తలుపులు తెరవకపోయినా బ్రహ్మోత్సవాలు నిర్వహించినట్లు లెక్కల్లో చూపారు. నూతన పాలకవర్గం, గ్రామస్థులు జీవిత నిర్వహించిన సమావేశంలో 2019-25 మధ్య ఖర్చుల వివరాలు ఇవ్వాలని కోరినా తగిన రీతిలో స్పందించలేదు. రూ.లక్షల్లో తేడాలు ఉండటంతో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ధర్మకర్తల మండలి ఛైర్మన్ మాగులూరి సత్యనారాయణ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఈవో శ్రీనివాసరావును సంప్రదించగా... జమా ఖర్చులకు సంబంధించి ఆడిట్ పూర్తయిందని, ప్రస్తుతం చేస్తున్నవి ఆరోపణలు మాత్రమేనని పేర్కొన్నారు.

❖ మద్దిరాలగుంట శివాలయం అధికారిగా పనిచేసిన సమయంలోనూ సుమారు రూ.70 లక్షల మేర అవకతవకలు వెలుగు చూశాయి. కౌలు ఆదాయం పూర్తిగా పక్కదారి పట్టినట్లు గుర్తించారు. ఆలయ ఆర్జిత ఆదాయం జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉండడంపై గ్రామస్థులు సైతం నిలదీశారు. ఇక్కడి నుంచి బదిలీ అయినా తరువాత పలువురు అధికారికి ఆలయ బాధ్యతలు అప్పగించలేదు.

నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

వైద్య కళాశాలల్లో పీపీపీ విధానం తగదు

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: పీపీపీ విధానంలో వైద్య కళాశాలలు నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ మాట్లాడుతూ... కొత్తగా నిర్మిస్తున్న వైద్య కళాశాలలను ప్రైవేటీకరిస్తున్నారని ఆరోపించారు. పీపీపీ విధానంలో పాటు జీవో నం.107, 108, 590లను రద్దు చేయాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. సంఘం నాయకులు వి.కోటి, శ్యామ్‌సన్, చంద్రశేఖర్, సచిన్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

సంతనూతలపాడులో బహుమతులు అందుకున్న విద్యార్థులతో విద్యాధికారులు

గ్రంథాలయాల సద్వినియోగంతో ప్రయోజనం

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వరరావు తెలిపారు. సంతనూతలపాడు గురుకులంలో గురువారం నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలో మాట్లాడారు. చిత్రలేఖనం, వ్యాసరచన, పాటలు, క్విజ్, వక్తృత్వం, మ్యూజికల్ ఛైర్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తహసీల్దార్ నారాయణరెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు తన్నీరు శ్రీనివాసరావు, గ్రంథపాలకుడు కె.సత్యనారాయణ, ప్రిన్సిపల్ అనంతయ్య పాల్గొన్నారు. ❖ రుద్రవరం ప్రాథమిక పాఠశాలలో వివిధ విభాగాల్లో ప్రతిభ చాటిన పిల్లలను ఎంఈవో వెంకారెడ్డి, గ్రంథపాలకుడు శేఖర్ అభినందించారు. ❖ నాగులుప్పలపాడు: శాఖా గ్రంథాలయంలో అక్షరాస్యత ప్రాధాన్యతను వక్తలు తెలియజేశారు. ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథపాలకుడు శ్రీనివాసరావు, గ్రామ ప్రతినిధులు పాల్గొన్నారు.

వరి పంటకు తెగుళ్ల బెడద

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి మండలం పి.నాయుడుపాలెంలో వరి పంటను తెగుళ్లు ఆశిస్తుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మొంథా తుపాను ప్రభావంతో చేలలో పెద్ద ఎత్తున నీరు నిలవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని చెబుతున్నారు. చీమకుర్తి రూరల్‌లోని పొలాల్లో పైరు ఎర్రగా మారి ఎండిపోతోంది. రకరకాల పురుగు మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేకపోతోందని వాపోతున్నారు. ఈ విషయమై వ్యవసాయాధికారి స్పందిస్తూ ఇనుపధాతు లోపంతో సమస్య తలెత్తి ఉండొచ్చన్నారు. శుక్రవారం పంటను పరిశీలించి రైతులకు తగిన సూచనలు చేస్తామన్నారు.

రంగుమారి ఎండుతున్న పైరు

నగదు జమకాకపోతే సంప్రదించండి

మద్దిపాడు, న్యూస్‌టుడే: నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడి సాధ్యమని ఏవో సర్వత పేర్కొన్నారు. పెదకొత్తపల్లి, నేలటూరు గ్రామాల్లో గురువారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో మాట్లాడారు. తెగుళ్ల నివారణ, పంట మార్పిడి ఆవశ్యకతను తెలియజేశారు. అన్నదాత సుఖీభవ నగదు జమకాని రైతులు స్థానిక సచివాలయాల్లోని వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఏఈవో శేషయ్య, వీఏఏలు విజయరత్న, లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

హాకీ జట్టులో మద్దిపాడు విద్యార్థులు

మద్దిపాడు, న్యూస్‌టుడే: మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్-14 హాకీ పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మాల్యాద్రి తెలిపారు. ఈ నెల 22, 23, 24 తేదీల్లో చిత్తూరు జిల్లా చంద్రగిరిలో జరగనున్న పోటీల్లో జిల్లాకు వీరు ప్రాతినిధ్యం వహించనున్నారు. బాలికల విభాగంలో ఏడుగురు, బాలుర విభాగంలో ముగ్గురు ఈ అవకాశం దక్కించుకున్నట్లు చెప్పారు. పిన్నింటి ఛారిటబుల్ ట్రస్ట్ తరఫున కిషోర్, కల్యాణిలు... వారిని అభినందించి క్రీడాదుస్తులు అందజేశారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. వ్యాయామోపాధ్యాయినులు సౌజన్య, వనజ తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి: విద్యానికేతన్ పాఠశాలకు చెందిన ఆరికాటి సాయిలత రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ పి.రవీంద్రబాబు, పీఈటీలు కోటేశ్వరరావు, వెంకట్ తెలిపారు. హాకీ ప్రకాశం ఉపాధ్యక్షుడు రమణారెడ్డి తదితరులు ఆమెను అభినందించారు.

ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

కారు ఢీకొని తీవ్ర గాయాలు

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: కారు ఢీకొని ద్విచక్రవాహనదారుడికి గాయాలయ్యాయి. ఉప్పుగుండూరు సమీపంలో గురువారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చీరాల వైపు 216 జాతీయ రహదారిపై వెళ్తున్న కారు... నాగన్నవాగు సమీపంలో ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఘటనలో అమ్మనబ్రోలుకు చెందిన శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను 108 వాహనంలో ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
కొత్తపట్నం : 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: **ఒంగోలు నగరం:** రైల్వే స్టేషన్ రోడ్డులో సుబ్బమ్మ హోటల్ ఎదుట తాగునీటి పైపులైను దెబ్బతిని పక్షం రోజులుగా నీరు వృథాగా పోతోంది.– **దేవినేని శ్రీనివాస్**

?: ఒంగోలు నగరం: కర్నూలు రోడ్డు, పొగాకు వేలం కేంద్రం ముఖద్వారం పక్కనున్న మూడు వీధి దీపాలు వెలగడం లేదు.
– జి.సుబ్బారావు

✓: పై రెండు సమస్యలను రెండు రోజుల్లో పరిష్కరిస్తాం.– **ఏసయ్య, మున్సిపల్ ఇంజినీర్**

?: **నాగులుప్పలపాడు:** గ్రామంలో కాలువల నిర్వహణ సరిగా లేక ఎక్కడి మురుగు అక్కడే నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. దోమల సమస్యా పెరిగింది.– **వెంకట్రావు**

✓: పరిశీలించి... పారిశుద్ధ్య పనులు చేయిస్తాం.– **రవికుమార్, ఎంపీడీవో**

మొంథా మిగిల్చిన గాయం

ఒంగోలు - కర్నూలు రహదారిలో చీమకుర్తి నుంచి మర్రిచెట్లపాలెం మధ్య మార్గం పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతంలో గ్రానైట్ క్వారీలు, పరిశ్రమలు విస్తరించడం, పరిమితికి మించిన బరువులతో భారీ వాహనాలు తిరుగుతుండడంతో తరచూ సమస్య నెలకొంటోంది. సాధారణ మరమ్మతులు చేపట్టినా ప్రయోజనం లేకపోతోంది. మొంథా తుపాను ప్రభావంతో బైపాస్ కూడళ్లు, సినిమాహాళ్ల ప్రాంతం, వీరభద్ర గ్రానైట్, రామతీర్థం కూడలి, మర్రిచెట్లపాలెం, మునినది ప్రాంతాల్లో పరిస్థితి దయనీయంగా మారింది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి పూర్తిస్థాయి మరమ్మతులకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.– **న్యూస్‌టుడే, చీమకుర్తి**

దారిపైనే మురుగు

కొత్తపట్నం జడ్పీ ఉన్నత పాఠశాల ఎదుట ప్రధాన రహదారిలో పరిస్థితి ఇది. సమీప నివాసాలు, దుకాణాల నుంచి వచ్చే వాడుక నీరు బయటకు పోయేదారి లేక ఇలా రోడ్డుపై నిలిచి సమస్య నెలకొంటోంది. దుర్వాసన వెదజల్లడంతో పాటు... వాహనాలు వెళ్లే సమయంలో పాదచారులపై చిందుతోంది. పంచాయతీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, కొత్తపట్నం

రోడ్డు పక్కనే చెత్త పోస్తున్నారు

భాగ్యనగర్ నుంచి అటవీ కార్యాలయానికి వెళ్లే దారిలో పరిస్థితి ఇది. ఎక్కడెక్కడి చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలను వాహనాల్లో తెచ్చి ఇక్కడ పారబోస్తున్నారు. దీంతో ఇటుగా రాకపోకలు సాగిస్తున్న వారు ఇబ్బంది పడుతున్నారు. వాటిని తొలగించడంతో పాటు... మళ్లీ అక్కడ వ్యర్థాలు వేయకుండా చూడాలని స్థానికులు విన్నవిస్తున్నారు.
– న్యూస్‌టుడే, ఒంగోలు అంజయ్యనగర్

వేడుకలో పాల్గొన్న భక్తులు

వైభవంగా అయ్యప్ప పడిపూజ

చీమకుర్తి, న్యూస్‌టుడే: దేవరపాలెంలో బుధవారం రాత్రి అయ్యప్ప పడి భజన వేడుకగా సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన మెట్లపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చి భజనలు చేపట్టారు. హోమగుండం నిర్వహించారు. అయ్యప్ప, భవానీ, శివ, గోవింద మాలలు ధరించిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భిక్ష ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన వెంకట కృష్ణారావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిపారు.

స్వామిత్వ సర్వేపై గ్రామ సభలు

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: చదలవాడ, నిడమానూరు గ్రామాల్లో గురువారం... స్వామిత్వ సర్వే గ్రామ సభలు నిర్వహించారు. నివేశన స్థలాలు, నిర్మాణాల కొలతలు నిర్ధారించి ఆన్‌లైన్‌లో నమోదు చేశామని ఎంపీడీవో తేళ్ల రవికుమార్ తెలిపారు. ఆస్తి యజమానులకు ఆ వివరాలు అందజేసి అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు చెప్పారు. తద్వారా శాశ్వత హక్కు పత్రం పొందవచ్చన్నారు. తద్వారా రుణాలు పొందే వీలుంటుందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు తెలియజేయండి

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: స్వామిత్వ సర్వేపై ఏవైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలని... పరిశీలించి ఆ మేరకు తిరిగి సర్వే చేపడతామని డిప్యూటీ ఎంపీడీవో అరుణకుమారి తెలిపారు. ఎం.వేములపాడులో గురువారం నిర్వహించిన గ్రామ సభలో మాట్లాడారు. గ్రామంలో నూరుశాతం సర్వే పూర్తయ్యిందన్నారు. తెదేపా మండలాధ్యక్షుడు మద్దినేని హరిబాబు, పంచాయతీ కార్యదర్శి కాశమ్మ, సర్పంచి ఇ.విజయలక్ష్మి, వీఆర్వో మౌలాలి, గ్రామస్థులు పాల్గొన్నారు.

చదలవాడలో సర్వే పత్రం అందజేస్తున్న ఎంపీడీవో రవికుమార్

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

ఒంగోలు గ్రామీణం: నిర్వహణ పనుల దృష్ట్యా ఒంగోలు నగర పరిధిలోని సోనియాగాంధీ నగర్, సుజాతనగర్, చెన్నకేశవమాన్యం, రెవెన్యూ కాలనీ, ఎన్టీఆర్ పార్కు, కొత్త డొంక, దక్షిణ బైపాస్ రోడ్డు, మంగమూరు రోడ్డు జంక్షన్ తదితర ప్రాంతాలకు... శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ పాండురంగారావు తెలిపారు.

ప్రపంచ మత్స్య దినోత్సవం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించే ప్రపంచ మత్స్య దినోత్సవంలో మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి పాల్గొంటారు. ముందుగా టంగుటూరు మండలం మల్లవరప్పాడు చెరువులో చేప పిల్లలను విడుదల చేస్తారు.

తాగునీటి లీకేజీకి అడ్డుకట్ట

స్పందనకు వందనం

మద్దిపాడు, న్యూస్‌టుడే: గుండ్లకమ్మ జలాశయం నుంచి వచ్చే పైపులైను మద్దిపాడు బస్టాండ్ కూడలిలో దెబ్బతిని నీరు వృథాగా పోతోంది. విషయం 'ఈనాడు - మేమున్నాం.. మీకు తోడుగా'లో గురువారం ప్రచురితం కావడంతో సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

మద్దిపాడు, న్యూస్‌టుడే: వృద్ధురాలి మెడలోని గొలుసును ఆగంతుకుడు తెంచుకుపోయాడు. మద్దిపాడు ఎస్సై వెంకట సూర్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బూరేపల్లి పునరావాస కాలనీకి చెందిన రావిపాటి వెంకటరత్నం అనే వృద్ధురాలు గురువారం ఉదయం తమ ఇంటి ఎదుట బ్రష్ చేస్తుండగా... ద్విచక్ర వాహనంపై వచ్చిన దుండగుడు ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కొని పరారయ్యాడు. బాధితురాలు వెంటనే మద్దిపాడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో... ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించారు. పారిశ్రామికవాడకు చెందిన ఓ కార్మికుడు ఈ ఘటనకు పాల్పడినట్లు గుర్తించి... అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

చెరువు కట్ట... భద్రమెంత?

❖ ఏళ్లుగా నిర్వహణ లేక సమస్య

న్యూస్‌టుడే – ఒంగోలు అర్బన్, సంతనూతలపాడు

మొన్నటి మొంథా తుపానుతో ఎక్కడికక్కడ చెరువుల కట్టలు తెగాయి. పలు ప్రాంతాల్లో జన జీవనం స్తంభించింది. కొన్నిచోట్ల ఇప్పటికీ ఆ ప్రభావం కనిపిస్తోంది. అయినప్పటికీ జలవనరుల శాఖ అధికారులు ఆయా వాటిని పరిశీలించి పటిష్ఠానికి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

అంతా బలహీనం...

ఇటీవల భారీ వర్షాలకు పేర్నమిట్ట చెరువు కట్ట రెండు ప్రాంతాల్లో తెగి... రెండు రోజుల పాటు కర్నూలు రోడ్డుపై నీటి ప్రవాహం కొనసాగింది. తొలి రోజు భారీ వాహనాలు సైతం రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొంది. సంతనూతలపాడు పెద్ద చెరువు ఎన్నడూ లేనంతగా అలుగు పారి ప్రధాన మార్గంపైకి వరద పోటెత్తింది. చిన్న చెరువుదీ ఇదే పరిస్థితి. పి.గుడిపాడు, ఎనికపాడు, మద్దులూరు చెరువుల్లోనూ ఉద్ధృతి కొనసాగింది. ఈ పరిస్థితి ఆయా కట్టలు ఎంత పటిష్ఠంగా ఉన్నాయో తెలియజెబుతున్నాయి.

తెగిన పేర్నమిట్ట చెరువు కట్ట (పాత చిత్రం)

గత ప్రభుత్వ నిర్లక్ష్యం...

సమస్య ఇంత తీవ్రంగా ఉన్నా రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులు ఆయా చెరువులను పరిశీలించిందీ లేదు... కట్టల సామర్థ్యం పెంపునకు తీసుకున్న చర్యలూ లేవు. ఎనికపాడు తదితర గ్రామాల్లో స్థానికులే కట్టలను బాగు చేసుకున్నారు. గత వైకాపా ప్రభుత్వం చెరువుల నిర్వహణను పూర్తిగా గాలికొదిలేసింది. దీంతో కట్టలు చిల్లచెట్లతో చిట్టడవుల్లా మారాయి. తూములు, అలుగులు బలహీనంగా మారాయి. ప్రస్తుతం ఆయా జల వనరులు నిండుకుండల్లా ఉన్నాయి. ఈ తరుణంలో మరోసారి భారీ వర్షాలు పడితే తీవ్ర నష్టం తప్పదు. ఇప్పటికైనా జలవనరుల శాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఒంగోలు మండల సమావేశం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజశేఖరరావు తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు హాజరు కావాలని ఓ ప్రకటనలో కోరారు.

పశుపోషణలో జాగ్రత్తలు అవసరం

మద్దిపాడు, న్యూస్‌టుడే: ఏడాదికో దూడ అన్న భావనతో పశువుల సంరక్షణ చేపట్టాలని పశు సంవర్ధక శాఖ ఏడీఏ కిషోర్‌కుమార్ తెలిపారు. గోకుల్ మిషన్ పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధకశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నందిపాడులో గురువారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరంలో మాట్లాడారు. పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. ఖనిజ లవణ మిశ్రమం, నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. పశువైద్యాధికారి ఎస్.హార్మ్యశ్రీ, శస్త్రచికిత్స నిపుణులు మణిరూప్, సహాయకులు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

INDIRA PRIYADARSINI LAW COLLEGE
South by-Pass, Pelluru, Ongole - 523 272
MANAGEMENT QUOTA SEATS (A/Y 2025-26)
Eligibility
- For 3 Year LL.B Course - 10+2+ Any Degree with 45% Marks
- For 5 Year B.A., LL.B Course - 10+2 or Equivalent with 45% Marks
- For LL.M (C.A & C.S branches) - Graduation Degree in Law
- For Details, and Guidelines: 08592-234156, 80081 64156
- Website: https://iplcongole.in/

C. V. RAMAKRISHNARAO, M.A.,M.L
Secretary & Correspondent

PUBLIC NOTICE

Under the instructions of my clients **1. Vennapusa Srinivasa Reddy S/o. Narsareddy, aged about 48 years, agriculturalist, S.N Padu Village and Mandal, Prakasam District, 2. Bolledu Prasanna Kumari W/o. Subba Rao, aged about 42 years, Resident of Ongole 3. Thallapalli Venkata Suresh S/o. Subramanyam aged about 34 years, resident of Bestavari Peta, 4. Pathakottu Suresh S/o. Pichireddy, aged about 34 years,** S.N padu Village and madnal I issue the following public notice to the public at large.

That our clients purchased the flats in the apartment complex constructed in Survey No.270/2, Z.P Colony, Ongole, under Registered Sale Deeds bearing Document Nos.1.1603/2018, 2. 2333/2018, 3. 2172/ 2018 and 4. 1602/2018 from Dumpa Venkata Reddy and Sri. B. Singareddy and the said property is in our clients possession. Previously, the Canara Bank authorities issued the sale notice and our clients challenged the said proceedings in S.A. 161/2019 on the file of Hon'ble Debts Recovery Tribunal, Visakhapatnam and the same was dismissed and my clients are making efforts to prefer appeal against the said order and in the mean while, the Canara Bank is proposing to sell the entire property by infringing my clients rights in the below schedule mentioned property. Hence, this public notice.

SCHEDULE PROPERTY

Prakasam District, Ongole Sub-Reg., Ongole corporation limits, Ongole, Z.PColony area, Sy.No.270/ 2, constructed building with five floors and our clients having each two Flats in 4th floor and 5th Floor vide Flat No.'s , 402, 501 and 502.

Ongole 21-11-2025 Sd/- **MACHIRAJU SRINIVASA RAO**
Advocate, Ongole

(c) eenadu

భాషలందు కుల్లూరు వేరయా

జిల్లాలోని 'కుల్లూరు' పేరు చెబితే.. ఆ ఊరి కంటే.. అక్కడి భాష గురించే ఎక్కువ మంది అడుగుతుంటారు. కారణం.. అక్కడి వారు ఇతరులకు అర్థం కాని గొలుసు భాషను మాట్లాడటమే.. మీరు చదవండి ఆ విశేషాలు.

. కలువాయి మండలంలోని కుల్లూరు వ్యాపారాలకు నిలయం. ఇక్కడి వారంతా గతంలో వివిధ ప్రాంతాలకు వెళ్లి వస్తువులు విక్రయించే వారు. ఎక్కువ మంది ముంబయి, మైసూరు, సూరత్, కోల్‌కతా వంటి మహానగరాలకూ వెళ్లేవారు. అక్కడ మెలకువలు తెలుసుకునేందుకు.. క్రయ విక్రయాల సమయంలో మూడో వ్యక్తికి అర్థం కాకుండా ఈ గొలుసు భాష ఉపయోగించేవారు. గ్రామానికి ఎవరైనా కొత్త వ్యక్తి వచ్చినప్పుడు.. అతడు ఎవరు? ఎవరి కోసం వచ్చారు? ఏ పనిపై వచ్చారనే విషయాలనూ గొలుసు భాషలోనే చర్చించుకునేవారు. రాపూరు మండలం నాగులవారిపల్లిలో కొందరు వివాహాలు చేసుకోవడంతో.. ఈ రెండు గ్రామాల్లోనే ఈ భాష ఉంది. కాలక్రమంలో వచ్చిన మార్పులతో ప్రస్తుతం వృద్ధులకే పరిమితమైంది. – న్యూస్‌టుడే, కలువాయి

గొలుసు భాషలోని కొన్ని పదాలు.. అర్థాలు

ఇడుము	ఆడపిల్ల
గీటు	రూపాయి
ఎడమాయి	వ్యక్తి
ఇరుసు	భార్య
పెడం	భోజనం
ఎర్రగాజు	మాంసం

ఎలా వేగాలి మరి

నెల్లూరు బ్యారేజీపై గాలి నాణ్యత, సాంద్రత వివరాలు తెలిపే డిస్‌ప్లే ఏర్పాటు చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, ఇరిగేషన్ శాఖ అధికారుల మధ్య సమన్వయం కొరవడి చివరకు నిరుపయోగంగా మారింది. నగరంలో గాలి నాణ్యత, అందులో వస్తున్న మార్పులను తెలుసుకునేందుకు వీలు లేకుండా పోయింది. అధికారులు పరికరానికి మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. – ఈనాడు, నెల్లూరు

వైద్యం.. మారని దైన్యం!

ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వెనుకబడుతూనే ఉన్నాయి. జిల్లాలోని ఏ ఒక్క దానికీ 'ఏ' గ్రేడ్ రాకపోవడం.. వాటి పనితీరును తేటతెల్లం చేస్తోంది.

అక్టోబరు నెలలో...

జిల్లాలోని ఏ పీహెచ్‌సీకి ఏ గ్రేడ్ రాలేదు. 8 బీ, 36 సీ, 8 డీ గ్రేడ్‌లో నిలిచాయి. జిల్లాపరంగా బీ గ్రేడ్‌లో నిలిచిన కోవూరుపల్లి మొదటి స్థానంలో నిలవగా.. రాష్ట్ర స్థాయిలో 241వ ర్యాంకులో ఉంది. గట్టుపల్లి ఆసుపత్రి జిల్లాలో చివరి స్థానంలో.. రాష్ట్ర స్థాయిలో 1087 స్థానంలో సరిపెట్టుకుంది. ఈ పరిస్థితికి కాన్పులు జరగకపోవడం ఓ ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఒక్కో పీహెచ్‌సీలో పది ప్రసవాలు చేయాలని లక్ష్యం నిర్దేశించగా.. గత నెలలో 26 మాత్రమే జరిగాయి. అది ఒక్క కలువాయిలోనే 7 ఉన్నాయి. అత్యవసరమైతే శస్త్రచికిత్స చేసే పరిస్థితి లేకపోవడం.. ఎక్కువ మంది పెద్దాసుపత్రులకు వెళుతుండటంతో.. తక్కువ కాన్పులకు కారణమన్న మాట వినిపిస్తోంది.

● దీనిపై డీఎంహెచ్‌వో వి.సుజాత మాట్లాడుతూ.. మెరుగైన సేవలు అందించేందుకు ప్రయత్నిస్తాం. ఉత్తమ ఫలితాలు సాధించేలా ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం అన్నారు.

బీ గ్రేడ్‌లో 8.. సీ36.. డీ.. 8

ఏ గ్రేడ్ గగనమే...

గత నెలలోనే కాదు.. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏ గ్రేడ్ సాధించడం.. అదో పెద్ద విషయం అన్నట్లు తయారైంది. ఏ గ్రేడ్ రావడంలేదని.. సీ, డీ గ్రేడ్‌లు సాధించిన పీహెచ్‌సీలు.. ఆ స్థానంలో ఎందుకు నిలవాల్సి వచ్చిందో సమాధానం చెప్పాలని ఉన్నతాధికారులు కోరినట్లు తెలిసింది. రానున్న రోజుల్లో అయినా పరిస్థితిలో మార్పు వస్తుందో లేదో వేచి చూడాల్సి ఉంది.

"రోగులకు అందే వైద్య సేవలు, పనితీరు ఆధారంగా పీహెచ్‌సీలకు ప్రభుత్వం నెలవారీ గ్రేడ్‌లు ఇస్తోంది. తద్వారా లోపాలు సరిదిద్దుకుని మెరుగైన సేవలు అందించేలా చూడటం ప్రభుత్వ ఉద్దేశం. రోజువారీ వచ్చే రోగుల సంఖ్య(ఓపీ), చికిత్స నిమిత్తం చేరేవారి సంఖ్య(ఐపీ), ఆసుపత్రుల్లో జరిగే కాన్పులు, ల్యాబ్ పరీక్షలు, ఐయూసీడీ ఆధారంగా మార్కులు వేసి.. గ్రేడ్‌లు నిర్దేశిస్తారు."

దస్త్రం గన్‌పించలే!

కలెక్టర్ ఆగ్రహం

రికార్డులు పరిశీలిస్తున్న ఆడిట్ అధికారులు

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లోని పలు విభాగాల్లో కీలకమైన కొన్ని రికార్డులు మాయమయ్యాయా? జరిగిన పరిణామాలు అందుకు బలం చేకూరుస్తున్నాయి. విజయవాడ నుంచి వచ్చిన ఆడిట్ బృందం మూడు రోజులుగా రికార్డుల పరిశీలిస్తుండటం.. ఆ క్రమంలో కొన్ని ఫైళ్లు కనిపించడం లేదని ఉద్యోగుల నుంచి సమాధానం రావడం.. ఆడిట్ బృందం అసంతృప్తి తెలియజేయడంతో.. గురువారం 'గన్ లైసెన్స్ రిజిస్టర్ ఎక్కడ' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. దాంతో సంబంధిత విభాగాల అధికారులు ఫైళ్ల వెతుకులాట ప్రారంభించారు. గురువారం సీనియర్ ఆడిట్ అధికారి ఎన్.బాలాజీ సింగ్, అధికారులు రాకేష్, సౌమిక్ రికార్డులు పరిశీలించారు. ముఖ్యమైన గన్ లైసెన్స్‌, భూముల సంబంధించిన దస్త్రాలపై దృష్టి పెట్టారు. రిజిస్టర్లు, ఫైళ్లను ఆడిట్ కోసం ఇవ్వాలని కోరారు. ఆ క్రమంలో 2017కు ముందు గన్ లైసెన్సులకు సంబంధించిన వివరాల రికార్డులను కోరగా.. నాలుగు రోజులైనా ఇవ్వలేకపోవడం పలు సందేహాలకు తావిస్తోంది. 2017 తర్వాత ఆన్‌లైన్ చేసిన వివరాలు మాత్రమే ఉన్నాయని చెబుతున్నారు. అంతకు ముందు రిజిస్టర్లు ఏమయ్యాయో అర్థం కాని పరిస్థితి. భూముల సంబంధించిన కొన్ని రికార్డులు సైతం కనిపించడం లేదని తెలుస్తోంది. ఆడిట్ అధికారులు మాత్రం ఈ నెల 27వ తేదీ వరకు జరిగే ప్రక్రియలో రికార్డులు ఇచ్చిన వాటిని ఆడిట్ చేసి నివేదికలో రాస్తామని, రికార్డులు అందకపోతే.. ఇవ్వలేదని పొందుపరుస్తామని స్పష్టం చేస్తున్నారు. ఏం జరుగుతుందో చూడాల్సి ఉంది.

కందుకూరులో కుట్లు అమెరికాలో అల్లికలు


దండలు, తోరణాలు తయారు చేయిస్తున్న అనూరాధ

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: ఉద్యోగం చేయాలన్న కోరిక నెరవేరలేదని దిగులు పడుతూ కూర్చోలేదు. మంచి భర్త, చక్కటి పిల్లలతో జీవితం సాఫీగా సాగిపోతోంది కదా అని వంట గదికే పరిమితమవ్వలేదు. కుటుంబ పోషణలో తనవంతు పాత్ర పోషించాలని నిర్ణయించుకున్న ఆమె.. తనకు ఇష్టమైన కుట్లు, అల్లికలనే అందుకు వేదిక చేసుకున్నారు. రమణీయతను జోడించి.. ఆకర్షణీయమైన వస్తువులు(డెకరేటెడ్ ఐటమ్స్) తయారు చేసి సామాజిక మాధ్యమాల వేదికగా విక్రయిస్తున్నారు. విదేశాలకూ ఎగుమతి చేస్తున్నారు కందుకూరు పట్టణంలోని యర్రవడ్డెపాలేనికి చెందిన పల్లాపు అనూరాధ.

తొలి అడుగు

బీఈడీ పూర్తి చేసిన అనూరాధ వాకిలి తోరణాలు, పూలదండలు, చిలకలు, షార్ట్ దండలు, కలశాలు, దియాస్టాండ్స్, జూట్ సంచులు, బ్యాక్ డ్రాప్స్, బ్యాంగిల్ బాక్స్, ఫ్లెక్సీమ్యాట్స్, రబ్బర్ షీట్లు, గన్ మెటల్స్ తదితరాలు తయారు చేసి. . తొలుత అమెరికాలోని తన స్నేహితులకు పంపించారు. వారికి నచ్చడంతో క్రమంగా ఆర్డర్లు పెరిగాయి. ప్రస్తుతం విజయనగరం, వైజాగ్, విజయవాడతో పాటు కేరళ, కర్ణాటక వంటి రాష్ట్రాలకు, ఆస్ట్రేలియా, సింగపూర్, లండన్ తదితర దేశాలకు కొరియర్ ద్వారా ఎగుమతి చేస్తున్నారు.

ముందడుగు

ఏడాదిగా నెలకు సరాసరి వేయి దండల వరకు విదేశాలకు పంపారు. 10 నుంచి 12 మంది మహిళలకు ఉపాధి చూపుతూ నెలకు రూ. 50వేల వరకు ఆదాయం పొందుతున్నారు. 'మొదట్లో రూ. 5వేలతో వ్యాపారం ప్రారంభించా. ప్రస్తుతం రూ. 4 లక్షల పెట్టుబడితో విదేశాలకు ఉత్పత్తులు పంపిస్తున్నా. శ్రావణ మాసం, పెళ్లిళ్ల సీజన్‌లో ఆర్డర్లు ఎక్కువగా వస్తాయి. భాష, కొరియర్ వంటి విషయాల్లో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించడంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడైన నా భర్త ఆదినారాయణ ప్రోత్సాహం బాగుంది అంటున్నారు.

కిన్ను కిషాల్ 163

బంతి ఎంత వేగంతో వస్తే.. అంతే బలంగా బ్యాట్‌కు పని చెప్పడం.. మైదానంలో ఉంటే మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌పై గురిపెట్టడం.. పరుగులే లక్ష్యంగా స్కోర్ బోర్డు టాపర్‌గా నిలవడం.. క్రికెటర్ కిన్ను కిషాల్ ప్రత్యేకం. నెల్లూరు నగరానికి చెందిన ఇతడికి ఆటపై మక్కువకు.. తండ్రి ప్రోత్సాహం తోడై.. రెండో తరగతిలోనే బ్యాట్ పట్టుకున్న ఈ యువకుడు.. తన ప్రతిభతో సచిన్ తెందూల్కర్‌కు చెందిన ఎంఐజీ అకాడమీలో శిక్షణకు ఎంపికయ్యాడు. అక్కడ ఆరు నెలల ప్రాథమిక శిక్షణ పూర్తి చేసుకున్నాడు. గత ఏడాది విజయనగరంలో జరిగిన అండర్-14 విభాగంలో తొలి మ్యాచ్‌లో 35 పరుగులు చేయగా.. కడపలో జరిగిన అండర్-19 పోటీల్లో మూడు మ్యాచ్‌ల్లో వరుసగా 50, 40, 20 స్కోరు సాధించాడు. తాజాగా కడపలోనే జరిగిన ఏసీఏ సౌత్ జోన్ అండర్-14 అంతర్ జిల్లాల పోటీల్లో కర్నూలు జట్టుపై 163 పరుగులు చేసి.. అద్భుతమైన ఆట తీరును ప్రదర్శించాడు. సీనియర్స్‌తో జరిగిన టీ-ట్వంటీల్లో 25 సెంచరీలు చేయడం గమనార్హం. గత ఆరు నెలలుగా ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలవడం గమనార్హం.

– న్యూస్‌టుడే, నెల్లూరు(క్రీడా విభాగం)

ఊరికే పడుంది.. ఉంటే పోలా!

చెత్త నుంచి సంపద సృష్టించేందుకు గత తెదేపా ప్రభుత్వంలో మర్రిపాడులో రూ.లక్షల వ్యయంతో నిర్మించిన సంపద తయారీ కేంద్రాన్ని అధికారులు నిరుపయోగంగా మార్చారు. దీంతో ఇదే అదనుగా కొందరు ఏకంగా నివాసం ఉంటున్నారు. మర్రిపాడులోని కేజీబీవీలో కొత్తగా వసతి భవనాలు నిర్మిస్తుండగా.. అక్కడ పనిచేసేందుకు వచ్చిన కార్మికులు రెండు నెలల నుంచి ఈ కేంద్రంలో ఉంటున్నారు. – న్యూస్‌టుడే, మర్రిపాడు

కాలువలు కుదించి.. కన్నీళ్లకు దారి!

ఈనాడు, నెల్లూరు

నెల్లూరు నగరంలో వరదనీటి కాలువ(స్టామ్ వాటర్)ల ప్రాజెక్టును గత తెదేపా ప్రభుత్వంలో ప్రారంభించారు. దీని ప్రకారం రూ. 55 కోట్లతో సుమారు 11 కి.మీ. మేర డ్రెయిన్లు నిర్మించాల్సి ఉండగా- 25శాతమే పూర్తి చేశారు. పైగా 40 నుంచి 60 అడుగుల వెడల్పు ఉన్న కాలువలను బాగా కుదించి కట్టారు. నిర్మాణాలు ఆపేసిన దగ్గర అవుట్‌ఫ్లో సక్రమంగా లేకపోవడం తదితరాలతో చెత్తాచెదారం పేరుకుపోయి ప్రజలు ఇబ్బంది పడాల్సి వచ్చింది. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఈ పనులను రద్దు చేసింది. నగరంలోని అన్ని కాలువలను సుమారు 162 కి.మీ. మేర రూ. 365 కోట్లతో అభివృద్ధి చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఆ తర్వాత అన్ని నిధులు ఇచ్చే పరిస్థితి లేదని.. రూ. 50 కోట్లతో అత్యవసరంగా చేయాలని నిర్ణయించారు.

కాలువలను అభివృద్ధి చేయడమంటే.. ఆక్రమణలు తొలగించడం.. పూడిక తీయించడం.. ఉన్నంత వరకు సిమెంట్ గోడలను కాంక్రీట్‌తో పటిష్ఠం చేయడం.. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో మాత్రం ఇందుకు భిన్నం. 15 అడుగుల వెడల్పు ఉన్న కాలువను మూడు అడుగులకు కుదించడంతో పాటు ఆక్రమణలకు అవకాశం ఇస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

15 అడుగులవి.. మూడు అడుగులకు

మనుమసిద్ధి నగర్ వంతెనకు ఓ వైపు పదిహేను అడుగుల వెడల్పు.. మరో వైపు మూడడుగులకు కుదించిన నిర్మాణం

నగరమంతా కాదు...

నెల్లూరు నగరంలో రెండు నియోజకవర్గాలు ఉండగా- రూ. 50 కోట్లు విడుదలై.. టెండర్ల దశలో ఉన్న పనులు నగర నియోజకవర్గంలోనే చేస్తారనే ప్రచారం జరుగుతోంది. రూరల్ నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న పంట కాలువలను ఎన్‌ఎంసీ సాధారణ నిధులతో చేస్తున్నారు. ఇందులో భాగంగానే మనుమసిద్ధి నగర్ దగ్గర కుదించి కడుతున్నారు. ఇదే రీతిలో చేస్తే కాలువల వ్యవస్థ మరింత అధ్వానంగా.. పాలకులు, అధికారుల మధ్య సమన్వయ లోపం ప్రజలకు శాపంగా మారుతుంది. నగరానికి ముంపు ప్రమాదం పెరుగుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

● దీనిపై నగరపాలక సంస్థ అధికారులను వివరణ కోరగా.. మనుమసిద్ధి నగర్ దగ్గర అవసరం ఉన్న మేరకే కాలువ నిర్మించామని, ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురికాకుండా మొక్కలు నాటామని చెప్పారు.

కారాగారానికి నలుగురు మావోలు

నెల్లూరు(నేర విభాగం) : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'లో భాగంగా బుధవారం అర్ధరాత్రి విజయవాడ నుంచి నలుగురు మావోయిస్టులను పోలీసులు నెల్లూరు కేంద్ర కారాగారానికి తీసుకువచ్చారు. విజయవాడలో 27 మంది మావోలను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వీరిలో నలుగురిని కోర్టులో హాజరు పరచగా డిసెంబరు 3వ తేదీ వరకు రిమాండ్ విధించారు. ఈ నేపథ్యంలో రాత్రి 11 గంటలకు ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళా మావోయిస్టులను కారాగారానికి తీసుకువచ్చారు. వారి వెంట తీసుకువచ్చిన వారెంట్ పత్రాలను పరిశీలించిన జైలు అధికారులు.. కారాగారంలోకి పంపించారు.

మత్తు వదలరా?

జిల్లాలో అధిక శాతం డ్రంకెన్ డ్రైవ్ కేసులు

● గత నెలలో నిర్వహించిన ప్రత్యేక డ్రంకెన్ డ్రైవ్‌లో 29 కేసులు నమోదయ్యాయి. 12 వాహనాలు సీజ్ చేశారు. ఈ నెలలో 36 కేసులతో పాటు 15 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

● వారం రోజుల కిందట మద్యం తాగి వాహనం నడిపిన ఎనిమిది మందిపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి. . న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా.. ఒక్కొక్కరికి రూ. పది వేల జరిమానా విధించారు.

న్యూస్‌టుడే, నెల్లూరు(నేర విభాగం): సురక్షితంగా గమ్యస్థానాలకు చేరి కుటుంబంతో ఆనందంగా గడపాల్సిన కొందరు.. వారికి తీరని లోటు మిగుల్చుతున్నారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. మరికొందరి జీవితాల్లో విషాదానికి కారకులవుతున్నారు. ఎన్ని హెచ్చరికలు చేస్తున్నా.. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న పరివర్తన మాత్రం కలగడం లేదు. జిల్లాలో చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాల్లో అత్యధికానికి మత్తే కారణమని పోలీసు అధ్యయనంలో తేలింది. నగరంలోని నార్త్ పోలీసు స్టేషన్ పరిధిలో నిత్యం 5 నుంచి 6, సౌత్‌లో 3 నుంచి 5 కేసులు రోజూ నమోదవుతూనే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో మార్పు రావాల్సిన అవసరం ఉంది.

కేసుల వివరాలు	ఆగస్టు	సెప్టెంబరు	అక్టోబరు	నవంబరు (ఇప్పటివరకు)
	120	110	130	90

జర్మనీలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో జర్మనీలో కార్పెంటర్లు, స్టీల్ ఫిక్సర్లు, పేవింగ్ స్టోన్ వర్కర్స్, రోడ్డు వర్కర్స్ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూం ప్రకటనలో తెలిపారు. పదో తరగతి లేదా ఇంటర్మీడియట్ అర్హత కలిగి, గరిష్ఠ వయసు 44 సంవత్సరాలు ఉండి, కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు సుమారు రూ. 2.57లక్షల జీతంతో ఎనిమిది నెలల కాంట్రాక్ట్ నియామకాలు ఉంటాయని తెలిపారు. వివరాలకు 99888 53335, 87126 55686, 87901 18349, 87901 17279 నంబర్లను సంప్రదించాలని కోరారు.

జలాశయంలో నిండుగా నిల్వ

జలనిధికి.. పరీక్షా సమయం!

ఆత్మకూరు, న్యూస్‌టుడే: వరదల సమయంలో సోమశిల జలాశయానికి గడ్డు కాలం షరామామూలుగా మారింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఉత్పన్నమైన కష్టాలు నేటికీ కొనసాగుతుండగా.. కూటమి ప్రభుత్వం వస్తూనే ప్రయత్నాలు మొదలు పెట్టినా అవి ప్రారంభ దశలోనే ఉండటం అందరినీ కలవరపరుస్తోంది.

మరమ్మతుల ఊసేదీ

సోమశిల 1155 అడుగుల మట్టికట్ట, 1455 అడుగుల కాంక్రీట్ నిర్మితం కాగా- 735 అడుగుల స్పిల్‌వే రూపొందించారు. 50× 45 ఎత్తు, వెడల్పు గల 12 క్రస్ట్‌గేట్లు ఏర్పాటు చేశారు. 2020, 2021 సంవత్సరాల్లో వరుసగా రెండు సార్లు భారీ వరద వచ్చింది. దాదాపు 5.6 లక్షల క్యూసెక్కులు రావడంతో ప్రాజెక్టు రక్షణ కట్టడాలు ధ్వంసమయ్యాయి. నీటి నియంత్రణలో ప్రధానమైన క్రస్ట్‌గేట్లను పట్టించుకోలేదు. దాంతో 11, 12 గేట్ల రోప్‌ల పొరలు తెగి ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. మరోవైపు ఆప్రాన్ మినహా.. మిగిలినవీ దెబ్బతిన్నాయి. స్టిల్లింగ్ బేసిన్‌లో వేగాన్ని తగ్గించే సిమెంట్ దిమ్మెలను మరమ్మతులు చేయలేదు. ఎడమ వైపు ఫ్లడ్ బ్యాంకు పూర్తిగా కొట్టుకుపోగా- కాంక్రీట్ గోడ నిర్మాణం జరగనే లేదు. కారణాలు ఏవైనా.. అధికారులు ప్రయత్నించినా.. పనులు చేపట్టేందుకు గుత్తేదారు తగిన రీతిలో ముందుకు రాలేదు. ప్రస్తుతం జలాశయంలో నీటి నిల్వ 74 టీఎంసీలు ఉంది. ఈ పరిస్థితుల్లో అధిక స్థాయిలో నీరొస్తే.. ప్రవాహంలో ఒత్తిడి, వేగం పెరిగే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం రూ. 2.4 కోట్లు కేటాయించి.. టెండర్లు పిలిచింది. పనులు చేపట్టేలోపు నిల్వ పెరగడంతో నియంత్రణకు పరిమితులు ఏర్పడ్డాయి.

పది గేట్లతో నియంత్రిస్తాం

జలాశయం 11, 12 నంబరు క్రస్ట్‌గేట్లు కదిలించే అవకాశం లేదు. వరద సమయంలో పదింటితోనే నియంత్రించాల్సి ఉంది. అందుకు సిద్ధంగా ఉన్నాం. ఉన్నతాధికారుల సూచనలతో కార్యాచరణను పకడ్బందీగా చేపడుతున్నాం.
– శ్రీనివాసకుమార్, ఈఈ సోమశిల ప్రాజెక్టు

రూ. 500కు గొడవ.. స్నేహితుడి హత్య

మాట్లాడుతున్న సీఐ సుధాకర్‌రెడ్డి

కోవూరు, న్యూస్‌టుడే: పూటుగా మద్యం తాగిన స్నేహితుల మధ్య రూ. 500 కోసం జరిగిన గొడవ. . మధ్యవర్తిత్వం వహించిన మరో స్నేహితుడి హత్యకు దారి తీసింది. గత నెల 29న కోవూరు పట్టణంలోని లక్ష్మీనారాయణపురం వద్ద ఎండు చేపల గోదాము సమీపంలో.. వేగూరు కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. కుళ్లిపోయిన స్థితిలో ఉండటంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు. . చివరకు అసలు విషయాన్ని ఛేదించారు. గురువారం సీఐ సుధాకర్‌రెడ్డి ఆ వివరాలు వెల్లడించారు. పోతిరెడ్డిపాళెం సాలుచింతలకు చెందిన షాజహాన్(38), మస్తాన్, కుక్కరాజా, పెంచలయ్య, సుబ్బయ్య స్నేహితులు. గత నెల 25న వీరంతా కలిసి మద్యం తాగుతుండగా.. కుక్కరాజా, మస్తాన్ మధ్య రూ. 500 బాకీ విషయమై వివాదం తలెత్తింది. ఆ క్రమంలో షాజహాన్ మధ్యవర్తిత్వం చేస్తుండటం రాజాకు నచ్చలేదు. దీంతో వీరి మధ్య ఘర్షణ జరిగింది. షాజహాన్ నాలుకకు గాయం కావడంతో అందరూ కలిసి కోవూరు సీహెచ్‌సీలో చికిత్స చేయించారు. ఇంటికి వెళ్లే క్రమంలో బజారు కూడలి వద్ద మరో మారు మద్యం తాగగా.. తిరిగి వివాదం చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో షాజహాన్‌పై మిగిలిన నలుగురు దాడిచేశారు. పెంచలయ్య, సుబ్బయ్య వెళ్లిపోగా.. తీవ్రంగా గాయపడిన షాజహాన్‌ను మస్తాన్, రాజా ఆటోలో వేగూరు కాలువ వద్దకు తీసుకువెళ్లి మరోసారి దాడి చేశారు. మృతి చెందారని నిర్ధారించుకుని కాలువలో పడేసి పరారయ్యారు. మస్తాన్‌కు షాజహాన్ వరసకు తమ్ముడు కావడంతో అతడు కనిపించడం లేదని ఈ నెల 16వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మస్తాన్‌పై అనుమానంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చివరకు హత్యగా తేల్చి నలుగురిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. కేసును ఛేదించిన కోవూరు పోలీసు బృందాన్ని ఎస్పీ అజిత అభినందించి రివార్డులు ప్రకటించినట్లు సీఐ తెలిపారు.

అటవీ ప్రాంతంలో కొల్లగొడుతున్న గ్రావెల్

అటవీ ప్రాంతం నుంచి ఒక వీపురుపల్లి తీసుకోవాలన్నా అటవీశాఖ చట్టం ప్రకారం కఠిన ఆంక్షలు ఎదురవుతాయి. అలాంటిది పొదలకూరు మండలం జనకుర్తి అటవీ ప్రాంతం నుంచి పట్టపగలే ఇష్టానుసారంగా పదుల సంఖ్యల ట్రాక్టర్లు, యంత్రాలతో గ్రావెల్ తరలిస్తున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారు. కొత్తగా నిర్మిస్తున్న పెట్రోల్ బంకులకు గ్రావెల్ తరలిస్తున్నారు.

– న్యూస్‌టుడే, పొదలకూరు

కనిగిరి.. డంపింగ్ యార్డ్ కనరేమీ?

కనిగిరి రిజర్వాయర్ వెనుక ఖాళీ స్థలాన్ని డంపింగ్ యార్డ్‌లా మారుస్తున్నారు. బుచ్చి మండలంలోని కొన్ని గ్రామాల నుంచి సేకరించిన చెత్తను రిజర్వాయర్ వెనక వవ్వేరు గ్రామ శివారు ప్రాంతంలో నిల్వ చేస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు చెత్తను దహనం చేస్తున్నారు. వర్షాలలో ఈ నీరంతా రిజర్వాయరులో కలవడంతో కలుషితం అవుతోంది. అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

–ఈనాడు, నెల్లూరు

హవ్వ.. రహదారి మధ్యలో స్తంభమా!

గ్రామంలోని బీసీ కాలనీలో రహదారి మధ్యలో ఉన్న విద్యుత్తు స్తంభంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డులో స్తంభం ఉండగా.. దాన్ని అలాగే ఉంచి సిమెంటు రోడ్డు వేశారు. ఈ విషయమై డిస్కం ఏఈ నాగార్జునను వివరణ కోరగా మాట్లాడుతూ పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, వింజమూరు

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా!

565 జాతీయ రహదారి పక్కనే పొదలకు వాహనాలు నిలిపేస్తుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారిపై వాహనాలు నిలపరాదన్న నిబంధనను అమలు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. రాత్రి వేళల్లో ఈ వాహనాలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయమై ఎస్ఐ ఆదిలక్ష్మిని వివరణ కోరగా వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

–న్యూస్‌టుడే, దుత్తలూరు

రోడ్డంతా ఒకేలా వేయండి.. లేకుంటే ఆపేయండి: కాకర్ల

ఆగిపోయిన రహదారి పనులు

కలిగిరి, న్యూస్‌టుడే: వేస్తే 82 అడుగులతో మొత్తం రోడ్డు వేయండి.. లేకుంటే ఆపేయాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హుకుం జారీ చేశారు. పనులు చేసే ఆధ్వర్యంలో స్థానిక తెదేపా నాయకులకు సూచించారు. దీంతో గ్రామ పరిధిలో పనులను గుత్తేదారు నిలిపివేశారు. గ్రామంలోని తహసీల్దారు కార్యాలయం, హెచ్‌పీ పెట్రోలు బంక్, బరోడా బ్యాంకు ఎదురుగా జరుగుతున్న జాతీయరహదారి పనుల కొలతలను పరిశీలించారు. కలిపి 82 అడుగులు ఉండడం, కొద్ది దూరంలో 62 అడుగులకు తగ్గించడంపై మండిపడ్డారు. ఎందుకు అలా చేశారని ప్రశ్నించారు. మెయిన్ రోడ్డు ప్రారంభం నుంచి చివర వరకు కాలువలతో కలిపి 82 అడుగులతో వేయాలన్నారు. భూసేకరణ ప్రక్రియ జరగలేదని, డీపీఆర్, వర్క్ అగ్రిమెంట్ మేరకు నిర్మిస్తున్నామని ఎన్‌హెచ్ డీఈ నాగిరెడ్డి, గుత్తేదారు సంస్థ ప్రతినిధులు తెలపగా అసహనం వ్యక్తం చేశారు. అగ్రిమెంట్లు, డీపీఆర్ రూపొందించింది మీరే.. ఇలా ఎలా చేస్తారని ప్రశ్నించారు. తహసీల్దారు రోడ్డు మధ్యనుంచి రెండు వైపులా భూసేకరణ మార్కింగ్ చేసి నోటీసులు ఇచ్చారని వారికి తెలిపారు. మండలంలోని పోలంపాడు, ఏపినాపి, రావులకొల్లు, తూర్పుదూబగుంట, చినఅన్నలూరు, కృష్ణారెడ్డిపాలెం గ్రామ పార్టీ కమిటీలను ఎమ్మెల్యే నియమించారు. ఒక గ్రామం వారు మరో గ్రామంపై పెత్తనం చేయొద్దన్నారు. నేను కూడా చేయనన్నారు. తెదేపా నాయకులు బి.వి.రామారావు, బి.నరసింహులునాయుడు, పి.వెంగపనాయుడు, వి.నరేంద్ర, పి.రేష్మ, వరప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు కొలతలు తీసుకుంటున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

బాలికా నేర్చుకో..

కస్తూర్బా విద్యాలయాల్లో వృత్తి విద్య కోర్సుల్లో తర్ఫీదు

భవితకు బాటలు వేసుకో!

వృత్తి శిక్షణలో భాగంగా తయారుచేసిన అల్లికలను చూపిస్తున్న విద్యార్థినులు

జిల్లాలో మొత్తం కేజీబీవీలు	12
వృత్తి విద్య కోర్సులు అమలయ్యే విద్యాలయాలు	ఐదు
అర్హులు	తొమ్మిది తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ ఏడాది
కోర్సు వ్యవధి	నాలుగేళ్లు
శిక్షణ పొందుతున్న విద్యార్థినులు	784 మంది

న్యూస్‌టుడే, దుత్తలూరు

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో చదువుకుంటున్న విద్యార్థినులకు నాణ్యమైన బోధనతోపాటు వారి భవిత బాటలు వేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో వీరికి వృత్తి విద్య కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. స్వయం ఉపాధి కల్పనకు భవిష్యత్తులో ఆర్థిక స్వావలంబన సాధించేలా విద్యార్థి దశ నుంచే సన్నద్ధం చేస్తున్నారు.

ఐదు కేజీబీవీల్లో.. జిల్లాలో అయిదు చోట్ల ఈ కోర్సులు అమలుచేస్తున్నారు. దుత్తలూరు మండలంలోని నందిపాడు, మర్రిపాడు, సీతారామపురం, కలిగిరి, కొండాపురం, కావలి, అనుమసముద్రంపేట, కందుకూరు, గుడ్లూరు, లింగసముద్రం, వలేటివారిపాలెం, ఉలవపాడులో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలున్నాయి. వీటిలో నందిపాడు, కావలి, మర్రిపాడులోని విద్యాలయాల్లో కుట్టు, అల్లికలు, కలిగిరిలో బ్యూటీ అండ్ వెల్‌నెస్, వలేటివారిపాలెంలో ఫుడ్ ప్రాసెసింగ్‌లో విద్యార్థినులకు శిక్షణ ఇస్తారు. ఇందుకు శిక్షకులను కూడా నియమించారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు నాలుగు తరగతులు, నాలుగు స్థాయిలుగా విభజించారు. పదో తరగతి, ఇంటర్ ద్వితీయ ఏడాదిలో పబ్లిక్ పరీక్షలతోపాటు వృత్తి విద్యా కోర్సులకు పరీక్షలను నిర్వహిస్తారు. అనంతరం శిక్షణకు సంబంధించిన ధ్రువపత్రాలను ప్రభుత్వం అందజేస్తోంది. ఇది పూర్తి చేసిన వారికి బయట సంస్థల్లో ఇంటర్న్‌షిప్‌లు కల్పించి స్టైపెండ్ ఇచ్చేలా చూస్తారు.

స్వయం ఉపాధికి ఊతం

విద్యార్థినులు చదువుకునే సమయంలో పొందిన వృత్తి విద్య శిక్షణతో భవిష్యత్తులో ఉపాధి కలుగుతుంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలకు ఉపయోగపడతాయి. ప్రభుత్వం స్వయం ఉపాధి యూనిట్లకు రాయితీపై రుణాలు ఇస్తున్న నేపథ్యంలో ఈ కోర్సులు ఉపయోగపడతాయని సమగ్ర శిక్షా ఏపీసీ వెంకటసుబ్బయ్య తెలిపారు. శిక్షణకు అవసరమైన అన్ని పరికరాలు, యంత్రాలు ఇటీవల కేజీబీవీలకు సరఫరా చేసినట్లు వివరించారు.

మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: ప్రజల ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో రోడ్డు భద్రత కమిటీ సమావేశాన్ని ఎస్పీ అజిత వేజండ్లతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, రేడియం పెయింటింగ్ వేయాలని సూచించారు. బుజబుజనెల్లూరు నుంచి భగత్‌సింగ్ కాలనీ వరకు ప్రమాదాలు సంభవించే తొమ్మిది ప్రాంతాల్లో నివారణ చర్యలు తీసుకోవాలని ఎన్‌హెచ్ అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ బస్టాండు వద్ద లోపలకు వెళ్లేటప్పుడు, బయటకు వచ్చేటప్పుడు బస్సులు నిలపకుండా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. నగర పరిధిలోని మద్రాసు బస్టాండు, ఆర్టీసీ, ఆత్మకూరు బస్టాండు, స్టోన్‌హౌస్‌పేట ప్రధాన కూడళ్లలో రోడ్డు మార్జిన్ ఆక్రమణలు లేకుండా, వీధివ్యాపారులు ఎక్కువ సమయం ఉండకుండా ట్రాఫిక్ నివారణకు నగరపాలకసంస్థ, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీ సౌజన్య, నగరపాలకసంస్థ కమిషనర్ వైవో నందన్, ఆర్అండ్‌బీ ఎస్ఈ రామకృష్ణప్రసాద్, డీటీసీ చందర్, ఎన్‌హెచ్‌ఏ పీడీ ఎంకే చౌదరి, డీపీవో శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ గంగాభవాని, ఆత్మకూరు ఆర్డీవో పావని తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలు సేవా దృక్పథంతో పని చేయాలి

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: సహకార సంఘాల సభ్యుల మధ్య మంచి అవగాహన ఉన్నప్పుడే ప్రజలకు సేవలు అందించవచ్చని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో అఖిల భారత సహకార వారోత్సవాలు-2025 ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత అభిప్రాయాలకు తావు లేకుండా అందరూ సమన్వయంతో సమష్టిగా పని చేయాలన్నారు. కోఆపరేటివ్ అధికారి గురప్ప మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో వారోత్సవాలను నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం అత్యుత్తమ సేవలు అందించిన సహకార సంఘాలు, సిబ్బందికి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈవోలు, డివిజన్ అధికారులు, సహకార సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

రబీలో 7.23 లక్షల ఎకరాలకు సాగునీరు: ఎస్ఈ

నెల్లూరు(పద్మావతిసెంటర్): జిల్లాలో రబీ సీజన్‌లో సోమశిల, కండలేరు జలాశయాల పరిధిలో 7,23,300 ఎకరాలకు సాగునీరు ఇవ్వనున్నట్లు జలవనరుల శాఖ ఎస్ఈ దేశినాయక్ తెలిపారు. సోమశిల జలాశయం పరిధిలో 5,04,000 ఎకరాలు, ఇందులో పెన్నాడెల్టా ఆయకట్టు పరిధిలో 2,26,000 ఎకరాలకు, కనుపూర్ కాలువ పరిధిలో 65,000, సోమశిల జలాశయంలో అంతర్భాగమైన సౌత్ ఫీడర్ కాలువ కింద 75,000, కావలి కాలువ కింద లక్ష, సౌత్ ఫీడర్ కెనాల్ కింద 48000 ఎకరాలకు సాగు నీరు ఇస్తామని వివరించారు. కండలేరు జలాశయం పరిధిలో తిరుపతి జిల్లాకు 1,75,000 ఎకరాలకు, నెల్లూరు జిల్లాకు 47,000 ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. కాలువల్లో పూడిక తీసి చివరి ఆయకట్టు వరకు రైతులకు నీరు అందించేందుకు రూ. 14 కోట్లు ఖర్చు చేస్తామన్నారు. ఇందులో కాలువల్లో పూడిక తీయడంతోపాటు చెరువు కట్టల బలోపేతం, దెబ్బతిన్న షట్టర్లను నిర్మించడం వంటి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

ప్రకాశం జిల్లా ఏపీసీగా ఉదయగిరి డిగ్రీ కళాశాల అధ్యాపకుడు

ఉదయగిరి, న్యూస్‌టుడే : ప్రకాశం జిల్లా సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ (ఏపీసీ)గా ఉదయగిరిలోని మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోటనీ అధ్యాపకుడు **దాసరిపల్లి అనిల్‌కుమార్** నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ గురువారం ఉత్తర్వులిచ్చారు. ప్రకాశం జిల్లా ఒంగోలు మండలం కొప్పోలు గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ ఉదయగిరి మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2021వ సంవత్సరం నుంచి పని చేస్తున్నారు.

IN THE COURT OF THE HON'BLE III ADDL. SENIOR CIVIL JUDGE AND J.M.F.C. AT KOLAR
O.S. No. 690/2024

BETWEEN: Land Marg Businessventures Pvt., Ltd., Represented by its partner ...Plaintiffs

AND: Gangadhara Ravindra Naidu and others ...Defendants.

SUMMONS UNDER ORDER 5 RULE 20 C.P.C TO PROPOSED DEFENDANT No. 3

G.V. Ramana Reddy, S/o. G.B. Reddy, Residing at No. 26-2-11-1, Sardhar Vallabai Patel Nagar, Opp: Rathnam School, Rithwik Enclave, Nellore, Nellore, Andhra Pradesh-524004.

Whereas, the plaintiff has instituted the above suit against you and others for the relief of Permanent Injunction, you are hereby summoned to appear in this court in person or by an advocate duly instructed on **15/12/2025** at **11 'O' clock** in the forenoon to answer the same, failing which the suit/application will be disposed off exparte.

The notice that in default of your appearance on the day above mentioned, the suit will be hard and determined in your absence.

Given under my seal and signature on this 15/11/2025 at Kolar.

By order of the Court, Sheristedar, Hon'ble Prl. Senior Civil Judge & C.J.M at Kolar

Advocate for Plaintiff:
SHAHNAWAZ MAMADAPER

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాముధర:	రూ. 11,740
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 93,920
వెండి గ్రాము :	రూ. 164.60

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	126
లేయర్	125
బ్రాయిలర్స్	228
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	252
లేయర్ మాంసం	212

తనిఖీ చేస్తున్న పోలీసులు

రామాయపట్నంలో సాగర్ కవచ్

ఉలవపాడు : తీర రక్షణ కోసం నిర్వహిస్తున్న సాగర్ కవచ్ కార్యక్రమాన్ని మండలంలోని రామాయపట్నంలో గురువారం ప్రారంభించారు. ఇక్కడి సీఎస్‌పీఎస్ పరిధిలోని గుడ్లూరు, ఉలవపాడు, సింగరాయకొండ, టంగుటూరు తీర ప్రాంతంలో ఈ మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నామని సీఐ శివన్నారాయణ తెలిపారు. ఇందులో భాగంగా తీర ప్రాంతంలోని గ్రామాలు, సముద్ర తీరంలోకి వచ్చిన వాహనాలను తనిఖీ చేశారు. ఓడరేవులో సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారా లేదా అని పరిశీలించారు. 12 చోట్ల తనిఖీ, ఆరు గ్రామాల్లో రక్షణ ఏర్పాట్లు, తొమ్మిది చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఉలవపాడు, వలేటివారిపాలెం, సింగరాయకొండ, టంగుటూరు ఎస్సైలు అంకమ్మ, మరిదినాయుడు, బి.మహేంద్ర, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

సచివాలయాలకు జవసత్వాలు

36 మంది డిప్యూటీ ఎంపీడీవోల కేటాయింపు

న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ): గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలో మార్పులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నెల్లూరు గ్రామీణం మినహా 36 మండలాలకు డిప్యూటీ ఎంపీడీవోలను నియమించింది. ఈ మేరకు గురువారం రాత్రి జీవోఎంఎస్ పదిని విడుదల చేయగా. . కలెక్టర్ ఆధ్వర్యంలో జడ్పీ సీఈవో, డీపీవో, రెవెన్యూ అధికారులు అమలుకు కసరత్తు ప్రారంభించారు.

769 సచివాలయాలు ఉండగా.. జిల్లాలో 769 సచివాలయాలుండగా.. 534 గ్రామ సచివాలయాలు, కార్పొరేషన్ పరిధిలో 166, కావలిలో 28, కందుకూరులో 17, ఆత్మకూరులో 8, అల్లూరులో 6, బుచ్చి నగర పంచాయతీలో పది వార్డు సచివాలయాలు సేవలందిస్తున్నాయి. వీటి పర్యవేక్షణకు డీఎల్‌పీవో స్థాయి సీనియర్ అధికారిని సచివాలయాల నిర్వహణ జిల్లా అధికారిగా నియమిస్తున్నారు. ఈయనకు ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. మండలానికి ఒకరి చొప్పున 36 మంది డిప్యూటీ ఎంపీడీవోలను నియమించారు. సీనియర్ సహాయకులకు ఉద్యోగోన్నతులు కల్పించారు. దీనిపై జడ్పీ ఇన్‌ఛార్జి సీఈవో శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. 36 మందిని మండల అధికారులుగా ఉద్యోగోన్నతుల ద్వారా కేటాయించారు. సంబంధిత ప్రక్రియను కలెక్టర్ ఆధ్వర్యంలో వెంటనే చేపడతామన్నారు

డిగ్రీలో నేరుగా ప్రవేశాలు

వెంకటాచలం, న్యూస్‌టుడే: విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో డిగ్రీ, ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో మిగిలిన సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు డీవోఏ డైరెక్టర్ ఆచార్య హనుమారెడ్డి తెలిపారు. బీకాం (కంప్యూటర్ అప్లికేషన్), బీబీఏ (లాజిస్టిక్), బీఎస్సీ (ఫిజిక్స్, స్టాటిస్టిక్స్), బీఎస్సీ- ఎంఎస్సీ ఇంటిగ్రేటెడ్ కోర్సులు(ఫుడ్‌టెక్నాలజీ, మైక్రోబయాలజీ), ఎంఎస్సీ (బయో ఇన్ఫర్మేటిక్), బీఎస్సీ పొలిటికల్ సైన్సు కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈనెల 24 తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. వివరాలకు వీఎస్‌యూ వెబ్‌సైట్ లేక వీఎస్‌యూలోని డీఓఏ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు

22న జిల్లావ్యాప్తంగా ఉపాధి గ్రామసభలు

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: ఈ నెల 22న జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఒకేసారి ఉదయం 10 గంటల నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు డ్వామా పీడీ గంగాభవానీ ప్రకటనలో తెలిపారు. సభల్లో ప్రధానంగా ఉపాధి కూలీల సమస్యలు, కొత్తగా ఇస్తున్న జాబ్ కార్డుల పరంగా తలెత్తిన సమస్యలు, పనికోసంగా దరఖాస్తు తదితర అంశాలపై మండలస్థాయి అధికారుల ఆధ్వర్యంలో గ్రామ సభలు జరుగుతాయన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

చిన్నారుల భద్రత అందరిది

నెల్లూరు(విద్య, దర్గామిట్ట), న్యూస్‌టుడే: చిన్నారుల భద్రత అందరిదని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారిణి బి.హేనాసుజన్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని దర్గామిట్టలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ, జిల్లా బాలల సంరక్షణ విభాగాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం బాలల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, అందరూ సమష్టిగా బాలల హక్కులను కాపాడాలని తెలిపారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి, ఎంఈవో మురళీధర్, బాలల సంరక్షణ అధికారి బి.సురేష్, వెంకటేశ్వర్లు, సతీష్, సీజేడబ్ల్యూఎస్ ఎన్జీవో శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

EENADU Classifieds

REAL ESTATE

PLOT FOR SALE

నెల్లూరు టౌన్‌కి దగ్గరగా గూడూరు, మనుబోలు, చెన్నూరు హైవేలోకి నుడా ఓపెన్ ప్లాట్స్ తక్కువ ధరకే, స్పాట్ రిజిస్ట్రేషన్, బ్యాంకు లోన్. Contact ✆ 91214 59131

TO LET

నెల్లూరు రామ్మూర్తి నగర్‌లో 1వ ఫ్లోర్‌లో 3 బెడ్ రూం, 2 హాల్స్, పూజ రూం గల ఇల్లు (2200 Sft) అద్దెకు కలదు. అద్దె: 35000. సంప్ర: 94940 49324

JOBS

నెల్లూరు జిల్లాలో ప్రముఖ ఫైనాన్స్ నందు పనిచేయడానికి కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను (పు), టెలికాలర్ కావలెను (స్త్రీ), Address: B.V.నగర్. ✆ 7997997080

నెల్లూరు మా సోలార్ సిస్టమ్ కంపెనీ నందు పనిచేయుటకు ఉత్సాహవంతులైన (M/F) కావలెను. అకౌంటెంట్, ఎలక్ట్రీషియన్, సోలార్ టెక్నికల్ పర్సన్స్. ✆ 91107 12220

శ్రీ బాలాజీ సర్వీసెస్ నెల్లూరు నందు పని చేయుటకు అనుభవం గల సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. Contact Numbeers : ✆ 92814 44697, 92814 44698.

చెన్నైలో ఇంట్లో ఉండి వంట పని చేయుటకు Chef (Male / Female) కావలెను. జీతం: 20,000/- సంప్ర|| Contact ✆ 98403 76075

TOURS AND TRAVELS

వేదవిద్యాసాధనా పరిషత్ వారిచే బద్రి, కేదార్ మొ|| ఛార్‌ధామ్ యాత్ర-2026 బుకింగ్ 1000/- మాత్రమే 2)కాశీ-ప్రయాగ యాత్ర, ప్రతి నెల 3)జమ్ము, వైష్ణోదేవి, కురుక్షేత్ర. పూజాభిషేకం, పిండదాన సహితముగా కాల్: 9394142516, వాట్సాప్ 9873790017

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు...

B/w 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే

వివరాలకు..

నెల్లూరు
80080 01790

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 600
Colour : రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నాణెం.. సేకరణ నైపుణ్యం

● ప్రదర్శనలతో విద్యార్థులకు అవగాహన
● ప్రభుత్వ ఉపాధ్యాయుడి చొరవ

వృత్తి ఉపాధ్యాయుడైనా, ప్రవృత్తి కరెన్సీ సేకరణ. వివిధ దేశాల నోట్లు, నాణేలు సేకరిస్తూ వాటితో ప్రదర్శనలు ఇస్తూ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.. నెల్లూరు నగరం ఆర్ఎస్ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు.. మురిగిపూడి సతీష్‌కుమార్. నాణేల సేకరణపై ఉన్న మక్కువ అతనికి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చింది.

– న్యూస్‌టుడే, నెల్లూరు (మార్కెట్ సెంటర్)

నెల్లూరు నగరంలోని శివప్రియ సెంటర్ ప్రాంతంలో బాబాయికి పుస్తకాల దుకాణం ఉండటంతో సతీష్‌కుమార్ డిగ్రీ చదివే రోజుల్లో అక్కడకు వెళ్లి కూర్చునేవారు. రకరకాల నాణేలు వస్తుండటంతో వాటిపై ఆసక్తి పెంచుకున్నారు. అప్పటి నుంచి మొదలైన ఆసక్తి 40 ఏళ్లుగా కొనసాగుతోంది. అమెరికా, కెనడా, రష్యా, చైనా, ఆఫ్రికా, ఫ్రాన్స్, కొలంబియా తదితర 40దేశాల నోట్లు, నాణేలు సేకరించారు. వీటిలో అరుదైన నోట్లు కూడా ఉన్నాయి. కొరియాకు చెందిన అతి చిన్న నోటుతోపాటు ఇండోనేషియాకు చెందిన 10వేల నుంచి లక్ష రూపాయల నోట్లు, రష్యాకు చెందిన ప్లాస్టిక్ నాణేలు ఆకట్టుకుంటున్నాయి. బ్రిటీష్ కాలంనాటి వెండి నాణేలతోపాటు పురాతన, అరుదైన కరెన్సీ వివిధ సేకరించి వాటిని భద్రపరుస్తున్నారు. దేశంలోని నాలుగు ప్రాంతాల్లోని మింట్‌లలో చిన్నచిన్న గుర్తులతో ముద్రించే కరెన్సీని సేకరించారు. వాటి ప్రదర్శన నిర్వహిస్తూ ఆయా దేశాల కరెన్సీ గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

నిరంతరం కొనసాగిస్తా

ఉద్యోగ విరమణ చేసిన తర్వాత పాఠశాలల వారీగా విద్యార్థులకు అవగాహన కల్పించాలనే ఆలోచన చేస్తున్నట్లు సతీష్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం గ్రంథాలయ వారోత్సవాలు, పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు జరిగినప్పుడు వీటిని ప్రదర్శిస్తున్నట్లు వెల్లడించారు.

సేకరించిన నాణేలతో ఉపాధ్యాయుడు సతీష్‌రెడ్డి

రైలు కింద పడి యువకుడి మృతి

కావలి: రైలు కింద పడి ఫకృద్దీన్ (33) అనే యువకుడు దుర్మరణం చెందిన వైనమది. కావలి- తెట్టు రైల్వే స్టేషన్ల మధ్య ఈ ఘటన చోటుచేసుకుంది. గురువారం ప్రభుత్వ రైల్వే పోలీసుస్టేషన్ ఎస్సై వెంకట్రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రాంతీయా సుపత్రికి తరలించారు.

బాలిక మృతిపై విచారణ

మర్రిపాడు, న్యూస్‌టుడే: కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయం వసతి గృహంలో ఈ నెల 19వ తేదీన బాలిక(14) మృతి చెందిన విషయమై గురువారం హైదరాబాద్ నవోదయ విద్యాలయ సమితి అసిస్టెంట్ కమిషనర్ చక్రపాణి, కర్నూల్, ప్రకాశం నవోదయ విద్యాలయం ప్రిన్సిపళ్లు పద్మావతి, శివరామ్, ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ విచారణ చేపట్టారు. బాలిక ఆత్మహత్య చేసుకున్న వసతి గృహాన్ని పరిశీలించారు. బ్యాగులు, పుస్తకాలు తనిఖీ చేశారు. తోటి విద్యార్థినులను ప్రశ్నించగా.. బాలిక మూడు రోజులుగా విచారంగా ఉందని, జ్వరం, జలుబుకు ఉపయోగించే మాత్రలు ఎక్కువగా మింగితే చనిపోతామా.. నేను చనిపోతే మీరు ఏడుస్తారా.. నవ్వుతారా అని తోటి విద్యార్థినుల వద్ద ప్రస్తావించినట్లు సమాచారం. ఒక పుస్తకంలో కూడా 'ఒంటరి జీవితం.. సైకో డైడ్' అని రాసుకున్నట్లు తెలుస్తోంది. తోటి విద్యార్థులు చెప్పిన విషయాలే కాకుండా మరే ఇతర కారణాలు ఉన్నాయా అని పలు కోణాల్లో విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. విచారణలో సీఐ గంగాధర్, ఎస్సై శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇళ్లకు వెళ్లిపోతున్న విద్యార్థులు

భయంతో ఇళ్లకు వెళ్లిన విద్యార్థులు.. విద్యార్థిని మృతితో వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులు భయంతో తల్లిదండ్రులతో కలిసి ఇళ్లకు వెళ్లిపోయారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు సుమారు 150 మంది వెళ్లిపోయారు. నవోదయలో గతంలో మాదిరిగా సిబ్బంది లేరని, విద్యార్థుల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. రెగ్యులర్ ప్రిన్సిపల్‌ను నియమించాలని కోరుతున్నారు.

'నాపై రిపోర్టు రాస్తే నీ అంతుచూస్తా'

మహిళా వీఆర్వో వాగ్వాదం

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: సరిగా పనిచేయడం లేదని నాపై రిపోర్టు రాస్తే నీ సంగతి తేలుస్తా.. నేనేంటో చూపిస్తా.. అంటూ ఓ మహిళా వీఆర్వో ఆగ్రహంతో ఊగిపోయిన ఉదంతం గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగింది. వివరాల మేరకు.. విద్యార్థులకు సంబంధించిన ధ్రువ పత్రాల విషయంలో ఆలస్యం చేయకుండా త్వరగా మంజూరు చేయాలని ఆర్ఐ శ్రీకాంత్.. సదరు మహిళా వీఆర్వోకు సూచించారు. దీంతో కోపోద్రిక్తురాలైన ఆమె నా ఇష్టం వచ్చినప్పుడు చేస్తాను. ఈ విషయంలో నా మీద రిపోర్టు పంపిస్తావా? నేను గిరిజన మహిళను నీపై అట్రాసిటీ కేసు నమోదు చేయిస్తా.. అంటూ విరుచుకుపడింది. ఈ ఘటనతో అక్కడే ఉన్న రెవెన్యూ అధికారులు నిర్ఘాంతపోయారు. దీనిపై తహసీల్దార్ గోపికృష్ణను వివరణ కోరగా.. వీఆర్వో ప్రవర్తనపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.

అరుణకు బెయిల్ మంజూరు

విజయవాడ, న్యూస్‌టుడే: ఎస్సై, అంగన్‌వాడీ పోస్టులు ఇప్పిస్తానంటూ ఒక వృద్ధుడిని రూ. 24.5 లక్షల మేర మోసం చేసిన కేసులో నిందితురాలు నిడిగుంట అరుణకు విజయవాడ 1వ అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. మోసం కేసులో నెల్లూరుకు చెందిన అరుణపై గత నెల 13న విజయవాడ సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేసి ఆమెను పీటీ వారెంట్‌పై న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఈ కేసులో నిందితురాలిని రెండు రోజుల పాటు పోలీసులు తమ కస్టడీలోకి తీసుకుని విచారించారు. నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్న అరుణ ఈ కేసులో తనకు బెయిల్ ఇవ్వాలంటూ న్యాయవాది ద్వారా పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన న్యాయమూర్తి దేవిక నిందితురాలికి బెయిల్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రూ. 25 వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించారు.

టిప్పర్‌ను ఢీకొన్న కారు

ఇంజినీరింగ్ విద్యార్థి దుర్మరణం

కొడవలూరు, న్యూస్‌టుడే: టిప్పర్‌ని వెనకనుంచి కారు ఢీకొనడంతో కారు నడుపుతున్న యువకుడు మృతిచెందాడు. కొడవలూరు మండలంలోని జాతీయ రహదారిపై కమ్మపాళెం వద్ద ఈ సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై చిన్నపరెడ్డి కోటిరెడ్డి కథనం మేరకు..నెల్లూరుకు చెందిన అన్వర్ అహ్మద్ (21), రంగనాథ్‌లు గంగవరం గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చివరిసంవత్సరం చదువుతున్నారు. బిట్రగుంటలో ఉన్న స్నేహితుడి వద్దకు వెళ్లి కారులో ఇంటికి తిరిగి వస్తుండగా జాతీయరహదారిపై కమ్మపాళెం వద్ద ముందు వెళ్తున్న టిప్పర్‌ను ప్రమాదవశాత్తు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న అన్వర్‌అహ్మద్ అక్కడికక్కడే మృతిచెందగా, రంగనాథ్‌కు గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు కేజీబీవీ బాలికలు

గుడ్లూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని కేజీబీవీ పాఠశాల నుంచి ముగ్గురు బాలికలు ఎంపికయ్యారని ప్రత్యేకాధికారిణి అమృతజ్యోష్ణ, పీఈటీ చిట్టెమ్మ గురువారం తెలిపారు. ఈ నెల 18న సింగరాయకొండ మండలం పాకలలో జరిగిన ఎంపికలో 17 సంవత్సరాల లోపు విభాగంలో ఎన్.స్నేహతిరుమల, ఎం.కొండమ్మ ఎంపిక కాగా, 14 సంవత్సరాలలోపు విభాగంలో పి.ప్రవల్లిక ఎంపికైంది.

ఎంపికైన బాలికలతో ప్రత్యేకాధికారిణి అమృతజ్యోష్ణ

కబడ్డీ, ఖోఖో జట్లకు..

వలేటివారిపాలెం, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే అండర్ 17, 14 విభాగాల కబడ్డీ, ఖోఖో జిల్లా జట్లకు వలేటివారిపాలెం జడ్పీ పాఠశాల క్రీడాకారులు ఎంపికయ్యారని ఫిజికల్ డైరెక్టరు కత్తి ఐజక్ తెలిపారు. 14 సంవత్సరాల లోపు విభాగంలో మర్రిమని విష్ణు కబడ్డీలో, గూడూరు సంతోష్ ఖోఖో జట్టుకు ఎంపికయ్యారు. 17 సంవత్సరాల లోపు విభాగంలో చప్పిడి అశ్విత, చొప్పర లోకేష్ చోటు సంపాదించారు.

ఎంపికైన క్రీడాకారులు

కావలి

• కావలి • ఉదయగిరి • కందుకూరు

పేదలకు పక్కా గృహాలు నిర్మించడమే ధ్యేయం

లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని పేదలందరికీ పక్కా గృహాలు నిర్మించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని బృందావనం, కోటారెడ్డి నగర్ సచివాలయాల్లో బుధవారం 415 మందికి ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ డీఈ పి.వి.నారాయణరెడ్డి, కమిషనర్ కె.అనూష, తహసీల్దారు లావణ్య, తెదేపా నాయకులు మల్లేశ్వరరావు, ఉన్నం వీరాస్వామి, పదిలపాటి కొండయ్య, ఉప్పుటూరి శ్రీనివాసరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, దామన్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణలో ఆదర్శంగా ఉండాలి

కందుకూరు గ్రామీణం : చెత్త సంపద కేంద్రాల ద్వారా సంపద సృష్టించడంలో గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని ప్రకాశం జిల్లా జడ్పీ సీఈవో చిరంజీవి సూచించారు. గురువారం ఓగూరులో ఇంటింటికీ చెత్త సేకరణను తనిఖీ చేశారు. అనంతరం చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. డిజిటల్‌లోని ఫ్యామిలీ విభిన్న శిక్షణ కార్యక్రమం ఇప్పటికే పూర్తిచేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో రత్నజ్యోతి, పంచాయతీ కార్యదర్శి హనుమంతరావు తదితరులు ఉన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)

కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: రీసర్వే ప్రక్రియలో తప్పులు చోటుచేసుకుంటున్నాయి.
- గంగపట్నం రామచంద్రయ్య, కావలి

సమాధానం: రీసర్వే కార్యక్రమాన్ని పక్కాగా చేయాలని ఆదేశించాం. ఎవరికి ఇబ్బంది లేకుండా చూస్తాం.
- ఎం.సన్నీవంశీకృష్ణ, ఆర్డీవో, కావలి - న్యూస్‌టుడే, కావలి

? లింగసముద్రంలోని సాయిశ్రీనివాస పాఠశాలకు వెళ్లే మార్గంలో చెత్త కుప్పలు ఉండడంతో పందుల సంచారం అధికంగా ఉంది.
- మాధవరావు, గ్రామస్థుడు

✓ సిబ్బందితో ఆ ప్రాంతంలోని చెత్త తీయిస్తాం.
- మాధవరావు, పంచాయతీ కార్యదర్శి, లింగసముద్రం - న్యూస్‌టుడే, లింగసముద్రం

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఉదయగిరి : సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ గ్రామ రెవెన్యూ సహాయకులు గురువారం ఇన్‌ఛార్జి తహసీల్దారు పాపయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత గల వీఆర్‌ఏలకు వీఆర్‌వోలు, రికార్డు అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో దుర్గయ్య, శ్రీనివాసులు, హజరత్, పిచ్చయ్య, ప్రకాష్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు. **లింగసముద్రం :** సమస్యలను తక్షణం పరిష్కరించాలని వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. వేతనాలు పెంచడంతోపాటు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దారు కోటేశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రసంగంలో ప్రతిభావంతులు

విద్యార్థులతో రుద్రకోట జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళి

కావలి, న్యూస్‌టుడే: మండలంలోని రుద్రకోట జడ్పీ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో గురువారం ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. వీటిలో భాగంగా 'విద్యార్థులపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీలో ప్రతిభ చూపారు. ఎల్లంటి హర్షిత, ముక్కు జనని, బొమ్మిరెడ్డి సాయిశుశ్రిత విజేతలుగా నిలిచారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళి వారికి బహుమతులు అందజేశారు.

ఉపన్యసించి.. మెప్పించి

బహుమతులిస్తున్న శ్రీప్రతిభ కళాశాల అధ్యాపకులు

కందుకూరు పట్టణం : పట్టణంలోని ఓవీ రోడ్డులో ఉన్న శ్రీప్రతిభ జూనియర్ కళాశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు గురువారం జరిగాయి. 'ఏఐతో భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎల్.ధృతి, వి.ఐశ్వర్య, ఎస్.కె.షబీనుల్ విజేతలుగా నిలిచారు. కళాశాల సీఈవో జయప్రకాష్‌నారాయణ, ప్రిన్సిపల్ జి.శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు.

వైభవంగా పరమేశ్వరుడికి రుద్రాభిషేకం

ఉదయగిరి : పట్టణంలోని బీసీ కాలనీ సమీపంలో శిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం కార్తిక మాసం, అమావాస్య తిథిని పురస్కరించుకొని పరమేశ్వరుడికి రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారికి పంచామృతాలు, సుగంధద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. **వింజమూరు, వరికుంటపాడు :** శివాలయాల్లో కార్తిక మాస ముగింపు ఉత్సవాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలనంతరం యర్రబల్లిపాలెం చెరువులో కార్తిక దీపాలు వదిలారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వరికుంటపాడు సమీపంలోని పల్లతిప్ప శివాలయంలో పూజలు వైభవంగా నిర్వహించారు.

మత్తు.. జీవితం చిత్తవదా!

కావలి, న్యూస్‌టుడే

వ్యసనాలకు బానిసలై కొందరు.. త్వరగా డబ్బు సంపాదించాలన్న యావతో ఇంకొందరు.. స్నేహితుల ప్రభావంతో మరికొందరు పక్కదోవ పడుతున్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. అందునా గంజాయి వ్యాపారం చేస్తున్నారు. దీన్ని రవాణా చేస్తూ... విక్రయిస్తూ పోలీసులకు దొరుకుతున్నారు. బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారు. కన్నవారికి శోకం మిగులుస్తున్నారు. కావలి కేంద్రంగా యువకులు ఈ వ్యాపారం చేస్తున్నారు.

కావలి ప్రాంతంలో పలువీధుల్లో గంజాయి పొడితో పాటు మాత్రలు, ఇంజక్షన్లు వంటివి కూడా దొరుకుతున్నాయి. ఆంధ్ర, ఒడిశా సరిహద్దు నుంచి సముద్ర మార్గంలో అల్లూరు మండలంలోని గ్రామాల వరకు తీసుకొస్తున్నారు. అటు నుంచి వివిధ రూట్లలో చాలా ప్రాంతాలకు తరలిస్తున్నట్లు పోలీసుల ద్వారా తెలుస్తోంది. ఎక్కువమంది బ్యాగుల్లో గోధుమ రంగు ప్లాస్టిక్ టేపుల అతికించి రవాణా చేస్తున్నారు. ఒడిశా నుంచి తెచ్చిన ధరకు రెట్టింపు స్థాయిలో విక్రయిస్తున్నారు. ఇదో కుటీర పరిశ్రమలా మారింది. పట్టణంలోని పలు ప్రాంతాల్లోని ఇళ్లలో ప్యాకెట్లుగా చేసి గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు. ఇది విద్యాలయాలకు పాకింది. విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని గంజాయి ముఠా విక్రయాలు చేస్తుంది. సిగరెట్లలో పెట్టి అమ్ముతున్నారు. దీంతో దీనికి బానిసలవుతున్నారు. ఇళ్లకు దూరంగా ఉన్నత చదువుల పేరిట హాస్టళ్లు..గదుల్లో ఉంటున్న వారు ఈ విషవలయంలో చిక్కుకుంటున్నారు.

గంజాయి కేసు వివరాలు వెల్లడిస్తున్న జీఆర్పీ నెల్లూరు డీఎస్పీ మురళీధర్, సీఐ సుధాకర్ (పాతచిత్రం)

నేరాల్లో..

◗ 2023 సంవత్సరంలో వెంగళరావునగర్‌లో దారిన పోతున్న అయిదేళ్ల చిన్నారి గొంతును గంజాయి మత్తులో ఉన్న యువకుడు బ్లేడ్‌తో కోశాడు. ఆ తరువాత వారంరోజులకే వెళ్లి మా పాప గొంతు కోసేశా అని నిందితుడు చెప్పడం గంజాయి మత్తుకు నిదర్శనం.

◗ 2024 సంవత్సరంలో కావలి పట్టణం పాతూరు ప్రాంతంలో గ్యాంగ్‌వార్‌లు జరిగాయి. పురపాలక పరిధిలోని పదో వార్డు కుర్రకారు ఈ మత్తులో ఘర్షణలు చోటుచేసుకోవడంతోపాటు నిత్యం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో పంచాయతీలు జరిగేవి.

ఇవిగో ఉదాహరణలు

ఈ ఏడాది.. రైల్వే పోలీసుస్టేషన్ పరిధిలో జూన్ 23న ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి తరలిస్తున్న ఇద్దరిని జీఆర్పీ సిబ్బంది పట్టుకొని 15 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ◗ గత ఏడాది కావలి- పెదపవని మార్గంలో పీజీ కేంద్రం వద్ద గంజాయి ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్న పేద మహిళల్ని రెండో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. ◗ అల్లూరు పరిధిలో 300 గ్రాము ◗ బిట్రగుంటలో ఆరు కిలోలు దొరికింది. **గత ఏడాది..** ఒకటో పట్టణ పరిధిలో మూడు చోట్ల 4 కిలోలు, రెండో పట్టణ పరిధిలో రెండు కేసుల్లో 3.8 కిలోలు, గౌరవరం టోల్‌ప్లాజా వద్ద రెండు కేసుల్లో 15 కిలోల వంతున దొరికింది.

ఉక్కుపాదం

మాదకద్రవ్యాలను అదుపు చేసేందుకు విస్తృతంగా చర్యలు తీసుకుంటున్నాం. సమాచారం వచ్చిన వెంటనే స్పందిస్తున్నాం. కళాశాలల్లో తరచూ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. మాకు సమాచారం ఇచ్చే వారి వివరాలు రహస్యంగా ఉంచుతున్నాం.

పి.శ్రీధర్, డీఎస్పీ, కావలి

ఏటీఎం..ఎప్పుడూ మూతే!



గ్రామంలోని కెనరా బ్యాంకు ఏటీఎం ఎప్పుడూ మూసివేసి ఉండడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకు పక్కనే ఉండడంతో వినియోగదారులకు సౌకర్యంగా ఉంది. పది రోజులుగా మూసివేయడంతో నగదు కోసం మాచవరం, కందుకూరు వెళ్లాల్సి వస్తోంది.
- గుడ్లూరు, న్యూస్‌టుడే

చుక్కల్లో పొగనారు ధర

వర్షాలకు పొగ నారుమడులు కొంత దెబ్బతినడంతో ఉన్న నారు ధరలకు రెక్కలొచ్చాయి. ఓగూరు సమీపంలో నారు మడులు ఉన్నాయి. ప్రస్తుతం పొగ మొక్కలు వేస్తున్నారు. దీంతో మూట రూ.6500ల వరకు పలుకుతుంది. గత ఏడాది కంటె రెట్టింపు పలకడంతో రైతులకు భారంగా మారింది. **- కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే**

బోరు వస్తువులు.. చోరుల పాలు

కౌరుగుంటలో తాగునీటి బోర్ల విడి భాగాలు మాయమవుతున్నాయి. గ్రామంలోని శ్మశాన స్థలంలో బోరు మూడు నెలల క్రితం మరమ్మతులకు గురైంది. దీంతో సిబ్బంది పంపును విప్పి పట్టా కప్పారు. ఈ క్రమంలో బోరు విడిభాగాలను కోసి కొందరు చోరీ చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ విషయమై ఎంపీడీవో వెంకటేశ్వర్లును వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. **- దగదర్తి, న్యూస్‌టుడే**

అధ్వానంగా రక్షిత పథకం

ఈ చిత్రం కావలి పట్టణం అడవిరాజుపాలెం వద్ద ఉన్న పురపాలక మినీ వాటర్ స్కీం. దీని నిర్వహణను అధికారులు మరిచిపోయారు. చుట్టూ మొక్కలు పెరిగాయి. బావిలో వ్యర్థాలు చేరాయి. ఈనీటినే శుద్ధి చేయకుండా సరఫరా చేస్తున్నారు. ఈ విషయమై పురపాలక కమిషనర్ శ్రావణ్‌కుమార్ స్పందిస్తూ బ్లీచింగ్ ప్రక్రియ జరిగేలా చూస్తామన్నారు. **- కావలి, న్యూస్‌టుడే**

చప్టా శిథిలం.. రాకపోకలకు భయం

తిమ్మారెడ్డిపాలెం- గంగపాలెం మధ్య నేల చప్టా శిథిలమై ప్రమాదకరంగా ఉంది. రాత్రి సమయాల్లో తరచూ ఇక్కడ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి వంతెన నిర్మించాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. **- లింగసముద్రం, న్యూస్‌టుడే**

సీఐ అనుమానాస్పద మృతిపై విచారణకు డిమాండ్

నిరసన తెలుపుతున్న శాలివాహనులు

కావలి, న్యూస్‌టుడే: ఇటీవల అనుమానాస్పదంగా మృతి చెందిన సీఐ సతీష్ ఉదంతంపై నిగ్గు తేల్చాలని శాలివాహన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఈ విషయమై ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కావలి ఆర్డీవో ఎం.సన్నీవంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి

లక్ష కార్డుల ఉద్యమంలో కార్డులు ప్రదర్శిస్తున్న దళిత నాయకులు

వింజమూరు, న్యూస్‌టుడే : అంబేడ్కర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని కోరుతూ గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం లక్ష కార్డుల ఉద్యమాన్ని దళితులు చేపట్టారు. ఈ సందర్భంగా దళిత నాయకుడు వి.పెంచయ్య మాట్లాడుతూ అంబేడ్కర్ చేసిన త్యాగాలు, ఆయన రచించిన రాజ్యాంగం విలువలు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్.వెంకట నరసింహులు, ఎం.పెద్దన్న, ఎ.శ్రీనివాసులు, జి.చెన్నయ్య పాల్గొన్నారు.

లింకు రోడ్లు అధ్వానం.. గ్రామీణులకు కష్టం

వరికుంటపాడు, న్యూస్‌టుడే: మండలంలోని పల్లెల్లో లింకు రోడ్లు అధ్వానంగా మారాయి. ఎన్నికల సమయంలో పాలకులు ఇచ్చిన హామీలు మాటలకే పరిమితమయ్యాయి. అడుగడుగునా గుంతలు పడడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. వర్షాల సమయంలో పరిస్థితి గురించి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు.

❖ జడదేవి- గండిపాలెం రోడ్డు నుంచి నల్లబోతులవారిపల్లెకు వెళ్లే రోడ్డు కి.మీ పరిధిలో గ్రావెల్ లేచిపోయి గోతులు, రాళ్లతో దర్శనమిస్తోంది. ❖ వరికుంటపాడు నుంచి జంగంరెడ్డిపల్లె వెళ్లే రోడ్డు మరింత దయనీయంగా ఉంది. ❖ 565 జాతీయ రహదారి నుంచి వింజమూరు మార్గంలో రెండు కి.మీ దూరంలో ఉన్న దక్కనూరు ఎస్సీ కాలనీకి రాకపోకలు సాగించాలంటే ప్రజలు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావు. వర్షాకాలంలో ఉప్పు వాగు ఉద్ధృతంగా ప్రవహించే సమయంలో రాకపోకలు సాగించలేక ఇబ్బందులు పడుతున్నారు. ❖ ఉదయగిరి- గండిపాలెం వెళ్లే రోడ్డు నుంచి జి.కొత్తపల్లె వరకు సుమారు కి.మీ దూరం రాళ్లు లేచి గోతులమయంగా మారింది. ఇటుగా రాకపోకలు సాగించే ద్విచక్రవాహనదారులు అవస్థలు పడుతున్నారు. ❖ ఉదయగిరి మండలం కుర్రపల్లి వద్ద జాతీయ రహదారి- పెద్దిరెడ్డిపల్లె వెళ్లే రోడ్డు నుంచి కి.మీ దూరంలో ఉన్న సాతువారిపల్లిలోకి పోయే రోడ్డు కంకర బయటపడి పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. ❖ రామదేవులపాడు- జనార్దనపురం 800 మీటర్ల దూరం నిడివి కలిగిన ప్రధాన రోడ్డు గోతులు, రాళ్లతో దర్శనమిస్తోంది. ఆరోగ్యం బాగలేని సమయంలో ఆసుపత్రికి వెళ్లాలన్నా ఇక్కట్లు తప్పడం లేదు. ❖ తిమ్మారెడ్డిపల్లె ఎస్సీ కాలనీ రోడ్డు నడిచేందుకు వీల్లేకుండా ఉంది. ❖ 565 జాతీయ రహదారి నుంచి దాదాపు 2 కి.మీ దూరం అశోక్‌నగర్ రోడ్డు పరిస్థితి మరీ దుర్భరంగా ఉంది.

దక్కనూరు ఎస్సీ కాలనీ రోడ్డు

ప్రతిపాదనలు పంపాం

గ్రామాల నుంచి ప్రధాన రోడ్లను కలిపే మార్గాలు అధ్వానంగా ఉన్నాయి. వీటిని తారురోడ్లు, సీసీ రోడ్లుగా ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే వెంటనే రోడ్డు నిర్మాణాలు చేపట్టి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూస్తాం. **మనోహర్, ఏఈ, పీఆర్**

సేవలతోనే గుర్తింపు

గుడ్లూరు, న్యూస్‌టుడే: పేదలకు సేవలతోనే ఆత్మసంతృప్తి లభిస్తుందని గుడ్లూరు పీఏసీఎస్ అధ్యక్షులు దామా వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక అభ్యుదయ పాఠశాలలో గుడ్లూరుకు చెందిన యశ్వంత్‌సాయితేజ వర్ధంతి సందర్భంగా ట్రస్టు నిర్వాహకులు అజయ్‌బాబు, రాజేశ్వరి దంపతుల ఆధ్వర్యంలో రూ.లక్ష విలువైన దుస్తులను భవిత పాఠశాల విద్యార్థులు, దివ్యాంగులు, వృద్ధులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అభ్యుదయ పాఠశాల హెచ్‌ఎం కలగా రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందలేదని చేనేతల నిరసన

వింజమూరు : మండలంలో ఇటీవల మొంథా తుపానుతో కురిసిన వర్షాలకు ఉపాధి కోల్పోయామని ఆదుకోవాలని గురువారం చేనేత కార్మికులు, మహిళలు తహసీల్దారును కోరారు. మండలంలో 225కు పైగా చేనేత కుటుంబాలుండగా 70 మందికి సాయం అందలేదన్నారు. అనర్హులు సాయం పొందారని ఆరోపించారు. అధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

స్వదేశీ వస్తువుల వాడకంపై ప్రచారం

ఉదయగిరి, న్యూస్‌టుడే : స్వదేశీ వస్తువులను వినియోగించాలని పట్టణంలో భాజపా నాయకులు గురువారం ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. అనంతరం కేంద్ర సహకార బ్యాంకుకు ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్వర్లు, భాజపా నాయకులు మేకపాటి మాల్యాద్రినాయుడు, గడ్డం ప్రసాద్, మన్నేటి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

సీతారామపురం : ఆత్మనిర్భర్ భారత్ అభియాన్ నివాస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రాచీన శైవక్షేత్రం ఘటికసిద్ధేశ్వరంలో భాజపా ఆధ్వర్యంలో ఇంటింటా స్వదేశీ కార్యక్రమం కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆలయ పూజారులు, విశ్వహిందూ ప్రచారక్‌లతో గురువారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కాలభైరవకేశవానంద్ స్వామి, భాజపా నాయకులు పలువురు పాల్గొన్నారు.

మేత భూములను ఎవరికీ ఇవ్వొద్దని ఆందోళన

నినాదాలు చేస్తున్న పీఆర్‌దొడ్ల గ్రామస్థులు

సీతారామపురం, న్యూస్‌టుడే : పశువుల మేత పోరంబోకు భూములను పరిశ్రమలకు కేటాయించరాదని మండలంలోని పీఆర్‌దొడ్లవాసులు తహసీల్దారు కార్యాలయం వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. గ్రామానికి సమీపంలోని సర్వే నంబరు 88లో ఉన్న పోరంబోకు భూముల్లో గేదెలు, గొర్రెలు, మేకలను మేపుకుని జీవనం సాగిస్తున్నారు. ఈభూమిని సీబీజీ ప్లాంట్ కొరకు కేటాయిస్తే మూగజీవాలకు మేత కరవవుతుందన్నారు. తహసీల్దారు ఫాజిహాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కోడె రమణయ్య, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దుతాం: బీద

పాఠశాలలో కంప్యూటర్ గదిని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

అల్లూరు, న్యూస్‌టుడే : ఇస్కపల్లి ఉన్నత పాఠశాలను మోడల్‌గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్సీ బీద రవిచంద్ర స్పష్టం చేశారు. గురువారం ఈ పాఠశాలను పరిశీలించారు. మూడెకరాల స్థలం పాఠశాలకు వితరణగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందులో ఆడిటోరియం ఏర్పాటుచేస్తామన్నారు. దాతల సహకారంతో 20 గదులు నిర్మాణం చేయనున్నట్లు చెప్పారు. 2027 జూన్ నాటికి పాఠశాలకు కొత్త రూపు వస్తుందన్నారు. అంతకుముందు తన నివాసంలో నాయకులతో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బీద గిరిధర్, బండి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలకు పురస్కారం

పురస్కారాన్ని అందజేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

కావలి, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో తొలిగా 56 సార్లు రక్తదానం చేసిన దివంగత కాటంరెడ్డి ఆదినారాయణరెడ్డి వర్ధంతి కావలి ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం నిర్వహించారు. ఆయన తనయుడు, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధనరెడ్డి నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. భారీ రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రెడ్‌క్రాస్ భవన్‌లో కాటంరెడ్డి ఆదినారాయణరెడ్డి స్మారక పురస్కారాన్ని కోవూరుకు చెందిన దేవిరెడ్డి సురేష్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు బెజవాడ రవికుమార్, కామంచి సుబ్బారావు, డాకారపు రవిప్రకాశ్, కలికి శ్రీహరిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ విద్యార్థులకు అరుదైన అవకాశం

బిట్రగుంట రైల్వేస్టేషన్‌లో లఖ్‌నవూ వెళ్లే స్కౌట్ విద్యార్థినులు

బిట్రగుంట, న్యూస్‌టుడే: ఉత్తరప్రదేశ్‌లోని లఖ్‌నవూలో ఈ నెల 23న జరిగే స్కౌట్, గైడ్స్ నేషనల్ జాంబోరియాలో పాల్గొనే అవకాశం అల్లూరు మండలం నార్తుఆములూరు పరిధిలోని గొల్లపాలెంలో ఉన్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాస విద్యాలయం చైల్డ్ ఆశ్రమానికి చెందిన 54 మంది విద్యార్థులకు దక్కింది. దీంతో వీరు గురువారం బిట్రగుంట రైల్వేస్టేషన్ నుంచి జమ్ముతావి ఎక్స్‌ప్రెస్‌లో వెళ్లారు. జిల్లా విద్యాశాఖాధికారి ప్రతినిధిగా నెల్లూరు ఎంఈవో మురళీధర్ విద్యార్థులకు ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా ఆశ్రమ సేవకులు రామచంద్ర శరత్‌బాబు మాట్లాడుతూ దేశవిదేశాల నుంచి 32 వేల మంది పాల్గొనే ఈ శిబిరంలో తమ ఆశ్రమ పాఠశాలకు చెందిన 54 మంది పాల్గొనే అవకాశం దక్కడం సంతోషంగా ఉందన్నారు. ఈ నెల 23న ప్రధాని మోదీ దీన్ని ప్రారంభిస్తారన్నారు.

అత్యాచారం కేసులో యువకుడి అరెస్టు

ఉదయగిరి, న్యూస్‌టుడే : ఉదయగిరి దుర్గం అటవీ ప్రాంతంలో ఈనెల 16వ తేదీ బాలికపై అత్యాచారానికి పాల్పడిన వింజమూరు పట్టణానికి చెందిన యువకుడు సాదిఖ్‌ను గురువారం అరెస్టు చేసినట్లు సీఐ ఎన్.వెంకట్రావు తెలిపారు. అతన్ని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి అంజయ్య వచ్చే నెల మూడో తేదీ వరకు రిమాండ్ విధించారన్నారు. దీంతో జైలుకు తరలించినట్లు ఆయన వివరించారు.

అయ్యప్ప భక్తుడి నిజాయతీ

కావలి, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన పోలు వెంకటేశ్వర్లు అనే అయ్యప్ప దీక్షాధారుడికి దొరికిన బంగారు వాచీని బాధితురాలికి అప్పగించి నిజాయతీ చాటుకున్నారు. రెండు రోజుల క్రితం కార్తికమాస పూజల్లో భాగంగా పాతూరు శివాలయానికి వచ్చిన చాముండేశ్వరి అనే భక్తురాలు వాచీ పోగొట్టుకున్నారు. ఆ సమయంలో అక్కడ ఉన్న వెంకటేశ్వర్లు దీన్ని ఆలయ సిబ్బందికి ఇచ్చారు. గురువారం ఆమె రావడంతో వివరాలు ఆరా తీసి అప్పగించారు.

బాలిక మృతిపై విచారణకు డిమాండ్

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని అడవిరాజుపాలేనికి చెందిన బాలిక మర్రిపాడు మండలంలోని కృష్ణాపురం జవహర్ నవోదయలో చదువుతూ ఆత్మహత్యకు పాల్పడిన ఉదంతంపై గిరిజన సంఘాలు నిరసన తెలిపాయి. గురువారం ఆ బాలిక మృతదేహానికి అంత్యక్రియలకు వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీనిపై సమగ్రంగా విచారణ చేయాలన్నారు. నిందితులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన నాయకులు కృష్ణయ్య, కేసీ పెంచలయ్య, సీపీఎం నాయకులు తాళ్లూరు మాల్యాద్రి, లోక్ అదాలత్ సభ్యులు మాలకొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్షల ఖర్చు.. వెలుగులు తుస్సు

న్యూస్‌టుడే, దుత్తలూరు

పంచాయతీల్లో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో అంధకారం నెలకొంటోంది. రాత్రిళ్లు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏటా కొత్తవి వేస్తున్నట్లు... పాత వాటికి మరమ్మతులు చేస్తున్నట్లు రూ.లక్షల్లో ఖర్చు చూపుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. పాలకవర్గాలతోపాటు పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణ కొరవడినందునే గ్రామాల్లో చీకట్లు అలుముకుంటున్నామని ప్రజలు ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గ్రామాల్లో చీకటి పడితే ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది.

దుత్తలూరులో వెలగని వీధి దీపం

ఉదయగిరి నియోజకవర్గంలో ఎనిమిది మండలాలుండగా 143 పంచాయతీలున్నాయి. గత తెదేపా ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో వీధి దీపాల ఏర్పాటు, వాటి పర్యవేక్షణ బాధ్యతలను ప్రైవేటు సంస్థకు అప్పగించింది. తెదేపా ప్రభుత్వం అధికారంలో ఉన్నంత కాలం దీపాలు మరమ్మతులకు గురైనా, కాలిపోయినా ఆ సంస్థే చూసుకునేది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా వీధి దీపాల నిర్వహణ గాలికొదిలేసింది. పంచాయతీలకు వచ్చే నిధులతో అయినా నిర్వహణ చేద్దామన్నా వాటిని సైతం పక్కదారి పట్టించింది. దీంతో వైకాపా ప్రభుత్వ హయాంలో ఏ గ్రామంలో చూసినా అంధకారమే నెలకొంది. పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో పంచాయతీ పాలకులు ఏమీ చేయలేని స్థితిలో ఉండిపోయారు.

నిధులు ఖర్చవుతున్నా..

పంచాయతీలకు వచ్చే ఆర్థిక సంఘం నిధులతోపాటు సాధారణ నిధులతో గ్రామాల్లో పారిశుద్ధ్యం, మంచినీటి పథకాలు. వీధి దీపాల నిర్వహణ పంచాయతీ సిబ్బంది చూడాలి. పలు ప్రాంతాల్లో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారినా పట్టించుకుంటున్న దాఖలాల్లేవు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో 32,189 దీపాలు ఏర్పాటుచేశారు. ప్రస్తుతం వాటిలో 30 శాతానికి పైగా మరమ్మతులకు గురవడంతోపాటు కాలిపోయాయి. పంచాయతీ పాలకులు కొత్త వాటిని ఏర్పాటు చేశామని, మరమ్మతులు చేశామని రూ. లక్షల్లో ఖర్చు చూపిస్తున్నారు. గ్రామాలు మాత్రం అంధకారంలో మగ్గుతున్నాయి. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు బయటకు రావాలంటే విష పురుగుల సంచారంతో హడలిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈవిషయమై కావలి డీఎల్పీవో వెంకటరమణ మాట్లాడుతూ పంచాయతీ సిబ్బందికి వీధి దీపాల నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు. మరమ్మతులకు గురైన, కాలిపోయిన వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

36 టన్నుల ఎరువుల విక్రయాలు నిలిపివేత

వలేటివారిపాలెం, న్యూస్‌టుడే: గ్రామంలోని ఓ ఎరువుల దుకాణంలో పత్రాలు లేని 36.09 టన్నుల ఎరువుల విక్రయాలను నిలుపుదల చేసినట్లు ఏవో శేషారెడ్డి వెల్లడించారు. గురువారం హరితపుత్ర వెజిటబుల్ అండ్ మిల్లెట్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ దుకాణాన్ని తనిఖీ చేశారు. పత్రాలు సరిగా లేకపోవడంతో రూ.4,25,480ల విలువైన ఎరువుల విక్రయాలను నిలుపుదల చేశారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే లైసెన్స్ రద్దుతో పాటు చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఏవో హెచ్చరించారు.

పాతకక్షలతో దాడి

కావలి : పాతకక్షల నేపథ్యంలో చోటుచేసుకున్న ఘర్షణలో ఇరువురికి గాయాలయ్యాయి. గురువారం కావలి మండలం చలంచర్ల గ్రామంలో ఈ ఘర్షణ చోటుచేసుకుంది. గోసాల వినోద్ అనే నిందితుడు నారిబోయిన అనిల్, లక్ష్మి దంపతులపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. బాధితులు కావలి ప్రాంతీయాసుపత్రికి చేరుకుని చికిత్స పొందారు.

తనయుడు దాడి చేశాడని ఫిర్యాదు

కావలి, న్యూస్‌టుడే: తనపై కుమారుడు దాడి చేశాడని పట్టణంలోని బాలకృష్ణారెడ్డినగర్‌కు చెందిన కట్టా కృష్ణ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. దాడిలో చేతికి తగిలిన గాయంతో కావలి ప్రాంతీయాసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చారు. వైద్యులు చికిత్స చేశారు.

సురక్షిత నీటితోనే సంపూర్ణారోగ్యం

కలిగిరి, న్యూస్‌టుడే: ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే స్వచ్ఛమైన నీటిని తాగాలని జిల్లా ఫ్లోరోసిస్ నివారణాధికారిణి డాక్టర్ దివ్య తెలిపారు. జాతీయ ఫ్లోరోసిస్ నివారణ, నియంత్రణ కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని తూర్పు గుడ్లదొన, పడమరగుడ్లదొన, ఎరుకులరెడ్డిపాలెం గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులతో గురువారం ఆమె సమావేశమయ్యారు. కార్యక్రమంలో గుడ్లదొన ఆరోగ్య మందిర్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

(c) eenadu

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

విద్యుత్తు సమస్యలు పరిష్కరించడం లేదా..!

ఈనాడు మీతోడు

కోవూరు పట్టణం, కోవూరు గ్రామీణం, ఇనమడుగు సెక్షన్ల పరిధిలో విద్యుత్తు సరఫరాలో సమస్యలు ఉన్నాయా...? రైతులకు వ్యవసాయ కనెక్షన్లు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారా..? నియంత్రికలు మరమ్మతులు చేయడం లేదా..? స్థానిక సిబ్బందికి చెప్పినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా..? ఇంకా పలు సమస్యలు నేరుగా కోవూరు ట్రాన్స్‌కో డీఈఈ మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకురావచ్చు. ఇందుకోసం 'ఈనాడు-మీతోడు' ఆధ్వర్యంలో డయల్ యువర్ డీఈఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. వినియోగదారులు తమ సమస్యలు, వినతులు, ఫిర్యాదులను దిగువ నంబరుకు ఫోన్ చేసి తెలియజేయొచ్చు. - న్యూస్‌టుడే, కోవూరు

తేదీ: 21-11-2025 (శుక్రవారం)
సమయం: మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల మధ్య

ఫోన్ నంబర్: 94408 12010

పేదరిక నిర్మూలనే లక్ష్యం

మనుబోలు : పేదరిక నిర్మూలనే లక్ష్యంగా మహిళలకు సుస్థిరమైన జీవనోపాధిని కల్పిస్తామని ఐబీ డీపీఎం మురళి అన్నారు. స్థానిక కమ్యూనిటీ హాల్‌లో గురువారం పొదుపు మహిళలు, సీసీ, వీవోఏలతో సమావేశం నిర్వహించారు. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, స్థిరమైన జీవనోపాధి, ప్రవర్తనలో మార్పులు, సామాజిక భద్రత, నైపుణ్యం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సమన్వయకర్త సుదర్శన్, ఏపీఎం వనజాక్షి, సంఘమిత్ర అధ్యక్ష, కోశాధికారులు నిర్మల, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు :79950 67034, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య : తోటపల్లిగూడూరుమండలం సౌత్ ఆములూరు పారుదల కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. వర్షాలకు నీరు పక్కనే ఉన్న ఇళ్లలోకి చేరుతోంది. - శివకుమార్

సమాధానం: పరిశీలించి తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. - అలీ, ఏఈ

? పొదలకూరు మండలం కనుపర్తి- ఆల్తుర్తి గ్రామాల లింకురోడ్డు గుంతలతో అధ్వానంగా ఉంది. - వెంకటయ్య, స్థానికుడు

✓ ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరవగానే పనులు చేయిస్తాం. - సుధాకర్, పీఆర్ ఏఈ

? సంగంలోని కామాక్షిదేవి సమేత సంగమేశ్వరాలయం వద్ద వ్యర్థాలు వేస్తున్నారు. అపరిశుభ్రంగా ఉంది. - రాజు, స్థానికుడు

✓ పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయిస్తాం. - ఆర్.నరసయ్య, పంచాయతీ కార్యదర్శి

? పొదలకూరు రూరల్ పరిధిలోని విఘ్నేశ్వర కాలనీ మూడో వీధిలో అధికంగా వేగ నిరోధకాలు ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. - అలీ, స్థానికుడు

✓ అవసరం లేని వాటిని తొలగించేలా చూస్తాం. - నరసింహారావు, ఎంపీడీవో

? తోటపల్లిగూడూరు మండలం పాపిరెడ్డిపాలెంలో మురుగు కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. - శ్రీనివాసులు, స్థానికుడు

✓ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - లక్ష్మీనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో

? అనంతసాగరం మండలంలోని రేవూరు ఎస్సీ కాలనీలో వీధిదీపాలు సక్రమంగా వెలగడం లేదు. - ప్రసాద్, గ్రామస్థుడు

✓ మరమ్మతులు చేపట్టి వెలిగేలా చూస్తాం. -రమణరావు, పంచాయతీ కార్యదర్శి

వ్యక్తిత్వ వికాసంలో ఎన్ఎస్ఎస్ కీలకం

వెంకటాచలం, న్యూస్‌టుడే: విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో ఎన్ఎస్ఎస్ లాంటి వేదికలు కీలక పాత్ర పోషిస్తాయని వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు అన్నారు. గురువారం చెముడుగుంట ఉన్నత పాఠశాలలో వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ ఒకటో యూనిట్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ...గ్రామీణ విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి సరైన దిశలో ప్రోత్సహిస్తే.. వారు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఫలితాలు సాధిస్తారన్నారు. జీవన నైపుణ్యాలు నేర్చుకునే అవకాశం ఎన్ఎస్ఎస్ కల్పిస్తుందన్నారు. బాల మనో వైద్య నిపుణులు సురేశ్‌బాబు మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఉదయ్ శంకర్, నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

జలాశయానికి 6,456 క్యూసెక్కుల వరద

అనంతసాగరం, న్యూస్‌టుడే: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి ఎగువ ప్రాంతాల నుంచి 6,456 క్యూసెక్కులు వరద నీరు వస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జలాశయంలో 77.988కి 74.309 టీఎంసీల నీరు నిల్వ ఉండగా 328.291 అడుగుల మేర నీటిమట్టం నమోదైంది. -17, -18 రివర్స్ స్లూయీస్ ద్వారా 50, పవర్ టన్నల్ ద్వారా 2,600 క్యూసెక్కులు డెల్టాకు విడుదల చేస్తున్నారు. నాన్‌డెల్టాలైన కండలేరు వరద కాలువకు 560, దక్షిణ కాలువకు 200, ఉత్తర కాలువకు 500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. రోజుకు సగటున 295 క్యూసెక్కులు ఆవిరవుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు వివరించారు.

నిత్య సాధన.. గెలుపు పథాన

పోలీసునవుతా: బి.ఐశ్వర్య

కొవలి మండలం కొండిన్నెకు చెందిన బి.ఐశ్వర్య పదో తరగతి చదువుతోంది. షాట్‌పుట్, డిస్కస్ త్రో ఆటల్లో జిల్లాలో విజయం సాధించింది. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. గత ఏడాది ఈ విభాగాల్లో రాష్ట్ర పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపింది. పోలీస్ కావాలనేదే తన లక్ష్యమని అంటోంది.

న్యూస్‌టుడే, ఆత్మకూరు

ఆత్మకూరు ఏపీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు చదువుతోపాటు ఆటల్లో రాణిస్తున్నారు. మండల, డివిజన్, జిల్లా స్థాయిలో పతకాలు సాధిస్తున్నారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నెల్లూరు ఏసీ స్టేడియంలో ఈనెల 5,6,7 తేదీలలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో పాల్గొని వివిధ విభాగాల్లో ప్రతిభ చూపారు. ఆయా విభాగాల్లో మొదటి రెండు స్థానాల్లో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

ఐపీఎస్ అవుతా: జి. గౌతమి

గూడూరు మండలం పాళెంపాడుకు చెందిన గౌతమి పదోతరగతి చదువుతోంది. ఇటీవల జరిగిన త్రోబాల్, జావిలిన్‌త్రో ఆటల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచింది. గత ఏడాది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికగా.. ఈ ఏడాది రెండోమారు ఎంపిక కావడం విశేషం. ఐపీఎస్ సాధించాలనేదే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెబుతోంది.

ప్రజలకు సేవ చేస్తాం: మాధురి, హిమబిందు

నెల్లూరు నగరానికి చెందిన బి.మాధురి, కె.హిమబిందు పదో తరగతి చదువుతున్నారు. మూడు కిలోమీటర్ల పరుగులో మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. రాష్ట్రపోటీలకు ఎంపికయ్యారు. చదువులో రాణించి దేశ రక్షణ విభాగంలో చేరి సేవ చేయాలని మాధురి చెబుతుంటే డాక్టర్ కావాలనేది తన లక్ష్యమని హిమబిందు చెబుతోంది.

ఐఏఎస్ అవుతా: ఎం.విజయలక్ష్మి

ఆత్మకూరు మండలం బోయిల్లచిరువెళ్లకు చెందిన ఈ బాలిక తొమ్మిదో తరగతి చదువుతోంది. ఇటీవల నిర్వహించిన 1500మీటర్ల పరుగులో రెండో స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఐఏఎస్ సాధించి పేదవారి అభ్యున్నతికి పాటుపడతానని చెబుతోంది.

భక్తిశ్రద్ధలతో ఉదయకళేశ్వరుడికి మహారుద్రాభిషేకం

గంగాపార్వతీ సమేత ఉదయకళేశ్వరస్వామి కల్యాణం.. రాపూరులో హాజరైన భక్తులు

కొడవలూరు, న్యూస్‌టుడే: ప్రముఖశైవక్షేత్రం గండవరం గంగాపార్వతీ సమేత ఉదయకళేశ్వర స్వామి వారికి కార్తీక అమావాస్య పురస్కరించుకుని గురువారం రాత్రి భక్తిశ్రద్ధలతో కల్యాణోత్సవం, మహారుద్రాభిషేకం నిర్వహించారు. దశమహా విద్యాదేవతా ఉపాసకులు నాగేంద్ర మహోదర స్వామి పర్యవేక్షణలో ప్రత్యేకబృందం మహారుద్రాభిషేకాన్ని నిర్వహించారు. నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ రాష్ట్ర డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిలు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ఛైర్మన్ ఆలం మాలకొండయ్య, ఈవో ఉమ, పీఏసీఎస్ ఛైర్మన్ వేమిరెడ్డి సిద్ధార్థరెడ్డి, సర్పంచి రాజకుమారి తదితరులు పాల్గొన్నారు. **రాపూరు:** ధర్మపరిరక్షణలో భాగంగా గురువారం ఉడిపి పేజావర తీర్థస్వామీజీ రాపూరు శివాలయాన్ని దర్శించుకున్నారు. భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. హైందవ సంక్షేమం, గోసంరక్షణతోపాటు, జనపద కళల అభివృద్ధి, గ్రామీణ, చేనేత కళల అభివృద్ధి జరగాలంటూ ఈ యాత్ర నిర్వహించినట్లు చెప్పారు.

షార్ట్‌టర్మ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: రాష్ట్ర, జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో పదో తరగతి ఆపై చదివిన యువతకు షార్ట్‌టర్మ్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామని ఆత్మకూరు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి తెలిపారు. వర్కింగ్ అసిస్టెంట్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ కమోడిటీస్, కస్టమర్ కేర్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ కోర్సుల్లో శిక్షణ ఇస్తారని తెలిపారు. ఆయా కోర్సుల్లో శిక్షణ పొందే ఆసక్తి ఉన్న యువత ఆత్మకూరు పాలిటెక్నిక్ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రంతో పాటు ఉద్యోగ కల్పన అవకాశాలు అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న యువత దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు.

వంతెన నిర్మాణానికి నిధులు కేటాయించండి

మంత్రి నిమ్మలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు : ఇందుకూరుపేట పల్లిపాలెం, గంగపట్నం, మైపాడు గ్రామాలను అనుసంధానం చేసే పల్లిపాలెం ఉప్పుటేరుపై వంతెన నిర్మాణం చేపట్టాలని ఇరిగేషన్‌శాఖ మంత్రి నిమ్మల రామానాయుడ్ని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కోరారు. గురువారం ఆమె విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి నియోజకవర్గంలోని పలు సమస్యలపై చర్చించారు. రూ.14.60 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన వివరాలను అందజేశారు. కనిగిరి రిజర్వాయర్ షట్టర్, సదరన్, ఈస్ట్రన్ ఛానల్ షట్టర్ల మరమ్మతులకు నిధులివ్వాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా కూటమి ప్రభుత్వంలో పనిచేస్తున్నామని ఏపీఈఎంసీఎల్ ఛైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి తెలిపారు. గురువారం నెల్లూరులో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో సమగ్ర గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి, పర్యావరణ సంబంధిత ప్రాజెక్టులను వేగవంతం చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా సంస్థను ముందుకు తీసుకెళ్లడం జరుగుతుందన్నారు.

అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు పెడితే జరిమానా

బుచ్చిరెడ్డిపాళెం : అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే భారీ జరిమానా విధించాలని ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ తెలిపారు. గురువారం ఆమె అధ్యక్షతన బుచ్చిపురపాలకసంఘంలో కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం 12 అంశాలు ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగిందన్నారు. త్వరలో వైకుంఠరథం ఏర్పాటు కానున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కమిషనర్ బాలకృష్ణ, వైస్ ఛైర్మన్ శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రమాదాలు

పొదలకూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రమాదాలు జరుగుతున్నాయని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. గురువారం పొదలకూరు మండలం దేవుగుడి రాజుపాలెం సమీపంలో ఇటీవల కూలిపోయిన కల్వర్టు పరిశీలించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ పొదలకూరు-రాపూరు రోడ్డు ప్రధాన రహదారని తాత్కాలిక మరమ్మతులు చేపట్టడం తగదన్నారు. కల్వర్టు నిర్మించేందుకు అధికారులు ఆగస్టులో ప్రతిపాదనలు పంపినా ఇంతవరకు ప్రభుత్వం ఎందుకు ఆమోదం తెలపలేదని ప్రశ్నించారు. నియోజకవర్గ ఎమ్మెల్యే సోమిరెడ్డి దోచుకోవడమే తప్ప ప్రజలకు ఉపయోగపడే పనులు చేయడం లేదని ఆరోపించారు.

వక్తలుగా రాణించి.. విజేతలుగా నిలిచి

ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెం, ఏఎస్‌పేట, పొదలకూరులలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు జరిగాయి. కళాశాల విద్యార్థులకు 'కృత్రిమ మేధ(ఏఐ) వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు', పాఠశాల బాలబాలికలకు 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోను ప్రభావం' అనే అంశాలపై ఉపన్యాసపోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, ఏఎస్‌పేట, పొదలకూరు,ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాలెం

విద్యార్థులతో ప్రిన్సిపల్ శ్రీదేవి, ఉపాధ్యాయురాలు పార్వతి

● ఏఎస్‌పేట మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో గురువారం పోటీలు నిర్వహించారు. సోహిల్ వైష్ణవి, షేక్ బీబీ ఆయేషా, షేక్ మహీరాలు విజేతలయ్యారు. వీరికి ప్రిన్సిపల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు పార్వతి బహుమతులు అందజేశారు.

బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్ లక్ష్మీదుర్గ తదితరులు

● పొదలకూరులోని నాగార్జున హైస్కూల్లో గురువారం నిర్వహించిన పోటీల్లో ఎ.పార్థవి, మణికంఠ, బి.నవ్య మొదటి మూడు స్థానాలు సాధించారు. వీరికి పాఠశాల కరస్పాండెంట్ ఎన్.లక్ష్మీదుర్గ బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ సుబ్బారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

● ఆత్మకూరు పట్టణంలోని డాక్టర్ బీఎస్ఆర్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉపన్యాసం పోటీల్లో ఎం. నాగహర్షిక, బి. జైదీప్, ఎస్. కల్పన విజేతలుగా నిలిచారు. వారికి కరస్పాండెంట్లు కె.శ్రీనివాసులునాయుడు, వి.నరసింహనాయుడు, ప్రిన్సిపల్ జి.సుబ్బారెడ్డిలు బహుమతులు అందజేశారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపల్

● బుచ్చిరెడ్డిపాళెం పురపాలకసంఘంలోని బెజవాడ బుజ్జమ్మ జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో సాహితీశ్రీ, బేబీ భవిష్యశ్రీ, పి. తౌహర్‌లు మొదటి మూడోస్థానాల్లో నిలిచారు. వీరికి హెచ్‌ఎం సుజాత, ఉపాధ్యాయినులు బహుమతులు అందజేశారు.

విద్యార్థినులతో ఉపాధ్యాయినులు

చీడపీడల నివారణకు చర్యలు చేపట్టాలి

పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు

పొదలకూరు, న్యూస్‌టుడే: జొన్న, మినుము, సెనగ పంటలకు ఆశిస్తున్న చీడపీడల నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం సహాయ సంచాలకులు మారుతీదేవీ అన్నారు. గురువారం మండలంలోని చిట్టేపల్లి, మొగుళ్లూరులో సాగు చేసిన పంటలను శాస్త్రవేత్తలతో కలిసి పరిశీలించారు. చిత్తపురుగులు, తెల్లదోమ నివారణకు క్లోరిఫైరిపాస్ రెండు మీ.లీ లేదా పాస్పేట్ ఒక గ్రాము వేపనూనె నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. పంటలో బంతి మొక్కలు వేసుకోవడం వల్ల రసంపీల్చే పురుగుల ఉద్ధృతి తగ్గుతుందని శాస్త్రవేత్త సురేఖాదేవి తెలిపారు. వ్యవసాయాధికారి ప్రతాప్, డీఆర్సీ ఏవో చక్రవర్తి, రైతులు పాల్గొన్నారు.

కోవూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No.249/2025

1) Kundurthi Alias Kundirthi Chaitanya Babjee
2) Kundurthi Alias Kundirthi Saraschandra Babji
3) Kundurthi Alias Kundirthi Ruthu Pavan Kumar Babji ..Plaintiffs

Vs

Nil ..Defendants

జనరల్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా:- పై నెంబరు దావాలోని వాదులు చనిపోయిన శ్రీ Alla Meenamma గారికి వారసులు వారేనని డిక్లేర్ చేయమని దావా దాఖలు చేసియున్నందున దీనిపై ఎవరికైనా ఎటువంటి అభ్యంతరాలు ఉన్నచో తే: 03-12-2025దిన ఉదయం: 10-30 ని॥లకు పై కోర్టుకు హాజరై తమ అభ్యంతరాలు తెలుపుకునేది. లేనియెడల ఎవ్వరికిని ఎటువంటి అభ్యంతరాలు లేవని కోర్టు వారు ముందుకు పోవుదురు.

ఇట్లు: P.Sunilkumar, వాదుల తరపు వకీలు

In the Court of the IV Addl. District Judge, Nellore

E.P. No. 620 / 2023
ARB CASE No. ARC/FSBFL/1101

M/s. FIVE STAR BUSINESS FINANCE LIMITED, Represented at present by Authorized Signatory Praveen Anand Babu Modukuri Regional Legal Manager - D.H.R./ Claimant

Vs.

1. Thummala Thulasi Ram
2. Gampala Somasri
3. Thummala Devasenamma - J.Drs/ Respondents

వేలం ప్రకటన

పై నెంబరున డిక్రీ హోల్డర్ డిక్రీ బాకీ రాబట్టు కొనుటకు జె.డి.ఆర్స్ తాలూకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని తే. 04-12-2025దిన ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల లోపల పై తెలిపిన కోర్టులో బహిరంగ వేలం పాట జరుపబడును. కావున పాటదారులు ఎవ్వరైనా వేలం పాటలో పాల్గొని పాట పాడుకొనవచ్చును.

SCHEDULE OF PROPERTY

SPSR Nellore District, Buja Buja Nellore Sub Registration, Venkatachalam Mandal, Kanupuru Bit-1 Village Panchayat, Kanupur Bit-1 Village, Survey No. 352/1-B, R.C.C. House bearing Assessment No. 90, in 104 Ankanams or 832 sq.yards of vacant site. Bounded by **East:** Some extant Raja Street & Some extant site of Kommi Kondaiah & Others, **South:** Raja Street, **West:** Own passage of Aduru Ankaiah to some extant and house & site of Kommi Varamma to some extant. **North:** Site of Kommi Varamma to some extant & site of Aduru Narasaiah to some Extent.

DHR Value of Rs. 6,00,000/-
Amin value of Rs. 10,40,000/-
Market Value of Rs. 20,38,000/-

సిహెచ్.సుభాషిణి, బి.ఎస్.సి., బి.ఎల్., డిక్రీ హోల్డర్ తరఫు అడ్వకేట్, నెల్లూరు

అధ్వానం.. పశువైద్య కేంద్రం

మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రం శిథిలావస్థకు చేరింది. గోడలు పగుళ్లిచ్చి అధ్వానంగా ఉంది. వర్షానికి ఉరుస్తుండటంతో ఇబ్బందికరంగా మారింది. సుమారు 30 ఏళ్ల కిందటిది కావడంతో దుస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. దాంతోపాటు డాక్టరు కూడా లేకపోవడంతో వైద్యం గగనంగా మారింది. ఇన్‌ఛార్జి పశువైద్యాధికారి ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతిపాదనలు పంపామన్నారు. - న్యూస్‌టుడే, అనుమసముద్రంపేట

అపూర్వ కలయిక

మనుబోలు, న్యూస్‌టుడే: బద్దెవోలు(బీవీపాలెం) ఉన్నత పాఠశాలలో 1970-75లో చదివిన విద్యార్థులు గురువారం పాఠశాలలో సమావేశమయ్యారు. పూర్వ విద్యార్థి, పీఏసీఎస్ ఛైర్మన్ రామకృష్ణయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. అప్పటి గణిత ఉపాధ్యాయుడు వెంకటసుబ్బయ్య, విజయమ్మ దంపతులను ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయిని చందన, పెంచలనాయుడు, రవి, శ్రీధర్‌రెడ్డి, రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దారి ఛిద్రం.. అన్నదాతలకు అసౌకర్యం

ముంబయి జాతీయ రహదారి నుంచి కోలగట్ల వరకు.. ప్రధానంగా సంగం పొలాలకు వెళ్లే మార్గం దారుణంగా మారింది. రాకపోకలు సాగించాలంటే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక లారీలతో ఈ పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటుగా మూడు గ్రామాల పొలాలు ఉన్నాయి. అధికారులు స్పందించి బాగు చేయిస్తే ఉపయుక్తంగా ఉంటుందని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సంగం

ప్రభుత్వ కార్యాలయం.. భయం భయం

స్థానిక మండల పరిషత్తు కార్యాలయం పెచ్చులూడుతూ ప్రమాదకరంగా ఉంది. విధులు నిర్వహించాలంటే సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. వర్షం వస్తే సమస్య తీవ్రంగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివిధ సమస్యలతో వచ్చే ప్రజలూ ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు

చెరువులో పడి వృద్ధుడి మృతి

పొదలకూరు, న్యూస్‌టుడే: పొదలకూరు మండల పరిధిలోని మరుపూరు గ్రామానికి చెందిన ఎన్. పెంచలయ్య(61) గురువారం సాయంత్రం చెరువులో పడి మృతి చెందారు. వివరాల మేరకు పశువులను మేతకు తోలికెళ్లారు. తిరిగి వచ్చే క్రమంలో గ్రామంలోని చిన్న చెరువులోకి పశువులు దిగాయి. వాటిని బయటకు తోలుకొచ్చే క్రమంలో బురదలో కూరుకుపోయారు. బయటకు రాలేక మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు అందింది.

గులికలు తిని యువకుడి..

సైదాపురం, న్యూస్‌టుడే: సైదాపురంలోని ఎమ్మెస్ కాలనీకి చెందిన బాబులు(27) గులికలు తిని గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాల మేరకు కుటుంబ వివాదాల నేపథ్యంలో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. మృతునికి భార్య,ముగ్గురు పిల్లలు ఉన్నట్లు వెల్లడించారు.

సైబర్ మోసం.. నగదు మాయం

సైదాపురం, న్యూస్‌టుడే: వాట్సప్‌కు వచ్చిన ఏపీకే ఫైల్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడంతో ఖాతా నుంచి నగదు మాయమైన ఘటన గురువారం మండలకేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల మేరకు సైదాపురానికి చెందిన చెంచుకృష్ణ స్థానిక సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. ఆధార్ కార్డు అప్‌డేట్ కాకపోవడంతో నెట్‌బ్యాంకింగ్ సేవలు నిలిచిపోయాయని ఖాతా సైతం శాశ్వతంగా పనిచేయకుండా పోతుందంటూ సైబర్‌నేరగాళ్లు అతని వాట్సాప్ నంబరుకు సందేశం పంపారు. అలా జరగకుండా ఉండాలంటే 'ఎస్బీఐ ఆధార్ అప్‌డేట్‌యాప్' ఇన్‌స్టాల్ చేసుకోవాలంటూ ఏపీకె ఫైల్‌ను పంపారు. దాన్ని ఇన్‌స్టాల్ చేసుకోగా బ్యాంకు ఖాతాలో రూ.14వేల నగదు మాయమైందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

విజ్ఞాన వృక్షాలు.. గ్రంథాలయాలు

విడవలూరు గ్రంథాలయంలో బహుమతులతో విద్యార్థులు

విడవలూరు, న్యూస్‌టుడే: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపులో భాగంగా విడవలూరులోని గ్రంథాలయంలో నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గ్రంథాలయాధికారిణి నిరూప బహుమతులు అందజేశారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పలు ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ డా. సుజాత మాట్లాడుతూ 'విజ్ఞాన వృక్షాలు- గ్రంథాలయ పుస్తకాలు' అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ విభాగపతి డా. కిరణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **మనుబోలు :** గ్రంథాలయాధికారి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో..స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయిని అమూల్య కుమారి పాల్గొన్నారు.

నాచు తొలగేదెలా.. నీరు పారేదెలా

న్యూస్‌టుడే, చేజర్ల

సోమశిల దక్షిణ కాలువలో పెరిగిన నాచు

కాలువల్లో సక్రమ నీటి సరఫరాకు నాచు ప్రధాన ఆటంకంగా ఉంటోంది. యంత్రాలకు అందక.. కూలీలు తీయడానికి వీలు కాక అధికార యంత్రాంగం, సాగునీటి సంఘాల ప్రతినిధులకు సవాల్‌గా మారింది. సోమశిల దక్షిణ కాలువ పరిధిలో 36వ కి.మీకి దిగువన.. 22వేల ఎకరాల ఆయకట్టు ఉంది. పూర్తి సామర్థ్యంతో కాలువ ప్రవహిస్తే ప్రతి భూమికి నీరు అందుతుంది. కానీ ఎడగారు అనంతరం నిలిచిన నీటిలో నాచు పెరగడంతో దిగువకు నీరు చేరే పరిస్థితి కనిపించడం లేదు. కాలువ అడుగు భాగంలో హెచ్చు తగ్గుల కారణంగా.. పూర్తిగా నీరు వెళ్లే అవకాశం లేదు. సరఫరా ఆగినా.. కాలువ ఎండక పోవడంతో పూడికతీతకు యంత్రాలు దిగే అవకాశం లేదు. దీని కారణంగా ప్రవాహ సామర్థ్యం 25 శాతం తగ్గుతుందని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. సోమశిల జలాశయం నుంచి పెన్నా డెల్టాకు ఈ నెల 15న నీరు వదిలినా.. పూడిక కారణంగా దక్షిణ కాలువకు 22న విడుదల చేయాలని ప్రాజెక్టు కమిటీ నిర్ణయించింది. అక్రమ మోటర్లూ కట్టడి చేయకుంటే నీటి పంపిణీ కష్టమని వారు అంటున్నారు.

రైతులకు నోటీసులు జారీచేయనున్నాం

చాంద్‌బాషా డీఈఈ, చేజర్ల

నాచు తొలగించటం కష్టంగా మారింది. కాలువపై ఉన్న భారీ మోటర్లు తీసివేయాలని రైతులకు నోటీసులు జారీ చేయనున్నాం. అన్నదాతలు నీటి సరఫరాను అనుసరించి సంయమనంతో పారించుకోవాలి.

సంగంలో సహకార వారోత్సవాలు

రైతులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న సహకారసంఘం బాధ్యులు

సంగం, న్యూస్‌టుడే: సంగంలోని ప్రాథమిక సహకార సంఘంలో గురువారం వారోత్సవాలు ఘనంగా జరిగాయి. అధ్యక్షులు జి.శ్రీనివాసులు యాదవ్ ఆధ్వర్యంలో తొలుత పతాకాన్ని ఆవిష్కరించారు. సహకార రంగాన్ని బలోపేతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. సీఈవో ఎం.బాలకృష్ణ, వ్యవసాయాధికారి శశిధర్, ఎస్సై పి.రాజేష్, తెదేపా మండల అధ్యక్షుడు బాణా శ్రీనివాసులురెడ్డి తదితరులు హాజరయ్యారు.

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: జాతీయ కో-ఆపరేటివ్ వారోత్సవాలు ముగిశాయి. ఇందూరుపేటలోని కో- ఆపరేటివ్ అగ్రికల్చర్ క్రెడిట్ సొసైటీ ఎక్సెలెన్స్ అవార్డుకు ఎంపికైంది. నెల్లూరు తిక్కన భవనంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతులమీదుగా సొసైటీ ఛైర్మన్ గండవరపు అమర్‌నాథ్ రెడ్డి అవార్డు అందుకున్నారు.

కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న గండవరపు అమర్‌నాథ్ రెడ్డి

(c) eenadu

నెల్లూరు

• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

అయ్యప్పస్వామికి వేడుకగా భగవతి పూజ

స్వామివారి ఉత్సవ విగ్రహంతో పూజకు కదిలిన అర్చకులు

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: నెల్లూరు వేదాయపాలెంలో కొలువుదీరిన అయ్యప్ప ఆలయంలో కేరళ సంప్రదాయం ప్రకారం మండల పూజలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం భగవతి పూజ జరిగింది. ముందుగా శ్రీవేలి ఉత్సవం, పడి కర్పూర దీప పూజలు నిర్వహించారు. అనంతరం ముందు నిర్మల దర్శనంలో క్షీరాభిషేకం, మహాగణపతి హోమం చేపట్టారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరిరావు, వెంకటరత్నం, కమిటీ సభ్యులు, అర్చకులు, ఉభయకర్తలు పాల్గొన్నారు.

నేడు ప్రపంచ మత్స్యకార దినోత్సవం

నెల్లూరు(నవాబుపేట): ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో నగరంలోని టౌన్‌హాల్‌లో శుక్రవారం ఉదయం నుంచి వేడుకలను నిర్వహిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారిణి కె.శాంతి ప్రకటనలో తెలిపారు. వేడుకలకు జిల్లాలోని మత్స్యకారులు, సహకార సంఘ సభ్యులు, ఆక్వారైతులు, బోటు యజమానులు, మత్స్యరంగంతో అనుబంధం ఉన్న వారు పాల్గొనాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: నగరంలోని బుజబుజనెల్లూరు మెయిన్‌రోడ్డులో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడులు చేస్తున్నాయి. – నాగయ్య, స్థానికుడు

సమాధానం: కుక్కలను పట్టించేందుకు చర్యలు చేపడతాం. – డాక్టర్ మదన్‌మోహన్, నగరపాలక సంస్థ, వెటర్నరీ అధికారి

? వేదాయపాలెం కరెంటు ఆఫీస్ నుంచి పోలీస్ కాలనీ వెళ్లే మెయిన్ వీధిలో నాలుగో స్తంభానికి వీధి దీపం వెలగడం లేదు. రాత్రి వేళ అంధకారం నెలకొని రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. – రమేష్, స్థానికుడు

✓ వీధి దీపం ఏర్పాటు చేయిస్తాం. – ముజాహిద్దీన్, నగరపాలక సంస్థ, డీఈ

? బట్వాడిపాలెం శాంతినగర్‌లో కాలువలు పూడికతో నిండిపోయాయి. మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. – సుకన్య, స్థానికురాలు

✓ కాలువల్లో పూడిక తీయిస్తాం. – డాక్టర్ కనకాద్రి, ఆరోగ్యాధికారి

–న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

ఉపన్యాస పోటీల్లో ప్రతిభ

బహుమతులు సాధించిన ఎల్‌ఎల్‌ఎస్ స్కూల్ విద్యార్థులు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: నగరంలోని వేదాయపాలెం ఎల్‌ఎల్‌ఎస్ స్కూల్లో గురువారం 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో విద్యార్థులకు 'ప్రతిభ పాటవ పోటీలు' నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస(స్పీచ్) పోటీలు నిర్వహించారు. అయిషా పాతిమా, కీర్తన, కె.ప్రత్యూష్ ప్రతిభ చూపి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. వీరికి ఆ పాఠశాల కోఆర్డినేటర్ పవన్‌కుమార్, ఉపాధ్యాయులు ఎం.ప్రభాకర్, సీహెచ్ మాధవి, హమీద, హరిప్రియ బహుమతులు ప్రదానం చేశారు.

పట్టాలు లేక ఇళ్లు ప్రశ్నార్థకం

పీఎంఏవై పథకానికి 200 మంది దూరం

న్యూస్‌టుడే, నెల్లూరు (వేదాయపాలెం)

ఈ స్థలం.. నెల్లూరు నగరం భగత్ సింగ్ కాలనీలోని షేక్ పీర్ మహమ్మద్‌ది. ఈయన ఇతరుల నుంచి కొనుగోలు చేశారేగానీ.. ఇల్లు నిర్మించుకునేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఖాళీగా వదిలేశారు. ఈ ప్రాంతంలో దాదాపు వందల సంఖ్యలో స్థలాలు ఖాళీగా ఉన్నాయి. ఆర్థిక స్థోమత లేక ఇళ్లు నిర్మించుకోలేక ఖాళీగా ఉంచారు. పట్టా కావాలంటే స్థలంలో నిర్మాణాలు చేపట్టాలి.. అందుకు ఆర్థిక స్థోమత లేమీ వెంటాడుతోంది. ఫలితంగా పీఎంఏవై పథకానికి అర్హత కోల్పోతున్నారు. పథకం గడువు ఈనెల 30తో పూర్తి కావస్తోంది. నిధులు అందకుండా పోతాయని ఆందోళన చెందుతున్నారు.

అవకాశాలున్నా.. చేరువకాక..

నగరంలోని వెంకటేశ్వరపురం జనార్దన్‌రెడ్డి కాలనీ లోపల జాతీయ రహదారి పక్కనే భగత్ సింగ్ కాలనీ ఏర్పాటైంది. కొన్ని సంవత్సరాల నుంచి ఇక్కడ స్థానికులు నివాసం ఉంటున్నారు. పోరంబోకు స్థలాల్లో పేదలు నివాసాలు ఉండటంతో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రి నారాయణ స్థానికులకు పట్టాలు అందించారు. తొలి విడత 698 మందికి అందజేయగా, రెండో విడత 250 మందికి అందజేసేందుకు జాబితా తయారు చేస్తున్నారు. పట్టా వచ్చాక పీఎంఏవై పథకం కింద దరఖాస్తు చేసుకుంటే రూ.2.50లక్షలు ప్రభుత్వం రుణం ఇస్తుంది. దీంతో చాలా మంది ఇక్కడ నిర్మాణాలు చేపట్టారు. పట్టాలు లేని వారి పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది.

నిబంధనతో ఆందోళన

పట్టా కావాలంటే స్థలంలో నిర్మాణాలు ఉండాలనే నిబంధన ఉండటంతో ఆ ప్రాంతంలో దాదాపు 200కి పైగా ఖాళీ స్థలాలు అలాగే ఉన్నాయి. పట్టా ఉంటే కేంద్ర ప్రభుత్వం అందించే పీఎంఏవై పథకం కింద నిర్మాణాలు చేపట్టవచ్చు. పట్టాలు లేక ప్రభుత్వ సాయం అందకుండా పోతోందని స్థానికులు వాపోతున్నారు. నిజమైన లబ్ధిదారులను గుర్తించి పట్టా అందజేస్తే ప్రభుత్వం పథకంతో నిర్మాణాలు చేపడతామని స్థానికులు కోరుతున్నారు. నగరపాలక అధికారులు స్పందించి ఖాళీ స్థలాలపై విచారణ జరిపి అర్హులైన వారికి పట్టాలు మంజూరు చేయాలని బాధితులు కోరుతున్నారు.

కేవీకేను సందర్శించిన నీతి ఆయోగ్ డైరెక్టర్

నెల్లూరు(పద్మావతి సెంటర్), న్యూస్‌టుడే: నీతి ఆయోగ్ డైరెక్టర్ మహమ్మద్ జుబైర్ అలీ హస్మీ నెల్లూరు నగరంలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని గురువారం సందర్శించారు. అంతకుముందు కోవూరు మండలం ఇనమడుగు వెళ్లి గ్రామస్థాయిలో కేవీకే చేపడుతున్న విస్తరణ కార్యకలాపాల అమలు, అవి రైతులకు ఏ విధంగా ఉపయోగ పడుతున్నాయో రైతులను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వాణి

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: చిన్నారులు వారి హక్కులు, చట్టాలను తెలుసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి పేర్కొన్నారు. గురువారం నగరంలోని కొత్తూరు బెత్తెల్ ఆర్ఫనేజ్ చిల్డ్రన్ హోమ్‌లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. అనంతరం వారికి అందుతున్న భోజన, వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆ హోమ్ సిస్టర్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ ఇన్‌ఛార్జిగా జేసీ

నెల్లూరు(మార్కెట్ సెంటర్): జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌ఛార్జి జేసీ వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల గ్రంథాలయ సంస్థలకు జేసీలను ఇన్‌ఛార్జులుగా నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రంథాలయ నిర్వహణకు నూతన ఛైర్మన్‌ను నియమించే వరకు ఇన్‌ఛార్జిగా ఉంటారు.

కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం

నెల్లూరు(రవాణా): కార్మికుల సంక్షేమమే తన మొదటి ప్రాధాన్యమని ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సురేష్ అన్నారు. ఛైర్మన్‌గా ఏడాది గడిచిన సందర్భంగా గురువారం నగరంలోని ఓ హోటల్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ జోనల్ ఛైర్మన్‌గా ఏడాదిలో విధి నిర్వహణలో మరణించిన, గాయపడిన ఉద్యోగులకు రూ. 2,90,000 మేర సంస్థ నుంచి ఆర్థిక సాయం చేశామన్నారు.

రెండు బిర్యానీ హోటళ్ల సీజ్

హోటళ్లను సీజ్ చేస్తున్న అధికారులు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: జిల్లా న్యాయమూర్తి సూచనలతో నగరపాలకసంస్థ కమిషనర్ వైవో నందన్ ఆదేశాల మేరకు గురువారం ఆరోగ్యాధికారి డాక్టర్ కనకాద్రి ఆధ్వర్యంలో 38వ డివిజన్ కోర్టు సముదాయం ఎదురుగా షాపింగ్ కాంప్లెక్స్‌లోని రెండు బిర్యానీ హోటళ్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యజమానులు బహిరంగంగా బిర్యానీ, మసాలాలకు సంబంధించి వివిధ ఆహార పదార్థాలు తయారు చేయడం వల్ల, వాటి ఘాటైన వాసనలతో చుట్టుపక్కల వారికి ఇబ్బందికరంగా మారిందని న్యాయవాదులు, కోర్టుకు వచ్చే కక్షిదారుల ఫిర్యాదుల మేరకు స్పందించినట్లు తెలిపారు. ఆహార పదార్థాలను బయట తయారు చేసుకుని ఇక్కడ విక్రయించుకోవాలని, షాపులో ఎటువంటి తయారీ చేయవద్దని నోటీసులు జారీ చేశామన్నారు. యజమానులు నోటీసులను ఖాతరు చేయని కారణంగా ఈనెల 13న మరలా జారీ చేశామని, నిర్దేశించిన చర్యలు తీసుకోకపోవడంతో షాపులను మూసివేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరుగ్రామీణం, న్యూస్‌టుడే: అందరం ఒక్కతాటిపై ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేద్దామని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. నెల్లూరు రూరల్ మండలం సౌత్ మోపూరు గ్రామానికి చెందిన మేకల సుప్రియ, పెంచలయ్య, పాశం వేణు, నాగులూరు రమణయ్యలతో పాటు 50 కుటుంబాలు తెదేపాలో గురువారం చేరాయి. నగరంలోని రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తెదేపాలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్టీలో చేరుతున్న ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ పముజుల ప్రదీప్, ఏఎంసీ వైస్ ఛైర్మన్ చంద్రశేఖర్, జలదంకి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న కార్మిక సంఘ నాయకులు

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ద్రోహం చేసిందని కూటమి ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తూ అన్యాయం చేస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులు అన్నారు. గురువారం కార్మిక సంఘం ఆధ్వర్యంలో నగరంలోని గాంధీ బొమ్మ సెంటర్ నుంచి కార్మికశాఖ కార్యాలయం వరకు ర్యాలీ, అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు గతంలో మాదిరిగా ప్రమాద బీమా, పెళ్లికానుక పథకాలు అమలుచేయాలని, 60 సంవత్సరాలు దాటిన వారికి పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్కే చాన్ బాషా, సూర్యనారాయణ, ఖలీల్, నజీర్, సంపూర్ణమ్మ, తుమ్మల శ్రీనివాసులు, బాదుల్లా, చిరంజీవి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కుంగిన సిమెంటు రోడ్డు

నెల్లూరునగరం మనుమసిద్ధినగర్ ప్రాంతంలోని కాలువ పక్కనే ఉన్న సిమెంటు రోడ్డు కుంగిపోయింది. స్థానికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు కింద మట్టి వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో రోడ్డు పగుళ్లిచ్చింది. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

నామమాత్రంగా స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర

నెల్లూరులోని బారా షహీద్ దర్గా ఆవరణం పిచ్చిమొక్కలతో నిండిపోయి విష పురుగులు చేరుతుండటంతో భక్తులు, పర్యాటకులు భయాందోళన చెందుతున్నారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టర్, కమిషనర్ దర్గా ఆవరణలో తూతూమంత్రంగా శుభ్రం చేసి చేతులు దులుపుకొన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

మళ్లీ అండర్ బ్రిడ్జిలో మురుగునీరు

నెల్లూరు నగరం రామలింగాపురం అండర్ బ్రిడ్జి కింద మళ్లీ మురుగునీరు చేరుతోంది. ఇటీవల బ్రిడ్జి మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం వంతెన కింద డ్రైనేజీ ఆగిపోవడంతో రహదారిపై మురుగునీరు చేరుతోంది. రాకపోకలు సాగించే ద్విచక్రవాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(మార్కెట్ సెంటర్)

రక్షణ కరవై.. ప్రమాదకరంగా..

నెల్లూరు గ్రామీణ మండలం పొట్టేపాళెం కలుజు సమీపంలో ప్రధాన మార్గంలోని కల్వర్టు వద్ద ప్రమాదం పొంచి ఉంది. రక్షణ గోడ లేక మట్టి కిందకు జారిపోతోంది. వాహనదారుడు ఏ మాత్రం ఆదమరిచినా కాలువలోకి పడిపోవాల్సిందే. అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, నెల్లూరుగ్రామీణం

బ్లాక్‌స్పాట్లపై చర్చ

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: రోడ్డు భద్రత - ప్రమాదాల నియంత్రణ అంశంపై రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి అదనపు డీజీపీ రోడ్డు సేఫ్టీ కేటీ ఉజేలా, డీఐజీ రోడ్డు సేఫ్టీ విజయ రావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఎస్పీ అజిత వేజెండ్ల, పోలీసు అధికారులు పాల్గొన్నారు. జిల్లాలోని రాష్ట్ర, జాతీయ రహదారుల్లో గుర్తించిన బ్లాక్‌స్పాట్‌ల గురించి చర్చించారు. అక్కడ తీసుకుంటున్న చర్యలపై ఎస్పీ వివరించారు. సమావేశంలో అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య, నెల్లూరుగ్రామీణ, డీటీసీ, కావలి డీఎస్పీలు జి.శ్రీనివాస రావు, గిరిధర్, శ్రీధర్, డీసీఆర్‌బీ సీఐ రామారావు, వీసీఆర్ సీఐ భక్తవత్సల రెడ్డి, ఎస్‌బీ-1 సీఐ వెంకటేశ్వర రావు, ట్రాఫిక్ సీఐ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు.. దెబ్బతిన్న మ్యాన్‌హోళ్లు

రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

నగరంలోని ఆంధ్రకేసరి నగర్‌లో సమస్యలు తిష్ఠ వేశాయి. దాదాపు పది వీధుల మధ్య ఈ ప్రాంతం విస్తరించింది. దర్గామిట్టలోని విద్యుత్తుభవన్. . పొదలకూరురోడ్డు మధ్య కొలువుదీరింది. ప్రధాన రోడ్డు దారుణంగా మారింది. గుంతలు, మిట్టలుగా, రాళ్లు లేచిపోవడం తదితర సమస్యలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఒకటో వీధి పరిస్థితి దారుణంగా ఉంది. మూడో వీధి సమీపంలో పోస్టల్ కార్యాలయ రోడ్డులో 12నెలల క్రితం జరిగిన రహదారి నిర్మాణ, ప్యాచ్ పనులు రూపు రేఖలు కోల్పోతున్నాయి. స్థానికంగా రిజిస్ట్రేషన్‌శాఖకు సంబంధించిన ప్రత్యేక కార్యాలయం ఉంది. అక్కడకు వచ్చే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ ఉన్న ఓ పెద్ద దుకాణం పక్క ప్రాంతం గుంతలమయమై అధ్వానంగా తయారైంది. పలువీధుల్లో భూగర్భడ్రైనేజీకి సంబంధించిన మ్యాన్‌హోళ్లు ధ్వంసమయ్యాయి. ప్రధాన వీధుల్లోనే మ్యాన్‌హోల్‌కు చుట్టూ నిర్మించిన గోడ దెబ్బతినింది. 3,4వీధుల్లో భవన నిర్మాణ సామగ్రిని రోజుల తరబడి నిల్వ ఉంచడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

మరమ్మతు పనులు చేయించాలి

– కేశవరావు, వ్యాపారి

ఈ ప్రాంతంలో కొంతకాలం క్రితం చేసిన ప్యాచ్‌పనులు సైతం పలు చోట్ల దెబ్బతిన్నాయి. రోడ్డంతా సక్రమంగా లేదు. వర్షమొస్తే రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.

వర్షం వస్తే ఇబ్బందే..: లలితమ్మ

రోడ్డుకు ఓ వైపున దర్గామిట్ట, మరోపక్క పొదలకూరు రోడ్డు ఉన్నాయి. రెండు వైపులా మెయిన్‌రోడ్డు వద్ద కంకర చెదిరిపోయి చిన్నపాటి వర్షం వచ్చినా నీరు ఆగిపోతూ అవస్థలు పడుతున్నాం. అధికారులు చర్యలు తీసుకోవాలి.

భార్య, అత్తపై దాడి

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: నగరంలోని మూలాపేటకు చెందిన సురేఖ, శ్రీనివాసులు దంపతులు. మద్యానికి, చెడు వ్యసనాలకు బానిసైన భర్త.. భార్య, పిల్లలను పట్టించుకోవడం లేదు. అతని చేష్టలతో విసిగిపోయిన సురేఖ ఆరు నెలల క్రితం పుట్టింటికి వచ్చేసింది. ఈ నెల 16న శ్రీనివాసులు భార్య వద్దకు వచ్చి ఆమెతోపాటు అత్తతో గొడవపడి దాడి చేసి వెళ్లిపోయాడు. బాధితురాలు గురువారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో చోరీపై కేసు నమోదు

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: విడవలూరు మండలం ముదివర్తికి చెందిన సురేష్ ఆటో డ్రైవరుగా పనిచేస్తున్నారు. భార్యకు అనారోగ్యంగా ఉండటంతో చికిత్స నిమిత్తం ఈ నెల 14న ఆటోలో ఆమెను తీసుకుని నెల్లూరు పొగతోటలోని ఓ ఆసుపత్రికి వచ్చారు. ఆసుపత్రి సమీపంలో ఆటో పార్కింగ్ చేసి లోనికి వెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం బయటకు వచ్చి చూడగా కనిపించలేదు. బాధితుడు గురువారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్న మాజీ సైనికోద్యోగి అరెస్టు

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: స్థానిక బీవీ నగర్‌కు చెందిన మాజీ సైనికోద్యోగి.. పలువురు మాజీ సైనికోద్యోగుల క్యాంటిన్ కార్డులను సేకరించి వారికి ఇచ్చే డిఫెన్స్ మద్యాన్ని ఇతరులకు విక్రయిస్తుంటారు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ అధికారులు.. మధ్యవర్తి ద్వారా మద్యం కావాలని ఆయన్ను సంప్రదించారు. ఆయన బాటిల్‌పై రూ.వెయ్యి అదనంగా తీసుకుని విక్రయిస్తుండగా ఎక్సైజ్ అధికారులు ప్రత్యక్షంగా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 12 బాటిళ్ల డిఫెన్స్ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. గురువారం నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై డి.శ్రీధర్ తెలిపారు.

● మాజీ సైనికోద్యోగి వద్ద 20కి పైగా మద్యం బాటిళ్లు ఉన్నాయని, ఎక్సైజ్ అధికారులు వాటిని తీసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. నిబంధనల ప్రకారం పది లీటర్ల కంటే ఎక్కువ మద్యం పట్టుబడితే అతనిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేయవచ్చు. పది లీటర్ల కంటే తక్కువగా ఉంటే స్టేషన్ బెయిల్ ఇవ్వవచ్చు. దాంతోనే తక్కువ బాటిళ్లు పట్టినట్లు చూపించారని విమర్శలు ఉన్నాయి. దీనిపై ఎక్సైజ్ నెల్లూరు-1 ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబును వివరణ కోరగా తాము దాడులు చేసే సమయంలో నిందితుడి వద్ద 12 బాటిళ్లు ఉన్నాయని సమాధానమిచ్చారు.

లాడ్జీలో జూదం.. పోలీసుల దాడి

నెల్లూరు(నేర విభాగం): మాగుంట లేఅవుట్‌లోని ఓ లాడ్జీలో జూదం ఆడుతున్నట్లు గురువారం దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ బి.కల్యాణ్ రాజుకు సమాచారం అందింది. సిబ్బందితో కలిసి దాడి చేసి జూదం ఆడుతున్న 8మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.56,130 నగదు, ఎనిమిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దాడిలో ఎస్సై బ్రహ్మయ్య, సిబ్బంది పాల్గొన్నారుడ.

మోసగించిన కేసులో..

భీమవరం గ్రామీణ: భీమవరం మండలం కొవ్వాడలో ఓ విద్యా సంస్థకు చెందిన విద్యార్థిని ఈ నెల 12న ఆత్మహత్యకు పాల్పడింది. నెల్లూరుకు చెందిన నవీన్‌రెడ్డి ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేయడంతోనే తన కుమార్తె ప్రాణం తీసుకుందని ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి హైదరాబాద్‌లో అరెస్ట్ చేసినట్లు ఎస్సై వీర్రాజు గురువారం తెలిపారు.

పాదచారుల మార్గం ఏర్పాటుకు ప్రణాళికలు

స్మార్ట్ స్ట్రీట్‌బజార్‌ను పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నగరంలోని స్మార్ట్‌స్ట్రీట్ బజార్ దుకాణాలను అనుసంధానించేలా పాదచారుల మార్గం రూపొందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ వైవో నందన్ అధికారులను ఆదేశించారు. మైపాడురోడ్డు జాకీర్‌హుస్సేన్‌నగర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన స్మార్ట్ స్ట్రీట్ బజార్ ప్రాంగణాన్ని గురువారం పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఒకటో డివిజన్ నవలాకులతోట ప్రాంతంలోని లేఅవుట్‌ను పరిశీలించారు. 12వ డివిజన్‌లోని శ్రీకరం లేఅవుట్‌ను ఎల్‌ఆర్ఎస్ అనుమతుల కోసం పరిశీలించారు. కార్యక్రమంలో సిటీప్లానర్ హిమబిందు, డీసీపీ రఘునాథరావు, ఏసీపీ మురళి, ఈఈ అనిల్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చినబాబు ఉన్నారు.

బాధితులకు నిత్యావసరాల పంపిణీ

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం నగరంలోని డామియన్ ఫౌండేషన్ అర్బన్ లెప్రసీ, టీబీ సెంటర్‌లో బాధితులకు నిత్యావసరాలు, పాదరక్షలు పంపిణీ చేశారు. వీసీ అల్లం శ్రీనివాసరావు, జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ ఖాదర్ వలి, వీఎస్‌యూ రిజిస్ట్రార్ కె.సునీత, ప్రిన్సిపల్ విజయ, ప్రాజెక్టు మేనేజర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE : NELLORE
E.P.No. 42/2022
O.S.No. 307/2014
Karnam Raveendra ... DHR
Vs.
Kalpam Sujatha ... JDR

వేలం ప్రకటన

పై నెంబరున డిక్రీ హోల్డర్ డిక్రీ బాకీ రాబట్టుకొనుటకు జె.డి.ఆర్ తాలూకు ఈక్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తులను తేది: 17–12–2025న ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల లోపల పై తెలిపిన కోర్టులో బహిరంగ వేలం పాట జరుపబడును. కావున పాటదారులు ఎవ్వరైనా వేలంపాటలో పాల్గొని పాట పాడుకొనవచ్చును.

SCHEDULE OF PROPERTY

Item No:1 - Nellore District Registration, Gudur Registration District - Bujabuja Nellore Sub - registration - Nellore Rural Mandalam - Amancharla Village S.No. 184-Extent Ac. 3-86 cents - layout Plots - Plot No: 33 - Extent 25 Ankanams or 167.225 Sqm - vacant site - bounded with : East : Plot No. 58, South : Plot No: 32, West : Thirty Feet Road, North : Plot No. 34 with all easement rights.

DHR Value Rs: 4,00,000/-
Amin Value Rs: 3,75,000/-
Market Value Rs: 2,00,000/-

Item No.2 - Nellore District Registration - Guduru Registration District - Bujabuja Nellore Sub - Registration - Nellore Rural Mandalam - Amancharla Village S.No. 184 - Extent Ac. 3-86 cents - layout Plots - Plot No. 34 - Extent 25 Ankanams or 167.225 Sqm - vacant site - bounded with : East : Plot No: 57, South : Plot No. 33, West : Thirty Feet Road, North : Plot No: 30 with all easement rights.

DHR Value Rs: 4,00,000/-
Amin Value Rs: 3,75,000/-
Market Value Rs: 2,00,000/-

ఎన్. సుధీర్‌రెడ్డి, B.Com., B.L.,
డిక్రీ హోల్డరు తరపు అడ్వకేటు, నెల్లూరు.
సెల్ : 94402 79122.

నెలలు నిండని శిశువులపై శ్రద్ధ అవసరం

మాట్లాడుతున్న ఉదయకీర్తి

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: నెలలు నిండకుండా పుట్టే శిశువులపై అవగాహన పెంచుకోవాలని మెడికవర్ హాస్పిటల్ పీడియాట్రీషియన్ డాక్టర్ ఉదయకీర్తి సూచించారు. ప్రపంచ ప్రీమెచ్యూరిటీ దినోత్సవం సందర్భంగా గురువారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 37 వారాలకు ముందే జన్మించే శిశువులపై తగిన వైద్య శ్రద్ధ అవసరమన్నారు. ప్రపంచంలో శిశువులు నెలలు నిండకుండానే జన్మిస్తున్నారని, దేశంలోనూ ఈ సంఖ్య గణనీయంగా పెరుగుతోందని తెలిపారు.

అనధికార కుళాయిలు గుర్తించాలి

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నగరంలో బిల్లులు రాని అనధికార తాగునీటి కుళాయిలను గుర్తించి చలానా రూపంలో నగరపాలకసంస్థ ఖజానాకు జమ చేయించి రెగ్యులర్ చేయించాలని కమిషనర్ వైవో నందన్ ఆదేశించారు. గురువారం కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటరులో ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు నగరంలో ఎటువంటి అనధికార కుళాయిలు ఉండకూడదని స్పష్టం చేశారు.

తెరపై ఈనాడు

ఎం.ఐ సినిమాస్.: స్క్రీన్. 1 కొదమ సింహం (తెలుగు), శిశు (తెలుగు), స్క్రీన్ .2 12ఏ రైల్వే కాలనీ (తెలుగు), స్క్రీన్..3. ప్రేమంటే (తెలుగు), రాజు వెడ్స్ రాంబాయి (తెలుగు), **స్పైస్.సినిమాస్:** స్క్రీన్ 1.ప్రేమంటే (తెలుగు), రాజు వెడ్స్ రాంబాయి (తెలుగు), స్క్రీన్ 2..కొదమ సింహం (తెలుగు), ప్రేమంటే (తెలుగు), స్క్రీన్ 3. ది గర్ల్ ఫ్రెండ్ (తెలుగు), మస్తీ 4 (హిందీ), స్క్రీన్.4.. శిశు (తెలుగు, ఇంగ్లిష్), స్క్రీన్.5.. 12ఏ రైల్వే కాలనీ (తెలుగు), **రెయిన్ సినిమా:** స్క్రీన్..1. ప్రేమంటే (తెలుగు), సిసు: రోడ్డు టు రివెంజ్ (ఇంగ్లిష్, తెలుగు), స్క్రీన్..2.. మఫ్టి పోలీసు (తెలుగు), ది గర్ల్ ఫ్రెండ్ (తెలుగు), ప్రేమంటే (తెలుగు), స్క్రీన్..3.. 12ఏ రైల్వే కాలనీ (తెలుగు), స్క్రీన్..4..పాంచ్ మినార్ (తెలుగు), ది ఫేస్ ఆఫ్ ది ఫేస్‌లెస్(2025) (తెలుగు), రాజు వెడ్స్ రాంబాయి (తెలుగు)

గ్రంథాలయాలకు వెళితే.. చదువులో రాణించొచ్చు

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్లడం అలవాటు చేసుకుంటే చదువులోనూ రాణించవచ్చని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజా పేర్కొన్నారు. నెల్లూరు నగరం స్టోన్‌హౌస్‌పేటలోని జిల్లా గ్రంథాలయ సంస్థలో జరుగుతున్న వారోత్సవాలు గురువారం ముగిశాయి. వారం రోజులపాటు వివిధ పోటీలు నిర్వహించారు. విజేత విద్యార్థులకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కుమార్‌రాజా మాట్లాడుతూ గ్రంథాలయ ప్రాముఖ్యతను తెలియజేసేలా జిల్లాలోని 61 శాఖ గ్రంథాలయాలు, గ్రామీణ గ్రంథాలయాల్లో వారోత్సవాలు నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ భూదాటి రాధయ్య జిల్లా గ్రంథాలయ సంస్థకు 50 పుస్తకాలు అందించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందజేస్తామని క్రెడాయి ఛైర్మన్ రామకృష్ణ ప్రకటించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులు

నగర సమస్యలపై నిర్లక్ష్యమేలా?

వ్యర్థాలతో నిండిన కాలువ

న్యూస్‌టుడే, నెల్లూరు(పొదలకూరురోడ్డు)

నెల్లూరు నగరంలో పలు ప్రాంతాలు అభివృద్ధికి దూరంగా ఉంటున్నారు. శివారులో మౌలిక వసతులు లేవు. నడిబొడ్డున ఉన్న కొన్ని ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఆర్టీసీ బస్టాండుకు కూతవేటు దూరంలో ఉన్న టక్కేమిట్టలో సమస్యలు తిష్ఠ వేశాయి. ప్రధానంగా మురుగు కాలువలు, సీసీరోడ్లు, చెత్తాచెదారం తదితర సమస్యలు పరిష్కారానికి నోచుకోక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చిన్నపాటి సమస్యలనూ నిర్లక్ష్యం చేయడం తగదని వాపోతున్నారు.

పూడిక తీయక..

ఇక్కడ ప్రధాన రోడ్డుతో పాటు అంజనా అపార్టుమెంటు వీధి, తూనికలు కొలతలశాఖ వీధి, మసీదు వీధి తదితర ప్రాంతాలు ఉన్నాయి. ప్రధానంగా మురుగు కాలువలు పూడికతీతకు నోచుకోలేదు. ఫలితంగా వాటి నుంచి దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిలిచిన మురుగులో దోమలు వ్యాప్తి చెంది సాయంత్రమైతే విజృంభిస్తున్నాయని వాపోతున్నారు. రాత్రివేళ ఇళ్లల్లో ఉండలేక పోతున్నామని తెలిపారు. కనీసం ఫాగింగ్ కూడా చేయడం లేదన్నారు. ప్రధాన రహదారి రాళ్లు తేలి గుంతలమయంగా మారింది. వాహనచోదకులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గుంతలు తప్పించే క్రమంలో వాహనాలు అదుపు తప్పి కింద పడిపోయి చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ● నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి డాక్టర్ కనకాద్రి మాట్లాడుతూ కాలువల్లో పూడిక తీయించి దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తామన్నారు.

(c) eenadu

● తెలివిగలవాడు ఎప్పుడూ వాదించడు..

● అహం నిన్ను నాశనం చేయకముందే అహాన్ని నువ్వు నాశనం చెయ్యి..

ఈనాడు శ్రీ సత్యసాయి

అలరించిన శ్రీసత్యసాయి సంగీత రాగమాల

పుట్టపర్తి, న్యూస్‌టుడే: సత్యసాయి శత జయంతి వేడుకల్లో భాగంగా అంతర్జాతీయ యువజన సదస్సును పురస్కరించుకుని గురువారం సాయికుల్వంత్ మందిరంలో శ్రీసత్యసాయి రాగమాల పేరుతో సంగీత విభావరి నిర్వహించారు. సత్యసాయి భక్తబృందం శ్రావ్యంగా సాయి భక్తి గీతాలను ఆలపించారు. ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ సతీమణి హిమవాహిని సంగీత బృందాన్ని సత్కరించారు. ఆ తర్వాత భక్తులు బాబా మహాసమాధిని దర్శించుకున్నారు.

సంగీత కచేరీ నిర్వహిస్తున్న సాయి భక్తబృందం

నేడు మహారాష్ట్ర సీఎం, ఒడిశా గవర్నర్ రాక

పుట్టపర్తి, న్యూస్‌టుడే: సత్యసాయి శత జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు శుక్రవారం పుట్టపర్తికి రానున్నారు. వీరు సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటారు. మహారాష్ట్ర సీఎం అంతర్జాతీయ యువజన సదస్సులో పాల్గొని, యువతను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

అందర్నీ ప్రేమించు.. సేవించు!

■ సేవల విస్తరణకు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు చర్యలు

ఈనాడు, పుట్టపర్తి: సత్యసాయి జీవితంలో తల్లి ఈశ్వరమ్మ పాత్ర చాలా కీలకం. ఈ ప్రాంత ప్రజలకు ఉన్నత విలువలతో కూడిన విద్య, మెరుగైన వైద్యం అందించాలని తల్లి కోరారు. ఆమె కోరిక మేరకు బాబా ప్రారంభించిన సామాజిక సేవలు ప్రపంచ నలుమూలలకు చేరాయి. బోధనలు, సేవలతో ప్రపంచవ్యాప్తంగా భక్తుల అభిమానం చూరగొన్నారు సత్యసాయి బాబా. శివైక్యం చెంది 15 సంవత్సరాలైనా.. సేవలు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. బాబా శతజయంతి ఉత్సవాలు మరో వందేళ్ల సేవలకు బలమైన పునాది అవుతాయని సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ పేర్కొన్నారు. 'అందర్నీ ప్రేమించు.. అందర్నీ సేవించు' అన్న సత్యసాయి బాటలో నడుస్తూ.. బాబా చేపట్టిన సేవా కార్యక్రమాలు విస్తరిస్తూ మరిన్ని ప్రవేశపెడుతున్నామని చెబుతున్నారు.

ఆధునిక సర్జరీ పరికరాలు

సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో రెండు సూపర్‌స్పెషాలిటీ, రెండు జనరల్, రెండు సంచార వైద్యశాలలు ఉన్నాయి. వీటిల్లో రోజూ సుమారు 3 వేల మందికి ఉచితంగా వైద్యం అందిస్తున్నారు.

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రోబోటిక్ సర్జరీ పరికరాలు

● గుండె సంబంధిత రోగ నిర్ధారణకు రూ.3.8 కోట్ల విలువైన ఎకో కార్డియోగ్రఫీ యంత్రాన్ని మేలో ప్రారంభించారు. గుండె, యూరాలజీకి సంబంధించి రూ. 8 కోట్ల విలువైన రోబోటిక్ సర్జరీ యంత్రాలను ఇటీవల అందుబాటులోకి తెచ్చారు. శస్త్రచికిత్సలను రోబో యంత్రాలతో ఉచితంగా చేస్తున్నారు. కంటి చికిత్సలకు అత్యాధునిక పరికరాలను ఇటీవలే సమకూర్చారు.

విలువలతో కూడిన విద్య

ఒకటో తరగతి నుంచి పీహెచ్‌డీ వరకు 102 విద్యా సంస్థల్లో దాదాపు 60 వేలమంది విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందిస్తున్నారు.

● శ్రీసత్యసాయి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదేళ్లలోపు బాలికలకు శతజయంతి ఉత్సవాల సందర్భంగా సుకన్య సమృద్ధి పథకాన్ని ప్రకటించారు. ఇందులో భాగంగా జిల్లాలోని 20,231 మంది బాలికల పేరుతో తపాలా కార్యాలయాల్లో రూ.50 లక్షలు వెచ్చించి మొదట ఖాతాలు తెరిచారు. త్వరలో వారిపేరుపై కొంతమొత్తం డిపాజిట్ చేయనున్నట్లు తెలుస్తోంది.

రైతులకు గిర్ జాతి గోవులు

జిల్లాలోని వంద మంది రైతులకు గిర్ జాతి ఆవులను ఇస్తున్నట్లు ప్రకటించారు. అవి ఈ ప్రాంత వాతావరణానికి అలవాటుపడితే మరింతమందికి ప్రయోజనం చేకూర్చేలా చర్యలు తీసుకోవాలని ఆలోచిస్తున్నారు. వీటి ద్వారా ఇక్కడి రైతుల జీవన ప్రమాణాలు పెరిగే అవకాశం ఉంది.

రహదారులను అనుసంధానం చేయండి

■ కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీకి జిల్లా ప్రజాప్రతినిధుల వినతి

పుట్టపర్తి, న్యూస్‌టుడే: సత్యసాయి శతజయంతి వేడుకల సందర్భంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ గురువారం పుట్టపర్తికి చేరుకున్నారు. ఆయనకు విమానాశ్రయంలో రాష్ట్ర మంత్రులు బీసీ జనార్ధన్‌రెడ్డి, సవిత, దుర్గేష్, సత్యకుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పల్లె సింధూరరెడ్డి, ఎం.ఎస్.రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, జాతీయ భాజపా కౌన్సిల్ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్, ట్రస్టు వర్గాలు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక కాన్వాయ్‌లో ప్రశాంతినిలయం చేరుకున్న కేంద్రమంత్రికి సాయికుల్వంత్ మందిరంలో ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ సాదర స్వాగతం పలికారు. సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా దర్శించుకున్నారు. జిల్లాలోని పెనుకొండ జాతీయ రహదారి నుంచి కొత్తచెరువు, పుట్టపర్తి, నల్లమాడ, ఓడీసీ, మహమ్మాద్‌బాద్, సీజీప్రాజెక్టు కొక్కంటి క్రాస్ వరకు, కదిరి నుంచి చెన్నై జాతీయ రహదారికి అనుసంధానం చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి కోరారు. ఏపీ సరిహద్దులోని రహదారులన్నీ కర్ణాటకతో అనుసంధానించేలా విస్తరించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత కోరారు. పెనుకొండ, రాప్తాడు, మడకశిర నియోజకవర్గాల్లో రహదారుల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

నితిన్‌గడ్కరీకి వినతిపత్రం అందజేస్తున్న మంత్రులు సవిత, సత్యకుమార్, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

మాక్ అసెంబ్లీకి ఆరుగురు విద్యార్థుల ఎంపిక

కొత్తచెరువు, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా నుంచి మాక్ అసెంబ్లీకి నియోజకవర్గానికి ఒకరు చొప్పున ఆరుగురు విద్యార్థులను ఎంపిక చేసినట్లు డీఈవో క్రిష్టప్ప తెలిపారు. పుట్టపర్తి నుంచి జి.నిషిత(జడ్పీహెచ్ఎస్, తలమర్ల), ధర్మవరం పి.జశ్వంత్ (బీఎస్సార్ మున్సిపల్ ఉన్నత పాఠశాల, సంజయ్‌నగర్), కదిరి ఎం.లిఖిత్‌రెడ్డి (జడ్పీహెచ్ఎస్, గూటిబయలు), పెనుకొండ కె.జయవర్ధన్ (జడ్పీహెచ్ఎస్, కోగిర) హిందూపురం పి.మేఘన (జడ్పీహెచ్ఎస్, పులమతి), మడకశిర పి.సంధ్య (జడ్పీహెచ్ఎస్, రాయాపురం) ఎంపికయ్యారు. విద్యార్థులు 23న విజయవాడకు వెళతారన్నారు. అక్కడ 24, 25 తేదీల్లో శాసనసభలో మాక్ అసెంబ్లీపై శిక్షణ ఇవ్వనున్నారని డీఈవో తెలిపారు.

మాట్లాడుతున్న ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాల ఫెర్రర్

విద్యార్థినుల నృత్య ప్రదర్శన

పిల్లల హక్కులు కాపాడాల్సిన బాధ్యత అందరిదీ

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: పిల్లల హక్కులపై ఐక్యరాజ్యసమితి రూపొందించిన నియమాలను అందరూ పాటించాలని ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాలఫెర్రర్ పిలుపునిచ్చారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పిల్లలు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఆమె సూచించారు. గురువారం ఆర్డీటీ సమ్మిళిత ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలల దినోత్సవం ఘనంగా జరిగింది. పిల్లలను మన జాతీయ సంపదగా భావించి వారి హక్కులకు ఎలాంటి ఆటంకం కలిగించకూడదని హెచ్చరించారు. బాలల సంరక్షణ కోసం ఆర్డీటీ ముందుస్తు చర్యగా అన్ని ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. పిల్లలు సురక్షితంగా, గౌరవంతో పెరిగే వాతావరణం కల్పించాలని పిలుపునిచ్చారు. ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి, విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ డైరెక్టర్ అర్చన మాట్లాడుతూ బాలల సంరక్షణ కేంద్రాల్లో పిల్లల భద్రత కమిటీలు ఏర్పాటు చేసి బాల్య వివాహాలను నిర్మూలిస్తున్నట్లు తెలిపారు. ఆట పాటల్లో గెలుపొందిన బాలలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి.

టమాటా కిలో రూ.50

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: అనంతపురం గ్రామీణం కక్కలపల్లి మార్కెట్‌లో టమాటా ధరలు పెరుగుతూనే ఉన్నాయి. పంట ఉన్న రైతులకు ధరలు ఊరిస్తున్నాయి. మూడ్రోజులుగా గరిష్ఠ ధరలు పరిశీలిస్తే ఈ నెల 18న టమాటా కిలో రూ.38, 19న 47, 20న రూ.50 పెరిగింది. గురువారం మార్కెట్‌లో రైతులు 1,875 టన్నులు విక్రయించారు. కిలో గరిష్ఠం రూ.50, మధ్యస్థం రూ.37, కనిష్ఠం రూ.27 చొప్పున ధరలు పలికాయి.

సత్యసాయి శత జయంత్యుత్సవం చరిత్రాత్మకం: కలెక్టర్

కొత్తచెరువు, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి శత జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ గురువారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేడుకలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు, శాసనసభ్యులు, సినీ, క్రీడా, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారని పేర్కొన్నారు. ఇప్పటి వరకూ పుట్టపర్తికి 4,24,153 మంది భక్తులు వచ్చారు. భక్తులు సాయి యాప్ 100 ద్వారా తమ వివరాలను నమోదు చేసుకున్నారు. ప్రశాంతి రైల్వేస్టేషన్ నుంచి 261 ప్రత్యేక బస్సులను ఉచితంగా నడిపారు. తాత్కాలిక బస ఏర్పాట్లలో భాగంగా వెస్ట్‌గేటు, ఎనుమలపల్లి, ప్రశాంతి నిలయంలో 1,92,151 మందికి బస ఏర్పాట్లు చేశాము. వైద్య ఆరోగ్య శాఖ అధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 25 ఉచిత వైద్యశిబిరాల్లో 8,011 మంది వైద్య సేవలు పొందారు. 42 కేంద్రాల్లో తాగునీటి సరఫరా, పురుషులు, మహిళలకు తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటి వరకూ 356683 మంది భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించాం. 5500 మంది పోలీసులతో భద్రతా చర్యలు చేపట్టాము. శిల్పారామం దగ్గర సెర్ప్ ద్వారా హస్తకళల శిబిరాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, చిత్రావతి నదీ తీరంలో తెప్పోత్సవం, లేజర్ షో ద్వారా సందర్శకులను ఆకట్టుకునే విధంగా ప్రదర్శనలు ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ వివరించారు.

సాగు చేస్తూ.. కబ్జా

సలకంచెరువులో ఓ నాయకుడి దందా

ఈనాడు, అనంతపురం: అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఓ స్థానిక నాయకుడు గ్రామంలోని భూముల్ని మింగేశాడు. అక్రమ నిర్మాణాలు చేపట్టాడు. అనధికారికంగా భూమి సాగు చేసుకుంటూ ఫలితాలు అనుభవిస్తున్నాడు. పనిలోపనిగా దేవుడి మాన్యం కూడా కలిపేసుకున్నాడు. అంతటితో ఆగకుండా ఆక్రమించిన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ప్రయత్నాలు సాగిస్తున్నాడు. దీనిపై గ్రామస్థులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. సదరు స్థానిక నాయకుడికి నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధి అండ ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆక్రమణకు గురైన భూమి

వైకాపా హయాంలోనే..

శింగనమల మండలం సలకంచెరువు పరిధిలో సర్వే నంబరు 97లో 455 ఎకరాల్లో చెరువు విస్తరించి ఉంది. చెరువుకు ఆనుకుని అదే గ్రామానికి చెందిన స్థానిక నాయకుడికి అర ఎకరా భూమి ఉంది. రాజకీయ అండతో సదరు నాయకుడు కొద్దికొద్దిగా చెరువును ఆక్రమించుకుంటూ వచ్చాడు. వైకాపా హయాంలో పక్కనే ఉన్న దేవుని మాన్యం రెండు ఎకరాల మేర కబ్జా చేశాడు. మొత్తంగా చెరువు, మాన్యం భూమి 5 ఎకరాలు ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నాడు. గత వైకాపా ప్రభుత్వంలోనే పట్టుపురుగుల షెడ్డు నిర్మించాడు. షెడ్డు నిర్మాణానికిగాను రాయితీ కోసం దరఖాస్తు చేసుకోగా అక్రమ నిర్మాణం కావడంతో అధికారులు తిరస్కరించారు. అందులోనే రెండు బోర్లు వేసుకోగా.. అధికారులు విద్యుత్తు కనెక్షన్ ఇవ్వడం గమనార్హం. అప్పట్లోనే ఆక్రమించుకున్న భూమిని తన పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించుకునేందుకు ప్రయత్నాలు సాగించాడు.

అధికార పార్టీలోకి మారి..

సదరు నాయకుడు కబ్జా భూమిని కాపాడుకునేందుకు అధికార పార్టీలో చేరాడు. స్థానిక ప్రజాప్రతినిధి అనుచరులతో అంటకాగుతూ చెరువు భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామస్థులు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ విషయంగా శింగనమల తహసీల్దార్ శేషారెడ్డి వివరణ కోరగా.. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు మేరకు మైనర్ ఇరిగేషన్ అధికారులకు లేఖ రాసినట్లు తెలిపారు. వారి నుంచి స్పష్టత వచ్చాక ఆక్రమణలు ఉంటే తొలగిస్తామని పేర్కొన్నారు.

చేనేతపురికి పూర్వ వైభవం!

మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటు దిశగా అడుగులు

ధర్మవరం న్యూస్‌టుడే: ధర్మవరం చేనేతకు పూర్వవైభవం రానుంది. ఎన్నో ఏళ్ల కలగా ఉన్న మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో 9.84 ఎకరాల భూమి కేటాయించింది. ఈ ప్రాజెక్టు రూ.38 కోట్లతో ఏర్పాటు కానుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా 25 వేల మంది లబ్ధి పొందనున్నారు. 10,114 మంది కార్మికులకు నైపుణ్య శిక్షణ, అవసరమైన మగ్గం ఉపకరణాలు అందించనున్నారు. క్లస్టర్ ఏర్పాటుతో మగ్గాల సంఖ్య పెరిగి చేనేత రంగం పురోగతి సాధించేందుకు దోహదపడుతుంది.

ఏమి చేస్తారంటే..

రూ.5 కోట్లతో భవనాన్ని నిర్మించనున్నారు. ఇందులో వీవింగ్, డయింగ్, డిజైనింగ్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి కొత్తవారికి తర్ఫీదు ఇస్తారు. పట్టుచీరల్లో వినియోగించే ముడిపట్టుకు రంగుల అద్దకం చేసేందుకు డయింగ్ యూనిట్లను అందుబాటులోకి తెచ్చి ఐదుగురు డిజైనర్లను శిక్షకులుగా నియమించనున్నారు. ప్రత్యేకంగా అధునాతన కంప్యూటర్లతో స్టూడియో ఏర్పాటు చేయనున్నారు.

★ క్లస్టర్‌లో నమోదైన సభ్యులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వృత్తి నైపుణ్యం కల్పించనున్నారు. అవసరమైనవారికి 90 శాతం రాయితీతో మగ్గాలు, ఎలక్ట్రానిక్ జాకార్డులు, 12 రకాల నేత పరికరాలు అందిస్తారు. ఇందుకోసం సర్వే నిర్వహించి 5,800 మందిని గుర్తించారు.

ఆదర్శ నమూనాగా తీర్చిదిద్దుతాం

-సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర మంత్రి

మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ దేశంలోనే ఆదర్శ నమూనాగా తీర్చిదిద్దుతాం. అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో వ్యవసాయ మార్కెట్‌యార్డులో భూమి కేటాయించాం. మంచి డిజైన్‌తో భవన నిర్మాణాలు చేపడతాం. ప్రపంచ వ్యాప్తంగా ధర్మవరం పట్టుచీరలకు మార్కెటింగ్ వ్యవస్థలను అనుసంధానిస్తాం. త్వరితగతిన క్లస్టర్ పనులు జరిగేలా చూస్తాం.

పుర పట్టణాభివృద్ధికి మరో రూ.15 కోట్లు

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: హిందూపురం పట్టణాభివృద్ధికి ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవతో కోట్లాది రూపాయలు మంజూరవుతున్నాయి. పట్టణంలోని అన్ని వార్డుల్లో రహదారులు, మురుగు కాలువల నిర్మాణానికి ఇటీవలే రూ.92.5 కోట్లు మంజూరు కావడంతో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారు. వీటికి అదనంగా మరో రూ.15 కోట్లు విడుదల అయ్యేలా ఎమ్మెల్యే చర్యలు తీసుకున్నారు. ఈ నిధులను పట్టణ ప్రధాన రహదారుల అభివృద్ధికి, రహదారులకు అడ్డంగా ఉన్న స్తంభాలను, ఇళ్ల మీదుగా వెళుతున్న తీగలు తొలగించడానికి ఉపయోగించనున్నారు.



నిధులు విడుదల పత్రాలను ప్రదర్శిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ రమేశ్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య

కేటాయింపు ఇలా...: మేళాపురం సర్కిల్ నుంచి ముద్దిరెడ్డిపల్లి మీదుగా సింగిరెడ్డిపల్లి వరకు సీసీ రోడ్డు, కాలువ నిర్మాణానికి రూ.3.58 కోట్లు. తహసీల్దార్ కార్యాలయంతో పాటు కోర్టులోకి వెళ్లడానికి ఉన్న రహదారి అభివృద్ధికి రూ.33.74 లక్షలు. రైల్వే రోడ్‌లోని డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, పచ్చదనం పెంపకానికి రూ.45 లక్షలు.. ఇలా పలు పనులకు నిధులు కేటాయించారు.

పశువులకు గరళతొట్లు!

■ పాచిపట్టి, మలినాలతో నీరు
■ పల్లెల్లో నిర్వహణ తీరిది

ధర్మవరం పట్టణం, తాడిమర్రి, న్యూస్‌టుడే: పల్లెల్లో పశువుల దాహార్తి తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నీటితొట్లెలు నిర్మించింది. ఈ ఏడాది జనవరిలో పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా ఎన్ఆర్‌జీఈసీ ద్వారా జిల్లాలోని అన్ని గ్రామాల్లో తొట్టెలు నిర్మించారు. వాటిని నీటితో నింపేందుకు ఏర్పాట్లు చేశారు. నిర్వహణ బాధ్యతలను గ్రామ పంచాయతీ అధికారులకు అప్పజెప్పారు. వారు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి తొట్టెలు కనిపించడం లేదు. దానికితోడు అందులో నీరు పాచిపట్టి ఉంటున్నాయి. ప్రభుత్వం కోట్లు ఖర్చుచేసి నీటితొట్టెలు నిర్మిస్తే అధికారులు నీరుగారుస్తున్నారని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తొట్టెలను శుభ్రంగా ఉంచాలని కోరుతున్నారు. ఈ విషయమై డివిజన్ పంచాయతీ అధికారి జనార్దన్‌రావు వివరణ కోరగా నీటితొట్టెలు శుభ్రంగా ఉండేలా గ్రామ పంచాయతీల అధికారులను ఆదేశిస్తామన్నారు.

ధర్మవరం మండలం నిమ్మలకుంట గ్రామంలో పిచ్చిమొక్కల నడుమ తొట్టె, పాచిపట్టిన నీరు

జిల్లాలో నిర్మించిన తొట్టెలు: 1,325 | ఒక్కో దానికి వ్యయం : రూ.18,000 | తొట్టెలకు ఖర్చుచేసిన నిధులు: రూ.2,38,50,000

జనతా ఖానా... అందలేదన్నా!

● రాయితీ అల్పాహారం ఎక్కడ? ● రైల్వే స్టేషన్లలో ఇదీ పరిస్థితి

గుంతకల్లు రైల్వే జంక్షన్‌లోని హోటల్

గుంతకల్లు, న్యూస్‌టుడే : రైళ్లలోని జనరల్ బోగీల్లో వెళ్లే ప్రయాణికులకు తక్కువ ధరకు అల్పాహారాన్ని అందించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం గతేడాది 'జనతా ఖానా' పథకాన్ని తీసుకొచ్చింది. ఆయా స్టేషన్లలో హోటళ్ల వారు పథకాన్ని అమలు చేయాలని ఉత్వర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పథకం అమలు కావడంలేదు. ప్రయాణికులు ఎక్కువ డబ్బులు వెచ్చించి అల్పాహారాన్ని కొనాల్సి వస్తోంది.

● రైల్వే డివిజన్‌లోని ముఖ్యమైన రైల్వే స్టేషన్లుగా గుంతకల్లు, తిరుపతి, రేణిగుంట, రాయచూరు, యాదగిరి, ధర్మవరం, పాకాల, కడప, మంత్రాలయం ప్రాంతాలు ఉన్నాయి. ఆయా స్టేషన్లలోని హోటళ్ల నిర్వాహకులు రూ.15కే ఏడు పూరీలు(175 గ్రాములు), ఆలూ బజ్జీ (150 గ్రాములు), ఊరగాయ(15 గ్రాములు), ఒక మిరపకాయను అందించాల్సి ఉంది. దీన్ని ఎవరూ అమలు చేయడం లేదు. వీటిని ప్రస్తుతం రూ.30, రూ.35 ధరలకు అమ్ముతున్నారు. ఫలితంగా సామాన్య, మధ్యతరగతి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

చిన్న అక్షరాలతో బోర్డులు

జనతా ఖానా పథకానికి సంబంధించి జనరల్ బోగీల్లో ప్రయాణించే వారికి అల్పాహారం అందించడానికి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు చెందిన జనరల్ బోగీలు ఎక్కడ ఆగుతాయో అక్కడ కౌంటర్లను ఏర్పాటు చేయాలని రైల్వే బోర్డు ఆదేశాలున్నాయి. ప్రయాణికులకు తెలిసే విధంగా కౌంటర్ల వద్ద బోర్డులను ప్రదర్శించాలి. ఎవరూ దీన్ని పట్టించుకోవడంలేదు. క్యాటరింగ్ విభాగాల వద్ద అన్ని వస్తువుల జాబితాలో జనతాఖానా గురించి చిన్న అక్షరాల్లో రాసి బోర్డులు పెట్టారు. ఎక్కడా రాయితీపై మెనూలో కనబరచిన ధరలతో అల్పాహారాన్ని ఇవ్వడం లేదు.

తనిఖీల సమయంలోనే..

రైల్వే స్టేషన్లలో అధికారులు తనిఖీలకు వస్తున్నారని సమాచారం ఉన్నప్పుడు మాత్రమే రాయితీతో ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై గుంతకల్లు రైల్వే స్టేషన్ క్యాటరింగ్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణను వివరణ కోరగా 'జనతా ఖానా' పథకాన్ని పటిష్ఠంగా అమలయ్యే విధంగా చూస్తామన్నారు. క్యాటరింగ్‌కు చెందిన హోటళ్ల యజమానులు పథకాన్ని అమలు చేయకుంటే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డిసెంబరు 3న ధ్రువపత్రాల పరిశీలన

కదిరి, న్యూస్‌టుడే: ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ చేసేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న శ్రీసత్యసాయి జిల్లా ఐటీఐ అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలన చేయించుకోవాలని కర్నూలు ఆర్టీసీ జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాల ప్రిన్సిపల్ నజీర్‌అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 25 నుంచి ఈనెల 8 వరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పదోతరగతి, ఐటీఐ ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని పేర్కొన్నారు. డిసెంబరు 3న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు. ఎన్సీవీటీతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కులధ్రువీకరణ, అంగవైకల్యం, మాజీ సైనిక ఉద్యోగుల పిల్లలైతే ధ్రువపత్రం, స్పోర్ట్స్ లేదా ఎన్‌సీసీ, బ్యాంకు ఖాతా, పాస్‌పోర్టు సైజు ఫొటో, ఆధార్ ఒక్కో సెట్ జిరాక్స్ కాపీలు తేవాలని పేర్కొన్నారు. సందేహాలు ఉంటే 08518 257025 నంబరులో సంప్రదించాలని కోరారు.

(c) eenadu

22న జిల్లావ్యాప్తంగా గ్రామసభలు

లక్ష్మీనగర్ (అనంతపురం): గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి ప్రజలకు అవసర మయ్యే సేవలను గ్రామస్థాయిలోనే అందించేందుకు జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామ పంచాయతీల్లో ఈనెల 22న గ్రామసభలు నిర్వ హిస్తున్నట్లు జిల్లా నీటి యాజ మాన్య సంస్థ (డ్వామా) పీడీ సలీం బాషా తెలిపారు. గ్రామ సభల్లో కొత్తజాబ్ కార్డుకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ఉపాధి శ్రామి కుల ఈకేవైసీలో భాగంగా తొలగిం చిన లేదా రద్దు చేసినట్లు ప్రకటిం చిన జాబితాపై ఉన్న అభ్యంతరా లను పరిశీలించి అర్హులైతే వారి పేర్లను పునరుద్ధరిస్తామని వెల్లడించారు. ఉపాధి శ్రామికులకు పని కావా లని దరఖాస్తులను అందజేయవచ్చు నని తెలిపారు. సభల్లో ఏపీడీ/ పీవోలు పాల్గొని సమస్యలు పరి ష్కారం కోసం చర్యలు తీసుకుం టారన్నారు. సభల్లో గ్రామపెద్దలు, ప్రజలు, ఉపాధి శ్రామికులు పాల్గొని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకో వాలని పీడీ కోరారు.

పట్టు అమ్మిన వెంటనే పైసలు

- ఆన్‌లైన్‌లో రైతులు, బ్యాంకు ఖాతాల వివరాలు
- జనవరి నుంచి ఏ రోజుకారోజు ఖాతాల్లో నగదు జమ


హిందూపురంలోని పట్టుగూళ్ల మార్కెట్

హిందూపురం, న్యూస్‌టుడే: పట్టురైతులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఈ-మార్కెటింగ్ సేవలు త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా పట్టుగూళ్ల మార్కెట్లలో అందుబాటులోకి రానున్నాయి. దీంతో మార్కెట్‌లో గూళ్లు విక్రయం జరిగిన కొన్ని గంటల వ్యవధి లోనే నగదు వారి ఖాతాల్లోకి జమ అయ్యే అవకాశం అందుబాటులోకి రానుంది. ఇప్పటి వరకు రైతులు పట్టుగూళ్ల మార్కెట్‌లో గూళ్లు విక్రయం జరిగినా కొనుగోలు చేసిన రీలరు నగదు అందించే వరకు రైతులు ఎదుచూడాల్సి వస్తోంది. కొంతమంది వేలంలో రైతుల వద్ద నుంచి పట్టుగూళ్లు కొనుగోలు చేసినా డబ్బు చెల్లింపులో జాప్యం చేయడం, ఫోన్ పే చేస్తామని చెప్పటంతో రైతులు ఇంటికి వెళ్లిన తర్వాత చూస్తే సకాలంలో ఆ మొత్తం చేరకపోవడం జరుగుతోంది. ఈ-మార్కెటింగ్ సేవలు అందు బాటులోకి వచ్చి గూళ్ల విక్రయం జరిగిన తర్వాత రైతులు ఇళ్లకు వెళ్లినా వారి ఖాతాలోకి కొన్ని గంటల్లోనే నగదు జమ అవుతోంది. ఈ విధానం కర్ణాటకలో ఇప్పటికే ఆ రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురావటంతో రైతులకు వెంటనే డబ్బు ఖాతాలో జమ అవుతుండటంతో చాలామంది అటువైపు వెళుతున్నారు.

జిల్లాలో పట్టుగూళ్లమార్కెట్లు	హిందూపురం, కదిరి, ధర్మవరం
పట్టు రైతులు	4వేలు

వేలంలో పాల్గొనే రీలర్లు ముందే జమ చేయాలి

పట్టుగూళ్ల వేలంలో పాల్గొనే రీలర్లు ఇకపై ముందే కొంత మొత్తం మార్కెట్ అధికారి ఖాతాలోకి డిపాజిట్ చేయాలి. ఇలాంటి వారే వేలంలో పాల్గొనే విధంగా మార్కెట్ అధికా రులు చర్యలు తీసుకొంటారు. డిపాజిట్ మొత్తం చెల్లించని రీలర్లు ఇకపై వేలంలో పాల్గొనే అవకాశం ఉండదు.

జనవరికి ఈ-మార్కెటింగ్ సౌకర్యం

వచ్చే జనవరి మాసానికి ఈ-మార్కె టింగ్ సేవలు పట్టు రైతులకు అందు బాటులోకి ప్రభుత్వం తీసుకొచ్చే అవ కాశం ఉంది. ఇప్పటికే రైతుల వివ రాలు, వారి బ్యాంకు ఖాతాలు అంతర్జా లంలో నిక్షిప్తం చేస్తున్నారు. ఈ విధానం అందుబాటులోకి వస్తే రైతులకు జాప్యం లేకుండా నగదు చేతికి చేరుతోంది.

-హంపయ్య, పట్టుగూళ్ల మార్కెట్ ఇన్‌స్పెక్టర్, హిందూపురం

నిబంధనలు మార్పు... రుణాల పెంపు

జిల్లా సమాఖ్య సాధారణ సమావేశంలో ఆమోదం

కొత్తచెరువు, న్యూస్‌టుడే: డ్వాక్రా సంఘాల్లో నిర్వహిస్తున్న ఆర్థిక లావాదేవీలు గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని మహిళల జీవి తాల్లో వెలుగులు నింపుతున్నాయి. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా రుణాలు అందిస్తుండటంతో మహి ళలు అధిక వడ్డీ వేధింపుల నుంచి బయటపడ్డారు. అయితే డ్వాక్రా సంఘాల్లో వెలుగు సిబ్బంది నిర్లక్ష్యం, స్వార్థం కారణంగా కొందరు సభ్యుల మొండి బకా యిలు పేరుకుపోయి ఇతర సభ్యు లకు శాపంగా మారింది. దీంతో నాన్ పర్ఫామింగ్ అసెట్ (ఎన్ పీఏ) కింద నమోదైన మండలా లకు స్త్రీనిధి రుణాల మంజూరు రెండు, మూడేళ్లుగా నిలిచిపో వడంతో మహిళలు ఆర్థికంగా సత మతమయ్యే పరిస్థితులు ఏర్ప డ్డాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో సగం మండలాలు తరచూ ఎన్ పీఏ కింద నమోదవుతున్నాయి. నిబంధనలు సడలిస్తూ తీసుకొ చ్చిన మార్పులతో జిల్లాలో ఎన్ పీఏ మండలాల సంఖ్య రెండిం టికి పరిమితం కానుంది.

కొందరి తప్పిదం... అందరికీ శాపం

మహిళా సంఘాల్లో స్త్రీనిధి రుణాలు చెల్లింపులో కొందరి అలసత్వం అందరికీ శాపంలా మారింది. గ్రామైక్య సంఘం నుంచి రూ.3 లక్షలు, మండల సమాఖ్య నుంచి రూ.20 లక్షల బకా యిలు పేరుకుపోతే ఎన్‌పీఏగా గుర్తించి మండలానికి స్త్రీనిధి రుణా లను నిలిపేశారు. దీంతో బకాయి దారులతోపాటు సకాలంలో రుణాలు చెల్లించిన వారికి మళ్లీ రుణాలు అందే పరిస్థితి లేదు. ఏళ్ల తరబడి ఎదురు చూసే పరిస్థితి ఏర్పడింది. విధిలేని పరిస్థితుల్లో కొందరు బయట అప్పులు చేసి అధిక వడ్డీలు చెల్లించలేక ఇబ్బం దులు పడిన ఘటనలు కోకొల్లలు.



పెంపు ఇలా..

- జిల్లా సమాఖ్యలో ఇటీవల రెండు రోజుల కిందట జరి గిన సాధారణ సమావేశంలో స్త్రీనిధి మంజూరు విధా నంలో తీసుకువచ్చిన అనేక మార్పులు డ్వాక్రా సంఘా లకు ఎంతో ఉపకరిస్తున్నాయి.
- మండల సమాఖ్య ఎన్‌పీఏ పరిమితిని రూ. 20 లక్షల నుంచి రూ.35 లక్షలకు పెంచారు. దీంతో జిల్లాలో బుక్కపట్నం, నల్లచెరువు మండలాలు మాత్రమే ఎన్‌పీఏ కింద మిగ లనున్నాయి.
- ఎస్‌హెచ్‌జీ రుణ పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 8 లక్షలకు పెంచారు.
- గ్రామ సంఘం రుణ పరిమితిని రూ. కోటి వరకు పెంచారు.

ఎన్‌పీఏ పరిమితి పెంచారు

ఇటీవల జరిగిన జిల్లా సమాఖ్య సమావేశంలో ఎన్‌పీఏ రుణాల పరిమితి నిబంధనల్లో మార్పు చేశారు. జిల్లాలో ఆ రెండు మండలాలు తప్ప మిగిలిన మండలాల్లోని అన్ని సంఘా లకు స్త్రీనిధి రుణాలు మంజూరుకానున్నాయి. సంఘాల ఆర్థిక లావాదేవీల నిర్వహణ, రుణాలు నేరుగా సభ్యులే చెల్లించేలా ప్రత్యేక యాప్ తీసుకొస్తున్నారు. దీంతో చెల్లింపులు పారదర్శ కంగా మరింత సులభతరం కానున్నాయి.

- నరసయ్య, డీఆర్‌డీఏ పీడీ, పుట్టపర్తి

EENADU Classifieds
BUSINESS SERVICES
BUSINESS OFFER

మీ బంగారం, వెండి డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/ షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 7382114647

JOBS

కావలెను: మా సంస్థ యందు పని చేయుటకు 150 మంది (10th to డిగ్రీ) యువకులు అర్జెంటుగా కావలెను. జీతం రూ.18 వేలుసంప్రదించండి. 8500242049.

తెలుగు మ్యారేజ్ బ్యూరో అనంతపూర్ బ్రాంచి నందు పనిచేయుటకు డిగ్రీ చదివి కంప్యూటర్ పరిజ్ఞానం గల మహిళ అభ్యర్థులు కావలెను. సంప్ర: Cell: 9885141567, 9885141199.

హాస్టల్ ఫుడ్ మేనేజర్ కావలెను. అనంతపురంలోని ఒక ప్రముఖ కళాశాలలో హాస్టల్స్ కోసం ఫుడ్ క్వాలిటి వంటశాల హైజిన్ రోజువారి భోజన తయారి మరియు సరఫరా పర్యవేక్షణకోసం అనుభవం ఉన్న హాస్టల్ ఫుడ్ మేననేజర్ కావాలి. హోటల్ మేనేజ్‌మెంట్ చేసినవారు లేదా ఫుడ్‌సూపర్ వైజింగ్‌లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం. వసతి కల్పించబడును. సంప్ర: 9133399861.

ఫామ్‌మేనేజర్ కావలెను. అనంతపురం రుద్రంపేట సమీపంలో ఉన్న మా గొర్రెల ఫామ్ కోసం గొర్రెల సంరక్షణ వాటి ఆహార నిర్వహణ డీ-వార్మింగ్/ వ్యాక్సినేషన్ మొదలైన వాటిపై మంచి అనుభవం కలిగి ఉన్నవారు కావలెను. వసతి కల్పించబడును. ఆసక్తిగలవారు సంప్ర: 9133399861

హైదరాబాద్‌లో పనికి వంటమాస్టర్ ఫ్యామిలీ (భార్యభర్త) జీ: 35 వేలు. కిచెన్ హెల్పర్స్ ఫ్యామిలీ (భార్యభర్త) జీ: 26 వేలు. కావలెను. రూం, మీల్స్ ఫ్రీ. ✆ 9493931224, 7386951320.

అటెండెంట్ కావలెను (పురుష) 63 సం. వయస్సు గల ఒంటరి పురుషుడికి సహకారం అందించేందుకు కావలెను. నెలవారీ జీతం. రామ్‌నగర్. 9393724047.

MARKETING/ SALES

ప్రముఖ ఆయిల్ మరియు మసాలాల కంపెనీకి Sales Executive కావలెను. సంప్రదించండి: ✆ 9032963185.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచా రించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదా రులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకట నల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS
5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే
తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...
వివరాలకు :
8008709784
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

ఆధ్యాత్మిక సమాచారం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నేడు(శుక్రవారం) ఉదయం 7.30 గంటలకు అమృతవల్లి అమ్మవారికి అభిషేక పూజలు నిర్వహి స్తారు. పది గంటలకు శ్రీవారికి కల్యాణోత్సవం ఉంటుంది. ఉదయం 6 గంటలకు స్వామివారి సాధారణ దర్శనం. ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల మధ్య అభిషేక, స్వర్ణకవచ సేవలు. తర్వాత తొమ్మిది నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు భక్తులకు స్వామివారి సర్వ దర్శనం ఉంటుంది.

బుగ్గరామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు


క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలోని పెన్నానది ఒడ్డున ఉన్న బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం కార్తికమాస పూజలు ముగిశాయి. బుగ్గరామలింగేశ్వరస్వా మికి భస్మాలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని కాశీ విశ్వేశ్వర లింగానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఆయా పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

పర్యాటక వలయం ఏర్పాటుకు కృషి: మంత్రి

ఆలయ చరిత్రను తెలుసుకుంటున్న మంత్రి కందుల దుర్గేష్

లేపాక్షి, న్యూస్‌టుడే: చిత్ర, శిల్పకళ లకు కాణాచిగా ఉన్న లేపాక్షితో పాటు కదిరి, పుట్టపర్తి వంటి ఆలయాలను కలుపుతూ పర్యాటక వలయం ఏర్పాటు చేసి అక్కడ పర్యాటకులకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం మంత్రి స్థానిక దుర్గా, పాప నాశేశ్వర, వీరభద్రస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయలంలోని పురాతన కట్టడాలు, చారిత్రక నిర్మాణాలు, ఆలయ చరి త్రను పర్యాటక శాఖ గైడ్ విరుపన్న వివరిం చారు. వీరభద్రస్వామి, దుర్గాదేవి అమ్మవా ర్లకు ప్రత్యేక పూజలు చేయించారు. అనం తరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేసి తద్వారా ఆదాయం పెంచుకునేలా ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్‌లు శ్రమిస్తున్నట్లు తెలి పారు. త్వరలోనే లేపాక్షి ఉత్సవాలు నిర్వ హించనున్నట్లు మంత్రి వివరించారు. తహ సీల్దార్ సౌజన్యలక్ష్మి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఉమేష్, నాయకులు లోకేష్, మండల కన్వీనర్లు బాలాజీగౌడ్, చిన్న ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టాలి

మాట్లాడుతున్న న్యాయమూర్తి రాజశేఖర్

అనంతపురం (మూడోరోడ్డు), న్యూస్‌టుడే: బాలల హక్కుల పరిరక్షణ తోనే పటిష్ఠమైన భావి భారత నిర్మాణం సాధ్యమని డీఎల్ఎస్ఏ కార్యదర్శి, న్యాయమూర్తి రాజశేఖర్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ ఎస్ఏ) కార్యాలయంలో గురువారం బాలల హక్కులపై సమావేశం నిర్వ హించారు. న్యాయమూర్తి మాట్లా డుతూ.. భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్ర మాలను పక్కాగా అమలు చేయాలన్నారు. ప్రభుత్వ వివిధ శాఖలు ఇందుకోసం గట్టిగా కృషి చేయాలన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. జిల్లాలో ఇంకా బాల్య వివాహాలు జరుగుతు న్నట్లు వార్తలు వస్తున్నాయన్నారు. వాటిని నియంత్రించడానికి ఐసీడీఎస్ అధికారులు కృషి చేయాలన్నారు. బాలలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలన్నారు. బాలలు మాదక ద్రవ్యాల బారిన పడకుండా కాపాడాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) మాలోల మాట్లాడుతూ.. బాలల హక్కుల ఉల్లంఘన జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండా లని ఆదేశించామన్నారు. బాలల హక్కుల అమలులో ఉద్యోగులు అలసత్వంగా వ్యవహ రిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఖుష్బూ కొఠారి, శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ కె.శ్రీనివాసరావు, న్యాయవాది నల్లప్ప పాల్గొన్నారు.

యువత చేతుల్లోనే దేశ భవిత

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ స్మిత

కదిరి, న్యూస్‌టుడే: యువత చేతుల్లో దేశా నికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రిన్సిపల్ స్మిత తెలిపారు. కదిరి ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యువజన సర్వీసులశాఖ, ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో యువజనోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా వివేకానందుడి చిత్రపటానికి పూలమాలతో నివాళి అర్పించారు. జానపద నృత్యం, గేయాలు, కథలు, పద్యాలు రాయటం, వక్తృత్వ, చిత్రలేఖనం, సైన్స్‌మేళా వంటి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ విజయకుమార్, రాష్ట్రపతి అవార్డు గ్రహీ తలు జీవన్‌కుమార్, కె.జయమారుతి మాట్లా డారు. యువత తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి దేశాభివృద్ధికి కృషి చేయాలన్నారు. జానపద నృత్యంలో ఆర్డీటీ మోనికా బృందం ప్రథమ, గీతాలాపనలో జ్యోషిణి బృందం ప్రథమ, జానపద నృత్య, గేయాలాపనలో ఎస్టీ ఎస్ఎన్ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానం పొందారు. వక్తృత్వంలో ఎ.మహిదా, చిత్రలేఖ నంలో ఎస్.ముస్కాన్, కవితల పోటీలో బి. ఉస్మాన్‌ఘని, కథలలో రెడ్డిశ్రీజ ప్రథమ బహు మతులు సొంతం చేసుకున్నారు. న్యాయ నిర్ణే తలుగా విష్ణుప్రియ, అనిల్‌నాయుడు, సుధాకర్, హైదర్‌అలీ వ్యవహరించారు. విజేతలకు బహు మతులు, ప్రశంసా పత్రాలను ప్రిన్సిపల్, ముఖ్య అతిథులు అందజేశారు. గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు.

జానపద నృత్యంలో ప్రథమ స్థానం పొందిన ఆర్డీటీ మోనిక బృందం

కార్యక్రమంలో ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకులు సుంకర రమేష్, అంబరీష్, బాలాజీ, మహేంద్ర, శిరీష, అస్సెట్ మేనేజరు శ్రీనివాసులు, అన్వర్‌బాషా పాల్గొన్నారు.

కార్మిక మండలి పునరుద్ధరణకు డిమాండ్

ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుల ప్రయోజనం కోసం ఏర్పడిన కార్మిక సంక్షేమ మండ లిని సత్వరమే పునరుద్ధరించా లని సీఐటీయూ అనుబంధ ఏపీ భవన నిర్మాణ కార్మికుల సంఘం డిమాండ్ చేసింది. గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ ప్రధాన గేటుముందు నిరసన చేపట్టారు. ఆ సంఘం కార్యదర్శి రామాంజినేయులు, అధ్య క్షుడు ప్రసాద్ మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు గత ప్రభుత్వం తీరని అన్యాయం చేసింది. మెమో 12, 14లను తీసుకొచ్చి తీరని ద్రోహం చేసిందని ఆరోపించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సత్వరమే ఆ మెమోలను రద్దు చేసి, పెండింగ్‌లో ఉన్న డెత్ క్లెయిమ్ లను పరిగణనలోకి తీసుకుని నిధులు చెల్లిం చాలన్నారు. సంక్షేమ మండలి పునరుద్ధరణ ద్వారా అనేక ప్రయోజనాలను కల్పించాల న్నారు. సెస్ నిధులను కార్మికులకే కేటాయిం చాలి. 50 ఏళ్లు దాటిన కార్మికులకు రూ.10 వేల ప్రకారం పెన్షన్ చెల్లించాలన్నారు. ఆ తర్వాత డిమాండ్లతో కూడిన వినతిని కలెక్ట ర్‌కు అందజేశారు. ఈ నిరసనలో నాయకులు పరమేశ్వర, నాగరాజు, సూర్యనారాయణ, ప్రవీ ణ్‌కుమార్, బాబు, సాయికిరణ్, సురేశ్, వెంక టనారాయణ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

రోజూ గంటసేపు అందుబాటులో విద్యాశాఖాధికారులు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: విద్యావిభా గంలో నెలకొన్న సమ స్యల పరిష్కారం కోసం డీఈవో, ఎంఈవోలు ప్రతిరోజూ ఒక గంటసేపు కార్యాలయంలో అందుబా టులో ఉండాలని విద్యా శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకూ మండల విద్యాశాఖాధికా రులు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకూ జిల్లా విద్యాశాఖాధికారి అందుబాటులో ఉండాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

26న గోల్‌షాట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాస్థాయి గోల్‌షాట్‌బాల్ సబ్ జూనియర్ బాల, బాలికల జట్ల ఎంపిక కదిరి మండల పరిధిలోని హరీష్ పాఠశాలలో ఈ నెల 26వ తేదీ నిర్వహిస్తు న్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసన్నకు మార్ ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకా రులు జనవరి 1, 2009వ సంవత్సరం తరు వాత జన్మించిన వారై ఉండాలని, ఆధార్ కార్డుతో ఎంపికకు హాజరవ్వాలని తెలి పారు. మరిన్ని వివరాలకు ఉమ్మడి జిల్లా అసోసియేషన్ కార్యదర్శి 97041 40510 నంబరులో సంప్రదించాలని కోరారు.

‘బార్ కౌన్సిల్ ఎన్నికల్లో సమర్థుడికే ఓటేయండి’

అనంతపురం (మూడోరోడ్డు), న్యూస్‌టుడే: రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల్లో సమర్థు డికే ఓటు వేయాలని హైకోర్టు న్యాయవాది బాలాజీ యలమంజుల అన్నారు. ఆయన గురువారం సీనియర్ న్యాయవాదులతో కలసి అనంతపురం కోర్టు ఆవరణలో న్యాయవాదు లకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనం తపురం నగరానికి చెందిన తాను ఇక్కడే న్యాయశాస్త్రంలో పట్టభద్రుడిని అయ్యాన న్నారు. తర్వాత హైకోర్టులో న్యాయవాద వృత్తిని చేపట్టానన్నారు. రైతుల పక్షాన నిలిచి వారికి దోహదపడేలా చట్టాన్ని తీసుకొచ్చానని గుర్తు చేశారు. తాను రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు ఎన్నికైన తర్వాత కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. న్యాయవా దుల బీమా, ఇతర సంక్షేమ పథకాలను అమలు చేయడానికి పాటు పడతానన్నారు. మహిళా న్యాయవాదులకు కోర్టు ఆవరణంలో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానన్నారు. హైకోర్టు న్యాయవాది రాజేంద్రప్రసాద్, సీని యర్ న్యాయవాదులు తిరుపతినాయుడు, లేపాక్షి నాయుడు, బుడేన్‌సాబ్, కేవీఎల్‌వీ ప్రసాద్, బాలకృష్ణ, ధర్మసింగ్‌నాయక్, సుద ర్శన్, జెన్నె ఆనంద్ పాల్గొన్నారు.

వెంటనే కావలెను
హిందూపురం పట్టణంలో Jio-BP పెట్రోలు బంక్ నందు పనిచేయుటకు Manager మరియు Pump Boys కావలెను.
Qualification: Degree,
Experience: Minimum 5 Years
Age: 30 - 40 సంవత్సరాలలోపు
Languages: Telugu, Hindi & English
Contact: 93925 66459

డిసెంబరు 10న సీపీఐ వందేళ్ల వేడుక

ఆజాద్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: సీపీఐ పార్టీ వందేళ్ల వేడు కలు అనంతపురం నగరంలో డిసెంబరు 10న నిర్వహిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీశ్ తెలిపారు. నగరంలోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవనంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి జగదీశ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డిసెంబరు 26వ తేదీ నాటికి కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తవు తున్న సందర్భంగా డిసెంబరు 10న నగరంలోని లలిత కళా పరిషత్‌లో పార్టీ నాయకుల ఆత్మీయ కలయిక నిర్వహిస్తామన్నారు. ముఖ్య అతి థులుగా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య హాజరవుతారని ఆయన వెల్ల డించారు. పార్టీ శ్రేణులు జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాఫర్, జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, సహాయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాం

పెద్దరెడ్డిపల్లి, (పరిగి,): కొడిగెనహళ్లి పంచాయతీలోని బిందూనగ ర్‌లో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి తాగునీటి కేంద్రాన్ని గురువారం మంత్రి సవిత ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గవ్యాప్తంగా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేం దుకు ఎన్టీఆర సుజల స్రవంతి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా కన్వీనర్ ఎస్.ఎన్.గోవిందరెడ్డి, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సోమప్ప, బాలాజీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

‘క్యూఎస్’లో వీఐటీకి 7వ ర్యాంకు

చెన్నై (వడపళని), న్యూస్‌టుడే: ‘క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్’లో 2026 సంవత్సరానికి వేలూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నా లజీ(వీఐటీ)కి దేశవ్యాప్తంగా 7వ ర్యాంకు, అంతర్జాతీయంగా 352వ ర్యాంకు లభించింది. పర్యావరణ ప్రభావ విభాగంలో ప్రపంచవ్యాప్తంగా 194వ స్థానంలో నిలిచి ప్రత్యేకత చాటుకుందని వర్సిటీ గురువారం ప్రకటన విడుదల చేసింది. సస్టెయినబిలిటీని పరిగణన లోకి తీసుకుని ర్యాంకులను విడుదల చేసిందని వీఐటీ కులపతి డాక్టర్ జి.విశ్వనాథన్ పేర్కొ న్నారు. సోషల్ ఇంపాక్ట్, గవ ర్నెన్స్, పర్యావరణ ప్రభావంలో వర్సిటీ అత్యంత ప్రతిభను కన బరుస్తోందని ఆయన అన్నారు. 2025లో అంతర్జా తీయ స్థాయిలో 396వ స్థానంలో ఉండగా 2026లో 352వ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు.

మెదడు రక్తనాళాలకు అరుదైన శస్త్రచికిత్స

కోలుకున్న రైతు పక్కీరప్పతో వైద్యులు అనిల్, మురళీ మోహన్‌కృష్ణ

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: కణేకల్లుకు చెందిన రైతు పక్కీరప్ప (47) మెదడులోని రక్తనా ళాలకు అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడినట్లు కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ అనిల్, డాక్టర్ మురళీమోహన్‌కృష్ణ తెలిపారు. గురువారం వారు కిమ్స్ సవీరా ఆసుపత్రిలో శస్త్రచికిత్సకు సంబం ధించిన వివరాలను వెల్లడించారు. పక్కీరప్పకు తీవ్ర తలనొప్పి రావటం, మతిమరుపు వంటి లక్షణా లతో ఆసుపత్రికి వచ్చారని వెల్లడిం చారు. ఆయనను పరిశీలించి సిటి యాంజియోగ్రామ్ పరీక్ష చేయగా ఆర్టెరియో వీనస్‌మాల్ ఫార్మేషన్ (ఏవీఎం) అనే సమస్య ఉందని గుర్తించామని తెలిపారు. సాధార ణంగా రక్తనాళాల నుంచి మెదడులోకి రక్తప్రసారం జరిగే క్రమంలో మెదడు లోని కీలక ప్రాంతాల వద్ద నరాలు ఉబ్బటంతో ఆయనకు మతిమరుపు లాంటి సమస్యలు వచ్చాయని వివరిం చారు. ఉబ్బిన నరాలు సరిగ్గా మెద డులో మాట, కదలికలను నియం త్రించే ప్రాంతంలో ఉండటంతో వాటిని ఆరు గంటలపాటు శస్త్రచికిత్స చేసి తొలగించామన్నారు. శస్త్రచికిత్స విజయవంతం తరువాత మెదడులోకి రక్తప్రసరణ సాధారణంగా జరుగు తుండటంతో రోగి కోలుకున్నారని ఎలాంటి ఇబ్బంది లేకపోవటంతో డిశ్చార్జి చేసినట్లు వివరించారు.

జాతీయస్థాయి పోటీలకు ఉపాధ్యాయుడి ఎంపిక


నాగేంద్రప్ప

అమరాపురం, న్యూస్‌టుడే: అమరాపురం ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు నాగేం ద్రప్ప జాతీయస్థాయి సింగిల్ బ్యాడ్మింటన్ పోటీ లకు ఎంపికయ్యారు. అఖిల భారత సివిల్ సర్వీస్ ఉద్యోగులకు జరిగిన క్రీడా పోటీల్లో ఈనెల 12న సత్యసాయి జిల్లా పెనుకొండలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎంపిక య్యారు. ఈనెల 19న విజయవాడ రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరిగిన 55ప్లస్ కేటగిరి సింగిల్స్ బ్యాడ్మింట న్‌లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఉపాధ్యా యుడు నాగేంద్రప్పను పాఠశాల ఉపాధ్యాయులు, సంఘం నాయ కులు అభినందించారు.

శతాధిక వృద్ధురాలి మృతి


లీలావతమ్మ

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: రాయ దుర్గం నియోజకవర్గ కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే ఎన్.సి.శేషాద్రి స్వామి సతీమణి, శతాధిక వృద్ధురాలు ఎన్.సి.లీలావతమ్మ (103) గురు వారం మరణించారు. ఆమె స్వగ్రామం మండ లంలోని రాయంపల్లి గ్రామం. ముగ్గురు కుమా రులు, ముగ్గురు కుతుళ్లు ఉన్నారు. భర్త, మాజీ ఎమ్మెల్యే శేషాద్రి స్వామి 30 ఏళ్ల క్రితమే మృతి చెందారు. కొంతకాలంగా వయో భార సమస్యలతో బాధపడుతున్న లీలావతమ్మ హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడి చెంతకు చేరింది. అక్కడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయినట్లు బంధువులు తెలిపారు.

బ్యాటరీల దొంగలు చిక్కారు

యాడికి, న్యూస్‌టుడే : ఓ వాహ నంలో బ్యాటరీలను చోరీ చేసి ఎత్తుకె ళ్తున్న ఇద్దరు దొంగలను దైవాలమ డుగు గ్రామస్థులు పట్టుకుని పోలీసు లకు అప్పగించిన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని దైవాలమడుగు, చందన గ్రామ పరిసరాల్లోని తోటల్లో విద్యుత్తు తీగలను గుర్తు తెలియని దొంగలు తరచూ ఎత్తుకెళ్తున్నారు. పోలీసులు, గ్రామస్థులు కలిసి రాత్రిళ్లు పహారా కాస్తూ వచ్చారు. బుధవారం అర్ధరాత్రి పెద్దవడుగూరు మండల కేంద్రానికి చెందిన రఘురాముడు, నాగ రాజు ఇద్దరు కలిసి దైవామడుగు సమీ పంలోని ఓ గనిలో నిలిపిన హిటాచీ వాహనంలోని రెండు బ్యాటరీలను ఎత్తుకెళ్తూ గ్రామస్థులకు చిక్కగా, వారిని బంధించి గుడిలో ఉంచారు. పెద్దఎత్తున రైతులు కలిసి గురువారం దొంగలను పోలీస్‌స్టేషన్‌లో అప్పగిం చారు. ఈ విషయంపై పోలీసులు విచారణ చేపట్టారు.

యువకుడి మోసపూరిత ఆర్థిక లావాదేవీలు?

ఉరవకొండకు వచ్చిన తెలంగాణ పోలీసులు

ఉరవకొండ, న్యూస్‌టుడే: తెలంగాణలోని నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్‌కేపల్లి పోలీస్‌స్టేషన్ చెందిన ఇద్దరు పోలీసు అధికా రులు గురువారం ఉరవకొండకు చెందిన ఓ సామాజిక వర్గం యువకుడి కోసం వెదుక్కుంటూ వచ్చారు. ఆ పోలీస్‌స్టేషన్ పరిధిలో యువకుడు 1.5 కోట్ల మోసపూరిత ఆర్థిక లావాదే వీల్లో భాగస్వామిగా ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. అతడి చరవాణి ఆధారంగా అదుపులోకి తీసుకొని ఉరవకొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈలోపు ఆ సామాజిక వర్గానికి చెందిన వారు పెద్ద సంఖ్యలో పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఆ లావాదేవీల్లో యువకుడి ప్రమేయం లేదని, వదిలేయా లంటూ తెలంగాణ పోలీసులతో వాదించారు. ఒకవేళ మీకు ఆధారాలు దొరికితే, తామే అతడిని ఎస్‌కే పల్లి పోలీస్‌స్టేష న్‌కు తీసుకొచ్చి అప్పగిస్తామనడంతో ఆ పోలీసు అధికారులు అంగీకరించినట్లుగా తెలిసింది.

రూ.3.05 లక్షల విలువైన రసాయన ఎరువులు, మందుల సీజ్


రుద్రంపేటలో ఎరువుల దుకాణంలో బిల్లులు పరిశీలిస్తున్న ఏడీఏ వెంకట్రాముడు, ఏవో వెంకటకుమార్

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లా వ్యవసా యశాఖ డివిజన్ తనిఖీ బృందా లను నియమిం చింది. అనంత పురం వ్యవ సాయ సబ్ డివి జన్‌కు గుత్తి డివిజన్ ఏడీఏ వెంకట్రాముడును నియమించారు. అందులో భాగంగా అనంతపురం గ్రామీణం ఏవో వెంకట్‌కుమార్‌తో కలిసి అనంతపురం నగర పరిధిలోని ఎరువులు, పురుగు మందులు దుకాణాలను ఏడీఏ తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, లైసెన్సులు, రికార్డులు కంపెనీ ‘0’ ఫారం, తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. నగరంలో ఐదు దుకాణాలు తనిఖీలు చేయగా రెండింటిలో లైసెన్సులో ‘0’ ఫారం లేక పోవడంతో రూ.3.05 లక్షల విలువైన రసాయన ఎరువులు, నీళ్ల మందును సీజ్ చేశారు. రుద్రంపేట కూడలిలో న్యాశ్రీ నివాస ఫర్టిలైజర్ దుకాణంలో రాయల్ ఆగ్రో లైఫ్ సైన్స్ కంపెనీకి చెందిన రూ.97,272 విలువైన హై-జింక్ 1.2 మెట్రిక్ టన్నులు రసాయన ఎరువులు, గుత్తిరోడ్డులోని ఉమా గోదాములో ఉన్న ఫార్మ్‌మాట్రిన్ కంపెనీకి చెందిన ఫోర్ఎస్ నీళ్ల మందు రూ.2.08 లక్షలు విలువైన 220 లీటర్లు సీజ్ చేశామని, అందుకు సంబంధించిన రికార్డులు చూపించే వరకు అనుమతి లేకుండా ఎరువులు, మందులు అమ్మకూడ దని ఏడీఏ వెంకట్రాముడు తెలిపారు.

(c) eenadu

హిందూపురం
• హిందూపురం • పెనుకొండ • మడకశిర

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కందుల దుర్గేష్, తదితరులు

లేపాక్షి పుస్తకావిష్కరణ

లేపాక్షి, న్యూస్‌టుడే: చరిత్రకారుడు మైనాస్వామి రాసిన 'ఆర్కిటెక్చర్ అండ్ ఆర్ట్ ఆఫ్ విజయనగర లేపాక్షి-కసాపురం' ఆంగ్ల పుస్తకాన్ని గురువారం మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. పుస్తకంలో లేపాక్షిలోని చిత్రకళలు, శిల్పాల గురించి మైనాస్వామి ఎంతో చక్కగా రాశాడని ఆయన్ను అభినందించారు. భవిష్యత్తులో పర్యాటకంపై మరిన్ని పుస్తకాలు రాయాలని పేర్కొన్నారు.

స్తంభానికి విద్యుత్తు సరఫరా..

సోమందేపల్లి, న్యూస్‌టుడే: స్థానిక అంబేడ్కర్ నగర్ కాలనీలో ఒక విద్యుత్తు స్తంభానికి గురువారం రాత్రి 9 గంటలకు ఒక్కసారిగా విద్యుత్తు సరఫరా కావడంతో స్థానికులు గుర్తించి భయాందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని 'న్యూస్‌టుడే' సోమందేపల్లి లైన్‌మెన్ సూర్యనారాయణ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించారు. జూనియర్ లైన్‌మెన్ బాబునాయక్‌తో కలిసి తీగలకు మరమ్మతులు చేసి, సమస్య పరిష్కరించారు.

తీగలను సరిచేస్తున్న సిబ్బంది బాబునాయక్

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 91548 46650
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

సమస్య: పట్టణంలోని పెనుకొండ రోడ్డు నుంచి శ్రీనివాసథియేటర్ వెళ్లే రహదారిలోని కాలువలో చెత్త పేరుకుపోయింది. **-నటరాజ్**
సమాధానం: కార్మికులను పంపి శుభ్రం చేయిస్తా. **-శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, హిందూపురం.**
సమస్య: ఎస్.రాయాపురం ఎస్సీ కాలనీలో మురుగు ప్రవహిస్తోంది. **-గోవిందప్ప**
సమాధానం: హరితరాయబారులతో తొలగిస్తాం. **-రాధమ్మ, సర్పంచి, ఎస్.రాయాపురం**
సమస్య: హెచ్‌గొల్లహట్టిలో వీధి దీపాలు లేక అంధకారంలో ఉంటున్నాం. **-జయలక్ష్మి**
సమాధానం: వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. **-గౌరమ్మ, సర్పంచి, కరికెర**

-న్యూస్‌టుడే, హిందూపురం అర్బన్, గుడిబండ

సమస్య: ముద్దిరెడ్డిపల్లిలో 37, 38వ వార్డుల్లో పది రోజులకోసారి తాగునీరు సరఫరా చేస్తున్నారు. ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. **-నరసింహులు**
సమాధానం: నీటి విభాగం అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాను. **-మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్**

-న్యూస్‌టుడే, హిందూపురం గ్రామీణం

ఇంటి బిల్లులకు ఎదురుచూపులు

• వైకాపా ప్రభుత్వంలో లబ్ధిదారులకు నిరాశ
• ఆశలన్నీ కూటమి ప్రభుత్వం పైనే..

పరిగి, లేపాక్షి, న్యూస్‌టుడే: 2018లో తెదేపా ప్రభుత్వం ఎన్టీఆర్ గృహకల్ప పథకం కింద పక్కా గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులు పెండింగ్ బకాయి బిల్లుల కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం లబ్ధిదారులకు చెల్లించాల్సిన బకాయిల గురించి ఏ మాత్రం పట్టించుకోలేదు. దీంతో ఐదేళ్లుగా లబ్ధిదారులు బకాయి బిల్లుల కోసం ఎదురు చూపులు చూసిన నిరాశే ఎదురైంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వమైనా బిల్లులు చెల్లించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

బకాయిలు ఇలా....

◆ పరిగి మండల వ్యాప్తంగా 1164 పక్కా గృహాలు మంజూరయ్యాయి. వాటిలో 403 నిర్మాణ దశలో ఉండగా 392 టాప్ లెవెల్ వరకు వచ్చి ఆగిపోయాయి. మొత్తం బిల్లులు రూ.5.39కోట్లు మంజూరు కాగా రూ.4.42కోట్లు నిధులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రూ.96లక్షలు బకాయిలు లబ్ధిదారులకు చెల్లించాల్సి ఉంది.

◆ లేపాక్షి మండలంలో 1236 పక్కాగృహాలు మంజూరు కాగా వాటిలో 526 టాప్ లెవెల్ వరకు రాగ, 289 పూర్తి అయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. మొత్తం రూ.10.83 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉండగా, రూ.9.31కోట్లు చెల్లించారు. మిగిలిన రూ.1.51 కోట్లు బకాయిలు రావాల్సి ఉంది.

పరిగిలోని హౌసింగ్ కార్యాలయం

రూ.40వేల వరకు రావాల్సి ఉంది

ఎన్టీఆర్ గృహకల్ప పథకం కింద బయట వ్యక్తుల నుంచి అప్పులు చేసి ఇల్లు నిర్మించుకున్నాను. రూ.40వేలు వరకు బిల్లులు రావాల్సి ఉండగా వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి హౌసింగ్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా బిల్లులు మాత్రం మంజూరు కాలేదు. దీంతో అప్పునకు వడ్డీలు కట్టలేక పోతున్నాం. ప్రస్తుతం కూటమి ప్రభుత్వమైనా బకాయి బిల్లులు చెల్లిస్తే చాలు. **-రత్నమ్మ, పరిగి**

ఉన్నతాధికారులకు నివేదించాం

ఎన్టీఆర్ గృహకల్ప పథకంలో లబ్ధిదారులకు చెల్లించాల్సిన పెండింగ్ నిధులు మంజూరు కోసం హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరైన వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేస్తాం.
-సునీత, నరేష్, హౌసింగ్ ఏఈలు, పరిగి, లేపాక్షి

దినచర్యలో భాగం.. గ్రంథాలయ సందర్శనం

గోరంట్ల, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి దినచర్యలో భాగంగా గ్రంథాలయాలను సందర్శించడం అలవాటు చేసుకోవాలని అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆదినారాయణ పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం అధికారి శ్రీధర్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కమిటీ గౌరవాధ్యక్షుడు శ్రీరాములు, ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, కార్యదర్శి శ్రీనివాసగుప్తా, సభ్యులు, విశ్రాంత ఎంఈవోలు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బహుమతులతో విద్యార్థులు

పెనుకొండ : గ్రంథాలయం విజ్ఞాన భాండాగారమని, విద్యార్థులు ప్రతిరోజు గ్రంథాలయానికి వెళ్లి విజ్ఞాన సముపార్జనతో ఉన్నతంగా ఎదగాలని ఎంఈవో సుధాకర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో 58వ వారోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి మహబూబ్‌బాషా, విశ్రాంత ఉపాధ్యాయుడు షమీవుల్లా, ఉపాధ్యాయులు ఉపేంద్ర, నబి, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

తాగునీటి పైపునకు మరమ్మతు

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: జక్కేపల్లి గ్రామంలో ప్రధాన రహదారి పక్కన పగిలిన తాగునీటి పైపు ద్వారా వృధాగా వెళ్తున్న నీటిని అరికట్టారు. ఈనాడులో 'తాగునీరు వృధా' శీర్షికన చిత్రకథనం వెలువడంతో పంచాయతీ కార్యదర్శి జయంత్‌రెడ్డి స్పందించి మరమ్మతు చేయించారు.

స్పందనకు వందనం

కాలనీ ప్రజల సంతోషం

హిందూపురం అర్బన్ : పట్టణంలో నెలకొన్న సమస్యలను 'ఈనాడు'లో 'అపరిశుభ్రతను పట్టించుకోరా' శీర్షికన గురువారం ప్రచురితం కాగా సంబంధిత అధికారులు స్పందించారు. ఉదయమే మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ పారిశుద్ధ్య కార్మికులను పంపి లక్ష్మీపురం రామాలయ మందిరం వెనుక కృష్ణారెడ్డిపేట కాలనీలో రాత్రి బస్‌షెల్టర్ పక్కన ఉన్న పిచ్చిమొక్కలు, వ్యర్థపదార్థాలు తొలగింపజేశారు.

కార్యకర్త కుటుంబానికి అండగా తెదేపా

పెద్దరెడ్డిపల్లి , (పరిగి), న్యూస్‌టుడే: పెద్దరెడ్డిపల్లికి చెందిన తెదేపా కార్యకర్త డి.ఎన్.నాగరాజు ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. తెదేపా సభ్యుడిగా ఉన్న నాగరాజు కుటుంబానికి పార్టీ నుంచి ప్రమాద బీమా నిధి ద్వారా రూ.5లక్షల చెక్కును గురువారం సాయంత్రం ఆయన కుటుంబ సభ్యులకు మంత్రి సవిత అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమం, భద్రతే తెలుగు దేశం పార్టీ ధ్యేయమని అన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగరాజు కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న మంత్రి సవిత

హిందూపురం అర్బన్ : తెదేపా ఎల్లప్పుడు ప్రజలకు అండగా ఉంటుందని మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేశ్‌కుమార్ పేర్కొన్నారు పట్టణంలోని దండు రోడ్డులో నివసిస్తున్న ఆదిలక్ష్మమ్మ ప్రమాదంలో ఆకస్మికంగా మృతిచెందింది. రూ.5లక్షల ప్రమాద బీమా చెక్కును వారి కుటుంబ సభ్యులకు గురువారం మున్సిపల్ ఛైర్మన్, తెదేపా పట్టణాధ్యక్షుడు వెంకటేశ్ ఆ కుటుంబానికి అందజేశారు.

'బాలయ్యపై తప్పుగా మాట్లాడితే సహించం'

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: పబ్లిసిటీ కోసం మా నాయకుడు ఎమ్మెల్యే బాలకృష్ణపై అవాకులు, చవాకులు పేలితే ఊరుకునేది లేదని, ప్రతి చర్యలు తప్పవని తెదేపా మహిళా విభాగం నాయకురాళ్లు వైకాపా సమన్వయకర్త దీపికాపై మండిపడ్డారు. వారు గురువారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దీపికా, ఆమె భర్త వేణురెడ్డి వస్తే బాలయ్య హయాంలో జరిగిన అభివృద్ధి చూపిస్తామని, వైకాపా ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని వారు చూపగలరా అని నిలదీశారు. పార్టీ అధికారంలో ఉన్న సమయంలో 8 నెలల కాలంలోనే ఇన్‌ఛార్జిగా వేణురెడ్డి దోపిడీని గుర్తుకు తెచ్చుకోవాలని సూచించారు. ఇసుక దోపిడీ, అక్రమ లేఅవుట్లు, స్థలాల అమ్మకం పేరుతో సొమ్ము తీసుకొని ఎగ్గొట్టడం, ఇప్పటికీ అప్పుల వాళ్లు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని ఆరోపించారు. స్థాయిని మరిచి బాలకృష్ణపై ఏదీ పడితే అది మాట్లాడితే బుద్ధి చెబుతామని హెచ్చరించారు. బాలకృష్ణను స్థానికేతరుడు అంటున్న మీరు ఎక్కడి వారు అని, ఇప్పటికీ బెంగళూరులో ఉండటం లేదా, తెలుగు కూడా రాని మీరు ఇలా ఎలా మాట్లాడుతారని ప్రశ్నించారు. సమావేశంలో నాయకురాళ్లు రామాంజినమ్మ, శ్రీదేవి, మాలక్క తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీదేవి, చిత్రంలో మహిళలు

భక్తిశ్రద్ధలతో పారాయణం

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని పులమతి రోడ్డులో ఉన్న రాజరాజేశ్వరి ఆలయంలో గురువారం రాత్రి శ్రీ లలిత పాదయాత్ర బృందం నిర్వహకుడు వైటీపీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రాజరాజేశ్వరి మహిళా మండలి విష్ణు, లలితాసహస్రనామ పారాయణం చేశారు. అనంతరం పాల్గొన్న మహిళలందరికీ పసుపు, కుంకుమ, గాజులు పంపిణీ చేశారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

మడకశిర, న్యూస్‌టుడే : పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ నాగరాజు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామిలు హాజరవుతారు. నియోజకవర్గంలోని 5 మండలాల పరిధిలో గల ప్రజలు వారి సమస్యలను అర్జీల రూపంలో విన్నవించుకుంటే సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక

గోరంట్ల: పాలసముద్రం ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న లిఖిత, చైతన్యకుమార్‌రెడ్డిలు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అండర్-14 బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం రామాంజనేయులు యాదవ్ పేర్కొన్నారు. విజేత విద్యార్థులను పాఠశాలలో గురువారం అభినందన సభ ఏర్పాటుచేశారు.

ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: కె.బసవనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రవీంద్రరెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19న అనంతపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడ పోటీల్లో పాల్గొని అన్ని విభాగాల్లో ప్రతిభ చూపి రాణించిన 9వతరగతి చదువుతున్న బి.పవిత్ర అండర్-14 విభాగంలో జావెలిన్, ప్రదీప్ సాఫ్ట్‌బాల్ రాష్ట్రపోటీలకు అర్హత సాధించారు. పీడీలు సురేష్‌కుమార్, అరుణ, ఉపాధ్యాయులు అభినందించారు.

వాలీబాల్‌కు మరో ఇద్దరు..

లేపాక్షి, న్యూస్‌టుడే: స్థానిక వివేకానంద ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న మోహన్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు ధనశ్రీ, వ్యాయామోపాధ్యాయుడు మహేష్‌బాబు తెలిపారు. త్వరలో నెల్లూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థి పాల్గొననున్నట్లు వారు వివరించారు. **పెనుకొండ :** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదోతరగతి చదువుతున్న స్కంద రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం రాఘవయ్య పేర్కొన్నారు. గురువారం క్రీడాకారుడికి పీడీ నాగభూషణ క్రీడా దుస్తులు బహూకరించారు. హెచ్ఎం మాట్లాడుతూ డిసెంబరు 6, 7, 8 తేదీల్లో నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాఘవేంద్రుడికి లక్ష దీపోత్సవం

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని కోటలో ఉన్న రాఘవేంద్ర బృందావనం మృతికా సన్నిదానంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికలో ఆలయ అర్చకుడు కౌశిక్ కార్తిక దీపాలు ఏవిధంగా వెలిగించాలి, దాని విశిష్టతను తెలియజేస్తూ వేద పండితులు మంత్రాలు వల్లిస్తుండగా పెద్దసంఖ్యలో బ్రాహ్మణ మహిళలు సంప్రదాయ పద్ధతిలో కార్తిక దీపాలు వెలిగించడం ప్రత్యేకత. అనంతరం రాఘవేంద్రుడికి, యోగానరసింహుడికి సప్తమ హారతులు సమర్పించారు. అదేవిధంగా ధర్మపురంలో కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో లక్షదీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేశ్‌కుమార్, రాఘవేంద్ర స్వామి ఆలయ అధ్యక్షుడు పాండురంగారావు, మహిళలు పాల్గొన్నారు.

కల్యాణవెంకటేశ్వరాలయంలో..

అమరాపురం, న్యూస్ టుడే: గౌడన కుంట కెంచమాంభదేవి ఆలయంలో గురువారం రాత్రి కార్తిక మాసం ఆఖరు రోజు ఘనంగా పూజలు నిర్వహించారు. అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించారు. పాల్గొన్న భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

అన్ని రంగాల్లో రాణించి గుర్తింపు తీసుకురావాలి

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి విద్యతో పాటు క్రీడలు, కళలు, ఆధ్యాత్మిక రంగాల్లో రాణించి సమాజంలో మంచి గుర్తింపు తీసుకురావాలని అవోపా సంఘం అధ్యక్షుడు ద్వారకనాథ్ పేర్కొన్నారు. పట్టణంలోని డీబీ కాలనీలో ఉన్న ప్రసన్నవేణి వేదిక మాలికలో భగవద్గీత పఠనంలో శిక్షణ పొంది గతనెలలో నిర్వహించిన ఇరు రాష్ట్రాల్లో పాఠశాల స్థాయి పోటీల్లో మొదటి స్థానం సాధించిన చిన్నారి సుంకు తారుష్‌ను అవోపా సంఘం సభ్యులు గురువారం సన్మానించారు. కార్యక్రమంలో అవోపా సంఘం కార్యదర్శి శ్రీనివాసమూర్తి, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర ప్రసాద్, నాగరాజు, ఉపాధ్యాయుడు చంద్రమౌళీశ్వర్‌లు పాల్గొన్నారు.

చిన్నారిని సన్మానిస్తున్న 'పురం' అవోపా సంఘం సభ్యులు

కూలిన ప్రహరీ.. రక్షణ కరవు

పెద్దమంతూరులో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రహరీ కూలిపోవడంతో అందులో పశువులు సంచరిస్తున్నాయి. పాఠశాల ఆవరణలో ఉన్న మొక్కలు నాశనమవుతున్నాయని స్థానికులు ఆరోపించారు. ఈ విషయంపై ఎంఈవో జయభాస్కర్ వివరణ కోరగా మండల వ్యాప్తంగా 2 వేల మీటర్ల వరకు ప్రహరీల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు చెప్పారు. **-న్యూస్‌టుడే, రొద్దం**

సాయి మార్గం అనుసరణీయం

పెనుకొండ, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి బాబా సేవామార్గం, ప్రేమతత్వం చిరకాలం అనుసరణీయమని భవిష్యత్తు తరాలకు మార్గదర్శకమని వక్తలు కొనియాడారు. గురువారం స్థాయిన పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జయప్ప ఆధ్వర్యంలో సత్యసాయి శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాలలో సాయి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు సేవాభావాన్ని అనుసరించాలని, తల్లిదండ్రుల పట్ల వినయ విధేయలతో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీసత్యసాయిసేవాసమితి కన్వీనర్ శంకర

కాలువ ఇలా.. మురుగు పారేదెలా?

పరిగిలోని మడకశిర ప్రధాన రహదారి పక్కనే ఉన్న కాలువ పిచ్చి మొక్కలు, కలుపుతో నిండిపోయింది. దీంతో మురుగు వెళ్లేందుకు ఆస్కారం లేకుండాపోయిందని ఆ ప్రాంతం వాసులు వాపోతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి నారాయణ దృష్టికి తీసుకెళ్లగా రేపటిలోగా శుభ్రం చేయిస్తానని తెలిపారు. **-న్యూస్‌టుడే, పరిగి**

నీరు పట్టుకొనే చోటే చెత్త..

ఉక్కుడం రంగాపురంలో తాగునీటి ట్యాంకు చుట్టూ అపరిశుభ్రత నెలకొంది. ఇళ్లలోని చెత్తాచెదారం ట్యాంకు పక్కనే వేయడంతో దిబ్బలాగా మారింది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి జయంత్‌రెడ్డి మాట్లాడుతూ హరితరాయబారుల ద్వారా చెత్తదిబ్బను తొలగిస్తామని తెలిపారు. **-న్యూస్‌టుడే, మడకశిర గ్రామీణం**

అంగన్‌వాడీ కేంద్రాలు.. పిచ్చిమొక్కలతో అవస్థలు

స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న రెండు అంగన్‌వాడీ కేంద్రాల నడుమ పిచ్చిమొక్కలు, గడ్డి ఏపుగా పెరిగిపోవడంతో చిన్నారులు, వారి తల్లులు ఇబ్బందులు పడుతున్నారు. వీటి కారణంగా ఆవరణ మంతా అపరిశుభ్రంగా మారింది. ఈ విషయంపై ఐసీడీఎస్ మండల పర్యవేక్షకులు శుభారాణి మాట్లాడుతూ వెంటనే పరిశీలించి, తగిన చర్యలు చేపడతామన్నారు. **-న్యూస్‌టుడే, సోమందేపల్లి.**

ట్యాంకు శిథిలం.. సమస్య పదిలం

ఎన్.ఆర్.రొప్పంలో నిర్మించిన నీటి ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. దీంతో నీరు నింపి సరఫరా చేయలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో గ్రామంలో నీటికి విద్యుత్తు లేని సమయంలో ఇబ్బందిగా మారింది. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరి మాట్లాడుతూ నీటి ట్యాంకు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. **-న్యూస్‌టుడే, గుడిబండ**

రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా విభాగిని

బెంగళూరు రహదారి నుంచి కె.బసవనపల్లి వీవర్స్ కాలనీ కూడలి మీదుగా ప్రారంభమయ్యే బైపాస్‌లో ఉన్న విభాగిని (డివైడర్)ని పూర్తిస్థాయిలో నిర్మించకపోవడంతో వేగంగా వెళ్లే వాహనాలు అదుపుతప్పుతున్నాయి. ఈ విషయమై ఎంపీడీవో దామోదరమ్మ మాట్లాడుతూ సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. **-న్యూస్‌టుడే, హిందూపురం గ్రామీణం**

22న కంటి ఉచిత వైద్య శిబిరం

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: సత్యసాయిబాబా శతజయంతిని పురస్కరించుకుని పట్టణంలోని ఆర్పీజీటీ రోడ్డులో ఉన్న సాయికృష్ణ నేత్రాలయంలో ఈనెల 22న (శనివారం) ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డా.జింకా కృష్ణమోహన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, కంటిఅద్దాలు, శస్త్రచికిత్సలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. పట్టణంలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాయితీతో ఉలవల పంపిణీ

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో ప్రత్యామ్నాయ పంటగా సాగు కోసం రైతులకు ఉలవల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు 1750 క్వింటాళ్ల ఉలవలు సరఫరా అయినట్లు ఏఓ తిమ్మప్ప తెలిపారు. 80 శాతం రాయితీతో 10 కేజీల బ్యాగును రూ.112లకు అందిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన రైతులు ఆయా రైతు సేవాకేంద్రాల్లో పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ తీసుకువెళ్లి ఉలవలు తీసుకోవచ్చని తెలిపారు.

గ్రామీణ ఆరోగ్య కేంద్రాలకు మహర్దశ

మడకశిర మండలం భక్తరపల్లిలో పిల్లర్లకే పరిమితమై..

కూటమి ప్రభుత్వం చొరవతో నిధుల విడుదల

మడకశిర గ్రామీణం, అమరాపురం, న్యూస్ టుడే: గ్రామస్థాయిలోనే రోగుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని సకాలంలో చికిత్సలు అందేలా గత వైకాపా హయాంలో నియోజకవర్గ వ్యాప్తంగా 72 సచివాలయాల పరిధిలో విలేజ్ హెల్త్ క్లినిక్(గ్రామీణ ఆరోగ్య కేంద్రం)ల నిర్మాణం చేపట్టారు. అప్పట్లో సిమెంటులో అవకతవకలు చోటుచేసుకోవడంతో పనులు ముందుకు సాగక ఎక్కడికక్కడే ఆగిపోయాయి. నిర్మించిన వాటికి బిల్లులు కూడా మంజూరు కాక గుత్తేదారులు అవస్థలు పడాల్సి వచ్చింది. ఐదేళ్లు పూర్తయినా నేటికీ వాటి నిర్మాణాలు అతీగతీ లేకుండాపోయింది. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్మాణాలకు వడివడిగా అడుగులు పడుతున్నాయి.

రూ.5.34 కోట్లతో నిర్మాణం పనులు

ఎన్ఆర్ఈజీఎస్, 15వ ఆర్థిక నిధులు, పీఎం అభిమ్ పథకాల ద్వారా వీటి నిర్మాణాలు చేపట్టనున్నారు. వివిధ దశలలో ఆగిన వాటికి నిధుల కోసం అంచనావేసి ప్రతిపాదనలు పంపగా ఒక్కో భవనానికి రూ.36లక్షల నుంచి రూ.42 లక్షల వరకు మంజూరయ్యాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 22 హెల్త్ క్లినిక్‌ల పనులకు గాను రూ.5.34 కోట్లు మంజూరయ్యాయి.

మార్చిలోపు భవనాల నిర్మాణాలు పూర్తి

నిధులు మంజూరయ్యాయి. ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు పూర్తి చేస్తాం.
- వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ డీఈ, మడకశిర

ఎక్కడెక్కడ ఎలా ఉన్నాయంటే..

● మడకశిర మండలంలో 18కి గాను రెండు పూర్తయ్యాయి. భక్తరపల్లిలో పిల్లర్లకే పరిమితమైంది. సొంత భవనం లేకపోవడంతో నాలుగేళ్లుగా భక్తరపల్లి ఆలయ సముదాయ భవనంలో క్లినిక్ నిర్వహించారు. ఇటీవల పాత కమ్యూనిటీ భవనంలోకి మార్చారు. గౌడనహళ్లిలో పాత ఆర్‌ఎస్‌కే భవనంలో చిన్నగదిలో నిర్వహిస్తున్నారు. మందుల నిల్వలకే ఈ గది సరిపోయింది.

● అమరాపురం మండలంలో 15 హెల్త్ క్లినిక్‌లకు గాను ఒక్కటీ పూర్తికాలేదు. ప్రైవేట్ భవనాల్లో అసౌకర్యాల నడుమ నిర్వహిస్తున్నారు. ● అగళి మండలంలో 13లో ఒకటి మాత్రమే పూర్తయ్యింది. మిగతావి వివిధ దశలలో ఉన్నాయి. సొంత భవనం లేక హళ్లీకెర, మధూడి పాత స్కూల్ భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఇనగలూరులో పాతగ్రామ పంచాయతీ భవనంలో చిన్న గదిలో నిర్వహిస్తున్నారు. ● గుడిబండ మండలంలో 16 విలేజ్‌హెల్త్‌లకు గాను రాళ్లపల్లిలో మాత్రమే పూర్తయ్యింది. మిగతావి వివిధ దశలలో ఉన్నాయి.

కాలువల నిర్మాణం.. తొలగనున్న సమస్య

సోమందేపల్లి, న్యూస్ టుడే: సోమందేపల్లిలోని సాయినగర్-జగ్జీవన్‌రామ్ నగర్ కాలనీ ప్రజల మురుగు సమస్య పరిష్కారానికి ఎట్టకేలకు అధికారులు, తెదేపా నాయకులు చర్యలు చేపట్టారు. ఈ రెండు కాలనీలకు సంబంధించిన పలువురు ప్రజల గృహాల నుంచి మురుగు నీరు పాత జాతీయ రహదారిపైకి వస్తుండటంతో ఎప్పుడే ప్రమాదం చోటు చేసుకొంటుందోనని కొన్నేళ్లుగా వాహనాల చోదకులు, పాదచారులు భయాందోళనకు గురయ్యారు. ఇక్కడి మురుగు సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయంపై 'ఈనాడు'లో పలుమార్లు చిత్ర కథనాలు ప్రచురితమైన సంగతి తెలిసిందే. కాలనీ వాసుల అవస్థలను తెదేపా నాయకులు మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లడంతో కాలువ నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే అక్కడ తవ్విన మట్టిని సగం వరకు పాత జాతీయ రహదారిపైకి వేయడం వల్ల ప్రస్తుతం ఒక వరుస రహదారిగా మారడంతో వాహనాల రాకపోకల సమయంలో పాదచారులు భయపడుతున్నారు. కొంతమేర మట్టిని వెంటనే తొలగించాలని పలువురు కోరుతున్నారు.

సాయినగర్-జగ్జీవన్‌రామ్ నగర్‌ల వద్ద కాలువ నిర్మాణం

(c) eenadu

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం • కదిరి •రాప్తాడు

రోడ్డును పరిశీలిస్తున్న మంత్రి జనార్దన్‌రెడ్డి

పనులు నాణ్యతగా చేపట్టాలి

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని.. అధికారులు పనులు నాణ్యతగా ఉండేలా చూడాలని మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి తెలిపారు. గురువారం ధర్మవరం నుంచి పుట్టపర్తి, కణుతూరు వెళ్లే మార్గాల్లో జరుగుతున్న రోడ్డు పనులను మంత్రి పరిశీలించారు. నాణ్యతపై ఆరా తీశారు. మంత్రి వెంట ర.భ.శా డీఈ నాగపుల్లంరావు, జేఈ హారికా తదితరులు ఉన్నారు.

ధర్మవరంలో బాబా శతజయంతి వేడుకలు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని లయోలా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సాయిబాబా శతజయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం సాయిబాబా చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. బాబా జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా రేవంత్‌కుమార్, ధనుష్‌కుమార్, జాహ్నవి, బాలవికాస్ నిలిచారు. వీరికి పాఠశాల ఛైర్మన్ శంకర్‌నాయుడు బహుమతులను అందజేశారు.

బాబా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విద్యార్థులు, పాఠశాల యజమాన్యం

మేమున్నాం.. మీకు తోడుగా

పుట్టపర్తి: 80085 73039
కదిరి : 80085 73033
ధర్మవరం: 99596 98222

సమస్య: మామిళ్లపల్లిలో వ్యాపారం సాగించే కొంతమంది కోళ్ల వ్యర్థాలను, చెత్త చెదారాన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో నిల్వ చేసి నిప్పు పెట్టడంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, బాటసారులు ముక్కు మూసుకునే పరిస్థితి నెలకొంది. **- మస్తాన్, స్థానికుడు**

సమాధానం: కోళ్ల వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని నిల్వ చేయకుండా చర్యలు చేపడుతాం.
- అరుణ్, పంచాయతీ కార్యదర్శి

సమస్య: మండల కేంద్రంలో నాలుగు రోడ్ల కూడలిలో వాహనాల వేగాన్ని నియంత్రించడానికి వేగ నియంత్రికలు ఏర్పాటు చేయాలి.
- సంజీవ, స్థానికుడు

సమాధానం: వేగ నియంత్రికలు, ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం.
- జయచంద్ర, పంచాయతీ కార్యదర్శి
- న్యూస్‌టుడే, కనగానపల్లి

వెలగని దీపాలు.. వీధుల్లో చీకట్లు

రాత్రివేళ ప్రజల అవస్థలు

గాండ్లపెంటలో అంధకారం

కదిరి గ్రామీణం, గాండ్లపెంట, కదిరి పట్టణం: కదిరి డివిజన్ పరిధిలోని గ్రామాల్లో వీధి దీపాలు రాత్రివేళ పూర్తిస్థాయిలో వెలగడం లేదు. రాత్రివేళ అంధకారంలో బయటకు రావాలంటేనే జనం భయపడిపోతున్నారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో విద్యుత్తు ఆదాతో పాటు పంచాయతీలకు బిల్లుల భారం తగ్గించాలనే ఉద్దేశంతో ఎల్ఈడీ దీపాలను పంచాయతీలకు అందజేశారు. ఇవి రోజూ సాయంత్రం 6 నుంచి ఉదయం 6 గంటల వరకు వెలిగేలా స్తంభాలకు ఆటోమేటిక్ స్విచ్‌లు కూడా ఏర్పాటు చేశారు. చాలా గ్రామాల్లో దీపాల పర్యవేక్షణ, నిర్వహణ సరిగా చేయడం లేదు. వెలగని దీపాలను మార్చడంలో జాప్యం చేస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి.

కదిరి డివిజన్ పరిధిలో ఇలా..

మండలం	వీధి దీపాలు
కదిరి	2,270
గాండ్లపెంట	1,361
నల్లచెరువు	1,642
ఎన్పీకుంట	1,260
తలుపుల	2,505
తనకల్లు	3,426

అధికారుల నిర్లక్ష్యం

వీధి దీపాల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా చాలా గ్రామాల్లోని వీధులు అంధకారంలో ఉంటున్నాయి. పని చేయని దీపాల స్థానంలో కొత్త లైట్లు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు సిబ్బంది దృష్టికి తెచ్చినా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. చలికాలం కావడంతో సాయంత్రం 6 గంటలకే చీకటి పడి రహదారులు కనిపించక ఇళ్లకు వెళ్లే విద్యార్థులు, పట్టణ ప్రాంతాలకు వెళ్లిన ప్రజలు, పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారిపై గుంతలు కనబడక జారి కిందపడుతున్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తగిన చర్యలు తీసుకుంటాం

గ్రామాల్లో వీధి దీపాల నిర్వహణకు స్పష్టమైన చర్యలు చేపడతాం. అవసరమైన వాటికి మరమ్మతులు చేపట్టడంతో పాటు నూతన దీపాలు ఏర్పాటు చేసేలా ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో, పంచాయతీ అధికారులను ఆదేశిస్తాం. **- వెంకటరత్నం, ఇన్‌ఛార్జి డీఎల్‌పీవో, కదిరి డివిజన్**

అయ్యప్పలకు అన్నదానం

భోజనం వడ్డిస్తున్న గురుస్వామి విజయ్‌కుమార్, దాత రాజారెడ్డి

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని శిర్డీసాయి బాబా ఆలయ ఆవరణలో అయ్యప్ప మాలధారులకు అన్నదాన కార్యక్రమాన్ని గురువారం భాజపా జిల్లా కార్యదర్శి డోలా రాజారెడ్డి సహకారంతో గురుస్వామి పీజే విజయ్‌కుమార్ ప్రారంభించారు. అయ్యప్పలకు స్వయంగా వారు భోజనం వడ్డించారు. రోజూ మధ్యాహ్నం 1 గంట నుంచి 2 గంటల వరకు భోజన సౌకర్యం కల్పిస్తున్నామని, మాలధారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని దాత పేర్కొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు సూర్యప్రకాష్, వీరనారాయణ పాల్గొన్నారు.

ఎల్ఎస్ఆర్ అనుమతి తప్పనిసరి

నంబులపూలకుంట: లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని తహసీల్దార్ దేవేంద్రనాయక్, డిప్యూటీ ఎంపీడీవో మాధవరెడ్డి లబ్ధిదారులకు సూచించారు. ఎన్పీకుంట మండల కేంద్రంలోని సర్వేనంబర్లు 274-2, 574-1, 643లో1, 3సీ, 3డీ, 3ఈ, 573, 678, 641-1సీ, 716, 276, 277, 278, 712 లలో అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్లను గురువారం వారు పరిశీలించారు. అనుమతులు లేని లేఅవుట్లలో భవన నిర్మాణాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు

ధర్మవరం, న్యూస్‌టుడే: జాతీయ హస్వదృష్టి వారోత్సవాలు పురస్కరించుకొని గురువారం పట్టణంలోని మధుకంటి ఆసుపత్రిలో విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని జిల్లా అంధత్వ నివారణ విశ్రాంత అధికారి డా.నరసింహులు నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. విద్యార్థులు టీవీని దగ్గరగా కూర్చొని చూడరాదన్నారు. సెల్‌ఫోన్‌ను అధిక సమయం పిల్లలు వీక్షించకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు.

సెంట్రింగ్ కడ్డీల తొలగింపు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోకి రాకపోకలు సాగించే ప్రధాన రహదారిపై సెంట్రింగ్ కడ్డీలు ప్రమాదకరంగా ఉన్నాయి. వంతెన పనులు ఆగిపోవడంతో కడ్డీలను తీసుకెళ్లకుండా రోడ్డుపైనే వదిలేశారు. అవి చోదకులకు తగిలితే ప్రాణాపాయం. దీనిపై ఈ నెల 19న ‘కడ్డీలు తగిలితే.. ప్రాణాలు హరీ’ శీర్షికన ‘ఈనాడు’లో కథనం ప్రచురితమైంది. గురువారం ర.భ.శాఖాధికారులు స్పందించి కడ్డీలను పూర్తిగా తొలగించేశారు. దీంతో వాహనాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రాకపోకలు సాఫీగా సాగిపోతున్నాయి.

సీసీ రోడ్డు నిర్మించరూ..

ధర్మవరం పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం పక్కన సాయినగర్‌లో నేటికీ మట్టిరోడ్డే ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి కొట్టుకుపోయి రాళ్లుతేలి రహదారి గుంతలు పడింది. ఈ మార్గంలో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించి సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ధర్మవరం**

వంతెనపై రక్షణ చర్యలు శూన్యం

ధర్మవరం మండలం మోటుమర్ల వద్ద వంతెనపై ఇరువైపులా రక్షణ దిమ్మెలు లేకపోవడంతో ప్రమాదకరంగా ఉంది. ధర్మవరం నుంచి పుట్టపర్తి వెళ్లే ప్రధాన మార్గంలో ఉన్న మోటుమర్ల వంతెన వద్ద వాహనదారులు ఏమాత్రం ఏమరుపాటుగా వెళ్లినా కిందపడే ప్రమాదం పొంచి ఉంది. ఇరువైపులా రక్షణ దిమ్మెలు ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ధర్మవరం**

జారి పడతారు జాగ్రత్త

కొత్తచెరువు ప్రధాన మరువ పారుతుండటంతో మహిళలు, పిల్లలు నీటిలో ఆడుతూ సందడి చేస్తున్నారు. కట్టపై అక్కడక్కడా పాచి ఏర్పడింది. మహిళలు, పిల్లలు ఏమాత్రం అజాగ్రత్తగా ఉండి జారిపడితే చెరువులో పడిపోయే ప్రమాదం ఉంది. రెవెన్యూ, పోలీసు అధికారులు చెరువు పరిసరాల్లో తగు జాగ్రత్త చర్యలు చేపట్టి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కొత్తచెరువు**

మురుగు తొక్కి పాఠశాలలోకి అడుగు

రామగిరి మండలం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఎంతోకాలంగా మురికి నీటి గుండా వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. సీసీ రోడ్డ పక్కన డ్రైనేజీ వ్యవస్థ లేక స్థానికులు వాడిన నీరు రోడ్డుపైకి వస్తోంది. ఆ నీరు చివరికి ప్రాథమిక పాఠశాల ప్రవేశ ద్వారం ముందు చేరి పాచిపట్టి రహదారి అస్తవ్యస్తంగా మారింది. విద్యార్థులు పాఠశాలలోకి వెళ్లాలంటే మురుగులో అడుగేసి జారి పడుతున్నారు. **- న్యూస్‌టుడే, రామగిరి**

స్థల వివాదంపై ఘర్షణ.. ఇద్దరికి గాయాలు

రామగిరి, న్యూస్‌టుడే : రామగిరి మండల పరిధిలోని పేరూరు గ్రామంలో స్థల వివాదంపై బంధువుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఘర్షణలో యువకులు రంజిత్, క్రాంతి ఇద్దరి తలలకు గాయాలైనట్లు గ్రామస్థులు తెలిపారు. వీరిని పేరూరులోని ఆర్ఎంపీ వైద్యుడు వద్ద చికిత్స చేసి తలకు కుట్లు వేసినట్లు తెలిపారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో లైన్‌మెన్‌కు..

కనగానపల్లి, న్యూస్‌టుడే: జూనియర్ లైన్‌మెన్‌కు గాయాలైన ఘటన కనగానపల్లి మండలంలోని చంద్రచర్లలో గురువారం చోటు చేసుకుంది. మండలంలోని మామిళ్లపల్లికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి చంద్రచర్ల ఫీడర్ ఆధీనంలో జూనియర్ లైన్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. విద్యుత్తు మోటార్లకు విద్యుత్తు సరఫరా కాకపోవడంతో తీగలను మరమ్మతు చేయడానికి స్తంభం ఎక్కి, తీగలను సరిచేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై స్తంభం నుంచి కిందకు పడి గాయపడ్డాడు. ధర్మవరంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి..

కనగానపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని భానుకోట పుట్టకనుమ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడినట్లు స్థానికులు పేర్కొన్నారు. ధర్మవరానికి చెందిన చంద్రనాయక్ పని నిమిత్తం ఉదయం కారులో కళ్యాణదుర్గానికి వెళ్లాడు. పని ముగించుకొని తిరిగి స్వగ్రామానికి వెళుతున్న సమయంలో భానుకోట పుట్టకనుమ వద్దకు రాగానే వాహన వేగాన్ని అదుపు చేయలేకపోవడంతో రోడ్డు అంచుభాగంలో పల్టీలు కొట్టుకుంటూ పడిపోయింది. చంద్రనాయక్ గాయపడటంతో ధర్మవరం ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

ఆటో ఢీకొని నలుగురికి..

నల్లమాడ, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కొండ కింద తండా సమీపంలో ద్విచక్రవాహనం - ఆటో ఢీకొని నలుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. రెడ్డిపల్లి నుంచి పిల్లలతో బైకు మీద వెళ్తున్న శ్రీనివాసులునాయక్, కూలీలు వెళ్తున్న ఆటో మలుపు వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కొండ కింద తండాకు చెందిన శ్రీనివాసులు నాయక్(38), సి.కొత్తపల్లికి చెందిన ఎ.లక్ష్మీదేవి(44), గోపేపల్లికి చెందిన జి.యశోధ(36), ఎద్దులవాండ్లపల్లి చెందిన జె.అశోక్(22)కు తీవ్రగాయాలయ్యాయి. వారందరినీ నల్లమాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

క్రికెట్ పోటీల్లో ధర్మవరం జట్టు విజయం

ధర్మవరం న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన తెదేపా నాయకుడు, పట్టుచీరల వ్యాపారి సందా రాఘవ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని గురువారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తపేట కూడలి వద్ద రక్తదాన, కంటి వైద్య శిబిరాలు నిర్వహించారు. 50 మంది రక్తదానం చేశారు. తెదేపా శ్రేణులు, చేనేతలు గజమాలతో సత్కరించారు. సందా రాఘవ కేక్ కోసి పంచిపెట్టారు. అన్నదానం చేశారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. విజేతగా నిలిచిన ధర్మవరం జట్టుకు రూ.10వేల నగదు బహుమతి, కప్పు, రన్నర్స్‌గా నిలిచిన గొట్లూరు జట్టుకు రూ.5 వేల నగదు, కప్పును అందజేశారు. కార్యక్రమంలో సందా రవీంద్ర, తెదేపా నాయకులు కొత్తపేట ఆది, జింకా పురుషోత్తం, నాగూర్ హుస్సేన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

విజేత జట్టుకు కప్పు, నగదు బహుమతి అందజేస్తున్న సందా రాఘవ

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

తనకల్లు, న్యూస్‌టుడే: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. తనకల్లు గ్రంథాలయంలో జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ప్రవీణ్, ఉపాధ్యాయులు హరిప్రసాద్ పాల్గొని మాట్లాడారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. గ్రంథాలయ అధికారి మస్తాన్‌వలి పాల్గొన్నారు.

ముదిగుబ్బ: ముదిగుబ్బ గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేసినట్లు గ్రంథాలయాధికారి బొజ్జేనాయక్ తెలిపారు.

ధర్మవరం పట్టణం: విద్యార్థులు పుస్తకాలతోపాటు పత్రికలు చదవాలని ఎంఈఓలు గోపాల్‌నాయక్, రాజేశ్వరి తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారి సౌభాగ్యవతి పాల్గొన్నారు.

నంబులపూలకుంట, గాండ్లపెంట: వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంపీడీవో పార్థసారథి, ఎంఈవో సుబ్బిరెడ్డి, గ్రంథాలయాధికారులు పరియాబాను, శాంతమ్మ, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

నల్లమాడ: స్థానిక గ్రంథాలయంలో నల్లమాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అధికారిణి శకుంతలబాయి బహుమతులు ప్రదానం చేశారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తనకల్లు: బహుమతులతో విద్యార్థులు, గ్రంథాలయ అధికారులు

‘ఉత్సవాల్లో భాగస్వామి కావడం అదృష్టం’

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగస్వామిని కావడం అదృష్టంగా భావిస్తున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. గురువారం ప్రశాంతినిలయంలో జరిగిన అంతర్జాతీయ యువజన సదస్సులో పాల్గొని, మహాసమాధిని దర్శించుకున్నారు. మంత్రులు సవిత, సత్యకుమార్‌తో కలిసి ఆయన ఏర్పాట్లను పరిశీలించారు.

లేఅవుట్లు, భవనాల క్రమబద్ధీకరణకు గడువు పొడిగింపు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: అనుమతిలేని లేఅవుట్లు, భవనాలను గడువులోపు క్రమబద్ధీకరించుకోవాలని పుడా అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పుడా పరిధిలో గత జూన్‌కు ముందు రిజిస్ట్రేషన్ అయిన అనధికార లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవడానికి ఎల్ఆర్ఎస్ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకోవడానికి అక్టోబర్‌లో గడువు ముగిసిందన్నారు. జీవో నం.1173 మేరకు 23 జనవరి 2026 వరకూ గడువు పొడిగించారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పుడా అధికారులు కోరారు.

పాఠశాలకు క్రీడా సామగ్రి వితరణ

గాండ్లపెంట, న్యూస్‌టుడే: మండలంలోని కటారుపల్లి ఉన్నత పాఠశాల, మోడల్ ప్రైమరీ పాఠశాలకు హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన వేమన ఫౌండేషన్, ఎన్మాక్స్ ఇంజినీరింగ్ నిర్వహణ సభ్యుడు ప్రసాద్‌రెడ్డి రూ.2 లక్షలు విలువజేసే క్రీడా సామగ్రితో పాటు ఇన్వర్టర్‌లను వితరణ చేశారు. ఆటల సామగ్రిని పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేయించి ప్రారంభించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మొదటి స్థానంలో నిలిచే వారికి నగదు బహుమతి అందించేలా బ్యాంకులో రూ.50 వేలు డిపాజిట్ చేశారు. ఆ మొత్తానికి వచ్చే వడ్డీ డబ్బులను ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి అందజేయాలని హెచ్ఎం సరళకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సురేష్‌బాబు, యస్ఆర్ అసోసియేట్ సభ్యుడు శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు విశ్వనాథరెడ్డి, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాత ప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రాయితీపై ఉలవల పంపిణీ

నల్లచెరువు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఒరువాయి, తలమర్లవాండ్లపల్లి, నల్లచెరువు పంచాయతీలోని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు రాయితీపై ఉలవలను ఆయా వ్యవసాయాధికారులతో కలిసి తెదేపా నాయకులు గురువారం పంపిణీ చేశారు. తెదేపా నాయకులు దేవేంద్ర గౌడ్, నాగభూషణ్ నాయుడు, నాగిరెడ్డి, ప్రభాకర్ నాయుడు, యుగంధర్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు: మండలంలోని తనకల్లు 1, 3, చీకటిమానిపల్లి, ఈతోడు, బొంతలపల్లి, గేమేనాయక్‌తండా, కోటపల్లి, మల్లిరెడ్డిపల్లి రైతు సేవాకేంద్రాల్లో నేటి నుంచి విత్తన ఉలవలు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయాధికారిణి భారతి తెలిపారు.

చరవాణులు వీడి గ్రంథాలయాల బాట పట్టండి

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులు చరవాణులతో కాలక్షేపం చేస్తూ సమయాన్ని వృథా చేసుకోకుండా గ్రంథాలయాలను సందర్శించాలని ఎంపీడీఓ బాలకృష్ణుడు పేర్కొన్నారు. చెన్నేకొత్తపల్లి గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామానికి దేవాలయం, విద్యాలయం ఎంత ప్రధానమో గ్రంథాలయం అంతే ముఖ్యమన్నారు. అనంతరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీలలో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

నూతన సభ్యులతో ఉపాధ్యాయులు

తలుపుల, న్యూస్‌టుడే: ఎస్టీయూ మండల నూతన కార్యవర్గ సభ్యులను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం ఉపాధ్యాయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఓబులరెడ్డిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్నం నిర్వహించిన సమావేశంలో మండల అధ్యక్షుడిగా పి.వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా విజయవర్ధన్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా హరిప్రసాద్‌రెడ్డి, మహిళా కన్వీనర్‌గా పద్మజ, మైనార్టీ కన్వీనర్‌గా తబ్రేజ్‌బాషా, జిల్లా కౌన్సిలర్‌గా రమణనాయక్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటరమణ, రాజశేఖర్‌రెడ్డి, బాబాఫకృద్దీన్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గౌరవ వేతనం విడుదలపై హర్షం

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం మసీదుల్లో పని చేసే ఇమామ్‌లు, మౌజన్‌లకు గౌరవ వేతనం విడుదల చేయడం పట్ల మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి మసీద్ ఏ మాలిక్ వద్ద ఇమామ్‌లు, మౌజన్‌లు, కూటమి నాయకులతో కలిసి హర్షం వ్యక్తం చేశారు. ఇమామ్‌లకు నెలకు రూ.10 వేలు, మౌజన్‌లకు రూ.5 వేలు చొప్పున ఏడాది వేతనం విడుదల చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు ధన్యవాదాలు తెలిపారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతని ఐసీడీఎస్ సూపర్ వైజర్ ప్రశాంతి పేర్కొన్నారు. చెన్నేకొత్తపల్లిలోని ఆదర్శ పాఠశాల, కస్తూర్బా విద్యాలయాలలో గురువారం బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. 18 ఏళ్ల లోపు ఉన్న బాలబాలికల హక్కులు పరిరక్షిస్తూ వారి శ్రేయస్సు కోసం కృషి చేయాలన్నారు. ఐక్యరాజ్య సమితి హక్కుల ఒడంబడిక ప్రకారం బాలలకు జీవించే హక్కు, రైట్ టు పార్టిసిపేషన్, రక్షణ పొందే, అభివృద్ధి చెందే ప్రాథమిక హక్కులు ఉన్నాయన్నారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

నల్లమాడ, న్యూస్‌టుడే: కదిరి గ్రామీణం పరిధిలోని బాబాకాలనీకి చెందిన జె.అంజనేయులు (54) మృతి చెందాడు. గురువారం గుజిరీ ఏరుకోవడానికి నల్లమాడకు వచ్చి ఈశ్వర వాటర్ ప్లాంటు వెనుక ఉన్న ఖాళీ స్థలంలో మృత్యువాత పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చనిపోయిన వ్యక్తి ఆరోగ్యం సరిగా లేదని అనారోగ్యం కారణంగా మద్యానికి బానిసయ్యాడని తెలిపారు. భార్య తులశమ్మ నల్లమాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఘనంగా సహకార వారోత్సవాలు

ముదిగుబ్బ: ముదిగుబ్బలోని వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో అఖిల భారత సహకార వారోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంఘం సబ్‌డివిజన్ సహాయ అధికారి జనార్ధన్ హాజరై జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో మహేష్‌బాబు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శివకుమార్‌షిరిడి, సూపర్‌వైజర్ కీర్తి సాగర్, సంఘం సిబ్బంది వైకుంఠ వాసిరెడ్డి, మౌలాసాహెబ్, సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరిస్తున్న సొసైటీ అధికారులు

కూరగాయల ధరలకు రెక్కలు

నాలుగురెట్లు పెరిగిన టమాటా



కదిరి పట్టణం, న్యూస్‌టుడే: మార్కెట్లో కూరగాయలు, ఆకుకూరల ధరలకు రెక్కలొచ్చాయి. తుపాను ప్రభావం.. వాతావరణంలో మార్పులతో ఉద్యాన పంటలకు తెగుళ్లు సోకడంతో ధరలు అమాంతం పెరిగాయి. ప్రధానంగా టమాటా ధర నాలుగు రెట్లు పెరిగింది. దీంతోపాటు చిక్కుడు, ముల్లంగి, చౌళికాయ, బీట్రూట్, కాకర ధరలు రెట్టింపయ్యాయి. వంద రూపాయలకు మూడు రకాల కూరగాయలు రావడం లేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తిమీర కట్ట రూ.10 నుంచి రూ.50కి, మెంతిఆకు రూ.30కి పెరిగింది. బెండ, బీరకాయల ధరలు నిలకడగా ఉండగా.. బీన్స్, వంకాయ ధరలు తగ్గాయి.

కదిరి మార్కెట్‌లో ధరలు (కిలో.. రూ.) పరిశీలిస్తే..

కూరగాయలు	అక్టోబరు	నవంబరు
టమాటా	10	40
మిర్చి	40	60
క్యారెట్	60	80
క్యాబేజి	20	40
కాకర	60	80
ముల్లంగి	20	50
బీట్‌రూట్	20	60
చౌళికాయ	30	80
చిక్కుడు	60	100
దొండకాయ	60	80

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

ముదిగుబ్బ: విద్యార్థితో ఉపాధ్యాయులు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి డిస్కస్‌త్రో పోటీలకు మండలంలోని ఎనుములవారిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి తేజేష్‌నాయక్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా హెచ్ఎం పార్వతి, పీఈటీ వెంకటరమణ, ఉపాధ్యాయులు గురువారం విద్యార్థిని అభినందించారు. ఈనెల 24, 25వ తేదీల్లో వినుకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఉపాధ్యాయులు తెలిపారు.

ధర్మవరం పట్టణం: పట్టణానికి చెందిన ఐదుగురు క్రీడాకారులు అండర్-14, 17 విభాగాల్లో జరిగే అంతర్‌జిల్లా బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం సెక్రటరీ జయచంద్రారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 23 వరకు ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టుకు బాలుర విభాగంలో లక్ష్మీనారాయణ, కార్తిక్, యేసు, బాలికల విభాగంలో శరణ్య, ప్రియా దీప్తి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులు పోటీలకు బయలుదేరి వెళ్లారు. వీరిని ధర్మంబా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రామిరెడ్డి, కార్యదర్శి హిదాయతుల్లా, కోచ్ సంజయ్ అభినందించారు.

ఎంపికైన విద్యార్థులు

తాడిమర్రి: రాష్ట్రస్థాయిలో ఈ నెల 22 నుంచి 24 వరకు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో జరిగే వాలీబాల్ పోటీలకు తాడిమర్రి ఉన్నత పాఠశాలకు చెందిన వర్షిత ఎంపికైంది. గురువారం పీడీ అమరాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రపోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టుకు వర్షితను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం అరుణ, పీఈటీ ప్రతాప్ విద్యార్థినిని అభినందించారు.

వర్షిత

కొత్తచెరువు: స్థానిక జిల్లా పరిషత్ బాలురు, బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన వరుణ్, లోకేశ్వరి బేస్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు గోపాల్, నూర్జహాన్ తెలిపారు. విద్యార్థులను హెచ్ఎంలు, పీడీలు వెంకటేష్, సూర్యనారాయణమ్మ అభినందించారు.

వరుణ్‌తో పీడీ వెంకటేష్

(c) eenadu

కర్షకుల ఆశలపై కారుమబ్బులు..!

– న్యూస్‌టుడే, నరసన్నపేట

జిల్లాలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నా.. ధాన్యం కొనుగోలు ప్రక్రియ మాత్రం పుంజుకోవట్లేదు. కేంద్రాలు ఎప్పుడు తెరుస్తారోనని అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

నరసన్నపేట సమీపంలో సర్వీసు రహదారిపై విక్రయానికి సిద్ధంగా ఉంచిన ధాన్యం బస్తాలు

అధికారులు ఈ నెల 15 నుంచి పంట కొంటామని చెప్పినా క్షేత్రస్థాయిలో జరగలేదు. నరసన్నపేటలో ఈ నెల 18న రెండు చోట్ల కేంద్రాలు ప్రారంభించినా.. కేవలం 30 బస్తాలు కొని.. సేకరణ నిలిపేశారు. 267 రైసు మిల్లులున్నప్పటికీ కేవలం ఒక్క మిల్లు నుంచి మాత్రమే బ్యాంకు గ్యారంటీ(బీజీ) వచ్చింది. మరోవైపు ఈ నెల 24 నుంచి తుపాను ప్రభావం ఉంటుందని తెలియడంతో అన్నదాతల్లో గుబులు మొదలైంది. చాలా చోట్ల నూర్పులు పూర్తయి ధాన్యం బస్తాలు విక్రయానికి సిద్ధం చేశారు. రైతులు పంట కాపాడుకునేందుకు టార్పాలిన్ల కోసం పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ధర వింటే.. గుడ్లు తేలేయాల్సిందే..!

– న్యూస్‌టుడే, సోంపేట

కోడి గుడ్డు ధర చుక్కలు చూపిస్తోంది. మూడు వారాల వ్యవధిలో వంద గుడ్ల ధర గతం కంటే రూ.120కు పైగా పెరిగి రికార్డు స్థాయికి చేరింది. నవంబరు ప్రారంభం నాటికి వంద గుడ్ల ధర పారం వద్ద రూ.5.70గా ఉంటే.. ప్రస్తుతం రూ.6.50 పలుకుతోంది. రిటైల్‌గా రూ.7.50 నుంచి రూ.8 వరకు అమ్ముతున్నారు. రాష్ట్రం నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువగా గుడ్లు ఎగుమతి అవుతుండటంతో డిమాండ్ పెరిగింది. మరోవైపు కార్తికమాసం పూర్తి కావడంతో గుడ్ల వినియోగం పెరిగే అవకాశం ఉందని, ధర మరింత పెరగొచ్చని వ్యాపారులు చెబుతున్నారు.

ఎందుకీ పరిస్థితి.. శీతాకాలంలో ఉత్పత్తిదారులు ఏటా గుడ్ల ఉత్పత్తిని 20 శాతం వరకు పెంచుతుంటారు. వ్యాధుల తీవ్రత, కోళ్ల దాణాలో వినియోగించే సోయా ధర పెరగడం తదితర కారణాలతో ఈ ఏడాది ఉత్పత్తి పెంచేందుకు ఆసక్తి చూపలేదని ఓ కోళ్లఫారం యజమాని బాబూరావు వివరించారు.

◆ జిల్లాలో రోజుకు 15 లక్షల వరకు గుడ్ల అమ్మకాలు జరుగుతాయని వ్యాపారులు చెబుతున్నారు. మరోవైపు సముద్రంపై చేపల వేట తగ్గడం వల్ల వీటి వినియోగం పెరిగి సామాన్యులపై ఆర్థిక భారం పడుతోంది.

పూర్తి చేస్తేనే.. పల్లెకు పండగ..!

లావేరు మండలం నాగంపాలెం, వేణుగోపాలపురం గ్రామాల మీదుగా రణస్థలం వెళ్లే రోడ్డు ఇది. సుమారు 2.5 కిలోమీటర్ల మేర రాళ్లు తేలి నిత్యం వాహనదారులకు నరకం చూపిస్తోంది. 'పల్లె పండగ'లో భాగంగా 11 నెలల కిందట పనులు ప్రారంభించారు. 80 శాతం పూర్తి చేశాక.. బిల్లులు మంజూరు కాకపోవడంతో గుత్తేదారులు మధ్యలో వదిలేశారు. అప్పటి నుంచి ప్రయాణికులు నరకం చూస్తున్నారు. ఈ విషయమై పీఆర్ ఏఈఈ పోలినాయుడు మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేశామని, నిధులు విడుదలైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. – న్యూస్‌టుడే, లావేరు

నడిపేది.. నిలిపేది.. నడిరోడ్డుపైనే..!

పట్టణాల్లో వాహనాల పార్కింగ్ స్థలాల్లేక ఇక్కట్లు

న్యూస్‌టుడే పరిశీలన

– న్యూస్‌టుడే, పలాస, ఇచ్ఛాపురం, ఆమదాలవలస పట్టణం, శ్రీకాకుళం నగరం

జిల్లాలోని పట్టణాలు, నగరాలు విస్తరిస్తున్నాయి. కొత్త షాపింగ్ మాల్స్, పెద్ద దుకాణాలు, ఆసుపత్రులు పెరుగుతున్నాయి. అవన్నీ రద్దీ ప్రదేశాల్లోనే ఎక్కువగా ఉంటున్నాయి. ఆయా చోట్ల ఎక్కడా పార్కింగ్ స్థలం లేకపోవడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పట్లేదు. వ్యాపార, వాణిజ్య సముదాయాల ఆరుబయటే వాహనాలు నిలపాల్సిన పరిస్థితి నెలకొంటోంది. నిర్మాణ సమయంలో అన్నీ ఉన్నట్లు దస్త్రాల్లో చూపుతున్నా.. క్షేత్రస్థాయిలో ఉండట్లేదు. ఫలితంగా ట్రాఫిక్ కష్టాలు మరింత జఠిలమవుతున్నాయి.

పలాసలో పార్కింగ్ స్థలంలో ప్రధాన రహదారిపైనే నిలిపి ఉంచిన వాహనాలు

కేటీరోడ్డులో కష్టమే..

☛ : పలాస-కాశీబుగ్గ
◆ : 64 వేలు
● : 30 ➡ : 04

పలాస-కాశీబుగ్గలోని మూడు రోడ్ల కూడలి, రైల్వే గేటు, ఆర్టీసీ కాంప్లెక్స్, ఇందిరా చౌక్ వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, ఆసుపత్రులు, లాడ్జిలు, కల్యాణ మండపాలు ఎక్కువగా ఉంటాయి. చాలా చోట్ల సెట్ బ్యాక్, పార్కింగ్, రిజర్వు స్థలం లేవు. దీంతో వినియోగదారులు వాహనాలను నడిరోడ్డుపైనే నిలపాల్సి వస్తోంది. ప్రతి శుక్రవారం సంత జరిగే రోజున పరిస్థితి మరింత ఇబ్బందిగా ఉంటోంది. కె.టి.రోడ్డు ఇరువైపులా వాహనాలతో నిండిపోతోంది.

నడవాలన్నా ఇబ్బందే..

☛ : ఇచ్ఛాపురం
◆ : 47 వేలు
● : 08 ➡ : 02

ఇచ్ఛాపురం పట్టణంలో పాత బస్టాండు, బజారు రోడ్డు, ప్రధాన రహదారి మార్గం, దాసన్నపేట, రథంవీధి, గోర్జీ వీధి, వీకే పేట, ఫకీరుపేట, ఆసుపత్రి రోడ్డు, పంజా కూడలి ప్రాంతాల్లో దుకాణాల ముంగిటే వాహనాలు నిలిపివేస్తున్నారు. ఒక్క చోట కూడా పార్కింగ్ స్థలం లేకపోవడంతో నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గాల్లో పాదచారులు సైతం నానాపాట్లు పడుతున్నారు.

ఉన్నదీ ఆక్రమించేశారు..

☛ : శ్రీకాకుళం
◆ : 1.50 లక్షలు
● : 20 ➡ : 01

జిల్లా కేంద్రంలోని కళింగ రహదారి, జీటీ రోడ్డు, అంబేడ్కర్ కూడలి, పొట్టి శ్రీరాములు మార్కెట్, ఏడు రోడ్ల జంక్షన్, పాత బస్టాండ్ తదితర ప్రాంతాల్లో వాణిజ్యసముదాయాలతో పాటు 430 దుకాణాలు ఉన్నాయి. వాటిల్లో పొట్టి శ్రీరాములు మార్కెట్ మినహా మరెక్కడా వాహనాలు నిలిపేందుకు స్థలం లేదు. అక్కడ కేటాయించిన స్థలాన్ని స్థానిక వ్యాపారులు ఆక్రమించేయడంతో అదీ ఉపయోగపడట్లేదు.

పర్యవేక్షణ లోపంతోనే..

☛ : ఆమదాలవలస
◆ : 49 వేలు
● : 06 ➡ : 0

ఆమదాలవలస పట్టణంలో నిత్యం సుమారు 10 వేల వరకు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎక్కడా పార్కింగ్ సదుపాయాల్లేవు. ప్రధాన రహదారిలో సెంటర్ డివైడర్ ఉండటంతో వాహనాలను దుకాణాల ముందే ఉంచుతున్నారు. పట్టణ ప్రణాళిక విభాగం పర్యవేక్షణ లోపం కారణంగా పార్కింగ్ స్థలాలు లేకుండానే నిర్మాణాలు చేపడుతున్నారు.

సూచిక: ☛ పట్టణం/నగరం | ◆ జనాభా | ● వాణిజ్య సముదాయాలు | ➡ పార్కింగ్ సదుపాయం ఉన్నవి

అసలే అది గిరిజన ప్రాంతం.. చుట్టూ పచ్చని పరిసరాలు.. ఆ పిల్లలిద్దరూ ఎంచక్కా కాసేపు ఆడుకుందామని బయటికెళ్లారు.. ఓ చెట్టు కాయలు తిన్నారు.. పాపం పసి వాళ్లకేం తెలుసు.. అవి తింటే మంచిది కాదని.. ప్రాణం మీదకొస్తుందని.. అంతే క్షణాల్లో విలవిల్లాడిపోయారు. ఆసుపత్రి పాలయ్యారు..

పసివాళ్లకేం తెలుసు.. ప్రాణాల మీదకొస్తుందని..!

ఉమ్మెత్త కాయలు తిని చిన్నారులకు తీవ్ర అస్వస్థత

చికిత్స పొందుతున్న విక్రమ్

మందస, న్యూస్‌టుడే: ఉమ్మెత్త చెట్టు కాయలు తిని ఇద్దరు చిన్నారులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మందస మండలంలో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. సాబకోట పంచాయతీ బిత్తరబందకు చెందిన రమ్మో జెన్నీ, జానకి జెన్నీ దంపతుల నాలుగేళ్ల బిడ్డ సవర గంగ, లక్ష్మణ్, నీలాపతి బుయ్యల కుమారుడు సవర విక్రమ్ గురువారం ఉదయం నిద్ర లేచాక ఆడుకోవడానికి ఓ ఖాళీ స్థలంలోకి వెళ్లారు. అక్కడున్న ఉమ్మెత్త చెట్టు కాయలు తిన్నారు. కాసేపటికే వాంతులు, వికారంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు అడగ్గా కాయలు తిన్నట్లు చెప్పారు. ఇంతలో ఒకరు స్పృహ కోల్పోవడంతో ఓ ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. నయం కాకపోవడంతో హరిపురం సామాజికాసుపత్రికి తరలించి.. ప్రాథమిక చికిత్స అందజేశారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో టెక్కలి జిల్లా ఆసుపత్రికి అక్కడ నుంచి శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ చికిత్స పొందుతున్నారని విక్రమ్ తండ్రి లక్ష్మణ్ తెలిపారు.

హరిపురం ఆసుపత్రిలో చిన్నారి గంగ

చర్మవ్యాధులపై శీతకన్నొద్దు..!

సర్వజనాసుపత్రికి బాధితుల తాకిడి

– న్యూస్‌టుడే, బలగ(శ్రీకాకుళం)

ప్రస్తుతం చలి చంపేస్తోంది. రోజురోజుకు శీతల గాలుల తీవ్రత పెరుగుతోంది. ఆ ప్రభావంతో చర్మ రుగ్మతలు వేధిస్తుంటాయి. చర్మం పొడిబారడం, పగుళ్లు రావడం, దురదతో కూడిన ఎర్రటి మచ్చలు ఏర్పడటం వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ ఈ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. రద్దీ ప్రదేశాలు, వసతి గృహాల్లో ఉండే విద్యార్థుల నుంచి చర్మ సమస్యలు అవకాశముందని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

◆ శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలోని చర్మ వ్యాధుల విభాగానికి ప్రస్తుతం రోజుకు 80 నుంచి 90 మంది వరకు అవుట్ పేషెంట్లు వస్తున్నారు.

◆ సాధారణంగా నెలకు 1,500 నుంచి 2,000 వరకు ఓపీ ఉంటుంది. ఇటీవల రోగుల తాకిడి పెరగడంతో ఈ నెల ఆ సంఖ్య మూడు వేలకు చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఎదురయ్యే ఇబ్బందులివీ..

- చర్మం పొడిబారి తామర(ఎగ్జిమా) వస్తుంది. దురద ఎక్కువగా ఉంటుంది. గోకితే దద్దుర్లు ఏర్పడి మంట పుడుతుంది.
- జలుబు, దగ్గు, ఎక్కువగా ఉన్న పిల్లలు ఎటోపిక్ డెర్మటైటిస్ వ్యాధికి గురికావడంతో ఎరుపు రంగు మచ్చలు వస్తాయి.
- సొరియాసిస్ సోకి చర్మంపై మచ్చలు ఏర్పడి పొట్టులా రాలిపోతూ దురద వస్తుంది. ● తలలో చుండ్రు పెరుగుతోంది. ● సెబోరిక్ డెర్మటైటిస్ తలలో ఏర్పడి పొట్టులా చర్మం ఊడిపోతుంది. ● కాళ్ల మడమలు, పెదాలు, చేతులపై పగుళ్లు వస్తాయి. ● చేతి మునివేళ్లు మంటగా ఉండి గుంజినట్లు అవుతాయి.



ఏం చేయాలంటే..

- చలి తీవ్రత ఎక్కువగా ఉండే వేళల్లో వీలైనంత వరకు ఇంట్లోనే ఉండాలి. బయటకు వెళ్లేటప్పుడు పూర్తిగా చర్మాన్ని కప్పేలా ఉన్ని లేదా కాటన్ దుస్తులు ధరించాలి. సన్‌స్క్రీన్ లేపనాలు వాడాలి.
- గ్లిజరిన్ సబ్బులు వాడాలి. గోరువెచ్చని నీటితో స్నానం చేయడం ఉత్తమం. చర్మం తేమగా ఉండేలా ప్రతి 2 గంటలకోసారి కొబ్బరి నూనె, కోల్డ్ మాయిశ్చరైజర్ క్రీములు పూసుకోవాలి.
- గృహిణులు పాత్రలు కడిగేందుకు సబ్బులు వాడతారు. ఆ పని పూర్తయిన వెంటనే చేతుల్ని శుభ్రం చేసుకుని కొబ్బరినూనె, మాయిశ్చరైజర్ క్రీములు, ఇతర లేపనాలు రాసుకోవాలి.
- రోజుకు కనీసం 3 లీటర్ల నీరు తాగాలి. విటమిన్ 'సి' ఉండే ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. సొరియాసిస్, తామర, దద్దుర్లు ఏర్పడితే ఇంట్లోనే సొంత వైద్యం చేసుకోకుండా తక్షణమే వైద్య నిపుణులను సంప్రదించి.. సలహా తీసుకోవాలి.

నిర్లక్ష్యం చేయకూడదు..

చర్మ రుగ్మతలకు ప్రాథమిక దశలోనే వైద్యం తీసుకుంటే సమస్య జఠిలం కాకుండా పరిష్కరించుకోవచ్చు. నిర్లక్ష్యం చేస్తే వ్యాధి పెరుగుతుంది.. సొరియాసిస్, తామర వచ్చినవారు వైద్యుల సూచనల మేరకు సక్రమంగా మందులు వినియోగించాలి. శీతాకాలంలో చర్మం ఎప్పుడూ తేమగా ఉంచుకునేందుకు ప్రయత్నించాలి.

– డా. వావిలాపల్లి రేవతి, చర్మవ్యాధి నిపుణురాలు, శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజనాసుపత్రి

సమగ్ర శిక్షా ఏపీసీగా వేణుగోపాలరావు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: సమగ్ర శిక్షా అదనపు సమన్వయకర్తగా పప్పల వేణుగోపాలరావును నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన కాకినాడ జిల్లా ఏపీసీగా విధులు నిర్వర్తిస్తున్నారు. శ్రీకాకుళం ఏపీసీగా ప్రస్తుతం పని చేస్తున్న ఎస్.శశిభూషణ్‌ను ఎక్కడా నియమించలేదు.

స్కిల్ హబ్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని బలగ ప్రభుత్వ ఐటీఐ నైపుణ్య శిక్షణ కేంద్రంలో రెండు నూతన శిక్షణ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏడీ వై.రామ్మోహన్ రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0లో భాగంగా మూడు నెలల శిక్షణ కాలం కలిగిన ఎలక్ట్రీషియన్, సైబర్ సెక్యూరిటీ అండ్ సోషల్ మీడియా అనలిస్ట్ కోర్సులకు ఈ నెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ ఆపై విద్యార్హతలు కలిగిన 18 నుంచి 30 సంవత్సరాలు ఉండే యువత అర్హులని స్పష్టం చేశారు. మరింత సమాచారం, దరఖాస్తు ప్రక్రియ వివరాలకు 70957 31303 నంబరుకు సంప్రదించాలని పేర్కొన్నారు.

కోతే కదా.. పోతే పోనీలే..!

– న్యూస్‌టుడే, గార

ఒకప్పుడు ఆహ్లాదం పంచిన ప్రాంతం.. ఇప్పుడు ఉసూరుమంటోంది. కళకళలాడిన తీరం వెలవెలబోతోంది. గార మండలం కళింగపట్నం-మత్స్యలేశం సాగర తీరం కోత ఆగట్లేదు. వంశధార నది నీటి ప్రవాహం కారణంగా పరిస్థితి దయనీయంగా మారుతోంది. పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలు సాగర జలాల్లో కలిసి పోతున్నాయే తప్ప ఫలితం కనిపించట్లేదు.

వైకాపా హయాంలో రూ.7.54 కోట్ల అంచనాలతో వరద రక్షణ పనులు చేపట్టారు. గుత్తేదారుకు సుమారు రూ.2 కోట్ల వరకు బకాయి ఉండటంతో ఆయన మధ్యలోనే వదిలేశారు. ఆ తర్వాత కోత పెరగడంతో నిర్మించిన ఇసుక గట్టు కనుమరుగై ప్రజాధనం గంగపాలైంది. ఇదే పరిస్థితి కొనసాగితే మత్స్యలేశం, బందరువానిపేట, పెద్దగణగళ్లవాని పేట గ్రామాలు కనుమరుగైపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

దయనీయంగా కె-మత్స్యలేశం వద్ద తీరం పరిస్థితి

ప్రస్తుతం మరింత కోతకు గురైన తీరం ఇలా..

సన్నగిల్లుతున్న ఆశలు..

- కె.మత్స్యలేశం తీర ప్రాంతాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్ గతేడాది జులైలో పరిశీలించారు.
- ఆ సమయంలో జలవనరులశాఖ అధికారులు సమస్య పరిష్కారం కావాలంటే సుమారు 1,600 మీటర్ల మేర రాతికట్ట నిర్మించాలని, అందుకు రూ.40 కోట్ల వరకు ఖర్చవుతుందని తెలిపారు.
- మూడు నెలల కిందట నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్(ఎన్‌సీసీఆర్) బృందం స్థానికంగా పర్యటించి.. కోత నివారణకు సుమారు రూ.90 కోట్ల అంచనాలతో ప్రభుత్వానికి నివేదిక పంపింది. దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి కదలిక లేకపోవడంతో స్థానికుల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయి.
- ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే పనులు చేపడతామని జలవనరులశాఖ డీఈఈ రవీంద్రనాయుడు తెలిపారు.

సరి చేస్తారా.. సర్దేస్తారా..?

డీఆర్‌డీఏలో అక్రమాలపై కానరాని చర్యలు

– ఈనాడు డిజిటల్, శ్రీకాకుళం

వైకాపా హయాంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలో(డీఆర్‌డీఏ) జరిగిన అక్రమాలపై అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల పేరిట నకిలీ బిల్లులతో రూ.కోట్లు పక్కదారి పట్టించినట్లు ఆధారాలున్నా పట్టించుకునేవారే లేకుండా పోయారు. అక్రమాలు చేసినవారు గత ప్రభుత్వంలో పెద్దల సాయంతో.. ప్రస్తుతం కొందరు కూటమి కొందరు నేతల సహకారంతో జాగ్రత్తపడుతున్నారనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నా ఎలాంటి చర్యల్లేకపోవడం గమనార్హం.

జరిగిన అక్రమాలు ఇవే..

◆ 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాల్లో 50కిపైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళా సమాఖ్యల ద్వారా నడిపించారు. అందుకు డీఆర్‌డీఏ పీడీ ఖాతాలకు రూ.16 కోట్లు చెల్లించారు. వాటిపై వచ్చే వడ్డీ సొమ్మును ఖర్చు చేసుకునే వెసులుబాటును అవకాశంగా చేసుకుని బోగస్ కంపెనీలు తెరిచారు.

◆ శ్రీరామ అండ్ కో కంపెనీ పేరిట నకిలీ జీఎస్టీ నంబరుతో కార్యకలాపాలు ప్రారంభించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జిల్లాలో జరిగిన కార్యక్రమాలు ఆ కంపెనీకే అప్పగించారు. నకిలీ బిల్లులు పెట్టి లక్షలు దోచుకున్నారు. ఆడిటింగ్ జరగకుండా జాగ్రత్త పడ్డారు. 2023లో బండారం బయటపడింది.

రూ.1.89 కోట్లు దోచేశారు..

వైకాపా నేతల సహకారంతో సంబంధం లేని శాఖలో పోస్టింగ్ తెచ్చుకున్న అధికారి కనుసన్నల్లోనే అక్రమాలు జరిగాయి. వైకేపీ-డీఆర్‌డీఏలో రూ.21.55లక్షలు, జిల్లా సమాఖ్యలో రూ.88.13 లక్షలు, టీటీడీసీలో రూ.80 లక్షల దుర్వినియోగం జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఆ లెక్కలను ప్రభుత్వానికి నివేదించారు.

ఏదీ విచారణ..?

ఈ అక్రమాలపై 'ఈనాడు' వరుస కథనాలు ప్రచురితం కావడంతో అప్పట్లో కలెక్టర్ స్పందించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినాయకాన్ని విచారణాధికారిగా నియమించారు. ఆయన ఏప్రిల్‌లో సెలవుపై వెళ్లిపోయాక.. విచారణ అటకెక్కింది.

కొండంత సందడి

ఇచ్ఛాపురం పీర్లకొండ భక్తులతో కిటకిటలాడింది. ఒడియా సంప్రదాయం ప్రకారం ఏటా మార్గశిర గురువారం రోజున కొండపై ఉన్న పురాతన కట్టడాలకు పూజలు చేస్తారు. అందులో భాగంగా ఉత్కళ ప్రాంతీయులు సాయంత్రం వరకు కొండపై ఉల్లాసంగా గడిపి మొక్కులు చెల్లించుకున్నారు. దిగువన కొబ్బరికాయలు కొట్టి.. కందకంలోని నీటిని తీర్థంలా స్వీకరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. వచ్చే వారం తెలుగువారికి కూడా మార్గశిర మాసం కావడంతో భారీగా భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్నారు.

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

మొక్కజొన్నకే జై..!

రబీలో 40 వేల ఎకరాల్లో సాగుకు కార్యాచరణ

– న్యూస్‌టుడే, లావేరు

జిల్లా రైతులు వరి తర్వాత మొక్కజొన్న సాగుకే ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం లభిస్తుండటంతో దీనిపై మొగ్గు చూపుతున్నారు. గతేడాది రబీలో 35 వేల ఎకరాల్లో ఈ పంట వేయగా.. ఈ ఏడాది 40 వేల ఎకరాల్లో సాగుకు కార్యాచరణ సిద్ధం చేశారు. ఒకప్పుడు అపరాలు ఎక్కువగా పండించేవారు. ప్రస్తుతం మొక్కజొన్నకు మార్కెట్‌లో డిమాండు ఉండటంతో సాగు సరళి మారుతోంది.

జిల్లాలో వివరాలిలా...

- సాగు చేసే మండలాలు: 14
- విత్తనాలు (ఎకరాకు): 8 నుంచి 10 కిలోలు
- దిగుబడి అంచనా: 38 నుంచి 45 క్వింటాళ్లు
- పెట్టుబడి (ఎకరాకు): రూ. 25 వేల వరకు
- పంట సమయం: 110 నుంచి 120 రోజులు

ఎందుకీ పరిస్థితి..

★ ఖరీఫ్‌లో కంటే మంచి దిగుబడులు రావడం ★ మెట్ట ప్రాంతాలు సాగుకు అనుకూలంగా ఉండటం ★ క్వింటా మొక్కజొన్న గింజల మద్దతు ధర రూ.2 వేల ఉండటం ★ పెట్టుబడి పోను ఎకరానికి సుమారు రూ.65 వేల వరకు మిగులుతుండటం ★ ఎకరా పొలానికి 8 నుంచి 10 కిలోలు విత్తనాలు సరిపోతాయి. ★ పంటకు 10 నుంచి 12 సార్లు తడులు అందిస్తే చాలు.

లావేరు మండలం వేణుగోపాలపురంలో మొక్కజొన్న విత్తనాలు వేస్తున్న రైతులు

ప్రోత్సహిస్తే మేలు..

- కూలీల కొరత కారణంగా ప్రస్తుతం మొక్కజొన్న రైతులు పంట సకాలంలో సాగు చేసుకోలేకపోతున్నారు.
- ప్రభుత్వం పురుగు మందులు సరఫరా చేస్తే ఉపశమనంగా ఉంటుందని రైతులు కోరుతున్నారు.
- 2014-19లో అప్పటి తెదేపా ప్రభుత్వం కత్తెర పురుగు నివారణ మందులు, వేపనూనె, విత్తనాలు, పరదాలు రాయితీపై అందించారు. వైకాపా హయాంలో నిలిపేశారు. మళ్లీ వాటిని పునరుద్ధరించాలని కోరుతున్నారు.

సూచనలు పాటించాలి..: రబీలో మొక్కజొన్న సాగు లాభదాయకమే. పంట వేసినప్పటి నుంచి అధికారుల సూచనలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించొచ్చు. పురుగు మందులు, వేప నూనె తదితరాలు రాయితీపై అందించాలని వినతులొస్తున్నాయి. ఉన్నతాధికారులకు నివేదించాం. – మనోహర్, జేడీ, వ్యవసాయశాఖ

గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌ఛార్జిగా జేసీ

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌ఛార్జిగా జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ నూతన అధ్యక్షుడిని నియమించినంత వరకు ఈ పదవిలో ఆరుమాసాల పాటు ఆయన కొనసాగుతారు.

మానసిక దివ్యాంగులకు అండగా మనోబంధు

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: మానసిక దివ్యాంగులను సంరక్షించి పునరావాసం కల్పిస్తున్న 'మనోబంధు ఫౌండేషన్ సేవలు అభినందనీయమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. జిల్లాలో అనాథలైన మానసిక దివ్యాంగులను రెడ్‌క్రాస్ సంస్థ గుర్తించి విశాఖపట్నంలోని మనోబంధు ఫౌండేషన్‌కు తరలిస్తున్నట్లు రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు పి.జగన్మోహనరావు తెలిపారు. బుధవారం ఏడుగురిని పునరావాస కేంద్రాలకు తరలించారు. ఈ సందర్భంగా మనోబంధు ఫౌండేషన్ గోడప్రతులను ఆవిష్కరించి, మానసిక రోగులను తరలించే అంబులెన్స్‌ను ప్రారంభించారు.

జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

(c) eenadu

క్వాంటం ఫీవర్..!

ట్రిపుల్‌ఐటీలో ఐబీఎం 'కిస్కిట్ ఫాల్' హ్యాకథాన్ పోటీలు

క్వాంటం కంప్యూటింగ్‌లో సత్తా చాటిన విద్యార్థులు

నైపుణ్యాలు నేర్పించాలే కానీ... మన యువత అద్భుతాలు సృష్టించగలరు. ఆవిష్కరణలు చేయగలరు. సరైన వేదిక ఏర్పాటు చేసి ప్రోత్సహించడమే ఆలస్యం. అందుకు ఉదాహరణ ట్రిపుల్ ఐటీలో ఇటీవల ఐబీఎం ఐటీ సంస్థ మార్గదర్శకంలో జరిగిన 'క్విస్కిట్ ఫాల్ ఫెస్ట్'. ఈ కార్యక్రమంలో నిర్వహించిన హ్యాకథాన్ పోటీల్లో ట్రిపుల్ ఐటీ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులు బృందాలుగా ఏర్పడి తయారు చేసిన ప్రాజెక్టులకు ప్రశంసలు, అవార్డులు అందాయి. -న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

❖ 'కిస్కిట్' అనేది ఐబీఎం రూపొందించిన సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కిట్. క్వాంటం కంప్యూటింగ్‌లో ఈ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి ఆవిష్కరణలతోపాటు సమస్యలు పరిష్కరించొచ్చు. ఇది పైథాన్ లాంగ్వేజ్‌లో అందుబాటులో ఉంది. కార్యశాలలు, హ్యాకథాన్, నెట్‌వర్కింగ్ వంటి కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు క్వాంటం కంప్యూటింగ్‌పై అవగాహన కల్పించడంతోపాటు రానున్న రోజుల్లో ఉద్యోగావకాశాలపై అనుభవజ్ఞులైన వారితో సలహాలు, సూచనలు ఇవ్వడమే 'కిస్కిట్ ఫాల్ ఫెస్ట్' లక్ష్యం.

❖ క్వాంటం కంప్యూటింగ్ ప్రస్తుతం వినియోగిస్తున్న కంప్యూటర్లతో పోల్చితే సాంకేతిక సమస్యల పరిష్కారంలో, సమాచార సేకరణలో వేగవంతమైంది. అత్యంత రక్షణాత్మక అనుసంధాన వ్యవస్థ కలిగి ఉంటుంది.

❖ క్వాంటం కంప్యూటింగ్‌పై పట్టు సాధిస్తే రీసెర్చ్ సైంటిస్ట్, క్వాంటం సాఫ్ట్‌వేర్ డెవలపర్, క్వాంటం హార్డ్‌వేర్ ఇంజినీర్, సైబర్ సెక్యూరిటీ స్పెషలిస్ట్, డేటా సైంటిస్టుగా అవకాశాలున్నాయి. ఐటీ కంపెనీ, వైద్య, ప్రభుత్వ రక్షణ శాఖల్లో ఉద్యోగాలున్నాయి.

❖ కూటమి ప్రభుత్వం రాజధాని అమరావతిలో క్వాంటం వ్యాలీ నిర్మాణం దిశగా అడుగు ముందుకేస్తోంది. క్వాంటం కంప్యూటింగ్‌పై యువతకు అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు సైతం నిర్వహిస్తోంది.

సున్నిత సమాచారం చోరీ కాకుండా

విద్యార్థులు సంధ్య, సరితనందన, మానస్విని బృందం రూపొందించిన ప్రాజెక్టుకు మొదటి బహుమతి దక్కింది. ముగ్గురు యువతులు కలిసి క్వాంటం కీ డిస్ట్రిబ్యూషన్ పద్ధతిలో ఈ91 ప్రోటోకాల్‌ను ఉపయోగించి ఎన్‌క్రిప్టెడ్ అప్లికేషన్ తయారు చేశారు. ఈ యాప్ సున్నితమైన సమాచారం చోరీ కాకుండా కాపాడం రక్షణ వ్యవస్థలా పని చేస్తుంది. ప్రభుత్వ రక్షణ రంగాలతోపాటు బ్యాంకింగ్ వ్యవస్థలో దీన్ని వినియోగించొచ్చు. నిర్వాహకులు ఈ ప్రాజెక్టును మెచ్చి ప్రథమ బహుమతి అందించారు.

తప్పులకు తావు ఉండదు

క్వాంటం కంప్యూటింగ్‌లోని హైబ్రిడ్ ఈ91, డైనమిక్ బెల్ట్ సంయుక్తంగా బి.ఎస్.సూర్య, ఎం.ప్రదీప్ రోషన్‌బాబు, ఎస్.అమృత వర్షిణి, ఏ.ఎం.నందిని ప్రాజెక్టు రూపొందించారు. పరిశోధన, రక్షణ, ఆర్థిక రంగాల్లో ఈ సమాచార బదిలీ మూడో వ్యక్తి వినకుండా, సైబర్ దాడులు జరగకుండా, సున్నితమైన సమాచారాన్ని ప్రమాదకర వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడేందుకు వినియోగిస్తారు. దీనిపై విద్యార్థి బృందం గూగుల్ సైట్‌లో ప్రాజెక్టు ప్రజెంటేషన్ రెండో బహుమతి దక్కించింది.

వ్యాధులు గుర్తించడంలో సాయం

క్వాంటం కంప్యూటింగ్‌లో 'ప్రోటీన్ ఫోల్డింగ్ సిమ్యులేటర్' అనే టూల్ ద్వారా కొత్త ఔషధాలు కనిపెట్టొచ్చని జె.సాయి, సాయి అఖిల్, ఐ.ఎం. ఎస్.స్వామి, ఎస్.సి.బి.ఎస్.సాయిరాం, వి.భరత్‌సాయి బృందం తెలియజేసింది. దీంతో ఈ టూల్‌ను వ్యాధులను గుర్తించే అత్యున్నతమైన సాంకేతిక కలిగిన పరికరంలో, విద్యా రంగంలో ఏదైనా అంశంపై బోధనకు, నేర్చుకునేందుకు ఉపయోగించొచ్చని ప్రాజెక్టు రూపంలో వివరించగా ప్రశంసలతోపాటు బృందం తృతీయ స్థానం సాధించింది.

నేడు స్వగ్రామానికి జోగారావు మృతదేహం!

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలం బాతుపురానికి చెందిన మావోయిస్టు పార్టీ (ఏవోబీ) స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు, టెక్నికల్ టీం ఇన్‌ఛార్జి మెట్టూరు జోగారావు అలియాస్ టెక్ శంకర్ మృతదేహం శుక్రవారం స్వగ్రామానికి చేరనున్నట్లు సమాచారం. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో బుధవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో జోగారావు మృతి చెందిన విషయం విదితమే. రంపచోడవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న ఆయన మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చేందుకు కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు గురువారం తెల్లవారుజామున చేరుకున్నారు. కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు పురుషోత్తం, అరుణ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ శవపంచనామా, పోస్టుమార్టం కార్యక్రమాలు పూర్తయ్యాయని పేర్కొన్నారు. అంబులెన్స్ ఏర్పాటు కాగానే బయలుదేరనున్నట్లు చెప్పారు. శుక్రవారం ఉదయానికి చేరుకునే అవకాశం ఉందన్నారు. గ్రామ రహదారి కూడలిలో ఉన్న అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి తదుపరి సమీప శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు బంధువులు తెలిపారు.

జోగారావు ఇంటి వద్ద నిరీక్షిస్తున్న కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు

ఓం సాయి.. జయ జయ సాయి

నగరంలో విశాఖ'బి' కాలనీలో షిర్డీ సాయిబాబా దేవాలయంలో బాబా సద్గురు సామూహిక సప్తాహ పారాయణం గురువారం ప్రారంభమైంది. అరసవల్లిలో బాబా తత్వప్రచార మందిరం నుంచి సాయిబాబా వేషధారణలు, మేళతాళాలు, కోలాటం ప్రదర్శనలతో సాగింది. అరసవల్లి నుంచి మిల్లు కూడలి, సూర్య మహల్, రామలక్ష్మణ కూడళ్ల మీదుగా విశాఖ'బి'కాలనీ షిర్డీసాయి ఆలయం వరకు సాయి నామస్మరణ మార్మోగింది. అడుగడుగునా భక్తులు హారతులు ఇచ్చారు. - న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: సంతబొమ్మాళి మండలం నౌపడ శివారు ప్రాంతంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం కావడంతో గ్రామంలో కలకలం రేగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నౌపడలోని కంచరాల ఉప్పు పొలం సమీపంలో ఓ మహిళ మృతదేహం ఉన్నట్లు గుర్తించిన కొందరు కార్మికులు గురువారం మధ్యాహ్నం పోలీసులకు సమాచారం ఇచ్చారు. నౌపడ ఎస్సై జి.నారాయణస్వామి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. టెక్కలి డీఎస్పీ డి.లక్ష్మణరావు, సీఐ కె.శ్రీనివాసరావు సిబ్బంది చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మహిళ ముఖంపై కత్తితో దాడి చేసిన ఆనవాళ్లు ఉండటంతో ఇది హత్య అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆమెకు సుమారు 30 ఏళ్లు ఉండొచ్చని భావిస్తున్నారు. మృతదేహానికి కొద్ది దూరంలో రక్తపు మరకలు ఉండటంతో ఇక్కడే హత్య చేశారా లేదా ఇంకెక్కడైనా చంపేసి ఇక్కడికి మృతదేహాన్ని తీసుకొచ్చారా అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనా స్థలంలో పలు వస్తువులు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానిత యువకులకు దేహశుద్ధి

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: కాశీబుగ్గలో అనుమానిత యువకులకు స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వజ్రపుకొత్తూరు మండలం పూండిలో కృష్ణారావు గురువారం ఆర్టీసీ బస్ ఎక్కారు. ఆయన వెనక సీటులో ఐదుగురు యువకులు కూర్చొని కృష్ణారావుతో గొడవకు దిగారు. ఆయన కాశీబుగ్గలో బస్సు దిగి సంతమైదానం వైపు వెళ్తుండగా వారు వెంబడించారు. కృష్ణారావు చేతులు పట్టుకుని బెదిరించి ఆయన వద్ద ఉన్న రూ.20 వేలు తీసుకున్నారు. బాధితుడు వెంటనే దొంగలని కేకలు వేయడంతో సమీపంలో ఉండే ట్యాక్సీ డ్రైవర్లు, స్థానికులు అక్కడికి రాగా యువకులు పరుగులు తీశారు. అందులో ముగ్గురు చిక్కగా ఇద్దరు పరారయ్యారు. దొరికిన వారికి దేహశుద్ధి చేసి, ఇద్దరిని స్తంభానికి కట్టేశారు. మరొక యువకుడు స్పృహ కోల్పోయాడు. విషయం తెలిసి పోలీసులు యువకులను ఠాణాకు తరలించారు. పట్టుబడిన వారి వివరాలు సేకరిస్తున్నామని సీఐ సూర్యనారాయణ పేర్కొన్నారు. వీరి వద్ద విజయవాడ నుంచి పలాస వరకు ఈ నెల 19న తీసిన ఐదు రైలు టిక్కెట్లు ఉన్నాయి.

పట్టుబడిన యువకులు

నిరుద్యోగులను మోసగించిన వ్యక్తి అరెస్టు

పాతపట్నం, న్యూస్‌టుడే: ఉద్యోగాల పేరుతో నకిలీ నియామక పత్రాలు ఇచ్చి నిరుద్యోగులను మోసం చేసిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు పాతపట్నం ఎస్సై కె.మధుసూదనరావు తెలిపారు. పాతపట్నం మండలం బొమ్మిక గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్, సాయికుమార్ అనే ఇద్దరికి ఓ కంపెనీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని సారవకోట మండలం చిన్నగుజ్జువాడ గ్రామానికి చెందిన కె.లోకేశ్వరరావు నమ్మబలికాడు. వారికి నకిలీ నియామకపత్రాలు ఇచ్చి ఇద్దరి వద్ద రూ.8 లక్షలు తీసుకున్నాడు. మోసపోయామని తెలుసుకున్న బాధితులు ఫిర్యాదు చేయడంతో ఎస్సై కేసు నమోదు చేశారు. నిందితుడిని గురువారం పాతపట్నం కోర్టులో హాజరుపరిచగా 14 రోజులు రిమాండు విధించినట్లు పేర్కొన్నారు.

ముగిసిన విజ్ఞాన వేడుక

పుస్తక మహోత్సవం విజయవంతం

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో ఏడురోడ్లకూడలి దరి నగర పాలక సంస్థ క్రీడా మైదానంలో గత పది రోజులుగా రాష్ట్ర సాంస్కృతిక శాఖ, గ్రంథాలయ పరిషత్ సహకారంతో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సిక్కోలు పుస్తక మహోత్సవం గురువారం ముగిసింది. కాళీపట్నం రామారావు మాస్టారు సాహిత్యవేదికపై కళింగాంధ్ర యాస-భాష అనే అంశంపై సదస్సు జరిగింది. ఆచార్య విష్ణుమూర్తి, నెట్టెం రమణ అధ్యక్షతన జరిగిన రెండు సదస్సులలో సిక్కోలు పుస్తక మహోత్సవం ఛైర్మన్, డాక్టర్ కణుగుల సుధీర్ మాట్లాడుతూ నేటి సమాజంలో పుస్తక పఠనాసక్తి తగ్గుతోందని తెలిపారు. అన్ని ఉద్యమాల్లాగే పుస్తక పఠనోద్యమం రావాల్సిన అవసరం ఉందన్నారు. కవులు, రచయితలను ఆయన అభినందించారు. విశ్రాంత ఆచార్యుడు వెలమల శిమ్మన్న, రచయితలు అట్టాడ అప్పలనాయుడు, కేతవరపు శ్రీనివాసరావు, బండి సత్యనారాయణ, ఉదయ్‌కిరణ్, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి కె.లక్ష్మయ్య, జనవిజ్ఞాన వేదిక తరపున గొంటి గిరిధర్, రామకృష్ణలు మాట్లాడారు.

❖ పత్తి సుమతి రాసిన డాన్‌డాన్ డార్విన్, ఎల్.ఎన్. కొల్లి రాసిన ఎకోస్ ఎంబార్క్, మొయిదా శ్రీనివాసరావు కరవాక పుస్తకాలను ఆవిష్కరించారు. జేవీవీ ఆధ్వర్యంలో సైన్సు ప్రయోగాలు నిర్వహించారు. పదిమంది కవులు, రచయితలు కవితా పఠనం జరిగింది. కుప్పిలి కామేశ్వరరావు, ప్రదీప్‌లు పాల్గొన్నారు.

❖ షణ్ముఖరావు మాస్టారు ఆధ్వర్యంలో కోటబొమ్మాళి మండలం కొత్తపల్లి స్కూల్ పిల్లలు డ్రగ్స్ వద్దు బ్రో ఒగ్గుకథ ప్రదర్శన, మూఢనమ్మకాలపై బ్రహ్మ సమాజం లఘునాటికను ప్రదర్శించారు. చివరిగా కొత్తూరుకు చెందిన హేమసూదన్ బృందం డప్పు విన్యాసాలు ఉర్రూతలూగించాయి.

'డ్రగ్స్ వద్దు బ్రో' నాటికను ప్రదర్శించిన కొత్తపల్లి పాఠశాల బాలికలు

సాగునీటి కష్టాలు

మెట్ట ప్రాంతాల్లో సాగు చేసిన వరి పంటకు సరిపడా సాగునీరు అందకపోవడంతో రైతులు పంటను కాపాడుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. గింజ తయారైన సమయానికి నీరులేకపోవడంతో సుదూర ప్రాంతాల్లో ఉన్న నీటిని ఇంజిన్లు ద్వారా పొలాలకు గొట్టాలు అమర్చి అందిస్తున్నారు. జి.లావేరు మండలం తాళ్లవలస పంచాయతీ శీర్లపాలెంలోని పలువురు రైతులు గడిచిన రెండు రోజులుగా ఇలానే చేస్తున్నారు. – న్యూస్‌టుడే, లావేరు

రాష్ట్రస్థాయి పోటీలకు సర్వం సిద్ధం

హరిపురం (మందస), న్యూస్‌టుడే: మందస మండలం సొండిపూడి ఉన్నత పాఠశాల క్రీడా మైదానం రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు వేదికైంది. శుక్రవారం నుంచి రెండు రోజులు (21, 22 తేదీల్లో) పోటీలు జరుగుతాయి. అందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు ప్రధానోపాధ్యాయుడు బి.సుందర్‌సోలమన్ తెలిపారు. 21 జిల్లాల నుంచి అండర్-14 బాలుర విభాగంలో 80, బాలికల విభాగంలో 80 మంది క్రీడాకారులు పాల్గొననున్నారని పేర్కొన్నారు. గురువారం సాయంత్రానికి ప్రకాశంతోపాటు పలు జిల్లాల నుంచి క్రీడాకారులు చేరుకున్నారన్నారు.

పోటీలకు వేదికైన సొండిపూడి మైదానం

కూత.. పతకాల మోత..!

జాతీయ స్థాయిలో సత్తా

అతి సాధారణ కుటుంబ నేపథ్యంతో కబడ్డీ ఆటలో జాతీయ స్థాయిలో పతకాలు అందుకుంటోంది **షేక్ హసీనా.** ఎచ్చెర్ల మండలం తోటపాలేనికి చెందిన ఈమె తండ్రి షేక్ మౌలానా భవన నిర్మాణం పనులు చేస్తుండగా. తల్లి ముంతాజ్ గృహిణి. రెండు సార్లు సీనియర్, ఒక సారి బీచ్ కబడ్డీ జాతీయ స్థాయి పోటీల్లో, మూడు సార్లు సౌత్ జోన్ యూనివర్సిటీ పోటీల్లో పతకాలు సాధించింది. ఎప్పటికైనా అంతర్జాతీయ వేదికపై సత్తాచాటడమే లక్ష్యంగా ముందుకెళ్తుంది.

– న్యూస్‌టుడే, పాతబస్టాండ్

జిల్లా అమ్మాయిలు కబడ్డీలో జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్నారు. క్రమంగా ఆటతీరును మెరుగుపరుచుకుంటూ ప్రతిచోటా పతకాలు సాధిస్తున్నారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ సహకారంతో ఆర్థిక అవాంతరాలను పక్కన పెట్టి జిల్లాకే పేరు తీసుకొస్తున్నారు.

పంజాబ్‌లో మెరిసింది

వజ్రపుకొత్తూరు మండలం పల్లిసారథికి చెందిన **సంగరి హర్షిత** తండ్రి భీమారావు బైక్ మెకానిక్‌గా పనిచేస్తుంటారు. గతేడాది రావులపాలెంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో స్వర్ణం అందుకున్న హర్షిత రాష్ట్ర స్థాయిలో జరిగిన సబ్ జూనియర్ పోటీల్లో పతకాలు సాధించిన జట్టులో కీలకమైన పాత్ర పోషించింది. 2024లో పంజాబ్‌లో జరిగిన సీనియర్ కబడ్డీ పోటీల్లోనూ మెరిసింది. ప్రస్తుతం ఈ ఏడాది జరగనున్న జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సన్నద్ధమవుతోంది.

రాష్ట్రస్థాయిలో స్వర్ణం

కోటబొమ్మాళి జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న **జె.చంద్రలేఖ** జాతీయ స్థాయి క్రీడల్లో పలు పతకాలు సాధిస్తోంది. మహారాష్ట్ర అమరావతిలో జరిగిన అండర్-14 జాతీయ పోటీల్లో, బిహార్ బుద్ధగయలో జరిగిన సబ్-జూనియర్ పోటీల్లో రాణించింది. రాష్ట్ర స్థాయిలో బాపట్లలో జరిగిన అండర్-14లో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టులో సత్తా చాటింది. బాపట్లలో జరిగిన సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీల్లో స్వర్ణం సాధించింది.

ఉత్తరాఖండ్‌లో ఉత్తమ ప్రతిభా

వజ్రపుకొత్తూరు మండలం పల్లిసారథికి చెందిన **తామాడ లీషా..** తండ్రి డిల్లేశ్వరరావు వ్యవసాయం చేస్తుండగా, తల్లి ధనలక్ష్మి గృహిణి. రావులపాలెంలోని రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకం అందుకుంది. కడపలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం సాధించింది. ఉత్తరాఖండ్‌లో జరిగిన జూనియర్ నేషనల్ ఛాంపియన్ షిప్‌లో సత్తా చాటి పతకం సాధించింది.

భూముల విషయమై కొట్లాట.. ఇద్దరికి గాయాలు

సారవకోట, న్యూస్‌టుడే: భూముల విషయమై జరిగిన కొట్లాటలో ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన సారవకోట మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు..గుమ్మపాడు పంచాయతీ అగదల గ్రామానికి చెందిన బమ్మిడి జయరామ్, ఆయన మేనల్లుడు హనుమంతు రామకృష్ణకు ఉమ్మడిగా 3.70 ఎకరాలున్నాయి. తన పేరు మీద ఉన్న భూముల్లో కొన్నేళ్లుగా రామకృష్ణ సాగు చేస్తున్నా పంట లాభాలు ఇవ్వడం లేదని జయరాం గతంలో నిలదీశారు. ఇద్దరి మధ్య 20 ఏళ్లుగా తగాదా కొనసాగుతోంది. పాతపట్నం న్యాయస్థానంలో కేసు నడుస్తోంది. రామకృష్ణ ఈ నెల 17న 70 సెంట్ల విస్తీర్ణంలో, జయరాం 70 సెంట్ల విస్తీర్ణంలో ఈనెల 19న వరిచేను కోత చేశారు. గురువారం మిగతా పంట కోత కోస్తున్న సమయంలో ఇరువర్గాల మధ్య తగాదా పెరిగి కర్రలు, కత్తులతో దాడులు చేసుకున్నారు. రామకృష్ణతో పాటు అతని భార్య జలజాక్షి, బావమరిది నాగభూషణ తనను కర్రలతో కొట్టి, కత్తితో గాయపరిచినట్లు జయరాం, కత్తితో తనను జయరాం పొడిచినట్లు నాగభూషణరావు ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.అనిల్‌కుమార్ తెలిపారు. రక్తపు మడుగులో ఉన్న జయరాంను బుడితి ఆసుపత్రికి అక్కడి నుంచి శ్రీకాకుళం తరలించారు. నాగభూషణ గాయాలతో నరసన్నపేట ప్రభుత్వాసుపత్రిలో చేరినట్లు పేర్కొన్నారు.

గంజాయితో ఒకరి అరెస్టు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: కాశీబుగ్గలో గంజాయితో ఒడిశాకు చెందిన మినకంఠన్ నాయక్‌ను గురువారం అరెస్టు చేసినట్లు ఎస్సై నరసింహామూర్తి తెలిపారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా చెల్లిగూడ ప్రాంతానికి చెందిన మినకంఠన్ సరకును రైలు ద్వారా చెన్నై తరలించేందుకు పలాస రైలు నిలయానికి వస్తుండగా అరెస్టు చేశామని పేర్కొన్నారు. అతని వద్ద నుంచి 17.76 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎస్సై చెప్పారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	145	245	265

విలువల సమాజ నిర్మాణం తత్వశాస్త్రంతోనే సాధ్యం

ప్లేటో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వీసీ ఆచార్య కె.ఆర్.రజని

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: విలువల గల సమాజం నిర్మాణం తత్వశాస్త్రంతోనే సాధ్యమని డా.బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.ఆర్.రజని అన్నారు. వర్సిటీలో గురువారం తత్వశాస్త్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లేటో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ ఆధునాతన సాంకేతిక ప్రపంచంలో పారదర్శకత, జవాబుదారీతనం, సామాజిక బాధ్యతతో కూడిన సుపరిపాలన కొనసాగాలంటే తాత్విక ఆలోచనలు, సిద్ధాంతాలు ఎంతగానో అవసరమన్నారు. రిజిస్ట్రార్ బిడ్డికి అడ్డయ్య, ప్రధానాచార్యులు ఎం.అనురాధ, కె.స్వప్నవాహిని, సీహెచ్.రాజశేఖరరావు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: రోడ్డుపై రెండు తులాల బంగారు గొలుసు దొరికిన విద్యార్థి రోహిత్ పురి దాన్ని పోగొట్టుకున్న వ్యక్తికి అందించి తన నిజాయతీని చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గొల్లవీధిలో ఉంటున్న నేవీ మాజీ ఉద్యోగి దక్కత విశ్వనాథరెడ్డి, గురువారం తన మెడలో ఉండే బంగారు గొలుసును ఎక్కడో పోగొట్టుకున్నారు. తర్వాత గమనించి, వెతికినా దొరకలేదు. అదే వీధికి చెందిన లోక్‌నాథ్ పూరి కుమారుడు రోహిత్ పురికి అది దొరికింది. విద్యార్థి కుటుంబ సభ్యులకు తెలియజేయగా.. అది విశ్వనాథరెడ్డిదని తెలుసుకుని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ సమక్షంలో ఆయనకు అందించారు. ఈ మేరకు విద్యార్థిని ప్రభుత్వ విప్ అభినందించారు. తెదేపా నాయకులు కొండా శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బంగారు గొలుసు అందుకుంటున్న విశ్వనాథ్‌రెడ్డి, చిత్రంలో ప్రభుత్వ విప్ అశోక్

భక్తులకు ఇబ్బంది లేకుండా రథసప్తమి వేడుకలు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: వచ్చే ఏడాది జనవరి 25న జరిగే రథసప్తమి వేడుకల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. గురువారం ఈవో కార్యాలయంలో సమీక్షించారు. తొలుత ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న క్యూలైన్లు, వాహనాల పార్కింగ్ తదితర స్థలాలను పరిశీలించారు. గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వచ్చే రథసప్తమి వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అవసరమైన బందోబస్తుతో పాటు భక్తులకు అవసరమైన సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, ఆలయ ఈవో కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్యే శంకర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి తదితరులు

చలో విద్యార్థి.. విహార యాత్రకు..!

ఒక్కో విద్యార్థికి రూ.500 విడుదల

జిల్లాలో 34 పాఠశాలలకు అవకాశం

పొందూరు, సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: పాఠశాలల్లో విద్యార్థులకు తరగతి గదుల్లో చదువే కాకుండా విహార యాత్రలు చేయడం ద్వారా విజ్ఞానం, వినోదం కలిగే విధంగా ఉండాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఎంపిక చేసిన పాఠశాలల్లో విద్యార్థులకు సమీపంలో ఉన్న విహార కేంద్రాలకు పంపిస్తోంది. జిల్లాలో పీఎంశ్రీ పథకం కింద ఉన్న పాఠశాలలకు ఈ అవకాశం కల్పించింది. ఈ నెలాఖరులోగా విజ్ఞాన, విహార యాత్రలకు వెళ్లేందుకు నిధులు విడుదల చేసింది. ఒక్కో విద్యార్థికి రూ.500 చొప్పున కేటాయిస్తూ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్ల ఖాతాలకు సమగ్ర శిక్షా నుంచి నిధులు జమ చేశారు. ఒక్కో పాఠశాల నుంచి మొత్తం విద్యార్థుల్లో 8 శాతం మందికి మాత్రమే అవకాశం కల్పించారు.

❖ జిల్లాలో ఎంపిక చేసిన 34 పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో 8 శాతం మందికి అవకాశం కల్పించారు. చురుకైన 50 ఏళ్లలోపు ఎస్కార్ట్ ఉపాధ్యాయులను ఎంపిక చేసి ప్రతి పది మంది బాలురకు ఒక పురుష ఉపాధ్యాయుడు, పది మంది బాలికలకు ఒక మహిళా ఉపాధ్యాయిని ఎస్కార్ట్‌గా వ్యవహరిస్తారు. ఎస్ఏ-1 పరీక్షలు అనంతరం ఈ నెలాఖరులోగా ఈ కార్యక్రమాన్ని పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడికి వెళ్లాలన్న విషయాన్ని పాఠశాల వారీగా విద్యార్థుల సంఖ్యను పరిశీలించి పంపించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

❖ జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల విద్యార్థులను ఈ నెలాఖరులోగా విజ్ఞాన విహార యాత్రకు పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఖాతాల్లో రూ.7.94 లక్షల నిధులు జమ చేయడం జరిగింది. ఈ యాత్ర ద్వారా విద్యార్థులకు విజ్ఞానం, వినోదం దొరుకుతుంది. - ఎ.రవిబాబు, జిల్లా విద్యాశాఖాధికారి, శ్రీకాకుళం

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
రీజనల్ ఆఫీసు, శ్రీకాకుళం, సింహద్వారం దగ్గర, కిమ్స్ ఆసుపత్రి రోడ్డు, వెంకటాపురం జంక్షన్, శ్రీకాకుళం-532410, ఆంధ్రప్రదేశ్.
Mail Id: rso.rosrikakulam@unionbankofindia.bank.in, Ph:08942 270919
ఎంప్యానల్‌మెంట్ నోటీసు
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ప్రముఖ జాతీయ బ్యాంకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీకాకుళం ప్రాంతంలోని వారి శాఖలు/కార్యాలయాలు/ఏటీఎంల కోసం సిసిటివి, సెక్యూరిటీ అలారం, ఫైర్ అలారం, ట్రిమ్ లాక్ & బయోమెట్రిక్ యాక్సెస్ సిస్టమ్ వంటి భద్రతా పరికరాల సరఫరా, సంస్థాపన మరియు నిర్వహణ కోసం విక్రేతలు/సంస్థలను ఎంప్యానెల్ చేయాలని కోరుకుంటోంది. ఆసక్తిగల సంస్థలు/విక్రేతలు/సరఫరాదారులు మరిన్ని వివరాలు మరియు పత్రాల డౌన్‌లోడ్ కోసం మా బ్యాంక్ వెబ్‌సైట్ www.unionbankofindia.co.in లేదా ప్రభుత్వ టెండర్ల వెబ్‌సైట్ http:/eprocure.gov.inను సందర్శించవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎటువంటి కారణాలు చెప్పకుండా అన్ని దరఖాస్తులను తిరస్కరించే హక్కును కలిగివుంది.
తేది: 20-11-2025 సం/- అసిస్టెంట్ జనరల్ మేనేజర్

EENADU Classifieds

REAL ESTATE
PLOT FOR SALE
Global IT Economy Future City Bhogapuram. VMRDA & RERA Approved Open Plots for sale. Cont: 8639765271.

JOBS
విజయ్ కన్‌స్ట్రక్షన్స్ & కన్సల్టెంట్స్ ఆఫీస్ శ్రీకాకుళంలో పనిచేయుటకు AutoCAD పురుష అభ్యర్థులు మరియు సైట్ సూపర్ వైజర్స్ కావలెను. సంప్ర: 9849216416.
వెల్డర్ కావలెను శ్రీకాకుళం టౌన్‌లో ప్రముఖ స్వచ్ఛందసేవా సంస్థకు డైలీ Rs.1000/-+ భోజనం కలదు ఆసక్తిగలవారు సంప్ర: 9440370558

Vision buzz కంపెనీలో డోర్ టూ డోర్ మార్కెటింగ్ చేయడానికి యువతి యువకులు స్టాఫ్ కావలెను. డైలీ Payment ఇవ్వబడును. ✆ 9550109729.

FACULTY/ TEACHERS
Reputed English Medium School in Srikakulam Requires Experienced Teachers with fluency in English for higher classes to teach English, Mathematics and Social Studies. Contact: 8500944175.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

SECURITY GUARDS
కాకినాడ ఏరియాలో ఒంటిమామిడి ప్రాంతం ప్రముఖ కంపెనీలో సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మంచి జీతం భోజనం+ వసతి కలదు. డ్యూటీ: 8 గం॥ జీతం: 18,500/- 26 రో॥ ✆ 8374164245, 7893197794.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

ఆక్రమణకు యత్నం

– న్యూస్‌టుడే, కాశీబుగ్గ

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలోని ఇంగిలిగాం రెవెన్యూ పరిధి హుదుహుదు ఇళ్ల ప్రాంతంలోని ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవుతోంది. ఇటీవల పొక్లెయిన్‌తో చదును చేయడంతో ఆక్రమణ ప్రయత్నం వెలుగులోకి వచ్చింది. హుదుహుదు ఇళ్ల నిర్మాణానికి గతంలో మంత్రి అచ్చెన్నాయుడు శిలాఫలకం వేయగా.. దాని చుట్టూ ఎలాంటి నిర్మాణాలు జరగనందున ఆ స్థలం ఖాళీగా ఉంది. దీనిపై ఆక్రమార్కుల కన్ను పడింది. ● రామన్న రోడ్డులో హుదుహుదు ఇళ్ల ప్రారంభమైతే శిలాఫలకం ప్రాంతం గుండా రహదారి నిర్మించాల్సి ఉంది. ఇప్పటికే నిర్మాణాలు చేపట్టి నివాసముంటున్న కుటుంబాలకు ఇదే ప్రధాన మార్గం. రహదారి పక్కన విలువైన స్థలం కావడంతో ఆక్రమార్కులు ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిపై తహసీల్దార్ కల్యాణచక్రవర్తి మాట్లాడుతూ సిబ్బందిని పంపించి పనులు నిలుపుదల చేశామని పేర్కొన్నారు.

బతకనిద్దాం.. చదవనిద్దాం..

మందసలో సీడీపీవో పి.అరుణ ఆధ్వర్యంలో బేటీ బచావో.. బేటీ పడావో ప్రతిజ్ఞ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆడ పిల్లలను బాహ్య ప్రపంచం నుంచి ఎలా రక్షించుకోవాలి, కౌమార దశలో ఉన్న పిల్లల వ్యక్తిగత శుభ్రత గురించి వివరించారు. సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, మందస

సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం

ఆకాష్ తండ్రి తాతారావుకు చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ అశోక్

కవిటి గ్రామీణం, సోంపేట, న్యూస్‌టుడే: సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. గురువారం రామయ్యపుట్టుగలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 19 మంది బాధితులకు రూ.14,07,503 చెక్కులు అందజేశారు. ● ప్రమాదంలో గాయపడిన సోంపేటకు చెందిన గేదెల ఆకాష్ వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.1.2 లక్షల చెక్కును ప్రభుత్వ విప్ బాధితుడి తండ్రి తాతారావుకు అందజేశారు. కోదండరామస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు బీన ఆనందరావు, తెదేపా జనసేన మండలాధ్యక్షుడు ప్రదీప్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

సోంపేట: సోంపేట ఉపకేంద్రం పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఈఈ జి.యజ్ఞేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు సోంపేట, బెంకిలి, జింకిభద్ర తదితర గ్రామాల్లో సరఫరా ఉండదన్నారు.

'క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్'పై శిక్షణ

పలాస గ్రామీణం: గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో వసంత కుమార్ అన్నారు. పలాస ఎంపీడీవో కార్యాలయంలో 'క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్'పై సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షకులు రేవతీపతి, జీవన్, డిప్యూటీ ఎంపీడీవో వైకుంఠరావు పాల్గొన్నారు.

ఆహ్లాదం కబ్జా

★ నిర్లక్ష్యం నీడలో కంద్ర వీధి పార్కు

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

కాసేపు ఆహ్లాదకరంగా గడిపేందుకు పూర్తిస్థాయి స్వాంతన చేకూర్చే ప్రదేశం లేని పురపాలకసంఘం ఇచ్ఛాపురమే. ఇక్కడి ప్రజలకు మిగిలింది గాంధీపార్కు మాత్రమే. ఇచ్ఛాపురం పురపాలక సంఘంలో గాంధీపార్కుతోపాటు ఉన్న పార్కులన్నీ దస్త్రాలకే పరిమితమయ్యాయి. వాస్తవంగా కనుమరుగవుతున్నాయి.. ఇప్పుడా పరిస్థితిలోనే కంద్రవీధి పార్కు ఉంది. తొలి రెండు కౌన్సిల్ పాలక మండళ్లు ఈ పార్కును అభివృద్ధి చేద్దామని, ఆక్రమణలు జరగకుండా కాపాడుకుందామని చుట్టూ ప్రహరీ నిర్మించారు. అనంతరం వచ్చినవారు ఎవరూ దీని కోసం పట్టించుకోకపోవడంతో పనికిరాని మొక్కలతో నిండిపోయింది. తర్వాత ఆక్రమణలకు గురైంది.

గతంలో కాలనీలు ఏర్పాటు చేసినప్పుడు కాలనీ మధ్యలో, రహదారి పక్కన కొంత స్థలాన్ని ప్రజా అవసరాల కోసం కేటాయించేవారు. బెల్లుపడకాలనీ, జీఎస్‌సీ కాలనీ (కంద్ర), బెల్లుపడ అచ్చమ్మపేట కాలనీ ప్రాంతాల్లో ఇలానే స్థలాలు కేటాయించారు. వీటిలో బెల్లుపడ, బెల్లుపడ కాలనీల్లో ఆ స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి. ఇక జీఎస్‌సీ (గొర్లె శ్రీరాములు నాయుడు కాలనీ)లో రెండు చోట్ల అలా స్థలాలను విడిచిపెట్టగా.. ఒకటి పార్కుగా, మరొకటి మొక్కల పెంపకం చేపట్టే మధ్య విభజన వేదికగా ఉంచారు. వీటిలో పార్కు స్థలం చాలా విలువైనది. దీంతో అక్రమార్కుల కళ్లు పడ్డాయి. అందుకు పుర పాలకుల నిర్లక్ష్యం కూడా తోడైంది.)

● ఆర్థిక సంఘ నిధులతో పార్కులను అభివృద్ధి చేసుకునేందుకు ప్రభుత్వం నిర్దేశించినా, పాలకులు దానిని వదలి, ఇతరత్రా అభివృద్ధి కార్యక్రమాలకు వాటిని కేటాయించారు. అవి కూడా పూర్తికాలేదు. ఇదే అవకాశంగా రూ. కోట్ల విలువైన ఈ స్థలంలో ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. వాహనాలు నిలిపేందుకు, ఇళ్లల్లోని మురుగునీటిని వదిలేందుకు ఈ పార్కు స్థలాన్ని వినియోగిస్తున్నారు. పార్కును దశలవారీగా అభివృద్ధి చేసి, ప్రహరీ, మొక్కలు, కుర్చీలు ఏర్పాటు చేస్తే ఆక్రమణలు ఆగుతాయని ఆరు వార్డుల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

పార్కు స్థలంలో చెత్త

చర్యలు తీసుకుంటాం

పార్కులో ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే, చట్టపరమైన చర్యలుంటాయి. కౌన్సిల్ నిర్ణయం మేరకు గతంలో నిధులు కేటాయించి, పనులు చేయించారు. పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుంటాం. – ఎన్.రమేష్, పుర కమిషనర్, ఇచ్ఛాపురం

పార్కు వినియోగ ప్రాంతాలు:	సమీప ప్రాంత కుటుంబాలు:	జనాభా:
4, 5, 6, 11 వార్డులు	సుమారు 2 వేలు	సుమారు 8 వేలు

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9502198883 8008552704

?: బాహుదా వంతెనకు దక్షిణం వైపున ముళ్లపొదలు రోడ్డుపైకి విస్తరించాయి. – వి.నాగేశ్వరరావు, ఇచ్ఛాపురం
● ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జంగిల్ క్లియరెన్స్ చేపడతాం. – డి.విక్రమ్, ఏఈ, ర.భ.శాఖ, ఇచ్ఛాపురం – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

?: బి.గొనపపుట్టుగ, దూగానపుట్టుగ, మహంకాళీపుట్టుగ తదితర గ్రామాల్లో విద్యుత్తు స్తంభాలకు తీగ జాతి మొక్కలు అల్లుకోవడంతో సరఫరాలో సమస్యలు ఏర్పడుతున్నాయి. – దూగానపుట్టుగ గ్రామస్థులు ● జంగిల్ క్లియరెన్స్ చేసి వాటిని తొలగిస్తాం. – యు.శ్రీనివాసరావు, విద్యుత్తుశాఖ ఏఈ, కవిటి – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

తాత్కాలిక కాలువ నిర్మాణం

స్పందనకు వందనం

ఇచ్ఛాపురం పట్టణం సాయమ్మ దిరం వీధి వద్ద మురుగునీరు నిలిచిపోతోంది. ఈ సమస్యను 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా పురపాలకులకు నివేదించగా, వారు స్పందించారు. రోడ్డు నిల్వ ఉండకుండా అడ్డంకులు తొలగించి, కచ్చాకాలువను నిర్మించారు. ఈ ప్రాంతం రైల్వే పరిధిలో ఉండటంతో పూర్తి శాశ్వత పరిష్కారం జరగడం లేదు. రైల్వే అధికారులు స్పందించి, శాశ్వత పరిష్కారం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

రోడ్డు అంచునే.. ప్రమాదం

ఇచ్ఛాపురం నీలకంఠేశ్వర వీధిలో శివాలయం పక్కనే, రోడ్డుకు ఆనుకుని విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు చేశారు. తక్కువ ఎత్తులో ఉండటం, విద్యుత్తు తీగలు దిగువకు వేలాడుతుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు పాఠశాలలకు విద్యార్థులు ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. నియంత్రికకు దిగువ ఉన్న కాంక్రీట్ దిమ్మకు ఆనుకొని కాలువ ఉంది. సమస్యను విద్యుత్తు ఏఈ గోవిందరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

చిన్న వర్షానికే బురద

ముచ్చింద్ర సమీపంలో పాఠశాలకు వెళ్లే దారి మురుగుతో అధ్వానంగా ఉంది. దీంతో విద్యార్థులు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. చిన్న వర్షం పడితే చాలు దారంతా బురదమయమై రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. ఈ విషయమై పంచాయతీరాజ్ శాఖ జేఈ ధనుంజయను వివరణ కోరగా గ్రామ నిధులు మంజూరయ్యాయని, వర్షాలు తగ్గాక త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

చెత్త వేయాల్సింది ఇక్కడే..

భైరిపురంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వృథాగా ఉంది. గ్రామంలో చెత్తను వీధుల్లో, రోడ్డుకు ఇరు వైపులా వేస్తున్నారు. చెత్తను సంపద కేంద్రానికి తరలించి కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై డిప్యూటీ ఎంపీడీవో వరప్రసాద్‌ను వివరణ కోరగా పరిశీలించి చెత్త నుంచి సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

రాకపోకలకు అవస్థలు

ఇచ్ఛాపురం పుర పరిధి పూరేటి వీధి ముఖద్వారంలో ఉన్న చిన్న కల్వర్టు ప్రమాదకరంగా మారింది. ఈ వీధిలో కొత్తగా సిమెంటురోడ్డు వేయడంతో ఎత్తుగా మారింది. ప్రధానవీధి పల్లంలో ఉంది. ఈ రెండింటిని కలిపి, కాలువపై పలకలు అమర్చారు. అవి ఏటవాలుగా ఉండటం, నాసిరకం కావడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ విషయమై పుర కమిషనర్ నల్ల రమేష్ స్పందిస్తూ, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

హెచ్చరిక బోర్డులు పెట్టరూ..

పలాస-కాశీబుగ్గ పురపాలిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి వివేకానందకాలనీ రోడ్డు వరకు కాలువలు ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. పాత ఆబ్కారీ శాఖ కార్యాలయం వద్ద రోడ్డు పక్కనే ఉన్న కాలువ మొక్కలతో నిండిపోవడంతో అటుగా వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. అధికారులు మలుపులు, కూడళ్ల వద్ద రహదారుల వద్ద హెచ్చరిక బోర్డులు, వేగనియంత్రికలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పలాస

సేవే మార్గం.. ప్రేమే నిత్యం

పలాస సత్యసాయిసేవా సమితిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

ఇచ్ఛాపురం సత్యసాయి పూజామందిరం

ఇచ్ఛాపురం, పలాస, న్యూస్‌టుడే: సమాజ సేవ, దీనులను ఆదుకునే మానవత్వంలోనే దైవసేవ ఉందని ప్రవచించిన భగవాన్ సత్యసాయిబాబా సూక్తులను ఆచరణలో పెడుతున్నామని ఇచ్ఛాపురం సత్యసాయి సేవాసమితి కన్వీనర్ ఆర్.గోపాలరావు తెలిపారు. గురువారం ఇచ్ఛాపురం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు అందించారు. తొలుత సాయిమందిరంలో పూజలు నిర్వహించారు. డా.దేవేంద్ర రెడ్డి, డా.అనూష, డా.నీలిమ పాల్గొన్నారు. ● పలాసలో సత్యసాయి బాబా శతవర్ష జయంత్యుత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మూడో రోజు సత్యసాయి సేవాసమితి ఆవరణలో పాదుకలు, సత్యసాయి విగ్రహానికి ఎమ్మెల్యే గౌతు శిరీష పూజలు చేశారు. మహిళా సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించారు. కన్వీనర్ ఐ.తిరుమలరావు, సేవాసభ్యులు పి.కౌంతేయుడు, శ్రీనివాసరావు, కొండలరావు, కామేశ్వరరావు పాల్గొన్నారు.

శిర్డీ సాయి మందిర వార్షికోత్సవం

బుడ్డెపుపేటలో శిర్డీ సాయి మందిర 19వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు సాయి మాల ధారణ పూర్తి చేసిన 40 మంది స్వాములు భజనలతో తిరువీధి కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు.
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

పేదలకు దుప్పట్ల పంపిణీ

సోంపేట, మందస: సత్యసాయి శతజయంత్యుత్సవాల సందర్భంగా సోంపేట సత్యసాయి మందిరంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారి మల్లా సర్వేశ్వరరావు, రమా దంపతులు, కుమారుడు మల్లా ఫణీంద్ర, ప్రజ్ఞ దంపతులు పేదలకు 100 దుప్పట్లు పంపిణీ చేశారు. సత్యసాయి ప్రత్యేక పూజల్లో కుటుంబ సభ్యులతో కలిసి సర్వేశ్వరరావు పాల్గొన్నారు. సత్యసాయి సేవాసమితి కన్వీనర్ బాపూజీ, ప్రతినిధులు కృష్ణారావు, తిరుమలరావు పాల్గొన్నారు. ● మందసలో సాయి బాబా సేవాదళ్ సభ్యులు పేదలకు 105 దుప్పట్లు, 100 చీరలు పంపిణీ చేశారు. సేవా సమితి, యూత్ సమన్వయకర్తలు ఈశ్వరరావు, శివ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కవిటి గ్రామీణం, ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మాణిక్యపురం జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి అయిదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి అండర్-14 సాఫ్ట్‌బాల్ బాలబాలికల పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు మజ్జి వైకుంఠరావు తెలిపారు. సుజాత జన్ని, సమీరా సాహు, శివం సాహు, మర్రిపాటి హర్షవర్ధన్, డొక్కరి నాని ఎంపికయ్యారు. వీరు ఈనెల 22న పులివెందులలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా వారిని, వ్యాయామోపాధ్యాయులు రవికుమార్ మహంతి, ఎం.తోటారావులను పాఠశాల వద్ద అభినందించారు. ★ ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఖోఖో పోటీల్లో డొంకూరు విద్యార్థులు సత్తాచాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు జి.హేమ కుమారి తెలిపారు. బాలికల విభాగంలో డి.మీనా, బి.ధనలక్ష్మి, బాలురు విభాగంలో డి.రవి, బి.దేవరాజు, బి.నవీన్, డి.జశ్వంత్ సత్తాచాటారని, వీరంతా ఈనెల 22 నుంచి 23 వరకు కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. గురువారం పాఠశాలలో విజేతలను అభినందించారు. పాఠశాల ఛైర్మన్ జానకిరావు, పాఠశాల సిబ్బంది వెంకటరమణ, గోవిందరావు, సువర్ణ, కృష్ణారావు, శ్రీహరి, వ్యాయామోపాధ్యాయుడు వజీర్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం గ్రామీణం: ఖోఖోకు ఎంపికైన విద్యార్థులతో సిబ్బంది

ఘనంగా అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం

బలరాంపురం మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల హక్కుల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు జి.యశోద, పాఠశాల సిబ్బంది శంకరం, దుర్గాప్రసాద్ గౌరీ, రవికుమార్ సంతోష్ పాల్గొన్నారు.
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

ఆధ్యాత్మిక శోభ

కవిటి గ్రామీణం: బల్లిపుట్టుగలో కార్తిక మాసాన్ని పురస్కరించుకొని భవానీశంకర్ ఆలయంలో 108 దీపాలు వెలిగించి గురువారం పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణమంతా శివనామస్మరణతో మార్మోగింది.

తెలుగు సాహిత్యంపై అవగాహన

సోంపేట: తెలుగు సాహిత్యంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని పాతపట్నం డిగ్రీ కళాశాల తెలుగు ఉపన్యాసకుడు డి.శివరామకృష్ణ సూచించారు. గురువారం బారువ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపల్ రామకృష్ణ అధ్యక్షతన 'తెలుగు సాహిత్యం- అవగాహన' కార్యక్రమం నిర్వహించారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ బి.మురళీమోహనరావుకు గురువారం మండలంలోని రెవెన్యూ సహాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని, అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు.

వరి చిరు సంచుల క్షేత్ర సందర్శన

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: కవిటిలో నిర్వహిస్తున్న వరిలో చిరు సంచుల ప్రదర్శన క్షేత్రాన్ని గురువారం వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు ఉదయ్‌బాబు, మధుకుమార్, శ్రీనివాస్ సందర్శించారు. రైతులు చిరు సంచులతో ఆర్‌జీఎల్ 7034లో వచ్చే దిగుబడులను పరిశీలించారు. సోంపేట ఏడీఏ భవానీ శంకర్, ఏవో పి.శ్రీదేవి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత.. కవిటి గ్రామీణం, ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: బి.గొనపపుట్టుగకు చెందిన చరణ్, అనన్యల తల్లిదండ్రులు కిడ్నీ వ్యాధితో మరణించారు. విషయం తెలుసుకున్న కుసుంపురం కేంద్రంగా పని చేస్తున్న మాతృమూర్తి యువజన సంఘం సభ్యులు గురువారం చిన్నారులకు రూ.8 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సర్పంచి ప్రకాష్, సభ్యులు సురేష్, భాస్కర్, అశీష్, గ్రామపెద్దలు పాల్గొన్నారు. ★ ఇచ్ఛాపురం మండలం హరిపురం బొడ్డకాళి గ్రామానికి చెందిన పి.సోమయ్య తుపాను కారణంగా తనకున్న పెంకిటిల్లు గోడ కూలింది. విషయం తెలుసుకున్న జనసేన రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎల్.రాజేష్ రూ.5 వేలు ఆర్థిక సాయంతోపాటు నిత్యావసర సరకులు అందించారు.

చిన్నారుల విద్యావికాసానికి 'ప్రేరణ'

ప్రేరణమిత్రలతో యూనిసెఫ్ ప్రతినిధి, కళాశాల ప్రిన్సిపల్

పలాస పట్టణం, న్యూస్‌టుడే: ఆరోగ్యం, పోషకాహారం, నీరు-పరిశుభ్రత, విద్య, చిన్నారుల రక్షణ ఈ అంశాలు యూనిసెఫ్‌కు ముఖ్య స్తంభాలని, అందులో భాగమైన ప్రేరణమిత్ర కార్యక్రమం చిన్నారుల విద్యావికాసానికి ఎంతో దోహదపడుతుందని యూనిసెఫ్ ప్రాంతీయ విద్యానిపుణుడు శేషగిరి మధుసూదనరావు అన్నారు. పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా జరిగిన ప్రేరణమిత్ర పైలట్ ప్రాజెక్టు కార్యశాల గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంతో యువతలో భాషానైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసం, సామాజిక స్పృహకు దోహదపడుతుందన్నారు. ప్రేరణమిత్రలంతా వారికి కేటాయించిన పాఠశాలలకు వారానికి రెండురోజులు వెళ్లి మార్చి 15 నాటికి మాడ్యూల్స్ పూర్తిచేయాలన్నారు. ప్రిన్సిపల్ జె.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

అల్పపీడనంతో రైతుల్లో గుబులు

★ కోత దశలో వరి పంట

– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

మొన్న వచ్చిన మొంథా తుపాను ప్రభావం రైతులపై తీవ్రంగా పడింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట నీట మునగడంతో అన్నదాతలు లబోదిబోమన్నారు. ఆ ముప్పు నుంచి తేరుకుని కోతలకు సిద్ధమవుతున్న తరుణంలో మరో అల్పపీడనం ఏర్పడి ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడంతో వారిలో మళ్లీ ఆందోళన మొదలైంది. గురువారం వాతావరణం ఒక్కసారిగా మారి ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని అక్కడక్కడా చినుకులు పడటంతో హలదారులు ఇప్పటికే కోసిన పంటను తడవకుండా కాపాడుకునేందుకు పరుగులు తీశారు.

నియోజకవర్గాల్లో పంటల సాగు వివరాలు	
మండలం	నాట్లు వేసినవి (ఎకరాల్లో)
కవిటి	2,791
ఇచ్ఛాపురం	5,950
కంచిలి	7,003
సోంపేట	7,423
పలాస	9,757
మందస	14,866
వజ్రపుకొత్తూరు	5,817

★ ఉన్న పంటను కోతలు కోసి ధాన్యం ఇంటికి తీసుకొచ్చే సమయంలో మేఘాలు, వర్షాలు భయపెడుతున్నాయి. దీనిపై వ్యవసాయశాఖ ఏడీ భవానీ శంకర్‌ను వివరణ కోరగా వాతావరణం తగ్గినంత వరకు కోతలు వాయిదా వేసుకోవాలని, కోసి పంటను కుప్పలు వేసి జాగ్రత్త చేసుకోవాలని సూచిస్తున్నారు.

ఏటా ఇదే పరిస్థితి..

ఏటా పంటలు చేతికొచ్చే తరుణంలో తుపాన్ల తాకిడి అధికంగా ఉంటుంది. అక్టోబరు రెండో వారం నుంచి డిసెంబరు వరకు పంటలకు వరుణుడి గండం తప్పడం లేదు. వరి నాట్లు వేసిన తర్వాత వర్షాలు లేక ఇంజిన్ల సాయంతో పంటలను అష్టకష్టాల మీద కాపాడుకున్న రైతులు అనంతరం తుపాను వల్ల కొంత నష్టపోతున్నారు.

పది పరీక్షలకు సన్నద్ధంకండి

ఇచ్ఛాపురం: పదో తరగతి పరీక్షలో అత్యధిక ఉత్తీర్ణత, చక్కటి మార్కులు సాధించేలా విద్యార్థులను సమాయత్తపరచాలని, దానికి సన్నద్ధం కావాలని ఎంఈవోలు కె.అప్పారావు, ఎస్.విశ్వనాథం పిలుపునిచ్చారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో గురువారం స్కూల్ కాంప్లెక్స్ అధ్యక్షులు, ఏఎంసీ సభ్యులు, సీఆర్‌ఎంటీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శనివారం జరగబోయే స్కూల్ కాంప్లెక్స్ అజెండాపై చర్చించారు. వంద రోజుల ప్రణాళిక అమలు, సీ, డీ విభాగాలు (వెనకబడిన) విద్యార్థులపై దృష్టి సారించాలని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు సక్రమంగా చేపట్టాలి

కంచిలి: ధాన్యం కొనుగోలు సక్రమంగా చేపట్టాలని తహసీల్దార్ రమేష్ కుమార్ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో మిల్లర్లు, ధాన్యం కొనుగోలుదారులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో తిరుమలరావు, వ్యవసాయ, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖాధికారులు పాల్గొన్నారు.

సమైక్యంగా కదులుదాం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఎలాంటి ఒడుదొడుకులు ఎదురైనా సమైక్యంగా కదలి, క్రైస్తవ సమాజాన్ని ముందుకు సాగిద్దామని వైకాపా రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ప్రధాన కార్యదర్శి డా.పత్తి అన్వేష్ పిలుపునిచ్చారు. గుంటూరు కృప మినిస్ట్రీస్ ప్రాంగణంలో గురువారం జరిగిన అఖిల భారత పాస్టర్స్ ఫెడరేషన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అఖిలభారత పాస్టర్స్ ఫెడరేషన్ మీడియా, సమాచార సమన్వయకర్తగా తనను నియమించారని అన్వేష్ తెలిపారు.

మాజీ మంత్రి పరామర్శ

హరిపురానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు వై.సోమేశ్వరరావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు మాజీ మంత్రి గౌతు శ్యామసుందరశివాజీ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వై.ఎస్.ఎన్.మూర్తి, బి.దుర్యోధనరావు, డి.తాతారావు, కర్రెయ్య, మురళీకృష్ణ, రుద్రయ్య పాల్గొన్నారు.
– న్యూస్‌టుడే, హరిపురం (మందస)

సేవలతోనే గుర్తింపు

ఉపాధ్యాయులకు వారు చేసిన సేవలే గుర్తింపునిస్తాయని ఎంఈవోలు ఎస్.శివరాం ప్రసాద్, కె.చిట్టిబాబు అన్నారు. బసవపుట్టుగ ప్రాథమిక పాఠశాలలో సేవలందించి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు బి.సంధ్య, ఎన్.శాంతమూర్తిలను పాఠశాల సిబ్బంది, గ్రామస్థులు గురువారం సత్కరించారు. ప్రధానోపాధ్యాయిని జీవన జ్యోతి పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు

కంచిలి, న్యూస్‌టుడే: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థులు, నిరుద్యోగులు వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలంటూ ఎంటీఎస్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.కామేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు సూచించారు. గురువారం కంచిలి గ్రంథాలయ శాఖలో గ్రంథాలయ ముగింపు వారోత్సవాలు చేపట్టారు. ఈ సందర్భంగా చేపట్టిన కార్యక్రమాల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రసాద్‌రావు, రామారావు, సుధాకర్, ఇప్పిలి కృష్ణారావు, కొత్తకోట శేఖర్, జి.రామదాసు, వీరాస్వామి, సారథి పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింట్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తరుపున సదరు బ్యాంకు యొక్క పలాస మెయిన్ బ్రాంచి Chief Manager వారి భోగట్టాపై ఇస్తున్న పబ్లిక్ నోటీసు.

పలాస పట్టణ కాపురస్తులు మల్లా సూర్యనారాయణ గుప్తా గారి కుమారుడు మల్లా సంతోష్‌కుమార్ నా క్లయింటు బ్యాంకు నుండి తీసుకొనబోవు రుణమునకు హామీగా అతని స్వాధీన, హక్కు అనుభవములో గల ఈ దిగువ షెడ్యూలులో వివరించిన ఆస్థిని తాకట్టు పెట్టుటకు ప్రతిపాదించి యున్నారు. సదరు ఆస్థికి సంబంధించిన లింకు డాక్యుమెంటు తేది: 08-04-2013 గల కాశీబుగ్గ సబ్‌రిజిస్ట్రారు ఆఫీసు దస్తావేజు నెంబర్ 1526/2013 గల రిజిష్టర్డ్ క్రయ దస్తావేజు ఒరిజినల్‌ను అతను పోగొట్టుకొని యున్నారని తెలియజేసియున్నారు. కావున సదరు ఆస్థిపై వేరెవరికైనా ఎట్టి హక్కు గాని, ఆసక్తి గాని ఉన్న యెడల అట్టివారు ఈ నోటీసు ప్రచురింపబడిన ఏడు రోజులు లోగా వారి యొక్క ఆక్షేపణలను నాకు గాని, నా క్లయింటునకు గాని తెలియజేయవలెను. లేని యెడల సదరు ఆస్థిపై వేరెవరికి ఎట్టి హక్కులు లేవనియున్నూ మరియు సదరాస్తిని సదరు మల్లా సంతోష్‌కుమార్ గారు నా క్లయింటు బ్యాంకులో తాకట్టు పెట్టుటకు ఎవ్వరికీ ఎట్టి అభ్యంతరములు లేవనియున్నూ భావించబడునని ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు

పలాస మండలం, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పురుషోత్తపురం గ్రామం, సర్వే నెం. 83/2 మరియు 88/6లో ఎల్లమ్మ వీధి డోర్ నెం: 15-3-1054, అసెస్‌మెంట్ నెం. 1084017681 గల తూ॥ప॥ 25½ అడుగులు, ఉ॥ద॥లకు 50 అడుగులు అనగా 141.66 చ॥గ॥లు లేదా 1275 చ॥అ॥ గల విస్తీర్ణంలో నిర్మింపబడిన గ్రౌండ్ ఫ్లోర్, మొదటి మరియు రెండవ అంతస్తు గల డాబా ఇంటికి హద్దులు: తూ॥ పెంట శశిభూషణరావు గారి స్థలం. ద॥ వీధి రోడ్డు. ప॥ కోరాడ శ్రీనివాసరావు గారి బిల్డింగ్. ఉ॥ పెంట వెంకటరమణ గారి పునాది.

రత్నాల శ్రీనివాసరావు, B.Com., D.P.M., B.L.,
అడ్వకేట్, గాంధీనగర్-2, పలాస-532 221. సెల్: 94905 57171

(c) eenadu

టెక్కలి

●టెక్కలి ●నరసన్నపేట ●పాతపట్నం

ఇదీ చేపల బజారు..!

కోటబొమ్మాళిలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన చేపల బజారు దుస్థితి ఇదండీ. నిత్యం చేపల విక్రయాలు జరిగే బజారు పరిసరాలు పనికిరాని మొక్కలతో అధ్వానంగా మారాయి. పంచాయతీ అధికారులు కనీస నిర్వహణ చర్యలు చేపట్టడం లేదని, ఇప్పటికైనా స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో ఫణీంద్రకుమార్ మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

ఘనంగా పడి పూజ

మండల కేంద్రం మెళియాపుట్టిలో జనసేన నాయకులు కొరికాన రవికుమార్ దంపతుల ఆధ్వర్యంలో మహా పడిపూజ ఘనంగా చేపట్టారు. కేరళకు చెందిన ఎం.ఎన్.రేజికుమార్ అర్చకులు ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు.

కార్యక్రమంలో అయ్యప్ప స్వామి భక్తులు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, మెళియాపుట్టి

బాధితులకు సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

నరసన్నపేట, న్యూస్‌టుడే: ఆపద సమయంలో ఆర్థిక తోడ్పాటు అందించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో గురువారం నియోజకవర్గానికి చెందిన 47 మంది లబ్ధిదారులకు రూ.25.17 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. తెదేపా నియోజకవర్గ కన్వీనరు బగ్గు అర్చన, పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

కార్యకర్తలకు అండగా తెదేపా

పాతపట్నం, న్యూస్‌టుడే: కార్యకర్తల కుటుంబాలకు తెదేపా అండగానే ఉంటుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మెళియాపుట్టి మండలం ముక్తాపురం గ్రామానికి చెందిన యోగేశ్వరరావు రహదారి ప్రమాదంలో మరణించారు. ఆయన కుటుంబ సభ్యులకు పార్టీ తరఫున రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కు గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో అందజేశారు. తెదేపా నాయకులు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయంలో చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణకు రూ.50 వేలు ప్రోత్సాహం

హిరమండలం: ప్లాస్టిక్ వ్యర్థాల పునర్వినియోగ పరిశ్రమ ఏర్పాటుకు యువత ముందుకొస్తే రూ.50 వేలు ప్రోత్సాహం నగదు అందజేస్తామని జడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు అన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో ఆర్.కాశీప్రసాదరావు అధ్యక్షతన గురువారం స్వచ్ఛ గ్రామ పంచాయతీలు-ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు.

దారులకు దండం.. ప్రయాణానికి గండం

– న్యూస్‌టుడే, కొత్తూరు

రహదారుల అభివృద్ధికి గత వైకాపా ప్రభుత్వం తీసుకున్న చర్యలు శూన్యం. కొత్త రోడ్లు వేసిన దాఖలు లేవు సరికదా అప్పటి తెదేపా సర్కారు ప్రారంభించిన రహదారి పనులను పూర్తిచేయకపోవడంతో రోడ్లన్నీ గుంతలతో అధ్వానంగా మారాయి. దీంతో ప్రజలు రాకపోకలు అష్టకష్టాలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో రోడ్లను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

● కొత్తూరు మండలంలోని పాతపాడు రహదారి అసంపూర్తిగా వదిలేశారు. రాష్ట్ర సరిహద్దు గ్రామాలతో పాటు, ఒడిశా వాసులకు హిరమండలం మీదుగా శ్రీకాకుళం వెళ్లేందుకు ఇదే దగ్గర దారి. పీహెచ్ రహదారిలోని నివగాం కూడలి నుంచి పాతపాడు గ్రామానికి రెండు కిలోమీటర్ల మేర రహదారి, వంతెనను నిర్మించాలని ఏడేళ్ల కిందట తెదేపా ప్రభుత్వం రూ.1.2 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించింది. ఒక లేయర్ మెటల్ వేశారు. వంతెన నిర్మాణాన్ని పూర్తి చేసి సుమారు రూ.40 లక్షలు ఖర్చు చేశారు. ఎన్నికల అనంతరం వచ్చిన వైకాపా సర్కార్ పూర్తి చేయకుండా వదిలేసింది.

కొత్తూరు: గుంతలతో అధ్వానంగా పాతపాడు రహదారి

● మెళియాపుట్టి మండలంలోని చింతపోలూరు నుంచి 10 గ్రామాలకు వెళ్లే పంచాయతీరాజ్ రహదారిని 5 కి.మీ నిర్మాణానికి రూ.కోటి అంచనాతో పనులు ప్రారంభించారు. కొంతవరకు చేసి వదిలేశారు.

● హిరమండలం మేజర్ పంచాయతీ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలో ప్రధాన అలికాం-బత్తిలి రహదారి అభివృద్ధికి రూ.25 లక్షలు మంజూరు చేశారు. పనులు ప్రారంభించి, అర్థాంతరంగా వదిలేశారు. ప్రధాన రహదారి కావడంతో నిత్యం పెద్ద సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు.

● ఎల్ఎన్‌పేట మండలంలోని ఏబీ రహదారి నుంచి సిద్ధాంతం గ్రామానికి వెళ్లే రోడ్డు నిర్మాణ పనులను మధ్యలోనే వదిలేశారు. 5 కి.మీ మేర పనులకు రూ.84 లక్షలు మంజూరు చేశారు. ఒక లేయర్ మెటల్ వేసి, రోలింగ్ చేసి అలాగే వదిలేశారు. రాళ్లపైనే రాకపోకలు సాగిస్తున్నారు.

రహదారి పనులు ప్రారంభిస్తాం..

పాతపాడు రహదారి పనులు పూర్తికి రూ.90 లక్షల నిధులు అవసరమని ప్రభుత్వానికి నివేదించాం. ఉపాధి నిధులు మంజూరుకు కృషి చేస్తాం. మూడు నెలల్లో పనులు ప్రారంభించి చర్యలు తీసుకుంటాం. సిద్ధాంతం, చింతలపోలూరు రహదారి, హిరమండలంలో ఏబీ రోడ్డు పనులు ప్రారంభించి పూర్తిచేస్తాం.

– రాధారాణి, సాగర్, డీఈఈలు పీఆర్, ఆర్అండ్‌బీ, పాతపట్నం, హిరమండలం

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయండి

జలుమూరు, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయిప్రత్యూష అన్నారు. జలుమూరు, కరవంజ రైతు సేవా కేంద్రాల్లో గురువారం ఆమె తనిఖీలు చేపట్టారు. దస్త్రాలను పరిశీలించారు. జలుమూరులో షెడ్యూల్ జాబిత సిద్ధంగా లేకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తి వివరాలు ఎప్పటికప్పుడు అంతర్జాలంలో పొందుపరచాలని ఆదేశించారు. తహసీల్దారు జె.రామారావు, వ్యవసాయాధికారి కె.రవికుమార్, సీఎస్ డీటీ జాఫర్ షరీఫ్, వ్యవసాయ సహాయకురాలు లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జలుమూరు రైతుసేవా కేంద్రంలో తనిఖీ నిర్వహిస్తున్న ఆర్డీవో సాయిప్రత్యూష, అధికారులు

కాలువల్లేక అవస్థ!

సారవకోట మండలం కొమ్ముసరియాపల్లి పంచాయతీ పెద్దగుజ్జువాడలో వీధి మధ్య చెరువు నీరు ప్రవహిస్తోంది. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు పేర్కొన్నారు. గ్రామానికి ఎగువన మంచినీటి కోనేరు ఉండటంతో వర్షాలకు నిండి వీధుల్లోకి నీరు పారుతోందని వాపోతున్నారు. సుమారు 6 నెలల పాటు ఇదే పరిస్థితి ఉంటుందంటున్నారు. కాలువలు లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమంటున్నారు. ఎంపీడీవోకు సమస్యను తెలియజేశామని, నిధులకు ప్రతిపాదనలు చేసినట్లు కార్యదర్శి సింహాచలం తెలిపారు. – న్యూస్‌టుడే, సారవకోట.

అల్లుకున్న నిర్లక్ష్యం

నందిగాం మండలం బెజ్జిపల్లి గ్రామంలో ఉన్న నియంత్రికకు ముళ్లతీగలు అల్లుకుంటున్నాయి. దీంతో విద్యుత్తు తీగలు రాపిడికి గురై తరచూ సరఫరా నిలిచిపోతుందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే వాటిని తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి ముళ్లతీగలను తొలగిస్తామని విద్యుత్తు శాఖ జేఈ నేతాజీ పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, నందిగాం

కాస్త ఇటు చూసి వెళ్లండి

నరసన్నపేట మండలం ఉర్లాం గ్రామ సచివాలయం వద్ద పరిస్థితి ఇది. రోడ్డంతా పనికిరాని మొక్కలతో పరిసరాలు, చెత్త, వ్యర్థాలను పేరుకుపోతున్నా వాటిని తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పలువురు మండిపడుతున్నారు. ఈ విషయాన్ని ఈవో పీఆర్డీ అల్లెన రమేష్ వద్ద ప్రస్తావించగా ఇటీవల సచివాలయం వద్ద చెత్తను తొలగించాలని ఆదేశించామని, చర్యలు తీసుకుంటామని తెలిపారు.

–న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం.

శిథిలం..భయం భయం

నందిగాం మండలం దేవళభద్ర పంచాయతీ జల్లపల్లి ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. దాని పక్కనే కొత్తది నిర్మించారు. విశ్రాంతి సమయం, సెలవు రోజుల్లో విద్యార్థులు ఈ పాత భవనంలోకి వచ్చి ఆడుకుంటున్నారని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల ఇంజినీరింగ్ అధికారితో మాట్లాడి శిథిల భవనాన్ని తొలగిస్తామని ఎంఈవో జి.నరసింహులు పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, నందిగాం

నిర్మించారు.. వదిలేశారు

పశువుల దాహార్తి తీర్చేందుకు పోలాకి మండలంలో 28 నీటి తొట్టెలు నిర్మించారు. ఇందు కోసం ఒక్కోదానికి రూ.30 వేలు ఖర్చు చేశారు. నీటి వనరులు అందుబాటులో లేనిచోట వీటిని నిర్మించడంతో వినియోగంలోకి రాక వృథాగా పోతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. దీనిపై ఏపీవో రమణ వద్ద ప్రస్తావించగా నీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, పోలాకి

అనర్హుల వివరాలు తొలగించండి.. సారవకోట: మృతి చెందిన, శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని తహసీల్దార్ విజయలక్ష్మి సూచించారు. మండల పరిషత్తు సమావేశ భవనంలో బీఎల్వోల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల డీటీ మురళి పాల్గొన్నారు.

సాగర తీరంలో మాక్ డ్రిల్

పోలాకి, న్యూస్‌టుడే: మండలంలోని సాగర తీర గ్రామాల్లో సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు సాగర్ కవచ్ నిర్వహించారు. రాజారాంపురం నుంచి చిన కొవిరిపేట వరకు ఉన్న గ్రామాల్లో భద్రతపై మాక్ డ్రిల్ చేశారు. ఎస్సై రంజిత్, పోలీసులు పాల్గొన్నారు.

స్థలాల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

కొత్తూరు: మెట్టూరు బిట్-1 పంచాయతీ వంశధార నిర్వాసిత కాలనీలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని నిర్వాసిత నాయకుడు బూర్లె శ్రీనివాసరావు అధికారులకు ఫిర్యాదుల విభాగంలో విన్నవించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉత్తమ ఫలితాలపై అభినందన

పాతపట్నం: ప్రభుత్వ పాఠశాలలో ప్రతిభ కలిగిన విద్యార్థులకు గుర్తింపు లభిస్తుందని సుడా ఛైర్మన్ కొరికాన రవికుమార్ అన్నారు. గోపాలపురంలోని శివానంద కుటీర్‌లో పడాల శ్రీనివాసులు మెమోరియల్ సొసైటీ వార్షికోత్సవం సందర్భంగా 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, పాఠశాలల ఉపాధ్యాయులనుఅభినందించి జ్ఞాపిక, ధ్రువపత్రాలు, బహుమతులు అందజేశారు.

ప్రభుత్వ కార్యాలయ నిర్మాణాన్ని అడ్డుకోవద్దు

జలుమూరు: జలుమూరు మండలం బొడ్డపాడులోని కాలనీ వద్ద ఖాళీగా ఉన్న స్థలంలో ప్రభుత్వ కార్యాలయం నిర్మాణాన్ని అడ్డుకోవద్దని సర్పంచి అంపోలు భాను ఆరోపిస్తున్నారు. దాన్ని పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి అధికారులు కేటాయించాలని ఆమె కోరుతున్నారు. దీనిపై తహసీల్దారు జె.రామారావు మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

బాలల హక్కులు పరిరక్షిద్దాం

నరసన్నపేట: బాలలహక్కుల పరిరక్షిద్దామని స్థానిక ఎస్‌వీసీటీ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. పంచాయతీ కార్యాలయం నుంచి మార్కెట్ వీధి వరకు సాగిన ర్యాలీలో విశ్వభారతి పాఠశాల విద్యార్థులు, లక్ష్మీనర్సింహ, కోలాట మహిళలు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై నిరసన

పాతపట్నం: పాతపట్నం మేజరు పంచాయతీ పరిధిలోని అచ్యుతాపురంలో వైకాపా ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై నిరసన తెలియజేస్తూ వీధిలో ర్యాలీ నిర్వహించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: అనాథ మహిళ మృతదేహాన్ని అంత్యక్రియలు చేసేందుకు టెక్కలికి చెందిన అభయం యువజన సేవాసంఘం ముందుకొచ్చింది. సంతబొమ్మాళి మండలం ఇజ్జువరం సమీపంలోని పంటపొలాల్లో మూడురోజుల కిందట స్వాధీనం చేసుకున్న మృతదేహాన్ని సంఘం ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది, పోలీసుల సహకారంతో అంత్యక్రియలు చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే : పాతనౌపడా గ్రామానికి చెందిన సాన జోగారావు(38) గురువారం తెల్లవారుజామున స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో పాతజాతీయ రహదారిపై అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈయన గతంలో డ్రైవరుగా పనిచేశాడు. మద్యానికి బానిసై స్థానికంగా రోడ్లపై తిరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఆయన మృతికి గల వివరాలు తెలియరాలేదు. జోగారావుకు భార్య, పిల్లలు లేకపోవడంతో సమీప బంధువుల ఇంటికి మృతదేహాన్ని తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని టెక్కలి పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే : కచేరీవీధిలో గతనెల 20న జరిగిన రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వృద్ధుడు కేసనకుర్తి ఈశ్వరరావు(62) చికిత్స పొందుతూ టెక్కలి జిల్లా ఆసుపత్రిలో బుధవారం రాత్రి మృతిచెందినట్లు ఎస్సై రాము తెలిపారు. సైకిల్‌పై వెళ్తున్న ఈయన్ను ఓ ద్విచక్రవాహనంతో ఢీకొనడంతో గాయపడ్డట్లు చెప్పారు. శ్రీకాకుళంలో చికిత్స అనంతరం ఇంటికి తీసుకొచ్చారు. మంగళవారం వృద్ధుడు అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల వ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా పలు పోటీల్లో విజేతలకు బహుమతులందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, బృందం

నరసన్నపేట: పుస్తక ప్రదర్శన పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ లత, విద్యార్థులు

పాతపట్నం: విజేతలతో ఉపాధ్యాయులు, అధికారులు, నిర్వాహకులు

పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్ల వితరణ

టెక్కలి పట్టణం, కోటబొమ్మాళి, నరసన్నపేట, న్యూస్‌టుడే: టెక్కలి జిల్లా ఆసుపత్రి పారిశుద్ధ్య కార్మికులకు గురువారం సత్యసాయి సేవ సంఘం సభ్యులు దుప్పట్లు పంపిణీ చేశారు. సూపరింటెండెంట్ సూర్యారావు, సాయి భక్తులు అన్నపూర్ణమ్మ, జగదీశ్వరరావు పాల్గొన్నారు. కోటబొమ్మాళిలో బాబాకు వంద రకాల పుష్పాలతో పూజలు చేశారు. నరసన్నపేటలోని బొడ్డవలసలో శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో నేత్ర వైద్యం శిబిరం నిర్వహించారు.

చెరువుల లెక్క.. ఇక పక్కా

– న్యూస్‌టుడే, ఎల్ఎన్‌పేట

చిన్నతరహా నీటి వనరులైన చెరువులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 7 విడత సర్వే కార్యక్రమాన్ని చేపట్టాయి. సర్వే బృందం క్షేత్రస్థాయికి వెళ్లి చెరువుల నంబరు, విస్తీర్ణం పొడవు, లోతు, ఎంత మేరకు ఆయకట్టుకు నీరు అందుతుంది, ఎంత మేర ఆక్రమణకు గురవుతున్నాయి తదితర వివరాలు నమోదు చేస్తున్నారు. ఇందుకోసం అధికారులకు శిక్షణ కూడా ఇచ్చారు. సర్వే పూర్తయితే కాసారాల లెక్క పక్కాగా తేలడంతో పాటు ఆక్రమణలు, ఇతర సమాచారం తెలియనుంది.

★ దాదాపుగా అన్ని మండలాల్లో సర్వే పూర్తివుతుంది. సాగునీటి చెరువులు చాలా చోట్ల ఆక్రమణకు గురయ్యాయి. చెరువు గట్లు, గర్భాలు ఆక్రమించి నిర్మాణాలు, పంట పొలాలుగా మార్చేస్తున్నారు. ఉపాధి పనులు చేస్తున్న సమయంలో ముందుగా ఆక్రమణలు గుర్తించి, తరువాత పనులు చేయాలని ఆదేశాలు ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీనిపై ఫిర్యాదులు వస్తున్నా చర్యలు తీసుకునేందుకు అధికారులు వెనుకంజ వేస్తున్నారు. తాజా సర్వేతో రెవెన్యూ శాఖ అధికారులు ఆక్రమణలు గుర్తిస్తున్నారు.

పాతపట్నం నియోజకవర్గ వివరాలు

మండలం	చెరువులు	సర్వే జరిగిన శాతం
ఎల్ఎన్‌పేట	211	83
హిరమండలం	644	73
పాతపట్నం	1,230	102
కొత్తూరు	465	73
మెళియాపుట్టి	985	107

ఎల్ఎన్‌పేటలో సర్వే చేస్తున్న అధికారులు

చివరి దశలో ఉంది..

సాగునీటి చెరువులు, బావులు, ఇతర నీటి వనరుల సర్వే చివరి దశకు చేరుకుంది. సర్వే పూర్తియిన వెంటనే ప్రభుత్వానికి నివేదికలు అందజేస్తాం. పూర్తి స్థాయిలో ప్రక్రియ సాగుతోంది.

–పి.అప్పారావు, డివిజన్ గణాంకాల అధికారి, టెక్కలి



(c) eenadu

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

ఆదిత్యుని సేవలో విదేశీయులు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అరసవల్లి సూర్యనారాయణస్వామిని పలువురు అమెరికన్లు గురువారం దర్శించుకున్నారు. శ్రీకాకుళం నగరంలో తమ స్నేహితుడి వివాహానికి హాజరైన వారు ఆదిత్యుని దర్శించుకున్నారు.

తెరపై ఈనాడు

• మారుతి: మట్క్ పోలీస్ • కిన్నెర: పాంచ్ మినార్ • కీర్తన • కాంతి • కీర్తి: ది గర్ల్‌ఫ్రెండ్ • ఎస్‌వీసీ (రామలక్ష్మణ): ప్రేమంటే • సూర్యమహల్: రాజు వెడ్స్ రాంబాయి • సన్‌మ్యాక్స్: 12ఎ రైల్వే కాలనీ • సరస్వతి: సిను
– న్యూస్‌టుడే, పాతశ్రీకాకుళం

25న చలో సరుబుజ్జిలి

వెన్నెలవలసలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న వాబ యోగి, గిరిజనులు

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: వెన్నెలవలస, బూర్జ మండలాల పరిధిలో థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మించేందుకు చేస్తున్న బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా ఈ నెల 25న చలో సరుబుజ్జిలి ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆదివాసీ నాయకుడు వాబ యోగి అన్నారు. వెన్నెలవలసలో ర్యాలీకి సంబంధించిన గోడ పత్రికను గురువారం ఆవిష్కరించారు. ఆదివాసీల పోడు భూములు, ప్రకృతిని రక్షించాలన్నారు. థర్మల్ ప్లాంట్ నిర్మించి బతుకులు బుగ్గిపాలు చేయొద్దన్నారు.

ఉపన్యాస పోటీలో పాల్గొన్న కాకినాడ ఆదిత్య జూనియర్ కళాశాల విద్యార్థులు

ఉత్సాహంగా ఉపన్యాస పోటీలు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో గురువారం కాకినాడ ఆదిత్య జూనియర్ కళాశాల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. 'కృత్రిమ మేధ వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అంశంపై విద్యార్థులకు నిర్వహించిన ఉపన్యాస పోటీలకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతిని ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థి డబ్ల్యూ.వి.ఎస్.నవీన్ మణికంఠ, ద్వితీయ బహుమతి రెండో ఏడాది చదువుతున్న ఎం. రూప్సి లక్ష్మి, తృతీయ బహుమతిని ద్వితీయ ఇంటర్ విద్యార్థి ఎం.దియాలు కైవసం చేసుకున్నారు. విద్యార్థులకు బహుమతులను కళాశాల ప్రిన్సిపల్ ఉర్లీశ్వరరావు, వైస్ ప్రిన్సిపల్ పి.ఆసిరినాయుడు తదితరులు అందజేశారు.

తీరాలంటే అవస్థలు..
తొలగాలి ఆక్రమణలు..!

న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

పట్టణంలో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు, పుర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు నిలిపేందుకు స్థలం లేకపోవడం, ఫుట్‌పాత్‌లు ఆక్రమించడం దుకాణాలు ఏర్పాటు చేయడంతో అవస్థలు తప్పడం లేదు.

• కర్రల గూడు, బడ్డీలు, తోపుడు బళ్లు, హోర్డింగ్ బోర్డులు ఫుట్‌పాత్‌లపై పెట్టేయడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు చూస్తున్నా.. పట్టించుకోవడం లేదు.

• కృష్ణాపురం నుంచి గేటు, ఓవర్ బ్రిడ్జి వరకు ప్రధాన రహదారికి ఆనుకుని ఫుట్‌పాత్, ప్రధాన కాలువపై బడ్డీలు ఏర్పాటు చేసి వ్యాపారాలు సాగిస్తున్నారు. కొంత కాలానికి ఆ దుకాణాలు

ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు

రూ. 6 నుంచి 10 లక్షల వరకు వేరొకరికి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

• ఫుట్‌పాత్‌లు, ప్రధాన కాలువలు సిమెంట్ పలకలతో కప్పేయడంతో పారిశుద్ధ్య పనులకు ఆటంకం ఉంటుంది లేదు. చిన్న వర్షానికే మురుగు నీరు రోడ్డుపైకి వచ్చేస్తోంది. ఆక్రమణ దుకాణాలను తొలగించి సమస్య పరిష్కరించాలని పురప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారులు చర్యలు తీసుకునేందుకు వస్తే అంతా ఒక్కటై ప్రజా ప్రతినిధులను కలిసి మాట్లాడుతుండటంతో అధికారులు వెనక్కి తగ్గాల్సిన పరిస్థితి నెలకొంది. ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆ దుకాణాల్లో కొన్ని తొలగించారు. ఆ తరువాత దృష్టి సారించకపోవడంతో మళ్లీ వ్యవహారం మొదటికి వచ్చిందని పలువురు చర్చించుకుంటున్నారు.

'త్వరలోనే రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించి, ట్రాఫిక్ సమస్య లేకుండా రహదారి విస్తరణ చేయిస్తాను. ప్రజలకు ఇబ్బందులు తీర్చిదిద్దే బాధ్యత నాది.' అని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు.

మేము న్యాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9441426248 8374620852

సమస్య: పుర పరిధిలోని సంతలు పేటకు వెళ్లే ప్రధాన రహదారిపై తుప్పలు, ముళ్ల పొదలు వస్తున్నాయి. ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. - రవి, స్థానికుడు

సమాధానం: తొలగిస్తాం. - జాన్సన్, మున్సిపల్ ఏఈ, ఆమదాలవలస

? : ఆమదాలవలస పట్టణంలోని పూజారిపేట, కంద్రపేట, పాతినవారివీధి, కొత్తకోటవారివీధి, బీసీనగర్, మెట్టక్కివలస తదితర ప్రాంతాల్లో దోమల బెడద ఎక్కువగా ఉంది. - మోహనరావు, ఆమదాలవలస

• : తగు చర్యలు తీసుకుంటాం. - టి.రవి, మున్సిపల్ కమిషనర్, ఆమదాలవలస
– న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

? : శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలోని పెద్దపాడు గాంధీనగర్‌లో పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా చేపట్టడం లేదు. - ఆదినారాయణ, పెద్దపాడు, గాంధీనగర్

• : పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. - పి.వి.వి.డి.ప్రసాదరావు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్
– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

పర్యావరణాన్ని పరిరక్షించాలి

గార, న్యూస్‌టుడే: గ్రామాల్లో పర్యావరణాన్ని రక్షించే సంస్కృతిని ప్రోత్సహించే విధంగా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈవో–పీ పరిసరాల పరిశుభ్రతపై పంచాయతీ సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. చెట్లు, మొక్కలు, నీటిని సంరక్షించాలన్నారు. గ్రామ స్థాయిలో పరిసరాల పరిశుభ్రతపై దృష్టిసారించాలన్నారు.

రేపు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

ఎచ్చెర్ల: కొయ్యాం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో ఆర్‌డీఎస్ఎస్, నిర్వహణ పనుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి 2 వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్తుశాఖ ఈఈ పైడి యోగేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీనివల్ల కొయ్యాం, కె.కె.నాయుడు, పీ.కె.నాయుడుపేట, బడివానిపేట, నిమ్మవానిపేట తదితర గ్రామాలకు విద్యుత్తు సరఫరా ఉండదని తెలిపారు.

రక్షణ ప్రశ్నార్థకం

ఆమదాలవలస మండలం నెల్లిమెట్ట గ్రామానికి వెళ్లే రహదారిలో రెల్లిగెడ్డపై ఉన్న వంతెనకు రక్షణ గోడ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు తెలిపారు. ఇసుక లారీలు ప్రయాణిస్తుండటంతో ఏ క్షణంలో వంతెన కూలుతుందోనని ఆందోళన చెందుతున్నారు. రక్షణ గోడ నిర్మించాలని కోరుతున్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని పీఆర్ డీఈ చంద్రశేఖర్ తెలిపారు.
–న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

పని చేయక 3 నెలలు

పొందూరు మండలం లక్ష్మీపేట గ్రామంలో ప్రాథమిక పాఠశాల పక్కన మంచినీటి బోరు మూడు నెలలు నుంచి పనిచేయకపోవడంతో గ్రామస్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి బాగు చేయాలని కోరుతున్నారు. ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా పంచాయతీ సిబ్బందితో మాట్లాడి చర్యలు చేపడతామన్నారు.
– న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

దుర్వాసన భరించలేకపోతున్నాం..

ఆనందపురం పంచాయతీ ఆబోతులపేట రహదారి పక్కన చెత్త నిల్వలు పేరుకుపోయాయి. దుర్వాసన భరించలేకపోతున్నామని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. రాత్రివేళల్లో దోమల బెడద అధికంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో రామకృష్ణను వివరణ కోరగా కార్యదర్శితో మాట్లాడి చెత్తను తొలగించే చర్యలు చేపడతామని తెలిపారు. – న్యూస్‌టుడే, జి.సిగడాం

కొమ్మలు తొలగించరూ

శ్రీకాకుళం నగరంలోని సూర్యమహల్ సమీపంలోని న్యూ కాలనీలో విద్యుత్తు శాఖ సిబ్బంది తీగలకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించి వదిలేశారు. దీంతో రహదారి ఇరుకుగా మారడంతోపాటు పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావును వివరణ కోరగా కొమ్మలు తొలగిస్తామన్నారు.
– న్యూస్‌టుడే, సూర్యమహల్ కూడలి (శ్రీకాకుళం నగరం)

మట్టి కుప్పలు.. తప్పని తిప్పలు

దమ్ము చేసే ట్రాక్టర్లు రోడ్డెక్కిన తరువాత చక్రాలకు అంటుకుని ఉండిపోయిన మట్టి.. రహదారిపై కుప్పలుగా పడిపోతోంది. ప్రయాణికులకు ఇది ప్రమాదకరంగా మారుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలతో జారి పడిన సందర్భాలు ఉన్నాయన్నారు. ఏటీ రోడ్డులో రొట్టవలస, కొండవలస, కొత్తకోట, మర్రిపాడు, పెద్దసవలాపురం, సింధువాడ, యరగాం, ఇప్పలపాలెం ఇతర గ్రామాల రహదారుల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఎంపీడీవో పావని వద్ద ప్రస్తావించగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. - న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

వైభవంగా పడిపూజ

తొంకలపర్తి(బూర్జ), న్యూస్‌టుడే: బూర్జ మండలంలోని తొంకలపర్తిలో బుధవారం రాత్రి అయ్యప్ప మహా పడిపూజ ఘనంగా జరిగింది. స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. భక్తి గీతాలను ఆలపించారు. కొండాపురం, పణుకువలస, టి.కె.రాజపురం, పాలకొండ(శివసన్నిధానం), తంపటాపల్లి, బుక్కూరు, ఇతర గ్రామాల స్వాములు పాల్గొన్నారు.

పుస్తకం మన నేస్తం

జాతీయ గ్రంథాలయాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. శ్రీకాకుళంతోపాటు, ఎచ్చెర్ల, ఆమదాలవలస నియోజకవర్గాల్లో పలు గ్రంథాలయాల్లో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందించారు. పుస్తకం నేస్తమని, గ్రంథాలయాలు అలవాటు చేసుకోవాలని వక్తలు తెలిపారు. – న్యూస్‌టుడే, బృందం

జి.సిగడాంలో..

కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో..

విజేతలతో ఎమ్మెల్యే గొండు శంకర్

ఇంటింటికీ తాగునీరు

పైప్‌లైన్ శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం, న్యూస్‌టుడే: ఇంటింటికి తాగునీరందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. గురువారం రణస్థలంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీరందించేందుకు పైప్‌లైనుకు శంకుస్థాపన చేశారు. సకాలంలో పనులు పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. సర్పంచ్ సంపు జిల్లా అధ్యక్షుడు పిన్నింటి భానోజీనాయుడు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జడ్పీ సీఈవో డి.సత్యనారాయణ అన్నారు. శ్రీకాకుళం గ్రామీణ మండలం పీజీపేటలో గురువారం ఇంటింటి చెత్త సేకరణలో పాల్గొని ప్రజలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. చెత్తను తరలించే సిబ్బందితో మాట్లాడి, వాహనాలను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయనతో పాటు ఎంపీడీవో ప్రకాశరావు, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చెత్తను తరలించే సిబ్బందితో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో సత్యనారాయణ

సత్యసాయి మందిరాల్లో యువజన దినోత్సవం

నగరంలో న్యూకాలనీలో సత్యసాయి మందిరం నిర్వహణలో పల్లకి ఉత్సవం

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: నగరంలో పలు ప్రాంతాల్లో సత్యసాయి మందిరాలు, భజనమండళ్లలో నిర్వహిస్తున్న పుట్టపర్తి సత్యసాయి బాబా శత జయంతి వేడుకల్లో భాగంగా గురువారం యువజన దినోత్సవం నిర్వహించారు. నగర సంకీర్తన, భజనలు చేశారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. భక్తి సంగీత విభావరి సత్యసాయి స్వర్ణదామకార్యాన, పల్లకి ఉత్సవం నిర్వహించారు.

'సీవిఐ సదస్సు బూటకం'

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: ఇటీవల విశాఖలో నిర్వహించిన సీఐఐ సదస్సు బూటకమని మాజీ సభాపతి తమ్మినేని సీతారాం వైకాపా... వెంకటరమణబాబు అన్నారు. గురువారం నివాసంలో మాట్లాడారు. 613 ఒప్పందాలు, 1.63 లక్షల ఉద్యోగాల ప్రకటనలో నిజం లేదన్నారు.

శ్రీనివాసులు రెడ్డికి సత్కారం

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: తెదేపా ఉత్తరాంధ్ర పరిశీలకుడు, రాష్ట్ర కనీసవేతన సలహా బోర్డు ఛైర్మన్ పి.శ్రీనివాసులు రెడ్డిని.. రాష్ట్ర ఎన్నికల విభాగ కార్యదర్శి ఎన్.వి.రమణ మాదిగ గురువారం శ్రీకాకుళంలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు.

సెల్ టవరు నిర్మించొద్దు

రణస్థలం, న్యూస్‌టుడే: జీఆర్‌పురంలోని వెంకటేశ్వర కాలనీ సమీపంలో చర్చి వెనక జనావాసాల వద్ద సెల్‌టవరు నిర్మాణాన్ని పలువురు మహిళలు అడ్డుకున్నారు. జనావాసాల మధ్య నిర్మించడం వల్ల రేడియేషన్ ఇబ్బందులుంటాయని నిర్మాణాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

తక్షణమే వీఆర్ ప్రకటించాలి

ఆనందపురంలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాలిశ్రీను

జి.సిగడాం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ, ఉద్యోగులకు తక్షణం 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆనందపురం, దేవరవలస, ఎంపెద్ద, జి.సిగడాం, సంతవురిటి వివిధ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు మెమో నంబరు 57ను అమలుపరచాలని, ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే పాత పింఛను విధానాన్ని వర్తింపజేయాలని కోరారు. బోధనేతర కార్యక్రమాలకు సంబంధించి ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలని ... డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి ... విద్యాశాఖ, చట్టం అమలుకు ముందు నియమించిన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపునిచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ధ్యానంపై అవగాహన శిబిరం

నగరంలో శ్రీచైతన్య పాఠశాలలో అవగాహన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: నగరంలో శ్రీచైతన్య పాఠశాలలో గురువారం పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో ధ్యానం, ప్రాణాయామం, పద్మాసనంలో కూర్చోవడంతో కలిగే మార్పులు సాధన వంటి అంశాలపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూమెంట్ కోఫరి బిందుమాధవ, ధనంజయరావు, దర్శరావు, ప్రణయ, కవిత, శ్రీదేవిలు పాల్గొని మాట్లాడారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నైపుణ్య కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: ఆమదాలవలస మండలంలోని దూసిపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌సెంటర్‌లో పలు కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ బి.జానకిరామయ్య గురువారం తెలిపారు. సైబర్ సెక్యూరిటీ, సోషల్ మీడియా ఎనలిస్ట్, జూనియర్ సూపర్ వైజర్లు, ఏసీ ఎస్.ఆపరేటర్ వంటి కోర్సుల్లో శిక్షణకు ఈ నెల 30లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7569077449కు సంప్రదించాలని కోరారు.

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలి

రణస్థలం, న్యూస్‌టుడే: కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలని రైతు సంఘం ఏపీ కార్యదర్శి పి.ప్రసాదరావు, కౌలు రైతుల జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ అన్నారు. గురువారం రణస్థలంలో విలేకర్లతో మాట్లాడారు. కూటమి సర్కారు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెండు విడతలుగా ఇచ్చిన అన్నదాత సుఖీభవ అసలు సాగుదారులైన కౌలు రైతులను విస్మరించిందన్నారు. వెంకటనాయుడు పాల్గొన్నారు.

సాగర్ కవచ్ తనిఖీలు

గార, న్యూస్‌టుడే: కొంగపట్నం-మత్స్యలేశం దీపస్తంభం వద్ద గురువారం సాగర్ కవచ్ తనిఖీలు జరిగాయి. మెరైన్ సి.ఐ. బి.ప్రసాదరావు పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. శ్రీకూర్మం కూడలి, మొగదలపాడు, కొంగపట్నం-మత్స్యలేశం సాగరతీరాలను పరిశీలించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఆటోడ్రైవర్లతో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ రామారావు

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: ఆటో చోదకులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ రామారావు హెచ్చరించారు. గురువారం నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. కాంప్లెక్స్ ఆవరణలోకి ఆటోలు ప్రవేశించకూడదన్నారు. రిమ్స్ ఆసుపత్రి నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ఎనిమిది ... మద్యం తాగి నడిపితే జైలు శిక్ష తప్పదన్నారు. లైసెన్సు, బీమాతోపాటు యూనిఫాం ధరించాలన్నారు.

ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు

గార, న్యూస్‌టుడే: గార మండలం గోరువానిపేటలో గురువారం సత్యసాయి శతవర్ష వేడుకలు అరసవల్లి సత్యసాయి శారదాక్షేత్రం ఆధ్వర్యంలో జరిగాయి. పల్లకి సేవ, వేదపారాయణం, వేద పఠనం, నగర సంకీర్తన, భజన, ఏకాహ పూజలు నిర్వహించారు. అనంతరం వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు.

పశువులకు బీమా చేయించుకోవాలి

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు రుణాలు తీసుకున్నారని, వాటితో కొనుగోలు చేసిన పాడి పశువులకు తప్పనిసరిగా బీమా చేయించాలని సరుబుజ్జిలి పశుసంవర్ధక శాఖ ఏడీ ఆనందరావు అన్నారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో ఆ శాఖ, వెలుగు సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. బీమా వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు.

మండల శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేయాలి

జి.సిగడాం, న్యూస్‌టుడే: మండల శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేయాలని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై సందీప్‌కుమార్‌ను కూటమి నాయకులు కోరారు. తెదేపా, భాజపా, జనసేన మండలాధ్యక్షులు కుమార్పు రవికుమార్, పైల విష్ణుమూర్తి, రవి స్థానిక నాయకులతో ఆయనను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు.

అధునాతన పద్ధతులతో మంచి దిగుబడులు

మలకాం గ్రామంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త కిరణ్‌కుమార్

సరుబుజ్జిలి, పొందూరు, పొందూరు గ్రామీణం, లావేరు, న్యూస్‌టుడే: ఆధునాతన పద్ధతులతో పంటలు దిగుబడి బాగుంటుందని ఆమదాలవలస కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం పొందూరు మండలం మలకాం గ్రామంలో రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ● డబుల్ వీల్ మార్కర్ ఉపయోగించి మొక్కజొన్న విత్తనాలు వేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చునని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సీనియర్ ఏరియా మేనేజర్ తవిటినాయుడు అన్నారు. పొందూరు మండలం చిగురువలస, లావేరు మండలం ఆడపాకలో రైతులతో డబుల్ వీల్ మార్కర్ ఉపయోగించి మొక్కజొన్న విత్తనాలు వేసే పద్ధతిపై రైతులకు అవగాహన కల్పించారు.

అపోహలు వీడండి.. రక్తదానం చేయండి

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్‌సీసీ దినోత్సవ సందర్భంగా ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ, గురజాడ విద్యాసంస్థల గాయత్రి కళాశాల, శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రి రక్తనిధి సంయుక్తంగా రక్తదాన శిబిరాన్ని గురువారం ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై. పోలినాయుడు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. గాయత్రి కళాశాల ప్రిన్సిపల్ కె.వి.వి.సత్యనారాయణ మాట్లాడుతూ రక్తదానంపై అపోహలు వీడాలన్నారు.

ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రాలుగా మారాలి

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు బొమ్మలతో బోధించాలని, తమ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆదర్శనీయంగా మార్చాలని ఆముదాలవలస ప్రాజెక్టు సీడీపీవో యం.వి.కె సత్యశ్రీ తెలిపారు. పొందూరు మండలం ఉపహార్ ఎన్‌జీవో కార్యాలయం లోలుగులో బుధవారం పొందూరు, జి.సిగడాం, ఎచ్చెర్ల మండలాల్లో 63 అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పలు సూచనలు చేశారు.

ఫలితాలు రావడం లేదు
అంపోలు అగ్రి టెస్టింగ్ ల్యాబ్ దుస్థితి

న్యూస్‌టుడే, గార

రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను పరీక్షించి ఫలితాలు వెల్లడించేందుకు ... వైకాపా ప్రభుత్వ ... నాలుగేళ్లు కిందట ... ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. వ్యవసాయ ప్రయోగశాలలు అంటూ ఆర్భాటం చేసి ప్రారంభించి పాలనా కాలం ముగిసిన పనులు పూర్తి చేయలేకపోయింది.

అంపోలు సమీపంలో జిల్లా స్థాయి ఇంటిగ్రేటెడ్ వ్యవసాయ ప్రయోగశాల

• గార మండలం అంపోలు పంచాయతీ జిల్లా కేంద్ర కారాగారం రహదారిలో సుమారు రూ. 3.68 కోట్ల నాబార్డు నిధులతో 2021లో భవన నిర్మాణాన్ని చేపట్టింది. ప్రతిపాదించిన అంచనాల ప్రకారం భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తయినా భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాల కోసం మరో రూ.2.08 కోట్లతో ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు సమాచారం.

• శాఖపరంగా పంపిన నివేదిక అప్పటి ప్రభుత్వం కార్యరూపం దాల్చకపోవడంతో పనులు పూర్తికి నిధులు లేకుండా పోయింది. సమకూర్చాలని నాబార్డుకు అధికారులు నివేదించినా నిధులు సమకూర్చకపోవడంతో ... వెసులుబాటు లేకపోవడం. నిధులు సమకూర్చాల్సి ప్రభుత్వం కేటాయింపులు చేపట్టకపోవడంతో పనులు నిలిచిపోయాయి.

• అన్నదాత ఉన్నతికి, వ్యవసాయ రంగ అభివృద్ధిని కాంక్షించే కూటమి ప్రభుత్వమైనా వ్యవసాయ ప్రయోగశాల పనులను పూర్తి చేయించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై వ్యవసాయశాఖ జేడీఏ మనోహరరావును వివరణ కోరగా 'పనులు పూర్తిగాక ఉన్నాయి. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పర్యవేక్షణలో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పనులు పూర్తి చేయిస్తామ'న్నారు.



హనుమంత వాహనంపై పద్మావతి అమ్మవారు

నేటి ఉత్సవాలు..

ఐదో రోజు శుక్రవారం రాత్రి గజవాహనసేవ జరగనుంది. అమ్మవారికి జరిగే వాహనసేవల్లో గజవాహనసేవకు అత్యంత ప్రాధాన్యం ఉంది. ఉదయం 8 గంటలకు పల్లకీ వాహన సేవ, మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 5 గంటల వరకు వసంతోత్సవం నిర్వహిస్తారు. గజవాహనసేవకు అలంకరించేందుకు తిరుమల నుంచి శ్రీవారి కాసులహారాన్ని శుక్రవారం శోభాయాత్రగా తిరుచానూరుకు తీసుకురానున్నారు.

అమ్మ.. కుంకుమ బొమ్మ

తిరుపతికి చెందిన సూక్ష్మకళాకారుడు పల్లి చిరంజీవి.. తిరుచానూరు కార్తిక బ్రహ్మోత్సవాల సందర్భంగా కుంకమతో అమ్మవారి రూపాన్ని గీశారు. అరకిలో కుంకుమతో నాలుగు అడుగుల చతురస్రాకార వస్త్రంపై అమ్మవారికి రూపమిచ్చారు. గత బ్రహ్మోత్సవాల్లో కాఫీ పొడితో 30 అడుగుల అమ్మవారి నిలువెత్తు చిత్రాన్ని చిత్రీకరించినట్లు చిరంజీవి తెలిపారు. తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా చింత గింజలపై శ్రీపద్మావతి శ్రీనివాస కల్యాణ ఘట్టాలను చిత్రీకరించారు. – ఈనాడు, తిరుపతి

పట్టాభిరాముడు.. భక్తజన హృదయుడు

తిరుచానూరు, తిరుమల, న్యూస్‌టుడే: తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం కల్పవృక్ష వాహనసేవ జరిగింది. అమ్మవారు చేతిలో పిల్లనగ్రోవి ధరించి మురళీకృష్ణుడు రూపంలో, రాత్రి హనుమంతవాహనంపై పట్టాభిరాముడి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు సాయంత్రం అమ్మవారికి ఊంజల్‌సేవ కనులపండువగా జరిగింది. శ్రీ పద్మావతి అమ్మవారిని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దర్శించుకున్నారు. వేద పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలకగా.. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం తిరుమలకు చేరుకున్న రాష్ట్రపతి స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు.

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పుష్పగుచ్ఛం అందిస్తున్న తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు పక్కన హోంమంత్రి అనిత

వనమిత్ర.. సాహసయాత్ర

- నల్లమలలో ట్రెక్కింగ్‌కు విస్తృత అవకాశాలు

శేషాచలం అడవులు ఆధ్యాత్మికతకు, ప్రకృతి అందాలకు నెలవు. ఇక్కడి అడవుల్లో ఎన్నో వింతలు, విశేషాలు ఇమిడి ఉన్నాయి. అయితే కొన్నేళ్లుగా కొందరు ట్రెక్కర్ల పేరుతో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలోనే అడవుల్లోకి వెళ్లడానికి వీల్లేదంటూ అటవీ అధికారులు నిషేధాజ్ఞలు జారీచేశారు. ఈ నిర్ణయంతో గుర్తింపు, అనుభవంగల ట్రెక్కర్లు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సడలింపు దిశగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు.

సామాజిక మాధ్యమాలే దిక్కు

జిల్లా పరిధిలో వందకు పైగా అనధికార ట్రెక్కింగ్ గ్రూపులు ఉన్నట్లు అంచనా. ఇవి ఫేస్‌బుక్, ఇన్‌స్టా, యూట్యూబ్ వేదికలుగా ఔత్సాహికులను ఆకర్షిస్తున్నాయి. వీటితోపాటు తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన జాతీయస్థాయి సంస్థలు, ట్రెక్కర్లు ఇక్కడికి రావడానికి ఆసక్తి చూపుతున్నారు. సాహసయాత్రలకు తోడు శ్రీవారి దర్శనం కలిసివచ్చే అంశం.

త్వరలోనే తుది నిర్ణయం

అటవీశాఖ సాయంతో ట్రెక్కింగ్ నిర్వహించడంపై దృష్టిసారించాం. గతంలో అధికారులు సూచించిన వనమిత్ర వెబ్ పోర్టల్ రూపొందించే దిశగా అధ్యయనం చేస్తున్నాం. నిబంధనలు, అనుమతులు, ఫీజు వంటి అంశాలపైనా చర్చలు జరుపుతున్నాం. త్వరలోనే తుది నిర్ణయం ప్రకటిస్తాం.
– సాయిబాబ, తిరుపతి జిల్లా అటవీపాలనాధికారి

పరిశీలనలోని అంశాలు

- ట్రెక్కర్లను ఒకతాటిపైకి తీసుకురావడం.
- ప్రత్యేకంగా వనమిత్ర పేరుతో వెబ్‌పోర్టల్ రూపొందించి రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించడం.
- ప్రత్యేకంగా ఐడీ కార్డులు జారీ చేయడం.
- అటవీశాఖ గుర్తింపు పొందిన గైడ్ల సాయం తీసుకోవడం.
- గుర్తింపులేని ట్రెక్కర్లకు అడ్డుకట్టవేయడంతోపాటు అటవీశాఖకు ఆదాయం సమకూర్చడం.
- జంగిల్ సఫారికి సాధ్యాసాధ్యాలు పరిశీలించడం. (మామండూరులో గతంలో అమలులో ఉండేది.)

సందర్శనకు వీలున్నవి

- తుంబురు, రామకృష్ణ, సనకసనంద, చక్ర, కుమారధార, పుసుపుధార, గుంజన జలపాతాలు, బ్రహ్మగుండం, చామల వ్యాలీ
- **ఎకో టూరిజం కేంద్రాలు:** తలకోన, ఉబ్బలమడుగు, మామండూరు

విన్నపాలు ఇలా..

కొందరు ట్రెక్కర్లు రెండునెలల కిందట తిరుపతి పర్యటనకు వచ్చిన ఏపీ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు(అటవీశాఖ) పి.మల్లికార్జునరావు దృష్టికి వారి సమస్యలను నివేదించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వ విధానాల్లో ఒకటైన అడ్వెంచర్ టూరిజంలో భాగంగా ట్రెక్కింగ్‌ను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని జిల్లా అధికారులకు ఆయన వివరించారు. అడవుల్లో ట్రెక్కర్లు, ఔత్సాహికులు, పరిశోధకులు, ప్రకృతి ప్రేమికుల కదలికలు ఉంటే స్మగ్లర్లు సైతం భయపడతారని, వనమిత్రలకు గుర్తింపు కార్డులు ఇచ్చి అటవీశాఖ సమన్వయంతో పర్యావరణం, వన్య మృగాల సంచారానికి ఇబ్బందులు లేకుండా ట్రెక్కింగ్‌ను ప్రోత్సహించే దిశగా ఆయన దిశానిర్దేశం చేశారు.

న్యూస్‌టుడే, తిరుపతి (జీవకోన)

- శేషాచలం విస్తీర్ణం : 5000 చ.కి.మీ.
- ప్రముఖ తీర్థాలు, జలపాతాలు: 108

ఏడు కొండలు బ్రాండ్లు..

- స్వామికి అలంకరించిన పూలతో అగరుబత్తీలు
- అంచనాకు మించి భక్తుల నుంచి డిమాండ్

అగరబత్తీలు తయారుచేస్తున్న మహిళలు

తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే: దేవుడికి అర్చన చేసిన పూలను అర్చకులు భక్తులకు ప్రసాదంగా ఇస్తే కళ్లకు అద్దుకొని స్వీకరిస్తారు. సాక్షాత్తు దేవదేవుడైన కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామికి అలంకరించిన పూలమాలలతో అగరబత్తీలు తయారు చేస్తే.. వాటి పవిత్రత గురించి చెప్పాల్సిన పనిలేదు. ఎస్వీ గోసంరక్షణ శాలలోని తితిదే (దర్శన్) కేంద్రంలో తయారు చేస్తున్న ఏడు రకాల అగరబత్తీలకు భక్తుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది.

- ఎల్ఎస్‌నగర్ సమీపంలోని ఎస్వీగోసంరక్షణ శాల ప్రాంగణంలో 2021లో సెప్టెంబరు 13న దర్శన్ ఇంటర్నేషనల్, బెంగళూరు సహకారంతో తితిదే అగరబత్తీల తయారీ కేంద్రం ఏర్పాటుచేశారు.

తయారీ ఇలా..

- ఏరోజుకారోజు స్వామి, అమ్మవార్లకు అలంకరించి తీసేసిన పూలమాలలను అగరబత్తీ కేంద్రానికి తరలిస్తారు.
- పూలను వేరు చేసి జల్లెడపడతారు. తర్వాత ఓ యంత్రంలో వేసి వాటిని నిర్ణీత వేడిలో ఆరబెడతారు.
- ఆరబెట్టిన పూలను పొడిచేసి, పలు మిశ్రమాలను కలిపి యంత్రాల్లో పోస్తారు.
- యంత్రం నుంచి వచ్చే పొడితో అగరబత్తీలు తయారుచేస్తున్నారు.

విస్తరించిన విక్రయాలు

ఏడు కొండలను ప్రతిబింబించేలా అగర బత్తీలకు తందనాన, దివ్యపాద, అభయహస్త, దృష్టి, సృష్టి, ఆకృష్టి, తుష్టి అనే పేర్లు పెట్టారు. ఒక్కో రకం అగరబత్తీకి ఒక్కో రకం పువ్వును వినియోగిస్తారు. వీటికి విపరీతంగా ఆదరణ ఉండడంతో అనుబంధ ఆలయాలతోపాటు, తెలంగాణ, చెన్నై, బెంగళూరు రాష్ట్రాల్లోని తితిదే ఆలయాల్లోనూ విక్రయిస్తున్నారు.

- రోజుకు ఉత్పత్తి: 27 వేల ప్యాకెట్లు
- ఆదాయం నెలకు: రూ. 4 కోట్ల నుంచి రూ.5 కోట్లు

సరిపడా లేని ఉత్పత్తి

ప్రారంభించిన రెండేళ్లలోనే భక్తుల డిమాండుకు తగ్గట్టు ఉత్పత్తి చేయలేకపోయారు. స్పందించిన తితిదే అధికారులు 2023లో మరో యూనిట్‌ను ప్రారంభించారు.

మహిళలే ఎక్కువ..

అగర్‌బత్తీ కేంద్రంలో మొత్తం 150 మంది పని చేస్తుండగా.. అందులో 128 మంది మహిళలే ఉండటం గమనార్హం. రోజుకు వంద గ్రాముల ప్యాకెట్లు 27వేల వరకు తయారుచేస్తున్నారు.

క్లిక్ చేస్తే.. పోయిన ఫోను తిరిగొస్తుంది!

ప్రస్తుతం మనిషికి సంబంధించిన సమస్తం చరవాణిలోనే ఉంటుంది. అలాంటి చరవాణి పోతే.. ఎవరైనా దొంగతనం చేస్తే.. అధైర్య పడాల్సిన పనేలేదు. ఒక్కసారి సీఈఐఆర్ యాప్‌లో వివరాలు నమోదు చేస్తే.. మీ ఇంటికే ఫోను అందజేస్తాం అంటున్నారు పోలీసులు. ఇలాంటి అనేక కేసులు ఛేదించి బాధితులకు న్యాయం చేశారు. ఇలా చిత్తూరు జిల్లా పోలీసులు ఇప్పటివరకు 4,106 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

హాయ్ అంటే చాలు..

- పోలీసు వాట్సప్ నంబరు **94409 00004**కు హాయ్ లేక హెల్ప్ అని మెసేజ్ చేయాలి.
- వారు చాట్‌బాట్ లింక్ పంపిస్తారు.
- క్లిక్ చేసి చరవాణి, యజమాని వివరాలు నమోదు చేస్తే ఫిర్యాదు వెళ్తుంది. తరువాత పోలీసులు దర్యాప్తు చేపట్టి ఫోన్‌ను స్వాధీనం చేసుకుంటారని చిత్తూరు క్రైం సీఐ మహేశ్వర్ తెలిపారు.

ఇలా చేయండి..

- సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్ ద్వారా చరవాణిని సులభంగా పొందొచ్చు.
- చోరీకి గురైన సిమ్ డూప్లికేట్ తీసుకొని ఎస్ఎంఎస్ వచ్చేలా యాక్టివేట్ చేయాలి.
- పోలీసు ఫిర్యాదు నంబరు, బిల్ స్కాన్, గుర్తింపు కార్డులు ఉంచుకొని ఆన్‌లైన్ ద్వారా నమోదు చేయాలి.
- గూగుల్‌లో సీఈఐఆర్ పోర్టల్‌లో బ్లాక్ స్టోలెన్/ లాస్ట్ మొబైల్ కాలమ్‌పై క్లిక్ చేయాలి.
- తర్వాత చరవాణి, యజమాని వివరాలు నమోదు చేస్తే ఫోను ఎవరు వాడుతున్నారో పోర్టల్‌కు వివరాలు వస్తాయి. సదరు వ్యక్తికి సంక్షిప్త సమాచారం వస్తుంది. ఇలా కేసులు ఛేదిస్తున్నారు.

- న్యూస్‌టుడే, చిత్తూరు నేరవార్తలు

హెచ్‌ఎం అకౌంట్ టెస్టుకు దరఖాస్తులు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: పురపాలక, ఎయిడెడ్ పాఠశాలల్లో వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు హెచ్‌ఎం అకౌంట్ టెస్టుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని డీఈవో వరలక్ష్మి గురువారం ప్రకటనలో తెలిపారు. www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో అపరాధ రుసుం లేకుండా ఈనెల 24 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ప్రతులను ఈనెల 25వ తేదీ లోగా అందజేయాలన్నారు. తర్వాత అపరాధ రుసుం రూ.60తో ఈనెల 30వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు గడువు ఉందని ఆమె పేర్కొన్నారు.

SRI BALAJI MEDICAL COLLEGE
HOSPITAL & RESEARCH INSTITUTE
SBMC RENIGUNTA
New Airport Road, Renigunta, Tirupati - 517520
WANTED
HOSPITAL
- Marketing Executives
- Marketing Telecallers
- Nurses (GNM / B.Sc.)
- Ward Boys
COLLEGE
- Accountant's
- Telecallers & Councellers
- HR Executives & Managers
- Hostel Wardens (Male & Female)
- Securities (Male & Female)
E-mail: info.sbmch@gmail.com
Mobile : 8106497638, 8125465490

మీ స్మార్ట్‌కార్డు తీసుకోకపోతే వెనక్కే..!

తిరుపతి(రెవెన్యూ), న్యూస్‌టుడే: చౌకదుకాణాల ద్వారా నిత్యావసరాల పంపిణీ పారదర్శకంగా జరగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అధునాతన సాంకేతికతతో స్మార్ట్ రేషన్ కార్డులను రూపొందించింది. జిల్లాకు సంబంధించి 5.80 లక్షల కార్డులు ఆగస్టులో చేరుకున్నాయి. వాటిలో 60 వేల కార్డులు పంపిణీకి నోచుకోక సచివాలయాల్లో ఉన్నాయి. వాటిని నెలాఖరులోపు తీసుకోకపోతే వెనక్కి పంపిస్తామని డీఎస్వో శేషాచలం రాజు తెలిపారు.

దయచేసి వినండి.. ప్లాట్‌ఫాం ఖాళీ అయ్యేవరకు ఆగండి

రైళ్ల రద్దీతో రేణిగుంటకు ముందే ఆపేస్తున్న వైనం

రేణిగుంట, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి దర్శనార్థం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి నిత్యం వేలాదిమంది ప్రయాణికులు వస్తుంటారు. తిరుపతి, రేణిగుంట సమీపానికి రైలు రాగానే దేవదేవుడి సన్నిధికి చేరువవుతున్నామనే ఆతృత చాలా మందిలో ఉంటుంది. కానీ రైల్వే అధికారులు ప్రయాణికుల ఆతృతపై నీళ్లు చల్లుతూ నిరీక్షణ పరీక్ష పెడుతున్నారు. రైళ్లను ఔటర్‌లో లేదా ఏర్పేడు, మామండూరు స్టేషన్ల వద్ద గంటల కొద్ది నిలిపివేస్తున్నారు.

కడప మార్గంలో నిలిచి ఉన్న ఎక్స్‌ప్రెస్ రైలు

ఇదీ సమస్య...

రేణిగుంట రైల్వే జంక్షన్ కావడంతో ముంబయి, చెన్నై, విజయవాడ, గుంతకల్లు, హైదరాబాద్ తదితర నగరాలకు ఈ మార్గమే ప్రధానమైంది. దిల్లీ, ముంబయి నగరాల నుంచి వారంతపు స్పెషల్స్ వస్తుంటాయి. రద్దీకి తగినన్ని ప్లాట్‌ఫామ్‌లు లేకపోవడంతో స్టేషన్‌కు సమీపంలో నిలిపివేస్తున్నారు.

- నిత్యం రాకపోకలు సాగించే రైళ్లు: 110
- పట్టాలు: 13
- ప్లాట్‌ఫాంలు: 05

ప్రయాణికుల ఇబ్బందులు...

రైళ్లు స్టేషన్‌కి సమీపంలోనే ఆపేస్తుండటంతో కనీసం తాగునీరు, ఆహారం సదుపాయం లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ అంశంపై రైల్వే అధికారులను వివరణ కోరగా తిరుపతి స్టేషన్ పనులు పూర్తయిన తరువాత ఇక్కడ పనులు చేసే అవకాశం ఉందని తెలిపారు.

ఇలా చేస్తే బాగు..

- ఒకటో ప్లాట్‌ఫాం నుంచి గూడురుకు వెళ్లే మార్గం లేదు. దీనిని కలుపుతూ సుమారు 12 ఏళ్ల క్రితం రేణిగుంట నుంచి గూడురుకు ఈ మార్గంలో పంపాలని రూ.కోట్లు ఖర్చు చేసి వంతెన నిర్మించారు. దానిపై పట్టాలు ఏర్పాటు చేసి అన్ని ప్లాట్‌ఫామ్‌లకు వచ్చే ట్రాక్‌లను అనుసంధానం చేస్తే రద్దీ తగ్గి ఔటర్‌లో నిలిచే సమస్య తగ్గుతుంది.
- 4వ నంబర్ ప్లాట్‌ఫామ్ పొడిగించాలని గత కొన్నేళ్లుగా ప్రతిపాదన ఉంది. ఈ పనులు పూర్తయితే సమస్య సగం తగ్గుతుంది.
- కనీసం మరో రెండు ప్లాట్‌ఫారాలు నిర్మిస్తే ఈ సమస్యను పూర్తిగా అదుపు చేసే అవకాశం ఉంది.

మాటలే.. చేతల్లేవ్

- పుర, నగరపాలికల్లో అక్రమలపై సాగని విచారణ
- కమిటీలు నియమించినా కనిపించని వైనం

పుత్తూరులో డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న నాటి ఆర్డీ విశ్వనాథ్, అధికారులు(పాతచిత్రం)

పుత్తూరు, న్యూస్‌టుడే: నాటి వైకాపా ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలోని పుర, నగర పాలక సంస్థల్లో చోటు చేసుకున్న అక్రమాలపై ప్రభుత్వం చేపట్టిన విచారణ కథ కంచికి అన్నట్లుగా మారింది. పురపాలక పరిపాలన, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళికా శాఖలతో నియమించిన విచారణ కమిటీలో ప్రజారోగ్యశాఖ నిర్లక్ష్యంతో అడుగులు ముందుకు పడలేదు.

విచారణకు ఆదేశించినా: చిత్తూరు, తిరుపతి నగర పాలికలతోపాటు పుత్తూరు, పుంగనూరు, మదనపల్లె పట్టణాల్లో అక్రమాలు జరిగాయి. వీటిపై సుమోటోగా, తెదేపా ఎమ్మెల్యేలు, నేతల ఫిర్యాదుతో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. అనంతపురం ఆర్డీ, నెల్లూరు ప్రజారోగ్యశాఖ ఎస్ఈ, పట్టణ ప్రణాళికా విభాగం అధికారితో వేర్వేరుగా కమిటీలు నియమించింది.

ఇదీ పరిస్థితి

- చిత్తూరు నగర పాలకలో చేపట్టిన వేర్వేరు విచారణల్లో ఒకటి పూర్తయ్యింది. పూర్వ కమిషనర్ అరుణ అక్రమాలపై నియమించిన విచారణాధికారి రవీంద్రబాబు అమరావతిలోని డీఎంఏ కార్యాలయానికే పరిమితమయ్యారు.
- పుంగనూరు, మదనపల్లెలో అక్రమాల నిగ్గు తేల్చేందుకు నియమితులైన ప్రజారోగ్యశాఖ ఈఈ సుబ్బరాయుడు నేటి వరకు అటువైపు కన్నెత్తి చూడలేదు.
- తిరుపతిలో ప్రజారోగ్య శాఖ ఇంజినీరింగ్ అక్రమాలపై దృష్టిసారించలేదు.

ఫిర్యాదు చేసినా..

నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పుత్తూరు పురపాలికలో జరిగిన అక్రమాలపై రెండుసార్లు ఫిర్యాదు చేయడమే కాక శాసనసభలోనూ ప్రస్తావించారు. ఈ మేరకు నాటి పురపాలక ఆర్డీ విశ్వనాథ్ చేపట్టిన విచారణ పూర్తయ్యింది. ఇక్కడే అసలు కీలక పరిణామం జరిగింది. ప్రజారోగ్యశాఖ అధికారులు వచ్చి వెళ్లడం తప్ప విచారణ నేటికి మొదలు పెట్టలేదు. 3 విభాగాల్లో విచారణ పూర్తయితేనే తుది నివేదిక ఇవ్వడానికి వీలవుతుంది.

పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుచానూరు విద్యుదీపాలతో మెరిసిపోతోంది. ప్రధాన కూడళ్లు, ఆలయ గోపురాలు, ప్రాకారాలు, కోనేరును అందంగా ముస్తాబు చేశారు. పట్టణమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. – ఈనాడు, తిరుపతి

లోడింగ్ ఛార్జీలు చెల్లిస్తే ఇసుక

- జిల్లాలో కొత్తగా రెండు కేంద్రాలు

తిరుపతి (మంగళం), న్యూస్‌టుడే: ప్రభుత్వం ఉచిత ఇసుక పంపిణీకిగాను నూతన విధివిధానాలపై ఉత్తర్వులు జారీచేసింది. ఇసుక రేవుల్లో వసూలు చేస్తున్న సీనరేజ్, డీఎంఎఫ్, మెరిట్ రుసుములను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. జిల్లాలో రేవులు లేకపోవడంతో సరిహద్దు జిల్లాల నుంచి తరలించే అవకాశం కల్పించింది. ప్రభుత్వం నిర్ణయించిన లోడింగ్ ఛార్జీలు చెల్లించి కావాల్సినంత పరిమాణంలో ఇసుకను తీసుకెళ్లవచ్చు.

మొదటిది గూడూరులో: గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అభ్యర్థన మేరకు గూడూరులో ఇసుక డిపో నెలకొల్పేందుకు కలెక్టర్ అనుమతులు మంజూరు చేశారు. ఈ డిపోనకు 65 కి.మీ. దూరంలోని నెల్లూరు జిల్లా సంఘం బ్యారేజీ పరిధిలోని రేవు నుంచి ఇసుకను తరలించేందుకు ఆమోదం తెలిపారు. టన్ను ధర రూ.674గా నిర్ణయించారు. గూడూరుకు 30 కి.మీ. దూరంలోని కోట మండలం గూడలిలోని స్వర్ణముఖి నది నుంచి ఇసుక తీసుకొనే అవకాశం కల్పించారు. ఇక్కడ ఇసుకను టన్ను రూ.259లకే విక్రయించాలి.

రెండోది భాకరాపేటలో..: చంద్రగిరి నియోజకవర్గం భాకరాపేటలో మరో డిపో ఏర్పాటు చేయనున్నారు. ఈ డిపోనకు 115 కి.మీ. దూరంలోని అన్నమయ్య జిల్లా మదనగోపాలపురం, అదాపూర్, కిచమాంబపురం రేవుల నుంచి ఇసుక తీసుకోనున్నారు. టన్ను ధర రూ.777గా నిర్ణయించారు.

104FM Tirupati
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

కృష్ణమ్మకు జల హారతి

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: హంద్రీ-నీవా ద్వారా కృష్ణమ్మ జలాలతో నిండిన కుప్పం పురపాలిక పరిధిలోని దళవాయికొత్తపల్లె చెరువులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు ట్రస్టీ నారా భువనేశ్వరి గురువారం జలహారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు చెరువు కట్టపై కొలువైన చౌడేశ్వరమ్మకు పూజలు చేశారు. అనంతరం కృష్ణమ్మ జలాలకు సారె సమర్పించి జలహారతి ఇచ్చారు.

(c) eenadu

ఉన్నాయంతే.. ఉలకవు

శ్రీవారి ఆలయం నుంచి భక్తులు వెలుపలకు వచ్చే మార్గంలోని వాహన మండపం సమీపంలో ఏర్పాటు చేసిన మెటల్ డిటెక్టర్లు పనిచేయడం లేదు. ఇక్కడ రెండింటిని తితిదే భద్రతా విభాగం ఏర్పాటు చేసింది. ఈ ప్రాంతంలో భద్రతా సిబ్బంది లేకపోవడం తోడు పరికరాలకు విద్యుత్తు కనెక్షన్ ఇవ్వలేదు. - న్యూస్‌టుడే, తిరుమల

ఇంకా జగన్ చిత్రాలే..!

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదిన్నర గడిచినా నేటికీ పలు ప్రభుత్వ కార్యాలయాల్లో మాజీ సీఎం జగన్ ఫొటోతో ఉన్న బోర్డులు ఉండటం గమనార్హం. ఇదెక్కడి చోద్యమని తెదేపా నాయకులు ప్రశ్నిస్తున్నారు. గురువారం మండల బొమ్మసముద్రం పీహెచ్‌సీలో జగన్ ఫొటోతో ఉన్న ఆరోగ్యశ్రీ బోర్డును జడ్పీటీసీ మాజీ సభ్యుడు బాలాజీ, మాజీ ఎంపీపీ నాగరాజయాదవ్ గుర్తించారు. వెంటనే ఆ బోర్డు తొలగించాలని అక్కడి ఆరోగ్యాధికారులకు సూచించారు. -న్యూస్‌టుడే, గుడిపాల

దీక్షలో ముని.. ప్రతిభలో రత్నం

నాయుడుపేట పట్టణానికి చెందిన ఆర్చరీ క్రీడాకారుడు గణేశ్ మునిరత్నం ప్రపంచ ఆర్చరీ వేదికపై మెరిశాడు. లక్సెంబర్గ్‌లోని స్ట్రాసెన్‌లో ఇటీవల జరిగిన ప్రపంచ ఆర్చరీ సిరీస్‌లో 11 జీటీ ఓపెన్ 2025 అండర్- 21 విభాగంలో తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించాడు. గతంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు దేశాల్లో జరిగిన పోటీల్లో పాల్గొని 11 వరకు పసిడి, కాంస్య పతకాలు సొంతం చేసుకున్నాడు. మూడునెలల కిందట కెనడాలో జరిగిన ప్రపంచ ఆర్చరీ యూత్ ఛాంపియన్‌షిప్‌లో పసిడి వరించింది.

- న్యూస్‌టుడే, నాయుడుపేట

దారిలో నిల్చుంటేనే దరిచేరేది

పాలసముద్రం మండలంలోని కృష్ణ జిమ్మాపురం పంచాయతీ కొల్లురెడ్డి కండ్రిగ(కేఆర్ కండ్రిగ)లో విద్యార్థులు, మహిళలు ఉచిత ప్రయాణానికి దూరమవుతున్నారు. గ్రామం నుంచి 20 మంది విద్యార్థులు బలిజకండ్రిగ జడ్పీ ఉన్నత పాఠశాల, పాలసముద్రం జూనియర్ కళాశాలకు వెళ్లి చదువుకుంటున్నారు. ఇక్కడ బస్ షెల్టర్ లేక రోడ్డు పక్కనున్న కల్వర్టు గోడలపై ఎండుతూ, వానకు తడుస్తూ బస్సుల కోసం వేచిఉంటున్నారు.

-న్యూస్‌టుడే, పాలసముద్రం

దక్షిణామూర్తికి విశేష అభిషేకాలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి ఆలయంలో కొలువుదీరిన శ్రీమేధా దక్షిణామూర్తికి విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అమావాస్యను పురస్కరించుకుని ఉదయం ఆలయం వద్ద సంకల్ప పూజలు చేశారు. గోక్షీరం, వివిధ పూజాద్రవ్యాలతో అభిషేకాలు జరిగాయి. ధూపదీప నివేదనాది కైంకర్యాలు పూర్తిచేశారు.

స్వామివారు

సేవలకు తరలివచ్చిన భక్తులు

వినతులు స్వీకరించి.. హామీ ఇచ్చి

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ ట్రస్టు ట్రస్టీ నారా భువనేశ్వరి కుప్పం పర్యటనలో భాగంగా రెండో రోజు గురువారం ఉదయం శాంతిపురం మండలం శివపురంలో సొంతింట్లో గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తర్వాత డీకేపల్లె చెరువులో జలహారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ అవార్డు పొందిన దిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులను ఆమె అభినందించారు. దయాళ్ శ్రవణ్ ఫౌండేషన్ ద్వారా వినికిడి పరికరాలను అవసరమైన వారికి పంపిణీ చేశారు. కడా, ఛాయ్ రాస్తా ఆధ్వర్యంలో స్వయం సహాయ సంఘాల ద్వారా ఏర్పాటు చేయనున్న ఛాయ్ రాస్తా లోగో ఆవిష్కరించారు.

పరమసముద్రంలోని కేజీబీవీ విద్యార్థినులతో సహపంక్తి భోజనం

పరమసముద్రంలోని కేజీబీవీని సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. అనంతరం వారితో కలసి భోజనం చేశారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడా పీడీ వికాస్ మర్మత్, ఏకేఎం ఉడా ఛైర్మన్ డా.సురేష్‌బాబు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్ కుమార్ పాల్గొన్నారు.

విలువల బడి ప్రారంభం

పురపాలిక పరిధిలోని సామగుట్టపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో సమాజ క్రాంతి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విలువల బడి కార్యక్రమాన్ని నారా భువనేశ్వరి ప్రారంభించారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల క్రమశిక్షణతో ఉన్నారు.. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరి, నో అడ్మిషన్ బోర్డులు పెట్టడం సంతోషంగా ఉందన్నారు.

రాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న హోంమంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

రాష్ట్రపతికి ఘన స్వాగతం

రేణిగుంట, న్యూస్‌టుడే: తిరుపతి పర్యటనలో ఉన్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు రేణిగుంట విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం లభించింది. గురువారం మధ్యాహ్నం తరువాత భారత వాయుసేన విమానంలో రేణిగుంట చేరుకున్న ఆమె నేరుగా శ్రీపద్మావతి అమ్మవారి దర్శనానికి వెళ్లారు. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, తితిదే ఎక్స్ అఫిషియో హరి జవహర్‌లాల్, కలెక్టర్ డా.వెంకటేశ్వర్, ఐజీ రాజకుమారి, ఎస్పీ సుబ్బరాయుడు, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తదితరులు స్వాగతం పలికారు. తిరుచానూరులో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, వంగలపూడి అనిత, ఎమ్మెల్యే పులివర్తి నాని, తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచమూర్తుల ఊరేగింపు

తిరుపతి(తితిదే): తిరుపతి శ్రీకపిలేశ్వరస్వామి ఆలయంలో నెల రోజుల పాటు జరిగిన హోమ మహోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా శ్రీచండికేశ్వరస్వామి హోమం నిర్వహించారు. అనంతరం ఆలయ పుష్కరిణిలో త్రిశూల స్నానం జరిగింది. రాత్రి పంచమూర్తుల గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్లు బాలకృష్ణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ పరీక్షకు దరఖాస్తులు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: జనవరి 2026లో జరగనున్న ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ పరీక్షకు జిల్లాలో పనిచేస్తున్న ఇన్ సర్వీస్ ఎస్జీటీ, గ్రేడ్-2 పండిట్, పీఈటీలు, క్రాఫ్ట్, డ్రాయింగ్, టైలరింగ్ ప్రత్యేక ఉపాధ్యాయులు ఈనెల 26లోగా పరీక్ష రుసుం చెల్లించాలని, దరఖాస్తు పత్రాలు ఈనెల 27లోగా డీఈవో కార్యాలయంలో సమర్పించాలని డీఈవో వరలక్ష్మి పేర్కొన్నారు. అపరాధ రుసుంతో డిసెంబరు మూడో తేదీ లోగా రుసుం చెల్లించాలని, నాలుగో తేదీ లోగా డీఈవో కార్యాలయంలో దరఖాస్తు పత్రాలు సమర్పించాలని ఆమె కోరారు.

అలా ఆవిష్కరించి.. ఇలా పక్కనపెట్టి

■ సువర్ణముఖి బ్యారేజ్ నిర్మాణానికి అడ్డంకులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: సువర్ణముఖి నది ఆనకట్ట ఆధునికీకరణకు సంబంధించి అయిదేళ్లు వైకాపా బాకా ఊదుతూ వచ్చింది. జైకా నిధులతో ప్రాజెక్టు పనులు ప్రారంభించనున్నట్లు ఎన్నికల ముందు శిలాఫలకాన్ని ఆవిష్కరించి ఉసూరుమనిపించారు.

బ్యారేజ్ నిర్మాణం చేపట్టాల్సిన ప్రదేశం

సాగునీటి వరప్రసాదిని

సువర్ణముఖి నది సాగునీటి వరప్రసాదిని. చంద్రగిరి సమీపంలోని అగస్త్యాచలంపై జన్మించే నది తొండవాడ సమీపంలో కల్యాణీ, భీమా నదులతో సంగమించి జిల్లాలోనే అత్యంత పెద్దదిగా ఖ్యాతి గడించింది. చంద్రగిరి, తిరుచానూరు, ఏర్పేడు, శ్రీకాళహస్తి, తొట్టంబేడు, పెళ్లకూరు, నాయుడుపేట, మండలాల్లోని తీరప్రాంత రైతులకు సాగునీరు అందిస్తోంది.

ఆయకట్టు అపారం

సువర్ణముఖి నది ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా రైతులు ఎంతో లబ్ధి పొందుతున్నారు. ప్రత్యక్షంగా పాతికవేల ఎకరాలకు పైగా సాగునీరు అందుతోంది. నదిలో నీటి వృథాను అరికట్టి రైతులకు సాగు జలాలుగా మళ్లించాలన్న ఉద్దేశంతో నీలం సంజీవరెడ్డి హయాంలో ప్రాజెక్టును నిర్మించారు. నదిలో ప్రవహించే నీటిని చెంబేడు కాలువ గుండా మళ్లించి తద్వారా కాల్వకు అనుసంధానంగా ఉన్న 46 చెరువులకు సాగునీరు అందుతోంది. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 13 వేల ఎకరాలకు పైగా సాగునీరు అందుతుండటం విశేషం.

ప్రాజెక్టు పేరు: సువర్ణముఖి సిస్టమ్స్
ఆనకట్ట పొడవు: 229.40 మీటర్లు
లిఫ్ట్ కెనాల్ పేరు: చెంబేడు
ఆయకట్టు: 10,200 ఎకరాలు
అనధికారిక ఆయకట్టు: 2,500 ఎకరాలు
అనుసంధాన చెరువులు: 46
లబ్ధి పొందే గ్రామాలు: 25

చెక్‌డ్యాముల ఏర్పాటుకు ప్రణాళికలు

నదిపై నీలం సంజీవరెడ్డి హయాంలో నిర్మించిన ఆనకట్టను అభివృద్ధి పరిచేందుకు జలవనరుల శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఆనకట్ట ప్రదేశంలో బ్యారేజ్ నిర్మాణానికి జైకా ద్వారా రూ. 58.40 కోట్లు నిధులు వచ్చేశాయంటూ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ పనులకు సంబంధించి నిధులు భారీగా ఉండటం, ప్రణాళికలో లోపాలు తదితర కారణాల దృష్ట్యా ఈ ప్రతిపాదన పక్కకు పెట్టినట్లు సమాచారం. ప్రత్యామ్నాయంగా ఆనకట్ట ఆధునికీకరణతో పాటు నదిలో చెక్‌డ్యాముల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. అధికారులు మాత్రం తొలి విడత నియోజకవర్గ పరిధిలోని చెరువుల అభివృద్ధికి ఇస్తున్నామని, ఆపై నిధులు సమకూరితే ఆనకట్ట అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసే ఆలోచనలో ఉన్నారు.

మంత్రి అచ్చెన్నాయుడు దంపతులకు ప్రసాదాలు అందజేస్తున్న అదనపు ఈవో వెంకయ్యచౌదరి

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు గురువారం దర్శించుకున్నారు. ఉదయం బ్రేక్‌లో కుటుంబసభ్యులతో కలిసి ఆలయం వద్దకు చేరుకున్న మంత్రికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి తీర్థప్రసాదాలు అందజేశారు. సినీ నిర్మాత దిల్‌రాజు సతీమణి తేజశ్విని కూడా స్వామిని దర్శించుకున్నారు.

నాలుగో రోజు.. చిన్న అప్పన్న మౌనం

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: కల్తీ నెయ్యి కేసులో కస్టడీలో ఉన్న చిన్న అప్పన్నను నాలుగో రోజు సిట్ ప్రశ్నించింది. ఎక్కువ ప్రశ్నలకు మౌనంగా ఉన్నట్లు సమాచారం. తితిదే మాజీ ఛైర్మన్, వైకాపా రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి మాజీ వ్యక్తిగత కార్యదర్శి చిన్న అప్పన్న కల్తీ నెయ్యి కేసులో ఏ24 నిందితుడిగా ఉన్నారు. ఆర్థిక లావాదేవీలు నడిపిన ఆయన్ను కస్టడీలోకి తీసుకుని విచారిస్తే కేసు కొలిక్కి వస్తుందని భావించిన సిట్ ఆ దిశగా చర్యలు చేపట్టింది. నాలుగు రోజులుగా చిన్న అప్పన్నను సిట్ విచారిస్తోంది. కిలో నెయ్యికి రూ.25 కమీషన్ తీసుకున్న విషయం.. హవాలా మార్గంలో తీసుకున్న రూ.50 లక్షలు ఎవరికి ఇచ్చారనే ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేదని తెలుస్తోంది. హైదరాబాద్‌లో వైవీ సుబ్బారెడ్డి విచారణలో అందిన సమాచారాల మేరకు ఇక్కడి విచారణాధికారులు ప్రశ్నించారు. దానికి పెద్దగా స్పందించలేదని సమాచారం. అప్పన్న ఐదు రోజుల కస్టడీ నేటితో ముగియనుంది.

జిల్లా వాలీబాల్ జట్టుకు ఎంపికైన విద్యార్థినులు

హోరాహోరీగా అండర్-14 వాలీబాల్ పోటీలు

తిరుపతి(గ్రామీణం) : దుర్గసముద్రం ఉన్నత పాఠశాలలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14 ఉమ్మడి చిత్తూరు జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు గురువారం హోరాహోరీగా జరిగాయి. హెచ్‌ం రవీంద్రరాజు మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశామని తెలిపారు. ● బాలుర జట్టు: లతీష్‌కుమార్ (జడ్పీ దుర్గసముద్రం), విమల్ (బీఎన్‌కండ్రిగ), చరణ్ (రాచపల్లి), యశ్వంత్ (నింద్ర), నరసింహ (నేలపల్లి), వరుణ్ (నెల్లేపల్లి), డిల్లీ (కుప్పంబాదూరు), బ్లెస్సింగ్ (కార్వేటినగరం), రాజు (రెడ్డివారిపల్లి), దినేష్ (గోవర్ధనపురం), రాంప్రసాద్ (శంకరాయపేట), గగన్‌కృష్ణ (తిరుపతి). ● బాలికల జట్టు: ఈశ(మాసిమాకులపల్లి), వెన్నెల(కొత్తకోట), భోజశ్రీ(తిరుపతి), నిషారాణి(దుర్గసముద్రం), తులసి(నెలవాయి), హేమశ్రీ(గుడిపల్లి), హవిష(తిరుపతి), చాందిని (అరణ్యం కండ్రిగ), తనూష (కాటపేరి), మోహన (మహదేవ మంగళం), కల్పన (అరికెల), బీనా(కేఎంపురం).

మామూళ్ల మార్కెటింగ్‌కు ప్రక్షాళన

■ తితిదే విభాగంలో పాతుకుపోయిన అధికారి బదిలీ

■ ఏసీబీ విచారణ దిశగా అడుగులు

తిరుమల, న్యూస్‌టుడే: మార్కెటింగ్ విభాగం ప్రక్షాళనపై తితిదే దృష్టిసారించింది. రూ.350 విలువచేసే కండువాను ఏకంగా రూ.1334లకు టెండర్లలో కొనుగోలుచేసి తితిదేకు రూ.50 కోట్లకుపైగా నష్టం మిగిల్చినట్లు ఇటీవల తితిదే ఛైర్మన్ బీఆర్‌నాయుడు మీడియాకు వెల్లడించారు. అనంతరం తితిదే మార్కెటింగ్ కొనుగోళ్ల విభాగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయాలని నిర్ణయించి కసరత్తు ప్రారంభించారు. కొన్నేళ్లుగా పాతుకుపోయిన సీనియర్ అసిస్టెంట్ వెంకటరమణ నాయక్‌ను మరో విభాగానికి బదిలీ చేశారు. కొనుగోళ్లలో కొన్నేళ్లుగా జరుగుతూ వచ్చిన అవినీతిపై ఏసీబీతో విచారణ చేయించాలని నిర్ణయించారు. దీనిపై ఫిర్యాదు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అదేవిధంగా హిందూ ధర్మప్రచార పరిషత్‌లో కల్యాణం ప్రాజెక్టును పర్యవేక్షించే అధికారిని బదిలీ చేశారు. భక్తుల నుంచి నగదు వసూలు చేస్తున్నట్లు ఆయనపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో క్రమశిక్షణ చర్యలు చేపట్టనున్నారు.

ఇకపై రెండేళ్లే కాలపరిమితి

ఇకపై మార్కెటింగ్-కొనుగోళ్ల విభాగంలో ఉద్యోగులు రెండేళ్ల మాత్రమే ఆ విభాగంలో పనిచేసేలా కాలపరిమితిని నిర్ణయించనున్నారు. అనంతరం మరొక అధికారిని ఆ పోస్టులో నియమించేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. అవినీతిని అరికట్టడంలో భాగంగా ఆ విభాగంలో పనిచేసేందుకు ఎంపిక చేసిన ఉద్యోగులపైన తితిదే విజిలెన్స్ విచారణ జరిపి అవినీతి ఆరోపణలు లేని నిజాయతీపరులను మాత్రమే ఎంపిక చేసేలా జాగ్రత్తలు తీసుకోనున్నారు.

ఆకస్మిక కొనుగోళ్లకు చెల్లు

తితిదే మార్కెటింగ్ శాఖ తక్షణావసరాల పేరుతో కొనుగోళ్లు చేసే సమయంలో తితిదేకు భారీగా నష్టం కలుగుతోందని పాలకమండలి గుర్తించింది. ఈ నేపథ్యంలో వాటిని తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపైనా దృష్టిసారించారు. సంబంధిత వస్తువులను భద్రపరిచేసేందుకు సరైన గోదాములు, శీతల గిడ్డంగులు లేవని అధికారులు తెలిపారు. స్పందించిన తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి మూడునెలల పాటు తితిదేకు అవసరమైన వస్తువులు నిల్వ ఉంచుకునేలా గోదాములు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

EENADU
Classifieds

REAL ESTATE
PLOT FOR SALE
GENERAL

క్యాష్ బ్యాక్ వెంచర్ 25 అం||ల ప్లాట్. స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికి బంపర్ ఆఫర్ (కొన్ని ప్లాట్లు మాత్రమే కలవు). Ph: 80086 15946

TO LET

తిరుపతి- జైనగర్‌లో బ్లిస్ హోటల్ వెనుక 60 అంకణముల 36x60 వేణి విశ్వవిహార్ బిల్డింగ్ గ్రౌండ్ ఫ్లోర్ రెండు 2 BHK బెడ్ రూమ్స్ మిగిలిన 3 ఫ్లోర్‌లో విశాలమైన 23 అటాచ్ బాత్రూమ్స్‌తో రూమ్స్, పార్కింగ్‌తో హోమ్ స్టే ఉమెన్స్ హాస్టల్‌కు తదితర వాటికి అద్దెకు కలదు. Cont: 99895 68666.

JOBS

SLN MARKETING Pvt. Ltd. Nagari Branch. Require Marketing Managers (6) (M/F) 15,000/- to 20,000/-. Cont: ✆ 95152 02700.

కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ F/M కావలెను. ఇంటర్నేషనల్ మ్యాట్రిమోనియల్ కన్సల్టెన్సీ, తిరుపతి బ్రాంచ్ కొరకు. ✆ 98666 33988.

SLN మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ నందు సూళ్లూరుపేట, నాయుడుపేట బ్రాంచీలలో పనిచేయుటకు మేనేజర్లు, అకౌంటెంట్లు, సిస్టం ఆపరేటర్లు, సైట్ ఇన్‌ఛార్జ్‌లు, డ్రైవర్లు కావలెను. ఆసక్తిగల వారు సంప్రదించండి. Contact: ✆ 70975 25709.

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఒకే డివిజన్.. కూటమి విజన్

☛ తీరనున్న నగరి ప్రజల కష్టాలు

పుత్తూరు, న్యూస్‌టుడే: ప్రజలకు సులభతర సేవలు అందించేందుకు ఒక నియోజకవర్గానికి ఒక రెవెన్యూ డివిజన్ నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం నగరికి వరం కానుంది. ఈ నియోజకవర్గంలోని మూడు మండలాలు నగరిలో, మరో రెండు తిరుపతి రెవెన్యూ డివిజన్‌లో ఉన్నాయి. నూతన విధానంతో అన్ని మండలాలు ఒకే డివిజన్‌లోకి రానున్నాయి.



నగరి టవర్ క్లాక్

☛ గత ప్రభుత్వం నియోజకవర్గంలోని మండలాలను అస్తవ్యస్తంగా విభజించింది. పుత్తూరు, వడమాలపేట మండలాలను తిరుపతి జిల్లాలో.. నగరి, నింద్ర, విజయపురం మండలాలను చిత్తూరులో కలిపారు. ఈ నేపథ్యంలో నగరి రెవెన్యూ డివిజన్‌లో నగరి, విజయపురం, నింద్ర, కార్వేటినగరం, వెదురుకుప్పం, ఎస్.ఆర్.పురం, పాలసముద్రం మండలాలు ఉన్నాయి. పుత్తూరు, వడమాలపేట మండలాలు తిరుపతి డివిజన్‌లో చేర్చారు. కార్వేటినగరం, వెదురుకుప్పం, ఎస్ఆర్‌పురం, పాలసముద్రం మండలాల ప్రజలు నగరి రావాలంటే పుత్తూరుకు వచ్చి వెళ్లాలి. దీంతో ప్రజల ఇబ్బందులు వర్ణనాతీతం. కూటమి ప్రభుత్వం దిశానిర్దేశంతో నగరి డివిజన్‌లో నగరి, పుత్తూరు, వడమాలపేట, నింద్ర, విజయపురం మండలాలు ఉంటాయి. గతంలో ఉన్న కార్వేటినగరం, ఎస్ఆర్‌పురం, వెదురుకుప్పం, పాలసముద్రం చిత్తూరు డివిజన్‌లోకి వెళ్లి పాలనాపరమైన సౌలభ్యం ఉంటుంది.

ఇతర శాఖల సమస్యలు ఇలా..

ప్రస్తుతం నియోజకవర్గంలో ఇద్దరు డీఎస్పీలు, నలుగురు సీఐలు పనిచేస్తున్నారు. వ్యవసాయం, జలవనరుల శాఖలో పుత్తూరు, నగరి డివిజన్లు ఉండటం సమస్యగా మారింది. వీటిని ఒకే డివిజన్ కిందకు తీసుకొస్తే ఇది పరిష్కారమవుతుంది. పుత్తూరు వ్యవసాయ డివిజన్‌లో నగరి, సత్యవేడు, చంద్రగిరి నియోజకవర్గంలోని మండలాలు ఉన్నాయి. దీంతో ఏ సమాచారం కావాలన్నా ఇబ్బందులే. రైతులు అక్కడికి చేరుకోవాలంటే అవస్థే. ఈ నేపథ్యంలో అన్ని శాఖలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా తీసుకొస్తే ప్రజల కష్టాలు తొలగినట్లే.

తిరుపతి (ఎస్వీయూ)

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: ఎస్వీయూ దూరవిద్య ఫలితాల కోసం కళ్లు కాయలు కాస్తున్నాయంటూ విద్యార్థులు వాపోతున్నారు. పరీక్షలు జరిగి నేటికి ఏడు మాసాలు గడుస్తున్నా నిర్లక్ష్యం వహిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డిగ్రీ కోర్సులకు సంబంధించి ఈ ఏడాది ఏప్రిల్‌లో పరీక్షలు నిర్వహించగా 16,412 మంది వరకు విద్యార్థులు హాజరయ్యారు. ఫలితాలు వస్తే ఉన్నత కోర్సులకు వెళ్లేందుకు అనువుగా ఉంటుందని భావించే విద్యార్థులకు నిరాశే ఎదురవుతోంది. గతంలో ప్రవేశాలు నిర్వహించినా పరీక్షలు మూడేళ్లపాటు జరగలేదు. డెబ్ అనుమతుల పునరుద్ధరణతో ఎట్టకేలకు నిర్వహించడంతో ఆనందించారు. అయితే ఫలితాల జాప్యంతో తమ పరిస్థితి త్రిశంకు స్వర్గంలో మారినట్లు దుఃఖిస్తున్నారు. అకడమిక్ సంవత్సరం సగం పూర్తయిందని, ఇకనైనా ఫలితాలు వెల్లడించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఎస్వీయూలో దిద్దుకోని తప్పులు

■ ఏడునెలలైనా వెల్లడించని దూరవిద్య ఫలితాలు

■ వేలమంది విద్యార్థుల ఎదురుచూపు

పీజీలో 15 విభాగాలు పెండింగ్

పీజీ కోర్సులకు సంబంధించిన పరీక్షలు ఏప్రిల్‌లో నిర్వహించగా 13 వేలమందికిపైగా హాజరయ్యారు. ఎంఏ ఇంగ్లిష్, సోషియాలజీ, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్, ఎంకాం, ఎంకాం (ఎఫ్ఎం), ఎంబీఏ, సోషల్‌వర్క్ ఫలితాలు వెల్లడి కాగా తక్కిన 15 విభాగాలకు సంబంధించి ఫలితాలు వెల్లడించాల్సి ఉంది. టీసీఎస్ సంస్థకు జవాబుపత్రాల మూల్యాంకనం, ఫలితాల వెల్లడికి సంబంధించి బాధ్యతలు అప్పజెప్పడంతో ఆన్‌లైన్ పద్ధతిలో మూల్యాంకనం చేయాలని నిర్ణయించారు. పలు లోటుపాట్లు, ఉద్యోగులు ఆచార్యులకు తగిన శిక్షణ, అవగాహన లేకపోవడంతో జాప్యం నెలకొన్నట్లు తెలుస్తోంది.

మనస్తాపంతో ఇద్దరి ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: వ్యసనాలు, కుటుంబ సభ్యులతో మనస్తాపానికి గురై ఇద్దరు వేర్వేరుగా ఆత్మహత్యకు పాల్పడ్డారు. తిరుపతి తూర్పు పీఎస్ సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. బాపట్లకు చెందిన నవీన్(30) తిరుపతి డీఆర్ మహల్ సమీపానికి చెందిన ఓ మహిళను వివాహం చేసుకుని ఇక్కడే ఉంటున్నారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. తిరుపతి-తిరుమల మధ్య ట్యాక్సీ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. 9 నెలల కిందట భార్య మృతి చెందింది. దీంతో మనస్తాపానికి గురైన నవీన్ మద్యానికి బానిసయ్యాడు. బుధవారం రాత్రి స్థానిక లాడ్జిలో ఉరేసుకుని మృతి చెందాడు.

● స్థానిక తాతయ్యగుంటకు చెందిన చంద్రబాబు(31) చిన్నపాటి పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడు. తాగుడుకు బానిసైన ఆయన అప్పులపాలయ్యారు. మనస్తాపానికి గురై బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని మృతి చెందాడు. పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

అరుణకు బెయిల్ మంజూరు

విజయవాడ, న్యూస్‌టుడే: ఎస్సై, అంగన్‌వాడీ పోస్టులు ఇప్పిస్తానంటూ ఒక వృద్ధుడిని రూ.24.5 లక్షల మేర మోసం చేసిన కేసులో నిందితురాలు నిడిగుంట అరుణకు విజయవాడ 1వ అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. మోసం కేసులో నెల్లూరుకు చెందిన అరుణపై గత నెల 13న విజయవాడ సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేసి ఆమెను పీటీ వారెంట్‌పై న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఈ కేసులో నిందితురాలిని రెండు రోజుల పాటు పోలీసులు తమ కస్టడీలోకి తీసుకుని విచారించారు. నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్న అరుణ ఈ కేసులో తనకు బెయిల్ ఇవ్వాలంటూ న్యాయవాది ద్వారా పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన న్యాయమూర్తి దేవిక నిందితురాలికి బెయిల్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రూ.25 వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించారు.

(c) eenadu

తిరుపతి

•తిరుపతి • చంద్రగిరి

విజ్ఞాన కేంద్రం.. భవితకు మార్గం

గ్రంథాలయంలో చదువుతున్న విద్యార్థినులు

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: విద్యార్థినుల విజ్ఞాన సముపార్జనకు శ్రీపద్మావతి మహిళా వర్సిటీ గ్రంథాలయం వేదికైంది. రోజూ వందలాది మంది విద్యార్థినులు క్రమం తప్పకుండా గ్రంథాలయాన్ని సందర్శిస్తూ జ్ఞానాన్ని పెంపొందించుకుంటున్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా వర్సిటీ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుంటున్న విద్యార్థినులు తాము పొందుతున్న ఉపయోగాలను 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.

తెలుగు మాట్లాడటం నేర్చుకున్నా

మాది ఒడిశా. ఒరియా భాష మాట్లాడతా. ఆంగ్ల విభాగంలో పీహెచ్‌డీలో చేరాక రోజూ గ్రంథాలయానికి వచ్చేదాన్ని. తెలుగు భాషపై పట్టు సాధించాలనుకున్నా. ఒత్తులు, దీర్ఘాలు రాకపోతే స్నేహితులను అడిగి నేర్చుకున్నా. వందకుపైగా తెలుగు నవలలు, పుస్తకాలు చదివా. తెలుగు బాగా రాయగలను, మాట్లాడగలను, చదవగలను. యూజీసీ నెట్ పరీక్షలో అర్హత సాధించా.

- ఎన్.హేమవతి, పరిశోధక విద్యార్థిని

పుస్తకమే సమస్యకు పరిష్కారం

ఎన్నో సమస్యలకు పుస్తకాలే పరిష్కారం చూపుతాయి. 2022లో న్యాయ కోర్సులో చేరాను. అప్పటినుంచి రోజూ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నా. న్యాయ సంబంధమైన పుస్తకాలతోపాటు 12 తెలుగు నవలలు చదివాను. మాల తీచందూర్ వ్యాస రచనా పోటీలలో మొదటి బహుమతి సాధించా. పోటీ పరీక్షల పుస్తకాలు, వార్తా పత్రికలు చదివి యూజీసీ నెట్ పరీక్షలో అర్హత సాధించా. **- మౌనిక, న్యాయ విద్యార్థిని**

నియంత్రణలో భావోద్వేగాలు

2017 నుంచి ఇక్కడ చదువుతున్నా. బీఏ ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం ఇక్కడే చేశా. ప్రస్తుతం పీహెచ్‌డీ చేస్తున్నా. రోజూ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నా. యూజీసీ నెట్, సెట్‌లో అర్హత సాధించా. ఆంగ్ల, తెలుగు రచయితల నవలలు చదివా. బాధలు, కష్టాలు వచ్చినప్పుడు మనల్ని ఎలా నియంత్రించుకోవాలో పుస్తకం నేర్పిస్తుంది. నేటి తరం యువత పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి. **- కావేరి శుక్లా, పరిశోధక విద్యార్థిని**

స్నేహితులతో మాట్లాడినట్లే

చదువుతోపాటు మంచి పుస్తకాలు చదవడానికి గ్రంథాలయమే ఉత్తమ ప్రదేశం. నవలలు, బయోగ్రఫీలు, సైకాలజీ పుస్తకాలు ఇక్కడ ఎక్కువగా ఉండటం వల్ల రోజూ గ్రంథాలయానికి వస్తాను. నేను యూపీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్నా. పుస్తకం చదువుతుంటే స్నేహితులతో మాట్లాడుతున్నట్లు ఉంటుంది. ఒకసారి అలవాటు చేసుకుంటే చనిపోయేదాక విజ్ఞానాన్ని పంచుతూనే ఉంటుంది.

-రసజ్ఞ, సైకాలజీ విద్యార్థిని

ప్రత్యేక ప్రతిభావంతులపై శ్రద్ధ

తిరుపతి(విద్య): జిల్లాలోని ప్రత్యేక ప్రతిభావంత విద్యార్థుల అంశంలో నిత్యం పర్యవేక్షణ ఉండాలని డీఈవో కేవీఎన్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఎస్వీజేఎన్ఎమ్ పాఠశాలలో జిల్లాలోని విద్యాశాఖ అధికారులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. సహిత విద్యపై భవిత కేంద్రాల్లోని విద్యాశాఖ అధికారులకు పలు అంశాలపై సూచనలు చేశారు. జిల్లా సహిత విద్యా సమన్వయకర్త చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో విస్తృత తనిఖీ

తనిఖీ చేస్తున్న ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది

తిరుపతి(రైల్వే), న్యూస్‌టుడే: మావోయిస్టుల 'షహీద్ సప్తా'లో భాగంగా తిరుపతి రైల్వేస్టేషన్‌లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఆర్పీఎఫ్ సహాయ భద్రతా కమిషనర్ రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు సంయుక్తంగా రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాంలపై మార్చ్‌ఫాస్ట్ చేసి ప్రయాణికులను అప్రమత్తం చేశారు. ఆర్పీఎఫ్ ఎస్సై రాంబాబు, ఆర్పీఎఫ్, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్లు సందీప్ కుమార్, ఆశీర్వాదం పాల్గొన్నారు.

10 కి.మీ. నరకమే

రామచంద్రాపురం మండలం సి.రామాపురం నుంచి చంద్రగిరి మండలం తొండవాడకు వెళ్లే మార్గం గుంతలమయమైంది. రాళ్లు తేలి ప్రమాదకరంగా మారింది. 10 కి.మీ. మేర ఇదే పరిస్థితి నెలకొంది. టన్నుల లోడుతో నిత్యం రాకపోకలు సాగించే టిప్పర్ల కారణంగానే ఈ దుస్థితి నెలకొన్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుమ్ముతో అల్లాడిపోతున్నామని రైతులు వాపోయారు. **-ఈనాడు, తిరుపతి**

సిరుల తల్లి.. వరాల కల్పవల్లి

తిరుచానూరు: కల్పవృక్ష వాహనంపై విహరిస్తున్న పద్మావతీదేవి

దేవతామూర్తుల వేషధారణలో కళాకారులు

కార్మికుల సంక్షేమమే లక్ష్యం

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: తిరుపతి టూవీలర్ మెకానిక్‌ల అసోసియేషన్ బలోపేతంతో పాటు కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తామని ఆ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక గాంధీ ట్రస్ట్ భవనంలో గురువారం నెలవారి సమావేశం జరిగింది. మెకానిక్‌ల సమస్యలు, సభ్యుల సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం ప్రమాదవశాత్తు గాయపడిన మెకానిక్ లక్ష్మీనారాయణకు, కిడ్నీ సమస్యతో బాధపడుతున్న మెకానిక్ బాషాకు సంక్షేమ నిధి నుంచి రూ.10వేలు చొప్పున చెక్కులను అందజేశారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు జలంధర్, ఉపాధ్యక్షుడు ప్రభు, కార్యదర్శి గురు ఆచారి, కోశాధికారి బాబు, సంయుక్త కార్యదర్శి తేజ, సభ్యులు పాల్గొన్నారు.

అదనపు కమిషనర్ బోర్డు తొలగింపు

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: 'నేనే అదనపు కమిషనర్' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై నగరపాలిక అధికారులు ఎట్టకేలకు స్పందించారు. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా గత ప్రభుత్వంలో నియమితులైన చరణ్‌తేజ్‌రెడ్డి మాతృసంస్థకు బదిలీ అయి నెలలు గడుస్తున్నా.. ఆయన పేరుతో ఛాంబర్, ఛాంబర్ ఎదుట ఉన్న బోర్డును గురువారం తొలగించారు.

కేంద్ర, రాష్ట్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్తాం

తిరుపతి(రైల్వే), న్యూస్‌టుడే: తిరుపతి బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, మంత్రులతో పాటు కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యేలు గాలి భానుప్రకాష్, బొజ్జల సుధీర్ రెడ్డి, డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. తిరుపతి బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ గిరిధర్ కుమార్, సభ్యులు ఎమ్మెల్యేలను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు సమర్పించారు. బాలాజీ రైల్వే డివిజన్ ఆవశ్యకతను ఎమ్మెల్యేలకు వివరించారు.

అయ్యో పాపం.. గోమాత!

భాకరాపేట పంచాయతీలో సేకరించిన చెత్త, ప్లాస్టిక్ కవర్లను సమీపంలోని ఖాళీ ప్రదేశంలో డంపింగ్ చేస్తున్నారు. అడవికి మేతకు వెళ్తున్న పశువులు వాటిని తిని చనిపోతున్నాయి. ఇటీవల మూడు పశువులు చనిపోయాయి. వ్యర్థాలను చెత్తసేకరణ కేంద్రాలకు తరలించాలని స్థానికులు గురువారం ఎంపీడీవో గిడ్డయ్యకు వినతిపత్రం ఇచ్చారు.

-న్యూస్‌టుడే, చిన్నగొట్టిగల్లు

వాహనం ఎదురొస్తే అంతే!

డీఎన్ రోడ్డు నుంచి కుక్కలపల్లి, పచ్చిపాలపల్లి, మల్లబ్బగారిపల్లి మీదుగా కొత్తపచ్చిపాలపల్లికి వెళ్లే తారు రోడ్డుపై ఎదురుగా వాహనం వచ్చినా తొలిగే పరిస్థితి లేదు. ఇరువైపులా కంపలు తగిలి గీతలు పడుతున్నాయి. మొగరాల నుంచి నాగాపురం మీదుగా వెళ్లే అయ్యవారిపల్లి రోడ్డు, పాకాల నుంచి చిన్నగోర్పాడు మీదుగా పెద్దరామాపురానికి వెళ్లే రోడ్డు, ఊట్లవారిపల్లి నుంచి కృష్ణాపురానికి వెళ్లే రోడ్ల పరిస్థితి సైతం ఇలాగే ఉంది. **-న్యూస్‌టుడే, పాకాల**

మురికికూపంలోనే చదువులు

నిర్లక్ష్యం నీడలో నగరపాలక పాఠశాల

తిరుపతి(విద్య), న్యూస్‌టుడే: ప్రశాంత వాతావరణంలో చదువుకోవాల్సిన విద్యార్థులు చుట్టూ మురుగు నీటితో, వర్షపు ఊటతో నానా అవస్థలు పడుతున్నారు. తరగతి గదిలో కూర్చోలేక.. బయట నిల్చోలేకపోతున్నారు. ఇది ఏ మారుమూల ప్రాంతంలోని పాఠశాల అనుకుంటే పొరపాటే. తిరుపతి నడిబొడ్డున బాలాజీకాలనీలోని కార్పొరేషన్ పాఠశాలలో విద్యార్థుల దుస్థితి.

వరండాలో వర్షపు నీరు, పనిచేయని ఆరో ప్లాంట్

సమస్య ఏమిటంటే..

❖ బాలాజీకాలనీలోని మాలవ్యాజీ ఉన్నత పాఠశాల వెనుక భాగంలోని మురుగు గుంత నుంచి వచ్చే మురుగు నీటితో పాఠశాల ముందు భాగంలో నిత్యం దుర్వాసనతో విద్యార్థులు తల్లడిల్లిపోతున్నారు. మధ్యాహ్నం దుర్వాసన భరించలేక సరిగా భోజనం చేయలేకపోతున్నారు.

❖ తరగతి గదులు, వరండాలో వర్షపు నీరు, ఊట నీరు చేరడంతో ఎక్కడ జారి కిందపడి ప్రాణాలపైకి తెచ్చుకుంటారో అనే భయాందోళనలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉన్నారు.

❖ ఆర్వో ప్లాంటు మరమ్మతుకు గురైంది. స్వచ్ఛమైన నీరు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

❖ మరుగుదొడ్ల వద్ద మురుగు పారుతోంది. రోజూ శుభ్రం చేయడం లేదు. మరుగుదొడ్లలోకి అడుగు పెట్టాలంటే బాలికలు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యలు ఏళ్లుగా ఉన్నాయి.

❖ కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగం వారికి ఫిర్యాదు చేశాం.. త్వరితగతిన సమస్య పరిష్కరిస్తామని అర్బన్ మండల విద్యాశాఖ అధికారి బాలాజీ అన్నారు.

విద్యార్థుల సంఖ్య **284**

ప్రపంచ జ్ఞానం పుస్తకంతో సాధ్యం

తిరుపతి(గ్రామీణం), న్యూస్‌టుడే: గ్రంథాలయం ఒక దేవాలయమని, ప్రపంచ జ్ఞానం పుస్తకంతోనే సాధించవచ్చని ఏపీ గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర సభ్యుడు డాక్టర్ వీఆర్ రాసాని వెంకటరామయ్య పేర్కొన్నారు. ముత్యాలరెడ్డిపల్లిలోని బాలల గ్రంథాలయంలో గురువారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. తితిదే పద్మావతీ బాలికల ఎయిడెడ్ పాఠశాలల్లోని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, ప్రశంసాపత్రాలు అందించారు. రచయిత ఉమాదేవి, గ్రంథాలయాధికారి ధనంజయులు, ఎం.ఎం. రెడ్డి, సిద్ధారెడ్డి, సురేష్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో వెంకటరామయ్య తదితరులు

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం శ్రీవారిని 67,121 మంది దర్శించుకున్నారు. రూ.4.75 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

తెలుగు యువత నేత పుట్టినరోజు వేడుక

తిరుపతి(మంగళం), న్యూస్‌టుడే: తెదేపా తెలుగు యువత స్పోక్స్‌పర్సన్ కంకణాల రజినీకాంత్ పుట్టినరోజు వేడుకలను గురువారం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆర్.సి. మునికృష్ణ ఛాంబర్‌లో ఘనంగా నిర్వహించారు. తెదేపా నాయకులు కేకు కోసి, జ్ఞాపిక అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. నాయకులు మస్తాన్ నాయుడు, ఉమాశంకర్, శ్రీధర్, సుబ్బుయాదవ్, సుధాకర్‌రెడ్డి, నాగప్రతాప్, చంద్ర, ముని, దేవా, జగ్గా తదితరులు పాల్గొన్నారు.

రజనీకాంత్‌ను సన్మానిస్తున్న ఉప మేయర్ ఆర్‌సీ మునికృష్ణ, నాయకులు

అవగాహనతో మొలల నివారణ

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: అవగాహనతోనే మొలల నియంత్రణ సాధ్యమని ప్రముఖ ఆయుష్ వైద్యులు భాస్కర్‌రావు పేర్కొన్నారు. ప్రపంచ మొలల దినోత్సవం సందర్భంగా స్థానిక సుమన అనోరెక్టల్ ఆసుపత్రిలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఎస్వీ ఆయుర్వేద కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, సర్జరీ విభాగాధిపతి భాస్కర్‌రెడ్డి హాజరయ్యారు.

సమావేశానికి హాజరైన వైద్యులు

In The Court of the prl. Junior Civil Judge, Tirupati
I.A.No. 499/2022, O.S.No.397/2022
K.Sanath Kumar ...Petitioner
V/s
K.Geetha ...Respondent
NOTICE TO THE RESPONDENT
K. Geetha W/o K.Venkatamuni Achari, D.No.1-61, Thanapalli Village, Kuntra pakam Post, Tirupati Rural Mandal, Tirupati Dist.
పై కనిన ప్రోనోటు దావాలో attachement Petitioner లో రెస్పాండెంటుకు నోటీసు నిమిత్తం 17.12.2025 న ఉదయం 10.30 గంటలకు పై కనిన రెస్పాండెంటు పై కనిన కోర్టులో హాజరై సమాధానం చెప్పుకోవలసినదిగా కోర్టువారు వాయిదా వేసియున్నారు. రానియెడల పరోక్షముగా తీర్మానించబడును.
వాయిదా తేది. 17.12.2025
P. PRABHAKAR NAIDU
Advocate-Tirupati

In The Court of the prl. Junior Civil Judge, Tirupati
O.S.No.397/2022
K.Sanath Kumar ...Plaintiff
V/s
K.Geetha ...Defendant
SUIT SUMMON TO THE DEFENDANT
K. Geetha W/o K.Venkatamuni Achari, D.No.1-61, Thanapalli Village, Kuntrapakam Post, Tirupati Rural Mandal, Tirupati Dist.
పై కనిన ప్రోనోటు దావాలో ప్రతివాదికి దావా సమన్లు నిమిత్తం 17.12.2025 న ఉదయం 10.30 గంటలకు పై కనిన ప్రతివాది పై కనిన కోర్టులో హాజరై సమాధానం చెప్పుకోవలసినదిగా కోర్టువారు వాయిదా వేసియున్నారు. రానియెడల పరోక్షముగా తీర్మానించబడును.
వాయిదా తేది. 17.12.2025
P. PRABHAKAR NAIDU
Advocate-Tirupati

నియామకం

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: శ్రీపద్మావతి మహిళా వర్సిటీ విద్యా విభాగం సహాయ ఆచార్యులు అనురాధను సమగ్ర శిక్షా అభియాన్ అన్నమయ్య జిల్లా అదనపు కో-ఆర్డినేటర్(ఏపీసీ)గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం జీవో జారీ చేసింది. విదేశీ సేవ నిబంధనల ప్రకారం డిప్యుటేషన్ విధానంలో నియమించినట్లు స్పష్టం చేసింది.

అక్రమ దుకాణం తొలగింపు

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: నగరపాలిక కమిషనర్ మౌర్య గురువారం రాత్రి న్యూబాలాజీ కాలనీలోని అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎదురుగా అనధికారికంగా ఓ రేకుల బంకు వెలిసిన విషయాన్ని ఆమె గమనించారు. క్యాంటీన్‌కు ఎదురుగా ఇబ్బందికరంగా ఉందని భావించిన ఆమె వెంటనే పట్టణ ప్రణాళిక విభాగపు అధికారుల్ని ఆదేశించడంతో ఏసీపీ, కార్యదర్శులు అక్కడికి చేరుకుని అనధికారిక బంకును తొలగించారు.

ఎస్వీఎంసీకి డాక్టర్ శ్రీలక్ష్మి బదిలీ

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: ఎస్వీ వైద్య కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్‌గా డాక్టర్ పి.శ్రీలక్ష్మి నియమితులయ్యారు. కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో కంటి విభాగం అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. డాక్టర్ విన్నపం మేరకు ఆరోగ్య వైద్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ ఉత్తర్వులు విడుదల చేశారు.

ఏటా బీఎండీ పరీక్షలు చేయించుకోండి

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: నలభై ఐదేళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఏటా ఎముకల సాంద్రత పరీక్షలు(బీఎండీ) చేయించుకోవాలని ప్రముఖ ఎముకలు, కీళ్ల నరాల వైద్య నిపుణులు డాక్టర్ సుకుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక సాయిసుధా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, ముంబయికి చెందిన ఇంటస్ ఫార్మా లిమిటెడ్ కంపెనీ సంయుక్తంగా సాయిసుధా ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు సుబ్బానాయుడు, వినయ్‌కుమార్, హిమబిందు, సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సుకుమార్

పింఛనర్ల సమస్యలు పరిష్కరించాలి

తిరుపతి(మంగళం), న్యూస్‌టుడే: రైల్వే, కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ విరమణ చేసిన పింఛనర్ల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని తిరుపతి సీఆర్ఎస్ పింఛనర్ల అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. గురువారం రెడ్డిగుంట సమీపంలోని ఎస్‌బీఐ కాలనీలో ఎంపీ గురుమూర్తికి వినతిపత్రం అందజేశారు.

చిరుత సంచారం అవాస్తవం

చంద్రగిరి గ్రామీణ, న్యూస్‌టుడే: కొటాల పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో చిరుత సంచారం అవాస్తవమని ఎఫ్ఆర్‌వో మాధవి తెలిపారు. గ్రామస్థులు చూపినవి చిరుత పాదముద్రలు కావని, భయాందోళన చెందొద్దని.. పాండురంగయ్యగారిపల్లి, కొటాల, పుల్లయ్యగారిపల్లి గ్రామాల ప్రజలకు ఆమె చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: **సమస్య:** నగరంలోని 48వ డివిజన్ పరిధిలోని మాధవ్‌నగర్‌లో మురుగు కాలువల వ్యవస్థ లేదు. మురుగునీరు నిల్వ ఉండిపోవడంతో దుర్వాసన, దోమల సమస్య ఎక్కువగా ఉంది.

- కన్నప్ప, మాధవ్‌నగర్

సమాధానం: పరిశీలించి కాలువలు లేని ప్రాంతాల్లో నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం.

- శ్యాంసుందర్, ఎస్ఈ, నగరపాలిక

సమస్య: తుడా కార్యాలయం ఎదురుగా గంగమ్మ గుడి వరకు ఇటీవల రోడ్డు విస్తరించారు. మాస్టర్‌ప్లాన్ రోడ్డు నిర్మించినా వాహనాలు రోడ్డంతా పార్కింగ్ చేస్తున్నారు. రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉంది. దుకాణాలు, వాహనాల కారణంగా ట్రాఫిక్ స్తంభిస్తోంది. **- నటరాజ్, పెద్దకాపువీధి**

సమాధానం: పరిశీలించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతాం. **-అమరయ్య, ఉపకమిషనర్, నగరపాలిక**

పాకాల, న్యూస్‌టుడే: **సమస్య:** నేంద్రగుంట నుంచి పెనుమూరుకు వెళ్లే రహదారిపై ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు. అసలే సింగిల్ రోడ్డు కావడం, ఇరువైపులా వర్షాలకు మట్టిని కోసి లోతుగా గోతులు ఏర్పడడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

-రమేష్, విశ్రాంత ఉద్యోగి, కె.వడ్డేపల్లి

సమాధానం: మండల పరిధిలోని రహదారిని విస్తరించడానికి రూ.11 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే రహదారి పనులు ప్రారంభిస్తాం.

-అజిత్‌కుమార్, ఏఈ, ర.భ.శాఖ

పశువులపై ఏనుగుల దాడి

భాకరాపేట, న్యూస్‌టుడే: చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచర్ల గ్రామంలో ఏనుగులు పశువులపై బుధవారం రాత్రి దాడి చేశాయి. చంద్రశేఖర్‌రెడ్డికి చెందిన వరి పైరును ధ్వంసం చేశాయి. అక్కడే ఉన్న పశువులపై దాడి చేయగా అవి కట్లు తెంచుకుని పారిపోయాయి. ఓ ఎద్దుకు తీవ్రగాయాలయ్యాయి.

మంగళంలో వివాహిత ఆత్మహత్య

తిరుపతి(మంగళం), న్యూస్‌టుడే: తిరుపతి అర్బన్ మండలం మంగళం పరిధిలోని కృష్ణవేణియాదవ్ కాలనీలో గురువారం ఇ.అనూష(30) ఆత్మహత్యకు పాల్పడింది. బెంగుళూరులో నివాసం ఉంటున్న రాజేంద్ర, శారదల కుమార్తె అయిన ఆమెకు పదేళ్ల క్రితం మంగళం సమీపంలోని హరిత కాలనీకి చెందిన బంధువుల అబ్బాయి ఇ.మునితో వివాహమైంది. వీరికి 7, 9 ఏళ్ల వయసుగల ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. మృతురాలి తల్లిదండ్రుల కథనం మేరకు.. భర్త ముని ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వ్యసనాలకు బానిసవడం వల్ల నిత్యం డబ్బుల కోసం భార్యను వేధించేవాడు. ఈ కారణంతోనే ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతురాలి భర్త మాత్రం తమ మధ్య ఎలాంటి గొడవలు లేవని, మొదటి నుంచి ఆమె అప్పులు చేసేదని చెప్పారు. ఆన్‌లైన్‌లో ట్రేడింగ్ చేసేదని పోలీసులకు వివరించారు. ఈ కారణంగానే ఇటీవలే సుమారు రూ.5 లక్షలు అప్పు చేసిందని, అప్పులు ఇచ్చినవారు గట్టిగా అడగడం వల్లే ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని తెలిపారు. తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు.

అనూష (పాతచిత్రం)

నగదు చోరీ కేసులో నిందితుడికి జైలు

తిరుపతి(లీగల్), న్యూస్‌టుడే: తిరుమల రెండో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో నమోదైన నగదు చోరీ కేసులో కర్ణాటకకు చెందిన సంజూ బటెన్‌వర్‌కి మూడు నెలల జైలుశిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి కోటేశ్వరరావు గురువారం తీర్పు వెలువరించారు.

శ్రీకాళహస్తి

• శ్రీకాళహస్తి • సత్యవేడు

జర్మనీ దేశీయులతో ఛైర్మన్ సాయిప్రసాద్

ఆలయ శిల్పకళ అద్భుతం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వర ఆలయం శిల్పకళ అద్భుతంగా ఉందని జర్మనీ దేశీయులు పేర్కొన్నారు. వాయులింగేశ్వరుని దర్శనార్థం 40 మంది భక్తబృందం గురువారం ఆలయానికి వచ్చారు. ట్రస్టుబోర్డు ఛైర్మన్ వీరికి దర్శన ఏర్పాట్లు చేయించారు. ఆలయ విశిష్టత, ప్రాశస్త్యం గురించి వివరించారు.

భోజనాల నాణ్యతలో రాజీ పడొద్దు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: అన్న క్యాంటీన్‌లో పేదలకు పంపిణీ చేసే ఆహార పదార్థాల నాణ్యతలో రాజీ పడొద్దని, రుచికరమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సూచించారు. పార్టీ శ్రేణులతో కలిసి గురువారం అన్న క్యాంటీన్‌ను సందర్శించారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. పేదల ఆకలి తీర్చే పథకాన్ని విస్తృతం చేయాలన్నారు.

అన్న క్యాంటీన్‌లో భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

గైర్హాజరైన అధికారులపై ఫిర్యాదు చేస్తా

సత్యవేడు, న్యూస్‌టుడే: కొంతమంది అధికారులు ప్రోటోకాల్ పాటించకుండా కార్యక్రమాలకు హాజరుకావడం లేదని, అలాంటి వారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి షోకాజ్ నోటీసులు జారీ చేయిస్తామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. గురువారం మండలంలోని జడేరిలో తారు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. కన్నావరం- జడేరి క్రాస్ నుంచి అల్లప్పగుంట వరకు రూ.2.34 లక్షలతో 4.67 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మిస్తామని చెప్పారు. శ్మశానానికి వెళ్లే దారి బాగు చేయాలని గ్రామస్థులు కోరారు. అధికారులు రాకపోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏవో త్రివిక్రమరావు, డీఈ రాజశేఖర్, ఏఈ నాగరాజు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం, ఏవో త్రివిక్రమరావు

ఖాతాల్లో నగదు
అన్నదాతల్లో ఆనందం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలు చేరువ కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల నిధులు బ్యాంకు ఖాతాల్లో పడటంతో రెట్టించిన ఉత్సాహంతో సాగు పనులు చేపట్టేందుకు సన్నద్ధం అవుతున్నారు.

39 వేల ఎకరాల్లో సాగు..

రబీ సీజన్‌లో వర్ష భయంతో ఇన్నాళ్లు నార్లు వేయకుండా రైతులు నిరీక్షిస్తూ వచ్చారు. వర్షం తగ్గుముఖం పట్టడంతో వరి సాగుతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే చెరువులు, బోర్లలో సాగునీటి నిల్వలు సమృద్ధిగా చేరాయి. శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల పరిధిలో దాదాపు 39 వేల ఎకరాలకు పైగా వివిధ పంటలు సాగవుతున్నాయి. వీటిల్లో 85 శాతం వరి సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. రెండు నియోజకవర్గాల పరిధిలో 57,500 మంది రైతులకు రూ.36.70కోట్ల లబ్ధి చేకూరింది.

రబీ సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

సాగు సమయానికి చేయూత

ప్రభుత్వం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల ద్వారా సరైన సమయంలో రైతులకు చేయూత అందించింది. రబీ సీజన్‌లో సాగు సన్నాహాలు జరుగుతున్నాయి. ఖాతాలో రూ.7 వేలు పడటంతో విత్తనాలు, యూరియా కొనుగోలుతో పాటు ఖర్చులకు ఉపయోగపడనున్నాయి.
- హరికృష్ణ, బాలగున్నయ్య, రైతులు, వెలంపాడు, ఏర్పేడు

నియోజకవర్గాల వారీగా వివరాలు..

నియోజకవర్గం	రైతుల సంఖ్య	నిధులు (రూ.కోట్లలో)
శ్రీకాళహస్తి	35,268	21.51
సత్యవేడు	22,232	15.19

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

? వరదయ్యపాళెం మండలంలోని చెన్నవారిపాళెంలో పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. శుభ్రత కార్యక్రమాలు చేపట్టాలి. **- శేఖర్** ● త్వరలో పారిశుద్ధ్య పనులు చేపడతాం. **- దీప, సర్పంచి**
– న్యూస్‌టుడే, వరదయ్యపాళెం

? శ్రీకాళహస్తిలోని హౌసింగుబోర్డు కాలనీ పురపాలక సంఘం పాఠశాల సమీపంలో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. **- నారాయణ** ● త్వరలో కొత్త దీపాలు ఏర్పాటు చేస్తాం. **- రవి, ఎలక్ట్రికల్ విభాగం అధికారి** – న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

? పాలమంగలం ఎస్టీ కాలనీలో కాలువల నిర్వహణ సక్రమంగా లేదు. ఇళ్ల ముందు మురుగు నిలిచిపోతోంది. **- కాళప్ప** ● మురుగు తొలగించి పరిసరాలు శుభ్రం చేస్తాం. **- ఆనంద్, కార్యదర్శి**
– న్యూస్‌టుడే, నారాయణవనం

వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పట్టణంలోని వి.ఎం.పల్లి మార్గంలో కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. ఇక్కడ సమస్యపై 'ఈనాడు' 'మేమున్నాం మీకు తోడుగా'లో వార్త ప్రచురితమైంది. కమిషనర్ భవానీప్రసాద్ స్పందించి శుభ్రత చర్యలు చేపట్టారు.

నేడు ఎమ్మెల్యే ప్రజాదర్బార్

నారాయణవనం, న్యూస్‌టుడే: నారాయణవనంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. తహసీల్దారు కార్యాలయం ఆవరణలో ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమం ఉంటుందన్నారు. అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని సూచించారు.

ప్రచార బోర్డుల ఏర్పాటుకు వినతి

కమిషనర్ మౌర్యకు వినతిపత్రం ఇస్తున్న ఈవో

ఏర్పేడు, న్యూస్‌టుడే: ఏర్పేడు మండలంలోని గుడిమల్లంలోని పరశురామేశ్వర ఆలయానికి సంబంధించిన ప్రచార బోర్డులను తిరుపతిలో ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని కమిషనర్ మౌర్యకు ఈవో రామచంద్రారెడ్డి వినతిపత్రం ఇచ్చారు. తిరుమలకు చేరుకునే భక్తులు సులభంగా పరశురామేశ్వర ఆలయానికి వచ్చేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. పరిశీలించి ఉత్తర్వులు జారీచేస్తామని కమిషనర్ చెప్పారు.

ప్రమాదం అంచున ఆటలు

సువర్ణముఖి నదిని ఆనుకుని ఏర్పాటు చేసిన కరకట్టపై పిల్లలు ఆటలు ఆడుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. పాఠశాలలు విడిచి పెట్టిన తర్వాత కట్ట చివరి వైపునకు వెళ్లి సంక్షేమ వసతి గృహం, పాఠశాల పిల్లలు ఆడుతున్నారు. ఎవరైనా పొరపాటున జారి పడితే ప్రాణాలు పోవాల్సిందేనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కరకట్టపైకి విద్యార్థులు వెళ్లకుండా చూడాలని కోరుతున్నారు. పరిశీలించి చర్యలు చేపడతామని అధికారులు చెప్పారు. – న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

వేంబాకం దారి.. అధ్వానం

నాగలాపురం మండలంలోని వేంబాకం గ్రామానికి వెళ్లే రహదారిలో కల్వర్టుల వద్ద పరిస్థితి ప్రమాదకరంగా మారింది. రోడ్డు నిర్మాణ సమయంలో గుత్తేదారు కాంక్రీటు వేయలేదు. దీంతో ఆ ప్రాంతంలో గోతులు కనిపిస్తున్నాయి. ఇటీవల వర్షాలతో ఇక్కడ నీరు నిలిచిపోవడంతో రాకపోకలు సాగించేందుకు పలువురు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకముందే గుంతలను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నాగలాపురం

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం శ్రీవారిని 67,121 మంది దర్శించుకున్నారు. రూ.4.75 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

కుంభాభిషేకానికి ఏర్పాట్లు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి ఆలయానికి అనుబంధంగా బేరివారి మండపం వద్ద కొలువుదీరిన ఆగ్నేయ గణపతి ఆలయంలో కుంభాభిషేకానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మహా శివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించాలంటే ముందుగా ఈ ఆలయంలో అభిషేకం చేయడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా ఈనెల 25 నుంచి మూడు రోజుల పాటు కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు చెబుతున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా జట్టు తరఫున మండలంలోని బత్తులవల్లం ఉన్నత పాఠశాలకు చెందిన 9, 8వ తరగతుల బాలికలు అఖిల, షర్మిల రాష్ట్రస్థాయి కబడ్డీ, నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. బీఎన్‌కండ్రిగలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో వీరు సత్తా చాటారు. మచిలీపట్నం, పశ్చిమ గోదావరిలో రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయని హెచ్‌ఎం జయసుధ చెప్పారు. విద్యార్థినులు, పీడీ బందిలకుమారిను అభినందించారు.

అఖిల

షర్మిల

పిచ్చాటూరు, న్యూస్‌టుడే: కారూరు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మణెయ్య రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయినట్లు ఎంఈవోలు హేమమాలిని, యుగంధరరాజు తెలిపారు. జిల్లాస్థాయిలో జరిగిన 400, 800 మీటర్ల పరుగు, క్రికెట్ పోటీల్లో రాణించారు. గురువారం ఆయనను సత్కరించారు.

గుంతలు.. ప్రమాద సంకేతాలు

రేణిగుంట, న్యూస్‌టుడే: సర్వీసు రోడ్లను ఆనుకొని ఉన్న స్థలాల్లో భారీ గుంతలు ఏర్పడటంతో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. రేణిగుంట రైల్వే గేటు వద్ద వంతెన ఏర్పాటుతో గంగమ్మ ఆలయం సమీపం నుంచి గేటు వరకు ఇరువైపులా సర్వీసు రోడ్లు నిర్మించారు. ఈ మార్గంలో వినాయకనగర్, గౌరీనగర్‌తో పాటు జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. సీఆర్ఎస్, తహసీల్దారు కార్యాలయం, బీసీ వసతిగృహం, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌కు ఇదే మార్గం. దీంతో రోజూ ఈ దారిలో వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి.

ఆకతాయిల హల్‌చల్..

ఇక్కడ పాఠశాలలు ఉండటంతో ఎక్కువగా ఆకతాయిల హల్‌చల్ చేస్తుంటారు. బాలికల ఉన్నత పాఠశాల ప్లస్ గ్రేడ్ సాధించడంతో ఇంటర్మీడియట్ తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యార్థినులు సాయంత్రం బయటకు వచ్చే సమయంలో కొందరు ద్విచక్ర వాహనాలతో వేగంగా తిరుగుతున్నారు. దీంతో విద్యార్థినులు ఆందోళనకు గురవుతున్నారు. దీంతో పాటు వంతెన కింద రైల్వేట్రాక్ ప్రాంతంలో మందుబాబుల వీరంగం అధికంగానే ఉంటుంది. జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో ఇరువైపులా సర్వీసు రోడ్లకు ఆనుకుని భారీ గుంతలు ఉన్నాయి. వర్షం నీరు భారీగా చేరి నిలిచిపోవడంతో కొందరు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. కానీ అధికారులు పట్టించుకోవడం లేదని, సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ఏఎంసీ కార్యవర్గం ఎన్నిక

చెంచయ్యనాయుడును సత్కరిస్తున్న నాయకులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మండలంలోని మన్నవరం గ్రామానికి చెందిన ఆర్.చెంచయ్యనాయుడు మూడోసారి ఏఎంసీ అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఇప్పటికే 2015-18 మధ్య రెండు సార్లు పదవి చేపట్టారు. శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఛైర్మన్‌గా చెంచయ్యనాయుడు, వైస్ ఛైర్మన్‌గా గంగిరెడ్డి, సభ్యులుగా అంకయ్య, మాధవరెడ్డి, చలపతి, రమేష్, చంద్రావతి, భాగ్యలక్ష్మి, రేష్మా, భూలక్ష్మి, జయకుమారి, సునీత, షేక్ మహ్మద్ షఫీ, యానాదయ్య, షేక్ హమీదా నియమితులయ్యారు.

500 కుటుంబాలకు సరకులు

సరకులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

కేవీబీపురం, న్యూస్‌టుడే: మండలంలోని రాయల చెరువు గండి పడడంతో నిరాశ్రయులైన కళత్తూరులో షేర్ జీసస్ వర్డ్ మినిస్ట్రీస్ ట్రస్ట్ సభ్యులు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. గ్రామంలోని 550 కుటుంబాలకు 5 కిలోల చొప్పున బియ్యం, నూనెతో పాటు సరకులు ఇచ్చారు. ట్రస్ట్ అధ్యక్షుడు జోసఫ్, నేత్ర సొసైటీ ట్రస్ట్ అధ్యక్షురాలు మేరీ, హెచ్.కుమార్, డాక్టర్ భాస్కర్, ఈశ్వర్ రెడ్డి, వెంకటరత్నం, నాగరాజు ఉన్నారు.

అరణియార్ గేట్ల మూసివేత

పిచ్చాటూరు, న్యూస్‌టుడే: అరణియార్ ప్రాజెక్టు స్పిల్‌వే గేట్లను గురువారం మూసివేసినట్లు డీఈ శ్రీనివాసులు తెలిపారు. జలాశయంలో నీటి మట్టం 30 అడుగులకు తగ్గడంతో పాటు వరద నీరు 100 క్యూసెక్కులు మాత్రమే ఉండటంతో గేట్లు మూసివేసినట్లు చెప్పారు. వర్షాలు పడితే నిర్దేశిత మోతాదులో నీరు దిగువకు విడుదల చేస్తామన్నారు.

బంగారం, నగదు చోరీ

ఏర్పేడు, న్యూస్‌టుడే: మండలంలోని పల్లంపేటలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చోరీ చేశారు. సీఐ శ్రీకాంత్‌రెడ్డి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ప్రకాశ్ తిరుపతిలోని బంధువుల ఇంటికి వెళ్లి గురువారం సాయంత్రం ఇంటికి వచ్చారు. తలుపులు తెరిచి ఉండటంతో ఇంట్లో బీరువాను పరిశీలించారు. అందులోని 40 గ్రాముల బంగారం, కిలో వెండి, రూ.10 వేలు నగదు పోయినట్లు గుర్తించారు. ఘటనపై పోలీసులకు ఆయన ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలియజేశారు.

శ్రీకాళహస్తి: అధికారులు, ఆహ్వానితులతో విద్యార్థులు

తొట్టంబేడు: ప్రశంసాపత్రాలు, బహుమతులతో విద్యార్థులు

విజేతలకు బహుమతుల ప్రదానం

శ్రీకాళహస్తి, తొట్టంబేడు, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకోవాలని ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ బాలుర ఉన్నత పాఠశాల వైస్ ప్రిన్సిపల్ ప్రద్యుమ్నశర్మ, ఆర్‌పీబీఎస్ జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం తీగల వెంకటయ్య అన్నారు. జాతీయ గ్రంథాలయాల వారోత్సవాల సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు గురువారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి లావణ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. ● విద్యార్థులు విధిగా పుస్తక పఠనం చేస్తే విజ్ఞానం పెంపొందుతుందని తొట్టంబేడు ప్రాథమిక పాఠశాలలో ఎంపీడీవో సురేంద్రనాథ్ సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా పాఠశాలలో చిత్రలేఖనం, వక్తృత్వం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు హరికృష్ణ, జయసుధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సువర్ణముఖి ప్రక్షాళన అవసరం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఎంతో పవిత్రమైన సువర్ణముఖి నది ప్రక్షాళనకు అధికారులు చర్యలు చేపట్టాలని శ్రీకాళహస్తీశ్వర క్షేత్ర పరిరక్షణ పరిషత్తు అధ్యక్ష, కార్యదర్శులు పురుషోత్తంగౌడ్, వెంకయ్య అన్నారు. శ్రీశుక బ్రహ్మాశ్రమం ఆవరణలో గురువారం కార్తిక వనభోజనాలు నిర్వహించారు. శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో బస్సులపై స్వామివారి నామాలు రాయాలని కోరారు. సభ్యులు ఈశ్వర్‌స్వామి, రమేష్, లక్ష్మీనారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

శతాబ్ద జ్ఞాపకం.. స్వామి విగ్రహం

ఏర్పేడు, న్యూస్‌టుడే: ఏర్పేడులో వ్యాసాశ్రమం స్థాపనకు వందేళ్లు పూర్తయిన నేపథ్యంలో పూర్వ విద్యార్థులు సద్గురు మలయాళ స్వామి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఏర్పేడు- వెంకటగిరి ప్రధాన రహదారి సమీపంలో పైవంతెన వద్ద సుమారు రూ.20 లక్షల వ్యయంతో ఆలయం నిర్మించారు. ఈనెల 22, 23 తేదీల్లో అక్కడ విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నట్లు తెలియజేశారు. ఇప్పటి వరకు చదివిన వెయ్యి మంది విద్యార్థులు పూజల్లో పాల్గొంటారని చెప్పారు.

రూపొందించిన విగ్రహం

మురుగు దాటితేనే.. మంచినీరు

శ్రీకాళహస్తి మండలంలోని బీవీపురం పంచాయతీలో బోరు చుట్టూ మురుగు నిల్వ చేరింది. నీరు కోసం వెళ్తున్న స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వృథా నీరు బయటకు వెళ్లే వీలు లేకపోవడంతో నిలిచిపోతోంది. మురుగుతో అవస్థలు తప్పడం లేదని పలువురు చెబుతున్నారు. – న్యూస్‌టుడే, ఏర్పేడు

కన్నావరంలో సమస్యలు కనరా..?

సత్యవేడు మండలంలోని కన్నావరం గ్రామంలో ఇరువైపులా కాలువలను ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంతో వీఆర్ కండ్రిగ- టీపీ పాళెం రోడ్డుపై నీరు పారుతోంది. కాలువలు మట్టితో మూసుకుపోవడంతో తాగునీటి పైపులైన్ల నుంచి వచ్చే నీరు రోడ్డుపైకి చేరుతోంది. వాహనదారులు రాకపోకలకు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. – న్యూస్‌టుడే, సత్యవేడు

పెళ్లి కావడం లేదని ఆత్మహత్య

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పెళ్లి కావడం లేదని, మనస్థాపానికి గురైన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ముత్యాలమ్మగుడి వీధిలో నివాసముంటున్న బాలాజీ (31) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. వివాహం కావడం లేదని కొన్నిరోజులుగా నిరాశగా ఉంటున్నాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రకాశ్‌కుమార్ తెలిపారు.

జ్వరంతో ఒప్పంద ఉద్యోగి మృతి

రాజశేఖర్

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి ఆలయం స్టోర్స్ విభాగంలో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగి రాజశేఖర్ (39) జ్వరంతో మృతి చెందారు. నెల రోజుల క్రితం ఆయన డెంగీకి గురవగా సకాలంలో తీవ్రత గుర్తించలేదు. దీనికి కామెర్లు తోడవడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. చికిత్స కోసం ఆలయ అధికారులు, ఉద్యోగులు రూ.1.35 లక్షలు నగదు అందజేసినా ఫలితం లేకపోయింది. రాజశేఖర్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆయన మృతికి ఉద్యోగ సంఘం నాయకులు గురువారం సంతాపం తెలిపారు.

బాలల హక్కులపై అవగాహన అవసరం

రేణిగుంట, న్యూస్‌టుడే: బాలల హక్కులకు అందరూ ప్రాధాన్యం ఇవ్వాలని ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి ఎం.రవిబాబు సూచించారు. గురువారం ఎస్వీయూ మానవ హక్కుల, సామాజిక అభివృద్ధి, జనాభా విద్య విభాగాలు, ఆకాంక్ష స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా గుత్తివారిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో బాలల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించాయి. బాలబాలికలకు ప్రభుత్వం ఉచిత విద్య అందిస్తుందని, 6-14 ఏళ్లలోపు పిల్లలు బడిలో ఉండాలని సూచించారు. బాలలను పనిలో పెడితే చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎస్వీయూ అధ్యాపకులు డాక్టర్ ఎథర్, డాక్టర్ రంజిత్‌కుమార్, డాక్టర్ కోదండరామిరెడ్డి, డాక్టర్ పార్థసారథి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేణిగుంటలో ర్యాలీలో పాల్గొన్న నిర్వాహకులు, విద్యార్థులు

విద్యతో అభివృద్ధి సాధ్యం.. ఏర్పేడు: చిన్నారులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దితే సులభంగా దేశాభివృద్ధి జరుగుతుందని ప్రగతి సంస్థ డైరెక్టర్ కేవీ రమణ పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కందాడ, పంగూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పించారు. హెచ్‌ఎం వరప్రసాద్, రామచంద్రయ్య, శిరీషా, సుభాష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గోడు వినండి.. గోడలు కట్టండి

పాఠశాలల్లో ప్రహరీలు లేక ఇబ్బందులు

తొట్టంబేడు, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం సర్కారు బడులను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్తామని గొప్పలు చెప్పింది. కానీ పరిస్థితి క్షేత్రస్థాయిలో భిన్నంగా ఉంది. పాఠశాల ప్రహరీ పనులు నేటికీ పూర్తికాకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో చాలా వరకు పనులు ముందుకు సాగకపోవడంతో సమస్య ఏర్పడింది. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలతో పలుచోట్ల జంతువులు, విషకీటకాలు లోపలకు వస్తుండటంతో చిన్నారులు ఆందోళనకు గురవుతున్నారు.

ఇవీ వివరాలు..
నియోజకవర్గం: శ్రీకాళహస్తి
మండలాలు: 4
పాఠశాలలు: 350
ప్రహరీల మంజూరు: 96
పెండింగ్‌లో ఉన్నవి: 32

విద్యార్థులకు అవస్థలు..

తొట్టంబేడు మండలంలోని చిట్టత్తూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు సమగ్ర శిక్షా పథకం నిధులతో ప్రహరీ నిర్మాణం పనులు ప్రారంభించారు. ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాలేదు. మంజూరైన నిధులతో పాఠశాలకు మూడు వైపుల నిర్మించి ముందు భాగం అసంపూర్తిగా వదిలేశారు. అటువైపు చెరువు ఉండటంతో పాములు, విషకీటకాలు లోపలకు వస్తున్నాయి. ఇక్కడ 150 మంది వరకు ఇబ్బందులు పడుతున్నారు. ● బోనుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణం పిల్లర్ల దశలో ఆగిపోయింది. ఇనుప చువ్వలు దర్శనమిస్తున్నాయి. ఇక్కడున్న 180 మంది విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. నిర్మాణానికి తీసుకొచ్చిన ఇనుము తుప్పు పట్టి పాడవుతోంది.

చిట్టత్తూరులో అసంపూర్తిగా నిర్మాణం

నిధుల మంజూరులో జాప్యం..

ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తామని గత ప్రభుత్వ పాలనలో హామీలు ఇచ్చారు. నాడు-నేడు పేరుతో పనులు ప్రారంభించి వదిలేశారు. నిధులు సకాలంలో రాకపోవడంతో పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. నియోజకవర్గంలోని చిట్టత్తూరు, బోనుపల్లి, పిల్లమేడు జడ్పీ పాఠశాలలు, సింగమాల, చెల్లూరు, రామానుజపల్లి, కుప్పయ్యకండ్రిగ ప్రాథమిక పాఠశాలల్లో పనులు అసలు ప్రారంభం కాలేదు. అసంపూర్తి పనులు కూటమి ప్రభుత్వం పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బహిరంగ ప్రకటన

ఇందు మూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా నా కక్షిదారు మెస్సర్స్ శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, తిరుపతి బ్రాంచి 1 మేనేజర్ వారు ఇచ్చిన దోగట్ల ప్రకారము ఈ క్రింది కనిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తి తిరుపతి నగరం, ఆర్.సి.రోడ్డు, ఇం.నెం.19-8-110లో యుండు చిన్నక్కగారి వెంకట్రామరెడ్డి గారి కుమారుడు సి.శ్రీనివాస కుమార్ గారికి చెందినదనియు, సదరు ఆస్తిని రిజిష్టరు తనఖా చేయించుకొని సదరు చిన్నక్కగారి శ్రీనివాస కుమార్ గారికి రుణము ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి ఈ క్రింద కనిన షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి హక్కులు, ఛార్జీలు, క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 7 దినములలోగా ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా కక్షిదారు బాధ్యులు కారు.

షెడ్యూలు

చిత్తూరు డి., శ్రీ బాలాజీ రి.డి., తిరుపతి, తిరుపతి రూరల్ సబ్ డి., తిరుపతి రూరల్ మండలం, నెం.21కు తుమ్మలగుంట గ్రూపునకు చేరిన నెం.47కు వేదాంతపురం గ్రామ రెవిన్యూ దాఖలా వేదాంతపురం మజరా, పద్మావతిపురం పంజ సర్వే నెం.226/1ఎ to 226/17లలో పూరా విస్తీర్ణం ఎ.8-58 సెంట్లు గల భూమిని తుడా (తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) వారిచే L.P.No.17/G1/1993, Date: 12-01-1999గా ఫైనల్ అప్రూవల్ కాబడిన లే-అవుట్‌లోని ప్లాట్లలో నాకు విక్రయ రూపేణ సర్వహక్కులు కలిగి ఈ దినం మీరు నేను విక్రయించు ప్లాటు నెం.255 గల జాగాకు హద్దులు, కొలతలు వివరం. తూర్పు: ప్లాటు నెం.264 గల జాగా, పడమర: 33 అడుగులు వెడల్పు గల రోడ్డు, ఉత్తరం: ప్లాటు నెం.254 గల జాగా, దక్షిణం: ప్లాటు నెం.256 గల జాగా, ఈ హద్దుల మధ్యన తూర్పు నుండి పడమరకు అ.55లకు మీ.16.775లు, ఉత్తరం నుండి దక్షిణమునకు అ.36లకు మీ.10.980లు, మొత్తం చ.అ.1980లు లేక చ.గ.220లు లేక 55 అంకణములు గల ఖాళీ జాగా పూరా విక్రయం.

జి.వి.సుబ్బయ్య, బి.ఎ., బి.ఎల్., అడ్వకేట్,
డి.నెం.8/114/2, రాయల్ నగర్, ఆర్.సి.రోడ్డు, తిరుపతి.
సెల్ నెం: 94402 02564

(c) eenadu

గూడూరు

•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

ప్రసవాల వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రామకృష్ణ

వైద్యుడి తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

వెంకటగిరి, న్యూస్‌టుడే: సామాజిక ఆరోగ్య కేంద్రం ఇన్‌ఛార్జి వైద్యుడు జిలానీ తీరుపై ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తీవ్రస్థాయిలో ఆగ్రహించారు. గురువారం ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల వైద్యుడిపై పలు ఆరోపణలు రావడంతో కలెక్టర్ విచారణ చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే నిధులు ఇష్టానుసారంగా ఖర్చు చేశారని మండిపడ్డారు. త్వరలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపడతామని ఎమ్మెల్యే వెల్లడించారు. ఏఎంసీ ఛైర్మన్ విశ్వనాథం, నేతలు ఆనంద్, చంద్రా, నరసింహులు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు. వైద్యుడు జిలానీ 'న్యూస్‌టుడే'తో చరవాణిలో మాట్లాడుతూ తాను ప్రస్తుతం సెలవులో ఉన్నానని వచ్చిన ఆరోపణలకు ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చినట్లు పేర్కొన్నారు.

బాల్యవివాహాలు చేస్తే జైలు

వెంకటగిరి, న్యూస్‌టుడే: బాల్యవివాహాలు చేస్తే రెండేళ్ల జైలుశిక్షతో సహా అపరాధ రుసుం విధిస్తారని సీడీపీవో శంషాద్‌బేగం అన్నారు. గురువారం పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాలలో బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికలు స్వీయ రక్షణ కోసం తప్పనిసరిగా కరాటేను నేర్చుకోవాలన్నారు. బాలల హక్కులపై నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందించారు. సూపర్‌వైజర్ వినుషా, టాటాట్రస్ట్ ప్రతినిధి శ్రీజ పాల్గొన్నారు.

ప్రమాణం చేస్తున్న ఏపీఎన్‌జీవో నూతన కార్యవర్గ సభ్యులు

గూడూరులో నిమ్మ ధరలు

మొదటి రకం: కేజీ రూ. 21 నుంచి రూ. 30 వరకు

రెండో రకం: కిలో రూ. 10 నుంచి రూ. 20 వరకు

వార్షిక ప్రణాళికపై ముగిసిన శిక్షణ

బాలాయపల్లి, న్యూస్‌టుడే: పొదుపు సంఘాల ఈసీ ప్రతినిధులకు స్థానిక స్త్రీశక్తి కార్యాలయంలో మూడు రోజులుగా నిర్వహించిన వార్షిక ప్రణాళికలపై శిక్షణ గురువారంతో ముగిసింది. వెలుగు ఏపీవో కిరణ్, సీసీలు చెంగల్రాయుడు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: స్థానిక స్త్రీశక్తి భవనంలో 18 నుంచి విజన్ బిల్డింగ్‌పై జరుగుతున్న శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. 51 మంది మహిళా రైతులకు టార్పాలిన్ పట్టాలు, 26 మందికి పిచికారీ యంత్రాలు రాయితీతో పంపిణీ చేశారు. మండల తెదేపా అధ్యక్షుడు శ్రీనివాసులు నాయుడు, ఉప ఎంపీపీ గోపాల్‌రెడ్డి, ఎంపీడీవో గోవర్ధన్, ఏపీఎం మునిజాయ్య, సీసీలు పాల్గొన్నారు.

పురపాలిక.. పాలించేవారు లేక

▸ మౌలిక వసతుల కల్పనకు నిధుల కొరత ▸ నిలిచిపోయిన కేంద్ర గ్రాంట్లు

గూడూరు గ్రామీణం-గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు పురపాలిక గ్రేడ్-1గా కొనసాగుతున్నా, ఆర్థికంగా వెనకబడి ఉంది. వైకాపా హయాంలో పాలకులు పురపాలిక పరిధిలోని చెన్నూరు, దివిపాలెం, పోటుపాలెం, నెల్లటూరు, చిల్లకూరు గ్రామ పంచాయతీలను విలీనం చేస్తూ అప్పట్లో ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారు. ఆయా పంచాయతీల పరిధిలోని ప్రజలు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దాంతో 2021 ఫిబ్రవరిలో జరగాల్సిన పురపాలిక ఎన్నికలు నిలిచిపోయాయి. గత నాలుగున్నర ఏళ్లుగా పాలకవర్గం లేదు. అప్పటి నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ఎన్నికలు జరగకపోవడంతో కేంద్రం నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు ఆగిపోయాయి. గూడూరు పురపాలికకు రూ.10 కోట్లు మేర నిధులు రాలేదు.

ఇదీ పరిస్థితి

- పురపాలిక- గూడూరు
- వార్డులు- 34
- విలీన గ్రామాలు- 5
- ఏటా ఆదాయం- రూ.11.20 కోట్లు
- కోల్పోయిన నిధులు- రూ.10 కోట్లు
- బకాయిలు- రూ.2 కోట్లు

మంత్రి ప్రకటించినా పురోగతి శూన్యం

పురపాలిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో విలీన గ్రామాల ప్రతిపాదనలు ఉపసంహరించి న్యాయస్థానంలో ఉన్న వ్యాజ్యాన్ని పరిష్కరిస్తామని పురపాలక మంత్రి నారాయణ అయిదు నెలల కిందట ప్రకటించినా నేటికీ పురోగతి లేదు. కూటమి ప్రభుత్వంలోనైనా గూడూరు పురపాలికకు ఎన్నికలు జరుగుతాయా? అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై కమిషనర్ వెంకటేశ్వర్లును వివరణ కోరగా ప్రభుత్వ నిర్ణయానుసారం వచ్చిన నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నామని చెప్పారు.

అధ్వానంగా మురుగు కాలువ

సగానికి తగ్గిన రాబడి

గూడూరు పురపాలిక పరిధిలో మొత్తం 34 వార్డులు ఉన్నాయి. ఆస్తి, నీటి పన్ను, వాణిజ్య భవనాల అద్దెలు, భవనాల నిర్మాణ అనుమతుల రుసుం, లైసెన్సు ఫీజుల రూపంలో వస్తున్న సాధారణ నిధుల నుంచి ఏటా రూ.11.20 కోట్లు రావాల్సి ఉండగా, కేవలం రూ.6.90 కోట్లు మాత్రమే వసూలు అవుతోంది. దీంతో రాబడిలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణకే అరకొర ఖర్చు చేస్తున్న పరిస్థితి. మౌలిక వసతుల కల్పనకు నిధుల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. గుత్తేదారులకు బకాయిలు రూ.2 కోట్లు మేర ఇవ్వాల్సి ఉంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు: 85002 02046 | నాయుడుపేట: 80085 73970 | సూళ్లూరుపేట: 88979 08890 | వెంకటగిరి: 80085 73966 | సమయం 10 AM TO 1 PM

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: **సమస్య:** స్వర్ణముఖి నదిలో ఇసుక, మట్టి తరలింపులు జరుపుతున్నారు. దీంతో నది స్వరూపం మారిపోయింది. – హనుమంతురావు, విశ్రాంత బ్యాంకు మేనేజరు

సమాధానం: ఇసుక, మట్టి తరలింపులు జరపకుండా గాడులు తీస్తాం. గాడుల్ని పూడ్చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం.

సమస్య: నాయుడుపేట ర.భ. అతిథి గృహం ఎదురుగా సెంట్రల్ లైటింగ్ వెలగడం లేదు. – మోహన్, స్థానికుడు

సమాధానం: దీపాలు వెలిగేలా చేస్తాం.

సమస్య: అగ్రహారపేటలో కుక్కలు, కోతుల బెడద ఎక్కువగా ఉంది. – అత్తికాయల సుబ్రహ్మణ్యం

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

సమస్య: స్థానిక నవోదయ పాఠశాల ఎదురువీధిలో గుంతలతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

సమాధానం: గుంతల్ని పూడ్చేలా చర్యలు తీసుకుంటాం. – ఎస్‌కే.ఫజులుల్లా, కమిషనర్

శ్మశాన వాటిక దారి ఆక్రమణపై ఫిర్యాదు

కోట, న్యూస్‌టుడే: తిమ్మనాయుడుపాలెం గ్రామంలో శ్మశాన వాటికకు వెళ్లే దారిని ఆక్రమిస్తున్నారంటూ మాజీ సర్పంచి ఆనంద కృష్ణమూర్తి ఆధ్వర్యంలో గ్రామస్థులు గురువారం తహసీల్దార్ జయజయరావుకు ఫిర్యాదు చేశారు.

అన్నదాతలకు కూటమి ప్రభుత్వం అండ

చిల్లకూరు: కూటమి ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలుస్తోందని తెదేపా మండలాధ్యక్షుడు దువ్వూరు రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. 'అన్నదాత సుఖీభవ' పథకం కింద నగదు జమచేసిన సందర్భంగా గురువారం చింతవరం అంబేడ్కర్ కూడలిలో పీఎం, సీఎం, చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నాయుడుపేట, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ నాన్‌గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ నాయుడుపేట కార్యవర్గం ఎంపిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగింది. ఎన్నికల అధికారి ఎస్.వి శ్రావణ కుమార్, పరిశీలకుడు లలిత్‌కుమార్ ఎన్నికలు నిర్వహించారు. నాయుడుపేట తాలుక ఏపీఎన్‌జీవో అధ్యక్షుడిగా కె.ఆనంద్ కుమార్, కార్యదర్శిగా వి.వి శ్రావణ్ కుమార్, కోశాధికారిగా కౌశిక్, సహాయ కార్యదర్శిగా మేరీ సుకన్య, అసోసియేషన్ ప్రెసిడెంటుగా ఆర్.కె మంజుల, సహాయ కార్యదర్శులుగా సరిత, సంజీవయ్య, బాల కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా రాజేష్, సయ్యద్ బాబు, అనీల్ కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మండల సమావేశం

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: మండలంలోని ఏంపీడీవో కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ 18వ సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. తాగునీటి, వీధి దీపాల సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ అనిల్ కుమార్ రెడ్డి సూచించారు. ఎంపీడీవో ఏవీ మురళీకృష్ణ, మండల స్థాయి అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

సర్వీసులు తగ్గి.. రద్దీ పెరిగి

నాయుడుపేట బస్టాండ్ నుంచి తిరుపతి వెళ్లాలంటే ప్రయాణికులు తిప్పలు పడాల్సి వస్తోంది. నిత్యం వేల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నా సకాలంలో బస్సులు ఉండటం లేదు. జాతీయ రహదారి ఆరు వరుసలుగా విస్తరించిన తర్వాత తిరుపతి వైపుగా వెళ్లే ఎక్స్‌ప్రెస్ సర్వీసులు అధిక సంఖ్యలో బస్టాండుకు రాకుండానే వెళ్తున్నాయి. దీంతో అరకొర బస్సులు మాత్రమే బస్టాండులోకి వస్తున్నాయి. – న్యూస్‌టుడే, నాయుడుపేట

కొలను కాదు... సిమెంటు రోడ్డు

గూడూరు- దుగరాజపట్నం రోడ్డు విస్తరణ పనులు రూ.కోట్లు వెచ్చించి చేపట్టినా సమస్యలు పరిష్కారం కావడం లేదు. కోట అడ్డరోడ్డు వద్ద రోడ్డు విస్తరణ పనులు చేపట్టి సిమెంటు రోడ్డు నిర్మించారు. అయితే రోడ్డు లోతట్టు ప్రాంతం కావడంతో వర్షం పడితే చాలు రహదారిపై నీరు నిలుస్తూ కొలనులా మారుతోంది. దాంతో వాహదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. – న్యూస్‌టుడే, కోట

బల్లలు విరిగి.. పెచ్చులూడి

సూళ్లూరుపేట మండలంలోని కొరిడి గ్రామంలో ఉన్న విశ్రాంతి భవనం దుస్థితికి చేరింది. బల్లలు విరిగి, పై పెచ్చులు మీద పడుతూ వేచి ఉండేందుకు ఇబ్బందిగా మారింది. ప్రాంగణంలో చెత్త నిల్వలతో దుర్వాసన వస్తోంది. దీంతో ప్రయాణికులు రోడ్డుపైనే నిరీక్షిస్తున్నారు. భవనానికి మరమ్మతులు చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సూళ్లూరుపేట గ్రామీణం

శునకాల గుంపు.. గ్రామస్థుల్లో జంకు

వాకాడు మండలంలోని పల్లెల్లో శునకాల బెడద ఎక్కువగా ఉంది. వాకాడు, నెల్లిపూడి, కొండూరు తదితర పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తూ గ్రామస్థులపై దాడులు చేస్తూ హడలు పుట్టిస్తున్నాయి. అత్యున్నత న్యాయస్థానం వీటిపై చర్యలు తీసుకోమని ఆదేశించినా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, వాకాడు

నిర్మాణం ఆగి.. అవస్థలు తెచ్చి

సూళ్లూరుపేట మండలంలోని మన్నేముత్తేరి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. నాడు- నేడు కింద మరుగుదొడ్ల భవన నిర్మాణం చేపట్టినప్పటికీ సకాలంలో నిధులు మంజూరు కాక అర్ధాంతరంగా ఆగిపోయిందని విద్యార్థుల తలిదండ్రులు వాపోతున్నారు. అధికారులు స్పందించి మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని వారు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సూళ్లూరుపేట

ఆర్థిక సాయం

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక మేరీ ఆశ్రమ వృద్ధులకు గురువారం స్థానిక జేఎంఎఫ్‌సీ కోర్టు న్యాయమూర్తి మీనాక్షి సుందరి ఉత్తర్వుల మేరకు కోర్టు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరెడ్డి రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. **నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే:** లోతువానిగుంటకు చెందిన యానాది సుబ్బమ్మ కుటుంబానికి గురువారం స్థానిక జనసేన నాయకులు అట్ల కృష్ణారావు రూ.10 వేలు ఆర్థికసాయం చేశారు. ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో మహిళ పూరిల్లు దగ్ధమైన సంగతి తెలిసిందే. ఏఎంసీ ఛైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, జనసేన అధ్యక్షుడు సతీష్, బాలుశెట్టి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధితుడి కుటుంబానికి రూ.20 లక్షల చెక్కును గురువారం ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ ఎస్ఎస్ఆర్ శర్మ అందజేశారు. ఆయన మాట్లాడుతూ సైదాపురం మండలం తూర్పుపూండ్ల గ్రామానికి చెందిన వెంకటరాజ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందడంతో అతని కుటుంబానికి రూ.20 లక్షల చెక్కును అందజేసినట్లు తెలిపారు. బ్రాంచ్ మేనేజర్ వినోద్, బీమా అధికారి శ్రీకాంత్ పాల్గొన్నారు.

క్రీడా పరికరాల పంపిణీ

చిల్లకూరు, న్యూస్‌టుడే: స్థానిక డా. బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యార్థులకు పెంచలకోన ఆలయ మాజీ ఛైర్మన్ తానంకి నానాజీ రూ.25వేల విలువైన క్రీడా పరికరాలను ఆయన నివాసంలో గురువారం పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ అనిల్‌కుమార్, పీడీ, చిల్లకూరు పీఏసీఎస్ అధ్యక్షుడు కొండా రామచంద్రారెడ్డి, తెదేపా నేతలు పాల్గొన్నారు.

గ్రంథ పఠనంతో మెరుగైన జ్ఞానం

వెంకటగిరి,న్యూస్‌టుడే: గ్రంథ పఠనం చేయడం వల్ల మెరుగైన జ్ఞానం లభిస్తుందని విశ్రాంత ఎంఈవో వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం గ్రంథాలయంలో వారోత్సవాలు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు రాధ, వైద్యులు రామాంజనేయులు, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, వెంకటేష్, రమేష్, వల్లభదాస్ పాల్గొన్నారు. విశ్వోదయ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

రైతన్నల ఆందోళన

తడ, న్యూస్‌టుడే: పొలాల్లోని వర్షపు నీటిని బయటకు వెళ్లనివ్వకుండా అడ్డుకట్టేసి కొందరు అడ్డుకుంటున్నారని మండలంలోని వేనాడు రైతులు గురువారం తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. పది రోజుల క్రితం వరినాట్లు పూర్తి చేశామని, ఇటీవల కురిసిన భారీ వర్షానికి పొలాల్లో నిండుగా నీరు చేరి పంట మునిగిపోయిందని రైతులు పేర్కొన్నారు. పొలాల్లోని నీరు బయటకు వెళ్లకుండా కొందరు అడ్డుకట్టేసి తూములను సైతం పూడ్చేసి దౌర్జన్యం చేస్తున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్వో బాబుకు వినతిపత్రం అందించి తమ పంటలను కాపాడాలని వారు కోరారు.

తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వేనాడు రైతులు

ఇండస్ కంపెనీ జీఎంకు మొక్కను అందిస్తున్న డీఎఫ్‌వో హారిక

నేలపట్టులో ఆర్వో ప్లాంటు ప్రారంభం

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో ఉన్న పర్యావరణ విజ్ఞాన కేంద్రం వద్ద ఇండస్ కాఫీ కర్మాగారం సహకారంతో సుమారు రూ.5 లక్షలు విలువ చేసే తాగునీటి శుద్ధి ప్లాంట్‌ను గురువారం ప్రారంభించారు. నేలపట్టుకు వచ్చే సందర్శకులకు శుద్ధి చేసిన తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసినట్లు కంపెనీ జీఎం షామ్ తెలిపారు. డీఎఫ్‌వో హారిక, కంపెనీ డైరెక్టర్ రవి ఎన్.గౌడ, సీఎఫ్‌వో మహేష్‌తో కలిసి ప్రారంభించారు. రేంజ్ అధికారిణి సౌజన్య, ఎఫ్ఎస్‌వో బాలయ్య పాల్గొన్నారు.

సమన్వయ లోపం.. సభ్యులకు శాపం

వాకాడు : మండల వెలుగు కార్యాలయంలో ఉద్యోగుల మధ్య సమన్వయం లోపించింది. కొందరు ఉద్యోగులు స్వయం సహాయక సభ్యులు దాచుకున్న పొదుపు మొత్తాలు డ్రా చేయాలన్నా కమీషన్ ఇవ్వాలని కింద స్థాయి సిబ్బంది ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. రుణం పొందాలన్నా, ప్రభుత్వ పథకం సభ్యులకు చేరాలన్న కొందరు ఉద్యోగులకు కమీషన్ ఇవ్వందే పనులు సాగడం లేదు. ఉద్యోగుల మధ్య సమన్వయ లోపంపై గురువారం అధికారులు సమీక్ష నిర్వహించారు. ఇకపై అలా జరగకూడదని హెచ్చరించారు.

రూ.30 లక్షలు గోల్‌మాల్

మండలంలోని స్వయం సహాయక సంఘాల్లోని కొందరు సభ్యులు, లీడర్లు, కింది స్థాయి ఉద్యోగులు కలిసి ఐదేళ్లుగా రూ.30 లక్షల వరకు నిధులను గోల్‌మాల్ చేసినట్లు దస్త్రాలు చెబుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా ఇంత వరకు ఒక్క రూపాయి కూడా రికవరీ చేయలేదు. ఇటీవల వాకాడులో ఓ గ్రూపు సభ్యులు రుణాలను సక్రమంగా చెల్లించినా బ్యాంకుకు చెల్లించలేదంటూ అధికారులు చెప్పడంతో సభ్యులు కంగుతిన్నారు. పక్కాగా విచారణ చేపడితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ విషయమై ఎంపీడీవో సాయి ప్రసాద్‌ను వివరణ కోరగా నిధుల గోల్‌మాల్ విషయమై విచారిస్తామని చెప్పారు.

ఘనంగా సహకార దినోత్సవం

చిల్లకూరు, న్యూస్‌టుడే: స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో అఖిల భారత సహకార దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. అధ్యక్షుడు కొండా రామచంద్రారెడ్డి, ఎస్‌డీఎల్‌సీవో రవికుమార్, సహకార బ్యాంకు గూడూరు శాఖ చీఫ్ మేనేజర్ హరికృష్ణ, సీఈవో రామానాయుడు పాల్గొన్నారు.

జెండా వందనం చేస్తున్న పీఏసీఎస్ ఛైర్మన్, రైతులు

ఎట్టకేలకు పాఠశాల కమిటీ ఎన్నికలు

కోట, న్యూస్‌టుడే: పెద్ద గోవిందపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల యజమాన్య కమిటీ ఎన్నికలు ఎట్టకేలకు నిర్వహించారు. గత కొంత కాలంగా ఎన్నికలు వాయిదా పడుతుండగా గురువారం ఎంఈవో దారా మస్తానయ్య ఆధ్వర్యంలో ప్రశాంతంగా జరిగాయి. కమిటీ ఛైర్మన్‌గా వెంకటేశ్వర్లు, వైస్ ఛైర్మన్‌గా స్వాతి, సభ్యులను ఎన్నుకున్నట్లు ఎంఈవో మస్తానయ్య చెప్పారు. ప్రధానోపాధ్యాయురాలు పార్వతీ ప్రవీణ కమిటీ సభ్యులతో ప్రమాణం చేయించారు.

ప్రమాణం చేస్తున్న కమిటీ సభ్యులు

నైపుణ్యం.. అమోఘం

✦ **రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక**

చిల్లకూరు, న్యూస్‌టుడే: ఇటీవల తిరుపతిలో జరిగిన వొకేషనల్ విద్యా విభాగంలో జిల్లాస్థాయి స్కిల్ కాంపిటేషన్‌లో ఎలక్ట్రానిక్స్, హార్డ్‌వేర్ విభాగంలో వృత్తి విద్యా శిక్షకులు చాందిని, కామాక్షమ్మ సహకారంతో వైర్‌లెస్ ఈవీ ఛార్జింగ్ ప్రాజెక్టును ప్రదర్శించి ప్రథమ బహుమతిని సొంతం చేసుకున్నారు వరగలి ఉన్నత పాఠశాల విద్యార్థులు. పదో తరగతి చదువుతున్న విద్యార్థినులు ఎ.భూమిక, ఎస్‌కే సమీరబేగం నైపుణ్య పోటీల్లో అమోఘమైన ప్రతిభను చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

శాస్త్ర విషయాలపై మక్కువ

చిన్ననాటి నుంచే సైన్స్‌పై మక్కువ. పాఠశాలలో ఉపాధ్యాయులు చేసే బోధన ఎంతగానో దోహదపడింది. కొత్త ఆలోచనలతో అందరి దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నా. నైపుణ్య పోటీలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు దోహదపడతాయి. శాస్త్రవేత్త కావాలన్నదే లక్ష్యం. - భూమిక

తక్కువ ఖర్చుతో ఉపకరణాల తయారీ

భిన్నమైన ప్రయోగాలు చేయాలని ఆసక్తి. ఇందుకు వృత్తి విద్యలో ఇస్తున్న శిక్షణ ఉపయోగపడింది. రోజురోజుకీ మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఉన్నత విద్యనభ్యసించాలన్నదే తపన. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉపయోగాలు ఉండే ఉపకరణాలు తయారుచేసి అందుబాటులోకి తెచ్చేందుకు ఇంజినీరు కావాలన్నదే లక్ష్యం. - ఎస్‌కే సమీరబేగం

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: దొరవారిసత్రంలోని ఏకొల్లు జాతీయ రహదారి కూడలి వద్ద గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. అతని వయసు సుమారు 60 ఏళ్ల వయసు ఉంటుందని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అజయ్ కుమార్ తెలిపారు.

క్రైం కార్నర్

తెదేపా నేత మధురెడ్డి ..

నాయుడుపేట, న్యూస్‌టుడే: వేమగుంటపాళెం గ్రామానికి చెందిన ఉమ్మడి నెల్లూరు జిల్లా తెలుగు యువత మాజీ ఉపాధ్యక్షుడు జలదంకి మధుసూదన్‌రెడ్డి(62) అనారోగ్యంతో గురువారం చెన్నైలో మృతి చెందారు. ప్రముఖ గుత్తేదారునిగా జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడిగా, తెలుగు రైతు కార్యదర్శిగా తెదేపాకు సేవలు అందించారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాజీ మంత్రి పరసా వెంకటరత్నం, నెలవల సుబ్రహ్మణ్యం, కిలివేటి సంజీవయ్య ఆయన మృతి పట్ల సంతాపం తెలిపారు.

తప్పిపోయిన పిల్లలు తల్లిదండ్రులకు అప్పగింత

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న గూడూరుకి చెందిన ధనుష్ శివసాయి, అన్నమయ్య జిల్లా పెనగలూరు మండలం యాపాటివారి పల్లి గ్రామానికి చెందిన అక్షిత్ అనే విద్యార్థులు పాఠశాల నుంచి గురువారం వెళ్లిపోయారు. పాఠశాల యాజమాన్యం గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారించి రైల్వేస్టేషన్‌లో పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్సై తిరుపతయ్య తెలిపారు.

ఆలయంలో పడిపూజ

వెంకటగిరి : కాశీ విశ్వనాథ స్వామి ఆలయంలో గురువారం అయ్యప్పస్వామి అఖండ జ్యోతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఊరేగింపు అనంతరం అఖండజ్యోతిని వెలిగించి, పడిపూజ చేశారు.

నియోజకవర్గ అభివృద్ధిపై చర్చ

వెంకటగిరి, న్యూస్‌టుడే: జనసేన కార్యాలయంలో గురువారం ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి శ్రీరామ్‌ను నియోజకవర్గ నేత తోట కృష్ణయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై చర్చించారు.

విలువిద్యలో గూడూరు విద్యార్థికి పతకం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని లయోలా కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి వెంకట లోకేశ్ రాష్ట్రస్థాయి విలువిద్య పోటీల్లో బంగారు పతకం సాధించినట్లు కరస్పాండెంట్ పంటా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో జరిగిన సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించారని చెప్పారు. ప్రిన్సిపల్ నారాయణ, వైస్ ప్రిన్సిపల్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థి వెంకట లోకేశ్‌తో కళాశాల ప్రతినిధులు

(c) eenadu

సాహసమే ఊపిరిగా!

విశ్రాంత సైనికులు సి.డి.ఎన్.వి.ప్రసాద్, కె.శ్రీనివాస్‌లు సాహస యాత్ర విజయవంతంగా ముగించారు. దేశ రక్షణకు కృషి చేసి... ఆ క్రమశిక్షణతో బోటులో ఆరు నెలల పాటు సాగరంలో యాత్ర సాగించి గురువారం విశాఖ చేరుకోగా ఘన స్వాగతం లభించింది.

6లో

నేటి నుంచి మార్గశిర మాసోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

విశాఖ-హైదరాబాద్ ప్రయాణికులకు ఊరట!

‘పశ్చిమ బైపాస్’పై రాకపోకలకు అనుమతి

విశాఖ-హైదరాబాద్ మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికులకు విజయవాడ ట్రాఫిక్ చెర నుంచి విముక్తి దొరికింది. ఎంచక్కా 30 కి.మీ.ల పశ్చిమ బైపాస్‌పై దూసుకెళ్లేందుకు గురువారం సాయంత్రం నుంచి దారులు తెరుచుకున్నాయి. ప్రయాణానికి ప్రతిబంధకంగా ఉన్న విద్యుత్తు టవర్ల సమస్యకు అధికారులు పరిష్కారం చూపించారు. చినఆవుటపల్లి దగ్గర బైపాస్ ఎక్కితే 30 నిమిషాల్లో విజయవాడ-హైదరాబాద్ రహదారిని చేరుకోవచ్చు.

–ఈనాడు, అమరావతి

దేవుడా.. దేవుడా ‘ఆనందపురం’ దాటించు!

★ జాతీయ రహదారిపై చుక్కలు చూపిస్తున్న కూడలి
★ సమస్యపై దృష్టిసారించని యంత్రాంగం.. పాలకులు

ఈనాడు, విశాఖపట్నం, న్యూస్‌టుడే, ఆనందపురం



ఎక్కడైతే... ప్రతి వాహనం కచ్చితంగా ఆగి తీరుతుందో..
ఎక్కడైతే... గజిబిజి గందరగోళం కనిపిస్తుందో..
ఎక్కడైతే.. ఇది జాతీయ రహదారేనా అని అనిపిస్తుందో..
ఎక్కడైతే... ట్రాఫిక్ పోలీసులు ఉరుకులు పరుగులు పెడతారో..
అదే... ఆనందపురం కూడలి!!

భోగాపురం విమానాశ్రయం నుంచి విశాఖ నగరానికి ట్రాఫిక్ ఇక్కట్లు లేకుండా వచ్చేందుకు అధికారులు కొన్ని రహదారులను విస్తరిస్తున్నారు. కానీ, అత్యంత కీలకమైన ‘ఆనందపురం కూడలి’లో సమస్యను మాత్రం పట్టించుకోవడం లేదు. జాతీయ రహదారులపై రాష్ట్రంలో ఎక్కడా కనిపించనంత విచిత్ర, అయోమయ... ప్రమాదకర పరిస్థితిని ఇక్కడ చూడొచ్చు. అయినా... అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్య తీవ్రతను కళ్లారా చూస్తూనే కాలం గడిపేస్తున్నారు.

★చెన్నై-కోల్‌కతా (జాతీయ రహదారి-16) మార్గంలో ఆనందపురం వద్ద నిత్యం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి 8 గంటల వరకూ ట్రాఫిక్ చాలా రద్దీగా ఉంటుంది.

★ పెందుర్తి, పద్మనాభం, ఆనందపురం మండలాల్లోని పలు గ్రామాల ప్రజలు సర్వీసు మార్గంలోనే రావాల్సివస్తోంది.

★ శ్రీకాకుళం, విజయనగరం వైపు నుంచి వచ్చే వాహనాలకే ఇబ్బంది ఉండదు.

జాతీయ రహదారి ఇక్కడుంది. కానీ ఇలా కిందికి దిగి కూడలిలోకి వాహనాలు రావాల్సి వస్తోంది.



సమస్య 1 గండిగుండం నుంచి ఆనందపురం రావాలంటే.. సర్వీసు రహదారే దిక్కు. జాతీయ రహదారిపై ప్రయాణిస్తే ఆనందపురం దాటి 3 కి.మీ. ముందుకెళ్లి, మళ్లీ 3 కి.మీ. వెనక్కి రావాల్సిందే.

సమస్య 2 విశాఖ నుంచి (కొమ్మాది మీదుగా) వచ్చి ఆనందపురం-అనకాపల్లి జాతీయ రహదారిపైకి చేరాలంటే చుక్కలు కనిపిస్తాయి. కూడలి నుంచి సర్వీసు రోడ్డులో 17 కి.మీ. ప్రయాణిస్తే గండిగుండం వద్ద జాతీయ రహదారిపైకి వెళ్లేందుకు అవకాశం ఉంది. లేదంటే... కూడలి దాటి 3 కి.మీ. ముందుకెళ్లి... మళ్లీ సర్వీసు రోడ్డులో 2 కి.మీ. వెనక్కి వస్తే జాతీయ రహదారిపైకి చేరొచ్చు.

సమస్య 3 విశాఖ నుంచి విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశా వైపు వెళ్లే ఏ వాహనమైనా జాతీయ రహదారి దిగి.. కూడలిని దాటి... మళ్లీ సర్వీసు రోడ్డు మీదుగా కి.మీ. ప్రయాణిస్తే గానీ జాతీయ రహదారిపైకి చేరదు.

ఏం చేయాలంటే.. ఇక్కడ ప్రస్తుతమున్న సర్వీస్ మార్గాలను విస్తరించాలి. స్థానిక పరిస్థితులకు, వ్యాపారాలకు ఇబ్బంది లేని రీతిలో పరిష్కార మార్గం చూపించాలి. ఉత్తరాంధ్రలోనే అతి పెద్ద పూల మార్కెట్‌కు రాకపోకలు సజావుగా సాగేలా చూడాలి.

99 సంస్థలు.. రూ.98,917 కోట్ల పెట్టుబడి

ఎంఓయూల అమలుకు కార్యాచరణ

కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వెల్లడి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఇటీవల జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో విశాఖ కేంద్రంగా ఏర్పాటయ్యే పరిశ్రమలకు సంబంధించి కుదిరిన ఎంఓయూ (అవగాహన ఒప్పందాలు) అమలుకు కార్యాచరణ రూపొందించామని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఆర్థిక అభివృద్ధి మండలి(ఈడీబీ) సూచనల మేరకు ఆయా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూకేటాయింపులు, విద్యుత్తు, నీటి సదుపాయాల కల్పన, ఇతర మౌలిక వసతుల ఏర్పాటుకు యంత్రాంగం పరంగా చర్యలను తీసుకుంటామని వివరించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు.

★ భాగస్వామ్య సదస్సులో రాష్ట్ర వ్యాప్తంగా 613 ఒప్పందాలు జరిగితే వాటిలో విశాఖ జిల్లాకు 99 ఎంఓయూలు వచ్చాయన్నారు. రాష్ట్రంలో రూ.13.21 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తే జిల్లాకు రూ.98,917 కోట్లు పెట్టుబడులు రానున్నాయన్నారు. వీటి ద్వారా 2,58,089 మందికి ఉద్యోగ అవకాశం కలగనుందని చెప్పారు.

★ పరిశ్రమల ఏర్పాటు కోసం జిల్లాలో 500 నుంచి 600 ఎకరాల భూములు సిద్ధంగా ఉన్నాయని, మరో 1200 ఎకరాలను వీఎంఆర్‌డీఏ ద్వారా సమీకరణ చేయనున్నామని తెలిపారు. విశాఖకు వచ్చే పరిశ్రమల్లో అధిక శాతం ఐటీ, టూరిజం, డేటా సెంటర్లు ఉన్నాయని, ఇప్పటికే ఏడు ఐటీ సంస్థలకు భూమి పూజ కార్యక్రమాలు జరిగాయన్నారు.

శిలకు హరితం.. కనులకు ఆనందభరితం!

రుషికొండ సమీప కార్తికవనం బీచ్‌లో గురువారం అలల తీవ్రత తగ్గి సముద్రం కొంత మేర వెనక్కి వెళ్లింది. దీంతో వివిధ ఆకృతుల్లోని ఆకర్షణీయ శిలలు వెలుగు చూశాయి. పచ్చటి నాచుతో హరితశోభ ఉట్టిపడిన వీటి మధ్య నిలిచిన నీటిని సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. –న్యూస్‌టుడే, సాగర్‌నగర్

ఇసుకతోటలో అగ్నిప్రమాదం

మూడు కార్లు దగ్ధం

వివరాలు 6లో

చెప్పాలి... 34 అంశాలు!!

భీమిలిలో ప్రయోగాత్మకంగా జనగణన

భీమునిపట్నం, న్యూస్‌టుడే: దేశంలో త్వరలో జరగబోయే జన గణనపై కసరత్తు ప్రారంభమైంది. ఇందులో భాగంగా భీమిలి జోన్‌లోని 2, 3 వార్డుల్లో ప్రయోగాత్మక సర్వే సాగుతోంది. ఇది ఈనెల 30 వరకు జరుగుతుంది. ఇప్పటికే నిర్వహించిన జియో ట్యాగింగ్‌లో రెండు వార్డుల పరిధిలో 9,200 భవనాలను గుర్తించారు. వీటిలో ఉన్న 17 వేల నివాసాల్లో సర్వేకు ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. జనాభా గణన రాష్ట్ర డైరెక్టర్ జె.నివాస్ వచ్చి దిశానిర్దేశం చేశారు. ‘హౌస్ లిస్టింగ్ ఆపరేషన్’ (హెచ్‌ఎల్‌ఓ) అనే మొబైల్ యాప్‌లో ప్రతి ఇంటికి సంబంధించిన 34 అంశాలను నమోదు చేస్తున్నారు.

యాప్‌లో నమోదు చేస్తున్న అంశాలివే..

1–16	ఇంటి పరిస్థితులు (యజమాని పేరు, డోర్ నెంబరు, కులం, కుటుంబ సభ్యుల సంఖ్య, ఇల్లు నిర్మాణ స్థితి)
17–25	ఇంటిలోని వనరులు (తాగునీటి వసతి, మరుగుదొడ్లు, స్నానాల గది, గ్యాస్ కనెక్షన్)
26–32	ఆస్తుల వివరాలు (టెలివిజన్, రేడియో, వాహనాలు)
33	రోజూ తినే ఆహారం, తదితర వివరాలు
34	ఇంటి యజమాని మొబైల్ నెంబరు

వివరాలు సేకరిస్తున్న ఎన్యూమరేటర్

సర్వే ఇలా..

వార్డులు	2, 3
బ్లాక్‌లు	83
ఎన్యూమరేటర్లు	69
సూపర్‌వైజర్లు	9

అందరూ సహకరించాలి: ఇళ్ల వద్దకు వచ్చే ఎన్యూమరేటర్లకు ఇంటి యజమాని ఎటువంటి సంకోచం లేకుండా పూర్తి సమాచారం ఇవ్వాలి. సమగ్ర జన గణన ద్వారా రాష్ట్రాలకు కేంద్రం నుంచి నిధులు లభిస్తాయి. తద్వారా పురోభివృద్ధికి అవకాశం ఉంటుంది. ఇందులోని లోటుపాట్లను సరిచేసుకుని త్వరలో జనగణన పూర్తిస్థాయిలో చేపడతాం.
– ఎస్.దయాసాగర్, రాష్ట్ర సెన్సస్ డిప్యూటీ డైరెక్టర్

నిరంతర పర్యవేక్షణ: 2, 3 వార్డుల్లో నిర్వహిస్తున్న గణనలో ఒక్కో ఎన్యూమరేటర్ రోజుకు 10 నుంచి 15 ఇళ్లను సందర్శించి వివరాలు సేకరిస్తున్నారు. ఛార్జి ఆఫీసర్‌గా జెడ్సీ వి.అయ్యప్పనాయుడు వ్యవహరిస్తున్నారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ పరిశీలించి సూచనలు చేశారు. ఇప్పటి వరకు 40 శాతం సర్వే పూర్తయింది.
– ఆర్.రేవతి, విశాఖ జిల్లా సెన్సెస్ ఇన్‌ఛార్జి

స్వామీ.. చల్లగా చూడు!

60వ వార్డు మెయిన్ రోడ్డులో శిర్డీసాయిబాబా మందిరం వద్ద అయ్యప్ప స్వామి పూజ నేపథ్యంలో గురువారం ఏర్పాటు చేసిన హిమ శివలింగం భక్తులను ఆకట్టుకుంది.
–న్యూస్‌టుడే, సింధియా

తరగని ఆసక్తి.. సాధనే శక్తి!

ఆదర్శం 77 ఏళ్ల వైజయంతిమాల

మురళీనగర్, న్యూస్‌టుడే: అవకాశాలను అందిపుచ్చుకుని క్రీడల్లో రాణించడానికి వయసు అడ్డంకి కాదంటారు నగరానికి చెందిన కొడాలి వైజయంతిమాల. వయసుకు తగ్గ ఆహారం తీసుకుని క్రమం తప్పకుండా సాధన చేస్తే విజయం సొంతం అవుతుందని చెబుతున్నారామె. 77 ఏళ్ల వయసులో ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ దేశాల్లో నిర్వహించే పోటీలకు(పరుగు, నడక, మారథాన్) హాజరవుతూ పతకాలు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇప్పటివరకు ఫ్రాన్స్, శ్రీలంక, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా, ఫిలిప్పీన్స్, స్వీడన్ దేశాలలో జరిగిన పోటీల్లో పాల్గొన్నారు. సాధించిన విజయాలు, పతకాలు, ఆసక్తి తదితర వివరాలు ఆమె మాటల్లోనే.

అదిగో.. అలా : ఒడిశా విద్యాశాఖలో క్లాస్-1 ఆఫీసర్‌గా 2006లో పదవీ విరమణ చేశాను. అనంతరం హైదరాబాద్‌లోని మహాత్మాగాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ సోషల్ యాక్షన్ (ఎంజీఎన్ఐఆర్ఎస్ఏ) సంస్థకు డైరెక్టర్‌గా పనిచేసి మహిళా సాధికారతకు యూఎస్ఏ, చైనా, మలేసియా, జపాన్, తైవాన్, కువైట్, ఆస్ట్రేలియా, బ్రిటన్, ఈజిప్ట్ దేశాల్లో జరిగిన ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొన్నా.

★ 2008 నుంచి విశాఖలో స్థిరపడ్డాను. 2009లో నగరంలో ‘వైజాగ్ రన్’ పేరుతో సాగిన పోటీల్లో తొలిసారి పాల్గొని మొదటి స్థానంలో నిలిచా. బహుమతి రూ.5 వేలు వచ్చింది. దీంతో ఇలాంటి క్రీడల్లో పాల్గొనాలనే ఆసక్తి కలిగింది.

జాతీయ పతాకంతో వైజయంతిమాల

గత 16 ఏళ్లుగా: ప్రతిరోజు ఉదయాన్నే నడక, పరుగు సాధన చేస్తున్నాను. విదేశాల్లో జరిగే పోటీలకు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకుని పాల్గొంటున్నాను. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం మరువలేనిది.

ఆహారపు అలవాట్లు.. ఉదయాన్నే రెండు గ్లాసుల నీరు తాగుతాను. రాగిజావ, ఓట్స్ తీసుకుంటాను. మొలకెత్తిన గింజలు, పండ్లు, ఎక్కువగా తీసుకుంటాను. అప్పుడప్పుడు ఇడ్లీ, దోశ తింటాను. నూనె తక్కువగా వేసిన కూరలను ఎక్కువగా తీసుకుంటాను. రాత్రి రెండు పుల్కాలు తీసుకుంటా.

ప్రశంసలు.. స్థానిక వాకర్స్ క్లబ్‌ల నుంచి ఎన్నో సత్కారాలు, ప్రశంసలు దక్కాయి. ఇప్పటివరకు 150కి పైగా పతకాలు సాధించా. పోటీలకు వెళ్లడం వల్ల శారీరకంగా, మానసికంగా ఆహ్లాదంగా ఉంటుంది. కొత్త కొత్త విషయాలు తెలుసుకుంటున్నాను. పోటీలకు వెళ్లేందుకు నా సొంత డబ్బునే వినియోగిస్తా.

THE ARYAPURAM CO-OPERATIVE URBAN BANK LTD. HEAD OFFICE, RAJAMAHENDRAVARAM (Reg.No.3127)

RECRUITMENT NOTIFICATION FOR THE POSTS OF ASST. CLERKS / ASST. CASHIER ON CONTRACT BASIS

Applications are invited from Candidates who passed **IBPS/ SBI/RRB'S CLERKS PRELIMS** for the post of Asst. Clerks on contract basis Age : 21 Yrs-28 Yrs. as on date of notification (Age relaxation as per Bank service conditions), **Consolidated payment of Rs. 24,000/- p.m** during probation period of 1 year and on confirmation pay scales will be applicable.

The vacancies are at our Guntur, Visakhapatnam and Bhimavaram Branches only

Selection Procedure : Written Test and Interview

Last date of application to be received to bank: 29-11-2025 by 5:00 p.m.

Those candidates who have applied in last one year are not eligible to apply **Application only in specified format can be sent through courier or email or through registered post or in person. Bank reserves right to refuse any application without assigning any reasons**

Detailed Recruitment notification & Application can be downloaded from Website:
http://www.aryapurambank.com/career.html
Email: arcobank_rjy@aryapurambank.com

Date: 21-11-2025 **Contact no.:-0883-2473550**
Secretary/CEO

‘వీఎంఆర్‌డీఏ’ ఆస్తులతో ఇష్టారాజ్యం!

ఖజానాకు గండి

ఈనాడు, విశాఖపట్నం : వీఎంఆర్‌డీఏ ఆదాయానికి గండి పడుతోంది. అధికారులతో కొందరు చేతులు కలిపి అనుమతి లేకుండా వ్యాపారాలు సాగిస్తున్నారు. కల్యాణ మండపాల అద్దె ఎగ్గొడుతున్నారు. ఇన్ని అవకతవకలు జరుగుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

టెండరు మాయ: కైలాసగిరిపై ఓ చోట 3900 చ.అడుగుల ఖాళీ స్థలంలో వ్యాపారానికి ఆరు నెలల కిందట టెండరు పిలిచారు. ఒకరు దక్కించుకోగా...ఆ స్థలంలో చెట్లున్నాయని పూర్తిగా ఇవ్వకుండా కొంత స్థలాన్ని తగ్గించారు. నిబంధనల ప్రకారం టెండరులో ఏ మార్పులు జరిగినా రద్దు చేసి కొత్తగా పిలవాలి. ఇక్కడ అది జరగలేదు. స్థలాన్ని తగ్గించడంతో సగం అద్దెతో నడుపుకుంటానని సదరు వ్యక్తి చెప్పగా అధికారులు తలూపారు. వాస్తవానికి దాన్ని రద్దు చేయాలి. అందుకే అనుమతులూ ఇవ్వలేదు. అయినప్పటికీ ఏకంగా 5 వేల చ.అడుగుల్లో షెడ్లు, రెస్టారెంటు నిర్మించేశారు. పూర్తిస్థాయి అనుమతి లేకుండానే నాలుగు నెలలుగా దర్జాగా వ్యాపారం సాగిస్తున్నారు.

అనుమతి లేని రెస్టారెంటు

ఫోన్‌పే చేయించుకొని: వీఎంఆర్‌డీఏ చీమలాపల్లి, ఎండాడ వద్ద రెండు కొత్త కల్యాణమండపాలు నిర్మించింది. అద్దెకు తీసుకున్న కొందరు సొమ్ములు వీఎంఆర్‌డీఏకు నేరుగా చెల్లించకుండా కింది స్థాయి అధికారుల ఫోన్‌పే చేయడం చర్చనీయాంశమవుతోంది.

కమిషనర్ మారిన వెంటనే: కైలాసగిరిపై ఎగ్జిబిషన్ నిర్వాహకులు కొండవాలుకు సమీపంలో బంగీజంప్ చేయించేవారు. గత కమిషనర్ విశ్వనాథన్ క్షేత్రస్థాయి పరిశీలనలో అది ప్రమాదకరంగా ఉండడంతో నిలిపేశారు. ఇటీవల కమిషనర్ బదిలీ అయిన వెంటనే మళ్లీ ఆరంభించడం గమనార్హం.

వారి పర్యవేక్షణేది?: కొండపై అన్ని రకాల వ్యాపారాలు కలిపి 51 దుకాణాలకు వీఎంఆర్‌డీఏ అనుమతిచ్చింది. వాటిపై పర్యవేక్షణ సరిగా లేదు. దుకాణాల ఏర్పాటులో నిబంధనల అతిక్రమణపై ఫిర్యాదులు రాగా కార్యదర్శి మురళీకృష్ణ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

హాకర్ జోన్: ‘కైలాసగిరిపై వాణిజ్య దుకాణాల నిర్వహణ కొంత గందరగోళంగా ఉంది. వ్యాపారులందరికీ కలిపి ఒక హాకర్ జోన్ ఏర్పాటు చేయాలని చూస్తున్నాం. అక్రమ దుకాణాలపై చర్యలు తీసుకుంటాం’ అని వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్ పేర్కొన్నారు.

సేఫ్టీ కోర్సుల్లో... చురుగ్గా ప్రవేశాలు

కంచరపాలెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ కెమికల్ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న సేఫ్టీ కోర్సుల్లో ప్రవేశాలు ఊపందుకున్నాయి. ఫైర్, ఇండస్ట్రియల్, కెమికల్ సేఫ్టీ కోర్సుల్లో అభ్యర్థులకు ఇక్కడ శిక్షణ ఇస్తారు. గతంలో శిక్షణ పొందిన వారు పలు కంపెనీల్లో మంచి ప్యాకేజీలతో ఉద్యోగాలు సాధించారు. దీంతో ఆయా సీట్లకు ఏటా డిమాండ్ పెరుగుతోంది. ఈ ఏడాది కోర్సుల్లో చేరేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించడం జరిగిందని ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణ తెలిపారు. ఇప్పటికే కొన్ని సీట్లు భర్తీ జరగ్గా మిగిలిన సీట్లను భర్తీ చేస్తామన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం శుక్రవారం నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 11 గంటలకు ఈ సమావేశం ప్రారంభం కానుంది. ప్రతిపక్ష వైకాపా.. అధికారపక్షాన్ని ఇరకాటంలో పెట్టేందుకు వ్యూహం రచించినట్లు సమాచారం. నగరంలో ఇటీవల జరిగిన భాగస్వామ్య సదస్సుకు చేసిన వ్యయం, జరిగిన పనుల వివరాలపై చర్చ జరగనుంది. దీంతో మేయర్ పీలా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం ఆయన ఛాంబరులో కూటమి కార్పొరేటర్లు సమావేశమయ్యారు.

వల నిండేలా... కల పండేలా!!

★ సాగరంలో అలుపెరగని వేట

★ నేడు జాతీయ మత్స్య దినోత్సవం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మత్స్య దిగుబడుల్లో విశాఖ హార్బర్ కీలక పాత్ర పోషిస్తోంది. సముద్ర జలాల్లో మత్స్యవేటకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తాజాగా సడలించిన నిబంధనలు కూడా ఎంతగానో ఉపకరించనున్నాయి. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు రాయితీలు, ఆర్థిక సహకారం అందిస్తు ప్రోత్సహిస్తున్నాయి. నేడు ‘జాతీయ మత్స్య దినోత్సవం’ నేపథ్యంలో జిల్లాలో పరిస్థితిపై ప్రత్యేక కథనం. ★ అధిక దిగుబడుల సాధనకు తీరంలో కృత్రిమ ఆవాసాలు ఏర్పాటు చేశారు. ఒక్కో ఆవాసానికి రూ.36 లక్షల వరకు ఖర్చు చేశారు. ఇటువంటివి 36 వరకూ జలాల్లో ఉన్నాయి.



జిల్లాలో ఇదీ సంగతి...

ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు	15
మరపడవలు	650
ఇంజిన్ బోట్లు	1210
తెప్పలు	540
మత్స్యకార గ్రామాలు	30
సముద్రంలో వేట సాగించే మత్స్యకారులు	14,500

★ సముద్రపు నాచు, చేపల పెంపకం వంటి వాటికి రాయితీలు ఇస్తూ మత్స్యకార గ్రూపులను ప్రోత్సహిస్తున్నారు. వీటిద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.320 కోట్ల మత్స్య దిగుబడులు సాధించవచ్చునని అంచనా..

మత్స్య దిగుబడులు ఇలా...

ఏడాది	టన్నులు	విలువ (రూ.కోట్లలో)
2023–24	1.32 లక్షలు	2017
2024–25	1.40 లక్షలు	2337

★ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అక్టోబరు వరకు లభ్యమైన మత్స్య సంపద 75,529 టన్నులు.

★ కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన నిబంధనల ప్రకారం విశిష్ట ఆర్థిక మండలి (ఈఈజడ్) పరిధిలో (200 నాటికల్ మైళ్ల దూరంలో) చేపలవేట సాగించే మోటారు, మర పడవలకు తప్పనిసరిగా యాక్సెస్ పాసు పొందాలి. రియల్ క్రాఫ్ట్ వెబ్‌సైట్‌లో లైసెన్సులు, సిబ్బంది వివరాలను నమోదు చేసుకోవాలి. దేశీయ ప్రాదేశిక జలాల్లో మాత్రమే వేట సాగించాలి. – పి.లక్ష్మణరావు, జేడీ, మత్స్యశాఖ

‘ఉక్కు’ సంకల్పానికి నష్టాల తూట్లు

ఈనాడు–విశాఖపట్నం: విశాఖ ఉక్కును నిలబెట్టేందుకు కేంద్రం భారీ ఆర్థిక సాయం అందించినా ఇంకా నష్టాలు వెంటాడుతున్నాయి. ఇందుకు బాధ్యులెవరు? అనేది చర్చనీయాంశంగా మారింది. యాజమాన్యం తీసుకుంటున్న చర్యలు సక్రమంగా లేవంటూ ఈనెల 12న అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో కార్మిక సంఘాలు ఓ లేఖ ఇచ్చారు. ‘జూన్‌లో ఆగమేఘాలపై మూడో ఫర్నేస్ మొదలు పెట్టడం.. అందుకు తగ్గ ముడి సరకు సరఫరా లేకపోవడం, టన్నుకు రూ.5వేలు ఎక్కువపెట్టి పెల్లెట్స్ కొనుగోలు చేయడం, మానవ వనరులు ఎడాపెడా తగ్గించడం, ఉత్పత్తి వచ్చినా వర్షాకాలం కావడంతో మార్కెట్ లేకపోవడం’ ప్రధాన కారణాలంటూ ఈ లేఖలో పేర్కొన్నారు. 2022లో సీఎండీ పోస్టుకు దరఖాస్తు చేసుకుంటే ఎంపిక చేయని అధికారికి, ఇప్పుడు ఇన్‌ఛార్జి బాధ్యతలిస్తారా అని కార్మిక, ఉద్యోగ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి.

■ మూడు ఫర్నేస్‌ల ఉత్పత్తి సామర్థ్యం: రోజూ 21 వేల టన్నులు
■ యాజమాన్యం విధించిన లక్ష్యం: నిత్యం 19 వేల టన్నులు
■ గత 50 రోజుల్లో లక్ష్యం అధిగమించింది: ఒకే ఒక్కరోజు

సరాసరి రోజూ వస్తున్న ఉత్పత్తి: 15,987 టన్నులు

ఏప్రిల్ - నవంబరు 20 వరకు నష్టాలు: రూ.1,324 కోట్లకు పైగా.



(c) eenadu

‘ఉక్కు’లో ముక్కంటికి మొక్కులు..!

గాజువాక, న్యూస్‌టుడే

కార్తికమాసమొస్తే అంతా శైవక్షేత్రాలను వెతుక్కుంటారు. భక్తిశ్రద్ధలతో ముక్కంటిని కొలుస్తారు. అయితే విశాఖ పరిసర ప్రాంతవాసులు మాత్రం స్టీల్‌ప్లాంట్ వైపు చూస్తారు. అదేమిటి..? ‘ఉక్కు’లో ఏముందను కుంటున్నారా..? ఈ పరిశ్రమ మధ్యలో ఓ ప్రసిద్ధ శివక్షేత్రం ఉందంటే ఆశ్చర్యం కలగకమానదు..!

ఆలయ సముదాయం

★ 1970 దశకంలో అధికారులు స్టీల్‌ప్లాంటు కోసం 22 వేల ఎకరాల భూములను సేకరించి 65 గ్రామాలకు పునరావాసం కల్పించారు. ఆ క్రమంలో బాలచెరువు గ్రామాన్ని పెదగంట్యాడకు తరలించినా అక్కడ ప్రసిద్ధ పర్వతవర్ధిని సమేత శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయాన్ని మాత్రం ఉంచేశారు. ఆలయాన్ని తొలగిస్తే కర్మాగారానికి అరిష్టమని ఆ రోజుల్లో గ్రామ పెద్దలంతా తీర్మానించడంతో ఉక్కు అధికారులు మిన్నకున్నారు. పాత బాల చెరువు గ్రామం (ప్రస్తుతం ఫీల్డ్‌మెషనరీ డిపార్టుమెంట్) వద్ద ఈ శివాలయం ఉంది. ఉక్కు బీసీ గేటు నుంచి విధులకు వెళ్లే వారంతా శివయ్యకు దణ్ణం పెట్టుకుని పనికి ఉపక్రమిస్తారు.

★ ఉక్కు ఎఫ్ఎండీ, సీఈడీ విభాగ ఉద్యోగులు ఒక కమిటీగా ఏర్పడి ఆలయ సేవలో తరిస్తున్నారు. ఇటీవల ఆలయ విస్తరణలో భాగంగా ఉద్యోగులు నిధులు సేకరించి ముఖద్వారం, వివిధ దేవతామూర్తుల ప్రతిమలు, ఉప ఆలయాలు, శివపార్వతుల విగ్రహాల ముందు ఫౌంటెయిన్ ఏర్పాటు చేశారు. గత సోమవారం భారీ అన్నసమారాధన, కార్తిక ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

బారులుతీరిన భక్తులు

నేటి నుంచి మార్గశిర మాసోత్సవాలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: పాతనగరంలోని బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఈనెల 21 నుంచి డిసెంబరు 19 వరకు మార్గశిర మాసోత్సవాలు నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం 8.45 గంటలకు ఉత్సవాలను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ జ్యోతి వెలిగించి ప్రారంభించనున్నారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో జరిగిన తొక్కిసలాట ఘటనను దృష్టిలో ఉంచుకొని క్యూలైన్ల నిర్వహణ, అన్నప్రసాదాల వితరణతో సహా వివిధ చోట్ల పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని ఆలయ అధికారులకు కలెక్టర్, సీపీ శంఖబ్రత బాగ్చీ ఆదేశాలు జారీ చేశారు. క్యూలైన్లలో భక్తులు ఎక్కువ సేపు నిరీక్షించకుండా చర్యలు చేపట్టాలని క్యూలైన్లలో ఉండే భక్తులకు తాగునీరు, మజ్జిగ, పిల్లలకు బిస్కట్లు, దివ్యాంగులు, గర్భిణులు, వృద్ధుల దర్శనాలకు ప్రత్యేక ఏర్పాట్లు వంటి అంశాల్లో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నెల రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నా ముఖ్యంగా గురువారం రోజున భక్తుల తాకిడి అధికంగా ఉండే అవకాశం ఉంది. ఆ రోజున ట్రాఫిక్ మళ్లింపు వంటి చర్యలు చేపట్టనున్నారు. అన్నప్రసాదాల నాణ్యత విషయంలో ప్రత్యేకంగా దృష్టి సారించారు.

సమన్వయంతో ఐఎఫ్‌ఆర్ విజయవంతం చేయాలి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 నుంచి 20 వరకు జరగనున్న అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ(ఐఎఫ్‌ఆర్)-2026ను విజయవంతం చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం, నౌకాదళ అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం ఉదయం ఐఎఫ్‌ఆర్ నిర్వహణపై నౌకాదళ అధికారులతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. రాష్ట్రపతి, ప్రధాని, రక్షణ మంత్రి, గవర్నర్, ముఖ్యమంత్రి ఇతర, రాజకీయ, అధికార ప్రముఖులు పాల్గొననున్నందున ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. ఎవరెవరు ఏయే పనులు చేయాలనే విషయమై ప్రాథమికంగా నిర్ణయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారుల అభివృద్ధి, కేబుల్ మార్పు, ఇతర నవీకరణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామన్నారు. ఎలాంటి లోపాలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. కమొడోర్ ఆమీ మాథ్యూ మాట్లాడుతూ ఐఎఫ్‌ఆర్-2026, మిలన్ నిర్వహణ, అతిథుల రాక తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. 100 మిత్ర దేశాల నుంచి అతిథులు వస్తారని, వారందరికీ రవాణా, వసతి సదుపాయం కల్పించాల్సి ఉంటుందన్నారు. ఫిబ్రవరి 15 నుంచి 20 వరకు మిలన్ విలేజ్ కార్యక్రమం, 18న రాష్ట్రపతి ఆధ్వర్యంలో ఐఎఫ్‌ఆర్, 19న సిటీ పరేడ్‌తో పాటు మిలన్ ప్రారంభోత్సవం, 19, 20 తేదీల్లో మిలన్ హార్బర్ ఫేజ్, 21 నుంచి 25వ తేదీ వరకు సీ ఫేజ్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. కాన్వెంట్ కూడలి నుంచి మారుతీ కూడలి వరకు, అక్కడ నుంచి నేవల్ బేస్, హార్బర్ పేస్ వరకు, పోర్టు పరిధిలోని రోడ్లను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో జేసీ మయూర్ అశోక్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ తేజ్‌భరత్, డీసీపీ మణికంఠ, నౌకాదళ అధికారులు రజనీశ్ శర్మ, అనూప్‌జా, వైకే కిశోర్, ప్రదీప్‌కుమార్, మనోజ్‌కుమార్, వీరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, చిత్రంలో వీఎంఆర్‌డీఏ కమిషనర్ తేజ్‌భరత్, జేసీ మయూర్ అశోక్, నేవీ ఉన్నతాధికారులు

కాంట్రాక్టు కార్మికుల వేతన ఒప్పందానికి డిమాండ్

సింధియా, న్యూస్‌టుడే : కాంట్రాక్టు కార్మికులకు త్వరితగతిన వేతన ఒప్పందం ఖరారు చేయాలని కోరమాండల్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ జనరల్ సెక్రటరీ జేవీ సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. గురువారం ఉదయం సంస్థ గేటు వద్ద నిర్వహించిన కార్మిక సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి దీనిని అమలు చేయాలని పేర్కొన్నారు. అన్‌స్కిల్డ్ లేబర్‌కు రూ.900లు, సెమీస్కిల్డ్ లేబర్‌కు రూ.1050, స్కిల్డ్ లేబర్‌కి రూ.1200, హైస్కిల్డ్‌కు రూ.1350ల వరకు చెల్లించాలని కోరారు. అనంతరం యాజమాన్యానికి వినతిపత్రాన్ని అందజేశారు. యూనియన్ నాయకులు చుక్క సత్యనారాయణరెడ్డి, కోలాట రామశంకర్రావు, మహాలక్ష్మిరెడ్డి, కసిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోరమాండల్ గేటు వద్ద మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు జేవీ సత్యనారాయణమూర్తి

ముగిసిన విశ్రాంత ఉద్యోగుల బోటుయాత్ర

సింధియా, న్యూస్‌టుడే: విశ్రాంత సైనిక ఉద్యోగులు సి.డి.ఎన్.వి.ప్రసాద్, కె.శ్రీనివాస్‌లు మే 13న మ్యాంగళూరులోని ఉడుపి తీరం నుంచి ఓ ఓపెన్ బోటులో చేపట్టిన సముద్రయానం గురువారం విశాఖలో ముగిసింది. తొలి హాల్టస్ సోమనాథ్ ద్వీపకల్పంలోని నోలో పోర్టు వద్ద చేసుకున్నారు. ప్రయాణంలో ఓ చోట అనుకూల వాతావరణం కారణంగా కెప్టెన్ ప్రసాద్ కాలికి గాయమైనా తిరిగి తమ ప్రయాణం కొనసాగించారు. వేల నాటికల్ మైళ్ల యాత్ర ఎట్టకేలకు గురువారం విశాఖలో విజయవంతంగా ముగిసింది. వైస్ అడ్మిరల్ కుంద్రవల్లి శ్రీనివాస్, సిబ్బంది వీరికి ఆత్మీయస్వాగతం పలికారు.

సహచర విద్యార్థులే: సి.డి.ఎన్.వి.ప్రసాద్ నౌకాదళంలో కెప్టెన్‌గా, కె.శ్రీనివాస్ ఆర్మీలో కల్నల్‌గా పనిచేస్తూ రిటైర్ అయ్యారు. వీరిద్దరూ కోరుకొండ సైనిక స్కూలులో సహచర విద్యార్థులే. ఖడకవాస్లాలోని జాతీయ రక్షణ అకాడమీలో సైనిక కోర్సు పూర్తిచేసి ఒకేసారి సర్వీసుల్లో చేరారు. వివిధ హోదాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ తర్వాత కూడా ఇంటికే పరిమితం కాకుండా ఈ యాత్రకు శ్రీకారం చుట్టారు. వీరి స్ఫూర్తిని నేవీ అధికారులు అభినందించారు. ఇది అందరికి మార్గదర్శనం కావాలన్నారు.

సాహస యాత్రికులకు స్వాగతం పలికిన నేవీ సిబ్బంది

PUBLIC NOTICE

Our Client Vizag Profiles Pvt.Ltd, Rep by its Director Sri Bavineni Suresh S/o. Koteswararao, director R/o D.No. 31-51-5/9, Villa No.9, Green City Towers, Yadava Jaggarajupeta, Revenue ward 58,Vadlapudi Post, Visakhapatnam is intending to purchase the below mentioned schedule property from its rightful vendor namely Sri Palla Sankara Rao, S/o. Late Palla Simhachalam, residing at D.No. 1-177, Gajuwaka, Visakhapatnam, who purchased the said property from his rightful vendor namely Sri Yeduru Demudu, s/o. Late Yeduru Saidu, risiding at Yadava Jaggaraju Peta, Gajuwaka Municipality limits, Visakhapatnam on15-10-2003 by way of obtaining registered possessory sale agreement with General Power of Attorney by way of paying a valid sale consideration amount to him and the said vendor Sri Yeduru Demudu got it registered before SRO of Gajuwaka and the Same was registered as document No. 874/2004, since the date of purchase till date the said Sri Palla Sankara Rao is in occupation with absolute legal entitlement, conveyance rights, right, title, interest over the said property. if any one has any objection regarding the sale transaction in between our client and the said owner/vendor of the below mentioned Property , the said objections shall send with documentary proof to the counsel of our client as mentioned below within 7 days period from the date of this publication, failing which our client will treat that the below mentioned property is free from all encumbrances, there after no claims shall be considered, further our client will proceed with the said sale transaction with the above said vendor/owner of the property.

Schedule: The vacant site in an extent of ac 0.49 cents in S.No 12/5, which is situate at Tunglam Village, Gajuwaka, GVMC Limits, within the limits of SRO of Gajuwaka and within the limits of GVMC. **Bounded by: East:** The land belongs to Joga Ramulu, **South:** The Land Belongs to Madisa Pydayya, **West:** The Land Belongs to Joga Ramulu and appanna and others, **North:** The Land Belongs to Madisa Pydayya

DVVR Pratap, B.Com, BL, IRPM, **R Sarada Nagarjun**, B.com. BL
DVVSS Harsha Vardhan, M.Tech, MBA, LLB, **R Lahari**, BA,LLB,
VES Prasad, BA, LLB,MHRM, Advocates:
D. No. 30-40-78, Main Road, Marripalem, Visakhapatnam-18 .
Ph: 0891-2730064, Cell: 9848418166,
email: durgampratap@gmail.com

నగర పోలీసు కమిషనర్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న నిక్‌నెట్ సీనియర్ అధికారి హమీద్ పాషా, చిత్రంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్, కమిషనర్ కేతన్ గార్గ్

అధికారులకు అభినందన

వన్‌టౌన్, న్యూస్‌టుడే: విశాఖ కేంద్రంగా ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సును విజయవంతం చేయడానికి విశేష కృషి చేసిన వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, ఉద్యోగుల సేవలను కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ప్రశంసించారు. వీఎంఆర్‌డీఏ బాలల ప్రాంగణంలో బుధవారం రాత్రి నిర్వహించిన అభినందన సభలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్, సీపీ శంఖబ్రత బాగ్చీ, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, ఇతర అధికారులు పాల్గొని వారి సేవలను కొనియాడారు. అనంతరం ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేసి అభినందనలు తెలిపారు.

ప్రశంసాపత్రం అందుకుంటున్న సమాచార శాఖ ఆర్జేడీ వి.మణిరామ్

దళారులను నమ్మి మోసపోవద్దు: గంటా

వన్‌టౌన్, న్యూస్‌టుడే: తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్‌కు భూములిచ్చిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని రైతులు సహకరించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌తో కలిసి భూములిచ్చిన రైతులతో గురువారం ఆయన సర్క్యూట్ హౌస్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ రైతులను తప్పుదోవ పట్టించేలా కొంతమంది దళారులు ముందుకొస్తున్నారని వారి మాటలు నమ్మవద్దని సూచించారు. రైతులు మాట్లాడుతూ గతంలో తమకు తెలియకుండానే తమ పేర్లతో న్యాయస్థానాల్లో కేసులు వేశారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఆర్డీఓ సంగీత్‌మాథుర్, తహసీల్దారు శ్రీనుబాబు, తర్లువాడ సర్పంచ్ బి.ఆర్.బి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోండి: ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న దళారులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే గంటా సూచించారు. ‘ప్రభుత్వం తీసుకోవాలనుకుంటున్న భూములపై దళారుల కన్ను పడింది. రైతుల వద్దకు వచ్చి రెండెకరాలకు 55 సెంట్లు అభివృద్ధి చేసిన భూమి ఇస్తామని, రూ. 1.15 కోట్ల నగదు ఇస్తామని, అంగీకరిస్తే ఒక్కరోజులోనే 50 శాతం సొమ్ములు బ్యాంకులో జమ చేస్తామని దళారులు నమ్మబలుకుతున్నారు. రెండు రోజులుగా సమావేశాలు నిర్వహిస్తున్నారు’ అని రైతులకు గంటాకు చెప్పినప్పుడు పైవిధంగా ఆయన స్పందించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా, చిత్రంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఆర్డీవో సంగీత్ మాథుర్ తదితరులు

సకాలంలో విమానాశ్రయ అనుసంధాన మార్గాలు పూర్తి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి సంబంధించి రూ.175 కోట్లతో 26.72 కిలోమీటర్ల పొడవున తలపెట్టిన 7 ప్రధాన రహదారులను వీఎంఆర్‌డీఏ కమిషనర్ ఎన్.తేజ్‌భరత్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా అడివివరం-గండిగుండం, గంభీరం-పరదేశిపాలెం, బోయపాలెం-కాపులుప్పాడ తదితర రోడ్లను ఆయన పరిశీలించారు. ఎలాంటి అవరోధాలు లేని చోట్ల పనులు వేగవంతం చేయాలని, ఈ రోడ్లన్నీ విమానాశ్రయానికి అనుసంధాన మార్గాలు అయినందున నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. వీటి ద్వారా భోగాపురం విమానాశ్రయానికి తొందరగా చేరుకొనేందుకు మార్గం సుగమం అవుతుందని అన్నారు. ప్రధాన ఇంజినీర్ వినయ్‌కుమార్, ముఖ్యప్రణాళిక అధికారిణి శిల్ప, పర్యవేక్షక ఇంజినీర్ మధుసూదనరావు, కార్యనిర్వాహక ఇంజినీర్ రామరాజు, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లు విశ్వనాథ్, రవిశంకర్, సహాయక ఇంజినీరు రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించాక అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్‌భరత్

లాన్‌టెన్నిస్ పోటీలకు ఉన్నతాధికారి ఎంపిక

విశాఖ క్రీడలు, పెదవాల్తేరు, న్యూస్‌టుడే: అఖిలభారత సివిల్ సర్వీస్ లాన్ టెన్నిస్ పోటీలకు వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ కొమ్మి రమేష్ ఎంపికయ్యారు. ఈ పోటీలు వచ్చే నెల 16 నుంచి 20వ తేదీ వరకు గుజరాత్‌లోని గాంధీనగర్‌లో జరగనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ, రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) సంయుక్తంగా అమరావతిలో రాష్ట్రస్థాయి లాన్ టెన్నిస్ పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో రాష్ట్రం నలుమూలల నుంచి వివిధ శాఖలకు చెందిన ఉద్యోగుల నుంచి 50 మంది క్రీడాకారులు పాల్గొనగా వారిలో ఏడుగురు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు సంబంధిత నిర్వాహకులు పేర్కొన్నారు.

సాధన చేస్తున్న వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ రమేష్

EENADU e Classifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

BUSINESS OFFER

BOYS HOSTEL FOR LEASE IMMEDIATELY
FULLY FURNISHED
5FLOORS with STRENGTH
Near GITAM University
Opp: Silver OAK School
YENDADA VIZAG
✆ 9010396396, 9390461426

BUILDING CONSTRUCTION

VIZAG TDR BPS
Contact for BPS PLAN APPROVALS
PILLA BRAHMAJI RAO
Rtd. BUILDING INSPECTOR
GVMC PRESENT LICENSED SURVEYOR
92904 41348

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై విశాఖ జిల్లా, విజయనగరం జిల్లా అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్ స్థిరాస్తి ఎక్కడ ఏ సంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. సిబిల్ అవసరం లేదు. అయోధ్య కోఆపరేటివ్ సొసైటీ బ్యాంక్. ✆ 9396 999 669.

ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభ వాయిదా లేదా నెలవారీ వడ్డీ పద్ధతిలో పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటీ, ✆ 73862 01191.

REAL ESTATE

FLAT FOR SALE

PENDURTHI

1080 Sft. with Car Park. 2 B/R Luxury Flat, Sarada Peetam Back side, Pendurthy Police Station Down. 9866811112, 9642211112.

GENERAL

MVP కాలనీలో 3BHK ఫ్లాట్, సాగర్‌నగర్ మరియు PM పాలెంలో 2BHK ఫ్లాట్ బ్యాంక్‌లోన్ సదుపాయంతో అమ్మకం. ✆ 8686997700.

HOUSE FOR SALE

ATCHYUTAPURAM

121Sq.Yds. Cellar+G+1 Building for sale. North-East Facing. Exclnt Vastu - Prime Location Assured Rental. A.G.M.T. ✆ 9885824528.

LAND FOR SALE

GENERAL

10 Acre Land for Sale- Near Jeypore- Vizianagaram Road (Panasalapadu Road) 500 M from Main Highway. ✆ 9652661542.

PLOT FOR SALE

ANAKAPALLI

Google Data సెంటర్‌కి దగ్గర నీలకుండీలు శొంఠ్యాంలో VMRDA/ RERA అప్రూవ్డ్ Open Plots సేల్. బ్యాంకు లోన్ సౌకర్యం. ✆ 9949375838.

ATCHYUTAPURAM

Vizag Economical Zone Atchutapuram - Yelamanchili 200 Ft Approching Rd. Commercial Plots Sale. VMRDA. ✆ 8639765271.

DTCP Approved Plot (1120 Sq.Yds) Cheemalapalli, Atchutapuram, Vizag. Contact Phone Number: 9923879631.

TAGARAPUVALASA

Thagarapuvalasa Y Jn, NH facing plots Ready to construct useful for duplex, hostel, commercial etc. ✆ 9992273747

GENERAL

Bogapuram Airport 3 Km డిస్టెన్స్ లో (గేటెడ్ కమ్యూనిటీ, Airport Residence) Open ఫ్లాట్స్ అందుబాటులో ఉన్నవి, 15,499 మాత్రమే. ✆ 98486 73474.

JOBS

Need Teaching Staff and Principal for ITI Anakapalli and Atchuthapuram. Salary: 15K/ 25K. Contact: 7032015042.

Wanted Collection Telecallers & Field Executives for Bank. Experience & Freshers can WhatsApp your details. ✆ 7207502157.

Draughtsman (Civil) with Diploma (Civil), B.Tech., B.Arch. (with Auto CAD & Preferably Pre DCR) Cont. 3-00 to 8-00 p.m. only. Phone: 9848159212.

Req. Part Time/Full Time. A well Reputed Company is looking for Experienced People as Managers (M/F) preferably Rtd./VRS/ LIC/HomeMakers above 30 Yrs. Monthly income 80K and above. Contact: 9347777899, 9030030411.

3S Solutions: Required Marketing Executives for Solar Company. Contact Phone Number : 70754 41639.

Agent & ABM Wanted for Chit Fund Company. Freelancers, Commission & Salary Basis. Monthly 10K to 50K+ ✆ 9392111223.

Castle Cubz- Hiring Designer (5+ yrs)- Expert in AutoCAD 2D/3D, SketchUp. Ar. T. S. Sandeep Reddy. ✆ 83093 90836.

Wanted Managerial Persons for a reputed org., any qlf. Full / Part Time, M/F, Retd. & Housewives with Desire & Earn High Incomes, Age: 30+. Contact Ph: 9848889021, 9701014777.

WANTED
2 దశాబ్దాల మా సంస్థ ఆఫీసులో
☛ మేనేజర్స్ - 10
☛ టీమ్‌లీడర్స్ - 10
☛ పార్ట్ టైమర్స్ - 20
25 సం॥ పైబడిన M/F కావలెను. గృహిణులు, రిటైర్డ్ పర్సన్స్‌కి ట్రైనింగ్ ఇవ్వబడును. 5 అంకెల ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. వర్క్ ఫ్రమ్ హోమ్ అవకాశం కలదు. మీ బయోడేటాతో సంప్రదించండి.
MEGHANATH, DGM
T.P.T. COLONY, VSP
✆ 9110762087, 9652834999

కావలెను
ప్రముఖ వ్యాపార సంస్థలో పనిచేయుటకు ఈ క్రింది స్టాఫ్ కావలెను.
❖ అసిస్టెంట్ జనరల్ మేనేజర్స్ : M/F
❖ చీఫ్ మేనేజర్స్ : M/F
అర్హత: ఏదైనా డిగ్రీ, వయస్సు: 30+. Retd; State/ Central Govt. Gazetted Officer Rank వారు మరియు LIC Agents, Chit Fund Agents, School Teachers కూడా అర్హులే. Part Time Jobs కూడా కలవు.
Con. P.N.V. SUBRAMANYAM
B.S. LAYOUT, VIZAG
Ph: 9848441497

ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేయుటకు స్త్రీ/పురు॥ కావలెను. రిటైర్డ్ ఉద్యోగులు/ హౌస్‌వైఫ్స్‌కి ప్రాధాన్యత. ఫిక్స్‌డ్ శాలరీ+ కమీషన్ Contact.: 8885866999.

Wanted Computer ఆపరేటర్ టైపింగ్ తెలుగు,ఇంగ్లీషులో ప్రావీణ్యం కల్గి స్పీడుగా టైప్ చేయగల Exp. కావలెను. Contact Phone: 9989765615, 9912208283.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఇసుకతోటలో అగ్నిప్రమాదం

◆ వంశీ ఫంక్షన్ హాల్ భవనంలో మంటలు
◆ టాటా షోరూంలోని మూడు కార్లు దగ్ధం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: మద్దిలపాలెం-ఇసుకతోట మార్గంలో ఆటోమోటివ్ కూడలి సమీప వంశీ ఫంక్షన్ హాల్ ఐదంతస్తుల భవనం సెల్లార్‌లో గురువారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో దట్టమైన పొగలు అలముకున్నాయి. ఈ భవనంలో గ్రౌండ్ ఫ్లోరులో టాటా కార్ల షోరూం, స్పేర్ పార్ట్స్ దుకాణం, ఫంక్షన్ హాల్, అమ్యూజ్‌మెంట్ పార్కు వంటివి ఉన్నాయి. పైఅంతస్తులో వ్యాయామ (జిమ్)శాల ఉంది. ఆ సమయంలో జిమ్ చేస్తున్న యువత ప్రమాదాన్ని గుర్తించి వెంటనే స్పందించారు. అయిదో అంతస్తు అద్దాలు పగులగొట్టి సుమారు 15 మంది బయటకు వచ్చేశారు. ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదు. ఎంవీపీ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. జీవీఎంసీ ట్యాంకులతో నీటిని సమకూర్చింది. 7 వాహనాలతో 35 మంది అగ్నిమాపక సిబ్బంది సుమారు నాలుగు గంటల సేపు శ్రమించాల్సి వచ్చింది.

★ ఈ ఘటనలో టాటా షోరూంలోని 3 కొత్త కార్లు కాలిపోయినట్లు షోరూం నిర్వాహకుడు భాస్కర్ తెలిపారు. సుమారు రూ.కోటి ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఆయన పేర్కొన్నారు. వీటితోపాటు స్థానికులకు చెందిన అయిదు ద్విచక్ర వాహనాలు దగ్ధమైనట్లు బాధితులు పేర్కొన్నారు. ఆ సమయంలో 17 కొత్త కార్లను అగ్నిమాపక సిబ్బంది సహాయంతో టాటా షోరూం నిర్వాహకులు బయటకు తీసుకురావడంతో ఆ మేరకు నష్టాన్ని నివారించారు. కొన్ని వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

భవనం నుంచి బయటకొస్తున్న పొగ

దగ్ధమైన వాహనం

★ అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి రేణుకయ్య, ఎంవీపీ సీఐ కె.ఎన్.ఎస్.వి.ప్రసాద్ మాట్లాడుతూ సెల్లార్‌లో కార్ల మరమ్మతులకు వినియోగించే పదార్థాలు, తీగలు వంటివి మంటలను మరింత వ్యాప్తి చేశాయని పేర్కొన్నారు. విద్యుత్తు షార్టు షర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు భావిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. సెల్లార్‌లో నాలుగు వైపులా దట్టమైన పొగలు అలముకోవడంతో అగ్నిమాపక సిబ్బంది లోపలకు వెళ్లడానికి ఇబ్బంది పడ్డారు. ఈపీడీసీఎల్ సిబ్బంది కూడా ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో పది ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని జేసీ కె.మయూర్ అశోక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటికి మూడు రైస్ మిల్లులు, జిల్లా వ్యాప్తంగా 29 రైతు సేవా కేంద్రాలను అనుసంధానం చేసినట్లు చెప్పారు. కనీస మద్దతు ధర గ్రేడ్-1కు రూ.2,389 (క్వింటాలు), సాధారణ రకం క్వింటాలు రూ.2369లుగా నిర్ణయించామన్నారు. వాట్సాప్ నెంబరు 7337359375కు రైతులు హాయ్ అని సందేశం పంపాలన్నారు. ధాన్యం సేకరించిన 24 గంటల వ్యవధిలో రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నిధులు జమ అవుతాయని చెప్పారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 7 గంటల వరకు కొనుగోలు కేంద్రాలు పని చేస్తాయన్నారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

‘ఆ 95 ఎకరాల కేటాయింపు రద్దు చేయండి’

ఈనాడు-విశాఖపట్నం: తెలంగాణలోని సంగారెడ్డి జిల్లాలో భారీ ప్రమాదం జరిగి ఎందరో మృతికి కారణమైన ‘సిగాచి’ కంపెనీ...ఏపీలో రసాయన పదార్థాల ఉత్పత్తి చేసే పరిశ్రమ స్థాపిస్తామనగానే విలువైన భూములు కేటాయించడం బాధాకరమని విశాఖకు చెందిన విశ్రాంత ఐఏఎస్ ఈఏఎస్ శర్మ పేర్కొన్నారు. ప్రభుత్వం కర్నూలు జిల్లాలో గుట్టపాడు గ్రామంలో ఎకరా రూ.30లక్షల చొప్పున కేటాయించిన 95 ఎకరాల జీవో నెంబరు 215ను వెంటనే రద్దు చేయాలంటూ గురువారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు లేఖ రాశారు.

లోకో ఢీకొని గుత్తేదారు మృతి

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : ఉక్కులో ముడిపదార్థం తరలించే రైలు (లోకో) ఢీకొని ఓ గుత్తేదారు మృతిచెందారు. స్టీల్‌ప్లాంటు పోలీసులు తెలిపిన వివరాలు ఇవి. బ్లాస్ట్ ఫర్నేస్-3 విభాగంలో నిర్వహణ పనులు చేస్తున్న గుత్తేదారు భాస్కర్ కురూప్(70) విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్లేందుకు రైల్వే ట్రాక్ దాటుతుండగా లోకో ఢీకొట్టింది. ఆయనను వెంటనే స్టీల్ జనరల్ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కేరళకు చెందిన భాస్కర్ కురూప్ పెదగంట్యాడలో కుటుంబంతో కలిసి ఉంటున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సుమారు 30 ఏళ్లుగా విశాఖలోనే ఉంటున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

నేడు పిటిషన్ల కమిటీ సమావేశం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: అసెంబ్లీ పిటిషన్ల కమిటీ సమావేశం ఈనెల 21న శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కమిటీ ఛైర్మన్, ఉప సభాపతి కె.రఘురామకృష్ణంరాజు అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నారు. సమగ్ర భూ సర్వే అంశంపై చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ చేసిన ఫిర్యాదు పరిశీలన కోసం కమిటీ విశాఖ జిల్లాకు వస్తోంది. జిల్లా అధికారులతో సమావేశమై ఆయా భూ అంశాలపై చర్చించనున్నారు. ఫిర్యాదులను కమిటీ సభ్యులు స్వీకరించనున్నారు. కమిటీ సభ్యులు ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, గురజాల జగన్‌మోహన్ రావు, కొణతాల రామకృష్ణ, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పల్లా శ్రీనివాసరావు, పి.విష్ణుకుమార్‌రాజు తదితరులు పాల్గొననున్నారు. ఉపసభాపతి రఘురామకృష్ణంరాజు శుక్రవారం ఉదయం 8.30 గంటలకు హైదరాబాద్ నుంచి విమానంలో విశాఖకు చేరుకుంటారు. ఆయా కార్యక్రమాలు ముగిసిన తర్వాత మధ్యాహ్నం విమానంలో తిరుగు ప్రయాణం అవుతారని అధికారిక ప్రకటన తెలిపింది.

ఏయూ మాజీ ఉన్నతాధికారికి జైలు!

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కీలక హోదాలో విధులు నిర్వర్తించిన మాజీ ఉన్నతాధికారికి కోర్టు ధిక్కరణ నేరం కింద నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ హైకోర్టు తీర్పు వెలువరించినట్లు సమాచారం. ఏయూలో పనిచేసిన ఓ ఉద్యోగి తనకు జరిగిన అన్యాయానికి హైకోర్టును ఆశ్రయించగా న్యాయస్థానం గతంలో ఆయనకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. సంబంధిత తీర్పును అమలు చేయకపోవడంతో బాధిత ఉద్యోగి మళ్లీ హైకోర్టును ఆశ్రయించగా గురువారం న్యాయస్థానం పైవిధంగా తీర్పు వెలువరించినట్లు తన న్యాయవాది ద్వారా సమాచారం అందిందని, తీర్పు ప్రతి ఇంకా రావాల్సి ఉందని బాధిత ఉద్యోగి పేర్కొన్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	103
లైవ్	142	123
డ్రెస్డ్	206	216
స్కిన్‌లెస్	234	226

పెందుర్తి

తెరపై ఈనాడు

లక్ష్మీకాంత్ స్క్రీన్-1 ప్రేమంటే (మార్నింగ్, ఫస్ట్ షో), 12వ రైల్వేకాలనీ (మ్యాట్నీ, సెకండ్ షో) స్క్రీన్-2 - రాజు వెడ్స్ రాంబాయి

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రహ్లాదపురం(వేపగుంట), న్యూస్‌టుడే : సింహాద్రినగర్, పద్మావతినగర్ 11 కేవీ ఫీడర్లలోని విద్యుత్తు వైర్ల మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్తు సరఫరా అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఏఈ బి.సింహాచలంనాయుడు గురువారం తెలిపారు. సింహాద్రినగర్, బొబ్బిలివారి వీధి, దత్తసాయినగర్, పద్మావతినగర్, మైత్రీనగర్, పరిసర ప్రాంతాల్లో విద్యుత్తు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

సేవకులకు సత్కారం

కృష్ణానగర్(వేపగుంట), న్యూస్‌టుడే: కృష్ణానగర్ దుర్గామల్లేశ్వర సహిత అయ్యప్పస్వామివారి ఆలయంలో నెలరోజుల పాటు స్వాములకు అందించిన సేవల్లో పాల్గొన్న సేవకులను, ఆలయ కమిటీ సభ్యులను జనసేన సీనియర్ నాయకులు సుధాకర్‌రాజు గురువారం సత్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు యర్రా నాగరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో జరిగింది.

సేవకులను సత్కరిస్తున్న సుధాకర్‌రాజు

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ సబ్‌స్టేషన్ కూడలిలో బస్ షెల్టర్ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. వర్షాలు, ఎండల సమయంలో అవస్థలు పడుతున్నాం. - **నాయుడు**

✓: సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం - **మురళీధర్ పట్నాయక్, పంచాయతీ కార్యదర్శి**

వేపగుంట, న్యూస్‌టుడే : ?: సిద్దిలక్ష్మీనగర్‌లో కాలువలు శుభ్రతకు నోచుకోవడం లేదు. - **శ్రీనివాసరావు**

✓: సమస్య పరిష్కరిస్తాం. - **అప్పలనాయుడు, ఏఎంహెచ్‌వో, జోన్8**

మురుగు లీకేజీకి అడ్డుకట్ట

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ శ్రమశక్తినగర్ కాలనీలో ఇరవై రోజులుగా వేధిస్తున్న భూగర్భ మురుగు నీటి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. రహదారిపై మురుగు నిలిచిపోయిన నేపథ్యంలో 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. సమస్యపై అధికారులు స్పందించాలని కోరుతూ బుధవారం కాలనీవాసులు నిరసన తెలిపారు. ఈ మేరకు 'ఈనాడు' పత్రికలో గురువారం 'మొరపెట్టుకున్నా పట్టించుకోరా..?' శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. తక్షణమే యూజీడీ సిబ్బందితో మురుగు లీకేజీకి మరమ్మతు చేయించారు. సమస్య పరిష్కరించారు. అధికారుల తీరుపై కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దివ్యాంగులకు ఉచిత శిక్షణ

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే: ఉక్కునగరం ఆయుధపోయలో ప్రత్యేక అవసరాల బాలల పాఠశాల విద్యార్థులకు కల్లర్ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇవ్వనున్నట్లు భాజపా గాజువాక ఇన్‌ఛార్జి కరణంరెడ్డి నరసింగరావు తెలిపారు. ఉక్కునగరం కల్లర్ ఫౌండేషన్ ఛైర్మన్ పేర్ల అప్పారావు అధ్యక్షతన గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి ఉద్యోగ అవకాశాలు కూడా ఉన్నాయన్నారు. పేర్ల అప్పారావు మాట్లాడుతూ కంప్యూటర్, అకౌంట్సు, రిసెప్షనిస్ట్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈత కొలనులో.. పతకాలు పట్టేస్తాం..

పరవాడ మండలం పి.భోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థినిలు స్విమ్మింగ్‌లో రాణిస్తున్నారు. బాల్యం నుంచే ఈతపై ఆసక్తి పెంచుకొని పతకాలు సొంతం చేసుకుంటున్నారు. శిక్షకుల పర్యవేక్షణలో కఠోర సాధన చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ నెల 08న ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో, 16న స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖలో జరిగిన రాష్ట్రస్థాయి ఫిన్ స్విమ్మింగ్ పోటీల్లో పతకాల పంట పండించారు. అందరి ప్రశంసలు అందుకున్నారు.

— న్యూస్‌టుడే, పరవాడ

శిక్షణ పొందుతున్న క్రీడాకారిణులు

రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ

మరింత సాధన చేస్తా..

నాలుగేళ్లుగా స్విమ్మింగ్ నేర్చుకుంటున్నా. స్వగ్రామం పి.భోనంగి. మొదట్లో స్విమ్మింగ్ అంటే భయపడే దాన్ని. కోచ్ ధైర్యం చెప్పడంతో క్రమేపి పట్టు సాధించా. రెండేళ్లుగా పోటీల్లో పాల్గొంటూ రెండు స్వర్ణ, ఒక రజత, కాంస్య పతకాలు సాధించా. తండ్రి శేఖర్ చేస్తున్న స్విమ్మింగును చూసి ఆసక్తి పెంచుకున్నా. మరింత సాధన చేసి క్రీడలో రాణిస్తా. - బండారు లాస్యవర్ణిత

అంతర్జాతీయ స్విమ్మర్‌గా..

తండ్రి నరహరి అంతర్జాతీయ స్విమ్మర్ కావడంతో ఈతపై ఆసక్తి పెంచుకున్నా. పి.భోనంగి వసతి గృహంలో ఉంటూ.. వేగంగా ఈదేందుకు తర్ఫీదు పొందుతున్నా. ఇటీవల విశాఖలో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి బ్రెస్ట్‌స్ట్రోక్ ఈత పోటీల్లో రజత, కాంస్య పతకాలు సాధించా. ఈ నెల 29న దిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యా. గతంలో పల్నాడు, విశాఖలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని రజత, కాంస్య పతకాలు సాధించా. ఇంటర్నేషనల్ స్థాయిలో రాణించడమే లక్ష్యం. – రోషిణి

నేవీలో కొలువు సాధిస్తా..

స్వగ్రామం అగనంపూడి. మూడేళ్లుగా ఈతలో తర్ఫీదు పొందుతున్నా. శిక్షకుడు హరినాథరెడ్డి వద్ద మెలకువలు నేర్చుకుంటూ క్రీడలో పట్టు సాధిస్తున్నా. ఇటీవల విశాఖలో జరిగే రాష్ట్ర స్థాయి ఫిన్ స్విమ్మింగ్ పోటీల్లో మూడు రజత పతకాలు సాధించా. గతంలో రాష్ట్ర స్థాయి ఫిన్ స్విమ్మింగ్ పోటీల్లో రెండు స్వర్ణ, ఒక రజత పతకాలు సాధించా. ఈతలో మరిన్ని మెలకువలు నేర్చుకొని నేవీలో కొలువు సాధించడమే లక్ష్యం. – ఐ.వైష్ణవి

తొలి ప్రయత్నంలోనే స్వర్ణం..

ఈత నేర్చుకోవడంతో నీటిలో మునిగిపోయిన వారిని రక్షించవచ్చని అమ్మానాన్న చెప్పేవారు. దీంతో ఇష్టం పెంచుకున్నా. ఏడాదిగా ఈత సాధన చేస్తున్నా. ఇటీవల విశాఖలో జరిగిన రాష్ట్రస్థాయి ఫిన్ స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొని తొలి ప్రయత్నంలోనే స్వర్ణ పతకం సాధించడంతో చాలా సంతోషంగా ఉంది. ముమ్ముందు మెరుగైన ప్రదర్శన చేసి ప్రపంచ స్థాయి స్విమ్మర్‌గా గుర్తింపు తెచ్చుకుంటా. – కె.ఆధ్య

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం: ఎమ్మెల్యే

తానాంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ, న్యూస్‌టుడే: ఫార్మా వ్యర్థాల నివారణకు చర్యలు తీసుకుంటానని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. 'మన గ్రామం - మన ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా గురువారం కలపాక, భరణికం, తానాం గ్రామాల్లో ఆయన కాలుష్య నియంత్రణ మండలి, ఎన్టీపీసీ, మండల అధికారులతో కలిసి పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని వినతిపత్రాలు స్వీకరించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. యువతకు కంపెనీల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పనిచేస్తోందన్నారు. రాంకీ యాజమాన్యం తానాం రెవెన్యూ పరిధిలో తవ్విన అక్రమ చెరువును ఎందుకు మూసివేయలేదని పీసీబీ అధికారులను ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఈ మేరకు వారు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యేకు వివరించారు. భరణికం మొల్లోడు గెడ్డవాగులో స్తంభించిన ఫార్మా వ్యర్థాలను ఆయన పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. అనంతరం పరవాడ మండల తెదేపా అధ్యక్షుడుగా నియమితులైన కన్నూరు వెంకటరమణను ఎమ్మెల్యే శాలువతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో సర్పంచి కన్నూరు దేవి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పైలా జగన్నాథరావు, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో రమేశ్‌నాయుడు, కూటమి నాయకులు పంచకర్ల ప్రసాద్, చింతకాయల ముత్యాలు, బొద్దపు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కన్నూరు వెంకటరమణను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

నేడు సబ్బవరం మండలంలో పర్యటన

సబ్బవరం, న్యూస్‌టుడే: పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు శుక్రవారం సబ్బవరం మండలంలో పర్యటించనున్నారని సబ్బవరం ఎంపీడీవో పి.పద్మజ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 'మన గ్రామం - మన ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా మండలంలోని బోదువలస, ఎల్లుప్పి అయ్యన్నపాలెం, వంగలి గ్రామాలను సందర్శించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

గోతులు.. నిత్యం వెతలే..!

నరవవానిపాలెం (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు పరిధి నరవవానిపాలెం నుంచి కుమ్మరి కాలనీకి వెళ్లే రహదారి దుస్థితి దయనీయంగా ఉంది. ఇటీవల ఈ ప్రాంతంలో భూగర్భ విద్యుత్తు తీగల పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో రోడ్డంతా తవ్వేశారు. ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం సమీపంలో భారీ గుంతలు ఏర్పడ్డాయి. గుంతలు పూడ్చి మట్టి చదును చేయకపోవడంతో ప్రమాదకరంగా ఉంది. రాత్రివేళల్లో అదుపుతప్పి పడిపోతున్నామని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేయించాలని కోరుతున్నారు.

కలుషిత నీటితో అనారోగ్య సమస్యలు

సుజాతనగర్‌లో ర్యాలీ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: కలుషిత నీరు తాగడంతో అనారోగ్య సమస్యలు వస్తాయని ఆదర్శ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ పీవో మంజుల అన్నారు. సుజాతనగర్‌లో జరుగుతున్న కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో భాగంగా గురువారం నీటి కాలుష్యంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు నినాదాలు చేస్తూ కాలనీలో ర్యాలీ చేపట్టారు. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలను వివరించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

వ్యర్థాలతో అవస్థలు

వి.జుత్తాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తి మండలం వి.జుత్తాడ రహదారిలో వ్యర్థాలు పేరుకుపోయాయి. పులగవానిపాలెం నుంచి జుత్తాడ వెళ్లే మార్గంలోని ఎన్టీఆర్ కాలనీ సమీపంలో రోడ్డు పక్కన పెద్ద ఎత్తున చెత్త చెదారం పోగుపడి ఉంది. ప్లాస్టిక్ సంచులు, కాగితాలు గాలికి ఎగిరి వాహనదారులపై పడి అసౌకర్యానికి గురిచేస్తున్నాయి. గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రమున్నప్పటికీ తగినంత మంది సిబ్బంది లేకపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణ కుంటుపడుతోంది. అధికారులు స్పందించి రోడ్ల పక్కన ఎవరూ వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రహదారికి మోక్షమెప్పుడో..?

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం గొర్లెవానిపాలెం-గొల్లలపాలెం రహదారి నుంచి అమృతపురం శివారు సూరిదేవిపాలెం వెళ్లే కిలోమీటరు రహదారి అధ్వానంగా ఉంది. సుమారు 20 ఏళ్ల క్రితం గ్రావెల్‌తో పిక్కలు వేసి రహదారిని గాలికొదిలేశారు. వర్షాలకు అవి తేలిపోయి నడవడానికి అవకాశం లేకుండా మారింది. వాహనాలు నిత్యం మరమ్మతులకు గురవుతున్నాయి. అప్పట్లో బీటీ రోడ్డుగా మారుస్తామని అధికారులు చెప్పి దశాబ్ద కాలం గడుస్తున్నా ఈ మార్గానికి మోక్షం కలగడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిని అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

వైభవంగా కార్తిక పూజలు

వేంకటాద్రిపై పూజల్లో పాల్గొన్న భక్తులు

పెందుర్తి, న్యూస్‌టుడే: కార్తిక మాసం చివరి రోజు, అమావాస్య తిథిని పురస్కరించుకుని వేంకటాద్రిపై గురువారం రాత్రి అఖండ దీపోత్సవం వైభవోపేతంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు మహర్తి రామానుజాచార్యులు నేతృత్వంలో అర్చకులు శ్రీవారికి అష్టోత్తర శతనామార్చన జరిపారు. అంతరాలయాన్ని దీపాలతో అలంకరించి దీపారాధన చేశారు. అనంతరం భక్తులు కొండ మెట్ల మార్గం, ఆలయ ధ్వజస్తంభం, ప్రాకారంలో జ్యోతులు వెలిగించారు. ఈవో నీలిమ పాల్గొని దీపారాధనలు చేశారు.

★ సుజాతనగర్‌లో కొలువైన కల్యాణ వేంకటేశ్వర స్వామికి నక్షత్ర దీపారాధన జరిగింది. 27 నక్షత్రాలకు ప్రతీకగా అర్చకులు 27 జ్యోతులు వెలిగించి ఆరాధించారు.

జ్యోతుల వెలుగుల్లో శ్రీనివాసుడు

సుజాతనగర్ హరిహర క్షేత్రంలో..

హరిహర క్షేత్రంలో కోటి దీపోత్సవం

మహాకాళేశ్వరుడి అలంకరణలో కేదారేశ్వరస్వామి

శివలింగాకృతిలో వెలిగించిన దీపాలు

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: సుజాతనగర్ హరిహర క్షేత్రం ఆవరణలో గురువారం రాత్రి కోటి దీపోత్సవం వైభవోపేతంగా జరిగింది. ఈ సందర్భంగా కేదారేశ్వర స్వామిని లక్ష రుద్రాక్షలతో అర్చకులు మహాకాళేశ్వరుడిగా అలంకరించి విశేష అర్చనలు చేశారు. 97వ వార్డు కార్పొరేటర్ వసంత ఈ ఉత్సవాన్ని ప్రారంభించారు. కాలనీకి చెందిన మహిళలు పాల్గొని ఆలయ ప్రాంగణంలో శివలింగాకృతిలో జ్యోతులు వెలిగించి దామోదరుడిని ఆరాధించారు.

ఆకట్టుకున్న దీపాలంకరణ

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట సమీప వరలక్ష్మీనగర్ కొండపై ఉన్న షిర్డి సాయిబాబా ఆలయానికి వెళ్లే మెట్ల మార్గంలో అఖండ దీపారాధన చేశారు. భక్తులు, స్వాములు, బాబా భక్తులు దీపాలు వెలిగించారు. ★ వరలక్ష్మీనగర్ కాలనీలోని మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూకాంబికా అమ్మవారికి దీపాలంకరణ చేశారు. ★ ప్రహ్లాదపురం నూకాంబికా అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో మధ్యాహ్నం భక్తులకు, అయ్యప్ప స్వాములకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్త గంగవరహాలు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా, శైలజ పాల్గొని ప్రారంభించారు.



వరలక్ష్మీనగర్‌లో నూకాంబికా అమ్మవారు

ఉచిత కంటి శిబిరానికి స్పందన

కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పరవాడ, న్యూస్‌టుడే: రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి యాజమాన్యం సహకారంతో జీవీఎంసీ పరిధి తాడి గ్రామంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ శ్రీకాంత్ ఈ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఉచిత శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కంటి వైద్యులు లోకేశ్, రాహుల్ తదితరులు 98 మందికి పరీక్షలు చేశారు. వారిలో 21 మందికి కంటి అద్దాలు, 20 మంది కంటి శస్త్ర చికిత్సలు అవసరమని వైద్యులు తెలిపారు. అద్దాలను రాంకీ ఫౌండేషన్ అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మహిళా కో-ఆర్డినేటర్ రాజేశ్వరి, శ్రీనివాస్, శశిధర్, ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి కో-ఆర్డినేటర్ శివ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

దుప్పట్లు అందుకున్న వారితో దాతలు

లంకెలపాలెం (పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ పరిధి లంకెలపాలెం సమీపంలోని శ్రీరామ్‌నగర్, ఎస్సీ, బీసీ, ఉప్పర కాలనీకి చెందిన వంద మంది పేదలకు దాతలు చిట్టిబోయిన అప్పారావు, పైడమ్మ, కోటేశ్వరరావు దుప్పట్లు, పండ్లు గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు గిరి ప్రసాద్, రమణబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు కల్పించాలి

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ ఫార్మాసిటీలో ముత్యాలమ్మపాలెం మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సర్పంచి చింతకాయల సుజాత, తెదేపా సీనియర్ నాయకులు చింతకాయల ముత్యాలు అన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గురువారం వారు మాట్లాడారు. ఫార్మా సంస్థలకు చెందిన వ్యర్థాలను తీరంలోకి నేరుగా విడిచి పెట్టేస్తుండడంతో మత్స్య సంపద నశించిపోయి వేటకు వెళ్లే మత్స్యకారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. గతంలో జిల్లా ఉన్నతాధికారులు ఇచ్చిన హామీ మేరకు ఐదు వందల ఉద్యోగ అవకాశాలను మత్స్యకార యువతకు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ ఆయా సంస్థల యాజమాన్యాలు ఉద్యోగాలు కల్పించకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న సర్పంచి చింతకాయల సుజాత, తదితరులు

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

సబ్బవరం, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ అన్నారు. మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలను వివరిస్తూ పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు 'అభ్యుదయం' పేరుతో పోలీసు సిబ్బంది చేపట్టిన సైకిల్ యాత్ర గురువారం సబ్బవరం చేరుకుంది. ఈ మేరకు డీఎస్పీ, సీఐ రామచంద్రరావు వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. సబ్బవరం ఎంపీపీ బోకం సూర్యకుమారి, తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, ఎంపీడీవో పి.పద్మజ, ఎంఈవో ఎంజే రవీంద్రబాబు, గ్రామ సర్పంచి దెడ్డం ప్రసాదరావు మాట్లాడుతూ మత్తు పదార్థాలతో కలిగే దుష్పరిణామాలను వివరించారు. సీఐ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలతో ఎవరైనా పట్టుబడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా హాజరైన విద్యార్థులతో అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సబ్బవరంలో ర్యాలీ నిర్వహించారు.

ర్యాలీలో పాల్గొన్న వారికి స్వాగతం పలుకుతున్న అధికారులు, తదితరులు

చట్టాలపై అవగాహన సదస్సు

దేశపాత్రునిపాలెంలో మాట్లాడుతున్న పరవాడ సీఐ మల్లికార్జునరావు

దేశపాత్రునిపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెంలో గురువారం రాత్రి క్రిమినల్ చట్టాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పరవాడ సీఐ మల్లికార్జునరావు పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. చట్టంలో వచ్చిన మార్పులను ప్రజలకు వివరించారు. సైబర్ నేరాల, మహిళల భద్రతపై అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

పోటీల్లో గెలుపొందిన చిన్నారులతో మేయర్ పీలా శ్రీనివాసరావు, తదితరులు

పెందుర్తి, న్యూస్‌టుడే: సాంకేతికత అభివృద్ధి చెందుతున్నప్పటికీ గ్రంథాలయాలకు ఆదరణ తగ్గడం లేదని జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. పెందుర్తి శాఖా గ్రంథాలయంలో జరిగిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం గ్రంథాలయాలను మరింత అభివృద్ధి చేస్తుందని పేర్కొన్నారు. గ్రంథాలయ అధికారిణి బి.చంద్రకళ ఆధ్వర్యంలో వారం రోజులుగా గ్రంథాలయంలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు మేయర్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డి నారాయణరావు, వేగి దివాకర్, నరసింహమూర్తి, రమణచిట్టి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు భూలోకరావు, రామకృష్ణ, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం శాఖా గ్రంథాలయంలో జరిగిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఎంపీపీ బోకం సూర్యకుమారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రంథాలయాలు దేవాలయాలతో సమానమన్నారు. ఫోన్లు వదిలి పుస్తకం చేత పట్టాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా వారం రోజులుగా ఇక్కడ నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో రవీంద్రబాబు, గ్రామ సర్పంచి దెడ్డం ప్రసాదరావు, గ్రంథాలయ అధికారిణి శిరీష, తదితరులు పాల్గొన్నారు.

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ సీనియర్ పాఠకులు కాండ్రేగుల వెంకట రామారావు, ప్రసాద్, సన్యాసిరావు పాల్గొని మాట్లాడారు. గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఎంపీపీ సూర్యకుమారి, ఎంఈవో రవీంద్రబాబు, సర్పంచి ప్రసాదరావు

పరవాడ శాఖా గ్రంథాలయంలో...



(c) eenadu

భీమిలి

సినిమాలు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్- మఫ్టీ పోలీస్
రాములమ్మ- 12 ఏ రైల్వే కాలనీ
తాతా- ప్రేమంటే
సప్తగిరి- రాజు వెడ్స్ రాంబాయి

నేడు తీర గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

తిమ్మాపురం(గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: అంతర్జాతీయ మత్స్యకార దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బీచ్‌రోడ్డు గ్రామాల్లో శుక్రవారం పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు చేపలుప్పాడలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం మంగమారిపేటలో సీవీడ్ సాగు ప్రాజెక్టు ప్రారంభం తర్వాత తిమ్మాపురంలో జరిగే మత్స్యకార దినోత్సవ సభలో పాల్గొంటారు.

అనంతుని హుండీ ఆదాయం రూ.6.49 లక్షలు

పద్మనాభం, న్యూస్‌టుడే: పద్మనాభం క్షేత్రంలో కొలువై ఉన్న అనంత పద్మనాభస్వామి దీపోత్సవం వేడుకలో భాగంగా రూ.6,49,020 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో పీఎల్ఎన్.రాజు పేర్కొన్నారు. భక్తులు హుండీల్లో వేసిన కానుకలు రూ.4,11,660 కాగా దర్శనం టికెట్లు, విరాళాలు ద్వారా రూ.2,37,360 వచ్చినట్లు ఈవో తెలిపారు. సెప్టెంబర్ 19 నుంచి నవంబర్ 19 వరకు ఈ మొత్తం ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. అలాగే కొండపైన దర్శనం టికెట్ల విక్రయం ద్వారా కార్తిక మాసం నెల రోజుల్లో రూ.3 లక్షలు వరకు ఆదాయం వచ్చిందన్నారు. దీపోత్సవ చరిత్రలో ఇదే అత్యధిక ఆదాయం అని కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, పీఎంపాలెం, న్యూస్‌టుడే: ?: ఆరో వార్డు క్రికెట్ స్టేడియం వెనుక ప్రాంతంలో వృద్ధాశ్రమం వద్ద కొద్ది రోజులుగా వీధిదీపాలు వెలగడం లేదు. – స్థానికులు ✓: మరమ్మతులు చేసి వెలిగేందుకు చర్యలు చేపడతాం. – గాయత్రీ (విద్యుత్తు ఏఈ)

?: అయిదో వార్డు బోరవానిపాలెం ఎంపీయూపీ పాఠశాల ప్రాంతంలో పందులు సంచారంతో ఇబ్బంది పడుతున్నాం. – ప్రధానోపాధ్యాయురాలు (బోరవానిపాలెం) ✓: పందుల సంచారం నిరోధానికి చర్యలు తీసుకుంటాం. – రాజా రవికుమార్ (ఏఎంహెచ్ఓ)

?: 8వ వార్డు మిధిలాపురి వుడాకాలనీ ఎమరాల్డ్ అపార్టుమెంట్ సమీప కాలువల్లో పూడికతో నిండిపోయింది. – ఎస్‌వీఎల్ రావు (నివాసితులు) ✓: కాలువల శుభ్రతకు చర్యలు తీసుకుంటాం. – రవి (శానిటరీ ఇన్‌స్పెక్టర్)

ప్రత్యామ్నాయం చూపక.. యథాతథంగా దుకాణాలు

కొమ్మాది, న్యూస్‌టుడే

జీవీఎంసీ జోన్-2లో 5 నుంచి 13 వార్డుల పరిధిలో ప్రధాన కూడళ్లు, రహదారి మార్జిన్లు, నడక మార్గాలను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న చిరుదుకాణాలను 'ఆపరేషన్ లంగ్స్' పేరిట సెప్టెంబరు నెలలో జీవీఎంసీ యంత్రాంగం తొలగించింది. సుమారు 225కు పైగా దుకాణాలను ప్రణాళికాధికారులు, సిబ్బంది పోలీసుల సహకారంతో ఐదురోజుల పాటు తొలగించారు. ఆ సమయంలో వారికి ప్రత్యామ్నాయ స్థలాలు చూపిస్తామని హామీ ఇచ్చి జీవీఎంసీ సిబ్బందితో వారి వివరాలు నమోదు చేసుకున్నారు. మరోవైపు పట్టణ ప్రణాళికాధికారులు

నడకదారిని ఆక్రమించి సాగిస్తున్న వ్యాపారాలు

జోన్‌లో ఐదుచోట్ల చిరువర్తకుల కోసం వ్యాపార ప్రదేశాలను ఎంపిక చేసినా ఇంకా ఎవరికీ కేటాయించలేదు. దీంతో ఆయా తొలగించిన స్థలాల్లోనే పుట్టగొడుగుల్లా దుకాణాలు వెలుస్తున్నాయి.

అలస్యం కావడంతో..: కొమ్మాది మాస్టర్ ప్లాన్ రహదారి, శివశక్తినగర్, మధురవాడ మార్కెట్ రోడ్, మారికవలస, మిధిలాపురివుడా కాలనీ రహదారి, పీఎంపాలెం, ఎండాడ తదితర ప్రాంతాల్లో రహదారి మార్జిన్లు, నడకమార్గాలను ఆక్రమించి చిరువర్తకులు వ్యాపారాలు సాగించేవారు. వారంతా రోజువారీ కూలీగా వ్యాపారాలు సాగించేవారు కావడం, ఆయా దుకాణాలను తొలగించి నెలలు గడుస్తున్నా అధికారులు ప్రత్యామ్నాయం చూపకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదికలు అందించాం..: జోనల్ పరిధిలో ఐదుచోట్ల చిరువర్తకుల కోసం స్థలాల ఎంపిక ప్రక్రియ చేపట్టాం. నగరంపాలెం నుంచి వాంబేకాలనీకి వెళ్లే మార్గంలో రెండుచోట్ల, ఎండాడ రహదారిలో దోబీగాట్ వద్ద, మధురవాడ లేక్‌వ్యూ లే-అవుట్ రోడ్డు, శ్రీకాంత్‌నగర్ ప్రధాన మార్గంలో స్థలాలను ఎంపిక చేశాం. ఆయా ప్రాంతాల్లో 460 దుకాణాల ఏర్పాటుకు అనువుగా సర్వే చేపట్టాం. ఆ నివేదికను ఉన్నతాధికారులను పంపించాం. వారి నుంచి ఆదేశాలు రాగానే చిరువర్తకులకు ఆయా స్థలాలను కేటాయిస్తాం. – కె.కనకమహాలక్ష్మి, జెడ్సీ, జోన్–2

స్థానిక నేతల చేతివాటం..

చిరువ్యాపారాలు సాగితే తప్ప కుటుంబ పోషణ గడవని చిరువర్తకులు యథావిధిగా ఆయా స్థలాల్లో దుకాణాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇదే అదనుగా కొంతమంది స్థానిక నేతలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. అధికారులకు చేయి తడపాలని లేకపోతే మళ్లీ తొలగిస్తారని డబ్బులు తీసుకుని దుకాణాలను ఏర్పాటు చేయిస్తున్నారు. దీంతో రహదారులకు ఇరువైపులా నడకమార్గాల్లో ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

★ నిత్యం రద్దీగా ఉండే మధురవాడ కూడలి వద్ద సేవారహదారిని ఆక్రమించి దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. నడకమార్గం సైతం ఆక్రమించేయడంతో ఆ దారిలో వెళ్లాలంటే నరకప్రాయమే. అయినా ఆ దుకాణాలను తొలగించలేదు. దీంతో పలు అనుమానాలకు తావిస్తోందని కొంతమంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కొమ్మాది, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా చేపడుతున్నామని, కేవలం పక్షం రోజుల్లోనే రూ.25 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 5వ వార్డులో సాయిరాంకాలనీలో కార్పొరేటర్ మొల్లి హేమలత ఆధ్వర్యంలో గురువారం రూ.12 కోట్ల అభివృద్ధి పనులకు శిలాఫలకాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే జీవీఎంసీ వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.150 కోట్లు వెచ్చించామన్నారు. గతంలో ప్రారంభించి అసంపూర్తిగా నిలిచిపోయిన మాస్టర్ ప్లాన్ రహదారులను పూర్తి చేసేందుకు మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, ఉన్నతాధికారులతో సమావేశం కానున్నామన్నారు. రూ.590 కోట్ల నిధులతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, మరో రూ.500 కోట్ల నిధులతో సురక్షితమైన తాగునీరు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

సాయిరాంకాలనీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

అనంతుని దీపోత్సవం విజయవంతం: 2014-19 తెదేపా ప్రభుత్వంలో అనంత పద్మనాభస్వామి ఘాట్‌రోడ్డు పనులు 80 శాతం పూర్తి చేశామని, వైకాపా ప్రభుత్వం ఆ 20 శాతం పనులు కూడా చేయలేక చేతులెత్తేసిందని గంటా విమర్శించారు. మళ్లీ తాము అధికారంలోకి వచ్చాక ఆయా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. దీంతో బుధవారం నాటి దీపోత్సవానికి 2 లక్షల మంది భక్తులు తరలివచ్చినా రద్దీపరంగా ఎలాంటి ఇబ్బంది తలెత్తలేదన్నారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, పిళ్లా వెంకటరావు, మాజీ కార్పొరేటర్ మన్యాల సోంబాబు, 5, 6, 7 వార్డుల అధ్యక్షులు నాగోతి వెంకటసత్యనారాయణ, గరేగురునాథ్, కానూరి అచ్యుత్‌రావు, జనసేన భీమిలి మండల అధ్యక్షులు నక్కా శ్రీధర్, గురుగుబెల్లి యోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో గీతం విద్యార్థుల ప్రతిభ

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: గీతం డీమ్డ్ వర్సిటీ వేదికగా గురువారం నిర్వహించిన రాష్ట్రస్థాయి టేబుల్‌టెన్నిస్ (టీటీ) పోటీల్లో గీతం విద్యార్థులు విశాఖ జట్టు తరఫున పాల్గొని ప్రతిభ చాటారు. పురుషుల సింగిల్స్ విభాగంలో విద్యార్థులు కుశాల్ దాస్, సూర్య, రోహిత్ హల్దర్ ప్రథమ స్థానంలో, మహిళల సింగిల్స్ విభాగంలో పి.హాసిని కాంస్య పతకాలు సాధించారు. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, శాప్ డైరెక్టర్ ఎండీ రమేష్‌కుమార్, జీవీఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ ఇ.అప్పలరాజు విజేతలకు బహుమతులు అందజేశారు. గీతం అసిస్టెంట్ డీన్ అరుణ్‌కార్తిక్, ఏపీ, జిల్లా టేబుల్‌టెన్నిస్ సంఘాల సంయుక్త కార్యదర్శి, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.శ్రీనివాస్, డీపీఎస్ఏ శర్మ, పలు జిల్లాల క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.

రిజిస్ట్రార్ గుణశేఖరన్ తదితరులతో విజేతలు

సేవలకు గుర్తింపు

పద్మనాభం, న్యూస్‌టుడే: సీఐఐ సదస్సులో ఉత్తమ సేవలందించినందుకు పద్మనాభం తహసీల్దార్ కె.ఆనందరావుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రశంసాపత్రం అందించింది. విశాఖలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ హరేంధిరప్రసాద్ చేతులమీదుగా ప్రశంసాపత్రంతో పాటు జ్ఞాపిక అందుకున్నారు.

కలెక్టర్ చేతులమీదుగా జ్ఞాపికను అందుకుంటున్న తహసీల్దార్ ఆనందరావు

పుస్తక పఠనం జీవితంలో భాగం కావాలి

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: పుస్తకాలు చదవడం ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని సింహాచలం దేవస్థానం ఏఈవో రమణమూర్తి అన్నారు. అడివివరం శాఖా గ్రంథాలయంలో వారం రోజుల పాటు జరిగిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. గ్రంథాలయాధికారి ఎన్.వి.నరసింహం ఆధ్వర్యంలో జరిగిన ముగింపు వేడుకలను రమణమూర్తి ముఖ్య అతిథిగా హాజరై వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విశ్రాంత ఎస్ఐ శైలేంద్రబాబు, కార్మిక నాయకుడు రాజు పాల్గొన్నారు.

అడివివరం గ్రంథాలయంలో ముగింపు వేడుకల్లో అతిథులు, విద్యార్థులు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి గ్రేడ్-1 శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఎస్.మహేష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వివిధ పోటీల విజేతలకు విజేతలకు బహుమతులు అందించారు. భీమిలి తాలూకా ప్రభుత్వ పింఛనుదారుల సంఘం అధ్యక్షుడు టి.భీమారావు, కళాసాహితి అధ్యక్షుడు పి.రాజేంద్ర ప్రసాద్ వర్మ, మున్సిపల్ మాజీ కౌన్సిలరు ఎం.లక్ష్మణరావు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు పాల్గొన్నారు.

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురం శాఖ గ్రంథాలయంలో మండల విద్యాశాఖ అధికారి కె.గంగరాజు మాట్లాడుతూ.. విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. గ్రామ పెద్దలు, లైబ్రేరియన్ అప్పారావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిట్టివలస (తగరపువలస,) న్యూస్‌టుడే: తగరపువలస అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ డా.మురళీకృష్ణ చేతులమీదుగా విజేతలకు బహుమతులను అందించారు. కళాశాల డైరెక్టర్ డా.చంద్రశేఖర్, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దర్గాగా కొండవాలుపై నిర్మాణాలు

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురం మండలం గిడిజాల రెవెన్యూ గ్రామంలో విజయనగరం- సింహాచలం రోడ్డుకి ఆనుకుని ఉన్న కొండవాలు భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. అక్కడ ఇష్టానుసారం నిర్మాణాలు చేపడుతున్నా యంత్రాంగం పట్టించుకోవడం లేదు. అటు వైపు నుంచే రెవెన్యూ అధికారులు రాకపోకలు సాగిస్తుంటారు. అయినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

విలువైన ప్రభుత్వ స్థలాలు: రహదారికి ఆనుకుని సుమారు 14 సెంట్ల ప్రభుత్వ భూమిని చదును చేసి అందులో భవన నిర్మాణ పనులు చేపడుతున్నారు. వీటిని ఎవరూ చూడకుండా ఉండేందుకు పరదాలు సైతం కట్టారు. అదే వరుసలో దీనికి సమీపంలో మరో వ్యక్తి 12 సెంట్ల ప్రభుత్వ భూమిలో చేపట్టిన భవన నిర్మాణ ప్రాంతానికి ఎవరూ రాకుండా ఉండేందుకు కంచె కట్టి అడ్డుగా కర్రలు పెట్టారు. ఈ రెండు స్థలాల విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.80 లక్షలు వరకు ఉంటుందని గ్రామస్థులు చెబుతున్నారు. ఇంత విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించినా రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనుబాబు వద్ద ప్రస్తావించగా తన దృష్టికి రాలేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రోడ్డుపై వెళ్లేవారికి కనిపించకుండా కట్టిన పరదాలు

ప్రభుత్వ భూమిలో వేసిన పిల్లర్లు

తుక్కు దుకాణంలో అగ్నిప్రమాదం

కొమ్మాది, న్యూస్‌టుడే: కొమ్మాది పాతదేవిమెట్ట ప్రాంతంలో ఓ తుక్కు దుకాణంలో గురువారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు, నిర్వాహకులు తెలిపిన వివరాలిలా.. 7వ వార్డు ప్రియదర్శినికాలనీకి చెందిన శామ్యూల్ అనే వ్యక్తి కొన్నేళ్లుగా కాపులుప్పాడ డంపింగ్‌యార్డు ఆధారంగా ఇక్కడ తుక్కుదుకాణం నిర్వహిస్తున్నాడు. ఉదయం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి పెదఎత్తున పొగలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న నిర్వాహకుడు, పీఎంపాలెం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. భారీ మొత్తంలో నష్టం వాటిల్లిందని నిర్వాహకుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా మధురవాడలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న తుక్కు దుకాణాల్లో వరుస అగ్నిప్రమాదాలు చోటుచేసుకోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రేపు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పీఎంపాలెం ఉప విద్యుత్తు కేంద్రం పరిధిలోని దర్శపురం కాలనీ ఫీడర్‌పై తీగల కింద చెట్ల కొమ్మలు తొలగింపు నేపథ్యంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా అంతరాయం కలుగుతుందని ఈఈ బి.సింహాచలంనాయుడు తెలిపారు. వినియోగదారులు గమనించాలన్నారు.

పద్మనాభం, న్యూస్‌టుడే: శిర్లపాలెం ఫీడర్ పరిధిలో పలు ప్రాంతాల్లో ఈనెల 22న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏఈ జగన్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కొమ్మాది, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జిల్లాస్థాయిలో నిర్వహించిన రగ్బీ, కబడ్డీ పోటీల్లో 13 మంది మధురవాడలోని చంద్రంపాలెం విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 22, 23 తేదీల్లో కర్నూలు, మచిలీపట్నం ప్రాంతాల్లో జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎం.మానస, బి.లిఖిత, బి.చంద్రిక, ఎస్.శ్రీనివాసరావు, జి.అశోక్‌లు పాల్గొంటారని ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటరావు తెలిపారు. నెల్లూరు జిల్లాలో జరగనున్న రగ్బీ పోటీలకు వి.అమృత, జె.మనీషా, పి.కృష్ణవాసుదేవ, ఎ.గిరిషకుమార్, సి.హెచ్.నవీన్, సి.హెచ్.బాలకృష్ణ, బి.చాందిని, బి.లిఖితలు ఎంపికయ్యారు. వీరిని గురువారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ గుదే అచ్యుతరావు తదితరులు అభినందించారు.

ఆనందపురం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా లంకెలపాలెం ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఖోఖో పోటీల్లో ప్రతిభ చాటి శిర్లపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయరాలు శారద వెల్లడించారు. అండర్-17 విభాగంలో రేగాని శృతిక, సారిక పవిత్ర, యర్ర హరిణి, శిర్ల చైత్రహర్షిని. . అండర్-14 విభాగంలో చందక మహేష్, బాలికల విభాగంలో బంటుబిల్లి సృజన, కోట్ల దీక్షిత ఎంపికయ్యారు. రగ్బీ క్రీడలో బంటుబిల్లి రేవతి, వాలీబాల్ పోటీల్లో పాసల శ్యామ్‌సుందర్, మారిక వంశీ ఎంపికయ్యారన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు బుత్తల సత్యం, విద్యార్థులను గ్రామస్థులు అభినందించారు.

చురుగ్గా రోడ్డు నిర్మాణ పనులు

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 98వ వార్డు అడివివరం గ్రామంలో అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయని వార్డు కార్పొరేటర్ పీవీ.నరసింహం పేర్కొన్నారు. గ్రామంలోని విజినిగిరిపాలెంలో రూ.19.70 లక్షలు, గాంధీనగర్‌లో రూ.19.86 లక్షలతో చేపట్టిన రహదారి నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో వార్డు తెదేపా అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, నాయకులు బంటుబిల్లి వరహా నరసింహం, మజ్జి కోటేశ్వరరావు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి పనులను పరిశీలిస్తున్న 98వ వార్డు కార్పొరేటర్ నరసింహం

ఆక్రమిత షెడ్డు కూల్చివేత

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి కృష్ణాకాలనీ వద్ద ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయానికి చెందిన స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన షెడ్డును పోలీసు బందోబస్తుతో రెవెన్యూ సిబ్బంది గురువారం తొలగించారు. ఇక్కడ ఖాళీగా ఉన్న స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించి సిమెంటు ఇటుకలతో షెడ్డును నిర్మించారు. ఐసీడీఎస్ అధికారుల ఫిర్యాదు మేరకు ఈనెల 19న అక్కడకు వెళ్లిన రెవెన్యూ సిబ్బందిని ఆక్రమణదారులు అడ్డుకోవడంతో వెనుదిరిగిన విషయం తెలిసిందే. గురువారం భీమిలి ఎస్ఐ ఎన్.గౌరి తదితర పోలీసు సిబ్బందితో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి అక్కడకు వెళ్లి జేసీబీ సహాయంతో షెడ్డును కూల్చివేసి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు.

జేసీబీతో తొలగిస్తున్న ఆక్రమిత షెడ్డు

అటవీ వనసమారాధనలో కలెక్టర్

ఎండాడ, న్యూస్‌టుడే: ప్రకృతి ఒడిలో ప్రజలతో కలిసి అటవీ శాఖ నిర్వహించిన కార్తిక వనసమారాధనలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అన్నారు. కంబాలకొండ అటవీ ప్రదేశంలో గురువారం నిర్వహించిన వనసమారాధనలో సీసీఎఫ్ బి.మొహమ్మద్ దివాన్‌మైదీన్, జిల్లా అటవీ శాఖాధికారి, హార్వేదర్ జి.మంగమ్మ, ఉప అటవీశాఖాధికారి శ్రీవాణి తదితర అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. కంబాలకొండ వాచ్‌టవర్ ఎక్కి ప్రకృతి అందాలను వీక్షించారు. అనంతరం సాంస్కృతిక, క్రీడా, వినోద కార్యక్రమాల్లో సందడి చేశారు. అటవీ శాఖ వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వాలీబాల్ ఆడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

భక్తజన సందోహంగా భైరవస్వామి సన్నిధి

సింహాచలం, న్యూస్‌టుడే: అమావాస్య తిథిని పురస్కరించుకుని భైరవవాకలోని సింహాచలం దేవస్థానం ఉప దేవాలయం భైరవస్వామి సన్నిధి గురువారం భక్తజన సందోహంగా మారింది. వేకువజాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. భక్తుల రాకతో అడివివరం ప్రధాన రహదారి నుంచి ఆలయానికి వెళ్లే అటవీ మార్గం కిక్కిరిసిపోయింది. స్వామిని దర్శించుకోవడానికి పెద్దఎత్తున భక్తులు ఆలయ ప్రాంగణంలో క్యూలైన్లలో బారులుతీరారు. భక్తుల వాహనాలతో అడివివరం - శొంఠ్యాం రహదారిలో రద్దీ నెలకొంది. పార్కింగ్ సమస్యతో భక్తులు ఇబ్బందిపడ్డారు. ఆలయానికి వెళ్లే మార్గంలో కనీస వసతులు లేకపోవడంతో అవస్థలు తప్పలేదు. మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. గోపాలపట్నం ఎస్ఐ రామారావు ఆధ్వర్యంలో 25 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది.

దర్శనానికి బారులుతీరిన భక్తులు

ఘనంగా ముగిసిన లక్ష దీపోత్సవం

జామరం సేవ చేస్తున్న అర్చకుడు

ఆనందపురం: గంభీరం ఐఐఎం రోడ్డులో కొలువుదీరిన శ్రీరాధ మదన్ మోహన్ స్వామి ఆలయం ఆవరణలో హరేకృష్ణ మూవ్‌వెంట్ ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న లక్షదీపోత్సవం గురువారం వైభవంగా ముగిసింది. సాయంత్రం సంధ్యా హారతి, కార్తిక దామోదర ఆకాశ దీపాన్ని నిష్కించన భక్తదాస వెలిగించారు. స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

సాగరతీరం.. దుర్భర జీవితం!

తగరపువలస, గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: భీమిలి నియోజకవర్గంలోని తీరప్రాంత మత్స్యకారుల జీవన స్థితిగతులు దుర్భరంగా ఉన్నాయి. ఏటా తుపానులు, అల్పపీడనాలు, ప్రతికూల వాతావరణంతో చేపలవేట ఆశాజనంగా లేకపోవడంతో వారంతా అవస్థలు పడుతున్నారు. గత అయిదేళ్లలో అప్పటి వైకాపా ప్రభుత్వం మత్స్యకారులకు మొండిచేయి చూపింది. రాయితీపై కనీసం వలలు, బోట్లు, భద్రత పరికరాలు, తదితరాలు ఏమీ ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం తమను ఆదుకుంటుందన్న కోటి ఆశలతో మత్స్యకారులు ఎదురుచూస్తున్నారు. **నేడు అంతర్జాతీయ మత్స్యకార దినోత్సవం** సందర్భంగా కథనం.

ఫిషింగ్ హార్బర్ లేక భీమిలి ఉప్పుటేరులో నిలిపి ఉంచిన బోట్లు

మత్స్యకార గ్రామాల్లో సమస్యలిలా.. మత్స్యకార గ్రామాల్లో సీఆర్‌జెడ్ ఉల్లంఘనలకు పాల్పడుతూ తీర ప్రాంతాన్ని ఆక్రమిస్తున్నారు. ★ మత్స్యకారులు తుపాను సమయాల్లో బోట్లు, వలలు భద్రపరచుకునేందుకు మంగమారిపేట మినహా మరెక్కడా షెడ్లు లేవు. ★ పరిశ్రమలు విడిచి పెడుతున్న రసాయన జల కాలుష్యంతో అన్నవరం, నాగమయ్యపాలెం, మంగమారిపేట, చేపలుప్పాడ, తదితర గ్రామాల్లో చేపలు సరిగా లభించక ఇబ్బంది పడుతున్నారు. ★ భీమిలి, చేపలుప్పాడ, మంగమారిపేట, పెద జాలారిపేటల్లో మినీ జెట్టీల నిర్మాణం హామీలకే పరిమితమవుతోంది. ★ చేపలను నిల్వ శీతల గిడ్డంగులు, ఎండబెట్టుకునేందుకు ప్లాట్‌ఫారాలు వంటి కనీస వసతులు లేవు. ★ మంగమారిపేట నుంచి భీమునిపట్నం వరకూ సముద్రపు కోత నివారణకు చర్యలు చేపట్టాలి.

అండగా కూటమి ప్రభుత్వం: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక వేట విరామ సమయంలో ఇచ్చే భృతిని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచింది. ★ రాయితీపై బోట్లు, వేట పరికరాలు, ప్రాణ రక్షణ పరికరాలను అందించే కార్యాచరణ చేపట్టింది. ★ మంగమారిపేట, తిమ్మాపురరం గ్రామాల్లోని మత్స్యకారుల ఉపాధి కోసం సముద్ర నాచు పెంపకం (సీవీడ్) సాగుకి ఏర్పాట్లు చేస్తోంది. ★ ఇటీవల మొంథా తుపాను సమయంలో ఒక్కో మత్స్యకార కుటుంబానికి 50 కిలోల బియ్యం, నిత్యావసరాలను అందించింది.

గణాంకాలిలా..:

★ చేపలవేట చేసే మత్స్యకారులు-6,102
★ ఫైబరు ఇంజిను బోట్లు, తెప్పలు-319
★ సంప్రదాయకుట్టు పడవలు-224
★ చేపల బేరగత్తెలు-1208
★ సముద్ర మత్స్యకార సొసైటీలు-18
★ మహిళా మత్స్యకార సంఘాలు-3
★ దేశీయ మత్స్యకార సంఘాలు-2

యథేచ్ఛగా నీటి చౌర్యం

మధురవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 8వ వార్డు ఎంవీవీ సిటీ సమీపంలో అనధికారిక నీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పనోరమహిల్స్ నుంచి మధురవాడ వుడా కాలనీకి వెళ్లే రోడ్డు ప్రారంభంలోని ఓ ఖాళీ స్థలంలో భూగర్భ బోరు నుంచి నీటిని తోడి ట్యాంకర్లతో విక్రయాలు చేస్తున్నారు. ప్రతి రోజు పదుల సంఖ్యలో ట్యాంకర్ల ద్వారా ఇక్కడి నుంచి నీటిని బయటకు తరలిస్తున్నారు. 5 వేలు, 10 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకర్లకు దూరాన్ని బట్టి ధరలు నిర్ణయించి విక్రయిస్తూ సొమ్ములు చేసుకంటున్నారు. వాల్టా చట్టం నిబంధనలకు విరుద్ధంగా బహిరంగంగా నీటి విక్రయం చేపడుతున్నా జీవీఎంసీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు వాపోతున్నారు. నీటి సరఫరా విభాగానికి సంబంధించి కొందరు కిందిస్థాయి అధికారులు వీరికి అండగా నిలవడంతో యథేచ్ఛగా నీటి చౌర్యానికి పాల్పడుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బోరు నుంచి ట్యాంకర్‌లోకి నీటిని నింపుతున్న దృశ్యం

పర్యాటక రంగంలో విస్తృత అవకాశాలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రపంచ పర్యాటక రంగంలో విస్తృత అవకాశాలు లభిస్తున్నాయని ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, హోటల్ రంగానికి చెందిన మిస్టర్ మార్క్ స్టెర్నజల్, మిస్టర్ జీడీఎన్ పాకియనాథన్, మిస్టర్ డేవిడ్ కసర్ పేర్కొన్నారు. సాగర్‌నగర్ సన్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ మేనేజ్‌మెంట్ ప్రాంగణంలో సన్ ఇంటర్నేషనల్ గ్రాండ్ హయత్ సంయుక్త ఆధ్వర్యంలో దేశ విదేశాల్లోని టూరిజం రంగంలో ఉపాధి అవకాశాలపై 'క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ యూఎస్ఏ జే1 వీసా' గురువారం నిర్వహించారు. సన్ ఇన్‌స్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశా జాస్తి మాట్లాడుతూ విశాఖపట్నంలోని సన్ విద్యార్థులు దేశవ్యాప్తంగా ప్రపంచంలోని వివిధ దేశాల్లో రాణిస్తున్నారన్నారు. క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొన్న 130 మంది విద్యార్థుల్లో 60 మంది విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో విదేశాలకు చెందిన టూరిజం రంగ ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో సన్ ఇన్‌స్టిట్యూట్ ఈడీ ఆశా జాస్తి, పారిశ్రామికవేత్తలు

ఇనాం రైతుల ఖాతాల్లోకి నగదు జమ

పీఎంపాలెం, న్యూస్‌టుడే: భీమిలి నియోజకవర్గం పరిధిలోని ఏడు గ్రామాల్లో ఇనాం భూములు కలిగిన రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద గురువారం ప్రభుత్వం నగదు జమ చేసింది. ఈ మేరకు ఆయా గ్రామాల రైతులు గురువారం ఎంవీపీ కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. పద్మనాభం, ఆనందపురం, భీమిలి మండలాలకు సంబంధించి బి.ఆర్.తాళ్లవలస, కృష్ణాపురం, ముచ్చర్ల, పద్మనాభం, బోని, శిర్లపాలెం, నారాయణ రాజుపేట గ్రామాల్లోని రైతులకు ఇనాం భూములున్నాయి. వివిధ సాంకేతిక కారణాలతో ఆయా రైతులకు అన్నదాత సుఖీభవ నగదు రాకపోవడంతో ఆర్థికంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తదితరులతో గంటా చర్చించారు. దీంతో ఎట్టకేలకు వారి ఖాతాల్లో నగదు జమ కావడంతో ఆయా రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేను కలిసి సత్కరించారు.

ఎమ్మెల్యే గంటాను సత్కరించిన రైతులు

(c) eenadu

విశాఖ తూర్పు

అఖండ దీపహారతి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ఆర్.కె.బీచ్ కాళీమాత ఆలయ సమీప సముద్ర తీరంలో అఖండ దీప సాగరహారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలిపాడ్యమి పురస్కరించుకొని గురువారం సాయంత్రం విశ్వభారత్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ముందుగా ప్రత్యేక పూజలు చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య
పెదవాల్తేరు, ఎంవీపీ కాలనీ: 8008574769
మద్దిలపాలెం: 9912120229

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ?: చినవాల్తేరు రజకవీధిలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన, దోమల బెడద అధికంగా ఉంది. –ఆదిలక్ష్మి, స్థానికులు ✓: రెండు రోజుల్లో సిబ్బందిని పంపించి శుభ్రత పనులు చేపడతాం. –శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ?: ఆరిలోవ శ్రీకాంత్‌నగర్ ప్రధాన రహదారితో పాటు అంతర్గత వీధుల్లో గోతులు పడి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. –ప్రసాద్, స్థానిక సంఘం ప్రతినిధి ✓: ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు రాగానే పనులు చేపడతాం. –వెంకటరావు, డీఈ, జీవీఎంసీ

ఇందిరానగర్ (విశాలాక్షినగర్), న్యూస్‌టుడే : ?: పాత డెయిరీఫారం కూడలి నుంచి రవీంద్రనగర్ వరకు ప్రధాన మార్గంలో పలు విద్యుత్ దీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నాం. –జగన్నాథరావు, సుందర్‌నగర్ ✓: వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. –రామ్‌శంకర్, పర్యవేక్షకుడు, వీధిదీపాల విభాగం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 16వ వార్డు కేఆర్‌ఎం కాలనీ పార్కు సమీప కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వ్యాపిస్తోంది. –శ్రీనివాసరావు, కేఆర్‌ఎం కాలనీ ✓: తక్షణమే సిబ్బందిని పంపించి సమస్య పరిష్కరిస్తాం. –సూరిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఆరిలోవ, న్యూస్‌టుడే: ?: 12వ వార్డు పరిధి శ్రీకాంత్‌నగర్, భగత్‌సింగ్‌నగర్ ప్రాంతాలకు కొళాయి నీరు సన్నటి ధార రావడంతో తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నాం. –పి.సత్యనారాయణ, శ్రీకాంత్‌నగర్. ✓: వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. –డి.చంద్రశేఖర్, పర్యవేక్షకుడు, మంచినీటి సరఫరా విభాగం

స్పందనకు వందనం

ఎట్టకేలకు వ్యర్థాల తొలగింపు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: 20వ వార్డు కిర్లంపూడి లేఅవుట్ ఎస్‌బీఐ ప్రాంత సమీపంలో రహదారిపై వ్యర్థాలు పేరుకుపోయి స్థానికులు కొద్ది రోజులుగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై గురువారం 'ఈనాడు'లో వెలువడిన వార్తకు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్ స్పందించి వాహన సిబ్బందితో శుభ్రత పనులు చేపట్టారు.

వెలిగిన హైమాస్ట్ దీపం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: పదోవార్డు ఎస్‌ఏజీనగర్ రామాలయం కూడలిలోని హైమాస్ట్ దీపం వెలగక స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సమస్యను పలువురు 'ఈనాడు-మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకురావడంతో వీధి దీపాల నిర్వహణ విభాగం పర్యవేక్షకుడు రామ్‌శంకర్ స్పందించారు. సిబ్బందితో గురువారం మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల భవితకు 'మార్గదర్శి'

మద్దిలపాలెం, న్యూస్‌టుడే

విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటే అనుకున్న లక్ష్యాలను సాధించడానికి మార్గం సుగమం అవుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1968 ఆగస్టు 3న చక్కటి లైబ్రరీని ప్రారంభించి నేటికీ కొనసాగిస్తున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని డిగ్రీ కళాశాలల్లో ఈ గ్రంథాలయమే పెద్దది. ఈ కళాశాలలో వివిధ డిగ్రీ, పీజీ కోర్సుల్లో సుమారు మూడు వేల మందికి పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. దివంగత ఎంపీ ఎంవీవీఎస్ మూర్తి హయాంలో ఇక్కడి గ్రంథాలయానికి ప్రత్యేకంగా భవనం సమకూర్చారు.

★ ఇక్కడి గ్రంథాలయంలో 35,500 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. చరిత్ర, కామర్స్, సైన్సు గ్రూపులకు సంబంధించిన వాటితో పాటు భారత రాజ్యాంగానికి, పోటీ పరీక్షలకు సంబంధించి మరెన్నో ఇక్కడ ఉన్నాయి. గాంధీ జీవిత చరిత్రతో పాటు ఎందరో ప్రముఖులకు చెందిన పుస్తకాలు ఇక్కడ లభ్యమవుతాయి. ప్రతి విద్యార్థి రోజుకు మూడు పుస్తకాలు ఇంటికి తీసుకెళ్లి 14 రోజుల తరువాత తిరిగి గ్రంథాలయానికి అందజేసే సౌలభ్యం ఉంది. ప్రతిరోజు సుమారు 300 మంది విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు.

★ ఆన్‌లైన్‌లో పుస్తకాలు చూసుకునే అవకాశం కూడా ఇక్కడ ఉంది. ఇందుకోసం విద్యార్థుల మెయిల్ ఐడీలకు కళాశాల మెయిల్ ద్వారా యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ అందజేస్తారు. www.drvskrishnagdc.edu.in వెబ్‌సైట్ ద్వారా కూడా గ్రంథాలయంలోని పుస్తకాల సమాచారం పొందవచ్చు.


గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు

ప్రాంగణంలో పుస్తకాలు, దినపత్రికలు చదువుతున్న విద్యార్థులు

★ డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఇదొక వరం లాంటిది. కొన్నేళ్లుగా ఇక్కడి పుస్తకాలను జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్నాం. వాటి రక్షణకు చెదల నివారణ మందు తదితరాలు ఉపయోగిస్తున్నాం. దుమ్ము, ధూళి పట్టకుండా యంత్రంతో ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నాం. వీటన్నింటి కోసం నెలకు రూ.15వేల వరకు ఖర్చు చేస్తున్నాం. విద్యార్థులు ఈ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. –డాక్టర్ ఎం.శ్రీనివాసప్రసాద్, కళాశాల గ్రంథాలయాధికారి

ఏయూలో జియోగ్రాఫిక్ దినోత్సవం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం భూభౌతిక శాస్త్ర విభాగం, ఇండియన్ సొసైటీ ఆఫ్ జియోమాటిక్స్ (ఐఎస్‌జి) విశాఖ ప్రాంతీయ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ డే-2025 నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా డెహ్రాడూన్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ (ఐఐఆర్ఎస్) డైరెక్టర్ డా.ఆర్.పి.సింగ్ 'డిజిటల్ ప్రపంచంలో రిమోట్ సెన్సింగ్, జీఐఎస్ పాత్ర: పరిణామం, ప్రస్తుత స్థితి, భవిష్యత్తు సామర్థ్యాలు' అన్న అంశంపై వర్చువల్‌గా ఉపన్యసించారు. ఐఎస్‌జి విశాఖ చాప్టర్ ఛైర్మన్ ఆచార్య కె.నాగేశ్వరరావు, ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, సదస్సు కన్వీనర్ డా.బి.ఆనందగజపతి రాజు, విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేత విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు.

విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న ప్రిన్సిపల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు తదితరులు

ఘనంగా ప్రపంచ తత్వశాస్త్ర దినోత్సవం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం తత్వశాస్త్రం, మతపరమైన అధ్యయనాల విభాగం ఆధ్వర్యంలో విభాగ సెమినార్ హాలులో గురువారం 'ప్రపంచ తత్వశాస్త్ర దినోత్సవం-2025' ఘనంగా నిర్వహించారు. ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఆచార్య ఎం.వి.కృష్ణయ్య మాట్లాడుతూ నేటి సాంకేతిక, సామాజిక మార్పుల నడుమ తత్వ దృష్టి అనివార్యమని పేర్కొన్నారు. ఆచార్య పి.జార్జి విక్టర్, ఆదికవి నన్నయ వర్సిటీ పూర్వ వీసీ ఆచార్య వై.వి.సత్యనారాయణ, ఆచార్య ప్రేమానందం, ఆచార్య కె.రమేష్‌బాబు, తత్వశాస్త్ర విభాగ పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

సోక్రటీస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న దృశ్యం

కార్యవర్గం ఎన్నిక

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: స్థానిక భగత్‌సింగ్ యువజన సేవాసంఘం నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా బాలాజీ, అధ్యక్షుడుగా తాతారావు, ఉపాధ్యక్షులుగా తిరుపతి, ఈశ్వరరావు, కార్యదర్శిగా ఆనందరావు, సహాయ కార్యదర్శిగా శ్రీనివాసులు, కోశాధికారిగా భాస్కరరావు, సహాయ కోశాధికారిగా మోహనరావులను ఎన్నుకున్నారు. మరో అయిదుగురిని సలహాసంఘం సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ రెండేళ్లపాటు కొనసాగుతుందని సంబంధిత ప్రతినిధులు పేర్కొన్నారు.

టేబుల్‌టెన్నిస్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

క్రీడాకారులను అభినందిస్తున్న కరస్పాండెంట్ మధుకుమార్, ప్రిన్సిపల్ చక్రవర్తి తదితరులు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో బుల్లయ్య కళాశాల క్రీడాకారులు పతకాలు గెలుపొందినట్లు సంబంధిత కళాశాల వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు తెలిపారు. ఈ పోటీలు గీతం డీమ్డ్ వర్సిటీలో బుధవారం ముగిశాయని, పి.ఎం.సి.రవివర్మ స్వర్ణం, ఎం.దీప్తి రజతం గెలుపొందారన్నారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ జి.ఎస్.కె.చక్రవర్తి విజేతలను అభినందించారు. పీడీ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా గ్రామీణ తహసీల్దారు కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ బాలికల గృహం, సదనంలో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. రెండవ అదనపు కోర్టు న్యాయమూర్తి ఎస్.వరలక్ష్మి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులు చక్కటి లక్ష్యాలను ఏర్పరచుకుని, వాటిని సాధించడం ద్వారా సమాజానికి ఉపయోగపడే పౌరులుగా మారాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలైన బాలికలకు బహుమతులు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పి.సూర్యభాస్కర్, బాలికల గృహం పర్యవేక్షణాధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా..

విశాలాక్షినగర్: ఎంవీపీకాలనీ ఐఐఎం కళాశాలలో గురువారం మహిళా ఉద్యమిత్వ దినోత్సవ వేడుకలు ఏపీ ఛాంబర్స్ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఐఐఎం డైరెక్టర్ కృష్ణమోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు తాము నిర్వహిస్తున్న రంగంలో నైపుణ్యాలు మెరుగుపరచుకుని మహిళా సాధికారిత దిశగా ముందడుగు వేయాలన్నారు. మహిళా విభాగపు ఛైర్‌పర్సన్ డాక్టర్ శ్రీవల్లి, శోభన్ ప్రకాశ్, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ద్వారా యువతలో ఐకమత్య లక్షణాలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఐకమత్యం, సమైక్యత లక్షణాలను యువతలో పెంపొందించే దిశగా ఎన్‌సీసీ పనిచేస్తోందని డిప్యూటీ డైరెక్టర్ జనరల్(ఏపీ-తెలంగాణ) ఎయిర్ కమొడోర్ నర్సింగ్ సైలాని అన్నారు. ఏయూలోని డా.వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో గురువారం ఎన్‌సీసీ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన సందర్శించారు. యువత సమాజానికి సేవ చేయాలనే ఆలోచనతో పనిచేయాలని సూచించారు. ఇందులో భాగంగా ఎన్డీఆర్ఎఫ్ బృందం ప్రత్యేక ప్రదర్శనను వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ తదితరులు తిలకించారు. ఇందులో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు అతిథులు బహుమతులు అందించారు. గ్రూప్ కమాండర్ కమొడోర్ సుమంత్ రాయ్, కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ యు.కార్తిక్, ఏయూ ఎన్‌సీసీ అధికారి డాక్టర్ ఎన్.ఎం.యుగంధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్డీఆర్ఎఫ్ పరికరాలను తిలకిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్, నర్సింగ్ సైలాని తదితరులు

సేవలకు గుర్తింపు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ది ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా) మెరైన్ విభాగం ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సులో విద్యావేత్త, పరిశోధకులు డా.వీవీఎస్ ప్రసాద్‌ను సన్మానించారు. ఇంజినీరింగ్ విద్య, పరిశోధన, వృత్తి పరమైన రంగాల్లో ఆయన చేసిన కృషిని గుర్తిస్తూ సత్కరించారు. ఈ మేరకు గురువారం ఆయనను వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ అభినందించారు. డా.ప్రసాద్ ఎంతోమంది పరిశోధక విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి గల జర్నల్స్‌లో ఆయన రాసిన 153 పరిశోధనా వ్యాసాలు ప్రచురితమయ్యాయి. నాలుగు స్వర్ణ పతకాలు పొందారు. పలు పాఠ్య పుస్తకాలు రచించారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సులు నిర్వహించారు.

ఆచార్య వీవీఎస్ ప్రసాద్‌ను అభినందిస్తున్న వీసీ రాజశేఖర్

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఐ.విజయబాబు అన్నారు. కళాశాల ప్రాంగణంలో గురువారం నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల గ్రంథాలయాధికారి డాక్టర్ ఎం.శ్రీనివాసప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ పి.జయ, అధ్యాపకులు డి.శ్రవణ్‌కుమార్, డాక్టర్ కె.రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

★ ఎంవీపీకాలనీ నగర శాఖ గ్రంథాలయంలో జరిగిన వేడుకల్లో రచయిత సుసర్ల సర్వేశ్వర శాస్త్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారి కె.వి.ఎ.ఉమామహేశ్వరరావు, వార్డు కార్పొరేటర్ మంగవేణి తదితరులు పాల్గొన్నారు.

గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపల్ విజయబాబు తదితరులు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని డా.వి.ఎస్.కృష్ణ గ్రంథాలయంలో గురువారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఏయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పద్మశ్రీ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు సందర్శించి ఇక్కడ లభించే అరుదైన గ్రంథాలను తిలకించారు.

ఎంవీపీకాలనీ నగర శాఖ గ్రంథాలయంలో విజేతకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

పుస్తకాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ ఆచార్య పద్మశ్రీ

24న బొకారో రైలు ఆలస్యం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: దక్షిణ మధ్య రైల్వే విజయవాడ-దువ్వాడ సెక్షన్‌లో వంతెన నిర్మాణ పనుల కారణంగా పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం కలగనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఈ నెల 24న ఉదయం 11.35 గంటలకు బయలుదేరాల్సిన ధన్‌బాద్-అల్లెప్పీ (13351) బొకారో ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 2.35 గంటలకు బయలుదేరేలా మార్పు చేసినట్లు పేర్కొన్నారు.

ఏయూ అధ్యయన సంస్థకు పరిశోధన ప్రాజెక్టు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: చమురు-సహజ వాయువు సంస్థ(ఓఎన్‌జీసీ).. కృష్ణా-గోదావరి బేసిన్ రాజమహేంద్రవరానికి సంబంధించిన భారీ పరిశోధన ప్రాజెక్టును ఆంధ్ర విశ్వవిద్యాలయం డెల్టా అధ్యయన సంస్థ (డెల్టా స్టడీస్ ఇన్‌స్టిట్యూట్)కు మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు పరిశోధనకు రూ.1.1 కోట్లు సమకూరడం పట్ల ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ హర్షం వ్యక్తం చేశారు.

మర్యాదపూర్వక కలయిక

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన ఈశ్వరయ్యను వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు విజయవాడ సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ప్రణవ్‌గోపాల్ ఈశ్వరయ్యకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు. విద్యార్థి నాయకుడుగా సేవలందించిన ఈశ్వరయ్య సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన నేపథ్యంలో ప్రణవ్‌గోపాల్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈశ్వరయ్యను శాలువతో సత్కరిస్తున్న ప్రణవ్‌గోపాల్

● అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 23వ వార్డు పరిధిలోని మద్దిలపాలెం, కేఆర్‌ఎంకాలనీ, చైతన్యనగర్ ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులకు గురువారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శంకుస్థాపన చేశారు. సుమారు రూ.86లక్షల జీవీఎంసీ నిధులతో ఈ పనులు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. సిమెంట్, తారురోడ్లకు సంబంధించి భూమి పూజ చేశారు. వార్డు కార్పొరేటర్ గుడ్ల విజయసాయి, సత్యారెడ్డి, బూసరాంబాబు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

● 22న ఉద్యోగ మేళా

కంచరపాలెం, న్యూస్‌టుడే: ఐటీఐ, డిప్లొమా విద్యార్థులకు ఈనెల 22న కంచరపాలెంలోని ప్రభుత్వ పాత ఐటీఐ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు వైస్ ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఐటీఐ ఫిట్టర్, డిప్లొమా మెకానికల్ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు పాల్గొనవచ్చునన్నారు. ప్రముఖ కంపెనీ టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్(హైదరాబాద్)కు చెందిన ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు అన్ని రకాల ధ్రువపత్రాలతో హాజరుకావాలని తెలిపారు.

● నిలిచిన ఫైబర్‌నెట్ సేవలు

అగనంపూడి: రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫైబర్‌నెట్ సేవలు గురువారం ఉదయం నుంచి నిలిచిపోయాయి. విశాఖ నగరంలోని ఎన్‌వోసీ (నెట్‌వర్క్ ఆపరేషన్స్ కేంద్రం)లో సాంకేతిక సమస్య తలెత్తడంతో సేవలకు అంతరాయం కలిగింది. ఉదయం 10 గంటలకు సేవలు నిలిచిపోగా రాత్రి వరకూ పునరుద్ధరించక పోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫైబర్‌నెట్ వాడుతున్న ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల్లోనూ కార్యకలాపాలు స్తంభించాయి. తరచూ సేవలకు అంతరాయం కలుగుతుండడంతో కనెక్షన్లు తగ్గిపోతున్నాయని కేబుల్ ఆపరేటర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల తాము ఉపాధి కోల్పోతున్నామని వాపోతున్నారు. ఇకనైనా ప్రభుత్వం తక్షణం స్పందించి సంస్థను గాడిలో పెట్టాలని కోరుతున్నారు.

ముగిసిన లక్ష దీపోత్సవం

ఆనందపురం: గంభీరం ఐఐఎం రోడ్డులో కొలువుదీరిన శ్రీరాధ మదన్ మోహన్ స్వామి ఆలయం ఆవరణలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న లక్షదీపోత్సవం గురువారం వైభవంగా ముగిసింది. సాయంత్రం సంధ్యా హారతి, కార్తిక దామోదర ఆకాశ దీపాన్ని నిష్కించిన భక్తదాస వెలిగించారు.

పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాల పంపిణీ

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: 23వ వార్డులో జౌట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం సమకూర్చిన వస్త్రాలను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వార్డు కార్పొరేటర్ గుడ్ల విజయసాయి గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు తెదేపా నాయకులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు. ★ 15వ వార్డులోని పారిశుద్ధ్య కార్మికులకు వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. నగరాభివృద్ధిలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర చాలా గొప్పదన్నారు. పలువురు నాయకులు, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: 18వ వార్డు పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులకు గురువారం వస్త్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణి తన కార్యాలయ ఆవరణలో జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం సమకూర్చిన వస్త్రాలు, ఏకరూప దుస్తులను అందించారు. నాయకులు పోలారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వస్త్రాలు అందుకున్న పారిశుద్ధ్య కార్మికులతో ఎమ్మెల్యే రామకృష్ణబాబు, కార్పొరేటర్ విజయసాయి తదితరులు

భక్తజన సందోహంగా భైరవస్వామి సన్నిధి

సింహాచలం, న్యూస్‌టుడే: అమావాస్య తిథిని పురస్కరించుకుని భైరవవాకలోని సింహాచలం దేవస్థానం ఉప దేవాలయం భైరవస్వామి సన్నిధి గురువారం భక్తజన సందోహంగా మారింది. వేకువజాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. భక్తుల రాకతో అడివివరం ప్రధాన రహదారి నుంచి ఆలయానికి వెళ్లే అటవీ మార్గం కిక్కిరిసిపోయింది. స్వామిని దర్శించుకోవడానికి పెద్దఎత్తున భక్తులు ఆలయ ప్రాంగణంలో క్యూలైన్లలో బారులుతీరారు. భక్తుల వాహనాలతో అడివివరం - శొంఠ్యాం రహదారిలో రద్దీ నెలకొంది. పార్కింగ్ సమస్యతో భక్తులు ఇబ్బందిపడ్డారు. ఆలయానికి వెళ్లే మార్గంలో కనీస వసతులు లేకపోవడంతో అవస్థలు తప్పలేదు. మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. గోపాలపట్నం ఎస్ఐ రామారావు ఆధ్వర్యంలో 25 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది.

8 మంది జూదరుల అరెస్టు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: జూదం ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని రూ.27,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్సు సీఐ భాస్కరరావు తెలిపారు. ఆ వివరాలిలా.. రామ్‌నగర్‌లోని ఓ మేడపై గురువారం సాయంత్రం జూదం ఆడుతున్నారనే సమాచారం రావడంతో ఈ దాడులు చేపట్టారు. నిందితుల్లో అయిదుగురు పురుషులు, ముగ్గురు మహిళలు ఉన్నారు. వారిని మూడో పట్టణ పోలీసులకు అప్పగించగా సీఐ పైడయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

అనంతుని హుండీ ఆదాయం రూ.6.49 లక్షలు

పద్మనాభం, న్యూస్‌టుడే: పద్మనాభం క్షేత్రంలో కొలువై ఉన్న అనంత పద్మనాభస్వామి దీపోత్సవం వేడుకలో భాగంగా రూ.6,49,020 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో పీఎల్ఎన్.రాజు పేర్కొన్నారు. భక్తులు హుండీల్లో వేసిన కానుకలు రూ.4,11,660 కాగా దర్శనం టికెట్లు, విరాళాలు ద్వారా రూ.2,37,360 వచ్చినట్లు ఈవో తెలిపారు. సెప్టెంబర్ 19 నుంచి నవంబర్ 19 వరకు ఈ మొత్తం ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు.

తుక్కు దుకాణంలో అగ్నిప్రమాదం

కొమ్మాది, న్యూస్‌టుడే: కొమ్మాది పాతదేవిమెట్ట ప్రాంతంలో ఓ తుక్కు దుకాణంలో గురువారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు, నిర్వాహకులు తెలిపిన వివరాలిలా.. 7వ వార్డు ప్రియదర్శినికాలనీకి చెందిన శామ్యూల్ అనే వ్యక్తి కొన్నేళ్లుగా కాపులుప్పాడ డంపింగ్‌యార్డు ఆధారంగా ఇక్కడ తుక్కుదుకాణం నిర్వహిస్తున్నాడు. ఉదయం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి పెదఎత్తున పొగలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న నిర్వాహకుడు, పీఎంపాలెం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. భారీ మొత్తంలో నష్టం వాటిల్లిందని నిర్వాహకుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా మధురవాడలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న తుక్కు దుకాణాల్లో వరుస అగ్నిప్రమాదాలు చోటుచేసుకోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రజలకు సురక్షిత మంచినీటిని అందించాలి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: దేశంలోని ప్రజలకు రక్షిత మంచినీరు అందించాలని భారత ప్రభుత్వ గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాలశాఖ ఉప కార్యదర్శి ఎల్.పచావ్ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో 'డ్రింక్ ఫ్రం ట్యాప్' పేరిట గురువారం నిర్వహించిన జాతీయ సదస్సులో మాట్లాడారు. పట్టణాల్లో మంచినీటి సరఫరా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సి ఉందన్నారు. మహా విశాఖ నగరపాలక సంస్థ చేపడుతున్న తాగునీటి సరఫరా విధానాన్ని కమిషనర్ కేతన్‌గార్గ్ వివరించారు. తెలంగాణ మున్సిపల్‌శాఖ సంచాలకులు, కమిషనర్ డాక్టర్ టి.కె.శ్రీదేవి మాట్లాడుతూ సురక్షిత నీటిని అందించడానికి అవసరమైన పైపులైన్ల నిర్మాణానికి కావాల్సిన నిధులు వెచ్చించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు డాక్టర్ ఎం.స్నేహలత, చిన్మయ్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు

STOCK MARKETలో
డబ్బులు సంపాదించడం ఎలా?
సులభంగా... సంతోషంగా
FREE SEMINAR
NOVEMBER 22nd SATURDAY 7 PM
NOVEMBER 23rd 11 AM 3 PM SUNDAY 7 PM
ELEGANT HOTEL
Opp. 7 Hills Hospital, Waltair Main Road, Ram Nagar, Visakhapatnam.
KRISHNA KAILAS
703 280 4888
703 280 5888

World Fisheries Day Greetings
చేనేత హస్తకళ
ప్రదర్శన మరియు అమ్మకములు
హ్యాండ్ లూమ్స్, హ్యాండీక్రాఫ్ట్స్
వేదిక: గిరిజన భవన్ సెక్టార్ -5,
MVP కాలనీ, డబుల్ రోడ్డు, విశాఖపట్నం.
* పోచంపల్లి * నారాయణపేట
* ఉప్పాడ * చీరాల * మంగళగిరి
* ఫ్యాన్సీ ఖాదీ * కలంకారి
* కాటన్ ప్రింటెడ్ బెంగాల్ సిల్క్
* కాంత్ వర్క్ కాటన్ భాగల్పూర్ సిల్క్
* బాంధని సిల్క్ * గుజరాత్ డిజైన్ టాప్స్
* లక్నో చికన్ వర్క్ * డోర్ కర్టెన్స్
* డోర్ మ్యాట్స్ * జైపూర్ టాప్స్
* వరంగల్ టవల్స్ & బెడ్‌షీట్స్
కార్తీకమాస సందర్భంగా 10% తగ్గింపు
పాత పట్టు ప్యూర్ జరీ చీరలు డబ్బులకు కొనబడును
27-11-2025 వరకు మాత్రమే

(c) eenadu

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

విద్యతోనే ఉజ్వల భవిత

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: విద్యతోనే ఉజ్వల భవిత సాధ్యమవుతుందని ఎంపీ శ్రీభరత్ అన్నారు. గురువారం జైలురోడ్డు వద్దగల విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. బోధన, వసతి సౌకర్యాలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా రాణించాలని సూచించారు.

ఎంపీ శ్రీభరత్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ప్రిన్సిపల్ ఆర్.మంజుల

కార్యక్రమంలో అధ్యాపకులు లక్ష్మి, నివేదిత, అనూష, శరణ్య తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు విగ్రహం ఆవిష్కరణ

జ్ఞానాపురం, న్యూస్‌టుడే: విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. డాబాగార్డెన్స్ దరి ఆర్‌బీఎం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆవిష్కరించడంతో పాటు పాఠశాల ఆవరణలో మొక్కలను గురువారం నాటారు. కార్యక్రమంలో హెచ్.ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు ప్రభాకర్, పైడప్పనాయుడు, పుష్పరాగిణి, నాగమణి, కూటమి నాయకులు గాయత్రి, సారిపల్లి మహేష్, మద్రివేముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

విశాఖ ఉత్తరం: 8008574796

విశాఖ దక్షిణం: 8008574977

మురళీనగర్, న్యూస్‌టుడే: ?: సెక్టార్-8 వాకర్స్ పార్కు ఎదురుగా ఉన్న విద్యుత్తు స్తంభానికి ఉన్న వీధి దీపం వెలగడం లేదు. - **రాజేశ్**, ✓: మరమ్మతులు చేసి వెలిగేలా చూస్తాం. - **అర్చన, వీధి దీపాల ఏఈ**

మాధవధార, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 50వ వార్డు సెక్టార్-8లో ప్రధాన రహదారిలో నిర్మాణ సామగ్రి వేసి కాలువలు మూసివేశారు. దీంతో మురుగు నిలిచిపోయి తీవ్ర దుర్వాసన వస్తోంది. - **ఎల్.రంగారావు**, ✓: సిబ్బందిని పంపించి కాలువలను శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటాం. - బి.సుధాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

మాధవధార, న్యూస్‌టుడే: ఎన్ఎస్‌టీఎల్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు నిర్వహిస్తుండటంతో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-2 ఈఈ బి.కె.నాయుడు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని మాధవధార, రాజీవ్‌నగర్, అప్పయ్యనగర్, కాకానినగర్, సాకేతపురం, దుర్గాపురం, విమాన్‌నగర్, ఎయిర్‌పోర్టు హెచ్‌పీసీఎల్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్తు నిలిచిపోనున్నట్లు తెలిపారు.

భట్రాజు కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

మురళీనగర్, న్యూస్‌టుడే: భట్రాజు కులస్తుల సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ కుల సంఘం ప్రతినిధి ఎన్.రవికుమార్ కోరారు. ఈ కులంలో పలువురు పేదరికంతో మగ్గిపోతున్నారని, వారి సమస్యలు ప్రభుత్వానికి విన్నవించుకోవడానికి కార్పొరేషన్ ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ మేరకు గురువారం విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం భట్రాజ్ సంఘం సభ్యులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర రాజు, ఓడీఎన్ రాజు, వి.శివ తదితరులు పాల్గొన్నారు.

సిమెంటు పరిశ్రమ నిర్మాణ ప్రతిపాదన రద్దు చేయండి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: పెదగంట్యాడ వద్ద అంబుజా సిమెంటు పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదనను రద్దు చేయాలని కోరుతూ జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేయాలని 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు కోరారు. ఈ మేరకు గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. గాజువాక ప్రాంత ప్రజల ఆరోగ్యాలను పరిగణనలోకి తీసుకుని ఈ ప్రతిపాదనకు వ్యతిరేకంగా తీర్మానించి, ప్రభుత్వానికి పంపించాలని విన్నవించారు.

27న ఆత్మీయ సమావేశం

మురళీనగర్, న్యూస్‌టుడే: సెక్టార్-8 వైశాఖి స్పోర్ట్స్ పార్కు వనితా భవన్‌లో వనితా వాకర్స్ క్లబ్ కార్యవర్గ సమావేశం గురువారం నిర్వహించారు. డిసెంబరులో చేయబోయే సేవా కార్యక్రమాలను క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి ఆధ్వర్యంలో చర్చించారు. క్లబ్ సభ్యులంతా ఈనెల 27న జరగబోయే వనసమారాధనకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎం.జయ, రీజనల్ కౌన్సిలర్ యు.శుభ, జి.శిరీషలత, ఎం.ప్రమీలారావు, ఎ.లీలావతి, చదువుల పద్మావతి, కె.బిందురాణి, సి.హెచ్.జ్యోతి, కె.వినీల, జి.షీలారాణి, సురేంద్రకౌర్, పి.సుభద్ర పాల్గొన్నారు.

పాతనగరంలో భారీ అన్నసమారాధన

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: కురుపాం మార్కెట్‌లో గురువారం గురుస్వామి శ్రీను ఆధ్వర్యంలో భారీ సమారాధన నిర్వహించారు. ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, దక్షిణ నియోజకవర్గం తెదేపా ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్, వార్డు తెదేపా అధ్యక్షుడు మజ్జి త్రినాథ్ పాల్గొన్నారు.

భోజనం వడ్డిస్తున్న ఎంపీ శ్రీభరత్, నిర్వాహకులు

అనధికార నిర్మాణం తొలగింపు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: జోన్-4 పరిధిలోని ప్రకాశరావుపేటలో అక్రమంగా చేపట్టిన నిర్మాణ స్లాబును పట్టణ ప్రణాళిక సిబ్బంది గురువారం తొలగించారు. ఏసీపీ ఝాన్సీలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

అలా తొలగించి.. ఇలా ఏర్పాటు చేసి..

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: నగరంలోని ప్రధాన రహదారులు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన తోపుడు బండ్లు, బడ్డీలను ఇటీవల జీవీఎంసీ అధికారులు తొలగించారు. అధికారులు అలా తొలగించారో లేదో.. మళ్లీ యథావిధిగా బడ్డీలు, తోపుడు బండ్లు పుట్టుకొస్తున్నాయి. దీంతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సెలవు రోజులు, ఉదయం, సాయంత్రం సమయాల్లో వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. నరసింహనగర్ రైతుబజార్ వద్ద పరిస్థితి మరింత దయనీయంగా ఉందని స్థానికులు, కొనుగోలుదారులు వాపోతున్నారు. అధికారులు వారం రోజుల పాటు శ్రమించి ఇక్కడ రహదారి పక్కనున్న దుకాణాలు, తోపుడు బండ్లను తొలగించారు. మూడు రోజులైనా కాలేదు వ్యాపారులు వెంటనే తోపుడు బండ్లు ఏర్పాటు చేసి యథావిధిగా అమ్మకాలు కొనసాగించుకుంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో బజార్‌కు వచ్చే వినియోగదారుల తమ వాహనాలు పెట్టుకోవడానికి స్థలం లేకపోవడంతో పాటుగా పాదచారులు నడిచేందుకు వీలులేకుండా కొంత మంది ఆక్రమించేశారని చెబుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా వాహనాలను పార్కింగ్ చేసి గంటలు కొద్ది వదిలేస్తున్నారు. ఆదివారాల్లో నరసింహనగర్ రైతుబజారు కొనుగోలుదారులతో కిటకిటలాడుతుంది. ఆ సమయంలో వాహనాల రద్దీ అధికంగా ఉండటంతో గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి దుకాణాలను తొలగించి మళ్లీ తోపుడు బండ్లు పెట్టకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నరసింహనగర్‌లో రోడ్డుకు ఒకవైపు తోపుడు బండ్లు, మరోవైపు పార్కింగ్ చేసిన వాహనాలు

టేబుల్‌టెన్నిస్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో బుల్లయ్య కళాశాల క్రీడాకారులు పతకాలు గెలుపొందినట్లు సంబంధిత కళాశాల వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు తెలిపారు. ఈ పోటీలు గీతం డీమ్డ్ వర్సిటీలో బుధవారం ముగిశాయని, పి.ఎం.సి.రవివర్మ స్వర్ణం, ఎం.దీప్తి రజతం గెలుపొందారన్నారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ జి.ఎస్.కె.చక్రవర్తి విజేతలను అభినందించారు. పీడీ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న కరస్పాండెంట్ మధుకుమార్, ప్రిన్సిపల్ చక్రవర్తి తదితరులు

కోలా స్ఫూర్తితో కార్మికుల సమస్యలపై పోరాటాలు

మాట్లాడుతున్న జీవీఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు పడాల రమణ

కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఆదర్శ కమ్యూనిస్టు నాయకుడు కోలా గురుమూర్తి స్ఫూర్తితో కార్మికుల సమస్యలపై పోరాటాలు చేస్తామని జీవీఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు పడాల రమణ అన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద గురువారం ఏర్పాటు చేసిన గురుమూర్తి వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటం చేసిన నాయకుడుగా ఆయన నిలిచారన్నారు. ఆర్మీ ఉద్యోగం వదిలి, కమ్యూనిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితుడై, ఉమ్మడి రాష్ట్రంలో మున్సిపల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేశారని కొనియాడారు.

ఆలయం హుండీ ఆదాయం లెక్కింపు

అక్కయ్యపాలెం,(దొండపర్తి), న్యూస్‌టుడే: దొండపర్తిలోని ఎరుకుమాంబ అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపును గురువారం నిర్వహించారు. గోపాలపట్నానికి చెందిన శ్రీహరి సేవా సంఘం సభ్యులు నగదు లెక్కించారు. 2-09-2025 నుంచి ఈ నెల 20వ తేదీ వరకు మొత్తంగా 78 రోజులకు గాను రూ.3,89,639 భక్తులు విరాళాలు రూపంలో సమర్పించారని ఆలయ కార్యనిర్వహణాధికారి డి.వి.ఎస్.సురేష్ బాబా తెలిపారు. ఈ లెక్కింపును ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయం ప్రధాన అర్చకులు జి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నగదు లెక్కిస్తున్న శ్రీహరి సేవా సమితి సభ్యులు

లబ్ధిదారులకు గృహ ఆమోద పత్రాల పంపిణీ

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: ఉత్తరం నియోజకవర్గానికి సంబంధించి ప్రధానమంత్రి ఆవాస్ యోజన - అర్బన్ 2.0 గృహ ఆమోద పత్రాల పంపిణీ కార్యక్రమం గురువారం ఉదయం అక్కయ్యపాలెంలోని షాదీఖానా కల్యాణ మండపంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీ శ్రీభరత్ పాల్గొని మాట్లాడారు. సొంత స్థలం ఉన్నవారు ఈ పథకానికి అర్హులన్నారు. లబ్ధిదారులు ఉత్తరం ఎమ్మెల్యే కార్యాలయంలో లేదా ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ అధికారులను సంప్రదించాలన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణంలో అధికారులు ఇబ్బంది పెడితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎక్కువమంది ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు ప్రజలను ప్రోత్సహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.1.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.1 లక్ష కలిపి మొత్తం రూ.2.5 లక్షలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ సత్తిబాబు, డీఈ ప్రసాదరావు, ఏఈ ప్రభ, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు

విజేతలకు ధ్రువపత్రాల అందజేత

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు వివిధ పాఠశాలలో పలు అంశాలపై పోటీలు నిర్వహించారు. వీరికి సూర్యబాగ్ వద్దగల జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజు ధ్రువపత్రాలు అందజేశారు. సోమశేఖరరావు, చిన్నికృష్ణ, కేవీఎస్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు అందుకున్న విద్యార్థులతో గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి బి.కుమార్‌రాజు

రామలింగేశ్వరుడి ఆలయంలో ప్రత్యేక పూజలు

యతిరాజు దంపతులను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: శంకరమఠం రోడ్డు రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వర ఆలయంలో కార్తిక మాసోత్సవాన్ని దేవదాయ శాఖ, గ్రామ గౌరీ సేవా సంఘం సభ్యుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్న సమారాధన చేశారు. ప్రతిరోజూ సాయంత్రం హరికథ చెప్పిన హరిదాసు యతిరాజు, శివ శ్రీమన్నారాయణ, భక్తి గీతాలు ఆలపించిన శ్రీనివాస్ రామకృష్ణశర్మ, దేవస్థానం అర్చకులు నాగశాస్త్రి మూర్తిని ఆలయం తరఫున ఘనంగా సత్కరించారు.

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 14వ వార్డు గణేష్‌నగర్‌లోని త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన ఆలయంలో గురువారం రాత్రి అర్చకులు సారిపాక సూర్యనారాయణ, వి.ఎస్.కుమార్ ఆధ్వర్యంలో ఆకాశ దీపారాధన చేశారు. పరిసర ప్రాంతాల నుంచి మహిళా భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో దీపాలు వెలిగించారు.

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: రైల్వేన్యూకాలనీ ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న శిర్డీ సాయి ధ్యాన మందిరంలోని శివ లింగానికి అధికసంఖ్యలో భక్తులు స్వహస్తాలతో పూజలు చేశారు. అర్చకుల మంత్రోచ్చారణ నడుమ సుగంధ ద్రవ్యాలతో మహా రుద్రాభిషేకం, అన్నాభిషేకం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన జరిపారు.

అక్కయ్యపాలెం(దొండపర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలోని శ్రీ హరి హర పుత్ర అయ్యప్ప భక్తి బృందం, గురుస్వామి తోనంగి నర్సింగరావు సారథ్యంలో గురువారం రాత్రి అయ్యప్ప పడి పూజను వైభవంగా జరిపారు. గాయకుడు కోరాడ గణేష్ భజన బృందం సభ్యులు పాల్గొని భక్తి గీతాలు ఆలపించి భక్తులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావుతో పాటు అధికసంఖ్యలో మాలధారణ ధరించిన భక్తులు పాల్గొని పూజలు జరిపారు.

అయ్యప్ప పడిపూజలో దీపారాధన

అల్లిపురం, న్యూస్‌టుడే: అల్లిపురం దరి కెప్టెన్ రామారావు కూడలిలోని రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పార్థివ లింగేశ్వరస్వామికి గురువారం మహారుద్రాభిషేకం పూజలు జరిపారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు దీపారాధన చేశారు. 21వ తేదీన శుక్రవారం తెల్లవారుజాము 3 గంటలకు పోలి స్వర్గం సందర్భంగా దీపారాధన నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం పేర్కొన్నారు.

రైల్వేస్టేషన్‌లో అత్యవసర చికిత్సా కేంద్రం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విజయనగరం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అత్యవసర వైద్య సేవలు అందించడానికి ప్రత్యేక గది అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. ప్రయాణికుల భద్రత, సంక్షేమం కోసం వాల్తేర్ డివిజన్ నెల్లిమర్ల మిమ్స్ ఆసుపత్రి సహకారంతో స్టేషన్‌లో 2, 3 ప్లాట్‌ఫామ్‌లపై ఈ గది ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. స్టేషన్‌లో ప్రయాణికులకు 24 గంటలు వైద్య సేవలు అందించడానికి సిద్ధంగా ఉండేలా ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రం ఏర్పాటులో వాల్తేర్ సీఎంఎస్ డాక్టర్ శరత్ బాబు, వైద్య విభాగం కృషిని డీఆర్ఎం లలిత్ బోహ్రా ప్రశంసించారు.

24న బొకారో రైలు ఆలస్యం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: దక్షిణ మధ్య రైల్వే విజయవాడ-దువ్వాడ సెక్షన్‌లో వంతెన నిర్మాణ పనుల కారణంగా పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం కలగనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఈ నెల 24న ఉదయం 11.35 గంటలకు బయలుదేరాల్సిన దన్‌బాద్-అల్పూజా (13351) బొకారో ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 2.35 గంటలకు బయలుదేరేలా మార్పు చేసినట్లు పేర్కొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

సీతంపేట, న్యూస్‌టుడే: ఈ నెల 14 నుంచి వారం రోజుల పాటు నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. శ్రీనగర్‌లోని విశాఖ పౌర గ్రంథాలయంలో ప్రతి రోజు రెండు చొప్పున వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజు సాయంత్రం మహమ్మద్ ఖాన్, మజ్జి దేవరాజు నిర్వహణలో సినీ సంగీత విభావరి ఉత్సాహభరితంగా సాగింది. కార్యక్రమాన్ని గ్రంథాలయ సహ కార్యదర్శి డి.వి.సూర్యారావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభిస్తున్న డీవీ సూర్యారావు

మురళీనగర్, న్యూస్‌టుడే: సెక్టార్-11 శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. జీవీఎంసీ ప్రాథమిక ఉన్నత పాఠశాలలు, కాలనీలోని ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారని గ్రంథాలయ అధికారి వై.పద్మజ తెలిపారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శన

మురళీనగర్, న్యూస్‌టుడే: సెక్టార్-8 బాలభాను విద్యాలయం వార్షికోత్సవాన్ని గురువారం ఛైర్మన్ బి.ఆర్.కె.రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల వేషధారణ, సాంస్కృతిక ప్రదర్శన అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ట్రస్టీ సి.హెచ్.సత్యదేవ్, సి.హెచ్.ఎస్.ఎన్.రాజు, వి.పార్వతి, జగద్గురు పీఠం అంతర్జాతీయ అధ్యక్షుడు కె.గురుప్రసాద్, వైద్యులు పాపారావు, ఎక్కిరాల అనంతకృష్ణ, ఎ.ప్రసన్న, సుందరి, ప్రిన్సిపల్ ఎస్.వి.శుభశ్రీ, టి.మనోరమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేషధారణలో విద్యార్థులు

ఏఎంఆర్‌పై అవగాహన శిబిరం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ప్రపంచ యాంటీ మైక్రోబియల్ నిరోధక అవగాహన-2025 కార్యక్రమాన్ని గురువారం ఆంధ్ర వైద్యకళాశాల ఆవరణలో నిర్వహించారు. మైక్రోబయాలజీ ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి 24 వరకు జరుగుతున్న వారోత్సవాల్లో భాగంగా కళాశాల ఆవరణలో నీలిరంగు బెలూన్లను ఎగురవేసి గ్లో బ్లూ ఏఎంఆర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విచ్చలవిడిగా యాంటీ బయోటిక్స్ ఔషధాలను వినియోగించరాదని, దీనివల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయా అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కేవీఎస్ఎం సంధ్యాదేవి తెలిపారు. నేను యాంటీ బయోటిక్ గార్డియన్ అంటూ ప్రతిజ్ఞ పత్రాలపై వైద్యులు, వైద్య విద్యార్థులు సంతకాలు చేశారు. ఉప ప్రిన్సిపల్స్ డాక్టర్ వి.మన్మథరావు, డాక్టర్ ఎ.కృష్ణవేణి, మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ పూసపాటి రత్నకుమారి పాల్గొన్నారు.



బెలూన్లు ఎగురవేస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్యాదేవి, ఇతర వైద్యాధికారులు

22న ఉద్యోగ మేళా

కంచరపాలెం, న్యూస్‌టుడే: ఐటీఐ, డిప్లొమా విద్యార్థులకు ఈనెల 22న కంచరపాలెంలోని ప్రభుత్వ పాత ఐటీఐ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు వైస్ ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఐటీఐ ఫిట్టర్, డిప్లొమా మెకానికల్ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు పాల్గొనవచ్చునన్నారు. ప్రముఖ కంపెనీ టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్(హైదరాబాద్)కు చెందిన ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు అన్ని రకాల ధ్రువపత్రాలతో హాజరుకావాలని తెలిపారు.

ఉపన్యాసం ఇచ్చి.. బహుమతి గెలిచి..

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అల్లిపురం, న్యూస్‌టుడే: విద్యార్థి దశలో చరవాణికి దూరంగా ఉండాలని అల్లిపురం దరి నీలమ్మవేపచెట్టు ప్రాంతంలోని విద్యోదయ ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.భగీరథ పేర్కొన్నారు. పాఠశాలలో 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై గురువారం ఉపన్యాస పోటీలు నిర్వహించారు. తొమ్మిదో తరగతి విద్యార్థి ఎస్.భోవనేశ్వరి రెడ్డి(ప్రథమ), 8వ తరగతి కె.లెనిషా(ద్వితీయ), 8వ తరగతి విద్యార్థి ఎస్.వి.జె.ఆకాంక్ష (తృతీయ) విజేతలుగా నిలిచారు. వీరికి బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజలకు సురక్షిత మంచినీటిని అందించాలి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: దేశంలోని ప్రజలకు రక్షిత మంచినీరు అందించాలని భారత ప్రభుత్వ గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాలశాఖ ఉప కార్యదర్శి ఎల్.పచావ్ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో 'డ్రింక్ ఫ్రం ట్యాప్' పేరిట గురువారం నిర్వహించిన జాతీయ సదస్సులో మాట్లాడారు. పట్టణాల్లో మంచినీటి సరఫరా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సి ఉందన్నారు. మహా విశాఖ నగరపాలక సంస్థ చేపడుతున్న తాగునీటి సరఫరా విధానాన్ని కమిషనర్ కేతన్‌గార్గ్ వివరించారు. తెలంగాణ మున్సిపల్‌శాఖ సంచాలకులు, కమిషనర్ డాక్టర్ టి.కె.శ్రీదేవి మాట్లాడుతూ సురక్షిత నీటిని అందించడానికి అవసరమైన పైపులైన్ల నిర్మాణానికి కావాల్సిన నిధులు వెచ్చించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు డాక్టర్ ఎం.స్నేహలత, చిన్మయ్ త్రిపాఠి పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు





కార్యకర్తల కష్టాల్లో తోడుంటా : ఎమ్మెల్యే పల్లా

గాజువాక, న్యూస్‌టుడే : పార్టీకి కష్టించి పనిచేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవడానికే 'నా కార్యకర్త..' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. గురువారం గాజువాక పార్టీ కార్యాలయంలో 'నా కార్యకర్త..' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇప్పటికి 400 మంది కార్యకర్తలతో వ్యక్తిగతంగా మాట్లాడానన్నారు. సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మొల్లి పెంటిరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక

• గాజువాక • విశాఖ పశ్చిమం

ఫ్లెక్సీల తొలగింపుపై వివాదం

సింధియా, న్యూస్‌టుడే : పారిశ్రామిక ప్రాంతంలో గురువారం ఫ్లెక్సీల తొలగింపు వివాదానికి దారితీసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫ్లెక్సీలు తొలగిస్తుంటే తమపై కొందరు కార్యకర్తలు అసభ్యపదజాలంతో మాట్లాడుతున్నారని సచివాలయ ఉద్యోగులు వాపోయారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని వారు తెలిపారు.

మహా శివుడికి రుద్రాభిషేకం

స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

అగనంపూడి, న్యూస్‌టుడే: అగనంపూడి పరిధి జూబిలీ హిల్స్ కాలనీలోని శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో గురువారం రుద్రాభిషేకం నిర్వహించారు. పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గాజువాక, పెదగంట్యాడ

సమస్య: పట్టణంలో ప్రజా మరుగుదొడ్లు సరైన నిర్వహణ లేక అధ్వానంగా మారాయి. తగిన శుభ్రతా చర్యలు చేపడితే బాగుంటుంది. –సీహెచ్ సన్యాసిరావు, చినగంట్యాడ, ప్రమీలారావు, గాజువాక, **సమాధానం:** అదనపు సిబ్బందితో శుభ్రతా పనులు చేపడతాం. –కిరణ్‌కుమార్, ఏఎంఓహెచ్

గోపాలపట్నం, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 92వ వార్డు అజంతాపార్క్‌కాలనీ సామాజిక భవనం రోడ్డులో పూడికలు తొలగించడం లేదు. – సత్యనారాయణ, అజంతాపార్క్ ✔: ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడతాం. – గోపీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ?: జీవీఎంసీ 52వ వార్డు గణేశ్‌నగర్‌లో వ్యర్థాలు తరలించడం లేదు. – లక్ష్మీ, గణేశ్‌నగర్ ✔: చెత్త సేకరణపై పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్

సీఎం సహాయనిధి.. ఎలా పొందాలంటే..

కరాస, న్యూస్‌టుడే : అనారోగ్య సమస్యలు.. ప్రమాదాలు.. అత్యవసర పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి వర్గాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోకుండా కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధిని (సీఎంఆర్‌ఎఫ్) అందిస్తోంది. అయితే చాలామందికి దీనికి ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలియదు. అన్ని ధ్రువపత్రాలు సక్రమంగా ఉంటే దీన్ని పొందడం సులువే. అదెలాగో తెలుసుకుందాం.

ఎవరు అర్హులంటే.. : ★ ముఖ్యమంత్రి సహాయనిధిని పొందాలంటే స్థానికుడై తెల్లరేషన్‌కార్డు కలిగి ఉండాలి. వైద్యం కోసం ఆ సమయంలో ఆరోగ్యశ్రీ పథకాన్ని వినియోగించకుండా వారి సొంత డబ్బును వైద్యఖర్చులకు ఉపయోగించి ఉండాలి. తరువాత సీఎంఆర్‌ఎఫ్ ద్వారా తిరిగి లబ్ధిపొందవచ్చు. ★ స్థానిక వార్డు సచివాలయం/ఎమ్మెల్యే కార్యాలయంలో దరఖాస్తులు తీసుకొని వారి వివరాలు, ఫోన్, బ్యాంకు ఖాతా, ఆసుపత్రి, మందుల ఖర్చు వంటి వివరాలను నింపి, తగిన పత్రాలు జత చేసి ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేయాలి.

పశ్చిమంలో లబ్ధిదారులకు అందిన సొమ్ము రూ. 1,68,18,056

ముఖ్యమంత్రి సహాయనిధిని ఓ బాలుడికి అందజేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

జత చేయాల్సిన ధ్రువపత్రాలు ఇవే...

★ ఆధార్‌కార్డు ★ తెల్లరేషన్/రైస్ కార్డు/ఆదాయ ధ్రువీకరణ పత్రం ★ ఎక్స్‌రే, స్కాన్, బయాప్సీ వంటి రోగనిర్ధారణ రిపోర్టులు ★ ఆసుపత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ★ చికిత్స వివరాలు, మందుల బిల్స్ స్టాంప్, తేదీతో ఉండాలి.

★ డిస్‌ఛార్జి వివరాలు, దానిపైన వైద్యుడి సంతకం, స్టాంపుతో ఉండాలి.

★ ఒక వేళ బాధితుడి తరఫున కుటుంబ సభ్యులైతే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, జనన, మరణ ధ్రువపత్రం

★ బ్యాంక్ పాస్ పుస్తకం మొదటి పేజీ

పశ్చిమంలో సీఎంఆర్‌ఎఫ్ ఇలా..

సీఎంఆర్‌ఎఫ్‌ను అందుకున్న దరఖాస్తుదారులు: 182	అందాల్సిన సొమ్ము: 1,36,98,648
లబ్ధిదారులకు అందిన సొమ్ము: రూ. 1,68,18056	
ఇంకా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు: 43	

పేదలకు మేలు చేసేందుకు..: పశ్చిమ నియోజకవర్గంలో సీఎంఆర్‌ఎఫ్ కింద ఇప్పటి వరకు 182 మంది లబ్ధిదారులకు రూ. 1,68,18056 అందించారు. పెండింగ్ ఉన్న వాటిని కూడా త్వరలోనే పరిష్కరిస్తాం. దీనివల్ల పేదలకు ఎంతో మేలు జరుగుతోంది. మా కార్యాలయానికి రోజూ ఈ పథకానికి దరఖాస్తు చేయటానికి వస్తున్నారు. – పి.గణబాబు, పశ్చిమ ఎమ్మెల్యే

ఆదుకున్నారు..: నేను ప్రైవేటు పనులు చేస్తుంటాను. కొంతకాలం క్రితం జరిగిన ప్రమాదం కారణంగా కాలుకు శస్త్రచికిత్స చేయాల్సి వచ్చింది. దీంతో వైద్యం, మందుల ఖర్చులకు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎమ్మెల్యే గణబాబు నాకు రూ.71,624 చెక్కును అందజేసి నాకు ఆర్థికంగా అండగా నిలిచారు. – పి.గోవింద్, సుభాష్‌నగర్

'చిల్లర వర్తకులే లక్ష్యంగా తొలగింపులు'

నిరసన తెలుపుతున్న సిటూ కార్యకర్తలు

సింధియా (నెహ్రూనగర్), న్యూస్‌టుడే : పారిశ్రామిక ప్రాంతం గుల్లలపాలెం మార్కెట్ వద్ద చిల్లర వర్తకులే లక్ష్యంగా తొలగింపులు సరికాదని మల్కాపురం జోన్ కమిటీ సిటూ నాయకులు కె. పెంటారావు అన్నారు. గురువారం జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగపు సిబ్బంది కేవలం మార్కెట్ పరిసరాల్లో చిల్లర వర్తకుల దుకాణాలనే తొలగించడం పట్ల నిరసన చేపట్టారు. శ్రీహరిపురం మెయిన్ రోడ్డు మొత్తం ఫుట్‌పాత్ ఆక్రమణకు గురైందని గుర్తుచేశారు. అవేమీ తొలగించకుండా చిల్లర వర్తకదారులనే ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదన్నారు. నిరసనలో దుకాణదారులు, సిటూ కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గోపాలపట్నం(కొత్తపాలెం), న్యూస్‌టుడే : జీవీఎంసీ 89వ వార్డు ఎల్లపువానిపాలెంలోని సుమారు రూ.19.50 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు స్థానిక వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ చేతుల మీదుగా గురువారం శంకుస్థాపన జరిగింది. కార్యక్రమంలో తెదేపా నాయకులు బొడ్డేటి విజయ్‌కుమార్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

బీటీరోడ్డు పనులు షురూ..!

స్పందనకు వందనం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : గాజువాక 75వ వార్డులో బీటీ రోడ్డు పనులకు ఎట్టకేలకు కదలిక వచ్చింది. 'ఈనాడులో' ఉక్కు నిర్వాసితకాలనీలో రహదారుల దుస్థితిపై వచ్చిన వార్తలకు జీవీఎంసీ అధికారులు స్పందించారు. సుమారు రూ.28 లక్షల నిధులతో మెటల్ రోడ్డు పనులు చేపట్టారు. వార్డు కార్పొరేటర్ లక్ష్మీ బాయి, ఇంజినీరింగ్ సిబ్బంది ఆయా పనులను పరిశీలించారు.

విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక

కూర్మన్నపాలెం, (అగనంపూడి), న్యూస్‌టుడే : దువ్వాడలోని విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 130 మంది విద్యార్థులు ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కళాశాలలో నిర్వహించిన మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో మిట్సుబా సంస్థలో 35 మంది, జె.ఎఫ్.వాబ్కోలో 10 మంది, వీల్స్ ఇండియాలో 41 మంది, లుకాస్ టీవీఎస్‌లో 44 మంది ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపల్, ప్లేస్‌మెంటు విభాగం ప్రతినిధులు, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో అధ్యాపకులు

పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాల పంపిణీ

ఎన్‌ఏడీకూడలి(బుచ్చిరాజుపాలెం), న్యూస్‌టుడే : జీవీఎంసీ 90వ వార్డు పారిశుద్ధ్య కార్మికులకు కార్పొరేటర్ బొమ్మిడి రమణ వస్త్రాలు పంపిణీ చేశారు. నగర శుభ్రతకు పాటుపడుతున్న కార్మికుల సేవలు వెలకట్టలేనివన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుచ్చిబాబు, సిబ్బంది సతీశ్, శ్రీను పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న విద్యావికాస్ కళాశాల ప్రతినిధులు; స్పీచ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు విజేతలకు బహుమతులు అందజేస్తున్న రవీంద్ర పాఠశాల ప్రతినిధులు

నైపుణ్యం చూపి.. ప్రశంసలు పొంది!

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

గాజువాక, న్యూస్‌టుడే : గాజువాకలోని విద్యావికాస్ జూనియర్ కళాశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'కృత్రిమ మేధ (ఏఐ) వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు..' అన్న అంశంపై నిర్వహించిన ఉపన్యాస (స్పీచ్) పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన నందిని, రోహిత, గౌతమిలకు కళాశాల డైరెక్టర్ వశిష్ఠ, ప్రిన్సిపల్ మహేంద్రరెడ్డి చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

రవీంద్ర ఇండియన్ పాఠశాలలో..

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో శ్రీనగర్‌లోని రవీంద్ర ఇండియన్ పాఠశాలలో 'విద్యార్థుల జీవితంలో సెల్‌ఫోన్ ప్రభావం' అన్న అంశంపై నిర్వహించిన ఉపన్యాస (స్పీచ్) పోటీల్లో కావ్య, దక్షాయిణి, లోహిత్ విజేతలుగా నిలిచారు. వీరికి పాఠశాల కరస్పాండెంట్ సూర్యకాంతం, ప్రిన్సిపల్ పద్మజారాణి, పలువురు ఉపాధ్యాయుల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

స్పీచ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రమాదకరంగా గోతులు

దర్పణం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : వెంపలినగర్ నుంచి అంబేడ్కర్‌కాలనీకి వెళ్లే సేవా మార్గంలో భూగర్భ విద్యుత్తు తీగల పనుల పేరుతో తవ్విన గోతులు ప్రమాదకరంగా మారాయి. పనులు నత్తనడకన సాగడంతో ఆటుగా రాకపోకలు సాగించే వారంతా ఇబ్బందిపడుతున్నారు. గోతుల వద్ద బారికేడ్లు, ఇనుప గేట్లు అడ్డుగా పెట్టి సంబంధిత గుత్తేదారులు చేతులు కడిగేసుకున్నారు. తక్షణం పనులు పూర్తిచేయాలని పలువురు కోరుతున్నారు.

ఊడ్చిన చెత్త కాలువలో..

ఫోకస్

గాజువాక, న్యూస్‌టుడే : పాతగాజువాక నుంచి వంటిల్లు కూడలి వెళ్లే 130 అడుగుల మార్గంలో ప్రధాన కాలువలు చెత్తతో నిండిపోతున్నాయి. ఇక్కడ చిరు వ్యాపారులు, దుకాణదారులు ఊడ్చిన చెత్తను నేరుగా కాలువల్లో పోస్తున్నారు. దీంతో ఎక్కడికక్కడ డ్రైన్లు జామై మురుగు నీరు రోడ్డెక్కుతోంది. ఇటీవల మొంథా తుపాను వర్షాలకు ఈ మార్గం జలమయమైన సంగతి తెలిసిందే. ప్రత్యేక శుభ్రతా పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నిలిచిన ఫైబర్‌నెట్ సేవలు

అగనంపూడి, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫైబర్‌నెట్ సేవలు గురువారం ఉదయం నుంచి నిలిచిపోయాయి. విశాఖ నగరంలోని ఎన్‌వోసీ (నెట్‌వర్క్ ఆపరేషన్స్ కేంద్రం)లో సాంకేతిక సమస్య తలెత్తడంతో సేవలకు అంతరాయం కలిగింది. ఉదయం 10 గంటలకు సేవలు నిలిచిపోగా రాత్రి వరకూ పునరుద్ధరించక పోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫైబర్‌నెట్ వాడుతున్న ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల్లోనూ కార్యకలాపాలు స్తంభించాయి. తరచూ సేవలకు అంతరాయం కలుగుతుండడంతో కనెక్షన్లు తగ్గిపోతున్నాయని కేబుల్ ఆపరేటర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల తాము ఉపాధి కోల్పోతున్నామని వాపోతున్నారు. ఇకనైనా ప్రభుత్వం తక్షణం స్పందించి సంస్థను గాడిలో పెట్టాలని కోరుతున్నారు.

పదో తరగతి విద్యార్థి అదృశ్యం

గోపాలపట్నం, న్యూస్‌టుడే : వసతిగృహంలో ఉంటున్న పదోతరగతి విద్యార్థి అదృశ్యమైన ఘటన గోపాలపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానిక సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లాకు చెందిన విద్యార్థి(16) ఆదివాసుల ప్రభుత్వ వసతి గృహంలో ఉంటూ.. సింహాచలం దేవస్థానం సంస్థకు చెందిన ఎయిడెడ్ పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. ఈనెల 18న పాఠశాల నుంచి వసతి గృహానికి వెళ్లిన విద్యార్థి తర్వాత కనిపించలేదు. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బాలుడి తండ్రి గురువారం గోపాలపట్నం పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే : అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీలు ఇస్మాయిల్, నర్సింహమూర్తి తెలిపారు. గురువారం పాఠశాల ఆవరణలో తొమ్మిదో తరగతికి చెందిన ఆర్.తరుణ్‌కుమార్, ఆర్.దిల్లీశ్వరిలను పాఠశాల హెచ్‌ఎం ఎల్‌ఎస్ కాంతం, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

తరుణ్‌కుమార్, దిల్లీశ్వరిలతో హెచ్‌ఎం కాంతం, పీడీలు ఇస్మాయిల్, నర్సింహమూర్తి

ఉద్యానవనానికి నిధులు ఇవ్వండి

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : పాతగాజువాకలో గాంధీ విగ్రహ పార్కును అభివృద్ధి చేయాలని మహాత్మా, మదర్ థెరిసా ట్రస్ట్ అధ్యక్షుడు జాగారపు శ్రీను గురువారం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రంలో కోరారు. కూడలిలో విగ్రహ పరిసరాలు అధ్వానంగా ఉన్నాయని, ఉద్యానవనం తీర్చిదిద్దుటకు నిధులు మంజూరు చేయాలని విన్నవించుకున్నారు.

LOST PASSPORT

I MIRTHIPATI SATYANARAYANA S/o M Jagannadham Resident of Door No. 32-9-4/2 Harijana Jaggayyapalem, Sheelanagar Gajuwaka Visakhapatnam-530012. Lost my **passport No. K9435888** while travelling from Gajuwaka to Aganampudi. If found to any one may Please Contact: **9030949145**

ఉక్కులో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు–3), న్యూస్‌టుడే: ఉక్కు కర్మాగారంలో ప్రస్తుతం గుర్తింపు సంఘంగా ఉన్న ఏఐటీయూసీ పదవీకాలం పూర్తయి ఇప్పటికే సుమారు రెండేళ్లు అయ్యిందని, తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని విశాఖ ఉక్కు శ్రామిక సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ కారణంగా కార్మికులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇది చాలదన్నట్టు ఉత్పత్తితో ముడిపెట్టి ఉద్యోగులకు జీతాలు చెల్లించేందుకు వీరి హయాంలో యాజమాన్యం ప్రకటించిందన్నారు. తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో విద్యార్థి ప్రతిభ

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు–3): పరవాడలోని సింహాద్రి ఎన్టీపీసీలో బుధవారం జరిగిన రాష్ట్రస్థాయి ఇంధన పరిరక్షణ-2025 పెయింటింగ్ పోటీల్లో ఉక్కునగరం డిపాల్ స్కూల్ విద్యార్థి ప్రణీత్ ప్రతిభ చూపాడు. తాను వేసిన పెయింటింగ్‌కు ద్వితీయ స్థానం దక్కింది. 55 మంది పాల్గొన్న ఈ పోటీల్లో బి.విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి డిసెంబరు మొదటివారంలో దిల్లీలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొనున్నాడు. ఈ సందర్భంగా రూ. 30 వేలు నగదు బహుమతి దక్కింది. విద్యార్థిని పాఠశాల ప్రిన్సిపల్, ఇతర సిబ్బంది అభినందించారు.

ప్రణీత్‌కు నగదు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

ఉక్కు కార్మికుల మహాధర్నా

ధర్నాలో పాల్గొన్న ఉక్కు అఖిలపక్ష నాయకులు, కార్యకర్తలు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : జీతాలను ఉక్కు ఉత్పత్తితో ముడిపెడుతూ యాజమాన్యం ఇచ్చిన సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్టీల్‌ప్లాంటు బీసీ గేటు వద్ద కార్మికులు మహాధర్నా నిర్వహించారు. యాజమాన్యం తీరుకు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. స్టీల్ ఇంటక్ అధ్యక్షుడు పీవీ రమణమూర్తి, మంత్రి రాజశేఖర్, అయోధ్యరామ్, రామస్వామి, మసేనురావు, కోరిబిల్లి అప్పారావు, దొమ్మేటి అప్పారావు, డీవీ రమణ, రామకృష్ణ, గోపీ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సమర్థులకు భాజపాలో చోటు

గాజువాక, న్యూస్‌టుడే : సిద్ధాంతాల ప్రాతిపదికన పనిచేసే భాజపాలో సమర్థులకు తగిన చోటు ఉంటుందని భాజపా జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు అన్నారు. గాజువాక బెస్ట్ వెస్ట్రన్ కాన్ఫరెన్స్ హాల్లో నియోజకవర్గ కార్యకర్తల ఆత్మీయ సమావేశం గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల పార్టీలో చేరిన 86వ వార్డు నాయకులు దామా సుబ్బారావు, భాస్కరనాయుడు, సుమంత్‌లను సత్కరించారు. గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, సిరసపల్లి నూకరాజు, కృష్ణంరాజు, దానేశ్, సోంబాబు, బాటా శ్రీను, ముసలయ్య, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పరశురామరాజు, చిత్రంలో కన్వీనర్ నర్సింగరావు తదితరులు

ఆధార్ కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

పాఠశాలలో సాంబారును పరిశీలిస్తున్న డీఈవో ప్రేమకుమార్

గోపాలపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కలిగించేలా పాఠ్యాంశాల బోధన ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమకుమార్ అన్నారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలుర, బాలికోన్నత పాఠశాలలను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల హాజరు పట్టిక, మధ్యాహ్న భోజన పథకం నాణ్యతలను పరిశీలించారు. పాఠశాలల్లో ఏర్పాటుచేసిన ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో దివాకర్, హెచ్ఎంలు స్వర్ణలత, వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమనీయం.. గౌరీ కల్యాణం

హైస్కూలురోడ్డు(గాజువాక), న్యూస్‌టుడే: గాజువాక హైస్కూలురోడ్డు గౌరీ మందిరంలో 50వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం గౌరీ పరమేశ్వరుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పీఠంపై ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించి పురోహితులు ప్రత్యేక పూజలు జరిపారు. గౌరీ సేవా సంఘం, గౌరీ మహిళా సంఘం సభ్యులు వేడుకల్లో పాలుపంచుకున్నారు.

కల్యాణోత్సవంలో పాల్గొన్న గౌరీ సంఘ సభ్యులు

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి, దువ్వాడ పరిధిలోని పలు కాలనీలకు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. మంగళపాలెం, అగనంపూడిలలోని ఉపకేంద్రాల్లో నిర్వహణ పనుల కారణంగా డొంకాడ, బీసీ.కాలనీ, కొండయ్యవలస, సాయినగర్, దానబోయినపాలెం, తలారివానిపాలెం, పినమడక, పెదమడక, శనివాడ, వెదుళ్లనరవ, నంగినారపాడు తదితర కాలనీలకు విద్యుత్తు సరఫరాను నిలుపుదల చేస్తామన్నారు.

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే : షీలానగర్ విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో విద్యుత్తు మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. షీలానగర్, గవర జగ్గయ్యపాలెం, వేంకటేశ్వరకాలనీ, హరిజన జగ్గయ్యపాలెం, పోర్టు రోడ్డు, కిమ్స్ ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

కోటి సంతకాల సేకరణ

పెదగంట్యాడ: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పెదగంట్యాడలో వైకాపా ఆధ్వర్యంలో గురువారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. 75వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీనివాసరెడ్డి(బుజ్జి) అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి మార్దుపూడి పరదేశి, జీవీ రమణారెడ్డి, మహేశ్వరరెడ్డి, నక్క వెంకటరమణ పాల్గొన్నారు.

MVR DEGREE COLLEGE

AFFILIATED TO ANDHRA UNIVERSITY
Recognised by APSCHE & UGC, NIRF & NAAC Re Accredited College
6-58-41/1, Shramika Nagar, GAJUWAKA, Visakhapatnam-26.

FEW SEATS AVAILABLE
Under Management Quota/Spot Admission

4 YEARS B.Sc., (Honours) with Single Major
B.Sc.: Artificial Intelligence
B.Sc : Data Science
B.Sc.: Computer Science
B.Sc.: Quantam Technologies
B.Sc.: Microbiology

B.Com
B.C.A (Honours)
B.B.A (Honours)
Digital Marketing
Business Analytics

YOGA
Diploma & PG Diploma
Part Time Evening Course

PG Courses
M.Sc.
Organic Chemistry
Applied Mathematics
Botany
Biotechnology
Computer Science

Hostel facility available for Girls

Last Date for Admission 24-11-2025

Contact for Information :
0891-2512891, 9866661134, 9866661135, 9866661136
www.mvreducation.com mvrcolleges@yahoo.com

Dr.V.Rama Rao
Secretary & Correspondent

రి.క.నెం.841/2025/SA/Dt.19-11-2025

తహసీల్దార్ వారి కార్యాలయం, గాజువాక మండలం

ప్రకటన

గాజువాక మండలం కాపురస్థులు శ్రీ ఈత వెంకట శేషాద్రి మరియు 12 ఇతరులు ఈ క్రింది పట్టికలో తెలిపిన గోపాల్ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ స్థలమునకు "నిరభ్యంతర ధృవీకరణ పత్రము" (NOC) మంజూరు చేయవలసినదిగా కోరియున్నారు.

గ్రామం పేరు	దరఖాస్తుదారుని పేరు	సర్వే నెం.	విస్తీర్ణం	ఫ్లాట్ నెం.
తుంగ్లం	ఈత వెంకట శేషాద్రి, S/o. లేటు కృష్ణారావు	71-2D2B	40 Sq.yds	S3
తుంగ్లం	ఆళ్ళ రమణబాబు, S/o. అచ్చియ్య (లేటు)	71-2D2B	40 Sq.yds	T3
తుంగ్లం	ఆర్ల కుమారి D/o. బెవర వెంకట రమణమూర్తి (లేటు)	71-2D2B	40 Sq.yds	S2
తుంగ్లం	చీకటి శ్రీనివాసరావు S/o. అప్పలనాయుడు	71-2D2B	40 Sq.yds	T4
తుంగ్లం	చింత వాణి D/o. బాలకృష్ణ శర్మ	71-2D2B	40 Sq.yds	SF-1
తుంగ్లం	చింత శ్రీనివాసరావు S/o. గంగరాజు	71-2D2B	40 Sq.yds	F4
తుంగ్లం	G. రాజ్యలక్ష్మి W/o. కృష్ణమూర్తి	71-2D2B	40 Sq.yds	FF4
తుంగ్లం	నట్టి కనక మహేష్ S/o. ఆనందరావు & జయంతి లక్ష్మీ పూర్ణిమ D/o. వెంకట రామకృష్ణ	71-2D2B	40 Sq.yds	G2
తుంగ్లం	మాడా శ్రీనువాసరావు S/o. తమ్మిరాజు (లేటు)	71-2D2B	40 Sq.yds	FF3
తుంగ్లం	మాడా శ్రీనువాసరావు S/o. తమ్మిరాజు (లేటు)	71-2D2B	40 Sq.yds	F1
తుంగ్లం	మాడా శ్రీనువాసరావు S/o. తమ్మిరాజు (లేటు)	71-2D2B	40 Sq.yds	T2
తుంగ్లం	సనపల జగన్నాధరావు S/o. సనపల పాపయ్య (లేటు)	71-2D2B	40 Sq.yds	GF-3
తుంగ్లం	బొక్కావు సీతన్నాయుడు S/o. కూర్మినాయుడు (లేటు)	71-2D2B	40 Sq.yds	S4

పైన తెలిపిన భూమికి "నిరభ్యంతర ధృవీకరణ పత్రము" (NOC) మంజూరు చేయుటకు ఎవరికైన ఎటువంటి అభ్యంతరములు ఉన్నచో, ఈ ప్రకటన అందిన 15 దినములలోగా ఈ కార్యాలయమునకు లిఖితపూర్వకంగా తెలియజేయవలసినదిగా కోరడమైనది.

టు
శ్రీ ఈత వెంకట శేషాద్రి మరియు 12 ఇతరులు
తుంగ్లం గ్రామం, గాజువాక మండలం

తహసీల్దార్
గాజువాక మండలం

23న విద్యార్థులకు ప్రతిభా పరీక్ష

గాజువాక, న్యూస్‌టుడే: ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా లక్ష్మీ హుందాయ్, ఎన్‌వీఆర్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 23న పాఠశాలల విద్యార్థులకు ది రామానుజన్ ఛాలెంజ్-2025 పేరుతో ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. వివరాలకు ఫోన్ నెంబర్: 79979 99552కు సంప్రదించాలని కోరారు.

దివ్యాంగులకు ఉచిత శిక్షణ

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు–3), న్యూస్‌టుడే: ఉక్కునగరం అరుణోదయం ప్రత్యేక బాలల పాఠశాల విద్యార్థులకు కల్చర్ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇవ్వనున్నట్టు భాజపా గాజువాక ఇన్‌ఛార్జి కరణంరెడ్డి నరసింగరావు తెలిపారు. ఉక్కునగరం కల్చర్ ఫౌండేషన్ ఛైర్మన్ పేర్ల అప్పారావు అధ్యక్షతన గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి ఉద్యోగ అవకాశాలు కూడా ఉన్నాయన్నారు. పేర్ల అప్పారావు మాట్లాడుతూ కంప్యూటర్, అకౌంట్స్, రిసెప్షనిస్ట్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, పాఠశాల ప్రిన్సిపల్ సావిత్రి, రమాదేవి, మాధవి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడ స్టేషన్‌లో సమస్యలు పరిష్కరించాలి

అగనంపూడి, న్యూస్‌టుడే : దువ్వాడ రైల్వేస్టేషన్లో పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వాల్తేరు డివిజన్ ఈస్ట్ కోస్టు రైల్వే మేనేజర్ ఎం.ఎస్.రావును ఎస్‌సీసీ కమిటీ సభ్యులు కోరారు. గురువారం స్టేషన్లో జరిగిన కన్సల్టేషన్ కమిటీ (ఎస్.సి.సి) సమావేశంలో సమస్యలపై చర్చించి ఆయనకు వినతిపత్రం అందజేశారు. వృద్ధులు, వికలాంగులు, పిల్లలు ప్లాట్‌ఫామ్‌లకు సులువుగా చేరుకోవడానికి ర్యాంప్‌లను నిర్మించాలన్నారు. ఎస్కలేటర్లు ఏర్పాటు చేయాలన్నారు. కమిటీ సభ్యులు కె.ఈశ్వర్, కె.వి.సుబ్బరాజు, జి.శశిధరణ్, ఎస్.అప్పలరాజు, బి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎం.ఎస్.రావుకు వినతిపత్రం అందజేస్తున్న కమిటీ ప్రతినిధులు

(c) eenadu

ఈనాడు
విజయనగరం

శుక్రవారం నవంబరు 21, 2025

ధన్యోహం ఓ శబరీషా

పూజలందుకున్న అయ్యప్పస్వామి

ఆకట్టుకున్న భారీ సెట్

భోగాపురం మండలం లింగావలస పంచాయతీ సమీప ముడసలపేట ఆర్అండ్ఆర్ కాలనీలో అంబలం పూజ వైభవంగా జరిగింది. దేవాలయాన్ని తలపించేలా భారీ సెట్‌ను రూపొందించారు. అరటి చెట్లతో అంబులం ఏర్పాటు చేసి అయ్యప్పస్వామితోపాటు వివిధ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప భక్తి గీతాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. జనసేన నాయకుడు చెల్లబోయిన నర్సింగరావు ఆధ్వర్యంలో వందల సంఖ్యలో భవానీ భక్తులు, అయ్యప్ప మాలధారణ స్వాములకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే లోకం మాధవి, నాయకుడు సీహెచ్.రాము తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, భోగాపురం

కోరుకొండ సైనిక పాఠశాల పూర్వ విద్యార్థులు, మాజీ సైనికులు సి.డి.ఎన్.వి. ప్రసాద్, కె.శ్రీనివాస్ మే 13న న్యూజిలాండ్‌లోని ఒపువా తీరం నుంచి టిస్టీ బోటులో చేపట్టిన సముద్రయానం గురువారం విశాఖలో ముగిసింది. వైస్ అడ్మిరల్ కుంద్రవల్లి శ్రీనివాస్, సిబ్బంది వీరికి ఆత్మీయ స్వాగతం పలికారు.– న్యూస్‌టుడే, సింధియా

కార్డు కావాలా.. పరేషన్ అవసరం లే!

ఒకప్పుడు కొత్త రేషన్ కార్డు కావాలన్నా.. పిల్లల పేర్లు కలపాలన్నా.. కాళ్లు అరిగేలా తిరగాల్సి వచ్చేది. మండల కార్యాలయాలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి. ఈ ఇబ్బందులకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఎవరైనా.. ఎప్పుడైనా దరఖాస్తు చేసుకునేలా సచివాలయాల్లో కొత్త వ్యవస్థ తీసుకొచ్చింది. డిజిటల్ సహాయకులకు బాధ్యతలు అప్పగించారు. జనవరి నుంచి జూన్ వరకు దరఖాస్తు చేసుకున్న వారికి జులైలో.. జులై నుంచి డిసెంబరు వరకు దరఖాస్తు చేసుకున్న వారికి జనవరిలో కొత్త కార్డులు అందిస్తారు. – న్యూస్‌టుడే, చీపురుపల్లి

పిల్లల పేర్లు కలపాలంటే..

పిల్లల ఆధార్ కార్డులు, జనన ధ్రువపత్రాలు, తల్లిదండ్రుల రేషన్ కార్డు ఉండాలి. వివరాలు నమోదు చేసి, వీఆర్వో, తహసీల్దారు పరిశీలనకు పంపిస్తారు. వారు అనుమతించగానే కార్డులో పేర్లు కలుస్తాయి. ఇతర వివరాలకు గ్రామ, వార్డు సచివాలయాల్లో సంప్రదించాలని జిల్లా పౌరసరఫరా శాఖ అధికారి మురళీనాథ్ తెలిపారు. కార్డుల్లో చిరునామాలు మార్పు చేసుకోవడానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

కొత్తగా వివాహమైతే ఇలా..

కొత్తగా పెళ్లైన దంపతులు రేషన్‌కార్డు చేసుకోవాలంటే గతంలో పెద్ద ప్రక్రియ ఉండేది. ముందుగా మహిళను తల్లిదండ్రుల జాబితా నుంచి తొలగించి, తదుపరి ప్రక్రియ చేపట్టేవారు. ఈ వ్యవధిలో లబ్ధి కోల్పోయేవారు. ప్రస్తుతం ఆ బాధ లేదు. భార్యాభర్తలు ఇద్దరి ఆధార్, భర్త పాత రేషన్‌కార్డు, పెళ్లి ధ్రువపత్రం తీసుకుని వెళ్తే.. ప్రభుత్వ వెబ్‌సైట్‌లో మ్యారేజ్ స్ప్లిట్ ఆప్షన్ నమోదు చేస్తారు. వారికి ఓ నంబరు కేటాయించి, దాని ఆధారంగా ఈకేవైసీ చేస్తారు. తర్వాత వీఆర్వో, తహసీల్దారు పరిశీలనకు పంపుతారు. అక్కడ నుంచి అనుమతి పొందగానే కార్డులు మంజూరు చేస్తారు. ఇంతలో అత్తవారింట్లో రేషన్ అందజేస్తారు.

కష్టాలతో నిండిపోయాయ్.. కన్నీళ్లు తుడవనంటున్నాయ్

వినియోగానికి నోచుకోని గోదాములు
పీఏసీఎస్‌ల నెత్తిపై గుదిబండ

నాబార్డు రుణాలతో గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేపట్టిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల (పీఏసీఎస్) గోదాములు నిరుపయోగంగా దర్శనం ఇస్తున్నాయి. స్థలాలను ఎంపిక చేయడంలో అనాలోచితంగా నిర్ణయం తీసుకోవడంతోనే నేడు దిష్టి బొమ్మల్లా మారాయి. గ్రామాలు, పట్టణాలకు దూరంగా రక్షణ లేని ప్రాంతాల్లో వీటిని నిర్మించడంతో అక్కడ పంటలను దాచుకునేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. – న్యూస్‌టుడే, గరివిడి, పార్వతీపురం

కెల్లలో గ్రామానికి దూరంగా గోదాము

రుణాలు చెల్లించేందుకు పాట్లు

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర వచ్చేంత వరకు నిల్వ చేసుకునేందుకు వీలుగా ఉమ్మడి జిల్లాలో గోదాములను నిర్మించారు. నిల్వ ఉంచిన సరకు విలువను బట్టి రైతుల నుంచి నామమాత్రపు అద్దె వసూలు చేసి, నాబార్డు రుణాలు చెల్లించాలి. కానీ ఎక్కడా వాడుకలోకి రాలేదు. రుణాలు చెల్లించడానికి సొసైటీలు పాట్లు పడుతున్నాయి. 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాముకు రూ.40 లక్షలు.. వెయ్యి మెట్రిక్ టన్నుల గోదాముకు రూ.70 లక్షలు వెచ్చించారు. పది శాతం రాయితీ పోనూ.. 90 శాతం రుణాన్ని 3 శాతం వడ్డీతో పీఏసీఎస్‌లు చెల్లించాలి. ఇప్పటికే అప్పుల ఊబిలో ఉన్న సొసైటీలకు ఇది ఆర్థిక భారమవుతోంది.

నిర్మించి.. వదిలేశారు

ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు పండించే వరి, మొక్కజొన్న, మినుము, పెసర ఇతర పంటల ఉత్పత్తులను గోదాముల్లో నిల్వ ఉంచుకుని గిట్టుబాటు ధర ఉన్నప్పుడు విక్రయించేలా సహకార శాఖ అధికారులు చర్యలు తీసుకుంటే ఉపయోగపడేవి. నిల్వ ఉంచిన ఉత్పత్తుల విలువలో 70 శాతం వరకు సహకార సంఘాల ద్వారా రైతులు రుణాలు పొందే అవకాశం ఉంది. కానీ ఆ దిశగా ఏ మాత్రం చర్యలు లేవు.

తొలి ప్రాధాన్యత వారికే..

గోదాముల్లో పంటలు దాచుకోవడానికి రైతులు ముందుకు రావడం లేదు. తొలి ప్రాధాన్యత వారికే ఇచ్చాం. వారు రానిపక్షంలో ప్రభుత్వ శాఖల అవసరాలకు కేటాయించి, త్వరలో వినియోగంలోకి తీసుకొస్తాం.

– పి.రమేష్, జిల్లా సహకారశాఖ అధికారి, విజయనగరం

ఉమ్మడి జిల్లాలో మంజూరైన గోదాములు	నిర్మాణం పూర్తి	స్థల సమస్యతో ప్రారంభం కానివి	వివిధ దశల్లో ఉన్నవి	ఖర్చు చేసిన నిధులు
65	41	07	17	రూ.21.46 కోట్లు

ఇబ్బందులు ఉంటే చెప్పండి

ఐసీడీఎస్ శాఖ పరిధిలో సమస్యలున్నాయా..? అంగన్‌వాడీ కేంద్రాల్లో సరకులు సక్రమంగా అందడం లేదా..? చిన్నారులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదా..? చిన్నారులు, మహిళల హక్కుల గురించి తెలుసుకోవాలనుకుంటున్నారా..? పని ప్రదేశాల్లో వేధింపులకు గురవుతున్నారా..? సీడీపీవోలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు అందుబాటులో ఉండటం లేదా..? అయితే నేరుగా ఐసీడీఎస్ పీడీ టి. విమలారాణితో మాట్లాడే అవకాశాన్ని 'ఈనాడు' కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా ఒక్క ఫోన్ కాల్ మాత్రమే.

– న్యూస్‌టుడే, అయ్యన్నపేట

తేదీ: 22.11.2025(శనివారం)
సమయం: ఉదయం 11 నుంచి 12 గంటల వరకు
ఈనాడు ఫోన్ ఇన్ కార్యక్రమం
సంప్రదించాల్సిన నంబరు: 94408 14584

'భూములు వెనక్కి ఇవ్వమనే హక్కు లేదు'

ఈనాడు, విజయనగరం: పరిశ్రమ నిర్మాణానికి సేకరించిన భూములను తిరిగి వెనక్కి ఇవ్వాలని కోరే హక్కు నిర్వాసితులకు లేదని హైకోర్టు స్పష్టం చేసింది. బొడ్డవర పంచాయతీలో సేకరించి, జిందాల్ యాజమాన్యానికి అప్పగించిన భూములపై ఇద్దరు నిర్వాసితులు వేర్వేరుగా దాఖలు చేసిన రిట్ పిటిషన్లపై గురువారం విచారణ జరిగింది. పిటిషనర్ల తరపున న్యాయవాది వినిపించిన వాదనలను న్యాయమూర్తి తోసిపుచ్చారు. నిర్వాసితులకు ఇప్పటికే నష్టపరిహారం చెల్లించామని పరిశ్రమ యాజమాన్యం న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లింది.

సకాలంలో ప్రభుత్వ "పథకాల అమలు"

ఈనాడు, విజయనగరం, విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గాల వారికి సకాలంలో ప్రభుత్వ పథకాలను అమలు చేసి, ప్రయోజనం కలిగేలా చూడాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కె.ఎస్. జవహర్ పేర్కొన్నారు. కమిషన్ కార్యదర్శి ఎస్.చినరాముడుతో కలిసి గురువారం జిల్లాలో పర్యటించారు. క్షేత్రస్థాయిలో పథకాల అమలు తీరును తెలుసుకున్నారు. జడ్పీ అతిథి గృహంలో వినతులు స్వీకరించారు. కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి, ఎస్పీ దామోదర్‌తో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. అట్రాసిటీ కేసుల్లో బాధితులుగా ఉన్నవారికి సాంత్వన చేకూర్చాలన్నారు. ఎస్సీ బాలుర వసతి గృహాలను అధికారులు తరచూ తనిఖీ చేయాలని, లోపాలు సరిచేసేందుకు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.

జిల్లాలో 32 కేసులు

ఎస్సీలకు సంబంధించి రాష్ట్రంలో ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకు 1,606 వినతులు వచ్చినట్లు జవహర్ తెలిపారు. 546 అర్జీలు భూసమస్యలకు సంబంధించినవే ఉన్నాయన్నారు. జిల్లాలో 32 కేసులు నమోదయ్యాయని చెప్పారు. పక్కి, సతివాడ, ముంజేరు, దత్తి తదితర ప్రాంతాల్లో అంటరానితనం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వీలైనంత తొందరగా పరిష్కారం చూపాలన్నారు. కులం పేరిట దూషణ కేసులు రాకుండా అరికట్టాలన్నారు. పక్షం రోజుల్లో చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బదులిచ్చారు. జేసీ సేదుమాధవన్, ఏఎస్పీ సౌమ్యలత, డీఆర్వో శ్రీనివాసమూర్తి, డీడీ అన్నపూర్ణ, ఈడీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్సీ కమిషన్ ఛైర్మన్ జవహర్, చిత్రంలో కార్యదర్శి చినరాముడు, కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి, ఎస్పీ దామోదర్, జేసీ తదితరులు

గరివిడి కాజా.. తింటే మజా

నోట్లో పెట్టగానే తియ్యగా కరిగిపోయే చెనా కాజా.. రుచి మధురం.. గరివిడి పేరు చెప్పగానే టక్కున గుర్తుచ్చేది ఈ స్వీటే. ఇక్కడ మాత్రమే దొరికే ఒక ప్రత్యేకమైన రకం ఇది. కాకినాడ గొట్టం కాజా మాదిరిగా ప్రసిద్ధి చెందింది. దీని తయారీ విధానం ప్రత్యేకంగా ఉంటుంది. దాదాపు ఆరు దశాబ్దాలుగా ఉమ్మడి జిల్లా వాసులకు ఈ స్వీటు సుపరిచితమే. కాలక్రమేణా ఉత్తరాంధ్ర, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించింది. – న్యూస్‌టుడే, గరివిడి

పరిచయం ఇలా..

దాదాపు 60 ఏళ్ల క్రితం ఓ కుటుంబం ఒడిశా నుంచి గరివిడికి వలస వచ్చి, చెనా కాజాను ఈ ప్రాంత ప్రజలకు పరిచయం చేసింది. అనతి కాలంలోనే ప్రాచుర్యం పొందింది. ప్రజలు ఎక్కువ ఆసక్తి చూపడంతో గరివిడిలోని మిగతా స్వీటు దుకాణదారులూ తయారు చేయడం మొదలుపెట్టారు. బంధువులు, తెలిసిన వారి ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ప్రాంతాలకు పంపేవారు. అలవాటు పడిన ఆయా ప్రజలు ఇక్కడికి వచ్చిన ప్రతిసారీ కొనుగోలు చేస్తుంటారు. శుభకార్యమేదైనా ఖాజా ఉండాల్సిందే. దారిలో వెళ్లేవారెవరైనా.. గరివిడి రాగానే కాజా కొనుగోలు చేయాల్సిందే.

తయారీ ప్రత్యేకం

కేవలం పాలను మాత్రమే కాజా తయారీలో ఉపయోగిస్తారు. మరే పదార్థాలు కలపరు. స్వచ్ఛమైన పాలు వేడిచేసి, చల్లార్చిన తర్వాత సహజ సిద్ధమైన పులుపు పదార్థాలను ఉపయోగించి విరిగిపోయేలా చేస్తారు. అందులో నుంచి వచ్చిన చిన్న చిన్న ముద్దలను చుట్టి, పాకంలో నానబెట్టి ఈ కాజాలను తయారుచేస్తారు. నాణ్యమైన పదార్థాలు, రంగు, రుచి, వాసన చక్కగా ఉండడంతో తినడానికి అంతా ఇష్టపడతారు.

కట్టకుండానే.. కనుమరుగు

ఎం.కొత్తవలస-మునకాలపేట గ్రామాల మధ్య తవ్వేశారిలా..

వేమలి వద్ద బ్రాంచి కెనాల్ దుస్థితి

ఈ చిత్రాల్లో కనిపిస్తున్నవి గజపతినగరం బ్రాంచి కెనాల్‌కు సంబంధించిన కట్టలు. గతంతో తెదేపా ప్రభుత్వ హయాంలో ఈ పనులు జరిగాయి. తోటపల్లి నీటిని ఇటుగా మళ్లించాలని భావించారు. వైకాపా రాకతో ప్రక్రియ నిలిచింది. ఆరేళ్లుగా పనులన్నీ ఆగిపోయాయి. దీంతో అక్రమార్కుల కన్ను పడింది. ఎక్కడికక్కడే తొలిచేస్తూ మట్టిని తరలించేస్తున్నారు. గజపతినగరం, గుర్ల, గరివిడి మండలాల్లో 50 కి.మీల మేర గట్లు ఉన్నాయి. పనులు ఆగిపోవడం, రక్షణ కరవవడం, అధికారుల తనిఖీలు లేకపోవడంతో ఇప్పటికే దాదాపు 40 నుంచి 50 ప్రాంతాల్లో తవ్వేశారు. చదును చేసి కొందరు పంటలు వేస్తున్నారు. మరికొందరు మొక్కలు నాటారు. గజపతినగరం మండలంలోని ఎం.కొత్తవలస, గుర్ల మండలం మునకాలపేట ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది. వేమలి, కొత్తవలస, రామన్నపేటలోనూ తవ్వకాలతో గట్లు బలహీనం అయ్యాయి. పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు రత్నకుమార్ తెలిపారు.

– న్యూస్‌టుడే, గజపతినగరం

22 నుంచి ప్రత్యేక సభలు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా పంచాయతీల్లో ఈనెల 22 నుంచి ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనున్నారు. పారదర్శకత, ప్రజలకు చేరువ చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశం. జాబ్‌కార్డుల కోసం కొత్తగా అర్జీలు, అర్హులైన వారికి కార్డుల జారీ, శ్రామికుల నుంచి పని కోసం దరఖాస్తులు తీసుకుంటారు. ఈకేవైసీ లోపాల కారణంగా రద్దయిన వాటిని పున:పరిశీలించి, అర్హులైతే పునరుద్ధరిస్తారని డ్వామా పీడీ ఎస్.శారదాదేవి తెలిపారు.

అనుసంధాన రోడ్లు.. గుండెల్లో గుబులు!

రైల్వే శాఖ మూడోలైను పనులు వేగవంతం కావడంతో బొబ్బిలి, దత్తిరాజేరు, గజపతినగరం, బొండపల్లి మండలాల్లోని నాలుగు చోట్ల రహదారి ప్రయాణాలకు ఇబ్బందులు కలగకుండా పైవంతెనలు (ఆర్వోబీ) ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. ఆర్అండ్‌బీ, రైల్వే ఇంజినీరింగ్ అధికారులు ఉమ్మడిగా మూడు నెలల క్రితం పరిశీలించారు. వంతెనతో ప్రయాణికుల ఇక్కట్లు తీరనున్నాయి. మరోవైపు అనుసంధాన (అప్రోచ్) రోడ్లకు ఎవరి స్థలాలు, భవనాలు పోతాయోననే భయం స్థానికుల్లో నెలకొంది. – న్యూస్‌టుడే, గజపతినగరం

మూడింటికి స్థలాలు ఖరారు

బొబ్బిలి మండలం దిబ్బగుడ్డివలస, దత్తిరాజేరు మండలం కోమటిపల్లి, బొండపల్లి మండలం కనిమెరక ప్రాంతాల్లోని రైల్వే లెవెల్ క్రాసింగ్‌ల వద్ద నిర్మాణాలు చేపట్టేందుకు స్థలాలు అనుకూలంగా ఉన్నట్లు అధికారులు అభిప్రాయానికి వచ్చారు.

పురిటిపెంటలో ఆర్వోబీ నిర్మాణంపై ఉత్కంఠ

పైవంతెన నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలం

ఓ నిర్ణయానికి రాక..

పురిటిపెంటలో ప్రస్తుత రైల్వేగేటు వద్ద రహదారికి 150 మీటర్ల దూరంలో ఉత్తరం వైపు పైవంతెన నిర్మించేందుకు అనుకూలంగా ఉన్నట్లు నిర్ధారించారు. వంతెనకు తూర్పున జాతీయ రహదారి, పడమరలో మెంటాడ రోడ్డును కలిపేందుకు అప్రోచ్ రహదారులు ఎలా నిర్మిస్తారనే అంశంపై అధికారులు నిర్ణయానికి రాలేదు. ఎటు నుంచి అప్రోచ్ రహదారులు వస్తాయో.. ఎవరి భూములు, భవనాలు పోతాయోననే అని స్థానికుల్లో ఆందోళన నెలకొంది.

నివేదికలు రావాలి.. గత సర్వేలకు సంబంధించి రైల్వేశాఖ నుంచి అప్రోచ్ రహదారుల డిజైన్ నివేదికలు రావాలి. దాని ఆధారంగా భూసేకరణ జరుగుతుంది. నివేదికల్లో ఉండే స్థలాల్లోని రైతులు, నిర్మాణాల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి, వారికి తెలియజేస్తాం. ప్రజల అభిప్రాయం తీసుకుంటాం. – రవిశేఖర్, డీఈఈ, ర.భ.శాఖ గజపతినగరం

ఆర్వోబీల వివరాలు

మండలం	గ్రామం	నిధులు (రూ.కోట్లలో)
బొబ్బిలి	దిబ్బగుడ్డివలస	49.43
దత్తిరాజేరు	కోమటిపల్లి	49.36
గజపతినగరం	పురిటిపెంట	46.86
బొండపల్లి	కనిమెరక	48.68

వేధింపులు ఆగేలా.. వేదన తీరేలా..!

● విజయనగరానికి చెందిన కె.వీరబాబు అదనపు కట్నం కోసం భార్యను వేధించేవాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు. ఈమేరకు కేసు నమోదైంది. తాజాగా అతడికి సంవత్సరం జైలు శిక్ష పడింది.

– న్యూస్‌టుడే, విజయనగరం అయ్యన్నపేట

ప్రస్తుతం చాలామంది వరకట్న వేధింపులతో ఇబ్బంది పడుతున్నారు. రోజూ ఇలాంటి ఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఇలాంటి వారికి అండగా నిలిచేందుకు వరకట్న నిషేధిత చట్టాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో 2015 నుంచి ఇప్పటివరకు 71 కేసులు నమోదయ్యాయి. బాధితులకు రూ.20 లక్షల మేర పరిహారం అందినట్లు ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు.

రక్షణాధికారిగా ఆర్డీవో..

రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం రెవెన్యూ డివిజనల్ అధికారులను ఈ చట్టం రక్షణాధికారులు నియమించింది. బాధితులకు అవగాహన కల్పించి, వారికి న్యాయం చేసేందుకు కలెక్టర్ ఛైర్మన్‌గా ఉండే కమిటీ అందుబాటులో ఉంటుంది. ఇందులో ఎస్పీ, సంయుక్త కలెక్టర్, ఐసీడీఎస్ పీడీ, అయిదుగురు సామాజిక కార్యకర్తలు ఉంటారు. మరో అడ్వైజరీ కమిటీ కూడా పనిచేస్తుంది.

శిక్ష ఇలా..

కట్నం ఇవ్వడం లేదా తీసుకోవడం నేరంగా పరిగణిస్తారు. జిల్లాలో ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు వచ్చిన ఫిర్యాదును పరిశీలిస్తుంది. నేరం రుజువైతే ఆరు నెలల నుంచి అయిదేళ్ల వరకు జైలు శిక్ష పడుతుంది. కనీసం రూ.10 వేల జరిమానా విధిస్తారని, తీవ్రత ఆధారంగా శిక్ష ఉంటుందని ఐసీడీఎస్ పీడీ టి.విమలారాణి తెలిపారు. చట్టంపై అవగాహన పెంచుకుని, బాధితులు సద్వినియోగం చేసుకోవచ్చన్నారు.

ఫిర్యాదు ఎలా..:

వేధింపులకు గురవుతున్న బాధితులు ఆర్డీవో కార్యాలయంలో లేదా స్థానికంగా ఉండే అంగన్‌వాడీ కేంద్రాల్లో, సీడీపీవోలను ఆశ్రయించవచ్చు. లేదా మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 181, పోలీసు హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించవచ్చు. ఐసీడీఎస్ జిల్లా కార్యాలయాల్లో ప్రత్యేక సెల్ కూడా ఉంటుంది.

కెల్ల భూములపై కన్ను

ఈనాడు, విజయనగరం: గుర్ల మండలంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. పశ్చిమబెంగాల్‌కు చెందిన సూపర్ స్మెల్టర్స్ లిమిటెడ్ సంస్థతో ఒప్పందం కుదిరిన వెంటనే ఈనెల 14న జీవో జారీ చేసింది. 1,085 ఎకరాల మేర కేటాయిస్తున్నట్లు అందులో పేర్కొంది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. భూసేకరణపై దృష్టిసారించింది.

రెండు దశల్లో..

తొలి దశ పనులకు 775 ఎకరాలు, రెండో దశ కోసం 310 ఎకరాలు అవసరం. ప్రభుత్వం భూములు అప్పగించిన వెంటనే నిర్మాణాలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సంస్థ ప్రకటించింది. 2029 ఏప్రిల్ నాటికి తొలి దశ ప్రక్రియను పూర్తి చేయాలని సంకల్పించింది. గుర్ల మండలంలోని కెల్ల, బెల్లానపేట, మన్యపురిపేట, దమరసింగి, ఎస్ఎస్ఆర్.పేట గ్రామాల పరిధిలోని భూములు అనుకూలమని గుర్తించింది. ప్రతిపాదిత 1,085 ఎకరాల్లో డి- పట్టా, అభ్యంతకర, అభ్యంతరం లేనివి, రోడ్లు, వ్యవసాయ పొలాలు, వినియోగ మార్పిడి స్థలాలున్నాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం ఒక్క దమరసింగిలోనే అడవులను ఆనుకుని 559.61 ఎకరాల మేర వ్యవసాయ భూములు ఉన్నాయి.

అవే ఎక్కువ..

పెద్ద పరిశ్రమ వస్తోందని జిల్లా వాసులు ఆనందపడుతున్నా.. కెల్ల ప్రాంతంలో అత్యధికంగా పచ్చని పంట పొలాలను రైతులు వదులుకోవాల్సి వస్తుంది. ప్రస్తుతం ఖరీఫ్‌లో వరి, మొక్కజొన్న, రబీలో ఆరుతడి పంటలు సాగు చేస్తున్నారు. ఇక్కడ రెండు ప్రధాన గ్రామాలు విస్తరించాయి. తగిన నష్టపరిహారం చెల్లించి, నిర్వాసితులకు ప్రత్యామ్నాయం చూపి, భూములు సేకరిస్తే పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి. బెల్లానపేటలో సుమారు 119 ఇళ్లలో 522 మంది, మన్యపురిపేటలో సుమారు 241 ఇళ్లలో 725 మంది నివసిస్తున్నారు. వీరిని మరో ప్రాంతానికి తరలించడం తప్పనిసరి. మిగిలిన గ్రామాలకు పాక్షికంగా దెబ్బతగిలినా వాటి పరిధిలోని భూములు ఇక కనిపించవు. అనుమతులు రాగానే భూసేకరణపై దృష్టిసారిస్తామని జిల్లాకు చెందిన ఓ ఉన్నతాధికారి 'ఈనాడు'కు తెలిపారు.

పంట భూముల మధ్యలో బెల్లానపేట గ్రామం

కొత్తవలస తహసీల్దారు సస్పెన్షన్

ఈనాడు, విజయనగరం: కొత్తవలస తహసీల్దారు అప్పలరాజును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. నాలుగు నెలల క్రితం మన్యం జిల్లా నుంచి కొత్తవలసకు బదిలీపై వచ్చారు. నాటి నుంచి అక్రమాలు చేస్తూ, వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని వీరభద్రపురం సహా పలు రెవెన్యూల్లో మ్యుటేషన్లకు సంబంధించి అక్రమాలకు పాల్పడ్డారని సమాచారం. చిన్నిపాలెం గ్రామ పరిధిలో ప్రభుత్వానికి చెందిన పోరంబోకు (చెరువు) స్థలంగా అధికారిక దస్త్రాల్లో నమోదై ఉన్నా.. జిరాయితీగా మార్చి ఇతరులకు మ్యుటేషన్ చేశారు. అడంగల్‌లో మార్పులు, సబ్ డివిజన్లు చేసి వెబ్‌ల్యాండ్‌లో దాన్ని నమోదు చేశారు. ఈ ప్రక్రియకు జేసీ అనుమతి తప్పనిసరి. అవేమీ లేకుండా నిర్ణయాలు తీసుకున్నట్లు ఆర్డీవో అందజేసిన ప్రాథమిక నివేదిక మేరకు.. కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారు.

విచారణాధికారి నియామకం

తహసీల్దారు అప్పలరాజుపై వచ్చిన ఆరోపణలపై విచారణకు కేఆర్‌సీసీ ఉప కలెక్టర్ మురళిని కలెక్టర్ విచారణాధికారిగా నియమించారు. ఇక్కడ విధుల్లో చేరిన నాటి నుంచి ఇప్పటివరకు ఆయన తీసుకున్న నిర్ణయాలు, మ్యుటేషన్లు, ఆరోపణలు, అందిన ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి నివేదించాలని ఆదేశించారు. 2013లో సీతానగరం మండల ఎఫ్ఏసీ తహసీల్దారుగా పనిచేసిన కాలంలోనూ అక్రమాల ఆరోపణలపై సస్పెండ్ అయ్యారు.

(c) eenadu

చీపురుపల్లి విద్యార్థులకు ప్రశంస

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లిలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులను ఇంటెల్ సంస్థ అంతర్జాతీయ వ్యవహారాల ప్రతినిధి సారా కెంప్ ప్రశంసించారు. కేంద్ర విద్యాశాఖ, ఇంటెల్ సంస్థ దిల్లీలోని అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇంపాక్ట్ ఫెస్టివల్‌లో మన బాలలు పాల్గొన్నారు. 'పారిశుద్ధ్యం ఎన్ పవ రింగ్ అవర్ శానిటేషన్ హీరోస్' అంశంపై ఆర్. హర్షిత, పీవీఎల్.ప్రణవి.. దేవస్థానాల్లో భక్తుల దర్శనాలకు ఇబ్బంది కలుగకుండా పవర్డ్ ఆటోమేటిక్ క్యూ సిస్టమ్ అంశంపై పైడిశెట్టి తనిష్క్ ఏఐ ద్వారా ప్రాజెక్టులను తయారు చేశారు. దీంతో ఇంటెల్ వ్యవహారాల బాధ్యురాలు సారా విద్యార్థులను, గైడ్ టీచర్ ప్రసాద్‌ను అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఇంటెల్ భారత్ ప్రభుత్వ వ్యవహారాల ప్రతినిధి సారా కెంప్, చిత్రంలో హర్షిత, ప్రణవి, తనిష్క్

జీవితంలో మరువలేం..

మా ప్రాజెక్టులను పరిశీలించిన భారత ప్రభుత్వ ఐటీ, ఎలక్ట్రానిక్స్ కార్యదర్శి ఎస్.కృష్ణన్ పాఠశాల పేరు ప్రస్తావిస్తూ మమ్మల్ని వేదికపై అభినందించారు. దీంతో మా ఆనందానికి హద్దులు లేవు. ఇంపాక్ట్ ఫెస్టివల్‌కు వెళ్లిన మాకు దేశ రాజధానిలో ఉన్నత సౌకర్యాలు కల్పించారు. ప్రాజెక్టులను ప్రదర్శించడానికి మా పాఠశాల, ప్రాజెక్టు వివరాలను పొందుపరుస్తూ ప్రత్యేకంగా ఛాంబర్ కేటాయించారు. అంతర్జాతీయ నిపుణులతో సంభాషించాం. దీంతో మాలో ఆత్మ విశ్వాసం పెరిగింది. జీవితంలో మరిచిపోలేం. - విద్యార్థులు

చలిని తరిమేలా.. ఉత్సాహం ఉరిమేలా

కొండ ప్రాంతంలో.. నది ఒడ్డున.. ఈ శీతాకాలంలో రాత్రి వేళ కలప మంట సెగకు చలి మటుమాయమవుతుంది. గంట్యాడ మండలంలోని తాటిపూడి సమీపంలో ఉన్న గిరి వినాయక ఎకో టూరిజం కేంద్రంలో క్యాంప్ ఫైర్స్ ప్రారంభమయ్యాయి. రాత్రి వేళ కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఇక్కడ గడిపేందుకు పర్యాటకులు తరలి వస్తున్నారు. ఇటీవల 'ఈనాడు'లో ప్రచురితమైన 'ప్రకృతి ఒడిలో సేదదీరుదాం రండి' కథనానికి ప్రకృతి ప్రేమికుల నుంచి విశేష స్పందన వస్తోందని కాటేజీ మేనేజర్ సీహెచ్.శేషు చెబుతున్నారు.

ఎకో టూరిజం కేంద్రంలో ఉన్న కాటేజీల వద్ద క్యాంప్ ఫైర్ వేసుకుని సందడి చేస్తున్న పర్యాటకులు

గిరి వినాయక ప్రాంతంలో కలపను అందుబాటులో ఉంచుతున్నామన్నారు.

– న్యూస్‌టుడే, గంట్యాడ(తాటిపూడి)

ఆగాలి.. లోతెంతో చూడాలి

పట్టణాభివృద్ధికి కేంద్రం రూ.కోట్లలో నిధులు మంజూరు చేస్తోంది. కానీ పనులు మాత్రం జరగడం లేదు. బిల్లులు మంజూరు కావడం లేదని గుత్తేదారులు సైతం ముందుకు రాని పరిస్థితి. సాలూరు పురపాలికలో ఆగస్టులో 57 పనులకు టెండర్లు పిలిస్తే 17 పత్రాలు దాఖలయ్యాయి. పాలనా అనుమతులు సైతం వచ్చాయి. ఉన్నతాధికారుల నుంచి అంగీకారం రాలేదు. సాంకేతిక లోపాల కారణంగా ఈ దుస్థితి నెలకొంది.

మక్కువ బైపాస్ రోడ్డులో ఏర్పడిన గుంతలు

ఇంకెప్పుడో.. ● కొన్ని పనులకు టెండర్లు పూర్తయినా ముందుకు కదలడం లేదు ● గాంధీపార్కు, ఒరియాపండావీధి, మజ్జులపేటలోని నీటి పథకాలకు మెట్లు కట్టేందుకు రూ.13 లక్షలు కేటాయించారు ● రైల్వేస్టేషన్ రోడ్డు కూడలి నుంచి మక్కువ బైపాస్ వరకు తారు రోడ్డు నిర్మాణానికి రూ.8 లక్షలు ● అటవీ కార్యాలయం నుంచి బంగారమ్మకాలనీ రెండో లైన్ తారురోడ్డుకు రూ.6.40 లక్షలు ● సామాజిక భవనం నుంచి రామాకాలనీ అపార్ట్‌మెంట్స్‌కు తారు రోడ్డు- రూ.8 లక్షలు ● శివాజీ కూడలి నుంచి ప్రధాన నీటి సరఫరా కేంద్రానికి రహదారి- రూ.12 లక్షలు ● పెదకోమటిపేట, యాతవీధి, చిట్లువీధిలో మార్గాల ఏర్పాటు- రూ.9.20 లక్షలు ● కోటవీధి దుర్గ గుడి నుంచి పెదహరిజనపేట చర్చి వరకు- రూ.9.60 లక్షలు ● క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ నుంచి రామాకాలనీ వివేకానంద స్కూల్ వరకు- రూ.9.50 లక్షలు ● ఎన్టీఆర్ కూడలి నుంచి రైల్వేస్టేషన్ కూడలి- రూ.13 లక్షలు ● ఆంజనేయస్వామి గుడి నుంచి బంగారమ్మకాలనీ వరకు రోడ్డు వేసేందుకు రూ.6.30 లక్షలు మంజూరైనా ప్రారంభం కాలేదు. ● ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే మొదలు పెడతామని పురపాలిక డీఈ బీవీ.ప్రసాద్ తెలిపారు.

– న్యూస్‌టుడే, సాలూరు

పుస్తక పఠనంతో మెరుగైన విజ్ఞానం

బహుమతులు పొందిన వారితో అధికారులు, ప్రముఖులు

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: చిన్ననాటి నుంచి పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని వయోజన విద్య ఉప సంచాలకుడు ఎస్.సుబ్రహ్మణ్యవర్మ, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి సూచించారు. గురువారం విజయనగరంలోని కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చరవాణులను అవసరం మేరకే వినియోగించాలన్నారు. గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందించారు. గంట్యాడ ఎంఈవో ఎస్.వెంకటరావు, సాహితీ వేత్తలు ఎ.గోపాలరావు, సముద్రాల గురుప్రసాద్, బుర్ర శ్రీనివాసరావు, బి.రామభద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మంజూరులో సందేహాలా..?

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 కింద గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయనుంది. ఈనెల 30 లోగా లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవాలి. గతంలో ఈ పథకం ద్వారా జిల్లాలో 36,862 మంది సచివాలయాల్లో దరఖాస్తులు చేశారు. ఈ నేపథ్యంలో వారు మళ్లీ సంప్రదించాలా.. వద్దా.. కొత్తవారికి ఏఏ పత్రాలు ఉండాలి.. సొంత స్థలం ఉండాలా.. గతంలో లబ్ధి పొందితే పరిస్థితి ఏంటి.. ఇంట్లో మరొకరి పేరున మంజూరైతే ఏం చేయాలి.. తదితర సందేహాల నివృత్తికి ఈనాడు అవకాశం కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా ఒక్క ఫోన్ కాల్ మాత్రమే. గృహ నిర్మాణశాఖ జిల్లా అధికారి గండి మురళీమోహన్ మీతో మాట్లాడనున్నారు.

ఈనాడు ఫోన్ ఇన్ కార్యక్రమం

★ తేదీ: 21.11.2025 (శుక్రవారం) ★ సమయం: ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ★ సంప్రదించాల్సిన నంబరు: 70939 30102 – న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్

దారిలోనే ఉంటున్నాయ్.. దాడులు చేస్తున్నాయ్

గుమ్మలక్ష్మీపురంలో గుంపుగా సంచరిస్తున్న శునకాలు

వీధి ఏదైనా.. అడ్డా మాదే అన్నట్లు గుంపులుగా సంచరిస్తున్నాయి గ్రామ సింహాలు. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేటలో వీధి శునకాలు హడలెత్తిస్తున్నాయి. ప్రధాన రహదారులు, ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో పెద్దసంఖ్యలో గుంపులుగా సంచరిస్తున్నాయి. 'భౌ'తిక దాడులకు పాల్పడుతుండడంతో చిన్నారులు, వృద్ధులు బయటకు రావాలంటే చేతిన కర్రపట్టుకోవాల్సి వస్తోంది. కుక్కలు నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కుక్కలను పట్టి, ఇతర ప్రాంతాల్లో విడిచిపెట్టేందుకు చర్యలు తీసుకుంటామని డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.

– న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం

తలగాంలో 25 గొర్రెపిల్లల మృతి.. వంగర: వంగర మండలం తలగాం గ్రామంలో గురువారం ఉదయం వీధి కుక్కల దాడిలో పి.సింహాలుకు చెందిన 25 గొర్రె పిల్లలు మృతిచెందాయి. ఇంటి సమీపంలోని షెడ్‌లో 40 పిల్లలను ఉంచి.. పెద్ద గొర్రెలను మేత కోసం బయటకు తీసుకెళ్లిన సమయంలో ఘటన చోటుచేసుకుంది.

బాలుడికి తీవ్రగాయాలు.. పార్వతీపురం, గ్రామీణం: కుక్క దాడిలో మూడేళ్ల బాలుడు గాయపడిన ఘటన పార్వతీపురం మండలంలోని తాళ్లబురిడి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామంలోని సుమిత్రాపురం కాలనీకి చెందిన బాలుడు టి.యశ్వంతకుమార్ ఇంటివద్ద ఆడుకుంటున్న సమయంలో కుక్క ముఖంపై దాడి చేయడంతో రక్తస్రావం జరిగింది. కుటుంబ సభ్యులు వెంటనే బాలుడ్ని డోకిశీల ఆసుపత్రికి తీసుకెళ్లగా ప్రాథమిక చికిత్స అనంతరం జిల్లా కేంద్రాసుపత్రికి దరలించారు. శునకాలను తరలించాలని బాలుడి తండ్రి శేఖర్ డిమాండు చేశారు.

ముఖంపై గాయం కారణంగా బోరుమంటున్న బాలుడు

ముంజేరులో కాలువ నిర్మాణంపై వివాదం

భోగాపురం, న్యూస్‌టుడే: భోగాపురం మండలంలోని ముంజేరు గ్రామంలో రెండు రోజుల క్రితం నుంచి జరుగుతున్న కాలువ వివాదం గురువారం తీవ్ర ఘర్షణకు దారితీసింది. పోలీసుల సమక్షంలో తెలగ సామాజిక వర్గానికి చెందిన వారు జేసీబీతో కాలువ తవ్వేందుకు ప్రయత్నించారు. వీరిని సిద్ధార్థ కాలనీ వారు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగి, ఒకరిపై ఒకరు రాళ్లు, మట్టి విసురుకున్నారు. పోలీసులు అదుపు చేసేందుకు ప్రయత్నం చేయగా చెల్లాచెదురుగా వెళ్లిపోయారు. అనంతరం సిద్ధార్థ కాలనీ వారు ఫిర్యాదు చేసేందుకు విజయనగరంలోని ఎస్పీ కార్యాలయానికి వెళ్లడంతో మరో వర్గానికి చెందిన వారు జేసీబీతో కాలువ తవ్వేశారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ ఆర్.గోవిందరావు పరిశీలించారు. సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వండుతున్న వంటల్లో ఇసుక పడడంతో భోజనాలు పాడయ్యాయి. వేరే బడి నుంచి తెప్పించారు.

ఇరువర్గాల మధ్య తోపులాట

భవనం చిన్నది.. బాధ్యత పెద్దది

– న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

విజయనగరంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉత్తరాంధ్ర ప్రాంతీయ శిక్షణ కేంద్రం అధ్వానంగా మారింది. చుట్టూ దట్టమైన అటవీ ప్రాంతం ఉండడంతో లోపలకొచ్చే వరకు ఇక్కడ భవనాలు కానరావడం లేదు. మౌలిక సదుపాయాలు సైతం అంతంత మాత్రమే. సరైన దారి కూడా లేదు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. శిక్షణకు వచ్చేవారికి అవస్థలు తప్పడం లేదు.

ప్రస్తుతం ఉన్నది ఈ ఒక్క గదే..

ఏళ్ల క్రితమే..

విజయనగరం జిల్లా కేంద్రానికి సమీపంలోని ఫూల్‌బాగ్‌లో ఉన్న కేంద్రానికి దివంగత పీవీజీ.రాజు 23.62 ఎకరాల స్థలాన్ని ఉచితంగా కేటాయించారు. 1963లో భవనం నిర్మించారు. అది శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతమున్న కార్యాలయం విధుల వరకే సరిపోతోంది. ఒక్కటే గది, వరండా మాత్రమే ఉన్నాయి. రాత్రి కాపలాదారుకు మరో చిన్న గది ఉంది. ఏడాదిలో ఉపాధ్యాయులకు 4 సార్లు, పిల్లలకు 5 సార్లు శిక్షణ క్యాంపులు, టెస్టింగ్ క్యాంపులు జరుగుతుంటాయి. ఒకేసారి 130 మంది నుంచి 140 మంది వరకు హాజరవుతారు. దీంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇవి అవసరం..

● వసతి, భోజన సౌకర్యాల నిమిత్తం 150- 200 మందికి సరిపడా డార్మెటరీ ● కేంద్రానికి వెళ్లేందుకు 250 మీటర్ల పొడవున రోడ్డు నిర్మాణం ● అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉండడంతో చుట్టూ ప్రహరీ ● ప్రస్తుతం 120 మంది ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటివరకు 2,250 మంది విద్యార్థులు నమోదయ్యారు. ఈ కేంద్రాన్ని సాహస కృత్యాలకు కేంద్రంగా తీర్చిదిద్దితే ఉపయోగకరంగా ఉంటుందని గైడ్ మాస్టర్లు పేర్కొంటున్నారు. ● ఇటీవల ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే శ్రీనివాసులనాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు శిక్షకుడు వాక చిన్నంనాయుడు తెలిపారు.

కళ్లు లేకున్నా.. కంప్యూటర్ వాడేస్తా

కీ బోర్డు నొక్కుతున్న అంధ విద్యార్థికి సూచనలు చేస్తున్న విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరంలోని ఫూల్ బాగ్ కాలనీలో ఉన్న ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలను ఎమ్మెల్యే అదితి గజపతిరాజు గురువారం సందర్శించారు. సదుపాయాలు, సమస్యలపై ఆరా తీశారు. అశోక్ గజపతి రాజు ముందు చూపుతో అయిదు ఎకరాల భూమి కేటాయించారన్నారు. ఇటీవల నిధులు మంజూరయ్యాయని, అభివృద్ధికి అన్నివిధాలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు కంప్యూటర్లను వాడి అలరించారు. అనంతరం ఎమ్మెల్యేతో కలిసి మొక్కలు నాటారు. ప్రిన్సిపల్ ఎం.మహేశ్వరరెడ్డి, ఎంఈఓ-2 పి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

వ్యర్థమే.. అక్కడ పరమార్థం

పట్టణాల్లో బయోమైనింగ్

న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

ఉమ్మడి జిల్లాలోని పుర, నగరపాలక, నగర పంచాయతీల్లో ఉండే డంపింగ్ యార్డులు ఒకప్పుడు చెత్త గుట్టలతో.. ప్లాస్టిక్ వ్యర్థాలతో.. పందుల సంచారంతో అపరిశుభ్రంగా ఉండేవి. ఇప్పుడా పరిస్థితిలో మార్పు వచ్చింది. బయోమైనింగ్ ప్రక్రియ చేపడుతున్నారు. చెత్తను ప్రాసెసింగ్ చేసి విభజిస్తున్నారు. చివరికి మట్టిగా మార్చుతున్నారు. బొబ్బిలి, రాజాం, పార్వతీపురం, పాలకొండలో ఇప్పటికే పూర్తికాగా.. విజయనగరం నగరపాలక సంస్థలో మూడో విడతలో పనులు జరుగుతున్నాయి. నాలుగో విడత టెండర్ల దశలో ఉంది. నెల్లిమర్ల, సాలూరులో ప్రారంభం కావాలి.

పనులు ఇలా..

● స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా తరుణీ ఏజెన్సీ ఈ పనులు చేస్తోంది

● బొబ్బిలి, నెల్లిమర్ల, రాజాం, పార్వతీపురం, పాలకొండ, సాలూరుతో పాటు విశాఖ రీజియన్ పరిధిలోని మరికొన్ని ప్రాంతాల్లో ప్రక్రియ నిర్వహణకు రూ.1.15 కోట్లతో ప్రతిపాదించారు

విజయనగరంలో రూ.15 కోట్ల వ్యయంతో మొదట విడతలో 2,06,101 మెట్రిక్ టన్నుల చెత్తను బయో మైనింగ్ చేశారు. రెండో విడతలో రూ.2.42 కోట్లతో 30,600 మె.ట, మూడో విడత కింద రూ.2 కోట్లతో 28 వేల మె.ట చెత్తను ప్రాసెస్ చేస్తున్నారు.

మైదానంలా మారిన విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలోని గుణుపూరుపేట డంపింగ్ యార్డు

● బొబ్బిలిలో 14,711 మె.ట, రాజాంలో 12,849 మె.టన్నులను మట్టిగా మార్చారు

● పార్వతీపురంలో 14 వేలు, పాలకొండలో 7,500 టన్నుల మేర సేకరించారు

● సాలూరులో 10 వేల మె.టన్నుల వ్యర్థాలను ప్రాసెసింగ్ చేయాల్సి ఉంది

● నెల్లిమర్ల నుంచి 7,789 టన్నులను విజయనగరం తరలించాలని భావిస్తున్నారు.

ఉపయోగాలివీ..

● బయోమైనింగ్ ప్రక్రియతో కాలుష్యం తగ్గుతుంది ● అక్కడ పచ్చదనం పెంపునకు అవకాశం ఏర్పడుతుంది

● ప్రాసెసింగ్ అనంతరం వచ్చే మట్టిరూపంలోని వ్యర్థాన్ని మొక్కలకు ఎరువుగా వినియోగించవచ్చు. రోడ్ల నిర్మాణంలో ఉపయోగించవచ్చు.

● చుట్టుపక్కల ప్రాంతాల వారికి దుర్వాసన సమస్య ఉండదు

సకాలంలో పూర్తికి చర్యలు.. అన్నిచోట్లా డిసెంబరు నెలాఖరులోపు ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. బొబ్బిలి, రాజాంలో పనులు పూర్తయ్యాయి. విజయనగరంలో ముగింపు దశకు వచ్చాయి. పాలకొండ యార్డు నుంచి వ్యర్థాలను శ్రీకాకుళం తరలిస్తున్నాం. – ఎస్.జ్యోతి, ఈఈ, ప్రజారోగ్య సాంకేతిక శాఖ

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	123	216	226

PUBLIC NOTICE
IN THE COURT OF THE HON'BLE ADDITIONAL DISTRICT AND SESSIONS COURT:: AT MEDCHAL
FCOP. No. 206 Of 2025
Between:
Mr. Dasari Sai Aakash ... Petitioner
AND
Smt. Praveena Yandamuri ... Respondent
To
Smt. Praveena Yandamuri, W/o Dasari Sai Aakash, D/o Y. Malleswara Rao Aged about 30 years, Occ: House wife R/o. 101, Sai Nilayam. 4, Sai Nagar Rajam, Andhra Pradesh-532127
Cell: 7093327509
My Client Mr. Dasari Sai Aakash have filed the above FCOP No.206 of 2025 for annulment of marriage U/s 12 of HM Act on the file of the Hon'ble Addl. District and Sessions Court at Medchal and the Hon'ble Court was pleased to order for paper publication against you therefore, you are hereby advised to appear in this court in person or by a pleader duly instructed on the 09th day of December, 2025 (09.12.2025) at 10-30 O'clock in the forenoon, failing which the said matter will be heard ex-parte.
Smt. Nagisetty Kalpana, Advocate
Arella Abode, H. No. 8-3-228/265/A, Rahmath Nagar, Yousufguda, Hyderabad 500045,
Mobile No. 9703814689

MAHARAJAH'S COLLEGE OF PHARMACY
(Approved by PCI, New Delhi & SBTET)
Phool Baugh, Vizianagaram-535 002
Ph: 08922-277255, Contact Mobile No's: 8121530528, 9912342138
E-Mail: principalmrcp@gmail.com, www.mrpharmacy.co.in
Admission Notification for 1st B. Pharmacy Under Category-B
NRI/Non-NRI Seats - AY 2025-26
Applications are invited from eligible candidates for admission into 1st Year B. Pharmacy under Category-B (NRI/Non-NRI) for the Academic Year 2025-26.

Course	Intake	"B" Category Seats
B.Pharmacy	100	30

Eligibility: Candidates should have passed the qualifying examination (Intermediate MPC/BIPC) with not less than 50% marks in the group subjects. Last date for submission of filled in applications to the college on or before 23.11.2025. The Admissions shall be made as per the guidelines of APSCHE.
PRINCIPAL

వ్యసనాలకు బానిసై వాహనాల చోరీ

పాలకొండ, న్యూస్‌టుడే: వ్యసనాలకు బానిసై చోరీలకు పాల్పడుతున్న యువకుడిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ రాంబాబు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటకు చెందిన టి.ప్రసాద్ పాలకొండలో ఉంటున్నాడు. మద్యం, ఇతర వ్యసనాలకు బానిసయ్యాడు. అవసరాలకు డబ్బు సరిపోకపోవడంతో వాహనాలను దొంగతనం చేసేవాడు. ఏలాం కూడలి వద్ద గురువారం వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులకు శ్రీకాకుళం వైపు నుంచి వస్తున్న ప్రసాద్ అనుమానాస్పదంగా కనిపించాడు. అదుపులోకి తీసుకుని విచారించగా.. నేరం ఒప్పుకొన్నాడు. అతడి నుంచి 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన సిబ్బంది రాజేష్, రమేష్‌కు నగదు బహుమతులు అందించారు. సీఐ ప్రసాదరావు, ఎస్సై ప్రయోగమూర్తి ఉన్నారు.

నాగావళి నదిలో పశువుల వ్యాపారి గల్లంతు

కురుపాం గ్రామీణం, కొమరాడ, న్యూస్‌టుడే: నాగావళి నది దాటుతూ ప్రవాహానికి చిక్కుకున్న ఓ వ్యక్తి గల్లంతైన ఘటన గురువారం కొమరాడ మండలంలోని చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం... కురుపాం మండలం బియ్యాలవలస గ్రామానికి చెందిన అన్నపురాయుడు(65) పశువుల క్రయవిక్రయాలు చేస్తుంటాడు. ఇందులో భాగంగా పార్వతీపురం సంతలో రెండు గేదెలను కొనుగోలు చేశాడు. తిరిగి వస్తుండగా కళ్లికోట- దళాయిపేట మధ్య నాగావళి నది దాటితే సులభంగా గ్రామానికి చేరుకోవచ్చని దిగాడు. ప్రవాహానికి కొట్టుకుపోయి అదృశ్యమయ్యాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై నీలకంఠం సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపడుతున్నారు.

సైనికా.. మళ్లీ రావాలి

యువ జవానుకు కన్నీటి వీడ్కోలు

చీపురుపల్లి, మెరకముడిదాం, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంపై విధులకు వెళ్తూ అసోంలో జరిగిన రహదారి ప్రమాదంలో మృతిచెందిన మెరకముడిదాం మండలం గొల్లలవలసకు చెందిన అడ్డూరి దుర్గాప్రసాద్ మృతదేహాన్ని గురువారం స్వగ్రామం తీసుకొచ్చారు. చీపురుపల్లి నుంచి స్వగ్రామం వరకు అంతిమ యాత్ర నిర్వహించారు. యువత అధిక సంఖ్యలో హాజరై జాతీయ జెండాలతో భారీ ర్యాలీ చేపట్టారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అందొచ్చిన కుమారుడి మృతితో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. ఆర్మీ అధికారులు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఎమ్మెల్యే కళా వెంకటరావు తదితరులు నివాళులర్పించారు.

అంతిమ యాత్రలో పాల్గొన్న యువత

మృతదేహాన్ని తీసుకొస్తున్న ఆర్మీ అధికారులు

నమోదులో నిర్లక్ష్యం.. పథకానికి దూరం

కలెక్టరేట్ వద్ద వినతిపత్రాలు చూపుతున్న రెల్లివలస గ్రామస్థులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: విజయనగరం జిల్లాలోని కొన్ని పాఠశాలల విద్యార్థుల వివరాలను నమోదు చేయకపోవడంతో తల్లికి వందనం పథకానికి దూరం కావాల్సి వచ్చింది. ఇలాంటి వారు 814 మంది ఉన్నట్లు గుర్తించారు. ఆరు దశల పరిశీలనలో భాగంగా అనర్హులైన వారికి వీరంతా అదనం. సచివాలయాలు, విద్యాలయాల మధ్య సమన్వయ లోపంతో ఈ పరిస్థితి ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు. వీరిలో ప్రభుత్వంతో పాటు ప్రైవేటు పాఠశాలల పిల్లలూ ఉన్నారు. ప్రవేశాలు పొందిన వారి వివరాలను పాఠశాల లాగిన్‌లో నమోదు చేయాలి. పేరు, తల్లిదండ్రుల పేర్లు, ఆధార్, తరగతి తప్పనిసరి. సిబ్బంది ఈప్రక్రియను సక్రమంగా నిర్వహించకపోవడంతో డేటా పోర్టల్‌లో అందుబాటులోకి రాలేదని తెలుస్తోంది.

అర్బన్‌లోనే ఎక్కువ..

ఎక్కువగా పట్టణాల పరిధిలో ఉండిపోయారు. ఈవిషయంలో విజయనగరం నియోజకవర్గం తొలిస్థానంలో ఉంది. రాజాం, బొబ్బిలి, నెల్లిమర్ల నగర పంచాయతీల్లోనూ అనర్హులున్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని జిల్లా సచివాలయాల అధికారిణి ఎస్.రోజారాణి తెలిపారు. పాఠశాలల డేటా లాగిన్ నుంచి తల్లికి వందనం పోర్టల్‌లోకి వస్తే కానీ ఏమీ చేయలేమన్నారు. జిల్లాలో 17,685 మంది గ్రీవెన్స్‌లో దరఖాస్తులు చేసుకోగా, అర్హతున్న వారిలో 12,105 మందికి డబ్బులు జమయ్యాయి. 1148 మందిని అనర్హులుగా గుర్తించారు. మిగిలిన వారికి త్వరలో నగదు అందనుందని రోజారాణి వెల్లడించారు.

ప్రాంతాలవారీగా లబ్ధిపొందని వారు..

మండలం	విద్యార్థులు
విజయనగరం	137
భోగాపురం	22
బొబ్బిలి	43
బొండపల్లి	22
చీపురుపల్లి	24
దత్తిరాజేరు	22
డెంకాడ	29
గజపతినగరం	24
గంట్యాడ	36
గరివిడి	23
కొత్తవలస	45
ఎల్.కోట	26
మెంటాడ	22
నెల్లిమర్ల	30
పూసపాటిరేగ	28
రేగిడి	34
రాజాం	60
సంతకవిటి	23
ఎస్.కోట	21
తెర్లాం	26
వేపాడ	28

22న ఉద్యోగ మేళా

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: విజయనగరంలోని మహారాజా ఫార్మసీ కళాశాలలో ఈనెల 22న విశాఖకు చెందిన ఫైజర్ ఫార్మా హెల్త్ కేర్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ప్రధానాచార్యుడు ఎం.రామయ్య ఓ ప్రకటనలో తెలిపారు. 2024, 2025 సంవత్సరాల్లో డీఫార్మసీ కోర్సును పూర్తిచేసినవారు అర్హులన్నారు. ఆసక్తి గలవారు దరఖాస్తు, విద్యార్హత ధ్రువపత్రాల నకళ్లు, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరుకావాలన్నారు.

డ్రైవింగ్ స్కూళ్లపై చర్యలు

నేరవార్తా విభాగం: జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న రెండు డ్రైవింగ్ స్కూళ్లపై చర్యలు తీసుకున్నట్లు రవాణాశాఖ ఉప కమిషనర్ మణికుమార్ తెలిపారు. ఒక కేంద్రం లైసెన్సును రద్దు చేశామని, మరోదాన్ని సరెండర్ చేశామన్నారు. త్వరలో అన్ని డ్రైవింగ్ స్కూళ్లను తనిఖీ చేసి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు.

EENADU Classifieds

REAL ESTATE

LAND FOR SALE
10 Acre Land for Sale- Near Jeypore- Vizianagaram Road (Panasalapadu Road) 500 M from Main Highway. ✆ 9652661542.

PLOT FOR SALE
Global IT Economy Future City Bhogapuram. VMRDA & RERA Approved Open Plots for sale. Cont: 8639765271.

OPEN PLOTS FOR SALE
● Google Data Center కి అతి దగ్గరలో
● నీలకుండీల జంక్షన్, కొండ్రాం
● GVMC పరిధిలో VMRDA/RERA అప్రూవ్డ్
● తక్షణ ఇంటి నిర్మాణం ● 167-400 Sqyds
● బ్యాంకు లోన్ సదుపాయం కలదు.
SUBHAGRUHA Infrastructures Private Limited
అందమైన ఊహకు... పొందికైన రూపం.
Call: 9502230091

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

JOBS
Vision buzz కంపెనీలో డోర్ టూ డోర్ మార్కెటింగ్ చేయడానికి యువతి యువకులు స్టాఫ్ కావలెను. డైలీ Payment ఇవ్వబడును. ✆ 9550109729.

SECURITY GUARDS
కాకినాడ ఏరియాలో ఒంటిమామిడి ప్రాంతం ప్రముఖ కంపెనీలో సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మంచి జీతం భోజనం+ వసతి కలదు. డ్యూటీ: 8 గం॥ జీతం: 18,500/- 26 రో॥ ✆ 8374164245, 7893197794.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

బొబ్బిలి

●బొబ్బిలి ●రాజాం ●గజపతినగరం ●చీపురుపల్లి

కల్వర్టు పనులు చేపడతాం

ఈనాడు కథనానికి స్పందన

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న కమిషనర్

రాజాం, న్యూస్‌టుడే: రాజాం పురపాలికలోని డోలపేట ఎస్సీ వీధి వద్ద కల్వర్టు పనులను రెండు రోజుల్లో చేపడతామని కమిషనర్ ఆకురాతి రామచంద్రరావు తెలిపారు. 'డోలపేట.. సమస్యలే అంతటా' శీర్షికన గురువారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏఈ వెంకటరామరాజుతో మాట్లాడారు. వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. ప్రాధాన్యత క్రమంలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు.

కూరగాయల ధరలు

రాజాం రైతుబజారులో గురువారం కూరగాయల ధరలు (కిలో రూ.లలో) ●టమాటా: 60 ●వంకాయలు: 70- 80 ●దొండ: 65 ●బీర: 60 ●బెండ: 60 ●కాకర: 60 ●చిక్కుడు: 60 ●ఆనపకాయ (ఒకటి): 25 ●అరటి (జత): 20 ●మునగ: 70 ●ఉల్లి: 30 ●బంగాళదుంపలు: 30 ●అల్లం: 80 ●వెల్లుల్లి 80 ●పచ్చిమిర్చి: 70 ●క్యాబేజీ: 40 – న్యూస్‌టుడే, రాజాం

తెరపై ఈనాడు

★ ఎస్వీసీ సీతారామా: 12 ఎ రైల్వేకాలనీ ★ ఎస్వీసీ సీతారామా మినీ: కొదమ సింహం ★ ఎస్వీసీ అప్సర: - – న్యూస్‌టుడే, రాజాం ★ బొబ్బిలిలో.. ★ లక్ష్మీ: కాంత ★ వాసవి: జిగ్రిస్ ★ టీబీఆర్ స్క్రీన్-1: కొదమ సింహం ★ టీబీఆర్ స్క్రీన్-2: ప్రేమంటే – న్యూస్‌టుడే, బొబ్బిలి

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రాజాం - 80085 74308
గరివిడి- 80085 74348

? ఆదర్శ పాఠశాలలో కుళాయిలు శిథిలావస్థకు చేరాయి. - విద్యార్థులు ★ చర్యలు తీసుకుంటాం. - రామకృష్ణారావు, ప్రధానాచార్యుడు – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

? ఎం. సీతారంపురం రాజమ్మతల్లి వీధిలో ప్రధాన పైపులైను లీకులతో తాగునీరు వృథా అవుతోంది. చెప్పినా పట్టించుకోవడం లేదు. - కె.ఉమామహేశ్వరరావు, డి.అప్పలనాయుడు ★ పంచాయతీ సిబ్బందితో మాట్లాడి, లీకులను అరికడతాం. - చిన్నయ్య, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ – న్యూస్‌టుడే, వంగర

? రుషింగిలో వీధి దీపాలు నిత్యం వెలుగుతూనే ఉన్నాయి. - స్థానికులు ★ చర్యలు తీసుకుంటాం. - రామారావు, పంచాయతీ విస్తరణాధికారి – న్యూస్‌టుడే, వంగర

? రామభద్రపురంలో విద్యుత్తు మోటారు కాలిపోవడంతో రెండురోజుల నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. - స్థానికులు ★ మోటారు బాగు చేసి, తాగునీరు అందిస్తాం. - సూరిబాబు, ఈవో – రామభద్రపురం

అక్రమం.. సక్రమం చేసుకునేలా..!

న్యూస్‌టుడే- బొబ్బిలి

భవనాల క్రమబద్ధీకరణకు అవకాశం

నోటీసుల జారీకి సిద్ధం..

అనుమతి లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను ఒకేసారి క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం బీపీఎస్‌ను తీసుకొచ్చింది. ఎప్పటి నుంచో చాలామంది దీనికోసం ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అవకాశం ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడ్డారు. ఎట్టకేలకు వెసులుబాటు కల్పించడంతో పట్టణాలకు రూ.కోట్లలో ఆదాయం సమకూరే అవకాశముంది.

బొబ్బిలి పురపాలికలో అనుమతులు లేని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భవనాలను ప్రణాళికా విభాగం అధికారులు గుర్తిస్తున్నారు. వారికి నోటీసులు ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. అవకాశాన్ని వినియోగించుకోకపోతే కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. పురపాలక సంఘానికి రూ.7 నుంచి రూ.8 కోట్ల వరకు ఆదాయం సమకూరే అవకాశముందని అధికారులు లెక్కిస్తున్నారు.

1985 జనవరి 1 నుంచి 2025 ఆగస్టు 31 మధ్య నిర్మించిన ఇళ్లకు బీపీఎస్ కింద దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ, దేవాదాయ, నదులు, కాలువల భూముల్లో, మాస్టర్ ప్లాన్ రోడ్లు, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, పార్కింగ్‌కు కేటాయించిన స్థలాల్లో నిర్మించిన ఇళ్లకు ఈ పథకం వర్తించదు. ఎన్ని అక్రమ భవంతులు ఉన్నాయి? ఎన్ని నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారో గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ప్లానులు మంజూరు చేసి నిర్మించిన వాటిలో 150 భవనాలు.. ప్లానులు లేకుండా నిర్మించినవి మరో 100 వరకు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, నోటీసులు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రుసుములు ఇలా..

◆ దరఖాస్తు సమయంలో రూ.10 వేలు చెల్లించాలి. ◆ మార్కెట్ విలువ మేరకు నివాస సముదాయాలకు చదరపు అడుగుకు రూ.40 నుంచి రూ.200.. వాణిజ్య సముదాయాలకు చదరపు అడుగుకు రూ.80 నుంచి రూ.400 వరకు ఉంటుంది.

మినహాయింపులూ ఉన్నాయ్..

◆ 60 గజాల లోపు జీప్లస్ టు ఇళ్లను నిర్మించుకున్న వారికి మినహాయింపు ఇచ్చారు. వారు ఎలాంటి రుసుము చెల్లించనవసరం లేదు. ◆ 1997 డిసెంబర్ 12 లోపు నిర్మాణాలకు 25 శాతం తగ్గింపు. ◆ మురికివాడల్లో 50 శాతం తగ్గింపు రుసుము ఉంటుంది.

ఈ పత్రాలు ఉండాలి..

◆ రిజిస్టర్ సేల్ డీడ్ కాపీ ◆ ఈసీ, మార్కెట్ విలువను ధ్రువీకరించే పత్రం ◆ ప్లాను (ఉంటే) ◆ స్ట్రక్చర్ ఇంజినీరు నుంచి భవన నాణ్యత పత్రం ◆ ఎన్‌క్లూజర్- 4 పత్రం ◆ గుర్తింపు పొందిన సాంకేతిక పర్సన్ (ఎల్‌టీపీ) ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

వినియోగించుకోవాలి..: అక్రమ కట్టడాల యజమానులకు ఇచ్చేందుకు నోటీసులు సిద్ధం చేస్తున్నాం. క్షేత్రస్థాయిలో సచివాలయ ఉద్యోగులతో సర్వే చేయించి గుర్తిస్తాం. ఆ మేరకు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలి. అప్పటికీ ముందుకు రాకుంటే క్రిమినల్ చర్యలు నమోదు చేస్తాం. ఇది మంచి అవకాశం. వినియోగించుకోవాలి.
- ఎల్.రామలక్ష్మి, పుర కమిషనర్, బొబ్బిలి

పూర్వ విద్యార్థుల సేవలు వినియోగించుకోవాలి

రామభద్రపురం: విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సీ కమిషన్ ఛైర్మన్ జవహర్

గజపతినగరం: వసతిగృహంలో చదువుకుని ఉన్నతస్థాయిలో ఉన్న పూర్వ విద్యార్థుల సేవలు వినియోగించుకుని, వసతిగృహాలను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కె.ఎస్.జవహర్ అన్నారు. గురువారం సాయంత్రం గజపతినగరంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహాన్ని సందర్శించారు. పూర్వ విద్యార్థులను రప్పించి, వారితో కెరీర్ గైడెన్స్ ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ★ రామభద్రపురం: ఎస్సీ కమిషన్ ఛైర్మన్ రామభద్రపురం జాతీయ రహదారి పక్కన ఉన్న వసతి గృహాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. గదులను తనిఖీ చేశారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ సెక్రెటరీ చినరాముడు, జిల్లా ఎస్సీ వసతి గృహాల డీడీ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ బకాయిలు చెల్లించాలి

బొబ్బిలి, న్యూస్‌టుడే: ఉద్యోగులకు చెల్లించాల్సిన పీఎఫ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు డిమాండ్ చేశారు. గురువారం బొబ్బిలి ఏపీటీఎఫ్ కార్యాలయంలో మాట్లాడారు. రావలసిన మొత్తాలు చెల్లించాలని దరఖాస్తు చేసుకున్నా.. ఆరు నెలలుగా ఎవరికీ అందడం లేదన్నారు. ఒక డీఏ ప్రకటించి, మిగిలిన మూడు డీఏల బకాయిలను ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. నాయకులు ప్రవీణ్ కుమార్, చిన్నారావు, శర్మ, కృష్ణమోహన్, యుగంధర్ పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు చర్యలు

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: బాలల హక్కులను కాపాడాలని, వాటికి భంగం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని గంట్యాడ ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు అనురాధ అన్నారు. గురువారం గంట్యాడ మండలం బుడతనాపల్లిలో బాలల హక్కులు, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. పిల్లలను చిన్నప్పటి నుంచే ప్రేమతో శిక్షణతో పెంచాలన్నారు. తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన మార్గం.. దారుణం

చిలకపాలేం- రాజాం- రామభద్రపురం మార్గంలో తెర్లాం మండలం ఎం.ఆర్.అగ్రహారం దాటిన తరువాత నుంచి ఉత్తరావిల్లి కూడలి వరకు దారి దారుణంగా తయారైంది. గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ మార్గంలో వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఉత్తరావిల్లి- బాడంగి- రామభద్రపురం దారి బాగుకు రూ.4.50 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ కూడా పూర్తయింది. కానీ పనులు ప్రారంభించలేదు. త్వరలో పనులు చేపడతామని ఆర్అండ్‌బీ ఏఈ అప్పలరాజు తెలిపారు. – న్యూస్‌టుడే, తెర్లాం

ప్రభుత్వ బడికి రక్షణ కరవు

రాజాం పురపాలిక పరిధి కొండంపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రక్షణ కరవవుతోంది. ప్రధాన గేటు లేకపోవడంతో ఆవరణలో శునకాలు, పందులు సంచరిస్తున్నాయని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. గ్రామస్థులు ముందుకొచ్చి, ప్రహరీ, ఇతర పనులకు చందాలు ఇచ్చేందుకు సమ్మతి తెలిపారు. చాలావరకు ప్రహరీ పనులు పూర్తయ్యాయి. కొత్త భవనం నిర్మించేందుకు ఒకరు ముందుకు వచ్చారని, డీఈవో అనుమతికి ప్రయత్నిస్తున్నామని హెచ్‌ఎం చంద్రనాయుడు తెలిపారు. – న్యూస్‌టుడే, రాజాం

మలుపు.. ప్రమాదాలకు పిలుపు

గంట్యాడ, బొండపల్లి, ఎస్.కోట మండలాల పరిధిలోని గ్రామాల్లో మలుపుల దారులతో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. బుడతనాపల్లి మీదుగా కిండాం అగ్రహారం, రాచకిండాం- కొండకిండాం, బురదపాడు- రేగుబిల్లి, పెంటశ్రీరాంపురం మీదుగా కొట్టాం వెళ్లే దారుల్లో మలుపులు, రోడ్డుపై తుప్పలతో ప్రమాదాలు గురవుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. తక్షణమే పరిశీలించి, చర్యలు తీసుకుంటామని పీఆర్ ఏఈ కృష్ణమూర్తి, ప్రాజెక్టు జేఈ సల్మాన్ అన్నారు. – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

రైతుల గుండెల్లో అలజడి

రంగవలస సమీపంలో పంట కుప్పలు పెడుతున్న రైతులు

తెర్లాం, న్యూస్‌టుడే: వాతావరణంలో మార్పులతో రైతుల్లో అలజడి మొదలైంది. గురువారం ఉదయం నుంచి తెర్లాం మండలంలో మబ్బులు కమ్ముకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 45 శాతానికి పైగా కోతలు పూర్తయ్యాయని వ్యవసాయ శాఖ సిబ్బంది చెబుతున్నారు. ప్రస్తుతానికి తుపాను హెచ్చరికలు లేవని, రైతులు జాగ్రత్తలు తీసుకొని, అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు జి.హేమంత్‌కుమార్, వ్యవసాయాధికారి బి.శ్రీనివాసరావు పేర్కొన్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు

బొబ్బిలి మండలం ఎం.బూర్జివలసలో తెదేపా హయాంలో నిర్మించిన సామాజిక మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. అప్పట్లో స్వచ్ఛభారత్ నిధులతో ఇంటింటి మరుగుదొడ్లు మంజూరు చేశారు. ఇళ్ల వద్ద స్థలం లేనివారికి గ్రామానికి సమీపంలో రూ.6 లక్షలు వెచ్చించి సామాజిక మరుగుదొడ్లు నిర్మించారు. వినియోగించకుండా వదిలేశారు. దీంతో వృథాగా పోయాయి. వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

పదిలో ప్రణాళికతో చదవాలి

విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలిస్తున్న అన్నారావు

చీపురుపల్లి, గ్రామీణం, న్యూస్‌టుడే: పదో తరగతిలో విజయానికి ప్రత్యేక ప్రణాళికతో చదవాలని నెల్లిమర్ల డైట్ అధ్యాపకులు సూచించారు. డైట్ అధ్యాపకులు అన్నారావు, శశిభూషణరావు, ఎపీఎస్ శర్మ, శ్రీనివాసరావు, అప్పారావు గురువారం చీపురుపల్లి బాలికోన్నత పాఠశాల, కేజీబీవీని సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు విద్యాశాఖ అమలు చేస్తున్న ఎఫ్ఎల్ఎన్, టీఎల్ఎమ్, విద్యార్థి తదితర కార్యక్రమాలను ఉపయోగించుకోవాలని సిబ్బందికి సూచించారు.

సచివాలయ సిబ్బందికి బాధ్యత అవసరం

దస్త్రాలు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

రామభద్రపురం, న్యూస్‌టుడే: సచివాలయాల సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని మండల ప్రత్యేకాధికారి ప్రశాంత్ కుమార్ అన్నారు. గురువారం రామభద్రపురం మండలం రొంపల్లి సచివాలయాన్ని తనిఖీ చేశారు. హాజరు పట్టికను పరిశీలించారు. రైతులు పలు సమస్యలను తెలియజేశారు. తక్షణమే పరిష్కరిస్తామని తహసీల్దారు రఫీజాన్ అన్నారు. ఎంపీడీవో బివిల్లి శంకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభించండి

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు సిద్ధంగా ఉంచిన ధాన్యం కొనుగోలు చేయాలని తహసీల్దారు శ్రీను, ఏవో శ్యామసుందర్ ఆదేశించారు. గురువారం తహసీల్దారు కార్యాలయంలో మండలంలోని మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ★ దత్తిరాజేరు: మండలంలో ధాన్యం సేకరణకు 75 వేల గోనె సంచులు సిద్ధంగా ఉంచినట్లు తహసీల్దారు హరికిరణ్ అన్నారు. ★ గజపతినగరం: గజపతినగరంలో తహసీల్దారు రత్నకుమార్, ఏవో కిరణ్‌కుమార్ మాట్లాడారు. ★ చీపురుపల్లి: కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన పరిమాణం మేరకే ట్రక్ షీట్ జనరేట్ చేయాలని తహసీల్దార్ ధర్మరాజు సూచించారు.

దేవాలయాల్లో ప్రత్యేక పూజలు


రామభద్రపురంలో దీపారాధన

రామభద్రపురం: రామభద్రపురం మండలంలోని దేవాలయాల్లో గురువారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. షిర్డీసాయి బాబా, ఆంజనేయ ఆలయాల్లో కార్తిక దీపారాధన జరిగింది. ★ గరివిడి: గరివిడి మండలం కొండశంభాంలో గాయత్రి మహాయాగం నిర్వహించారు. గ్రామం సుభిక్షంగా, ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని కాంక్షిస్తూ జరిపించినట్లు నిర్వాహకులు తెలిపారు. ★ మెంటాడ: మెంటాడలోని ఉమామహేశ్వరస్వామి ఆలయంలో 108 కలశాలతో పంచామృతాభిషేకం నిర్వహించారు.

ఇళ్లకు మోక్షం కల్పించాలి.. బొబ్బిలి: టిడ్కో, జగనన్న ఇళ్లకు మోక్షం కల్పించాలని సీపీఐ నాయకులు డిమాండు చేశారు. రామన్నదొరవలస జగనన్న కాలనీలోని టిడ్కో ఇళ్లు, జగనన్న కాలనీ సముదాయాల వద్ద నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వమైనా దృష్టిసారించి లబ్ధిదారులకు అందజేయాలని కోరారు. ఎం.శ్రీనివాసరావు, కె.అప్పన్న, అశోక్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

కొండంపేట.. సమస్యల కోట

కోసుకుపోయిన ప్రధాన రహదారి

రాజాం, న్యూస్‌టుడే: రాజాం పురపాలిక పరిధిలోని కొండంపేటలో సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాజాం- బొబ్బిలి రహదారి నుంచి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతింది. ఎక్కడికక్కడ గోతులు ఏర్పడ్డాయి. రాజాం- బొబ్బిలి రహదారి నుంచి వెళ్లే దారిలో ప్రారంభంలోనే భారీగా కోసుకుపోయింది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు.

పంచాయతీల కాలంలో నిర్మించిన మురుగునీటి కాలువలు శిథిలమయ్యాయి. కొన్ని వీధులకు కచ్చాకాలువలే దిక్కు. ఒకటో వీధిలో కొత్త స్తంభాలు వేసినా.. పాతవి తొలగించకపోవడంతో రహదారికి అడ్డంగా ఉన్నాయి. కల్లాల వీధులకు రహదారి నిర్మించినా.. ఇరువైపులా కాలువలు వదిలేశారు. ఎస్సీ వీధికి రహదారి, కాలువలు 100 అడుగుల మేర నిర్మించాల్సి ఉంది. సచివాలయం వీధిలో రెండు దశాబ్దాలుగా కాలువలు, రహదారుల నిర్మించాలని కోరుతున్నా ఫలితంలేదు. దేవుడమ్మ, పూసల వీధిల్లోనూ ఇదే పరిస్థితి. శివాలయానికి వెళ్లే దారిలో బంగారం చెట్టు సమీపంలో రహదారి పనులు నిలిచిపోయాయి. రామమందిరం వీధిలో కాలువలు, రోడ్లు నిర్మించాల్సి ఉంది. దేశాలమ్మ తల్లి రెండో వీధి, పాఠశాల వీధిలో వరద కాలువ నిర్మించాలి. సమస్యలన్నీ పరిష్కరిస్తామని రాజాం పురపాలిక కమిషనర్ ఆకురాతి రామచంద్రరావు తెలిపారు.

ప్రాథమిక పాఠశాల సమీపంలో అధ్వానంగా వరద కాలువ

24 గంటల్లోనే ధాన్యం డబ్బులు జమ

ధాన్యం తూకం వేస్తున్న నాయకులు, అధికారులు

గుర్ల, న్యూస్‌టుడే: ధాన్యం అమ్మిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లోకి నిధులు జమ చేస్తామని తెదేపా రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు అన్నారు. తెట్టంగి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. కొనుగోళ్లు పారదర్శకంగా చేపట్టాలని సొసైటీ ఛైర్మన్ కిరణ్‌కుమార్, మాజీ ఎంపీపీ సన్యాసినాయుడు మిల్లర్లకు సూచించారు. తహసీల్దారు ఆదిలక్ష్మి, ఏవో తిరుపతిరావు, సొసైటీ సీఈవో రామునాయుడు, నేతలు మహేశ్వరరావు, అప్పలనాయుడు, సన్యాసినాయుడు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 37 మంది ఎంపిక

ఉద్యోగ మేళాకు హాజరైన అభ్యర్థులు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లి జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం నిర్వహించిన ఉద్యోగ మేళాలో 37 మంది ఉద్యోగాలు సాధించారు. విశాఖలోని అచ్చుతాపురానికి చెందిన సాన్విరా బయోసైన్సెస్ ఫార్మా కంపెనీ ప్రతినిధులు ముఖాముఖిలు నిర్వహించి, ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈనెల 24న విధుల్లో చేరాలని సూచించారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు, అనురాగ్ చౌదరి పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: బొబ్బిలి మండలం కోమటిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థినులు ముగ్గురు అండర్- 14, 17 విభాగాల్లో రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 22న బాపట్లలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం రామ్మోహనరావు తెలిపారు. విద్యార్థినులు లంక శరణ్య, లంక జాహ్నవి, కిలారి జ్ఞానేశ్వరిని వ్యాయామ ఉపాధ్యాయిని రాజేశ్వరి, ఉపాధ్యాయులు అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గజపతినగరం: మానసిక వ్యాధితో బాధపడుతూ పురుగుమందు తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన గజపతినగరం మండలంలో చోటుచేసుకుంది. ఎం.గుమడాం గ్రామానికి చెందిన గంట్యాడ అప్పలనాయుడు (54) మానసిక వైద్యానికి చికిత్స పొందుతున్నారు. బుధవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగారు. కుటుంబసభ్యులు విజయనగరం ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై కిరణ్‌కుమార్‌నాయుడు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

బొబ్బిలి గ్రామీణం: ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొని వ్యక్తి గాయపడిన ఘటన బొబ్బిలి మండలంలో చోటుచేసుకుంది. కింతలవానిపేటకు చెందిన గొల్లపల్లి గోవిందరావు ద్విచక్రవాహనంపై లింగమ్మవలస నుంచి బలిజిపేట మండలం చిలకలపల్లి వెళ్తుండగా.. బలిజిపేట నుంచి బొబ్బిలి వస్తున్న బస్సు కోమటిపల్లి వద్ద ఢీకొంది. తలకు తీవ్ర గాయం కావడంతో స్థానికులు 108లో బొబ్బిలి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం విజయనగరం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీ

బొబ్బిలి: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు గాయపడిన ఘటన బొబ్బిలి పట్టణంలో చోటుచేసుకుంది. బాడంగి మండలం కోటపల్లికి చెందిన హరి, బొబ్బిలి పట్టణానికి చెందిన ధర్మతేజ ద్విచక్రవాహనాలపై ఎదురెదురుగా వస్తూ.. పట్టణంలోని చర్చిసెంటర్ సమీపంలో గురువారం సాయంత్రం ఢీకొన్నారు. ఇద్దరూ గాయపడ్డారు. స్థానికులు సీహెచ్‌సీకి తరలించారు. హరిని విజయనగరం తరలించారు. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు

రాజాం: మద్యం తాగి వాహనం నడుపుతూ ఈనెల 18న పోలీసులకు దొరికిన రాజాం పట్టణంలోని మల్లికార్జునకాలనీకి చెందిన టి.దుర్గాప్రసాద్‌కు జూనియర్ సివిల్ జడ్జి కె.నైమిష మూడు రోజుల జైలు శిక్ష గురువారం విధించినట్లు ఎస్సై ఏఆర్ దామోదర్ ఒక ప్రకటనలో తెలిపారు. రహదారి ప్రమాదాలు తగ్గించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

అవకతవకలపై విచారణకు ఆదేశం

చీపురుపల్లి, న్యూస్‌టుడే: గతంలో చీపురుపల్లి ప్రభుత్వాసుపత్రి సామాజిక ఆరోగ్య కేంద్రంగా ఉన్న సమయంలో జరిగిన అవకతవకలు, అభియోగాలపై అప్పట్లో పనిచేసిన వైద్యాధికారితో పాటు మరో 21 మందిపై పూర్తిస్థాయి విచారణ జరపడానికి ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. విచారణాధికారిగా శ్రీకాకుళం జిల్లా పలాస కిడ్నీ రిసెర్చ్ యూనిట్ సీఎస్ (జీఎల్) డా.ఎం.శ్రీహరిబాబును నియమించింది. దీనిపై పూర్తి నివేదిక సమర్పించాలని వైద్యారోగ్య శాఖ పేర్కొంది.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

మెంటాడ, న్యూస్‌టుడే: మెంటాడ మండలం పోరాం ఉన్నత పాఠశాల పీడీ కొల్లి తవిటినాయుడు ఈనెల 19న గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన సివిల్ సర్వీసెస్ స్పోర్ట్స్ మీట్ రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటారు. జాతీయస్థాయికి ఎంపికయ్యారు. వంద మీటర్ల పరుగును 12.5 సెకన్లలో పూర్తిచేసి ప్రథమ, లాంగ్ జంప్‌లో 4.89 మీటర్లు దూకి ప్రథమ స్థానాలు కైవసం చేసుకున్నారు. వచ్చేనెల 13 నుంచి బిహార్‌లో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం.. గజపతినగరం, దత్తిరాజేరు: గజపతినగరం, కోమటిపల్లి విద్యుత్తు ఉపకేంద్రాల్లో నిర్వహణ పనుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ బి.రఘు తెలిపారు. మెంటాడ: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ రఘు తెలిపారు.

గ్రంథాలయ వారోత్సవాల ముగింపు

బాడంగిలో బహుమతులతో చిన్నారులు

న్యూస్‌టుడే బృందం: గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా అన్ని గ్రంథాలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ★ బాడంగి గ్రంథాలయంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు డైరెక్టర్ రౌతు రామ్మూర్తినాయుడు మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే చదవడం అలవరుచుకోవాలని సూచించారు. పోటీల్లో గెలిచిన చిన్నారులకు బహుమతులు అందించారు. ★ యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు కె.విజయగౌరి బొబ్బిలిలో మాట్లాడారు. చిన్నారులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

వేతనదారుల సంఖ్య పెంచాలి

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: బొబ్బిలి మండలం జె.రంగరాయపురం పంచాయతీలో ఉపాధిహామీ పనులను ఎంపీడీవో రవికుమార్ గురువారం పరిశీలించారు. వేతనదారుల సంఖ్య పెంచాలన్నారు. మస్తర్లు పరిశీలించారు. ముందస్తు కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు. ★ రామభద్రపురం: రామభద్రపురంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీవో రత్నం పరిశీలించారు. మస్తర్లు తనిఖీ చేశారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

గుంతతో చింత

బొబ్బిలి పట్టణంలోని రాజా కళాశాల సమీపంలో ప్రధాన రహదారిపై భారీ గుంతతో నిత్యం ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇటీవల వరుసగా వాహనాలు అందులో కూరుకుపోతున్నాయి. గురువారం ఉదయం భారీ లారీ దిగిపోయింది. ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తాయి. గుంతను పూడ్చే చర్యలు కనిపించడం లేదని వాహనాల యజమానులు ఆరోపిస్తున్నారు. వాడుక నీరు రాకుండా కట్టడిచేస్తే కొంతవరకు సమస్య తొలుగుతుంది. త్వరలో సమస్య పరిష్కరిస్తామని కమిషనర్ రామలక్ష్మి తెలిపారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి

జీడి మామిడి తోటల సాగుపై శిక్షణ

రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్త

గరివిడి, న్యూస్‌టుడే: గరివిడి మండలం ఎం.దుగ్గివలసలో జీడి మామిడి తోటల సాగుపై గురువారం రైతులకు శిక్షణ నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త ఎస్.శ్రీనివాసరాజు జీడి మామిడి పంట యాజమాన్య పద్ధతులు, ఎరువులు, సస్య రక్షణ చర్యలు గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యాన శాఖ అధికారి ఎం.అనూష, మాజీ సర్పంచి బి.రమణమూర్తి పాల్గొన్నారు. ★ గజపతినగరం: ఉద్యాన శాఖ అధికారి బి.దీప్తి గుడివాడ, మరుపల్లి గ్రామాల్లో మామిడి తోటలను పరిశీలించి రైతులకు యాజమాన్య పద్ధతులు వివరించారు.

పైపులకు లీకులు.. ప్రయాణికులకు పాట్లు

ఆసుపత్రి రోడ్డులో లీకులు పరిశీలిస్తున్న కమిషనర్

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి పట్టణంలో తాగునీటి పైపులైన్ల లీకులతో రక్షిత నీరు కలుషితమవుతోంది. మరోవైపు నీటి నిల్వతో రహదారులు గుంతలమయమవుతున్నాయి. విద్యుత్తుశాఖ కార్యాలయం సమీపంలో ప్రధాన పైపులైను నెల రోజులుగా లీకవుతోంది. ఆసుపత్రి దారిలో తరచూ లీకులు ఏర్పడుతున్నాయి. సకాలంలో చర్యలు తీసుకోవడంలో పుర ఇంజినీర్లు విఫలమవుతున్నారు. దీనివల్ల రహదారులకు నష్టం కలుగుతోంది. పురాతన పైపులైన్లు కావడంతో లీకులు వస్తున్నాయని పుర కమిషనర్ రామలక్ష్మి అన్నారు. ఆసుపత్రి రోడ్డులో భారీ వాహనాలు వెళ్లడంతో పైపులు పాడవుతున్నాయని, సరిచేస్తామని తెలిపారు.

సేవా మార్గంలో పయనించాలి

బొబ్బిలి, న్యూస్‌టుడే: బాబా సేవా మార్గంలో భక్తులు పయనించాలని ఉపఖాజానాధికారి వెంకటపద్మనాభం అన్నారు. సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా బొబ్బిలి సమితి ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమాల్లో మాట్లాడారు. ● రాజాం గ్రామీణం: సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాజాం పట్టణం పరిధి కంచరవీధిలోని సత్యసాయి మందిరంలో పేదలకు వస్త్రదానం చేశారు. జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సౌజన్యంతో కార్యక్రమం చేపట్టినట్లు కన్వీనర్ కొనపల బసవరాజేశ్వరరావు తెలిపారు. కమిటీ సభ్యులు ప్రసాదరావు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

మేము తోడుగా.. మీకు తోడుగా (10 AM TO 1 PM)
విజయనగరం పట్టణం -80089 02900
విజయనగరం గ్రామీణం -80085 74317
ఎస్.కోట -8008574326
బొబ్బిలి -70959 54646

?: గుంకలాం శివారు ప్రాంతంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. దోమలు విజృంభిస్తున్నాయి. – స్థానికులు ☛: కార్మికులతో పనులు చేయిస్తాం. – శంకరరావు, పంచాయతీ కార్యదర్శి – న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

?: ఓ మందిరం ప్రాంతంలో కుక్కల సంచారం ఎక్కువగా ఉంది. – స్థానికులు ☛: సిబ్బందిని పంపించి చర్యలు తీసుకుంటాం. – కె.సాంబమూర్తి, ప్రజారోగ్య అధికారి

?: పోలయ్యపేటలో చెత్త పేరుకుపోయింది. – స్థానికులు ☛: వెంటనే బాగు చేయిస్తాం. – రవి, ఏఈ

?: పోలయ్యపేటలో రహదారి అధ్వానంగా మారింది. – స్థానికులు ☛: మరమ్మతులు చేస్తాం. – పి.నల్లనయ్య, కమిషనరు – న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

?: కల్యాణీనగర్‌లో వ్యర్థాలను తొలగించడం లేదు. – స్థానికులు ☛: సిబ్బందిని పంపించి చర్యలు తీసుకుంటాం. – కె.సాంబమూర్తి, ప్రజారోగ్య అధికారి – న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

తెరపై ఈనాడు
● ఎస్వీఎస్: పాంచ్ మినార్ ● శ్రీకృష్ణ: రాజు వెడ్స్ రాంబాయి ● ఆదిత్య: కె.ర్యాంప్ ● లీల మహల్: ప్రేమంటే ● రంజని ప్రీమియర్-1: 12ఎ రైల్వే కాలనీ, కొదమ సింహం ● శివరంజని ప్రీమియర్-2: ప్రేమంటే ● హిమగిరి: 12ఎ రైల్వే కాలనీ ● సప్తగిరి: శివ, మస్తీ పోలీస్ – న్యూస్‌టుడే, కంటోన్మెంట్

విజయనగరం
●విజయనగరం ●నెల్లిమర్ల ● ఎస్.కోట

రైతు సమస్యలా.. ఫోన్ చేయండి

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: శృంగవరపుకోట మండలంలో వ్యవసాయానికి సంబంధించి ఏమైనా సమస్యలున్నాయా? వరి కోతలు, నూర్పులు, అపరాల సాగు, తెగుళ్లు, ధాన్యం విక్రయాలు, అన్నదాత-సుఖీభవ మంజూరులో ఇబ్బందులున్నాయా? సమస్యలను మండల వ్యవసాయాధికారి కె.రవీంద్ర దృష్టికి తీసుకువెళ్లే అవకాశాన్ని 'ఈనాడు' కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా ఫోన్ చేయడమే.

★ తేదీ: 22.11.25 (శనివారం)
★ సమయం: ఉదయం 10 గంటల నుంచి 11 గంటల మధ్య
★ చేయాల్సిన ఫోన్ నెంబరు: 83310 56300

నిధులున్నా నీరసం.. దరిచేరని లక్ష్యం

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థలో అభివృద్ధి పనులు ఎక్కువగా మంజూరు చేస్తున్నా సకాలంలో పూర్తి చేయడం లేదు. మౌలిక సదుపాయాలు లేక నగరవాసులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ఏడాది రూ.30.01 కోట్లతో 271 పనులు మంజూరుకాగా ఇప్పటి వరకు 65 మాత్రమే పూర్తి చేశారు. పనులలో జాప్యం జరుగుతుండడంతో విమర్శలు వస్తున్నాయి.

కమ్మవీధిలో కాలువ నిర్మాణ పనులు

రూ.3.50 కోట్లు చెల్లింపు

నగరంలో చేసిన పనులకు సంబంధించి నిధి పోర్టల్‌లో రూ.12కోట్లు బిల్లులు అప్‌లోడ్ చేశారు. గుత్తేదారులకు రూ.3.50 కోట్లు చెల్లించారు. రూ.8.50 కోట్లు చెల్లించాల్సి ఉంది. మరో రూ.3 కోట్ల బిల్లులు అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాల్సి ఉంది. అలా చేస్తేనే పే అండ్ అకౌంట్ విభాగం ప్రభుత్వానికి పంపిస్తుంది. అయితే సెలవులు, ఇతర కారణాలతో గడువులోగా చాలా బిల్లులు అప్‌లోడ్ కాలేదని, దీనివల్ల ఇబ్బందులు పడుతున్నామని గుత్తేదారులు ఆరోపిస్తున్నారు.

పనులు వేగవంతం చేస్తాం..

ఒక్కరే ఎక్కువ పనులకు టెండర్లు వేస్తుండడంతో జాప్యం జరుగుతోంది. సకాలంలో పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నాం. పూర్తయిన వాటి బిల్లులు నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం. సకాలంలో ప్రారంభించకుంటే నోటీసులు జారీ చేస్తున్నాం. గుత్తేదారుల సమ్మె కారణంగా టిడ్కో విభాగం ద్వారా చెల్లింపులకు సీఎఫ్ఎంఎస్ లేఖలు రాశాం. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు చర్యలు చేపడతాం. – పి.నల్లనయ్య, కమిషనరు

ఇదీ పరిస్థితి..

నగర పాలికలో ఒక గుత్తేదారే ఎక్కువ పనులకు టెండర్లు వేస్తున్నారు. కొన్ని చేసి, వాటికి బిల్లు వచ్చే వరకు మిగతావి చేయడం లేదు. దీంతో జాప్యం జరుగుతోంది. కొందరు 28 నుంచి 30 శాతం తక్కువకు వేస్తుండడంతో మిగతావారు రావడం లేదు. మరో వైపు గత రెండేళ్ల పాత బకాయిలు చెల్లించాలని గుత్తేదారులు జీవీఎల్ సమ్మె చేపట్టారు. టిడ్కో విభాగం ద్వారా థర్డ్ పార్టీ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. పూర్తి చేసిన పనికి కమిషనర్ నుంచి పాస్ ఆర్డర్ వచ్చిన తర్వాత 5.57 శాతం వడ్డీ మినహా మిగతా బిల్లు చెల్లించాలని కోరారు. ఇందుకు రూ.6 కోట్లు వరకు నగర పాలక సంస్థ పీడీ ఖాతా నుంచి జమ చేయాల్సి ఉంటుంది. జీవీఎల్‌ జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో దీనిపై చర్చించి, కమిషనరు ద్వారా సీఎఫ్ఎంఎస్‌కు లేఖ రాశామని అధికారులు తెలిపారు. సకాలంలో పనులు చేయని వారిని బ్లాక్ లిస్ట్‌లో ఉంచాలని కోరారు.

అధ్వానంగా ఉద్యానాలు.. గుంతల రహదారులు

బాలాజీనగర్‌లోని చైతన్య కళాశాల దారిలో ఉద్యానం దుస్థితి

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: విజయనగరం నగరపాలక సంస్థ పరిధి 33వ డివిజన్‌లోని బాలాజీనగర్‌లో నెలకొన్న సమస్యలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. పడుచేట్ల కల్వర్టు పలకలు పాడై ప్రమాదకరంగా మారాయి. న్యూసెంట్రల్ పాఠశాల దారిలో ఈ పరిస్థితి కనిపిస్తోంది. బాలాజీ నగర్ వివిధ లైన్లలో రహదారి గుంతలమయమైంది. ఈ వీధిలో కాలువలు శుభ్రం చేయడం లేదని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. దోమల బెడద ఎక్కువగా ఉందని ఆందోళన చెందుతున్నారు. నాలుగో లైనులో రహదారులకు ఇరువైపులా తుప్పలు పెరిగి వాటిని తరలించడం లేదు. ఉద్యానాలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. చైతన్య కళాశాల ఎదురుగా ఉన్న ఉద్యానం నిర్వహణ లేక పనికిరాని మొక్కలు పెరిగాయి. ఆట పరికరాలు విరిగిపోయాయి. బాలాజీ కాలనీలోనూ ఇదే పరిస్థితి. వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంతంలోని మూడు వీధుల్లో కాలువలపై పలకలు లేవు. తూనికలు, కొలతల శాఖ కార్యాలయం వైపు వెళ్లే రహదారి దారుణంగా మారింది. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనరు పి.నల్లనయ్య తెలిపారు.

దళితులపై దాడులు ఆపాలి

నెల్లిమర్ల: దళితులపై దాడులను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని జైభీమ్‌రావు భారత్ పార్టీ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు కోరారు. విజయనగరంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ జవహర్‌కు వినతిపత్రం అందజేశారు. దళితుల భూములను కబ్జా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడుతామని ఆయన హామీ ఇచ్చారు.

డిగ్రీలో ప్రవేశాలకు ఆహ్వానం

ఎస్.కోట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 24తో గడువు ముగియనుందని, అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ సీహెచ్ కేశవరావు తెలిపారు. కళాశాలలో బీకాం హానర్స్, బీఏ ఎకనామిక్స్, బీఎస్సీ పొలిటికల్ సైన్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, మ్యాథ్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు.

విశ్రాంతి తీసుకుంటోంది..!

ఎస్.కోట మండలం కిల్తంపాలెం నవోదయ విద్యాలయం వద్ద ఉన్న బస్టాండు శిథిలావస్థకు చేరుకుని నిరుపయోగంగా మారుతోంది. పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు బస్సుల కోసం ఇక్కడే వేచి ఉంటున్నారు. స్లాబు పాడవడంతో వర్షం పడితే కారుతోంది. జీవీఎల్ జాతీయ రోడ్డు నిర్మాణం పైకి, భవనం కిందికి ఉండడంతో వాననీరు నిల్వ ఉంటోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, శృంగవరపుకోట

అధ్వానం.. అవస్థలమయం

డెంకాడ మండలంలోని మోపాడ నుంచి కొండరాజుపేట, బంగార్రాజుపేట వెళ్లే ప్రధాన రహదారి గుంతలతో అధ్వానంగా దర్శనమిస్తోంది. ఎక్కడికక్కడే గుంతలు ఏర్పడడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఒళ్లు గుల్లవుతోందని, వాహనాలు పాడవుతున్నాయని వాపోతున్నారు. ఎంపీడీవో భవానీని వివరణ కోరగా సంబంధిత అధికారులతో మాట్లాడి రహదారి మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, డెంకాడ

దోమల విజృంభణ

ఎస్.కోట పట్టణంలో పారిశుద్ధ్యం చర్యలు కానరావడం లేదు. పట్టణ శివారు ఎస్‌డబ్ల్యూపీ కేంద్రం వద్ద జాతీయ రహదారి పక్కన తాగి పడేసిన కొబ్బరి బొండాలు కుప్పలుగా పేరుకుపోయాయి. రోజుల తరబడి తరలించక, వర్షాలకు నీరు చేరి దోమలు విజృంభిస్తున్నాయి. రోగాలు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొలగించి, మళ్లీ వేయకుండా చర్యలు తీసుకుంటామని పంచాయతీ శానిటరీ మేస్త్రీ నానిగిరి కృష్ణ తెలిపారు. – న్యూస్‌టుడే, శృంగవరపుకోట

రోడ్డు తవ్వారు.. వదిలేశారు.!

కొత్తవలసలోని శారదానగర్, మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టుకు వెళ్లే మార్గంలో రహదారి తవ్వి వదిలేశారు. ఇటీవల మొంథా తుపాను కారణంగా ఆర్బీసీ సముదాయం, సాయినగర్ ప్రాంతంలో నీరు నిలిచిపోయింది. నీరు పోయేందుకు రోడ్డు తవ్వారు. నేటికి పూడ్చకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో పెట్రోల్ బంక్ పక్క నుంచి మలుపు తిరిగి శారదానగర్‌కి, కోర్టుకు వెళ్తున్నారు. పంచాయతీ కార్యదర్శి బి.శైలజ దృష్టికి తీసుకువెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. – న్యూస్‌టుడే, కొత్తవలస

కార్యాలయం పెచ్చులూడుతోంది!!

జిల్లా కేంద్రంలో కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న మండల వ్యవసాయాధికారి కార్యాలయం శిథిలస్థితికి చేరింది. గోడలు, స్లాబు, పిల్లర్లు పెచ్చులూడుతున్నాయి. గదుల్లో కూర్చుని విధులు నిర్వహించడానికి ఉద్యోగులు భయపడుతున్నారు. వర్షాల సమయంలో పైనుంచి నీరు కారుతోందని చెబుతున్నారు. ఈ సమస్యను వ్యవసాయాధికారి శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంకండి

ప్రమాణ స్వీకారం చేస్తున్న మండలాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

జామి, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని ఎమ్మెల్యే లలితకుమారి అన్నారు. గురువారం జామిలో నిర్వహించిన తెదేపా మండల కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు. కష్టపడి పని చేసినవారికి గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం మండలాధ్యక్షుడిగా వర్రి రమణ, సభ్యులు ప్రమాణం చేశారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాంప్రసాదు, గజపతినగరం నియోజకవర్గ అధ్యక్షుడు పి.స్వామి నాయుడు, ప్రధాన కార్యదర్శి రమణమ్మ, దాసరి కార్పొరేషన్ రాష్ట్రాధ్యక్షుడు పీవీ రత్నాజీ, నాయకులు రాధాకృష్ణ, ఎర్నాయుడు, పైడిబాబు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.శ్రీలక్ష్మి, సర్పంచి వెంకట త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో పచ్చదనం.. స్వచ్ఛతకు శ్రీకారం

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: పల్లెల్లో పచ్చదనం, పరిశుభ్రత నింపేందుకు ప్రభుత్వం నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2030 నాటికల్లా గ్రామాలను స్వచ్ఛంగా మార్చి తద్వారా అభివృద్ధి సాధించాలని ఐక్యరాజ్య సమితి పేర్కొంది. ఈ మేరకు అధికారులు చర్యలకు ఉపక్రమించారు. దీనికోసం రెండు రోజులుగా సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణలు ఇచ్చారు.

ఎంపిక చేసిన గ్రామాలివీ..

లక్కవరపుకోట మండలం తలారి, కొత్తవలసలోని చింతలపాలెం, జామి, ఎస్.కోట, వేపాడ మండల కేంద్రాలు.

అవగాహన సదస్సులు..

ఈ కార్యక్రమం కోసం మండలానికో గ్రామాన్ని ఎంపిక చేస్తున్నారు. ముందస్తు ప్రణాళికలు రూపొందించి, ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. గ్రీన్ అంబాసిడర్లతో స్వచ్ఛత పనులు చేయించనున్నారు. కాలువలు, పరిసరాల పరిశుభ్రత, చెత్త సేకరణ, తరలింపు, మురుగు నిల్వ ఉండకుండా చర్యలు, చెత్తతో సంపద తయారీ తదితరాలు చేపట్టనున్నారు. ఎంపిక చేసిన గ్రామాలకు శుక్రవారం గ్రీన్ అంబాసిడర్లు బయల్దేరనున్నారు. ఈ ప్రక్రియకు ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో కుమార్ తెలిపారు. పంచాయతీలను మెరుగు పరిచే దిశగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు పరిశీలకుడు డీపీఆర్సీ రిసోర్స్ పర్సన్ ఎన్.ఖాన్ పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండు

నిరసన తెలుపుతున్న వీఆర్‌ఏలు

విజయనగరం గ్రామీణం, న్యూస్‌టుడే: రెవెన్యూ శాఖలో అర్హులైన వీఆర్‌ఏలకు వీఆర్వోలుగా ఉద్యోగోన్నతి కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహనరావు, జిల్లా అధ్యక్షుడు కె.గురుమూర్తి డిమాండ్ చేశారు. గురువారం విజయనగరంలోని తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు.

హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి

జవహర్‌ను సత్కరిస్తున్న జేఏసీ నాయకులు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని జిల్లా పౌరుగు సేవల ఉద్యోగుల జేఏసీ డిమాండ్ చేసింది. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నాయకులు జి.మహేంద్రబాబు, పల్లిక శ్రీను తదితరులు గురువారం జడ్పీ అతిథి గృహంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కె.ఎస్.జవహర్‌ను కోరారు. ముందుగా ఆయనకు పుష్పగుచ్ఛమందించి, సన్మానించారు. ● జవహర్‌ను ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మర్యాదపూర్వకంగా కలిశారు.

పుస్తక పఠనంతో మనో వికాసం

ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: పుస్తక పఠనంతో మనో వికాసం పెంపొందుతుందని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ అన్నారు. విజయనగరంలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన పుస్తక సమీక్ష పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. గతానికి వర్తమానాన్ని, భవిష్యత్తును అనుసంధానం చేసే అద్భుతశక్తి ఒక్క పుస్తకానికే ఉందన్నారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం సహాయ లైబ్రేరియన్ నారాయణ, కళాశాల సంచాలకుడు ఎం.శశిభూషణరావు పాల్గొన్నారు. ● **ఎస్.కోట, ఎల్.కోట, నెల్లిమర్ల, డెంకాడ, వేపాడ** మండలాల్లోనూ కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు అతిథులు, గ్రంథాలయాధికారులు బహుమతులు అందజేశారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: గంగుబూడి ఉన్నత పాఠశాల విద్యార్థులు బి.కీర్తన, సీహెచ్ హరిత, కె.జాషువా సుందర్ రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శారదాదేవి, వ్యాయామ ఉపాధ్యాయుడు రవికుమార్ గురువారం తెలిపారు. 21 నుంచి 23 వరకు నూజివీడులో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ● **నెల్లిమర్ల:** సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయ వాలీబాల్ పోటీలకు నెల్లిమర్ల మిమ్స్ వైద్య కళాశాల విద్యార్థినులు డి.సృజన, భార్గవి ఎంపికైనట్లు పీడీ కె.కళావెంకటరావు తెలిపారు. ఛైర్మన్ ఎ.సత్యనారాయణ రాజు, మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ప్రవీణ్‌వర్మ, డీన్ లక్ష్మీకుమార్, డైరెక్టర్ వేణుగోపాలరావు అభినందించారు. ● **జామి:** కుమరాం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మణికంఠ, జశ్వంత్ రాష్ట్రస్థాయి బాస్కెట్ పోటీలకు, మానస, చైతన్య, ప్రదీప్ వాలీబాల్‌కు ఎంపికయ్యారు. హెచ్‌ఎం బాబులాల్, జి.శ్రీనువాసరావు, పీడీలు ఆర్.జగదీష్, సన్యాసినాయుడు అభినందించారు.

ఉపాధ్యాయులతో విద్యార్థులు

ప్రారంభ దశలోనే గుర్తించాలి

కొత్తవలస: ప్రారంభ దశలోనే కుష్ఠువ్యాధిని గుర్తించాలని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ సూచించారు. తుమ్మికాపల్లి, సీతంపేటలో గురువారం నిర్వహించిన ఎల్‌సీడీసీ సర్వేను పరిశీలించారు. అనుమానిత కేసుల్ని గుర్తించి వ్యాధి వ్యాప్తి, లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. లెపర్సీ నోడల్ పర్సన్ ఎం.ఈశ్వరరావు, ఆరోగ్య సహాయకులు సత్యారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వంద మందికి నిత్యావసరాల పంపిణీ

కొత్తవలస: సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం సమితి ఆధ్వర్యంలో 100 మందికి నిత్యావసరాలను ఎమ్మెల్యే లలితకుమారి, రాష్ట్ర దాసరి కార్పొరేషన్ ఛైర్మన్ రత్నాజీ పంపిణీ చేశారు. కన్వీనర్ పి.రవికుమార్, పీఏసీఎస్ ఛైర్మన్ వెంకటరమణ, మాజీ ఎంపీపీ జి.జయప్రకాష్ నారాయణ, కె.అప్పారావు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

నేరవార్తా విభాగం: వినియోగదారులు దొంగ బంగారం కొనుగోలు చేయొద్దని డీఎస్పీ ఆర్.గోవిందరావు సూచించారు. గురువారం ఒకటో పట్టణ స్టేషన్ ప్రాంగణంలో బంగారం వర్తకులతో సమావేశమయ్యారు. కాపలాదారులను నియమించుకోవాలని, సీసీ కెమెరాలు అమర్చుకోవాలన్నారు.

ఉప సర్పంచిపై కేసు నమోదు

జామి: అలమండ ఉప సర్పంచి లగుడు దేముడుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరజనార్దన్ తెలిపారు. రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన కోట అప్పారావు ఇంటి నిర్మాణానికి తీసుకొచ్చిన పిక్క ఇసుకను కమ్యూనిటీ హాలు గోడ వద్ద ఉంచారు. ఈ నెల 12న ఇది చూసిన దేముడు ఇక్కడ ఎందుకు ఉంచారని ప్రశ్నిస్తూ, వాదులాటకు దిగాడని, కులంపేరిట దూషించాడని అప్పారావు ఫిర్యాదు చేశాడు.

విద్యాప్రగతిలో మేటిగా నిలవాలి

దస్త్రాలను పరిశీలిస్తున్న డీఈవో

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలు విద్యా ప్రగతిలో మేటిగా నిలవాలని, అందుకు ప్రణాళికాబద్ధంగా బోధన చేయాలని డీఈవో యు.మాణిక్యం నాయుడు తెలిపారు. గురువారం ఆయన వీరభద్రపేట పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించి, దస్త్రాలు, రిజిస్టర్ తనిఖీ చేశారు. ఎంఈవో సీహెచ్ కూర్మారావు, హెచ్‌ఎం ఏవీ ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు ఉన్నారు.

జాతీయస్థాయికి ఎంపిక

కొత్తవలస, న్యూస్‌టుడే: ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఈనెల 23 నుంచి 29 వరకు నిర్వహించనున్న స్కౌట్స్, గైడ్స్ జాతీయ జంబోరికి జిల్లా నుంచి కొత్తవలస జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 26 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిలో 8 మంది స్కౌట్స్(బాలురు), 18 మంది గైడ్స్(బాలికలు) ఉన్నారు. శుక్రవారం వీరు బయల్దేరనున్నారు. గతంలోనూ ఈ పాఠశాల నుంచి 19 మంది వెళ్లారని గైడ్స్ జిల్లా ట్రైనింగ్ కమిషనర్ ఎ.కనక లక్ష్మి చెప్పారు. హెచ్‌ఎం సీహెచ్.ఈశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

క్షేత్రస్థాయిలో పర్యటించండి

విజయనగరం పట్టణం: సచివాలయాల సిబ్బంది రోజూ క్షేత్రస్థాయిలో పర్యటించి, సమస్యలను గుర్తించాలని కమిషనరు పి.నల్లనయ్య ఆదేశించారు. గురువారం ఏడో నంబరు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విధులకు సకాలంలో హాజరు కావాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వసూళ్లపై విచారణ

నేరవార్తా విభాగం: నగరంలోని ఘోషాసుపత్రిలో ఉద్యోగాలు ఇప్పిస్తానని ఓ వ్యక్తి డబ్బులు వసూలు చేయడంపై 'ఈనాడు'లో గురువారం వచ్చిన వార్తపై ఆసుపత్రి సూపరింటెండెంటు అల్లు పద్మజ స్పందించారు. తన కార్యాలయంలో విచారణ జరిపారు. నిందితుడు నలుగురి వద్ద రూ.80 వేల వరకు వసూలు చేశాడని చెప్పారు. అధికారికంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ● ఘోషాలో సెక్యూరిటీ గార్డుపై జరిగిన దాడిపై ఆరా తీశారు.

28న ప్రారంభం

విద్యావిభాగం: నగరంలో నిర్మిస్తున్న శేషగిరి విజ్ఞాన కేంద్రాన్ని వచ్చేనెల 28న ప్రారంభించనున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, కోశాధికారి రెడ్డి మోహనరావు తెలిపారు. గురువారం పనులను పరిశీలించారు.

జూదరుల అరెస్టు

ఎల్.కోట: మండలంలోని భీమాళి గ్రామ పొలిమేరలోని మామిడితోటలో నిర్వహిస్తున్న జూద శిబిరంపై పోలీసులు దాడులు చేశారు. నలుగురిని అరెస్టు చేసి, రూ.24,110 స్వాధీనం చేసుకున్నామని ఎస్సై నవీన్‌పడాల్ తెలిపారు.

మర్యాదపూర్వక కలయిక

భోగాపురం: పోలిపల్లిలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగార్రాజును నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ కె.సత్యవతి మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కౌన్సిలర్ ఎ.సత్యనారాయణ ఉన్నారు.

ఆలయంలో దొంగతనం

కొత్తవలస: విశాఖపట్నం-అరకు జాతీయ రహదారికి ఆనుకొని మంగళపాలెం కూడలిలోని హనుమాన్ ఆలయంలో గురువారం వేకువజాము 2 గంటల సమయంలో చోరీ జరిగింది. ఇద్దరు యువకులు, ఒక యువతి ద్విచక్ర వాహనంపై వచ్చి హుండీ, యాంపిల్‌ఫైర్ దొంగిలించినట్లు సీసీ కెమెరాలో రికార్డయింది. గ్రామస్థులు పోలీసులు ఫిర్యాదు చేశారు.

అక్షరాంధ్రతో మహిళలకు మేలు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: అక్షరాంధ్రతో మహిళలకు మరింత మేలు జరుగుతుందని నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ బంగారు సరోజని అన్నారు. గురువారం నెల్లిమర్లలో మెప్మా ఆధ్వర్యంలో వయోజన విద్యా వాలంటీర్స్, మహిళ సంఘాల సభ్యులకు శిక్షణ ఇచ్చారు. డ్వాక్రా సంఘాల లావాదేవీలు అర్థం కావాలంటే ప్రతి మహిళ చదవడం, రాయడం నేర్చుకోవాలన్నారు. అనంతరం మెప్మా అమలు చేస్తున్న కార్యక్రమాల వార్షిక సంచిక 'అవని' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కమిషనరు టి.జయరాం, మెప్మా అధికారి రాము, మహిళలు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించాలి

గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

డెంకాడ, న్యూస్‌టుడే: ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని, అధికారులు నిబద్ధతతో పనిచేయాలని ఎమ్మెల్యే నాగమాధవి సూచించారు. బంటుపల్లిలో గురువారం 'మన ప్రజలతో మన ఎమ్మెల్యే' కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. గొడిపాలెం నుంచి వచ్చే సాగునీటి కాలువలో పూడిక తీత పనులు చేపట్టాలన్నారు. ఆక్రమణలుంటే తొలగించి అవసరమైన చోట శ్లాబు కల్వర్టులు, పైపులైన్లు వేయాలన్నారు. ఎంపీపీ బి.వాసుదేవరావు, నాయకులు జనార్దనరావు, కె.మురళీ, సురేష్, శ్రీను పాల్గొన్నారు.

కొత్తవలస చేరుకున్న అభ్యుదయ సైకిల్ యాత్ర

మాట్లాడుతున్న సీఐ షణ్ముఖరావు, వేదికపై సైకిల్ యాత్రికులు

కొత్తవలస, న్యూస్‌టుడే: డ్రగ్స్ రహిత సమాజస్థాపన కోసం పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు అభ్యుదయం పేరుతో పోలీసులు నిర్వహిస్తున్న సైకిల్ యాత్ర గురువారం కొత్తవలస చేరుకుంది. సీఐ సీహెచ్.షణ్ముఖరావు వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దెందేరు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. శుక్రవారం ఉదయం జిల్లాలో యాత్ర ప్రారంభించనున్నారని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తవలస, న్యూస్‌టుడే: లక్కవరపుకోట మండలం కొట్యాడ గ్రామానికి చెందిన కె.అక్కునాయుడు(53) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు సీఐ షణ్ముఖరావు తెలిపారు. పెందుర్తి మండలం నందవరపువానిపాలెంలో కుమార్తె ఎం.చంద్రకళ వద్ద ఉంటున్న ఈయన స్వగ్రామంలో బుధవారం బంధువు మృతి చెందడంతో ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగొస్తుండగా దెందేరు సమీపంలో అదుపుతప్పి బోల్తా పడ్డాడు. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పెద్ద కుమార్తె బి.రోహిణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

(c) eenadu

గోదావరికి పుష్కర శోభ

జిల్లాలో స్నాన రేవుల ఆధునికీకరణకు ప్రతిపాదనలు

ఈనాడు డిజిటల్, భీమవరం, పెనుగొండ గ్రామీణ, నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: గోదావరి పుష్కర శోభ అప్పుడే మొదలైంది. నదీ తీరంలో పుణ్యస్నానాలకు పోటెత్తే భక్తుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధి చేయడంతో పాటు రద్దీకి తగ్గట్టుగా రహదారుల నిర్మాణం, ఆలయాల సుందరీకరణపై ప్రత్యేక దృష్టి సారించారు.

● తెదేపా హయాంలోనే 2015లో పుష్కరాలు జరిగాయి. అప్పట్లో రూ. కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి చేశారు. గత పుష్కరాలకు జిల్లాలో సుమారు 50 లక్షల మంది స్నానాలు చేయగా 2027 జులై 23 నుంచి ఆగస్టు 3 వరకు జరుగనున్న పుష్కరాలకు మరింత పెరుగుతారని అంచనా వేశారు.

మరో ఏడు

గత పుష్కరాలకు 32 ఘాట్లు ఉండగా మరో ఏడింటిని పెంచనున్నారు. ఆచంటలో కోడేరు, పల్లిపాలెం, రావిలంక, పుచ్చల్లంక, కరుగోరుమిల్లి, అయోధ్యలంక, పాలకొల్లులో కె.ఎస్.పాలెం, నరసాపురంలోని నవరసపురం సమీపంలో కొత్త ఘాట్లు నిర్మించనున్నారు. వీటికి ఆయా ప్రాంతాలను బట్టి రూ. కోటి నుంచి కోటిన్నర వరకు ఖర్చు చేయనున్నారు.

అభివృద్ధి, సుందరీకరణ

గత పుష్కరాల్లో నరసాపురంలో అయిదు ఘాట్లతో పాటు లక్ష్మణేశ్వరం, రాజుల్లంక, ఆకుటెల్ల కోడేరు, సిద్ధాంతం, యలమంచిలి, దొడ్డిపట్లలో ఘాట్లు ఏర్పాటు చేశారు. వాటి అభివృద్ధి, సుందరీకరణకు రూ.108 లక్షలతో ప్రతిపాదనలు పంపించారు. నరసాపురంలోని వలందర రేవు, ఆచంటలోని పెద్దమల్లం ఘాట్లను రూ.7 లక్షల చొప్పున ఆధునికీకరించనున్నారు. పెద్దమల్లం మసేనమ్మ ఆలయం వద్ద రూ.25 లక్షలతో 4.5 కిలోమీటర్ల రహదారి నిర్మించనున్నారు. దొంగరావిపాలెం, కేదారేశ్వరస్వామి ఆలయం, దొడ్డిపట్ల, ఆచంట, చించినాడ, లలితాంబ రేవుల వద్ద సుందరీకరణకు సన్నాహాలు చేస్తున్నారు.

త్వరలోనే కొలిక్కి

జిల్లాలో గోదావరి తీరంలో మూడు అయిదు కిలోమీటర్ల పరిధిలో ఉన్న దేవాలయాలతో పాటు ప్రసిద్ధ ఆలయాలను సందర్శించే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రణాళిక చేస్తున్నాం. ఏపీ రేవుల వద్ద రద్దీ ఎక్కువ ఉంటుంది, వాహనాల పార్కింగ్, మహిళలు వస్త్రాలు మార్చుకునేందుకు వసతి, మంచినీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య నిర్వహణ, ట్రాఫిక్ మళ్లింపు తదితర అంశాలను ఆయా శాఖల వారీగా నివేదికలు తయారు చేస్తున్నాం. త్వరలో పనులు మొదలు పెడతాం.

- ఎ.వెంకటఅప్పారావు, జిల్లా పర్యాటకశాఖ అధికారి

పోలింగ్ కేంద్రానికి 1200 మంది ఓటర్లు

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఒక్కో పోలింగ్ కేంద్రానికి గరిష్ఠంగా 1200 ఓటర్లను మాత్రమే కేటాయించాలని కలెక్టర్ నాగరాణి తెలిపారు. ఆ అంశంపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో ఆమె గురువారం సమీక్ష నిర్వహించారు. గతంలో ఆ సంఖ్య 1500 ఉండేదని చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న 1461 పోలింగ్ కేంద్రాలతో పాటు అదనంగా 123 సిద్ధం చేశామన్నారు. పోలింగ్ కేంద్రం ప్రాంతం, పేరు మార్పులకు ప్రతిపాదనలు తయారు చేశామని పేర్కొన్నారు. ఓటరుగా నమోదు చేసుకున్న 7,432 మందికి ఎపిక్ కార్డులు ఇస్తామని వివరించారు. అర్హత కలిగిన వారు ఓటరుగా నమోదు చేయించుకునేందుకు రాజకీయ పార్టీలు ప్రోత్సహించాలని సూచించారు.

హాయ్ చెప్పండి.. ధాన్యం అమ్ముకోండి

విషయం: ధాన్యం కొనుగోలు

గతం: గతంలో రైతులు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి నమోదు చేసుకోవాల్సి వచ్చేది.

ఇప్పుడు: పొలం వద్దో.. ఇంటి వద్దో ఉండి వాట్సాప్ నంబరుకు హాయ్ అని మెసేజ్ పంపితే చాలు అధికారులే రైతులకు ఫోన్ చేస్తారు. ఏ కేంద్రంలో, ఏ సమయానికి, ఏ రకం ధాన్యం, ఎన్ని బస్తాలు విక్రయిస్తారనే వివరాలతో స్లాట్ బుక్ చేస్తారు. దీని వల్ల సమయం, ఖర్చు తగ్గుతాయి.

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే

ప్రస్తుతానికి తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాల్లో అధిక శాతం, ఆచంటలో సగం మాసూళ్లు పూర్తయ్యాయి. డెల్టాలోని మిగిలిన మండలాల్లో మొదలయ్యాయి. అన్ని చోట్లా ఈ వారంలో విక్రయాలు జోరందుకోనున్నాయి. వాట్సాప్ సేవలను రైతులు ఉపయోగించుకోవాలని జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ ఇబ్రహీం తెలిపారు.

వాట్సాప్ నంబరు - 73373 59375
కంట్రోల్ కేంద్రం నంబరు - 81216 76653

- వాట్సాప్ ద్వారా సంప్రదించిన రైతులు - 191
- ధాన్యం దిగుబడి అంచనా - 6.83 లక్షల టన్నులు
- కేటాయించిన స్లాట్లు - 204
- కొనుగోలు లక్ష్యం - 5 లక్షల టన్నులు
- ఇప్పటి వరకు కొన్న ధాన్యం - 97.29 టన్నులు
- రైతు సేవా కేంద్రాలు - 307

24న ఐఎస్ జగన్నాథపురానికి పవన్ కల్యాణ్

ఈనాడు- ఏలూరు, న్యూస్‌టుడే- ద్వారకాతిరుమల: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఏలూరు జిల్లా పర్యటన ఖరారైంది. ఈ నెల 24న ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురానికి రానున్నారు. గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి గుడికి స్థానికంగా ఉన్న 30 ఎకరాల కొండ పోరంబోకు భూమిని దేవస్థానానికి కేటాయిస్తూ హక్కు పత్రాలు అందజేయనున్నారు. ఇది ద్వారకాతిరుమల శ్రీవారి దేవస్థానానికి దత్తత ఆలయం కావడంతో.. అధికారులు చొరవ తీసుకుని ఈ పత్రాలు ఇవ్వనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ మేరకు అధికారులు భూమిని సర్వే చేసి హద్దులు నిర్ణయించారు. గతంలో రాయితీ వంటగ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు పవన్ ఇక్కడికి రాగా, లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చెందిన కొండ పోరంబోకు భూమిని తిరిగి ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. దీనికి మంత్రివర్గం ఆమోదం తెలపడంతో.. పత్రాలు పంపిణీ చేయనున్నారు. ఆలయం పైకి రూ.3 కోట్లతో బీటీ రహదారి, మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణ పనులకు ఉప ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. పవన్ కల్యాణ్ పర్యటన నేపథ్యంలో పి.రాజవరంలో హెలిప్యాడ్ నిర్మాణానికి పోలీసు, రెవెన్యూ, ర.భ.శా. అధికారులు గురువారం సాయంత్రం స్థల పరిశీలన చేశారు.

ఎవరు బాబూ.. నిన్నెక్కడా చూడలేదే!

● ఏలూరులో మావోయిస్టుల అలజడి
● అద్దె ఇళ్ల వారు.. తస్మాత్ జాగ్రత్త

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే

పూర్వం.. మన వీధిలో గానీ.. మన ఊరిలో గానీ.. కొత్త ముఖాలు కనిపిస్తే.. ఎవరైనా అడిగేది ఎవరు బాబూ. కానీ.. ఈ మధ్య ఎవరు.. ఎప్పుడు వస్తున్నారో.. ఎప్పుడు పోతున్నారో.. వారెవరో.. వారు ఎందుకు వచ్చారో కూడా అడగడం లేదు. ఆఖరుకు ఇంటి యజమానులు కూడా తెలుసుకోకుండా అద్దెకు ఇచ్చేస్తున్నారు. ఏలూరులో అదే జరిగింది. 15 మంది మావోయిస్టులు ఇల్లు తీసుకుని ఉండటం సంచలనమే.

పచ్చని ఉమ్మడి పశ్చిమ గోదావరి ప్రశాంతమైన జిల్లాల్లో ఒకటి. ఇలాంటి చోట మావోయిస్టులు, దొంగలు, గుర్తింపు కార్డులు లేని విదేశీయులు ఉండటం ప్రజల్ని ఉలిక్కిపాటుకు గురిచేస్తోంది.

★ అప్పుడప్పుడూ కార్డన్ సెర్చ్ (ఏదొక ప్రాంతాన్ని చుట్టుముట్టి తనిఖీ నిర్వహించడం) పోలీసులు నిర్వహిస్తారు. శివారు కాలనీల్లోనే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వందలాది కార్మికులను తీసుకొచ్చి ఒకే భవనంలో, గదుల్లో ఉంచిన వారిపై కూడా నిఘా ఉంచాలి.

ఎందు కొస్తున్నారంటే.. ★ చేపలు, రొయ్యలు చెరువుల వద్ద కాపలాదారులుగా, కార్మికులుగా అసోం, ఒడిశా, కేరళ, పశ్చిమ బంగాల్ నుంచి అధికంగా వస్తారు. ★ బంగారు ఆభరణాల తయారీ, దుకాణాల్లో పనికి రాజస్థాన్, మధ్యప్రదేశ్‌కు చెందిన వారు వచ్చారు. ★ నిర్మాణ రంగంలో బిహార్, ఒడిశా రాష్ట్రాల కార్మికులు ఉంటున్నారు. ★ యలమంచిలి, గోదావరి తీరంలో ఇటుక బట్టీల్లో బంగాల్ కార్మికులు పనిచేస్తారు. ★ తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాల్లోని పరిశ్రమల్లో ఇతర రాష్ట్రాల కార్మికులదే పైచేయి. వాళ్ల భాష ఏమిటో, ఏం మాట్లాడుకుంటున్నారో అర్థం కాని పరిస్థితి.

ఆచంట: ఇటీవల నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో అక్కడున్న వారి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

అన్ని వివరాలు తెలుసుకోవాలి

● ఇళ్లు అద్దెకు ఇచ్చేటప్పుడే ఏ రాష్ట్రం నుంచి వచ్చారు, ఎక్కడ, ఏం పని చేస్తారు, వాళ్లతో ఇంకా ఎవరైనా వచ్చారా వంటి వివరాలను యజమాని తెలుసుకోవాలి. ● వారి సమగ్ర వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలి. ● వందల సంఖ్యలో కార్మికులను తీసుకొచ్చే ఏజెన్సీలు జిల్లాలో 15కు పైగా ఉన్నాయి. ఎందర్ని తీసుకొచ్చారో, ఎక్కడ ఉంచారో ఆయా పోలీస్‌స్టేషన్లలో తెలపాలి.

జరుగుతోంది ఏంటంటే..

కొత్తగా ఎవరైనా వచ్చినా.. అనుమానితులు అయినా.. కొత్త వ్యక్తులు సంచరించినా పోలీసులకు సమాచారం ఇవ్వండని పదేపదే చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

● అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో నిఘా ఉంచామని **ఎస్పీ అద్నాన్ నయీం అస్మి** తెలిపారు. అనుమానితుల సమాచారం ఉంటే స్థానిక పోలీసు స్టేషన్‌లో తెలియజేయాలని సూచించారు.

➤ తాడేపల్లిగూడేనికి చెందిన ఓ కానిస్టేబుల్ రాత్రివేళ విధుల్లో ఉండగా ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తుల దాడిలో గాయపడి మృతి చెందాడు. ➤ రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు యువకులు కొన్ని నెలలుగా ఇక్కడే ఉంటూ దొంగతనాలకు పాల్పడ్డారు. భీమవరంలోని మహిళ మెడలో గొలుసు లాక్కెళ్లిపోతూ తప్పించుకునే యత్నంలో తుపాకీ కాల్పులకు తెగబడ్డారు.

➤ పెనుమంట్ర పరిధిలో చెరువులపై ఉన్న అయిదుగురి నుంచి నాటు తుపాకీలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ➤ భీమవరం ఇందిరమ్మ కాలనీలో కొన్నేళ్ల కిందట కార్డన్‌సెర్చ్‌ను పోలీసులు నిర్వహించారు. ఆ సమయంలో ఇతర ప్రాంతాలకు చెందినవారితో పాటు, ఇద్దరు దొంగలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఎటుచూసినా కొత్త ముఖాలే.. జిల్లాలో ఓ ప్రైవేటు సంస్థ నిర్వహించిన సర్వేలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికుల సంఖ్య ఇదీ

ఒడిశా- 11500 | పశ్చిమ బంగాల్- 7350 | అసోం- 3200 | బిహార్- 4300 | రాజస్థాన్- 2500 | మిగిలిన రాష్ట్రాల నుంచి- దాదాపు 1200 మంది

సుబ్బారాయుడి షష్ఠికి సర్వం సిద్ధం

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: షష్ఠి ఉత్సవాలకు అత్తిలిలో శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ముస్తాబవుతోంది. 25వ తేదీ రాత్రి 7.20 గంటలకు స్వామి కల్యాణంతో ఉత్సవాలు ప్రారంభమై 15 రోజుల పాటు అంగరంగ వైభవంగా జరుగుతాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు, ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. షష్ఠి రోజు 50 వేల మంది భక్తులకు అన్నసమారాధన చేయనున్నారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇప్పటికే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, 150 మందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమరాజు చెప్పారు.

గ్రేడ్-I కార్యదర్శులకు ఉద్యోగోన్నతులు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో 20 మంది గ్రేడ్-1 కార్యదర్శులకు మండల స్థాయి సచివాలయ అధికారులుగా ఉద్యోగోన్నతులు లభించినట్లు జిల్లా గ్రామ, వార్డు సచివాలయ అధికారి దోసిరెడ్డి గురువారం తెలిపారు. జిల్లాలో 20 మండలాలకు మండల స్థాయి సచివాలయ అధికారులను నియమించాల్సి ఉంది. 20 మందికి పదోన్నతులు ఇవ్వడంతో కలెక్టర్ ఆదేశాలతో వారికి మండలాలు కేటాయించాల్సి ఉందని చెప్పారు.

చీకటి వలయానికి చిక్కొద్దు

● భవితను పణంగా పెట్టొద్దు
● గంజాయి విక్రయ కేసుల్లో యువతే అధికం

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: బాధ్యతలు.. బంధాలు మరిచిన కొందరు యువకులు పెడదారి పడుతున్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను అంధకారంలోకి నెట్టుకుంటున్నారు. మరికొందరు గంజాయి విక్రయ కేసుల్లో ఇరుక్కుంటూ భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ తరహా కేసులు ఎక్కువగా చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది.

◆ ఏలూరుకు చెందిన ఓ యువకుడు ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం చెవుటూరు శివారులోని ఓ కళాశాల సమీపంలో కొందరికి గంజాయి సరఫరా చేస్తుండగా.. అక్కడి పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్దనున్న 1.10 కిలోల సరకు స్వాధీనం చేసుకున్నారు.

◆ పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట శివారు మార్టేరు రోడ్డులో ఏడుగురు యువకులు 3.95 కిలోల గంజాయి తరలిస్తుండగా.. వారిని పోలీసులు అరెస్టు చేసి.. సరకును సీజ్ చేశారు.

పెరిగిన పరిస్థితులు.. పలువురు యువకులు తాము పెరిగిన వాతావరణ పరిస్థితుల కారణంగా నేరాలు, జూదాలు, మత్తు పదార్థాలు తదితర వ్యసనాలకు బానిసలవుతున్నారు. ఇంటర్, డిగ్రీతో చదువు మానేసి మద్యం, మత్తుకు బానిసలవుతున్నారు. అక్రమ మార్గంలో డబ్బు సంపాదించే క్రమంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి తక్కువ ధరకు గంజాయి తీసుకొచ్చి, ఉభయ జిల్లాల్లోని యువతకు విక్రయిస్తూ.. సొమ్ము చేసుకుంటున్నారు.

సామాజిక మాధ్యమాలతో.. సామాజిక మాధ్యమాలను అడ్డుపెట్టుకుని.. కొందరు యువకులు గంజాయి వ్యాపారం చేస్తున్నారు. నకిలీ ఐడీలతో సామాజిక మాధ్యమాల ఖాతాలు తెరచి.. బృందాలుగా ఏర్పడి గంజాయి విక్రయాలు, కొనుగోలు చేస్తున్నారు. సరకు ఎక్కడ దొరుకుతుంది? ఎంత కావాలి? ధరెంత? తదితర వివరాలు పోస్టు చేసుకుంటున్నారు. ఇటీవల రాజోలులో పట్టుబడిన యువకులు సైతం ఇదే పంథా అనుసరించడం గమనార్హం. 'గంజాయి విక్రయాలు, వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. ఏలూరు నగర శివారులోని గంజాయి కార్యకలాపాల అనుమానిత ప్రాంతాల్లో డ్రోన్లతో నిఘా పెట్టాం. కొందరు యువకులు కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు నిర్ధారించాం. పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తున్నాం' అని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో కేసుల వివరాలిలా

2022	485
2023	390
2024	412
2025	306

రుద్రా.. వీరభద్రా

కార్తికం, అమావాస్య సందర్భంగా పంచారామ క్షేత్రం గునుపూడి సోమేశ్వరజనార్దన స్వామిని వివిధ రకాల పండ్లతో అలంకరించి విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు.

- న్యూస్‌టుడే, భీమవరం ఆధ్యాత్మికం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామాంజనేయులు, పాల్గొన్న కలెక్టర్ నాగరాణి, అధికారులు

రుణాల మంజూరులో శ్రద్ధ చూపని బ్యాంకులు

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: రుణాల మంజూరులో బ్యాంకులు శ్రద్ధ చూపడం లేదని ఎమ్మెల్యే, పీఏసీ ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నత విద్యకు రుణాలిస్తే విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతారని, చిరు వ్యాపారులకు సరళతరంగా రుణాలిస్తే ఆ కుటుంబాలు బాగుపడతాయన్నారు. వచ్చే సమావేశం నాటికి మంజూరులో పురోగతి కనిపించాలని పేర్కొన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ రుణాల మంజూరులో బ్యాంకర్లు ప్రభుత్వ లక్ష్యాలు నెరవేర్చాలన్నారు. గృహ, వ్యవసాయ, విద్యా రుణాల మంజూరుకు ప్రత్యేక దృష్టి సారించాలని బ్యాంకుల ప్రతినిధులకు సూచించారు. వివిధ అంశాలపై సమీక్ష జరిపారు. సమావేశంలో జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ నాగేంద్రప్రసాద్, యూనియన్ బ్యాంకు ప్రాంతీయ హెడ్ సత్యనారాయణ, నాబార్డు డీడీ నిష్యంత్‌చంద్ర, ఆర్బీఐ ప్రతినిధి రామకృష్ణ పాల్గొన్నారు.

ఈనాడు మీతోడు

బస్సు ప్రయాణంలో అవస్థలా?

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: మీ ప్రాంతానికి ఆర్టీసీ బస్సులు సకాలంలో రావడం లేదా? అసలు బస్సు సౌకర్యమే లేదా.. రద్దీ వేళల్లో ప్రయాణానికి ఇబ్బందులున్నాయా? ఉచిత ప్రయాణం సౌకర్యవంతంగా ఉందా.. ఇలా ఇతరత్రా సమస్యలను జిల్లా ప్రజా రవాణాధికారి దృష్టికి తీసుకెళ్లే అవకాశాన్ని 'ఈనాడు' మీకు కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా ఇక్కడ పేర్కొన్న చరవాణి నంబరుకు నిర్ణీత సమయంలో ఫోన్ చేయడమే. సమస్యలతో పాటు సలహాలు, సూచనలు జిల్లా అధికారికి తెలపవచ్చు.

రేపు జిల్లా ప్రజారవాణాధికారితో ఫోన్ ఇన్

తేదీ	సమయం	చరవాణి నంబరు
22-11-25 (శనివారం)	ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య	99592 25479

రైతుల వద్దకే వ్యవసాయ శాస్త్రవేత్తలు

మహదేవపట్నం (ఉండి), న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన అధిక వర్షాలు ఖరీఫ్ వరి పంట దిగుబడులపై ప్రభావాన్ని చూపుతున్నాయి. ఈ దశలో పంటను సురక్షితంగా ఒడ్డుకు చేర్చడం నుంచి గింజలో తేమ శాతాన్ని తగ్గించడం.. ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించడం తదితర అంశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. సకాలంలో రబీ సాగుకు సమాయత్తమవడం.. నారుమడి నుంచి నాట్ల దశ వరకూ అనువైన విత్తనాల ఎంపిక, నీరు, ఎరువులు, కలుపు యాజమాన్య పద్ధతులు తదితర సందేహాలను నివృత్తి చేసుకోవాలనుకుంటున్నారా.. ఇందుకు 'ఈనాడు' క్షేత్రస్థాయికే వ్యవసాయ నిపుణులు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది.

తేదీ: 22.11.25
ఉదయం 9 గంటలకు

ఎవరు: కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ఎన్.మల్లికార్జునరావు, ఉండి ఏడీఏ కె.ప్రతాప్

ప్రదేశం: మహదేవపట్నం సత్రం - వంతెనకు మధ్య రహదారికి ఆనుకొని, గొట్టుముక్కల భాస్కరవర్మ వ్యవసాయ క్షేత్రం

Authorised Channel Partner TATA POWER SOLAROOF INDIA'S NO. 1 SOLAR ROOFTOP COMPANY

AQJ GREEN ENERGY PRIVATE LIMITED

APEPDCL (Domestic and other than Domestic Category) / NATIONAL PORTAL EMPANELLED VENDOR

PM SURYA GHAR MUFT BIJLI YOJANA

We deal in sales & installation of solar panels for residential, commercial, industrial sectors

WALK- IN INTERVIEW on 21-11-2025 & 22-11-2025.

We are looking for experienced candidates in sales and installation of solar panels in the following positions:

- **MANAGER** : with accounting knowledge.
- **MARKETING STAFF** : experience in promoting the sale of solar panels.
- **OFFICE ASSISTANT** : expertise in handling and uploading documents in DCR Portal.

Walk- in with your resume between 04.00 pm & 06.00pm at

22A-5-17, 2nd Floor, Singh Street, Chittivalasapakalu, Powerpet, Eluru - 534002. Ph: 92810 61398. Branch Offices:- Vizag: 92810 61399. Rjy: Ph: 92810 61397. Email: aqjgreenenergy@gmail.com

WALK-IN INTERVIEWS

SHANMUKHA AGRITEC LIMITED — Your Partner in Prosperity

SHANMUKHA AGRITEC LIMITED, part of **SHIVASHAKTI GROUP** successfully completed 30 years in service of farmers. Having a range of Agro Chemicals, Micro Nutrients, Water Soluble Products, etc...

Recruiting Sales & Marketing Professionals....

Qualification & Experience :

B.Sc. (Ag)/M.Sc. (Ag)/Any Graduate with 5+ Years in Sales & Marketing of Agri-inputs

REGION-1 Srikakulam, Vizianagaram, Vizag

Vacancies: Regional Manager : 01; Area Sales Manager : 03; Sales Officer : 06

REGION-2 East & West Godavari

Vacancies: Regional Manager : 01; Area Sales Manager : 03; Sales Officer : 07

Interested Candidates need to register at the below coordinates
Mail-Id: hr@shanmukha.net

VENUE-1: KVS LODGE & HOTEL, Opp. Tirumala Medicover Hospital. Mayuri tiffins backside, PSR complex, Vizianagaram. Contact: 95059 18819

VENUE-2: HOTEL SITARA ELITE, Beside Kumari Theatre, Vyagram Road T.Nagar, Rajamahendravaram. Contact: 98499 90544

Walk-In Timings for both the Venues
10:00 AM to 04:00 PM on Sunday, 23rd November 2025

A Good Decision will Lead to a Great Career...

SHANMUKHA AGRITEC LIMITED (AN ISO 9001:2015 CERTIFIED ORGANIZATION)
Reg. & Corp. Off: H.No. 1-90/28/C/5, Plot No. 5 & 10, 1st Floor, B5, South/2, Madhapur, Hyderabad, Shaikpet, Telangana-500081, India.

THE ARYAPURAM CO-OPERATIVE URBAN BANK LTD. HEAD OFFICE, RAJAMAHENDRAVARAM (Reg.No.3127)

RECRUITMENT NOTIFICATION FOR THE POSTS OF ASST. CLERKS / ASST. CASHIER ON CONTRACT BASIS

Applications are invited from Candidates who passed **IBPS/ SBI/RRB'S CLERKS PRELIMS** for the post of Asst. Clerks on contract basis Age : 21 Yrs-28 Yrs. as on date of notification (Age relaxation as per Bank service conditions), **Consolidated payment of Rs. 24,000/- p.m** during probation period of 1 year and on confirmation pay scales will be applicable.

The vacancies are at our Guntur, Visakhapatnam and Bhimavaram Branches only

Selection Procedure : Written Test and Interview

Last date of application to be received to bank: 29-11-2025 by 5:00 p.m.

Those candidates who have applied in last one year are not eligible to apply **Application only in specified format can be sent through courier or through registered post or in person. Bank reserves right to refuse any application without assigning any reasons**

Detailed Recruitment notification & Application can be downloaded from Website:
http://www.aryapurambank.com/career.html

Email: arcobank_rjy@aryapurambank.com

Date: 21-11-2025 Contact no.:-0883-2473550 Secretary/CEO

MANAGEMENT - ADMISSIONS 2025-26

Post B.Sc - 2 Years (Qualification GNM)
M.sc Nursing - 2 Years (B.Sc + 1year)
Courses offered: GNM, B.Sc Nursing, Post B.Sc, M.Sc Nursing

FIND US ON GOOGLE COLLEGE ADDRESS

Secretary & Correspondent Smt. Vasantha Kumari Indupalli B.Sc.,(N) R.N,R.M, DNEA, DNA. Former Principal Govt. School of Nursing, cxd Achoc Inspector: Indian Nursing Council New Delhi

MOTHER THERESA COLLEGE OF NURSING, KAKINADA
Cont : 0884-2345966, 2345977, Direct: 9247255155

పదవీ విరమణ వేళ మీ ఆత్మీయులకు శుభాకాంక్షలు తెలపండి



జి.ఎస్.టి. 5% అదనం

మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీస్‌లో సహోద్యోగులు ఎవరైనా రిటైర్ అవుతున్నారా! అయితే వారికి అందించండి అభినందన చందనాలు. ఆకాంక్షించండి... వారి భావి జీవిత, సుఖమయ ఆనందాలు... తెలియజేయండి ఈనాడు ద్వారా పదవీ విరమణ శుభాకాంక్షలు.

80080 12494

ప్రశంసా పత్రాలు అందిస్తున్న రాహుల్‌కుమార్‌రెడ్డి తదితరులు

వారంలో ఒక రోజు గ్రంథాలయ సందర్శన

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: వారంలో ఒకరోజు విద్యార్థులు తప్పనిసరిగా గ్రంథాలయం సందర్శించి పుస్తకాలను చదవాలని సంయుక్త కలెక్టర్ రాహుల్‌రెడ్డి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం స్థానిక ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వారం రోజులుగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందించి, పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన ఉపాధ్యాయులను సత్కరించారు. ఆర్డీవో కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ ఆర్.రాంబాబు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పి.కోటేశ్వరరావు, కార్యదర్శి కె.వెంకటరమణ, గ్రంథాలయాభివృద్ధి కమిటీ ప్రతినిధులు, శాఖాగ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులతో స్వయంగా మాట్లాడాలి.. భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: పీజీఆర్ఎస్‌లో వస్తున్న ఫిర్యాదులపై నేరుగా అర్జీదారులతో మాట్లాడి పరిష్కరించాలని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులతో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. రెండు నెలల్లో వచ్చిన అర్జీలపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. రెండు నెలల్లో 1,652 అర్జీలు రాగా 1,447 పరిష్కరించామన్నారు. అర్జీల పరిష్కారంలో ఎక్కువగా లోపాలున్న మత్స్యశాఖ అధికారులకు ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని సోషల్ ఆడిట్ డైరెక్టర్‌ను ఆదేశించారు.

రైతులకు ఇబ్బంది రాకుండా చూడాలి.. భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులతో ఆయన గురువారం జూమ్ ద్వారా వివిధ అంశాలపై సమీక్ష జరిపారు. గోనెసంచుల్లి మిల్లుల నుంచి ముందుగానే సేకరించి రైతు సేవా కేంద్రాల్లో సిద్ధం ఉంచాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ములు పడేలా చూడాలన్నారు.

ఆనందమే

సచివాలయ ఉద్యోగుల బదిలీలకు అవకాశం

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల అంతర్ జిల్లా బదిలీలకు సర్కారు ఆమోదం తెలిపింది. దీంతో ప్రభుత్వ కొలువుల్లో ఉన్న భార్యాభర్తలు ఒకేచోటకు వెళ్ళొచ్చు. ఈ నెల 30వ తేదీకి ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

జిల్లా	సచివాలయాలు	ఉద్యోగులు
ఏలూరు	605	4,518
పశ్చిమ	535	4,203

ఉమ్మడి జిల్లాలో 1,140 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 8,721 మంది పనిచేస్తున్నారు. 2019లో సచివాలయ వ్యవస్థ అమలులోకి వచ్చిన తర్వాత 2022లో ఉద్యోగుల రెగ్యులరైజేషన్ చేపట్టారు. ఆ ఏడాది చివర్లో స్పౌజ్ కోటాలో బదిలీలు చేశారు. అప్పట్లో పరస్పర అంగీకారం మేరకు మాత్రమే బదిలీలు నిర్వహించారు. ప్రస్తుతం స్పౌజ్ కోటాకు అవకాశం ఇవ్వడంతో చాలా మందికి ఊరట లభించనుంది.

మార్గదర్శకాలు ఇవీ.. ఉద్యోగులు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి. అనితా, విజిలెన్స్ కేసులు పెండింగ్‌లో ఉన్న వారు బదిలీలకు అనర్హులు. ప్రస్తుతం పనిచేస్తున్న చోట ఎలాంటి బకాయిలు లేవని ఎంపీడీవో, పురపాలక కమిషనర్ల నుంచి ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. దానిని ఆన్‌లైన్‌లో పొందుపరచాలి. దరఖాస్తుల పరిశీలన అనంతరం జాబితాను పోర్టల్‌లో పెడతారు. వీటిపై అభ్యంతరాలను అప్‌లోడ్ చేయాలి. పరిశీలన అనంతరం సీనియారిటీ ఆధారంగా తుది జాబితా ప్రకటిస్తారు.

సులువు పట్టారు.. కొలువు కొట్టారు..

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు పెద్దఎత్తున ఇన్ఫోసిస్‌లో ఉద్యోగాలు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ప్రముఖ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ ఈ సంవత్సరపు క్యాంపస్ నియామకాల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ప్రతిభకు మంత్ర ముగ్ధమైంది. వందల సంఖ్యలో ఉద్యోగాలను ఒకేసారి విద్యార్థులు సాధించడం విశేషం. ఈ విజయంతో రాష్ట్రంలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో పండగ వాతావరణం నెలకొంది. ఈ సారి ఇన్ఫోసిస్ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో విద్యార్థులు సాంకేతిక ప్రతిభతో పాటు సమస్యలను పరిష్కరించే తీరు, సృజనాత్మకత, వినూత్న ఆలోచనలు ప్రదర్శించడం వంటి లక్షణాలు కంపెనీ ప్రతినిధులను కట్టిపడేశాయి. కోడింగ్ రౌండ్, టెక్నికల్ ఇంటర్వ్యూ తదితర దశల్లో విద్యార్థుల సమర్థతను స్పష్టంగా గుర్తించి ఎంపిక చేసుకున్నారు. తల్లిదండ్రులు, అధ్యాపకులు, సహ విద్యార్థుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు భావోద్వేగానికి గురవుతున్నారు. నూజివీడు, శ్రీకాకుళం, ఇడుపులపాయ, ఒంగోలు క్యాంపస్‌లలో ఈ పరిస్థితి నెలకొంది. 2,600 మంది విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలకు రిజిస్టర్ చేసుకుంటే 1,016 మంది ఎంపికవడం విశేషం.

ప్రతిష్ఠాత్మక కంపెనీకి..

దేశంలోనే ప్రతిష్ఠాత్మక కంపెనీగా ఉన్న ఇన్ఫోసిస్‌కు ఎంపికవడం సంతోషంగా ఉంది. ఇక్కడ పొందిన శిక్షణ, వాతావరణం, ప్రాజెక్టులు మమ్మల్ని ఈ స్థాయికి తీసుకువచ్చాయి. ఆన్‌లైన్ శిక్షణ ఎంతో ఉపయోగపడింది.
- ఎస్‌కే ఆసియా, బట్టు సుజన్ శ్వేత

కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రధానం

ఉద్యోగ సాధనలో కమ్యూనికేషన్ స్కిల్స్ కీలక భూమిక పోషించాయి. బేసిక్ కోర్సులతో పాటు బ్యాంకింగ్ సెక్టార్ అవసరమైన అంశాలను ఔపోసన పట్టాం. దీంతోనే ఉద్యోగ సాధన సాధ్యమైంది.
- పి.నవ్యశ్రీ, పి.పావని

ప్రతిభ చూపుతాం..

ప్రస్తుత ప్యాకేజీని పక్కన పెడితే ముందు మన సామర్థ్యాన్ని బట్టే జీతం లభిస్తుందని ఆశిస్తున్నాం. ఆరు నెలల్లో మేమేంటో, మా ప్రతిభ ఏమిటో అక్కడ చూపిస్తాం. శిక్షణ అనంతరం మరో పరీక్ష ఉంటుంది. దీనిని బట్టే జీతం ఎంతనేది నిర్ణయిస్తారు. **- టీవీఎస్ లిఖితా భవాని, ఎం.లిల్లీ**

మరింత బలోపేతం చేస్తాం

భవిష్యత్తులో ఐటీ విద్య మరింత బలోపేతం అవుతుంది. విద్యార్థులు సామర్థ్యాలను నిరూపించుకోవడం అభినందనీయం. ముందు మరిన్ని ఉద్యోగాల సాధనే లక్ష్యంగా ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లను తీర్చిదిద్దుతున్నాం.
- సంద్ర అమరేంద్రకుమార్, రిజిస్ట్రార్, ఆర్జీయూకేటీ

లక్ష్యానికి అనుగుణంగా..

విద్యార్థుల లక్ష్యాలకు అనుగుణంగానే ఫలితం ఉంటుందని తేలింది. భవిష్యత్తులో మరింతగా రాణించి మంచి ప్యాకేజీలను పొందుతారని ఆశిస్తున్నాం. ఆ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం.
- రుద్రం చింతయ్యనాయుడు, ప్లేస్‌మెంట్ సెల్ ఇన్‌ఛార్జి

గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌ఛార్జిగా జేసీ

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌ఛార్జి పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరులోని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ ప్రస్తుతం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాగానే ఉంది. దీంతో ఏలూరు జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ గౌడ పర్సన్ ఇన్‌ఛార్జిగా వ్యవహరించనున్నారు.

గోదావరి తీరంపై డేగకన్ను

కుక్కునూరు, న్యూస్‌టుడే: పోలీసుల కన్ను గోదావరి తీరంపై పడింది. ఏలూరులో 15 మంది నక్సల్స్ పట్టుబడటం, వారంతా ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన వారు కావటంతో, వారు ఏ మార్గంలో వచ్చారన్న దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ప్రధానంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం విలీన మండలాలకు చేరువగా ఉంది. ఆ రాష్ట్ర అడవుల నుంచి అల్లూరి జిల్లాలోకి ప్రవేశించి, అక్కడి నుంచి గోదావరి నది దాటితే ఏలూరు జిల్లాకు చేరుకునే అవకాశాలు ఉన్నాయి. ఆయుధాలతో వారు ఏలూరుకు చేరుకోవటం కూడా ఆశ్చర్యపరుస్తోంది. ఎవరైనా సానుభూతిపరుల సహాయంతో చేరి ఉండవచ్చనే అనుమానాలు బలపడుతున్నాయి. 2005లో కుక్కునూరు పోలీసుస్టేషన్ పేల్చి వేత ఘటనలో మావోలు వింజరం రేవు వద్ద గోదావరి దాటి వచ్చారు. గోదావరి రేవు నుంచి ముందుగానే ఓ ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసుకొని, సంఘటనా స్థలానికి చేరుకొని, పేల్చివేత జరిపారు. అప్పటి నుంచి గోదావరి నదిపై వారు రాకపోకలు సాగాయి. పలు సందర్భాల్లో ఇందుకు తగిన ఆధారాలు లభ్యమయ్యాయి. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లోని అబుజ్‌మడ్, అల్లూరి జిల్లాలోని ఆంధ్రా, ఒడిశా సరిహద్దు (ఏఓబీ) ప్రాంతం నక్సల్స్ తలదాచుకునేందుకు ఏ మాత్రం అనుకూలంగా లేకపోవడంతో, వీరు దాటి జిల్లాలోకి ప్రవేశించే అవకాశాలు ఉంటాయనే అనుమానాలు పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. దీంతో తీరంపై డేగకన్ను వేశారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో అల్లూరి జిల్లా నుంచి మన జిల్లాలోకి ప్రవేశించేందుకు దాదాపు 10 రేవులున్నాయి. పోలీసులు ఆ రేవులపై నిఘా పెట్టారు. రేవు పడవ దాటించే గుత్తేదారులు, చేపలవేట కొనసాగించే జాలర్లకు హెచ్చరికలు జారీ చేశారు. రాత్రి పూట పడవలు దాటవేయొద్దనీ, ఎవరైనా వ్యక్తులు బలవంతంగా పడవ దాటించాలని ఒత్తిడి తెస్తే, వారి వివరాలు అందించాలనీ సూచించారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా రేవు దాటితే వెంటనే పోలీసులకు సమాచారం చేరవేయాలని తెలియజేస్తున్నారు.

పలు రైళ్ల సేవల పొడిగింపు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు రైళ్ల సేవలను పొడిగించినట్లు దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పీఆర్వో కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. డిసెంబరు ఒకటి నుంచి జనవరి 12 వరకు ప్రతి సోమ, శుక్రవారాల్లో కాకినాడ టౌన్-మైసూర్ (07033) రైలు నడపనున్నట్లు పేర్కొన్నారు. డిసెంబరు 2 నుంచి జనవరి 13 వరకు ప్రతి మంగళ, శనివారాల్లో మైసూరు-కాకినాడ టౌన్ (07034) రైలు, జనవరి 2 నుంచి 9వ వరకు ప్రతి శుక్రవారం నరసాపూర్-ఎస్ఎంవీటీ బెంగళూరు (07153) రైలు, జనవరి 3 నుంచి 10 వరకు ప్రతి శనివారం ఎస్ఎంవీటీ బెంగళూరు-నరసాపూర్ (07154) రైలు నడపనున్నట్లు వివరించారు.

నూజివీడు మామిడి.. వచ్చేసింది!



ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఫలరాజు మామిడికి నూజివీడు ప్రసిద్ధి. మార్చి నెలలో వచ్చే మామిడి ఈ ఏడాది నవంబర్ నెలలోనే ఆగిరిపల్లి, వడ్లమానుకు చెందిన కొందరు రైతుల వద్ద అందుబాటులోకి రావడంతో మామిడి ప్రియులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వివాహాలు, విందు భోజనాల్లో మామిడితో ప్రత్యేకంగా వంటలు చేస్తుంటారు. ప్రస్తుతం చాలా కొద్ది మంది దగ్గర మాత్రమే మామిడి కాయలు లభిస్తుండటంతో ఉమ్మడి జిల్లాలోని అనేక మంది ఇక్కడకు వచ్చి కొనుగోలుకు ఉత్సాహం చూపుతున్నారు. విజయవాడ నుంచి పలువురు వ్యాపారులు సైతం నూజివీడు రసాల కోసం బారులు తీరుతున్నారు. తన మిత్రుడు కుమారుడి వివాహంలో ప్రత్యేక వంటల కోసం 82 కిలోల మామిడిని కిలో రూ.150 చొప్పున కొనుగోలు చేసినట్లు ఆగిరిపల్లికి చెందిన గుండుబోగుల వెంకట రమేశ్ (చిన్నారి) 'న్యూస్‌టుడే'కు తెలిపారు. సాధారణ రోజుల్లో ఇదే మామిడి కిలో రూ.10-15కి లభించడం విశేషం.

గోదారమ్మకు హారతి

హిందూ ధర్మ పరిరక్షణ, పవిత్ర నదుల సంరక్షణ సంకల్ప దీక్షలో భాగంగా నరసాపురం వశిష్ఠ పుష్కర్ ఘాట్‌లో కార్తిక అమావాస్య సందర్భంగా గురువారం రాత్రి గోదావరికి హారతి ఇచ్చారు. నరసాపురం విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. నరసాపురం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, నరసాపురం పట్టణం**

కుటుంబానికో పారిశ్రామికవేత్త: కలెక్టర్

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. మెప్మా రూపొందించిన ఆవని అనే సంచికను వారు గురువారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. మెప్మా ద్వారా అమలవుతున్న పథకాల గురించి వివరించారు. అవన్నీ ఈ పుస్తకంలో పొందుపరిచి ఉన్నాయన్నారు. ఈ పుస్తకాలను త్వరలోనే జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లకు, మెప్మా సిబ్బందికి అందజేస్తామని మెప్మా పీడీ హెప్సిబా వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి సాఫ్ట్‌బాల్ పోటీలు పోటీలు

వీరవాసరం, న్యూస్‌టుడే: వీరవాసరం జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నేటి నుంచి ఈ నెల 23 వరకు జరగాల్సిన రాష్ట్ర స్థాయి అండర్ 17 బాలబాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు, రాష్ట్ర స్థాయి జట్ల ఎంపిక పోటీలను వాయిదా వేసి డిసెంబరు 2, 3, 4 తేదీల్లో నిర్వహించనున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శులు సునీత, మల్లేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

70 మినీ అంగన్‌వాడీలకు వర్గోన్నతి

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జిల్లాలో 70 మినీ అంగన్‌వాడీలకు మెయిన్ కేంద్రాలుగా వర్గోన్నతి కల్పించారు. దీంతో వాటిలో పనిచేస్తున్న కార్యకర్తల్లో పదో తరగతి ఉత్తీర్ణులైన 59 మందికి మెయిన్ కార్యకర్తలుగా ఉద్యోగోన్నతి కల్పించినట్లు జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి డి.శ్రీలక్ష్మి తెలిపారు. వారికి ఇప్పటి వరకు వచ్చే రూ.7 వేలు వేతనానికి బదులు రూ.11,500 గౌరవ వేతనం వస్తుందని వివరించారు.

శ్రీవారి క్షేత్రంలో గదులు, కాటేజీల ఖాళీల వివరాలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించి శుక్ర, శనివారాల్లో గదులు, కాటేజీల ఖాళీల వివరాలు ఆలయ అధికారులు వెల్లడించారు.

సత్రం పేరు	ఖాళీలు	
20న రాత్రి 10గంటల సమయానికి	21న	22న
ధర్మప్పారాయ నిలయం	112	35
తితిదే సత్రం	13	16
రాణి చిన్నమ్మారావు సత్రం	27	31
కాటేజీలు	26	00
బాలాజీ	05	05

సంప్రదించాల్సిన నంబర్లు:
90375 69891, 90375 67892
ఆన్‌లైన్ బుకింగ్ కోసం:www.aptemples.ap.gov.in

నేటి నుంచి కొప్పర్రులో పుస్తక ప్రదర్శన

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా కొప్పర్రులో శుక్ర, శనివారాల్లో కొప్పర్రు కథావాహిని, పుస్తక పంపిణీ కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు కొప్పర్తి రాంబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని రాజశ్రీ తెలిపారు. మండల పరిషత్ మెయిన్ పాఠశాలలో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. 200 పుస్తకాలను ప్రదర్శనగా ఉంచుతామన్నారు.

జడ్పీ రహదారుల మరమ్మతులకు నిధులివ్వండి

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే : ఇటీవల కురిసిన వర్షాలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో జడ్పీ రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయని, మరమ్మతులు చేపట్టడానికి నిధులు విడుదల చేయాలని జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ విజ్ఞప్తి చేశారు. పంచాయతీరాజ్ కమిషనర్ వీఆర్ కృష్ణతేజను విజయవాడలోని ఆయన కార్యాలయంలో గురువారం కలిశారు.

జాతీయ రహదారిపై ప్రమాదం

బైక్‌ను ఢీకొన్న కారు.. ఒకరి దుర్మరణం, మరొకరికి గాయాలు

కారుపై వైకాపా మాజీ ఎమ్మెల్యే స్టిక్కర్

పెడన, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా పెడన మండలం మడక వద్ద 216 జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి దుర్మరణం చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు మండలంలోని లంకలకలగుంట గ్రామానికి చెందిన మువ్వల చిన వెంకటేశ్వరరావు(55)గా గుర్తించారు. క్షతగాత్రుడు సిరంగి నాగమలేశ్వరరావు ఆస్పత్రిలో కోలుకుంటున్నట్లు పోలీసులు చెప్పారు. ఈ ఇరువురు మడకలోని ఒక ఫాంహౌస్‌లో పనిచేస్తారు. ఉదయం పనికి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొని ఈప్రమాదం జరిగింది. ఈ కారు నరసాపురానికి చెందినదిగా పోలీసులు నిర్ధారించారు. కారుపై నర్సాపురం వైకాపా మాజీ ఎమ్మెల్యే ముదునూరు ప్రసాదరాజు పాస్(స్టిక్కర్) ముందు గ్లాసుపై కన్పిస్తోంది. 2022 డిసెంబరుతో పాస్ కాలపరిమితి ముగిసింది. రూరల్ సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్సై సత్యనారాయణ ఘటనా స్థలానికి తరలివచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

★ బంధువుల ఆందోళన: ప్రమాద సమాచారం అందుకున్న లంకలకలవగుంట గ్రామస్థులు ఘటనా స్థలానికి తరలివచ్చి ఆందోళన చేశారు. కారు మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణమైందని నిరసించారు. అయితే అధికారులు నచ్చజెప్పి మృతదేహాన్ని ముందుగా ఆస్పత్రికి, కారును పోలీసుస్టేషన్‌కు తరలించారు. కారుకు ఇన్సూరెన్స్ లేనట్లు పోలీసులు చెప్పారు.

ప్రమాదానికి కారణమైన వాహనం

డిసెంబర్‌లో మత్స్య కళాశాల తరలింపు

స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలోకి మార్పు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నరసాపురం మండలం లక్ష్మణేశ్వరంలో నిర్వహిస్తున్న మత్స్య కళాశాల సీతారాంపురం సౌత్‌లోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలోకి డిసెంబర్ నెలలో మారుస్తామని కళాశాల ప్రిన్సిపల్ కె.మాధవి తెలిపారు. కళాశాల ప్రారంభమైన 2023-24 నుంచి నేటి వరకు రెండు బ్యాచ్‌ల తరగతులు పూర్తయ్యాయన్నారు. మూడో బ్యాచ్ తరగతులు డిసెంబర్ నెలలో స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో కొనసాగుతాయన్నారు. విద్యార్థుల సౌలభ్యం దృష్ట్యా మత్స్య కళాశాలను మారుస్తున్నామన్నారు.

భారతీయ స్టేట్ బ్యాంక్
పాలకొల్లు ముఖ్య శాఖ, పశ్చిమ గోదావరి జిల్లా.

స్వాధీనత ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(1) ననుసరించి
(స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ... Term Loan A/c.No. 38369760982 - Rs.9,22,445/- and Housing Term Loan A/c.No.42280659862 - Rs.12,55,177/- ... తేది. 18-09-2024 ... రూ.21,77,622/- ... తేది. 02-07-2025 ... [illegible]

తేది: 18-11-2025
ప్రదేశం: పాలకొల్లు
అధీకృత అధికారి
భారతీయ స్టేట్ బ్యాంక్
పాలకొల్లు ముఖ్య శాఖ

స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అస్మి

అపహరించిన రూ.15 లక్షలు విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: బస్సు ఎక్కుతున్న ప్రయాణికుడి జేబులోంచి అపహరించిన రూ.15 లక్షలు విలువైన బంగారు ఆభరణాలను దొంగిలించిన దొంగలను భీమవరం ఒకటోపట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి వెల్లడించారు. భీమవరానికి చెందిన కణితి ఆంజనేయప్రసాద్ నగల తయారీ దుకాణంలో పనిచేస్తారు. తయారు చేసిన ఆభరణాలను నరసాపురంలోని ఓ దుకాణ యజమానికి ఇచ్చేందుకు ఈ నెల 17న భీమవరం బస్టాండుకు వెళ్లారు. బస్సు ఎక్కే క్రమంలో జేబులోని నగలు ఉన్న సంచిని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. చుట్టుపక్కల వెతికినా ఎలాంటి ఆచూకీ లేదు. బాధితుడు పోలీసులను ఆశ్రయించారు. దొంగతనం జరిగిన ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను సీఐ ఎం.నాగరాజు, ఎస్సై మోహనవంశీ పరిశీలించారు. దొంగతనానికి పాల్పడినవారు నూజివీడు కొత్తపేటకు చెందిన బంకురు కుమార్, అజరాయిపేటలో ఉంటున్న మలుగుమాటి సుభాష్‌గా గుర్తించారు. వారిరువురి కదలికలను గుర్తించి 48 గంటల వ్యవధిలో పట్టుకుని బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు పరిశోధనలో కీలకంగా వ్యవహరించిన సీఐ నాగరాజు, ఎస్సై మోహనవంశీ, హెడ్‌కానిస్టేబుల్ యెహోషువా, కానిస్టేబుళ్లు జి.రామకృష్ణ, అడ్డాల శ్రీనుకు నగదు రివార్డులను ఎస్పీ అస్మి అందజేశారు. అదనపు ఎస్పీ వి.భీమారావు, ఎస్బీ సీఐ కె.వి.వి.ఎన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

మోసగించిన కేసులో అరెస్టు

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: భీమవరం మండలం కొవ్వాడలో ఓ విద్యాసంస్థకు చెందిన విద్యార్థిని ఈ నెల 12న ఆత్మహత్యకు పాల్పడింది. నెల్లూరుకు చెందిన నవీన్‌రెడ్డి ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేయడంతోనే తన కుమార్తె ప్రాణం తీసుకుందని ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి హైదరాబాద్‌లో అరెస్ట్ చేసినట్లు ఎస్సై వీర్రాజు గురువారం తెలిపారు.

పుస్తకాలకు ఏదీ సాటి రాదు : ఎమ్మెల్సీ

విద్యార్థినికి బహుమతి అందిస్తున్న గోపీమూర్తి

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: అంతర్జాలం ఎంత అందుబాటులో ఉన్నా పుస్తక పఠనానికి సాటి రాదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి అన్నారు. భీమవరం మండలం చినఅమిరం ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని పాఠశాలల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలని సూచించారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వేగేశ్న అనురాధ, ఎస్ఎంసీ సభ్యుడు వత్సవాయి సూర్యనారాయణరాజు, గ్రంథాలయం నిర్వాహకుడు సీహెచ్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుడికి ఎయిరిండియా నష్టపరిహారం

ఆచంట, న్యూస్‌టుడే: విమానంలో తనకు కేటాయించిన సీటు సరిగా లేదని ఫిర్యాదు చేయడంతో సదరు సంస్థ వినియోగదారుడికి నష్టపరిహారం ఇచ్చిన ఘటన ఇది. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట ఎంపీడీవోగా పనిచేస్తున్న బి.కృష్ణమోహన్ ఈనెల 10న ముంబై నుంచి విజయవాడ రావడానికి ఎయిరిండియా విమానం ఎక్కారు. అందులో ఆయనకు కేటాయించిన సీటు సరిగా లేదు. దీంతో సిబ్బంది విమానంలో ఖాళీగా ఉన్న మరో సీటు ఇచ్చారు. విమానం బయలుదేరడానికి ముందు సీటు పరీక్షించాలి కదా? అనే అంశంపై ఆయన ఎయిరిండియా సంస్థకు ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. సంస్థ ఆధారాలు పరిశీలించి గురువారం రూ.1,450 నష్టపరిహారం చెల్లించినట్లు కృష్ణమోహన్ తెలిపారు. వినియోగదారుల అవగాహన కోసమే తాను ఈ అంశం వెల్లడిస్తున్నట్లు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -106 రిటైల్ ధర 133 చికెన్ విత్ స్కిన్ - 193, చికెన్ స్కిన్‌లెస్ - 219.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, 134, 145 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

కొయ్యలగూడెం మండలంలో ఆయుధ కర్మాగారం?

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: మండలంలో ఆయుధ కార్మాగారం వచ్చే అవకాశం కనిపిస్తోంది. బోడిగూడెం, మంగపతిదేవిపేట గ్రామాల పరిధిలో దీని ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలపై అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఈ రెండు గ్రామాల పరిధిలో అసైన్‌మెంటు భూమి అధికంగా ఉండటం కూడా అనుకూల అంశంగా భావించి ఈ ప్రాంతాన్ని ఎంపిక చేస్తున్నట్లు తెలుస్తోంది. బోడిగూడెం పరిధిలో దాదాపు 600 ఎకరాలు, మంగపతిదేవిపేట పరిధిలో 400 ఎకరాలు వెరసి సుమారు వెయ్యి ఎకరాల వరకు అసైన్‌మెంటు భూమి ఈ రెండు గ్రామాల పరిధిలో ఉన్నట్లు గుర్తించారు. కార్మాగారం ఏర్పాటుకు అవసరమైన సుమారు 1,200 ఎకరాల వరకు భూసేకరణ చేయడం సాధ్యమేనని తేల్చారు.

భూ పరిశీలన.. జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ రమణ, కొయ్యలగూడెం తహసీల్దారు నాగరాజు, అధికారులు గురువారం బోడిమంగపతిదేవి పరిధిలో కొన్ని భూములను పరిశీలించారు. ఈ రెండు గ్రామాల పరిధిలో ఉన్న భూముల మధ్య నుంచి చింతలపూడి కాలువ వెళ్లింది. అధికారుల బృందం ఆ ప్రాంతాన్ని పరిశీలించి కర్మాగారం కోసం ఎంపిక చేసే ప్రాంతంలో కాలువ ఉంటే ఇబ్బందులపై చర్చించుకున్నట్లు తెలిసింది.

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU eClassifieds

BUSINESS SERVICES
ఏలూరు జ్ఞాపికా TVS షోరూమ్‌లో పర్మినెంట్ ఉద్యోగాలు ... Ph: 94922 25959.
బంగారు బ్యాంకులో/ ప్రైవేట్ సంస్థలో తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి ... Ph: 81422 92071.
లక్ష్మి మోటార్స్ (YAMAHA షోరూమ్) ... 96667 14613.
HYD, SR ... 9391009238, 8885070231.

REAL ESTATE
PLOT FOR SALE
వైజాగ్ Google ... 9949000033

FACULTY/ TEACHERS
WANTED LADY Teachers. Sub: Hindi, Mother Teachers, O: D.Ed., B.Ed., PG, Degree. Variant Primary School, R.R.Pet, Eluru. Contact: 97069 12338.

JOBS
దక్షిణాఫ్రికాదేశంలో ప్రముఖ ... ISO ... ultratechminerals@gmail.com Ph:9573306158 ...

గమనిక ...
నేటి మార్కెట్ పెట్టుబడి ధర ... 08819-224254

ప్రకటన చిన్నదైనా స్పందన అతిపెద్దం CLASSIFIEDS

భీమవరం
● భీమవరం ● ఉండి

అర్జీల స్వీకరణ నేడు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం నియోజకవర్గంలోని సమస్యలపై ప్రజల నుంచి వచ్చే అర్జీలను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు స్వీకరించనున్నారు. శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఫిర్యాదులు స్వీకరిస్తారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

పాలకోడేరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పాలకోడేరు సొసైటీ ఛైర్మన్ కొత్తపల్లి నాగరాజు సూచించారు. మోగల్లు రైతు సేవా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు కొత్తపల్లి బాబు, సర్పంచి కృష్ణకుమారి, కలిదిండి సందీప్ వర్మ, కార్యదర్శి పీవీఎల్ నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

పిల్లరు సామర్థ్య పరీక్షలు

ఉండి, న్యూస్‌టుడే: ఉండిలో 165వ జాతీయ రహదారిలో రైల్వే పైవంతెనకు సంబంధించి ఆఖరి పిల్లరు సామర్థ్యాన్ని తేల్చే బరువు పరీక్షలు(లోడ్ టెస్ట్) గురువారం ప్రారంభమయ్యాయి. విజయవాడకు చెందిన ప్రైవేటు సంస్థ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు దగ్గరుండి చేపట్టారు. రైల్వే పైవంతెన డిజైన్ ప్రకారం 340 టన్నుల బరువుండే వాహనాలు వెళ్తాయని అంచనా. 510 టన్నుల వరకూ వెళ్లినా పునాదులు తట్టుకుంటాయా..! అనే అంశాన్ని నిర్ధారించే పరీక్షలు జరుగుతున్నాయని స్థానిక అధికారులు తెలిపారు. రెండ్రోజుల్లో ఈప్రక్రియ పూర్తవుతుందని వివరించారు. ఆ తరువాత ఫైల్ క్యాప్ వేసే పనులు చేపడతామని చెప్పారు. ఆ సమయంలో వాహనాలను మళ్లింపు మార్గాల్లో రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఘనంగా చండీ హోమం

పూర్ణాహుతి నిర్వహిస్తున్న వెంకటరమణశర్మ

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే : కార్తిక మాసం అమావాస్య సందర్భంగా భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మ ఆలయ కళా వేదికపై గురువారం చండీ హోమం నిర్వహించారు. సామూహిక దంపతులతో ప్రధానార్చకుడు మల్లికార్జునశర్మ, వెంకటరమణశర్మ, వేదపారాయణదారులు చేయించారు.

వెంకటసాయి సన్నిధిలో దీపోత్సవం

బాబా, శివలింగాకారంలో దీపాలు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: హౌసింగ్‌బోర్డు కాలనీ వెంకటసాయిబాబా మందిరంలో కార్తిక దీపోత్సవం ఆలయ ఛైర్మన్ మల్లినీడి తిరుమలరావు, అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నిర్వహించారు. అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మల్లినీడి సుధాకర్ దంపతులు బాబా ప్రతిమ, ఓంకారం, శివలింగాకారంలో దీపాలు వెలిగించారు.

కాళ్ల (భీమవరం గునుపూడి), న్యూస్‌టుడే : ఏలూరుపాడులో రుక్మిణీ సత్యభామ సమేత పాండురంగస్వామి ఆలయంలో దీపోత్సవం గురువారం రాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు.

'పొరుగు వారి హక్కులు' గోడ పత్రాల ఆవిష్కరణ

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: 'పొరుగువారి హక్కులపై దేశ వ్యాప్త ఉద్యమం' కార్యక్రమంలో భాగంగా జమాతే ఇస్లామీ హింద్ భీమవరం శాఖ కార్యాలయంలో పట్టణశాఖ అధ్యక్షుడు షేక్ అస్ఘర్ గురువారం కర పత్రాలు, గోడ పత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21 నుంచి 30 వరకు దేశ వ్యాప్తంగా చేపట్టే ఈ కార్యక్రమంలో ఇరుగు పొరుగువారితో సత్సంబంధాలు, ఇచ్చి పుచ్చుకునే పూర్వ సంప్రదాయాలు, ఆదర్శ సమాజం అనే అంశాలపై పట్టణంలో ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. కన్వీనర్ షేక్ మహబూబ్‌జానీ, సభ్యులు ఇంతియాజ్, బాదర్‌బాషా, షాహిదీన్, రిజ్వాన్‌పాషా, అక్బర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మహదేవపట్నంలో నిత్య సహాయ మాత వేడుకలు

మహదేవపట్నం (ఉండి), న్యూస్‌టుడే: స్థానిక కతోలిక ప్రార్థనాలయంలో నిత్య సహాయ మాత వార్షిక వేడుకలు గురువారం నిర్వహించారు. స్థానిక విచారణ కర్త బి.ధనకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. చేబ్రోలు పుణ్య క్షేత్ర నిర్వాహకుడు కారుమంచి జాన్, భువనపల్లి, ముమ్మిడివరం, కేశనకుర్రు విచారణ గురువులు బి.ఫ్రాన్సిస్, అలెక్స్ మరియన్న తదితరులు విశ్వాసులను ఉద్దేశించి ఉపన్యసించారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక జీవితాన్ని పెంపొందించుకోవాలన్నారు. సాయంత్రం మరియమాత విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు.

సమయం లేదు మిత్రమా!

చెరువుల్ని నింపేందుకు ఇదే సరైన తరుణం

ఉండి, భీమవరం అర్బన్, న్యూస్‌టుడే

గోదావరిలో నీరు పుష్కలంగా ఉండటంతో ఎర్రబురద బెడద సమసిపోయింది. ఖరీఫ్ మాసూళ్లు ప్రారంభమైన నేపథ్యంలో వ్యవసాయానికి నీటి అవసరాలు దాదాపు తగ్గిపోయాయి. కాలువల ద్వారా ఎగువ నుంచి దిగువ వరకూ ప్రవహిస్తున్న నీటిని పట్టణాలు, పల్లెలు, మారుమూల నివాసిత ప్రాంతాల్లోని చెరువుల్లో నింపుకొనేందుకు ఇదే అనువైన సమయం. రాబోయేది దాళ్వా కాలం కావడంతో నీటి వనరులు తగ్గిపోయే అవకాశముంది. అదే జరిగితే శివారు, మెరక భూములకు తొలి ప్రాధాన్యమిస్తూ మురుగుని ఎత్తిపోసే పరిస్థితి రావొచ్చు.

యండగండిలో సగంలోపే నీరున్న మంచినీటి చెరువు

భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో	పట్టణాలు : 2 (భీమవరం, ఆకివీడు)
గ్రామీణ మండలాలు: 6	
జనాభా : 4.80లక్షలు	నీటినిల్వలు:
మంచినీటి చెరువులు : 154	50 శాతం లోపే

ఆలస్యం చేస్తే .. తాగునీటికి ఇబ్బందే!.. చెరువుగట్ల నిర్వహణ వివిధచోట్ల అధ్వానంగా తయారైంది. ఆ పరిసర ప్రాంతాలు చెత్తాచెదారంతో అల్లుకుపోయాయి. వర్షాకాల ప్రారంభ దశలో దాదాపు అన్ని తటాకాల్లో నీటినిల్వ సామర్థ్యం పెరిగింది. ఆగస్టు నుంచి గోదావరిలో ఎర్ర బురద సమస్య ఎదురైంది. దీంతో ఆ రంగున్న నీటినే కాలువలకు సరఫరా చేశారు. దీంతో తాగునీటి చెరువులను నింపుకొనే అవకాశం లేకుండా పోయింది. ఇప్పుడు కాలువల్లోకి తాజా నీరొస్తోంది. పంట అవసరాలు తీరడంతో కొన్నిచోట్ల నీటిని వృథాగా కాలువలోకి వదిలేస్తున్నారు. ఈ దశలో ఏమాత్రం ఆలస్యం చేయకుండా చెరువులను నూరు శాతం నింపుకోవాలి. లేనిపక్షంలో రబీ ముగిసే వరకూ స్వచ్ఛమైన నీరు లభించడం కష్టమేననని గత అనుభవాలు స్పష్టంచేస్తున్నాయి.

అత్యవసర చర్యలు చేపట్టండి

రక్షిత పథకాలకు నీరందించే చెరువులను అత్యవసరంగా నింపుకోవాలని ఆదేశాలు జారీచేశాం. పాత నీటిని బయటకు తోడించి తాజా నిల్వలతో నింపుకోవాలి. తద్వారా తాగునీటి సమస్యను అధిగమించొచ్చు. -టి.శ్రీనివాసరావు, డీఈఈ, గ్రామీణ నీటి సరఫరా శాఖ, భీమవరం

మేమున్నాం.. మీకు తోడుగా..

భీమవరం పట్టణం: 80085 74471	10 AM to 1 PM
భీమవరం మండలం: 80085 74533	వీరవాసరం: 80085 74475
పాలకోడేరు: 80085 74467	ఉండి: 80085 74526
ఆకివీడు: 80085 74525	కాళ్ల: 94401 04042

ఉండి, న్యూస్‌టుడే : ? ఉండి నుంచి మహదేవపట్నం వెళ్లే కాలువ మార్గంలో వివిధ చోట్ల గట్లు బలహీనంగా తయారయ్యాయి. ఆయా ప్రాంతాలను అధికారులు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. - శివ సుబ్రహ్మణ్యం, ఎన్నార్పీఅగ్రహారం
✔ పరిశీలించి కాలువ గట్టు అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు తయారుచేస్తాం. - ఫణిశంకర్, జలవనరులశాఖ ఏఈ, ఉండి

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: ? పట్టణంలో గునుపూడి మీ సేవా కేంద్రం వెనుక ఉన్న విద్యుత్తు స్తంభాలకు ఉన్న లైన్లు కలిసిన చోట నాలుగు రోజులుగా మంటలు వస్తున్నాయి. - నివాసితులు
✔ స్తంభాలపై లైన్లు పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - కె.రవివర్మ, విద్యుత్తుశాఖ ఏఈ

పెదపుల్లేరు రహదారి పరిశీలన

ఉండి, న్యూస్‌టుడే : ఉండి నుంచి పెదపుల్లేరు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిని ఆశాఖ ఏఈ కె.శ్రీహరిరాజు గురువారం పరిశీలించారు. 'మేమున్నాం .. మీకు తోడుగా' శీర్షికన ఈనాడులో ఈనెల 17న ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించారు. దారి గుంతలు పడినచోట మురుగునీరు నిలిచిపోకుండా కల్వర్టులు ఏర్పాటు చేస్తామన్నారు. రహదారి అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు పంపించామని శ్రీహరిరాజు తెలిపారు.

ఉపసభాపతి ఆదేశంతో ఉప్పులూరుకు అధికారులు

మైక్రో ఫిల్టర్ నీటిని పరిశీలిస్తున్న శ్రీనివాసరావు, హరనాథరావు

ఉప్పులూరు(ఉండి), న్యూస్‌టుడే: ఉప్పులూరు గ్రామాన్ని ఉపసభాపతి, ఎమ్మెల్యే కనుమూరు రఘు రామకృష్ణరాజు ఆదేశంతో వివిధ శాఖల అధికారులు గురువారం పరిశీలించారు. గత కొన్ని రోజుల నుంచి జ్వరాలతో తక్షణ చర్యలు తీసుకోవాలని, సరైన కారణాలు అన్వేషించి నివారణ చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఉప సభాపతి రఘురామకృష్ణరాజు అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ భీమవరం డీఈఈ శ్రీనివాసరావు, ఉండి ఏఈ హరనాథరావు ఆధ్వర్యంలో మైక్రో ఫిల్టర్ ద్వారా సరఫరా చేస్తున్న మంచినీటి నమూనాలు తొలుత పరీక్షించారు. అవన్నీ సురక్షితంగానే ఉన్నాయని నివేదిక వచ్చిందని డీఈఈ శ్రీనివాసరావు చెప్పారు. మంచినీటి చెరువులోని నిల్వ నీటిని ఇంజిన్ల ద్వారా బయటకు తోడించాలని గ్రామ అభివృద్ధి అధికారి డి.శ్రీనివాసరావును ఆదేశించారు. ఉప్పులూరు గ్రామంలో అన్నిచోట్ల సూపర్ క్లోరినేషన్ చేయించామని ఎంపీడీవో ఎంపీఎన్ఎస్ శ్రీనివాసు తెలిపారు. ఆ ప్రాంతాన్ని డిప్యూటీ ఎంపీడీవో సిస్టర్‌కళ, గ్రామ అభివృద్ధి అధికారుల సంఘం మండల అధ్యక్షుడు జేవీటీనాయుడు తదితరులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు.

సహాయకుల ఖాళీల భర్తీకి దరఖాస్తులు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: భీమవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో టీకేవీ లక్ష్మీకాంతం తెలిపారు. దరఖాస్తులను తమ కార్యాలయంలో ఈ నెల 21 నుంచి 28 సాయంత్రం 5 గంటల లోపు అందజేయాలని సూచించారు. ఖాళీల వివరాలు ఇలా.. చినపేట (జనరల్), లోసరి (జనరల్), టిడ్కో హౌస్ (బీసీ-ఈ), రెడ్డి చెరువు (బీసీ-ఏ), కరుకువాడ (ఎస్సీ-3), తోకతిప్ప (జనరల్), రాజీవ్‌నగర్ (ఎస్సీ), గొంది (ఎస్టీ), అడ్డవంతెన (ఈడబ్ల్యూఎస్), గరగపర్రు (బీసీ-ఏ), పెద జువ్వలపాలెం (జనరల్), కొణితివాడ-2 (ఎస్సీ-2).

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఆకివీడు, ఉండి, కాళ్ల, పాలకోడేరు మండలాల పరిధిలోని 19 అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులు చేసుకోవచ్చని సీడీపీవో వాణీవిజయ రత్నం తెలిపారు. స్థానికులైన వివాహితులు మాత్రమే అర్హులు, వయస్సు 21 నుంచి 35 ఏళ్ల లోపు ఉండాలి, ఈ నెల 21 నుంచి 28వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆకివీడు ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని, పూర్తివివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు.

జక్కరం: బహుమతులు అందుకున్న విద్యార్థులు

చిన్నారులకు ఆటల పోటీలు

కాళ్ల (భీమవరం గునుపూడి), న్యూస్‌టుడే: జక్కరం ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఉన్నత భారత్ అభియాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కళాశాల సమన్వయకర్త జె.జీవన్‌కుమార్, కళాశాల ప్రతినిధులు కె.ఎం.గణేష్, జి.సూరిబాబు పాల్గొన్నారు.

ఇదేనా..స్వచ్ఛత

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని పెద్ద పురపాలక సంఘమైన భీమవరంలో స్వచ్ఛత ఎలా ఉందో చెప్పడానికి ఈ చిత్రం ఓ ఉదాహరణ. పురపాలక కార్యాలయానికి పక్కన ఉన్న ద్వారాన్ని ఇటీవల తెరిచారు. వాస్తు కోసం దారి పునరుద్ధరించారు. గేటు తెరిచి చెత్త వేసి నిప్పుపెట్టారు. ఇలా ఒక్కచోటే కాదు.. పట్టణంలో ఎటుచూసినా చెత్త గుట్టలు కనిపిస్తున్నాయి. ఇంటింటా చెత్త సేకరణ లేదు. ఎవరికి చెబుదామన్నా పట్టించుకునేవారు లేరంటూ ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం నిర్వహించే అర్జీల స్వీకరణలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులుకు నేరుగా చెప్పేందుకు వెళ్లడానికి పలు కాలనీల ప్రతినిధులు సిద్ధమయ్యారు.

బాలికల రక్షణ అందరి బాధ్యత

కరపత్రాలు, పుస్తకాలతో విద్యార్థులు

వీరవాసరం, న్యూస్‌టుడే: బాలికల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పడాల చారిటబుల్ ట్రస్ట్ జిల్లా సమన్వయకర్త ఆకుల మౌనిక అన్నారు. ప్రపంచ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని వీరవాసరం ఎంఆర్‌కే జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాలల హక్కులు, బాల్య వివాహాలు, అత్యాచారాలు, బాలికల రక్షణ, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు బాలిక రక్షణ, హక్కులపై రూపొందించిన కరపత్రాలు, పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు గుల్లిపల్లి విజయలక్ష్మి, ఐసీడీఎస్ సీడీపీవో టీకేవీ. లక్ష్మీకాంతం, సూపర్‌వైజర్ సరోజిని, ప్రధానోపాధ్యాయుడు జుత్తిగ శ్రీనివాస్ ట్రస్ట్ సభ్యులు రొంగల శైలజ, ఇందిర, తార పాల్గొన్నారు.

సత్కారం పొందిన దివ్యాంగులు, వివిధ రంగాల్లో సేవలందిస్తున్నవారు

వన సమారాధనతో దివ్యాంగులకు మానసిక ఉల్లాసం

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: దివ్యాంగులకు కార్తిక వన సమారాధన నిర్వహించడంతో వారిలో మానసిక ఉల్లాసం కలిగిస్తుందని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు సతీమణి సత్యవాణి గురువారం అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏఎంసీ ఆవరణలో దివ్యాంగులకు వన సమారాధన, వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న వారికి, దివ్యాంగులకు అభినందన సత్కారం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే సతీమణి సత్యవాణి, ఏఎంసీ ఛైర్మన్ కె.సుజాత దామోదర పూజలుచేసి వన సమారాధన ప్రారంభించారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, వివిధ సంస్థల ప్రతినిధులు, దాతలు పాల్గొన్నారు.

నెట్‌బాల్‌లో ప్రతిభ

పతకాలు సాధించిన క్రీడాకారులతో సత్యనారాయణ తదితరులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో భీమవరంలోని సీఎస్ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు పతకాలు సాధించారని ప్రిన్సిపల్ ఎండీ సలీంఖాన్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పటమట ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఈ నెల 8 నుంచి 10 వరకు జరిగిన అండర్-17, ధర్మాజీగూడెంలో ఈ నెల 15 నుంచి 17 వరకు జరిగిన అండర్-19లో పతకాలు సాధించిన క్రీడాకారులను కరస్పాండెంట్ చీడే సత్యనారాయణ అభినందించారని ప్రకటనలో తెలిపారు.

డిసెంబరు 31 నుంచి మహాసభలు

కాళ్ల (భీమవరం గునుపూడి), న్యూస్‌టుడే: సిటూ ఆల్ ఇండియా మహాసభలు విజయవంతం చేయాలని కాళ్ల మండల సీఐటీయూ కన్వీనర్ యిర్రింకి ఏడుకొండలు గురువారం కోరారు. సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు విశాఖలో జరిగే మహాసభలకు కార్మికులందరూ తరలిరావాలన్నారు.

ఆక్వా సాగులో యాంటీబయాటిక్స్ తగ్గించండి

జ్యోతి వెలిగించి అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మత్స్య పరిశోధనా సంస్థ అధికారులు, శాస్త్రవేత్తలు

వీరవాసరం, న్యూస్‌టుడే: ఆక్వా రంగంలో యాంటీబయాటిక్స్ వినియోగాన్ని తగ్గించి ఆరోగ్యకరమైన దిగుబడులు సాధించడం ద్వారా దేశ ఆక్వా రంగాన్ని ప్రపంచ దేశాల్లో ముందు వరసలో నిలబెట్టవచ్చని మత్స్య పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ఎ.చంద్రశేఖరరావు అన్నారు. ప్రపంచ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్) వారోత్సవాల్లో భాగంగా గురువారం వీరవాసరం తులసీ కన్వెషన్ హాలులో ఏఎంఆర్ వల్ల కలిగే దుష్పరిణామాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఎంపెడా ఆధ్వర్యంలోని నేషనల్ సెంటర్ ఫర్ సస్టెయినబుల్ ఆక్వాకల్చర్ సంస్థ సహకారంతో ఏఎంఆర్ ప్రాధాన్యం, ఆక్వా సాగులో మేలైన పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో మత్స్య పరిశోధనా సంస్థ అధిపతి శ్రీనివాసరావు, సీనియర్ శాస్త్రవేత్త పి.లావణ్య, ఎఫ్‌డీవో ఎస్.దుర్గారావు, రైతులు యరకరాజు గోపాలకృష్ణరాజు, వీరవల్లి చంద్రశేఖర్, మళ్ళ తులసీ రాంబాబు, మన్నే శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాల స్థాపనలో భాగస్వాములు కావాలి : ఎంపీడీవో

పాలకోడేరు, న్యూస్‌టుడే: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పాలకోడేరు ఎంపీడీవో వి.రెడ్డియ్య కోరారు. ఆర్‌జీఎస్ఏ కార్యాచరణ ప్రణాళిక అమలుపై మండల పరిషత్ కార్యాలయంలో గురువారం స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంద కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, తడి, పొడి వ్యర్థాల నుంచి వర్మికంపోస్టు తయారీ, పచ్చటి మొక్కలు పెంపకం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రామప్రసాద్, రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవా కార్యక్రమాలు

అందుకున్న రాతపుస్తకాలతో విద్యార్థులు

వీరవాసరం, న్యూస్‌టుడే: వీరవాసరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పాలకొల్లు లయన్స్ క్లబ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించి ఉచిత కంటి వైద్య శిబిరంలో అవసరమైన 61 మందికి మండల లయన్స్ క్లబ్ ఛైర్మన్ పోలిశెట్టి సత్యనారాయణ(దాసు) ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. అవసరమైన వారికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేయిస్తామన్నారు. మండల వ్యాప్తంగా ఎన్ఎంఎంఎస్ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులు రాత పుస్తకాలు పంపిణీ చేశారు. ప్లాస్టిక్ నిర్మూలనలో భాగంగా లయన్స్ క్లబ్‌కు 500 భోజన ప్లేట్లు సమకూర్చారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ ఛైర్మన్ ఎస్.వసంతలక్ష్మి, సభ్యులు దేవిరెడ్డి పుల్లారావు, గొలగాని సత్యనారాయణ, పోలిశెట్టి శ్రీనివాస్, అందే శివశంకర్, నూకల అప్పాజీ, వసంతాల భుజంగరావు, కొప్పినీడి శ్యామలరావు, ఉంగరాల శంకర్ హనుమాన్, పోలిశెట్టి శిరీష తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: కైకలూరు రైల్వే సిగ్నల్ దగ్గరల్లో ట్రాక్‌పై గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందినట్లు భీమవరం రైల్వే ఎస్సై ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. మృతి చెందిన వ్యక్తికి 50 నుంచి 60 సంవత్సరాలు వయసు ఉంటుందని తెలుపు రంగు చొక్కా, సిమెంటు రంగు ప్యాంటు ధరించి నట్లు తెలిపారు. వివరాలు తెలిసిన వారు 99084 48729 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

23న జీర్ణకోశ సమస్యలపై వైద్య శిబిరం

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామ రాజు భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 23న ఆదివారం మెంటేవారితోట సుందరయ్య భవనంలో జీర్ణకోశ వ్యాధులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ ఛైర్మన్ బి.బలరాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరంలో కడుపునొప్పి, ఉబ్బసం, గ్యాస్ సమస్యలు ఇతర జీర్ణకోశ సమస్యలకు వైద్యుడు పిఎస్ఆర్.అనీస్ ఉచితంగా పరీక్షలు నిర్వహించి ఔషధాలు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

కొనసాగిన ప్రత్యేక శిబిరం.. ఉప్పులూరు (ఉండి), న్యూస్‌టుడే: జ్వరాల బారిన పడిన ఉప్పులూరులో యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం గురువారం కొనసాగింది. వైద్యాధికారి ఐసీ కీర్తన 27 మంది రోగులను పరీక్షించారు. వారిలో ముగ్గురు నుంచి రక్తన మూనాలు సేకరించి పరీక్షించి జ్వరాలు లేవని నిర్ధారించినట్లు అధికారులు తెలిపారు. గ్రామంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి ఏఎస్ఎస్ఎన్‌మూర్తి, ఎంపీహెచ్‌ఈవో జి.వెంకటేశ్వరరావుల ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు ఏడు బృందాలుగా వెళ్లి జ్వరాల పీడితులను గుర్తించే అంశంపై సర్వే నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలు శనివారం వరకూ కొనసాగుతాయన్నారు.

జూద స్థావరంపై దాడి

కాళ్ల (భీమవరం గునుపూడి), న్యూస్‌టుడే: ఏలూరుపాడు శివారు పేకాట స్థావరంపై కాళ్ల ఎస్సై ఎన్.శ్రీనివాసరావు తమ సిబ్బందితో కలిసి దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1,200 స్వాధీనం చేసుకున్నారు.

బాలలకు క్రీడా పోటీలు

ప్రశంసా పత్రాలు అందుకున్న చిన్నారులు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు మాదివాడ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా బాల నటుడు రేవంత్ (బుల్లిరాజు)ను సత్కరించారు. ఈ సందర్భంగా బాల, బాలికలు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

క్విజ్..వక్తృత్వం.. దుంపగడప (ఆకివీడు), న్యూస్‌టుడే: దుంపగడపంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.సుజాత, అధ్యాపకులు పాల్గొన్నారు.

సినీ నటుడు బుల్లిరాజును సత్కరిస్తున్న నాయకులు, లయన్స్ క్లబ్ సభ్యులు

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు.. పాలకోడేరు, న్యూస్‌టుడే: పాలకోడేరు, గొల్లలకోడేరు శాఖా గ్రంథాలయాల్లో వారం రోజుల పాటు నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రతిభ పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎంఈవో పీవీఎస్ నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు కొత్తపల్లి నాగరాజు, గ్రంథాలయాధికారులు కృష్ణమూర్తి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆఖరి పిల్లరుకు సామర్థ్య పరీక్షలు

ఉండి, న్యూస్‌టుడే: ఉండిలో 165వ జాతీయ రహదారిలో రైల్వే ఫైవంతెనకు సంబంధించి ఆఖరి పిల్లరు సామర్థ్యాన్ని తేల్చే బరువు పరీక్షలు(లోడ్ టెస్ట్) గురువారం ప్రారంభించారు. విజయవాడకు చెందిన ప్రైవేటు సంస్థ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు దగ్గరుండి చేపట్టారు. రైల్వే ఫైవంతెన డిజైన్ ప్రకారం 340 టన్నుల బరువుండే వాహనాలు వెళ్తాయని అంచనా. 510 టన్నుల వరకూ వెళ్లినా పునాదులు తట్టుకుంటాయా..! అనే అంశాన్ని నిర్ధారించే పరీక్షలు జరుగుతున్నాయని స్థానిక అధికారులు తెలిపారు. రెండ్రోజుల్లో ఈప్రక్రియ పూర్తవుతుందని వివరించారు. ఆ తరువాత ఫైల్ క్యాప్ వేసే పనులు చేపడతామని చెప్పారు. ఆ సమయంలో వాహనాలు మళ్లింపు మార్గాల్లో రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

చిన్నారులు సమాజానికి విలువైన సంపద

ఉపాధ్యాయులు, విద్యార్థుల ప్రదర్శన

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: చిన్నారులు సమాజానికి విలువైన సంపద అని సీడీపీవో ఎం.ఉమ అన్నారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు జడ్పీ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం గురువారం నిర్వహించారు. అనంతరం గ్రామంలో విద్యార్థులతో ప్రదర్శన నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు కె.రాజశేఖర్, జనార్దన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శివయ్యకు లక్ష బిల్వార్చన

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పాలకొల్లు మండలం చింతపర్రు ఉమాపార్వతీ మల్లేశ్వరస్వామి ఆలయంలో గురువారం కార్తిక మాసం అమావాస్య సందర్భంగా లక్ష బిల్వార్చన నిర్వహించారు.

రుద్రాభిషేకాలు.. **నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే:** నరసాపురం పట్టణంలో అమరేశ్వర, కపిలమల్లేశ్వర, పార్వతి విశ్వేశ్వర, పార్వతి సమేత బసవేశ్వర, కామాక్షీ సమేత ఏకాంబరేశ్వరస్వామి ఆలయాల్లో గురువారం రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు, బిల్వార్చనలు, సహస్ర నామార్చనలు నిర్వహించి పంచ హారతులు ఇచ్చారు.

క్షీరారామంలో లక్షపత్రి పూజలు.. **పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే:** కార్తిక మాసం ఆఖరి రోజు సందర్భంగా పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం లక్షపత్రి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిని పూలతో అలంకరించారు.

దోమ పుట్టేది ఇక్కడే.. పట్టించుకోండి ఇప్పుడే..

వ్యాధుల కారకాలుగా ఖాళీ స్థలాలు

సీతారామపురం సౌత్ కొత్తపేటలో ఖాళీ స్థలంలో చెత్త

పెనుగొండ, నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: ఖాళీ స్థలాలు దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఏళ్లుగా వాటిని వినియోగించకపోవడంతో తుప్పలు, పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. వాటిని ప్రక్షాళన చేసేందుకు యజమానులు ముందుకు రాకపోవడంతో.. స్థానికులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పెనుగొండ మండల కేంద్రంలోనూ పరిస్థితి దారుణంగా ఉంది. ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ ప్రదేశాల్లో వర్షపు నీరు నిలవడం, కలుపు మొక్కలు పెరగడంతో దోమలకు ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయి. పెనుగొండ జేవీఎల్‌నగర్, కోడిపందేలదిబ్బ, నగరేశ్వర కాలనీల్లో ఇందిరశాంతినగర్, విద్యుత్తు ఉపకేంద్రం తదితర ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు స్థానికులకు ఇబ్బందికరంగా మారాయి. వర్షం వస్తే నీటి నిల్వతో విష పురుగులు తిరుగుతున్నాయని ఆ ప్రాంత వాసులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా కాలనీల్లో డ్రెయిన్లు లేక మురుగునీరు ముందుకు సాగడం లేదని వాపోతున్నారు. ఖాళీ ప్రదేశాల్లో పెరిగిన మొక్కలను స్థల యజమానులు తొలగించేందుకు, దోమల నివారణకు పంచాయతీ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో టి.సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ.. స్థానికులకు ఇబ్బంది కలిగించే ఖాళీ స్థలాలపై ప్రత్యేక దృష్టి సారించి సమస్య పరిష్కరిస్తామన్నారు.

నరసాపురం మండలం చిట్టవరం, పాతనవరసపురం, లక్ష్మణేశ్వరం, ఎల్చీచర్ల, చామకూడిపాలెం, కొపర్రు, సరిపల్లి గ్రామాల్లో ఖాళీ స్థలాల్లో చెత్త, పిచ్చిమొక్కలు పెరిగి.. దోమల పునరుత్పత్తి కేంద్రాలుగా మారాయి. నియంత్రణ చర్యలు చేపట్టకపోవడంతో రాత్రి, పగలు దోమలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. నీటి ప్రవాహంతో డెంగీ, మలేరియా తదితర ప్రమాదకర వ్యాధుల బారిన పడుతున్నామని వాపోతున్నారు. ఈ విషయమై డీఎల్‌పీవో ఐ.జ్యోతిర్మయి మాట్లాడుతూ.. స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించామన్నారు. నిబంధనలు పాటించని ఖాళీ స్థలాల యజమానులపై చర్యలు చేపడతామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసాపురం	:80085 74504	ఆచంట	:90631 44737
పాలకొల్లు	:80085 74510	పెనుగొండ	:80085 74469
పోడూరు	:90631 44741	పెనుమంట్ర	:91212 29087

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? పట్టణంలోని బ్యాంకు వీధిలో చెత్త సక్రమంగా తొలగించడం లేదు. - సి.హెచ్.కనకరాజు, నరసాపురం

✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - ఎం.అంజయ్య, పురపాలక కమిషనర్

మొగల్తూరు, న్యూస్‌టుడే: ? మోడి- ముత్యాలపల్లి రోడ్డులో పైపులైను నుంచి శుద్ధి జలాలు లీకై వృధాగా పోతున్నాయి. - సుబ్రహ్మణ్యం

✔ పైపులైన్‌కు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తాం. - మోహనరావు, ఏఈ, తాగునీటి సరఫరా విభాగం

స్పందనకు పందనం

డ్రెయిన్‌లో పూడికతీత.. **పెనుగొండ, న్యూస్‌టుడే:** వడలి ఎస్సీ కాలనీలో డ్రెయిన్ పూడిపోయి మురుగు రహదారిపైకి చేరుతున్న వైనంపై ఈ నెల 18న 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన సమస్యకు సర్పంచి కాసాని విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఎస్.శ్రీనివాసరెడ్డి స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందితో డ్రెయిన్‌లో పూడికతీత పనులు చేయించి చెత్త, వ్యర్థాలు తొలగించారు.

కొప్పర్రులో దీపోత్సవం

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: కొప్పర్రు శివాలయంలో గురువారం రాత్రి దీపోత్సవం నిర్వహించారు. శివలింగాకారంలో ఏర్పాటు చేసిన దీపాలు ఆకట్టుకున్నాయి.

బాబాకు అభిషేకాలు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలో పార్కు రోడ్డు, స్వరాజ్యరామం వీధుల్లోని శిర్డీ సాయిబాబా ఆలయాల్లో గురువారం విభూతి అభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించి పంచ హారతులు ఇచ్చారు. ఉదయం నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించండి

మాట్లాడుతున్న రామరాజు

నరసాపురం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు ప్రజలకు వివరించాలని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు సూచించారు. పట్టణంలోని ఒకటో వార్డులో గురువారం తెదేపా కమిటీ సమావేశం నిర్వహించారు. దీనికి హాజరైన ఆయన మాట్లాడారు. సమావేశంలో మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఏఎంసీ ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పాలూరి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రయోజనాలే మిన్నగా పని చేయండి

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: తమ సొంత ప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనాలే మిన్నగా సీపీఎం కార్యకర్తలు పని చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు మంతెన సీతారామ్ పిలుపునిచ్చారు. వేములదీవి పడమరలో గురువారం పార్టీ కార్యకర్తలకు నిర్వహించిన మండల స్థాయి శిక్షణ తరగతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కేంద్రంలో భాజపా కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల మధ్య అసమానతలు బాగా పెరిగాయన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కవురు పెద్దిరాజు, మండల కార్యదర్శి జల్లి రామ్మోహనరావు పాల్గొన్నారు.

ఆచంటలో అన్నసమారాధన

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట ఉమారామలింగేశ్వరస్వామి ఆలయ సత్రంలో కార్తికమాసం చివరి రోజు గురువారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మండలంలోని వివిధ గ్రామాల భక్తులతో పాటు సుదూర ప్రాంతాల నుంచి అఖండ జ్యోతిలో ఆవు నెయ్యి సమర్పించడానికి వేల సంఖ్యలో హాజరయ్యారు. అంతకు ముందు ఉసిరి చెట్టు వద్ద లక్ష్మీనారాయణుడికి ప్రత్యేక పూజలు చేశారు.

పారిశ్రామిక శిక్షణతో ఉపాధి అవకాశాలు: పితాని

విద్యార్థికి ధ్రువపత్రం అందిస్తున్న సత్యనారాయణ

ఆచంట, న్యూస్‌టుడే: పారిశ్రామిక శిక్షణ పొందిన వారికి కూటమి ప్రభుత్వం అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఐటీఐ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వృత్తి, పారిశ్రామిక శిక్షణ కోర్సుల ప్రాధాన్యత వివరించారు. 2023-2025లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందించారు. ఎంపీపీ సూర్యకుమారి, తహసీల్దార్ జి.కనకరాజు, ఎంపీడీవో బి.కృష్ణమోహన్, ప్రిన్సిపల్ ఐవీ సత్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కూటమి సర్కార్

పెనుగొండ, న్యూస్‌టుడే: రైతులకు అండగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పెనుగొండ ఏఎంసీ ఛైర్మన్ బడేటి వీరబ్రహ్మం(బ్రహ్మాజీ) అన్నారు. గురువారం స్థానిక ఏఎంసీలో నిర్వహించిన సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల సమస్యలను ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. పుంత రహదారులను అభివృద్ధి చేయాలని, ఏఎంసీలో పలు భవనాల నిర్మాణం, గోదాము తదితర వాటికి మరమ్మతులు చేపట్టాలని పాలకవర్గ సభ్యులు తీర్మానించారు.

వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

వైద్య శిబిరానికి స్పందన

మొగల్తూరు, న్యూస్‌టుడే: మొగల్తూరు వన మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం గౌరీశంకర్ కార్పెంటర్స్ సంఘ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. భీమవరానికి చెందిన మిత్ర మెడికేర్ వైద్య బృందం వైద్య సేవలు అందించింది. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

నేడు పెయ్య దూడల అందాల పోటీలు

యలమంచిలి, న్యూస్‌టుడే: కాంభోట్లపాలెంలో మండల స్థాయి లేగ పెయ్య దూడల అందాల పోటీలు, పశువుల్లో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి పి.చంద్రశేఖరరెడ్డి గురువారం తెలిపారు. విజేతలకు మొదటి, ద్వితీయ, తృతీయ, ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్లు చెప్పారు. అన్ని గ్రామాల ప్రజలు, రైతులు వారి దూడలతో అందాల పోటీల్లో, పశు వైద్య శిబిరంలో పాల్గొనాలని ఆయన కోరారు.

రహదారికి మరమ్మతులు

పోడూరు, న్యూస్‌టుడే: పెనుమదం రహదారి మరమ్మతులకు అధికారులు చర్యలు తీసుకున్నారు. 'అడుగడుగునా గుంతలే' శీర్షికతో ఈ నెల 3న 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు ర.భ.శాఖ ఏఈ మూర్తి స్పందించారు. రెండు రోజులుగా గుంతలు పూడ్చిస్తున్నారు.

మాక్ అసెంబ్లీకి శివరామకుమార్ ఎంపిక

మొగల్తూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థులతో ఏర్పాటు చేయనున్న మాక్ అసెంబ్లీకి పేరుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి పి.శివరామకుమార్‌ను ఎంపిక చేసినట్లు పాఠశాల విద్య కమిషనర్ కార్యాలయం నుంచి గురువారం మండల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు అందాయి. ఒక్కొక్క నియోజకవర్గం నుంచి ఒక విద్యార్థిని ఎంపిక చేసేందుకు ఇటీవల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పలు విభాగాల్లో పరీక్షలు నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో 1, 2, 3 స్థానాల్లో నిలిచిన విద్యార్థుల జాబితాలను కమిషనర్ కార్యాలయాలకు పంపించారు. ప్రథమ స్థానంలో ముత్యాలపల్లి బండిముత్యాలమ్మ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని తిరుమాని పూజశ్రీ నిలిచింది. ఆ విద్యార్థినినే ఎంపిక చేస్తారని అందరూ భావించారు. దీనికి భిన్నంగా శివరామకుమార్‌ను ఎంపిక చేశారు. దీంతో అధికారులు అభ్యర్థి పేరు మార్పు చేశారని ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణ మాట్లాడుతూ.. విద్యార్థిని ఎంపిక చేసేందుకు కమిషనర్ కార్యాలయంలో రాష్ట్రస్థాయిలో నిర్దేశించిన వివిధ అంశాలు పరిగణనలోకి తీసుకున్నారన్నారు. గత మూడేళ్లలో ఆ విద్యార్థి సాధించిన మార్కులు, ఇతర అంశాలను కూడా ప్రామాణికంగా తీసుకున్నారని డీఈవో తెలిపారు.

దళారులను నమ్మొద్దు

యలమంచిలి, న్యూస్‌టుడే: రైతులు దళారులను నమ్మకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్ముకోవాలని, అప్పుడే మద్దతు ధర లభిస్తుందని తెదేపా మండలాధ్యక్షుడు మామిడిశెట్టి పెద్దిరాజు సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూటమి నాయకులు గురువారం ప్రారంభించారు. ధాన్యం అమ్మిన 48 గంటల్లోనే రైతుల బ్యాంక్ ఖాతాల్లో సొమ్ము జమ చేస్తున్నామన్నారు. వ్యవసాయాధికారి డి.బాలాత్రిపురసుందరి, కూటమి నాయకులు ఉన్నమట్ల కబర్ధి, బొప్పన హరికిశోర్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యలోనే వదిలేశారు

గ్రామాల్లో నిర్మించ తలపెట్టిన ఆరోగ్య కేంద్ర భవనాలు కొన్ని చోట్ల అసంపూర్తిగా కనిపిస్తున్నాయి. ఒక్కో భవనానికి రూ.17.5 లక్షల నిధులు మంజూరు చేశారు. కానీ సొమ్ములు సకాలంలో చెల్లించకపోవడంతో గతంలో గుత్తేదారులు పనులను మధ్యలో ఆపేశారు. చినమల్లంలోనూ భవన నిర్మాణం పనులు మధ్యలోనే ఆగిపోయింది. దీంతో ఆరోగ్య సిబ్బంది పాడైన పంచాయతీ భవనంలోనే విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ ఇన్‌ఛార్జి ఏఈ నవీన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం నిధుల కొరత ఉందని, నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, పెనుగొండ గ్రామీణ**

నేడో.. రేపో.. పడటం ఖాయం

పాలకొల్లు గ్రామీణ పంచాయతీ నాగరాజుపేటలోని మూడో వీధిలో విద్యుత్తు స్తంభం ఓ పక్కకు ఒరిగిపోయింది. స్తంభం పడిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకుని స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్తు ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, పాలకొల్లు గ్రామీణ**

ఇలా ఉంటే.. జరగదా ప్రమాదం!

చినమల్లం పేదల కాలనీలోని విద్యుత్తు స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్ పరివర్తకానికి పిచ్చి పాదులు అల్లుకున్నాయి. దీంతో తరచూ విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు చెబుతున్నారు. విద్యుత్తు తీగల మరమ్మతులు, తీగలపై ఉన్న మొక్కలు తొలగించేందుకు ప్రతి వారం విద్యుత్తు సరఫరా నిలిపి వేస్తున్నారే తప్ప.. స్తంభాలకు మాత్రం ఎక్కడ పాదులు అక్కడే ఉంటున్నాయని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయమై ఎల్ఐ సువర్ణకుమార్ మాట్లాడుతూ.. సిబ్బంది కొరత ఉందని, పక్కన గ్రామంలో ఉన్న లైన్‌మెన్‌తో తక్షణం తొలగిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, పెనుగొండ గ్రామీణ**

విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలి: సీపీఎం

నిరసన తెలుపుతున్న నాయకులు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు డిమాండ్ చేశారు. నరసాపురం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగా విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేసేందుకు యత్నిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కోడి లక్ష్మణ్, నోములకొండ, పొగాకు నారాయణరావు, మంచిలి నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యంపై కేసు

నరసాపురం, న్యూస్‌టుడే: వ్యక్తి అదృశ్యమైన ఘటనపై గురువారం కేసు నమోదు చేశామని పట్టణ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. పట్టణానికి చెందిన బొర్రా వెంకటరమణ(48) చెరకురసం విక్రయ దుకాణం నిర్వహిస్తున్నారు. ఈ నెల 13న మధ్యాహ్నం దుకాణం వద్ద నుంచి ఇంటికి వెళ్లి భోజనం చేసిన అనంతరం తిరిగి దుకాణానికి వెళ్తున్నానని ఇంటివద్ద చెప్పి బయటకు వెళ్లారు. అప్పటి నుంచి ఆయన కనిపించడంలేదు. దీనిపై ఆయన భార్య విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

మహిళ.. **పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే:** మహిళ అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. యలమంచిలి మండలం దొడ్డిపట్లకు చెందిన మహిళ ఈనెల 15న మందులు తెస్తానని వెళ్లి ఎంతకు తిరిగి రాలేదు. దీంతో బంధువులు, చుట్టుపక్కల ఆరా తీయగా.. ఆచూకీ దొరకలేదు. దీనిపై గురువారం ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.గురయ్య తెలిపారు.

యువతిని వేధించిన వారిపై.. **పోడూరు, న్యూస్‌టుడే:** యువతిని వేధించిన వారిపై పోడూరు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని వద్దిపర్రుకు చెందిన ఓ యువతిని అదే గ్రామానికి చెందిన యువకుడు ప్రేమ పేరుతో వేధించడంతో పాటు మరో యువతి సాయంతో అసభ్య పదజాలంతో ఆమెను ఇబ్బంది పెట్టాడు. దీనిని గ్రామ పెద్దల దృష్టికి తీసుకెళ్లగా. . న్యాయం జరగలేదు. దీనిపై బాధిత యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ జి.రమేష్‌బాబు తెలిపారు.

ఏం జరిగింది.. ఎందుకీ తనిఖీలు?

తీర ప్రాంత గ్రామాల్లో 'సాగర్ కవచ్' మాక్‌డ్రిల్

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణం, గోదావరి, సముద్రతీర ప్రాంత గ్రామాల్లో గురువారం డీఎస్పీ జి.శ్రీవేదఅరవింద ఆధ్వర్యంలో రక్షణ సిబ్బంది విస్తృత తనిఖీలతో ప్రజల్లో అలజడి నెలకొంది. సముద్రంలో నావికాదళ సిబ్బంది, తీరం, పట్టణంలోని బస్టాండు, రైల్వేస్టేషన్లో పోలీసు, మెరైన్ పోలీసులు తనిఖీ చేశారు. బస్టాండులో ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ హడావుడి చూసిన ప్రజలు సంఘ విద్రోహశక్తులు చొరబడి ఉంటారని భయభ్రాంతులకు గురయ్యారు. ఆఖరుకు 'సాగర్ కవచ్'లో భాగంగా మాక్ డ్రిల్ నిర్వహించారని తెలుసుకుని ఓహో ఇదా సంగతి అనుకున్నారు.

పుస్తక పఠనం కొనసాగించాలి: ఆర్డీవో

నరసాపురం: బహుమతి అందజేస్తున్న దాసి రాజు

నరసాపురం, పట్టణం, మొగల్తూరు, పాలకొల్లు మార్కెట్, పెనుమంట్ర, న్యూస్‌టుడే: విజ్ఞానం పెంపొందించే పుస్తకపఠనం కొనసాగించాలని ఆర్డీవో దాసి రాజు సూచించారు. నరసాపురంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో వారోత్సవాలు ముగింపు సందర్భంగా నిర్వాహకురాలు కుమారి అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ★ నరసాపురం వైఎన్‌లో వ్యాసరచన పోటీలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ★ మొగల్తూరులో గ్రంథాలయ నిర్వాహకుడు హనుమంతరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో విద్యార్థులకు బహుమతులు అందించారు. ★ పాలకొల్లు డీఎన్నార్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఏఎస్ఎన్ఎమ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ముగింపు వేడుకలు ప్రిన్సిపాళ్లు పి.శోభారాణి, టి.రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ★ పెనుమంట్ర, మార్టేరు శాఖా గ్రంథాలయాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

ఆక్వా సాగులో యాంటీబయోటిక్స్ ఎక్కువగా వాడొద్దు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: రొయ్యల సాగులో ఎక్కువగా యాంటీబయోటిక్స్ ఎక్కువగా వాడొద్దని ఏపీ ఆక్వా యూనివర్సిటీ రీసోర్సుపర్సన్ ఎన్.వీరభద్రరావు అన్నారు. లక్ష్మణేశ్వరం మత్స్య కళాశాలలో 'రొయ్యల సాగు యాజమాన్యం' అనే అంశంపై ఏర్పాటు చేసిన మూడ్రోజుల సదస్సులో రెండో రోజు గురువారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆక్వా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అనంతరం రాజుల్లంకలో రొయ్యల చెరువులను శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. రీసోర్సు పర్సన్‌లు కె.శ్రావణి, సి.ప్రభంజన్‌కుమార్‌రెడ్డి, బలభద్రపురం ఏపీ ఆక్వా యూనివర్సిటీ శాస్త్రవేత్త ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రొయ్యల చెరువును పరిశీలిస్తున్న బృందం

సమాజాభివృద్ధిలో భాగస్వాములుకండి

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

నరసాపురం గ్రామీణ, మొగల్తూరు, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ప్రతినిధులు, గ్రామ కార్యదర్శులు, డ్వాక్రా స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు సమాజ ప్రగతిలో భాగస్వాములు కావాలని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ వృత్తి నైపుణ్య కన్సల్టెంట్ సిరిగిరి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. డ్వాక్రా స్వయం సహాయక సంఘాల సభ్యులు సామాజిక కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. ★ గ్రామాల స్వచ్ఛతలో భాగస్వాములు కావాలని ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి సూచించారు. మండల పరిషత్తు సమావేశ మందిరంలో గురువారం వీవోలు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు నిర్వహించిన శిక్షణ తరగతిలో ఆయన మాట్లాడారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: సిద్ధాంతంలో అనాథ శవానికి పంచాయతీ, రెవెన్యూ, పోలీసు అధికారులు గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. స్థానిక కచేరి సెంటర్ వద్ద ఉన్న ఓ వ్యక్తి(62) మృతి చెందాడని సమాచారం రావడంతో సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహానికి పంచనామా చేసి అంత్యక్రియలు చేశారు.

అలలపై వల కళకళ

మత్స్యకారులకు డబుల్ ఇంజిన్ సర్కార్ సహకారం

నరసాపురం, గ్రామీణ, మొగల్తూరు, న్యూస్‌టుడే: ప్రపంచమంతా మాగన్నుగా నిద్రించే అర్ధరాత్రి కీచురాళ్ల ధ్వనుల మధ్య కారు చీకట్లో మత్స్యకారులు చేపల వేటకు వెళ్తుంటారు. ఉద్ధృతంగా ప్రవహించే జీవనది గోదావరి, సముద్రం ఆటుపోటులతో ప్రవాహ దిశ మార్చుకునే ఉప్పుటేరులు, కడలి కల్లోల అలలపై రాత్రి, పగలూ వ్యత్యాసం తెలియకుండా మత్స్యకారులు చేపల వేట సాగించి విశేష మత్స్య సంపదను వెలికి తీసుకువస్తుంటారు. ఈ వృత్తినే నమ్ముకుని కుటుంబాలను పోసిస్తూ.. జీవితాలను నెట్టుకొస్తున్న మత్స్యకారులకు డబుల్ ఇంజిన్ సర్కార్ తగిన విధంగా సహకారం అందిస్తూ.. చుక్కానిలా నిలుస్తోంది. **నేడు మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం...**

జిల్లాలో మొత్తం మత్స్యకారుల జనాభా సుమారు: 1.80లక్షల మంది	సముద్ర చేపల వేట సాగించే మత్స్యకారుల కుటుంబాలు: 6,100
నదులు, కాలువలు, ఇతర జలవనరుల్లో చేపలు వేటాడే మత్స్యకార కుటుంబాలు: 30వేలు	

అండదండలు.. మెరైన్ మత్స్యకారులకు ప్రభుత్వం అండదండలు అందిస్తోంది. ఒక్కొక్కటి రూ.1.20 కోట్ల విలువైన అధునాతన బోట్లను రాయితీపై అందజేస్తోంది. సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులకు మార్గనిర్దేశం చేసేందుకు వీలుగా వారి బోట్లలో ట్రాన్సిప్లాండర్లను అమర్చుతున్నారు. వేట నిషేధ కాలంలో ఒక్కొక్కరికి రూ.20వేలు అందిస్తున్నారు. మోటారు బోటుకు లీటరు డీజిల్‌పై రూ.9 రాయితీపై నెలకు 300 లీటర్లు అందజేస్తున్నారు. రాయితీపై పడవలు, వలలు, మత్స్య సంపద రవాణాకు వాహనాలు ఇస్తున్నారు. రూ.10 లక్షల బీమా అమలు చేస్తున్నారు.

చేపలు వేటాడే బోట్లు

సమగ్ర అభివృద్ధికి..

మత్స్యకారుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వాలు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయి. ఆయా పథకాలకు అర్హులను ఎంపిక చేసి వారికి అందజేస్తున్నాం. మత్స్యకారులు ఆయా సంఘాల్లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. దీని ద్వారా ప్రభుత్వ లక్ష్యం నెరవేరేందుకు అవకాశం ఉంటుంది. **- ఎల్ఎల్ఎన్ రాజు, సహాయ సంచాలకుడు, నరసాపురం**

ఆర్థిక సాయం అందజేత

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లు మండలం అరట్లకట్టకు చెందిన ఎ.అరుణకుమారి అనే మహిళ కొంతకాలంగా అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలిసిన వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకట రామరాజు ఆమెకు రూ.10 వేలను అందించారు. చెక్కును ఫౌండేషన్ కన్వీనర్ పి.బుద్ధరాజు గురువారం ఆమెకు ఇచ్చారు.

మీకు 78వ జయంతి-60 ఏళ్ల మన జ్ఞాపికలు
నాలో నిత్యమూ పూచి పరిమళించే మధుర మందారాలు

జననం: 21.11.1948
మరణం: 01.12.2024
కీ॥శే॥ కలిదిండి రామరాజు గారు
ఆడిటర్
నిత్యం మీ స్మరణలో జీవిస్తున్న
బచ్చు సత్యనారాయణ, Retd.SBI, Hyd

(c) eenadu

తాడేపల్లిగూడెం

• తాడేపల్లిగూడెం • తణుకు

పరిసరాల శుభ్రతపై అవగాహన

ర్యాలీ చేస్తున్న సభ్యులు, అధికారులు

ఇరగవరం, న్యూస్‌టుడే: ప్రతీ గ్రామాన్ని శుభ్రంగా ఉంచేందుకు స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో, కోర్సు డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. ఇరగవరం మండల పరిషత్తు కార్యాలయంలో క్లీన్ అండ్ గ్రీన్ పంచాయతీలపై గురువారం రెండో రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పరిసరాల శుభ్రతపై అవగాహన ర్యాలీ చేశారు. మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

ఉచిత రక్త పరీక్షలు

తణుకు, న్యూస్‌టుడే: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి నెలా మూడో గురువారం స్థానిక కార్యాలయంలో సాయిశ్రీ శ్వేత డయాగ్నస్టిక్ సహకారంతో ఉచిత మధుమేహ, రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం 47 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. ప్రముఖ న్యూరో వైద్యులు రమేష్ కుమార్ చికిత్స చేసి.. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. సంఘ అధ్యక్షుడు కరుణాకర్ చౌదరి, సభ్యులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నమూనా సేకరిస్తున్న సిబ్బంది

ముగిసిన కార్తిక పూజలు

తణుకు, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా నెల రోజుల పాటు పైడిపర్రు శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో గురువారం చివరి రోజు కావడంతో స్వామి వారికి విశేష పూజలు చేశారు. ఉదయం స్వామికి పల్లకి సేవ నిర్వహించి, నక్షత్ర హారతి ఇచ్చారు. పల్లకి సేవ ప్రారంభించి నేటికి పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు మురళీ శర్మ బృందాన్ని పూలమాలలతో సత్కరించారు. ఏటా కార్తిక మాసంలో రోజూ భక్తులకు అల్పాహారం, భక్తుల సహకారంతో అన్న సమారాధన నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు. చివరి రోజున రంగు రంగులతో బొక్కుత్సవం నిర్వహించారు.

సమస్యల ఆవాసం.. టిడ్కో సముదాయం..

లబ్ధిదారుల అవస్థలు

తాడేపల్లిగూడెం అర్బన్ (న్యూస్‌టుడే): తాడేపల్లిగూడెం మండలం ఎల్.అగ్రహారంలో ఉన్న టిడ్కో గృహ సముదాయాల్లో మౌలిక సౌకర్యాల లేమితో నానా అవస్థలు పడుతున్నారు. ఖాళీ ప్రదేశాల్లో పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగి చిట్టడివిని తలపిస్తోంది. విష సర్పాలకు నిలయాలుగా మారాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు కొరత, చెత్త చెదారం ఎక్కడికక్కడ పేరుకు పోవడంతో దోమలు విపరీతంగా పెరిగిపోయి విష జ్వరాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలను అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని.. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని స్థానికులు వేడుకుంటున్నారు.

చెదలపడుతున్న గోడ

✦ పలు బ్లాకుల్లో శ్లాబ్‌ల నుంచి నీరు లీకేజీలు వస్తున్నాయి. నాలుగోవ అంతస్తు శ్లాబ్ నుంచి నీరు గ్రౌండ్ ఫ్లోర్ వరకు లీకవుతుందని, దీంతో విద్యుదాఘాతం తగులుతుందేమోనని భయాదోళనలు చెందుతున్నారు. నీరు లీకేజీ కొన్ని చోట్ల చెదలు పడుతున్నాయని వాపోతున్నారు. విద్యుత్తు స్తంభాలు మూలన పడేశారు. పలు వీధుల్లో రాత్రిళ్లు చీకటి అలుముకుంటోందని చెబుతున్నారు.

రెండ్రోజులకు.. మంచినీటిని రెండ్రోజులకు ఒకసారి వదులుతుండటంతో బిందెలు, టబ్బుల్లో నిల్వ చేసుకోవాల్సి వస్తుందని అంటున్నారు. తాగునీటి ట్యాంకరు రోజూ ఒకే సమయానికి రాకపోవడంతో పనులకు వెళ్లిన వారికి ఇబ్బందులు తప్పడం లేదని మహిళలు ఆవేదన చెందుతున్నారు. నీటిని ఇరవై నాలుగు గంటలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తొట్టెలు లేవు.. చెత్తను వేయడానికి ఈ సముదాయాల్లో ఎక్కడా తొట్టెలు లేవు. దీంతో చెత్తను కాలనీలోనే పారేయడంతో దుర్వాసనతో వెదజల్లుతోందని పలువురు చెబుతున్నారు. అంతర్గత రహదారులను శుభ్రం చేయకపోవడంతో రోడ్లన్నీ అపరిశుభ్రంగా తయారవుతున్నాయని, వర్షం పడితే మరీ ఛిద్రంగా మారుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.


ఆవరణలో దట్టంగా పిచ్చి మొక్కలు

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	99488 53114
తణుకు	85558 50851
తణుకు గ్రామీణం	63005 79402
అత్తిలి	91548 46774

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ? యాగర్లపల్లి రజక సంఘం వీధిలో మురుగు రహదారిపై చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. - విజయ్, స్థానికుడు

✔ మురుగు సాఫీగా సాగేలా చర్యలు చేపడతాం. - సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

? స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీ శివారు ఖాళీ స్థలాల్లో మురుగు కదలక దోమల వృద్ధి చెందడంతో కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. - వెంకట్రావు, స్థానికుడు.

✔ పరిశీలించి పరిష్కరిస్తాం. - ఏసుబాబు పురపాలక కమిషనర్

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ? అత్తిలి నుంచి పాలూరు, ఈడూరు, మంచిలి, కంచుమర్రు మీదుగా భీమవరం వెళ్లే రహదారి పెద్ద పెద్ద గోతులతో ఛిద్రంగా మారింది. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం - రంగారావు, స్థానికుడు

✔ త్వరలో రోడ్ల నిర్మాణం చేపడతాం. - ర.భ.శాఖ డీఈ వరలక్ష్మి

సీపీఆర్‌తో బతికే అవకాశం

మాట్లాడుతున్న వెంకటకృష్ణ

తణుకు, న్యూస్‌టుడే: కార్డియాక్ అరెస్ట్ జరిగినప్పుడు సీపీఆర్ అందిస్తే బాధితుడు బతికే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని దీనినే గోల్డెన్ మినిట్స్ అంటారని రోటరీ క్లబ్ అధ్యక్షుడు కలగర వెంకటకృష్ణ, ప్రముఖ కార్డియో నిపుణులు ప్రదీప్ ఇమ్మానియేలు అన్నారు. తణుకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మహిళా కళాశాలలో క్లబ్ అధ్యక్షుడు వెంకటకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సీపీఆర్ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ చిట్టూరి ఉషారాణి, క్లబ్ సెక్రెటరీ సుధాకర్, ప్రసన్న, ఐశ్వర్య, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

చరవాణి మాకొద్దు

బహుమతులు అందుకున్న విద్యార్థులు

తణుకు, న్యూస్‌టుడే: ఈనాడు ఆధ్వర్యంలో గురువారం స్థానిక గురజాడ విద్యానికేతన్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాల్లో సెల్‌ఫోన్ ప్రభావం' అంశంపై 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు చరవాణి మాకొద్దు అనే అంశంపై ఉపన్యాసాలు చేశారు. ప్రతిభ కనబరిచిన వై. జ్యోతిక, కె. హేమ ప్రత్యూష, పి. వెంకట శ్రీజ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు కళాశాల డైరెక్టర్ సీతారామయ్య చౌదరి, ప్రిన్సిపల్ జీఎస్ఆర్. శాస్త్రి, ఇన్‌ఛార్జి రాణి రత్న ప్రభ బహుమతులు అందజేశారు.

ఉల్లాసంగా ఉపన్యాసాలు..

తణుకు, న్యూస్‌టుడే: ఇంపల్స్ జూనియర్ కళాశాలలో గురువారం ఈనాడు ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. కృత్రిమ మేధతో భవిష్యత్తులో వచ్చే మార్పులు అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులు ఉపన్యాసాలు ఇచ్చారు. ఆర్ లక్ష్మీ వైష్ణవి, హేమలావణ్య వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు కళాశాల డైరెక్టర్ అండ్ ప్రిన్సిపల్ కె. ఎన్.వి. రామ్‌కుమార్, కేర్ వరపు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధతో భవిష్యత్తు మార్పులు.. కొండయ్యచెరువు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం కొండయ్య చెరువు సమీపంలోని శ్యామల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గురువారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. దీనిలో భాగంగా 'కృత్రిమ మేధ, భవిష్యత్‌లో వచ్చే మార్పులు'' అంశంపై ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన భవాని, మహేష్, దుర్గ ప్రిన్సిపల్ మోహన్, అధ్యాపకులు బహుమతులు అందజేశారు.

ముఖ్యమంత్రి సహాయనిధితో పేదలకు ఊరట

గణేష్‌నగర్(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయ నిధితో పేదలకు ఊరట లభిస్తుందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. గురువారం తన విడిది కార్యాలయం వద్ద పెంటపాడు మండలానికి చెందిన 12 మంది పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. రేఖ్ల సతీశ్ రైలు ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకోవడంతో జీవనోపాధికి ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో రూ.10 వేలు ఆర్థిక సహాయమందించారు. పెంటపాడు మండల అధ్యక్షుడు పుల్ల బాబీ, రీజనల్ సమన్వయకర్త మధులత, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ తదితరులు

ఈత కొలను అభివృద్ధికి రూ. 50 వేలు అందజేత.. గణేష్‌నగర్(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: కడకట్ల ద్వారా నగర్‌లో ఎమ్మెల్యే, తన స్నేహితుల సహకారంతో నిర్మిస్తున్న ఈత కొలనుకు వెంకట నరసింహ డెవలపర్స్ భూపతిరాజు శివాజీ తరుపున లోటస్ ఎన్‌క్లేవ్ ప్రతినిధి మురళీ కృష్ణంరాజు గురువారం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు తన విడిది కార్యాలయం వద్ద రూ. 50 వేలు అందించారు. అభివృద్ధి కమిటీ సభ్యులు సత్తి శివ, అనిల్, డైమండ్స్ లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు గోపీకృష్ణ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిశీలన

భాగ్యలక్ష్మిపేట(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: భవన నిర్మాణ, ఇతర కార్మికుల బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జీ తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం గ్రీవెన్స్ సెల్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలు పరిశీలించారు. కార్యాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న బాబ్జీ

స్వచ్ఛ గ్రామాల సంకల్పం నెరవేర్చాలి

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: స్వచ్ఛ గ్రామాల సంకల్పాన్ని నెరవేర్చడంలో ప్రజల పాత్ర కీలకమని ఎంపీడీవో విజయ కుమారి అన్నారు. నిడమర్రు మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం గ్రామాల అభివృద్ధి, స్వచ్ఛత, పచ్చదనం వంటి అంశాలపై డ్వాక్రా సంఘ సభ్యులు, సీసీలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలు, పరిష్కార మార్గాలను వివరించారు. డిప్యూటీ ఎంపీడీవో స్వామి తెలిపారు.

అవగాహన సదస్సులో పాల్గొన్న డ్వాక్రా సభ్యులు

ప్రభుత్వ సహకారం.. ప్రతిభకు ప్రోత్సాహం

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు విద్య నందించేందుకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుంది. తొలుత ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంతో నాణ్యమైన భోజనం అందిస్తుంది. దీంతో పాటు పోటీ విద్యార్థులు మధ్య తరగతి కుటుంబాల పిల్లలు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు సంబంధిత పుస్తకాలను అందించడానికి శ్రీకారం చుట్టింది. ఈ తరహా ఎంపీసీ, బైపీసీ చదువుతున్న ప్రథమ, ద్వితీయ సంవత్సరం వారికి ఈఏపీసెట్, నీట్ పరీక్షల మెటీరియల్‌లను అందించింది.

నియోజకవర్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు ఇలా..

ప్రాంతం	విద్యార్థులు	సైన్స్ ఒకేషనల్
తాడేపల్లిగూడెం	460	152
మాదవరం	62	11
పెంటపాడు	313	86

వైద్యురాలు అవుతా.. నా పేరు మోహన వెంకట అమృత. తాడేపల్లిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్నా. వైద్యురాలిగా స్థిరపడాలనేది నా కోరిక.

ఇంజినీరింగా.. నా పేరు నవదీప్. తాడేపల్లిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్నా. ఇంజినీరుగా సేవలందించాలన్నది నా ఆశయం.

ఆర్వో ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే

రిబ్బన్ కత్తిరిస్తున్న ఆరిమిల్లి

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బల్లిపాడు వ్యవసాయ సహకారం సంఘం ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆర్వో ప్లాంట్ ప్రారంభించారు. అనంతరం బల్లిపాడు మదన గోపాల స్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి అభినందన సభలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అన్ని వర్గాలకు న్యాయం చేసేలా అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని 11 దేవాలయాలకు పాలక వర్గాలు ఏర్పాటు చేశామన్నారు. సొసైటీ అధ్యక్షుడు విత్తంశెట్టి సత్యనారాయణ, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు గారపాటి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

దారంతా మురుగు.. దాటేదెలా మడుగు

తాడేపల్లి గూడెం టూటౌన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం పట్టణ పరిధిలోని వెంకట సుబ్బయ్య కాలనీలో రహదారులు అధ్వానంగా మారాయి. దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం ఉన్న మట్టి రహదారులపై మురుగు నీరు నిలవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. కనీసం మరమ్మతులైనా చేయించాలని అధికారులను పలుసార్లు వేడుకున్నా ఫలితం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

రోడ్డుపై మురుగు నీరు

ఆ ఆస్పత్రిలో అన్నీ సాధారణ ప్రసవాలే

రాష్ట్రంలో రెండో స్థానంలో వేల్పూరు పీహెచ్‌సీ

తణుకు గ్రామీణం,న్యూస్‌టుడే: పశ్చిమ గోదావరి జిల్లాలో పదేళ్ల నుంచి అత్యధిక సాధారణ ప్రసవాలు చేస్తూ జిల్లాలో మొదటి, రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది వేల్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం. 2024-25 ఏడాదిలో 61, గడిచిన ఆర్నెల్లలో 34 సాధారణ ప్రసవాలు చేసి పలు పీహెచ్‌సీలకు ఆదర్శంగా నిలుస్తోంది. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి గీతాబాయి, డీడీఓ వైద్యాధికారి కేఎమ్ఆర్ కిశోర్ సూచనలతో క్రమం తప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు, దాతల సహకారం, సిబ్బంది కృషితోనే ఇది సాధ్యమైనట్లు వైద్యాధికారులు సాయి భవానీ, సాయిగిరిరెడ్డి పేర్కొన్నారు.

ప్రతీ నెలా.. ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ ద్వారా ప్రతీ నెల 9, 10వ తేదిలలో ఉచిత ప్రసూతి సేవలను పీహెచ్‌సీలో అందిస్తున్నారు. దీని ద్వారా గర్భిణుల్లోని రక్తహీనత, గర్భధారణ ప్రేరిత రక్తపోటు, గర్భధారణ మధుమేహం వంటి సమస్యలను గుర్తించి సాధారణ ప్రసూతికి అవసరమైన సంరక్షణను అందిస్తున్నారు.

ఫీల్డ్ సర్వే.. వేల్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఫీల్డ్ సర్వేతో గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే చేసి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నారు. ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంతో విష జ్వరాల రాకుండా అవగాహన చర్యలు చేపడుతుంటారు. సూపర్‌వైజర్లు ఉదయలక్ష్మి, శ్రీనివాస్, ల్యాబ్ టెక్నీషియన్ మూర్తి, ఇతర సిబ్బంది సహాయ సహకారాలతో ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ప్రదర్శనలో విద్యార్థులు

చట్టాలపై అవగాహన

మాధవరం(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: బాలల హక్కుల దినోత్సవంలో భాగంగా అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో మాధవరంలోని జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. బాలలు చట్టాలు, విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో ప్రదర్శన నిర్వహించారు. ప్రిన్సిపల్ రామారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సదరం దరఖాస్తులు ఆఫ్‌లైన్లో తీసుకోవాలి

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: దివ్యాంగుల నిర్ధరణ సదరం ధ్రువ పత్రం కోసం దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ తరుణంలో సదరం స్లాట్ బుకింగ్‌ను ఆఫ్‌లైన్‌లోనూ తీసుకునేలా వెసులుబాటు కల్పించాలని జిల్లా వైకాపా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు బుడితి సుజన్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం అత్తిలిలో ఓ ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తులను సత్వరమే వెరిఫికేషన్ నిర్వహించి పింఛన్లు మంజూరు చేయాలన్నారు.

రోజూ ఫ్రైడే డ్రైడే

తణుకు, న్యూస్‌టుడే: దోమ పుట్టుకకు చెక్ పెట్టేందుకు ప్రతి రోజూ ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పాటించాలని తణుకు సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ఇరగవరం కాలనీతో పాటు ఎస్సీ, బీసీ వసతి గృహాలను సందర్శించారు. పరిసరాలను పరిశీలించి సూచనలు చేశారు. ఏఎన్ఎమ్‌లు మోహిని, కనక దుర్గా, సరోజిని, హెల్త్ అసిస్టెంట్ కిశోర్, వసతి గృహ అధికారులు రవీంద్ర భారతి, కరుణ, కళ్యాణి, అరుణ, ఆశాలు భవాని తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వరరావు

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించుకోవాలని డీఏవో వెంకటేశ్వరరావు, తాడేపల్లిగూడెం భూసార పరీక్ష కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకురాలు లక్ష్మీదేవి సూచించారు. గురువారం ఉండి, ఆకివీడు మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు మట్టి నమూనా, సేకరణ, భూసార పరీక్షలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆయా శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరపత్రాలు చూపుతున్న విద్యార్థులు

సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు

తణుకు, న్యూస్‌టుడే: సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం, తణుకు శిశు అభివృద్ధి ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ సహాయకుల పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తణుకు ఐసీడీఎస్ సీడీపీవో శ్రీలక్ష్మీ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సజ్జాపురం-2, ఇరగవరం, గోటేరు, గోటేరు-1, అయినపర్రు-1, అర్జునుడిపాలెం-2 సీతానగరం, అత్తిలి-14, దువ్వ 120 మినీ, ఉప్పరగూడెం, ఈడూరు కేంద్రాల్లో ఒక్కొక్కటి చొప్పున ఖాళీలు ఉన్నాయని, ఆయా ప్రాంతాల వివాహిత మహిళలే అర్హులని పేర్కొన్నారు. 1-7-2025 నాటికి 21 సంవత్సరాలు నిండి కనీస విద్యార్హత పదో తరగతి ఉండాలన్నారు. అదనపు విద్యార్హతలకు ప్రాముఖ్యత ఇస్తారని తెలిపారు. దరఖాస్తుదారులు ధ్రువీకరణ పత్రాల నకళ్లను జతచేసి, అటస్టేషన్ చేయించి ఈ నెల 28 సాయంత్ర 5 గంటల లోపు స్థానిక కార్యాలయంలో నమోదు చేసుకోవాలని ఆమె తెలిపారు. మరిన్ని వివరాలకు 63010 97255 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

వైద్యులను సత్కరించిన సభ్యులు

ఘనంగా వన సమారాధన

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: కమ్యూనిటీ పారామెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ అసోసియేషన్ పెంటపాడు, తాడేపల్లిగూడెం మండలాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం కార్తిక వన సమారాధన నిర్వహించారు. ప్రపంచ పాంక్రియాస్ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకుని శశి కళాశాల సమీపంలో నిర్వహించిన వనసమారాధనలో ప్రముఖ వైద్యులు, నాయకులను సత్కరించారు. వైద్యులు పాండు రంగారావు, దివ్యశ్రీ, ఎస్సీ, ఎస్టీ జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కొల్లి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మారుతీ ఆలయంలో మహా చండీహోమం

భాగ్యలక్ష్మిపేట(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: భాగ్యలక్ష్మి పేటలోని మారుతీ ఆలయంలో గురువారం చండీ మాత ఆవిర్భావాన్ని పురస్కరించుకుని మహాచండి హోమం నిర్వహించారు. పలు దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పల్లెలు పచ్చదనంతో మెరవాలి

ఉంగుటూరు, న్యూస్‌టుడే: పల్లెలు పచ్చదనంతో మెరిసేందుకు కలిసికట్టుగా పని చేయాలని ఎంపీడీవో రాజ్ మనోజ్ కోరారు. సుస్థిర అభివృద్ధిలో భాగంగా పచ్చదనం-పరిశుభ్ర గ్రామాలు అనే అంశంపై మండల పరిషత్తు సమావేశ మందిరంలో స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు, వీవోలకు గురువారం శిక్షణ ఇచ్చారు.

లారీ ఢీకొని ఒకరికి గాయాలు

రాచర్ల(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తిని లారీ ఢీకొన్న ఘటన రాచర్ల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సుబ్బారావు అనే వ్యక్తి పొలం పనుల నిమిత్తం వెళుతుండగా రాచర్లలో లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

నేడు క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశాలను మేరకు శుక్రవారం ఉదయం 7 గంటలకు అత్తిలి పంచాయతీ పరిధిలో నిర్వహించనున్నట్లు అత్తిలి అభివృద్ధి అధికారి భాస్కర్ తెలిపారు. మండలంలోని 18 గ్రామాల కార్యదర్శులు పాల్గొంటారన్నారు.

దుప్పట్ల వితరణ

యాగర్లపల్లి(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం యాగర్లపల్లిలోని ఆదర్శన బాలమందిర్ నందు స్వాతి అకాడమీ లైఫ్ స్కిల్స్ ఛారిటబుల్ సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం కుష్ఠు వ్యాధిగ్రస్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షురాలు చిక్కాల అంబిక మాట్లాడుతూ.. గత ఇరవై ఏళ్లుగా ఈ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

తణుకు, ఇరగవరం, న్యూస్‌టుడే: విద్యార్థులు వారోత్సవాలు, వేసవి శిబిరాల సమయాల్లో మాత్రమే కాకుండా రోజూ గ్రంథాలయాలకు రావడం అలవరచుకోవాలని గ్రంథాలయాధికారిణి ప్రవీణ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని స్థానిక మహిళా శాఖ గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు చిలుకూరి సుజాత, కార్యదర్శి బసవ శ్రీదేవి మాట్లాడారు. వారం పాటు నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. వీరమణి, లక్ష్మీదేవి, నాగమణి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ✦ ఇరగవరం శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి అయ్యప్ప స్వామి ఆధ్వర్యంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గంగాధరరావు విజేతలకు బహుమతులు అందజేశారు. రామయ్య, చిట్టి వెంకయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ✦ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానం సంపాదించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి గుత్తికొండ కృష్ణారావు అధ్యక్షత వహించారు. విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

తాడేపల్లిగూడెంలో..

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఆరవల్లి గ్రామ గ్రంథాలయంలో నిర్వహించిన ఆటలు, వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీల విజేతలకు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. గ్రామంలో వివిధ సేవలందించిన పెద్దలను సత్కరించారు.

తణుకు : మహిళా శాఖ గ్రంథాలయంలో బహుమతులు అందుకున్న విజేతలతో సభ్యులు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్థానిక ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు అధ్యక్షతన వహించారు. ముఖ్య అతిథులుగా తేదేపా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్, బ్రాహ్మణ, వైశ్య కార్పొరేషన్‌ల డైరెక్టర్లు సబ్నీసు కృష్ణ మోహన్, పద్మనాభుని మురళిలు పాల్గొని మాట్లాడారు. మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్, ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మి, పుస్తక పఠన కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలకు అడ్డుకట్ట

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డీఐజీ కోయ ప్రవీణ్.. చిత్రంలో ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్, ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ తదితరులు

మైదుకూరు, న్యూస్‌టుడే: సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ నేరాలను పోలీసులు అడ్డుకట్ట వేస్తున్నట్లు కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మైదుకూరు పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూం శిలాఫలకాన్ని, గదిని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌తో కలిసి ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం ప్రవీణ్ మాట్లాడుతూ.. పోలీసులు క్షేత్రస్థాయిలో కనిపించక పోయినా విధులు నిర్వర్తించేలా పెద్ద పట్టణాలు, ప్రధాన కూడళ్లలో అందించి పహారా కాసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటుకు ఎమ్మెల్యే పుట్టా నిధులు అందించి ప్రోత్సాహం చాటుకున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, ఏఎస్పీ ప్రకాష్ బాబు, డీఎస్పీ రాజేంద్రప్రసాద్, సబ్ డివిజన్‌లోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

కార్తికం.. ముగింపు ఉత్సవం

కార్తిక మాసం ముగింపును పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా పలు ఆలయాల్లో భక్తులు గురువారం పూజలు చేశారు. మైదుకూరు భీమేశ్వరాలయంలో హోమం నిర్వహించారు. 108 కలశాలతో మరకత లింగాన్ని అభిషేకించారు. పాతూరులో గ్రామోత్సవం, అన్నప్రసాద వితరణ చేశారు. మహిళా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, మైదుకూరు

ఆర్టీపీపీ లోపాలపై అసెంబ్లీకి నివేదిస్తాం

ఆర్టీపీపీలోని ఆరో యూనిట్‌లో పరిశీలిస్తున్న పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సభ్యులు తదితరులు

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: ఆర్టీపీపీలో పరిశీలించిన లోపాలు, సూచనలను నివేదిక రూపంలో అసెంబ్లీకి సమర్పిస్తామని పబ్లిక్ అండర్‌టేకింగ్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఎర్రగుంట్ల సమీపంలోని ఆర్టీపీపీని కూన ఆధ్వర్యంలో కమిటీ సభ్యులైన [illegible] గురువారం పరిశీలించారు. తొలుత ఆరో యూనిట్, కోల్ ప్లాంట్ తదితర ప్రాంతాల్లో కలియదిరిగి పలు అంశాలపై ఆరా తీశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. విద్యుత్తు ఉత్పత్తిలో నాణ్యత, ఖర్చు తదితర అంశాలను పరిశీలించినట్లు చెప్పారు. ఉపయోగించే బొగ్గు నాణ్యత సక్రమంగా లేదని గుర్తించామన్నారు. బూడిద ఒక కోటీ యాభై లక్షల టన్నులు నిల్వ ఉన్నట్లు తెలిపారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ.రామారావు ఆర్టీపీపీకి శంకుస్థాపన చేసిన స్తూపాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, ఏపీ జెన్‌కో థర్మల్ డైరెక్టర్ అశోక్ కుమార్‌రెడ్డి, ఆర్టీపీపీ సీఈ వాసుదేవరావు, తహసీల్దార్ శోభన్‌బాబు, విజిలెన్స్ సీఐ నారాయణ యాదవ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

టమాటకు కాస్త ఊరట

చిన్నమండెం, న్యూస్‌టుడే: నిన్నటి వరకు టమాల ధరలు పాతాళం వైపు పరుగులు తీశాయి. తాజాగా చిన్నమండెం ప్రాంతంలో తోటల దగ్గర 30 కిలోల పెట్టె గురువారం రూ. వెయ్యి పలికింది. దాదాపు మూడన్నర నెలల తర్వాత ఈ ధర పలకడం గమనార్హం.

● మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, రాయచోటి నియోజకవర్గాల్లో పలువురు రైతులు సీజన్‌తో పని లేకుండా సంవత్సరం పొడవునా టమాట సాగు చేస్తారు. చిన్నమండెం మండలంలోని కలిబండ రోడ్డు నుంచి గతంలో రోజూ ఇరవై వరకు మినీ లారీలు దిగుబడులు తీసుకెళ్లేవి. కాయలు తగ్గిపోవడంతో వ్యాపారులు ఇప్పుడు ఆటోలు, బొలెరో వాహనాల్లో మార్కెట్లకు తరలిస్తున్నారు.

● జులైలో 30 కిలోల పెట్టె రూ. 980 పలకగా ఆ తర్వాత క్రమేణా తగ్గింది. ● గత నెల 22న రూ. 800కు దిగజారింది. ఆ తర్వాత మరింత తగ్గుతూ రూ. 350కి చేరింది. ● ఈ నెల 1న రూ. 450 పలకగా రోజు రోజుకూ పెరుగుతూ 16న రూ. 820, 19న రూ. 920, 20న రూ.1,000 పలికింది. ● మదనపల్లె మార్కెట్‌లో మొదటి రకానికి రూ. 1,300 వరకు లభించినట్లు రైతులు తెలిపారు.

అడ్డదారిలో యువతరం

● సీకే.దిన్నె మండలం ఇందిరా నగర్ వద్ద కడప ఎక్సైజ్ పోలీసులు ఇటీవల దాడులు చేపట్టి ఇరవై కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. 12 మందిని అరెస్టు చేశారు. వీరందరు యువకులు కావడం గమనార్హం.

● నాలుగు రోజుల కిందట తొమ్మిది మంది గంజాయి స్మగ్లర్లను కడప రిమ్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 23 కిలోల గంజాయి, 1,620 మత్తు మాత్రలు స్వాధీనం చేసుకున్నారు. వీరు కూడా యువకులు, అందులోనూ ఇంజినీరింగ్ చదువుకున్న వారుండడం విశేషం.

● వారం రోజుల కిందట పులివెందుల పోలీసులు సైబర్ నేరానికి పాల్పడిన 12 మందిని అరెస్టు చేసి రూ. 12 లక్షల నగదు, వివిధ రకాల ఏటీఎం కార్డులు, బ్యాంకు, పాస్‌పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన వారిలో అంతా 20 - 30 ఏళ్ల వారే ఉన్నారు.

సంవత్సరం	కేసులు	అరెస్టైన నిందితులు	స్వాధీన గంజాయి కిలోలు	వాహనాల సంఖ్య
2023	26	172	310	13
2024	47	140	188	08
2025	45	110	200	27

(అక్టోబరు 31 వరకు)

జిల్లాలో 18 నుంచి 27 ఏళ్ల మధ్య వయసున్న యువత నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల దస్త్రాలు వెల్లడిస్తున్నాయి. అందులోనూ ఉన్నత విద్య అభ్యసిస్తున్న వారుంటున్నారు. సులువుగా డబ్బులు సంపాదించేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. చోరీలతో పాటు గంజాయి అక్రమ రవాణా, మత్తు మాత్ర విక్రయాలు, సైబర్ నేరాలు, చివరికి హత్యలకూ పాల్పడుతుండటం కలవరానికి గురిచేస్తోంది. ఈ పరిస్థితిపై ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కడైనా గంజాయి, మత్తు మాత్రలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే 112కు సమాచారం ఇవ్వాలన్నారు. డ్రోన్ కెమెరాలతో పలు ప్రాంతాలపై నిఘా ఉంచామని చెప్పారు. జిల్లాలోకి గంజాయి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కొందరు యువకులు జల్సాలకు అలవాటు పడి గంజాయి విక్రయాలు సాగిస్తున్నారని, అటువంటి వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు.

- న్యూస్‌టుడే, కడప నేరవార్తలు

జిల్లాలో ఎరువుల కొరత లేదు

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాలో ఎరువుల కొరత లేదని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్రానాయక్ అన్నారు. కడపలోని ఎరువుల గిడ్డంగులను ఆయన గురువారం తనిఖీ చేశారు. ఎంత మొత్తం ఎరువులు ఏఏ రకాలు, ఎంత వచ్చాయనే వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుత పంట కాలానికి యూరియా 4,500 టన్నులు, డీఏపీ 500, కాంప్లెక్స్ రకాలు 120 టన్నులు గోదాముల్లో ఉన్నట్లు తెలిపారు.

జడ్పీలో ఉద్యోగోన్నతులు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: జడ్పీ పరిధిలో సీనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న పలువురికి డిప్యూటీ ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ, జీఎస్‌డబ్ల్యూఎస్ సెక్రటరీ కాటమనేని భాస్కర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం ఇరవై మందికి ఉద్యోగోన్నతులు కల్పించగా.. అందులో లింగారెడ్డి, అనురాధ ఇప్పటికే ఉద్యోగ విరమణ చేయడంతో 18 మందికి వర్తించనుంది. వీరికి వైఎస్సార్ కడప, అన్నమయ్య, సత్యసాయి జిల్లాలు కేటాయించారు.

పల్లె పాలన ప్రక్షాళన!

జిల్లాలో 11 రూర్బన్ పంచాయతీలు

ఈనాడు, కడప: పంచాయతీరాజ్‌లో సంస్కరణలకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం అమలులో ఉన్న క్లస్టర్ వ్యవస్థను రద్దు చేసింది. పంచాయతీలను స్వతంత్ర పరిపాలన యూనిట్లుగా ప్రకటించింది. రూర్బన్ పంచాయతీలతో కలిపి నాలుగు గ్రేడ్లుగా విభజించడంతో పాటు పంచాయతీ కార్యదర్శుల హోదాను పంచాయతీ అభివృద్ధి అధికారులు(పీడీఓ)గా మార్చింది. పురపాలక సంఘాల స్థాయిలో ప్రతి పంచాయతీలోనూ పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, గ్రామీణ ప్రణాళిక, వీధి దీపాలు, ఇంజినీరింగ్, ఆదాయం, పన్నుల వసూళ్ల విభాగాలను ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించనుంది.

● 10 వేలకు పైగా జనాభా ఉన్న వాటిని ‘రూర్బన్ పంచాయతీలు’గా ఎంపిక చేసింది. ఈ తరహా పంచాయతీల్లో పట్టణ స్థాయి మౌలిక వసతులు కల్పిస్తారు. ఈ పరిధిలోకి జిల్లాలో 11 గ్రామ పంచాయతీలొస్తాయి.

● ప్రస్తుతం ఉన్న క్లస్టర్ విధానంలో రెండు/ మూడు గ్రామ పంచాయతీల బాధ్యతలు ఒక కార్యదర్శి నిర్వహిస్తున్నారు. నూతన విధానం కింద ప్రతి పంచాయతీకి కార్యదర్శి స్థాయి అధికారిని నియమిస్తారు. ప్రస్తుతం 48 ఏళ్ల కింద ఉన్న సిబ్బంది నమూనాను అమలు చేస్తుండగా ఇకపై ప్రక్షాళన ద్వారా అన్ని స్థాయిల్లో సిబ్బంది అందుబాటులో ఉంటారు. ● 4 వేల నుంచి 10 వేల జనాభా, ఏడాదికి రూ. 50 లక్షలు ఆపై ఆదాయం లేదా మండల కేంద్రంగా ఉన్న పంచాయతీలను గ్రేడ్-1గా వ్యవరిస్తారు.

● 2 వేల నుంచి నాలుగు వేల జనాభా ఉన్న వాటిని గ్రేడ్-2గా, 2 వేలలోపు ఉన్న పంచాయతీలను గ్రేడ్-3గా ఎంపిక చేశారు. క్లస్టర్ వ్యవస్థ కింద ఉన్న గ్రేడ్-4, 5 పంచాయతీలను రద్దు చేసి గ్రేడ్-3 వరకే ప్రభుత్వం పరిమితం చేసింది.

జిల్లాలో గ్రామ పంచాయతీలు: 557
● గ్రేడ్–1: 59
● గ్రేడ్–2: 154
● గ్రేడ్–3: 333

● ఇవీ రూర్బన్ పంచాయతీలు: ● సోమిరెడ్డిపల్లె(బి.మఠం), ● పోరుమామిళ్ల, ● రంగసముద్రం(పోరుమామిళ్ల), ● చెన్నూరు, ● ఖాజీపేట, ● వేంపల్లె, ● ముద్దనూరు, ● కొత్తపల్లె(ప్రొద్దుటూరు), ● గోపవరం(ప్రొద్దుటూరు), ● సోములవారిపల్లె(ప్రొద్దుటూరు), ● చవటపల్లె(ప్రొద్దుటూరు).

ఆ ఏడుగురు.. అధ్యక్షా అంటారు

కడప విద్య, న్యూస్‌టుడే: రాష్ట్ర విద్యాశాఖ నిర్వహించనున్న విద్యార్థి అసెంబ్లీకి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి ఒక్కో విద్యార్థి ఎంపికయ్యారు. రాజ్యాంగ దినోత్సవమైన నవంబరు 26న నిర్వహించే అసెంబ్లీ కార్యక్రమంలో వీరు పాల్గొంటారు. ఎంపికైన వారిలో కె.యోగవర్షితరెడ్డి(బద్వేలు), మహమ్మద్ అనస్(కడప), డి.నాగవైష్ణవి(పులివెందుల), వడ్లతేజ నరసింహాచారి(కమలాపురం), మేడిగ సంగీత(జమ్మలమడుగు), షేక్ యల్లల ఆసిఫా(ప్రొద్దుటూరు), పి.వీర ఉదయశ్రీ(మైదుకూరు) ఉన్నారు. వీరు అసెంబ్లీలో ఎమ్మెల్యేల్లా మాట్లాడనున్నారు.

సైబర్ మోసాలపై రంగంలోకి ఈడీ!

ఈనాడు, కడప: ఉద్యోగాలు, మోసపూరిత పెట్టుబడుల యాప్‌ల ద్వారా జిల్లాకు చెందిన పలువురు మోసపోయారు. ఈ తరహా నేరాలు దేశ వ్యాప్తంగా చోటుచేసుకుంటున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెలుగు చూసింది. వాట్సప్, టెలిగ్రామ్ గ్రూపులు, బల్క్ ఎస్ఎంఎస్‌ల ద్వారా మోసాలకు పాల్పడ్డారు. ఎక్కువ కమీషన్లు, త్వరితగతిన లాభాలు వస్తాయని ప్రలోభపెట్టి నకిలీ యాప్‌లు, వెబ్‌లింకుల్లో రిజిస్టర్ చేయించారు. ఈ వ్యవహారాల్లో కొందరు సీఐలు, కానిస్టేబుళ్ల పాత్ర కూడా ఉన్నట్లు వెలుగుచూసింది. ఇలాంటి మోసాలతో జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల్లో రూ.285 కోట్లు సేకరించినట్లు గుర్తించారు. దీంతో జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన సైబర్ మోసాల కేసులపై ఈడీ దర్యాప్తు ప్రారంభించింది.

నియోజకవర్గానికి పది మూడు చక్రాల మోటార్ సైకిళ్లు

కడప చిన్నచౌక్, న్యూస్‌టుడే: జిల్లాలోని శారీరక విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల మోటార్ సైకిళ్లు అందించనున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అధికారి కృష్ణకిశోర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గానికి పది చొప్పున మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఔత్సాహికులు ఈ నెల 25వ తేదీలోపు ఏపీడీఏఎస్‌సీఏసీ.ఏపీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 18 నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగి.. 70 శాతం కంటే ఎక్కువ వికలత్వం కలిగి ఉన్నట్లు తెలిపే సదరం ధ్రువీకరణ పత్రం ఉండాలని, కుటుంబ వార్షికాదాయం రూ. 30 వేలు కంటే ఎక్కువ ఉండకూడదని తెలిపారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం చెల్లుబాటయ్యే లైసెన్స్ కలిగి ఉండాలని, గతంలో ప్రభుత్వం, ఏ ఇతర ప్రైవేట్ ఏజెన్సీ నుంచి వాహనం పొంది ఉండకూడదని వివరించారు.

దాగుడుమూతల దందాకోర్

◆ అడంగళ్లలో అనుమానాస్పద నమోదులు

◆ సీకే దిన్నెలో ఆగని ‘భూ’చోళ్ల అక్రమాలు

కడప నగరంలోని ఈపీఎఫ్ భవన్ ఎదుట ఉన్న స్థలం

ఈనాడు, కడప: తినమరిగి‘నోళ్లు’ ఆగడం లేదు. విలువైన భూములు కొట్టేసేందుకు వక్ర మార్గాలు పడుతున్నారు. తమతో అంటకాగే అధికారులతో కలిసి కొట్టేసే కుయుక్తులు పన్నుతున్నారు. ఇందుకుగాను దస్త్రాల్లో నమోదు చేసే వివరాలతో దాగుడు మూతలు ఆడుతున్నారు. అనుమానాస్పద వివరాలతో తమ పరం చేసుకునేందుకు చూస్తున్నారు. అందుకుగాను రెవెన్యూ గ్రామంలో పలు సర్వే నంబర్లలో పట్టాదారు, అనుభవదారుని పేర్ల వద్ద నివాస గృహాలుగా నమోదు చేశారు. సాధారణంగా వ్యక్తుల పేర్లు ఉండాల్సిన చోట నివాస గృహాలుగా నమోదు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● కడప నగరంలోని భవిష్య నిధి(ఈపీఎఫ్) భవన్ ఎదుట ఉన్న విలువైన స్థలం. దస్త్రాల్లో ప్రభుత్వ భూమిగా నమోదై ఉంది. ఆచరణలో మాత్రం కడప నగర కార్పొరేషన్ పాలకవర్గంలోని ఓ వైకాపా ప్రజాప్రతినిధి చేతిలో ఉండిపోయింది.

● కమలాపురం నియోజకవర్గం సీకే దిన్నె మండలం విశ్వనాథపురం రెవెన్యూ గ్రామంలో భూముల విలువ పెరిగింది. ఇక్కడ సెంటు భూమి విలువ రూ.10 లక్షలు పలుకుతోంది. దీంతో దాదాపు రూ. 3.50 కోట్ల విలువైన సర్వే నంబరు 13లోని 34 సెంట్ల ప్రభుత్వ భూమిని కొట్టేయడానికి వైకాపా నేత ఒకరు పావులు కదుపుతున్నారు.

వాగునూ మింగేసే యత్నం

సీకేదిన్నె మండలంలోని ఊటుకూరు రెవెన్యూ గ్రామంలో సర్వే నంబరు 235/5లో 0.47 సెంట్లు, 235/12లో 0.73 సెంట్లు చీమల గంగమ్మ పేరిట డీకేటీ పట్టా ఇచ్చినట్లు వెబ్ ల్యాండ్ అడంగల్‌లో చూపుతోంది. ఈ భూమంతా రెవెన్యూ రికార్డు ఆర్ఎస్ఆర్ ప్రకారం 42.78 ఎకరాలు వాగుగా కనిపిస్తోంది. ఇక్కడే అసలు మతలబు ఉంది. వాగును మింగేసేందుకు డీకేటీ పట్టా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై కడప నగరానికి చెందిన కొందరు కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు.

మరికొన్ని భూములకు

కడప నగర పరిధిలోని విలువైన భూముల ఖరీదు భారీగా ఉండటంతో సీకే దిన్నె మండలంపై అక్రమార్కుల కళ్లు పడ్డాయి. కొన్ని స్థలాలకు సంబంధించి రిమార్కుల వద్ద కూడా తహసీల్దార్ సంతకం లేకపోయింది. గతంలో చోటుచేసుకున్న అక్రమాలపై ఉన్నతాధికారులు ఇప్పటికే ప్రత్యేక దృష్టి సారించారు. ఓ వైపు రద్దు పర్వం సాగిస్తున్నారు. అదే సమయంలో మరో వైపు ఆక్రమణలకు అధికారిక ముద్ర వేసుకునేందుకు భూచోళ్లు ఎత్తులు వేస్తూనే ఉండటం గమనార్హం.

594 బడుల్లో ఒకే ఒక్కరు

చిత్రంలో కనిపిస్తున్నది వేంపల్లి మండలం ఇడుపులపాయ ఎంపీపీఎస్ మెయిన్ పాఠశాల. 1లో ఒకరు, 2లో ఇద్దరు, 3లో ఇద్దరు, 4లో నలుగురు, 5లో ముగ్గురు మొత్తంగా 1 నుంచి 5 తరగతుల వరకు 12 మంది విద్యార్థులున్నారు. వీరందరికీ ఒకే ఉపాధ్యాయుడు బోధన చేస్తున్నారు.

ఈ చిత్రం బద్వేలు మండలం సి.బోయినపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోనిది. 2లో నలుగురు, 3లో నలుగురు, 4లో ఐదుగురు, 5వ తరగతిలో నలుగురు మొత్తంగా 17 మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయిని పాఠాలు చెబుతున్నారు. ఈ ఏడాది 1వ తరగతిలో ప్రవేశాలు సున్నాగా నమోదైంది.

కడప విద్య, న్యూస్‌టుడే: 2014 - 2019 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో జిల్లా వ్యాప్తంగా 485 ఏకోపాధ్యాయ పాఠశాలలున్నాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం నూతన విద్యా విధానం అమలు పేరుతో అవలంబించిన చర్యలతో ఆ సంఖ్య ఏకంగా 770కి పెరిగింది. అప్పటి చర్యలు ఇందుకు కారణాలయ్యాయి. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ- 2025 నియామకాలు చేపట్టింది. దీంతో ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య 594కి తగ్గింది.

● బోధనకు అవరోధం: ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయుడే ప్రధానోపాధ్యాయుడి బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. సెలవుపై వెళ్లిన సమయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రాథమిక విద్య విద్యార్థులకు అతి ముఖ్యమైన దశ. అందులో బలమైన పునాది పడితేనే ఉన్నత విద్యలో రాణించగలుగుతారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో విద్యార్థుల విద్యకు అనేక ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఈ విషయమై డీఈవో షంషుద్దీన్ మాట్లాడుతూ.. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో సమస్యలు లేకుండా, బోధన సాఫీగా సాగేలా చర్యలూ తీసుకుంటున్నామని తెలిపారు.

జీవన ప్రమాణం అవసరం లేదు ప్రయాణం

కలకడ, న్యూస్‌టుడే: పింఛను పొందేందుకు జీవన ప్రమాణ పత్రం(లైఫ్ సర్టిఫికెట్) సమర్పించడం ఎంతో అవసరం. పింఛనుదారులకు ఈ విషయం ఏటా ఓ ప్రహసనంలా ఉండేది. సమర్పించేందుకు ప్రయాస పడేవారు. మీసేవా, నెట్ సెంటర్ల చుట్టూ తిరిగేవారు. ప్రస్తుతం ఇంటి నుంచి కాలు బయట పెట్టకుండానే సమర్పించే అవకాశాన్ని కేంద్రం కల్పించింది. చరవాణిలో ముఖ ఆధారిత గుర్తింపు ద్వారా ఇంటి నుంచే పత్రం పొందేలా యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.

● గతంలో పత్రం పొందనివారైతే: వివరాలను కొత్తగా నమోదు చేయాలి. పేరు, పీపీవో నంబరు, బ్యాంకు, డిపార్టుమెంట్, పింఛను మంజూరు ఏజెన్సీ వివరాలు సమర్పించాల్సి ఉంటుంది. ఆ తర్వాత రౌండ్ సర్కిల్‌లో ముఖం స్పష్టంగా కనిపించేలా ఫొటో తీసుకుంటే ప్రక్రియ పూర్తయినట్లు సందేశం వస్తుంది.

● ఇలా నమోదు: ● గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి జీవన్ ప్రమాణ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయాలి. ● ఆధార్ సంఖ్య, చరవాణి నంబరు, ఈ-మెయిల్ ఐడీ అందులో నమోదు చేసి సమర్పించాలి. ● అనంతరం చరవాణికి ఓటీపీ వస్తుంది. అది నమోదు చేయగానే ముఖ ఆధారిత గుర్తింపు నిర్ధారణ కోరుతుంది. ● చరవాణిలో వచ్చే సర్కిల్ వద్ద ముఖం కనిపించేలా స్పష్టంగా కెమెరా ఉంచాలి. పచ్చటి గీతతో సర్కిల్ వచ్చి సందేశం చేరితే రిజిస్ట్రేషన్ పూర్తయినట్లే. ● ఆ తర్వాత యాప్ మూసి వేసి మళ్లీ తెరవాలి. ● అనంతరం ఆధార్ సంఖ్య, చరవాణి నంబరు, ఈ-మెయిల్ ఐడీ అడుగుతుంది. ఈ వివరాలు నమోదు చేసి సమర్పిస్తే పింఛను వివరాలు ప్రత్యక్షమవుతాయి.

నిమ్మ.. దిగజారెనమ్మా

ధరల పతనంతో రైతన్న కలవరం



జమ్మలమడుగు, న్యూస్‌టుడే: రోజురోజుకు నిమ్మ ధరలు తగ్గి పోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడులు కూడా రాకపోవడంతో కూలీల ఖర్చులూ చెల్లించలేక అవస్థలు పడుతున్నారు. వెయ్యి కాయలున్న బస్తా జమ్మలమడుగులో రూ. 300 మాత్రమే పలుకుతోంది. అదే సమయంలో బెంగళూరులో రూ. 600కు విక్రయిస్తున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవడంతో కాపు ఎక్కువగా ఉన్నందున ధర దిగజారిపోయినట్లు రైతులు ఆవేదన చెందుతున్నారు.

గండికోటలోనే 20 వేల చెట్లు: ఉద్యాన శాఖ అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలోని 36 మండలాల్లో 5,328.25 ఎకరాల్లో నిమ్మ తోటలు విస్తరించి ఉన్నాయి. జమ్మలమడుగు మండలం గండికోటలోనే సుమారు ఇరవై వేల నిమ్మ చెట్లు ఉన్నాయి. మొంథా తుపాను కంటే ముందు ధరలు ఆశాజనకంగా ఉండేవి. ఆ తర్వాత నుంచి పతనం ప్రారంభమైందని రైతులు చెబుతున్నారు. చెట్టు నుంచి కాయలు కోసి మార్కెట్‌కు తరలించాలంటే కోతకు, ప్యాకింగ్, కమీషన్, లారీ బాడుగ, రవాణాతో కలుపుకొని బస్తాపై రూ.500 నుంచి రూ.600 వరకు అదనంగా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే తోటల నుంచే నేరుగా ఇతర పట్టణాలకు తరలించే అవకాశం కల్పించాలని ఉద్యాన శాఖ అధికారులకు సూచిస్తున్నారు.

మండలం	నిమ్మ సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
పెండ్లిమర్రి	1,110.79
చక్రాయపేట	1,106.45
వేంపల్లె	879.57
సీకే దిన్నె	383.38
వేముల	249.22
అట్లూరు	158.21
ఒంటిమిట్ట	147.10
సిద్ధవటం	145.79
ముద్దనూరు	143.31
జమ్మలమడుగు	131.23
మైదుకూరు	100.31
దువ్వూరు	79.49

రామయ్య క్షేత్రంలో నిఘా కునుకు

దక్షిణ మాడ వీధిలో అమర్చని సీసీ కెమెరా



చోరీకి గురైనా తిరిగి ఏర్పాటు చేయలేదు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయంలో నిఘా వ్యవస్థ కోసం ఏర్పాటు చేసిన మూడో నేత్రాలు పూర్తిస్థాయిలో పనిచేయడం లేదు. పర్యవేక్షణ కొరవడి, నిర్వహణ లోపంతో కొన్ని కునుకు తీస్తున్నాయి. నాలుగేళ్ల కిందట తితిదే నిధులతో 45 చోట్ల సీసీ కెమెరాలు అమర్చారు. ఆ తర్వాత నిర్వహణ లోపాలతో కొన్ని మొరాయించాయి. వినియోగంలో లేని వాటిని తొలగించారు. కోనేరు-సత్రపాళెం గుట్ట మధ్యలో రెండేళ్ల కిందట ఒక కెమెరా చోరీకి గురైతే ఇంతవరకు మళ్లీ అమర్చలేదు. ప్రస్తుతం 33 చోట్ల నిఘా నేత్రాలు ఉంటే అందులో 23 మాత్రమే పనిచేస్తున్నాయి. కొన్ని చెట్ల కొమ్మలు, రెమ్మల మధ్యలో ఉన్నాయి.

చెలరేగుతున్న ఆకతాయిలు

శ్రీరామచంద్రమూర్తి దర్శనం కోసం వచ్చే భక్తుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ఇటీవల అతివలు, యువతులు అధిక సంఖ్యలో వస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి యాత్రికులు వాహనాలను ఆలయం పరిసర ప్రాంతాల్లో నిలిపి గుడిలోకి వెళ్తున్నారు. ఈలోపు ఆకతాయిలు అద్దాలు పగులకొట్టి అందులో ఉన్న వస్తువులు, నగదు అపహరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

(c) eenadu

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రతి నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ప్రజాదర్బార్ కార్యాలయాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, తెదేపా ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డిలు ప్రజాదర్బార్ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు.

ప్రజాదర్బార్ కార్యాలయం ప్రారంభం నేడు

OFFICE OF THE DISTRICT MEDICAL & HEALTH OFFICER, YSR KADAPA
Rc. No. School Children/DBCS/YSR, KDP Dated: 20.11.2025

TENDER NOTIFICATION

The sealed tenders are invited from the standard agencies/ manufactures and registered suppliers for supply of SPECTACLES with the Following Specifications to District Medical & Health Officer/District Programme Manger, District Blindness Control Society, YSR Kadapa. FOR SUPPLY TO SCHOOL CHILDREN EYE SCREENING PROGRAMME.

Sl. No.	Name of the items	Approximately estimated Spectacles	Estimated tender value Rs:	EMD Rs:
1	Spectacles (Children)	3700	Rs: 10,36,000 (Ten lakhs thirty six thousand rupees only)	Rs: 10,000

Date of Sale & place of tender Schedules at O/o Dist. Programme Manager, Dist. Blindness Control Society, Old RIMS YSR Kadapa during the working days of the office hours from 11.00 A.M to 4.00 P.M. **Last date** to submit filled in application is on: 02-12-2025 by 4.00 PM, Date of Opening of Tenders: 03/12/2025 at .00 PM at O/o Joint Collector, YSR Kadapa. Cost of Tenders Application is Rs 1,000/- (One Thousand Only) each. EMD Amount will be Rs.10,000/- (Ten Thousand Only) per Bidder to be paid through DD in favour of District Medical & Health Officer, YSR Kadapa while submitting the Tender. **No correspondence will be entertained in this regard. The District Procurement Committee Decision is final in deciding the Spectacles as per Standards.**

Sd/- **District Medical & Health Officer**
Vice-Chairman, DBCS, Y.S.R. District.

గండికోట సందర్శన

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: గండికోటలోని అందాలు ఎంతో ఆకట్టుకున్నాయని పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ ఛైర్మన్ ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. గురువారం సాయంత్రం ఆయనతో కమిటీ సభ్యులు ఎమ్మెల్యేలు శ్రావణ్‌కుమార్, కుమార్‌రాజా, రంగారావు, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిలు గండికోటను సందర్శించారు. వారి వెంట ఆర్డీవో సాయిశ్రీ, తహసీల్దార్ శ్రీనివాసులురెడ్డి, సీఐ నరేష్‌బాబు తదితరులున్నారు.



గండికోట పెన్నాలోయ వద్ద స్వీయచిత్రం తీసుకుంటున్న పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సభ్యులు

నాణ్యత మరిచి.. నిబంధనలు విస్మరించి

- కాలనీల్లో ఒరిగిపోతున్న విద్యుత్తు స్తంభాలు
- పరిమితికి మించి నియంత్రికల ఏర్పాటు

ఈనాడు కడప, ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరులో గత వైకాపా ప్రభుత్వంలో జగనన్న లేఅవుట్ కాలనీల్లో ఏర్పాటు చేసిన విద్యుత్తు వ్యవస్థ నిధుల కోసమే అన్న చందంగా మారింది. నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించడమే ఈ స్థితికి ప్రధాన కారణం. వర్షానికే స్తంభాలు నేలకు ఒరిగిపోతున్నాయి. ఫలితంగా నేలలోకి విద్యుత్తు ప్రసరిస్తే అటువైపు వెళ్లేవారికి ముప్పు పొంచి ఉంది. ఈ దుస్థితి పట్టణ శివారు ప్రాంతాల్లోని బొల్లవరం, మీనాపురం, రామేశ్వరం లేఅవుట్ కాలనీల్లో దాపురించింది.

★ కాలనీల్లో 13,468 ఇళ్లను నిర్మిస్తున్నారు. రూ.8.97 కోట్లతో విద్యుత్తు వ్యవస్థను రూపొందించారు. పరిమితికి మించి చిన్నవి కాకుండా అధిక సామర్థ్యం కలిగిన 100 కేవీఏ, 160 కేవీఏ నియంత్రికలు సుమారు 122 ఏర్పాటు చేశారు. కోట్ల రూపాయల వ్యయం చేసినప్పటికీ విద్యుత్తు స్తంభాలు గాలి, వానకు కూలిపోతున్నాయి. స్తంభానికి ఏర్పాటు చేయాల్సిన సిమెంట్ కాంక్రీట్ పనుల్లో నాణ్యత లోపించింది.

★ ఈ సమస్యపై ప్రొద్దుటూరు విద్యుత్తు శాఖ ఈఈ రమణారెడ్డిని వివరణ కోరగా మూడు కాలనీలు తమ అధీనంలోకి తీసుకున్నామన్నారు. అక్కడ నల్లరేగడి భూములు కావడంతో వర్షానికి నేల కుంగి, స్తంభాలు నేలకు ఒరిగిపోతున్నాయని సరిచేస్తామని వివరించారు.

బొల్లవరం జగనన్న కాలనీలో వర్షానికి ఒరిగిపోయిన విద్యుత్తు స్తంభం

విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహం

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా ప్రొద్దుటూరులోని రవీంద్ర పాఠశాలలో విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. హారిక (8వ తరగతి), స్నేహ (6వ తరగతి), తన్విప్రియ (9వ తరగతి) విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వారికి పాఠశాల కరస్పాండెంట్ ప్రభాకర్‌రెడ్డి, హెచ్‌ఎం ఖాదర్‌వలీ బహుమతులు అందించారు.

★ ప్రొద్దుటూరులోని బ్రిలియంట్ పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం అనే అంశంపై సుజన (9వ తరగతి), సన (8వ తరగతి), తౌసిఫ్ (9వ తరగతి) విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వారికి ప్రిన్సిపల్ నాగశ్రావణి, హెచ్‌ఎం మాబూచాన్ బహుమతులు అందించారు.

ప్రొద్దుటూరులో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రవీంద్ర పాఠశాల కరస్పాండెంట్ ప్రభాకర్‌రెడ్డి, హెచ్‌ఎం ఖాదర్‌వలీ

ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో ప్రొద్దుటూరు బ్రిలియంట్ పాఠశాల ప్రిన్సిపల్ నాగశ్రావణి, హెచ్‌ఎం మాబూచాన్

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

మైదుకూరు, న్యూస్‌టుడే: ఆరోగ్యం, పర్యావరణ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా గురువారం మైదుకూరు మండలం అన్నలూరులో తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు ప్రదర్శన చేశారు. జాతీయ సేవా పథకంలో భాగంగా నాలుగో రోజు ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలని, ప్లాస్టిక్ నిర్మూలించి పర్యావరణాన్ని కాపాడాలని, భూసార పెంపొందించి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ ప్రచారం చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జ్యోత్స్న, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎన్.వాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.రమణయ్య పాల్గొన్నారు.

అన్నలూరులో ర్యాలీ చేస్తున్న తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు

సీపీఐ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ 24న

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: మైలవరం మండలం చిన్నకొమ్మెర్ల గ్రామం వద్ద ఉన్న సిమెంటు పరిశ్రమకు భూములిచ్చిన రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 24న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. ఇందుకు సంబంధించి గురువారం కరపత్రాలు ఆవిష్కరించారు. బాధిత రైతులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కృష్ణ, వెంకటరమణ, మునిరెడ్డి, పవన్, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank — కడప మరియాపురం బ్రాంచ్
హెచ్ నెం.2/485, గ్రౌండ్ ఫ్లోర్, ఐటిఐ సర్కిల్, మరియాపురం, కడప, ఆం.ప్ర-516003.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

టు:
ఋణగ్రహీత : శ్రీ సంకటాల వెంకటేశ్వర రావు, తండ్రి : మునయ్య, డి నెం.2/35, బ్రాహ్మణపల్లి, కలసపాడు, కడప, ఆంధ్రప్రదేశ్-516217.
డియర్ సర్ / మేడమ్,
విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.
మా కెనరా బ్యాంక్, కడప మరియాపురం బ్రాంచ్ నుండి
శ్రీ సంకటాల వెంకటేశ్వర రావు గారు పొందిన లోన్ వివరములు:

లోన్ స్వభావం & లోన్ అకౌంట్ నెం.	లోన్ మొత్తం మరియు లోన్ తేది	ఈ తేది నాటికి వడ్డీతో కలిపి బకాయి మొత్తం	వడ్డీ రేటు (పీనల్ ఛార్జీలతో కలిపి)
హౌసింగ్ లోన్ అకౌంట్ నెం.160001959175	రూ. 53,60,000/- తేది. 08-11-2023	రూ.53,47,975.12/-	9.8%
కెనరా హోమ్ లోన్ సెక్యూర్ అకౌంట్ నెం. 164012270540	రూ. 2,64,620/- తేది. 29-05-2024	రూ.2,55,475/-	10.35%

మాకు తనఖా పెట్టిన వ్యక్తి/వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు/ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ **నదరు ఋణాన్ని తేది.07.11.2025 న నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ)గా వర్గీకరించింది.** అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా **రూ.56,03,450.12/- (అక్షరాల యాభై ఆరు లక్షల మూడు వేల నాలుగు వందల యాభై రూపాయల పన్నెండు పైసలు మాత్రమే)** + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధింపబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.

SARFAESI చట్టం నందలి సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిస్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగింది.

తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి

వైఎస్ఆర్ జిల్లా, కడప తాలూక, గ్రామ పొలాలు, చిన్నా చౌక్, సబ్ జైల్ దగ్గర, NGO కాలనీ, వార్డు 38, ప్లాట్ నెం.1127, సర్వే నెం.1043/1 వద్ద విస్తీర్ణం 191.26 చ॥గ॥లు / 3.95 సెంట్లులోని ప్లింత్ ఏరియా 1163 చ॥అ॥లుతో గ్రౌండ్ ఫ్లోర్ మరియు 1163 చ॥అ॥లుతో మొదటి అంతస్తు రెసిడెన్షియల్ భవనం డోర్ నెం.38/339-1127 తో కలదు. **హద్దులు : తూర్పు** : ప్లాట్ నెం.1128 యొక్క స్థలం, **దక్షిణం** : ప్లాట్ నెం.1138 యొక్క స్థలం, **పడమర** : ప్లాట్ నెం.1126 యొక్క స్థలం, **ఉత్తరం** : రోడ్డు.
టైటిల్ హోల్డర్ : శ్రీ సంకటాల వెంకటేశ్వరరావు

తేది: **10.11.2025**, ప్రదేశం: కడప — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

ఆర్టీపీపీ ఉద్యోగులతో సమావేశం

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: ఆర్టీపీపీలో గురువారం పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ ఛైర్మన్ కూన రవికుమార్‌తో పాటు సభ్యులు ఎమ్మెల్యేలు రంగారావు కుమార్‌రాజా, శ్రావణ్‌కుమార్, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఆర్టీపీపీ అధికారులు, ఉద్యోగులతో అంతర్గత సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై కమిటీ సభ్యులు నిలదీసినట్లు సమాచారం. గత వైకాపా ప్రభుత్వంలో నూతన జీవో ద్వారా దాదాపు 39 మంది ఆర్టీపీపీలో చేరడంపై చర్చించారు. బూడిద వినియోగం, ఆర్టీపీపీకి శంకుస్థాపన చేసిన మాజీ సీఎం ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేసే అంశాలపై మాట్లాడారు. నిధులు దుర్వినియోగంపై కమిటీ సభ్యులు ప్రశ్నించగా అధికారులు సరైన సమాధానం ఇవ్వలేదని తెలిసింది.

★ డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీ పర్యటనకు వచ్చిన పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే కూనరవికుమార్ ఆధ్వర్యంలోని సభ్యులకు గురువారం సమస్యలపై పలువురు వినతిపత్రాలను అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్‌శక్తి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆర్టీపీపీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. పరిశ్రమ నుంచి వచ్చే కాలుష్యంతో పడుతున్న ఇబ్బందులను గ్రామస్థులు కమిటీకి వివరించారు.

ప్రజలందరికీ మెరుగైన వైద్యం

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 60 మంది లబ్ధిదారులకు రూ.21.19 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ మల్లికార్జున, స్టేట్ లీగల్ సెల్ కార్యదర్శి సూర్య పెద్దిరాజు, పాపిరెడ్డి, కొండయ్య, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పత్రాలు అందుకున్న బాధితులతో తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి

భూ సమస్యకు పరిష్కారం

రాజుపాళెం, న్యూస్‌టుడే: మండలంలోని భూ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డి చర్యలు తీసుకున్నారు. గ్రామాల్లోని 199 మంది రైతుల భూములకు సంబంధించిన దస్త్రాలు లేవని సమస్యను ప్రజలు ఎమ్మెల్యేకు తెలిపారు. ఆయన జేసీ అదితిసింగ్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించినట్లు తహసీల్దార్ మనోహరరెడ్డి వివరించారు. ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

బద్వేలు, అట్లూరు, న్యూస్‌టుడే : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడ్డారు. అట్లూరు మండలం లింగాలకుంట చెరువు మలుపు వద్ద సిద్దవటం నుంచి బద్వేలు శివానగర్‌కు ద్విచక్రవాహనంపై వెళ్తున్న రవి, అక్బర్ బాషాలు రోడ్డుపై ఉన్న పశువులను ఢీకొన్నారు. గాయపడిన వారిని బద్వేలుకు తరలించారు.

★ బద్వేలు సమీపంలోని సుదర్శన ఆశ్రమం వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన రైల్వే ఉద్యోగి మనోరంజన్ గాయపడ్డారు. కృష్ణపట్నం నుంచి తాడిపత్రికి వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న ఆల్విన్ లారీని అదుపుతప్పి ఢీకొంది. కారులో ఉన్న రైల్వే ఉద్యోగికి గాయాలయ్యాయి.

తమ్ముడిపై అక్క ఫిర్యాదు

పెద్దముడియం, న్యూస్‌టుడే: తమ్ముడిపై సోదరి ఫిర్యాదు చేసిన ఘటన పెద్దముడియం మండల పరిధిలో చోటుచేసుకుంది. పెద్దపసుపులలో తనకు చెందిన ఎనిమిది ఎకరాల పొలంలో తన తమ్ముడు ఈశ్వర్‌రెడ్డి దౌర్జన్యంగా శనగ విత్తనం వేయడమే కాకుండా తనను బెదిరించారని లలిత పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం ఈశ్వర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ.సుబ్బారావు తెలిపారు

అంత్యక్రియలు

మంచికి, మానవత్వానికి
మారుపేరుగా నిలిచి, చెరగని చిరునవ్వుతో
మా అందరికీ ప్రేమానురాగాలు,
ఆప్యాయతలు పంచి దైవసన్నిధికి చేరిన
శ్రీమతి కాటుబోయిన సుబ్బలక్ష్మమ్మ గారి ఆత్మకు
శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...
శోకతప్త హృదయాలతో
భర్త : కాటుబోయిన నాగేశ్వరరావు
Retd. PET

జననం : 1950
మరణం : 19.11.2025
కీ॥శే॥ కాటుబోయిన సుబ్బలక్షుమ్మ
టీచర్స్ కాలనీ, ప్రొద్దుటూరు.

కుమారులు :	కోడళ్లు :
కాటుబోయిన నాగరాజు యాదవ్	శ్రీమతి అనసూయ
కాటుబోయిన చంద్రశేఖర్ యాదవ్	శ్రీమతి శివకుమారి
కాటుబోయిన రవిశంకర్ యాదవ్	శ్రీమతి కుసుమకుమారి

మరియు కుటుంబ సభ్యులు

అంత్యక్రియలు : 21.11.2025వ తేదీ శుక్రవారం ఉదయం 10:30 ని॥ల నుండి మోడంపల్లె బైపాస్ రోడ్డు, ప్రొద్దుటూరులోని హిందూ శ్మశానవాటిక నందు నిర్వహించబడును.

డిగ్రీ కళాశాలలో ఏకరూప దుస్తుల పంపిణీ

విద్యార్థినికి దుస్తులు అందజేస్తున్న ప్రిన్సిపల్ నారాయణరెడ్డి, అధ్యాపకులు

మైదుకూరు, న్యూస్‌టుడే : మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులకు గురువారం కళాశాల అధ్యాపక బృందం ఉచితంగా రెండు జతల ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. కళాశాల స్టాఫ్ క్లబ్ ఆధ్వర్యంలో 40మంది విద్యార్థులకు దుస్తులను అందజేసినట్లు ప్రిన్సిపల్ పి.నారాయణరెడ్డి తెలిపారు. బోధన, బోధనేతర సిబ్బంది సహకారంతో గత మూడేళ్లుగా విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

స్వామిత్వ సర్వేపై గ్రామ సభలు

రాజుపాళెం, న్యూస్‌టుడే: స్వామిత్వ సర్వేలో సమస్యలుంటే ఫిర్యాదు చేయవచ్చని డిప్యూటీ ఎంపీడీవో షాకీర్ అలీ ఖాన్ తెలిపారు. ఈ మేరకు మండలంలోని దద్దనాల, గాదెగూడురు గ్రామాల్లో గురువారం స్వామిత్వ సర్వేపై గ్రామ సభలు నిర్వహించారు. గాదెగూడురులో సర్పంచి వరలక్ష్మి మాట్లాడుతూ.. సర్వేలో సమస్యలుంటే సభ దృష్టికి తీసుకుని పరిష్కారం చేసుకోవాలన్నారు.

వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యం

మైదుకూరు, న్యూస్‌టుడే : వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో ఎం.శ్రీధర్‌నాయుడు అన్నారు. గంజికుంట పంచాయతీలో పరిసరాల పరిశుభ్రత పచ్చదనం అంశంపై గురువారం ప్రజలకు అవగాహన కల్పించారు. సచివాలయంలో కార్మికులకు శిక్షణ ఇచ్చారు.

టెట్ నుంచి మినహాయించాలని వినతి

బద్వేలు, న్యూస్‌టుడే: ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బద్వేలు ఎన్జీవో కార్యాలయంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం స్పందించకపోతే ధర్నా చేస్తామని హెచ్చరించారు.

ఉద్యోగుల హక్కుల సాధనకు పోరాటం

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు ఏపీ ఎన్జీవో సంఘం నూతన అధ్యక్షుడు జె.రామసుబ్బయ్య యాదవ్‌ను గురువారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సంఘం రాష్ట్ర అదనపు సాధారణ కార్యదర్శి వెంకటకృష్ణయ్య యాదవ్, గౌరవసలహాదారుడు నాగమల్ల శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు కె.దేవానంద్, ముఖ్య సలహాదారుడు కురువ పుల్లయ్య, సభ్యులు వెంకటరమణయాదవ్, పెద్దన్న యాదవ్ పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఉద్యోగుల హక్కుల సాధన దిశగా నిరంతరం కృషి చేయాలని, భవిష్యత్తులో మరిన్ని పదవులు పొందాలని వారు ఆయన్ను అభినందించారు.

ఎన్జీవో సంఘం అధ్యక్షుడు రామసుబ్బయ్యను సత్కరిస్తున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు

LIC HFL LIC HOUSING FINANCE LTD with you, for your dream home
ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
సాయినిలయం, శ్రీ వెంకటరమణ శారీస్ యొక్క ఫస్ట్ ఫ్లోర్, హెచ్.నెం.238 & 239, ఎపి హౌసింగ్ బోర్డ్, రాజీవ్‌పార్క్ రోడ్డు, కడప-516001. ఫోన్: 08562-255434

ఇ-వేలం అమ్మకం ప్రకటన

ఎల్.ఐ.సి. హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (LIC HFL) వారి యొక్క అధీకృత అధికారిగా ఉన్న ఈ దిగువ సంతకందారుడు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 నందు చెప్పబడిన నిబంధనలు మరియు అందలి సెక్షన్ 13(12)తో కలిపి చదవబడే విధంగా సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క నిబంధన 3 క్రింద తమకు లభించిన అధికారములను వినియోగింపుకొంటూ ఈ దిగువ చెప్పబడిన ఋణగ్రహీత(లు) / తనఖాదారు(లు) చెల్లించవలసిన బకాయి మొత్తములను తిరిగి చెల్లించవలసినదిగా కోరుతూ డిమాండ్ నోటీసు జారీచేసియున్నారని ఇందుమూలముగా తెలియజేయడమైనది. అయినప్పటికీ మా నోటీసులు నందు చెప్పబడిన బకాయి మొత్తములను ఈ ఋణగ్రహీత(లు) / తనఖాదారు(లు) చెల్లింపులో విఫలమైనందున, ఈ దిగువ చెప్పబడిన సంతకందారుడు, ఈ దిగువ చెప్పిన ఆస్తులను సదరు పై చట్టం యొక్క సెక్షన్ 13(4) మరియు సెక్షన్ 14తో కలిపి చదవబడే నిబంధన 8 క్రింద **భౌతికముగా స్వాధీనము** చేసికొనియున్నారు.

వ. నెం.	లోన్ నెం. / ఋణగ్రహీత / సహ-ఋణగ్రహీత పేరు	స్థిరాస్తి వివరములు	రిజర్వుధర (రూ.)	ధరావత్తు (రిజర్వు ధరలో 10%)	బ్యాంక్ వివరములు (ధరావత్తు బదిలీ చేయవలసిన)
1	**711900004144** శ్రీ పులిమి జేమ్స్ (ఋణగ్రహీత) కడప ఏరియా ఆఫీస్ సంప్రదించవలసిన నెం: **7702819174 8792853764 9704020357**	షెడ్యూలు-ఎ: 30.12.2019 తేదీగల విక్రయ దస్తావేజు నెం. 10310/2019 ప్రకారము ఆస్తి. కడప అర్బన్ సబ్ జిల్లా, కడప మునిసిపల్ కార్పొరేషన్, పుట్లంపల్లి రెవెన్యూ గ్రామము, రిమ్స్ దగ్గర, సర్వే నెం.132/3, సబ్-డివిజన్ సర్వే నెం.132/3బి (కడప రెవెన్యూ డివిజనల్ అధికారి ద్వారా 01.03.2014 తేదీనాటి కన్వర్షన్ నెంబర్. D.Dis.E./37/2014 ప్రకారము) నందు మొత్తం ఎ. 7.46 సెంట్లలో 3 ఎకరాల 18 సెంట్లు లేదా 1.290 హెక్టార్స్ లేదా 15391.2 చ॥గ॥ విస్తీర్ణమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు: తూర్పు**: సర్వే నెం. 133 లోని ఆస్తి; **దక్షిణం**: సర్వే నెం. 134	రూ. 35,00,000/-	రూ. 3,50,000/- (బిడ్ పెంపుదల మొత్తం రూ.10,000/-)	Beneficiary Name: LIC Housing Finance Ltd Branch Name: HDFC BANK Account Number:- LHFLVW711900004144 IFSC Code:- HDFC0000109 Property Id :- VW711900004144

లోని రాస్తా; **పడమర:** శ్రీ జి.వెంకటలక్ష్మమ్మకు చెందిన స్థలములోని మిగిలిన పోర్షన్; **ఉత్తరం:** రిమ్స్ రోడ్డు.
షెడ్యూలు-బి: కడప జిల్లా, కడప సబ్ జిల్లా, కడప సిటీ, పుట్లంపల్లి రెవెన్యూ గ్రామము, పైన పేర్కొన్న షెడ్యూలు-ఎ ఆస్తి మొత్తంలోని "కాన్‌కోర్డ్ క్యాస్టిల్" ప్రతిపాదిత కాంప్లెక్స్ ఎ బ్లాక్, మొదటి అంతస్తులో 1350 చ॥అ॥ (కామన్ ఏరియా కలుపుకొని) విస్తీర్ణములోని ఫ్లాట్ నెం. 257 మరియు 100 చ॥అ॥ కార్ పార్కింగ్ ఏరియా మరియు మొత్తం స్థలములో అవిభాజ్యపు మరియు అనిర్దిష్టపు 1/300వ వంతు భాగమైన 58.89 చ॥గ॥ స్థలముతో సహా యావదాస్తి. **దీనికి హద్దులు: తూర్పు:** ఉమ్మడి వరండా; **దక్షిణం:** శూన్యాకాశము & ఎ-బ్లాక్‌లోని ఫ్లాట్ నెం. 248; **పడమర:** శూన్యాకాశము; **ఉత్తరము:** శూన్యాకాశము & ఎ-బ్లాక్‌లోని ఫ్లాట్ నెం. 238.

ఇ-వేలం యొక్క వెబ్‌సైట్	https://bankauctions.in
ఆస్తి తనిఖీ కొరకు తేది & సమయం	05-12-2025 ఉ॥ 10.00 గం॥ల నుండి సా॥ 05.00 గం॥ల మధ్యన
టెండరు / సీల్డ్ బిడ్ సమర్పించుటకు చివరి తేది	22-12-2025 సా॥ 05.00 గం॥ల లోపు (ఆన్‌లైన్ విధానం ద్వారా మాత్రమే)
ఇ-వేలం తేది మరియు సమయం	23-12-2025 ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 01.00 గం॥ వరకు

ఇ-వేలం ద్వారా విక్రయం చేయు పైన చెప్పబడిన అసెట్స్ / ఆస్తులు (SARFAESI, చట్టం 2002 నందు నియమములు మరియు నిబంధనలకు లోబడి మరియు తదుపరి చెప్పిన నిబంధనలు) కొరకు జారీ చేసిన ఈ బహిరంగ ప్రకటనతో పాటుగా, ఎల్.ఐ.సి. హెచ్.ఎఫ్.ఎల్ వారు ఆన్‌లైన్ విధానం ద్వారా పైన చెప్పబడిన ఆస్తులను "ఎక్కడ ఏమి ఉన్నదో అలాగే" మరియు "అక్కడ ఏమి ఉన్నదో అదే" ప్రాతిపదిక పై కొనుగోలు చేయుటకు ఆసక్తి గల బిడ్డర్ల నుండి ఆఫర్లను ఆహ్వానించుచున్నాము.

వేలం ద్వారా విక్రయం యొక్క నియమములు & నిబంధనలు ఈ దిగువ చెప్పబడినవి

1) "ఎక్కడ ఏమి ఉన్నదో అలాగే", "అక్కడ ఏమి ఉన్నదో అదే", "ఏదైతే ఉన్నదో అదే" మరియు "ప్రశ్నించే వీలులేని" ప్రాతిపదిక పై మాత్రమే ఇ-వేలం నిర్వహించబడును మరియు "ఆన్‌లైన్" విధానము ద్వారా ఇ-వేలం ఎల్.ఐ.సి. హౌసింగ్ ఫైనాన్స్ వారిచే ఆమోదిత ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ M/s.4 Closure వారిచే నిర్వహించబడును. 2) ఆసక్తి గల బిడ్డర్లు తమ పేర్లను దయచేసి మా పోర్టల్ https://bankauctions.in నందు నమోదు చేసుకొనవలెను మరియు వారి యొక్క యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్‌లను ఉచితంగా పొందవచ్చును. ఇ-వేలం విధానం ద్వారా పాల్గొనుటకు ఆన్‌లైన్ శిక్షణ కొరకు ఆసక్తిగల అర్హత కలిగిన బిడ్డర్లు మా సర్వీసు ప్రొవైడరు M/s.4Closure, సంప్రదించవలసిన వ్యక్తి: శ్రీ టి.జయప్రకాష్‌రెడ్డి, ఫోన్: 8142000064, ఇ-మెయిల్ ఐడి: prakash@Bankauctions.in & info@bankauctions.in నందు సంప్రదించగలరు. 3) ఆమోదిత ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ M/s.4Closure వారి https://bankauctions.in వెబ్‌సైట్ దర్శించి వేలం ద్వారా విక్రయం చేయు ఆస్తి యొక్క పూర్తి వివరములు మరియు అందలి పూర్తి నియమములు మరియు నిబంధనలు తెలుసుకొనవచ్చును. 4) మరిన్ని వివరముల కోసం దయచేసి సంప్రదించండి: 7702819174, 8792853764, 9704020357.

తేది: 20-11-2025, ప్రదేశము: కడప — సం/- అధీకృత అధికారి, ఎల్.ఐ.సి. హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

పరుగు పందెంలో సత్తా

రాధ

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు ఎద్దుల వెంకటసుబ్బమ్మ పురపాలక బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎన్.రాధ రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్, వ్యాయామ ఉపాధ్యాయురాలు లక్ష్మీదేవిలు తెలిపారు. జిల్లా స్థాయి పరుగు పందెంలో విద్యార్థి సత్తా చాటడంతో వినుకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది.

విద్యార్థికి అభినందనలు

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: ఈ నెల 19న బద్వేలులో జరిగిన అంతర్ కళాశాలల బ్యాడ్మింటన్ సింగిల్స్ పోటీల్లో ప్రొద్దుటూరు వేదవ్యాస డిగ్రీ కళాశాలకు చెందిన మొదటి సంవత్సరం విద్యార్థి పి.భరత్ రాజేష్ రెండో బహుమతి సాధించాడు. కళాశాల నిర్వాహకులు ఎల్.నాగేశ్వరరెడ్డి విద్యార్థిని అభినందించారు.



ప్రొద్దుటూరులో విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు నాగేశ్వరరెడ్డి, సుదర్శన్‌రెడ్డి

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి డిస్కస్‌త్రో పోటీలకు ఎంపికయ్యారని శ్రీవైష్ణవి పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ, ప్రిన్సిపల్ కళ్యాణి తెలిపారు. వెంకటేష్ ప్రథమ, సాయి నరసింహ ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు.

విజేతలను అభినందిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ

ఉల్లి పంట ఉత్పాదకతపై కేంద్ర బృందం ఆరా

దువ్వూరు, న్యూస్‌టుడే : దువ్వూరు మండలం చిన్న శింగనపల్లె గ్రామంలో గురువారం కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ డిప్యూటీ కమిషనరు బి.జె.బ్రహ్మ, కేంద్ర బృందం సభ్యులు ఉల్లి పంట ఉత్పాదకతపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కేంద్ర బృందం ఉల్లిపంట సాగు, సస్య రక్షణ, దిగుబడులపై రైతులతో ముఖాముఖీ ద్వారా తెలుసుకున్నారు. కార్యక్రమంలో బృందం సభ్యులు మనోజ్, రాజీవ్‌కుమార్, అధికారులు జయదగ్ని, సతీష్, రామకృష్ణ పాల్గొన్నారు.

EENADU Classifieds

AUTO

VEHICLES FOR SALE

Sundaram Finance Ltd Vehicle for Sale KIA CARENS CLAVIS Model 2025 Registration Number AP-40-HM-2627. Cell : 9440909749, 8500667214.

Vehicle for Sale Unregistered Maruti Brezza Smart Hybrid VXI1.5L 5MT BSVI Buyers Has come to along with IDS Address Proof. Cont: Indusind Bank Ltd, W/14-245, 1st Floor, IVR Towers Beside Saibaba School, ITI Circle, Kadapa-516003, 8328668171, 7550065615.

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647

TO LET

COMMERCIAL

కడప మారుతీనగర్ (నాగార్జున స్కూల్ ప్రక్కన) విద్యాసాగర్ హాస్పిటల్ దగ్గర 4000 Sft బిల్డింగ్‌ను బాడుగకు గాని లేక అమ్మబడును. Cell :7702936190.

JOBS

Amaravathi Software, Kadapa. Job Offer For Any B.Tech, M.Tech, MBA. Interview Date: 23-11-2025, Time: 9 AM - 5 PM, Cont: 9849720149.

NIT కేరళలో EEE B.Tech చదువుతున్న నడవలేని విద్యార్థినిని (PWD) చూసుకొనుటకు B.Tech చదువుకొని 35 సం॥లోపు వయస్సు ఉన్న ఒంటరి మహిళలు కావలెను. భోజనం, వసతి కల్పించి జీతం ఇవ్వబడును. Cell: 9866432259.

ప్రముఖ ట్రాక్టర్ కంపెనీ డీలర్షిప్ లో పని చేయుటకు స్పేర్స్ ఇన్‌ఛార్జి కావలెను. హనుమాన్ మోటార్స్, M.G.Auto Nager, Proddatur 9390032810.

FACULTY/ TEACHERS

కడప పట్టణంలో ప్రముఖ స్కూల్ నందు నర్సరీ నుండి UKG వరకు బోధించుటకు 5 & 10 సం॥ అనుభవం కల్గిన టీచర్స్ కావలెను. Cell : 6281155858, 9966149515.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ॥ 350/- మాత్రమే
Contact: KDP: 9989997626 8008514248 PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

(c) eenadu

ఎంఎస్‌ఎంఈ ధ్రువపత్రంతో ఔత్సాహికులకు ప్రయోజనం



మైదుకూరు, న్యూస్‌టుడే : సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న వారు ఎంఎస్‌ఎంఈ (జడ్‌ఈడీ) ధ్రువపత్రంతో ఎక్కువ ప్రయోజనాలు పొందే అవకాశం ఉందని పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ చాంద్‌బాషా తెలిపారు. గురువారం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఔత్సాహికులతో ఎంఎస్‌ఎంఈ, జడ్‌ఈడీ అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జడ్‌ఈడీ ధ్రువపత్రం కలిగిన వారిని ప్రభుత్వం గుర్తిస్తుందని, బ్యాంకుల ద్వారా రాయితీ రుణాలు పొందవచ్చని వివరించారు.

ఉల్లి రైతులను ఆదుకోవాలని డిమాండ్

మైదుకూరు, న్యూస్‌టుడే : గిట్టుబాటు ధర లేక నష్టపోయిన ఉల్లి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పరిహారాన్ని వెంటనే అందించాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎ.వి.రమణ డిమాండ్ చేశారు. హెక్టారుకు రూ.50 వేలు అందజేస్తామని ప్రకటించి రెండు నెలలైనా ఇప్పటికీ పరిహారం అందలేదన్నారు. వెంటనే పరిహారం అందించకపోతే ఉల్లి రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

వెలుగు సిబ్బందిపై ఫిర్యాదు

అట్లూరు, న్యూస్‌టుడే : కమలకూరు క్లస్టర్ సీసీ విధులకు సక్రమంగా రావడం లేదని, ఎస్సీ డ్వాక్రా సంఘాలకు ఉన్నతి రుణాలు మంజూరు చేయమని పలుమార్లు ప్రశ్నించినందుకే తనను తొలగించేందుకు ఏపీఎం కుట్రచేస్తున్నారని మండల సమాఖ్య అధ్యక్షురాలు సరస్వతి ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా తమ పదవులను తొలగించే ప్రయత్నం చేస్తున్నారని డ్వాక్రా మహిళలతో కలిసి ఆమె డీసీసీబీ ఛైర్మన్ సూర్యనారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన పీడీ రాజ్యలక్ష్మికి చరవాణి ద్వారా తెలియజేయడంతో స్థానిక వెలుగు కార్యాలయంలో జరగాల్సిన గ్రామ సమాఖ్య మహాసభను ఏపీఎం సురేష్‌బాబు వాయిదా వేశారు.



ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ప్రొద్దుటూరు విద్య, జమ్మలమడుగు, చాపాడు, న్యూస్‌టుడే: గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల వ్యాప్తంగా గ్రంథాలయాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

చాపాడులో విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న అధికారులు

విజేతలతో ప్రొద్దుటూరు గ్రంథాలయ ఉద్యోగులు

జమ్మలమడుగులో ప్రశంసాపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

మండల సర్వసభ్య సమావేశం నేడు

రాజుపాళెం, న్యూస్‌టుడే: రాజుపాళెం ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో షాకీర్ అలీఖాన్ తెలిపారు. అజెండాపై చర్చ ఉంటుందని, మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు

కలసపాడు, న్యూస్‌టుడే: మండలంలోని మహానందిపల్లె పంచాయతీ పరిధిలోని పద్మావతి వృద్ధాశ్రమంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారి శైలజ 25 మంది వృద్ధులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సామాజిక అధికారి వెంకటసుబ్బమ్మ, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, సిబ్బంది స్వాతి, వృద్ధాశ్రమ సూపరింటెండెంట్ వెంకటరెడ్డి, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.







(c) eenadu

ఆర్టీసీ ఆర్ఎం వైఖరిపై మండిపాటు

రిలే దీక్షలో మాట్లాడుతున్న జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, చిత్రంలో నాయకులు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే : ఆర్టీసీ ఆర్ఎం మొండి వైఖరిని విడనాడి ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి డిమాండు చేశారు. సమస్యల పరిష్కరించాలని కోరుతూ కడప ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం ఎదుట ఎన్ఎంయూ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే దీక్షలు గురువారం మూడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ ఆర్ఎం వచ్చినప్పటి నుంచి ఉద్యోగుల వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సంస్థ నిబంధనలను పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. చిన్న చిన్న తప్పిదాలకు ఎలాంటి విచారణ లేకుండా బదిలీలు, సస్పెండ్ చేయడం సరికాదన్నారు. ఆర్టీసీ ఎన్ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివారెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులను ఆర్ఎం బానిసలుగా చూస్తున్నారని ఆరోపించారు. ఆర్ఎం ప్రభుత్వ ఉత్తర్వులను సైతం తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరికలు చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎన్ఎంయూ జిల్లా అధ్యక్షుడు నాగముని, కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యక్షుడు భానుప్రసాద్, నాయకులు సుబ్బారావు, జయరాం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

OFFICE OF THE DISTRICT MEDICAL & HEALTH OFFICER, YSR KADAPA
Rc. No. School Children/DBCS/YSR, KDP Dated: 20.11.2025
TENDER NOTIFICATION

The sealed tenders are invited from the standard agencies/ manufactures and registered suppliers for supply of SPECTACLES with the Following Specifications to District Medical & Health Officer/District Programme Manger, District Blindness Control Society, YSR Kadapa. FOR SUPPLY TO SCHOOL CHILDREN EYE SCREENING PROGRAMME.

Sl. No.	Name of the items	Approximately estimated Spectacles	Estimated tender value Rs:	EMD Rs:
1	Spectacles (Children)	3700	Rs: 10,36,000 (Ten lakhs thirty six thousand rupees only)	Rs: 10,000

Date of Sale & place of tender Schedules at O/o Dist. Programme Manager, Dist. Blindness Control Society, Old RIMS YSR Kadapa during the working days of the office hours from 11.00 A.M to 4.00 P.M. **Last date** to submit filled in application is on: 02-12-2025 by 4.00 PM, Date of Opening of Tenders: 03/12/2025 at .00 PM at O/o Joint Collector, YSR Kadapa. Cost of Tenders Application is Rs 1,000/- (One Thousand Only) each. EMD Amount will be Rs.10,000/- (Ten Thousand Only) per Bidder to be paid through DD in favour of District Medical & Health Officer, YSR Kadapa while submitting the Tender. **No correspondence will be entertained in this regard. The District Procurement Committee Decision is final in deciding the Spectacles as per Standards.**

Sd/- District Medical & Health Officer
Vice-Chairman, DBCS, Y.S.R. District.

కెనరా బ్యాంక్ Canara Bank — కడప మరియాపురం బ్రాంచ్, కడప, ఆం.ప్ర-516003.

ఋణగ్రహీత /హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

[illegible]

లోన్ స్వభావం & లోన్ ఖాతా నెం.	లోన్ మొత్తం మరియు లోన్ తేది	ఈ తేదీ నాటికి బకాయి మొత్తం	వడ్డీ రేటు
హౌసింగ్ లోన్ ఖాతా నెం.160001959175	రూ. 53,60,000/- తేదీ. 08-11-2023	రూ.53,47,975.12/-	9.8%
కెనరా హోమ్ లోన్ సెక్యూర్డ్ ఖాతా నెం. 164012270540	రూ. 2,64,620/- తేదీ. 29-05-2024	రూ.2,55,475/-	10.35%

[illegible]

తేదీ: 10.11.2025, ప్రదేశం: కడప — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (LIC HFL)
సౌలినిలయం, శ్రీ వెంకటరమణ శాలిస్ యొక్క ఫస్ట్ ఫ్లోర్, హెచ్.నెం.238 & 239, ఎపి హౌసింగ్ బోర్డ్, రాజీవ్‌పార్క్ రోడ్డు, కడప-516001. ఫోన్: 08562-255434

ఇ-వేలం అమ్మకం ప్రకటన

[illegible]

రిజర్వుధర (రూ.)	ధరావత్తు (రిజర్వు ధరలో 10%)	బ్యాంక్ వివరములు (ధరావత్తు బదిలీ చేయవలసిన)
రూ. 35,00,000/-	రూ. 3,50,000/-	Beneficiary Name: LIC Housing Finance Ltd; Branch Name: HDFC BANK; Account Number:- LHFLVW711900004144; IFSC Code:- HDFC0000109; Property Id :- VW711900004144
బిడ్ పెంపుదల మొత్తం రూ.10,000/-		

ఋణగ్రహీత: 711900004144 — 7702819174, 8792853764, 9704020357

ఇ-వేలం యొక్క వెబ్‌సైట్	https://bankauctions.in
ఆస్తి పరిశీలన తేదీ & సమయం	05-12-2025 ఉ॥ 10.00 గం॥ నుండి సా॥ 05.00 గం॥ వరకు
టెండరు / బిడ్ సమర్పించుటకు చివరి తేదీ	22-12-2025 సా॥ 05.00 గం॥ వరకు
ఇ-వేలం తేదీ మరియు సమయం	23-12-2025 ఉ॥ 11.00 గం॥ నుండి మ॥ 01.00 గం॥ వరకు

[illegible]

తేదీ: 20-11-2025, ప్రదేశం: కడప — సం/- అధీకృత అధికారి, ఎల్.ఐ.సి. హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

కంప్యూటర్ ఇచ్చితిరి.. అంతర్జాలం మరిచితిరి

వేంపల్లె, న్యూస్‌టుడే: జిల్లాలోని జడ్పీ ఉన్నత పాఠశాలలకు ప్రభుత్వం రెండు నెలల క్రితం కంప్యూటర్లు సరఫరా చేసింది. కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య, ఇతరత్రా వాటిని వీటిలో పొందుపరిచి అవసరమైనప్పుడు డీఈవో, ఇతర కార్యాలయాలకు వీటి ద్వారా పంపాల్సి ఉంటుంది. ఇంతవరకు బాగానే ఉంది. అంతర్జాల సౌకర్యం లేకపోవడంతో సదరు పాఠశాలల్లోని వివరాలను ఉన్నతాధికారులకు పంపలేని పరిస్థితి నెలకొంది. దీంతో కంప్యూటర్లు నిరుపయోగంగా మిగలగా.. ఉపాధ్యాయులకు ఇబ్బందులు తప్పడం లేదు.

కుదరని సర్దుబాటు

జిల్లాలో 121 స్కూల్ కాంప్లెక్స్ ఉన్నత పాఠశాలలున్నాయి. ఒక్కొక్క స్కూల్ కాంప్లెక్స్ జడ్పీ ఉన్నత పాఠశాల కింద 8 ప్రాథమిక పాఠశాలలుంటాయి. ఒక్కో స్కూల్ కాంప్లెక్స్ పాఠశాలకు సమగ్ర శిక్షా అభియాన్ కింద కంప్యూటర్ ఏర్పాటు చేశారు. పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు, అంతర్జాలం ప్యానల్స్ అనుసంధానంతో విద్యా బోధన సాగుతోంది. సదరు అంతర్జాలాన్నే తాజాగా పంపిన కంప్యూటర్లకూ వాడుకోవాలని జిల్లా ఉన్నతాధికారులు చెబుతున్నారు. పాఠశాలల్లో ఆ పరిస్థితులు లేకుండా పోయాయి. అంతర్జాల సౌకర్యాన్ని కంప్యూటర్లకు సర్దుబాటు చేయడం కష్టమని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఈ విషయమై సమగ్ర శిక్షా అభియాన్ అకడమిక్ మానిటరింగ్ అధికారి వీరేంద్ర మాట్లాడుతూ.. ఉన్నతాధికారులతో మాట్లాడి స్కూల్ కాంప్లెక్స్ జడ్పీ ఉన్నత పాఠశాలలకు పంపిన కంప్యూటర్లకు అంతర్జాల సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వేంపల్లె జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న కంప్యూటర్

జిల్లాలో మండలాలు	:	36
స్కూల్ కాంప్లెక్స్ జడ్పీ ఉన్నత పాఠశాలలు	:	121
విద్యార్థుల సంఖ్య	:	30,000
ఉపాధ్యాయుల సంఖ్య	:	2,000

సూక్ష్మజీవులతో వ్యాధుల వ్యాప్తి

విద్యార్థులకు యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల అధ్యాపకులు, వైద్య విద్యార్థులు

మారుతీనగర్: బ్యాక్టీరియా, ఫంగస్, పరాన్నజీవుల వంటి సూక్ష్మజీవులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్య కళాశాల మైక్రోబయాలజీ విభాగం వైద్యులు డాక్టర్ ఖాజామొయినుద్దీన్, డాక్టర్ విజయవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ సూక్ష్మ జీవులు మందులకు అనుగుణంగా మారినప్పుడు చికిత్స పని చేయదని, వ్యాధులు వ్యాప్తి చెంది మరణాల రేటు పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక గాంధీనగర్ నగరపాలక పాఠశాలలో ప్రపంచ ఏఎంఆర్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ వైద్య కళాశాల మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెండో సంవత్సర వైద్య విద్యార్థులు పాల్గొని విద్యార్థులకు యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అంటే ఏమిటి, అది సమాజంపై చూపే ప్రభావంపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా విద్యార్థులు చేతులు కడుక్కోకుంటే వచ్చే ప్రమాదకర బ్యాక్టీరియాల గురించి వివరించారు.

2న ఆర్టీసీ అప్రెంటీస్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే : ఏపీఎస్ఆర్టీసీలో అప్రెంటీస్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు డిసెంబరు 2న ధ్రువపత్రాల పరిశీలన కోసం కర్నూలు జోనల్ కళాశాలకు హాజరు కావాలని జోనల్ కళాశాల ప్రిన్సిపల్ నజీర్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. డీజిల్ మెకానిక్ ట్రేడ్ అభ్యర్థులు 2వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మోటారు మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, మెషినిస్ట్, ఫిట్టర్, డ్రాఫ్ట్స్ మెన్ (సివిల్) అభ్యర్థులు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటలలోపు హాజరు కావాలన్నారు. అభ్యర్థులు తమ ఒరిజనల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు. పత్రాల పరిశీలన కోసం రూ.118 చెల్లించాలన్నారు. 2వ తేదీ కేవలం కడప జిల్లా అభ్యర్థులు మాత్రమే హాజరు కావాలన్నారు. ఏవైనా సందేహాలుంటే నం:08518-257025కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు ప్రతిభా పరీక్ష 23న

కడప విద్య, న్యూస్‌టుడే : కడప నగరం జిల్లా పరిషత్తు కార్యాలయ ఆవరణలోని సభా భవనంలో ఆదివారం ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు తెలుగు, హిందీ భాషలపై ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు ప్రతిభా పరీక్ష నిర్వహించనున్నట్లు రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ (ఎస్ఎల్‌టీఏ) జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, రాష్ట్ర కోశాధికారి బోగా గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం భోజన అనంతరం బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ముఖ్యఅతిథులుగా పద్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మ, ప్రభుత్వ విప్, జమ్మలమడుగు శాసనసభ్యుడు చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి, ఎస్ఎల్‌టీఏ, ఉపాధ్యాయ సంఘాల గౌరవాధ్యక్షుడు, సంస్కృతి సేవా సమితి కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులురెడ్డి, ఎన్టీఆర్ వైద్యవిశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యుడు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్ కొండయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాండ్లపర్తి శివానందరెడ్డి, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత చదువులబాబు హాజరు కానున్నారని తెలిపారు.

జగన్ పాపం పండింది

ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డి

పటేల్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డి, చిత్రంలో నాయకులు, అధికారులు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే : 'మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాపం పండింది. ఇక తప్పులు ఉడకవు. సీఎం చంద్రబాబు కోసం పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ చూపించాం. పులివెందుల పులుల కోరలు పీకేశాం. వై.ఎస్. అవినాష్‌రెడ్డికి చెక్ పెడతాం.' అని జమ్మలమడుగు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డి అన్నారు. జగన్, అవినాష్ కేసులన్నీ నాంపల్లి సీబీఐ కోర్టులో జరుగుతున్నాయి. ఇక్కడ మేము సంబరాలు చేసుకుంటుంటే అక్కడ వాళ్లు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. పటేల్ జయంతి సందర్భంగా గురువారం స్థానిక కలెక్టరేట్‌లో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టరేట్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. 'కష్టం కంటే జమ్మలమడుగులో అభివృద్ధి పనులు ఎక్కువగా జరిగాయి. చంద్రబాబునాయుడు నన్ను పట్టించుకోపోమనేది వైకాపా వారి భ్రమ' అని అన్నారు. చంద్రబాబు తనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. కూటమి 18 నెలల పాలనలో మన రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుంటామని కేంద్రం రూ.12 వేల కోట్లు కేటాయించిందన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారంలో జరుగుతున్న తప్పులను మాత్రమే ప్రభుత్వం ఎత్తి చూపుతోందన్నారు. మోదీ వల్లే విశాఖ ఉక్కు కర్మాగారానికి రూ.12 వేల కోట్లు నిధులు వచ్చాయన్నారు. నక్సలిజం బాగా తగ్గిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు ఒక్క ఏపీలోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

'రైతు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం'

వేంపల్లె, న్యూస్‌టుడే : రైతు సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎంపీ, రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి విమర్శించారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రభుత్వ హయాంలో ఏ ఒక్క పంటకు గిట్టుబాటు ధర లభించక రైతులు అల్లాడిపోతున్నారన్నారు. అరటి, చీనీ, బత్తాయి, మిర్చి, పొగాకు, పసుపు ఇలా ఏ పంట ఉత్పత్తులను అడిగేవారు లేక రైతుల పరిస్థితి దయనీయంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా, ఇతర ఎరువుల ధర అమాంతం పెరిగిపోయిందని, అరకొర పంట నష్టపరిహారం, పంటల బీమా పరిహారం అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద 2024-25 సంవత్సరానికి సంబంధించి రైతులకు ఒక్క పైసా ఇవ్వకుండా ఎగ్గొట్టిందని దుయ్యబట్టారు. సూపర్ సిక్స్ హామీలలోని కొన్నింటిని ఇప్పటికీ ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు. నిరుద్యోగ భృతి కింద ఒక్కో నిరుద్యోగికి రూ.3 వేలు, ఆడబిడ్డ నిధి కింద 19 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న ప్రతి ఆడబిడ్డకు రూ.1500 ఇస్తామన్న హామీలు ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛను ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. బుధవారం కడప జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్‌సిక్స్ హామీలన్నీ అమలు చేశామని చెప్పడంలో నిజం లేదన్నారు.

సమగ్రశిక్షా జిల్లా ఏపీసీగా ప్రేమంత్‌కుమార్

కడప విద్య, న్యూస్‌టుడే : జిల్లా సమగ్రశిక్షా అదనపు పథక సమన్వయకర్త (ఏపీసీ)గా ప్రేమంత్ కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి కోనశశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ప్రస్తుతం నంద్యాల జిల్లా ఏపీసీగా పనిచేస్తున్నారు. ఒంటిమిట్ట మండలం మాధవరం చెందిన ప్రేమంత్‌కుమార్ 2008 సంవత్సరంలో నందలూరు డిప్యూటీ తహసీల్దారుగా విధుల్లో చేరారు. ఉద్యోగోన్నతితో రాయచోటి తహసీల్దారుగా పనిచేశారు. ఆ తరువాత ఏపీ ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో జనరల్ మేనేజర్‌గా, నంద్యాల జిల్లా ఏపీసీగా డిప్యూటీ కలెక్టర్ హోదాలో విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం జిల్లాకు ఏపీసీగా రానున్నారు. జిల్లా ఏపీసీ నిత్యానందరాజులును నంద్యాలకు బదిలీ చేశారు. డిప్యూటీ కలెక్టర్ హోదా కలిగిన వీరు డిప్యుటేషన్ ప్రాతిపదికన ఫారిన్ సర్వీస్ నిబంధనల మేరకు విధులు నిర్వర్తించనున్నారు.

ఆర్టీసీ ఎన్ఎంయూ గ్యారేజీ కమిటీ ఎన్నిక

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే : కడప ఆర్టీసీ ఎన్ఎంయూ గ్యారేజీ నూతన కమిటీ ఎన్నికైంది. ఎన్నికైన కమిటీ సభ్యులు గురువారం డిపో మేనేజరు కన్యాకుమారిని సన్మానించారు. ఎన్ఎంయూ గ్యారేజీ అధ్యక్షుడిగా టీఈఎస్ రెడ్డి, కార్యదర్శి పీఎస్ రాయుడు, అదనపు కార్యదర్శి సీవీ సుబ్బారావు, సంయుక్త కార్యదర్శిగా ఎస్.జిలానీ, కోశాధికారిగా ఎస్ఆర్‌వీ రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

కమలాపురం, న్యూస్‌టుడే : పట్టణంలోని బాలుర జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు, ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన ఏపీ స్కూల్ గేమ్స్ పోటీల్లో ప్రతిభ సాధించి రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికయ్యారు. నెల్లూరులో ఈ నెల 22 నుంచి 24 వరకు జరగనున్న అండర్-14 వాలీబాల్ పోటీల్లో నిత్య వెంకటమణి, చంద్రగిరిలో జరగనున్న హాకీ పోటీల్లో ఉమర్‌బాషా, మదనపల్లెలో జరగనున్న ఫుట్‌బాల్ పోటీల్లో సుశాంత్, అలాగే అండర్-17 కింద కర్నూలులో జరిగే కబడ్డీ పోటీల్లో చరణ్ ఆడేందుకు కసరత్తు చేస్తున్నారని పాఠశాల పీడీ వెంకటసుబ్బన్న తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను గురువారం పీడీతో పాటు హెచ్ఎం ఖాజాపర్వీన్, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులతో పాఠశాల హెచ్ఎం ఖాజాపర్వీన్, పీడీ వెంకటసుబ్బన్న

చింతకొమ్మదిన్నె : మండలంలోని అంగడివీధి హైస్కూల్‌లోని 8వ తరగతి విద్యార్థి మోక్షజ్ఞగౌడ్ అండర్-14 రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత, వ్యాయామ ఉపాధ్యాయుడు అగ్గిరప్ప తెలిపారు. ఈ నెల 19వ తేదీ బుధవారం కడప నగరంలోని డీఎస్ఏ స్టేడియంలో అండర్-14 జిల్లా స్థాయి క్రికెట్ ఎంపికలు నిర్వహించారు. అయితే ఇందులో మోక్షజ్ఞగౌడ్ తన ప్రతిభను చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈ నెల 29 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు గుంటూరు జిల్లాలోని పెరిచర్లలో జరిగే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా మంచి ప్రతిభ చాటాలని ప్రధానోపాధ్యాయురాలు సుజాత, వ్యాయామ ఉపాధ్యాయుడు అగ్గిరప్ప, ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయులు

ఒంటిమిట్ట : మండలంలోని కొత్త మాధవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు బాధ్య హెచ్ఎం కేశవరెడ్డి, పీడీ విశ్వనాథ్ గురువారం తెలిపారు. సైక్లింగ్ అండర్-17లో పి.వినయ్‌కుమార్ (పదో తరగతి), అండర్-14లో పి.జస్వంత్ (ఎనిమిదో తరగతి) అర్హత సాధించారు. బాస్కెట్‌బాల్ అండర్-17 జట్టుకు పి.లక్ష్మీరెడ్డి (ఎనిమిదో తరగతి) ఎంపికయ్యారని వివరించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటినట్లు పేర్కొన్నారు. ముగ్గురు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

ఎంపికైన కొత్తమాధవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

పులివెందులలో రెండు చోరీలు

పులివెందుల, న్యూస్‌టుడే : పులివెందుల సర్కిల్ పరిధిలో రెండు చోరీలు జరిగాయి. మైత్రి లేఔట్‌లో నివాసం ఉంటున్న ఎ.విజయరాఘవరెడ్డి తల్లి చేతులకు ఉన్న బంగారు గాజులను గుర్తుతెలియని వ్యక్తులు బెదిరించి తీసుకెళ్లారు. విజయరాఘవరెడ్డి ఈ నెల 15న తెలిసిన వారికి సంబంధించి వివాహ నిశ్చితార్థం వేడుకకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. ఇంటివద్ద తన తల్లి ఉండటంతో ఆమెకు తోడుగా కుమారుడు క్రాంతిరెడ్డిని ఉండమని చెప్పి వెళ్లారు. మధ్యాహ్నం కుమారుడు క్రాంతిరెడ్డి ఇంట్లో ఉండగా తన తల్లి బయట ఉందని, దీంతో ఎవరో గుర్తుతెలియని వ్యక్తి ముఖానికి ముసుగు వేసుకుని వచ్చి బంగారు గాజులు ఇవ్వాలని బెదిరించి తీసుకెళ్లినట్లు విజయరాఘవరెడ్డి పులివెందుల పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంగారం విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని ఆయన తెలిపారు. పులివెందుల మండలం యర్రబల్లె గ్రామానికి చెందిన బాలగంగిరెడ్డి ఇంట్లో చోరీ జరిగినట్లు పులివెందుల పోలీసులకు ఫిర్యాదు అందింది. గత మూడు నెలల కిందట బాలగంగిరెడ్డికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో హైదరాబాద్‌కు చికిత్స కోసం వెళ్లారు. మూడు నెలల తర్వాత వచ్చి చూస్తే ఇంటి తలుపులు పగులుకొట్టి ఉండటం గుర్తించారు. ఇంట్లోకెళ్లి చూడగా బంగారు గొలుసు, ఉంగరం తీసుకెళ్లినట్లు గుర్తించి ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.లక్షన్నర విలువైన సొత్తు చోరీ జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పులివెందుల సీఐ సీతారామిరెడ్డి తెలిపారు.

గంజాయి, మత్తు స్థావరాలపై నిఘా

కడప నేరవార్తలు : జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న స్థావరాలపై స్పెషల్ పార్టీ పోలీసులు గురువారం డ్రోన్ కెమెరాలతో జల్లెడ పట్టారు. నగరంలో ఒకటో పట్టణ ఠాణా పరిధిలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. గంజాయి, మత్తు పదార్థాలను తాగే ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో గుర్తించారు. పట్టుబడిన వారికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు గురువారం ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. కూడళ్ల వద్ద వాహనాలను ఆపి తనిఖీలు నిర్వహించారు. వాహనదారుల పత్రాలను పరిశీలించారు.

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే స్థావరాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

పులివెందుల, న్యూస్‌టుడే : పులివెందుల జేఎన్‌టీయూ కళాశాలలో ఉద్యోగుల క్వార్టర్స్‌లో వివాహిత పర్వీన్ గురువారం ఉరి వేసుకుని మృతి చెందింది. పోలీసులు, స్థానికుల సమాచారం మేరకు.. జేఎన్‌టీయూ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా తాజ్‌మహబూబ్ విధులు నిర్వహిస్తున్నారు. ఆమె కళాశాల క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. పర్వీన్, తన భర్త టిప్పుసుల్తాన్ ఇరువురూ హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. కుటుంబ కలహాల నేపథ్యంలో పర్వీన్ బుధవారం అక్క తాజ్‌మహబూబ్ ఇంటికి వచ్చింది. గురువారం అక్క విధులకు వెళ్లిన తర్వాత మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఇంట్లో ఫ్యాన్‌కు పర్వీన్ ఉరి వేసుకుని మృతి చెందింది. ఇంట్లో పని మనిషి గది శుభ్రం చేసేందుకు తలుపులు తీయాలని పిలిస్తే పలకకపోవడంతో చుట్టుపక్కల వారికి ఆమె తెలియజేసింది. తాజ్ మహబూబ్, చుట్టుపక్కల వారు వచ్చి తలుపు పగులకొట్టి చూడగా.. పర్వీన్ ఉరి వేసుకుని మృతి చెందడాన్ని గుర్తించారు. తన సోదరి మృతికి ఎవరూ కారణం కాదని, చిన్ననాటి నుంచి సున్నిత మనస్తత్వం కలిగి ఉండడంతో తన భర్తతో ఉన్న మనస్పర్థాలతో ఇలా చేసుకుందని తాజ్‌మహబూబ్ పోలీసులకు తెలిపారు. పులివెందుల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



పర్వీన్ కుటుంబ సభ్యులనుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ సీతారామిరెడ్డి

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

చెన్నూరు, న్యూస్‌టుడే : మండలంలోని ఇర్కాన్ కూడలి సమీపంలోని కేసీ కాలువలో గురువారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎగువ నుంచి కేసీ కాలువలో మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు వారు వెళ్లి పరిశీలించారు. మృతదేహంపై వస్త్రాలు లేవు. ముక్కు పుడక, కాలి పట్టీలు ఉన్నాయి. అక్కడే పంచనామ నిర్వహించి, ఆత్మహత్యకు పాల్పడిందా..? ఏదైనా ఘటన కారణంగా మృతి చెందిందా..? అన్న కోణంలో విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామన్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా

తొండూరు : సిమెంటు లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటన తొండూరు మండలంలో మల్లేల గ్రామ సమీపంలో గురువారం జరిగింది. ఈ ప్రమాదంలో వాహన చోదకుడు స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రగుంట్ల సిమెంటు కర్మాగారల నుంచి బెంగళూరుకు వెళ్తున్న క్రమంలో మండలంలోని మల్లేల గ్రామ సమీపాన ఉన్న మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. నాలుగు వరుసల రోడ్డు విస్తరణ నేపథ్యంలో మలుపు వద్ద ఎలాంటి ప్రమాద సూచిక లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

EENADU e Classifieds

AUTO

VEHICLES FOR SALE

Sundaram Finance Ltd Vehicle for Sale KIA CARENS CLAVIS Model 2025 Registration Number AP-40-HM-2627. Cell : 9440909749, 8500667214.

Vehicle for Sale Unregistered Maruti Brezza Smart Hybrid VXI1.5L 5MT BSVI Buyers Has come to along with IDS Address Proof. Cont: Indusind Bank Ltd, W/14-245, 1st Floor, IVR Towers Beside Saibaba School, ITI Circle, Kadapa-516003, 8328668171, 7550065615.

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647

TO LET

COMMERCIAL

కడప మారుతీనగర్ (నాగార్జున స్కూల్ ప్రక్కన) విద్యాసాగర్ హాస్పిటల్ దగ్గర 4000 Sft బిల్డింగ్‌ను బాడుగకు గాని లేక అమ్మబడును. Cell :7702936190.

JOBS

Amaravathi Software, Kadapa. Job Offer For Any B.Tech, M.Tech, MBA. Interview Date: 23-11-2025, Time: 9 AM - 5 PM, Cont: 9849720149.

NIT కేరళలో EEE B.Tech చదువుతున్న నడవలేని విద్యార్థినిని (PWD) చూసుకొనుటకు B.Tech చదువుకొని 35 సం॥లోపు వయస్సు ఉన్న ఒంటరి మహిళలు కావలెను. భోజనం, వసతి కల్పించి జీతం ఇవ్వబడును. Cell: 9866432259.

ప్రముఖ ట్రాక్టర్ కంపెనీ డీలర్షిప్ లో పని చేయుటకు స్పేర్స్ ఇన్‌ఛార్జి కావలెను. హనుమాన్ మోటార్స్, M.G.Auto Nager, Proddatur 9390032810.

FACULTY/ TEACHERS

కడప పట్టణంలో ప్రముఖ స్కూల్ నందు నర్సరీ నుండి UKG వరకు బోధించుటకు 5 & 10 సం॥ అనుభవం కల్గిన టీచర్స్ కావలెను. Cell : 6281155858, 9966149515.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసి ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ॥ 350/- మాత్రమే
Contact: KDP: 9989997626, 8008514248 PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

పరికరాలు దివ్యాంగులకు వరం

పులివెందుల, న్యూస్‌టుడే : భారత ప్రభుత్వం దివ్యాంగులకు అందించే పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో-1, 2 చంద్రశేఖర్‌రావు, రామానాయుడు అన్నారు. గురువారం పులివెందులలోని రమణప్ప సత్రంపాఠశాలలో దివ్యాంగులకు వైద్య పరీక్షలు, అనంతరం పరికరాల పంపిణీ కోసం ప్రభుత్వం కృత్రిమ అవయవాల తయారీ సంస్థ (అలింకో) సహకారంతో సమగ్ర శిక్ష, సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రమణారెడ్డి అధ్యక్షత వహించారు. కృత్రిమ అవయవాలు, త్రిచక్ర వాహనాలు, శ్రవణ యంత్రాలు తదితర వాటిని అందించేందుకు సంస్థ ముందుకు వచ్చిందన్నారు. కార్యక్రమంలో భవిత పాఠశాల రిసోర్స్ పర్సన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సహకార రంగాన్ని బలోపేతం చేయాలి

మాట్లాడుతున్న డీసీఓ వెంకటసుబ్బయ్య

కడప గ్రామీణ, న్యూస్‌టుడే : సహకార రంగాన్ని బలోపేతం చేయాలని జిల్లా సహకార శాఖ అధికారి వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. సహకార వారోత్సవాల్లో భాగంగా గురువారం సహకార కాలనీలోని గృహనిర్మాణ సంఘ కార్యాలయంలో సహకార జెండాను ఎగురవేసి ఆయన మాట్లాడారు. దేశంలో సహకార రంగం ప్రజలకు చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జయభారత్‌రెడ్డి, డీఎల్‌సీఓ గోపీకృష్ణ, జిల్లా సహకార ఆడిట్ అధికారి బ్రహ్మానందరెడ్డి, ప్రతినిధులు శేషారెడ్డి, భానుప్రకాశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిరసనతో ప్రజాప్రతినిధుల్లో కదలిక

పులివెందుల, న్యూస్‌టుడే : తమ ప్రాంతానికి గత 20 రోజులుగా నీరు సరఫరా కావడం లేదని పులివెందుల పురపాలక పరిధిలోని బ్రాహ్మణపల్లె గ్రామస్థులు గురువారం బిందెలతో నిరసన తెలిపారు. 20 రోజుల నుంచి నీటి సరఫరా చేసే మోటారు మరమ్మతులకు గురైందని, దాన్ని బాగుచేయించేందుకు ఏ ఒక్కరూ ముందుకు రాలేదని, దీంతో నీటి ఎద్దడి ఏర్పడిందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. నీరు లేకుంటే ఏ పని జరగదని వాపోయారు. పనులకు వెళ్లితేనే జీవనం గడిచేది, పనులకు వెళ్లకుండా నీటికోసం ఎదురు చూడాలంటే కష్టతరంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న పులివెందుల పురపాలక ఛైర్మన్ వరప్రసాద్, వైస్ ఛైర్మన్ వై.ఎస్.మనోహర్‌రెడ్డి స్థానికంగా కౌన్సిలర్ మహేశ్వరరెడ్డితో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కరించాలని సూచించారు. ఈ మేరకు వారే స్వయంగా వెళ్లి మోటారు బోరును బాగుచేయించి వెంటనే నీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నారు.

బ్రాహ్మణపల్లెలో నీటి కోసం బిందెలతో నిరసన తెలుపుతున్న ప్రజలు

ఆర్టీసీకి ఆదాయం.. అభివృద్ధికి బస్టాండ్ దూరం

వసతుల్లేక ప్రయాణికుల అవస్థలు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే : జిల్లాలో కడప, మైదుకూరు, బద్వేలు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల డిపోలున్నాయి. అన్ని డిపోల కంటే కడప డిపో అన్ని రంగాల్లో ముందుంది. కడప బస్టాండును 1978లో నిర్మించారు. ఇప్పటి వరకు అలానే ఉంది. అప్పట్నుంచి ఆధునికీకరణ చేశారే తప్ప.. బస్టాండును ఇప్పటి వరకు విస్తరించలేదు. మొత్తం 17 ప్లాట్‌ఫారాలున్నాయి. 100 ఆర్టీసీ, 49 అద్దె బస్సులున్నాయి. రోజూ 57 వేల కిలోమీటర్లు తిరుగుతూ.. ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నాయి. రోజూ ఇంధన ఖర్చు రూ.11 లక్షలు వెచ్చిస్తున్నారు. ఆదాయం రూ.25 లక్షలు వస్తోంది. కానీ జిల్లా కేంద్రమైన కడప బస్టాండు అధ్వానంగా ఉంది. ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. ప్రయాణికులకు వసతులూ సమకూర్చడం లేదు.

బస్సు ప్రాంగణం అధ్వానం.. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో ఉన్న బస్టాండులు చాలా విశాలంగా అధిక సంఖ్యలో ప్లాట్‌ఫారాలు, వసతులున్నాయి. పక్కనున్న చిత్తూరు, తిరుపతి, కర్నూలు, అనంతపురం బస్టాండులు విశాలంగా బాగున్నాయి. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా పులివెందుల బస్టాండు ఉంది. కానీ జిల్లా కేంద్రమైన కడప బస్టాండు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. జిల్లా బస్టాండు కావడంతో రోజుకు 600 బస్సులు వచ్చి వెళ్తున్నాయి. మధ్యాహ్నం వేళల్లో బస్సులు నిలిపేందుకు స్థలం ఉండదు. బస్టాండు ఆవరణలో స్థలం నిరుపయోగంగా ఉంది. దాన్ని వినియోగించుకునే దానిపై ఆర్టీసీ అధికారులు దృష్టి సారించడం లేదు. ఆ స్థలం ఉపయోగించుకుంటే బస్టాండ్ విశాలంగా ఉండటంతోపాటు మరిన్ని బస్సులు నిలిపేందుకు వీలుగా ఉంటుంది. వసతులు సమకూర్చేందుకు వీలుంటుంది. కానీ ఆ దిశగా అధికారులు ఆలోచన చేయడం లేదు.

నిరుపయోగంగా ఉన్న ఖాళీ స్థలం

కలగానే ఆధునికీకరణ

కడప ఆర్టీసీ బస్టాండును ఆధునికీకరిస్తామని గత కొన్నేళ్ల నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతూనే ఉన్నారు. కానీ ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. 30 ప్లాట్‌ఫారాలు.. అత్యాధునిక షాపింగ్ మాల్స్, మినీ సినిమా థియేటర్లు, హోటళ్లు తదితర వసతులతో నిర్మిస్తామని చెప్పారేతప్ప.. ఆ దిశగా తీసుకున్న చర్యలు శూన్యం. ఇప్పుడున్న ఎండీ ద్వారకా తిరుమలరావు బస్టాండు ఆధునికీకరణపై దృష్టి పెడితే ఇతర జిల్లా కేంద్రాల బస్టాండు వలె కడప బస్టాండు ఉంటుంది. ఆర్టీసీ ఆధునికీకరణ విషయాన్ని ఆర్టీసీ ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి వద్ద ప్రస్తావించగా.. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, మరోసారి ఈ విషయమై ఉన్నతాధికారులను సంప్రదిస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM to 1 PM)
కడప : 8008573428, 8688701384
పులివెందుల : 8008573466, 8008573474
కమలాపురం : 8008573475

సమస్య : వేంపల్లెలోని గాండ్లవీధి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. **- సుబ్బయ్య, వేంపల్లె**

సమాధానం : పారిశుద్ధ్య సిబ్బందిని పంపి చెత్తాచెదారాన్ని తొలగిస్తాం. **- నాగభూషణ్‌రెడ్డి, గ్రామ పంచాయతీ ఈవో, వేంపల్లె** – న్యూస్‌టుడే, వేంపల్లె

రైతుబజారులో కూరగాయల ధరలు

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: నగరంలోని రైతుబజారులో కూరగాయల ధరలు కిలో (నిన్నటివి) ఇలా... బంగాళదుంప-45, క్యాబేజి-30, క్యారెట్-70, బీన్స్-40, బీట్‌రూట్-50, కీర-30, దోస-40, దొండకాయలు-50, ముల్లంగి-40, అల్లం-60, 80, క్యాలీఫ్లవర్-50, క్యాప్సికం-70, టమాట-20 - 25, మిరపకాయలు-40, వంకాయలు-35, బెండకాయలు-35, బీర-48, కాకర- 50, మటిక్కాయ-45, చిక్కుడు-60, అలసందకాయలు-50, అనపకాయలు-65, ఉల్లిపాయలు-20 - 25, మునగకాయలు-60

కూచిపూడి బోధకురాలి పోస్టు భర్తీకి ఇంటర్వ్యూ 25న

వైవీయూ, న్యూస్‌టుడే : యోగివేమన విశ్వవిద్యాలయం లలిత కళల విభాగంలో కూచిపూడి నృత్యంలో మహిళా బోధకురాలు నియామకం కోసం ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ప్రధానాచార్యులు ప్రొఫెసర్ శ్రీనివాసులు తెలిపారు. అభ్యర్థులు డిప్లొమా ఇన్ కూచిపూడి డ్యాన్స్, పీజీ ఇన్ కూచిపూడి డ్యాన్స్ అర్హత కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు బయో డేటా, సంబంధిత ధ్రువపత్రాలు, జిరాక్స్ కాపీలతో నేరుగా విశ్వవిద్యాలయంలోని నూతన పరిపాలనా భవన్‌లోని ఫైన్ ఆర్ట్స్ విభాగంలో జరిగే వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. ఇతర వివరాలకు www.yvu.edu.in ను సందర్శించాలన్నారు.

రోడ్డు తవ్వారు.. నీరు పారించారు..!

కడప నగరంలో ఎర్రముక్కపల్లె ఎస్‌బీఐ నుంచి రాజీవ్ పార్క్ రోడ్డుకు వెళ్లే మార్గంలో జార్జిరెడ్డి వీధిలో తాగునీటి పైపులైన్ పగిలి నీరు రోడ్డుపై వృథాగా పోతోంది. దీంతో రహదారంతా బురదమయంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇటీవల యంత్రంతో తవ్వకాలు జరిపిన క్రమంలో పైపులైన్ దెబ్బతినడం వల్ల లీకేజీ ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. ఫలితంగా ఆ చివర నుంచి ఈ చివర వరకు రోడ్డుపై నీరు వృథాగా పారుతున్నా నగర పాలక సంస్థ అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. సమస్యను కడప నగరపాలక సంస్థ ఏఈ దేవేంద్ర దృష్టికి తీసుకెళ్లగా ఇటీవల కొత్తగా పైపులైన్ ఏర్పాటు చేశామన్నారు. ఆ పైపులైన్‌లోకి నీరు వదిలిన సందర్భంలో లీకేజీలు ఏర్పడుతుంటాయి.. వాటిని గుర్తించి మరమ్మతులు చేస్తామన్నారు. - న్యూస్‌టుడే, కడప గ్రామీణ

ప్రసంగంతో మెరిసిన బాలికలు

బహుమతులు, ప్రశంసా పత్రాలు అందుకున్న విజేతలతో డైరెక్టర్ మధుసూదనరెడ్డి, కరస్పాండెంట్ మనోహర్‌రెడ్డి

కడప విద్య, న్యూస్‌టుడే : కడప నగరంలోని వివేకానంద బాలికల జూనియర్ కళాశాలలో గురువారం ఈనాడు ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. ‘కృత్రిమ మేధ (ఏఐ) వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు’ అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాసం (స్పీచ్) పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో పి.హర్షిత (మొదటి సంవత్సరం), వై.అనుశ్రీబాయి (మొదటి సంవత్సరం), ఎం.సుష్మ (మొదటి సంవత్సరం) నిలిచారు. విజేతలకు డైరెక్టర్ డాక్టర్ మధుసూదనరెడ్డి, కరస్పాండెంట్ డీఎస్‌ఆర్ మనోహర్‌రెడ్డి, ప్రిన్సిపల్ పి.దాదాకళందర్ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

స్మార్ట్ కిచెన్‌లకు పెట్టే ఖర్చు కార్మికులకు ఎందుకివ్వరూ?

మారుతీనగర్, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల్లో సంవత్సరాల తరబడి పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచేందుకు ముందుకురాని ప్రభుత్వాలు స్మార్ట్ కిచెన్‌ల పేరుతో రూ.లక్షలు ఖర్చు చేయడం ఏమిటని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) గౌరవాధ్యక్షుడు చాంద్ బాషా ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం నగరంలోని ఆ యూనియన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత 23 ఏళ్లుగా మధ్యాహ్న భోజన పథకంలో పని చేస్తున్న కార్మికులతో ప్రభుత్వం వెట్టి చాకిరి చేయించుకుంటుందన్నారు. కామాక్షమ్మ, సులోచనమ్మ, మేరీ, లీలావతి పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌ఛార్జిగా జేసీ

మారుతీనగర్, న్యూస్‌టుడే : జిల్లా గ్రంథాలయ సంస్థల వ్యవహారాలు నిర్వహించడానికి జిల్లా జాయింట్ కలెక్టర్‌లను ఇన్‌ఛార్జిలుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరు ఈ బాధ్యతలో ఆరు నెలలు లేదా కొత్త ఛైర్మన్‌ల నియామకం జరిగే వరకూ ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మాధవి

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే : సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని కడప ఎమ్మెల్యే మాధవి అన్నారు. గురువారం కడప ద్వారకానగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటిని పరిశీలించి సంబంధిత అధికారులకు బదలాయించారు. సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆమె సూచించారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు.

ప్రజల సమస్యలు వింటున్న బీటెక్ రవి

పేదల సంక్షేమానికి పెద్దపీట

పులివెందులు, న్యూస్‌టుడే : పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని పులివెందుల నియోజకవర్గ తెదేపా బాధ్యుడు బీటెక్ రవి అన్నారు. గురువారం ఆయన పులివెందులలోని తెదేపా కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగాలు కల్పించాలని, వృద్ధాప్య పింఛన్లు, ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు చేయించాలని, వివిధ సమస్యలపై ప్రజలు వినతిపత్రాలు సమర్పించారు.

నీటిపారుదల శాఖ మంత్రికి వినతి

పులివెందుల, న్యూస్‌టుడే : పులివెందుల ప్రాంతంలోని రైతులందరికీ పొలాలకు సాగునీరందేలా చర్యలు తీసుకోవాలని తుంగభద్ర హైలెవల్ కెనాల్ ప్రాజెక్టు ఛైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కోరారు. గురువారం అమరావతిలోని సచివాలయంలో మంత్రిని ఆయన కలిసి పులివెందుల ప్రాంత రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, నీటి సరఫరాలు కాలువలు ఆధునీకరణ, తదితర సమస్యలు వివరించారు. అనంతరం ఇరిగేషన్ శాఖ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ శ్యాంప్రసాద్‌ను కలిసి కాలువల ఆధునికీకరణకు సాంకేతిక పరమైన సమస్యలు పరిష్కరించాలని కోరారు.

టిప్పర్ ఢీకొని యువకుడి మృతి

దౌల్తాబాద్, న్యూస్‌టుడే: టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన దౌల్తాబాద్‌లో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాలంపేట- అంతారం తారు రోడ్డు విస్తరణ పనులు సాగుతున్నాయి. ఈ పనుల్లో భాగంగా అల్లాపూర్ గ్రామ సమీపం నుంచి మట్టిని రోడ్డుకు తరలిస్తున్నారు. గురువారం టిప్పర్‌లో జేసీబీతో మట్టిని నింపుతుండగా డ్రైవర్ వాహనాన్ని నిలిపి కిందికి దిగాడు. వాహనం మట్టి లోడుతో ముందుకు వెళ్లి.. ఎదురుగా ఉన్న మరో టిప్పర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎదురుగా ఉన్న వాహన డ్రైవర్ శ్రీనివాస్ యాదవ్(26) తప్పించుకునేందుకు ప్రయత్నించగా వీలుకాక.. దానికిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడు ఆంధ్రప్రదేశ్‌లోని కడపవాసిగా గుర్తించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఫిర్యాదు అందలేదని ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

మాట్లాడుతున్న సీడీపీవో శాంతమ్మ

నందిమండలం (పెండ్లిమర్రి), న్యూస్‌టుడే : బాల్య వివాహాలు చట్టారీత్యా నేరమని సీడీపీవో శాంతమ్మ అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం నందిమండలం జడ్పీ ఉన్నత పాఠశాల్లో బాల్య వివాహాల నివారణ, బాలల రక్షణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలుగు అనర్థాలను, బాలల హక్కుల రక్షణ చట్టం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఎంఈవో-1 సుజాత, మండల తెదేపా నాయకుడు శ్రీనివాసులురెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షంషాద్, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య, సచివాలయ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే : సైబర్ నేరాల బారినపడి ఇబ్బందులు పడొద్దని పెండ్లిమర్రి గ్రామీణ సీఐ మోహన్ అన్నారు. గురువారం పెండ్లిమర్రి కేజీబీవీలో సైబర్ నేరాలు, శక్తియాప్‌పై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు అలవాట్లకు దూరంగా ఉన్నప్పుడే మంచి భవిష్యత్తుకు చేరుకుంటారని తెలిపారు. బాల్య వివాహాలు, బాలికలు, మహిళలపై జరుగుతున్న దాడులు వాటి నివారణ చర్యలు గురించి వివరించారు. ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్, కేజీబీవీ ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీలు చేస్తున్న హైపవర్ కమిటీ సభ్యులు

డిగ్రీ పరీక్షల్లో ముగ్గురు డీబార్

వైవీయూ, న్యూస్‌టుడే : యోగి వేమన విశ్వవిద్యాలయ పరిధిలో జరుగుతున్న డిగ్రీ పరీక్షలను గురువారం హైపవర్ కమిటీ ఆకస్మికంగా తనిఖీ చేసింది. రెండు కేంద్రాల్లో ముగ్గురు విద్యార్థులను డీబార్ చేసినట్లు ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఆచార్య కృష్ణారావు తెలిపారు. హైపవర్ కమిటీ సభ్యులు ఆచార్య మాధవి, ఆచార్య రియాజున్నీసా సుండుపల్లెలోని వీరభద్ర డిగ్రీ కళాశాలలో ఒకరిని, పుల్లారెడ్డిపేట ఎస్‌ఎల్‌ఎస్ డిగ్రీ కళాశాలలో ఇద్దరిని ఆచార్య వెంకటేశ్వర్లు డీబార్ చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి

లింగ వివక్ష చూపితే చర్యలు

కడప గ్రామీణ, న్యూస్‌టుడే : ఎవరైనా లింగ వివక్ష చూపితే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం జిల్లా సమాఖ్య సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. లింగ వివక్ష నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ సునీత లింగ వివక్షతపై చర్యలు, చట్టాలు గురించి వివరించారు. ఏపీడీ వెంకటేశ్వర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దూరం

సిద్దవటం, న్యూస్‌టుడే : వ్యాధులు సోకకుండా విద్యార్థులు తప్పకుండా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆర్‌బీఎస్‌కే జిల్లా నోడల్ అధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. గురువారం సిద్దవటంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భోజనం తినే ముందు, మలవిసర్జన తర్వాత చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. ఐరన్ పోలిక్ మాత్రలు మింగితే రక్తహీనతబారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆర్‌బీఎస్‌కే జిల్లా మేనేజరు రామమూర్తి, వైద్యాధికారి నవీన్‌కుమార్, లక్ష్మీనరసమ్మ, మౌలాలి, లక్ష్మీదేవి, సిబ్బంది, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం చిలకల వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

సిద్దవటం, న్యూస్‌టుడే : మండలంలోని మాధవరం-1, వెలుగుపల్లె, టక్కోలు, మాధవరం-1, 2, 3 వార్డుల గ్రామాలకు చెందిన నలుగురు లబ్ధిదారులకు గురువారం రూ.1.99 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు అందజేశారు. తెదేపా నాయకులు నాగమునిరెడ్డి, జింకా శ్రీనివాసులు, శివ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

26న సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం

మారుతీనగర్, న్యూస్‌టుడే : స్థానిక రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో కొత్త కలెక్టరేట్ సమీపంలో మహావీర్ కూడలిలో వెలిసిన సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఈ నెల 26న సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా ప్రత్యేక పూజలు, 18 అడుగుల స్వామి వారి విగ్రహానికి అభిషేకాలు, అలంకరణ, అనంతరం కల్యాణం నిర్వహిస్తామని ఆలయ అర్చకులు తెలిపారు.

సీఐని కలిసిన తెదేపా నాయకులు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : ఒంటిమిట్ట సర్కిల్ కార్యాలయంలో నూతన సీఐ పి.నరసింహరాజును తెదేపా నాయకులు గురువారం కలిశారు. జడ్పీటీసీ సభ్యుడు అద్దలూరు ముద్దు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బాషా, నాయకులు బొడ్డే వెంకటరమణ, రోశయ్య, బుజ్జి, శివశంకర్, మహీంబాషా, చంద్రశేఖర్, కామరాజు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శాలువా కప్పి సత్కరించారు.

సామాజిక మాధ్యమాలపై అప్రమత్తత అవసరం

విద్యార్థినులకు సూచనలు ఇస్తున్న సీఐ సీతారామిరెడ్డి

పులివెందుల, న్యూస్‌టుడే : సామాజిక మాధ్యమాలపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని పులివెందుల పట్టణ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. గురువారం పులివెందులలోని మహాత్మా జ్యోతిబాపులె రెసిడెన్షియల్ పాఠశాలలోని విద్యార్థినులకు సైబర్ క్రైం, సామాజిక మాధ్యమాలపై అప్రమత్తత, సమాజంలో జరుగుతున్న మోసాలు, తదితర వాటిపై ఆయన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థినులు సమాజంలో అన్నింటినీ ఎదుర్కొనే దృఢమైన ఆలోచనలు, చలాకీతనం పెంపొందించుకోవాలని సూచించారు. ఏదైనా సమస్య వస్తే పోలీసులకు సమాచారం ఇస్తే వాటిని ఎదుర్కొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. శక్తి యాప్ ద్వారా మహిళలు వారికి కలిగే ఇబ్బందులను పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ హరిత, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

మారుతీనగర్, న్యూస్‌టుడే : జిల్లా గ్రంథాలయ సంస్థలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు, వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని ఉప సంచాలకులు వెంకటసుబ్బారెడ్డి, గర్ల్ ఛైల్డ్ డెవలప్‌మెంట్ అధికారిణి ఆరోగ్యరూత్‌మేరీ అన్నారు. ప్రపంచమంటే ఏంటో తెలియాలంటే ప్రతి ఒక్కరూ గ్రంథాలయాన్ని సందర్శించి అందులోని పుస్తకాలు తప్పనిసరిగా చదవాలన్నారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రంథాలయ ముగింపు వారోత్సవాల్లో గురువారం వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. 14వ తేదీ నుంచి నేటి వరకు పలు పాఠశాలల విద్యార్థులకు అనేక రకాల ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు సుప్రియ, అనంతలక్ష్మి, ఆనంద్‌రాజు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉప సంచాలకులు వెంకటసుబ్బారెడ్డి, అధికారిణి ఆరోగ్యరూత్‌మేరీ

దాతల దాతృత్వం.. వినియోగంలోకి ఆర్వో కేంద్రం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : మండలంలోని కొత్తమాధవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సాంకేతిక లోపాలతో నిరుపయోగంగా ఉన్న తాగునీటి శుద్ధి కేంద్రాన్ని దాతల దాతృత్వంతో వినియోగంలోకి తీసుకొచ్చారు. వైకాపా పాలనలో మనబడి ‘నాడు - నేడు’లో రక్షిత జలం సరఫరా కోసం రూ.6.68 లక్షలతో ఆ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మూడేళ్లుగా వినియోగంలో లేదు. రాజంపేట మండలం కారంపల్లెకు చెందిన దొండపాణి సుబోద్ రెడ్డి రూ.25 వేలు ఆర్థిక సాయం చేశారు. కొత్తమాధవరానికి చెందిన తెదేపా నాయకుడు ఆలూరి ప్రసాద్ మరో రూ.5 వేలు వెచ్చించి నీటి సరఫరా కోసం పైపులు, కుళాయిలు తెప్పించారు. ఈ బడిలో 279 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఆర్వో కేంద్రం పనిచేయకపోవడంతో రోజూ ప్రైవేటు వ్యక్తుల నుంచి 10 నీటి (క్యాన్లు) డబ్బాలు కొనుగోలు చేస్తున్నారు. ఇందు కోసం రూ.250 నుంచి రూ.300 వరకు వెచ్చిస్తున్నారు. ఈ భారం గురువులపై పడుతోంది. ఎంఈవో-2 వల్లూరు బ్రహ్మయ్య చొరవ తీసుకుని గుత్తేదారు సుబోద్ రెడ్డితో మాట్లాడి ఒప్పించారు. దాతలు తోడ్పాటు అందించడంతో మరమ్మతులు చేయించినట్లు బాధ్య హెచ్‌ఎం కేశవరెడ్డి తెలిపారు. తాగునీటి శుద్ధి కేంద్రం బాగు చేయించడానికి సహకారం అందించిన దాతలకు కృతజ్ఞతలు చెప్పారు.

పాఠశాలల్లో ఆర్వో కేంద్రాన్ని శుభ్రం చేస్తున్న ఉపాధ్యాయులు

రాబర్ట్‌సన్‌పేటలో గంజాయి స్వాధీనం

కోలారు, న్యూస్‌టుడే : రాబర్ట్‌సన్ పేట పరిధి స్కూల్ ఆఫ్ మైన్స్ వద్ద గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. కడపజిల్లా చమలరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కంచర్ల హర్షవర్ధనరెడ్డి (21), యాటె మహేంద్ర (21) అనే వ్యక్తులను నిందితులుగా గుర్తించారు. వీరి నుంచి రూ.2.01 లక్షల విలువైన 4.140 కిలోల గంజాయిని జప్తు చేసుకున్నామని డీఎస్పీ వి.లక్ష్మయ్య తెలిపారు.

గోపురాలపై మొక్కల తొలగింపు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : కోదండ రామాలయంలో తూర్పు, ఉత్తర గోపురాలపై ఉన్న ఆకు, తీగజాతి, కలుపు మొక్కలను పురావస్తుశాఖ, తితిదే సివిల్, విద్యుత్తు విభాగం సిబ్బంది గురువారం తొలగించారు. నిచ్చెన సాయంతో గోపురాలపైకి సిబ్బంది ఎక్కి తీసేశారు. ఆలయ ప్రాకార పిట్ట గోడలపై అల్లుకున్న చెట్ల తీగలను తీసేసి శుభ్రం చేశారు.

IN THE COURT OF HON'BLE ADDITIONAL SENIOR CIVIL JUDGE COURT, KADAPA
I.P.No. 66 /2025

Polepalli Nagaraju, S/o Late Reddappa, Hindu, aged about 44 years, residing at Gowtham Vegetable Nursery, Angallu Village and Post, Kurubalakota Mandal, Annamayya District. **...Petitioner**

Vs

1) Gosala Venkata Ramana, S/o Gangulu @ Gangulaiah, aged about 62 years, Hindu, Business, residing at D.No.13/387-C, Near R.T.C Bus-Stand, Vempalli Village, Post and Mandal, Kadapa District

2) Gosala Reddy Keerthana, aged about 3 years, minor, represented by her mother, Gosala Prasanna, W/o Gosala Siva Sankar, aged about 22 years, Hindu, Residing at D.No. 9/75, Anjaneyapuram Village, Chakrayapeta Mandal, YSR District. **..Respondents/ Creditors**

NOTICE

Whereas the Petitioner filed the insolvency petition before the Hon'ble Additional Senior Civil Judge, Kadapa Vide IP.No. 66 of 2025 and the same is posted for your appearance on **14-12-2025**, all of you hereby directed to appear before the Hon'ble court at 10:30 A.M in person or through your counsel or advocate, otherwise the petition may be decided in your absence.

BY ORDER OF THE COURT
R.CHANDRA OBULA REDDY
Advocate for the Petitioner

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

వరల్డ్ ఫిషరీస్ డే శుభాకాంక్షలు కళాభారతి
చేనేత, హస్తకళా మేళా
అఖిల భారత హస్తకళా, చేనేత వస్త్ర ప్రదర్శన & అమ్మకం
EXHIBITION cum SALE
NNK కళాక్షేత్రం, కడప
చేనేత మేళా చివరి తేదీ : 23.11.2025

(c) eenadu